సమగ్ర ఆంధ్ర సాహిత్యం

మొదటి సంపుటి



ఆరుద్ర

తెలుగు అకాడమి

తెలుగు అకాడమి ప్రచురణ - 30

సంప్రదింపు గ్రంథావళి

సమగ్ర ఆంధ్ర సాహిత్యం

మొదటి సంపుటి

రచన

ఆరుద్ర

తెలుగు అకాడమి
హైదరాబాదు

***samagra aandhra saahitya;* Writer :** Arudra; Reprint : 2012
pp. xii + 1100 + iv.

Revised Edition : 2002
Reprint : 2005, 2007, 2012
Copies : 1000

Published by TELUGU AKADEMI, Hyderabad- 500 029 (Andhra Pradesh) under the Centrally Sponsored Scheme of Production of Books and Literature in Regional Languages at the University level of the Goverment of India in the Ministry of Human Resource Development, New Delhi.

Price : Rs. 325=00

Printed in India
Laser Typeset at Sri Maruthy Laser Printers, Chennai - 600 014
Printed at M/s. Deccan Press, Hyderabad
Andhra Pradesh.

భూమిక

1968లో తెలుగు అకాడమి స్థాపన జరిగిన నాటినుంచీ ఉన్నత స్థాయిలో బోధనభాషగా తెలుగు స్థిరపడటానికి అకాడమి నిర్వహిస్తున్న కృషి అందరికీ తెలిసిన విషయమే. తెలుగు అకాడమి ఇంటర్మీడియట్ స్థాయి నుంచి స్నాతకోత్తరస్థాయివరకు పాఠ్య పఠనీయ గ్రంథాలను, అనువాద, సంప్రదింపు గ్రంథాలను, శాస్త్ర నిఘుంటువులను, జనరంజక గ్రంథాలను, మోనోగ్రాఫ్‌లను, వృత్తి విద్యాకోర్సులకు సంబంధించిన గ్రంథాలను ప్రచురిస్తున్నది. అంతే కాకుండా తెలుగు అకాడమి ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగు మాధ్యంలోనే గాక ఆంగ్ల మాధ్యంలో కూడా పాఠ్యగ్రంథాలను ప్రచురించి విద్యారంగానికి సముచితమైన సేవ చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంవారు ప్రముఖ సాహితీవేత్త శ్రీ ఆరుద్ర రచించిన సమగ్ర ఆంధ్ర సాహిత్యం గ్రంథం సర్వహక్కులను, ప్రచురణ బాధ్యతను తెలుగు అకాడమీకి అప్పగించడంతో ఆ గ్రంథ ప్రచురణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

గతంలో 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' 13 సంపుటాలుగా వెలువడి సాహిత్యాభిమానుల ఆదరణ పొందింది. దీనిలో ఆరుద్రగారు జీవించి ఉండగానే, వారే పలు మార్పులూ, చేర్పులూ చేసుకున్నారు. ఆ సవరణలన్నింటినీ పొందుపరచి, దీనిని మళ్ళీ 4 భాగాలుగా తీసుకొచ్చే ప్రయత్నం తెలుగు అకాడమి చేసింది. ఆ నాలుగు భాగాలలో ఇది మొదటిది. గతంలోలాగే ఇది సాహిత్యాభిమానుల ఆదరణ పొందుతుందడనడంలో సందేహం లేదు.

సమగ్ర ఆంధ్ర సాహిత్యం గ్రంథాన్ని ప్రచురించి తెలుగు సాహిత్యాభిమానులకు అందించాలన్న సంకల్పంలో భాగంగా అకాడమి తొలి ప్రయత్నంగా ఈ సంపుటాన్ని ఆరుద్ర జన్మదిన కానుకగా వెలువరించడం జరిగింది. ఈ గ్రంథ ప్రచురణకు సహకరించిన శ్రీమతి రామలక్ష్మి ఆరుద్రగారికి కృతజ్ఞతలు. ఈ గ్రంథం సాహిత్యాన్ని అధ్యయనంచేసే విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు, సాహిత్యాభిమానులకు, విమర్శకులకు అత్యంత ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నాం.

ఆచార్య కె. యాదగిరి
సంచాలకులు
తెలుగు అకాడమి

మనవి మాటలు

సాహిత్యాభిలాష గల సాధారణ పాఠకులు ఆంధ్ర సాహిత్యం గురించి సంపూర్ణంగా తెలుసుకోవాలనుకుంటే, వాళ్ళకు ఉపయోగించే పుస్తకాలు నేడు అందుబాటులో లేవు. నన్నయభట్టునుండి చిన్నయసూరిదాకా మాత్రమేకాక సాతవాహనుల కాలం నుండీ సాహితీ సమితి దాకా ఆంధ్ర సాహిత్యం అనేక విధాలుగా, బహుముఖాలుగా సాగింది. ప్రజ్ఞావంతులైన తెలుగుకవులు రచించిన గ్రంథాలు అన్నీ అచ్చుపడి వెలుగు చూడలేదు. అచ్చయిన పుస్తకాలు కూడా అన్నీ అందరికీ లభించడంలేదు. లభించిన పుస్తకాలైనా అన్నీ సాధారణ పాఠకులకు బోధపడే వివరణలతో లేవు. ఈకొరతను తొలగించవలసిన బాధ్యత నేటి సాహితీపరులపై వుంది.

పన్నెండు సంపుటాలలో సమగ్ర ఆంధ్ర సాహిత్యం ప్రజానీకానికి పరిచయం చేద్దామనే సంకల్పం కొన్నేళ్ళ కిందట నాకు కలిగింది.

సమగ్రత ఆశయం. దీన్ని సాధించడానికి ఇది ప్రయత్నం. పూజ్యులు కందుకూరి వీరేశలింగంగారు ప్రామాణిక సాహిత్యరచనకు పునాదులు వేశారు. శ్రీయుతులు మానవల్లి రామకృష్ణకవిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, చిలుకూరి వీరభద్రరావుగారు, కొమర్రాజు లక్ష్మణరావుగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు మొదలైన మహనీయులు సాహిత్యంతోపాటు దేశ చరిత్రను కూడా విశదం చేశారు. సురవరం ప్రతాపరెడ్డిగారు మన సాంఘిక చరిత్రకు శ్రీకారం చుట్టి కొత్త కోణాలను చూపెట్టారు. వీరి రచనలను ఆధారం చేసుకొని తమ ప్రతిభతో కొత్త ఆకరాలను గుర్తించి, నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించి సాహిత్య చరిత్రను అనేకమంది విద్వాంసులు, విమర్శకులు, విఖ్యాత పత్రికలలో, వివిధ గ్రంథాలలో వివరిస్తున్నారు. ఈ అమూల్య రచనలన్నింటిని నా దృక్పథంతో సమన్వయం చేయడానికి ఈ రచనలో యత్నించాను.

ఒక భాష మాట్లాడే ప్రజల దేశ చరిత్ర, సాంఘిక చరిత్ర, సాహిత్య చరిత్ర ఒకదానితో ఒకటి పెనవేసుకొని వుంటాయి. రాజకీయాలవల్ల వివిధ రంగాలలో పరిణామాలు ఏర్పడుతూ వుంటాయి. విభిన్న సంఘటనలే జరిగినా అవి ఒక చారిత్రక క్రమంలోనే వుంటాయి. రాజకీయ ప్రభావాలకు లోనుకాని యుగం వుండదు. రాజవంశాల పేరుమీదుగా యుగాలను పేర్కొనడం రివాజే.

సాంఘిక చరిత్రకు పనికివచ్చే సాహిత్య గ్రంథాలనే ఎన్నుకొనడంవల్ల సురవరం ప్రతాపరెడ్డిగారి యుగవిభజన వారి ప్రయోజనాలకు అనుకూలమైంది. సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో విస్తీర్ణతను దృష్టిలో పెట్టుకొని నేను యుగాల అంకెను, ఆయా రాజవంశాల ప్రాముఖ్యాలను బట్టి పెంచవలసి వచ్చింది. ఆదిలో నేను వేసుకొన్న ప్రణాళికలో యుగవిభజన చేసుకొన్నాను. కాని పుస్తక ప్రచురణను ప్రారంభించడానికి ముందే ప్రతిసంపుటిలో పుటల పరిమితిని, సంపుటాల సంఖ్యను, ఒక్కొక్క సంపుటం వెలనూ, పన్నెండు సంపుటాలకు మొత్తం పూర్తిగా ముందే చెల్లించే పక్షంలో సెట్టువెల, అందువల్ల

లభించే లాభసాటి సదుపాయాలూ ప్రకాశకులు ప్రకటించారు. ఎందరో ఈ ప్రణాళికకు స్వాగతం చెప్పారు. చందాదారులుగా చేరారు.

1965 జనవరి నెలనుండి ఈ సంపుటాల రచనకు ఉపక్రమించాను. ప్రతి సంపుటిలోని పుటల పరిమితి ముందుగానే నిర్ణయం కావడంవల్ల ప్రతి ప్రకరణలో తెలిసిన ఏ ఒక్కటీ వదిలిపెట్టకుండా విరివిగానే రాసినా చివరకు కుదించడం తప్పనిసరి అయింది. సమగ్రత దెబ్బతినకూడదని సంపుటాల సంఖ్యను పెంచి అదనపు యుగాలనూ, ఉపయుగాలను చేర్చవలసి వచ్చింది. ప్రచురణకు ముందే ప్రజలకిచ్చిన వాగ్దానానికి భంగం లేకుండా పన్నెండు సంపుటాలనూ వరుసగా ప్రచురించడం జరిగింది.

1965 ఏప్రియల్ నెల నుండి నవంబరు నెల దాకా ఎనిమిది నెలలు క్రమం తప్పకుండా ఆసాంతం రచనచేసి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' సంపుటాలను అచ్చుకివ్వడంలో నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. టెన్షన్‌వల్ల రావలసిన అన్ని రుగ్మతలూ వచ్చాయి. అయినా ప్రజలకు ప్రకాశకులతోపాటు వాగ్దానం చేసినది పన్నెండు సంపుటాలు కనుక ఆ సంఖ్యను పూర్తిచేయాలని నిశ్చయించాను. అది 1968 ఫిబ్రవరి నాటికిగాని పూర్తిచేయలేక పోయాను. ఈ పన్నెండు సంపుటాలు వెలువడుతున్నప్పుడు ఆసక్తితో చదివి, సహృదయంతో విమర్శించి, ప్రోత్సహించిన వాళ్ళెందరో ఉన్నారు. చెల్లాచెదురుగా ఉన్న ఆకారాలను ఒక్కచేత్తో క్రోడీకరించి విశ్లేషణ చేస్తున్నప్పుడు రచనలో తప్పులు దొర్లడం తప్పదు. వీటికి తోడు సాపు వ్రాస్తున్నప్పుడో, ప్రూఫు దిద్దుతున్నప్పుడో మరికొన్ని పొరపాట్లు చేరుకున్నాయి. నా అంతట నేను గుర్తించిన తప్పులతోబాటు విమర్శకులు సూచించే లోపాలూ, కొందరి కోపాలూ రెండవ ముద్రణలో సర్దుకొంటానని అప్పుడే సవినయంగా విన్నవించుకొన్నాను. మొదటి ముద్రణ సంపుటాలన్నీ ఏనాడో చెల్లుబడి అయిపోయాయి. రెండవ ముద్రణకోసం ఎందరో ఎదురుచూస్తున్నారు. కొందరు ఒత్తిడి చేస్తున్నారు. గత సంవత్సరం నా రెండు కళ్ళ కేటరాక్టులకూ ఆపరేషన్ విజయవంతంగా జరగడంవల్ల గ్రంథ పఠనానికి, రచన కార్యక్రమానికి వీలు కలిగింది.

సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో కొరతగా మిగిలిపోయిన సంపుటాలను పూర్తిచేయడమేగాక, తొలి పన్నెండు సంపుటాలను కొత్త వైనాలు చేర్చి తిరగరాసి ప్రచురించాలని నిశ్చయించాను. 'ప్రజాశక్తి బుక్ హౌస్' వారు పునర్ముద్రణ ప్రచురణ ప్రారంభిస్తున్నారు. ఒక వ్యక్తి సమాజంలో ఏదైనా సాధించగలిగాడంటే దానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఎందరి సహాయ సహకారాలో ఉంటాయి. నా కృషిలో నాకు తోడ్పడిన వారందరికీ నా కృతజ్ఞతలు. ఈ పరమార్థాన్ని సాధింప చేస్తున్న నా ఉత్తమార్థం రామలక్ష్మికి నా అభినందనలు.

1988 సంక్రాంతి
మదరాసు - 600 017

ఆరుద్ర

సమగ్ర ఆంధ్ర సాహిత్యం - నా మాట

తెలుగు సాహిత్యం ప్రసక్తి వస్తూన్నన్ని రోజులు ఆరుద్ర జీవించి ఉంటాడు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం అతణ్ణి చిరంజీవిని చేసింది. దీనిలో అసత్యం లేదు. అతిశయోక్తి లేదు. అప్పట్లో ''తెలుగు సాహిత్యంపై విస్తృతంగా పరిశోధనచేస్తూన్న మీరు ధన్యజీవులు'' అన్నారు వావిళ్ల రామస్వామిశాస్త్రులుగారు 'ఈ సమగ్ర ఆంధ్ర సాహిత్యం ద్వారా చక్కని వాడుక భాష ఎలా రాయాలన్నది జాతికి తెలిపిన మొదటివాడు, సాహిత్య చరిత్ర ఆ భాషలో రాసి మెప్పించినవాడూ ఆరుద్రే'' అన్నారు మిత్రులు జి. కృష్ణ. ''మీ వ్యవహారిక భాష చాలా ఉత్సాహాన్ని కలిగిస్తూంది సామాన్యులకిది సుబోధకంగా, కుతూహలాన్ని రేకెత్తించేదిగా వుంది' అని మెచ్చారు ఎ.ఎస్.గుప్తగారు. 'మీ రచన విలక్షణంగా వుంది - సాహిత్య నిర్వచనాన్ని లక్ష్యంగా వుంచుకుంటూనే అనేకానేక నూతన అంశాలు సవిస్తరంగా హృద్యమమైన శైలిలో ప్రసక్తం కావడం - యీ రచనలోని విశేషాంశం. ఇంపుసొంపులతో ముద్దులు మూటకడుతూ, ఆంధ్ర ప్రజానీకాన్ని మురిపిస్తున్న మీ కృషి అజరామరమైనది'' అని సాహిత్యభూషణ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లుగారు భావించారు. ''మీరు అపూర్వమైన ఇన్ఫర్మేషన్ ఆంధ్ర సాహిత్యాన్ని గురించి సంపాదిస్తూ మాకానందం కలుగ చేస్తున్నారు'' అని అభిమానం ప్రకటించారు కప్పగంతుల లక్షణశాస్త్రిగారు. ''ఆరుద్రగారి గ్రంథ రచనా పద్ధతి - అతి రుచికరంగా వుండి, అక్కడక్కడి వారి చెణుకులు లెనిన్‌గ్రాడ్ మంచు సోనల్లా చనవులునెరపి చక్కలిగింతలు పెడుతాయి చదువరిని'' అని లెనిన్‌గ్రాడ్ నుంచి ఎస్.వి.జోగారావుగారు భావించారు. ''అవసరం అయిన చోట వివరణ అనవసరమైన చోట సవరణ సరసమైన తీర్పు, హృద్యమైన మార్పు, పఠితలను ఆసక్తి కల్గిస్తూంది అన్నది సత్యోక్తి'' అన్నారు శ్రీ కొమండూరి రామానుజాచార్యులుగారు. ''సామాన్య పాఠకులకు మొట్టమొదటిసారిగా సాహిత్య చరిత్రలో పరిచయం ఏర్పరచుకొనే అవకాశం కల్గించింది. ఎప్పుడైనా ఎక్కడైనా చదువుకుపోడానికి వీలైనది - మీ సజీవమైన భాష మీ అద్భుత రచనా చాతుర్యం!' ఎస్.వి.సూర్యనారాయణ అభిప్రాయపడ్డారు. ''వజ్రాలు ఏరడం, రాళ్ల ఏరడం కూడా మనకు ఉపయోగమే. ఆ రాలు ఏరినవాడు మనం కోరకుండానే వరాలు ఇచ్చినవారే.'' వేలూరి వారి ఉవాచ. ''ఈ సంపుటాలలో నువ్వు తెలుగు ప్రపంచంలో చిరంజీవివి అవుతున్నావు'' అంటూ దీవించారు తాపీవారు.

ఇలా ఎందరెందరో పెద్దలు, ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం మెచ్చారు. ఆరుద్ర భుజం తట్టారు. ''పూర్తిచేసిగాని ఆగకు'' అని హెచ్చరించారు. ఈ హెచ్చరికకు కారణం వుంది. ఇప్పటిదాకా ఎందరెందరో తెలుగు సాహిత్య చరిత్రను ప్రారంభించినా కొనసాగించిన దాఖలాల్లేవు. ఆరుద్ర ఈ సంపుటాలలో పోనుపోను ఆధునిక కాలపు యువతరానికి అందని, తెలియని - ఎన్నో విషయాలను అందించారనీ, ఈ రీత్యా పోనుపోను సంపుటాలు అపారమైన విలువను సంతరించుకున్నాయనీ - పెద్దలు భావించారు, భావిస్తున్నారు.

ఆరుద్ర చాలా పట్టుదల గల వ్యక్తి. కువిమర్శకుల ధోరణికి కృంగిపోయే తత్వంగాని, పొగడ్తలకు పొంగిపోయే బలహీనతగాని లేని వ్యక్తిత్వం అతనిది. తను

వేసుకున్న ప్రణాళిక ప్రకారం - శ్రమించి రాసుకుంటూపోయాడేగాని, ప్రచురణకర్తలు ఏం చేస్తున్నారన్నదాన్ని గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. శ్రమదోపిడీని సహించలేని యీ సామ్యవాదిని - ఎలా దోచుకున్నారో, దోచుకోబడ్డాడో పదుగురు చెప్పినా పట్టించుకోలేదు. ఫలితం తొలిముద్రణ మాకే రుణభారాన్ని మిగిల్చింది. రెండవ ముద్రణ అతి నిర్లక్ష్యంగా ప్రచురణ అయి అతని మనసును బాగా కృంగదీసింది.

కవి, భావుకుడు, వ్యాపారం తెలియనివాడు, స్నేహానికి ప్రాణం పెట్టే తత్వమున్న వాడు యింత దారుణంగా కృంగిపోవడం నేను కళ్లారా చూశాను. ఈ దేశంలో సాహిత్యం బువ్వపెట్టదు. ఏదో వృత్తి వుండి పక్కన సాహిత్య వ్యాపారం చేసుకుంటే ఏమోగాని లేకుంటే బ్రతుకు భారమే మిగులుతుంది.

ఆరుద్ర పోయాక నేనో నిర్ణయానికి వచ్చాను. యువకుడు, ఉత్సాహవంతుడు అయిన మన ముఖ్యమంత్రి చంద్రబాబుగారిని ''ఈ సాహిత్య సంపుటాల సర్వహక్కులు స్వీకరించండి. వాటి విలువ సాటిలేనిది'' అని కోరాను. వారు ప్రభుత్వం తరఫున స్వీకరించి ఆ హక్కులు, ప్రచురించే బాధ్యతలను - తెలుగు అకాడమీ వారి చేతుల్లో పెట్టారు. చక్కని అవగాహన, సాహిత్యం పట్ల ఎంతో అభిమానం గల డాక్టర్ ఎ. మంజులతగారు ఈ కార్యక్రమానికి ఎంతో సంతోషంగా శ్రీకారం చుట్టి ''ఇకమీదే ఆలస్యం'' అని అన్నప్పుడు - ఆమె అభిమానాన్ని నేను కొలవలేను. పదమూడు సంపుటాలను - నాల్గు సంపుటాలుగా రూపొందించాలని నిర్ణయించాను. సంస్కరించి ప్రచురణకు తొలి సంపుటానికి నాంది పల్కాను. ఈ విషయంలో నాకు అన్నివిధాలా వెన్నుదన్నుగా డా॥ మేడిపల్లి రవికుమార్ (ఎస్.వి.యూనివర్సిటీ, తెలుగుశాఖ) నిలబడ్డాడు. ఆరుద్ర తను చేద్దామనుకొన్న మార్పులూ, చేర్పులు, తీసేయాలనో, తగ్గించాలనో అనుకున్నవి - అన్నీ అన్ని సంపుటాలలో నోట్ చేసి పెట్టారు. నేను వాటిని అనుసరించి అమల్లో పెడుతూనే, అవసరమైన చోట్ల కుదిస్తూ - తొలి సంపుటి సిద్ధం చేశాను. ఆగస్టు 31, ఆరుద్ర జన్మదినం నాటికి దీనిని వెలువరిస్తానని - బాధ్యత సంతోషంగా డాక్టర్ మంజులత స్వీకరించారు. ఇది నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. మళ్లీ ముఖచిత్రం రాసి యిచ్చారు బాపు - ఎప్పటికీ ఆరుద్ర అభిమాని ఆయన; 'నేను వేయడమేమిటి? ఆయన వేయించుకున్నారు'' అన్నారు.

ఉత్సాహంతో ప్రచురణ భారం స్వీకరించిన తెలుగు అకాడమీ డైరక్టర్ డాక్టర్ ఎ. మంజులతకు, హక్కులు స్వీకరించి నాకు మనశ్శాంతిని చేకూర్చిన ప్రియతమ చంద్రబాబుగారికీ నేను శాశ్వతంగా రుణపడి వున్నాను.

నా భావనలో ఆరుద్ర అభిరుచికి దీటైనది - యీ తెలుగు అకాడమీ వారి ప్రచురణే. ఇదే నాకు తొలి ప్రచురణేమో అనిపిస్తుంది.

30-7-2002
చెన్నయ్

కె. రామలక్ష్మి

విషయసూచిక

1.	ఆదిమయుగం	01
2.	మతాలు కామితాలు	61
3.	జైనం వైనాలు	77
4.	తెలుగు జనులు - కన్నడ కావ్యాలు	86
5.	మల్లియ రేచన	101
6.	చాళుక్యయుగం	118
7.	నన్నయ్యభట్టు	125
8.	నన్నెచోడుడు	160
9.	బద్దెన	186
10.	అమృతనాథుడూ మరికొందరూ	190
11.	పావులూరి మల్లన	196
12.	వేములవాడ భీమకవి	203
13.	సుమతి భీమన	220
14.	మల్లికార్జున పండితారాధ్యుడు	237
15.	కాకతీయ యుగం	255
16.	మంత్రి భాస్కరుడు	271
17.	భాస్కరుని కేతన	276
18.	యధావాక్కుల అన్నమయ్య	280
19.	క్షేమేంద్రుడు	287
20.	కవి భల్లటుడు	293
21.	తిక్కన సోమయాజి	298
22.	ఆంధ్ర భోజుడు	349
23.	అప్పనమంత్రి	354
24.	శివదేవయ్య	359
25.	మూలఘటిక కేతన	366
26.	కమలనాభామాత్యుడు, బయ్యన	392

27.	మంచెన	394
28.	పెద్దయామాత్యుడు	404
29.	పాల్కురికి సోమనాథుడు	411
30.	చక్రపాణి రంగనాథుడు	427
31.	కృష్ణమాచార్యులు	433
32.	మారన	448
33.	అథర్వణాచార్యుడు	459
34.	పద్మనాయక రెడ్డిరాజుల యుగం	469
35.	భాస్కర రామాయణ కవులు	484
36.	శరభాంకుడు	505
37.	శ్రీగిరి అయ్యగారు	510
38.	రావిపాటి తిప్పన్న	514
39.	చిమ్మపూడి అమరేశ్వరుడు	522
40.	ఎఱ్ఱాప్రెగ్గడ	549
41.	నాచన సోమనాథుడు	580
42.	గోనబుద్ధరాజు	601
43.	కాచభూపతి, విట్ఠలరాజు	614
44.	దోనయామాత్యుడు	621
45.	పశుపతి నాగనాథకవి	631
46.	ప్రకాశ భారతీయోగి	634
47.	కందనామాత్యుడు	636
48.	మడికి సింగన	641
49.	మడికి అనంతయ్య	657
50.	కొరవి సత్యనారన	664
51.	విన్నకోట పెద్దన	666
52.	జన్నమంత్రి, కవి రాక్షసుడు	673
53.	శ్రీనాథుడు	681
54.	నిశ్శంక కొమ్మన	757

55.	దగ్గుపల్లి దుగ్గన	768
56.	జక్కన	780
57.	గజపతుల - తొలిరాయల యుగం	795
58.	గౌరన	815
59.	వెన్నెలకంటి అన్నయ్య	830
60.	అనంతామాత్యుడు	841
61.	కొలని గణపతి దేవుడు	859
62.	అయ్యలరాజు తిప్పయ్య	866
63.	ఆంధ్రకవి రామయ్య	873
64.	పోతన	881
65.	బొప్పరాజు గంగన్న	920
66.	ఏర్చూరి సింగన్న	925
67.	వెలిగందల నారయ్య	935
68.	కాకునూరి పండితులు	940
69.	నూతనకవి సూరన	943
70.	చంద్రమౌళి, దేవరాజభట్టు	954
71.	కూచిరాజు ఎర్రన్న	959
72.	అడిదంకవులు, పూసపాటి రాజులు	971
73.	దూబగుంట నారాయణకవి	975
74.	అన్నమయ్య	985
75.	తాళ్ళపాక తిమ్మక్క	1008
76.	ప్రోలుగంటి చెన్నయమంత్రి	1023
77.	పిల్లలమర్రి పినవీరభద్రుడు	1033
78.	నందిఘంట జంట	1050
79.	భైరవ కవి	1066
80.	సంప్రదించిన గ్రంథాలు	
81.	ముఖ్యపదానుక్రమణిక	

ఆదిమ యుగం

అనగనగా ఒక ఈగ ఇల్లలుక్కొంటూ తన పేరు మరచిపోయిందట. ''పేదరాశి పెద్దమ్మా! పెద్దమ్మ కొడుకా! కొడుకు చేతి గొడ్డలీ!... నా పేరేమిటీ?'' అని ఎందరెందరినో పేరుపేరునా వరసపెట్టి అడిగిందట.

అచ్చంగా అలాగే తెలుగువాడనే తేనెటీగ తన సంగతి మరచిపోవడం జరిగింది. ఆదిలో తన పేరేమిటి? తన దేశం పేరేమిటి? తన భాషను ఏమని పిలిచేవారు? తన జాతి ఎలా వ్యవహరించేది? ఇటువంటి ప్రశ్నలకు జవాబులు ఎందరెందరినో అడిగి తెలుసుకొంటేగాని దొరకవు.

పేరు – పెరిమె

ఆంధ్ర సాహిత్యంలో మనకు లభిస్తున్న మొట్టమొదటి కావ్యం నన్నయ గారి భారతం. అది క్రీ.శ. 11-వ శతాబ్దినాటిది. అందులో మన భాష 'తెనుగు' భాష అని ఆయన పేర్కొన్నారు. అయితే నన్నయగారి కాలంనాటికే దీనికి 'ఆంధ్ర' భాష అనే పర్యాయపదం ఉన్నట్టు తెలుస్తున్నది. తమ స్నేహితుడు నారాయణభట్టు ఆంధ్ర భాషలో కూడ కవిత్వం చెప్పగలడని తాము స్వయంగా వ్రాసిన నందంపూడి శాసనంలో ఆయనే చెప్పారు.

నన్నయగారికి ఒక శతాబ్దం పై చిలుకు ప్రాచీనుడు మల్లియరేచన కవిజనాశ్రయమనే లక్షణ గ్రంథాన్ని మన భాషలో రాశాడు. అయితే అతడు 'తెనుగు' అని చెప్పాడో 'తెలుగు' అని పేర్కొన్నాడో నికరంగా చెప్పలేం. ఏ మాటనైనా ఆయన ప్రాస స్థానంలో వాడలేదు అందుచేతనే ఈ సంశయం. బహుశా 'తెనుగు' అనే ప్రయోగాన్ని చేసి ఉండవచ్చు.

వీరిద్దరికన్నా కొంత ప్రాచీనుడు ఉద్యోతనుడు అనే ప్రాకృత భాషాకవి. 'కువలయ మాల' కథలో తన కాలంలో ప్రచారంలో ఉన్న పద్దెనిమిది దేశాల వారినీ, వాళ్ళ భాషలనూ పేర్కొన్నాడు. అతడిచ్చిన జాబితాలో ఆంధ్రదేశం, ఆంధ్ర భాషా ఉన్నాయి. ఆనాడు ఆంధ్రులను గురించి ఆయన చెప్పినది నేటికీ అక్షరాలా వర్తిస్తుంది.

''పియ మహిళా సంగామే సుందరగత్తేయ భోయణే రోద్దే
అటుపుటు రటుం భణంతే ఆంధ్రేకుమారో సలోయేతి''

ఈ ప్రాకృతాన్ని శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు ఇలా తెలుగు మాటలలోకి తర్జుమా చేశారు.[1] ''అందగత్తెలన్నా, అథవా యుద్ధరంగమన్నానూ సమానంగా ప్రేమించేవాళ్ళున్నూ, అందమైన శరీరాలు గలవాళ్ళున్నూ, తిండిలో దిట్టలున్నూ అయిన ఆంధ్రులు అటూ పుటూ ('పెట్టు' కాబోలు) రటూ ('రట్టు' ఏమో) అనుకొంటూ వస్తూండగా చూచాడు.'' ఉద్యోతనుడు చెప్పిన సుగుణాలు నేటికీ మనలో ఉన్నాయి. ఈ ప్రాకృత కవికాలం క్రీ.శ. 892 ప్రాంతం.

అంతకు ముందు ఆంధ్రమనే పదాన్ని జాతి వాచకంగా, దేశపరంగా వాడుతూ వచ్చేవారు. మన దేశాన్ని మొట్టమొదట పాలించిన సాతవాహనులు తమ జాతిపేరుగాని, తమ దేశం సంగతినిగాని తాము వేయించిన ప్రాకృత శాసనాలలో ఎక్కడా చెప్పలేదు. వీళ్ళు క్రీస్తు శకానికి పూర్వమే పాలించారు. తమ రాజ్యాన్ని దక్షిణాపథం అన్నారు.

అయితే ఇటీవలి పరిశోధనలవల్ల సాతవాహనుల జన్మభూమి ఆంధ్రదేశమే అని, వారి భాషలో అత్యంత ప్రాచీనమైన తెలుగు మాటలే ఉన్నాయని రుజువైంది. పురాణాలలో పేర్కొన్న ఆంధ్రభృత్యులూ, ఆంధ్ర రాజులూ సాతవాహనులే అన్న సంగతి రూఢి అయింది.

క్రీ.శ. 234లో శివస్కందవర్మ అనే పల్లవ యువరాజు ఒక ప్రాకృత శాసనంలో మన దేశాన్ని 'అంథాపథం' అన్నాడు. దేశపరంగా ఆంధ్ర శబ్దాన్ని వాడిన వాళ్ళలో ఇతడే ప్రప్రథముడు. తరవాత తరవాత మన దేశాన్ని ఆంధ్రమండలం, ఆంధ్ర విషయం, ఆంధ్రభూతలం, ఆంధ్రదేశం అని రకరకాలుగా చాలామంది తమ శాసనాలలో పేర్కొన్నారు.

తమిళ సంగవాఙ్మయంలో చివరి సంకలనమైన 'పురనానూరు'లో 'ఆమ్ అందిరం' అనే నాయకుని ప్రసక్తి ఉంది. ఈ సంకలనం క్రీ.శ. 4వ శతాబ్దిది.

ఆంధ్ర దేశానికి త్రిలింగ దేశమనే పేరుకూడ ఉంది. ఈ మాటను మొట్టమొదట వాడినవాడు కాకతీయ యుగంలోని విద్యానాథుడు అని అతడి శ్లోకాన్ని బట్టి చెప్పుకొంటారుగాని, నిజానికి అంతకుముందే ఎప్పుడో వాడినవాడు రాజశేఖరుడనే సంస్కృత కవి. అతని 'విద్ధసాలభంజిక' అనే నాటకంలో ఒక రాజుగారు త్రిలింగాధిపతి. రాజశేఖరుడు క్రీ,శ. 880–920 మధ్యకాలంలోనివాడు. ఇతడు 'త్రిలింగ' అనే పదాన్ని రేఫయుక్తంగా 9వ శతాబ్దంలో వాడాడుగాని అంతకుముందు రేఫ లేకుండా కేవలం 'తిలింగ' అనే రూపంలో వాడుకలో వుండేది. మార్కండేయపురాణంలోనూ, వాయు పురాణంలోనూ 'తిలింగ' అనే పదమే వాడారు.

ఈ 'తిలింగ' అనే పదమూ, 'తెలుగు' అనే మాటా ఒక కుదుటిలోవే అనుకోవాలి. మన భాషకు తెలుగు భాష అనే పేరే ఎక్కువ వాడకంలో వుంది. నన్నయగారు తమ

1. గిడుగు రామమూర్తి పంతులుగారి తమ సప్తతి జన్మదినోత్సవ ప్రచురణ 'వ్యాససంగ్రహం'లో ప్రాకృత గ్రంథకర్తలూ, ప్రజాసేవానూ అనే వ్యాసంలో.

భారతంలో 'తెనుగు' అనే మాట వాడారు గనక కొందరు ఆ పదమే ప్రాచీనమంటారు. తిక్కనగారి సమకాలికుడైన కేతన తన 'ఆంధ్ర భాషా భూషణం'లో ప్రాసస్థానంలో 'తెలుగు' అనే మాటను నాలుగైదుసార్లు వాడాడు. అందుచేత 'తెలుగు' అర్వాచీనమని కొందరనుకోవచ్చు గాని 'తెలుగు' పదమే చాలా ప్రాచీనమని చెప్పాలి. ఎందుచేతనంటే తమిళ, కర్ణాటక శాసనాలలో 'తెలుంగ' అనే పదమే మొట్టమొదట కనబడుతోంది.

తమిళ వాఙ్మయంలో అత్యంత ప్రాచీనమైన 'అగత్తియం' అనే లక్షణ గ్రంథంలో ''కొంగణం కన్నడం కొల్లం తెలుంగుం'' అని సూత్రీకరించారు. కొంతమంది తమిళుల దృష్టిలో 'అగత్తియం' క్రీస్తుశకానికి కొన్ని శతాబ్దుల పూర్వం నాటిది. కాని, తమిళ పండితులలో కొంచెం సజావుగా వుండే వైయాపురిపిళ్ళెగారి అంచనా ప్రకారం క్రీ.శ. 5వ శతాబ్దిలో అగత్తియం రచన జరిగి ఉంటుంది. (కొందరు పండితులు 'అగత్తియం' కర్తృత్వం విషయంలో చర్చలు లేవదీసి, అది అర్వాచీనం కావచ్చునని వాదిస్తున్నారు. మన 'ఆంధ్ర శబ్దచింతామణి'కీ, దీనికీ ఈ విషయంలో పోలికలున్నాయి).

'ఆంధ్ర', 'తెనుగు', 'తెలుగు' అనే మూడు పదాలలో ఏది ఎంత ప్రాచీనమో తెలుసుకొన్నాము. భాషాపరంగా వీటిని ముందుగా వాడినవాళ్ళ పేర్లూ, తారీఖులూ తెలుసుకొన్నాము. ఆ తారీఖులు మళ్ళీ ఒక్కసారి జ్ఞాపకం చేసుకొని ముందుకుపోదాం.

'తెలుంగు'	అగత్తియం	క్రీ.శ. 5-వ శతాబ్ది
'ఆంధ్ర'	ఉద్యోతనుడు	క్రీ.శ. 9-వ శతాబ్ది
'తెనుగు'	నన్నయ	క్రీ.శ. 11-వ శతాబ్ది

క్రీ.శ. 5-వ శతాబ్దినాటికే ఇతరులు మన భాషను 'తెలుంగు' భాష అని పిలవనైతే పిలిచారుగాని, ఆ భాష ఎలా ఉండేదో, వాక్యరచన ఎలా సాగేదో, పాటలూ, పద్యాలూ ఉండేవో లేవో మనకు తెలియదు. ఎందుచేతనంటే, మన లిపిలో, మన మాటలతో రచించిన మొట్టమొదటి తెలుగు శాసనం మనకు క్రీ.శ. 575 నాటిదే లభించింది. అయినా, మనం దానితో తృప్తిపడి ఊరుకోకూడదు. మన భాష ఎంత ప్రాచీనమో తెలుసుకోవాలి. దాని స్వభావాన్ని సాధ్యమైనంతవరకూ ఆకళించుకోవాలి. ఆనాటి తెలుగు సారస్వతం మనకు ఎలాగూ దొరకదు కాబట్టి కనీసం భాషాస్వరూపాన్నయినా తెలుసుకొంటే మంచిది.

తొలి తెలుగుమాట

మన అమరావతీస్తూపం చాలా ప్రాచీనమైనది. దానిని మూడు అంచెలుగా కట్టారు. క్రీస్తుపూర్వం 200 మొదలుకొని క్రీ.శ. 200 లోపున ఈ నిర్మాణం సాగింది. ఇక్కడ దొరికిన ఒక రాతిపలకమీద 'నాగబు' అనే మాట కనబడింది.[2] ఇదే మనకు లభించిన మొదటి

2. ఇది తెలుగు పదమని మొదట గుర్తించినవారు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. చూ॥ 'భారతి' జూన్ 1928 (ఈ పదం అసలు ఆంధ్రలిపికి మూలంగా భావించి దాని స్వరూపాన్ని ఈ గ్రంథానికి రంగపీఠికగా తీసుకొని అట్టమీద అగ్రశీర్షికగా అగ్రపీఠమిచ్చాను).

తెలుగుమాట. ఈ 'నాగబు' అన్న పదమే నాగమ్బు, నాగంబు, నాగమ్ము, నాగము, నాగం అని మార్పులు చెందింది. ఇవాళ వాడుక భాషలో బిందుపూర్వక బుకారంతో ఏమాటనూ మనం ప్రథమా విభక్తి ఏకవచనంలో వాడము. 'ము'కారం వాడవలసిన చోట్లలో సైతం సున్ననే ఉచ్చరిస్తాం. అందుచేత 'నాగంబు' అనేది ఏదో కొత్తగా వినబడవచ్చుగాని ఈ కోవలో ఉన్న అసలు సిసలు ద్రావిడభాషా పదాన్ని మనం నేటికీ నిత్యం వాడుతూనే ఉన్నాం. అది 'చెంబు.' అందుచేత నాటినుంచి నేటిదాకా ఈ 'బు' ప్రత్యయం తెలుగు భాషలో సజీవంగానే ఉంది.

మన దేశాన్ని పాలించిన ప్రాచీన రాజులు వేయించిన ప్రాకృత సంస్కృత భాషాశాసనాలలో పేర్కొన్న గ్రామాల పేర్లూ, వ్యక్తుల పేర్లూ తీసుకొంటే ఎన్నో తెలుగు పదాలు మనకు తెలుస్తాయి. మొదటి తెలుగుభాషా శాసనానికి పూర్వం మన భాషలోని పదాలు ఎలా ఉండేవో తెలుసుకోవడానికి ఇవి చాలా తోడ్పడతాయి. ఇలా సేకరించిన పదాల పట్టిక చూడండి.

కొన్ని ప్రాచీన శాసనాలలోని తెలుగు పదాలు

పదము	శాసనము	కాలము
అన్తుక్కూర	అత్తివర్మ గోరంట్ల తామ్ర శాసనం	క్రీ.శ. 350
అఋతొఱె	శాలంకాయన పెదనందివర్మ పెదవేగి శాసనం	క్రీ.శ. 390
ఆచంట	అనంతవర్మ శృంగవరపు కోట దానశాసనం	క్రీ.శ. 450; 550
ఇర్బులి	రెండవ పులకేసి కొప్పరపు శాసనం	క్రీ.శ. 631
ఉరవపల్లియే	విష్ణుగోపుని ఉరవపల్లి తామ్ర శాసనం	క్రీ.శ. 342-366
ఏఱూర	విజయదేవవర్మ ఏలూరు తామ్రశాసనం	క్రీ.శ. 5-వ శతాబ్ది
ఓమ్గోడు (ఒన్గోడు)	రెండవ విజయస్కందవర్మ ఒమ్గోడు దాన శాసనం	క్రీ.శ. 385
కంగూర	దామోదరవర్మ మట్టిపాడు తామ్రశాసనం	క్రీ.శ. 295-315
కంఋూరు	మూడవ మాధవవర్మ పొలమూరు శాసనం	క్రీ.శ. 635
కడా కుదురు	రెండవ సింహవర్మ ఒమ్గోడు శాసనం	క్రీ.శ. 363-385
కణ్డుకూర	విష్ణుగోపుని ఉరవపల్లి తామ్రశాసనం	క్రీ.శ. 342-366
కణ్ఢి (కణ్డలి)	పృథ్వీమూలుని గోదావరి తామ్రశాసనం	క్రీ.శ. 538
కమ్బురాఞ్చారువే	శాలంకాయన నందివర్మ పెదవేగి శాసనం	క్రీ.శ. 475
క(కు)రుపూర	సింహవర్మ శాసనం	క్రీ.శ. 310
కళిక - కిణ్డెప్ప	అనంతవర్మ శృంగవరపు కోట దానశాసనం	క్రీ.శ. 450; 550
కుడావాడ	మాధవవర్మ ఈపూరు (1) తామ్రశాసనం	క్రీ.శ. 495
కుడూర	బర్జెస్ -'బుద్దిస్ట్ స్తూపాస్ ఆఫ్ అమరావతి & జగ్గయ్యపేట' నెం. 50	
కూడూర	జయవర్మ కొండముడి తామ్రశాసనం	క్రీ.శ. 235
కుణ్డూరు	మాధవవర్మ పొలమూరు శాసనం	క్రీ.శ. 635

పదము	శాసనము	కాలము
కుణ్ణూరు (కుణ్టూరు)		
కురువక గ్రామ		
కురువాడా	నందివర్మ కంతేరు తామ్ర శాసనం	క్రీ.శ. 4
కెవురురే	బర్జెస్ - 'బుద్ధిస్ట్ స్తూపాస్ ఆఫ్ అమరావతి & జగ్గయ్యపేట' నెం. 19	
కొంపెర	స్కందవర్మ కానుకొల్లు తామ్రశాసనం	
కొట్టిశర్మ	అత్తివర్మ గోరంట్ల శాసనం	క్రీ.శ. 4-వ శతాబ్ది
కోడికిమ్ (కోడంకి)		
కోణ్డముడి	జయవర్మ కొండముడి తామ్రశాసనం	క్రీ.శ. 270-285
కొణ్డవేఙుపూర్	రెండవ పులకేశి కొప్పరపు తామ్రశాసనం	క్రీ.శ. 631
కోణ్డమంచి	పృథ్వీమహారాజు తాణ్డివాడ దానశాసనం	క్రీ.శ. 7వ శతాబ్ది
కోడ్డమురువుదు		
కోహితూరె	చంద్రవర్మ కోమర్తి తామ్రశాసనం	క్రీ.శ. 380-395
ఖడవలి (కొడవలి)	చందసతి కొడవలి శాసనం	క్రీ.శ. 3వ శతాబ్ది
గోలశర్మ	విజయస్కందవర్మ ఒంగోడు శాసనం	క్రీ.శ. 4వ శతాబ్ది
చిన్తపురి (చిన్నపురి)	విజయస్కందవర్మ కంతేరు తామ్రశాసనం	క్రీ.శ. 4వ శతాబ్ది
చీకూర - చూయిపాక	పృథ్వీమూలుని గోదావరి తామ్రశాసనం	క్రీ.శ. 538
చెఞ్చెరువ గ్రామే	శాలంకాయన నందివర్మ పెదవేగి శాసనం	క్రీ.శ. 475
చెన్దలూరు	రెండవ కుమారవిష్ణుని చెందలూరు తామ్రశాసనం	క్రీ.శ. 5వ శతాబ్ది
ఙడతూరే	ఇక్ష్వాకుల శాసనం	3వ శతాబ్ది
తాణ్డివాడ	పృథ్వీమహారాజు తాణ్డివాడ దానశాసనం	క్రీ.శ.7వ శతాబ్ది
తానుపాక - తాన్ఱి కొన్ఱ	అత్తివర్మ గోరంట్ల తామ్ర శాసనం	4వ శతాబ్ది
తెల్లవల్లి విషయే - తొణ్టాపర	అనంతవర్మ సిరిపుర తామ్ర శాసనం	క్రీ.శ. 528-29
దాలూరే	చారుదేవి బ్రిటీష్ మ్యూజియం తామ్రశాసనం	క్రీ.శ. 275-285
దేయవాటి	ఉమావర్మ ధవళపేట దానశాసనం	క్రీ.శ.400-430
దొడ్డిస్వామి	విష్ణుగోపుని నెడుంగరాయ దానశాసనం	5వ శతాబ్ది
నడిప్పి (నడిపి)	నెడుంగరాయ తామ్ర పట్టిక	క్రీ.శ. 448
నఱాచడు - నాగోళామి		
నేత్రపాటి విషయ	విక్రమేంద్రవర్మ చిక్కుళ్ళ దానశాసనం	క్రీ.శ. 537
పగుహూరు	పల్లవీ విష్ణుగోపవర్మ చూర దానశాసనం	క్రీ.శ. 340
పఱికివిషయే	ఇంద్రభట్టారకవర్మ రామతీర్థ శాసనం	క్రీ.శ. 530
పాంతూర	జయవర్మ కొండముడి తామ్రశాసనం	క్రీ.శ. 235
సాగుణారవిషయే		
పికిరే	సింహవర్మ పికిరదాన శాసనం	క్రీ.శ. 364
పిడిహ	కానుకొల్లు ప్రాకృత శాసనం	
పురణిసమ	ఇంద్రభట్టారకవర్మ రామతీర్థ తామ్రశాసనం	క్రీ.శ. 530
పులిమ్బూరు (పొలమూరు)	మాధవవర్మ పొలమూరు తామ్రశాసనం	క్రీ.శ. 635

పదము	శాసనము	కాలము
పులోక (పులక)	శరభవర దాన శాసనం	క్రీ.శ. 5, 6వ
పెణుకపఱ్ఱు	రెండవ సింహవర్మ ఒమ్‌గోడు శాసనం	శతాబ్దులు
పెరువాటక	ఇంద్రభట్టారకవర్మ రామతీర్థ తామ్రశాసనం	క్రీ.శ. 530
పొలంబోర	మూడవ మాధవవర్మ పులమూరు శాసనం	క్రీ.శ. 635
ప్రాలూర	శాలంకాయన నందివర్మ పెదవేగి శాసనం	క్రీ.శ. 475
మంచణ్ణ	మాధవవర్మ ఈపూరు తామ్ర శాసనం	క్రీ.శ. 495
మందర	బర్జెస్ - 'బుద్దిస్ట్ స్తూపాస్ ఆఫ్ అమరావతి & జగ్గయ్యపేట నెం. 22	
మయిన్దవాటకి	మాధవవర్మ పొలమూరు తామ్ర శాసనం	5వ శతాబ్ది
మహాకామ్‌దురూరే	ఇక్ష్వాకుల శాసనం	క్రీ.శ. 3వ శతాబ్ది
మహాతగవర	కొండముడి జయవర్మ శాసనం	క్రీ.శ. 270-285
మహాతలవర	వీరపురుషదత్తుని నాగార్జున కొండశాసనం	క్రీ.శ. 239
మాఙ్గడూ(దూ) గ్గ్రామే	సింహవర్మ మంగదూరు దానశాసనం	క్రీ.శ. 364
ముదాటి తటాక	పల్లవ విష్ణుగోపవర్మ చూరదాన శాసనం	క్రీ.శ. 340
ముణ్ణార మురొకకి	మాధవవర్మ ఈపూరు II తామ్ర శాసనం	క్రీ.శ. 495
మూగమూరు	పృథ్వీమూలుని గోదావరి తామ్ర శాసనం	క్రీ.శ. 538
మూయెరకూటువ	పల్లవ విష్ణు గోపవర్మ చూరదాన శాసనం	క్రీ.శ. 340
మేఱితాప	పల్లవ విష్ణు గోపవర్మ చూరదాన శాసనం	5వ శతాబ్ది
రాకలువ	శక్తివర్మ రాజోలు తామ్ర శాసనం	క్రీ.శ. 537
రావిరేవ	విక్రమేంద్రవర్మ చిక్కుళ్ళ తామ్ర శాసనం	క్రీ.శ. 537
రేగొన్టం	విక్రమేంద్రవర్మ చిక్కుళ్ళ తామ్ర శాసనం	క్రీ.శ. 537
ఱగుబమ్ఱు	పల్లవ విష్ణు గోపవర్మ చూరదాన శాసనం	క్రీ.శ. 340
ఱెందుఘూరవాసక	విక్రమేంద్రవర్మ చిక్కుళ్ళ తామ్ర శాసనం	క్రీ.శ. 537
విదేనూర పల్లికా	విజయనందివర్మ కొల్లేరు దాన శాసనం	క్రీ.శ. 4వ శతాబ్ది
విరపర	యువరాజ శివస్కందవర్మ మైదవోలు శాసనం	4వ శతాబ్ది
విర్పఱు (పథాత్)	రెండవ పులకేశి కొప్పవరపు తామ్ర శాసనం	క్రీ.శ. 631
విలెమ్బలి	మాధవవర్మ ఈపూరు I తామ్ర శాసనం	క్రీ.శ. 420-455
విళవట్టి	సింహవర్మ విళవట్టి దాన శాసనం	క్రీ.శ. 446
వేకుమారి	విజయస్కందవర్మ కంతేరు తామ్ర శాసనం	క్రీ.శ. 4వ శతాబ్ది
వేపురకే (వేపూరు)	శ్రీ పులోమావి మాక్యదోని శాసనం	క్రీ.శ. 200
సకునక	అనంత శక్తివర్మ సకునక దాన శాసనం	
సారపల్లి	ప్రభంజనవర్మ చికాకోల్ తామ్ర శాసనం	క్రీ.శ. 450-560
హలమ్బుర	బర్జెస్ - 'బుద్దిస్ట్ స్తూపాస్ ఆఫ్	
హిరలూరే	అమరావతి & జగ్గయ్య పేట' నెం. 43	

ఈ పట్టికవల్ల తెలిసే విషయాలను కొన్నింటిని బేరీజు వేద్దాం. ఆ రోజుల్లో గ్రామాల పేర్ల చివర ఊరు, కుదురు, కొన్ఱ, కోడు, ఱెఱువు, తొఱె, పర, పఱ్ఱు, పాక, మంచి, ముడి, మూడి, రేవు, వట్టి అనే తెలుగు మాటలు ఉండేవి. ఇప్పటికీ తెలుగుదేశంలో కొన్ని గ్రామాల పేర్ల చివర ఈ మాటలే మనకు కనబడతాయి. ఈ శాసనాలలోని వేప, రావి, రేగు, తాడి మొదలైన మాటలనుబట్టి నాటికీ నేటికీ కొన్ని చెట్లకు ఒకే పేరు

వాడుతున్నామని తెలుస్తోంది. ఆ రోజుల్లోనూ రేవులుండేవి. రేవును తొఱె అనే పర్యాయపదంతో పిలిచేవారు. 'బియ్యం' అనే మాటను నేడు మనం వాడుతాముగాని ప్రాచీనులు 'ప్రాలు' అని వాడేవారు. నేడు 'తలంబ్రాలు'లో మాత్రమే మనకు ఈ 'ప్రాలు' అనే రూపం కనబడుతున్నది. నేడు మనం పుస్తకాలలో వాడుతున్న కురు, పెరు, చెన్ను మొదలైన విశేషణాల వాడకం నాడే మొదలుపెట్టారు. ఆనాడు ప్రారంభించిన చిన్న, తెల్ల మొదలైన విశేషణాలు నేటికీ నిలిచి ఉన్నాయి.

ఇవాళ మనం సంస్కృత పదాలనూ, తెలుగు మాటలనూ కలిపి సమాసాలు గ్రంథస్థం చేయడానికి కొన్ని నియమాలు పెట్టుకొని తెలుగు మాటలు సమాసం ముందు విశేషణాలుగానే వాడుతున్నాం గాని ఆనాడు మన పూర్వులు ఇలాంటి బెడదలు పెట్టుకొన్నట్టు లేదు. 'నేత్రపాటి విషయం', 'మహాకొందూరు', 'మహాతలవర' మొదలైన మిశ్ర సమాసాలు యథేచ్ఛగా చేసేవారు.

ఒక్క శాసనాలవల్లనే కాక ప్రాచీన ప్రాకృత గ్రంథాల మూలంగా కూడ మనకు కొన్ని తెలుగు పదాల సంగతి తెలుస్తుంది. హాలుడు అనే సాతవాహన రాజు తన కాలంలో ప్రచారంలో ఉండిన కవిత్వాన్ని సంకలనం చేశాడు. అందులో అత్త, పిల్ల, మోడి, పాడి, పొట్ట, కరణి మొదలైన తెలుగు మాటలున్నాయి. ఇవి తెలుగు భాషలోనుంచే ప్రాకృతంలోకి వెళ్ళాయని చెప్పడానికి వ్యాఖ్యాతల వివరణలూ, హేమచంద్రుడి 'దేశినామాల' అనే నిఘంటువులోని అర్థాలూ ఆధారాలు. ప్రాకృతంలోకి వెళ్ళిన తెలుగు మాటలను గురించి తిరుమల రామచంద్రగారు 1948 'భారతి' పత్రికలో వ్యాసాలు వ్రాశారు. దివాకర్ల వెంకటావధానిగారు తమ 'ప్రాఙ్నన్నయ యుగము' అనే పుస్తకంలోనూ విపులంగా చర్చించారు. ఈ మాటల పట్టికను ఈ క్రింద చూపెడుతున్నాను.

గాథా సప్తశతిలోని తెలుగు మాటలు

మాట		వాడిన కవిపేరు	గాథ
అత్త		కుమారిలుడు	1–8
అత్త		చామీకరుడు	6–69
అత్త		మాధవుడు	5–97
అద్దాయే	(అద్దం)	రాయవగ్గుడు	3–4
అలాహి	(అల్ల–ఒల్లను)	శాలివాహనుడు	2–27
అవ్వో	(అవ్వ!-విషాదం)	శాలివాహనుడు	5–75
అవ్వో	(అవ్వ!-ఆశ్చర్యం)	సరళుడు	3–73
అవ్వో	(అవ్వ!-ఇబ్బంది)	సీహుడు	4–6
ఓ	(సంబోధన)	ఉల్లోలుడు	5–37
ఓ	(సంబోధన)	మహాయేవుడు	2–5
కరణి	(తీరున)	అహాయుడు	3–100
కిలించియ	(క్రించు)	మయిరందుడు	1–80

మాట		వాడిన కవిపేరు	గాథ
కుసుంభ	(కుసుమ పువ్వు)	వలాయిచ్చుడు	2–45
కై	(విభక్తి)	మానుడు	5–32
కై	(విభక్తి)	హరియాలుడు	1–30
చటులం	(చట్టున)	ససిరాయుడు	2–62
చోజ్జం	(చోద్యం-విడ్డూరం)	భోజయుడు	5–6
తాళూర	(తకర)	అవటంకుడు	1–37
తీరయే	(తీరదు)	పావచ్చీలుడు	2–95
తుప్ప	(నెయ్యి-త్రువ్వు)	అలక్కుడు	3–88
పలాల	(పుల్లి గడ్డి)	కలసీహుడు	2–9
పాడి	(పడ్డ)	ముహరాయుడు	1–65
పాణవుడి	(పొలసు)	హాలుడు	3–27
పిలూఅ	(పిల్ల)	మాణుడు	2–2
పేచిరి	(పేచ్చారితనం)		
నాచనసోముడు వాడాడు –			
''మచ్చరపు వాసుదేవుడు పేచారితనంబు''		హాలుడు	4–71
పోట్టం	(పొట్ట)	అలక్కుడు	3–85
ఫలహి	(ప్రత్తి)	కహిలుడు	2–65
ఫలహి	(ప్రత్తి)	జణ్ణంద సామడు	4–60
ఫలహి	(ప్రత్తి)	వాలుడు	4–59
బోండి	(పంది)	విగ్గహుడు	5–2
బోల	(వేళ్ళ)	అరికేసరి	3–20
బోల	(వేళ్ళు)	నిరువణుడు	3–32
బోల	(వేళ్ళు)	వాహనరాయుడు	3–10
మోడి	(మోడి-బింకం)	శాలివాహనుడు	5–65
రుంప	(రంపం)	హాలుడు	2–20
వాలుంకి	(ఒల్లెంక-వాలుగ)	అలయుడు (అనీకుడు?)	1–10
సావులి	(శాలువ)	ణీలుడు	3–69

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు 1931లోనే పాళీభాషకూ, కొన్ని తెలుగు మాటలకూ ఉన్న పోలికలను గురించి ఆ సంవత్సరపు మార్చినెల భారతిలో ఒక వ్యాసం వ్రాశారు. బొంది, పస్తాయించు, ఓర, కూల్చు, ఒడ్డు అనే అయిదు పదాలను చూపెట్టారు. ఇవి బహుశా మనకు పాళీభాషలోనుంచే వచ్చాయన్నారు. కాని, వీటిలో 'బొంది' అనే పదం తెలుగునుంచే పాళీలోకి వెళ్ళిందని చెప్పవచ్చు.

> ''రూవముహతణుసు బోందీ భూసియడొావయేసు బొంగిల్లో,
> భల్లూ రిచ్ఛే భగ్గం లిత్తే భంభీయ అసఈయే''.
>
> (దేశినామమాల 6–99)

''బోందీ రూపం, ముఖం, శరీరంచేతి త్ర్యర్థా, బోందం ముఖ మిత్యన్యే' అని వివరణ. 'బొంది' శరీరమైనా నేటికి ''నీ బొంద'' అనే తెలుగు తిట్టులో 'ముఖం' అనే అర్థం నిలబడనే నిలబడింది. లక్ష్మీకాంతంగారు చూపిన మిగతా పదాలు ప్రాకృతంలోనుంచే తెలుగులోకి వచ్చాయనుకోవచ్చు.

ఇచ్చి పుచ్చుకోళ్ళు

మన భాషకు ప్రాకృత, సంస్కృత భాషలతో సంబంధం శతాబ్దాల తరబడిగా ఉంది గనుక ఆ భాషలలో నుంచి వేలకువేల పదాలు మనకు సంక్రమించడంలో ఆశ్చర్యం లేదు. రెండుమూడు వందల సంవత్సరాలు మాత్రమే మనమీద అధికారం చలాయించిన ఉరుదూ, ఇంగ్లీషు భాషలలోంచి వందలాది మాటలు మన నిత్య వ్యవహారంలోనూ, తద్వారా సాహిత్యంలోనూ చొరబడడం మన అనుభవంలోని విషయమే. ఇంకొక భాషలోంచి మాటలను ఎరువు తెచ్చుకొని మన సొంతం చేసుకొన్నంత మాత్రాన మన భాష ఆ భాషకు పుత్రిక అనలేము. తొలిరోజుల్లో మనం ఎన్నో పదాలను సంస్కృత, ప్రాకృతాల నుంచి బదులు పుచ్చుకున్నట్లే మనమూ అన్నీ కాకపోయినా కొన్నయినా ఎరువిచ్చాము.

ఈ విధంగా మనం ఎరువిచ్చిన మాటలు సైతం అసలు సంస్కృతంలోనివేనని పండితులు బుకాయిస్తారు. ఈ భేషజాన్ని కుమారిలభట్టు ఏనాడో బయటపెట్టాడు. వైదిక భాషలోనికి సంక్రమించిన మ్లేచ్ఛ భాషా పదాలకు అర్థనిర్ణయం చేసేటప్పుడు సంస్కృత వైయాకరణులు ఆ మ్లేచ్ఛ పదాలకు సంస్కృత వ్యుత్పత్తులు కల్పించి వాటి అర్థాన్ని ఎలా సమర్థించారో చూపెట్టడానికి ద్రావిడ భాషాశబ్దాలైన శోర్, పాంబు, వయిర్, అంతర్ మొదలైనవి కుమారిలభట్టు ఉదాహరణగా చూపెట్టాడు. ఈయన క్రీ.శ. 7-వ శతాబ్ది వాడని కొందరంటారుగాని వాస్తవానికి అంతకన్నా ప్రాచీనుడనీ, క్రీ.శ. 500 ప్రాంతాన గాని, ఆ మాటకు వస్తే అంతకు పూర్వమే గాని జీవించి వుంటాడనీ తెలుగుభాషా సమితి వారు వారి 'విజ్ఞానసర్వస్వం' 3-వ సంపుటిలో (పుట 758) నిరూపించారు. అంటే క్రీ.శ. 5-వ శతాబ్దినాటికే భాషాశాస్త్రరీత్యా ద్రావిడ భాషలకు ఒక స్థానం ఏర్పడింది.

సంస్కృతము-తెలుగు

ఆధునిక భాషాశాస్త్రాలు పరిణతి చెందడానికి పూర్వం ''తల్లి సంస్కృతంబె ఎల్ల భాషలకును'' అని మనవాళ్ళు విశ్వసించేవారు. తెలుగు భాష కూడా గీర్వాణంలోనుంచే జనించిందన్నారు. మన తాతతండ్రులు దానిని ఒప్పుకున్నారు. ఆధునిక యుగంలో దూరాలు తగ్గిపోయాయి. వివిధ భాషలవాళ్ళూ చేరువవుతున్నారు. శాస్త్రీయ పద్ధతులలో పరిశోధనలు సాగుతున్నాయి. వీటిని ఆధారం చేసుకొని ప్రపంచ భాషలలో వివిధ కుటుంబాలు ఉన్నాయనీ, అందులోని ద్రావిడ భాషా కుటుంబంలో మన తెలుగు భాష చేరుతుందని శాస్త్రజ్ఞులు చెప్పుతున్నారు.

అయినా కొందరు ఇంకా సంస్కృతంలోనుంచే తెలుగు పుట్టిందని భావిస్తున్నారు. ఇతరులను అదే నమ్మమనికూడ చెప్పుతున్నారు. డాక్టరు చిలుకూరి నారాయణరావు గారు తెలుగు సంస్కృత, ప్రాకృతజన్యమని నిరూపించడానికి విశ్వప్రయత్నాలు చేసి ఎంతో తాపత్రయపడ్డారుగాని ఆచార్య గంటి జోగి సోమయాజిగారూ, ఆచార్య కోరాడ రామకృష్ణయ్యగారూ, వజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రిగారూ మొదలైనవారు దీనిని పూర్వపక్షం చేశారు.

సయానా స్వతంత్రభాష

అందువల్ల తెలుగు కూడా ఒక స్వతంత్ర భాషేనని మనం సగర్వంగా చెప్పుకోవచ్చు. ఇది ద్రావిడ భాషా కుటుంబంలో ఒక ముఖ్యమైన భాష. తమిళ, కర్ణాటక, మలయాళాలు మన తోబుట్టువులు.

ప్రస్తుతం తేలిన లెక్కల ప్రకారం ద్రావిడ భాషా కుటుంబములో మొత్తం ఇరవై యొక్క భాషలున్నాయి. వాయవ్య దిశనుంచి మూలద్రావిడం ప్రస్థానం చేసి వివిధ కాలాలలో విడిపోతూ వచ్చిందని శాస్త్రజ్ఞులు చెప్పారు. ఏయే కాలాల్లో, ఏయే దిక్కుల్లో పయనిస్తూ ఏయే భాషలుగా మూలద్రావిడం విడిపోయినదీ సోవియట్ యూనియన్‌లోని ద్రావిడ భాషా శాస్త్రజ్ఞుడు యం.యస్. ఆంద్రొనోవ్ ఒక భౌగోళిక పటంలో చూపెట్టాడు.[3] (ప్రక్క పుటలో ఈ బొమ్మ వుంది). ఈ ఇరవై యొక్క భాషలను మూడు ఉప భాషా కుటుంబాలుగా విభజించారు.


ఉత్తర ద్రావిడం :	1. బ్రాహుయీ	2. మాల్తో	3. కూరూఖ్
మధ్య ద్రావిడం :	1. గోండి	2. కొండ	3. కూయి
	4. మండ	5. పర్జి	6. గదబ
	7. కోలామీ	8. పెంగొ	9. నాయకీ
	10. కువి	11. తెలుగు	
దక్షిణ ద్రావిడం :	1. తుళు	2. కన్నడం	3. కొడగు
	4. తోద	5. కోత	6. మలయాళం
	7. తమిళం		

మధ్య ద్రావిడంలో తెలుగుతో కలుపుకొని ఇప్పుడు పదకొండు భాషలున్నాయి. రష్యను శాస్త్రజ్ఞుని పటంవల్ల క్రీ.పూ. 2000 ప్రాంతాలలో మధ్య ద్రావిడ భాష వివిధ శాఖలుగ చీలడం ప్రారంభమైంది. గోండి, కొండ ముందు విడిపోయాయి. మరో అయిదువందల ఏళ్ళకు పర్జి, గదబ, నాయకి, కోలామీ భాషలు వేరుపడ్డాయి.

3. The Brahvi Language - M.S. Andronov, "Nauka' Publishing House Central Dept. of Oriental Literature, Moscow 1980.

క్రీ.పూ. 1000 నాటికి తెలుగు మూల ద్రావిడం నుంచి విడిపోయి ప్రత్యేకతను సంతరించుకొంది. అయినా ఉపభాషా కుటుంబాలలోని చుట్టాలతో పోలికలు లేకపోలేదు.

ఈ భాషలన్నీ సంస్కృతంతో సంపర్కం లేని కాలంలో కూడ వ్యవహారంలో వున్నవే. మన తెలుగు భాషను మొట్టమొదట మాట్లాడిన జనులు ఆర్యులంత నాగరికత కలవాళ్ళు కాకపోతే కాకపోవచ్చునుగాని వాళ్ళ బ్రతుకు వాళ్ళు చల్లగా బ్రతికినవాళ్ళే.



ఆర్యులు ఈ ప్రాంతాలకు రాకముందే ఈ గడ్డపై జీవించినవాళ్ళ చరిత్ర ఏమిటి? వాళ్ళ ఆచార వ్యవహారాలేమిటి? ఆటపాటలేమిటి? అనే ప్రశ్నలు వేస్తే వాటికి చాలా మట్టుకు ఊహాగానాల వల్లగాక వివిధ ఆధునిక శాస్త్రాల సాక్ష్యంతో సమాధానాలు చెప్పవచ్చు. ఆంత్రోపాలజీ, ఆర్కియాలజీ మొదలైనవి ఇందుకు సాయపడతాయి.

నాగభూమి-నాగులు

ఆర్యులు రాకముందు మన తెలుగుగడ్డపై నాగజాతివాళ్ళు నివసించే వాళ్ళని విశ్వసనీయంగా చెప్పుకోవచ్చు. అమరావతి శిల్పాలలో శిల్పులు పాము పడగలున్న మానవులను చిత్రించారు. వాళ్ళు స్థానికులు: నాగులు అని చెప్పడమే ఆ శిల్పాల ఉద్దేశంగా కనబడుతూంది. ప్రాచీన బౌద్ధగాథలలో ఆంధ్రదేశాన్ని నాగభూమిగా వర్ణించారు. ప్రపంచ కథానికలకు ఆది బ్రహ్మ అనదగ్గ గుణాఢ్యుడు ఆంధ్రుడే. ఇతడు క్రీ.పూ. 200 మొదలు 150 సంవత్సర ప్రాంతాలలో వర్ధిల్లాడని పురాతత్వవేత్తలు నిర్ధారణ చేశారు. ఇతని తల్లి బ్రాహ్మణకన్య; తండ్రి నాగప్రభువు. గుణాఢ్యుడు తండ్రివంక చుట్టాల 'పైశాచి' భాషను నేర్చుకొని అందులో కథలు వ్రాశాడు కాబోలు. సాతవాహనుల తర్వాత ఒకవంక ఇక్ష్వాకులు తెలుగుదేశాన్ని పాలిస్తూ వుంటే, మరొకవంక పాలించిన రాజులలో పల్లవులు ముఖ్యులు. ఈ రాజవంశానికి మాతృమూర్తి నాగుల ఇంటి ఆడబడుచు. పల్లవ రాజ్య స్థాపకుడైన వీరకూర్చ మహారాజుకు నాగకన్యను వివాహం చేసుకోవడం వల్లనే రాజ్యం లభించింది. పల్లవుల జన్మస్థానం మన పలనాడు.

పై విషయాలవల్ల ప్రాచీన ఆంధ్రదేశంలో నాగులు, నాగరాజులు వుండేవారని తెలుస్తున్నది. ఈ నాగరాజులెవరు? వీళ్ళకు దక్షిణాపథంలో అధికారం ఎలా వచ్చింది? అనే ప్రశ్నలకు డాక్టర్ నేలటూరి వెంకటరమణయ్య గారు సమాధానం చెప్పారు. నాగరాజులు ఆంధ్రదేశానికి కొత్తగా వచ్చినవాళ్ళు కారు. చిరకాలం నుంచి ఆంధ్రదేశంలోనే నివసిస్తూ, ఆంధ్ర రాజకుటుంబంతో సంబంధ బాంధవ్యాలు నెరపుకొంటూ వచ్చిన సామంతరాజులే అని తమ 'చరిత్ర రచన'లో వ్రాశారు.

కోదులు - గోండులు

ఈ నాగులు వాడిన భాష సంస్కృతం కన్నా విరుద్ధమైనదీ, మన తెలుగో, లేక దానికి దగ్గరలో ఉండే ఇతర భాషో అని చెప్పడానికి ఏమైనా ఆధారాలున్నాయా? ఈ ప్రశ్నకు సమాధానం కొంత పరిశోధనవల్ల తెలుస్తుంది. నేడు 'కోదు' భాష మాట్లాడే ఆదిమవాసులు ప్రాచీన నాగవంశాలవాళ్ళ వారసులు కావచ్చును. ఈ కోయలలో చాలా తెగలున్నాయి. అందులో నాగవంశం ఒకటి. మరావి, పోతారి, కరంగ, నురెతి, ధుర్వా అనే పేర్లుగల అయిదు కులాలవాళ్ళు ఈ నాగవంశానికి చెందినవాళ్ళే. కోయలు నాగుపామును కూడా ఆరాధిస్తారు. 1937 ఆగస్టు భారతిలో తేకుమళ్ళ రామచంద్రరావుగారు కోయల గురించి విపులమైన వ్యాసం వ్రాశారు. వాళ్ళ ఆచార వ్యవహారాలన్నీ తెలుగువాళ్ళవే అని సవిస్తరంగా నిరూపించారు.

కోదులకు భాషా విషయంగా దగ్గర చుట్టాలైన గోండులు కూడ ప్రాచీన నాగుల కోవలోవాళ్ళనే చెప్పాలి. ఈ గోండుల చరిత్ర చూస్తే తెలుగువాళ్ళు వీళ్ళ వారసులని తెలుస్తుంది! గోండులు తమ ప్రాచీన ఉత్పత్తి కథను చెప్పుకొంటూ టేకం, మార్కం, పూసం, తెలింగం అనే నలుగురు దేవతలను పేర్కొంటారు. ఇందులో తెలింగం దేవతే ప్రాచీన తెలుగు జాతి మూలపురుషుడని ఊహించవచ్చు.

గోండుల వంశోత్పత్తి కథను ఆర్.వి. రస్సెల్‌గారు 'మధ్యపరగణాలలోని జాతులు-కులాలు' అనే తమ గ్రంథం 3-వ సంపుటిలో విపులంగా వ్రాశారు. వారు వివరించిన కథకూ, రామచంద్రరావుగారు సేకరించిన కోదుల కథకూ చిన్న చిన్న భేదాలున్నా, నలుగురు దేవతల విషయంలో ఇద్దరూ ఒక్కలాగే చెప్పారు. ఈ ఉత్పత్తి కథను పరిశీలిస్తే గోండుల ప్రాచీనత స్పష్టమవుతుంది.

> ''ఆదిని ధవళగిరి దగ్గర కోయదొరలు పదహారువందల కోట్లమంది నివసిస్తూ ఉండేవారు. వాళ్ళు అశుభ్రంగా ఉంటూ, స్నానం చెయ్యక, ఏది పడితే అది తింటూ ఉండేవారు. వాళ్ళ మురికితనానికి చీదరించుకొని మహాదేవుడు వాళ్ళందరినీ ఒక కొండగుహలో బంధించివేశాడు. వాళ్ళెంత దుర్గంధభూయిష్ఠంగా ఉన్నా, పార్వతికి వాళ్ళపైన మక్కువ. అందుచేత వాళ్ళను విడిపించడానికి తపస్సు చేసింది. 'లింగో' అనే కుమారుణ్ణి పొందింది. అతడు కోదులను విడిపించమని మహాదేవుణ్ణి ప్రార్థించాడు. తాను చెప్పే కొన్ని సాహసకృత్యాలను గనుక లింగో చేస్తే వాళ్ళనలాగే విడుదల చేస్తానని మహాదేవుడు షరతు పెట్టాడు. లింగో వాటినన్నింటినీ చేశాడు. గత్యంతరం లేక శివుడు కోయదొరలను విడిచిపెట్టాడు.
>
> ''లింగో ఆ పదహారువందల కోట్లమందితో ప్రయాణమై సాగిపోయాడు. త్రోవలో ఒక నది తగిలింది. లింగో వాళ్ళకు బియ్యం, జొన్నపిండి ఇచ్చాడు. కోయదొరలు అక్కడ ఆర్యుల దేవతల యొక్క నేతిని కొల్లగొట్టారు. ఆ నది ఒడ్డున వంట చేసుకొని, భోంచేసి నది దాటారు. అప్పటికి వాళ్ళలో నాలుగు జాతులవాళ్ళు (టేకం, మార్కం, పూసం, తెలింగం) ఉన్నారు. నది దాటాక లింగో కోయదొరలకొక పట్టణం నిర్మించాడు. వాళ్ళను తెగలుగా విభజించి, కులాలు ఏర్పరిచి, కట్టుబాట్లు ఏర్పరిచాడు''.

గోండులు - భీముడు

ఆర్యులతో సంపర్కం ఏర్పడి వాళ్ళను దోచుకోవడం, అప్పటిదాకా కోదులకు నెయ్యిని గురించి తెలియకపోవడం వాళ్ళ ప్రాచీనతకు నిదర్శనలు. రస్సెల్, రామచంద్రరావుగార్లు వివరించని ఇంకొక విశేషాన్ని సయ్యద్ సిరాజ్ ఉల్ హసన్‌గారు 'మ.ఘ.వ. నైజాము డొమినియన్లలోని కులాలు-జాతులు' (1920) అనే పుస్తకంలో

చెప్పారు. గోండులు తమ మూలపురుషుడుగా భీమసేనుణ్ణి పేర్కొంటారు. ఈ పాండవవీరుడికి హిడింబివల్ల ఏకకాలంలో అయిదుగురు మగసంతానం కలిగిందట. అంతమంది ఒక్కసారి పుట్టడంవల్ల విసుక్కొని వాళ్ళను వాళ్ళ కర్మానికి వదిలి హిడింబి చక్కాపోయిందట. ఈ పసిపాపల మీద జాలిపుట్టి మహాదేవుడు వీళ్ళను పార్వతికి అప్పజెప్పాడట. ఆమె వాళ్ళకు స్తన్యమిచ్చి సాకిందటగాని, వాళ్ళు పాలతోపాటు ఆమె ప్రాణాలనుగూడ పీల్చివేయసాగారట. అందుచేత మహాదేవుడు మండిపడి వాళ్ళను పర్వత గుహలో బంధించాడట. ఆ తరువాత 'పెడ్లింగో' వాళ్ళను విడిపించాడట.

మధ్య ద్రావిడంలోని 'కూబి' భాషను మాట్లాడే కొండదొరలలో 'పాండవ రైతుల'నే తెగ ఒకటుంది. ఈ కొండదొరలు తాము పాండవుల సంతతివారమని చెప్పుకొంటూ పాండవ దొరలమని పిలిపించుకొంటారు. జనక మహారాజు సంతతి వాళ్ళమని కూడ చెప్పుకుంటారు. జనకుడే తమకు పోడు వ్యవసాయం నేర్పాడని చెప్పుకొంటారు. రాచరికపు వ్యవస్థ గోండులలో ప్రాచీన దశలోనే వచ్చినట్టుంది.

భీమసేనుడు మూలపురుషుడు అనే ఈ అదనపు విషయం కూడా గోండుల లాంటి ద్రావిడ జాతుల ప్రాచీనతనే రుజువు చేస్తుంది. టాలెమీ తన భూగోళగ్రంథంలో 'గోండాలియా' అనే పేర వాళ్ళను పేర్కొన్నాడు. టాలెమీకాలం క్రీ.శ.150 అతని పూర్వమే ఎంతోకాలం నుంచీ వాళ్ళకా పేరు ఉండాలనీ, లేకపోతే ఇలా పేర్కొనడం జరిగింది కాబట్టి గోండులు క్రీస్తుకు పూర్వం నుంచి ఉండేవారని, వాళ్ళలో ఒక జాతివారైన 'తెలింగం' వాళ్ళుకూడ అంత ప్రాచీనులనీ మనం నిస్సందేహంగా చెప్పుకోవచ్చు.

ప్రాచీన తెలుగు భాషతో సంబంధమున్న గోండు, కోదు భాషలు మాట్లాడే ప్రదేశానికీ, మొట్టమొదట ఆంధ్రులకు కూడా సంబంధముందని రుజువు చేయడానికి చారిత్రక సాక్ష్యాలున్నాయి. బౌద్ధ జాతక కథలలో ఒక్కటైన 'సెరివానిజ జాతకం' ఒక అంధపురాన్ని పేర్కొంటుంది. ఇది ఆంధ్రపురమే. ఈ పట్టణం తెలవాహా నదీతీరాన ఉన్నదని ఆ జాతకకథే స్పష్టం చేస్తున్నది. ఈ తెలవాహా నదినే నేడు తెల్ అని పిలుస్తున్నారు.[4] ఇది మహానదికి ఉపనది, తెల్‌లోయ, పాత విశాఖపట్టణం జిల్లాలో తెలుగు మాట్లాడే ప్రాంతాలూ సాతవాహనుల ఏలుబడిలో లేవని కొందరి అభిప్రాయం. అయినా డాక్టర్ డి.ఆర్.భండార్కరు గారి ఉద్దేశంలో మధ్య పరగణాలలో కొంతభాగం, విశాఖపట్టణం జిల్లా కలిసి ప్రాచీన కాలంలోని ఆంధ్రప్రాంతంగానే ఉండేది. బహుశా కృష్ణా, గోదావరి జిల్లాలలోని ప్రాంతాలు ఇందులో కలిసి ఉండవచ్చునని ఆయనే అంటున్నారు. సాతవాహనులు జయించాక ఈ తూర్పు దిక్కుకూడ ఆంధ్ర ప్రాంతమైందని పండితుల అభిప్రాయం.[5] బౌద్ధుల జాతక కథల కాలంనాటికి 'కు' భాష మాట్లాడే ప్రాంతంకూడ ఆంధ్రసీమే అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

4. భారతీయ విద్యా భవన్‌వారి చరిత్ర. The Age of Imperial Unity, పుట 195.

5. యాజ్ దానీ సంపాదకత్వాన ప్రచురితమైన "The Early History of Deccan'లో గుర్తి వెంకటరావు గారు. పుట 77.

ద్రావిడ భాషలలో తెలుగుకోవకు చెందిన కుయి, గోండ్, పర్జి, కోలామీ, ఖిల్లి, నైకి మొదలైన భాషలతోనూ, ఉపభాషలతోనూ మన భాషను సరిపోల్చి పరిశీలిస్తే మన గ్రాంథిక భాషాచరిత్ర బాగా బోధపడుతుంది. నేడు మనం గ్రాంథికంలోనే వాడే ఈవు (నీవు), ఈరు (మీరు), తారు (వారు) మొదలైనవి కుయి భాషలో సజీవంగా నేటికీ వ్యవహారంలో ఉన్నాయి. తమిళ భాషలోని 'అవన్', తెలుగు భాషలోని 'వాఁడు' అనే మాటలకు మధ్యస్థంగా ఉండే 'అవండు' అనే పదం ఖిల్లీ భాషలో వాడుకలో ఉంది. 'అనుంగు' అనే ప్రియమైన పదానికి ఆ భాషలో 'నాయొక్క' అని అర్థం. కోలామీ భాషలో కూడా ఇదే అర్థం.

గ్రియర్సన్‌గారు తమ భారతీయ భాషల సర్వేలో ఈ కోలామీ భాషను గురించి ఇలా అన్నారు : ''భాషా శాస్త్రదృష్ట్యా చూస్తే కోలామీలు ప్రాచీన ద్రావిడ తెగకు చెందిన వాళ్ళని చెప్పక తప్పదు. ఇతర ముఖ్య ద్రావిడ భాషల పరిణామంలో వీళ్ళు పాల్గొనలేదని చెప్పాలి. లేదా వీళ్ళు స్వతస్సిద్ధంగా ద్రావిడ భాషను మాట్లాడని తెగవాళ్ళు అనుకోవాలి.'' ఇందులో మొదటి ఊహే సబబైనది. కోలామీ కొన్ని విషయాలలో తెలుగునూ, కొన్ని విషయాలలో కన్నడాన్నీ పోలి ఉంటుంది.

వ్యుత్పత్తి - అర్థం

కోలామీ భాషలో అత్యంత ప్రాచీన తెలుగు రూపాలు ఉన్నాయని విశ్వసిస్తే మన భాషయొక్క వ్యుత్పత్తి అర్థాన్ని ఆ వ్యాకరణంతో సాధించవచ్చు. 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం' అనే పుస్తకంలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ఇలా వ్రాశారు:

> ''ఇటీవలి పరిశోధనల వలన తెలుగు శబ్దముయొక్క ప్రాచీనార్థమును మరింత సన్నిహితముగా తెలిసికొనుటకు వీలగుచున్నది. ప్రాచీన కాలమున ఈ దేశమునందు 'తలైంగ్' అను జాతివారు నివసించినట్లు ఊహింపబడుచున్నది. ...తలైంగ్ జాతివారి నివాసభూమి తెలుంగు, తెలుగుదేశముగా వ్యవహరించబడి యుండును. ఈ శబ్దమే తిల్లింగ, త్రిలింగ శబ్దములకు మూలమని యూహింపవచ్చును. తలైంగ్, తలేంగ్ అనగానేమియని చూచాయగా విచారణ చేయవచ్చును. తల యనగా శిరస్సు, తలస్థానమును ఆక్రమించినవారు, అనగా నాయకులైన జనులు తలైంగులై యుందురు. తలైంగు ప్రజలు తమకు ముందీదేశమున నున్న అనాగరికులను జయించి నాయకత్వము వహించినవారై యుందురు. కావున వీరికి తలైంగ్, తలేంగ్ - అనగా నాయకులైన ప్రజలు అని ప్రశస్తి వచ్చియుండును.''

ఈ విచారణకు ఆధారంగా ప్రామాణిక సాక్ష్యం కోసం అధోజ్ఞాపికలో లక్ష్మీరంజనంగారు ఇలా వ్రాశారు : ''ధాతువు చివర ఏజ్' అను వర్ణకముండు విధానము

కోలామీ భాషలో నేటికిని కానవచ్చుచున్నది. 'ఏజ్' వర్ణకము ఐంగ్, ఏంగ్‌గా మారియుండవచ్చును. విశేషములకొరకై పగిడి సేతుమాధవరావుగారు రచించిన "A Grammar of the Kolami Language" అను పుస్తకము చూడదగును.''

'ఏంగ్' కాలక్రమాన 'ఐంగ్'గా మారిందని చెప్పవలసిన అవసరం ఒక విధంగానే వస్తుంది. తల+ఏజ్ అనే కలయికవల్లనే పదం ఏర్పడిందనుకొన్నప్పుడు మార్పు ప్రసక్తి వస్తుందిగాని తమిళ భాషలోని 'తలై' అనే ఐకారాంత ప్రాచీన రూపానికే 'ఏంగ్' వర్ణకం కలిపినందువల్ల 'తలైంగ్ వచ్చిందని సహజ వ్యుత్పత్తి చెప్పుకొంటే చాలు. ఇక్కడ ఒకటి గుర్తుంచుకోవాలి. కోదు భాషలో 'తలకు' ఈనాడు 'తలై' అనే ఐకారాంతరూపం కాక 'త్లవు' అని హ్రస్వ వుకారంతో ఒక ప్రాంతంలో, 'త్లవూ' అనే 'వూ'కారాంతంగా ఒక ప్రాంతంలో మాటలున్నాయి. ఇక్ష్వాకుల కాలంనాటికే తెలుగులో 'మహాతలవర' అనే పదమున్నట్టు మనం ఇంతకుముందే చూశాము. అప్పటికే ఇతర ద్రావిడ భాషలలో ఐకారాంతం తెలుగులో అకారాంతమైనా నేటికీ తమిళంలో 'తలైవర్' అని మాటమధ్యలో సైతం ఐకారమే ఉంది. ఇక్ష్వాకులకన్నా ప్రాచీన కాలంలో అత్యంత పూర్వరూపంలో 'తలై' అనే పదానికి ఏజ్ వర్ణకం కలిసి 'తలైంగు' అనే రూపం ఏర్పడిందని చెప్పుకోవడమే భావ్యం.

మన భాషకు ఇటువంటి వ్యుత్పత్తిని అంగీకరించక త్రికళింగ, త్రిలింగ అనే సంస్కృత రూపాలలోనుంచే 'తెలుగు' పుట్టిందనేవాళ్ళు కొందరున్నారు. అసలు 'త్రికళింగ' అనే పదంలోని 'కళింగ' ఎలా పుట్టిందో చూద్దాము. ఈ కళింగ పదానికి కులింగ అనే పర్యాయ పదం ఉంది. కుయి భాషలో వడ్లను కులింగ అంటారు. ఇందులో 'ంగ' బహువచన ప్రత్యయం. తెలుగులో గింజజాతుల పేర్లన్నీ బహువచనంలోనే వాడినట్లు కుయి భాషలో కూడ 'కులింగ' నిత్య బహువచనం. ''ఆర్యులు యవభుక్తులు కాగా ఈ కోయలు వడ్లు తినేవారై యుండిరి. వడ్లు పండించుట, వాటినే ముఖ్యాహారముగా వాడుట యీ ద్రవిడజాతివారి ఆచారము. గాన వీరి ద్వేషులైన యార్యులు, కులింగులు (వడ్లవారు) అని వీరిని పిలిచియుండెడివారని చెప్పిన యేమియు నసహజముగా నుండదు. అబ్రాహ్మణులు బ్రాహ్మణులను పప్పుబాపనయ్యలని చెప్పుటలేదా? ఇట్లు వీరికి కులింగులు, కలింగులు అని నామకరణమైనది'' అని గొడవర్తి రామదాసుగారు ''కళింగ సంచిక''లో వ్రాశారు.

కోదుల వంశోత్పత్తి చరిత్ర గురించి చెప్పుకొంటున్నప్పుడు టేకం, మార్కం, పూసం, తెలింగం దేవతలకు లింగో బియ్యం, జొన్నపిండి ఇవ్వడాన్నీ, వాళ్ళు ఆర్యుల నేతిని కొల్లగొట్టడాన్నీ జ్ఞాపకం తెచ్చుకొంటే, ఈ కులింగ-వడ్ల వ్యుత్పత్తి బాగా అతికినట్టు సరిపోయింది. కళింగులు మాట్లాడేది తెలుగు భాషే.

తెలుగు, తెనుగు మాటల వ్యుత్పత్తిని ఇతర విధాలుగా సాధించడానికి పండితులు ప్రయత్నించారు. తెలి+అగు=తెలుగు అనీ, తెౕ+అగు = తెనుగు అనీ చెప్పారుగాని ఈ

మాటల ప్రాచీన రూపాలలో తెలుంగు, తెనుంగు అని పూర్ణ బిందువు ఉండేది గనుక 'అగు' అనే ముక్క కలిపినందువల్ల ఈ మాటలు పుట్టలేదని మరికొందరు భావించారు. గోండి మొదలైన భాషలలో 'ంగ' అనేది బహువచన ప్రత్యయం. ఈ ప్రత్యయమే తెలుగు, తెనుగు అనే మాటలలో ఉందని చెప్పారు. మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు ''తెల+ఉర్+ంగ్'' కలిసి 'తెలుంగ్' అయి ఇప్పటి పలుకుబడినిబట్టి 'ఉ' చేరగా 'తెలుంగు' అను నుడి ఏర్పడియుండునని తోచె. దానికి తెల్లగా ఉండువారు, అట్టివారి భాష, తేటగా ఉండు నుడుల భాష అని అర్థములు వచ్చును. తేటతెలుగను వాడుక అందరకును తెలిసినదే కదా!'' అని 'తెలుగు-తోబుట్టువులు' అనే పుస్తకంలో వ్రాశారు. ఈ వ్యుత్పత్తి భాషా గుణాన్ని తెలియజేస్తుంది గనుక ఇది అర్వాచీనమని వారే తృప్తిపడలేదు.

'తెలుగు' అనే పదం అర్వాచీనమైతే 'తెనుగు' ప్రాచీనమని రామచంద్రశాస్త్రిగారు తేర్+ఉర్+ంగ్+ఉ కలిసి తెనుగు ఏర్పడిందని చెప్పారు: ''ఈ వ్యుత్పత్తినిబట్టి అర్థమేమందురా? తెన్నున (దారిలో) ఉండువారు; వారి భాష. తెన్నున ఉండువారి దేశము తెనుగునాడయ్యె. ఈ తెనుగునాడే ఆర్యుల దక్షిణాపథము. తెనుగునాటికి 'తెనాలము' అను పేరు ఉండినట్లు తెనాలి తెలుపుచున్నది'' అని వ్రాశారు ఆచార్య గంటి జోగిసోమయాజిగారు. 'తేర్' అనే మాట దిక్కును సూచిస్తుందన్నారు.

'తెనుగు' అనే మాటకు ఇంకొక వ్యుత్పత్తి చెప్పవచ్చు. అత్యంత ప్రాచీనకాలంలో మన గడ్డమీద నాగులు మొదలైనవాళ్ళు నివసించేవారనీ, వాళ్ళ భాష నేటి కోదు, గోండు, కోలామీల మూలమనీ మనం చెప్పుకొన్నాము. కోదులు, గోండులు తమను 'కు' అని పిలుచుకుంటారు. ఈ ఆదిమ భాషల నుండి విడిపోయినవాళ్ళు దక్షిణాదికి పోయి ఉంటారు. వాళ్ళకు, వాళ్ళ భాషకు 'తెన్-కు' అనే ప్రత్యేకమైన పేరు ఏర్పడి ఉంటుంది. అదే 'తెన్+ఉన్+కు'గా తెన్ దిశన ఉండే 'కు' భాష అనే అర్థంతో 'తెనుగు' అయి ఉంటుంది.

నేటి 'కు' భాష అయిన కోదు భాషకు వ్యాకరణం వ్రాసిన లింగం లక్ష్మాజీపంతులుగారు ''ఈ భాష తొల్లింటి తెలుగుయొక్క అపభ్రంశమో, లేక ఆ తొల్లింటి తెలుగో అయి ఉంటుందని నేనెప్పుడూ భావిస్తున్నాను'' అని వ్రాశారు. కోదు భాషను చాలా కొద్దిమందే నేర్చుకోవడంవల్ల దానియొక్క ప్రాచీనతనూ సరళత్వాన్నీ, భాషాశాస్త్ర దృష్ట్యా దాని పరిపక్వతనూ అంచనా వేయలేకపోతున్నారని ఆనాడు చెప్పారు. "it contains, of course, words sufficient to express the ideas which mankind have in the infant state of civilization'' అన్నారు. శైశవదశలో ఉన్నప్పుడు ప్రకటించదగిన భావాలకు సరిపోయేటన్ని మాటలు ఆ భాషలో ఉన్నాయన్నారు.

పాత పాటలు - మాటలు

కోదు భాషలో చాలా ప్రాచీనకాలం నుంచి పాటలు ఉన్నాయి. తమ వేల్పుల కొలువులలో కోదులు 'తంతు' అంతా పాటలలోనే కానిస్తారని లక్ష్మాజీపంతులుగారు వ్రాశారు. వీటికి మన వేదాలలోని ఋక్కులకున్నంత గౌరవాన్ని ఇవ్వడానికి ఎవరు తటపటాయించినా మానవ సమాజ శాస్త్రాన్ని చదువుకొన్న ఆధునికులెవరూ వెనుకాడరు. ఆదిమ సమాజాలలో పాటలు ముందు పుట్టాక వచనం తరువాత పుట్టటం నైజం.

గిడుగువారు సవరుల గురించి రాసిన ఒక సంగతి గుర్తు చేసుకొనడం అవసరం.

> ''సవరులలో సాధారణముగా అందరికీ మగవాడు కానీ, ఆడదికానీ నాట్యము చేయడము, పాటలు పాడటమూ సహజముగా యిమిడి ఉంటుంది. విడిగా ఒక్కరిని పాడమంటే పాడలేకపోయినా, నలుగురు కలిసి సంతోషంగా ఆవేశమెత్తినట్లు మైమరచి పాడుతూ ఆడతారు. అప్పుడు దగ్గరగా ఉన్న ప్రతి సవరవాడూ వాళ్ళతో కలసి పాడినా పాడకపోయినా లయ తప్పకుండా ఆడతాడు. వాళ్ళ పాటకున్నూ, పద్యానికిన్నీ భేదమేమీ లేదు. ప్రతి సవరవాడు, ప్రతి సవరది అప్పటికప్పుడు పాటకూర్చి పాడగలరు. పాటలు పాడుకుంటూ అడవిలో కర్రలు కొట్టడము, పొలములో చేను కోసుకోవడము మొదలయిన పనులు చేసుకుంటూ ఉంటారు. కొండమీదను, అడవులలోను, డంగడా, డంగడీలు (అనగా పెళ్ళికాని పడుచువాడూ, పడుచుదీ) ఒకరినొకరు చూసుకొని, పలకరించుకొంటూ కులాసాగా మాటలాడుతూ ఉన్నప్పుడు వలపు పుట్టినట్టాయెనా వాళ్ళ మాటలు పాటలుగానూ, వాళ్ళ చేష్టలు నాట్యము, అభినయముగా మారిపోతవి. అప్పుడు వాళ్ళు కల్పించిన పాటలలో శృంగారము, హాస్యము, పదలాలిత్యము కనబడతవి. పెళ్ళిళ్ళు, దేవతల ఉత్సవాలు అయినప్పుడు గ్రామస్థులు అందరూ కలిసి పాడుతూ, ఆడుతారు.''

ఆదిమ సమాజంలో కవిత్వం ఎందుకో పై వాక్యాలు చెప్తాయి.

ఋగ్వేద ప్రజలు ఏకవచనంలో ఏదీ కోరలేదు. ఉమ్మడి జీవితంలో బహువచనమే సమంజసం. తెలుగువాడు కూడా మా దేశం, మా వూరు, మా ఇల్లు, మా అమ్మ, చివరకు మా ఆవిడ అని ఒకనాటి సమిష్టి జీవితాన్నే బహుధా వచిస్తున్నాడు.

మన తెలుగు భాషలో కూడా సాతవాహనుల కాలంనుంచీ పాటలు ఉండేవి. హాలుని గాథాసప్తశతిలో పాటల ప్రసక్తి కొన్నిచోట్ల ఉంది. ఆ పాటలన్నీ పాత తెలుగులో ఉండేవనుకోవచ్చు. గాథాసప్తశతిలో పాటలను గురించి ఎక్కడెక్కడ చెప్పాడో చూద్దాం.

''చక్కగా దంచిన సన్నబియ్యపు వన్నెలాంటి వెన్నెల తాను కోరుకున్నదానికన్నా కొల్లగా పండిన పైరును పల్లె రైతు చూశాడు. ఆనందంతో ఇచ్చవచ్చినట్టు పాడుకొన్నాడు.''

అని ఏడవ వందలోని 98-వ గాథ చెపుతున్నది. ఈ పాట ఆ రైతు అప్పటికప్పుడు తాను కట్టుకొన్నాడో, లేక అంతకుముందే అతని తాలూకు వాళ్ళు అల్లుకొన్నదో కాక తప్పదు. ఆ పాటలోని తెలుగు మాటలు ఏమిటో?

పెళ్ళికూతురికి పెళ్ళి కడియాలు తొడిగించి పునిస్త్రీలు మంగళ గీతాలు పాడుతున్నారు. ఆ పాటలలో తనకు కాబోయే మగని పేరు, అతని వంశం తీరు వర్ణిస్తూ వుంటే వింటున్న పెళ్ళికూతురికి ఒళ్ళు పులకరించిందట. (7-42)

ఆ ముద్దరాలికి అంత పారవశ్యం కలిగించిన ఆ పాటలు అప్పటికప్పుడు ముత్తయిదువులు కట్టినవే కదా! ఆ జాణలు పాడిన పాటలలోని తెలుగు నుడికారం ఏమిటో?

వలచిన వాడెవడో దూరమైనాడు. అతని గురించి సూటిగా విలపించడానికి వీలులేదు. అందుచేత పాటనెపంతో బుగులుకొనే దుఃఖభారంతో, బిగిసిన గొంతుకతో, సగం సగమే వెలువడుతూ మాటలు తెగిపడుతూ ఉంటే ఒక విరహిణి ప్రియుణ్ణి తలుచుకొంటున్నది.

ఈ ఎడబాటు పాటలో కన్నీళ్ళు చిందిన జాలిమాట లేమిటో? ఈ పాట ఆమె అప్పటికప్పుడే కట్టుకొన్నదే అవాలి.

గాథాసప్తశతిలో ఆడవాళ్ళూ, పాటకజనం పాడుకొనే పాటల గురించి మనం ఇప్పుడు పరిశీలించాము. ఎందుకంటే, వీళ్ళు ఒక్క దేశభాషనే వాడుకొనేవాళ్ళు కాబట్టి. విద్యావంతులు, రాజులు, ఉద్యోగులూ అయితే సంస్కృత ప్రాకృతాలు రెండూ వాడి ఉంటారు. అందుచేత సహజ దేశీయమైన వాటిని గురించే చూశాము. ఇక చరిత్రలో నూతన దృక్పథాన్ని అలవరచుకుని ''తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీ లెవరోయ్'' అనే జిజ్ఞాసవంటి పరిశీలనతో ఆదిమ యుగాన్ని చూస్తే ఇంకా ఎన్నెన్నో విషయాలు స్ఫురిస్తాయి.

మన తెలుగుదేశంలోని శాలిహుండం, రామతీర్థం, శంకరం, కోరుకొండ, గుంటుపల్లి మొదలైనచోట్ల బౌద్ధుల విహారాలకోసం కొండలు దొలుస్తున్న తెనుగు శ్రామికులు తమ అలసట మరిచిపోవడానికి ఏ చక్కని పాటలు పాడుకొన్నారో ఎవరికి తెలుసు? ఘంటసాల, భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండ, జగ్గయ్యపేట మొదలైన సమతల ప్రదేశాలలో బౌద్ధస్తూపాల నిమిత్తం శిలలు చెక్కుతూ శిల్పాలు సృజించిన కళాకారులు కూనిరాగాలు తీస్తూ ఏ తెనుగు మాటలు నోట పలికారో!

దక్షిణాపథంలో తూర్పు పడమర తీరాలనున్న ఎన్నెన్నో కరపట్టణాలలో ఒక రేవునుంచి ఇంకొక రేవుకు సరకులు సరఫరా చేసే చిన్న ఓడలలో తెడ్డు వేసుకొంటూ తేలిపోయిన తెలుగు నావికులు ఏవైనా పాడుకొనే ఉంటారు. వాటిలోని పలుకుబళ్ళు ఏమిటో?

పదకవిత్వం - పొరుగు తమిళం

ఎంతో వైవిధ్యముండే ఈ పాత పాటలను ఆదిలో జాగ్రత్త చేయలేదు. చేస్తే మనకుకూడ అతి ప్రాచీనమైన సాహిత్యముండేదని మనం గర్వించేవాళ్ళం. మన పండితులకు పదకవిత్వమంటే ఈసడింపు. ''ముది విటులు విధవ లంజెలు పదకవితలు మారుబాస బాపనవారల్'' అని తిట్టిపోశారు. పాటను కవిత్వంగా ఎంచక మనం చెడ్డాం. పాటనే తొలి కవిత్వంగా ఎంచి తమిళులు ప్రాచీన సాహిత్యమున్నవాళ్ళయినారు.

తమిళ భాషా చరిత్రలో క్రీ.శ. 4-వ శతాబ్ది ఒక కొత్త యుగానికి ప్రారంభమయింది. తమిళనాడులో ఒక కొత్త చైతన్యం ఉప్పొంగింది. ప్రాచీన గేయాలను సేకరించి వాటిని సక్రమమైన సంకలన గ్రంథాలుగా వింగడించి అందుబాటులో ఉండే గ్రంథాలుగా రూపొందించాలని పాలించే రాజులూ, పాళెయగాండ్రూ గుర్తించారు. ఈ కృషిని నిర్వహించడానికి ప్రసిద్ధ కవులనే నియమించారు. ఆ కవులూ ఉత్తమ గేయాలనే ఎన్నుకొన్నారు.

ఆ పాటలను విషయాలవారీగా వింగడించారు. ఆ పిమ్మట పాటల పొడుగునుబట్టి మళ్ళీ ఉపవర్గీకరణ చేశారు. అందువల్ల 4 నుంచి 8 పాదాలు ఉండే గేయాలు ఒక సంపుటంగా, 9 నుంచి 12 పాదాలు ఉండేవి ఇంకొక సంపుటంగా ఏర్పడ్డాయి. 13 నుంచి 31 పాదాలు ఉండే గేయాలు మరొక సంకలనంగా రూపొందాయి. విషయాలవారీ వర్గీకరణంవల్ల 'ఎట్టుత్తొగై', 'పత్తుప్పాట్టు' అనే 18 సంపుటాలు ఏర్పడ్డాయి.

ఇందులో కొన్ని అర్వాచీనాలను మినహాయిస్తే ఆరు సంపుటాలలోనే 2186 గేయాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 26,350 పాదాలు ఉన్నాయి. ఇవన్నీ 'అగవల్' ఛందస్సులో వ్రాసిన గేయాలే, ఈ ఛందస్సు వంటిది సంస్కృత ఛందస్సులో లేదు. ఇది కేవలం దేశీయం.

'ఎట్టుత్తొగై' సంకలన గ్రంథాలలో ఒక విభాగం పేరు 'పరిపాడల్'. తక్కిన సంపుటాలకన్నా ఇది విలక్షణమైనది. ఇందులో ప్రతి గేయానికీ ఒక గద్యంవంటిది ఉంటుంది. అందులో ఆ గేయ రచయిత పేరు, ఆ గేయానికి స్వరకల్పన చేసిన గాయకుని పేరు, వర్ణమెట్టు కట్టిన రాగం పేరూ ఉంటాయి. ఇది ఋగ్వేదంలోని సూక్తాలలో ఋషిపేరు, ఛందస్సు పేరు, స్తుతించిన దేవత పేరూ చెప్పిన సంప్రదాయానికి దగ్గరలో ఉన్నట్టుంది.

ఈవిధమైన సంకలన గ్రంథాలను క్రీ.శ. 4-వ శతాబ్దిలో రూపొందించినందువల్ల తమిళులు ప్రాచీన సాహిత్యం కలవాళ్ళైనా, ఇది మన తెనుగుగడ్డ మీద జరిగిన సంకలనానికి అక్షరాలా అనుసరణే. క్రీ.శ. 1వ శతాబ్దిలోనే హాలుడు ఆంధ్రదేశంలోనే ప్రాకృత గాథలను సేకరించాడు. అప్పటి తెలుగు పాటలను ఎవరూ సంకలనం చేయకపోవడం మన దురదృష్టం.

అయితే మనం అట్టే బాధపడనక్కరలేదు. తమిళ, కన్నడ సాహిత్యాలకన్నా మనది చాలా లేటుగా ప్రారంభమైనదనుకోనక్కరలేదు. ఇప్పటిదాకా దొరికిన సాక్ష్యాలను చారిత్రకంగా తారీఖులు తైపారువేస్తే ఈ ముఖ్యమైన మూడు ద్రావిడ భాషలలో ఒక శతాబ్ది అటూఇటూగా సాహిత్యం ఆవిర్భవించిందని చెప్పుకోవచ్చు.


వివరం	తమిళం	కన్నడం	తెలుగు
మొట్టమొదటి దేశభాషా శాసనం	క్రీ.శ. 5వ శతాబ్ది	క్రీ.శ. 450	క్రీ.శ. 575
మొదటి కవితా సాక్ష్యాలు	క్రీ.శ. 470కి పూర్వం	క్రీ.శ. 700 బాదామీ శాసనం	క్రీ.శ. 850 ప్రాంతం
మొదటి లక్షణ గ్రంథం	క్రీ.శ. 470 పిదప	క్రీ.శ. 850	క్రీ.శ. 941 ప్రాంతాలు
మొదటి కావ్యం	క్రీ.శ. 800	క్రీ.శ. 941	క్రీ.శ.1051 పిదప

సేకరించే గనుక వుంటే తమిళ భాషలోలాగే మన తెలుగులో కూడ సాతవాహనుల కాలంనుంచీ పాటలు దొరకనే దొరికేవన్న తృప్తి మనకు మిగిలింది. ఒకవేళ అటువంటి పాటలు లభిస్తే అవి ఎలాంటి ఛందస్సులో ఉంటాయో ఊహించడమేమంత కష్టం కాదు.

సాతవాహనులు తెలుగు గడ్డమీద ప్రాభవం చెందారు, గోదావరి ఉత్తరతీరాన వున్న అశ్మకంలోనూ, దక్షిణ తీరాన వర్ధిల్లిన ములక రాష్ట్రంలోనూ వాళ్ళ రాజ్యం కాళ్ళు నిలదొక్కుకొని కొద్దిగా దక్షిణానవున్న అసిక రాష్ట్రంలో వ్యాపించింది. ప్రాచీన తెలంగాణా వారి పరిపాలనకు జన్మభూమి. క్రీస్తుకు పూర్వం 230 నుండి 107 దాకా పాలించిన ఛిముకుడు ఈ వంశానికి మూలపురుషుడు. అతని దగ్గర్నుంచి వరుసగా 30 మంది రాజులు క్రీ.శ. 203-210 దాకా నాలుగువందల నలభై సంవత్సరాలు ఒక వెలుగు వెలిగారు. ఆదిలో మౌర్యులకు అణకువగా వుంటూ, తర్వాత సామంతులై, స్వతంత్రులై చివరకు సామ్రాజ్యాధిపతులయ్యారు. మొదట మూడు రాష్ట్రాలకే పరిమితమైన వీరి పాలన క్రమంగా ఆరు రాష్ట్రాలకు పెరిగి ఔన్నత్యదశలో పది రాష్ట్రాలకు విస్తరించింది.

మౌర్యులకు అరిగాపులుగా ఉండే కాలంనుంచి సాతవాహనులు పరిపాలనా భాషగా ప్రాకృతాన్నే ఉపయోగించేవారు. విశాల సామ్రాజ్యంలో వివిధ భాషలుంటాయి. ఒక భాషకి అధికార భాష అనే హోదా వస్తుంది. ఒక లిపి మాత్రమే ఆనాటికి అందరికీ అందుబాటులో ఉండేది. దానిపేరు బ్రాహ్మీలిపి. సాతవాహనులు ఆదినుంచీ నాణాలు

పోత పోసేవారు. అవి విరివిగా దేశమంతటా ప్రచారంలోకి వచ్చాయి. నాణాలపైన వివిధ చిహ్నాలు ఉంటాయిగాని వాటిమీద జారీ చేయించిన రాజు రూపచిత్రం అన్నది కనబడడం కొంచెం లేటుగా వచ్చిన పద్ధతి. రూపం వుంటే నాణాలను రూప్యము అంటారు. అదే నేటి రూపాయి అయింది. భారతదేశంలో మొట్టమొదటగా వెండి రూపాయిలను వేయించిన ఘనత సాతవాహనులకే దక్కుతుంది. అంతకు ముందు భారతీయుల రూప్యాలు లేవు. విదేశీయులవే ఉండేవి. సాతవాహనుల వెండి రూపాయలు దేశంలో ఏయే ఊళ్ళలో లభించినదీ ఈ పటంలో చూడవచ్చు.



సాతవాహనుల కాలం నాటి వెండి నాణెముల వ్యాప్తి చెందిన ప్రదేశములు

ఇప్పటి క్రీ.శ. 88వ సంవత్సరం నుండి 200 సంవత్సరం దాకా రమారమీ ఒక శతాబ్దం కాలంలో పరిపాలించిన ఆరుగురు సాతవాహన రాజుల వెండినాణాలు లభ్యమవుతున్నాయి. వీటిని ముద్రింపించి విడుదల చేస్తున్నప్పుడు ఈ ఆరుగురు రాజులూ తాము తెలుగువాళ్ళమన్న సంగతినీ, తమ నాణాలు తెలుగు గడ్డమీద నుండి ప్రచారం

పొందుతాయనీ మరచిపోలేదు. బ్రాహ్మీలిపిలోనే నాణెం ఒకపక్క ప్రాకృతంలోనూ, రెండోపక్క తెలుగులోనూ తమ నామధేయాల వక్కాణాన్ని చెక్కించారు. తెలుగు వక్కాణం మాత్రాచ్ఛందస్సులలో ఉండడం గమనార్హం. అందుకే సాతవాహనుల కాలంలోని పాటలు లభిస్తే అవి ఎలాంటి ఛందస్సులలో ఉంటాయో ఊహించడమేమంత కష్టం కాదని ధైర్యంగా చెప్పగలుగుతున్నాం. ఆ నాణాలపై గల వక్కాణాలు చూద్దాం.

1. వాసిష్ఠీ పుత్రుడు ఇమ్మడి పులుమావి (క్రీ.శ. 88–116)
ప్రాకృతం : రాఞో వాసిఠీ పుతస సరిపులు మావిస
తెలుగు : అఱహణకు | వాహిట్టి | మా కణకు | తిఱుపులు | మావికు
5 & 5 & 5 + & 4 & 4 +

2. వాసిష్ఠీ పుత్రుడు నాలుగవ సాతకర్ణి (క్రీ.శ. 116–145)
ప్రాకృతం : రాఞో వాసిఠీ పుతస సిరిసాతకణిస
తెలుగు : అఱహణకు | వాహిట్టి | మాకణకు | తిఱుహాత | కణకు
5 & 5 & 5 & 5 & 3 +

3. శివశ్రీ పులుమావి (క్రీ.శ. 145–152)
ప్రాకృతం : రాఞో వాసిఠీ పుతస శివసిరిపుడు మావిస
తెలుగు : అఱహణకు | వాహిట్టి | మాకణకు | సివతిఱుపు | డుమావికు
5 & 5 & 5 & 5 & 5

4. శివసిరి ఖంద సాతకర్ణి (క్రీ.శ. 15?–165)
ప్రాకృతం : రాఞో వాసిఠీ పుతస సిరిఖడ సాతకణిస
తెలుగు : అఱహణకు | వాహిట్టి | మాకనకు | తిరుఖళు | హాత | కణికు
5 & 5 & 5 & 4 + & 3 + & 3 +

5. యజ్ఞశ్రీ సాతకర్ణి (క్రీ.శ.165–194)
ప్రాకృతం : రాఞో గోత విపుతస సిరియ ఞ సాతకణిస
తెలుగు : అఱహణకు | గోతమీ | పుతకుహిరు | యఞహా | తకణికు
5 & 5 & 5 & 5 & 5 +

6. విజయ సాతకర్ణి (క్రీ.శ. 194–200)
ప్రాకృతం : రాఞో వాసిఠీ పుతస సిరివిజయ సాతకణిస.
తెలుగు : అరహణకు | వాసిఠీ | పుతకుహిరు | సిరివిజయ | హాతకణికు.
5 & 5 & 5 & 5 & 5

ఈ ఆరు వక్కాణాలలో, ప్రతి తెలుగు పాఠంలో అయిదు మాత్రల గణాలు కనబడతాయి. ఏదైనా గణంలో ఒకటో రెండో మాత్రలు లోపిస్తే దీర్ఘాలు తీసి సరిపెట్టు కొనేవారు కాబోలు. మొదటి రెండు వక్కాణాలలో మూడవ గణం పైన, అంటే నాలుగో

గణం ప్రారంభంలో ప్రాసయతి వున్నట్టు కనబడుతుంది. మిగతా వక్కణాలలో ప్రాసయతి వేరే గణ మధ్యంలో కనబడుతుంది. ఇది ప్రాథమిక దశలోని రగడలు.

వైతాళీయ భేదాలయిన దేశి జాతి పద్యాలను రగడలంటారు. వివిధ తాళాన్వితలు కాబట్టి వీటిని వైతాళీయాలంటారు. ఇవి మాత్రా గణ బద్ధాలు. పాదంలో సమ మాత్రా సంఖ్యగల కొన్ని గణాలు పరిమిత సంఖ్యలో వుంటాయి. మూడు, నాలుగు, అయిదు మాత్రలున్న గణాలలో వివిధ తాళాలలో రగడ భేదాలుంటాయి.

మూడు మాత్రల గణాలున్న గతిని త్రస్యగతి అంటారు.

నాలుగు మాత్రల గణాలున్నవాటిని చతురస్రగతి అంటారు.

అయిదు మాత్రల గణాలుంటే ఖండగతి అంటారు.

ఆదిలో ఈ మూడు గతులలోనే రగడలుండేవి. ఉచ్చారణలో త్ర్యస్రగతినే త్రిశ్ర, తిశ్ర గతి అంటారు. గతి భేదాలనుబట్టి ఏర్పడ్డ రగడలకు పేర్లు పెట్టుకోవాల్సి వచ్చింది.

త్రిశ్రగతి రగడలను తురగవల్గన మన్నారు.


చతురస్ర గతి రగడలకు మధురగతి అని పేరు

ఖండ గతి రగడలకు ద్విరదగతి అని పేరు.

కాలక్రమాన ఛందోరీతులలో అభివృద్ధి వచ్చాక మాత్రా గణాల స్థానంలో పద్ధతి మూలకంగా అక్షర గణాలొచ్చాక రగడల సంఖ్య పెరుగుతూ వెళ్ళింది. మార్గ ఛందోరీతులను వీటికి అన్వయించేసరికి వీటి పేర్లూ, తీర్లూ అన్నీ మారిపోయాయి. మాత్రా గణాల లెక్కన చూస్తే సాతవాహనుల నాణాలలో కనబడే ఈ రగడలు ఖండగతికి చెందినవి.



1



2



3

సాతవాహనుల వెండినాణాలను పరిశీలించి, వీటి బొరుసు వైపు తెలుగు మాటలున్నాయని గుర్తించి లోకానికి తెలియజేసినవారు పురాతత్త్వ శాఖలోని ప్రముఖులు డాక్టర్ పురాణం రాధాకృష్ణ ప్రసాదుగారు, డాక్టర్ ఇంగువ కార్తికేయశర్మగారునూ 1970లో మొదటిసారిగా ప్రసాద్‌గారు సాతవాహనుల వెండి రూప నాణాలపై ఒక పరిశోధనా పత్రాన్ని ఒక పురాతత్త్వ సదస్సులో సమర్పించారు. శర్మగారు ''కాయినేజ్ ఆఫ్ సాతవాహన ఎంపైర్'' అనే గ్రంథం రాశారు.

కార్తికేయ శర్మగారు నేటి ఛందో గ్రంథాలలో విస్తరించిన రగడల తీరులను బట్టి ఆ ప్రాచీన రచనలలోని మాత్రల సంఖ్యలను లెక్కించి విశ్లేషించారు. అక్షరాల సంఖ్యను కూడ చెప్పారు. మార్గపద్ధతిలోనే అక్షర గణాల ప్రభావంవల్ల పాదంలోని అక్షరాల లెక్క అవసరమవుతూంది. మాత్రాచ్ఛందస్సులో ఇవి వర్తించవు.

సాతవాహనుల వెండి నాణాలపై కనిపించే ఈ ప్రాదెనుగు వక్కాణాలతో 'కు' అనే ఒక్క షష్ఠీవిభక్తి ప్రత్యయం తప్ప మిగిలిన అరహణ, మాకణ, పుత, తిరు అనే పదాలు తెలుగు మాటల్లాగా వినగానే స్ఫురించవు. అయితే ఇవి బహుప్రాచీనరూపాలు. 'రాజ్ఞో' అనే ప్రాకృతపదం తెలుగులో 'అరహణ' అయింది. ఇది శాస్త్ర సమ్మతం. ద్రావిడ భాషలలో పదాదిని 'ర' కారం వుండదు. అందుకే 'రథం' అన్న పదాన్ని ప్రాచీనులు 'అరదము' అనే వికృతి పదంగా మార్చుకొన్నారు. ప్రాకృతంలోని 'సుతస' అనే మాటను ఛందస్సు కోసం ఒకసారి 'మాకణకు' అనీ, మరోసారి యథాతథంగా 'సుతకు' అని వాడారు. 'మాకణకు' అనే షష్ఠ్యంతానికి 'మాకణ్టు' అనేది ప్రథమావిభక్తి గల రూపం అవుతుంది. సాతవాహనుల కాలంనాటి తెలుగులో 'మాకండు, అంటే కొడుకని అర్థం. ఈ మూల ద్రావిడపదం రాను రాను తెలుగులో 'మగన్డు', 'మగండు', 'మగడు'గా మారింది. తమిళంలో మగన్ అయింది. క్రీ.శ. 9-10 శతాబ్దాల వైదంబుల శాసనాలలో 'మగన్డు' అనే మాట కొడుకు అనే అర్థంలోనే వాడారు.[6] ఉత్తరోత్తరా తెలుగులో అర్థం మారిందిగానీ, తమిళంలో మగన్ అంటే ఇప్పటికీ కొడుకనే అర్థం. 'సిరి' అన్న పదానికి 'తిరు' అన్న పర్యాయపదం చాలా ప్రాచీన రూపమని ఈ సాతవాహనుల రగడలు చెప్తాయి.

ఆ అత్యంత ప్రాచీనకాలంలో ఈ ఛందస్సులను ఏమని పిలిచేవారో తెలియదు. ప్రజా సాహిత్యంలో నేటికీ ఇవి తెలుగులో వివిధ పరిణామాలలో వివిధ పరిణామాలతో కనబడతాయి. ఆనాడు శిష్ట సాహిత్యంలో ఇతర ఛందస్సులు ఉన్నాయి. వాటిలో 'గాథా' అనే ప్రాకృత ఛందస్సు చాలా విరివిగా ప్రచారంలో ఉండేది. హాలుడు సేకరించిన కవిత్వమంతా ఈ గాథాచ్ఛందస్సులో ఉండబట్టే దానికి 'గాథాసప్తశతి' అనే పేరు పెట్టారు. ఈ గాథాచ్ఛందస్సుకూ, మన తెలుగుతనానికీ ఏదైనా సంబంధం ఉందేమో చూద్దాం.

గాథా ఛందస్సు - తెలుగు

గాథా ఛందస్సు మాత్రాబద్ధమైనది; సంస్కృత ఛందస్సులాగా అక్షరబద్ధం కాదు. మాత్రాచ్ఛందస్సులన్నీ గేయాలే. గాథాచ్ఛందస్సులలో గాహూ, గాహా, ఎగ్గాహా, ఉగ్గాహా, గాహిణీ, సింగిణీ, ఖండ అనే ఏడు రకాల భేదాలున్నాయి. ప్రతి గాథకూ నాలుగు పాదాలుంటాయి. మొత్తం నాలుగు పాదాలకూ కలిసి కనీసం 54 మాత్రలు ఉండాలి. ఏ గాథలోనూ 64 మాత్రలకు మించి ఉండకూడదు. ఈ గాథా భేదాలలో కొన్ని సామాన్య నియమాలు ఉన్నాయి.

6. చూ॥ ప్రాచీనాంధ్ర శాసనాలు - బూదరాజు రాధాకృష్ణ, 1971 పుట 75

1. మొదటి పాదంలో 12 మాత్రలు ఉండాలి.

2. ఆరవ గణము ఒక ప్రత్యేక నియమాన్ని అనుసరిస్తుంది.

3. రెండవ, నాలుగవ పాదాల అంత్యాక్షరాలు గురువులుగా ఉండాలి.

4. బేసిని జగణ ముండదు,

కందమే మూలకందం

ఈ నియమాలు పురాతన ప్రాకృతానికి ఎంత కచ్చితంగా వర్తిస్తాయో నేటి మన కంద పద్యాలకు గూడ అంత పట్టుదలగానూ వర్తిస్తాయి. 64 మాత్రలున్న పరిపూర్ణ గాథనే ప్రాకృతంలో 'ఖండఆ' అని పిలుస్తారు. మన కందపద్యంలో కూడ 64 మాత్రల పరిపూర్ణత ఉంది. తెలుగు కవిత్వానికి కందమే మూలకందం. రేచన తన కవిజనాశ్రయంలో లక్షణాలన్నీ కందాల్లోనే చెప్పాడు. నన్నయగారి రచనలో మొత్తానికి సగానికి సగం - 1219 - కంద పద్యాలు ఉన్నాయి. అలాగే నన్నెచోడుని కవిత్వంలోనూ సగానికి సగం - 534 - కంద పద్యాలున్నాయి.

హాలుని కాలం నుంచీ నేటిదాకా తెలుగునాట ఒకే రకమైన ఛందస్సు అవిచ్ఛిన్నంగా ఉన్నదని మనం సగర్వంగా చెప్పుకోవచ్చు. ఇది అసలు సిసలు దేశీయమైన ఛందస్సు. కోదులకు 'కొంధీ' అని పేరు కూడా ఉంది. దీనికీ, 'ఖండఆ'కూ సంబంధమున్నదేమో పరిశోధించాలి. ఏమైనా ఇది తెలుగువాళ్ళ దగ్గర నుంచి ప్రాకృతంలోకీ, ప్రాకృతంలో నుంచి సంస్కృతానికీ వెళ్ళింది. సంస్కృతంలో దీనిని 'ఆర్య' అంటారు.

కంద పద్యానికి తెలుగునాట ఇంత ప్రాచీన సంప్రదాయమున్నా జినవల్లభుని బొమ్మలగుట్ట - కుర్క్యాల శాసనంలో తప్పించి మరి ఏ తెలుగు శాసనంలోనూ ఇప్పటిదాకా ఇది కనబడదు. రెండవ యుద్ధమల్లుని కుమారుడైన బాదప మహారాజు క్రీ.శ. 927–934 సంవత్సరాల మధ్య ఎప్పుడో వేయించిన ''అమంచాక'' శాసనంలో మాత్రం సంస్కృతంలో కంద పద్యముంది. సంస్కృతంలో వుంది గనుక దీనిని ఆర్యాగీతి అనుకోనక్కరలేదు. తెలుగు కందంలో ఉండేటట్టు ఇందులోనూ యతిప్రాసలన్నీ ఉన్నాయి చూడండి :

''ధవళగుణో ధవళయశో
ధవళిత దిఙ్మండలోవ - దమితారాతిః,
భవభక్తో భవకరుణో
ధ్రువభవ భోగాన్వితో వి- భాతి సుకీర్తిః''

''ఈ పద్యమునుబట్టి తెలుగు ఛందమగు కందమునకు అధిక ప్రచారముండెనని చెప్పవచ్చును. ఎంతో ప్రచారముండిననే సంస్కృత మయమయిన శాసనమందు తెలుగు లక్షణములతో గూడిన పద్యమునకు

ప్రవేశము కల్గునని చెప్పుటకు వీలగును. కన్నడమందు ప్రచారమందున్న కందము యొక్క ప్రభావము వలన ఈ పద్యము వ్రాయబడినదనుటకు వీలులేదు. కన్నడమందలి కందమునకు ప్రాసనియతి యున్నను యతి నియమము, సరూపాక్షర యతి నియమము లేదు. ఆ నియమము తెలుగు నందే యున్నది. ఈ కారణముచే తెలుగునందు ప్రసిద్ధమయిన కంద ప్రభావమే పై సంస్కృత కందమునకు కారణమని చెప్పవలెను''

అని శ్రీ సంపత్కుమారగారు తమ 'తెలుగు ఛందోవికాసము'లో వ్రాశారు.

తెలుగు - కన్నడం

చాలాకాలం దాకా తెలుగు, కన్నడ దేశాలకు మరీ దగ్గర సంబంధం వుండేది. రెండింటికీ మూలభాష ఒక్కటే. సాంఘిక, మత విషయాలలోనూ రెండూ ఒక్క మార్గంమీదనే పయనించాయి. కన్నడం మాట్లాడే పశ్చిమ చాళుక్యులు తెలుగుదేశాన్ని జయించి ఇక్కడ రాజ్యం ఏర్పరచుకొన్నారు. సాతవాహనుల కాలం నుంచి క్రమేణా ప్రాకృత సంస్కృతాలు తెలుగుదేశంలో రాజకీయ భాషలయితే, పశ్చిమ చాళుక్యుల కాలం నుంచి కన్నడం దేవిడీ భాషగా వుండేదనిపిస్తున్నది, పశ్చిమ చాళుక్యుల అధికారప్రభ తగ్గుముఖం పట్టి రాష్ట్రకూటులది పై చేయి అయ్యేదాకా కన్నడమే తెలుగుదేశంలో రాజ్యమేలిందనుకోవచ్చు. రాష్ట్రకూటులకూ, తూర్పు చాళుక్యులకూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండేది గనుక గుణగ విజయాదిత్యుని కాలంనుంచి, అనగా క్రీ.శ. 9-వ శతాబ్ది నుంచి కన్నడ ప్రభావం మన గడ్డమీద తగ్గింది.

కన్నడ కవులు - తెలుగు

అయితే ఆ తరువాత కూడ తెలుగుదేశంలో పుట్టిన కవులు సైతం కన్నడమే అభ్యసించి, ఆ ప్రాంతాలకు వలసపోయి, ఆ రాజులను ఆశ్రయించి ఆ భాషలోనే కవిత్వం చెప్పడం చేత సాహిత్యరీత్యా కన్నడానికే ప్రాచీనత ఏర్పడింది. కన్నడంలో ఆదికవి పంపడు. ఆయన జన్మస్థానం తెలుగుదేశంలోని వేంగిపర్రు. ఆయన వేములవాడను పాలించిన అరికేసరి అనే కన్నడ ప్రభువు పోషణలో మహాభారతాన్ని స్వతంత్ర కావ్యంగా రచించాడు. అంతకుముందు 'ఆదిపురాణ'మనే జైన తీర్థంకర చరిత్ర వ్రాశాడు. ఈయన వాటిని కన్నడంలో వ్రాసినా, మాతృభాష అయిన తెలుగు మాటలు కొన్ని ఆయన కావ్యంలో నేటికీ నిలిచిపోయాయి.[7] చూడండి.

ఒరుగు = (పంపభారతం, 11-47) వ్రాలు, నిదురించు. కన్నడంలో నిదురకు వేరే దేశ్యం లేదు.

7. మద్రాసు యూనివర్సిటీ వారి Annals of Oriental Research, 1955 భట్టుగారి వ్యాసం.

ఒడ్డ = (పంపభారతం, 6-71) తెలుగు = ఒడ్డు, పందెం, పంతం 'ఒట్టు' ఇందులో నుంచే పుట్టిందా? ఒడ్డు, ఒట్టు ఒకటే ప్రాచీనరూపం గలవేమో!

ఎక్కసక్క = (పంపభారతం, 11-137) ఎకసక్కెము. ప్రస్తుత కన్నడ భాషలో లేదు. తుళులో హద్దుమీరిన, అగణితం అనే అర్థంలో ఉంది.

బోన = (పంపభారతం, 3-79) వండిన ప్రాలు, అన్నం.

ఇటువంటి కన్నడ మఱుగులలో తెలుగు రూపాలు కనబడతాయి. పంపకవి 'వండిన ప్రాలు'గా బోనాన్ని వాడితే, రన్నకవి 'ఎసరు' అనే తెలుగుమాటనే వాడాడు. ఇతడు కన్నడ రత్నత్రయంలో మూడవవాడు, రెండవ రత్నమైన పొన్నకవికి కన్నడంలో కావ్యం వ్రాయమని ప్రోత్సాహమిచ్చినవాళ్ళు తెలుగువాళ్ళు. వేంగీ విషయంలోని కమ్మనాటికి చెందిన మల్లపార్యుడూ, పున్నమార్యుడూ ప్రేరేపిస్తే పొన్నకవి కన్నడంలో 'శాంతి' పురాణం అనే జైన పురాణం వ్రాశాడు. మొత్తంమీద కన్నడ రత్నత్రయంలో ముగ్గురూ తెలుగు సంబంధాలు ఉన్నవాళ్ళే. అందుకే వీళ్ళు తెలుగు ఛందస్సులను కన్నడ భాషకు కానుక ఇచ్చారని భావించడంలో విడ్డూరం వుండదు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రచురించిన 'దక్షిణభారత సాహిత్యములు' అనే పుస్తకంలో కన్నడ సాహిత్యం గురించి గడియారము రామకృష్ణశర్మగారు విపులమైన చరిత్ర వ్రాశారు. వారు కన్నడంలోని మొదటి లక్షణ గ్రంథమైన 'కవిరాజమార్గం' గురించి చెప్పాక ''ఆ భాషలోనికి ప్రాకృతచ్ఛందస్సులనుండి కందము, రగడ గ్రహింపబడినవి. తెలుగు నుండి ద్విపద, సీసము, గీతము తీసికొనబడినవి'' అని వివరించారు.

ప్రాచీనతా స్థాపన

మొత్తానికి సాతవాహనుల కాలంనాటికే తెలుగు భాష ఉండేదనీ, అందులో పాటలు ఉండేవనీ, అవి దేశవాళీ ఛందస్సులో ఉండేవనీ, ఆనాటి సంప్రదాయాలు నేటికీ తెలుగుదేశంలో నిలిచి ఉన్నాయనీ చూచాయగా తెలుసుకొన్నాం. దీనికి తెలుగు లిపిలో లేని శాసనాలూ, గ్రంథాలూ ఆధారమైనాయి. మన లిపిలోనే దొరికిన వాటినిబట్టి మన భాష గురించీ, మన సాహిత్యం గురించీ తెలుసుకోవడం మరొక ఘట్టం.

తెలుగు - రాయలసీమ (రేనాడు)

దక్షిణాపథాన్నంతటినీ ఆదిలో పాలించిన సాతవాహనుల దుర్గాలూ, టంకశాలలూ నేటి తెలంగాణంలో ఉండవచ్చు; ప్రపంచ విఖ్యాతిని ఆర్జించుకొన్న బౌద్ధారామాలూ, స్తూపాలూ కోస్తా జిల్లాలలో ఉండవచ్చు. కాని తెలుగు లిపిలో ఉన్న మొట్టమొదటి తెలుగు శాసనాలన్నీ మనకు రాయలసీమలోనే దొరికాయి. క్రీ.శ. 6-వ శతాబ్ది నాటికి దాని పేరు 'రేనాడు'. అది ఏడువేల గ్రామాల మండలం. దీనిని ఆరోజుల్లో చోళులు

పాలిస్తూ ఉండేవారు. రేనాడును పాలించబట్టి వీళ్ళకు రేనాటి చోళులు అని పేరు వచ్చింది. వీళ్ళు వేయించిన తెలుగు శాసనాలను మెకంజీ సహాయకులు ఎన్నడో సేకరించినా, వీటిని గురించి చాలా లేటుగానే పరిశోధనలు జరిగాయి.

రేనాటి చోళుల ధర్మమా అని మనకు ప్రాచీన తెలుగు వాక్య రచనా విధానం తెలుస్తున్నా, వాళ్ళ చరిత్ర పూర్తిగా మనకు తెలియదు. రావుబహదూర్ హెచ్. కృష్ణశాస్త్రి గారూ, నేలటూరి వెంకటరమణయ్యగారూ, మల్లంపల్లి సోమశేఖరశర్మగారూ, ముట్లూరి వెంకటరామయ్యగారూ, కె.ఎ. నీలకంఠశాస్త్రిగారూ ఈ రేనాటి చోళులను గురించి వివిధ పత్రికల్లో వ్రాసిన వ్యాసాలు ఇప్పటికీ చెల్లా చెదురుగానే ఉన్నాయి. వాటి సారాంశాన్ని ఏ చరిత్రకారుడూ క్రోడీకరించలేదు. ఆనాటి తెలుగు భాషా స్వరూపాన్ని ఇప్పటిదాకా నిలబెట్టిన ఈ పూజనీయులను గురించి, అందులోనూ అక్షరాలా 'పుణ్య' కుమారుణ్ణి గురించి పట్టుమని పది వాక్యాలు వరుసగా మన అధికారిక చారిత్రక గ్రంథాలలో కనబడవు. వీళ్ళను గురించి వివిధ పత్రికలలో ప్రామాణిక చరిత్రకారులు చెప్పిన విషయాలను క్రోడీకరించి చెప్పుకొని మన కృతజ్ఞతను తెలియజేసుకొందాం.

రేనాటి చోళుల చరిత్ర

ఏ చరిత్రనైనా రచించడానికి ఉపక్రమించే ముందు అందుకు సహాయపడే ప్రామాణిక సాక్ష్యాలు ఏమిటేమిటో బేరీజు వేసుకోవడం అవసరం. రేనాటి చోళుల చరిత్రను క్రోడీకరించడానికి ఈ క్రింది ఆకరాలు పూర్తిగా పనికివస్తాయి.

1. హెచ్. కృష్ణశాస్త్రిగారు 'ఎపిగ్రాఫియా ఇండికా' 11-వ సంపుటి 35-వ సంచికలో ప్రకటించిన పుణ్యకుమారుని మాలెపాడు శాసనాలు.

2. నేలటూరు వెంకటరమణయ్యగారు మదరాసు క్రైస్తవ కళాశాల పత్రిక 1929 జనవరి సంచికలో 'త్రైరాజ్యపల్లవ' అనే వ్యాసానికి అనుబంధంగా ప్రకటించిన 'మాలెపాడు శాసనాల కాల నిర్ణయం' అనే జ్ఞాపిక.

3. రైసుదొరగారు 'ఎపిగ్రాఫియా కర్ణాటికా' 12-వ సంపుటిలో ప్రకటించిన, మద్దిగిరి తాలూకా శ్రావణగుడివద్ద దొరికిన కొన్ని వీరగల్లులూ, శాసనాలూ.

4. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు గిడుగురామమూర్తి పంతులుగారి 75-వ జన్మదినోత్సవ సందర్భంలో ప్రచురించిన 'వ్యాససంగ్రహం'లో ప్రకటించిన ''పోట్లదుర్తి- మాలెపాడు శిలాశాసనం.''

5. పుట్టపర్తి శ్రీనివాసాచారిగారు ''జర్నల్ ఆఫ్ ఇండియన్ హిస్టరీ'' 15-వ సంపుటిలో ప్రకటించిన ''శ్రీకంఠచోళుని శాసనాలు.''

6. కె.ఎ. నీలకంఠశాస్త్రిగారూ, ముట్లూరు వెంకటరామయ్యగారు కలిసి ''ఎపిగ్రాఫియా ఇండికా'' 27వ సంపుటి 42-వ సంచిక నాలుగవ భాగంలోనూ, దాని తరువాతి

దానిలోనూ ప్రకటించిన ''అనంతపురం, కడప జిల్లా నుండి తెలుగు చోడుల శాసనాలు.''

7. హెచ్.కె. నరసింహస్వామివారు ''ఎపిగ్రాఫియా ఇండికా'' 27-వ సంపుటి 44-వ సంచికలో ప్రకటించిన ''పుణ్యకుమారుని దొమ్మర నంద్యాల శాసనం.''

ఈ ఏడు ప్రత్యక్ష ప్రమాణాలు కాక వీటివల్ల తెలిసిన విషయాలనూ, ఇతరాలనూ చర్చిస్తూ వివిధ చారిత్రక రచయితలు వ్రాసిన విషయాలు కూడ అక్కడక్కడ తోడ్పడతాయి. ఈ ఆకరాలతో తెలియవచ్చినంత మట్టుకు, సంగ్రహంగానే అయినా, రేనాటి చోళుల చరిత్రను చెప్పుకోవాలి.

రేనాడు ఎక్కడుంది?

నేటి రాయలసీమలోని కొన్ని ప్రాంతాలను ''రేనాడు'' అని పిలిచేవారని చెప్పుకున్నా, ఏయే ప్రాంతాలు కలిస్తే ఆనాటి రేనాడు ఏర్పడిందో స్పష్టంగా ముందు తెలుసుకోవడం అవసరం. ఇప్పటివరకూ దొరికిన వివిధ శాసనాలలో ఏయే ప్రాంతాలు రేనాడుగా చలామణి అయినాయో ఆ గ్రామాల పట్టికను కుందూరి ఈశ్వరదత్తుగారు తయారుచేశారు.[8] వారు క్రోడీకరించిన విషయాలవల్ల రేనాడు ఒకప్పుడు ఈ క్రింది ప్రదేశాలు ఉన్న మండలం అని తెలుస్తున్నది.


1. కర్నూలు మండలంలోని దక్షిణ భాగమైన కోయిలకుంట్ల, సిరివేలు తాలూకాలు.
2. కడప జిల్లాలోని జమ్ములమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, కమలాపురం తాలూకాలు.
3. అనంతపురం మండలంలోని దక్షిణప్రాంతమైన హిందూపురం తాలూకా ప్రాంతం.
4. చిత్తూరు మండలంలో ఉత్తరదిక్కున కడప జిల్లాకు అనుకొని ఉన్న మదనపల్లి తాలూకా.

ఈ భూభాగాలన్నీ కలసిన ప్రదేశమేగాక మరికొంత భాగం కూడ రేనాడులో చేరుతుంది. అసలు ఈ మండలానికి రేనాడు అనే పేరు ఎలా వచ్చిందో తెలిస్తే దీని సంపూర్ణ వైశాల్యాన్ని తెలుసుకోవచ్చు. రేగడినేల ఉన్న ప్రాంతం కాబట్టి రేగడినాడు అయి రేనాడుగా మారిందని పుట్టపర్తి శ్రీనివాసాచారిగారు అభిప్రాయపడ్డారు. అయినా, ఇది వాస్తవం కాదనీ, రేనాడు అనే పదంలోని 'రే' రేగడినికాక 'రేడు' అనే నృపవాచకమైన అర్థాన్ని సూచిస్తుందనీ ఆచార్య నీలకంఠశాస్త్రి, ముట్లూరి వెంకటరామయ్యగార్లు అన్నారు. ఎందుచేతనంటే, క్రీ.శ. 10-వ శతాబ్దికి ముందు ''మహారాజపాడి'' అనే ప్రాంతం ఒకటి శాసనాలవల్ల తెలుస్తున్నది. రేనాడు ఎలాగైతే ఏడువేల దేశమో, మహారాజపాడికూడ ఏడువేల పరిమితమే. క్రీ.శ. 6-వ శతాబ్దినుంచీ రేనాడుగా వ్యవహరించిన ప్రాంతాన్నే ఆ

8. ప్రాచీనాంధ్ర భూగోళం, పుట 285.

తరువాత ''మహారాజపాడి'' అని పిలిచేవారు. దీనికే 'మార్జావాడ' అనే ఇంకొక పేరుంది. శాసనాలన్నింటినీ పరిశీలించిన ఈశ్వరదత్తుగారు ''మార్జావాడరాజ్యము'' నేటి కడప, చిత్తూరు మండలములను దాటి మైసూరు రాష్ట్రములోని కోలారు మండలము వరకు వ్యాపించియుండె''నని ఊహించారు.[9]

ఇప్పుడీ ఆధారాలను పురస్కరించుకొని రేనాడు వైశాల్యాన్ని దేశపటంలో గుర్తిద్దాం. పెన్నకు ఉత్తర దక్షిణాలలోనూ, తూర్పుపడమరలలోనూ విస్తరిల్లిన, ఆ నదీ పరీవాహ ప్రదేశమంతా రేనాడుగా ఉండేది. ఆంధ్రదేశ చరిత్రలో అత్యంత ప్రాచీనకాలంలో ఈ ప్రదేశాన్ని ఏమని పిలిచేవారు, ఎవరు పాలించేవారు అన్నది తెలుసుకోవడం కూడ ముఖ్యమే.



ఎవరు పాలించారు : ఇక్ష్వాకుల కాలంలో మహా సేనాధిపతి, మహాతలవర 'వాసిఠీపుతకందచలికిరెంణక' అనే దండనాయకుడొకడు 'హిరణంక' వంశంలోనివాడు ఉండేవాడు. హిరణ్యా రాష్ట్రాన్ని పాలించడంచేత ఈ వంశానికి 'హిరణంక' అనే పేరు వచ్చిందనీ, ఈ హిరణ్యా రాష్ట్రమే రేనాడు యొక్క ప్రాచీన నామమనీ భావరాజు వెంకట కృష్ణరావుగారు భావించారు.[10] కందచలికి రెంణక క్రీ.శ. 200 ప్రాంతంవాడు. అప్పటినుంచి రేనాడు తెలుగు చరిత్రలో రాజ్యవైభవాన్ని అనుభవిస్తూ ఉండేది. ఆ తరువాత ఆ ప్రాంతాలను ఎవరు పాలించారో తెలియదు. రేనాటి చోళులు తాము కరికాల చోళవంశంవాళ్ళమని చెప్పుకున్నారు. అందుచేత ఈ ప్రాంతం కరికాల చోళుని కాలంలో అతని ఏలుబడిక్రిందనో, అతని ప్రతినిధుల పరిపాలనలోనో ఉండేదనుకోవచ్చు.

9. ప్రాచీనాంధ్రభూగోళం. పుట 255.

10. Early Dynasties of Andhra Desa, pp.46-47.

కరికాల చోళుని గురించి నేలటూరి వెంకటరమణయ్యగారు గొప్ప పరిశోధన చేసి, మిథ్యాపురుషుడుగా అందాకా అందరూ భావిస్తూ వచ్చిన కరికాలునికి చారిత్రక స్థానం కల్పించారు. కరికాలుడు త్రిలోచన పల్లవుని కాలంవాడనీ, క్రీ.శ. 480–510 మధ్య కంచిని పాలించిన పల్లవరాజు మొదటి నందివర్మే త్రిలోచన పల్లవుడనీ వెంకటరమణయ్యగారు నిరూపించారు.[11] కాబట్టి కరికాల చోళుని కాలం క్రీ.శ. 485 ప్రాంతం. ఆ రోజుల్లో రేనాడు అతని క్రిందే ఉండేదని ఊహించవచ్చు.

కరికాల చోళుడు తమిళదేశంలో కావేరీ నదీతీరాన ఉండే ఉరయూరు రాజధానిగా పాలించేవాడనీ, అతడు ఉత్తరానికి దిగ్విజయం చేశాడనీ, అలా అతడు విజయయాత్ర చేసినప్పుడు రేనాటి ప్రాంతాలలో అతని వంశస్థులు స్థిరపడ్డారనీ నేలటూరి వారితోపాటు చాలామంది చరిత్రకారులు భావిస్తున్నారు. అయితే భావరాజు వెంకటకృష్ణరావుగారు మాత్రం చోళులు ఉత్తరాది నుంచి, అనగా బహుశా ఆంధ్రదేశం నుంచే దక్షిణాదికి వెళ్ళారని భావించారు.[12] దీనికి కారణం లేకపోలేదు. ఆంధ్రదేశంలో కూడా 'చోళవాడి' ఉండేది. ఈనాటి మహబూబ్‌నగర్ జిల్లా ఒకనాడు చోళవాడి అనే పేరుతో ఉండేది. దీనికి పానగల్లు రాజధాని. పండితారాధ్య చరిత్రలో పాల్కురికి సోమనాథుడు చోళవాళితోపాటు వేలవాళి, లెంకవాళి అనే ప్రదేశాలు పేర్కొన్నాడు.[13] చోళ, వేళ, లెంక అనేవి సైనిక పదాలనీ, ఆయా ఉద్యోగాలు చేసేవాళ్ళవల్లనే ఆ ప్రాంతాలకు ఆ పేర్లు వచ్చాయనీ భావరాజువారి ఉద్దేశం.

కరికాల చోళుని గురించి తమిళ వాఙ్మయంలో ప్రాచీనకాలం నుంచీ విస్తారంగా పాటలూ, ప్రశంసలూ ఉన్నాయి. అయితే అతనిని గురించి శాసన ప్రమాణాలు మాత్రం తెలుగుదేశంలోనే దొరికాయి. తెలుగు జిల్లాల కైఫీయత్తులలోనే కరికాలుని గురించి వ్రాసినది దొరుకుతుంది. అడవులు కొట్టించి, అగ్రహారాలు పుట్టించి, కరికాలుడు ఆంధ్ర దేశంలో విశేషమైన అభివృద్ధి సాధించినట్లు తరతరాలుగా జనం చెప్పుకొంటున్నారు. నేటి రాయలసీమలో ఉండే ఆనాటి పొత్తపినాడే కరికాలుడు ప్రత్యేకంగా శ్రద్ధ వహించి పెంపొందింపజేసిన ప్రదేశం.

తమిళ దేశంలో కరికాలుడు పాలించాడని చెప్పుకొనే ఉరయూరు, కావేరిపూంపట్టణం ప్రాంతాలలో పురాతత్త్వ శాఖవారు ఇటీవల త్రవ్వకాలు మొదలుపెట్టారు. కొన్ని ప్రాచీన శిథిలాలు బయటపడినాయనీ, కొన్ని శాసనాలు దొరికాయనీ వార్తలు వచ్చాయి. ఈ నూతన చారిత్రక సాక్ష్యాలను పండితులు సమన్వయం చేసేదాకా కొన్ని కొత్త విషయాలు మనకు తెలియవు. పాత సాక్ష్యాలను బట్టి నేలటూరి వెంకటరమణయ్యగారు

---

11. Trilochana Pallava & Karikalachola.
12. Early Dynasties of Andhra Desa, P.239, Foot Note.
13. పండితారాధ్య చరిత్ర, మహిమ ప్రకరణం, పుట 185 ''చోళవాళికి కాక క్షోణీతలేశ! వేళవాళికి కర్తవే అటులైన.''

ఇచ్చిన [14] కరికాల వంశవృక్షంతో కాలనిర్ణయ పట్టిక కూడ జతచేద్దాం. అప్పుడు ఈ క్రింది వంశావళి వస్తుంది.

జటాచోడ లేక జట్ చెన్ని (క్రీ.శ. 460)

కరికాల (క్రీ.శ. 485)

మావనకెళ్లి, లేక మహిమానచోళ (క్రీ.శ.510–535)

రెండవ కరికాల — దశవర్మ — తొండమాన, లేక ఇళం తిరయన్ (క్రీ.శ. 535–560)

మన రేనాటి చోళులు నిజంగా కరికాల వంశం వాళ్ళయితే, ఇది వాళ్ళ పూర్వుల వంశవృక్షం. రేనాటి చోళులలో మొదటిరాజు కాశ్యప గోత్రుడైన నందివర్మ అని తెలుస్తున్నది. ఇతడు క్రీ.శ. 550 ప్రాంతాలలో ఉండి వుంటాడని నీలకంఠశాస్త్రి, వెంకట రామయ్యగార్లు కాలనిర్ణయం చేశారు. అయితే రేనాటి చోళులలో ప్రథముడు, కరికాల చోళుని మనుమడైన తొండమాన ఇళంతిరయన్ సమకాలికుడై ఉంటాడు. ఇద్దరూ 550లో జీవించారు కాబట్టి. అయితే వీళ్లిద్దరికీ ఏ విధమైన బాంధవ్యముందో మనకు ప్రస్తుతం తెలియదు. తొండమాన చోళుని సోదరులు వంశావళిలో పేర్కొన్న ఇద్దరూ తెలుగు శాసనాలవల్ల తెలియవచ్చే వ్యక్తులు. వీళ్ళకూ, రేనాటి చోళులకూ ఎటువంటి సంబంధమో కూడ ప్రస్తుతం మనం చెప్పలేము.

రేనాటి చోళులలో మొదటి రాజైన నందివర్మకూ, కరికాల చోళునికీ పట్టుమని వంద సంవత్సరాల ఎడం కూడ లేదు. తాము కరికాల చోళుని వంశంలోని వాళ్ళమని చెప్పుకొన్న పుణ్యకుమారునికీ, రేనాటి చోళులలో మొదటివాడైన నందివర్మకూ నూటపాతికేళ్ళ ఎడమే వుంది. అంటే కరికాలునికీ, పుణ్యకుమారునికీ మధ్య ఏడెనిమిది తరాల ఎడమే వుంది. అందుచేత తన వంశకర్త గురించి పుణ్యకుమారుడు ఊహాగానం చేసి అట్టే అభూతకల్పనలు కల్పించవలసిన అవసరం లేదు. కరికాలునికీ, రేనాటి చోళులకూ సంబంధం నిజంగానే వుండి వుంటుంది.

తెలుగులోని మొట్టమొదటి శాసనంలో తెలిసే రేనాటి చోళుని పేరు ఎరికల్ ముత్తరాజు ధనంజయుడు. ఇతడు నందివర్మ కుమారుడు. ఈ ధనంజయుని పేరు ముందున్న 'ఎరికల్' అనే మాట గురించీ, 'ముత్తరాజు' అనే మాట గురించీ నీలకంఠశాస్త్రి,

14. Trilochana Pallava and Karikalalochola, pp. 27, 30, 31.

వెంకటరామయ్యగార్లు గొప్ప చర్చ చేశారు. 'ఎరికల్' అనేది ఒక ప్రాంతాన్ని సూచిస్తుంది. రేనాటి చోళుల ప్రప్రథమ నివాసస్థానమే ఈ ఎరికల్ అయి వుంటుంది. ''ఎపిగ్రాఫియా కర్ణాటికా'' 12-వ సంపుటలో చోళుల శాసనాలు కొన్ని ప్రకటించారు. అందులో ''ఎరిగలవాడి అరునూరు'' అనే పదం చాలాసార్లు వస్తుంది. ఈ ''ఎరిగలవాడి'' అనే మాటలోనిదే ''ఎరికల్'' అని నీలకంఠశాస్త్రి, వెంకటరామయ్యగార్లు గుర్తించారు.

''ఎరికల్'' అనేది ప్రదేశాన్ని సూచిస్తే, ఆ ప్రాంతం ఎక్కడ ఉన్నది అనే ప్రశ్న పుడుతుంది. మైసూరు రాష్ట్రంలోని తుంకూరు జిల్లా పావగడ (పాగొండ) తాలూకాలో ఉండే నిడుగల్లు గ్రామమే మన రేనాటి చోళుల ''ఎరికల్'' అని నీలకంఠశాస్త్రి, వెంకటరామయ్యగార్లు భావించారు. దీనికి కారణం, చోళవంశపు వివిధ శాఖల్లో తెలుగుదేశంలో ఎలాగైతే వెలనాటి చోళులు, కందూరు చోళులు మొదలైన కుటుంబాలున్నాయో అలాగే కన్నడ ప్రాంతాలలోనూ హేమావతి చోళులు, నిడుగల్లు చోళులు అనే రెండు తెగలవాళ్ళు ఉన్నారు. ఈ నిడుగల్లూ, రేనాటి చోళుల పెరిగల్లూ ఒకటే అనే నీలకంఠశాస్త్రి, వెంకటరామయ్యగార్లు భావించారు.

ఇది సరికాదనీ, ఆదిలో రేనాడు పడమట శేషాచలాన్నీ, ఉత్తరాన పెన్ననూ దాటి వెళ్ళడానికి ఆస్కారం లేదని పుట్టపర్తి శ్రీనివాసాచార్యులుగారు చెప్పారు.[15] కన్నడ దేశంలోని తుంకూరువద్ద ఒక చోళరాజు శాసనం దొరకబట్టీ, అతడు రేనాటి చోళ వంశంలోని మహేంద్ర విక్రమచోళుడే అయివుంటాడని గుర్తించబట్టీ నీలకంఠశాస్త్రి, వెంకట రామయ్యగార్లు ఇలా భావించారనీ, ఒకవేళ ఈ వ్యక్తి గుర్తింపు సక్రమమైనా అంతదూరం దాకా రేనాడు విస్తరించదనీ శ్రీనివాసాచార్యులుగారి వాదం. కడపకూ, తుంకూరుకూ మధ్య రేనాటి చోళశాసనాలు ఏవీ కనిపించకపోవడమే అందుకు కారణమని వారు చెప్పారు.

శ్రీనివాసాచార్యులుగారి అభ్యంతరం నిజమైనదేగాని వారు ఎరికల్లు ఎక్కడుంటుందో చెప్పలేదు. 'ఎరిగల్లు' అనే మాట మారి ఏవిధంగానూ నిడుగల్లు అనే రూపం సంపాదించుకోలేదు. అందుచేత ఎరిగల్లు అనే రూపానికి దగ్గరలో ఉన్న మాటకోసమే మనం వెతకాలి. 'ఎరిగల్' అనే పదానికి అర్థాన్ని నిర్ణయిస్తూ నీలకంఠశాస్త్రి, వెంకటరామయ్యగార్లు చేసిన చర్చలో 'ఎరిగల్' అనే మాటను 'ఇరిగల్' అని కూడ పిలిచేవారని శాసనప్రమాణాలు చూపారు. 'ఎరిగల్' మారి 'ఇరిగల్' అయినట్టే 'ఇరిగల్' మారి 'ఇరుగల్' అయి, 'ఇనుగల్లు'గా స్థిరపడవచ్చు. ఇనుమారు, ఇనుమడించు అనే మాటలలోని 'ఇను'కు రెండు, రెట్టింపు అనే అర్థాలు అందరికీ తెలిసినవే. 'ఇరుగల్లు' అనే పదం 'ఇనుగల్లు'గా మారిందని అంగీకరిస్తే ఈ గ్రామాన్ని గుర్తించడం ఏమీ అసాధ్యం కాదు. అది రేనాడులోనే ఉంది.

15. Journal of Indian History, Vol. 15

రేనాడే కాలక్రమాన మహారాజ పాడిగా మారి, మార్జావాడ అయిందని మొదటనే మనం తెలుసుకున్నాం. ప్రథమ రాజేంద్ర చోళుని కాలంనాటి తిరువల్లము గ్రామంలోని బిల్వనాథేశ్వరస్వామి ఆలయంలో ఉన్న తమిళ శాసనంలో[16] "మహారాజపాడిలోని ఇన్గల్లూరు నాడు" అనే వైనం ఉంది. ఈ సంగతి కుందూరి ఈశ్వరదత్తుగారు తమ 'ప్రాచీనాంధ్ర భూగోళం' (253-వ పుట)లో చెప్పారు. ఈ ఇన్గల్లూరు నేటి కాళహస్తి డివిజన్‌లో ఉన్న 'ఇనగళూరు' అని వారు గుర్తించారు.

ఈ ఇనగలూరే గనుక మన రేనాటిచోళుల జన్మస్థానమైతే వాళ్ళ మూల పురుషుడైన కరికాల చోళునికి కూడ అదే తొలిపట్టు అనడానికి ఆస్కారం లేకపోలేదు. భావరాజు వెంకటకృష్ణరావుగారు ఊహామాత్రంగా చెప్పినదానికి చారిత్రక సాక్ష్యాలు కూడ దొరుకుతాయేమో చూద్దాం. కరికాల చోళుడు ఓడించిన త్రిలోచన పల్లవునితో పల్లవ రాజ్యం తాత్కాలికంగా అణగారిపోయింది. దీనికి కారణం 'కళవర్లు' అనే భయంకరుల దండయాత్ర అని చరిత్రకారులు చెప్పారు. ఈ కళవర్లు ఎవరో, ఎక్కడ నుంచి దక్షిణాదికి దాడివెళ్ళారో తెలుసుకొందాం.

కళవర్లు: "తమిళ దేశానికి ఉత్తరాన ఉన్న దేశమంతటిలో ఒకప్పుడు కళవర్లు అనే జాతివాళ్ళు ఉండేవాళ్ళు. తూర్పున వేంగడం నుంచి పటమట మైసూరు రాష్ట్రపు పశ్చిమోత్తర సరిహద్దుదాకా వీళ్ళు విస్తరించి ఉండేవాళ్ళు. ఆంధ్రులు దక్షిణానికి వ్యాపించినందువల్ల ఈ కళవర్లు కూడ కదలవలసి వచ్చింది. ఈ కదలిక వల్లనే తొండమండలమనే కంచి చుట్టుప్రక్కల ప్రాంతాలను పాలించే రాజవంశాలకు అధికార భ్రష్టత్వం ఏర్పడింది. వివరాలన్నీ మనకు లభ్యం కాకపోయినా, ఇంకా దక్షిణాదిన కూడ రాజకీయ పతనాలు ఈ కళవర్లవల్లనే వచ్చాయి. ఈ కళవర్లు చోళ రాజ్యంలో స్థిరపడ్డారు. పాండ్య రాజ్యంలో కూడ నిలద్రొక్కుకున్నారేమో! క్రీ.శ. 4-వ శతాబ్ది ఆరంభించిన రోజులలో ప్రాచీన రాజకీయ పరిస్థితులను ఈ కళవర్లు సంపూర్ణంగా మార్చివేశారు. ఈ సంగతులు 'సంగం' యుగపు సాహిత్యంవల్ల తెలుస్తున్నాయి.[17]

కలభ్రులు: కళవర్లేకాక కలభ్రులు అనే జాతివాళ్ళుకూడ తమిళదేశపు రాజకీయ పరిస్థితులలో కల్లోలం కలిగించారు. క్రీ.శ. 550 ప్రాంతాలలో పాండ్య రాజ్యాన్ని పల్యాగశాలై - ముడుకుడిమి - పెరువళుడి పాండ్యరాజు పాలించేవాడు.[18] ఇతడు యజ్ఞయాగాలు చాలా చేశాడని 'పల్యాగశాలై' అనే అతని బిరుదే చెప్తున్నది. ఇతడు బ్రాహ్మణులకు ఊళ్ళూ, అగ్రహారాలూ దానం చేశాడు. కలభ్రుడనే కవిరాజు పాండ్య సామ్రాజ్యాన్నంతనీ ఆక్రమించుకొని అధిరాజులను తరిమివేసి అగ్రహారాలను సొంతం చేసుకొన్నాడు. కలభ్రులు నిర్దాక్షిణ్యంగా, భయంకరంగా రాజ్యానికి వచ్చారు. తర్వాత 'కొడుంగోన్' అనే పాండ్యరాజు కలభ్రులను పారదోలి అగ్రహారాలను మళ్ళీ బ్రాహ్మణులకు ఇచ్చివేసినట్లు శాసనాలవల్ల తెలుస్తున్నది. 'కొడుంగోన్' క్రీ.శ. 590-620

16. South Indian Inscriptions, Vol. III, page.106.

17. The Age of Imperial Unity, pp.233-34

18. Historical Sketches of Ancient Deccan - Subrahmanya Iyer (1917) p.109

దాకా పాలించాడు.[19] ఈ కలభ్రులనే సింహవిష్ణువు (క్రీ.శ.570-600), మొదటి నరసింహవర్మ (క్రీ.శ.630-666), తొలి ఇద్దరు విక్రమాదిత్యులూ (క్రీ.శ. 746 దాకా) గెలిచారని పల్లవ, చాళుక్య శాసనాల వల్ల తెలుస్తున్నది. రమారమి ఒకటిన్నర రెండు శతాబ్దాలు కలభ్రులు దక్షిణ దేశాన్ని అల్లకల్లోలం చేశారని నిశ్చయంగా చెప్పవచ్చు.

ఇంతకూ 'కలభ్రులు ఎవరు' అన్న ప్రశ్నకు సమాధానం కచ్చితంగా చెప్పడమనేది వీలుకాదు. ఈ జాతి నిర్ణయ సమస్య దక్షిణ భారత చరిత్రలో చాలా గడ్డు సమస్య. క్రీ.శ. 8-వ శతాబ్ది నుంచి 11వ శతాబ్దిదాకా కొడుంబాలూరు పాలించిన ముత్తరాయరు వంశీయుల పూర్వులే కలభ్రులని కొందరు గుర్తించారు. మరికొందరు వెల్లాల కులంలోని కళవర్లు కావచ్చునన్నారు. ఇంకొందరు కర్ణాటకులన్నారు. అయితే కలభ్రులూ, కళవర్లూ ఒకరేనన్న గుర్తింపే చాలా సమంజసమైనది. నేటి తిరుపతి ప్రాంతమైన ప్రాచీన వేంగడంలోని తిరైయర్, పవత్తిరి, పుల్లి అనే కళవర్ నాయకుల ప్రసక్తి తమిళ 'సంగం' వాఙ్మయంలో కనబడుతుంది. క్రీ.శ. 3-వ శతాబ్దిలో సాతవాహనుల పతనంవల్లా, పల్లవులు రాజ్యానికి రావడంవల్లా, సముద్రగుప్తుడు దక్షిణాపథంలో దిగ్విజయం చేయడంవల్లా రాజకీయ కల్లోలం ఏర్పడి తిరుపతి ప్రాంతంలో ఉండే కళవర్లు తమ నివాసస్థానాలను వదలిపెట్టవలసివచ్చిందేమో! కలభ్రుల దండయాత్ర దక్షిణ రాజ్యాలను కబళించి వేసింది.

కళవర్ నాయకులలో ఒకని పేరు తిరైయర్ అని సంగం వాఙ్మయం చెప్తున్నది. కరికాల చోళుని మనుమడు తొండమాన్‌కు తిరైయర్ అనే పేరు ఉండడం గమనించదగినది. ఈ కళవర్లందరూ తిరుపతి ప్రాంతాలవాళ్ళు కావడం, రేనాటి చోళుల జన్మస్థానం ఇనగలూరు ఉన్న కాళహస్తి ఇక్కడికి దగ్గరలోనిదే కావడమూ గమనించదగిందే. కరికాల చోళుని పేరులో ఉన్న 'కరి'కీ, 'కాళా'నికీ, 'కాళహస్తి'లోని 'కాళా'నికీ, 'హస్తి'కీ ఏమైనా సంబంధం ఉందా? మన కాళహస్తి స్థల పురాణంలో ఒక సాలెపురుగు ప్రసక్తి కూడ ఉంది. అలాగే కరికాల చోళుని వంశంలోని కొచ్చెంగణాన్ పూర్వజన్మలో సాలెపురుగు. ఈ సంగతి తమిళ శాసనాలలోనే ఉంది.[20] రాజేంద్రచోళుడు తన తిరువేళంగాడు శాసనంలో ఇది చెప్పాడు. ఇన్ని విషయాలు బాదరాయణ సంబంధాన్నేకాక రేనాటి చోళుల పూర్వీకులే దక్షిణాదికి వెళ్ళారనే అనుమానాన్ని దృఢం చేస్తున్నాయి.

శాసన ప్రమాణాలవల్ల తయారు చేసిన రేనాటి చోళుల వంశవృక్షంలో పదమూడు తరాలు అవిచ్ఛిన్నంగా తెలుస్తున్నాయి. ఇందులోని ముఖ్యులను గురించి టూకీగా చెప్పుకొందాం.

నందివర్మ (క్రీ.శ. 550): ఇతడు కాశ్యప గోత్రుడు. రేనాటి చోళులలో తెలియవచ్చిన మొదటి చారిత్రక పురుషుడు. ఇతనికి ముగ్గురు కుమారులు. పెద్దవాడు సింహవిష్ణువు. ఇటువంటి పేరు పల్లవ రాజులలోనేగాని చోళవంశీయుల్లో కనబడదు.

19. The Classical Age, p.266.

20. Ine Cholas - Prof. K.A. Nilakantha Sastri (1955). P. 51

అందుచేత ఈ పేరు చోళులు పల్లవులకు సామంతులనీ, తమ ప్రభువు పేరు తమ పిల్లలకు పెట్టుకొన్నారనీ తెలియజేస్తున్నది. సింహవిష్ణువు పేరే తప్ప అతని సంతానమెంతో, వాళ్ళు ఏయే కాలాలలో పాలించారో తెలియదు. నందివర్మ రెండవ కుమారుని పేరు సుందర నందుడు. ఇతని తరువాత ఇతని సంతతివాళ్ళను గురించి పన్నెండు తరాలదాకా ఊహించడానికి ఆస్కారముంది. ఇది రేనాటి చోళుల రెండవ కోవగా భావిద్దాం. నందివర్మ మూడవ కుమారుడు ధనంజయుని సంతతిని గురించే మనకు ఎక్కువగా తెలుస్తున్నది.

ధనంజయుడు (క్రీ.శ. 575) : ఇతనికి ఎరికల్ ముత్తరాజు అనే బిరుదు ఉన్నట్టు తెలుసుకొన్నాం. ఎరికల్ అనే మాట అర్థాన్ని చర్చించి అది కాళహస్తి డివిజన్‌లోని ఇనగలూరు అని తేల్చుకొన్నాం. ఇక ముత్తరాజు అనే బిరుదును గురించి తెలుసుకొందాం. పూర్వం రాజకుటుంబాలలో మహారాజు, యువరాజు, ముత్తరాజు అనే విభేదాలు ఉండేవి. మహారాజు రాజధానిలో ఉండి పాలిస్తాడు. అతని తర్వాత రాజ్యానికి వచ్చే వారసునికి యువరాజపట్టం కట్టేవారు. యువరాజు కాక మిగిలిన రాజకుమారులలో పెద్దవాణ్ణి ముత్తరాజు అని పిలిచేవారు. అంటే, యువరాజు తరువాత రాజ్యానికి రావడానికి అవకాశాలున్నవాడికే ఈ పట్టం ఇచ్చేవారు. రాజ్యంలో యువరాజు ఒక భాగాన్ని, ముత్తరాజు మరొక భాగాన్ని పాలిస్తుండేవారు. ఎరికల్ ముత్తరాజు ధనంజయుడు రేనాడు ఏలుతూండేవాడు. కమలాపురం తాలూకా కలమళ్ళ గ్రామంలోని చెన్న కేశవాలయం ప్రాంగణంలో ధనంజయుని శాసనం దొరికింది. దీని ప్రకారం అతడు చిరంబూరిలో ఉండే రేవణగారి ప్రోత్సాహంతో దానమిచ్చినట్లు తెలుస్తున్నది. బహుశా ఇతనిదే ఇంకొక శాసనం కమలాపురం ఎర్రగుడిపాడు చెన్నకేశవాలయంలో దొరికింది. ఇది ఆనాటి రాజకీయ చరిత్రను చెప్తుంది. ఈ శాసనంలో ఎరికల్లు ముత్తరాజు కుండికాళ్ళు అనే ఆయన సిపార్సు చేస్తే 'ఇరవాదియాదినాల్గు' మర్తురల కొలత ఉన్న నేలకోటలో ఉండే బ్రాహ్మణునికి దానం చేశాడు. 'ఇరవై ఆదినున్న నాలుగు' అని సంఖ్యను చెప్పడం ఒక విలక్షణం. ఈ దానానికి దుర్జయరాజుల ముత్తరాజులు, నవప్రియ ముత్తరాజులు, పల్లవ యువరాజులు సాక్షి అని శాసనం చెప్తున్నది. చోళుల శాసనాలలో పల్లవ యువరాజును పేర్కొనడంవల్ల బహుశా పల్లవులకూ, చోళులకు అధిరాజ సామంత సంబంధాలు ఉన్నాయని తెలుస్తున్నది. ఇందులోని దుర్జయరాజు కాకతీయ కొండ పడమటి వెలనాడు వంశాలకు మూలపురుషుడైన దుర్జయుడు కావచ్చు. నవప్రియ ముత్తరాజు ధనంజయుని కొడుకే కావచ్చు.

మొదటి మహేంద్ర విక్రముడు (క్రీ.శ. 600) : ఇతడు ధనంజయుని కుమారుడు. ఇతనికి నవరామముదిత శిలాక్షర, చేర చోళ పాండ్యాధిపతి అనే బిరుదులు వున్నాయి. సరిగ్గా ఇలాంటి సామంతులు తాము ఎవరికి అణకువగా వుంటారో ఆ రాజుల బిరుదులను ధరించడం అరుదు కాదు. మహేంద్ర విక్రముడు ఒక చిన్న రాజ్యానికి ప్రభువు. ఇతడు తమిళదేశంలో వున్న చేర చోళ పాండ్య దేశాలు జయించడం అసంభవం. తమకున్న అపార శక్తిసామర్థ్యాలతో బాదామి చాళుక్యులే ఇది సాధించలేకపోయారు. అందుచేత

మహేంద్ర విక్రమ చోళుడు పల్లవులకు సామంతుడై రాజ్యం ఆరంభించి ఉంటాడు. అయితే, ఇతని కాలంలో దక్షిణదేశ చరిత్రలో కల్లోలాలు రేగాయి. బాదామి చాళుక్య ప్రభువు పులకేశి పల్లవులపై దండయాత్రలు చేశాడు. ఇది అవకాశంగా తీసుకొని మహేంద్ర విక్రముడు తన స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నాడు. తనకు 'మహారాజ' బిరుదు పెట్టుకొన్నాడు అని నేలటూరి వెంకటరమణయ్యగారు వ్రాశారు. కాని పుట్టపర్తి శ్రీనివాసాచార్యులుగారు మహేంద్ర విక్రమ చోళుడు సామంతుడుగానే చనిపోయాడని భావించారు.

అయితే రేనాటి చోళులు ఎప్పుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నారు? మహారాజ పదవి ఎలా సంపాదించారు? ఈ చోళరాజ్యం ఎప్పుడు తలయెత్తింది? కంచిని పాలించిన పల్లవులకు ఈ ప్రాంతంపై అధికారం ఉండేదని మనకు తెలుసు. పల్లవుల ప్రాబల్యాన్ని ప్రతిఘటించి ఇంత చిన్న రాజ్యం విలసిల్లడం అసంభవం. పైగా ఈ రాజులు స్వతంత్రులైతే పల్లవుల పేర్లు పెట్టుకోవడంలో అర్థం లేదు. అయితే పల్లవులు ఈ రాజులను ప్రోత్సహించి ఉంటారు. కారణం ఏమంత నిగూఢమైనది కాదు. ఒక ప్రక్క గాంగులు, ఒక ప్రక్క చాళుక్యులు అప్పుడే ప్రవర్ధిల్లుతున్నారు. ఈ రెండు బలవంతమైన రాజ్యాలూ వృద్ధి చెందుతూ ఉండగా పల్లవులకు తమ రాజ్యంలోని ఈ దూరప్రాంతంపై పట్టు తప్పిపోతున్నది. రేనాడు జారిపోతున్నది. అందుచేత మహేంద్ర విక్రముడు 'చోళ మహారాజు' అనే బిరుదుతో శాసనాలు వేయగలిగి ఉండేవాడని పుట్టపర్తివారి అభిప్రాయం. వీరి ఉద్దేశంలో మహేంద్ర విక్రముని కుమారుడు పుణ్యకుమారుడు స్వాతంత్ర్యం ప్రకటించుకొన్న చోళరాజు.

పుణ్యకుమారుడు (క్రీ.శ. 625): ఇతడు రేనాటి చోళులలోకెల్లా ఎన్నదగిన వాడు. ఇతనికి పోర్ముఖరామ, పురుష శార్దూల, మదనవిలాస, మదముదిత, ఉత్తమోత్తమ అనే బిరుదులున్నాయి. ఇతని భార్య పేరు వసంతపోరి. పుణ్యకుమారుడు కూడ పల్లవులకు సామంతుడుగానే రాజ్యానికి వచ్చి ఉంటాడుగాని ఆనాటి రాజకీయ కారణాలవల్ల స్వాతంత్ర్యం ప్రకటించుకొని ఉంటాడని పుట్టపర్తి వారి భావం. ఏమంటే, ఇతని బిరుదులలో కొన్ని పల్లవులకు సంబంధించినవి.

బాదామిని పాలించిన రెండవ పులకేశి క్రీ.శ. 630లో దక్షిణ దిగ్విజయయాత్ర చేశాడు. పల్లవులను ఓడించాడు. దారిలో ఉన్న రేనాటి చోళులతో బాంధవ్యం నెరపుకొని ఉంటాడు. పుణ్యకుమారుడు చాళుక్యుల అల్లుడైనాడనడానికి ఆస్కారముంది. పులకేశి దండయాత్రకు ముందు అతడు తన స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని, మహారాజ్యాధిపతి అనే గౌరవాన్ని నిలబెట్టుకొన్నట్లు కనబడుతుంది. ఇతని భార్య చెక్కించిన ఒక శాసనంలో ఇతనికి పృథ్వీవల్లభ, చోళ మహారాజ అనే బిరుదులున్నట్లు తెలుస్తుంది.

ఈ బిరుదులు గమనించదగినవి. ఇవి అతని రాజ్యాధికారపు పెంపును సూచిస్తాయి. రేనాటి చోళులు బాదామి చాళుక్యుల ప్రాభవంలోనికి వచ్చారని ఇవి సాక్ష్యమిస్తాయి.

'పృథ్వీవల్లభ' అనే బిరుదు చాళుక్యులకు ప్రత్యేకమైన బిరుదు. పుణ్యకుమారుని కాలంలోనే ఇది మొదటిసారిగా చోళుల శాసనాలలో కనబడుతుంది. అందుచేత ఆ కాలంలోనే చోళులకు, చాళుక్యులకు సంబంధ బాంధవ్యాలు ఏర్పడినట్లు తెలుస్తున్నది. ఇందాకా మనం ఊహించినట్లు పుణ్యకుమారుడు బహుశా తన భార్య వసంతపోరివల్ల చాళుక్యులకు చుట్టమై ఉంటాడు. 'పోరి' అనే మాట చాళుక్య రాజకుమార్తెలలోనే తప్ప ఇంకెక్కడా కనబడదు. రెండవ పులకేశి కుమారుడు చంద్రాదిత్యుని రాణి పేరు విజయమహాదేవిపోరి. తూర్పు చాళుక్యరాజు మంగి మహారాజుకు పృథివిపోరి అనే కుమార్తె ఉంది. అందుచేత పోరి అనే మాట బాదామీ, చాళుక్య వంశాలకు ప్రత్యేకమైందని స్పష్టమవుతున్నది.

పుణ్యకుమారుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నాక తన పూర్వీకుడైన కరికాల చోళునిలాగ 'త్రైరాజ్య స్థితిని' పొందినట్లు చెప్పుకొన్నాడు. ఇతని శాసనాలవల్లా, ఇతని భార్య శాసనాలవల్లా మన ప్రాచీనాంధ్ర భాష స్థితి మరి కొంచెం ఎక్కువగా స్పష్టమవుతున్నది.

ఈ రేనాటి చోళుల చరిత్రను ఇంతకన్నా విపులంగా - అన్ని పురుషాంతరాలవాళ్ళవైనాలూ మనం తెలుసుకోవలసిందేకాని, మనం ఇప్పుడు ఈ సంపుటాలలో సాహిత్య చరిత్రనేగాని దేశచరిత్రను చెప్పుకోవడం లేదు. ఏ ఇతర ప్రామాణిక గ్రంథాలలోనూ రేనాటి చోళులను గురించి ఈమాత్రమైనా చెప్పరు గనుక తెలుసుకున్నాం. నాలుగు తరాలవరకూ వివరాలు ఆకళించుకొన్నాం. మిగతా తరాల వ్యక్తుల పేర్లూ, తారీఖులూ వున్న వంశవృక్షం చూసి తృప్తిపడదాం.

రేనాటి చోళుల వంశవృక్షం

(సూర్యవంశం)

కరికాల చోళ

1-వ తరం: నందివర్మ - కశ్యపగోత్రం (క్రీ.శ. 550)

2వ తరం: సింహవిష్ణు (క్రీ.శ. 575) | సుందరనంద (క్రీ.శ. 575) | ధనంజయ (క్రీ.శ. 575)

3వ తరం: నవరామ (క్రీ.శ. 600) [సుందరనంద కుమారుడు] | మొదటి మహేంద్ర విక్రమ నవరామ ముదిత శిలాక్షర చేర చోళ పాండ్యాధిపతి (క్రీ.శ. 600) [ధనంజయ కుమారుడు]

4వ తరం: ఏరెయమ్మ (క్రీ.శ. 625) [నవరామ కుమారుడు] | గుణముదిత (క్రీ.శ. 625) | పుణ్యకుమార వసంత పోరి చోళమహారాణి భర్త, పోర్ముఖరామ, పురుష శార్దూల, మదనవిలాస, మదముదిత, ఉత్తమోత్తమ బిరుదాంకితుడు (క్రీ.శ. 625) [మహేంద్ర విక్రమ కుమారులు]

5వ తరం	విజయకామ (క్రీ.శ. 650)	మొదటి విక్రమాదిత్య (క్రీ.శ. 650)
6వ తరం	వీరార్జున (క్రీ.శ. 675)	శక్తికుమార (క్రీ.శ. 675)
7వ తరం	అగ్రణి పిడుగు (క్రీ.శ. 700)	రెండవ విక్రమాదిత్య చోళమహారాజు చోళమహారాణి భర్త (క్రీ.శ. 700)
8వ తరం	కోకిలి (క్రీ.శ. 725)	ఉత్తమాదిత్య (క్రీ.శ. 725); సత్యాదిత్య (క్రీ.శ. 725)
		బాణరాజుల పితూరీ
9వ తరం	రెండవ మహేంద్ర (క్రీ.శ. 750) మానరవి, మారుఊపిడుగు	
10వ తరం	ఎళంబోళ (క్రీ.శ. 775); కాపిచోళ ముత్తరాజు (క్రీ.శ. 775)	పృథ్వీవల్లభ - విజయాదిత్య చోళ (క్రీ.శ. 750)
11వ తరం	నృపకామ (క్రీ.శ. 800)	
12వ తరం	దిహికర (క్రీ.శ. 825)	
13వ తరం	శ్రీకంఠ అధిరాజ (క్రీ.శ. 850)	

ఇక - మనకు సాహిత్య చరిత్ర ముఖ్యం కనుక రేనాటి చోళుల శాసనాలవల్ల ఆనాటి భాషాస్వరూపం, వాక్యనిర్మాణం మొదలైన వివరాలు తెలుసుకొందాం.

తెలుగు శాసనాలు

రేనాటి చోళులతోపాటు తెలుగులోనే తమ శాసనాలు వేయించిన ప్రశంసనీయులు బాణరాజులు, వైదుంబులు. ఈ రాజవంశాలవాళ్ళ చరిత్రలు కూడా చెల్లాచెదురుగానే ఉన్నాయి. వాటిని కూడ క్రోడీకరించవలసిన అవసరం ఉన్నది. ఇప్పటిదాకా ఇటువంటి రెండవశ్రేణి రాజకుటుంబాల చరిత్రపట్ల ఎవరూ శ్రద్ధకనబరచకపోవడానికి కారణం నన్నయగారికి పూర్వమున్న తెలుగు శాసనాలన్నీ ప్రకటింపబడకపోవటమే. శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు తమ 'ఆంధ్రవచనవాఙ్మయము' అనే గ్రంథంలో ఇటువంటి ప్రాచీన శాసనాలను లెక్కకు నూరింటిని బేరీజు వేశారు. కొన్ని శాసనాలను సంపూర్ణంగా ఇచ్చారు. గ్రంథవిస్తర భీతిచే కొన్నింటిని వదిలిపెట్టేశారు. వారు చెప్పినట్లు "ఆనాటి భాషాస్వరూపమును, సాంఘిక వ్యవస్థను కొంతవరకైనను తెలిసికొనుటకీ శాసనముల సమగ్ర పరిశీలన మావశ్యకము. ఈ శాసనములంతకుముందే ప్రకటితములై

నను నవి యన్నియు నొక్కచో లేనందున పరిశోధనకు, భాషయందు కృషి చేయువారికి ప్రాచీన రచనాస్వరూపము దురవగాహమగుచున్నది.''

దొరికినంతమటుకు రేనాటి చోళుల మొత్తం 33 శాసనాలలోనూ ప్రాచీనమైనది ధనంజయుని కలమళ్ళ శాసనం. దీని కాలం క్రీ.శ. 575. ఆనాటి తెలుగు ఎలా ఉంటుందో చూడండి :

1. ....
2. కల్ ము(తు)రా
3. జు ధనంజ
4. యన్ఱు రేనా
5. ణ్డు ఏళన్
6. చఱుమ్బూరి
7. రేవణకాలు(పం)
8. పు చెనూరుకాజు
9. అళిక ళా(ఊ)రి
10. ణ్డవారు (ఊరి)
11–14. (నాలుగు పంక్తులు శిథిలం)
15. ... పంచ(మ)
16. హాపాతక శ
17. కు.

ఈ శాసనంలోని మొదటి పంక్తి లోపించినా అందులో ''స్వస్తిశ్రీ ఎఱి'' అనే అక్షరాలు ఉంటాయి. వివిధ శాసనాలలోని బిరుదులు, పేర్లు, విషయాల క్రమాన్నీ పరిశోధించే విద్వాంసులు ఇటువంటి పూరణలు చేస్తూ ఉంటారు. ఈ శాసనంలోనే 2వ పంక్తిలో బ్రాకెట్టులో వున్న 'తు' అనే అక్షరాన్ని గమనించండి. అలాగే 7-వ పంక్తిలోని 'పం', 9-వ పంక్తిలోని 'ఊ' మొదలైనవన్నీ శాసన పరిశోధకులు పూరించిన అక్షరాలు. కొన్ని పంక్తులు పూరించడానికి కూడ వీలులేనంతగా శిథిలాలు అవడంచేత అక్కడ ఊహాగానం చేయకుండా వదిలివేశారు.

ఈ రేనాటి చోళుల శాసనాలలోనే, ఉన్నంతవరకూ పరిపూర్ణంగా ఉన్నది - పుణ్యకుమార చోళమహారాజుల రామేశ్వర స్తంభ శాసనం. ఇందులో పరిశోధకుల పూరణలు కూడ చాలా తక్కువ. శాసనాన్ని చూడండి:

1. స్వస్తిశ్రీ పో.
2. మ్ముగ్ఖ రామపుణ్యకు
3. మార ప్రిథివీ వల్లభ
4. చోళ మహారాజులకు

5. ప్రవర్ధన్ మాన వి
6. జయరాజ్య సంవత్సరమ్బుళ్ యే
7. నగు నాణ్డు వసంతిపోఱి
8. చోళమహాదేవులు తారు
9. ముణ్డి వసంతీశ్వరమ్బున పూళ్ళ
10. వట్టమ్బున వారికి విరిపఱి
11. తి పులొమ్బున రెణ్డు తోటలు
12. (రి) హితమ్బు రాచమానమ్బున
13. మున్నూఱు నేల మా
14. ఱ్పిడుగు రట్టగుళ్ల
15. అనతిగాను వసన్తీశ్వ
16. రమ్బున కిచ్చినది (1) దీ
17. (ని)కి వక్రమ్బు వచ్చువా
18. న్డు (గళ) రేని బార
19. నాసి వేరువు పాఱి
20. జమ్పినవాన్డు గట్టు
21. విరిపఱితిక మ్మ (రి) విని
22. యన వ్రాసె.

ఈ శాసనాన్నే ఈనాడు మనం వ్రాసుకొనే మాదిరిగా వ్రాస్తే ఇలా ఉంటుంది:

> ''స్వస్తిశ్రీ పోర్ముఖనామ పుణ్యకుమార పృథివీవల్లభ చోళ మహారాజులకు ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబులు యేనగునాఁడు వసంతిపోఱి చోడమహాదేవులు తాము ముంఁడ్రివసంతీశ్వరమున పూళ్ళ వట్టంబున వారికి విప్పర్తి పొలమున రెండుతోటలు రిహితంబ రాచమానమ్మున మున్నూరు నేల మార్పిడుగు రట్టగుడిగాను వసంతీశ్వర మ్మున కిచ్చినది. దీనికి వక్రము వచ్చు వాళ్ళుగల రేని వారణాసి వేవురు పాఱు(ల) జంపినవాళ్ళు గట్టు: విప్పర్తి కమ్మరి వినియన వ్రాసె''

ఈ శాసనంలోని మాటలు కొన్ని మనకు ఏమీ బోధపడవు. చారిత్రక పరిశోధకులు విడమర్చి చెపితేగాని తెలియవు. కొన్ని ఈనాటి వర్ణక్రమంలోనికి మార్చి వ్రాస్తే రకీమని తెలిసిపోతాయి. 'ప్రిధివి' అనే మాటను 'పృథివి' అని వ్రాసుకొంటేనేగాని ఇవాళ చాలామందికి ఇదేమిటో వెంటనే తట్టదు. కొందరు తెలుగువాళ్ళు 'ఋ'కారాన్ని 'రు'కారంగా ఇప్పుడు ఉచ్చరిస్తున్నా, ప్రాచీనకాలంలో 'రి' కారంగానే పలికేవారు. ఇప్పటికీ ఇతర భాషలవాళ్ళు అలాగే ఉచ్చరిస్తున్నారు. మనం వ్రాతలో సరిగ్గా వ్రాసినా 'గృహప్రవేశం' 'క్రుతజ్ఞత' లాంటి ఉచ్చారణలు ఇవాళా చేస్తున్నాం.

పై శాసనంలో పేర్కొన్న పుణ్యకుమారునిదే ఇంకొక శాసనం ఉంది. దీనిని 'పొట్లదుర్తి-మాలెపాడు శాసనం' అంటారు. ఆ రెండు గ్రామాల మధ్య దొరకడంచేత దానికి ఆ పేరు పెట్టారు. దీనిని మల్లంపల్లి సోమశేఖరశర్మగారూ, నేలటూరి వెంకటరమణయ్యగారూ కలిసి సంపాదించారు. ఆ ప్రాంతాల శాసనాలన్నీ ఎఱ్ఱరాళ్ళమీదే చెక్కడం వాడుక. ఇది కూడా ఎఱ్ఱరాతిమీదే చెక్కి ఉన్నది. దీనికి ప్రతిబింబాన్ని తీసి, రాతిదగ్గరే కూర్చొని చదివి కొంతవరకు శాసనపాఠాన్ని సరిచూసుకొన్నారు. గిడుగు రామమూర్తిగారి సప్తతి తమ జన్మదినోత్సవ సంచికగా ప్రకటించిన 'వ్యాససంగ్రహం'లో ఈ శాసనాన్ని సోమశేఖరశర్మగారు ప్రకటించారు. శాసనం చిన్నదేగాని ప్రాముఖ్యం గొప్పదే చూడండి ఆ శాసనం :

1. స్వస్తి (॥*) శ్రీసోటమహారాజు ల్లొళన ఇన్పు టొలి
2. అణపొతులు రేవణకాలు పుద్ధణకాలు ఇచ్చిన ప
3. న్నస పెన్బాఴ ఇశఴేనికిౝ (॥) తేని అచ్చినవాన్ఴ(ప)
4. (క్బ*) మహాపా(త) న్ఴ కుౝ (।*)
5. అసివై హువు లికితమ్ (॥*)

ఈ శాసనంలోని ఴ అనే అక్షరాన్ని 'ష' అని ఉచ్చరించాలని శర్మగారు సూచించారు. ఇటువంటి ఉచ్చారణ నేటికీ తమిళంలో ఉంది. ఆ అక్షరాన్ని వాళ్ల 'ழ' అని వ్రాసుకొంటారు. మన ప్రాచీన శాసనాలలో ఇది చాలాసార్లు కనబడుతుంది. ఈ అక్షరంతో ఉండే మాటలలో అది క్రమంగా కొన్నిటిలో 'ళ'గానూ, మరికొన్నిటిలో 'డ'గానూ, ఇంకా కొన్నిటిలో బండిరాగానూ మారిపోయింది. నన్నయగారి కాలం నాటికే ఆ అక్షరం గాని, దాని ఉచ్చారణగాని ప్రచారంలో లేదు.

ఈ శాసనానికి అర్థం ''చోళమహారాజు ఒప్పుకొంటే ఇనుప్రోలు అనే గ్రామంలోని రేవణగారు, వుద్దణగారు అనే కులపు పెద్దలు పెద్ద బ్రాహ్మణుడు 'ఇశరేడు' గారికి ఇచ్చిన పన్నస ఇది. దీనిని చెరిచేవాడు పంచ మహాపాతకుడౌతాడు. ఇది అసివైరువు అనేవాడు రాశాడు.''

ఇవాళ మనం 'గారు' అని మర్యాదసూచకంగా వాడే మాటకు పూర్వం 'కాలు' అనే రూపం వుండేది. ఈ శాసనంలో ''ఒల్లన అన్న పదానికి 'పల్లె అన' అనే అర్థం చెప్పుకోవాలి. 'ఒల్లన' అనే మాటలోని 'ఒల్ల' అనే రూపం ప్రస్తుతం శిష్టుల వ్యవహారంలో లేకపోయినా పామరుల వాడుకలో ఉంది. నేటికీ విశాఖపట్నం జిల్లాలో విద్యాగంధం లేనివాళ్ళు ''నాను ఒల్లకోను, నువ్వొల్లకోరా'' అని ప్రయోగిస్తున్నారు.

అయితే 'ఒళన' అనేది 'లోన' అనే మాటకు ప్రాచీన రూపమని పరిశోధకులు భావిస్తున్నారు. ఇదే సమంజసమైన 'చోళ మహారాజులు ఒప్పుకొంటే' అని అర్థం చెప్పుకోవాలి.

ఈ శాసనంలో 'ఇశరేడు' అనే వ్యక్తి పేరు గమనించదగినది. 'రేడు' అంటే రాజు అని అందరికీ తెలుసు. ఇక 'ఇశ'కు అర్థం ఏమిటి? తమిళంలో 'ఇశై' అంటే సంగీతమని అర్థం. మన తెలుగులోనూ ప్రాచీన కాలంలో అదే మాట ఉండేదేమో! ఇశరేడు అనేది సంగీత సామ్రాట్టువంటి బిరుదు కాకపోయినా ఆ పేరున్నవాడికి సంగీతాన్నిబట్టే అది పెట్టి ఉంటారు. కంపనం, చలనం అనే అర్థంలో 'ఇసిఱింతలు' అనే మాట మన కోశాలలో ఉంది.

సంఘం - సంప్రదాయాలు

రేనాటి చోళుల శాసనాలవల్ల ఆనాటి సాంఘిక విషయాలు కొన్ని తెలుస్తాయి. ఆ రోజుల్లో సూర్యుణ్ణి ఆరాధించేవారు. దేవాలయాల్లో ఆదిత్యగ్రహాన్ని నిలపడం ఉండేది. శ్రీ పర్వతం పుణ్యతీర్థంగా, వారణాసికి సమానంగా ప్రసిద్ధికెక్కింది. దేవాలయాలలో దీపాల కోసం నూనెగానుగలను దానం చేసేవారు.[21] నేటి 'రెడ్డి'ని ఆనాడు 'రట్టగుడి' అనేవారు. ఇది ఒక పదవి. దీనికి కూడ పట్టం కట్టడమనే ఆచారం ఉండేది. ''గంగరట్టగుళ్ళు నుఱ్ఱుమ్మవల్లవ రట్టగుడి పట్టంబు గట్టి నిల్పి'' అని ఒక శాసనంలో ఉంది.[22]

ఆనాటికి మన భాష ఇంకా పూర్తిగా మూలద్రావిడంతో నిండిపోలేదనుకోవాలి. అరవ భాషలో నేటికీ కుమారుడు అనే మాటకు 'మగన్' అనే పదం వాడుతారు. రేనాటి చోళుల కాలంలో ఇదే కొడుకు అనే అర్థంలో 'మగన్రు' అనే మాట ఎన్నోసార్లు ఉపయోగించారు. ఈ పదంలోని 'రు' అనే ప్రత్యయం గౌరవసూచకమైన బహువచన సంకేతం అనిపిస్తుంది. నేటికీ ఇది కన్నడంలో ఉంది. మనం కూడ పుస్తకాలలో దీనిని 'ళ' కార 'ల' కారాల తర్వాత బహువచన ప్రత్యయంగా వాడుతున్నాం. బాలురు, కృపాళురు, దయాళురు అనే పదాలలో 'రు'నే విధిగా వాడాలని వ్యాకరణ నిమయం. నన్నయగారి కాలం తరువాత కూడ ఇది వాడుకలో ఉంది. పండితారాధ్యుడు భేతాళురు, అవినీతులరు అనే మాటలు వాడాడు. బహుశా మగన్రులోని బండిరా 'రు'కు కాక 'డు'కి చిహ్నాం కావచ్చు.

రేనాటి చోళుల కాలంలో కూడ దేవాలయాల సొత్తును 'కైంకర్యం' చేసేవాళ్ళు ఉండేవారు. ''దేవస్వంములఱ్చంబు గొణ్ణవాన్రు వారనాశి వచ్చిన పాపంబు గొణ్ణ వాన్రు'' అని ఒక శాసనంలో ఉంది.[23] అంటే ''దేవుడి సొత్తు లంచం తిన్నవాండ్లు కాశిలో చంపిన పాపం కట్టుకొనేవాళ్ళు'' అని అర్థం. ''ఎంత యేనియు ఱోగొన్నవాన్రు, ఇచ్చిన వాన్రు చెడువాన్రు'' అని మరొక శాసనంలో ఉంది.[24] అంటే ''ఎంత మాత్రం లంచం ఇచ్చినా, పుచ్చుకొన్నా నాశనమవుతారు.''

21. దక్షిణ భారత శాసనాలు, పదవ సంపుటి, నెం.593
22. దక్షిణభారత శాసనాలు, పదవ సంపుటి, నెం. 6
23. అదే పుస్తకం, అదే సంపుటి నెం. 611
24. దక్షిణ భారత శాసనాలు పదవ సంపుటి నెం. 612

ఆ రోజుల్లో కృష్ణపక్షాన్ని 'చీకు' అనీ, శుక్ల పక్షాన్ని 'పెంపు' అనీ తెలుగు మాటలతో వ్యవహరించేవారు. నెలలను కూడ పూర్తిగా తెలుగు పేర్లతోనే పిలిచేవారు 'చిట్టది' అని జ్యేష్ట మాసాన్ని వ్యవహరించేవారు.[25] నేటికీ మన రైతులు జ్యేష్టను 'చిట్టె' అని పిలుస్తారు. డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తిగారు సంకలనం చేసిన 'మాండలిక వృత్తిపద కోశం' ప్రథమ సంపుటిలో ఇటువంటి తెలుగు మాటలు వున్నాయి. వీటిని రేనాటి శాసనాలతో తైపారు వేస్తే ఇలాంటి విశేషాలు తెలుస్తాయి. ఇతర నిఘంటువులలో ఈ మాటలు వుండవు.

రేనాటి చోళుల కాలమానంలో కార్తెలు కూడ ఉండవేమో అనే అనుమానానికి ఆస్కారంగా 'కొండకార్తియ' అని ఒకమాట పుణ్యకుమారుని తిప్పలూరి శాసనంలో వుంది. ఇరవై ఏడు నక్షత్రాలకూ ఇరవై ఏడు కార్తెలున్నా, మన రైతులు కొన్ని కార్తెలను నక్షత్రం పేరుతో కాక వేరే సంకేతాలతో పిలుస్తారు. ఉదాహరణకు : అశ్వనికార్తెను చింతపోవు కార్తె అంటారు. రేనాటి చోళుల కాలంలో కొండకార్తె దేనికో సంకేతమై వుంటుంది అని ఊహాగానం చేయవచ్చునుగాని, ఈ మాటలను పండితులు కొండ, కార్తియ అని విడివిడిగా చదువుతున్నారు. కొండ అనే మాటకు 'కొనిన' అని అర్థం చెప్పి 'కార్తియ'ను కార్తీక మాసమని వివరించారు. ఆనాడు శాస్త్రీయ జ్యోతిష పంచాంగం కూడ వాడుకలో వుండేదని ఆ శాసనం వల్లనే తెలుస్తున్నది. ''కొండకార్తియ చీకున విదియ సోమవారమ్బు పుణరు పుష్యమ్బు బ్రహస్పతి హోరకాను'' అని తిథి వార నక్షత్రాలూ, హోరాకూడ పేర్కొన్నారు : ఆనాడూ ప్రాంతీయ వాతావరణ సంబంధమైన పండుగలు ఉండేవి. ఏరువాక పున్నమి పర్వదినం.[26] శైవమతంలో లకులీశ పాశుపతశాఖ నాటికే వుంది. రేనాటి చోళులు లకులీశ ఆరాధన చేసేవారు.[27]

ఆనాడు వీరమరణం పొందినవాళ్ళ జ్ఞాపకార్థం 'కల్లు' ప్రతిష్ఠించేవారు. మల్లులను పొడిచి చచ్చినవాడికి కూడ ఒక వీరగల్లు వేశారు.[28]

రేనాటి చోళుల తర్వాత ఆ ప్రాంతాన్ని వైదుంబులు పరిపాలించారు. వీళ్ళుకూడ తెలుగులో శాసనాలు వేయించారు. ఇతర రాజులు 'దత్తి', 'పన్నస' మొదలైనవి ఇస్తూ బ్రాహ్మణులకూ, దేవాలయాలకూ దానాలు చేసినట్టు శాసనాలు వేయిస్తే, వైదుంబరాజుల కాలంలో ఎక్కువగా వీరుల జ్ఞాపకార్థం వేయించినవే కనబడతాయి. వైదుంబ మహారాజుల బిరుదులోనే ఈ 'యుద్ధప్రీతి' కనబడుతుంది. అతని శాసనాలలో ''అనేక సమర సంఘట్టనోపలబ్ధ జయలక్ష్మీ సమాలింగిత వక్షస్థల గండత్రినేత్ర శ్రీ వైదుంబ మహారాజు'' అనే సమాసం మొదటనే ఉంటుంది.

---

25. వెంకయచోడుని దొంగలసాని శాసనంలో ''నేణ్టి చిట్టది పెంపున'' అని ఉంది. ఈ శాసనాన్ని త్రిలింగ రజతోత్సవ సంపుటంలో ముట్లూరి వెంకటరామయ్యగారు ప్రకటించారు.
26. దక్షిణ భారత శాసనాలు, పదవ సంపుటి, నెం. 695
27. పుణ్యకుమారుని దొమ్మరనంద్యాల తామ్రశాసనం - ఎపిగ్రాఫియా ఇండికా, సంపుటి 27, నెం. 44.
28. ద.భా.శా. 10-వ సంపుటి, నెం.624

వైదుంబ మహారాజులు సలిపిన సమరాలలో వాళ్ళ వీరులు కొందరు ఒరిగారు. కొందరు పాఱలకు, పసులకు పొడిచినవారు. అంటే బ్రాహ్మణుల కోసం, గోవుల కోసం యుద్ధం చేశారు.[29] కొందరు శూరగతి నడిచి అమరలోకం పోయారు.[30] ఒకడు ఏదో మఱొక్క కయ్యంబున ఏనుగును తాకి పొడిచి పడ్డాడు.[31] ఇంకొకడు ''అలిగి గుఱంబుపడి గిర...డి తలగొని కొట్టంబు వజ్జిరాజుబలంబు ఓడఁ గఱగించి.... సురలోకం బేగె.[32] ఉత్తరోత్తరా అందరు తెలుగు రాజుల శాసనాలలోనూ తరచుగా కనిపించే మహారాజు ప్రిధివిరాజ్యం చేయగాను'' అనే మాటలు మొదట ఈ వైదుంబరాజుల శాసనాలలోనూ కనబడతాయి.

ఈ వైదుంబరాజుల శాసనాలలో మరొక విలక్షణత వుంది. శాసనం కొంత తెలుగులోనూ, కొంత కన్నడంలోనూ వ్రాయించడం కూడ వుంది. ఆనాడు అధికారిక భాష కన్నడం కావడంవల్ల అలా జరిగిందనుకోవాలి.

బాణరాజులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు మొదలైన రాజవంశాలవాళ్ళు కూడ తెలుగులో శాసనాలు అదే కాలంలో వేయించారు. ఒక్కొక్క శాసనం ఒక్కొక్క కొత్త విషయాన్ని మనకు చెబుతుంది. వీటన్నిటిని శ్రద్ధగా పరిశీలించి క్రోడీకరిస్తే ఆనాటి సాంఘిక చరిత్రా, భాషా చరిత్రా తెలుస్తుంది. మన నుడికారపు పుట్టుపూర్వోత్తరాలు తెలుస్తాయి.

ఇవాళ మనం ఏడుకొండలవానిని ''ఆపదమ్రొక్కులవాడు, అడుగడుగు దండాలవాడు'' అంటాం. ఈ 'అడుగడుగు' అనే నుడికారం నన్నయగారికి పూర్వమే మొదలైంది. నలంజపాడు శాసనంలో ''అడుగడు గశ్వమేధంబున ఫలంబగు'' అని వుంది.

ఈ శాసనాలవల్ల ఆచార వ్యవహారాల పుట్టుపూర్వోత్తరాలు కూడ తెలుస్తాయి. ఈనాడు 'బోయ' అన్న మాట గొల్లలకే వర్తిస్తుందిగాని, ప్రాచీనకాలంలో బ్రాహ్మణులకు కూడ బోయలుండేవారు. 'బోయ' అన్నది 'భోజ' శబ్దం నుంచి పుట్టింది. 'భోజకులు' అంటే ఊరిపెద్దలు - గ్రామ ప్రముఖులు. రాజాధికార పురుషులలో వీళ్ళొకరు. 'ముదుగొండబోయ దుగ్గశర్మ' మొదలైన ప్రయోగాలు శాసనాలలో కనబడతాయి. 'గౌడ' అనే పదానికి ప్రాచీన కాలంలో గౌరవం వుండేది. గ్రామకుడి అనే మాట గామకుడి, గామోడ, గాముండ, గావుండ, గౌండ అయి ఇవాళ గౌడ అయింది.

నన్నయగారికి పూర్వం ఉండే శాసనాలను బాగా పరిశీలించి, వాటి ద్వారా తెలిసే భాషాస్వరూపాన్ని పరీక్షించిన కొద్దిమందిలో డాక్టరు దివాకర్ల వెంకటావధానిగారొకరు, వారు తమ 'ప్రాఙ్నన్నయయుగము'లో 'చాళుక్యయుగంనందలి భాష' అనే శీర్షికతో 188

29. దక్షిణ భారత శాసనాలు, పదవ సంపుటి. నెం. 622
30. అందులోనే నెం. 624
31. అందులోనే నెం. 632
32. అందులోనే నెం. 639

పేజీల సుదీర్ఘ అధ్యాయం వ్రాశారు. అందులో ఎన్నో వ్యాకరణ విషయాలు చర్చించారు. అది సాహిత్య పరిశోధకులకు సహాయకారి అవుతుంది. ఆలోచనలు రేపుతుంది. బూదరాజు రాధాకృష్ణగారు 1971లో 'ప్రాచీనాంధ్ర శాసనాలు' అనే గ్రంథంలో 'నాగబు' దగ్గర్నుంచి క్రీ.శ. 1100 వరకు లభ్యమైన శాసనాల ప్రతులు తయారు చేశారు. కొన్ని కొన్ని పదాలకు అర్థనిర్ణయం చేశారు. 'నన్నయ పదప్రయోగ సూచిక'ను వేయించినట్టే మన సాహిత్య అకాడమీ వారసులవంటివారు ప్రాఙ్నన్నయ పదాల పట్టికను, నిఘంటువును తయారు చేయించాలి. అప్పటికిగాని ప్రాఙ్నన్నయ భాషాస్వరూపం మనముందు సాక్షాత్కరించదు.

గద్యంలోనే పద్యం

ఈ గద్యశాసనాలలో ఛందోబద్ధంగా ఉన్న కొన్ని పంక్తులు కనబడతాయి. పుణ్యకుమారుని పొట్లదుర్తి మాలెపాడు శాసనంలో 'ద్విరదగతి రగడ' ఉందని దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు వ్రాశారు. వెంకయచోడుని దొంగలసాని కనుమశాసనంలో 'మహాక్కర' ఉందని ముట్లూరు వెంకటరామయ్యగారు ఊహించారు. వీటినీ, ప్రాఙ్నన్నయ గద్యశాసనాలలో ఛందోబద్ధమైన భాగాలనూ ఒక పదమూడింటిని వెంకటావధానిగారు చర్చించారు. అయితే కొన్నింటిలో యతి ఉంటే ప్రాస ఉండదు; ప్రాస ఉంటే యతి ఉండదు; రెండూ ఉంటే గణాలు సరిపోవు. ఈ పంక్తులలో ఛందోవాసనలు ఉన్నాయని తృప్తిపడాలేగాని, సంపూర్ణంగా సలక్షణమైన ఛందోబద్ధశాసనాలు మనకు గుణగ విజయాదిత్యుని కాలంలో - క్రీ.శ. 848 నుంచే కనబడతాయి.

చాళుక్యుల చేయి

తెలుగుదేశాన్ని చాళుక్యరాజు గుణగవిజయాదిత్యుడు పాలిస్తూ ఉండిన సమయంలో కన్నడ దేశాన్ని రాష్ట్రకూట చక్రవర్తి అమోఘవర్ష నృపతుంగుడు పాలించేవాడు. ఈయన గుణగ విజయాదిత్యునికి మేనమామ. అయినా ఈ రెండు రాజ్యాలవాళ్ళకూ విరోధముండేది. చెప్పుకోదగ్గ యుద్ధాలూ జరిగాయి. ఈ యుద్ధాలు కత్తిపట్టే కాక గంటం పట్టుకొని కూడ జరిగాయనవచ్చు. నృపతుంగుడు కన్నడంలో 'కవిరాజమార్గ' మనే లక్షణగ్రంథాన్ని వ్రాయించాడు. కన్నడ కవిత్వాన్ని బాగా పోషించాడు. మేనమామతో విరోధమున్న గుణగ విజయాదిత్యుడు కూడ తెలుగు భాషలో ఒక లక్షణ గ్రంథాన్ని వ్రాయించి ఉంటాడు. ఛంధోగ్రంథం వ్రాయించినా మానినా అతడు తెలుగు కవిత్వాన్ని తెలుగు గడ్డమీద పాదుకొలిపాడు.

ఈ సంగతినే బహుశా నన్నెచోడుడు తన కుమారసంభవంలో ఇలా గ్రంథస్థం చేశాడు:

''మును మార్గకవిత లోకం
బున వెలయగ దేశికవిత పుట్టించి తెనుం

గును నిలిపి రంధ్రవిషయం
బున జన జాళుక్యరాజు మొదలుగ పలువుర్''.

ఈ పద్యంలోని చాళుక్య రాజుపేరు ఏమిటో చెప్పకపోయినా తూర్పు చాళుక్యులలో గుణగ విజయాదిత్యుని కాలంలోనే 'ఓం' ప్రథమమని తెలుగు పద్యాలున్న శాసనాలు దొరుకుతాయి. మేనమామలతో విరోధం సంగతి పైన చెప్పనే చెప్పుకొన్నాము. పాల్కురికి సోమనాథుడు 'ప్రాసోవా యతిర్వా' అనే తెలుగు ఛందస్సుకు సంబంధించిన సూత్రాలను తన పండితారాధ్య చరిత్రలో పేర్కొనడం చేత ఒక ప్రాచీన తెలుగు లక్షణ గ్రంథం ఉండి ఉండాలని కూడ చెప్పుకోవచ్చు. ఇది సంస్కృతంలోనే ఉంటుంది. 9వ శతాబ్దిలో రచించినట్లు చెప్పుకొనే 'గుణకాంకియం' అనే ఛందస్సు ఇప్పుడు దొరకడం లేదని కన్నడ సాహితీపరులు అంటున్నారు. ఈ 'గుణకాంకియం' మన గుణగ విజయాదిత్యునికి అంకితమైన కన్నడ ఛందస్సా?

నన్నెచోడుడు చెప్పినట్టు తెలుగు కవితను 'పుట్టించా'లంటే ఛందోగ్రంథం ఒకటి ఉండాలిగదా! తమిళ భాషలో 11వ శతాబ్దికి చెందిన 'యాప్పరుంగం కార్కై' అనే సుప్రసిద్ధ చ్ఛందో గ్రంథంలో 'వాంఛియార్ సెయిద పడుగ చన్దమ్' అనేది వుంది. తమిళులు మన తెలుగు భాషను ప్రాచీన కాలం నుంచి 'వడుగు' అని పిలిచేవారు. సంగం సాహిత్యంలోనే 'వడుగర్' అనే మాట తొమ్మిదిసార్లు ఉంది. ఈ తెలుగు ఛందస్సును వాంఛియార్ అనే కవి వ్రాశాడు. తెలుగులో ఈ పేరుగల ప్రసిద్ధుడెవడూ లేడు గనుక రేచన అనడానికి బదులు తమిళుడు వాంచన అన్నాడా, లేక తమిళంలో వ్రాసేటప్పుడు వర్ణక్రమం తప్పిందా అని ఆలోచించి వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'మన రేచనే తమిళంలో వాంఛియార్ అయ్యా'డన్నారు. రేచన తెలుగులో కవిజనాశ్రయం వ్రాశాడన్నది ప్రసిద్ధమైన సంగతే. అయినా రేచన అనే మాట తమిళంలో వాంచియగా మారిందనుకోవడంకంటే వాంఛియ అనే కవే ఉన్నాడనుకోవడం మేలు. అదీకాక తమిళంలో రేచన అనే మాటను వ్రాయాలంటే ఆ భాష సంప్రదాయం ప్రకారం రేచణ్ణ అని ణకారపుజడ్డ ఉపయోగించడం జరిగేది అని రావూరి దొరస్వామిశర్మగారు 'తెలుగు భాషలో ఛందోరీతులు' అనే తమ గ్రంథంలో విశదపరిచారు. వారన్నట్టు 'వాంచేశ్వర', 'వాంఛనాథ' వంటి పేర్లలో ఏదో ఒకటి ఉన్న కవి సంస్కృతంలో వ్రాసిన తెలుగు ఛందస్సు క్రీ.శ. 10వ శతాబ్దికి పూర్వమే ఉండి ఉంటుంది. దానినే పాల్కురికి సోమనాథుడు ఉదాహరించాడేమో!

తొమ్మిదవ శతాబ్ది తెలుగు కవిత్వం

ఇంతకూ ఛందోగ్రంథం ఉందో లేదోగాని తెలుగు కవిత్వం మటుకు – తొమ్మిదవ శతాబ్దినాటిది. శిలాక్షరమై చెక్కు చెదరకుండా ఇవాళదాకా నిలిచిపోయింది. ఇది గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగడు చేసిన దానాన్ని తెలిపే శాసనం. ఇది గుంటూరు మండలంలోని అద్దంకి గ్రామంలో ఒక పొలంలో ఉన్న రాతిమీద చెక్కినది.

శాసనం పైభాగం కొంతా, అడుగుభాగం కొంతా శిథిలమైపోయింది. అయినా ఒక పూర్తిపద్యం, కొంత గద్య దొరికింది.

''పట్టంబు గట్టిన ప్రథమంబు నేణ్డు
బలగర్వ మొప్పంగ బై లేచి సేన
పట్టంబు గట్టించి ప్రభు పండరంగు
బంచిన సామంతపడువతో బోయి
కొట్టముల్ పండ్రెండు గొని వేంగి నంటి
గొల్చి యాత్రిభువనాంకుశబాణనిల్పి
కట్టెపు దుర్గంబు గడు బయల్సేసి
కందుకూర్బెజవాడ గావించె మెచ్చి''

ఈ పద్యం పేరు తరువోజ. ఇది మొదటి తెలుగు పద్య శాసనంలో దొరకడం సముచితమే. మన ఆడవాళ్ళ పాటలు కొన్ని తరువోజలోనే ఉంటాయి. విన్నకోట పెద్దన తన కావ్యాలంకార చూడామణిలో

''తలకొని తలబ్రాలు దంపెడిచోట
దరుణుల చేసొంపు దనరు దర్వోజ.''

అని దంపుళ్ళ పాటలలో దరువోజ ఉంటుందన్నాడు.

తరువోజలోంచే ద్విపద పుట్టింది. ఒక తరువోజ పాదాన్ని రెండు ముక్కలు చేసి ఆ ముక్కలకు ప్రాసయతి వేస్తే అది ద్విపద అవుతుంది. చిన్న ఛందం ముందుపుట్టి, దానిని పెంచుకొని వెళ్ళడం రివాజు గనుక ద్విపదే ముందు పుట్టిందనే వాదం కూడా ఒకటి ఉంది. వాస్తవానికి రేచన ద్విపద లక్షణం చెప్పాడు. కాని, ''తరువోజకన్న ద్విపదే ప్రాచీనమైతే నన్నయగారు దానిని వాడి ఉండరా? నన్నయగారు తరువోజను వాడారు. ద్విపదను వాడలేదు కనుక అది ప్రాచీనం కాదా'' అని మన పరిశోధకులు భావిస్తారు.

తరువోజే ముందు పుట్టిందని ప్రతిపాదించే అమరేశం రాజేశ్వరశర్మగారు తమ 'నన్నెచోడుని కవిత్వం' అనే పుస్తకంలో ఇలా వ్రాశారు :

> ''మన యాంధ్రభాషయందు ద్విపదలు మొట్టమొదటి మాఱుగా మనకు దర్శనము నొసంగినది పాల్కురికి సోమనాథుని రచనలయందు. అంతకు బూర్వము ద్విపదల యునికి కాధారములు గానరావు. నన్నయ గాని, పావులూరి మల్లనగాని, పండితారాధ్యులుగాని, నన్నెచోడుడుగాని, అథర్వణుడుగాని, తిక్కనగాని వీనిని వాడనేలేదు. కేవలము దేశిపద్యములే గల ప్రాఙ్నన్నయయుగములోని శాసనములందును నీద్విపదల యున్కి కనుపట్టదు. కన్నడమునందు నిది లేదు.
>
> ''ఇక దరువోజ యన్ననో, నన్నయకు ముందు గల శాసనములందున్నది. నన్నెచోడుని కుమారసంభవమున విరివిగా

వాడబడినది. నన్నయభట్టారకుడును వాడినాడు (ఆది. 2-151, 3-172). తిక్కన సోమయాజి భారతమునను గలదు (స్త్రీ. 1-43, 2-157). ఈవిధముగా దరువోజ మొదటి నుండియు గలదు... ద్విపద యన్ననో సోమనాథుని తరువాతనే వ్యాప్తిగాంచినది.

"మఱియొక విశేషమేమనగా మనకు నిశ్చితముగా సోమనాథుని పిదప వెలువడినవని చెప్పదగిన కృతులందు దరువోజ కానరాదు... అనగా దేలిన సారాంశము ద్విపద యావిర్భవించి తరువోజను వెనుకకు నెట్టినదన్నమాట."

రాజేశ్వరశర్మగారి ప్రతిపాదన చాలా సమంజసంగా ఉందనిపిస్తుందిగాని నన్నయగారికి ఒక శతాబ్దం పూర్వుడు మల్లియరేచన తరువోజకూ, ద్విపదకు విడివిడిగా లక్షణాలు చెప్పాడు. అతని కాలంలో రెండూ ఉండేవన్నమాట. అయినా గుణగ విజయాదిత్యుని కాలంనాటి లక్షణకర్తలు రెండు ద్విపద పాదాలనూ కలిపి ఒకటిగా చేసుకొని దానికి తరువోజ అని పేరు పెట్టడానికి ఆస్కారం లేకపోలేదు. అంతకుముందు సక్రమంగా నాలుగేసి పాదాల పద్యాలు లేకపోవచ్చు. "Desi metres of the South Indian Languages, including Tamil, are generally of two-line or three-line formations and can be carried on to any lengths, Kural in Tamil is of three lines and may be compared to the Tripadi or Trivadi; of Kannada. Regular fourlined metres seem to be a very late feature in Tamil as also other South Indian Languages." అని కోరాడ రామకృష్ణయ్యగారు వ్రాశారు.[33] అయితే తమిళ భాషలోని 'అగవల్పా' ఛందంలో నాలుగు పాదాలు లేకపోలేదు. కాని ఆ పద్యం చాలా చిన్నది కనుక రెండు పాదాలుగానే భావించినా దోషం లేదు.

అద్దంకి శాసనంలో పేర్కొనబడిన పండరంగుని ప్రశంసించుకొనే రెండు సీసపద్యాలున్న శాసనాలు ఒకటి కందుకూరులోనూ, ఇంకొకటి ధర్మవరంలోనూ దొరికాయి. కందుకూరు శాసనం చాలామటుకు శిథిలమయింది. అందులో సీసపద్యముందని మొట్టమొదట కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు గుర్తించారు. ఉన్నంతవరకూ ఆ పద్యం చూడండి.

"శ్రీనిరవద్యుండు చిత్తజాతసముండు
    శివపదవరరాజ్య సేవితుండ
ఖిలుడు నన్నృతరిపుబలుడు నాహవరావ
    దండమోద్య సిఘాసనుం డగణిత
దానమాన్యుండు దయానిలయుండును
    భండన నండన పండరంగు
.... కొలదిలేని
    కొట్టము ల్వోడిచి గుణకనల్ల

33. Annals of Oriental Research - Centenary Number. University of Madras, 1957.

తాని పక్షపాతి.................
....
....
...............విభవగౌరవేంద్ర''

ఈ పద్యంలో 'కొలదిలేని' అనే మాట వచ్చేదాకా అన్నీ తత్సమ పదాలే ఉండడం గమనార్హం. ఈ సీసం ఏ పాదాని కా పాదం తెగిపోకుండా ఉండే 'గునుగుసీసం' కావడం మరొక విశేషం. ''అహవరావ దండమోద్యసిఘాసనుండు'' అనే కొద్దిపాటి దీర్ఘసమాసాలు అప్పుడే మొదలైనాయి.

ఈ పండరంగుని ప్రస్తుతించే ఇంకొక సీసపద్య శాసనం ధర్మవరందీ ఉందను కొన్నాం. అందులో పాదాలు గునుగుసీసం పాదాలు కావు. తెగిపోతూ ఉంటాయి. కందుకూరు శాసనం చివరిభాగం ఎక్కువ లోపిస్తే ఇందులో పద్యం మొదట కొంచెం లోపించింది.

''............ నరరామవిభుతోడ
నెడఱిన బోయలనడివి జొన్పె
లోహసనం బెక్కి రాహను నొడిచిన
వల్లభు కొల్వున నెల్లనెఱిగ
కన్నరాభూపతి వెన్నాజిలో జూచె
సంకిలాండను ఱేని బింకముడిచె
దండు బైవచ్చిన బెండైన చోడని
చేకొని కాచె భూలోక మెఱిగ
కిరణపురముడహాల నిరుతంబు దణినాడు
నచలపురము సొచ్చె నచలితుండు
వల్లభుండు గుణకనల్లుండు పంచిన
పండరంగు చూరె పండరంగు.''

ఈ సీసంలో సర్వత్ర ప్రాసయతినే పాటించాడు. ఇందులో తత్సమ పదాలకన్నా దేశ్యాలు ఎక్కువ. 'గుణకెనల్లుడు' అనేది గుణగవిజయాదిత్యుని బిరుదు. ఆ రోజుల్లో బిరుదులు కన్నడ భాషలోనే ఉండేవి కాబోలు. వెంకయచోడుని శాసనంలో 'పుసియిల్లాదాష్టు' అనే బిరుదు ఒకటి ఉంది. 'జగదొబ్బగండ' మొదలైన బిరుదులు ఈ కాలంలోనే మొదలైనవి. ఈ ధర్మవరం శాసనం చరిత్రకారులకు చాలా తోడ్పడుతుంది. పండరంగుడు ఆనాటి యుద్ధతంత్రవేత్తలలో మహామనిషి. అతడి కదన పాండిత్యం అనుపమానం. అతడు అలెగ్జాండరు, నెపోలియన్ మొదలైన సేనానియంతలతో సరిసమానమైనవాడు. గుణగవిజయాదిత్యుని కీర్తిలో పండరంగునికి ఎక్కువపాలు ఉంటుంది.

మధ్యాక్కరలు

గుణగవిజయాదిత్యుని తమ్ముడు యుద్ధమల్లుడు బెజవాడలో కుమారస్వామికి ఒక గుడి కట్టించాడు. ఁ సంగతి చెప్తూ 'మధ్యాక్కరలు' అనే ఛందస్సులో శాసనం వేయించాడు. ఈ శాసనం మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉంది. ఈ మధ్యాక్కరలు ఆ కాలంలో ప్రచారంలో ఉండేవి. కన్నడంలోనూ ఇవి ఉన్నాయి. రేచన తన కవిజనా శ్రయంలో లక్షణం చెప్పాడు. నన్నయగారు కూడ తమ భారతంలో వాడారు. ఆ తరువాత వాటినెవరూ వాడనేలేదు. నన్నయగారి భారతాన్ని పూరిస్తున్నాంకదా అని ఎఱ్ఱాప్రగడ గారు ఔచిత్యం కోసం వాడారు. నాటికి నేడు విశ్వనాథ సత్యనారాయణగారు వాటిని పునరుద్ధరించారు. ఈ మధ్యాక్కరలు నన్నయగారి కాలంనాటికే మాత్రాచ్ఛందస్సుల ప్రాభవం నుంచి దూరం కావడంలో నడక కుంటుపడి వీటి ఆకర్షణ తగ్గిపోయిందను కోవాలి (మధ్యాక్కర గేయాలని గుర్తించి ఈ గ్రంథకర్త కొన్ని రచించాడు).

> ''అంతటా రాములావారూ అంగనా సీతనూ గూడీ
> సంతసామందుచూ వేగా స్వాపురామునకు చనుదెంచీ
> తమ్ములా తోడనూ గలసీ నెమ్మదీ రాజ్యాము లేలే
> ధర్మాముతో ప్రజలెల్లా తామరాతంపరాలైరీ''

అని ఆడవాళ్ళు పాడుకొనే రామాయణం పాట మధ్యాక్కరే. ''ఇది పాట కాబట్టి స్త్రీ బాలపామరాదులు పాడే రీతినిబట్టి కొన్ని దీర్ఘములు, విఱుపులు ప్రవర్తిల్లును'' అని నిడుదవోలు వెంకటరావుగారు తమ 'తెలుగు కవుల చరిత్ర'లో వ్రాశారు. స్త్రీలూ, పామరులూ పాడేటప్పుడే దీర్ఘాలు వస్తాయనుకోవడం సహజమే గాని వైదిక ఋషులూ, వేదపారంగతులూ పాడేటప్పుడు కూడ వేదమంతటి దానిలోనూ లేని దీర్ఘాలు వస్తాయి; ఉన్నవి కుదించుకొని పోతాయి.

వైదిక ఛ్ఛందస్సు

చిలుకూరి నారాయణరావుగారు వైదిక ఛ్ఛందస్సు గురించి గిడుగువారి సంచికలో వ్రాసిన విషయాలు చూస్తే ఇది బోధపడుతుంది.

> ''వైదిక ఛ్ఛందస్సులలో కేవలము అక్షరనియమమే ప్రధానమైనట్లు కనబడుతుంది గాని... అక్షరనియమానికి సరిపోయేటట్లు చదవడానికి పాదములలో కొన్ని మార్పులు చేసుకోవలెను.
>
> ''(1) య, వ అనే అంతస్థములు పదములో ఉన్నా, సంధివల్ల ఏర్పడినా సాధారణముగా వాటిని ఇ, ఉ-లుగా ఉచ్చరింపవలెను. స్యామ = సిఅమ; స్వర్ = సుఅర్; వ్యుషా = విఉషాః; విదథేష్వఞ్జన్ = విదథేషు అఞ్జన్.

''(2) సంధిలో కలిసిన అచ్చులను ప్రత్యేకముగా ఉచ్చరింపవలెను.
చాగ్నయే = చఅగ్నయే; వీన్ద్రః=విఇన్ద్రః; అవతూతయే=అవతు ఊతయే;
ఏన్ద్ర=ఆఇన్ద్ర;''

వేదాన్ని పాడేటప్పుడు అక్షరాలను ఎలా దీర్ఘాలు చేసుకోవాలని పూర్వులు శాసించారో చూశాక మన మాత్రాచ్ఛందస్సులకు కూడ కొన్ని నియమాలు చేసుకోవలసిన పరిస్థితి ఉందని తెలుస్తున్నది. మధ్యాక్కరలో ఇంద్రగణానికి అయిదు మాత్రలు, సూర్యగణంచోట నాలుగు మాత్రలూ ఉండాలి. అలా ఉంటేనే తాళానికి సరిపోయి పాడడానికి వీలుగా ఉంటుంది. ఏ కారణంవల్లనైనా అయిదు మాత్రలకు తక్కువైన ఇంద్రగణాన్ని వ్రాస్తే ఏదో ఒక హ్రస్వాక్షరాన్ని దీర్ఘం చేసుకొని తాళం సరిపెట్టుకోవాలి. సాతవాహనుల నాణాలలో అయిదు మాత్రల గణాలే ఎక్కువ అని, మాత్రలు కొరవడితే అక్షరాన్ని సాగదీయాలనీ గమనించాలి. ఇందాకా చెప్పిన ఆడవాళ్ళ పాటనే వ్రాసేవిధంగా తీసుకొని మాత్రాచ్ఛందస్సుగా ప్రస్తరిద్దాం:

అంతట । రాముల వారు । అంగన । సీతను । గూడి ।

∪ | | ∪ | | ∪ | ∪ | | ∪ | | ∪ |

4 4 3 4 4 3

ప్రతి ఇంద్రగణంలోనూ నాలుగు మాత్రలే ఉన్నాయి. అందుచేత దీర్ఘాలు అవసరమవుతున్నాయి. మన ఆడవాళ్ళ పాటలు కూడ వేదాలవంటివి. పుట్టిన దగ్గర నుంచి పెంచి పెద్దను చేస్తూ మన చెవులకు విందులు చేసి మన సంస్కృతికి అజ్ఞాతంగా ప్రాణం పోస్తూ మన తల్లీ తోడూ పాడే పాటలను మనం గౌరవిస్తేనే భాష, సంప్రదాయం, తెలివితేటలూ బ్రతుకుతూ ఉంటాయి. మన కవులు అక్షరగణ నియమాలున్న ఛందస్సులపై ఎగబడినందువల్ల మధ్యలో మధ్యాక్కరలు అంతరించినా ఆడవాళ్ళ పాటలలో అవి ఇంకా సజీవంగానే ఉన్నాయి.

యుద్ధమల్లుడు వేయించిన శాసనంలోని మధ్యాక్కరలు ఏమిటో, ఆ శాసనం ఏమి చెప్తూన్నదో చూద్దాం.

''స్వస్తి నృపాంకు శాత్యంత వత్సల సత్య త్రినేత్ర
విస్తర శ్రీయుద్ధ మల్లు డనవద్య విఖ్యాతకీర్తి
ప్రస్తుత రాజాశ్రయుండు త్రిభువనాభరణుండు సకల
వస్తు సమేతుండు రాజు సల్కిభూ వల్లభుం డర్థి
పరగంగ బెజవాడ గొమరుసామికి భక్తుడై గుడియు
నిరుపమమతి నృపధాము డెత్తించె నెగిదీర్చి మఠము
గొరగ ల్గాకొరు మిందువిడిసి బృందంబు గొని యుండువారు
పరిగాన యవ్వారణాసి వ్రచ్చిన పాపంబు గొండ్రు
వెలయంగ నియ్యొట్టు డస్సి మలినురై విడిసిన బ్రోల

గల తన పతులును రాజు పట్టంబుగట్టిన పతియు
నలియపై వారల వెల్వరించిన నశ్వమేధంబు
ఫలమపేక్షించిన లింగ మడిసిన పాపంబు దమకు.
జననుత చేబ్రోల నుండి బెజవాడ జాత్రకు వచ్చి
త్రినయన సుతుడుండు సోటు మెచ్చక తీవిరి యిన్నెలవ
యనఘుండు సేకొని యిందు ప్రత్యక్షమైయున్న నిచ్చ
గని మల్ల డెత్తించె గుడియు మఠమును గార్తికేయునకు.
దీని జేబ్రోలు యేలెడువారె తిరం బేలువారు
ఒండుసోటిగొరగలును బెట్టు వేఱుగాను జను యీ స్థితి
సేకొని కాచువారె దీనిని దారు నిల్పినావారు
స్థితిదప్పి యడపుట పాపంబుగానీ
రమణతో బెజవాడ కెల్ల బెడంగును రక్షయుంగాను
దమ తాత మల్లపరాజు పేఱిఱు దాను గట్టించె
గ్రమమున దానికి కలశబిడ్డట్లు మొగమాడు
సమరంగ శ్రీయుద్ధమల్లుం డెత్తించె నమిత తేజుండు
తన ధర్మన్ వొడబడి కాచు నృపతులకున్న....'' (శాసనం అసంపూర్ణం)

ఈ శాసనంలో వచనానికి ముందున్న భాగాన్ని మొదట యుద్ధమల్లుడు వేయించాడు. తరువాత వున్న భాగాన్ని మనుమడు వేయించాడు. మొదటి యుద్ధమల్లుడి కాలంలో చేబ్రోలులో కుమారస్వామి ఆలయం వుండేది. ఆ దేవుడు బెజవాడకు జాత్ర వచ్చేవాడు. ఒకసారి కుమారస్వామి బెజవాడకు వచ్చి ఆ చోటును మెచ్చుకొని అక్కడే ఉండిపోయాడట. అందుచేత యుద్ధమల్లుడు గుడిని కట్టించాడు. ఆ గుడితోపాటు ఒక మఠాన్ని కట్టించాడు. అందులో 'గొరగలు' అనే ప్రత్యేకమైన శైవులు మాత్రమే మకాము చేయాలి. ఇతరులు చేస్తే కాశిలో చంపినంత ఒట్టు. ఈ ఒట్టును కాస్త తీసి గట్టుమీద పెట్టేసి గొరగలు కానివాళ్ళు బసచేస్తే ఊళ్ళో ఉండే స్థానికాధికారులు, ఊరేలే రాజు, దేశానికి పట్టం కట్టుకొన్న ప్రతీవాళ్ళను వెళ్ళగొట్టాలి. అలా చేస్తే అశ్వమేధయాగం చేసినంత పుణ్యం; చేయకపోతే శివలింగాన్ని బ్రద్ధలు కొట్టినంత పాపం.

కుమారస్వామి - తెలుగులు

కుమారస్వామిని ఆరాధించడం తెలుగుదేశంలో సాతవాహనుల కాలం నుంచి వస్తున్నదే. ఆ రాజులలో నలుగురి పేర్లు ఈ దైవానికి చెందినవే. ఇక ఇక్ష్వాకుల కాలంలో నాగార్జున కొండదగ్గరి విజయపురిలో కార్తికేయ విగ్రహాలు దొరికాయి. చాళుక్యుల

ఇలవేల్పు స్వామి మహాసేనుడు. అంటే కార్తికేయుడు. అసలు చాళుక్యుల తొలి 'కర్మరంగం' విజయపురే అని అక్కడి శాసనాలవల్ల తెలుస్తున్నది. పూర్వం కార్తికేయునికి ప్రత్యేకంగా గుడులు ఉంటే, అవి పావులూరి మల్లన కాలానికి శివాలయంలో వినాయకుడు, నంది, పార్వతి మొదలైన దేవతలతోపాటు కుమారస్వామికి కూడ ఒక విగ్రహం ఉండే స్థితికి వచ్చాయి. రానురాను అది కూడ తగ్గిపోయింది. మొదటి యుద్ధమల్లుడి కాలంలోని ఒక ఊరి నుంచి ఇంకొక ఊరికి దేవుణ్ణి జాతర చేసి తీసికొని వెళ్ళడం అనే ఆచారం చూస్తే జనసామాన్యం కూడ రాజుల ఇలవేల్పును ఆరాధించడం జరిగేదని తెలుస్తున్నది.

నేటి పూరీ జగన్నాథంలోని 'రథయాత్రను' దృష్టిలో పెట్టుకొంటే ఆనాడు కార్తికేయుడి జాతరలో ఎంత జనసమ్మర్దం, ఎంత కోలాహలం, ఎంత ఉత్సాహం ఉండి వుంటుందో ఊహించుకోవచ్చు. జగన్నాథునికి ఆలయాలు ఉండే ఊళ్ళలో కూడ (ఉదాహరణకు : విశాఖపట్నం, విజయనగరం) సరిగ్గా పూరీలో రథయాత్ర జరిగేనాడే జాతర చేసి, దేవుణ్ణి ఇంకొక చోటికి తీసుకువెళ్ళి పదిరోజులు అక్కడే ఉంచే ఆచారం నేటికీ ఉంది. ఇలాగే ఆనాడు ఆంధ్రదేశమంతటా ఒక పర్వదినంనాడు కార్తికేయుని జాతరలు జరిగేవేమో! కనీసం బెజవాడ, చేబ్రోలుల మధ్య అటువంటి జాతరలు జరిగేవని ఈ శాసనం చెప్తున్నది. వాటి దూరం ఎక్కువే. చేబ్రోలు గుంటూరునకు తొమ్మిదిమైళ్ళ దూరాన తెనాలి తాలూకాలో ఉంది. జనులు దారిపొడుగునా ఈ ఉత్సవంలో పాల్గొనేవారని ఊహించవచ్చు.

అటువంటి ఉత్సవాలలో పాడుకొనే పాటలు, చేసే భజనలు తప్పనిసరిగా తెలుగులోనే ఉండాలి. ఆ పాటలు ఈ మధ్యాక్కరల ఛందస్సులో ఉండేవేమో! కన్నడంలో అక్కరలు అయిదు రకాలవి ఉన్నాయి. అయినా ఒక్క మధ్యాక్కరకే తెలుగులో ఎక్కువ చోటు దొరికింది. నన్నయగారు ఒక్క మధురాక్కరనే, ఒక్కసారి మాత్రమే వాడారు.

''తెలుగునం దీ మధ్యాక్కర కొక్కదానికే ప్రయోగముండుటకొక కారణమున్నది. ఈ అక్కరకు ద్విపదతో సంబంధము హెచ్చుగా నుండుటయే ఆ కారణము'' అని సంపత్కుమారగారు చెప్తున్నారు.

ఇంతదాకా పేర్కొన్న నాణాలలో రగడ, శాసనాలలో తరువోజ, సీసం, ఆటవెలది, తేటగీతి, మధ్యాక్కర అనే ఛందస్సులు ఉన్నాయి. వీటికీ, ద్విపదకూ సంబంధం ఉంది. ఇవన్నీ గుణగ విజయాదిత్యుని కాలంలోనే, అంటే క్రీస్తుశకం 850 ప్రాంతంలో మొదట రాతికెక్కాయి. ఇవి ''ఆ కాలమునుండియే కాక అంతకన్న చాలాకాలము ముందునుండియే ప్రచారమునందున్నట్లు నిశ్చయముగా చెప్పవచ్చును. 'అంతకన్న చాలాకాలము ముందు' అనగా ఆ కాలమేదియో నిర్ణయించుటకు సరియైన ఆధారములు లేవు'' అని సంపత్కుమారగారు వ్రాశారు.

తెలుగు - తమిళం

ఆధారాలు లేకపోలేదు. యతిప్రాసల విషయంలో తెలుగు తమిళాన్ని పోలుతుంది. కొన్ని తమిళ ఛ్చందస్సులు ఆదిలో అన్ని ద్రావిడ ప్రాంతాలకూ వర్తించేవనుకోవచ్చు. మన సీసపద్యం తమిళంలో 'అగవల్పా' ఛందస్సుకు దగ్గరలో ఉందని కోరాడ రామకృష్ణయ్యగారు వ్రాశారు. "Two *Ahavalpa* lines of Tamil having four lines each can be made equal or identified with one line of *Sisa* verse having eight ganas"[34] అని ఒకచోట అన్నారు. "...మనము నన్నయకు పూర్వకాలిక రచనలుగా గుర్తించినవానిలో ద్విపద, గీత సీసములను గురించి పరిశీలింపవలసియున్నది. ద్విపద రెండు పాదములకును ప్రాస నియమము కలదు. సీసపాదమునకా నియమము లేదు. తెలుగునం దిట్టి ప్రాస నియమము లేని పద్యము లొక ప్రత్యేక గణముగా నేర్పడినవి. అవే ఉపజాతులననవి. 'జాతులు, కందాదులు, నుపజాతులు, గీతాదులు.' ఈ ఉపజాతుల మూలముననే తెలుగు ఛందస్సు ప్రాచీన దక్షిణ దేశీయ చ్ఛందస్సంప్రదాయమును కన్నడముకంటెను విశేషముగా నిలుపుకొనియున్నదని చెప్పవలసియున్నది... తమిళమునందలి 'వెన్‌బా' పద్యములలో ప్రాస (యదుగై) నియమమున్నను అగవల్పా పద్యములలో నట్టి నియమము లేదు. తెలుగున గొన్నింటిలో లేకుండుట కిదియే కారణము కావచ్చును" అని కోరాడవారు ఇంకొకచోట వ్రాశారు.[35] అయితే ప్రాస నియమం గల సీసానికి మల్లియ రేచన లక్షణం చెప్పాడు. దీనిని 'ప్రాససీసము' అన్నాడు. ఇది ప్రచారంలోంచి పోయిందనుకోవాలి.

"కుశలవకథ, అక్కలపాట అనే కామేశ్వరిపాటా తమిళ ఛందమైన 'అగవల్పా' వరుసలో వున్నాయి. తమిళ గణాలైన శీర్లను ఉపయోగించకపోతే ఈ పాటలను ప్రవర్తించడం సాధ్యం కాదు. 'ఋషుల ఆశ్రమం', 'రామపట్టాభిషేకం', 'సీతసురటి' వంటి తరువోజలో వున్న పాటలు నిజానికి 'అగవల్పా' పాదాలను రెట్టించినందువల్ల ఏర్పడినవే. ఈ ఛందస్సు తమిళంలో 'ఎంజీరు కడనెఱిల్ అశిరియ విరుత్తం' అంటారు. వరుస పాటలవంటి చాలా వాట్లలో ఒక్క సంస్కృతం ముక్క కూడ వుండదు" అని టేకుమళ్ళ రాజగోపాలరావుగారు తమ 'ద్రావిడ భాషల తులనాత్మకచ్ఛందస్సు' అనే పుస్తకంలో వ్రాశారు.[36]

అగవల్పా పద్యం తమిళంలో చాలా ప్రాచీనం. సంగం వాఙ్మయంలో పాటలన్నీ ఆ ఛందస్సులోనే ఉంటాయని మనం ఇంతకుముందు చెప్పుకున్నాం. సంగం సాహిత్యం తమిళంలో క్రీస్తుశకం 300 ప్రాంతంలో సేకరించారని కూడ చెప్పుకున్నాం. అగవల్పాపద్యం ఎంత ప్రాచీనమైనదో దాని పోలికలున్న తెలుగు ఛందస్సులు కూడ అంత ప్రాచీనమైనవని చెప్పుకోవడంలో తప్పేమీ వుండదు.

---

34. Annals of Oriental Research - Centenary Number, University of Madras, 1957.

35. భాషాసారస్వతములు - దేశి. పుటలు 190, 191, 192.

36. A Comparative Prosody of the Dravidian Languages (Part I utrams) by T. Rajagopala Rao, 1913.

రాతి, రాగి శాసనాలు

గుణగ విజయాదిత్యుని కాలంలో వేయించిన శిలా శాసనాలు తెలుగు భాషలోనూ, దేశీయ ఛందస్సులోనూ వున్నా రాగిశాసనాలు సంస్కృతంలో ఉన్నాయి. అతని సాతలూరు శాసనంలో ఒక చంపకమాల వుంది. భాష సంస్కృతమైనా యతిప్రాసల విషయంలో ఇది దేశీయ మర్యాదలను పాటించి వ్రాసినది. నాలుగు పాదాలలోనూ ప్రాస వుంది. మొదటి రెండుపాదాలలో తెలుగువాళ్ళు పాటించే యతినియమం వుంది. ఆ పద్యం ఇది :

''అరినృపవాజివారణ ప-దాతి మహోభ్ర విరామమారుతః
వరకరికార సుస్థితసి- భాప్రవినాశిత భానుసన్నిభః
గురుతర దీనభాగవత మానసమానిత కల్పపాదపః
వరకరిగల్ల భూమిపభుజాసి రిపోజిభువి ప్రసాదితే''.

ఇందులో ఏ పాదాని కాపాదం తెగిపోతుంది. పాదాంత విశ్రాంతి అనేది సంస్కృత మర్యాద. దీనిని తెలుగుకవి పాటించాడు. అయితే తెలుగులోనికి దిగుమతి చేసుకొన్న సంస్కృత వృత్తాలలో మరికొన్నాళ్ళకు ఈ మర్యాద మారిపోయింది. గుణగవిజయాదిత్యుని కాలానికి నూరేళ్ళ తరువాత, అంటే క్రీ.శ. 953లో సర్వదేవుడనే కవి ఉండేవాడు. ఇతనికే పొన్నకవి అనే పేరుకూడ ఉంది. కన్నడ రత్నత్రయంలో రెండవవాడు ఈయనే. ఇతడు తెలుగులో ఆదిపురాణం అనే జైనగ్రంథం వ్రాశాడు. ఆ గ్రంథం ఇవాళ మనకు దక్కలేదు. కాని అందులోని పద్యాలు ఒక మూడు మిగిలాయి. వాటిలో ఒక మత్తేభం వుంది.

''సరసీజాత వియోగకారి పురయోషా వక్త్ర హృద్యాతి సుం
దర కాంతిం దటిగించుబో యని మదిం దర్కించి దోషాకరున్
బుర ముద్దండకరంబు లెత్తి చలివం బొత్తెనయ ట్లొప్పును
ద్దుర సౌధాగ్ర నిబద్ధహేతువు మహోదోలాభిరామంబుగన్.''

ఈ మత్తేభంలో ప్రాస మలుపు తీసుకొన్నదే రెండవ పాదంలోనూ, నాలుగవ పాదంలోనూ వుంది. ఈ కాలానికి మరొక యాభై సంవత్సరాల తర్వాత వేయించిన విరియాల కామసాని శాసనంలో మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలూ ఉన్నాయి. మొదటి పద్యంలో తప్ప మిగతా అన్ని పద్యాలలోనూ ప్రాస మలుపు తీసుకొన్నది చూడండి.

''చ. అనుపమ దూర్జయాన్వయ సుధాబ్ధిననేకులు రాజనందనుల్
సనిన బొరంటి వెన్నడను సంభవుడయ్యె నతిప్రసిద్ధుడై
వినుత విరోధిమండలికి వెన్నడు వెన్నడువోలె వానికిన్
ఘనుడగు నెఱ్ఱిభూపతి జగద్విదితుం డుదయించె గీర్తితోన్.

ఉ. భావితకీర్తి నాతనికి బాండవమధ్యమ భీముడో యనన్
గా విరియాల భీమనృప ఘస్మరుడై జనియించె వానికిన్
భూవినుతుండు మండలిక భూషణు డెఱ్ఱ నరేంద్రు డుత్తమ
శ్రీవినుతుండు బంధుజన సేవ్యుడు దా వినుతించె నున్నతిన్

చ. అతడని బొట్ట చేత వసుధాధిపు జేకొని, దాని వైరిను
ద్ధితముగ జంపి యాకొరవిదేశమునందు ప్రతిష్ఠ చేసి తద్యా(?)
త తనయు పేరు పోడగల దాయము చిట్టర గద్యనంబు న
ప్రతిముడు వాని (దా) మొగడు పల్లయు పంద్రెడు నేలు నిప్పుడే.

చ. అరుదగునట్టి యెఱ్ఱనృపునంగన కామసానియొక్క మే
ల్గరుదని బేతభూవిభునిగా గతి వల్లభు బిన్నవాని దా
బరగగ జేతబట్టి ఘను బల్ల వరాయని యన్వయాబ్జ భా
స్కరవిభు చక్రవర్తిగని కాకతి నిల్పుట కోతిసేయదే.

ఉ. కాల (రి) కాలుడై పడసె కాడయనాయకు జంపి సుర డ
వ్వేలుపుగొండ రవ్వనృపు వేలుపుగొండన నిల్పి వానిచే
మేలుగ మూడు ముప్పయిని మేలుగ నేరెడు బోదిపాడునుం
మేలుగ టేకుమావిడులు మేలుగ రెండయరాజు సంగడై.''

మలుపు ప్రాసలు

సంస్కృత వృత్తాలనే తీసుకొన్నా ఆ భాషలోని ఆనవాయితీ అయిన పాదాంత విశ్రాంతిని పాటించక, తెలుగువాళ్ళూ, కన్నడంవాళ్ళూ మలుపు తీసుకొనే ప్రాసను వాడటానికి కారణం అది దేశీయ సంప్రదాయం కావడమే. ఈ సంస్కృత వృత్తాలు రాకపూర్వం మన దేశంలో పాటలు ప్రచారంలో ఉండే ఉంటాయి. ఈ పాటలలో మలుపు తీసుకొనే ప్రాసలు ఎంతో అందాన్ని తీసుకువచ్చి వీనులవిందు చేస్తాయి.

''శ్రీకరూ డను పువ్వు తుమ్మెదా! మూడు
లోకము లాయెను తుమ్మెదా!
సాకారమైయుండు తుమ్మెదా! పర
మేకాంతమున జూడు తుమ్మెదా!
ఆఱురేకుల పువ్వు! తుమ్మెదా అది
మీఱీన వాసన తుమ్మెదా!
వేఱుసేయక నీవు తుమ్మెదా! శివు
చేరీ భజించవె తుమ్మెదా!''

ఇలా మలుపు తీసుకొనే ప్రాసలను తరువోజవంటి దేశీయ ఛ్ఛందస్సులలో కూడ మన పూర్వులు వాడారు. పండరంగడి అద్దంకి శాసనం చూడండి. కొన్ని పాదాలలో పదాలు మలుపు తిరుగుతాయి.

''పట్టంగట్టిన ప్రథమంబు నేడు
  బలగర్వ మొప్పగ బై లేచి సేన
పట్టంబు గట్టించి ప్రభుబండరంగు
  బంచిన సామంత పదువతో బోయ
కొట్టముల్ పండ్రెండు....................''

ఈ విధంగా ఒక అవిచ్ఛిన్నమైన సంప్రదాయం, జాతీయత తొలినుంచీ మన భాషలో, ఛందస్సులో వస్తూనే ఉంది. చాలా పూర్వమే దేశీయ ఛ్ఛందస్సులు, సంస్కృత ఛ్ఛందస్సులు ప్రచారంలో ఉన్నట్టు చూశాం. ఏయే ఛందస్సులు ఎప్పటినుంచి మొదలైనట్టు శాసన సాక్ష్యాలుగాని, గ్రంథస్థమైన ఆధారాలుగాని ఉన్నాయో ఒకసారి చూద్దాం.

ఛందస్సు	ఆకరం	దాని కాలం
రగడ	సాతవాహనుల నాణాలు	క్రీ.శ. ప్రారంభం
తరువోజ	పండరంగని అద్దంకి శాసనం	క్రీ.శ. 848
సీసం	గుణగ విజయాదిత్యుని కందుకూరు శాసనం	క్రీ.శ. 850
ఆటవెలది	గుణగ విజయాదిత్యుని ధర్మవరం శాసనంలో ఎత్తుగీతి	క్రీ.శ.848
తేటగీతి	1. గుణగ విజయాదిత్యుని కందుకూరు శాసనంలో ఎత్తుగీతి	క్రీ.శ.848
	2. పద్మకవి జినేంద్ర పురాణం నుంచి ఉదహరించిన సీసంలోని ఎత్తుగీతి	క్రీ.శ.941
మధ్యాక్కర	యుద్ధమల్లుని బెజవాడ శాసనం	క్రీ.శ. 885
కందం	1. జినవల్లభుని కుర్క్యాల శాసనం	క్రీ.శ. 941
	2. సర్వదేవుని ఆదిపురాణంలోనిదని ఉదహరించినది	క్రీ.శ. 953
	3. బాదవ మహారాజు ఆరుంబాక సంస్కృత శాసనంలోని తెలుగు లక్షణాల పద్యం	క్రీ.శ. 980
చంపకమాల	1. గుణగ విజయాదిత్యుని సాతలూరు సంస్కృత శాసనంలో కొంత తెలుగు లక్షణాలున్నది.	క్రీ.శ. 848
	2. విరియాల కామసాని శాసనం	క్రీ.శ. 1000 ప్రాంతం
ఉత్పలమాల	విరియాల కామసాని శాసనం	క్రీ.శ. 1000 ప్రాంతం
మత్తేభం	సర్వదేవుని ఆదిపురాణంలోంచి ఉదహరించినది	క్రీ.శ. 953
రగడ	రాజరాజు కోరుమిల్లి శాసనం	క్రీ.శ. 1022

ఈ పట్టికవల్ల ముఖ్యమైన ఛందస్సులు ఒక పది ప్రాచీన కాలంనుంచీ ప్రచారంలో ఉండి పద్యరచన సాగుతూ ఉండడంవల్ల సాహిత్యం ఉద్భవించడానికి చక్కని ప్రారంభాలు

ఆనాడు తెలుగులో ఉన్నాయని తెలుస్తున్నది. రేచన కవిజనాశ్రయంలో లక్షణాలు చెప్పాడుగాని ఆ ఛందాలన్నింటిలో ఉండే రచనలేవీ లభ్యం కాలేదు. మనం ఇప్పటిదాకా చూసినవి ఎక్కువగా శాసనాలలోని సాక్ష్యాలే. ఇవి ప్రభువుల దానాలూ, వీరుల పరాక్రమాలూ తెలిసేవి మాత్రమే కనుక వీటిలో అట్టే భావానందప్రదాయకమైన కవిత్వం లేకపోవడం సహజమే. ఈ లోపంతోపాటు సుపరిష్కృతమైన వచన రచన కూడా లేనట్టు అనిపిస్తున్నది.

ఆనాటి వచన రచన

నిజమే. చదువురానివాళ్ళ చాకలి పద్దు వంటి వర్ణక్రమాలలో బోలెడు తప్పులతో ఉండే మాటలు నేటి వ్యాకరణాన్వయానికి లోబడని వాక్యాలలో ఉండడం చూస్తే ఆనాడు వచన రచన లేదనిపిస్తుంది. అయినా శిష్టకావ్యాల వచన రచనకు దగ్గరలో ఉన్న చక్కని గద్య కుసుమాలు ఆనాడు వికసించకపోలేదు.

క్రీ.శ. 850 నాటి గుణగ విజయాదిత్యుని కాలంలో వేయించిన ధర్మవరం శాసనం వచన రచనలో సలక్షణత్వానికి సాక్ష్యం ఇస్తుంది. శాసనాన్ని చూడండి.

''విజయాదిత్య పాదపద్మ భ్రమరాయమాణ శ్రీ మత్కడయ రాజు గుణగణా భరణుండు తనకెని ఈశ్వరునకు గార్తికేయుండు బోలె చౌషష్టి కళావిశారదూడయిన అయ్యాపయ్యాయు సకల కళాశాస్త్రార్థ పారగులైన పెద్దపండరంగులు అయిలమ పెగ్రడలుంగరమ్మున పండరంగును ఈ ధర్మ నిర్వాహన్యోదోగమ్మునకు బృహస్పతి సమానులయిన పెగ్రడకాడెయగారి కొడుకు బెజయరాజు సమర్థుడని ఆత్మాన్మతంబున బంచిన ప్రసాదంబని సమస్త రాజ్య భారానిరూపిత మహామంత్రాధిపతి మహేశ్వర పక్షపాతి దేవబ్రాహ్మణ గురుభక్తిపరుండు సశక్తిత్రయ సంపన్నుండు మయబెజయరాజు బెజయేశ్వరంబు గలశనిర్వహణంబు సేసి దిశగుడ్లుం బ్రాకారంబు మటంబును నెమియించి....: (S.I:1. 10-3)

ఇంత చక్కటి వచన రచన ఆనాడు సాగిందంటే ఏమైనా హృద్యమైన కథలూ, గాథలూ కూడా ఇలా వ్రాసుకొనేవారనీ, అవన్నీ కాలగర్భంలో కలసిపోయాయనీ అనిపించకమానదు. ఆ కథలన్నీ దక్కివుంటే ఎంత బాగుండును అని అనిపించకమానదు.

ఇటువంటి సంపదను భద్రం చేసిన శిలలు భూమిలో కలసిపోయినా, గ్రంథాలను క్రిములు భక్షించాయన్నా, రాగిరేకులను అల్పసంతోషులు కరిగించి వేశారన్నా కళ్ళవెంట నీళ్ళూ, వేడి నిట్టూర్పులూ, గొంతులో చేదు, గుండెలో బరువూ జనించక తప్పదు.

ఆశాజ్యోతి

అయినా ఒక ఆశ జ్యోతిలాగా మనసులో వెలుగు జిమ్ముతూంది. మొన్న మొన్నటిదాకా, అంటే వీరేశలింగంగారు శాస్త్రీయ పద్ధతులలో 'కవుల చరిత్ర' వ్రాయడం

మొదలుపెట్టేదాకా నన్నయగారితోనే తెలుగు భాష పుట్టిందనేగాని అంతకుముందూ కవులు వుండేవారనిగాని, ఛందస్సూ ప్రచారంలో ఉండేదనిగాని 'చదువుకున్న' వాళ్ళు సైతం విశ్వసించేవారు కాదు. అటువంటిది నేడు ప్రాఙ్నన్నయ యుగం గురించి ఎంతో పరిశోధన జరిగింది. తెలుగు సాతవాహనుల కాలంనుంచీ వుందని నిరూపించే సాక్ష్యాలు దొరుకుతున్నాయి. భావిపరిశోధనవల్ల, మరీ ప్రాచీనమైనవి కాకపోయినా, చాళుక్య యుగంలోని శాసనాలతోపాటు సాహిత్య యుగం బయటపడకపోతుందా అనే ఆశాభావం ఆరనిజ్యోతిగా వుంటుంది.

అలాంటి సాహిత్యం బయటపడితే మహామంచిదే. లేకపోయినా నన్నయగారికి పూర్వం సుమారు వెయ్యి సంవత్సరాలు తెలుగు తేనెటీగలు ఎంత శ్రమించి తియ్యని పట్టు పెట్టాయో తెలుసుకొనే అవకాశాలు ఆధునిక పద్ధతులవల్ల తెలిశాయి.

ఇల్లు అలుకుకొన్నాక తన పేరు తెలుసుకోవాలని ఆ ఈగకు జ్ఞాపకం వచ్చింది. తెలుసుకొన్నది.

ఇల్లలికాక... ... ఇక పండుగే!

మతాలు - కామితాలు

ఆంధ్ర సాహిత్యం గురించి సమగ్రంగా తెలుసుకొనడానికి ఈ సంపుటాలలో చేతనైనన్ని ప్రయత్నాలు చేద్దాం. సాహిత్యంపట్ల మన దృక్పథం ఏమిటో ముందు స్పష్టం చేసుకొందాం. వాఙ్మయం గురించి పూర్వులు చెప్పిన విషయాలూ, చేసిన నిర్వచనాలూ జ్ఞాపకం చేసుకొందాం.

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు ఒక గొప్ప సంగతి విశదం చేశారు.

''... 'దేశమంటే మట్టికాదోయ్! దేశమంటే మనుషులోయ్' అన్నాడు గురజాడ అప్పారావు. దీని తాత్పర్యం ఆలోచిస్తే వాఙ్మయం అన్నా లేక సాహిత్యం అన్నా ఆయా కాలాల్లో, దేశాల్లో వుండే ప్రజల ఉద్దేశాలూ, ఆచారాలూ, సంఘవ్యవస్థలూ, అభిరుచులూ మొదలైన వాటినన్నిటినీ కాలగర్భంలో లీనమైపోనీయకుండా వాటికి సారస్వత స్వరూపమైన తేజస్సుగూర్చి శాశ్వతంగా అక్షర విన్యాసంతో నెలకొల్పిన ఒక ఆకారమనిన్నీ, అది ఏకాలంలో ఎప్పుడు ఏ మాత్రం ప్రజ్ఞ కలవారైనప్పటికీ చాలు, కదిపితే తన నిజస్వరూపాన్ని విస్పష్టంగా వెల్లడి చేయగలిగిన అలౌకిక చైతన్యం కలిగిన ఒక దివ్యతేజః ప్రపూర్ణమైన విజ్ఞానరాశి అనిన్నీ అవగతం అవుతుంది కాబట్టి అది సాజాత్యవైజాత్యాలను స్ఫుటంగా వెల్లడించే సాధనం...''

ఆదినారాయణశాస్త్రిగారు యిచ్చిన ఈ వివరణతో సాహిత్య స్వభావం తేట తెల్లమవుతుంది. దేశమంటే మనుషులు, ప్రజలు. ప్రజలే తమ చరిత్రను సృష్టించుకొన్నట్టు

ప్రజలే తమ సాహిత్యాన్ని సృష్టించుకొంటారు. ఆదినుండీ మానవులు భూమికోసం, భుక్తికోసం, లేమినుండి విముక్తికోసం ప్రకృతి శక్తులతో పోరాడుతూనే వున్నారు. ఆ పోరాటాల విజయపరంపరలే నాగరికత, నాజూకు బతుకులు - ఇవి సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. ఇందులో వివిధవర్గాల సాజాత్య వైజాత్యాలు స్ఫుటంగా వెల్లడవుతాయి. పామరులు పాడుకొన్న నోటి పాటలూ, కల్పనాశక్తిగల గ్రామీణ కవులు కైగట్టి తరువాత తరాలకు అందించిన గేయాలూ కాలగర్భంలో కలిసిపోకపోయినా, కాలవశాన మార్పులు చెందినా ఏదో ఒక రూపంలో నేటికీ సజీవంగానే వున్నాయి. సామెతలూ, పొడుపు కథలూ ప్రాచీన విజ్ఞానానికి, ఒకనాటి సాహిత్యానికి గనులు. త్రవ్వి తలకెత్తుకోవలసినవి చాలా వున్నాయి.

ఆంధ్రసాహిత్యం గురించి చెప్పుకొనేటప్పుడు మన గురించి, మన భాష గురించి మళ్ళీ ఒకసారి చర్చించుకోవాలి.

మనం ఆంధ్రులం. మన భాషను తెనుగు, తెలుగు అని పిలిచేవారు. తర్వాత అది ఆంధ్రభాషగా కూడా ప్రసిద్ధమైంది. ఆంధ్రులెవరు? తెలుగువారెవరు? తెలుగువారూ, తెనుగువారూ ఒకరేనా? ఆదిలో గణసమాజాలలో ఉండేటప్పుడు వీరి జీవిత విధానాలేమిటి? ఆచార వ్యవహారాలేమిటి? ఆహారాలేమిటి? ఆహారం కోసం వారు పండించే పంటలేమిటి? మందలుగా పెంచిన జంతువులు ఏమిటి? ఇరుగు పొరుగు తెగలతో వాళ్ళ సంబంధాలెటువంటివి? తమ సంఘంలోనే వావివరసలెలా ఉండేవి? పెళ్ళిళ్ళు ఎలా జరిగేవి? పిల్లల పెంపకం ఏ పద్ధతుల్లో ఉండేది? జీవితావసర వస్తువులు ఎలా తయారు చేసుకొనేవారు? సరుకుల మార్పిడి తమలో తామూ, ఇరుగు పొరుగు తెగలతో ఎలా జరిగేది? ఇచ్చిపుచ్చుకోడాలు సరకులవరకేనా? లేక మనుషులకు కూడా వర్తించేదా?

ఇలాంటి వివిధ ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకొని వాటిని క్రోడీకరించితే అదే సంస్కృతి చరిత్ర అవుతుంది. ఇది సాహిత్య చరిత్ర కనుక ఇటువంటి ప్రశ్నలన్నింటికి మనం జవాబులు చెప్పుకోవడం లేదు. ఏదో అవసరమైనంత మటుకే చర్చించాము. కావలసిన విషయాలే చెప్పుకొన్నాం. అయితే సాహిత్య చరిత్ర అన్నది దేశ చరిత్ర నుండి విడిగా ఉండదు. జాతి చరిత్రలోని అన్ని భాగాలతో అది పెనవేసుకొని ఉంటుంది. ఒక భాష మాట్లాడే ప్రజల సంస్కృతిని తరతరాలుగా నిక్షిప్తం చేసే సాధనం సాహిత్యమే. అందుచేత వివిధ కోణాల నుంచి సాహిత్య చరిత్రను కూడా అధ్యయనం చేయాలి.

ఆంధ్రులెవరు? ఎక్కడివారు? ఎప్పటివారు? ఈ ప్రశ్నలకు ఇవాళ సమాధానాలు చాలా టూకీగా, సులభంగా చెప్పవచ్చు. ఆంధ్రుల ప్రసక్తి మొట్టమొదటిసారిగా ఐతరేయ బ్రాహ్మణంలో కనబడుతుంది. వైదిక వాఙ్మయంలో వేదాలు ప్రాచీనమైనవి. క్రీ.పూ. 1500 - క్రీ.పూ. 1000 సంవత్సరాల మధ్య ఇవి ఉద్భవించాయి. వేదాలు రెండు భాగాలుగా ఉంటాయి. మొదటి భాగమైన మంత్రాలను సంహితలంటారు. వేదమంత్రాల ఆవిర్భావానికి గల సంగతి సందర్భాలను, ప్రాచీన గాథలను, ప్రాథమిక దర్శనాలనూ తెలియజేసే

భాగాలను బ్రాహ్మణాలంటారు. ఋగ్వేదానికి అనుసంధానమైన ఐతరేయ బ్రాహ్మణం క్రీ॥ పూ॥ 600 నుండి 500 మధ్యకాలంలోనిది. ఇందులోనే ఆంధ్ర ప్రసక్తి తొలిసారిగా ఉంది. అందుచేత అప్పటికి కొన్ని తరాల ముందునుంచే ఈ ప్రజలున్నారన్నమాట. ఎన్ని తరాలని ప్రశ్నించుకొంటే ఎన్నో ఎన్నెన్నో తరాలనుంచే అని మాత్రమే చెప్పుకోగలము.

ఐతరేయ బ్రాహ్మణం ప్రకారం ఆంధ్రులు అనార్యులు. ఆర్యావర్తానికి సరిహద్దు ప్రాంతాలలో నివసించే అయిదు జాతుల మ్లేచ్ఛులలో వీళ్ళొకరు. ఆంధ్ర, పుండ్ర, శబర, పుళింద, మూతిబ అనే అనార్యులందరినీ ఒక కోవలోని వాళ్ళుగా ఆర్యులు భావించారు. క్రీ.శ. 6వ శతాబ్దిదాకా పుళిందులు వింధ్య పర్వత ప్రాంతాలలో నివసించేవారు. తూర్పు మాళవలోనూ, జబల్పూరు అని ఇప్పుడు పిలిచే దభాల దక్షిణంలోనూ కూడా పుళిందులు ఉండేవారు; కనుక ఆంధ్రులు కూడా ఆ ప్రాంతాలలో వారే. నిషాదులతో, కిరాతులతో, బర్బరులతో కూడా ఆంధ్రులను మనుస్మృతి, భరతుని నాట్యశాస్త్రం - మహాభాగవతం మొదలైన గ్రంథాలు పేర్కొన్నాయి.

క్రీస్తుపూర్వం 600 నాటికి ఆంధ్రులు అనాగరికులు, ఆటవికజాతులలోని వాళ్ళూ అయితే కావచ్చు. కానీ రెండు మూడు వందల ఏళ్ళలోనే మహాబల సంపన్నులు ఎలా అయ్యారు? క్రీస్తుపూర్వం నాలుగవ శతాబ్దంలో మగధ సామ్రాజ్యాన్ని పాలించిన చంద్రగుప్తమౌర్యుని ఆస్థానంలో ఉండే గ్రీకు రాయబారి మెగస్తనీసు ఆంధ్రుల ప్రాబల్యాన్ని పేర్కొన్నాడు. మౌర్యుల తర్వాత ఆంధ్రులే లెక్కలోనికి వస్తారన్నాడు. ఆంధ్రులకు బోలెడన్ని పల్లెలూ, కోటగోడలూ, బురుజులూ ఉండి సురక్షితమైన ముప్ఫయి పట్టణాలు ఉండేవని మెగస్తనీసు రాతవల్ల తెలుస్తుంది. అంతేకాదు మౌర్యచక్రవర్తి సేనలో లక్ష కాల్బలం, రెండువేల గుర్రాలు, వెయ్యి ఏనుగులను ఆంధ్రులు సప్లయి చేసేవారని కూడా ఆ గ్రీకు రాయబారి చెప్పాడు.

ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 600) నాటి ఆంధ్రులు కేవలం అనాగరికులు కారని చెప్పాలి. కట్టుదిట్టమైన ఒక సాంఘిక వ్యవస్థా, పకడ్బందీ అయిన ఒక రకం రాజకీయ, వ్యవస్థా ఏర్పడి ఉండకపోతే చంద్రగుప్త మౌర్యుని కాలానికి అంతటి మహత్తర సైన్యాన్ని పంపించగల స్థితిలో ఆంధ్రులుండేవారుకారు. క్రీస్తుపూర్వం 230–207 సంవత్సరాల మధ్యనున్న చిముక సాతవాహనుడు ఇరవై మూడేళ్ళు పాలించి, తొలి సాతవాహనుల వంశాన్ని స్థాపించాడంటే అప్పటికి ఎంతో పూర్వకాలంలోనే రాచరికం పునాదులు పడ్డాయన్నమాట.

ఈ రాజవంశంలో ఇద్దరు 'చిముక' అనే పేర్లున్న వ్యక్తులు కనబడుతున్నారు. తొలి చిముకునికీ, రెండో చిముకునికీ రమారమి రెండువందల సంవత్సరాల ఎడం కనబడుతుంది. రెండో చిముకుని నాణెం ఒకటి కోటిలింగాల వద్ద లభించింది. ఈ ప్రదేశం సాతవాహనుల జన్మ రాష్ట్రంలోనిది. బహుకాలం నుంచీ ఇక్కడ ఆంధ్రుల పరిపాలన సాగుతూ ఉందని చెప్పుకోవచ్చు.

సాతవాహనుల జన్మరాష్ట్రాన్ని 'అంధక రట్టమ'ని పిలిచేవారని బౌద్ధ గ్రంథాలవల్ల తెలుస్తుంది. అశ్యకులు, అళకులు లేక ముళకులు అని ఆంధ్రరాజులను పిలిచేవారు. అశ్మక, ములక అనే ప్రాంతాలు నేటి తెలంగాణా, రాయలసీమ భూభాగాలలో ఉన్నాయి. అశ్మకంలోనేవున్న నేటి కరీంగనర్ జిల్లాలోని కోటిలింగాలవద్ద అత్యంత ప్రాచీన నాణాలు దొరికాయి. వాటిమీద 'రఞోగోభద్ర', 'రఞో సమగోప' అనే ఇద్దరు రాజుల పేర్లు కనబడుతున్నాయి. ఈ పేర్లు వివిధ పురాణాలలో పేర్కొన్న సాతవాహన రాజుల జాబితాలో కనబడవు. అందుచేత ఆ రాజ్యస్థాపనకు పూర్వమే ఈ నాణాలు చలామణిలోనికి వచ్చాయని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ పేర్లలో ఒకటి శుంగ వంశపు రాజులలో తొమ్మిదవ రాజైన భాగభద్రునికి చెందుతుందంటున్నారు. ఒకనాడు ఈ తెలుగు పరగణాలలో మౌర్య, శుంగ, కణ్వ, ఆంధ్ర వంశాల రాజులు పరిపాలించిన మాట మాత్రం నిజం.

ఇన్ని రాజ్యాలు ఇక్కడ మొలకెత్తడానికి, వేళ్ళూనడానికి కారణాలు ఏమిటి? ఆర్థికంగా లాభసాటి కాని ఏ ప్రాంతాలనైనా ఎవరూ పాలించాలనుకోరు. లక్ష కాల్బలం సమీకరించదగిన స్తోమతగల రాజ్యాన్ని పోషించే ఆర్థిక వ్యవస్థ ఏమిటి? లక్షమంది సైనికులను మేపగలిగిన పంటలను పండించే సైరికులు ఎంతమంది? ఆ రైతుల శ్రమకు ప్రతిఫలం ఏమిచ్చేవారు? పడ్డ పాటుకు కోరుకొన్న సుఖం దక్కేదా? లేక కష్టాలే ప్రాప్తించేవా? లక్షమంది సైనికులకు ఆయుధాలు, తల తొడుగులు, కవచాలు తయారు చేసే కార్మికులెంతమంది? వీళ్ళకు శ్రేణులు ఉండేవా? ఆయుధాలకేకాక, ఆహారోత్పత్తికి అవసరమైన పనిముట్లను తయారు చేయడానికి ముడిసరుకు ఎక్కడ లభించేది?

నేటి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్లు, ఖమ్మం జిల్లాలలోని కొన్ని భాగాలు కలిసిన ప్రాచీన అశ్మక రాష్ట్రంలో ముడి ఇనుము నాటికీ, నేటికీ కూడా లభ్యమవుతూంది. రాక్షసి బొగ్గు దొరుకుతుంది. ఈ ఖనిజ సంపదే తొలి సాతవాహనుల ప్రాబల్యానికి, రాజ్యస్థాపనకూ దారితీసింది. ఈ పరగణాలలోని ఊళ్ళకు తలవరులు ఉండేవారు. చాలా ఊళ్ళు కలసి ఒకనాడుగా ఏర్పడ్డాక తలవరులందరికీ పెద్దగా ఒక మహాతలవర ఏర్పడ్డాడు. మౌర్యులతో సంపర్కం ఏర్పడ్డాక రఠులూ, మహారఠులు, సేనాపతులు, మహాసేనాపతులు పుట్టుకొచ్చారు. ఇంతింతై వటుడింతై అన్నట్టు మొదట మూడు రాష్ట్రాలలో ఉండే సాతవాహనులు పది రాష్ట్రాలదాకా విస్తరించారు. పరిపాలన చేతిలో దక్కించుకొందుకు పలురకాల మతాలను అనుసరించారు. పాడిపంటలు పెంపుదల కోసం బౌద్ధమతాన్ని, ప్రభుత్వాధిక్యత కోసం యజ్ఞ సంస్కృతినీ పాటించేవారు.

వ్యావసాయికంగా ఉత్పత్తిలో ఉన్నత శిఖరాలను అందుకోదలచిన వ్యవస్థ యజ్ఞ సంస్కృతిని నిత్యం ప్రోత్సహించలేదు. వైదిక యజ్ఞయాగాదులు ఋగ్వేదకాలంలో ఆర్యుల జీవన విధానం కావచ్చునుగాని గణరాజ్యాలు పోయి సామ్రాజ్యాల దిశగా మానవ సంఘాలు పయనిస్తున్నప్పుడు జైన, బౌద్ధమతాల వంటివి తల ఎత్తక తప్పదు,

సామాన్య ప్రజలు వాటిని ఆచరించకా తప్పదు. ఋగ్వేద ఆర్యులు గోమాంసాన్నీ, గుర్రం మాంసాన్నీ, గొర్రెలూ, మేకలు వాటితోపాటు తినేవారు. వాటిని ముందు యజ్ఞంలో దేవతలకు అర్పించి తరవాత హాయిగా తినేవారు. బుద్ధుని కాలంలో కూడా 'గోమాంసాన్ని నరికి బజారులో పోగులు పెట్టి అమ్మడం' బౌద్ధగ్రంథాలలో సైతం చెప్పారు.

మహాయజ్ఞాలలో ఏకకాలంలో అయిదు వందల ఎద్దులు, అయిదు వందల గోవులు, అయిదు వందల దున్నలు, అయిదు వందల మేకలు, అయిదు వందల పొట్టేళ్లు సేకరించి యూపాకులకు కట్టి వధించేవారు. రోజుకు అయిదునూర్ల లెక్కన జంతువులను చంపి తినేవారన్నమాట. ఇవి తమ మందలలో తాము పెంచిన జంతువులయితే ఎవరికైనా ఆక్షేపణ ఉండకపోవచ్చు. తమ ఆహారం కోసం తాము పెంచుకొన్నవి, తమ చేతులతో తాము వధించి తమ దేవతలకు అర్పించి తనివితీరా తాము తినడంలో తప్పులేదనిపించక మానదు.

అయితే రానురాను యజ్ఞం చేసే యజమానులు, రాజులు తమ చేతులతో తాము స్వయంగా ప్రాణివధ చేసేవారు కారు. సేవకుల చేత చేయించేవారు. బలిపశువులు కూడా ఆ పాలకుల, బ్రాహ్మణుల సొంతాలు కావు. అందుకే యజ్ఞకార్యాలలో పనిచేసే సేవకులు, చర్మకారులూ, సామాన్య ప్రజలతోపాటు బాధపడేవారు. ధర్మానంద కోశాంబిగారు దీనికి కారణం ఇలా చెప్పారు.[1]

''సేవకులు, చర్మకారులు యజ్ఞకార్యములు సేయుటలో సంతృప్తిబడుట యెందుకు? నడుమ నడుమ వదరుటెందుకు? దీనికి గారణమేమి? యజ్ఞములందు వధింపబడు జంతువులు బీదలైన రైతులవి. వారిని బెదిరించి, యా జంతువుల గైకొని వత్తురు. దీనితో నారైతులకు మనస్సులందమిత దుఃఖము, వారివంటి వారైన సేవకులు, చర్మకారులు వీరికి దుఃఖము, 'సుత్తనిపాతమం'దు 'బ్రాహ్మణ ధమ్మిక సుత్తము' లో బ్రాచీన కాలమందలి బ్రాహ్మణాచరణము వర్ణితము. ఆ ఘట్టమందీ క్రింది గాథలున్నవి.

యధా మాతాపితా, భాతా, అఞ్ఞేఆజ్ఞావాపిచ, ఞాతకా
గావో, నో, పరమామిత్తాయాసు జాయంతి, ఓ సదా
అన్నదా, బందా, చేతా, వణ్ణదా, సుఖదా, తధా
పీత మత్థవసం ఞత్వా నాస్సుగావో హనింసుతే.

''తల్లిదండ్రులు, దమ్ములు, నితర బంధువులు - వీరివలెనే గోవులు మా కత్యంత ప్రియములు. మా సేద్యము వానిపైననే యాధారపడియున్నది. అన్నము, బలము, కాంతి, సుఖము - యీ పదార్థములనిచ్చు దాతలివియే. దానిని గ్రహించి ప్రాచీన బ్రాహ్మణులు గోవులను వధింపకుండిరి.''

---

1. ధర్మానంద కోశాంబి, 'బుద్ధ భగవానుడు' పుట్టపర్తి నారాయణాచార్యులు (1957) కడప.

పై గాథలనుబట్టి సామాన్య ప్రజలకు గోవు లిష్టబంధువులవలె బ్రియమైనవనియు, వానిని యజ్ఞయాగములందు నిరవధికముగ జంపుట వారికిష్టము లేదనియు స్పష్టము గదా!

జైన, బౌద్ధమత ప్రభావంవల్లనే ప్రాచీన బ్రాహ్మణులు శాకాహారులయ్యారు. సామాన్య ప్రజానీకంలోని అత్యధిక సంఖ్యాకులు మాంసాహారులేగానీ పాడిపంటలకు అవసరమైన పశుసంపదను తప్పించి మిగతావే తినేవారు. తమ దేవతలకు బలియిచ్చి తాము భుజించే వాటిని పరిమితం చేశారు. తరతరాలుగా వచ్చే ఆచారాలను తప్పించడం అశోక చక్రవర్తి అంతటివాడికే తప్పలేదు. రాజుల సువారంలో మాంసాహారం తప్పనిసరి. అహింసావాది అయ్యాక అశోకుడు తన ధర్మలిపులలో ఇలా ప్రకటించాడు.[2]

> "ఆహారము కొరకు ప్రియదర్శి దేవానాం ప్రియుని మహానసమందు వంట యింటిలో ప్రతిదినము వేలాది జంతువులు వధింపబడెడివి.
>
> ఈ ధర్మలిపి వ్రాయించు నాటికి రాజప్రాసాదమున రోజుకు మూడు జీవులు - ఒక జంతువు, రెండు పక్షులు - మాత్రమే మాంసాహారము కొరకు చంపబడెడివి.
>
> ఈ జీవులుకూడ ప్రతిదినము వధింపబడుటలేదు. ఇకనుండి ఇవికూడ చంపబడవు."

ఆహారం అన్ని ప్రాణులకూ జీవితావసరమే. అయితే మానవులు మాత్రమే అలవాట్లను మార్చుకోగలరు. తరతరాల ఆచారాలను మార్చడానికి వీలుగా మత విశ్వాసాలను మలచుకోగలరు. ఆర్థికంగా లాభసాటి అయిన ఏ మతాన్నయినా వాణిజ్యవర్గాలు ప్రోత్సహిస్తాయి. అటువంటి బలవత్తర వర్గాలు ఆదరించబట్టే ఆదినుంచీ, అంటే అశోకుని కాలానికి చాలా ముందుగా ఆంధ్ర ప్రాంతాలలో బౌద్ధమతం విస్తరించి వర్ధిల్లింది.

ప్రాచీన అశ్మక రాష్ట్రమైన కరీంనగర్ జిల్లాలోని ధూళికట్ట, ఫణిగిరి, తిరుమలగిరి వంటి ప్రదేశాలలో, ఖమ్మం పరగణాలోని గుమ్మడిదుర్రు, కృష్ణామండలంలోని అల్లూరు, జగ్గయ్యపేట, బెజవాడ, గుడివాడ, ఘంటసాల వంటి క్షేత్రాలలో, అటు ఉత్తరాన ఉభయగోదావరి మండలాలలో గుంటుపల్లి, ఆరుగొలను, కొడవలి, ఇంకా ఉత్తరాన సంకారం, రామతీర్థం, శాలిహుండం వంటి స్థావరాలలో, దక్షిణాన గుంటూరు మండలంలోని గరికపాడు, గోలి, చేజర్ల, అమరావతి, నాగార్జునకొండ వంటి స్థానాలలో, పశ్చిమాన రాయలసీమలోని గుత్తి వంటి తావుల్లో ఆదిమకాలం నుంచీ బౌద్ధమతం అల్లుకుపోయింది. వ్యాపారవర్గాలకు చేరువలో ఉండే కొండలలో, విహారాలలో బౌద్ధభిక్షువులు నివసించేవారు. వారికోసం రాజవంశాలలోని స్త్రీలూ, వాణిజ్య శ్రేణులలోని ప్రముఖులూ దానాలు చేసేవారు, గుహాలయాలు దొలిపించారు. సామాన్య ప్రజలు కూడా స్థూపనిర్మాణాలకు విరివిగా విరాళాలు ఇచ్చినట్టు శిలాక్షర సాక్ష్యాలు ఉన్నాయి. మౌర్యుల సంపర్కంవల్ల లిపి, బ్రాహ్మీలిపి, భాష ప్రాకృతం అయినా ప్రజల

2. మొదటి శిలానుశాసనం. 'అశోకుని ఎర్రగుడి శిలాశాసనము.'

నిత్య వ్యవహారాలు మాతృభాషలోనే జరిగేవి. ప్రజల జీవిత విధానాలను, కట్టూ బొట్టూ మొదలైన విశేషాలను మౌనంగా విశదం చేసే శిల్పసంపదను ఆంధ్రభూమిలో బౌద్ధులు మనకు ఇచ్చిపోయారు. శాసనాధారాలు అశోకుని కాలంనుంచీ లెక్కకట్టుకోవాలి. ఎందుచేతనంటే ఆ చక్రవర్తి కాలమే రూఢిగా తెలియవచ్చేది. క్రీస్తుపూర్వం 273 నుండి 230 దాకా అతడు పాలించాడు. అతని సామ్రాజ్యంలో ఆంధ్రదేశం కూడా ఒక భాగమే.

అశోకుడు తన సామ్రాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించాడు. ఒక్కొక్క రాష్ట్రానికి ఒక ముఖ్య పట్నం ఉంది. పశ్చిమోత్తరంలో గాంధార రాష్ట్రానికి తక్షశిల రాజధాని. కళింగ రాష్ట్రానికి తోసలి ముఖ్య పట్నం. పశ్చిమ భారతానికి ఉజ్జయిని ప్రధాన నగరం. దక్షిణ భారతంలోని ఆంధ్ర రాష్ట్రానికి సువర్ణగిరి రాజధాని.

ఇప్పటికీ మన రాష్ట్రంలో ఆ నగరం లేకపోలేదు. అయితే ఇప్పుడు అది నగరం కాదు, గ్రామం. సువర్ణగిరి అనే పేరు సొర్నగిరి, సొన్నగిరిగా మారి నేటికి జొన్నగిరి అనే పేరుతో పాత ప్రసిద్ధ నామానికి ప్రతిధ్వనిగా మిగిలింది. ఈ జొన్నగిరి దగ్గర ఎర్రగుడి అనే మరో గ్రామం ఉంది. ఇక్కడే జొన్నగిరి ప్రాచీన రాజధాని నగరమని రుజువుచేసే సాక్ష్యాలు దొరికాయి.

కర్నూలు జిల్లా పత్తికొండ తాలూకాలో గుత్తికి వాయువ్య దిశన ఎనిమిది మైళ్ళ దూరంలో ఎర్రగుడి గ్రామం ఉంది. గ్రామ సమీపంలో పెద్ద రాతి బండలున్నాయి. ఈ బండలమీద అలనాడు అశోక చక్రవర్తి తన ధర్మలిపులను చెక్కించాడు. సుమారు రెండువేల రెండువందల సంవత్సరాలు ఈ శిలానుశాసనాలు వెలుగులోనికి రాలేదు. 1928లో భూగర్భశాఖకు చెందిన ఎ. ఘోష్ అనే శాస్త్రజ్ఞుడు ఖనిజాల కోసం ఎర్రగుడి ప్రాంతాలను పరిశోధిస్తూ వుంటే ఈ శిలాక్షరాలు ఆయన కళ్ళపడ్డాయి. ఆయన పురాతత్త్వ శాఖవారికి ఈ సమాచారం అందచేశారు. పురాతత్త్వ శాఖకు చెందిన దయారాం సహానీగారూ, హరిప్రసాద్‌శాస్త్రిగారు ఎర్రగుడికి వెళ్ళి శాసనాలను పరిశీలించారు. అశోకుని ధర్మలిపులను గుర్తుపట్టారు. భూగర్భ శాఖవారు ఖనిజాల కోసం వెదుకుతూ వుంటే పురాతత్త్వ శాఖ వారికి బంగారం కన్నా విలువైన చారిత్రక ప్రమాణాలు దొరికాయి. 1929 జూన్ 11వ తేదీనాడు ఆంధ్ర జిల్లాలో అశోకుని శాసనాలు దొరికినట్టు పత్రికా ముఖాన ప్రకటించారు.

ఈ వార్త ఆంధ్ర చారిత్రక పరిశోధకుల వీనులకు విందయింది. కాళ్ళకు కదలికను తెచ్చింది. చరిత్ర పరిశోధనకే జీవితాన్ని అంకితం చేసిన మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, పరిశోధనా పద్ధతులను పకడ్బందీగా తీర్చిదిద్దిన నేలటూరు వెంకటరమణయ్యగారు వెనువెంటనే ఎర్రగుడికి వెళ్ళారు. ధర్మలిపులను చూశారు. చాలా రహస్యంగా శాసనాలకు నకళ్ళు కాగితాలమీదకు ఎక్కించారు. ఈ ఎస్టాంపేజ్ పత్రాలను గుట్టుచప్పుడు కాకుండా చెన్నపట్నం తీసుకువెళ్ళారు.

ప్రభుత్వం వారిని నమ్ముకుంటే ఈ శాసనాలు వెలుగు చూడ్డానికీ, అందులోని విషయాలు లోకానికి తెలియడానికీ ఏళ్లూ పూళ్ళూ పడతాయని ఈ తెలుగు చరిత్రకారులకు తెలుసు. అందుకే శాసనాలను చదివి పరిష్కరించి, 1929 సెప్టెంబరు మాసం భారతి పత్రికలో ప్రచురించారు.

మల్లంపల్లివారో, నేలటూరివారో భయపడినట్లే 1928లో బయటపడిన శాసనాలను 1958లో, అంటే ముప్ఫై సంవత్సరాలకుగాని ప్రభుత్వమువారు ఎపిగ్రాఫియా ఇండికాలో అధికారరీత్యా ప్రకటించలేదు. ఇందుకు బోలెడన్ని కారణాలు ఉన్నాయి.

ఎర్రగుడి దగ్గర అశోకుడు వేయించిన రెండు లఘుశిలానుశాసనాలూ, పధ్నాలుగు పెద్ద శిలానుశాసనాలూ దొరికాయి. అశోకుడు తన సువిశాల సామ్రాజ్యంలో ఇతర చోట్ల వేయించిన శాసనాల పాఠాలే వీటిలోకూడా వున్నాయి. ఇవి ఆంధ్ర జిల్లాల్లో దొరకడం వల్ల అశోకుడు తన శిలానుశాసనాలలో చెప్పిన సువర్ణగిరి ఉనికిని నిర్ణయించటానికి అవకాశాలు లభించాయి.

అశోకుని కాలంలో జొన్నగిరి ఎలా ఉండేదో వూహించుకొనడం ఏమంత కష్టం కాదు. అశోకుని ఇతర ప్రాదేశిక రాజధానులంత గొప్పగా జొన్నగిరి వుండేదన్న మాట. పాటలీపుత్రం సామ్రాజ్యానికి రాజధాని అయితే మిగతావి ఉపరాజధానులు. రాజధానిలో రాజూ, ఉపరాజధానిలో ఉపరాజూ ఉంటాడు. ఉపరాజు అంటే సమ్రాట్టుకు సాక్షాత్తూ తోడబుట్టినవాడై వుంటాడు. ఉపరాజులే కాక యువరాజులు, రాజకుమారులూ, ఆర్యపుత్రులూ కూడా ఉపరాజధానిలో వుంటారు. ఈ ఉపరాజులను రాష్ట్రీయులంటారు.

ఇక పరిపాలనా వ్యవస్థలో న్యాయాధికారులైన రజ్జుకులూ, మహామాత్రలూ, అంత మహామాత్రలూ, ధర్మ మహామాత్రలూ ఉపరాజధానిలో కూడా వుండేవారు. అంతేకాదు స్త్రీ అధ్యక్ష మహామాత్రలూకూడా వుండేవారు. ఇది ఈనాటి మహిళా సంక్షేమశాఖ లాంటిది.

అశోకుని కాలంలో స్త్రీల స్థితిగతులు ఎలా ఉండేవి? సామాన్య స్త్రీల జీవన విధానం ఎలా వుండేది? ఈ సంగతులు అశోకుని శిలానుశాసనాలవల్ల తెలుస్తాయా? తెలుగు గడ్డమీద కూడా ఈ ధర్మలిపులు లభించడంవల్ల సుమారు రెండువేల రెండు వందల సంవత్సరాల క్రిందట తెలుగు ఆడబడచుల ఆచార వ్యవహారాలేమిటి? వారే మతం అనుసరించేవారు? ఈ ప్రశ్నలకు కొన్ని సమాధానాలు ఈ ధర్మలిపులవల్ల తెలుస్తాయి.

పదమూడవ శిలానుశాసనంలో అశోకుడు చెప్పినట్టు ''ఏదో ఒక మతమును అనుసరించని జనముండు దేశమే లేదు.'' అశోకుడు తన మొట్టమొదటి శిలానుశాసనంలో ఇలా చెప్పాడు.

''ఇచ్చట ఏ సజీవ ప్రాణిని బలి యివ్వకూడదు.''

''ఇచ్చట ఏ విధమయిన వేడుక, సమూహము కూడా నిషేదిద్ధము''
''అట్టి సమావేశము వలన హాని కలుగునని దేవానం ప్రియుని అభిప్రాయం.''

పై మూడు అనుశాసనాల వలన అశోకుని కాలంలో జాతరలు జరిగేవని, వాటిలో జంతుబలులు ఇచ్చేవారని స్పష్టం అవుతున్నది. ఈ జాతరలలో తెలుగు స్త్రీలు ఎలా పాల్గొనేవారో తెలుగు సాహిత్యం వలన తెలుసుకోవచ్చు.

ప్రతి గ్రామానికి ఒక దేవత వుంటుంది. ఆ గ్రామ దేవతకు జాతర చేసే దినాన్ని గ్రామాధికారి నిర్ణయిస్తాడు. జనులు కల్లు బాగా తాగి చిందులాడుతారు. పామరస్త్రీలు గోర్వెచ్చని చమురంటుకొని, తలకు నీళ్ళు పోసుకుని, కొత్త బట్టలు కట్టుకొని, కంట-కాటుక, నొసట సింధూరము దిద్దుకొని, కొప్పులో పూలు తురుముకొని, తాంబూలం వేసుకొని, వేపాకుమండలు పట్టుకొని బయలుదేరుతారు.

గంగ జాతరలో పాల్గొనే సామాన్య స్త్రీలను తెనాలి రామకృష్ణుడు తన పాండురంగ మాహాత్మ్యంలో ఇలా వర్ణించాడు.

అంబోధరము క్రింద నసియాడు నైరావ
తియు బోలె సిడి వేలె దెఱవయోర్తు
చెందమ్మి కొలన రంజిల్లు నంచయుబోలె
నిప్పుటేట నటించె నెలతయోర్తు
తొలుసంజె యెండ వర్తిలు జక్కవయు బోలె
నీగె బందిరి గుండమింతి యోర్తు
జలనీలపై నిక్కు నలువ మొగ్గయు బోలె
ననటాకు నర్తించె నతివయోర్తు
కాంత యొక్కర్తు మూపునఁగండలిచ్చె
మాఱుగాలిచ్చెనొక సుధామధురవాణి
లలన యొక్కర్తు నోరి తాళంబులిచ్చె
శక్తి జాతర తమ భక్తి శక్తులెసగ (3-77)

విజయనగర సామ్రాజ్య కాలంలోని ఈ ఆచారాలను రామకృష్ణుడు యథాతథంగా వర్ణించాడు. సమకాలికులయిన విదేశీ చరిత్రకారులు ఈ సంగతులను ధృవీకరించారు. ''ఈ దేశములోని స్త్రీలు అతి సాహసికురాండ్రు. తమ మొక్కులను చెల్లించుకొనుటలో భయంకరమగు పనులను చేయుదురు'' అని బార్బోసా తన కళ్ళారా చూసి రాశాడు.

జాతరలలో జంతుబలి ఆత్మ హింసాత్మక చర్యలూ వుంటాయనే అశోకుడు తన మొట్టమొదటి శిలా శాసనంలో జంతుబలులను, జాతరలను నిషేధించాడు. అయితే ప్రజలు తరతరాలుగా వస్తున్న తమ ఆచార వ్యవహారాలను మానలేరు. ఇంట్లో నోములూ, వ్రతాలూ చేసుకొనక మానరు. అనారోగ్యం వస్తే మొక్కుకుంటారు. కోరిన కోర్కెలు తీరిన

మొక్కిన మొక్కులు చెల్లించుకుంటారు. వీటిని ఏ రాజూ నిషేధించలేదు. అందుకే అశోకుడు తన తొమ్మిదవ శిలానుశాసనంలో ఇలా చెప్పాడు.

''1. దేవానం ప్రియుడు ఈ విధముగ దెల్పెను.

2. జనులు అనారోగ్యముగా నున్నప్పుడు గృహమందు వివాహాది శుభకార్యములు జరుగునప్పుడు మంగళ ప్రధానమయిన క్రతువులు చేయుచుందురు.

3. ఆయా సందర్భములలో శుభాకాంక్షులై పుణ్యకార్యములు చేయుట కూడా కలదు.

4. అందు ముఖ్యముగా స్త్రీలు నిరుపయోగమైనట్టి, అర్థరహితములైనట్టి పనులెన్నో చేయుట కలదు.

5. శుభప్రదమయిన కార్యములను తప్పక చేయవలసినదే.

6. కాని సాధారణముగా మనము చేయు కార్యములు తగినంత ప్రయోజనకరములు కావు.''

అశోకుడు అలనాడు చెప్పిన ఆ మాటలు అక్షరాలా ఈనాటికీ నిజం. అశోకుని కాలంలోనే కాదు అథర్వవేద కాలంలోనూ వున్నాయి. ఆ వేదానికి అనుబంధమయిన సర్పవేదం, పిశాచవేదం, అసురవేదం తొలినాటి భయాలను, ప్రమాదాలనూ, విరుగుళ్ళనూ తెలియజేస్తాయి. జ్వరం, వరుస జ్వరం, పసరికలు, అజీర్ణం, జలోధరం, కుష్ఠ వ్రణాలు, పురుగులు పడడం, పశురోగాలు, విషప్రయోగాలు మొదలయిన వాటిని నివారించడానికి అథర్వ వేదంలో మంత్రాలు వున్నాయి.

ఆరోగ్యం కోసం సర్వ ప్రయత్నాలూ చేయవలసినదే. ఔషధం చికిత్స అవసరమే. పెళ్ళి, పురుడు మొదలైన శుభకార్యాలలో వేడుకలు జరుపుకోవలసినదే. అయితే సంవత్సరంలోని మూడువందల అరవైరోజులూ ఏదో ఒక వ్రతం చేయడానికి వీలుగా తిథికో పండుగ మనకు లేకపోలేదు. ఈ వ్రతాలు కాక ఆడవారు నోచే నోములకు లెక్కలేదు. స్త్రీలలో ఇంకా మూఢనమ్మకాలు వుంటున్నాయి.

ప్రాణికోటిలో పోతు జీవాలకన్న పెంటి జీవాలకే బాధ్యతలు ఎక్కువగా ఉంటాయి. బిడ్డలను కనడం, సాకడం, జీవనవిధానాలు నేర్పడం, వాటి బ్రతుకులు అవి బతకగలిగేదాకా కూనల యోగక్షేమాలు చూడడం, సంరక్షించడం మొదలైనవన్నీ తల్లికే పరిమితమైన విధులు. తనవారి మంచి చెడ్డల గురించి ఏర్పడే కామితాల వల్లనే ఆడవారిలో ఒకరకం విశ్వాసాలు ఏర్పడుతాయి. ప్రకృతి శక్తులను మెప్పించడం, ఒప్పించడం, వాటిని తమకు అనువుగా తిప్పుకోవడం వంటి కార్యాలలోనే ఆదిమ మంత్రచర్యలు ప్రారంభమయ్యాయి. చెట్టులోనూ, పుట్టలోనూ, సకల చరాచర జీవకోటిలోనూ శక్తులను గమనించి వాటిని పూజించడం ప్రపంచ వ్యాప్తమైన మహిళాలోక చర్య. మాతృత్వం జీవకోటికి నిత్యరక్ష.

ప్రపంచ మంతటిలో ఆదిమ దేవతలందరూ స్త్రీమూర్తులే, మాతృకలే. తెలుగు గడ్డమీద కూడా తొలిదేవతలు అమ్మవార్లే, పెద్దతల్లులే. క్రీస్తుపూర్వం రెండు మూడు శతాబ్దాలనాటి సాతవాహన జన్మరాష్ట్రంలో అడ్డాలలో బిడ్డను పెట్టుకొన్న మాతృదేవత విగ్రహం లభించింది. పురాతత్వ శాస్త్రజ్ఞులు ఇటువంటి శిల్పాన్ని 'అంకధాత్రి' అని పిలుస్తారు (చూ॥ చిత్రం ౧). తల్లీబిడ్డల శిల్పాలు ప్రపంచంలో ఎక్కడివైనా సారావృద్ధి మంత్రచర్యకు సంబంధించినవే. తొలి సాతవాహనుల కాలంలో ధూలికట్టదగ్గర 'అంకధాత్రి' బొమ్మ దొరికితే పెదబంకూరు వద్ద ఒక చేతిని పైకెత్తి రెండోచేత్తో పళ్ళగుత్తిని పట్టుకొన్న మాతృక బొమ్మ దొరికింది.[3] ఒక చిలుక ఈ తల్లి ఎడమ చన్నును గ్రోలడానికి ప్రయత్నిస్తున్నట్లు కనబడుతుంది (చూ॥ చిత్రం ౨). స్తనాలు మాతృత్వధారకు నిలయాలు. లోక సంతానానికి ఆకలి పోగొట్టే ఆహార పోషకాలు. 'జగత్తు మిథ్య' అనే వేదాంతం ముదిరిన వాళ్ళే నారీ స్తనభర నాభీదేశాన్ని వీక్షించి అవి కేవలం 'మాంస వసాది వికారా'లనుకొంటారుగాని ప్రపంచంలోని ప్రాక్తన జనులందరూ అవి అన్నపూర్ణలనే భావించారు. తమ దేవతలకు ఎన్నో చేతులూ, ఎన్నో తలలూ ఉన్నాయని భావించినట్టే తమ మాతృదేవతలకు బహుళస్తనాలు ఉన్నట్టు ఊహించుకొని బొమ్మలు చేసుకొన్నారు. మన తెలుగుగడ్డ మీద ధూళికట్టవద్ద దొరికిన ఒక మాతృక తన నిండు చనుగవను రెండు చేతులతో పట్టుకొని పాలివ్వబోతున్నట్టు చూచుకాలను చూపిస్తున్న భంగిమలో ఉంది. సాతవాహనుల అమ్మవారి బొమ్మలలో 'కుమరి' అనే దేవత ప్రముఖమైనదిలాగ కనబడుతోంది (చూ॥ చిత్రం 3). ఈమెకు గుడులు కూడా ఉండేవి.

తెలుగువారు మాతృస్వామ్య వ్యవస్థనుండి వచ్చినవారు. అందుకే సాతవాహనులు తరువాత ఇక్ష్వాకులూ మొదలైనవారు తమ పేర్లలో ముందు తమ తల్లి పేరు చెప్పుకొనేవారు. ఇక్ష్వాకుల కాలంలో 'ఆడపెత్తనం' పెద్దతనానికి చిహ్నం. మాతృస్వామ్య వ్యవస్థను తోసిరాజనకపోయినా, బౌద్ధమతాన్ని కాదని యజ్ఞ సంస్కృతికి పెద్దపీట వేసే వైదికమతానికి ఇక్ష్వాకులలో మొదటి మహారాజు 'చాత్తములుడు' రాజ్యావసాన కాలంలో ప్రజల ఆగ్రహానికి లోనయినట్టు కనబడుతోంది. ఇతడు అశ్వమేధం, వాజపేయం, అగ్నిష్టోమం మొదలైన యజ్ఞాలను చేశాడు. అనేక కోటి హిరణ్యాలను, గోవులను, హలక్షేత్రాలను దానం చేశాడు. దీనివల్ల ఆర్థిక విధానంలో అనుకోని మార్పులు వచ్చినట్టున్నాయి, ప్రజలు తిరగబడ్డారు.

చాత్తములుని తర్వాత అతని కుమారుడు మాఠరీపుత్ర వీర పురుషదత్తుడు రాజ్యానికి వచ్చారు. తండ్రి చేపట్టిన వైదిక మతాన్ని నిరసించి ప్రజలకు అంగీకారమైన బౌద్ధాన్ని మళ్ళా స్వీకరించాడు. ప్రజలను శాంతింపజేశాడు. ఈ సంఘటనలను నాగార్జునకొండ వద్ద లభించిన శిల్పాలు చెప్తాయి.[4]

3. Krishna Sastry, V.V : 'The Proto and Early Historical Cultures of A.P., P. 223 Hyderabad, 1983.

4. బి.యన్. శాస్త్రి ''ఆంధ్రుల సాంఘిక చరిత్ర'' (క్రీ॥ పూ॥ 400 - క్రీ॥ శ॥ 1100 వరకు) పుటలు 119 నుండి.







ఒక శిల్పము నందొకరాజు ఎడమచేతిని నడుమున కాన్చి, కుడి మోకాలిపైన పిడికిలి బిగించి, కుడిచేతి నుంచి ముందుకు వంగి ఏడు పడగల నాగుపాము మధ్యనగల లింగమును కుడి పాదముతో త్రొక్కుచున్నట్లు చిత్రించబడినది. కుడిచేతి తర్జని వ్రేలును పైకెత్తి నిషేధించుచున్నట్లు ఒక వ్యక్తి, అతని ప్రక్కగా కత్తులతోనున్న ఇద్దరు వ్యక్తులు, మరిద్దరు చేతులు పైకెత్తి అఱచుచున్నట్లును చెక్కబడినది. ఈ శిల్పము వీరపురుషదత్తుని బ్రాహ్మణ మత నిరసనమును తెల్పును.

మరియొక శిల్పమున రాజు, అతని వెనుక ఛత్రవాహకుడు, సేవకుడు చిత్రింపబడినారు. రాజు ఎడమ చేయి నడుముపైనను, బిగపట్టిన కుడిచేయి కుడిమోకాలి పైనను, రాజు దక్షిణ పాదము పిడికిలి నాగ గర్భమందున్న శివలింగము పైననున్నట్లు చిత్రింపబడినది. ధనుర్ధారులగు ముష్వురు వ్యక్తులు రాజు ముందర నిలబడినట్లును, అతని వెనుక వస్త్రములను, ఆభరణములను ధరించిన అమాత్యుడును చెక్కబడినారు.

ఇంకొక శిల్పమున ఎడమ, కుడి భాగములందు రెండు సంఘటనలు చూపబడినవి. ఎడమవైపున నున్న శిల్పమున రాజు నడుమునకు రెండు చేతుల నాన్చి, వంగి కుడిపాదముతో నాగ గర్భస్థ శివలింగమును త్రొక్కుచున్నట్లును, అతని వెనుక ఇద్దరు స్త్రీలు హస్తములు మోడ్చి నిలిచియున్నట్లును పై భాగమున అశ్వము, గజము, ధర్మచక్రయుక్త శూన్య సింహాసనమును చిత్రింపబడినవి. శిల్పమునందలి దక్షిణ భాగమున బోధిసత్వుడు సింహాసన మధిష్ఠించ, అతని ఎదుట నిలబడిన రాజు ఏదియో చెప్పుచున్నట్లును, బోధిసత్వుని పాదముల ముందు కూర్చున్నట్లును చిత్రింపబడినది. ఈ సంఘటనలు ద్వారము ముందు జరిగినట్లు తెలియుచున్నది. అది నగర ద్వారమో, ఆలయ ద్వారమో అయి ఉండును.

ఇందు మొదట శిల్పమున రాజున కెదురుగానున్న వ్యక్తులు శైవులు. రాజు బ్రాహ్మణ మతమును నిరసించినట్లీ శిల్పము వలన తెలియుచున్నది.

రెండవ శిల్పమున రాజు సాధికారముగా మంత్రులు, యోధులు ఉన్న సమయమున వైదిక మతమును త్యజించినట్లు చిత్రింపబడినది.

మూడవ శిల్పమున ఎడమ భాగమందలి దృశ్యముయొక్క పర్యవసానమే కుడివైపునున్న శిల్పము నందలి దృశ్యము. ఇందు స్త్రీలు చిత్రింపబడినారు. వీరు బౌద్ధమతానురక్తులు. వీర పురుషదత్తుడు బౌద్ధమును స్వీకరించుటకు ప్రేరేపించినవారు. వీర పురుషదత్తుడు శైవమును త్యజించి, బౌద్ధమును స్వీకరించి బోధిసత్వుని పాదముల నాశ్రయించినాడని చూపుట ఈ శిల్పము యొక్క ముఖ్యోద్దేశము.

ఇక్ష్వాకులూ, వాళ్ళ ముందు సాతవాహనులూ బౌద్ధాన్ని ఆదరించినా 'కుమరి' వంటి మాతృదేవతలను ఆరాధించే వ్యవస్థనుండి వచ్చారు. అనేక యుద్ధాలలో పాల్గొని రాజ్య విస్తరణ చేసుకొంటున్న దశలో యుద్ధాలకు అధిష్ఠాన దేవత, అందులోనూ

మగదేవత అవసరమయ్యారు. అందుకే స్వామి మహాసేనుడు అన్న పేరుతో కార్తికేయుని ఆరాధించడం ప్రారంభించారు. ఈ దైవానికుండే పర్యాయనామాలలో కొన్ని సాతవాహన రాజుల పేర్లలోనూ, తరువాత రాజవంశాలవాళ్ళ పేర్లలోనూ కనబడతాయి. కుమారస్వామి శరవణభవుడు. దీనికి తెలుగు పేరు పులుమావి. దీని వ్యుత్పత్తిని తెలుగుగోష్ఠి పండితులు సాధించి ''పులు=రెల్లు; మావి=గర్భస్థ శిశువును కప్పియుండు పొర, జరాయువు, పండితార్థము పులుమావి అనగా రెల్లునుండి జన్మించినవాడు'' అని చెప్పారు.[5]

సాతవాహనుల పేర్లలోనూ, ఇతర రాజవంశాలలోని పేర్లలోనూ 'స్కంద' అనే పదంకూడా తరచుగా కనబడుతుంది. సాతవాహనుల కాలంనుండి తూర్పు చాళుక్యుల కాలందాకా ''కుమారస్వామి ఆరాధన తెలుగు పరగణాలలో ఉధృతంగానే సాగేది. ఇక్ష్వాకులలో వీరపురుషదత్తుడు ప్రాచీన శైవాన్ని నిరసించినా పల్లవుల కాలంనుంచీ శైవ ప్రాబల్యం అధికమైంది. బౌద్ధ, జైన మతాలలో శాక్తం ప్రవేశించి భోగలాలస కూడా చోటుచేసుకొన్నాక, ఆర్థిక విధానాలకు, పాలకవర్గాల శ్రేయస్సుకూ అవసరమైన వేరే మతం కావలసి వచ్చింది.

వేదాంతులు 'సోహం' అన్న భావం ప్రకటించినా ప్రజలచేత 'దాసోహం' అనిపించే మత విశ్వాసం కావలసి వచ్చింది. దైవభక్తితో కూడా దాస్యభక్తిని శ్లాఘించే భక్తిమార్గం పాలక వర్గాలకు శ్రేయస్కరం. ఒక పక్క యజ్ఞ సంస్కృతి ప్రబోధించే స్మార్తులనూ, రెండోపక్క వేద ప్రామాణ్యాన్ని అంగీకరించని జైనులను వ్యతిరేకించే కాలముఖ శైవులు నూతన మతాన్ని ప్రచారం చేశారు. స్మార్తులు నిరసించే దేవాలయాలలో ఆరాధనలూ, జైనులు ఖండించే పామర మంత్ర చర్యలనూ ఈ శైవం తనలో ఇముడ్చుకొంది. భక్తి సిద్ధాంతం ఫ్యూడల్ వ్యవస్థకు లాభసాటి కాబట్టి క్రమేణా శైవానికి రాజాదరణ లభించింది.

బౌద్ధ విహారాలకూ, జైన బసదులకు సామ్రాజ్యపతుల దగ్గర్నుంచి సామాన్యుల దాకా ఎందరో ఇచ్చిన దానాలవల్ల మతాధిపతులు మాండలికులకన్నా బలవంతు లయ్యారు. వీరి అధీనంలోఉన్న భూములను సాగుచేసే రైతులు, తోటలను, దొడ్లను పెంచి ఫలసాయాన్ని వర్తక, వ్యాపారాలకు సరఫరా చేసే వ్యక్తులు పూర్తిగా ఈ వ్యవస్థపైన బతికేవారు. జైనులు నాలుగు రకాల దానాలు చేస్తూ ఉచితంగా ఆహారం, ఔషధం, అధ్యయనం, ఆశ్రయం ఇచ్చేవారు. అయితే ఇది జైనధర్మాన్ని నమ్మేవారికే పరిమితం. సత్రాలూ, మఠాలు సోమరిపోతులను కూడా తయారుచేసేవి.

జైనులను కాలాముఖులు అనుకరించారు. బ్రహ్మచర్యాన్ని షరతుగా పెట్టకపోవడంవల్ల, స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వడం వల్లా శైవం ప్రజలు పాల్గొనే మతమయింది. కాలాముఖులూ, వారి గుడులూ, మఠాలు చిన్న సైజు రాజ్యాలయ్యాయి. వీరిని చూసి స్మార్త బ్రాహ్మణులు కొన్ని రాజీలకు దిగి దానధర్మాలు గ్రహించడానికి

5. ''తెలుగు మరుగులు'' పుట. 35.

సుముఖులయ్యారు. అయితే వైద్యులు, విగ్రహారాధకులూ, నటులు, గాయకులు, శూద్రులకు పౌరోహిత్యం చేసేవాళ్ళూ, వడ్డీవ్యాపారులూ మొదలైనవారు బ్రాహ్మణులైనా దానానికి అనర్హులన్నారు. జైనులను చూసి స్మార్తులూ, స్మార్తులను చూసి జైనులు పోటాపోటీలపై వర్ణాశ్రమ ధర్మ పరిరక్షణకు పూనుకొని ప్యూడలిజం ఊడలు వేసే స్థితికి తెచ్చారు. పాలకవర్గ సంస్కృతిని పరిరక్షించే సాహిత్యాన్ని ప్రబోధం చేస్తూ ఆ భావాలను ప్రచారం చేశారు.

ఉన్నత వర్గాల వారి మతం ఏదైనా గ్రామీణులు, 'పామరులు' తమ అమ్మవార్ల కొలువులు, జాతరలు మానలేదు. సాతవాహనుల కాలంలో కుమరిలాగ ఇక్ష్వాకుల కాలంలో హరీతి, తర్వాత మారీచి మొదలైన దేవతల ఆలయాలు, విగ్రహాలు కనబడ తాయి. శిష్టుల పురాణాలు రూపొందుతున్న వేళల్లోనే జానపదుల కుల పురాణాలు, స్థల పురాణాలు మౌఖికంగా వర్ధిల్లాయి. నేటికీ మాతపురాణం, జాంబపురాణం, గౌతుపురాణం వంటి అసలు సిసలు తెలుగు పురాణాలు జనంలో బతికున్నాయి. శిష్ట మతాలనుండి సంక్రమించిన భావాలు కూడా గ్రామీణ గాథలలో రూపాంతరం చెందాయి. నేడు సజీవంగా ఉన్న ఈ మౌలిక సంప్రదాయాన్నే ప్రాచీన పురాతత్త్వ పరిశోధనా ఫలితాలను జోడించి తులనాత్మక పరిశోధన చేస్తే ఒకనాటి మన సంస్కృతి ఎముకల గూడు మాత్రమేకాక దాని కండ, కొవ్వు, వర్చస్సు వగైరాలన్నీ ఊహించుకొనడానికి వీలుంటుంది.

కామితాలను తీర్చే మతాలే వేరు రూపాలలోనైనా బతికుంటాయి. కామితాలను తీర్చలేనివి కాలగర్భంలో కలిసిపోతాయి.

జైనం వైనాలు

అత్యంత ప్రాచీన చారిత్రక కాలం నుంచీ జైనమతం ఆంధ్రదేశంలో ఉంది. ఏ ఒక్క ప్రాంతంలోనో కాదు. కళింగం, వేంగి, వెలనాడు, పాకనాడు, అరువనాడు, పులుగులనాడు, మార్జవాడి, సబ్బినాడు ఒకటేమిటి నేటి యావదాంధ్ర దేశంలో అర్హామతం వ్యాపించింది. ఈనాడు సుమారు పద్దెనిమిది తెలుగు జిల్లాలలోని 84 ఊళ్ళలో జైన స్థావరాల అవశేషాలు కనబడుతున్నాయి. ఇప్పటికీ కొన్ని ఊళ్ళలో జినాలయాలు చెక్కు చెదరకుండా ఉన్నాయి. కొలనుపాక వంటివి నేటికీ జైనుల యాత్రాస్థలాలే. శివగంగ, ఆర్యవటం, నేమం, బోగాపురం, హనుమకొండ, వరంగల్లుకోట మొదలైనచోట్ల ఏనాడో జైనులు తవ్వించిన తటాకాలు ఈనాడు చల్లని జలాలు ఇస్తున్నాయి. దాహం తీరుస్తున్నాయి.

'కవిత్వమొక తీరని దాహం' అని కవిగారు చెప్పొచ్చు. చారిత్రక కుతూహలం అంతకన్నా తీరని దాహం. ఒకనాడు ఆంధ్రదేశం అంతటా వ్యాపించిన జైనమత ప్రభావం

ఆంధ్రులమీద ఎంత ఉంది? ఆంధ్రులు జైనమతానికి చేసిన సేవ ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెదకడం సముచిత కర్తవ్యమేకాక, కృతజ్ఞతా సూచకం కూడా అవుతుంది. ఏమంటే జైనులే తెలుగు వాళ్ళకి అక్షరాభ్యాసం చేసిన గురువులు. అందుకే 'సిద్ధం నమః' అనే నమస్కారాన్ని నేటికీ విడిచిపెట్టక మనం విద్యారంభం చేస్తున్నాం. మనకి లెక్కలు నేర్పిందీ జైనులే! ఎక్కాలు అనే మాట ఆ సంగతినే జ్ఞాపకం చేస్తుంది. ప్రాకృతంలో ఎక్కాలను మగ్గలు అంటారు. అందులో ప్రతిదీ 'ఎక్కస' అని మొదలవుతుంది (ఎక్కసవర్గో ఎక్కాబియ్యాస వర్గోచారి అంటూ). మగ్గలు మరుగుపడినా ఎక్కాలు మనకు దక్కాయి. ఒకనాడు జైనగాథలను తెలుగులోనే తెలుగువాళ్ళు చదువుకొనేవారు. ఆ జైన సాహిత్యం తరువాత కవుల దృష్టిలో 'గాసటబీసటే' అయింది. ఎర్రయ్యగారు తమ నృహింహపురాణంలో 'గాసటబీసటే' చదివి గాథలు త్రవ్వు తెనుంగు వారిని పేర్కొన్నారు (1-9). ఆనాడు త్రవ్విన గాథలు నేడు కాలగర్భంలో కలిసిపోయినా వాటిని మళ్ళా తవ్వి తలకెత్తుకోవాలి.

ఇతిహాసపు చీకటికోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు
దాచేస్తేదాగని సత్యం

హరిసేనుడు 'బృహత్కథాకోశం' అనే గ్రంథంలో చెప్పిన కొన్ని కథలు ఆంధ్రదేశానికీ, జైనమతానికీ గల సంబంధాలు చెప్తాయి. నయసేనుడు 'ధర్మామృతం'లో తెలుగు దేశానికి, జైనులకు గల మరికొన్ని కథలు చెప్పాడు. ఇవి కేవలం కథలే అయినా వీటి నివురులో చారిత్రక సత్యాల నిప్పు కప్పబడి ఉన్నట్టు పరిశోధకులు భావిస్తారు.

ఇటీవల గుంటుపల్లిలో బయటపడ్డ ఖారవేలుని శాసనంవల్ల హాథీగుంఫ శాసనంలో ఆంధ్రుల గురించి చెప్పినవన్నీ ఎక్కడో దక్షిణ మహారాష్ట్రలో కాక నేటి ఆంధ్ర లోనే జరిగినవని స్పష్టమవుతోంది. ఖారవేలుడు జయించిన పిథుండను గుంటుపల్లిగా చరిత్రకారులు భావిస్తున్నారు. గుంటుపల్లి తొలిపేరు గ్రుడ్డుపల్లి. దానినే పృథుఅండ అని సంస్కృతీకరించారట! గుంటుపల్లిలోని గుహాలయంలో సుజ్ఞాననాథుడనే జైనాచార్యుడు క్రీ.పూ. రెండవ శతాబ్దిలో ఉండేవాడు. అతని శిష్యురాలు సానాదా అనే అజ్జిక ఆ గుహాలయంలో సోపానపంక్తిని కట్టించింది. శాసన ప్రమాణాలవల్ల తెలియవచ్చే ఆంధ్రదేశపు ప్రాచీనతమ జైనులు వీరు.

మహాపద్మనందుడు మగధ దేశానికి ఎన్నడో తీసుకుపోయిన కళింగజిన విగ్రహాన్ని ఖారవేలుడు మళ్ళా పట్టుకువచ్చినట్టు హాథీగుంఫ శాసనం చెప్తుంది. కళింగ రాజ్యానికి ముఖలింగం రాజధాని, ఇది నేటి ఆంధ్రదేశంలోనే వుంది. కళింగరాజ్యం ఒకనాడు

గోదావరిదాకా వుండేది. నందరాజు సంగ్రహించిన కళింగజిన విగ్రహం పదవ తీర్థంకరుడైన శీతలనాథుని ప్రతిరూపం అని చరిత్రకారులు చెప్తారు. శీతలనాథుడు కళింగ రాజ్యంలోనే జన్మించి కైవల్యం చెందాడు. ఇరవై నలుగురు తీర్థంకరులలో ఒకరు ఆంధ్రదేశం లోనే జన్మించడం విశేషమే.

హాథీగుంఫ శాసనాన్ని పరిష్కరించిన జయసాల్వుగారు శీతలనాథుని జన్మస్థానం భాదలపురమని అదే భాద్రపురం లేక భద్రాచలమనే గుర్తింపును ఆమోదించారు. త్రిషష్టిశలాకా పురుష చరిత్రలోని శీతలనాథుని చరిత్ర కూడా అతని జన్మస్థానం దక్షిణ భారతంలోనే వున్నదని చెప్తుంది. దిగంబర జైనాచార్యుల పట్టావళులలో ఒకటి భాదలపురం దక్షిణంలోనే వున్నదని ధ్రువపరుస్తూంది. భద్రాచలం ఒకనాడు జైనస్థావరమే అని భావించడానికి ఆధారాలు లేకపోలేదు.

గ్రామనామాల చివర 'పాడు' అనే మాట వుంటే దానిని జైనగ్రామంగా పరిగణించడానికి ఎవరికీ అభ్యంతరం ఉండదు. భద్రాచలం తాలూకాలో బైరాగులపాడు, కూడలిపాడు, రేగులపాడు, వేపలపాడు అనే గ్రామాలు నేటికీ వున్నాయి. గోదావరి అద్దరిని భద్రాచలం ఉంటే, ఇద్దరిని బూర్గంపాడు వుంది. అది తాలూకా కేంద్రం. ఆ ప్రాంతంలో ఇంకెన్ని పాడులున్నాయో తెలియదు. భద్రాచలం తాలూకాలో పెదశీతనపల్లె అనే గ్రామం కూడా ఉంది. ఈ పేరులోని 'శీతన'కూ, శీతలనాథునికి ఏదైనా సంబంధముందేమో చూడాలి.

భాదలపురం శీతలనాథుని జన్మస్థానం మాత్రమే కాదు. దిగంబర జైనుల ఆచార్యులలో తొలి పదహారుమందీ అక్కడే నివసించారనీ పట్టవళులలో ఒకటి పేర్కొంటూంది. భద్రబాహుడు, గుప్తిగుప్తుడు, మేఘనంది, జినచంద్రుడు, కుందకుందా చార్యుడు మొదలైన ఈ పదహారుమంది ఆచార్యులూ భాదలపురంలో కాకపోయినా దక్షిణ భారతంలోనే వుండేవారు. వీళ్ళలో కుందకుందాచార్యుడు అచ్చంగా ఆంధ్రుడు.

అనంతపురం జిల్లాలో గుంతకల్లుకు నాలుగుమైళ్ళ దూరాన కొనకొండ్ల అనే గ్రామం వుంది. క్రీస్తుపూర్వం మొదటి శతాబ్దంలో ఆ ఊళ్ళో ఎల్లయ్యో, ఏలయ్యో అనే ప్రతిభావంతుడు జైనం స్వీకరించి పద్మనంది అనే పేరు పెట్టుకొన్నాడు. గెద్ద ఈకల పింఛాన్ని చేతపట్టుకునేవాడు. మెడ కొంచెం వంకరగా ఉండేది కాబోలు అతణ్ణి పద్మనంది, వక్రగ్రీవుడు, గ్రద్ధపింఛుడు, ఏలాచార్యుడు అని పిలిచేవారు. అయినా కొనకొండ్ల గ్రామవాసి కనుక ఆ వూరి పేరుతోనే అతడు ప్రసిద్ధుడయ్యాడు. కొనకొండ్లకు ఒకప్పుడు కొండకుంద అనే పేరు వుండేది. అందుకే ఏలాచార్యుడు కొండకుందా చార్యుడయ్యాడు. ఆ పేరు సంస్కృతీకరణం పొంది కుందకుందాచార్యునిగా మారింది.

కుందకుందాచార్యుడు మహా పండితుడు. సమయాచారం, ప్రవచనసారం, పంచాస్తికాయసారం అనే సారత్రయ గ్రంథాలను, నియమసారమనే ఎనిమిది గ్రంథాల

సంకలనాన్నీ, రయనసారం, అష్టపాహుడ, బరసానువాకం, దాసభక్తి, మూలాచారం అనే గ్రంథాలను రచించాడు. వీటిలో చివరిది జైనగ్రంథాలలో అత్యంత ప్రాచీన ప్రామాణిక గ్రంథం. కుందకుందాచార్యుడు దిగంబర జైనులకు గురుపీఠం. అతని శిష్య పరంపర తామరతంపర. తమది కుందకుందాన్వయమని ఎందరెందరో జైనయతులు చెప్పుకొన్నారు. నేటికీ కుందకుందాచార్యుని పేరు జైనులు స్మరిస్తారు. జైనసభల ప్రారంభంలో చదివే మంగళాశాసనంలో ఆ పేరు కనబడుతుంది.

మంగళం భగవాన్ వీరో
మంగళం గౌతమో గణిన్
మంగళం కుందకుందార్యో
జినధర్మోస్తు మంగళం

మహావీరుడు, గౌతములతోబాటు ఒక్క కుందకుందాచార్యుణ్ణే పేర్కొని స్తుతించడంలోనే అతని విశిష్టత తెలుస్తోంది. ఇతడు ఇంతటి మహావ్యక్తి కనుక ఇతడు మావాడంటే మావాడని కన్నడులు, తమిళులు ప్రయత్నించారు. తిరుక్కురళ్ రచించిన వళ్ళువర్ మరెవరో కాదు. కుందకుందాచార్యులే అని తమిళ పండితుల వాదన. అయితే శాసన ప్రమాణాలవల్ల ఈ వాదనలు నిలిచేవి కావు.

కొనకొండ్ల గ్రామంలోనే శిథిలమయిన శాసనాలు వున్నాయి. వాటివల్ల తన అనేకాంతవాదంతో దిగ్విజయం చేసిన పద్మనంద భట్టారకుల జన్మస్థానం కావడంవల్లనే ఆ గ్రామం జగద్విఖ్యాతమైనదని తెలుస్తుంది. ఆ మహనీయుని నివాసం కనుకనే అది జైనులకు తీర్థయాత్రాస్థలమైందని కూడా ఒక శాసనం చెప్తుంది. కొనకొండ్లను కొండకుందేయతీర్థం అంటారు. బౌద్ధమతానికి ఆచార్య నాగార్జునుణ్ణి ఇచ్చిన ఆంధ్రదేశం జైనానికి కుందకుందాచార్యులను ఇచ్చింది. నాగార్జునుని శూన్యవాదం బౌద్ధానికి ఎంత విలువైనదో... ... కుందకుందాచార్యుడి అనేకాంతవాదం జైనానికి అంత బలమైనది. నేటికీ జైన దార్శనిక పరిశోధకులు కుందకుందాచార్యుని గ్రంథాల నుంచి విరివిగా ఉదాహరణలిస్తూ వుంటారు.

కుందకుందాచార్యులు 95 సంవత్సరాలు జీవించాడు, ఆత్మతత్వాన్ని వివరించాడు. వీతరాగాన్ని ప్రబోధించాడు. దివాకరుడు ప్రతిపాదించిన అభేదవాదాన్ని తీవ్రంగా ఖండించాడు. కుందకుందాచార్యుడు దార్శనిక చర్చల్లో ఉగ్రుడు. పరసమయ ఖండన తీవ్రంగా చేసేవాడు. దేశం నలుమూలలా సంచరించాడు. అతని శిష్యులు కూడా అతనంత పాండిత్యం గలవారే. శూరులే కాక ప్రచారశూరులు.

కుందకుందాచార్యుని శిష్యులలో బలాకపింఛుడు, కుందకీర్తి, సామంత భద్రులు ముఖ్యులు. వీళ్ళలో కుందకీర్తి 'సూత్రావతారం' అనే వ్యాఖ్యానగ్రంథం రాసి విఖ్యాతుడయ్యాడు. సామంతభద్రుడు శాస్త్రచర్చలోనూ, తర్కంలోనూ ఘటికుడు.

తమిళదేశంలో జైనమత ప్రచారానికి ఇతడే బాధ్యుడు. కుందకుందాచార్యుని ఇతర శిష్యులు ఆంధ్రదేశంలోని పలుప్రాంతాలకు వెళ్ళి మూలసంఘశాఖలు విస్తరింపచేశారు.

క్రీస్తుశకం ఒకటవ దశాబ్దంలోనే బెజవాడలో జైనమూల సంఘశాఖ ఉండేది. ఆనాడు జైనులు బెజవాడను వేణాకతటీపురి అని పేర్కొనేవారు. ఆచార్య అర్హబలి ఆనాటి సంఘాచార్యులలో మహోన్నతుడు. అతని ఆధ్వర్యంలో ఆనాటి దక్షిణ భారతంలోని దిగంబర జైనులు వేణాకతటీపురంలో సమావేశమై జైన సిద్ధాంతాన్ని సంకలనం చేయదలిచారు. సిద్ధాంత క్రోడీకరణకు ఏర్పాటు చేసే సభలను సంఘయానం అంటారు. ఇటువంటిదే ఇంతకుముందు ఖారవేలుడు ఏర్పాటు చేశాడు. కాలం గడుస్తున్నకొలదీ సంఘంలో, దేశంలో వచ్చే మార్పులను గమనించి ఆమోదించడానికో, నిరాకరించడానికో ఇటువంటి సంఘయానాలు అవసరం. బెజవాడలోని ఆనాటి సభలో అనుమానాలు వచ్చాయి. వాటి నివృత్తికోసం ఆచార్య అర్హబలి పుష్పదంతుడు, భూతబలి అనే ఇద్దరు యతులను పరమ ప్రామాణికుడైన ఆచార్య ధారసేనుని వద్దకు పంపించాడు. ధారసేనుడు గిరినగరంలోని చంద్రగుహవాసి. ఇది సౌరాష్ట్రంలో ఉంది. జైననిగమాగమాల సాంగోపాంగాలలో ధారసేనుడు నిష్ణాతుడు, అష్టాంగ మహిమా నిమిత్తజ్ఞుడు. బెజవాడ నుంచి ఆంధ్రజైనులు ఇతని దగ్గరకు వచ్చి సందేహనివృత్తి కావించుకొన్నారు. ఆచార్యుని ప్రబోధాలను 'మహాకర్మ ప్రకృతి ప్రభావం' అనే గ్రంథంగా భద్రపరచి బెజవాడకు తీసుకువచ్చారు. ఈ ప్రవచనాలను ఆంధ్రసంఘం ముందు నివేదించారు. ఈ సంఘయానంలోనే మూలసంఘంలోని దేశిగణం, నందిసేన, దేవభద్ర అనే శాఖలుగా వర్తించడానికి సంఘాచార్యులు అనుమతించారు. ఇంతకుముందే మూలసంఘం నుండి సితాపట సంఘం, కాష్ఠసంఘం, ద్రావిడ సంఘం, యాపులీ సంఘం పుట్టాయి.

యాపులీ సంఘాన్నే యాపనీయ సంఘం అని కూడా పిలుస్తారు. యాపనీయ జైనులు విలక్షణమైన వాళ్ళు. శ్వేతాంబరులలాగ స్త్రీలకు కూడా మోక్షం లభిస్తుందని నమ్ముతారు. దిగంబరులలాగ వస్త్రాలను నిరసిస్తారు. ఆంధ్రజైనులలో యాపనీయులు కూడా వున్నారు. అసలు ఆ శాఖ ఆంధ్ర, కర్ణాటకలలోనే ఉద్భవించింది. ఖారవేలుని సంఘయానంలో చాలా ప్రముఖపాత్రను వహించింది. ఈ యాపనీయులు ఉత్తరోత్తరా యక్షిణీ దేవతల ఉపాసనతో మంత్రసిద్ధులూ, మహిమలూ మొదలైన వ్యామోహాలలో పడ్డారు. యాపనీయులను గోప్యులని కూడా పిలుస్తారు.

జైనయతులు సాధారణంగా బాగా చదువుకొన్నవాళ్ళు. జైనాగమాలేకాక జ్యోతిషం, సర్పవిద్య, అసురవిద్య, వశీకరణవిద్య మొదలయిన వాటిలో ఆరితేరినవాళ్ళు. ముఖ్యంగా వాళ్ళ జ్యోతిష విద్యవల్ల సాధారణ ప్రజలనుండి చక్రవర్తులదాకా అందరూ సమ్మోహితులయ్యేవారు. సాతవాహనుల కాలం నుంచి కాకతీయుల కాలమువరకు జైనులకు రాజాశ్రయం లభిస్తూ వచ్చింది. మండలేశ్వరులు, మహామండలేశ్వరులు, రాజవిషయాధ్యక్షులు, దండనాథులు, జైనబసదులకూ, జినాలయాలకు ఎన్నో గ్రామాలను దానం చేశారు.

జైనయతులకు రాజాశ్రయం లభించితే ఆశ్చర్యం లేదు. జైనయతులు రాజులకు ఆశ్రయమిచ్చి, వాళ్ళ రాజ్యస్థాపనకు కారకులయిన ఉదంతాలు ఆంధ్ర చరిత్రలో లేకపోలేదు. కడప మండలం పేరూరులో సింహనంది అనే జైనాచార్యుడు ప్రసిద్ధుడు. ఇక్ష్వాకు వంశపాలన అంతరించాక దడిగ, మాధవులనే ఇద్దరు ఇక్ష్వాకు సోదరులు సింహనందిని ఆశ్రయించారు. వాళ్ళకు రాజ్యపాలనా విద్యలో శిక్షణ యిచ్చి, సింహనంది వాళ్ళచేత తలకాడులో గాంగరాజ్య స్థాపన చేయించాడు. అందుకే పేరూరుకు గంగపేరూరు అనే పేరు వచ్చింది.

రాజపుత్రులకేకాక సాధారణ ప్రజలకు కూడా జైనులు విద్యాదానం చేసేవారు. రాయదుర్గం యాపనీయులు స్త్రీ పురుషులకు సామూహికంగానూ విడిగానూ పాఠాలు చెప్పే దృశ్యాలు అక్కడి శిల్పాలపై నేటికీ నిలిచివున్నాయి. మూలసంఘం బలాత్కారగణం, కొండకుందాన్వయ సరస్వతీ గచ్ఛకు చెందిన అమరకీర్తి ఆచార్యులు, అతని శిష్యులు మాఘనంది ఒకనాడు రాయదుర్గంలో వుండేవారు. చాలా జైనబసదులలో విద్యాదానం ఉన్నా, భారతదేశంలోని పధ్నాలుగు కేంద్రాలనే జైనులు మహావిద్యాస్థానాలుగా పరిగణిస్తారు. అందులో పెనుగొండ ఒకటి. జినభూషణ భట్టారక, దేవర వంటి యతులు పెనుగొండలో ఉండేవారు. ఈ యతులలో సంఘాచార్యులు, గణాచార్యులు, ఉపాధ్యాయులు, వాచకాచార్యులు, ఉచ్చారణాచార్యులు, పృచ్ఛకాచార్యులు వుండేవారు. వీళ్ళు జైనసిద్ధాంతాన్ని పరిరక్షణ కావించేవారు.

జైనబసదులలో సత్రాలయాలు వుండేవి. ఇందులో అన్నదానం చేసేవారు. ఈ బసదులు యమనియమ స్వాధ్యాయనమౌనానుష్టాన జప సమాధిశీల సంపన్నులు, శాస్త్ర, సిద్ధాంత, సమయకోవిదులు. అన్ని వర్ణాల యతులు, శ్రావకులు, క్షుల్లకులు, క్షపణకులు, అజ్జకులు గౌరవించే ఆచార్యుల ఆధిపత్యంలో వుండేవి. వర్ణభేదం లేని మతంగా ప్రారంభమైన జైనంలో చాతుర్వర్ణాలు ప్రవేశించాక హైందవ మతానికి, జైనానికి తేడాలు తగ్గసాగాయి. హిందూ సంఘంలో లాగే జైనుల్లో కూడా తొలి మూడువర్ణాల వాళ్ళకే దీక్షాధికారం వుందనే పతనానికి జైనసంఘం జారిపోయింది. జైనశూద్రుడు హిందూ శూద్రునికన్నా ఏమీ ఎక్కువ బావుకొనే స్థితిలో లేడు. సమాజంలోని అత్యధిక సంఖ్యాకులకు నిరుపయోగమైన మతం ప్రజాదరణకు నోచుకోలేదు.

భూతదయను, అహింసను బోధించే మతం యుద్ధాలవల్ల బతికే దండనాథులకు అభిమతం అయిందంటే విడ్డూరమే. ప్రతిష్ఠానపురం సాతవాహన రాజస్థానంలో వుండే 52 మంది యోధులు తమ పేర 52 జినాలయాలను నిర్మించారని జినప్రభాసూరి 'కల్పప్రదీపం'లో చెప్పాడు. గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగడు జైనుడే. అతని సంతతివాళ్ళూ, ఆయుధోపజీవులే. పండరంగని మనుమడు దుర్గరాజు సైనిక స్థావరమైన కటకాధిపతి. తన పేర కటకాభరణ జినాలయం కట్టించాడు. రెండవ అమ్మరాజు సామంతులలో ధీమనరవాహనులు సైన్యాధిపతులే. ఈ సోదరుల విన్నపం మీదనే రెండవ అమ్మరాజు జయసేను భట్టారకులకు పెదగాదెలపర్రు దానం చేశాడు.

వేంగీ దేశంలో తూర్పు చాళుక్యులలాగ సబ్బినాడులో వేములవాడ చాళుక్యులు జైనపోషకులే. కమ్మనాడులో జైనమతాన్ని స్వీకరించినవాళ్ళు సబ్బినాడుకు వలసపోయే టంత ఆశాజనకంగా ఆ ప్రాంతం ఉండేది. తెలుగు కవులను కన్నడ భాషకు దత్తపుత్రులుగా యిచ్చిన ఘనత ఆంధ్ర జైనానికే దక్కింది.

ఇందూరు సీమలోని బోదన అతి ప్రాచీన జైనక్షేత్రం. పురుదేవ కుమారుడైన భరత చక్రవర్తి ఈ క్షేత్రంలో 525 ధనుస్సుల పొడుగున్న బాహుబలి శిలావిగ్రహాన్ని చేయించాడు. ప్రతిమ చుట్టూ కీకారణ్యం పెరిగి కుక్కుట సర్పాలు చేరాయి. అందుచేత దాన్ని కుక్కుటేశ్వరమని పిలిచేవారు. కాలక్రమాన ఆ ప్రతిమ కాలగర్భంలో కలిసిపోయిం దంటారు. ఈ పౌదనపురంలోని గోమటీశ్వరుని విగ్రహాన్ని చూసే నేడు విశ్వవిఖ్యాతమైన విగ్రహాన్ని చాముండరాయలు శ్రావణ బెళగోలాలో ప్రతిష్ఠించాడు.

ఈ పౌదన ప్రభావం వల్లనే తెలంగాణాలో జైన తీర్థంకరుల బృహత్ ప్రతిమలు కనబడతాయి. సోమదేవ సూరి తెలుగుగడ్డమీద జైన గ్రంథాలు సంస్కృతంలో రాశాడు. తెలంగాణలో మతప్రచారం చేశాడు. దాని ఫలితంగా తెలంగాణాలో జైనం విశేషంగా వ్యాపించింది. పోట్లచెరువు దగ్గర ఎన్నో జినాలయాలు, శిథిల శిల్పాలు నేటికీ కనబడతాయి. ఒకనాడు అక్కడ అయిదువందల జైనబసదులు వుండేవి. వీరశైవ విజృంభణలో దేవర దాసయ్య ఈ అయిదువందల బసదుల్నీ నాశనం చేశాడు. ఈ సంగతినే పాలకురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో ఇలా చెప్పాడు :

దేవర దాసయ్య భావజాంతకుడ
దైవంబనుచు జైనతర్కంబు సూకి
....
పొసపరి దట్టిల్ల బోట్ల చెర్వునను
వసదు వేణ్నూరును వ్రచ్చివైపించి
వెన జినప్రతిమల విటతాటమాడి
యెవగునాడీ జైనులెక్కడ సనిరి?

(పండి. 1–పుట 590)

పోట్లచెరువు జైనులు ఎక్కడికెళ్ళారో గాని రాజరాజనరేంద్రుడు రాజమండ్రిలో జైనులను హింసించినప్పుడు వాళ్ళు కాందిశీకులై కాకతీయుల శరణుజొచ్చారు. కాకతీయులు తొలినుంచీ జైనులే. వాళ్ళ వంశపురుషుడు మాధవవర్మ యక్షేశ్వరీదేవి దయవల్ల సైన్య సంపదను పొందాడని మేడరాజు గోవిందపురం శాసనంలో వుంది.

అష్టా సహస్రాణి మతంగజానా
దశాశ్వ కోటీరమితంపదాతిం
జినాజ్ఞయా మాధవ చక్రవర్తీ
యక్షేశ్వరీ దత్తపరాత్సలేభే

ఈ శ్లోకంలోని యక్షేశ్వరి ఎవరైనా కాకతీయులు తొలి దగ్గర్నుంచీ దిగంబర జైనాభిమానులని తెలుస్తుంది. దిగంబర జైనులే శాసన దేవతలలో షోడశ విద్యాదేవులను చిత్రిస్తారు (శ్వేతాంబరులు మూడవపాలు కూడా వాడరు). హేమచంద్రుడు చెప్పిన షోడశ విద్యాదేవుల పేర్లు ఇవి :

1. రోహిణి	9. గౌరి
2. ప్రజ్ఞాప్తి	10. గాంధారి
3. వజ్రశృంఖల	11. సర్వాస్త్ర మహాజ్వాల
4. కువిశాంకుశ	12. మానవి
5. చక్రేశ్వరి	13. వైరోత్యా
6. నరదత్తా	14. అచ్ఛుప్త
7. కాళి	15. మానసి
8. మహాకాళి	16. మహామానసిక

ఈ షోడశదేవులే తంత్రవిద్యలో ప్రవేశించారు. పూజలు పొందుతున్నారు. కాకతీయులు పూజించిన యక్షేశ్వరి ఆదిలో చక్రేశ్వరి కావచ్చు. పద్మాక్షిగా ప్రచారం పొందింది. వరంగల్లులోని పద్మాక్షి గుడిలో వున్నది మాత్రం వేరే దేవత. జైన విగ్రహాలకు వేరే పేర్లు పెట్టి పూజించడం తెలుగువాళ్ళకు కొత్తగాదు. దానవులపాడులోని పార్శ్వనాథ విగ్రహానికి 'ఎల్లయ్య' అనే పేరుపెట్టి నేడు సంతానం కోసం పూజిస్తున్నారు. జానపద గేయాలు ఆ విగ్రహానికి చేసే జాతరలో వినిపిస్తాయి. ఈ పూజలు చేసేది జైనులు కాదు. జనుల సంహారాన్ని సహించిన హిందువులే అని చరిత్రకారుడొకాయన ఎత్తిపొడుస్తున్నాడు.

దానవులపాడు నిజంగా జైనుల శ్మశానం. సల్లేఖన కోసం అక్కడ యతులు, శ్రావకులు పలు ప్రాంతాల నుంచి కోరి చేరేవారు. శైవుల భృగుతాపాన్ని ఖండించిన సోమదేవసూరి ఈ జైనాచారం సంగతి మర్చిపోయినట్టుంది. పరుల దోషాలను పరుషంగా ఖండించే జైనులు తమ ముప్పు కొనితెచ్చుకున్నారు. ఒక వంక వైష్ణవులు, మరొకవంక వీరశైవులు, ఇంకొక పక్కనుంచి వైదిక మతాభిమానులు జైనంపై విరుచుకుపడ్డారు.

జైనదర్శనం నిరీశ్వరమైనా మతం మటుకు సంకుచితం అయింది. విగ్రహారాధన, ఆచారవిధులు, పూజలు, పునస్కారాలు అతిపేలవమై నేడు జైనానికి, హైందవానికి తేడాయే కనబడదు. జైన విశ్వాసాలు కొన్ని హిందూమతంలో కలిసిపోయాయి. కర్మసిద్ధాంతం, పునర్జన్మలో నమ్మకం మొదలైనవి జైనప్రచారం వల్లనే గట్టిపడ్డాయి. ఆంధ్రులపై జైనప్రభావం ఇంకా ఎవరూ గట్టిగా తలపెట్టని పరిశోధనా విషయం. మానవశాస్త్ర పరిశోధనా పద్ధతులపై కృషి చేస్తే తెలుగుదేశంలో జైనప్రభావం గురించి చాలా విషయాలు వెల్లడి అవుతాయి.

ఉదాహరణకు 'నిత్యకళ్యాణం, పచ్చతోరణం' అనే సామెత తీసుకుంటే ఇది జైనమత సంపర్కంవల్లనే పుట్టిందని చెప్పవచ్చు. జైన తీర్థంకరులకు కళ్యాణోత్సవాలు జరుపుతారు. కళ్యాణమంటే పెళ్ళికాదు. జన్మ మొదలు కైవల్యందాకా వున్న అంచెలను స్మరించే జయంతులు. జైన బసదులలో నిత్య కళ్యాణాలు జరగడంబట్టి ఈ సామెత పుట్టింది. మరొక తార్కాణం, తెలుగువాళ్ళు వర్జ్యం చూడనిదే ఏ పనీ చేయరు. ఈ విశ్వాసం యాపనీయ జైనులు ఆంధ్రులకు విడిచిపెట్టారు. లేపాక్షి చిత్రకళకు జైన చిత్రకళ ప్రోద్బలమని చరిత్రకారుల ఊహ.

తెలుగు పురుషుల మీదకన్నా, తెలుగు స్త్రీలమీద జైన ప్రభావం ఎక్కువ వుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. స్త్రీల రామాయణం పాటలలో విడ్డూరాలవలె కనబడే ఘట్టాలు చాలావరకు జైనరామాయణం నుండి సంక్రమించినవే. 'రాముడికి సీత ఏమౌతుంది?' అనే నా వ్యాస పరంపరలో ఈ విషయాన్ని నేను విపులంగా చర్చించాను. రంగనాథ, భాస్కర రామాయణాలలో కనబడే అవాల్మీకాలకూ, జైన రామాయణానికీ సంబంధం వుంది.

తెలుగుదేశంలో విరివిగా ప్రచారం పొందడంవల్లా, గ్రంథాలు రచించిన జైనులు తెలుగుదేశంలో నివసించడంవల్లా, మహాతలవర అనే పదం జైన సూత్ర గ్రంథాలలో కనబడుతుంది. ఆచార్య హేమచంద్రుడు తన దేశినామాలలో పేర్కొన్నవాటిలో చాలా తెలుగు మాటలు వున్నాయి. వీటిని తెలుగుభాషా పరిశోధకులు గుర్తించారు.

ఆంధ్రదేశంలో జైనమత చరిత్ర గురించి సమగ్ర పరిశోధలు అవసరం. ప్రాకృత, సంస్కృత జైనగ్రంథాలూ, పాశ్చాత్యులు వాటిపై రాసిన వ్యాఖ్యలు, కన్నడ కావ్యాలూ నిశితంగా పరిశీలించనిదే ఇది సాధ్యం కాదు. ఆంధ్రజైనం గురించి పరిశోధించినవారిలో బుర్రా శేషగిరిరావుగారు ఆద్యులు. భావరాజు వెంకటకృష్ణారావుగారూ, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ప్రాథమిక కృషి చేశారు. శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు చాలా శ్రమించి, ఎన్నేళ్ళ పరిశోధన ఫలితంగానో యావదాంధ్రదేశంలో వున్న జైన స్థావరాల గురించి విపుల గ్రంథం రాశారు. బి.ఎన్.ఎల్. హనుమంతరావుగారు తమ 'రెలిజన్ ఇన్ ఆంధ్ర' అనే గ్రంథంలో జైనమతం గురించి విస్తరించి రాశారు. ఇంకా చెయ్యవలసిన పరిశోధనలు ఎన్నో వున్నాయి.

ముఖంమీద కోపంకొద్దీ ముక్కు కోసుకున్న సామెతలాగ జైనులమీద పగతో ఆంధ్రదేశం ఆనాటి సాహిత్యాన్ని అక్షరాలా మంట కలుపుకొంది. తమిళ భాషలో ఎన్నో జైన కావ్యాలు వుండగా, తెలుగులో ఏమీ దక్కలేదంటే ఆనాటి ఆంధ్రుల దురహంకారమే అందుకు కారణం.

చాప చిరిగినా చదరంత అని, ఎంత విధ్వంసం జరిగినా తెలుగు జీవితంపైనా, తెలుగు సాహిత్యంపైనా జైనప్రభావం తగుమాత్రం మిగిలిపోలేదు. తెలుగువాళ్ళ మొదటి ఛందో గ్రంథం జైనరచనే.

ఆంధ్ర సాహిత్యం అనువాద సాహిత్యంగా ప్రారంభం కావటంచేత సమకాలిక సమాజం అందులో అట్టే ప్రతిఫలించలేదు. అయినా తొలి తెలుగు గ్రంథాలు రెండు-మూడింటిలో సమకాలిక ప్రభావం కొద్దిగానైనా కనబడుతుంది. మూలఘటిక కేతన, మంచెన లాంటివాళ్ళు జీవించిన కాలంలో తెలుగుదేశంలో జైనం ఉద్ధృతంగానే వుంది. అందుకే దశకుమార చరిత్రలో, కేయూరబాహు చరిత్రలో ఆ యిద్దరు కవులూ జైనపల్లెలను, జైన జీవితాన్నీ పేర్కొన్నారు. కేతన నీచంగానూ, మంచెన కొంచెం మంచిగానూ జైనులను చిత్రించారు. ప్రాచీన ఆంధ్ర శతకాలలో నేటికీ సజీవమైన సుమతీశతకం జైన రచనే అంటారు. తెలుగులో రచించిన ఏకైక జైనకావ్యం శ్రావణ బెళగోలాలో ఉందిగాని అది ముద్రణభాగ్యం నోచుకోలేదు. ఆదిలో జైనులను నిర్గ్రంథులని పిలిచేవారు. ఆంధ్రజైనులు మాత్రం ఇప్పటికీ నిర్గ్రంథులుగానే మాటవరసకు ఉండిపోయారు.

తెలుగు జనులు - కన్నడ కావ్యాలు

కర్నూలు జిల్లాలోని తూర్పు కనుమలలో పుట్టి, ఒంగోలు పరగణాలో ప్రవహించి కనుపర్తి గ్రామం దగ్గర సాగరసంగమం చేసే గుండ్లకమ్మ నదిని పదకొండు వందల సంవత్సరాల కిందట గుండినది అని పిలిచేవారు. ఆ ప్రాంతాలను కమ్మనాడులని పేర్కొనేవారు. ఇది వేంగిమండలంలో ఉండేది. గుండినది తీరాన్ని గుండికర్రు - గుండికబ్బిలని వ్యవహరించేవారు. ఇక్కడ ఏడు గ్రామాలు ప్రసిద్ధాలైనాయి. ఈ సప్త గ్రామాలలో -

విడుంగొండ, వసంతకొట్టూరు, విక్రమపురం, వంగిపఱ్ఱు అనే వాటి పేర్లు తెలుస్తున్నాయి. ఇవి అగ్రహారాలు. ఇప్పటి బాపట్ల తాలూకాలోని వంగీపురాన్నే ఆ రోజుల్లో వంగిపర్ర అని పిలిచేవారని పరిశోధకులు నిర్ణయించారు.

వంగీపురం అగ్రహారంలో పదకొండువందల సంవత్సరాల కిందట మాధవ సోమయాజి అనే కమ్మ బ్రాహ్మణుడు ప్రసిద్ధుడు. యజ్ఞయాగాదులు చేసే ఈ వైదిక సదాచారపరుని వంశంలో అభిమానచంద్రుడనే కుమారుడు, కుమారయ్యా అనే మనుమడూ, భీమనప్పయ్యా అనే మునిమనుమడూ జన్మించారు. ముత్తాతగారైన మాధవ సోమయాజి యజ్ఞయాగాలు చేసి యజన యాజనాధ్యయ నాధ్యాపన దాన ప్రతి గ్రహ షట్కర్మ నిరతులై, సప్తసోమ సంస్థలను ఆదరించిన వేదమూర్తులయితే, మునిమనుమడు భీమనప్పయ్యా వైదిక మతానికి విముఖుడయ్యాడు. యజ్ఞయాగాదులలో పశుహింసను చూసి గర్హించి ఉంటాడు. భూతదయాపరుడయి ఇతర మతాలను వీక్షించాడు. మతాలన్నిటిలో జైనమతమే ఉత్తమమైనదని గ్రహించి దానిని స్వీకరించాడు. వైదిక కర్మకాండలను వ్యతిరేకించాడు.

గ్రామవాసులందరూ కలసికట్టుగా మతాంతరులైతే ఏ ఇబ్బందీ ఉండదు. కొందరు కొందరు వ్యక్తులు విడివిడిగా వేరు మతాలకు మళ్ళితే సమస్యలు ప్రారంభమవుతాయి. వంశపారంపర్యంగా అనుసరిస్తున్న ఆచార వ్యవహారాలకూ, అనుభవిస్తున్న ఆస్తిపాస్తుల హక్కుభుక్తాలకూ అంతరాయం ఏర్పడుతుంది. కులకట్టుబాట్లను కాదన్నవారిని బంధువర్గం బహిష్కరిస్తుంది. కులంపోతే కూడుపోయినట్టే. ఊళ్ళో నీళ్ళూ నిప్పూ పుట్టవు. జైనమతాన్ని అభిమానించి అందులో చేరిన భీమనప్పయ్యకు వంగిపర్రులో చుక్కెదురయింది. జీవితం దుర్భరమైంది. అగ్రహారాన్నైనా వదులుకొనడానికి అతడు సిద్ధపడ్డాడుగాని జినేంద్ర ధర్మాన్ని విసర్జించడానికి ఇష్టపడలేదు. ఆ మతం వ్యాప్తిలోనున్న తెలుగు ప్రాంతాలకు వలసవెళ్ళిపోదలచాడు. భార్యనూ, పుత్రుడు పద్మప్పనూ వెంటబెట్టుకొని బహుశా క్రీ.శ. 910 ప్రాంతాలలో సబ్బినాడు దారిపట్టాడు.

నేటి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల సంయుక్త ప్రాంతాలను ఒకప్పుడు సపాదలక్ష అని పిలిచేవారు. బోధన్ రాజధానిగా ఈ దేశాన్ని చాళుక్యులు పాలించేవారు. ప్రజలు తెలుగువాళ్ళే అయినా పాలకులు కర్ణాటకులు. రాజభాష కన్నడం, డెబ్బయిరెండు నియోగాల వారిలో ఎక్కువమంది కర్ణాటకం నుండి వచ్చినవారే. ఈ చాళుక్యులు ఉత్తరోత్తరా వేంబులవాడకు తమ రాజధానిని మార్చుకొన్నారు. అందుకే ఈ రాజ వంశాన్ని వేములవాడ చాళుక్యులని చరిత్రకారులు పిలిచేవారు. లేములవాడనే వేముల వాడ అని పేర్కొనడం కూడా ప్రారంభమైంది. దీనిని సబ్బినాడు అని వ్యవహరించేవారు.

భీమనప్పయ్య సబ్బినాడుకు భార్యాబిడ్డలతో వచ్చినపుడు దీనిని ముమ్మడి యుద్ధమల్లుడు (క్రీ.శ. 895-915) గాని, అతని కొడుకు ఇమ్మడి నరసింహదేవర (క్రీ.శ. 915-930) గాని పరిపాలిస్తూ ఉండేవారు. బహుశ కుమారుడే కావచ్చు. ఇతడు మహాయోధుడు. ఇతడు రాష్ట్రకూటులకు సామంతుడేగాని సార్వభౌముడైన ముమ్మడి గోవిందునికి సాక్షాత్తూ బావమరిది. తన ఏలిక తరపున ఎన్నో యుద్ధాలలో పాల్గొన్నాడు. లాట దేశాన్ని జయించాడు. సప్తమాళవాలను దగ్ధంచేసి ఆ ప్రభువులను ఓడించి వాళ్ళచేత కప్పాలు పుచ్చుకున్నాడు. ఘూర్జరదేశాన్ని జయించాడు. గంగాతీరందాకా దిగ్విజయం చేసి గంగాతరంగాలలో తన తురంగాలను తానమాడించాడు. ఇతడు చాలా సామర్థ్యంగల ఏలిక.

ఆ రోజుల్లో సింగన జోస్యులనే జ్యోతిష శాస్త్రవేత్త సబ్బినాడులో వుండేవాడు. ఇతడు జైన బ్రాహ్మణుడు. ధార్వాడ పరగణాలోని యణ్ణికెర గ్రామంనుంచి వలసవచ్చి సబ్బినాడులో స్థిరపడ్డాడు. ఇతని స్వదేశాన్ని 'బెళ్వొల'లని పిలుస్తారు. ఈ బెళివొల సింగన్నగారితో వంగిపర్రు భీమనప్పయ్యకు పరిచయమేర్పడింది. ఏ విద్యలో ఘటికుడో గాని భీమనప్పయ్య తన వైదుష్యంతో సింగన్నగారిని మెప్పించాడు. అవనితలాకాశ వ్యాప్త కీర్తిని అచిరకాలంలోనే గడించాడు. నిజగుణమణి, గుణరత్నాకరుడూ, అజ్ఞాన తమోనీకారుడూ అయిన భీమనప్పయ్యను కేవలం అభిమానించడమేకాక అతణ్ణి అల్లుణ్ణి

చేసుకొన్నాడు. 'వబ్బెణబ్బె' అనే తన కూతుర్ని కన్యాదానం చేశాడు. ఈమెవల్ల భీమనప్పయ్యకు జినవల్లభుడనే కుమారుడు కలిగాడు.

పద్మప్పన్నా, జినవల్లభుడూ ఒక తల్లి కడుపున పుట్టినవారు కాకపోయినా కలసిమెలసి పెరిగారు. రాజభాష కన్నడం, మతభాష సంస్కృతం, మాతృభాష తెలుగు మూడింటినీ పద్మప్పన్న క్షుణ్ణంగా చదువుకొన్నాడు. అన్నయ్యతోపాటు ఆ మూడు జినవల్లభుడూ అధ్యయనం చేశాడు. పద్మప్పన్నను పంపనగారు అని పిలిచేవారు. ఇతనికి పేరు ప్రఖ్యాతులు వచ్చాక పంపనార్యుడని గౌరవ సూచకంగా వ్యవహరించేవారు. పంపనగారికి విఖ్యాతి వూరికే రాలేదు. తన కాలం నాటికి లభ్యమవుతున్న ఛందో వ్యాకరణ కావ్యాలంకార శాస్త్రాలన్నీ అధ్యయనం చేశాడు. కర్ణాటక కవులలో ప్రసిద్ధులైన శ్రీవిజయ, కవీశ్వర, పండిత, చంద్ర, లోకపాలాదుల పద్యకావ్యాలన్నీ పఠించాడు. విమలోదయ, నాగార్జున, జయబుధ, దుర్వినీతులనే రచయితల గద్య రచనలను పరిశీలించాడు. పూర్వం రాష్ట్రకూట చక్రవర్తి నృపతుంగుడు (క్రీ.శ. 815-877) సరస్వతీ తీర్థావతారుడని ప్రసిద్ధి చెంది ఎందరో కవులను పోషించాడు. ఆ నృపతుంగ దేవానుమతమైన కవిరాజమార్గం అనే ఛందో గ్రంథం పంపనగారికి కరతలామలకమైంది. కవితారచన నల్లేరుపై బండి నడకగా సాగింది.

తన కవిత్వం 'పరమజినేంద్ర ముఖచంద్ర వాక్చంద్రికా ప్రసర ప్రసాధోర్ణం' అని పంపనగారి అచంచల విశ్వాసం. అది సూక్తి కల్లోల మాలాకీర్ణం. తాను కవితా గుణార్ణవుడు. తాను ఆచరించే జైనధర్మాన్ని చాటిచెప్పే గ్రంథాన్ని కన్నడంలో రచించదలచారు. జినసేనుడు సంస్కృతంలో 'పూర్వపురాణం' అనే పేరుతో రచించిన గ్రంథాన్ని ఆధారం చేసుకొని 'ఆదిపురాణం' అనే ఉత్కృష్ట రచనను చేశారు. ఈ పదహారు ఆశ్వాసాల కావ్యాన్ని మూడు నెలలలో విరచించారు. జైనతీర్థంకరులలో మొదటివాడైన ఋషభనాథుని పంచకళ్యాణాలను ఇందులో సవిస్తరంగా కథనం చేశాడు.

పంపనగారు తమ ముప్పయితొమ్మిదో ఏట క్రీ.శ. 941లో ఆదిపురాణ రచనను చేశారు. ఒక సబ్బినాడులోనేకాక, ఉత్తర కర్ణాటకయైన పులిగెరలోనూ, బనవాసిలోనూ అతడు చాలాకాలం గడిపినట్టుంది. అది రాజనగరం. అక్కడ పంపనగారు రాచకొలువులో శాస్త్ర, శస్త్ర విద్యలలో తనకున్న వైదుష్యాన్ని ప్రదర్శించి ఉండవచ్చు. ఏమైనా పులిగెరలో చాలాకాలం ఉండడం వల్ల పంపనగారి పలుకుబడులు, ఆ 'తిరుళకన్నడ' పలుకుబళ్ళుగా సందర్భోచిత పదాలుగా భాసిల్లాయి. సకలార్థ సంయుతం, ఉదాత్త వస్తు విశ్వాసం, లలితపదాలు, ప్రసన్న కవితా గుణాలూ, కోమలం, సూక్తి గర్భం, మృదు సందర్భం మొదలైన కావ్య గుణాలతో హితమిత మృదు వచనుడై, ప్రసన్న గంభీర వచన రచనలో చతురుడై పంపనగారు సమస్త వివిధ బుధజన వినుతుడయ్యారు. ఆ కారణంచేతనే వేములవాడ చాళుక్యులలో విశిష్ట చరిత్రగల ఇమ్మడి అరికేసరి (క్రీ.శ. 930-935) ఆస్థానంలోనికి ఆహ్వానం వచ్చింది.

ఇమ్మడి అరికేసరి గొప్ప యోధుడు. ఎన్నో యుద్ధాలలో పాల్గొన్నాడు. చాలా బిరుదులున్నవాడు. పాంబరాంకుశ, అమ్మనగంధవారణ, గంధేభ విద్యాధర, ఆరూఢ సర్వజ్ఞ, ఉదాత్తనారాయణ, నొడుత్తిగెల్వ, గుణనిధి, గుణార్ణవ, శరణాగత వజ్రపంజర మొదలైనవి అనేక బిరుదులలో. తనకు 'గుణార్ణవ' అనే బిరుదు ఉన్నందుకు తన కవులలో శ్రేష్ఠుడైన పంపనగారికి ఆ రాజు కవితా గుణార్ణవుడనే బిరుదు ప్రదానం చేశాడు. వ్యాస విరచితమైన భారతాన్ని కన్నడంలో రచించమన్నాడు.

''కథావస్తువు పెద్దది. అందులో వస్తువిన్యాసం నష్టం కాకుండా సమస్త భారత కథను అపూర్వంగా చెప్పిన కవులు ఇప్పటిదాకా ఎవరూ లేరు. వర్ణనాంశాలూ, కథాంశాలూ సమంజసంగా జోడించి చెప్పగల శక్తి పంపనగారికి మాత్రమే ఉందని పండితులంతా ఏకకంఠంతో ఘోషించి స్తోత్రాలు చేస్తున్నందువల్ల ఈ ప్రబంధాన్ని చెప్పదలచుకొన్నాను'' అని పంపనగారు ఆదిలోనే విశదం చేశారు (విక్రమార్జున విజయం 1-11). విపుల యశోవితాన గుణాలు తమ కావ్య నాయకులలో ఉన్నాయని పూర్వకవులు ప్రాచీన రాజులకు ఆరోపిస్తారు. వాస్తవానికి గుణార్ణవుడైన అరికేసరి పూర్వరాజుల సద్గుణాలు కలవాడు కనుక మహాభారత కథలో అతని కథను చేర్చి కిరీటితో గుణార్ణవుని పోల్చదలచాను (1-14) అని స్పష్టం చేశారు.

వ్యాసమునీంద్రుని విస్తారమైన వచనామృత వార్ధిని నేను ఈదుతాను. అయితే నేనా కవి వ్యాసుణ్ణనే గర్వం నాకు లేదు. గుణార్ణవుని సాధుస్వభావం నా మనోమందిరంలో ప్రవేశించింది కనుక ఈ కావ్యాన్ని చెప్తున్నాను. ఈరీతిగా ప్రీతి ప్రదర్శన దోషమా?'' అని పంపనగారు నిష్కర్షగా ప్రశ్నించారు (1-13), అర్జునుడికీ, అరికేసరికీ అభేదాన్ని చెప్పినా కావ్యాన్ని ప్రసన్న కవితా గుణంతో, లలిత పదాలతో చెప్పాడు.

విక్రమార్జున విజయాన్ని పంపనగారు క్రీ.శ. 945 నాటికి పూర్తిచేసి ఉంటారు. క్రీ.శ. 946 నాటి ఒక శాసనంలో ఈ కావ్యావతారికలోని అయిదు పద్యాలు ఉదాహృతాలయ్యాయి. సమస్త భారత కథా సంబంధమైన ఈ విక్రమార్జున విజయాన్ని తన పేర చెప్పినందుకు అరికేసరి పంపనగారికి సబ్బినాడు నట్టనడుమలో ఉండే ధర్మపురాన్ని అగ్రహారంగా ఇచ్చారు. ఇది శాసనదత్తమైన గ్రామం. ఈ ఊరికి ఉత్తర దిగ్భాగంలో ఉండే వృషభాద్రి మీద ఈ శాసనాన్ని చెక్కారు. భీమనప్పయ్య వంగిపర్రులోని తాతలనాటి అగ్రహారాన్ని వదలుకొని సబ్బిరాష్ట్రానికి వచ్చినా, ఒక ప్రయోజకుడైన పెద్ద కొడుకు సబ్బినాడులో రాజాశ్రయముతోపాటు ఒక అగ్రహారాన్ని పొందాడు. భీమనప్పయ్యకు ఇది నిజంగా పుత్రోత్సాహం కలిగించే సందర్భమే.

భీమనప్పయ్య ద్వితీయ పుత్రుడు జినవల్లభుడు కూడా కవే. సంస్కృతాంధ్ర, కర్ణాటక భాషలలో ఇతడు చెప్పిన పద్యాలు ఒక శాసనంలో శిలాక్షరాలై నిలచాయి. ఇతడు సమస్త సకల కళా ప్రవీణుడు. భవ్యరత్నాకర గుణపక్షపాతి. బహు కావ్య రచనా సమర్థుడు, కవిత్వ తత్త్వ విశారదుడు. రెండు చేతులా దానధర్మాలు చేస్తూ అపర దానకర్ణుడని

పించుకొన్నాడు. ఈ జినవల్లభుడు ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో ఉపలబ్ధమవుతున్న ప్రప్రథమ రచనలో తోడ్పడ్డాడు. ఈ సంగతులు వచ్చే ప్రకరణంలో చెప్పుకొందాం. ప్రస్తుతం చెప్పుకోవలసిన ముఖ్య విషయం, ఈ జినవల్లభుడు తన శాసనంలో చెక్కించిన కందపద్యాలే తెలుగు శాసనాలలో లభించే ప్రాచీనమైనవి.

కంద పద్యాలే తెలుగు, కన్నడ భాషలలో ఆదికవులు ఎక్కువగా మక్కువపడి వాడిన పద్యాలు. పంపనగారు తమ ఆదిపురాణంలోనూ, విక్రమార్జున విజయంలో మొత్తంమీద చెప్పిన వివిధ ఛందస్సులలో పద్యాలు క్రమంగా మొదటి దాన్లో 1630, రెండవ కృతిలో 1607 ఉన్నాయి. వీటిలో కందాలే ఎక్కువ. ఆది పురాణంలో 950, విక్రమార్జున విజయంలో 730 కందాలను పంపనగారు చెప్పారు. ఈ పద్ధతినే తర్వాతి కవులు ఒక్క కన్నడ కావ్యాలలో మాత్రమే కాదు, తెలుగు కావ్యాలలో కూడా అనుసరించారు.

విక్రమార్జున విజయంలో పంపనగారు ఒక విషయాన్ని సగర్వంగా చెప్పుకొన్నారు. తన కృతులు అవతరించాక అవి అంతకుముందున్న కవుల కబ్బాలన్నింటినీ తొక్కి పారేశాయి (14-59). పూర్వ కావ్యాలను మట్టుపెట్టినట్టే, ఉత్తరోత్తర కావ్యాలకు మేలుబంతులయ్యాయి. తెలుగు ప్రబంధాలలో మనం చూసే అనేక లక్షణాలు పంప భారతంలో కనిపిస్తాయి... పంపకవి సృష్టించిన పాత్రలు మూలభారతంలోని పాత్రలకు ప్రతిరూపాలు కావు. అవి పంపకవి హృదయాన్ని ఎత్తి చూపించే మణిదీపికలు అని ఆర్వియస్ సుందరంగారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు.[1] విక్రమార్జున విజయంలోని వివిధ విషయాల గురించి వీరు చక్కగా విశదం చేశారు. పంపనగారు సాహిత్య సౌరభాన్ని చూపిస్తూ తెలుగు, కన్నడ భారతాల పోలికలను జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారు వివరించారు.[2] తెలుగునాట పుట్టిన పంపనగారు తెలుగులో పుట్టిన ఎన్నో కావ్యాల రీతులకు వరవళ్ళు పెట్టారు.

పంపకవి తండ్రితాతలు తెలుగుదేశానికి చెందినవారేకాక, తెలుగువారే అని చెప్పుకొన్నా ఫరవాలేదు. ఎందుకంటే ఈ విషయాన్ని ఖండించడానికి కూడా ఎక్కువ ఆధారాలు లేవు. అయితే పంపనగారి తల్లిమాత్రం కన్నడదేశపు ఆడపడుచేనని నిస్సంశయంగా చెప్పవచ్చు. ధారవాడ జిల్లాకు చెందిన అణ్ణిగెర జోయినసింఘుని మనుమరాలయిన అబ్బణబ్బె అన్న అచ్చకన్నడపడుచు పంపతల్లి అని ఆర్వియస్ సుందరంగారు రాయడం విడ్డూరంగా ఉంది. పంపనగారు తమ తల్లిపేరుగాని, మాతామహుని పేరుగాని చెప్పుకోలేదు. జినవల్లభుని కుర్క్యాల శాసనంవల్ల మాత్రమే సింగజోస్సుల పేరూ, అతని కూతురు అబ్బణబ్బె పేరూ లోకానికి తెలుస్తున్నాయి.[3] ఈ శాసనాన్ని పరిష్కరించిన నేలటూరి వెంకటరమణయ్య గారు తమ ఇంగ్లీషు వ్యాసంలోనూ,

---

1. కన్నడ సాహిత్య చరిత్ర (1977). పుట. 48

2. కస్తూరి (1983)

3. ఎపిగ్రాఫియా ఆంధ్రికా - ద్వితీయ సంపుటం. పుటలు 21 నుండి...

తెలుగు వ్యాసంలోనూ ఈ సంగతులు స్పష్టపరిచారు. జినవల్లభుడు తాను వబ్బణబ్బె కుమారుడనియు, జోయినసింఘుని మనుమడననియు, పంపని తమ్ముడననియు చెప్పుకొనియున్నాడుగదా! పంపడెచ్చటను వీరి మాట ఎత్తుకొనన్నైనలేదు. దీనికి కారణమేమి? పంపడును, జినవల్లభుడును నేకోదరులు గారేమో. అబ్బణబ్బె పంపనికి సవతితల్లి యగునేమో. తత్కారణమున నతడు అబ్బణబ్బెనుగాని, ఆమె తండ్రియైన జోయినసింఘుని (గాని) కుమారుడైన జినవల్లభునిగాని పేర్కొని యుండకపోవచ్చును.''[4] వేరే ఆధారాలు దొరికేదాకా సుప్రసిద్ధ చరిత్రకారుల అంచనాలు మాత్రమే ఆమోదయోగ్యాలు.

సాహిత్య చరిత్రకారులందరూ ఆమోదించని విషయం ఇంకోటి ఉంది. ఆరవీటి రాజుల యుగంలో క్రీ.శ. 1560 ప్రాంతాలలో ఒక అజ్ఞాత గ్రంథసంధాత 35 కావ్యాల పేర్లను చెప్తూ 32 మంది కవుల పద్యాలను సేకరించాడు. 'పద్మకవి' రచించిన 'జినేంద్ర పురాణం' అనే కావ్యంలోంచి ఒక పద్యాన్ని ఉదహరించాడు. దీనిని యితర పద్యాలతోబాటు వేటూరు ప్రభాకరశాస్త్రిగారు తమ ప్రబంధ.రత్నావళిలో ప్రచురించారు. ఆ పద్యం ఒక సీసం.

హరినిలయంబును హరి నిలయంబును
విషధరాఢ్యంబును విషధరాఢ్య
ముప్సరోమయమును నప్సరోమయమును
వన విలాసమును పావన విలాస
మున్నత కరిశృంగ మున్నత కరిశృంగ
మిందు కాంత స్రవమిందు కాంత
మురుకలనకులంబు నురుకలనకులంబు
నంశుకాంత ద్యోతి నాంశుకాంత
మొనర నవశత సాహస్రయోజనోన్న
తమును పదివేల యోజన లమరువలము
గలిగి కనకాద్రికి న్నూటఁ గలిగిన రి
ప్రథితమై యొప్పు మందర పర్వతంబు.

ప్రభాకరశాస్త్రిగారు ప్రబంధరత్నాకరంబు పీఠికలో ఇలా రాశారు. ''ఇందు జినేంద్ర పురాణమనియు, నాది పురాణమనియు రెండు జైన ప్రబంధము లుదహరింపబడినవి. కాని వానియందలి పద్యము లెక్కువగా జేకొనబడవయ్యెను. ఉన్న పద్యములం జూడగా ప్రాచీనతర రచనగా దోపకున్నది.''

అయితే నిడుదవోలు వెంకట్రావుగారు మాత్రం ఈ పద్మకవి పంపనగారే అనీ, ఈ జినేంద్ర పురాణాన్ని క్రీ.శ. 941 ప్రాంతాల్లో రచించారనీ భావిస్తూ తమ తెలుగు కవుల

4. 'పల్లవులు-చాళుక్యులు' పుట 364.

చరిత్రలో వ్రాశారు. ఈ పద్య ప్రాచీనతను సందేహించడానికి కారణం ఇందులోని విషధర నిలయంబు, విషధర నిలయంబు అనే శ్లేషయే అని చెప్పి, ఇది చిత్రకవిత అని ఇలాంటి రచనలను నృపతుంగుడు తాను కవిరాజ మార్గంలో పేర్కొన్నాడని నిడదవోలువారు వాదించారు.[5]

అన్నం ఉడికిందో, లేదో చెప్పడానికి ఒక మెతుకును పట్టి చూస్తే సరిపోవచ్చుగాని, ఒక కావ్యం, ప్రాచీనతను అసందిగ్ధంగా తేల్చడానికి ఒక కబళమంత ఘట్టం కావలసి వస్తుందేమో. పంపనగారు తెలుగులో కావ్యరచన తన యౌవనంలో చేశారో, వార్ధక్యంలో చేశారో, అసలు చేశారో లేదో తేల్చడం కష్టం.

చరిత్రకారులు పంపనగారు తమ వార్ధక్యంలో సన్యసించారనీ, 'శుభనంది' అనే పేరు పెట్టుకొన్నారని భావిస్తున్నారు. ఇందూరు సీమలో ఉన్న బోధన్‌లో పంపనగారి సమాధి ఉంది. దీని గురించి సీతారామ జాగీర్దారుగారు ఎపిగ్రాఫియా ఆంధ్రికా, ద్వితీయ సంపుటంలో (పుట 31 నుండి) వివరించారు. పంపనగారు జనన మరణాలు తెలుగుగడ్డమీదనే జరిగినా అతని కావ్యాలు ఒకనాడు కావేరీ, గోదావరుల మధ్యనున్న కన్నడనాడులో సర్వత్రా ఇప్పటికీ జీవిస్తూనే ఉన్నాయి.

ఇంతటి అదృష్టాన్ని యితర తెలుగు జైనులు, ముఖ్యంగా పంపనగారి సమకాలికుడే అయినా పొన్నమయ్య నోచుకోలేదు. అయినా అతడు కూడా చరిత్రలో చేర్చవలసినవాడే.

అది క్రీస్తుశకం 973 ప్రాంతం.

వేంగీ విషయం త్రిభువనాలలో ఉపమాతీతమైన దేశం. అక్కడ సమస్తమూ సంగతమై వుంటాయి. ఉత్తుంగ ఫలద్రుమాలతో అమూల్యా వస్తు విధానమైనది. ఆ రాజ్యం ఆ ధరణీవధూతిలకం, ఆ ధరణీ లలనా ముఖాబ్జం, ఆ ధరణీరమైక నవయౌవనం, ఆ ధరణీ ప్రియాకటాక్షధర విభ్రమ భ్రమణం ''కమ్మనాడు'' మహత్తరమై విద్యాధరలోక సమానంగా వుంది. అటువంటి అతి విఖ్యాతమైన కమ్మనాడులో ''పుంగనూరు'' అనే పురముంది.

ఆ పుంగనూరులో ద్విజోన్నత విద్యానిధి. బహుశ్రుత ప్రజ్ఞానిధి, ఉపమానాతీత ధైర్యవంతుడు, యాజ్ఞవల్క్య సదృశుడు, కౌండిన్య గోత్రీకుడు నాగమయ్యా అనే జైన బ్రాహ్మణుడు నివసిస్తూ వుండేవాడు. ఈయనకు ఇద్దరు కుమారులు. పెద్దవాడు మల్లప్ప, చిన్నవాడు పున్నయ్యా. ఈ అన్నదమ్ములు జినచంద్ర మునీంద్రుల శిష్యులు, క్రీస్తుశకం 973 నుండి 997 దాకా పాలించిన తైలవుని చ మూపతులు, మల్లప్ప జ్యోతిష శాస్త్రంలో బభ్రు, వరాహమిహిర, శౌనక, సునంద గార్గ్యులతో సమానుడు దానకర్ణుడు, అమ్మన భక్తుడు. ఇతని తమ్ముడు పున్నయ్యా అన్నన భక్తుడు (అమ్మన భక్తుడు అంటే పితృభక్తి పరాయణుడు, అన్ననభక్తుడు అంటే భాతృభక్తి పరాయణుడు).

5. తెలుగు కవుల చరిత్ర – పుట 86.

ఈ అన్నదమ్ముల గురువైన జినచంద్ర మునికి కైవల్యం సిద్ధించింది. శిష్యులు తమ గురువుగారి జ్ఞాపకార్థం వారికి అంకితంగా ఒక జైన పురాణాన్ని తయారు చేయిద్దామను కున్నారు. సాటి తెలుగువాడు, కన్నడంలో మేటి కవిత్వం చెప్పగలవాడూ ముఖ్యంగా జైనుడూ, జైనాగమ పురాణాలు తెలిసినవాడూ అయిన పొన్నమయ్యగారిని రప్పించారు. ఆయన అప్పటికే ''భువనైక రామాభ్యుదయం'' అనే చంపూకావ్యం రచించి, రాష్ట్రకూట చక్రవర్తి ముమ్మడి కృష్ణుని వల్ల ఉభయకవి చక్రవర్తి అనే బిరుదును పొందినవాడు. ఆ సంగతి ఇలా చెప్పుకొన్నవాడు.

భువనద కన్నడ సక్కద
గవిగళ్ సలెసొలెసోలె పమాంగిత్తం
సవివేక ముభయ కవి చ
క్రవర్తి వెసరల నిజాహితోష్ణం వృష్ణం (1-9)

రాష్ట్రకూట చక్రవర్తి మూడవ కృష్ణుడు క్రీస్తుశకం 939 నుంచి 968 దాకా పాలించాడు. ఆ నడిమికాలంలో ఎప్పుడో పొన్నమయ్యగారు భువనైక రామాభ్యుదయం రచించి ఉభయకవి చక్రవర్తి బిరుదాన్ని పొందారు. ఉభయ భాషలంటే తెలుగు కన్నడాలూ, కన్నడ సంస్కృతాలూ కావచ్చును. పొన్నమయ్యగారికి, బహుశా నూరేళ్ళ ముందు కన్నడంలో అసగుడనే కవి కుమార సంభవ కావ్యాన్ని రాశాడు. బహుశా ఇది కాళిదాసు కుమార సంభవానికి అనువాదం కావచ్చు. అసగకవిని, కాళిదాసునీ పొన్నమయ్యగారు కొట్టి పారేశారు.

కన్నడ గవి తయెళ సగం
గన్నూర్మడి రేఖ గగ్గళం సక్కదోళ్
మున్నుళ్ళ కాళి దాసం
గన్నాల్మడి రచన యోళ్ కురుళ సవణం (1-11)

కన్నడ కవిత్వంలో అసగుని కన్న నూరింతలు గొప్పవాణ్ణి. రచనలో మున్నున్న కాళిదాసుకన్నా నాలుగింతలు గొప్పవాణ్ణి అని ధీమాగా చాటుకున్న పొన్నమయ్యగారి ధైర్యాన్ని మెచ్చుకోవాలి. ఈయన రచించిన భువనైక రామాభ్యుదయం పధ్నాలుగు ఆశ్వాసాల కావ్యం. చాలా అమూల్యమైనదని కవిగారి ఉద్దేశం. ఒకవేళ వెలకట్టాలంటే ఆశ్వాసానికో భువనం చొప్పున జమకడితే పధ్నాలుగు ఆశ్వాసాలకి పధ్నాలుగు భువనాలు సరిపోతాయి.

విదిత భువనైక రామా
భ్యుదయ క్కంబెలె మావుడంతరమింతే
పదినాల్కుల భువనంగళ
పదునాల్కా శ్వాస రచనెగంచెలె యక్కుం (12-66)

శాంతి పురాణం

ఇంతటి ధిషణాహంకార సంభార దోహలుడైన పొన్నమయ్యాగారిని రావించి మల్లప్ప, పున్నయ్యలు తమ గురువుగారి పరోక్షంలో శాంతి పురాణం అనే జైన పురాణాన్ని రచింపజేశారు. జైనతీర్థంకరులలో పదహారవ తీర్థంకరుడైన శాంతినాథుని చరిత్రను ఈ పన్నెండు ఆశ్వాసాల చంపూకావ్యం విశదపరుస్తుంది. ఈ పురాణానికి ''పురాణ చూడామణి'' అనే పేరుంది. ఇది జైనులకు మాత్రమే బాగా రుచించే కావ్యం. వారికే ఇది సుబోధకంగా వుంటుంది.

శాంతిపురాణంలోని వివిధ పద్యాలవల్ల పొన్నమయ్యగారి సర్వతోముఖ ప్రతిభ కనబడుతుంది. అష్టాదశ వర్ణనలూ, నవరస పోషణ, ఛందోవైవిధ్యం, ప్రయోగ దక్షత మొదలైనవి సాక్షాత్కరిస్తాయి. 1636 గద్య పద్యాలున్న ఈ కావ్యంలో 1169 కంద పద్యాలున్నాయి. కంద పద్యరచన పొన్నమయ్యగారికి నల్లేరుమీద బండినడక. నాలుగింట జగణం వాడడం, అలతి అలతి యమకాలు కందానికి అందం తెస్తాయి. కందం తర్వాత ఉత్పల, చంపకాలు (మొత్తం 233), ఆ తర్వాత మత్తేభ, శార్దూలాలు (మొత్తం 157) విరివిగా రచించారు. ఏ పద్యంలోనైనా ధార అనర్గళం. ఏ పద్యాన్ని చూసినా ఎంతో చెయ్యి తిరిగినవాడి రచనగా స్పష్టమవుతుంది.

ఈ శాంతి పురాణాన్ని చెప్పించిన అన్నదమ్ముల్లో మల్లప్పకు అయిదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు వున్నారు. ఇందులో ఒక కుమార్తె అత్తిమబ్బె ఆహవమల్ల సత్యాశ్రయుణ్ణి పెళ్ళాడి రాజపత్ని అయింది. ఈమె కుమారుడు నన్ని నారాయణుడు కూడా ఏలిక అయ్యాడు. ఇందువల్ల అత్తిమబ్బె రాజమాత కూడా అయింది. రెండు చేతులా దానధర్మాలు చేసి ''దానచింతామణి'' అనే బిరుదుకు పాత్రురాలైంది. ఈమె ఒక అపూర్వమైన దానం చేసింది.

తన తండ్రి చెప్పించిన శాంతిపురాణం శాశ్వతంగా వుండాలన్న సంకల్పంతో ఆమె ఆ మాతృక గ్రంథానికి వేయి ప్రతికలను పుట్టించి ఆ ప్రతులను దానం చేసింది. వేయి తాళపత్ర ప్రతులను రాయించడం చాలా శ్లాఘనీయమైన సత్కార్యం. అత్తిమబ్బె ఆనాడు అన్ని ప్రతులను రాయించబట్టే శాంతిపురాణం చాలా ప్రాచుర్యం పొందింది. పొన్నమయ్యగారి కవితను తరతరాలవారు పఠించగలిగారు. ఆయనను కన్నడ కవిత్రయంలో చేర్చగలిగారు.

పొన్నమయ్యగారిని రన్నకవి, నయసేనుడు, కర్ణపార్యుడు, దుర్గసింహుడు, నేమిచంద్రుడు, రుద్రభట్టు మొదలైన కన్నడ కవులు తమ తమ కావ్యాలలో పూర్వకవి స్తుతిలో భక్తితో నుతించారు. కొందరు పంపన కవికన్నా ఈయననే ముందుగా పేర్కొన్నారు.

పర్యాయ నామాలు

శాంతిపురాణం ప్రథమాశ్వాసంలోని అవతారిక పద్యాలవల్లా, చరమాశ్వాసంలోని ఉపసంహారం పద్యాలవల్లా పొన్నమయ్యగారి పర్యాయ నామాలు, బిరుదులు తెలుస్తాయి. ఆయనకు పొన్న, పొన్నిగ, పొన్నమయ్య, పొన్నమార్య, సవణ (శ్రమణ). కురుళ్గ సవణ (సాధువాక్య శ్రవణ), సర్వదేవ కవీంద్ర అనే పేర్లున్నాయి. ఉభయకవి చక్రవర్తి, సౌజన్య కందాంకుర, పాపేభ కంఠీరవ అనే బిరుదులున్నాయి. శాంతి పురాణంలోని చిట్టచివరి పద్యంలో తమ ''సర్వదేవ'' పర్యాయ నామాన్ని పొన్నమయ్యగారు ఇలా ఒక మత్తేభంలో చెప్పారు.

సకలజ్ఞం, కవి చక్రవర్తి, జనచంద్రేం ద్రంగె సద్భక్తి పూ
ర్వక దిండమ్మన భక్తనుం తదను జాతం పున్న నుం పేర్వరుం
దుకరం ప్రార్థి సె శాంతినాథ కధియం లే నప్పినం సర్వదే
వకవీంద్రుం బరెదం బుధర్ పొగర్పునం తన్నం మహోత్సాహదిం. (12-82)

సర్వదేవారాధనం తెలుగువాళ్ళకి ఇక్ష్వాకుల కాలంనుంచీ వస్తున్న ఆచారమే. నాగార్జునకొండ త్రవ్వకాలలో ఒకచోట పుష్పభద్రుని, సర్వదేవుని, కార్తికేయుని, నవగ్రహముల దేవాలయాలు బయటపడ్డాయి (భాషా సమితివారి విజ్ఞాన సర్వస్వం - మూడవ సంపుటి పుట 888). ఇక్ష్వాకుల కాలం నుంచి కమ్మనాడు చారిత్రకంగా ప్రసిద్ధికెక్కింది. కమ్మనాడులో పుట్టినవాళ్ళలో కొందరికి సర్వదేవుడనే పేరు పెట్టుకొనడంలో ఆశ్చర్యం లేదు.

సర్వదేవుడు

పొన్నమయ్యగారికి సర్వదేవకవి అనే పేరున్నట్టు వారి పద్యంవల్లనే తెలుస్తుంది. తెలుగు సాహిత్యంలో కూడా ఒక సర్వదేవుడనే కవి వున్నాడు. 16వ శతాబ్దంలోని ఒక అజ్ఞాత సంకలనకర్త వివిధ గ్రంథాల నుండి పద్యాలు సేకరించాడు. సర్వదేవుని ఆది పురాణంలోనివని రెండు పద్యాలను ఉదాహరించారు. కన్నడంలో కవిత్వం చెప్పిన సర్వదేవుడూ, తెలుగులో ఆది పురాణం రాసిన సర్వదేవుడూ ఒకరేనా అన్న సందేహం నేలటూరి వెంకటరమణయ్యగారికి కలిగింది. కొంపెల్ల జనార్దనరావు సంపాదకత్వాన వెలువడుతూ వుండే 'ఉదయిని' పత్రికలో సర్వదేవుని గురించి ఒక వ్యాసం రాశారు. (సంచిక 5 - మే 1936) అందులో ఇలా చెప్పారు.

ఆదికవి?

''మనకు లభ్యమైన యాంధ్ర వాఙ్మయమంతటికిని ప్రాచీనతమ గ్రంథము నన్నయభట్టు భారతమే. కాని యిది యాంధ్రమున ప్రథమ కావ్యము కాదు. నన్నయ నాటికి ఆంధ్ర కవిత్వము చక్కగ పెరిగి వికసించినది.

''కావ్యరచన సర్వసాధారణముగ నలవడినగాని శాసనములను పద్యరూపముగ విరచించుట సంభవింపదు. కావున నాంధ్రులప్పటి కెన్నో శతాబ్దములకు పూర్వమే కవితా నిర్మాణశక్తి కలిగియుండిరనుట సమంజసము. మరియు ఆంధ్రదేశజులు అన్యభాషయందు ఉత్తమ కావ్యములు రచించగలిగినప్పుడు మాతృభాషయందు కవనము సెప్పజాల కుండిరనియు, సెప్ప నుద్యమించి యుండరనియు తలంచుట హాస్యాస్పదము.

''పొన్నడను నామాంతరముగల ఈ సర్వదేవుడే ఆదిపురాణమును దెనుగున రచించిన సర్వదేవుడని నా తలంపు. పొన్నడు వేంగీ విషయాంతర్గతంబగు కమ్మనాటి వాడగు జైనకవి సర్వదేవుడని పేరు గల్గినవాడు. సర్వదేవుడు తెలుగున జైనపురాణమును వ్రాసిన జైనకవి. ఇద్దరికిని పేరొక్కటే, దేశమొక్కటే, మతమొక్కటే, ఇద్దరును కవులు, ఇప్పటికి నా తలపున కాధారమింతియ. భావి పరిశోధన నా నమ్మకమును దృఢపరచ గలదని ధైర్యము గలదు.''

తెలుగులో నన్నయగారికి ముందు గ్రంథరచన చేసిన యింకొక కవి లేకపోలేదు. ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు తమ ప్రాఙ్నన్నయ యుగంలో ఈ కవి పేరును చాలాసార్లు స్మరించారు. ఇతర సాహిత్య పరిశోధకులు కూడా ఇతనిపై రాశారు.

ఆంధ్రసాహిత్యంలో సర్వదేవుడనే ఒక కవి వున్నాడు. ఇతడు ఆదిపురాణం, విరాట అనే రెండు కావ్యాలను రాశాడని చెప్తూ, వాటినుంచి ముచ్చటగా మూడు పద్యాలను ఒక అజ్ఞాత సంకలనకర్త ఉదహరించాడు. పెదపాటి జగన్న అనే మరో సంకలనకర్త సేకరించిన పద్యాలతో కలిపి ఈ అజ్ఞాత సంకలనకర్త పోగుచేసిన ''ఉదాహరణ పద్యాలను'' వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రబంధ రత్నావళి అనే గ్రంథరూపంలో ప్రచురించారు (1918). దీని పీఠికలో ప్రభాకరులు ఇలా రాశారు:

> ''ఇంతవరకు నాంధ్రభాషలో కవిజనాశ్రయము తక్క జైన ప్రసక్తమగు కబ్బము కానరాలేదు. ద్రవిడ, కర్ణాటక భాషలలో జైనకృతులు పెక్కులున్నవి. ఇందు (ప్రబంధ రత్నావళిలో) జినేంద్ర పురాణమనియు, నాది పురాణమనియు రెండు జైన ప్రబంధములుదహరింపబడినవి. కాని, వానియందలి పద్యము లెక్కువగా జేకొనబడవయ్యెను, ఉన్న పద్యములు చూడగా ప్రాచీనతర రచనముగా దోపకున్నవి.'' (పుట XXVII)

పైన చెప్పిన గ్రంథాలలో జినేంద్ర పురాణాన్ని పద్మకవి రచించాడు. ఆది పురాణాన్ని సర్వదేవుడు అనే కవి చెప్పాడు. ఈ సర్వదేవుడు ప్రాచీనుడా? ఇది ఇప్పటికీ తేలని ప్రశ్న. నేను సమగ్రాంధ్ర సాహిత్య రచన చేస్తున్నప్పుడు సర్వదేవుని కాల నిర్ణయ సమస్య ఎదుర్కొనవలసి వచ్చింది. ''వేటూరివారు ప్రాచీనతరము కాదన్న పద్యాలను రాసినవాడు అర్వాచీనుడే యతడు'' అని భావించి రాయలయుగంలోని సర్వదేవునికోసం గాలించాను.

మన సాహిత్యంలో మలయమారుతం సర్వన్న, కాసె సర్వప్ప అనే ఇద్దరు కవులు తప్పించి ''సర్వ'' అనే పదం పేరులోవున్న మరో కవి కనిపించలేదు. సర్వన్న భాగవతం షష్ఠస్కంధం రాసినవాడు, సర్వప్ప చారిత్రక కావ్యకర్త. ''ప్రతాప చరిత్రం'', ''సిద్ధేశ్వర చరిత్ర'' అనే రెండు చారిత్రక కావ్యాలను రాశాడు. మన కావ్యాలలో కవులు తమ తాత తండ్రుల పేర్లను చెప్పుకొంటారు. ఇలాంటి వంశవర్ణనలో ఎవరైనా సర్వకవి దొరుకుతాడా అని వెదికాను. లింగమగుంట రామయ్య అనే కవి ఆనందకానన మాహాత్మ్యం, చతుర్వాటికా మాహాత్మ్యం అనే రెండు కావ్యాలు రాశాడు. అందులోని మొదటి కావ్యంలో తన తాతగారిని ఇలా స్తుతించాడు.

''భవ్య భాగీరథీ సతీ ప్రాణవిభుడు
ఘనులు బస్వన రామలక్ష్మణుల తండ్రి
మహిత విద్యుడు మత్పితా మహుడునైన
సర్వకవి సార్వభౌముని సన్నుతింతు.'' (ఆర్. 677)

అవతారికలో ఇలా తాతగారిని పద్యాలలో నుతించడమే కాక ఆశ్వాసాంత గద్యలో కూడ వారి పేరును చెప్పుకొన్నాడు.

''ఇది శ్రీమచ్చాతుర్వాటే రామచంద్ర వరప్రసాద్ లబ్ధకవితా విచిత్ర సర్వయామాత్య పౌత్ర లక్ష్మయామాత్యపుత్ర విభుజన విధేయ లింగమకుంట రామయ నామధేయ ప్రణీతంబైన వాయుపురాణ లక్ష్మీ సంహితోక్తానంద కానన మహాత్మ్యంబునందలి పంచమాశ్వాసము''. (ఆర్. 677)

ఈ లింగమకుంట రామయ్య మరెవరోకాడు. సాక్షాత్తూ తెనాలి రామకృష్ణుని అల్లుడు. ఈ రామయ్య తాతగారు రామకృష్ణునికి ఒక్కతరం పెద్దవాడు. ఇతడే సంకలనకర్త చెప్పిన సర్వదేవుడనుకొన్నాను. అనుకోవడమే తడవుగా తడుముకోకుండా లింగమగుంట సర్వకవి అనే శీర్షికతో రెండు పుటల వ్యాసం రాసి సమగ్ర ఆంధ్ర సాహిత్యం 'తెనాలి కవులు - బంధువులు' అనే శీర్షికలో చేర్చాను.

(నవాబుల యుగం)

శైవులు, వైష్ణవులు, జైనులు

ఇది తొందరపడి చేసిన పని. ''సర్వదేవుడు'' అనే అర్వాచీన కవికోసం గాలించి గుర్తించానే తప్ప అతడు ఆదిపురాణం అనే జైన గ్రంథాన్ని రాసి వుంటాడా అని లోతుకు వెళ్ళి ఆలోచించలేదు. తెనాలివారు, లింగమగుంట వారూ ఆదిలో శైవులు, తర్వాత వైష్ణవం పుచ్చుకున్నారు. లింగమగుంట సర్వకవి భార్య పేరు భాగీరథి. పెద్ద కొడుకు పేరు బసవన్న. ఈ పేర్లు అతని శైవసంబంధాలను చూపెడుతున్నాయి. సర్వకవి మనుమడు రామయ్య వీరవైష్ణవుడు. శైవక్షేత్రమైన కాశీని వైష్ణవక్షేత్రంగా ప్రస్తుతించాడు.

శైవులకూ, వైష్ణవులకూ జైనులంటే పడదు. పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతుంది. అటువంటప్పుడు లింగమగుంట సర్వకవి ఆదిపురాణం ఎలాగ రాస్తాడు? రాయడానికి ఆస్కారం లేదు. అయినా 18వ శతాబ్దంలో పింగళి ఎర్రన, మంగళగిరి ఆనందయ్య అనే కవులు బ్రాహ్మణులై వుండి క్రైస్తవ కావ్యాలు రాయలేదా? బహుశా ఈ ఉదంతాన్ని దృష్టిలో పెట్టుకునే లింగమగుంట సర్వకవి ఆదిపురాణం రాశాడని నేను పొరబడి వుండవచ్చు. అదీకాక పెదపాటి ఎర్రన అనే మరొక అర్వాచీనుడు మల్హణ చరిత్ర అనే కావ్యంలోని పూర్వకవి స్తుతిలో సర్వదేవుణ్ణి స్తుతించాడు. పెదపాటి ఎర్రన్నకు ఒకటి, రెండు తరాల ప్రాచీనుడుగా లింగమగుంట సర్వకవి ఒక్కడే కనబడుతున్నాడు. సర్వదేవుడు అత్యంత ప్రాచీనకవి అని నమ్మలేక ఇన్ని సాకులు వెదుక్కోవలసి వచ్చింది.

ఒక సీసం

అన్నిటికన్నా మరొక పెద్ద సాకు కూడా లేకపోలేదు. అజ్ఞాత గ్రంథ సంకలనకర్త సర్వదేవుని విరాటంలోనిదంటూ ఒక సీసపద్యాన్ని కూడా ఉదహరించాడు.

ఇక్షురసాబ్ధి నీరెట్టిదో యని మది
    నూహించి యువ్విళులూరకుండ
నిరసంపు ముదిమికి పరిహారంబగు రసా
    యనము మీదికి చిత్తమరుగకుండ
ఆవిరి దేహము సాధించు సిద్ధరసంబు
    కందువ యచ్చోటి కందకుండ
నాయువు చిరస్థాయిగా జేయుసు
    ధారసంబు వేడ్కత గలకుండ
నఖిల జనులకు పంకేరుహాసనుండు
పేర్చియన్నింటి రుచులొనగూర్చి తెచ్చి
సంచితంబులుగా సంగ్రహించె ననగ
భావిత జలములై వురసరోవరము నొప్పు (ప్రబంధరత్నావళి - 464)

ఈ సీస పద్యాలలోని ఛ్ఛందశ్శిల్పం ప్రాచీన లక్షణాలతో లేదు. మన సాహిత్యంలో కనబడే మొట్టమొదటి సంపూర్ణ సీసపద్యం చాళుక్య భీముని ధర్మవరం శాసనంలోనిదే (క్రీ.శ. 9వ శతాబ్ది).

ఇందులో సర్వత్ర ప్రాసయతినే పాటించారు. నన్నయగారి భారతంలోని సీసపద్య రచనలో కొన్ని గట్టి నియమాలు వున్నాయి. పద్యాన్ని ప్రాసయతితో మొదలుపెడితే అంతటా దానినే కొనసాగించడం, యతితో మొదలుపెడితే సర్వత్రా దానినే వాడడం, యతి, ప్రాసయతి ఒకదాని తర్వాత ఒకటి వివిధ పాదాలలో వాడడం మొదలైనవి నన్నయగారి నియమాలు. అత్యంత ప్రాచీన సీసపద్య రచనలో ఇటువంటి పట్టింపులు తప్పనిసరి.

కఠిన నియమాలు

అజ్ఞాత సంకలనకర్త ఉదహరించిన సర్వదేవుని విరాటంలోని సీసపద్యంలో ఈ కఠోర నియమాలు లోతుగా వెళ్ళకపోతే కనబడవు. మొదటి పాదంలో అంతటా యతి వుంది. సరే, రెండోపాదం ప్రథమ దళంలో ప్రాసయతి, ద్వితీయదళంలో యతి కనబడుతున్నాయి. మూడవ పాదంలో తలకిందులుగా యతి, ప్రాసయతి వున్నాయి. నాలుగో పాదంలో మళ్ళా దాన్ని తారుమారు చేసి ప్రాస యతి, యతీ వున్నాయి. ఎత్తుగీతిలో మొదటి పాదంలో యతీ, మిగతా మూడు పాదాలలో ప్రాసయతి కనబడుతున్నాయి (షరా: ఎత్తుగీతి ఆఖరి పాదంలో భావిత - వరము అనే పదాలు ఉన్నాయి. పాఠాంతరముంటే అందులో ప్రాసయతి ఉండొచ్చు).

• నన్నయగారి సీస పద్యాలను విశ్లేషించి వారు పెట్టుకున్న నియమాలను గిడుగు సీతాపతిగారు 1922లో బేరీజు వేశారు. అందులోని నమూనాలన్నింటిని పరిశీలిస్తే ఒక ''మెథడ్'' కనబడుతుంది. ఈ సర్వదేవుని సీస పద్యాలలో కూడా ఒక ప్రణాళిక లేకపోలేదు. ఈ సీస పద్యంలో -

మొదటిపాదం
సర్వయతి
రెండోపాదం
ప్రాసయతి - యతి
మూడోపాదం
యతి - ప్రాసయతి
నాల్గోపాదం
ప్రాసయతి - యతి
ఎత్తుగీతి ఒకటో పాదం
యతి
రెండు మూడు పాదాలు
ప్రాసయతి
నాల్గోపాదం
యతి

అంటే సర్వదేవుడు కూడా కొన్ని నియమాలు పెట్టుకొనే సీసరచన చేశాడు. అందుచేత ఇది ప్రాచీనతర రచన కాదని కొట్టి పారెయ్యకూడదు. చాళుక్య భీముని ధర్మవరం శాసనంలో సీసపద్యంకన్నా ప్రాచీనమైనది ఒకటుంది. అది గుణగ విజయాదిత్యుని కందుకూరు శాసనంలో ఉంది (క్రీస్తుశకం 860). అయితే ఇది శిథిలమై సంపూర్ణ పాఠం దొరకదు. దొరికినంత మటుకు చూస్తే మొదటి పాదం రెండు దళాలలో యతి, రెండు మూడు పాదాల రెండు దళాలలోనూ ప్రాసయతి, మూడవ పాదంలో బహుశా రెండు దళాలలోనూ యతి కనబడుతున్నాయి. ఎత్తుగీతి రమారమి శిథిలమైంది.

జైన కవి

సర్వదేవుడు తన విరాట కావ్యంలోని సీసంలో ప్రాచీన సీసరచనా నియమాలకు దగ్గర్లోనే ఉన్నాడు. విశ్లేషించి చూడకుండా రచన ప్రాచీనతరం కాదని నిర్ణయించకూడదు.

లింగమగుంట సర్వకవి వైష్ణవుడైన శైవుడు కనుక అతడు జైన గ్రంథమైన ఆదిపురాణం రాయడానికి వీల్లేదు. అతడు శైవుడిగానే వుండి, అతని మనుమడు మాత్రం వైష్ణవుడయినా ఆ సంగతి ఈ నిర్ణయానికి అడ్డురాదు. శైవులు జైనులకు బద్ధ శత్రువులు. సర్వదేవుడనే జైన కవే ఆదిపురాణం కర్తని నిస్సందేహంగా చెప్పవచ్చు. అతని విరాటంలోని సీసపద్యంలోని ఛందో నియమాలు కూడా అతని ప్రాచీనతకు నిదర్శనాలు. సరే. సర్వదేవుడనే జైన కవి ఒకడున్నట్టు తేలుతుంది. అతడు ఎప్పటివాడు? ఎక్కడివాడు? తల్లితండ్రులెవరు? మొదలైన ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. సర్వదేవుడే పొన్నమయ్యగారని నేలటూరి వెంకట రమణయ్యగారు ఎన్నడో 1936లోనే సప్రామాణికంగా నిర్ణయించారు. తరువాత 1956లో కూడా కొంత పరిశోధన చేసి ఆ నిర్ణయాన్ని నిడుదవోలు వెంకటరావుగారు సమర్థించారు. తెలుగు ఆదిపురాణంలో సర్వదేవుడు వ్రాసిన కందపద్యం ఒకటి అజ్ఞాత సంకలనకర్త ఉదహరించాడు.

హరి నీలమణి విరాజిత
సురుచిర గోపురము రగిలిచూచిత మిస్రా
కరుడు విధుంతుద మండల
పరిశంకం జేసి పురము జనదోడున్ (ప్రబంధ రత్నావళి 8-463)

పంపకవి కన్నడంలో రచించిన ఆదిపురాణంలో సరిగ్గా ఇలాంటి పద్యమే వుంది.

శాళి హరి నీలమణికిర
ణాళి సొదర్దసెయ రాహగె త్తగిదిద్ద
టాళి గెగళల్లి నాదెయె
మాళీచంచెరను నడెవంది నపం
హరినీలమణిరాహువు (విధుంతుద)

మొదలైన శబ్దసామ్యాలను భావసామ్యాలను నిడుదవోలు వారు గమనించమన్నారు. తెలుగులో సర్వదేవునివి మూడే పద్యాలు దక్కాయి. అందులోని ఒక పద్యం కన్నడ సంబంధాన్ని చూపెట్టింది. పొన్నమయ్యగారికి ''హరినీల'' అనే పదంతో కందపద్యం రాయడం అలవాటే అని శాంతి పురాణంలోని ఇంకో రెండు కందపద్యాలు దాఖలా.
(2-97, 5-142)

తెలుగులో వెలసిన ఆదిపురాణం దొరికితే పొన్నమయ్యగారు మన ఆదికవి అవుతారు. లేకపోతే ఆదికవి అభ్యర్థిగా మిగులుతారు.

నన్నయగారికి ముందు కవులున్నారే తప్ప కావ్యాలు దొరకలేదన్న నమ్మకంతో సర్వదేవుణ్ణి సరిగ్గా అంచనా వేయకపోతే అది చరిత్రకే హాని.

మల్లియ రేచన

కన్నడ సాహిత్యంలో ఆదికవి పంపన్నగారూ, అతని తమ్ముడు జినవల్లభుడూ వేములవాడలో ఉంటున్న కాలంలోనే, క్రీ.శ. 940 ప్రాంతాలలో మల్లియ రేచన అనే తెలుగు కవి జీవిస్తూ ఉండేవాడు. అతడు కేవలం కవి మాత్రమే కాదు, కవి జనాశ్రయుడు. ఎందరో కవులను పోషించగలిగినంత శ్రీమంతుడు, శిష్టామరతరువు. పంపనగారు, జినవల్లభులలాగ ఇతడు కూడా జైనుడు. సాధారణ జైనుడు కాడు. శ్రావకాభరణుడు, జైనాగమాలూ, సమయతుష్యయాన్ని చదువుకొన్నవాడు. వాదీంద్ర చూడామణి శిష్యుడు. జినమత హితుడు. జగద్గీతకీర్తి.

ఆ రోజుల్లో సబ్బినాడులో ఎందరో సంస్కృత, కర్ణాటక భాషా కవులు ఉండేవారు. యశస్తిలక చంపు, నీతి వాక్యామృతం వంటి గ్రంథాలు రచించిన సోమదేవసూరిలాగ ఏ గ్రంథాలు చెప్పారోగాని తాటవీయ, విద్యారాశి, వ్యాఖ్యాని భట్టారక, పిచ్చనభట్ట మొదలైన సంస్కృత కవులు విలసిల్లిన కాలమదే. వారంతా రాజధాని నగరమైన వేములవాడలో మెలగినవారే. ఆ నగరంలో సర్వశాస్త్ర అభిజ్ఞుడూ, విమల యశోభాసుర చరితుడూ అయిన మల్లియ రేచనవల్ల ఉచిత సత్కారాలు పొందినా పొందకపోయినా అతడు సారప్రజ్ఞాంబోనిధి పురుషుడని విని ఉంటారు. వాళ్ళ కావ్యాలను మల్లియ రేచన ఆలకించి ఉండొచ్చు.

పంపనగారితో ఎటువంటి పరిచయముందో తెలియదుగాని వారి సవతి తమ్ముడైన జినవల్లభునితో మల్లియ రేచనకు ప్రగాఢమైన స్నేహబంధముంది. వాళ్ళిద్దరూ ప్రాణసమాన మిత్రులు. జినవల్లభుడు తాను వాగ్వధూవర వల్లభుడనని చెప్పుకొన్నాడు. ఇతడు సకల కళాప్రవీణుడు. భవ్య రత్నాకరుడు. గుణపక్షపాతి, చతుర కవిత్వ రచనలో సుప్రసిద్ధుడు. బహువిధముల కావ్యాలు రచించడంలోనూ, కవిత్వ తత్త్వం తెలుసుకొని విమర్శించడంలోనూ, సత్పురుషులకు విద్య నేర్పడంలో, శ్రావ్యంగా సంగీతం పాడడంలో, రాగయుక్తంగా చదవడంలో జినవల్లభునికి ఉన్న శక్తిసామర్థ్యాలు ఇలలో సాటిలేనివని తానే చెప్పుకొన్నాడు.

ప్రాణసమాన మిత్రులైన మల్లియ రేచనా, జినవల్లభుడూ తమ కాలంనాటి సాహిత్య వ్యవస్థ గురించి ఎన్నో విషయాలు చర్చించుకున్నారు. సంస్కృతంలోనూ, కన్నడంలోనూ కావ్యాలున్నాయి. లక్షణ గ్రంథాలున్నాయి. తెలుగులో కూడ సాహిత్య రచనలు లేకపోలేదు. పొన్నమయ్యగారు సర్వదేవుడనే తమ బిరుదు నామంతో తెలుగులో ఆదిపురాణం రచించాడు. శాసన కవులు వివిధ ఛందస్సులు వాడుతూ తెలుగు పద్యాలు రాస్తున్నారు. ముదిగొండి చాళుక్య నృపులలో ఒకడైన కుసుమాయుధుడు (క్రీ.శ. 870–895) పాలిస్తున్నప్పుడు శాసనాలలో చక్కని వచన రచనలు కూడా వెలువడుతున్నాయి. సంస్కృత, కర్ణాటక భాషలలో ఉన్నట్టే తెలుగులోకూడా ఒక లక్షణ గ్రంథం అవసరమని భావించారు.

మల్లియ రేచన తాను ఎలాగూ కవిజనాశ్రయుడు కనుక తన పేరనే 'కవిజనాశ్రయం' అనే ఛందోగ్రంథాన్ని రచించాలనుకున్నాడు. ఆ రచనలో తాను తోడ్పడుతానని జినవల్లభుడు చెప్పాడు. మల్లియ రేచనకు శ్రావకాభరణుడనే బిరుదు ఉన్నట్టే, జినవల్లభునికి వాచకాభరణుడనే బిరుదు ఉంది. ఇద్దరి తండ్రుల పేర్లూ భీమనలే. ఎటొచ్చీ రేచన మాత్రం భీమనాగ్రసుతుడు. జినవల్లభుడు పంపనగారి తమ్ముడు. తమ ఇద్దరి గురించే రేచన తన గ్రంథంలో మొదటనే ఇలా చెప్పాడు:

పరగిన విమల యశోభా
సురనిరతుడు భీమనాగ్రసుతు డఖిలకళా
పరిణతుడయ్యెను భూసుర
వరప్రసాదోచిత ధ్రువ శ్రీయుతుడై

ఈ పద్యం రేచన తన గురించే చెప్పుకొన్నాడని నికరంగా తేల్చడానికి గ్రంథంలో తనను తాను 'జన సుత భీమ తనూజా!' అని పిలుచుకొన్నాడు.[1] తాను 'వణిగ్వంశ చూడామణి' కాబట్టి తనకు భూసురవరాలు కావాలి. ఈ భూసురులు జైన బ్రాహ్మణులు. జైనంలో కూడా వర్ణాశ్రమ ధర్మాలు వచ్చి చోటు చేసుకున్నాయి.

తన గురించి చెప్పుకొన్నాక జినవల్లభుని గురించి, తన కావ్య రచన గురించి రేచన ఇలా చెప్పాడు:

అసమాన దానరవి తన
య సమానోన్నతుడు వాచకాభరణుడు ప్రా
ణ సమాన మిత్రు డీ కృతి
కి సహాయుడుగా నుదాత్త కీర్తి ప్రీతిన్.
అనవద్య కావ్యలక్షణ
మొనరుగా గవి జనాశ్రయుండు మల్లియ రే
చన సుకవి కవిజనాశ్రయ
మను ఛందము తెనుగుబాస నరుదుగ జెప్పెన్.

ఈ రెండు పద్యాలలోని విషయాలూ అక్షరసత్యాలు. ఈ ఛందం అనుపమైనదే, అపూర్వమైనదే. అంతదాకా తెలుగులో తెలుగు కవిత్వం గురించి ఛందోగ్రంథం చెప్పలేదు. జినవల్లభుడు నిజంగా అపర దానకర్ణుడే. అతడు కుర్క్యాల గ్రామం దగ్గరున్న బొమ్మల గుట్టమీద ఇరవై నలుగురు జైనతీర్థంకరులలో ఆద్యంత జినుల బింబాలను, చక్రేశ్వరదేవి మూర్తినీ చెక్కింపించాడు. త్రిభువన తిలకమనే దేవాలయాన్ని కట్టించాడు. తన అన్నగారైన

1. జననుత భీమ తనూజా!
సున యార్జిత విభవ తేజ! సుభగమనోజా
వినుత విశిష్ట సమాజా
యన నంత్యాప్రాసమగు నహర్పతి తేజా (కవిజనాశ్రయము, సంజ్ఞాభిషేకం)

పంపనగారి పేరిట కవితా గుణార్ణవమనే చెరువును తవ్వించాడు, మదన విలాసమనే వనాన్ని నిర్మించాడు. ఈ దానాలన్నింటినీ వివరిస్తూ ఆ బొమ్మల గుట్టమీదనే చాలా పెద్ద శాసనాన్ని చెక్కించాడు.[2] ఇది అరుదయిన శాసనమే. ఇందులో సంస్కృతాంధ్ర కర్ణాటక భాషలలో గద్యపద్యాలున్నాయి. ఈ శాసనంలోనే తనకు 'వాచకా భరణుడ'నే బిరుదున్న సంగతిని జినవల్లభుడు ఇలా చెప్పుకొన్నాడు.

అజస్ర జినవందనా గత మునీశ్వర శ్రావక ప్రజా స్తవ
రవ ప్రతిధ్వనిత శబ్ద కోలాహలైః
అధిష్ఠిత దిగంబరో వృషభశైల ఏష స్వయం
పరం వదతి వాచకాభరణ కీర్తి మాకలతః

ఈ సంస్కృత శ్లోకంలో తనకున్న వాచకాభరణుడన్న బిరుదును చెప్పుకొంటే మూడు తెలుగు కంద పద్యాలలో తన దానధర్మాల సంగతి ఈ శాసనంలోనే ఇలా చెప్పుకొన్నాడు.

జిన భావనము లెత్తించుట
జిన పూజల్ సేయుచున్న జినమునులకు న
త్తిన యన్న దానమీవుట
జినవల్లభు బోలగలరె జిన ధర్మపరుల్

దినకరు సరి వెల్గుదుమని
జినవల్లభు నొట్టు నెత్తు జిత కవిననకున్
మనుజుల్ గలరే ధాత్రిన్
విను తిచ్చుదునని యవృత విబుధ కవీంద్రుల్.

ఒక్కొక్క గుణము కల్గుదు
రొక్కటగా కొక్క లక్క లేరెవ్వరికిన్
లెక్కింప నొక్క లక్కకు
మిక్కిలి గుణ పక్షపాతి గుణ మణి గణముల్.

ఈ మూడు కంద పద్యాలనూ చెప్తున్నప్పుడు జినవల్లభుడు తాను తెలుగు పద్యాలను చెప్తున్నానని మొదట్లో జాగ్రత్తపడ్డాడు. తెలుగు కవితా సంప్రదాయాలను పాటిస్తూ యతిప్రాసలను కరెక్టుగా పాటించాడు. తీరా చివర పద్యం చెప్తున్నప్పుడు ఆ సంగతి మరచిపోయి కన్నడ కంద పద్యంలోలాగ ఒక్క ప్రాసనే పాటించాడుగాని యతిని విస్మరించాడు. కన్నడంలో యతి పట్టింపు లేదు. తెలుగులో రెండూ తప్పనిసరిగా ఉండాలి. అందుకే మల్లియ రేచన ఇలా లక్షణం చెప్పాడు.

2. ఇన్‌స్క్రిప్షన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ - కరీంనగర్ డిస్ట్రిక్ట్స్, సంపాదకుడు పి.వి. పరబ్రహ్మశాస్త్రి, పుట 10 నుండి.

విలస త్పాదా ద్యక్షర
ములు వళ్ళగున్ ద్వితీయములు ప్రావళ్ళున్
నెలకొని తమ తమ పాదం
బుల యతి పై నన్న పాదముల వ్రాలదురున్

ఈ వళ్ళలో స్వరవళ్ళూ, వర్గవళ్ళూ, సరసవళ్ళూ, ఎక్కటివళ్ళూ అనే నాలుగు రకాలున్నాయని రేచన విశ్లేషించి చెప్పాడు. ఏ లక్షణకర్తయినా సరే తనకు పూర్వులు చెప్పిన వాటిని లక్ష్యాలుగా తీసుకొని వాటిలోని సంప్రదాయాలను లక్షణాలుగా చెప్తాడు. మల్లియ రేచన అందుకే 'పూర్వశాస్త్రోక్త విధి'ని ఈ వళ్ల గురించి చెప్పాడు. తాను ఏయే పూర్వశాస్త్రాలు చూశాడో గాని రెండింటి పేర్లే సందర్భాన్నిబట్టి ఇలా చెప్పాడు.

అర్థసమ వృత్తాధికారంలో ఇలా చెప్పాడు.

ఇప్పాట దొల్లి పింగళాఖ
చెప్పిన క్రియ దప్పకుండ జెలువలరంగా
జెప్పబడి వళ్ళు ప్రాసలు
తప్పక యర్థ సమ వృత్త తతి విదితము గాన్

తెలుగు ఛందో గ్రంథాలలో కవిజనాశ్రయం మొట్టమొదటిదైతే, భారతీయ ఛందో గ్రంథాలన్నింటిలో 'పింగళచ్ఛందమే' ప్రథమమైనది. ఇది సంస్కృతంలో వైదిక, లౌకిక వాఙ్మయాల ఛందస్సులను సూత్రీకరించి చెప్తుంది. ఈ సూత్రాలకు హలాయుధభట్టు తన వార్తికాన్ని రచించారు. అత్యంత ప్రాచీనమైన పింగళచ్ఛందం మొదలుకొని ఎన్నో లక్షణ గ్రంథాలను మల్లియ రేచన చూసి ఉంటాడు. దోషాధికారంలో ఇంకో ప్రామాణికుని పేర్కొన్నాడు.

జయదేవాదిచ్ఛందో
నయమున సంక్షేపరూపునం జెలువుగ మ
ల్లియ రేచన సుకవిజనా
శ్రయుడీ ఛందంబు జెప్పె జనులకు దెలియన్

ఈ పద్యంలో రేచన పేర్కొన్న జయదేవుడు ఏ జయదేవుడో తెలియదు. సంస్కృత సాహిత్యంలో ముగ్గురు జయదేవులు కనబడుతున్నారు. ప్రసన్న రాఘవ నాటకకర్తగా ఒక జయదేవుడు, శృంగార మాధవీయ చంపూ ప్రణీత అయిన ఇంకొక జయదేవుడు, సుప్రసిద్ధమైన గీతగోవిందాన్ని అష్టపదులుగా రచించిన మరొక జయదేవుడూ ఉన్నారు. ఈ చివరి జయదేవుడే చంద్రాలోకం, రతిమంజరి, తత్త్వ చింతామణి, కారకవాదములనే గ్రంథాలు కూడా చేశాడు. అయితే ఇతడు రేచనకు బాగా అర్వాచీనుడు. ఛందో గ్రంథం చెప్పిన జయదేవుడెవరూ కనబడడు. మరి రేచన ఎందుకు చెప్పాడు?

తెలుగులో ఛందో గ్రంథాలను రచించిన వారిలో రమారమి కట్టకడపటివాడు కస్తూరి రంగయ్య (క్రీ.శ.1740-50). తన ఆనంద రంగరాట్ఛందంలో ప్రాచీన ఛందో గ్రంథకర్తలను ఇలా పేర్కొన్నాడు.

చను నుత్తమ గండా థా
ర్వణ హనుమదనంత సుకవి రాక్షస జయదే
వనుత శ్రీధర గోక
ర్ణ నీల కంఠాది భీమన ఛ్ఛందంబుల్ (1-6)

ఈ గ్రంథకర్తలలో చాలామంది రేచనకు అర్వాచీనులే. అందుచేత రేచన పేర్కొన్న జయదేవాదులలో ఆద్యులు ఎవరో ప్రస్తుతానికి తేలని సంగతే. లభ్యమవుతున్న ఛందో గ్రంథాలలో కవిజనాశ్రయమే ప్రాచీనతమమైనది. కస్తూరి రంగయ్య మల్లియ రేచననూ, కవిజనాశ్రయాన్ని బొత్తిగా పేర్కొననట్టే ఈ ఉదాహృత పద్యంవల్ల తోచవచ్చునుగాని, భీమనచ్ఛందం అన్నమాట పూర్తిగా కవిజనాశ్రయానికే వర్తిస్తుంది. మన సాహిత్యంలో తర్వాతి లాక్షణికులు అనంతుడు, విన్నకోట పెద్దన్న, వెల్లంకి తాతంభట్టు, లింగమగుంట తిమ్మన, అప్పకవి, కస్తూరి రంగకవి మొదలైన వాళ్ళందరూ ఈ కవిజనాశ్రయాన్ని చదవినవాళ్ళే. ఇందులోని పద్యాలకు పద్యాలు వాడుకొన్నవాళ్ళే. ఈ గ్రంథం ఇంత ప్రాచీనమైనా, ఇంత ప్రశస్తమైనా దీని రచయిత ఎవరో తేల్చలేని పరిస్థితి ఆ లాక్షణికులవల్ల తెలుగు భాషలో ఏర్పడటం శోచనీయం.

ఈ దుస్థితికి కారణమేమిటి? తరువాత లాక్షణికులెవరూ రచయితగా రేచన పేరు ఎందుకు తలచలేదు? కవిజనాశ్రయంలో కనీసం వందసార్లు ఈ పేరు వస్తుంది. అయినా, అతనికి చెయ్యెత్తి దండం పెట్టలేదు. అనాదిగా 'భీమన ఛంద'మనే మారుపేరుతో కవిజనాశ్రయం చలామణీ అవుతూ వచ్చింది. వేములవాడ భీమకవిని లాక్షణికునిగా చాలామంది నుతించారు. కాని భీమనఛందమనేది ప్రత్యేకంగా ఏదీ దొరకలేదు. ప్రాచీనుడైన భీమకవి తనంత ప్రాచీనమైన కవిజనాశ్రయం వ్రాసే ఉంటాడని నమ్మడానికి కొంత ఆస్కారం అప్పకవి (క్రీ.శ. 1656) మాటలవల్ల కలిగింది.

గ్రంథాదిని మగణం ఉంటే మంచిదని చెప్తూ ''భారతమునందు శ్రీవాణీ గిరిజా'యని శబ్దశాసనుడును, కవిజనాశ్రయమునందు 'శ్రీకాంతా'యని వేములవాడ భీమకవియును... మొదల గదియించిరి'' అంటూ అప్పకవి వ్రాశాడు. అయితే చారిత్రక సత్యాలకూ, అప్పకవికీ సగమెరుక. ఇదే అప్పకవి నన్నయగారి ఆంధ్రశబ్ద చింతామణిని వేములవాడ భీమకవి గోదావరిలో కలిపేశాడంటూ, అది 500 సంవత్సరాలు అజ్ఞాతవాసం చేసి, సారంగధరుని దయవల్ల తరువాత అవతరించిందంటూ అభూత కల్పనలు వ్రాశాడు. ఈ అప్పకవి దృష్టిలో బ్రాహ్మణుడు తప్ప ఇంకెవడూ పుస్తకం వ్రాయడానికి వీల్లేదు. ఖండించడానికి ఇతడు బ్రాహ్మణేతరుని పద్యాలను లక్ష్యాలుగా స్వీకరించాడు. అప్పకవి దృక్పథం అంతో, ఇంతో అతని ముందు వాళ్ళకూ, తరువాత వాళ్ళకూ లేకపోలేదు.

రేచన బ్రాహ్మణుడు కాడు; వైశ్యుడు. పోనీ, వైదిక భక్తితత్పరుడు కూడా కాదు. జైన మతస్థుడు. కాబట్టి ఇతనికి పెద్దపీట వేయవలసిన అవసరం మనవాళ్ళకు కలగలేదు. వేములవాడ భీమకవి పనిగట్టుకొని డబ్బుకోసం రేచన వ్రాసినట్టు ఈ పుస్తకం వ్రాశాడని ప్రచారం చేశారు.

''వేములవాడను వెలసిన
భీమేశ్వరు కరుణగల్గు భీసుకవి నే
గోమటి రేచన మీదను
నీ మహి గవులెన్న ఛంద మెలమి రచింతున్.''

అని భీమకవి అవతారికలో వ్రాశాడని కల్పించి కవిజనాశ్రయంలో అతికించారు. మరి ఆ పుస్తకంలో రచయిత తన్ను తాను శతాధికంగా సంబోధించుకోవడం ఉంటుంది కదా, దానికేం దారి? అందుచేత ఇంకొక పద్యం ఉత్పత్తి చేశారు.

''నిను నీవె పొగడు వైఖరి
నొనరించెద దెనుగుబాస నొప్పగ ఛందం
బును గనక కవిత చెప్పిన
వినవే లచ్చనము వాడు వెంగలిరేచా!''

అని భీమన చెప్పాడట. దీనిని రేచన చెప్పనిచ్చాడా? 'వెంగలి' అనే మాటకు మూర్ఖుడు, అవివేకి, వెర్రివాడు, అమాయకుడు, మూఢుడు, జడుడు అనే అర్థాలున్నాయని కూడా అతనికి తెలియదా? విద్యాగంధం లేకపోవచ్చుగాని పల్లెటూళ్ళో కిరాణాకొట్టు పెట్టుకొనే కోమటికి గూడా 'వెంగలి' అన్నది తిట్టు అని తెలుస్తుందే! రేచనకు అర్థం తెలియక తల ఊపి భీమకవికి డబ్బు ఇచ్చి ఇలా వ్రాయించుకొన్నాడా? వశ్యవాక్కు, శాపానుగ్రహదక్షత ఉన్నవాడూనని నమ్ముతున్న వేములవాడ భీమకవికే డబ్బు కక్కుర్తిని అంటగట్టడానికి మనవాళ్ళు వెనుతీయలేదు. ఇంతకూ వేములవాడ భీమకవి రేచనకు చాలా అర్వాచీనుడు.

అందుకే ఈ పద్యాలు ప్రక్షిప్తాలని చాలామంది విశ్వసిస్తారు. అయినా కవితా వైఖరినిబట్టి ఈ అవతారిక ప్రక్షిప్తం కాదనియే నమ్మిన జయంతి రామయ్య పంతులుగారిని ఏమనగలం? వారు ఆంధ్ర సాహిత్య పరిషత్తు తరపున కవి జనాశ్రయాన్ని వేములవాడ భీమకవి కృతిగా 1917లో తొలిసారి అచ్చు వేయించారు. లాక్షణిక లోకంలో చిరకాలం నుంచి ఇదే అభిప్రాయం చలామణీ అవుతున్నది. కాబట్టి అలా చేశారనుకోవాలి.

ఈ ప్రవాదనను పక్కకుపెట్టి, గ్రంథంలోని అంతస్సాక్ష్యాన్నిబట్టి కృతికర్త గురించి ఇంకా వివరంగా తెలుసుకొందాం.

కవిజనాశ్రయ రచన ప్రారంభించేనాటికి తెలుగులో ఎన్ని కావ్యాలున్నాయో తెలియదుగానీ, తెలుగు కవులు ఒక విలక్షణమైన ఛందోరీతిని అనుసరించేవారు.

కన్నడానికీ, తెలుగుకూ సంస్కృత, ఛందో గ్రంథాలే మార్గసంప్రదాయానుసరణకు మార్గాలు. అయితే ఉపగణాల పరిగణనలో తెలుగువారిది ప్రత్యేక విధానం. పింగళ చ్ఛందం ప్రకారం ఏర్పడే అక్షరగణాలలో నేడు అందరికీ నోటికి వచ్చే 'య మా తా రా జ భా న స' అనే అష్ట గణ పరిగణన సర్వసామాన్యమేగాని సంస్కృతంలో లేకుండా కన్నడ, తెలుగు ఛందస్సులలోనే కనబడే ఉపగణాలలో రెండు భాషలూ రెండు భిన్న పద్ధతులను అనుసరిస్తాయి. కన్నడంలో బ్రహ్మ, విష్ణు, రుద్ర గణాలనే మూడు పేర్లతో ఇరవై ఎనిమిది ఉపగణాలను లెక్కిస్తారు. తెలుగువారు సూర్య, ఇంద్ర చంద్రగణాలనే మువ్వరుస కేటాయింపులో కేవలం ఇరవై రెండు ఉపగణాలనే లెక్కలోనికి తీసుకొంటారు.

మల్లియ రేచన తన కవిజనాశ్రయంలో ఇంద్ర, సూర్య, చంద్రగణాలనే ఈ క్రిందివిధంగా చెప్పారు.

భరత నగ నల సలంబులు
వరుసనె యియ్యారు నెన్న వాసవ గణముల్
మరి నహము విన గణంబులు
సరవిం దక్కినవి యెల్ల జంద్ర గణంబుల్.

తెలుగువారికి విలక్షణమైన ఈ ఉపగణ విధానాన్ని చెప్పడంచేత అప్పటికే తెలుగు కవులు అనుసరిస్తున్న ఒక విలక్షణమైన సంప్రదాయాన్ని రేచన చెప్పాడని భావించాలి. తెలుగు కవిత్వం కేవలం శాసనాలలో పద్య రచనకే పరిమితం కాలేదనీ, కావ్యరచన సాగుతూ ఉండేదనీ చెప్పవచ్చు. అయితే అనవద్య కావ్య లక్షణాలను చెప్పే గ్రంథం లేనందువల్ల రేచన ఒక ఛందోగ్రంథాన్ని రచించవలసి వచ్చింది. సత్కావ్యాన్ని చెప్పే కవులు పొందరాని వస్తువులేవీ ఉండవు. కావ్యమంటే ఏమిటి?

కమనీయ సమస్త కళా
గమములకును జన్మభూమి కావ్యము! కావ్యా
గమ విదుడు సర్వ విదుడని
సమయ చతుష్టయమునందు జదివిరి మోదలన్.

శ్రుతులు, శ్రుత్యంతాలు, రాద్ధాంతాలూ, సిద్ధాంతాలూ అనే నాలుగింటినీ సమయ చతుష్టయమంటారు. ఈ శాస్త్రార్థ సరణిని చెప్పే కవిత్వ తత్త్వము భూమండలంలో పూజింపదగ్గది. అయితే లక్షణాలు తెలియని కవి చేసే రచనలు గుడ్డివాడు, గుడ్డి గుర్రాన్ని ఎక్కి స్వారి వెడలినంత హాస్యాస్పదంగా ఉంటుంది. సత్కృతికి ఉదాత్త ఫలమూ, కీర్తీ వస్తాయి.

గద్యకావ్యాలూ, పద్యకావ్యాలూ అని కావ్యాలు రెండు రకాలు. ఆనాడు సబ్బినాడులో గద్యకావ్యాలు గూడా ఉండేవి కాబోలు. అందుచే రేచన ఇలాగ లక్షణం చెప్పాడు.

హృద్యాన వద్యకావ్యము
గద్యము పద్యమని చెప్పగ ద్వివిధమగున్
గద్యమ పార పదనిక
రద్యోతి తనవ రసార్ధ రచనల నెగడున్.

ఆనాడు గద్య కావ్య రచన ప్రచారంలో ఉండకపోతే రేచనకు రెండు తరాల పూర్వమే చాళుక్య భీముని 'కొరివి' (నల్గొండ జిల్లా) శాసనంలో ఎంచక్కటి గద్య కుసుమాలు ఇంతగా వికసించవు. శాసన పాఠాన్ని చూడండి.

''శ్రీ విక్రమాదిత్య నృపాగ్రతనయుడైన చాళుక్యభీముడు, శౌచ కందర్పునకు వేంగీశ్వరునకు రణమర్ధనృయకులతిలకుండైన కుసుమాయుధుండు గన్నర బల్లహున కస్త ప్రాప్తంబైన రణమర్ధకంఠియ దనభుజ వీర్య బలపరాక్రమంబునం హెచ్చి కంఠియగట్టి, పట్టంబెత్తి ఖడ్గసహాయుడై నేలయెల్లం గావంబూని మంచికొండనాడా దిగ వేంగీదేశము విష్ణువర్ధనుతో నర్ధరాజ్యంబు సేయుచున్న కుసుమాయుధు పెద్దకొడుకనేక రిపునృపతి మణిమకుట మకరికా.... మసృణిత... గల కలావర్తండు రాజ్యంబు సేయుచు నిష్ఠ విషయకామ భోగంబు లనుభవించుచు సుఖంబునుండి యొక్కనాడు.

''కొరవి నల్ల జెరయ కొడుకు పెద్దన (ను) కావించి ''నీవు నా ప్రాణ సమానుండవైన చెలివి' నీ చేసిన యుపకారంబునకూ బ్రత్యుపకారంబు సేయవలయు నీకేమి వలయుం? దాని వేండి కొమ్మన్న... శ్రీ నాకెల్లం గలదేమి లేకున్న వేండికొండుమయిననుం బరోపకారంబు పొంది... కొరవియున్న భీముడు సల్కాల కులసనపడినిగెల్చి శ్రీనిరవద్యుండనేక సమరసంఘట్టన భుజాపి భాసురుండై తమయన్న రాజ్యశ్రీల కెల్లన్దాన యర్హుండై చేకొనినిల్పి భీమ సల్కికేయన్ ధనకనకవస్తు వాహనోత్సవంబుల్ తమయన్న గొణగయ్య చేసిన ధార్మువులు...

(తెలంగాణా శాసనాలు 1వ సంపుటి. పుట 163)

ఈ శాసనంలో చెప్పిన చాళుక్యభీముడు క్రీ.శ. 892లో పట్టంకట్టుకొన్నాడు. శాసనకాలం మహా అయితే మరో ఏడాది తర్వాతది కావచ్చు. అందుచేత మల్లియ రేచనకు రెండు తరాల పూర్వమే చక్కని వచన రచన తెలుగులో జరుగుతూ ఉండేదని కచ్చితంగా చెప్పవచ్చు.

కన్నడ భాషలో గద్య రచన రేచన సమకాలికులే చేస్తూ ఉండేవారు. క్రీ.శ. 920 ప్రాంతాలలో శివకోట్యాచార్యుడనే జైనుడు ''వడ్డారాధనే'' అనే కన్నడ గద్య గ్రంథాన్ని రచించాడు. ఇందులో పంధొమ్మిదిమంది జైన మునుల కథలు కథనం చేశాడు. ఇందులోని భాష కన్నడం. శైలి సంస్కృత, కన్నడాల మిశ్రమం. దొరికినంత వరకు కన్నడ సాహిత్యంలో ఇదే మొదటి గద్యకావ్యం. నిజానికి ఆ భాషలో మొట్టమొదటి సాహిత్య కృషి కూడా అదే అని చరిత్రకారులు చెప్తారు. నృపతుంగుని కాలంలో వెలువడిన 'కవిరాజ మార్గం' లక్షణగ్రంథం మాత్రమే.

అయితే క్రీ.శ. 815-877 మధ్యకాలంలోని కవిరాజ మార్గంలోనే గద్య కావ్య లక్షణం సమ సంస్కృత గద్య కావ్యాల విషయం చెప్పారు.

పద పాద నియత నియమాస్పదమల్ల దళం కృతం, క్రియకారక దోళ్
పుదిదర్థ వ్యక్తియనే పుదు 'గద్యో' మనేక రూపభేద విభక్తం. (1-25)

కన్నడ గద్య కథా వాఙ్మయంలో ప్రకటతర వస్తు విస్తరమూ, పండిత ప్రియము, గద్య పద్య మిశ్రితమైన మార్గ మహాకావ్య లక్షణాలుంటాయని వేత్తలు చెప్పారు. చంపూ కావ్యాలలో నిరతిశయ వస్తు విస్తరము ఉంటుంది. మల్లియ రేచనను ఆశ్రయించుకొన్న కవులు చాలామంది వస్తుకవులే. తాను వస్తుకవి జనాశ్రయుడనని తేటగీతి లక్ష్యంలో చెప్పుకొన్నాడు. ఆనాడు వస్తు కవితను అందరూ ఉద్ధృతంగా చెప్పేవారు కాబోలు. దీని ప్రభావం తర్వాత తరాలపై కూడా చాలా ఉంది.

మల్లియ రేచనకు రెండు తరాలర్వాచీనుడు నాగవర్మ అనే కవి క్రీ.శ. 990 ప్రాంతాలలో ఉండేవాడు. ఇతడు కూడ పంపనగారి పూర్వులలాగే వేంగీ మండలం వంగిపఱ్రునుండి వచ్చిన తెలుగువాడే. రాజభాష అయిన కన్నడంలో కావ్యాలు చెప్పిన ఘటికుడే. ఈ నాగవర్మ బాణుని కాదంబరిని కన్నడ చంపూ కావ్యంగా రచించాడు. అందులో ఒకచోట ఇది వస్తు బంధం అని చెప్పాడు.

ఇదుచోద్యం కవిహృద్గతం నవరసం నిర్దోషమెందీగళా
దదు కాదంబరి సేవ్యమాడు దనితుం తానెయ్దె భూభాగదోళ్
ఉదిత శ్రీకవి నాగవర్మనవచస్పందోహదిం దోషమం
దదలంకారద వస్తు బంధ మిదు తానెం మూడదేంగెయ్యదో [3]

వస్తు కవితను చెప్పే ఈ నాగవర్మ కవిజనాశ్రయాన్ని చదివే ఉంటాడు. అది ఇచ్చిన ఉత్తేజంతో కన్నడ ఛందోగ్రంథం ఒకటి రచించదలచాడు. ఛందోంబుధి అనే పేరుతో ఒకటి రాశాడు. రేచనలాగే తానూ జయదేవాద్యర ఛందోద్యయ ప్రయోగాలు చూశానన్నాడు. అయితే రేచన పేరు ఎత్తలేదు. ఈ నాగవర్మ జైనుడు కాదు. వేదమతానుయాయి అయిన బ్రాహ్మణుడు. ఇతడు ఒక విలక్షణమైన పని చేశాడు. సర్వసాధారణముగా కవులు తమ కృతులను రాజులకో, ఇష్టదైవాలకో అంకితమిస్తారు. నాగవర్మ మాత్రం ఛందోంబుధిని తన భార్యకే అంకితం చేశాడు. ''నాగవర్మ యంకిత పద్ధతి యత్యంతము ప్రశంసనీయము'' అని చెప్తూ నిడుదవోలు వెంకటరావుగారు ఇంకా ఇలా వివరించారు.[4] ఆయా ఘట్టములలో నామెను సంబోధించునపుడు నాగవర్మ వాడిన విధుచింతానన, విభీతేక్షణ, మదవతి, అంబరుహాలోలనయన, వ్యాలోలనీలాలక మొదలగు సంబోధన లీనాటి వారికి వింతగ దోచవచ్చునుగాని యంతకన్న విడ్డూరములగు సంబోధనలున్నవి.

3. దక్షిణ భారత సాహిత్యములు - 1962, పుట 72
4. ఆంధ్ర కర్ణాట సారస్వతములు - పరస్పర ప్రభావాలు - పుట 39.

స్రగ్ధరా, మహాస్రగ్ధరా సంబోధనలు - నాలుగు పాదములలో ఇంచుమించు రెండు పాదములు -

స్రగ్ధరా - శ్యామే రామాభిరామ గురుక్కుచ యుగళీ మల్లికాచారు పుష్పోద్దామ ప్రోద్ధామకేశాన్విత బగెవసరిం స్రగ్ధరానామ వృత్తం

రెండవ పాదాంతము -

మహాస్రగ్ధర... మహాస్రగ్ధరా నామ వృత్తం
గురువృత్తోత్తుంగ వక్షోరుహ భరవిలసన్మధ్య రేఖావిలాస
స్ఫురిత ప్రోద్ధామ కాంచీ ఘనమణి నితంబస్థలా భోగభారే

ఇట్టి సంబోధనలానాడునూ వాడుకలో నుండి నుండవుగాని కావ్యములందున్న వని తలంపవచ్చును.''

తన భార్యను సంబోధిస్తూ ఛందో గ్రంథం చెప్పాలన్న ఉద్దేశం, బహుశా నాగవర్మకు కవిజనాశ్రయం చదివాకనే స్ఫురించి ఉండవచ్చు. రేచన తన కృతిలో తనను తాను సంబోధించుకొంటూ రమారమి అన్ని పద్యాలూ చెప్పాడు. ఆ సంబోధనలలో కూడా 'కమలాధీశా' (1-72). శ్రీ రమణీ ప్రియా (2-103), శ్రీ తన్వీ ప్రముదితచిత్తా!! (2-135). శ్రీ దయతాదిపా (3-20) మొదలైనవీ ఉన్నాయి. స్వీయ విషయ సూచనకు కమలాధీశుడు (2-132); శ్రీదేవీపతి (5-27), శ్రీ సమేతుడు (3-16), శ్రీ నారీప్రియకరుడు (4-1) మొదలైన ప్రయోగాలు కనబడతాయి. బహుశా మల్లియ రేచన భార్య పేరో, ఇష్టపత్ని పేరో కమలగానీ, శ్రీదేవిగాని కావచ్చు. అయితే ఈ కవిజనాశ్రయుడు దక్షిణ నాయకుడు మాత్రమే కాదు, శృంగార శేఖరుడు.

తన విశేషణాలలో పాండిత్యం తరువాత రూపం గురించి చెప్పుకొన్నది ఎక్కువ. సుగుణ సుందర తరుణీస్మర విభుడు, వారస్త్రీ సంసేవ్య వక్షుడు, సుందరీవశ్య విద్యామణీ, కుచభారనమ్ర వధూముఖాం భోజ భాస్కరుడు, అనంగ సన్నిభాంగుడు, మానినీ కామనిభుడు మొదలైనవి ఇతని రాసిక్యతను తెలియచేస్తున్నాయి. కృతి రచనలో రేచనకు సాయపడిన జినవల్లభుడు కూడా ఏం తక్కువ తినలేదు, తన వైనాలను 'బొమ్మలగుట్ట' శాసనంలో ఇలా చెక్కించుకున్నాడు.

గీతంగాతు మనేక భేద సుభగం కావ్యాని సోచా వచం
వాచా వాచాయితుం ప్రియాణి వదితుం సాద్ధాప్యకర్తుం సతాం
భోగాన్సేవితు మంగనారమ యితుం పూజాం విధాతుం జినే
జానీతే జినవల్లభుః పరమిదం పంపాభిధానానుజః ।

ఈ శ్లోకంలో 'అంగనా రమయితుం' అన్న ప్రశంస గమనించదగ్గది. కవిజనాశ్రయాన్ని రచించిన శ్రావకాభరణుడూ, దానికి సహాయం చేసిన వాచకాభరణుడు మతంవల్ల జైనులైనా మోక్షానికి ముందు మెట్టుమీద ఎక్కువసేపు నిలబడిపోయిన భవ్యులలాగ కనబడతారు.

జైనులను భవ్యులంటారు. జినవల్లభుడు తన శాసనంలో తాను భవ్యరత్నాకరుడనని చెప్పుకొన్నాడు. జైన సమూహాలను భవ్య జనత అన్నాడు. కన్నడ శాసనాలలో ఈ పదం రూఢి అయింది. హంపీ నగరాన్ని బుక్కరాయలు స్థాపించు కున్నప్పుడు అక్కడ వైష్ణవులకూ, జైనులకూ చాలా వివాదాలు ఏర్పడ్డాయి. భవ్యులను భక్తులు దారుణంగా, అన్యాయంగా చంపేస్తున్నారని బుక్కరాయలకు జైనులు మొరపెట్టుకున్నారు. వాళ్ళ వివాదాన్ని సామరస్యంతో అతడు పరిష్కరించాడు (చూ॥ ఎపిగ్రాఫియా కర్ణాటికా 9వ సంపుటం మాగడి తాలూకా 18వ శాసనం). విజయనగర నిర్మాణ కాలంలో కూడా జైనులు అధిక సంఖ్యలో ఉండేవారు. దేశమేలే రాజులూ, సైన్యాలను నడిపే సేనానులూ భక్తులకు ఆలయాలు కట్టించారు.[5] ఆయుధోప జీవులైన సైనిక ప్రముఖులు అహింసను బోధించడం, ఆచరించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమే. కవిజనాశ్రయకర్త గంటంతో పాటు ఖడ్గంకూడా పట్టినవాడే.

మల్లియ రేచన మంచి పరాక్రమశాలి. కనుక ఇంత 'సుందరీవశ్య విద్య' అలవరచుకొన్న వాడనుకోవాలి. ప్రహరణ కుశలుడు, ఆనతారి, మృగేంద్రోద్య చ్ఛౌర్యుడు, అమిత సాహసుడు, మందరభూభృత్సమానుడు అనే పదాలు ఇతని శౌర్యాన్ని చెప్తున్నాయి. ఇతడు బహుశా చిలుకూరి వీరభద్రరావుగారు చెప్పినట్లు సేనానీ కావచ్చు. లేకపోతే ప్రహరణ కౌశలానికి ఆస్కారముండదు; ఆనతారి అవడానికి వీలుండదు.

ఒకవేళ ఇతడు వణిగ్వంశ చూడామణి కనుక, కులవృత్తి అయిన వ్యాపారమే చేసినా పెద్ద పెద్ద సార్థవాహులను, బిడారులను నడిపి వుంటాడు. దారి దోపిళ్ళు విచ్చలవిడిగా జరిగే ఆ కాలంలో వ్యాపారానికైనా మంచి సాహసముండాలి.

అతని సాహసాన్ని తెలియజేసే విషయాలు మనకు లభించవుగాని సాహిత్య సంప్రదాయాన్ని తెలుసుకోవడానికి ఆధారాలున్నాయి. ఇవాళ మనం అరసున్నా లున్నాయని భావించే పదాలను కొన్నింటిని నిండు సున్నాలతో ప్రాసస్థానంలో ప్రయోగించారు. ఉదాహరణకు ఈ పద్యం చూడండి.

''మూండు సేసిన గణములు రెండు నలములు
మూండి నగణములును మొగినహంబు
పోండిగాగ నర్థమున కగు మీద ని
ట్లుండ జెప్పవలయు నొగి ప్రగీతి.''

ఈ ప్రగీతి అనేది దేశి కవితలకు చెందిన జాతులలోనిది. మల్లియ రేచడు తన కాలంలో వుండే కవితలనూ, దేశ కవితలనూ బాగా పరిశీలించాడని తెలుస్తున్నది. తన

5. Social and Political Life in VIZAYANAGARA EMPIRE by B.A. SALATORE Vol. 103

కాలంలో పాటలు ప్రచారంలో వుండి అందులో తాళంకోసం మాటల హ్రస్వాలను దీర్ఘం చేయడం అతను గమనించి వుంటాడు. అందుకే దోషాధికారంలో-

''వెలయగ జెఱాకు విలుగొని
యలరమ్ముల జేతబట్టి యంగజుడు విరా
హుల నేయు నేర్పుకడిమిన్
దొలమెలయగ ననిన గాకు దోషంబయ్యెన్.

అని చెప్పాడు. 'చెఱాకు విల్లు' 'విరాహుల' అనకూడదన్నాడు. అప్పుడు శృంగార గేయాలు ప్రచారంలో ఉండేవా? జైనులు వ్రాసిన లెక్కల పుస్తకాలలో సైతం శృంగార ముందని, మహావీరాచార్యులవారు వ్రాసిన సారసంగ్రహ గణితంలోని శ్లోకాలను చూస్తే తెలుస్తుంది.

మల్లియ రేచడు తాను శ్రావకాభరణుడనని అడుగడుగునా చెప్పుకొన్నా జైనమత ప్రసక్తి ఉదాహరణలుగా రెండు చోట్లనే చెప్పాడు. దోషాధికారంలో -

''ఘనదండ కాష్ట కృష్ణా
జినములు సొగయింపనొక్క జినముని చనుదెం
చెననగ సమయ విరోధం
బని కవులకు జెప్ప కవిజనాశ్రయుడొనరన్.
జిననుత ధర్మ మహింసయ
యను మతమున వితతముగ గజాసురు బాపం
బని చంపడయ్యె నీశ్వరు
డన నిది యాగమ విరోధ మనిరి కవీంద్రుల్.''

జైనమతం ఒకనాడు తెలంగాణాలో చాలా ఉచ్ఛస్థితిలో వుండేది. 'చాప చిరిగినా చదరంత' అని ఎంత తుడిచిపెట్టుకొనిపోయినా నిన్న మొన్నటిదాకా జైనులు తెలంగాణాలో వుండేవారని శేషాద్రిరమణకవులు వ్రాశారు. వేములవాడలోనూ, పరిసరాలలోనున్న మూడేపల్లి, దిలాసవరం, కొత్తపల్లి, నగనూరు మొదలైన గ్రామాలలో నేటికీ జైన దేవాలయాలు వున్నట్టు జయంతి రామయ్యగారు కూడా రాశారు. పూర్వం వేములవాడ, దానికి అరకోసు దూరంలోని నామపల్లి కలసి పెద్దపట్టణంగా వుండేదట. వేములవాడలో లేమలు (భోగ స్త్రీలు) నివసించడం చేత ఆ గ్రామానికి లేమలవాడ అనే పేరొచ్చిందట.[6]

లేమలవాడలో నివసించబట్టే కాబోలు ఛందోగ్రంథంలో సైతం శృంగారాన్ని రేచన తీసుకువచ్చాడు. దోషాధికారంలోని ఈ పద్యం చూడండి.

6. పరిషత్ప్రచురణ కవిజనాశ్రయం పీఠికలో జయంతి రామయ్యగారు చెప్పిన మాటలు ఇవి.

ప్రియమున నే నిన్ను మనః
ప్రియు పాలికి బుచ్చబోయి బింబాధరః పా
డియె యిట్లు చేయనని సం
శయార్థముగ జెప్పు గృతుల సంశయమయ్యెన్.

నాయిక తన చెలికత్తెను దూతిగా నాయకుని వద్దకు పంపిస్తే అక్కడ కాని పని జరిగింది. తిరిగి వచ్చిన దానిని చూసి నాయిక ప్రశ్నించడం, వ్యంగ్యంగా సూచించడం ఈ పద్యంలో చెప్పాడు. ఛందోగ్రంథమే రాశాడు గాని రేచన అలంకారశాస్త్రం రాస్తే ఎన్ని చెప్పేవాడో, చెవికింపుగా ఎన్ని వినిపించేవాడో.

శ్రావ్యత అన్నది ఛందో సుగుణాలలో ముఖ్యమైనది. దేశి తెనుంగుల తియ్యని నొడుపుల తెల్లముగా నర్థ దృష్టి తెలుపుట ముఖ్యమని కూడా రేచన పండితుని మతము. సులలితముగ విలసత్పదములలో రసికమైన రచనలు ఎసగి ఉంటాయని అతనికి తెలుసు. వినడానికి కమ్మగా ఉండేచోట పాదాలూ, పాదమధ్యపదాలూ విరగాలన్నది ముఖ్యం. దీనికోసమే యతి అన్నది అవసరమైంది. రేచన యతి గురించి ఇలా చెప్పాడు :

విశ్రాంతి, విరతి, విశ్రమ
విశ్రామ, విరామ, విరమ విరమణ లనగా
విశ్రుతమగు యతి కృతి కధి
క శ్రావ్యంబై బెడంగుగా నిడవలయున్.

శ్రవణ సుభగంగా ఉండడం కోసమే మధ్యాక్కర లక్షణంలో మూడవ గణముపై, అంటే నాలుగవ గణము ప్రథమాక్షరం యతికి స్థానంగా నిర్దేశించాడు. అయితే వేములవాడ చాళుక్యుల రాజ్యంలో పూర్వంనుంచీ ఉన్న ఈ సంప్రదాయాన్ని వేంగీ చాళుక్యులు మార్చేశారు. క్రీ.శ. 898–934 ప్రాంతంలో బెజవాడలోని యుద్ధమల్లుని శాసనంలోని మధ్యాక్కరంలో నాలుగింటిపై, అంటే అయిదోగణం మొదటి అక్షరంపై యతిని నిల్పడం ప్రారంభించారు.

స్వస్తి నృపాంకు శాత్యంత వత్సల - సత్యా త్రినేత్ర
విస్తర శ్రీ యుద్ధమల్లు డనవద్యు - విఖ్యాత కీర్తి
ప్రస్తుత రాజాశ్రయుండు త్రిభువ నా - భరణుండు సకల
వస్తు సమేతుండు రాజ సల్కి భూ - వల్లభుండర్థి.

వేంగీ చాళుక్యులు తెచ్చిన ఈ మార్పునే నన్నయగారు తమ భారత రచనలో వాడిన 39 మధ్యాక్కరలలో పాటించారు. అయితే చెవికింపుగా ఉండని ఈ యతి స్థాన విధానాన్ని తర్వాత కవులెవరూ అనుసరించలేదు. నన్నయగారి పిమ్మట మధ్యాక్కరను చెప్పిన ఎర్రనగారు పాత పద్ధతిలో మూడింటిపైననే యతిని, రేచన మతం ప్రకారం చెప్పారు. లక్షణకర్తలందరూ దీనినే ఆమోదించారు. "ఏ లాక్షణికుడును నన్నయ మతమును

స్పృశింపలేదు; సరిగదా స్మరింపలేదు. కారణము దురూహ్యాము'' అని రావూరి దొరసామి శర్మగారు బాధపడ్డారు.[7]

కారణం చాలా సహజమైనదే. కంద పద్యంలో బేసిని జగణ మెందుకు నిషేధించారు? శ్రావ్యతకు భంగమనే. అదే జగణం నాలుగింట ఉంటే చక్కగా లయాన్వితంగా ఉంటుంది. రేచన కొన్ని కందాలలో నాలుగింట జగణం ప్రయోగించాడు. దీనిని బ్రౌను దొరగారు గుర్తించారు. క్రీ.శ. 1325లో కాగితం ప్రతిని పుట్టించి ఆంగ్లానువాదం చేస్తున్నప్పుడు -

''పరగిన విమల యశో భా
సుర చరితుడు భీమనాగ్ర సుతు డఖిల కళా
పరిణతుడయ్యెను భూ సురో
వర ప్రసాదోచిత ధ్రువ శ్రీయుతుడై''

అనే పద్యంలోని నాలుగో పాదం గురించి హెచ్చరిక చేస్తూ 'Note here an amphibrated వరపు appears in the 4th place. Which is very rare' అని దొరగారు నోటు రాసుకున్నారు. (D. 1279)

రేచన కందాలలోనే కాదు. పొన్నమయ్యగారి కందాలలో కూడా నాలుగింట జగణం నేను గుర్తించాను. తెలుగు కవులలో ఈ ప్రయోగాన్ని చక్కగా వాడిన ప్రసిద్ధులలో తిమ్మనగారు ప్రముఖులు. శ్రీరంగం శ్రీనివాసరావు తన సిరి సిరి మువ్వ శతకంలో ఇలా చెప్తాడు.

జగణంతో జగడం కో
రగా దగదు కాని దాని రస్సాగొయ్యా
నగలాగ వెలుగును గదా
చిగిర్చితే నాలుగింట సిరిసిరిమువ్వా![8]

నిజమే. యతి ప్రాసలు తెచ్చిపెట్టుకొన్నట్టుగాక చిగిర్చినట్టు ఉండాలి. కవి గ్రంథంలోని విషయాలే కాదు, వాటిపై వ్యాఖ్యానాలు కూడా అతికినట్టు ఉండకూడదు. కవిజనాశ్రయకర్త ఎవరన్న సంగతి గ్రంథంలోని ఆంతరంగిక సాక్ష్యంవల్ల తెలుస్తున్నా, పెద్ద గందరగోళాన్ని తర్వాతి వాళ్ళు సృష్టించారు. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఈ గ్రంథానికి పది ప్రతులు ఉన్నాయి. వీటిలో మూడు కాగితాల ప్రతులు (D 1279; D 1303; D 1304).

7. తెలుగు భాషలో ఛందోరీతులు - పుట. 159.
8. ఈ పద్యంలోని రెండవ పాదంలో యతి భంగాన్ని కవి కావాలనే చేశాడు. 'ర'కు 'ర' కంటికింపైన యతి అన్నాడు.

మిగతావి తాళపత్ర ప్రతులు (D 1280 నుండి D 1287 దాకా). వీటిలో D 1280 అనే ప్రతికి ఇంగ్లీషులో వివరణ ఇస్తూ ఇలా చెప్పారు.

"It can be made out from this that the Author, Malliyarecana (not Recana son of Malliya), the eldest son of Bhimana, surnamed kavijanasrayudu and Sravakabhara-nankudu wrote this work with the help of Vacakabharanudu."

ఇంగ్లీషులో ఇంత స్పష్టంగా చెప్పిన గ్రంథానికే తెలుగు వివరణలో "దీనినిబట్టి కవిజనాశ్రయుడు." శ్రావకభరణాంకుడు అగు మల్లియ రేచన (మల్లియ కొడుకు) వాచకాభరణుడనువాడు (భీమన కొడుకు?) సహాయుడు కాగా కవిజనాశ్రయమను ఛందమును రచించెనని తెలియుచున్నది."

ఇంగ్లీషు వివరణలో not Recana son of Malliya అన్నాక తెలుగులో మల్లియ కొడుకు? అనే ప్రశ్నార్థకాన్ని కుండలీకరణాల్లో పెట్టడంలో గ్రంథాలయాధికారుల ఉద్దేశం ఏదైనా, రేచన విషయంలో స్పష్టమైన చారిత్రక అవగాహన లేదన్న సంగతి విశదమవుతుంది.

రేచన భీమన కొడుకే. అందులోనూ పెద్ద కొడుకే. అయితే మల్లియ రేచన అనే పేరులో మల్లియ అనే ప్రథమావయవం అర్థమేమిటి? బహుశా ఇది ఇంటి పేరో, తల్లి పేరో కావచ్చు. 'వైశ్యకుల ప్రకాశిక'లో ఉన్న బోలెడు ఇంటి పేర్లలో మల్లియ, మల్లెల అనే పేరు కనబడలేదు. కాబట్టి తల్లి పేరే కావచ్చును. మధ్యయుగాలలో కూడా మైలమ భీముడు, ప్రోలమ తిక్కడు మొదలైన పేర్లు చరిత్రలో కొత్తకావు. మల్లియ అన్నది తల్లి పేరే అన్న ఈ సంజాయిషీ ప్రస్తుతానికి ఊహాగానం కిందే పరిగణించాలి. భావి పరిశోధనవల్ల దీనిని ఖరారు చేయవచ్చు. లేదా కొట్టిపారేయవచ్చు. అంతదాకా ఇలాంటి వింతలు కలపకూడదు.

వికట కవులు కొన్ని వింతలు కల్పించి
కవిజనాశ్రయంబున గలిపినారు

అని అప్పకవి చెప్పనే చెప్పాడు. తానే కొన్ని కల్పించి ప్రచారం చేశాడు. లాక్షణికులు తమకు అభిమతమైన వాటిని రచించి ప్రసిద్ధుల పేరిట ప్రక్షిప్తం చేస్తారు. ప్రామాణికులు మాత్రం సమంజసమైన వాటినే స్వీకరిస్తారు. కవిజనాశ్రయములో చెప్పిన లక్షణాలను ఎవరెవరు ఎలా అనుకరించినదీ, వాడుకొన్నదీ మన సాహిత్య పరిశోధకులు బాగా వివరించారు. విద్వాన్ రావూరి దొరస్వామిగారు అనంతుని ఛందానికీ, కవిజనాశ్రయానికీ ఉన్న పోలికలను చూపెడుతూ 42 పేజీల సుదీర్ఘమైన, సప్రామాణికమైన వ్యాసాన్ని ప్రకటించారు.[9] ఇతర పరిశోధకులూ కృషి చేశారు.

9. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక - 38వ సంపుటం.

''కవిజనాశ్రయము ప్రాచీనమైన, ప్రథమమైన ఛందోలక్షణ గ్రంథము కాబట్టి తరువాత ఛందోలక్షణములన్నియు దీనినే అనుసరించినవి. తెలుగునందు ఛందో గ్రంథములు దాదాపు ముప్పదియైదున్నవి. ప్రఖ్యాతమైనవి కొద్దిమాత్రమే'' అని సంపత్కుమారగారు వ్రాసి ఆ కొద్ది గ్రంథాలను కవిజనాశ్రయంతో తైపారు వేశారు.[10]

కవిజనాశ్రయము తొలి గ్రంథం. కనుక ఇందులో చిత్రకవిత్వం గురించి, బంధ కవిత్వం గురించి ఏమీ చెప్పలేదు. రేచన కాలానికి రగడలు శిష్టసాహిత్యంలో లేవు కాబోలు వాటికి లక్షణం చెప్పలేదు. కవిజనాశ్రయంలో గూఢ కవితను చూపిన పరిశోధకులు కూడా లేకపోలేదు. నన్నెచోడుని మీద ప్రత్యేకంగా కృషి చేసిన దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు కవిజనాశ్రయంపైన కూడ తమ విలక్షణ దృష్టిని ప్రసరింపజేశారు. 'తెలుగు తొలికావ్యం కవిజనాశ్రయ'మని అక్టోబరు 1959 భారతిలో ఒక వ్యాసం వ్రాశారు. వేంగీ చాళుక్యులలో దానార్ణవుడనే రాజు క్రీ.శ. 956–972 మధ్య ఉండేవాడు. ఇతడు జైనుడయ్యాడు. ఈ జైనుడు శ్రావకాభరణుడైన రేచనతో సహకరించి కవిజనాశ్రయం పూర్తిచేయించాడని రెడ్డిగారి వాదం. దీనికి ఆధారంగా కవిజనాశ్రయం అవతారికలోని ఈ రెండు పద్యాలను వారు చూపెట్టారు.

''పరగిన విమల యశోభా
సుర నిరతుడు భీమనాగ్రసుతు డఖిల కళా
పరిణతు డయ్యెను భూసుర
వరుడు ప్రసారోధిత ధ్రువ శ్రీయుతుడై.

అసమాన దాన రవి తన
యసమానోన్నతుడు యాచకాభరణుడు ప్రా
ణ సమాన మిత్రు డీ కృతి
కి సహాయుడుగా నుదాత్త కీర్తిఽ ప్రీతిఽ''

ఈ పద్యాలలో మొదటిదానిలో 'విమల' అనే మాట విమలాదిత్యునకు అన్వయిస్తుందట. రెండో పద్యంలోని 'దాన' అనే మాట దానార్ణవుని సూచిస్తుందట. ఇది 'గూఢ కవిత' అంటారు. ఈ కొత్త వాదాన్ని, నాకు తెలిసినంత మటుకు పండితులెవరూ చర్చించనూ లేదు; ఆమోదించనూ లేదు.

అందరు నిన్నటిదాకా ఇది భీమన ఛందం అనే చెప్పుకునేవారు. రచయితకు రావలసిన కీర్తిని రానియ్యకుండా గ్రహణం పట్టించారు. ఇప్పుడిప్పుడే ఆ గ్రహణం విడుస్తోంది. వినయానికి కొంచెం విరుద్ధమైనా రమారమీ ప్రతి పద్యంలోనూ తన గురించి రేచన చెప్పుకొనడం మంచిదే అయింది. వాచకాభరణుడు తనకు ఈ రచనలో సహాయం చేశాడన్న ప్రకటన చాలా గట్టి సాక్ష్యమైంది. జినవల్లభుడు తప్ప వాచకాభరణుడని

10. తెలుగులో ఛందో వికాసము.

ప్రసిద్ధిగాంచిన వేరొక జైన విద్వాంసుడు శాసనాల్లోగాని, కన్నడ వాఙ్మయంలోగాని లేడు. కవిత్వ తత్త్వమెరిగిన వాచకాభరణుడు ఇతడే తప్ప ఇంకొకడు ఆ కాలంలో లేడని చరిత్రకారులు స్పష్టపరిచారు. వేములవాడ అనే ప్రాచీన జైన విద్యాకేంద్రంలో క్రీ.శ. 940 ప్రాంతంలో జినవల్లభుని సహాయంతో మల్లియ రేచన కవిజనాశ్రయాన్ని రచించాడని సుప్రసిద్ధ పరిశోధకులు పుచ్చా వాసుదేవ పరబ్రహ్మశాస్త్రిగారు నిర్ధారణ చేశారు.[11]

'నిజం నిలకడమీద తేలకపోదు' అన్న సామెతకు రేచన కవిజనాశ్రయమే చక్కని నిదర్శనం.

11. తెలుగు మణుగులు – తెలుగు గోష్ఠి చర్చా సంహిత । రామనగర్, హైదరాబాద్.

చాళుక్య యుగం

మన తెలుగు దేశాన్ని సుమారు అయిదువందల సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా పరిపాలించిన రాజవంశం తూర్పు చాళుక్యులదే. క్రీ.శ. 624లో కుబ్జవిష్ణువర్ధనుడు తెలుగుదేశంలో తన పాలన ప్రారంభించాడు. నాటినుండి రాజరాజ నరేంద్రుని కుమారుడు రాజేంద్ర కులోత్తుంగుడు క్రీ.శ. 1118లో మరణించేదాకా ఒకే వంశంలోని వ్యక్తులు ఈ దేశాన్ని పరిపాలించారు. కులోత్తుంగునికి తెలుగు రాజ్యంకన్నా పెద్దదైన చోళ సామ్రాజ్యం సంక్రమించి అతడు దక్షిణాదికి వెళ్ళిపోయాడుగాని ఇతని తండ్రికాలందాకా ఆంధ్రదేశంలోని వివిధ నగరాలే మన రాజధానులు.

ఇంత సుదీర్ఘకాలం పరిపాలించారు గనుకనే చాళుక్యులు నిజంగా తెలుగు సంస్కృతికీ, సాహిత్యానికీ సృష్టికర్తలయ్యారు. మొదట వీళ్ళ రాజధాని ఏలూరుకు సమీపాన ఉన్న వేంగిపురం. తరువాత బెజవాడ, ఆ పిమ్మట రాజమహేంద్రవరం. మొట్టమొదటి రాజధాని వేంగిపురం కాబట్టి వీరికి వేంగిచాళుక్యులనే పేరు వచ్చింది. ఆ పట్టణం ఏలూరుకు ఉత్తరాన ఏడుమైళ్ళ దూరంలో ఉండేది. ఇప్పుడు బొత్తిగా పాడుపడిపోయినా ఆనాడు అది రెండుక్రోసుల పొడవు వెడల్పులు ఉండిన గొప్ప నగరం. ఇక్కడ ఇప్పటికీ పాడు పడిపోయిన దేవాలయాలు యాభైకన్నా ఎక్కువే ఉన్నాయట.

దేవాలయాల వైభోగం

పూర్వం మన సంస్కృతికి ఆటపట్టులు దేవాలయాలే అని చెప్పాలి. శిల్పం, చిత్రకళ, నాట్యం, సంగీతం మొదలైన కళలన్నింటికి అది కూడలిస్థానం. పెద్ద దేవాలయాలైతే, వాటిని నమ్ముకొని డెబ్భయిరెండు నియోగాలవారు జీవించేవారు. ఈ వృత్తులవాళ్ళలో స్థానాపతులు, పూజారులు, నర్తకాచార్యుడు, నర్తకీ నర్తకులు, గాయనీ గాయకులు, పిల్లన గ్రోవి ఊదే వాంశికులు, తిత్తిఊదే నాద గాయకులు, మద్దెల వాయించే మార్దంగికులు, వివిధ స్త్రీజనచామర కరండవాహినులు, ద్వాదశ సేవా విలాసినులు, దేవపరిచారాహ్వానకులు, శంఖపూరకులు, శిల్పులు మొదలైనవాళ్ళు ఉండేవారు. దేవాలయాలను ఆనుకొని సత్రాలు ఉండేవి. వీటికి రాజులు, సామంతులు, దండనాథులు

భూములిచ్చేవారు.[1] పశువులిచ్చేవారు, తోటలు వేయించేవారు, తటాకాలు తవ్వించేవారు. ప్రతి దేవాలయం ఒక చిన్న సైజు రాజధాని.

కట్టు, బొట్టు కళలు

చాళుక్యుల కాలంలో కూడా బౌద్ధ, జైనమతాలు సజీవంగా ఉన్నా ఆరామ నిర్మాణాలు ఆగిపోయాయి. దేవాలయాలు కట్టించడమే జరిగిందనుకోవాలి. చాళుక్య వంశంలోని నరేంద్ర మృగరాజు ఒక్కడే నూటఎనిమిది శివాలయాలు కట్టించాడు. ఉద్ధృతంగా సాగిన నిర్మాణ కార్యకలాపాలవల్ల 'చాళుక్య శిల్పం' అనేది ఒకటి రూపురేఖలను సంతరించుకొంది. ఆంధ్రదేశంలోని వివిధ ప్రాచీన దేవాలయాలలోని గండారాలను పరిశీలిస్తే ఆనాటి కట్టూ, బొట్టూ, కళలూ ఎలా ఉండేవో తెలుస్తాయి.

చాళుక్య శిల్పాలలో సంగీత నాట్యాల ఔన్నత్యం కనబడుతుంది. విజయవాడలోని జమ్మిదొడ్డి చిత్రాలలో, బిక్కవోలు, భీమవరం గండారాలలో వాద్యగోష్ఠులు కనబడతాయి. పిల్లనగ్రోవి ఊదేవాళ్ళు, వీణలు వాయించే యువతీ యువకులు, కంచుతాళాలు వాయించేవాళ్ళు. పంబలవంటి మృదంగాలు వాయించేవాళ్ళు, చేతులుతట్టి తాళం వేసేవాళ్ళు, కోలాటమాడేవాళ్ళు, నోరుతెరచి పాడుతున్నారా అన్నట్టు కనబడేవాళ్ళూ, నాటినుంచి నేటిదాకా అలా నాట్యం చేస్తున్నట్లే కనబడతారు.

మధుర కవితలు

ఈ సంగీత, నాట్యాలకు పరిపూర్ణతనిచ్చే మధుర కవితలు కూడ ఆనాడు విలసిల్లే ఉంటాయి. దేవునిమీద పాటలే కాక వీరుల గురించి కూడ ఆ రోజులలో పాటలు పాడుకొనేవారు. నన్నయగారి భారతంలో ఉలూచి తాను అర్జునుని పరాక్రమాన్ని ముందుగానే 'నాగీ గీతాల'వల్ల విని తెలుసుకున్నానని చెప్పింది.[2] నన్నెచోడుని కుమార సంభవంలో అరణ్యానికి తపస్సు కోసం వెళుతున్న పార్వతి ఆటవికుల పాటలు విన్నది. వాళ్ళు 'గౌడుగీతాలు' ఆలపించారు. తరతరాలుగా తమ కాలానికి వచ్చిన పాటలను గురించే ఈ ఇద్దరు ఆదికవులూ చెప్పారనుకోవాలి.

ఆస్థాన వార విలాసిని

చాళుక్య భీముని ఆస్థానంలో సమస్త గాంధర్వ విద్యావిశారద అయిన చల్లవ్వ అనే ఒక వారవిలాసిని ఉండేది. రాజు ఆమెకు అత్తిలి గ్రామంలో వెయ్యిపోకచెట్లున్న భూమి. 50 పుట్లు పండే పొలమూ, నివేశన స్థలమూ ఇచ్చాడు.[3] ఆమె తండ్రి పేరు మల్లప్ప.

1. దక్షిణ భారత శాసనములు 10-వ సంపుటి, నెం. 74
2. మహాభారతం, ఆది. 8-131.
3. చాళుక్యభీముని అత్తిలి తామ్రశాసనం.

అతను కూడ సంగీతంలో ఆరితేరినవాడే; తుంబురుని వంటివాడని శాసనంలో ప్రశంసించారు. అతని తల్లిపేరు తొండక్క. ఆమె అప్సరస వంటిది. ఈ గాంధర్వ విద్యావిశారదలు నాటి తెలుగు పాటలతో తెలుగుసీమను సుశ్రావ్యం చేసేవారు.

చదరంగ చాతుర్యం

క్రీ.శ. 910 నాటికే మన దేశంలో చదరంగం బాగా ఆడేవారనీ, బలగాన్ని మట్టితో తయారుచేసుకొనేవారనీ తెలుస్తున్నది. ''చాళుక్యభీముని ఖడ్గమనునట్టి సముద్రమునందు మునింగి (రాష్ట్రకూట) కృష్ణవల్లభుని చతురంగసేన నీళ్ళలో మునిగిన చతురంగమందలి సేనవలె కరగిపోయెను'' అని ఒక శాసనంవల్ల తెలుస్తున్నది.[4]

మార్గపద్ధతి - దేశిపద్ధతి

ఇలాగ వివిధ లలిత కళలు వర్ధిల్లిన చాళుక్యుల కాలంలో ఉదాత్త రసాన్వితమైన సాహిత్యం కూడ వర్ధిల్లే ఉంటుంది. అయితే అది దేశిసాహిత్యం కనుక లాక్షణికుల మన్ననలకు నోచుకోలేదు అనుకోవాలి. వాళ్ళకు ఎప్పుడూ మార్గపద్ధతిమీదనే మోజు. ఆదిలో శ్రీరామచంద్రుడంతటివాడు దేశిని ఈసడించి మార్గపద్ధతి గానాన్నే మెచ్చుకొన్నాడన్న భావం పండితలోకంలో వేళ్ళూనిందంటే మధుర కవితలు ఎటువంటి పరిస్థితిలో ఉండేవో ఆలోచించుకోవచ్చు.

కుశలవులు అయోధ్య వీధులలో రామాయణం గానం చేశారు. పాడుతూ ఆడి చూపించారు. ''పాట మనోహరంగా ఉంది. శ్లోకాలు అంతకన్నా మనోహరంగా ఉన్నవి. ఎప్పుడో జరిగింది ఇప్పుడు కన్నుల ఎదుట జరుగుతూ ఉన్నట్లు తోచింది.'' అంటూ అందరూ మెచ్చుకొన్నారు. ఈ సంగతిని విని రాముడు వాళ్ళను కొలువు కూటానికి పిలిపించి పాడించుకున్నాడు. ఆ దేవవర్చస్సులు వీణావేణు తాళమృదంగాదులు మ్రోగుతూ ఉండగా ఆలాపించి రామాయణ మహాకావ్యాన్ని దేశిపద్ధతిని పాడుతూ అభినయించసాగారు. ఆ గానానికి సదస్యులు అందరూ ఉప్పొంగి పోయినారు. తన్మయులు అయినారు. అప్పుడు రాముడు ఆ కుశలవులను చూచి 'మార్గ పద్ధతిన ఆ మహాకావ్యమును గానం చేయ'మని చెప్పాడు.[5]

వాల్మీకి రామాయణంలోని ఈ ఘట్టాన్నే అనువదించి వ్యాఖ్యానిస్తున్న సందర్భంలో వావిలకొలను సుబ్బారావుగారు తమ 'మందరం'లో తమ ఉద్దేశాలను అమూలకమైనా రాముని నోటంట చెప్పించారు. కుశలవుల గానమహిమచే ఆనందపరవశులైన సభ్యుల్ని చూసి రాముడు ఇలా అన్నాడట.

---

4. చాళుక్యభీముని అత్తిలి తామ్రశాసనం పంక్తులు 19-22 ''యస్య ఖడ్గజలవార్ధి నిమగ్నం కృష్ణవల్లభ బలం నసపత్నం. (మృణ్మయంతు చతురంగ బలవాక్షి ప్రమేవ విలయాగత మాజౌ)'' బ్రాకెట్లలోని భాగాన్ని కొమర్రాజు లక్ష్మణరావుగారు వేరొక శాసనంలోనుంచి సంపాదించారు.

5. శ్రీనివాస శిరోమణిగారి వాల్మీకి రామాయణ అనువాదం బాలకాండ.

''ఓ సాధువులారా! 'సద్యఃఫలం సంగీత'మని గాన మనోహరత్వమున నానందమగ్నులగుచున్నారు. సంగీత మాపాత మధురము. కావున విన్నంత వరకే మధురము ఆవల కాదు. ఇది యట్లుకాదు. కావున మీరు కథయందుండు విశేషమును గూడా గ్రహించుటకై సాహిత్య భాగమునకు మనస్సీయవలెను. అది దృఢముగ మనస్సున నిలిచి స్మరించినపుడంతయు సంతోషం కలిగించును. శ్రేయస్సును సమకూర్చును...

తరువాత మూలంలో ఉన్న శ్లోకం ఇది:

> తతస్తుతౌ రామవచః ప్రచోదితావగయతాం
> మార్గవిధాన సంపదా సచాపిరామః పరిషద్గ
> తశ్శానైర్బు భోషయాసక్త మనాభభూవ ॥ (బాల 4-31)

''శ్రీరామచంద్రుని యుత్సాహకరములైన మాటలకు సంతోషించినవారై కుశలవులు దేశాది నియమములు లేక యెచ్చటనైనను పాడగూడిన మార్గమను సంగీత విధానము ననుసరించి రామచరితమంతయు నిట్లు పాడిరి'' అని వావిలకొలను వారు తాత్పర్యం చెప్పారు.[6]

మార్గ విధానం ఎక్కడైనా పాడేది కాదు. సభలలోనే, విద్వత్తును ప్రదర్శించుకొనేందుకు పాడేదే.

ప్రజాకళలు ప్రభువుల ప్రాంగణంలోనికి వెళ్ళగానే 'క్లాసికల్' ఆహార్యాన్ని ధరిస్తాయి. ఇది సంగీతంలో మరీని.

సంగీతం విషయంలోనే అందరినీ తన్మయం చేస్తున్న దేశిపద్ధతిని కాదని మార్గపద్ధతికి పట్టం కట్టిన పూర్వులు సాహిత్యంలో దేశిని ప్రోత్సహిస్తారా? సాధారణ జనాన్ని వాడుక భాషలో కథలు చెప్పుకోనిస్తారా? వాటికి సాహిత్య గౌరవమిస్తారా? ఈ లీలావతి కథను చూడండి.

నాయిక అడుగుతుంది గదా –

> ''రాత్రి రమణీయంగా ఉంది. దానికి తగినట్టే శరత్కాలము గూడ మనోహరముగా వున్నది. ప్రేమాస్పదుడవైన నీవున్నూ (నాకు) స్వాధీనుడవై వున్నావు. పరిజనులు కూడ అనుకూలురుగా వున్నారు. నాకు లేనిదంటూ లేదని అనుకొంటాను. కనుక ఏదేనా మనసుకు ఇంపు పుట్టించే సంభాషణ గలదిగానూ, ఈ ప్రదోష కాలపు వినోదానికి తగినట్టిదిగానూ వున్న కొత్త కథ – చక్కని రసం ఉట్టిపడేదాన్ని, మహిళా జనానికి ఇంపు సంపాదించేదాన్ని సాధించండి (అంటే చెప్పండి)'' అని.

---

6. వావిలకొలను సుబ్బారావు మందరం బాలకాండ, పుట 366 నుండి.

ఇలాగు ఎంతో అమాయకత్వాన్ని వెల్లడిస్తూ అడిగిన ప్రియురాలిని చూచి ఆ కథానాయకుడు -

''కవులు 'మూడు రకాల కథలే లోకంలో ఉన్న' వన్నారు - దివ్యకథ అనీ, దివ్యమానుషీకథ అనీ, మానుషీకథ అనీ... వాటిలో మాలాంటి అప్రాజ్ఞులు చెప్పే కథలు (లక్షణ శాస్త్రాలు అనుసరించి చెప్పేవి కావు కాబట్టి) లోకంలో పరిహాసం పొందవు. మరి? నన్నెందుకు పరిహసిస్తావూ? శబ్దశాస్త్రాన్ని వినేనా ఎరగని వాడికి బాగా మాట్లాడ్డాని కేనా వీలు కాదంటారుకదా? అల్లాంటి స్థితిలో వికలమైన కథాబంధం మరి చెప్పేదేమిటి?'' అన్నాడు.

'ఈ మాటల్లో 'లక్షణ శాస్త్రాల ఇనుప గొలుసులు చూచి ఎంతటి సహజ చాతుర్యం వున్నా, నోరు తెరవడానికి ఎల్లా భయపడేవారో ఆ కాలమువారు!' అనే విషయం తెలుస్తున్న'దని ప్రాకృతభాషలో వున్న లీలావతి కథను తెలుగులో చెప్తూ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి వ్యాఖ్యానించారు. ఆ కథ ఇంకా ఇలా ఉంది.

''ఇల్లా అన్న ప్రియుడి మాటలకు అతడి ప్రియురాలు అన్నదీ - ప్రియతమా! ప్రియతమా! ఏ శబ్దశాస్త్రం చక్కని ముద్దులు గురిసే సుభాషితం దారిని పాడుచేసి వేసిందో ఆ శబ్దశాస్త్రం వల్ల లాభం ఏముందీ! దేనిచేత అర్థం చాలా విశదంగానూ, దాపరికం లేని హృదయంతోనూ వెల్లడి అవుతుందో అదే మీపాలిటికి శబ్దం అని నా మతం. అంతేకాని అర్థంకాని లక్షణంతో ఏమి లాభం? కనుక అల్లాగే (అంటే, రాని వ్యాకరణాది లక్షణ శాస్త్రాలవైపు పోయి చెడగొట్టుకోకుండా సంభాషణలోనే) పరిశుద్ధంగా విప్పారిన హృదయం గల ఇంపైన కథలు విస్తారంగా దేశిమార్గంలో ఒప్పి ఉండేటట్టు, దివ్య మానుషులకు చెంది ఉండేటట్టు చెప్పండి'' అని ఆ నాయిక అడిగింది.[7]

నాయకుడు కథ చెప్పాడు. ప్రాకృత వాఙ్మయంలో లీలావతి కథకు అగ్రస్థానం ఇస్తారు. ఆంధ్రులం మనమూ తప్పకుండా ఇవ్వాలి. ఇది ఆంధ్రదేశానికి సంబంధించిన ఒక చారిత్రక కథ అనీ, ఇందులో ఆంధ్రదేశంలోని అనేక ప్రాంతాలు వర్ణింపబడ్డాయనీ మానవల్లి రామకృష్ణకవిగారు వ్రాశారట. ఇందులో ఆంధ్రదేశపు సాతవాహన మహారాజూ, సింహళద్వీపపు రాజకుమార్తెల ప్రేమగాథ వర్ణితమవుతుంది. గ్రంథకర్త కాలం క్రీ.శ. 6-7 శతాబ్దుల మధ్య అని కవిగారు చెప్పారు. ఇంక కొంచెం అర్వాచీనం అయితేనూ కావచ్చునట. ఈ కావ్యంలోని లాక్షణిక నిరంకుశత్వం మన చాళుక్య యుగంనాటి సాహిత్య వ్యవస్థను తెలియజేస్తుంది.

ఈ కాలంలో తెలుగు గడ్డమీద జన్మించిన కవులు కన్నడంలో సంస్కృతంలో, ప్రాకృతంలో వ్రాసిన కావ్యాలు మనకు దొరుకుతున్నాయి. వాళ్ళు తెలుగులోనూ వ్రాస్తే

7. గిడుగువారి సప్తతి తమ జన్మదిన సంచికలో పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారి వ్యాసం.

దొరకవా? వ్రాయలేదు అని కొందరు సిద్ధాంతీకరిస్తున్నారు. కవులున్నారుగాని కావ్యాలు లేవు అని మనం భావించాలి కాబోలు.

నన్నయగారికి పూర్వం అసలు భాషే లేదని ఒకప్పుడు భావించేవారు. ఉందని తెలిశాక, ఉన్నా అది 'ద్రవస్థితి'లో ఉండేదనీ, దాన్ని ఆయన సంస్కరించి 'ప్రమాణీకరించా'రనీ భావించేవారు. రేనాటి చోళుల తెలుగు శాసనాలు దొరికాక పద్యాల పొడ ఎక్కడా కనపడకపోయినా చక్కని వచనం ఉండేదని అంగీకరించారు. ఈ శాసనాల సేకరణలో, పరిష్కారంలో, వ్యాఖ్యానంలో ప్రశంసనీయమైన కృషి చేసిన మల్లంపల్లి సోమశేఖరశర్మగారు కొన్నిట్లో ఉండే భాషా విశేషాల గురించి ఇలా రాశారు.

''శాసనభాష అంతా తెలుగే. శాసనమంతా గద్యంలో వున్నది, కొన్ని కొన్ని పదాలు మాత్రమే కాకుండా వాక్య రచన కూడ విలక్షణంగానే వున్నది... శాసనము లోని తెలుగు పదముల కొన్నింటి రూపమును, అర్థమును గూడ సుబోధమగుట లేదు. ఇంకను విచిత్రమైనది ఇందలి వాక్యరచనా పద్ధతి. ఇది ఇప్పుడు మనము వాడు పద్ధతికి భిన్నమైనది. ఇప్పుడు మనము వాక్య రచనలో క్రియాపదమును కర్త కర్మలకు తరువాత పెట్టుదుము... మాచర్ల శాసనమున అది కర్తకు తరువాతను, కర్మకు పూర్వమును వచ్చినది. ఇది అపూర్వము. పొట్లదుర్తి మానెపాడు శాసనమునను యీ పద్ధతియే కానబడును. ప్రాచీనాంధ్ర వాక్యరచనా పద్ధతి యిదేనా? ఇది యింక యితర శాసనము లలో కానవచ్చునా? ఇది యేమైనా యీ పద్ధతి ఎంతకాలము వరకుండునో? ఇది నాటి సామాన్య పద్ధతి కానిచో (ఈ) శాసనములో ఇట్లుండుటకు కారణమేమి?''

సోమశేఖరశర్మగారి యీ వాక్యాలను ఉదహరిస్తూ నేలటూరి వెంకట రమణయ్యగారు ఒక సంగతి చెప్పారు.

''లభ్యమైన ప్రాచీన తెలుగు శాసనములనన్నింటిని సమకూర్చి వానిని ఒండొంటితో బోల్చి పరిశోధించి చూచినగాని సోమశేఖర శర్మగారి ప్రశ్నలన్నింటికిని సరియైన సమాధానము కుదరదు.[8]

ఈ సుప్రసిద్ధ పరిశోధకులు సూచించిన తులనాత్మక పరిశీలన, నిశిత విశ్లేషణ ఇటీవల జరిగింది. బూదరాజు రాధాకృష్ణగారు దానిని చేశారు. క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 1100 వరకూ ఉన్న 269 శిలాతామ్ర శాసనాలను పరిశీలించారు. భాషా చరిత్రను నిరూపించారు. ఆయన తన అముద్రిత పరిశోధక వ్యాసానికి సంగ్రహ రూపాన్ని ''ప్రాచీనాంధ్రం - శాసన భాషా పరిణామం'' అనే శీర్షికలో ప్రచురించారు.[9]

చారిత్రక కాలంలో జరిగిన మార్పులను లెక్కలోనికి తీసుకొని రాధాకృష్ణగారు తెలుగు భాషా చరిత్రను మూడు దశలుగా విభజించారు.

8. పల్లవులు - చాళుక్యులు పుట. 344

9. భద్రిరాజు కృష్ణమూర్తిగారి సంపాదకత్వాన వెలువడిన 'తెలుగు భాషా చరిత్ర'లో (1974).

1. ప్రాక్సాహిత్య దశ : క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 600 మధ్యనున్న దశ. ఈ కాలంలోనే తరువాతి కాలంలోని భాషకు నిరూపకమైన విలక్షణ నిర్మాణ క్రమం, ప్రత్యేక భాషా క్రమం ఏర్పడ్డాయి. సంస్కృత సంపర్కం, ప్రభావం బాగా ఉండేవి.

2. సాహిత్య దశ : క్రీ.శ. 7–9 శతాబ్దాల మధ్యకాలం, వ్యావహారిక సాహిత్య మాండలికాలు ఏర్పడ్డాయి. పద్య శాసనాలు తలచూపాయి. సంస్కృత ప్రభావంవల్ల కర్మణి ప్రయోగం, యత్తదర్థక ప్రయోగం వంటివి ఎరువుగా వచ్చాయి. మణిప్రవాళశైలి ఆచారంలోకి వచ్చింది. నాలుగోవంతు మాటలు ఎరువుగా వచ్చాయి.

3. కావ్య భాషా దశ : క్రీ.శ. 10–11 శతాబ్దాల మధ్యకాలం. ఈ దశలో వచ్చిన పెద్ద మార్పు పదజాలానికి సంబంధించినది. ఎరువు మాటల సంఖ్య సగానికి సగంగా ఉంది.

క్రీ.శ. 7వ శతాబ్దినుంచే మన భాషలో కావ్యశైలి ఏర్పడిందని కోరాడ మహదేవశాస్త్రిగారు నిరూపించారు.[10] ఆయనే ఇలా చెప్పారు. ''కావ్యశైలి రూపొందించిం దంటే కవితా వ్యవసాయం చాలాకాలంగా జరుగుతూ ఉందన్నమాట. కాని నాటి వాఙ్మయమెలాంటిదో, దాని స్వభావమేమిటో తెలుసుకోవటానికి మనకిప్పుడు ఆధారాలు లేవు... ప్రాఙ్నన్నయ యుగం పద్య శాసనాలు ఇంతవరకు దొరికినవన్నీ దేశీయ ఛందస్సులలోనే ఉన్నాయి. దేశీ వాఙ్మయం ఆనాడు విశేష ప్రచారం పొంది ఉండినది అనడానికి సందేహం లేదు... శిష్టులెవరూ ఆ దేశిని ఆదరించకపోవటంచేతను, అది శిష్టకవి ప్రయుక్తం కాకపోవడం చేతను లాక్షణికులు దాని లక్షణ నిర్దేశంలో శ్రద్ధ వహించలేదు. నన్నయ మార్గ కవితా ఫక్కి ఏర్పడిన తర్వాత దేశి మార్గం క్రమంగా మాసిపోయింది. దేశి కవులు లాక్షణిక కవులుగా పరిగణింపబడలేదు. లేకపోతే నన్నెచోడ, పాల్కురికి సోమనాథులు అంతకాలం అజ్ఞాతంగా ఉండిపోవటం ఎలా సంభవిస్తుంది?'' అజ్ఞాతంగా ఉన్న వాటిని బయటకు తీయడం చరిత్రకారుల కర్తవ్యం. కనుమరుగైపోతున్న వాటిని కాలగర్భంలో కలిసిపోకుండా కాపాడటం సంస్కృతీ సంరక్షకుల బాధ్యత. గతాన్ని అవగాహన చేసుకొని వర్తమానాన్ని వ్యాఖ్యానించడం, భావికి బాటలు వేయడం సాహితీపరుల విద్యుక్తధర్మం. చరిత్రను అర్థం చేసుకునేవాళ్ళకు అభ్యుదయం తథ్యం.

క్రీ.శ. 1198లో ఓరుగల్లులో గణపతిదేవ చక్రవర్తి కాకతీయ సామ్రాజ్యాన్ని స్థాపించేదాకా వర్ధిల్లిన యుగాన్ని మనం చాళుక్య యుగమని పేర్కొందాం. బాదామి, వేములవాడ, ముదిగొండ, వేంగీ చాళుక్య వంశాల పాలనలో వెలసిన కావ్యాలూ, తెలిసిన కవులూ, ఇంతవరకూ తెలియని చారిత్రక విషయాలూ తెలుసుకొందాం. ఇది ఒక మహాయుగం. క్రీ.శ. 624 నుంచి 1198 దాకా ఇది వర్ధిల్లి వికసించి ఫలించింది. ఈ మహాయుగంలో, ప్రసిద్ధులైన కవులచరిత్రలను వారివారిమతాలను, అభిమతాలను, భావాలను, ప్రభావాలను, ప్రసిద్ధం కావలసిన వైనాలను తెలుసుకొందాం.

10. తెలుగు భాషా చరిత్ర సం॥ భద్రిరాజు కృష్ణమూర్తి. పుట. 205

నన్నయభట్టు

ఆంధ్ర సాహితీపరులంతా ఏటేటా పండుగ చేసుకోదగిన రోజు తెలుగు భారతం పుట్టినరోజు. నేటికి రమారమి 900 సంవత్సరాల క్రిందట అది తీరాంధ్ర దేశంలో జన్మించింది. అప్పుడా ప్రాంతాలను వేంగీదేశమని పిలిచేవారు.

ఆ వేంగీదేశానికి నాయకరత్నమైన రాజమహేంద్రపురంలో దేవేంద్ర వైభవంతో, పరమానందంతో అనవరత మహామహీరాజ్యాన్ని రాజకులైకభూషణుడైన రాజరాజ నరేంద్రుడు పరిపాలిస్తూ ఉండేవాడు. ఇతడు సకల భువన లక్ష్మీ విలాసనివాసమైన కోటలో విద్యా విలాస గోష్ఠిలో ఇష్ట కథా వినోదాలతో ఆనందించేవాడు. ఆ గోష్ఠిలో అపార శబ్దశాస్త్ర పారగులైన వైయాకరణులు ఉండేవారు. భారత రామాయణాది అనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులూ, మృదు మధుర రసభాసురమైన నవార్థ వచన రచనలో విశారదులైన మహాకవులూ ఉండేవారు. వివిధ తర్కవిగాహిత సమస్తశాస్త్రసాగర సాగరీయః ప్రతిభులైన తార్కికులూ ఉండేవారు. మామూలుగా ఉండే మంత్రులు, పురోహితులు, సేనాపతులు, దండనాయకులు, దౌవారికులు, మహాప్రధాని, సామంతులు, విలాసినులు ఎలాగూ ఉండేవారు.

ఆకాంక్ష, ఆమోదం

ఇటువంటి వాళ్ళంతా ఉన్న విద్యా విలాస గోష్ఠిలో ఒకనాడు రాజరాజు తనకు అనురక్తుడూ, లోకజ్ఞుడూ, శబ్దశాసనుడూ, ఉభయకావ్య రచనాభిశోభితుడూ అయిన నన్నయగారిని చూసి ఇలా అన్నాడు : ''విమలమతితో అనేక పురాణాలు విన్నాను. అర్థ ధర్మ శాస్త్రాల తెరగు తెలుసుకున్నాను. ఉదాత్త రసాన్విత కావ్యనాటక క్రమాలు పెక్కు చూచాను. ఈశ్వరాగమాలమీద హృదయాన్ని నిలుపుకొన్నాను. అయినా నా మనసులో ఎప్పుడూ శ్రీ మహాభారతంలోని అంతరార్థం వినాలనే అభిలాష అధికంగా ఉంటూ ఉంది. అదీ కాక మా చంద్రవంశంలో ప్రసిద్ధులైన పాండవోత్తముల చరిత్రనే నిరంతరం వినాలనుకొంటూ ఉంటాను. బంగారు కొమ్ములున్న నూరు గోవులను ఉత్తమ బహువేద విప్రులకు దానం చేసిన ఫలం భారతం వింటే వస్తుంది. నా మనసు ఎప్పుడూ భారత కథా శ్రవణ ప్రవణమే. కాబట్టి కృష్ణద్వైపాయన మునిశ్రేష్ఠుడు రచించిన మహాభారతంలో నిరూపితార్థమేమిటో తెలిసేటట్టు మీ తెలివితేటలు, ప్రతిభ చూపించి తెలుగులో రచించండి.''

ఈ విధంగా రాజరాజు ఆనతివ్వగానే నన్నయగారు ఇలా అన్నారు: ''ఆకాశంలో మసకమసకగానే స్పష్టంగా కనిపించే నక్షత్రాలను లెక్కపెట్టడం, సర్వవేదశాస్త్రాల అశేష సారాన్ని ముదంతో పొందడం, అడుగు పెట్టడానికి వీల్లేని నిగూఢార్థ జలాలున్న భారత భారతీ సముద్రాన్ని బుద్ధిబాహువుల బలంతో ఈదడం బ్రహ్మదేవునకైన చేతనవుతుందా? అయినా దేవా, నీవు అనుమతించావు కనుక విద్వజ్జనుల అనుగ్రహంతో, నాకు తెలిసినట్టు ఈ కావ్యాన్ని రచిస్తాను'' అని ప్రారంభించారు.

తెలుగుపై అప్పటి చిన్నచూపు

రాజానుమతి దొరికింది గనుక విద్వజ్జనులు అనుగ్రహించారు. అప్పటిదాకా ఈ విద్వాంసులు తెలుగులో కావ్యాలు రచించడానికి అడ్డువచ్చారని తలచినా తప్పులేదు. కట్టమంచి రామలింగారెడ్డిగారన్నట్టు "వారికి దేవభాషేగాని దేశభాష పనికిరాదు."[1] ఆ రోజుల్లో విద్యంటే సాంస్కృతిక విద్యే విద్య. మిగతా భాషలను వారు ఈసడించేవారు. చరిత్ర తొలిరోజుల్లో ప్రాకృత భాష గురించి వేదాల తిరువెంగళాచార్యులవారు వ్రాసింది అక్షరాల తెలుగు భాషకు వర్తిస్తుంది.

> "బ్రాహ్మణుల వైదిక మత ప్రభావం విశేషించి అత్యుచ్ఛస్థితిలో వుండేటప్పుడు జన సామాన్యపు వ్యవహారంలో ఉన్న ఈ భాషను ఇంతింతనరాని నిరాదరణ చేసేవాళ్ళు. అంతేకాదు, అస లితర జాతులను ఎక్కువ ఆదరింపక తామే సర్వోత్కృష్టులమనే భావంతో ఇతరులందరినీ ఒకవిధమైన అనాదర బుద్ధితో చూసేవారు కూడ. నీతి, ధర్మము మొదలైనవి అన్నీ బ్రాహ్మలు శాసించిన తీరున ఉండాల్సిందేగాని వేరే తోవలేదు. భగవత్సేవ, మతము, యోగానుష్ఠానము, ధర్మచింత, తత్వవిజ్ఞానము మొదలైనవి అన్నీ వెనకబడ్డవి. కొద్దిమంది బ్రాహ్మణుల చేతిలో సంఘానికి సంబంధించిన అధికారాలన్నీ ఉండిపోయి, వారే సంఘానికి సర్వాధికారు లైరి. ఇతరులకు వైదికభాష దుర్జ్ఞేయమై అందలి రహస్యములు తెలియరాని వయ్యెను. అధ్యాపనాధికారము బ్రాహ్మడికే తప్ప ఇతరులకు లేదయ్యెను. అందువల్ల బ్రాహ్మడాడిందాట, పాడింది పాట అయ్యెను. అతడికి రాజ్యశాసకుడగు క్షత్రియుడు తోడయ్యెను. ఇకనతడి అధికారానికి అడ్డుతగిలేదేముంది?"[2]

అన్యమతాలకు ఆదరణ

జనసామాన్యం పాల్గొనే అవకాశం లేని మతం కొద్దిమంది అధికారజాతులకే పరిమితమైంది. అప్పుడు జైనతీర్థంకరులూ, బుద్ధుడూ మొదలైనవాళ్ళు సర్వజనయోగ్యమైన మతాన్ని బోధించారు. జనసామాన్యం, స్త్రీజనం 'అమ్మయ్య!' అని నిట్టూర్చి ఆ మతాలను ఆదరించి ఆచరింపసాగారు. అందుకే రాజపురుషులు వైదిక మతానికి ఆశ్రయమిచ్చినా, ఆడవాళ్ళు జైన బౌద్ధ మతాలకు దానధర్మాలు చేయడం, ఆరామాలు కట్టించడం జరిగింది. రాజరాజు కాలానికి వెయ్యేళ్ళకు ముందుగానే తెలుగునాట బౌద్ధజైనాలు కాళ్ళు నిలదొక్కుకొన్నాయి.

---

1. రాజరాజనరేంద్ర పట్టాభిషేకం సంచిక పుట 201.
2. గిడుగువారి సప్తతి తమ జన్మదినోత్సవ సంపుటము – 'వ్యాససంగ్రహం' వేదాల తిరువెంగళాచార్యులు గారి 'ప్రాకృత భాషా చరిత్రము'. పుటలు 272–273.

ఆ మతాలు జనసామాన్యపు భాషలలో ప్రబోధాలు చేసేవి. అందరికీ తెలిసే విధంగా పాటలు, గాథలు ప్రచారంలో వుండేవి. జనమంతా ఈ మతాలవైపు ఎగబడ్డప్పుడు బ్రాహ్మణ్యానికి గంగవెర్రులెత్తాయి. వైదిక మతాన్ని పునరుద్ధరించాలనే సంకల్పం వచ్చింది. కుమారిలభట్టులాంటి మేధావులు బౌద్ధజైన శాస్త్రాలను చదివి వాటిని ఖండించసాగారు. శంకరాచార్యులు బుద్ధుడిని విష్ణుమూర్తి తొమ్మిదవ అవతారం చేసి జనసామాన్యాన్ని మంత్రముగ్ధుల్ని చేశారు. అనార్యుల దేవత రుద్రుడు పురాణాల కెక్కడం ఏనాడో జరిగింది. శివపూజ వైదిక మతమయింది.

రాజరాజు 'రాజా' సంకల్పం – నన్నయ శ్రీకారం

చోళుల కాలంలో, దక్షిణాదిని శైవమతం మూడు పువ్వులూ ఆరు కాయలూ కాచినది. రాజరాజ నరేంద్రుడు తన అమ్మగారింట ఈ మతాన్ని అభిమానించి ఉంటాడు. తన తల్లిదండ్రులు జైనులైనా, తాను శైవమతాన్ని స్వీకరించాడు. తన సవతి తమ్ముడితో రాజ్యం కోసం తాను చేసిన యుద్ధాలలో బ్రాహ్మణ్యం తనకు సహాయం చేసి జనాన్ని తనవైపు తిప్పి ఉంటుంది. రాజరాజు బ్రాహ్మణభక్తి ఇంతా అంతా కాదు. అతడు వర్ణాశ్రమ ధర్మాలపై ఆధారపడే మతాన్ని ఉద్ధరించదలిచాడు.

> ''అగ్రవర్ణముల అధికారము పదిలపరచుటకునై ప్రాచీన మత గ్రంథములను దేశభాషలలోనికి బరివర్తింపజేసిరి. వర్ణాశ్రమ ధర్మపరాయణు లును తమ వైరులు ప్రయోగించిన దేశభాషా ప్రకటనాస్త్రమే తాము ను ప్రయోగింపవలసిన వారైరి. ఇదియు కాబోలు, తొలుదొల్త న పంచమ వేదమును స్పృశించుటకు హేతువు. అసలు వేదమైన ఋగ్వేదమును, దాని ననుసరించి కల్పింపబడిన తక్కిన మూటిని జనులకు కనబరచుట పాతకముకదా! పాతకము కానున్నను లాభకరము కానేరదు. ఋగ్వేదమును వివక్షతో జదివినవారు వర్ణధర్మముల నంగీకరింపరనుట నిశ్చితార్థము కాదు. కావున పంచమ వేదమే ప్రయోజనకారియైన కృతి. దానిని మొట్టమొదట తెనిగించిరి.[3]

అని కట్టమంచి రామలింగారెడ్డిగారు చెప్పినది చారిత్రక సత్యము.

అందుకే నన్నయగారికి విద్వజ్జనుల అనుగ్రహం అవసరమైంది. ఆ రోజుల్లో విద్యాపరిషత్తులు ఉండేవి. వీటినే ఆయన సత్సభలు అన్నారు. ప్రారంభంలోనే ఈ సభలకు ఆయన నమస్కారం చేశారు.

> ''పరమ వివేకసౌరభ విభాసిత సద్గుణ పుంజవారి జో
> త్కరరుచిరంబులై సకలగమ్యు సుతీర్థములై మహామనో
> హర సుచరిత్రపావన పయః పరిపూర్ణములైన సత్సభాం
> తర సరసీవనంబుల ముదంబొనరం గొనియాడి వేడుకన్.''

3. రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక. పుట. 201.

ఆయన భారత రచనకు ఉపక్రమించారు. ఇటువంటి సత్సభలు అనాదిగా ఉండేవను కోవచ్చు. తమిళ వాఙ్మయంలో మూడు సంఘాలు ఉండేవి. 'సంగం' అంగీకరించినదే ఆ రోజుల్లో కావ్యమయ్యేది. కన్నడ భాషలో కూడ కవి సంఘాలు ఉండేవి. రాజాస్థానాల లోనే, రాజాశ్రయంతోనే ఈ కవి సంఘాలు విలసిల్లేవి. కన్నడంలో రన్నకవి తనను ఇలా పొగడుకొన్నాడు.

''కొండాటద సామంతర
మండళికర సకల చక్రవర్తిగళ సభా
మండలదొ ళుభయ కవిముఖ
మండన మాగిర్ప రత్న మీ కవిరత్నం.''

తెలుగు గడ్డమీద పుట్టిన కవులంతా కన్నడం అభ్యసించి కర్ణాటకులను ఆశ్రయించి, జైనమతాన్ని స్వీకరించి ఆ భాషలో ఆ మతాన్ని నుతిస్తూ కావ్యాలు వ్రాయడం తెలుగు రాజుల కళ్ళు తెరిపించింది. రాజరాజు ఇటు కన్నడ సాహిత్యం గురించి, అటు తమిళ సాహిత్యం గురించి తెలుసుకున్నాక తెలుగులో ఉద్గ్రంథమైన రచన సాగితే తప్పులేదని భావించి ఉంటాడు.

భారతానికి భారీ ప్రచారం

ఆ కాలంనాటికే కన్నడంలో 'విక్రమార్జున విజయ'మనే పేరుతో పంపభారతం, 'గదాయుద్ధం' అనే మరొక కావ్యం భారతాన్ని ప్రచారంలోకి తెచ్చింది. తమిళంలో కూడా 'వెణ్బా' గీతాలలో భారత రచన జరిగింది. దానిని క్రీ.శ. 7, 8 శతాబ్దాలలో పెరిందేవనార్‌కవి రచించాడు. సంస్కృత భారతాన్నే దేవాలయాలలో పురాణంగా చెప్పేవారు. 7-వ శతాబ్దిలో పరమేశ్వరవర్మ అనే పల్లవరాజు ఒక దేవాలయంలో భారతాన్ని పురాణంగా చదివి చెప్పినవాళ్ళకు ఒక ఊరిలో ఒక భాగాన్ని ఇచ్చాడని చెప్పే తమిళ శాసనమొకటి కనబడుతున్నది.[4]

ఇక సంస్కృతంలో పంచరాత్రం, దూతకావ్యం, మధ్యమవ్యాయోగం, దూతఘటోత్కచం, కర్ణభారం, ఊరుభంగం, బాలచరితం అనే భాసుని భారత నాటకాలు పాండవుల కథను రసవత్తరంగా చిత్రించాయి. రాజరాజు ఉదాత్త రసాన్వితాలైన కావ్య నాటకక్రమాలు పెక్కింటిని చూశానన్నాడు. అతని నాటికే ''భారతాది కథల చీరమరుగుల ఆటగా బొమ్మలనాడించే'' గ్రామీణ వినోదం ఉందో లేదోగాని భారతం కావ్యరూపంలో తెలుగులో అవతరించడానికి పరిస్థితులు పరిపక్వంగా ఉన్నాయి.

---

4. ఆంధ్ర వాఙ్మయచరిత్ర సర్వస్వము. శిష్ట్లా రామకృష్ణశాస్త్రిగారు. పు. 165

భారత ప్రారంభం

''బహుభాషల బహు విధముల బహు జనములవలన వినుచు భారత బద్ధస్పృహు''డగు రాజరాజు ఆనతిచ్చిన భారత రచన తెలుగులో ప్రారంభమయింది.

''సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తి లో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తి నిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురు డయ్యె జగద్ధితంబుగన్''

అయితే భారత రచన సరిగ్గా ఎప్పుడు, ఏ సంవత్సరంలో జరిగింది అనే ప్రశ్న వేసుకొంటే, ఇది రాజరాజు రాజకీయ చరిత్ర చూస్తేనేగాని విశదమవదు. భారతం అవతారికలో చెప్పిన మాటలనూ, రాజరాజు చరిత్రనూ తైపారువేసి చూడాలి.

రాజుగా రాజరాజు పాట్లు

క్రీ.శ. 1019లో విమలాదిత్యుడు మరణించాడు. అతని తరువాత రాజరాజు రాజ్యానికి వచ్చాడు. అయినా అతని సవతి తమ్ముడు దానికి అడ్డువచ్చాడు. అందుచేత రాజరాజుకు రాజ్యం వశం కాలేదు. విజయాదిత్యుడు కర్ణాటకుల సహాయంతోనూ, కళింగ గంగరాజుల సఖ్యంతోనూ వేంగీ సింహాసనాన్ని ఆక్రమించుకొన్నాడు. రాజరాజు చేసేదిలేక తమిళదేశంలోని మేనమామల రాజ్యానికి వెళ్ళాడు. ఆ మేనమామ సామాన్యుడు కాడు; చక్రవర్తి. అతడు మేనల్లుని దుస్థితి చూసి జాలిపడ్డాడు. తన సైన్యాన్ని రెండుపాయలుగా చేసి, ఒకటి రాష్ట్రకూటుల మీదికీ, ఇంకోటి వేంగీపైకి పంపించాడు.

చోళచక్రవర్తుల సేనాని వేంగిని జయించి విజయాదిత్యుని పారద్రోలి రాజ్యాన్ని రాజరాజుకు అప్పగించాడు. రాజరాజు క్రీ.శ. 1022 ఆగస్టు 22వ తేదీన పట్టాభిషేకం చేసుకొన్నాడు. అతడు పట్టం పట్టుకొని పదేళ్ళయినా నడవకుండానే రాజ్యం కోల్పోయాడు. అతని సవతి తమ్ముడు విజయాదిత్యుడు క్రీ.శ. 1031లో కర్ణాటక సైన్యాన్ని వెంటతీసుకొచ్చి వేంగీ రాజధాని అయిన బెజవాడను స్వాధీనపరచుకొని పట్టాభిషేకం చేసుకొన్నాడు. రాజరాజు మళ్ళా మేనమామల దేశానికి కాందిశీకుడై వెళ్ళాడు.

చోళ చక్రవర్తి ఈసారి ముగ్గురు దండనాయకులతో పెద్ద సైన్యాన్ని రాజరాజుకు సహాయంగా పంపించాడు. యుద్ధంలో ముగ్గురు దండ నాయకులూ మరణించారు. కాని క్రీ.శ. 1035లో రాజరాజు మళ్ళా తన బెజవాడ సింహాసనాన్ని సాధించుకున్నాడు. మళ్ళీ పట్టుమని పదేళ్ళయినా సుఖంగా పరిపాలన చేయకుండానే కష్టాలు దాపురించాయి. 1039లో మళ్ళా మేనమామ వద్దకు వెళ్ళవలసి వచ్చింది. క్రీ.శ. 1044లో కర్ణాటకులు తాము వేంగీ పురవరేశ్వరులమని ప్రకటించుకొన్నారు. అంటే వేంగీని జయించారన్నమాట. రాజరాజుకు వేంగీలో కొంతభాగమే దక్కింది. అంతా స్వాధీనం చేసుకోవడానికి

రాజరాజు మళ్ళా అత్తవారింటికి సహాయానికి వెళ్ళాడు. అయితే అతని మేనమామ అంతకు రెండేళ్ళ పూర్వమే మరణించాడు. మరది రాజ్యమేలుతున్నాడు. అతడు 1047లో రాజరాజును మళ్ళీ వేంగియందు చేర్చాడు. అయినా బలవంతులైన కర్ణాటకుల సహాయంతో విజయాదిత్యుడు ఒత్తిడితెచ్చి రాజ్యం ఆక్రమించుకున్నాడు.

క్రీ.శ. 1050లో వ్రాయించిన ఒక శాసనంలో తంజావూరికి సమీపంలో ఉన్న తిరువయ్యూరులోని ఒక శివాలయానికి రాజరాజు 300 మాడలు దానం చేశాడు. దీనినిబట్టి చూస్తే స్వరాష్ట్రాన్ని ఆక్రమించుకొన్న కర్ణాటక చాళుక్యులను వెళ్ళగొట్టడానికి రాజరాజు తన మరిదియైన రాజాధిరాజును సహాయం వేడపోయినట్టు తోస్తున్నది.[5] అయితే ఇది విఫలమైంది కాబోలు.

> "ఈ పరిస్థితులను చూచిన రాజరాజ నరేంద్రుడును, అతని కుల బ్రాహ్మడు నన్నయభట్టును రాజనీతిని ప్రయోగించిరి. పశ్చిమ చాళుక్యులకు ప్రధానమాత్యుడైన వాణస మధుసూనయ్యకు బంధువైన వాణస నారాయణభట్టు నన్నయభట్టునకు బాల్యమున సహాధ్యాయి. ఆ కారణమును పురస్కరించుకొని నన్నయ రాజరాజ నరేంద్రునికి పశ్చిమ చాళుక్యులతో మైత్రి కుదిర్చి, నారాయణభట్టును తమ యాస్థాన మందు చాళుక్యుల రాయబారిగా నుంచుకొని రాజమహేంద్రవరమునకు మార్పించి రాజరాజ నరేంద్రునికి శాంతి చేకూర్చెను."[6]

రాజరాజు కాలంవరకూ వేంగీదేశానికి బెజవాడ రాజధానియై ఉండేది. కర్ణాటక సామ్రాజ్యం యొక్క సరిహద్దుకు అది అత్యంత సమీపస్థమై ఉండిన కారణంచేత అది మాటిమాటికి శత్రువుల తాకిడికి లోనవుతూ వచ్చింది. కాబట్టి రాజరాజు శత్రువులకు సులువుగా అందుబాటుకాని స్థలంలో, రాజ్యానికి మధ్యన, గోదావరి ఉత్తరపు ఒడ్డున తన పేర రాజమహేంద్రమనే కొత్త రాజధాని నిర్మించుకొన్నాడు.

నారాయణభట్టు

చాళుక్యులతో సంధి చేసుకోవడం, కొత్త రాజధానికి మారడం క్రీ.శ. 1051లో జరిగింది. అప్పుడే నారాయణభట్టుకు రాజరాజు కోరుమిల్లి అగ్రహారాన్ని ఇచ్చాడు. ఈ దానశాసనాన్ని నన్నయగారే స్వయంగా వ్రాశారు. ఈ నారాయణభట్టు వాఙ్మయ ధురంధరుడు. సంస్కృత కర్ణాటక ప్రాకృత పైశాచికాంధ్రభాషలలో కవిరాజ శేఖరుడు. 'కవీభవజ్రాంకుశ' మనే బిరుదున్నవాడు. ఈయన తెలుగుదేశానికి రావడం చాలా మేలైంది. ఇతడు భాషాయుద్ధాలలో 'పాయక పాకశాసనునికి భారత ఘోరరణంలో నారాయణుడిలాగా' నన్నయగారు 'అభిమతంగ' తోడ్పడ్డాడు. అందువల్లనే భారత రచన జరిగింది.

5. తెలుగుభాషాసమితి విజ్ఞానసర్వస్వం, 3వ సంపుటం, పుట. 165
6. అదే పుస్తకం, పుట. 186

వేంగిదేశానికి నాయకరత్నమైన రాజమహేంద్రపురంలో కొలువుండి రాజరాజు తనను భారతం వ్రాయమని అడిగినట్టు నన్నయగారు భారతం అవతారికలో చెప్పారు. అందుచేత తెలుగులో ఆదికావ్య రచన క్రీ.శ. 1051 తరువాతనే జరిగి ఉంటుంది. అప్పటికిగాని తూర్పు చాళుక్యుల రాజధాని బెజవాడనుండి రాజమహేంద్రపురానికి మారలేదు.

రచనలో చిక్కులు - ఉత్తుత్త వార్తలు

రాజానుమతంతో, విద్వజ్జనుల అనుగ్రహంతో నన్నయగారు భారత రచనకు ఉపక్రమించాక "భాషాచ్ఛందస్సులు సమకూర్చుకొనుటకు గూడ గ్లేశపడవలసి వచ్చెను" అని పండితులు చెప్పుకొంటారు. ఆయన "తన కాలమున ప్రజల వ్యవహారమున నుండినదియు, శాసనాదులందుండి నదియు నగు దేశ్యభాషనంతను పరిశీలించి, వైవిధ్యముతో గూడి చిత్రచిత్రముగా నుండినయందలి రూపములకు తత్సమశబ్దములకు వలెనే యొక స్థిరమైన రూపము నొసగుటకు ప్రయత్నించెను" అని కూడ చెప్పుకుంటారు. ఇదంతా మన ఊహేగాని నన్నయగారు ఎక్కడా చెప్పలేదు. అగాధమైన భారతం అనువాదం చేయడానికి తటపటాయించారేగాని ఛందస్సు గురించి, భాష గురించి ఆయన ఎక్కడా బాధపడినట్టు లేదు.

'శబ్దశాసన' బిరుదుకు అసలు కారణం

"నన్నయకు శబ్దశాసనత్వమును కలిగించిన ప్రధాన కారణములలో అతడు అవ్యవస్థితమైన తెలుగు శబ్దములకొక వ్యవస్థను ఏర్పరచి, దానికి రూపస్థైర్యము నొసగుట యొకటని నిస్సందేహముగా చెప్పవచ్చును" అని పండితులందరూ భావిస్తారుగాని నన్నయ భారతాంధ్రీకరణానికి ముందే విపుల శబ్దశాసనుడు. అంతకుముందు తెలుగు పదాలను శాసించడానికి ఉత్తమ తెలుగు కావ్యమే లేదాయె. నన్నయగారు వ్రాసిన శాసనాలు సంస్కృతంలోనివాయె. కాబట్టి ఆయనకు 'శబ్దశాసను'డనే బిరుదు తెలుగు శబ్దాలకి ఒక వ్యవస్థను ఏర్పరచినందువల్ల వచ్చి ఉండదు.

నన్నయగారి కాలానికి ముందే తెలుగులో కనీసం పది ఛందోభేదాలు తెలుగుదేశంలో విపులంగా ప్రచారంలో ఉండేవని చూశాం. క్రీ.శ. 940లో, అంటే భారత రచనా ప్రారంభానికి నూటపదేళ్ళకు ముందే మల్లియ రేచన కవిజనాశ్రయమనే ఛందోగ్రంథాన్ని రచించారని తెలుసుకొన్నాం. నన్నయగారి కాలానికి చాలా ముందుగానే ఆయన వ్రాసిన వచనానికి దగ్గరలో ఉండే వచనం చాళుక్యభీముని కొఱవి శాసనంలో ఉందని గమనించాం. ఇక నన్నయగారి సమకాలిక రచనలు చూద్దాం. క్రీ.శ. 1023 నుండి 1060 దాకా బస్తరును పాలించిన చోడుల శాసనాలలోని భాష నన్నయగారి భారత రచనాకాలంనాటికీ, అంతకు ముందూ ఉన్న తెలుగు భాష స్వరూపాన్ని తెలియజేస్తుంది - ఆ బస్తరు శాసనాలలో కొన్ని శిథిలాలు. అందుచేత రెండు మూడు శాసనాలు, ఒకే రాజు వేయించినవి కలిపి చదువుకొంటే ఈ క్రింద వచనం వస్తుంది.

''స్వస్తి సహస్ర ఫణామణికిరణనికరావభాసుర, నాగ వంశోద్భవ, భోగవతీ పురవరేశ్వర విశదజయపటుపటహా గాంభీర్య యశోలంకృత దశదిశాంతరాళ ధేనువ్యాఘ్రులాంఛన, చిందకుల తిలక కమలభాస్కర, మహేశ్వర చరణ కమల దళితకింజల్క పుంజపింజరిత భ్రమరాయమానులై శ్రీ మజ్జగదేకభూషణ మహారాజుల రాజ్యాభివృద్ధి ప్రవర్ధమానములై ఆచంద్రార్కముగా.... బారసూరి నెలవీట సుఖసంకథా వినోదంబుల నుండగా శకంద్రిప కాలాతీత సంవత్సరంబుల 982 నేటి శార్వరి సంవత్సరంబున కార్తీకమాసంబున శుద్ధ పంచమి సోమవారమునాడు స్వస్తి అరిదుర్ధ రావర భూజాసిభానుర ప్రచండ ప్రద్యోత్కర దినకరకులనందన కాశ్యపగోత్ర కరికాలాన్వయవారినాతకంబల పఱభూషణ రక్త ధ్వజసింఘలాంఛన ఒఱయూరు పురవరేశ్వ చోడవంశోద్భవ అమ్మగామ పురవరేశ్వరులైన శ్రీ మన్మహామండలేశ్వర చంద్రాదిత్యరాజులు రాజధాని బారసూరన్ దమ వేయించిన చంద్రాదిత్య నామాంకిత తటాకంబున శ్వతుననదమ ప్రతిష్ఠసేసిన చంద్రాదిత్యేశ్వరంబైన ఈశ్వరాలయంబు నకు.... నిలిపిన శిలాస్తంభ శాసనము ఇవ్విధంబున నిద్దేవాలయంబునకు స్థానపతి ధర్మరాశి దత్తటాక శివాలయ సమీపంబున నిజస్థాపితంబైన చంద్రాదిత్యా నందనకర వనంబును దానిక ఇచ్చినది ఇల్లు. దీనికి గమ్మలవాడు బుద్ధనాయకుఁడునుణముమినాయకుఁడును సుంకయరేమ నాయకుఁడు శ్రీకరణముమినాయకుఁడు రాజగురులు రుద్రపండితులు కుమార నారాయణసెట్టియు నదియంకలసెట్టియు అంగడిదుగ్గిసెట్టి వీరు సాక్షిపురుషులుగా నీశ్వరయప్రాలు దీనికిన్ గాలకాలాంతమున్ జననీక నడమంగాదని సృజియించిన బాహత్తరి నియోగములయం దెవ్వడేని కల్లెసనిన.... జల్పి ఈకంభస్థితి నెల్పిన రాజుగల్గెనేని వారణాసి వేయిగవిలల వేవురు బ్రాహ్మణల జంపి నెత్తురు ద్రాగినవారు... (ఖండరించినవాడు భీమాచారి)[7]

నన్నయగారి కాలందే ఇంకొక శాసనం - క్రీ.శ. 1043 నాటిది - దొరుకుతున్నది. దీనిని చూడండి :

''స్వస్తి శకవర్షంబుల్ఱ౯౬౫ నాటి సుభానుసంవత్సరమున నుత్తరాయణ నిమిత్తమున నగ్రహారము వెలనాటి వలివేరి త్రిపురుహదేవరకు నాచంద్రార్క మఖండవర్తిదివియలు మూఁటికి దండనాయక తిక్కపయ్య నాయకు లిచ్చిన గొఱియలు నూటయేంబది. వీనిని జేకొని సంతానక్రమమున నిత్యం మూఁడుమానికలు వేయి ముమ్మడి భీమనడుం బోయంగలవాడు ఇద్దేవరక యన్నుందీ యగ్రహారము పెరువలినగ్గియ షడంగవిభాట్లు ఆచంద్రార్క

7. దక్షిణ భారత శాసనములు, 10-వ సంపుటి, నెంబరు 643 నుంచి 646 దాకా.

మఖండవత్తి దివియ యొకొంటికి నిచ్చిన గొఱియ లేంభది ఇందుల బ్రహ్మదేవరకు నొంగేఋమార్గమున దేసెట్టి మాహాసామంతనంబయ కొడుకు మండలిక గన్నయ యాచంద్రార్క మఖండవత్తి దివియ యొకంటికి నిచ్చిన గొఱియ లేంభది.''[8]

కావ్యభాష - శైలి - స్పెల్లింగులు

నన్నయగారి కాలంలో ఒకే మాటను వివిధ ప్రాంతాలవాళ్లు రకరకాల ఉచ్చరించడంవల్ల వేరు వేరు 'స్పెల్లింగు'లతో వ్రాయడం జరిగింది. నన్నయగారు తాము ఉచ్చరించేటట్టు వ్రాసుకొన్నారు. అదే మనకు కావ్యభాషగా మిగిలింది. నన్నయగారు తమ ఉచ్చారణకు ఏయే వర్ణాలను వాడారో మనకు తెలియదు. ఆయన వ్రాసుకొన్న ప్రతి మనకు దొరకలేదు. కాని అది రూపాంతరాలు పొంది మనకు సుపరిచితమైంది. నన్నయగారు తమ కాలంలో ఉండిన భాషనంతటినీ వాడి ఉండరు. ఆయన వాడిన దేశ్యాలే మనం అలవాటుపడినవైనాయి. ఆయన వాడని బోలెడన్ని మాటలు - నన్నెచోడుడూ, పండితారాధ్యుడు వాడిన ఆనాటి పాత మాటలు మనకు కొత్తగా కనబడుతున్నాయి.

పద సంపద పెంపు - పెంపులో నష్టము

తన కాలంలో ఉన్న తెలుగు మాటలూ ఉత్తమ కావ్యరచనకు సరిపోవని నన్నయగారు సంస్కృత శబ్దాలను తెలుగులోకి తీసుకువచ్చారని మరొక ఊహ పండితులలో ఉంది. అప్పటికే కన్నడ భాషలోనికి బోలెడన్ని తత్సమాలు సమ సంస్కృతాలనే పేరుతో జొరబడ్డాయి. తెలుగు శాసనాల్లలో కూడ అవి కనబడతాయి. పంపనగారు, పొన్నమయ్యగారు, రన్నడు మొదలైనవారు సంస్కృత శబ్దాలను ఎలాగ కన్నడించారో అలాగే తెలుగు కవులు గూడ తత్సమాలను తెలుగు చేశారు. నన్నయగారు ఈ సంప్రదాయాన్నే అనుసరించారు. దీనివల్ల భాషలో పదసంపద హెచ్చినా కొంత నష్టంకూడ కలుగకపోలేదు.

''తెలుగుకు కొన్నిపట్ల సంస్కృత సాహాయ్యం అతి మాత్రమైనట్టు కనపడుతుంది. వాడుకలో కొన్ని సంస్కృత శబ్దములు తెలుగు శబ్దముల స్థానమును పూర్తిగా ఆక్రమించినవి. కొన్ని వాటితో పోటీ చేస్తున్నవి. కొన్ని వాటితో ఉమ్మడికూడుతున్నవి. తెలుగుదేశము చాలాభాగము సముద్రమును ఒరసి ఉన్నది. అందుచేత సముద్రమునకు తెలుగు పేరు ఏదో వాడుకలో ఉండే ఉంటుంది. అది ఇప్పుడు వాడుకలో కనబడదు. సంస్కృత శబ్దమైన 'సముద్రము' అనేదే దేశమందు అంతటనూ, పండితులలోనూ, పామరుల లోనూ కూడ వాడుకలో ఉన్నది. అక్కడక్కడ దీని వికృతి అయిన

8. దక్షిణ భారత శాసనములు, 10వ సంపుటి. నెంబరు.6

'సంభ్రమము' అనే శబ్దమున్ను వినబడుతున్నది. 'మనుష్య' శబ్దమునకు సరియైన తెలుగు మాట ఇప్పుడు ఏదీ కనబడదు. కొన్ని సంస్కృత శబ్దములు వాటికి సరి అయిన తెలుగు శబ్దములు ఉన్నప్పటికీ వాటిని పుస్తకాలలో అణగదొక్కి తామే వాడుకలోకి వచ్చినవి. 'భయము' 'వెఱపు'ను తోసివేస్తూ ఉన్నది. 'జ్వరము'న్ను, 'ఉష్ణము'న్ను, 'వేకి'ని గెంటి వేసినవి. 'కుక్క' 'నాయి'ని పారదోలింది. 'దేవుడు' 'వేల్పు'ను వినబడనీయ లేదు. 'వ్యవసాయము' 'సేద్యము' మూలకు నెట్టినది. 'మాంసము' 'ఎరచి' 'నంజుడు', 'పొలసు' శబ్దములకు తోసిరాజు చెప్పినది. 'సొమ్ము' 'విడిముడి'ని కనబడనీయదు. 'ప్రాణము' 'ఉసురు'ను తొక్కిపెట్టినది. 'రక్తము' 'నెత్తురు'తో పోటీ చేస్తున్నది.''[9]

అని బులుసు పాపయ్యశాస్త్రిగారు వాపోయిన దాంట్లో అక్షరాలా నిజముంది.

ఈ విషయాన్ని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారుకూడ ''సంస్కృత భాషా సంపర్కముచే తెలుగునకు గొప్ప మేలుకలిగినను కొంత కీడు కూడ కలిగినది'' అన్నారు.[10] ''వర్తమానాంధ్రభాషలో అచ్చికపదములకన్నా సంస్కృత భాగమే విపులముగా నున్నది'' అని చెప్పాడు. ఈ వాక్యంలోనే 'లో', 'కన్నా', 'గానున్నది' అనేవి తప్పించి మిగతావన్నీ సంస్కృత శబ్దాలే. ఇది తరతరాల నుంచీ చదువుకొన్న వాళ్ళు తమ భావాలను తత్సమాలున్న మాటలతోనే చెప్పుకోవడంవల్ల వచ్చిన వైపరీత్యం. అర్థం లేని నియమాలకు లొంగడం కూడ ఒక కారణమే.

అర్థాంతరంగా వచ్చిన అరసున్న

మాటవరసకు నిడుదవోలు వెంకటరావుగారు ''(ఇ-)ప్పుడు సర్వసాధారణముగాఁ బ్రయోగింపబడు నర్ధబిందురేఖ యిటీవలఁ గల్పింపబడినదిగాని పూర్వము లేదనియుఁదేలుచున్నది''. అని అర్ధంతరంగా వచ్చిన అరసున్నను ఆ వాక్యంలోనే అయిదుసార్లు వాడారు.[11]

నన్నయగారు సంస్కృత వ్యాకరణపు మర్యాదలనే తెలుగులోకి తెచ్చారు. ''ద్రోణుండు మఱి ద్రుపదుండు... సఖులయి ధనుర్వేదమగ్ని వేశుల తోడ నర్థిఁగఱచి[12] అన్నదాంట్లో 'తోడ' అనే విభక్తి, అభిమన్యుడు 'ధౌమ్యు'తో వేదం చదవడం, ధనుంజయునితో ధనుర్వేదం అభ్యసించడం[13] అన్నవాటిలో 'తో' అనే విభక్తి సంస్కృత కారకచ్ఛాయలే. ('ఉపయోగంబునం దాఖ్యాతకుం దోడవకర్ణకంబగు అని చిన్నయసూరి

---

9. గిడుగువారి సంచిక, 'తెలుగు' వ్యాసం, పుట. 4
10. 'ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి', పుట. 65.
11. 'తెలుగు కవుల చరిత్ర', పుటలు 45, 46
12. భారతం, ఆది 7-5.
13. భారతం, ఆది 8-227.

సూత్రీకరించవలసి వచ్చింది). మనం ఇవాళ చదువు గురువువద్ద, అయ్యవారి దగ్గర నేర్చుకొంటాంగాని అతని 'తో' కాదు.

సజీవభాష చంపినా చావదు

ఎన్ని తత్సమ పదాలు తెచ్చినా, ఎంత సంస్కృత కారకచ్ఛాయలనే దింపినా నన్నయగారు తమకాలంనాటి సజీవ భాషలోనే గ్రంథ రచన చేశారు. భారతంలోని నిరూపితార్థం వివరించి చెప్పడానికి వ్రాసినదాయె. ఆనాటి సామెతలు, పలుకుబళ్ళు, నుడికారపు సొంపులు ఒకరకంగా చూస్తే నేటికీ మారలేదు. భావాలు నాటికీ నేటికీ ఒకటే. 'కుంతికడుపు చల్లగా పుట్టిన ఘనబుజుడు'[14] అనే ప్రయోగం నన్నయగారు ఆంధ్రభాషా సరస్వతి కడుపు చల్లగా వాడారు. 'వెతుకుతున్న తీగ కాళ్ళకు తగిలిం'దనే సామెత అప్పుడూ ఉంది. 'రోయు తీగె కాళ్ళం బెనగెందా ననుచు[14-2] అని తన కాలపు మాటలలో వాడారు. 'గుండెలమీద చెయ్యి వేసుకొని హాయిగా నిద్రపోవడం' అనే నుడికారం నాటికీ నేటికీ ఉంది. ''అర్జునువలని భయముసెడి ఱొమ్మున జేయిడి నిద్రవోయె.''[14-3] 'వంటయింటి కుందేలు' అనే సామెత నాటికీ నేటికీ ఒక్కలాగే ఉన్నట్లు నేటి భారత ప్రతులవల్ల తెలుస్తున్నది. ఆదిపర్వం 6-వ ఆశ్వాసంలో నన్నయగారు ''వంటయిల్ కుందెలుసొచ్చె'' అని ప్రయోగించారు. అయితే దీనినే నన్నెచోడుడు తన కుమారసంభవం 12-వ అశ్వాసంలోని 87వ పద్యంలో ''వేటకాని యిల్లు వెఱువక కుందెలు సొచ్చినట్టు'' అని వాడాడు. అందుచేత ప్రాచీనరూపం ''వేంటయిల్ కుందెలు సొచ్చి'' కావచ్చును. దీర్ఘంమీద పూర్ణబిందువు పోయి 'వెంటయిల్' 'వంటయిల్'గా మారిందేమో అనే అనుమానం కలుగుతున్నది.

మారని మానవ స్వభావం

మాటలు మారవచ్చు: కొత్త పలుకుబళ్లు రావచ్చుగాని మానవ స్వభావం ఎప్పుడూ ఒక్కలాగే వుంటుంది. ఇతిహాసాన్ని తెనిగిస్తున్నా అందులోని పాత్రల స్వభావాలను స్పష్టంగా చిత్రించడంలో నన్నయగారు తమ 'నేర్పువిధము' ఏమిటో చూపించారు. పాత్రలను తొలిసారి పరిచయం చేస్తూన్నప్పుడే వాళ్ళ స్వభావాలను తెలియజేసే విశేషణాలను వాడుతారు. పాత్రలు పరస్పరం వాడే సంబోధనలలో చాలా ఔచిత్యం పాటిస్తారు.

మాటల్లో ఔచిత్యం

'ఎవరూ నీసాటి రానట్టు నీకు విలువిద్య నేర్పుతా'నని ద్రోణాచార్యులవారు అర్జునునికి మాట ఇచ్చారు. అలా ఇచ్చిన తరువాత, నేర్పాక అర్జునుడు ఏకలవ్యుణ్ణి చూచాడు. అతని పాటవాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఏకాంతంగా ద్రోణునితో ఇలా చెప్పాడు :

---

14. భారతం, ఆది 6-19,

14-2. ఆది 5-220.

14-3. ఆది 6-63.

''విలువిద్య నొరులు నీ క
గ్గలముగ లేకుండ నిన్ను గఱపుదు నని మున్
బలికితిరి, నాక కాదీ
త్రిలోకముల కధికు జూచితిమి యొక యెఱుకున్.

నాకంటెను మీకంటెను
లోకములో నధికు డతిబలుండు ధనుర్వి
ద్యాకౌశలము నాతడు
మీకుం బ్రియశిష్యుడటె యమిథ్యావచనా!''[15]

చిట్టచివర ఈ సంబోధన వేయడంలో ఎంతో అర్థమయింది. 'అబద్ధాలాడనివాడా!' అని పిలవడంలోనే 'నీ మాట నిలబెట్టుకో' అనే సూచన వుంది. అందుకే ఇలా చెప్పగానే 'విని ద్రోణుండదరిపడి 'వాణ్ణి చూద్దాం పద' అన్నాడట.

ఖాండవ దహనానికి ముందు 'ఘనభుజ! ఇది గాండీవం బనబరగిన ధనువు' అని అగ్నిహోత్రుడు అర్జునునికి అపురూపమైన విల్లు ఇచ్చాడు. ఇలా ఇస్తూ 'ఘనభుజ' అనడంలో సారస్యం వుంది. భుజబలం బాగా ఉన్నవాడుగాని దానిని ప్రయోగించలేడు.

అలవాటులో పొరపాటు

పోను పోను భారతంలో ఇంత చక్కని ఔచిత్యవంతమైన పదాలు వాడిన నన్నయగారు ప్రారంభంలో గరుత్మంతునిచేత తల్లిని 'పయోరుహాననా!' అని పిలిపించడం బాగులేదు.[16] ఇలాగే ఇంకొకచోట అర్జునుడు కర్ణుణ్ణి 'కానీన!' అని పిలుస్తాడు. కర్ణుని జన్మరహస్యం చిట్టచివరగాని ఎవరికీ తెలియదు. అర్జునుడు ఆదిలోనే ఈ మాట ఎలా వాడాడు? ఇలాంటివి ఒకటి రెండు తప్పిస్తే, మాటలు వాడడంలో నన్నయగారు అసమానులు.

మర్యాదలు - మన్ననలు - తెలుగుదనం

సంభాషణ శైలిలో కథ చెప్పేటప్పుడు నన్నయగారు తెలుగుతనంలో ఉండే మర్యాదలన్నీ వాడుతారు. ''అనిననుదంకు డిట్లనియె - అయ్యా! మీయానతిచ్చినట్ల మసలవలదు, మిమ్ము వీడ్కొని చనువాడ!' గౌరవసూచకం 'మీరు' అని వాడడం తరువాత కవులు మానేశారు. గురువునైనా, దేవుణ్ణయినా 'నీవు' అనడమే పరిపాటి అయింది. గౌరవ సూచకమైన 'మీరు', 'వీరు' ఎలా వాడారో అలాగే ఎత్తిపొడవడానికి కూడ నన్నయగారు వాడారు. 'అర్జునుడు కట్టి తీసుకొచ్చిన ద్రుపదుణ్ణి చూసి 'వీరెవరయ్యా! ద్రుపద మహారాజులె!'' అనడంలో తెలుగుతనం ఉంది.

---

15. ఆది. పంచమ. 239-240
16. భారతం. ఆది 2-49.

ఏకచక్రపురంలో భీముడు తాము ఉంటున్న ఇంటివాళ్ళకు వచ్చిన కష్టాన్ని తీరుస్తానన్నాడు. బకాసురుణ్ణి చంపుతానన్నాడు. అయినా ఒకటి కోరాడు.

''కడుపునిండ గుడువ గానమి రేయెల్ల
గన్నునొందకున్న గరము డస్సి
యున్నవాడ! నాకు నోపుదురేని యా
హారతృప్తిసేయు డట్టులయిన.''

''కడుపునిండా తిండి తినకపోవడంవల్ల రాత్రంతా కన్నుమూతపడక చాలా నీరసంగా ఉన్నాను. మీకు వీలైతే నాకు ఆహారతృప్తి కలిగించండి'' అని భీముడు ఆ ఇంటి వాళ్ళను అడిగాడు. ఆహారతృప్తి కలిగించమని కోరుతున్నవాడు భీముడు కనుక తన తిండిలోని దండితనం తనకు తెలుసు గనక ఆ ఇంటివాళ్ళను 'ఓపుదురేని, తిండిపెట్ట'మన్నాడు. 'శక్తివుంటేనే' అనే అర్థంలో ఈ మాట వాడడంలో నన్నయగారి ఔచిత్యం కనబడుతుంది.

ఆ ఇంటివాళ్ళకు వచ్చిన కష్టాన్ని వర్ణించడంలోనే నన్నయగారు ఎంతో 'నేర్పు' చూపించారు. బకాసురునికి ఆహారంగా వెళ్ళవలసిన వంతు ఆ ఇంటికి వచ్చింది. ఎవరు వెళ్ళాలి? 'నేనంటేనే'నని విచారంతో ఒక్కొక్కళ్లూ త్యాగం చేయాలనుకొన్నారు. పెద్దవాళ్ళంతా ఇలా శోకమగ్నలయి ఉన్నప్పుడు –

''బాలకుం డొక కొండొక కోల చేత
బట్టికొని యేన రక్కసు గిట్టిచంపి
చులుకవత్తు మీ రేడ్వగా వలవ దనుచు
గలయ నూరార్చెదన తొక్కు బలుకులొప్ప''

కుర్రాడు రాక్షసుణ్ణి చంపివస్తాననడం మూలంలో ఉన్నదే. కరుణామయ సన్నివేశంలో నవ్వించి ఏడిపించడానికి కుటుంబంలో సహజమైన సన్నివేశాన్ని వ్యాసుడు సృష్టించాడు. అయితే మూలంలో కుర్రాడు గడ్డిపరకను పట్టుకొంటాడు. ఈ అనువాదంలో నన్నయగారు వాని చేతిలో కోలను పెట్టారు. వాడు 'తొక్కు పలుకులు' ఒప్పగా రాక్షసుణ్ణి చంపి 'చులక' వత్తుననడంలో తెలుగుతనం వచ్చింది. కుర్రాడు కర్రతిప్పుకుంటూ మన కళ్ళముందు నిలబడతాడు.

అనువాదమైనా అనువాదం కాని పంథా

మూలాన్ని కొన్నిచోట్ల కుదించడం, కొన్నిచోట్ల విస్తరించడం మొదలైనవి నన్నయగారు చెయ్యడానికి కారణముంది. ఆయనకు రాజరాజు ఇచ్చిన ఆదేశం 'భారత నిరూపితార్థం యేర్పడచెప్పు' మనడమే. అనువాదం చేయమనలేదు. అందుకే నన్నయగారు

''ప్రధానముగా వ్యాసభారతమునందలి కథనే యనుసరించినను ఎడనెడదనకు బూర్వముండిన సంస్కృత కర్ణాటక కవుల కావ్యముల నుండికూడ గొన్ని భావములు గ్రహించియు, కొన్నిచోట్ల సందర్భానుగుణముగా నూతన కల్పనలు గావించియు, ననుచితములని తోచిన యంశములు పరిహరించియు, గొన్ని వర్ణనలు పెంచియు, గొన్ని తగ్గించియు, ఆంధ్రభారతమును సర్వాంగ సుందరముగ వెలయించెను. అందుచేతనే యనువాదమన్న పేరున్నను అతి స్వతంత్ర గ్రంథమువలెనే శోభిల్లుచు నన్నయ ప్రతిభా విశేషమును వేయివిధముల వెల్లడి చేయుచున్నది'' అని దివాకర్ల వెంకటావధానిగారు సుదీర్ఘ పరిశోధన, కూలంకష పరిశీలన చేశాక చెప్పిన మాటలు అక్షరాలా నిజం.

వెంకటావధానిగారు 'నన్నయ భారతం' అనే తమ పుస్తకంలో నన్నయగారు ఎక్కడ మూలాన్ని అనుసరించలేదో, ఎక్కడ పెంచారో, ఎక్కడ తగ్గించారో విపులంగా, ఉదాహరణలతో చెప్పారు. జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారు ''వ్యాస భారతము - నన్నయ పరిష్కారము'' అనే తమ సిద్ధాంత గ్రంథంలో యథామూలకత, మూలకుంచనం, మూల ప్రపంచనం, అనథ్యా ప్రకల్పనం, మూల శీర్షికల్లో చాలా విపులంగా 785 పుటలలో చర్చించారు. ఇంతకూ నన్నయగారు ఏ సంస్కృత ప్రతిని అనుసరించారో మనకు తెలియదు. ఆయన గ్రహించిన ప్రతికి మిక్కిలి సన్నిహితమైన ప్రతులు ఏమిటో వెంకటావధానిగారు తమ పుస్తకంలోనే గుర్తించారు. అలాగే మృత్యుంజయరావుగారు కూడా అదే అభిప్రాయానికి వచ్చారు.

ఔచిత్యంపై దీక్ష - సారస్యాలు

నన్నయగారి సంస్కృత ప్రతిలో కొన్ని రసవత్తరమైన ఘట్టాలు లేవు కాబోలు - కుమార అస్త్రవిద్యా ప్రదర్శనంలో భీముడు కర్ణుణ్ణి కానిమాటలంటాడు. కులం తక్కువ వాడంటాడు. అప్పుడు కర్ణుడు తెల్లబోయి ఏం చేయాలో తెలియక నిట్టూర్పులతో, వాడిన మొఖంతో ''ఆకాశంబువలన నున్న యాదిత్యుం జూచుచు మిన్నకుండె'' తన తండ్రి ఎవరో తెలియక సూర్యుణ్ణి అవ్యక్తంగా చూస్తూ ఊరుకోవడంలో ఎంతో సానుభూతిసూచకమైన ఔచిత్యముంది. దానిని వ్రాసిన నన్నయగారు సరిగ్గా ఇలాంటిదే ఇంకొక ఘట్టం, మూలంలో ఉన్నా వ్రాయలేదు.

మత్స్యయంత్రాన్ని ఎక్కుపెట్టడానికి కర్ణుడు వెళ్ళాడు. అది చూచి ద్రౌపది ఎలుగెత్తి ''నేను సూతుణ్ణి పెళ్ళి చేసుకోను'' అంది. కర్ణుని హృదయం గాయపడింది. ఆకాశంలోఉన్న సూర్యుణ్ణి మళ్ళా చూసి విల్లు కిందపడేశాడు. ఈ సంగతి కొన్ని సంస్కృత భారత ప్రతులలో ఉంది. ఇది మధుర సుబ్బాశాస్త్రిగారి వర్తమాన తరంగిణీ ముద్రాక్షరశాల ప్రతిలో ఉంది; వావిళ్ళవారి Southern Recension ప్రతిలో లేదు. దక్షిణ దేశపు అన్ని ప్రతులలోనూ ఇది లేకపోబట్టి నన్నయగారి ప్రతిలోకూడ లేకపోవచ్చును. ఉంటే, ఔచిత్యంకోసం దీన్ని విడిచిపెట్టరు. మూలంలో ఔచిత్య విరుద్ధమైనది ఉంటే తొలగిస్తారు.

భీముడు బండిమీద భోజనం పెట్టుకొని బకాసురుని దగ్గరకు వెళ్ళాడు. యమునాతీరంలో బండిని విప్పాడు. రాక్షసుణ్ణి పిలిచాడు. వాడు వచ్చేదాకా ఊరికే ఉండడమెందుకని బండిలో కూర్చుని అన్నం తినడం మొదలుపెట్టాడు. ఇది మూలంలో ఉంది. నన్నయగారు ఆచారవంతులు. అందువల్ల భీమునిచేత కాళ్ళూ ముఖం కడిగించి, ఆచమనం చేయించి ఆ తరవాత తినిపించారు.[17]

ఇటువంటి మూలంలో లేని ఆచారాలు నన్నయగారిలో చాలా కనబడతాయి. ''పుణ్యాహరవ పురస్సరంబుగా'' గృహప్రవేశం చేయించారు.[17-2] ద్వైపాయనుడు, ధౌమ్యుడు మొదలైన భూసురుల చేత సూత్రవిన్యాస మమర శాంతిక విధులు చేయించారు.[17-3]

లోతుకు వెళ్ళి చూస్తే నన్నయగారి కవిత్వంలో ఇటువంటి సారస్యాలు చాలా కనబడతాయి - లోతుకు వెళ్ళి వెతికితే సముద్రగర్భంలో రత్నాలూ, ముత్యాలూ దొరికినట్టు. అయితే సేకరించేవాళ్ళు నిపుణులై ఉండాలి. ఈ సంగతి నన్నయగారు మొదటే చెప్పుకొన్నారు.

''సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయు క్తిలో
నారసి మేలునా, నితరు లక్షరరమ్యత నాదరింప, నా
నా రుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారతసంహితారచనాబంధురుడయ్యెజగద్ధితంబుగన్'' (1-1-26)

కవీంద్రులు లోతుకువెళ్ళి ప్రసన్న కథాకలితార్థయుక్తిని చూసి ''మేలు సెభాష్, బాగుంది'' అని మెచ్చుకొంటారట. ఇతరులు అక్షరరమ్యతను ఆదరిస్తారట. ఇలాగ నానారుచిరార్థసూక్తి నిధియైన తాము జగద్ధితంగా భారత సంహితారచనబంధురు లయ్యారట. ఆయన నిజంగా నానారుచిరార్థసూక్తుల పెన్నిధే. వర్ణాశ్రమ ధర్మాలను నిలబెట్టడానికే కాక మానవ జీవితం ఔన్నత్యవంతంగా ఉండటానికి కూడా పనికివచ్చే సుభాషితాలు అక్కడక్కడ ఉపదేశం చేశారు. ఉపదేశం చేయనిది కావ్యం కాదు.

కావ్యానికి ఉజ్జీవన - ఉపదేశం

తన తండ్రి మెడలో పామును వేసిన పరీక్షిత్తుకు శృంగి శాపమిచ్చాడు. శాపమిచ్చాక ఆ సంగతిని తండ్రికి తెలియజేశాడు. అప్పుడా పెద్దముని, కుర్రాడు తొందరపడ్డాడని బాధపడి, కొడుకుతో ఇలా అన్నాడు :

''క్రోధమ తపముం జెరచును
క్రోధమ యణిమాదులైన గుణముల బాపుం
గ్రోధమ ధర్మక్రియలకు
బాధ యగుం, గ్రోధి గా దపస్వికి జన్నే?

17. భారతం, ఆది. 6-292. 2. ఆది 6-150. 3. ఆది. 8-70.

క్షమలేని తపసి తపమును
బ్రమత్తు సంపదయు ధర్మబాహ్యు ప్రభురా
జ్యము చిన్న కుంభమున తో
యములట్టుల యధ్రువంబు లగు నివి యెల్లన్.'' (1-2-174, 175)

ఈ సూక్తులు మూలంలో లేవు. కథతో కలిసిపోయేటట్టు ఇక్కడ ఈ సుభాషితాలు చెప్పడంలో నన్నయగారు నేర్పు చూపించారు. ఈ పద్యాలే తర్వాత సుమతి శతకకర్త ''తన కోపమె తన శత్రువు'' అనే పద్యం చెప్పడానికి వరవడి అయిందేమో! నన్నయగారి సూక్తులలో ఇవాళ విరివిగా వాడుకొనేవి ఉన్నాయి. సూరుల జన్మంబు సురల జన్మంబు ఏరుల జన్మంబు నెరుగంగ నగునే?'' (1-6-60): ''గతకాలము మేలువచ్చు కాలముకంటెన్'' (1-5-159). ''నుతజలపూరితంబులగు నూతుల నూరిటికంటె సూనృ తవ్రత, యొక బావి మేలు...'' (1-4-94) మొదలైనవి ప్రసిద్ధమైన ఉదాహరణలు. సామెతలలాగ, నానుడులలాగ జాతీయమైన మరికొన్నిటిని కూడ చూడవచ్చు.

1. ఎరుకగలరె మగువ లెందు? (1-2-34)
2. కామికి నయనంబున నొండు దలంపబోలునే? (1-4-215)
3. ధనమున విద్యను సంతతి దనిపినవా రెందు గలరె? (1-5-119)
4. వేడు టెంతయు గష్టము. (1-5-218)
5. పురుషహీనమైన యువతిజూచి ఎల్లవారు జులకనపేక్షింతురు. (1-6-257)
6. ఎప్పుడు సుచిత యెరుల యిండ్ల పొత్తున నుండున్? (1-7-29)
7. కాము శక్తి యుడివింపగ శక్యమె యెట్టివారికిన్? (1-7-59)
8. కీర్తి లేనివానికి జీవనంబు నిరర్థకంబు చూవె? (1-8-31)
9. వృద్ధుల బుద్ధులు సంచలింపవే? (2-2-9)
10. సిద్ధుల చరితంబు లల్పులకు నెరుగశక్యమె? (2-2-19)

ఇటువంటి సుభాషితాలు, రుచిరార్థసూక్తులు సార్వకాలికమైనా కొంత పాతకాలపు మాటలతో ఉండటంవల్ల నిత్యవ్యవహారంలో మనం వాడుకోవడం పొసగదు. అర్వాచీనులు చెప్పిన సూక్తులు మన వాడుక భాషకు దగ్గరలో ఉంటాయి కనుక వాటినే మనం చెప్పుకుంటాముగాని నన్నయగారు ఆదిలో ఇటువంటి సూక్తులు చాలా చెప్పారు. ఉదాహరణకు భాగవతంలోని ఈ పద్యం తీసుకోండి.

''వారి జాక్షులందు వైవాహికములందు
బ్రాణవిత్త మానభంగమందు
చకితగోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము వొందదధిప!'' (అష్టమము. 585)

ఆపద్ధర్మంగా అబద్ధమాడటానికి లైసెన్సు తీసుకునేటప్పుడు ఈ పద్యాన్నే ఆబాల గోపాలం నేడు వాడుతున్నాము. పోతరాజుకన్నా ఎన్నడో ముందుగా ఈ అర్థంవచ్చే

సూక్తిని నన్నయగారు భారతంలో చెప్పారు. శుక్రునివద్ద ప్రమాణం చేసిన యయాతి ఆ నియమాలను ఎలా ఉల్లంఘించటం, ఎలా అబద్ధమాడటం అని బాధపడుతున్నప్పుడు శర్మిష్ఠ ''ఈ ఏనింటియందు నసత్యదోషంబు లేదని మునివచన ప్రమాణంబు గలదు'' అని ఇలా ఉపదేశం చేశాక చెప్తుంది.

''చను బొంకగ బ్రాణాత్యయ
మున సర్వధనాపహరణమున వధగావ
చ్చిన విప్రార్థమున వధూ
జనసంగమమున వివాహ సమయములందుఁ'' (1-3-178)

బమ్మెర పోతరాజుగారు చెప్పిన సుభాషితం కూడ నన్నయగారు చెప్పినలాంటిదే. అయితే పోతరాజు గారిది చక్కగా విరుగుతూ చదువుకొందుకు హాయిగా సాగిపోతుంది. నన్నయగారిది కుంటినట్టు కనబడుతుంది.

అక్షర రమ్యత

ధార చక్కగా, ఏ అడ్డంకులూ లేకుండా ప్రవహించుకొంటూ పోవడానికీ, శబ్దాలంకారాలకూ నన్నయగారు 'అక్షర రమ్యత' అని పేరు పెట్టినట్టుంది. పోతరాజుగారిలో ఈ అక్షర రమ్యత పూర్తిగా వుంది. నన్నయగారిలో లోపించిందేమో అని మొదట మనకు తోస్తుందిగాని, తరచిచూస్తే పోతరాజుకు వరవడి పెట్టిందికూడ నన్నయగారే!

''ధ్యేయుడవు, సకలలోక
స్థేయుండవు, నమ్రులకు విధేయుడవు, వయో
పాయజ్ఞుడ విజ్ఞగముల
నీ యెరుగని యవియు గలవె నీరజనాభా!'' (2-1-106)

అనే పద్యం నన్నయగారిదని చెప్పేదాకా తెలియకపోవచ్చు. ఇటువంటి పద్యాలే తరువాతి కవుల శబ్దాలంకారాలకు ఒజ్జబంతులైనాయి. పద్యంలో ఏదైనా ఒకమాట ఎలా వాడితే అటువంటిదే దాని ప్రక్కన వాడి, మనసుకు ఉల్లాసం కలిగించడం నన్నయగారు తరచు ప్రయోగించే సాధారణ శిల్పం.

1. ... దుర్గ మార్గజలగౌరవ భారత భారతీ సముద్రము (1-1-20)
2. భారత భారతీ శుభగభస్తి చయంబుల జేసి (1-1-22)
3. ... కృష్ణాజినవస్త్రునస్త్ర విషయాప్త విషాదు నిషాదుజూచి (1-5-235)
4. మదమాతంగ కురంగ కాంచనల సన్మాణిక్య గాణిక్య సంపద లోలిం గొనివచ్చి (2-1-19)
5. సారగసారవారిరుహ శౌక్తిక మౌక్తిక విద్రుమద్రుమైలాగురు చందనంబులు (2-2-110)
6. కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్ సూచుచుండన్. (2-2-233)

ఇలాగ వెంటనే వినిపించకపోయినా గుంఫనంగా ఉండే శిల్పాన్ని వాడడంలో నన్నయగారు నేర్పరులే.

''ఘోరవనమున వీరు గిమ్మీరు డను సు
రారి నిశ్చలభీకరాకారు బట్టి
పోర వధియించినట్టి సమీరజునకు
భూరిభుజునకు మార్కొనువారు గలరె?''

''ఇందు రకారపునరావృత్తి తేటగీతిలో గూడ బ్రాస సౌందర్యమును గూర్చుచు రమణీయముగా నున్నది'' అని దివాకర్ల వెంకటావధానిగారు వ్రాశారు. అప్పుడప్పుడు తేటగీతులలో సర్వత్ర ప్రాసయతి వాడడం నన్నయగారికి ఇష్టంలాగుంది.

''ఏను గుర్వర్థ మర్థినై మానవేశ
కడగి వచ్చితి నిపుడు నీకడకు వేడ్క
దండితారాతి నీదేవి కుండలము
లిమ్ము నాపూన్కి యిది సఫలమ్ముగాగ.'' (1-1-95)

అని ఆదిపర్వంలో ప్రథమాశ్వాసంలో మొదటి ఘట్టాలలోనే వ్రాశారు. నన్నయగారు సీసపద్యాలలో ప్రాసయతి మొదలుపెడితే దానినే కొనసాగించడం, యతితో మొదలుపెడితే అంతటా దానినే వాడడం, యతి, ప్రాసయతి ఒకదాని తరవాత ఒకటి వాడడం మొదలైన నియమాలు పెట్టుకొన్నారు. ఈ నియమాల పట్టికలను మొదట గిడుగు వెంకట సీతాపతిగారు తయారు చేశారు.[18] సీసపద్యాలలోనే కాక ఉత్త తేటగీతలలో కూడ నన్నయగారు అప్పుడప్పుడు ఇటువంటి నియమాలను పెట్టుకొన్నట్టు కనబడుతుంది.

''కన్నియలతోడ నాడుచు నున్నదాని
బాదమర్దితమ్మైయొక్క *పన్నగంబు
గఱచె గన్నియలందఱు వెఱచి పఱచి
యఱచుచుండ బ్రమద్వర *యవని ద్రెళ్లె.'' (1-1-147)

ఈ పద్యంలో ఒకటి, మూడు పాదాలలో ప్రాసయతి, రెండు, నాలుగు పాదాలలో యతి వాడారు. మూడు, నాలుగు పాదాలలో అయిదు బండిరాలు వాడడంలో అరపుల కఠోరత్వాన్ని స్ఫురింపచేస్తున్నారు.

ఇలాటి శబ్ద శిల్పాలు ఏ కవి అయినా ప్రయత్నపూర్వకంగా కాక అవ్యక్తంగానే చేస్తాడు. పదాలు, పదబంధాలు, సమాసాలు వాటంతటు అవే, వినయ విధేయతలతో కవియొక్క శాసనాలకు లోబడినట్టు, కవాతులోని సైనికులలాగ, తమ తమ నిర్ణీత స్థానాలలో సర్దుకొంటాయి.

18. అప్పకవీయం - వావిళ్ళ ప్రచురణ (1934) పీఠిక.

ఆంధ్రశబ్ద చింతామణి – వాదులు, అపవాదులు

నన్నయగారు తాము 'విపుల శబ్దశాసను'లని చెప్పుకొన్నారు. దీనికి సరియైన అర్థం ఇవాళ మనం చెప్పలేము. వ్యాకరణం వ్రాయడంవల్ల బిరుదులాంటి ఈ విశేషణం చెప్పుకొన్నారని పండితులు ఊహిస్తున్నారు. 'ఆంధ్రశబ్ద చింతామణి' అనే సంస్కృతంలో వ్రాసిన తెలుగు వ్యాకరణం నన్నయగారు రచించినదే అని కొందరు పండితులు వాదిస్తారు. అర్వాచీన ప్రయోగాలను కూడ తెలియజేసే ఈ వ్యాకరణం నన్నయ వ్రాసినది కాలేదని మరికొందరు గట్టిగా వివాదిస్తారు. ఎవరో 'ఔదార్య' వంతులు తాము వ్రాసిన వ్యాకరణాన్ని ప్రశస్తికోసం, ప్రామాణిక బలంకోసం నన్నయగారికి అంటగట్టారని నమ్మకంగా చెప్పవచ్చు.

కొందరు అర్వాచీన లేఖకులో, కవులో కొన్ని పద్యాలను నన్నయగారికి అంటగట్టి ఆయన గాంభీర్యాన్ని కించపరుస్తున్నారని మరికొందరు తలపోస్తున్నారు. మత్స్యగంధిని చూసి పరాశరుడు ఈవిధమైన కామోద్రేకం పొందినట్టు భారతంలో ఇప్పుడు కనబడుతుంది.

చపలాక్షిచూపుల చాడ్పున కెడమిచ్చు
చిక్కని చనుగవ జీరగోరు
నన్నువకై దీగయందంబు మదినిల్పు
జఘనచక్రంబుపై జలుపు దృష్టి
యభిలాష మేర్పడనట్లుండగా బల్కు
వేడ్కతో మరుమాట వినగ దివురు
నతిఘనలజ్జావనతయగు నక్కన్య
పైబడి లజ్జయుబాపగడగు
నెంత శాంతులయ్యు, నెంత జితేంద్రియు
లయ్యుగడు వివిక్తమైనచోట
సతుల గోష్ఠి జిత్తచలన మొందుదు రెందు
గాముశక్తి కోర్వగలరె జనులు?''

ఇది ప్రక్షిప్తమని భూపతి లక్ష్మీనారాయణగారు సమంజసంగా అభిప్రాయపడ్డారు.[19] ఇంత పచ్చిగా ఉండే పద్యం అన్ని వ్రాత ప్రతులలోనూ లేకపోవడంవల్ల వారి అనుమానం సక్రమమైనదే. నన్నయగారు కామాన్ని ఇలా చిత్రించరు. ఇటువంటివి నోట పలుక గూడదని వారి ఉద్దేశంలా కనబడుతుంది. ''నువ్వు బ్రహ్మచారివి; నేను కన్యను. కామశక్తి వల్ల మన ఇద్దరికి వివాహం ఎన్నడో అయింది'' అని దేవయాని చెప్పినప్పుడు కచుడు అత్యంత విషాదాకులుడై ''లోకనింద్యమగు నర్థము నీ వాకునకు దెచ్చుటుచితమే?'' (1-3-130) అని మందలిస్తాడు. పచ్చి వర్ణనలు నన్నయగారు వాకునకు కూడా తేలేరు.

19. సాహిత్యోపన్యాసములు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ.

శృంగార రసం పేర చలామణి అయే ఈ కామ ప్రవృత్తి వర్ణన తరువాత ప్రబంధాల ధోరణిలోనిది. ఆ ప్రభావంలోని కవి ఎవరైనా వ్రాసి అనాలోచితంగా ఇది నన్నయగారికి అంటగట్టి ఉంటాడు.

గారడీ రచన

ఇలాటి కవే ఇంకొకడు మరొక అర్వాచీన ధోరణిలోని పద్యం అరణ్యపర్వంలో నలచరిత్ర ఘట్టంలో ఇరికించి ఉంటాడు.

''సహకారమత్ప్రియ సహకారు బున్నాగ
పున్నాగు దిలక భూభువనతిలకు
జందనబుధహారిచందను బుష్పితా
శోకసుహృ్జ్జనశోకదమను
వకుళకులైకదీపకు విభీతకభయో
పేతా ర్తిహరు నలుప్రీతితోడ
గానరే కానలలోన లోకోత్తరు
నని మ్రానిమ్రానికి నరిగియరిగి
యడుగు నడుగు లెండబొడవొడ బొక్కిన
నిర్ఝరాంతరముల నిలుచు బొలుచు
గిరుల దరుల యెడల నురుగుహాగృహముల
దొంగి తొంగి చూచు దోయజాక్షి.''

ఇటువంటి నానార్థాల గారడీ రచన తరువాత కవులలో ఎక్కువగా మొఖం మొత్తేటట్టు కనబడుతుంది. కనక నన్నయగారు ఇది వ్రాసి ఉండరేమోననిపిస్తుంది. వ్రాస్తే వారే దీనికి వరవడి పెట్టారనుకోవాలి. రకరకాలుగా పాండిత్య ప్రకర్ష చూపెట్టుకొనే ఇలాంటి రచనలు సంస్కృతంలో అప్పటికే ఉన్నాయట. నన్నయగారు తాము ఉభయభాషా కావ్యరచనాభి శోభితులమని చెప్పుకొన్నారు.

'కులబ్రాహ్మణ' కల్లోలం

మహాభారతం అవతారికలోనే నన్నయగారు తమ అర్హతలనూ, యోగ్యతలనూ క్రోడీకరించినట్టు ఒక సీసపద్యం ప్రథమపురుషలో వ్రాశారు.

''తన కులబ్రాహ్మణు ననురిక్తు నవిరళ
జపహోమతత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రాహ్మండాది
. నానాపురాణ విజ్ఞాననిరతు

బ్రాతు నాపస్తంబసూత్రు ముద్గలగోత్ర
జాతు సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు నుభయభాషా కావ్యరచనాభి
శోభితు సత్ప్రతీభాభియోగ్యు
నిత్యసత్యవచను మత్యమరాధిపా
చార్యు సుజను నన్నపార్యు జూచి
పరమధర్మవిదుడు పరచళుక్యాన్వయా
భరణు డిట్టు లనియె గరుణతోడ'' (1-1-9)

ఈ పద్యంలోని 'కులబ్రాహ్మణుడు' అనే మాటను పట్టుకొని బ్రాహ్మణ్యమంతా తగవులాడుకొన్నారు. నన్నయగారు వైదికి అని కొందరూ, నియోగి అని కొందరూ ఈ మాట సాక్ష్యంతోనే ప్రచండయుద్ధం చేశారు. అర్థం లేని ఈ అంతఃకలహం చల్లారినా, నివురుకప్పిన నిప్పులాగా తెలుగు సాహిత్యలోకంలో చాలాకాలం ఉంటూనే వచ్చింది. నన్నయగారి కాలంలో రాజులకు కుల బ్రాహ్మణులు శాసనలేఖకులుగా ఉండేవారని ప్రామాణిక సాక్ష్యాలున్నాయి. నన్నయగారు నందమపూడి శాసనం, మండశాసనం రచించారు. శాసన లేఖకులుగూడ రాజులవద్ద వంశపారంపర్యంగా ఉంటూ ఉంటారనే నమ్మకంతో కొందరు సాహిత్య చరిత్రకారులు రాజరాజు తండ్రివద్ద వుండే శాసన లేఖకుడితోనూ, రాజరాజు కొడుకువద్ద ఉన్న లేఖకుడితోనూ నన్నయగారికి బంధుత్వాన్ని కట్టారు.[20] దాని ప్రకారం నన్నయగారి వంశవృక్షం ఇలా ఉండవచ్చు.

భీమన
(రణస్తిపూడి శాసనకర్త - క్రీ.శ. 1019)
|
బేతనభట్టు
(కోరుమిల్లి, కలిదిండి శాసనాలు క్రీ.శ. 1036)
|
నన్నయభట్టు
(నందంపూడి, మండశాసనాలు - క్రీ.శ. 1053)
|
భీమనభట్టు
(సోమలదేవి శాసనకర్త - క్రీ.శ. 1065)

20. ఆంధ్రకవి తరంగిణి - చాగంటి శేషయ్యగారు మొదటి సంపుటం.

కవిలెల్లోనే కవిత

శాసన లేఖకులను సాంధి విగ్రహకులు, మహాసాంధి విగ్రహకులు అని పిలవడం వేములవాడ చాళుక్యుల కాలంలో ఉండేది. నన్నయగారు కూడా రాజరాజుకు కుల బ్రాహ్మణుడు కాబట్టి శాసన లేఖకులై సాంధివిగ్రహకులుగా కూడా పేరు పొంది ఉంటారు.

''సాంధి విగ్రహకులు మంత్రులనియు, అన్యరాజులతో సంధిగాని యుద్ధంగాని వీరి మూలముననే జరిగెడివనియు చరిత్ర పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు'' అన్న సంగతి చెప్తూ ఇది పొరపాటని నేలటూరు వెంకటరమణయ్యగారు ఇలా వివరించారు.

''కాని లభ్యమైన సాక్ష్యమునుబట్టి చూడగా వీరి వృత్తిధర్మమునకు సంధి విగ్రహములతోనెట్టి సంబంధముండినట్లు గానరాదు. వీరు శాసనములందు సర్వసామాన్య ముగా శాసన గ్రంథ రచయితలుగానే పేర్కొనబడియున్నారు. సాంధి విగ్రహి పదముల కిచట షాడ్గుణ్యముతో నెట్టి సంబంధముండునట్లు తోచదు. వీరికిచట వాక్యరచనయందు శబ్దములను గూర్చుట, సమస్త పదములను విడదీయుటయని యర్థము చేసికొనుట యుక్తము.'[21]

నన్నయగారు కూడా శాసనగ్రంథ రచయితలు, సాంధి విగ్రహకులు. బహుశా ఈ కారణాలవల్లనే వారికి విపుల శబ్దశాసనులు అనే విశేషణం కూడా వచ్చి ఉంటుంది. ప్రత్యేకంగా వ్యాకరణ రచన చేసినందువల్ల కాదు. వ్రాసేది శాసనమే అయినా దానిని సైతం కావ్యంగా భావించి నన్నయగారు శ్రద్ధగా వ్రాసేవారని నందంపూడి... శాసనంవల్ల తెలుస్తున్నది. ''ఆజ్ఞప్తిరస్య కటకాధిరాజః కావ్యానాం కర్తా నన్నయభట్టో లేఖకో గండాచార్యః'' అని ఆ శాసనంలో ఉంది. కాబట్టి శాసనం కూడా కావ్యమే.

కావ్య నిర్వచనం

అయితే మహాకావ్యానికీ, కావ్యానికీ చాలా తేడా ఉంది. అది నన్నయగారికి బాగా తెలుసు. దానిని వారే మొట్టమొదట బాగా నిర్వచనం చేశారు. శౌనకాది మహామునులు ప్రారంభంలో సూతుణ్ణి కథ చెప్పమన్నారు. 'ఎలాంటి కథ కావా'లని అతడు అడిగాడు. వాళ్ళు ఇలా జవాబు చెప్పారు.

''ఏయది హృద్య, మపూర్వం
బేయది, యెద్దాని వినిన యెఱుక సమగ్రం
బై యుండు, నఘనిబర్హణ
మేయది, యక్కథయ వినగ నిష్టము మాకున్'' (1-1-30)

---

21. ''పల్లవులు - చాళుక్యులు'' (పుటలు 229-30)

ఉత్తమ కావ్యం ఎలా ఉండాలో ఈ పద్యం బాగా చెప్తుంది. ఇది చాలా చక్కని నిర్వచనం. హృద్యంగా, అపూర్వంగా, అఘనిబర్హణం చేసేదిగా ఉంటూ, వింటే సమగ్రమైన జ్ఞానాన్ని ఇచ్చేదే మహాకావ్యం. భారతం ఒక విజ్ఞానసర్వస్వం కనుకనే ధర్మతత్వజ్ఞులు ధర్మశాస్త్రమంటారు; ఆధ్యాత్మవిదులు వేదాంతమంటారు; నీతి విచక్షణులు నీతి శాస్త్రమనీ, కవివృషభులు మహాకావ్యమనీ, లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమనీ, ఐతిహాసకులు ఇతిహాసమనీ, పరమ పౌరాణికులు పురాణ సముచ్చయమనీ కొనియాడుతారు.[22] అయితే ఇది విశ్వజనీనం.

ఇటువంటి కావ్యాన్ని తెనుగు చేసేటప్పుడు నన్నయగారు కొంచెం డోలాందోళనలోపడి, తర్వాత విద్వజ్జనంబుల యనుగ్రహంబున రచించడానికి పూనుకొన్నారు. అందుకే తాము కృత్యాద్యవస్థలో ఏ మానసిక స్థితిలో ఉన్నారో, అదే స్థితిలో వైశంపాయనుణ్ణి వర్ణించారు. జనమేజయుడు సర్పయాగం మానుకొన్న వేళలో వ్యాసులవారు శిష్యులతో వచ్చారు. పరీక్షిత్తు కోరిక మేరకు భారతం వినిపించదలచు కొన్నారు. కథనం చేయమని వైశంపాయనుణ్ణి ఆజ్ఞాపించారు.

అప్పుడు జనమేజయుడు విద్వజ్జన పరివృతుడై సమస్త జనపాల సభాజనయోగ్యుని వైశంపాయన మునిని వినువేడ్కతో వినతుడై పూజించాడు.[23] రాజరాజు తనను పూజించడం నన్నయగారికి ఇక్కడ జ్ఞాపకం వచ్చి ఉండాలి. తాను పొందినట్టే వైశంపాయనుడు కూడ ''విద్వజ్జనంబుల యనుగ్రహంబుల వడసి''[24] ''సభాంతరములన్ విదితంబగు దానిని'' ఉత్తమ 'సభా' సేవ్యంబగు దానిని చెప్పినట్టు వ్రాశారు.

విద్వత్సభల ప్రాబల్యం

నన్నయగారి కాలంలో విద్వత్సభల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. కనుక వైశంపాయనుని కాలంలో కూడ వాటిని పేర్కొన్నారు. తమ కాలంలోని వేంగీ పరిషత్తుల మాటనే ఆమోదించి తన కావ్యం రమణీయంగా, రమ్యంగా ఉందని సభాపర్వంలో ఒక ఆశ్వాసం చివరా, అరణ్యపర్వం మూడు ఆశ్వాసాల చివరా నన్నయగారు వ్రాసుకొని ఉంటారని విశ్వనాథ సత్యనారాయణగారు సమంజసంగా ఊహించారు. ''రమణీయార్థ ప్రతిపాదక శ్శబ్దః కావ్యం'' అనే పండితరాయల నిర్వచనం వేంగీపరిషత్తుల అభిప్రాయమే అయి ఉంటుందని భావించారు.

వేంగీ పరిషత్తులపట్ల ఎంత భక్తి ఉందో, వేంగీ దేశమంటేనూ అంత అభిమానం నన్నయగారికుంది. అందుకే మూలంలో లేకపోయినా, తీర్థయాత్రలు చేస్తున్న అర్జునునికి వేంగీదేశాన్ని చూపించారు.

---

22. భారతం, 1-1-32.
23. భారతం, 1-3-7.
24. భారతం, 1-3-8.

''దక్షిణ గంగ నా దద్దయు నొప్పిన
గోదావరియు జగదాదియైన
భీమేశ్వరంబును బెడగుచున్న శ్రీ
పర్వతంబును జూచి యుర్విలోన
ననఘమై శిష్టా గ్రహార భూయిష్ఠమై
ధరణీ సురోత్తమా ధ్వరవిధాన
పుణ్యసమృద్ధమై పొలుచు వేగిదేశ
విభవంబు జూచుచు విభుడు దక్షి
ణాంబు రాశి తీర్థంబున కరిగి దురిత
హారియైన కావేరీ మహాసముద్ర
సంగమంబున భూసురేశ్వరుల కభిమ
తార్థ దానంబు జేసి కృతార్థుడగుచు.'' (1-8-139)

దానాలు, దక్షిణలు - వర్ణాశ్రమ ధర్మరక్షణ

మూలంలో ఉన్నా లేకపోయినా, బ్రాహ్మణులకు దానాలు ఇప్పించడం, దక్షిణలు ఇప్పించడం నన్నయగారికి సరదా.

మూలంలో జానెడు బ్రాహ్మణాధిక్య ప్రశంస ఉంటే అనువాదంలో దానిని బారెడు చేయడంవల్ల సహజంగానే, ''నన్నయ భట్టారకుడు తన భారత భాగమును బ్రాహ్మణోత్కర్షతో నింపెను'' అన్న అభియోగం వచ్చింది. దీనిని ఖండించడానికా అన్నట్టు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు తమ గ్రంథం ''సారమతి నన్నయ్య''లో చాలా ప్రయత్నించారు. ''ఈ బ్రాహ్మణ ప్రశంసా వచనములు వ్యాసభారతములోనివే. నన్నయ స్వాతిశయముతో తెచ్చిపెట్టినవి గావు'' అని వాదించారు. అయితే నిజానికి నన్నయగారు తెచ్చిపెట్టినవే ఎక్కువ. ఈ సంగతిని జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారు చక్కగా నిరూపించారు.

గరుత్మంతుడు అమృతం తీసుకురావడానికి బయలుదేరుతూ తనకు ఆ శక్తిసామర్థ్యాలు కలిగించే ఆహారాన్ని ప్రసాదించమని తల్లిని అడిగాడు. ''సముద్రగర్భంలో అనేక శతసహస్ర సంఖ్యలలో నిషాదులున్నారు. వాళ్ళను భక్షించు'' అని వినత చెప్పింది. అయితే ఒక షరతు పెట్టింది. ''బ్రాహ్మణులను మాత్రం తినకేం!'' అని హెచ్చరించింది. ''బ్రాహ్మణుడెవరో నాకెలా తెలుస్తుంది!'' అని గరుడుడు అడిగాడు. ''మింగితే గాలంలాగ ఎవడైతే గొంతుక దిగకుండా మంటలాగ దహిస్తూ ఉంటాడో అతడే బ్రాహ్మణుడని తెలుసుకో'' అని చెప్పింది. గరుడుడు వెళ్ళాడు. నిషాదులను మింగాడు. అందరూ గొంతుక నుండి కడుపులోనికి దిగారు కానీ ఒకడు దిగలేదు. దహించసాగాడు. ''నా కంఠంలో బ్రాహ్మణుడుంటే బయటికి రావాలి'' అన్నాడు గరుడుడు. ''అయితే

నాతోబాటు నాభార్య నిషాదికూడా ఉంది. ఆమెను వదిలిపెట్టి రావడం ధర్మమా!'' అని జవాబు వచ్చింది. ''సరే ఆమెతోబాటు బయటకు రా!'' అన్నాడు ఖగరాజు.

ఈ ఘట్టంలో మూలంలో ఉన్నదేమిటో, నన్నయగారు చేర్చిందేమిటో మృత్యుంజయరావుగారు ఇలా చెప్పారు.

''మూలమున గరుడ కంఠస్థుడగు బ్రాహ్మణుడు
- నిషాదీ మమ భార్యే యం నిర్గచ్ఛతు మయాసహ (ఆది-21-3)

అని మాత్రము పలుక, దెలుగున

- అపవిత్ర మదీయ భార్య కీ
ర్తిప్రియ! దీని బెట్టి చనుదెంచుట ధర్మువె నాకు? (ఆది ద్వి 64)

భ్రష్టుండైన విప్రుని గూడ నన్నయ తెలుగున ధర్మజ్ఞునిగా జిత్రించుట గమనింపదగినది.

మఱియు

-ఏతామపి నిషాదీంత్వం పరిగృహ్యాశునిష్పత! (ఆది-21-4)

అని మాత్రము మూలగరుడుడు పలికినట్లుండ,

- విప్రులబొందియున్న యపవిత్రులు బూజ్యులు గారె -

అనునది తెలుగున విశేషముగా గలదు. (ఆది ద్వి 64)

ఇది నిషాదికూడ గరుడుని కంఠమునుండి బయటబడుటకు హేతువును జూపుటయే కాక నన్నపార్యునకు విప్రులయెడ గల విశేష ప్రతిపత్తికి నిదర్శనమై యొప్పుచున్నది.''[25]

మృత్యుంజయరావుగారు ఇలాంటివే ఇంకో పన్నెండు ఘట్టాలలో నన్నయగారి విప్రభక్తికి తార్కాణాలు విపులంగా చూపెట్టారు. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు మాత్రం తిలాపాపం తలాపిడికెడు అన్నట్టు నన్నయగారితో పాటు కవిత్రయంలో తక్కిన ఇద్దర్నీ ముఖ్యంగా తిక్కనగారికి కూడా ఈ ఉత్కర్షలో ఎక్కువ పాలును ఇచ్చారు''... బ్రాహ్మణ భక్తియు, బరహిత యుక్తియును అని నినాదముతో ప్రారంభించి అనుశాసనిక పర్వమున తిక్కనార్యుడు రచించి ''బ్రాహ్మణోత్కర్షమును చూచిన పండ్లు పులిసిపోవును'' అని చెప్పి ''నిజమునకు ఈ అపరాధము''నకు మూలము వ్యాసమహర్షి అని సాకును చూపెట్టారు.[26]

అసలు భారతాన్నిగానీ, అష్టాదశ పురాణాలనుగాని వ్యాసప్రోక్తమని చెప్పి ప్రచారం చేసినది పాలకవర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే! రాచరికాన్ని రక్షించే

25. వ్యాస భారతము - నన్నయ పరిష్కారం, పుటలు 758-9
26. ''సారమతి నన్నయ్య'' పుటలు 19 నుండి 24 దాక

బ్రాహ్మణ్యానికి సకల సౌకర్యాలు కల్పించాలి. వాళ్ళ జీవనోపాధికి ఇబ్బంది కలగకూడదు. దానాలూ, దక్షిణలు పుష్కలంగా ఉండాలి. అందుకే వీలైనన్నిచోట్ల బ్రాహ్మణులకు అందరిచేతా దక్షిణ కల్పించారు. బ్రాహ్మణ కన్యను రాజు వివాహం చేసుకోవడం భారతంలో ఉంది. నన్నయగారికి ఇది విరుద్ధంగా తోచింది. ప్రసిద్ధమైన ఇతిహాస ఘట్టాన్ని మార్చలేరు కదా! అందుచేత జనమేజయునిచేత ప్రశ్న వేయించారు.

''వర్ణ ధర్మముల్ గాచుచు వసుధయెల్ల
ననఘచరితుడై యేలిన యయ్యయాతి
భూసురోత్తమ! భార్గవ పుత్రియైన
దేవయానిని దా నెట్లు దేవిజేసె?'' (1-3-97)

ఈ ప్రశ్ననే తరువాత యయాతి చేత దేవయానిని అడిగించారు. దేవయాని అతణ్ణి పెళ్ళి చేసుకోమంటుంది. అతడు ''క్షత్రియ కన్యల బ్రాహ్మణులు వివాహం బగుదురు గాక యధర్మోత్తరంబుగా క్షత్రియులు బ్రాహ్మణ కన్యల వివాహంబగుదురే? నీ పలుకులు ధర్మవిరుద్ధంబులు; మరియు సర్వవర్ణాశ్రమ ధర్మంబులు సంకరంబులుగాకుండ రక్షించుచున్న యేన యిట్టి యధర్మంబున కొడంబడితినేని జగత్ప్రవృత్తి విపరీతంబగు''[27] అని యయాతిచేతే కథలో అడిగించడం వల్ల జనమేజయుడు వేసిన ప్రశ్నకు వైశంపాయనుడు జవాబు చెప్పాడని నన్నయగారు సూచిస్తున్నారు. శుక్రుడు వచ్చి ఇది ధర్మవిరుద్ధం కాదని చెప్తే పెళ్ళి చేసుకొంటానంటాడు.

మూలంలో ఇంత విపులంగా లేదు. ''నేను క్షత్రియుణ్ణి; నీవు బ్రాహ్మణ కన్యవు. అందుచేత మనకు వివాహం సాగదు. పైగా శుక్రాచార్యుల వారికి ఇందువల్ల వచ్చే ఆగ్రహం తలచుకొంటే భయమేస్తున్నది'' అని మూలంలో అంటాడు. అంటే యయాతి ఈ పెళ్ళికి మనసులో ఇచ్చగించినట్టే! ఇటువంటి సూచనైనా రానివ్వకుండా వర్ణాశ్రమ ధర్మాల రక్షకుణ్ణి అని తెలుగు భారతంలో యయాతి చెప్పాడు.

ప్రసన్న కథాకలితార్థయుక్తి

వ్యాఖ్యానిస్తేగాని తెలియని కొన్ని సొగసులను 'నన్నయగారి ప్రసన్న కథాకలితార్థయుక్తి' అనే పేరుతో విశ్వనాథ సత్యనారాయణగారు సవిస్తరంగా వ్రాశారు. 'కలితార్థయుక్తి' అంటే 'కథతో కూడుకొని యొక మహార్థము ప్రవేశించుట. ''ఇది యొక మహాశిల్పము. ఇది నన్నయగారి యుపజ్ఞ'' అని చెప్పారు.

'కలితార్థయుక్తి' అనే పాఠం సాధు పాఠం కాదనీ, బహుప్రతులలో కనబడే 'ప్రసన్న కథాకలితార్థయుక్తి' అనేదే స్వీకరించవలసిన పాఠమని కొందరు భావిస్తున్నారు.[28]

27. భారతం, 1-3-1962.

28. ''సారమతి నన్నయ'' ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, పుట. 50

''నన్నయగారి భారత రచనమునందు కన్నడ భారత ప్రభావమున్న విషయము సుప్రసిద్ధము. లలిత పదం, ప్రసన్న కవితాగుణ మిల్లదే అను మాటనుబట్టి అందలి ప్రసన్నకవితా అను మాటయే నన్నయగారి పద్యమున ప్రవేశించినదని తలచినచో ''కథాకవిత' అను పాఠము అపపాఠమనియే చెప్పవలసియున్నది'' అని కూడా నొక్కి వక్కాణిస్తున్నారు.

నన్నయగారి మీద పంపనగారి భారత ప్రభావం లేకపోలేదు. ఇద్దరిలోనూ సమాన కవితా ధర్మాలున్నాయి. ఇద్దరిలోనూ సమాన పదాలు కూడా వెతికితే కనిపిస్తాయి. పంపనగారి ఛందోవైవిధ్యాన్నే నన్నయగారు అనుసరించారు. ఇద్దరికి చంపకమాలలు ఇష్టం. పంపనగారు తమ భారతంలో 409 చంపకాలు వాడితే, నన్నయగారు తమ మూడు కృతులలో 240 వాడారు. ఇద్దరికి దేశి ఛందస్సుల్లో కందాలంటేనే ఎక్కువ మక్కువ. పంపనగారు 730 కందాలనూ, నన్నయగారు 1219 చెప్పారు. ఇద్దరూ హితనుత మృదువచనులే. ఇద్దరూ ప్రసన్న గంభీరులే. అయితే కథాకథనం చేయడంలో ఇద్దరి ప్రయోజనాలు విభిన్నాలు.

పంపనగారికి ఒకటే లక్ష్యం. తన ప్రభువు అరికేసరికీ, అర్జునుడికీ అభేదం కల్పించి సమస్త భారతాన్ని ప్రబంధంగా కథనం చేయడమే అది. నన్నయగారికి రాజరాజు ఇచ్చిన ఆనతి వేరు. అధికధీయుక్తితో మహాభారత బద్ధ నిరూపితార్థాన్ని తెనుగున రచించమని రాజాజ్ఞ. పంపనగారు భారతంలోని ముఖ్యమైన ఘట్టాలను విస్మరించకుండా విష్ణుమూర్తి నుండి బ్రహ్మ పుట్టడం దగ్గర్నుంచి అర్జునుడి జన్మం దాకా అతనికి నామకరణం చేస్తూ అరికేసరికున్న 108 బిరుదనామాలు పెట్టేరని చెప్పటందాకా కథనంతా ఒక ఆశ్వాసంలో కేవలం 140 గద్యపద్యాలలో చెప్పారు. ఇదే పరిమాణపు భారత నిరూపితార్థాన్ని నన్నయగారు అయిదాశ్వాసాలలో మొత్తం 1035 గద్యపద్యాలలో చెప్పవలసివచ్చింది. ఇదే కథా కవితార్థయుక్తికి కారణం. కవిత కాదు కథ ముఖ్యం.

ఈ పరిస్థితికి మరో ప్రబలమైన కారణం కూడా ఉంది. రాజరాజుకు పట్టుకొన్న కొత్త యిష్టాలలో భారత కథా శ్రవణాసక్తి ఒకటి. ''అస్మదీయ వంశమున బ్రసిద్ధులై విమల యశో శోభితులైన పాండవోత్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్టమనీ'' చెప్పాడు. తమది చంద్రవంశమనీ, పాండవుల వంశంలో తాము పుట్టామనీ వేంగీ చాళుక్యులు భావించడం రాజరాజు తండ్రి విమలాదిత్యుని కాలం నుంచే ప్రారంభమైంది.

ఈ రాజవంశంలో కుబ్జ విష్ణువర్ధనుడు (క్రీ.శ. 615–633) ప్రథముడు. ఇతని కాలంనుంచి విమలాదిత్యుడు (క్రీ.శ. 1001–1022) దాకా ఇరవై ఆరుమంది రాజులు పాలించారు. వాళ్ళలో ఈ ఆఖరి రాజు తప్ప మిగతా రాజులెవరూ తాము వేయించిన దానశాసనాల్లో తమ వంశక్రమాన్ని పౌరాణిక వ్యక్తులతో వరుసగా చెప్పుకోలేదు. చారిత్రక వ్యక్తులనే పేర్కొనడం గుణగ విజాయాదిత్యుని కాలంలో మొదలైంది.

పురుషాంతరాలు గడుస్తున్న కొద్దీ క్రమక్రమంగా ప్రశస్తి అభివృద్ధి చెందడం మొదలెట్టింది. విమలాదిత్యుని రాజ్యాభిషేకము నాటికి పరిస్థితి మారింది.

విజయాదిత్యుడు చోళరాజు కన్యక కుందవ్వను పెళ్ళాడాడు. ఈమె చక్రవర్తి రాజరాజచోళుని కుమార్తె. విజయాదిత్యుడు రెండు పుష్కరాల కాలం అత్తవారి రాజ్యంలోనే ఉన్నాడు. నిజానికి తమ తండ్రి దానార్ణవుడు క్రీ.శ. 72లో వీరమరణం చెందాక రాజ్యం పరుల పాలయ్యాక తన అన్నగారయిన శక్తివర్మతోపాటు విమలాదిత్యుడు కాందిశీకుడుగా చోళ సామ్రాజ్యానికి వెళ్ళి తంజావూరు చేరువలో ఉన్న 'తిరువైయారు'లో ఉన్నాడు. రాజవంశంలోని వ్యక్తులు కాందిశీకులయ్యారంటే మందీమార్బలం, దాసదాసీలు, ఆశ్రితులూ అందరూ అనుసరిస్తారు. వచ్చిన వాళ్ళందరికీ చోళ చక్రవర్తి ఆశ్రయం లభించింది. ఇల్లుకన్నా గుడి పదిలం అన్నట్టు ఇక్కడే బాగుందనుకొని కొందరు చోళ కొలువులో ప్రవేశించారు. శక్తివర్మకు అప్పటికి వివాహాలు అయిపోయివుంటాయి. అందుచేత చోళ చక్రవర్తి తన కూతురు కుందవ్వను విమాలాదిత్యునకిచ్చి పెళ్ళి చేశాడు. ఇదే ఒక ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుకు దారితీసింది.

చోళులు తాము సూర్యవంశం నుంచి పుట్టామనీ, తమ వంశం స్వయంభువు, బ్రహ్మ, సూర్యుడు, మనువు, ఇక్ష్వాకు, రాముడు మొదలగు పురాణ పురుషులనుంచి ఉత్పత్తిల్లిందని ప్రకటించుకొన్నారు. వారితో సాపత్యం కోసం వేంగీ చాళుక్యులు ముఖ్యంగా విమలాదిత్యుడు గొప్పలు చెప్పుకోవడం ప్రారంభించారు.

''అంతటి యుదాత్త రాజవంశంతో వివాహ సంబంధము గావించుకొనిన విమలాదిత్యుడు స్వవంశమంతకు దీసిపోయినదని చెప్పుట కంగీకరించునా? తాను చోళుల యాశ్రితుడైనంత మాత్రముననే చిరకాలము సామ్రాజ్య వైభవమనుభవించిన నిజవంశ ప్రాధాన్యత అంతరించిపోవునా? కావున మామగారి వంశమువలె తన వంశమును బ్రాచీన క్షత్రియ వంశమని ప్రకటించుకొనుటకు విమలాదిత్యుడు పౌరాణిక వంశానుక్రమణికను నిర్మించుకొని శాసనస్థము గావించుకొనెను. చోళులు దమవంశము సూర్యుని నుండి పుట్టినట్లు చెప్పుకొన, విమలాదిత్యుడు తన వంశము సూర్యుని జోడగు చంద్రునినుండి యుత్పత్తి యాయెననియు మన్వాది పురాణ పురుషులకు సములైన బుధ, పురూరవ, భారత, పాండవాదులు దనవంశమునకు మూల పురుషు''లనియు దెల్పెను.[29]

తండ్రి విమలాదిత్యునిలాగా రాజరాజ నరేంద్రుడు కూడా తమది చంద్రవంశమని పరరాష్ట్రాలలో ఉన్నప్పట్నుంచీ విశ్వసించి పాండవుల చరిత్ర తనకు అనురక్తుడైన నన్నయగారిచే చెప్పించుకొన్నాడు.

అసలు నన్నయ్యగారే పర రాష్ట్రాలనుండి వచ్చిన అనాంధ్రులనే వాదం ఒకటి 1938లో లేచింది. ఆ వాదాన్ని లేవతీసినవారు పండిత శ్రీ అక్కిరాజు ఉమాకాంత

29. పల్లవులు - చాళుక్యులు, పుట. 357

విద్యాశేఖరులు. ఆయన 1911లో శ్రీనాథుని పల్నాటి వీరచరిత్ర పరిష్కరించి ప్రకటిస్తూ ప్రథమ భూమికలో శ్రీనాథుడు తెలుగువాడు కాడని నొక్కి చెప్పారు. 1938లో అదే పుస్తకానికి ద్వితీయ భూమిక రాస్తూ ఇలా చెప్పారు:

''శ్రీనాథుడు కర్ణాటుడు. శ్రీనాథుడు కర్ణాట దేశస్థుడని నేను సకారణంగా ప్రథమ పీఠికలో విశదపరిచాను... శ్రీనాథుడితో సంబంధం లేకున్నా, కన్నడీలని ఒక బ్రాహ్మణ శాఖవారు ఇప్పటికీ పల్నాటిసీమలో కరాలపాటి గ్రామంలో వున్నారు.

''ఇలానే నన్నయకూడ అనాంధ్రుడుగా కనబడుతున్నారు. ఆంధ్రదేశాన్ని జయించిన చాళుక్యులకు, చోళులకు బంధుత్వ మేర్పడిన కాలంలో యితడు అరవదేశం నుంచి వచ్చి ఉండవచ్చు... శ్రీనాథుడివలె దేశంలో చిరకాల నివాసం గల వంశంలోనివాడు కాక అప్పుడప్పుడే వచ్చి చేరినవాడో, అలా చేరిన ద్రావిడ కుటుంబానికి చెందినవాడో అయి ఉండవచ్చును. కనుకనే తన భాష అయిన అరవంలోని మాటలను అనావశ్యకత స్థలాలలో కూడ తప్పించుకొనజాలని దశలో ఉండినట్టు కనబడుతున్నది. ఇతడు వాడిన శబ్దాలు కొన్ని ఆంధ్రదేశపు వ్యవహారంలో లేకపోవడమే కాకుండా, తమిళదేశంలో ఇప్పటికీ సాధారణ జనులలో కూడా వాడుకలో ఉన్నవి.''

అక్కిరాజువారు పై ప్రకటన చేస్తూ మచ్చుకు ఎనిమిది మాటలను సవివరంగా ఉదహరించి తమ వాదాన్ని ప్రతిపాదించారు. ఈ వాదాన్ని ఆంధ్ర సాహిత్య లోకంలో ముప్పాతిక మూడు వీసాలు ఆమోదించలేదు. పోనీ అని ఈ వాదాన్ని కూలంకషంగా చర్చించి ఖండించినట్టుకూడా కనబడదు. ఆ పని ఇప్పటికైనా ఎవరో ఒకరు చేయడం అవసరం. అక్కిరాజువారు ''నన్నయ పేరు కూడ అనాంధ్రమేను'' అని చెప్పారు.

''నన్న అంటే అరవంలోనూ, కన్నడంలోనూ మంచి అని అర్థం. తెలుగులో లేనేలేదు'' అని కూడా అక్కిరాజువారు విశదపరిచారు. నిజానికి కన్నడంలో ''నన్న'' అంటే ''నాయొక్క'' అని అర్థం. నన్నయగారి అసలు పేరు ''నన్నయ్యభట్టు'' ఈ స్పెల్లింగ్‌తోనే ప్రాచీన శాసనాలలో వారి పేరు కనబడుతుంది. ''నన్ని'' అంటే కన్నడంలో చాలా అర్థాలున్నాయి. సత్యం, నిస్సంశయం, నిశ్చయంగా, ప్రేమ, అనురాగం, అనుబంధం అనే అర్థాలు ''నన్ని'' శబ్దానికున్నాయి. ''నన్నికార'' అంటే సత్యసంధుడని అర్థం. నణ్ణి లేక నన్ని అనే మూల ద్రావిడ పదంనుంచి అన్ని ద్రావిడ భాషలలోనూ వివిధ శబ్దాలు వచ్చాయి.

''నన్ని'' అనే పదం ఆ రూపంలో తెలుగులో లేదుగాని ననుచు, ననపు, ననుపుకత్తె, ననుపుతాడు, ననుపువడు, ననుపు, నన్ను అనే పదాలు ''నన్ని'' అనే ద్రావిడ పదంలోంచే తెలుగులోకి వచ్చాయి. ననుపు అంటే అనురక్తి. నన్నయగారి పేరులోను, నారాయణభట్టు పేరులోనూ, కుమారసంభవకర్త నన్నెచోడుని పేరులోనూ ఈ ''నన్ని'' శబ్దం కనబడుతుంది.

''నన్ని'' శబ్దం నుంచే నన్నన, నల్లన అనే పదాలు తమిళంలో వున్నాయి. ''నల్ల'' అంటే మంచి అని అర్థం. ''నల్ల'' శబ్దానికి వేదములని, నల్లార్ అంటే వేదవిదులని అర్థం. బ్రాహ్మణ అగ్రహారానికి ''నల్లిండ్లు'' అనేది దేశ్యరూపం. నన్నయగారు నని, నన్ర, నల్ల, ననుపు మొదలైన మాటలు మంచి అనే అర్థంలో ఎక్కడా వాడలేదు. ఒక్క ''నల్లిండ్లు'' అనే ప్రయోగం మాత్రం వారి భారత భాగంలో కనబడుతుంది. ''బ్రహ్మవిదుల నెలయింగ నల్లిండ్లు నిలిపి'' (భారతం 2-2-121). ప్రాజ్ఞన్నయ యుగంలో వ్యక్తినామాలుగా నల్లయా, నల్లాతణ్ణ్, నల్లుణ్ణు అనే పేర్లు కనబడతాయి. వీటిలోని 'నల్ల' శబ్దం రంగుకాక మంచితనాన్ని, వేదపాండిత్యాన్ని సూచిస్తుంది. (చూ॥ బూదరాజు రాధాకృష్ణగారి 'ప్రాచీనాంధ్ర శాసనాలు' పుటలు 357, 358).

ప్రాజ్ఞన్నయ యుగంలో 'నన్నియ' అనే పదానికి మారుగా 'నల్లయ' అనే పదం వ్యక్తినామంగా తెలుగుదేశంలో ప్రచారంలో వుందన్న సంగతి స్పష్టం. నన్నెచోడుని కాలందాకా 'నన్ని' శబ్దం వ్యక్తి నామంలో ఒక భాగం అన్న సంగతి కూడా నిస్పష్టమే. వైదుంబులలోనూ, చాళుక్యులలోనూ 'నన్న' అనే మాట వ్యక్తినామ భాగంగా కనబడుతుంది. ''నన్నయరాయర్'' వైదుంబరాజు. ఇతడు కడప జిల్లాకు చెందిన ఇంగల్లూరునాడుకు చెందినవాడు. క్రీస్తుశకం 1005లోని ఒక దాన శాసనంలో ఇతని పేరు కనబడుతుంది (చూ॥ నీలకంఠశాస్త్రిగారి ''ది చోళాస్'' పుట 188).

''నన్నినులుంబన్'' అనే వ్యక్తి చాళుక్యవీరుడు. ఇతడు కల్యాణ చాళుక్యుల సైన్యంలోని యోధుడు. కొప్పం యుద్ధంలో మరణించారు. ఇతడు 1054 ప్రాంతాలవాడు అంటే నన్నయగారికి సమకాలికుడు.

ప్రాజ్ఞన్నయ యుగంలోనూ, నన్నయగారి కాలంలోనూ 'నన్న', 'నన్ని' అనే పదం వ్యక్తినామ భాగంగా దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రాంతాలలోనూ కనబడుతూంది. మధ్య యుగాలలో కూడా ''నన్నయ'' అనే పదానికి సమానార్థకంగా ''నన్నప'' అనే వ్యక్తినామం ప్రచారంలో వుంది. కమ్మవారిలో నన్నపనేని వారున్నారు. బ్రాహ్మణేతరులలో కూడా ''నన్న'' అనే పేరుంది. కనుక ఆ పదానికి ''మంచి'' అనే అర్థం ఆరోపించవచ్చు. వేదవిదుడు నల్లార్ అనే అర్థం అతకదు.

అందుచేత ''నన్న'' అనే పదం ఆధారం చేసుకుని నన్నయగారు అనాంధ్రులని వాదించడం ఎంతమాత్రం సమంజసం కాదు. వారికాలంలో కడప జిల్లాలోని ఒక వ్యక్తికి నన్నయ అనే విశేషణం నామ భాగంగా వుండడం గమనించదగ్గ సంగతి. ఈవిధంగా అక్కిరాజువారి వాదంలోని ఒక విషయాన్ని పూర్వపక్షం చేయవచ్చు.

ఇకపోతే ''ఆంధ్రదేశాన్ని జయించిన చాళుక్యులకు, చోళులకు బంధుత్వమేర్పడిన కాలంలో ఇతడు అరవదేశం నుంచి వచ్చి వుండవచ్చును'' అన్న ప్రతిపాదనను పరిశీలిద్దాం. ''ఆంధ్రదేశానికి చోళ సంబంధం కలిగిన సమయాన ద్రావిడులు కొందరిక్కడికి వచ్చినట్టు

కనబడుతుంది'' అన్న అక్కిరాజుగారి మాటలు నిజమే. అయితే ఆ ద్రావిడులలో నన్నయగారి కుటుంబం వుందా? అన్నది పరిశోధించవలసిన సంగతి.

నన్నయగారి పోషకుడు రాజరాజ నరేంద్రునికి కొన్ని తరాల ముందు నుంచి వేంగీ చాళుక్యులకూ, తంజాపురి చోళులకూ సత్సంబంధాలు వుండేవి. బాంధవ్యాలు కూడా వుండేవి. రాజరాజ నరేంద్రుని తాత దానార్ణవుడు క్రీస్తుశకం 972-93లో చనిపోయాడు. అతని పెద్దకొడుకు శక్తివర్మ తండ్రి మరణం తర్వాత రాజ్యానికి రావడానికి ఇరవై ఏడు సంవత్సరాలు పట్టింది. ఇందులో కనీసం పాతిక సంవత్సరాలు శక్తివర్మ తంజాపురి చోళుల అండను వున్నాడు.

దానార్ణవుడు పోయినప్పుడు శక్తివర్మ వయసు ఇంచుమించు ఆరేడు సంవత్సరాలు. అతని తమ్ముడు విమలాదిత్యునికి నాలుగైదు ఏళ్లుంటాయి (విమలాదిత్యుడే రాజరాజ నరేంద్రుని తండ్రి). ఈ పసివాళ్ళని తీసుకొని రాజకుటుంబం మొదట కళింగంలో తలదాచుకున్నారు. తర్వాత తంజావూరు వెళ్ళి చోళులను ఆశ్రయించారు. అప్పుడు చోళసామ్రాజ్యాన్ని రాజరాజచోళుడు పాలిస్తూ వున్నాడు. ఆ చక్రవర్తి వేంగీ చాళుక్య రాజకుమారులకు విద్యాబుద్ధులు చెప్పించడమేగాక, విమలాదిత్యునికి తన కూతురు కుందవ్వాదేవినిచ్చి పెళ్ళి చేశాడు. రాజరాజ నరేంద్రుడు బహుశా తంజావూరులో జన్మించి వుండవచ్చు.

క్రీస్తుశకం 975 నుండి 1000 దాకా వేంగీ చాళుక్యరాజ కుటుంబం తంజావూరు దగ్గర వున్న తిరువైయారులో నివసించింది. అప్పుడు ఆ రాజ కుటుంబానికి నన్నయగారి కుటుంబంతో పరిచయం ఏర్పడి వుండడానికి ఆస్కారం లేకపోలేదు. క్రీస్తుశకం 999లో శక్తివర్మకి వేంగీ రాజ్యం స్వాధీనమైంది. పట్టాభిషేకం చేసుకున్నాడు. తంజావూరు నుంచి రాజకుటుంబం తెలుగుదేశానికి వచ్చింది. అప్పుడు వాళ్ళతోపాటు నన్నయగారి కుటుంబం కూడా వేంగీ రాజధానికి వచ్చి స్థిరపడి వుండవచ్చు.

తంజావూరు సీమనుంచి తమిళ బ్రాహ్మణ కుటుంబాలు తెలుగుదేశానికి వచ్చి స్థిరపడడం, గొప్ప సాహిత్యసేవ చేయడం చారిత్రక సత్యమే. ఆంధ్రదేశంలోని బ్రాహ్మణులలో ద్రావిడ శాఖలు వున్నాయి. పుదూరు ద్రావిడులు, పుట్టగుంట ద్రావిడులు, ఆరామ ద్రావిడులు, దిమిల ద్రావిడులు, పేరూరు ద్రావిడులు అనేవి ముఖ్యమైన శాఖలు. పుదూరు ద్రావిడ బ్రాహ్మణులలో వేదం వెంకటరాయశాస్త్రిగారు జగద్విఖ్యాతులు. ఆరామ ద్రావిడ బ్రాహ్మణులలో చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు జగత్ప్రసిద్ధులు. దిమిల ద్రావిడ బ్రాహ్మణులలో శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) సాహిత్య యుగకర్త. పేరూరి ద్రావిడ బ్రాహ్మణులలో ఆదిభట్ల నారాయణదాసు ఆటపాటల మేటి.

పుదూరు ద్రావిడులు తంజావూరు సీమలో కుంభకోణం దగ్గరనున్న కండ్రి మాణిక్యమనే అగ్రహారం నుండి వచ్చి నెల్లూరు జిల్లాలో స్థిరపడ్డారు. పుదూరు ద్రావిడుల

ఇళ్ళలో నేటికీ తమిళమే మాట్లాడుతారు. వీరి తమిళంలో ప్రాచీన తమిళ వాఙ్మయపు ఛాయలుంటాయి. కొన్ని పదాలు ప్రాచీన సంఘం వాఙ్మయంలో తప్ప కనబడవు. వీరి ప్రయోగాలు కొన్ని మధుర, రామనాథపురం జిల్లాలలోనే చూడవచ్చు. (నెల్లూరు మండల సర్వస్వంలో పుదూరు ద్రావిడుల చరిత్ర - పుట 505). చాలా ప్రాచీనకాలంలో తంజావూరునుండి ద్రావిడులు ఆంధ్రదేశానికి వలస రావడం చారిత్రక సత్యమే కనుక నన్నయగారి కుటుంబం కూడా అలాగే తెలుగుదేశానికి వస్తే ఆశ్చర్యపడనక్కర్లేదు.

అయితే, ఈ వూరికావూరు యెంతో, ఆ వూరికి ఈ వూరూ అంతే. నన్నయగారు తమిళదేశం నుంచి వచ్చిన ద్రావిడులు అనడం ఎంత సమంజసమో, తెలుగుదేశం నుంచి తమిళ రాజ్యానికి వెళ్ళిన ఆంధ్రులని చెప్పడం కూడ అంత సమంజసమే అనవచ్చు. వేంగీ చాళుక్యుల రాజ కుటుంబం కాందిశీకులుగా తంజావూరు సీమకు వెళ్ళినపుడు వాళ్ళననుసరించి పరివారంలో నన్నయగారి కుటుంబం కూడ వుండడానికి ఆస్కారం లేకపోలేదు. నన్నయగారి కుటుంబం రాజరాజ నరేంద్రుని కులబ్రాహ్మణ కుటుంబం. వంశపారంపర్యంగా కులబ్రాహ్మణులు రాజవంశాన్ని సేవిస్తూ వుంటారు. మహాభారతం సభాపర్వంలో నారదుడు ధర్మరాజుకు రాజనీతిని బోధిస్తూ ఇలా అడుగుతాడు.

అనఘుల శాస్త్రవిధిజ్ఞుల
ననురక్తుల పితృపితామహక్రమమున వ
చ్చిన విప్రుల మంత్రులఁగా
నొనరించితె కార్యసంప్రయోగము పొంటెన్ (సభా. 1-27)

మూలశ్లోకంలో పితృ, పితామహక్రమము అనే మాటలు ఈ సందర్భంలో లేనేలేవు. కావాలని నన్నయగారు వాడారు. నన్నయ అనే నామానికి అనురక్తుడు అనే అర్థం గమనించదగ్గ విషయం. తాము పితృపితామహక్రమంలో రాజరాజ నరేంద్రుని కుటుంబానికి అనురక్తులు కాబోలు.

తగినన్ని ఆధారాలు లేకపోయినా, సాహిత్య చరిత్రకారుల ఊహాగానం వల్ల శక్తివర్మ దగ్గర, అతని తమ్ముడు విమలాదిత్యుని వద్ద నన్నయగారి తాత భేతన భట్టూ, తండ్రి భీమన భట్టూ శాసన లేఖకులని పితృ పితామహక్రమం ఒకటి ఏర్పడుతుందని ఇంతకుముందు చూశాం. ఈ కులబ్రాహ్మణులు రాజకుటుంబంలో తంజావూరుసీమకు కాందిశీకులుగా వెళ్ళి రాజ్యలాభానంతరం స్వదేశానికి తిరిగి వచ్చారని ఊహించడమే సమంజసమవుతుంది.

అక్కిరాజు ఉమాకాంతంగారు శ్రీనాథుడు కర్ణాటకుడు అని చెప్తూనే ఇలా రాశారు. ''శ్రీనాథుని గ్రంథములు చదివినచో నాంధ్రభాష యతని స్వభాషగానే కన్పించును... కానినతడు బాల్యమునుండి తెలుగుదేశంలో నుండెననుటకు సందేహము లేదు. బాగుగ మాటలాడ నేర్చినప్పటినుండి తెలుగే మాట్లాడి యుండును. తల్లిదండ్రులతో

నీతడప్పుడు మిశ్రమ కర్ణాటకము మాటలాడుచుండినను నివసించినది కొండవీటి సీమ గావున తెలుగువారితో కలిసిమెలిసి, తెలుగువారితో సహవాసము చేసి ప్రాతఃకాలము మొదలు సాయంత్రము వరకు తెలుగులో మునిగి తేలుచుండ వలసినవాడై చివరకు దెనుఁగు దేశస్థుడిగా మారియుండును.'' (ప్రథమ భూమిక పుట - 46)

ఈ ఊహాగానం నన్నయగారిపట్ల వర్తించదని అక్కిరాజుగారి వాదం. నన్నయగారి భాషలోని ఎనిమిది ద్రావిడ పదాలను ఉదహరించి వితండవాదం చేశారు. ప్రాఙ్నన్నయ యుగంలోని ప్రయోగాలు చూడక ఈ పదాలు తమిళుల నుంచి దిగుమతి చేసినవని భావించారు. భాషా ప్రయోగాలవల్ల కూడా నన్నయగారు తమిళులు కారని రుజువు చేయడం ఏమంత కష్టమైన పనికాదు.

నన్నయగారు స్వచ్ఛమైన ఆంధ్రులే. తమిళదేశం నుండి వచ్చినవారు కాదుకానీ పాత మైసూరు ప్రాంతంనుండి వచ్చి వేంగీ రాజ్యంలో స్థిరపడినవారనే వాదం ఇంకొకటి వుంది. హోసూరు కె.యస్. కోదండరామయ్యగారు ఈ భావాన్ని ప్రచారం చేశారు. తమ ప్రతిపాదనకు సాక్ష్యాలు చూపించారు. 'నన్నయ' అనే పేరు మైసూరు మండలంలోనే నాడు పలువురు పెట్టుకునేవారు.

పశ్చిమ గంగరాజుల పేర్లలో 'నన్నియ గంగ' అనే పదబంధం కనబడుతుంది. రెండవ పృథ్వీపతి కుమారుని పేరు 'నన్నియ గంగ'. అలాగే ఆ వంశంలోని రెండవ బూతయ్యకూ 'నన్నియ గంగ' అనే బిరుదు ఉండేది. 'నంజుండయ్యా, నంజయ్యా, నన్నయ అనే పురుషనామాలూ, నంజమ్మ, నంజుడమ్మ అనే మహిళానామాలు ఆనాడు ప్రచురమైనవే. మైసూరు మండలంలో కావేరీ నదికి ఉపనది అయిన కబ్బినా లేక కపిలనదీ తీరాన 'నంజన గుడి' అనే క్షేత్రం ఉంది. అక్కడి దేవునికి గొప్ప ఆలయం ఉంది. ప్రజలు ఆ స్వామిని 'నంజుండేశ్వరుడు' అని పిలుస్తారు. 'నంజు' అంటే విషము, 'ఉండు' అంటే తిండి అని అర్థాలు విషాన్ని తిన్న దైవంగా ఈ దేవుణ్ణి పిలుస్తారు. బిడ్డలు లేనివారు ఈ దైవానికి మొక్కుకొని సంతానం కలిగాక స్వామి పేరునే పిల్లలకు పెట్టుకొనే ఆచారం ఉంది. నంజుండేశ్వరునికే నన్నయ అనే వ్యవహార నామం ఉందనడానికి శాసనాధారాలు ఉన్నాయి. హోసూరు కె.యన్. కోదండరామయ్యగారు ఈ సంగతి విశదం చేస్తూ ఇలా ఒక ప్రసంగ వ్యాసంలో[30] రాశారు.

''ఈ నంజుడేశ్వరస్వామికి 'నన్నయ' యను పేరున్నట్లు ఈ ప్రాంతమున లభించిన ఒక శాసనము నుండి తెలియుచున్నది. ఈ శాసనం 'నగర్ల' అను గ్రామము నందున్నది. ఇది యొక శిలాశాసనము. నగర్ల గ్రామము నంజనగుడి తాలూకాలోనే ఉన్నది. ఈ శాసనము భాష కన్నడము. అది యిట్లున్నది.

30. 12-2-1983నాడు హోసూరులో జరిగిన నన్నయ నవశత జయంతి సందర్భంగా రాసిన ప్రత్యేక వ్యాసం, హోసూరు ఆంధ్ర సాంస్కృతిక సమితి పరిశోధనా వ్యాసం-2.

1. ఇదు విద్యాదానం దేవా రంగెయ్య బ్రతిగళుణ్బునో
2. ౦స్వస్తి సత్యవాక్య కొంగుణివమన్ దమన్మ
3. హా రాజాధిరాజ కోళాల పురవరేశ్వర నన్దగిరి నాథం
4. ఋమత్పేమన్ న (డి) గ్గె విద్యాధరయ్యం చిన్నపంగెయ్దు న
5. గరల నన్నయ్యన దేగులక్కె ముత్తెరెయుం పడెదు కొట్టం
6. అమణ్ను నన్నయ్యన ధమన్మం విద్యాధరయ్యన నస్తతి.
7. యవక్కాన్ వొదిదక్కె సక్కళె బెళ్ళన్దూరు కిరువెళ్ళన్దూరుం
8. సత్తియూరుం సింగనూరు నగరల పన్నివన్రు మహా ప
9. రిషెయు ఎడెనాడము వన్నాన్ ళ్గాముండు గళుం నక్కి ఇ
10. దనళొదువ్వాన్ రణాసియుం సాయిరం కవిలెయు మనఱు
11. దొం ఇదం కాదం గో సహస్రం గొట్ట ఫలమనెయ్దు వోం
12. .... కె............. సుగ్దొన్న్దు
13. గవఱ బిజయన్తన నట్ట బెల్ల పాత్ర ద మరంగళ్

(Vide E.C. Vol. II, Nanjangud. No. 239 P. 236)

ఈ శాసనాన్ని పశ్చిమ గంగరాజు ముమ్మడి రాచమల్లు, సత్యవాక్య కొంగుణివర్మ (క్రీ.శ. 920-925) వేయించాడు. నన్నయదేవర ఆలయానికి అనుబంధంగా వేదపాఠశాల ఉండేది. అక్కడ విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయాలు ఉండేవని ఈ విద్యాదానం కోసం చేసిన శాసనం తెలియచేస్తుంది. ఇటువంటి ఏదో మైసూరు మండలపు విద్యాలయంలో నన్నయగారు నారాయణభట్టుతో కలసి చదువుకొని ఉండవచ్చు. నారాయణభట్టు కళ్యాణీ చాళుక్య ప్రభువు అహవమల్ల త్రైలోక్యమల్ల సోమేశ్వరుని ప్రధాని. కాబట్టి ఆ ప్రాంతాలవాడే అతని సహాధ్యాయి అయిన నన్నయగారు కూడా అక్కడ జన్మించినవారేకాక కొన్నాళ్ళుండి విద్యాభ్యాసం చేసినవారూ కావచ్చును. ఏమైనా నాలుగు చాళుక్య రాజ్యాలలో ఏదో ఒకదానిలో ఉన్న తెలుగువారు.

క్రీస్తుశకం తొమ్మిది, పది.శతాబ్దాలలో తీరాంధ్రంలో వేంగీ చాళుక్యులు, వరంగల్లు, కంభంమెట్టు మండలాలలో ముదిగొండ చాళుక్యులూ, కరీంనగరు ప్రాంతాలలో వేములవాడ చాళుక్యులు, మైసూరు మండలంలో కల్యాణీ చాళుక్యులూ పాలిస్తూ ఉండేవారు. ''మైసూరు రాజ్యమనినంతనే అది పూర్తిగా కన్నడ రాజ్యమనియు, అచ్చట నున్న వారందరు కన్నడిగులే యనియు నొక భ్రాంతి నేటి తెలుగువారిలో కనబడుచున్నది. ఇది నిజము కాదు. ఈ రాజ్యములో తెలుగువారు లక్షల కొలదిగనున్నారు. కొన్ని జిల్లాలలో తెలుగువారు కన్నడిగుల కంటె ఎక్కువగా కూడ నున్నారు'' అని హోసూరు కోదండరామయ్యగారు ఇవాళ చెప్పిన మాటలు ఆ వేళ కూడా వర్తిస్తాయి.

నన్నయగారు ఎక్కడివారైనా రాజరాజనరేంద్రుని కుల బ్రాహ్మణులయ్యారు. బహుశా ఇది పితృ పితామహక్రమంగా కల్గిన పదవి. తన వంశం చంద్రవంశమని నమ్మి

బహు భాషల, బహు విధముల, బహు జనముల వలన వింటూ ఉండేవారు. దీనిని తెలుగులో చెప్పించాలనే కోరిక ఎప్పట్నుంచీ ఉందోగాని క్రీ.శ. 1051లో తన ఏభై ఏడవయేట గోదావరీ తీరాన రాజమహేంద్రం కట్టుకొన్నాక, స్థిరపడ్డాకగాని చెప్పించే స్తిమితం ఏర్పడలేదు. అప్పటికీ నన్నయగారికి కూడా రమారమి అదే వయసు లేదా కొన్నేళ్ళు తక్కువ గావచ్చు. నారాయణభట్టుకు నందంపూడి అగ్రహారంగా ఇచ్చినదీ, అతడు పాకశాసనికి నారాయణుడట్లు నన్నయగారికి తోడుపడడం వేంగీ దేశపు అగ్రహారంలో స్థిరపడ్డాకగాని వీలుకాదు. నారాయణభట్టు కూతురు కుసుమ ఆ మరుసటి సంవత్సరం క్రీ.శ. 1052లో దాక్షారామం నుంచి దానాలు చేసింది. అప్పటినుంచి భారత రచన సాగుతూ క్రీ.శ. 1061లో రాజరాజు అవసానదశలో ఆగిపోయి ఉంటుంది. ''ఉన్నట్టుండి యాకస్మికముగ నతడు రాజు పదచ్యుతుడై పోవుట చేతనే మహాభారత రచన కంతరాయము కల్గి యాగిపోయినది'' అని చరిత్రకారులు చెప్తున్నారు.[31]

అరణ్య పర్వంలోని చతుర్థాశ్వాసంలోని అజగరోపాఖ్యానం తర్వాత శరత్కాలాగమనాన్ని వర్ణిస్తూ ఉండగా, నన్నయగారి రచన ఆగి సంపూర్ణమైంది. అజగరోపాఖ్యానం తర్వాత నహుషునివల్ల ధర్మరాజు 'ఆధ్యాత్మ రహస్యంబు నిమ్ముగా' విన్నట్టే నన్నయగారు కూడా ఒక ఆధ్యాత్మికోన్నత సోపానం ఎక్కారని విజ్ఞులు భావిస్తున్నారు. 'ఖరకిరణ తాపమున...' అనే పద్యమునుండి 'శారదరాత్రులుజ్జ్వల...' మనే పద్యందాకా నన్నయగారు చెప్పిన తొమ్మిది గద్యపద్యాలు వారు నిర్యాణ నిర్వాణ పర్యవసాయి కనుక అలా చెప్పాడని మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి సారస్యం తీశారు.[32]

భూసతికిం దివంబునకు బొల్పెసగంగ శరత్సమాగమం
బాసకల ప్రమోదకర మై విలసిల్లె మహర్షిమండ లో
పాసిత రాజహంస గతిభాసి ప్రసన్న సరస్వతీక మ
బ్జాసన సౌభితం బగుచు నబ్జజు యానముతో సమానమై.

శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారక హార పంక్తులం
జారు తరంబు లయ్యె వికసన్నవ కైరవ గంధబంధురో
దార సమీర సౌరభము తాల్చి సుధాంశు వికీర్యమాణ క
ర్పూర పరాగ పాండురుచిపూరములం బరిపూరితంబులై. (అరణ్య 4-141-2)

వీటిలో తొలిపద్యంలోని 'ప్రసన్న సరస్వతీక'మనే ప్రయోగం చాలా ఔచిత్యవంతమనీ, అవతరణికలోని ''ప్రసన్న కథాకవితార్థయుక్తిలో నారసి'' అనే మాట ఈ అవసానపు ఘట్టముతో సమన్వయం చేసుకోవాలని మధునాపంతుల వారి సూచన.

31. అదే పుస్తకంలో, పుట 424.
32. 'మధునాపంతుల సాహిత్య వ్యాసాలు' (1982)లో 'నన్నయగారి వెన్నెల రేయి' అనే వ్యాసంలో ఇది చెప్పారు.

నన్నయగారి కవిత్వం అర్ధాంతరంగా ఆగిపోయినా ఆయన తెలుగు సాహితికి పెట్టిన ఒరవడి నాటినుంచి నేటిదాకా సాగుతూనే ఉందనీ భాషా శాస్త్రజ్ఞులు నిరూపిస్తున్నారు.[33]

''ఆంధ్రభాషకు నన్నయగారు పెట్టినది భిక్ష. తక్కిన కవులందరు నన్నయగారి నుండి భాషా శబ్దములు, పద్య రచనలోని యొడుపులు గ్రహించినవారే గాని యొక్కరికిని నన్నయగారి ప్రసన్న కథా కలితార్థయుక్తి తెలియదు'' అని విశ్వనాథ సత్యనారాయణగారు ఉద్ఘాటించారు. దీనికి కారణం కట్టమంచి రామలింగారెడ్డిగారు ఏనాడో చెప్పారు. నన్నయగారు మితభాషులు. గాంభీర్యమనేది నన్నయగారి శైలికి ప్రాణం. మితిలేకున్న గాంభీర్య ముండదు. గాంభీర్యము వినయముతో కూడుకొని ఉంటుంది. వినయమున్న వాడే నిత్య సత్యవచనుడవుతాడు. సత్యవిదూరాలైనవి కృత్రిమంగా కనబడతాయి. రసోత్పత్తికి తగవు.

రుచిరార్థ సూక్తులతో, గంభీరమైన శైలిలో తొలి తెలుగు కావ్యం ఆవిర్భవించిన రోజు ఏదోగాని అది ఏటేటా మనం పండగ చేసుకోవలసిన రోజే కదా!

నన్నెచోడుడు

ఆంధ్రకవితా సామ్రాజ్యాన్ని 'ఆదికవి' అనే బిరుదు గద్దెపైనుండి, నన్నయగారు, ఆదినుంచి క్రీ.శ. 1910 దాకా ఏ మాత్రం ఒడిదుడుకులూ లేకుండా పరిపాలిస్తూ వచ్చారు. ఆ సంవత్సరం తెలుగు సాహిత్యలోకంలో గొప్ప సంచలనం కలిగింది. నన్నయగారిని ఆదికవి సింహాసనం నుంచి దింపి ఆ పట్టం కవిరాజశిఖామణి నన్నెచోడునికి కట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. కొందరు ఈ 'విప్లవానికి' సహాయం చేశారు. నన్నయాభిమానులు దీనిని శాయశక్తులా ఎదిరించారు. నయాభిమానులు తోడ్పడ్డారు. సాహిత్య రాజ్యంలో హాహాకారాలతో జరిగిన ఈ అంతఃకలహంతో, సంకులసమరంలో కొందరు సాహితీపరుల నిజాయతీలు గాయపడ్డాయి. నన్నయగారి తరువాత ఉన్న పూర్వకవులలో కొంతమంది స్థానాలకు కూడ చలనమేర్పడింది. ఈ 'పితూరీ' చివరకు లాభమే చేకూర్చింది. అప్పటిదాకా తెలియని ఒక సరికొత్త పాతకవిని దేశానికి పరిచయం చేసింది.

దీనికంతటికీ మూలకారకులు మానవల్లి రామకృష్ణకవిగారు (1866–1957). వీరు సంస్కృతాంధ్ర సాహిత్యాలలో మంచి వైదుష్యం కలవారు. ద్రావిడ కర్ణాటక కేరళ ప్రాకృతాది భాషలలోనూ చక్కని పరిచయం కలవారు. ప్రాచీన గ్రంథాలను సంపాదించడం, పరిష్కరించి ప్రకటించడం వీరి జీవితాశయం. ఎందరెందరో విస్మృత కవులకు వీరు మళ్ళీ ప్రాణం పోశారు. ''కవిగారు జీవిత పరమార్థముగా ప్రాచీన గ్రంథ సంపాదనమునకు పూనకయుండినచో ప్రాచీన గ్రంథములెన్నియో నేడు లోకము

33. తెలుగు సాహితికి నన్నయ ఒరవడి (వాగను శాసనం) (1986) డాక్టర్ హెచ్.ఎస్. బ్రహ్మానందం.

నకు లేకయే పోయి యుండెడివి'' అన్న గన్నవరపు సుబ్బరామయ్యగారి మాటలు అక్షరాలా సత్యం.

కవిగారు నన్నెచోడుని కుమారసంభవంలో మొదటి ఏడాశ్వాసాలను ఒక సంపుటంగా 1909వ సంవత్సరంలో ప్రకటించారు. దానిలో నన్నెచోడుడు క్రీ.శ. 940 వాడని వ్రాశారు, ఇది నన్నయగారిని ఒక శతాబ్దం అర్వాచీనుడిగా చేసివేస్తుంది. అందుకే అంత సంచలనం పుట్టింది. కాకలుతీరిన సాహిత్య పరిశోధకులు ఎవరెవరు ఏయే విధాలుగా నన్నెచోడుని కాలనిర్ణయం చేశారో చూడండి.

కాలం గురించిన తకరార్లు

మానవల్లి కవిగారు నడకుదిటి వీరరాజుగారు నేలటూరి వెంకటరమణయ్యగారు	క్రీ.శ. 940
చిలుకూరి వీరభద్రరావుగారు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు జయంతి రామయ్యగారు	క్రీ.శ.1120 ప్రాంతం
వీరేశలింగంగారు బుర్రా శేషగిరిరావుగారు కోరాడ రామకృష్ణయ్యగారు	క్రీ.శ. 1160–1170

శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు ఒక్కరూ క్రీ.శ. 1325 ప్రాంతాలన్నారు. వీరి వాదాన్నే ఈ మధ్య నా మిత్రులు వేదము వెంకటరాయశాస్త్రిగారు బలపరచి, నన్నెచోడుడు తిక్కనకు కూడ ముందు ఉండడానికి ఆస్కారం లేదు. ఆ తరువాతి వాడేననీ, క్రీ.శ. 1300 ప్రాంతాలవాడనీ ప్రతిపాదించారు. మొదటి తరంలోని ఉద్దండ పండితులు చేసిన కాలనిర్ణయాలను చూశాం కనుక ఇంక తరువాతి పండితులు ఎవరెవరు ఏ కాలాన్ని స్వీకరించారో చూద్దాం.

నన్నయకు సమకాలికుడని, అంటే 1028–1078 ప్రాంతాలవాడని చాగంటి శేషయ్యగారు అంటున్నారు. దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు కుమార సంభవ కావ్యం లోనే గుంభనంగ కవికాలం ఉందని రకరకాలుగా ప్రమాణాలు త్రవ్వి తిథివారాలు కూడ ఇచ్చారు. వారి లెక్క ప్రకారం కుమార సంభవం క్రీ.శ. 1053 మార్చి 30-వ తేదీకి సరియైన విక్రమార్క శకం 1110 విజయ సంవత్సర చైత్రశుద్ధ అష్టమి జయవారం.

సర్వశ్రీ నిడుదవోలు వెంకటరావుగారు, ఖండవల్లి లక్ష్మీరంజనంగారు, దివాకర్ల వెంకటావధానిగారు మొదలైనవాళ్ళంతా వీరేశలింగంగారి వాదాన్నే స్వీకరించి నన్నెచోడుడు నన్నయ, తిక్కనల మధ్యకాలం వాడని ఆమోదించారు. సాహిత్యలోకంలోని

చాలామంది ఈ మెజారిటీ వాదాన్నే ఒప్పుకొని కాలనిర్ణయ వివాదంలోనికి దిగలేదు. మనంతట మనం స్వతంత్రంగా పరిశోధించి ఈ కవి కాలాన్ని నిర్ణయించడానికి ప్రయత్నించవచ్చు. కాని ఇదొక పద్మవ్యూహం. తారీఖుల అడవిలో, శాసనాల సముద్రంలో, చారిత్రక సందిగ్ధాల ఊబిలో, ప్రామాణిక గ్రంథాల పర్వత శ్రేణులమీద, వాదోపవాదాల ఎడారిలో ప్రయాణం చేసిచేసి చివరికి ఒక నిర్ణయానికి రావచ్చు. ఇది ఈ ప్రకరణం చిట్ట చివరకు అట్టే పెడదాం. కాల నిర్ణయం పైన ప్రత్యేకంగా ఒక పుస్తకం వ్రాయవలసి వచ్చింది.

నన్నెచోడుని చరిత్ర సాహిత్యం

వాస్తవానికి నన్నెచోడుని మీద ఎన్ని పుస్తకాలకైనా ఆస్కారముంది. అందుకే మన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు పోటీపెట్టి ఈ కవిమీద పుస్తకాలు వ్రాయించారు. వేదం వెంకటరాయశాస్త్రిగారు 'నన్నెచోడుని కవిత్వము' అనే పుస్తకం వ్రాశారు. దీనికి అకాడమీ వారు బహుమతి ఇచ్చారు. భాషాప్రవీణ అమరేశం రాజేశ్వరశర్మగారు కూడ 'నన్నెచోడుని కవిత్వము' అని ఒక పుస్తకం ప్రకటించారు. నా మిత్రులు తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు కూడ 'కవిరాజు శిఖామణి' (ప్రథమ భాగము) అనే గ్రంథాన్ని ప్రకటించారు.

ఇవిగాక ఆదిలో శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు 1937 నాడే ప్రచురించిన నన్నెచోడదేవ 'కుమార సంభవ విమర్శము' 1951లో దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డిగారు ప్రచురించిన 'నన్నెచోడ కవిచరిత్ర' మొదలైనవి చెప్పుకోదగ్గ గ్రంథాలు. ఇందరు వ్రాసిన ఈ పుస్తకాలన్నీ కవిరాజ శిఖామణియొక్క సర్వతోముఖ ప్రతిభను సమగ్రంగా చూపెడతాయి.

ఒరవడిపెట్టిన ఒజ్జ

'ఆదికవి' అన్న బిరుదు లేకపోతే పోయిందిగాని నన్నెచోడుడు నిజంగా చాలా విషయాలలో ఆద్యుడు. ప్రతి ప్రబంధంలోనూ మనం మొట్టమొదట చదివే ఇష్టదేవతా ప్రార్థన, పూర్వకవిస్తుతి, కుకవినింద, గ్రంథకర్త స్వవిషయం, కృతిపతివర్ణన, షష్ఠ్యంతాలు మొదలైనవి నన్నెచోడుడే మొదలుపెట్టాడు. ఇదే తరువాతి కవులకు ఒరవడి అయింది.

ఇతనికి పూర్వం మల్లియ రేచన తన కవిజనాశ్రయములో ఒక కందపద్యంలోని రెండున్నర పాదాలలో ''గురుయతి గణములు పాదాంబురుహంబుల కెరగి సుకవి బుధజనముల నాదరమున దలచి'' కృతి చెప్పాడు. ఆ తరువాత కాలంలో నన్నయగారు భారతంలో ఒకే పద్యంలో 'హరిహరాజగజాననార్క షడాస్యమాతృ సరస్వతీ గిరిసుతాదిక దేవతాతతికి' నమస్కృతి చేశారు. నన్నెచోడుడు వరసపెట్టి పేరుపేరునా ఒక్కొక్కర్నీ ఒక్కొక్క పద్యంలో స్తుతించాడు. నన్నయగారు గురుపద్య విద్యకు ఆద్యుడైన వాల్మీకిని, వ్యాసుణ్ణీ, సత్సభలనూ కొనియాడి ఊరుకొన్నారు. నన్నెచోడుడు

ఆదికవి వాల్మీకిని, వేదవ్యాసుని, వరకవితాసింహాసనమెక్కి కవీంద్రులనే దాసులుగా ఏలిన కాళిదాసును, వస్తుకవితలో జనారాధితుడైన భారవిని, గూఢ వస్తుమయ కావ్యాన్ని చెప్పి హరునే మెప్పించిన ఉద్భటుణ్ణి, పోయిన చేతులు తెచ్చుకున్న బాణుణ్ణి[1] పేరుపేరునా ఒక్కొక్క పద్యంలో నుతించి తెలుగులో కవిత్వాన్ని పుట్టించిన చాళుక్యరాజు మొదలుగ పలువుర్ని పేర్కొని, 'విస్తర' మతులైన పురాణక సంఘాన్నీ, ఉత్తమ 'మార్గ' సత్కవీశ్వరులనూ, 'దేశి' సత్కవులనూ, కృత 'వస్తు' సమితికి మదినెరగు విబుధవర్గాన్నీ తలచాడు. ఆనాడు విస్తర, మార్గ, దేశి, వస్తుకవితలనే చతుర్విధ కవిత్వాలు ఉండేవేమో!

వస్తుకవిత – అంటే...?

నన్నెచోడుడు తనది వస్తుకవిత్వమన్నాడు. అంటే ఏమిటో ఒక్కొక్కరూ ఒక్కొక్కరకమైన అర్థం చెప్తున్నారు. ''వస్తుకవిత యనగా ప్రకృతిని వాస్తవముగా వర్ణించు కవితయనియు, వస్తుకవులనగా ప్రకృతిశోభను వాస్తవముగా వర్ణించు కవులనియు ననుటయే'' అని అమరేశం రాజేశ్వరశర్మగారు వ్రాశారు. ''రామాయణ, కిరాతార్జు నీయము లేక వస్తు ప్రతిపాదకములై వెలయుట చేత నా కావ్యములలోని వస్తు ప్రాధాన్యమును సూచించుటకై నన్నెచోడు డాకావ్యములను వస్తుకావ్యములనియు, వారిది వస్తుకవితయనియు బేర్కొనెను. తాను జెప్పనేర్చి చెప్పిన కవితనుగూడ వస్తుకవితయని పేర్కొనినాడు'' అని తిమ్మావజ్ఝలవారు వ్రాశారు.

వస్తుకవిత అంటే ప్రబంధ కవిత్వమే అని ''ప్రబంధములు పలువిధములనియు, అందు మహాకావ్యము వస్తువు, అనగా కథావస్తు ప్రాధాన్యము గలదనియు, అట్టి వస్తువును ఆశ్రయించినదే వస్తుకవిత అనియు, చాటు ప్రబంధాదుల వంటిది కాదనియు తెలియు చున్నది'' అని వేదం వెంకటరాయశాస్త్రిగారు వ్రాశారు.

ఆనాటి తెలుగు కావ్యాలలో ఏ ఒక్కటీ దొరకలేదుగాని లభించిన ఒకే ఒక లక్షణ గ్రంథంలో మల్లియ రేచన తాను 'వస్తుకవి జనాశ్రయుణ్ణ'ని చెప్పుకొన్నాడు. అప్పటి సబ్బినాడులోనూ, ఇతర ప్రాంతాల కన్నడ సాహిత్యంలోనూ వస్తుకవిత ఉండేది. నాగవర్మ తన కర్ణాటక 'కాదంబరి' చంపువును వస్తుబంధమని ఇలా చెప్పుకున్నాడు.

ఇదుచోద్యం కవి హృద్గతం నవరసం నిర్దోషమెందీగళా
దుదుకాదంబరి సేవ్యమాడు దనితుం, తానైద భూభాగదోళ్
ఉదిత శ్రీకవి నాగవర్మన వచస్సందోహదిం దోషమం
దదలంకారద వస్తుబంధ మిదు తానెం మాడదేం గెయ్యదో.

కన్నడ చంపూ రచనలో 'చెర్తాణ' అనే ప్రక్రియా భేదం ఒకటి ఉంది. అలాగే 'బెదండె' అనే ఇంకోరకం కావ్యవిభేదం వుంది. రెండు 'నిరతిశయవస్తు విస్తర' పద్య

1. బాణుడు తిరిగి చెయ్యి తిరిగినవాడందాం.

మహాకావ్యాలే. ఈ లక్షణాలను కన్నడ భాషలోని తొలి లక్షణ గ్రంథం 'కవిరాజమార్గం' క్రీ.శ. 850 ప్రాంతాలలోనే విశదం చేసింది (1-32). ఒక్క పద్య కావ్యాలే కాదు, గద్య కావ్యాలు కూడా 'ప్రకటతర వస్తువిస్తర' రచనలే. కర్ణాటక భాషలోని ఆదికవి పంపనగారు వస్తువిద్య, వస్తుకృతి అనే మాటలు వాడారు. విస్తారమైన సాహిత్య సంపదగల కన్నడ వాఙ్మయాన్నీ, అందులోనూ కవిరాజమార్గాన్ని తెలుగు కవిరాజ శిఖామణి నన్నెచోడుడు ఎన్నోసార్లు చదివే వుంటాడు. క్రీ.శ. 853లో 'అసగ, అనే పేరుగల ఒక కన్నడకవి సంస్కృతంలో జైన కావ్యాలనూ, కన్నడంలో కుమార సంభవాన్ని రచించాడు. ఇతని పేరూ, కావ్యాల పేర్లూ మాత్రమే తెలుస్తున్నాయి. నన్నెచోడుని కాలంలో అసగుని కుమారసంభవం ప్రచారంలో ఉండి ఉంటుంది. దాన్ని కవిరాజ శిఖామణి చూశాడో లేదో, చూస్తే అనుసరించాడో లేదో తెలియదు. కన్నడంలోంచి మాత్రం వస్తువిద్యను పట్టుకొని, వస్తుకృతిని చెప్పాడు.

'వస్తుకవిత' అనే సంప్రదాయాన్ని నన్నెచోడుడు కన్నడం నుంచి మాత్రమే కాక తమిళ సాహిత్యం నుంచి బహుశా అనుసరించాడని తిమ్మావఝల వారు చూపించారు. ఆ భాషలో 'నవనీత పాట్టియర్' అనే అలంకార గ్రంథంలో ''కవి, గమకి, వాది, ఎన్లవగైయం, ఆసు, మధురం, చిత్తిరం, విత్తద ఎన్లు నాలై వగైయుం'' అనే రెండు రకాల విభాగాలు పేర్కొన్నారని ''ఆశు, మధుర, చిత్ర, విస్తరములను చతుర్విధ కవితలలో నీ వస్తుకవిత విస్తరకవితలో నంతర్భాగము కావచ్చును'' అని తిమ్మావఝలవారు అన్నారు. నన్నెచోడుడు విస్తర, మార్గ, దేశి వస్తు కవితలను పూర్వకవులనుతిలో వేర్వేరుగా పేర్కొనడం మనం ఇందాకా చెప్పుకొన్నాం.

కుకవులపై ధ్వజం

పూర్వ కవులను నుతించిన తర్వాత నన్నెచోడుడు కుకవులను పట్టుకుని తిట్టాడు. ఒక చిన్న వచనంలో ''మఱియు దోషగ్రాహకులగు కుకవి వరాకులం బరిహరించిరి, నెట్లనిన'' అవి వరుసగా పద్యాలు చెప్పాడు. ఒకటా - రెండా - మూడు పద్యాలలో నిందించి తృప్తిపడక 'కావున' అని ఒక చిన్న పదం వంతెన వేసి, మరొక పద్యంలో తిట్టి, ఇంకొక వచనం ముక్క 'అది యెట్లనిన' అని అతికి మళ్ళీ వరసగా పద్యాలు చెప్పాడు. తాను రచించబోయే పద్ధతిని సమర్థించుకొన్నాడు. ఒక రకం కవిత్వానికి అతను ఆద్యుడు. అప్పటిదాకా ఎవరూ తలపెట్టని గ్రంథరచనకు పూనుకొన్నాడు. దోషగ్రాహకులు అడుగడుగునా ఉంటారు కాబట్టి వాళ్ళను ఉపసంహరించవలసిన అవసరం ఆయనకు వచ్చింది. ఎలా తిట్టాడో చూద్దాం.

''కుకవి గుణాలనైనా దోషాలుగా చేస్తాడుగాని దోషాలను గుణాలుగా చేయలేడు. కుక్క దొంతులు తోస్తుందిగాని పేర్చగలదా?'' అన్నాడు.

అతని కాలంలో ఉత్తమ కావ్యాలను అర్థం చేసుకొని ఆదరించలేదు. తక్కువ అభిరుచులున్న పుస్తకాలమీదికే అల్పులు ఎగబడేవారు కాబోలు.

''నెరయ రసవంతమగు కృతి కెరగనేర
రల్పరసకృతి కెరగుదు రల్పులెల్ల
జెరకు పిడిచిన రసమున కెరగిరాక
పిప్పి కరిగెడు నీగలపెల్లువోలె'' (1-30)

అని ఈ సంగతి చెప్పాడు. కుకవి నిందలో నన్నెచోడుడు పిప్పిమీద వాలే ఈగలతో పోల్చడం చూసి తర్వాతి కవులు చాలామంది అక్షరాలా 'మక్కికి మక్కి' అనుసరించి ఈగలను వాడారు.

చిత్రకవి సింగరార్య తన బిల్హణీయంలో నన్నెచోడునిలాగా కుకవులను ఈగలతో పోల్చాడు. ''నిర్మలావయవమ్ములు నెమ్మి విడిచి వ్రణములకు బారుమక్షికా ప్రతతి భంగి ఒప్పులు గ్రహింప కెప్పుడు తప్పు లరయు కాకవుల లోకములు నిరాకరింతు'' అన్నాడు. నిర్మలమైన అవయవాలపైన ముసిరినా ఈగలు రోత కలిగిస్తాయని మరచిపోయాడు!

కనుపర్తి అబ్బయామాత్యుడుకూడ కవిరాజశిఖామణిని మక్కికిమక్కి అనుసరించాడు. ఈగలకు 'ప్రపూతి హేయకవితావ్రణ శోధన వాంఛ' తప్పించి 'వటీర చర్చిత సుగంధతను స్థితిబుద్ధి' ఎలా కలుగుతుందన్నాడు. ఇలా 'కవిరాజ మనోరంజనం'లో, 'అనిరుద్ధచరిత్ర'లో కూడా అబ్బయామాత్యుడు ఈగల పోలికనే కుకవులకు తెచ్చాడు. 'మక్షికా వితతులు వ్రణంబు పరికించుగతిని కొదవను గణించుట కుకవుల నైజబుద్ధి' అన్నాడు.

కవితాశయాలు

కావ్యమంటే ఎలా ఉండాలని తాము భావిస్తున్నారో ప్రతి కవీ కృత్యారంభంలోనే వ్రాయడం ఆచారమే. ఇదికూడ నన్నెచోడుడు ప్రారంభించాడు. కుకవి నింద తరువాత తొమ్మిది పద్యాలలో కవితాశయాలను వివరించాడు.

''మృదురీతి సూక్తు లింపొదవింప మేలిల్లు
భావమ్ము నెలమి క్రీడావహాముగ
మెరుగుల గన్నులు మిరుమిట్లు వోవంగ
గాంతిసుధానూతికాంతి బెనయ
వర్ణనలెల్ల చో వర్ణకెక్కంగ
రసములు దళుకొత్తి రాలువార
దేశిమార్గంబులు దేశీయములుగా న
లంకారముల దా నలకంరింప

నాదరించి విని సదర్థాతిశయమున
బుధులు నెమ్మనమున నిధులు నిలుప
వలవదే సమస్త వస్తుకవీశ్వర
నూత్నరుచిరకావ్య రత్నవీథి? - (1-36)

అని వస్తుకవిత్వ పద్ధతిని రత్నాల బజారులాగా వర్ణించాడు. విలువైనదిగా గుర్తించాడు. కావ్యం ఎలా ఉండాలో ఇంకొకవిధంగా విశదం చేశాడు.

గడుసుదనం, గమ్మత్తులు

''పదబంధంబుల నగ్గలించి బుధశబ్దభ్రాజియై, సద్గుణా
స్పదమై దుష్కవిహృదత్సరోజవనముల్ బంజింపుచున్ భూరిస
మ్మదలీలన్ విలసిల్లి సత్కృతిజగన్మాన్య ప్రభావంబునన్
మదనాగంబును బోలె గ్రాలవలదా మా రెందు లే కున్నతిన్?'' (1-40)

అని కావ్యాన్ని మదపుటేనుగుతో పోల్చాడు. అందుకే మత్తేభ వృత్తాన్ని తీసుకొన్నాడు. నన్నెచోడునిలో ఇటువంటి గడుసుదనాలు చాలా ఉన్నాయి. ఏ ఛందస్సులో ఏది చెప్పాలో అతనికే తెలుసు. శివపార్వతులు ఏనుగుల రూపంలో క్రీడించారని వర్ణించినప్పుడు మళ్ళీ మత్తేభాన్నే వాడాడు. మన్మథుడు సపరివారంగా శివుని మీదికి దాడి వెళ్ళేటప్పుడు మత్తకోకిల వృత్తాన్నే వాడాడు. తాను వాడిన ఛందస్సు పేరుకూడ ఆ పద్యంలోనే వచ్చేటట్లు చొప్పించడం ఇతనికొక సరదా. స్వాగతవృత్తం వ్రాస్తే అందులో స్వాగతమనే పదం వాడతాడు. క్రౌంచపదం అనే వృత్తంలో వ్రాస్తే ఆ పేరు తెస్తాడు. ఇటువంటి గమ్మత్తులను ముద్రాలంకారమంటారు. ఈ చాతుర్యం కావలసిందే కాని ఉక్తిచాతుర్యానికి నన్నెచోడుడు ప్రాధాన్యమిస్తాడు. దానినే మొదట చెప్పాడు.

''చతురోక్తుల నుతపద బహు
గతుల నలంకార భావకాంతి రసార్థో
న్నతిగతి నతిరసికులు వర
సతిగతి నెరిగింపవలెదె సౌభాగ్యమునన్?'' (1-39)

అని కావ్యాన్ని సౌభాగ్యవతిగా ఎంచుకొన్నాడు. ''తల యూపింపనిది కావ్యమె?'' (1-41) అని ప్రశ్నించాడు ''అరువది నాలుగు విద్యలలో నేర్పు నైసర్గికమై వాలిన సుకవులకు'' తప్ప ఇంకెవరికైనా కృతులు చెప్పడానికి తరమౌతుందా? అని ప్రశ్నించాడు. అష్టాదశ వర్ణనలతో పరిపూర్ణమై, దశప్రాణాలతో సజీవమై, నవరసభావభరితమై, ముప్పయిఆరు అలంకారాలతో రమణీయమైన దివ్యకథ తాను చెప్తున్నానన్నాడు (1-41-43). చెప్పినట్టుగానే అన్నీ నెరవేర్చాడు. తెలుగులో అష్టాదశ వర్ణనలను మొదట పేర్కొన్నవాడు ఇతడే.

మాటల్లో నీటు

ఈ పద్దెనిమిది వర్ణనలనూ కవిరాజ శిఖామణి ఎంత చక్కగా చేసినదీ అమరేశం రాజేశ్వరశర్మగారు తమ గ్రంథంలో విపులంగా, 126 పేజీల ప్రకరణంగా చర్చించారు. ఇలా వివరంగా పరిశీలించినందువల్ల కొన్ని చక్కని సారస్యాలను కూడా తీశారు. మాట వరుసకు నన్నెచోడుడు జలకేళీ వర్ణనలో వాడిన ఒక మాటకు బాగా అర్థం చెప్పారు. మనం నేడు 'ఓలలాడడం' అనే మాటను 'మునిగితేలడం' అనే అర్థంలో వాడుతున్నాం. ప్రాచీనులు ఏ అర్థంలో వాడేవారో మనకు తెలియదు. వసుచరిత్రలో రామరాజ భూషణుడు -

''ఓలంబాలక 'యోల యోల' యన 'నోలో' లంచు మేలంబునన్
లోలంబాలక యోర్తు గ్రుంకి బిసవల్లుల్ దున్మి తూటాడి కెం
గేలం బట్టి తటాలునన్ నెగసె...''

అని వర్ణించాడు. ఒకర్తె 'ఓల ఓల' అంటే రెండవది 'ఓలోల' అని ఎందుకు మునిగి తేలిందో తెలియదు. ఇది కవిరాజు పద్యంవల్ల తెలుస్తున్నది అని రాజేశ్వరశర్మగారు విశదీకరించారు.

''తన ముఖ మంబుజాత మనిదందడి మూవు నలివ్రజాంబుతో
బెనగు విదగ్ధ ప్రోల నొక బేల సతిం గని యోలబెట్టి పి
ల్చిన నది తన్ను బట్టునని చేరిన దేటుల దాని మూవి కొం
డనుచునుగ్రుంకిపోయి చదురాలయి నవ్వుచులేచెనొక్కెడన్.'' (9-88)

అని నన్నెచోడుడు వర్ణించాడు. జలకేళి చేస్తున్న ఒక చెలువ నీళ్ళలో నిలబడి వుంది. ఆమె ముఖం పద్మంలాగ ఉందని తుమ్మెదలు మూగాయట. వాటితో ఆమె సతమతమవు తున్నది. ఇది గమనించి, అదను దొరికిందని ఇంకొక చెలి ఓలపెట్టి పిలిచిందట. అది తనను పట్టుకొంటుందని తన చుట్టూ ముసురుకొన్న తుమ్మెదలతో 'ఆమెను పట్టుకోం'డని చెప్పి, సతమతమవుతున్నది మునిగి నవ్వుతూ ఇంకొక చోట తేలింది.

''దీనినిబట్టి 'ఓల యనునది ఈ యాటలోని ఒక సంకేత శబ్దమనియు' ఎవరి పేరు చెప్పి ఆటలోని దొంగ దీని నుచ్చరించిన వారు వెంటనే నీటిలో మునిగి మరియొకచోట దేలవలె ననియు దేలుచున్నది. అట్లు నీటిలో గ్రుంకి పారిపోనిచో వారు ఆటలో 'దొంగ'గా బరిగణింపబడుదురేమో! అనగా దొంగ ముట్టుకొనుటకు ముందుగా వారికి చేయు హెచ్చరికయే యీ 'యోల' యను పదమని నిర్ణయించవచ్చును' అని రాజేశ్వరశర్మగారు వ్రాశారు. బాగానే ఉంది. 'దొంగ' ఓలఓల అనగానే మునిగేది కూడ 'ఓలోల' అనాలి అని వసుచరిత్రలోని పద్యం చెప్తున్నది. తుమ్మెదలతో బాధపడుతున్న ఇంతి ఇలా అనడం నన్నెచోడుడు వర్ణించలేదు.

అష్టాదశ వర్ణనలు - అనుయాయులు

'కవిరాజ శిఖామణి' పనికట్టుకుని అష్టాదశ వర్ణనలు చేయడమే అతని అర్వాచీనతకు నిదర్శనమని మిత్రులు వేదం వెంకటరాయశాస్త్రిగారు ఒక పట్టికను తయారు చేశారు. ఏయే కాలాలలో, ఏయే అలంకారికుడు, ఎన్నెన్ని వర్ణనలు శాసించాడో చూపించారు. సంస్కృతంలో ప్రతాపరుద్రీయం వ్రాసిన విద్యానాథుడు, కావ్యాలంకార చూడామణి వ్రాసిన విన్నకోట పెద్దన, నన్నెచోడుడు, అప్పకవి, సాహిత్యదర్పణం వ్రాసిన విశ్వనాథ కవిరాజులను పట్టికలో క్రమంగా పేర్కొన్నారు. ఈ వరుస ఇలా చెప్పడానికి నన్నెచోడుడు ప్రతాపరుద్రీయాన్ని అనుసరించాడనే వెంకటరాయశాస్త్రిగారి నమ్మకమే కారణం. అయితే ''ప్రతాపరుద్రీయం దండి ననుసరించినది'' అని వారే 121-వ పుటలో ఒప్పుకొన్నారు. నన్నెచోడుడు దండిని అనుసరించి ఉండకూడదా? దండి క్రీ.శ. 7-వ శతాబ్దం వాడే! నన్నెచోడుని తర్వాత అష్టాదశ వర్ణనలు పేర్కొన్నవాడు పాల్కురికి సోమనాథుడు. ఇతడు కూడ విద్యానాథుని అలంకారశాస్త్ర ప్రభావంలో పడి అలా చెప్పాడని వెంకటరాయశాస్త్రిగారి ఉద్దేశం.

పాల్కురికి సోమనాథుడు నన్నెచోడుణ్ణే అనుసరించాడని ఎందుకనుకోగూడదు? నన్నెచోడుడు మొదటివాడు గనక ''వర్ణనాష్టాదశమున్'' పరిపూర్ణంబై, దశప్రాణంబు సప్రాణంబై, నవరసభావభరితంబై షట్త్రింశదలంకారలంకృతంబై రమణీయంబైన దివ్యకథారంభంబున్'' అని ఒక వరుసలో చెప్పలేదు. సోమనాథుడు అనుసరించాడు కనక

''తొమ్మిది రసములు దొలుకాడ దాని
ఇమ్మడివర్ణన లెసగంగ ద్విగుణ
మగు నలంకారంబు లలరార, దాని
ద్విగుణభావార్థముల్ దీటుకొనంగ''

తేట తెలుగులో ద్విపద వ్రాస్తానన్నాడు. తొమ్మిది రసాలు, తొమ్మిదిరెళ్ళు పద్ధెనిమిది వర్ణనలు, పద్ధెనిమిది రెళ్ళు ముప్ఫయ్యారు అలంకారాలు, ముప్ఫయ్యారు రెళ్ళు డెబ్బయిరెండు అర్థభావాలు అని రెట్టించుకొంటూపోయాడు. ఈ రెట్టింపు లెక్కలో దశప్రాణాలు మరచిపోయాడు.

గారడీలు - గమ్మత్తులు

సోమనాథుడే ప్రాచీనుడై, నన్నెచోడుడే అతణ్ణి అనుసరిస్తే ఇంతకన్నా చమత్కారం చూపెట్టడానికి ప్రయత్నించడా? గమ్మత్తులూ, గారడీలూ అతనికి నైసర్గికం. తన కాలానికి ముందున్న అలంకార శాస్త్రాన్ని మన్నించి అందులో ఉన్న లక్షణాలతో రమణీయమైన దివ్యకథారంభానికి అభిముఖుడయ్యాడు. గ్రంథానికి శ్రీకారం చుట్టి అప్పటికే నలభైనాలుగు పద్యాలు చెప్పాడు. అందుకే ఈ లెక్కలలో గారడీ చేయలేదనుకోవాలి.

అవును అవతారికలో చెప్పవలసినవి ఎన్నో ఉన్నాయి. గ్రంథాన్ని తన గురువుకు కృతి యివ్వడం అందులో మొదటిది.

అంకితానికి నాంది

తెలుగు సాహిత్యంలో కృతిని సప్తసంతానాలలో ఒకటిగా భావించి అంకితం ఇవ్వడంకూడ నన్నెచోడునితోనే మొదలవుతుంది. ఇది కవిరాజ శిఖామణి కన్నడం నుంచి గ్రహించాడని కోరాడ రామకృష్ణయ్యగారు స్పష్టంగా తెలియజేశారు.[2] తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు తరువాత చాలా చక్కగా నిరూపించారు.

''కావ్యమును రాజునకో మరియొకరికో యంకితమిచ్చు నాచారము సంస్కృత కవులలో లేదు. నన్నయకూడ తన భారతమును 'భారత శ్రవణాసక్తి' కలిగిన రాజరాజనరేంద్రుని శ్రోతగా జేసి వినిపించెనేకాని యాతని కంకితమీయలేదు. కన్నడ కవులు మాత్రము తాము కృతికన్యా జనకులై తమ కృతులను తమ కన్యలుగా దలపోసి తమ్ము బోషించు రాజును కృతిపతిజేసి, యాతని కంకితమిచ్చు చుండిరి. కన్నడమున బంప కవి యరికేసరి రాజునకు, రన్నకవి సత్యాశ్రయ వల్లభునకు తమ తమ కావ్యములను గృతి యిచ్చిరి. నన్నెచోడుడును వారి ననుసరించి... తనకు గురువును నిష్టదైవమును గూర్చు నిజేశుడును దానెయైన జంగమ మల్లికార్జున యోగికి గృతియిచ్చెను....

''ఇట్లు కృతి యొసగుటలో గూడ మరియొక విశేషము కలదు. అది ఏదనగా, కథానాయకునితో కృతిపతికి అభేదము పాటించి నాయక గుణాభివర్ణన వ్యాజమున కృతిపతి గుణాభివర్ణనము సేయుట. ఈ సంప్రదాయముగూడ నన్నెచోడుడు కన్నడ కవుల నుండియే పరిగ్రహించి నాడు. కన్నడమున పంపకవి తన విక్రమార్జున విజయమున కథానాయకు డగు నర్జుననికిని, కృతిపతియగు అరికేసరి రాజునకు నభేదము పాటించి కథను నిర్వహించెను. అట్లే రన్నకవియు తన 'సాహసభీమ'మను కావ్యమున కథానాయకుడగు భీమసేనునకును, కృతిపతియగు సత్యాశ్రయ వల్లభునకును నభేదము కల్పించి కథానిర్వహణము కావించెను. ఈ సంప్రదాయమునే యవలంబించి నన్నెచోడుడును కుమారసంభవ కథానాయకుడగు పరమేశ్వరునికిని, కృతిపతియగు జంగమ మల్లిఖార్జున యోగికిని నభేదము పాటించి కథానిర్వహణము గావించినాడు.''[3]

2. కుమారసంభవం - (మదరాసు యూనివర్సిటీ ప్రచురణ, 1948) పీఠిక - పుట. 22.
3. కవిరాజశిఖామణి - తిమ్మావజ్ఝల కోదండరామయ్య, పుట. 94-95

గురువుపై గురుభక్తి

నన్నెచోడునికి తన గురువంటే ఒళ్ళు తెలియనంత భక్తి. అతనికి అంకితమిచ్చి, కావ్యంలో అడుగడుగునా అతణ్ణి నుతించడంలో ఈ భక్తి కనబడుతుంది గాని ఇది ఒకచోట మరీ శిఖరాగ్రాన్ని అందుకుంది. కుమారసంభవ కావ్యములో పార్వతి శివుని గురించి తపస్సు చేయడానికి వెళుతుంది. అడవిలో ఆమెకు రకరకాల ఆటవికులు కనబడ్డారు. మదసింధుర గామినులు జీరిక కల్లుతాగి గౌడుగీతాలు పాడుతున్నారు. శబరకామినులు పెక్కు రాగాలతో మదోత్కటంగా పాడుతున్నారు. ఎవరిని గురించి? ఇంకెవరౌతారు? 'మునిముఖ్యు లోకగురు జంగమలింగ మల్లికార్జునన్' కీర్తించారు. పార్వతి ఇంకా ముందుకు సాగింది. ఋషుల పల్లి చూచింది. ముని మాన్యులను దర్శించుకొంటూ వెళ్ళగా వెళ్ళగా ఆమెకు విప్రముని పుంగవుడైన జంగమ మల్లిఖార్జునుడే కనబడ్డాడు.

అతడు వృక్షమూల నివాసుడు. ఆతత వేదవేది. అనూన రుద్రాక్షధారి. అఘూరి. అతణ్ణి చూచి ''భూరి ప్రీతింబ్రణమిల్లి గురుస్థానంబుగా స్వీకరించి పార్వతి పరమభక్తియుక్తి నారాధించి తత్ప్రసాదంబున పడయు నిజాభిమతం త్యజించి శైవాగమవిధి దీక్షగొని పరమేశ్వరుడు దయంబున బ్రసన్నుం డగునట్టి మంత్రధ్యాన వ్రతాచారంబు లుపదేశంబు గొని తన్నియోగంబున'' తపస్సుకు ఆరంభించిందట. తన గురువును పార్వతికే గురువును చేశాడు! ఇంతకన్న గురుభక్తి ఇంకేం కావాలి?

గురువు ఘనత

ఈ మల్లికార్జునయోగి మహా విద్వాంసుడు, శ్రీశైల నివాసి. న్యాయ వైశేషికాది షట్తర్క కర్కశుడు. అందుచేత పరవాది భయంకరుడు. వేద షడంగశాస్త్ర పురాణేతి హాసాలూ, ఆగమాది సకల కళా స్వరూపాలూ తెలిసినవాడు. నిఖిల విద్యాగురుడు. ఇతర మతాలను ఖండించి శైవమతాన్ని బోధిస్తూ వుండేవాడు. ఇతడు ఓడించిన వాళ్ళలో 'వాదీంద్ర చూడామణి' అనే జైనాచార్యులు కూడ ఉన్నాడు కాబోలు. 'పరవాదీంద్ర ఘనా ఘనానిలు' అనే పద్యపాదం దీనినే స్ఫురింపజేస్తున్నదని నిడుదవోలు వెంకటరావు గారు అన్నారు. ఒక వాదీంద్రుడు తెలుగులో మొదటి లక్షణ గ్రంథాన్ని వ్రాసిన మల్లియ రేచన గురువు. అయితే నన్నెచోడునికి రేచన కొన్ని తరాల ప్రాచీనుడు.

మల్లికార్జున యోగి కవీంద్రుడు కూడ ఈ సంగతి నన్నెచోడుని కుమార సంభవంలో అక్కడక్కడ చెప్పాడు. సుప్రసిద్ధుడైన మల్లికార్జున పండితారాధ్యుడే మల్లికార్జున యోగి అని కొందరు భావించారు గాని అది సత్యం కాదు (ఎందుకు కాదో తరువాత చూద్దాం). తన గురువు తనకు ప్రసాదించిన కవిత్వాన్ని ''రవికి దీపమున నర్చన లిచ్చుపగిది అర్పిస్తున్నా''నని నన్నెచోడుడు చెప్పాడు.

స్వవిషయం

అంకితం సంగతి చెప్పాక తన గురించి చెప్పుకొన్నాడు. తాను సగర సుతులు, భగీరథుడు, రాముడు, కరికాలచోడుడు మొదలైనవాళ్ళు పుట్టిన సూర్య వంశంలో

పుట్టానని చెప్పుకున్నాడు. తన తండ్రి పాకనాడు ఇరువదియొక్క వేయికి అధీనుడైన చోడబల్లి అనీ, తన తల్లి హైహయాన్వయాంబర శశిరేఖయైన శ్రీసతి అని చెప్పుకొన్నాడు. తన తల్లి చోడబల్లి అగ్రమహిషి. తాను రాతిపొన్నలు, రాతి కోడి ఉన్న ఒరయూరి కధిపతిననీ, తనకు టెంకణాదిత్యుడనే బిరుదు ఉందనీ విశదం చేశాడు. ఇతడు వివిధ యజ్ఞాలు చేసి పవిత్రకృత దేహుడయ్యాడు.

ఇతడు తాను ఒరయూరికి అధిపతినని చెప్పుకొనడం చేత నిజంగా ఆ పేరుగల ఊరినుంచే పాలించాడని మొదట భావించారు. ఒరయూరు తమిళదేశంలో తిరుచిరాపల్లికి అరమైలు దూరంలో ఉంది. తన తండ్రి పాకనాడు పాలిస్తూ ఉంటే తాను దక్షిణాదిని ఉన్నట్లు కవి చెప్పాడని కొందరు పొరబడ్డారు. ''ఒరయూరు నన్నెచోడుని నివాసము. ఇది దక్షిణ దేశమున ప్రసిద్ధమైన 'ఒరయూరు' గాక తెనుగు దేశమున నున్నది'' అని నిడుదవోలు వెంకటరావుగారు[4] వ్రాశారు. అయితే ఏ కారణంవల్లనో అది ఎక్కడ ఏ జిల్లాలలో ఉన్నదో కచ్చితంగా చెప్పలేదు.

వాస్తవానికి 'ఒరయూరు పురవరాధీశ్వర' అనేది ఒక బిరుదు. తమ పూర్వులు ఒరయూరిని పాలించారు కనుక ఆ సంగతి క్రమానుగతంగా చోడులలో ఒక శాఖవారు చెప్పుకొంటున్నారు. ప్రాచీనులే కాదు అర్వాచీనులు కూడా క్రీ॥ శ॥ 17వ శతాబ్ది ప్రథమ పాదంలో పర్తియాల సంస్థానం పాలకులు జూపల్లివారు కూడా తాము ఒరయూరు పురాధీశ్వరులమనే చెప్పుకొన్నారు. ఈ సంగతి ఎలకూచి బాలసరస్వతి రచించిన చంద్రికా పరిణయంలో వుంది (బి 508). దక్షిణదేశంలో ఎప్పుడో పరిపాలించిన ఊరును విడిచిపెట్టినా, ఆ సంగతి చెప్పుకొంటున్నట్లే తెలుగు చోడులలో ఒక శాఖకు చెందిన కోడూరువారు ఆ ఊరు విడిచిపెట్టినా తాము కోడూరు పురవరాధీశ్వరులమని చెప్పుకోవడం కూడ వుంది. తెలుగు చోడులలో రేనాటి చోడులు, పొత్తపి చోడులు, కందూరు చోడులు, కోడూరు చోడులు, వెలనాటి చోడులు మొదలైన శాఖలున్నాయి. నన్నెచోడుడు కందుకూరినుండి పాకనాడు ఇరవై ఒక్క వెయ్యిని పాలించిన మహామండలేశ్వరుల వంశంలోవాడై ఉంటాడని పెదచెరుకూరి శాసనాన్నిబట్టి ఊహించవచ్చు. ఈ శాసనంలో మాత్రమే చోడబల్లి, నన్నెచోడులనే తండ్రీ కొడుకుల పేర్లు ఉన్నాయి. ప్రత్యేకంగా నన్నెచోడుని శాసనాలు ఏమీలేవు. లేకపోవడానికి కారణాలు తరువాత వెతుకుదాం.

ప్రతిభ - ప్రతిన

నన్నెచోడుడు తనది అనూన ప్రతిభ అన్నాడు. ఆ ప్రతిభా సముద్రంలోని ఉదీర్ణ రుచిర వస్తువిస్తారితోత్తమ కావ్యరత్న విభూషణాన్ని ఆకల్పాంతస్థాయిగా తన గురువు శ్రీ పాదాలకు విభూషను చేస్తానన్నాడు.

''రవికుల శేఖరుండు కవిరాజ శిఖామణి గావ్యకర్త స
త్కవి భువి నన్నెచోడుడటె కావ్యము దివ్యకథం గుమారసం

4. తెలుగు కవుల చరిత్ర, పుట. 199.

భవమటె సత్కథాధిపతి భవ్యుడు జంగమమల్లికార్జునుం
డవిచలితార్థ యోగధరుడట్టె వినం గొనియాడజాలదే?'' (1-57)

అని పొంగిపోయాడు. ఆ తరువాత సుదీర్ఘమైన వచనంలో ఎటువంటి గురువునకు అంకితమిస్తున్నదీ చెప్పాడు. ఈ వచనం షష్ఠీ విభక్తిలోని 'కు'తో అంతమైంది. తరవాత ఎనిమిది పద్యాలను షష్ఠీవిభక్తి ఉన్న పదాలతోనే వ్రాశాడు. వీటిని షష్ఠ్యంతాలంటారు. ఇతడు మొదటిసారిగా ఇలా అంకితాన్ని వ్రాయడం చూశాక ఇతరులూ ఎందరో అనుసరించారు.

ఈ పద్ధతి ఇంకే భాషలోనూ లేదు. బోలెడన్ని యితర విషయాలను కన్నడం నుంచి అనుసరించిన నన్నెచోడుడు దీనిని స్వయంగానే కొన్ని శాసనాలలో కనబడే దేశీయాచారాలను చూసి ప్రారంభించాడని దేవరపల్లివారూ, అమరేశంవారూ, కాళిదాసును చూసి మొదలుపెట్టాడని తిమ్మావఝలవారూ వ్రాశారు. కాళిదాసు తన రఘువంశ మహాకావ్యం ప్రారంభంలో రఘువంశుల గుణగణాలను ఉగ్గడిస్తూ షష్ఠ్యంత విశేషణాలతో, ఉదాత్త కవితాఫణితిలో అయిదు శ్లోకాలు వ్రాశాడు.[5] ''కాళిదాసు కవితయందపారమైన భక్తి ప్రపత్తులు గలిగిన నన్నెచోడుడీ శ్లోకములలోని కవితకు ముగ్ధుడై, యట్లే తన కృతిపతియగు జంగమ మల్లికార్జునుని గూడా షష్ఠ్యంత విశేషణములతో స్తుతింప నుద్బోధము గొనియుండుననుట యసంభావ్యము కాజాలదు'' అని కోదండరామయ్యగారు వ్రాశారు. ఇది కూడ సబబుగానే ఉంది.

షష్ఠ్యంతాలైనాక నన్నెచోడుడు ''నా చెప్పం బూనిన దివ్యకథా సూత్రం బెట్టిదనిన'' అని విషయ సూచికను చెప్పాడు.

1. సతిజన్మం	7. మన్మథదహనం
2. గణపతి జన్మం	8. పార్వతి తపస్సు
3. దక్షయజ్ఞ ధ్వంసం	9. శివపార్వతుల కల్యాణం
4. పార్వతిజన్మం	10. వాళ్ళ రతిభోగాలు
5. శివుని ఉగ్రతపస్సు	11. కుమారజననం
6. దేవతల కల్లోలం	12. తారకాసుర సంహారం

అనే పన్నెండు విషయాలను చెప్తానని ఒక పద్యంలో తెలియజేశాడు. ఇతని కావ్యంలో పన్నెండు ఆశ్వాసాలు ఉన్నా ఒక్కొక్క ఆశ్వాసంలో ఒక్కొక్క విషయం చెప్పలేదు. కొన్ని తక్కువలో సరిపెట్టాడు. కొన్ని విస్తారంగా వర్ణించాడు. ఈ పన్నెండు విషయాలలోనూ నవరసాలూ, అష్టాదశ వర్ణనలూ, ముప్ఫయిరెండు అలంకారాలూ గాక చిత్ర కవిత్వాలు, బంధకవిత్వం కూడ ఇమిడ్చాడు.

5. రఘువంశం, 1-వ సర్గ, శ్లో. 5-9

గడుసుదనం

తన కృతి ''సకలావయవములం బరిపూర్ణంబైన కావ్యాంగన'' అన్నాడు. మొత్తం 2005 గద్య పద్యాలలో ఈ పరిపూర్ణత తెచ్చాడు. ఇందులోని సంస్కృత వృత్తాలు 454 మాత్రమే. 895 దేశి సంప్రదాయంలోని జాత్యుపజాతులే. నాలుగవవంతు కందపద్యాలు వాడాడు. ప్రతి ఆశ్వాసం కందపద్యంలోనే మొదలవుతుంది. విభక్తులతో అంతమయ్యేటట్లు ఆశ్వాసముల ఆద్యంత పద్యాలను రచించిన వాళ్ళలో నన్నెచోడుడే ప్రథముడని చెప్పాలి. ఒక ఆశ్వాసాన్ని ఏ విభక్తితో అంతం చేస్తే అదే విభక్తితో తరువాతి ఆశ్వాసాన్ని మొదలుపెట్టడం ఈ సంవిధానంలోని ప్రత్యేకత. ఈ నియమాన్ని తరువాతి కవులైన తిక్కనగారూ, కేతనగారూ ఇంకొక మెట్టు ముందుకు తీసుకువెళ్ళారు. ఆశ్వాసాన్ని ఏ విభక్తితో మొదలుపెడితే ఆ విభక్తితోనే కథను ఎత్తుకొని మొట్టమొదటి పద్యాన్నో గద్యానో నడపడమనే మరొక కొత్త నియమాన్ని వాళ్ళు పెట్టుకొన్నారు. నిజానికి ఈ గడుసుదనం వాళ్ళకు నన్నెచోడుడే నేర్పాడనుకోవాలి. కవిరాజ శిఖామణి ఈ ఎత్తుగడ విభక్తిని రమారమి అన్ని ఆశ్వాసాల మొదటి గద్యంలోనో, పద్యంలోనో వాడాడు. అయితే కొన్నిటిలో తప్పాడు. తిక్కన, కేతనగార్లు ఎక్కడా తప్పలేదు.

ఆశ్వాసముల మొదట విభక్తులు

కథ ఎత్తుకొనే మొదటి గద్యపద్యాల విభక్తులు

ఆశ్వాసం	చోడరాజుగారి కుమారసంభవం	తిక్కనగారి నిర్వచనోత్తర రామాయణం	కేతనగారి దశకుమార చరిత్ర
ద్వితీయ	ద్వితీయావిభక్తి: ... మల్లికార్జున దేవున్ అతి నీలాభ్ర విలంబియై సర్వేశు దక్షప్రజాపతిగాంచెన్ ... బ్రహ్మాండ బాండోదరున్	మనభూమిశుడొగిన్ - శ్రీరామచంద్రుడిట్లు	షష్ఠీ, తిక్కనామాత్యునకున్ - అభ్యుదయ పరంపరాభి వృద్ధిగా నాచెప్పంబూనిన
తృతీయ	ప్రథమ: మల్లికార్జునుడు నెగడ్తన్ సకల భువనాధీశ్వరుండైన పరమేశ్వరుండు	 మనుమ జగతీపాలున్ - హరిగని దేవదూత	ప్రథమ: మంత్రి తిక్కండెలమిన్ మునినాథుండగు వామదేవుడు
చతుర్థ	ద్వితీయా విభక్తి: మల్లికార్జున దేవున్ ఇట్లు పార్వతి పరమభక్తియుక్తిం దగిలి (ఎత్తుగడ తప్పింది)	మనుమజనపతి యెలమిన్ - ఆ దశకంధరుం డఖిల వినోదంబుల	తిక్కామాత్యా! (సంబుద్ధి) దేవ! భవదీయచరరా సంపీనగోరి

ఆశ్వాసం	చోడరాజుగారి కుమారసంభవం	తిక్కనగారి నిర్వచనోత్తర రామాయణం	కేతనగారి దశకుమార చరిత్ర
నవమ	ద్వితీయ: దివ్యమునివరేణ్యు నగణ్యుఁ హరి పరమేష్ఠిపురందరాద్యమర వరసహింతుడైన యీశ్వరునకు హిమవంతుడు (ఎత్తుగడ తప్పింది)	మనుమసిద్ధి ధరణీశుడొగిఁ జననాథు డుడుగరలు	తిక్క చమూపా! దేవా! దేవరయున్నచో టెరుగ నుద్దేశించి
దశమ	మల్లిఖార్జునదేవుఁ దహనాంబకుం దలచి దహనుండు సంచలించుచు (ఎత్తుగడ తప్పింది)	మనుమసిద్ధి జగతీశుడొగిఁ రేపకడ నక్కుమారుడు	తిక్కనామాత్యుడొగిన్ రాజవాహనధరాధీశ్వరుండు
ఏకాదశ	ఉదారుండు మల్లికార్జును డెలమిఁ పరమేశ్వరుడు శరాణీసహితుండె	—	తిక్కనామాత్యుడొగిఁ రాజవాహన మహీవల్లభుండు మంత్రగుప్తు మొగంబుచూచిన
ద్వాదశ	మందరాచలోరు ప్రస్థుఁ పరమేశ్వరు నతులభక్తియుక్తి నారాధించి	— —	తిక్కదండాధీశా! మహాపురుషా! పరమకారుణ్యంబ కారణంబుగా...
పంచమ	మల్లికార్జునదేవుఁ అమరగయంద్రియాళి విషయంబులతో... శివుగాంచెమనోజుడు దవ్వుదవ్వులఁ	మనుమ వసుమతీ వల్లభుచేఁ — శంభునిచే నివ్విధమున	తిక్కనామాత్యునకుఁ రాజవాహన మహీవల్లభు నకు దనచరితంబు చెపదలంచి...
షష్ఠ	అణిమాది గుణగుణాలంకారుఁ పరమేశ్వరుం దపోమహిమ	మనుమసిద్ధి జనపాలునకుఁ — దనుజాధీశ్వరునకు	తిక్కనామాత్యునకుఁ అతనికిట్లని విన్నపంబుసేయు
సప్తమ	ప్రథమ: శేముషీనిధి పేర్మిఁ పరమేశ్వరుండు నిజమనోరంబు	మనుమమానధీశుడొగిఁ అక్కడ గమలాసనుడా రక్కసు డమరేంద్రుమీద	తిక్కదండాధీశుఁ ఉపహారవర్మ గనుగొని
అష్టమ	మల్లికార్జును డెలమిఁ ఇటుపరమేశ్వరుండు	మనుమసిద్ధి నరవరు డెలమిఁ అంత నొకనాడు నృపు డత్యంత మహిమ	తిక్కన మంత్రి! భూపలలామ! నిఁ వెదకి

ఖరారు కవిత్వ లక్షణాలు

పరిపూర్ణమైన కావ్యాన్ని రచించిన వాళ్ళలో మొదటివాడు కనుక కవిరాజశిఖామణి ప్రారంభించిన ప్రతి విషయాన్నీ ఇంత విపులంగా తెలుసుకోవలసి వచ్చింది. వీటన్నింటినీ ఇతడే నిజంగా ఓం ప్రథమం మొదలుపెట్టకపోయినా ఇతడు గొప్పకవి అనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. యిప్పుడు మనం తెలుసుకొన్నవన్నీ నిజమైన కవిత్వానికి

కొలబద్దలు కావు. పాత్రచిత్రణ, పోషణ, రసోత్పత్తి కలిగేటట్టు కథ చెప్పడం, తల ఊపించడం, ఆహా అనిపించడం, బొమ్మ కట్టేటట్టు వర్ణించడం – ఇవీ నిజమైన కవిత్వానికి లక్షణాలు. ఇవన్నీ నన్నెచోడుని కుమారసంభవంలో ఉన్నాయి. అక్కడక్కడ ఘట్టాలలో కవితాశక్తిని చూద్దాం.

కాము మాయలు

పరమేశ్వరుడూ, దాక్షాయణీ అన్యోన్యరాగాతి రేకమున కామకేళీవిలాసులయ్యారు. వెండికొండసానువులందు ఒక కొలనులో ఏనుగుల గుంపు విహరిస్తున్నది. ఆ మత్తేభాల క్రీడలు చూసి పార్వతికి 'కౌతుకరతైక కాలీనభావాభిలాష' కలిగింది. ఆమె ఉద్దేశం శివుడు గ్రహించాడు.

''సతి గరిణి యగుడు ద్రిగజ
త్పతి గరియై కూడె సతులు భవించిన యా
కృతిగూడ నేర్పకాదే
యతిశయముగ నింగితజ్ఞులకు ఫల మెందుఁ?

ఆదిమూర్తుల శివశక్తు లచలమతులు
హరుడు సతియును సురతార్థులై విహీన
తరములగు మృగరూపముల్ దాల్చి రనిన
గాము మాయల నెవ్వారు నేమిగారు?'' (1-103)

ఇక్కడ నన్నెచోడుడు శివుని ఇంగితజ్ఞానం మొదట చెప్పాడు. మరి అంతటివాడు మృగరూపం దాల్చడమేమిటి? ఆమె తక్కువదా? అచలమతి అయిన శక్తి. వీళ్ళు విహీనతరములైన మృగరూపాలు దాల్చడానికి కారణం కాముని మాయ అన్నాడు. ఈ కాముని ఉద్ధృతం మొదట కొన్ని ఆశ్వాసాలలో చూపెట్టబోతున్నాడు కనక ముందే దాన్ని చెప్పడం అవసరమే.

అనుకున్నదొకటి, అయిందొకటి

మన్మథుడు ఇంద్రలోకానికి వెళ్ళాడు. ఉగ్రతపస్సు చేసుకొంటున్న శివుని దృష్టి పార్వతివైపు తిప్పించమని దేవేంద్రుడు కోరాడు.

'' 'నా కిది యేమి గగనం' బని దర్పకుడు దర్పించి –

''శూలి సేకొన్న తపమెల్ల కాలిసేసి
యతని దేహంబునందు సామాలిజేసి
కామకింకరు జేసి నా కడిమి నెరత
గంటి నీ ప్రస్తరము దీర్పగంటి నెలమి. (4-53)

'నాకుం దగిన కెలసంబుగంటి, దీని కింతకు మైకొంటి. దాంబూలంబు దయసేయు''మని. అది తీసుకొని ఇంటికి బయలుదేరాడు. అక్కడ ఇంటిదగ్గర రతి మది తల్లడిల్ల పతిరాకకు ఎదురు చూస్తున్నది. అంతకంతకు అద్భుతములు, దుర్నిమిత్తాలు పుడుతున్నాయి. అశుభసూచనల కెంతో బెగ్గలించింది. ఇంతలో మన్మథుని మకరకేతనం కనబడింది. అలిగానం, మదకోకిల కలరవాతోద్యం శుకస్వనఘనమంగళ పాఠరవం చెలరేగగా మన్మథుడు వచ్చాడు.

''పతి జూచి రతి నిజాంత
ర్గతభేదం బెలమి మఱుపుగా నిడి కాలో
చితవచనాంతరముల సుర
పతి గడువెస నిన్ను నేమి పనిరా బనిచెన్?''

అని అడిగింది. అతడు చిరునవ్వు నవ్వుతూ ఆమె ముఖవికారం చూసి ''ఏం, ఎందుకలా అంత తల్లడిల్లుతున్నావు'' అని అడిగాడు. ఆమె దుశ్శకునాల సంగతి చెప్పి ''నీపోయివచ్చిన కార్యం బెరిగింపుము'' అంటే, ''పెద్ద విశేషం లేదు. ఉమామహేశ్వరుల తపోభంగం చేయమంటే, ఒప్పుకొని వచ్చాను'' అన్నాడు.

రతి తల్లడపాటు

రతి అదిరిపడి, ఉల్లంబున తల్లడిల్లుచు –

''మన కులదైవమున్ మన్నన లేదేని
త్రిభువనారాధ్యుడన్ తెంకలేక
పరమయోగాత్ముడన్ భక్తి లేదేనియు
సర్వేశ్వరుం డను శంకలేక
యజశిరోదళను డ న్నదురు లేదేనియు
గాలారి యను నోటి కండలేక
విషమాంబకుండను వెరపు లేదేనియు
బ్రళయాగ్నిరుద్రుండన్ భయము లేక
పంచెనట్టి యుగ్రుపై నిన్ను నదిమీద
బోయి తనకు లగ్గబోయి లగ్గ
వచ్చునే ప్రధాన వైరాన మరణంబు
ధ్రువమనంగ వినడె దివిజవిభుడు!

ఇడపక పంచె నాత డొక యేలినవా డని పూన్కికాడవై
పొడువగబోయె దీవు నొక పోటరిమూటన నీకు నక్కడన్
మృడు డొక యెల్లిదుండకట మెచ్చక సింగపు వేటలాడగా
గడగెద రిట్లయైన దుదిగాకెడ నింద్రుడు నీవు దక్కుటే!

ఆ నాకంబున గల య
మ్మానిను లందరును నీకు మనమిడి యున్నం
దాని సహింపక సురవిభు
డీనెపమున జంపదలచి యీపని బంచెన్.

నిను జూచిన కన్నుల సుర
వనితలు దను జూడకున్న వాసవు డలుకన్
జని చానన్ బంచిన జా
జను నే యాతని చలం బసాధ్యముగాగన్ - (4-61 నుండి 64)

అతని శరాసనంబు గనకాచల, మిక్షుశరాసనంబు నీ
కతనికి నమ్ము పాశుపత, మంటిన గందెడు పువ్వు లమ్ము నీ;
కతడు పురాపహారి, విరహాతుర పాంథజనాపహారి నీ;
వతనికి నీకు హస్తిమశకాంతర మెమ్మెయి నెన్ని చూచినన్.

ఈశు దలచు మహాత్ముల హృదయములును
గాడనోపని మృదుపుష్ప కాండనికర
మతని భేదింప నోపునే యంగజన్మ!
తమ కసాధ్యుల సాధింప దలప దగునె!

ఆడదాన, నబల, నైన నేయించుక
యలిగి చూచుడును భయమున దలరు,
దుగ్రు నుగ్రలోచనోద్భూతవహ్నికి
నెదిరి నిలువ నీకు నెంతకొలది?

కొని బాలురైనను దిని పిప్పియుమిసెడు
చెరకువిల్లని నమ్మి చేతబట్టి
మెలతల తలవెండ్రుకల బొందికందెడు
నలరుపుష్పము లమ్ములని తలంచి
తలిరాకులైన గదల్పనోపని మంద
పవనుండు నొక పెనుప్రాపుగాగ
నబలలు సోపిన నాకాశమున బారు
నల శుకములు మూలబలము గాగ

నెంతవేసవి ముట్టిన నెండ గమరు
నను వసంతుడు దగు సహాయంబుగాగ
గాకిపిల్లల కోడు పికములు బోటు
మగలుగా నుగ్రుపై బోవదగున మదన!'' (4-72 నుండి 75)

హితోపదేశం

అని నయాన, భయాన చెప్పింది. నిన్ను చూసిన కళ్ళతో తన్ను అప్సరసలు చూడటం లేదని ఈర్ష్యకొద్దీ నీ చావుకు పంపిస్తున్నాడన్నది. చిట్టచివర 'ఆడదాన్ని నేను కోపంతో చూస్తేనే బెదిరిపోయే నీవు శివుణ్ణిం తట్టుకొంటా' వన్నది. అతని ఆయుధాలను ఈసడించింది. అనుకూలవతి, అన్యోన్యంగా ఉండే సతి భర్తకు చేయవలసిన హితోపదేశం నన్నెచోడుడు మెట్లుమెట్లుగా రచించాడు.

రతిని ఒప్పించి, తనకు వరముందనీ, ఏ కీడూ జరగదనీ నచ్చజెప్పి ఆమెను తీసుకొని శివుని తపోభంగం చేయడానికి మన్మథుడు వెళ్లాడు. వాతావరణం మనోజ్ఞమైంది. వసంతం ఉదయించింది. ప్రకృతిలో జంటలు మదన పరవశంతో విరతికొన్నారు.

''ఆమనికి నెలమి విపులా
రామంబుల పొల్పుసూచి రాగోత్కటమై
కాముడు రతిగని తానును
కామాతురుడై మనోవికారము వొందఁ.

లత్తుకరసమున జొత్తిల్ల బదతల
 ముల నరచేతుల మోవి బూసి
నవకుసుమంబుల నానా విధంబుల
 తొడవులు రచియించి తొడిపి వేడ్క
రాజీవపుష్ప పరాగంబు గబళించి
 విలసిల్లు సీమంత వీథిబోసి
యరవిరిసురపొన్న యకరువు వరుసతో
 నలకల జిన్నిపు వ్వలికి కలయ
సలలితంబగు పుప్పొడి డులిచి వీగు
జన్నుగవమీద బోయుచు జెన్ను మిగుల
సుదతిగై సేసి ప్రీతితో జూచుచుండె
భావజన్ముండు వచ్చిన పనియు మరచి'' (4-114, 115)

కాముడే రతిని చూసి తాను కామాతురుడవడం, వచ్చిన పని మరచిపోవడం ఆ ఉన్మత్త వసంతశోభను చూపుతుంది. కవి కూడ తరువాతి కథ చెప్పకుండా వర్ణనలు చేయడాన్ని కూడ ''భావజన్ముండు వచ్చిన పనియుమరచి'' అన్నమాటతో సమర్థించ వచ్చు.

మన్మథుడు శివునిపై బాణం వేశాడు. శివుడు మన్మథుణ్ణి చూసి కోపించి కన్ను తెరిచాడు. మన్మథుడు భస్మమయ్యాడు.

''కని కోపించెనొ గానక
ముని కోపించెనొ మహోగ్రముగ నుగ్రుడు సూ
చిన గాలెనొ చూడక యట
ముని గాలెనొ నాగ నిమిషమున నరగాలెన్.

గిరిసుతమై గామాగ్నియు
హరుమై రోషాగ్నియుం దదంగజుమై ను
ద్ధుర కాలాగ్నియు రతిమై
నురు శోకాగ్నియును దగిలి యొక్కట నెగసెన్.'' (5-51,52)

ఈ ఆఖరు పద్యం 'ఆహా' అనిపిస్తుంది. ఇటువంటి ఘట్టాలు కుమార సంభవంలో కోకొల్లలు. పాత్ర చిత్రణలో, కథాకథనంలో పండిన ఈ కవి ప్రకృతి వర్ణనలో మరింత నైపుణ్యాం చూపిస్తాడు. ఈ గ్రీష్మ వర్ణన చూడండి.

''తలచిన డెందము గందును
బలికిన నోరెల్ల బొక్కు బ్రభసూచిన రె
ప్పలు గమరు ననగ బటుతర
విలయానలభాతి నెండు వేసవి కాంచెన్.'' (6-135)

గ్రీష్మ వర్ణనలోనే ఇంకొక పద్యం ఉంది.

''ఆతపభీతి నీడలు రయంబున మ్రాకులక్రిందు దూరెనో
ఆ తరులుం దృషాభిహతులై తమ నీడలు తార త్రాగెనో
భాతి ననంగ నీడ లురుపాదపమూలములం దడంగె గ్రీ
ష్మాతపమధ్య వాసరములందు జలింపకయుండు నెండలన్.'' (6-141)

ఎండ వేడిమికి భయపడి చెట్ల నీడలే చెట్ల క్రింద దూరాయట. కొంతసేపటికి ఆ ఎండవేళ దాహానికి తట్టుకోలేక చెట్లు తమ నీడలను తామే తాగేశాయా అన్నట్లు ఆ నీడలు కనబడలేదట. అంత భయంకరంగా ఉంది వేసవి.

ఈ కల్పన యథాతథంగా 'కళింగత్తుపరణి' అనే తమిళ కావ్యంలో ఉంది చూడండి.

''ఆదవం పరుగుం ఎన్రు నిన్ర విళ్గల్
అంగుం నిన్రు కుడిపోనదు
అప్పాదవం పునల్ పెరాదు వుణంగువన
పరుగుం నమ్మె ఎన వెరువియే?[6]

కళింగత్తుపరణిని రచించినవాడు జయంగొండాన్, ఇతడు మొదటి కులోత్తుంగ చోళుని ఆస్థానకవి. ఈ తమిళ పద్యాన్ని చూసే నన్నెచోడుడు అనువాదం చేశాడని

6. కళింగత్తుపరణి - కాడుపాడియదు.

చెప్పవచ్చు. గ్రీష్మవర్ణన ముగించి ఒక వచనం వ్రాశాక ఈ పద్యాన్ని విడిగా వ్రాసి తరవాత ఇంకొక వచనం వ్రాయడమే దానికి సాక్ష్యం. మంచి కవిత్వాన్ని అనుసరించడంలో తప్పులేదు.

నన్నెచోడుడు సంస్కృత కవులలో ఎవరెవరిని అనుసరించాడో విశదం చేస్తూ మొదట శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారూ, తమిళ సంస్కృత కన్నడ కవులలో చోడునికి మార్గదర్శకులను చెపుతూ తిమ్మావజ్ఝలవారూ, 'భారవి-నన్నెచోడుడు', 'కాళిదాస మహాకవి - నన్నెచోడదేవుడు', 'చోడునిపై బాణభట్టు ప్రభావం', 'నన్నెచోడుడు - ఉద్భటుడు', 'నన్నెచోడునిపై వాల్మీకి ప్రభావం' అని వివిధ ప్రకరణాలుగా అమరేశం రాజేశ్వరశర్మగారూ తులనాత్మక పరిశీలనం చేశారు. క్రీ.శ. 11-వ శతాబ్దికి పూర్వమున్న తమిళ వాఙ్మయంతో ఇంకా కొంత తైపారు వేయాలి.

నన్నెచోడుడు పనికట్టుకొని తమిళ కన్నడ పదాలను, మారుమూల పదాలను వాడతాడని కొందరు ఫిర్యాదు చేస్తారు. అతడు జాను తెనుగే వాడాలని అభిలాషతో తన కాలంలో ఉండే దేశిపదజాలాన్నే వాడాడు. అతని రోజుల్లో ఉండిన మాటలు చాలా మటుకు మనకు బోధపడకపోవచ్చు. అది అతని తప్పుకాదు. నన్నెచోడుడు వాడిన దేశ్య వైకృతపదాలన్నిటికీ పదప్రయోగ సూచికను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రచురించారు.

ఈ సూచికకు సంపాదకులైన దివాకర్ల వెంకటావధానిగారూ, అబ్బూరి రామకృష్ణ రావుగారూ ఇలా వ్రాశారు: ''నన్నయ నన్నెచోడుల భాషాప్రయోగ విధానములందు చాలా వ్యత్యాసమున్నది. నన్నయ కవిత సమాస భూయిష్ఠమయ్యు కడుంగడు ప్రసన్నమైనది. దాని నవగాహనము చేసుకొనుటలో పాఠకులు శ్రమపడనవసరము లేదు. నన్నెచోడుని కవిత్వమట్టిది కాదు. అందు పెక్కు పద్యముల కన్వయము కుదరదు. అతడు ప్రస్తుత నిఘంటువులలో కనుపించని పెక్కు పదములను వాడియున్నాడు.''

ఇలా అనుకోవడంకన్నా ''నన్నెచోడుడు వాడిన పెక్కు పదములను మన నిఘంటుకర్తలు స్వీకరించటానికి అవకాశాలు కలుగలేదు'' అనుకోవడం మంచిది. నన్నెచోడునిలాగే దేశ్యాలను ఎక్కువ వాడిన పాల్కురికి సోమనాథుడు శబ్దరత్నాకరం రచించిన బహుజనపల్లి వారి దృష్టిలో అయిదవరకం కవి. పాల్కురికి సోమనాథునికీ, తాళ్ళపాక అన్నమాచార్యులవారికీ పదప్రయోగ సూచికలు తయారైతేగాని కావ్యభాషలో వున్న దేశ్యాలలో ముప్పాతికైనా మనకు చిక్కవు.

నన్నెచోడుని కావ్యం ఇన్నాళ్ళు మరుగుపడిపోవడం రకరకాలుగా దురదృష్టమైంది. ''ఆదికవి అనే పేరు నోచుకోకపోయినా చాలా విషయాలలో ఆద్యుడై పరిపూర్ణమైన ప్రబంధాన్ని ఇతడే మొదలుపెట్టాడు. ఇతనికి రావలసిన ప్రబంధ పరమేశ్వరుడనే బిరుదు కూడా ఎఱ్ఱాప్రెగ్గడకుపోయిం''దని కోరాడ రామకృష్ణయ్యగారు చింతిస్తూ ''వాస్తవానికి ఆంధ్ర సాహిత్యంలో ప్రప్రథమ ప్రబంధ పరమేశ్వరుడు కవిరాజశిఖామణి నన్నెచోడుడేయని చెప్పక తప్పదు'' అన్నారు.

అది సత్యమే. అయినా, నన్నెచోడునికి పాత బిరుదులు ఇవ్వడానికి ప్రయత్నించక, వేరే కొత్తపీట వేసి కొలుచుకోవడం మంచిది. నన్నెచోడుడు ప్రబంధ ప్రజాపతి!

ఇటీవల అసలుకే ఎసరుపెట్టే పితూరీ ఒకటి జరిగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం - తెలుగు శాఖలోని ఆచార్యులు కొర్లపాటి శ్రీరామమూర్తిగారు ఈ గొడవను తెచ్చిపెట్టారు. నన్నెచోడుని కుమారసంభవం అనే ప్రాచీన కావ్యం ఏదీ లేదని, మానవల్లి రామకృష్ణ కవిగారే దానిని రాసి తమ వ్రాతప్రతికి పుత్రికగా ఒక తాళపత్ర ప్రతిని పుట్టించి దానిని తంజావూరు సరస్వతీమహలు గ్రంథాలయంలోనికి స్మగుల్ చేశారని కొర్లపాటి వారి వాదం. ఒకటి కాదు రెండు కాదు, పాతికేళ్ళ పైచిలుకు సంవత్సరాలు శ్రమపడి ఆరు అధ్యాయాలూ, ఆరు అనుబంధాలతో అభిప్రాయాలతో 300 పుటలు భారీసైజు విమర్శక గ్రంథాన్ని రచించారు. ''నన్నెచోడుని కుమార సంభవము ప్రాచీన గ్రంథమా?'' అని పేరు పెట్టి ప్రచురించారు. ప్రాచీనం కాదు, ఈ కావ్యం, కవిగారి కూట సృష్టి అని అభాండం వేశారు.

శ్రీరామమూర్తిగారి వాదానికి ఆధారం ఏమిటంటే, ''కుమార సంభవం తాళపత్ర గ్రంథం కట్టపైగాని, లోపలగాని ప్రాచీన తాళపత్రముల పట్టిక'' లేకపోవటం. ఇది ''ప్రాగభావమా? ప్రధ్వంసాభావమా? అను ప్రశ్న వ్యర్థం'' అని చెప్పి, 1912వ సంవత్సరం కంటే పూర్వం. తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయం నందు కుమార సంభవం తాళపత్ర గ్రంథము లేదనుట నిర్ధారక సాధనము'' అని కొర్లపాటివారు వక్కాణించారు.

అయితే శరభోజి కాలంలోనే క్రీ.శ. 1801లో ఒక గ్రంథాల పట్టిక తయారయినట్టు దాఖలాలు వున్నాయి చూడండి:

''శరభోజి మహారాజు వారికి పట్టమయ్యేందుకు మునుపు ఈ సరస్వతీ మహల్ పుస్తకాలకు వివరమైన జాప్తాలేదు. 1720 కాళయుక్తి సంవత్సర శరభోజి మహారాజువారి పట్టమయ్యా మన్యంభట్లుయనే గంగాధరభట్టు సదాశివభట్లుకు దానాధికారం ఇచ్చిన పిమ్మట ఈ సరస్వతీమహల్ కాగితాల పుస్తకాలు, తాట్యాకుల పుస్తకాలును తగుమైనవార్లనే నియమించి, పెరీనీలును జాప్తారాసి శాలివాహన శక సంవత్సరం 1722 ఇంగ్లీషు సంవత్సరములు 1801లో జాప్తా పరిష్కారంగా గలుగజేసినది రౌద్రినామ సంవత్సరము.''

ఈ యాదస్తు కూడ ఒక తాళపత్ర గ్రంథంలో ఉంది.[7] యిందులో చెప్పిన సదాశివభట్లు వారి అధికారంలో తయారయిన సంస్కృత గ్రంథాల పట్టిక వివరాలను చూడండి.

7. "Dr. Brunell No. Palm Leaf Ms. I. 15024-15461" అనే పుస్తకంలో ఉన్న దీనిని సరస్వతీ మహలు తెలుగు పండితులు శ్రీ విశ్వనాథంగారు చదివి చెప్పగా నేను రాసుకొన్నాను.

''రౌద్ర సంవత్సరము మార్గశీర్షశుద్ధ ద్వితీయ్యా అంగారక వారం మధ్యస్తులు వేదమూర్తి గంగాధరభట్లు, సదాశివభట్లు లాండిగె వారి అధికారమునందు తాళపత్ర పుస్తకాలు రుజువుజూసి రాసిన వివరం రామాయణం పేట్యా పుస్తకాలకు లెక్క వివరం।''

ఈ సంగతులు ఉదహరించి తీర్థం శ్రీధరమూర్తిగారు వాటిని ఇలాగ సుబోధకం చేశారు.

ఇందులో రామాయణం పేట్యా పుస్తకాలు అనగా రామాయణము మొదలగు కావ్యములుగల పెట్టె అని భావము. ఆ పెట్టెలో ''కుమార సంభవము'' సంస్కృత కావ్యమను దృష్టితో ఆ సంస్కృత తాళపత్ర గ్రంథ సూచికయొక్క 7వ ఆకులో, పద్యకావ్యము అను శీర్షిక క్రింద నిట్లున్నది:

1. పద్యకావ్యం.	కుమార సంభవము
తెలుగు లిపి.	ఆకులు 127
పూర్తి 189.	(క్రమ సంఖ్య)

పై కుమార సంభవమే నన్నెచోడుని కుమార సంభవమని ఎట్లు భావింపవచ్చునని కొందరికి సంశయము కలుగుట సహజము. తంజావూరు గ్రంథాలయములోని తెలుగు గ్రంథములకు ఒక ముద్రిత వివరణ గ్రంథ పట్టిక కలదు. దాని వివరములివి. Descriptive Catalogue of the Telugu manuscripts in the Tanjore Saraswathi Mahal Library, Waltair, 1933.

పై ముద్రిత వివరణ గ్రంథపట్టిక నూతనమైనది. అందు 33వ పుటలో నన్నెచోడుని కుమార సంభవమును గూర్చి యిట్లు పరిచయము గలదు.

152. కుమార సంభవము (నన్నెచోడుడు)

M. 189, 161/4 x 1¼, 127. 1-126 సమగ్రము.

పై వివరంలో M.189 అనగా Manuscript No. 189. ఈ సంఖ్యయే మొదట తెల్పబడిన సంస్కృత తాళపత్రగ్రంథ సూచికలోని గ్రంథ క్రమసంఖ్య. మఱియు 127 అను సంఖ్య ఆ గ్రంథములోని పత్ర సంఖ్యను తెల్పుచున్నది. కావున కుమారసంభవము యొక్క గ్రంథ క్రమ సంఖ్యయు, పత్ర సంఖ్యయు కూడా ముద్రితాముద్రిత గ్రంథ పట్టికలయందు సమానముగ కనబడుచుండుటచే రెండును ఒక గ్రంథమనుటకు సందేహము లేదు.

పై సప్రామాణికమైన సంజాయిషీని ఇస్తూ శ్రీధరమూర్తిగారు ఇంకో సత్యాన్ని బయటపెట్టారు.[8] తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయములోని ఆ తాళపత్ర గ్రంథంలోనే దాని లేఖన కాలానికి ఒక రకం సూచన ఉంది. అందులోని 54వ కమ్మ రెండో పక్కన ఆరవ ఆశ్వాసాంత గద్యం తర్వాత లేఖకుడు ఇలా రాశాడు.

8. తీర్థం శ్రీధరమూర్తిగారు మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో చాలాఏళ్ళుగా పండితులుగా పనిచేసి ఇటీవల రిటైరు అయ్యారు. వీరి వ్యాసం మణిమంజరి 10వ సంపుటంలో ఉంది.

''శ్రీమన్మహారాజాధిరాజు రాజమహారాజు శాహజి రాజు భూపాలక సార్వభౌమస్య విజయోస్తు! యిష్టార్థ స్పంతు. భవానీ శంకర కృపయా ఆయుష్యాభివృద్ధిరస్తు.''

ఇందులో పేర్కొన్న శాహజి కాలం క్రీ.శ. 1684–1710. అందుచేత కుమార సంభవం కావ్యానికి ఉన్న ఒకే ఒక తాళపత్ర గ్రంథం పదిహేడో శతాబ్దం చివరలోనో, పద్దెనిమిదో శతాబ్దం తొలి దశకంలోనో పుట్టింది (మానవల్లి రామకృష్ణ కవిగారు గాని 1866లో పుట్టలేదు).

కావ్యానికి లభ్యమవుతున్న ఏకైక ప్రతి పుట్టిన కాలం ఉజ్జాయింపుగా తెలుస్తూంది. అలాగే కవి కాలం కూడా తెలుసుకోడానికి ఏవైనా ఆధారాలు ఉన్నాయా! లేకపోలేదు.

తమిళ కావ్యం కళింగత్తు పరణిలోని వేసవి వర్ణనను నన్నెచోడుడు అనువదించాడని ఇంతకుముందు చెప్పుకొన్నాం. అప్పుడు ఒక పద్యం సంగతే చూశాం. అదే వేసవి వర్ణనలో కవిరాజశిఖామణి ఇంకో పద్యం ఇలా రాశాడు.

ఉరునిధాగ వాతహతి గరుల తలలు
వ్రస్సి లోపలి ముత్యముల వరుస విరిసి
మంగలములోని ప్రేలల భ్రంగి దూలి
వ్రేలి పడగాచె గట్టెండ విడువరించి (6–138)

కళింగత్తుపరణిలో వెదురు కణుపులు పగిలి ముత్యాలు వెలువడడం ఒకటి కాదు. రెండు పద్యాలలో వర్ణించాడు.[9] నన్నెచోడుడు ఏనుగుల కుంభస్థలాలనే కొట్టాడు. జయంగొండాన్ వర్ణనలవల్ల కవిరాజ శిఖామణి ప్రభావితుడయ్యాడని చెప్పొచ్చు. కళింగత్తుపరణి కులోత్తుంగ చోళుని కళింగయుద్ధం తర్వాత చెప్పిన వీరకావ్యం. ఆ యుద్ధం అతడు రాజ్యానికి వచ్చిన 33వ యేట జరిగింది. అతడు పట్టం కట్టుకొన్న ఏడు క్రీ.శ. 1070, పరణి రచనా కాలం 1110 తర్వాత నన్నమాట. నన్నెచోడుడు ఆ కాలంలోని వాడని చెప్పవచ్చు.

కళింగత్తుపరణి వల్లనేకాదు, ఆ కావ్యానికి కారణభూతుడైన కులోత్తుంగ చోళునివల్ల కూడా నన్నెచోడుడు ప్రభావితుడై అతణ్ణి అనుకరించాడు. రాజరాజ నరేంద్రుని కుమారుడు ఇటు తండ్రివంక చాళుక్యులకూ, మాతామహులవంక చోళులకు వారసుడై తాను ఉభయ కులోత్తుంగుడనని చెప్పుకొన్నాడు. కవిరాజ చూడామణి తండ్రివంక చోడుడు, తల్లివంక నుండి హైహయ వంశ బంధువు. చాళుక్యచోళ చక్రవర్తిలాగ తనకూ రెండు కులాలు ఉన్నాయని ప్రకటించుకొన్నాడు.

పాత్రుడ నసదృశ కాశ్యప
గోత్రుడ నచ్చరిత నుభయ కులశుద్ధుండన్

9. చూ... కళింగత్తుపరణికి నా అనువాదం వెన్నెల - వేసవి. వేసవి భాగంలో 17, 18 నెంబరుగల పద్యాలు.

మిత్రాన్వయ శేఖరుడ బ
విత్రీకృత దేహుడను వివిధ యజ్ఞములన్ (1-55)

ఉభయ కులోత్తుంగ చోళుడు పట్టం కట్టుకొన్న క్రీ.శ. 1070 నాటికిగాని, ఆ తరువాత ఒక పదేళ్ళకుగాని ఈ ఉభయ కులశుద్ధుడు జన్మించి ఉండవచ్చు. తన ఇరవయ్యో యేట జంగమ మల్లిఖార్జుని శిష్యరికం ప్రారంభించి ఉండవచ్చు. క్రీ.శ. 1090 నాటికి శ్రీపర్వతం వద్ద ఈ ఆచార్యుడు ప్రసిద్ధుడని ఖాజీపేట దర్గా శాసనం సాక్ష్యం ఇస్తోంది.[10]

... శకవర్షం 1012 నేయ ప్ర
మోద సబవత్సర కార్తీక బహుళ
15 ఆదిత్యా వారదందు
సూర్యగ్రహణ నిమిత్తమా
పళ్ళియం కాళాముఖత పోధనరుం
శ్రీపర్వత ప్రసిద్ధ మల్లికార్జున
శిళా మఠా చార్యరుం
అప్పర్వత వళియ రామేశ్వర పండితర్గె తచ్ఛిష్య
పరంపరా చార్యకముం
తదుప్పన్న నిధిని
దాన శుల్క దండ దనోప భొగ్యముం
త్రిభోగాభ్యంతర సిద్ధియ మప్పంతు
సర్వనమస్యమాగి తత్పాద
ప్రక్షళన హస్తోదక నాన పూర్వక మిత్తు సలిసిదా
నిజగురు ధర్మోమం సముద్ధరి సలభితా
(బేత) రసన సుపుత్ర

ఈ కన్నడ శాసనం కాకతీయ బేతరాజు యిచ్చినది. ఇందులోని మల్లికార్జున శిళామఠాచార్యులే నన్నెచోడునికి గురువు. ఆ పర్వతంపై గల రామేశ్వర పండితుని గురించి నన్నెచోడునికి తెలుసు. ఆ బేతరాజుకున్న దారిద్ర్య నిద్రావణ బిరుదు కూడా కవిరాజు శిఖామణికి తెలుసు. బిరుదు ఎవరిచ్చినా దారిద్ర్య నిద్రావణుడు నన్నెచోడుని దృష్టిలో జంగమ మల్లయ్యే. అందుకే కుమారసంభవంలో 'దారిద్ర్య నిద్రావణా?' అనే మకుటంతో ఒక దశకం రాశాడు.

శ్రీ రామేశ గవీశ్వరాదు లెద నీ శ్రీపాదముల్ భక్తితో
నారాధించి సమస్తలోక సముదాయాధీశులై రన్న సం

10. ఈ శాసన పాఠాన్ని మెకంజీ గుమాస్తాలు ఎన్నడో సేకరించారు. L.R. సంపుటి 45లో 17-21 పేజీలలో ఉంది. ఈ సంగతి చెప్తూ ముట్లూరి వెంకటరామయ్యగారు భారతి 1941 ఆగస్టు సంచికలో రాశారు. చదువుకొందుకు సులువుగా నేటి వరుసక్రమంలో పంక్తులు చక్కచేసి చూపెట్టాను.

సారుల్ దుఃఖ నివారణార్థ మభవుర్ సర్వేశు లోకత్రయా
ధారున్ నిన్ మది గొల్వకున్కి యుఅవే దారిద్ర్యనిద్రావణా (10-90)

ఈ పద్యంలోని 'గవీశ్వర' అనే పాఠాన్ని 'కవీశ్వరా' అని దిద్ది వావిళ్ళవారు అచ్చువేశారు. బహుశా 'గమీశ్వరా' అన్నది కవి ఉద్దేశించిన పాఠం కావచ్చు. పూర్వం కవిగమతి విద్వజ్జనాలు వుండేవారు. నన్నెచోడుడు "కవిగమకి ప్రశంసితుడు (2-208). కవిగమకి వాగ్మిగాయక నట చింతామణి (3-112), కవిగమకి బుధనిధానుడు (11-1)" అని కుమార సంభవంలో మూడుచోట్ల ప్రయోగించినట్టు తిమ్మావఝలవారు గుర్తించారు. రామేశ్వర పండితుడు 'గమకి' కావచ్చు. 'కవిగమకి వాది వాగ్మియర్' అని కన్నడ గ్రంథాలలో ప్రసిద్ధ చతుష్టయ ప్రశంస వుంది. నన్నెచోడుడు కన్నడ భాషలోని అసగకవి విరచితమైన కుమారసంభవం చదివాడో లేదో తెలియదు. తన కాలానికి లభ్యమైనవన్నీ కూలంకషంగా అధ్యయనం చేసే ఉంటాడు. తాను రచించదలచుకొన్న కుమారసంభవ కావ్యాన్ని తన గురువు, ప్రభువు, దైవం అయిన జంగమ మల్లయ్యకు అంకితమివ్వ దలిచాడు. సప్త సంతానాలలో కృతి ఉత్కృష్ట సంతానం. తన గురువుగారి పేర సప్త సంతానాలూ ప్రతిష్ఠించదల్చాడు (1-46). ముందు కృతి ఇచ్చాడు. మిగతా సంతానాలలో అగ్రహారం, గుడి, తోట, చెరువు, నిధి నన్నెచోడుడు నిల్పాడా? శాసనాలు వేయించాడా? శ్రీశైలంలో వాటిని వేయిస్తే అవన్నీకొన్ని చారిత్రక కారణాల వల్ల ధ్వంసమయ్యాయి. ఎవరో కావాలని వాటిని అంతం చేశారని చరిత్రకారులు భావిస్తారు. సాతవాహనుల కాలంనుంచీ శ్రీశైలం చరిత్రకెక్కిన క్షేత్రం. ఆదిలో అది జైన స్థావరం. సిద్ధులు అక్కడ ఉండేవారు. తర్వాత వివిధ చారిత్రక దశలలో కాపాలికులు, కాలాముఖులు, పాశుపతులు, చివరకు వీరశైవులు ఆ క్షేత్రంపై ఆధిపత్యం వహించారు. నన్నెచోడుడు కాలాముఖ శైవానికి చెందినవాడు. వీరశైవుల ప్రాబల్యం వచ్చాక అంతకుముందు ఆ క్షేత్రంలో ఇతరులు వేయించిన శాసనాలన్నింటిని నాశనం చేయించారు. అయితే ఆ శాసన గ్రామాలను మాత్రం అనుభవించడానికి రాజానుమతం సంపాదించారు. అందుకే శకసంవత్సరం 1235లో, అంటే క్రీ.శ. 1313లో పూర్వపు "చక్రవర్తులున్ను, మండలేశ్వరులున్ను, రాజులున్నూ, నాయకులున్నూ, మన్య నాయకులున్నూ సాటిగల భక్తిజనులైన ధర్మపరులు తమకు సుకృతార్థం ఇచ్చిన" 70 గ్రామాలను తమ మఠాలకు చెందేటట్లు ప్రతాపరుద్రదేవ మహారాజులవల్ల శాసనం పుచ్చుకొన్నారు.[11] గ్రామాల పేర్లేగాని వాటిని ఇచ్చిన పూర్వ దాతల పేర్లను స్మరించలేదు. ఒకవేళ ఇచ్చి ఉంటే నన్నెచోడుని శాసనాలు ఇలాగ శ్రీశైలంలో అంతర్ధానమయ్యాయి. అయితే లభ్యమవుతున్న ఇతర శాసనాల పరోక్ష సాక్ష్యంవల్ల నన్నెచోడుని కాలం క్రీ.శ.1123-48 అని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు నిర్ణయించారు. కళింగత్తుపరణి, ఖాజీపేట శాసనాల సాక్ష్యంతో క్రీ.శ. 1080-1130 ప్రాంతాలని మనం ఉజ్జాయింపుగా నిర్ణయించవచ్చు. నన్నెచోడుడు ఎప్పుడు పుట్టినా ఈ శతాబ్దం తొలిదశకం ప్రారంభందాకా అతని గురించి సమకాలిక సాహిత్యలోకానికి

11. P.V. Parabrahma Sastry, SRISAILAM - 1st History and cult, 1982.

తెలియదు. ఈ కవిరాజ శిఖామణి కావ్యంలో నన్నయగారిని గద్దె దింపాలనుకొన్న పితూరీలు సద్దుమణిగాయి. కుమార సంభవమనే తెలుగుకావ్యం కూట సృష్టి అనే ఇటీవలి నీలాపనిందను ఎవరూ సీరియస్‌గా పట్టించు కొన్నట్టే లేదు. అయితే నన్నెచోడుని కావ్యాన్ని మాత్రం సాహితీపరులు సీరియస్‌గా అధ్యయనం చేయాలి. అది మన ప్రప్రథమ సద్రస బంధుర ప్రబంధం.

బద్దెన

సుమతిశతకంలోని ఒక్క పద్యమైనా తెలియని తెలుగువాడు ఉండడుగాని, దానిని ఎవరు వ్రాశారో నిస్సందేహంగా, అసందిగ్ధంగా రుజువు చేసేవాడు ఇప్పటిదాకా లేడు. సుమతి శతకాన్ని బద్దెన వ్రాశాడని పండితలోకంలో సగం మంది వాదిస్తారు. మిగతావాళ్ళు 'అతడు వ్రాసి ఉండడానికి ఆస్కారం లేదని' భేదిస్తారు.

సుమతి శతకాన్ని వ్రాయకపోయినా బద్దెన గ్రంథకర్తగా తెలుగు సాహిత్యంలో నిలుస్తాడు. అతడు 'నీతిశాస్త్ర ముక్తావళి' అనే రాజనీతి గ్రంథాన్ని వ్రాశాడు. అందులో తనను తాను రకరకాలుగా సంబోధించుకున్నాడు. ఆ పేర్లనుబట్టి అతడు నన్నెచోడ నరేంద్రుడనీ, నన్ననగంధవారణుడనీ తెలుస్తున్నది. అతనికి కావ్యచతుర్ముఖుడనే బిరుదు కూడా ఉంది. కుమారసంభవాన్ని రచించిన నన్నెచోడుడు ఆంధ్ర వాఙ్మయంలో సుప్రసిద్ధుడున్నాడు. సరిగ్గా అతని పేరే కల బద్దెన ఆ వంశంలోనివాడేననీ, బహుశా నన్నెచోడునికి బంధువనీ తెలుస్తున్నది. బద్దెన తనను నన్ననగంధవారణుడని చెప్పుకొన్నాడు. దీని అర్థాన్ని వేదం వెంకటరాయశాస్త్రిగారు ఇలా వివరించారు :

> ''నన్నన అనువానికి గంధవారణమువంటివాడు. గొప్ప సంరక్షకుడని యర్థము. ఇది కన్నడ బిరుదము. కన్నడ రాజ్యములో ఈ బిరుదు సర్వ సామాన్యము. చక్రవర్తుల కొమాళ్ళకు వారి తండ్రులతోడి ప్రియబాంధవ స్నేహాతిశయములను తెలుపు సందర్భమున కవులు ఈ బిరుదును, వారికి జీవితములో కలదానినే తమ కవితలో వ్రాసినారు. 'అమ్మనగంధవారణ' మనుటకు 'తండ్రికి ఏనుగువంటివాడు' అని అర్థం. ఈ 'అమ్మ'కు 'అయ్య' అని అర్థము. పశ్చిమ చాళుక్యుల శాసనములలోనుండి లెక్కలేనన్ని యుదాహరణముల నీయవచ్చును.''[1]

ఈ విధంగా అర్థం చెప్పి శాస్త్రిగారు ఈ బిరుదుకు, నన్నెచోడునికి గల సంబంధాన్ని చక్కగా విశదపరిచారు.

1. 'నన్నెచోడుని కవిత్వము' – పుట 84.

''ఇందువలన నాకు తోచున దేమనగా బద్దెన నన్నెచోడుని ఎరిగి అతనిపై భక్తిగలిగి తానును కవితలో అట్టివాడనని తనను ఆ పేరట సంబోధించుకొని, అతనికి సామంతుడో, కుమారునితో సమానుడైన భృత్యుడో, లేక సాక్షాత్తు కుమారుడో, లేక ఎట్లో సన్నిహితుడై యుండి అందుచే నన్ననగంధవారణుడనికూడ సంబోధించుకొన్నాడు. ఇందుచే నన్నెచోడ బద్దెచోడు లిరువురును ఒకరి వెనువెంట నొకరు రాజ్యమేలియో, జీవించియో యుండవలెను''[2]

కుమార సంభవాన్ని వ్రాసిన నన్నెచోడుని కాలాన్ని మనం క్రీ.శ. 1080–1130 ప్రాంతాలని ఒప్పుకొంటున్నాం. నన్నెచోడ నామధారులు రెండు మూడు వంశాలలో ఉన్నారు. బద్దెన ఎవరికి గంధవారణుడో చెప్పలేము. అయితే శాసన ప్రమాణాలనుబట్టి పలువురు బద్దెన నామధేయులు కనబడుతున్నారు. క్రీ.శ. 1200 ప్రాంతాలలో ఒక బద్దెన, 1261 ప్రాంతాలలో ఇంకొక బద్దెన ఉన్నారని తెలుస్తున్నది.[3] ఈ బద్దెన లిద్దరూ తాతామనుమలు వీరు అర్వాచీనులు.

కుమార సంభవకర్త నన్నెచోడుని కాలమని ఇప్పుడు మనం నిర్ణయించిన క్రీ.శ. 1080–1130 నాటికి ఒక బద్దెన ఉన్నట్టుకూడ శాసన ప్రమాణంవల్ల తెలుస్తున్నది. ఒకానొక శాసనంలో ''కృష్ణవేణీ నదీతీర దక్షిణ షట్సహస్ర విషయాధీశ్వర వీరమహేశ్వర కీర్తి సుధాకర గుణరత్నాకర వేంగిచాళుక్య మూలస్తంభ రిపుదళిత కుంభికుంభ బలయాంగనా గృహతోరణ నన్ననగంధవారణనామాది ప్రశస్తి సహితం శ్రీ మహామండలేశ్వర బద్దచోళనరేంద్రం'' అని యున్నది. ఈ శాసనం పాశ్చాత్య చాళుక్యుడగు భువనైక మల్లుని కాలంలోనిది. కావున ఇతడు క్రీ.శ. 1070లో ఉండెనని యూహింపవచ్చును. అయిన నట్టి బిరుదు గలవాడు కేవల సామంతరాజా, లేక స్వతంత్రుడా అని సందేహింపవలసియున్నది. ''ఈ శాసనం చెన్నపట్టణపు లైబ్రరీలోని చరిత్రములోనిదిగావున నమ్మదగినది గాదు. అవి ఇంక నసంశోధికములు'' అని బద్దెన నీతిశాస్త్ర ముక్తావళిని తొలిసారిగా ప్రకటించిన మానవల్లి రామకృష్ణకవిగారు ఆ పుస్తకం పీఠికలో వ్రాశారు.[4]

ఈ శాసనం ఏ సంపుటం లోనిదో కవిగారు వివరించలేదు. బహుశా మెకంజీ సంపుటాలలోనిదేమో! ఈ శాసనంలో బద్దెచోడ, నన్ననగంధవారణ అనే రెండు పేర్లూ కనబడతాయి (మెకంజీ సంపుటాలు వెలుగు చూచినప్పుడు ఈ నన్ననగంధవారణ బద్దెచోళుడెవరో తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ఈ సంపుటాలను పరిష్కరింపజేస్తున్నారని వినికిడి. ఇవి ఎంత త్వరగా అచ్చువేస్తే అంత మంచిది. చారిత్రక సమన్వయం సులభమవుతుంది).

2. అదే పుస్తకంలో పుటలు 84, 85.
3. కృష్ణా జిల్లా గన్నవరం తాలూకాలో కోండనాయని పర శాసనం. ఉదాహరించినది జయంతి రామయ్యగారు. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక (రాక్షస, పుట 273) 1915.
4. ఈ పుస్తకాన్ని ఇటీవలనే నరేంద్ర సాహిత్య మండలి (తణుకు) వారు పీఠికలో ప్రకటించారు.

మెకంజీ సంపుటాలలోని శాసనాలు విశ్వసనీయమే. ఖాజీపేట శాసనంలోని రామేశ్వర పండితుని కాలనిర్ణయాన్ని ఈ సంపుటాల్లోని పాఠంలోంచే చరిత్రకారులు ముట్నూరి వెంకటరామయ్యగారు చేయడం నన్నెచోడుని మీది ప్రకరణంలో చూశాం. బద్దెనపట్ల కూడా ఇది వర్తిస్తుంది.

బద్దెన తన నీతిశాస్త్ర ముక్తావళిలో తనను తాను బద్ధిభూపతీ, బద్ది నృపా, బద్దినరేంద్రా అనేకాక మరొక 19 బిరుదు పేర్లతో పిలుచుకొన్నాడు. అవి ఇవి:

1.	ఉదార వైరోచనుడా	11.	భూపదిలీసా
2.	కావ్యచతుర్ముఖా	12.	మానగుణోన్నత
3.	కీర్తినారాయణా	13.	యశోనిధీ
4.	కొమరుర భీమా	14.	రాజభూషణా
5.	దశదిశాభరణాంకా	15.	రాజమనోజభూభుజా
6.	నన్నునగంధవారణా	16.	వివేకచతురాననుడా
7.	నన్నెచోడ నరేంద్రా	17.	రాజరాజమనోజా
8.	నయతత్వనిధీ	18.	వివేకభూషణా
9.	నరేంద్ర చతురాననుడా	19.	సర్వజ్ఞనిధీ
10.	పరపక్షభైరవా		

ఈ బిరుదులలో ఏ ఒక్కటీ ఇప్పటిదాకా బద్దెనకాల నిర్ణయానికి జయంతి రామయ్యగారు ఉపయోగించిన శాసనంలో లేదని వంగూరి సుబ్బరావుగారు వ్రాశారు. రామకృష్ణకవిగారు నమ్మడానికి వీలులేదన్న మద్రాసు లైబ్రరీ శాసనంలో కనీసం రెండు పేర్లు కనబడుతున్నాయి. ఆ శాసనంవల్ల బద్దెన కుమారసంభవ కర్తకు సమకాలికుడవుతున్నాడు.

ప్రస్తుతం మనకు లభించే ఆధారాలతో బద్దెన కాలాన్ని నిర్ణయించడం కొంతవరకు సాధ్యమే. అయితే అతని నివాస స్థానాన్ని ఇదీ అని చెప్పడం వీలుపడదు. అతడు రచించిన నీతిశాస్త్ర ముక్తావళివల్ల తెలియవచ్చినంత మాత్రమే మనం చెప్పుకోగలం. ఈ రాజనీతి గ్రంథంలో ఇప్పుడు సుమారు 162 పద్యాలున్నాయి. దీనిని తొలిసారి అచ్చువేస్తున్నపుడు మానవల్లి రామకృష్ణకవిగారు మొదట ఒక సీసపద్యాన్ని అచ్చువేశారు. ఆ పద్యంవల్ల బద్దెన గ్రంథంలో 15 పద్ధతులున్నాయని తెలుస్తున్నది. ఈ నీతులు వల్లెవేసేవాళ్ళ నోళ్ళలోబడి దబ్బరపాఠాలు ఏర్పడ్డాయనీ, వాటిని కవులు సవరించాలని తెలుస్తున్నది. ఈ పద్యాన్ని బద్దెన వ్రాయలేదు. నీతిశాస్త్రముక్తావళి వ్రాసుకొన్న లేఖకుడెవడో వ్రాసినది కావచ్చు. దీనివల్ల ఈ పుస్తకానికి ఎంత ప్రచారముందో తెలుసుకోవచ్చు.

క్రీ.శ. 1347 ప్రాంతాలలో వాడైన మడికి సింగన చిన్నప్పుడే బద్దెన నీతిని వల్లెవేసి ఉంటాడు. తన 'సకలనీతి సమ్మతంలో' 38 పద్యాలు ఉదాహరించాడు.[5] 'అళియ

5. బద్దెన పద్యాలు సుమారు 60 సకలనీతి సమ్మతంలో ఉదహరింపబడినవంటారు. కాని నా లెక్కకు 38 మాత్రమే తేలాయి.

రామరాయల ముత్తాత కంకితమీయబడిన శ్రీధరచ్ఛందమునందును' బద్దెన పద్యాలు ఉన్నాయట. శ్రీధరుని కాలం 1350 అని రావూరి దొరసామిశర్మగారు పేర్కొన్నారు.[6] శ్రీధరచ్ఛందాన్ని గౌరన (క్రీ.శ. 1385–1445) పేర్కొన్నాడు. పధ్నాలుగో శతాబ్ద పూర్వార్ధంలోనే బద్దెన నీతులు లాక్షణికులు ఉదహరించేటంత బహుళ ప్రచారం పొందాయని చెప్పవచ్చు. కాబట్టి బద్దెన సుప్రసిద్ధుడని చెప్పడానికి చాలా ఆస్కారముంది.

శుద్ధక్షత్రియులు కానివారు ఆ రోజుల్లో రాజుల క్రింద ముద్ర వేయించుకొనేవారనీ, 'బుధులు' కానివారు వాళ్ళను నమ్ముతూ వచ్చేవారనీ ఈ పద్యంవల్ల తెలుసుకోవచ్చు.

''ధాత్రీకుటుంబకత్వజ
గత్త్రాణ నిసర్గమతులు కావున శుద్ధ
క్షత్రియులుండగ నొరులన -
పాత్రులనమ్ముదురె బుధులు బద్దెనరేంద్రా!'' (నీ.శా.ము. 5)

ఇందులోని ఎత్తిపొడుపులోని పోటు ఆనాటి వివిధ రాజకుటుంబాలకు తగిలి ఉంటుంది. చతుర్థకులజుల్ని సూర్యవంశానికి, చంద్రవంశానికి వారసుల్ని చేయడం ఆనాటి బుధులకు పరిపాటే! ఎటువంటి రాజును బుధులు నమ్ముతారో చెప్పి, రాజు ఎలాంటి వాళ్ళను నమ్మాలో ఈ పద్యంలో చెప్పాడు.

''స్థిరమతినేకస్థితిజను -
పురుషుని నమ్మునది పెక్కు బుద్ధులమై నూ
సరవెల్లి పొడలు చూపెడు -
నరుపొరుపున బోకయేల నయతత్వనిధీ!'' (నీ.శా.ము. 22)

''ప్రయోజనమునకు తగిన వెలయిచ్చునది నరేశ్వరుడు'' (24) అని చెప్పాడు. ''ఎత్తిన కాలేగాని సిరికి ఎన్నడూ నిల్చినకాలు నిల్చగా జిత్తములేదు'' (76) అని చెప్పాడు. ''చెలులూ చుట్టాలూ కోరి అభీష్టం పంచి కుడువని సిరి నిస్సారం, నిరర్థకం'' (84) అన్నాడు.

''స్నేహలతలు సద్గుణసం -
దోహజలంబుననె పెరుగు దుర్గుణయుక్త
స్నేహితులవలన మాత్ర -
స్నేహము జెడునండ్రు రాజసిద్ధాంతవిదుల్.'' (నీ.శా.ము. 88)

అని చాలా చక్కగా చెప్పాడు.

కందపద్యాలనుకాక బద్దెన ఇరవై చంపకమాలలు, ఇరవైరెండు ఉత్పలమాలలు వ్రాశాడు. శైలి చక్కగా ఉంటుంది. బద్దెన కందాల రచనాశిల్పం సమకాలికుడైన

6. తెలుగు భాషలో ఛందోరీతులు పుట. 403.

నన్నెచోడుడు, అర్వాచీనుడైన తిక్కన మొదలైన ప్రాచీనుల వైపుకే మొగ్గుతుంది. అర్వాచీనమైన విరుపులు, నడక తక్కువ. అందుకే సుమతీశతకంలోని శైలికీ, దీనికీ తేడా ఉందనిపిస్తుంది. వాస్తవానికి సుమతీశతకపు ధోరణి పద్యాలు అక్కడక్కడ లేకపోలేదు.

గజస్నానము (28), ఊసరవెల్లి పొడులువంటి ఒకటి రెండు తప్పించి ఇతని కవిత్వంలో జాతీయాలు, పలుకుబళ్ళు వంటివి దొరకవు.

మొత్తంమీద సుమతీశతకం బద్దెన రచన కాదని కచ్చితంగా చెప్పగలిగినా, ఆ కాలమునాటిది కాదని మాత్రం చెప్పలేము. సుమతీశతకం వ్రాయకపోయినా బద్దెనకు వచ్చిన తక్కువేం లేదు. అతడు చెప్పుకొన్న ఈ పద్యం నిజమైతే చాలు.

''శ్రీవిభుడైన బద్దెవిభు చేసిన నిస్తులనీతిసార ము
క్తావళి శిష్టలోక హృదయప్రియమై యలరారుగాత యిం
దీవరగర్భుడున్ హరియు దేజమెలర్పగ జంద్రసూర్యులున్
దేవగణంబులున్ బుధులు దిక్పతులున్ గలయంతకాలమున్.''

అమృతనాథుడూ, మరికొందరూ

ఎవరైనా మహాయోధునికి యుద్ధరంగంలో వీరమరణం ప్రాప్తిస్తే చరిత్ర అతని పేరును గుర్తుపెట్టుకుంటుంది. సమకాలికులు అతని వీరగాథలు చెప్పుకుంటారు. కవులు అతనిపై పద్యాలు చెప్తారు. క్రీస్తుశకం పన్నెండవ శతాబ్దపు తొలి పాతికేళ్ళలో (ప్రస్తుత నల్గొండ జిల్లాలోని) ఏరువ పీఠం నుండి పరిపాలించిన మైలమ భీముడనే మహావీరుడు ఏదో యుద్ధంలో మరణించాడు. ఆ సంఘటనపై ఒకటి కాదు, రెండు కాదు పద్నాలుగు పద్యాలు సంకలన గ్రంథాలలోనికి ఎక్కాయి. వీటిని ఎవరో ఒక్క కవే చెప్పాడో, పలువురు చెప్పారో తెలియదు.

మైలమ భీముడు చారిత్రక వ్యక్తే. ఏరువ భీముడనే ఇంకొక పేరు అన్న దేవుని రాజమండ్రి శాసనాలవల్ల తెలియవస్తోంది. ఈ ఏరువ భీముడూ, మైలమ భీముడూ భిన్న వ్యక్తులని చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. అయితే ఏరువ వంశానికి తండ్రివంక సంబంధముండే మైలమ భీముడొకడు కాకతి రుద్రదేవుని కాలంలో ఉన్నాడని నేలటూరి వెంకటరమణయ్యగారు ఇటీవల శాసన ప్రమాణాలతోనే వ్రాశారు.[1] మల్లంపల్లి సోమశేఖరశర్మగారు నేలటూరివారితో ఏకీభవించి సహరచన చేశారు. ఈ శాసనాలవల్ల మైలమ భీముని కాలం క్రీ.శ. 1121 ప్రాంతాలు.

1. శ్రీ యాజ్దానీ సంపాదకత్వాన ప్రచురించిన The Early History of Deccan (ది ఎర్లీ హిస్టరీ ఆఫ్ దక్కన్) 9వ భాగం - పుట 582.

ఇద్దరు సుప్రసిద్ధ చరిత్రకారులు తండ్రివంక సంబంధాన్ని చూపెట్టినా, పేరులోనే మాతృనామంగల వ్యక్తిగనుక తల్లివంక శాసనాలవల్ల ఈ వీరుని కాల నిర్ణయం చాలా ముఖ్యమైన విషయం. దీనికి తగిన సాక్ష్యాలు ప్రస్తుతం లభిస్తున్నాయి.

నల్గొండ జిల్లా ఏరువ సింహాసనాధిపతులైన కందూరు చోడులలో ఒక మైలమదేవి కనబడుతుంది. ఈమె వీరపత్ని; వీరమాత. ఈమెకు భీమన అనే పుత్రుడున్నాడు. మైలమ వేయించిన శాసనాలలో ఒకటి దాక్షారామంలోను, రెండు పానగల్లులోనూ వున్నాయి. ఈమె ఇమ్మడి తొండరసచోళ మహారాజు పట్టమహిషి. ఇతడు క్రీ.శ. 1078–1098 మధ్య రెండు దశాబ్దాలు పాలించాడు.[2] ఈ దంపతులకు ముగ్గురు కుమారులు, రెండవ కుమారుని పేరే భీమదేవచోడుడు. ఇతనికే నల్లభీమదేవ చోడుడనీ, చోడ భీమదేవ నారాయణుడని వేరే పేర్లు కూడా వున్నాయి. ఇతడు క్రీ.శ. 1101–1124 మధ్య రెండు పుష్కరాలు పాలించాడు. తన ముగ్గురు కొడుకులలో మధ్యవాడైన ఈ భీముడు కుంతీసుత మధ్యముడైన భీముడంతటి పరాక్రమశాలి అని మైలమ పొంగిపోయేది. ఇతని కీర్తికోసమే ఈమె 1124లో సూర్యగ్రహణ కాలంలో 108 మంది బ్రాహ్మణులకు చోడనారాయణపురమనే అగ్రహారాన్ని దానం చేసింది (చూ॥ నల్లగొండ మండల సర్వస్వము, మైలాంబిక పానుగల్లు శాసనము - పుట 682).

మైలమభీముడు 1101లో రాజ్యానికి వచ్చాడని పైన ఇచ్చిన తారీకుల వల్ల తెలుస్తోంది. అయితే అతని తండ్రి 1098 దాకా పాలించాడు. తండ్రి తర్వాత నాలుగేళ్ళకుగాని భీమన రాజు కాకపోవటానికి కారణముంది. ఇతని అన్నగారు ఉదయనచోడుడు సహజంగా పట్టం కట్టుకోవాలి. కానీ అతడు యుక్తవయసు రాకముందే మరణించాడు. ఇమ్మడి తొండరసచోడుని తర్వాత అతని తమ్ముళ్ళిద్దరూ వదినగారి కుమారులు మరీ చిన్నవాళ్ళని రాజ్యభారం వహించారు. 1101 నాటికి మైలమభీమునికి యుక్తవయసు వచ్చి పట్టాభిషేకం చేసుకొని పరిపాలన ప్రారంభించాడు. ఇతని శాసనాలూ, ఇతని భార్య ధెన్నమదేవి శాసనాలు లభిస్తున్నాయి.

మైలమ తన కొడుకు భీమన పేర, అతని కీర్తికోసం అగ్రహారాన్ని దానం చేసిన సంవత్సరం (క్రీ.శ. 1124)లోనే అతడు ఏదో యుద్ధంలో వీరమరణం చెందాడు. అప్పుడే ఒకరో, పలువురో కవులు 'ఎలిజీ' పద్యాలనూ చెప్పారు. ఎవరు ఎన్ని పద్యాలు చెప్పారో వివరాలు దొరకలేదుగానీ, మైలమ భీముని వీరమరణంమీద ఇప్పటికి పదిహేను పద్యాలు లభ్యమవుతున్నాయి.

ఏఱువనభీమ! నీ వగతుతెక్కని కొండలు చంచలాత్ములై
దూఱని యట్టి ఘోరవని దుర్గములున్ వనితా వియోగులై

2. శ్రీ బి.యన్. శాస్త్రిగారి సంపాదకత్వంలో వెలువడిన 'నల్గొండ మండల సర్వస్వము' (1986)లో కందూరు చోడుల వంశవృక్షం 91వ పుటలో వుంది. 90వ పుట నుండి 120వ పుటదాకా ఈ వంశచరిత్ర విపులంగా కూడా అందులోనే వుంది.

పాఱని త్రోవలుం దినని పండును నాకటు గూరలుప్పగా
నేఱని కల్లులుం గలవె యీ లవణాంబుధి వేష్టితావనిన్ 1

యాచక శేఖరుండు సుగుణాంబుధి మైలమ భీముడీల్గినన్
జూచి వరించె రంభ, యెడజొచ్చె దిలోత్తమ, వారినిద్దరన్
ద్రోచె ఘృతాచి, ముగ్గురకు దొడ్డడి కయ్యము పుట్టె నంతలో
నాచుకుపోయె ముక్తిసతి, నవ్విరి యుద్దశ జూచి నిర్జరుల్[3] 2

అహితుల దాకి పోరునెడ నంబుధి కల్గిన నాటి దాము గో
గ్రహణము నాటి పార్థు గద గౌరవు నేసిననాటి భీము నా
గ్రహ మెసగం బురత్రయము గాల్చిన నాటి లలాట లోచనున్
మహి నుపమింపగా దగునె మైలము భీముని క్రమున్? 3

పన్ని తురంగమంబునకు బక్కెర వెట్టినవార్త హోరిచే
విన్న భయంబునం గలగి వీసరనాడును చక్రగోట్టమున్
మన్నియు పట్టణంబులును మక్కెన వేంగి కళింగ లాదిగా
నిన్నియ నొక్కపెట్టగునే నేరువ భీమనృపాలు ధాటికిన్ 4

అరివరు లేరువభీమని
పొరువున మనలేరు చిచ్చుపొంతను వెన్నై
తెరువున బెస్తరై జూదరి
సిరియై రేన్జెట్టు క్రింద జిల్లెడు చెట్టయి 5

ఆలములో నరాతులకు హమ్మని మార్కొనవచ్చునే మహో
కాళికి శూలికిన్ బ్రళయ కాలపు గాలికి రాఘవేంద్రు బా
ణాళికి బక్షినాయకు నఖాళికి మత్తగజేంద్ర వైరిదం
ష్ట్రాళికి దావపావక శిఖాళికి మైలమభీమ వాలికిన్ 6

నేఱువు బ్రహ్మ జేరె నిజనిర్మల తేజము సూర్యు జేరె నా
కారము కాముజేరె నధికంబగు లక్ష్మి యనంతు జేరె గం
భీరత వార్ధి జేరె గల పెంపు కులాద్రుల జేరె గీర్తి దా
నూఱట లేక త్రిమ్మురుచు నున్నది మైలమ భీము డీల్గినన్ 7

గరళపు ముద్ద లోహమవగాఢ మహాశనికోట్లు సమ్మెటల్
హరు నయనాగ్ని కొల్మి యురగాధిపు కోరలు పట్టుకార్లు ది
క్కరటి శిరంబు దాయ లయకాలుడు కమ్మరి వైరి వీరసం
హరణ గుణాభి రాముడగు మైలమభీమన ఖడ్గసృష్టికిన్ 8

3. 'నోచినవారి సొమ్ములవి నోమని వారికి వచ్చునే ధరన్' అని అయిదవ పాదం ఒకటి అధికపాఠం. ఇది నాచనసోముని ఉత్తర హరివంశంలోనూ ఉంది.

తెరలంబాది నభంబు దాకిన బయోధిం జొచ్చినన్ శైలగ
హ్వారముల్ దూరిన జిక్క భీములు నృపవ్రాతంబు బోనిచ్చునే
గరుడంబై చనిపట్టు మింటి తుద నుగ్రగ్రాహమై చొచ్చి సా
గర మధ్యంబున మ్రింగు బట్టుకొను సింగం బై గుహాంతంబునన్ 9

అలమున జిక్క భీముడు
వాలతివేగమున బెఱికి వడి తుదకవియన్
బ్రేలిబడ బడుగు నేసెను
ఏలేరును గసిమి భైరవేశుం డెరుగన్ 10

వీరగుణ ప్రతాపగుణ విశ్రుతః మైలమ భీమః నీ యశం
బారభమాన తారకర హార విలాసము నీ నికేతనం
బారభమాన తారకర హార విలాసము నీ భుజార్గళం
బారభమాన తారకర హార విలాసము చిత్ర మిద్ధరన్ 11

భండన భీమ! నీ యెదుర బారక నిల్చిన శాత్రవుల్ బృహ
న్మండల పుండరీక పురనాక నివాసులు నోర్చినన్ బృహ
న్మండల పుండరీక పురనాక నివాసులు చచ్చినన్ బృహ
న్మండల పుండరీక పురనాక నివాసులు చిత్ర మిద్ధరన్ 12

విదిత గురుప్రతాప గుణవిశ్రుత! మైలమభీమభూష! నీ
పదిలపు ఖడ్గధార దెగి పారిన వీరుడు గోపురంబుపై
విదిత సువర్ణ రత్నమయ వేదిక మీదను నిల్చి కాంచు నౌ
బదిపదు లగ్ని హోత్రులను బన్నిరు సూర్యుల నూరుచంద్రులన్ 13

అసమున గాశికా నగరమం దసువుల్ త్యజియించినంత నే
యసదృశమైన కన్నుగల దచ్చట మైలమ భీమభూష! నీ
యసి దెగిపడ్డ వైరులకు నంబకముల్ పదినూరులయ్యె నీ
యసికిని వారణాసికిని నంతరమెంత దలంచి చూచినన్ 14

వసుమతిలో జిరకాలము
మశకంబై మనుటకంటె మదకరికుంభ
గ్రసనంబగు సింహంబై
మసలుట యొక గడియ చాలు మైలమభీమా! 15

పై పద్యాలలో ''పన్ని తురంగమంబునకు...'' అనే నాలుగవ పద్యం త్రాళ్ళ ప్రొద్దుటూరు శాసనంలో చెక్కి వుంది. 6వ పద్యంలో రేఫ - అకార ప్రాస ఉంది. 8వ పద్యంలో చివర ''సింగంబై - గుహాంతరమునన్'' అనే దానిలోని మాటలను స్ఫురింపజేస్తాయి. రెండర్థాలు వచ్చే ద్వ్యర్థి కావ్యం వ్రాయదగిన కవి చెప్పిన పద్యాలలాగే 10వ పద్యం, 11వ పద్యం ఉన్నాయి.

ఈ పదిహేను పద్యాలనూ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సేకరించి ప్రచురించారు. వీటిలో తొలిపద్యం చాటుపద్య మణిమంజరి ఒకటవ భాగం (1988)లో 289 నెంబరు పద్యంగానూ, మిగతావి రెండవ భాగంలో 21 నుండి 34వ నెంబరుదాకా ఉన్న పద్యాలుగానూ అచ్చువేశారు. ఈ పద్యాలన్నీ ''ఒక్క వరుసలోనివే యగుటచే నొక్కరి చేతనే రచియింపబడినవనుకొనెదను'' అని వేటూరి వారు చెప్తూ, ఆ కవి వేములవాడ భీమకవి అని అభిప్రాయపడ్డారు. వీటిలో ఏ ఒకటో రెండో అతడు చెప్పడానికి ఆస్కారం ఉండవచ్చుగానీ చివరి పద్యం అమృతనాధుడనే కవి చెప్పినట్టు దాఖలా ఉంది.

కాచిరాజు బసవన్న (క్రీ.శ. 1480–1530) ఒక లాక్షణికుడు. ఇతడు 'కవి సర్పగారుడము'' అనే ఛందో గ్రంథాన్ని రచించాడు. ఇది ప్రామాణికమైనది కనుక దీనిని ఇతర లాక్షణికులు ఉత్తరోత్తరా పేర్కొంటూ వచ్చారు. ఈ గ్రంథంలో 'శ-స'లకు ప్రాసమైత్రిని అంగీకరిస్తూ దానికి లక్ష్యంగా బసవన్న పైనున్న పదిహేను పద్యాలలో చివరిదైన ''వసుమతి చిరకాలంబును....'' అనే పద్యాన్ని ఉదహరించారు. దీనిని అమృ తనాధుడు రచించాడని కాచిరాజు బసవన్న స్పష్టపరచారు.

మైలమ భీముడంతటి మహావీరుడు మరణించినప్పుడు అమృతనాధుడు ఏదో ఒక్క పద్యమే చెప్పి ఊరుకొంటాడా? మిగతా పధ్నాలుగు పద్యాలలో కొన్ని అతనివి కూడా ఉండవచ్చు. కందూరు చోడుల ఏరువ పీఠాన్ని ఆశ్రయించుకొన్న కవులూ, భట్టులూ అనేకులు. వాళ్ళలో భీమన అనే కవి ఒకడు ఉన్నాడేమో. అతడు 'గరళపు ముద్దలోహ' మనే పద్యం చెప్పాడు. 'భీమన చాటుధారా' అని ఇంటి పేరు చెప్పకుండా దీనిని అప్పకవి ఉదహరించడం గమనించదగ్గ సంగతి. సుప్రద్ధుడైన వేములవాడ భీమకవితో ఇతడు అభిన్నుడనుకోడం జరిగిందా? ఏమో.

అమృతనాధుని సమకాలికులూ ఏరువ భీమునిపై పద్యాలు చెప్పిన మరికొందరు ఎవరో? వివరాలేం తెలియవు.

ఈ పద్యాలన్నీ ఒక్క వరుసలోనివేయగుటచే నొక్కరిచేతనే రచియింపబడినవను కొందునని ప్రభాకరశాస్త్రిగారు భావిస్తే ఇవన్నీ ఒక్క వీరుని మీదనే చెప్పినవని ఇతరులు భావించడంలో ఆశ్చర్యం ఉండకపోవచ్చు. అయితే ఈ పదిహేను పద్యాలలో అయిదు విభిన్నమైన నామధేయాలు కనబడతాయి.

1. ఏ విశేషణం లేకుండా ''భీమునృపాలుడు'' అని ఒక పద్యం ఉంది. (నెంబరు 4)
2. భండన భీముడనే సంబోధనతో ఒక పద్యం కనబడుతుంది. (నెంబరు 12)
3. చిక్క భీముడనే పేరుతో రెండు పద్యాలున్నాయి. (నెంబర్లు 9, 10)
4. ఏరువ భీముడనే పేరిట రెండున్నాయి. (నెంబర్లు 1,5)
5. మైలమ భీముడిమీద తొమ్మిది పద్యాలున్నాయి. (నెంబర్లు 2, 3, 6, 7, 8, 11, 13, 14, 15)

ఇవన్నీ ఒక్క వీరుని మీద, ఒక్క కవే చెప్పినవని, ఏకకాలంలో చెప్పినవనీ భావించకూడదేమో. కందూరు చోడులలో భీముడనే పేరుగల రాజులు కూడా అయిదుగురు కనబడతారు.

1. తొలి ఏరువ భీమచోడుడు క్రీ.శ. 1040-1050
2. ఇమ్మడి ఏరువ భీమచోడుడు క్రీ.శ. 1066-1077
3. (మైలమ) భీమదేవచోడుడు క్రీ.శ. 1101-1124
4. ముమ్మడి భీమదేవచోడుడు క్రీ.శ. 1176-1200
5. నాల్గవ భీమదేవచోడుడు క్రీ.శ. 1236-1260

పైన వింగడించిన అయిదు సంబోధనల పద్యాలు ఈ అయిదుగురు రాజులలో ఎవరిమీద ఏ కవి చెప్పాడో నిర్ణయించడం సాధ్యం కాదు. అమృతనాథుడూ, భీమకవి అనే రెండు పేర్లయినా తెలుస్తున్నందుకు సంతోషించాలి.

పై పదిహేను పద్యాలలో 'పన్నితురంగమంబునకు....' అనే నాలుగవ పద్యం తాళ్ళ ప్రొద్దుటూరు శాసనంలో చెక్కి ఉంది అని గుర్తించాము. ఈ పద్యపాఠాన్ని శాసన పద్యమంజరిలో జయంతి రామయ్యగారు మొదట ప్రకటించారు. ఇదే శాసనాన్ని నేలటూరు వెంకటరమణయ్యగారు, ముట్లూరు వెంకటరామయ్యగారు పరిష్కరించి భారతి ఫిబ్రవరి 1938 సంచికలో ప్రచురించారు. ఒకే రాయి మీద చెక్కినా ఇందులో రెండు శాసనాలు ఉన్నాయి. ఏరువ భీమ నృపాలుని మీద ఈ పద్యం మధ్యలో వస్తుందిగాని, క్రీ.శ. 1323లో ఉన్న జాగతాపు గంగయ్య దేవచోళుడి వంశం గురించి, శాసనాలు నెలకొల్పిన కారణాల్ని ప్రధాన భాగం వివరిస్తుంది.

శాసన పరిశోధకులు ఈ ఏరువ భీముడు వేంగీ, కళింగము, మన్నియ, వడ్డెతెక్కలి, ఈసరనాడు, చక్కరగొట్టము, మంచెన మొదలైన వాటిని స్వతంత్రునిగ కాక కాకతీయ గణపతి దేవుని సామంతునిగ క్రీ.శ. 1230 ప్రాంతాలలో జయించి ఉంటాడని భావిస్తున్నారు. "కావున ఏరువ భీముడు కాకతి గణపతిదేవుని సమకాలీనుడని మేమొనర్చిన సిద్ధాంతము అసంగతము కాదేని భీమునియొక్క ఉత్తరదేశపు దిగ్విజయము. గణపతి సైన్యముల గూడి చేసినదనుట అసమంజసము కానేరదు" అని చెప్పారు.

ఈ కాల నిర్ణయంవల్ల ఈ ఏరువ భీముడు క్రీ.శ. 1101-1124 మధ్యనున్న మైలమభీముడు విభిన్నులవుతారు. పై పదిహేను పద్యాలలోని వ్యక్తులు వివిధ కాలాలలో వారు కాబట్టి, వారిపై పద్యాలు చెప్పిన కవులు విభిన్న కాలాలలో ఉన్న విభిన్న వ్యక్తులని తేలుతోంది. ఒక వంశంలోని వివిధ వీరులపై వివిధ కవులు చెప్పిన పద్యాలు ఆ వంశాన్ని ఆశ్రయించుకొన్న వందిమాగధులు భద్రం చేశారని, వీరుల పేర్లేగాని, కవుల పేర్లు భద్రపరచలేదని చెప్పవచ్చు. ఒకటిమాత్రం వాస్తవం. మహాయోధుడు మరణించినప్పుడు జాతి అతణ్ణి జ్ఞాపకం పెట్టుకొంటుంది. కవులు పద్యాలను చెప్తారు. ఆ పద్యాలనేగాని చెప్పినవారి పేర్లను ప్రజలు జ్ఞాపకం పెట్టుకోరు. ఈ యుగంలో మైలమభీముని మీదా, ఆ

వంశంలోని వారిమీద పద్యాలు చెప్పినట్టే, తర్వాత యుగాలలో ఖడ్గతిక్కన మీదా, వెలుగోటివారి మీదా, ఇతర వీరులమీద పద్యాలు చెప్పినవాళ్ళున్నారు. వాళ్ళ పేర్లు కూడా ఏమీ తెలియవు. ఇటువంటి కవులు తమ పేరుకోసం ఈ పద్యాలు చెప్పరు. జాతికోసం, ప్రజల కోసం, మంచికోసం ప్రాణమిచ్చిన వారిని సముచితంగా సంస్మరించుకొనడమే ఈ పద్యాల పరమ ప్రయోజనం.

ఈ కోవ కవులలో అమృతనాధుడు ప్రథముడుగ కనబడుతున్నాడు.

పావులూరి మల్లన

పురాణాలూ, ఇతిహాసాలూ, కావ్యాలూ, అలంకారాలూ, నాటకాలూ, సంస్కృత భాషలోనే చదువుకొనే మన పూర్వులు, గణితం మొదలైన లౌకిక విద్యలు ప్రాకృత భాషద్వారా నేర్చుకొనేవారు కాబోలు.

''ఎక్క సవర్గో ఎక్కా
బియ్యాసవర్గో చారి''

అంటూ వల్లె వేసేవారు. ప్రాకృతంలో ఉన్న ఈ 'మగ్గల'లో ప్రతిదీ 'ఎక్కన' అని మొదలవుతుంది. మగ్గలను మనం మరచిపోయినా 'ఎక్కాలు' అనే మాట వీటివల్లనే మనకు దక్కింది. ప్రాకృత భాషలో ప్రాథమిక గణిత సూత్రాలను తెలుగువాళ్ళు నేర్చుకోవడమనేది సాతవాహనుల కాలంనుంచి అవిచ్ఛిన్నంగా వస్తూ ఉండేదని చెప్పవచ్చు. సంస్కృత భాషకు రాజాదరణ లభించిన పిమ్మట తెలుగువాళ్ళు ఆ భాషను కూడ కరతలామలకం చేసుకొన్నారు. పండిత భాషలో రచించిన శాస్త్రీయ గ్రంథాలను విద్యావంతులు చదువుకొనేవారు.

శాస్త్రీయ గ్రంథాలు - తెలుగులోకి తర్జుమా

రాజరాజ నరేంద్రుని ధర్మమా అని పంచమవేదమే తెలుగులోకి రావడం చేత ఇతర శాస్త్రీయ గ్రంథాలను సైతం తర్జుమా చేస్తే తప్పులేదనే నమ్మకం తెలుగువాళ్ళకు వచ్చింది కాబోలు! పావులూరి మల్లన 'సారసంగ్రహగణితం' అనే సంస్కృత గ్రంథాన్ని అనువదించాడు. ఇతనికి రాజరాజ నరేంద్రుడు ఒక అగ్రహారం ఇచ్చాడని వీరేశలింగంగారు వ్రాశారు. ఇతనికి కాదు, ఇతని తాతకు ఇచ్చాడని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు రుజువు చేశారు.[1]

1. ఈ కవి కాలనిర్ణయ వివాదం గురించి 'మణిమంజరి' సంపుటి-1, సంచిక-1, (ఫిబ్రవరి 1981)లో 29వ పుట నుంచి వివరాలు ఉన్నాయి.

నన్నయ - మల్లన

మొదటి తెలుగు కావ్యాన్ని ప్రారంభిస్తూ నన్నయగారు మంగళాచరణం సంస్కృతంలో చేసినట్లే పావులూరి మల్లన కూడ ఒక శ్లోకంతోనే తన గ్రంథాన్ని మొదలుపెట్టాడు.

''శ్రీకంఠం సుగుణం సమస్తజగతాం కర్తార మీశం గురుం
భూతోయానల చంద్రసూర్యపవనవ్యోమాత్మమూర్తిం విభుం
నిత్యానందమయోపయోపి గిరిజయాసార్థం ప్రజావృద్ధయే
మాయాయోగ ముపై తి తం శివకరం వందే శివం శ్రేయసే.''

గ్రంథాదిని శ్రీకారంతో సంస్కృతంలో శ్లోకం రాసినట్లే మల్లన తరువాత కూడా వ్రాశాడు.

''శ్రీకాంత నిర్మలమనోర్చిత పాదపద్మం
విశ్వోద్భవస్థితిలయాది విధానహేతుం
తత్తద్గుణ క్రియవశా త్ర్పవిభక్త మూర్తిం
సర్వజ్ఞ మీశ్వరమహం ప్రణమామిభక్త్యా.''

అని ద్వితీయాధ్యాయ ప్రారంభంలో ఒక శ్లోకం ఉంది. గ్రంథమంతా దొరికితే ప్రతి అధ్యాయంలోనూ ఇలా ఉందో లేదో తెలుస్తుంది. ఇది నన్నయగారి పద్ధతికి విరుద్ధం అయితే మల్లన ఒక్కొక్క అధ్యాయానికీ మొదట సంస్కృత శ్లోకంలో ప్రార్థన చేశాడనుకోవాలి.

నన్నయగారు పంచమవేదాన్ని 'భారత భారతీ సముద్రము' అన్నారు. దానిని 'దరియంగ నీదను విధాతృనకైనను నేరబోలునే' అన్నారు. పావులూరి మల్లనకూడ గణితశాస్త్రం గురించి అలాగే భావించాడు. కాని 'అభినవ సంఖ్యామణిదీప్తి సారసంగ్రహ గణిత సముద్రంబు దరువంగ గణగితి బ్రీతిన్' అని చెప్పుకొన్నాడు.

నన్నయగారిలాగే పావులూరి మల్లనకూడ మూలంలో ఉన్న బోలెడన్ని శ్లోకాలను ఒక్క పద్యంలోకి కుదించగల నేర్పున్నవాడు. గణిత శాస్త్రాన్ని ప్రశంసిస్తూ మూలంలో ఏడు శ్లోకాలు ఉంటే ఇతడు వాటిని ఒక్క శార్దూలంలోకి కుదించాడు.

''అర్కాదిగ్రహ సంచరగ్రహణ కాలాన్వేషణోపాయముఙ్
దర్కవ్యాకరణాగమాది బహుశాస్త్ర ప్రోక్త నానార్థ సం
పర్కాదివ్యవహారమున్ భువనరూపద్వీపవిస్తారముఙ్
దర్కింపఙ్ గణితప్రవృత్తివెలిగాదక్కొండెఱిగించునే?''

తాను అనువదిస్తున్న గ్రంథాన్ని వ్రాసిన వ్యాసుణ్ణి నన్నయగారు పేర్కొని నుతించారుగాని పావులూరి మల్లన మాత్రం అలా చేయలేదు.

పావులూరి గణితం జైనమా?

ఈ పుస్తకం గురించి నిడుదవోలు వెంకటరావుగారు తమ 'తెలుగు కవుల చరిత్ర'లో [2] ఇలా వ్రాశారు.

> ''తెలుగు భాషలో వెలసిన శాస్త్రీయ గ్రంథములలో పావులూరి గణితము బహుళ ప్రచారము బడసినది. ఇది యాంధ్రజైన వాఙ్మయమునకు సంబంధించినది. ఆంధ్రజైన వాఙ్మయమునందలి కావ్యములు నశించినను శాస్త్రీయ గ్రంథములు, నిత్యవ్యవహారమున కుపయుక్తములగుటచే, నిలిచినవి.''

కాని పావులూరి గణితానికి, జైనవాఙ్మయానికి ఏవిధమయిన సంబంధమూ లేదు. ఉంటే, తాను అనువదిస్తున్న పుస్తకాన్ని మూలంలో ఎవరు వ్రాశారో ఆయనను మల్లన వినుతించేవాడు. కనీసం పేర్కొనైనా పేర్కొనేవాడు. అది చేయలేదు. దానికి కారణముంది.

సంస్కృతంలో గణిత సారసంగ్రహం రచించినవాడు మహావీరాచార్యులు. రాష్ట్రకూట రాజగు అమోఘవర్షుని రాజ్యకాలంలోనివాడు. క్రీ.శ. 814-877 మధ్య తన గ్రంథాన్ని రచించాడు. ఇతడు జైనుడు. గ్రంథంలో జైన ధర్మం కనబడుతుంది. దానిని అనువాదం చేసిన మల్లన శైవుడు, అందులోనూ జైనులను సహించలేని శైవుడు కాబోలు! మూలంలో 'జినభవనాలు' అని వ్రాసిన చోట్లలో ఇతడు శివాలయాలను ప్రతిష్ఠించాడు. ఉదాహరణకు ఇతడు ఇచ్చిన మొట్టమొదటి లెక్కనే తీసుకుందాము.

> ''మేలుగ నెనిమిదియొక్క శి
> వాలయమున కంబుజంబు లర్పించినచో
> నీ లెక్క నూటనలుబది
> నాలుగు భవనముల కెన్ని నలినము లయ్యెన్?''

దీనికి మూలశ్లోకాన్ని చూడండి.

> ''దత్తా న్యేకైకస్మై జినభవనా యాంబుజాని తాన్యష్టౌ
> వసతీనాం చతురుత్త చాత్వారింశచ్ఛతాయ కతి?''

జిన భవనాలను శివాలయాలు చేసినట్లె జైనతీర్థంకరులను శివుని కుటుంబ వ్యక్తులుగా మార్చివేశాడు. మూలశ్లోకాన్నీ, దాని తెనిగింపునూ చూస్తే ఇది తెలుస్తుంది.

> ''ఆదాయాంభోరుహిణి స్తుతిశతముఖరః శ్రావక స్త్రీర్థకృద్భ్యః
> పూజాంచక్రే చతుర్భ్యో వృషభజినవారర్ త్ర్యంశ మేషామనుష్య
> త్ర్యంశం తుర్యం షడంశం తదను సుమతయే తన్నవద్వాదశాంశౌ
> శేషేభ్యో ద్విద్విపద్మం ప్రముదితమనసా దత్తకింతత్ప్రమాణః (ప్రకీ. 3-8)

2. మద్రాసు యూనివర్సిటీ ప్రచురణ నెం. 13, 1956.

దీని అర్థం: ఒక శ్రావకుడు అంభోరుహాలను సేకరించి, స్తుతిశతకాన్ని బిగ్గరగా పఠిస్తూ మహనీయుడైన జినవృషభుడాదిగాగల నలుగురు తీర్థంకరులనూ సేకరించిన పూలలో ఒకట మూడవపాలుతో పూజించదలచి, అలా కేటాయించిన వాటిలో క్రమంగా ఒకట మూడింతలు, ఒకట నాలుగింతలు, ఒకట ఆరింతలతో ముగ్గురిని పూజించి సుమతిని ఒకట తొమ్మిదింతలతోనూ, పన్నెండింతలతోనూ పూజించాడు. మిగతా పందొమ్మండు గురు తీర్థంకరులనూ, ప్రముదిత మనసుతో రెండేసి పూలు పెట్టి పూజించాడు. సేకరించిన పుష్పాల సంఖ్య ఎంత?

ఈ లెక్కను మల్లన ఎలా తెనిగించాడో చూడండి:

''కమలానీకములం డ్రిభాగము శివుం గౌరిం దదష్టాదశాం
శము హేరంబు'దదర్ధముం గుహు నవాంశంబుం దదీయత్రికాం
శమున్ నంది నిజాం శమర్కునకు నిచ్చన్ భక్తిబూజించె శే
షము త్రింశత్సహితాష్టకంబు గణపూజం జేసె దా నెంతయో?''

ఈ పద్యంలో తీర్థంకరులకు బదులుగా శివుణ్ణి, అతని పరివారాన్నీ నిలిపినా మల్లన మనకొక మేలు చేశాడు. ఆనాటి ఒక ఆచారం దీనివల్ల తెలుస్తుంది. కమలాలు పట్టుకు వెళ్ళిన భక్తుడు ఒకే ఆలయంలో వివిధ దేవతలను పూజించి ఉంటాడుగదా. శివాలయంలో అర్కుణ్ణి ఎలా పూజించాడు అన్న ప్రశ్న మనకు వస్తుంది. రేనాటి చోళుల ఒక శాసనంలో ఆదిత్యగ్రహాన్ని నిలపడం అనే విషయం తెలుస్తున్నది. ఆ రోజుల్లో శివాలయంలోనే సూర్యగ్రహస్థాపన జరిగేది కాబోలు! మల్లన ఈ పద్యంలో 1. శివుడు, 2. గౌరి, 3. వినాయకుడు, 4. కుమారస్వామి, 5. నంది, 6. సూర్యుడు, 7. శివగణాలు ఆనాటి శివాలయంలో ఉన్నారని చెప్పాడు. నన్నయగారు భారతకృత్యాదిని ''నానేర్చు విధంబున నిక్కావ్యంబు రచించెద''నని తొడంగి –

''హరిహరాజగజాననార్క షడాస్యమాతృ సరస్వతీ
గిరిసుతాదికదేవతాతతికిన్ నమస్కృతిసేసి...''

అని పేర్కొన్న పద్యంలో ఎక్కువమంది దేవతలలో హరి, అజ, మాతృ, సరస్వతులు తప్ప మిగతావాళ్ళు ఒక దేవాలయంలో ఉన్నారు.

గణితంలోనే శృంగారం

మత విద్వేషంవల్ల మాతృక వ్రాసినవాని పేరెత్తకపోయినా, ఆలయాలనూ ఆరాధ్య దైవాలనూ మార్పు చేసినా ఇతర విషయాలలో బాగానే అనువదించాడు. మహావీరా చార్యులు గణిత శాస్త్రంలో శృంగారరసాన్ని లాక్కొనివచ్చి ఇచ్చిన ఈ లెక్క చూడండి.

''కాచి ద్వసంతమాసే ప్రసూనఫలగుచ్ఛ హరనమ్రోద్యానే
కుసుమాసవ రసరంజితశుకకోకిల మధుపమధురనిస్వన నిచితే

హిమకరధవళే పృథులే సౌధతలే సాంద్రరుంద్రమృదుతల్పే
ఫణిఫణా నితంబబింబా కనదమలాభరణ శోభాంగే
పాఠీనజఠరనయనా కఠిన స్తనహారనమ్రతనుమధ్యా
సహ నిజపతినా యువతీ రాత్రౌ ప్రీత్యాను రమమాణా
ప్రణయకలహే సముత్థే ముక్తామయకంఠికా తదబలాయాః
ఛిన్నావనౌ నిపతితా తత్త్ర్యంశ శ్చేటికాం ప్రాపత్
షడ్భాగ శ్శయ్యాయాం అనంతరానంతరార్థ మితి భాగాః
షట్సంఖ్యానా స్తస్యాః సర్వే సర్వత్రా సంపతి తాః
ఏకాగ్రషష్టి శతయుత సహస్రముక్తాఫలాని దృష్టాని
తన్మౌక్తిక ప్రమాణం ప్రకీర్ణకం వేత్సి చే త్కథయ'' (ప్రకీ. 3:17-22)

ఈ శ్లోకాలకు అర్థం ఏమిటంటే -

''వసంతమాసంలో ఒకానొక రాత్రి ప్రసూనఫలగుచ్ఛాల హారాలతో నమ్రమైన ఉద్యానవనంలో పువ్వు తేనియలరసాలతో రంజితమైన శుకకోకిల మధుపాల మధుర స్వరాలు నిండియుండగా వెన్నెలంత తెల్లగా ఉండే పృథులమైన సౌధతలాన సాంద్రరుంద్ర మృదుతల్పంమీద ఫణిఫణా నితంబబింబం గలదీ, కనదమలాభరణశోభాంగి అయినటు వంటిదీ, పాఠీనజఠర నయనాలు గలిగినటువంటిదీ, కఠిన స్తనహారాలచేత నమ్రమైన నడుముగలదీ ఒక యువతి భర్తతో ప్రీతికరంగా రమణతో ఉంటున్నది. అప్పుడు ప్రణయ కలహంలో ఆమె ముత్యాల కంఠహారం తెగి కిందపడిపోయింది. ఆ హారంలోని ముత్యా లలో మూడువంతులు అక్కడ ఉన్న చేటికను చేరుకొన్నాయి. ఒకటి ఆరువంతులు శయ్య మీద పడ్డాయి. మిగిలినవాటిలో సగం, ఆ సగంలో మళ్ళీ సగం, ఇందులో ఇంకొకసగం ఇలా ఆరుసార్లు విభజిస్తే ఎన్నో అన్ని సర్వేసర్వత్రా పడ్డాయి. చెదరకుండా ఉన్న ముత్యాలు 1,161 ఉన్నాయి. నీకు ప్రకీర్ణకం లెక్కలు తెలిస్తే మొత్తం ముత్యాల సంఖ్య చెప్పు.''

మూలంలో ఇంతటి శృంగారవర్ణన, రమణీయమైన వాతావరణ పూర్వరంగం ఉన్నా మల్లన వాటిని లెక్కించక ముందుగానే ముత్యాల దండ త్రెంచి వేశాడు.

''సురతమునం బెనంగునెడ సుందరి హారము త్రెస్సి ముత్యముల్
పరువడి శయ్యతూర్పున ద్రిభాగము రాలెను దాని కర్థమై
నెరసె దదష్టదిక్కులను నిర్మలమై నగనాగలోకముల్
తిరముగ నుండె సూత్రమున దెల్పుము మా కవి యెన్ని యేర్పడన్''

ప్రణయకలహమని మూలంలో ఉంటే ఈయన అనంగకేళిని కల్పించాడు. అందుకే చేటికను చుట్టుపక్కల ఉండనివ్వలేదు. ఔచిత్యం పాటించడం మంచికవి లక్షణం.

పరతంత్రంలోనే స్వతంత్రం

ఇలా మూలగ్రంథంలో ఎన్నిటినో మల్లన తొలి రెండు అధ్యాయాలలో అనువదించినా ఎందుచేతనో వీరేశలింగంగారు తమ 'కవుల చరిత్ర'లో ఇలా వ్రాశారు :

''ఈ పావులూరి గణితము మహావీరాచార్యుల వారి సంస్కృత గణితసారసంగ్రహమునకు భాషాంతరీకరణము. ఇందలి పద్ధతులు మాత్రమే పయిగ్రంథమునుండి తెనిగింపబడినవిగాని లెక్కలన్నియు మల్లనార్యుని చేత స్వతంత్రముగా గల్పింపబడినవే.''

వీరేశలింగంగారు ఇలా వ్రాసినట్టే ''మూలమునుండి పద్ధతులు, సూత్రములు గ్రహింపబడినవే కాని యుదాహరణములన్నియు గవి స్వంతముగ గల్పించినవే'' అని నిడుదవోలు వెంకటరావుకూడ తమ ''తెలుగు కవుల చరిత్ర'లో వ్రాశారు.

కొన్ని కొన్ని లెక్కలలో మూలంగా ఇచ్చినంత పెద్ద అంకెలు ఇవ్వలేదు. అందుకు ఒకవేళ ఛందస్సు అడ్డు వచ్చిందేమో! స్థాలీపులాకంగా చూస్తే సొంతంగా కల్పించిన వాటికన్నా అనుసరించినవే ఎక్కువగా కనబడతాయి.

అప్పటి సంఘ విశేషాలకు అచ్చు మచ్చు

సొంతంగా అనుకరించినా, స్వతంత్రంగా కల్పించినా మొత్తంమీద మల్లన తెలుగువాళ్ళకు మంచి పుస్తకాన్నే ఇచ్చిపోయాడు. దీనివల్ల ఆనాటి కొలమానాలు, నాణెపు విలువలు, కొన్ని సాంఘిక విషయాలు తెలుస్తున్నాయి.

''పరగ రెండుపాళ్ళు బంచిన ధన రాశి
నిచ్చె రాజు మగుడ నేడుపుట్లు
బ్రజలకెల్ల నాల్గుపాళ్ళ సమములై (మగు)
రాశి మొదల ధాన్యరాశి యెంత?

పంట మూడుపాళ్ళు బంచిన ధనరాశి
నైదుపుట్ల పందు మవనివిభుడు
ప్రజలకెల్ల నాల్గు భాగములకు నొక్క
సరిగ మొదలి ధాన్యసంఖ్య ఎంత?''

అనే లెక్కలలో అధికారి పంపకం పాళ్ళను రాజు మళ్ళా ప్రజలందరికీ ఇవ్వడం వంటి సాంఘిక సంప్రదాయం తెలుస్తున్నది. ఒక చిన్నం డబ్బులకు దళహీనమైన శొంఠి పలమెడు ఇచ్చేవారని ఒక లెక్కలో చెప్పాడు. అగరు, కస్తూరి, కర్పూరం, కుంకుమ మొదలైన సామగ్రులను పేర్కొన్నాడు. చదరంగపు వడ్లగింజల లెక్కను ఇచ్చాడు.

''మొద లొకట నిల్పి దానిం
గదియగ దుదికాక రెట్టిగా గూడినచొ
విదితముగ బల్కు మాకుం
జదరంగపు టిండ్లకైన సంకలిత మొగిక్''

మొదటి గళ్ళో ఒకటి, రెండవదానిలో రెండు, మూడవదానిలో నాలుగు - ఈ లెక్కన రెట్టించుకొంటూ పోతే మొత్తం 64 గళ్ళకు ఎంత వస్తుందో మాకు చెప్పు అని ఈ పద్యంలో ప్రశ్నించాడు. దీనికి పద్యంలోనే జవాబు చెప్పాడు.

''శరశశి షట్కచంద్ర శరసాయకరంధ్ర వియన్న గాగ్ని భూ
ధర గగనాబ్ధి వేదగిరితర్క పయోనిధి పద్మజాస్య కుం
జర తుహినాంశు సంఖ్యకు నిజంబగు తచ్చతురంగ గేహవి
స్త రమగు రెట్టిరెట్టి కగు సంకలితంబు జగత్ప్రసిద్ధికిక్.''

అన్నాడు. మన భారతీయ పద్ధతిలో ఒక్కొక్క అంకెకూ కొన్ని సంకేతాలుంటాయి, శర అంటే అయిదు (మన్మథుడి శరాలు అయిదు కనుక), శశి అంటే ఒకటి (ఆకాశంలో చంద్రుడు ఒక్కడే గనుక), షట్కం అంటే సహజంగా ఆరే. ఈవిధంగా పరిభాషలో చెప్పిన మాటలకు అంకెలు వేసుకొంటూపోతే జవాబు వస్తుంది. అలా వచ్చిన సంఖ్య : 18446744073709551615.

పద్యంలో మొదట శర-అయిదు, శశి-ఒకటి, షట్క-ఆరు మొదలైన అంకెలిచ్చాడే, మరి జవాబులో మొదట అవి లేవే అని ఆశ్చర్యపోకండి. మన సంప్రదాయ ప్రకారం అంకెలు వెనుకనుంచి వేసుకురావాలి. అయిదు, ఒకటి, ఆరు అనే వరుసలోనే ఆఖరు నుంచి అంకెలు కనబడతాయి చూడండి.

ఇవేకాక నానావిధ వినోద సమస్యలను ఇచ్చాడు. మచ్చుకు ఒకటి.

''ఆరునొక్కట్ల నొడ్డుగా నమరబెట్టి
యంనగుణకంబుచేతను నమరబెంచి
సొరిది వర్ణించి జనులకు జోద్యముగను
హిమకరోపమలబ్ధంబు నెరయవచ్చు.''

1, 11, 111 అనే అంకెను 1,11, 111 అంకెతో గుణిస్తే 12345654321 వస్తుంది.

మహావీరాచార్యులగారి గణితసార సంగ్రహంలో ఎనిమిది ప్రకరణాలు వున్నాయి. మల్లన మూలంలోని గణిత విధానాలనే స్వీకరించాడని అభిజ్ఞులు చెప్తారు. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఈ గ్రంథానికి పదమూడు తాళపత్ర ప్రతులు (D 2283 నుండి D 2295) వున్నాయి. ఒక కాగితం ప్రతి వుంది (D 2282). అన్నీ అసమగ్రాలే లభ్యమవుతున్నా, పావులూరి మల్లన గణితం అంతా కూడా అచ్చుపడలేదు. తిరుపతి దేవస్థానం వాళ్ళు కొంతమటుకే అచ్చువేశారు. 'భారతి' పత్రికలో తిమ్మావఝల కోదండరామయ్యగారు

కొంత ప్రకటించారు. (1953 జూలై సంపుటి 30 – సంచికలు 7-9), లీలావతి గణితానికి తెలుగు వ్యాఖ్య వ్రాసిన వేదము లక్ష్మీనారాయణశాస్త్రిగారు వావిళ్ళ సంస్థకోసం పూర్తి గ్రంథాన్ని పరిష్కరించి అచ్చుకు 1964కు ముందే సిద్ధం చేశారు.

దశవిధ గణితమని కూడా పేరు పొందిన ఈ పావులూరి గణితం చారిత్రక విద్యార్థులకు పనికివచ్చే మంచి పుస్తకం.

వేములవాడ భీమకవి

సాహిత్య చరిత్రకారులకు ఇప్పటికీ పెద్ద సమస్యగా మిగిలిపోయిన కవులలో వేములవాడ భీమకవి ఆద్యుడు. ఇతడు రచించినట్లు చెప్పుకొనే పుస్తకాల్లో ఏ ఒక్కటీ నేడు లభించదు. ఇతడు చెప్పాడని భావించే చాటువుల్లో ఏది నిజంగా ఈయన చెప్పిందో తేల్చలేము. ఎందరో తెలుగు కవులు ఇతణ్ణి నుతించారు. ఇతని తిట్లూ, దీవనలూ, మహిమలూ కథలకింద చెప్పుకొంటున్నారు. అయినా యితని కాలమేదో ఎవరూ ఇప్పటికీ సరిగ్గా నిర్ణయించలేదు. నన్నయగారిని నుతించడానికి ముందుగా ఇతణ్ణే శ్రీనాథుడు నుతించాడు. కాబట్టి ఇతడు నన్నయగారికన్నా పూర్వీకుడని కొందరంటారు. ఇతని పుస్తకాలను నన్నయగారు నాశనం చేయించారని అప్పకవి పుట్టించిన అపవాదును పురస్కరించుకొని ఇతడు నన్నయగారి సమకాలికుడని మరికొందరంటారు. ఇతడు చెప్పినవి లోకంలో ప్రచారం పొందిన చాటువులను ఆధారం చేసుకొని, వాటిలో పేర్కొన్న చారిత్రక పురుషుల కాలాన్నిబట్టి ఇతని కాలనిర్ణయం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. అన్ని చాటువులనూ నమ్మితే ఇతడు రెండు మూడు వందల సంవత్సరాలు సజీవంగా ఉండి ఉండాలి!

ఇతడు నన్నయగారి సమకాలికుడు కాకపోయినా నన్నయగారి తరువాతా, తిక్కనగారికి ముందూ జీవించి ఉంటాడని కొందరి ఊహ. ఇతర భాషా సాహిత్యాల సాక్ష్యాలనుబట్టి ఇతణ్ణి పధ్నాలుగో శతాబ్దానికి తీసుకువెళ్ళిన వాళ్ళూ ఉన్నారు. కందుకూరి వీరేశలింగంగారు ఇతణ్ణి 1340-50ల మధ్యవాడని చెప్పారు. భీమకవి వ్రాసిన పుస్తకాల పేర్లు వినడమేగాని చూడలేదని చెప్పిన పింగలి సూరన్న కాలం క్రీ.శ. 1550. భీమకవి 1350 ప్రాంతాలవాడైతే క్రీ.శ. 1550 నాటికే, అంటే రెండువందల ఏండ్లలోనే పుస్తకాలు దొరకడం మానేస్తాయా? భీమకవిని నుతించిన మొట్టమొదటివాడు శ్రీనాథుడు. 1380-1450 ప్రాంతాలవాడు. తనకు యాభై సంవత్సరాల పూర్వపు వాడిని శ్రీనాథుడు నన్నయగారికన్నా ముందుగా పేర్కొంటాడా?

వ్యక్తిత్వం, విశేషాలు

భీమకవి నన్నయగారికన్నా ప్రాచీనుడు కాకపోయినా తిక్కనగారి కాలానికి దగ్గరగా చాళుక్య యుగంలో ఉండి ఉంటాడనిపిస్తున్నది. ఇతని చాటువులవల్లా, ఇతణ్ణి

గురించి ఇతరులు చెప్పిన వాటివల్లా ఈయన వ్యక్తిత్వం ఎలాంటిదో, ఇతని కాలం ఏదో మొదలైనవి మనం కూడ ప్రత్యేకంగా పరిశోధన చేద్దాం. ఏం తేలుతుందో చూద్దాం.

భీమకవి, చాటువులు ఉదాహరణలు

''ఘనుడన్ వేములవాడ వంశజుఁడ; దాక్షారామభీమేశనం
దనుడన్; దివ్యవిషామృత ప్రకటనాకావ్య ధుర్యుండ; భీ
మన నా పేరు; వినంగ జెప్పితి దెలుంగాధీశ! కస్తూరికా
ఘనసారాదిసుగంధ వస్తువులు వేగం దెచ్చి లాలింపురా!''

ఈ చాటువులో కవి సంబోధించిన తెలుగాధీశుడు ఎవడో చరిత్రకారులు నిర్ణయించలేకపోతున్నారు. దానికి కారణం మన చరిత్రలో 'తెలుంగాధీశుడు' అనే బిరుదుగాని, పేరుగాని ఉన్న రాజులు లేకపోలేదు. ఆ పేరున్నవాళ్ళ కాలానికి భీమకవిని లాక్కొస్తే అతడు మరీ అర్వాచీనుడయిపోతాడు. అందుచేత 'తెలుంగాధీశ' అనే మాటను 'కళింగాధీశ' అని మార్చివేస్తే ఈ చిక్కు ఉండదని భావించి కొందరు 'కళింగాధీశ' అనే పాఠాంతరం చూపెట్టారు. మరికొందరు 'వెలుంగాధీశ' అనే మాటను సప్లయి చేశారు. అయినా 'తెలుంగాధీశ' అనే పదాన్ని మార్చకూడదు. కారణమేమిటంటే భీమకవిని స్తుతించిన మొదటి తెలుగుకవి శ్రీనాథుడీ పద్యాన్ని పాత జ్ఞాపకాల పొరలలోంచి గుర్తుచేసుకునే తానూ ఒక చాటువు చెప్పాడు. అది -

''అక్షయ్యంబుగ సొంపరాయని తెలుంగాధీశ! కస్తూరికా
భిక్షాదానము చేయురా సుకవిరాడ్బృందారక శ్రేణికిన్
దాక్షారామ పురీవిహారవర గంధర్వాప్సరో భామినీ
వక్షోద్వయ కుంభికుంభములపై వాసించు దద్వాసనల్''.

భీమకవి చాటువులోనూ, శ్రీనాథుని చాటువులోనూ మూడు సమాన పదాలు ఉన్నాయి. అవి: ఒకటి ''తెలుంగాధీశ'! రెండు 'కస్తూరికా'; మూడు 'దాక్షారామ' అనేవి. ఇద్దరూ సమకాలికులు కారు కాబట్టి ఈ తెలుంగాధీశులు వేరు వేరు వ్యక్తులే అయినా బిరుదుమాత్రం అదేకావచ్చు. ఇంతకు ముందు తెలుంగాధీశుణ్ణి తాను మెచ్చుకునే కవి కస్తూరికాఘనసారాధి సుగంధ వస్తువులు యాచించిన పద్యం గుర్తుకువచ్చే శ్రీనాథుడు తన చాటువును ఈ పద్ధతిలో చెప్పాడనుకోవడంలో తప్పులేదు.

తెలుంగాధీశుడు ఎవడో తేలకపోయినా ఈ చాటువువల్ల భీమకవి దాక్షారామ భీమేశనందనుడనీ, దివ్య విషామృత ప్రకట నానాకావ్యధుర్యుడనీ తెలుస్తున్నది. ఈ కవికి సుగంధద్రవ్యాలంటే ప్రీతి కాబట్టి మంచి రాజసం గల వ్యక్తి అని ఊహించవచ్చు. మడిమాన్యాలూ, అగ్రహారాలూ అడగక కస్తూరి, పచ్చకర్పూరం మొదలైనవి తెచ్చి లాలించమనడంలో కవియొక్క స్వాతంత్ర్యం, భోగలాలసత్వం ప్రస్ఫుటమవుతున్నాయి.

చెయ్యి చాపి యాచిస్తూ, దాతను 'రా' కొట్టడంలో కవియొక్క పై చేయి కనబడుతున్నది. అన్నట్టు శ్రీనాథుడు కూడ తన దాతను ఇలాగే 'రా' కొట్టాడు.

ప్రస్తుతం మనకు లభ్యమయ్యే చారిత్రక ఆకరాలవల్ల భీమకవిని గురించి ఈ చాటువు మూలంగా మాత్రమే మనం తెలుసుకోగలము. మరొక చాటువు తీసుకొని దానివల్ల ఏమి తెలుసుకోగలమో చూద్దాము.

ప్రస్తుతం బస్తరు, జయపురం సంస్థానం మొదలైన ప్రదేశాలున్న సీమని రాజరాజనరేంద్రుని కాలంలోనూ, ఆ తర్వాతనూ 'త్రికళింగం' అని పిలిచేవారు. దీనికి చక్రకూటం రాజధాని. ఈ రాజ్యాన్ని చోడగంగు పాలించేవాడు. ఇతణ్ణి చూడటానికి ఒకసారి వేములవాడ భీమకవి వెళ్ళినట్లుంది. 'కవీశ్వరుడు వచ్చా'డని ప్రతీహారిచేత రాజుగారికి కబురుపెట్టాడు. 'పేరు కనుక్కో'మని రాజుగారు ఆదేశించారు. అప్పుడు భీమకవి ఈ పద్యాన్ని వ్రాసి పంపాడట.

''శాపాను గ్రహ వటువును
రాపాడెడి కవుల నెత్తి రంపం బనగా
భూపాలసభల బూజ్యాడ
నాపేరే భీమనంద్రు నరవర! వినుమా!''

ఈ పద్యాన్ని చదువుకొన్నా, అందులోని శాపానుగ్రహవటువు, కవుల నెత్తిరంపం వంటి మాటలను తేలికగా కొట్టిపారవేయడమేకాక 'కవి కింత తల బిరుసా' అని కళింగేశ్వర చోడగంగు కోపపడ్డాడు. ''ఇప్పుడు కాదు; సందడిలో ఉన్నాను; అది తీరాక రమ్మను'' అని చెప్పి పంపించాడు. భీమకవికి ఒళ్ళు మండింది. తన శాపపటుత్వం చూపడానికి ఈ క్రింది పద్యం చెప్పాడు.

''వేములవాడ భీమకవి వేగమె కళింగగంగు తా
సామము మాని కోపమున సందడిదీరిన రమ్ము పొ మ్మనెన్
మోమును జూడ దోష మిక ముప్పదిరెండు దినంబు లావలన్
జామున కర్థమం దతని సంపద శత్రుల జేరుగావుతన్''

కవిగారి శాపంవల్లనో, కాకతాళీయంగానో కళింగ గంగురాజ్యం పరహస్తగత మైంది. వాస్తవానికి రాజు చెప్పిన 'సందడి' రాజకీయ వ్యవహారాలు కావచ్చు. రాజరాజ నరేంద్రుని తరవాత రాజ్యానికి వచ్చినా కుళోత్తుంగచోళుడు తెలుగుదేశంలో ఉండక దక్షిణాదిని పెద్ద సామ్రాజ్యం పాలిస్తూ ఉండేవాడు. అతని తరపున ఇక్కడ రాజప్రతినిధులు ఏలుతూ ఉండేవారు. వాళ్ళు స్థిరపడి రాజ్యాన్ని హస్తగతం చేసుకోకుండా ఉండాలని కుళోత్తుంగుడు వాళ్ళను త్వరత్వరగా బదిలీలు చేస్తూ ఉండేవాడు. కళింగగంగు ఈ మార్పులను అదనుగా తీసుకొని ఏమి చేశాడో ఏమో అతనికీ, చాళుక్య చోళులకూ వైరం వచ్చింది. కుళోత్తుంగుని సామంతుడు కోన ఇమ్మడి పోతరాజు దండెత్తి త్రికళింగేశ్వరుని జయించి కళింగదేశపు మదపుటేనుగులను తెచ్చి రాజేంద్రచోడునికి ఇచ్చాడు. ఓడిపోయిన కళింగ గంగు దేశాలు పట్టాడు.

తరవాత కొంతకాలానికి ఒకచోట రాత్రి చీకటిలో ఈ కళింగ గంగు కాలుజారి పాతరగోతిలో పడ్డాడట. అంత బ్రతుకు బ్రతికిన మహారాజు ఇప్పుడో కాలిదివ్వటీ అయినా లేకపోయిందే అని ఆక్రోశించాడట. ఇది భీమకవి యింటిముందే జరిగిందో, లేక భీమకవి అటు వచ్చాడో, ఆ దుఃఖాన్ని విని ''ఎవరు నువ్వు?'' అని ప్రశ్నించాడట. ''భీమకవి చేసిన జోగి!''నని అతడు ఏడ్చాడట. ''నామాట ఊరికే పోతుందా'' అని భీమకవి గర్వంగా ఈ పద్యం చెప్పాడట :

''రాముని అమోఘ బాణమును, రాజశిఖామణికంటి మంటయున్,
దామరచూలి వ్రాతయును, దారకవిద్విషు ఘోరశక్తియున్
భీము గదావిజృంభణ, ముపేంద్రుని చక్రము, వజ్రి వజ్రమున్
వేములవాడ భీమకవి వీరుని తిట్టును రిత్తపోవునే?''[1]

ఈ పద్యం విన్నాక కళింగగంగు 'క్షమించ'మని కవిగారి కాళ్ళపై పడ్డాడట. అప్పుడు భీమకవి కరుణించి ఈ పద్యం చెప్పాడట.

''వేయిగజంబు లుండ పదివేల తురంగము లుండ నాజిలో
రాయల గెల్చి సజ్జనగరంబున బట్టము కట్టుకో వడిన్
రాయకళింగగంగ! కవిరాజు భయంకరమూర్తి సూడు దా
బోయిన మీనమాసమున బున్నమపోయిన షష్ఠినాటికిన్.''[2]

---

1. ఈ పద్యానికే పాఠాంతరంలాంటిది ఒకటి భీమకవిగారి చాటువుగా ప్రచారంలో ఉంది. అది :
''బిసరుహగర్భు వ్రాతయును విష్ణుని చక్రము వజ్రివజ్రమున్
దెసలను రామబాణము యుధిష్ఠిరుకోపము మౌనిశాపమున్
మసకపు పాముకాటును కుమారుని శక్తియు గాలు దండమున్
బశుపతి కంటిమంటలును బండితవాక్యము రిత్తపోవునే?''

2. ఈ దీవన చాటువులో ''కవిరాజు భయంకరమూర్తి చూడ దాబోయిన మీనమాసమున'' అని ఒక పాఠం ఉంది.
'పోయిన' అనే పదం భూతకాలాన్నే సూచిస్తుంది. రాబోయే కాలం గురించి చెప్పాలంటే 'వచ్చే మీనమాసంలో' అని అనాలిగాని 'పోయిన మీనమాసమున' అనకూడదుకదా! అందుకే
''రాయకళింగగంగు కవిరాజభయంకరమూర్తి జూడగా
బోయెను మీనమాసమున బున్నమి పోయిన షష్ఠినాటికిన్.''
అనే పాఠం కొందరు కల్పించారు. ఇది అంత తృప్తికరమైనది కాదు. పద్యం డొంకతిరుగుడుగా ఉంటుంది. 'రాముని అమోఘబాణమును' అనే చాటువులో 'కవివీరుని తిట్టు' గురించి చెప్పాడు గనక ఈ దీవన చాటువులో దానినే వాడుకొని సవరణ చేస్తే తెలుగు పలుకుబళ్ళకు విరుద్ధం కాని పాఠం వస్తుంది.
'చూడు' అన్నది దిద్దినపాఠం; సూడు అన్నది సాధుపాఠం. ఈ మాటకు వైరము, పగ, కసి, కక్ష, విరోధము అనే అర్థాలున్నాయి. ద్రావిడ భాషలలో ''సూళ్'' అనే పదానికి శపథం, ప్రతిన, శాపం అనే అర్థాలున్నాయి (D.E.D.2260). 'సూడు దా బోయిన' అన్నదానికి 'శాపం తాను పోయినన్' అని అర్థం.

అని దీవించాడట. ఆ బలంవల్ల కళింగగంగు మళ్ళా తన రాజ్యం సంపాదించుకొన్నాడట. ఈ దీవనలో భీమకవి రాయలను గెల్చి రాజ్యం సంపాదించుకోమన్నాడు. ఈ రాయలు కోనఇమ్మడి పోతరాజు పెద్దన్నగారైన రాయలని చాగంటి శేషయ్యగారి అభిప్రాయం. తమ్ముడు జయించిన ప్రదేశం అన్నగారి ఏలుబడిలో వుండి వుంటుంది.

అప్పటి మానం - సౌరమానం

ఈ చాటువులవల్ల భీమకవి శాపానుగ్రహదక్షత మాట అలా వుంచి అతని ప్రాచీనత తెలుస్తున్నది. రాజరాజ నరేంద్రుని కాలంలోనూ, అటు తరువాత కొంతదాకానూ మన దేశంలో సౌరమానం ప్రచారంలో వుండేది. మాసాలను మేషమాసం, వృషభమాసం అని పన్నెండు రాసుల పేర్లతో పిలిచేవారు. భీమన తన దీవనలో 'మీన మాసమున పున్నమిపోయిన షష్టినాటికిన్'' అన్నారు. అతడు సౌరమానం ప్రచారంలో ఉన్నప్పటి వ్యక్తేనని మనం నికరంగా తేల్చుకోవచ్చు.

ఈ చాటువులలోని సజ్జనగరం ఎక్కడుంది? పిఠాపురానికి, చాళుక్య భీమవరానికి దగ్గరలో ఒక సజ్జనగరం ఉందని శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు 'కళింగ సంచిక'లో వేసిన భూగోళపటంలో సూచించారు. గోపాలకృష్ణమూర్తిగారి ఉద్దేశంలో భీమకవి తిట్టిన రాజకళింగగంగు అనంతవర్మ చోడగంగదేవుడే. ఇతని కాలం క్రీ.శ. 1076-1147 అని గోపాలకృష్ణమూర్తిగారు అంచనా వేశారు. క్రీ.శ. 1118లో ఉత్కళం కళింగం నుంచి వేరయిందనీ, కాలచుర్యులు అనంతవర్మను ఓడించారనీ వారు వ్రాశారు. భీమకవి శాపకాలం ఈ ప్రాంతాలనే కావచ్చునేమో!

భీమకవి నల్లసిద్ధి అనే రాజుపైన ఒక పద్యం చెప్పాడు. అది ఆయన రచించిన నృసింహపురాణంలోనిదని లాక్షణికులు ఉదాహరించారు. అది -

''వాండిమి నల్లసిద్ధి జనవల్లభు డోర్చిన రాజు భీతుడై
యాంధ్రను గానకుండా వృషభాంకము బెట్టికొనంగ జూచితో
నేం డిది యేమి నీ వనుచు నెచ్చెలు లెల్ల హసింప నంతలో
మూండవకంటితోడి దొర మూర్తివహించిన మ్రొక్కి రంగనల్.''

ఈ పద్యంలోని ప్రాసవల్ల భీమకవి ప్రాచీనత స్పష్టమవుతుందని కొందరంటారు. ఇటువంటి ప్రాసలను నన్నెచోడుడు వాడాడు కనుక భీమకవి కూడ ఆ కాలంవాడేనని చెప్పాలని వారి వాదం. ఈ పద్ధతి ప్రాసలు నాచన సోముని కాలం దాకా ఉన్నాయి. కాబట్టి ఇది ప్రాచీనతకు గురుతు కాదని వీరేశలింగంగారి అభిప్రాయం (ఆంధ్రకవుల చరిత్ర, పుట 207). దీనిని మన్నించి భీమకవి కాలం ఎప్పుడై ఉంటుందో చూద్దాం. నాచన సోముని కాలం 1430 ప్రాంతాలు. శ్రీనాథుని కాలం 1380-1450. కాబట్టి ఈ ఇద్దరూ సమకాలికులు. తనకాలంవాడైతే భీమకవికి శ్రీనాథుడు నన్నయగారి కన్నా పెద్దపీట

వేయడుగనుక 'దీర్ఘముమీద పూర్ణబిందువు' వాడిన వేములవాడ భీమకవి నాచన సోముని కన్నా నన్నెచోడునికే దగ్గర్లో వుండివుంటాడు.

ఈ పద్యంలో పేర్కొన్న నల్లసిద్ధి ''పంద్రెండవ శతాబ్దమునంతముననగా బై చెప్పబడిన సాగి పోతరాజు కాలమున గడప మండలములోని వల్లూరు పట్టణము రాజధానిగా బొత్తపినాడు, మొదలగు దేశములను పాలించెను'' అని చిలుకూరు వీరభద్రరావుగారు వ్రాశారు.[3] క్రీ.శ. 1162లో మైలమ భీముని కాలంలో ఉదయచోడుని దండనాయకులైన నల్లసిద్దయ్య, సిద్ధమయ్యలు అనే ఇద్దరు వ్యక్తులున్నారు. వీళ్ళలో ఒకడు నృసింహపురాణంలో పేర్కొన్నవాడు కావచ్చునేమో;

విలక్షణ పద్యం

ఇతని నృసింహ పురాణంలోనిదేనని కస్తూరిరంగ కవి తన 'ఆనంద రంగరాట్ఛందం'లో మరొక పద్యం ఉదహరించాడు. అది :

మానవనాథుడు గంగా
స్నానాంతరము సకల దానములు మహా
దీనులగు విప్రకోటికి
సేనా దయతోడ నిచ్చి శివు సేవించెన్.''

ఈ పద్యం రెండు విధాలుగా విలక్షణమైంది. ఒకటి 'స్నాన' అనే పదంలోని 'స' కారానికి 'దాన' అనే పదంలోని 'ద' కారం యతిమైత్రిగా చూపిస్తుంది. ఈ యతి మన తెలుగులో అరుదేగాని తమిళంలో దీనిని 'తగరం-నగరం' అని వాడుకగా చెప్పుకొంటారు. ఈ యతిని గురించి మన ప్రాచీన లాక్షణికులు ఏమీ చెప్పలేదు.[4] ఈ పద్యంలోని రెండవ విలక్షణం ఏమిటంటే - 'సేనాదయతోడ' అనే మాట వాడడం. ఈ గ్రామీణ వ్యావహారిక రూపం భీమకవి వాడిందేనా?

భీమనగారి చంపకం అఖండయతి ప్రయోగం అంటూ పొత్తపి వెంకటరమణ కవి తన లక్షణ శిరోమణిలో ఈక్రింది పద్యం ఉదహరించాడు.

''వెలవెలబారి తాల్మి గడు వేగెద వగ్గి ముడింగి దీధితుల్
పొలుపరి కుందివందినను బోటియపోలెను వాసినూచి చం
దలగతినొంది చిక్కితి గృశాంగుడనైతి శశాంక నీవునున్
గళితసురంగ మంగళ వికాసవిభాతిని కుందసాగితే''

---

3. ఆంధ్రుల చరిత్ర, రెండవ భాగం (1912), పుట 257.

4. కొందరి ఉద్దేశంలో భీమకవి కవిజనాశ్రయం వ్రాశాడు. దీనికి లాక్షణికులు పరంపరగా చెప్పుకొనే సంప్రదాయాన్ని ఇంకా సాక్ష్యంగా చూపెడతారు. భీమకవి నిజంగా లాక్షణికుడైతే కవిజనాశ్రయం వ్రాస్తే ఈ యతిని చెప్పడా? ఈ పద్యం భీమకవికృతం కాదు. రంగకవి పొరబడి ఉదహరించా డంటారా? ఆ పొరబాటు భీమన కవిజనాశ్రయం వ్రాశాడనటంలో కూడా వుంటుంది.

ఈ పద్యాన్ని పొత్తపివారు ఒకందుకు ఉదహరిస్తే, మనం ఇంకొకందుకు ఉపయోగిద్దాం. దీని ఆఖరి పాదంలోని 'గళితసురంగ మంగళ' అనే సమాసం చూశారా? అందులోని 'సురంగ' అనే మాటను ప్రాచీన కవులు మాత్రమే మొదట వాడేవారు. నన్నెచోడుడు యథావాక్కుల అన్నమయ్య దీనిని మొదటిసారి ఉపయోగించిన ప్రాచీనులు. వేములవాడ భీమకవికూడా ప్రాచీనుడనీ, అప్పటికాలంవాడు కావచ్చుననీ ఊహించడానికి ఈ పద్యంలో 'సురంగ' శబ్దం పనికి వస్తున్నది.

ఈ పొత్తపి వెంకటరమణ కవే భీమన ప్రార్థనా పంచకంలోనిదంటూ 'శ్రీలలనాతనూభవ' అనే పద్యాన్ని ఉదహరించాడు. మన్మథుణ్ణి కృత్యాదిలో నుతించడం నన్నెచోడుని కాలంనాటి కవుల ఆచారం అనుకుంటే ఒక పద్యంలో ప్రత్యేకంగా మన్మథుణ్ణి ప్రార్థించిన భీమకవి కూడ ఆ కాలంవాడే అనుకోవచ్చు. దశకుమార చరిత్రలో కేతన కూడా మన్మథుణ్ణి నుతించాడు. భీమకవి నన్నెచోడునికీ, తిక్కనగారికీ నడుమ ఉండవచ్చు.

చారిత్రకంగా చూస్తే ఆధారరహితాలూ, అసంగతాలూ ఎన్నో భీమకవి గురించి అప్పకవి చెప్పాడు. అతడు చెప్పిన చాలావాటిని పరిశోధకులు తోసిరాజన్నారు. ఇంకొకళ్ళు వ్రాసిన పుస్తకాలూ, పద్యాలూ భీమకవికి అప్పకవి అంటగడితే కోప్పడిన పరిశోధకులు, 'అదే అప్పకవి మరొక కవిదని స్పష్టంగా చెప్పిన ఒక చాటుధారను భీమకవిదే కావచ్చు' నంటున్నారు.

''నెల్లూరి తిరుమలయ్య ఆరవచోట తకారంబు నిలిపి తన గుఱ్ఱమును దొంగలించిన శ్రీపతిరాజు పోతరాజును నేడు దినంబులకుం జావందిట్టిన చాటుధార'' అంటూ అప్పకవి ఈ క్రింది పద్యం ఉదహరించాడు.

> ''హయ మది సీత, పోతవసుధాధిపు డారయ రావణుండు, ని
> శ్చయముగ నేను రాఘవుడ, జాహ్నవి వారధి, మారు డంజనా
> ప్రియతనయుండు, లచ్చన విభీషణు, డా గుడిమెట్ట లంక, నా
> జయమును పోతరక్కసుని చావును నేడవవాడు సూడుడీ.''

ఈ పద్యంలోని పోతరాజు అప్పకవి చెప్పిన శ్రీపతిరాజు పోతరాజు కాడనీ, అతడు త్యాగి పోతరాజనీ చరిత్రకారుల ఊహ. ఎందుకంటే, గుడిమెట్ట పాలించినది త్యాగివారే కనుక. ఈ త్యాగివారి వంశంలో చాలామంది పోతరాజులు ఉన్నారు. అందులో మొదటి పోతరాజే ఈ పద్యంలోని పోతరాజని చాగంటి శేషయ్యగారి ఊహ. ఇంతకూ ఈ పోతరాజుకు లచ్చన అనే తమ్ముడున్నాడో లేడో తెలియదు. ఆ లచ్చన తన పాలిటి విభీషణుడైనాడని చాటుకవి చెప్తున్నాడు. మారుడనేవాడు తన రామాయణంలో హనుమంతుడయ్యాడన్నాడు. ఈ మారుడు కామదేవుడైన మన్మథుడా? లేక మారుడనే వ్యక్తియా? పోతరాజుకు గుఱ్ఱంమీద ప్రేమ పుట్టించిన మన్మథుడా? లేక 'సాహిణి' మారుడెవడైనా ఉన్నాడా? అతడు 'సాహిణి' మారుడే అయితే, శాంతం పాపం!

రామాయణంలోని ఆంజనేయుని స్వామిభక్తిని మెచ్చుకొని శ్రీరాములవారు సంతత కటాక్షవీక్షణాల కరుణించేవారు. అయితే ఈ భీమాయణంలో ఆంజనేయుడైన 'సాహిణి' మారుణ్ణి శివుని మూడోకంటి వీక్షణాలతో కవిగారు 'దీవించారు'. వేములవాడ భీమకవి పదునొకండవచోట హకారంబు నిలిపి మోడుగడియలకు రామగిరి దుర్గమున ముత్తికదిగిన మారుని జావదిట్టిన చాటుధార.

''చక్కదనంబు దీవియగు సాహిణిమారడు మారుకైవడిన్
బొక్కి పడంగలండు చలమున్ బలమున్ గల యీ చళుక్యపుం
జొక్కనృపాలు డుగ్రుడయి చూడ్కుల మంటలు రాలజూచినన్
మిక్కిలి రాజశేఖరుని మీదికి వచ్చిన రిత్తవోవునే?''

''హయమది సీత'' లోని మారుడూ, ''చక్కదనంబు దీవియగు సాహిణి మారుడూ'' వేరు వేరు వ్యక్తులనుకోవాలి. ఇంతకూ సాహిణి మారనపై మూడవ కన్ను తెరచిన రాజశేఖరుడు ఎవరు? ఆ చొక్క నృపాలుడు మొదటి కుళోత్తుంగ చోళుడే అని చాగంటి శేషయ్యగారంటారు.

అద్భుత పద్యాలు

ఈ చొక్కనృపాలునిపై భీమకవి చెప్పిన చాటువులని రెండు 'అద్భుతమైన పద్యాలు ప్రచారంలో ఉన్నాయి. ఒకసారి చొక్కనృపాలురం వారు మల్లెపందిరి స్తంభానికి కాలు ఆనించి కూర్చున్నారట. ఆయన భీమకవిగారి మహత్తును పరీక్షించాలని ''కవిగారూ, ఈ కఱ్ఱ స్తంభాన్ని చెట్టుగా మార్చగలరా?'' అని ప్రశ్నించారట. కవిగారు 'ఓ' అని ఒప్పుకొని ఈ పద్యం చెప్పారట.

''ఆనీతాభ్యుపదాన శృంఖలపదాభ్యాలంబిత స్తంభమా!
నేనే వేములవాడ భీమకవి నేనిం జిత్రకూటంబులో
భూనవ్యాపిత పల్లవోద్భవ మహాపుష్పోప గుచ్ఛంబులన్
నానాపక్వ ఫలప్రదాయివగుమానాకల్ప వృక్షాకృతిన్.''

భీమకవి ఈ పద్యం చెప్పగానే ఆమల్లె సాలరాట కొమ్మలతో, ఆకులతో, చిగుళ్ళతో, పువ్వులతో మహావృక్షమైపోయిందట. 'మేజిక్కు' చేయమని అడిగిన చొక్క నృపాలుడు రాటకు ఆన్చిన తన కాలు తీసుకోవడం మరచిపోయాడు కాబోలు! ఆ కాలు చెట్టులో ఇరుక్కొనిపోయిందట. దానిని ఊడదీసుకొలేక చెట్టును యథాప్రకారంగా రాటగా మార్చమని ప్రార్థించాడట. కవిగారు మళ్ళా ఇంకో పద్యం చదివారట. అది:

''శంభువర ప్రసాదకవిసంఘువరేణ్యుడ నైన నా వచో
గుంభన చేయ నెంతో యనుకూలత నొంది తనూనభావనన్
గుంభిన జొక్క నామ నృపకుంజరు పందిటి మల్లెసాలకున్
స్తంభమురీతి నీతనువు దాలిచి యెప్పటియట్ల యుండుమా!''

ఈ పద్యం చెప్పగానే చెట్టు రాటగా మారి రాజు ఆరాటం పోగొట్టిందట. ఇటువంటి అద్భుత కార్యాల గురించి చెప్పుకోవడానికి బాగానే ఉంటుందిగాని వాటిని చేయడానికి మంత్రశక్తికన్న తంత్రశక్తి చాలా అవసరం.[3] వేరే సాధనాలు లేక నోటిమాట తోనే ఇంత మేజిక్ చేయడం అసంభవం. గోలకొండ మిరియాలు తాటికాయలంత ఉంటాయంటే నమ్మవచ్చుగాని ద్వారబంధాలు పట్టవంటే నమ్మలేము. భీమకవి ఒక చొక్కనృపాలుని కాలంలో ఉండేవాడని నిర్ణయించడానికే ఈ పద్యాలు మనకు ఒకవేళ పనికి రావచ్చును.

తిట్టుకవిత్వంలో దిట్టలు

అసలు చొక్కనృపాలుణ్ణి చూడడానికి మొట్టమొదట వెళ్ళినప్పుడే భీమకవి చెప్పిన పద్యమంటూ ఒక సీసపద్యం ప్రచారంలో ఉంది. తిట్టుకవిత్వంలో దిట్టలైన కొంతమంది కవుల పేర్లు ఈ పద్యంలో ఉన్నాయి చూడండి:

''గడియలోపల దాడికడిగి ముత్తునియగా
దిట్టిన మేధావి భట్టుకంటె
రెండుగడెల బ్రహ్మదండిముండ్లన్నియు
డుల్లదిట్టిన కవి మల్లుకంటె
మూడుగడియలకు మొనసి యత్తిన గండి
పగులదిట్టిన కవిభానుకంటె
నరజాములోపల జెరువునీ ళ్లింకంగ
దిట్టిన బడబాగ్ని భట్టుకంటె
నుగ్రకోపి నేను నోపుదు శపియింప
గ్రమ్మరింప శక్తి గలదు నాకు
వట్టి మాన జిగురు పుట్టింప గిట్టింప
బిరుద వేములాడ భీమకవిని.''

ఈ పద్యంలో చెప్పిన మేధావి భట్టు, కవిమల్లుడు, బడబానలభట్టు పదిహేనవ శతాబ్దానికి ముందుకు రారు. అందుచేత వీళ్ళకు ప్రాచీనుడైన భీమకవి వీళ్ళను పేర్కొని చొక్కనృపాలుని వద్ద పద్యం చెప్పడం కుదరదు. కాబట్టి ఈ పద్యాన్ని ఎవరో కట్టి భీమకవికి అంటగట్టారనుకోవాలి.

---

3. ఈ సంపుటి రచయిత 'ఆలిండియా మేజిక్ సర్కిల్' సభ్యుడు. ప్రపంచ విఖ్యాతి ఆర్జించిన పి.సి. సర్కార్ వంటి మహా ఇంద్రజాలికులు సైతం మంత్రాలవల్లా, మహిమలవల్లాకాక బుద్ధికుశలతతో, నేర్పుగా, యాంత్రిక తాంత్రిక సాధనాలతోనే అద్భుత మాయా దృశ్యాలను సృష్టిస్తారని సాధికారంగా చెప్పగలడు.

అన్నట్టు ఈ చొక్కనృపాలుడు మొదటి కులోత్తుంగుడని, అతనిమీదనే భీమకవి ఈ పద్యాలు చెప్పి ఉంటాడని చాగంటి శేషయ్యగారి ఊహ. కులోత్తుంగ చోళుడు తమిళ దేశంలోనే ఉండి ఆ భాషాకవులనే పోషించినట్లు తెలుస్తున్నది. కాని తన తండ్రిలాగ తెలుగు కవులను ఆదరించాడనడానికి ఆధారాలేవీ లేవు.

సమన్వయం

మొత్తంమీద 'హయ మది సీత', 'చక్కదంబు దీవి', 'ఆనీతాభ్యుపదాన', 'శంభువరప్రసాద' అనే నాలుగు పద్యాలలోని చారిత్రక విషయాలనూ సమన్వయం చేయడానికి కూడ అవకాశం లేకపోలేదు.

'హయ మది సీత' చాటువులోని త్యాగిపోతరాజు చాగంటి శేషయ్యగారనుకొనే మొదటి పోతరాజుకాక రెండవ పోతరాజు అవుతాడు. ఇతని శాసనం ఒకటి క్రీ.శ. 1199 లోనిది. ఇప్పుడు బెజవాడ కనకదుర్గ గుడిలో ఉంది. ఈ రెండవ పోతరాజుకాలం చాళుక్యపుం జొక్కనృపాలుని కాలానికి కూడ సరిపోతుంది. మూడవ కులోత్తుంగ చోళుడే అతడని భావించవచ్చు. ఇతనికీ, ఓరుగల్లుకూ సంబంధముంది.

మూడవ కులోత్తుంగ చోళ చక్రవర్తి క్రీ.శ. 1195లో పుదుక్కోటలో వేయించిన ఒక శాసనంలో ఇలా ఉంది: ''యుద్ధములో భయంకరులైన వడుగరును (తెలుగువారిని) సాధించి వేంగీమండలమును తన అధికారము క్రిందికి తీసుకువచ్చిన పిదప అతడు స్వర్ణవర్షమును కురిపించి బంగారు నగరమైన ఉరంగైలో ప్రవేశించెననియు చెప్పబడినది. ఈ విషయములు ఎంతవరకు సత్యమైనవో తెలియదు. ఉరంగై నగరము ఓరుగల్లు (ఒరుంగల్లు-వరంగల్లు) నగరమే... ఇతడు స్వర్ణవృష్టి కురిపించి ఉరంగై నగరమును ప్రవేశించినట్లు చెప్పుటవలన ఈతడు యుద్ధమున జయించి కాక బంగారు నాణెములను కాకతీయోద్యోగివర్గమునకు లంచముగా వెదజల్లి ఉరంగై నగరమును ప్రవేశించినట్లు ఊహింపవలసి యున్నది'' అని తెలుగుభాషా సమితివారి మూడవ సంపుటి (పుట 222)లో మల్లంపల్లి సోమశేఖరశర్మగారు వ్రాశారు.

కులోత్తుంగ చోళునికి చొక్కనాయనారని నామాంతరం ఉంది. దీనికి చాగంటి శేషయ్యగారు శాసన ప్రమాణాన్ని (కవితరంగిణి-1, పుట 249) చూపించారు. మూడవ కులోత్తుంగుడు క్రీ.శ. 1178-1266లో పాలించాడని ఆయన ఒప్పుకొన్నారు.

ఈ చాటువులలో 'చక్కదనంపుదీవి' అనేది 'రామగిరి దుర్గమున ముత్తికదిగిన సాహిణిమారని జావదిట్టిన చాటుధార' అని అప్పకవి చెప్పాడు. ఈ రామగిరిదుర్గం కరీంనగరు జిల్లాలో ఉంది;[6] వరంగల్లుకు దగ్గరే.

6. కుందూరి ఈశ్వరదత్తుగారి 'ప్రాచీనాంధ్ర భూగోళం' - పుట 79.

వేములవాడ భీమకవి చెప్పినదే అంటూ అప్పకవి ఇంకొక చాటుధారను ఉదహరించాడు. ఇందులో చక్కని కవిత్వం కూడా ఉంది.

> ''గరళపుముద్ద లోహ మవగాఢమహాశనికోట్లు సమ్మెటల్
> హరునయనాగ్ని కొల్మి యురగాధిపు కోరలు పట్టుకార్లు ది
> క్కరటిశిరంబు దా లయకాలుడు కమ్మరి వైరివీరసం
> హరణగుణాభి రాముడగు మైలమభీమన ఖడ్గసృష్టికిన్.''

ఈ చాటువులోని మైలమ భీమన చారిత్రక వ్యక్తే.

ఇంతకు ముందు ప్రకరణంలో అమృతనాథుడు, మరికొందరు గురించి చెప్పుకొంటున్నప్పుడు, ఏరువనాడును పాలించిన నలుగురు భీమనలను గురించి తెలుసుకున్నాం. అందులో మైలమ భీమునికాలం క్రీ.శ. 1101-1124 అని విశదమయింది. ఇతని తల్లి మైలమదేవి క్రీ.శ. 1098లో దాక్షారంలో ఒక శాసనం వేయించింది. భీమేశ్వరదేవరకు అఖండ దీపదానాన్ని చేసింది. ఆ సంవత్సరం ఆమె దాక్షారంకు వెళ్ళినపుడు ఆమెతోపాటు రెండవ కుమారుడు భీముడు కూడ తోడువెళ్ళాడేమో. స్థానికుడైన భీమకవి ఆ వీరుని ఖడ్గవిద్యాపాతాన్ని చూచి ఈ పద్యం చెప్పాడేమో.

సంకలన కర్తలు ఉదాహరించిన 'ఏరువ భీమ నీ పగతురెక్కని కొండలు...' అనే పద్యంలో ఏరువ భీముడనే పేరు ఉంది. 'గరళపుముద్ద'లో మైలమ భీముడని ఉంది. ఇద్దరు అభిన్నులని భావించి ఈ భీమనృపాలుని సచివుడైన దాన రాజుకు 'రామగోపాల చరితము' నంకితమిచ్చిన భీమ మనిషే వేములవాడ భీమకవి అవి విశ్వసించి ఆ దానరాజు కాలాన్ని శక సంవత్సరాల లెక్కలో తక్కువ చెప్పిన రాచిరాజు సీసమాలికను ఆధారం చేసుకొని కాలనిర్ణయం చేసిన వాళ్ళు ఉన్నారు. వీళ్ళలో నిడుదవోలు వెంకటరావుగారు ప్రసిద్ధులు, ఆద్యులు. ఆయన తమ 'తెలుగు కవుల చరిత్ర'లో (మద్రాసు యూనివర్సిటీ ప్రచురణ) వేములవాడ భీమకవిని గురించి వ్రాస్తూ, ''ఈతడు క్రీ.శ,. 1100-80 ప్రాంతముల విలసిల్లెనని పూసపాటి రాచిరాజు విరచిత మాలికను బట్టి నిర్ణయించితిని (చూ. భారతి, 26 సంపుటి, 3వ సంచిక, పుటలు 137-139)'' అన్నారు.

వెంకటరావుగారు ''చూ, భారతి'' అన్నారు కనక సదరు భారతిని చూశాను. అందులో ''పూసపాటి రాచిరాజు'' అనే కవి గురించి తెలియజేశారు. ''కృతిభర్తయైనను, కృతికర్తయైనను నీతడు విద్వత్కవి యనుటకు సందియము లేదు. ఇక స్పష్టముగా రాచిరాజ కృతమని చెప్పదగినది, మనకు లభ్యమగుచున్నది వసిష్ఠగోత్ర క్షత్రియుల సీసమాలిక. ఈ మాలికలో భీమకవి రచించినది రామగోపాల చరిత్రమనియు, నది పూసపాటివారి వంశీయులలో నొకడగు భీమరాజునకు దండనాథుడైన దానరాజునకు కృతియనియు దెలియుచున్నది. ఈ మాలికలో దానరాజు కాలముగూడ దెలుపబడినది... గిరి-7, నిధి-9, గగనం-0, ఇందు-1: అనగా శా.శ. 1097 (+78 = 1175 క్రీ.శ.). దానరాజు

కాలము క్రీ.శ. 1175 కావున నాతనికి కృతినిచ్చిన వేములవాడ భీమకవియు 1150-70 ప్రాంతముల వాడని స్పష్టముగా చెప్పవచ్చు. ఇంతవరకు చాటుపద్యముల నాధారముగా జేసుకొని సందిగ్ధముగా నిర్ణయించిన విషయము నీ మాలిక నిస్సందేహముగా స్థిరపరచుచున్నది. ఈ యుదంతము కవుల చరిత్రకు క్రొత్త విషయము'' అని నిడుదవోలువారు భారతిలో వ్రాశారు.

ఈ వ్యాసాన్నే ఆధారం చేసుకొని కవితరంగిణి రచించిన చాగంటి శేషయ్యగారు ఆ పుస్తకం 8-వ సంపుటిలో ''శ్రీ వెంకటరావు పంతులుగారి శ్రమ, పరిశోధనములవలన నీ రాచిరాజు రచించిన సీసమాలిక లభించుటచే భీమకవి కాలము నిస్సంశయముగా నిర్ధారణమైనది... రాచిరాజు రచించిన వసిష్ఠగోత్ర క్షత్రియుల సీసమాలికను వెంకట్రావు పంతులుగారొకమారు దయతో నాకొసగినందున జూచితిని'' అని వ్రాశారు.

ఒక గడ్డుసమస్యగా నిలిచిపోయిన కవికాల నిర్ణయం ఇంత అసందిగ్ధంగా తేలడం సాహిత్య చరిత్రలో కీర్తించదగిన విషయం. అయితే దేనిమీద ఆధారపడి ఇటువంటి నిర్ణయం చేయాలో ఆ సాక్ష్యం ప్రామాణికమైనదేనా? రాచిరాజు సీసమాలిక ఎక్కడిది? అచ్చుపడిందా అముద్రితమా? ఏ గ్రంథాలయంలో ఉంది? ఎలా దొరికింది? మొదలైన విషయాలను వెంకటరావుగారు తమ భారతి వ్యాసంలో చెప్పనేలేదు (ప్రామాణిక చరిత్ర కారులు తమకు దొరికిన ఆకరాలను, ప్రమాణాలను అడుగడుగునా అధోజ్ఞాపికలలో నైనా చెప్పడం అవసరం. అదే రివాజు. ఈ సంప్రదాయాన్ని వెంకటరావుగారు ఈ సందర్భంలో ఎందుకు అనుసరించలేదో దురవగాహం).

చెప్పవలసిన భారతి వ్యాసంలో చెప్పకపోయినా, రాచిరాజు సీసమాలిక తమకెలా లభ్యమైనదీ ఇంకొకచోట చెప్పారు. నటశ్రీ దువ్వూరి జగన్నాథశర్మగారు పరిష్కరించి ప్రకటించిన 'తెలుగు పారాశరీయహోర - విజయరామ రాజీయము'[7] అనే పుస్తకానికి పీఠిక వ్రాస్తూ శర్మగారు రచించిన, ప్రచురించిన గ్రంథాలను చెప్పి ''ఈ గ్రంథము లీనా డలభ్యములైనను చారిత్రకంగా నెంతేని విలువగలవి. మరియును భావి పరిశోధకులకు, చరిత్రకారులకునవి మిక్కిలి ఉపయోగకరములు. వాని యుపయోగమెట్టిదో ఈ క్రింది యుదాహృత విషయమును బట్టి గ్రహింపనగును. నేను మద్రాసు విశ్వవిద్యాలయం పక్షమున తెలుగు కవుల చరిత్ర వ్రాయుచు వేములవాడ భీమకవి కాలం నిర్ణయించుటకు శర్మగారు ప్రకటించిన పూసపాటి రాచిరాజు విరచితముగు సీసమాలిక (పై గ్రంథములలోనిదే) యెంతేని యుపయోగించినది. దాని ననుసరించి నేను నిర్ణయించిన భీమకవి కాలం క్రీ। శ। 1170 ప్రాంతమని యంగీకృతమైనది. ఆంధ్ర కవితరంగిణికారులగు చాగంటి శేషయ్యగారును దీని నామోదించి తమ గ్రంథమున నెలకొల్పిరి'' అని నిడుదవోలు వారు కృతజ్ఞత చెప్పారు.

---

7. ప్రాప్తిస్థానం: నటశ్రీ ప్రచురణాలయం, కోటగేటువద్ద, రామచంద్రపురం, గోదావరి - వయా రాజమండ్రి.

ఈ నటశ్రీ జగన్నాథశర్మగారు ఇటీవల 'మాధవవర్మ - మైలమభీమ' అనే పుస్తకం రచించి ప్రకటించారు. అందులో పూసపాటివారి మూలపురుషుడైన మాధవవర్మ రచించిన 'జనాశ్రయ' మనే సంస్కృత ఛందస్సును అదే వంశంలో ప్రసిద్ధుడైన మైలమభీమన పోషణలో ఉండే వేములవాడ భీమకవి 'కవిజనాశ్రయ'మనే పేరున తెలిగించాడని రుజువు చేయడానికి ప్రయత్నించారు.

నటశ్రీ జగన్నాథశర్మగారు ప్రకటించిన రాచిరాజు సీసమాలికలో వత్సవాయివారి వంశానికి మూలపురుషుడు దానరాజనీ, అతడు చంద్రవర్మచే వత్సవాయిని కానుకగా పొందాడనీ, ఈ బహుమానపు తారీఖు క్రీ.శ. 1175 అనీ ఉంది. అయితే ''వత్సవాయివారి మూలపురుషుడు సాగిపోతరా'' జయినట్లు వత్సవాయి గోపరాజున కంకిత మీయబడిన 'రామవిలాస'మను గ్రంథములో ఏనుగు లక్ష్మణకవి వ్రాశాడు. ''గణపతి దేవునికి బూర్వము వత్సవాయి అను నింటిపేరు గల రాజకుటుంబమే లేదని స్పష్టముగ చెప్ప వచ్చును. సాగి పోతరాజు కాకతి గణపతి దేవచక్రవర్తి కాలమున కృష్ణాతీరమున గుడిమెట్టలో రాజ్యము చేయుచుండెనని బెజవాడ మొదలగు ప్రదేశములలో గల సాగి పోతరాజు శాసనముల వలననే బోధపడగలదు'' అని చిలుకూరు వీరభద్రరావు వ్రాశారు.[8]

క్రీ.శ. 1175లోనే వత్సవాయి కనుక, దానరాజు, చంద్రవర్మ అనే వ్యక్తులు చారిత్రక పరీక్షకు నిలబడకపోవచ్చు. ఈ తారీఖునుబట్టి వేములవాడ భీమకవి కాలనిర్ణయంలో తొందరపడకూడదు.

రాచిరాజు సీసమాలిక పూర్తిపాఠం లభ్యమవుతూంది. దేవిడి జమీందారులు ప్రసాదభూపాలుడు రచించి ప్రకటించిన ''ఆంధ్రవిజ్ఞానం'' అయిదో సంపుటంలో 'రాచిరాజుగారి సీసమాలిక'లో అరోపం క్రింద ఇది ప్రకటితమైంది (పుటలు 2701 నుండి 2703). ఇందులో వశిష్ఠగోత్ర క్షత్రియుల ఇంటి పేర్లు ఉన్నాయి. ఇది 56 పాదాల సీసపద్యం. క్రీ.శ. 1458లో ఉన్న రాచిరాజు దీన్ని వ్రాశాడని అందులోని తప్పీళ్ళవల్ల తెలుస్తుంది. అయితే ఈ సీసమాలిక ప్రక్షిప్తం. దీనిని ఎవరో అర్వాచీనులు సృష్టించారు. ఈ సాహిత్య ఫోర్జరీని దువ్వూరివారు ప్రకటించారు. ఈ సీసమాలిక అంత ప్రాచీనం కాదని రుజువు చేయడానికి ఒక్క ఉదాహరణం చాలు. ఇందులోని ఛప్పన్న కుటుంబాలలో నంద్యాల కృష్ణంరాజుగారిది కూడా ఒకటని 37వ పాదంలో స్పష్టంగా ఉంది. నంద్యాల కృష్ణంరాజు సుప్రసిద్ధుడు, పింగళి సూరపరాజుగారి కళాపూర్ణోదయం అంకితం పుచ్చుకొన్నాడు. ఇతడు క్రీ.శ. 1550 ప్రాంతాలవాడు. ఇతని గురించి నూరేళ్ళ ముందు 1458లో ఉన్న రాచిరాజు ఎలా వ్రాయగలడు? ఎవరో ఎందుకో సృష్టించినదే తప్ప ఈ సీసమాలిక రాచిరాజుది కాదు. భావి పరిశోధనవల్ల ఈ ఫోర్జరీ చేసినదెవరో బయటపడవచ్చు.

---

8. ఆంధ్రుల చరిత్రము - 5వ సంపుటము (1936) పుటలు 73, 74.

ఈ శతాబ్దపు తొలిరోజులలో, విజయనగర సంస్థానంలో ఒక పెద్ద దావా చెలరేగింది. దీన్ని 'పెద్ద దావా' అంటారు. ఇందులో గురజాడ అప్పారావుగారికాలం వ్యయమైంది. అప్పారావుగారి పుత్రులు గురజాడ రామదాసుగారు ఆ దావా సంగతి ఇలా చెప్పారు.

''విజయనగర సంస్థానాధీశుల చరిత్ర నిశ్చయముగ శాపదష్టమే! విజయనగర రాజుల వంశమూ నిరంతర ధారగా సాగినది కాదు! రెండేసి, మూడేసి తరముల కొక్కక్క విరుపు కలిగి దత్తతాను క్రమణయైన గాకుండా వారి జ్ఞాతివర్గమున వేరొక శాఖలో మొగసంతతి వారెవరో రాజ్యానికొచ్చుట తటస్థించుచుండెను. ఈ కారణము చేతనే వారి ఆది కుటుంబమున ఆఖరి పురుషుడగు శ్రీ ఆనందగజపతి మహారాజావారు గుజరాతుల చరిత్ర రాజతరంగిణివలె తమ వంశచరిత్ర వ్రాయించ నుద్యమించిరిగానీ అది సాగలేదు! వారి మరణానంతరం సంస్థానంపై వారసత్వపు వ్యాజ్యము వచ్చిన ధనవంతులు విశాలమయిన పలుకుబడిగల మహరాణీల చేతిలో వారి పూర్వ వంశావళులన్నిచోట్లా వ్యాజ్యావసర ములకు అనువైనట్లు మార్చివేయబడ్డది'' (చూ... దువ్వూరి వారు ప్రచురించిన తెలుగు పారాశరీయ హోర విజయరామ రాజీయము పుట-XI)

ఆ పెద్ద దావాలో ఒక వైపునుంచే కాదు ఇరుపక్షాలవాళ్ళూ వంశవృక్షాలనూ, పాత వివరాలనూ దిద్ది పారేశారు. తమకు ఇబ్బందికరమైన గ్రంథాలను వెలుగు చూడనివ్వలేదు. తమకు అనుకూలమైన వాటిని సేకరించో, సృష్టించో ప్రకటించారు. తమ ఆశ్రితులచేత తమకు అనుకూలమైన వంశావళులు తయారు చేయించారు. దువ్వూరి జగన్నాథశర్మగారు కళింగసీమలోని కొన్ని క్షత్రియ కుటుంబాలకు విధేయులు. వాళ్ళ శ్రేయోభిలాషి ''ఏనాటినుంచో క్షత్రియ కీర్తినే ఆశ్రయించి యున్నా''నని ఆయన చాటుకొన్నారు (చూ... తెలుగు పారశరీయహోర - పుట XXIV). వారు తమ వాదానికి భిన్నముగా ''ప్రబంధావళులందు బద్దెము లుండెనేని - అవి ఫోర్జరీలనదగినవే!'' అని స్పష్టపరిచారు. (అదే పుస్తకంలో పుట XLVI).

దువ్వూరి వారు ప్రకటించిన రాచిరాజు సీసమాలిక కూడ ఫోర్జరీయే అని ఆంతరంగిక సాక్ష్యాలవల్ల రుజువైంది. ఈ ఆకారాన్ని నమ్ముకొని నిడుదవోలు వెంకటరావుగారు, చాగంటి శేషయ్యగారివంటి ధీమంతులు పొరపాటు కాల నిర్ణయాలు చేయడం దురదృష్టకరం.

ఇంతదాకా భీమకవి చాటువులనూ, అతని పద్యాలని ఇతరులు ఉదహరించినవీ చర్చించి భీమకవిని గురించి కొంత తెలుసుకొన్నాం. ఇక అతణ్ణి ఏయే కవులు, ఏయే కాలాలలో నుతించారో, అలా నుతించేటప్పుడు ఏయే విషయాలు చెప్పారో పూర్తిగా తెలుసుకొందాం. ఇందువల్ల భీమకవి వ్యక్తిత్వం ఇంకా కొంచెం స్పష్టంగా బొమ్మ కడుతుంది.

1.	శ్రీనాథుడు (1380–1458)	వచియింతు వేములవాడ భీముని భంగి నుద్దండలీల నొక్కొక్కమాటు
2.	కొరవి గోపరాజు (1430–1490) (ఈ కాలపువాడే అయిన లాక్షణికుడు అనంతుడు కవిజనాశ్రయంలోని పద్యాలను అనుసరించినా, భీమకవిని నుతించలేదు; లాక్షణికునిగా ప్రశంసించనూలేదు.)	వేములవాడక సుఖియై వేములవాడం జరించి వేములవాడ౯ దా మెరసిన భీముని సుత భీముని బలభీము విముఖతభీముదలంతు౯.
3.	ఆంధ్రకవి రామయ్య (1450)	ఛందోనిబంధన చాతురీధోరేయు వాగ్దానము వేములవాడ భీము. (ప్రబంధరత్నావళి, పుట 124, పద్యం 422)
4.	వెల్లంకి తాతంభట్టు (1480–1520) (భీమకవిని పేర్కొన్న మొదటి లక్షణకర్త)	"భీమన అఖండంబు మొదలైన కొన్ని వళులకు లక్షణ లక్ష్యంబులు చెప్పడు" "ప్రజ్ఞాలవదుర్విదగ్ధ లసంగతంబుగా బెనచి తగిలించినా; రతని యంకితంబు లేవుగావున వానిం బ్రమాణింపతగదు" (కవిచింతామణి)
5.	మొల్ల (1500–1550)	స్తుతగుణోద్ధాము నాచనసోము భీము
6.	పింగలి సూరన్న (1550)	భీమన తొల్లి చెప్పెనను పెద్దలమాటయెకాని, యందునుండేమియు నేయెడన్నిలుచు టెవ్వరు గానరు.
7.	పెదపాటి సోమనాథుడు (1550)	వాక్ప్రతోషితదక్షవాటీ మహాస్థానభీము.
8.	చిత్రకవి పెద్దన (1550)	త్ర్యక్షవర ప్రసాదకవితాఢ్యుని వేములవాడభీముని౯.
9.	లింగముగుంట తిమ్మన (1550)	భీమనయు ననంతయును బెద్దనయును తాతానయును జెప్పినట్టి ఛందములుగూర్చి ప్రకరణము లొప్పజేసెను బ్రహ్మసంఖ్య నొనర లింగముగుంట తిమ్మన యనుకవి.
10.	పొత్తపి వెంకట రమణ కవి (16...)	భీముని ఫణబంధపేశలంబు
11.	వార్తకవి రాఘవయ్య (1650)	"జగతతగణయుతము సంపత్కరంబుగా మంచి దనుచు భీము డెంచినాడు" "ఛందం మొదలనే వేములవాడ భీమ కవిగారి ప్రయోగం ఉన్నది."

12.	కాకునూరి అప్పకవి (1650)	''వికటకవులు కొన్ని వింతలు గల్పించి కవిజనాశ్రయమున గలిపినారు. వాని గైకొనంగ వల దప్రయుక్తంబు లేల సెప్పు భీము డెరిగియెరిగి'' ''కవిజనాశ్రయమున 'శ్రీకాంతా'యని వేములవాడ భీమకవియును.''
13.	పట్టుపు సరస్వతీ సోమయాజి (1670)	భీమేశ్వరు డితడు మా నామము వా డనుచు వ్రాసి నాలుకతుద వాగ్బామిని బీజాక్షర మా భీమన దలచినను గల వభీష్టఫలంబుల్. (పృథుచరిత్రము)
14.	ఓరుగంటి రామకవి (1710)	భీమేశ్వర లబ్ధకవితావాచా సిద్ధిగల వేములవాడ భీమనార్యుం డొనరించిన జనాశ్రయం బనుఛందంబు (కవితాలక్షణసారం)
15.	కూచిమంచి తిమ్మకవి (1715)	భీమన చెప్పిన పదియతులను ప్రకారాంతమున వ్రాసుకొన్న పద్యమే ఉంది.
16.	కస్తూరి రంగకవి (1750)	ఆదిమకవి భీమన రేచనమీద నంకితముగా జెప్పినాడు.
17.	పిండిప్రోలు లక్ష్మణకవి (1770-1840)	పృథు కుకవి స్వాంభీము భీము
18.	కట్టమూరి కామేశ్వరకవి (?)	రమణీయపాకాభిరాము భీము
19.	శేషధర్మము-లక్ష్మణకవిస్తుతి (?) R 620	భీము ననంత జిత్రకవి పెద్దన సుధీంద్రు జగత్ప్రసిద్ధులర్.

శ్రీనాథుని సాక్ష్యంవల్ల భీమకవి ధోరణి 'ఉద్దండ' లీల అని తెలుస్తున్నది. కొరవిగోపరాజు స్తుతివల్ల భీమకవి బలభీముడు, వినుత భీముడు అని గ్రహించవచ్చు. ఆంధ్రకవి రామయ్య చెప్పిన దానినిబట్టి భీమకవి ఛందోనిబంధన చాతురీ ధౌరేయుడనీ, వాగ్ధాముడనీ తెలుస్తున్నది. వెల్లంకి తాతంభట్టు భీమన ఛందస్సును పేర్కొన్న మొదటి లాక్షణికుడు. వీరు భీమనఛందంలోని ప్రక్షిప్తాలను తొలగించాలన్నారు. అంటే తాతంభట్టు కాలానికే భీమనఛందం అనబడేది లేఖకుల 'చౌర్యానికి' పాల్పడిందన్నమాట. ఆంధ్రకవి రామయ్యా, తాతంభట్టూ వేములవాడ భీమకవిని లక్షణకర్తగా పేర్కొన్నారుగాని ఆయన రచించిన కావ్యాలు పింగలి సూరన్న కాలం నాటికే కనబడవు. పెదపాటి సోమనాథుని సాక్ష్యం ప్రకారం భీమకవి నివాసమైన వేములవాడ దక్షవాటీ మహాస్థానంలో ఉన్నదే అని గ్రహించవచ్చు. చిత్రకవి పెద్దన స్తుతివల్ల భీమకవి ఈశ్వరప్రసాద కవితాఢ్యుడని తెలుస్తున్నది.

కవిజనాశ్రయం వేములవాడ భీమకవి రచించినదే అని వార్తకవి రాఘువయ్యా, అతని సమకాలికుడు కాకునూరి అప్పకవీ సాక్ష్యమిస్తున్నారు. అయితే అప్పకవి చెప్పిన

దానినిబట్టి వికటకవులు కొన్ని వింతలు కల్పించి కవిజనాశ్రయంలో కలిపారని తెలుస్తున్నది. ఆ వింతలలో కెల్లా మొదటి వింత కవిజనాశ్రయం వేములవాడ భీమకవి వ్రాశాడని ప్రచారం చేయడమే అని మనం ఎందుకు నమ్మకూడదో!

అప్పకవి కాలం నాటికే కాదు, అంతకు రెండువందల ఏళ్ళకుముందే వెల్లంకి తాతంభట్టు కాలానికి ముందుగానే ప్రజ్ఞాలవదుర్విదగ్ధులు అసంగతంగా పెనచి కవిజనాశ్రయంలో కొన్ని తగిలించారట. ఆ తగిలించిన వాటిలో మొదటిది వేములవాడ భీమకవి ఈ గ్రంథం వ్రాశాడనే పుకారు, మొదటి అసంగతం కావచ్చుగదా!

ఇంతకూ ఆంధ్రకవి రామయ్య 1450లో మొట్టమొదటిసారిగా వేములవాడ భీమకవి ఛందోనిబంధన చాతురీ ధౌరేయుడని చెప్పేదాకా ఆ పట్టం అతనికి ఉన్నట్టు కనబడదు. ఏమంటే, ఈ 'ఆంధ్రకవి' గారి సమకాలికులో, లేక కొద్దిగా పూర్వులో అనదగ్గ ఇద్దరు లాక్షణికులు భీమకవిని లక్షణకర్తగా పేర్కొనలేదు; నుతించలేదు. ఈ ఇద్దరూ అనంతుని ఛందం వ్రాసిన అనంతామాత్యుడు, కావ్యాలంకార చూడామణి వ్రాసిన విన్నకోట పెద్దన.

ఈ లక్షణకర్తలు కవిజనాశ్రయం చూడలేదనుకోవడానికీ వీలులేదు. అనంతుడు కవిజనాశ్రయంలోని డజన్లకొద్దీ పద్యాలకు అనుకరణలు వ్రాశాడు. విన్నకోట పెద్దన్న కవిజనాశ్రయంలోని దోషాధికారంలో చెప్పిన ఒకటి రెండు పద్యాలను అనుకరించాడు, చూడండి.

''చినికెడు బురిసెమిళులు ముద
మున నాడెడు నింద్రగోపములు పారెడు నా
మనికాలమయ్యె నిలలో
ననగా కాలవిరోధదోష మనిరి కవీంద్రుల్. (కవిజనాశ్రయం, దోష 29)

గ్రీష్మకాలంబు మత్తిలి కేకు లాడె
నింద్రగోపంబు లిలమీద నెల్లబొడమె
జాగె ప్రథమాంబువులకునై చాతకంబు
లనగ గాలవిరుద్ధ సమాఖ్యమయ్యె. (కావ్యాలంకారచూడమణి 6-13)

ఘనదండ కాష్ట కృష్ణా
జినములు సొగయింప నొక్క జినముని చనుదెం
చెననగ సమయవిరోధం
బని కవులకు జెప్పు కవిజనాశ్రయు డొనరన్. (కవిజన. దోష 32)

అమరగ బులితోలును మ
స్తమునం బలుజడలు దాల్చి సౌగతు డొప్పెన్.

హిమకర శేఖరు గుడి నన
సమయవిరుద్ధార్థ మగుచు జను సత్కృతుల౯. (కావ్యాలంకార 6-134)

ఇద్దరు ప్రసిద్ధ లాక్షణికులు కవిజనాశ్రయాన్ని ఈవిధంగా అనుకరించినా దానిని రచించినట్లు భీమకవిని నుతించకపోవడానికి ఏదైనా కారణముంటుంది. బహుశా భీమకవి ఆ గ్రంథాన్ని వ్రాయకపోవడమే పెద్ద కారణం కావచ్చు. భీమకవి కవిజనాశ్రయం వ్రాయలేదని తెలుసుకోవడం కన్నా వ్రాసినవేమిటో చెప్పుకోవడం ముఖ్యం. ఇతడు రాఘవ పాండవీయం వ్రాశాడంటారు. అది నేడు దొరకదు. శతకంఠ రామాయణం రచించాడంటారు. అందులోని రెండు పద్యాలను లాక్షణికులను ఉదహరించారు. నృసింహపురాణం చెప్పాడు. ఇందులోనివనే ఒకటి రెండు పద్యాలు కూడ లాక్షణికుల ఉదాహరణల వల్ల దొరుకుతున్నాయి. చాటువులవల్లా, ఒకటీ అరా పద్యాలవల్లా ఒక కవి శైలి, ప్రత్యేకత, భావనాసక్తి సంతృప్తికరంగా ఆవిష్కరించుకొనలేము. కనీసం ఒక ఘట్టాన్ని, ఒక సంపూర్ణ శీర్షికను చదివితేగాని రసానందం కలగదు.

అటువంటి అవకాశం భవిష్యత్తులో కలగాలని ఆశిద్దాం.

సుమతి భీమన

సుమతీశతకం ఎంత ప్రసిద్ధమైనదో దాని కర్తృత్వ నిర్ణయంగానీ, కాలనిర్ణయంగానీ అంతకు పదింతలు జటిలమైన సమస్యలు. నీతిశాస్త్ర ముక్తావళిని రచించిన బద్దెనే సుమతి శతకాన్ని రచించాడని మానవల్లి రామకృష్ణ కవిగారు చెప్పినట్టు ఇంతకు ముందు ఒక ప్రకరణంలో చెప్పుకొన్నాం. మొదటిసారిగా 'నీతిశాస్త్ర ముక్తావళి'ని ప్రచురిస్తున్నప్పుడు దాని పీఠికలో ఈ క్రింది మొదటి పద్యాన్ని చూపించారు.

శ్రీ విభుడ గర్వితౌరి
క్షావరదళ నోపలబ్ధ జయలక్ష్మీసం
భావితుడ సుమతి శతకము
గావించిన ప్రోడ గావ్య కమలాసనుడన్

''ఇతడే సుమతి శతకమును రచించెనని ప్రథమ పద్యము జూచిన దోచును గాని ఈ పద్యము నాకు లభించిన యైదు ప్రతులలో నొక్కదానిలో మాత్రమే యున్నది. సుమతి శతకమునకును దీనికిని పాకభేదము గానవచ్చుచున్నది. జాతీయ వాచకములలో భేదమగపడును అని రామకృష్ణకవిగారు స్పష్టంగా రాశారు.[1]

1. నీతి శాస్త్ర ముక్తావళి పీఠిక - పుట 5.

శతకకవుల చరిత్రను రచించిన వంగూరి సుబ్బారావుగారు ఇలా చెప్పారు :

''నీతిసారముక్తావళి, సుమతి శతకముల జక్కగ చదివిన వారవి ఏక కర్తృత్వములని యంగీకరింపజాలరు. ఐనను వ్యతిరేక సాక్ష్యము లేనంతవరకు శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు పద్యముననుసరించి బద్దెనయే దీని కర్తయని తలంచుదుము గాక''[2]

అప్పటికి వ్యతిరేక సాక్ష్యం లభించనందువల్ల వంగూరి సుబ్బారావుగారిలాగే వేదం వెంకటకృష్ణ శర్మగారు కూడా సుమతి శతకకర్తా, బద్దెనా అభిన్నులన్న అభిప్రాయానికి వచ్చారు. తమ 'శతక వాఙ్మయ సర్వస్వం'లో సుమతి శతకంపైన కూలంకష చర్చ చేశారు. అందులోని సొగసులు చూపించారు. ''బద్దెన మొదట నీతిశాస్త్రముక్తావళిని, ఆ తరువాత సుమతి శతకమును వ్రాసియుండెననుట యందించుకయు సంశయింపబని లేదు'' అని రాసి వెనువెంటనే ఇంకొక పేరా మొదలుపెడుతూ ''సుమతిశతకము నీతిశాస్త్ర ముక్తావళివలెనంత ప్రౌఢముకాదని'' తేల్చారు.[3]

రెండింటిలోని పాకభేదం వల్లనే సుమతి శతకం, నీతిశాస్త్ర ముక్తావళి వేరువేరు రచయితల కృతులన్నభావం ఎవరికైనా కలుగుతుంది. వ్యతిరేక సాక్ష్యం కనబడక కర్తల అభిన్నత్వాన్ని కొందరు అంగీకరించారు గాని రామకృష్ణ కవిగారే వ్యతిరేక సాక్ష్యాన్ని చూపెట్టకపోలేదు. దానికి కారణం ఉంది. సుమతి శతకాన్ని భీమన వ్రాశాడని చెప్తూ ఒక పద్యాన్ని లాక్షణికుడు కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణ సార సంగ్రహంలో ఉదహరించాడు. ఇతడు క్రీ.శ. 1740 ప్రాంతాలవాడు. భీమన అనే పేరు కనబడగానే దానికి, వేములవాడ భీమకవికి మనవాళ్ళు ముడిపెట్టేస్తారు. సుమతి శతకం వ్రాసినది ఇతడే అని కొందరు అనుమానించసాగారు. చెదలవాడ భీమకవి ఒకడున్నాడని అతడు సుమతి శతకాన్ని వ్రాశాడా? అని మానవల్లి రామకృష్ణకవిగారే సందేహించారు. వారు చూసిన సుమతి శతకపు తాళ పత్రాలలో ప్రథమ పద్యం భీమకవి పేరున ఉందట.

రామకృష్ణకవిగారు ఏ ప్రతి చూశారోగాని, మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం లోని D. 1810 నెంబరు తాళపత్ర ప్రతిలో ఈ పద్యం ఉంది.

శ్రీకరమగ భీమన మును
లోకమునకు బొగడగా విలోకించి మదిన్
బ్రాకటముగా సుమతికి మతి
చేకూడగ సుమతి నీతి చెప్పదొడంగెన్.

గ్రంథాలయంవారి వర్ణనాత్మక కేటలాగులో ఈ ప్రతి చూడడానికి చాలా ప్రాచీనమైనదిగా కనబడుతూందన్నారు. ''వ్రాత మంచిది కాదు. కన్నడమౌడి గలది. తప్పులు హెచ్చు. శైథిల్యము గ్రంధపాతములు గలవు'' అని చెప్పారు. ఈ ప్రతి సాక్ష్యాన్ని

2. శతక కవుల చరిత్ర - పుట 62.
3. శతక వాఙ్మయ సర్వసము - పుట 74.

కొట్టిపారెయ్యడానికి వీల్లేదు. భీమన అంటే ఒక్క వేములవాడ భీమనే కానక్కర్లేదు. మనకు తెలిసిన ఒకే ఒక్క సుప్రసిద్ధునికి అన్నీ అంటకట్టడం మానవ నైజమేగాని చరిత్రకారులు అలా చెయ్యలేరు. చాళుక్య యుగంలో ఎందరు భీమనలున్నారో, వాళ్ళకు కవులతోగాని, కవిత్వంతోగాని ఎంత సంబంధముందో చూసి నిర్ధారణ చేయడం కర్తవ్యం. సుమతీ శతకమంత సుప్రసిద్ధగ్రంథం రచించినదెవరో తెలుసుకొనడానికి శాయశక్తులా ప్రయత్నించడం సాహిత్య చరిత్రకారుల విధి.

వంగిపర్రు భీమనప్పయ్య

ఇతడు క్రీస్తుశకం 900 ప్రాంతాలవాడు. ఆదిలో వేంగీ రాష్ట్రంలో ఉండే వైదిక కమ్మ బ్రాహ్మణుడు. జైనుడయ్యాక సబ్బినాడుకు వలసవెళ్ళాడు. ఇతని కొడుకులిద్దరూ కవులే. అగ్రసుతుడు కన్నడ సాహిత్యంలో ఆదికవీ, కవిరత్నత్రయంలో మొదటివాడు అయిన పంపనగారు, రెండోకొడుకు జినవల్లభుడు. ఇతని బొమ్మలగుట్ట శాసనంలోనే తొలిసారిగా తెలుగు కంద పద్యాలు కనబడుతున్నాయి. కుమారులలాగే భీమనప్పయ్య కూడా కవిత్వం చెప్పాడో, అందులోనూ కందాలు చెప్పాడో లేదో ఇప్పటికి తెలియవచ్చే ఆకరాలబట్టి చెప్పలేము.

మల్లియ భీమన్న

ఇతడు కూడా జైనుడే. క్రీస్తుశకం 900 ప్రాంతంవాడే. కవిజనాశ్రయం రచించిన రేచనకు తండ్రి. తాను భీమ తనయుడన, భీమనాగ్రసుతుడనని రేచన మన తొలి లక్షణ గ్రంథంలో పేర్కొన్నాడు. మల్లియ భీమన కూడా కవిత్వం తెలిసినవాడే కావచ్చు. కవిజనాశ్రయానికి 'భీమన ఛందం' అనే ప్రచారం రావడంలో ఇతని ప్రసక్తి ఏమైనా ఉందేమో పరిశోధించాలి.

భీమన ప్రెగ్గడ

ఇతడు క్రీ.శ. 1072 ప్రాంతాలవాడు. రాజమండ్రిలోని మార్కండేయ స్వామికి ఆ సంవత్సరం దీపదానం చేసి ఒక శాసనం వేయించాడు. శాసన పద్యం ఇతని రచనే అని నిడుదవోలు వెంకటరావుగారి ఊహ.[4] అంతేకాదు ఈ భీమనే రాజరాజ నరేంద్రుని సవతి సోదరుడయిన విజయాదిత్యుని కూతురు సోమలదేవి దాక్షారామ శాసనంలోని పద్యాలకర్త అనికూడా నిడుదవోలువారు అనుకుంటున్నారు. ఈ భీమన ప్రెగ్గడ నన్నయగారి కుమారుడని చాగంటి శేషయ్యగారు భావించారు.

బంగెన భీమన

ఇతడు క్రీ.శ. 1124లో మహామాండలికుడై బెజవాడ రడ్డికం చేసిన సుఖస్థితిని రాజైనవాడు. ఒక్క పద్యమయ శాసనంలో ఇతని పేరు కనబడడం తప్ప ఇతడు కవియన్న

4. తెలుగు కవుల చరిత్ర - పుట 162.

దాఖలాలు లేవు. శాసన పద్య మంజరిలో ఇతని వైనం నాలుగు గద్యపద్యాలలో వుంది (పుట 11). నిడుదవోలు వెంకటరావుగారు ఇతని ఈ వైనంతోపాటు మరికొన్ని సంగతులు చెప్పే పద్యాలను ఉదహరించారు.[5] ఈ పద్యం వల్ల బంగెన తమ్మభీమన అగ్రహారాలూ, విద్యాదానాలు, హిరణ్య, భూ, గో, కన్యాదానాలూ, సత్రాలు ధర్మం చేశాడు. కృతులు చెప్పించినట్టు చాటుకోలేదు.

ఎల్లమ భీమన, పూరమ భీమనలు

క్రీ.శ. పదకొండో శతాబ్దంలో డొంగేరు, పంచికుర్రు, చేబ్రోలు ప్రాంతాలలో ఈ భీమనామధారులు కనబడతారు. వీరు బుద్ధవర్మ వంశంలోనివారు. ఈ వంశాన్ని దీనానాథ కవీంద్ర గాయకులు కీర్తిస్తూ ఉంటారు. ముక్కంటికాడు వెట్టివల్ల ఈ వంశపురుషుడు బుద్ధవర్మ డొంగేరు మార్గత్రయాన్ని శాసనంగా పొందాడు. ఈ అన్వయంలో ఈ క్రింది వ్యక్తుల వంశవృక్షం ఒక శాసనంవల్ల తెలుస్తోంది.

గండడు
|
దేసటి పండడు
|
విల్లమ భీముడు
|
గండడు
|
మేడమ పండడు
|
పూరమ భీమన
|
భీమయ పండడు

ఈ ఏడు తరాల వ్యక్తులలో చిట్టచివరివాడైన భీమయ పండడుమాత్రమే సర్వకళా ప్రవీణుడూ, కవీ అని తెలుస్తోంది. చేబ్రోలులోని ఒక శాసనంలో ఇతని కవితా శక్తులు ఇలా కీర్తించబడ్డాయి.

---

5. అదే పుస్తకంలో పుట 232.

తలపుసదర్ధ భావమును తద్గత సూక్తులు గూఢవర్ణనల్
గొలుసుకొనంగ ప్రావడులు గోరిన భంగినవచ్చి ముట్ట గో
మల గతి దేశి మార్గముల మట్టుపడుం గటనంబులొప్పనా
ద్యుల క్రియ జెప్ప నేర్చె నృప ధూర్జటి భీమయపండ డిమ్మహిన్.

చక్కగా దేశి మార్గాలలో ఆద్యుల క్రియ పద్యాలు చెప్పనేర్చిన ఈ మహామండలేశ్వర పండయ తన తండ్రి భీమరాజుకు ధర్మార్థంగా కుమారస్వామి దేవరకు అఖండ దీపం పెట్టినట్టు శాసనంలో చెప్పాడేగాని తన తండ్రి కవిత్వం చెప్తాడని ఎక్కడా పేర్కొనలేదు. ఈ వంశంలో ఇద్దరు భీమనామధారులున్నారు గాని వాళ్ళ సాహిత్య జీవనం సంగతి తెలియదు. వీళ్ళు కొన్ని గ్రామాలను వృత్తులుగా పొందినవాళ్ళు.

వేములవాడ భీమకవి

ఇతని గురించి విపులంగా ఒక ప్రకరణంలోనే చెప్పుకొన్నాం.

శ్రీధరుని భీమన

క్రీ.శ. 1199 ప్రాంతాలలో శ్రీధర మంత్రి కుమారుడైన భీమన ఒకడు తెలియ వస్తున్నారు. ఏలూరు మసీదులోని స్తంభం మీది శాసనంలోని ఒక పద్యం వల్ల ఈ పేరు మాత్రమే తథ్యం. వివరాలు తెలియవు. (శాసన పద్యమంజరి 2-21).

చెదలవాడ భీమన

నీతిశాస్త్రముక్తావళి పీఠికలో మానవల్లి రామకృష్ణ కవిగారు ఇతని పేరు చెప్పారు. సుమతి శతకం ఇతడు రాశాడా అన్న అనుమానం వ్యక్తపరిచారు తప్ప వివరాలు విశదం చేయలేదు.

చాళుక్య యుగంలో ఇంతమంది భీమ నామధేయులు కనబడుతున్నా వీరిలో ఎవరు సుమతిశతకకర్తలో చెప్పలేం. కవి జైనుడై ఉంటాడని సాహిత్య చరిత్రకారులు కొందరు భావిస్తున్నారు. 24 జైన తీర్థంకరులలో సుమతి ఐదవవాడు. అతని పేరు పెట్టుకొన్న భక్తుడెవరో ఈ శతకం రచించి ఉంటాడని లేక ఆ జైన తీర్థంకరుని సంబోధిస్తూ చెప్పిన శతకమని అనుకుంటారు. అందుచేత పంపనగారి తండ్రి భీమనప్పయ్యగారి దగ్గర్నుంచి ఎనమండుగురు భీమనల గురించి చెప్పుకున్నాం. కవి ఎప్పటివాడో చెప్పడానికి కూడా ఆకరాలు తక్కువే కాదు, బొత్తిగా లేవనుకోవచ్చు. విశ్వసనీయమైన పాఠాలున్న ప్రతులు చూడకపోతే కవి గురించి, కావ్యం గురించి, కవి కావ్యాల కాలం గురించి నిక్కచ్చి నిర్ణయాలు చేయడం కష్టం. సుమతి శతకం మొట్టమొదటిసారిగా 1868లో అచ్చుపడ్డట్టు తెలుస్తూంది. ఆ తర్వాత అది ఎన్ని ముద్రణలు పొందిందో ఎన్నెన్ని అసాధు పాఠాలు అందులో చేరాయో చెప్పలేం. కులాభిమానాలతో పాఠాలు మార్చేయడం కూడా

జరిగింది. పాత తాళపత్ర గ్రంథాలలో ఏ ఒక్కదానిలోనూ కనబడని పద్యాలను అచ్చువేసి దేశంమీదకు వదలడం కూడా జరిగింది. నమ్మదగ్గ వ్రాతప్రతులను ఈ శతకంపై చర్చలు జరిగిన సాహితీపరులు ఆట్టే చూపినట్టు కనబడదు. చూడవలసినవి లేకపోలేదు.

మన ఆంధ్ర సాహిత్యంలోని ఎన్నో గ్రంథాల తాళపత్ర ప్రతులను దేశం నాలుగుమూలలనుండి సేకరించి వాటిని కాగితాలమీదకు ఎక్కించి, టీకా తాత్పర్యాలు రాయించి, ముఖ్యమైన వాటిని ఇంగ్లీషులోనికి అనువదించిన బ్రౌను దొరగారు సుమతి శతకం విషయంలో కూడా ఎంతో కృషి చేశారు. మొన్నమొన్నటిదాకా ఆయన సేకరించి అనువదించిన సుమతిశతకం వ్రాతప్రతి గురించి తెలుగు దేశానికి తెలియదు. మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఇది మూలుగుతూ ఉంది. దీనిని నా మిత్రులు చల్లా రాధాకృష్ణశర్మగారు గుర్తించి, పరిష్కరించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి ప్రచురణగా 1973లో ప్రకటించారు. ఈ ముద్రణలో 150 పద్యాలున్నాయి. వీటిలో 85 పద్యాలకే బ్రౌను దొరగారి ఆంగ్లానువాదాలు ఉన్నాయి.

మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో సుమతి శతకానికి తాళపత్ర ప్రతులు ఉన్నాయి. వాటి వివరాలు కేటలాగులోని భోగట్టాలను బట్టి ఇలా క్రోడీకరించవచ్చు.

ప్రతి నెంబరు	పద్యాల మొత్తం	ప్రతి తీరు
D. 1810	96	అత్యంత ప్రాచీనం
D. 1811	112	ప్రాచీనం
D. 1812	97	ప్రాచీనం
D. 1813	80	ప్రాచీనం
D. 1814	97	ప్రాచీనం
D. 1815	105	ప్రాచీనం
D. 1816	110	ప్రాచీనం
D. 1817	95	అత్యంత ప్రాచీనం
D. 1818	60	ప్రాచీనం
D. 1819	110	అత్యంత ప్రాచీనం

ఈ పదింటిలో మూడు మరీ ప్రాచీనమైనవి. మిగతావి ప్రాచీనం మాత్రమే. ఈ మాతృకలనుంచి బ్రౌను దొరగారు ఒక కాగితం ప్రతిని పుట్టించి తమ పండితులలో ఎవరిచేతనో 1832 జూలై నాటికి ముందే సవ్యాఖ్యాన ప్రతిని తయారు చేయించారు. ఇందులో 130 పద్యాలున్నాయి. వాటికి టీకా తాత్పర్యాలున్నాయి. ఈ ప్రతి నెంబరు D. 1820. అయితే ఇది కేటలాగు నెంబరు. ఇప్పుడు గ్రంథాలయంలో ఈ నెంబరు చెప్తే గ్రంథాన్ని సిబ్బంది తీసి వెంటనే ఇవ్వలేరు. తెలుగు లిపిలోని సంస్కృత గ్రంథాల విభాగంలో చేరింది. కోహలాచార్యుని భరతశాస్త్రం మొదలైన గ్రంథాలున్న బైండింగు

పుస్తకంలో చేర్చారు. ఇప్పుడు దీని నెంబరు S.D. 1116 (D. 12994). ఇది ప్రాచీన పాఠ నిర్ణయానికి పనికి వస్తుంది.

బ్రౌను దొరగారు తమ ఆంగ్లానువాదానికి తయారు చేయించిన ప్రతిలో 150 పద్యాలను చేర్చారు. ఈ ప్రతి, ఏ ఒక్క కేటలాగులోనూ వర్ణితం కాలేదు. అందుచేత పరిశోధకుల దృష్టికి రాలేదు. చల్లా రాధాకృష్ణశర్మగారు గుర్తించారు. దీని నెంబరు D. 3090 అని ఆయన చెప్పారు. అయితే ఈ సంఖ్య ఇప్పుడు మారింది. దీనిని TEL. B. 672గా గ్రంథాలయం సిబ్బంది మార్చారు. ఈ ప్రతివల్ల సుమతి శతకం గురించి బోలెడన్ని విషయాలు తెలుస్తాయి.

పూర్వం అచ్చుపడిన సుమతి శతకం ప్రతులలో ఈ క్రింది పద్యం కనబడుతుంది.

అడిగిన జీతం బివ్వని
మిడిమేలపు దొరనుగొల్చి మిడుకుట కంటెన్
వడిగల యెద్దుల గట్టుక
మడిదున్నుక బ్రతుకవచ్చు మహిలో సుమతీ.

ఈ పద్యాల్ని ఆధారంగా చేసుకొని సురవరం ప్రతాపరెడ్డిగారు శతక రచనా కాలాన్ని నిర్ణయించడానికి ప్రయత్నించారు.[6] ''ఎద్దులగట్టుక, మడిదున్నుక'' మొదలగు ప్రయోగములు సుమతి శతకములో కనబడతాయి. 'కొను'కు 'క' కారాదేశం ప్రాచీనం కాదు. క్రీ.శ. 1470-80 మధ్యకాలంలో ఉన్న దూబగుంట నారాయణకవి తన పంచతంత్రంలో ఇటువంటి ప్రయోగాలను చాలా వాడాడు. జనమంచి శేషాద్రిశర్మగారు పదకొండు ప్రయోగాలను పంచతంత్రం పీఠికలో చూపించాడు. సుమతి శతకం వ్యాకరణ రీత్యా 15వ శతాబ్దికి వస్తుందని ఈ ప్రయోగాలను నమ్మి ఎవ్వరైనా నిర్ణయిస్తే తప్పులేదు. అయితే ఈ పద్యం బ్రౌను వ్రాతప్రతులలో ఎక్కడా లేదు. అచ్చు పుస్తకంలో ఎవరో పండితులు చేర్చారు.

వేదం వెంకటరాయశాస్త్రిగారు సుమతి శతకాన్ని బద్దెన రచించి ఉంటాడని ఊహించారు. నన్నెచోడ బద్దెచోడులు ఒకరి తరువాత ఒకరు జీవించి ఉంటారని భావించారు. ''ఈ ఊహను బలపరచు నాధారములేకపోయినను మరింత యనుకూలపరచు విషయమేమనగా బద్దెనది నీతిశాస్త్రము నన్నెచోడుడు ప్రబంధములో కథావశమున రాజనీత్యోపదేశమును ప్రవేశపెట్టినారు... సుమతి నామ మిరువురకును ప్రియమైనదిగా కనపడుచున్నది. బద్దెన శతకమున సంబోధనము మాత్రమే నన్నెచోడుడన్ననో 'సుమతి'ని కుమార సంభవమున ఒక చక్కని పాత్రగా ప్రవేశపెట్టినాడు'' అని వ్రాశారు.[7]

6. సుజాత పత్రిక P. 15-12-1950 అని వేదం వెంకట కృష్ణశర్మగారు శతక వాఙ్మయ సర్వస్వంలో కోట్ చేశారు.
7. నన్నెచోడుని కవిత్వము - పుట 85.

శత్రువు దగ్గరకు రాయబారిని పంపి కలను చెప్పనిదే పాడికాదని బృహస్పతి మనుమడు 'సుమతి'ని దేవతలు తారకాసురుని వద్దకు రాయబారం పంపిస్తారు. అయితే ఈ సుమతి ఏ రాజనీతినీ కుమార సంభవంలో చెప్పడు. శుక్రాచార్యుడు దశమాశ్వాసంలో 180వ నెంబరు పద్యం నుండి ఒక పదినీతులు ఉపదేశిస్తాడు. నన్నెచోడుని 'సుమతి'కి, శతకంలోని సుమతికి పేర్లలో బాదరాయణ సంబంధమే తప్ప ఇంకేం లేదేమో!

అయితే కర్త ఎవరైతేనేంగాని, సుమతి శతకంలో కనబడే సామాజిక పరిస్థితులలో కొన్ని, నన్నెచోడుడు కుమార సంభవంలో చిత్రించిన కొన్ని సమకాలిక సందర్భాలలో సారూప్యం కలవే. భావాలు సమానమైనవే. నన్నెచోడుని కుమారసంభవం పౌరాణిక ఇతివృత్తంగల వస్తుమయ కావ్యం, అయినా ప్రబంధం కనుక సమకాలిక సాంఘిక మర్యాదలు ఎంత రూపాంతరం చెందినా ప్రతిస్పందించకపోలేదు, సుమతి చెప్పిన పద్యాలు శతకరూపంలోనివి మన తెలుగు సాహిత్యంలో ఒక్క శతకాలలోనే సమకాలిక సమాజం మారువేషం వేసుకొనకుండా సాక్షాత్కరిస్తుంది. వర్గస్వభావాలు ప్రస్ఫుటమవుతాయి.

సుమతి శతకాన్ని జైనుడు చెప్పినా, శైవుడు చెప్పినా అతడు ఉన్నతవర్గానికి చెందినవాడని, శూద్రేతరుడని చెప్పవచ్చు. చదువుకొన్న శూద్రులకు ఉన్నత వర్గాల వాళ్ళు భయపడుతున్న కాలమది. ఎదురు చెప్పకుండా దాస్యం చేయవలసిన వర్గంవాళ్ళు చైతన్యవంతులై ప్రశ్నించడం ప్రారంభిస్తే పాలకవర్గ ప్రయోజనాలు దెబ్బతింటాయి. అటువంటి శూద్రుని దగ్గరకు వెళ్ళకూడదు, చెంత చేరనీయకూడదు. దుష్టులకు దూరంగా ఉండాలన్న సామెత పూర్తిగా కాకపోయినా ప్రమాదకరమైన వాటికి సాధ్యమైనంత ఎడంగా ఉండాలన్న సూత్రం ఈ క్రింది పద్యంలో కనబడుతుంది.

ఉదకము త్రావెడు హయమును
మదమున నుప్పొంగుచున్న మత్తేభంబున్
మొదవు కడనున్న వృషభము
జదివిన శూద్రుగనిచేర జనదుర సుమతీ

నీళ్ళు తాగుతున్న గుఱ్ఱము, మదించిన ఏనుగూ, ఆవును దాటబోతున్న ఎద్దూ దగ్గరకెళ్ళితే తంతాయి, తొక్కుతాయి, కుమ్ముతాయి. అలాగే చదువుకొన్న శూద్రుడు కూడా అని శతకకర్త వర్గంలోని వాళ్ళ భావాలు లోకజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాయి. సుమతి భీమన గ్రామకరణమో, లేక కరణాల బంధువో అయి ఉంటాడు. ఆ వర్గ ప్రయోజనాలను సంరక్షించే నీతులను చెప్తాడు. ఇతడు 'గోచికి పెద్ద, అంగవస్త్రానికి చిన్న' అన్నట్టు మహానగరానికి చెందినదీ, కుగ్రామం అనడానికి వీలులేనిది అయిన జనపదం వాసి కావచ్చును. సమకాలిక పాలనా వ్యవస్థలోని మార్పులకు గట్టిగానే స్పందించాడు.

శాలివాహన శక సంవత్సరాలు 1067 అంటే క్రీస్తుశకం 1145లో తెలుగుదేశపు గ్రామీణ వ్యవస్థలో చాలా ముఖ్యమైన మార్పు వచ్చినట్టుంది. ఈ సంవత్సరాన్ని కరణీకపు

వృత్తిలో వారందరూ గుర్తుపెట్టుకోదగ్గదిగా భావిస్తారు. అంతకుముందు గ్రామకరణాలందరూ పంచాణం వృత్తికి సంబంధించిన కర్మశాలులైన కంసాలులు. వీళ్ళను ఈ పదవుల నుండి తప్పించి గోపరాజు రామప్రధాని ఆరువేల గ్రామాల కరణీకాలను నియోగులకు ఇప్పించాడన్న కథ దేశంలో ప్రచారమైంది. ఈ కట్టుకథలో చారిత్రక సత్యం ఇసుమంత ఉండే అవకాశాలు లేకపోయినా ఇది బహుళ ప్రచారంలో ఉండి మెకంజీ కయిఫీయత్తు లన్నింటిలోనూ వాటిని చెప్పిన కరణాలు ఏకగ్రీవంగా ఈ కరణీకపు జనశ్రుతిని శకసంవత్సరాన్ని చెప్పసాగారు.

సుమతి శతకంలో కరణాలకూ, కంసాలులకూ గల వైషమ్యం కొట్టొచ్చినంత దిట్టంగా కనబడుతుంది. బ్రౌను దొరగారి ప్రతిలో కరణాలమీద 9 పద్యాలూ, అగసాలెలమీద 4 పద్యాలు ఉన్నాయి. శతకకర్త చెరిచేయగ సాలిపొందు చేయ వద్దంటాడు (91). గ్రామాలలోని కరణాలను, తీర్పరులను తరచుగా మార్చకూడ దంటాడు.

ఒకయూరి కొక్క కరణం
బొక తీర్పరియైన గాక నొగితరుచైతే
కకపికలు గాక యుండునే
సకలంబును గొట్టువడుట సహజము సుమతీ (20)

కరణం మెతకగా ఉండకూడదు. కర్కశంగానే ఉండాలట. లోకులు సరకు చేయాలంటే కరుకుదనం కావాలంటాడు.

కరణంబు సాదువై నం
కరి మదముడిగినను పాముగరవక యున్నన్
ధర తేలు మీటకున్నం
కర మరుదుగ లెక్కగొనరు గదరా సుమతీ (26)

ఈ శతకకర్త తేలు 'మీటు' తుందని ఇంకో పద్యంలోకూడా చెప్పాడు.

పాలసునకైన యాపద
జాలింబడి తీర్చవలదు సరసుడవైతే
తేలగ్నిబడగ బట్టిన
మేలెరుగన్ మీటుగాక మేదిని. సుమతీ (68)

'తేలుమీటు' అనే ఈ ప్రయోగం కవికాలానికిగాని, ప్రాంతానికిగానీ సూచకం కావచ్చును. భట్టుమూర్తి, 'లొట్టయదేటిమాట' అనే చాటువులో 'తాఁగుట్టకయున్న వృశ్చికము కుమ్మర పుర్వని యాదురే కదా'! అని ప్రాసస్థానంలో 'కుట్టు' అనే మాటను వాడాడు. 'తేలుమీటడం' అన్నది ఏ కాలంలో ఏ ప్రాంతాలలో ప్రచారమో పరిశోధించాలి.

ఆ కాలంలో అగసాలెల అధికారం తగ్గి వెలమల ప్రాబల్యం ఎక్కువవుతున్న దనుకోవాలి. శతకకర్త వెలమలపట్ల కూడా తన ద్వేష భావాన్ని, చిన్న చూపునూ ప్రదర్శించాడు.

తలనుండు విషము పాముకు
వెలయంగా దోకనుండు వృశ్చికమునకున్
ఖలునకు నాలుక నుండును
వెలమకు నిలువెల్ల విషము వినురా సుమతీ (46).

తరువాత అచ్చుపడిన పుస్తకాలలో ఈ పద్యంలోని మూడు నాలుగు చరణాలను సంస్కరించి

''తల తోక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!''

అని అచ్చువేశారు. అయితే శతకకర్త కాలంలోని పాఠంవల్ల ఆనాటి వర్గ వైషమ్యాలు తెలుస్తాయి. పద్మనాయకులు బలపడుతున్న సంధియుగం కావచ్చును. ఇంకో పద్యంలో నమ్మకూడని వాళ్ళలో వెలమలను చేర్చారు.

వెలయాలు సేయు బాసలు
వెలయగ నగసాలి పొందు వెలమలనుడువుల్
కలలోన గన్న కలిమియు
విలసితముగ నమ్మరాదు వినరా సుమతీ (82)

శతకకర్త కాలం నాటికి వేశ్యాలోలత ఎక్కువైంది. అది శృంగారానికి చిహ్నమైంది. ఈ శతకంలో ఒకటి కాదు రెండు కాదు 14 పద్యాలు 'వెలయాలు' అన్న సబ్జెక్టుమీద చెప్పాడు. నన్నెచోడుడు కుమార సంభవంలో పని కట్టుకుని అష్టామాశ్వాసంలో చంద్రోదయ వర్ణన చేశాక 22 గద్యపద్యాలలో జారబజారును చాలా విపులంగా వర్ణించాడు (124 నెంబరు నుండి 145 దాకా), విటవిటీజనంబులు గూర్చుండి నటవిట గోష్ఠిలో విట విదూషక నాగరక పీఠమర్ధకుల చతురోక్తి, పరిహాసోక్తి, వక్రోక్తి, గ్రామ్యోక్తుల తగిలి సంభాషిస్తూ తమ మనో వ్యాపారాలను తెలియజేయడాన్ని నన్నెచోడుడు చెప్పి ఇంకో పదమూడు పద్యాలలో కామతత్త్వ భేదంబుల గోష్ఠివాదంబులు విశదం చేశారు (అష్టమాశ్వాసం 157 నుండి 170). సుమతి శతకకర్త ఆ కాలంవాడే కాబట్టి కుమారసంభవంలోని భావాల వంటివే తన సమకాలిక సమాజంలోనివి శతకంలో చెప్పాడు. నన్నెచోడుడు 'రొక్క మీగలుగువాడె మనోజుడు గూలియాలికిన్' (8-143) అని చెప్పాడు. శతకకర్త ఇలా అన్నారు.

కొక్కోకమెల్ల జదివిన
జక్కని వాడైన, రాజు చంద్రుండైనన్

రొక్కా రొక్కము లియ్యక
చిక్కదురా వారకాంత సిద్ధము సుమతీ (35).

శతకకర్త వెలయాలూ, త్రాసు ఒక లాంటివే అన్నాడు. వీసమెటుపక్క అధికమైతే అటే మొగ్గుతారని చెప్పాడు (50). మరునైన, విష్ణుడైనను, సురపతి సుతునైన చంద్రజూటుని నైనన్ సురకాని ముద్ర ఇవ్వకపోతే తరుణులు తాకనివ్వరని చెప్పాడు (129). వారభామినులకు వలపు లేదన్నాడు (37). ఈ సంగతి చాలా పద్యాలలో విశదం చేశాడు.

వెలయాలి వలన కూరిమి
గలుగదు, మరి కలిగెనేని కడతేరదయా
పలువురు నడిచే తెరువున
పురిమొలవదు, మొలిచెనేని పొదలదు సుమతీ (83).

ఇటువంటి భావాన్నే నన్నెచోడుడు కుమారసంభవంలో మరింత సామాన్య ధర్మంగా ఇలా చెప్పాడు.

ఇలబుట్టదు, పుట్టియుదా
నిలవదు, నిలిచియును వొక్క నిజమున దిరమై
కలదాక నెయిద నేరదు
వెలయాండుర కలుపు మగల విడుపును సతులన్ (8-165)

కూరిమిగల కూటమి కోరదగ్గది, నన్నెచోడుడు ఇంకా ఇలా చెప్పాడు.

వరసతి సురత కళాగమ
పరిణతుడగు విటుని గూడి పాయదు మరిడె
ప్పురమున బాసియు నెన్నడు
నొరుగవయదు జున్నుతిన్న యెట్టియవోలెన్ (8-160)

శతకకర్త కూడా 'గుభగుభలు లేని కూటమి' చప్పన అని చెప్పాడు (81). మనసులు కలియడం ముఖ్యం.

తానై పైకొని కవయని
మానినితో జెలిమి సేయ మనసిడి డాయం
బూను పెనిమిటికి నక్కలు
బీనుగుతో బెనగునట్టి ప్రియమగు సుమతీ (49).

ప్రేమలేక పెనగడం ఇంకో పద్యంలో మరొకలాగ ఉపమించాడు.

వలపు మది సతికి బుట్టక
బలిమిం దమ కించి విటుడు బైకొనుటెల్లన్
మలయజము సానపైనిడి
జలము నిడక తీసినట్టి చందము సుమతీ (79).

శతకకర్త ధర్మార్థకామాలలో కామానికి ఇవ్వవలసినంత ప్రాముఖ్యాన్ని ఇచ్చి, కులపాలికా ప్రణయాన్నే ప్రబోధించాడు. ''సిరికిని ప్రాణంబు పత్ని' అన్నాడు (123). కులకాంతతో ఎప్పుడూ కలహించవద్దని చెప్తూ 'కలకంఠి కంట కన్నీరొలికిన సిరియింటనుండ నొల్ల'దని హెచ్చరించాడు (33). ఇటువంటి రమణులతోనే రతి రాగరంజితమవుతుంది.

మిసిమిగల చూత ఫలములు
బిసుకంగల చోట రసము బిప్పిలు భంగిన్
రసికుడు రమణుల రతులం
గొసరిన శృంగారరసము గురియును సుమతీ (77).

రతి లేనిదే జగతి లేదు. అది ఎక్కువైనా, తక్కువైనా దోషమే.

రతి లేక ముదియు నంగన
రతివల్లనె ముదియు నశ్వరత్నము మిగులన్
రతి వలన ముదియు పురుషుడు
రతి విరహిత గజము ముదియు రయమున సుమతీ (138).

మోదము ముదిమిలో కాక ప్రాయంలోనే అనుభవించాలన్నది శతకకర్త మతంలాగ ఉంది. ప్రాయపుటాలిని తడవుల పుట్టినింట ఉంచవద్దన్నాడు (22). విసువక యౌవనులుండగ పసిబాలుల పొందువాడు పసరమని చెప్పాడు (28). భోగము కాంక్షణీయమన్నాడు. అందులోనూ ఎటువంటి భోగము నిజమైన భోగమో ఇలా చెప్పాడు.

భోగానుభవము వెలిగా
శ్రీ గలుగుట వృథ, సముల్లశిత హితవనితా
భోగము వెలిగా దక్కిన
భోగములన్నియు వృథలు భువిలో సుమతీ! (126)

ధర్మార్థకామ పురుషార్థాలు మూడింటిలో కామం గురించి సుమతి భీమన ఇంత విశదం చేశాడన్న విషయం చాలామందికి తెలియకపోవచ్చును. అతడు ధర్మార్థాల రెండింటి గురించి బోధించిన లోకరీతులు, సంఘరీతులు సుప్రసిద్ధాలు కనుక ''విద్యాభ్యాసము చేయు బాలుర కత్యంతోపయుక్తంబగు సుమతి శతకము'' అని దీనిని పాఠ్యగ్రంథంగా ప్రతిపదార్థాలతో ప్రకటించడం బహుకాలం నుంచి వస్తున్నదే. ముద్రిత ప్రతులలో కనబడే చాలా పద్యాలు తాళపత్ర ప్రతులలో కనబడవు. ప్రాచీన పాఠాలెన్నో మారిపోయాయి. ఉదాహరణకు 'అక్కరకు రాని చుట్టము' అనే పాఠానికి 'అక్కరకు రాని అర్థము' అన్నది చాలా అర్థవంతమైన ప్రాచీన పాఠం వుంది. అలాగే 'తన కోపమే తన

మృత్యువు' అన్నది కూడా తొలిపాఠం. ముద్రిత ప్రతులలో ఈ క్రింది పద్యం మొట్టమొదట కనబడుతుంది.

శ్రీరాముని దయ చేతను
నారూఢిగ సకల జనుల నౌరాయనగా
ధారాళమైన నీతులు
నోరూరగ చవులు బుట్ట నుడివెద సుమతీ!

ఈ పద్యం మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం ప్రతులలోనే కాదు, తంజావూరు సరస్వతి మహలు గ్రంథాలయంలోని నాలుగు ప్రతులలో కూడా లేదు. ఈ నాలుగింటిలో రెండు నాగరలిపిలో లిఖించిన గ్రంథాలు. ఇవి తంజావూరు మహారాష్ట్ర రాజులకోసం లేఖకులు వ్రాసినది. క్రీస్తుశకం 18 శతాబ్దంలో 'శ్రీరాముని దయచేతను' అనే పద్యం లేదన్నది నికరమైన సంగతి. పదిహేడో శతాబ్దంలోనే అధికపాఠాలు ఈ శతకంలో చేరాయని చెప్పవచ్చు. ఉదాహరణకు -

మాటకు ప్రాణము సత్యము
కోటకు ప్రాణంబు సుభటకోటి దలంపన్
బోటికి ప్రాణము మానము
చీటికి ప్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ (76)

ఇది ప్రక్షిప్తం కావచ్చును. 'చీటి' అన్న పదం పదిహేడో శతాబ్దంలోని కంకంటి పాపరాజు, ధరణి దేవులరామయ్య మొదలైన కవులు విరివిగా వాడారు. వసుచరిత్రలో రామరాజ భూషణుడు ''కుంతలస్థలికి గుణ గరిష్ఠని చీటి కమనీయ కేతకీ గర్భదళము'' అని ప్రయోగించాడు (1-73). ఈ ఒక్క పద్యంలో తప్ప మిశ్ర నిఘంటువులో చేరే ప్రయోగాలను శతకకర్త చేసినట్టు కనబడదు. వంగూరి సుబ్బారావుగారు ''కాలనిర్ణయ మునకు వీలైన తురక పదాలు ఎవ్వియు నిందునే జూచినంతవరకు కనబడలేదు'' అని చెప్పారు.[8] ఇది వాస్తవమే. లేఖకులు చేర్చిన అధిక పాఠాలేవో గుర్తుపట్టాలంటే వివిధ తాళపత్ర ప్రతులను తులనాత్మకంగా పరిశీలించి సుమతి శతకానికి సంశోధిత ప్రతిని తయారు చేయాలి. ఇది కర్తృత్వ సమస్యను కూడా తేల్చడానికి పనికి రావచ్చును.

శతకకర్త జైనుడు కావచ్చుననే సందేహం సాహిత్య చరిత్రకారులకు లేకపోలేదు. అందుకే పంపనగారి తండ్రి మొదలుకొని ఎందరో భీమనామధేయులను గమనించాం. పంపనగారి తండ్రే ఈ శతకానికి కర్త అయితే ఇదే తెలుగు సాహిత్యంలో లభ్యమవుతున్న మొట్టమొదటిదనీ, మన వాఙ్మయం శతకకావ్యంతో ప్రారంభమైందని చెప్పాలి. అయితే ఇప్పుడున్న ఆధారాలతో ఈ సూచన కూడా చూచాయిగా చేయలేము. జినవల్లభుని

8. శతక కవుల చరిత్ర పుట - 51.

శాసనం దొరికినట్టు వంగిపర్రు భీమన శాసనాలు దొరికి అందులో కందపద్యాలుంటే ఊహకు బలం చేకూరుతుంది.

ఆ ప్రాచీనకాలంలోని ఇంకొక జైనుడు మల్లియ భీమన. ఇతడు కవి జనాశ్రయకర్తకు తండ్రి. వైశ్యుడు. ఇతడు ఈ శతకాన్ని చెప్పడానికి ఆస్కారం కనబడటం లేదు. ఇందులో కోమట్లను దూషించే పద్యాలు కనీసం నాలుగు ఉన్నాయి. ''అల్లుని మంచితనమూ, గొల్లని సాహిత్య విద్యా, కోమటి నిజమూ, తెల్లని కాకులూ లేవ''న్నాడు (4). కోమటి విశ్వాసం బొంకని చెప్పాడు (37). కోమట్లు (ఊరి) పెద్దలైతే జనం బతకరన్నాడు (102). అయితే ''పురికిని కోమటి ప్రాణము'' అని పాజిటివ్‌గా ఒక మాట చాటకపోలేదు (123). ఏమైనా మల్లియ భీమన ఈ శతకం చెప్పాడని భావించడానికి హేతువులు తక్కువే.

అసలు ఈ శతకాన్ని జైనుడు రచించాడా అన్నది సందేహాస్పదమే. శివుడు (52); ఈశ్వరుడు (70); పంచాక్షరి (89); వేదాంత రహస్యం (100); గుప్తం చేయవలసిన మంత్రం (103) మొదలైన విషయాల ప్రసక్తి ఈ శతకంలో లేకపోలేదు. హైందవ పౌరాణిక గాథల నుండి పేర్లూ, ఉపమలూ విరివిగానే వాడాడు. చల్లారాధాకృష్ణశర్మగారు భావించినట్లు తిరుక్కురళ్ చెప్పిన తిరువళ్ళువర్‌లాగే సుమతి భీమనకూడా జైనుడు కాబట్టి శైవ వైష్ణవ పౌరాణిక గాథల సూచనలను తక్కువగా చెప్పాడన్న విషయం పరిశీలిస్తే నిలువదు. ఇటువంటి సూచనలున్న పద్యాలన్నీ ప్రక్షిప్తాలనలేము కదా. గాథలు పెక్కాడువాడే కావ్యుడని శతకకర్త విశ్వాసం (29). ఇందులో అదే చేశాడు.

ఏది ఏమైనా శతకకర్త చెప్పిన ఒక సంగతి వాస్తవం. అది అతని శతకానికి కూడా వర్తిస్తుంది.

పాలను గలిసిన జలములు
పాల విధంబుననె యుండు బరికింపగా
పాలరుచి చెరుచు నాక్రియ
జాలని నరు పొందు విడువ సహజము సుమతీ (121)

పాలలో కలిసిన నీళ్ళలాగే ఒక గ్రంథంలో చేర్చిన ప్రక్షిప్తాలు కూడా నకళ్ళులాగ కాక సిసళ్ళులాగే కనబడతాయి. గాని అవి చెడగొట్టే ప్రమాదం లేకపోలేదు. ఆంధ్రసాహిత్యం అదృష్టంకొద్దీ ఏదైనా ప్రాచీన తాళప్రతిలోని అసలు సుమతి శతకం లభిస్తే మరికొన్ని విషయాలు తెలియవచ్చు. కనీసం ఇప్పటికున్న ఒకే ఒక్క ప్రతిలోనైనా ఈ శతకాన్ని భీమన రచించాడన్న మాట కనబడుతున్నది కనుక ప్రస్తుతానికి ఇతనిని 'సుమతి భీమన' అని పిలువడం సముచితమనుకొంటున్నాను.

పూర్వ పరిశోధకులు కొందరు బద్దెన ఈ శతకకర్త అని భావించారు కదా: అందులోని వాదన ఎంతవరకు సమంజసమని పరిశీలించడం అవసరమే. బద్దెన కృతమైన నీతిశాస్త్ర ముక్తావళిలోనూ, సుమతి శతకంలోనూ రమారమీ యథాతథంగా ఉన్న కందపద్యాలు మూడంటే మూడే ఉన్నాయి. అవి ఏమిటో చూద్దాం.

అనఘా! వినుముద్యోగికి
ధనమొండెం గీర్తియుండె తగుచావొండెం
దనరంగ నిరుద్యోగికి
ధనకీర్తులు లేవు చావు తథ్యము సుమతీ! (3)

ఇది నీతిశాస్త్ర ముక్తావళిలో చాలా చిన్న మార్పులతో మూడోపాదంలో 'వినుము నిరుద్యోగికి మరి' అనీ, నాలుగో పాదంలో చివర 'తద్యంబరయన్' అని కనబడుతుంది. ఇక రెండో పద్యం శతకంలో ఇలా ఉంది.

పతి కడకు తన్ను గూర్చిన
సతి కడకున్ వేల్పుకడకు సద్గురు కడకున్
సుతు కడకు రిత్త చేతుల
మతిమంతులు చనరు నీతి మార్గము సుమతీ (60)

ఇది నీతిశాస్త్ర ముక్తావళిలో కొద్దిగా క్రమం మారి ఇలా ఉంది.

సుతుకడకు తన కూర్చిన
సతి కడకును వేల్పు కడకు సద్గురు కడకున్
బతి కడకు రిత్త చేతుల
మతిమంతు లనగ జనదు మహీ బద్దెనృపా.

ఇక మూడో పద్యంలోని పోలికలు చూద్దాం. శతకంలో ఇలా ఉంది.

నయమన్న పాలు ద్రావరు
భయమన్న నమేధ్యమైన భక్షింతురుగా
నయమెంత దోసకారియె
భయమే చూపంగ వలయు ప్రజలకు సుమతీ (116)

దీనికి పాఠాంతరం ఒకటి ప్రశస్తం కానిది కనబడుతోంది. రెండోపాదంలో 'భయమునను విషమ్మునైన భక్షింతురుగా!' అన్నది కొన్ని ముద్రిత ప్రతులలో ఉంది. అది సముచితం కూడా కాదు. ఇక నీతి శాస్త్ర ముక్తావళిలో ఇలా ఈ పద్యమే మార్పు చెందింది.

నయమన్న బాలుద్రావరు
భయమన్న నమేధ్యమైన భక్షింతురు, నా
భయము నయము లోపల
భయమే నయమంద్రు బుధులు బద్దెనరేంద్రా!

ఈ మూడు పద్యాలలో మాత్రమే కొన్నిచోట్ల యథాతథ పద ప్రయోగాలు ఉన్నాయి. శతకకర్త కందంలో చెప్పిన భావాన్ని బద్దెన వృత్తాలలో పొదగడం కొన్నిచోట్ల కనబడుతుంది.

బలవంతుడ నాకేమని
పలువురితో నిగ్రహించి పలుకుటమేలా?
బలవంతమైన సర్పము
చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ! (74)

ఇది సుప్రసిద్ధమైన పద్యం. దీనికి మూలమనదగ్గ పద్యం నన్నెచోడుని కుమార సంభవంలో కందంలోనే దొరుకుతుంది. చూడండి.

బలహీనులయ్యు నేమగు?
బలువురు దమలోన గూడి బలియునినైనన్
గెలుతురు సూడగనీహా
రలవంబుల గూడె తీవ్రరశ్మిని గప్పున్ (కుమార 10-19)

బద్దెన నీతిశాస్త్ర ముక్తావళిలో "పలువురి తోడ నిగ్రహము బాంధవవర్గముతోడి గర్వము" మొదలైనవి పేర్కొని అవి హాని కార్యాలన్నాడుగాని ఐకమత్యంతో బలహీనులు ఒక బలవంతుని ఓడించగలరని చెప్పలేదు (చూ... నీతిశాస్త్ర ముక్తావళి-116). సుమతి శతక కర్తృత్వాన్ని బద్దెనకు అంటకట్టవలసిన అవసరమేం లేదు. దానిని విరచించకపోతే అతనికి వచ్చిన తక్కువేం లేదు. అలాగే శతకకర్తకూ తగినంత సామర్థ్యం, స్వతంత్రభావనా పటిమా ఉన్నాయి.

సుమతి శతకాన్ని భీమన రచించాడనుకోవచ్చు. ఇతడు నన్నెచోడునికీ, బద్దెనకూ ఒక తరం అర్వాచీనుడు కావచ్చును. ఈ శతకం పుట్టినప్పట్నుంచీ ఎదుగుతూనే వచ్చింది కాబోలు పలు విధాలైన నోళ్ళలో పడి రకరకాలుగా మారింది అనుకోవచ్చు. ఆదిలో కవి ఎలా చెప్పాడో మనకు తెలియదు. ఆయా కాలాలలోని లేఖకులు తమ తమ సమకాలిక ఉచ్చారణకు వీలైన తీరుగా, తమ ప్రాంతాల పలుకుబళ్ళకు దగ్గరగా, ఈనాటి ముద్రాపకులు నడమంత్రపు వ్యాకరణ నియమాలకు విధేయంగా ఈ పద్యాలు రాసుకొంటూ వున్నట్టు కనబడుతుంది. ఒక రెండు ఉదాహరణలు చూద్దాం.

అక్కరకురాని యర్థము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమున దా
నెక్కిన బారని గుర్రము
గ్రక్కున విడువంగ వలయు గదరా సుమతీ (86).

ఇది సుప్రసిద్ధం. ఇవాళ 'అక్కరకు రాని చుట్టము' అనే పాఠాంతరం ప్రచారంలో ఉంది. ఈ పద్యం మొత్తానికి వేరే పాఠాంతరం ఒకనాడు వాడుకలో ఉంది.

తరిమిన బారని గుర్రము
దరమెరుగని రాజు కొలువు తరుణుల యెడలం

దరి తీవు సేయు మోహము
గరగరగా విడువ వలయు గదరా సుమతీ.

ఈ పద్యాన్ని క్రీ.శ. 1863వ సంవత్సరంలో అద్దంగి నివాసులు బొడ్డపాటి లక్ష్మిపతి గారు వ్రాసుకొన్న తాళపత్ర ప్రతిలోంచి సేకరించి, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో ప్రచురించిన పద్యాలలో చేర్చారు (సంపుటి 27- సంచిక 3).

ఇటీవలి ముద్రాపకులు అచ్చువేసే తీరునూ, అదే పద్యాన్ని ప్రాచీన లేఖకులు వ్రాసుకున్న విధానాన్ని కూడా చూద్దాం. రెంటాల సుబ్బారావుగారు ప్రచురించిన ఈ పాఠాన్ని చూడండి.

ఇచ్చునదె విద్య రణమున
జొచ్చునదే మగతనంబు సుకవీశ్వరులన్
మెచ్చునదె నేర్పు వాదుకు
వచ్చునదే కీడు సుమ్ము వసుధను సుమతీ (11)

తంజావూరు సరస్వతి మహలులోని తాళపత్ర ప్రతులలో 'అశ్వమేధ యజమాన మంత్రానుక్రమణిక, వ్రాసుకొన్న లేఖకుడు ఆ ప్రతి కడపటి ఆకుమీద ఇలా లిఖించారు.

ఇచ్చేదె విద్య రణమున
జొచ్చే దే మగ తనంబు సత్కవివరులన్
మెచ్చేదె నేర్పువాదుకు
వచ్చే దే యవగుణంబు వసుమతి సుమతీ (B 12284)

సరస్వతి మహలు కేటలాగు రెండవ సంపుటి అనుబంధంలో 'చెదిరిన ముత్యాలు' శీర్షికలో కనబడే ఈ పద్యం రెండో పాదంలో యతిభంగం ఉంది. బ్రౌను దొరగారి ప్రతిలో 'రణమున జచ్చేదే మగతనంబు సత్కవివరులన్ మెచ్చేదే చదువు' అన్న సాధు పాఠం ఉంది (పద సంఖ్య 11).

లేఖకులు ఎలా వ్రాసినా, తరతరాలుగా ఎలా పఠించినా, సుమతి శతకంలోని నిగ్గుమాత్రం పలచన కావడంలేదు. బహుశా ఇదే మొట్టమొదటి తెలుగు శతకం కావచ్చు. ఇది చిరంజీవి!

మల్లికార్జున పండితారాధ్యుడు

ఈనాడు ఎవరైనా ఒంటినిండా విభూతి పూసుకొని, రుద్రాక్షలు ధరించి, మతం వేసుకొని కూర్చుంటే అతడు మన కంటికి కనబడడు. ఎవరో భక్తుడనుకొంటాము. ఏడెనిమిది వందల సంవత్సరాల కిందట ఇటువంటి వేషమే వేసుకొన్న వానిని చూసి బ్రాహ్మణులే వెక్కిరించారట. ఇది వైదిక మతానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారట!

దాక్షారామంలో సుమారు ఎనిమిదివందల ఏళ్ళ కిందట (బహుశా క్రీ.శ. 1160లో) 'వానస' వారి ఇంటివద్ద మల్లికార్జునుడు అనే ఒక యువకుడు ఒకనాడు ఒళ్ళంతా విభూతి పూసుకొని త్రిపుండ్ర రేఖలు దిద్ది శివపురాణంలో చెప్పినట్లు శిరస్సుకు, చేతులకు, శిఖకు, చెవులకు, రొమ్మున, మెడలో రుద్రాక్షలు కట్టుకొని వీరమహేశ్వర దీక్షను, వీరవ్రతాన్ని పాటిస్తున్నాడు. అక్కడి బ్రాహ్మణులు అతణ్ణి చూశారు; నివ్వెరపోయారు. ఏమంటే, అతడు భీమేశ్వరస్వామివారి గుడిపూజారి కుమారుడు, వైదిక మార్గాన్ని అనుసరించవలసినవాడు. బాగా చదువుకొని పండిత బిరుదాన్ని పొందాడు. అందుకే ఆ బ్రాహ్మణులు అతణ్ణి చూసి ''పండితయ్యా నువ్వు విద్వాంసుడవు. పురాణాలు చదివావు, వేదాలు చదివావు. ఈ రుద్రాక్షలు ధరించడమేమిటి? ఈ విభూతి పూసుకోవడమేమిటి? ఈ లింగం కట్టుకోవడమేమిటి? ఈ పాదోదకం త్రాగడమేమిటి?'' అని ఆక్షేపించారు. పండితయ్యా నవ్వి, వాళ్ళకు తన కొత్త మతాన్ని బోధపరిచాడు. సమస్త వేద వేదాంగాలలోనుంచి ఉదాహరణలిస్తూ, అన్నీ తన మతానికి అనుకూలంగా వ్యాఖ్యానం చేశాడు. విభూతి మహిమ విడమరిచాడు. లింగార్చనా మహిమ విశదపరిచాడు. ప్రసాద స్వీకారంలో, గురుపాదోదక పానంలో ఉన్న గొప్పతనం విప్పిచెప్పాడు. ఆక్షేపించినవాళ్ళు ఆ పాండిత్యానికి ఆశ్చర్యపోయి, అతణ్ణి పొగుడుతూ వెళ్ళిపోయారు.

సనాతన బ్రాహ్మణాచారాలున్న వానస భీమన్నగారి యింట బహుశా 1140లో పుట్టిన పండితయ్యకు ఈ శైవమతం ఎలా అబ్బిందంటే - వీళ్ళ ఊరు దాక్షారామానికి పక్కనే ఉన్న కోటిపల్లిలో అవాంతరయ్యా అనే పేరున్న ఆరాధ్యదేవర ఒకాయన ఉండేవాడు. అతడు పండితయ్యకు శైవ దీక్ష ఇచ్చి ఆ మత రహస్యాలను బోధించాడు. అవన్నీ నేర్చుకొని పండితయ్యా వాటిని ఉద్ధోలంగా ఆచరణలో పెట్టాడు. శివుణ్ణి ఎంత భక్తితో పూజించేవాడో శివభక్తులను అంతకన్నా ఎక్కువగా ఆరాధించేవాడు; ఆదుకొనేవాడు, సేవలు చేసేవాడు. వెల్లగుండ మహాదేవయ్యా అనే భక్తుడు ఒకనాడు నిద్దరలేస్తూ, ఆ బద్దకంలో పొరపాటున శివార్చన పాత్రలను తన్నడం జరిగింది. వెంటనే ఆ భక్తుడు ప్రాయశ్చిత్తంగా తన కాళ్ళను నరికేసుకొన్నాడు. ఇది చూసిన పండితయ్యా శివునికి దీపారాధన చేసిన నూనెను ఆ కాళ్ళకు రాసి ప్రథమ చికిత్స చేశాడు. పండితయ్యా చేసిన పరిచర్యవల్ల ఆ భక్తునికి కాళ్ళు వచ్చాయి. మళ్ళీ నడుస్తున్నాడు. ఇది పండితయ్యా మహిమేనని లోకం చెప్పుకోవడం మొదలుపెట్టింది. అతని కీర్తి నలుమూలలకూ పాకింది.

ఆ కాలంలో ఇతర ప్రాంతాలలో కూడ వీరశైవ మతాన్ని అనుసరించేవాళ్ళు ఉండేవాళ్ళు. వాళ్ళను ఒక పక్క నుంచి బ్రాహ్మణులు ఈసడించి బాధిస్తూ ఉండేవారు. మరొక పక్క జైనులు, బౌద్ధులు ఎద్దేవా చేసేవారు. పోరండ్ల అగ్రహారంలో సూరసానమ్మ అనే ఒక వితంతువు వీరశైవ మతదీక్ష పుచ్చుకొని, జాతిభేదాలను పాటించక పంచములను సైతం, భక్తులైతే ఆదరించేది. ఆమె ఒకనాడు ఒక మాలవానికి ఇంట్లో అన్నం పెడుతున్నపుడు ఆ అగ్రహారంలోని బ్రాహ్మణ్యమంతా ఆ ఇంటిమీదపడి రొష్టు పెట్టారు. ఆమె వాళ్ళ ముందర ధైర్యంగా నిలబడి, ఎలుగెత్తి కోపించి, అందరినీ శాంతింపజేసి, భక్తుల కథలు చెప్పి పరమేశ్వరుని మహిమలు వివరించి,, రొష్టు పెట్టడానికి వచ్చిన వాళ్ళు గమ్మున సాష్టాంగపడేటట్లు చేసింది. ఈ సూరసానమ్మ పండితయ్య కీర్తి విని అతణ్ణి చూడడానికి వెళ్ళింది. ఒక్కర్తే కాదు; బెలిదేని వేమనారాధ్యుడనే ఇంకొక భక్తునితో కలిసి వెళ్ళింది.

సుదూరం నుంచి వచ్చిన ఈ భక్తులు పండితయ్యగారి ఇంటికి చేరుకొనేసరికి ఆయన శివపూజ చేసుకుంటున్నాడు. వీళ్ళ రాక చూసి, చేస్తున్న శివపూజ కూడ మానివేసి శివునికన్న శివభక్తులే గొప్పవాళ్ళని, వచ్చినవాళ్ళను వైభవంగా పూజించాడు. సూరసానమ్మగారూ, వేమనారాధ్యుడూ ముక్కుమీద వేలువేసుకొన్నారు. అతని మతావేశం బండారు బసవన్నను మించిపోయిందనుకొన్నారు. ఈ బసవన్న కర్ణాటకుడు, కల్యాణ కటకాన్ని పాలించే బిజ్జలుని కోశాధికారిగా ఉంటూ శివభక్తులకు డబ్బు విచ్చలవిడిగా గుమ్మరిస్తూ, కానివాళ్ళను క్రూరంగా హింసిస్తూ మతప్రచారం చేస్తున్నాడు. ఇది క్రీ.శ. 1160 నుంచీ సాగుతోంది. అతని గురించికూడ జనులు రకరకాల కథలు చెప్పుకొంటున్నారు. అప్పటికి ఇవి పండితయ్యదాకా రాలేదు.

బసవన్న మహిమలూ, అతని భక్తుల ప్రభావం సూరసానమ్మ పండితయ్యగారికి చెప్పింది. బసవన్న 'శివపసాయితం' అనే ఖడ్గాన్ని ధరించి వీరపద్ధతిని మతాన్ని బోధిస్తున్నాడు. అలాగే పండితయ్య కూడ తెలుగుదేశమంతా సంచరించే మతాన్ని స్థాపించాలనుకొన్నట్టుంది.

ఆ రోజుల్లో వెలనాటి చోళులు తెలుగుదేశంలో చెప్పుకోదగ్గ రాజులు, ఇప్పటి గుంటూరు జిల్లా తెనాలి తాలూకాలోని చందవోలు వాళ్ళ రాజధాని. దీనికి సదనవో, ధనదుపురం అనే పేర్లు కూడ ఉండేవి. ఈ ఆస్థానంలో జైనబౌద్ధ మతాలకు ఆశ్రయముండేది. రాజగురువు బౌద్ధపద పదాచార్యుడు. ఈ బౌద్ధుణ్ణి ఓడించి రాజును తన మతానికి తిప్పుకొంటే బాగుంటుందని పండితయ్య తలచినట్లుంది. శిష్యవర్గాన్ని తీసుకొని వెలనాటి చోళుల రాజధానికి బహుశ క్రీ.శ. 1174 ప్రాంతాలలో వచ్చాడు. నగరంలో తన మతాన్ని ప్రజలకు బోధించసాగాడు. రాజగురువుకు సహజంగా ఒళ్ళుమండింది. సభ పెట్టించమని రాజును కోరాడు. పండితయ్యను అతని మతాన్ని విశదీకరించమన్నాడు.

రాజు సభ పెట్టించాడు. ఆ సభలో జైనులు, బౌద్ధులు, సాంఖ్యులు, అద్వైతులు, చార్వాకులు, లోకాయతులు మొదలైన నానాదర్శనాల వాళ్ళూ ఉన్నారు. ఆ సభలో

పండితయ్యా తన మతాన్ని వివరించడమేకాక బౌద్ధమతాన్నీ, దానితోపాటు మిగతా అన్ని మతాలనూ ఖండించాడు. 'శేషం కోపంతో పూరించ'మన్నట్లు అంతటితో ఊరుకోక శివుణ్ణి మించిన దైవం లేడని చెప్పడానికి తన తల ఇస్తానన్నాడు. నిప్పు ముట్టుకొంటానన్నాడు. శివునికన్నా వేరే దైవమున్నాడని ఎవరైనా చెప్తే వాళ్ళ తల తన కాలితో తంతానన్నాడు. ప్రతిజ్ఞ చేశాడు. ఈయన ఇలా తిట్లలోకి దిగితే మిగతావాళ్ళు ఊరుకొంటారా? పైగా రాజాశ్రయమున్న బౌద్ధగురువు నోరుమూసుకొని ఉంటాడా? అతడూ పండితయ్యా భాషలోనే మాట్లాడి ఉంటాడు.

ఇది పండితయ్యా శిష్యులకు కోపం కలిగించింది. తమ గురువును నిందించిన బౌద్ధుని ద్రోహంకన్నా, అతణ్ణి ప్రాణాలతో పోనిస్తే తామే ఎక్కువ ద్రోహులమవుతామని పండితయ్యా శిష్యులలో రేమయ్యా, దేవయ్యా అనే ఇద్దరు కంకణం కట్టుకొని ఈ పనికి పూనుకొన్నారు. తమ దగ్గరున్న సరుకంతా వెంటనే అమ్మివేశారు. ఇతరులెవరూ చూడకుండా బౌద్ధుణ్ణి అనుసరించారు. ఆయన చందవోలుకు దగ్గర సముద్రంలో ఉన్న ఒక లంకలోని బౌద్ధారామంలో రోజూ ప్రార్థన చేస్తూ ఉంటాడని తెలుసుకొన్నారు. మర్నాడు వేకువ ఝామున మారువేషాలు వేసుకొని లంకలోని బౌద్ధాలయానికి వెళ్ళారు. అక్కడ పొంచి ఉండి బౌద్ధగురువు రాగానే మీదపడి, పొట్ట చింపి, పళ్ళూడగొట్టి, పండితయ్యాను తిట్టిన నాలుక చూపించమని అడిగి దానిని తరిగి, రొమ్ము తొక్కి, పేగులుపీకి, తలతెంచి దానిని పొట్టలోపెట్టి కట్టి, 'ఇది అసంఖ్యాత మాహేశ్వరుల వసువు' అని ఉత్తరం రాసి పెట్టి రొమ్మున ఉంచి వెళ్ళిపోయారు.[1]

ఈ దారుణ హత్యా సంగతి రాజుకు తెలిసింది. రొమ్మునున్న లేఖను చూశాడు. పండితయ్యాను పిలిపించి అడిగితే, ''ఇది నేనే చేయించాను, నేనే చంపించాను'' అని నిర్భయంగా ఒప్పుకొన్నాడు. ఈ హత్యకు శిక్షగా రాజా పండితయ్యాను చంపించక జీళ్ళపాలు తెప్పించి, కళ్ళలో పోయించి అవి మటుకు తీయించాడు. పండితయ్యా 'రాజు సర్వనాశనమవుతా'డని శపించాడు. ఈ శాపం ఫలించేదాకా తనకు మళ్ళీ కళ్ళు ఇవ్వవద్దని దేవుణ్ణి వేడుకొన్నాడు.

''పశుపతి మీ భక్తిపరులు 'శాపాద
పి శరాదపి' యనంగ పెనుద్రోహి ద్రుంచు
నంతకు...''

''కన్నులిస్తే నీ భక్తులాన'' అని ఒట్టుపెట్టాడు. 'శాపాదపి శరాదపి' అనడంలో ఔచిత్యముంది. శాపంవల్ల ఒక వ్రణం పుట్టి రాజు మరణించాడంటారు. కాని దానివల్ల గాక పండితయ్యాగారి అనుచరుల శరం వల్లనే రాజు మరణించాడు. ఈ సంగతి విశ్వసనీయమైనదే.

---

1. ఇదంతా 'పండితారాధ్య చరిత్ర'లోని వర్ణనమే.

శాపం పెట్టాక పండితయ్య చందవోలు నుంచి అమరావతికి (బహుశా క్రీ.శ. 1175లో) వెళ్ళాడు. దేవుణ్ణి వివిధ స్తుతులతో కీర్తించి, కృష్ణానదిలో ఒడ్డోలగం ఏర్పరచి భక్తులతో ''మనం వెలనాటి సీమనుంచి వెడలివచ్చాం. వాడు చస్తాడు. మన కళ్లు వస్తాయి'' అని చెప్తూ వుండగా

''అంతలోననె ఫణిహారి యాద్రోహి
నంతకు ప్రోలికి ననిపి యేతెంచి
నలి భక్తతతికి విన్నప మాచరింప...''

పండితయ్య సంతోషించాడు.

''ఈ ఫణిహారి ఎవడు? చోడని ఫణిహారియ కావలయును. వ్రణబాధితుడై చోడుడు మృతినందుట వాస్తవమైనచో ఫణిహారి యాద్రోహి నంతకపురి కనుచుట పొసగి యుండదు; చంపుట వాస్తవమైనచో వ్రణబాధచే జచ్చుట వాస్తవమైయుండదు. చోడని నంతకపురి కంపివచ్చితినని ఫణిహారి పండితారాధ్యులకును, భక్తతతికిని విన్నవించు కొనుట చూడగా నతడు పండితారాధ్యుల శిష్యవర్గములోనివాడనియు, రేమయదేవయలు గుర్వాజ్ఞమీదనో, లేకయో బౌద్ధగురుని హింసించి చంపినట్లు అతడును వెలనాటి చోడుని హత్యచేసి చంపెనని తోచుచున్నది'' అని నేలటూరి వెంకటరమణయ్యగారు కూపీ తీశారు.[2] పండితయ్య చంపించిన వెలనాటి చోడుడు క్రీ.శ. 1163–1180 దాకా పాలించిన రాజేంద్రచోళుడే.

పండితయ్య అమరావతిలో ఉంటున్నప్పుడే అతనికి బండారు బసవన్న దగ్గరనుంచి కబురు వచ్చింది. అంతకుముందు బసవన్నకూ, పండితయ్యకూ ఉత్తర ప్రత్యుత్తరాలలో, లేక దూతల ద్వారా సంప్రతింపులలో జరుగుతూ ఉన్నాయి. 'జందెం తీసి జాతి విడిచి తనలో వచ్చి కలియ'మని బసవన్న పండితయ్యను కోరాడట. దానికి సమాధానమిచ్చి పండితయ్య తన అనుచరులను బసవయ్య దగ్గరకు పంపించాడు. వాళ్ళు బసవన్న సందేశాన్ని, దానితోపాటు విభూతినీ తీసుకొని వచ్చారు. పండితయ్య అప్పటికే కన్నడ భాషను నేర్చుకొంటున్నాడు కాబోలు. బసవన్న పంపించిన విభూతిని ధరించగానే పరవశత్వంతో ఆ భాషలో కవిత్వం చెప్పసాగాడు. బసవన్నను కలుసుకోవడానికి కల్యాణ కటకానికి బయలుదేరాడు.

దారిలో నల్లగొండ జిల్లాలో ఉన్న పానుగల్లులో మకాం చేశాడు. ఆ ఊరు ఇంకొక శాఖ చోడరాజులకు ముఖ్యపట్నం. దానిని అప్పుడు ఉదయచోడుడు క్రీ.శ. 1136–1176లో పరిపాలిస్తూ ఉండేవాడు. ఇతడు వేములవాడ భీమకవి ప్రశంసించి పద్యాలు చెప్పిన మైలమభీముని వంశంలోనివాడు. ఆ రాజ్యపు కోశాధికారి అయిన

2. 'సోమనాథు డెప్పటివాడు?' అనే పుస్తకంలో – పుట 16.

గోవిందప్రగ్గడ పండితయ్యకు ముఖ్య శిష్యుడు. తన గురువుగారికి రాజోచితసేవలు చేశాడు. మిగతా ఉద్యోగులు, పరివారం చాలామంది పండితయ్య శిష్యులయ్యారు. రాజును సేవించడం మానివేసి పండితయ్య కొలువులో ఉండిపోసాగారు. ప్యూడలు వ్యవస్థలో దాసులు అక్షరాలా తమ ప్రభువుల ఎంగిలి కూడు తినాలి. స్వామి భక్తిని ప్రకటించుకొందికి ప్రభువు నమిలి ఉమ్మే తాంబూలాన్ని అరచేతితో గ్రహించి భక్షించాలి. రాచమేడలలో ఒకడు పండితయ్య ప్రభావంలో పడి - ఆత్మాభిమానాన్ని పెంచుకొన్నాడు. రాజు సొంత సేవకుడైన ధవళేశునామయ్యను తమ్మి తిని స్వామిభక్తిని ప్రకటించుకో మన్నాడు· ఆలెంక. అతడు నిరాకరించాడు. దాసుడు విధులు నిర్వర్తించలేదని రాజు ఆగ్రహించాడు. నామయ్యకు పౌరుషం వచ్చి ''ఈ బొంది మీదికాని నా ఆత్మ మీది కాదు. కావాలంటే మీ శరీరం మీరు తీసుకోండి'' అన్నాడు. రాజు చేతిలోని చురియను తీసుకొని గోపురం మీదికెక్కి తల గండరించుకొన్నాడు. తన ఉద్యోగులను విద్రోహులకింద మారుస్తున్నారని రాజు పండితయ్యను నిందించాడు కాబోలు. ఆ రాజుమీద కూడ శాపాలు పెట్టి, బసవన్నను కలుసుకోవాలని పండితయ్య పయనమయ్యాడు. దారిలో మజిలీలు చేస్తూ శిష్యుల సపర్యలందుకొంటూ సాగుతూ వనిపురం చేరుకొన్నాడు. ఇది నేటి వనిపట్ల గ్రామం కావచ్చు. ఇక్కడనుండి కల్యాణికి పండితయ్య బయలుదేరాడు.

అయితే, దారిలోనే దారుణమైన బసవన్న మరణవార్త తెలిసింది. అన్ని మతాలవాళ్ళనూ ఒక్కలాగ చూడవలసిన ప్రభుత్వాన్ని పాక్షికం చేసి బొక్కసంలోని ద్రవ్యాన్ని ఒక మతం వాళ్ళకే విరజిమ్ముతున్నందుకు రాజు బసవన్నపై ఆగ్రహించాడు. అందుచేత బసవన్న బిజ్జలుణ్ణి చంపించాడు. రాజ్యాన్ని వదలి పారిపోయాడు. ఇది జరిగిన కొద్దినాళ్ళకే బసవన్న క్రీ.శ. 1196లో మరణించాడు. బసవన్నను కలుసుకోవాలని ఎంతో ఉత్సాహంతో వెళుతున్న పండితయ్యపై పిడుగు పడినట్లయింది. ఆక్రోశించి, ప్రేలాపించి, అతడు శ్రీశైలం దారిపట్టాడు. బసవన్న మరణంతో పండితయ్య ప్రాణాలే పోయినట్టయినాయి. శ్రీశైలం పోలేక వెల్లటూరులో నిలిచిపోయాడు. ఇది కృష్ణా తీరంలో కూడలి సంగమేశ్వరానికి రెండు మైళ్ళ దూరంలో వుంది. అప్పుడు ఈ ప్రాంతాలను కన్నాటిగోకర్న దేవమహారాజు పాలిస్తున్నాడు. ఇతడు క్రీ.శ. 1185లో తన తండ్రి పోచిరాజుకు పుణ్యంగా ''మల్లికార్జున పండితారాధ్యుల కాళ్ళు కడిగి ధారాపూర్వకంగా ఒక దానం చేశాడు''.[3] శ్రీశైలం వెళ్ళలేక కొండ ఎక్కే ఓపికకూడా లేకపోయింది. తనకు బదులు శిష్యుణ్ణి కొండ ఎక్కి మొక్కు చెల్లించమని తాను కొండ అడివారంలోనే ఉండిపోయారు. శిష్యులు గిరి ప్రదక్షిణం చేసి వచ్చాక తాను ఇంక జీవించవలసిన అవసరం లేదని తనువు చాలించాడు. బహుశా ఇది క్రీ.శ. 1197లో జరిగి ఉంటుంది. మరణించినా అతని రచనలు జీవిస్తూనే వున్నాయి.

ఆంధ్రదేశంలోని పండితయ్యనేకాక, కర్ణాటకంలో ఎందరినో బసవన్న ప్రభావితుల్ని చేశాడు. జాతి భేదాలు లేని నీతిని నెలకొల్పడానికి ప్రయత్నించాడు.

3. ఈ దాన శాసనం తెలంగాణా శాసనములు - 25 సంపుటి - 171వ పుటలో ఉంది.

ఎందరో ఉత్తేజితులయ్యారు. బసవన్న బాటలో పయనించసాగారు. నాటి ఉద్యమంలో త్రికరణ శుద్ధిగా పాల్గొన్నారు. ఉద్యమాలలోంచి కవులు పుడతారు. సందేహం లేదు. కొందరు కవులు ఉద్యమాలకోసమే పుడతారు. ఇది చారిత్రక సత్యం. ఏ ఉద్యమం తాలూకు ఆదర్శాలనైనా ప్రచారం చేయడానికి కవి చక్కని సాధనం. సాహిత్యానికి సాంఘిక ప్రయోజనం వుంది. తేరగా తిని కూర్చునే వర్గాల వాళ్ళు, వాళ్ళ ఆశ్రితులు మాత్రమే 'కళ కళకోసమే' అంటారు. సమాజాన్ని, సాహిత్యాన్ని విడదీయనివాళ్ళు కళ ప్రజలకోసం అని భావించి కళారూపాలద్వారా సాంఘిక విప్లవాన్ని సాధించడానికి పూనుకొంటారు.

వర్ణభేదాలనూ, వర్గభేదాలనూ తొలగించి సమాజాన్ని సమూలంగా కూల్చివేసి సర్వులూ సమానులన్న ధర్మాన్ని ప్రతిష్ఠించుతూ నూతన వ్యవస్థను నిర్మించాలన్న ఉద్యమం ఏ కాలంలోనైనా గొప్ప ఉద్యమమే. నేటికి ఎనిమిది వందల సంవత్సరాల కిందట దక్షిణ భారతంలో, ముఖ్యంగా కర్ణాటకంలో ఈ ఉద్యమాన్ని నడిపినవాడు బండారు బసవన్న. గొప్ప సాహిత్యాన్ని సృష్టించాడు. ఈ సాహిత్యం పేరు అనుభవ సాహిత్యం. ఇది ప్రజలకోసం, ప్రజల భాషలో రాసిన సాహిత్యం.

బండారు బసవన్న రచనలను వచనాలు అంటారు. ఈ వచన సాహిత్యం ద్వారా ఆయన వీరశైవాన్ని ప్రబోధించాడు. బసవన్నకు చాలాకాలం ముందుగా దేశంలో వచన సాహిత్యమూ వుండేది - శైవమూ వుండేది. అయితే ఈ రెండింటినీ చక్కగా జోడించినవాడు బసవన్న. వీరశైవాన్ని అనుసరించే ఇతర శివశరణులు అల్లమ ప్రభువూ, అక్కామహాదేవి, చెన్న బసవన్న వచన సాహిత్యం రాశారు. అక్కా మహాదేవి వచనాలు మధురాలు. బసవన్న వచనాలు భవ్యాలు. ప్రభుదేవరవి దివ్యాలు అని విమర్శకులు చెప్పారు. చెన్న బసవన్న వచనాలలో స్వమతాభిమానం, పరదూషణా ఎక్కువకావడం వల్ల కావ్య గౌరవం తగ్గిందని విమర్శకులు భావిస్తారు.

"శివశరణుల భక్తి సిద్ధాంతమగుటయే కాక ప్రజలలో మతమై ప్రబలినది. ఈ మతమున వర్ణరహిత సమాజమునకు పునాదులేర్పడినవి. దానికి తగినట్టులే సాహిత్యము కూడ పుట్టినది. ఈ సాహిత్యమునే అనుభవ సాహిత్యమందురు" అని చెప్తూ శివశరణుల వచనాలు కన్నడంలో ఉపనిషత్తులంత గౌరవాన్ని నోచుకొన్నాయి అని విమర్శకులు చెప్పారు.[4] అనుభవానికి రాని ఆ స్వర్గలోకాలను గురించి శివశరణులు చెప్పారు, వారికి దివ్యనాయకులు లేరు; దీర్ఘ వర్ణనలు లేవు. పురాతన భక్తులే వారికి ప్రామాణికులు. కథకు భక్తుల చరిత్ర వారికి అవసరం. కవితలో కల్పనలు లేవు. సంఘంలో కులములు లేవు. తత్త్వంలో భిన్నత లేదు. ఇదే అనుభవ కవిత. ఈ లోకానికి దూరంకాని ప్రజోపయోగమైన కవిత, బసవాదుల వచన సాహిత్యం.

---

4. "బసవేశ్వర వచనాలు - సమగ్ర సమీక్ష" డాక్టరు బాడాల రామయ్య (1976-77). ఈ ప్రకరణంలో నేను ఉదాహరించబోయే బసవేశ్వర వచనాల తెనుగు అనువాదం వారు చేసినదే.

అనుభవ సాహిత్యంలో నియమితమైన ఛందస్సులేదు - లయ ఉంటుంది. కథ లేదు - కవిత ఉంటుంది. కల్పన లేదు - అనుభవం ఉంటుంది. శివశరణుల భాష కష్టపడి నేర్చుకోవలసిన సంస్కృతం కాదు. పుట్టుకతో సహజంగా వచ్చిన మాతృభాష. వాళ్ళు శాస్త్రాల జోలికి పోరు. వాళ్ళ నడవడే ఇతరులకు ఆదర్శం. వాళ్ళు దయకు కట్టుబడతారు. ధర్మంతో ఎదురు తిరుగుతారు. పాండిత్య ప్రకర్ష మచ్చుకైనా ఉండదు. విన్న వెంటనే భావం ఎదుటివారి గుండెల్లో సూటిగా నాటుకొంటుంది. ప్రజల భాషలో చెక్కిన ప్రజాకవిత్వం కనుక బసవన్న తన వచనాలతో నూతన మతాన్ని ప్రచారం చేయగలిగాడు.

బసవన్న పుట్టుకచేత బ్రాహ్మణుడు, కాలాముఖశైవుడు. లకులీశ, కాలాముఖ, పాశుపత శైవాలు వేదాన్ని ప్రమాణంగా అంగీకరించవు. ఈ శైవులకు నిగమాలకన్నా ఆగమాలే ముఖ్యం. ఆగమాలంటే పారంపర్య లోకాచారం. బసవన్న వర్ణాశ్రమ ధర్మాలను తూచా పాటించమని చెప్పే వైదికమతాన్ని నిరసించాడు. బ్రాహ్మణులు చెప్పేదొకటి చేసేదొకటి అని గ్రహించాడు. జీవులందరూ శివాంశ సంభూతులని చెప్తూ వర్ణభేదం పాటించడం ఎందుకని ప్రశ్నించాడు. కులం పట్టింపులు లేని, ఎక్కువ తక్కువలు లేని, ఆడా, మగా తేడాలు లేని సమాజం కోసం ఉద్యమించాడు.

బసవన్న కుశాగ్రబుద్ధి. గణితంలో ఆరితేరినవాడు. అతని మేనమామ బలిదేవచండనాయకుని వల్ల బసవన్న రాచకొలువులో చేరాడు. ఉత్తరోత్తరా కల్యాణ కటకాన్ని పాలించిన బిజ్జలుని కోశాధికారి అయ్యాడు. పన్నెండుమంది మంత్రులపై పెత్తనం చేస్తూ సర్వాధికారి అయ్యాడు. పదవిలోకి రాకముందు చేపట్టిన ఉద్యమాన్ని బసవన్న పదవిలోనికి వచ్చాక ఆచరణలో పెట్టాడు.

కళ్యాణిలో బసవన్న పన్నెండు సంవత్సరాలు వున్నాడు. అనుభవమండపం అతని వాసం. అక్కడ శివశరణులందరూ చేరేవారు. జంగమ సంప్రదాయమైన సమయాచారాన్ని పాటించేవారు. ఈ వీరశైవులు బ్రాహ్మణుల యజ్ఞయాగాదుల, పశు హింసను, వర్ణాశ్రమాలను తీవ్రంగా దుయ్యబడతారు. మఠాలకు దానమివ్వడం, ఆలయ నిర్మాణం, తీర్థయాత్రలు సమ్మతించరు. తద్దినాలు పెట్టరు. పురిటిమైల, చావుమైల పాటించరు. మద్యమాంసాలు నిషేధిస్తారు. కొన్ని ఆర్థిక సూత్రాలపై జీవిస్తారు.

కర్మ మార్గములోని కర్మను వీరశైవులు ''క్రి'' అంటారు. కాయకమంటారు. కాయకంలోగాని, క్రి లోగాని ఫలము లేదు, వ్యాపారముంది. అంటే క్రి చేత పాప పుణ్యాలు లేవు. పునర్జన్మ లేదు ('నేయి కరిగిన మరల వెన్నలేదు' వచనం నెం. 867). కాయకష్టం చేసి జీవుడు బతకాలి. కాయకష్టంతో సంపాదించినది కూడబెట్టకూడదు (కూర్చకురా ద్రవ్యంబు కూర్చిన భవంబు తప్పదురా). ఎప్పుడు సంపాదించినది అప్పుడే ఖర్చు పెట్టాలి. వడ్డీకి ఇవ్వకూడదు. ఆర్థిక అసమానతలకు వడ్డీ వ్యాపారమే మూలకారణమని బసవన్న గ్రహించాడు.

శివుడిచ్చు సంపద శివభక్తులకు గాక వడ్డీకై ఇచ్చుట పాడికాదు. (వచనం - 229)

ఆర్థిక అసమానతలను, అవమానకరమైన జాతి భేదాలను తొలగించే మతం కనుక అగ్రవర్ణాల వారికన్నా అడుగువర్గాలవారు, అట్టడుగు వృత్తులవారు బసవన్న మతంలో చేరారు. బసవన్న చెప్పింది చేస్తాడు. కులభేదాలు లేవు గనుక మధుపయ్యా అనే బ్రాహ్మణుని కుమార్తెను, హరళయ్యా అనే చర్మకారుని కొడుకుకు యిచ్చి పెళ్ళిచేయ తలపెట్టాడు.

వాస్తవానికి ఆదిలోనే బసవన్న కులభేదాలు పాటించలేదు. డోహరకక్కయ్యా అనే చర్మకార భక్తుణ్ణి ఎంతో సేవించాడు. కక్కయ్యా ప్రసాదంవల్లనే బసవన్న అక్కగారు నాగమ్మ చెన్న బసవన్న అనే కుమారుణ్ణి కన్నది. ఆమె అసలు పెళ్ళి చేసుకోలేదు. బసవన్న ఉపనయనమే చేసుకోలేదు. అక్కగారివల్ల బసవన్న సంఘంలో ఆదిలోనే నిందలపాలయ్యాడు. అయినా లెక్కచేయలేదు.

గొప్ప సాంఘిక విప్లవమైన వర్ణాంతర వివాహాన్ని (క్రీ.శ. 1196 ఫిబ్రవరి పన్నెండో తేదీనాడు) శివశరణులు చాలా ఉత్సాహంగా జరిపించారు. దేశంలో కల్లోలం పుట్టింది. బ్రాహ్మణ కన్యను మాదిగవాడి కొడుకు పెళ్ళాడుతాడా అని సనాతనులు ఆగ్రహులయ్యారు. ఈ ఘోరకృత్యాన్ని సహించుతావా అని రాజుని అడిగారు. పెళ్ళి జరిగిన నాలుగో రోజున రాజు హరళయ్యా, మధుపయ్యాలను శిక్షించాడు. శివశరణులు తిరగబడ్డారు. కల్యాణి పాడైంది. రెండు నెలలు తిరగకముందే రాజును శివశరణులు 1196 ఏప్రిల్ 3వ తేదీనాడు హత్య చేశారు. మరో మూడు నెలలకు బసవన్న 1196 జూలై 7వ తేదీనాడు లింగైక్యం చెందాడు.

ఉద్యమాలూ, విప్లవాలూ నెగ్గినా మగ్గినా పద్యం మటుకూ నాటి చరిత్రను భద్రపరుస్తుంది. బసవన్న ప్రచారం చేసిన మతంలోని కొన్ని అంశాలను మల్లికార్జున పండితారాధ్యుడు కూడా ప్రబోధించాడు. ఈ సంగతి అతని రచనలవల్ల తెలుస్తుంది.

పండితయ్యా రచనలలో మనకు లభ్యమయ్యేదల్లా 'శివతత్వసార'మనే 'శతకం' (దీనిని చక్కగా పరిష్కరించి విపులమైన పీఠికతో మొట్టమొదట కొమర్రాజు లక్ష్మణరావుగారు ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో ప్రకటించారు). ప్రతి శతకంలోనూ సంఖ్యా నియమం వుండాలి. పద్యం చివర ఒకే మకుటం వుండాలి. ఈ రెండు నియమాలూ ఇందులో లేవు. గ్రంథంలో 489 కందపద్యాలున్నాయి. వీటిలో 191 పద్యాలకు మకుటాలే లేవు. మిగతా 298 పద్యాలకు రకరకాల మకుటాలున్నాయి. ఏయే మకుటాలు ఎన్నిసార్లు వాడినది అకారాదిగా ఇచ్చిన ఈ పట్టిక చూడండి.

'శివతత్వ సారంలోని'' మకుటాలు

సంఖ్య	మకుటము	పద్యాల సంఖ్య	సంఖ్య	మకుటము	పద్యాల సంఖ్య
1.	అంబారమణ	2	15.	నిరుపమ మహిమా	2
2.	అజా	28	16.	పతివతిలోకా	1
3.	అపారమహిమాధారా	1	17.	పరమానంద	2
4.	ఈశానా	6	18.	పురసంహారా	3
5.	ఉరగాభరణ	1	19.	మహేశా	29
6.	కపర్దీ	3	20.	రాజాభరణా	2
7.	కరుణాంబునిధీ	1	21.	రుద్రా	62
8.	చంద్రధరా	1	22.	విష్ణువరేణ్యా	3
9.	చంద్రాభరణా	1	23.	శివా	135
10.	జితసంసారా	1	24.	సమస్తకామాతీత	2
11.	తత్వాతీతా	1	25.	సమస్త యోగానంద	1
12.	త్రిలోక సేవితచరణా	1	26.	సర్వజ్ఞా	1
13.	దురితారాతీ	2	27.	సర్వానందా	4
14.	నిత్యానందా	1	28.	హరా	1

ఈ పట్టికవల్ల 'శివా' అన్న మకుటం ఒక్కటే శతాధిక సంఖ్య దాటింది. రుద్ర, అజా, మహేశా అనేవి నూరులోపే.

''ఇట్లిందు గొన్నిచోటుల శతకలక్షణము కానరాకున్నను మొత్తముమీద నిది శతకమనియే చెప్పవచ్చును. పూర్వశైవులలో నిది శతకమనియే చెప్పబడుచుండెను. పండితారాధ్య చరిత్రయందు పాలకురికి సోమనాథుడు దీనిని శతకమనియే యనెను.

''శతకంబు శివతత్వసారము దీప
కళికమహానాటకము నుదాహరణ'' (పర్వత, పుట 369)

ఇట్లాంటి యాంధ్రభాషయందు బుట్టిన శతకములలో మొట్టమొదటిదియని చెప్పవలయును. కావ్యములలో ద్వితీయమైనను శతకములలో నద్వితీయమే'' అని లక్ష్మణరావు గారు 'శివతత్వ సారము' పీఠికలో తొలిసారి వ్రాశారు.

అప్పటినుంచి చాలామంది దీనిని శతకం కిందనే పరిగణిస్తున్నారు. కాని ఇది శతకం కాదు. ఈ సంగతి నిడుదవోలు వెంకటరావుగారు 1949 జనవరి 'భారతి'లో మొదట చెప్పారు. 'శతకవాఙ్మయ సర్వస్వము' రచించిన విద్వాన్ వేదం వెంకటకృష్ణశర్మగారు దీనిని ఇలా ఖండించారు; ''పూర్వ విమర్శకులందరు చక్కగా బరిశోధించి శివతత్వ సారము 'శతకమే'యని లాక్షణికముగ సమర్థించి యుండగా, వెంకటరావుగారు కారణములెవ్వియు

జూపకయే 'ఆవిధముగా చెప్పుట పొరపాటు' అని తుండూ తుపాకీ లేకయే కొట్టివేయుట కాధారము సోమనాథుడు శతకమును వేరుగా తన ద్విపదలో జెప్పుటయే. నిజమునకు సోమనాథుడు 'శతకంబు శివతత్త్వసార'మని నుడువుటలో నా గ్రంథమున కది విశేషణముగ నుపయోగించెనని దృష్టియం దుంచుకొన్న యెడల సందియమునకు తావొసంగదు.''

సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో రెండుచోట్ల శివతత్త్వ సారానికి ముందు 'శతకము' అనే మాట వాడాడు కాబట్టి అది శతకమే అని వెంకటకృష్ణశర్మగారి అభిప్రాయం. ఇది పూర్వ విమర్శకులందరు చక్కగా పరిశోధించి తేల్చిన విషయమని వారు ముందుగానే విశ్వసిస్తున్నారు. వాస్తవానికి ఇంకా కొంచెం పరిశోధన అవసరం. నిడుదవోలు వెంకటరావుగారు దానిని కొంత చేశారు. పూర్వ విమర్శకులు చక్కగా పరిశోధించిన దేమిటో చూద్దాము.

సోమనాథుడు 'అనుభవసారం' అనే కృతిలో ''శివతత్త్వసార గద్య పద్య సమితి శివుని మహిమ దెల్పినట్టి మల్లికార్జున పండితయ్యగారి దలతు ననుదినంబు'' అని వ్రాశాడు. ఈ వ్రాతవల్ల శివతత్త్వసారం శతకం కాక గద్యపద్య సమితి అని తేలుతుంది. లక్ష్మణరావుగారు 'గద్య' అను పదము 'హృద్య'కు మారుగ లేఖక ప్రమాదమున బడినదేమో! అట్లుగాక 'గద్యపద్య'మను పాఠమే నిజమగునేని పండితుడు గద్యము నందును నొక శివతత్త్వ సారమును రచించియుండును'' అని అభిప్రాయపడ్డాడు.

సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో పండితయ్య వ్రాసిన కృతులన్నింటిని వివిధ ప్రకరణాలలో, వివిధ స్థలాలలో పేర్కొన్నాడు. వాటి నన్నిటిని మన పూర్వ విమర్శకులు బేరీజు వేశారెగాని ఒక్క సంగతి విస్మరించడంవల్ల 'శివ తత్త్వసారం శతకం' అనే అభిప్రాయం నిలిచిపోయింది. సోమనాథుడు పండితారాధ్య చరిత్ర - వాద ప్రకరణంలో ''శతకంబు శివతత్త్వసారమాదిగను గద్య పద్యంబు లాకాంక్ష జదువుచు'' అని వ్రాసినచోట ఇంకకొంచెం ముందుగా చెప్పిన.మాటలు చూడడం అవసరం.

''క్రమమున 'దక్షాధ్వరంబు' 'న్యాసాష్ట
కమును' 'గణాడంబరము శాభరంబు'
నొత్తిలి చదువుచు నుబ్బుచు జనుచు
నత్తరి భట్లు గైవారంబుసేయ
శ్రుతిపంచగద్యముల్ రుద్రమహిమయు
శతకంబు శివతత్త్వసార మాదిగను''

అన్నాడు సోమనాథుడు. ఇందులో ఆయన పండితయ్యగారి రచనలని పేర్కొన్న దక్షాధ్వరం, గణాడంబరం అనేవి ఇప్పుడు శివతత్త్వసారంలోనే అంతర్భాగాలుగా ఉన్నాయి. వీటిని 300 నంబరు పద్యంనుంచి 319 దాకా 'దక్షాధ్వర ధ్వంసము' అనే శీర్షికతో, 320 నుంచి 347 దాకా 'ప్రళయవర్ణనము-గణాధిపుల యాటలు' అనే శీర్షికతో,

349 నుంచి 381 దాకా 'శివగణవర్ణనము' అనే శీర్షికతో లక్ష్మణరావుగారే మొట్టమొదట ప్రచురించారు. ఆ తరువాత 382 నుంచి 388 దాకా 'సద్భక్తుల మహిమ' అనే శీర్షికను పెట్టారు. ఇందులోని చివరి పద్యం వారి నిశిత పరిశోధన దృష్టినుంచి తప్పించుకొని వుంటుంది. ఆ పద్యంలో తాను అంతవరకు వర్ణించినదేమిటో పండితయ్యగారే సందేహాలకు తావులేకుండా చెప్పారు.

''అరుదుగ బురాణములలో
బరువడి మును సెప్పియున్న భంగి 'గణాడం
బరవిభవము' వర్ణించితి
ధరణీధరవంద్య నా యథాశక్తి శివా!''

అని 385వ నెంబరు పద్యంలో ఉంది. ఇదే గణాడంబరమనే మాట సోమనాథుడు కూడ చెప్పాడు. కాబట్టే నేటి శివతత్త్వసారం వాస్తవానికి శతకం కాక పండితయ్యగారి వివిధ రచనల సముచ్చయం కింద మనకు లభించిందనుకోవాలి. సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో అక్కడక్కడ పేర్కొన్న వాటినన్నిటినీ క్రోడీకరిస్తే పండితయ్యగారి రచనల సంఖ్య 44 దాకా తెలుతుంది.

1. అక్షరగద్య

2. అనామయము	17. పర్వతపదములు	32. రుద్రసహస్రనామము
3. ఆనందగీతములు	18. ప్రభాతపదములు	33. వర్ణాడంబరము
4. ఆనందపదములు	19. బసవగీతములు	34. వాలేశుపదములు
5. ఉదాహరణములు	20. బాణగద్య	35. వెన్నెలపదములు
6. గణవర్ణణపదములు	21. భీమేశుగద్య	36. శంకరగీత
7. గణాడంబరము	22. భృంగీ స్తవము	37. శంకరపదములు
8. గీతసూక్తములు	23. మయూర స్తవము	38. శతకము
9. గొబ్బిపదములు	24. మిలయరాజీయము	39. శారభము
10. తుమ్మెదపదములు	25. మలహణము	40. శివతత్త్వసారము
11. దక్షాధ్వరము	26. మహానాటకము (లు	41. సంజవర్ణణ (ము
12. దీపకళిక	27. మహాస్తోత్రసూత్రము	42. సంసారమాయాస్తవ
13. నివాళిపదములు	28. మహిమ్న స్తవము	43. హరలీల
14. నీలకంఠ స్తవము	29. ముక్తకములు	44. హలాయుధము
15. న్యాసాష్టకము	30. మౌనిదండకము	
16. పంచగద్యములు	31. రుద్రమహిమ (లు	

ఈ పట్టికలో కొన్ని పునరుక్తాలు అయినట్టు తోచక మానదు. అక్షర గద్య, బాణగద్య భీమేశుగద్య బహుశా పంచగద్యలలో చేరి వుంటాయి. అలాగే గణాడంబరం, గణవర్ణన పదములు ఒకటే కావచ్చు. ఆనంద గీతములు, ఆనంద పదములు కూడ ఒక రచనకే రెండు పేర్లేమో! ఇంకా కొంత పరిశోధన చేస్తేనే గాని పండితయ్య రచనల లెక్క ఇంత అని తేల్చి చెప్పడానికి వీలులేదు. ఆ సంఖ్య ఎంతైనా, అన్ని గ్రంథాల సముచ్చయంలో మనకు దొరికినది శివతత్త్వసారమే అయినా ఇతర రచనల గురించి కొంత కాకపోతే కొంతైనా తెలుసుకోవడానికి ఆస్కారం లేకపోలేదు.

మాటవరసకు – పండితయ్యగారు 'భీమేశుగద్య' రచించారని చెప్పాడు గదా సోమనాథుడు – ఇదేమిటి? ఏ భాషలో వ్రాసినది? అని ప్రశ్నించి పరిశోధనలు చేస్తే గద్యకు పీఠికగా సంస్కృత శ్లోకం ఉందని తెలుస్తుంది. దీని మొదటి పదం 'యత్ సంవిత్తి' అని కూడ తెలుస్తుంది. ఈ శ్లోకంలో తప్పులున్నాయని ప్రతిపక్షులు ఆక్షేపిస్తే దీనిని కాశీకి పంపించారని తెలుస్తున్నది. చూడండి – మహిమ ప్రకరణంలో సోమనాథుడు ఈ విషయం గురించి ఎంత వ్రాశాడో!

''భీమేశు పద్యంబు పీఠికయైన
శ్లోకంబు తప్పుగా గైకొని వావ
దూకులు దారు నిరాకరించుడును
వారణాసికి సాక్షి గోరి యాశ్లోక
మారంగ గౌళభట్టారకు కడకు
బనుప 'యత్సంవిత్తి' యనిన శ్లోకాది
బొనరు నాల్గక్షరంబులకు భాష్యముగ
వెరవున నాలుగువేల గ్రంథంబు
విరచించి కర్తగా హరు ప్రతిష్ఠించి
శేషాక్షరార్థ మా శేషుడైనను వి
శేషించి యిట్లని చెప్పలే డనుచు
ధీరుడు గౌళభట్టారకు డతుల
భూరియశుడు వ్రాసి వుత్తేర దార
చదివి సిగ్గిలి తర్కజాలంబు లుడిగి
మదమేది బౌద్ధులు మగుడ రేనాడు
మరియేల తొరలేని మల్లికార్జునుని
దొరలిపో గెలువంగ?'' (మహిమ, పుటలు 6–7)

దీనివల్ల పండితయ్య వ్రాసిన ఒక్క శ్లోకానికే నాలుగువేల గ్రంథం భాష్యమున్నట్లు కొత్తగా తెలుస్తున్నది. సంస్కృత భాషలో గ్రంథం అంటే 32 అక్షరాల పద్యసముదాయం. పండితయ్యగారి కాలంలో కాశీలో గౌళభట్టారకుడనే ఏ ప్రసిద్ధపండితుడున్నాడో, అతని

రచనలేమిటో పరిశోధిస్తే మరికొన్ని కొత్త విషయాలు పండితయ్యగారి రచనల గురించి తెలుస్తాయేమో!

ఇతర రచనల గురించి భావి పరిశోధనలు ఏమి చెప్తాయోగాని శివతత్వసారం గురించి బహిరంగ, అంతరంగ సాక్ష్యాలవల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. అసలు ఈ శివతత్వసారాన్ని పండితయ్య వ్రాయడానికి కారణాన్ని సోమనాథుడు చెప్పనే చెప్పాడు. 'వీరమాహేశ్వరచారమార్గానుసారి'యై 'కేవల భక్తిగతి ప్రతిష్ఠించ'డానికే ఆయన శివతత్వసారం ఆనాటి శివభక్తుల 'మాన్యువల్' అతివాద పార్టీ క్రమశిక్షణ స్మృతిలాంటిది. అందులో ఏమేమి చెప్పారో చూద్దాం.

1. శివభక్తులను చూచి జాతి మొదలైనవి అడగడం మానెయ్యాలి. (ప. 121)
2. శివభక్తులకు జబ్బు చేసినా, లేమి వచ్చినా, భయం కలిగినా ఆదుకోవాలి. తప్పకుండా వాళ్ళకు మేలు చేయాలి. (122)
3. రొంపిలో పుట్టినా పద్మం చాలా పూజ్యమైనట్టు ఎలాంటి కీడు కులంలో పుట్టినా శివభక్తుడు గొప్పవాడే. (130)
4. కులం తక్కువవాడే శివభక్తుడైనందువల్ల గొప్పవాడవుతున్నప్పుడు కులమున్న వాడైతే ఇక చెప్పేదేముంది? బంగారానికి తావి అబ్బినట్టే! (133)
5. బ్రాహ్మణులు ఎలాగైతే వధకు అనర్హులో శివభక్తులు కూడా అనర్హులే. (213)
6. భర్త శివభక్తుడు కాకపోతే అవమని భార్య బుద్ధిచెప్పాలి. అతడు అలా కాని పక్షంలో అతణ్ణి వదిలివెయ్యాలి.
7. శివుణ్ణి పూజించే భార్య, భక్తుడు కాని భర్త చిత్తం వచ్చినట్టు నడుచుకోవలసిన అవసరం లేదు. పురుష ప్రతికూలత్వం వల్ల ఆ సతికి దుర్గతి లేదు. (231-233)
8. శివభక్తులు కానివాళ్ళు ఎంత పెద్దవాళ్ళయినాసరే కాళ్ళకు దండం పెట్టగూడదు. వాళ్ళు నమస్కరించినా దానిని స్వీకరించరాదు. (262).
9. శివభక్తులు కానివాళ్ళవద్ద అప్పుచెయ్యగూడదు; వాళ్ళకు అప్పు ఇవ్వకూడదు. వాళ్ళను చూడగూడదు. వాళ్ళతో సరదాగా మాట్లాడగూడదు.
10. వాళ్ళతో సమానంగా ఒకదగ్గర పడుకోగూడదు. వాళ్ళతో సమానంగా ఒక ఆసనంపైన కూర్చోగూడదు. వాళ్ళ సహవాసం చెయ్యకూడదు. (263-264)
11. శివనింద చేసే పాపులను ఆలోచించకుండా చంపివెయ్యాలి. శివనింద చేసే అవమానకరమైన పుస్తకాలను విచారించకుండా తగలబెట్టివెయ్యాలి. ఆ పుస్తకాలను చెప్పినవాణ్ణి చంపివెయ్యాలి. (275-276).
12. శివభక్తుడు చేసిన పాపమైనా పుణ్యమే అవుతుంది. శివభక్తులు కానివాళ్ళు చేసిన పుణ్యమైనా పాపమే అవుతుంది.
13. శివభక్తుల దుర్గుణాలను వెదికేవాడు చండాలుడు. (286)

ఇలాంటి విద్వేషపూరితమైన మతాన్ని ప్రచారం చేసి అందులో చెప్పినట్లే అక్షరాలా నడుచుకొన్నవాడు ఎంతటి పండితుడైనా మహాభయంకరుడు. తెలుగుదేశంలోని కొన్ని ఇతర మతాల పుస్తకాలను తగలబెట్టిన అపకీర్తి పండితయ్య జీవితంలో తీరని కళంకం. సాత్విక భక్తిని కాక తామస ప్రవృత్తిని ప్రచారం చేయడం ఆనాటి పరిస్థితులవల్ల జరిగిందని ఈనాడు మనం క్షమాపణ చెప్పుకోవలసిన అవసరం లేదు. పండితులైనవారు పామరులలోని పాశవిక తత్వాన్ని మచ్చిక చేసుకొని సాధుమార్గంలో పెట్టాలి కాని మొండిభక్తిని బోధించడం తప్పు.

పండితయ్య ప్రచారం చేసిన మొండిభక్తి ఇంతా అంతా కాదు. శివభక్తితో తరిగిన తలలు మళ్ళీ అతుకుకొంటాయట. కోసిన నాలుకలు మళ్ళీ వస్తాయట. ఈశ్వర భక్తులు సద్యః ప్రతాపులట. పుచ్చిన కళ్ళు మళ్ళీ వచ్చేస్తాయట. దేహం తొడిసి ద్రవ్సిన పుండు చెచ్చెర తేరుకొంటుందట. ఇటువంటి 'వీరభక్తి'కి రావణాసురుడు తన తలలు తరిగి ప్రోగులు పెట్టినందువల్లనే దేవేంద్రుణ్ణి జయించాడట. ఇలాంటి ప్రచారం సాగినందువల్లనే జనులు వీరశైవులై, ఆవేశపూరితులై ఆత్మబలిదానాలు చేయటం మొదలుపెట్టారు. 'తలపండు' ఇచ్చినవాళ్ళు వీరులు. వీళ్ళ జ్ఞాపకార్థం వీరగల్లులు ప్రతిష్ఠించడం ఆచారం. వీరపూజకు వీరగుడ్డములను అభిమానులు కట్టించేవారు. బాకులతో కడుపులు కోసుకొంటున్నట్లూ, కత్తులతో తలలు కోసుకొంటున్నట్లూ చెక్కిన శిలాప్రతిమలు నేటికీ గ్రామాల పొలిమేరలలో కనబడుతూ వుంటాయి. ఆత్మబలి నిజంగా పండిపోయిన 'మెసోకిజం' (Masochism). ఆత్మహింసలో ఆనందం పొందడం ఒక రుగ్మత. వీరశైవులు ఇటు ఆత్మహింసా చేసుకోగలరు, అటు పరపీడనా చేయగలరు.

శైవేతరులను పీడించడం, దండించడం పండితయ్యగారు గొప్పగా కీర్తించారు. దక్షాధ్వరధ్వంసంలోనూ, గణాడంబరంలోనూ ఆయన వర్ణించిన శివగణాల చర్యలన్నీ ఆనాటి వీరశైవుల సాహసాలకు వరవళ్ళు. శివభక్తులు కాని ఆడవాళ్ళను హింసించడం కూడ పండితయ్య దృష్టిలో ఒప్పే.

మారారిద్రోహునింటికి
బేరంటము వచ్చి తనుచు బెలుచను గోసెఁ
వైరమున నదితిముక్కును
భారతినాసికయు వీరభద్రుడు రుద్రాః (309)

స్వాహాపతిభామినియగు
స్వాహాంగన ముక్కు, నెడమ చనుమొనయు దగఁ
సాహసముతోడ జిదిమిన
బాహుబలం బొప్పె వీరభద్రునకు శివా! (314)

అని ఆయన కీర్తించారు.

కన్నడ దేశంలో వీరశైవాన్ని ప్రబోధించిన బండారు బసవయ్యకూడ యింత నిర్దాక్షిణ్య దృక్పథాన్నే అలవరచుకొన్నాడు. 'శివపసాయిత' మనే ఖడ్గాన్ని పట్టుకొని మరీ ప్రబోధించాడు (పైగంబరు మహమ్మదుకూడ కత్తి పట్టుకొని మత ప్రచారం చేశాడన్నది గుర్తు తెచ్చుకోదగ్గ విషయం). బండారు బసవన్న జాతి భేదాలను రూపుమాసి సామాన్య ప్రజలకు ఆత్మగౌరవాన్ని యిచ్చే దారి తొక్కినందుకు ప్రశంసనీయుడే. ఇటు కులరహితమైన మతాన్ని నెలకొల్పడానికి తెలుగుదేశంలో పండితయ్యకు ముందు ఇతర శైవాచారపరులు ప్రయత్నిస్తూనే వచ్చారు. వందయేళ్ళ ముందు బెజవాడలో శ్రీపతి పండితుడు మాల ఇంట భోంచేశాడు. అందుచేత తనను వెలివేసి తనకు నీళ్ళు పుట్టనివ్వకుండా చేసినవాళ్ళకు నిప్పుపుట్టకుండా చేశాడు. ఉత్సాహంలో వివిధ కులాలవాళ్ళు విభేదాలను మరచిపోయి ఒక ఉమ్మడి నమ్మకాన్ని అలవరచుకొన్నారు. ఇటువంటి విశాల దృక్పథంలోనే వీరశైవాన్ని పండితయ్య యౌవనంలో స్వీకరించి వుండవచ్చునుగాని అతడు ఏటికెదురీదలేకపోయాడు.

జందెము తీసి, జాతిని విడిచి వచ్చి తనలో కలియవలసినదిగా బసవయ్య పండితయ్యను కోరినట్లూ, దానికి పండితయ్య సమాధానం చెప్పి పంపించినట్లూ ఇందాక చెప్పుకొన్నాం. పండితయ్య చెప్పిన సమాధానం ఏమిటంటే, ''భక్తిమీద వలపు బ్రాహ్మణ్యంబుతో బొత్తు బాయలేను నేను బసవలింగ!'' అన్నదే. ఇవాళిటి కమ్యూనిస్టుల పరిభాషలో చెప్పాలంటే పండితయ్య 'డీ-క్లాస్' అవలేకపోయాడు. తన వర్గాన్ని విడిచి విస్తృత ప్రజానీకంతో కలియలేకపోయాడు. ఒకరకంగా అతని సంస్కృత సంస్కారమే దీనికి అడ్డువచ్చి ఉంటుంది.

పండితయ్య వేదవేదాంగాలూ, శాస్త్రాలూ ఉడ్డోలంగా చదువుకొన్నాడు. సంస్కృత వ్యాకరణం క్షుణ్ణంగా అభ్యసించాడు. 'పశుపతి' అనే మాటను అతని ప్రతిపక్షులు వ్యాకరణరీత్యా వెక్కిరించారు. 'పశువులనబడే ఇతర దేవతలే శివునకు పతులు' అని వాళ్ళు విపరీతార్థం చేశారు కాబోలు. దానికి సమాధానంగా ఈ పద్యాలు చెప్పాడు.

''పతి రుద్రుడు పశువుల కని
శ్రుతి చెప్పుచు నునికిజేసి రుద్రుడు పతిత
క్కితరులు పశువులు పొమ్మని
మతిలో నెరిగితి శ్రుతి ప్రమాణమున శివా!

పూని యతద్గుణసంవిద్
జ్ఞానబహువ్రీహి మాన్ప జనుదెంచెన్ యణ్
మానితషష్ఠీతత్పురు
షానూనసమాస మెరుగ రజ్ఞులు రుద్రా!''

'పశుపతి' అనే సమాసం బహువ్రీహి కాదు. ''పశూనాం పతిః పశుపతిః (షష్ఠీతత్పురుషం). పశుపతేరిదం పాశుపతం (పశుపతి+అణ్)'' అని భావం.

వ్యాకరణ విషయాలనే కాదు. శ్రుతిస్మృతిపురాణాలలో ఉన్న సంస్కృత సమాసాలనుకూడ కందపద్యాలలోకి దించడం పండితయ్యకు నల్లేరుమీద బండి నడక. ''న కర్మణా, న తపసా, న జపై, ర్న సమాధిభిః'' అనే సంస్కృతోక్తులు పద్యంలోకి ఎలా దింపినదీ చూడండి.

''క్షుమతి జిత్రము జితచి
త్తసంభవా! 'నకర్మణా నతపసా నజపై
ర్న సమాధిభి' రవ్యయ! నీ
యసదృశ భక్తికిని బ్రియుడ వగు దీశానా!'' (111)

ఉదాహరిస్తున్న సంస్కృత ప్రామాణిక వచనాలను యథాతథంగా తెలుగు ఛందస్సుకు పొదగడం పండితయ్యను చూచే పాలుకురికి సోమనాథుడు నేర్చుకొన్నాడు. అల్లసాని పెద్దనగారిదాకా ఇది సాగుతూనే వచ్చింది. పెద్దనగారు ''దుర్బలస్యబలం రాజాం'' మొదలైన సంస్కృతోక్తులను వాడారు. పండితయ్య సుదీర్ఘమైన సంస్కృత సమాసాలను కూడ తెలుగులో జాతిచ్ఛందస్సులలోనికి దింపాడు.

1. దురితారిభవచ్చరణాబ్జ భక్తిలలనా పరవశ భావము, 2. షట్త్రిం శత్పరోర్వపరిగత జగత్ప్రభవహేతు జగన్నిర్వాణ సోమరూపము మొదలైన 'అద్భుతమైన సమాసాలను' వేదము వెంకటకృష్ణశర్మగారు 22 క్రోడీకరించారు.

సంస్కృతం ఎంత బాగా వచ్చో తెలుగు నుడికారం కూడా పండితయ్యకు అంత బాగానూ తెలుసు. మసిపాతను కట్టిన మాణిక్యం, ఓడున పోసిన నీళ్ళు, బంగారానికి తావి అబ్బడం, పువ్వులవల్ల నారలు తలకెక్కడం మొదలైన సామెతలు అతని కాలంలో ఉండే పద పాదాలలో కనిపిస్తాయి. 'బ్రతుకుజీవుడా!' అనీ', 'బ్రతికిపోయాను!' అనీ ఇవాళ మనం వాడుకొంటాం.

భక్తుల దవ్వుల గని శివ
భక్తులు వచ్చిరని పొంది బ్రతికితి నని పో
భక్తుల కెదురేగి యథా
శక్తిస్థితి జేయవలయు సత్క్రియలు శివా! (140)

అని పండితయ్య ఈ జాతీయాన్ని ఆనాడే వాడాడు. 'అంటీముట్టని' అనే మాటసొంపు ఇంకొక పద్యంలో వాడాడు. (478)

పండితయ్య ఈ గ్రంథంలో వాడిన పదాలు కొన్ని నేడు ప్రచారంలో నుంచి వైదొలగాయి. కొన్ని నిఘంటువులకు ఎక్కలేదు. ఇటువంటి విచిత్ర పదాల పట్టిక ఒకటి చూడండి.

పండితారాధ్యుని విలక్షణ పదాలు

అకజుడు
అతకడచిన = అతిక్రమించిన
అతగులు = బలహీనులు
అన్నడు = ఆనాడు
అన్నడే = ఆనాడే
ఆలరి = దుశ్శీలుడు
ఆలావు
ఎయిదడు = పొందలేడు
ఎయిదు = పొందు
కరకంఠుడు = శివుడు
కొందఱ్
కోలెమ్ముం
గొరలడే
తర్ధయు
త్రిప్పటము
దీర్ఘాయని = దీర్ఘాయువని
దేవలకుడు
నిరాణ = స్వచ్ఛమైన
పరిమాల్చుడు
పాదఱి = అధముడు
పానలు = సందేహము
పినుగులు
పొసపరి = పట్టుపట్టి
ప్రమితి = యథార్థజ్ఞానము
బడరుడు = దేవుడు
బతరుండు
బత్తళి = నగ్నత్వము
బదసిన
బనబములు
బిలబిలి
బ్రమడియిల్లు
బ్రహ్మోక్త = వేదములలో చెప్పబడిన
భూతిశాసనధరుడై = భూతశాసనధరుడై
మంద్రేయేనిఙ్ = బ్రతుకదలచితిరేని
మడది
మఱివెండి = మఱిమఱి
మహాదేవి
మిడిచి
ముద్దటులు = పిడుకలు
మెయి = ప్రీతిమెయి
మెరయలు
రట్టుళ్ళు = రెడ్లు
వక్కడు
వక్కండు = కృశింపతగ్గడు
వడ్డణము
వరవుడు = దాసి
వఱ్ఱుగ
వలచిన = సువాసనకొద్ది
వహిత్రంబు
వాచికొను
శబ్దంబున = ఉపనిషద్వాక్యములవలన
సూడుపట్టె = పగపట్టె
హ్రొబ్బని

ఈ పదాలలో 'అన్నడు' అనే పదం ఒకటి వ్యాకరణ విశేషాన్ని చూపిస్తుంది. ఏ+నాడు = ఎన్నడు అనేది నేడు మనం సర్వసాధారణమైన మాటగా గుర్తించాం. ఈ 'అన్నడు' కూడ ఆ+నాడు = అన్నడు అనే పదరూపం తెలియజేస్తుంది. 'కొందరు' అనే మాటలో తుది ఉకార లోపంతో 'కొందర్' అని 367-వ పద్యంలో ప్రయోగించాడు. పండితయ్య ఒక్కమాట ఇలా ప్రయోగిస్తే పాల్కురికి సోమనాథుడు 'అనియెదర్, కొనినవార్' మొదలైన మాటలు పది పన్నెండు వాడాడు.[5]

5. పండితారాధ్య చరిత్ర, చిలుకూరి నారాయణరావుగారి పీఠిక. పుట. 178.

శివతత్వసారంలోని కొన్ని ప్రయోగాలు నేటి వ్యాకరణానికి లొంగవు. అందుచేత ఆ పాఠాలను మార్చివేయడానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయిగాని అదృష్టవశాత్తూ ఈ గ్రంథం ఇరవైయవ శతాబ్దంలో ప్రచురణ పొందబట్టి ఛాందస వైయాకరణుల ఔదార్యాన్ని ఇది తప్పించుకొని ప్రాచీన సంప్రదాయాన్ని మనకు తెలియజేయగలుగుతున్నది. వ్యాకరణ విశేషాలేకాక ఛందోవిశేషాలు కూడ గమనించదగినవే. సిద్ధ 'ణ' కారానికి నకారముతో ప్రాస చెల్లదని లాక్షణికుల మతం అయినా పండితయ్య ప్రయోగాలు 3 దొరుకుతాయి.

1. జ్ఞానస్వరూ... తా, ర్యా_ణం (బది) (47)
2. సం, త్రాణగతి స్వామిభృత్య, జ్ఞానంబున (67)
3. గుణవత్పాత్రుల బూజిం, చిన (137)

ఇలాగే 100, 114, 115 నంబరు పద్యాలలో అఖండయతి, 196, 317, 320, 444 నంబరు పద్యాలలో పలపల గిలక ప్రాస, 247నంబరు పద్యంలో రేఫ సంయుక్త పూర్వాక్షర లఘుత్వం కనబడతాయి. 148, 158 నంబరు పద్యాలలో యతిభంగం కనబడుతుంది.

విచిత్ర పదాల ప్రయోగం, వ్యాకరణ విరుద్ధాల అస్తిత్వం, ఛందోవిశేషాల ఉపయోగం చూపించినంతమాత్రాన ఒక కవియొక్క ప్రాశస్త్యం తెలియదు. సార్వజనీనమైన రసానందం సార్వకాలికంగా కలిగించగలిగినవాడే ఉత్తమ కవి. పండితయ్య ప్రచార కవులకు ఆద్యుడు. వస్తుప్రదర్శనశాలలో అపురూపమైన వస్తువులను చారిత్రక జ్ఞానంకోసం ఎలా నిలుపుకోవాలో అలాగే పండితయ్య రచనను సాహిత్యంలో భద్రపరచాలి.

ప్రత్యేకమైన అభిమానం కలవాళ్ళకూ, సాహిత్య పరిశోధకులకూ, ఇది బహుళంగా పనికివచ్చే పుస్తకం. దీనివలన ప్రయోజనము అంతే.


కాకతీయ యుగం

చరిత్ర తెలియని సామాన్యుడు సైతం రుద్రమదేవి పేరును సగర్వంగా చెప్పుకొంటాడు. ప్రతాపరుద్రుని పేరు వినే ఉంటాడు. ఈ ఇద్దరు సుప్రసిద్ధ వ్యక్తులూ ఏ రాజవంశానికి చెందినవారో ఆ కాకతీయుల పేరిటనే ఒక సాహిత్య యుగాన్ని మనం ఇప్పుడు చదువుకోబోతున్నాము.

ఏకచ్ఛత్రాధిపత్యం కింద ఇంచుమించు నేటి తెలుగు దేశమంతటినీ పరిపాలించిన వారు కాకతీయులే. వీళ్ళ రాజ్యం క్రీ.శ. 900-912కు మూడు తరాల ముందే ప్రారంభ మయింది. కాని ఇది మహాసామ్రాజ్యమయింది క్రీ.శ.1200 తరువాతనే. అందుచేత ఈ యుగాన్ని మనం ఆ తారీఖు నుంచే లెక్కించుకుందాం. క్రీ.శ. 1323లో ఈ వంశంలోని ఆఖరు రాజు ప్రతాపరుద్రుడు ఢిల్లీ సైన్యాలకు పట్టుబడడంతో ఈ మహాసామ్రాజ్యం అంతరించింది. కాబట్టి కాకతీయ యుగం క్రీ.శ. 1200 నుండి 1325 దాకా అని ఉజ్జాయింపుగా పరిగణిద్దాం. ఈ వంశంలోని పాలకుల పట్టిక ఇది.

1.	ముమ్మడి గుండన	క్రీ.శ. 900-912
2.	ఎర్రన	క్రీ.శ. 912-950
3.	మొదటి బేతన	క్రీ.శ.
4.	పిండి గుండన	క్రీ.శ. 950-990
5.	ఇమ్మడి బేతన	క్రీ.శ. 950-1050
6.	ప్రోలన	క్రీ.శ. 1055-1075
7.	ముమ్మడి త్రిభువన మల్ల బేతన	క్రీ.శ.1075-1098
8.	త్రిభువన మల్ల దుర్గరాజు	క్రీ.శ.1098-1115
9.	ఇమ్మడి ప్రోలరాజు	క్రీ.శ. 1115-1150
10.	రుద్రదేవ మహారాజు	క్రీ.శ.1150-1195
11.	మహాదేవరాజు	క్రీ.శ.1196-1199
12.	గణపతిదేవ చక్రవర్తి	క్రీ.శ.1198-1262
13.	రుద్రమదేవి	క్రీ.శ.1262-1291
14.	ప్రతాపరుద్రుడు	క్రీ.శ. 1291-1323

ఈ ఏలికలందరూ దుర్జయ వంశంవారు. తెలుగునాట రాజ్యంచేసిన వెలనాటి చోళులు, చాగివారు, కొండపడమటివారు, వెలమవారు, విరియాలవారు మొదలైన


కాకతీయ సామ్రాజ్యము
గణపతి చక్రవర్తి కాలము
సింహళము

చాలామంది తాము దుర్జయ వంశజులమనే చెప్పుకొంటారు. వీరందరూ ఒకే వంశ పురుషుని సంతతివారో కాదో చెప్పలేం.

ఇప్పుడు ఇచ్చిన పట్టికలోని మొదటి ఏలిక ముమ్మడి గుండన ముత్తాత వెన్నరాజు కాకతీయుల రాజ్యస్థాపకుడని చెప్పుకోవచ్చు. ఇతని కాలనిర్ణయం ఇదమిత్థం అని చరిత్రకారులు తేల్చలేదు. ఈ రాజు కాకతి నుండి రాజ్యం చేయడం వల్ల ఈ వంశం వారిని కాకతీయులని పిలుస్తారు. జగ్గయ్యపేట ప్రాంతంలో దొండపాడు దగ్గర కాకతమ్మ బీడు, కాకతి రామచంద్రపురం అనే ప్రదేశాలున్నాయట.[1] ఈ వంశంవారికి కాకతమ్మ అనే గ్రామదేవత ఆరాధ్యదైవం. ఈ కాకతమ్మకు ఏకవీర సైదోడు.

ఏకవీరాదేవిని ఇప్పటికీ నాందేడ్ జిల్లాలోని కందహారుపురంలో ఆరాధిస్తూ ఉంటారు. కాకతీయుల రాజ్యస్థాపకుడు వెన్నరాజు ఆ ఊరి నుంచే వచ్చాడనీ, తనతో తమ ఆరాధ్య దైవాన్ని తీసుకువచ్చాడనీ చరిత్రకారులు భావిస్తారు. ఎక్కడి నుంచి వచ్చినా దుర్జయ సంతతికీ, సామంత విష్టి వంశానికీ చెందిన కాకతీయులు తెలుగునాట స్థిరపడ్డారు. తొలుత గరుడ లాంఛనులయినా తర్వాత వరాహ లాంఛనులయ్యారు. నాలుగు శతాబ్దాలపాటు ఈ వంశంలోని పధ్నాలుగు మంది వివిధ పీఠాల నుండి పాలించారు.

ఇక ఇప్పుడీ ఏలికల గురించి విడివిడిగా కొంచెం తెలుసుకొందాం. కాకతీయ వంశంలోని ఆది పురుషులు క్రీ.శ. 10వ శతాబ్దంలో నేటి వరంగల్లు జిల్లాలోని గూడూరు ప్రాంతాలను పాలిస్తూ వేంగీ చాళుక్యులకు సామంతులుగా ఉండేవారు. ఆ శతాబ్దం చివరి పాదంలో చాళుక్యరాజ్యం అల్లకల్లోలమయింది. రాజ్యం కోసం అన్నదమ్ములు పరస్పర యుద్ధాలు, హత్యలు, కుట్రలు కావించుకొన్నారు. ఈ అంతఃకలహాల అదనులో సామంతులు స్వతంత్రం ప్రకటించుకొన్నారు. ఒక సామంతుణ్ణి ఇంకొక సామంతుడు కబళించి పెద్దరాజ్యం ఏర్పరచుకోవడానికి ప్రయత్నాలు చేశారు. ఈ పరిస్థితుల్లో కాకతిరాజ్యం ఏర్పడింది. రెండవ బేతరాజు ఈ విధంగానే స్వతంత్రించి రాజైనాడు. అనుమడు, కొండడు అనే ఇద్దరిని నిర్జించి అనుమకొండను జయించాడు. ఇతనిది గరుడాంకం. అందుచేత ఇతణ్ణి గరుడ బేతరాజు అని కూడా పిలుస్తారు. ఇతని శత్రువులు ఇతణ్ణి గద్దె నుంచి కదిలింపజూశారు. అయితే విరియాల ఎర్రన, అతని భార్య కామసాని మొదలైనవాళ్ళు శ్రమించి శత్రువులను నిర్మూలనం చేసి బేతరాజును కొరవి దేశానికి అభిషిక్తుణ్ణి చేశారు. ఈ కామసాని వేయించిన ఒక పద్యమయ శాసనం గురించి మనం 'చాళుక్య యుగం'లో చెప్పుకొన్నాం. కామసాని కోటిచేసే కాకతిని నిల్పింది. కాకతీయ రాజ్యానికి ఇది అంకురార్పణ.

క్రీ.శ. 1055లో మొదటి ప్రోలరాజు రాజ్యానికి వచ్చాడు. ఇతని పూర్వుడు వేంగీచాళుక్యుల నుంచి స్వతంత్రిస్తే ఇతడు కల్యాణీ చాళుక్యుల నుంచి అనుగ్రహం సంపాదించాడు. వాళ్ళకు సామంతుడై సబ్బినాడులోని అనుమకొండను సంపాదించాడు.

1. కాకతి మైలాంబ బయ్యారం చెరువు శాసనం - పి.వి. పరబ్రహ్మశాస్త్రి, భారతి, ఏప్రిల్ 1967.

తన ప్రతిభతో కాకతీయ రాజ్యానికి సుస్థిరమైన పునాదులు వేశాడు. ఇతని తరువాత రెండవ బేతరాజు రాజ్యానికి వచ్చాడు.

క్రీ.శ. 1075లో రాజ్యానికి వచ్చిన ముమ్మడి బేతరాజు తన పూర్వుడు కల్యాణి చాళుక్యులకు సామంతుడైతే, తాను, వాళ్ళు అంతఃకలహాలలో ఉన్న అదను చూసి స్వతంత్రుడవడానికి ప్రయత్నించాడు. కాని ఆ రాజవంశంలో ఒక బలవంతుడు చక్రవర్తి కాగానే అతనికి దయాపాత్రుడై సబ్బినాడులో 1000 గ్రామాలకు ఆధిపత్యం సంపాదించాడు. త్రిభువనమల్ల, విక్రమచక్రి, మహామండలేశ్వర, చలమర్తిగండ మొదలైన బిరుదులతో ముమ్మడి బేతరాజు కల్యాణీ చాళుక్యుల సామంతుడుగా పరిపాలించాడు. ఈ రాజు కాలందాకా తెలంగాణాలో జైనమతం విస్తారంగానే ఉండేది. ఇతడు శైవదీక్ష పుచ్చుకొన్నాడు. ఇతని గురువు కామేశ్వర దీక్షితుడనే మహాశైవుడు.

ముమ్మడి బేతరాజు తర్వాత క్రీ.శ. 1110లో రెండవ ప్రోలరాజు రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో చుట్టుపక్కల రాజ్యాలన్నీ అల్లకల్లోలమయినాయి. సమయం చూచుకొని ఇమ్మడి ప్రోలరాజు తన రాజ్యాన్ని అన్నిపక్కలా విస్తరింపజేశాడు. దక్షిణాన కొండపల్లి ప్రాంతాన్ని, ఉత్తరాన మంత్రకూటాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. తూర్పు నుంచి వేములవాడ రాజులు దండెత్తితే అణచి వేశాడు. యుద్ధాలు చేసి రాజ్యాన్ని విస్తరించిన ఈ రాజు చివరకు యుద్ధంలోనే వీరమరణం పొందాడు.

క్రీ.శ. 1150లో రెండవ ప్రోలరాజు మరణానంతరం అతని కుమారుడు రుద్రదేవ మహారాజు రాజ్యానికి వచ్చాడు. ఇతనికి కూడా తండ్రిలాగే యుద్ధాలంటే ప్రీతి. రాజ్యాన్ని విస్తరించడమే ఇతని ఆశయం. తొలుత ఇతడు గోదావరి, కృష్ణా మండలాలదాకా తన ప్రభుత్వాన్ని వ్యాపింపజేశాడు. ఇతని కాలంలోనే ఇటు వేంగీచాళుక్య రాజ్యం, అటు కల్యాణీ చాళుక్యుల ప్రభుత్వం అంతరించాయి. రుద్రదేవుడు క్రమేపీ తన రాజ్యాన్ని తూర్పున సముద్రందాకా, పశ్చిమాన కల్యాణిదాకా, ఉత్తరాన మాల్యవంత పర్వతందాకా, దక్షిణాన శ్రీశైలం వరకూ విస్తరింపజేశాడు. అనుమకొండ నగరం చాలక, ప్రక్కనే ఓరుగల్లు దుర్గాన్ని నిర్మించాడు. మహావీరుడైన రుద్రదేవుడు క్రీ.శ. 1196లో దేవగిరి యాదవులతో జరిగిన యుద్ధంలో మరణించాడు.

రుద్రదేవుని తరువాత అతని సోదరుడు మహాదేవరాజు రాజ్యానికి వచ్చాడు. తన అన్న మరణానికి కారణభూతులైన యాదవులపై కత్తికట్టి ఏనుగులను తోలించుకొని వచ్చాడు. ఇతడు గజయుద్ధంలో నేర్పరి. ఇతనితో ఇతని కుమారుడు గణపతి దేవుడు కూడ యుద్ధానికి వెళ్లాడు. యుద్ధంలో తండ్రి మరణించాడు; కొడుకును యాదవులు బందీ చేశారు. వాళ్ళ చెరసాలలో ఇతడు రెండు మూడు సంవత్సరాలు ఉన్నాడు. తర్వాత విడుదల పొందాడు.

ప్రముఖులూ, ప్రాభవం

గణపతి దేవుని పరిపాలన వాస్తవానికి క్రీ.శ. 1200 నుంచి ప్రారంభమైందనుకోవాలి, ఇతడు తన సర్వతోముఖ ప్రతిభతో మహాసామ్రాజ్యాన్ని స్థాపించి దానికి చక్రవర్తి అయినాడు. దాదాపు నేటి ఆంధ్రదేశమంతా అతని ఏలుబడిలోనికి వచ్చింది. ఇతడూ, ఇతని తర్వాత సామ్రాజ్యాన్ని పాలించిన ఏలికలూ కాకతీయ యుగంలో ప్రముఖులు.

గణపతిదేవుని తర్వాత అతని కుమార్తె రుద్రమదేవి సింహాసనమెక్కింది. కాకతీయ రాజ్యంలో తొలినుంచీ స్త్రీలకు సమానమైన ప్రాముఖ్యం ఉన్నది. కాకతిని ఆదిలో నిలిపింది ఆడది. విరియాల కామసాని పాటుపడి నిలబెట్టిన ఈ రాజ్యంలో ఇంకొక మహిళ రాణిగా విశాల సామ్రాజ్యాన్ని పాలించడంలో ఔచిత్యముంది. రుద్రమదేవి పేరు చెపితేచాలు, అప్పుడు పుట్టిన బిడ్డకు కూడా ఒళ్ళు పులకరిస్తుంది.

తన తరువాత రాజ్యానికి వచ్చే తన కుమార్తె రుద్రమదేవికి తగిన వరుణ్ణి ఎంచుకొనడంలో గణపతిదేవ చక్రవర్తి సముచిత నిర్ణయాలే తీసుకున్నాడు. నేటి పశ్చిమ గోదావరి, కృష్ణా మండలాలలో కొన్ని భాగాలను ఆ రోజులలో నిడుదవోలు చాళుక్యుల వంశంవారు పరిపాలన చేశారు. వీరు వేంగి, నిడుదవోలు, కోనేరు, తడికలపూడి మొదలైన ప్రదేశాలు తమ రాజ్యపీఠాలుగా మండలేశ్వరులై పరిపాలన చేశారు. వీరు మొదట జననాథపురం చాళుక్యులకు అణకువగా ఉండేవారుగాని కాకతీయ సామ్రాజ్యం వేళ్లూనుకొంటూన్న కాలం నుంచీ దానికే సామంతులయ్యారు. రెండు వంశాలలోని పేర్లను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

కాకతీయులు		నిడుదవోలు చాళుక్యులు	
1. రుద్రదేవ మహారాజులు	1150–1195	1. వేంగీ గొంక	1150–1196
2. మహాదేవరాజు	1196–1199	2. అయ్యపదేవుడు	1193
		3. గణపతి	1193–1212
3. గణపతిదేవ చక్రవర్తి	1196–1199	4. మొదటి మహాదేవుడు	1196–1233
		5. ముమ్మడి గొంక	1212–1230
		6. ముమ్మడి అయ్యపదేవ	1230–1233
		7. ఇమ్మడి వేంగీశ్వర	1233–1250
		8. ఇందుశేఖర	1238–1255
4. రుద్రమదేవి	1262–1291	9. వీరభద్ర	1250–1266
		10. ఇమ్మడి మహాదేవ	1255

గణపతి, మహాదేవ అనే పేర్లు రెండు వంశాలలో కనబడతాయి. సాధారణంగా సామంతులు తాము ఎవరికి అణకువ[illegible] ఉన్నారో ఆ వంశంలోని ప్రసిద్ధ నామాలనే తమ

బిడ్డలకు పెట్టుకొంటారు. నిడుదవోలు చాళుక్యులు కోనహైహయ వంశం వాళ్ళతో కూడా వియ్యమందారు. 'సమాన వియ్యం' స్థాయికి చేరినవారు. అందుకే క్రీ.శ. 1238-1255 మధ్య పాలించిన ఇందుశేఖరుని రెండో కుమారుడైన వీరభద్రునికి రుద్రమదేవి నిచ్చి గణపతిదేవ చక్రవర్తి వివాహం జరిపించాడు.[2]

రుద్రమదేవి తరువాత ఆమె మనుమడు ప్రతాపరుద్రుడు రాజైనాడు. అతని జీవితం 'ప్రతాపరుద్రీయ'మనే నాటకంగా తెలుగువాళ్ళకు కీ॥ శే॥ వేదం వెంకటరాయశాస్త్రిగారి ప్రతిభావంతమైన రచనతో సుపరిచితమైంది. సంపూర్ణమైన చారిత్రక సత్యం కాకపోయినా, ఈ నాటకం నాటి వైనాలు కొన్ని అందరికీ చక్కగా తెలిపింది. ప్రతాపరుద్రునితో కాకతీయ యుగం పరిసమాప్తమైంది.

ఈ యుగంలో సాహిత్యం వర్ధిల్లింది. సంగీతం దశదిశలా చల్లగా మారుమోగింది. ఆకాశపు టంచులపైన, కెరటాల ఒంపుల మీద, దిగ్గజాల కుంభస్థలాల మీద తెలుగు గజ్జెలు నాట్యం చేశాయి. గుట్టలు గుళ్ళుగా మారాయి. రాళ్ళు రమణీయమైన శిల్పాల కింద జీవం పోసుకున్నాయి. సామాన్యులు కూడ వైభవోపేతమైన జీవితాన్ని గడిపినట్టు నాటి సాంఘిక చరిత్ర వల్ల తెలుస్తున్నది. స్త్రీలూ, పురుషులూ చక్కగా అలంకరించుకొని చల్లగా నవ్వుతూ తనివితీరా ఆనందించినట్లు నాటి సాహిత్యాన్ని చూస్తే తెలుస్తున్నది. ఈ యుగంలో రచించిన పుస్తకాల వల్లా, ఈ యుగాన్ని గురించి వ్రాసిన సమీప కాలంలోని గ్రంథాల వల్లా కాకతీయ కాలపు సాంఘిక చరిత్రను సురవరం ప్రతాపరెడ్డిగారు వివరాలతో విశదపరిచారు.[3] అందులో మతము, సంఘ సంస్కారము, కళలు, విద్యావ్యాపకము, చిత్రలేఖనము, చేతిపనులు, ప్రజలకు సౌకర్యములు, వ్యాపారము, ప్రజల వినోదము, పాచికల ఆట, స్త్రీల అలంకరణములు, వివిధములు అనే శీర్షికలతో 65 పుటల సమన్వయం చేశారు. వేశ్యలను ఉంచుకోవడం, జూదమాడడం ఈ యుగంలో ఉద్ధృతంగా వుండినవనుకోవాలి.

సుమతీ శతకకారుడు ఏనాడో చెప్పాడు :

తమలము సేయని నోరును
రమణుల చనుమొనల మీద రాయని మేనున్
కమలములు లేని కొలనును
హిమధాముడు లేని రాత్రి హీనము సుమ్మీ

కాకతీయ యుగంలో కలవారు హీనంగా బతకడానికి అంగీకరించినట్టు లేదు. పూర్వ యుగాలలో జైనులు ఎంత శృంగార పురుషులయ్యారో ఈ యుగంలో శైవులు

2. వీరభద్రుడు ఇందుశేఖరుని పెద్ద కొడుకని పూర్వ చరిత్రకారులు కొందరు భావించారు. కొల్లూరు సూర్యనారాయణగారు History of the Minor Chalukya Families in Medieval Andhra Desa అనే పుస్తకంలో ఈ విషయం చర్చించారు. పుట. 163.

3. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - 2వ ప్రకరణం, కాకతీయుల కాలము, పుటలు 38 నుంచి 102 వరకూ.

అంతకు రెట్టింపుగా సకాములయ్యారు. పాల్కురికి సోమనాథుడు తన బసవ పురాణంలో పండితారాధ్య చరిత్రలో 'మిండజంగాల విచ్చలవిడి కామాన్ని ఉద్ధోలంగా' వర్ణించాడు. శ్రీశైలంలో శివరాత్రి యాత్రలో 'మిండజంగాలు అడపతిత్తులు మూపున ధరించి, తొడితొడి ఆకులు మడిచి సంబెళలు యిస్తూ ఉంటే తాంబూలం సేవిస్తూ కస్తూరి సుగంధాలు పరిమళిస్తూ నానానఖవ్రణ చుంబనాలు నెరభక్తులకు మాటు పడకుండా నడుస్తూ -

'రారోరి బగుత తేరా లంజకనుచు
నారంగ వ్రయమున కడిగి తెచ్చుటలు
'బసవన్న కరుణరా! బగుతనీకనుచు
నసలిచ్చుచును ధనం బడిగి తెచ్చుటలు
'గలియుగ బసవండ నిలనీవని యనుచు
నలరించి భక్తులనడిగి తెచ్చుటలు
బ్రాకటంబున వచ్చు పణ్యాంగనలను
గ్రేకంట జూచుచు గేలిసేయుటలు

ఇవాళ విడ్డూరంగా ఉన్నాయనిపించవచ్చు. అయితే బసవేశ్వరుని కాలంలో కల్యాణకటకంలోనే లక్షా ఎనభైవేల మంది శైవులలో వేశ్యల యిండ్లనుండి భోగించు మిండజంగాలు పన్నెండువేల మంది ఉండేవారు. వీళ్ళ లంజరికం వెచ్చానికి భక్తులు రెండుచేతులా ఇచ్చేవారు. అయ్యగాంద్రందరూ లంజరికానికి వెళుతూ ఉంటే అదేమిటో తెలియని ముగ్ధ సంగయ్యా అనే వెర్రిబాగులవాడు తానూ వెళతానంటే బసవన్న పంపించడం, వారవనితలు నాట్యం చేయడం 'మున్నిట్టి సుఖము ఇట్టి లంజరిక మెరుగ'నని ఆ భక్తుడు పొంగిపోవడం పాల్కురికి సోమనాథుడు సవిస్తరంగా కథనం చేశాడు. దైవ సేవలోనైనా రాజసేవలోనైనా, ఆ యుగంలో వారకాంతలు తప్పనిసరి భోగినులు. రాజును సేవించే వారకాంతలు ఎటువంటి దుస్తులు ధరించాలో 'కామందకం' అనే నీతిశాస్త్ర గ్రంథం ఇలా చెపుతున్నది.

''లలితమంజుల విమలాంగలతలు వెలుగ
సూక్ష్మ వస్త్రాభరణమాల్యా సుభగమూర్తు
లగుచు వారాంగనలు మన్మథాస్త్రలీల
బలిసి కొలువంగవలయు భూపాలమదను.''[4]

రాజులెంత వినోదించినా రాజు చుట్టూ ఉండే పరిజనులు మాత్రం వ్యసనాలలో
18 చిక్కుకోకూడదని ఇంకొక గ్రంథం చెపుతున్నది.

---

4. సకలనీతి సమ్మతం 284 ప.

''ద్యూతమెల్ల జముని దూతయుగా, ధనం
బెల్ల హాలహలము, నింతులెల్ల
ఘోరతరములైన కారాగృహములుగా
దలచునతడు ప్రియుడు ధరణిపునకు.''[5]

సురవరం ప్రతాపరెడ్డిగారు ప్రశంసనీయంగా ప్రారంభించిన ఆంధ్రుల సాంఘిక చరిత్రలో కాకతీయుల కాలపు విశేషాలను ఇనుమడింపజేసే అంశాలు సకలనీతి సమ్మతం లోని గ్రంథాల వల్ల తెలుస్తాయి.

సాహిత్యం - సాహితీపరులు

ఈ యుగంలో ఎవరెవరు ఏయే గ్రంథాలు వ్రాసి తెలుగు సాహిత్యాన్ని శ్రీమంతం చేశారో తెలుసుకొందాం. వాళ్ళ పుస్తకాలు నష్టమైనా, వాటి గురించి తెలుసుకొనే ఆకరాలుంటే పరిశోధిద్దాం. విపులంగా చర్చించుకొందాం. విశదమయ్యే వివరాలను చదివి ఆనందిద్దాం.

ముందు ఈ రాజవంశంలోని వ్యక్తులెవ్వరైనా స్వయంగా గ్రంథాలు వ్రాశారేమో తెలుసుకొందాం. 'నీతిశాస్త్రముక్తావళి' అనే గ్రంథం వ్రాతప్రతులలో ఒకదాంట్లో ఈ పద్యం ఉన్నదని మానవల్లి రామకృష్ణ కవిగారు ఆ పుస్తకం ముద్రిత ప్రతి పీఠికలో వ్రాశారు.

''పరువడి నాంధ్రభాషగల బద్దెన నీతియు, సంస్కృతంబులో
బరగ బ్రతాపరుద్ర నరపాలునిచే రచియింపబడ్డ యా
నరవరు నీతిసారము వినం జదువం గడు మంచి దంచు జె
చ్చెరగని నీతి పద్ధతులు చేసె వినోదము బాలబోధకున్.''[6]

ఈ పద్యం వల్ల ప్రతాపరుద్రుడు సంస్కృతంలో నీతిసారం అనే గ్రంథం వ్రాసినట్టు స్పష్టమవుతున్నది. ఈ ప్రతాపరుద్రుడు కాకతీయులలోని ఆఖరువాడు కాక క్రీ.శ. 1150-1195 మధ్య పాలించిన రుద్రదేవుడేనని పండితులు గుర్తించారు. సంస్కృతం లోనేకాక తెలుగులో కూడ 'నీతిసారము' అనే చక్కని ప్రబోధ గ్రంథం ఉంది. దీనిలో నుంచి మొత్తం 111 పద్యాలను మడికి సింగన 'సకలనీతి సమ్మతం' అనే సంకలన గ్రంథంలో ఉదాహరించాడు. సంస్కృత 'నీతిసార' రచయిత ప్రతాపరుద్రుడని నికరంగా చెప్పగలంగాని తెలుగు నీతిసారం దానికి అనువాదమో కాదో, దానిని మొదటి ప్రతాపరుద్రుడే వ్రాశాడో లేదో చెప్పలేము, ఇది ఇంకొక కవి వ్రాశాడని తేలేదాకా దీనిని మొదటి ప్రతాపరుద్రుడే వ్రాసినట్లు భావించాలని చాగంటి శేషయ్యగారి అభిప్రాయం.[7]

---

5. పంచతంత్రిలోనిదని సకలనీతి సమ్మతంలో చెప్పిన 484వ పద్యం.
6. ఈ పద్యం ఆఖరు పాదాన్ని చెచ్చెరగ, వినీతిపద్ధతులు అని విరువగూడదని చాగంటి శేషయ్యగారు 'ఆంధ్రకవి తరంగిణి' మూడవ సంపుటం 17వ పుటలో వ్రాశారు.
7. కవితరంగిణి - రెండవ సంపుటం (ద్వితీయ ముద్రణ) పుట 49.

సంస్కృత నీతిసారం ప్రచారంలో వుండేదనీ, క్రీ.శ. 1560-70 ప్రాంతాల ఉండిన ముద్దరాజు పెదరామన రాఘవపాండవీయ వ్యాఖ్యలో దీనిని ఉదాహరించడమే దీనికి ప్రమాణమనీ నిడుదవోలు వెంకటరావుగారు వ్రాశారు.[8] తెలుగు నీతిసారం కూడా అంత ప్రచారంలో వుండడం గమనార్హం. ఇది ప్రతాపరుద్రుడే వ్రాసినా, ఇంకెవరు వ్రాసినా యిది మంచి గ్రంథం. చక్కని నీతులు బోధిస్తుంది. నీతులేకాక జాతీయాలు కూడ అందులో వున్నాయి. ఉదాహరణకు చూడండి :[9]

''పాముున కెరకలు వచ్చినట్లు, (అంటే రెక్కలు వచ్చినట్లు) (34); కుక్కతోక బట్టుకొని మహాంబుధి దాటదలచినట్లు (403); మిడుత లగ్గిమీద బడినయట్లు (783); అంబుధి కలము లేక ఈదగడగినట్లు (కలము అంటే 'పెన్ను' అనే అర్థమే కాదు. ఓడ, నావ అనే అర్థాలు కూడ ఉన్నాయి). (783)

రాజనీతి - రాజుల పరమార్థం

ఈ నీతిసారాన్ని రాజకవి వ్రాసినా వ్రాయకపోయినా ఇందులో చక్కని రాజనీతి ఉంది. దృష్టిలో పెట్టుకోవడం కనబడుతుంది.

''పచ్చ లాయకట్ల బరిబోవు నారంభ
మడవి గలయు సుత్తె కడగ బొలము
పంటమీద నరుల పైడెత్తగరవగు
బ్రజల చేటు భూమి బాడుసేయు.'' (122)

అయితే విభజించి పాలించడం, విభజించి శిక్షించడం రాజనీతికి మొదటి మెట్టు. నీతిసారంలోని ఈ పద్యం అదే బోధిస్తుంది.

''పెక్కండ్రు జనులు నేరమి
యొక్కట జేసినను వారి నొకమరి గినియం
జిక్కరు గావున నేర్పున
నొక్కొకరన పాపి శిక్ష యొనరింపదగుర్.'' (200)

దండనీతి రాజులకు చాలా ముఖ్యమేగాని ప్రజల క్షేమాన్ని ప్రప్రధానముగా చూడాలని ఇంకొక పద్యం కూడ చెపుతుంది.

''జనపతి పర్జన్యు గతిం
దన భూప్రజ బ్రోవవలయు, దగ బ్రోవడయే
దను బాసి పోవు నాప్రజ
ఘన నీరస సరసి బాయు ఖగముల భంగిగ్.'' (100)

---

8. తెనుగు కవుల చరిత్ర, పుట. 308.
9. బ్రాకెట్లలోని అంకెలు సకలనీతి సమ్మతంలోని పద్యాల సంఖ్యలు.

కర్తలు తెలియని కావ్యాలు

సకలనీతి సమ్మతంలో ఉదాహరించిన ఈ 'నీతిసారం' కర్త పేరు తెలియనట్టే, ఈ సంకలన గ్రంథంలోనే ఇంకా విరివిగా వాడుకొన్న మరొక రెండు పుస్తకాల కర్తల పేర్లు కూడ తెలియవు. ఆ పుస్తకాలు – ఒకటి పంచతంత్రం. రెండు కామందకము. ఈ గ్రంథాలను తరువాత వేరే కవులు సంస్కృతం నుంచి అనువదించారు. పంచతంత్రాన్ని ఇద్దరు ముగ్గురు అనువాదం చేశారు. అయితే వీళ్ళందరూ చాలా అర్వాచీనులు. ప్రప్రథమంగా పంచతంత్రాన్నీ, కామందకాన్నీ కాకతీయ యుగంలోనే ఎవరో అనువాదం చేశారని మడికి సింగన్న ధర్మమా అని తెలుస్తున్నది. పంచతంత్రంలో నుంచి అతడు 189 పద్యాలను ఉదాహరించాడు. కామందకంలోనుంచి 292 గద్య పద్యాలను వాడుకొన్నాడు. ఈ గ్రంథకర్తల పేర్లు తెలియకపోవడం చాలా దురదృష్టం. పంచతంత్రాన్నీ, కామందకాన్నీ తెలిగించిన అర్వాచీన కవుల చరిత్రలను తెలుసుకొంటున్నప్పుడు ఈ ప్రథమ రచయితల పద్యాలతో వాళ్ళ పద్యాలను విరివిగా తైపారు వేద్దాం. ఇప్పుడు మచ్చుకు కొన్ని మంచి పద్యాలు రెండింటిలో నుంచి చూసి తృప్తిపడదాం.

పంచతంత్రంలో మిత్రలాభం మొదటిది. స్నేహధర్మాన్ని, స్నేహితుల గొప్పదనాన్ని మొదటి పంచతంత్ర కవి ఇలా శ్లాఘించాడు:

''కుడుచుట కుడవగబెట్టుట
యడిగిన నిడు టడిగికొనుట యంతఃస్థం బే
ర్పడ నెరుగుట యెరిగించుట
కడు మైత్రికి లక్షణములు కనుగొన నారుఽ.'' (742)

''పెనులేమినైన విడువ మి
యును గుహ్యముసెప్పుటయును నొక యాపద పొం
దినయప్పు డడ్డుపడుటయు
మనమున దలపోయ బరమమైత్రికి ఫలముల్.'' (743)

''ఒక్క తల్లి కొప్ప నుదయంబుబొందిన
బాంధవంబుకంటె బహుగుణముల
వసుధ నెన్ని చూడ వాగ్జాతబాంధవం
బధిక మండ్రు చూవె యార్యులెల్ల.'' (744)

''పరిపూర్ణుడయ్యు బురుషుడు
పరమసుహృత్తు లన యాసపడవలయు మదిఽ
పరిపూర్ణుడయ్యు నంబుధి
పరగగ శశిపొడుపు నాసపడడే యెపుడుఽ?'' (747)

మొదటి పంచతంత్ర కవి మంచి కవి. తన దృష్టిలో సత్కవి ఏమి చేయగలడో అతడిలా చెప్పాడు.

''కొందరు చెప్పినంతయును గూర్పవచింతురు చిల్కపోలికన్
కొందరు మూగుభంగి నొనగూడదలంచి వచింపనేర రిం
పొందదలంచినట్ల వల నొప్పవచింతురు కొందరుర్విలో
నెంచును సత్కవీంద్రుగతి; నీ క్రియ మర్త్యులు మూడు చందముల్.'' (346)

ఇక ప్రథమ కామంద రచయిత వ్రాసిన పద్యాలు చూద్దాం. ఇతడు ప్రౌఢకవి, కొంచెం ఉన్నత భాషనే వాడుతాడు. సమాస కల్పన అంటే చాలా ఇష్టం. చూడండి ఒక పద్యం:

''హేలాకృష్ణ సుతీక్ష్ణతరా
లోలకరాళ మండలాగ్ర మరీచి
వ్యాలీఢ రూఢబాహు స
మాలంబనసేయు లక్ష్మి యభిసారికయై.'' (940)

ఇతడు తేలిక మాటలలో కూడ పద్యం నడపగలడు. ఉదాహరణకు చూడండి:

''పెనుగజము ద్రుంచు నక్రము
తన నెలవున నుండి, నెలవుదప్పిన మరి తా
శునకంబు చేత జచ్చుం
దన నెలవున హీనుడైన దగ ఘనునోర్చున్.'' (889)

సరిగ్గా ఇదే భావాన్ని తరువాతి శతకకర్త వేమన్న వాడాడు. ఆ పద్యం ఆంధ్రదేశంలో ఆబాలగోపాలానికీ కంఠతా వచ్చు.

''నీళ్ళలోన మొసలి నిగిడి యేనుగు దీయు
బైట కుక్కచేత భంగపడును.
స్థాన బలిమి కాని తన బల్మి కాదయా
విశ్వదాభిరామ! వినుర వేమ!''

ప్రథమ కామందక రచయిత సామదాన భేద దండోపాయాలతోపాటు ఉపేక్షోపాయాన్ని కూడా చెప్పాడు. చూడండి:

''వ్యసనము నన్యాయంబును
మసలక యుద్ధమును జేయ మాన్పమి యది దా
బొసగు ద్రివిధ స్వరూపత
నెసగ నుపాయములయం దుపేక్ష యనంగ౯.'' (635)

''ప్రకటముగ గీచకుం డొగి
నకార్య మొనరించువేళ నవినీతుండై
చకితుండపోలె విరటుం
డొకభంగి యుపేక్ష చేసి యుండడె మదిలోన్.'' (636)

తల్లిని చూడడానికి వెళ్ళినప్పుడైనా రాజు భవన శోధన చేయించాలని చెప్పాడు (279). అయినవాళ్లే ఎలాగ రాజులను నిర్జిస్తారో వివరించాడు:

''భద్రసేనుడు నిజపత్ని యింటికి జన
నతని తోబుట్టువ యతని దునిమె
దల్లి మంచము క్రింద నల్లవ యడగి తా
బుత్రుండ కారూషు బొడవడంచె
లాజలు విషమున నోజించి తేనియ
యని కాశిరాజు దద్వనిత యడచె
గరళాక్త మేఖలాఘనమణి సౌవీర
భూపు వైరంత్యు నూపురము చేత
జాతుషీ శస్త్రంబు జడయందు నిడుకొని
రమణి యొక్కత విదోరథుని జంపు
టెరిగి నమ్మక సతియింటి కేగ జనదు
కెరలి శత్రులపై బ్రయోగింపవలయు.'' (287)

యుగ విశేషం

కర్తల పేర్లు తెలియకపోయినా ఒక్కొక్క గ్రంథంలో వందకు పైన పద్యాలు దొరికినందుకు సంతోషించాలి. కర్తల పేర్లు తెలిసినా, వాళ్ళు వ్రాసిన గ్రంథాలను గురించి ఏమీ తెలియక విచారించే ఘట్టాలు ఈ యుగంలోనూ బోలెడు ఉన్నాయి. అయితే, ఈ యుగంలో వెలసినన్ని నీతిశాస్త్ర గ్రంథాలు ఇంతకుముందు లేవు. ప్రతాపరుద్రుని నీతిసారం, ప్రథమ కామందకం, బద్దెన నీతిశాస్త్రముక్తావళి, ప్రథమ పంచతంత్రం, శివదేవయ్య పురుషార్థసారం, ముద్రామాత్యం మొదలైనవి ఈ పట్టికలో కొన్నే. కేతన విజ్ఞానేశ్వరీయం, ధర్మశాస్త్రం, మారన మార్కండేయ పురాణం కూడ వర్ణాశ్రమ ధర్మాలను వివరిస్తుంది. ఈ యుగంలో సంపూర్ణమైన భారతంలో నుంచి విదురనీతి, ధౌమ్యనీతి, ధృతరాష్ట్రనీతి అనే శీర్షికల క్రింద నీతులు వేరే వ్రాసుకోవడం జరిగింది.

భోగలాలసతోపాటు నీతిపరత

ఒకరకంగాచూస్తే కాకతీయ యుగంలో ప్రజలు ఎంత భోగలాలసులో అంత నీతిపరులు! అయితే నీతి, అవినీతి అనే వాటి స్వరూప స్వభావాలు యుగధర్మాన్ని బట్టి మార్పులను సంతరించుకొంటాయి. యుగధర్మం ఎప్పుడూ ఉత్పత్తి విధానాలకు, ఆర్థిక

సంబంధాలకూ అనువుగానే రూపొందుతుంది. ఆదినుండీ మానవుల తాపత్రయం ఒక్కటే. బతికున్నంతకాలం తమకు చక్కని బతుకు తెరువూ, చచ్చాక తమకూ, తమ పితృలకూ ఉత్తమ గతులు లభించాలి. కర్మకాండలన్నీ ఈ సూత్రం పైన ఆధారపడి వుంటాయి. ఆచారవ్యవహారాలూ, మతవిశ్వాసాలూ నిరంతరం సవరణలు పొందుతూ ఉండడానికి సామాజిక వర్గ సంబంధాలే కారణం.

కాకతీయ యుగంలో మత విప్లవాలు చాలా ముమ్మరంగా చెలరేగాయి. ఒకనాడు తెలుగు గడ్డమీద విస్తరించిన బౌద్ధం ఈ యుగంలో పూర్తిగా నష్టంకాకపోయినా నామమాత్రావశిష్టంగా మిగిలింది. బుద్ధుణ్ణి విష్ణుమూర్తి తొమ్మిదో అవతారాన్ని చేసివేశాక బౌద్ధానికి ఒక ప్రత్యేకత తగ్గిపోయింది. క్రీ.శ.1171లోనే వెల్లంకి గంగాధరమంత్రి శివునికి, కేశవునికి గుళ్ళు కట్టించి ప్రతిష్ఠ చేసినట్టే బుద్ధునికి కూడా ఆలయం నిర్మించాడు. ఒక శాసనంలో ఇలా చెప్పాడు:

పరమేశుడు హరి బుద్ధ
స్వరూపుడై యసురవరుల వంచించుట నా
హరియనియ పట్టశాలము
జిరముగ బుద్ధ ప్రతిష్ఠ జేసితి భక్తిన్.
(తెలంగాణా శాసనములు, సంపుటి-1, కాకతీయ శాసనసంఖ్య-6)

బౌద్ధం ఇలాగ హిందూ మతంలో అంతర్లీనం అవుతున్నా, జైనం మాత్రం ఆర్థిక కారణాల వల్ల తన ఆధిపత్యాన్ని నిలుపుకొనడానికి పెనుగులాడుతుంది. బౌద్ధం తర్వాత ఆస్తులున్న మతం జైనమే. జైన బసదులకూ, సత్రాలకూ లెక్కలేనన్ని భూములూ, గ్రామాలూ, తోటలూ ఉండేవి. జైనయతులు, మతాచార్యులూ పెద్ద భూస్వాములయ్యారు. మహామండలేశ్వరులని వారిని పిలవకపోయినా ఆ స్థాయికి ఎదిగారు. వర్గ స్వభావాలలో మార్పులు వచ్చి జైనంలో కూడా వర్ణాశ్రమ ధర్మాలు జొరబడ్డాయి. జైన శూద్రునికీ, హిందూ శూద్రునికీ తేడా ఏమీ లేదు. రైతులు తమ జీవనోపాధికి మతాధిపతుల భూములపై ఎక్కువగా ఆధారపడవలసి వచ్చింది. అందుచేత ఏ ఆలయమైనా ఫ్యూడలు స్వభావాన్ని సంతరించుకొంది.

జైనుల ఆధిపత్యంపైన కాలాముఖ శైవాచార్యులు ఎప్పుడో తిరగబడ్డారు. జైనంలో వర్ణాశ్రమ ధర్మాలు ఘనీభవిస్తున్నపుడు శైవం కుల భేదాలను పాటించని మతంగా రూపుదిద్దుకొనడం వల్ల సామాన్య ప్రజానీకం ఇటు ఆకర్షితులయ్యారు. కాలాముఖాచార్యులు ఆలయాధిపతులయ్యారు. ఔదార్యం గల భూస్వాములయ్యారు. వీరు బోధించే భక్తిమార్గం ఫ్యూడలు స్వామిభక్తికి జీవగర్రగా ఉండడం వల్ల మహామండలేశ్వరుల దగ్గర్నుంచి మామూలు శ్రీమంతుల దాకా అందరూ శైవాన్ని ఆచరించడం మొదలైంది. భక్తులు భగవంతునికేకాక అతని ప్రతినిధులకు కూడా దాసులయ్యారు. పాల్కురికి సోమనాథుడు ఇలా చెప్పుకొన్నాడు.

బసవ గోత్రుడను బసవని కరుణ
బసవేశు శ్రీ పాద పద్మ సేవకుడ
బసవన్న బొగడ పాల్పడు కవీంద్రుడను
బసవన్న బొగడ పాల్పడు పాతకుండ
బసవన్న దూత నే బసవన్న బంట
బసవన్న లెంక నే బసవన్న లెంగి
బసవన్న యిలు పుట్టు బానిస కొడక

శైవం ఇటువంటి పుట్టుబానిస మనస్తత్వాన్ని భక్తులలో సృష్టిస్తూ ఉంటే వైష్ణవం తక్కువ తినలేదు. తొలి వైష్ణవ గేయకవి కృష్ణమాచార్యులు ఇలా చెప్పాడు: ''నరహరి దాసాను దాసులకు దాసుడను, తొత్తును, తొండడను, బంటును.'' జ్ఞాన, భక్తి, ప్రపత్తులనే మూడు యోగాలలో ప్రపత్తి అనే శరణాగతి యోగమే సర్వ జీవకోటికీ ఉపయుక్తమైనదని విశిష్టాద్వైతం ఉపదేశం చేస్తుంది. హరిని సేవించడం ఎంత పుణ్యాదాయకమో హరిదాసులను పూజించడం అంతకన్నా ఎక్కువ పుణ్యం. పంచవిధ భక్తిమార్గాలలో దాస్య, సఖ్య భావాలలో సఖ్యం సమ ఉజ్జీవులకూ, దాస్యం బడుగువర్గాలకూ రంగరించారు.

మతాధిపతుల ప్రాబల్యం పెరిగి వాళ్ళకు స్థిరాస్తులూ, చరాస్తులూ అధికం కావడంతో రైతుమీద భారం కూడా అధికం కాజొచ్చింది. పన్నెండో శతాబ్దం నుండీ పుర్వాడలు పన్నుల విధానం తడిసి మోపెడయింది. ఒక పక్క రాజప్రాసాదంలోని వైభోగాలకు సరిపడ్డ పన్నులు చెల్లించవలసిన ప్రజలు, రెండోపక్క రాజభోగాలకన్న మితిమించిన భోగలాలసత్వం గల మతతత్త్వాన్ని కూడా పోషించే భారం వహించవలసి వచ్చింది.[10] తేరగా సుఖపడేవాళ్ళు పడుతూనే ఉన్నారు. భోగాలకు అలవాటుపడ్డాక పాటుపడడం ఉండదు. పాల్కురికి సోమనాథుడు ఒక పాత్రచేత నిజం చెప్పించాడు. ''తగు నిరుపేద నిదానంబుగాంచి, దిగవిడ్చియేగునే మగిడి కూలికిని?''

కూలి చేయడం కన్నా కొల్లగొట్టడం, కన్నాలేయడం మొదలైనవైనా మత విశ్వాసాన్ని పోషించడానికి మార్గాలే అని ప్రచారం చేయడం విడ్డూరమైన బోధనలే. కన్నడ బ్రహ్మయ్య అనే శైవుడు గడియకన్నం, గడపకన్నం, గోడకన్నం, నేలకన్నం మొదలైనవాటిలో గొప్ప ప్రజ్ఞావంతుడు. భక్తుల ఇంటికి పొరపాటున కన్నం వేస్తే వాళ్ళని లేపి పాదోదకం, ప్రసాదం పుచ్చుకొంటాడు. ఇతర ఇళ్ళలో అయితే త్వరత్వరగా సొత్తంతా చేజిక్కించుకొని తెచ్చి జంగమకోటికి దానధర్మాలు చేస్తాడు. ఈ కథ బసవ పురాణంలోనిది.

శైవులలోని నాయనమార్లకు వైష్ణవులలోని ఆళ్వారులు ఏం తీసిపోలేదు. పన్నిద్దరాళ్వార్లలో ఒకరైన పరకాల యోగి అనే తిరుమంగై యాళ్వారు వైష్ణవార్థముగ

10. Myth & Realty - D.D. Kosambi, Bombay, 1962; పుట. 32.

దొడరి దొంగిలించిననే దోషములేదు అని తలచి దోపిడి దొంగగా పరిణామం చెందాడు. ''అడవులలో దాగి, సముద్రతీరమునందలి కరపట్టణముల నుండి సాగు వర్తకపు సరుకుల దారుల కాచి దోచియు ధనికుల తెరువడ్డగించి నిలబెట్టి నిలువున దోచియు అహంకరించి పెనగిన వారి మదమడించి దోచియు పలుతెరగుల నార్జించి నిష్ఠతో వ్రత మాచరింపసాగిన'' పరకాలమునీంద్రుల దివ్య కథను తరువాత కవులు గానం చేశారు.[11]

భుక్తి మార్గాన్ని చూపెట్టడమే భక్తి మార్గానికి పరమప్రయోజనం. జిన భవనాలను కూలదోసి శివాలయాలను కట్టినా, పాతదేవుళ్ళను విష్ణుమూర్తి అవతారంగా మార్చినా ఉద్దేశమొకటే. వనరులను తమ మతంవారే అనుభవించాలి. కల్యాణ కటకంలో బసవన్న మతం రాకపూర్వం ఆలయాలలోని దేవకులు అందరికీ ప్రసాదం ఇచ్చేవారు. వీరశైవం వచ్చాక లింగవంతులకే ఇచ్చేవారు. బోయలు దేశమేలే రాజువద్దకు వెళ్ళి శైవులే ''దొడగి ప్రసాదంబు గుడుచుచున్నారు. అడరంగ మాకించుకైన నిడరు'' అని ఫిర్యాదు చేశారు. రాజు బసవన్నను పిలిపించి ''నీవు చేస్తున్నది ఆదిమార్గమో బల్మియా?'' అని అడిగాడు.

రాజులు వీలైనప్పుడల్లా ఆదిమార్గాన్ననుసరించే నీతిని నడపాలి. అది వీలులేనప్పుడల్లా బలిమి తప్పదు. కాకతీయ యుగంలో పాత నీతులు తెలుసుకోవలసిన అవసరం వచ్చింది. అందుకే రాజులూ, మంత్రులూ, వివిధ వ్యక్తులూ నీతిశాస్త్ర గ్రంథాలను రచించారు. సంకలనం చేసుకొన్నారు.

మొదటి ప్రతాపరుద్రుని తరువాత ఈ వంశంలో ఏలికలెవరూ స్వయంగా గ్రంథ రచన చేసినట్టు లేదు. గణపతిదేవ చక్రవర్తి బావమరిది జాయపసేనాని సంస్కృతంలో గ్రంథాలు రచించాడు. కాకతీయ శిల్పానికి లక్షణగ్రంథం అనదగిన 'నృత్తరత్నావళి'ని రచించాడు. ఇందులోని శ్లోకాలకు లక్ష్యాలుగానే రామప్ప గుడులలో కనిపించే మనోహర నాట్యభంగిమలను శిల్పులు గండరించారట.[12]

సాహిత్యంలో ఎలాగైతే మార్గ పద్ధతుల స్థానంలో దేశి కవితలను నిలిపారో, అలాగే నాట్యంలో కూడా దేశి రీతులను ప్రోత్సహించడం కాకతీయ యుగంలో వృద్ధి అయింది. జాయపసేనాని రచించిన ''నృత్తరత్నావళి'' భారతీదేవి సన్నిధిలో తెలుగువారు వెలిగించిన సంధ్యా దీపములలో మొదటిది ఇప్పటికి. ''తరువాతి లాక్షణికుల కొందరికి మార్గదర్శకమైనది'' అని దీనిని తెనిగించిన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు అక్షరసత్యాలు చెప్పారు. దేశినృత్తంలో పుష్పాంజలి మొదలు గొండ్లిపేరణి, ప్రేంఖణము, చర్చరీ రాసకం, శివప్రియ, చిందు, కందుక, భాండిక, ఘటిసణీ, చారూ, బహురూప కొల్లాట నృత్యాలను సవిస్తరంగా ఈ గ్రంథంలో జాయప వివరించాడు. తెలుగు సాహిత్యంలో నృత్య ప్రసక్తిగల పద్యాలను అర్థం చేసుకోవాలంటే, నృత్తరత్నావళి సాయం లేనిదే సాధ్యం కాదు. దీనిని

11. తాళ్ళపాక కవులు వివిధ సాహితీ ప్రక్రియలు - పుట. 258.
12. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ద్వితీయ ముద్రణ, పుట 66.

జాయప క్రీ.శ. 1253-54లో రచించాడు. గణపతిదేవ చక్రవర్తి స్వయంగా శ్రద్ధ వహించి కళలు నేర్పించినందుకు అతని మరిది అయిన జాయప శాశ్వతంగా వుండే నృత్తలక్షణ గ్రంథాన్ని రచించాడు. ఇతని గీతరత్నావళి నష్టమైందిగాని, లభించివుంటే తొలిరోజుల తెలుగుపాటల వైనాలు తెలిసేవి.

నృత్తరత్నావళి వంటి నాట్యశాస్త్ర గ్రంథాలే గాక ఇతర సంస్కృత భాషా కృతులు కూడా కాకతీయ యుగంలో వెలిశాయి. విద్యానాథుని ప్రతాపరుద్ర యశోభూషణం నేటికీ చాలా ప్రామాణికమైన అలంకారశాస్త్రం. ఇది క్రీ.శ. 1291-1325 సంవత్సరాలలో కాకతీయ రాజ్యంలోని తుట్టతుది ప్రతాపరుద్రుని నాయకునిగా చేసి చెప్పిన సాహిత్య లక్షణ గ్రంథం. ఈ రాజు గొప్ప విద్వాంసుడూ, సరసుడూ, కవిపండిత బృంద రక్షకుడూ అని చెప్పవచ్చు. మొత్తంమీద రాజులేగాక రాచమరదులు, మాండలికులు మొదలైనవాళ్ళు ఈ యుగంలో సాహిత్య పోషణ చేశారు.

అంకితాలకు అంకురార్పణ

వాస్తవానికి అంకితాలు పుచ్చుకోవడం ఈ యుగంలోనే ప్రారంభమైంది. మనుమసిద్ధి తిక్కనగారిని పిలిచి, తన పేరుమీద ఒక పుస్తకం చెప్పమన్నాడు. తిక్కనగారు కేతనను పిలిపించి తనకొక పుస్తకం అంకితమిమ్మన్నాడు. తిక్కనగారి కలలో ముందు కవిగారి నాన్నతో సిఫార్సు చేయించి దేవుడే భారతం అంకితం పుచ్చుకొన్నాడు. తమ కావ్యాలను కన్యలుగా భావించడం కూడ ఇప్పుడే మొదలైంది. కూళలకు కావ్యకన్యనిచ్చి ధనం పొందడం పడుపు కూటికింద పరిగణించి బాధపడేటంత దుస్థితికి అంకితాలు పుచ్చుకోవడం దిగజారినట్టుంది. కవులు తమ స్వోత్కర్షను ప్రకటించుకొనే బిరుదులు పెట్టుకొనేవారు లేక ఇతర కవులు ఇచ్చేవారు. కేతనకు అభినవదండి అనే బిరుదు ఉంది. బయ్యనకు 'భవ్యభారతి' అనే బిరుదును తిక్కనగారే ఇచ్చారు. శివదేవయ్య సంస్కృతాంధ్ర కవితాపితామహుడు. చోడతిక్కరాజు కవిసార్వభౌమాంకుడు.

ఆడంబరంలోనే నిరాడంబరత

బిరుదులలో ఎంత ఆడంబరం వున్నా, ఆనాటి కవుల పేర్లలో నిరాడంబరమైన తెలుగుదనం ఉంది. సంస్కృతంలో చెప్పితే గంభీరంగా వుండే శబ్దాలకు వికృతులను, ఏమాత్రమూ బిడియపడకుండా మన కవులు ధరించారు. తిరుకాళత్తి దేవుని పేరులోనుంచి పుట్టిన సిసలు తెలుగు మాట 'తిక్కన' అనే పేరు. భైరవ శబ్దంలో నుంచి 'బయ్యన్న' పుట్టింది. త్రిపురాంతకుణ్ణి తెలుగువాళ్ళు 'తిప్పన్న' అని పిలిచేవారు. భాస్కరుడు బాచన్న. జగన్నాథుడు జగ్గన్న. తెలుగులో ఉన్న తమ పేర్లకూ, ఇంటిపేర్లకూ సిగ్గుపడడం తరువాతి కవుల లక్షణం. 'రెండుచింతల' అనే ఇంటిపేరును 'ద్వితింత్రిణి' అనీ, 'గాలి' అనే ఇంటి పేరును 'ప్రభంజనం' అనీ సంస్కృతీకరించడం అర్వాచీనులు మొదలుపెట్టారు.

ఉభయభాషా ప్రవీణులు

కాకతీయ యుగంలోని తెలుగు కవులు సంస్కృతంలో రచనలు చేసినా, తమ పేర్లను మార్చుకొన్నట్టు లేదు. అప్పయార్యుడు, జాయపసేనాని, శాకల్యా మల్లకవి, రాయపాడి తిప్పన్న మొదలైన తెలుగువాళ్ళు ప్రతాపరుద్రుని ఆస్థానంలో వుండిన సంస్కృత రచయితలు. ఆ ఆస్థానంలోనే రెండువందల మంది తెలుగు కవులు ఉండేవారు. ఈ యుగంలో ఉన్న కవులందరి గురించి తెలుసుకొనే అవకాశం మనకు లేదుగాని తెలియవచ్చినన్ని వివరాలు పేరుపేరునా తెలుసుకొందాం.

మంత్రి భాస్కరుడు

కవిత్రయంలో ద్వితీయులైనా తిక్కనగారు కవిత్వంలో అద్వితీయులు. ఆయనంతటి కవి ''మా తాతగారి మొఖం చూసైనా లోకం నన్ను మన్ననతో ఆదరిస్తుంది. నా కృతి గుణాలను వేరే చెప్పడమెందుకు?'' అని నిర్వచనోత్తర రామాయణంలో మొట్టమొదటనే ఈవిధంగా తెలియజేశారు:

''సారకవితాభిరాము గుంటూరివిభుని
మంత్రిభాస్కరు మత్పితామహుని దలచి
యైన మన్ననమెయి లోక మాదరించు,
వేర నా కృతిగుణములు వేయు నేల?'' (1-12)

ఈ పద్యంలో తాతగారిపట్ల తిక్కనగారి వినయ విధేయతలే కాక ఆనాటి పండితలోకం భాస్కరమంత్రి పేరు చెపితే ఎంత గౌరవం చూపేవారో తెలుస్తున్నది. ఒక్క తిక్కనగారి మాటల మూలంగానేకాక మూలఘటిక కేతన పద్యం వల్లకూడ భాస్కరమంత్రి (క్రీ.శ. 1190-1220) చెప్పుకోదగ్గ కవి అని తెలుస్తున్నది. తిక్కన గారికే అంకితమిచ్చిన దశకుమార చరిత్రలో కేతన భాస్కర మంత్రిని ఇలా వర్ణించాడు:

''శాపానుగ్రహశక్తి యుక్తుడమలాచారుండు సాహిత్యవి
ద్యాపారీణుడు ధర్మమార్గపథికుం డర్థార్థిలో కావన
వ్యాపారవ్రతు డంచు జెప్పు సుజనవ్రాతంబు గౌరీపతి
శ్రీపాద ప్రవణాంతరంగు విబుధ శ్రేయస్కరుఁ భాస్కరుఁ.'' (1-32)

భాస్కర మంత్రిని గురించి ఆనాడు లోకం ఏమని చెప్పుకొనేదో ఈ పద్యంవల్ల స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఆయన శాపానుగ్రహ శక్తియుక్తుడనీ, సాహిత్యా విద్యా పారీణుడనీ లోకం చెప్పుకోవడానికి అతడు ప్రశంసనీయమైన కవిత్వం చెప్పి ఉండాలి. అయినా భాస్కరమంత్రి వ్రాసిన పుస్తకాలేమిటో మనకు తెలియదు. ఈనాడు ప్రసిద్ధమైన భాస్కరరామాయణం ఈ మంత్రి భాస్కరుడే రచించాడని డాక్టరు నేలటూరు

వెంకటరమణయ్యగారూ,[1] చాగంటి శేషయ్యగారూ[2] భావించారు. చాగంటివారి వాదాన్ని నిడుదవోలు వెంకటరావుగారు ఆమోదించారు.[3]

'నస్మరంతి'కి కారణం?

అయితే మంత్రి భాస్కరుడు రామాయణం రచించినట్టు ప్రాచీనులెవరూ చెప్పలేదు. నిర్వచనోత్తర రామాయణంలో తాతగారిని సారకవితాభిరాముడని నుతించిన తిక్కనగారు గాని, దశకుమారచరిత్రలో భాస్కరమంత్రిని లోకం సాహిత్య విద్యాపారీణుడని చెప్పు కొంటున్నదని వర్ణించిన కేతనగాని రామాయణ రచనను గురించి పల్లెత్తు మాట కూడ అనకపోవడం గమనార్హం. తిక్కనగారి శిష్యుడైన మారన కూడ తన మార్కండేయ పురాణంలో తన గురువుగారి తాతగారు రామాయణం వ్రాసినట్టు చెప్పలేదు. ఆ కాలపు వాడే అయిన మంచెన కేయూర బాహుచరిత్రలో వాక్పూర్ణ మేరువులైన నన్నయభట్టునూ, తిక్కకవి చంద్రుణ్ణీ మాత్రమే నుతించాడుగాని ఎవరి మొఖం చూసి లోకం తన కవిత్వాన్ని ఆదరిస్తుందని తిక్కనగారు ప్రశంసించారో ఆ మంత్రి భాస్కరుని పేరైనా ఎత్తలేదు. భాస్కరుడు పూజనీయమైన రామాయణాన్ని రచించేవుంటే, మంచెన విస్మరిస్తాడా?

ఈ ప్రాచీనంలో మొదటి ఇద్దరూ భాస్కరుణ్ణి రామాయణ కర్తగా చెప్పలేదు; మిగతా ఇద్దరూ నుతించనేలేదు. అయినా కవులు పూర్వకవిగా నుతించిన వాళ్ళలో భాస్కరుడు లేకపోలేదు. కాని వాళ్ళందరూ క్రీ.శ. 1320కి తరువాతి వాళ్ళేగాని ముందువాళ్ళు కారు. ప్రత్యేకంగా ఈ సంవత్సరాన్ని ఒక హద్దుగా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే –

హుళక్కి భాస్కరునికి నమస్సులు

క్రీ.శ. 1320 ప్రాంతాలలో హుళక్కి భాస్కరుడనే కవి కాకతీయ రాజధానిలో ఉన్నాడు. అతడే రామాయణాన్ని వ్రాసినట్టు నిదర్శనలున్నాయి. క్రీ.శ.1320 తరువాత ఎవరు భాస్కరుణ్ణి నుతించినా ఆ నమస్కారం హుళక్కి భాస్కరునికే చెందుతుందిగాని, స్పష్టంగా పేరు చెప్పి దండం పెడితేనే తప్ప మంత్రి భాస్కరునికి చెందదు.

కొంతమంది సాహిత్య పరిశోధకులు మరి మంత్రి భాస్కరుడే రామాయణం వ్రాశాడని ఎందుకు భావిస్తున్నారు, ఏ ప్రమాణాలను తమ వాదానికి అనువుగా చూపిస్తున్నారు అనే ప్రశ్నలు పుట్టకమానవు. తిక్కనగారు ఉత్తర రామాయణం వ్రాశారు. అంతకుముందే మిగతా ఆరు కాండలూ సహజంగా ఎవరో, ముఖ్యంగా తమ తాతగారో వ్రాసి ఉండకపోతే తిక్కనగారు పూర్వ రామాయణాన్ని కాక ఉత్తర రామాయణాన్ని ఎందుకు వ్రాశారన్న సందేహమే చాలా ప్రబల కారణం కాబట్టి లోకంలో చాలా

1. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక, 1940–41.
2. ఆంధ్ర కవితరంగిణి, రెండవ సంపుటం
3. తెనుగు కవుల చరిత్ర, పుట 314

ప్రసిద్ధమైన భాస్కర రామాయణంలోని భాస్కర పదం మంత్రి భాస్కరునికే చెందుతుందని ప్రతిపాదించారు.

అయితే ఈనాడు లభ్యమవుతున్న భాస్కర రామాయణంలో నలుగురు కర్తల పేర్లు కనబడుతున్నాయి. ప్రతి కాండాంత గద్యవల్లా తెలిపే పేర్లను వరుసగా వ్రాసుకొందాం.

1. బాలకాండ - భాస్కర సత్కవిపుత్రుడు మల్లికార్జునభట్టు
2. అయోధ్యకాండ - వీరమారయ కుమారుడు కుమారరుద్రదేవుడు
3. అరణ్యకాండ - సకల కవిజన వినుతయశస్కరుడు భాస్కరుడు
4. కిష్కింధాకాండ - భాస్కర సత్కవిపుత్రుడు మల్లికార్జునభట్టు
5. సుందరకాండ - భాస్కర సత్కవిపుత్రుడు మల్లికార్జునభట్టు
6. యుద్ధకాండ - హుళక్కి భాస్కరుడు కొంత చెప్పగా మిగిలినది అయ్యలార్యుడు

ఈ గద్యలలో కర్తగా భాస్కరుని పేరు రెండుసార్లు వస్తుంది. అరణ్యకాండ వ్రాసిన భాస్కరుని ఇంటిపేరుగాని, బిరుదుగాని ఏమీ తెలియదు. హుళక్కి భాస్కరుడు యుద్ధ కాండలో కొంత చెప్పాడని అయ్యలార్యుడు చెప్పాడు కనుక ఆ భాస్కరుని ఇంటిపేరు తెలుస్తున్నది. మంత్రి భాస్కరుని ఇంటిపేరు కొట్టరువువారు. అందుచేత యుద్ధకాండకు, అతనికి సంబంధం లేదుగాని ఇంటిపేరూ, మంత్రి బిరుదూ ఏమీలేని అరణ్యకాండ మాత్రం అతడు వ్రాసినదే అని పరిశోధకులలో కొందరు భావించారు. అందుకు తమకు తోచిన బలమైన కారణం కూడ చూపించారు.

అరణ్యకాండ తృతీయపంథా

భాస్కరరామాయణంలో మిగతా కాండలన్నీ ఒకలాగ ఉంటే, అరణ్యకాండ మాత్రం ఒక విషయంలో ఇంకొకలాగ ఉంది. మిగతా కాండలను కర్తలు ఎంత దీర్ఘమైనా సరే ఆశ్వాసాల క్రింద విభజించలేదు. ఒక్క అరణ్యకాండలో మాత్రము రెండు ఆశ్వాసాలు ఉన్నాయి. ఈ విలక్షణత్వం కొట్టవచ్చినట్లు కనబడి బహుశా కొట్టరువు భాస్కరుడే దీని రచయిత అని పరిశోధకులు భావించారు. దానికి తోడు అరణ్యకాండలో ప్రథమాశ్వాసం చివర ఉన్న

''పుణ్యుం డూర్జితశౌర్యధైర్యమహిమస్ఫూర్తిస్ఫురద్వైభవా
గణ్యుం డార్యజనానురంజితమహాకారుణ్యుడుర్ శ్లాఘ్యుసా
గుణ్యుం డన్వయవార్ధి చంద్రుడు రిపుక్షోణీశ్వరస్థాపితా
రణ్యుం డార్తశరణ్యు డుజ్వలయశోరమ్యుండు సౌమ్యుం డిలర్''

అనే 292వ పద్యంలోలాంటి ఎత్తుగడే తిక్కనగారి నిర్వచనోత్తర రామాయణం అష్టమాశ్వాసం చివరి

''పుణ్యుడు భారతీవిభవపూతవికాసముఖారవిందలా
వణ్యుడు దీవ్రకోపదవవహ్నినిరర్గళదగ్ధశాత్రవా
రణ్యుడు మానినీహృదయరంజనన్నై పుణరూఢరూపతా
రణ్యుడు భీతివిహ్వలవిరోధిశరణ్యవరేణ్యు డున్నతిన్.''

అనే పద్యంలో కనబడింది. తాతగారి పద్యాన్ని తిక్కనగారు అనుసరించారని పరిశోధకులు భావించారు. ఈ ఒక్క పద్యమేకాక ఈ ప్రథమాశ్వాసంలో కట్టకడపటి మాలినీవృత్తంలోని ఎత్తుగడ కూడ నిర్వచనోత్తర రామాయణం అష్టమాశ్వాసంలోని మాలిని ఎత్తుగడలాగే ఉంది.

''వితరణఖని యుద్యద్వీర్యశౌర్య ప్రభావో
న్నతుడు భుజబలాత్యున్మాదవిద్విద్ధరిత్రీ
పతిహరణసమిద్భాభాగగమ్యుండు సంభా
వితపరిణతచిత్తోర్వీసురుం డుర్వి నెందున్.'' (భాస్కర)

''వితరణఖని యుద్యద్వీరశృంగారలక్ష్మీ
సతిరతివరలీలాషంగకృత్సంగతాంగుం
డతులితమతివిస్తారాప్తదేవేజ్యు డిజ్యా
ప్రతిదినపరితృప్తి ప్రాప్తసప్తార్చి ధాత్రిన్.'' (నిర్వచనోత్తర)

ఇక నేం? మంత్రి భాస్కరుడే అరణ్యకాండ రచయిత అనే సిద్ధాంతాన్ని బలంగా ప్రచారం చేశారు.

చాగంటి శేషయ్యగారు మరీ గాఢంగా, ఘాటుగా వాదించసాగారు. ''గద్యయం దున్నను లేకపోయినను కవిత్వమునందు మంత్రి భాస్కరుని స్థానమును నిలువబెట్టి యాతనికి న్యాయము కలుగుటకై ప్రయత్నింపకమానను. అతని పక్షమున న్యాయము లేదని తోచినచో నాతనికై పెనుగులాడను.'' అని వ్రాశారు.[4] భాస్కర రామాయణ పాఠభేదాలను గురించి చర్చించారు. అరణ్యకాండ ఆదిలో మంత్రి భాస్కరుడే వ్రాశాడని భావించారు.

మిగతా కాండలకన్నా విలక్షణంగా ఉన్న ఈ అరణ్యకాండ మంత్రి భాస్కరునిదని నమ్మాక, అతడు మొదటి రెండు కాండలూ వ్రాయకుండా 'శుభమా' అని అరణ్యకాండ మొదలు పెడతాడా అన్న సందేహం రాకమానదు. పాఠభేదాలు చూస్తే మొదటి భాస్కర రామాయణంలో ప్రక్షిప్తాలూ, అధికపాఠాలూ కొల్లలుగా దొరుకుతాయి. ఈ అదనపు పద్యాలను తొలగిస్తే ఏది మిగులుతుందో అదే మంత్రి భాస్కరుడు వ్రాసినదని పరిశోధకులు భావించారు. మొదటి మూడు కాండలూ వ్రాసినవాడు అరణ్యకాండతో

4. ఆంధ్రకవితరంగిణి, రెండవ సంపుటం (ద్వితీయ ముద్రణ) పుట 118.

ఆగిపోతాడా అనీ, కిష్కింధా సుందరకాండలలో కూడ ప్రథమ ప్రతి మంత్రి భాస్కర రచితమేననీ విశ్వసించారు. చూడండి నిడుదవోలు వెంకటరావుగారు ఏమంటున్నారో -

> ''హుళక్కి భాస్కరుడే గాని మంత్రి భాస్కరుడు రామాయణ రచయిత కాడనుట యాకాశహర్మ్యమును నిర్మించుట వంటిది. ఉపలబ్ధ తాళపత్రగ్రంథ పరిశోధనల వలన మంత్రి భాస్కరుని కర్తృత్వము నిలుచుననియు, నాతడు ప్రాచీన కవులలో నొక ప్రసిద్ధ కవియని స్థిరపడుననియు నాయాశయము.[5]''

ఇప్పుడున్న భాస్కర రామాయణ గద్యలో హుళక్కి భాస్కరాదుల పేర్లు కనబడతాయే, మరి వాటికేం సాధనం? నిడుదవోలు వారు కొన్ని ప్రతిపాదించారు. మంత్రి భాస్కరుని రామాయణం మూలానుసరణంగా లేదు. క్లుప్తీకరించాడు. అందుచేత భాస్కరునికి నూరేళ్ళ తరువాత ఎర్రా ప్రెగడ క్రీ.శ. 1310 ప్రాంతాలలో వాల్మీకి రామాయణాన్ని విపులంగా అనువాదం చేశాడట. ఎర్రన రామాయణం వ్రాసిన తరువాత అసంపూర్ణంగా వున్న మంత్రి భాస్కర రామాయణాన్ని హుళక్కి భాస్కరాదులు పూరించారట!

భాస్కర రామాయణం నూరేళ్ళపాటు అసంపూర్ణంగా ఉండిపోతే తిక్కనగారు, కేతనా, మారనా ఎందుకు నిర్లక్ష్యం చేశారో నిడుదవోలువారు చెప్పలేదు. చాగంటి శేషయ్యగారి వాదాన్ని సమర్థించే వెంకటరావుగారు ఒక సంగతి మరచిపోయారు. శేషయ్యగారి అంచనా ప్రకారం మంత్రి భాస్కరుని రామాయణం సమగ్రమేకాక అది చోడతిక్కరాజుకు అంకితమిచ్చినది కూడా.[6] అసమగ్ర రచననుగాని, అసంపూర్ణ కావ్యాన్ని గాని ఎవరూ ఎవరికీ అంకితమివ్వరు. మంత్రి భాస్కర రామాయణం చోడ తిక్కరాజుకు అంకితమిచ్చిననాటికి సమగ్రమైతే ఇంక హుళక్కి భాస్కరాదులు పూరించవలసిన అవసరం ఏముంది?

మంత్రి భాస్కరుడు నిజంగా రామాయణం వ్రాసి, దానిని చోడతిక్కరాజుకు అంకితమిస్తే దానిలో ఒకకాండలో తన పద్యాలు కొన్ని వందలు చేర్చి ఆ పుస్తకాన్ని కుమారరుద్రదేవుడు తన తండ్రి సాహిణిమారయ్యకు అంకితమిస్తాడా? గ్రంథచౌర్యమేకాక సాహిత్య కుట్ర పాపం కుమారరుద్రునికి అంటగట్టడమవుతుంది.

ఈ సంగతి గుర్తించే ఈ గ్రంథచౌర్యారోపణ తప్పించడానికి చాగంటి శేషయ్యగారు ఇలా వ్రాశారు:

> ''కుమార రుద్రదేవుడు భాస్కర రచితములగు గద్య పద్యములను గ్రహించి, మరి రెండువందల గద్యపద్యములను రచించి చేర్చి, తాను

5. తెనుగు కవుల చరిత్ర, పుట 314
6. ఆంధ్ర కవితరంగిణి, రెండవ సంపుటం (రెండవ ముద్రణ), పుట 96.

రచించిన భాగమును సాహిణిమారయ కంకితముచేసి తాను వ్రాసికొనిన ప్రతియందు రెండు గద్యలను, రెండు విధములగు కాండాద్యంత పద్యము లను వేసియుండును. తత్ప్రతికా లేఖకులు కొందరీ రెండు విధములగు వ్రాతలలో నొకదానిని విడిచివేసి తమ యిష్టమువచ్చిన యొక గద్యను, ఒకవిధమగు నాద్యంత పద్యములను వ్రాసికొనియుందురు.''[7]

ఇది విపరీతమైన ఊహాగానం. రెండువందల పద్యాలు వ్రాసి తండ్రికి అంకితమిచ్చేవాడు, మంత్రి భాస్కరుని పద్యాలనే ఎందుకు స్వీకరించాలి? తన పుస్తకంలో రెండు గద్యలూ, రెండు రకాల ఆద్యంత పద్యాలూ ఎందుకు వ్రాయాలి?

'తిక్కనగారి తాతగారు' మాత్రమే

హుళక్కి భాస్కరుడు వ్రాయించిన, వ్రాసిన రామాయణంలో మంత్రి భాస్కరునికి స్థానం కల్పించాలనుకొంటే వచ్చే చిక్కులే ఇవి. దేశంలో ఉన్న తాళపత్ర ప్రతులన్నీ శోధించిగాని మంత్రి భాస్కరునికి రామాయణ విషయంలో పెద్ద పీట వెయ్యకూడదు. భావి పరిశోధనల వల్ల కొత్త విషయాలు తెలిసేదాకా ఇతడు తిక్కనగారి తాతగారు మాత్రమే. ఇతని రచనలేమీ బయటపడలేదు. ఇతని ప్రయోగాలంటూ ఏ లక్షణకర్తా ఒక్క పద్యమైనా ఉదాహరించలేదు. ఇతని మంత్రి బిరుదును పేర్కొంటూ ఇతణ్ణి ఏ పూర్వకవీ స్తుతించలేదు. ఇతణ్ణి తిక్కనగారు వినయవిధేయతలతో ''మా తాతగారి మొఖం చూసి లోకం నన్ను గౌరవిస్తుం''దని ప్రస్తుతించడం భావ్యమేగాని ఇప్పుడు చాలామంది తిక్కనగారి మొఖం చూసే మంత్రి భాస్కరుణ్ణి గౌరవిస్తారు.

భాస్కరుని కేతన

సంస్కృతంలో భట్టబాణుడు 'కాదంబరి' అనే మహాకావ్యం రాశాడు. దానిని కేతన అనే కవి తెలుగులోకి అనువదించాడు. ఇతని పద్యాలను ఒక సంకలనకర్తా, ఒక లాక్షణికుడూ ఉదాహరించారు. పెదపాటి జగ్గన్న తన ప్రయోగ రత్నాకరంలో భాస్కరుని కేతన ప్రెగ్గడ కాదంబరిలోనిదని ఈ క్రింది పద్యాలను ఇచ్చాడు.[1]

''గంధర్వాత్మజ రాజు జూచె, బతియుం గాదంబరింజూచె, ద
ర్పాంధీ భూతమనస్కుడై మరుడు విల్లందెః బ్రసూనోల్లస
ద్గంధం బొప్పగ నెక్కువెట్టి గుణనాదం బాని పుష్పాస్త్రముల్
సంధించెః దెగబాపి యేయదొడగెన్ సవ్యాపసవ్యంబుగన్.'' 96

7. ఆంధ్ర కవితరంగిణి, రెండవ సంపుటం (రెండవ ముద్రణ), పుట 126.

1. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి ప్రబంధ రత్నావళి, పుట 31.

''దీనిలోపల గొన్ని దినములుండిన నుష్ణకరుడైన నట శీతకరుడుగాడె?
దీని లోతెరిగిన దా నంబురాశిలో గాదని జలశాయిగాపు రాడె?
దీని తీయని నీరు దివిజులు త్రావి చూచిన దమ యమృతంబు చేదువారె?
దీని తోయమ్ముల దీర్థమాడిన నెంత పాపాత్ములును మోక్షపదవి గనరె?
యనుచు గొలని నీటి యతిశయత్వంబును బరపు పెంపుదీపు బావనతయు
మనుజ నాయకుండు గొనియాడి పడివాగె త్రాట హయము దిగిచి తరియజొచ్చె.'' 97

ఒకరు కాదు, ముగ్గురు

తెలుగు కవులలో కేతన అనే పేరు వున్నవాళ్ళు ఇద్దరు ముగ్గురు కనబడతారు. ఒకడు సుప్రసిద్ధుడు; 'దశకుమార చరిత్ర' తెనిగించి తిక్కనకు అంకితమిచ్చిన మూలఘటిక కేతన. రెండవవాడు నండూరి కేతన. ఇతడు కవిత్వం చెప్పినట్లు మంచెన వ్రాసిన కేయూరబాహు చరిత్రలోని అవతారిక పద్యాల వల్ల తెలుస్తున్నది. ఈ ఇద్దరు కవులలో ఏ ఒక్కరి తండ్రి పేరూ భాస్కరుడు కాదు. అందుచేత భాస్కరుడనే తండ్రిగల కేతన కోసం వెదికితే తిక్కన సోమయాజి పెదతండ్రి ఒకడు దొరుకుతాడు. ఈ భాస్కరుడు వెనుకటి ప్రకరణంలో మనం చెప్పుకొన్న మంత్రి భాస్కరుడే.

కొట్టరువువారి వంశంలో భాస్కరుని కుమారుడైన కేతన కవిత్వం చెప్పినట్లు మూలఘటిక కేతన దశకుమార చరిత్రలో ఇలా వ్రాశాడు:

''కవితకు ముఖ్యు డీత డన గామితవస్తువు లిచ్చువాడునా
నవరస భావకుం డిత డనన్ బురుషార్థపరాయణుండునా
నవునన రాజనీతివిషయజ్ఞు డితం డన గీర్తిచంద్రికా
ధవళితదిక్కుడై నెగడె ధన్యుడు కేతనమంత్రి ఇమ్మహిన్.'' (దశ 1-36)

మూలం - అనుసరణం

ఈ పద్యం ప్రమాణంవల్ల కాదంబరి రచయిత తిక్కనగారి పెదతండ్రి భాస్కరుని కేతనే అని చెప్పవచ్చు. ఇతడు కాదంబరిని అనువదించినట్లు మూలఘటిక కేతన చెప్పలేదు. అసలు తన కృతిపతి తిక్కనగారే ఏయే గ్రంథాలు చేశారో చెప్పలేదు. అయినా మూలఘటిక కేతన దశకుమార చరిత్రను అనువాదం చేశాకనే భాస్కరుని కేతన కాదంబరిని అనువదించి వుండవచ్చు.

ఏమంటే, దశకుమార చరిత్ర, కాదంబరి రెండూ సంస్కృతంలో వచన కావ్యాలే. ''గద్యమ్మున దండి చెప్పిన కథాక్రమ మొప్ప దెనుంగుబాస గద్యమ్మును బద్యముంబెరయ
9 అంచితభావరసోదయాభిరామమ్మగునట్లుగా ''దశకుమార చరితము''ను మూలఘటిక కేతన అనువదించాడు. మూలంలోని వచన కావ్యాన్ని తెలుగులో చంపూకావ్యంగా తనకు ముందు తన కృతిపతి పెదతండ్రి అనువాదం చేస్తే ఆ సంగతి మూలఘటిక కేతన

చెప్పడా? కాదంబరిని చంపువుగా అతడు అనువదించినట్లే ఇది అనువాదం చేస్తున్నానని వ్రాసేవాడు. మూలఘుటిక కేతన చూపిన దారినే భాస్కరుని కేతన అనుసరించి ఉంటాడు. కాని, ''రసవత్తరమగు కాదంబరిని వీడి రెండవదియగు దశకుమార చరిత్రమునే కేతన తెలిగించుటకు గారణము అతఃపూర్వమే అది తెలిగింపబడియుండుట యగునేమో'' అని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రబంధరత్నావళిలో అభిప్రాయపడ్డారు. (పీఠిక, పుట 8)

ఊరికెనే ఉదాహరిస్తారా?

ఇతని ప్రయోగాలను లాక్షణికులు ఉదాహరించారంటే అవి చెప్పుకోదగ్గవే అయివుంటాయి. లక్షణకర్త కస్తూరి రంగకవి ప్రాదియతికి ఉదాహరణ ఇస్తూ, 'కేతన- కాదంబరియందు' అని క్రింది పద్యం చూపించాడు:

''జనవరేణ్యు గాంచి సాష్టాంగ మెరగిన
నా విభుండు వాని లేవనెత్తి
కౌగలించి వాని గనుగొని కేయూర
కాభిదాన మొసగె గౌతుకమున.''[2]

ఇది ''సాష్టాంగము, సాహంకారము, సాంబశివుడు, సాంగోపాంగం, సాటోపం ఇవి మొదలైనవానియందు అర్ధ్యక్షర హల్లుతో అచ్చు కూడియున్నందున హల్లుకైననూ, అచ్చుకైననూ యతి యుండజెప్పితే ప్రాదియతి యగును. గనుక రెండింటి లక్ష్యము'' అన్న సందర్భంలో ఉదాహరించాడు. ఇంక తకార, డకారాలకు యతి చెల్లుతుందని అభేదయతికి ఉదాహరణగా కేతన కాదంబరిలో నుంచి -

'డాచే యంకతలింబు జేర్చివలచేతం మాలికన్ దాల్చి...'' అని ఒక్క పాదాన్నే ఇచ్చాడు.[3]

మానవల్లి రామకృష్ణ కవిగారు నన్నెచోడుని కుమార సంభవం తొలిసారిగా ప్రచురిస్తున్నపుడు ప్రథమ భాగం అనుబంధంలో కేతన కాదంబరిలోనిదంటూ ప్రబంధమణి భూషణంలోని 36వ పద్యాన్ని చూపించారు. దాని పాఠం ఇది:

ఆనక యమృతంబు దానిట్టి చలియని
    జనులకేర్పరుపగా జాలువారు
చూడక మన్మథు సుందరాకారంబు
    గరిమ జూపగ జాలుకడక వారు
వినకయె పరతత్త్వవిపుల నినాదంబు
    వినిపింప జూచెడు తెరవువారు

2. ఆనందరంగరాట్ఛందము 3-213
3. అందులోనే 3 - 282

అంటక మెరుపుల యందంబు వ్రేగును
　　గణుతింప జాలు ప్రఖ్యాతివారు
కంపుగొనకయే కల్పవృక్షముల పుష్ప
సౌరభం బిట్టిదని చెప్పజాలువారు
ఎందుజూచిన ధాత్రిలో హృదయ దృష్టి
కవులు గానని మర్మంబుగలదె జగతి?

మానవల్లి వారు అదే కుమార సంభవం ప్రథమ భాగం అనుబంధంలో కేతన కాదంబరిలోనిదని మరొక పద్యాన్ని కూడా సూచించారు. దాని పాఠం ఇది:

కడువేడి పెల్లెండ పుడమివేల్చి ప్రొద్దు
　　లాకాశగతియె మేలని తలంప
వాత్యాభిహతి లగ్గవాడి వియచ్ఛము
　　లవనిపై జనుటమేలని తలంప
వడివడిగా నీళులుడికిన జలముల్
　　వనచరవృత్తిమేలని తలంప
వనమున కార్చిచ్చు దనరిన వనచరు
　　లంబు సంచరణ మేలని దలంప
　　వాడి యెండ గాసె వడిగొనె సుర గాడ్పు
　　లెసగె వడయగాని నెగసి వీచె
　　దావదహన మెడలె జీవుల కధికసం
　　తాపకారియగు విదాఘవేళ

భాస్కరుని కేతన సీసపద్యాల ఎత్తుగీతులుగానేకాక విడిగా కూడా ఆటవెలదులను అభిమానిస్తాడని తోస్తోంది. ఇతడు కవిప్రతిభను వర్ణిస్తూ రాసిన ''ఆనక యమృతంబు'' అనే పద్యంలాంటి పద్యాన్ని పూర్వకవులలోనైనా ఎంతోమంది వ్రాయలేదు అని నిడుదవోలు వెంకటరావుగారు అభిప్రాయపడుతున్నారు.[4]

కేతన కాదంబరి నుంచి అయిదు పద్యాలూ, ఒక శార్దూల పాదం మాత్రమే లభిస్తున్నాయి.

కాదంబరి దశకుమార చరిత్రలూ, కుమార సంభవమూ కాకతీయ యుగంలో చంపూకావ్యాలుగా తెలుగులో అవతరించడంవల్ల సంస్కృతంలోని పంచకావ్యాలూ ఆనాడు అనువాదం పొందాయేమో అన్న అనుమానం కలుగుతున్నది. మిగతా కావ్యాలు కాకపోయినా కనీసం కాదంబరి బయటపడితే అదే పదివేలు!

ఇతని కాలం క్రీ.శ. 1230–50.

---

4. గ్రంథ విమర్శలు శీర్షికలో భారతి – ఆగస్టు 1965.

యథావాక్కుల అన్నమయ్య

కావ్యాలూ, ప్రబంధాలూ ప్రజాసామాన్యంలో ప్రచారం పొందినా పొందకపోయినా తగుపాటి అక్షరాస్యులకు కూడా తెలిసిన తెలుగు గ్రంథాలు నిస్సందేహంగా శతక వాఙ్మయంలోనివే. ఏదో ఒక శతకంలోని పద్యం రాని తెలుగువాడంటూ ఉండడేమో! పద్యం పూర్తిగా రాకపోయినా కొన్ని మకుటాలైనా తెలియనివాడు ఉండనే ఉండడు.

వృత్తాలలో తొలి శతకం

ఈ వాఙ్మయ శాఖలో మకుట నియమం గల మొదటి కృతి సుమతీశతకం. ఇది కందపద్యాలలో ఉంది. యథావాక్కుల అన్నమయ్య రచించిన సర్వేశ్వర శతకం వృత్తాలలో, అందులోనూ హెచ్చుగా మత్తేభ శార్దూలాలలో చెప్పిన తొలి రచన. ఇతనికి పూర్వుడైన మల్లికార్జున పండితారాధ్యుడు రచించిన శివతత్త్వసారం శతకం అనే పేర చలామణి అవుతున్నా, అది పండితయ్యగారి వివిధ రచనల సంపుటి. అందులో మకుట నియమం, సంఖ్యా నియమం లేని పద్యాలెన్నో ఉన్నాయి. ఈ సర్వేశ్వర శతకంలో అన్నమయ్య తన గ్రంథాన్ని శతకం అని ఒకసారి పేర్కొన్నా 'సర్వేశ్వరస్తోత్రం'[1] అని ఒకసారీ, 'సర్వేశ్వర ప్రాకామ్యస్తవం'[2] అని మరొకమారూ పేర్కొన్నాడు. కవి తన కావ్యాన్ని ఏ పేరుతో పిలుస్తాడో దానికి విభిన్నమైన పేరులు ప్రచారంలోకి రావడం మన ప్రాచీనకవుల చరిత్రలలో సహజమే.

మన పురాతన కవులందరూ ఈ శివకవిలాగ తన కావ్యం వ్రాసిన తారీఖును ఆ గ్రంథంలోనే స్పష్టంగా పొందుపరిస్తే మన సాహిత్య చరిత్ర రచన చాలా సులభమయ్యేది. అన్నమయ్య తన 'సర్వేశ్వర ప్రాకామ్యస్తవం' శాలివాహన శకం 1164 (అనగా క్రీస్తుశకం 1242)లో రచించినట్టు చెప్పుకొన్నాడు.[3] ఈ సంగతి ఇంత విశదంగా చెప్పినట్టు తన గురించి వేరే సంగతులేవీ చెప్పుకోలేదు.

ఊరు, పేరు, గురువు

''దూదికొండ అనే ఊరిలోని మహనీయుడు ఆరాధ్య సోమేశ్వర ప్రభువుయొక్క కరుణ అనే వసంతంలో జనించిన సద్భావాలనే పువ్వులతో, సర్వేశ్వరా! నీ పాదాలు రెండూ పూజిస్తాను'' అని ఒక పద్యంలో అన్నాడు.[4] అందుచేత ఆరాధ్య సోమేశ్వరుడు అన్నమయ్య గురువు అని ఊహించవచ్చు. ఈ సోమేశ్వరుడే పాల్కురికి సోమనాథుడని నిడుదవోలు వెంకటరావుగారు ఊహిస్తున్నారు.[5] దీనిని వేదం వెంకటకృష్ణశర్మగారు ఖండిస్తున్నారు.[6] వేదంవారి వాదంలోనే సబబులు ఎక్కువగా కనబడుతున్నాయి.

---

1. 129వ పద్యం.
2. 127వ పద్యం.
3. అదే పద్యంలోనే
4. మళ్ళా అందులోనే.
5. తెనుగు కవుల చరిత్ర, పుట 374.
6. శతకవాఙ్మయ సర్వస్వము, పుటలు, 29-31

పాల్కురికి సోమనాథుడు క్రీ.శ. 1280-1340 మధ్యవాడు అని దేశ చరిత్రకారులు నిర్ణయించారు. కనుక 1242లో శతకం వ్రాసిన అన్నమయ్యకు గురువు కాలేడు.

కొందరు పాత కవులు అన్నమయ్య, సోమనాథులలో మొదటివారినే మొట్టమొదటివారినిగా పేర్కొనడం కూడ జరిగింది. పూర్వ కవులను స్తుతిస్తూ పింగళి ఎల్లకవి (క్రీ.శ. 1760 ప్రాంతంలో) తన 'తోభ్యచరిత్రము'లో ఇలా చెప్పాడు:

''భక్తిమై రేణుక ప్రమదోత్తము నుతించి
మాయదేవాహ్వయు మహిమ బొగడి
చెలగి యథావాక్యముల నన్నమయగారి
భజియించి మ్రొక్కిడి పాలకురికి
సోమనగారి బ్రస్తుతిజేసి...''

ఈ పద్యంలో మొదట అన్నమయ్యనూ, తరువాత సోమనాథుణ్ణీ నుతించడం వల్ల, పూర్వుల సాక్ష్యం వల్ల అన్నమయ్యే ప్రాచీనుడని చెప్పవచ్చు.[7] ఇంతకూ పాల్కురికి సోమనాథుని నివాసస్థానం దూదికొండ కాదు. అన్నమయ్య గురువు ఆ ఊరివాడు.

గురువుగారి స్వగ్రామం ఏదై ఉంటుందో శిష్యునిది కూడ అదే అనుకోవాలి. అలాగైతే అన్నమయ్య నేటి కర్నూలు జిల్లాలో ఆనాడు నివసించాడనుకోవాలి. దూదికొండ అనే గ్రామం కర్నూలు జిల్లాలో ప్రత్తికొండ తాలూకాలోని ప్రత్తికొండకు సమీపంలో ఉంది. అన్నమయ్య ఈ గ్రామానికి తరువాత ఎప్పుడో వచ్చాడని జనశ్రుతివల్ల మనం భావించాలి. ఏమంటే, ఆయన స్వగ్రామం గోదావరి తీరంలోని పట్టిస అని అంటారు. ఆయన శ్రీశైలం తీర్థయాత్రకు వెళ్ళి తిరుగు ప్రయాణంలో పల్నాడు తాలూకాలో కృష్ణా తీరాన 'జెట్టిపాలెం' దాపున వున్న సత్రశాల అనే చోట స్థిరపడ్డాడట. ఈ ప్రదేశాన్నే విశ్వామిత్రక్షేత్రం అంటారట. జీవితాంతందాకా ఆయన అక్కడే ఉన్నాడని ప్రతీతి.

గోదావరి 'పట్టిస'వాడు కృష్ణానది 'జెట్టిపాలెం' దగ్గర స్థిరపడితే దూదికొండలోని గురువుగారి వద్ద ఎప్పుడు ఉపదేశం పొందాడు? శ్రీశైలయాత్ర చేసుకొని తిరుగు ప్రయాణంలో సత్రశాల దగ్గర స్థిరపడితే అతడు శ్రీశైలయాత్ర ముగించుకొని స్వగ్రామం వైపు తూర్పున కాక పశ్చిమంగా ప్రయాణం చేసి వుండాలి. ఏమంటే, ప్రత్తికొండ తాలూకా శ్రీశైలానికి నైరుతి దిశలో ఉంది. ఒకవేళ అన్నమయ్య దూదికొండ వాడేనేమో!

మెడకు గండకత్తెర

ఈయన కృష్ణా తీరాన స్థిరపడ్డాక తన మెడకొక గండకత్తెర తగిలించుకొని ఒక్కొక్క తాటాకు మీద ఒక్కొక్క పద్యం చొప్పున సర్వేశ్వర శతకం వ్రాయడానికి ఉపక్రమించాడట. వ్రాసిన ప్రతి పద్యం 'కృష్ణా'ర్పణం చేశాడట. ఏటి కెదురీది ఆ తాటాకు

7. ఈ పద్యాన్ని నిడుదవోలు వెంకటరావుగారే తమ 'తెనుగు కవుల చరిత్ర'లో ఉదాహరించారు.

మళ్ళా తనదగ్గరకు చేరుకుంటే దాన్ని తీసుకొని తాటికి గుచ్చేవాడట. ఏ ఒక్క పద్యమైనా తిరిగి రాకపోతే తగిలించుకొన్న గండకత్తెరతో శిరస్సు ఛేదించుకొంటానని ఘోరప్రతిజ్ఞ చేశాడట. ఒక పద్యం ఎదురీత మరిచిపోయింది కాబోలు, దారితప్పి ఏట్లో కొట్టుకుపోయిందట. తాను వ్రాసిన పద్యం దారితప్పినా తాను మాట తప్పనివాడు కనుక అన్నమయ్య కంఠం ఉత్తరించుకోబోయాడట. దేవుడు ఒక పసులకాపరి రూపంలో వచ్చి ''ఈ తాటాకు ఏట్లో కొట్టుకువచ్చి నాకు దొరికింది'' అని ఒకటి అన్నమయ్య చేతికిచ్చాడట. తీరా చూస్తే అది అన్నమయ్య వ్రాసిన పద్యం కాదు; ఇంకొకటి! అయినా అది 'సర్వేశ్వరా!' అనే మకుటంతోనే ఉందట. దీన్ని దేవుడే వ్రాశాడని అన్నమయ్య భావించినట్లు ఈ కథను ప్రచారం చేసినవాళ్ళు భావించారు.

భయంకరాచారాలు

కథలో వాస్తవలేశం ఏమైనా ఉందో లేదో చెప్పలేముగాని అన్నమయ్య తత్వానికి విరుద్ధమైన గండకత్తెరను ఆయన మెడకు కట్టుకథకులు తగిలించారు. వీరశైవ మతంతో పాటు కొన్ని భయంకరాచారాలు కూడ దేశంలో వ్యాపించాయి. శివార్పణగా అంగాలు ఛేదించుకోవడాలూ, ఆత్మహింసలు చేసుకోవడాలూ, తుదకు తమ తల తామే తరుగుకోవడాలూ మేరలేని భక్తిలక్షణాలనీ, అలా చేసినవాళ్ళంతా కైలాసం చేరుకుంటారనీ బోధించినవాళ్ళు చెప్పారు. భక్తులు నమ్మి ఆచరించారు. ఇటువంటి మూఢనమ్మకాన్ని గర్హిస్తూనే బహుశ అన్నమయ్య ఈ క్రింది పద్యం చెప్పివుంటాడు.

''అమితోత్సాహము నంది నీకు దన సర్వార్థంబులం గూర్చి నే
మముతో నిచ్చుటకంటె శౌర్యగుణసామర్థ్యంబునుం బొంది ప్రా
ణము నీ కిచ్చుటకంటె దుస్తరభవోన్మాదంబు మర్దించి చి
త్తము నీకిచ్చుట పెక్కుభంగుల మహౌదార్యంబు సర్వేశ్వరా!'' (76)

ఇందులో చెప్పిన 'దుస్తరభవోన్మాదం' ఆనాటి మతోన్మాదానికి పర్యాయపదంగా మనం తీసుకోవచ్చు. ఇటు 'వీరభక్తి'ని ఎలా నిరసించాడో అటు అద్వైతాన్నీ, 'అహం బ్రహ్మాస్మి' తత్వాన్నీ ఖండించాడు. ఈ క్రింది పద్యం చూడండి.

''చావంబుట్టుచు బుట్టజచ్చుచు మహాచండాల సంసారపా
రావారంబున గూలి తా జెడుటకుం బ్రహ్మక్తిగా నాత్మలో
నేవం బొందక యేసు నీ వనుట తా నేజ్ఞానమో శ్రీమహా
దేవా! యిట్టి కుతర్కముం గలదె చింతింపంగ సర్వేశ్వరా!'' (74)

సాత్త్విక భక్తుడు

ఇతడు కేవలం సాత్త్విక భక్తుడు. ఆడంబరాలు, అర్థంలేని తర్కాలు, అనర్థకమైన ఉన్మాదాలూ నిరసించేవాడు. మోక్షం కోసం ఎక్కడెక్కడో వెదకనక్కర్లేదంటాడు, తీర్థాలలో మునగక్కర్లేదంటాడు.

అన్నట్టు, గోదావరీ తీరంలో పుట్టి పెరిగిన అన్నమయ్య తీర్థయాత్రలకని కృష్ణా తీరానికి వచ్చి అక్కడ స్థిరపడిపోయాడని చెప్పుకొంటారుగాని ఈయన దీక్ష పుచ్చుకొన్నాక తీర్థయాత్రలకు ఏమి ప్రాముఖ్యం ఇవ్వలేదు. ''పలుతీర్థంబుల గ్రుంకుకంటె మహిలో భక్తాంఘ్రిపానీయముల్ తలమీదం జిలికించుకో దగును; తీర్థంబాడ భారంబు; తత్ఫల మత్యల్పము'' (23) ''రమణన్ భక్తసమగ్రదర్శనము తీర్థశ్రేణి, తద్గోష్ఠితీర్థము, తద్దివ్యదయావలోకనము తీర్థం బెన్నగా నిట్టి జంగమ తీర్థాంబుధి నోలలాడక వివేకభ్రష్టులైపోయి లోకమునం దీర్థము లంచు నేరులు సొరంగా నేల సర్వేశ్వరా!'' (24) అని ఇలాగ ఒకటి రెండు పద్యాలలోకాక ఆరు పద్యాలలో వీరశైవులందరిలాగే తీర్థయాత్రా నిరసనం చేశాడు.

అయితేనేం, కవిని గురించి మనకు తెలిసినది అతని గ్రంథంలోని భావాలకు విరుద్ధమైనా, అతని గురించి లోకులు ఏమి చెప్పుకొంటున్నారో తెలుసుకోవడం అవసరం. యథావాక్కుల అన్నమయ్యగారి కుటుంబానికి 'ఉత్తరోత్రా' 'సోమరాజువారు' అనే ఇంటిపేరు వచ్చిందనీ, వాళ్ళు నేటికీ పల్నాడు తాలూకాలో ఉంటున్నారనీ తెలుస్తున్నది. వాళ్ళు తెలియజేసిన విషయాలవల్లనే అన్నమయ్య గోదావరీ తీరంవాడనీ, యాత్రలు వెళ్ళాడనీ మన సాహిత్య చరిత్రకారులు వ్రాస్తున్నారు. అర్వాచీనుల మాటలకన్నా అంతరంగిక సాక్ష్యం యొక్క బలం ఎక్కువ కనక అన్నమయ్య పద్యాల నుండే అతని గురించి ఇతర వివరాలు సేకరించడానికి ప్రయత్నం చేద్దాం.

కవిని గురించి ఆరా

ఒక పద్యంలో అన్నమయ్య ''కడుజిత్రంబుగ జేయగా నొర సురంగంబయ్యోనే ఖడ్గమం దిడకున్నన్'' అన్నాడు.[8] కత్తి పెట్టని ఒర ఎంత చిత్రంగా చేసినా అందమైన దవుతుందా అని దాని అర్థం. ఇంకొకచోట ''చిత్తము శూకలాశ్వము విధంబై యుండు'' నన్నాడు.[9] శూకలాశ్వం అంటే తర్ఫీదు ఇవ్వనట్టి గుర్రం. మరొక పద్యంలో ''గురుమంత్ర కార్ముకంలో ఆత్మాస్త్రం సంధించి అష్టాంగ మహాముష్టి వివేకి వేస్తే, అది కైవల్య లక్ష్యంలో నాటుతుం''దని[10] విలువిద్యను గురించి చెప్పాడు. కత్తి, ఒర, బాణం వేయడం, గుర్రానికి తర్ఫీదు ఇవ్వడం మొదలైనవాటిని ఉపమానాలుగా చెప్పినందువల్ల అన్నమయ్య మొదట దండనాథుడేమో అనే అనుమానానికి ఆస్కారం లేకపోలేదు.

నాటకాలపై మోజు

ఇతనికి తన కాలంలోని నాటకాలంటే చాలా ఇష్టమని కూడ ఊహించడానికి వీలుంది. రెండు పద్యాలలో వాటిని చెప్పాడు. ఆ రోజుల్లో నాటకాలు కౌముదీ ఉత్సవాలలో ఆడేవారని కూడ ఈ పద్యాల వల్ల తెలుసుకోవచ్చు. చూడండి ఆ పద్యాలు:

8. నెంబరు 79లో
9. నెంబరు 131లో
10. నెంబరు 69లో

''అమరంగా స్ఫుటభక్తి నాటకము భాషాంగక్రియాంగాభిర
మ్యముగా జూపిన మెచ్చి మీరలు పురే యన్నంతకున్ యోనిగే
హములన్ రూపులు వన్నుకొంచును నటుండై వచ్చి సంసారరం
గములోనం బహురూపమాడు వెలయంగా జీవి సర్వేశ్వరా!'' (20)

''ప్రారంభించి చకోరపోతము మహీయజ్యోత్స్నయం దుత్సవ
శ్రీరంజిల్లుచు వేడ్క నుండుగతి నా చిత్తంబు నీ దివ్యశృం
గారాధ్యానమునం దహర్నిశము జొక్కంజేయవే దేవ శ్రీ
గౌరీలోచన నర్తకీనటన రంగస్థాన సర్వేశ్వరా!'' (86)

నాటకాలూ మొదలైనవాటిని చెప్పినట్టే అన్నమయ్య తన సమకాలిక జీవితంలోని ఉపమానాలతోనే పద్యాలు చెప్పాడు. ''కనకంబందు ఘనీభవించిన కళంకంబెల్ల సువ్యక్తికా ననలాస్యంబునగాని పోదు'' అని స్వర్ణశుద్ధినీ[12], అనుబంధాలు, ఇంద్రియాలు అనే భూతవర్గాన్ని, మంత్రోరుసాధనతో ఉచ్చరణ చేయడం, అంజనం వేయడం మొదలైన భూతవైద్యాలనూ[13] పేర్కొన్నాడు.

తాను సమకాలిక జీవితంలో చూచినవేకాక పాత గ్రంథాలలో చదువుకొన్న భావాలను కూడ ఇతడు పద్యాలలో చెప్పాడు. మహిమ్నం, మల్హణం, అనామయం మొదలైన సంస్కృత గ్రంథాల నుంచీ, శివతత్వసారం మొదలైన తెలుగు పుస్తకాలలో నుంచీ ఇతడు భావాలు స్వీకరించాడని పండితులు చెప్తున్నారు. ఎక్కడ నుంచి భావాలు తెచ్చుకొన్నా ఇతడు తన ప్రతిభను వాటికి జోడిస్తాడు.

రావణాసురుడు రచించాడని చెప్పే శివతాండవ స్తోత్రంలో శృంగార, శృంగారేతర రసాల కలయిక ఒకదాని తరువాత ఒకటిగా పునరావృతమవుతుంది. అలాగే అన్నమయ్య రచించిన ఈ క్రింది పద్యంలో విభిన్న తత్వాల పొందిక కనబడుతుంది.

''సకలాధీశ్వర పట్టభద్రుడవు, భిక్షగామి, వత్యంతశాం
తకళాత్ముండవు, రౌద్రమూర్తి, సతిసౌందర్యాంబికాసంగమా
ధికలోలుండవు, దివ్యయోగిని, మదిం దెల్లంబుగా నెట్టి వా
రికి దా శక్యమె నీ నిజం బెరిగి వర్ణింపంగ సర్వేశ్వరా!'' (106)

ఇటువంటి శిల్ప చాతుర్యం ఇతడు వ్రాసిన 138 పద్యాలలోనూ అధికంగానే కనబడుతుంది. అయితే ఈయన రచనలో తత్సమ, తద్భవ శబ్దాలే ఎక్కువ. దేశ్యాలు తక్కువే. జాను తెనుగు అట్టే వాడడు. ఇతడు వాడిన శివకవులకు సహజమైన ప్రయోగాలు – 'సమూహి, సురంగం' మొదలైన కొన్నిటిని నిడుదవోలు వెంకటరావుగారు చూపించారు. ఇతడు వాడిన విలక్షణ ప్రయోగాలు కొన్ని వేదం వెంకటకృష్ణశర్మగారు పేర్కొన్నారు. గీపెట్టు, గింజుకొను వంటి వాడుకలో వున్న జాతీయాలు ఈ శతకంలో

12. నెం. 68

13. నెం. 67

అక్కడక్కడ పొందుపరిచాడని వేదంవారన్నా, అన్నమయ్య తత్సమాలే అధికంగా వాడడం చేత 'కొంగజపం' మొదలైన మాటలకు 'బకవేషార్చన' అనే రూపాలు కనబడతాయి. ''కసవుంబెంచిన చేనియట్లు'' అనే తెలుగు మాటల సామెతకన్నా ''భ్రమరధ్యానము దాల్చి కీటకము సద్భావాది సంయుక్తి దాభ్రమరంబై ఖగవీథినాడు నరిక్'' అనే సంస్కృత 'న్యాయాలు' ఎక్కువగా కనబడతాయి. అయితే అన్నమయ్య కవిత్వం, చిత్తశుద్ధి గల భావాలకు 'యథావాక్కులు' అని చెప్పాలి. ఈ శతకం గురించి జయంతి రామయ్యగారు ఇలా చెప్పారు:

> ''శైలి హృద్యము. ధార యనర్గళము. చదువువాని కేపాటి వాచకత యున్నను జాలును, తమంత దాము దొర్లిపోవును. పద్యరచనా శిల్పమున కిది ముఖ్య లక్షణము.''

ఈ మాటలు కూడ యథావాక్కులు, కొన్ని చక్కని పద్యాలు:

''జగతీ చక్రము పాదఘట్టన నదృశ్యంబై ప్రవర్తింపగా
గగనం బంతయు బాహుమండల సమగ్ర వ్యాప్తులం దద్భుతం
బుగ ఘూర్ణిల్ల నజాంత్య వేళల సముద్భూతాంగ హారావళుల్
నెగడం బొంగి నటింతు తాండవ మహానృత్యంబు సర్వేశ్వరా! (18)

అనురాగంబున నిన్ను జూచు దలపోయుం జొక్కు గాక్షించు వ
ర్ణన సేయం దమకించు సిగ్గువిరియం బ్రార్థించు శోషించు నం
తను నీ ధ్యానము దాల్చుదన్ను మరచుం దా నీదశావస్థలం
దనరంగా మది నిన్ను డక్కగొను సద్భక్తుండు సర్వేశ్వరా! (32)

ఘటదుగ్ధంబులు పేరుగాక వెలయంగా నెంత తోడంటిన
న్నట దుగ్ధాంబుధి పేరునే జగములో నల్పుండు దుస్సంగతిం
జటులాత్ముం డగుగాక యెయ్యెడల నీ సద్భక్తుడే కార్య ము
త్కటమై తాకిన నవ్యచిత్తు డగునే తర్కింప సర్వేశ్వరా! (44)

సతి వేడ్కం దన ప్రాణవల్లభునితో సంయోగ మాసించుగా
కతనిం బ్రార్థనసేసి సొమ్ముగొనిపో నర్రాడునే తజ్జ్ఞ డీ
క్షితి నీ భక్తియ వేడుగాక మరి నీ శ్రీపాదము ల్గొచ్చి కు
చ్ఛితకామ్యార్థము లొంద వేడుకొను నే చింతింప సర్వేశ్వరా! (45)

భ్రమరధ్యానము దాల్చి కీటకము సద్భావాదిసంయుక్తి దా
భ్రమరంబై ఖగవీథి నాడు ననినక్ భావించి నిన్నాత్మ నె
య్యముతో ధ్యానముసేయు మర్త్యుడును నీయట్లే పరవ్యోమత
త్త్వమునం దవ్యయలీలనుండు టరుదే తర్కింప సర్వేశ్వరా! (46)

అమరశ్రేణులకుఁ సుధామయకళౌఘాత్మీయసారంబు ర
మ్యముగా గ్రోలగనిచ్చి తా నొక కళామాత్రాంగుడై యున్న చం
ద్రమునిం జూచి జనమ్ము మ్రొక్కు క్రియ నారఁ భక్తపూజావిధి
క్రమభారాకృశు జూచి మ్రొక్కుదురు లోకంబెల్ల సర్వేశ్వరా! (47)

భవదాకారమె కాంచు నీ స్తవకదంబ శ్రేష్ఠసద్వాక్యముల్
చెవులార న్విను నిన్నె చెప్పు మది దుశ్శీలేంద్రియాటోపదు
ర్వ్యవసాయాత్ముల గాంచుచో వినెడిచో వర్ణించుచో జీకునుం
జెవిటి న్మూగయు నై చరించు మహి నీ శీలుండు సర్వేశ్వరా! (50)

పెంపం దల్లి యగుఁ రుజాపటలదుష్పీడావిధిక్షోభ వా
రింపఁ వైద్యుడగుఁ గుమార్గవిధులం గ్రీడింప బోకుండ శి
క్షింపఁ బల్లిదుడైన తండ్రియగుచుఁ శ్రీమంతుగా నెంతయుఁ
సంపద్వృద్ధియొసంగ దాతయగు నీ సద్భక్తి సర్వేశ్వరా! (56)

ఉరుసంసారగజేంద్ర దర్పదళన వ్యూఢప్రతాపోగ్రకే
సరి, దుష్ప్రాపశరీరబంధ విపులక్ష్మాజ వ్రజచ్ఛేదని
స్ఫురిత క్రూరకుఠారధార దురిత ప్రోద్భూతజీమూతదు
స్తరసంఘాత విఘాతమారుతము నీ సద్భక్తి సర్వేశ్వరా! (57)

కలయం గాష్ఠయుగంబు గూర్చి తరువంగా బుట్టి తత్సాధనం
బులరెంటిన్ దహియించు వహ్నిగతి దా బొల్పొంద గాయంబు సం
ధిల సత్కర్మముతో మథింపగ భవచ్చిద్భక్తి సద్వహ్నియు
జ్జ్వలమై కాయము గర్మముం జెరుచు దత్వం బెన్న సర్వేశ్వరా! (81)

కలవారై మతిమంతులై రసికులై గంభీరులై ధీరులై
లలనా మన్మథులై సముజ్జ్వలవచోలాలిత్యులై నిత్యులై
బలవిభ్రాజితులై యశోభరితులై భాసిల్లు భాగ్యోదయుల్
తొలిజన్మంబుల మిమ్ముగొల్చిన మహాత్ముల్ వారు సర్వేశ్వరా!'' (122)

క్షేమేంద్రుడు

పూర్వకాలంలో మహారాజులు నిండుసభలో కొలువుతీరినప్పుడు ఆస్థానంలోని ఆశ్రితులు, పరివారం ఏయే స్థానాలలో కూర్చొనేవారో ఈ క్రింది పద్యం వివరిస్తుంది.

''వెనుకదెస నిల్చి కామినీ వితతి గొల్వ
దక్షిణంబున సుకవివితాన మమర
వామదిశయందు బొగడెడి వందిజనులు
నెదుర గాయకగేయంబులు లింపుపెంప''

ప్రభువు సభ చేస్తాడు. ఈ పద్యం 'ముద్రామాత్యం' అనే ప్రాచీన గ్రంథంలోనిదని మడికి సింగన అనే కవి క్రీ.శ. 1347 ప్రాంతాలలో 'సకలనీతి సమ్మత'మనే సంకలన గ్రంథంలో ఉదాహరించాడు.[1] 'ముద్రామాత్యం' వ్రాసిన రచయిత పేరు ఇదమిత్థం అని చెప్పలేము. సకలనీతి సమ్మతాన్ని ప్రచురించిన మానవల్లి రామకృష్ణ కవిగారు ''ముద్రామాత్యము క్షేమేంద్రుడను బిరుదు వహించిన లక్కాభట్టు అను కవి రచించినట్లు తోచుచున్నది'' అని చెప్పారు. ఇలా తోచడానికి ఆధారమేమిటో ఈ మాటలు వ్రాసిన సకలనీతి సమ్మతం పీఠికలో వ్రాయలేదు. కాశ్మీర దేశంలో క్షేమేంద్రుడనే కవి క్రీ.శ. 1020-1080 ప్రాంతాలలో ఉండేవాడు. ముద్రామాత్యం వ్రాసిన తెలుగు కవి ఆ కాశ్మీర కవి వ్రాసిన గ్రంథాలలో దేనినైనా అనువాదం చేసి ఆ మూల రచయిత పేరును బిరుదుగా పొందివుంటాడు. కాశ్మీర క్షేమేంద్రుడు 34 గ్రంథాలు వ్రాశాడు. అందులో 19 మాత్రమే నేడు దొరుకుతున్నాయి. వీటిలో నీతిశాస్త్రానికి సంబంధించినవి కూడ ఉన్నాయి.[2] ఈ తెలుగు క్షేమేంద్రుడు క్రీ.శ. 1080 తరువాతనేగాని అంతకు ముందు జీవించి ఉండడు. అందుచేత ఇతడు కాకతీయ యుగం తొలిదినాలలో ఉన్నవాడు.

ఈ సంగతి ఇతని పద్యాలలో ఒకదానిలో నిరూపించవచ్చు. మంత్రిలేని మహీపతులు నాలుగు కాలాలపాటు నిలబడలేరని ఇతడు ఇలా చెప్పాడు :

''రాజరాజవంశభూజనపతు లీల్గి
రకట! మంత్రి తొలగి యలికినాడు
ఏది పసుపుసేయ నిటు నిల్వబోలదు
రాజు లేని కయ్యు మోజపడునె?'' (సకలనీతి 927)

---

1. మడికి సింగన క్రీ.శ. 1420 ప్రాంతాలవాడని ఇతరులంటారుగాని సుప్రసిద్ధ చరిత్రకారులు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తమ ''History of Reddy Kingdoms'' గ్రంథంలో (పుట 514) ఇతని కాలాన్ని ఇలా నిర్ణయించారు. వేదం వెంకటరాయశాస్త్రిగారు దీనినే బలపరిచారు. చూ : వారి 'నన్నెచోడుని కవిత్వం', పుట 82.

2. తెలుగు భాషాసమితి : విజ్ఞానసర్వస్వం – 6వ సంపుటి 'విశ్వసాహితి', పుట 648.

ఇందులోని రాజరాజవంశీయులు చాళుక్య యుగంలోనివాళ్ళు, వాళ్ళ రాజ్యం అంతరించాక చెప్పిన పద్యమిది! అందుచేత ఈ కవి కాకతీయ యుగంలోనే ఉంటాడు. అందులోనూ ఒకవేళ తిక్కనగారికి ముందు జీవించి ఉంటాడని వేరొక ఆధారంవల్ల చెప్పవచ్చు. అదేమిటంటే, తిక్కనగారు 'కవివాగ్బంధం' అనే లక్షణ గ్రంథం వ్రాశారని ప్రతీతి, ఆ పుస్తకంలో 'వృద్ధియతికి క్షేమేంద్రులు చెప్పిన శతపక్షి సంవాదంలో పద్యము' అని ఒకటి కనబడుతుంది. ఈ సంగతి వివరిస్తూ, ఆ సీసపద్యంలోని రెండు పాదాలను మాత్రమే ఒక అముద్రిత గ్రంథాల పట్టికలో ప్రచురించారు.[3] ఆ పాదాలు ఇవి :

''అమలినాక్షరరూపి యాద్యంతసకలలో
 కైకసంస్తుత్యసురౌఘవంద్య!
కమలాసనార్చితకాంతార్ధవరదేహ
 కౌశికప్రియరవి కైరవాప్త!''

ఈ పాదాలను ఉదాహరించిన కవివాగ్బంధాన్ని నిజంగా తిక్కనగారే రచిస్తే, తెలుగు క్షేమేంద్రుడు క్రీ.శ. 1200 ప్రాంతాలలో జీవించి ఉండాలి. మడికి సింగన కాలమైన క్రీ.శ. 1347కు పూర్వుడన్నది మాత్రం తథ్యం. కవివాగ్బంధంలో పేర్కొన్న శతపక్షి సంవాదం ఎటువంటి కావ్యమోగాని ఇతర లాక్షణికులు గూడ ఇందులోనుంచి ప్రయోగాలు తీసుకొన్నారు. క్రీ.శ. 1480-1520 మధ్య జీవించిన వెల్లంకి తాతంభట్టు తన 'కవి చింతామణి'లో 'శతపక్షిసంవాదంలోని'దని చెప్తూ ఈ క్రింది పద్యం ఉదాహరించాడట :

''నీవీబంధము వీడ మోవి యదరన్ నేత్రంబు లల్లాడ జన్
గ్రేవల్ గాసగ విచ్చు క్రుమ్మడివిరుల్ పృథ్వీస్థలిం జెంద స
ద్భావాగాగాములోన చెమ్మగిల చిత్తం బుత్తలంబొంద నా
నావిభ్రాంతులు పుట్టు నింతులకు చెంతన్ వింతవారుండినన్.''[4]

ఇందులో మదన వికారాలు ఉండడంవల్ల బహుశా అది శృంగారరసానికి చెందిన కావ్యం కావచ్చునేమో అనిపిస్తున్నది. ఇందులోని ఇతర పద్యాలేవీ దొరకలేదు. ఇలాంటి కావ్యం నష్టమవడం దురదృష్టమే. కాశ్మీర క్షేమేంద్రుని ప్రథమ రచనలైన దేశోపదేశం, కర్మమాల అనే గ్రంథాలలో శృంగారం అతి వేలంగా ఉండడం ఇక్కడ మనం గమనించాలి. కాశ్మీర క్షేమేంద్రుడు యౌవనంలో శృంగార ప్రియుడై ఉండవచ్చు.[5] తెలుగు క్షేమేంద్రునిలో ఈ శృంగార వాసనలు ఉన్నాయి. ఇందువల్ల ఇతని కీ బిరుదు వచ్చిందా?

తెలుగు క్షేమేంద్రుడు వ్రాసిన 'శతపక్షిసంవాదం'లోని ఒక పద్యమూ, రెండు పాదాలూ మాత్రమే దొరికాయని చింతించే మనం అతని ముద్రామాత్యంలోని పద్యాలు

3. తంజావూరు సరస్వతీమహల్ 'అముద్రిత తెనుగు గ్రంథాల వర్ణనాత్మక సూచిక', మొదటి సంపుటం, పుట 294.
4. 'తెనుగు కవుల చరిత్ర'లో నిడుదవోలు వెంకటరావుగారు ఉదాహరించారు. పుట 381.
5. తెలుగు భాషా సమితి - విజ్ఞాన సర్వస్వం 6వ సంపుటం, 'విశ్వసాహితి' పుట 1048.

కనీసం 32 దొరికినందుకు సంతోషించాలి. వీటి నన్నింటినీ మడికి సింగన్నే ఉదాహరించాడు. వీటిలో ఇంతకుముందే మనం చెప్పుకొన్న 'రాజ రాజ వంశ భూజన పతు'లనే పద్యాన్నీ, ఈ క్రింది పద్యాన్నీ పేర్కొని రామకృష్ణకవిగారు 'ముద్రామాత్యం' ఎటువంటి గ్రంథమో ఊహించారు.

''కొన్ని దినంబులిక్కడ నకుంఠితలీల బథశ్రమార్తియై
యున్నబలంబు గెల్చికొను టొప్పగు, నంతియ కాదు శత్రుభూ
మి న్నిజమార్గ మారయక మిన్నక యేగుట యేది బుద్ధి యా
యున్నెడ జూచి వెళ్ళు జనులున్నర చెప్పుడు గూఢచారతన్.'' (సకలనీతి 852)

''ఇవి కథా భాగంలోని పద్యములట్లు గాన్పించును గాని కేవలము నీతి విచారములు గావు'' అని వ్యాఖ్యానించారు. ''ముద్రామాత్యము కేవలము నీతి గ్రంథము కాక ముద్రారాక్షసమువలె నొకరాజుకు ప్రాభవమును సంపాదించు మంత్రి శిఖామణి నీతి ధౌరంధర్యమును వర్ణించు కావ్యమేమోయను సందియము కలిగించుచున్న''దని వ్రాశారు. అయితే మడికి సింగన ఉదాహరించిన 32 పద్యాలను చదివాక ఇది కథాకావ్యం కాదేమో అనిపిస్తున్నది. ఇది కూడ శివదేవయ్య 'పురుషార్థం,' బద్దెన 'నీతిశాస్త్రముక్తావళి' వంటి నీతిగ్రంథమే అని చెప్పవచ్చు.

అయితే 'ముద్రామాత్యం'లో కొన్నిచోట్ల భావాలూ, అన్వయాలూ ఏ పద్యాలలోవి ఆ పద్యాలలో పూర్తికావు. తరువాతి పద్యంలోకి కూడ విస్తరిస్తాయి. ముద్రామాత్యం లోనిదని మడికి సింగన ఉదాహరించిన మొదటి పద్యమే సగంలో మొదలవుతుంది, చూడండి.

''అనుచు దలంచి రాజసచివాధిపు లెంతయుబ్రేమతోడ బ్రా
ర్థన మొనరింప సర్వజనతాహితబుద్ధి వహించి యంధ్రవా
గ్వనధివిలాసవీచికల వారక తెప్పల దేల్చి యింపుసొం
పినుమడిగా నయామృతము నిచ్చెద మెచ్చులు పల్లవింపగన్.'' (సకలనీతి 36)

అందుచేత ఇది కథాకావ్యం అని భ్రమపడడానికి వీలుంది. ఇందులోని నీతులు గూడా కేవలం సరళమైనవి కాని వక్రమార్గాలు కూడా బోధిస్తాయి. మాటున దాగి యుద్ధం చేయవచ్చునని కవి ఉపదేశిస్తాడు, చూడండి.

''వేర యొకచోట వలయొగ్గి వేటకాడు
తొలగియుండి మృగంబుల ద్రుంచు పగిది
రూపునూపక శత్రువు రూపుగూల్చు
టిదియె నయమార్గమిట్లు జయింపవలయు.'' (సకలనీతి 895)

అధర్మాన్ని అధర్మంతోనే జయించాలనీ, వజ్రాన్ని వజ్రంతోనే ఛేదించాలనీ చెప్పే స్వభావం కలవాడు అపకారికి ఉపకారం చేయమనడు. అలా చేస్తే రాజ్యాలు నిలబడవు.

రాజ్యం కోసం ఏది చేసినా తప్పులేదనే 'నీతి' మార్గమిది. దండయాత్రల సమయంలో, శత్రువులు వచ్చే దారిలోని చెరువులలో, నూతులలో విషం కలపాలని కూడ ఇది బోధిస్తుంది.

''తా నరులు వచ్చు తెరువున
మానుగ గల చెరువులందు మడువులయందుఀ
బూని ఘనగరళతరళము
గా న్గొనరింపంగవలయు గడువేగమునఀ.'' (సకలనీతి 916)

ఇది ఆ రోజుల్లో దుర్గ రక్షణకు ముఖ్యమే. ఈ కవి కౌటిల్యాన్ని మనఃస్ఫూర్తిగా ఉపదేశించి దానిని సమర్థిస్తారు.

''కౌటిల్యా వృత్తినెంతయు
బాటించియేకాక సంధి బలహీనుల కె
ప్పాట నలవడునె? యైనను
పాటించి యెరుంగవలయు బరహృదయంబుల్.'' (సకలనీతి 354)

ఇందాక చెప్పినట్టు వజ్రాన్ని వజ్రంతోనే కోయాలన్న నమ్మకం కలవాడు కాబట్టే ఈ క్రింది పద్యం సూటిగా చెప్పాడు:

''మతి మంతుల యంత్రంబులు
ప్రతియంత్ర క్రియనెగాని పాయవు దృఢకీ
లితఘనఘటితకవాటము
ధృతి దాలముచేతగాక తెరవగననగునే?'' (సకలనీతి 40)

ఈ పద్యంలోని రెండవ భాగంలో చెప్పినట్టు చక్కని ఉపమానాలతో నీతిని వివరించడం అక్కడక్కడ కనబడుతుందిగాని ఆంధ్రభోజుని నీతిభూషణంలోలాగ సర్వత్రా కనబడదు. అయితే, ఉపమానాలు వాడినచోట్ల చక్కగా చెప్పాడు, చూడండి:

''పెద్దయైన యినుపముద్ద దానొకలేత
తీవనైన నెట్లు త్రెంపనేర్చు
నల్పమైన నదియు నతిశరధారచే
ద్రెంపనోపు నెంత దృఢమునైన.'' (సకలనీతి 715)

''నీరున ననలం బారుట
నారయ లోక ప్రసిద్ధ మయ్యనలముచే
నీరు గడుదోష ముడుగదె
చారుతరోపాయశక్తి సంపదవలనఀ?'' (సకలనీతి 716)

బలం లేనప్పుడు కుటిల పద్ధతి చెప్పినా అకుటిల బలదర్ప మున్నప్పుడు ఎలా యుద్ధం చేయాలో ఒక పద్యంలో చెప్పాడు.

''వికటపటుశూలకలితా
శకటోద్భటగజఘుటాదిచక్రవ్యూహా
ప్రకట మొనరింపగాదగు
నకుటిలదుజదర్ప మొప్ప నాహవభూమిన్.'' (సకలనీతి 920)

ఈ పద్యంవల్ల 'ముద్రామాత్యం' రచించిన రోజుల్లో కూడ ప్రాచీన యుద్ధ గ్రంథాలలో చెప్పినట్లు వ్యూహాలు పన్నేవారని తెలుస్తున్నది. ఇతని రచన సంపూర్ణంగా దొరికినా, ఇతడు వ్రాసిన యితర రచనలు దొరికినా ఆనాటి వైనాలు మరికొన్ని తెలిసేవి.

ఇతడు 'శూద్రక చరిత్ర' అనే గ్రంథం కూడ వ్రాసినట్టు మానవల్లి రామకృష్ణ కవిగారు సకలనీతి సమ్మతం పీఠికలో చెప్పారు. ఈ పుస్తకంలోని ప్రయోగాలను లాక్షణికులు ఉపయోగించారో లేదో తెలియదు. ఇప్పటిదాకా ఎవరూ పేర్కొనలేదు.

తెలుగులో శూద్రక చరిత్ర రచన ఎప్పుడు జరిగిందో, ఎవరివల్ల జరిగిందో కచ్చితంగా చెప్పలేంగాని కన్నడంలో క్రీ.శ. 900 ప్రాంతాలలోనే మొదటి గుణవర్మ జైన గ్రంథమైన హరివంశాన్ని, చంపూకావ్యమైన శూద్రక కావ్యాన్ని విరచించాడు. లక్షణ గ్రంథాలలో గుణవర్మ వ్రాసిన శూద్రక కావ్యం నుంచి అనేక పద్యాలు ఉదాహృతాలయ్యాయి. ''శూద్రకునికి సంబంధించిన కథలు సంస్కృతంలోనూ, ప్రాకృతంలోనూ చాలా ఉన్నాయి. వీటిలో గుణవర్మ దేనిననుసరించిందీ స్పష్టంగా తెలియదు'' అని పరిశోధకులు అంటున్నారు.[7]

మొదట కన్నడ సాహిత్యంలోనూ, తర్వాత తెలుగు సాహిత్యంలోనూ జైనులవల్లనే శూద్రక చరిత్ర ప్రచారం అయింది. జైన వాఙ్మయంలో మేరుతుంగుని థారావళి ఉజ్జయిని రాజుల నికరాలను కథనం చేస్తుంది. కాలకాచార్యక ధానకం సుప్రసిద్ధం కనుక అది ప్రభాతకచరిత్ర మొదలైన చాలా జైన గ్రంథాలలో కనబడుతుంది. కాలకాచార్యుని కథకూ, శూద్రకుని చరిత్రకూ ఒక పీటముడి ఉంది.

క్రీస్తుపూర్వం 204 ప్రాంతాలలో ఘూర్జరదేశంలో మాళవ రాజ్యాన్ని గర్దభిల్లుడనే రాజు పాలిస్తున్నాడు. అతని దేశంలో కాలకాచార్యుడనే జైన యతి ఉన్నాడు. ఇతనికి సరస్వతి అనే సోదరి ఉంది. చాలా అందగత్తె. ఆమె జైనధర్మాన్ని అవలంబించి బసదిలో చేరింది. రాజు ఆమెను చూసి మోహించాడు; చెరబట్టాడు; చెరిచాడు. కాలకాచార్యుడు ఆగ్రహోదగ్రుడయ్యాడు. దేశాన్ని విడిచి సింధు భూములకు పశ్చిమాన ఉండే శకద్వీపానికి వెళ్ళాడు. దానిని పరిపాలిస్తున్న శాహీశక నాయకుణ్ణి తన జ్యోతిషజ్ఞానంతో మెప్పించాడు. అతని ఆశ్రయాన్ని సంపాదించాడు. ఈ నాయకుడేకాక ఇంకా 95 గురు

7. కన్నడ సాహిత్య చరిత్ర - ఆర్వీయస్ సుందరం, పుట. 28

నాయకులు ఆ రాజ్యాలలో ఉన్నారు. వీరికి ఒక అధినాయకుడు ఉన్నాడు. అతణ్ణికూడా కాలకాచార్యుడు మెప్పించి వశంవదుణ్ణి చేసుకొన్నాడు. 95 మంది సహనాయకులతో దండు వెడలి గుజరాతును ఆక్రమించుకోమని చెప్పాడు. కాలకాచార్యుని బోధనలవల్లనే మొట్టమొదటిసారిగా శకులు భారతదేశంపై దండెత్తారు. ఉజ్జయినిని ముట్టడించారు. రాజుని సంహరించి ఆక్రమించుకొని స్థిరపడ్డారు. గర్దభిల్లుని మరణం తర్వాత కాలకాచార్యుడు తన సోదరి సరస్వతిని తీసుకొని ప్రతిష్ఠాన నగరంలో ఉన్న శాతవాహన రాజును ఆశ్రయించాడు. శకులు 17 సంవత్సరాలు ఉజ్జయినిని పాలించాక గర్దభిల్లుని కుమారుడు విక్రమాదిత్యుడు పగ తీర్చుకొన్నాడు. శకులను ఓడించి దేశం నుండి వెళ్ళగొట్టాడు.[8]

వివిధ భారతీయ భాషలలోని కథా సాహిత్యాలలో విక్రమాదిత్యుడు సరిసాటిలేని సాహసాంకుడు. ఇతని చుట్టూ ఎన్నో కట్టుకథల పుట్టలు అల్లుకొని అసలు విక్రమార్కుడనే వ్యక్తి లేనేలేడు, అతడు ఉత్త మిథ్యాపురుషుడనే భ్రాంతి పొరలు కప్పేదాకా వెళ్ళింది. అయితే విక్రమాదిత్యుడు చారిత్రక వ్యక్తే. ఇతడు మరెవరో కాదు, శూద్రకుడే. స్కాందపురాణంలోనూ, క్రీ.శ. 586 ప్రాంతాలలోని సుమతీ తంత్రంలోనూ శూద్రకయుగం ప్రసక్తమయిందని కె.పి. జయస్వాలేగారు చెప్పారు.[9] ఎల్లార్యుని జ్యోతిష్యదర్పణంలోని ఈ క్రింది శ్లోకం శూద్రక శకాన్ని విక్రమాబ్దాలనూ ఇలాగ చెప్తుంది.

బాణాబ్ధి గుణదస్రోన 2345 శూద్రకాబ్దాకలేరతాః
గుణాబ్ధి వ్యోమరామోనా 3043 విక్రమాబ్దాః కలేర్గతాః

(లాహోరులోని పంజాబు విశ్వవిద్యాలయం సంస్కృత లిఖిత గ్రంథాల కేటలాగు సంపుటి 2, సంఖ్య 3465. శ్లోకం 71 అని సత్యశ్రవగారు తమ గ్రంథంలో చెప్పారు.)

పశ్చిమ భారతంలో శకులను నిర్జించిన మొట్టమొదటి భారతీయుడే శూద్రకుడు. ఇతడు శస్త్ర విద్యలలో, శాస్త్ర విద్యలలో పారంగతుడైన బ్రాహ్మణుడు. ఇతడే మృచ్ఛకటికం, పద్మప్రాభృతిక రచనలు చేసినవాడు. ఈ శూద్రకవి – విక్రమాదిత్యుని చరిత్రనే కన్నడంలో మొదట గుణవర్మ, తర్వాత తెలుగులో క్షేమేంద్రుని వంటివారు చెప్పారు.

కవులు పూర్వం ఏ చరిత్రను రాశారోగాని, శూద్రకుని గురించి సాహిత్య చరిత్రకారులు యిప్పుడు ఇలా చెప్పుకొంటున్నారు.[10]

శూద్రకుడు : (క్రీ.పూ. 300?) సంస్కృత కవి. ప్రాచీన కాలము నుండియు పండితులను, విమర్శకులను మిక్కిలి ఆకర్షించుచు వచ్చిన ఉత్తమ కవి జీవితములలో శూద్రక మహాకవి జీవితము కూడ ఒకటి. రామిల సోమిల కవులు శూద్రక కథ రచించినట్లు

8. "The Age of Imperial Unity" - P. 155
9. "Quoted by SATYA SHRAVA - 'SAKAS IN INDIA' " P. 122.
10. తెలుగు భాషా సమితివారి విజ్ఞాన సర్వస్వం, 6వ సంపుటి 'విశ్వసాహితి' పుట.789.

సూక్తిముక్తావళిలోని ఒక చాటువు పేర్కొనుచున్నది. అనంతకవి అను ఒక కవి తన వీరచరితములో శూద్రకుడు బ్రాహ్మణుడనియు, శాలివాహనునికి మిత్రుడనియు, శాలివాహనుడును, అతని కుమారుడగు శక్తి కుమారుడును గతించిన పిదప శూద్రకుడు ఉజ్జయినికి రాజయ్యెననియు పేర్కొనెను. ఇంకను పెక్కు గ్రంథములందు శూద్రక ప్రస్తావము కలదు. ఇతడు క్రీ.పూ. 300-600 సం॥ల నడుమ జీవించి వుండునని పలువురు ప్రాచ్య, పాశ్చాత్య పండితులు అభిప్రాయపడుతున్నారు. ఈతడు రచించిన మృచ్ఛకటికము సంస్కృత సారస్వతమున విఖ్యాతిగాంచిన కొలది రూపకములలో ఒకటి.

'శూద్రకరాజ చరిత్రము'ను, 'శతపక్షిసంవాదము'ను క్షేమేంద్రుడు రచనలని లక్షణ గ్రంథాలలో వీటినుంచి ఉదాహరణ లున్నాయని ఒక్క మానవల్లి రామకృష్ణకవిగారే చెప్పారు. వీరు చెప్పినదానికి పాక్షిక సాక్ష్యమే వుంది. ఈ రెండు గ్రంథాలలోంచి లాక్షణికులు పద్యాలు తీసుకొన్నారుగాని అవి క్షేమేంద్రుడు రచించినట్టు చెప్పలేదు. భల్లటుడనే ఒక తెలుగు కవి కూడా శూద్రకరాజు చరిత్రను రచించాడు. అతని పద్యాలను కూడా లాక్షణికులు తీసుకున్నారు.

తెలుగు క్షేమేంద్రుని రచనలు దొరకలేదుగాని ఇతని పుస్తకాలు దొరికితే ''ఆంధ్ర వాగ్వనధివిలాస వీచికల వారక తెప్పల'' తేలివుండే వాళ్ళమే! అతడు ''సొంపినుమడిగా నయామృతం మెచ్చులు పల్లవింపగా'' ఇస్తే క్రోలెడివాళ్ళమే!

ముందు ముందైనా ఇతని రచనలు బయటపడతాయేమో చూడాలి.

కవి భల్లటుడు

కాశ్మీర దేశంలో భల్లటుడనే ఒక సంస్కృత కవి ఉండేవాడని చెప్పుకొంటారు. ఇతడు ఏ కాలంవాడో తెలియదు. కాని భల్లట శతకం అనే కృతి ఇతడు రచించాడని ప్రతీతి, ఇతని గురించి సంస్కృత వాఙ్మయ చరిత్రలో మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు ఏమీ చెప్పలేదు. తెలుగు భాషా సమితివారి విజ్ఞాన సర్వస్వం ఆరవ సంపుటి - విశ్వసాహితి-లో కూడా ఏమీ వ్రాయలేదు. తెలుగు సాహిత్యంలో ఒక కవి భల్లటుడు ఉన్నాడు.

క్రీ.శ. 1600 ప్రాంతాల ఉన్న ఎలకూచి బాలసరస్వతి తొలిసారిగా బయటపెట్టి, టీక వ్రాసిన ఆంధ్రశబ్ద చింతామణి అనే పేర సంస్కృత భాషలో వ్రాసిన తెలుగు వ్యాకరణంలో కవి భల్లటుని పేరు కనబడుతుంది. అందుచేత ఈ కవి క్రీ.శ. 1600కి పూర్వపువాడని కచ్చితంగా చెప్పవచ్చు. ఇతడు సంస్కృతంలో గణమంజరి, పదమంజరి అనే రెండు గ్రంథాలు వ్రాశాడట. కందుకూరి వీరేశలింగంగారు రెండు పుస్తకాలలోంచీ చెరో శ్లోకాన్ని ఉదాహరించారు.[1] పదమంజరిలో ఈ శ్లోకముంది.

1. ఆంధ్రకవుల చరిత్రము, ప్రథమ భాగం, పుట. 669

లక్ష్మీర్బుద్ధ నృపాలేన యం ప్రాప్తా కవిభల్లటం
తేన కావ్యదృశాప్రోక్తాసప్రాసాపదమంజరీ

దీనిని బట్టి కవి భల్లటుని కాల నిర్ణయాన్ని వీరశలింగంగారు చేశారు. ఈ శ్లోకంలోని బుద్ధన్నపాలుడు రంగనాథ రామాయణాన్ని రచించిన వ్యక్తే అని గుర్తించారు. ఒక్క శ్లోకం ఆధారంగా ఇలా కాలనిర్ణయం చేయడం కష్టమే. ఈ బుద్ధన్నపాలుడు ఆ బుద్ధన్నపాలుడే అని అసందిగ్ధంగా చెప్పగల ఇతర బిరుదులు, కనీసం తండ్రి పేరు మొదలైనవి అవసరమే. పదమంజరిలో అటువంటి సాక్ష్యమేదైనా ఉంటే వీరేశలింగంగారు ఉదాహరించే ఉండేవారు. కొండపడమటి రాజ్యాన్ని పాలించిన ఎలదాయసింహ, అనియంకభీమ బిరుదులున్న మూడవ బుద్ధరాజు క్రీ.శ. 1143-1171 మధ్య ఇమ్మడి కులోత్తుంగుడి సామంతునిగా చరిత్రలో కనబడుతున్నాడు. ఈ బుద్ధరాజునే కవి పేర్కొని వుంటే ప్రాచీనుడవుతాడు. ఒకవేళ రంగనాథ రామాయణాన్ని రచించిన బుద్ధన్నపాలుణ్ణీ కవి భల్లటుడు ఉద్దేశించి ఉంటే అతని కాలం క్రీ.శ. 1360-1380 ప్రాంతాలై ఉంటుంది. బుద్ధన్నపాలుని కాలం అదే.

కవి భల్లటుని కాలం ఒక శ్లోకంవల్ల తెలుసుకొన్నట్టే వీరేశలింగంగారు గణమంజరి నుండి ఉదాహరించిన దానివల్ల అతని నివాస స్థానం తెలుసుకోవచ్చు. ''శ్రీమద్దాక్షారామ భీమనాధవరప్రసాదలబ్ధ సకల భాషా కవితా నిర్వాహక కవిభల్లట విరచితా గణమంజరీ సమాప్తా'' అని గణమంజరి కడపట ఉందట. అందుచేత ఇతడు ద్రాక్షారామంవాడు. ఇది కరీంనగరులోనిది కావచ్చుగాని వీరేశలింగంగారు గోదావరి మండలంలోనిదే అని అభిప్రాయపడ్డారు.

భల్లటుడు విక్రమార్క చరిత్ర అనే కావ్యం వ్రాశాడు. దీనినే భేతాళ పంచవింశతి అంటారు. భల్లటుడు శూద్రకరాజ చరిత్రము, భేతాళ పంచవింశతి రచించినట్టు లక్షణ గ్రంథాలు చెప్తున్నాయట. శూద్రకరాజునే 'శూద్రక విక్రమాదిత్యుడ'ని వ్యవహరిస్తారని క్షేమేంద్రుని గురించి చెప్పుకొన్న ప్రకరణంలో తెలుసుకొన్నాం. విక్రమార్క చరిత్ర, శూద్రక రాజ చరిత్రము, భేతాళ పంచవింశతి అని మూడు విభిన్న నామాలతో పిలిచినా, అది బహుశా ఒకటే గ్రంథమయి ఉండవచ్చు. భల్లటుని భేతాళ పంచవింశతే మార్పుచెంది షోడశకుమార చరిత్రగా 14వ శతాబ్దంలో వెలసిందని నిడుదవోలు వెంకటరావుగారి అభిప్రాయం.[2] కవి భల్లటుడు చాలా ప్రాచీనుడని, క్రీ.శ. 1160-70 ప్రాంతంవాడని భావించడంవల్ల వారు ఇలా అనుకొంటున్నారు.

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు కవి భల్లటుని భేతాళ పంచవింశతిని సంస్కరించి అచ్చుకు సిద్ధంగా ఉంచినట్లు వ్రాశారు. అది వెలుగు చూడడం అవసరం. వారు ఇంకా ఇలా వ్రాశారు.

---

2. తెనుగు కవుల చరిత్ర, నిడుదవోలు వెంకటరావుగారు - పుట 306.

''రచననుబట్టి చూడగా నిది పదునాల్గవ శతాబ్ది కింకనూ పూర్వపుది గాదనిపించును. లక్షణ గ్రంథకర్తలు దీనిని కవి భల్లటుడు రచించిన దానినిగా నుదహరించి నారు. ఇది కథాసరిత్సాగర భాగమయి యుండును. ఏలననగా నీ గ్రంథము సమగ్రముగా దొరకినను గ్రంథకర్త పేరుగాని, ఆశ్వాస విభాగముగాని యందు గానరాదు. దీని ప్రతి తప్పులతో, గ్రంథపాతములతో దొరతనమువారి లైబ్రరీలోనున్నది. అనేక స్థలముల ప్రత్యంతరముల తోడ్పాటుతో దీనిని నేను సరిగా సమకూర్చినాను. ఇది ముద్రితముగావలసి యున్నది. పిఠాపురాస్థాన కవులు శ్రీ ఓలేటి వేంకటరామశాస్త్రిగారి కథాసరిత్సాగ రాంధ్రీకరణమున నీ కథలున్నవి. ఎఱ్ఱన నీతి కథావిధానమును నీ కథ లున్నవి. మరి యింకొక బేతాళ పంచవింశతి రచనము తంజావూరి లైబ్రరీలో నున్నది. అది వేరయినది.''

వికల్పయతికి ఉదాహరణంగా భేతాళ పంచవింశతి నుండి ఈ క్రింది పద్యాన్ని ఆనందరంగరాట్‌ఛందం ఉదాహరించింది.

చోరాగ్రాహ్యా గజాంకుశంబు నలినీశుంభన్మదేభంబు ది
జ్నారీమౌక్తికదర్పణంబు రజనీకాంతామనోహారి
విస్తారాంబోధితరంగకారి గిరిజా ప్రాణేశ భాస్వజ్జటా
శ్రీరమ్యాభరణంబు చంద్రు డుదయించెన్ సుప్రభాభాసియై. (3-197)

కస్తూరి రంగకవి ఇది భేతాళ పంచవింశతిలోని దన్నాడేగాని కవి భల్లటుని కృతి అని చెప్పలేదు. అయినా ప్రస్తుతం కవి భల్లటుడు వ్రాసినదే అని ఇతర లక్షణ గ్రంథాలు చూసి నిడుదవోలు వెంకటరావుగారు చెప్తున్నారు. ఈ చంద్రోదయ వర్ణన చాలా చక్కగా ఉంది. ఇది శ్రీనాథుని రచన అంటే నమ్మేటంత ప్రౌఢంగా ఉంది. భల్లటుని పద్యాలలో తత్సమ పదసంపద శ్రీనాథునికి తీసిపోదని అతని శూద్రకరాజ చరిత్రము నుండి దొరికే ఇంకో పద్యం రుజువు చేస్తుంది, చూడండి.

సమదేభాళి తలంకి పై కురికినన్ శంకించి భూపాలుడా
లము గన్గొన్ గని దాని శూద్రకుడు లీలన్ ద్రుంచె నే నప్పుడ
త్యమితోద్యత్ప్రసవార్థినై కుసుమగంధఘ్రాణలుబ్ద భ్రమ
ద్భ్రమరభ్రాజిత పాటలీ విటప మధ్యస్థుండనై చూచితిన్.

ఈ పద్యంలో శూద్రకుడు అనే పేరు కనబడుతుంది. ఇది శూద్రకరాజు చరిత్రలోని పద్యమే అని చెప్పవచ్చు. అయితే ప్రాదియతుల శీర్షికలో అతి అనే ఉపసర్గలోని హల్లుకు ఉదాహరణను చెప్తూ ఈ పద్యం బ్రహ్మాండ పురాణంలోనిదని కస్తూరిరంగకవి పేర్కొన్నాడు.[3] అయితే ఇదే పద్యాన్ని శూద్రకరాజ చరిత్రములోనిదంటూ ఇతర లాక్షణిక గ్రంథాలలో ఉదాహరించారని నిడుదవోలు వెంకటరావుగారు చెప్పారు.[4]

3. ఆనందరంగ రాట్ఛందం 3-361
4. తెనుగు కవుల చరిత్ర - పుట 307. ఏ లక్షణ గ్రంథాలలో ఉదాహరించారో వారు వివరించలేదు.

ఈ రెండు పద్యాలేకాక చిన్నచిన్న పదాలతో వున్న పద్యమొకటి భల్లటునిది దొరుకుతున్నది. ఇది అతని విక్రమార్క చరితములోనిదని కందుకూరి వీరేశలింగంగారు ఉదాహరించారు.

చెప్పకున్న నీవు జీవంబు విడుతువు
జెప్పినపుడు తనకు జీవ హాని
చెప్పిమున్న నీకు జీవంబు విడిచెద
నీవు చన్న వెనుక నిలువలేను.[5]

ఈ పద్యం తాము ఎప్పుడో చదివిన చీమల కథను జ్ఞాపకం చేస్తుందని చాగంటి శేషయ్యగారు వివరించారు.[6] ఒక రాజుగారికి చీమల భాష వచ్చు. ఆయన ఒక పీటమీద కూర్చుని తలంటు పోసుకుంటూ ఉంటే ఒక చీమలబారు అటు వస్తుందట. పీటగోడు అడ్డమొచ్చింది. చీమల రాజు దాన్ని పీకెయ్యమని ఆర్డరిచ్చింది గాని చీమలు దానిని కదిలించలేకపోయాయి. చీమలు రాజుకు చెప్తాయి. కదల్చలేకపోతే తప్పుకొని పోదామని చీమల రాజు అభిభాషించాడట. ఈ సంభాషణ అంతా తలంటు పోసుకునే రాజు విని నవ్వాడు. కారణమేమిటి అని నలుగు పెడుతున్న రాణి అడిగింది. అతడు చెప్పలేదు, మానలేడు. ఏమంటే తనకు చీమల భాష వచ్చునని చెప్తే అతని తల బద్దలవుతుందని శాపముందట. చెప్పకపోతే రాణి చస్తానందట.

ఈ కథ జక్కన విక్రమార్క చరిత్రలోగాని, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక లోగాని, బేతాళ పంచవింశతిలో గాని, మరెక్కడా గాని లేదని చాగంటి శేషయ్యగారు వ్రాశారు. చీమల భాష ప్రసక్తి వున్న కథ ఒకటి ఎర్రాప్రెగడగారు వ్రాసిన హరివంశంలో (పూర్వ 2) ఉంది చూడండి.

ఇక్కడ బ్రహ్మదత్తునకుం దత్పితామహుండగు విభ్రాజుండు తొంటి
తపస్సమయ సంకల్పంబువలనం బుత్రుండై విష్వక్సేనుండనంబ్రభవించెనట్లు
లబ్దసంతానుండై యతండు దేవీసమేతంబుగా నగరబహిరుద్యానంబున
విహరించుచు నొక్కనాడేకాంతంబున (213)

ఒక చీమ తన ప్రియుడు కా-ముకుడై యర్థి తెలుపంగమును బూనినకిం
కకు బాయక బంగించుప-లుకు లాకర్ణించితగ బెలుచనవ్వుటయున్ (214)

మానిని యెంతయు సిగ్గును - దీనతయును గదిరి పెక్కు దినములశన
ధ్యానపరిమ్లానత మెయి - దానూరకయున్న బ్రభుడు తద్దయువంతన్ (215)

నిత్యంబునుం దలంచి యవ్విధంబునకు నిమిత్తం బడిగిన
నవ్వెలంది నీవు నవ్వుట నన్ను గేలిగొనిన చందంబ యందు సంది

5. ఆంధ్రకవుల చరిత్ర, పుట 669.
6. ఆంధ్రకవి తరంగిణి, 3వ సంపుటము, పుట 227.

యంబులే దట్లు గావున జీవితం బింక నేమిటికనిన నతం డా నవ్వు
నకుం గారణంబు సెప్పె నెంతసెప్పిన నయ్యింతి నమ్మని నెమ్మనంబుతోడ.

(216)

పురుషవరేణ్యా యేల యిటు పొచ్చెపుమాటల నన్మొరంగె దె
వ్వరు జనకోటియందెరుగువారు పిపీలిక పల్కు దేవతా
వరమున నొండె దొల్లిటి భవంబు తపంబున నొండె నద్భుతా
ధ్వరవిధి నొండెగాక గరువంబగు తత్పరిబోధ మబ్బునే? (217)

నీనగవునకుం గారణ - మే నమ్మం దెల్లగాగ నెరుగగ నది యె
ట్లైన నొనర్పక యుండిన - నేనిదె నీయాన ప్రాణ మింతట విడతున్. (218)

అనిన నతం డెయ్యదియునుం జేయనేరక యయ్యాపదకుం బ్రతీకారంబు
చింతించి యార్తవరణ్యుం డగు నారాయణు నుద్దేశించి యుపవాసంబుతో
నారుదినంబులు పడియుండ నారవ నాటి వేకువనుం గలలోన వచ్చి
యద్దేవుండు (219)

వినుమీ రేపకడయ ని - న్ననుపమశోభనము వొందు ననుమానము లే
దనఘా విడువు విషాదం - బనియె నతడు మేలుకనియె నక్షణమతగన్ (220)

ఈ కథనే కవి భల్లటుడు విక్రమార్క చరిత్రలో చెప్పాడా? ఏమో తెలియదు. ఊహాగానం తప్ప మనమేం చేయలేము. కవి భల్లటుడు మంచికవే కాక, వ్యాకరణవేత్త. అనుశాసనం చేశాడు. ఇతడు వ్రాసిన వ్యాకరణాన్ని 'కవి భల్లట ఫక్కిక' అని అప్పకవి తన గ్రంథంలో పేర్కొన్నాడు (1-5). అప్పకవి కాలం నాటికి ఆ గ్రంథం ప్రచారంలో వుండే ఉండాలి. ఆంధ్ర శబ్ద చింతామణిలో ఒక సూత్రం ఇతని మతాన్ని ఇలా చెప్తుంది.

కవిభల్లటైః క్రియాణాం నామ్నాం చోల్లోప ఇష్యతే హ్యాషు
ప్రథమైకవచనమాత్రేవికృతానాంతాదయోఽపికథ్యంతే. (హలంత. 19)

''కవి భల్లటాచార్యులనెడి పురాతన లక్షణకర్త చేత క్రియలకును సుబంత రూపములకును అంత్యమైన యకారమునకు లోపము ఇచ్చయింపబడుచున్నది. ఈ లోప ప్రదేశములందు ప్రథమైక వచనమాత్రమందు నకారాంతములు మొదలైన శబ్దములును తెనుగునందు చెప్పబడుచున్నవి'' అని బాలసరస్వతి ఈ శ్లోకానికి టీక వ్రాశాడు.[7] అప్పకవి తన గ్రంథంలో ''కవిభల్లటమతసంధులు'' అనే శీర్షికలో 5 పద్యాలు ఈ సూత్రం పైననే వ్రాశాడు.

ధాతుపదముల కడపట దనరు రేఫ
శృంగములకు లోపంబులు చెల్లుచుండు
హల్లు పైకొన్నచో గవిభల్లటార్య
మతమున వికల్పనంబున బతగగమన (అప్ప. 5-115)

7. బాలసరస్వతీయం, వావిళ్ళప్రతి, పుట 231, 1963

ఆంధ్ర శబ్దచింతామణిలో పేర్కొన్న మతం తప్ప భల్లట విరచిత ఫక్కి సూత్రాలు మనకు నేడేవీ దొరకవు. ఇంతకూ ఈ సూత్రంలో కవి భల్లటుడు చెప్పుకొన్న వ్యాకరణ ప్రయోగాలు ఏమిటంటే మెత్తురు+మునులు = మెత్తుర్మునులు; చూడరు+జనులు = చూడర్జనులు; కన్ను+తెరచి=కన్దెరచి; పల్లు+మోపి=పల్మోపి మొదలైనవి అని బాలసరస్వతి చెప్పాడు.

కవి భల్లటుని పుస్తకాలు లభిస్తేనే తప్ప యింతకుమించి చెప్పుకొనలేం. అతడు తెలుగువాడే అయినా కాశ్మీర సువాసనలు గుబాళించే కవిత చెప్పాడేమో!

తిక్కన సోమయాజి

నా దేశం ఆనందించడానికి నేను ఈ కావ్యం వ్రాస్తున్నాను అని చెప్పిన మొదటి కవి తిక్కనగారు. ''ఆయన కావించిన సృష్టి ఇంకొకరివల్ల అయ్యేది కాదు. ఆయన ఏనోట పలికిన పలుకైనా వేదంలాగ పొలుపొందుతుంది. వాణీశుడిత డొక్కడే అని చెప్పదగి, మహిమవల్ల కవిబ్రహ్మ అని పేరుకెక్కిన తిక్కనగారికి నమస్కరిస్తాను'' అని కవిత్రయంలోనే ఒకరైన ఎఱ్ఱాప్రెగడగారన్నారు. ఆయన చెప్పిన మాటలు అక్షరాలా నిజం. తిక్కనగారు చేసిన సాహిత్య సృష్టి ఇంకొకరివల్ల అయ్యేది కాదు.

నిర్వచనంగా ఉత్తర రామాయణాన్ని వ్రాశారు. ఒక్కచేతిమీదుగా భారతంలో పదిహేను పర్వాలను రమారమి 16,457 గద్యపద్యాలలో రసబంధురంగా రచించారు. తన కాలపునాటి తెలుగు నుడికారపు విరజాజుల సౌరభం నేటికీ తమ కవితారసంతో భద్రపరిచారు. తమ సర్వతోముఖ ప్రతిభను భారతంలో అడుగడుగునా ప్రదర్శించి దానిని అద్వితీయం చేశారు.

ఆయన ఉభయ కవిమిత్రుడు; కవి బ్రహ్మ. కృతులు చెప్పారు; కృతులను అంకితం పుచ్చుకొన్నారు. ఈ గ్రంథాలవల్ల ఈ మహామనిషి జీవితాన్ని, వైదుష్యాన్ని, సాహిత్యాన్ని సమగ్రంగా తెలుసుకోవచ్చు.

దిట్టమైన వైదుష్యం

తిక్కనగారిది అమలోదాత్తమనీష. వారు ఉభయ కావ్య ప్రౌఢి పాటించే శిల్పంలో పారంగతులు. కళావిదులు.[1] ఆది కవీంద్రులను, నూత్నసత్కవీశ్వరులను భక్తితో కొలిచి, వారి కృపవల్ల తగువిధంగా కవితావిలాసవిస్తర మహనీయులయినారు.[2] సరసమధురవచో గుంఫన సుప్రసాదసంబోధన గోచర బహువిదార్థ తాత్పర్యంగా ఉత్తర రామాయణం చెప్పారు.[3] ఈ సంగతులన్నీ ఈ కావ్యంలో వారు స్వయంగా చెప్పుకొన్నవి.

1. నిర్వ. 1-13 2. నిర్వ. 1-2 3. నిర్వ. 1-3

తిక్కనగారిని గురించి కేతన, వారికి అంకితమిచ్చిన దశకుమార చరిత్రలో చెప్పిన విషయాలవల్ల ఇంకా ఎన్నో సంగతులు తెలుస్తాయి. వారు ఎంత గొప్ప విద్వాంసులో బోధపడుతుంది. కేతన చెప్పినవి చెప్పుకొందాం. తిక్కనగారు వేదాది సమస్త విద్యాభ్యాస విభాసి (1-87); బహుకళా సంపన్నుడు (1-89); సకలవిద్యా కళాచరణుడు (-88); తెనుగున, సంస్కృతమున చతురుడు (1-91); విద్యావైశారద్య సముద్యోతితమతి (1-98); సకలాగమార్థతత్త్వవిచారోదారుడు (2-119); అనితరగమ్యావాఙ్మయ మహార్ణవ వర్తన కర్ణధారుడు (8-194); విద్యానిధానము (10-192); మయూరసన్నిభ మహాకవి (1-6); సారకవితానిర్మాణచాతుర్యుడు (7-164); కావ్యకళాజనిభూమి (5-134); భారవి కల్పుడు (9-85); ఆర్యభోజుడు (2-20).

ఆయన ఇంతటి విద్వాంసుడు కనుకనే కవులకు మిత్రులైనారు. కవిజన రాజకీయ సహకారము (1-8); సుకవీంద్రబృందరక్షకుడు (1-88); కవిసరోజ మార్తాండుడు (1-99); కవీంద్రలోకాధారుడు (2-119); పోషిత సత్కవీంద్రుడు (4-128); కవిలోక చాతకవ్రజనవజలదస్తనితభాషణ ప్రకరుడు (9-85) అని కేతన దశకుమార చరిత్రలో చెప్పాడు. తిక్కనగారు తాము ఉభయకవిమిత్రులమని భారత గద్యలో స్వయంగా వ్రాసుకొన్నారు.

రాజవైభవం, రాచపదవులు

ఇంతమంది కవులకు పట్టుగొమ్మగా ఉండి వాళ్ళను పోషించాలంటే, రాచ పదవులలో ఉన్నవాళ్ళకుగాని సాధ్యం కాదు. తిక్కనగారు మహావైభవంగా జీవించిన వారు. వారికి మనుమసిద్ధి రాచపదవులు ఇచ్చాడు.

''అందలంబు గొడుగు నడపంబు మేల్కట్టు
చామరములు జమిలి శంఖములును
గంబగట్లు భూమి కానిక గాగ బెం
బెసగు రాచపదవు లెల్ల బడసె'' (దశకు. 1-21)

అని కేతన చెప్పాడు. 'రాచపదవులం బడసి తిక్కన రాజ్యసుఖంబులనుభవించుచు' ఉండేవారనీ చెప్పాడు. నిర్జిత దేవేంద్ర వైభవంతో (8-95); దీనజనతావిధానముగా (1-88); సతతదాన వినోదిగా (8-95) తిక్కనగారు జీవించారు.

''కృతులు రచియింప సుకవుల
కృతులొప్ప గొనంగ నొరునికిం దీరునె నా
కృతివిభుడు వితరణశ్రీ
యుతు డన్నమ సుతుడు తిక్కడొకనికి దక్కఁ?'' (దశకు 1-90)

అని కేతన చెప్పాడు.

రచించిన కృతులు

తిక్కనగారు రచించిన కృతులు మనకు నిర్వచనోత్తర రామాయణం, మహాభారతం లభిస్తున్నాయి. అయితే కేతన దశకుమార చరిత్ర రచించేనాటికి భారత రచన జరిగి ఉండదు. నిర్వచనోత్తర రామాయణం కేతన కావ్యాన్ని అంకితం పుచ్చుకొనకముందు వ్రాసినదే అని కొందరి మతం.[4] అయితే దశకుమార చరిత్రకు ముందు తిక్కనగారు రచించిన కృతులేమిటి? ఆ కృతులను చూసి కేతన ఈ పద్యం చెప్పి వుంటాడు :

''అగునన్న గొమ్మతిక్కడు
జగతి నపూర్వార్థశబ్దచారుకవితయై
నెగడిన 'బాణోచ్ఛిష్టం
జగత్రయం' బనిన పలుకు సఫలం బయ్యెఁ'' (దశకు. 1-89)

'బాణోచ్ఛిష్టం...' అనేటంత ప్రశంస పొందడానికి చాలా గొప్ప రచన, విస్తరమైనది చెప్పాలి; కనీసం ఉత్తర రామాయణ, మహాభారతాల రచన అంత గొప్పది. ఆ గ్రంథాల రచన జరక్కముందే ఇంత ఘనమైన పొగడ్తకు తగిన గ్రంథాలు ఏమి రచించి ఉంటారు?

'విజయ సేన' విచారం

తిక్కనగారు 'విజయసేనము' అనే ప్రబంధం రచించారని లోకంలో ఒక ప్రతీతి ఉంది. 'ప్రబంధ రత్నాకరము' అనే సంకలన గ్రంథంలో పెదపాటి జగ్గనకవి 'విజయసేనము'లో నుంచి కొన్ని పద్యాలను చేర్చుకొన్నాడు.[5] ఈ కవి క్రీ.శ.1550-60 ప్రాంతాలవాడు. అప్పటికి 'విజయసేనము' అనే ప్రబంధం ప్రచారంలో ఉంది. క్రీ.శ. 1656లో ఉన్న కాకునూరి అప్పకవి తన గ్రంథంలో కూడ 'విజయసేనము'లో నుంచి ఒక పద్యాన్ని ఉదాహరించాడు. కాకుస్వరవళుల శీర్షికలో సంశయప్లుతయతికి లక్ష్యంగా ఈ క్రింది పద్యం చూపించాడు:

''వల్లభు డేగు దుర్లభుడు వాని దెసం దగులూది యిమ్మెయిఁ
దల్లడ మందెదేల యుచితస్థితికి న్నను బాపజూపినఁ
దల్లియు బంధులోకమును దండ్రియు నేమనువా రెరింగిరే
నుల్లమ! యిట్లు నీకుదగునో, తగదో పరికించి చూడుమా!''[6]

---

4. వేదం వెంకటరాయశాస్త్రిగారు - 'నన్నెచోడుని కవిత్వం'లో.
5. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'ప్రబంధ రత్నావళి'లో మొదట 9 పద్యాలు ప్రకటించారు. ఇందులో 7 జగ్గనకవి సేకరించినవి. రెండు (నెం.153, 157) ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి ఉదాహరణ గ్రంథంలోనివి. ఈ పుస్తకం చిట్టచివర మరి రెండు పద్యాలు తిక్కన విజయసేనములోనివని వేటూరివారు చేర్చారు. (పుటలు 183, 184)
6. అప్పకవీయం. 3-254

ఇది విజయసేనములోనిదని అప్పకవి చెప్పాడు. ఈ పద్యాన్నే కూచిమంచి తిమ్మకవి (క్రీ.శ. 1750–1756) తన సర్వలక్షణసార సంగ్రహంలో ఉదాహరించాడట, అయితే ఇది 'విక్రమసేనము' అనే గ్రంథంలోనిదనీ, దీనిని చిమ్మపూడి అమరేశ్వరుడు రచించాడనీ తిమ్మకవి చెప్పాడట.[7] అప్పకవి 'విజయసేనము' కర్త ఎవరో చెప్పలేదు. పెదపాటి జగ్గకవి ఉదాహరించిన రెండు పద్యాలలో వినాయక ప్రార్థన వుంది.

''అల్లన దొండ మెత్తి శివునౌదలయేటి జలంబు పుచ్చి సం
పుల్లత బాదపీఠకము పొంతన యున్న సహస్రనేత్రుపై
జల్లి శివార్చనా కమలసంహతి బ్రోక్షణ సేయునట్లు శో
భిల్లు గజాననుండు మదభీప్సితసిద్ధకరుండు గావుతన్.'' (ప్రబంధ. 153)

''గీర్వాణాచలసాను వాత్మరదనక్రీడాహతంబైన న
య్యుర్వీరంధ్రమునం దనంతఫణరత్నోద్యత్ప్రభ ల్పర్వి దృ
క్పర్వంబై పొదిగట్టి పేర్చిన మదిం గంబంబ యంచున్ కన
ద్గర్వోన్మీలితనేత్రుడై మెరయు వేదండాననుం గొల్చెదన్''. (ప్రబంధ. 157)

ఇలా రెండు పద్యాలలో గణపతిని స్తుతించడం కనబడుతుంది. మొదటి పద్యంలో వర్ణన కళ్ళయెదుట బొమ్మ కట్టినట్టు వుంది. తొండమెత్తి ఏటి నీళ్ళతో శివునికి అభిషేకం చేసి పాదాలవద్ద ప్రార్థిస్తున్న ఇంద్రుని వేయికళ్ళూ వేయి కమలాలుగా భావించి వాటిని పూజలో ప్రోక్షణ చేస్తున్నట్టు అతనిమీద నీళ్ళు జల్లడం తొలి దృశ్యంగా చూపిస్తున్నారు. రెండవ పద్యంలో పాత్రలు కళ్ళయెదుట బొమ్మకట్టవు. మనసులో ఊహించుకొనే దృశ్యమే కనబడుతుంది. ఈ రెండు పద్యాలూ తిక్కనగారు వ్రాయడానికి అవకాశముంది గాని, చిమ్మపూడి అమరేశ్వరుడు కూడ వ్రాస్తే వ్రాయవచ్చు. అయితే అమరేశ్వరుడు చేసిన గణపతి ప్రార్థన వేరే మనకు లభిస్తున్నది. ఇంతకూ తిక్కనగారు నిర్వచనోత్తర రామాయణంలోగాని, భారతంలోగాని వినాయక ప్రార్థన చేయలేదు. చేయదలచుకొంటే, భారతాన్ని రచించిన వేదవ్యాసుణ్ణి స్తుతిస్తున్నపుడు ఆ మహాగ్రంథానికి లేఖకుడుగా వున్న వినాయకుణ్ణి కూడ తిక్కనగారు నుతిచేసేవారు. నిర్వచనోత్తర రామాయణంలోనే దేవతలలో హరిహర పద్మగర్భులను మాత్రమే కొలుచుకున్నారు. ఈ వినాయక ప్రార్థన మరీ తొలి రచనలోనిది కావచ్చు. నన్నెచోడునిలాగ పేరు పేరునా దేవతలను నుతించడం కేతనలో కనబడుతుంది. తిక్కనగారు కూడ విజయసేనము వ్రాస్తే అందులో వివిధ దేవతా ప్రార్థనలు చేసివుంటారు.

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రబంధరత్నావళిలో ఉదాహరించిన మిగతా తొమ్మిది పద్యాలలోనూ రెండు పురవర్ణనంలో కోటపరిఖను గురించి వ్రాసినవి. మొదటిది చూడండి:

7. ఈ సంగతి చాగంటి శేషయ్యగారు ఆంధ్రకవి తరంగిణి 2-వ సంపుటం (ద్వితీయ ముద్రణ) పుట 205లో చెప్పారు. నేను చూచిన లక్షణసార సంగ్రహం ప్రతులలో ఈ సంగతి లేదు.

''పద్మంబులును వప్రపద్మరాగ ప్రతిబింబములను తగ బెరసి మెరయ
గల్లోలములును రంగన్మక రాయతతుండములును నటు తొట్రుపడగ
బిసములు విహరణ రసనమాగతరసాతల నాగశిశువులు చెలిమిసేయ
జక్రయుగ్మంబులు జలకేళిలోలనితంబినీ స్తనములు తడబడంగ

సొంపు మీరినట్టి పెంపును గంభీర
తయును బరపు (బ్రోవు) వేడ్కగలిగి జనులు
సంస్తుతింప నఖిల సన్నివేశ స్థితి -
నప్పురంబు పరిఖ యతిశయిల్లు.''[8]

తిక్కనగారు నిర్వచనోత్తర రామాయణంలో అయోధ్యపురాన్ని వర్ణిస్తూ ఒక సీసపద్యంలో పరిఖను వర్ణించారు. విజయసేనములోని పద్యాన్నీ, దీనినీ పోల్చి చూద్దాం.

''అవగాహనమునకు నరిగిన గజముల మదములు కూడిన నదులుగాగ
ఝుషకకుళీరకచ్ఛపమక రాదిసత్త్వముల మొత్తము పర్వతములు గాగ
బ్రాకారమణిగణ ప్రతిబింబనికరంబు విలసిల్లు బహురత్న వితతిగాగ
రంగత్తరంగ పరంపరపై దేలు కలహంసములు శంఖకులముగాగ
గరము పొలుపు మిగులు బరిఖ విశాలగం
భీర మగుచు బరపుబేర్మిజేసి
యఖిల భూమిచక్ర మను తలంపున బుర
వరము జుట్టియున్న శరధివోలె.'' (నిర్వచన. 1-50)

రెండు సీసాల ఎత్తుగీతులలో 'గంభీరత', 'అఖిల సన్నివేశ స్థితి' ఉండడం గమనించదగిన పోలిక, ఉత్తర రామాయణంలోని పరిఖావర్ణనం సంపూర్ణంగా చెయ్యి తిరిగినట్టు ప్రౌఢంగా వుంది. విజయసేనములోని సీస పద్యం ప్రాథమిక రచనగా కనబడుతుంది. లేదా అనుసరణ.

ఇక వేటూరి ప్రభాకరశాస్త్రిగారు విజయసేనములోనిదని ఉదాహరించిన రెండవ పరిఖావర్ణన చూద్దాం:

''తరుణుల వీగు జన్నుగవ తాకున మన్మథ చక్రవాకబం
ధురగతి లీల గామినుల తోరపుటూరుల **ఘట్టవంబులన్**
కరిపరహస్తకాండ పటుఘట్టనలన్ బరిఖాతరంగముల్
దిరుగుడువడ్డ తీరముల దెట్టువుగట్టు సరోజ రేణువుల్!'' (ప్రబంధ. 184)

---

8. ప్రబంధ రత్నావళి, పుటలు 183, 184.

అక్షరాలా ఇదే పద్యాన్ని నిర్వచనోత్తర రామాయణంలో 'అవగాహనమునకు' అనే సీసపద్యం తరువాత వావిళ్ళవారు ముద్రించారు. 1952వ సంవత్సరపు ప్రతి చూడండి. 51వ నెంబరు పద్యంగా ఇది కనబడుతుంది.[9]

ఇక విజయసేనములోనిదని జగ్గన ఉదాహరించిన మరొక పద్యం చూద్దాం:

''కొనియెదమన్న బండరులు కోటుల కమ్ముదు; రమ్మబూని తె
చ్చిన సర కెంత పెద్దవెలచెప్పిన గొంద్రు తగంగ నిచ్చి; న
చ్చిన వెలతీర్చి లక్ష్మితమ చెప్పినయట్టుల చేయు సొంపు, పే
ర్కొన గణుతింపరాదు పురికోమటులం బ్రణుతింపనొప్పదే?''   (ప్రబంధ. 136)

రమారమి ఈ పద్యంలో వర్ణించినట్లే అమ్మకాలు, కొనుగోళ్ళు నిర్వచనోత్తర రామాయణంలోని వైశ్యవర్ణనలో కూడ కనబడతాయి. చూడండి.

''ఫెలుచునెడక్ మనంబులకు వెక్కసమంద ధనంబు లమ్ముచో
ఫిలసదనేక వస్తువులు విస్మయమందగ జూడ్కులెల్ల సొం
పుల సహజంబులై యెలమిబొందగ నుజ్జ్వలలక్ష్మి యెప్డు ద
మ్మలవడజెంద వైశ్యజను లప్పురి నొప్పుదు రప్రమేయులై''   (నిర్వచన. 1-56)

తిక్కనగారు రచించిన విజయసేనములోనిదే అంటూ మానవల్లి రామకృష్ణకవిగారు ఒక సీసపద్యాన్ని - అందులోనూ వైశ్యులను వర్ణించేదే - ఉదాహరించారు, చూడండి.

''అమ్మెద ననిన బద్మాక్షు కౌస్తుభమైన వెరవక కొనియెడు వెరవు గల్గి
విలువ యిచ్చెదమని వేడిన బులిజున్ను గమ్మపసిండియు నమ్మగలిగి
ఏవస్తు వెంత ప్రొద్దెందరు చనుదెంచి యెంతటి కడిగిన నెదురగలిగి
తమయింట లేని యర్థము లర్థపతియింటనైన వెదకిన లేవనుట గలిగి
తమ కులాచారవర్తన (?) ముకొరకు
నంగడుల యొప్పునకును బేహారుమాట
గాని లాభమునకు నాటగా రనంగ
వరలుదురు పురవరమున వైశ్యవరులు.''

ఈ పద్యాన్ని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రబంధ రత్నావళి పీఠికలో (పుట 10) పేర్కొని, ''తిక్కనగారు ఒకే గ్రంథంలో రెండు పద్యాలలో వైశ్యవర్ణన చేస్తారా'' అని సందేహించారు. నిజమే, ఇది ఇంకొక గ్రంథంలోనిది కావచ్చు. ఇంక పెదపాటి జగ్గకవి ఉదాహరించిన మిగతా పద్యాలను చూద్దాం. రెండూ కథానాయికను వర్ణించేవి.

---

9. అతి ప్రాచీన ముద్రిత ప్రతులలోకూడ ఈ పద్యం నిర్వచనోత్తర రామాయణంలోని 51వ పద్యంగానే ఉంది. చూ: కొమాండూరు అనంతాచార్యులవారూ, కందుకూరు వీరేశలింగంగారూ, రాయదుర్గం నరసయ్యగారూ పరిష్కరించిన ఆనంద ముద్రణ (క్రీ.శ. 1898).

''కిసలయకదళీబిసబిం
బసుధాంశుప్రాయవస్తు బహువిధరూపో
ల్లసము మదముడుప నజు డొక
యసమాకృతి దాల్చె ననగ నంగన యొప్పెన్.'' (ప్రబంధ. 155)

''మదనవశీకారమంత్రదేవత దృష్టిగోచరమూర్తి గైకొనియె నొక్కొ
సితకరబింబ నిస్సృత సుధాధారనితంబినీరూపంబు దాల్చెనొక్కొ
విధికామినీశ్రేష్ఠ విజ్ఞానపరసీమ భాసురతనులీల బడసెనొక్కొ
కాక యొక వధూటి కడుపున బుట్టిన - భామ కేల యట్టి రామణీయ
కంబు గలుగు ననుచు గన్నియపై మహీ-పాలసుతుడు దృష్టిపరపె నర్థి.''
(ప్రబంధ. 159)

ఒక సీసపద్యం విజయసేనుణ్ణి వర్ణించేది కూడ పెదపాటి జగ్గన్న ఉదాహరించాడు.

''అరిమానసమ్ములు దరికొని యేర్చు నెవ్వని యుజ్జ్వలాకారవైభవంబు
బుధుల లజ్జానతి బొందునట్లుగ జేయు నెవ్వని పాండిత్య మెసగ మెసగ
నెట్టి మాన్యులనైన నెవ్వని వితరణంబులు వంది (జనుల) చాపల మొనర్చు
వనితాజనము మానధనము గోల్పుచ్చు విచ్చలవిడి నెవ్వానివిలసనంబు
అట్టి విజయసేను నభిరామమూర్తిని-ద్యానిరూఢమతి వదాన్యవరుడు
మధుర విభ్రమైకనిధి యను జగమెల్ల-నతడు చిత్రగుణసమగ్రుడగుట.''
(ప్రబంధ.152)

ఇప్పటిదాకా ప్రబంధరత్నావళిలోనివని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఉదాహరించిన పద్యాలలో తొమ్మిది చూచి చర్చించాం. మిగతా మూడు రాజనీతికి చెందినవి.

''ఉత్సాహ ప్రభుమంత్రశక్తుల నజేయుండై పరీక్షించినన్
దిత్సావ్యగ్రుడు కాక విగ్రహముచో దేశంబు గాలంబు సం
పత్సామగ్ర్యము జూపి శక్యముదెసన్ బ్రారంభియై భూప్రజా
వాత్సల్యార్ధమనస్కుడైన (పతి) శశ్వచ్ఛ్రీసమేతుం డగున్.''[10] (ప్రబంధ. 154)

''పరధనపరాంగ నాజన
పరిహారము పరమధర్మపథ మందురు స
త్పురుషులు మరవక వీనిం
బరికింపుము వినకు మెపుడు పై శున్యంబుల్.'' (ప్రబంధ. 158)

''మహిమ చెడదు స్వామ్యమాత్యసుహృత్కోశ
రాష్ట్రదుర్గ బలపరాయణులకు

10. ఈ పద్యాన్నే ఆంధ్రభోజుడు రచించిన 'నీతిభూషణం' లోనిదంటూ సకలనీతి సమ్మతంలో మడికి సింగన చేర్చాడు. (చూ॥ స.స. 150)

నీవు నిదియు నెరిగి కావింపు సప్తాంగ
సంగ్రహంబు నీతిశాస్త్రనిపుణ!'' (ప్రబంధ. 160)

అప్పకవి ఉదాహరించినదీ, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఉదాహరించిన పదకొండూ, మానవల్లి కవిగారు ప్రసాదించిన మరొకటి మొత్తం పదమూడు కాక ఇంకొక రెండు పద్యాలను 'విజయసేనము'లోనివని చిలుకూరి వీరభద్రరావుగారు కూడా ఉదాహరించారు[11] చూడండి.

''ఘనసారకస్తూరికాగంధముల నన్యగంధబంధంబులు గరపి కరపి
కుసుమితవల్లి కాలసితవీథుల జొచ్చి గని సరోగృహముల మునిగిమునిగి
సమధికాహార్యాంగ సంగీతములతోన కన్నెతీగల కాట గరపికరపి
కుముదకుట్మల కుటీకోరకంబులు దూరి యలిదంపతుల నిద్ర దెలిపి తెలిపి
యనుదినమ్ము నప్పురాంతికమ్మున గట్టు - వాలువోలె విప్రవరుడువోలె
నట్టువోలె దాను నచ్చిన చెలివోలె - మలయుచుండు మందమారుతంబు.''.

''పల్లవపుష్పసంపదల బంచి వసంతుడు కాపురాకకై
యెల్ల వనంబు సంకటము లేదగదా రొండికంబుమీర న
ట్లల్లన క్రోలిక్రోలి మలయానిలు డందు బురాణపత్రముల్
డుల్లగజేసె సత్క్రియ బటుత్వము కాముడు విచ్చలింపగన్.''

''విజయసేనము మిక్కిలి ప్రౌఢమైన యముద్రిత గ్రంథము గావున శైలి తెలియుటకై దానినుండి కొన్ని పద్యము లిందు దానినుండి కొన్ని పద్యములిందు బ్రకటించుచున్నాను'' అని వీరభద్రరావు గారు మూడు పద్యాలు ఉదాహరించారు. ఒకటి మనం ఇందాకా చర్చించినదే, 'మదనవశీకర మంత్రదేవతదృష్టి' అనేది మిగతా రెండూ కొత్తవి. వీటిని తాము ఎక్కడ నుంచి సంపాదించారో వీరభద్రరావు చెప్పనేలేదు. 'అముద్రిత గ్రంథం' అని పేర్కొన్నారు. వారికి తాళపత్ర గ్రంథం దొరికిందా? లేక ఇతర సంకలన గ్రంథాల నుంచి సేకరించారా? ఏమైనా, విజయసేనము నుంచి మొత్తం పదిహేను పద్యాలు దొరుకుతున్నాయి. ఈ ప్రబంధాన్ని అసలు తిక్కనగారు వ్రాశారో లేదోగాని అక్కడక్కడ తిక్కనగారి భావాలతో పోలికలు మాత్రం కనబడుతున్నాయి. ఇది తిక్కనగారి తొలి రచన అని భావించవచ్చు.

తిక్కన ఛందోగ్రంథం

మన కవిత్రయంలో ఆద్యులు నన్నయగారు సంస్కృతంలో ఒక తెలుగు లక్షణ గ్రంథం వ్రాసినట్లు ఎలాగ చెప్పుకొంటున్నామో అలాగే ద్వితీయులు తిక్కనగారు తెలుగులో ఒక ఛందో గ్రంథం వ్రాసినట్లు కూడ ఒక ప్రతీతి ఉంది. తంజావూరు

11. ఆంధ్రుల చరిత్రము : మధ్యయుగము, పుటలు 96, 97.

సరస్వతీమహల్ గ్రంథాలయంలో 'కవివాగ్బంధనము' అనే తాళపత్ర గ్రంథం ఒకటి ఉంది.[12] దాని నెంబరు 703. అందులో చివర ఈ పద్యం కనబడుతుంది:

''తనరగ గవివాగ్బంధన
మను ఛందం బనని వెలయ హర్షముతో ది
క్కన సోమయాజి చెప్పెను
జనులెల్ల నుతింప శాస్త్ర సమ్మతిగాఁగ౯.''

తిక్కనగారే ఈ ఛందోగ్రంథం వ్రాశారనడానికి ఈ పద్యం తప్పించి మరొక ఆధారం లేదు. కవిజనాశ్రయంలోని ''గగమాయె రెండు గురువులు''[13] అనే పద్యం ఈగ్రంథంలో ఉందట. గ్రంథాదిని ఈ పద్యం ఉంది:

''విద్యలలోపల నుత్తమ
విద్య కవిత్వంబు మరి కవిత్వము ఛందో
వేద్యము గావున జెప్పెద
హృద్యంబుగ గవిత ఛంద మేర్పడ గృష్ణా!''

ఇదే పద్యం లింగమగుంట తిమ్మకవి వ్రాసిన సులక్షణసారంలో గ్రంథాదిని మూడవ పద్యంగా కనబడుతుంది.[14] ఆయనేకాదు అనంతుని ఛందంలో గ్రంథాదిని 5వ పద్యం గానూ సాక్షాత్కరిస్తుంది. కవివాగ్బంధనంలో గణస్వరూపం, గణాధిదేవతలు, గ్రంథాదిని ఆ గణాల ప్రయోగం వల్ల సంభవించే కీడు మేలులు, వర్ణములు, వర్ణాధిదేవతలు, వర్ణముల రంగులు, రాశ్యధిపతులు, వాళ్ళ మిత్రత్వశత్రుత్వాలు, యతుల సంఖ్య, వాటిలో వృద్ధియతికి ఉదాహరణ మొదలైనవి ఉన్నాయట. ఇది 36 పంక్తుల తాళపత్ర గ్రంథం (ఉన్నవి ఆరు కమ్మలు, కమ్మకు ఆరు పంక్తులు).

ఇందులో 27 యతుల ప్రసక్తి ఉంది. క్రీ.శ. 1435 వాడైన అనంతామాత్యుడు 24 యతులనే చెప్పాడు. అందుచేత ఈ పుస్తకం తిక్కనగారి కాలంది కాకపోవచ్చు. అదీకాక క్రీ.శ. 1560లో ఉండిన లింగమగుంట తిమ్మకవి పుస్తకంలోని ''విద్యలలోపల నుత్తమ విద్య కవిత్వంబు'' అనే పద్యం కూడ ఉండబట్టి ఇది ఎవరో ఆ తరువాత వ్రాసుకొన్న పుస్తకంగా మనం భావించవచ్చు.

ఈ కవివాగ్బంధనానికే 'కవిసార్వభౌమచ్ఛందస్సు' అనే ఇంకొక పేరు ఉందట. తిక్కనగారి కృతిపతి అయిన మనుమసిద్ధి యొక్క తండ్రి తిక్కరాజు 'కవిసార్వభౌమాం కుడు.' ఈ సంగతి తిక్కనగారే చెప్పారు (నిర్వచన. 1-35). ఈ కవిసార్వభౌముడు తన పేర

12. 'తంజావూరి గ్రంథాలయంలోని తెలుగు వ్రాతప్రతుల వర్ణనాత్మక కేటలాగు' - ఆంధ్ర యూనివర్సిటీ ప్రచురణ. పుటలు 293, 294.
13. పరిషత్ ముద్రణ, సంజ్ఞలో 19వ పద్యం.
14. సులక్షణసారం, వావిళ్ళ ముద్రణ. రావూరి దొరస్వామి శర్మగారి పరిష్కరణ, 1955.

ఏదైనా ఛందో గ్రంథం చెప్పాడా? ఇతని పేరులోని 'తిక్క' శబ్దం వల్ల పొరబడి లేఖకులు 'కవిసార్వభౌమచ్ఛందం తిక్కన సోమయాజికృత'మని వ్రాసుకొన్నారా? వేరే ఆకరాలు దొరికితేనేగాని ఏమీ తేల్చలేముగాని తిక్కనగారు ఇంత చిన్న గ్రంథం చెప్పి ఉండరని మాత్రం అనిపిస్తున్నది.

కృష్ణశతకం

కందుకూరి వీరేశలింగంగారు తమ కవుల చరిత్రలో ''తిక్కనగారు కృష్ణశతక మొకటి చెప్పిరని వెంకటరంగకవి యీ పద్యము నుదాహరించుచున్నాడు'' అని వ్రాసి ఆ పద్యాన్ని పొందుపరిచారు.

''అరయన్ శంతనుపుత్రుపై విదురుపై నక్రూరుపై గుబ్జపై
నరుపై ద్రౌపదిపై గుచేలునిపయిన్ నందవ్రజశ్రేణిపై
బరగం గల్గు భవత్కృపారసము నాపై గొంత రానిమ్ము నీ
చరణాబ్జంబులు నమ్మినాను జగదీశా! కృష్ణ! భక్తప్రియా!''[15]

అయితే, వంగూరి సుబ్బారావుగారు 'ఇది తిక్కనగారిది కాదు. ఈ సంగతి అముద్రిత గ్రంథ చింతామణిలో చర్చించి వీరేశలింగంగారికి' ప్రత్యుత్తరమిచ్చారట. పైగా ఇది వెన్నెలకంటి జన్నయ్య వ్రాసిన 'దేవకీనందన' శతకంలోనిదని రుజువు చేశారట.[16]

మొత్తంమీద తిక్కనగారి ఇతర కృతులని అసందిగ్ధంగా చెప్పుకోదగినవి ఏవీ లేవు. అయినా వారి గొప్పతనాన్ని చాటే ఉత్తర రామాయణ, మహాభారతాలు చాలు. ఆ రెండు పుస్తకాలలోని సృష్టివల్ల 'బాణోచ్ఛిష్టం జగత్సర్వం' అనే ఉక్తి తిక్కనగారిపట్ల తప్పకుండా వర్తిస్తుంది. అయితే దశకుమార చరిత్రలోనే ఈ పోలిక తీసుకురాబట్టి ఆ పుస్తక రచనాకాలానికి తిక్కనగారి ఇతర కృతులు ఏమిటా అని చర్చించుకొన్నాం.

సంస్కృత మహాకవులతో పోలిక

తిక్కనగారిని కేతన ముగ్గురు సంస్కృత సాహిత్య వ్యక్తులతో సరిపోల్చాడు. ఆయన మయూరసన్నిభ మహాకవి (1-6), ఆర్యభోజుడు (2-120), భారవికల్పుడు (9-85) అని దశకుమార చరిత్రలో కేతన చెప్పాడు. మయూరుడు క్రీ.శ.7వ శతాబ్దానికి పూర్వుడు. ప్రసిద్ధుడైన బాణభట్టుకు ఈ సుప్రసిద్ధుడు బావమరది. మయూరుని రచనలలో సూర్యశతకం గొప్పది. ఈ పద్యాలను ఆనందవర్ధనాది లాక్షణికులు ప్రమాణంగా స్వీకరించారు. సూర్యశతకం వర్ణన ప్రధానమైనది. మయూరుని గురించి వ్రాస్తూ కొండూరు వీరరాఘవాచార్యులుగారు ఇలా అన్నారు.[17]

---

15. ఆంధ్ర కవుల చరిత్ర, ప్రథమభాగం, పుట 148.
16. శతకకవుల చరిత్ర - వంగూరి సుబ్బారావుగారు, 1957 ముద్రణ, పుట. 92
17. 'విశ్వసాహితి' - తెలుగు భాషాసమితి సర్వస్వం. 6-వ సంపుటం పుట.754.

''త్రయీమూర్తిగా ప్రసిద్ధివడసిన సూర్యునిగూర్చి ఈ కవి చేసిన ఆధ్యాత్మిక వర్ణన మిక్కిలి తక్కువ.'' మయూరసన్నిభుడని సమకాలం వారిచేత పేరు పొందిన తిక్కనగారు సూర్యవర్ణన ఎలా చేశారో చూద్దాం :

''నీరజాకరములు నిష్ఠమై జేసిన భవ్యతపంబుల ఫల మనంగ
దివసముఖాభినందిత చక్రయుగ్మకంబు ల యనురాగంపు బ్రోవనంగ
హరిహరబ్రహ్మ మహానుభావంబు లొకటి గా గరగిన గట్టి యనగ
నతులవేదత్రయలతికాచయము పెనుపొంద బుట్టెడు మూలకందమనగ

నఖిలజగముల కన్దెర యగుచు జనస
మాజకరపుట హృదయసరోజములకు
ముకుళనంబును జృంభణంబును నొనర్చి
భానుబింబంబు పూర్వాద్రిపై వెలింగె'' (విరాట. 2-212)

ఇందులో లౌకిక, ఆధ్యాత్మిక వర్ణనలు రెండూ సమంగా ఉన్నాయి. ఇది భారతంలోని వర్ణన. దీనిని చూచి, ఈ ఒక్క పద్యాన్నిబట్టి కేతన తిక్కనగారిని 'మయూర సన్నిభుడు' అనడు. తిక్కనగారి భారత రచనకు ముందే ఆ పోలికను కేతన తీసుకువచ్చాడు. మయూరునిలాగే తిక్కనగారు సూర్యశతకం ఏమైనా చెప్పారా? ఆంధ్రదేశంలో భాస్కర శతకం చాలా ప్రసిద్ధమైనది. దీని కర్త ఎవరో తెలియదు. బ్రౌను దొరగారు దీనిని సేకరించారు. వారే అకారాదిగా వ్రాయించి వుంటారు. లేక కవే అకారాదిగా చెప్పాడేమో! ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగార ప్రతులలో కొన్నిటిమీద మారన వెంకయ్య కృతమని ఉందట.[18] ఇది చూచి బ్రౌనుదొరగారు ఇలాగే వ్రాయించారని వావిళ్ళ వెంకటేశ్వర్లుగారు ఊహించారు. ఒకానొక లిఖిత ప్రతిలో మారవికృతమని ఉందట.[19] ప్రసిద్ధమైన భాస్కర శతకం అప్పకవికన్న ప్రాచీనమేగాని తిక్కనగారు రచించిందనడానికి ఆస్కారం లేదు, దోనూరి కోనేరుకవి మొట్టమొదట చెప్పిన చిత్రాంగీ సారంగధరుల ప్రసక్తి భాస్కరశతకంలో వస్తుంది. కోనేరుకవి కాలం 1547 ప్రాంతాలు. ఒకవేళ భాస్కర శతకకర్త గౌరనగారి నవనాథ చరిత్రలోని చిత్రాంగీ సారంగధరులను మనసులో ఉంచుకొన్నా అతని కాలం 15-వ శతాబ్ది తొలిరోజులు దాటిపోదు. సూర్యశతకంగాని, భాస్కర శతకం వంటిదిగాని తిక్కనగారు వ్రాశారా లేదా అన్నది ప్రధాన సమస్య కాదు. వారికి 'మయూర సన్నిభుడు' అనే ప్రశంస సమకాలంలోనే ఉంది.

కేతన దశకుమార చరిత్రలో తిక్కనగారిని 'ఆర్యభోజుడు' అని పేర్కొనడం కూడ మనం గుర్తించాలి. బహుశా ఈ మాట – 'ఆంధ్రభోజుడు' అనే బిరుదు లేఖక దోషంవల్ల యిలా అయిందా? ఈ మాటను వాడిన పూర్తి పద్యం చూడండి.

---

18. నీతిశతక సంపుటం -1, భాస్కర శతకం, వావిళ్ళ ప్రచురణ, పుట. 27.
19. శతక కవుల చరిత్ర – వంగూరి సుబ్బారావుగారు. పుట. 247

''అతులశుభచరిత్రుం డన్వయాంభోజమిత్రుం
డితరసచివగాత్రుం డిద్ధలక్ష్మీకళత్రుం
డతిదినకరతేజుం డన్నమాంధాతనూజుం
డతనుగుణసమాజుం డార్యభోజుండు ధాత్రిన్.'' (దశకుమార. 2-120)

ఈ మాట యతిస్థానంలో వుంది. 'ఆంధ్రభోజుండు' అన్నా సరిపోతుంది. ఏ ఉద్దేశంతో కేతన ఈ మాట వాడాడో మనకు తెలియదు. సంస్కృతంలో భోజుడు గొప్పకవి. మన ఆంధ్ర సాహిత్యంలో 'ఆంధ్రభోజు'డనే బిరుదుతో ఒక కవి కనబడు తున్నాడు. అతని ఊరూ, పేరూ మొదలైన యితర వివరాలేవీ తెలియవు. తిక్కనగారి బిరుదులు ఉభయకవిమిత్రుడు, కవిబ్రహ్మ అన్నవేగాని ఆర్యభోజుడు అనిగాని, ఆంధ్రభోజుడు అనిగాని వారికి ప్రసిద్ధమైన బిరుదు లేదు. సంస్కృతంలో భోజుడు ఎటువంటివాడో, అతని పేరు బిరుదుగా వహించిన తెనుగుకవి వ్రాసిన పుస్తకాలు ఏమిటో 'ఆంధ్రభోజుడు' అనే శీర్షికలో చర్చించుకొందాం.

ఇంక తిక్కనగారు భారవికల్పులు అని కేతన ఎందుకన్నాడో చెప్పుకొందాం. సంస్కృతంలో భారవి గొప్పకవి. ఇతడు 18 సర్గల కావ్యంగా కిరాతార్జునీయం రచించాడు. ఇది సంస్కృత పంచకావ్యాలలో ఒకటి. భారవి కవిత్వంలో అర్థగాంభీర్యం ప్రధానమైనది. అందుకే ''భారవేరర్థగౌరవం'' అని పండితలోకం చెప్పుకొంటుంది. తిక్కనగారిలో కూడ అర్థగాంభీర్యమే ప్రధానం. అందుచేత కేతన వారిని భారవికల్పులు అన్నాడు కాబోలు.

కేతన దశకుమార చరిత్ర రచనకు ముందే తిక్కనగారి నిర్వచనోత్తర రామాయణం రచన జరిగి ఉండాలని వేదం వెంకటరాయశాస్త్రిగారు చెప్తున్నారు.[20] తిక్కనగారు వ్రాసిన ఉత్తర రామాయణం చూశాకనే కేతన ఈవిధంగా నుతించడానికి అవకాశం ఉంటుంది.

''అభినుతుడు మనుమభూవిభు
సభ దెనుగున సంస్కృతమున జతురుండై తా
నుభయకవిమిత్రనామము
త్రిభువనమున నెగడ మంత్రి తిక్కడు దాల్చెన్.'' (దశకుమార. 1-6)

అని కేతన చెప్పాడు. తిక్కనగారు సంస్కృతంలో కూడ చతురులు. వారు ఆ భాషలో వ్రాసిన గ్రంథాలేమిటో మనకు తెలియవు. కొన్ని కొన్ని శ్లోకాలు చెప్పినట్టుమాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. నిర్వచనోత్తర రామాయణ మంగళాచరణం వారు సంస్కృత శ్లోకంలో ఈ విధంగా చేశారు.

20. చూ. 'నన్నెచోడుని కవిత్వం' - అనుబంధం - 'ఆ', పుట 8. రచనాకాలం క్రీ.శ. 1246కు ముందు అని వారి అభిప్రాయం. క్రీ.శ. 1253 తరువాత అని చాగంటి శేషయ్యగారు.

''శ్రీ రాస్తాం మనుమక్షితీశ్వరభుజా స్తంభే జగన్మండల
ప్రాసాదస్థిరభారభాజి దధతీ సా సాలభంజీ శియం
శుండాలోత్తమగండభిత్తిషు మదవ్యాసంగవశ్యాత్మనాం
యా ముత్తేజయతేతరాం మధులిహో మానందసాంద్రా స్థితిః'' (నిర్వచన 1-1)

ఈ ఒక్క శ్లోకమేకాక వారు రచించినది మరొకటి కూడ మనకు లభ్యమవుతున్నది. తిక్కనగారు శివకేశవులను ఒక్క రూపంలో విలీనం చేసి హరిహరనాథునిగా ఊహించు కొన్నారు. శివగాథలకు విష్ణుగాథలకు, శైవవైష్ణవాలకు సమైక్యతను సాధించారు. ఆ దేవతామూర్తిమీద సంస్కృతంలో స్తవాలు రచినట్టు ఉంది.

''కి మస్థిమాలాం కిము కౌస్తుభంవా
పరిష్క్రియాయాం బహుమన్య సే త్వం
కిం కాలకూటః కిమువా యశోదా
స్తన్యం తవ స్వాదు వద ప్రభో! మే.''[21]

హరిహరనాథుణ్ణి చూచి ''ప్రభూ! నీకు అలంకరించుకొనడంలో అస్థిమాల ఇష్టమా, కౌస్తుభం ఇష్టమా? నీకు కాలకూటం రుచిగా ఉంటుందా? యశోదాదేవి స్తన్యం రుచిగా ఉంటుందా? నాకు సెలవియ్యి?'' అని అస్థిమాల ధరించే అతి భయంకరుణ్ణి చంటివానిగా మార్చి ప్రశ్నించారు. ఈ శ్లోకమంటే తిక్కనగారికి చాలా ఇష్టం కాబోలు! విడిగా చాటువుగానో, లేక ఏదైనా స్తవంలోనో చెప్పిన దీన్ని తమ మహాభారతం అవతారికలో ఉదాహరించారంటే ఎంత మక్కువ లేనిదే చేస్తారు!

ఇష్టమైన పద్యాలు - సరదా

తిక్కనగారికి తమకు ఇష్టమైన పద్యాలను మళ్ళీ మళ్ళీ వాడుకొనడం సరదా. కథా సందర్భాన్ని అందుకు వీలుగా తిప్పుకొంటారు. తనను చూచి మోహించిన కీచకునికి ద్రౌపది హెచ్చరిక చేస్తుంది. తన పతులు చాలా బలవంతులనీ, తన ఒంటిమీద చెయ్యివేస్తే వాళ్ళ చేతిలో అతనికి చావు మూడుతుందనీ చెప్తుంది. ఆ ఘట్టంలోని పద్యమిది.

''దుర్వారోద్యమబాహువిక్రమరసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీరనిర్మథనవిద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలఁ వెసం గిట్టి గం
ధర్వుల్ మానము బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయింగీచకా!'' (విరాట. 2-55)

అప్పటికి కీచకుణ్ణి ఎలాగో వదిలించుకొంది. విధిలేక కల్లు తేవడానికి వెళ్ళి, వాడు వెంట తరిమితే కొలువు కూటం పక్కకు పరుగెత్తి అతికష్టం మీద తప్పించుకొంది. ఆ రాత్రి భీముణ్ణి పాకశాలలో కలుసుకొంది. కీచకుడు అప్పకు మొక్కడానికి రావడం దగ్గర్నుంచి ఏమేమి జరిగిందో చెప్పింది. కీచకుడు తనమీద మరులుకొంటే తాను ఎలా చీవాట్లు

21. మహాభారతం విరాటపర్వం 1-11లో తిక్కనగారు ఉదాహరించినదే.

పెట్టిందీ చెప్పింది. వాడితో ఇలా అన్నానని మళ్ళీ 'దుర్వారోద్యమ బాహువిక్రమ' అనే పద్యాన్నంతటినీ ఒక్క అక్షరం మార్పు లేకుండా చెప్పింది. (విరాట. 2-172)

ఈ పద్యమంటే చాలా ఇష్టం కాబట్టి తిక్కనగారు దీనినే కథా సందర్భంలో చక్కగా ఇమిడేటట్టు మళ్ళీ వాడుకొన్నారు. ఇంకొక రెండు పద్యాలూ ఇలాగే వాడారు. ఆయనకేకాక ఒక పద్యం ఆంధ్రులందరికీ చాలా ఇష్టం.

''వచ్చినవాడు ఫల్గును డవశ్యము గెల్తు మనంగరాదు రా
లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వనేర్చునే
హెచ్చగు గుందగుం దొడరుటెల్ల విధంబుల కోర్చుటట్లుగా
కిచ్చదలంచి యొక్క మెయినిత్తరి బొందగు చేతయుం దగుఁ.'' (విరాట. 4-234)

అని భీష్ముడు చెప్తే

''విని కురుపతి దరహసితవదనుం డగుచు నిట్లనియె :

మనకు, బాండురాజతనయవర్గమునకు
నెట్లు వొందు గలుగు? నేను రాజ్య
భాగమీను, సమరభంగిక విక్రమ
నిరతి బూను టిదియ నిశ్చయంబు.'' (విరాట. 4-236)

భీష్ముడు చెప్పిన పద్యం, దానికి దుర్యోధనుని జవాబు యథాతథంగా మళ్ళీ ఉద్యోగపర్వంలో తిక్కనగారు వాడుకున్నారు. సంధికి వెళుతూ కృష్ణుడు పాండవులలో ప్రతి ఒక్కని అభిప్రాయాలూ తీసుకొని తన ఉద్దేశాలు చెప్తాడు. అర్జుననితో ఇలా అన్నాడు :

''అదియెల్ల నట్లుండె నిచ్చట విరాటు పసులఁ బెట్టింప
నీవు వోయినయప్పుడు భీష్ముండు దుర్యోధనుతో జెప్పిన తెరంగు
'వచ్చినవాడు ఫల్గును డవశ్యము గెల్తు మనంగరాదు రా
లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వనేర్చునే
హెచ్చగు గుందగుం దొడరుటెల్ల విధంబుల కోర్చుటట్లుగా
కిచ్చదలంచి యొక్క మెయినిత్తరి బొందగు చేతయుందగుఁ.''

అనియె, దాని కతం డుత్తరం బిచ్చిన తెరంగు -

''మనకు, బాండురాజతనయవర్గమునకు
నెట్లు వొందు గలుగు? నేను రాజ్య
భాగమీను, సమరభంగిక విక్రమ
నిరతి బూను టిదియ నిశ్చయంబు.''

అని పలికె. నది యంతయు బదంపడి మనమెల్ల వింటిమి కాదె యా
మాటల ఫలం బప్పుడ కనియు నా కష్టాత్ముండు వెండియుం దెలియండు.
(ఉద్యోగ. 3-84 నుంచి 88)

'వచ్చినవాడు ఫల్గునుడు' అనే పద్యంమీద మక్కువకొద్దీ తిక్కనగారు ఇలాగ కథలో సంభాషణలు నడిపించారు. 'రాలచ్చి' అనే మాట కూడ వారికి చాలా ఇష్టం. నిర్వచనోత్తర రామాయణంలో ఒకసారి దీనిని ప్రయోగించారు.

''నిచ్చలు నిత్తెరంగున ననింద్యచరిత్రు డనేకభంగులన్
వచ్చిన విన్నపంబు లనివారణమై విని నిశ్చయంబుగా
నిచ్చు సదుత్తరంబులకు నెల్ల జనంబులు సంతసిల్ల రా
లచ్చి నహీనసద్గుణకలాపములం దగిలించె దక్షుడై.'' (నిర్వచన. 8-18)

నిర్వచనోత్తర రామాయణంలోనే తిక్కనగారు జలక్రీడ చేస్తున్న సీతను యిలా వర్ణించారు:

''తడిసి మెరుగుబొగరెక్కిన
పడుతుక లలితాంగయష్టి పదనికి రా బుల్
గడిగిన మరుఖడ్గలతిక
వడువున మోహనవిలాసవైభవ మొందెన్.'' (నిర్వచన. 8-60)

సరిగ్గా ఇదే ప్రయోగం విరాటపర్వంలో చేశారు. ఉత్తరను చెలులు అలంకరిస్తున్నప్పుడు ఇలా వర్ణించారు :

''పదనికి రా బులుగడిగిన
మదనాస్త్రము రేఖగలిగి మానిని మెయి సె
న్నొదవ గయిసేసి రప్పుడు
ముదితాజనములు ప్రమోదమున లలితముగన్'' (విరాట. 5-355)

భారతంలో వారు చేసిన మొదటి స్త్రీ వర్ణన కూడా ఉత్తర అందమే. బృహన్నల కొలువుకూటానికి వచ్చి ''నీ కూతురికి నాట్యం నేర్పుతాను'' అన్నాక విరాటుడు ఉత్తర కోసం కబురుపెట్టాడు. ఆమె సభలోకి ఎలా వచ్చిందీ ఇలా వర్ణించారు.

''అల్లదనంబున యనువు మైకొన జూచు
    నడపు కాంతికి వింతతొడవుగాక
వెడవెడ నూగారి వింతయై యేర్పడ
    దారని వళులలో నారు నిగుడ
నిట్టలు ద్రోచుచు నెలవుల కలమేర
    లెల్లను బిగియెక్కి యేర్పడంగ

దెలుపును గప్పును వెలయంగ మెరుగెక్కు
తారకంబుల గల్కితనముదొడర
జరణములును నడుము జన్నులు గన్నులు
జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు
చునికి దెలుపుచుండ నుత్తర సనుదెంచె
నలరువిలుతుపువ్వుటమ్ముపోలె.'' (విరాట. 1-245)

తిక్కనగారి స్త్రీ వర్ణనలను గురించి శిష్టా రామకృష్ణశాస్త్రిగారు మంచి సొగసు కనిపెట్టారు. ''నిశ్చలస్త్రీల నెప్పుడును తిక్కన వర్ణింపడు. వారు నడుచునపుడు, నవ్వినప్పుడు, పలికినప్పుడు కలుగు సౌందర్యమును ద్యోతకము సేయును. ఉదాహరణకు -

లలితంబులగు మట్టియల చప్పు డింపార నంచకైవడి నడ నల్లవచ్చి
యెడమేని నెత్తావి సుడియంగ బయ్యెద సగము దూలించి వైమగుడ దిగిచి
సోలెడు నెలదీగెలీల గ్రాలుచు వింతచెలువంబు దలకొన జేరి నిలిచి
తెనిగన్నుగవకు నెచ్చెలియైన లేత నవ్వొలయంగ సరసంపు బలుకు పలికి

మెరయు చెయ్యుల రాగంబు మెయికొనంగ
నెడద సొగయించుమాటల నెలమిమిగుల
నిన్ను ననురక్తిగొలుచు నన్నెలతలుండ
నీరసాకార సైరంధ్రి గోరదగునె? (విరాట. 2-64)

అనుపలుకు సుధేష్ణ పలుకులను గీచకుడిట్లు ప్రత్యాఖ్యానముచేసె -
గండుమీలకుబుట్టి కాముబాణములతో గలిసియాడెడునట్టి కన్నుగవయు
బిసకాండముల శిక్షబెరిగి లేదీగల మెచ్చకయున్నట్టి మృదుకరములు
జిగురులతో సంధిచేసి యంబుజములపై నెత్తిచనునట్టి పదతలములు
కలకంఠములచేత గరచిన విద్యవీణల కిచ్చునట్టి తిన్నని యెలుంగు
నత్తెరంగున రేఖయు నవ్విధంబు - గరువ చందంబు నమ్మెయి కలికితనము
నట్టిచెన్నును సైరంధ్రియందకాక-కలవెయొరులకు? నెరుగక పలికితబల!
(విరాట. 2-67)

ఈ రీతిగా తిక్కన వర్ణనలు దాగుడుమూతలాడుచు నితని పూర్వకవులు, లేక తరువాతి కవులు గూడ ననుకరింపజాలని యొక విశిష్టత గలిగియున్నవి.'[22] శిష్టా రామకృష్ణ శాస్త్రిగారు చెప్పినది నిజమే. తిక్కనగారి స్త్రీలు 'చైతన్య సంపుటాలు' (విరాట 2-27) సౌందర్యాన్ని వర్ణించడానికే కాదు; కరుణ, జాలి పుట్టించడానికి కూడ చలనమున్న స్త్రీలనే తిక్కనగారు వర్ణిస్తారు. స్త్రీ పర్వంలో పద్దెనిమిదిరోజుల ఘోరయుద్ధం ముగిశాక, పద్దెనిమిది

22. ఆంధ్రవాఙ్మయ చరిత్ర సర్వస్వము. సంపుటము-1, పుటలు 404, 405.

అక్షౌహిణుల సైన్యం నేలకొరిగాక, నక్కలూ, కాకులూ, రాబందులూ, గద్దలూ, తోడేళ్ళూ శవాలకోసం, కాట్లాడుకుంటున్న యుద్ధభూమిలో తాళికట్టిన భర్తకోసం, తమతో పుట్టిన సోదరులకోసం, పదినెలలు మోసి కన్న బిడ్డలకోసం, బ్రతుకును పంచుకొన్న బంధువుల కోసం వెదుక్కొనడానికి స్త్రీలు అంతఃపురాలు వదిలి ఎండనుబడి రావడం తిక్కనగారు ఎలా వర్ణించారో చూడండి :

''చేతులు నడుదల సేర్చు టుత్కటశోక మాకారములు దాల్చినట్టులుండ
విరిసిన వేనలుల్ వెన్నుల బ్రక్కల నెరపి చూపర దృష్టి నీరుసేయ
నందంద దొరగెడు నశ్రుజలంబుల పెంపున మోములు ముంపబడగ
నేమియు దొడవులు లేమిబాడరియున్నయంగంబులందు దైన్యంబు నెరయ
పతుల నన్నలదమ్ముల సుతులహితుల - బేరుకొని వాతులెండంగ బ్రేముడించి
పనవు పలుకులు వినువారి వనట దేల్చ - గురుకుమార! నారీజనకోటివచ్చె.''

(స్త్రీ. 1-98)

వాళ్ళకు ఒంటిమీద తిన్నగా బట్టలైనా లేవు. అసలు ఒంటిమీద స్పృహ ఉంటేగా, దుస్తులులేవన్న సంగతి గుర్తుకురావడానికి? పూర్వం కొద్దిగా పమిట చెదిరినా సిగ్గుపడేవారు. నేడు కుంకుమలే చెదిరాయి. వాళ్ళ నాథులు ఈ లోకం విడిచారు. వాళ్ళ మనసులూ ఈలోకంలో లేవు. తిక్కనగారు ఎలా వర్ణించారో చూడండి:

చెలులైన జూడ బయ్యెద
దొలగుటకును సిగ్గువడు వధోజనతతి య
త్తల యెదుర నేకవస్త్రం
బులతో నంగములు వికృతి బొందగ నడచెఁ.'' (స్త్రీ. 1-99)

వాళ్ళు ఇంకా ఎలా ఉన్నారంటే,

''విపులహర్మ్యతలంబులు వెడలునట్టి
వెలది మొత్తముల్ వొల్చె బల్వేటకారు
పతులజంపిన గిరిగుహాప్రతతి వెడల
బారు సింగంపు బెంట్లకు బాటి యగుచు.'' (స్త్రీ. 1-102)

స్త్రీ పర్వం నిజంగా గాంధారిది. ఆమె అందులో మూర్తీభవించిన శోకదేవత. తన కడుపున నూరుపండ్లు పండితే అందులో అన్నీ చెడిపోయాయి. అంధులకు ఊతకోలగా ఒక్కణ్ణి కూడ మిగల్చక భీముడు అందరినీ మింగాడు. ''అందులో ఒక్కడు కూడ నీకు అపకారం చేయనివాడు లేడా?'' అని భీముణ్ణి దీనంగా ప్రశ్నించింది! ఆమె ఆదినుంచీ కళ్ళకు గంత కట్టుకొన్నదే. ఆ కట్టు సందులోంచి ఆమె చూపులు ధర్మరాజు గోళ్ళమీద

పడ్డాయటు. వాటికే అతని గోళ్ళు కందిపోయాయటు. అర్జునుడు కృష్ణుని వెతక దాక్కొన్నాడు.[23] ఆమె కృష్ణునికి యుద్ధ దృశ్యాలు చూపించింది. మాటమాటకూ కోటి నిప్పులకోలలు హృదయాన్ని దొలుస్తూ ఉండగా వ్యాఖ్యానం చేసింది. ఆమె కళ్ళకు కట్టిన కట్టుతోనే ఆ హృదయ విదారకమైన దృశ్యాలను చూసింది. వాస్తవానికి సాధారణ నేత్రాలు యుద్ధాల పర్యవసానంలోని భీకర సత్యాన్ని వీక్షించలేవు. గాంధారివి ఒకరకంగా ఎక్స్-రే కళ్ళు. అవి జీవితసత్యాన్నే చూస్తాయి. వాటిలోనుంచి కారే కన్నీళ్ళలో బడబాగ్ని ఉంది. కవుల గంటాలు ఉంటాయి. శిల్పుల కుంచెలు ఉంటాయి. వీణ లుంటాయి. వేణువు లుంటాయి. అవి వాస్తవతత్వాన్ని రచిస్తాయి. వినిపిస్తాయి. మానవుణ్ణి మానవునికి జ్ఞాపకం చేస్తాయి.

గాంధారి, కుంతి పాత్రలు

గాంధారి విచిత్రమైన సంకేతం; ఆడదానికి అచ్చమైన చిహ్నం. ఆమె పుట్టుగుడ్డి కాదు. జీవితాన్ని చూడగలదు. అయినా మగవాడు స్వార్థపరుడు. అహంకారి. దూరదృష్టి లేనివాడు. నిజానికి ఏదీ చూడలేడు. వాడు పుట్టుగుడ్డి. తాను చూడలేడు. తన ఉత్తమార్థాన్ని కూడ పరమార్థం చూడనివ్వడు. ఆమె కళ్ళకు దళ్ళు కడతాడు. అతడికోసం ఆమె భరిస్తుంది. కళ్ళు మూసుకొంటుంది. అయినా విలయకాలతమిస్రంలో ఆమె నయనాలు జ్ఞానరోచిస్సులను చూస్తాయి. భగవంతునికే అతని సృష్టిలోని వేదనా భరితమైన సత్యాన్ని చూపెడుతాయి.

గాంధారి అదే చేసింది. కృష్ణుడు తాను తటస్థంగా వున్నానని అన్నదమ్ముల మధ్య కయ్యం పెట్టాడు. ఆప్తులు, అయినవాళ్ళు, గురువులు, శిష్యులు పరస్పరం కొట్టుకొని చచ్చారు. యుద్ధం ముగిసేదాకా కృష్ణుడే సూత్రధారి. పీనుగు పెంటలు కొండంత ఎత్తు పెరిగాక గాంధారి ముందుకొచ్చింది. పేరుపేరు వరసపెట్టి ప్రతి శవాన్నీ, ఆ శవంపైన పడి రోధించే ఆడకూతుర్నీ వేలెత్తి చూపింది. కృష్ణుడు నోరుమూసుకొని విన్నాడు. భారతంలో స్త్రీపర్వం శిఖరాగ్రం, ఆ ఎత్తు తర్వాత మిగతా పర్వాలన్నీ పల్లాలే!

గాంధారి ఒక రకమైన పాత్ర అయితే, కుంతి మరొక రకం ఆడది. గాంధారి చెడ్డవాళ్ళను కన్న మంచితల్లి. యుద్ధానికి వెళుతూ తన కొడుకు దీవనల కోసం వస్తే ''ఎటు ధర్మం వుంటే అటే జయముంటుంది, వెళ్ళు!'' అని దీవించిన ఉత్తమురాలు. కుంతి పరుల పంచను విధిలేక పడివున్న పరాధీనురాలు. పరిభవ దుఃఖిత. పదమూడు సంవత్సరాలు బావకొడుకు చేతి అదయమగు కూడు తిన్నది. రాయబారానికి వచ్చిన కృష్ణుణ్ణి చూసి ఆమె బావురుమని ఏడ్చింది. అతడు తన మేనల్లుడు. పుట్టింటి చుట్టం. అయినవాళ్ళు కనబడితే అసహాయులైన ఆడవాళ్ళు ఎలా రోదిస్తారో తిక్కనగారు చక్కగా చూపించారు. కుంతిని తెలుగు ఆడబడుచును చేశారు. చూడండి.

---

23. స్త్రీ. 1-176.

''బావ యొప్పండను పలుకుల నేమగు నాతని కొడుకు గీడాడ నేల?
కురువృద్ధుడగు బాహ్లికుని దూరనేటికి భీష్మునిపై బ్రయివెట్టనగు నె?
యిట్టి క్రూరుల యింటి కిచ్చిన మనవారి నందుగాకట్లు దాననుట మేలె?
యర్జును పుట్టినయప్పుడు వీడు లోకములెల్ల గెల్చు పొగడ్త మొగులు
ముట్టునట్టిదయగు రణముల జయించు - గౌరవుల సోదరులు దానుభూరి రాజ్య
గౌరవము బొందునని యశరీరవాణి - వలికెనది దిట్టువడుగాక వలయునేని.''
(ఉద్యోగ. 3-195)

''ఇట్టి క్రూరుల ఇంటికి ఇచ్చిన మనవాళ్ళను తిట్టుకోవాలిగాని'' అని కుంతి అచ్చంగా తెలుగుదనంతో శోకాలు తీసింది. అలిగిన భీమఫల్గునులకు అడ్డంలేదని ఆమెకు తెలుసు. అంత అంత అవమానాలు పడ్డాక పగతీర్చుకోవాలన్నదే ఆమె ఉపదేశం. తనకు వచ్చిన న్యూనత, ద్రౌపదికి జరిగిన పరాభవం కుంతి ఎప్పుడూ మరచిపోదు.

తిక్కనగారు చిత్రించిన ద్రౌపది అభిమానవంతురాలు. భర్తనైనాసరే అనాదరించగల స్వాభిమానం ఉంది. అజ్ఞాతవాసానికి వెళుతున్నప్పుడు ధర్మరాజు ఇలా హెచ్చరించాడు. ఈ హెచ్చరికలో ఔచిత్యం ఉంది. భావి సూచనా ఉంది.

''మన వంశంబును వృత్తం
బును బెంపును గావజాలు పుణ్యసతివి దు
ర్జనులగు తులువల తలపులు
గనుగొని యేమరక మెలగగా వలయు జమీ!'' (విరాట. 1-110)

''అనిన విని యాజ్ఞసేని యనాదరమందస్మితసుందర వదనారవింద
యయి యతని కిట్లనియె.''[24] (విరాట. 1-111)

అని ఆమె చెప్పిన మాటలను తిక్కనగారు వ్రాశారు. ఇందులో అనాదరం అభిమానంవల్ల వచ్చినదే. ఇంతకూ ధర్మరాజుపైన తనకు మనసులో గౌరవం లేకపోలేదు. కీచకుడు వెంటపడి బాధిస్తున్నప్పుడు అర్ధరాత్రి వంటయింటికి పోయి భీమునితో మొరపెట్టుకొంది. ''పరుగెత్తి పోతూ ఉంటే ఆ కులపాంసనుడు వెంట తరిమాడు. అది నువ్వు చూశావు. మీ అన్న పెద్దతనం చూశావు. నేనేమంటాను?'' అని మొదట ఈ పద్యం చెప్పింది.

---

24. 'సాదరమందస్మితవదనారవిందయై' అని పాఠాంతరం చదలువాడ సుందర రామశాస్త్రులువారూ, దండిగుంట సూర్యనారాయణ శాస్త్రులవారూ కలిసి వ్రాసిన 'భారతసంజీవిని' వ్యాఖ్యతోపాటు ప్రచురించిన శారదాంబికా ముద్రాక్షరశాలవారి భారతప్రతి (1913)లో ఈ పాఠం ఇచ్చి ఇలా వ్యాఖ్యానించారు. 'సాదరమందస్మితసుందరవదన అరవింద - సాదరముతో కూడిన చిరునగవుచే చక్కని కమలమువంటి మోముగలది పాఠాంతరము : అనాదరమందస్మిత = ఆదరము లేమిచే గలిగిన చిరునవ్వుచేత యుధిష్ఠిరుని వాక్యమునందు అనాదరము చెప్పుట యుచితముకాదు. కావున బూర్వపాఠమే యుక్తము. పుట 30. సరియైన పాఠనిర్ణయానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారు వేసే ప్రతికోసం వేచి ఉందాం.

''మీ సుభటత్వముఁ బలము మిన్నకపోవక దుస్ససేను డ
ట్లాసభలోన నన్ బరిచె నంతియకాక జయద్రథుండు సం
త్రాసభరంబు లేక నుచితం బొనరించిన జెల్లిపోయె నే
డీసభికుల్ గనుంగొనగ నిట్లయితిన్ వగ నాకు వింతయే?'' (విరాట. 2-176)

నిజమే. కష్టాలు ఆమెకు కొత్త కావు. ఈ కష్టాలకు మూలకారణం ధర్మారాజేనని ఎవరేనా అనవచ్చు. అయితే ద్రౌపది మనసులో అలా అనుకోదు. ''సమస్తజన స్తవనీయుండగు పాండవాగ్రజు నిక్కంబ నిందించినదానంగా''నని మరపురాని మంచి పద్యంలో ఇలా వర్ణించింది.

''ఎవ్వని వాకిట నిభమదపంకంబు రాజభూషణరజోరాజి నడగు
నెవ్వని చారిత్ర మెల్లలోకములకు నొజ్జయై వినయంబు నొరపుగరపు
నెవ్వని కడగంట నివ్వటిల్లెడు చూడ్కి మానిత సంపద లీనుచుండు
నెవ్వని గుణలత లేడు వారాసుల కడపటి కొండపై గలయ బ్రాకు
నతడు భూరిప్రతాపమహా ప్రదీప - దూరవిఘటిత గర్వాంధకారవైరి
వీరకోటీరమణిఘృణివేష్టితాంఘ్రి - తలుడు కేవలమర్త్యుడె ధర్మసుతుడు.''
(విరాట. 2-191)

కట్టుకొన్న పెళ్ళాం దృష్టిలో చులకన కానంతకాలం మగవాడు ఎన్ని బాధలైనా ఓర్చుకోగలడు. ద్రౌపదికి అంతరాంతరాలలో భర్తలందరిమీదా ఇంతటి గౌరవం, ప్రేమ ఉన్నాయి కాబట్టే పాండవులు అన్నీ నెట్టుకొచ్చారు. ఆమెకూడ ''మీ ముక్కున నూర్పుగల్గ నొకమూర్ఖుని చేబడితిన్‌సభాస్థలిన్'' (విరాట. 2-226) అని యేడ్చింది. ''మీరేమి సేయుదురు? దైవారంభముగాక!'' (విరాట. 2-227) అంటుంది :

తాను పడ్డ అవమానాలన్నింటికి ప్రతీకారంగా ప్రచండ యుద్ధం జరగబోతుందని ఆమె ఆశించింది. ఆ ఆశ నిరాశగామారి అయిదు ఊళ్ళకు ధర్మరాజు మెత్తపడుతున్నప్పుడు ఆమె ఒళ్ళుమండింది. తాపం భరించలేకపోయింది. ''మారట నోరిదాననయి మాటలు చిత్తమునందు నిల్పక ఏను కారులు ప్రేలుతాను. వినుడు. వీరిడి అయిన మానిసికి వివేకముంటుందా?''[25] అని పాండవులను కడగడం మొదలుపెట్టింది. ''అయిదూళ్ళు ఇస్తే సిగ్గులేక పుచ్చుకొని వీళ్లు ధృతరాష్ట్రుణ్ణి సేవించుకొందుకు వెళ్తారు. సరే బాగుంది'' అని మొదలు పెట్టింది.

''అరయమి జేసి కోడ లన కప్పుడు దాసిగ జేసె నమ్మహా
పురుషుని పాలికిం బతులు వోవగ వీరలతోన యేను జె
చ్చెర జని కోటరంబు దగ జేయుదునో యటుగాక పాడియై
వరవుడ మోపి చేయుదునొ వారికి మాధవ! నిశ్చయింపుమా!

25. ఉద్యోగ, 3-107

అని యట్లుగ్గడించి -

ద్రోవది బంధురంబున క్రొమ్ముడి గ్రమ్మున విడ్చి వెంద్రుకల్
దా వలచేత బూని యసితచ్ఛవి బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలగ మనంబున బొంగు విషాదరోషముల్
గావగలేక బాష్పములు గ్రమ్మగ దిగ్గన లేచి యార్తయై.

గోవిందు ముందటం బెట్టి యిట్లనియె -

ఇవి దుస్ససేను వ్రేళ్ళం-దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి కౌ
రవులకడ దీరుమాటల - యవసరమున దలపవలయు నచ్యుత! వీనిన్.
ఈ వెంద్రుకలు వట్టి యీడ్చిన యాచేయి దొలుతగా బోరిలో దుస్ససేను
తను వింతలింతలు దునియలై చెదరి రూపరియున్న గని యుడుకారుగాక
యలుపాల బొనుపడునట్టి చిచ్చే యిది పెనుగద వట్టిన భీమసేను
బాహుబలంబును బాటించి గాండీవ మనునొక వి ల్లెప్పుడును వహించు
కట్టివిక్రమంబు గాల్పనే యిట్లు బ-న్నములు వడిన ధర్మనందనుండు
నేను రాజరాజు పీనుంగు గన్నార-గానబడయమైతిమేని గృష్ణ!

నెట్టన యిట్టియల్క మదినిల్పితి రక్కసతాల్మి జిచ్చొడిం
గట్టినయట్లు పెద్దయునుగాలము దీనికి నారు టెన్నడుం
బుట్టదు దుష్టనిగ్రహము పూని జగంబులు గాచునట్టి తో
బుట్టువు నీవు దేజమున బొల్చిన భర్తలు గల్గ నచ్యుతా!''

(ఉద్యోగ. 3-112 నుండి 118)

ద్రౌపది హావభావచేష్టలు అన్నీ కళ్ళకు కట్టినట్లు తిక్కనగారు చిత్రించారు. క్రొమ్ముడి క్రమ్మున విడ్చి ఎడమచేత్తో పట్టుకుని కృష్ణుని ముఖంముందు పెట్టి చూపించడం, 'ఈ వెంద్రుకలు పట్టి ఈడ్చిన దుశ్శాసనుని ఒళ్ళు ఇంత, ఇంత, ఇంత ముక్కలవడం చూడా'లని అరచేతిలో పెట్టి బొటనవ్రేలు క్రమేపీ కొనగోళ్ళదాకా వెళ్ళడం కళ్ళముందు బొమ్మ కడుతుంది. తిక్కనగారిది అమోఘమైన సృష్టి!

అటువంటి పరిభవదుఃఖిత అయిన ఆడబడుచును చూశాక ఎంత జగంబులు ఏలే తోబుట్టువైనా సంధి ఎలా పొసగనిస్తాడు? ఆమె రాజరాజు పీనుగును కన్నారా చూడాలని నిశ్చయించింది. కృష్ణుడు తనకు తెలిసిన రాజనీతినంతా ఉపయోగించి రెండు పక్షాలనుంచీ యుద్ధం ప్రకటింపజేశాడు. తిక్కనగారు తమకు తెలిసినంత రాజనీతినీ ప్రయోగించి ఉద్యోగపర్వాన్ని సంభాషణశైలిలో అనన్యంగా రూపొందించారు.

అయితే తిక్కనగారు కృష్ణుని పాత్రను చిత్రించడంలో లోటు వచ్చిందని కొందరు అభిప్రాయపడుతున్నారు. దేశిరాజు భారతీదేవిగారు ఇలా వ్రాశారు : (కృష్ణుడు

హస్తినాపురం వెళ్ళాక దుర్యోధనుని ఇంటికి వెళ్ళి కుశల ప్రశ్నలు వేసి విదురుని ఇంట్లో భోజనానికి వెళ్ళాడు) ''ఈ సందర్భమున సుయోధనుడు వంటకము చేయించితిననియు, తన యింట భుజింపు మనియును కోరగా నందులకు కృష్ణుడియ్యకొనకుండుటచే సుయోధనుడు కారణమడుగగా కృష్ణుడు తాను పగవాడననియు, పగతుర యింటిలో కుడుచుట కూడదనియు కట్టెవిరిచి పొయిలో పెట్టినట్లు మాట్లాడెను. ఇట్టు లలౌక్యముగా మాట్లాడుట చూడ రాజకీయ చతురత కాదేమోనని తోచుచున్నది. రాయబారమునకు ముందుగానే ''నీవు దురాగతుడవు, పగతుడవు నీ యింట కుడవ''నని నిర్మొగమాటముగ చెప్పుట కృష్ణునివంటి రాజకీయతంత్రజ్ఞునకు తగినటువంటిదా అను సందియమునకు తావొసగుచున్నది. తిక్కన కవియేగాక మంత్రియు, రాజ్యతంత్రజ్ఞుడు కూడ నై యున్నాడు కదా! అట్లు చిత్రించుట కేమైన మంచి కారణమున్నదేమో ఊహాతీతము''[26]

నిజానికి ఇందులో సూక్ష్మమైన రాజనీతి ఉంది. దుర్యోధనుడు కృష్ణుణ్ణి భోజనానికి ఉండమన్నాడు. కృష్ణుడు 'వద్దులే' అన్నాడు. దుర్యోధనుడు కారణం చెప్పమన్నాడు. కృష్ణుడు ''దూత లెందు దొలిదొలి గుడువం గొనగట్ట దొడగుదురె? వచ్చిన కార్యము దీర్చి పిదప జేయుండెల్లర్.'' (ఉద్యోగ 3-218) కృష్ణుడు దూతల నీతిని చెప్పాడు. దుర్యోధనుడు వినలేదు. ''కార్యం తీరుతుంది, తీరకపోతుంది. దాని సంగతి అప్పుడు చూచుకోవచ్చు. ఇప్పుడు 'ముకుద్రాట గాలు గ్రువ్వనేల కమలనాభ!' దీనికి కారణం నాకు తెలిసినదేదీ లేదు.'' అన్నాడు. ఇంతపట్టు పట్టాడు కనక కృష్ణుడు చెప్పాడు. ''తేటపరుపవలయునేని విను''మని చెప్పాడు. తాను పాండవుల దూతగా వచ్చాడు. దూత నూటికి నూరుపాళ్ళు తన తరపువాళ్ళ మనిషిగా వుండాలి.

''పరనృపతులు పుత్తెంచిన
పరవస్తుచయము ముట్టవలవదు విషదు
స్తరమంత్ర యంత్రమాయా
పరిశుష్కాస్పదము లగుట బార్థివు డర్థిన్.''
(శివదేవయ్య పురుషార్థసారం. సకలనీతి. 271)

అని రాజనీతి. రాజులాగే రాజదూతకూడ పరుల యింట భుజింపగూడదు. అందుకే పట్టుపట్టి అడిగేదాకా కృష్ణుడు చెప్పలేదు. తాను పాండవుల పక్షాన వచ్చాడు. వాళ్ళకు ఏవిధమైన అన్యాయం జరిగినా సంధి పొసగదని ముందే చెప్తున్నాడు. తాను మొహమాటపడేది కూడ లేదని హెచ్చరిక. దుర్యోధనుడు వేసిన ఎత్తుకు ఇది పై ఎత్తు. సంధి పొసగదని సభలోకి వెళ్ళడానికి ముందే తెలుసు. విదురుని ఇంట్లో ఆదిలోనే చెప్పి వేశాడు.

''ఎరుగుదు నేను సుయోధను
కొరగామియు, నతనితోడ గూడిన నృపులం
దరు బగ మనమున నిడికొని
యరుముటయును, సంధి పొసగదనియు మహాత్మా!'' (ఉద్యోగ. 3-242)

26. 'కవిత్రయ కవితారీతులు - తరువాతి కవులపై వారి ప్రభావము' పుట 57.

అయినా,

''చుట్టములలోన నొప్పమి పుట్టినప్పు
డడ్డపడి వారితోడ గొట్లాడియైన
దాని నుడుపంగ జొరకున్నవాని గ్రూర
కర్ముడని చెప్పుదురు కర్మకాండవిదులు.'' (ఉద్యోగ. 3-242)

కాబట్టి రెండుపక్షాల వాళ్ళకూ శాంతి గావించడానికి ప్రయత్నిస్తానన్నాడు. శాంతి కాలేదు. ఘోరసంగ్రామం జరిగింది. తిక్కనగారు యుద్ధాలలోని బీభత్సాన్ని చూసి భయపడే భీరువులు కారు. ఆయన చమూపతి. దండాధీశుడు. అందుకే యుద్ధాలను సైతం రమణీయమైన ప్రకృతి దృశ్యాలతో పోల్చి వర్ణించారు. ''తొట్టితొట్టి యెడనెడ మడువులు గట్టు శోణితంబు నీళ్ళనందుబడి తేలాడు. వెలి గొడుగులు పుండరీకంబులును, వింజామరలు మరాళ పుంజంబును నై కొలంకుల చందంబు నొంద వాని కెరగెడు కొదమ తుమ్మెదపదువుల పగిది దొరగు నాఖండ లతనయఖండిత పరవీర కాలాయసనారాచ శకలంబుల వలనను, గిరీటి శరపాటవ పరిస్ఫోటితరిపుకపాలగళిత మస్తిష్కపలల పంకంబు నను నలుదెసల నంతంత గదియం జాగిపడియున్న కృత్తకచరణంబులను, వెదపదనికి రొంపి గలంచి వరుజులు పదిలంబుగా నమర్చిన కేదారంబు తెరంగు దోచుటకు వీడ్డై చతురహాలికుండు సల్లు పరువంపు మొలకల చెలువున బెల్లుడుల్లు ఫల్గునాశుగసంతాడన వికీర్ణ శత్రుశేఖర వజ్రవ్రజంబుల వలనను సంగ్రామం బభిరామంబయ్యును ఘోరప్రకారంబయ్యె'' అని విరాటపర్వంలోనే (5-60) వర్ణించారు. యుద్ధపంచకంలో వర్ణనలు ఇంకా 'అభిరామాలు.'

యుద్ధభూమిలో అలసిపోయిన యోధులు ఏనుగుల కుంభస్థలాలపై నిదురించారట: దానిని ఇలా వర్ణించారు :

''తరుణుల కుచములపై రతి
పరవశులై యొరగు పతుల పగిది సమరసం
భరితశ్రమమున నిద్రిం
చిరి కరికుంభముల జెంది చెన్నుగ జోదుల్.'' (ద్రోణ. 5-273)

స్త్రీల వక్షోజాలను ఏనుగుల కుంభస్థలాలతో పోల్చి వర్ణించడం కవి సమయం. తిక్కనగారు యుద్ధభూమిలోని ఏనుగుల కుంభస్థలాలను తరుణీకుచకుంభాలతో పోల్చారు. యుద్ధవర్ణనలో ఇటువంటి చెమకులు చూపిస్తేగాని కథ రక్తికట్టి ముందుకు సాగదు.

భారత వీరులంతా కసిగా యుద్ధం చేసినవాళ్ళే, ఒళ్ళు తెలియకుండా శత్రువులను సంహరించిన వాళ్ళే. సౌప్తిక పర్వంలో కృపాచార్యుడూ, కృతవర్మా మరీని! వాళ్ళు రాక్షసావేశ సంభృత క్రౌర్యులయ్యారు. శరణుచొచ్చినవాళ్ళను సైతం పట్టుకొని నరికి ప్రోగులుపెట్టారు (సౌప్తిక 1-198). అయితే మర్నాడు ''మున్ను రాక్షసావేశంబునంజేసి నీచ

పరాక్రమంబు లాచరించి తదనంతరంబ తెలిసి యారధికవరులు వగం బొగులు చున్నవారు.'' (సౌప్తిక 1-204).

రాక్షసావేశంలో యుద్ధం చేసినవాళ్ళలో భీముడు ప్రథముడు. విరాట పర్వంలోనే కీచకుణ్ణి చంపిన చంపు సామాన్యంది కాదు.

''వికృతపు జావు సంప మది వేడుక వుట్టిన గిట్టిపట్టి మ
స్తకమును దీనదీర్ఘ భుజశాఖలు బాదయుగంబు మేనిలో
నికి జొర నుగ్గుగా దురిమి నించిన క్రంతల తిత్తియైన కీ
చకు ధరణీస్థలిం జదిపి చక్కని ముద్దగ జేసె దుష్టుడై.'' (2-353)

భీముడు ఇది దుష్టుడై చేశాడని తిక్కనగారు కచ్చితంగా చెప్పనే చెప్పారు. ఇక దుశ్శాసనుణ్ణి చంపిన విధం దారుణం; అమానుషం. ''ఆ సభలోన గొన్న ఋణమంతయు నీగగ గంటి వడ్డితో'' అని ఘోర విహారం చేసి

''ఏ నురము వ్రచ్చి నెత్తురు - తేనియ యిదె ద్రావెదం గదిసి నను గడిమిన్
మానుప దిక్కు గలిగినన్-రాని మ్మెలుగింపు మీ మొనం గలవారిన్.

అని పెలుచం బలికి కుఠారంబు వెరికి యతని మొగంబు మీద జళిపించి,

నరసింహుం డసురేంద్రు వ్రచ్చుకరణిన్ రౌద్రం బుదగ్రంబుగా
నుర మత్యుగ్రత జీరి క్రమ్ము రుధిర మ్ముల్లాసియై దోయిటన్
వెరవారం గొని త్రావు మెచ్చు జవికిన్ మేనన్ మొగంబున్ భయం
కరరేఖం బొరయంగ జల్లికొను నక్కోరవ్యు జూచుం బొరిన్

ఇట్లు దారుణభంగిం బ్రతిజ్ఞాకరణ పూరణం బాచరించి -

తల్లి చన్నుల పా లేను ద్రావ నెట్టు
లాననే పలు తెరగుల తేనియలును
ఖండశర్కరతోడి దుగ్ధంబు లనభ
వింపబడవే యవియు నింత యింపుగావు.'' (కర్ణ 3-212 నుండి 216)

దోసిటితో వెరవార త్రాగి, రుచికి మెచ్చుకొని, ఒంటిమీదా మొఖంమీదా చల్లుకొని, ''నేను ఇంతకుముందు త్రాగినవేవీ ఇంత రుచిగా లే'వని రాక్షసంగా ఆ సమయంలో పలికిన భీముడు తాను చేసిన పనికి సిగ్గుపడ్డాడు. స్త్రీ పర్వంలో గాంధారి ఇలా అడిగింది:

''వైరి నని జంపుదురుగాక వ్రచ్చి నెత్తు
రెత్తికొని క్రోలు క్రూరాత్ము లెచటనైన
నెన్నడేనియు గలిగిరే యీవుదక్క
నది వృకోదర! వృకవిధ మసురభంగి.'' (స్త్రీ. 1-162)

దానికి భీమసేనుడు ఇలా అన్నాడు:

> ''ఆ సభలోని కట్టు ద్రుపదాత్మజ దా
> గాసిగ నీడ్చి వల్వలొలువగా గినుకం
> జేసిన బాసకై పెదవి జేర్చితి దు
> శ్శాసను శోణితం బిది నిజం బరయన్.'' (స్త్రీ. 1-164)

ప్రతిజ్ఞకోసం పెదవిని చేర్చాననన్నాడు. సైనికులను భయపెట్టడానికి ముఖానికి పూసుకున్నానన్నాడు. ''ఆ రెండు పనులకై యట్లు ద్రావుటగా నటించితింగాని

> అన్యజనముల శోణితమైన ద్రావు
> టధిక పాతకమని విందు ననుజు రక్త
> మాన నేనంత వెఱ్ఱినే? యంతపాప
> కర్ముడనె? తల్లి! యంత నిష్కరుణమతినె?'' (స్త్రీ. 1-168)

భీముడు చెప్పిన సమాధానానికి గాంధారి తృప్తిపడిందో లేదోగాని తెలుగు పండితులు ఒప్పుకున్నారు ''భీముడు ప్రతిజ్ఞానిర్వహణార్థము రాక్షసరూపమును బూనెనే కాని రాక్షసుడు కాలేదు. రక్తమును బెదవిని జేర్చెనేగాని యాస్వాదింపలేదు. సుక్షత్రియవీరుడగుట నధర్మయుద్ధమునకు గడంగలేదు. అశ్వత్థామ అట్లు కాదు'' అని భూపతి లక్ష్మీనారాయణరావుగారు వ్రాశారు.[27]

అశ్వత్థామ వింతపాత్ర. దుష్టచతుష్టయంలో మిగతా ముగ్గురూ ఉన్నంతకాలం ఇతడు సూటిగా వాగ్వాదం చేసినవాడే. ప్రతిఘటించినవాడే. తన రాజు దుర్మార్గపు చావు చచ్చేటప్పుడు తాను ఒక్కడూ పగతీర్చుకొని స్వామిభక్తిని ప్రదర్శించాడు. అశ్వత్థామ సౌప్తికపర్వంలో ఆ రాత్రి చేసిన వీరహోమం - ఆత్మోపహారం తిక్కనగారి కాలంలోని వీర శైవమతాన్ని పరోక్షంగా ప్రతిబింబిస్తుంది.

> ''ఏ నీయాపద గడిచిన - నానా భూతోపహార నవ్యార్చన నీ
> శానుని బ్రీతుం జేసెద - బూని ప్రమథగణము నన్ను బొగడునటులుగన్.''
> (సౌప్తిక. 1-114)

అని మనసులో మొక్కుకున్నాడు. అతని ముందు ఒక వేది తోచింది. అందులో జ్వాల వెలిగింది. అశ్వత్థామ పరమేశ్వరుణ్ణి ఉద్దేశించి ఇలా అన్నాడు :

> ''తెర గెట్టిదియో నా మది - నెరుగ మదాత్మోపహార మిచ్చెద నీకుం
> గరకంఠ! వరము నాకు బ-గర బరిమార్పంగ శక్తి గలుగుటయ చుమీ!''
> (సౌప్తిక. 1-121)

27. 'భారతము - తిక్కన రచన' పుట 98.

అని మంటలో ఉరికాడు. శివుడు ప్రత్యక్షమయ్యాడు. ఈ పద్యాల మధ్య ఒక సుదీర్ఘమైన వచనం ఉంది. అందులో శివ 'గణాడంబరం' ఒకటి కనబడుతుంది. వాళ్లు ''మాంస రుధిరంబుల బూర్ణంబులగు కపాలంబుల గరతలంబులంగొని యాభీలంబులగు భక్షణ పానంబు లాచరించుచు... సౌప్తిక వ్యాపార ఘోరత్వంబు గనుంగాని వినోదించుటకు'' వచ్చారు. (సౌప్తిక. 1-116)

ఈ సౌప్తికపర్వంలో విలక్షణత్వం ఉంది. అంతకుముందు ఏ పర్వంలోనూ చెప్పని మహాస్రగ్ధరలు 14 తిక్కనగారు ఇందులో చెప్పారు. ద్రౌపది కుమారులలో ఒక్కొక్కరినీ అశ్వత్థామ చంపుతున్నప్పుడు ఒక్కొక్క మహాస్రగ్ధర వ్రాశారు (సౌప్తిక. 1-181, 183, 185, 187, 189). ఇప్పటిదాకా విలక్షణ ఛందస్సులమీద అట్టే దృష్టిని పోనివ్వని తిక్కనగారు, ఈ పర్వం నుంచి విశేషవృత్తాలను వాడడానికి మొదలుపెట్టారు. స్త్రీ పర్వంలో రకరకాల ఛందస్సులు వ్రాశారు. స్త్రీ పర్వంలో అరుదైన విశేష వృత్తాలను వాడడమేకాక ఎప్పుడూ వాడే - ఉత్పలమాల, చంపకమాల, మత్తేభం, శార్దూలం వంటివి వాడకపోవడం గమనించతగ్గది. మహాస్రగ్ధర స్రగ్ధర కూడ స్త్రీపర్వంలో వాడలేదు. వ్రాసిన మొత్తం గద్యపద్యాలలో కందాలు ఎక్కువ.

ఇన్ని రకాల ఛందస్సులు వ్రాసినా తిక్కనగారు కందాలపై ప్రభుత్వాన్ని నెరపినట్లు లోకం చెప్పుకొంటుంది. ''నన్నయగారి సీసపాదముల చివర భావముగాని, భాషగాని సామాన్యముగ నాగక తరువాతి పాదమునకు సాగిపోవును. తిక్కన సీసపాదములు నాల్గును చివర కాగిపోవును'' అని కొందరు అభిప్రాయపడతారు.[28] కాని ఇది సర్వత్రా కాదు. కథ చెప్పేటప్పుడు తిక్కనగారు నన్నయగారిలాగ గునుగు సీసాలు వ్రాయక పోలేదు. వర్ణనలలో నన్నెచోడునిలాగ విరుగుల సీసాలు వ్రాశారు. తిక్కనగారు బంధగర్భకవిత్వాలు ఏమీ చెప్పలేదు.

> ''అగునన గొమ్మయ తిక్కడు
> జగతి నపూర్వార్థశబ్ద చారుకవితమై
> నెగడిన బాణోచ్ఛిష్టం
> జగత్త్రయం బనిన పలుకు సఫలం బయ్యెన్.'' (దశకు. 1-89)

అని కేతన చెప్పినట్టు ముందు మనం చెప్పుకొన్నాం. అపూర్వార్థ శబ్దచారుకవితలో తిక్కనగారు వాడిన జాతీయాలు, సామెతలు మొదలైనవి కోకొల్లలు. వారు తెలుగుదనాన్ని పూర్తిగా ఒంటపట్టించుకొని ప్రతిపద్యాన్ని జాత్యమైన తీరునే వ్రాశారు. పాతపడ్డమాటలు వారికి గిట్టవని ముందు తెలుసుకొంటాం. జాతిజీవనంలో ఉండే భాషను - సజీవభాషను వారు గ్రంథస్థం చేశారు. అది ఆనాటి శిష్టవ్యావహారికం. అందులోని నుడికారపు తీయదనం కొంత చూద్దాం.

---

28. శిష్టా రామకృష్ణశాస్త్రిగారు - 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సర్వస్వము' సంపుటము 1 పుట 409.

తిక్కనగారి సామెతలు, జాతీయాలు

నీరు గవిసియున్న నిప్పుబోలె (విరాట. 1-228)

అందని మ్రాకుల పండ్లు కోయదలచుట (విరాట. 2-58)

పిడుగుపడినవాని గౌరవిం జూడిన తెరంగున (విరాట. 2-103)

బెబ్బులి యున్న పొదరిలు సొచ్చులేడి చందంబున (విరాట. 2-112)

ఆడుకూయు ఆలకూయును లాతివారికైన అరయవలయు (2-177)

కాదు కూడదన (విరాట. 2-257)

కయ్యమునకు గాలుద్రవ్వకున్న (విరాట. 3-110)

ఓహరి సాహరి నయ్యాలచేరుగా (విరాట. 3-165)

నివురుగవిసిన మెరయని నిప్పువోలె (విరాట. 4-75)

పెన్నిధిగన్న పేదచందంబున (విరాట 4-149)

మంటలో మిడుతలు సొచ్చినట్లయిన (విరాట 5-33)

వేల్పువచ్చినయట్ల మేనువొంగ (విరాట. 5-40)

ఏనుగునకు సిళ్ళు నూపినట్లు (విరాట. 5-81)

నీరు పైగవిసిన నిప్పులట్ల (విరాట. 5-351)

కయ్యంబునకు గాలు ద్రవ్వుచునుండె (ఉద్యోగ. 1-225)

క్షీరోదక వృత్తి (ఉద్యోగ. 1-263)

మడుగుచీర యందు మసిందాకినట్లు (ఉద్యోగ. 1-295)

పిల్లిపట్టిన యీరువు (ఉద్యోగ 2-25)

అరచేత ప్రాణంబులిడి (ఉద్యోగ 2-128)

చిచ్చునకు దోడు గరువలి వచ్చుగతి (ఉద్యోగ 2-191)

మంటలో మిడుతలుదగ్రవృత్తి నురకదలచినట్లు (ఉద్యోగ. 2-220)

కయ్యమునకు గాలుద్రవ్వ (ఉద్యోగ. 2-226)

ఉల్లిపట్టుమాటలు (ఉద్యోగ. 2-242)

నేవోసిన యగ్నిభంగి (ఉద్యోగ 2-243)

మున్నీరు సొచ్చిన యేరుల చందంబున నడంగిపోవుట (ఉద్యోగ. 2-265)

విరిగిన బార సాపవచ్చునే. (ఉద్యోగ. 2-284)

డెందాన చెయి పెట్టుకొని నిద్రించుట (ఉద్యోగ. 3-19)

అగ్గి చల్లనగుట (ఉద్యోగ 3-52)

క్షీరోదకగతి (ఉద్యోగ. 3-258)

ఆకొని ముసిండిదినిన గ్రొవ్వు లావుగలుగునయ్యా! (ఉద్యోగ. 3-333)

శ్రీరా మొకా లొడ్డినవారి విధమ (ఉద్యోగ 3-343)

మంటపై వావిరిగ్రమ్ము నాశలభవర్గము చాడ్పున (ఉద్యోగ. 3-398)

కంటికిన్ రెప్పయుబోలె (ఉద్యోగ 4-114)

నూతి కప్పవిధమున (ఉద్యోగ 4-196)

పాము బొదివి పడదిగిచిన చీమల గమియట్ల (ద్రోణ. 1-85)

ఉరిసిన పుండుల నుప్పుపెట్టుట (ద్రోణ. 5-358)

కొంగున నగ్ని దాచినట్లు (స్త్రీ. 2-179)

కన్నులు చల్లగ (నిర్వచన. 2-9)

నిధి నిరుపేదవాడు గన్నట్లు (నిర్వచన. 2-81)

చెవులుపట్టి యాడించు (నిర్వచన 4-22)

పులిమీసల నుయ్యాలలాగి (నిర్వచన 6-11)

సిరివచ్చిన మోకాలు నూపువారుం గలరే (నిర్వచన. 6-70)

నడికంటే చావుమేలు (నిర్వచన. 8-119)

పాలతోడ విషం బిడుపగిది (నిర్వచన. 9-3)

తమ రెండు మహాకావ్యాలలోనూ తిక్కనగారు ఇంత చక్కని జాతీయాలను, నుడికారపు సొంపులను చూపించినా ఆనాటి సాహిత్యలోకంలో సజీవ భాషను వాడనివాళ్ళు ఎక్కువ ఉన్నట్టు కనబడతారు. నన్నెచోడుడు మొదలుపెట్టిన కుకవి నింద ఒక విధంగా మేలుచేసిందనే చెప్పాలి. తిక్కనగారు కూడ కుకవి నింద భారతంలో చేయకపోయినా నిర్వచనోత్తర రామాయణంలో చేశారు. దీనివల్ల ఒక లాభం కలిగింది. ఆనాటి సాహిత్య వ్యవస్థ మనకు తెలుస్తున్నది.

నిర్వచనోత్తర రామాయణం అవతారికలో తిక్కనగారు తమ కాలంనాటి సాహిత్య వాతావరణాన్ని చక్కగా విశదం చేశారు. ఆనాడు కవులు విచ్చలవిడిగా, చిత్తం వచ్చినట్లూ వ్రాసేవారు కాబోలు! కుకవులనూ, దుర్విటులనూ తిక్కనగారు ఒక కోవలోవాళ్ళుగా జమకట్టారు. ఈ రెండు తెగలవాళ్ళూ పలుకుల పొందు లేక, రసభంగం చేస్తూ, పాతబడ్డ మాటలలో తమ నేర్పు చూపిస్తూ, ఎక్కడా హృదయాన్ని వికసింపజేయలేక, ఏదీ కాని పద్ధతిలో పొంగిపోతూ లోకంలో నవ్వులపాలు అవుతారట. తెలుగులో కవిత్వం చెప్పదలచిన కవులు అర్థానికి తగిన మాటలు తీసుకోక యతిప్రాసల కోసం మొత్తం పులిమి వదిలిపెట్టివేసేవారు. సంస్కృత శబ్దంతో కొందరు తెలుగు పలుకుబడి కలుపుతున్నప్పుడు ఆ భాషలోని లింగవచనాలకూ, ఈ భాషలోని లింగవచనాలకూ భేదం కనబడేది.

కృతిలో ఇలా భేదించకుండా ఉంటే బుధజనం మెచ్చుకొనేది. జాతీయం కాని శుద్ధ సంస్కృతాన్ని ఆరోజుల్లో కవిత్వంలో చొప్పించేవారు కాబోలు. పాల్కురికి సోమనాథుడు వృషాధిప శతకంలో కొన్ని మణిప్రవాళ రచనలు చేశాడు. ఆ కాలంలో అవి చాలా ప్రచారంలో ఉండబట్టే అలా రచించి ఉంటాడు.

''అనయము జేతులందు భవదంఘ్రిసరోజయుగం నమామి నె
మ్మనమున సంస్మరామి యను మాటల నిర్ వరివస్కరోమహా
మ్మనుచు మణిప్రవాళమున నంకనసేయుదు భక్తలోకహృ
ద్వనజవిహారలోల బసవా బసవా బసవా వృషాధిపా! 50

అరశుగిరిప్రసాద ముదయానె భవద్గుణవర్ణ సల్పి నా
కొరువనినే స్మరామి సురయేశ్వరురే గణవర్మ యంచు ని.
ట్లు రుదు మణిప్రవాళమున నంకనసేయుదు నిన్ను మన్మనో
వరకరుణావిధేయ బసవా బసవా బసవా వృషాధిపా! 60

వాయువు వొందు యీవిగతవావ అమాపరహంబభౌ (?)
న్యాయవిధేయ మీశతరియన్యనబాణు కళాభిదంచు వా
గ్దేయమణిప్రవాళమున దెల్లము నిన్ను నలంకరింతు దే
వా యమిబృందవంద్య బసవా బసవా బసవా వృషాధిపా!'' 61

ఇటువంటి మణిప్రవాళ రచన ఉండబట్టే శుద్ధసంస్కృతి వ్యాకరణబద్ధమైన ఆ విభక్తులు, క్రియలు మొదలైనవి తెలుగులో ఉండరాదని కేతన తన ఆంధ్రభాషా భూషణంలో నిషేదించవలసి వచ్చింది.[29]

ఇవాళ మనం ఇంగ్లీషు మాటలను తెలుగులో వాడేటప్పుడు కూడ తెలుగు మర్యాదలను పాటించే వాడుతున్నాం. 'అర్జెంటు'గా అంటాంగాని 'అర్జెంట్లీ'గా అనం. 'పక్షిభిః' అనే మాటకు 'పక్షులు' అని తెలుగు బహువచనం ఎలా వాడుతున్నామో అలాగే 'బసెస్' అనే మాటకు 'బస్సులు' అని వాడుతున్నాం. 'రెండు బస్సులు తప్పాయి' అంటాంగాని 'రెండు బసెస్ తప్పాయి' అనం.

లోకోక్తులలాగా, జాతీయాలవలె బహుళ ప్రచారాన్ని పొందిన 'శుభస్య శీఘ్రం', 'ఆలస్యా దమృతం విషం' వంటి కొన్నింటిలోనూ సంస్కృత విభక్తులను తెలుగువాళ్ళం వాడుకొంటున్నాం. తిక్కనగారి కాలంలో చిత్తం వచ్చినట్టు సంస్కృత ఫక్కీలో తెలుగు రచన చేసేవారు కాబోలు. పండితారాధ్యుడు తన కందాలలో శ్రుతిస్మృతి పురాణాలలో నుంచి సంస్కృతోదాహరణాలను వందలకు వందలు చొప్పించేవాడు. అతని రచనలను చూశాక ఇతరులు మణిప్రవాళ రచన కూడ చేసేవారు కాబోలు. లేకపోతే కేతన అలా నిషేధించవలసిన అవసరం లేదు. ఈ మణి ప్రవాళ రచన జాతీయం కాదు. అందుకే

29. పద్యం నెం. 29, 30

తిక్కనగారు ''జాత్యముగామి నొప్పయిన సంస్కృత మెయ్యెడ జొన్ప''నని శపథం చేశారు.[30]

'ఒప్పయిన సంస్కృతం' అని తిక్కనగారు చెప్పిన దానికి పై విధంగానే మనం అర్థం చెప్పుకోవాలి. వారు సుదీర్ఘమైన సంస్కృతసమాస రచన నిర్వచనోత్తర రామాయణం లోనే చేశారు. చూడండి.

''నిరుపమరణకేళీ నిర్దళద్వైరిధాత్రీ
వరతనుగళితాసృగ్వారిపూరావగాహా
దరభర పరిఖేలద్యాతుధానాంగనాని
ర్భర మదమధుర స్తోత్ర ప్రసన్నాత్ముచేతక్'' (నిర్వచన. 4-101)

పద్యమంతా ఒక్కటే సమాసం. అంతా సంస్కృతమే. ఆఖర్న ఉన్న 'చేతక్' అనే ప్రత్యయం, దాని ముందున్న 'ఉ'గామం తప్ప తెలుగుతనం ఏదీ లేదు. 'ఒప్పయిన సంస్కృతం జొన్పను' అని శపథం చేసిన తిక్కనగారు ఇంత సమాస కల్పన చేశారంటే వారి ఉద్దేశంలో ఒప్పయిన సంస్కృతం ''వృక్షేణ దక్షాయ పక్షిభిః'' లాంటిది. ఇలాంటి రచన తిక్కనగారిలోనూ లేదు; వారి ధర్మమా అని తెలుగు సాహిత్యంలోనూ లేదు. తిక్కనగారి రచనలు ప్రచారంలోకి వచ్చాక మణిప్రవాళ రచన తెలుగులో అంతరించింది.

ఆ రోజుల్లో కవినామధారులు తెలుగులో కవిత్వం చెప్తున్నప్పుడు యతి ప్రాసలు వాడక తప్పదు కనుక, ఆ నియమాలను పాటించడానికి అర్థంలేని వ్యర్థపదాలను ఆ స్థానాలలో వాడి ఎలాగో కిట్టించి సరిపెట్టుకొని సంతృప్తిపడేవారనీ, దీనిని తిక్కనగారు గర్హించారనీ, యతిప్రాసల స్థానంలో అర్థవంతమైన మాటలే వాడాలనీ చెప్పారు. చూడండి ఆ పద్యం.

''తెలుగు కవిత్వము చెప్పం
దలచిన కవి యర్థమునకు దగియుండెడు మా
టలు గొని వళులుం బ్రాసం
బులునిలుపక యొగినిబులిమి పుచ్చుట చదురే?'' (నిర్వచన 1-7)

తిక్కనగారికి ముందు నన్నయగారి కాలం నుంచీ మనకు చక్కని కవిత్వం లభిస్తూనే ఉంది. వాటిలో యతిప్రాసలు లేనివి అట్టే లేవు. లేనేలేవు అని చెప్పవచ్చు. అయినా తిక్కనగారు ఇలా 'తెలుగు కవిత్వం చెప్పదలచిన కవి యతులు, ప్రాసలు పెట్టక పులమడం బాగుంటుందా' అని ప్రశ్నించడం వల్ల ఆ కాలంలో యతిప్రాసల విషయంలో కక్కుర్తిపడే పరిస్థితి ఏదైనా వచ్చిందేమో! 'శుద్ధ సంస్కృతం చొప్పించను' అనే ప్రతిజ్ఞతోపాటు తిక్కనగారు ఇంకొక శపథం కూడ చేశారు. ''ప్రాసము ప్రకారము వేరగు నక్షరంబులక్

30. నిర్వచన. 1-14.

శ్రుత్యనురూపమంచు నిడ''నన్నారు. ఇలా రెండూ ఒక్కలాగే ధ్వనిస్తాయని వేరే వేరే అక్షరాలను ప్రాసలలో వాడడం ఇంతకన్నా గతి లేదనే దుస్థితిని తోపింపజేస్తుందట. 'ర'కారానికి బండిరా ప్రాసగా వాడడం, ఒత్తక్షరాలకూ, ఒత్తులేని అక్షరాలకూ ప్రాసమైత్రిని చూపించడమూ ఆనాడు మొదలైంది కాబోలు. దీన్ని గర్హిస్తూ తిక్కనగారు ఇటువంటి శపథం చేసి ఉత్తర రామాయణం రచించారు. కృతి ఎలా చేయాలో ఇలా చెప్పారు :

''భూరివివేకచిత్తులకు బోలు వనం దలపుఙ్ దళంబులఙ్
సౌరభ మిచ్చు గంధవహు చందమునం బ్రకటంబుచేసి యిం
పారెడు పల్కులం బడయ నప్పలుకుల్ సరిగ్రుచ్చునట్లుగా
జేరుపనేరగా వలయు జేసెద నే గృతి యన్నవారికిఙ్''. (నిర్వచన 1-5)

ఒప్పుయిన సంస్కృతాన్ని నిషేధించినట్లే తప్పుయిన తెలుగును కూడ వాడకూడదని కేతన తన ఆంధ్రభాషాభూషణంలో చెప్పాడు. ఏయే పదాలు గ్రామ్యాలో చెప్పి అలాంటివి కవుల గ్రంథాలలో ఎవరూ ఒప్పరు అన్నాడు.

''పంచాకుమయ్యా తోపించాకుమయ్యా వా
టీ దెచ్చుతారు మమ్మూదలించి.''[31]

మొదలైన దీర్ఘాలు ఆనాడు పాటల్లో, మాటల్లో పామరులు వాడేవారు కాబోలు. శిష్టులు కూడా వాడేవారేమో తెలియదు. తన కాలంనాటి శిష్టవ్యావహారికాన్నే తిక్కనగారు స్వీకరించినట్లు చెప్పవచ్చు. కేతన నిషేధించిన దీర్ఘాలలో చేరుతుందేమో అనే అనుమాన మున్నా ఈ ప్రయోగం తిక్కనగారిలో కనబడుతుంది.

''అనుపమసత్యవిస్ఫురణ నాడినమాట 'మఱాకు' మన్న నీ
యనుజుల నల్వురం గడుపు మర్జునుచేతకు సమ్మతించితిఙ్.''
(భారతం. ఉద్యోగ. 4-70)

ఇవి కుంతి కర్ణునితో చెప్పే మాటలు. తిక్కనగారు చెప్పారు గనక 'మఱాకు' వంటి ప్రయోగాలకు గతి కల్పించాలి, తిక్కనగారు తమ కాలంలో ఉన్న అన్యదేశ్యాలను సైతం గ్రంథంలో వాడారేమో అనిపిస్తుంది. చూడండి ప్రయోగం :

''ధృతరాష్ట్రుం డతిలోభదూషితుడు ధాత్రీభాగ మీనేర్చునే
సుతుడుం గష్టుడు సంధియేల యగు నంచుఙ్ మున్న కై పెక్కిన
ట్టితలం పచ్యుత!...'' (భారతం.ఉద్యోగ. 3-72)

ఇందులో 'కైపు' అన్న మాట ఉంది. ''మరి యది పూర్తిగా ఆంధ్ర దేశీయమా, లేక తురుష్కుల యనంతరము మన భాషలోకి వచ్చినదా అనునదే ప్రశ్న, నాచన సోమునికి

31. ఆంధ్ర భాషా భూషణం. 26వ పద్యం.

ముందెవ్వరును వాడినట్లు కానరాదు. అప్పటికి మహమ్మదీయ సంపర్కము మనకు కలిగినదే'' అని వేదం వెంకటరాయశాస్త్రిగారు వ్రాశారు.[32] నన్నెచోడుడు చాలా అర్వాచీనుడని భావించిన శాస్త్రిగారు అతడు తొమ్మిదిసారులు 'కైపు' అన్న పదం ఎలా వాడాడో ఉదాహరించారు. తిక్కనగారు సైతం ఈ పదం వాడారు కనుక నాచన సోమునికి ముందు కూడా ఈ మాట ఉందని రూఢి అవుతున్నది. నన్నెచోడుడు తొమ్మిదిసార్లు వాడబట్టి తిక్కనగారు ఒకసారి వాడి ఉండవచ్చు. ఇంతకూ అది అసలు అన్యదేశ్యం కాదేమో! కేతన తన ఆంధ్రభాషాభూషణంలో 'ఆంధ్రం అయిదు రకాలు' అని చెప్పాడేగాని అందులో అన్యదేశ్యాల ప్రసక్తి లేదు. ఇది అన్యదేశ్యమైనా ఇబ్బంది లేదు. ప్రాతపడ్డ మాటలతోనే తమ నేర్పు చూపే 'కుకవుల' పట్ల తిక్కనగారికి ఎలాగూ సద్భావం లేదు. వారు కొత్త మాటలు స్వీకరించే నైజం గలవారు.

ప్రతి కవీ తాను ఏ ప్రాంతంలో జీవిస్తాడో ఆ మాండలీకాలను తన గ్రంథాలలో వాడతాడు.

''ఇది కడు ముద్దరాలు... ఒంటి దిరుగుదాని కోర్వదు'' (విరాట. 1-103)
''మీర లిందులకు నిప్పుడు వచ్చినదానికిం గతం బెయ్యది'' (విరాట.1-190)

మొదలైన ప్రయోగాలలో ''తిరుగుటకు, వచ్చుటకు'' అనడానికి మారుగా ''తిరుగుదానికి, వచ్చినదానికి'' అని నెల్లూరు మాండలికాలున్నాయి. ఇలాటివెన్నో దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు చూపించారు.[33] ఇంకొక నెల్లూరి మాండలీకంగూడ తిక్కనగారిలో కనబడుతుంది.

''హరి ననుదెంచె నాజికి దశానను నోర్వక రిత్తయెట్లొకో
మరలెను జాలడొక్కొ యను మాట వడం బనిలేదు బ్రహ్మచే...''
(నిర్వచన. 6-83)

చేపన్నా, రాపన్నా అని నేటికీ నెల్లూరు మండలంలో వాడతారు. ఆనాడే ఈ ప్రయోగం వాడుకలో ఉందని దీనివల్ల తెలుస్తున్నది. తిక్కనగారు తమ రచనలలో ఇలా అప్రయత్నంగా తాము నివసించిన మండలంలోని ప్రత్యేకతలను చొప్పించినా వారి పూర్వులది మాత్రం నెల్లూరు కాదు.

తిక్కనగారి వంశం

తిక్కనగారి పూర్వీకులు వెలనాడులో ఉండే గుంటూరి వారు. తమ తాతగారిని తిక్కనగారు 'సారకవితాభిరాము గుంటూరి విభుని మంత్రి భాస్కరు మత్పితామహుని దలచి'' అని నుతించారు.[34] తండ్రిగారిని కూడా ఇలాగే గుంటూరి విభునిగా పేర్కొన్నారు.

32. 'నన్నెచోడుని కవిత్వము'. పుట 94.
33. సాహితి, నవంబరు 1961
34. నిర్వచన. 1-12

''మజ్జనకుండు కేతన మల్లన సిద్ధనామాత్యవరుల కూరిమితమ్ముండు గుంటూరి విభుడు కొమ్మన దండనాథుండు'' అని చెప్పారు.[35] తిక్కనగారి తండ్రి తాతలు ఇద్దరూ గుంటూరి విభులే. అయినా ఆ వంశంలోని చాలామంది - అంటే తిక్కనగారి పెత్తండ్రులూ, పెత్తండ్రికొడుకులూ - నెల్లూరి రాజుల వద్ద మంత్రులూ, దండనాథులుగా ఉన్నవారు. తిక్కనగారు సరేసరి. మనుమసిద్ధికి కరుణాపాత్రులు. ''నిజకులక్రమాగతంబగు మంత్రి పదంబున వర్ధిల్లినవారు.''[36]

తాత తండ్రులిద్దరూ గుంటూరి విభులైతే తిక్కనగారూ, వారి పెత్తండ్రులూ, పెత్తండ్రుల బిడ్డలూ నెల్లూరి చోడుల వద్ద ఎలా చేరారు? 'గుంటూరి విభుడు' అన్నది ఉత్త బిరుదు కాదు. తెలుగుచోడులు తాము 'ఒరయూరు పురవరాధీశ్వరుల'మని సంప్రదాయసిద్ధంగా చెప్పుకొన్నట్టు తిక్కనగారి పూర్వులు తాము 'గుంటూరి విభుల'మని లాంఛానానికి చెప్పుకొని ఉండరు. ఏ చారిత్రక కారణాలవల్ల కొట్టరువువారు గుంటూరి నుండి నెల్లూరికి వచ్చారో చూద్దాం.

క్రీ.శ. 1186 ప్రాంతాలకు ముందు చందవోలు, గుంటూరు ప్రాంతాలను వెలనాటిచోడులు మహావైభవంగా పరిపాలించేవారు. ఆ సంవత్సరం వాళ్ళ రాజ్యం పతనం కావడం ప్రారంభించింది. నెల్లూరును పాలించే చోడతిక్కరాజు చిన్నప్పుడే వెలనాటి రాజైన పృథ్వీశ్వరుణ్ణి చంపి, ఆ తలతో బంతాట ఆడాడట. క్రీ.శ. 1206లో పృథ్వీశ్వరుడు చనిపోయి ఉంటాడు. చోడతిక్కరాజు ఆ సంవత్సరంలో వెలనాడు జయించి ఉంటాడు. అప్పుడు గుంటూరులో ఆ ఊరికి విభుడుగా ఉండే కొట్టరువు భాస్కరుడు చోడతిక్క రాజును ఆశ్రయించి ఉండవచ్చు. భాస్కరుని వైదుష్యం తిక్కరాజు చెవిని బడడానికి ఆస్కారముంది. తిక్కరాజు స్వయంగా కవి. ''సకల విద్యాపరిశ్రమము దెల్పగనేల కవిసార్వభౌమాంక మవని జెల్ల? పొగడ నేటికి తిరుకాల భూవిభునకు'' అని తిక్కనగారే ఈ తిక్కరాజును ప్రస్తుతించారు.[37] కవిసార్వభౌముడైన తిక్కరాజు సారకవితాభిరాముడైన మంత్రి భాస్కరుని చేరదీసి ఆశ్రయమివ్వడంలో వింత లేదు.

అప్పటికి భాస్కర మంత్రికి అరవై ఏళ్ళు ఉంటాయి.[38] అతనికి నలుగురు కొడుకులు: పెద్దవాడు కేతనప్రగ్గడ, రెండవవాడు మల్లన, మూడవవాడు సిద్ధన, కడగొట్టువాడు కొమ్మన. ఈయనే తిక్కనగారి తండ్రి. భాస్కరుని మూడవ కొడుకు సిద్ధనమంత్రి ప్రఖ్యాతుడయినాడు. ఇతడు చోడతిక్కరాజుకు మంత్రి. అందులోనూ ఆప్త మంత్రి.

''స్థాపిత సూర్యవంశ వసుధాపతినా బరతత్వధూత వా
ణీపతినా నుదాత్తనృపనీతి బృహస్పతి నా గృహస్థగౌ
రీపతినా గృపారససరిత్పతినా బొగడొందె సిద్ధ సే
నాపతిప్రోడతిక్క జననాథశిఖామణి కాప్తమంత్రియై''[39]

35. భారతం. విరాట. 1-10 36. దశకు. 1-20 37. నిర్వచన. 1-35
38. ఈ ఊహకు కారణాలు ముందుపేజీల్లో వివరిస్తాను. 39. దశకు. 1-62.

అని ఇతడు వాసికెక్కాడు. ఈ సిద్ధనమంత్రి కుమారుడే ప్రసిద్ధుడైన ఖడ్గ తిక్కన. సిద్ధన మంత్రికి ఏడుగురు కుమారులు. అందరూ నెల్లూరు చోడుల కొలువులో వున్నవారే. సిద్ధనమంత్రి ఆరవ కొడుకే చినభాస్కరుడు. క్రీ.శ. 1215లో జరిగిన సేవణదండయాత్రను అరికట్టడంలో ప్రముఖపాత్రను వహించిన దండనాథుడు కొందరు కొడుకులూ, మనుమలూ ఇలా నెల్లూరి ఆస్థానంలో ఉండగా, భాస్కరమంత్రి గుంటూరులోనే ఉండి కులక్రమానుగతంగా వచ్చే గుంటూరి విభుత్వం కొనసాగిస్తూ ఉండి ఉండవచ్చు. ఇతని తరవాత ఇతని కడగొట్టు కొడుకు కొమ్మన గుంటూరి నిభుడైనాడు.

పెదతండ్రులూ, పెదతండ్రి కొడుకులూ నెల్లూరులో పెద్దపదవులలో ఉండడంవల్ల తిక్కనగారు చిన్నప్పుడే నెల్లూరికి వచ్చి ఉండవచ్చు. రాజకుమారుడు మనుమసిద్ధితో పాటు పెరిగి అతని కరుణకు పాత్రులయి ఉండవచ్చు. మనుమసిద్ధి తిక్కనగారిని 'మామా' అని పిలిచేవాడు. ఇద్దరూ చిన్నప్పటి నుండి సాయిలా పాయిలాగా తిరగడం వల్ల ఇటువంటి వరుస కలుపుకోవడానికి ఆస్కారం కలిగి ఉంటుంది.

తిక్కనగారు గొప్ప రాజనీతి పారంగతులు. దశకుమార చరిత్రలో కేతన పదకొండుసార్లు తిక్కనగారి నయవిద్యా నైపుణ్యాన్ని కొనియాడాడు. చూడండి :

> సామాద్యుపాయ విదునకు (1-94); నయోద్ధతునకు (1-96); నీతి చాణక్యునకు (1-96) ఇతర సచివదాత్రుండు (2-120); నీతి సంపదా ఖండల పూజ్య (3-163); భాసురనయ శిక్షా (4-1); నీతి నిపుణమతిజిత పురుహూతామాత్యునకు (4-129); రాజనయ విధా ప్రయోజన విశారద (8-94); మతి విజిత సురేజ్యా (8-96); అరిసచివ మహోపాయాప హారుండు (9-86); నరపతినయ విద్యానైపుణ్యా ప్రౌఢభావా! (11-144).

రాజకుమారునితో కలిసి చదువకోబట్టే తిక్కనగారు నయశిక్షలో భాసురులయి నారని ఊహించవచ్చు. తిక్కనగారు మనుమసిద్ధిని 'వివిధ విద్యా పరిశ్రమవేది' అన్నారు. తమతోపాటు చదువుకొంటే అతని వివిధ విద్యలలో పరిశ్రమను గుర్తించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. మనుమసిద్ధి శత్రువులను తిక్కనగారు ఇలా వర్ణించారు:

> ''దండప్రణామంబు దగ నభ్యసించిరో నెరి బోరగిలిబడ నేర్చునాడ
> వ్రేళ్ళులు గరవంగ వెరవల్వరించిరో నోర జేతులు గ్రుక్కి నొల్లునాడ
> కడు సంకటంపు బేరడవులు దూరంగ దరమునేసిరొ యిల దడవునాడ
> పలుదెస విరిగిపో బరువుసాధించిరో క్రీడలుగా బారి యాడునాడ
> బాలశిక్షలుగా కొండు భంగి నింత-యచ్చుపడియుండు నే వీరికనగ నిన్ని
> తెరగులకు నేర్పు గలిగి వర్తింతు రాజి - మనుమనృపుదాకిపోయిన
> మనుజ పతులు.'' (నిర్వచన. 1-40)

తనతోపాటు తన కృతిపతి అభ్యసించిన బాలశిక్షలకూ, వీటికీ భేదం ఉందనే అవ్యక్తచైతన్య స్రవంతిలోని భావాలవల్ల ఈ పద్య రచన జరిగిఉంటుంది. చిన్నప్పట్నుంచీ

నెల్లూరిలోనే ఉండి చదువుకొని తిక్కనగారు అక్కడే స్థిరపడిపోయి ఉంటారు. గుంటూరి విభుత్వంకన్నా పెద్ద పదవి వారికి లభించింది. విక్రమ సింహపురమైన నెల్లూరు తిక్కనగారికి నిజస్థానమైంది.

గుంటూరి విభులైన కొట్టరువువారికి, నెల్లూరికీ ఎలా సంబంధం వచ్చిందని ఇతరులు రకరకాలుగా ఊహిస్తున్నారు. కీ.శే. వేదం వెంకటరాయశాస్త్రిగారు ఇలా చెప్పారు: ''తిక్కన వంశమువారు తొలుత కృష్ణాతీరదేశమునందలి వెలటూరను గ్రామమున నుండినవారనియు, బిదప నుద్యోగధర్మముచేత గుంటూరికి బోయి చేరిరనియు, దరువాత గొండొక కాలమునకు దిక్కన సోమయాజి తండ్రియగు కొమ్మనా మాత్యుడు నెల్లూరు పురంబున ధర్మదారం బాణిగ్రహణంబుసేసి యా బంధుత్వంబున నెల్లూరికి రాకపోకలు సేయుచుండెననియు, నా దంపతుల కుదయించిన తిక్కన మనుమజనపాలు నా స్థానంబున నమాత్యుడును బండితాగ్రగణ్యుడునై ప్రసిద్ధివడసి కొన్నాళ్ళకు జన్న మొనర్చి, అను నీవ్రాత విచారణీయమగుచున్నది''[40]

తిక్కనగారి వంశానికి మూల పురుషుడు మావెన. క్రీ.శ. 1129లో గుంటూరు మండలం సత్తెనపల్లి తాలూకా మావెందల (మాడాల)లో ఉన్న సకలేశ్వరునికి దీపం పెట్టిన మావెన ఒకాయన ఉన్నట్టు శాసనాలవల్ల తెలుస్తున్నది.[41] ఈ మావెన 'సుంకాల బెగ్గడ', అంటే సుంకాలు వసూలు చేసే అధికారి.


తిక్కనగారి వంశం ఏడు పురుషాంతాలు వారి కాలంలోనే వర్ణితమైంది. కేతన దశకుమార చరిత్రలో ఇచ్చిన వివరాలవల్ల ఈ వంశవృక్షాన్ని సులభంగా వ్రాయవచ్చు.

కేతనగారు వర్ణించిన వంశావళివల్ల భాస్కరమంత్రిగారి పెద్ద కొడుకు కేతన ప్రగ్గడయొక్క పుత్రపౌత్రుల పేర్లు కూడ తెలుస్తున్నాయి. ఇప్పుడు మనం చర్చించే కొన్ని విషయాలకు ఆ పేర్లన్నీ అనవసరమని మనం వ్రాసుకొన్న వంశవృక్షంలో వాటిని చేర్చలేదు. మనకు కావలసింది - ఖడ్గతిక్కన తమ్ముళ్లెవరు, అతనికెంతమంది కొడుకులు అన్నది.

40. ఇది తాము సంకలితం చేసిన నిర్వచనోత్తర రామాయణం ఉపోద్ఘాతంలో తాము వ్రాసినట్టు కీ.శే. వెంకటరాయశాస్త్రిగారు 'తిక్కన సోమయాజ విజయం'లో వ్రాశారు. పుట. 4

41. 'A.R. నెంబరు 290. 1932-33' అని చాగంటి శేషయ్యగారు, ఆంధ్ర కవి తరంగిణి - రెండవ సంపుటం (ద్వితీయ ముద్రణ) పుట. 152

తిక్కనగారి వంశవృక్షం



ఈ వంశ వృక్షంలో 14వ నెంబరు వ్యక్తి చిన భాస్కరుడు. క్రీ.శ. 1215లో జరిగిన సేవణ దండయాత్రను అరికట్టడానికి పాటుపడ్డాడు. అప్పటికి అతడు పైలాపచ్చీసులో ఉన్నాడనుకొంటే అతని జననకాలం క్రీ.శ. 1195 అవుతుంది. ప్రతి అన్నకూ, తమ్మునికీ మధ్య ఏడాదే ఎడముంది అనుకొంటే ఖడ్గతిక్కన జననకాలం క్రీ.శ. 1190 అవుతుంది.

సేవణ దండయాత్రలో పాల్గొన్నది చిన భాస్కరుడు (14వ నెంబరు వ్యక్తి) కాడు. అతని చిన్నన్న ద్వితీయ భాస్కరుడు (10వ నెంబరు వ్యక్తి) అని మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు గుర్తించారు.[42] అన్నదమ్ముల మధ్య ఎడం మనం అట్టే లెక్కించలేదు కాబట్టి కొంచెం ఐదేళ్ళ కుడి ఎడమలలో ఈ కాలాలు సరిపోతాయి.

క్రీ.శ. 1190లో పుట్టిన ఖడ్గతిక్కన తన 70వ ఏడుదాకా - అంటే 1260 దాకా మనుమసిద్ధి కొలువులో దండనాథుడుగా ఉన్నాడని చెప్పుకొందుకే ఈ చర్చ. ఖడ్గతిక్కనా, మనుమసిద్ధీ 1260లో కాటమరాజుతో వచ్చిన పుల్లరి తగువులో, యుద్ధంలో మరణించారని మన చరిత్రకారులంతా ముక్తకంఠంతో చెప్తున్నారు. కాటమరాజు చరిత్రమీద ప్రత్యేక పరిశోధనలు చేశాక ఇందులో అట్టే చారిత్రక సత్యం లేదనిపిస్తున్నది. ఎదిగివచ్చిన కొడుకులు ఇందరు ఉండగా డెబ్బయిఏళ్ళ వయసులో ఉన్న ఖడ్గతిక్కన యుద్ధానికి వెళ్ళడంగాని, తొంభై సంవత్సరాలైనా ఉండే అతని తల్లి విరిగిన పాలు పోయడంగాని జరగవేమో!

ప్రస్తుతానికి మనకు కావలసినది తిక్కనగారి వంశంలో అందరూ నెల్లూరు చోడుల కొలువులోని వాళ్ళేఅన్న సంగతే. మొదటి తిక్కరాజుకు మంత్రిగా ఉండిన సిద్ధనగారు సూర్యవంశాన్ని మళ్ళా స్థాపించారు. అలాగే తిక్కనగారు మనుమసిద్ధిని గద్దెపై ఎక్కించారు. దీనిని ఆనాటి రాజకీయ చరిత్ర తెలియజేస్తుంది.

రాజకీయ చరిత్ర

మొదటి తిక్కరాజు నెల్లూరు రాజ్యాన్ని సుదీర్ఘకాలం పరిపాలించాడు. అతని కుమారుడు మనుమసిద్ధేకాక అల్లుడు తిక్కరాజు కూడ రాజ్యంలో ప్రముఖులు. మామగారి చివరిరోజులలో అల్లుందిక్కరాజు దానధర్మాలు చేసిన శాసనాలు క్రీ.శ. 1244-45లో, 1245-46లో కనబడుతున్నాయి. అయితే క్రీ.శ. 1246-47లో అల్లుం దిక్కరాజు తాను కాంచీపురవరాధీశ్వరుడనని ప్రకటించుకొన్నాడు. ఈ అల్లుం దిక్కరాజు తమ్ముడు విజయాదిత్యుడు. ఈ విజయాదిత్యుడే మనుమసిద్ధి రాజప్రతినిధిగా ఏలుతున్న రాపూరు ప్రాంతాలను క్రీ.శ. 1247-48లో తన స్వాధీనంలోకి తీసుకొన్నాడు. మొదటి తిక్కరాజు క్రీ.శ. 1246-47లో చాలా అస్వస్థుడై ఉంటాడు. ఇతడు జబ్బుపడగానే కుమారుడైన మనుమసిద్ధిని తోసిరాజని అల్లుం దిక్కరాజు తను రాజై నెల్లూరును ఆక్రమించుకొని ఉంటాడు. తన తమ్ముడు విజయాదిత్యునిచేత మనుమసిద్ధిని రాపూరు

---

42. కాటమరాజుకథ (మద్రాసు గవర్నమెంట్ ఓరియంటల్ సీరీస్) ద్విపద కావ్యం. పీఠిక. పుటలు 25, 26.

ప్రాంతాల నుంచి తరిమించి ఉంటాడు. అప్పటికి ఇంకా చోడతిక్కరాజు జీవించే ఉంటాడు. షాజహానులాగా బలవంతులైన బంధువుల చేతిలో బందీగా వున్నా ఉండి ఉంటాడు.

క్రీ.శ. 1249లో మనుమసిద్ధి కడపలో ఉన్నాడు. తన తండ్రి రోగం నుండి విముక్తుడైనందుకు దానం చేసినట్టు ఒక శాసనం చెప్తున్నది.[43] ఆ రాజు చివరి దినాలలో వ్యాధిగ్రస్తుడైనాడని తెలియడంవల్ల ఏదో అంతఃపుర విప్లవం జరిగి ఉంటుందని వేదం వెంకటరాయశాస్త్రిగారు భావిస్తున్నారు. క్రీ.శ. 1249లోనే మొదటి తిక్కరాజు మరణించాడేమో! అల్లుందిక్కరాజు, అతని తమ్ముడు అధికారాన్ని కైవసం చేసుకొన్నారు. మనుమసిద్ధి అడవులు పట్టాడు. కాని అట్టేకాలం క్లిష్టపరిస్థితులలో ఉండలేదు. ఆ సంవత్సరమే కాకతీయ గణపతిదేవుడు మనుమసిద్ధికి సహాయంగా సేనలు పంపించాడు. కాకతీయ సేనాధిపతి సామంతభోజుడు కంచిదాకా వచ్చాడు.

గణపతిదేవ చక్రవర్తి మనుమసిద్ధికి తోడ్పడడం తిక్కనగారి అభ్యర్థన వల్లనే జరిగింది, సిద్ధేశ్వర చరిత్ర అనే ద్విపద కావ్యంలో తిక్కనగారు ఓరుగల్లుకు వెళ్ళడం, అక్కడ సభలో ఇతర మతాలవాళ్ళను ఓడించడం, గణపతిదేవ చక్రవర్తికి భారతం చదివి చెప్పడం, అతణ్ణి మెప్పించి అతని సహాయాన్ని పొందడం కవి విపులంగా వర్ణించాడు. చూడండి.

గణపతిదేవుణ్ణి చూడడానికి తిక్కనగారు వెళ్ళారు. ఒక్కొక్క పండితులూ వక్కలాకులు తీసుకొని చక్కని తాంబూలసమితులు పట్టుకొని ఒక్కపెట్టున ఎదురు వెళ్ళారు. దిక్కుదిక్కుల నుండి వెడలి విద్యార్థులు అక్కడక్కడ కావ్య శ్లోకార్థాలు చదువుతూ ఉంటే ఒక్కొక్కవిధంగా వినిపిస్తూంటే చక్కన వింటూ మిక్కిలి అందలాలు ఎక్కి తిక్కన సోమయాజిగారు ఓరుగల్లు ప్రవేశించారు.

పణిహారులవల్ల తిక్కనగారి రాక విని గణపతి మహారాజు ఎదురు వెళ్ళాడు. శంఖాలు, పటహాలు, కాహళులు మొదలైన వాద్యఘోషలు చెలరేగుతూ ఉండగా భారత శాస్త్ర ప్రవీణాగ్రగణ్యుణ్ణి, వేదశాస్త్రాభ్యాసవిదుణ్ణి, చాలా విద్యావిద్యజాలాలన్నింటినీ పాలూ నీరులాగ వేరుపరచగల హంసవంటివాణ్ణి ఆ మహాత్ముణ్ణి ఆ మహారాజు ఎట్టన ఎదురేగి నేర్పుగా తీసుకువచ్చి అర్ధాసనస్థితునిగా జేసి, మెచ్చి, తాంబూలాదులు హెచ్చుగా ఇచ్చి, నవ్యసుగంధమాల్యానుయుక్తునిగా, దివ్యవస్త్రచ్ఛన్నభవ్యునిగా చేసి పూజించి ఆయన చెప్పిన శాస్త్రార్థాలు విన్నాడు. తిక్కన సోమయాజులు అక్కజంగా ద్వైతం, అద్వైతం, ఉత్తమజీవనం, దైవమతి, చిద్వివేకం గల ధర్మమర్మాలైన రాజనీతులు, పురాతన కథలయిన భారతాఖ్యానం, ఆ వీరనరులు తగినవిధంగా చేసిన యుద్ధప్రకార పర్వాలు కళ్ళకు కట్టినట్లు వర్ణించి దినదినమూ చెప్తే విని గణపతిదేవ మహారాజు సంతోషించాడు.

43. ఇది V.R.I. నెం. 812 అని వేదం వేంకటరాయశాస్త్రిగారు డిసెంబరు 1964 భారతిలో పేర్కొన్నారు.

అనుమకొండలో అప్పుడు బౌద్ధమతం వుండేది. బౌద్ధులు తమ మత ప్రావీణ్యా శాస్త్ర వృద్ధులట. వాదసమృద్ధులట, వేదవిరుద్ధులట. జైనబౌద్ధులతో వాదం పెట్టించాలని మహారాజు వాళ్ళను పిలిపించాడు. తిక్కనగారు వాళ్ళను శాస్త్రార్థపోడిమిగా, వాదమితో, ఇతిహాసవరశాస్త్రవేద సారముఖస్థ సిద్ధాంతప్రయుక్తిని ఓడించి, బౌద్ధజైనుల వసతులన్నీ కూలద్రోయించి, ఆ దైవాల పేర్లు మునుముట్ట అణచి, ఆ మతాల నామ మడచిపెట్టి వాళ్ళను సీమనుంచి దోమలలాగ తోలి వెళ్ళగొట్టించారు. ముప్ఫయిఆరు ఘునిజైన వసతులు కూలద్రోయించి అందరు జైనులను నరికించి చంపి చెండాడి సోమయాజులవారు సురుచిరోద్దండ భీమపరాక్రమ బిరుదులతో ఒప్పారినారట.


గణపతిదేవ చక్రవర్తి తిక్కన సోమయాజిగారిని మెచ్చుకొని, వింతవస్త్రాలు, వివిధ భూషణాలూ అతిప్రీతితో ఇచ్చాడు. సత్యసంధుడు, సభ్యవర్తనుడు అయిన తిక్కన సోమయాజులు రాజుతో ఇలా అన్నారు: ''తగు మాట ఒకటి విను. ఇది ధర్మకార్యం. సూర్యవంశంలో సొబగొందుచున్నట్టి ఆర్య పూజితవర్యుడు ఆ మనుమసిద్ధిరాజు నెల్లూరును తాను రమణీయంగా ఏలుతూ ఉంటే అక్కన బయ్యనలు అధిక బలిష్ఠులు అక్కడ సిద్ధిరాజును పారదోలి రాజ్యం చిక్కించుకొన్నారు. వాళ్ళు ఒక్క కాసుకూడ మనుమసిద్ధికి ఇవ్వరు. వాళ్ళను దండించి వారి నెల్లూరును వారికి అవారిత ప్రీతితో ఇప్పించు.'' గణపతిదేవ మహారాజు 'అలాగే కానియ్యండి' అని సవాలక్ష సద్రవ్యహేమ నిష్కాలు వెచ్చించి నెరమించు యజ్ఞశుష్కము పుటములు సొబగొంధిమించే యజ్ఞ కుండలాలు ఆయనకు అర్పిస్తే తిగ్మాంశు తేజంతో తేజరిల్లుతూ గణపతిదేవుని అనుజ్ఞ తీసుకొని సోమయాజిగారు వెళ్ళిపోయారు.[44]

తిక్కనగారు ఓరుగల్లు నగరానికి వెళ్ళి గణపతిదేవ చక్రవర్తి సహాయాన్ని అర్థించినట్టు సాహిత్యా గ్రంథాల సాక్ష్యంవల్ల తెలుస్తూవుంటే గణపతిదేవుడు స్వయంగా తిక్కన బయ్యనలను జయించినట్లు శాసన ప్రమాణం వుంది. ''మహామండలేశ్వరులైన కాకతి గణపతిదేవ మహారాజులు దిగ్విజయము చేసి పరమండలములు సాధించి దక్షిణదిగ్భాగమున నెల్లూరు గాల్చి తద్విరోధులైన పడిహారి బయ్యన తిక్కనల వెరసిన శాత్రవశిరంబులు కందుక క్రీడా వినోదము సలిపి ద్రవిడ మండలమున కులోత్తుంగ రాజేంద్రచ చోడనిచ్చికొని నెల్లూరి రాజుచేత ఏనుంగులంగానికగొనివచ్చి...'' అని ఒక శాసనం చెప్తున్నది.[45] ఈ శాసనం ఎప్పటిదో తారీఖు తెలియదు. అయినా కాకతి గణపతిదేవుడు క్రీ.శ. 1249లో దక్షిణ దిగ్విజయం చేశాడు కనుక ఇది అప్పటిదే అని చెప్పవచ్చు.

44. సిద్దేశ్వర చరిత్ర. కాసెసర్వప్ప ప్రణీతం. పుట 114 నుంచి 117 దాకా ఉన్న ద్విపదపాదాలకు ఇది వ్యావహారిక వచనరూపం.

45. 1945 ఫిబ్రవరి నెల భారతిలో నేలటూరు వెంకటరమణయ్యగారు ఉదాహరించారు.

శాసనంలోని తిక్కన బయ్యనలే సిద్దేశ్వర చరిత్రలో చెప్పిన అక్కన్న బయ్యన్నలు. వీళ్ళు మనుమసిద్ధి బావమరదులు అని వేదం వెంకటరాయశాస్త్రిగారు భావిస్తే 'సోదరులే' అని దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డిగారు భావిస్తున్నారు.[46] నెల్లూరు చోడవంశాన్ని చూడండి



ఈ వంశవృక్షం వల్ల తిక్కరాజనే అన్నయ్య, చినతాతగారి వంశంలోని విజయాదిత్యుడనే జ్ఞాతి మనుమసిద్ధికి ఉన్నాడని తెలుతున్నది. జ్ఞాతి సంగతి దేవుడెరుగునుగాని మనుమసిద్ధికి ఒక అన్న వున్నాడా? దశకుమార చరిత్రలో కేతనగాని, నిర్వచనోత్తర రామాయణంలో తిక్కనగారు గాని చెప్పలేదు. తిక్కనగారి వంశంలో ఖడ్గతిక్కన కొడుకులను సైతం వర్ణించిన కేతన మనుమసిద్ధి సోదరులను వర్ణించక పోవడానికి ఏవైనా రాజకీయ కారణాలు ఉంటాయి:

నిర్వచనోత్తర రామాయణంలోనూ, దశకుమార చరిత్రలోనూ ఉన్న వర్ణనలు చూస్తే మనుమసిద్ధి రాజ్యం చేస్తున్నప్పుడే ఆ కావ్యాలను వ్రాసినట్టు కనబడుతుంది. వీటిని ఈ ఇద్దరు క్రీ.శ. 1249 తరువాతనే వ్రాయడానికి ఆస్కారం ఉంది. క్రీ.శ. 1249 దాకా మొదటి తిక్కరాజు సజీవుడని ఒక శాసనం చెప్తున్నది. తండ్రి జీవితకాలంలోనే తిక్కన స్వతంత్రంగా రాజ్యం చేసినట్టు చారిత్రక సాక్ష్యాలు లేవు. గణపతిదేవుని దండయాత్ర క్రీ.శ. 1253లో జరిగిందనీ, ఈ దండయాత్ర పూర్తిఅయిన పిదపనే తిక్కనగారు

46. భారతి - 1965 మార్చి. 'నెల్లూరు చోడవంశం' అనే వ్యాసంలో.

నిర్వచనోత్తర రామాయణాన్ని రచించి ఉంటారనీ చాగంటి శేషయ్యగారు అభిప్రాయపడుతున్నారు.[47] ఇది వాస్తవం కావచ్చు.

క్రీ.శ. 1249లో కాకతీయ సేనలు దక్షిణాదికి వచ్చి జయించినా, మళ్ళా క్రీ.శ. 1250లో జటావర్మ సుందరపాండ్యుడు మనుమసిద్ధిని పారదోలినట్లు ఒక శాసనం ఉంది. క్రీ.శ. 1253లోగాని మనుమసిద్ధి స్థిరపడిఉండడు. అదీకాక తిక్కనగారు నిర్వచనోత్తర రామాయణంలో మనుమసిద్ధిని ఇలా వర్ణించారు:

''ద్రవిడోర్వీపతిగర్వముం దునిమి శౌర్యంబొప్ప గర్ణాట ద
ర్పవిఘాతంబు నొనర్చి వైరిమనుజేంద్ర శ్రేణికిఁ గొంగనా
నవనింబేర్కొనియున్నయట్టి విజయక్ష్మాధీశ్వరుంగాసిగా
నెనిచెంజోళనమన్మసిద్ధియని ప్రాయేటఁ బ్రగాఢోద్ధతిఁ.'' (నిర్వచన. 1-39)

ఇందులోని ద్రవిడోర్వీపతి జటావర్మ సుందరపాండ్యుడు, విజయలక్ష్మాధీశ్వరుడు మనుమసిద్ధియొక్క చినతాతగారి వంశంలోనివాడు అయి ఉంటారు. వైరి మనుజేంద్ర శ్రేణిలో సోదరతిక్కరాజు ఉండి ఉండవచ్చు.

ఏది ఏమైనా తిక్కనగారిని మనుమసిద్ధి 'మామా!' అని వరసపెట్టి పిలుస్తున్నందుకు తిక్కనగారు అల్లుని ఇల్లు నిలబెట్టారు. పోయినరాజ్యం సంపాదించి పెట్టారు. ఉన్న దాయాదులను రూపుమాపారు. బహుశా ఈ దాయాదుల కలహం భారతంలోని జ్ఞాతుల కలహం లాంటిది కావచ్చు. ఇటీవలి చరిత్రలో విజయనగరం వారసత్వం కేసులో మహాకవి గురజాడ తలమునకలుగా మునిగిపోయినట్టు తిక్కనగారు ఆదిలో నెల్లూరు చోడుల అంతఃకలహంలో పూర్తిగా పాల్గొని ఉంటారు. ఈ యుద్ధాలకు ముందు రాయబారాలలో, సంధిబేరాలలో, సహాయ సంపత్తులు సేకరించడంలో 'ఉద్యోగ పర్వం' అనుభవానికి వచ్చి ఉంటుంది. 'యుద్ధపంచకం' కళ్ళకుకట్టి ఉంటుంది. నిజజీవితంలో భారత కథను చూచిన తిక్కనగారు నన్నయగారు వదలిపెట్టిన మహాకార్యాన్ని తుదముట్టా పూర్తిచేయాలని సంకల్పించుకొని ఉంటారు.

క్రీ.శ. 1253 తరువాత నిర్వచనోత్తర రామాయణ రచన పూర్తి అయ్యాక యజ్ఞం చేసి ఆ పిమ్మట భారత రచన చేసి ఉంటారు. నిర్వచనోత్తర రామాయణం రచించిన కాలానికి వారు సోమయాజులు కారు. ఆ పుస్తకం గద్యలో ''ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విధేయ తిక్కన నామధేయ ప్రణీతం...'' అనే ఉంది. భారతంలో ''ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతం'' అని ఉంది. నిర్వచనోత్తర రామాయణ రచనాకాలానికి ముందే యజ్ఞం చేసి ఉంటే ఆ సంగతి గద్యలో భారతంలో మోస్తరుగానే చెప్పుకొనేవారు. అయితే

47. ఆంధ్రకవితరంగిణి - రెండవ సంపుటం (ద్వితీయ ముద్రణ) పుటలు 252, 253.

48. నెల్లూరు శాసనాలు - రెండవ భాగం. నెం. 16, పుట 830.

దశకుమార చరిత్రను కేతన అంకితమిచ్చిన నాటికి తిక్కనగారు వివిధ యజ్ఞాలు చేసినవారే. కేతన ఏమి చెప్పాడో చూద్దాం.

అధ్వరాబ్జదిననాథునకుఁ (1-94)

చతురానన సన్నిభునకు
సతత స్వాహాస్వధేతి శబ్దద్వయ సం
స్కృత హవ్య కవ్యసంత
ర్పితమఖశిఖిముఖనిలింప పితృవర్గునకుఁ (1-95)

ఆగమప్రథితకర్మ ప్రస్ఫురమూర్తికిఁ (1-100)

ఉదాత్త శ్రౌతస్మార్త కర్మతత్పరమతికిఁ (2-1)

వేదోదితకర్మవ్రత (3-164)

యాగవిద్యాభిరామా (3-165)
సతతాధ్వరక్రియాకర్మఠపాణిపద్మునకు (5-134)
మఖసంతోషితమరుత్సమాజునకు (5-135)
యాజకమండలోత్తమా! (8-94)
యాగాహరణ నిపుణచిత్తుండు (9-86)
ఆగమగోష్ఠీఘటన ప్రదేశము (10-192)

ఇలాగ కేతన పదకొండుసార్లు తిక్కనగారిని యజ్ఞయాగాదులు చేసేవారినిగా వర్ణించాడు. అప్పటికి ఆయన సోమయాగం తప్ప అన్నీ చేసేశారేమో! దానినికూడ చేస్తే ఎక్కడేనా 'సోమయాజి' అని కేతన పేర్కొనేవాడే.

యజ్ఞయాగాదులంటే తిక్కనగారికి చాలా యిష్టం అన్న సంగతి వారి రచనలలో కూడ ప్రతిఫలిస్తున్నది. రావణాసురుడు చెరపట్టిన స్త్రీలను ఎలా వర్ణించారో చూడండి.

''ఉడుగకకాల్చుచు నుండెడు శోకంబ యతితీవ్రహవ్యవాహనుడుగాగ
నిట్టూర్పుగాడ్పులు నిగిడించుటయ విలసిల్ల బ్రజ్వలితంబ సేతగాగ
బాయక యొనరించు బహువిలాపంబుల రాజితమంత్రాక్షరములుగాగ
గన్నీరుబోరన గ్రమ్మించుటల పొరిబొరి నాజ్యధారల పోతగాగ
గొలదికగ్గలమై యెదగలుగువగల - యొనరు సమిధలు గా నిట్టులువిదపిండు
రావణాభిచారంబుగ భావమందు-నుగ్రముగ వేల్పు తెరగుననుండెజూడ.''

(నిర్వచన. 5-112)

మారణహోమం చేస్తున్న ఈ ఉవిదపిండు మొదట రావణాసురునికి ఎలా పట్టుబడిందో వేటకాడికి చిక్కిన పశుపక్ష్యాదుల ఉపమానాలతో చెప్పారు చూడండి.

''తట్టికివచ్చి యిట్టట్టు వోనేరని లేళ్ళవిధంబున లీలయెడలి
వలజిక్కియెక్కడ మెలగంగనేరని చిలుకలచాడ్పున జెన్నుదరిగి
మాపున జొరబడి యావలజనలేని మీలచందంబున జాలగుంది
యురులలోఁబడి యెందునరుగంగజాలని నెమిళుల తెరగున గొమరుదక్కి
కలయ జూచుచు బలుకంగ నెలుగురాక - నలగుమేనులతో నెరిదలలు వీడి
వెగడుపడి వెల్లనై కడువిన్నబోయి-పుష్పకంబుననున్న యప్పొలతులెల్ల.''
(నిర్వచన.5-10)

ఈ పద్యంలో ఒక చక్కని శిల్పం వుంది. సీసపద్యం నాలుగు పాదాలలోనూ వరుసగా లేళ్ళనూ, చిలుకలనూ, చేపలనూ, నెమిళ్ళనూ చెప్పారు. తేటగీతిలో చూచుచు, పలుకంగ, ఎలుగురాక, నలగుమేనులతో, నెరితలలు వీడి అనే క్రియలను వాడారు. ఆడవాళ్ళ కళ్ళు లేడికళ్ళు. పలుకులు చిలుకపలుకులు. మేనికాంతి బేడిసలలాగ మిలమిల లాడుతుంది. శిఖలు నెమలిపింఛాలు. ఎటూ పోలేని లేళ్ళలాగా, బెదురుచూపులు చూస్తూ వలలో చిక్కిన చిలుకలలాగా నోట మాటరాక, చేపలలాగ తప్పించుకోలేని మేనులతో, పింఛాలు వాలిన నెమళ్ళలాగ ఆ జవరాళ్ళు వున్నారనడంలో మంచి కల్పన వుంది. కవి సమయానికి కట్టుబడుతూ సందర్భోచితంగా వర్ణించడం జరిగింది.

ఒక్కమాటలో పాత్రల స్వభావాన్ని చెప్పడంలో తిక్కనగారు సిద్ధహస్తులు. ''ఈ తరుణులందర్నీ ఎందుకిలా చెరబట్టావు'' అని విభీషణుడు అడిగితే ''శౌర్యవంతులు పగరవారి జెరలపట్టక ముద్దాడివత్తురయ్య'' అని రావణుడు కచ్చితంగా చెప్పాడు. (నిర్వచన. 6-5)

వాస్తవానికి నిర్వచనోత్తర రామాయణంలో పదికి ఏడింతలు రావణ కథేగాని రామచరిత లేదు. ఈ రావణ చరిత్రకు రాముడు కేవలం శ్రోత. ఈ కావ్యంలో పది ఆశ్వాసాలు వున్నాయి. ఎనిమిదివ ఆశ్వాసం నుంచి రామకథ మొదలవుతుంది. నన్నెచోడుని కుమారసంభవం చదివిన ప్రభావం వల్ల ఇందులో తిక్కనగారు కూడా సీతారాముల ఉద్యాన విహారం, సీతారాముల జలవిహారం, సీతారాముల లీలావిహారం మొదలైనవి 64 పద్యాలలో వర్ణించారు.

''మూలములో పది పద్యములలో ముగిసిన ఈ దంపతుల స్వచ్ఛంద విహారాలను తిక్కన అరవై పెద్ద పద్యాలలో వింతవింతగా విరివిగా వర్ణించినాడు. (నిర్వచన. 8:20.80) ముందు ఆమె పడబోయే మహాయాతనను కవి భావనచేయ గలుగుట కిది పాథేయంగా భావించినాడేమో! వాల్మీకి ఈ సందర్భంలో సీతారాములచే మైరేయమాంససేవ చేయించినాడు. (రా.ఉ.42-18) కాని తిక్కన దానిమాట చల్లగా జార్చినాడు. అసలు సీతారాములేమిచేసినా చేయకపోయినా తిక్కన బ్రాహ్మణ దృష్టిలో ఆ రెంటికీ చోటు లేదాయెనేమో! అప్పటికింకా ఆయన సోమయాజియేనా కాలేదుగా?'' అని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వ్యాఖ్యా చేశారు.[49] మూలంలో పదిపద్యాల విహారం ఇందులో

---

49. సారస్వతావలోకము. 'తిక్కన తీర్చిన సీతమ్మ.' పుట. 156

చిన్నా పెద్దా 64 పద్యాలు కావడం తిక్కనగారి రసదృష్టి, నన్నెచోడుని ప్రభావం అని చెప్పాలి. పార్వతి చెలికత్తెలు కుమారసంభవంలో జలక్రీడ చేసినట్లే ఇక్కడ సీతమ్మ చెలికత్తెలు కూడ చేస్తారు.

'నును గాంతిదొలకెడు ఘనకుచ యుగళంబులదరంగ జిలుకుల నాడియాడి
మెరుగులుదూగెడు మృదుకరవల్లిక లల్లాడ జల్లుపోరాడి యాడి
జిగితొలంకెసగెడు మొగములు నిక్కుచు నడగుచుండగ నీదులాడియాడి
మించెల్ల దిక్కులు ముంచిచల్లెడు మేను లలసిక్రాలగ నోలలాడియాడి
యొలినిలుచుచు గరళుల దేలిచనుచు - మునిగిపోవుచు నోర్తోర్తు ముంచిపట్టి
లోతునకు నొయ్యదిగుచుచు నీతలేని - యచటమిన్నకయీదుచునాడిరర్థి.''
(నిర్వచన.8-49)

కుమార సంభవంలో 13 పద్యాల జలక్రీడ వర్ణన ఉంటే ఇందులో 23 పద్యాలు ఉన్నాయి. వీటిలో కొన్ని మరీ మనోహరంగా ఉంటాయి, చూడండి.

''అందరకుమున్న సలిలవిహారమునకు
గడగి యొక్కర్తు గ్రక్కున దొడవలూడ్చి
నెలతుకల మొత్తమను పచ్చవిలుతుననుగు
టంపపొదిలోని బరిగోలయట్టులుండె.'' (నిర్వచన. 8-46)

జలవిహారం చేశాక వనితలకు పెదవులు ఎర్రబడ్డాయి; కురులు నల్లబడ్డాయి; దంతాలు తెలుపెక్కాయి. నిర్మల మధుర స్వభావుల పొందువల్ల వారి వారి స్వభావాలు ఇనుమడిస్తాయని ఒక కల్పన చేశారు. చూడండి:

''వెలదికి మోవికెంపు నెరివేనలికప్పును దంతపం క్తినుం
దెలుపును బేర్చి యొప్పెసగె నీళులపొందుననట్ల యెవ్వరిం
గలసిన వారి వారి దెసగల్గు గుణం బనుకూలవృత్తి ని
ర్మల మధురస్వభావులు సమగ్రవిలాసము వొందజేయరే?'' (నిర్వచన. 8-61)

సీతారాముల వనవిహారంలో ఆ దంపతుల శృంగార విలాసాన్ని బొమ్మ కట్టించినట్టు తిక్కనగారు వర్ణించాడు. అందని పువ్వులు సీతచేత రాముడు కోయించాడు. చూడండి:

''అల్లవె లెస్స పువ్వులని యందని గుత్తుల దిక్కుసూపి తా
నల్లనచేరి నేను నెగయన్నిను నెత్తెద గోయుమంచు భూ
వల్లభు డాదటం బొదివి వామవిలోచన నెత్తెదత్తనూ
వల్లికతోన మైబులకవర్గము కాముడు నారు పోయగన్.'' (నిర్వచన. 8-31)

వనవిహారం పూర్తి అయేసరికి సీతారాములు ఇరువురును ''సౌఖ్య రసముల గరువుగట్టి పోసిచేసిన రూపుల పోల్కు''లైరి. (8-80)

ఇంత అన్యోన్యంగా ఉన్న సీతను రాముడు లోకానికి వెరచి, నోళ్లలు మూయలేక 'సడికంటే చావుమే'లనే సామెత తలచి విడిచిపెట్టడానికి నిశ్చయించాడు. వాల్మీకి ఆశ్రమంవద్ద వదలిపెట్టమని లక్ష్మణునికి చెప్పాడు. తానే వెళ్ళి సీతతో 'తపోభూములకు వెళ్ళాలని ముచ్చటపడ్డావుగా, లక్ష్మణదేవుడు నిన్ను తీసుకువెళతా'డని చెప్పి పంపించాడు. సీత పొంగిపోయి వెళ్ళింది. అడవిలో లక్ష్మణుడు చెప్పలేక చెప్పలేక చెప్పాడు. ఆమె కీలు ఎడపిన జంత్రముక్రియ నేలపయి పడిపోయింది. అప్పుడామె చేష్టలను కవిబ్రహ్మ తప్ప వర్ణించలేడన్నంత గొప్పగా - వివరాలతో తిక్కనగారు యిలా వర్ణించారు.

పడి మూర్ఛిల్లి మఱుడనొక - వడికిం దెలివొంది బాష్పవార్రి గనుగవం
గడలుకొనుచుండ వాతెర - దడుపుచు వెలవెల్లనగుచు దల్లడపడుచుఙ్.

(9-18)

పలుకుడిగి పెద్ద ప్రా-ద్ధాకులదృష్టి మరందిజూచు గొండొకనవ్వుం
దలయూచు ముక్కుపైనం -గుళమిడు వెరగందు వగలకుంగొలువిచ్చుఙ్.

(9-19)

సందియంబువడ విచారంబునకుజొర - మారువలుక నొండు మాడ్కి సేయ
వెరవుగాక పిడుగు వ్రేసినయట్లైన - మాటకియ్యకొనుచు బోటిపలుకు

(9-20)

సీతమ్మ లక్ష్మణునితో చెప్పిన ప్రతిమాటా కన్నీళ్ళలో ముంచినా మండే నిప్పుకణం, నోటివెంట ఎంతసేపటికీ మాటరాక పెదవులు తడుపుకొని ఎట్టకేలకు ఆమె అన్న మొట్టమొదటి మాటలు ''అగుగాక. యిట్లు చేసెద. రాముడిని నేను అనేది ఏముంటుంది!'' అంటూ ఇలా చెప్పింది :

''అఖిలధర్మస్థితి నపచారియందునే యౌవనంబున దపమాచరించె
గరుణాసముద్రుండు గాడందునే యట్టి యపరాధి గృతకవాయసముగాచె
నాశ్రితరక్షమై నర్థిలేడందునే పగతుతమ్ముని రాజ్యపదవి నిల్పె
బాటించి నన్ను సంభావింపడందునే నాకుగానెన్నొ యత్నములుచేసె
బతిజనించినకోలెన్న బరహితైక-లోలమతి యొడలోసిదిమినబాలువచ్చు
నాత డిది కార్యమని నిశ్చయంబుచేత - నా యభాగ్యంబు యొండొక వేయునేల?

(9-22)

అవును! తన అభాగ్యమే! కష్టాలు అనుభవించడానికే పుట్టిన శరీరం ఇది. పూర్వజన్మలో ఇతరులు తనవల్ల బాధపడ్డారు. ఇప్పుడు ఆ ఫలం అనుభవించకుండా పోతుందా? అని తలచింది. అప్పగింతలు పెట్టసాగింది.

''అతులిత పుణ్యామూర్తులగు నత్తలకెల్లను నేనుభక్తిమ్రొ
క్కితి నెరిగింపు సూర్యకులకేతువు నా విలసిల్లు రాముసం
తతి భరియించి యున్నయది దానికి శోభనమందగచ్చప
స్థితినయినం దలంపు దయసేయుడు మీరనియప్పగింపుమీ!'' (9-25)

పెట్టవలసిన అప్పగింత అయిపోయింది. భర్తకు చెప్పాలి. ఏమి చెపుతుంది?

''జనపతికి నింక నే నే
మనిచెప్పిన నేమియగును, నది గడచనె, నై
నను నూసువోక వెండియు
ననియెద నొకమాట రఘువరానుజ! నీతోఁ.'' (9-26)

తనమదినొక్క యుమ్మలిక దక్కిన మంచిది దానిబాపగా
నని తలపోసి చేయుపని కక్కట యేనును లోనుగానె నా
కునెరుగజెప్పి పొమ్మనుటకుం దగనే మొగమోటలేక మ
న్ననయెడనైన రాజుల మనంబులు ద్రిప్పగ బల్మికల్గునే?'' (9-27)

నాతో చెప్పి పొమ్మనడానికి తగనా అంది. అతడు తన భర్తగా తనను పంపలేదు; జనపతిగా, రాజుగా పంపాడు. కాని, తాను భార్యగా అతని మాటను శిరసా వహించాలి. 'కానిమ్ము' అంది. పూర్వం చేసిన అగ్నిపరీక్షను తలచుకొంది.

''మేనికి నంతవంత బడ మిక్కిలి కారియ బెట్టి నొంపగా
బూనితినోర్చుకున్న నదిపోవునె యట్లు జగంబువారలుఁ
మానములేక యీ తులువమాటల నాదెస నాడ దుస్సహం
బైనది దీని మానుపు నుపాయముచొప్పడ దేమి సేయుదుఁ.'' (9-30)

సీత ఇలా అంటూనే ఉంది. లక్ష్మణుడు మారుమాటాడకుండా ఆమె పాదాలను చూసి మొక్కి ప్రదక్షిణం చేసి వెళ్ళిపోయాడు. ఆమె అడవిలో ఒంటరిగా మిగిలింది. అడవిలో జీవితం ఆమెకు కొత్తకాదు. పూర్వం పధ్నాలుగేళ్ళు గడిపింది. అయితే అప్పటిదారి వేరు. ఇప్పటిదారి వేరు. అదే బాధపడింది.

''మున్నా తెరంగుననున్నట్టి యే నిప్పు డెమ్మెయి వనమున కెట్లుపోదు
నిదియేమి యొంటిమైనే తెంచితనిన నెప్పాట నేమరుమాటవలుకనేర్తు
నెవ్వరితోడ నే నేమని యీ దురవస్థ మాటికి జెప్పి వనరుదాన
బతియిల్లు వాపినకతము నన్నడిగిన నేను దప్పేదిగా నేర్పరింతు
మునిసతీ జనంబు ముందటగొంకక- యెవ్విధమున మెలగి యిచటనిలచి
కాలమెట్టి భంగి గడపుదు నేనని - యడలి యేడ్చుచున్న యవసరమున.''
(9-35)

నిజమే! భర్త యిల్లు వదలిపెట్టిన ఆడదాన్ని అందుకు కారణమడిగితే ఏ తప్పువల్ల ఇలా జరిగిందని చెప్పుకోగలదు? అందుకే ఆమె అడలి ఏడ్చింది.

ఇటువంటి కష్టాల్లో ఉన్న సీతమ్మను వాల్మీకి ఆదుకొన్నాడు. అతని ఆశ్రమ పరిసరాల్లోనే లక్ష్మణుడు ఆమెను వదలిపెట్టాడు. వాల్మీకి ఆదికవి. కవులందరికీ

పూజనీయుడు. ప్రత్యేకంగా ఒక పద్యంలో నుతించకపోయినా తిక్కనగారికి వాల్మీకిమీద ఎనలేని గౌరవముంది. రామాయణం వాల్మీకి ఆశ్రమంలో నిత్యపారాయణం. దానిని ఇలా వర్ణించారు :

''ఆశ్రమము నెల్లయెడలను
విశ్రుత మునిదారకులు ప్రవీణతమై మం
జుశ్రుతిమేళనమానం
దాశ్రులు బులకలును దాల్చునట్లుగ బాడఁగ. (10-42)

అభినవాకృతియగు కృతియగుటజేసి
యాత్మగౌతుక మంతంత కగ్గలింప
నమ్మునీశ్వరు చెప్పిన యాదికావ్య
మయిన రామాయణము చెవులార వినుచు. (10-43)

సరసంబగు రఘుకులపతి
చరితం బొక్కొక్కచో నిజస్వాంతంబుం
గరగింప దన్మయత్వము
బొరయుచు నద్దినము నృపతి పుత్రుడు గడపెఁ.'' (10-44)

తిక్కనగారి వాల్మీకి

ఒక మహాకవి యింకొక మహాకవి పాత్రను తన రచనలో సృష్టించినప్పుడు అతని నోటంట ఏ మాటలు చెప్పిస్తాడో, ఏ భావాలు వివరిస్తాడో, ఏ ఉపదేశం చేయిస్తాడో చూస్తే అది చాలా ఔచిత్యవంతంగా కనబడక మానదు. వాల్మీకి పాత్రను తిక్కనగారు ఎలా చిత్రించారో చూద్దాం.

సీతమ్మ కంటికి, మంటికి ఏకధారగా ఏడుస్తున్నది. అప్పుడు ఆ యేటి ఒడ్డుకు మునిబాలకులు వచ్చారు. ఆ శోకాన్ని విన్నారు. వాళ్ళ గుండెలు కరిగిపోయాయి. ఆశ్రమానికి వెళ్ళారు. వాల్మీకితో చెప్పారు. ''ఏ మహానుభావుని భార్యోగాని నిరుపమానమైన ఉదాత్తమూర్తి శోకిస్తూవుంటే చూశాం. దగ్గరకు వెళ్ళడానికి కాళ్ళు ఆడక, మీతో చెప్పడానికి వచ్చాం'' అన్నారు.

వాల్మీకి దివ్యదృష్టితో చూశాడు. రామచంద్రుని భార్య అని గ్రహించాడు. వెంటనే 'ధర్మవిధిని' మహితార్ఘ్యపాత్రను చేత తీసుకొన్నాడు. రభసంతో వెళ్ళాడు. ఆమె ఘోరదశాపరిపాక తప్తచేతన. ఆమెను 'సంతర్పణ వాక్య పూర్వకం'గా ఊరడించాడు. ఆమె ఆ ముని పాదయుగళానికి అశ్రుధారలతో 'పాద్యం' అర్పించింది. అతడు మనక్షోభం సంధిల్ల గద్గదికా నిరుద్ధమానసుడై ఇలా అన్నాడు. ''జనకమహారాజు తండ్రట!

దశరథమహారాజు మామట! విశాల యశశ్శ్రీధనుడైన రాముడు నాథుడట. వనితలలో నీకు సరిసాటి ఎన్నగలమా? నువ్వు ఇక్కడికి రావడానికి గల కారణం హృదయంలో భావించి తెలుసుకొన్నాను. నీ పావన చరిత్ర ఈ వెడ మాటలవల్ల ఆరడిపోవడం చూసి అతి విచారిస్తున్నాను.

''లోకముల నెద్దియేనియు నాకు నెరుగ
రానియట్టిది లేదు నిర్మలతనొప్పు
నీదుచరితంబు తెల్లంబుగాదె! రాము
నేరమియెచూవె యింతయు నిక్కమరయ.'' (9-44)

అన్నాడు. 'లోకంలో నాకు తెలియనిదంటూ లేదు' అని మొదట చెప్పడం స్వాతిశయం, స్వోత్కర్షగా కనబడుతుందిగాని సీతను అనునయించడానికి ఇది చెప్పాలి. ఈ ధిషణాహంకారం యిక్కడ కావాలి. ఆమె విశ్వసించాలి. ''నాకు సమస్తం తెలుసు. నీ చరిత్ర నిర్మలమైనది. వాస్తవానికి యిదంతా రాముని అజ్ఞత సుమా!'' అని ఊరడించాడు.

''ఇదె మనయాశ్రమం బిచట నీవు వసింపు తపస్వినుల్ ప్రియం
బొదవగ నీకు నెల్లపనియుం బరమాదరవృత్తి నాచరిం
చెద రిదె నీగృహంబునకు జేరితి గావున నీదుగర్భ మ
భ్యుదయముబొందు దుర్యశముపోవు బదంపడి నమ్ము మెమ్మెయిన్.'' (9-45)

ఈ పద్యంలో ''ఇది మన ఆశ్రమం'' అని మొదట అన్నాడు. వెంటనే 'నీ గృహానికి చేరావు' అన్నాడు. నీ గర్భం అభ్యుదయం చెందుతుందన్నాడు. ఈ అపవాదు మెల్లగా పోతుందన్నాడు. 'మనయాశ్రమం', 'నీ ఇల్లు' అని చెప్పాక 'నీవు గర్భిణివి' అని జ్ఞాపకం చేయడంలో ఎంతో లోకజ్ఞత వుంది. పురిటికి పుట్టింటికి వచ్చినట్టు ఆమె భావించడానికి అప్పుడే వీలుంది.

''అర్చన స్వీకరించు!'' అంటే ఆమె అతని మాటలలోని నిజాన్ని గ్రహించింది. అర్ఘ్యం అందుకొంది. 'సుశ్లోకు'డైన ఆ మునీశ్వరు సాకతమున శోకవహ్ని శాంతత పొందింది. ఆమెను మెల్లగా నడిపించుకొంటూ తన ఆశ్రమానికి చేరుకొన్నాడు. వాళ్ళకు తపస్వినులు ఎదురైనారు. వాల్మీకి ఆమెను వాళ్ళకు యిలా పరిచయంచేసి అప్పగించాడు.

''జనకుని కూతు రార్యగుణశాలిని రాముని దేవి సీత యా
తని కొరగామి నియ్యెడకు దాపసవృత్తి జరింపవచ్చె ని
వ్వనితకు నెల్లకృత్యము దివానిశముం బరికించి బాంధవం
బు నెరయజేయుడీయని తపోధనసత్తము డప్పగించినన్.'' (9-48)

ఎంత మితభాషి! ఎంత తూచి వాడిన మాటలు! ''జనకుని కూతురు! ఆర్య గుణశాలిని! రాముని దేవి! సీత! అతని చేతకానితనంవల్ల యిక్కడికి తాపసవృత్తి

చరించడానికి వచ్చింది'' అనడంలో ఎంతో కథ ఒక మహాకవి ఇంకొక మహాకవిచేత చెప్పించాడు.

తరువాత మళ్ళీ వాల్మీకి పాత్రచేత తిక్కనగారు ఇలాగ మాట్లాడించినది శ్రీరాముడు అశ్వమేధయాగం చేసినపుడే. ఆ యాగానికి వాల్మీకి కుశలవులను వెంటబెట్టుకొని వెళ్ళాడు. రాముని మనసు ఎలా ఉందో తెలుసుకోవాలనుకొన్నాడు. కుశలవులతో రాముని చెవి సోకునట్లుగా రామాయణం పాడమన్నాడు. మనుజేశ్వరు సభలో నేనున్నను లేకున్నను మనంబున గొంకక పాడమన్నాడు. వాళ్ళు పాడారు. రాముడు విన్నాడు. విని 'ఉత్సుకతతో' ''ఎవరి పిల్లలు మీరు? ఈ ప్రబంధం ఏ ముని కృతం?'' అని ప్రశ్నించాడు. ఆ కుమారులు ఆదికవి మోము చూశారు. అతని ముఖంలో చెప్పమని అనుజ్ఞ కనబడింది. ''ఈ సందర్భం వీరుచేసినది. మేము వీరి శిష్యులం'' అని చూపించారు. రాముడు వాల్మీకిని శ్లాఘించాడు. ''మీ రచనవల్ల నా అల్పచరిత్రను లోకం కొనియాడుతుంది. మీ కృపామహిమచేత కావ్యమయోజ్వలమూర్తి నయినాను. ఈ కుర్రవాళ్ళెవరో వినాలని వుంది. ఇందులో ఏమీ రహస్యం లేకపోతే చెప్పండి'' అని రాముడు అడిగాడు. వాల్మీకి యిలా చెప్పాడు:

''వినయము బెంపు నేర్పును వివేకమునుం గల నీవు మేదినీ
తనయ దొరంగుటెట్టు లుచితంబుగ జూచితివిట్లు పోలునే
యనల విశుద్ధమైన సతినక్కట యెక్కడనేని బొమ్మ నీ
వని వెడలంగ ద్రోచిన దయాగుణకీర్తికి హానిపుట్టదే? (10-128)

నా డగ్నిలోన ద్రోచిన
వాడవకట! యంత బోక వల్లభనిమ్మై
నే డడవి ద్రోచి తెదగడు
వాడిగదేనీకు రాఘవకులప్రవరా! (10-129)

అంతనుండియు నీతోడ నలిగియున్న
వారమేమది యట్లుండె వారిజాక్షి
తెరగు వినుమని యిట్లను మరియు ముని వి
నీతజాతోత్సుకుండగు నృపవరునకు.'' (10-130)

''ఆనాటి నుంచి నువ్వంటే నాకు కోపం'' అని రామునితో తిక్కనగారి వాల్మీకే అనగలడు.'' ''దానికేం, విన్ను'' అని సీతను తాను కాపాడిన సంగతి, కుశలవుల జన్మం మొదలైనవి వివరంగా చెప్పాడు. వాళ్ళను పెంచి పెద్దవాళ్ళను చేసి విద్యాబుద్ధులు నేర్పడం తెలియజేశాడు.

''ఎంతకాలంబువోయిన నెరవకాదె
యొరుల సొమ్మనితలచి యాగోత్సవమున

కిదియ కానుకగా వీరి నిట్లు తెచ్చి
నిన్ను జేర్చితి రఘుకులనృపవరేణ్య!'' (10-139)

తన ధర్మాన్ని నిర్వర్తించి కుమారులను తండ్రికి అప్పచెప్పి ఊరుకొన్నాడు వాల్మీకి. తిక్కనగారిలాగే తిక్కనగారు సృజించిన వాల్మీకి కూడ „నిండుకుండ! మితభాషి! గంభీరుడు!

వ్యాస వాల్మీకు లిద్దరి సృష్టినీ తన సొంతం చేసుకొన్న తిక్కనగారు ప్రజలకోసం, ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగా మహాకవిత్వ దీక్షావిధినొంది గద్యపద్యాలు వ్రాశారు. దేశం ఆనందించాలన్న కోరిక గొప్పది. 'ఆనందం' అన్నది తిక్కనగారి ఆశయం. భారతంలో ప్రతిపర్వాంతంలో ఆనందం ముద్ర ఉంటుంది. హరిహరనాథుణ్ణి ఆనంద రూపునిగా వారు ఊహించారు. పర్వాంత పద్యాలలో ఆఖరి సంబోధనలు ఎలా ఉన్నాయో చూడండి :

1.	విరాట పర్వాంతం	ఆనంద సంస్తూయమానా!
2.	ఉద్యోగ పర్వాంతం	పరమానంద భూత్యేకరూపా
3.	భీష్మ పర్వాంతం	సంతతానంద సాంద్రా
4.	ద్రోణ పర్వాంతం	శాశ్వతానందమూర్తీ
5.	కర్ణ పర్వాంతం	నిర్భరానందదేహా
6.	శల్య పర్వాంతం	ఆనందరూపా
7.	సౌప్తిక పర్వాంతం	సుస్థిరానందభాసా
8.	స్త్రీ పర్వాంతం	ఆనందశీలా
9.	శాంతి పర్వాంతం	భాస్వరానందమార్గా
10.	ఆనుశాసనిక పర్వాంతం	నిష్కలానందమూర్తీ
11.	అశ్వమేధ పర్వాంతం	దర్శితానందవర్త్మా
12.	ఆశ్రమవాస పర్వాంతం	సానందవర్గా
13.	మౌసల పర్వాంతం	ఆనందప్రకాశస్వరూపా
14.	గ్రంథాంతం పర్వాంతం	సంభృతానందభావా!

చదువరుల సౌకర్యం కోసం పర్వాంత పద్యాలలోని సుదీర్ఘ సమాసాలలోనుంచి ఆనందముద్రను వేరుచేసి చూపించాను. నాలుగవ పాదంలో విధిగా ఆనందముద్ర ఉంటుంది.

తిక్కనగారు పర్వాంతంలో ఆనందముద్రను వాడుతారని మొదట గుర్తించినది రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. కావ్యాలను అభిమానిక పదాంకితంగా భారవి, మాఘాదులవలె తెలుగులోను కొందరు చేసినట్లుంది. తిక్కనగారివలె

హరిహరోపాసకుడైన కొఱవి గోపరాజు తన 'సింహాసనద్వాత్రింశిక'ను 'స్వరూపా' అనే మాటతో అంకితం చేశాడని రాళ్ళపల్లివారు గుర్తించారు.

పర్వాంతంలో ఆనందముద్రను వేసిన తిక్కనగారు గ్రంథాదిని దానిని వాడారా అన్న అనుమానం కలుగుతుంది. ''శ్రీయన గౌరినాబరగు చెల్వకు...'' అనే మంగళా చరణం అయ్యాక వెంటనే తిక్కనగారు వచనంలో ఆనందముద్ర వేశారు. ''... అని సకల బ్రహ్మప్రార్థనంబు చేసి తత్ప్రసాదాసాదిత కవిత్వతత్త్వ నిరతిశయానుభావానంద భరితాంతఃకరణుండనగుచు...'' (విరాట. 1-2)

అయితే కావ్యం మొట్టమొదటి పద్యంలోకాక రెండవ నెంబరు వచనంలో భావానందం వుంది. కనుక గ్రంథాంతంలో ఉపధాపద్యంలో (ఆఖరి దానికి ముందున్న దానిలో) కూడా భావానందం వాడితేనేగాని శిల్పంలో నిండుదనం రాదు. అందుకే ఆ ఉపధాపద్యం లోపలే ''కేవల భావానందమయా! వేదవ్యాస వర్ణనారూఢదయా!'' అని ఉపధాచరణంలో వాడి సరిపుచ్చారు. (స్వర్గా. 96)

భారత రచనా కాలంలోనేకాక అంతకు ముందునుంచీ ఈ ఆనందపదానురక్తి తిక్కనగారికి వుంది. నిర్వచనోత్తర రామాయణం మంగళాచరణంలో 'ఆనందసాంద్రా స్థితి' అని వుంది. శ్రీహర్షుని నైషధం యిలాగే ఆనందపదాంకితమట. తిక్కనగారు ఉభయ భాషలలోనూ పండితులు. హర్షుని శిల్పరహస్యాన్ని వాడుకొన్నారు కాబోలు. లేక వారికి తైత్తిరీయం చెప్పిన ''ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్'' అన్నది పరమ ప్రమాణం కాబోలు. ఈ ఆనందముద్రవల్ల వారి ఫిలాసఫీ 'మానవజీవితం' ఆనందమయం అవాలనే ఆకాంక్ష' అని తెలుస్తున్నది. అయితే మానవుడెప్పుడూ పంజరంలోని చిలుక. తిక్కనగారికి ఈ ఉపమానం చాలా ఇష్టం. నిర్వచనోత్తర రామాయణంలో మొదటి మనుమసిద్ధిని వర్ణిస్తూ, ''కీర్తిజాలము త్రిలోకీశారికకు అభిరామ రాజిత పంజరంబుగ జేసి'' అని చెప్పారు. (నిర్వచన. 1-30)

భారతంలోని షష్ఠ్యంతాలలో హరిహరనాథుణ్ణి ''త్రిభువనశుకదృఢ పంజరవిభవ మహితుణ్ణి'' చేశారు. కాని, వెంటనే ''నమస్త విష్టప నిర్మోక భుజంగపతిని'' చేశారు. (విరాట. 1-33). పంజరం లాంటి ప్రాపంచిక జీవితంలో భావానంద మొకటే మానవుణ్ణి ఆశాజీవిగా చేస్తుంది. కోరికల కుబుసాన్ని మానవుడు వదలిపెట్టినా, కొత్త కుబుసం పుట్టుకొస్తుంది. మానవుడు సృష్టించుకొన్న దేవుడైనా కనీసం సమస్తవిష్టప నిర్మోకభుజంగపతి కావడం కొన్ని వేళలలో అవసరం. భారతాన్ని సంపూర్ణంగా రచించిన తిక్కనగారికి ఇంకే కోరికలూ లేవనిపిస్తున్నది. ''హరిహరనాథా! సర్వభువనార్చితః! నక్ కృపజూడు మెన్నడుక్'' అని ఒక్కటే ఒకటి కోరుకొన్నారు.

భారతంలో గ్రంథాదిని కృతికర్త భావానంద భరితాంతఃకరణుడు. గ్రంథాంతంలో కృతిపతి సంభృతానంద భావుడు. ఏ ఆశయానికైతే మనం మన జీవితాన్ని అంకితం చేశామో ఆ ఆశయం యొక్క ఆనందమే మన ఆనందం!

ఆంధ్ర భోజుడు

శ్రీరామునంతటివాని చరిత్ర వాల్మీకి వ్రాయకపోతే తెలిసేది కాదు. మేరు పర్వతాన్ని ఎత్తిన రాజైనాసరే. అతనిమీద ఒక కవి కృతి చెప్పకపోతే భూమిమీద అతని కథ ఎవరూ చెప్పుకోరు. ఈ నిత్యసత్యాన్ని తెలుగులో ఒక కవి పద్యంలో చెప్పాడు.

''ఆకులవృత్తి రాఘవు శరాగ్రమునందు దృణాగ్రలగ్న నీ
రాకృతి వార్ధి యింకుట దశాస్యుని జంపుట మిథ్యగాదె వా
ల్మీకులు సెప్పకున్న కృతిలేని నరేశ్వరు వర్తనంబు ర
త్నాకరవేష్టితావని వినంబడ దాతడు మేరు వెత్తినన్.'' (సకలనీతి. 22)

ఇంత చక్కని పద్యం చెప్పిన ఈ కవి పూర్తిపేరు ఏమిటో మనకు తెలియదు. ఇతడు ఏ కాలంలో జీవించాడో, ఏ రాజుమీద కృతి చెప్పాడో కూడ వివరాలు దొరకవు. అయితే ఇటువంటి రసవంతమైన పద్యాలు ఇతడు చెప్పాడని మనకు ఎలా తెలుస్తున్నదంటే 'నీతి భూషణం' అనే గ్రంథంలోని పద్యాలు అని పేర్కొని మడికిసింగన 25 పద్యాలను తన 'సకల నీతి సమ్మతం'లో వివిధ శీర్షికల క్రింద ఉదాహరించాడు.

మడికిసింగన పుస్తకాన్ని తొలిసారి ప్రచురించిన మానవల్లి రామకృష్ణ కవిగారు ''నీతిభూషణమును నాంధ్రభోజుడను కవి రచించినట్లొక లక్షణ గ్రంథమున గలదు. కాని యత డెవ్వడని గుర్తింప వీలుకాదు. బాలబోధలక్షణమున దీనిలో నుండి పెక్కు పద్యము లుదాహృతములయ్యె'' అని వ్రాశారు. రెండు పద్యాలను చూపించారు. అవి ఇవి:

''సకలస్థాణుశిరః ప్రవర్తి నురుపక్షద్వంద్వశుక్లాభిరం
జకుడన్ సర్వదిగంతగామి ననకృత్సం సేవ్యమానుండ నై
ష్ఠికుడం గావున మత్స్యమాను డగునే శీతాంశు డం చెప్పుడున్
బక మిందుం బ్రహసించునట్లు సుజనుం బల్కుం దురాత్ముం డిలన్''.

''వలసిన వంకలం గురియు వర్ష సమాగమమేఘ మేగి త
న్మలినత దాతయం దవగుణంబును సహ్యమె వృష్టిలేక ని
ర్మల మగుచో దలంపగ శరద్ఘన మేటికి నట్ల యీగి మై
నెలయనివాని వెల్లదన మేమి ప్రయోజన మర్థికోటికిన్''[1]

బాలబోధలక్షణం నుంచి తీసుకొన్న ఈ రెండు పద్యాల తరువాత ''నీతి భూషణమునకు సంస్కృత మూలమేదో యిప్పటికి దెలియరాదు'' అని కవిగారు వ్రాశారు. ఇది అనువాదమని భావించడానికి ఏమి ఆధారాలున్నాయో మనకు తెలియరాదు. ధారాపురం రాజధానిగా పరిపాలించిన భోజరాజు (క్రీ.శ. 1000-1050) ఈ తెలుగు పుస్తకాన్ని వ్రాశాడని రామకృష్ణకవిగారు భావించారు. భోజరాజవిభూషణమనే

1. సకల నీతిసమ్మతం (1923) పీఠిక. పుట-5

నీతిభూషణము పేరు ఉదాహరించి రామకృష్ణకవిగారు ''భోజరాజాంధ్ర ద్రవిడ కర్ణాటముల గవిత్వము చెప్పజాలెననుట మనకు హృదయానందముగా నున్నది'' అని వ్రాశారు.[2]

మడికిసింగన తన గ్రంథంలో తెలుగు రచనలనే ఉదాహరించాడు. ''ఆంధ్రభాషా కోవిదులగు సుకవీంద్ర విరచితంబైన ముద్రామాత్యపంచతంత్ర బద్దెభూపాలచాణక్య ధౌమ్య విదుర ధృతరాష్ట్ర బలభద్ర కామందక గజాంకుశ నీతిసార నీతిభూషణ క్షేమేంద్ర భోజరాజవిభూషణ పురుషార్థసార భారత రామాయణాది మహాకావ్యములు వాడుకొన్నాడు.[3] అతడు నీతిభూషణాన్ని, భోజరాజవిభూషణాన్ని వేరువేరుగా పేర్కొన్నాడుగాని పద్యాలు ఒక్క నీతిభూషణములోనుంచే ఉదాహరించాడు.

మడికిసింగన వాడుకొన్న నీతిభూషణములో నుంచే లక్షణకర్తలు ప్రయోగాలను స్వీకరించారనుకోవాలి. నీతిభూషణాన్ని ఆంధ్రభోజుడు వ్రాశాడని ఏ లక్షణకర్త చెప్పాడో రామకృష్ణకవిగారు విశదపరచలేదు. బాలబోధ లక్షణకర్త అయితే అతడు లింగమగుంట తిమ్మన. ఇతడు క్రీ.శ.1560 ప్రాంతాలవాడు. ఆ కాలం నాటికి నీతిభూషణం ప్రతులు లేఖకులు వ్రాసుకొంటూ ఉండేవారు. కవి పేరుగాని, బిరుదుగాని వ్రాసుకొనే ఉంటారు. లక్షణకర్త బిరుదునే ఉదాహరించారు. అది ఆనాడు ప్రసిద్ధం కావచ్చు. బిరుదు చెప్తేచాలు. పేరు తెలిసేరోజులు. తిక్కనగారిని కేతన, ఆర్యభోజుడని చెప్పడం మనం ఇంతకుముందు గమనించాం. అయితే అది సుప్రసిద్ధమైన బిరుదు కాదనికూడ చెప్పుకొన్నాం.

మడికిసింగన ధర్మమా అని మనకు దక్కిన ఈ కవి పద్యాలు చాలా రసవత్తరంగా ఉన్నాయి. చెప్పేవి నీతులైనా చాలా చక్కగా, కవిత్వముట్టిపడేటట్లు చెప్పాడు. సున్నితమైన హాస్యం, గంభీరమైన భావాలు ఉన్న కవి. ''కవిత్వం మంచి తెలియని పురుషులు పశువులు. అయితే వీళ్ళు గడ్డి తినకపోవడం పశువుల అదృష్టమే!'' అని ఒక పద్యంలో అన్నాడు. ''మంచి కవిత్వాన్ని వింటే మంచివాళ్ళే పొంగిపోతారు. చెడ్డవాళ్ళు పొంగుతారా? చంద్రుణ్ణి చూస్తే సముద్రాలు పొంగుతాయిగాని నూతులు పొంగుతాయా?'' అన్నాడు. ''అడవులు కాలుస్తూ గొప్పగా ఉన్నప్పుడే అగ్నికి గాలి మిత్రుడు. చిన్న దీపంగా ఉన్నప్పుడు ఆర్పివేసే ఘనుడు. హీనులకు స్నేహితులేమిటి?'' అన్నాడు ఇంకొక పద్యంలో.

ఉదాత్తమైన ఉపమానాలతో ఉత్తరోత్తరా ఇతర కవులకు ఒరవడిపెట్టే శిల్పంతో నీతికావ్యాన్ని వ్రాసిన ఈ కవి నిస్సందేహంగా మహాకవి. ఇతని సంపూర్ణ గ్రంథం మనకు లభ్యమవకపోవడం అక్షరాలా మన దురదృష్టం. ఈ ఇరవై అయిదు పద్యాలనైనా దక్కించినందుకు మనం మడికి సింగనకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

2. నీతిశాస్త్ర ముక్తావళి. బద్దెన రచన, పీఠిక, పుట.6 (నరేంద్రనాథ సాహిత్య మండలి ప్రచురణ)
3. సకలనీతిసమ్మతం, ప్రథమాశ్వాసం 7.

మడికి సింగన కీర్తిశిఖరం

క్రీ.శ. 1347లో ఉన్న అయ్యలమంత్రి కుమారుడు కనుక ఈ సంవత్సరానికి ఒక తరం అర్వాచీనుడవుతాడని సుప్రసిద్ధ చరిత్రకారులు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు కాలనిర్ణయం చేశారు.[4] మడికిసింగన తన పద్మపురాణం ఉత్తరఖండంలో దాని రచనా కాలాన్ని ఇచ్చాడని, అది క్రీ.శ. 1420 అని కొందరు సాహిత్య చరిత్రకారులు భావిస్తున్నారు. అయితే క్రీ.శ. 1370 ప్రాంతాలలోనే మడికిసింగన ఉండి ఉండాలి. నీతిభూషణకర్త అంతకు పూర్వుడే. ఎంత పూర్వుడన్నదే ప్రశ్న?

నీతిశాస్త్రాలూ, ధర్మశాస్త్రాలూ ఎక్కువగా కాకతీయ యుగంలోనే రచించడం ప్రారంభించినట్లు కనబడుతున్నది. నీతిభూషణం కూడ ఈ కాలంలోనే ఉద్భవించి ఉంటుంది. శైలి, శిల్పం, ఉపమానాలు వాడడం, నీతి చెప్తున్నా చమత్కరించడం చూస్తే అంతకుముందు పుట్టిన నీతి గ్రంథాలకన్నా ఉత్తమంగా ఉపదేశం చేయాలనే ఉద్దేశం, నేర్పు కనబడతాయి.

మడికిసింగన ఏయే విభాగాలకింద ఇతని పద్యాలను ఉదాహరించాడో ఆ శీర్షికలకిందే, దొరికిన అన్ని పద్యాలనూ ప్రకటిస్తున్నాను.

(సకల నీతి సమ్మతమునుండి సేకరించిన నీతిభూషణము).

గ్రంథ ప్రశంస

''జను లిది అల్ప గ్రంథం - బనవలవదు దీన దోచునన్నియు బెక్కుల్
గనుపట్ట జేయు వాతా-యనవివరము పిన్న గాదె యూరసి చూడక్? (20)

భువి నధికుడు దెలుపని యు-క్తివిశేషము చిరుతవాడు దెలు పెడునొకచో
రవికి మరుగైన గొందిని-దివియ ప్రకాశింప జేయదే యొక్కొకచోక్? (21)

ఆకులవృత్తి రాఘవు శరాగ్రమునందు దృణాగ్రలగ్న నీ
రాకృతివార్ధియింకుట దశాస్యుని జంపుట మిథ్యగాదె వా
ల్మీకులు సెప్పకున్న కృతిలేని నరేశ్వరు వర్తనంబు రత్నా
కరవేష్టితావని వినంబడ దాతడు మేరువెత్తినక్. (22)

సరసకవితరుచి యెరుగని-పురుషుల పశువులని నిక్కముగ నెరుగుదు, వా
రురువడి దృణంబు మేయమి-పరికింపగ ధరణి బసుల భాగ్యంబెందుక్? (31)

సుందర సర్వలక్షణ విశుద్ధకవిత్వము గన్నచో రస
స్యంది నిజస్వభావు డనజాలినయ ట్లనిజస్వభావు డా

4. History of the Reddy Kingdoms, p.514

నందము బొందునట్లు కుజనప్రకరంబు లెరుంగ నేర్చునే
చందురు జూచి మోదమున సాగర ముబ్బిన నూతు లుబ్బునే? (32)

ఆజ్ఞాపాలనము:

ఏజనుల కాజ్ఞ సాలని - రాజును రాజేంద్రునాజ్ఞ ప్రకటింపని యా
రాజునకు గోడ వ్రాసిన - రాజునకుఁ భేదమేమి? ప్రాజ్ఞున కరయన్? (77)

ప్రజా పాలనము:

తన నగరిలోన నించుక - యును భాండాగార మనుచు నునికిదగదు రా
జునకుఁ భండారం - బని యేమర కరయవలయు ననిశమువారిఁ. (103)

న్యాయపుటరితల పూవులు - గోయుట నట లెస్స తగదు కువలయపతి క
న్యాయ మరిమ్రాను వొడిచిన - గాయలు వెసగోయునట్టి కరణిదలంపఁ. (124)

రాజాదాయవ్యయప్రకారము:

శూరమణుడు పేదైనను - ధారుణి నెచ్చోటు దగదు ద్రవ్యము వెదకఁ
వారాశి వట్టిపోయిన - నీరొం డొకదెస ఘటింప నేరగనగునే! (140)

రాజనీతి:

మతశస్త్రము ప్రకృతులు మే - నతిశయధర్మంబు ప్రాణ మతిదృఢతరసం
కృతిజోదు చదులు కన్నులు - చతురుండగు దూత మోముజననాథునకుఁ. (148)

స్వామియు మంత్రియుదుర్గ
స్తోమము రాష్ట్రంబు ధనము సుహృదులు బలముఁ
గా మహిసప్తాంగంబులు
నేమరక యొనర్పవలయు నిందుల రక్షల్.[5]

ఉత్సాహ ప్రభుమంత్రశక్తుల నజేయుండై పరిక్షీణసం
ధిత్సావ్యగ్రుడుగాక విగ్రహముచో దేశంబు కాలంబు సం
పత్సామగ్ర్యము జూచి కార్యముదెసఁ బ్రారంభియై భూప్రజఁ
వాత్సల్యార్ద్రమనస్కుడైన పతి శశ్వచ్ఛ్రీసమేతుం డగుఁ (150)

ఎందును నాయాసమునకు - బందయయినవాడు సిరికి బాత్రుండగునే?
మందరగిరి మోవడె గో - విందుడు మును లచ్చికొరకు విబుధులెరుంగఁ? (190)

సమయముల రంతుపరివా-రముమత్తు నియోగిజనుల రాయిడి యరిమ్రు
చ్చిమి గ్రేణి కారయ న్యా-యము లేకుండంగ బ్రజల నరయగవలయుఁ (227)

---

5. ఇదే పద్యం నాలుగవ పాదంలో 'దా మదిలో నెరిగి నేని దగ రక్షించెన్' అనే మార్పుతో మంచెన కేయూరబాహు చరిత్రలో ఉంది. (4-205). సప్తాంగాల వివరాలు ఇద్దరూ ఒకే వరుసలో చెప్పారనుకోవాలి.

రాజభృత్యనీతులు:

దూరమున వెరవు గదిసిన - దారు నిలుచువారి నృపతి దగుమన్నింపన్
దూరమున బిరుదు గదిసిన - దా రచ్చట లేనివారి దగువర్జింపన్. (439)

సేవకనీతులు:

తక్కిన యాత్ముడు గలడే - యెక్కుడుగా నెత్తిపలికి హిత మెరిగింపన్
జెక్కిలిమీటుట కూరిమి - తక్కుటయే పాలుపోయుతరిబాలునకున్. (461)

స్థిరమతి నెప్పుడు నిజమం - దిరమున దిద్వారమునను దెల్లముగా సం
గరముననుం గ్రమ్మన నే - నరుడుండు నతండు ప్రియుడు నరనాథునకున్. (462)

ఏ నితనికి మాన్యుడ నని - భూనాథుని కరుణ నమ్మి పొంగి భటుడు సే
వానియతి వరలు టొప్పదు - నానాటికి క్రొత్త మన్ననలునృపతులకున్. (503)

మంత్రరక్షణార్థములు:

కానలు దరికొను పావకు-డైన ప్రభంజనుడు మిత్రు డల్పత దీపం
బైన శిఖి నార్పుగావున - హీనుండగువాని కెందు నెక్కడిమిత్రుల్? (751)

దండయాత్ర:

ప్రవిమల విక్రమపరుడగు - నవనీశ్వరునంకతలమునందు రిపుశ్రీ
దవిలి కుటుంబిని పోలిక - నవిరళమై యుండు నెపుడు నంచితమహిమన్. (774)

తగ వేపట్టును లేక దుర్వ్యసనియై ధర్మక్రియాహీనుడై
తగవారుం బ్రజలున్ విరాగులగు చేత ల్సేయు భూపాలుపై
దగ దండెత్తిన రాజు గెల్చునరికిన్ దా దండియై నిల్వగా
దగు రా జచ్చట లేకయున్న దగు దద్రాజ్యంబునున్ జేకొనన్. (775)

అనురాగియు సద్వృత్తుడు - ఘనశక్తి తయము దైవికము బౌరుషమున్
ధనమును దన కబ్బిన పతి-నననది యివిలేనియట్టి జనపాలుపయిన్. (776)
తనచేతగాని కాదను-పనికిం బ్రతినిధిగ నన్యు బనిచిన దీ
రునె యౌషధంముమా రిది-యని మూల్యం బిడిన రోగ మరుగుట గలదే? (790)

ప్రయాణ వ్యసనపరీక్ష:

అరిపధకుం దగునంతకు - ధరణీశుం డోర్వవలయు దక్కువయైనన్
నరు డాటదయ్యె నుండడె - హరి గొల్లడనంగబడడె యనువగుదాకన్? (893)

కార్యత్వరితనీతులు:

డెందమున దెలిసియును - జేయం దెంపరిగాక యుండు నాతనితలపో
తలదీరునె యవకార్యము - మందెరిగినమాత్ర దెవులు మానుటగలదే? (957)

''ఇది అల్పగ్రంథం అనవద్దు. దీనిలోనే ఎన్నో కనబడతాయి. ఎన్నింటినో చూపించే కిటికీ చిన్నదే కదా!'' అని కవి ఈ గ్రంథం మొదటే అన్నాడు. ఇప్పుడు దొరికిన పద్యాలు కూడ తక్కువని అనుకోనక్కరలేదు. ఇతని కవిత్వశక్తిని ఈ గవాక్షరంధ్రం సమగ్రంగా చూపెడుతుంది.

నీతిభూషణంలోని ప్రతి పద్యం అక్షరాలా భూషణం!

అప్పనమంత్రి

ప్రతి పద్యం ఒక భూషణంలాగ రచించిన ఆంధ్రభోజు డెవరా అన్న ప్రశ్న ఇంతకుముందు మనకు కలిగింది. అది బిరుదేగాని తల్లిదండ్రులు పెట్టిన పేరు కాదని చెప్పకనే చెపుతున్నది. ఆంధ్రభోజుడు బహుశా అప్పనమంత్రి అవుతాడా అనే సందేహం కలుగుతున్నది. ఏమంటే, ఇతడు 'చారుచర్య' అనే చిన్న గ్రంథం వ్రాశాడు. అందులో రెండవ పద్యం చూడండి.

''రాజహితంబుపొంటె సుకరంబగు వైద్యసునీతి ధర్మని
ర్వ్యాజపథానుసార మగునట్లుగ నిర్జరభాష దొల్లి యా
భోజునిచేత జెప్పబడి పొల్పగు నీకృతి 'నూత్నసత్కళా
భోజుడు' మంత్రి యప్పన ప్రబుద్ధుడు చేసె దెనుంగుబాసగన్.'' (2)

సంస్కృతంలో ఆ భోజుడు చెప్పిన ఈ కృతిని 'నూత్నసత్కళా భోజుడు' మంత్రి యప్పన తెలిగించాడని కవి చెప్పుకొన్నాడు. ఇతడు తన పేరుకు ముందు వాడిన విశేషణం గమనించదగింది. దీనిని బట్టే అతనికి 'ఆంధ్రభోజు'డనే బిరుదు వచ్చిందా?

రెండు గ్రంథాలలోని పద్యాలనూ తైపారు వేసి చూస్తే రెండింటి కవిత్వం ఒకేలాగున వున్నట్టు కనబడుతుంది. 'నీతివిభూషణం'లోని ఉపమానాన్ని ప్రతి పద్యం ఉత్తర భాగంలో చక్కగా వాడడం మనం గమనించాము. 'చారుచర్య'లో కూడ ఈ శిల్పం కనబడుతుంది. చూడండి.

''వర్ధమానులైనవారికి నాపద- హీనజనులకంటె నెక్కుడంద్రు
కచవితానమునకు గాక ఖండన మెండు - రెప్పవెండ్రుకలకు జెప్పబడెనె?'' (69)

ఈ ఒక్క పద్యంలోనేకాదు ఇంకొక పద్యంలో కూడ ఇదేరకమైన సంవిధానం కనబడుతుంది. చూడండి :

''ఆత్మకునివలె బాతకుం డయినవాని
నన్యు గొనియైన వెసదెగటార్పవలయు

ఇంటు బుట్టియు గీడైన యెలుక జంప
బిల్లికిని దుగ్ధములు పోసి పెంచుకరణి.'' (72)

ఆటవెలది, తేటగీతులలోనే కాక వృత్తాలలో కూడ యిటువంటి ఉపమానాలు, అర్థాంతరన్యాసాలు చివర వాడడం ఈ కవి పద్యాలలో కనబడుతుంది. చూడండి :

''సముచితయత్నశక్తియుతసాహసుడై తగు నుత్తముండు మ
ధ్యము బలహీనసాధనము లారయ జెప్పగనేల రెండు పా
దములనె కల్గి యా హనుమ దాటె సముద్రము కాటిరేని య
శ్వమునకు నూరుగా శ్లోదని సన్నపు గాల్వయు దాటగల్గునే?'' (67)

వీటన్నిటిని బట్టి చూస్తే 'చారుచర్య'ను తెనిగించిన అప్పనమంత్రి 'ఆంధ్రభోజు'డనే పేర పేరెన్నిక. పొందాడనిపిస్తున్నది. ఇదే నిజమైతే ''ఆంధ్రభోజుడెవరు?'' అనే ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది.

అప్పనమంత్రి కాలం మడికిసింగనకు పూర్వమే. ఏమంటే, తన 'సకలనీతి సమ్మతం'లో 'చారుచర్య' నుండి కూడ ఒక పద్యం మడికిసింగన ఉదాహరించాడు. 'చారుచర్య'లోని 35-వ పద్యం 'సకలనీతిసమ్మతం'లో 258-వ పద్యంగా వుంది. మడికిసింగన కాలం క్రీ.శ. 1370 ప్రాంతాలు అని మనం తెలుసుకున్నాం. కాబట్టి అప్పనమంత్రి కాకతీయ యుగంలోనివాడే అవుతాడు.

'చారుచర్య'లో అప్పనమంత్రి తనను గురించి ఎక్కువగా చెప్పుకోలేదు. ఇతని తండ్రి పేరు గోవిందాచార్యుడు; తల్లి పేరు నాగమాంబ. ఆమె తన పుట్టింటివారికి, మెట్టినింటివారికి పేరు తెచ్చిన ఇల్లాలు కాబోలు. కవి ఆమెను 'కులద్వయశిరోభూషణ ధర్మచరిత' అని పొగిడాడు. ఇతనికి వల్లభాచార్యుడనే అన్నయ్య వున్నాడు. వీళ్ళ మేనమామ ప్రసిద్ధుడు కాబోలు, 'సింగనామాత్యు మేనయల్లుడ' అని తనను గురించి కవి చెప్పుకొన్నాడు. అప్పనమంత్రి ఉభయభాషాకవిత్వమానవైదగ్ధ్యుడు.

ఇంతకన్న ఇతణ్ణి గురించి వేరేమీ తెలియదు. అన్నట్టు యితడు శృంగార పురుషుడు కాబోలు, 'నారీజన పంచబాణనాగమయప్పా' అని తనను తాను సంబోధించుకొన్నాడు (ప. 13). ఇంకొక చోట 'గణకలలామా!' అన్నాడు (ప. 63). బహుశా ఇతడు కరణం కావచ్చు. ఆ తరువాతి పద్యంలోనే 'మంత్రి శేఖరా!' అనే సంబుద్ధి కనబడుతుంది. ఇవేవీ అతణ్ణి గురించి విశేషంగా ఏమీ చెప్పవు.

'చారుచర్య' చాలా చిన్న గ్రంథం. ఇందులో 76 పద్యాలు మాత్రమే ఉన్నాయి. ప్రొద్దుట లేచింది మొదలు చక్కని దినచర్య ఎలా ఉండాలో వివరించే వైద్యనీతి గ్రంథం ఇది. ఎటువంటి దంతకాష్ఠాలతో పళ్ళు తోమాలో, ఎలాంటి నీళ్ళతో స్నానం చేయాలో, ఏయే పువ్వులు ధరించాలో, భోజనం చేస్తూ ఎప్పుడు నీళ్ళు తాగాలో, తాంబూలం ఎలా

వేసుకోవాలో, ఎటువంటి స్త్రీతో రమించాలో, ఏయే వేళలలో భోగించాలో, ఎలా సత్ప్రవర్తన కలిగి ఉండాలో ఈ గ్రంథం బోధిస్తుంది.

ఆ రోజులలో భోగులు ఎలాంటి పుష్పాలు ధరించేవారో ఈ పద్యం చెపుతుంది :

''గేదగిపువ్వు దాలిచి సుఖింతురు మేలుజవాది పూసి హృ
న్మోదముగాగ గన్నెరులు మొల్లలతో వకుళప్రసూనముల్
జాదులు పాటలంబులును సంపెగలున్ శతపత్రకంబులున్
శ్రీ దనరారు భోగులు ధరింతురు కస్తురి గూర్చి వేడుకన్.'' (12)

ఉత్త పువ్వుల వాసన చాలదు కాబోలు, లేక వాటిలోని దోషాలను పోగొట్టడానికో కర్పూరం కూడా కలిపి ధరించేవారు. చూడండి:

''గోరంటుపువ్వు మరువము - చేరిక విరవాజివిరులు చెంగలువులు క
ర్పూరమున గూర్చి ముడుతురు - నారీజనపంచబాణ! నాగమయప్పా!'' (13)

అప్పనమంత్రి చక్కని శృంగారపురుషుడు కాబట్టి వేసవి రాత్రులలో జాణలు ఎటువంటి పువ్వులు ధరించేవారో, ఏ నీరు చల్లుకొనేవారో చెప్తున్నాడు.

''మొల్లలు జాజి క్రొవ్విరులు మొత్తములున్ గరవీరరాజి దా
వెల్ల దొలంకు పువ్వు కురువేరు త్రిదోషహరంబు లారయన్
చల్లదనంబు దీన సహజంబగు గొజ్జగనీరు గొంత పై
జల్ల ధరింతు రర్థి మెయి జాణలు వేసవిరాత్రు లెప్పుడున్.'' (14)

ఎండకాలంలో చలువ నిచ్చే పువ్వులు ధరించినట్టే, శీతకాలంలో వేడి చేసే పుష్పాలను ముడవడం అవసరం. అందుకే చెప్తున్నాడు:

''పొన్నలు చేమంతులు సుర
పొన్నలు సంపెగలు మొగలిపువ్వులు పొగడల్
పన్నుగ హిమమున ముడుతురు
ఇన్నియు నుష్ణంబులగుట యెరిగిన భోగుల్.'' (16)

మొగలిపువ్వుకంటె మొగి చెంగలువ కంటె మేలు పువ్వు పుడమి మీద లేదన్నాడు (20). బంతిలో ఎవరూ లేకుండా భోజనం చేయకూడదన్నాడు.

పెక్కండ్రు లేకయున్నను
నొక్కడిరువురైన బంక్తి నాగిగుడువక తా
నొక్కండ భుక్తిగొనుట ది
యెక్కుడు నింద్యమని చెప్పిరిద్ధ చరిత్రుల్ (33)

—

భుక్తి ముందర నాలుగుసార్లు, భోజనోత్తరమున రెండుసార్లు. అటుపైన రాత్రి ఆరుమార్లు తాంబూల సేవ చేయమన్నాడు.

వదన వికాస సౌరభవివర్ధన కారి లసన్మదాపహం
బుదర విశేష సౌఖ్యకర ముగ్ధత దోషబలప్రహారిస
మ్మద జనకంబు తమ్ములము మానవతీ పరిభోగవేళలన్
మదన పునర్భవీ కరణ మంత్రము తుల్యమె దాని కెద్దియున్ (51)

అప్పనమంత్రి తాంబూలానికి సాటి ఏదని ప్రశ్నిస్తే ఇంతకు ముందు తన శతకంలో సుమతి భీమన ''పలుతోమిసేయు విడియము వెల యింతని చెప్పరాదు వినురా సుమతీ'' అన్నాడు. (పద్యం 66)

అంతేకాదు. ఇంకా యిలా చెప్పాడు:

వీడెము సేయని నోరుం
చేడెల యధరామృతంబు జెందని నోరు
బాడగనేరని నోరున్
బూడిద కి ర వైన పాడుబొందర సుమతీ (80)

అయితే అప్పనమంత్రి ఏయే వ్యాధులున్నవారు తాంబూలం వేసుకోకూడదో కూడా చెప్పాడు. (54)

భోగజీవితం కాంక్షణీయమేగాని స్త్రీని ఎప్పుడు అనుభవించాలో, ఎప్పుడు కలవకూడదో, అలా కాదని కలిస్తే వచ్చే పరిణామాలేమిటో చెప్పాడు.

సురతంబు పగలుచేసినఁ
బురుషుని యాయువు నశించు; పుట్టును పాపో
త్కరమగు సంతతి సంధ్యల;
సిరిదొలగును బర్వ తిథుల; సిద్ధము రాత్రిన్. (56)

అప్పనమంత్రి, ఎటువంటి స్త్రీ పొందు మంచిదో రెండు పద్యాలలో వివరించాడు.

''నలికపు గౌను చారుజఘనంబును వట్రువ వల్దచన్నులున్
బలుచని దీర్ఘనీలకచభారము జెన్ను మొగంబు వాలుగ
న్నులు మెరుగారి సన్నమయి నున్నగు చామనఛాయ గాత్రమున్
బలితపు సిగ్గు గల్గు నెలప్రాయపు సుందరి బొంద మేలగున్. (58)

మెలగునప్పుడ క్రొక్కారు మెరుగువోలె
బ్రాంతమున నిల్చినప్పుడు ప్రతిమబోలి

యురమునను జేర్చినప్పుడు విరుల దండ
బోలు తిన్నని కామిని బొంద మేలు.'' (59)

ఈ 'చారుచర్య'ను వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పీఠికతో ముక్త్యాల సంస్థానాధీశులు ప్రకటించారు. వావిళ్ళవారు కూడ ప్రచురించారు. (1949). ప్రభాకరశాస్త్రిగారు తమ పీఠికలో ''కర్ణాటాంధ్ర భాషా ప్రబంధములలో గృతికర్త తన పేరనే సంబోధించుకొనుచు బద్యములను జెప్పుకొను సంప్రదాయము కొన్ని ప్రాచీన కృతులందు గానవచ్చుచున్నది. తెనుగున బద్దెన నీతి యట్టిది. ఈ చారుచర్యకును, నా బద్దెన నీతికిని శైలియందు సాదృశ్యము కొంతయగుపడుచున్నది. ఏకకాల రచనములయి యుండునని నాతలపు ఆ బద్దెన తిక్కనకించుమించుగా సమకాలము వాడగునని తలపబడుచున్నాడు. ఈయనయు నప్పటి వాడు కాదగును. అనగా మడికిసింగనకు నూరేండ్లు ముందున్న వాడగునన్నమాట'' అని రాశారు.[1] ఈ సంగతులు అంగీకరిస్తూ చాగంటి శేషయ్యగారు ''ఈ కవి క్రీ.శ. 1350 ప్రాంతము వాడ''ని తమ అభిప్రాయం చెప్పారు.

వ్రాతప్రతులలో భోజుని సంస్కృత చారుచర్య రెండు విధాలుగా ఉందనీ. ఒకటి చిన్నదనీ, రెండోది కొంచెం పెద్దదనీ ప్రభాకరశాస్త్రిగారు చెప్పారు. ''ఈ తెలుగు రచన భోజుని గ్రంథమున కనువాదమేగాని సరియైన తెనిగింపు కాదు. ఆ రెండు తెరగుల సంస్కృత గ్రంథములకును నివి సంగ్రహముగా నున్నవి. వానిలోని విషయములన్నియు నిందుగానరావు'' అని వేటూరివారు చెప్పారు.[2]

భోజుడేగాక క్షేమేంద్రుడు కూడ ఒక చారుచర్య సంస్కృతంలో చెప్పాడు. దీనికి హిందీలో శ్రీ దేవదత్తశాస్త్రిగారు వ్యాఖ్యానం రచిస్తే, పి.వి. రమణారెడ్డిగారు తెనుగు వచనంలో వివరిస్తూ వ్యాఖ్యానం చేశారు.[3]

శ్రవ్యా శ్రీవ్యాసదాసేన సమాసేన సతాంమతా!
క్షమేంద్రేణ విచార్యేయం చారుచర్యా ప్రకాశితా!!
ఇతిశ్రీ ప్రకాశేన్ద్రాత్మజ వ్యాసదాసాపరాఖ్యా మహాకవీ
శ్రీ క్షేమేంద్ర కృతా చారుచర్యా సమాప్తాః!!

అని చివరన వుంది. భోజుని చారుచర్యకూ, దీనికీ సంబంధం లేదు.

'నీతిభూషణం' వ్రాసిన ఆంధ్రభోజుడు, భోజుని చారుచర్యను తెనిగించిన ఈ అప్పనమంత్రే అని నేను భావిస్తున్నాను. ఇద్దరూ భిన్నవ్యక్తులయినా ఇతడు కాకతీయ యుగంలోని వ్యక్తే.

---

1. చారుచర్య - ఉపోద్ఘాతం (1922)
2. ఆంధ్రకవి తరంగిణి - నాలుగవ సంపుటం. పుట 129
3. చారుచర్య పి.వి.రమణారెడ్డి (తె. అనువాదం) నరసారావుపేట, 1979.

శివదేవయ్య

తెలుగు కవులలో చాలామంది నామధేయాల వల్లనే అమాత్యులుగా చలామణి అవుతున్నారు. కాని, మహాసామ్రాజ్యానికి మంత్రిత్వం చేస్తూ కవిగా, అందులోనూ సంస్కృతాంధ్ర కవితా పితామహుడుగా పేరుపొందినవాడు శివదేవయ్య. ఇతడు కాకతీయ సామ్రాజ్యాన్ని పాలించిన గణపతిదేవ చక్రవర్తివద్ద, రుద్రమదేవివద్ద, ప్రతాపరుద్రునివద్ద మంత్రిగా ఉండి మన్ననలు పొందాడు. ఇతణ్ణి చూసిన తిక్కనగారు ఈయన సాక్షాత్తూ ఈశ్వరుడని ప్రస్తుతించారట. ఈ సంగతి సోమదేవరాజీయంలో ఉంది.[1]

మంత్రిగానేకాక మహిమాస్పదుడుగా ఇతణ్ణి గురించి కొన్ని కథలున్నాయి. ప్రతాపరుద్రుని పట్టపురాణి శివదేవయ్యగారి విగ్రహానికి నిత్యం పూజ చేసేదట. రాజుగారితోపాటు శివదేవయ్య కూడ ఒక శివరాత్రినాడు ఉపవాసమున్నాడు. ఇద్దరూ పచ్చి మంచినీళ్ళు కూడ ముట్టలేదు. అలాంటప్పుడు శివదేవయ్యగారు గర్రున త్రేన్చాడట. భుజించకుండానే త్రేన్పు ఎందుకొచ్చిందయ్యా అంటే, ప్రతాపరుద్రుని రాణి శివునికి నైవేద్యం పెట్టిందట. అది దేవునిలాంటి శివదేవయ్య స్వీకరించడం జరిగిందట. ఈ కథ ప్రతాపచరిత్రలో ఉంది.[2] ప్రతాపరుద్రుని భార్య శివదేవయ్యగారిని రోజూ పూజించడానికి కారణమేమిటంటే, ఒకనాడు శివదేవయ్యగారు అంతఃపురంలోకి వచ్చినప్పుడు ఆయన పరపురుషుడని ఆమె లోనికి తప్పుకొన్నదట. ప్రతాపరుద్రుడు ఆమెను మందలించి ''శివదేవయ్యగారు పరపురుషుడేమిటి? పరమేశ్వరుడు. ఆయనను పూజించు'' అని చెప్పాడట. ఈ కథవల్ల శివదేవయ్యగారికి అంతఃపురంలోకి నిరాఘాటప్రవేశముండేదనీ, రాణివాసపు స్త్రీల సమక్షంలో కూడ ఆయన రాజుతో మంత్రాంగం చర్చించేటంత నమ్మకస్థుడనీ మనం ఊహించవచ్చు.

ఈ మహామంత్రి కవిత్వం కూడ చెప్పేవాడని మనకు అనంతర కవుల గ్రంథాలవల్ల తెలుస్తున్నది. తుళ్ళూరి శరభరాజకవి 'శరభరాజీయం' అనే గ్రంథం వ్రాశాడు. అందులో తన వంశానికి శివదేవయ్యే మూలపురుషుడని చెప్పుకొన్నాడు. అతణ్ణి నుతించాడు.

> ''శ్రీమదష్టాంగ ప్రసిద్ధయోగాభ్యాసి ధరనోరుగంటి సత్పురనివాసి
> ప్రాణలింగార్జిత భావసంచయమౌళి యజ్ఞానతిమిర సంహారహేళి
> బోధ సన్మిత్రంబు పోష్యదయాశాలి శోభితాశాంతయశోవిశాలి
> అమలశ్రీవత్స సంయమిగోత్రపావని వర్ణితసకల విద్వన్నిధాని

---

1. ద్వితీయాశ్వాసం, 39–40. ''పనుచమనెడ తిక్కనుఖియ, జ్జన వరసింహాసనమున సచివాగ్రణియై, తనరెడి శివదేవయ్యం, గనుగొని యా రాజుతోడ గడకం బలికెర్. వసుమతీనాథ! ఈత డీశ్వరుడుగాని, మనుజమాత్రుండు గాడు బల్మారు నితని, యనుమతంబున నీవు రాజ్యంబు నెమ్మి, నేలుమని చెప్పి యా ఘనుం డేగుటయును.''
2. సిద్ధేశ్వర చరిత్రము. సంపాదకులు : ఖండవల్లి లక్ష్మీరంజనంగారు. పుట. 156.

సంతతోల్లాసి దిననాథసమవిభాసీ
రహితదుష్కర్మి నిత్యసన్మహితధర్మి
యనగ నుతికెక్కి శివదేవు డనెడు యోగి
నాయకుండు సదా మోక్షదాయకుండు.

అతడు ప్రతాపరుద్ర వసుధాధిపుచేత నవాగ్రహారముల్
హితమతి నంది నిత్యసచివేశ్వరసంతతి కెల్ల మేటియై
యతులిత సంస్కృతాంధ్రకవితావళి కెల్ల బితామహుం డనన్
సతతము వన్నె కెక్కి బుధసంఘములోన మహాప్రసిద్ధుడై.''

ఈ రెండవ పద్యంలో ''సంస్కృతాంధ్రకవితావళికెల్ల పితామహుండనన్' అనే మాటలు ముఖ్యంగా మనం గమనించాలి. ఈ పద్యాన్ని ఉదాహరిస్తూ 'ప్రథమాంధ్ర కవితాపితామహుడు-శివదేవయ్య' అని నిడుదవోలు వెంకటరావుగారు భారతిలో ఒక వ్యాసం వ్రాశారు.[3] ''ఈతడే ఆంధ్రకవితా పితామహుడన్న బిరుదము ధరించినవారిలో మొదటివా''డని వారు చెప్పారు. అయితే శరభరాజు పద్యంవల్ల శివదేవయ్య ''సంస్కృతాంధ్రకవితావళికెల్ల పితామహు'డని తెలుస్తున్నది గాని ప్రత్యేకంగా 'ఆంధ్ర కవితాపితామహ' అనే బిరుదు ఉన్నట్లు కచ్చితమైన సాక్ష్యం లేదు.

శివదేవయ్య ఏయే పుస్తకాలు వ్రాశాడో తెలియదు. అయినా ఇతని గ్రంథాల పేర్లను ఊహించడానికి వీలుంది. కొందరు లక్షణకర్తలు ఇతని పద్యాలను ఉదాహరించారని మొదటిసారిగా మానవల్లి రామకృష్ణకవిగారు 'సకలనీతి సమ్మతం' అనే పుస్తకం పీఠికలో యిలా వ్రాశారు: ''పురుషార్థసారము గణపతికిని, రుద్రమదేవికిని మంత్రియగు శివదేవయ్యచే రచితమని 'శివదేవయ్య పురుషార్థసారములో' అను ఉదాహరణముల వలన నూహింపదగియున్నది. అతడు పురుషార్థసారముగాక 'శివదేవధీమణీ!' యను మకుటముగల యొక శతకమును గూడ రచించినట్లు తోచుచున్నది. బాలబోధమునను, లక్షణశిరోమణిలోను పురుషార్థసార, శివదేవ శతకపద్యము లుదాహృతములయ్యె.''[4]

బాలబోధచ్ఛందాన్ని లింగమగుంట తిమ్మన వ్రాశాడు. ఇతడు క్రీ.శ. 1560 ప్రాంతాలలో వున్నవాడు. 'లక్షణశిరోమణి'ని పొత్తపి వెంకటరమణకవి వ్రాశాడు. ''ఇందులో పెక్కు ప్రాచీన గ్రంథముల నుండి లక్ష్యములు గైకొనబడినవి. దీనింబట్టి చూడగా నీకవి అప్పకవి కంటె బూర్వుడుగా దలపదగియున్నాడు'' అని ఆంధ్రసాహిత్య పరిషత్తువారు వ్రాశారు.[5] అప్పకవి కాలం మనకు తెలుసు. అది క్రీ.శ. 1658. అందుచేత పొత్తపి వెంకటరమణకవి 1600 ప్రాంతాల వాడనుకోవచ్చు. దీనివల్ల 17-వ శతాబ్ది ప్రారంభం దాకా శివదేవయ్య పుస్తకాల ప్రతులు దేశంలో దొరికేవని తెలుస్తున్నది. ఇతని

3. భారతి. సంపుటి 23, సంచిక 3.
4. సకలనీతిసమ్మతము, పీఠిక, పుట 4.
5. 'పరిషత్పుస్తక భాండాగారము' మూడవ భాగము - 'లక్షణ గ్రంథములు', పుట 6.

గ్రంథాలను చదివిన అనంతర కవులు ఇతణ్ణి పూర్వకవి స్తుతిలో పేర్కొన్నారు. క్రీ.శ. 1678–1693 ప్రాంతాలలో వుండిన ఎడపాటి ఎర్రన తన మలహణ చరిత్రలో యిలా నుతించాడు.

''వినుతు లౌనర్తు నంధ్రకవిప్రభు నన్నయభట్టు – తిక్క
యజ్వను, శివదేవు భాస్కరుని...''

క్రీ.శ.1680 ప్రాంతాల 'నాగరఖండం' రచించిన జంటకవులు అయ్యంకి బాలసరస్వతి – తురగా రాజకవి ఇలా ప్రశంసించారు:

''శివతత్త్వు, శివదేవు, చిన్మయు, భవదూరు
శరభాంకు, రాజశేఖరుని, వేము
నన్నపను దిక్కనను బ్రబంధపరమేశు...''

క్రీ.శ. 1760 తర్వాత 'తోభ్యచరిత్రం' వ్రాసిన పింగళి ఎల్లన ఇలా కీర్తించాడు.

''చెలగి యథావాక్యముల యన్నమయగారి
భజియించి మ్రొక్కిడి పాలకురికి
సోమన్నగారి బ్రస్తుతిజేసి ప్రియమంది
శివదేవముఖనవకవుల నెంచి...''

పురుషార్థసారాన్ని మొదట పేర్కొన్నవాడు మడికిసింగన. ఇతడు వివిధ నీతిశాస్త్రాల సారాన్ని సేకరించి 'సకలనీతిసమ్మతం' అనే సంకలన గ్రంథాన్ని చేశాడు. అందులో శివదేవయ్య పద్యాలను విరివిగా వాడుకొన్నాడు. సింగన కాలం క్రీ.శ. 1347.

రామకృష్ణకవిగారు అచ్చువేసిన సకలనీతిసమ్మతం మూడాశ్వాసాల పుస్తకం. 992 గద్యపద్యాలున్నాయి. వీటిలో 90 పద్యాలు పురుషార్థసారం నుండి గ్రహించినవే. దుర్గ సంరక్షణం, ఆజ్ఞాపాలనం, ప్రజాపాలనం, రాజాదాయ వ్యయప్రకారం, రాజనీతి, విషపరీక్షాలక్షణం, వాచక లక్షణం, బ్రాహ్మణాచారం, రాయబార ప్రకారం, చారుల నీతులు, రాజభృత్యుల నీతులు, సేవక నీతులు, సేవకు కొరగాని రాజులు, అష్టాదశ వ్యసనములు, అనసూయత, దండయాత్ర, శకునజ్ఞానము, ప్రయాణ వ్యసన పరీక్ష, చోరనీతులు అనే 19 శీర్షికల క్రింద పురుషార్థసారంలోని పద్యాలను వాడుకొన్నాడు. ఇంత విపులంగా ఉదాహరించడానికి పనికివచ్చిన పురుషార్థసారం ఆనాటి ప్రామాణిక గ్రంథాలలో ఒకటి అని చెప్పక తప్పదు. ఇందులోని విషయాలను ప్రతాపరుద్రుడు తు.చ. తప్పక అమలు జరిపి ఉంటాడని కూడా ఊహించవచ్చు.

ప్రతాపరుద్రుడు రాజ్యానికి వచ్చిన వెంటనే పరిపాలన విధానాన్ని సంస్కరించి, సామ్రాజ్యము నంతటిని 77 నాయంకరములుగా విభజించాడు. వాటికి తనను ఆశ్రయించు కొన్న నమ్మకస్థులను అధిపతులుగా నియమించాడు. ఈ సంస్కరణ శివదేవయ్య ఉపదేశం వల్లనే జరిగి ఉంటుందని పురుషార్థసారంలోని ఈ క్రింది పద్యంవల్ల తెలుసుకోవచ్చు.

''రాజుల సమ్మతిఁ దరతరంబుల ప్రాతల భక్తియుక్తులఁ
రాజితశస్త్రధారుల బరాక్రమవంతుల నప్రమత్తులన్
భోజన హేమవస్త్ర పరిపుష్టులు హృష్టులు నైనవారిగా
నోజ యొనర్చగావలయు నొద్దను పాయకయుండ భృత్యులన్.''
(పురుషార్థసారంలోనిదిగా చెప్తూ సకలనీతి సమ్మతంలో, 178)

పురుషార్థసారంలోనుంచి 90 పద్యాలను వాడుకొని, మడికిసింగన అది అసలు ఎవరు వ్రాశారో చెప్పలేదు. బహుశా అతని కాలం నాటికి అది చాలా ప్రసిద్ధమై ఉంటుంది. అందుకే చెప్పవలసిన అవసరం లేదనుకొన్నాడేమో!

మడికిసింగన వినియోగించిన 90 పద్యాలలోనుంచి శివదేవయ్య శైలిని, చెప్పే తీరును, వాడే ఉపమానాలను తెలుసుకోవచ్చు. పురుషార్థసారం కథాకావ్యం గాదు కాబట్టి ఇవి రసవంతంగా లేకపోవచ్చును. రుచిరార్థ సూక్తులు, లోకజ్ఞత ఉన్నాయని ఇవి చెప్తాయి.

చేనుకు కంచెవేసి అది బాగా పండాక ఫలసాయాన్ని ఎలాగైతే అనుభవిస్తామో అలాగే ప్రజలను ఆజ్ఞాపాలనం అనే కంచెతో కాపాడి ఫలింపజేయాలని ఈ క్రింది నీతి చెప్పాడు.

''వెలుగుబెట్టి చేనుగలయంగ బండిన - నురిపి ఫలముగొన్న తెరగుదోవ
నాజ్ఞవెట్టి ప్రజల నరియప్పనంబులు-గొనగవలయు రాజకుంజరుండు.''
(సకలనీతి. 82)

బ్రహ్మసృష్టిలో పశువు పశువే! పులి పులే! కాని, రాజు తలుచుకుంటే పసరం పులి అవుతుంది! పులి సాధువౌతుంది అని ఈ క్రింది పద్యంలో చెప్పాడు.

''పసరము బసరము, పులి బులి,
బిసరుహసంభవుని దృష్టి పెంపెంతమహిఁ?
పసరము బులిజేయు బులిం
బసరముగా జేయు నృపతి బల మది గాదే?'' (సకలనీతి. 83)

తగినంతవిధంగా ప్రజలను రక్షించక వాళ్ళమీద పడి తినే రాజు ఎటువంటి మూర్ఖుడో చెప్పాడు.

''చాల బ్రజ బ్రోవకయ తా
గోలాసఁ బాడి దప్పికొనుచుండెడి భూ
పాలకుడు కుప్పజిచ్చిడి
పేలాల్ వెదకికొని తినెడి బేల తలంపఁ.'' (సకలనీతి. 107)

కాకతీయ యుగంలో శైవమతం బాగా విజృంభించినా ఆనాడు లోకాయతులు, చార్వాకులు మొదలైన హేతువాదులు కూడ ఉండేవారని తెలుసుకోవచ్చు. ఇటువంటి నాస్తికులను దూరం చేయడం 'సుగుణం' అని శివదేవయ్య ఈ పద్యంలో చెప్తున్నాడు.

''సకల జనానురంజనము సత్యము శౌచము మంత్రగోపనం
బకృపణవృత్తి దక్షత ధనార్జితశీలత భోగమీగి నా
స్తిక ఖలసంగవర్జనము శిష్టవిధేయత దుష్టనిగ్రహం
బకుటిలభావమింద్రియజయంబు గుణంబులు భూమిభర్తకున్.'' (సకలనీతి.144)

ఆనాడు రాజసభలలో వాచకులు ఉండేవారు. వచ్చిన లేఖలు మొదలైన వాటిని చదవడం వాళ్ళ వృత్తి. వాచక లక్షణాలను శివదేవయ్యా మూడు పద్యాలలో వివరించాడు.

''వెనుకకుబోక హాయనక వేసటనొందక బంతి బంతిలో
బెనపక కానమింబ్రమసి బెగ్గిలకెంతయు మున్ను సూచుచున్
గనుకని యక్షరాక్షరము కందువు దప్పక యేక చిత్తుడై
యనుపమభక్తితో జదువునాతని వాచకులండ్రు సజ్జనుల్.'' (306)

''ఊరక మురియక యుబ్బసంబందక వెరవక దేహంబు విరిచికొనక
నిడుసున బెట్టక నిప్పోటమునబోక తరవాయిదప్పక తడవికొనక
యక్షర స్పష్టత యనగీతనష్టత గాకుండ నర్థంబుగానబడగ
నయ్యైరసంబుల కనురూపముగ బెక్కు రాగముల్ ఫణితులు బాగుపుట్ట
చెరకుకొననుండి నమలిన చెలువుదోప - నంతకంతకు వేడుక యతిశయిల్ల
జదువుచున్నారువీరల చదువుబోల- జదువులేదని పొగడిరి సభికవరులు.'' (307)

''వడకక నిక్క కీయనక వ్రాలక తోలక తూలిపోక సం
దడిబడ కెన్నికోక గతిదప్పక తుమ్మక దగ్గులేక వెర్
బడకటు వెక్క కుబ్బక నెపంబిడ కంజక వంజగాక రం
గుడిగి పఠింపగావలయు నో పటువాచక మెట్టి మేటికిన్.'' (308)

ఈ పై మూడు పద్యాలలోనూ మొదటి రెండు పద్యాలూ జైతరాజు ముమ్మయ్యా రచించిన 'విష్ణుకథానిదానం'లోని పద్యాలని చెప్తూ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రబంధ రత్నావళిలో పొందుపర్చారు. (నెంబరు ప్ర.ర.లో వరుసగ 399, 376)

ఆ కాలంలో ఇచ్చిన అడ్డమైనవారి దగ్గరా బ్రాహ్మణులు దానాలు పుచ్చుకోవడం పరిపాటి కాబోలు. అది చూచి శివదేవయ్యా ఏవగించుకొన్నాడేమో! గంపెడు సంసారపు కడుపు నింపడానికి దానాలు పట్టడం కన్నా కాడిగట్టి మడి దున్నుకోవడం మేలని హితోపదేశం చేస్తున్నాడు.

''అతికాంక్ష దుప్ప్రతిగ్రహా - రతికంటెను బహుకుటుంబరక్షార్థముగా
క్షితిసురులకు కృషి సేయుట - హితమనిరి పరాశరాదు లిక్కలి వేళన్.''
(సకలనీతి. 316)

అగ్రవర్ణులు ముగ్గురికీ పరిచరులు లేకపోతే గడవదు గనుక ''సరసిజ సంభవుడు శూద్రజాతి సృజియించెన్'' (455) అనీ, రాజు దేవాంశోద్భవుడనీ, అతణ్ణి మానవమాత్రునిగా తలచగూడదనీ (458) బోధించాడు. రాజాజ్ఞ వెలుగకపోతే ప్రపంచం అంధకార మవుతుందని చెప్పాడు.

''భూతలపతి వితతాజ్ఞా- జ్యోతి బ్రవర్తింపకున్న సూర్యాగ్ని శశి
జ్యోతులు వెలుగవుగానవి- చేతనముం బొంది సృష్టి చీకటిగాదే.'' (సకలనీతి. 80)

ప్రజలను చెరిచి కూడబెట్టిన ధనాన్ని ఖర్చు పెట్టాలనీ, ప్రజలూ డబ్బూ పెరిగిపోతే భుజబలంతో రాజు నిభాయించుకోలేడనీ ఆర్థిక సూత్రాలను చెప్పాడు.

''ప్రజ జెరిచి కూడబెట్టిన
నిజధన మది వలయు వ్యయము నిచ్చలు జేయన్
బ్రజయును ధనమును బొలిసిన
భుజబలమున నిలువదరమె భూపతి కెందున్?'' (సకలనీతి. 123)

తన్నుమాలిన ధర్మం లేదని, రాజు తనను తాను రక్షించుకోవడమే విజయమని ఈ క్రింది పద్యంలో చెప్పాడు.

''జనలక్ష్మికి, ధనలక్ష్మికి - ననుపమ మగు ధర్మలక్ష్మి కాత్మయ మూలం
బని యాత్మరక్ష మరవక - జననాథుడు సేయవలయు సతతము ప్రీతిన్.''

శివదేవయ్య ఒక శతకాన్ని కూడా వ్రాశాడనీ, దాని మకుటం ''శివదేవధీమణీ!'' అనేదనీ రామకృష్ణకవిగారు చెప్పారు. రెండు ఉదాహరించారు.[5]

''అరయగ బిన్ననాట సిరియాళుడనై యెలబ్రాయమందు సుం
దరుడను నంబియై పదనుదప్పిన గుండయగారి చందమై
ధర జరియింపగల్గిన దథాస్తు వృథాపరిపాక రూపదు
ష్కరజననం బిదేమిటికి గాలుపనే శివదేవధీమణీ!''

ఇది ఎవరో శివదేవయ్య మీద చెప్పి ఉంటారు. లేకపోతే బద్దెనలాగ, రేచనలాగ, వేమనలాగ శివదేవయ్య తన్ను తాను సంబోధించుకొని చెప్పి ఉంటాడని అందరూ భావిస్తున్నారు. సిరియాళుడు, సుందరనంబి, గుండయలు శైవభక్తులు. సిరియాళుడు అరువత్తుమూవరులో ఒకడు. ఇతని కథను పాల్కురికి సోమనాథుడు ప్రచారం చేశాడు. వీరశైవం విస్తరిల్లిన రోజులలోనే ఈ పద్యం పుట్టి ఉంటుంది.

---

5. మానవల్లి రామకృష్ణకవిగారు 1923లో 'సకలనీతి సమ్మతము' పీఠికలో ఈ రెండూ ఉన్నాయి. చూ... ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి పునర్ముద్రణ - (1970) పుటలు 87, 88.

'శివదేవధీమణీ' శతకంలోనిదేనని ఇంకొక పద్యాన్ని మానవల్లివారు ఇలా ఇచ్చారు.

''ప్రాణు నపాను గూర్చి యల పాము గదల్చి తదూర్ధ్వకీలితో
డ్యాణము నొత్తి మేను దృఢమై నిగుడం బిగియించి దృష్టులం
ఘోణము చేర్చి యాప్రణవఘోషణమున్ విని యందు మానస
క్షీణము సేసినం బసవసిద్ధుడనా శివదేవధీమణీ!''

ఈ పద్యాన్నే తిక్కనగారు తమ భారతంలో అనుసరించారని నిడుదవోలు వెంకటరావుగారు అభిప్రాయపడుతున్నారు.[6] అందుకు ఆధారంగా భారతంలోంచి ఈ పద్యాన్ని చూపెట్టారు.

''ప్రాణు నపానునందును నపానుని బ్రాణునియందు నిల్పి ని
ర్వాణము గోరి చిత్తము దిరంబుగ బట్టగ బ్రాణసంయమా
క్షీణత దేహిమధ్యశిఖి జిమ్మగ దత్త్రయ మొంది మూర్ధపా
రీణత గోర్కిసల్పు నపరిచ్యుతి దర్గతుడైన యోగికిన్.'' (ఆనుశాసనిక. 5-260)

తిక్కనగారే శివదేవయ్యను అనుసరించారనడానికి ఆధారమేమిటి? సౌప్తికపర్వం ద్వితీయాశ్వాసంలో కృష్ణుడు ధర్మరాజుకు శివుని మహిమను చెప్పే ఘట్టంలో ''తెల్లమిగాగ నేను శివదేవునెరుంగుదు'' అనే పద్యపాదంవల్ల తిక్కనగారు శివదేవయ్యను ఎరుగుదురన్న సంగతి ధ్వనిస్తున్నదని వెంకటరావుగారు శతక కవుల చరిత్ర - అనుబంధంలో వ్రాశారు.

తిక్కనగారి దృష్టిలో శివదేవయ్య సాక్షాత్తూ ఈశ్వరుడేనని సోమదేవ రాజీయం వ్రాసిన కవి చెప్పిన సంగతి మనం ముందే చూశాం. ఈ శివదేవయ్యే కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని గురువైన విశ్వేశ్వర దేశికులై ఉంటారని చిలుకూరి వీరభద్రరావుగారి అభిప్రాయం. ఇద్దరూ భిన్న వ్యక్తులని చాగంటి శేషయ్యగారు మొదలైనవారి భావన.

'సంస్కృతాంధ్రకవితావళికెల్ల బితామహు'డని పేరు పొందిన శివదేవయ్య ఇతర కృతులు దొరికితేనేగాని అంత పెద్ద బిరుదు అతనికి ఎలా వచ్చిందో మనం తెలుసుకోలేము. ఆ కృతులు బయటపడనంతవరకు అతడు ఒక నీతిశాస్త్ర రచయితగానూ, శతకకర్తగానూ మాత్రమే నిలుస్తాడు.

6. వంగూరి సుబ్బారావుగారి శతక కవుల చరిత్ర అనుబంధం, పుట. 727.

మూలఘుటిక కేతన

కాకతీయ సామ్రాజ్యాన్ని గణపతిదేవ చక్రవర్తి పరిపాలించే కాలంలో వేంగి దేశంలో వెంటిరాల అనే అగ్రహారం వుండేది. దీనినే బహుశా వెర్రిరాల అనికూడ పిలిచేవారు. ఈ అగ్రహారానికి మూలఘుటికవారు అధికారులుగా వుండేవారు. వీళ్ళు చాలాకాలం నుంచి వెలనాటి చోడుల ఆస్థానంలో వుండేవారు. ఈ వెలనాటి చోళులు ఒకనాడు వైభవంగా వెలిగినవాళ్ళు. నేటి గుంటూరు జిల్లాలోని చందవోలు వీళ్ళకు రాజధాని. క్రీ.శ. 1180 ప్రాంతాలలో ఈ వంశంలోని రాజు ఉత్తరాన పిఠాపురం, దాక్షారామమేగాక శ్రీకూర్మందాకా జయించాడు. వేంగిలోని విద్వాంసులు వెలనాడును నమ్ముకొని వుండేవారు కాబోలు. దాక్షారామంలో పుట్టిన పండితారాధ్య మల్లికార్జునుడు వెలనాడుదాకా రావడం చాళుక్యయుగపు చివరిరోజులలోనే మొదలైంది. తీరాంధ్రంలో చాళుక్యుల తరవాత చెప్పుకోదగ్గ రాజులు వెలనాటి చోళులే. అయినా వాళ్ళ ప్రభ తిక్కనగారి కాలానికి కొద్ది ముందురోజుల్లోనే క్షీణించసాగింది. వెలనాటి చోళులలో రమారమి ఆఖరి రాజని చెప్పదగ్గ పృథ్వీశ్వరుణ్ణి నెల్లూరి తిక్కరాజు (మనుమసిద్ధి తండ్రి) బహుశా క్రీ.శ. 1206లో నిర్జించాడు. ఆనాటి నుంచి వెలనాటి చోళుల రాజ్యవైభవం తగ్గడమేగాక ఆ ఆస్థానాన్ని నమ్ముకొన్న కవులూ, విద్వాంసులూ వేరే కొమ్మలు పట్టుకోవడానికి ప్రయత్నాలు కూడా చేశారేమో అనిపిస్తుంది. క్రీ.శ. 1218 నుంచీ కాకతీయ గణపతిదేవుని శాసనాలు వెలనాడులో కనబడుతున్నాయి. నెల్లూరు చోళులు కూడా వెలనాడు మీద కొంత పరోక్షమైన పెత్తనం జరిపేవారేమో! మూలఘుటిక వంశంలో ముఖ్యుడైన కేతనకవి వేంగి వెలనాడు వదలి నెల్లూరికి ఏ కారణాలచేతనో మరి క్రీ.శ. 1246కు ముందే వెళ్ళవలసి వచ్చింది.

కేతన అప్పటికే ప్రసిద్ధుడు. ఆనాటికే అతనికి అభినవదండి అనే బిరుదు ఉండేది. అతడు 'సంస్కృత భాషాకర్తృత్వంలో నుతిగన్నవాడు.' వివిధ కళానిపుణుడు, కవిజనమిత్రుడు, విజ్ఞానానూన మనస్కుడు. మితవచనాలలోనూ, హితవచనాలలోనూ నిపుణుడు. నానాశాస్త్రజ్ఞుడు. ధర్మశాస్త్రాన్ని కరతలామలకం చేసుకొన్నవాడు, శబ్దశాస్త్రం తెలిసినవాడు. ఇతడు ఏవో రాజకీయ కారణాలవల్ల నెల్లూరుకు వెళ్ళివుంటాడు. ఏమంటే ఇతని బావమరిది బండారు కేతన చాలా ప్రసిద్ధుడు. వెలనాటి చోళుల దండనాథుడు. ఇతడు మంత్రిగా కీర్తికెక్కాడు. ఆంధ్రదేశంలో ముప్పయి ఇద్దరు ప్రసిద్ధ మంత్రులను కీర్తించే సీసమాలిక ఒకటి వుంది. అందులో బండారు కేతన పేరుంది. ''ఆత్మీయతపముచే నర్థివాలుకమడ్డు, కేడించె బండారు కేతమంత్రి'' అనే ప్రశంస కనబడుతుంది. ఈ బండారు కేతమంత్రి ఏదేనా రాజకీయ వ్యవహారాల మీద సున్నితమైన పరిష్కారం చేయవలసిన సమస్య నిమిత్తం మూలఘుటిక కేతనను నెల్లూరు పంపించి **వుంటాడు.**

నెల్లూరు రాజుల ఆస్థానంలో ఆనాడు కొట్టరువువారు అత్యంత ప్రముఖ స్థానాలలో ఉన్నారు. ఆ వంశంలో మీసం వచ్చిన ప్రతివాడూ మంత్రిగానో, దండనాథుడుగానో, మరొక ఉద్యోగంలోనో నెల్లూరు చోడులను కొలుచుకొంటూ వుండేవాడు.

తిక్కనగారు మనుమసిద్ధిమహీశ సమస్త రాజ్యభాగ ధౌరేయులు! వారి పెదతండ్రి సిద్ధనమంత్రిగారు మళ్ళా సూర్యవంశాన్ని నిలబెట్టినవారు. పెదతండ్రి కొడుకు ఖడ్గతిక్కన రాయవేశ్యా భుజంగ రాజ్యరత్నాకర స్ఫూర్తి, రాజమూర్తి గంధవారణ బిరుద విఖ్యాతకీర్తి. ఈ ఖడ్గ తిక్కన కొడుకులు నలుగురు. అందులోని ప్రతి ఒక్కడూ రూపానికి మన్మథుడు, దానానికి కర్ణుడు.

ఖడ్గ తిక్కనగారికి ఆరుగురు తమ్ముళ్ళున్నారు. అందులో పెద్ద తమ్ముడు ఒక మంత్రి భాస్కరుడు. కడగొట్టు తమ్ముడికన్నా ముందువాడు చినభాస్కరుడు సైతం గొప్ప వీరుడు. క్రీ.శ. 1215లో జరిగిన సేవణ దండయాత్రను అరికట్టడంలో పేరుతెచ్చుకొన్నాడు.

తిక్కనగారి పెదతండ్రిగారూ, వారి ఏడుగురు పుత్రులూ ఇంతటి ఉద్ధండులైతే ఇక తిక్కనగారి తండ్రి ''సూర్యవంశ భూపాల సురుచిర రాజ్యావన వసంతుడు'' ఈ కొమ్మనామాత్యుడు కేవలం రాచకార్యాలలోనేకాక విద్యావంతులతో కూడా కాలం గడపేవాడు కాబోలు. ఇతనిని బుధలోకవత్సలుడని కూడా చెప్పుకొంటారు.

రాజకీయోద్యోగాలలో ఇంత ప్రముఖ స్థానాలు వహించిన కొట్టరువు వారితో ఏపని పడిందో, మూలఘటిక కేతన నెల్లూరుకు వచ్చి తిక్కనగారిని కలుసుకొన్నాడు. అప్పటికే సంస్కృత రచనలు చేసిన, 'అభినవదండి' అని బిరుదు పొందిన కేతనను చూశాక తిక్కనగారంతటివాడు తానూ ఒక కృతి అంకితం పుచ్చుకోవాలనుకొన్నారు. ఒకనాడు కేతనగారిని అత్యాదరంతో రావించి, ఆసనం, అర్ఘ్యం, పాద్యం, తాంబూలం, అంబరాలు, ఆభరణాలు, దానాలు మొదలైన ఉపచారాలు చేసి, ''కేతనా! నీవు సంస్కృతాద్యనేక భాషా కావ్యరచనా విశారదుడవన్న సంగతి జగత్ప్రసిద్ధం. కాబట్టి ఒక కావ్యం రచించి నన్ను కృతిపతిని చెయ్యాలి'' అని సగౌరవంగా ప్రార్థించారు. కేతన కూడ తన కావ్యకన్యకకు తగిన వరుడు అవుతాడని తిక్కనగారి మనోరథం సఫలం కావించడానికి దండి సంస్కృతంలో గద్యాన చెప్పిన దశకుమార చరిత్రను తెలుగులో గద్యపద్యాలున్న కావ్యంగా చెప్పాడు.

అందువల్ల తెలుగులో తొలి కథాకావ్యం పుట్టింది.

దండి దశకుమార చరిత్ర సంస్కృతంలో సుప్రసిద్ధమైన గద్యకావ్యం. పదలాలిత్యంతో, మనోహరమైన వర్ణనలతో, సజీవమైన పాత్రలతో, సమకాలిక జీవితాన్ని చిత్రించే ఘట్టాలతో, హాస్యవ్యంగ్య సంభాషణలతో, రసోచితమైన కథనంతో సంస్కృత దశకుమార చరిత్ర లోకోత్తరంగా ఉంటుంది. కవి పదిమంది వీరకుమారుల సాహసగాథలను కథనం చేస్తాడు. వీళ్ళ వీరోచిత చరిత్రలో మొదట క్లుప్తంగా వీళ్ళ తండ్రుల వైనాలు, వాళ్ళంతా ఏ రాజులదగ్గర ఉండిందీ చెప్తాడు. యౌవ్వనం రాగానే దశకుమారులు సాహసయాత్రకు వెళ్ళి చెల్లాచెదురవుతారు. ఒక్కొక్కరూ ఒక్కొక్క విచిత్ర జీవితానుభవాన్ని పొందుతారు. అపూర్వ సంఘటనలలో చిక్కుకొంటారు. ఈ పదిమందీ మళ్ళీ కలుసుకొని తమతమ కథలు తమలో నాయకుడైన రాజకుమారునికి చెప్తారు. ఇదీ కథాబీజం. దీనిని కథనం చేయడంలో దండి గొప్ప ప్రజ్ఞ కనబరిచాడు.

ఇతడు చెప్పిన కథను మనం టూకీగా చెప్పుకుందాం:

పూర్వం మగధ దేశాన్ని రాజహంసుడు అనే రాజు పరిపాలిస్తూ వుండేవాడు. అతడికి ముగ్గురు మంత్రులు. ఆ ముగ్గురు మంత్రులకు వెరసి ఏడుగురు కుమారులు. ఈ ఏడుగురు కుమారులలో ఒకడు ప్రపంచం నిస్సారమని బౌద్ధయాత్రలకు పోయాడు. ఇంకొకడు దుర్వ్యసనాలకు లోనై దేశద్రిమ్మరి అయినాడు. మరొకడు సముద్ర వ్యాపారం చేస్తూ దేశాంతరాలు పోయాడు. ఇకపోతే నలుగురు మంత్రి కుమారులూ, రాజూ రాజ్యంలో ఉన్నారు. వీళ్ళు కూడా అట్టేకాలం రాజ్యంలో లేరు. శత్రురాజులు వచ్చి ఓడించడం వల్ల అడవులు పట్టిపోయారు. ఈ రాజుకి సహాయం చేయడానికి వచ్చిన మిథిలరాజుకే కష్టాలొచ్చాయి. అతడేమయాడో తెలియదు.

(1) అడవిలో మగధరాజు రాజహంసుడికి ఒక కొడుకు పుట్టాడు. అతడికి రాజవాహనుడు అనే పేరు పెట్టారు. దశకుమారులలో ఇతడు మొదటివాడు.

(2) సుమతి మంత్రికి ఒక కొడుకు పుట్టాడు. అతడికి 'ప్రమతి' అనే పేరు పెట్టారు.

(3) సుమంత్రుడనే అమాత్యుడికి కుమారుడు పుడితే ఆ బిడ్డకు 'మిత్రగుప్తు'డని నామకరణం చేశారు.

(4) సుమిత్రుడనే మంత్రికి పుట్టిన తనయుడికి 'మంత్రగుప్తుడు' అనే పేరు పెట్టారు.

(5) సుశ్రుతుడు అనే మంత్రికి పుట్టిన తనయుడికి 'విశ్రుతుడు' అనే పేరు పెట్టారు.

(6) మగధ రాజుకి సాయం చేయడానికి వచ్చిన మిథిల రాజు ఏమయ్యాడో తెలియదని చెప్పుకొన్నాం. అతని రాణికి కవల పిల్లలు పుట్టారు. ఒక బిడ్డని కొండవాళ్ళు ఎత్తుకుపోయి బలీయబోతూవుంటే ఒక ముని రక్షించి రాజహంస మహారాజు వద్దకు చేర్చాడు. ఈ బిడ్డకు ''అపహారవర్మ'' అని పేరు పెట్టారు.

(7) రాజహంస మహారాజు ఒకనాడు అడవిలో తీర్థస్నానానికి వెళుతూ ఉంటే ఒక కిరాతపత్ని చేతిలో ఒక అందమైన కుర్రాణ్ణి చూశాడు. ఆ బిడ్డ తన స్నేహితునికి పుట్టిన కవలలో రెండోవాడని తెలుసుకొని ఆ బిడ్డను తీసుకువెళ్ళి ఉపహారవర్మ అని పేరు పెట్టాడు.

(8) ఇందాకా రాజుగారి మంత్రుల కుమారులలో ఒకడు సముద్రయానం చేసి దేశాంతరాలకు పోయాడని చెప్పుకొన్నాం కదా. ఆ రత్నగర్భుడు చూలాలైన భార్యతో స్వదేశానికి తిరిగి వస్తూవుంటే ఓడ మునిగిపోయింది. గర్భిణి ఒడ్డుకు చేరింది. ఒక బిడ్డను కన్నది. ఆ బిడ్డను ఒక ఏనుగు ఎత్తుకొని వెళ్ళిపోయింది. ఆ ఏనుగు మీద ఒక సింహం గర్జించి దుమికింది. ఏనుగును చంపేసింది. బిడ్డ చివరకు ఒక మునికి దక్కాడు. ఆ ముని రాజు వద్దకు పంపించాడు. రాజహంస రాజు వాడికి పుష్పోద్భవుడని పేరుపెట్టాడు.

(9) ఒకనాడు రాజహంస మహారాజు వద్దకు అతని రాణి వసుమతీదేవి ఒక బిడ్డను ఎత్తుకొని వచ్చింది. 'ఎవరీ అబ్బాయి?' అని రాజు అడిగాడు. ''వ్యసనాలకు లోనై దేశాలుపట్టిపోయాడే ఒక మంత్రికుమారుడు, అతడికి ఈ బిడ్డ పుట్టాడట. వీడిని ఒక యక్షకన్య తీసుకొనివచ్చి నాకు ఇచ్చింది'' అని రాణి చెప్పింది. 'సరే వీణ్ణీ పెంచుదాం' అని రాజు ఆ కుర్రాడికి 'అర్థపాలుడు' అనే పేరు పెట్టాడు.

(10) లోగడ మంత్రికుమారులలో ఒకడు ప్రపంచం నిస్సారమైనదని తీర్థయాత్రలకు పోయాడని చెప్పుకొన్నాం. అతడు దక్షిణాదిన ఒకత్తెను పెళ్ళి చేసుకొన్నాడు. బిడ్డలు పుట్టకపోతే ఆమె చెల్లెల్ని చేసుకొన్నాడు. ఈ రెండోభార్యకు ఒక బిడ్డ పుడితే, మొదటి భార్య కన్నుకుట్టుకుంది. దాది బిడ్డను ఆడిస్తున్నప్పుడు వాళ్ళిద్దర్నీ కావేరీలో తోసేసింది. జలగండం చాలదన్నట్టుగా ఆమె పట్టుకొన్న కొమ్మనొక పాముంది. అది దాదిని కాటేసింది. దాది ఒక మునికి బిడ్డనప్పజెప్పి చచ్చిపోయింది. ఆ బిడ్డ రాజహంస మహారాజు వద్దకు చేరాడు. వాడి కథ విని వాడికి 'సోమదత్తుడు' అని పేరు పెట్టి పెంచాడు.

ఈ పదిమంది చిన్నవాళ్ళే దశకుమారులు. వీళ్ళు పెరిగి పెద్దవాళ్ళయ్యారు. యుక్తవయసు వచ్చాక పదిమందీ కలసి దిగ్విజయానికి వెళ్ళారు. దారిలో వింధ్యాటవిలో మకాం చేశారు. అక్కడో మాతంగుడు కనబడ్డాడు. అతడు రాజవాహన కుమారుణ్ణి కొంచెం ప్రక్కకు పిలిచి, తనకో సాహసోపేతమైన సహాయం చెయ్యమని కోరాడు. చెలికాండ్రతో చెప్తే వాళ్ళు ఒప్పుకోరేమో అని రాజవాహనుండు మిగతా తొమ్మండుగురికీ చెప్పకుండా ఆ రాత్రి మాతంగుడితో ఆ సహాయం చెయ్యడానికి వెళ్ళాడు.

ప్రొద్దుట లేచి చూస్తే రాజకుమారుడు లేడు. తొమ్మండుగురు అతడి కోసం వెదకడం మొదలుపెట్టారు. తలోదారిగా పోయారు. మళ్ళా ఒక సంకేత స్థలంలో కలుసుకోవాలనుకున్నారు.

రాజవాహనుడు చేసిన సహాయం వల్ల మాతంగుడు పాతాళ రాజయ్యాడు. ఆ లోకపు రాజకన్యను పెళ్ళిచేసుకొన్నాడు. ఈ ఉపకారం చేసి రాజవాహనుడు వింధ్యాటవి లోనికి వచ్చాక దశకుమారులలో మిగతావాళ్ళు కనబడలేదు. వాళ్ళకోసం వెదుకుతూ, తిరుగుతూ తిరుగుతూ ఉండగా మొదట సోమదత్తుడు కనిపించాడు. తన కథ చెప్పాడు.

1. సోమదత్తుని కథ:

రాజవాహనుణ్ణి వెదుకుతున్న సోమదత్తుడికి ఒక రత్నం దొరికింది. దానిని అతడు కుచేలుడులాంటి పేదబ్రాహ్మణుడికిచ్చాడు. అతణ్ణి రాజభటులు బంధించారు. ఆ బ్రాహ్మణుడు నాకేం తెలియదు, ఇచ్చింది ఇతడు అని సోమదత్తుణ్ణి చూపించాడు. భటులు అతణ్ణి బంధించారు. కారాగారంలో పారేశారు. అక్కడ కొందరు దొంగలున్నారు. వాళ్ళు నిజంగా దొంగలు కారు. ఆ దేశం రాజుని చంపడానికి వచ్చిన గూఢచారులు. వాళ్ళ

సంకెళ్ళను సోమదత్తుడు బ్రద్దలు కొట్టాడు. అందరూ తప్పించుకొనిపోయారు. వీరకేతువు అనే రాజును కలుసుకొని అతని శత్రువుని ఓడించారు. సోమదత్తుడి ప్రతాపానికి మెచ్చుకొని వీరకేతువు తన కూతుర్నిచ్చి పెళ్ళిచేశాడు. ఆమెతో కలసివస్తూండగానే రాజవాహనుడు కనబడ్డాడు. వీళ్ళిద్దరూ కలుసుకొన్నాక అక్కడికి పుష్పోద్భవుడు వచ్చాడు. తన కథ రాజవాహనుడికి వినిపించాడు.

2. పుష్పోద్భవుని కథ:

తన రాజకుమారుణ్ణి వెదుక్కుంటూ వెళ్ళిన పుష్పోద్భవుడికి కొండమీంచి పడిపోతున్న ఒక మనిషి కనిపించాడు. ఆ మనిషిని భూమిమీద పడనివ్వకుండా అతడు రక్షించాడు. వివరాలు కనుక్కుంటే తీరా ఆ మనిషి తన తండ్రే. పదహారేళ్ళ తరవాత నీ కొడుకు కనబడతాడని ఎవరో జోస్యం చెపితే ఇన్నాళ్ళూ ఆగాడు. ఇంక లాభం లేదని ఆత్మహత్యా చేసుకొంటూ ఉంటే కొడుకే రక్షించాడు. ఇంతలో అగ్నిలో దూకి ఆత్మహత్యా చేసుకోబోయిన ఒక స్త్రీ కనబడింది. ఆమె అతని తల్లి! ఆమెకూడా జ్యోతిష్యం విని కొడుకు కోసం, భర్తకోసం ఇన్నాళ్ళు ప్రాణాలు నిలుపుకొంది. నిరాశతో ప్రాణాలు తీసుకొంటూ ఉంటే ఇద్దరూ వచ్చి రక్షించారు. తల్లితండ్రులను ఒక ముని ఆశ్రమంలో ఉంచి పుష్పోద్భవుడు రాజవాహనుడి కోసం వెదకడం ప్రారంభించాడు. అతడు దొరకకపోయినా అడవిలో నిధి నిక్షేపాలు దొరికాయి. ఆ సంపదతో ఉజ్జయినికి వెళ్ళి అక్కడ శిష్యులతో, స్నేహితులతో ఉన్నాడు. ఆ ఊళ్ళో బాలచంద్రిక అనే అమ్మాయి ఉంది. ఆమెను పుష్పోద్భవుడు ప్రేమించాడు. దుర్మార్గుడైన రాజసోదరుడు కూడా ఈ పిల్లపైనే కన్ను వేశాడు. ఆ పిల్లచెయ్యి పట్టుకోబోయాడు. ఈ చారువర్మని మాయోపాయంతో చంపి పుష్పోద్భవుడు ఆమెను పెళ్ళి చేసుకొన్నాడు. జ్యోతిష్యుల శకునాలవల్ల రాజవాహనుణ్ణి కలుసుకునే రోజు వచ్చిందని తెలుసుకొని బయలుదేరాడు. కలుసుకొన్నాడు.

3. రాజవాహనుడి కథ:

ఈ ఇద్దరు మిత్రులనూ తీసుకొని రాజవాహనుడు అవంతీపురంలోనికి వెళ్ళాడు. ఆ ఊరి రాజకుమార్తె పేరు అవంతీసుందరి. ఆమెను రాజవాహనుడు ప్రేమించాడు. పుష్పోద్భవుడు పెళ్ళాడిన బాలచంద్రిక ఈ రాజకుమారి చెలికత్తె. అందుచేత ఆమె తన చెలికీ, రాజవాహనుడికీ సమావేశం ఏర్పాటు చేసింది. ఇద్దరికీ పూర్వజన్మలు జ్ఞాపకం వచ్చాయి. వాళ్ళకు కొన్ని శాపాలున్నాయి. ఇద్దరూ ఈ జన్మలో కలసి, ప్రేమించి పెళ్ళిచేసుకొని శాపాల నుండి విముక్తి పొందాలి. అయితే దీనికి అవాంతరాలున్నాయి. ఇద్దరూ విరహంలో పడ్డారు.

రాజవాహనుడు అంతఃపురంలోనికి ఎలా ప్రవేశించడం, ఎలా ఆమెను పెళ్ళి చేసుకోవడం! ఇంతలో ఒక ఇంద్రజాల విద్యాప్రవీణుడు రాజవాహనుడి స్నేహితు డయ్యాడు. అతడు భయంకరమైన గారడీలు చేసి, ఆ దేశపు రాజును సంముగ్ధుణ్ణి చేసి

చివర మంగళప్రదంగా పెళ్ళి జరిపిస్తానని రాజకుమార్తెకూ, రాజవాహనుడికి నిజంగా పెళ్ళి చేశాడు. దంపతులు అంతఃపురానికి పోయి శయనించారు. ఇంతలో రాజవాహనుడి కాళ్ళకు సంకెళ్ళు చుట్టుకొన్నాయి. అతణ్ణి శత్రువులు తీసుకుపోయారు. ఇది శాపఫలం. భార్యను రెండు నెలలు ఓపిక పట్టమని రాజవాహనుడు బందీగా వెళ్ళిపోయాడు.

రాజవాహనుణ్ణి బంధించిన చండవర్మ అనే రాజు అంబాలిక అనే అమ్మాయిని ప్రేమించాడు. ఆమెను పెళ్ళి చేసుకొంటున్న లగ్నంలోనే రాజవాహనుణ్ణి చంపాలను కొన్నాడు. కోట దగ్గర ఏనుగుతో తొక్కించి రాజవాహనుణ్ణి హతం చేయాలను కొన్నాడు. కానీ తెలవారుతూ ఉండగా రాజవాహనుడి కాళ్ళకున్న సంకెళ్ళు విడిపోయాయి. ఆ శృంఖలాలు ఒక అప్సరసగా మారిపోయి తన కథ చెప్పుకొంది. వెళ్ళిపోయింది. ఇంతలో చండవర్మ చచ్చిపోయాడని కేకలు వినబడ్డాయి. ఎవరు చంపారా! అని ఆశ్చర్యపోయి పక్కనున్న ఏనుగునెక్కి రాజభవనానికి వెళ్ళాడు. చండవర్మను చంపింది అపహారవర్మ. అతణ్ణి కలుసుకున్నందుకు రాజవాహనుడు చాలా సంతోషించాడు. అతడొక్కడే కాదు, దశకుమారులలో మిగతా ఆరుగురూ కూడా అప్పుడే అక్కడే అతణ్ణి కలుసుకొన్నారు. ఇంతమంది ఇక్కడికెలా వచ్చారా అని రాజవాహనుడు ఆశ్చర్యపోయాడు. ఒక్కొక్కర్ని వాళ్ళ వాళ్ళ కథలు చెప్పమన్నాడు. వాళ్ళు చెప్పారు.

ఈ ఏడుగురి కథలూ ఏడు అద్భుత గాథలు. చదువుతూ ఉంటే ఉత్సాహంగా, ఉద్వేగంగా ఉంటుంది. మొత్తం దశకుమార చరిత్రలో అన్ని కథలూ అద్భుతంగానే ఉంటాయి.[1] నేటి జానపద చలనచిత్రాల సాహసాలకు ఇది మూలకందం. ఇంత అద్భుత గాథలున్నా ఇది వాస్తవికతకు దూరంగా పోదు. తిరుమల రామచంద్రగారు చెప్పినట్టు ''అప్పటి సమాజాన్ని దండి వదలిపెట్టలేదు.''[2] ఆయన ఇంకా ఏం చెప్తున్నాడో చూడండి.

> ''నిజానికి సమకాలిక సమాజాన్ని రూపుకట్టించిన ప్రాచీన రచన దీనిని మించినది మరొకటి లేదు. దండి సమాజపు వెలుగు నీడలను ప్రస్ఫుటంగా చిత్రించాడు. దీనితో రచనకు పంచప్రాణాలూ సమకూరాయి. దొంగ సన్యాసులు, కపట బ్రాహ్మణులు, మోసకారులైన వేశ్యలు, కపట కులటలు, గజదొంగలు దండిదృష్టి నుండి తప్పిపోలేదు. దండి ప్రజాకవి. ప్రజాజీవితాన్ని ఆకళించుకొన్న కవి. కనుకనే ప్రజాసామాన్య సుఖదుఃఖాలు, ఉత్సాహోద్వేగాలు, రాగద్వేషాలూ కావ్యమంతటా కుమ్మరించాడు.''

ఇటువంటి మూల కథను మూలఘటిక కేతన పన్నెండు ఆశ్వాసాల కావ్యంగా తెలిగించాడు. దీనిని తాను 'అంచిత భావరసోదయాభిరామం'గా అనువదించినట్లు భావించాడు.

---

1. ఈ కథాకావ్యాన్ని చక్కని వచనంలో నా మిత్రులు విద్వాన్ విశ్వం అనువాదం చేశారు.
2. విద్వాన్ విశ్వం అనువాదానికి వ్రాసిన పీఠిక - పుట. 6

అయినా ఈ కావ్యాన్ని ప్రకటిస్తూ కందుకూరి వీరేశలింగంగారు ఇలా రాశారు: ''ఇతరాంధ్రకవుల వలననే యితడును సంస్కృత కావ్యాలను సరిగా నాంధ్రీకరింపక కథాంశమును మాత్రమునే గైకొని వర్ణనాంశములను విశేషముగా విడిచియు, మార్చియు, జేర్చియు యథేచ్ఛముగా రచన చేసి యున్నాడు.''[3]

కేతన మూలంలో ఏయే మార్పులూ కూర్పులూ చేశాడో శిష్టారామకృష్ణశాస్త్రిగారు చక్కగా పరిశీలించి తైపారు వేశారు. వారి మాటలను చూడండి:

''మూలమున వసుమతీదేవి వర్ణనలు బహుదీర్ఘముగా జేయబడగ, కేతన దానిని పూర్తిగా వదిలివేసినాడు. అవంతీసుందరీ పరిణయము సందర్భమున రాజవాహనుని యుద్యానవన విహారము సంస్కృతమున విపులముగ జేయబడగ కేతన దానిని త్యజించుటయేగాక, పరిణయానంతరము చేయబడిన కేళిగృహ సంభోగ వర్ణనలు గూడ వదలివేసెను. దీనినిబట్టి విశేష శృంగార వర్ణనలితనికి గిట్టవేమో యనిపించును. అట్లే యుపహారవర్మ కథలో శయ్యపై పరుండియున్న స్త్రీ వర్ణనలు మూలమున విపులముగను, బహురమణీయముగను జేయబడగ కేతన దానిని విడిచివేసెను. ఉపహారవర్మ కథలో వికటవర్మ తన భార్య కుతంత్రము వలన మరణించుట కాతని కురూపము కారణ మనియు, నందుచే నామెయాతని నేవగించెననియు మూలమున చెప్పబడెను. కారణములు బలవత్తరముగా నుండుటకై వికటవర్మ విద్యావంతుడు గాడనియు, మోటవాడనియు, భార్యా దాసీజనములతో సంభోగించు నీచుడనియు కేతన కవి కల్పించి 'పాత్రపోషణము' చేసినాడు.[4]

శిష్టావారి ఉద్దేశంలో కేతన ఏమంత గొప్ప కవికాడు. ఈ కావ్యంలో రసపోషణ బాగుగా జరగలేదనియే చెప్పవలయునని తీర్పు చెప్పాడు. అయితే కేతన ఈ కావ్యం చెప్పి తిక్కనగారిని మెప్పించానని పొంగిపోయాడు. ''బ్రహ్మదేవుడైనా కవిత్వం చెప్పి తిక్కనగారిని మెప్పించలేడు. అలాంటిది నేను దశకుమార చరిత్ర చెప్పి ఆయనను మెప్పించాను. ఇంక నన్ను వేరే పొగడాలా?'' అని ఈ పద్యం చెప్పుకొన్నాడు.

కవితజెప్పి యుభయకవిమిత్రు మెప్పింప
నరిది బ్రహ్మకైన నతడు మెచ్చ
బరగ దశకుమార చరితంబు జెప్పిన
ప్రోఢ నన్ను వేరె పొగడనేల? (ఆంధ్రభాషాభూషణం-5)

తనకు పుస్తకం అంకితమిచ్చినవారి కవితను ఏ కృతిపతి అయినా మెచ్చుకొంటాడు. తిక్కనగారూ అలాగ మొహమాటానికి మెచ్చుకొనడమే తప్ప ఆ ప్రశంస ''త్రికరణశుద్ధితో జెప్పిన మాటగ నెంచరాదు'' అని శిష్టావారు అభిప్రాయపడుతున్నారు.[5] అనంతర ప్రబంధ

3. దశకుమార చరిత్ర - వీరేశలింగంగారి పరిష్కరణ, ప్రథమ ముద్రణ 1901.
4. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వం, మద్రాసు యూనివర్సిటీ ప్రచురణ. పుటలు 459-60.
5. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వము. మద్రాసు యూనివర్సిటీ ప్రచురణ. పుటలు 469, 470.

కవుల ధోరణి మాత్రమే కాదు, తనకు ముందున్న నన్నయాదుల సంపూర్ణ ప్రతిభ కేతనలో లేనిమాట వాస్తవమే. అంతమాత్రాన అతణ్ణి చులకన చేయకూడదు. తెలుగులో మొట్టమొదటి కథాకావ్యాన్ని అతడు వ్రాశాడు. ఔచిత్యాన్ని పాటించేవాడు. ఎప్పుడూ మంచి కవే అవుతాడు. కేతన 'మితసత్యహితవచోనిపుణుడు.' మితభాషణ గంభీరతకు చిహ్నం. ఇది నన్నయగారిలో వుంది. కేతన కూడ సానుభూతితో చదివితే, ఒక్కమాటలో కొండంత అర్థం నన్నయగారిలాగ తోపింపజేస్తాడు.

నిద్రపోతున్న నాయికను నాయకుడు చూశాడు. అప్పుడు అతడు యిలా భావించుకొన్నాడు.

''కనుగొనునంత నామనసు గన్నులు మన్మథు డింతిపాలు చే
సిన మెలగంగలేక గతచేష్టుడనై యిది నిద్రపోవుచో
మనమున కింతపుట్టె గరిమంబుగ విభ్రమముం గరంబు నొం
దినతరి జూచువారలకు ధీరత ఎక్కడి దంచు లోలతన్.'' (దశకు. 6-147)

ఈ పద్యంలో ఆయువుపట్టుమాట 'ధీరత.' ఈ సుందరి నిద్రపోతున్నప్పుడే మనసులో యింత పుట్టింది; ఇక మేలుకొంటే ధీరత ఎక్కడిదన్నాడు. నాయకుడు ధీరత పోగొట్టుకోలేదు. కనుకే ముక్తసరిగా అన్నాడు.

కేతన పాత్రల మనసులోని భావాలను అట్టే విశదీకరించక వాళ్ళ రూపాన్నీ, కట్టునూ, బొట్టునూ, అలంకారాలను విపులంగా వర్ణిస్తాడు. ఇతడు చేసిన ఈ వర్ణనలే తరువాతి కవులకు మార్గదర్శకాలయినాయి. కదిరీపతి శుకసప్తతిలో, అయ్యలరాజు నారాయణామాత్యుడు హంస వింశతిలో తెలుగుదనం ఉట్టిపడే రచనలు చేయడానికి, వివిధ విషయాల పట్టికలు ఇవ్వడానికి కేతన పెట్టిన పరవళ్ళు దిద్దడమే కారణం. కథాకథన కావ్యంలో జాబితాల రచనకు ఇదే నాంది. చూడండి ఆనాటి ఆభరణాల వివరాలు:

''మట్టియ లుజ్జ్వలమణినూపురంబులు మొలనూలువస్త్రముల్ ముత్తియముల
కట్టువడంబులు గట్టినూళ్ళును సుద్ద సరితీగెమినుకులు నందిదండ
లంగుళీయకములు హారికంకణములు చేకట్టుపాలెలు చెన్ను మెరుగు

టాకులు సరిపెణ లాల క్తకముపూత కాటుకతిలకంబు కమ్మపువ్వు
లాదిగాగల మేలిద్రవ్యముల నొప్ప - బసదనముచేసి యుచితరూపంబుదాల్చి
బాలచంద్రికబోటినై పజ్జ నరిగి - దారువర్మని లోగిలి దరియజొచ్చి.''
(దశకు. 3-77)

దొంగతనానికి ఆనాటి దొంగలు ఏ సాధనాలు పట్టుకొని వెళ్ళేవారో ఆ సాధనాలను వర్ణిస్తున్నాడు.

''పొయిదల నీలి దీట్కొలిపి బూడిద ముండుల బంతి గాలచీ
రయు సెలగోల కత్తి భ్రమరమ్ముల క్రోలును మైలమందు గొ
య్యాయు సురిగ్రొంకి నారసము నాదిగ గల్గిన సాధనంబుల
న్నియు సమకూరజేసికొని నేర్పున నేగితి ముచ్చుప్రొద్దునన్.'' (దశకు. 5-72)

తన సమకాలిక సమాజాన్ని దండి ఎంత చక్కగా కన్నులకు కట్టించాడో కేతన కూడ అంత చక్కగానే చిత్రించాడు. విప్రనారాయణ కథలాంటిది ఆదిలో దశకుమార చరిత్ర లోనే ఉంది. ఒక ఋషిని చెడగొడతానని సానికూతురు శపథం పట్టింది. అది చెల్లించుకొంది.

ఈలోగా ఆ వేశ్య ఋషి దగ్గరకు కపటవృత్తిని చేరినప్పుడు వేశ్యమాత పెట్టేగోడు మూలంలో ఎలా ఉందో చూడండి.

''నేను చేసిన తప్పల్లా కులాచారం ప్రకారం నా ధర్మాన్ని నేను నిర్వర్తించాను. వేశ్య తల్లి చేయవలసిన విధులివి. పిల్ల పుట్టిన నాటినుంచి చక్కగా ఆహారంతో పోషించాలి. పుట్టిన పండుగలూ, పండువులూ వచ్చినప్పుడు ఉత్సవాలూ, పేరంటాలు చేయాలి. కామశాస్త్రం చదివించాలి. నృత్యం, గానం, వాద్యం, నాట్యం ఆస్వాద్యపుష్పగంధకళల పాటవం కలిగించాలి. చదువూ, మాటకారితనం నేర్పాలి. వ్యాకరణం, తర్కం, సిద్ధాంతం వగైరా విద్యలలో జ్ఞానం కల్పించాలి. జీవనోపాయులైన క్రీడాకౌశలాదులను, ద్యూత కళలను నేర్పించాలి. నమ్మకమైన వారితో ఇతర రహస్యాలు నేర్పాలి. ఉత్సవాదులలో బాగా అలంకరించి కూతురును ప్రదర్శించాలి. ఆవిడను గూర్చి ప్రచారం చేయాలి. ఎవరికో ఒక జాతి రూపధనాదులు గలవారికి గాంధర్వ వివాహం చేసి శుల్కం పుచ్చుకోవాలి. ఇవి మా ధర్మాలు. ఇవన్నీ నేను చక్కగా నిర్వర్తిస్తూ వచ్చినాను. ఈ విషయంలో తల్లి మాటను ఏ వేశ్యాపుత్రికా దాటడానికి వీల్లేదు.''[6]

దీనిని కేతన ఎలాగ విశదం చేశాడో గమనించండి. నాటికీ, నిన్నటి 'చింతామణి' నాటకంలోని వేశ్యమాతల నీతులకు ఏమీ తేడాలేదు.

''తనయఁగని గారవంబున
ననుదినమును సావధానయై యొడకమునన్
దెనిచి పదంబిడి - యలజ
వ్వన మగుటయు వేడ్కతోడ వారిజముఖికిన్

పరిమితాహారంబు వాటించి యొడియంగ
ముల నాడు నాటికి నలుగు వెట్టి
చదురైన మాటలు సడినన్న జెప్పి శృం
గారంబు గావించు క్రమము దెలిపి

6. దశకుమార చరిత్ర, విద్వాన్ విశ్వం, పుట. 72

మెత్తని విద్యలు మేలుగా నెరిగించి
యుపచారములు సేయు యొరపుగరపి
సౌభాగ్యమునకునుం జాలిన నోములు
నోమించి పడయంగ నూలుకొలిపి

పేరు మెప్పును గలవాడు ప్రియము తోడ
నడిగి పుత్తెంచెనేని నెయ్యం బెరింగి
రేపు మాపని యాసలు చూపి చూపి
యింపు పుట్టించి మది బిలిపింప వలయు

ధనవంతుడైన వానిం
దనయిచ్చన దిరుగువాని దానగుణమునన్
బనుపడు వానింగైకొని
యనుపంగా వలయు గూతు నాతని కడకున్

మగలం బలువుర దన్నుం
దగిలింపగ కొరపు గరపి తానొక్కనిపై
దగులము సేసిన నొకమెయి
మగిడింపుచు గూతు బడపు మరపగ వలయున్.

(దశకుమార - 5-13 నుండి 16)

''సానులవల్ల చెడిపోయినవాళ్ళంతా భ్రష్టులే. వాళ్ళకు మరి విమోచనం లేదు. వాళ్ళు జైనమతంలో కలవవలసిందే'' అన్న విపరీతపు భావనలు ఆనాడు ఉండేవి కాబోలు. కేతన ఇలా చెప్పాడు :

''మిండాటమాడిపొలిసిన - మిండలకును జైనవృత్తి మేలని మదిలో
నొండు తలపుడిగి జినముని - మండలికృప వడసి యొక్క మాంత్రికుచేతన్.''

(5-59)

ఆ భ్రష్టుడు దీక్షితుడైనాడట. దండి తన కాలపు జైనులనేకాక బ్రాహ్మణ్యాన్ని కూడ విడిచిపెట్టలేదు. వాళ్ళలో నీచముంటే అదీ చెప్పాడు. కేతన కూడ దానిని వివరించాడు.

''చదువులు విడిచి యాచారంబు దిగద్రావి ధర్మువు చెరిచి సత్యంబు మరచి
మొగమాట తెగజూచితగవు దూరముచేసి కులముగీటునబుచ్చి వలనుదప్పి
శౌచంబు వదలి విశ్వాసంబు మొరగి తాలిమి మాలి పెద్దరికము తొరంగి
దయపిరిందికిపైచి నయము క్రుమ్మడగించి బాంధవంబురివి పాపమున బొదలి
నెరుకులకు నొజ్జలై వారి యిండ్ల గుడిచి - కొలిచి దీవించి యించుకవెలికిబోయ
లనగబరగిన పారు లియ్యడవిలోన - నెన్నబెక్కండ్రుగలరు ధాత్రీశతిలక!''

(దశకు.)

కేతన కావ్యంలో పెద్ద పెద్ద సంస్కృత సమాసాలు ఉండవు. ఆయన చిన్న చిన్న తెలుగు మాటలతోనే కథా కథనం చేస్తాడు. తెలుగుతనం ఉట్టిపడే సామెతలూ, జాతీయాలూ, పలుకుబళ్ళూ ఇతని రచనలో ఉన్నాయి. కొన్ని చూడండి:

> ''కన్నుగానక కయ్యంబునకు కాలుద్రవ్వి (2-4), లోకమువారు నవ్వరే? (2-32), ముప్పెట్టు (3-66), ఏటికి ఎదురీదు మాడ్కి (3-120), పొంగారెడు నేతికి బైపై నీరంబు జల్లినట్ల నిష్ఫలమయ్యెఁ (3-127), తలప్రాణము తోకకువచ్చె (3-129), అందని మ్రాని పండ్లకును నగ్రులు సాచిన నేమి చేయుదురుఁ (3-131). ఆడబోయిన తీర్థ మెదురుగ వచ్చిన క్రియ (3-142), పెళ్ళి అనే ఉద్దేశంలో తలబ్రాలకు లగ్నమనిన అనడం (5-85), పీనుగు పెంట (5-123), తేనియబడ్డ యీగగతి (6-30), కుక్కకు టెంకాయ దక్కదు (6-86), ఎయ్యది యెట్లు పోయినఁ (6-98), గురివింద వేమునడరిన పరుసున (7-43), కాన వెన్నెలక్రియ రిత్తవోయె (12-54).''

మొట్టమొదటి కథకావ్యాన్ని విరచిస్తూ వున్న కేతన ఇందులో కొన్ని కొత్త పద్ధతులు ప్రవేశపెట్టాడు. అతని కాలానికి నన్నెచోడుని కుమార సంభవం ప్రచారంలోనికి వచ్చి అష్టాదశ వర్ణనల మీద మోజు హెచ్చింది కాబోలు, కేతన కృతిపతి వంశాన్ని వర్ణించడానికి అతను ఉండే విక్రమ సింహపురాన్ని వర్ణిస్తానని పురవర్ణన, కావ్యం మొదలు పెట్టకముందే, చేయడం మొదలుపెట్టాడు. అష్టాదశ వర్ణనల్లో పుత్రోదయం ఒకటి వర్ణించాలి. ఇంకా కావ్యం ప్రారంభించకముందే కృతిపతి అయిన తిక్కనగారిని వారి తల్లి ఎలా కడుపుతో ఉన్నదీ వర్ణించాడు.

> ''గర్భితనవసుధాకరపయోనిధిమాడ్కి సతిమేను పాండురచ్ఛవి వహించె
> కలితభృంగాబ్జకుట్మలయుగ్మకము పోల్కి కాంతచన్ముక్కులగప్పు మిగిలె
> మకరందసంవాహమలయానిలుని క్రియ నంబుజాననగతి యలసమయ్యె
> నుచిత కాలాగ మనోజ్వలకుసుమంబుగతి నింతినాభి వికాసమొందె
> వళులువిరిసెగౌను బలిసె గోర్కులు మది - సందడించె నారు నందమయ్యె
> ననుపమానభాగ్యయగు నన్నమాంబకు-వర్ణనీయగర్భవైభవమున.''
>
> (1-86)

కృతిపతి జననానికి ముందు ఇటువంటి గర్భవైభవాన్ని ఇంకే కవీ వర్ణించి ఉండడు. అష్టాదశ వర్ణనల మోజుపుట్టిన తొలిదినాలు కనుక కేతన ఇలా ఈ పద్యం చెప్పాడు. వాస్తవానికి దశకుమార చరిత్రలో కథానాయకుడు రాజవాహనుని జననానికి ముందు అతని తల్లి వ్రేకటిని వర్ణించడానికి అవకాశం వుంది. కేతన అలా చెయ్యలేదు. ఇక్కడ వర్ణించాడు కనుక అక్కడ వచనంలో ఒక్కముక్కలో కొట్టిపారవేశాడు. కేతన మొదలుపెట్టిన గర్భదారణ వర్ణనను తరువాతి కవులు ఎందరో అనుసరించారు. కేతన పదబంధాలనూ, భావాలనూ కూడ అనుసరించారు.

తారాశశాంక విజయంలో శేషము వెంకటపతి వ్రాసిన ఈ పద్యం చాలా ప్రసిద్ధమైనది.

''లోకములోన కొంద రబలుల్ సతులర్ దనియింపలేక య
స్తోకమనీష నన్యపురుషుల్ దమ కాంతల నంటకుండ దా
టాకులలోన వ్రాసిరి పరాంగన నంటుట బాపమంచు న
య్యాకులపాటు జూచి యిపు డాకులపా టెనయంగ నేటికిర్?'' (శశాంక. 3-82)

ఈ ప్రఖ్యాత పద్యంలోని ఆకులపాటు కేతనగారి తాటాకులలోనే మొదలైంది.

''వేకువ గమ్మదెమ్మెరలు వీవగ మాపుల నెల్లిదంపుగా
రాకులపాటు డెందమున నాకులపా టొదవింపఁజొచ్చె శో
భాకరపల్లవ ప్రచయ మంగజవహ్ని శిఖాసరూపతం
గైకొని వంతజేసె బథిక ప్రకరంబునకున్ వనంబునర్.'' (3-93)

కేతన ఇష్టదేవతా ప్రార్థనలో వినాయకుని బాల్యక్రీడను వర్ణించాడు.

''గ్రక్కున నేత్రయుగ్మము కరద్వితయమ్మున మూసిపట్టి యా
మిక్కిలి కంటికిర్ దనదు మిక్కిలి హస్తము మాటుచేసి యిం
పెక్కెడు బాలకేళి బరమేశ్వరు చిత్తము పల్లవింపగా
దక్కక ముద్దునం బొలుచు దంతిముఖుం గొలుతుం బ్రసన్నుగార్.'' (1-5)

అల్లసాని పెద్దనగారు కూడ వినాయకుని బాల్యాంక విచేష్టను వర్ణించారు.
(మను. 1-4)

''అంకముఁజేరి శైలతన యాస్తన దుగ్ధము లానువేళ బా
ల్యాంక విచేష్టఁ దొండమున నవ్వలి చన్నబళింపబోయి యా
వంకఁగుచంబు గాన కహి వల్లభహారము గాంచివే మృణా
ళాంకురశంకనంటె డుగజాస్యునిఁ గొల్తునభీష్ట సిద్ధికిన్.

కేతన ఇష్టదేవతా ప్రార్థనలో కుమారస్వామిని నుతించాడు (1-6), మన్మథుణ్ణీ నుతించాడు (1-7). పూర్వకవులలో నన్నెచోడుడూ, వేములవాడ భీమకవీ మన్మథుణ్ణి కావ్యారంభంలో నుతించిన కవులు.

కావ్యాంతంలో కేతన భరత వాక్యంలాగ ఇలాగ చెప్పాడు.

రాజవాహన నృపతి ధర్మమున రాజ్య
పాలనము చేయునెడల బ్రజపరమ సుఖము
గనిరి ధరయెల్ల శ్రీ ధాన్య కటకమయ్యె
నతని కీర్తులు పాల్పొంగినట్లు వెలసె (దశకుమార. 12-93)

తంజావూరు పాలించిన రఘునాథ నాయకుడు (1600-1630) ఒక రామాయణం రచించాడు. అందులోని పురవర్ణనలో ''శ్రీధాన్యకటకమై చెన్నొంద నగరంబు'' అని వర్ణించాడు. (1-59). కేతన ధాన్యకటకాన్ని పద్యంలో తేవడానికి కొంచెం సబబుంది. అతని బావమరది దండనాథుడైన వెలనాటి రాజ్యంలోనిదే ధాన్యకటకం కూడ. వేంగిలోని వెంటిరాల అగ్రహారమే కేతన జన్మస్థానమైనా వెలనాడూ, ధాన్యకటకం అతని నివాసభూములు కావచ్చును. కృత్యాదిని కృతిపతి నివాస నగరాన్ని వర్ణించే కావ్యంలో చివర తన ఊరిపేరు చొప్పించాడా?

కృత్యాదిని కేతన కొన్ని కొత్త విషయాలను కూడ తొలిసారి పెట్టాడు. నేడు మనం ఏ ప్రాచీన కావ్యం తీసి చూసినా షష్ఠ్యంతాల తరువాత ''అభ్యుదయపరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన...'' అనే మాటలు కనబడతాయి. వీటిని తొలిసారి వాడింది కేతన.

కేతనకు ప్రాచీనులూ, కొద్దిపాటి సమకాలికులూ, సమీపకాలికులూ షష్ఠ్యంతాల తరువాత కథ ఎలా ప్రారంభించారో చూడండి.

1. **నన్నెచోడుడు, కుమార సంభవం:** ''మల్లికార్జున మునికిన్'' పరమ భక్తి ముక్తి నావర్జిత హృదయుండనై సకల భువన భవనావతారకారుడైన పరమేశ్వరు నవతారంబగుట యుం దదంశావతారంబుగా న్యావర్ణించి నా చెప్పంబూనిన దివ్యకథాసూత్రం బెట్టిదనిన. (1-67)

2. **తిక్కనగారు, నిర్వచనోత్తర రామాయణం:**

 అమ్మను మనృపతి కభ్యుద
 యమ్ముగ నేఁజెప్ప బూనినట్టి కథకు నా
 ద్యమ్మయి యయోధ్యయను నా
 మమ్మున నెగడిన పురోత్తమము వర్ణింతున్. (1-45)

 భారతం ''హరిహరనాథునకు...'' భక్తపరతంత్రునకున్
 ''ఏనువిన్నపంబు సేయు తెలుంగుగా సంతస్సన్నిధింగలిగించుకొని
 యిమ్మహాకావ్యంబు నర్థంబు సంతతంబు సేసెద.'' (విరాట. 1-37)

3. **కేతన, దశకుమార చరిత్ర:** తిక్కనామాత్యునకున్ అభ్యుదయ పరంపరాభివృద్ధిగ నాచెప్పం బూనిన కథానికాయంబను సురలతాజాలం బెట్టిదనిన... (2-2)

4. **మంచెన, కేయూరబాహు చరిత్ర:** ఒక్కటే షష్ఠ్యంత పద్యం ''ఈ గుండయ ప్రెగ్గడకును...''

 ''ఇష్టార్థ సిద్ధియు నైశ్వర్య సమృద్ధియుఁ బుత్ర పౌత్రాభివృద్ధియుఁగా నా రచయింపబూనిన కథాక్రమం బెట్టిదనిన.''

5. **మారన, మార్కండేయ పురాణం:** గన్నరథినీ పతికిన్... పరమ కళ్యాణ పరంపరాభి వృద్ధిగా నారచియింపబూనిన యిమ్మహాపురాణంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన...'' (ప్రథమ-1)

నేడు సర్వసాధారణంగా కనిపించే 'అభ్యుదయ పరంపరాభివృద్ధి, పదాలక్రమం ఒక్క కేతన రచనలోనే కనబడుతుంది. తిక్కనగారు నిర్వచనంగా వ్రాశారు గనుక వారి రామాయణంలో దీనికి ఆస్కారం లేకపోయింది. అయినా ఆయన మనుమసిద్ధికి 'అభ్యుదయమ్ము'గ అని వాడినారు. ఇది కేతన మాటలను చూశాకే కావచ్చు. కేతన షష్ఠ్యంతాలతో ప్రథమాశ్వాసం పూర్తిచేసి ద్వితీయాశ్వాసంలో 'అభ్యుదయపరంపరాభి వృద్ధి' చెప్పాడు. ఇతని తరవాత ఇంకెవరూ ఇలాగ చేయలేదు. కేతన వ్రాసినన్ని షష్ఠ్యంతాలు కూడ ఎవరూ వ్రాయలేదు. వేదం వెంకటరాయశాస్త్రిగారన్నట్టు కందపద్యాల మధ్య దూలంగా ఒక శార్దూలం వేసి షష్ఠ్యంతాలు వ్రాశాడు. ఇందువల్ల అసలు షష్ఠ్యంత రచనా విధానానికి కేతనే ఆద్యుడని వెంకటరాయశాస్త్రిగారు అభిప్రాయపడుతున్నారు. నన్నెచోడుని విధానాన్ని కేతన అతి చేశాడేమో అని నా ఉద్దేశం.

కేతన నన్నెచోడునిలాగ ముద్రాలంకారాలు మొదలైనవి వాడలేదు. గర్భకవిత్వం చెప్పలేదు. సీదాగా కథ చెప్పుకొంటూ పోయాడు. ఓజోగుణం గల సమాస రచనతో వీరరసానికి శార్దూల మత్తేభాలు వాడడం తరువాతి కవులలో పరిపాటి. కేతన అలాగ చేయలేదు.

శిష్టారామకృష్ణ శాస్త్రిగారు కేతన ఛందస్సుల గురించి ఇలా రాశారు.[7]

'దశకుమార చరిత్రమున ప్రత్యాశ్వాసాంతమున నొకమాలిని వృత్తము తప్ప విశేష వృత్తముల వేనిని కేతన వాడలేదు. కందము, గీతము విశేషముగాను, వృత్తుల చంపకమాలలను, శార్దూల, మత్తేభములను మాత్రమక్కడక్కడను కవి వాడినాడు. కాని నన్నయ వాడిన యక్కరలు, తరువోజలు, లయగ్రాహులు, లయహారిణులుగాని, పంచ చామరాది వృత్తములనుగాని, నన్నెచోడుడు వాడిన క్రౌంచపదము, స్రగ్ధర, మహాస్రగ్ధరాది వృత్తములనుగాని కేతన మందుకైన వాడలేదు.

కేతనపైన అట్టే సదభిప్రాయం లేని శిష్టావారు కేతన వాడినవాటిని గుర్తించలేదు. కేతన తరువోజ వాడాడు (11-87). రెండు ఉత్సాహవృత్తాలను చెప్పాడు (10-161; 12-6). రెండు మత్తకోకిలలను పలికించాడు (8-49; 10-88). ఒక తరల రచించాడు (10-22). ఈ నాలుగు విశేషవృత్తాలను 'మందుకు' అభినవదండి - చెప్పినా ఇవి కలికంలో కనబడకపోతే వింతలేదు. రాశిలోనికి రానివి వాసికెక్కవు. అభినవదండి బిరుదు ఎప్పుడు వచ్చిందో వివరిస్తూ కందుకూరి వీరేశలింగంగారు ఇలా వ్రాశారు: ''ఇతడు దండి విరచితమైన దశకుమార చరిత్రమును తెనిగించుటచేత బండితులీతని నభినవదండియని

7. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వం. పుట. 472.

పొగడినట్లే క్రింద నుదాహరింపబడెడి 'ఆంధ్ర భాషా భూషణము' లోని రెండవ పద్యములో కవియే చెప్పుచున్నాడు.

> ''వివిధ కళానిపుణుడ నభి-నవదండి యనంగ బుధజనంబులచేతఁ
> భువి బేరుగొన్నవాడను-గవి జనమిత్రుడను మూలఘుటి కాన్వయుడఁ.''

అయితే వాస్తవానికి దశకుమార చరిత్ర అనువదించడానికి ముందే కేతనకు 'అభినవదండి' అనే బిరుదు ఉండేది. ఈసంగతి దశకుమార చరిత్ర అవతారికవల్లనే విశదపడుతుంది.

> ''వేగి విషయమున వెఱ్ఱిరాలను పేర నభిరామమగు నగ్రహారమునకు
> నగ్రణి యగువాని నభినవదండినా బొలువు మీరినవాని...
>
> గేతనార్యుని నన్ను విఖ్యాతయశుని... అత్యాదరంబున రావించి 'నీవు సంస్కృతాద్యనేక భాషాకావ్యరచనా విశారదుండ వగుట జగత్ప్రసిద్ధంబు గావున నొక్కకావ్యము రచించి నన్ను గృతిపతిం జేయవలయునని సగౌరవంబుగా బ్రార్థించిన నేనును... దశకుమార చరిత్రము చెప్పబూనితి.''
>
> (దశకు. 1-23, 24, 25)

జనులిచ్చిన ఈ 'అభినవదండి' బిరుదు కేతనకు చాలా ఇష్టం. అందుకే దశకుమార చరిత్ర కావ్యాదిలోనూ, ప్రతి ఆశ్వాసం గద్యలోనూ దీనిని చెప్పుకొన్నాడు. తాను వ్రాసిన ఇతర గ్రంథాలలో ఆత్మ సంబోధన చేసుకొంటూ, లేక లోకానికి చెప్తూ వ్రాసిన పద్యాలలో ఈ బిరుదు తెగ వాడుకొన్నాడు.

తేట తెనుగు మాటలు వాడడంలో కేతనకు కేతనే సాటి. సంస్కృతంలో లలితమైన పదాలను దండి వాడితే తెలుగులో తేటయిన మాటలను అభినవదండి వాడాడు.

తెలుగులో తొలి కథాకావ్యాన్ని రచించి ఎలాగైతే ఒక విధానానికి శ్రీకారం చుట్టాడో, అలాగే లక్షణ గ్రంథాలకూ, ధర్మశాస్త్రాలకూ కూడ కేతన నాంది పలికాడు. అతని ఇతర పుస్తకాలను గురించి కూడ కొంత తెలుసుకొందాం.

ఆంధ్ర భాషా భూషణం: ఇది తెలుగు భాషలో తెలుగు భాషకు చెప్పిన మొట్టమొదటి వ్యాకరణం. దీనికి ముందే ఆంధ్ర భాషావ్యాకరణాన్ని సంస్కృతంలో ఒక నన్నయభట్టు విరచించాడనీ, అథర్వణాచార్యుడు అందులోని లోట్లను సంస్కృతంలోనే పూరించాడనీ లాక్షణికలోకం చెప్పుకొంటుంది. ఈ వాదానికి కళాప్రపూర్ణ వజ్ఝల చినసీతారామ శాస్త్రిగారు జీవితాన్ని అంకితం చేశారు. అయితే 'ఆంధ్ర భాషా భూషణం' పుట్టడానికి ముందు ఏ భాషలోను తెలుగు వ్యాకరణం లేదని చెప్పాలి. ఎందుకంటే ఈ పుస్తకంలోనే ఉంది:

''మునుపు తెనుగు భాషకు ఎన్నడూ, ఎవ్వరూ లక్షణం చెప్పలేదు. నన్నయభట్టాది కవిజనాల కరుణచేత విద్వాంసులు మనసులో మెచ్చుకొనేటట్లు నేను చెప్తున్నాను.

సంస్కృత ప్రాకృతాది లక్షణాలు చెప్పి తెనుగు భాషకు లక్షణం చెప్పకపోవడం పూర్వకవులకు చేతకాక కాదు. నన్ను ధన్యుణ్ణి చెయ్యాలని నాకు వదిలేశారు. భాషావేదులు నేను చెప్పిన లక్షణం విని నేను ఆషణ్ముఖ పాణినులకు ఉజ్జీనని సంతోషించగా 'ఆంధ్రభాషా భూషణం' అనే శబ్దశాస్త్రాన్ని రచిస్తాను. ఇందులో ఒప్పులుంటే మెచ్చుకోండి. తప్పులుంటే తగినట్టు దిద్దండి. అంతేగాని తప్పును ఒప్పు అనకండి. ఒప్పును తప్పు అనకండి. ఓ కవులూ! మిమ్మల్ని ప్రార్థిస్తాను. గుణదోషాలు తెలిసి ఇది గుణం, ఇది దోషం అని సుకవులు పూజలు గొంటారు. గుణదోషాలు తెలియకుండా దుర్గుణాలనే గుణాలని కుకవులు పొగుడుతారు. కొత్తగా ఆంధ్రభాషకు ఒక లక్షణం చెప్పాడు, వీరు ఉత్తమ విద్వాంసుడని పెడముఖం పెట్టకుండా వింటే మేలు. మీరు నన్ను నిందించితే మీకు ఎదురాడి జవాబు చెప్పడం చాలా దుస్సహమైనది. కవులారా! మీకు నమస్కారం చేస్తాను. మనసులో నన్ను అన్యథా భావించకండి. కాళిదాసు మయూరాది మహానుభావులకే తప్పులుంటాయి. ఇతరులకు ఉండవా? సారమతులైన సుకవుల కారుణ్యమే కవిజనాలకి కలిమి, నేర్పు. గంగానదికి త్రోవ చెప్పమంటే కంచి, నెల్లూరు, ఓరుగల్లు, అయోధ్య అనే పురాల మీదుగా వెళ్ళు అని బోలెడన్ని త్రోవల్లో ఒకటి చూపినట్టు, ఎన్నో మార్గాలున్న తెలుగు భాషకు ఒక దారి చెప్పాను.[8]

ఇంత సుదీర్ఘమైన ఉపోద్ఘాతం చెప్పినా కేతన తనకు ముందే సంస్కృత భాషలో ఒక నన్నయభట్టు ఒక వ్యాకరణం వ్రాస్తే ఆ సంగతి స్పష్టంగానే చెప్తాడు. సంస్కృత సూత్రాలను అనుసరించితే ఆ సంగతి చెప్పేవాడు. ఇతడు వ్రాసిన మిగతా రెండు పుస్తకాలూ సంస్కృతంలోంచి అనువాదాలే. ఫలానా గ్రంథాలను తెనిగిస్తున్నాను అని వాటిలో స్పష్టంగా పేర్కొన్నాడు. ఇందులో అలాంటిదేం చెప్పక 'క్రొత్తగా' వ్రాస్తున్నాను అన్నాడు. అందుచేత కేతన వ్రాయడానికి ముందు తెలుగు భాషకు వ్యాకరణం తెలుగులోగాని, సంస్కృతంలోగాని లేదనే చెప్పాలి. ఉంటే దానిని కేతన చూడలేదు. అవతారిక పద్యంలో 'నన్నయభట్టాదికవి జనంబుల కరుణన్' అని చెప్పాడు. కనుక ఇది నన్నయగారి ఆంధ్రశబ్ద చింతామణినే సూచిస్తుంది అని వాదించేవాళ్ళు లేకపోలేదుగాని భారతాది లక్ష్యగ్రంథాలనే చెప్తుంది. కేతన ఈ వ్యాకరణంలో నన్నయగారు వాడిన వాడిమయూఖములు, కఱకంఠుడు మొదలైన ప్రయోగాలను లక్ష్యాలుగా తీసుకొని పేర్కొన్నాడు. నన్నయ భారతభాగమే కేతనకు ప్రధాన లక్ష్యగ్రంథమనుకోవచ్చును. నన్నయగారు 'సారమతి కవీంద్రులు ప్రసన్న కథా కవితార్థయుక్తి' అని వాడినట్టే అవతారిక పన్నెండో నెంబరు పద్యంలో కేతన కూడా 'సారమతులైన సుకవు'లని చెప్పడం గమనార్హం. కేతనకు ముందు తెలుగులో రేచన

8. ఆంధ్ర భాషాభూషణంలో 6వ నెంబరు పద్యం నుండి 13వ నెంబరుదాకా ఉన్న 8 పద్యాల భావం. కేతన వ్యాకర్త కనుక ఈ పద్యాలలో కొన్ని గడుసు ప్రయోగాలు చేశాడు. ఒకచోట 'కవులూ' అని ఇంకొకచోట 'కవులారా' అని ప్రయోగాలు చేశాడు. 'మధ్యమ పురుష' ఆరగాగమం వికల్పమనే సూత్రాన్ని సూచిస్తున్నాడు.

రచించిన 'కవిజనాశ్రయమ'నే ఛందోగ్రంథంలో కొంత వ్యాకరణ ప్రసక్తి లేకపోలేదు. దాన్ని యితడు చూశాడు. రేచన వాడిన పరిభాషను కూడా కేతన గ్రహించాడు. కేతన వ్యాకరణం వల్ల తెలుగు భాషా చరిత్ర, కేతన కాలంనాటి భాషా స్వరూపం ఎంత తెలిస్తే అంతా చెప్పుకొందాం. మన భాషను 'తెలుగు' అని 'ల'కార మధ్యంగానూ, 'తెనుగు' అని 'న' కార యుక్తంగానూ అతని రోజులలో వ్యవహరించేవారు. ఇతడు లాక్షణికుడు కనుక ప్రాసస్థానంలో ఈ రెండు రూపాలనూ కావాలనే వాడాడు. తెనుగు అనే రూపం అయిదుసార్లూ [9], తెలుగు అనే రూపం ఆరుసార్లూ[10] కనబడతాయి. ఈ భాష కొంత సంస్కృతంవల్ల కలిగినా, కొంత తనంతట తానే కలిగిందని, ఈ రెండూ కలసి యేకమై తెనుగు భాష అయిందని చెప్పాడు చూడండి:

తల్లి సంస్కృతంబె యెల్ల భాషలకును
దానివలనఁ గొంత గానబడియె
గొంత తాన కలిగె నంతయు నేకమై
తెనుగు బాస నాఁగ వినుతికెక్కె (-14)

ఈ తెనుగు భాష అయిదు రకాలని కేతన చెప్పాడు. అవి : 1) తత్సమం 2) తద్భవం, 3) అచ్చతెనుగు, 4) దేశ్యం, 5) గ్రామ్యం. ఈ అయిదింటిని వేరేవేరే విస్తరించుతానని వివరించాడు. మొదటి రెండింటి గురించి అన్ని వ్యాకరణాలూ చెప్తాయి. అచ్చతెనుగు ఏమిటి అని ప్రశ్నిస్తే ఇవాళ తలొకరూ తలొక నిర్వచనం యిస్తారు. కేతన మొట్టమొదట చెప్పినది ఇది.

తల, నెల, వేసవి, గుడి, మడి
పులి, చలి, మడుఁగూరు పేరు బూరుగు మగవా
డలుకయని యెల్ల వారికి
దెలిసెడి యాపలుకు లచ్చతెనుగన బరగున్ (-23)

ఇవాళ మనం అచ్చతెనుగు అనుకొనే వలరాజు, అలరుపిండు వెడవిల్తుడు, తెక్కలికాడు మొదలైన మాటలు దేశ్యాలన్నారు.

23వ పద్యంలో 'తల, నెల, వేసవి, గుడి, మడి, పులి, చలి, మడుగు, ఊరు, పేరు, బూరుగు, మగవాడు, అలుక' అని ఎల్లవారికి తెలిసెడి యాపలుకు లచ్చ తెనుగన బరగున్'' అని చెప్పాడు.

24వ పద్యంలోనూ, 25వ పద్యంలోనూ **దేశి** తెలుగులో ఎటువంటి పదాలుంటాయో చెప్పాడు. వాటిని అకారాదిగా పొందుపరుస్తున్నాను. చూడండి.

---

9. ఈ నెంబరు పద్యంలో 'తెనుగు' ప్రాసస్థానంలో ప్రాస యతిలో వుంది : 14, 124, 132లో రెండుసార్లు 133.
10. తెలుగు – అనే రూపం 15, 43, 64, 70, 126, 190.

అలరుపిండు
అసదు
(అసత్‌భవంకాదా?)
ఇంతి
(ఇది 'స్త్రీ' భవం కాదా?)
ఉక్కు
ఉల్లము
ఉవిద
(యువతీశబ్దభవం కాదా?)
ఎక్కలి
ఎడకడు
ఎలనాఁగ
ఎలమావి
ఎల్లి
ఎరగలి
ఎసకము
ఎఱకువ
కడలి
కడిమి
కమ్మతావి
కలవలము
కలువకంటి
(కల్హార్ధభవంకలువకాదా?)
కాఁటియ
కెంజాయ
(కెంపు+చాయ ఇందులో
చాయ ఛాయా శబ్దభవం
కాదా?)
కెమ్మోవి
క్రేణి
క్రొమ్మించు
క్రొన్నన
కొలులుట
కౌను
గనయము
గమి
గ్రద్ధ
(ఇదిగృధ్ధ భవం కాదా?)
చిగురుబోడి
చెంత
చెచ్చెర
చెలువ
జోటి
తబ్బిబ్బు
తనివి
తలిరుబోడి
తామరకంటి
(తామరతామరసభవం కాదా?)
తివురుట
తెక్కలికాడు
తెమ్మెరలు
తెలిగన్ను
తెలువ
తేఁటి
తొయ్యలి
నలుక
నాన
నెగ్గము
నెత్తమ్మి
నెమ్మి
నొసలు
పరి
పొలిండులు
ప్రసన్న
పొచ్చెము
పొద్దు
(ఇది బ్రధ్నభవం కాదా?)
పొలపము
పోటు
బగి
బాగు
బోటి
మక్కువ
మచ్చిక
మన్ను
మిన్ను
ముట్టు
ముతనము
ముద్దియ
మెఱుగుబోడి
మేటి
మొగి
రేయెండ
రేఱేడు
లగ్గు
వదరు
వలరాజు
వలకంత
వసలు
వాలుగంటి
విన్నదనము
విసువుట
వీఁక
వీడ్తెఱ
వీనులు
వీఁచోపులు
వెక్కసము
వెడవిల్తుడు
వెన్నడి
వెన్ను
వేఁట
వేనలి
సరి

ఇలాగ 'తేరనాడిన దేశ్యంపు పలుకుల'య్యాయి. ఇందులో కొన్ని తద్భవాలవంటి వున్నాయి. ఇందులో కొన్ని నేడు అచ్చ తెనుగు క్రింద చలామణీ అవుతున్నాయి. అయినా తొలితెలుగు వ్యాకర్త వీటిని దేశ్యాలన్నాడు. రెండు పుంజీలు తక్కువగా నూరు దేశ్య పదాలను కేతన ఇచ్చాడు. వీటివల్లకన్నా ఇతడిచ్చిన గ్రామ్య పదాల పట్టికవల్ల ఆ కాలంలో జనసామాన్యం ఎలా మాట్లాడేవారో, ఎలాగ దీర్ఘాలు తీసేవారో తెలుస్తుంది. అతడు ఇచ్చిన 37 గ్రామ్య పదాలను యథాతథ క్రమంలో చూసి అందులో అన్నీ గ్రామ్యమో కాదో చూద్దాం.

పంచాకుమయ్యా, తోపించాకుమయ్యా, వాటీదెచ్చుతారు, మమ్మీాదలించి, యేగగొంటూరమ్మ, యేదాలు, వోదాలు, మోసేటివారు, ఆసనేసువారు, వాడి విరాళితో బాడిగవోకుమీ యీడేకదా, మమ్ముయిను తిసేసె, పంపేరు, తెంపేరు, పాడేరు, సూసేరు, యిందాము, కందాము, పొందుము, ఇస్తి, అటుకు, దవ్వు, వెగడు, అషువలె, ఇషువలె, ఆడ, ఈడ, ఏడ, అచ్చు, ఇచ్చు, ఓయ, గాయ, ఏయక, ఉండాడు, బామ్మడు, గద్ద, గుద్ద.

ఇందులో ఆఖరిది అశ్లీలం కనుక గ్రామ్యంలో చేర్చాడు. లక్షణ విరుద్ధంగా ఉండేదేగాక, బూతులైతే వాటిని గ్రామ్యం కిందనే జమకట్టాలని కేతన ఉద్దేశమనుకోవాలి. ఆడ, ఈడ, ఏడ అనేవి గ్రామ్యాలన్నాడుగానీ వాటికి ప్రాచీన మహాకవి ప్రయోగాలు ఆంధ్రమహాకవి భారతంలోనే ఉన్నాయి.

ఏనేడ - నింద్రాదు లేడ	-	3-2-47
నగరె నలినాక్షులేనేడ	-	3-2-137
విప్రయోగమేడ	-	3-2-137

ఇలా నన్నయగారి ప్రయోగాలే 'ఏడ' అనే మాటకు నాలుగు కనబడుతున్నాయి. అలాగే మిగతా వాటికి ఇతర కవిప్రయోగాలు సూర్యరాయాంధ్ర నిఘంటువులో కనబడతాయి.

కేతన రోజుల్లో కూడా కొందరు 'అషువలె' 'ఇషువలె' అనేవారనీ, మనలాగే పంపేరు, తెంపేరు అని వాడుకొనేవారనీ తెలుస్తోంది. పంచాకుమయ్యా వంటి దీర్ఘాలు పాటల్లో వాడేవారేమో అనిపిస్తోంది. ''బాడిగవోకుమీ'' అనేది సుమతీ శతకంలోని 'ఏరకుమీ' వంటి ప్రయోగాలను స్ఫురింపచేస్తుంది. అయితే ఇటువంటి ప్రయోగాలు 'దశకుమార చరిత్ర'లో కేతనే వాడాడు.

''చిలుకా! పల్కకుమీ లతాంతశరుఁడా! చెల్వంగ్రుపం జూడుమీ, యళులారా! మొరపంబు దక్కి నిలుఁడీ, యాలోలమందానిలా! కలయం చాలకు మీపిక ప్రకరమా! కంఠధ్వనుల్ నల్దెసల్, చెలగం గూయక తక్కుమీ యనుచు రాజీవాస్యలుద్బాష్పలై. (దశ. 8-126)

బహుశా ఈ 'మీ'లు కాదేమో అతని ఉద్దేశంలో గ్రామ్యాలు. బాడిగ అన్నమాట కావచ్చును.

తెలుగు భాష తత్సమం, తద్భవం, అచ్చతెనుగు, దేశ్యం, గ్రామ్యం అని అయిదురకాలు అంటూ చెప్పి ఇందులో తత్సమం తప్పించి మిగతా నాలుగింటినీ అచ్చతెనుగు అంటారన్నాడు. తద్భవాల్ని కూడా అచ్చతెనుగులోనే కలిపాడు. గ్రామ్యాన్ని వివరించి ఇది ఇతరులను తిట్టేచోట వాడవచ్చునుగాని దీనినెవరూ వేరేచోట ఒప్పరు అని చెప్పాడు.

ఆంధ్రభాషాభూషణంలో 196 పద్యాలు మాత్రమే ఉన్నాయి. అయినా ఇది తక్కువ గ్రంథమేం కాదు. ఇందులో భాషాభేదాలు, తత్సమరూపాలు, సంధి, విభక్తులు, వచనములు, సమాసములు, క్రియలు, తద్ధితాలు మొదలైన వాటి లక్షణాలు వున్నాయి. '' 'ఆంధ్రభాషాభూషణ' మెంత చిన్న పుస్తకమయినను, విపుల వ్యాకరణము లేని కాలమున మహోపకారము చేయుటయేకాక, తర్వాతి వ్యాకరణ కర్తలకు మార్గదర్శకమయినది'' అని శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు చెప్పినది అక్షరాలా నిజం.[11] విన్నకోట పెద్దన రాసిన కావ్యాలంకార చూడామణి 9వ అధ్యాయంలోని వ్యాకరణ విభాగం కేతన కృతికి రూపాంతరమని చెప్పవచ్చును. ప్రాచీనులలో ఇతడు ఇలాగ అనుసరిస్తే ఆంధ్రభాషా భూషణం నుంచి చిన్నయసూరి కోకొల్లలుగా సూత్రాల సులువులు, ఉదాహరణలు వ్రాసుకున్నాడు. అయితే ఆంధ్రభాషాభూషణాన్నే లక్ష్యంగా తీసుకొని కొన్ని సూత్రాలు చెప్పవచ్చును. సూరిగారు చెప్పలేదు. ఉదాహరణకు:

లక్షణములు దెలిపెడిచో
నక్షరములు దెలియు కొఱకుననువైన క్రియల్
శిక్షార్థముగా బల్కెద
లాక్షణికులు తప్పుగా తలంపకుడుమదిన్. (33)

ఈ పద్యంలో 'తెలియుకొఱకు' అనే ప్రయోగం వుంది. అర్థం: తెలియుట కొరకు, భావార్థక 'ట' కారానికి లోపం వచ్చింది. ఇది బాలవ్యాకరణంలో చెప్పలేదు. ఆంధ్రభాషా భూషణం మొదలుకొని వడ్లమూడి వారి వ్యవహారిక వ్యాకరణం దాకా వచ్చిన వ్యాకరణాల సమన్వయం చాలా అవసరం.

ఇటీవల దశాబ్దాలలో ఈ రంగంలో చక్కని కృషి జరుగుతూంది. హరిశివకుమార్‌గారు 'కేతన-అతని కృతులు' అనే విషయాన్ని తీసుకొని సిద్ధాంత వ్యాసం వ్రాసి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించి పిహెచ్.డి పట్టం పొందారు. దీనినే ఒక పుస్తక రూపంలో ప్రచురించారు.[12] ఆంధ్రభాషా భూషణంపై కూడ డెబ్బయ్ పై చిలుకు పుటల విపుల సమీక్ష ఇందులో ఉంది.

డాక్టరు బొడ్డుపల్లి పురుషోత్తంగారు 'తెనుగు వ్యాకరణ వికాసము' అనే రెండు భాగాల గ్రంథాన్ని 'పండిత సమాదరణీయం' కావాలని ఆకాంక్షిస్తూ ప్రకటించారు. ఇది 1966 పిహెచ్.డి పట్టంకోసం చేసిన రచన. 1969లో గ్రంథ ప్రచురణ జరిగింది.

---

11. ఆంధ్రభాషా భూషణం: వావిళ్ళ ప్రచురణ (1949) పీఠిక.
12. కేతన: డాక్టర్ హరిశివకుమార్, వరంగల్, 1973.

ఈ పండితులందరూ కేతన గురించి విరివిగానే చర్చించారు. ఇతని పారిభాషిక పదాలను ఏర్పరచుకొన్న పద్ధతిని హరిశివకుమార్‌గారు విపులీకరించారు. కేతన కర్ణాటక భాషాభూషణాన్ని అనుసరించాడన్న అభిప్రాయం పూర్వం తెలుగు పరిశోధకులకు ఉండేది. అయితే కేతన అలా చేయలేదని అమరేశం రాజేశ్వరశర్మగారు రుజువు చేశారు. గ్రంథనామాలలో మాత్రమే సామ్యం ఉంది.

కేతన తన గ్రంథమున పాణినీయమునుండీ, కాతంత్రంనుండీ కొన్ని సంజ్ఞలను తీసుకొన్నాడు. కురుచలు, నిడుపులు, పనులు (క్రియలు), సున్నలు, పొల్లులు, తోసిపుచ్చుట (ఆదేశముగా వచ్చుట) అనే తెనుగు పారిభాషిక పదాలు వాడాడు. ఇద్వర్ణాలకు బదులు వు్రు, డు్రు, ము్రు, అ్రు, ఇ్రు, ఉ్రులనేవి వాడాడు.

"కేతన వ్యాకరణమున గొన్ని లోపములున్నను మరియొక గ్రంథ సాహాయ్యము లేకుండ దనకుఁ దానుగాఁ ద్రోవఁజేసికొని కావించిన యరణ్య ప్రయాణమువలె భాషా స్వభావమును గుర్తించుచు మహాకవి ప్రయోగములను బరిశీలించుచుఁ గావించిన వ్యాకరణ గ్రంథం గొప్ప ప్రయత్నమని యభినందింపక తప్పదు" అని అమరేశం వారు అన్నది సత్యం.[13]

విజ్ఞానేశ్వరీయం :

ఇది ధర్మశాస్త్రం. యాజ్ఞవల్క్యమహర్షి మూడు కాండములలో ఒక ధర్మశాస్త్రం రచించాడు. దీనిని యాజ్ఞవల్క్యస్మృతి అని పిలుస్తారు. దీనికే 'మితాక్షరి' అనే పేరుతో ఒక వ్యాఖ్యానాన్ని విజ్ఞానేశ్వరుడు విరచించాడు. దానికి మూలఘటిక కేతన ఇలా చెప్పాడు:

> మును సకలశాస్త్ర ధర్మము!
> విని విజ్ఞానేశ్వరుండు వివిధ ప్రౌఢిఁ
> జనులకుఁ దెలిపినదానిం ।
> దెనుఁగునఁ జెప్పెద సమస్త దేశీయులకున్ (1-5)

పేరుకు అనువాదమైనా ఇది స్వతంత్ర గ్రంథమన్నంత జాతీయాలతో, నుడికారపు సొంపుతో ఉంది. కవి తన కాలపు విషయాలను ఇందులో జొప్పించాడని కొన్ని విషయాల వల్ల తెలుస్తోంది.

> ముఱికి నాటివారు మొఱకులు పెనపరు!
> లఱవ వారు ద్విజుల కాసపెద్ద
> యనుచు దేశ భాషలను గులంబును దిట్టు!
> నతఁడు దండువచ్చు శతపణములు. (2-56)

ఈ ప్రాయశ్చిత్త కాండలోని పద్యంలో కవి తన సమకాలికమైన ముఱికినాటివారినీ, అరవవారినీ పేర్కొనడం చూడవచ్చు. మూలంలో విజ్ఞానేశ్వరుడు ఈ సంగతులు చెప్పడు కదా.

13. ఆంధ్ర వ్యాకరణ వికాసము - అమరేశం రాజేశ్వరశర్మ - 1973.

ఈ ధర్మశాస్త్రంలో మూడు కాండలున్నాయి. ఆచారకాండ 141 పద్యాలు, ప్రాయశ్చిత్తకాండ 140 పద్యాలు, వ్యవహార కాండ 152 పద్యాలు మొత్తం 433 వున్నాయి. మనం నేడు ఆచారవ్యవహారాలు అనే మాటలోని ఆచారం, వ్యవహారం ఈ ధర్మశాస్త్రం నిర్దేశిస్తుంది। ఆచారం అంటే వర్ణాశ్రమ ధర్మాల నిర్వహణ, ప్రాయశ్చిత్తం అంటే 'క్రిమినల్ లా' అని చెప్పవచ్చును. వ్యవహారం అంటే 'సివిల్ లా', కేతనే వ్యవహారం అనే మాటకు చక్కని నిర్వచనం ఇచ్చాడు.

విచ్చలవిడి బలవంతుం ।
డచ్చుగ(గారించుటయును నబలుఁడుచాలన్
నొచ్చి మహీపతిసభకున్ ।
వచ్చి యెఱింగింప నదియె వ్యవహారమగున్ (3-8)

ఈ ధర్మశాస్త్రం వల్ల ఆనాటి ఆచారవ్యవహారాలు చాలా చక్కగా బోధపడతాయి. ఇది నాటి సాంఘిక చరిత్రను తెలుసుకొనడానికి ఉపయోగిస్తుంది. ముఖ్యంగా ప్రాయశ్చిత్త వ్యవహారకాండలు పనికివస్తాయి.

'ఊరి పొలాలను మేసే పశువులను బందెపెట్టి జుల్మానా ఆ రోజులలో తీసుకొనే వారు, ఎనుముకు పాతిక, మొదవుకు పరక, గొఱ్ఱెకు వీసం; పశువుల సొంతదారుడు తెలిసి తెలిసి ఒకరి చేలోకి వీటిని తోలితే రెట్టింపు పుచ్చుకోవాలి.

ఎనుమునకు బందెపాతిక!
గొననగు మొదవునకుఁ బరక గొఱియక వీసం
బొనర నొరుచేనుమేసిన!
నినుమడి గొనవలయు నొడయఁ డెఱిఁగి విడిచినన్ (2-4)

ఊరి చుట్టూ కంచె ఎంత వెయ్యాలో చెప్పాడు:

లొట్టెనుఁగంత పొడవున ।
దట్టముగా వెలుగు వెట్టఁదగు నూరులకుం
జుట్టును దిరుగగఁ జేలకు ।
నట్టి పొలము మేసెనేని నగుబందెగొనన్ (2-5)

ఊరికీ చేనికీ మధ్య నూరు విండ్ల ఎడము ఉండాలంట.

ఊరికిఁ జేనికి నడుమెడ ।
యారయఁగా నూఱు విండ్లయంతవలయు సం
చారార్థ ముఖర్వటమున ।
కారెట్టియుఁ బట్టణమున కాయిను మడియన్. (2-18)

ఆ రోజుల్లో దాసులు, భృత్యులు రమారమీ బానిసలలాగ వుండేవారు. సేవకులకు దాస్యం నుండి విమోచనం లేదు. యజమాని ప్రాణాలు కాపాడినా కృతజ్ఞత ఇంకొకలాగ చెప్పాలిగాని దాస్య విమోచనం లేదు.

తూలెడు తన ప్రాణమ్ములఁ ।
దాలిమితోఁ గాచెనేని దాసుని దాస్యం
బేలినపతి విడువక తనిఁ ।
బోలఁగ రక్షింపవలయుఁ బుత్రుని సరిగన్ (2-32)

ఆ రోజులలో దాసులను డబ్బిచ్చి కొనుక్కొనేవారని తెలుస్తోంది. కూలి పనివాళ్ళు కూడ వుండేవారు.

దాసుఁడు భృత్యుడు నెంతయు ।
వాసిగఁ బనిసేయువారు వారల లోనం
దాసుఁడు విలిచిన ఛటుఁడు ।
ద్భాసిత భృత్యుండు కూలిపని వాఁడెందున్ (2-36)

'పదుగురాడు మాట పాడియై ధరజెల్లు' అన్నట్టు ఆ రోజుల్లో కూడా మెజారిటీ ఏది న్యాయమని ఒక కట్టుబాటు పెట్టుకుంటే దానినే రాజు పాటించాలి.

పెక్కండ్రు గూడి సమయం ।
బొక్కటి గల్పించి నడుపుచుండు మరేనిన్
నిక్కముగా నా సమయము ।
దక్కొని చెల్లించుటయును ధర్మము పతికిన్ (2-38)

ఆ రోజుల్లోకూడ తెలుగు వీధులలో పామరులు బండబూతులు కూసేవారు. ఆ నేరానికి జుల్మానా యేంటో చెప్తున్నాడు వినండి.

వానితల్లి తోబుట్టుగఁ వాని యాలు ।
వాని లంజెలు వారికిఁ దానుమగఁడ
ననుచు నీ క్రియబూతాటమాడి తిట్టు ।
నతని గనఁదగుఁపంచ వింశతి పణములు. (2-44)

అయితే అందరికి ఒకరకమైన న్యాయం లేదు. గొప్పా, బీదా, ఎక్కువ, తక్కువ వున్న సంఘంలో గొప్పవాళ్ళ ప్రక్కనే న్యాయం ఉండేటట్లు పెక్కండ్రు ఒక్కటై సమయం ఏర్పరచుకొంటారు. తనకన్నా ఎక్కువవాళ్ళ భార్యలను తిడితే ఒక రేటు జుల్మానా, తక్కినవాళ్ళను తిడితే ఇంకొక రేటు. చూడండి :

తనకంటె నధికు బరనతి ।
నెనికమిగులఁ దిట్టనేని నేఁబది పణముల్
తనకంటె హీనుఁ దిట్టినఁ ।
దనరింగఁ బంౘ్రెండు నరయు దండువుగలుగున్. (2-45)

జూదాలు, వ్యభిచారం, దొంగతనాలు, హత్యలు మొదలైన నేరాలకు శిక్షలు మొదలైనవి వివరాలతో చెప్పాడు.

చంపిన వానిని సరిగాఁ ।
జంపుట తగు విప్రుఁడైనఁ జంపకపతిత
త్సంపదఁగొని తలగొఱిగి ప ।
దంపడి కుక్కచ్చువ్రాసి దండింపదగుఙ్. (2-64)

మొఖంమీద కుక్కచ్చు వ్రాయడం ఒక గొప్ప దండన. బహుశా అది కలకాలం ఉండిపోయేటట్టు వాతలేసేవారేమో. కుక్కచ్చు అంటే కుక్క పాదంలాగ కనబడే బొట్టు. ఈ శిక్షనే ఇంకొక పద్యంలో వివరించాడు చూడండి:

తలగొఱిగించి కుక్కడుగు తప్పక ఫాలమునందు వ్రాసి ముం
గల ధన మెల్లఁ బుచ్చుకొని గాడిదనెక్కఁగఁజేసి గ్రామముఙ్
వెలువడఁ ద్రోచిపుచ్చుటయ విప్రుని జంపుట క్షుద్ర జంతులం
జొలవక చంపు తప్పుగలచోఁదగి చంపుట ధర్మమె మ్మెయిన్. (3-42)

విజ్ఞానేశ్వరీయంలో ప్రాయశ్చిత్తకాండ 'క్రిమినల్ లా' మాత్రమే కాదు, క్రిమినల్ ప్రొసీజరు కోడ్ కూడా. హత్యచేసి హంతకుడు పారిపోతే ఎలా పరిశోధన చేయాలో విపులంగా చెప్తుంది.

ఒకని నెవ్వరెఱుంగ కుండంగఁ జంపి తాఁ జంపినవాఁడు ప్రచ్ఛన్నుడైనఁ
జిచ్చిన యాతని నెచ్చెలి భృత్యుని నన్నదమ్ముని బట్టి యరచియైన
నతివల వేర్వేరయడిగి చచ్చినపొంత నెలసెడు వారల నెల్లనరసి
యే యర్థములవెంట నెవ్వరితోడను చెనఁకువ గలిగెనో యనియునడిగి
చంపుటకుఁ దగినట్టి యాశంకయొరుల । మీఁదఁదగిలిన వారల నూఁదిపట్టి
యరసి తెలివిని శుద్ధిలేదయ్యెనేని । తగిన దండంబు దండింపఁదగును బతికి.
(2-103)

విజ్ఞానేశ్వరీయంలోని వ్యవహారకాండ సభలో విచారణ ఎలా చేయాలో, సాక్ష్యాలు ఎలా వినాలో మొదలైనవి వివరిస్తుంది. అసలు సభ అంటే ఏమిటి - అందులో ఎందరుండాలి అన్నది చెప్తుంది.

వినికిగల్గువారి వేదజ్ఞులవారి ।
సత్యయుతుల ధర్మశాస్త్రవిదుల
ద్వేషరాగరహిత విప్రుల హితుల స ।
భ్యులుగఁ జేయవలయు భూవిభుండు (3-2)

ఆ విప్రులేడ్వురైనను ।
నేవురు ముప్వురునునైన నిమ్మహిలోనం
భావిత సభయగుఁ గావున ।
మూవురవశ్యంబువలయు ముఖ్యులు సభకున్. (3-3)

సాక్ష్యాలు రెండురకాలుగా ఉంటాయి మానుషాలు, దైవాలు అని. మన పూర్వీకులు దేవుడిమీద ఎంత భక్తిగల్గవారైనా వ్యాజ్యాలలో మానవుడికే ఎక్కువ విలువ ఇచ్చేవారని ఈ క్రింది పద్యంవల్ల తెలుస్తోంది.

ఒక్కఁడు మానుష మూఁదఁగ ।
నొక్కఁడు దైవంబునూఁడి యెడఁబడకున్నన్
నిక్కపు మానుషముంగొని ।
తక్కక పెనఁకువలు దీర్పఁదగు సభ్యులకున్. (3-31)

అసత్యాలు చెప్పే సాక్షుల వాలకాలు ఎలా వుంటాయో మానవ నైజాన్ని చక్కగా పరిశీలించి కేతన ఈ పద్యం చెప్పాడు.

నెలకొనియొకచోట నిలువక పెదవులు నాలుకయందంద నాకుచుండు
నుదురు చెమర్పంగ వదనంబువెల్లనై పలుకులు తడఁబడఁ బలుకుచుండు
వాతెఱతడిలేక వఱువట్లువట్టింగఁ బెదవులు దడుపుచు బెదరిచూచుఁ
బలుకులుఁ జెయ్యులుఁ దలఁపులుఁదగ నిజప్రకృతిఁ బొందక కడువికృతిఁబొందు
సాక్షిచెప్పుచోట సభఁబాడియాడుచో । నెవఁడతఁడు దుష్టుఁడిరవుగాఁగ
నిట్టి లక్షణముల నెఱిఁగి సభ్యులు పాడి । నిర్ణయించి చెప్పనేరవలయు. (3-45)

పత్రము సాక్షి లేకపోతే పాడితీర్చేచోట పరీక్షలు పెట్టేవారు. మనం 'అగ్నిపరీక్ష' అని వాడుకొనేమాట ఇందులోంచే వచ్చింది. పరీక్షలు అయిదు రకాలు. తుల, అగ్ని, జలం, విషం, కోశం అనే పద్ధతులలో వుంటాయి. బ్రాహ్మణులకు తులాపరీక్ష, క్షత్రియులకు అగ్నిపరీక్ష, కోమట్లకు జలం, శూద్రులకు విషం అని చెప్పాడు. కోశం అన్ని వర్ణాలకు వర్తిస్తుంది.

తులాపరీక్ష చాలా గమ్మత్తుగా ఉంటుంది. ఏదైనా తగాదావస్తే శోధించవలసిన వాణ్ణి మొదట ఒక త్రాసులో ఎక్కిస్తారు. అతడెత్తు ఇటుకలను తీసుకొంటారు. వాటిని జాగ్రత్త చేస్తారు. కొన్నిరోజులు పోయాక పరీక్ష పెడతారు. ఆనాడు మళ్ళా త్రాసులో

అతణ్ణి కూచోబెట్టి ''దేవతలారా! ఇతడు శుద్ధుడైతే ఎత్తండి, హీనుడైతే దించండి'' అని తుల తూచుతారు.

విషపరీక్ష చాలా కఠినమైనది. చూడండి:

క్రొత్తకుండలోన గ్రూరసర్పమునిడి ।
యర్తితముగఁజేసి యందులోన
నిమ్మపండువేసి నెమ్మితోఁదిలియంగ ।
శోధ్యుఁడైనవాఁడు శుద్ధుఁడయ్యె. (3-121)

విజ్ఞానేశ్వరీయంలో కేతన తనకాలంనాటి సంగతులనే స్మృతికర్తల అభిమతానికి విరుద్ధం కాకుండా చెప్పాడు. కాల దేశాచారాలు పాటించడం నాటి సంఘంలో ముఖ్యం. అందుకే ఇలా చెప్పాడు:

కులదేశాచారంబులు ।
తలకొని చేయంగవలయుఁ దమకులదేశం
బులనెందుఁ జెల్లుఁగావున ।
నలయక యది విహిత ధర్మమని రాచార్యుల్ (1-9)

తత విజ్ఞానేశమతము ।
చతురంబుగ జెప్పుచోఁ బ్రసంగమువరుసన్
గతములు చెప్పితినేనిఁ ।
స్మృతికర్తల చొప్పు తప్పఁ జెప్పితిననరే. (1-10)

నిస్సందేహంగ కేతన 'తప్పఁజెప్పలేదు' అని విజ్ఞానేశ్వరీయం చదివిన వాళ్ళకి అనిపిస్తుంది. ఇటువంటి ధర్మశాస్త్రంలో కవిత్వం ఏమీ ఉండదుగాని సాంఘిక చరిత్రకు అవసరమైన ముడిసరుకు చాలా ఉంది. కావ్యమైనా, మహాకావ్యమైనా ఎరుకను సమగ్రం చేయడం ముఖ్యం.

తెలుగులో తొలి కథాకావ్యాన్ని వ్రాయడమేకాక మొట్టమొదటి వ్యాకరణ గ్రంథాన్ని, ధర్మశాస్త్రాన్ని విరచించిన కేతన ధన్యుడు.

కమలనాభామాత్యుడు, బయ్యన

తాత మంత్రి భాస్కరు డెలాగైతే తిక్కనగారు నుతించినందువల్ల కవిగా మనకు పరిచయమైనాడో అలాగే శ్రీనాథుని తాత కమలనాభామాత్యుడు కూడా గొప్ప కవి అని శ్రీనాథుడు నుతించడం వల్ల తెలుస్తున్నది. తిక్కనగారు తమ తాత ఏ గ్రంథం రచించారో చెప్పకపోబట్టి అనేక వాదోపవాదాలు చెలరేగి, ఆయన పేరు భాస్కరుడు కాబట్టి అతడే భాస్కర రామాయణం వ్రాసివుంటాడని కొందరు భావించడం, దానిని రుజువు చేయడానికి ప్రయత్నిస్తూ వుండడం జరిగింది. శ్రీనాథుడు తన తాత ఎలాంటి కవో, ఏ పుస్తకం వ్రాశాడో చెప్పాడు. కాశీఖండంలో ఇలా నుతించారు:

''మత్పితామహు గవిపితామహుని దలతు
గలితకావ్య కళాలాభు గమలనాభు
జంద్రచందనమందార సదృశకీర్తి
సరససాహిత్య సామ్రాజ్య చక్రవర్తి.'' (కాశీఖండం, పీఠిక - 20)

ఈ పద్యంవల్ల కవిసార్వభౌముని తాత సాహిత్య సామ్రాజ్య చక్రవర్తి అని తెలుస్తున్నది. ఇది బిరుదు కాకపోవచ్చుగాని అంతటి వైభవంతోనూ కమలనాభుడుండే వాడని ఇంకొక స్తుతివల్ల తెలుస్తున్నది.

''కనకక్ష్మాధరధీరు వారిధితటీ కాల్పట్టణాధీశ్వరుఁ
ఘనునిఁ బద్మపురాణ సంగ్రహకళాకావ్య ప్రబంధాధిపుఁ
వినమత్కాకతి సార్వభౌము గవితావిద్యాధరుం గొల్తుమా
యనుగుందాత బ్రదాత శ్రీకమలనాభామాత్య చూడామణిఁ.''

అని భీమేశ్వర పురాణం అవతారికలో (1-10) శ్రీనాథుడు నుతించాడు. దీనివల్ల కమలనాభామాత్యుడు కాకతీయ సార్వభౌమునిచేత మన్ననలు పొందినవాడనీ, కవితా విద్యాధరుడనీ, పద్మపురాణ సంగ్రహాన్ని కావ్య ప్రబంధంగా రచించాడనీ తెలుస్తున్నది. ఇతడు ఏదో కరపట్టణానికి అధిపతి అనికూడ తెలుస్తున్నది. అయితే ఆ కాల్పట్టణం ఎక్కడిదో వివాదగ్రస్థమైంది. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు కృష్ణామండలంలో కాళీపట్టణమే ఈ కాల్పట్టణమన్నారు. కొమర్రాజు లక్ష్మణరావుగారు ''ఇది కలవటం అనే గ్రామ''మన్నారు. ఇప్పటికీ దీనిని అసందిగ్ధంగా ఎవరూ గుర్తించలేదు.

శ్రీనాథుడు స్పష్టంగా తన తాత వినమత్కాకతి సార్వభౌముడని, కవితా విద్యాధరుడనీ చెప్పాడు. అయినా కమలనాభుని పేరు ప్రతాపచరిత్రలో ఎక్కడా కనబడదు. శాకల్యమల్లభట్టు, శివదేవయ్యా, శరభాంకుడు, మల్లికార్జునభట్టు, హుళక్కి భాస్కరుడు మొదలైన విద్వాంసుల పేర్లే కనబడతాయి. శ్రీనాథుడు తన తాత విద్యాధరుడని చెప్పాడు. కాకతీయ యుగంలో ప్రతాపరుద్రుని కాలంలో విద్యానాథుని సమకాలికుడుగా ఒక విద్యాధరుడున్నట్లు ఈయూణ్ణి వెంకటవీరరాఘవాచార్యులుగారు

గుర్తించారు.[1] ఈ విద్యాధరుడు 'ఏకావళి' అనే గ్రంథం వ్రాశాడని, అది కె.పి. త్రివేదిగారు పరిష్కరించగా బొంబాయి సంస్కృత ప్రచురణలవారు అచ్చువేసినట్లుగా చెప్పారు.[2] ఈ విద్యాధరునికీ, శ్రీనాథుని తాత అయిన కవితా విద్యాధర కమలనాథునికీ ఏవిధమైన సంబంధమూ లేదు కాబోలు; ఉంటే ఈయూణ్ణి వారు చెప్పేవారే. ఈ సందర్భంలో చాగంటి శేషయ్యగారు ఇలా వ్రాశారు.[3]

> ''ఉత్కల దేశాధిపతియగు నరసింహరాజును వర్ణించుచు విద్యాధరుడను కవి సంస్కృతమున నేకావళి యను నలంకార గ్రంథమును రచించెను. ఆ రీతిగనే విద్యాధరుడను కవి[4] సంస్కృతమున ద్వితీయ ప్రతాప రుద్రుని కీర్తి ప్రతాపములను వర్ణించుచు బ్రతాపరుద్ర యశోభూషణమను పేర నలంకార శాస్త్రమును రచించెను. శ్రీనాథ మహాకవి ప్రతాపరుద్రుని యాస్థానమున శాస్త్ర విషయమున విద్యానాథుడున్నట్లే కమలనాభా మాత్యుడు వినమత్కాకతిసార్వభౌముడై కవితా విషయమున విద్యాధరుడై యుండెనని సూచించుటకోయన దన తాతను గవితా విద్యాధరుడని పై పద్యమున వర్ణించినట్లు కనబడుచున్నది. కమలనాభుడు తన గ్రంథము నెవరికి గృతియిచ్చెనో తెలియదు.''

కమలనాభామాత్యుడు వ్రాసిన పద్మపురాణం కూడా నేడు దొరకదు. దీనిలోనుంచి ఏ ఒక్క ప్రయోగాన్నీ లాక్షణికులు ఉదాహరించలేదు. కాబట్టి మచ్చుకైనా ఒక్కటీ దురదృష్టవశాత్తూ మనకు లభించడం లేదు. కమలనాభుని పద్యాలు దొరక్కపోయినా శ్రీనాథుడు అతణ్ణి నుతించిన పద్యాన్ని లాక్షణికులు ఉదాహరించారట. కూచిమంచి తిమ్మకవి లక్షణసార సంగ్రహంలో 'మత్పితామహు గవిపితామహు' అనే పద్యాన్ని 'మత్పితామహు ధీపితామహు' అనే పాఠంతో ఇచ్చాడట. ఈ సంగతి వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'శృంగారశ్రీనాథం' ప్రథమ ప్రకరణంలో (పుట 6) చెప్పారు. కమలనాభుడు పద్మపురాణం వ్రాయక, దానిని కృతిగా స్వీకరించాడని ప్రభాకరశాస్త్రిగారు అనుమానించారు. ''పద్మపురాణ సంగ్రహ కథాకావ్య ప్రబంధాధిపుడనియు, కలితకావ్య కళాలాభుడనియు నుండుటచే నాతడాగ్రంథమునకు కృతిపతియయ్యెనేమోయని సందేహము కలుగవచ్చును'' అని అందులోనే వ్రాశారు. తాము ఊహించినట్టు కమలనాభుడు పద్మపురాణం వ్రాయకపోయినా అతడు కవే అని చెప్పుకోవాలన్నారు. 'సరస సాహిత్య సామ్రాజ్య చక్రవర్తి, కవితా విద్యాధరుడు' అని శ్రీనాథుడు నుతించాడు కదా!

ఏమైతేనేం, ఇప్పటికి తిక్కనగారి తాత, శ్రీనాథుని పితామహుడూ ఒకే 'బోటు'లో పయనిస్తున్నారు.

1. ఆంధ్ర ప్రతాపరుద్రయశోభూషణం, పీఠిక. పుట 82.
2. అదే పుస్తకం, పుట 89, అధోజ్ఞాపిక.
3. ఆంధ్ర కవితరంగిణి, మూడవ సంపుటం (ద్వితీయ ముద్రణ), పుట 186.
4. 'విద్యానాథుడు' అనడానికి అచ్చుతప్పు కాబోలు.

అన్నట్లు ఈ 'బోటు'లోనే చోటుచెసుకొని ఇంకొక ప్రసిద్ధ కవియొక్క పితామహుడు కూడ ప్రయాణం చేస్తున్నాడు. అతడు భోజరాజీయం, అనంతుని ఛందస్సు మొదలైన లక్ష్య, లక్షణ గ్రంథాలను రచించిన అనంతామాత్యుని తాత బయ్యన. ఇతని కవిత్వాన్ని మెచ్చి తిక్కనగారే 'నవ్యభారతి' అనే బిరుదు ఇచ్చారట ఈ సంగతి అనంతామాత్యుడు భోజరాజీయంలో చెప్పాడు.

''క్షితి గ్రతుకర్తృతామహిమ చేకొని పంచమవేదమైన భా
రతము దెనుంగుబాస నభిరామముగా రచియించినట్టి యు
న్నత చరితుండు తిక్కకవినాయకు డాదట మెచ్చ 'భవ్యభా
రతి' యన బేరుగన్న కవిరత్నము 'బయ్యన' మంత్రి యల్పుడే?''

(భోజరాజీయం, పీఠిక.)

తిక్కనగారు తమ తాత ఏ పుస్తకాలు వ్రాశాడో చెప్పనట్టే ఆయనకు బిరుదు ఇచ్చిన ఈ కవిరత్నం ఏ గ్రంథాలు రచించాడో మనుమడు అనంతామాత్యుడూ చెప్పలేదు. తిక్కనగారికి సమకాలికుడై, కాకతీయ యుగంలో భవ్యభారతి బయ్యన ఉండేవాడని మాత్రం తెలుస్తున్నది.

మంచెన

బాలరసాల పుష్పనవపల్లవ కోమలకావ్యకన్యకన్
- గూళల కిచ్చి యప్పడుపుగూడు భుజించుటకంటె సత్కవుల్
- హాలికులైననేమి మరి యంతకు నాయతి లేనినాడు గౌ
- ద్దాలికులైన నేమి నిజదారసుతోదరపోషణార్థమై. (1-13)

ఈ పద్యం తెలుగుదేశంలో చాలా ప్రచారంలో ఉంది. దీనిని బమ్మెర పోతరాజు గారు వ్రాశారని లోకం చెప్పుకొంటున్నది. కాని ఆయనకు సుమారు నూటయాభై, రెండువందల సంవత్సరాలకు ముందుగానే ఈ పద్యం పుట్టింది. ఇది కేయూరబాహుచరిత్ర అనే తెలుగు కావ్యంలో ఉంది. ఈ గ్రంథాన్ని మంచెన రచించాడు; నండూరి గుండయ మంత్రికి అంకితమిచ్చాడు.

మంచెన తన కావ్యంలో కృతిపతిని గురించి విస్తరంగా చెప్పాడుగాని తనను గురించి ఏమీ చెప్పుకోలేదు. విద్వజ్జనమాన్యుడు, ఉభయకావ్యసరణిజ్ఞుడు అనే రెండే రెండు విశేషణాలనే తప్ప తనకు కావ్యంలో మరేదీ ఎక్కడా వాడుకోలేదు. గుండన మంత్రికి తాను ఇష్టసఖుడనని చెప్పుకొన్నాడు. గద్యలో 'సకల కవిజనవిధేయమంచెన నామధేయ' అని విధేయతతో క్లుప్తంగా వ్రాసుకొన్నాడు.

నండూరి గుండన మంత్రి యొక్క తాత కేతన గొప్ప మంత్రి. వెలనాటి చోడులలో ఆఖరివాడైన పృథ్వీశ్వరుని వద్ద క్రీ.శ. 1182-1206 ప్రాంతాలలో మంత్రిగా ఉండేవాడు. వెలనాటి చోళుల రాజ్యం క్షీణించినా కేతన మంత్రి మనుమలు ఉచ్చస్థితిలోనే ఉండేవారు. నండూరి గుండన మంత్రికి ఇద్దరన్నలున్నారు. పెద్దన్న కేతన దండనాథుడు; చిన్నన్న పేరుకూడ కేతనే; ఇతడు మంత్రి. 'కవిత్వ సంపద'లో పొగడ్తకు ఎక్కినవాడు. 'గణకవర్గ' కళామహిమచే ప్రగల్భుడైనవాడు. ఈ కేతన ఏమి కావ్యాలు వ్రాశాడో తెలియదు. కువలయాశ్వ చరిత్ర అనే కావ్యాన్ని ఒక కేతన వ్రాశాడని లక్షణ కర్తలు పేర్కొన్నారు. ఆ కేతన బహుశా ఇతడేనేమో!

నండూరి గుండన మంత్రి చాలా వైభవంగా జీవించేవాడట. అగ్రహారాలిచ్చి, ఎందరెందరికో వడుగులూ, పెళ్ళిళ్ళూ చేయించి ఏటేటా కాకుళేశ్వరుని తిరునాళ్ళలో రెండు చేతులతో డబ్బు వెదజల్లేవాడట. ఆయన నేటి గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాలోని చందవోలులో వుండేవాడట. ఆనాడు దీనిని ధనదుపురం అనేవారు. అది అక్షరాలా కుబేరుని పట్నంలాంటిదని చెప్పడానికి దానిని మంచెన ఇలా వర్ణించాడు.

''మంటికడవ, నులక-మంచంబు, పూరిల్లు-నూలిచీర, రత్నకీలితంబు
కాని పైడితొడవు గలుగు టెరుంగరు-ధనదుపురములోని జనములెల్ల.'' (1-19)

రత్నాలు తాపడంకాని బంగారపు నగలు కూడ సీసమే. అవి మట్టికడవ, నులకమంచం, నూలిచీర కోవకు చెందేవి. ఇవి ఆ వూరివారు ఎరుగరట! ఇది అతిశయోక్తిగాని రసవంతం.

ఇటువంటి వూళ్ళో వున్న గుండన మంత్రి తన ఇష్టసఖుడైన మంచెన కవిని పిలిపించి ''నువ్వు ప్రాజ్ఞసంభావిత కావ్యదక్షుడవు. నాపేర ఒక కృతి రచించు'' మని అడిగాడు. అప్పుడు మంచెన పై ''బాలరసాలపుష్ప'' పద్యం చెప్పి ''కూళలకిచ్చి ఆ పడుపుకూడు తినకూడదుగాని మంచివానికి అంకితమివ్వవచ్చు'' నని ఉపక్రమించాడు. 'తన కృతిలక్ష్మికి ముఖ తిలకం'గా కృతిపతి వంశాన్ని వర్ణించాడు. 46 పద్యాలలో గుండన మంత్రి వంశాన్నీ, అతని కీర్తి ప్రతిష్ఠలను వర్ణించాడు, ఒక్కటే ఒక షష్ఠ్యంత కందపద్యాన్ని వ్రాసి కథ మొదలుపెట్టాడు.

ఏ కథను చెప్పాలో, ఎలా చెప్పాలో కృతిపతే నిర్దేశించాడు.

స్థాయి రసము శృంగారం
బై యలవడ గథలు నీతులై యెడనెడరా
గేయూరబాహు చరితము
సేయుము నీ వాంధ్ర భాష శిల్పము మెరయన్ (1-11)

నిజానికి కావ్యంలో శ్రీకారం చుట్టిన తరువాత రెండవ పద్యంలోనే మంచెన శిల్పం మెరయడం మొదలుపెట్టింది చూడండి.

''కరిముఖు డశ్వినుల్ శ్రుతులు కంజసముద్భవు మోము లంబికే
శ్వరు మొగముల్ తదాత్మజుని వక్త్రము లాదిమునీంద్రమండలం
బురగపతుల్ గ్రహంబుల్ పయోరుహనాథుడు తారకంబులుక్
బొరిబొరి నెల్లసంపదలు పోలమగుండని కిచ్చుగావుతక్.''

ఈ పద్యంలో చక్కని శిల్పముంది. కరిముఖుడు ఏకదంతుడు; అశ్వినులు ఇద్దరు; వేదాలు మూడు; బ్రహ్మ తలలు నాలుగు; శివుని వదనాలు అయిదు; అతని కుమారుని ముఖాలు ఆరు; ఆదిమునులు ఏడుగురు; దిక్పాలకులు ఎనమండుగురు; గ్రహాలు తొమ్మిది; దశావతారాలు ఎత్తిన విష్ణువు; అనంతమైన తారకలూ తన కృతిపతిని కాపాడుతూ ఉండాలన్నాడు. ఈ పద్యంలో ఒకటినుంచి అనంతందాకా అంకెలు పేర్కొనడంలో ఒక వింత ఔచిత్యముంది. గుండన మంత్రి 'గణక శిఖరరత్నం', ఈ విశేషణాన్ని గ్రంథాంతంలో చెప్పాడు. గణకత్వవిద్యలో మేటి అయిన కృతిపతిని అంకెలలో మెప్పించడం సముచితమే.

గుండన మంత్రి కేయూరబాహు చరిత్ర చెప్పమన్నాడు. దీనికి మూలం ఏమిటో కృతిపతి విశదం చేయలేదు; కృతికర్త ప్రకటించలేదు. అయినా సంస్కృతంలో రాజశేఖర కవి వ్రాసిన విద్ధసాలభంజిక అనే దృశ్యకావ్యాన్నే కొద్ది మార్పులు చేసి, మధ్యమధ్య బోలెడు కథలు గుదిగుచ్చి 'కర్ణసౌఖ్యావహమై ప్రబంధ రచనాశ్రయమయ్యెడు మార్గం' ఊతగా రచించాడు.

కేయూర బాహువు అనే రాజుకు రత్నసుందరి అనే భార్య ఉన్నది. ఆ దంపతులిద్దరూ అన్యోన్యంగా హాయిగా ఉండేవారు. పెళ్ళాంమీదనున్న అనురాగంతో రాజు రాచకార్యాలను పట్టించుకొనేవాడు కాడు. ఇది మంత్రి భాగురాయణునికో సమస్యగా తోచింది. రాజు బుద్ధిని పరిపాలనవైపు ఎలా తిప్పడమా అని ఆలోచించాడు. ఇంకో పెళ్ళి చేస్తే అనురాగాన్ని పంచుకొనే సవతివచ్చి రాణి ప్రభావం తగ్గుతుంది అనే ఆలోచన ఉత్తరోత్తరా రావడానికి వీలుగా గూఢచారులు మంత్రికి కొన్ని వివరాలు చెప్పారు.

లాట దేశాన్ని ఒకరాజు పాలిస్తున్నాడు. అతడి పేరు చండవర్మ. అతని కుమారుని పేరు మృగాంకవర్మ. నిజానికి ఈ కుమారుడు కుమారుడు కాడు కుమార్తె. మగ సంతానం లేకపోతే గద్దెకు దిక్కులేదని కూతురునే మగాడికింద ఆ రాజు రహస్యంగా పెంచుకున్నాడు. ఈ అమ్మాయి పేరు మృగాంకవళి. ఈమెని పెళ్ళి చేసుకొన్నవాడు చక్రవర్తి అవుతాడని ఎవరో సిద్ధుడు జ్యోతిష్యం చెప్పాడు. ఈ రహస్య వివరాలన్నీ భాగురాయణునికి చారులు చెప్పారు.

ఈ చిన్నదాన్ని తన రాజ్యానికి రప్పించి కేయూరబాహువుకు పెళ్ళి చేస్తే అటు భార్యా వ్యామోహం తగ్గుతుంది, ఇటు చక్రవర్తి అయ్యే యోగం కలసివస్తుంది. ఆ అమ్మాయిని ఎలా రప్పించడం? సరిగ్గా అదే సమయానికి లాటదేశం మీద శత్రురాజులు దండెత్తుతున్నారట. ''ఇటువంటి పరిస్థితులలో మీ యువరాజు మృగాంకవర్మ అక్కడ

వుండడం మంచిది కాదు. మా దేశానికి పంపించండి'' అని భాగురాయణుడు లాట రాజుకు కబురు పెట్టాడు. ఆ రాజు సరే అని పంపించాడు. అలా పంపడానికి పూర్వ బంధుత్వం తోడ్పడింది. కేయూరబాహువు భార్య రత్నావళికి లాటరాజు పినతల్లి భర్త.

రాజుకు రెండోపెళ్ళి చేయడానికి అనువుగా పెళ్ళికూతురునైతే రప్పించాడుగాని రాజుని మొదటి భార్య వ్యామోహం నుంచి ఎలా తప్పించడం? దానికి వీలుగా మంత్రి అంతఃపురదాసీలలో కళావతి అనే దాన్ని తన పక్కకు తిప్పుకొన్నాడు. దాని సాయంతో నాటకమాడాడు.

మృగాంకవళిని వేరుగా నొక యింట్లో పెట్టి కళావతిని తోడుగా ఉంచాడు. శిల్పకళా నిపుణులను రప్పించి వాళ్ళచేత అపూర్వమైన మందిరం కట్టించాడు. దానిలో మాయగోడలు, గుట్టుతలుపులు, కీలుబొమ్మలూ పెట్టించాడు. దాని రహస్య ద్వారాలు ఇంకెవరికీ తెలియవు.

రాజును రత్నావళి ప్రభావం నుండి వేరుచేయడానికి భాగురాయణుడు ఒక పన్నాగం పన్నాడు. రాణిగారికి మేఖల అని ఒక ఇష్టసఖి ఉంది. ఈమెకూ, రాజుగారి విదూషకుడికీ పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతుంది. ఈ అమ్మాయికి పెళ్ళి కాలేదు. ఒక ఆడపిల్లకు మగాడి వేషం వేయించి మేఖలకు పెళ్ళి చేయించాడు. పెళ్ళయిన తర్వాత సంగతి బయట పడింది. మేఖల అవమానాగ్నులతో తప్తమైంది. ఈ మాయ పెళ్ళి విదూషకుగు చేయించినది కాదు. రాజే చేయించాడని రాణి మండిపడింది. తన యిష్టసఖికి జరిగిన అవమానం తనకు జరిగినదే అని కోపంతో రాజు ముఖాన్ని చూడడం మానేసింది. కోప గృహానికి పోయింది.

రాజు ఒంటరివాడయ్యాడు. మంత్రి కట్టించిన కొత్త మందిరంలో శయనిస్తూ వచ్చాడు. ఒకనాడు అతని కళ్ళముందు ఒక అపూర్వ లావణ్యవతి కనిపించింది. తన మెడలోని ముత్యాలపేరు రాజు మెడలో వేసింది. ఉన్నట్టుండి మాయమైంది. రాజు విరహంలో పడ్డాడు. ఎవరీ అమ్మాయి? తను కన్నది కలకాదు. హారం నిదర్శనంగా ఉంది. పాపం! రాజుకు మంత్రి పెట్టించిన మాయగోడలు, గుట్టుతలుపులు, కీలుబొమ్మలు తెలియవు.

ఇంకా అలుక తీరని రాణివద్దకు మంత్రి కళావతిని పంపించాడు. రాజుమీద పగ తీర్చుకోవాలంటే మేఖలకు చేసిన మాయపెళ్ళి లాంటిదే రాజుకు చెయ్యాలి. మగవాడికి ఆడవేషం వేసి చేస్తే బుద్ధివస్తుంది అని నూరిపోసింది. సాధారణ సంబంధం అయితే రాజు మొగ్గడు, ఒప్పుకోడు. అందుచేత తన పినతల్లి కొమారునే ఇచ్చి పెళ్ళి చేయిస్తుట్టు రాణి చెప్తే పగ తీరుతుంది. మృగాంకవర్మ ఎలాగు ఊళ్ళో ఉన్నాడు. అతనికి ఆడవేషం వేస్తే అచ్చం కన్నెపిల్లలాగ ఉంటాడు అని కళావతి ఉపదేశం చేసింది. ఇష్టసఖికి అవమానం చేసిన రాజుపై కసితీరా పగతీర్చుకోవడానికి మాయ పెళ్ళికదా అని రాణి ఒప్పుకొంది.

రాజుకూడా పెళ్ళికి ఒప్పుకొన్నాడు. ఇలా ఒప్పుకోవడానికి ముందే రాజుకూ, మృగాంకావళికీ సమావేశాన్ని మంత్రి కల్పించాడు. ఆమె జన్మరహస్యం కూడా గుట్టుగా తెలియచేశాడు. రాజు ఇష్టపడ్డాడు. పెళ్ళయిపోయింది. తన తమ్ముడు మృగాంకవర్మకే ఆడవేషం వేసి పెళ్ళి చేసినట్లు రాణి భావిస్తూనే ఉంది. అంతలోనే లాటదేశం నుండి వుత్తరం వచ్చింది. మృగాంకవర్మ నిజానికి ఆడపిల్లే అని ఇప్పుడు అసలు రాజ్యానికి వారసుడు జన్మించాడని పురిటి కబురు వచ్చింది. రాణి తెల్లబోయింది. అయినా తేరుకొని ధైర్యం తెచ్చుకొంది. ఏమైనా ధీరకదా. తరువాత అందరూ సుఖంగా ఉన్నారు.

కథ చిన్నది. అయినా చిత్రమైనది. కృతిపతి ఆదేశించినట్లు ఇందులో స్థాయిరసం శృంగారమే. ఇంక కథలు నీతులై ఎడనెడ రావాలి. అందుకోసం మంచెన ఇరవై రెండు నీతికథలను తీసుకొచ్చి కథలో చొప్పించాడు. ఇవన్నీ పంచతంత్ర హితోపదేశాలలోనివే.

కృతిపతి చెప్పమన్నాడు కనక కథలను బలవంతాన కథలో తీసుకొచ్చి కలిపినట్టే కనబడతాయి. అసలు కథకూ, పిట్టకథలకూ సంబంధం లేదు. స్థాయిరసం శృంగారమైతే నీతికథలను ఎలా ముడిపెట్టడం? అందుచేత మంత్రికి అతని మేనల్లుడు సోమదత్తుడు చెప్పినట్టు కొన్ని కథలు, అంతఃపుర దాసీలు సుమతి, మకరందిక, సుకుమారికలు తమలో తాము చెప్పుకొన్నట్టు కొన్ని, రాజుకు విదూషకుడు బాదరాయణుడు చెప్పినట్టు కొన్ని ఈ పిట్టకథలను మూలకథతో ముడిపెట్టాడు. ఏయే ఆశ్వాసాలలో ఏయే కథలున్నాయో చూడండి.

మంచెన నీతికథలు

ద్వితీయాశ్వాసంలో

సోమదత్తుడు చెప్పినవి:

1.	ప్రాలసరి తైలమమ్మిన వైశ్యబాలిక కథ (7-16)	10 పద్యాలు
2.	తాత్కాలికమతితో సమయస్ఫూర్తితో ప్రమాదము గడచిన దక్షుని కథ (20-25)	6 పద్యాలు
3.	విద్యాన్వితుడైనా మతిలేనందువల్ల హతుడైన విప్రునికథ (28-34)	7 పద్యాలు
4.	దిట్టతనముతో తన కార్యము నడిపిన చతురిక కథ (40-74)	35 పద్యాలు

సుమతి చెప్పినది:

5.	సన్నపుకార్యములకు పోరిన శశకపింజలముల కథ (87-95)	9 పద్యాలు

మకరందిక చెప్పినది:

6.	తొండలు పోరితే జనులకు బాధపుట్టిన కథ (97-107)	11 పద్యాలు

సుకుమారిక చెప్పినది:

7.	తేనెబొట్టున ఎక్కుడైన ఆపదలు మొలిచిన కథ (109-118)	10 పద్యాలు
		మొత్తం 88 పద్యాలు

తృతీయాశ్వాసంలో

సుమతి చెప్పినది:

1.	అహిభేకోపాఖ్యానం (9-261)	పద్యాలు 253

ఇందులోని ఉపకథలు:

(i)	కాకముచేరిన హంసలకు చేటైనకథ (35-76)	42
	(ఉపకథలోనే మరో పిట్టకథ :	
	కమఠంబులు గరుడబాధ కడచిన కథ (54-68)	15
(ii)	చేసిన మేలు మరచి కాకులు నీటి కాకులపై తప్పులు మోపిన కథ (80-108)	29
(iii)	ఉపకారం చేసిన పులుగును పరిభవించి పులి చెడిన కథ (112-134)	23
(iv)	లోభగుణంబుచేత మృగధూర్తుడు మృత్యువు చెందిన కథ (139-145)	7
(v)	నారికేళ బకమనే పులుగు దురైశ్వర్యమహిమచే మడిసిన కథ (148-161)	14
(vi)	అతిలోభంచేత ధనగుప్తుడనే వణిజుడు తన సొమ్ము భూపతిపాలు చేసిన కథ (168-207)	40
(vii)	పరపురుషుడని కొడుకు ముఖం చూడని అతినిష్ఠ దుష్టకపటమని చెప్పే కథ (211-245)	35

సుకుమారి చెప్పినది:

2.	కోతి సహవాసమున గిజిగాడు చెడిన కథ (264-283)	పద్యాలు 20

మకరందిక చెప్పినవి:

3.	బుద్ధిమాలిన కపి భూమిపాలుని చంపిన కథ (289-300)	పద్యాలు 12
4.	వివేకియైన చోరుడు శత్రువైన విప్రుని కాచిన కథ (302-338)	పద్యాలు 37
		మొత్తం 322

చతుర్థాశ్వాసంలో

బాదరాయణుడు చెప్పినవి:

1.	సుతహంతయైన కిరాతుణ్ణి మృతునిగా చేసిన చిలుకమ్మ కథ (64–79)	16 పద్యాలు
2.	మొగమోడి హతుడైన యక్షుని కథ (84–93)	10 పద్యాలు
3.	అహిమూషికోపాఖ్యానము (99–122)	24 పద్యాలు
		మొత్తం 50 పద్యాలు

కేయూరబాహు చరిత్రలో 767 గద్య పద్యాలు ఉన్నాయి. అందులో 468 గద్యపద్యాలు ఈ పిట్టకథలకే పట్టాయి. పోతే 307 పద్యాలు అసలు కథకు వినియోగించారు. ఇందులో 48 పద్యాలు అవతారికకూ, నాల్నాలుగు పదహారు పద్యాలు ఆశ్వాసాల ఆద్యంత పద్యాలకూ పోతే 233 గద్యపద్యాలే ఫక్తుకథ. ఇంత చిన్న కథాభాగంలోనే మంచెన తన శిల్పం మెరిసేటట్టు రచన చేశాడు. సామెతలు, జాతీయాలు వాడుతూ ఆహ్లాదం కలిగిస్తాడు:

> జగంబున నోడల బండ్లు, బండ్ల నోడలు జనుదెంచు (3–103); డాగబోయియుం దలవరియింట దాగిరి (4–164); ముసలికి సంతసంబులు కొరతయే (4–178); కడుపు చల్లగ (1–36); గద్దియ కెవ్వరు దిక్కులేదని (1–74); గుండెలు జల్లుమనంగ (1–103); నిన్న రాతిరి పెళ్ళి, నేడిదేమివచ్చె దీనికి (1–121); ఒకనాటఁ బ్రాణంబు ననునె నవసిన మాత్రఁ (3–143); మందునకైన మత్స్యంబు లేకుండ (3–161); ముక్కున నీరెత్తుట (3–201); ఈ జరభి మూడుజగంబులు మ్రింగు చుండె (3–223); తల నెక్కించుకొనుట (4–95); మెచ్చునకు ధైర్యం తెచ్చుకొనుట (4–196); ఇష్టాపత్తి, సోడుముట్టు, కాటులాడు వంటి ప్రయోగాలు. 'అటక' అనే మాటకు 'అట్టుగ' అనే రూపం. జడ్డ 'టు' కారం; యతి స్థానంలో 'గ' కారం ప్రాసస్థానంలో ఉన్నది కనబడుతుంది (3–238). తిట్టులో నేడు మనం వాడే 'ముండ' అనే విశేషణం ఆనాడే కనబడుతుంది. 'ముండపులుగు లకట! మోసపుచ్చె' (3–74); ముండయెలుకలు (2–180) అనే ప్రయోగాలూ కనబడతాయి.

అష్టాదశ వర్ణనలు మొదలైనవి మంచెన కాలానికి ముందుగా నన్నెచోడుని కుమారసంభవంలోనే ఉన్నాయి. మంచెన కుమారసంభవాన్ని చూశాడని కేయూరబాహు చరిత్రను ఇటీవల కొత్తగా ప్రచురించిన తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు వ్రాశారు. నన్నెచోడుడు మాత్రమే ప్రయోగించిన 'తాడిడిఫలంబు గొనుట' అనే ప్రయోగాన్ని మంచెన 'తాడిడిపండు దిన్నక్రియ' (4–145) అని ప్రయోగించాడని చెప్పారు. అలాగే నన్నెచోడుడు మాత్రమే వాడిన 'నోరగొలదుల్' అనే ప్రయోగాన్ని ఇతడు

'నోరంగొలందులు కూయు' (4-51) అని వాడుకొన్నాడట. నన్నెచోడుని పద్యాలలో భావాలకూ, మంచెన పద్యాలలో భావాలకూ సామ్యాలు చూపించారు.

నన్నెచోడుడు ఉమామహేశ్వరుల శృంగారలీలలను ఇలా వర్ణించాడు:

''కలహంసకలరవాకలిత నిర్ఝరముల సారసారావాబ్జషండములను
రోలంబ రుతిలతాందోలంబులను శుకమంజులస్వన పుష్పమండలములు
కలకంఠరణిత మాకందవనముల బారావతధ్వని మందిరస్థలముల
గేకికలధ్వానగిరికందరంబుల లావుకనినద లీలాతలముల
నప్పటప్పటి కనురాగ మగ్గలింప-గామరస మంతకంతకు గడలుకొనగ
నలి రమించిరి కైలాసనగముమీద-బరమసుఖలీల నాజగత్పతియు సతియు.''
(కుమార. 1-78)

మంచెన తన కథలోని నాయికానాయకుల విహారాన్ని ఎలా వర్ణించాడో చూడండి:

''కర్పూర కస్తూరికా పరిమళకరండములట్టి రత్నహర్మ్యములయందు
గోకిలకీరాది కోలాహలంబున విలసిల్లు నుద్యాన తలములందు

మత్తకేకులకెల్ల నృత్తరంగములైన రమణీయకేళిశైలములయందు
బరిమళకదళికాప్రాప్తలతాశ్రేణి నమరు దీర్ఘికల తీరములయందు
నాడు నాటికి వేడ్కలు నాటుకొనగ
సారెసారెకు నింపు లింపారుచుండ
నంతకంతకు నాదట లగ్గలింప
నంగజక్రీడ దేలుదు రభిమతముగ.'' (కేయూర. 4-201)

మంచెన తన పూర్వులను అనుకరించాడనుకొంటే ఇతణ్ణి అనంతర కవులు అనుసరించారు. ఈ పద్యం చూడండి. తన ఎడదమీది హారాన్ని రాజు మెడలో వేసిన మృగాంకావళిని చూచి రాజు ప్రశ్నిస్తున్నాడు.

''ఎవ్వరిదాన వీవు హరిణేక్షణ! యెయ్యది నీకు బేరు? ని
న్నెవ్వతె దెచ్చె? జెప్పు మిది యేర్పడ బంటుగ నన్ను నేలుమం
చవ్వసుధేశ్వరుం డతివహ స్తమువట్టిన బట్టి ధైర్యముౕ
ద్రవ్వెడు కన్నులం గొని యదల్చి వదల్చెగరంబు చయ్యనౕ.'' (కేయూర. 4-21)

ఈ ఒక్క పద్యాన్ని అల్లసాని పెద్దనగారు ఈ క్రింది 'వరూధిని స్వగతం'లోనూ, ''ఎవ్వతె వీవు'' అనే ప్రవరుని ప్రశ్నలలోనూ (2-39) రెండు పద్యాలలో అనుసరించారు.

''ఎక్కడివాడొ? యక్ష తనయేందు జయంతవసంతకంతులం
జక్కదనంబునౕ గెలువ జాలెడు వీని మహీసురాన్వయం

బెక్కడ? యీతనూవిభవ మెక్కడ? యేలని బంటుగా మరుగ్
డక్కగొనంగరాదె యకటా! నను వీడు పరిగ్రహించిరగ్'' (మను. 2-35)

ఎవ్వతె వీవు భీతహరి ణేక్షణ! యొంటి చరించె దోటలే
కివ్వనభూమి, భూసురుడనేఁ బ్రవరాఖ్యుఁడ ద్రోవ తప్పితిం
గ్రొవ్వున నిన్న గాగ్రమున కుం జనుదెంచితి, నూరుం జేర నిం
కెవ్విధిఁ గాంతుఁ దెల్పఁగద వే! తెరువెద్ది? శుభంబు నీకగున్.

వివిధచ్ఛందస్సుల మీద ఎలా ప్రత్యేకమైన మోజు లేదో అలాగే మంచెనకు శబ్దాలంకారాల మీద కూడ అట్టే మమకారం లేదు. అయినా అవి అక్కడక్కడ వాటంతటు అవి వచ్చినట్లు కనపడతాయి.

''కౌశికగోత్ర భూసురశిఖామణి కేతనభూవరుండు పృ
థ్వీశ నరేంద్రుమంత్రి యయి యెల్లెడ జాల బొగడ్తకెక్కనా
కాశనదీమరాళశివకాశసురాశనతారకేశ నీ
కాశతరాధిరోచి రవకాశవికాస యశోవిశాలుడై.'' (కేయూర. 1-82)

ఈ పద్యంలోని చివరి రెండు పాదాలలోని శబ్దాలంకారం వంటి శిల్పమే తరువాత పోతనగారి కాలంనాటికి ప్రతి పద్యంలోనూ కనిపించేటంత విస్తారమైంది.

'కర్ణసౌఖ్యావహమై' రచించమని గుండనమంత్రి కోరడంవల్ల తియ్యని మాటలు, చెవికింపైనవి మంచెన బాగా వాడాడు. గుండల కర్ణసౌఖ్యం కోరడానికి కారణముంది, అతడు కవిగాయక పోషకుడు (3-344); భ్రాజితమృదు మధుర కావ్యపరిణతుడు (3-345); కళావిజ్ఞాతసంగీత విద్యాభిరతుడు (3-346). అందుకే ఏరికోరి చెవికింపుగా ఉండే రచన చెప్పమన్నాడు. శృంగారరసంతోపాటు కావ్యంలో నీతులుగూడ చెప్పమని గుండనమంత్రి ఇష్టసఖుణ్ణి అడిగాడు. అవి నీతిశాస్త్రాలూ, ధర్మశాస్త్రాలూ తెలిగిస్తున్న రోజులు. శతకాలు వెలుస్తున్న రోజులు. మంచెన నీతులను క్రోడీకరిస్తే, మకుటం ఉండదుగాని ఒక శతకంలోని భాగాలులాగ కనబడతాయి.

కేయూరబాహు చరిత్రలోని నీతులు ప్రాచీనకాలంలోనే ప్రచారంలోకి వచ్చాయని వీటిలో కొన్ని మడికి సింగన తన సకలనీతిసమ్మతంలో ఉదాహరించడంవల్లనే తెలుస్తున్నది. కేయూరబాహు చరిత్రలోనివంటూ ఈ రెండు పద్యాలను అతడు ఇచ్చాడు:

''నైజగుణంబగు తమమది - రాజస మప్పటికి గప్పి ప్రజతో నయ్యై
యోజం బరికింపని యా-రాజులు సాధులని నమ్మరా దెప్పటికిక్.'' (సకల. 504)
''పొడమదు చేయని కార్యము - పొడమక యుండంగ గప్పిపుచ్చెద మన నె
న్నడు రాదు చేతగలిగిన - వెడమలయపు మనుజు లేల వేల్పులకైనగ్?''
(సకల 736)

ఈ రెండూ కేయూరబాహు చరిత్రలో ఉన్నాయి. మొదటిది ద్వితీయాశ్వాసంలో 86వ పద్యంగా, రెండోది తృతీయాశ్వాసంలో 232వ పద్యంగా కనబడతాయి.

ఆంధ్రసాహిత్యంలో మొదటి నుంచీ అనువాదాలే ఉన్నా సంస్కృతంలోని దృశ్యకావ్యాన్ని తెలుగులో శ్రవ్యకావ్యంగా అనువదించడానికి ఇదే మొదటిదని బులుసు వెంకటరమణయ్యగారు చక్కగా చెప్పారు.[1] కేయూరబాహు చరిత్రకు మూలమైన విద్ధసాలభంజిక దృశ్యకావ్యమే. విద్ధసాలభంజికలో 'త్రిలింగ' అనే పదం దేశవాచకంగా ఉందని బులుసువారే మొట్టమొదట చెప్పారు. ఆ వ్యాసంలో అన్నీ బాగానే ఉన్నాయిగాని ''... 'పీనుగు' అనుటకు బదులుగా 'పినుగు' (పుట. 48) అని కలదు'' అని వ్రాశారు. ఆ పద్యం చూడండి:

''అని పక్షిహితము సెప్పిన- విని వెంగలియైన క్రోతి వీడిరవున నా
లును దాను నుండి నన్నొక-పినుగుంగా దలచి కాదె ప్రేలదొడంగెE?'' (3-277)

ఇందులో 'పినుగు' అన్నది పీనుగుక్రింద మార్చాలని వారి ఊహ. అది అనవసరం. 'పినుగు' అనే మాట మల్లికార్జున పండితారాధ్యుడు శివతత్వసారంలో వాడాడు. ఈ పద్యాన్నే ఉదాహరణగా ఇస్తూ, సూర్యరాయాంధ్ర నిఘంటువులో ఈ మాటకు అవివేకి, శక్తిహీనుడు అని అర్థం చెప్పారు. 'పీనుగు' అని మారిస్తే ఛందోభంగమవుతుంది.

మంచెన ఏ ప్రాంతంవాడో తెలియదుగాని కందుకూరి వీరేశలింగంగారు ''ఇతడు రాజమహేంద్రపుర నివాసు''డని వ్రాశారు. దీనికి ఆధారం లేదని తిమ్మావఝ్ఝల కోదండ రామయ్యగారు చెప్పారు. అయితే ''వెలనాటి చోడులు లోనైన రాజులు చాళుక్యరాజ్య ప్రతినిధులుగా రాజమహేంద్రవరము రాజధానిగా వేగిదేశమును పాలించినవారే'' అని వీరేశలింగంగారు ఏదో ఒక సబబు చూపించారు. ఇందువల్ల మంచెన రాజమండ్రి వాడన్నారు. కృతిపతి నేటి గుంటూరువాడు కనుక, కవి అతనికి ఇష్టసఖుడు కనుక ఇందులో రెండవ వ్యక్తి కూడ ఆ ప్రాంతంవాడే అని చెప్పడం సముచితమే. మంచెన తన కావ్యంలో ఏదైనా ప్రత్యేక ప్రాంతాన్ని కథలో చెప్పాడేమో చూద్దాం.

''మొగిళులలోని యేకతము ముచ్చిలి పుచ్చుకొనంగ జాలు ద
స్తగిరికి దామ్రపర్ణికిని సంగమమైన ఘటింప నేర్తు నిE
మిగిలినయట్టి బుద్ధిమతి మేదిని నెందునుగాన నేమిక్రొ
త్త గలుగజూచి పెండిలి ముదంబని యాడితి బోటి చెప్పుమా!'' (4-180)

ఈ పద్యంలో 'అస్తగిరికి, తామ్రపర్ణికి సంగమం ఘటించడం' అనే మాటలవల్ల ఏమైనా తెలుసుకోవచ్చునేమో! తామ్రపర్ణి నది తిరునెల్వేలి జిల్లాలో ఉంది. ఇది సామెత కాబోలు. భావిపరిశోధనలవల్లగాని ఇది తేలదు.

1. భారతి - ఏప్రిల్ 1961. కేయూరబాహు చరిత్రపై వ్యాసం.

తరుచుగా మన శాసనాలలో రేనాడు ఏడువేలు, వెలనాడు ఆరువేలు అని ఒక 'నాడు' చెప్పిన వెంటనే ఒక సంఖ్యను చెప్తారు. ఈ సంఖ్య ఏమిటి? గ్రామాలా, కాదా అని చరిత్రకారులకు అనుమానం వచ్చింది. మంచెన తన ఈ గ్రంథం అవతారికలో చెప్పిన ఈ పద్యం ఆ అనుమానాన్ని నివారిస్తుంది.

''అరుదందర్ వెలనాటిచోడ మనుజేంద్రా జ్ఞాపనంబూని దు
స్తరశక్తింజని యేకవింశతి సహస్రగ్రామ సంఖ్యాకమై
ధరణింబేర్చిన పాకనాడు నిజదోర్దండైక లగ్నంబుగా
బరిపాలించె నమాత్యకొమ్మన జగత్ప్రఖ్యాత చారిత్రుడై.'' (1-27)

ఈ పద్యంవల్ల స్పష్టంగా అది గ్రామ సంఖ్యే అని విశదమవుతున్నది.

సప్త సంతానాలలో కృతి ఒకటి అని మొదట గ్రంథస్థం చేసిన మంచెన కృతికన్య కొన్నిచోట్ల నిజంగా 'బాలరసాల పుష్పనవపల్లవ కోమలమే!'

పెద్దయామాత్యుడు

అష్టావధానాలూ, శతావధానాలూ నేటికీ కొందరు కవులు చేస్తున్నారు. అడిగిన ఛందస్సులో కోరిన విషయంమీద, పెట్టిన నియమాలకు లోబడి, అప్పటికి అప్పుడు ఆశువుగా కవిత్వం చెప్పి రంజింపచెయ్యడం కూడా ఒక ప్రత్యేకమైన కళే!

శతావధానాలకు స్వర్ణయుగం తిరుపతి వేంకటకవుల జీవితకాలం. ఆ తరువాత సంపూర్ణ శతావధానాలు చేసినవాళ్ళే అరుదు. ఆంధ్ర సాహిత్యంలో ఈ అవధానాలు ఇటీవల కొత్తగా వచ్చినవి కావు. చాలా ప్రాచీనమైనవే. రమారమి తిక్కనగారి కాలం నుంచి వస్తున్నవే.

మనుమసిద్ధి చనిపోయాక క్రీ.శ. 1285 నుంచీ నెల్లూరును రెండవ తిక్కరాజు పాలించాడు. అతని ఆస్థానంలో పెద్దయామాత్యుడనే కవి వుండేవాడు. ఇతడు ఉద్దండపిండం. కవిత్వంలో ఎన్నిరకాల సాముగరిడీలు చేయడానికి వీలుంటుందో అన్నీ చేయగల సమర్థుడట. ఎవరు ఏ అవధానం చేసినా, ఆ విద్యలో అతగాడితోపాటు ఇతణ్ణి తూస్తే ఇతడే కొంచెం ఎక్కువమిల్లు చూపిస్తాడట.

ఆశుకవిత్వమేకాక, అవధాన ప్రదర్శనలేకాక ప్రబంధాలు వ్రాయడంలో కూడ పెద్దయామాత్యుడు సిద్ధహస్తుడే అని తెలుస్తుందిగాని, ఇతడు వ్రాసిన కావ్యాలేవీ నేడు మనకు లభించవు. పోనీ వాటి పేర్లయినా తెలియవు. ఇతడు ఇంత ఉద్దోలమైన కవి అని ఇతని మనుమడు జక్కన వ్రాసిన 'విక్రమార్క చరిత్ర' ద్వారా తెలుస్తున్నది. ఆ పుస్తకంలో పెద్దయామాత్యుడు ఏయే విద్యలలో ఆరితేరినవాడో, ఎలాంటి చిత్రకవితలు చెప్పగలడో

విశదం చేస్తూ ఒక పెద్ద సీసమాలిక - పన్నెండు పాదాలది[1] వుంది. ఇందులోని విషయాల నన్నిటినీ వరుసగా చెప్పుకొందాం:

1. సంస్కృతం, ప్రాకృతం, శౌరసేని మొదలైన భాషలలో గడియకొక శతకం చెప్పగలడు;
2. ప్రహసనం, ప్రకరణం, భాణం మొదలైన బహువిధాల రూపకాలలో రూఢి మెరిసేటట్టు రచనలు చేయగలడు;
3. చక్రి, చతుర్భద్ర, చతురుత్తరాధిక క్షుద్ర కావ్యాలు పెక్కులు రచించాడు;
4. ఆంధ్ర కవిత్వంలో తజ్ఞులు మెచ్చేటట్లు మేలుగా ప్రబంధం చెప్పాడు;
5. ఏ రీతిలోనైనా సరే, ఏ ధాతువునైనా సరే ఇమ్ముగా నవరసాలలో మంచి వర్ణనలు చేయగలడు;
6. ఏక సంధా, ద్విసంధా, త్రిసంధలలో ధారణచేసి ఏదైనా గడగడ చదువగలడు;
7. ఎవడు ఏ అవధానం చేసినా, ఆ అవధానంలో వానికన్న కొంచెం ఎక్కువ తూగేటట్టు రాణించగలడు;
8. వృత్తకందం, కందవృత్తం, చతుర్విధ కందాలు మొదలుగా గల గర్భ కవిత్వాలు చెప్పగలడు;
9. అక్షరచ్యుతకం, మాత్రాచ్యుతకం, బంధుచ్యుతకం, నామగోప్యం, క్రియాగోప్యం, భావగోప్యం మొదలైన కొత్త కొత్త విధానాలు పుట్టించుకొని, క్రమప్రబంధాలు చెప్పగలడు;
10. గోష్ఠిలో పద్యమూ, గీతా ఆర్భాటంగా చదవగలడు;
11. ఇంతెందుకూ? అన్ని విద్యల చివర అంచులు చూపినవాడు;
12. నెల్లూరి తిరుకాళమనుజవిభుని సమ్ముఖంలో సాహిత్య సరణి మెరసి మహిమ గాంచినవాడు.[2]

పెద్దయామాత్యుని రచనలేవీ మనకు దక్కలేదని ముందే చెప్పుకున్నాం. అయినా మనుమని గ్రంథంలో దొరికిన ఈ పద్యాన్నిబట్టి తాత గొప్పదనాన్ని తెలుసుకున్నాం. పెద్దయామాత్యుడు ఆంధ్ర వాఙ్మయంలో అవధానాలకు అక్షరాలా పెద్దయ్య. ఇతని రచనలు దొరకలేదు. కాబట్టి ఇతని పేరు చెప్పుకొని రకరకాల చిత్రకవిత్వాలను గురించి, వాటి చరిత్రను గురించి ముచ్చటించుకొందాం.

పెద్దయామాత్యుడు సంస్కృతం, ప్రాకృతం, శౌరసేని మొదలైన భాషలలో గడియకొక శతకం చెప్పగలడని జక్కయ్య అన్నిటికన్న ముందుగా చెప్పాడు. అష్టభాషా

1. విక్రమార్క చరిత్ర - జక్కన రచన. 1-20
2. ఇవి జక్కన విక్రమార్క చరిత్రలో '1-20'కి వచన రూపం.

పాండిత్యం ఆ రోజుల్లో ఘనంగా చెప్పుకొనేవారు. కేయూరబాహు చరిత్రలో మంచెన తన కృతిపతిని గొప్పగా వర్ణించాడు. ఒక్కొక్క భాషనూ ఒక్కొక్క భామినిగా భావించి, వాటికి నాథునిగా నండూరి గుండయ మంత్రిని నుతించాడు.

''గౌళీ నిర్జరరాజ నందనుని, బంగాళీ ముఖాబ్జార్కు, నం
ద్రీలీలాంగజు, ఘూర్జరీ రతికళా దీక్షా సముద్భాసితున్
జోళీలోల విలోచనోత్పల సుధాంశుం, గుంతలీ భద్రు, నే
పాళీ నూతన కూచిమారు, గుకురీ ప్రత్యగ్ర పాంచాలునిన్.'' (కేయూర. 1-77)

అష్టభాషల్లో కవిత్వం చెప్పేవాళ్ళను ఆనాడు ఆదరించేవారనీ, అదొక గొప్పగా చెప్పుకొనేవారనీ భాస్కర రామాయణ రచనలో భాగమున్న మల్లికార్జునభట్టు గద్యవల్ల తెలుస్తుంది. అతడు 'శ్రీమదష్టభాషాకవిమిత్ర కులాపవిత్ర భాస్కర సత్కవిపుత్ర' అని చెప్పుకొన్నాడు. తిక్కనగారు ఉభయకవి మిత్రుడేగాని వారి సమీపకాలంలో అష్టభాషా కవిమిత్రులు వెలిశారు.

పాల్కురికి సోమనాథుడు తాను వ్రాసిన వృషాధిప శతకంలో ఎనిమిది భాషల్లోనూ కాకపోయినా సంస్కృత, ద్రావిడ, కన్నడ, ఆరె, మణిప్రవాళ, అరుదు మణిప్రవాళ, వాగ్గేయమణిప్రవాళ జాను తెలుగులలో ఒక్కొక్క పద్యం వ్రాశాడు. భాషకొక పద్యం చొప్పున మాత్రమేకాక పదహారు పాదాలకు తగ్గక 88 పాదాలదాకా వివిధ భాషల వరుస నడకలు కూడా సోమనాథుడు వ్రాశాడు. తెలుగు, తమిళం, కన్నడం, ఆరె బంతులుకట్టి పాడించాడు.[3]

సోమనాథుని వంటివాళ్ళు ఒక్క శతకంలో మాత్రమే, భాషకొక పద్యం చొప్పున మాత్రమే చెప్పారుగాని పెద్దయామాత్యుడు ఒక్కొక్క భాషలో ఒక్కొక్క శతకానికి శతకమే, గడియకొకటి చొప్పున చెప్పగలవాడని జక్కన యీ సీసమాలికలో ధ్వనించాడు కాబోలు.

సంస్కృత అలంకార గ్రంథాలలో పదిరకాల రూపకాలను చెప్పారు. నాటకాలు ఈ దశరూపకాలలో ఒక విభేదం. పెద్దయామాత్యుడు ప్రహసనం, ప్రకరణం, భాణం అనే బహువిధాలైన రూపకాలను రచించాడని జక్కన చెప్తున్నాడు. ఇతడు ఏ భాషలో రచించాడోగాని తెలుగులో మొన్న మొన్నటిదాకా ప్రహసనాలూ లేవు; ప్రకరణాలూ లేవు.

సంస్కృత కవులు దృశ్యకావ్యంగా వ్రాసిన వాటిని మన తెలుగు కవులు చంపూ కావ్యాలుగానే అనువదించారు. సంస్కృతంలో రాజశేఖరుడనే కవి విద్ధసాలభంజిక అనే

3. పండితారాధ్య చరిత్ర - పర్వత ప్రకరణం. పుట 374 నుండి 391. పాల్కురికి సోమనాథుడి తమిళ రచనలను నా మిత్రులు చల్లా రాధాకృష్ణశర్మగారు తమ ''Tamil Elements in Telugu Literature'' అనే ప్రామాణిక గ్రంథంలో పరిష్కరించారు. (ఇది అముద్రితం)

దృశ్య కావ్యాన్ని వ్రాస్తే, దానిని మంచెన కేయూరబాహు చరిత్ర అనే పేరుతో శ్రవ్య కావ్యంగా అనువదించాడు. పెద్దయామాత్యుడు తెలుగులోనే ప్రహసనాలు మొదలైనవి రచిస్తే అవి నష్టమవడం మనకు నిజంగా పెద్దలోటే! వీటిని అతడు సంస్కృతంలోనే వ్రాశాడని భావించడానికి గూడా వీలుంది. ఈ సీసమాలికలోనే ఇంకొకపాదంలో 'ఆంధ్ర కవిత్వంబునందు' అని ప్రత్యేకంగా పేర్కొని, అందులో పెద్దయామాత్యుడు ప్రబంధాలు వ్రాయగలడని చెప్పబట్టి ముందు పాదాలలో రచనలు సంస్కృతం లోనివే అని భావించవచ్చు.

అలంకారికుల మతంలో రీతులు చాలా ఉన్నాయి. వైదర్భి, గౌడి, పాంచాలి, లాటి అని నాలుగు ముఖ్యమైన రకాలను విన్నకోట పెద్దన తన కావ్యాలంకార చూడామణిలో చెప్పాడు. సంస్కృతంలో ఆరు రకాలదాకా ఉన్నాయి. అవి : 1. వైదర్భి; 2. గౌడి; 3. పాంచాలి; 4. లాటి; 5. మాగధి; 6. ఆవంతిక. ''దేశ విభాగములనుబట్టి రీతులకు పేర్లు పెట్టుచు లెక్కించినచో అవి బహు సంఖ్యాకములగును'' అని చెలమచర్ల రంగాచార్యులుగారు చెప్పారు.[4] వైదర్భి కోమలంగా ఉంటుంది. గౌడి కఠినంగా ఉంటుంది. పాంచాలి మిశ్రమంగా ఉంటుంది. ఓజస్సు, ప్రసాదం మొదలైన గుణాలున్న పదాల కూర్పును రీతి అంటారు. రీతులలో ఏది అడిగినా అందులో పెద్దయామాత్యుడు కవిత్వం చెప్పగలడట. అంతేకాదు, ఈ రీతులలో అడిగిన దాంట్లో కోరిన ధాతువున చెప్తాడట.

ధాతువులు వ్యాకరణ శాస్త్రంలో భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్కాలం మొదలైనవాటికి గుర్తులు. ఇవి పదిరకాలు. సంస్కృత వ్యాకరణంలో ధాతువులు లట్, లిట్, లృట్ అని దశవిధాలుగా ఉంటాయి. వీటిని లడాదులంటారు. మన తెలుగులోనూ క్రియలను ఈవిధంగానే చిన్నయసూరి విభజించాడు. పెద్దయామాత్యుడు ధాతువు అన్నప్పుడు ఏ అర్థంలో వాడాడో మనకు తెలియదు. ధాతువులలో ''వృద్ధిక్షయ భయజీవిత మరణం లజ్జాసత్తా స్థితిజాగరణం, శయనక్రీడారుచి దీప్త్యర్థం ధాతుగణం త మకర్మక మాహుః'' అని అకర్మకధాతువులు వున్నాయి.[5] ధాతువు అంటే ఛందస్సు అనికూడ అర్థం చెప్పుకోవచ్చు. సంగీత శాస్త్రంలో ధాతువు, మాతువు అనే విభేదాలు వున్నాయి. పాటలో మాటలను మాతువు అంటారు. గేయాన్ని ధాతువు అంటారు.[6] ధాతువు అంటే సంగీతపు కూర్పు అనే అర్థం రూఢి అయిందిగాని నాట్యశాస్త్రంలో 'తాళం' అనే అర్థంవచ్చే భాగంగా దీన్ని పేర్కొన్నారు. వాద్యకరణాశ్రయమైన ధాతువులు నాలుగు ఉన్నాయి.[7] పెద్దయామాత్యుడు నడకను దృష్టిలో పెట్టుకొని 'ధాతువు' అనే మాటను వాడి ఉంటాడు. ఏ రీతిలోనైన, ఏ ధాతువునైన నవరసాలలో సువర్ణనములు పెద్దయామాత్యుడు చేస్తాడట. ఇది ఆశుకవిత్వమే.

---

4. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము. పుట. 106
5. ఆంధ్ర వాచస్పత్యం - ద్వితీయ సంపుటం. పుట. 110
6. 'వాగ్గేయకార చరిత్రము' - బాలాంత్రపు రజనీకాంతరావుగారు. పుట. 47
7. నాట్యశాస్త్రం - పోణంగి శ్రీరామ అప్పారావుగారు, పుట.784.

పెద్దయామాత్యుడు చతుర్విధకందాలను చెప్పగలడన్నాడు. అతని కాలానికి ముందే నన్నెచోడుడు ఈ గారడీలు చేశాడు. పెద్దయామాత్యుని రచన దొరకలేదు. కనుక నన్నెచోడుని పద్యాన్నే తీసుకొని చతుర్విధకందాలు ఎలా ఉంటాయో చూద్దాం.

కవి ఒకటే కందపద్యం వ్రాస్తాడు. దీనిలో నుండి ఇంకొక మూడు కందపద్యాలను, ఏ అక్షరాన్నీ మార్చకుండా తయారు చేసుకోవాలి. అలా తయారు చేయడానికి కొన్ని నియమాలు వున్నాయి. మొదటి కందపద్యంలోని రెండవ చరణంలోని రెండవ గణాన్ని తీసుకొని అక్కడ నుంచి చదివితే కొత్త పద్యం రావాలి. ఈ కొత్త పద్యం రెండవ చరణంలోని రెండవ గణంతో మొదలుపెట్టి మరొక పద్యం, దానిలో నుంచి ఇలాగే ఇంకొకటీ రాబట్టవచ్చు. చూడండి. (మీ సౌకర్యంకోసం కావలసిన గణసూచనతో అచ్చు వేస్తున్నాను.)

సుజ్ఞానయోగతత్త్వవి- ధిజ్ఞుల్ భవబంధనముల ద్రెంచుచు భువిలో
నజ్ఞాన పదము బొందక- ప్రాజ్ఞుల్ శివుగొల్తు రచల భావన దవులన్

(కుమార. 12-27)

ఈ కందపద్యంలో రెండవ చరణంలో రెండవ గణం 'భవబం' అనే అక్షరాలతో మొదలవుతుంది. ఇక్కడనుంచి మొదలుపెట్టి పద్యాన్ని వ్రాసుకొని పోయి రెండవ కందాన్ని చదువుకోవచ్చు. రెండవ కందం:

భవబంధనముల ద్రెంచుచు.- భువిలో నజ్ఞానపదము బొందక ప్రాజ్ఞుల్
శివుగొల్తు రచలభావన- దవులన్ సుజ్ఞానయోగతత్త్వవిధిజ్ఞుల్.

ఈ కందంలోని రెండవ పాదంలోని రెండవ గణం 'అజ్ఞాన' అనే అక్షరాలతో మొదలవుతుంది. అక్కడనుంచి వ్రాసుకొని వెళదాం. మూడవకందం:

అజ్ఞానపదము బొందక - ప్రాజ్ఞుల్ శివు గొల్తు రచల భావన దవులన్
సుజ్ఞానయోగతత్త్వ వి- ధిజ్ఞుల్ భవబంధనముల ద్రెంచుచు భువిలో.

దీనిలోనుంచి నాలుగవ కందాన్ని, పైవాటిని పుట్టించినట్లే, రాబట్టి చదువుకొందాం.

శివుగొల్తు రచల భావన- దవులన్ సుజ్ఞాన యోగతత్త్వ విధిజ్ఞుల్
భవబంధనముల ద్రెంచుచు- భువిలో నజ్ఞానపదము బొందక ప్రాజ్ఞుల్.

ఈ నాలుగవ కందం రెండవ పాదంలోని రెండవ గణం 'సుజ్ఞాన' అనే అక్షరాలలో ఉంది. ఇక్కడనుంచి వ్రాసుకొని వెళితే మళ్ళీ మనకు మొదటి కందమే వస్తుంది.

ఇటువంటి చతుర్విధకందాలు పెద్దయామాత్యుడు ఎన్ని చెప్పాడో మనకు తెలియదు. అతడు వృత్తకందాలుకూడ చెప్పాడని సీసమాలికవల్ల తెలుస్తున్నది.

వృత్త కందానికి విన్నకోట పెద్దన రచించిన దానిని ఉదాహరణంగా తీసుకొందాం. ఈ సరసిజ వృత్తాన్ని చూడండి:

శ్రీవిశ్వేశక్ష్మావరు సేవాశ్రితులు వొగడుదురు సిరివరగుటకై
ధీవిద్యా సంభావితదేవున్ ధృతియుతు హిత జనదివదినకరున్
శ్రీవర్ణింతున్ భావనజీవున్ జితరిపుశశికులశిఖరి మృగపతిన్
భావోదంచద్భావితభావున్ బ్రతిదినసముదిత బహుతర విభవున్

(కావ్యాలంకార చూడామణి. 6-54)

ఈ వృత్తంలో ఒక గమ్మత్తు ఉంది. ఇందులో రెండు కంద పద్యాలు ఉన్నాయి. మొదటి రెండు పాదాలను ఒక కందపద్యంలాగ చదువవచ్చు; మూడు నాలుగు పాదాలను రెండవ కందం లాగ చదవవచ్చు.

ఒకటవ కందం:

శ్రీవిశ్వేశక్ష్మావరు-సేవాశ్రితులు వొగడుదురు సిరివరగుటకై
ధీవిద్యాసంభావిత - దేవున్ ధృతియుతు హితజనదివసదినకరున్.

రెండవ కందం:

శ్రీవర్ణింతున్ భావన- జీవున్ జితరిపుశశికులశిఖరిమృగపతిన్
భావోదంచద్భావిత- భావున్ బ్రతిదినసముదితబహుతరవిభవున్.

ఈ పద్యంలో మరొక సొగసుకూడ ఉంది. ప్రతి పాదంలోనూ మొదటి తొమ్మిది అక్షరాలనూ తీసుకొని విడిగా వ్రాస్తే నవాక్షర వృత్తం ఒకటి వస్తుంది. ఈ తొమ్మిది అక్షరాలూ మినహాయిస్తే పాదపాదానికీ మిగిలినవి కలిపి చదివితే మణిగణనికరం అనే వృత్తం వస్తుంది. చూడండి :

నవాక్షర వృత్తం:

శ్రీవిశ్వేశక్ష్మావరు సేవా- ధీవిద్యాసంభావితదేవున్
శ్రీవర్ణింతున్ భావనజీవున్- భావోదంచద్భావితభావున్.

మణిగణనికరం:

శ్రితులు వొగడుదురు సిరి పరగుటకై- ధృతియుతు హితజనదివసదినకరున్
జితరిపుశశికులశిఖరిమృగపతిన్- బ్రతిదినసముదితబహుతర విభవున్.

పెద్దయామాత్యుడు ఇంకా రకరకాల చిత్రకవిత్వాలను చెప్పగలడని తెలుస్తున్నది. వాటిలో కొన్నింటినే కొన్ని లక్షణగ్రంథాలు వివరిస్తాయి. అన్నింటికీ ఉదాహరణలు దొరక్కపోవచ్చు. పెద్దయామాత్యుడు 'ఛాలెంజి' చేసి చేపట్టిన ఈ చిత్రగర్భ కవితను

అనంతరకవులు యథాశక్తి, యథోచితంగా ఉపయోగించారు. వెన్నెలకంటి అన్నయ్యకవి తను రచించిన షోడశకుమార చరిత్రలో చిలక చేతనే అవధానాలు చేయించాడు చూడండి.

అష్టభాషల మధురాశువిస్తరచిత్ర
కవితలు చెప్పు సత్కవులు మెచ్చ
నామ్నాయములు నాల్గు నంగంబు లారును
నఖిలశాస్త్రంబులు నవగతములు
నూతనరీతుల ధాతువిభ్రమముల
రసములు మెరయు వర్ణకము వాడు
నేపురాణంబుల నేకథ యడిగినం
దడబాటు లేక యేర్పడగజెప్పు
నోలి నవధానములు వేనవేలు నూపు
శబ్దజ్ఞానినైనను సరకుగొనదు
గౌతమునినైన దొడరి తర్కమున గెలుచు
నవధరింపు మీకీరంబునవనినాథ. (షోడశ. 6–13)

చిత్రకవిత్వ ప్రక్రియను చూపిన గ్రంథాల పట్టికను రావూరి దొరస్వామిశర్మగారు తయారు చేశారు.[8] చూడండి:

అనుభవసారము	నరసభూపాలీయము	రామాభ్యుదయము
అప్పకవీయము	పారిజాతాపహరణము	రావణదమ్మీయము
ఉత్తరహరివంశము	బిల్హణీయము	రుక్మవతీపరిణయము
కళాపూర్ణోదయము	భద్రాపరిణయము	రుక్మాంగదచరిత్ర
కవిజనరంజనము	మిత్రవిందాపరిణయము	లక్షణరాజీయము
కవిరాజమనోరంజనము	ముకుందవిలాసము	లక్షణసారసంగ్రహము
కావ్యాలంకార చూడామణి	రసికజనమనోభిరామము	సమీరకుమారవిజయము
కుమారసంభవము	రసికాభిలాషము	సింహాసనద్వాత్రింశిక
జైమినిభారతము	రాధికాసాంత్వనము	సుదక్షిణాపరిణయము
దశావతారచరిత్ర	రామకృష్ణోపాఖ్యానము	హంసవింశతి
ధర్మఖండము	రామరాజీయము	

ఈ లిస్టులో కందిఘంట జంటకవుల వరాహపురాణం లేదు. అందులో ఎన్నో చిత్రకవిత్వాలు వున్నాయి.

8. తెలుగు భాషలో ఛందోరీతులు, పుట 380.

దొరస్వామి శర్మగారు లిస్టువేసిన ఈ ముప్ఫయి రెండు కావ్యాలలో జక్కన వ్రాసిన 'విక్రమార్కచరిత్ర' లేకపోవడం గమనించదగింది. తాతగారు ఏ విద్యలో అందెవేసిన చెయ్యో, ఆ చిత్రకవితను మనుమడు మచ్చుకైనా చెప్పకపోవడం చిత్రమే!

ఏమైనా ఇన్నిరకాల చిత్రకవితలలో మొనగాడు గనుక పెద్దయామాత్యుని గురించి ఇలా చెప్పుకొన్నాం.[9] ఇతడు వ్రాసిన రచనలన్నీ దొరికితే అవి చిత్రకవితా నిఘంటువు లవుతాయనడానికి సందేహం లేదు.

చిత్రకవిత్వంలో 'కవిత్వం' ఎంత ఉంటుందన్నది వేరే ప్రశ్న!

పాల్కురికి సోమనాథుడు

తొలి కోడి కనువిచ్చి నిలిచి మైవెంచి
జలజల రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కున గాలార్చి కంఠంబువిచ్చి
ముక్కున నీకెలు చక్కొల్పి కడుపు
నిక్కించి, మెడసాచి, నిక్కి మున్సాచి
కొక్కొరో కుర్రని కూయకమున్న -

తెలుగు తోటలో మొదటి కోకిల కంఠమెత్తి, తెలుగువాళ్ళకోసం, తెలుగు ఛందస్సులో పాటలు పాడింది. ఆ కోకిల పేరు పాల్కురికి సోమనాథుడు. అతడు పాడిన తెలుగు ఛందస్సు పేరు ద్విపద. తెలుగుజాతి అతనికిచ్చిన దివ్యాయుధం ద్విపద. తెలుగుజాతికి అతడిచ్చిన గొప్ప కానుక కూడ ద్విపదే. పాల్కురికి సోమనాథుడు పుట్టకపోతే పాడుకొందుకు తెలుగువాళ్ళకే ఛందస్సూ ఇంత రాణించేది కాదేమో! ప్రజలకోసం అతడు పుట్టాడు. ప్రజలే అతణ్ణి అమర కవిని చేశారు.

కాకతీయ సామ్రాజ్యాన్ని గణపతిదేవ చక్రవర్తి, ఓరుగల్లు రాజధానిగా పాలిస్తూఉండే రోజుల్లో రాజధానికి పండ్రెండు క్రోసుల దూరంలో ఉన్న పాల్కురికి గ్రామంలో, రమారమి క్రీ.శ.1240 ప్రాంతాలలో సోమనాథుడు జన్మించాడు. ఇతని తండ్రి పేరు విష్ణురామిదేవుడు; తల్లి పేరు శ్రియాదేవమ్మ. వీళ్ళది సంప్రదాయయుక్తమైన బ్రాహ్మణ కుటుంబం. అందుకే సోమనాథుడు వేదవేదాంగాలు అధ్యయనం చేశాడు. అతనికి వేదం

8. తెలుగు భాషలో ఛందోరీతులు, పుట 380.
9. ఇతని మనుమడు క్రీ.శ. 1372 తరువాత విక్రమార్క చరిత్ర వ్రాశాడు. తాత క్రీ.శ. 1285 ప్రాంతాలవాడైతే తాతామనవళ్ళ మధ్య రమారమి తొంభయి సంవత్సరాలు తేడా వస్తుంది. అందుచేత పెద్దయామాత్యుడు క్రీ.శ. 1279 ప్రాంతాల తిక్కరాజు దగ్గరకాక ఇంకో తిక్కరాజు ప్రాపకంలో క్రీ.శ. 1300 దాకా ఉండి ఉంటాడేమో!

చెప్పుకొన్నాక, యుక్తవయసు వచ్చేరోజుల్లో కరస్థలం విశ్వనాథయ్య అనే గురువు కవిత్వంలో అభిరుచి కలిగించాడు. కవితా రహస్యాలు చెప్పి కావ్యశక్తి కలిగింపజేశాడు.

సోమనాథుడు కవిత్వం అల్లడం నేర్చుకొన్న రోజుల్లో తెలుగు సాహిత్యంలో ఉరుతరగద్యపద్యోక్తులే కావ్యాలలో ఉండేవి. సంస్కృత సమాసభూయిష్ఠ రచన సాగుతూ ఉండేది. ఉత్తమ కావ్యాలు రచించాలంటే సంస్కృత భాషలో ఉండే పురాణేతి హాసాలనో, కావ్యాలనో అనువదించడం తప్ప ఇంకొకదారి ఉండేది కాదు. ఛందస్సులు కూడ సంస్కృత మర్యాదలను అనుసరించేవే ఉండేవి, నన్నెచోడుని కుమార సంభవం, మల్లికార్జున పండితారాధ్యుని శివతత్త్వసారం, యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకం మొదలైనవి పాల్కురికి సోమనాథుడు పఠించి ఉంటాడు. అతనికి మల్లికార్జున పండితుని రచనలేకాక మతం కూడ బాగా నచ్చింది. ఆ వీరశైవమతాన్ని అతడు స్వీకరించాడు.

వీరశైవంలో భక్తులకు జాతిభేదాలు లేవు. స్త్రీపురుష విభేదాలూ లేవు. అంతా సమానులే. కులగోత్రాల ప్రమేయం లేదు. కలిమిలేముల పట్టింపు లేదు. చదువు సంధ్యల అవసరం లేదు. పురిటిమైల, చావుమైల పాటించరు. వర్గవిభేదాలు లేవు. శివభక్తుడైతే చాలు, అతడు ఆరాధించదగినవాడు; అర్చించదగినవాడు; కీర్తించదగినవాడు, శివభక్తుడు వాస్తవానికి శివునికన్నా గొప్పవాడు. సంఘంలో ఉన్న తారతమ్యాలను నిర్మూలించి సమానత్వాన్ని ప్రతిపాదించే మతం ఉడుకు నెత్తురు ఉబికే వయసులో ఉన్న సోమనాథుణ్ణి ఆకర్షించడంలో వింతలేదు. 'స్వేచ్ఛను కోరేవాడే నిజమైన కవి. సాంఘిక నియంతృత్వం నుంచి బయటపడటానికి సోమనాథుడు, ఈనాడు యువకవులు అభ్యుదయ రచయితలైనట్లు, ఆనాటి అభ్యుదయవాదమైన వీరశైవాన్ని చేపట్టాడు. పండితయ్య రచనలను ప్రచారం చేశాడు.

పండితారాధ్యుని సమకాలికులలో బెలిదేవి వేమనారాధ్యుడనే పరమ ఆరాధ్యదేవుడు ఉండేవాడు. ఇతని వంశంలో గురులింగార్యుడనే మతగురువు ఉన్నాడు. అతని దగ్గర పాల్కురికి సోమనాథుడు శివదీక్ష పుచ్చుకొన్నాడు. దీక్షనిచ్చే గురువు శివస్వరూపుడు, దీక్షాకాలంలో గురు హస్తం శిష్యుని మస్తకాన్ని సోకుతుంది. వెంటనే శిష్యుడు రెండవ జన్మ ఎత్తినట్టు లెక్క. ఈ జన్మలో గురుహస్తం నుంచి శిష్యుడు ఉద్భవిస్తాడు. అందుచేత అప్పటినుంచి అతడు గురుహస్త సంజాతుడు. లౌకికమైన తల్లిదండ్రులతో పనిలేదు. గురుహస్తమే తల్లి; గురుహస్తమే తండ్రి. గురు పాదమే శిరోధార్యం. గురువు గోత్రమే తన గోత్రం.

గురులింగార్యునివద్ద దీక్ష పుచ్చుకొన్న సోమనాథునికి ఆ గురువువద్దనే దీక్ష పుచ్చుకొన్న గోడగి త్రిపురారి అనే భక్తుని పరిచయం కలిగింది. ఇద్దరూ పండితయ్యగారి శివతత్త్వసారాన్ని పఠించారు. ఇద్దరూ ఆ మహిమకు ముగ్ధులైనారు. ఇద్దరూ ఆ మతాన్ని ప్రచారం చేయదలచుకొన్నవారే. సోమనాథుడు కవిత్వం చెప్పగలవాడు కాబట్టి త్రిపురారి తన స్నేహితుణ్ణి 'శుద్ధభక్తిమార్గాన్ని' కవిత్వంలో విస్తరించమన్నాడు. సోమనాథుడు 'అనుభవసారం' అనే కృతిని గోడగి త్రిపురారికి అంకితమిస్తూ చెప్పాడు.

ఈ పుస్తకం 243 పద్యాలున్నది. ఇందులో సోమనాథుడు తాను కరస్థలం విశ్వనాథయ్యగారివద్ద నేర్చుకొన్న కవితావిద్యనంతా ప్రదర్శించాడు. ఇందులో ఉన్న పద్యాల వివరాలు ఇవి.

163	కందపద్యాలు	1 మహాస్రగ్ధర
23	సీసపద్యాలు	1 త్రిభంగి
23	చంపకమాలలు	1 క్రౌంచపదం
16	ఉత్పలమాలలు	1 మాలిని
5	శార్దూలాలు	1 మయూరం
5	మత్తేభాలు	1 మానిని
2	తరువోజలు	

తన తొలిరచనలో సోమనాథుడు ఇన్నిరకాల ఛందస్సుల్లో కవిత్వం చెప్పాడుగాని పోనుపోను ఈ ఛందస్సులు ఇంత అదృష్టం మళ్ళీ నోచుకోలేదు. సోమనాథుడు వీటన్నిటిని వదిలిపెట్టి, చివరకు ఒకే ఒక ఛందస్సుకు జీవితాన్ని అంకితం చేశాడు. అది ద్విపద అని ముందే చెప్పుకొన్నాం. ఈ 243 పద్యాలలో ద్విపదలు లేవుగాని ద్విపదకు రెట్టించిన రూపమైన తరువోజలు రెండు ఉన్నాయి. చిత్రమేమిటంటే, ఏ ద్విపదనైతే సోమనాథుడు ఉత్తరోత్తరా చేబట్టబోతున్నాడో ఆ ద్విపదకు ఇబ్బడి రూపమైన తరువోజ ఈ అనుభవసారంలోని ఆఖరు పద్యం. అందులోనే అతడు ద్విపదకు శ్రీకారం చుట్టాడా అనేటట్టు చివర 'శ్రీ'తో అంతమయ్యే 'మంగళమహాశ్రీ'లు వాడాడు. ఆ తరువాత అతడూ తరువోజలు వాడలేదు; అతని ప్రభావం ఉద్ధృతం అయినాక అనంతర తెలుగు కవులూ వాడలేదు. ఈ 'అనుభవసారం'లో సోమనాథుడు 'త్రిభంగి' అనే ఛందస్సు నొకదానిని వాడాడని పై పట్టికలో చూశాం. ఇది అపురూపమైనది. ఇతని తరువాత దీనినెవరూ వ్రాయలేదు. అందుచేత లాక్షణికులు దీనినే లక్ష్యం క్రింద స్వీకరించారు. ఆంధ్ర సాహిత్యంలో 'నభూతో నభవిష్యతి' అయిన త్రిభంగిని చూద్దాం.

''గురుమత సహితులు, దురిత విరహితులు
సురుచిర సజ్జనవర్తుల్, ధ్రువకీర్తుల్, శాంతసుమూర్తుల్
పరిహృత వికృతులు, నిరవధి సుకృతులు
మరణ పునర్భవదూరుల్, సువిచారుల్ భక్తివిచారుల్
పరవశ హృదయులు, నిరుపమసదయులు
పరసమయ ప్రవిఫాలుర్ గుణశాలుర్ దానసుశీలుర్
పరహిత చరితులు, వరగుణభరితులు
పరమ పరాత్యనుషక్తుల్, శివభక్తుల్, శాంతనియుక్తుల్.''(అనుభవ. 194)

ఇందులో చిన్న పాదాలలో రెండు అంత్యప్రాసలూ, పెద్దపాదాలలో మూడు అంత్య ప్రాసలూ ఉంటాయి. మొత్తం ఎనిమిది పాదాలకూ ఆదిప్రాస ఉంటుంది. శిల్ప

రహస్యాలను కరస్థలి విశ్వనాథయ్యగారు ఎన్ని సోమనాథునికి బోధించారో వాటిని అతడు తన తొలి రచనలో అమలు పెట్టాడు. ఒక పక్క ఇలా సంవిధానంలో సిద్ధహస్తుడవుతూనే సోమనాథుడు చక్కని పదాలతో ఉత్తమ భావాలను చెప్పసాగాడు.

సోమనాథునిలో సున్నితమైన హాస్యం కూడ ఉంది. సంస్కృత విద్య గట్టిగా నేర్చుకొన్నాడు గనుక అందులో సామెతలు మొదలైనవి అతడు పిలిస్తే పలుకుతాయి; పిలవకుండానే వస్తాయి.

''తనుభక్తిపారవశ్యం - బున మరవక తా శివైక్యము గల్గునె? యెం
దును 'మమమాతావంధ్యా'-యను బాసలు పొసగునే? మహానందాత్మా!''
(అనుభవ. 172)

సంస్కృతంలోని సామెతలేకాదు, తెలుగు సామెతలు సైతం అతని చెప్పుచేతలలో ఉంటాయి చూడండి:

''వంటని దుర్వ్యసనంబుల-పెంటకుగా కీశుభక్తి పెంపునకుం గా
కుంట జెడు భక్తుడాసల-రెంటిని నెడతాకి చెడ్డ రేవనిభంగిన్.'' (అనుభవ. 114)

తన తొలిరచన అయిన అనుభవసారంలోనే ''ఒడలెల్లం జెవులై (84); చేతివాని విడిచి కాలబడినవాని కాసపడినట్లు (216); శవమునకు శృంగారం (223)'' మొదలైన ప్రయోగాలు చేశాడు. అతని కాలంలోనే నాణెములలో కానీలు ఉండేవని తెలుస్తున్నది.

''చేయునెడభక్తిపరులకు-న్యాయార్జితమైనయట్టి యరకానికి న
న్యాయార్జితమగు మాడలు-వేయును సరిగావు భక్తనిధి త్రిపురారీ!''
(అనుభవ. 146)

సోమనాథుడు అనుభవసారాన్ని మల్లికార్జున పండితారాధ్యుని ప్రభావంతో వ్రాశాడు. ఈ పుస్తకంలోనే మూడు పద్యాలలో:

''మహిమదెల్పినట్టి మల్లికార్జునపండి-తయ్యగారి దలతు ననుదినంబు''

అనే మకుటంతో ఆయనను కీర్తించారు. పండితయ్యగారి మతావేశాన్ని పూర్తిగా తాను స్వీకరించాడు. ఈ 'అనుభవసారం'లో ''సోమనాథుని తరువాతి కృతులలో గాననగు పరమతనింద, మతావేశము లేకపోవుటచే నిది నేడు పఠనీయ గ్రంథముగా నుండదగినది'' అని ఈ పుస్తకాన్ని అచ్చువేసిన వావిళ్ళ వెంకటేశ్వర్లుగారు వ్రాశారు.[1] కాని, ఇందులోనూ పరమతనింద ఉంది. 'దౌర్భాగ్యాద్వైతులు' అని ఒక పద్యంలో తిట్టారు (177). శివభక్తులు కానివాళ్ళపట్ల అసహ్యం చాలా ముఖ్యమైన భక్తలక్షణమని ఇలా చెప్పాడు:

1. 'అనుభవసారం'. బండారు తమ్మయ్య, తిమ్మావఝల కోదండరామయ్య గార్ల పరిష్కరణ, వావిళ్ళ ముద్రణ. 1955. పీఠిక పుట. 6

''శివభక్తులయెడ భయమును - శివునెడ నతివీరగుణము శీలంబులయం
దవికల్పంబగు చలమును - భవియెడ రోతయునువలయు భక్తుల కెందుఁ''
(అనుభవ. 58)

శివభక్తులు కానివాళ్ళ విషయంలో జాలీ, కరుణా ఉండగూడదని ఇంకొక పద్యంలో చెప్పాడు:

''చెనయు శివద్రోహుల యెడ
ధనుధర్మములెడల దక్క దయయును శాంత
త్వనిరూఢియు శృంగారిలు
ననయము భక్తులకు గురుపదాంబుజభృంగా!'' (అనుభవ. 129)

ఇవన్నీ పండితయ్యగారి భావాలే. వీటిని పూర్తిగా సోమనాథుడు ఒంట పట్టించుకొన్నాడు. ఈ అనుభవసారం రచన పూర్తి అయినాక ఇతడు వీరశైవ మతాన్ని కన్నడదేశంలో ప్రబోధించిన బసవన్న గురించి విన్నాడు. అతని ప్రభావంలో పడ్డాడు. తలమునకలుగా ఆ భక్తిలో ఓలలాడాడు. ఇక్కణ్ణుంచి సోమనాథుని కవితా జీవితంలో యింకొక ఘట్టం మొదలైంది.

కన్నడదేశంలో క్రీ.శ. 1162 ప్రాంతాలలో కళ్యాణపురాన్ని బిజ్జలుడు అనే రాజు పాలిస్తూ వుండేవాడు. అతని దగ్గర బలదేవుడు అనే మంత్రి ఉండేవాడు. ఇతనికి బసవన్న అనే మేనల్లుడున్నాడు. ఇతడు శైవుడు. నందీశ్వరుని అవతారమని జనులు చెప్పుకొంటారు. ఎనిమిదేండ్ల ప్రాయంలోనే భక్తుడయినాడు. తల్లిదండ్రులు ఉపనయనం చేయబోతే వద్దనీ, తనకు కులము అక్కరలేదనీ, కులభేదాలను రూపుమాపడానికే తాను పుట్టాననీ చెప్పాడట. ఈ బసవన్న మేనమామ ద్వారా రాజోద్యోగం సంపాదించాడు. భాండాగారానికి అధిపతి అయినాడు. ఇతడు బ్రాహ్మణ మతాన్ని నిరాకరించాడు. శివభక్తులంతా ఒక్కటే కులమని, వాళ్ళు శివునికన్నా గొప్పవారని, భక్తికన్నా వేరే ముక్తిమార్గం లేదని తన మతాన్ని ప్రచారం చేశాడు. మతప్రచారానికి ఉన్నతోద్యోగం పనికివస్తుందని మేనమామ తరవాత మంత్రిపదవిని చేపట్టి అధికారాన్ని మతం కోసం వినియోగించుకొన్నాడు. బొక్కసంలోని డబ్బు జంగాలకు వెదజల్లాడు. ఖడ్గాన్ని పట్టుకొని తన భావాలను బోధించాడు. ఇతడు అనేక మహిమలు చేశాడని జనం చెప్పుకొన్నారు. వంగకాయలను లింగకాయలను చేశాడట. జొన్నలను ముత్యాలు చేశాడట. ఇతని వీరభక్తి మహిమలు జనసామాన్యంలో వ్యాపించి మతం కూడ వర్ధిల్లింది.

బసవన్న మహిమలు విని పండితారాధ్యుడే ముగ్ధుడై అతణ్ణి దర్శించుకోవాలని వృద్ధాప్యంలో బయలుదేరాడు. బసవన్నా, పండితయ్యా మరణించాక వారి గాథలు మరీ విస్తరిల్లాయి. తమిళ దేశంలో వెలసిన అరవై ముగ్గురు నాయనార్ల కథలు అద్భుతమైన శివభక్తిని ఆకాశానికి ఎత్తిస్తాయి. ఇవన్నీ విన్న సోమనాథుడు ఆవేశం చెందాడు. బసవన్న

జన సామాన్యానికి బోధించిన భక్తినీ, పండితయ్యా పండితులను ఓడించిన పద్ధతినీ జోడించి, ఈ భక్తుల కథలతో వీరశైవాన్ని ప్రచారం చేయాలనుకొన్నాడు. జనానికి బోధపడే విధంగా బసవన్న కథా, భక్తుల కథా చెప్పాలనుకొన్నాడు. అంతదాకా తెలుగు సాహిత్యంలో గద్యపద్యాలలో కావ్యాలున్నాయి. జనానికి అందుబాటులో లేని వృత్తాలలో, సంస్కృత సమాసాలతో బసవన్న కథ చెపితే తన ఉద్దేశం నెరవేరదు. అందుచేత ఒక పూర్వ ఛందస్సును ఎంచుకొన్నాడు.

ఆడవాళ్ళు బియ్యం దంచేచోట రోళ్ళూరోకళ్ళతో పాడే పాటలలో తరువోజ ఛందం ఉందని అతనికి తెలుసు. నాలుగు పాదాలలో ఒకే ప్రాస పెట్టి వ్రాస్తే జనానికి దూరమైన మార్గ ఛందంలాగ ఉంటుందని తరువోజనే ఆనాటి కవులందరూ వాడుకొనేవారు, అయితే తరువోజలోని రెండు పాదాల ఖండం ఒక ఛందంగా పూర్వం ప్రచారంలో ఉండేదని సోమనాథునికి తెలుసు. క్రీ.శ. 940 ప్రాంతాలలో నున్న మల్లియ రేచన తన కవిజనాశ్రయంలో ద్విపదకు ఇలా లక్షణం చెప్పాడు.

ఇంద్రగణములు మూడింద్ర గణంబొకటి
చంద్రాస్య ద్విపదకు జను చెప్పరేచ ।   (జాత్యధికారం - 30)

రేచన కాలం నాటికే తెలుగు కవితలలో తరువోజ, ద్విపద, త్రిపద, చౌపద, షట్పద వంటి ఛందస్సులు వాడుకలో ఉండేవి. అందుకే వాటికి లక్షణం చెప్పాడు. ఇవి శిష్ట సాహిత్యంలో కాక ప్రజల సాహిత్యంలో ఉండేవి కాబోలు. జైనులు ఈ ఛందస్సులలో తమ మత ప్రచారం చేసుకొనేవారు అని భావించవచ్చు. వీటిలో ప్రథమమైన ద్విపదను సోమనాథుడు ఎంచుకొన్నాడు.

జైనులను ద్వేషించే శైవులు జైన ఛందస్సును స్వీకరిస్తారా అనే సందేహం రావచ్చునుగాని, నిజానికి శైవులు జైనుల సంప్రదాయాలలో చాలా వాటికి అనుకరణలు సృష్టించి సొంతం చేసుకొన్నారు. ఉదాహరణకు, జైనుల లెక్క ప్రకారం త్రిషష్ఠి శలాక పురుషులు ఆరాధ్యులు. ప్రాచీన కాలం నుండి వారి మతంలో ఇరవైనలుగురు తీర్థంకరులూ, పన్నెండుమంది చక్రవర్తులూ, తొమ్మిదిమంది వాసుదేవులూ, తొమ్మిదిమంది ప్రతి వాసుదేవులూ, తొమ్మిదిమంది బలదేవులూ వెరసి అరవై ముగ్గురు పురాణపురుషులు ప్రసిద్ధులు. వీరి చరిత్రలను ఈ జైనులు గానం చేస్తారు.

జైనులలాగ మాకూ అరవైముగ్గురు పురాతన భక్తులు లేకపోలేదని శైవులు కూడా లెక్కకు అంతమంది కథలను సంతరించుకొని చెప్పుకోసాగారు. త్రిషష్టి శలాక పురుషులందరూ ఔత్తరాహులేగాని, అరువత్తు మూవురు మాత్రం తమిళాంధ్ర కర్ణాటక శైవులే. ఎంతో కొంత చెప్పుకోదగ్గ కథ గలవారే. వీరిలో ముప్పయి ఇద్దరి చరిత్రలను బసవన్న కథతో జోడించి సోమనాథుడు కథనం చేశాడు.[1] (ఈ కథనానికి ద్విపద యోగ్యమైన ఛందస్సుగా భావించాడు.)

1. సోమనాథుడు కథనం చేసిన 32 మంది అకారాదిగా ఇవి.

1) అడిభర్త 2) అరివాళు నాయనారు 3) ఇరువదాండారి 4) ఉడుమూరి కన్నప్ప 5) ఏణాధినాధుడు 6) కరయూరి చోడుడు 7) కరికాళవ్వ 8) కవి కామదేవుడు 9) కళియంబ నాయనారు 10) కుమ్మరి గుండయ్య 11) కొట్టయ చోడుడు 12) గుగ్గులు కళియారు 13) చండేశుడు 14) చిరపురి 15) చిరుతొండడు 16) చేది వల్లభుడు 17) చేరమ చక్రవర్తి 18) తిరునావుకరుసు 19) తిరుమూలదేవుడు 20) దంగుళి మారయ్య 21) నక్కనైనారు 22) నమినంది 23) నరసింగ మానయర్ 24) నాట్యన మిత్తండి 25) పిళ్లనయనారు 26) పూసరనైనారు 27) మంగయక్కరసి 28) మానకంజారుడు 29) మిరుమిండడు 30) రుద్ర పశుపతి 31) సాంఖ్య తొండడు 32) సుందర నాయనారు.

''ఉరుతరగద్య పద్యోక్తులకంటె - సరసమై పరగిన జానుదెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట - గూర్చెద ద్విపదలు గోర్కిదై వార
దెలుగుమాట లనంగ వలదు, వేదముల - కొలదియకాజూడు డిల నెట్టులనిన
బాటితూమునకును బాటియౌనేని - బాటింప సోలయు బాటియకాదె
అల్పాక్షరముల ననల్పార్థరచన - కల్పించుటయకాదె కవి వివేకంబు''
(బసవ. 1–65 నుండి 174)

అని ద్విపదలను దేశానికి పరిచయం చేశాడు.[2] భక్తుల కథలతో బసవ పురాణం రచించాడు. ఈ పురాణమంతా అతనికి కరస్థలి సోమనాథయ్యాగారు, రెంటాల మల్లినాథుడు, దోచమాంబ, గోడగి త్రిపురారి మొదలైన భక్తులు విశదపరిచారు. 'భక్తులచే విన్నమాడ్కి' అతడు దీనిని చెప్పాడు.

ఇది ఏడు ఆశ్వాసాల కావ్యం. ప్రథమాశ్వాసంలో కైలాస వర్ణనతో కథ ప్రారంభ మవుతుంది. శివుడు నందిని భూలోకంలో జన్మించి శైవమతోద్ధరణ చేయమంటాడు, బసవన్న జన్మిస్తాడు. ఉపనయనం అక్కర్లేదని తల్లిదండ్రులతో వాదిస్తాడు. శివుడే ప్రత్యక్షమై బసవన్నకు శైవధర్మాలు ఉపదేశిస్తాడు. రెండవ ఆశ్వాసంలో బసవన్న శివాచారనిరతి, మంత్రి అవడం, వంగకాయలను లింగ కాయలు చేయడం, జొన్నలను ముత్యాలు చేయడమేకాక యితర శివభక్తుల కథలూ ఉన్నాయి. మూడవ ఆశ్వాసంలో బసవన్న తన భార్య చీర విప్పించి, మిండ జంగాని కిప్పించిన కథ, ఇతర ముగ్ధభక్తుల కథలూ వర్ణించారు. నాలుగవ ఆశ్వాసంలో మడివాలు మాచయ్య కథ ముఖ్యం. ఇతడు రజకుడు. గొప్ప భక్తుడు ఇతని మాటంటే బసవన్నే మన్నించి ఆచరిస్తాడు. అయిదవ ఆశ్వాసంలో కిన్నెర బ్రహ్మయ్య, కలకేత బ్రహ్మయ్య, మోళిగ మారయ్య, తెలుగు జొమ్మయ్య మొదలైన భక్తుల కథలు ఉన్నాయి. ఆరవ ఆశ్వాసంలో కూడ భక్తుల కథలే ఎక్కువ. అయితే, వీరందరూ జైనసంహారం చేసిన వీరశైవులు. ఏడవ ఆశ్వాసంలో భక్తుల కథలతోపాటు బసవన్న విషమారగించి అరిగించుకోవడం, బిజ్జలునితో విరోధం, బసవన్న నిర్యాణం మొదలైనవి ఉన్నాయి.

2. తరువోజలోనుంచే ద్విపద పుట్టిందనే వాదాన్ని అమరేశం రాజేశ్వరశర్మ గారు ప్రతిపాదించారు. చూ. వారి 'నన్నెచోడుని కవిత్వం' పుట 62. ఇది ద్విపద ప్రాచీనత తెలియని రోజులలోని భావన.

కన్నడదేశంలో మతాన్ని ప్రచారం చేసిన బసవన్న కథతో, తమిళదేశంలో విశేషవ్యాప్తిగల 'అరువత్తు మూవరు' నాయనారుల కథలను జోడించి తెలుగులో కావ్యం వ్రాయడంతో సోమనాథుడు ఆనాటి దక్షిణదేశ చరిత్రలో ఒక 'జాతీయ సమైక్యత'ను సాధించాడు. ఇది ప్రజలు వాడుకొందుకు వ్రాశాడు కనుక ఇందులో ప్రసాదగుణం, జానుదెనుగు ఎక్కువ. పాండిత్యప్రకర్షగాని, వాద ప్రచారానికి యుక్తియుక్తులుగాని, పదడాంబికంగాని కనబడవు. నాటకీయత ఉన్నా లేకపోయినా కథలను చిత్తశుద్ధితో కొంతవరకూ రసవంతంగా కథనం చేశాడు. పాత్రలను కన్నులకు కట్టినట్టు చిత్రించాడు. వాళ్ళ ఊహలను చక్కగా వర్ణించాడు. ఆడవాళ్ళ పాటలకు దగ్గరలోఉన్న ఛందంలో ఆడవాళ్ళ ఊహలను ఎంత అందంగా వర్ణించాడో చూడండి - బెజ్జమహాదేవి అనే భక్తురాలు శివునికి తల్లిలేదని చింతించి తనే తల్లి అయి అతణ్ణి తనయునిగా చేసుకొన్న భక్తురాలు. ఆమె భావాలను సోమనాథుడు ఎలా చెప్పాడో చూడండి. శివునికి

''తల్లిగల్గిన నేల తపసి గానిచ్చు - దల్లి గల్గిన నేల తల జడల్గట్టు
దల్లి యున్న విషంబు ద్రావనేలిచ్చు - దల్లియుండిన దోళ్ళుదాల్ప నేలిచ్చు
దల్లి పాముల నేల ధరియింపనిచ్చు - దల్లి బూడిద యేల తా బూయనిచ్చు
దల్లి వుచ్చునె భువి దనయుని దిరియ - దల్లి వుచ్చునె సుతు వల్లకాటికిని
దల్లి లేకుండిన తనయుడుగాన-ప్రల్లదుడై యిన్ని వాట్లకు వచ్చె
జన్నిచ్చి పలుమాఱు వెన్నయు బెట్టి-పన్నుగా నిన్నియు బాలును బోసి
యాకొనగా గడు పరసి పాలిచ్చి - సాకించి పెనుపదే జనని గల్గినను
దా నింతవా డయ్యె దల్లిలేకయును-దా నెంత వెరుగునో తల్లిగల్గినను?''

(బసవ. 111.635-650)

సకలేశ్వరు మాదరాజయ్య కథలో శివుడు కుటిల వేషం వేసుకొని గొల్లడుగా వస్తాడు. తన కాలపు గొల్లలు ఎలా ఉండేవారో సోమనాథుడు బొమ్మ కట్టించాడు. బసవన్న విషం త్రాగడం, కథలో ఆ విషాన్ని నూరించడం, అది పొగలు గ్రక్కడం, అది శివునికి నైవేద్యంపెట్టి 'గ్రోలం'డని పేరుపేరునా భక్తులకు భక్తులు వడ్డించడం సోమనాథుడు ఉత్తేజంగా వర్ణించాడు. శివుడు హాలాహలం తాగినట్టే ఉంటుంది.

ఇటువంటి మహిమలుగల బసవన్నకు సోమనాథుడు మనోవాక్కాయ కర్మలతో భక్తుడైనాడు. బసవని ధ్యానం తప్ప మరొకటి లేదు. వ్రాసేవన్నీ బసవని కోసమే; బసవనిమీదనే శరణు బసవగద్యం, బసవాష్టకం, బసవోదాహరణం, బసవా బసవా! అనే వృషాధిప శతకం - సర్వం అతనికి బసవమయమే. బసవన్న గురించి సోమనాథుడు ఇలా చెప్పాడు:

''వడిచారు జలముల కొడలెల్ల కాళ్ళు
వడిగాలు చిచ్చున కొడలెల్ల నోళ్ళు

వడివీచు గాడ్పున కొడలెల్ల దలలు
వడితీయు బసవన కొడలెల్ల భక్తి''

ఈ మాటలు అక్షరాలా సోమనాథునికే వర్తిస్తాయి. ఎంతో భావావేశంతో బసవన్న చరిత్రను ప్రజలకు చెప్పడం అతని కవిత్వానికి ప్రయోజనం అనుకున్నాడు. అది అచిరకాలంలోనే నెరవేరింది.

ప్రతాపరుద్రుడు రాజ్యానికి వచ్చిన కొత్తలో ఓరుగల్లులోని స్వయంభూదేవుని ఆలయానికి వెళ్ళాడట. ఆ మంటపంలో బసవపురాణ పఠనం జరుగుతూందట. రాజు ''ఏమిటా పురాణం'' అని అడిగాడట. అప్పుడొక ధూర్తవిప్రుడు ''పాల్కురికి సోమపతితుడు మధ్య వళ్ళు పెట్టి ఈ మధ్య ద్విపద వ్రాశాడు. అది అప్రమాణం, అనాద్యం'' అని చెప్పాడట. రాజు వినకుండానే వెళ్ళిపోయాడు.

ఈ సంగతి శిష్యులు పాల్కురికి సోమనాథునికి చెప్పారు. అతడు ఇది అవమానం క్రింద భావించాడు. విని ఊరుకుంటే అది భక్తులకు తలవంపులని భావించి వివాదానికి బయలుదేరాడు. లింగముద్ర యెడ్ల సంగడించి కూడకట్టినట్టి గూడారు బండిమీద ఓరుగంటికి వెళ్ళాడు.

ఓరుగల్లులో ప్రతాపరుద్రుని మంత్రి ఇందుమూరి అన్నయ్య ఉన్నాడు. అతడు సోమనాథుని శిష్యుడే. ఓరుగల్లు ప్రవేశించి సోమనాథుడు అందర్నీ పాదాక్రాంతులను చేసుకొన్నాడు. పరమతాలను ఖండించి, వీరశైవాన్ని ప్రతిష్ఠించడానికి పండితయ్యగారి పద్ధతి మంచిదనుకొన్నాడు. ఆయనయొక్క చరిత్రను వ్రాస్తే ప్రయోజనముంటుందని భావించాడు. దానికితోడు శ్రీశైలంలోని శివతత్త్వగోష్ఠి ప్రసంగంలో వీరమహేశ్వరాచార వర్తనులు అతణ్ణి పండితయ్య చరిత్రను చెప్పమని దీవించారు. తేట తెనుగులో ద్విపద రచించాలని నిశ్చయించాడు. మొత్తం 11, 810 ద్విపదలలో అయిదు ప్రకరణాలలో పండితయ్య చరిత్రను చెప్పాడు. అది ఒక చిన్నసైజు విజ్ఞాన సర్వస్వం. ఇందులో లేనిదంటూ లేదు. ''ఆ కాలపుటాంధ్ర దేశ ప్రజా చరిత్రమున యది యనేక విషయముల తెలుపుచున్నది'' అని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చెప్పిన మాటలు అక్షరాలా సత్యాలు. అందుకే దీనిని తిమ్మావఝ్ఝల కోదండరామయ్యగారు తెలుగు జాతి తొలి విజ్ఞాన సర్వస్వం అన్నారు.[3] పండితారాధ్య చరిత్రకు 348 పేజీల ఉపోద్ఘాతం వ్రాసిన చిలుకూరి నారాయణరావుగారు సోమనాథుడు ఏమేమి సాధించినదీ వివరించారు. ఇతని నవీన గుణాలను సంగ్రహంగా 25 చెప్పారు. అతడు వాడిన పదాలకు, పేర్కొన్న విషయాలకు పట్టికలిచ్చారు.

ఎన్నెన్నో అపూర్వమైన పదాలు దొరికే గ్రంథాలను రచించిన సోమనాథుడు నిజంగా తెలుగు నిఘంటు కర్తలకు ఎంతో తోడ్పడతాడు. అయితే బహుజనపల్లి

3. పరిశోధన, ఆగస్టు – నవంబరు, 1953.

సీతారామాచార్యులవారు తమ శబ్దరత్నాకరంలో పాల్కురికి సోమనాథుణ్ణి అయిదవరకం కవిగా వర్గీకరించారు. కవిత్వ విషయంలో అభిప్రాయ భేదాలు ఉండవచ్చుగాని భాషాశాస్త్ర రచనకు, నిఘంటు రచనకు తోడ్పడే సోమనాథుడు ఆ దృష్ట్యా ప్రథమ శ్రేణి రచయితే అవుతాడు. రసపిపాసులు మాత్రం సోమనాథునిపట్ల అట్టే మొగ్గకపోవచ్చు. అందుకే సార్వజనికమైన ప్రశంసకు సోమనాథుడు పాత్రుడు కాలేకపోయాడు.

సోమనాథుని రచనలపై, జీవితంపై విపులమైన పరిశోధన చేసి విశిష్టమైన విశ్లేషణ పొందుపరిచిన వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అతని పాండిత్యం గురించీ, కవితాశక్తిని గురించీ రాగద్వేషాలు లేని అంచనా వేశారు. ఇలా రాశారు:

''వేదముల నుండి, పురాణముల నుండి శివసారమ్య ప్రతిపాదకములయిన వాక్యముల నీతడు హెచ్చుగా జూపినాడు... పూర్వోత్తర మీమాంసలు, పురాణములు మొదలుగ మతాచార విధులకు సంబంధించిన సంస్కృత గ్రంథములనెల్లా నీతడు శోధించినాడు. పాండిత్యమిట్లుండగా నీతడు సంస్కృతాంధ్ర, కర్ణాట, ద్రవిడ, మహారాష్ట్ర భాషలలోగవిత జెప్పనేర్చినవాడు. సంస్కృతాంధ్ర, కర్ణాట భాషలలో నీతడు రచించిన గ్రంథములే గలవు. కాని యీతని సంస్కృత కవిత యంత రసవంతమయినదిగాదు. సంస్కృత వచన రచనము నంత మేలయినది గాదు. ఆంధ్రదేశమునను, ఆంధ్ర వాఙ్మయమునను గడించిన గౌరవము కంటె సోమనాథుడు కర్ణాట దేశమునను, కర్ణాట వాఙ్మయమునను హెచ్చు గౌరవమును గడించెను. కాని యాతని కర్ణాట రచనములునంత గొప్పవి కావు...''[4]

బండారు తమ్మయ్యగారు మాత్రం మరొకలాగ అభిప్రాయపడుతున్నారు. ''ఆంధ్ర కవులలో సర్వజ్ఞతా శక్తిగల నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడ, నన్నెచోడ, నాచన సోమనాథ, శ్రీనాథుల మించిన విద్వత్కవిగా నీతని గణింపనగును'' అని తమ్మయ్యగారు సోమనాథుని ఆకాశానికి ఎత్తారు.[5]

ఇంతటి ప్రశంస విభిన్న విమర్శకులనుండి సోమనాథునికి లభించలేదు. సర్వజ్ఞతా శక్తితోపాటు సంయమనం సత్కవికి కావలసిన లక్షణం. మిత భాషి స్తుతి పాత్రుడవుతాడు.

పాల్కురికి సోమనాథుణ్ణి అనంతర కవులు నుతించకపోవడానికి అతడు[6] ప్రశాంతుడు కాకపోవడమే కారణమని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వ్రాశారు. వారింకా ఇలా చెప్పారు. ''అతనిది అణపరాని యుద్రేకము, భావ బలమే లేని వట్టి శుష్క కల్పనలతో నిండిన మన ప్రబంధములవంటివి చదివి చప్పిడి పడిన కొందరిని ఇతని గ్రంథములు మొదలు మొదలు ఆవకాయవలె ఆకర్షించును. ఇక శైవభక్తిగలవారి మాట చెప్పబనిలేదు.

4. వేటూరివారి పీఠికలు - 1985. పుట. 161
5. బసవ పురాణం, వావిళ్ళ ప్రచురణ. 1952 పీఠిక పుట.51
6. సారస్వతా లోకము. పుట. 110

''పశుపాశుపతియుండ బశువుతా పంద- పశుజీవులకు బెట్టుపందలబట్టి
సోడంబుతో ముక్కు సూటిగా గోసి- కూడనిట్టిక బ్రామకేడ బోవచ్చు?''
(బసవసవరద నాచయ్య కథ)

అనునది వాని యాక్రోశమునకు మచ్చు. ఇట్టివి కుప్పలు. అతనినట్టిపని చేయనిచ్చుట కేకాలమందును, ఏ సంఘము అంగీకరింపదు. గావున ''ఏడబోవచ్చు'' నను అతని ప్రశ్నకు 'నీ యిష్టము వచ్చిన చోటికి బొ'మ్మని చెప్పి తెలుగు సహృదయులు పెడమొగము పెట్టి యూరకున్నారు. ఈ యుద్రేకపు టూకదంపులకు తోడుగ దిక్కు దశ- తల తోక లేని పవాడముల పునరుక్తులతో సోమనాథుని గ్రంథములు నిండినవి.[7]

అనంతకృష్ణశర్మగారు కుండబద్దలు కొట్టినట్టు ఇలాగ తెగవేసి చెప్పారు. దివాకర్ల వేంకటావధానిగారు కొంచెం మొగమాటపడుతూ ఇలా అన్నారు. ''పాఠకుల భావన కించుకైన విడిచిపెట్టక ఈతడు దేనినైనను విస్తృతవేతరముగా వర్ణించుచుండును''[8] సోమనాథుడు తన రచనలో ''పెక్కు పట్టులందు... పాఠకుడు సరిగా దన్ను వెన్నాడగలడాయనికూడ జూడ బోడయ్యెను. పదుల కొలది ద్విపదలు గడచినను బయికి బయికి వాక్యము పొడుగు వారుచు సాగుచుండుటేగాని ముగియకుండుట... పెక్కుపట్టుల జూడగలము'' అని వేటూరి వారు యథార్థం చెప్పారు.[9] అనంతకృష్ణశర్మగారు కచ్చితంగా ఇంకొక సంగతి చెప్పారు ''పాల్కురికి సోమనాథుడుత్తమోత్తమకవి యని మన మింకను అనుకొనుట కర్థమేమనగా మన కావ్యరసానుభవసంస్కారము ఎక్కవలసిన మెట్లింకనుగొన్ని కలవనుటయే''[10]

కొన్ని మెట్లుకిందనే ఉన్న సామాన్య జనానికి అర్థమవాలని సంస్కృత సమాస భూయిష్ఠ రచనను నిరసించి జాను తెనుగును చేపట్టిన పండితారాధ్య చరిత్రలో ఇతడు సుదీర్ఘ సమాసాలు చేశాడు. ద్విపద గౌరవాన్ని నిలబెట్టడంకోసం ఏకపాద సమాసాలు మొదలు సప్తపాద సమాసాల వరకు ఇతని రచనలలో ఉన్నాయి. మచ్చుకొకటి చొప్పున నిడుదవోలు వెంకటరావుగారు చూపించారు.[11] ఏడుపాదాలలో ఒకే సమాసమున్నది చూద్దాం.

''కుందేంద్రు చంద్రికా గోక్షీరఫేన- సుందరామల పరిస్ఫురిత సద్వర్ణ
భస్మసమాలిప్త భావజదేహ- భస్మసాత్కరణ విభావసులోచ
నబ్రహ్మగీర్వాణ నాకేశవంది- తబ్రహ్మయోగి సదాపూజనీయ
సకల నిష్కల వికసల్లీల...'' (పండిత- వాద ప్రకరణ)

---

7. అందులోనే. పుటలు 110, 111
8. ఆంధ్రవాఙ్మయ చరిత్రము, పుట. 23.
9. వేటూరి వారి పీఠికలు – పుట 285
10. సారస్వతాలోకము. పుట. 111
11. పరిశోధన, ఆగస్టు – నవంబరు 1953 – సోమన సృష్టించిన ఛందస్సు.

పండితులను మెప్పించడానికే ఈ సమాస కల్పన; ప్రజల కోసం కథ. తన కాలంనాటి ప్రజలు ఎలా ఉండేవారో, ఏ పాటలు పాడుకొనేవారో, ఏ నాటకాలు చూసేవారో, ఏ వేడుకలు జరుపుకొనేవారో, ఎలా ఏయే భాషలు మాట్లాడేవారో ఈ కావ్యంనిండా గుప్పించాడు. అతని కావ్యాలలోకెల్లా ఇది గొప్పది. ఇందులో పర్వత ప్రకరణం మరీ గొప్పది.

సమకాలిక సమాజానికి అద్దం పట్టడమే ఉత్తమ సాహిత్య లక్షణాలలో ప్రధానమైనదైతే సోమనాథుని పెద్ద రచనలు బసవపురాణం, పండితారాధ్య చరిత్ర కొన్ని విషయాలకు నిలువుటద్దాలనే పడతాయి. కొన్ని సందర్భాలలో కొన్ని విశేషాలను భూతద్దంలో చూపెడతాయి. సోమనాథుని విభిన్న విషయ పరిజ్ఞానం అసామాన్యం. ''అపరిచితములు నాత్మానుభవ దూరములునగు చౌర్యము, దూత్యము, రసవాదము, వైద్యము మున్నగు నసాధారణ విషయములు వర్ణించునపుడుగూడ నీతడు ప్రకటించెడు ప్రతిభ పాఠకుల నాశ్చర్యచకితులను గావించును'' అని బండారు తమ్మయ్యగారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు.[12]

సోమనాథుని గ్రంథాలు వీరశైవ సిద్ధాంత ప్రచారం నిమిత్తమే రచించినవి కనుక స్వీయమతోత్కర్షా పరమత దూషణా వికట దర్పణాలలో రూపాలలాగ కనబడతాయి. సోమనాథుడే ఒకచోట ఇలా ప్రకటించాడు:

''ఇసుమంత బూడిద నొసలచూసినను
మసలక కొండంత మరులొందుననుట
తెల్లంబు...''

సోమనాథుని నొసలు మీద ఇసుమంత బూడిదకాదు, అసలు నఖశిఖ పర్యంతం తనువంతా కొన్ని నిలువుల విభూతి గుట్టలో నిరంతరం పొరలాడేదే కాబట్టి ఆ మరులు కొండంతకాక అంతకు రెండింతల మెండింతలు. అతడు ప్రోత్సహించిన పరమతాలపై హింస నచణం ధ్వంస నచనం దారుణం.

జనసమయ మతస్థుల శిరముల దునిమి
మును విష్ణు సమయుల ముక్కులు గోసి
యద్వైతులను హతాహతముగా ద్రోలి
విద్వేషవాదుల విటతాట మార్చి
చార్వాక వాదుల గర్వంబడంచి
సర్వేశు భక్తియే యుర్వినిష్ఠించి

మత ప్రచారం చేయదలచిన సోమనాథుడు మహాభయంకరుడు. అతడు వైదిక మతాన్ని విద్వేషిస్తాడు.

12. బసవపురాణం. వావిళ్ళ ప్రచురణ. (1952) పుట. 93

పట్టి ప్రాణముతోడ బశువు వధించు
కట్టిడులగు పశుకరుముల తోడ
వీసానికైన యెట్టి దోసానికైన
చేసాచికొను కర్మ జీవులతోడ
మానుగా సురపాటినర్థి సోమ
పానంబుగా వించు పారుల తోడ

అతని విరోధం అర్థం చేసుకోగలం. పశుహింస, మాంస భక్షణం, సురాపానం గర్హించతగినవి కావచ్చు. అహింసను బోధించే మతాలను కూడా హింసాదృష్టితోనే వీరశైవం చూస్తుంది. జిన రూపముల తలలు చిద్రువలుచేసి, జినవసదుల మీది సిడములు పీకి, యొక్కొక్క లింగంబు నొక్కొక్క బసది నక్కజముగ నిలిపి ''శైవులు'' ఊరుకోలేదు ఒక్క ఊర్లోనే...

పదునెనిమిదివేలు మొదలి జైనులను
బొరిగొని పిలిపించి పొరి పొరి బట్టి
యచ్చెరువంద గులచ్చిరియారు
చెచ్చెర నటమున్న చేయించి నట్టి
కాలియున్న యినుప శూలంబులందు...
జినమార్గవర్తుల నినుప కొర్రులను
గనల దివియించె...

మతం ఎంత మహత్తరమైన ఆశయాలతో స్థాపించినా భీకరమైనదే. శైవంలాగే వైష్ణవం కూడా. వర్ణాశ్రమ ధర్మాలను వ్యతిరేకిస్తూ అంత్యజులను ఉద్ధరించే వైష్ణవాన్ని కూడా సోమనాథుడు ఒప్పుకొనడు. 'అరవపారుల' మాటలు వినవద్దంటాడు. ఆవిర్భవింపని అభవునికి దేవకీ పుత్రాది దేవతలు సములు కాదంటాడు. శివకేశవులకు అభేదం చెప్పే హరిహరనాథతత్త్వాన్ని కూడా ఎదిరిస్తాడు. హరిహరుడనే మాటకు కొత్త అర్థం చెప్పి హరిని హరించుటచే హరిహరుడయ్యాడని హరుణ్ణి పెద్ద చేస్తాడు. తాను పట్టిన కుందేటికి మూడు కాళ్ళతో పాటు మూరెడు కొమ్ము కూడా ఉందని వాదించగలడు.

''వీరశైవము తలపెట్టిన కులావరణ నిర్మూలనము దుస్తరమైనది. లింగాయతులు, జంగములు, సాలె, జాండ్రలు ప్రత్యేక కులమువారై మరికొన్ని కులము లేర్పడినవి. వైదిక ధర్మ ప్రాబల్యము తిరిగి తలయెత్తినది. భక్తి ప్రధానమైన వీరశైవము నిర్జీవమై, ఆచార సంప్రదాయబద్ధమై సాంఘిక ప్రయోజనములకును, మానవ కల్యాణమునకు నిరుపయోగమైనది'' అని కాశీనాథుని నాగేశ్వరరావుగారు చెప్పిన మాటలలో యథార్థముంది.[13]

13. బసవ పురాణం - ఆంధ్ర గ్రంథముల ప్రచురణ - ప్రస్తావన పుట-2

భగవంతుని కన్నా భక్తుడే గొప్పవాడు. అతడు ఏది అడిగినా మారు మాటాడకుండా చెల్లించడమే విధి. తన కొడుకును చంపి వండిపెట్టమని ఒక జంగం అడిగిన వెంటనే సిరియాలుడు ఆ కోరికను చెల్లించాడు. అడిగినవాడు శివుడే అనుకొన్నాడు. ఈ చరిత్రను

మేటి యైచను భక్త కూటు వలందు
బాటలుగా గట్టి పాడెడువారు
బ్రస్తుతోక్తుల గద్య పద్య కావ్యముల
విస్తారముగ జేసి వినుతించువారు.

బయల్దేరారు. అయితే సిరియాలుడు చేసిన పనికి హలాయుధునివంటి భక్తులు ఛీకొట్టి చీదరించుకొన్నారు.

మృడునకు నరమాంసమే కాని యొండు
మెడకు బోదయ్యెనో? అని ప్రశ్నించాడు.

అడిగెబో మనసులో తరయ తప్పేమి?
కొడుకు జంపగ గత్తిగొన్న యంతటినె
మృడుడు జాణండేని మెచ్చంగ వలదె?

అని నిలదీసి అడుగుతున్నారు. హలాయుధుడు చివరకు

సెట్టికి గర్మంబు దిట్టు దేవరకు
గట్టిల్లెనింతియ కాదె కావునను
భక్తుని మింగిన పచ్చిరక్కసుడు
భక్తుని జంప బాల్పుడు సూనె కాడు
నిదియొక్క కథయుగా నిలరచియించి
చదువు మూఢులకు సంభ్రాతులకును
వెలియు జుండో...'' అని వెలివేశాడు.

హలాయుధునిలాగ ఎందరికో జుగుప్స కలిగి ఉండాలి. ఈ వెలికథను కథనం చేసినందుకు సోమనాథుని చిత్తశుద్ధిని ఎంతగా మెచ్చుకుంటామో అతని కాలంలో సజీవమై, సమరశీలమై సమానతలను సాధించడానికి లేచిన ఉద్యమం కుప్పకూలి చప్పనై సమసి చివరకు ''మాలకు మాంసంబు మరి గొడారికి తోలు'' కూడా మిగలకుండా అంతరించినందుకు చింతించాలి. వర్గభేదాలను రూపుమాపకుండా వర్ణభేదాలను తొలగించడానికి ప్రయత్నించడం పునాదులు లేని ఇళ్ళు కట్టడమే. ఇతర కవుల రచనల్లోంచి పలుకుబళ్ళు, సామెతలు, జాతీయాలు అని ఏవోకొన్ని తీసి ఆనందించడం మనకు అలవాటు. ఏమంటే వాళ్ళు వ్రాసే పద్ధతి దేశీయం కాదు. మార్గం. అందులో జాతీయాలను, దేశిని చొప్పిస్తే ఎంతో గొప్పగా చెప్పాడని మురిసిపోవాలి. పాల్కురికి

సోమనాథుని బసవపురాణం, పండితారాధ్య చరిత్రలలో జాతీయం కానిదేమిటో తీసిచూపించగలిగితే చూపించాలి. మిగతాదంతా తెలుగుతనమే. ఇతడు వాడే సంస్కృతోక్తులు సైతం ఆనాటి తెలుగు పండితలోకం వాడుకొనేవే!

సోమనాథుడు తన రెండు ముఖ్య కావ్యాలనూ శ్రీశైలంలోనే ప్రారంభించాడు. అక్కడే పూర్తి చేశాడేమో! అతడు ఓరుగల్లులో ఉన్నాడనుకోవచ్చు. ఆ తర్వాత రాజ్యం తురకల పాలవుతుందని కన్నడదేశానికి వెళ్ళిపోయాడట. అక్కడ జీవసమాధి పొందాడట.

సోమనాథుడి రచనల జాబితా:

(1) అనుభవసారం (2) అష్టోత్తరశతనామగద్య (3) అక్షరాంక గద్య (4) అక్షరాంకపద్యములు (5) గంగోత్పత్తిరగడ (6) చతుర్వేద సారం (7) చెన్నబసవ రగడ (8) చెన్నమల్లు సీసములు (9) నమస్కార గద్య (10) పంచరత్నములు (11) పంచప్రకారగద్య (12) పండితారాధ్య చరిత్ర (13) బసవపురాణం (14) బసవాష్టకం (15) బసవోదాహరణం (తె) (16) బసవోదారహరణం (సం) (17) మల్లమదేవీ పురాణం (18) రుద్ర భాష్యం (సం) (19) వృషాధిపశతకం (20) వృషభాష్టకం (సం) (21) శరణు బసవగద్య, (22) సద్గురురగడ (కన్నడ) (23) సోమనాథ భాష్యం (సం) (24) సోమనాథ స్తవం.

ఇదీ సంగ్రహంగా పాల్కురికి సోమనాథుని జీవితం, కవితా జీవితం. ఇతని కాలం గురించి అభిప్రాయభేదాలున్నాయి చూడండి:

ఆంధ్ర గ్రంథమాలవారు 1926లో తొలిసారిగా బసవ పురాణం ప్రచురించినప్పుడు దానిని పరిష్కరించి విపులమైన పీఠికను రాసిన వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సోమనాథుని కాల నిర్ణయాన్ని చేశారు. అతడు క్రీ.శ. 1190 ప్రాంతాలవాడని సిద్ధాంతంగా నిశ్చయించారు (వేటూరి వారి పీఠికలు – పుట. 140)

మల్లంపల్లి సోమశేఖరశర్మగారు: ''రెంటాల మల్లినాథుడు క్రీ.శ. 1290లో ఉండినట్లు శాసనములనుబట్టి విస్పష్టమగుచున్నందున పాలకురికి సోమనాథుడును అప్పటివాడే యనుటకు అభ్యంతరముండదు. ఎట్లయినను బసవపురాణ, పండితారాధ్య చరిత్రలు క్రీ.శ. 1290 కిని క్రీ.శ. 1320కిని నడిమి కాలమున బుట్టిన గ్రంథములు.'' భారతి, సం.22, పుటలు 107, 108.

నేలటూరి వెంకటరమణయ్యగారు: ''సుమారు 1280 నుండి 1340 వరకును జీవించెననుకొనవచ్చును.'' – సోమనాథుడు ఎప్పటివాడు? (వావిళ్ళ ప్రచురణ)

చాగంటి శేషయ్యగారు: ''1240 నుండి 1320 దాకా'' – ఆంధ్ర కవితరంగిణి, రెండవ సంపుటం.

నిడుదవోలు వెంకటరావుగారు: ''1190 నుండి 1260.''

చిలుకూరి నారాయణరావుగారు: ''ఎవరెంత గింజుకున్నా సోమనాథుడు క్రీ.శ. 1240 ముందుకు రాడు.'' - భారతి, 1948 నవంబరు.

బండారు తమ్మయ్యగారు: ''1160కి 1240కి నడుమ.''

1303లో మొదటిసారి మహమ్మదీయులు ఆంధ్రదేశంపై దండెత్తి వచ్చారు. (ప్రతాపరుద్రదేవుడు 1296లో రాజు అయ్యాడు.)

1303 తరువాత కొద్దికాలానికే సోమనాథుడు ఓరుగల్లు వదలి వెళ్ళిపోయాడు అనుకొనవచ్చు.

సోమనాథుని కాలం గురించి పండితులలో ఎలా అభిప్రాయభేదాలు వున్నాయో అతని జన్మస్థలం గురించి కూడా అలాగే అభిప్రాయభేదాలు వున్నాయి. చిలుకూరి నారాయణరావుగారూ, చాగంటి శేషయ్యగారూ సోమనాథునిది మైసూరు రాష్ట్రం తుముకూరు తాలూకాలోని 'హాల్కుర్కి' అంటారు. ఇతరులు తెలంగాణాలోని పాలకుర్తి అంటారు.

తెలుగుదేశంలో పేరుమోసిన సాహిత్యవేత్తలంతా పాల్కురికి సోమనాథుడిపైన, వీరశైవవాఙ్మయంపైన పరిశోధనలు చేసినవారే! మొట్టమొదట బ్రౌనుదొరగారు 1840లో జంగమసాహిత్యంపైన వ్యాసం వ్రాశారు.[14] పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రను ప్రప్రథమంగా నిడుదవోలు సుందరం పంతులుగారు ప్రచురించారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారూ, చిలుకూరి నారాయణరావుగారూ, బండారు తమ్మయ్యగారూ, నిడుదవోలు వెంకటరావుగారూ, నేలటూరు వెంకటరమణయ్యగారూ, శిష్టా రామకృష్ణ శాస్త్రిగారూ, మల్లంపల్లి సోమశేఖర శర్మగారూ ముఖ్యమైన పరిశోధనలు చేశారు. వారి పరిశోధనలను సమన్వయంచేసి సారాంశాన్ని ఇలా చెప్పుకొన్నాం. పాల్కురికి సోమనాథునిపై విపులంగా చెప్పుకోవాలంటే ఒక పుస్తకమే పడుతుంది. తవ్వినకొద్దీ రత్నాలిచ్చే గని అతడు.

అతడు తన పద్యంలో ఇలా చెప్పుకొన్నాడు:

ఆనయము పాలకురికి సో-మనాథు డన బరగువాడ మానవసంస
ర్గనివర్తకుడను గురుభ-క్తి నిరూపితమానసుండగృతకృత్యుండక్.

తన మొట్టమొదటి రచనలోనే తాను కృతకృత్యుడనని చాటుకొన్నాడు సోమనాథుడు. అతడు గురుభక్తిలోనే కాక ఉరుతరభాషాసేవలోనూ నిజంగా కృతకృత్యుడే!

---

14. పరిశోధన. వీరశైవ వాఙ్మయం : విద్వాంసుల సేవ - చల్లా రాధాకృష్ణశర్మ.

చక్రపాణి రంగనాథుడు

ఆదికవి వాల్మీకి పాడుకోవడానికి వీలుగా అనుష్టుప్ ఛందంలో రామాయణం మొట్టమొదట సంస్కృతంలో వ్రాస్తే, అదేరీతిగా పాడుకోవడానికి అనువైన ద్విపద ఛందస్సులో తెలుగులోనూ ఒక కవి తొలిసారి రామాయణాన్ని రచించాడు. ఆ ద్విపద కావ్యానికి 'రంగనాథ రామాయణం' అనేది రూఢమైన పేరు. రంగనాథుడు అనే కవి వ్రాయబట్టే దానికాపేరు ఏర్పడిందని లోకం చెప్పుకొంటున్నది. తెలుగు కవులలో రంగనాథుడనే పేరున్నవాడు చక్రపాణి రంగనాథుడు తప్ప ఇంకెవ్వరూ లేకపోబట్టి ఇతడే ఈ రామాయణాన్ని రచించినట్టు చాలామంది భావిస్తున్నారు. అయితే ఆంతరంగిక సాక్ష్యాన్నిబట్టి రంగనాథుడనేవాడెవడూ అసలు రామాయణాన్ని వ్రాయలేదు. ఒకవేళ ఎవరైనా వ్రాసిఉన్నా చక్రపాణి రంగనాథుడు మాత్రం దానిని వ్రాసి ఉండడానికి వీల్లేదు. ఎందుచేతో వివరిస్తాను.

రంగనాథ రామాయణంలో స్పష్టంగా దానిని గోనబుద్ధ భూపతి తన తండ్రి పేర వ్రాసినట్టు కనబడుతుంది. అయితే లాక్షణికులు ఈ రామాయణాన్ని ఉత్తరోత్తరా 'రంగనాథ రామాయణం' అనే పిలువసాగారు. కాబట్టే అది రూఢిగా చెలామణి అయింది. అయితే రంగనాథుని పేరు ప్రత్యేకంగా చెప్పి రామాయణంలోని ద్విపదలు ఉదాహరించిన లాక్షణికుడు ఒకడే ఒకడు ఉన్నాడు. అతడు పొత్తపి వెంకటరమణ కవి. అతడు క్రీ.శ. 16వ శతాబ్దివాడు. ఆయన తన 'లక్షణ శిరోమణి'లో 'అచ్చువెల్లి రంగన్నగారు' అను పేర రంగనాథ రామాయణంలోని ద్విపదలు ఉదాహరించాడు.[1] లాక్షణికుల ఉద్దేశంలో రంగనాథుని ఇంటిపేరు అచ్చువెల్లి వారేగాని, చక్రపాణివారు కాదు. అందుచేత మనం ఇప్పుడు చెప్పుకొంటున్న కవికీ, రంగనాథ రామాయణానికీ బాదరాయణ సంబంధమేతప్ప ఇంకేం లేదు.

అదీగాక చక్రపాణి రంగనాథుడు వాస్తవానికి పాల్కురికి సోమనాథుని సమకాలికుడని మనం తెలుసుకున్నాం. పాల్కురికి సోమనాథుడు క్రీ.శ. 1280–1340 దాకా జీవించినవాడు. రంగనాథ రామాయణాన్ని, అది వ్రాసిన కవి ఎవరైనా, 14వ శతాబ్ది చివరి భాగంలో, 1380 ప్రాంతాల వ్రాసి ఉండాలని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు సప్రమాణంగా నిరూపించారు.[2] పధ్నాలుగో శతాబ్ది పూర్వార్ధంలో పాల్కురికి సోమనాథునితో వాదించి ఓడిపోయి శివదీక్ష పొంది శైవుడుగా మారిన రంగనాథునికీ, ఆ శతాబ్ది ఉత్తరార్ధంలో రామాయణ రచనకూ సంబంధం ఉండడానికి ఆస్కారం లేదు.

చక్రపాణి రంగనాథుడూ, పాల్కురికి సోమనాథుడూ సమకాలికులన్న సంగతీ, ఇద్దరూ మొదట వాదించుకొన్న సంగతీ, రంగనాథుడు సోమనాథుని శిష్యుడై శివదీక్ష

1. సింహావలోకనం – వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వ్యాస సంపుటి, పుట. 30
2. రంగనాథ రామాయణం – పీఠిక రాయలు అండ్ కో. ప్రచురణ. పుటలు 9–11.

పుచ్చుకొన్న వివరాలూ మనకు తెలుగు పుస్తకాలవల్లకాక, కన్నడ కావ్యాలవల్ల తెలుస్తాయి. కన్నడంలో విరక్తతొంటెదార్యుడు 'సోమనాథపురాణం' అనే కావ్యాన్ని వ్రాశాడు. అందులో ఇలా చెప్పాడు:

చక్రపాణి రంగనాథుడనే వైష్ణవునితో సోమనాథునికి మతవిషయంలో వివాదం ఏర్పడింది. శైవుడు కానివానిని కంటితో చూడగూడదనే నియమమున్నందువల్ల సోమనాథుడు తెరచాటున ఉండి రంగనాథునితో వాదించడానికి అంగీకరించాడు. కాని సోమనాథుని కుమారుడు చతుర్ముఖ బసవేశ్వరుడే తండ్రికి మారుగా తలపడ్డాడు. ఇద్దరికీ గొప్పవాదం జరిగింది. రంగనాథుడు ఓడిపోయాడు. పరాజయ దుఃఖంతో అతడు ఇంటిముఖం పట్టాడు. త్రోవలో శ్రీశైలం ఉంది. రంగనాథుడు ఆ క్షేత్రంలో ఆగి మల్లికార్జునస్వామిని దర్శించుకోలేదట. అందుచేత అతని రెండు కళ్ళూ పోయాయి. రంగనాథుడు అహోబలం చేరుకొని నరసింహస్వామిని ప్రార్థించాడు. స్వామివారు ఆ రాత్రి కలలో కనబడి శివుని గొప్పదనం బోధించారట. రంగనాథుడు సిగ్గుపడి బుద్ధితెచ్చుకొని శ్రీశైలం వెళ్ళి మల్లికార్జునుణ్ణి పూజించాడు. అప్పుడొక కన్ను వచ్చిందట. ఆ తరువాత పాల్కురికి సోమనాథుని పాదాలమీద పడి క్షమాపణ చెప్పుకోగా రెండవ కన్ను వచ్చిందట.

కళ్ళు మళ్ళీ రాగానే రంగనాథుడు ఒక రగడతో దేవుణ్ణి స్తుతించాడు. అందులో ప్రతిపాదం చివరా 'కంటి' అనే మాట ఖరారుగా ఉంటుంది. కనుకనే దానిని 'నయనరగడ' (రగడలలో తొమ్మిది రకాలున్నాయి. అందులో ద్విరదగతి, మధురగతి, హరిగతి, హరిణగతి, వృషభగతి అనే అయిదూ 'గతి' అనే పదంతో అంతమవుతాయి). ఈ నయనరగడ కూడ రగడ భేదాలలో ఒకటి అవుతుందని పొరబడి చాగంటి శేషయ్యగారూ,[3] శిష్టా రామకృష్ణశాస్త్రిగారూ[4] దీనిని 'నయనగతి రగడ' అని పేర్కొన్నారు.

తొంటె దార్యుడు చెప్పిన కథనూ, నయన రగడనూ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చాటుపద్య మణిమంజరి ద్వితీయ భాగంలో ప్రచురించారు (వాస్తవానికి రంగనాథుని చరిత్రను తెలిపే ఆకరాలన్నిటిని సేకరించారు). నయన రగడ 342 పాదాల కృతి, చాటుపద్య మణిమంజరిలో ఒక పాదం పోయింది. ఈ రగడలో చెప్పిన విషయాలనుబట్టి రంగనాథునికి ఒకసారి కన్నులుపోయి తిరిగి వచ్చాకనే ఇది చెప్పినట్లు తెలుస్తుంది. చూడండి ఈ పాదాలు.

''నయముగా నయనములు నా కీయ బొడగంటి
భయభక్తు లీ భర్గు పాదములు పొడగంటి.''

తొంటెదార్యుడు చెప్పిన సభలో వాదంకూడ నిజమేనని నయనరగడలో ఈ పాదాలు తెలియజేస్తాయి.

---

3. ఆంధ్ర కవి తరంగిణి, మూడవ సంపుటం, పుటలు 147, 148
4. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వము. పుట. 558

''త్రిభువనము భక్తులకు దృణకణములని కంటి
సభలందు భక్తులకు జయవాదమని కంటి.''

కన్నడంలో ఒక్క తొంటెదార్యుడేకాక సిద్ధనంజేశకవి కూడ చక్రపాణి రంగనాథుడు సోమనాథుని చేతిలో ఓడిపోయినట్లు తన 'గురురాజ చరిత్రము'లో చెప్పాడు. రంగనాథుడు శివదీక్ష పుచ్చుకొన్నాక వీరభద్ర విజయం, శరభలీల అనే గ్రంథాలనేకాక శ్రీ గిరినాథ విక్రమము అని అయిదువందల సీసపద్యాలను తెలుగులో వ్రాసి దానినే మళ్ళీ సంస్కృతంలోనూ వ్రాశాడట. రంగనాథుని ఇతర కృతుల వివరాలను ఇస్తూ సిద్ధనం జేశకవి వ్రాసిన కన్నడ పద్యాలను వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఉదాహరించారు. ఆ పద్యాలు ఇవి:

''శ్రీశైల భర్తకును సీసంగ ళెనూఱు
లేసప్ప పద్యంగ ళెంటు సావిరగళుం
భాసురద దండకం సాహస్రతారావళియు నాల్కు లయగ్రాహియు

ఆ శతకవృత్తగళు దోధకం సావిరవు
భాసురద తోటకం నూఱు రగళెగ ళేడు
భాషిసిద మత్తకోకిల మూఱు సావిరం గీతియం తాఱునూఱు

సరసమంజెర వెంటుకందంగ ళై నూఱు
విరచిసిద కృతియు మూవత్తాఱు గద్యగళు
నిరువ మూవత్తాఱు వుభయ శతకం వొప్పు మిగిలు సర్వేశ నిమగె''

ఈ కన్నడ పద్యాలవల్ల శ్రీశైలమల్లికార్జునుని పేర 500 సీసపద్యాలు, 8000 పద్యాలున్న మరొక గ్రంథం, వేయి పాదాలుగల ఒక దండకం, ఒక తారావళి, నాలుగు లయగ్రాహులు, ఒక వృత్తశతకం, వేయి దోధకవృత్తాలు, నూరు తోటకవృత్తాలు, ఏడు రగడలు, 3000 మత్తకోకిలలు, 600 గీతపద్యాలు, 8 మంజరులు, 500 కందాలు, 36 గద్యలు, 36 ఉభయశతకాలూ రంగనాథుడు చెప్పాడని తెలుస్తుంది. ఈ కృతులన్నీ ఇప్పుడు మనకు దొరకవుగాని ఇతడు ఇన్ని చెప్పడానికి కారణం మాత్రం తెలుస్తుంది.

తనకు కళ్ళు తిరిగి వచ్చాక తన ఎత్తు కృతులు దేవునికి సమర్పిస్తానని రంగనాథుడు మొక్కుకొన్నాడు. ఆ మొక్కు తీర్చుకోవడానికి వందలూ, వేలూ పద్యాలున్న గ్రంథాలు రచించాడని ఊహించవచ్చు. చూడండి, నయన రగడలో ఈ మొక్కుగురించి తెలిపే పాదాలు.

''ఇంక శ్రీగిరి జేర నేగందు నని కంటి
శంకరుని కృపవడయ సమయ మిది యని కంటి
నికను నాయెత్తు కృతు లిత్తునని పాడగంటి
నిక గృతుల్ చెప్ప నా కేమి భయమని కంటి

వడి గృతుల్ నాయెత్తు వచ్చునని పొడగంటి
మృడు డింక నా కృతుల్ మెచ్చునని పొడగంటి.''

తన యెత్తు కృతులు సమర్పిస్తానని రంగనాథుడు మొక్కుకొన్న సంగతిని 'ఏకశిలానగర వృత్తాంతం' స్పష్టం చేస్తుంది. అయితే అందులో రంగనాథుడు అహోబలానికి బదులు శ్రీరంగానికి వెళ్ళినట్లు ఉంది చూడండి.

''రంగనాథుడు ఆందోళికపై నెక్కి చనుదెంచునప్పుడు త్రిపురాంతక దేవుని గోపురంబు జూచి 'ఇది యేమి? అని యడిగిన నా వివరాలు త్రిపురాంతక గోపురంబని పలుకుటయు నా శివభవనంబు జూడనొల్లక మైనపు జడ్లు కప్పించుకొనియె. అప్పుడు రంగనాథుని నేత్రంబులు గానరాక జాత్యంధునివలెనే మగిడి శ్రీరంగానికి పోయి యద్దేవుని బ్రసన్నుని జేసికొని నేత్రంబులు పోయెనని మొరయిడుటయు నద్దేవుండు కరుణించి త్రిపురాంతక దేవుణ్ణి వేడుకొమ్మనుటయు రంగనాథుడు మళ్ళీ త్రిపురాంతకమున కేతెంచి యద్దేవునకు నమస్కరించి తనయెత్తు కృతులు సమర్పింతునని వ్రతంబుసేసి భక్తి మయంబగు రగడ చెప్పిన నద్దేవుండు ప్రసన్నుండై రంగనాథునకు నిరుకన్నుల నొసగుటయు రంగనాథుడు పాలకుర్తికింజని సోమనాథునిచే శివదీక్ష గొనియె. ఆ యయ్య వద్ద శైవ రహస్యంబులు తెలిసికొనుచుండె.''[5]

రంగనాథుడు పాల్కురికి సోమనాథుని ప్రభావంలో కవిత్వం చెప్పాడనడానికి నయనరగడలోని ఈ క్రింది పాదాలు పనికివస్తాయి.

''శ్రుతి 'యేక ఏవ రుద్రో' యనగ బొడగంటి
శ్రుతి 'పరంబ్రహ్మ'మని శూలి బల్కుట గంటి''

సంస్కృతోక్తులను ద్విపదలలో ఉదాహరించడానికి సోమనాథుడు గురువు. అతని తర్వాతనే కవులు ఇలా వ్రాయడం నేర్చుకొన్నారు.

సిద్ధనంజేశకవి చెప్పిన గ్రంథాల జాబితాలో ఏడు రగడలు ఉన్నాయి. అందులో ఒకటి నయనరగడ. దీని అసలు పేరు శివభక్తిదీపిక. రెండో రగడ 'శివమంత్రవర్ణనము' దీనినే 'నమశ్శివాయరగడ' అంటారు. దీనిలో ప్రతిపాదం చివరా 'నమశ్శివాయ' అని వుంటుంది. ఇది నూటయెనిమిది పాదాల కృతియని భావించవచ్చు. ఏమంటే దీని చివర

''ఈ యష్టోత్తరశతముం - బాయక పఠియించునతడు పరమానంద
శ్రీయుక్తుడు రైయుక్తుడు - ధీయుక్తుడు నైతనర్చు దివ్య మహత్త్వక్.''

అని ఫలశ్రుతి ఉంది. ఇది అష్టోత్తరశతం అని తెలియజేసినా ముద్రితమైన దానిలో 102 పాదాలే దొరుకుతున్నాయి. ఈ రగడవల్ల రంగనాథుని గురించి మనమేమీ తెలుసుకోలేము. నయనరగడలో కొందరు వ్యక్తుల పేర్లు ఉన్నాయి.

---

5. చాటు పద్య మణిమంజరి, రెండవ భాగం, పుటలు 82, 83.

''ఘనుడు దూషకర గండడని కంటి
జనకల్పతరులలో జయశాలి యనికంటి
దవిలి రంగనమంత్రి ధన్యకృతి యనికంటి
భువిలోన బ్రోలాంబ పుణ్యవతి యనికంటి'

అని చెప్పాడు. ఈ రంగనమంత్రి, ఈ ప్రోలాంబ ఎవరో తెలియదు. బహుశా రంగనాథుని తల్లిదండ్రులు కావచ్చు.

శివభక్తిదీపిక వ్రాతప్రతిలో కడపట ''వైష్ణవ చక్రపాణి రంగనాథుడు శైవదీక్షాధారణమైన తర్వాతను చేసిన నయనరగడ'' అని వ్రాసి ఉందట. ఇందులో చెప్పిన 'చక్రపాణి' అనే ఇంటిపేరు నిజమైనదే అని బలపరచడానికి ఇంకొక సాక్ష్యముంది. కొలని గణపతి దేవుడు తన 'శివయోగసారము'లో ఇలా స్తుతించాడు:

''ఆసమశివభక్తి సమా - నసునిం బాల్కురికి సోమనాథుని, గవిరా
జసమున్నతయశు సద్యః- ప్రసాది యగు చక్రపాణి రంగన గొలుతున్.''

కొలని గణపతిదేవుడు క్రీ.శ. 1400 ప్రాంతంవాడు. క్రీ.శ. 1430 ప్రాంతాలలో ఉన్న అనంతమాత్యుడు తన భోజరాజీయంలోనూ, క్రీ.శ. 1430-1490 మధ్య ఉండిన కొరవిగోపరాజు తన సింహాసన ద్వాత్రింశికలోనూ రంగనాథుణ్ణి నుతించారు. అంటే 15-వ శతాబ్ది ప్రారంభం నాటికే రంగనాథుడు అశేషకీర్తిని సంపాదించాడన్నమాట. కొలని గణపతిదేవుడు ఎలాగైతే పాల్కురికి సోమనాథుని తరువాత రంగనాథుణ్ణి స్తుతించాడో అలాగే లింగకవి భద్రకవి (క్రీ.శ. 1530-1542 ప్రాంతాలు) కూడ తన సానందోపాఖ్యానంలో వరుసగా నుతించాడు.

''సకలవేదపురాణశాస్త్రేతిహాస- నికరార్థములు ప్రమాణించి సద్భక్తి
శ్రీమతి నుద్ధరించిన పాలకుఱికి- సోమనాథేశ్వరు సొంపుతో గొలిచి
రంగ ద్విశాలాంతరంగమ్మునందు- రంగనాథుని గవిరాజన్యు దలచి.''

అని చెప్పాడు. క్రీ.శ. 1560 ప్రాంతాలలో ఉండిన లింగమగుంట తిమ్మన అనే లాక్షణికుడు రంగనాథుని ఈ తోటకవృత్తాన్ని 'బాలబోధచ్ఛందస్సు'లో ఉదాహరించాడు.

''ఉపవాసము లెల్లను నుండుట నీ కృప వచ్చుటకా యదిరి త్తసుమీ
యపవిత్రుని బుల్లని యంబలికై సుపవిత్రుని జేయుట సుద్దిగదే!''

ఇలాగే హనుమచ్ఛందస్సులో కూడా ఇంకొక తోటక వృత్తాన్ని లాక్షణికుడు ఉదాహరించాడు. రంగనాథుని రచనలలో తోటకాన్నే రెండు లక్షణ గ్రంథాల్లో పేర్కొనడం వల్ల అడు 100 తోటక వృత్తాలు వ్రాశాడని సిద్ధనంజేశుడు చెప్పిన సంగతి నిజమే అవుతుంది.

క్రీ.శ. 1550 దాకా రంగనాథుని కృతులు ఆంధ్రదేశములో దొరకుతూనే ఉండేవని చెప్పవచ్చు. ఆ ప్రాంతాలలో జీవించిన పెదపాటి జగన్నాథ కవి సంకలనం చేసిన ప్రబంధ రత్నాకరంలో మూడు పద్యాలున్నాయి.

> ''అదలని తేరు, తేరికిని నాదరువై తగు విల్లు, వింటికిం
> గుదురగు నారి, నారిపయి గూన్కు శరంబు, శరంబు బొడ్డునం
> బొదలిన యంత, యంత ముఖముల్ నిజవాసములైన గుఱ్ఱముల్
> చెదరక నీకు నెట్టిపని సేయునయా! గిరిజాధినాయకా! (407)

> ''ఓజు చేముట్టక యొగ్గాన బట్టక చక్కగా దివిబాఱు చక్రములును
> లాయాన గట్టక లలి మేత వెట్టక వర్ణహీనంబైన వారువములు
> తవనవెట్టక జీవితము కాసుముట్టక సత్త్వసంపద జూపు సారథియును
> కడచీల దట్టక ఘనముగా మెట్టక గంభీర సంపద గలుగు నిరుసు
> గలిగి తనరారు నరదంబు గడకనెక్కి - త్రిపుర విజయంబు జేకొన్న దేవదేవు
> డిందుశేఖరు డానంద మందిరుండు-మనల గరుణా విధేయుడై మనుచుగాత!
> (408)

> ''గోశతపంచవార్ధులును గోయుగ వార్ధులు గోత్రివార్ధులున్
> గోశర వార్ధులున్ చెదిత గోశత (వార్ధులు) పంచవార్ధ లా
> కేశవ తల్పపద్మభవ కేకిపవాహన దానవేశదే
> వేశులకిచ్చునట్టి పరమేశ్వరుడీవుత మా కభీష్టముల్.'' (409)

ఇందులోని మొదటి రెండు పద్యాలలో రంగనాథుని కవిత్వ ధోరణి తెలుస్తున్నది. సీసపద్యంలో చక్కని తెలుగు మాటలు వాడారు. ఇందులోని ఓజు, యొగ్గం, లాయం మొదలైన చక్కని మాటలు రంగనాథుని దేశి అభిమానాన్ని సూచిస్తాయి! 'ఒగ్గం' అంటే ''ఏనుగు లోనగువానిని బట్టునపుడని పడుటకై త్రవ్వి, మీద తేలికైన కఱ్ఱలను, కంపలను కప్పి, యాపైని కొంచెము మట్టిపరచి నేలమట్టముగా చేసిన పల్లము'' అని సూర్యరాయాంధ్ర నిఘంటువు వివరిస్తుంది. రంగనాథుని ప్రయోగంవల్ల 'ఒగ్గం' అంటే పల్లమనే సాధారణార్థం కూడ ఉందని తెలుసుకోవచ్చు. రంగనాథుని రచనలన్నీ దొరికితే ఇలాంటివెన్నో తేలుతాయి.

అనంతామాత్యుడు, గోపరాజువంటి కవులు నుతించి, లింగమగుంట తిమ్మనలాంటి లాక్షణికులు గౌరవించిన చక్రపాణి రంగనాథుడు తనయెత్తు కృతులు చెప్పినా అందులో ఒకటో, అరో మాత్రమే నేటికి మిగలడం నిజంగా దురదృష్టం!

కృష్ణమాచార్యులు

మన ఆధునిక యుగంలో 'వచన పద్యాలు' అనేవి బహుజన ఆదరణీయాలైనాయి. చాలామంది కవులు వీటిని వ్రాస్తున్నారు. పద్యాలవంటి వచనాలు వ్రాయడం తెలుగు సాహిత్యంలో ఇవాళ కాదు, చాలాకాలం క్రిందటే - ప్రతాపరుద్రుని కాలంలోనే ప్రారంభమైంది. ఆ కాలంలో జీవించిన కృష్ణమాచార్యులు అనే కవి 'సింహగిరి వచనాలు' అనే కృతిని రచించాడు.

'వచన రచన' అనేది ఈ యుగానికి చాలా పూర్వమే ఉండేది. తమ కాలంలో ''నవార్థ వచన రచనా విశారదులయిన మహాకవులు'' వుండేవారని నన్నయ్యగారు ఆంధ్ర మహాభారతం అవతారికలోనే చెప్పారు. ఆ వచన రచనలు ''మృదు మధుర రసభావ భాసురా''లని వారి మాటలవల్లనే తెలుస్తూంది (1-8). తిక్కనగారు తాము వ్రాసిన ఉత్తర రామాయణంలో మచ్చుకైనా వచనం వ్రాయక కావ్యానికి నిర్వచనం అనే విశేషణాన్ని పెట్టుకొన్నారు. తిక్కనగారి కాలం దాకా కవులు చంపూ కావ్యాలలో వచనాన్ని వర్ణనలకూ, కథ చెప్పడానికీ వాడుకొనేవారు. వచనం లేకుండా పద్యాలలోనే వర్ణన చేయవచ్చు గాని పేలవమైన ఘట్టాలను వచనంలో దాటెయ్యకుండా పద్యాలు రచించడం కష్టమే. అందుకే తిక్కనగారు ఇలా చెప్పారు:

> వచనం లేకయు వర్ణన - రచియింపగ గొంత వచ్చు బ్రౌఢులకు గథా
> ప్రచయము బద్యములన పొం-దుచితంబుగ జెప్పు టార్యు లొప్పిద మనరే?
>
> (నిర్వ. 1-15)

వచన రచన అంటే తిక్కనగారి కాలం నాటికి కథా కథనం అని అర్థం ఉండేదని కూడ ఇంకొకరకంగా తెలుసుకోవచ్చు. కేతన తన దశకుమార చరిత్రలో ఒకచోట ఇలా వ్రాశాడు. రాజవాహనుడు దశకుమారులలో ఒకడైన మిత్రగుప్తుని చూసి అడిగాడు:

> నీ వర్తనంబు జెప్పుము - నావుడు నత డెంతయున్ వినయమున ప్రణతుం
> డై వచన రచన యొప్పు మ-హీవరునకు విన్నవించె నిట్లని ప్రీతిన్.
>
> (దశకుమార. 10-3)

దశకుమారులలో మిగతావాళ్ళ కథలన్నీ ఒక లాంటివి. ఈ మిత్రగుప్తుడి కథ ఇంకొక లాంటిది. మిగతావాళ్ళు వాళ్ళ వాళ్ళ కథలను, ఆ కథలలో తటస్థపడ్డ ఇతర పాత్రల కథలను చెప్పుకొంటూ పోయారుగాని మిత్రగుప్తుడు మాత్రం తన కథలో ఒక పాత్రకు పిట్టకథలు, నీతికథలు చెప్పవలసి వచ్చింది. ఈ కథలు రమారమి యక్షప్రశ్నల వంటి సమస్యలకు సమాధానాలు. ఇలాంటి కథలతో కూడుకొన్న కథ కాబట్టి 'వచన రచన యొప్పు' మిత్రగుప్తుడు కథనం చేశాడని కేతన చెప్పడం జరిగింది కాబోలు.

తిక్కనగారు వచనము అని దేనిని పేర్కొన్నారో దానినే ఆ కాలంలో గద్య అని పిలిచేవారు కాదేమో అనే అనుమానానికి ఆస్కారంగా తిక్కనగారు ఉత్తర రామాయణంలో 'వచనం' వ్రాయలేదుగాని ప్రతి ఆశ్వాసం చివర 'గద్యము' వ్రాసుకొన్నారు. ఒక్క పాల్కురికి సోమనాథుడే తన ద్విపద కావ్యాలలో 'వచనం'గాని, 'గద్యం'గాని చొరబడకుండ గద్యలో చెప్పే సంగతులను గూడ ద్విపదలోనే చెప్పాడు.

ఇది యసంఖ్యాత మహేశ్వర దివ్య-పదపద్మ సౌరభ భ్రమరాయమాణ
జంగమలింగ ప్రసాదోపభోగ-సంగత సుఖ శరధినిమగ్న
సుకృతాత్మ పాలకురికి సోమనాథ-సుకవి ప్రణీతమై శోభిల్లి తనరి
చరిలింగ ఘనకరస్థలి విశ్వనాథ-వరకృపాంచిత కవిత్వ స్ఫూర్తి జేర్చి
చను బసవపురాణమను కథయందు-వనుపమంబుగ బ్రథమాశ్వాసమయ్యె.

అని బసవపురాణంలో వ్రాశాడు. ఇలాగే ఆశ్వాసం చివరా ద్విపదలే చెప్పాడు. పండితారాధ్య చరిత్రలో కూడ ఇలాగే వ్రాశాడు. ''ఆరూఢ్యగద్యపద్యాది ప్రబంధపూరిత సమాసభూయిష్ఠరచన సర్వసామాన్యం'' కాదు. గద్యపద్యోదాత్త కృతులు, ద్విపదలూ సమమే అని భావించేవాడు కనుక గద్యలో చెప్పవలసింది ద్విపదలో చెప్పాడు.

తిక్కనగారు నిర్వచన కావ్యంలో చివర గద్యాలు వ్రాయడంవల్ల కొంత అనుమానం ఉన్నా ఆ కాలంలో చంపూకావ్యాలలో ఉండే వచనమూ, గద్యమూ ఒకటేనని కేతన మాటలవల్లే మళ్ళీ తెలుస్తున్నది. ''గద్యమ్మున దండి చెప్పిన కథాక్రమ మొప్ప దెనుంగుభాష గద్యమ్మును బద్యముం బెరయ... చెప్పఁబూనితిన్'' (దశ.1-25) అన్నాడు.

ఆశ్వాసాల చివర ఉండే గద్య సంప్రదాయం వేరు, ఆశ్వాసాల లోపల ఉండే గద్య సంప్రదాయం వేరు అని నిడుదవోలు వెంకటరావుగారు వివరించారు.[1] ఆశ్వాసాంత గద్యలు బిరుదు గద్యలు అని వారు అర్థం చెప్పారు. అయితే లక్షణకారుల నిర్వచనం ప్రకారం బిరుదు గద్యలు సంబోధనాంతముగా ఉండాలి. ఆశ్వాసాంత గద్యములు అలా ఉండవు; ప్రథమ పురుషలో ఉంటాయి. అయినా అవి బిరుదు గద్యలే అని వెంకటరావుగారి అభిప్రాయం.

క్రీ.శ. 1435 ప్రాంతాల కవితా రచన చేసిన అనంతామాత్యుడు తన ఛందోదర్పణంలో గద్య లక్షణాన్ని చెప్పి దానికి ఒక లక్ష్యాన్ని రచించాడు. చూడండి ఆ లక్షణ లక్ష్యాలు:

కనుగొన బాధరహితమై-పనుపడి హరిగద్దెవోలె బహుముఖరచనం
బున మెరయు గద్య మది దా-దెనుగుకృతుల వచనమనగ దీపించు గడున్.

1. ఆంధ్ర వచన వాఙ్మయం, పుట 8.

స్వస్తి సమస్త భువన రక్షాదక్ష శ్రీపుండరీకాక్ష భుజగపతీ సింహాసనా రూఢ సురనికరమకుటతటఘటిత సురుచిరమణి గణప్రభావిభాసిత పాదపీఠ! వేద నినదానుకారి గౌరవ లలిత నూపురాలంకృత చరణ సరసిజయుగళ నవ్య పదాంగుష్ఠ నఖమయూఖరేఖాయిత సురత్రవాహా పీతాంబరధర నూత్న మేఖలా కలిత కటితట ప్రదేశ చతురానన జనక నాళీకశోభితనాభి సరోవర, యఖండ బ్రహ్మాండ కలాపగోపన నిపుణోదర, క్షీరసాగర తనయామనోజ్ఞ గేహీకృత విపుల వక్షస్థల కనత్కనక కటక కేయూర ప్రముఖ భూషణ భూషిత చతుర్భుజ, శంఖపంకజ సుదర్శన గదాధర కిరీట కుండలాభిరామ యనవరత ప్రసన్నవదన కౌండిన్య వరద శ్రీ యనంత పద్మనాభ నమస్తే నమస్తే నమః అని గద్య పఠనం బొనర్చు నుత్తములకు నుత్తమాయురారోగ్యంబు లొదవునని విశద వచనంబుల విద్వజ్జనంబు లభినుతింతురు. (అనంతుని ఛందం. 2-2,3)

ఈ గద్యం శాసనాలలోలాగ 'స్వస్తి'తో మొదలై దండకంలోలాగ 'నమస్తే నమస్తే నమః' అని అంతం కావడం గమనించదగ్గది. ఆశ్వాసం చివర అనంతుడు దండక లక్షణం ఆ ఛందంలోనే చెప్తూ 'నమస్తే నమస్తే నమః' అని ముగించలేదు. అతి ప్రాచీనమైన 'కవిజనా శ్రయం'లోని దండకం సంబోధనలలోనే అంతమవుతుంది. కావ్యాలంకార చూడామణి (క్రీ.శ.1402-1407)లో విన్నకోట పెద్దనకూడ 'విశ్వేశ్వరా! విశ్వవిశ్వంభరాధీశ్వరా!'' అని సంబోధనంతోనే దండకాన్ని ముగించాడు. క్రీ.శ. 1550 ప్రాంతాలనున్న చిత్రకవి పెద్దన తన లక్షణసారసంగ్రహంలో కూడ దండకాన్ని సంబోధనతోనే అంతం చేశాడు. అయితే తెలుగు కావ్యాలలోని మొట్టమొదట దండకం వ్రాసిన నన్నయగారు మాత్రం దండకాన్ని 'శ్రీ'తో మొదలుపెట్టి ''నమస్తే నమస్తే నమః'' అని ముగించారు (అరణ్యా. 1-324). ఈ లక్ష్యమే తరువాతి కవులకు మార్గదర్శకమయిందిగాని లక్షణకారులు ఇచ్చిన లక్ష్యాలు కాలేదు.

అనంతమాత్యుడు పేర్కొన్న గద్యంలాంటిది మధుర కవితలలో చేరుతుందని వార్తాకవి రాఘవయ్యా అనే లాక్షణికుడు తన 'లక్షణదీపిక'లో చెప్పిన దానినిబట్టి తెలుస్తున్నది. ఇతడు క్రీ.శ. 1600 ప్రాంతంవాడు. ఈ గ్రంథం అముద్రితం. 'ఆశుమధుర చిత్రవిస్తార కవిత్వంబు'లనే నాలుగు విధాల కవితలకు నిర్వచనం చేసి ఏయే శాఖలలో ఎన్నెన్ని రెమ్మలున్నాయో వివరించాడు.

మధుర కవిత్వంలో;

నాటకాలంకారములు, కళికోత్కళికలు, విభక్త్యధిదేవ తోదాహరణ ములు, సప్తతాళ నటనలు, వట్టొట్లు, గీతప్రబంధములు, చతుర్భద్రిక అష్టభద్రికలు, బిరుదావళి, నామావళి, భోగావళి, రంగఘోష, జయఘోష, చతురుత్తర సంఘటనలు, యక్షగానంబున వెలయు పదములు, దరువులు,

> లీలలు, ధవళములు, మంగళహారతులు, శోభనములు, ఉయ్యాల జోలలు, జక్కుల రేకుపదములు, చందమామ సుద్దులు, అష్టకములు, ఏకపద, ద్విపద, త్రిపద, చతుష్పద, షట్పదాష్టపదులు ఇవి యాదిగా నన్నియు లయప్రమాణంబులనొప్ప మృదుమధుర వచన రచనల బ్రసిద్ధంబైన యవి మధుర కవిత్వంబులు.

అని వార్తాకవి రాఘవయ్య చెప్పాడు.[2]

> మృదుమధుర వచన రచనలు నన్నయగారి కాలంనుంచే ఉండేవని ఇందాకా తెలుసుకున్నాం. నన్నెచోడుని కాలంలో ''విస్తర, మార్గ, దేశి, వస్తు'' కవితలు ఉండేవని అతడు పూర్వకవిస్తుతిలో వాడిన విశేషణాలవల్ల మనం ఈ గ్రంథం ప్రారంభంలో చూశాం. నన్నెచోడుడు చెప్పిన 'దేశి' శాఖలో వచన రచనలుండే మధుర కవితలు చేరవచ్చు.

వార్తాకవి రాఘవయ్య చెప్పిన మధుర కవితాభేదాలలోని 'చతుర్భద్రిక' అనేది ఈ యుగంలోకూడ ఉండేదని జక్కన వ్రాసిన విక్రమార్కచరిత్ర వల్ల తెలుస్తుంది. జక్కన తాత ''చక్రచతుర్భద్ర చతురుత్తరాధిక క్షుద్ర కావ్యములు పెక్కు రచింప...'' సమర్థుడు. ఇతడు రెండవ తిక్కరాజు కాలంలో, అంటే క్రీ.శ. 1285 ప్రాంతాలలోనూ, ఆ తరువాత యుగంలోనూ ఉండేవాడు. తన తాత క్షుద్ర కావ్యములు వ్రాసేవాడని చెప్పిన జక్కన ఈ శతాబ్దం చివరిరోజులలో గ్రంథరచన చేసినవాడే.

మధుర కవితలను సంస్కృత లక్షణకర్తలు క్షుద్రకావ్యాలుగా పేర్కొన్నారు. గ్రామ దేవతలను క్షుద్రదేవతలన్నారు. చిల్లర దేవుళ్ళూ, దేశి కవితలూ వాళ్ళ దృష్టిలో క్షుద్రాలే మరి! అయినా రావిపాటి తిప్పన్నలాంటి ఉత్తమ సంస్కృత కవులుకూడ దేశి మర్యాదలు పాటించి 'క్షుద్ర' కవితలు చెప్పినందువల్లనేమో విద్యానాథుడు తన ప్రతాపరుద్రీయంలో క్షుద్రకావ్యాలకు కూడ లక్షణం చెప్పాడు.

లౌకిక సంస్కృతంలో గద్యానికి ప్రాధాన్యం వుంది. సంస్కృతంలో గద్య ఒక ఛందో భేదం. వామనుడు గద్య రచన మూడు రకాలని చెప్పాడు. వాటిని వృత్తగ్రంథి, చూర్ణము, ఉత్కలిక అని పేర్కొన్నారు.

వృత్తగ్రంథి - వచనంతో ప్రారంభమైన పద్యమని తోపింపజేసే రచన.

చూర్ణము - పొడుగాటి సమాసాలతో యమకాలూ, గిమకాలూ ఉన్న గద్య రచన.

ఉత్కళిక - సమాస భూయిష్ఠమైనా సాభిప్రాయంగా సాగే గద్య రచన. తెలుగులో ఉత్కళికలు రగడ భేదాలతో రచిస్తారు.

---

2. 'ఉదాహరణ వాఙ్మయం' పుట 10లో నిడుదవోలు వెంకటరావుగారు ఉదాహరించారు.

వామనుడు చెప్పిన వృత్తగ్రంధి చూర్ణము, ఉత్కళిక మధుర కవితలతోనే చేరుతాయి. ఇవి దేశి సంప్రదాయంలో లీనమైపోయాయి. ఇప్పటికీ జానపదులు జాను తెనుగులో కొన్ని రకాల గద్యలను వాడుకొంటూ వుంటారు. ఇది సజీవంగా వున్న సంప్రదాయం.

ఆచార్య తూమాటి దొణప్పగారు తమ ''జానపద కళా సంపద'' అనే గ్రంథంలో మెరవణి గద్యం విపులంగా రాశారు. తలంబ్రాలయిన తర్వాత కొత్త దంపతులను మెరవణి బండిమీద రాత్రిపూట ఊరేగిస్తారు. అప్పుడు వాద్యగాళ్ళ నాయకుడు ఇరువంక పెళ్ళి చుట్టాలపై చదివే గద్యను ''మెరివిణిగెద్ది'' అంటారు. మేళాన్ని ఆపి ఈ గద్యలను చదువుతారు. గద్య సాగుతున్నప్పుడు ఊతగా డోలుకాడు డోలువాయిస్తూ, పలుకులు పలుకుతూ హంగుచేస్తాడు.

పరిశీలించి చూస్తే గొల్లసుద్దులూ, ఒగ్గుకతా మొదలయినవి ఇటువంటి గద్యలే. ఇప్పటికీ జానపదులను సంతోష పెడుతున్న సజీవ కళారూపాలే.

దేశి సాహిత్యంలో కాటమరాజు కథ చాలా ప్రాచుర్యంగల వీరగాథల సంహిత. వీటిలో ఒకటి మంజరీ ద్విపదకు సన్నిహితమైన రూపంలో రాస్తూ గంగుల పిన యెల్లయ్యా అనే దేశికవి ఇలా స్పష్టం చేశాడు.

> వినయంగా గంగుల యెల్లయ్య్యా కూర్మి
> తనయుడు సర్వనకును సహోదరుడు
> పినయెల్లయనువాడు ప్రియము దీపింప
> వలనొప్పు శ్రీనాథు వచన పద్ధతిని
> సలిపెను యదుశాస్త్ర చరితమంతయును.

కాటమరాజు కథ గాన యోగ్యమైన వీరగాథ. దీనిని సుద్దుల గొల్లలు పాడుతారు. అయ్యలరాజు నారాయణ తన హంసవింశతిలో ఈ సుద్దుల గొల్లలను వర్ణించాడు.

> కొమ్ములు వీరణాలు జిగిగుల్కెడు వ్రాతల కృష్ణలీలరిన్
> గ్రమ్ముగుడార్లు వీరుడగు కాటమరాజు కథానులాపముల్
> బమ్మిన పుస్తకాలు ముఖపట్టిడి కట్టుదు మాలలున్ నెరా
> సొమ్ములు నామముల్ వెలయ సుద్దుల గొల్లలు వచ్చిరెంతయున్.

కథ చెప్తున్నప్పుడు సుద్దుల గొల్లల కొమ్ములు ఊదుతారు. వీరణాలు వాయిస్తారు. కొందరు శంఖాలను కూడా ఊదుతారని చరిత్రకారులు చెప్తున్నారు. కాటమరాజు కథను ఈ వాద్యాలతో ఆలపించేవారని అయ్యలరాజు నారాయణ చెప్తున్నా గంగుల పిన యెల్లయ్యా శ్రీనాథుని వచన పద్ధతిలో ఈ రచనను చేసినట్టు ఎందుకు చెప్పుకున్నాడో?

శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్రను ద్విపదగా రచించాడు. కాటమరాజు కథలాగే దానినికూడా అంతకు ముందుగానే కొమ్ములతో, వీరణాలతో, శంఖాలతో ఆలపించే వారనీ, ఆ బాణినే తాను తీసుకున్నానని గంగుల పిన యెల్లయ్య తెలియచేస్తున్నట్టుంది. శ్రీనాథుని కాలం నుంచి మన వచన రచనలను పాడేవారని ఇందువల్ల మనం నికరంగా తేల్చుకోవచ్చు. ఇది దేశి సాహిత్య లక్షణం.

దాఖలాల కోసం 'శ్రీనాథుని కాలంనుంచీ' అని చెప్పుకొంటున్నాంగాని ద్విపదలన్నీ గానం చేసేవారని భావించవచ్చు. ద్విపద సాహిత్యాన్ని తెలుగులో నిలిపిన పాల్కురికి సోమనాథుడే తన బసవ పురాణాన్ని యాత్రికులు శివరాత్రినాడు శ్రీశైలానికి వెళుతూ పాడుకొనేవారని చెప్పాడు. ఇప్పటికీ బసవ పురాణాన్ని జంగములు, లింగబలిజెలు మొదలైనవారు శుభాశుభ సమయాలలో పారాయణ చేస్తూ ఉంటారు.

వీర శైవం ఆదినుంచీ వచన రచనల గానాన్ని మతప్రచార సాధనంగా వాడుకొంది. వీరశైవాన్ని ప్రారంభించిన బసవేశ్వరుడు ''లాలితంబుగ నాల్గులక్షలమీద నోలి నర్వది నాల్గువేల గీతములు'' రచించాడట. వాటిని వచనాలంటారు. బసవన్న సంగీత కళలో గొప్ప ప్రజ్ఞావంతుడని సోమనాథుడు చెప్పాడు.

> విరచిత శుద్ధ సాళవ నవీన మృదుస్వర మంద్ర మధ్యతా
> ర రుచిర దేశిమార్గ మధురస్వర గీత సుభాతరంగిణీ
> తరల త రంగజాల నముదంచిత కేళి విలోల సంగమే
> శ్వర శరణయ్య నీకు బసవా! బసవా! బసవావృషాధిపా

అని సోమనాథుడు పొగడాడు. అల్లమ ప్రభువు గాంధర్వ పండితోత్తముడని చెప్పాడు. కన్నడ భాషలోని వీరశైవుల అనుభవ సాహిత్యం ఎక్కువగా గానయోగ్యమైన వచన రచనలే. వీటి ప్రభావం పండితయ్యగారి కాలం నుంచీ తెలుగువారిమీద పడింది. జైనులను చూసి శైవులూ, వీళ్ళను చూసి వైష్ణవులూ ప్రచార సాధనాలయిన దేశి రచనలను ప్రజలలో ప్రోత్సహించారు.

మొత్తం మీద కాకతీయ యుగంలోనూ, అంతకుముందు యుగంలోనూ మధుర కవితలు ప్రచారంలో ఉండేవి. ఆ శాఖలోనే కృష్ణమాచార్యులు రాణించాడు. ఆద్యుడైనాడు. ఇతని గురించి ప్రతాప చరిత్రలో ఇలా వుంది:

> మరియు నొక్కనాడు సంతూరను గ్రామంబున కృష్ణమాచార్యుల తమ్ముండు అనంతాచార్యులు రజకస్త్రీ తోడం గూడంగా ఆ రజకుండు ఆ యిద్దరి పొడిచితే మృతం బయిరి, అప్పురి విప్రులు యిది (?) శూద్ర పీనుగతో గూడ సమసిరిగనుక యా విప్రులు మోయకుండిరి. అది విని కృష్ణమా చార్యులు తమ మదిని విచారించి వాసుదేవమూర్తిని కీర్తించిన, ఆ శవంబు తనంత తానే కాష్ఠంబునకు నడచుటయు, యిది విని సకల జనంబులు విప్రులు యేతెంచి కృష్ణమాచార్యుల పాదంబులకు ప్రణమిల్లి యా

> యపరాధంబులు క్షమియింపు మనుటయు యా వార్త ప్రతాపరుద్రుండు చారులచే నెరింగి కృష్ణమాచార్యుల రావించి పూజించి యేకశిలానగరి నాలుగవ భాగంబున యేబది గ్రామంబుల కధికారంబు, యొక్క యూరు అగ్రహారంబుగా యనుపుటయు కృష్ణమాచార్యులు సంతూరున ప్రవేశించి కల్లతనంబు పుట్టుటంజేసి కల్లూరను గ్రామంబు గట్టి కోట పెట్టుటయు మూడు వర్షంబులు అధికారంబు చేసిన గ్రామంబుల కల్గు పదార్థంబు వెచ్చించి తామ్ర పత్రికలు వేయించి యా పత్రికలమీద తాను రచించిన చాతుర్లక్ష గ్రంథంబు లిఖియించి అది శకటంబుపై పన్నుకొని శ్రీరంగంబునకు కొనిపోవ నుద్యోగించిన కొందరు ధూర్తులు కూడి యా రాజ సముఖంబునకు బోయి ''కృష్ణమాచార్యులకు మీరు అధికారం బిచ్చిన గ్రామంబు(ల) ఆ పదార్థంబు వెచ్చించి తామ్ర పత్రికలు సేయించి శ్రీరంగంబునకుం గొనిపోవుచున్నాడు' అని యెరింగించిన ప్రతాప రుద్రుండు '**అతండు** మహాత్ముండు, అతనికి యేది యిష్టంబో నాకు అదియే యిష్టం'బని యూరకుండుటయు ఆ వార్త యిష్టజనులచే కృష్ణమాచార్యులు విని వూరకపోయిన మూర్ఖత్వం బని రాజసముఖంబునకు యేతెంచి యాబైగ్రామంబుల పదార్థంబున పరుషత్రియంబునకు లెక్కలు వినిపించె. అప్పుడు మూడు లక్షల వరహాలు ఆయమనిన, కృష్ణమాచార్యులు తన మనంబున వాసుదేవు నారాధించి వొక వచనంబు రచించిన (మెచ్చి) యేక శిలానగరంబున కనక వృష్టి గురియుటయు యిదిగని ప్రతాప రుద్రుండును ఆ పరిజనంబులును కృష్ణమాచార్యుల బూజించిన వారిచే వీడ్కొని కృష్ణమా చార్యులు శ్రీరంగంబున కరుగుటయు...[3]

ప్రతాప చరిత్రలోని ఈ వైనంవల్ల ప్రతాపరుద్రుని కాలంలో కృష్ణమాచార్యులనే కవి ఉండేవాడనీ, అతడు తామ్ర పత్రికలు వేయించి వాటి మీద తాను రచించినవి వ్రాయించాడనీ, అతడు ఆపదలో వాసుదేవుని పూజించి ఒక 'వచనంబు' రచించాడనీ నికరంగా తెలుస్తున్నది.

నంబూరి కేశవాచారి రచించిన ఆచార్య సూక్తి ముక్తావళి అనే గ్రంథం వల్ల కృష్ణమాచార్యుడు రామానుజాచార్యులవారి కాలం వాడని తెలుస్తుంది.

> ఏసూరి రజపని యింట మృతానుజ నడపించె బిత్రుకాననంబు దనుక
> నా బ్రహ్మరుద్రులకైన గన్పడనట్టి నృహరి నాడించెను నిత్య మెవ్వ
> డెవని శాపమున సర్వేశుని గుడియైన నేడహాములు కాలె నేకరీతి
> నట్టి కృష్ణార్యునికైన లక్ష్మణముని నాశ్రయింపక ముక్తి యమరదయ్యె.
>
> (ఆచార్య. 3 ఉల్లాసం, 70)

3. సిద్దేశ్వర చరిత్ర (కాకతీయ రాజుల చరిత్ర - ప్రతాప చరిత్ర) సంపాదకుడు ఖండవల్లి లక్ష్మీరంజనం, పుటలు 159-60.

ఈ ఆశ్రయించడం మనసా కాదు. ప్రత్యక్షంగానే ఉడయవర్లను కలుసుకొనడం, మాట్లాడుకొనడం మొదలైనవి జరిగాయట. రామానుజులు క్రీ.శ. 1019 నుండి 1139 దాకా 120 సంవత్సరాలు పరిపూర్ణాయువుతో జీవించారు.[4] కృష్ణమాచార్యుడు ప్రతాప రుద్రుని కాలం వాడేగాని అంతకు పూర్వుడని చెప్పలేం. రామానుజుల ప్రభావాన్ని మరింత ఇనుమడింప జేయడానికి ఆంధ్రదేశంలో గొప్ప గాయకుడనీ, మహాభక్తుడనీ పేరుపొందిన కృష్ణమాచార్యుల అహంకారాన్ని రామానుజులు పోగొట్టారనే కథను తరువాత ప్రచారకులు కల్పించారని మిత్రులు తిమ్మావజ్ఝల కోదండ రామయ్యగారు వ్రాశారు.[5] ఆచార్య సూక్తి ముక్తావళివల్ల కృష్ణమాచార్యుని గురించిన సాహిత్య విషయాలు తప్ప చారిత్రక విషయాలు తెలుసుకోలేం.

కలకాల మొకరీతి గల గీతములు బాడి
 కవితయు చెప్పి నీకడనె యుండి
నీనృత్యకేళికి నిత్యసాహ్యము జేసి
 నిన్ను కన్నుల మ్రోలనే భజించి
నిఖిల లోకములలో నే దొడ్డ భక్తుడ
 నని పేరువడి యొప్పు డాత్మ నిన్ను
గడపముంగిటి కల్పకంబని తలతు నా
 ముంగొంగు బసిడని మురియుచుందు (ఆచార్య. 3వ ఉల్లాసం, 55)

అని కృష్ణమాచార్యుడు నరహరితో చెప్పుకొన్నాడట. అతడు ఒక చేత్తో తాళం, ఇంకోచేత్తో వీణ పట్టుకొని సంకీర్తనలతో దేవుడిపై గానం చేసేవాడు. ఈ కీర్తనలనే రాగి రేకులపై చెక్కించాడు కాబోలు.

ఇతనిలాగే తమ రచనలను తామ్రపత్రికలపైన వ్రాయించిన తాళ్ళపాక కవులు ఇతనిని తమ రచనలలో పేర్కొన్నారు. తాళ్ళపాక అన్నమాచార్యులవారి మనుమడు చిన తిరుమలయ్యా సంకీర్తన లక్షణం వ్రాస్తూ ఇందులో ఇలా చెప్పాడు:

ధర కృష్ణాచార్యాదిక - పరికల్పిత పదము తాళబంధచ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యం - బరగున నిర్యుక్తనామ భాసితమగుచున్.[6] (54)

ఈ పద్యాన్నే ఉదాహరిస్తూ ఈ సంకీర్తన లక్షణాన్ని తాళ్ళపాక అన్నమయ్యే రచించాడని నిడుదవోలు వెంకటరావుగారు సర్వత్రా చెప్పారు.[7] ఇది మనుమడు చెప్పిన పద్యం. తాత సంస్కృతంలో చెప్పాడు. దానికి తండ్రి వ్యాఖ్యానం చేశాడు. మనుమడు లక్షణం చెప్పాడు. ఈ విషయాలు సంకీర్తన లక్షణాన్ని అచ్చువేసిన తాళ్ళపాకవారి 'లఘుకృతుల' లోనే ఉన్నాయి.

4. తెలుగు భాషా సమితివారి విజ్ఞాన సర్వస్వం 7వ సంపుటి : 'దర్శనములు' - పుట 303.
5. 'కృష్ణమాచార్య వచనములు' - భారతి, నందన - వైశాఖం. (మే, 1952)
6. "The Minor Works of Tallapaka Poets" - Published by Tirupati Devasthanams.
7. భారతి, సెప్టెంబరు 1945 - 'వచన వాఙ్మయ ప్రథమాచార్యుడు' వ్యాసంలో.

తాళ్ళపాక చిన్నన్న చెప్పిన పై పద్యంవల్ల కృష్ణమాచార్యులవారు చూర్ణికలు వ్రాశారని తెలుస్తున్నది. చూర్ణిక వచనరచనా భేదాలలో ఒకటి. క్రీ.శ. 1550కి పూర్వమున్న 'లక్షణ శిరోమణి' మతం ప్రకారం అయిదు విధాలు: 1. గద్య, 2. బిరుదుగద్య, 3. చూర్ణిక, 4. వచనము, 5. విన్నపము అని నిడుదవోలు వెంకటరావుగారు విశదపరిచారు. కృష్ణమాచార్యుడు చూర్ణికలేకాక వచనాలు, విన్నపాలు కూడా వ్రాశాడు.

ప్రతాప చరిత్రలో కృష్ణమాచార్యుడు 'సంతూరు' అనే గ్రామంలోని వాడని చెప్పినా అతడు విశాఖపట్టణం దగ్గర ఉన్న సింహాచలంలో ఉండేవాడని అతడు వ్రాసిన సింహగిరి వచనాలవల్ల తెలుస్తున్నది. ఇతని సింహగిరి విశాఖపట్టణం జిల్లాలోనిదే అని ఈ క్రింది పద్యం చెప్తుంది.

''కృష్ణమాచార్య సంకీర్తనంబుల జిక్క సింహాద్రి యప్పనిచేత కాదు.''

ఈ పద్య పాదం 'వెంకటాచల విహార శతకం'లోనిదని తిమ్మావఝ్ఝల వారు ఉదాహరించారు. విశాఖపట్టణం దగ్గరి సింహాచలంలోని దేవుడికే అప్పన్న అనే పేరు ఉంది.

సింహాచలం కళింగ దేశాంతర్భాగం! బహుశ క్రీ.శ. 9వ శతాబ్దంలో ఇక్కడ ఆలయ నిర్మాణం జరిగి ఉండవచ్చునని చరిత్రకారులు భావిస్తున్నారు.[8] కళింగదేశాన్ని ఏలిన చాళుక్య చోళ వంశీయుడైన కులోత్తుంగ చోళుడు (క్రీ.శ. 1076-1118) తమిళ సంస్కృతిని ప్రవేశపెట్టాడని శాసనాధారాలు ఉన్నాయి. విశాఖపట్టణానికి కులోత్తుంగ చోళపుర మన్నది మరుగునపడ్డ పేరు. క్రీ.శ. 11వ శతాబ్దం నుండి సింహాచలం వైష్ణవ క్షేత్రంగా ప్రాచుర్యం పొందింది. ఆలయానికి అనుబంధంగా ఎన్నో మఠాలు వెలిసి ఉంటాయి. అటువంటి ఒక మఠంలో కృష్ణమాచార్యుడు పెరిగాడు.

పెరిగింది సింహగిరి మఠంలోనైనా కృష్ణమాచార్యుడు పుట్టింది సంతూరు అనే గ్రామంలోనే. ఇది ఎక్కడుందో గుర్తించాలంటే అది సులభసాధ్యం కాదు. అయితే ఇది విశాఖమండలంలో ఉన్న గ్రామమే అని భావించడం సమంజసం.

1. సింహాచలానికి చేరువలోనే విశాఖ తాలూకాలో ఒక సంతపాలెం ఉంది. 2. విశాఖ జిల్లాలోనే వీరవల్లి తాలూకాలో ఒక సంతపాలెం ఉంది. 3. శృంగవరపుకోట తాలూకాలో సంతపాలెం అని ఒక గ్రామం, సంతపేట అనే మరొక గ్రామం కనబడుతున్నాయి. 4. పాలకొండ తాలూకాలో సంతకవిటి అనే గ్రామం ఉంది. 5. చీపురుపల్లి తాలూకాలో సంతపురిటి అనే ఊరు కనబడుతూంది.

విశాఖ జిల్లాలోని ఈ గ్రామాలు చాలా మటుకు జమీందారీ గ్రామాలే. కృష్ణమాచార్యులు వీటిలో ఏదో ఒక ఊళ్ళో జన్మించాడని చెప్పుకోవచ్చు. అయితే డాక్టరు

8. విజ్ఞాన సర్వస్వం - తెలుగు సంపుటి - 2. పుట. 778.

ఎం. కులశేఖరరావుగారు ఇది తెలంగాణాలో ఉండవచ్చునని భావిస్తున్నారు. సంతూరు అనే పేరుకు శాబ్దికంగా సమీపంగా ఉన్న 'సంతవూరు' అనే గ్రామం మహబూబునగరము జిల్లాలో ఉందనీ, అది ప్రాచీనమైనదనీ, 'సంతవూరు' అనే ఇంటిపేరుగల వైష్ణవులు మహబూబునగరం జిల్లాలో ఇప్పటికీ ఉన్నారని కులశేఖరరావుగారు చెప్తున్నారు.[9] డాక్టర్ వేటూరి ఆనందమూర్తిగారు కృష్ణమాచార్యుల జన్మస్థలం ఇదే కావచ్చుననే ఈ వాదాన్ని ఆమోదిస్తున్నట్టున్నారు.[10] ప్రస్తుతం లభిస్తున్న ఆకరాలవల్ల ఈ ఊరు ఇదే అని నిక్కచ్చిగా తేల్చలేం. ఏ వూళ్ళో పుట్టినా కృష్ణమాచార్యులు సింహాచలం చేరుకొన్నాడు. అక్కడే ప్రసిద్ధుడయ్యాడు.

'సింహగిరి వచనాలు', 'విష్ణునామ సంకీర్తన ఫలము' అనే పేరుతో తంజావూరు సరస్వతీ మహల్ పుస్తకశాలలో ఉన్నాయి. సింహగిరి వచనాల్లో మచ్చుకు ఒకటి:

దేవా!

పదికోట్ల యజ్ఞాది క్రతువులు నడపంగానేమి,
తొమ్మిదికోట్ల తులాభారంబులు తూగంగానేమి,
యెనిమిదికోట్ల సువర్ణ దానంబులు సేయంగానేమి,
యేడుకోట్ల గోదానంబులు సేయంగానేమి,
ఆరుకోట్ల భూ దానంబులు సేయంగానేమి,
అయిదుకోట్ల కన్యాదానంబులు సేయంగానేమి,
నాలుగుకోట్ల వస్త్రదానంబులు సేయంగానేమి,
మూడుకోట్ల సత్యాది వ్రతంబులు సేయంగానేమి,
రెండుకోట్ల అన్నదానంబులు సేయంగానేమి,
కోటి స్నానంబులు సేయంగానేమి?

దేవా!

మీ నామోచ్చారణంబు సేయక పదికోట్ల యజ్ఞాది క్రతువులు నడిపిన
దేవేంద్రుడు నిలువల్లా యోనులయ్యెను.

దేవా!

మీ నామోచ్చారణంబు సేయక తొమ్మిదికోట్ల తులాభారంబులు తూగిన ధుర్యోధనుండు యమపురికేగెను.

దేవా!

మీ నామోచ్చారణము సేయక ఎనిమిదికోట్ల సువర్ణదానంబులు సేసిన కర్ణుండు పసిడికొండమీది యన్నంబుల కపేక్షించెను.

---

9. సింహగిరి వచనాలు – పుట. X
10. తొలిసంకీర్తన కవులు – పుట. 15

దేవా!

మీ నామోచ్చారణంబు సేయక యేడుకోట్ల గోదానంబులు సేసిన కార్తవీర్యుండు గోహత్య బ్రహ్మహత్యా పాతకంబుల బొందెను.

దేవా!

మీ నామోచ్చారణంబు సేయక యారుకోట్ల భూదానంబులు సేసిన బలి విష్ణు పాదంబున పాతాళంబున కేగెను.

దేవా!

మీ నామోచ్చారణంబు సేయక అయిదుకోట్ల కన్యాదానంబులు సేసిన ధ్రువుండు కాశి క్షేత్రంబున బండ్రెండువేల యేండ్లు భిక్షంబెత్తెను.

దేవా!

మీ నామోచ్చారణంబు సేయక నాలుగుకోట్ల వస్త్రదానంబులు సేసిన మార్కండేయుడు మతిహీనుండయ్యెను.

దేవా!

మీ నామోచ్చారణంబు సేయక మూడుకోట్ల సత్యాదివ్రతంబులు నడిపించిన హరిశ్చంద్రుడు కులహీనుని యింట గాడుకాచెను.

దేవా!

మీ నామోచ్చారణంబు సేయక రెండుకోట్ల యన్నదానంబులు సేసిన ధర్మజుండు యమపురి తొంగి చూచెను.

దేవా!

మీ నామోచ్చారణంబు సేయక కోటి స్నానంబులు సేసిన కుమారస్వామి కోరిక సిద్ధించదాయెను.

దేవా!

మీ నామోచ్చారణంబు సేసిన ప్రహ్లాద, నారద, పుండరీక, వ్యాస, శుక, శౌనక, భీష్మ, దాల్భ్య, రుక్మాంగద, అర్జున, బలి, విభీషణ, భృగు, గాంగేయ, అక్రూర, విదురాదులగు పరమ భాగవతోత్తములు నారాయణ స్మరణవలన గృతార్థులైరి. గావున యతి రామానుజముని పరందాతారు అనాథపతియైన సింహగిరి నరహరి నమోనమో దయానిధీ.

సింహగిరి వచనాలనేకాక కృష్ణమాచార్యుడు శఠకోపవిన్నపాలు కూడ రచించాడు. ఇవి ద్రావిడ వేదానికి అనువాదం. ఈ సంగతిని చెప్తూ తాళ్ళపాక చిన్నన్న తన 'పరమయోగివిలాసం'లో

శఠమతరాద్ధాంత సంహారియైన - శఠకోపముని బోలు శఠకోపమౌని
వేదంబు తెనుగు గావించి, సంసార - ఖేదంబుమాన్చిన కృష్ణమాచార్యు.[11]
(పరమ-అవతారిక, పుట 3)

నుతించాడు. చూర్ణికలు, వచనాలు, విన్నపాలు మాత్రమేకాక కీర్తనలు కూడ కృష్ణమాచార్యుడు వ్రాసేవాడని 'ఆచార్యసూక్తి ముక్తావళి' వల్ల తెలిసింది. ఇతడి ఆధ్యాత్మిక కీర్తనవల్ల దేవుడికే వైరాగ్యం కలిగిందని అన్నమాచార్య చరిత్రలో ఉంది.

ఇతడు చెప్పిన వచనాలు తామ్రపత్రికలపై వ్రాయించాడని 'ప్రతాప చరిత్ర'వల్ల తెలుసుకొన్నాము. తాళ్ళపాక వారి రచనలున్న రాగిరేకులు బయటపడినట్టే కృష్ణమా చార్యుల ఈ తామ్రపత్రికలు కూడ వెలుగు చూస్తే ఆంధ్ర సాహిత్యం అదృష్టవంత మవుతుంది. కృష్ణమాచార్యుడు శ్రీరంగం వెళ్ళిపోయాడని 'ప్రతాప చరిత్ర' చెప్పడం వల్ల అక్కడా, అతడు సింహాచలంలో ఉండేవాడు కనుక ఆ క్షేత్రంలోనూ పరిశోధిస్తే ఈ రాగి రేకులు దొరుకుతాయేమో!

కృష్ణమాచార్యుని సంపూర్ణ రచనలు లభించేదాకా అతని కవితను గురించి అంచనా వేయలేము. అతని అముద్రిత గ్రంథం ఒక్కటే ఉంది. అతని గురించి లోకులు చెప్పుకొనే గాథలు కూడా కొన్ని ఉన్నాయి.

కృష్ణమాచార్యులు ఓరుగంటిలో ఒక పతివ్రతా గృహానికి వెళ్ళి ఆ ఇంటి బ్రాహ్మణునికి తులసీ మాహాత్మ్యం కథ చెప్పాడు.

> ''ఈ కథ కృష్ణమాచార్యులు సంకీర్తనశాయగా వక యింట నలువురు కోడళ్ళు నీళ్ళకడవలు తీసుకువస్తూ వుండినవేళ, ఆ ఇంటి పెద్దకోడలు ఈ సంకీర్తన విందామనెను. రెండో కోడలు పూర్ణ కడవలు దించుకొని విందామనెను. కడమ ఇద్దరు కోడళ్ళు యీ సంకీర్తనకేమీ, ఈ మాటలకేమీ పోదాము రమ్మనిరి. గనుక ఈ సంకీర్తన విందామన్న కోడలు భూమండల మేలే రాజుకొడుకై జన్మించెను. పూర్ణకుంభములుదించి విందామన్న కోడలు చక్రవర్తియై జన్మించెను. కడమ ఇద్దరు - యిక్కడ సంకీర్తన వినక పోదాము రమ్మన కోడళ్ళు అనామకుల యింట నూరు జన్మంబులు పందులై జన్మించిరి'' అని లోకులు కథలు చెప్పుకొన్నారు.[12]

కృష్ణమాచార్యులు విష్ణుమూర్తియొక్క పదకొండవ అవతారమట. ''అతండు కురుకుమారులను కురుక్షేత్రమందు పోట్లదించిన దోషంబు వాయుకొరకు తిరు అవతరించినాడు'' అని కథ కట్టి లోకులు చెప్పుకొన్నారు.[13] ఈ కథలోని వచనం

11. ఆచార్య సూక్తి ముక్తావళి - 3వ ఉల్లాసం.
12. ఈ కథ మద్రాసు ప్రాచ్య లిఖిత భాండాగారంలో R.447అనే ప్రతిలోనిదని తిమ్మావజ్ఝలవారు భారతి (నందన-వైశాఖ) వ్యాసంలో సంపూర్ణంగా ఉదాహరించారు.
13. ఇది R-206 అనే ప్రతిలోనిదని అదే వ్యాసంలో తిమ్మావజ్ఝలవారు సవిస్తరంగా కథ పొందుపరచి చెప్పారు.

కృష్ణమాచార్యులది కాకపోయినా ఎంతో మనోహరంగా ఉంది. కృష్ణమాచార్యుల వచనాలను గురించి తిమ్మావజ్ఝలవారు ఇలా వ్రాశారు.

''...ఇంచుమించు పదునేడవ శతాబ్దందాకా తెలుగులో నికరమైన వచన కావ్యాలు అవతరించలేదు. అలాంటి దశలో ఈ కృష్ణమాచార్య వచనములు పదమూడవ శతాబ్దంలో రచింపబడిన తొలి వచన గ్రంథం కావడం ఒక విశేషం కాదా మరి! అనుపూర్విలో నొక కథా వస్తువు లేకపోయినా వచన కావ్యాల కుండవలసిన లక్షణాలన్నీ ఇందులో ఉండకపోయినా, అతి ప్రాచీనకాలంలో, అంటే పదునేడవ శతాబ్దికి పూర్వం తెలుగులో ప్రత్యేకమైన వచన కావ్యాలే లేవని అనుకునే దశలో అంతకింకా నాలుగువందల యేండ్లనాడు వెలసిన తొలి తెలుగు వచన రచన యిది కావడం దీనిలో విశిష్టత.''

చాలాకాలందాకా వివిధ పరిశోధకులు వేరువేరు పత్రికలలో ప్రచురించిన వ్యాసాలవల్లా, చెల్లాచెదురుగా ఉన్న ఆకరాలవల్లా మాత్రమే కృష్ణమాచార్యుల గురించి పైన చెప్పుకొన్న వైనాలు తెలియవచ్చాయి. 1968 డాక్టర్ ఎం. కులశేఖరరావుగారు సింహగిరి వచనములు సంపాదించి పరిష్కరిస్తే ఆ గ్రంథాన్ని హైదరాబాద్ ఆంధ్ర రచయితల సంఘంవారు ప్రచురించారు. తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయంలో ఉండే ''విష్ణునామ సంకీర్తన ఫలము'' (డి. 809) అనే వ్రాతప్రతిని ఆధారం చేసికొని ఈ పరిష్కరణ జరిగింది. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ''సింహగిరి నరహరి వచనములు'' (డి.1464) అనే తాళపత్రప్రతి ఉండేదిగాని అది ప్రస్తుతం అదృశ్యమైంది. అందుచేత ఒక్క ప్రతి ఆధారంగానే కులశేఖరరావుగారు ఈ పుస్తకాన్ని సమర్పించారు. ఇందులో చిన్నా పెద్ద మొత్తం అరవై వచనాలున్నాయి.

ఈ అరవై వచనాలలో ఆరు వచనాలలోని సంగతులవల్ల కృష్ణమాచార్యుల జీవిత విశేషాలు కొంతవరకూ తెలుసుకొనడానికి ఆస్కారం కనబడుతూంది. జననంనుండి సుస్థిరకీర్తి ప్రతిష్ఠలను పొందడందాకా వివిధ ఘట్టాలలో కృష్ణమాచార్యుల ప్రవర్తన ఎలా పరిణామం చెందుతూవచ్చిందో వీటివల్ల చెప్పుకోవచ్చు. అయితే ఈ వచనాలు ఒక క్రమంలో ప్రకటితం కాలేదు. వాటిని ఒక వరుసలో పేర్చుకొని భోగట్టాలను క్రోడీకరిస్తే అసమగ్రమైనా కృష్ణమాచార్యుల జీవిత చిత్రం కొంతవరకు ఆవిష్కృతమవుతుంది.

శాలివాహన శకవర్షాలు 1212కు సరియైన వికృతి నామసంవత్సరంలో, అంటే క్రీ.శ. 1290లో సంతూరు అనే ఊళ్ళో కృష్ణమాచార్యులు ఆకృతి పొందాడనుకోవచ్చును. ఇతడు దుష్ట నక్షత్రంలో వ్యతిరేకయోగంలో పుట్టాడని తల్లిదండ్రులే రోతచెంది ఇతణ్ణి ఒక పాడునూతిలో పారేశారు. అంధకారమైన ఆ కూపంలో రోదిస్తున్న శిశువును కృష్ణకువ్వారు అనే సన్యాసి శిరోమణి చూసి రక్షించాడు. సింహాచలంలోనున్న ఒక మఠంలో పెట్టారు. పుట్టుకతో నిజంగా ఆ బిడ్డ గుడ్డివాడు కాడుగాని కొంచెం చూపుకు అంతరాయం ఉండేదేమో. అయినా మఠంలో పెరుగుతున్నప్పుడే స్వామివారికి నైవేద్యం పెట్టిన పాలను కళ్ళకు అద్దుకోవడంవల్ల చూపు మెరుగుపడింది. మఠంలోని ఇతరుల

సంకీర్తలు విన్న బాలుడికి అవి ఒంటపట్టాయి. తాను స్వతంత్రంగా పాటలు కట్టి పాడసాగాడు. దేవుడో, దేవుడిలాంటివాడో చాతుర్లక్ష గ్రంథ సంకీర్తనలు చేయమని ఆనతిచ్చాడు. ప్రోత్సహించాడు. (రచన సంఖ్యా. 52)

సింహాచలం మఠంలోని చిన్నవాడు సంకీర్తనలు చేయడం, వాటిని అందరూ మెచ్చుకోవడం ఆనోటా, ఈనోటా పాకింది. సంతూరులోని తల్లిదండ్రులకు ఈ సంగతి తెలిసింది. అంధుడైన బాలుడు కులాధారుడయ్యాడని సంతోషించి జననీ జనకులు, బంధువులూ, గోత్రాదివరులు, సహోదరులూ మాత్రమేకాక పితృ పితామహ ప్రపితామహులు కూడా వెళ్ళి కుర్రవాడిని చూశారు. పొంగిపోయారు. కువ్వారును చూసి తమ చిన్నవాడిని పరమ భాగవతోత్తముని చేసినందుకు కృతజ్ఞతలు చెప్పుకొన్నారు. కుర్రవాడిని తీసుకొని వెళ్ళి జాతక కర్మాన్నప్రాశన చౌలోపనయనాదులైన బ్రాహ్మణ కర్మములు ఆచరించారు. (వచన సంఖ్య-20)

బాలకృష్ణమాచార్యులు సంతూరులోనే పెరిగాడు. వయసుకుతగ్గ స్నేహితులు ఉండేవారు. వాళ్ళ ఆటపాటలుండేవి. ఒక కోమటి పిన్నవాడితో కోడిపుంజుల జూదాన్ని ఆడుతూ వుంటే కృష్ణమాచార్యుల కోడి ఓడిపోయి చచ్చిపోయింది. కోపంతో ఆ కోమటి కుర్రవాడిని 'తిరుకుచ్చు' పట్టుకొని మారితే అతడు చచ్చిపోయాడు. ''వీడిని బతికించకపోతే మీరు శబరి ఎంగిలి తిన్నారని లోకానికి చాటనా? రాక్షసులను చంపేటప్పుడు బండబూతులు తిట్టేవారని లోకానికి చెప్పనా?'' అని దేవుని బ్లాక్‌మెయిల్ చేసి కోమటి చిన్నవాడిని బతికించుకొన్నాడు. (వచన సంఖ్య-55)

కృష్ణమాచార్యులకు యుక్తవయసు వచ్చింది. మేనమామ రంగాచార్యులు తన కూతురునిచ్చి పెళ్ళిచేయాలనుకొన్నాడు. తన తిరుకల్యాణానికి స్వామివారు 'వేంచేసెదనోయి కృష్ణమాచార్యా!' అని చెప్పారట. పెళ్లికి ఒక శూద్రుడు కూడా వచ్చాడు. కృష్ణమాచార్యులు అతనిలో స్వామివారిని చూశాడు. అతనికి తళియ వడ్డింప చేశాడు. మామగారు రంగాచార్యులు వచ్చి ''అదేమి కృష్ణమాచార్యా ఇతండు చరముండై యున్నాడు. నీకును యజ్ఞోపవీతములు లేవు. ఇతడు వైష్ణవుడని తళియ వడ్డించితివి... శూద్రునకు నిష్టాన్నమును భుజింపబెట్టితివి నీవు వెలి'' అని పెళ్ళినాడే అల్లుణ్ణి వెలివేశాడు. కృష్ణమాచార్యులు చలించలేదు. కూతురు బతుకు చెడుతుందని ఆలోచించి రంగాచార్యులు ఆ రాత్రి చిన్నదానిని తీసుకొని వెళ్ళి భర్త దగ్గర విడిచిపెట్టాడు. (వచన సంఖ్య - 53)

పెళ్ళికి ముందే కృష్ణమాచార్యులు విష్ణుమూర్తి పదకొండో అవతారమనే నమ్మకం వ్యాపింపజొచ్చింది. కృష్ణమాచార్యులు చివరకు ఏకశిలానగరం చేరుకున్నాడు. అప్పుడు అక్కడ శైవం ఉద్ధృతంగా ఉంది. ఒక అగసాలె భక్తుడు మరణించితే అతని భార్యా భర్తతోపాటు సమాధికి వెళ్ళడానికి సిద్ధం కాబోతున్నది. అక్కడకు కృష్ణమాచార్యులు వచ్చాడు. ఆమె నమస్కరించితే దీర్ఘాయుష్మంతురాలవై ఉండమని దీవించాడు. ''నేను సమాధికి పోతున్నాను'' అని ఆమె అంది. అతడు సంకీర్తన చేశాడు. శవానికి ప్రాణం

వచ్చినట్టు దిగ్గునలేచి ఆ అగసాలె కూర్చున్నాడు. ''నీ పాట విని కైలాసంలోని శివుడు నన్ను శివకింకరులచేత మరల దోపించాడు - వచ్చాను'' అని అతడు చెప్పాడు. కృష్ణమాచార్యులు వాళ్ళను దీవించాడు. (వచన సంఖ్య-34)

ఏకశిలానగరంలో ఎన్నాళ్ళున్నాడోగాని కృష్ణమాచార్యులు మళ్ళా సింహాచలం చేరుకొన్నాడు. భార్యతో కాపురం చేస్తున్నా వేశ్యాలోలుడయ్యాడు. అయినా అతని కీర్తి దేశమంతా వ్యాపించింది. పాకనాడులోని పొతకమూరు వాస్తవ్యులు అవుబళ నారసింహుని నాట్యవినోదులు ఆరుగురు అన్నదమ్ములు కృష్ణమాచార్యుల కీర్తిని విన్నారు. ఆయన విష్ణుమూర్తి పదకొండో అవతారం కాబట్టి ఆయన దర్శనం చేసుకొనడానికి వచ్చారు. సింహాద్రిలోవారి తిరుమాళిగను కనుక్కోలేకపోయారు. ''చీనిచీనాంబరములు ధరియించినయనేక చెలికత్తెలైన వారకాంత లిరుపార్శ్వంబుల కైదండలీయగా ఆ కాంతా వైభవములకు చొక్కుతూ తనకు ప్రియకాంతయైన జగన్మోహనాంగి అనే వారకాంత కుచభరంబుల మీద హస్తములు వహించి వేంచేస్తున్న కృష్ణమాచార్యులనే చూసి పదకొండో అవతార పురుషుని తిరుమాళిగకు దారి చెప్పమన్నారు. తాము దర్శనం చేసుకోదలచిన మహనీయుని గుణగణాలు వర్ణించారు. కృష్ణమాచార్యులకు జ్ఞానోదయమైంది. పశ్చాత్తాపం చెందాడు. వారకామినులమీద మోహం విడిచి పొతకమూరి అన్నలకు కృష్ణమాచార్యుల వాకిళ్ళు చూపించి వేచియుండమని చెప్పి తాను పెడద్వారమున వెళ్ళి తల మీసాలు బోడించుకొని స్నానం చేసి శిఖాయజ్ఞోపవీతాలు ధరించి కటి సూత్రాన కాషాయవస్త్రాలు ఆడకట్టుగా కట్టి తిరుమణి, తిరుచూర్ణాలు ధరించి ఒక చేత్తో వీణను ఇంకో చేత్తో చిటితాళాలు ధరించి సంకీర్తన వాక్పూజలు ప్రారంభించాడు. వేషం మార్చుకొన్నా కృష్ణమాచార్యులను పొతకమూరి భాగవతులు గుర్తుపట్టారు. ఒకరివల్ల ఒకరు కృతార్థులయ్యారు. అప్పటికి తాను చెప్పవలసిన చాతుర్లక్ష సంకీర్తనలలో లక్షా తొంభై వేలు తక్కువగా ఉన్నాయని, వాటిని పూర్తి చేస్తానని కృష్ణమాచార్యులు చెప్పాడు. (వచన సంఖ్య - 32)

'సింహగిరి వచనములు' వల్ల కృష్ణమాచార్యుల జీవిత విశేషాలు ఈ మాత్రం తెలియవస్తున్నాయి. కృష్ణమాచార్యులు వికృతినామ సంవత్సరంలో జన్మించినట్టు ఒక సంకీర్తనవల్ల తెలుస్తోంది. మరొక సంకీర్తనలో తన పదహారోయేట తారణనామ సంవత్సరంలో తనకు స్వామిదర్శనమైందని చెప్పుకొన్నాడు. దీనివల్ల వెనక్కువెళ్ళగా విభవనామ సంవత్సరంలో ఇతడు ప్రభవించాడని చెప్పాలి. మరొక సంకీర్తనలో పరాభవ సంవత్సర ఆషాఢశుద్ధ ద్వాదశినాడు చిటితాళాలు ధరించి సంకీర్తన చేస్తూ ఉండగా కువ్వారు తన్నేలినట్లు చెప్పాడు. ఈ పరాభవం క్రీ.శ. 1326 సరిపోతుంది. బహుశా ఇది ముఖ్యమైన సంవత్సరం కావచ్చు.

డాక్టరు వేటూరి ఆనందమూర్తిగారు కృష్ణమాచార్యులు క్రీ.శ. 1268-1323 మధ్యవాడని కాలనిర్ణయం చేశారు.[14] కులశేఖరరావుగారు సేకరించిన సంకీర్తనలు కాక

14. తొలి సంకీర్తన కవులు - పుట. 13.

వీరివద్ద మరికొన్ని ఉన్నాయట. కీర్తిశేషులు తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు తమ జీవితకాలంలో లభించినన్ని కృష్ణమాచార్యుని వచనాలను సేకరించి ఒక క్రమంలో పెట్టి ప్రకటనకై సంస్కరించి ఉంటారనిపిస్తోంది. వారి ప్రతి ఏమైందో.

కృష్ణమాచార్యులు సింహగిరి వచనాలేకాక, నృసింహనామాలు, రామనామ కీర్తనలు, రామనామాలు మొదలైన ఇతర రచనలు కూడా చేశాడు. ఇతనితోనే తెలుగులో గానయోగ్యమైన వైష్ణవ కవిత్వం తెలుగులో ప్రారంభమైంది. లభ్యమైన సింహగిరి వచనాలు విశ్లేషణవల్ల ఎన్నో విశేషాలు తెలియవస్తాయి. కులభేదాలను పాటించక ఒక మత విశ్వాసాలను నమ్మే వారంతా సమానులనే ఆశయం అమలు చేస్తూ తన పెళ్ళినాడే శూద్రునిలో దేవుని చూసి అతనికి తళియ వడ్డింపించి వెలి అయిన కృష్ణమాచార్యులు శ్లాఘనీయుడే! బంధువులకు వెలి అయినా ఇటువంటి ఉదారచరితులు వసుధైక కుటుంబ సభ్యులై ఉన్నతాశయాలకు చేరువలోనే ఉంటారు.

మారన

ఆంధ్ర సాహిత్యంలో లభ్యమవుతున్న మొట్టమొదటి పురాణాన్ని అనువాదం చేసిన కవి మారన. ఇతడు తిక్కనగారి శిష్యుడు. ఈయన అనువదించింది మార్కండేయ పురాణం. ఇతణ్ణి అనుసరించింది చాలామంది. మారన తెలిగించిన మార్కండేయ పురాణంలోని గాథలే ముందు గౌరన తర్వాత శంకరకవి హరిశ్చంద్రోపాఖ్యానికి, అల్లసాని పెద్దన మనుచరిత్రకు, సవరం చిననారాయణ చెప్పిన కువలయాశ్వచరిత్రకు మార్గదర్శక మైనాయి. మారన గ్రంథంలోని యమలోక వర్ణననే సంగ్రహించి ప్రౌఢకవి మల్లన తన రుక్మాంగద చరిత్రలో పొందుపరిచాడని వావిళ్ళవారు ప్రచురించిన మార్కండేయ పురాణం పీఠికలో శేషాద్రి రమణ కవులు వ్రాశారు.

ఉత్తరోత్తరా ఇంతమందికి ఉపయోగపడిన ఈ కవి కాలం గురించి మనకు స్పష్టంగా తెలిపే ఆధారాలున్నాయి. ఇతడు తన గ్రంథాన్ని గన్నయ నాయకునికి అంకితమిచ్చాడు. ఈ గన్నయ ప్రతాపరుద్రుని సేనాని. ఆ చక్రవర్తిచేత విలసిత రాజ్యచిహ్నాలను, విశ్రుతలక్ష్మిని, నాయకత్వాన్ని పొందినవాడు. ఓరుగల్లు నగరానికి కటకపాలుడైనాడు. ప్రతాపరుద్రుడు క్రీ.శ. 1295 నుంచి 1326 దాకా పాలించాడు. కృతి పుచ్చుకొన్న గన్నయ నాయకుడూ, ఇచ్చిన మారనగారూ ఆ కాలంవాళ్ళే.

ఈ కవికాలం చిక్కులు లేకుండా ఇంత సులభంగా తేలినా ఇతడు ఎక్కడివాడో చెప్పడం అంత తేలిక కాదు. తిక్కనగారి అనుగ్రహంవల్ల కవితాశక్తిని సంపాదించినట్లు ప్రతి ఆశ్వాసం చివరా ఇది ''శ్రీమదుభయ కవిమిత్ర తిక్కన సోమయాజి ప్రసాదలబ్ద సరస్వతీ పాత్ర తిక్కనామాత్య పుత్ర మారయ నామధేయ ప్రణీతంబైన మార్కండేయ పురాణం''

అని గద్యలో చెప్పుకోవడంవల్ల ఇతడు నెల్లూరు వాడేమోనని కొందరనుకొంటున్నారు. ఓరుగల్లు 'కమీషనర్' అయిన గన్నయ్యకు అంకితం ఇవ్వడంవల్ల ఇతడు ఏకశిలానగరం వాడని మరికొందరు భావిస్తున్నారు. తాను ఏ ఊరివాడైనదీ ఇతడు ప్రత్యేకంగా చెప్పుకోలేదు. అయితే గ్రంథంలోని పరోక్ష సాక్ష్యంవల్ల ఇతడు తెలంగాణాలోని గోదావరి ప్రాంతం వాడేమోనని నేను భావిస్తున్నాను.

మార్కండేయ పురాణంలోని చతుర్థాశ్వాసంలో ఒక భూగోళ ప్రకరణం ఉంది. ప్రపంచంలోని ప్రముఖ ద్వీపాల గురించి ఖండాల గురించి, నదులను గురించి, పర్వతాలను గురించి అందులో వివరాలున్నాయి. ఆ ప్రకరణంలో మారన పనికట్టుకొని ఈ క్రింది పద్యం (179) వ్రాశాడు.

''సురుచిరమగు సహ్యానగో-త్తరమున విలసిల్లుచుండు దద్దయుగోదా
వరి, తత్ప్రదేశము మనో-హరము పవిత్రము మునీంద్ర! యఖిలధరిత్రిన్.''

పురాణేతిహాసాలను అనువదించే మన ప్రాచీనులు తమ తమ జన్మస్థలాలను ఆ కావ్యాలలో గుట్టుగా, అవ్యక్తంగా పేర్కొనడం అసహజం కాదు. నన్నయగారు వేంగిని, తిక్కనగారు పెన్నను మహాభారతంలో పేర్కొనడం మనం చూశాం. మారన పై పద్యంలో గోదావరి ప్రదేశం ప్రపంచమంతటిలో పవిత్రమని చెప్పడానికి అది అతని నివాసభూమి కావడమే కారణం కావచ్చు.

తెలంగాణాలోని గోదావరీ పరివాహ ప్రదేశమే ఇతని జన్మస్థానమైతే తిక్కనగారు గణపతిదేవ చక్రవర్తిని చూడడానికి ఓరుగల్లు వెళ్ళినప్పుడు మారన వారి శిష్యుడుగా చేరి ఉండడానికి ఆస్కారముంది. తిక్కనగారి భారత రచన పూర్తి అయిన పిమ్మటనే మారన మార్కండేయ పురాణం చెప్పినట్లు గ్రంథాదిని చేసిన కవిస్తుతిలో తిక్కనగారిని 'భారత సంహితా కతావిభు'డని పేర్కొనడం వల్ల తెలుస్తున్నది (పీఠిక 10). ఆ విభుత్వం భారత రచన పూర్తికానిదే జరగదు. మారన మార్కండేయాన్ని తెలిగించడానికి పూనుకొనే సమయానికి తెలుగు సాహిత్యంలో భారత రామాయణాలు సంపూర్ణంగా ఉద్భవిల్లాయి. దశకుమార చరిత్ర వంటి కథాకావ్యాలు వెలిశాయి. బసవపురాణం, పండితారాధ్య చరిత్రవంటి సమకాలిక చరిత్రలు పుట్టాయి. ఇటువంటి పరిస్థితుల్లో 'సరస సాహిత్య సౌరభ సంవాసితమైన' మారన హృదయ కమలంలో 'అపూర్వ కావ్యరచనా కుతూహలం' అనే మధులిహం వివరిస్తున్నది. కొత్తది చెప్పాలనే కోరిక జుమ్మని శ్రుతి మీటుతున్నది.

అప్పుడు ఒకనాడు గన్నయ నాయకుడు విద్వాంసులు, పౌరాణికులు, సరస సాహిత్య విద్యా విశారదులైన కవివరులు పరివేష్టించిన రమ్యహర్మ్యానికి మారనను రావించి సత్కరించి 'నూతన కథా విస్తారమై' యోగ్యమైన మార్కండేయ పురాణం వినాలనే కోరికను తెలియజేశాడు. కావున దత్పురాణము ప్రకాశిక సార కథామృతం

బొగిందాని జగజ్జనంబు లలరన్ వచియింపు తెనుంగునన్ వచః శ్రీ విభవంబు పెంపు విలసిల్లగ గోవిదులిచ్చుమెచ్చి సంభావనసేయ జారుగుణ భాస్వర మారయసత్కవీశ్వరా! అని చెప్పాడు (పీఠిక 17). కొత్తది రచించాలనే కుతూహలమున్న కవికి కొత్తది వినాలనే కృతిభర్త దొరికాడు. అందుచేత మారన మార్కండేయాన్ని 2,547 గద్యపద్యాలుగా అనువదించాడు. ఈ పురాణం నూతన కథావిస్తారమై రమణీయంగా, రసమయంగా చెప్పడానికి నాలుగైదు కథలే పనికి వస్తాయి. వాటిని మారన చక్కగా అనువదించాడు. మిగతావన్నీ ధర్మపన్నాలే, వర్ణాశ్రమ ధర్మాలు, శ్రాద్ధ నియమాలు, పురాతన వంశావళీ వివరాలూ మొదలైనవి చాలా ఎక్కువ.

ఉదాహరణకు, తృతీయాశ్వాసంలో మదాలస తన కుమారుడైన అలర్కునికి రాజధర్మాలు బోధించి కర్మదీక్ష యిస్తుంది. ఆ ప్రబోధం (122 నుండి 266 దాకా) 147 పద్యాలలో చేసింది. ఇది ఒక మైనర్ 'విజ్ఞానేశ్వరీయం', సంగ్రహ ధర్మశాస్త్రం తృతీయా శ్వాసంలోనే దత్తాత్రేయుడు అలర్కునికి 'యోగబోధ' చేస్తాడు (290 నుండి 360 దాకా). 71 పద్యాలతో ఇది సంక్షిప్త యోగశాస్త్ర ప్రవేశిక.

తృతీయాశ్వాసంలో వున్న 395 పద్యాలలో ఈ ఉపదేశాలు 218 అంటే సగానికి పైన అన్నమాట. ఈ ఒక్క ఆశ్వాసంలోనే కాదు, ఇతర ఆశ్వాసాలలో కూడా యిటువంటి పూర్వాచార వివరాలు లేకపోలేదు.

అసలు మార్కండేయ పురాణం ధర్మసందేహాలు నివృత్తి చేయడానికి పుట్టింది. మహాభారతాన్ని రచించిన వ్యాసుల వారికి జైమిని అనే శిష్యుడున్నాడు. అతనికి భారతంలో కొన్ని సందేహాలు కలిగాయి. సృష్టిస్థితి లయకారకుడైన పురుషోత్తముడు మానవుడుగా ఎందుకు పుట్టాడు? అతని సోదరుడైన బలరాముడు తీర్థయాత్రలకు వెళుతున్నప్పుడు బ్రహ్మహత్య ఎలా చుట్టుకొంది? పరమ పుణ్యులైన పాండవులు అయిదుగురికి ద్రౌపది ఒక్కతే భార్య ఎలా అయింది? ఈ ద్రౌపదికీ, పాండవులకూ పుట్టినవాళ్ళు పెళ్ళీ గిత్రా చేసుకోకుండా 'అనాథుల' లాగా ఎందుకు చచ్చిపోయారు? ఈ సందేహాలు నివృత్తి చేసుకోవడానికి జైమిని మార్కండేయ మహాముని వద్దకు వెళ్ళాడు. తన అనుమానాలను చెప్పాడు. ''సమాధానాలు చెప్పాలంటే చాలాసేపు పడుతుంది. ఇప్పుడు నాకు వ్యవధి లేదు. అనుష్ఠానానికి వేళయింది. నీకు నిజంగా తెలుసుకోవాలని వుంటే, వింధ్య నగరం దగ్గర నలుగురు ధర్మపక్షులున్నారు. వెళ్ళి వాళ్ళనడుగు'' అని మార్కండేయుడు చెప్పాడు.

పక్షులేమిటి? ఈ ధర్మసందేహాలు నివారణ చేయడమేమిటి? అని జైమిని ఆశ్చర్యపడి అడిగితే వాళ్ళ వృత్తాంతాన్ని మార్కండేయుడు (16 నుండి 98 దాకా) 83 గద్యపద్యాలలో చెప్పాడు.

జైమిని ఆ పక్షులవద్దకు వెళ్ళి తన ధర్మసందేహాలు నివారణ చేయమన్నాడు. వారూ ఒక్కొక్కటే నివారణ చేశారు. ప్రథమాశ్వాసంలోని 187వ గద్యం అయ్యేసరికి సందేహాలు

నివారణ అయిపోయాయి. అయితే ఆఖరి సందేహం తీరేటప్పటికి ఒక కథ మధ్యలో ఆగిపోయింది. హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి రాజ్యమిచ్చాడు. అది తీసుకొని ముని రాజును రాజ్యంలోంచి వెళ్ళగొట్టాడు. పురజనులు అడ్డగించారు. వాళ్ళను విడిచి పోవడానికి 'కాళులాడమి' హరిశ్చంద్రుడు తన రాణి చేయిపట్టుకొని నిలబడ్డాడు. అప్పుడు విశ్వామిత్రుడు నయమొకింత లేక ఆ సుదతీ తిలకాన్ని తన చేతి ప్రచండదండంతో కొట్టాడు. ఆ దారుణాన్ని చూసిన అయిదుగురు 'విశ్వదేవతలు' విశ్వామిత్రుణ్ణి తిట్టి పోశారు. అతడు వాళ్ళను శపించాడు. మనుషులుగా పుట్టమన్నాడు. కోపంకొద్దీ శాపమిచ్చినా వెంటనే ప్రసన్నుడై ''మీరు సంతానాన్ని కనక్కరలేదు; అల్పకాలంలోనే శరీరం విడిచి దేవరూపాలు పొందుతారు'' అని అనుగ్రహించాడు. ఆ అయిదుగురు విశ్వదేవతలే ద్రౌపదికి పుట్టినవారు.

ఇక్కడి దాకా కథ చెప్పి ధర్మపక్షులు ''నువ్వు అడిగినవాటికి జవాబులు చెప్పాం. ఇంకేం వినాలని వుంది'' అని అడిగితే ఆ హరిశ్చంద్రుని కథ పూర్తిగా చెప్పమన్నాడు జైమిని. ఒక కథ చెప్పాక ఇంకొక ప్రశ్న. దానికి జవాబుగా మరొక కథ. కథలో పాత్రలు, ఇతర పాత్రలకు చెప్పే కథలు మొదలైనవి మొత్తానికి తృతీయాశ్వాసం దాకా ఆక్రమించాయి. ఆ పిమ్మట ప్రతి పురాణంలోనూ ఉండే 'సర్గ, ప్రతిసర్గ, మన్వంతరం, నృపవంశాలు, వంశానుచరితలు' అనే అయిదు లక్షణాలతో క్రోష్టుకి అనే మునికి మార్కండేయుడు చెప్పిన విపులమైన పురాణాన్ని ధర్మపక్షులు జైమినికి చెప్పారు.

ఈ కథలను మారన మూలానికి చాలామటుకు విధేయంగా అనువదించాడు. వర్ణనాంశాలకంటే కథాంశాలకే ప్రాముఖ్యమిచ్చాడు.

''మొత్తమున మారనకవి యాంధ్రీకరణము భారతాంధ్రీకరణముకంటె మూలమునకు జేరువగ నుండును. ఆ విషయము ఉభయ గ్రంథముల బఠించిన ద్యోతకము కాఁగలదు'' అని శేషాద్రి రమణ కవులు పరిశీలించిన మీదటే చెప్పి వుంటారు. అయితే పురాతన ఆచార వ్యవహారాలు తన కాలంనాటి విశ్వాసాలకు, అభిరుచులకు విరుద్ధమైనవైతే ఏమాత్రం మార్చనట్టు కనబడుతుంది. ఉదాహరణకు, శ్రాద్ధములందు ఏయే మాంసాలు పితృదేవతలకు ఎన్నెన్ని నెలలు తృప్తి ఇస్తాయో చెప్పే ఘట్టంలో మారన ఏమీ మార్పు చేయలేదు.

హవిష్యాన్నం	-	ఒక నెల
చేపల మాంసం	-	రెండు నెలలు
లేడి మాంసం	-	మూడు నెలలు
కుందేలు మాంసం	-	నాలుగు నెలలు
పక్షి మాంసం	-	అయిదు నెలలు
పంది మాంసం	-	ఆరు నెలలు
వేట మాంసం	-	ఏడు నెలలు

ఇఱ్రి మాంసం	-	ఎనిమిది నెలలు	
దుప్పి మాంసం	-	తొమ్మిది నెలలు	
గోరుపోతు మాంసం	-	పదినెలలు	
తగరు మాంసం	-	పదకొండు నెలలు	
ఆవుపాలు, పాయసం	-	పన్నెండు నెలలు	(తృతీయ. 199)

పితృదేవతలకు తృప్తినిస్తాయని మారన వివరించాడు. పదకొండు మాసాలదాకా మాంసాలు చెప్పి పన్నెండో మాసం పాలూ, పాయసం మూలంలోనే చెప్పాడు. మన సంఘంలో ద్విజులు కూడా ఒకనాడు గోమాంసం తినేవారు. గోవు పూజనీయమై, ఆ మాంసం నిషిద్ధమై సంఘంలోని అగ్రవర్ణాలు మూడూ ఇతర మాంసాలే భక్షించే రోజులు కొన్ని వున్నాయి. క్రమేణా తెలుగు బ్రాహ్మణులు ఏ మాంసమూ తినని ఆచారం ఏర్పడింది. బంగాలీ బ్రాహ్మణులు నేడు చేపల మాంసం తింటారు. మూలం వ్రాసినవాళ్ళు పదకొండు నెలలదాకా మిగతా మాంసాలను పేర్కొనడం కూడా గొప్పే.

మార్కండేయ పురాణంలోని ఇతర ఘట్టాలలో దత్తాత్రేయ మహర్షి ''కామలీలాలస భావుడై ఒక కామినితో మధువు త్రాగుతూ, మాంసం తింటూ, ఆడుతూ పాడుతూ వుంటాడు. అతడికి కార్తవీర్యార్జునుడు 'మద్య' మాంస వివిధాహార సమర్పణం' చేశాడు. మహిషాసురుని చంపే ఘట్టంలో దేవి మధుపానరాగ స్ఫురిత నయనయగుచు సంపూర్ణ మధురాక్షరంబుగ నిట్లనియె.

ఏ నీమధురాసవరస
మానిన యిందాక నెట్టులైనను మూఢా
త్మా! నలువునఁజెలఁగుమునా
చేనీ వీల్గుటయు సురలు చెలఁగుదురువెసన్. (6-113)

ఇటీవల పురాణాలను అనువాదం చేసేవాళ్ళు ఇటువంటి ఇబ్బందికరమైన పూర్వాచారాలనూ, నేటి నమ్మకాలకు సరిపడని ఆహారవిహార నియమాలను మార్చేస్తున్నారు. రామాయణంలో రామలక్ష్మణులు పర్ణశాల నిర్మించాక లక్ష్మణుడు జింక మాంసంతో భూతతృప్తి చేశాడని వాల్మీకి వ్రాస్తే, శ్రీనివాస శిరోమణిగారు ''కమలాఫలాలు'' తీసుకొచ్చి నైవేద్యం పెట్టినట్టు అనువాదం చేశారు. శివపురాణం అనువదించిన ముదిగొండ నాగవీరయ్య శాస్త్రిగారు కొన్ని దిగమింగలేని వాటిని మార్చేశారు; అయినా ఎబ్బెట్టుగా కనబడేవి చాలా మిగిలిపోయాయి. అందుకే ''మూలగ్రంథ రచనా కాలంబునకిప్పటి కాలంబునకు బ్రపంచధర్మంబులు చాలగ మార్పైయుండుటబట్టి చదువరుల కందందుఁగొన్ని యెడలనించుక వ్యత్యాసంబుగఁ దోచినఁ దోచవచ్చునుగాని విజ్ఞులట్టి వానినిఁ బాటింపరని తలంచెదను'' అని సంజాయిషీ చెప్పుకొన్నారు.

హరిశ్చంద్రోపాఖ్యానాన్ని మారన 144 గద్యపద్యాలలో రమణీయంగా చెప్పాడు. పాత్రచిత్రణ, మనస్తత్వ నిరూపణ చక్కగా వుంది. చూడండి, పెళ్ళాన్ని అమ్ముకోవడం కన్నా దారుణం ఇంకొకటి ఉండదు కదా! హరిశ్చంద్రుడు భార్యను విక్రయిస్తూ పలికిన పలుకులివి...

''ఓ పురజనులార! నా పత్ని నమ్మెద
నే దాసిగా వెల యెఱిగి పెట్టి

కొనుడు నన్నెవ్వఁడని యడిగెదరేని
నే నృశం సుండను దానవుండ

నతిపాప కర్ముడ నా లినమ్ముకొనంగ
నరుగు దెంచిన కఠినాత్మకుండ.'' (1-214)

నేను నృశంసుండను, అనగా నరులను బాధపెట్టేవాడను, దానవుడను అంటూ చెప్పుకొన్నాడేగాని హరిశ్చంద్రుడు పేరు చెప్పుకోలేదు. బ్రాహ్మణుడు వచ్చి వెల ఎంత అని అడిగాడు. విపుల దుఃఖవేదనతో పలుకడానికి నోరు రాకపోతే ఆ బ్రాహ్మణుడే తగినంత ధనం హరిశ్చంద్రుడి వల్కలాలతో ముడిచిపెట్టి శ్యైబను తలపట్టి ఈడ్చాడు (హరిశ్చంద్రుడి భార్య పేరు. ఈ పురాణంలో శ్యైబ; చంద్రమతి కాదు). అప్పుడామె ఏడుస్తూ

విడువవయ్యా తండ్రి! తడయక వచ్చెద
వీఁడె నన్నుఁజూచి వెగచి వెగచి
కొడుకు దద్ద వెగడుపడి యేడ్చుచున్నాడు
బుజ్జగింతు ననుచు పుత్రుగాంచి
అన్నన్న నన్ను ముట్టకు
మన్న నృప తనూజ దాసి నశుచి ననుచుఁబైఁ
గన్నీరు వెళ్ళి గొనఁగా
నున్న జనని కొరగు బాలుఁడు డుగక పట్టెన్. (1-216-17)

అమ్ముడు పోయిన వెనువెంటనే ''నేను దాసిని, అశుచిని, నువ్వు రాజకుమారుడవు, నన్ను ముట్టుకోకూడదు'' అని రోదించే కన్నతల్లి ''చేతో సన నిధి పిండలివండు''గా వున్నప్పుడు చదివేవాళ్ళ గుండెలు అవిసిపోక మానవు (సముద్రాలు 'పిండలివండు'గా కలత చెందాయని వర్ణించడం మారనకు అలవాటు. ఇంకో రెండు మూడుసార్లు ఈ పదబంధం వాడాడు).

కొందరు కవులకు కొన్ని ఊతపదాలు వుంటాయి. తిక్కనగారు 'తగ' ఎక్కువగా వాడారు. మారన 'వెస' అన్న మాటను తెగవాడాడు. భావోద్వేగం ఎక్కువగా ఉన్న

పద్యాలలో ఈ మాట ఎక్కువగా కనబడుతుంది. ఊతపదమైనా అప్పుడప్పుడు చెవికింపుగా ఉండేటట్టు దానిని ప్రయోగించడం జరిగింది.

... ... మాయయాతన్వినై
నను దయజూపవే భుజగనాయక! నాకు వెసన్ మదాలసన్ (3-88)

ఇటువంటి చిన్న శబ్ద శిల్పాలు వాటంతట అవే వచ్చినట్టు కనబడతాయిగాని పనిగట్టుకొని రాసినట్టుగాని, కవి వాటిమీద శ్రద్ధ జూపినట్టుగాని కనబడవు.

ఉత్తరోత్తరా పోతనగారు వాడిన 'శారదనీరదేందు' లాంటి మాటల కలయికను మారన మొదలెట్టాడు 'అలర్కుడొప్పెనా శారదనీరదేందు విలసద్యాశుడై బగు పుత్రవంతుడై' (3-269) అని వ్రాశాడు. తెలుగు నుడికారాన్ని అక్కడక్కడ 'చలదశ్వత్థ దళంబు భంగి' (1-115) అని సంస్కృతీకరించినా మారన జాతీయాలు, సామెతలు చక్కగా వాడే కవి. చిచ్చుచీరను కట్టడం, సూదికి రెండుమొనలు కలవే అని అడగడం, యౌవనం అడవిగాచిన వెన్నెల అయిపోయిందని వాపోవడం 'మిన్ను విరిగి కూలినట్టు భావించడం,' 'పెంపు బూడ్ద బొట్టయ్యెనే' అని అడగడం మొదలైన తెలుగుదనం ఉట్టిపడే మాటలు అక్కడక్కడ వాడాడు. తెలుగుదేశపు ఆచారాలను కూడ ఉన్నంతలో చూపించాడు. ఆరోజుల్లో రాచవీధుల్లో మాలలు ఎలాగ నడిచేవారో వర్ణించాడు. ఛండాల వేషంలో ధర్ముడు

ఇలగోల దట్టుచు 'సం
బళి సంబళి' యనుచు గ్రందుపడు జనములకున్
దొలగుచు నొదుగుచు నాభూ
తలపతి కడ కరగుదెంచి తానిట్లనియెన్ (1-226)

అని కళ్ళకు కట్టినట్టు చూపించాడు. మాలవానికి దాస్యం చేయడం ఇష్టంలేక హరిశ్చంద్రుడు ఆరాటపడడానికి వీలైనంత జుగుప్స పుట్టేటట్టు ఛండాల వేషాన్ని మారన వర్ణించాడు. నీతికి కట్టుబడి ఆ మాలనే సేవించడంలో కథానాయకుని శీలాన్ని ఇనుమడింప చేశాడు.

మార్కండేయ పురాణంలోని నీతులను తరువాతి కవులు చదివినట్టున్నారు. మనకు చాలా సుపరిచితమైన ''అప్పిచ్చువాడు వైద్యుడు...'' అనే సుమతి శతకం పద్యార్థాన్నే ఉపదేశం చేసే పద్యాన్ని మారన మార్కండేయ పురాణంలో (3-248) వ్రాశాడు. చూడండి:

''ఎచ్చట శ్రోత్రియుడును ధన-మిచ్చునతడు నీరుగలుగు నేరును వెజ్జున్
మచ్చికయును లేకుండును-నచ్చట వసియింప వలవ దభినుత చరితా!''

సుమతి శతకం వ్రాసిన కవి ఈ పద్యాన్నీ, మార్కండేయ పురాణమూలంలోని శ్లోకాన్నీ చూచి ఇలా వ్రాశాడు:

అప్పిచ్చువాడు, వైద్యుడు
నెప్పుడు ప్రవహించునట్టి యేరును ద్విజుడుం
జొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టి యూరు జొరకుము సుమతి

మూలశ్లోకం:

''ధనకః శ్రోత్రియోరాజా నదీ వైద్యాస్తు పంచమః
పంచయత్ర న విద్యంతే న తత్ర దివసం వసేత్''

సుమతి భీమన ప్రాచీనుడు. వాస్తవానికి మారన పుస్తకంలోనుంచి భావాలను గ్రహించిన తరువాతి కవులు అతణ్ణి నుతించినట్టు కనబడదు. మనుచరిత్ర వ్రాసిన పెద్దనగారు కనీసం మారనను పేర్కొనైనాలేదు. తెలుగు మార్కండేయ పురాణంలోని భావాలను ఆయన స్వీకరించినట్లు ఈ క్రింది పద్యాల పోలికలు సాక్ష్యమిస్తాయి.

''ఈ సుకుమారుడెవ్వడొకొ యిందుల కెందులనుండి వచ్చెనో
భాసుర రూపకాంతిజిత భావజ చంద్రుడితండు రాగ లీ
లా సరసత్వ మొప్పగడు లాలసుడైనను జూచెనేని నే
జేసిన పుణ్య మెవ్వరును జేయరు; కామునిదక్క నేలుదుర్.''

(మార్కండేయ. 4-230)

''ఎక్కడివాడొ యక్షతనయేందు జయంత వసంత కంతులం
జక్కదనంబునన్ గెలువజాలెడు వీని మహీసురాన్వయం
బెక్కడ? యీతనూ విభవ మెక్కడ? యేలనిబంటుగా మరున్
డక్కగొనంగ రాదె యకటా! ననువీడు పరిగ్రహించినన్?'' (మనుచ. 2-35)

మార్కండేయ పురాణం ముఖ్యంగా దేవీమహాత్మ్యాన్ని ప్రకటిస్తుంది. మహిషాసుర మర్దనం, శుంభనిశుంభుల వధ మారన చాలా ఉత్తేజకరంగా అనువదించాడు. మహిషాసుర సంహారం 68 గద్యపద్యాల భాగం. ఆ తరువాత శుంభనిశుంభుల వధ, దేవీమాహాత్మ్యం 125 గద్యపద్యాల భాగం. వీటిలో 'లయగ్రాహి', మహాస్రగ్ధర, మాలిని, దండకం మొదలైన విశేష వృత్తాలను మారన వాడాడు. తెలుగుకవులు తరచుగా లయగ్రాహిలో వసంతవర్ణనే చేస్తారుగానీ, మారన యుద్ధ వర్ణన చేశాడు.

దండకంలో మారన ఎక్కువగా తెలుగు మాటలే వాడాడు. ''నారాయణీ దేవి' మా మ్రొక్కుగైకొనుము'' అనే మాటలు పల్లవిలాగ దండకంలో పునరావృతం కావడం ఈ దండకంలోని విలక్షణత్వం. ఇంకే దండకంలో యిటువంటి వింత కనబడలేదు. చూడండి మారన రచించిన దండకం:

''శ్రీ విష్ణుశక్తీ! జగన్మూలశక్తీ! త్రిశక్తీ! మహాశక్తీ! నారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము కాష్ఠాదికాలస్వరూపంబులం జేసి పాకంబు గావించి లోకంబులన్మ్రింగు నారాయణీ! దేవి! మా మ్రొక్కుగైకొమ్ము! సర్గస్థితి ధ్వంసనంబు లొనర్పన్నిమిత్తంబ త్రైగుణ్యమూర్తీ! జగద్గీతసత్కీర్తి! నారాయణీ! దేవి! మా మ్రొక్కుగైకొమ్ము! రమ్యాక్షసూత్రాది చిహ్నావలిం దాల్చి హంసంబు పై నీవు బ్రహ్మాణివై యెప్పు నారాయణీ! దేవి! మా మ్రొక్కుగైకొమ్ము! వాలూద్రిశూలంబుఁ గేల నెల్వొంగంగ బొలందురో చల్లటాలంకృతిం జేయ మాహేశ్వరీ మూర్తి బెంపారి యాబోఁతుమీఁద న్వెలుంగొందు నారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము! హస్తమ్ములన్జక్రశంఖాదిలోక ప్రశస్తాయు ధమ్ముల్మెఱుంగారఁగా వైష్ణవీ రూపలీల న్విహారంబు గైకొన్న నారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము! రాజన్మయూరంబుఁదేజంబుతో నెక్కి చేశక్తి శోభిల్లఁ గౌమారివై పోల్చు నారాయణీ! దేవి! మామ్రొక్కు గైకొమ్ము! వారాహివై యేక దంష్ట్రంబున న్నీవు ధాత్రీతలం బెత్తి శ్రీ నారసింహాకృతిన్ దైత్యులంద్రుంచి లోకైక రక్షావిధి న్ధన్యవైనట్టి నారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము! చరాడా కిరీటంబు దోర్వజ్రము న్ప్రజ్వరిల్లంగ వేగన్నులుంగ్రాల వృత్రాద్రివీరులం ద్రుంచి మాహేంద్రి వై యున్న నారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము। శ్రీకంఠదూతీ! శివా! ఘోరనాదంబు మ్రోయంగ దైతేయులం జంపి యుగ్రాజిఁ జెల్వారు నారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము। దంష్ట్రాకరాళాననంబు న్శిరోమాలికా దీప్తి జాలంబును న్దేజరిల్లంగ సంగ్రామరంగంబునం జండముండాదులం గిట్టి చెండాడి చాముండ వై మేదినిన్బెంపున న్మీఱు నారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము! సర్వంబునం బాణీ పాదాస్యముల్గల్గి సర్వంబున న్శీర్ష నేత్రాంగముల్గల్గి సర్వంబున న్నాసికాకర్ణముల్గల్గి సర్వంబు నీవైన సర్వేశ్వరీ! సర్వశక్త్యాత్మికా! సర్వరూపా! మహాదుర్గ! మా మ్రొక్కు గైకొమ్ము! మమ్మర్థి రక్షింపు ముక్కన్నులం జాలజెన్నొందు నీ మోము కాత్యాయనీ! మమ్మునే భీతియుం బొందకుండంగ రక్షించు రక్షోగణాభీలమై నీదు శూలంబు శ్రీ భద్రకాళీ! మముందాన రక్షించు నాదంబున న్దిక్కు లల్లార్చు నీ ఘంట దోషంబులం దోలిమమ్మెప్డు రక్షించు నక్తంచరశ్రేణి రక్తంబునం దోఁగి కెంజాయ రంజిల్లు నీ వాలు మమ్మేలుచు న్మేలుగావించు రోగంబులం బాచి రాగంబుతో నీవు మాకుం బ్రసాదింపు సంతుష్టవై యిష్టకామంబు లేప్రొద్దు దేవీ! నినున్భక్తి సేవించు సద్భక్త సంఘంబు లెన్నండు నేదుఃఖము లొంద కే బాధలం జెంద కానంద లీలన్సుఖం బుండు గాంచున్నమస్తైక భద్రా! సమస్తైక పుణ్యా! నమస్తే నమస్తే నమః (6-244)

దండకంలో ఈ పల్లవి ఇలాగ మళ్ళా మళ్ళా రావడం ఆనాటి పాటలను స్ఫురింపచేస్తోంది అనుకోవచ్చును. తరువోజను, తలంబ్రాలను దంపే చోట ఆడవాళ్ళు పాడేవారని నాచన సోముడు వ్రాశాడు. మారన రెండు తరువోజలు ఈ పుస్తకంలో వ్రాశాడు (1-151, 3-126). పాల్కురికి సోమనాథుడు ద్విపదను ప్రచారం చేశాక ఈ తరువోజలు ఇంకెవ్వరూ వాడలేదని అమరేశం రాజేశ్వరశర్మగారు అభిప్రాయపడు తున్నారు. మారన సోమనాథుడికి సమకాలికుడు. అప్పటికింకా తరువోజలు ప్రచారంలో వున్నాయి.

మారన తన గురించి ఏమీ చెప్పుకోలేదుగాని కృత్యాదిని భారతీదేవిని నుతించడంలో తన వైదుష్యాన్ని పరోక్షంగా చెప్పుకొన్నాడు.

ఆరయ నొక్క భంగిగ రహస్యపు జోటను రాజసన్నిధిన్
సూరి సభాంతరంబులను జొప్పడి తప్పక గద్య పద్యముల్
దోరలు పేర్చినట్లు మదిఁదోఁపఁగఁ జేయుట సంతతంబునా
భారమ కాదె వీని కనుభారతి మాకుఁ బ్రసన్న యయ్యెడున్. (పీఠిక. 5)

రహస్యపుచోట, రాజసన్నిధిలో, పండిత సభలో ఒక్కలాగ గద్యపద్యాలు దోరలు పేర్చినట్లు మదిని తోచేటట్టు మారన చెప్పేవాడని తెలుస్తోంది. రహస్యపుచోట ఈయన ఎలాంటి పద్యాలు చెప్పాడో తెలియదు. ఈ పురాణాన్ని కృతి పుచ్చుకొన్న గన్నయ వారవనితాలోలుడు. పుస్తకంలోని సుమారు రెండువందల సంబోధనలలో ఎక్కువ గన్నయను శృంగార పురుషుడిగా పిలిచేవే! విలాసినీ మనోహర, బాలా రతికేళీ పాంచాలా! భామినీ హృద్యమూర్తీ, వారవిలాసినీ వదన వారిజమిత్ర, భామినీ పంచబాణా ప్రౌఢ స్త్రీ మకరాంకా! అని చాలా విధాలుగా గన్నయ కాముకత్వాన్ని మారన కనబర్చాడు. ఆ రోజుల్లో ఓరుగల్లు వారస్త్రీలతో వైభవంగా వుండేది. శ్రీనాథుడి క్రీడాభిరామం దీనిని విపులంగా వర్ణిస్తుంది.

మార్కండేయ పురాణాన్ని కృతి పుచ్చుకున్న గన్నయతోబాటు మారన మొదట వారకాంతల యిండ్లకు వెళ్ళేవాడా? ఆ రహస్యపు చోట్లలో హృద్యమమైన పద్యాలు చెప్పేవాడా? ఏమో! మారన శృంగార వర్ణన చక్కగానే చేయగలడు. దానికి ఈ క్రింది పద్యం సాక్ష్యం.

ఆ నగుమోముచెన్ను శశియందును బంకరుహంబునందులే
దానయన ప్రభాతి మదనాస్త్రములందు మెఱుంగులందులే
దానును మేనికాంతి లతికావలియందుఁ బసిండియందులే
దానలి నాయతాక్షి లలితా కృతి నామదిఁబాయ నేర్చునే! (2-161)

మెఱుఁగారు లేఁదీఁగ మెచ్చనియత్తన్వి తనులత చెల్వంబు గనుఁగొనంగఁ
గల కంఠముల యెలుంగుల యేపు దీపించు నలపొల్తి ముద్దు బల్కులు వినంగ!
గనక కుంభంబుల కాంతి గైకొనని యా కాంత చన్గవ చిగ్గఁగౌఁగిలింపఁ
జిగురుటాకుల నును జిగిసొంపు దెగడు నచ్చపలాక్షి కెమ్మోవి చవిగొనంగఁ
జిత్త మొదవు తివుటఁ జిడిముడి పడియెడు, నీవు ధర్మాతత్త్వ నిపుణహృదయ
వాలతాంగి నన్ను నను రక్తిమైఁ గూర్పు మన్మథాగ్ని నేను బ్రుందకుండ.
(2-162)

ఈ పద్యాల శృంగారం బాగున్నా ఇది రక్తి కట్టని ఘట్టంలోనిది. పడుచుకుర్రాడు చెలికాడితో తన విరహాన్ని చెప్పుకొంటే బాగుంటుంది కానీ, కుష్ఠువాడు, రోగంతో

బాధపడేవాడు, ''హేయ రసము మూర్తమైనటులు'' వుండేవాడు, వేశ్యను చూసి, అనురక్తుడై, దాని దగ్గరకు తీసుకెళ్ళమని భార్యను బ్రతిమాలుకొనడంలో ఈ పద్యాలు మారన చెప్పాడు. అందుచేత రసాభాసం తప్పదు.

తన కృతిపతికూడా వారవధూలంపటుడని తెలిసేకాబోలు మార్కండేయ పురాణం అనువదించమని గన్నయ అడగగానే ''ఇతడిమ్మేదిని నింత ధన్యుడగునే!'' అని మారన ఆశ్చర్యంతో పద్యం చెప్పాడు. ఆ సందేహం నిజమే అయింది. గన్నయ సేనాని అంత ధన్యుడు కాలేదు. ప్రతాపరుద్రుణ్ణి మహమ్మదీయులు చెరపట్టి తీసుకొనిపోయాక గన్నయ తురకలలో కలిశాడు. మతం మార్చుకొన్నాడు. పేరు మార్చుకొన్నాడు. ఢిల్లీకి పోయి అక్కడ పాలకులకు నమ్మకస్థుడై కొన్నాళ్ళకు వరంగల్లుకి రాజప్రతినిధిగా వచ్చాడు. ఇతడి జీవితంలోని వివిధ విషయాల గురించి వివరంగా శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు 1939 ఫిబ్రవరి మాసం భారతిలో వ్రాశారు. మతం మార్చుకొన్నాక గన్నయ 'మల్లిక్ మకబూల్' అని పేరు మార్చుకొన్నాడు. ఉత్తరాన ఢిల్లీ సుల్తానుల చరిత్రలో చాలా ప్రముఖ పాత్రను వహించాడు. కానీ జహానన్న బిరుదు పొందాడు. అయితే వరంగల్లులో నిలువలేకపోయాడు.

మతం మార్చుకొన్నాక వరంగల్లుకు వచ్చిన గన్నయను మారన కలుసుకొంటే ఎలా పరిణమించేదో, ఏ చర్య జరిగేదో వూహించి ఈ గ్రంథకర్త ''ఈశ్వర అల్లా తేరేనామ్'' అనే నాటిక విరచించాడు.

అందుకే మార్కండేయ పురాణంలో పీఠిక (18)లో మారన ''ఇతడిమ్మేది నింత ధన్యుడగునే!'' అని చెప్పిన పద్యంలో క్రూరమైన వ్యంగ్యం అవ్యక్తంగా ధ్వనించింది. ఇది నన్నయగారు ''అమలిన తారకా సముదయంబుల నెన్నను'' అని చెప్పిన పద్యంలోని వ్యంగ్యం వంటిది. అయితే ఈ పద్యం చివర ''ఈ దివ్య పురాణ రత్నమును మార్కండేయమేఁ జెప్పగాంచితి, పుణ్యాత్ముడనైతి, జన్మము ఫలించెన్ లోకసంభావ్యమై'' అని మారన అత్యంత ప్రమోదం చెందాడు.

తెలుగులో దొరికిన మొదటి పురాణం కనుక ఇది నిజంగా లోక సంభావ్యమే.

అథర్వణాచార్యుడు

నన్నయగారు వదిలిపెట్టిన భారతాన్ని విరాట పర్వం నుంచి తిక్కనగారే కాక మొదటి నుంచీ ఇంకొక కవికూడ పూర్తిచేశాడు. అతని పేరు అథర్వణుడు. ఇటువంటి అరుదైన పేరు తెలుగువాళ్ళలో ఉండదు కనుక ఇది పెట్టుపేరేమో అని కొందరు అనుమానించారు. ఇతడు జైనుడనికూడ అభిప్రాయపడుతున్నారు. ఇతడు భారతం కొన్ని పర్వాలు ఆంధ్రీకరించడమేకాక ఒక ఛందోగ్రంథం కూడ వ్రాశాడు. 'వికృతివివేకం' అనే వ్యాకరణ గ్రంథాన్ని సైతం సంస్కృతంలో రచించాడని లోకులు చెప్పుకొంటారు.

అయితే ఆ వ్యాకరణ గ్రంథాన్ని అర్వాచీనులెవరో వ్రాశారని, దానికి ప్రశస్తి రావడం కోసం అథర్వణకృతిగా చలామణి చేశారని పండితులలో కొందరు గట్టిగా విశ్వసిస్తున్నారు. బహుశా అథర్వణాచార్యుడు ఈ వికృతి వివేకాన్ని రచించినట్లు మొట్టమొదట చెప్పి వ్యాఖ్యానం వ్రాసిన గాలి ఓబళయ్య అనే పండితుడే ఈ పుణ్యాం కట్టుకొన్నాడని కూడ నిరూపించగలుగుతున్నారు. గాలి ఓబళయ్య తన తెలుగు పేరులో గాంభీర్యం లేదని, ప్రభంజనం అహోబలపతి అని మార్చుకొన్నాడ్డట. నన్నయగారు సంస్కృతంలో వ్రాశారనుకొన్న తెనుగు వ్యాకరణాన్ని అప్పకవి తెలిగించాడన్న 'ఈసు' కొద్దీ అహోబలపతి ఈ 'వికృతి వివేకాన్ని' రచించాడట.

ఈ విషయాలన్నీ కందుకూరి వీరేశలింగంగారు తమ ఆంధ్ర కవుల చరిత్రలో విపులంగా విశదపరిచారు. మరికొన్ని కొత్త విషయాలను చాగంటి శేషయ్యగారు తమ ఆంధ్ర కవి తరంగిణి మూడవ సంపుటంలో ప్రతిపాదించి చక్కగా వివరించారు. అప్పకవి వ్రాసిన తెనుగు పద్యాలనే అహోబలపతి సంస్కృతీకరించి అథర్వణుని పేరు పెట్టాడని ఆయన అభిప్రాయపడుతున్నారు. అప్పకవి పద్యాలనూ, అహోబలపతి శ్లోకాలనూ స్పష్టంగా చూపించారు. చూడండి:

> ''ఆదిని శబ్దశాసన మహాకవి చెప్పిన భారతంబులో
> నేది వచింపగా బడియె నెందును దానినె కాని సూత్రసం
> పాదన లేమిచే దెనుగుపల్కు మఱొక్కటి గూర్చి చెప్పగా
> రాదని దక్షవాటికవి రాక్షసు డీనియమంబు జేసినర్.
> ఆ మూడు పర్వములలో-నామాన్యుడు నుడువు తెరగు లరసికొని కృతుల్
> దాము రచించిరి తిక్క సు-ధీమణి మొదలైన తొంటి తెనుగుకవీంద్రుల్.''
>
> (అప్పకవీయం. పీఠిక, 46, 47)

ఈ మాటలు అప్పకవి సొంతాలు కూడ కావు. సాక్షాత్తు భగవంతుడే స్వప్నంలో కనబడి చెప్పినవని అప్పకవి వ్రాసుకున్నాడు. ఈ భగవంతుడే వికృతివివేకం వ్రాసిన వానికికూడ కనబడివుండాలి. అప్పకవికి చెప్పిన మాటలనే చెప్పినట్లు ఈ శ్లోకాలు ఉన్నాయి.

''శబ్దానుశాసన కృతేనహి భారతస్య
పర్వత్రయేణ కథితం పదమేవ యోగ్యం,
నాన్యత్ ప్రయోగసరణా వనుశాస్త్రదృష్టే
రేవంకృతోహి నియమః కవి రాక్షసేన.
శ్రీ తిక్కయజ్వప్రముఖ విచక్షణసుధాంశవః
తదభ్యుపగమాయత్తచేతసః కవనే రతాః.''

ఈ శ్లోకాలను క్రీ.శ. 17వ శతాబ్దంలోని అహోబలపతికాక 13వ శతాబ్దంలోని అథర్వణుడే వ్రాస్తే అతనికి తిక్కనగారు భారతాన్ని విరాట పర్వం నుంచే తెనిగించారని తెలిసే ఉంటుంది. ఆ పదిహేను పర్వాలనూ చదివాకనే తన భారతం వ్రాశాడా? తనకు కొద్దిగా పూర్వుడూ, తాను ప్రామాణికుడుగా అంగీకరించినవాడూ పూర్తిచేసిన భారతాన్ని మళ్ళీ అనువదించడానికి పూనుకొంటాడా?

ఈ శ్లోకాలను అహోబలపతి అప్పకవినుంచే స్వీకరించి వుంటాడు. అప్పకవి తన లక్షణ గ్రంథం గురించి ఇలా గొప్ప చెప్పుకొన్నాడు:

''ఇది చదివిన పిమ్మట మఱి- యెదియేనియు జదువు బుద్ధి యేలా వొడమున్
బదపడి గ్రంథములన్నియు-వెదకివెదకి సారమెల్ల వివరింపంగన్.'' (1-7)

ఇలాగే అహోబలపతి తన వ్యాఖ్యానం గురించి కూడ చెప్పుకొన్నాడు:

''యస్సారోథర్వణ గ్రంథే సోప్యత్రైవ విధీయతే.
తేన తత్పంక్తి కాలోకలోలతా త్యజ్యతాం బుధైః.''

'అథర్వణాచార్యుని గ్రంథమందున్న సారమంతటినీ ఇందులో చేర్చాను. కనుక అతని గ్రంథాన్ని ఆలోకించాలనే కోరికను పండితులు వదిలివేయుదురుగాక' అని ఈ శ్లోకానికి అర్థం. ఆంధ్రశబ్ద చింతామణికి వ్యాఖ్యానం వ్రాస్తూ కృత్యాధిని అథర్వణాచార్యుని గ్రంథం గురించి ఈ శ్లోకం వ్రాయవలసిన అగత్యం అహోబలునికి లేదు. ఈ అప్రస్తుత ప్రసంగం వల్లనే ఇతడు అథర్వణునిపేర గ్రంథాన్ని రచించాడనే బలపడుతున్నదని చాగంటి శేషయ్యగారి వాదం. ఇదే పెక్కురు పరిశోధక పండితుల అభిప్రాయమని చెప్తూ దీనిని బలపర్చడానికి ఆచార్య దొణప్పగారు 'వికృతి వివేక కర్తృత్వము' అనే వ్యాసాన్ని ఇటీవల రాశారు.[1] అంతరంగికమైన అనేక సాక్ష్యాలతో వికృతి వివేకం అథర్వణ కర్తృత్వము కాదని అహోబలపండితుడే దీనిని సృష్టించి అథర్వణునికి అంటగట్టాడని నిరూపించారు. ''అథర్వణుడు అంత ప్రాచీనుడు కాడు. అప్పకవి మొదలైనవారి దరిదాపులకు సమకాలికుడంటారా? అప్పుడంత రగడ ఎందుకో? అథర్వణుడు నాల్గువందల శతాబ్దులు మనవైపు నడచివచ్చినచో వికృతి వివేక కర్తృత్వము ఆయనకే కట్టిపెట్టడంలో నేను

1. భాషా చారిత్రక వ్యాసావళి. 1972 ప్రథమ ముద్రణ. ద్వితీయ ముద్రణ 1987. పుట 85 నుండి.

మొదటివాడనని'' అనే భావాలను ఆచార్య ద్రోణప్పగారు ఈ వ్యాసంలో నొక్కి వక్కాణించారు.

'వికృతి వివేకం' అనే కారికావళిని రచించకపోతే పోయె, అథర్వణుడు త్రిలింగ శబ్దానుశాసనం విరచించి ఉంటాడని కొందరు వ్యాకరణ పండితులు ఇంకా ఆశిస్తున్నారు.[2] అయితే క్రీ.శ. 1660 ప్రాంతాలలో మండ లక్ష్మీ నరసింహాచార్యులు అనే వైయాకరణి రచించిన 'ఆంధ్రకౌముది' అనే గ్రంథానికే 'త్రిలింగ శబ్దానుశాసనము' అనే నామాంతరం ఉంది (చూ... మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం D కేటలాగు – D1223). నన్నయగారికి కర్తృత్వం అంటగట్టిన ఆంధ్రశబ్దచింతామణికంటే ఈ త్రిలింగ శబ్దానుశాసనం ప్రథమమని అమరేశం రాజేశ్వరశర్మగారు ఆంతరంగిక సాక్ష్యాలవల్ల భావిస్తున్నారు. అంతవరకూ బాగానే ఉందిగానీ త్రిలింగ శబ్దానుశాసనం అథర్వణ కృతమన్నవారి ఆశ యుక్తమయినది కాదు. 17వ శతాబ్దంలోని వైయాకరణులకు తాము సంస్కృతంలో రచించిన ఆంధ్ర వ్యాకరణాలను తగిలించడానికి నన్నయ, అథర్వణుడు అనే రెండు చిలకకొయ్యలు కావలసి వచ్చాయి. అంతే.

మొత్తంమీద అథర్వణాచార్యుని పేర చలామణి అవుతున్న కారికావళి అతని కృతి కాదు, అతడు వ్రాసిన భారతంగాని, ఛందస్సుగాని దొరకవు. అయినా తిక్కనగారికి సమకాలికుడనీ, ఉదాహరించదగ్గ ప్రామాణిక ప్రయోగాలు చేసిన కవి అనీ ఇతని పద్యాలను పేర్కొన్నవాళ్ళ గ్రంథాలవల్ల తెలుస్తున్నది. తరువాతి కవులు ఉదాహరించిన పద్యాలు మాత్రమే ఇతనివి మనకు దక్కాయి.

అథర్వణాచార్యుణ్ణి పేర్కొన్న ప్రాచీనుడు గౌరన. ఇతడు క్రీ.శ. 1445 మధ్య జీవించాడు. లక్షణదీపిక అనే ఛందోగ్రంథం రచించాడు. అందులో అథర్వణచ్ఛందాన్ని పేర్కొన్నాడు కనుక అథర్వణుడు గౌరనకు కనీసం ఒక శతాబ్ది ముందు ఉండవచ్చునని ఊహించడానికి అస్కారముంది.

ఇతడు జైనసంప్రదాయానికి చెందిన కవి అని కొందరు ఊహిస్తున్నారు గాని ఆనందరంగరాట్ఛందంలో ప్రాదియతికి ఉదాహరణగా అథర్వణాచార్యులు చెప్పిన ఈ పద్యాన్ని కస్తూరి రంగకవి ఉదాహరించాడు.

''అనవరతమును బూజింప సాంబశివుని
దలప దలపులు ఫలియించు గలుషమణగు.'' (3-217)

కవి జైనుడైతే ఇలా వ్రాస్తాడా? పోనీ, ఇది ఏదేనా కావ్యంలోనిది కావచ్చును; పాత్రల మాటలు కావడానికి కూడా అస్కారముంది అనుకొంటే అథర్వణచ్ఛందంలోని వంటూ మాతృకా పూజావిధానం గురించి ఈ రెండు పద్యాలను కస్తూరిరంగకవే ఉదాహరించాడు.

2. ఆంధ్ర వ్యాకరణ వికాసం – ప్రథమ భాగంలో అమరేశం రాజేశ్వరశర్మగారు పుట. 197 నుండి.

''కలువల గొప్పు దీర్చి సిరిగంధ మలంది మెఱుంగు ముత్తియం
బుల తొడవుల్ బెడంగడర బూని దుకూలము గట్టి చేతులం
బొలుపగు రత్న వీణియము బుసక్తముగ్ విలసిల్ల గుందకు
ట్మలరుచి నొప్పు విప్రకులమాతృక సత్కవితాప్రదాయియై. (2–270)

అలవడ సంపెగల్ తురిమి యచ్చపుగస్తురి మేనబూసి కెం
పుల తొడవు ల్వహించి మఱి పుష్పశరంబును దీయవిల్లు జే
తుల విలసిల్ల గావిజిగి దూకొను పుట్టముగట్టి దీపకు
ట్మలరుచి బొల్చు రాజకులమాతృక భూజనవశ్య కారియై'' (2–273)

ఇవి జైనసమయానికి విరుద్ధమా? పరిశోధించాలి. 'కలువలగొప్పు... అనే పద్యం కవిగజాంకుశం' లోనిదని లక్షణాదీర్పకాకారుడు చెప్పాడు. ఈ మాతృకాపూజా విధానంలోని పద్యాలు తేలిక మాటలతో చక్కగా ఉన్నాయి. అయితే అథర్వణుని శైలి చాలా కఠినమనీ, సమాసజటిలమైన ఇతని కవిత కవిత్రయం వారి భారతం ముందు నిలబడలేకపోయిందనీ, అందుకే దీనికి ప్రచారం కలగలేదనీ పండితులు భావిస్తున్నారు. ఈ భావనలో నిజం లేకపోలేదు. చూడండి దుర్యోధనుని వర్ణన ఎలా చేశాడో!

''నతనానావని నాథయూ ధమకుటన్యస్తాబ్జ రాగోజ్జ్వల
ద్ద్యుతివిభ్రాజిత పాదపీఠు లలనాదోశ్చామరోద్ధూతమా
రుతలోలాళివినీలకుంతలు బ్రభారుగ్ధాము గేయూరశో
భితబాహాపరిఘుగ్ సువర్ణ దరణీభృద్ధైర్యు దుర్యోధనుగ్.''[3]

ఈ సమాస రచన ఆంధ్ర సాహిత్యంలో శ్రీనాథుని ప్రవేశానికి దారి చేస్తున్నది. దుర్యోధనుణ్ణి ఎటువంటి పదాడంబరముతో వర్ణించాడో అంతటి శబ్దజాలంతోనూ రాజసూయం చేస్తున్న ధర్మరాజునూ వర్ణించాడు.

''ప్రణతా శేషవసుంధరాధిప శిరస్స్రగ్గంధరులుబ్ధ భ్రమ
త్క్వణదభ్ర భ్రమకృద్ద్విరేఫగుణ ఝుంకార ప్రదాబద్ధసం
ప్రణవత్యుత్ప్రథిత ప్రవర్ధిత సమస్త క్షత్రసూయాధ్వర
క్షణసింహాసన భాసితుగ్ దృఢధనుశ్శ్లాఘాజనుగ్ ధర్మజుగ్.''[4]

''ఈ పద్యంలోని 2, 3 చరణముల యర్థము కుదురలేదు. మేము మార్చలేదు'' అని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తన 'ప్రబంధ రత్నావళి'లో మొదటి పుట క్రింద సూచించారు. సుదీర్ఘమైన సమాసాలలోనే కాక విడివిడిగా తత్సమ పదాలను వాడి రసపుష్టి కలిగించడం కూడ అథర్వణునికి చేతనౌను అని వెల్లంకి తాతంభట్టు ఉదాహరించిన ఈ ఉద్యోగపర్వంలోని పద్యం నిరూపిస్తుంది.

---

3. తాతంభట్టు – కవి చింతామణిలో ఉదాహరించాడు. ప్రబంధ – 21 పద్యం.
4. ప్రబంధ – 35 పద్యం.

''తృష్ణాతంతుని బద్ధబుద్ధులగు రాధేయాదులం గూడి శ్రీ
కృష్ణుం గేవలమర్త్యుగా దలచి మర్దింపగ నుత్సాహవ
ర్ధిష్ణుం డయ్యె సుయోధనుండకట! ధాత్రీనాథ! యూహింపుమా
యుష్ణీషంబుగ గట్టవచ్చునె మదవ్యాఢో గ్రశుండాలముః?''[5]

అథర్వణుని కాలంనాటికే కావ్యంలో పురవర్ణన చేయడం బాగా నాటుకు పోయిందని చెప్పడానికి అతడు చేసిన ఈ హస్తినాపుర వర్ణన సాక్ష్యమిస్తుంది.

''రాజమండల పూర్ణ రాజమండల వీధిరత్న గర్భామల రత్నగర్భ
గంధర్వ గంధర్వ గంధర్వ నగరంబు నాగపున్నాగపున్నాగవనము
మార్గణ మార్గణ మార్గణపీఠ ముత్తుంగ భుజంగ భుజంగ భూమి
కాంతకాంతారాతికాంతకుంతస్థలి వీరకుమార కుమార సరసి
యనగ బొగడుకెక్కు నలకాపురబుదే
వేందుపురము దానవేంద్రు పురము
గ్రేణిసేయు లలితశోణాంశుమణి బద్ధ
గోపురంబు హస్తినాపురంబు.''[6]

ఇప్పటిదాకా చూపిన పద్యాలవల్ల అథర్వణుడు తత్సమ, తద్భవశబ్దాలనేగాని జాతీయత ఉట్టిపడే తెలుగు మాటలు తన భారతంలో వాడలేదనిపించవచ్చునుగాని అతడు అందులో కూడ సిద్ధహస్తుడని ఈ పద్యం నిరూపిస్తుంది.

''పది దినము లయిదు ప్రొద్దులు
పదపడి రెణ్ణాళ్ల నొక్క పగలుఀ రేయుఀ
గదనంబుజేసి మడిసిరి
నదిసుత గురు కర్ణ శల్య నాగ పురీశుల్.''

ఈ పద్యాన్ని కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణ సారసంగ్రహంలో ఉదాహరించాడు. దేశ్యాలను ఎలా వాడాలో అథర్వణునికి బాగా తెలుసు. తన ఛందోగ్రంథంలో ఈ విషయం వ్రాసి ఉంటాడని ఆనందరంగరాట్ఛందములో పేర్కొన్న ఈ క్రింది పద్యం తెలియజేస్తుంది.

''దేశ్య తెలుగులందు దెలియ నొక్కొకచోట
హల్లులోననచ్చు లణగియుండు
నట్టిచోట రెండు నమరు వళ్ళకు జెప్ప
నాదిసుకవివరుల యనుమతమున.'' (3-180)

---

5. ప్రబంధ - 15వ పద్యం
6. ప్రబంధ - 45వ పద్యం.

(తెమ్మెర, ఓలమాస, క్రచ్చర, ఆరడి, వీరిడి, క్రిక్కిరిసె అను నీ మొదలుగాగల దేశ్య తెనుగు శబ్దములయందు హల్లులలో నచ్చులైన స్వరము లిమిడి యుండుటచేత అచ్చుకు, హల్లుకు ఆ యక్షరమునే యతిగా జెప్పనగు ననుట)

దేశ్యాలు వాడినా, తత్సమాలు వాడినా, రెండూ కలిపి వాడినా చక్కగా, చిక్కగా రచన చేయడంలో అథర్వణుడు ప్రజ్ఞావంతుడే అని అప్పకవి ఉదాహరించిన విరాటపర్వంలోని ఈ పద్యాలు తెలియజేస్తాయి.

''ధర్మతనయ! యుష్మదాజ్ఞానిగళవిని - బద్ధమగుచు జిక్కువడియె గాక!
విజయమత్తగజము విడివడ్డచో నడ్డ-పాటు గలదె విష్టపత్రయమున?
(అప్ప. 3-124)

శ్రీకంఠు డెదురునపుడు వ-నౌకోధ్వజమింద్రమకుట మర్జునతురగా
నీకము దివ్యశతాంగము- నా కవ్వడి కబ్బియున్న నత డేమగునో?
(అప్ప. 3-141)

ఆ కర్ణు దురాలాపము - లాకర్ణింపగ నసహ్యమై ద్రోణునితో
నాకనదీసుతుడనియె వ-నౌకోధ్వజ మెఱుగ వచ్చు నరు జూపితగగ్.
(అప్ప. 3-142)

ఢాండమిత్రభేరికాధ్వానముం ఢులీ ని
నాదమును మిన్నుముట్ట ననారతంబు
పెక్కు గంధర్వపతులు నల్దిక్కులందు
గాచు సౌగంధికంబు దేగలరె యొరులు?'' (అప్ప. 5-155)

అథర్వణుడు కనీసం కర్ణపర్వం దాకా భారతాన్ని అనువదించాడని అసందిగ్ధంగా చెప్పడానికి ఈ క్రింది పద్యం పనికివస్తుంది.

కురుపతి రవిసుతుని సువ-ర్ణరత్నభూషణతతుల నురక బహుమతిచే
సి రభసము మీఱ సేనల-కు రాజు గావించె సమరకుశలుండగుటన్.[7]

అథర్వణుడు ఆదిపర్వం నుంచీ అనువాదం మొదలుపెట్టాడనడానికి ఈ క్రింది పద్యం సాక్ష్యమిస్తుంది. దీనిని ఆంధ్ర కౌముదీకర్త ''అథర్వణ భారతే ద్రౌపదీ వివాహే సఖీం ప్రత్యర్జున వాక్యం'' అని 45వ పుటలో ఉదాహరించాడు.

''ఆతరిని చెలికి నిచ్చిన
రోతొడవులు తొడిగెనాసరోజదళాక్షి

---

7. ''ఆంధ్రకౌముది'' అను త్రిలింగశబ్దానుశాసనం అనే సంస్కృత భాషలో వ్రాసిన తెలుగు వ్యాకరణంలో అథర్వణాచార్యుల భారతంలోని ప్రయోగాలు ఉన్నాయి. వీటిలో తొమ్మిది పద్యాలను నిడుదవోలు వెంకటరావుగారు తమ తెనుగు కవుల చరిత్రలో అనుబంధంలో (పుటలు 390-391) ఉదాహరించారు.

కౌతుకమున జెప్పుమని విన
బ్రీతి జనించెడిని తనదు హృదయంబునకున్.''[8]

ఆదిపర్వంలోనిదే అని అజగరనహుషవాక్యంగా ఈ పద్యాన్ని ఆంధ్రకౌముదీకర్త ఉదాహరించినట్లు నిడుదవోలువారు ఉటంకించారు.

''నే నిదిగో మత్కులోద్భవుడైన జముని
వట్టి పాఱుని శాపంబు బాసి తింక
సొర్గమున కేగెదను మీరు సుఖము జెంది
యుండు డనుచు విమాన మెక్కండ నెగయ.''

ఈ పద్యంలో ఒక విలక్షణ ప్రయోగముంది. 'స్వర్గం' అనే పదానికి 'సొర్గము' అనే వికృతిని కవి ఉపయోగించాడు. ఇది 'సుఖము' అనే మాటకు వళిగా యతిస్థానంలో ఉంది. ఈ రూపాన్ని మన నిఘంటుకర్తలు స్వీకరించలేదు. శబ్దరత్నాకరం, ఆంధ్ర వాచస్పతం వంటి పుస్తకాలలో ఇది కనబడదు.

అథర్వణాచార్యుడు అరణ్యపర్వాన్ని అందులో ఉన్న ఉపాఖ్యానాలన్నింటితో అనువదించినట్టు ఈ రామాయణ కథలోని పద్యం చెప్తోంది.

నయమార రాఘవుడు నా-వయెక్కి నడిదాటి జాహ్నవీశైవలినిన్
జయజయ యని వినువీధుల-వియచ్చరులు సన్నుతింప వేడుకతోడన్.[9]

ఈ కందంలో ఒక అందం ఉంది. రెండు మూడు పాదాలలో 'వయెక్కి', 'వియచ్చ' అనే జగణాలున్నాయి. నాలుగింట జగణం వాడి ఆ అందాన్ని ప్రస్ఫుటంగా తిక్కనగారు ప్రదర్శించారు. అందుకే కందానికి తిక్కనగారినే ఘనుడంటారు. అథర్వణుడు కూడా నాలుగింట జగణం వాడడంలో నేర్పరి. 'వయెక్కి' అని జగణం వాడుతూ నావను యెక్కినట్టు ఛందస్సులోనే స్ఫురింపచేస్తున్నాడు. ఇది శిల్ప రహస్యం. ఇంతకుముందు ఉదాహరించిన 'కురుపతిరవిసుతుని' అనే పద్యంలో కూడా నాలుగింట జగణముంది. యుద్ధపంచకంలోనిదే యింకొక పద్యంలోకూడా అథర్వణుడు నాలుగింట జగణం వాడిన కందపద్యం ఉంది. చూడండి:

''కురుభీష్మకర్ణ గాంధా-రరాజభూరిశ్రవులు దొరకు తోడ్పడి గ్ర
చ్చర కవ్వడి మార్కొని ని-బ్బరముగ నటుగురిసిరంప వానలుకడిమిన్.''[10]

కుమార సంభవంలో నన్నెచోడుడు 534 కంద పద్యాలు వ్రాసినా ఎక్కడా నాలుగింట జగణం లేదు. ఒక్క పద్యంలో కొంత గ్రంథపాతం వుంది. అక్కడ ఒకవేళ నన్నెచోడుడు వేరెక్కడా వాడని నాలుగింట జగణం వాడేడేమో! చూడండి:

8. తెనుగుకవుల చరిత్ర. పుట. 391
9. తెలుగు కవుల చరిత్ర, పుట. 392
10. అందులోనే, పుట. 390

"స్తనములు సకుంతలాస్యము
వనములపై దోప వీక చవనజంబులు...
....చే
కొనుక్రియ వెల్లిత యీదెగోమలి కొలనన్." (కుమార. 9-84)

నాలుగింట జగణం వాడుతూ అథర్వణాచార్యులు వ్రాసిన యింకొక కందపద్యం మళ్ళీ అరణ్యపర్వంలోనే దొరుకుతుంది. చూడండి:

"వరధౌమ్యాచార్య పుర-స్సరులై స్వాధ్యాయహోమజపతత్పరులై
యరువదివేల సవులు ధ-ర్మరాజు మఖమఖుత జనిరి రాజ్యంబునకున్."[11]

అథర్వణాచార్యులు విరాటపర్వంలో నుంచి కూడా ఒక పద్యాన్ని ఆంధ్ర కౌముదీకర్త ఉదాహరించాడు. అది కీచకుడు ద్రౌపదితో చెప్పినది.

ఇక నొకసారి బల్కిన ఘులీలని చిందునో నోటిముత్యముల్
వికచసరోరుహాక్షి! వినవే! నను మన్ననచేసి కావుమీ
అకట! మనోభవాశుగచయంబుల నా తనువెల్ల నొచ్చిపో
దె! కరుణ సూపియేలుకొనుదే! కినుకిప్పుడుసేయ నేటికే?[12]

ఈ పద్యంలో కొన్ని విలక్షణ ప్రయోగాలున్నాయి. ముత్యాలు చిందే చప్పుడు 'ఘులీల్' అని కవి చెప్పాడు. నోటిముత్యాలు చిందడం చక్కని జాతీయం. 'ఏలుకొనవే' అని సంప్రార్థనకి 'ఏలుకొనుదే' అనే ప్రయోగం యతిస్థానంలో దొరుకుతున్నది. చిన్నయసూరిగారు 'సంప్రార్థనంబుల ముజ్జున కదాదులు విభాష ననుప్రయుక్తంబు లగు' (క్రియ. 33) అనీ, 'ఎదాదు లనుప్రయుక్తంబులగు నప్పుడు ముజ్జునకు వుజిరుజియగు' (క్రియ. 34) అనీ సూత్రీకరించారు. ఇది సమగ్రం కాదని బహుజనపల్లివారు ప్రౌఢ వ్యాకరణంలో 'ప్రార్థనంబునం దన్వత్యయాంతక్రియలమీద గదకదవు పూర్వకంబు లన్నాదు లనుప్రయుక్తంబు లగు' (క్రియ. 9) అని లక్షణశేషం చెప్పి 'ప్రోవ గదన్న', 'ప్రోవగద వన్న' మొదలైన రూపాలకు గతికల్పించాడు. అథర్వణుని ప్రయోగం వారు చూడలేదు. లేకపోతే కద, కదవులతోపాటు ఉత్త 'ఏ' కారానికికూడా సూత్రంలో చోటు కల్పించేవారు.

అథర్వణాచార్యుడు వ్రాసిన ఉద్యోగపర్వంలో నుంచి కూడా ఆంధ్ర కౌముదీకర్త ఒక పద్యాన్ని ఉదాహరించాడు. ఇది సంజయ ధృతరాష్ట్ర సంవాదంలోనిది.

"అరయగ వారెల్లరు బ్రబ[illegible]రు గావున వారితో విరోధమ్మునకే
లరపయదసందికిం బం-పురాచబెబ్బులి మతేనె పోయి మఱలెదన్."

11. తెనుగు కవుల చరిత్ర - పుట. 391
12. అదే పుస్తకంలో, అదే పుటలో.

ఇందులో మళ్ళీ మనకు నాలుగింట జగణం కనబడుతుంది. 'ఏమ్యాదుల ఇత్తునకు సంధి వైకల్పికముగా నగు' అనే వ్యాకరణ సూత్రానికి (బాల. సంధి. 5) ఉదాహరణగా మఱి+ఏనె=మఱేనె అనే ప్రయోగం ఇందులో వుంది. 'ప్రబలురు' అని బహువచనరేఫం ప్రాసస్థానంలో ఉంది. ఇక్కడ రాచబెబ్బులి వంటి ప్రయోగం తిక్కనగారి 'మెత్తని పులిని' స్ఫురింపజేస్తుంది. తిక్కనగారు ఉద్యోగ పర్వంలోనే సంజయ ధృతరాష్ట్ర సంవాదంలోనే ఈ పద్యం చెప్పాడు.

అనయము పుట్టి జూదమున యప్పుడ యింతయు జిచ్చుపెట్టి కా
ల్చిన యిది నీయుపేక్షయ వశీకృతచిత్తుడు ధర్మసూతి మె
త్తని పులి యెల్లవారలు నధర్మము నీపయిబెట్టునంతకున్
వినడును గానడుం బిదప నీకును నాకు మరల్పవచ్చునే? (ఉద్యోగ. 2-14)

తిక్కనగారూ, అథర్వణాచార్యుడూ సంజయ ధృతరాష్ట్ర సంవాదంలోనే మెత్తని పులి, రాచబెబ్బులి అనే మాటలను ప్రాసస్థానంలో వాడడం కాకతాళీయమైనా ఇద్దరు మహాకవులు ఒకలాగే ఆలోచిస్తారనడానికి ఇది నిదర్శనం.

తిక్కనగారు స్పష్టంగా చెప్పకపోయినా రేఫ ఱకారాలను ప్రాసస్థానంలో పులిమి చెప్పనన్నారు. అలాగే అథర్వణాచార్యుడు కూడా మామూలు 'ర'కారాన్ని, బండిరాని విడివిడిగా కేటాయించి వాడినట్టు కనబడుతుంది. 'ఱకారస్య' అని ఆంధ్ర కౌముదీ కారుడు అథర్వణ భారతంలోనుంచి ఒక పద్యాన్ని ఉదాహరించాడు.[13]

''తఱచైన కురుబలంబుల
మఱిపింపుచు కడిమిమెఱయ మారిమసగిన
ట్లఱిముఱి బెడంగు గద గొని
కఱువలి కొడుకండు నుఱుము కావించె వడిన్.''

ఇందులో 'కఱువలి' అనే మాట శకటరేఫంతో ఉంది. శబ్దరత్నాకరంలో కరువలి అని సాధురేఫంతోనే రూపాన్ని స్వీకరించారు. సూర్యరాయాంధ్ర నిఘంటువులో కూడా సాధురేఫ గల రూపమే వుంది. అథర్వణ ప్రయోగం వల్ల యిది శకటరేఫగల రూపంలాగ కనబడుతున్నది. అథర్వణుడు మహాకవేగాక లక్షణకర్త. ఇతని ప్రయోగాన్ని ఇంకొక లక్షణకర్త అయిన ఆంధ్రకౌముదీకర్త 'రేఫఱకార యోరుదాహరణాని' అని పేర్కొన్నాడు. 'కురుపతిరవిసుతుని' అనే పద్యం నుండి ఈ 'తఱచైన' పద్యందాకా వున్న తొమ్మిది పద్యాలను[14] నిడుదవోలు వెంకటరావుగారు మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోని 1323 సంఖ్యగల అముద్రిత గ్రంథం నుండి తీసుకున్నారట. ఈ తొమ్మిది పద్యాలూ చాలా విషయాలు మనకు తెలియజేశాయి. ఇవి అథర్వణ భారతం

13. తెనుగుకవుల చరిత్ర, పుట. 392.
14. తెనుగు కవుల చరిత్ర, పుట 390.

లోనివేగాని మరెందులోవీ పొరబడి ఆంధ్ర కౌముదీకర్త యివ్వలేదని నిడుదవోలువారు ఇలా వ్రాశారు: ''నన్నయ, తిక్కనలను బేర్కొని వారి భారత భాగవతములనుండి స్పష్టముగా గ్రంథకర్త యుదాహరణము లిచ్చియుండుటచేత పై యథర్వణభారతో దాహృతులు సరియైనవి యని గ్రహింపనగును.''[15] వెంకటరావుగారు అనుబంధంలో అదనంగా ఇచ్చిన తొమ్మిది పద్యాలతో కలిపి పందొమ్మిది పద్యాలు అథర్వణ భారతంలోనివి దొరికాయి.

మొత్తంమీద ఈ ఉదాహరణలన్నీ చూస్తూ వుంటే ఒక చక్కని భారత రచన మనకు దక్కలేదే అన్న చింత ప్రతి సాహిత్యప్రియునికీ కలుగుతుంది. ఇతని ఛందస్సులోనివని లాక్షణికులు ఉదాహరించిన పద్యాలను గమనిస్తే ఇతని గ్రంథం సమగ్రమైనదేమో అనిపిస్తుంది. ఒక్క ఆనందరంగరాట్ఛందంలోనే ఇతనివి 26 పద్యాలు పేర్కొన్నాడు.

అథర్వణుని భారతమో లేక కనీసం ఛందస్సో ముందు ముందు లభించాలని ఆశిద్దాం. ఇప్పటికి దొరికిన ఆకరాలనుబట్టి ఇతణ్ణి గురించి యింతకన్నా ఎక్కువ మనకు తెలియదు.

15. అదే పుస్తకంలో, పుట. 392

పద్మనాయక-రెడ్డిరాజుల యుగం

రేచర్లవారు వెలమవీరులు. వీరినే పద్మనాయకులంటారు. కాకతీయ సామ్రాజ్యంలో గణపతి దేవ చక్రవర్తి కాలం నుంచీ వీరు సేనానులుగా ఉండేవారు. రుద్రమదేవి రాజ్యానికి వచ్చినపుడు, ఆడది గద్దెనెక్కడం సహించలేని సామంతులూ, సేనానులూ తిరగబడినప్పుడు, రేచర్ల ప్రసాదాదిత్య నాయకుడు ఆమె పక్షం వహించి పోరాడాడు. అందుకే అతనికి 'కాకతీయ రాజ్యస్థాపనాచార్య' అనే బిరుదు వచ్చింది. ఇతని మనుమడు దాచానేడు ప్రతాపరుద్రుని వద్ద సేనానిగా ఉండేవాడు. దాచానేడు కుమారుడు సింగమనాయకుడు కూడా ఆ కొలువులోనే ఉండేవాడు.

తన అమ్మమ్మ రుద్రమదేవిని గద్దెమీద నిలిపినందుకు బహుశా, ప్రతాపరుద్రునికి వెలమవీరులంటే ఎక్కువ ఇష్టం కాబోలు, ఇతర కులాలవాళ్ళను త్రోసిరాజని వీళ్ళకే ఉన్నతపదవులు ఇవ్వడం మొదలెట్టాడు. ఇది చూచి ఇతర వర్ణాల నాయకులు తిరగబడ్డారు. క్రీ.శ. 1314 ప్రాంతాన గండికోటలో చేరి పితూరీ చేశారు. ప్రతాపరుద్రుడు స్వయంగా దీనిని అణచివేశాడు.[1] వెలమనాయకులు దక్షిణానికి దండు వెడలి ప్రతాపరుద్రునికి విజయాలు సంపాదించారు. అందుకే రేచర్లవారికి 'పంచ పాండ్య దళ విభాళ' అనే బిరుదు వచ్చింది. వెలమ వీరులందరిలోనూ సింగమ నాయకుడే ప్రతాపరుద్రునికి దయాపాత్రుడైనట్టున్నాడు. రాజు అతనికి ఎనభై వరాలు ఇచ్చాడట. సంస్కృతంలో ఎనభైని 'అశీతి' అంటారు. అందుకే ఇతనికి అశీతి వరాల సింగమ నాయకుడనే పేరు వచ్చింది. ప్రతాపరుద్రుని వద్ద ఉండే 72 మంది నాయకులలో ఈ ఎనభై వరాల నాయకుడే ప్రముఖుడని చెప్పుకోవచ్చు. అందుకే ప్రతాపరుద్రుని పరిపాలనా కాలాన్ని - కాకతీయ సామ్రాజ్యపు చివరి రోజులను మనం పద్మనాయక యుగంగానే పరిగణిద్దాం.

కాకతీయ సామ్రాజ్యంలో 72 మంది నాయకులుండేవారు. 75 మంది ఉండేవారా, లేక 77 మందా అన్నది ఒక చిన్న సమస్య. వడ్డాది అప్పారావుగారు 72మంది నాయకుల పేర్లను పట్టికవేసి చూపించారు.[2] ఈ నాయకులలో బ్రాహ్మణులు, రెడ్లు, వెలమలు, కాయస్థులు, క్షత్రియులు - అన్ని వర్ణాలవాళ్ళూ ఎందరో వున్నారు. వీళ్ళలో చాలామంది చారిత్రక పురుషులుగానే కనబడుతున్నారు. కొందరిని గురించి శాసనాధారాలు కూడా దొరుకుతున్నాయని వడ్డాది అప్పారావుగారు వ్రాశారు.

ఈ నాయకులందరూ ప్రతాపరుద్రునితో బాటు మహమ్మదీయులను ఎదిరించారు. తెలుగు చక్రవర్తి పర రాజుల చేత చిక్కాక, తెలుగుదేశం అల్లకల్లోలమైనప్పుడు ఈ నాయకులందరూ ఒక్క త్రాటిమీద నడచి ముసునూరివారి నాయకత్వం క్రింద కలసికట్టుగా మహమ్మదీయులతో పోరాటం సాగించారు. ఆంధ్రదేశపు వివిధ ప్రాంతాలపై వివిధ

1. ఆంధ్ర సంస్కృతి - చరిత్ర (1960) - డాక్టరు బి. రామరాజుగారు తమ విద్యార్థులచేత వ్రాయించిన సంపుటం, పుట 231.
2. రెడ్డి సంచిక - పుటలు 6, 7.

నాయకుల పెత్తనం తొలినుంచీ సాగుతూనే వుంది. ప్రతాపరుద్రుడు పోయాక వాళ్ల వాళ్ల మండలాలకు వాళ్లు వాళ్లు అధిపతులయ్యారు. ఈ నాయకులలో ముఖ్యులయిన వాళ్ళలో ఎవరెవరు ఏయే ప్రాంతాలు పాలిస్తూవచ్చారో ఈ పట్టిక చూడండి.

వరుస	నాయకుడు	ముఖ్యనగరం లేక ప్రాంతం
1.	ఇందులూరి రుద్రదేవుడు	సింహాచలం నుండి ఏలూరి దాకా
2.	కొప్పుల రెడ్లు	పిఠాపురము రాజధానిగా కొఠాము ప్రాంతాలు రుద్రదేవుడి క్రింద ఏలారు.
3.	ముమ్మడి నాయకుడు	రాజమండ్రి దగ్గరి కోరుకొండ రాజధాని.
4.	ముసునూరి అనపోతా రెడ్డి	తొయ్యేరు ముఖ్యనగరం
5.	ముసునూరి ప్రోలయనాయకుడు	రేకపల్లి ముఖ్యనగరం- భద్రాచలం పాలవంచ ప్రాంతం
6.	కాపయ నాయకుడు	ఆమనగల్లు రాజధాని
7.	చెరకువంశపు రెడ్లు	కమ్మనాడు
8.	దేవగిరి నాయుడు	పల్నాడు
9.	శ్రీగిరి నాయుడు	తంగెడ
10.	సోమయాజుల రుద్రసేనాని	వెలనాడు
11.	గోనవంశపు రెడ్లు	వర్ధమానపురం
12.	ముప్పిడి నాయకుడు	పాకనాడు
13.	జుట్లయలెంక గొంకరెడ్లు	ములికినాడు, రేనాడు మొదలగునవి
14.	రేచర్ల సింగమ నాయకుడు	రాచకొండ
15.	గణపతి నాయకుడు	మంచికొండ
16.	వేమారెడ్డి	అద్దంకి

ఈ నాయకులందరూ సంఘీభావంతో ముసునూరు ప్రోలయ నాయకుడి ఆధిపత్యం క్రింద యుద్ధం చేసి మహమ్మదీయుల పరిపాలన తెలుగుదేశంలో తాత్కాలికంగా ఆపారు. ప్రతాపరుద్రుని మరణంతో తురుష్కులకు వశమైన ఓరుగల్లుకు 1336లో విముక్తి కలిగింది. మళ్ళా ఓరుగల్లు కోట కొత్తళం మీద ఆంధ్ర పతాక ఎగిరింది. ఆంధ్రదేశాధీశ్వర, ఆంధ్రసురత్రాణ బిరుదులతో ముసునూరి కాపయ నాయకుడు తెలుగుదేశానికి అధిపతి అయ్యాడు. స్వాతంత్ర్య విజయాలు లభించేదాకా తెలుగు నాయకులలో ఉండే సంఘీభావం, ఐకమత్యం తరువాత అంతరించాయి. ఎవరికి వాళ్లే స్వతంత్రించి స్వతంత్ర రాజ్యాలు ఏర్పరచుకొన్నారు.

దేశానికి ప్రమాదం తప్పిందనగానే రేచర్ల సింగమ నాయకుడు తన గొప్పను ప్రకటించుకున్నాడు. ముసునూరి కాపయ నాయకునికి లోబడి ఉండడం పరువు తక్కువ అనుకున్నాడు. దక్షిణ దిశనున్న నాయకులందర్నీ జయించి తన రాజ్యాన్ని కృష్ణా నదీతీరం దాకా విస్తరింపజేశాడు. కృష్ణా, తుంగభద్రానదుల మధ్యనున్న కొన్ని దుర్గాలు, నల్లగొండ

జిల్లాలోని ఏలేశ్వరం అతనికి వశమయ్యాయి. అమనగల్లు అతని కేంద్రం. తన రాజ్యాన్ని అతడు ఉత్తర దిశలో కూడా వ్యాపించదలచుకొన్నాడు. కాపయ నాయకునితో యుద్ధం చేశాడు. 1340 ప్రాంతాలలో తన బావమరిదిని చెరలో పెట్టారని రేచర్ల సింగమ నాయకుడు జల్లిపల్లి కోటను ముట్టడించాడు. ఆ కోటకు అధిపతులయిన సోమవంశ క్షత్రియులు మాయోపాయంతో సింగమ నాయకుణ్ణి చంపివేశారు.

ఈ వార్త వినగానే సింగమ నాయకుని కుమారులు అనపోత నాయకుడు, మాదా నాయకుడు ఉద్రిక్తులయ్యారు. కత్తికట్టి జల్లిపల్లి కోటను ముట్టడించి, ఆ రాజులనూ, వాళ్ళకు తోడ్పడ్డ వాళ్ళనూ చంపి పోగులు పెట్టి, ఆ రక్తంతోనే తండ్రికి తర్పణం చేశారు. ఈ వెలమ సోదరులు అనేక యుద్ధాలు చేశారు. పద్మనాయక రాజ్యాన్ని సుస్థిరం చేశారు. ముసునూరి కాపయ నాయకుణ్ణి యుద్ధంలో చంపి అనపోత నాయకుడు ఓరుగల్లు వశపరుచుకున్నాడు. ఆంధ్ర సామ్రాజ్యానికి రాజధానిగా ఉన్న ఈ ముఖ్య నగరాన్ని జయించినా, అనపోత నాయకుడు రాచకొండనే తన రాజధానిగా చేసుకొని పాలించాడు. తన తమ్ముడు మాదారేడును దేవరకొండ పాలకుణ్ణి చేశాడు. నాటి నుంచి మాదారేడు సంతతి దేవరకొండలోనూ, అనపోత నాయకుని వంశంవాళ్ళు రాచకొండలోనూ ఉండి రాజ్యం చేశారు. రేచర్లవారి రాజ్యానికి ఉత్తరాన గోదావరి నుంచి, దక్షిణాన శ్రీశైలం, పశ్చిమాన బహమనీ రాజ్యం, తూర్పున కొండవీడు రాజ్యం సరిహద్దులు. అనపోత నాయకుడి కాలం నుంచి ఆ పద్మనాయకుల చరిత్రే ఇప్పటి తెలంగాణా చరిత్ర అయింది. పశ్చిమాన ఉన్న బహమనీ సుల్తానులతో సహజీవనం మంచిదని పద్మనాయకులు భావించారు కాబోలు, వాళ్ళతో సంధి చేసుకున్నారు. గోలుకొండ ప్రాంతాలను వాళ్లకు వదలిపెట్టారు. ఇప్పుడు పద్మనాయకులు ఇలా చేయబట్టే గోలుకొండ, భాగ్యనగరం రాజధానులుగా ఉత్తరోత్తరా తెలుగు రాజ్యాన్ని నవాబులు పాలించారు.

పద్మనాయకులు తెలంగాణాలో విజృంభించి తమ రాజ్యాన్ని ఏర్పరచుకొంటున్న కాలంలోనే అద్దంకి సీమలో రెడ్డిరాజులు స్వతంత్రించి రాజ్యం నిర్మించుకొన్నారు. ఒక రకంగా పద్మనాయకులూ, రెడ్డిరాజులూ ఆనాటి తెలుగు చరిత్ర రథానికి రెండు చక్రాలు. అందుకే కాకతీయ సామ్రాజ్యం అస్తమించిన తరువాత విజయనగర రాజ్యం విస్తరించి రాయల యుగం మొదలయ్యేదాకా వున్న మధ్య కాలం 150 సంవత్సరాలలో పూర్వార్ధాన్ని పద్మనాయక యుగమనీ, ఉత్తరార్ధాన్ని రెడ్డిరాజుల యుగమనీ పేర్కొంటున్నాం. పద్మనాయక యుగంలో ఇతర రాజుల ప్రాపకంలో ఉన్న కవులు కూడా వస్తారు. క్రీ.శ. 1375 దాకా పద్మనాయక యుగమని చెప్పుకుందాం.

రెడ్డి రాజ్యాన్ని స్థాపించిన వేమారెడ్డి క్రీ.శ. 1325-1353 మధ్య కాలంలోనివాడు. ఇతడు అశీతి వరాల సింగమ నాయకుడి సమకాలికుడు. అద్దంకి సీమను పాలించాడు. ఇతని ఆస్థానంలో కవిత్రయంలో మూడవవాడైన ఎఱ్ఱా ప్రెగ్గడగారున్నారు.

ఈ శతాబ్దంలో పరిపాలించిన పద్మనాయకుల పేర్లూ, రెడ్డిరాజుల పేర్లూ, వాళ్ల వాళ్ల కాలాలూ తెలుసుకుందాం.

పద్మనాయక ప్రభువులు

అశీతి వరాల సింగమ నాయకుడు	క్రీ.శ.1335–1361
రాచకొండలో అనపోత నాయకుడు	
దేవరకొండలో మాదా నాయకుడు	క్రీ.శ. 1361–1384
రాచకొండలో కుమారసింగ భూపాలుడు	
దేవరకొండలో పెదవేదగిరి నాయకుడు	క్రీ.శ. 1384–1399

రెడ్డిరాజులు

వేమారెడ్డి	క్రీ.శ.1325–1353
అనపోతారెడ్డి	క్రీ.శ.1353–1364
అనవేమారెడ్డి	క్రీ.శ. 1364–1386
కొమరగిరిరెడ్డి	క్రీ.శ. 1386–1402

ఈ శతాబ్దంలో జీవించిన కవుల చరిత్రను సులభంగా అవగాహన చేసుకొందుకు ఈ రాజకీయ చరిత్రను తెలుసుకొనవలసి వచ్చింది. ఆయా కవుల గురించి చర్చిస్తున్నప్పుడు ఈ రెడ్డిరాజుల గురించి తెలుసుకొందాం.

కాకతీయ సామ్రాజ్యం పతనమయ్యాక, పద్మనాయకులూ, పంటరెడ్లూ మాత్రమే కాక మరికొందరు కూడా రాజ్యాలు ఏర్పరచుకున్నారు. వాళ్లలో ఆనెగొందిని పాలించిన హరిహరరాయలు, అతని సోదరుడు బుక్కరాయలు ముఖ్యులు, ఈ కంపిలి రాజ్యమే తరువాత విజయనగర సామ్రాజ్యంగా పరిణమించింది. మనం ఇప్పుడు చెప్పుకొంటున్న పద్మనాయక యుగంలోని రాజులకు సమకాలికులైన కంపిలి రాజుల పట్టికను కూడా చూద్దాం.

మొదటి హరిహరరాయలు	క్రీ.శ. 1335–1355
మొదటి బుక్కరాయలు	క్రీ.శ. 1355–1377
రెండవ హరిహరరాయలు	క్రీ.శ. 1377–1404

ఈ కంపిలి రాజులలో మొదటి హరిహరరాయలు రాజ్యస్థాపనలోనే నిమగ్నుడయ్యాడు. అతడు చేసిన విద్యాపోషణ ఏమిటో మనకు తెలియదుగాని అతని సోదరుడు మొదటి బుక్కరాయలు మాత్రం విద్వాంసుడు, విద్యాభిమాని. సాయన, మాధవులు ఇతని కొలువులోనే వుండి వేదభాష్యం వ్రాసి ఈ రాజునకు అంకితమిచ్చారు. సంవిధాన చక్రవర్తి నాచన సోముడు బుక్కరాయలవల్ల అగ్రహారం పుచ్చుకున్నాడు. కంపిలి రాజులలో

కొందరు స్వయంగా కవులు; అందులోనూ అనంతర కవులు నుతించేటంత గొప్ప కవులు. మొదటి బుక్కరాయలకు ఏడుగురు కుమారులు. వీరిలో ఆరవవాడు భాస్కర భవదూర మహీపతి. ఇతడు భవదూరుడు అనే పేరుతో ప్రసిద్ధుడైన కవి. ఎడపాటి ఎర్రన అనే కవి క్రీ.శ. 1678–1693 ప్రాంతాలలో మల్హణ చరిత్ర అనే గ్రంథంలో పూర్వకవులను ఇలా స్తుతించాడు.

వినుతు లొనర్తు నాంధ్రసుకవిప్రభు నన్నయభట్టు, దిక్కయ
జ్వను, శివదేవు, భాస్కరుని, జక్కన, నాచనసోము, సర్వదే
వుని, భవదూరు, వేము...

ఈ పద్యంలోని భవదూరుడు కంపిలి రాజకుమారుడే. ఇతణ్ణి జంటకవులు తురగా రాజకవి, అయ్యంకి బాలసరస్వతులు తమ 'నాగరఖండం' అనే ప్రబంధంలో క్రీ.శ. 1731 తర్వాత ఇలా పేర్కొన్నారు :

శివతత్త్వ శివదేవు, చిన్మయు భవదూరు
శరభాంకు రాజశేఖరుని వేము...

అనంతర కవులచే ఇలా నుతులు పొందిన ఈ భవదూరుడు ఏ గ్రంథాలు రాశాడో తెలియదు. ఇతని పద్యాలను కొన్నింటిని సంకలనకర్తలు స్వీకరించారని నిడుదవోలు వెంకటరావుగారు వ్రాశారట.[3]

నాచన సోముని గురించి చెప్పుకొనేటప్పుడు కంపిలి రాజులను గురించి అవసరమైనంత చెప్పుకొందాం. ఇప్పుడు పద్మనాయక ప్రభువుల కాలంలోని సాంఘిక చరిత్రనూ, సాహిత్య స్థితినీ తెలుసుకొందాం.

ఈ యుగం రాజకీయంగా అల్లకల్లోలాలతో ప్రారంభమైంది. పద్మనాయకులు వీరాధివీరులు. అమిత పరాక్రమవంతులు. ప్రచండ రణవ్యాపారం వారికి ఒక క్రీడావిశేషం. ఈ కాలంలో వీరు వాడుకలోనికి తెచ్చిన భయానక బీభత్స చర్య రణముకుడుపుట; అనగా "శత్రువులు నిహతులైనచోట వారి రక్తముతో కలిపిన అన్నము వారి తలపునుకలలో పెట్టుకొని యొడలికి భస్మమలదికొని, జుట్టు విరయబోసుకొని యర్ధరాత్రి కాలమున నొంటిగా దిగంబరులై భూతబలి మంత్రములు చదువుచు ఢాకిన్యాదులకు బలిపెట్టుట. ఇది ఆగమోక్త విధానమని చెప్పుదురు. యుద్ధమున జయించినపుడెల్ల వీరు ఈ విధమున చేయుచు వచ్చిరని 'వెలుగోటి వంశావళి' తెలుపుచున్నది. ఈ యాచారము తెలంగాణాలోనే రేచర్ల వంశులలోనే వాడుకలో నుండినట్లు కనిపించును" అని కీ.శే. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు వ్రాశారు.[4]

3. ఇది ఆంధ్ర కవి తరంగిణి నాలుగవ భాగం పుట.150లో చాగంటి శేషయ్యగారు చెప్పారు. వెంకటరావుగారు భవదూరుడు గురించి భారతిలో వ్రాశారు. ఏ సంవత్సరమో, ఏ నెలో శేషయ్యగారు చెప్పలేదు.

4. విజ్ఞాన సర్వస్వం – తెనుగు భాషాసమితి ప్రచురణ – 3వ సంపుటం పుట. 305

ఈ యుగంలోని కవుల రచనలలో కూడా ఈ వీరాచారం కనబడుతుంది. మడికి సింగన వ్రాసిన దశకుమార చరిత్రలో బాణాసురుడు శివునితో ఇలా చెప్పుకొంటాడు.

వీరరక్తంబుల వేతాళ సమితి-నారూఢగతి నోలలాడింపలేదు
యొరపైన నృపలోక మృదుశరీరముల-మెరసి ఢాకినులకు మేవగాలేదు.
(కల్యాణ కాండ. 769-770)

'వెలుగోటివారి వంశావళి'లో ఈ ఆచారం ఇంకా ఇలా సవిస్తరంగా ఉంది.

''నూటొక్క రాజుల శిరంబులు ఖండించి, యేబదియొక్క రాజుల గలుగాన్గలాడించి మఱియు ముప్పదిముగ్గురు రాజుల బట్టి పూజించి రణ బలిగా తెచ్చి యా రణక్షోణినర్పించి, దిగంబరీ, కాళీ, మహాకాళీ, శాకినీ, ఢాకినీ, బాయిళాకాయినీ భూతప్రేతపిశాచంబుల దలచి రణదేవరా! మహారణరాజా, రణశూరా, రణవీరభేతాళా! భైరవా, వీరభద్రా, రణపోతురాజా కలహకంటకీయని నిజబలంబులకు జయంబు కల్గెననుచు కలహాధిదేవతల నారాధించి, తలంచి, పూజించి, కాళీమహాకాళికి వీరరాజుల నరబలిగా నరకించి భట్టును దామును రణము గుడిపించి...

రాజుల నూటయొక్కరి శిరంబుల ద్రుంచి రణంబులోపలఁ
రాజకుమారు లెమ్మురుధిరంబుల పండిన భుక్తి దృప్తులై
రాజకపాలపాత్రమున రక్తము గ్రోలుచు భూతకోటుల
ట్లాజి జయుండు సింగవిభు నగ్రసుతుండనవోతు బాడెడుఁ
కొమ్మని మచ్చ యౌబళుని గూల్చి శిరంబులు ద్రుంచి గన్నుయఁ
బిమ్మట ద్రుంచి తత్సుతుల బేర్చిన బొమ్మలువెట్టి దారులం
దమ్మటము ల్వెసం గొనియె దాచయసింగని పట్టి యెట్టిడో
బొమ్మలుబెట్టు నిట్టు లనపోతడు వైరము బూనువారికిఁ

రణవీధి గొండమగ్రాజుగొమ్మల దేవు పిన్నని జయరుద్రు బెనచి తరిగి
తలలు పొక్కండ్లుగా నిలిపి తద్రక్తమై యెసరుగా బలివండి యెసక మెసగి
హెమ్మాడియును గూడి యెలమి నూటొక్కంధ్ర రాజుల బగబట్టి రమణ జంపి
కలుగాన్గ లాడించి కలరక్త మెల్లను భూతసమితి తృప్తి పొందుపరచి
జల్లిపల్లొద్ద రాజుల త్రుళ్లణంచి - యహహబిరుదులు పచరించిరపుడు వేడ్క
నను మగ ల్చొచ్చి రలభట్టు లౌననంగ మహిని సింగయయనపోత మాదవిభులు.

శత్రువుల పైన అంత కక్ష, చంపాక కూడా వీరావేశం, బీభత్స ప్రధానమైన ఆచరణ, జుగుప్స లేకుండా నెత్తుటికూడు నివేదించడం మొదలైనవి మాధ్యమిక యుగాల బర్బరత్వ చిహ్నాలు. ఒక ప్రక్క ఇంత అమానుషంగా ప్రవర్తిస్తూనే ఆనాటి వ్యక్తులు కళలను కూడా ఆరాధించారు. గ్రంథాలను రచించారు. సాహిత్యాన్ని సృష్టించారు. సరస్వతిని సేవించారు.

క్రీ.శ. 1384 నుండి పద్మనాయక రాజ్యాన్ని పాలించిన కుమార సింగభూపాలుడికి 'సర్వజ్ఞ' అనే బిరుదు ఉంది. ఇతడు గొప్ప సాహిత్య పోషకుడు.

సర్వజ్ఞ సింగ భూపాలుడు స్వయంగా రచయిత, సంస్కృతంలో 'రసార్ణవ సుధాకరం' అనే అలంకార శాస్త్రం, 'సంగీత సుధాకరం' అనే నాట్యగ్రంథం, 'కందర్ప సంభవం' అనే భాణం, 'కువలయావళి' అనే నాటిక వ్రాశాడు. ఇందులో 'కందర్ప సంభవం' దొరకలేదు. (దీనిని ఇతడు వ్రాయలేదేమో! చూ॥ ఈ పుస్తకంలోనే పశుపతి నాగనాథుడి చరిత్ర) మిగతా పుస్తకాలన్నీ దొరుకుతున్నాయి. వాటిని అచ్చు వేశారు కూడా. రసార్ణవ సుధాకరాన్ని బులుసు వెంకట రమణయ్యగారు అనువాదం చేసి 1950లో ప్రకటించారు. ఇది మూడు విలాసములు - అంటే భాగాలు గల నాట్యాలంకారశాస్త్ర గ్రంథం. ఈ మూడు భాగాలలో వరుసగా రస, భావ, నాట్య విషయాలు లక్షణోదాహరణాలతో సహా వివరించాడు. ఎన్నో కావ్యనాటకాల నుండి ఉదాహరణలిచ్చాడు. అలంకార శాస్త్రాలలో మరేదీ ఇందులో చెప్పినంత విపులంగా రూపకాల గురించి చెప్పదట. సింగ భూపాలుడు స్వయంగా కొన్ని రూపక భేదాలను రచించినవాడాయె మరి.

ఈ సర్వజ్ఞుడు వ్రాసిన సంగీత సుధాకరం శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరానికి వ్యాఖ్యానం. ఇది సింగ భూపాలుడు వ్రాయలేదని, అతని అస్థానంలోని విశ్వేశ్వర కవి వ్రాసి రాజు పేరు పెట్టి ఉండాలని డాక్టర్ వి. రాఘవన్‌గారు వ్రాశారట.[5] సింగ భూపాలుడు 'రత్నపాంచాలిక' అనే ఒక సంస్కృత నాటకాన్ని కూడా వ్రాశాడని చెప్పుకుంటారుగాని, ఇది కువలయావళికి మరోపేరు. ఇతని కొలువులో గొప్ప విద్వాంసులుండేవారు. చమత్కార చంద్రిక వ్రాసిన విశ్వేశ్వర కవి, పశుపతి పండితుడు, అతని కొడుకు నాగనాథుడు, అమరకోశానికి వ్యాఖ్య వ్రాసిన బొమ్మకంటి అప్పయామాత్యుడు, దేవరకొండ రాజ్యంలో శాకల్యమల్లభట్టు, శాకల్యఅయ్యలార్యుడు మొదలైన విద్వాంసులు ఉండేవారు.

శాకల్య మల్లభట్టు శైవుడు. రాచకొండ, దేవరకొండ ప్రభువులు మొదట శైవులే. అయితే, వేదాంత దేశికుల కుమారుడు వరదాచార్యుడనే పండితుడు సర్వజ్ఞ సింగమ నాయకుని కొలువులోనికి వచ్చి ఆస్థాన పండితుడైన శాకల్యమల్లభట్టును ఓడించి వైష్ణవ మతాన్ని స్థాపించి రాజువల్ల మిక్కిలి గౌరవము పొందినట్లు వైష్ణవ గ్రంథాలు చెప్తున్నాయట.[6] సర్వజ్ఞ సింగ భూపాలుడు మత రహస్యాలను తెలుసుకొని రావడానికి కొందరు వైష్ణవులను వేదాంత దేశికుల వద్దకు పంపాడని, వారు రహస్య సందేశ, తత్త్వ సందేశ, సుభాషిత నీవ్యాది గ్రంథాలను వ్రాసి అతనికి పంపించారని ఒక ఐతిహ్యమున్నట్లు

5. ఆంధ్ర వాగ్గేయకారు చిత్రము - బాలాంత్రపు రజనీకాంతరావు, పుటలు 28, 29.
6. ఆంధ్ర సంస్కృతి - చరిత్ర - డాక్టరు బి. రామరాజుగారు విద్యార్థుల చేత వ్రాయించిన సంపుటం పుట 253

చిలుకూరి వీరభద్రరావుగారు వ్రాశారు.[7] సింగమ నాయకుడి కాలంలోనే రేచర్ల వారు వైష్ణవాన్ని ఆదరించారుగాని అంతకుముందు వాళ్లు శైవులే. భైరవప్రతిష్ఠలు చేసినవాళ్లే.


రంగనాథ రామాయణం వంటి వైష్ణవ గ్రంథాలు, నవనాథ చరిత్ర వంటి శైవసిద్ధుల గాథలు వెలువడిన ఈ కాలంలో కవులు హరిహర సమన్వయం అలవరచుకొంటున్నట్టు కనబడుతుంది. ఎర్రయ్యగారు శంభుదాసు అనే బిరుదుపెట్టుకొని రామాయణం, నృసింహపురాణం వ్రాశారు. ఏమైనా ఈ కాలంలో వీరశైవం తగ్గుముఖం పట్టిందని చెప్పాలి. అయితే వీరశైవులు సృష్టించిన ద్విపద ఛందస్సు ప్రజాదరణ పొందింది. రాజులు, కవులు సమానంగా ఆదరించిన ఛందస్సు అది. ఈ యుగంలోని కవుల గురించి, వారి గ్రంథాల గురించి ఇంకా విపులంగా ప్రతాపరుద్రుడి అవసానకాలం దగ్గర్నుంచీ వరుసగా తెలుసుకొందాం. దానికి ముందు ఈ యుగం ఉత్తరార్ధంలోని రెడ్డి రాజ్యాల గురించి మరికొంత విపులంగా చెప్పుకోవాలి.

రెడ్డిరాజుల యుగం

క్రీస్తు శకం పధ్నాలుగు, పదిహేను శతాబ్దాలలో రెడ్డిరాజులు ప్రత్యేకంగా ఒక మహారాజ్యాన్ని తెలుగు దేశంలో స్థాపించి పాలించినా, రెడ్లు మన దేశ చరిత్రలో అంతకన్నా చాలా ప్రాచీనులు. ఈ రెడ్డిరాజ్య స్థాపనకు సుమారు వెయ్యేళ్ళ ముందు క్రీ.శ. 7వ శతాబ్దంలో ప్రతి ఊళ్లోనూ రెడ్లు ఉండేవారని శాసన ప్రమాణం ఉంది. అయితే ఆ ప్రాచీన కాలంలో రెడ్లను 'రట్టగుళ్ళు' అనే పేరుతో పిలిచేవారు. క్రీ.శ. 632లో వేయించిన ప్రథమ విష్ణువర్ధనుని చీపురుపల్లి శాసనంలో ''రాష్ట్రకూట ప్రముఖాన్ కుటుంబినః'' అనే ప్రసక్తి మొదటిసారిగా కనబడుతుంది.[8] ఈ రాష్ట్రకూట ప్రముఖులనే 'రట్టగుళ్ళు' అనేవారు. 'కుటుంబినః' అనే పదానికి 'సేద్యంచేసేవాళ్ళు' అని అర్థం.[9]

ఈ రాష్ట్రకూట కుటుంబీకులను ఆయా గ్రామాలలో సమావేశపరచి ప్రాచీనులు తాము చేసిన దానశాసనాలను ప్రకటించేవారు. అప్పుడు దానం సంగతి అందరికీ తెలిసేది. రాష్ట్రకూట ప్రముఖ కుటుంబీకులకు 'పంట రెడ్డి ప్రముఖులు' అని ఒకరకంగా అర్థం చెప్పుకోవచ్చు. ఆదిమ కాలంలో కాడి కట్టుకొని సేద్యం చేసే పంటరెడ్లు కాకతీయ యుగం నాటికి కత్తి పట్టుకొని కదనం చేసేవారయ్యారు. మాతృదేశాన్ని పరరాజుల దాడి నుండి రక్షించే నాథులయ్యారు. ప్రతాపరుద్రుణ్ణి ఢిల్లీ సైన్యాలు పట్టుకొనిపోయాక కాకతీయ సామ్రాజ్యం అంతరించింది. కొన్నాళ్ళదాకా వివిధ ప్రాంతాలలో నాయంకరాలు చేసేవాళ్లు ఏకతాటిమీద నిలబడి ముసునూరివాళ్ళ నాయకత్వం క్రింద దేశానికి స్వాతంత్ర్యం

7. ఆంధ్రుల చరిత్ర - మూడవ భాగం, పుట 55
8. Indian Antiquary, Vol.XX p.15
9. రెడ్డి సంచిక; రెడ్డి పదోత్పత్తి వికాసం - కందూరి ఈశ్వరదత్తు, పుట 104


రెడ్డిరాజుల కాలంనాటి
ఆంధ్రప్రదేశం
రామగిరి
ఓరుగల్లు
రాచకొండ
దేవరకొండ
సింహాచలం
పిఠాపురము
రాజమండ్రి
ద్రాక్షారామము
బెజవాడ
శ్రీశైలము
బెల్లంకొండ
కొండవీడు
మచిలీపట్నం
వినుకొండ
చెందవోలు
అద్దంకి
కంపిలి
త్రిపురాంతకము
మోటుపల్లి
విజయనగరము
కందుకూరు
ఉదయగిరి
నెల్లూరు

తెచ్చారని పద్మనాయక యుగంలో చెప్పుకున్నాం. ఆ తరువాత పద్మనాయకులు రాచకొండ, దేవరకొండ రాజ్యాలనూ, పంటరెడ్లు కొండవీటిరెడ్డి రాజ్యాన్నీ, సంగమవంశ రాజులు విజయనగర రాజ్యాన్నీ స్థాపించుకొని ఏకకాలంలో పాలించారని చెప్పుకొన్నాం. ఇప్పుడు ప్రత్యేకంగా ముందు రెడ్డిరాజుల యుగం గురించి చెప్పుకుందాం.

రెడ్డిరాజ్య స్థాపన క్రీ.శ. 1325లోనే జరిగింది. ప్రోలయ వేమారెడ్డి రాజ్యాన్ని స్థాపించడమేకాక పరాక్రమంతో పరభూముల్ని ఆక్రమించి అనుజులకు, తనుజులకు, బంధువులకు, మిత్రజనులకు ఇచ్చాడు. చాలా పెద్ద రాజ్యం వారసులకు ఇచ్చిపోయాడు. అయితే అది పద్మనాయకుల ధాటికి తట్టుకొని క్రీ.శ. 1353–1364 మధ్య పాలించిన అనపోతారెడ్డి కాలంలో నిలబడ్డది కాని తరువాత విచ్ఛిన్నం కావటం మొదలుపెట్టింది; శిథిలమైంది. ఇది 1364–1386లో పరిపాలన చేసిన అనవేమారెడ్డి కాలంలో జరిగింది. అయితే కొమరగిరిరెడ్డిని రాజుగా ఉంచి, అతని బావమరిది కాటయ వేముడు రాజ్యాన్ని పెంచి సుస్థిరం చేశాడు. అందుచేత ఉజ్జాయింపుగా 1375 నుంచి రెడ్డిరాజుల యుగాన్ని లెక్క పెట్టుకుందాం.

ప్రోలయ వేమారెడ్డి తన అన్నగారికి చందనవోలు రాజ్యం ఇచ్చాడు. తాను కొండవీడు రాజధానిగా పాలించాడు. కొన్నాళ్ళకు రెడ్డిరాజ్యంలో రాజమహేంద్రవరం కూడ ఒక ముఖ్యమైన రాజధానిగా ఏర్పడింది. కొండవీటి రెడ్డిరాజ్యం అంతమైన మరికొన్నాళ్ళదాకా రాజమహేంద్రవర రాజ్యం ఒక వెలుగు వెలిగింది. ఈ మూడు ప్రాంతాలలోనూ ఏక కాలమందే జరిగిన చరిత్రను అర్థం చేసుకోటానికి దానిని ఒక పట్టిక రూపంలో చదువుకుందాం.

చందనవోలు	కొండవీడు	రాజమండ్రి
ప్రోలయ వేమారెడ్డి అన్న మాచారెడ్డి గుంటూరు జిల్లా చందనవోలు రాజధానిగా క్రీ.శ. 1325 నుంచి పాలించాడు.	క్రీ.శ.1325లో ప్రోలయ వేమారెడ్డి రెడ్డి రాజ్య స్థాపన చేశాడు. ఇతడు ఎర్రా ప్రెగడగారిని ఆదరించిన రాజు. తన బంధువులకు వివిధ సీమలు ఇచ్చాడు. క్రీ.శ. 1325 నుంచి 1353 దాకా పాలించాడు.	
	1353లో ప్రోలయ వేమారెడ్డి పోయాక అతని కొడుకు అనపోతారెడ్డి రాజ్యానికి వచ్చాడు. 1364 దాకా	

చందనవోలు	కొండవీడు	రాజమండ్రి
	పాలించాడు. ఇతని కుమారుడు కొమరగిరి రెడ్డి. అయితే తండ్రి మరణానంతరం కుమారుడు రాజు కాలేదు. అనపోతారెడ్డి సోదరుడు రాజ్యం చేశాడు.	
మాచారెడ్డి కొడుకు పెదకోమటి రెడ్డి ఈకాలంలో ఉండేవాడు.	అనవేమారెడ్డి (ఇతడు అనపోతారెడ్డి సోదరుడు) 1364 నుంచి 1386 దాకా రాజ్యం చేశాడు. కొమరగిరి రెడ్డి బహుశా కుర్రవాడు కావటం ఒక కారణం కావచ్చు. ఇతడు ఎంతోమంది విద్వాంసులను, కవులను పోషించాడు. అయితే ఒక్క కృతిని కూడా ఇతని కెవరూ అంకితమిచ్చినట్లు లేదు. ఇతడు 1386లో మరణించాడు.	
పెదకోమటి రెడ్డి కొడుకు వేమారెడ్డి (పెదకోమటి వేముడు) చందనవోలు రాజ్యంతో తృప్తి పడలేదు. అనవేమారెడ్డి మరణంతో కొండవీటి గద్దె మీద ఇతడు మరులుకొన్నాడు. 1386 నుంచి యుద్ధాలు చేశాడు గాని రాజీకి ఒప్పుకొన్నాడు. కొమరగిరి రెడ్డి బతికున్నంత కాలం కొండవీడును అతడే పాలించవచ్చునని, అంతకాలం తాను అణకువగా ఉంటానని పెదకోమటి వేముడు ఒప్పుకున్నాడు.		
	కొమరగిరి రెడ్డిని 1386లో అతని బావమరిది కాటయ వేముడు గద్దె నెక్కించాడు. ఇతడు ప్రధాని; దండనాథుడు; గొప్ప పండితుడు.	క్రీ.శ. 1386 ప్రాంతాలలో రాజమండ్రిలో దువ్వూరి రెడ్ల వంశం వాడు అల్లాడరెడ్డి కొండవీడుకు అణకువగా ఉండేవాడు. ఇతడు కాటయ వేమునితో వియ్యమందాడు.
	కొమరగిరి రెడ్డి తన బావమరిది కాటయ వేముని దిగ్విజయానికి పంపాడు. అతనితోపాటు యువరాజుగా తన కొడుకు	

చందనవోలు	కొండవీడు	రాజమండ్రి
	అనపోతారెడ్డిని పంపాడు. కటకం దాకా జయించి తూర్పున రాజ్యం విస్తరించాడు.	క్రీ.శ. 1390లో రాజమండ్రి ఒక రాజధానిగా రెడ్డి రాజ్యంలో రూపొందింది. కొమరగిరి రెడ్డి తన కొడుకు అనపోతారెడ్డిని రాజ ప్రతినిధిగా పంపాడు. అతడు 1395 దాకా ఉన్నాడు. తరువాత మరణించాడు. కొడుకు చనిపోగానే రాజమండ్రి రాజ్యాన్ని కొమరగిరి రెడ్డి తన బావమరిది కాటయ వేమునికి ఇచ్చేశాడు.
రాజమండ్రి రాజ్యాన్ని కొమరగిరి అతని బావమరిదికి ఇవ్వడం పెదకోమటి వేమునికి కోపం తెప్పించింది. కొండవీడును స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నం మొదలుపెట్టాడు. (ఈ ప్రయత్నంలో మామిడి సింగన్న, శ్రీనాథుడు ఉన్నారు.)		
	క్రీ.శ. 1402లో కొమరగిరి రెడ్డి చనిపోయాడు. వెంటనే చందన వోలు నుంచి పెదకోమటి వేముడు యుద్ధం చేసి కొండవీడును స్వాధీనం చేసుకొన్నాడు. రాజ్యం సుస్థిరం చేశాడు.	
		పెదకోమటి వేముని అధికారం ఒల్లక కాటయ వేముడు రాజమండ్రి రాజ్యం ఏలుకొన్నాడు. ఇతని రాజ్యకాలం 1395-1414.
		కాటయ వేముని మరణానంతరం అతని కొడుకు రెండవ కొమరగిరి రాజ్యానికి వచ్చాడు. 1414 నుండి 1416 దాకా రాజ్యం చేశాడు. ఆ తరువాత కాటయ వేముని కూతురు అనితల్లి తరపున మామగారు అల్లాడరెడ్డి 1417-1420 దాకా రాజ్యం చేశాడు.

చందనవోలు	కొండవీడు	రాజమండ్రి
	క్రీ.శ.1420లో పెదకోమటి వేముడు మరణించాడు. ఇతడు గొప్ప విద్వాంసుడు శ్రీనాథుని పోషకుడు.	
		అల్లాడరెడ్డి పోయాక అతని కొడుకు రాజ్యానికి రావాలి. అయితే సోదరులు రాజ్యం ఆక్రమించుకున్నారు. 1420–23 దాకా ఈ దురాక్రమణ సాగింది.
	పెదకోమటి వేముని తరువాత అతని కొడుకు రాచవేముడు రాజయ్యాడు. 1420–23 దాకా పాలించాడు. ఇతనితో కొండవీటి రెడ్డి రాజ్యం అంతరించింది. ఈ రాజ్యం అంతరించాక శ్రీనాథుడు మెల్లగా రాజమండ్రికి మారాడు.	
		పినతండ్రుల చేతిలోని రాజ్యాన్ని అల్లాడరెడ్డి కుమారులు స్వాధీనం చేసుకున్నారు. వీరభద్రారెడ్డి రాజ్యం చేశాడు. ఇతని అన్న వేమారెడ్డి (అల్లయ వేముడు) నిజంగా సర్వాధికారి. తమ్ముడు దొడ్డారెడ్డి మంచి యోధుడు. వీళ్ళ మంత్రి బెండపూడి అన్నయ్య. వీరభద్రారెడ్డి 1423–1448 దాకా పాలించాడు. 1428 ప్రాంతాలలో - వీరభద్రా రెడ్డి రాజైన అయిదేళ్ళకు శ్రీనాథుడు ఇక్కడకు వచ్చి అన్నయ్య మంత్రికి భీమఖండం అంకితమిచ్చాడు. తరువాత మరో పదేళ్ళకు ఈ రాజమండ్రి రెడ్డి రాజుల ఆస్థానంలో చేరాడు. వీరభద్రారెడ్డికి కాశీఖండం అంకితమిచ్చాడు. క్రీ.శ.1434–35లో గజపతులు రాజమండ్రిని ఆక్రమించుకొన్నారు. అంతటితో రెడ్డి రాజ్యం అంతరించింది.

ఇక్కడ ముందుగా ఒక్కటి చెప్పుకోవాలి. రెడ్డిరాజులలో 'వేమ' అనే పేరున్నవాళ్లు చాలామంది ఉన్నారు. వాళ్ళను సరిగా గుర్తుపెట్టుకోటానికి వాళ్ళను తండ్రిపేరు కలిపి పిలిచేవారు. కాటయ వేముడంటే కాటయరెడ్డిగారి కుమారుడు వేమారెడ్డి అని అర్థం. పెదకోమటి వేముడు అంటే పెదకోమటిరెడ్డిగారి కుమారుడు వేమారెడ్డి అని అర్థం. ఈ సంగతులను గుర్తుపెట్టుకుంటే రెడ్డిరాజుల చరిత్రలో పేర్లు సాధారణ పాఠకుణ్ణి ఇబ్బంది పెట్టవు.

ఈ రెడ్డిరాజులందరూ విద్యాపోషకులే. క్రీ.శ. 1325లో రాజ్యాన్ని స్థాపించిన ప్రోలయ వేమారెడ్డి కవిత్రయంలో ఒకరైన ఎర్రయ్యగారిని పోషించి కృతులు పుచ్చుకున్నాడు. ఈ రాజ్యంలో కడపటివాడు క్రీ.శ. 1427-48 మధ్య పాలించిన వీరభద్రారెడ్డి. ఇతడు శ్రీనాథుని కాశీ ఖండాన్ని అంకితం పుచ్చుకున్నాడు. ఈ రాజ్యం ఆద్యంతాలలో ఇద్దరు మహాకవులు వాళ్ళ పోషణలో గొప్ప కృతులు రచించారు. మధ్యలో ఉన్న కవులు కూడా చెప్పుకోదగ్గవారే.

అసలు ఈ రాజకుటుంబంలోని వ్యక్తులు కూడా మహా విద్వాంసులు. పెదకోమటి వేముడు స్వయంగా కవి. బహుగ్రంథకర్త. సంగీతసాహిత్యాలలో ప్రజ్ఞానిధి. 'శృంగారదీపిక' అనే పేరుతో అమరుకశతకానికి వ్యాఖ్య, 'సప్తశతీ సారటీక' అనే పేరుతో శాలివాహన గాథాసప్తశతికి వివరణ, 'సాహిత్య చింతామణి' అనే పేరుతో అలంకార శాస్త్రాన్ని వ్రాశాడు. ఇందులో ప్రాచీన సమకాలిక గ్రంథాలను పేర్కొని ఉదాహరణ లిచ్చాడు. ఇది గొప్ప ప్రామాణిక గ్రంథం. అలంకార శాస్త్రం కాక 'సంగీత చింతామణి' అనే గాంధర్వ విద్యాశాస్త్రం వ్రాశాడు. వీరనారాయణ చరిత్రమనే భాణం వ్రాశాడు. ఇంకా ఇతడెన్ని కృతులు వ్రాశాడో తెలియదు. ఇవన్నీ సంస్కృతంలోనే ఉండడం గమనించదగ్గ విషయం.

పెదకోమటి వేమారెడ్డి ఎంతటి మహావిద్వాంసుడో, కాటయ వేముడు కూడా అంత పండితుడు, కాళిదాసు నాటకాలు మూడింటికీ, 'కుమారగిరి రాజీయం' అనే పేరుతో గొప్ప వ్యాఖ్యానం వ్రాశాడు. కుమారగిరి అంటే కర్పూర వసంతరాయలు అనే బిరుదు గల కొమరగిరిరెడ్డే. ఇతడు తన బిరుదు పేరుతో 'వసంతరాజీయ' మనే నాట్యశాస్త్రం వ్రాశాడు. ఇతని ప్రియురాలు లకుమ. ఈమె ఒక్క భావానికి వేయి విధాలుగా అభినయం చేసిచూపే చతుర.

జయతి మహిమా లోకాతీతః కుమారగిరిప్రభో
స్సదసి లకుమాదేవి యస్య ప్రియాసదృశీప్రియా
నప మభినయం నాట్యార్థానాం తనోతి సహస్రధా
వితరతి బహూనర్థా సర్థి ప్రజాయ సహస్రశః (శాకుంతల వ్యాఖ్యానం)

ఈ లకుమాదేవి కొమరగిరికి ఉంపుడుగత్తె కాదనేవారు 'శ్రియా సదృశీ ప్రియా' అనే పాఠాన్ని ఈ శ్లోకంలో చెప్తారు.[10] ''ఇతడు ప్రియులతో విహరించుటకు కేళీరథములు, క్రీడించుటకు క్రీడాసరస్సులను నిర్మింపజేసెను'' అని చరిత్రకారులు చెప్తారు.[11] ఇతడు వైరాజ, పుష్పక, కైలాస, మలిక, త్రివిష్టప అనే అయిదు విధాలైన సమున్నత ప్రాసాద జాతులలో పుష్పక జాతికి చెందిన గృహరాజ సౌధం నిర్మించాడని కూడా చెప్తారు. ఇతడు చాలా వైభవంగా వసంతోత్సవాలు జరిపించేవాడు. దేశదేశాల నుంచి సుగంధ ద్రవ్యాలను తెలుగు తీరాలకు తెప్పించేవాడు.

తీరాంధ్ర దేశాన్ని రెడ్డిరాజులు పాలించే కాలంలో రాచకొండ, దేవరకొండ రాజ్యాలను ఏలిన పద్మనాయకులు కూడా సంస్కృతాన్ని బాగా పోషించారు. వాళ్ళ వివరాలు ఇవి :

క్రీ.శ. 1335-1361	అశీతి వరాల సింగమనాయకుడు
క్రీ.శ. 1361-1384	రాచకొండలో అనపోతనాయకుడు
	దేవరకొండలో మాదానాయకుడు
క్రీ.శ. 1384-1399	రాచకొండలో కుమార సింగభూపాలుడు
	దేవరకొండలో పెదవేదగిరి నాయకుడు
క్రీ.శ. 1399-1421	రాచకొండలో రెండవ అనపోతనాయకుడు
	దేవరకొండలో పెద వేదగిరికుమారులు కుమార మాదానాయక రామచంద్రనాయకులు
క్రీ.శ. 1421-1430	రాచకొండలో మాదానాయకుడు
క్రీ.శ. 1430-1475	రాచకొండలో ముమ్మడి సింగమనాయకుడు దేవరకొండలో కుమార మాదానాయకుని కొడుకు లింగమనేడు.

ఈ చివరి ఇద్దరు రాజులను శ్రీనాథుడు దర్శించాడు. పద్మనాయకులకూ, రెడ్డినాయకులకూ పడదు, పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. రెడ్డిరాజులతో విజయనగరం పరిపాలకులు వియ్యమందారు. ఆ రాజుల పట్టిక ఇది :

మొదటి హరిహరరాయలు	1335-1355
మొదటి బుక్కరాయలు	1355-1377
రెండవ హరిహరరాయలు	1377-1404
రెండవ బుక్కరాయలు	1404-1406
మొదటి దేవరాయలు	1406-1422
రెండవ ప్రౌఢదేవరాయలు	1423-1446

10. శ్రీనాథుని కవితాసమీక్ష, ద్వితీయ సంపుటం - చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు, పుటలు 60-61.
11. విజ్ఞానసర్వస్వం 3వ సంపుటి - తెలుగుభాషాసమితి. పుట. 327

ఈ విజయనగరం రాజులలో కడపటి వానిని కూడా శ్రీనాథుడు దర్శించి కనకాభిషేకం చేయించుకున్నాడు. ఈ ప్రభువు కూడా సంస్కృత గ్రంథాలు వ్రాశాడు. ''మహానాటక సుధానిధి'' అనేది అతని కృతులలో ఒకటి.

ప్రభువులందరూ సంస్కృతాన్ని ఆదరించి స్వయంగా ఆ భాషలో గ్రంథాలు వ్రాయడంవల్ల తెలుగు కవిత్వంలో కూడ సమాసభూయిష్ఠమైన కవిత్వం బాగా వేళ్ళూనింది. డుమువులు చేరిస్తేచాలు, అది తెలుగు కవిత్వమనే సంప్రదాయం స్థిరపడింది. కొందరు రాజులు సంస్కృతంలో అలంకార గ్రంథాలు వ్రాయడం వల్ల కొందరు కవులు తెలుగులో కూడా అలంకార గ్రంథాలు వ్రాశారు. లక్షణ సమన్వితంగా కావ్యాలు వ్రాయాలనే తహతహ ఈ కాలం నుంచి ఇంక మొదలవుతుంది.

అయితే ఈ యుగంలో గ్రంథాలు తమ సమకాలిక జీవితాన్ని అద్దంలాగ ప్రతిఫలిస్తున్నాయి. శ్రీనాథుడు వర్ణించిన మహారాజుల వసంతోత్సవాల దగ్గర నుంచి ఒక్క చుక్క నీళ్ళు కూడా కలపకుండా గోరక్షకుడు పాలు ఇచ్చాడని చెప్పిన గౌరన సూక్ష్మాంశం దాకా ఎన్నో సాంఘిక వివరాలు దొరుకుతున్నాయి. ఈ రెడ్డిరాజుల యుగంలో రచించిన పుస్తకాల వల్ల తెలిసే సాంఘిక చరిత్రనంతటిని సురవరం ప్రతాపరెడ్డిగారు చక్కగా క్రోడీకరించి కుప్పలు పోశారు.[12]

ఆదిలో పంటలు పండించే రాష్ట్రకూట ప్రముఖులైన కుటుంబీకులు ఒక రాజ్యాన్ని స్థాపించి తెలుగు సాహిత్యాన్ని చక్కగా పండించారు. ఈ శ్యామల సస్యాలను పరిశీలిద్దాం.

భాస్కరరామాయణ కవులు

భారతీయ సాహిత్యంలో ఆదికవి వాల్మీకి, ఆదికావ్యం రామాయణం అయితే తెలుగు సాహిత్యంలో పద్యకావ్యంగా వెలసిన మొట్టమొదటి రామకథ భాస్కర రామాయణం. దీనిని భాస్కరుడు రచించాడని దీని పేరే చెప్తోంది. మన దేశ చరిత్రలో వాఙ్మయంలో పలువురు భాస్కరులున్నారు. అయితే వాళ్ళలో హుళక్కి భాస్కరుడే నిజంగా భాస్కర రామాయణ కర్త అని నిరూపించగలిగిన ఒక బలమైన సాక్ష్యం ఉంది. భాస్కర రామాయణంలోనే యుద్ధకాండ చిట్టచివర ఒక పద్యంలో కవి ఇలా చెప్పాడు.

> అమర హుళక్కి భాస్కర మహాకవి చెప్పగ నున్న యుద్ధ కాం
> డము తరువాయి చెప్పె బ్రకట ప్రతిభాషణు డప్పలార్యస
> త్తమునుతు డయ్యలార్యుడు గృతస్థితి నార్యులు మెచ్చునట్లుగా
> హిమకర తారకారవిమహీవలయస్థిరలక్ష్మి చేకురన్. (భాస్కర.యుద్ధ. 2699)

---

12. ఆంధ్రుల సాంఘిక చరిత్ర.

ఈ పద్యంవల్ల హుళక్కి భాస్కర మహాకవి యుద్ధకాండలో కొంతదాకా చెప్పాడని తెలుస్తున్నది. అందుచేత ఈ రామాయణానికి హుళక్కి భాస్కరుడి వల్లనే భాస్కర రామాయణం అనే పేరు వచ్చిందనే వాదం సబబైనది. అయితే రామాయణ పద్యకావ్యాన్ని ఎవరు వ్రాశారో ఆ పుస్తకం చూస్తే తెలియదా, కృత్యాదిని అవతారికలోనూ, కృతి చివర గద్యలోనూ కవి తన పేరు చెప్పుకుంటాడు కదా అనే ప్రాథమికమైన ఆలోచన మనకు వస్తుంది. భాస్కర రామాయణంలో అవతారిక లేదు. గద్య చూద్దామా అంటే కాండకొక మోస్తరుగా ఉంది. ఏయే కాండలో ఎలా ఉందో ఈ పట్టిక చూస్తే విశదమవుతుంది.

వరుస	కాండ	గద్యవల్ల తెలిసే రచయిత పేరు	గద్య పద్యాల సంఖ్య	సూచన
1.	బాలకాండం	అష్టభాషా కవిమిత్రుడు, భాస్కర సత్కవి పుత్రుడు మల్లికార్జున భట్టు.	785	ఏకాశ్వాసం
2.	అయోధ్యకాండం	సకల కళావిశారదుడు, శారదాముఖ ముకురాయమాణుడు, సారస్వత భట్టబాణుడు, నిశ్శంక వీరమారయ కుమారుడు కుమార రుద్రుడు	455	ఏకాశ్వాసం
3.	అరణ్యకాండం	సకల సుకవిజన వినుతుడు, యశస్కరుడు భాస్కరుడు	734	రెండాశ్వాసాలలో వ్రాశాడు
4.	కిష్కింధకాండం	మల్లికార్జునభట్టు (బాలకాండ వ్రాసిన కవే)	832	ఏకాశ్వాసం
5.	సుందరకాండం	(బాల, కిష్కింధలు వ్రాసిన) మల్లికార్జునభట్టు	573	ఏకాశ్వాసం
6.	యుద్ధకాండం	(1) హుళక్కి భాస్కరుడు 1140 పద్యాల దాకా చెప్పాడు.	1140	ఏకాశ్వాసం
		(2) అక్కడ నుంచి శాకల్యమల్ల కవి తాలూకు అయ్యలభట్టు తుదముట్ట చెప్పాడు.	1562	
గద్య పద్యాల సంఖ్య ప్రకారం స్థానాలు - 1. మల్లికార్జున భట్టు - మొత్తం 2190; 2. భాస్కరుడు - మొత్తం 1874; 3. అయ్యలభట్టు - 1562; 4. కుమార రుద్రుడు మొత్తం 455				

ఈ వివిధ గద్యలను చూస్తే భాస్కర రామాయణాన్ని నలుగురు వ్రాసినట్లు కనబడుతుంది. భాస్కరుడు అరణ్యకాండం పూర్తిగానూ, యుద్ధకాండలో కొద్దిగానూ చెప్పాడు. అతని కుమారుడైన మల్లికార్జున భట్టు బాల, కిష్కింధ, సుందరకాండలు మూడు చెప్పినట్టు తెలుస్తున్నది. కుమార రుద్రుడు అయోధ్యకాండ చెప్పాడు. అయ్యలార్యుడు యుద్ధకాండ శేషాన్ని పూర్తిచేశాడు. కాండల లెక్కన చూస్తే భాస్కర పుత్రుడు మల్లికార్జున భట్టే ఎక్కువ చెప్పినట్టు కనబడుతుంది.

'గద్య పద్యాల లెక్కలను పట్టి చూసినా మల్లికార్జునుడే ఎక్కువ చెప్పినట్టు, ఒక కాండన్నర చెప్పిన భాస్కరుడు రెండో స్థానంలో, శేషకాండం రచించిన అయ్యలార్యుడు

మూడవ కవిగా, పూర్తికాండను చెప్పిన కుమార రుద్రుడు నాలుగవ కవిగా గణనకొస్తారు. ఈ గద్యపద్యాల లెక్కలు బహుశా తప్పుకావచ్చు. ఏమంటే భాస్కర రామాయణంలో మొదట ఎన్ని పద్యాలున్నాయో ఎవరికీ తెలియదు. ఆదిలో ఇందులో లేని పద్యాలు ఇతరులు చెప్పినవి, బాగా ఉన్నాయనుకొన్నవి అనంతర లేఖకులు తమ ప్రతులలో కలుపుకొనడం మొదలుపెట్టారు. భాస్కర రామాయణం తరువాత ఇతర కవులు, అందులోనూ ప్రసిద్ధులు కూడా, రామాయణ కావ్యాన్ని వ్రాశారు. ఆ రామాయణాలన్నీ నష్టమైపోయాయి. కాని అందులోని పద్యాలు ఈ భాస్కర రామాయణంలో వచ్చి కలిశాయనిపిస్తుంది. ఎందువల్లనంటే వివిధ శైలులలో కొన్ని పునరుక్తులు అక్కడక్కడ కనిపిస్తాయి. అవన్నీ ప్రక్షిప్తాలని భావించాలి. మూల భాస్కర రామాయణంలో ఎన్ని పద్యాలున్నాయో మనకు ఎలా తెలుస్తుంది? దేశంలో ఉన్న భాస్కర రామాయణ ప్రతులన్నీ సేకరించి ఒక ప్రామాణిక ముద్రణ ప్రచురించే దాకా ఊహాగానం తప్ప ఇంకేం చేయలేము. తమ ఊరిలో ఉన్న ఒక భాస్కర రామాయణ ప్రతితో తైపారు వేసి బాలకాండం మొదటి రచనలో 400 గద్య పద్యాలు, అయోధ్య కాండలో 267, అరణ్య కాండలో 390 గద్య పద్యాలు మాత్రమే ఉండేవని చాగంటి శేషయ్యగారు వ్రాశారు. మిగతా కాండలలో మొదటి లెక్క ఎంతో నిర్ణయించడానికి వారికి సాధనాలు లభ్యం కాలేదన్నారు.

మూడు కాండలు వ్రాసిన మల్లికార్జున భట్టు పేరు మీదు గాక అతని తండ్రి పేరున ఈ రామాయణం ఎందుకు ప్రఖ్యాతమైంది అనే ప్రశ్న కూడా జనించడం సహజమే. దీనికి కందుకూరి వీరేశలింగంగారు ఒక కారణం ఊహించారు.

''... భాస్కరుడు మొట్టమొదట తన కుమారుడైన మల్లికార్జున భట్టునకు బాలకాండమును, శిష్యుడైన కుమార రుద్రదేవున కయోధ్యా కాండమును తెనిగించుటకిచ్చి తా నారణ్యకాండమును బుచ్చుకొని యుండును. తానే మొదటిదైన బాలకాండమును బుచ్చుకొని ఇతరులకే తరువాతి కాండముల నియ్యక తానేల యారణ్యకాండమును బుచ్చుకోవలెనని కొందరడుగవచ్చును. వర్ధిష్ణువులయి చిరకాలము మనగోరెడి తరుణ వయస్కులైన వారికా కాండము నియ్యక వారి శ్రేయస్సు గోరియే యతడు తాను వయసు చెల్లినవాడై మోక్షార్థియయి యున్నవాడగుటచేత నారణ్యకాండమును గైకొని యుండును... పిన్న యీడువాడైన మల్లికార్జునభ ట్లేండ్లు చెల్లినవాడైన తండ్రి కంటె నధిక వేగముగా పద్యరచన చేయగల కవితాధార కలవాడగుటచే జనకు డారణ్యా కాండమును ముగింపక ముందే తన బాలకాండమును ముగించి, తన సహపాఠియైన కుమార రుద్రదేవుని కిచ్చిన యయోధ్యకాండమును, తండ్రి చేయుచుండిన యారణ్యా కాండమును విడిచిపెట్టి కిష్కింధాకాండమును జేయనారంభించెను. ఇంతలోపల భాస్కరుడు తన యారణ్యా కాండమును ముగించి కొడుకు చేయుచున్న కిష్కింధా కాండమును తరువాయి నందుకొని దానిని పరిసమాప్తి నొందించి సుందరకాండము జేయనారంభించెను. తరువాత మల్లికార్జున భట్టందుకొని సుందరకాండమును ముగించియుండును. మరల భాస్కరుడు యుద్ధకాండమును జేయుచుండగా మిత్రుడైన యయ్యలార్యుడాతని యనుమతి మీదనే

యుద్ధకాండము యొక్క యుత్తర భాగమును గైకొని రామాయణమును తుదముట్టించి యుండును.[1]

భాస్కర రామాయణంలోని గద్యలు ఒక్కొక్క కాండలో ఒక్కొక్క విధంగా ఎందుకున్నాయో వీరేశలింగంగారి వివరణ బాగా విశదం చేస్తుంది గాని ఇది ఊహే. దీనికి చారిత్రక ఆధారాలు లేవు. హుళక్కి భాస్కరుడి సారథ్యం క్రింద ఈ అనువాదపురథం సాగిందని కూడ గట్టిగా చెప్పలేం. కుమార రుద్రుడు తాను అనువదించిన అయోధ్యాకాండ తన తండ్రి సాహిణిమారనకి అంకితమిచ్చాడు. మల్లికార్జున భట్టు మూడు కాండలూ ముక్కంటికి అంకితమిచ్చినట్టు శివుణ్ణి స్తుతిస్తూ కాండాంతంలో కొన్ని పద్యాలు కనబడతాయి. అరణ్యకాండంలో పేరు చెప్పకుండా ఎవరో ప్రభువును ప్రశంసించే పద్యాలు కనబడతాయి. ఎవరే కాండ వ్రాసినా అయోధ్యాకాండ మొదలు ఇతర కాండలలో సైతం మొట్టమొదట సాహిణి మారనను సంబోధిస్తూ పద్యం కనబడుతుంది. ఒక కాండలో శివుణ్ణి స్తుతించే పద్యాల మధ్య సాహిణి మారన ప్రశంస కనబడుతుంది. పద్యాలన్నీ ఇలా కలగాపులగం కావడానికి లేఖకులు చిత్తమొచ్చినట్టూ వ్రాసుకొనడమే తప్ప ఇంకొక కారణం కనబడదు.

సాహిణి మారన భాస్కరబృందం చేత రామాయణం వ్రాయించినా, కృతి అందుకొనేలోగా మృతిచెందాడని, అందుచేతనే ఇటువంటి గద్యలూ అవతారిక లేని గ్రంథము, అనంతర కవుల రామాయణ రచనల్లోంచి అసంఖ్యాకమైన సంకీర్ణ పద్యాలు మనకు ఇప్పుడు లభిస్తున్నాయని మనం అనుకోవాలి. కృతి పుచ్చుకున్నా పుచ్చుకోక పోయినా సాహిణి మారనకూ భాస్కర రామాయణానికీ సంబంధం ఉంది. కనుక అతడి గురించి కొంత తెలుసుకొని ముందుకు సాగుదాం.

ముప్పయ్యిద్దరు మంత్రుల ఘనతను శ్లాఘించే ఒక సీసమాలిక ఆంధ్రదేశంలో బహుళ ప్రచారంలో ఉంది. అందులో ఒక పాదంలో ''కొనియె భాస్కరు చేత దెనుగు రామాయణం బారూఢి సాహిణి మార మంత్రి'' అని ఉంది. అందుచేత సాహిణి మారన అమాత్యవాచ్యుడని చెప్పవచ్చు. అయోధ్యకాండ రచించిన కుమార రుద్రదేవుడు ఈ సాహిణి మారన కుమారుడే అని, ఒకానొక తెలుగు శాసనం ద్వారా తెలిసే మారయ, కుమార రుద్రులనే తండ్రీకొడుకులు భాస్కర రామాయణంలోని కృతి భర్త, కృతి కర్తలు అయిన తండ్రీకొడుకులనీ అంగీకరిస్తే సాహిణి మారన గురించి కొన్ని వివరాలు తెలుస్తాయి.

గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకాలో కోటనెమలి పురిలో ఒక రాతి పలక మీద ఒక శాసనం ఉంది. దీని కాలం క్రీ.శ. 1311. దీనిని వ్రాయించినవాడు మారయ సాహిణి రుద్రదేవంగారు. ఇతడు ప్రతాపరుద్రునకు సామంతుడు. గజసాహిణి, పల్లినాడు, గులిందా స్థలాల అరవై ఊళ్ళకు అధికారి, ప్రతాపరుద్రుని ఏలుబడిలో సాహిణి మారయ ఈ

1. ఆంధ్ర కవుల చరిత్రము - ప్రథమభాగం (ద్వితీయ ముద్రణ) పుట 309.

ప్రాంతాలకు అధికారం సంపాదించాడనీ, తండ్రి తరవాత కొడుకు గజసాహిణై ఈ అరవై గ్రామాలనూ పరిపాలించే వాడనీ ఊహించవచ్చు. కుమారుడి శాసనం క్రీ.శ. 1311లో కనబడుతుంది కనుక తండ్రి అంతకు ముందు మరణించి ఉంటాడు.

సాహిణి మారయ జీవిత కాలంలో రామాయణ రచన జరిగి ఉంటే ఈ కావ్యం క్రీ.శ. 1310కి పూర్వమే జనించిందన్నమాట. సాహిణి మారన పల్నాడు ప్రాంతాల పాలకుడు కనుక భాస్కరుడూ, అతని పుత్రుడూ, మిత్రుడూ కూడ ఇక్కడి వాళ్లే అని, రామాయణ రచన ఇక్కడే జరిగిందని భావించడానికి ఆస్కారం వుంది గాని హుళక్కి భాస్కరుడు సుప్రసిద్ధుడు; అతడు ప్రతాపరుద్రుడి ఆస్థానంలో ఉండేవాడని ప్రతాపచరిత్ర చెబుతున్నది. వాస్తవానికి ప్రతాపరుద్రుని కొలువులో హుళక్కి భాస్కరుడు తప్ప యింకే ప్రసిద్ధ కవి ఉన్నాడో కూడ ఆ చరిత్ర చెప్పదు. కాకతీయ మహా సామ్రాజ్యానికి పాలకుడైన ప్రతాపరుద్రుని పోషణలో ఉండే హుళక్కి భాస్కరుడు అరవై గ్రామాలకు మాత్రం ఏలికగావుండే సాహిణి మారనకు ఇంత గొప్ప గ్రంథం అంకితమిస్తాడా?

భాస్కర రామాయణ రచన జరిగిన రోజులలో రాజకీయ సాంఘిక పరిస్థితులను మనం చక్కగా ఊహించుకొనవచ్చు. క్రీ.శ.1303లో మహమ్మదీయులు తెలుగుదేశంపైన దండెత్తి వచ్చారు. అప్పటినుంచీ కాకతీయ సామ్రాజ్యానికి నిత్యం దండయాత్రల ప్రమాదం, అప్పుడప్పుడు ముట్టడులు, అడపాదడపా యుద్ధాలు తప్పలేదు. ఆ రోజుల్లో యుద్ధాలంటే ప్రజాజీవనం రమారమీ స్తంభించిపోయేది. ఊళ్లు కొల్లగొట్టేవారు. పంటలు పాడుచేసేవారు, గ్రామాలు తగలెట్టేవారు. ఇటువంటి కాలంలో ఆదరించే నాథుడు లేకపోయినా ఈ భాస్కర రామాయణ రచన జరిగి ఉంటుంది. పరిస్థితులు చక్కబడి ప్రభువు కృతి తీసుకుంటాడనే నమ్మకంతో భాస్కరబృందం రచన సాగించి ఉంటారు. ఏ విపత్కర పరిస్థితుల వల్లనో రచన ఆగిపోయింది. భాస్కరకవి మరణించి కూడా ఉంటాడు. మల్లికార్జునభట్టూ, కుమార రుద్రుడూ తాము రచించిన భాగాలకు గద్యాలు వ్రాసుకొని ఒకరు ఈశ్వరాంకితంగానూ, ఇంకొకరు తండ్రికి కృతిగానూ తమ రచనలు సమర్పించి తృప్తిపడి ఉంటారు. తర్వాత లేఖకుల పొరపాట్లవల్ల ఎక్కువ కాండలలో మొదటి సాహిణి మారయను సంబోధించే పద్యాలు చేరి ఉండవచ్చు.

ఈ పద్యాలను ఇలా చేర్చిన లేఖకులే మంత్రి భాస్కరుడు ఆదిలో వ్రాసిన రామాయణంలో హుళక్కి భాస్కర బృందం వ్రాసిన రచనలను చేర్చి ఉండకూడదా అన్న ప్రశ్న కూడా ఉదయించడానికి ఆస్కారం లేకపోలేదు. మంత్రి భాస్కరుడు వ్రాయబట్టే దీనికి భాస్కర రామాయణం అనే పేరు వచ్చిందని నేలటూరి వెంకటరమణయ్యగారూ,[3] చాగంటి శేషయ్యగారూ[4] భావిస్తున్నారుగాని ఇతర పరిశోధకులు మంత్రి భాస్కరునికీ,

3. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక – 1940–41;

4. ఆంధ్రకవితరంగిణి రెండవ భాగం;

దీనికీ సంబంధం లేదని తేల్చారు. ఎవరెవరు ఎలా చెప్పారో శిష్ట్లా రామకృష్ణశాస్త్రిగారు ఇలా విశదం చేశారు:[5]

... భాస్కర రామాయణమును గూర్చి చర్చించినవారిలో గురజాడ శ్రీరామమూర్తిగారు తమ కవి జీవితములలో హుళక్కి భాస్కరునే గ్రహించిరికాని మంత్రి భాస్కరుని గైకొనలేదు. కం. వీరేశలింగంగారు కవిచరిత్రలో మొదటి ముద్రణమున మంత్రి భాస్కర, హుళక్కి భాస్కర, సాహిణి మారనల నేకకాలమువారిగజేసి తికమకలు పడినను, పునర్ముద్రణమున విషయచేర్చి చేసి మంత్రి భాస్కరుని దూరము చేసి హుళక్కి భాస్కరునే గ్రహించిరి. ఆంధ్రుల చరిత్రలో చిలుకూరి వీరభద్రరావుగారు హుళక్కి భాస్కరుని, సాహిణి మారననే విశ్వసించిరి గాని మంత్రి భాస్కరుని తలపెట్టలేదు. పురాణచంద్రిక కర్త హుళక్కి భాస్కరుడనియే తలచెను. కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారును, మేడేపల్లి వెంకటరమణాచార్యులుగారును మంత్రి భాస్కరునకు, భాస్కర రామాయణ రచనకు సంబంధము లేదనియే తేల్చిరి కదా. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మంత్రి భాస్కరుని పేరు తలపెట్టనేలేదు, సుప్రసిద్ధ విమర్శకులందరు తత్త్వవిచారము చేసి యా విషయమున హుళక్కి భాస్కరునే రామాయణకర్తగా నిర్ణయించిరి...

క్రీ.శ. 1923లో ప్రకటించిన వావిళ్ళ ప్రతిలో మేడేపల్లి వెంకటరమణాచార్యులుగారు 42 పేజీల పీఠిక వ్రాసి మంత్రి భాస్కరునికీ, భాస్కర రామాయణానికీ సంబంధం లేదని చెప్పారు. 1961లో ప్రచురించిన వావిళ్ళ ప్రతిలో మేడేపల్లివారి పీఠికతోబాటు ఎవరో 'విద్యారత్న' గారి 'భాషా విశేషములు' అనే వ్యాసం కూడా ఆదిని ఉంది. మేడేపల్లి వారి పాల వంటి పీఠికలో ఈ 'విద్యారత్న' గారి విశేషాలు మజ్జిగచుక్కలు. మేడేపల్లి వారు ఎంతో నైపుణ్యంతో మంత్రి భాస్కరుణ్ణి తొలగిస్తే, 'విద్యారత్న' గారు మళ్లా రెక్కపట్టుకొని లాక్కొచ్చారు.

ఈ వివాదానికి ఎవరు మొదట శ్రీకారం చుట్టారో గాని ఇది రావణాసురుడి కాష్ఠంలాగా కాలుతూనే ఉంటుంది. విచిత్రమేమిటంటే, రచయిత ఎవరైనా సరే భాస్కర రామాయణానికి అతడు శ్రీకారం చుట్టలేదు. మన కావ్యాలన్నీ శ్రీకారంతో మొదలవుతాయిగాని ఈ మహాకావ్యం అలా ప్రారంభమవలేదు. ''రాముని శుభచరితమ్మును'' అనే కంద పద్యంతో కావ్యం ఆరంభమైనట్టు కనబడుతుంది. కృతిముఖంలో అమరవాచకాలు, మంగళార్థవాచకాలు ఉంటే ప్రశస్తమని చెప్తూ అప్పకవి ఏ కావ్యం మొదట ఏ అమరవాచకాలు ఉన్నాయో వివరించాడు.

ఏకావళియందు ''ప్రాలేయాచల కన్యకా'' కల్పిత కల్పవల్లియందు ''హేరంబ మవలంబే'' యనియు, రామాయణమునందు ''రాముని శుభ చరితమ్మును'' అనియును ... ఉందన్నాడు.[6] అప్పకవి రోజుల్లో (క్రీ.శ. 1656) దీనిని భాస్కర

5. ఆంధ్రవాఙ్మయచరిత్ర సర్వస్వము, పుట – 607
6. అప్పకవీయం, ద్వితీయాశ్వాసము, పుట – 364

రామాయణం అనే పేరుతో కాక రామాయణం అని ఉపపద రహితంగానే పిలిచేవారని తెలుస్తున్నది. అప్పకవి ఇందులోనుంచి 15 పద్యాలను ఉదాహరించాడు. ఎక్కువగా హుళక్కి భాస్కరుడి రచనలోంచే తీసుకొన్నాడు. అయోధ్యకాండలోంచి ఒకటి, సుందరకాండలోంచి రెండు మాత్రమే తీసుకొన్నాడు.

హుళక్కి భాస్కరుడు అరణ్యకాండతోనే రచన ప్రారంభించాడని చెప్పుకొంటారు. సాహిణి మారయకు అతడు అంకితం ఇచ్చాడో లేదో మనకు తెలియదు కాబట్టి కాండ ప్రారంభంలో ఉండే కంద పద్యం కాక రెండో పద్యమే అతడి మొదటి రచన అని భావిద్దాం. చూడండి, అతని మొదటి పద్యం -

పుణ్యు చరిత్రు డత్రి మునిపుంగవు వీడ్కొని రాము డంచితా
గణ్యు గుణాభిరాము డుపకంఠమునం జని కాంచె దండ కా
రణ్యము సిద్ధసంయమినిరాజితచారుతపోనుజాత స
త్పుణ్యము, నిర్మలాంబువరపుష్కర పూర్ణ సరోవరేణ్యమున్. (అరణ్యా. 1-2)

అరణ్యము, పుణ్యము, వరేణ్యము అనే అనుప్రాసము హాయిగా ఉంది.

తెలుగు సాహిత్యంలో ఈ పద్యం పుట్టాక ఎవరైనా ఎక్కడికైనా వెళ్ళి ఏదైనా చూశారని వర్ణిస్తే 'అటుజనికాంచె' అనే మాటలు వస్తే ఈ శబ్దాలంకారం వాడడం ఒక ఫేషనయింది.

ఈ అనుప్రాసాన్ని హరివంశం ఉత్తరభాగంలో ఎర్రయ్యగారు (హరి.ఉ.6-7), ఉత్తర హరివంశంలో నాచన సోమన (ఉ.హరి.2-38), విక్రమార్క చరిత్రలో జక్కన, సింహాసన ద్వాత్రింశికలో కొరవి గోపరాజు; మనుచరిత్రలో అల్లసాని పెద్దనగారుకూడా వాడారు.

ఎప్పటివాళ్ళో ఎందుకు సమకాలికుడు - ఈ రామాయణంలో ఒక కాండ వ్రాస్తూన్న కుమార రుద్రుడు ఇలా వ్రాశాడు:

అట జని కాంచి రంత వసుధాధిపు లారతి లోలకిన్నరీ
ఘటిత గుహాకుటీ కనకక్రమకవాటము సన్మణి ప్రభా
హటదురు శృంగజాటము సమావృత మాల్యవతీతరంగిణీ
తటతరువాటమున్ బహుళ తాపస కూటము జిత్రకూటమున్.

(అయోధ్యా. 287)

ఇంకొక కవి అనుకరించడం అలా ఉంచుదాం. అరణ్యాకాండం మొట్టమొదట వ్రాసిన సంవిధానంలోనే ఆ కాండ చిట్టచివర హుళక్కి భాస్కరుడే ఇంకొక పద్యం వ్రాశాడు.

రాకొమరుల్ గనుంగొనిరి రమ్యగుహాగత కిన్నరీకమున్
స్వీకృత నాకసింధుజలసేకము సంకులదంతి దంతిభి

ద్భీకర పుండరీకమును దీపితసంయమి వేదనాదజ
ల్పాకము సిద్ధసేవిత తవః పరిపాకము ఋశ్యమూకమున్. (అరణ్యా. 2-436)

ఈ రామాయణ కవులలో హుళక్కి భాస్కరుడిదే ప్రౌఢకవిత్వమని విమర్శకులు చెప్తారు. భాస్కరుడిలో ఔచిత్యము, రసపోషణ బాగా ఉంది. నాటకీయతలో ఉన్న వ్యంగ్యం తెలిసినవాడు. అరణ్యావాసం తొలి ఘట్టంలోనే విరాధుడనే రాక్షసుడు సీతను ఎగరేసుకుపోతాడు. అక్కడ ఆ ఘట్టంలో రాముడిచేత హుళక్కి భాస్కరుడు ఏమనిపించాడో చూడండి.

అని పలికి వినుము లక్ష్మణ- జనకజదైన్యంబు సూడ జాలుటకంటెన్
ఘనమగు శోకము నాకెం-దుసు లేదంబ! ప్రియమంద దొరగెద దనువున్.
(అరణ్యా. 1-20)

ధరణి రాజ్యము గోల్పాటు దండ్రిచావు
నిష్టబంధువియోగంబు దుష్టయాతు
నిష్ఠు రారణ్యావాసంబు నేడునాదు
దేహదాహంబు సేసె వైదేహికతన. (అరణ్యా. 1-21)

సీత లేకపోతే తన బ్రతుకు ఏమౌతుందో మొదటే చెప్పించాడు. ఇలాగే సీతారామ లక్ష్మణులు జటాయువును కలుసుకొన్న మొట్టమొదటిసారి ఆ విహగేంద్రుడిచేత ఇలా వివిధ సేవలు చేస్తాననిపించాడు.

వితతగిరీంద్రశృంగముల వేడుకజూడగ గోరినప్పు డ
ద్భుతముగ మిమ్ము మోచికొనిపోయెద జానకి కాపువెట్టినన్
సతతము గాచియుండెద వెసంజనిచేసెద నెంత దవ్వునం
దతిశయమైన యెట్టిపని యైనను బొచ్చెము గాదు రాఘవా! (అరణ్యా. 1-104)

'జానకిన్ కాపువెట్టిన సతతము గాచియుండెద' అని జటాయువు అనడంలో ఎంత ఔచిత్యం ఉంది! చివరకు తానే కాపుగా ఉండవలసి వచ్చింది. ఆ కాపుదలలోనే ప్రాణాలు ఇవ్వవలసి వచ్చింది. పక్షిరాజు మరణించాడు. సీతను రావణుడు తీసుకొనిపోతున్నాడు. ఆమె 'హా రామ! హా నాథ' అని హాహాకారాలు చేసింది. 17 పద్యాలలో ఎక్కువ కందాలలో హుళక్కి భాస్కరుడు ఇది వర్ణించాడు. ఇవి చాలా గొప్పవి. ఒకటి రెండు చూడండి:

అంత నఖిలదిశలు 'హారామ, హానాథ'
యను నెలుంగు వినుచు నడల దొడగె
జనకతనయనీడజాడ సింహాది స
త్త్వముల గములు వెంట దగులుచుండె. (అరణ్యా. 2-150)

పవనచలితశాఖాప-ల్లవముల భయహాసచేష్టలం బొసర జెలం
గు విహంగంబులు రుతముల-నవనిసుతను వెరకువెరకు మన్నట్లుండెన్.
(అరణ్యా. 2-151)

ఓలిశృంగంబు లెత్తిన కేలుగాగ
నిర్ఝరంబుల పెనుమ్రోత నిగిడి బెరయ
గిరులు జనక రాజాత్మజ పరిభవంబు
జగము లెరుగ నాక్రోశించు పగిది దోచె. (అరణ్యా.2-152)

సీత లేని పర్ణశాలను రాముడు చూశాడు. అంతా వెదికాడు, గాలించాడు. సీత కనబడలేదు. అతడి మనస్సు మనస్సులో లేదు. ఆలోచనలు లేవు. ఆందోళన, అనుమానాలు, ఆవేదన, తాను తానేనా - ఇది నిజమేనా అనే సందేహాలు అన్నీ వచ్చాయి. ఈ ఘట్టంలో రాముడి ప్రథమ వేదన హుళక్కి భాస్కరుడు ఎలా వర్ణించాడో చూడండి :

ఏమెయి నడుగులు లేనిది - యేమరుదో పర్ణశాల యిది గాదొకొ యే
రాముడగానో రాముడు - రామం బెడబాసి క్షణము బ్రతుకగ - గలడే? -

అని పలికి,

ఏ మ్మెట్టీయది మెట్టుగా దిది వనం బేరాకుమారుండనో
సౌమిత్రీ! విను నీవు రాముడవెవత్సా నిక్క మేరాముడన్
భూమీశుండవు రామచంద్రుడవు హా భూమీజ చంద్రాననా
యేమే యెక్కడ నున్నదాన విట రావే యుల్ల మల్లాడెడిన్.

ఈ తిగ్మాంశుడు నేవజొచ్చె నను రే యే నాట సర్కాస్పదం
బీతం డిందుడె యౌనొ లక్ష్మణుడ నీ కేమౌదు నే జెప్పు మా
నా తోబుట్టువుగానె నాథ మరి యేనాథుండ నిక్కంబుగా
సీతానాథుడ నెందు బోయితివె యో సీతామనోవల్లభా! (2:260-263)

శ్రీరాముని ఆరాటాన్నే కాక అందాల రూపును కూడా హుళక్కి భాస్కరుడు కమనీయంగా వర్ణించాడు. శూర్పణఖ చూసిన రాముణ్ణి ఇలా బొమ్మ కట్టించాడు :

రేకులన్నియు విచ్చి రేయెండ జిగి నిండి, కరమొప్పు తెల్లదామరలకంటె
నరలేని నెరదీప్తి మెరు గెక్కి సరిమింట, జరియించు సంపూర్ణ చంద్రుకంటె
నునుదీగజిగిదోగి నునుపారనిగ్గారి, తనరు దిక్కరుల హస్తములకంటె
నిగిడి చేరువలెల్ల నీలోత్పలద్యుతులపచరించు హరినీల రుచులకంటె
నితని కన్నులొప్పు నీరాజు మో మొప్పు-నితని కరములొప్పు నితని మేని
కాంతి యొప్పు ననుచు గడువేడ్క సన్నిశా-చరిణి చూచె రామచంద్రు దవిలి.
(అరణ్యా. 1-135)

శూర్పణఖ శ్రీరాముని అందాన్ని చూసి ఎంత ముగ్ధురాలయిందో సీత అందాన్ని సైతం వింటే మోహించేటంత గొప్పగా వర్ణించింది. హుళక్కి భాస్కరుడు రావణాసురునికి ఎలా చెప్పించాడో చూడండి:

విదియచందురుడైన వెలదినెమ్మోమున గలిసిన సంపూర్ణకాంతి వడయు
వడగాలియైన నప్పడతి యూర్పుల చెంత బరగిన మలయాద్రిపవనుబోలు
నమవస యిరులైన నయ్యింతి చిఱునవ్వు సొలపున వెన్నెల చెలువుబూను
నలరి యే ఋతువుల నయిన నా సతిమేని ప్రభగన్న వనములు పల్లవించు
బట్టబయలైన నా సితపద్మనేత్ర
కన్నుగవయొప్పు జిగి సొంపు గడలు కొనిన
విమల కమల షండంబుల విధము నొందు
నెందు సరిపోల్చ గలరె యయ్యిందుముఖికి? (అరణ్యా.1-280)

మాయలేడిని వర్ణించడంలో హుళక్కి భాస్కరుడు మంచి ఊహాశక్తిని చూపించాడు.

నెలలోని యిఱ్ఱికి నీలకంఠుని చేత
బొలుపారు లేడికిబుట్టెనొక్కొ
యజు డన్నిరత్నంబులందునుం గలుగు క్రొ
మ్మించుల దీని గల్పించె నొక్కొ
రోహిణాచలము మేరువు గూడి యురుతర
ప్రభల నీహరిణంబు బడసె నొక్కొ
క్రొక్కారు మెరుగులు జుక్కల యొరపును
గలసి యీ మృగమయి వెలసె నొక్కొ
దీని బోలంగ జంతువుల్ త్రిభువనముల
యందు మరి కలవొకొ యనియాత్మ మెచ్చ
ప్రీతి వనదేవతలుసూడ సీత దృష్టి
మార్గమున కల్ల జనియె నమ్మాయ యిఱ్ఱి. (అరణ్యా. 2-25)

హుళక్కి భాస్కరుడు చక్కని జాతీయాలూ సామెతలూ వాడుతూ ఆహ్లాదకరంగా కథ చెప్పాడు.

యిసుము చల్లిన రాలని ఘోరకాననం (1-13) మిడుతలు కార్చిచ్చుపై జన్నకరణి (1-173), నీవా రేవిధి బోయిన నేమగు (1-264), ఆకసంబు విరిగి పైబడ్డ నాత్మలో వెరవ డెపుడు (2-68); నిప్పు జెదలంట నేర్చునె? (2-71), నిలువు నీరగుట (2-76) మొదలైనవి అరణ్యకాండంలో ప్రయోగించాడు. ఇతనికి విస్ఫులింగములు అనే మాట వాడడం సరదా. ఇది అరణ్యకాండలో ఎన్నిసార్లు వాడాడో శిష్టా రామకృష్ణశాస్త్రి గారు ఇలా లెక్కవేశారు.[7]

7. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వము.

కనదురు విస్ఫులింగములు గ్రక్కు మహోశని బోలు శూలమున్ (1-24); కనదురు విస్ఫులింగములు కన్నుల రాలగ (1-129); కవిసిరి విస్ఫులింగములు గైదువులం జెదరంగ రాక్షసుల్ (1-192); విస్ఫులింగతతులు వివిధ ముఖంబుల వెడలునట్లు (1-221); మహోశని గతి విస్ఫులింగములు చల్లుచు బెల్లడరంగ (1-239) - ఇట్లు మరియు ననేక స్థలములందు వాడబడినది. ఈ పదము యుద్ధకాండ పూర్వభాగమున గూడ నిట్లే బహుస్థలములం దుపయుక్తమైనది. చూడండి:

'చూడ్కుల నొక్కట విస్ఫులింగముల్ వెలువడ' (53); హూమాగ్నులపసవ్య ధూమమడర విస్ఫులింగమ్ములు వెలువడు (84); దశకంఠకఠోరకంఠ ఖండన చణచండ మార్గణ గణ స్ఫురణ స్ఫుట విస్ఫులింగముల్ (373); కైదువుల్ విస్ఫులింగముల నుమియ (470); గదా విస్ఫులింగాగ్ని జ్వాలలు గన్నులీనుకొన (509); నానా విధ విస్ఫులింగములు (519); కనుగోనల విస్ఫులింగములు ఘోరగతింజెదరంగ (867); విస్ఫులింగములు సల్లుమొనం బొరిం (983) - ఇట్లనేక స్థలములందింకను ప్రయోగింపబడిన దీ పదము.''

యుద్ధకాండలో కూడ ఈ పదం ఇన్నిసార్లు ప్రయోగింపబడడంవల్ల అరణ్యకాండా, యుద్ధకాండ పూర్వభాగం ఒక్కడే వ్రాశాడని రుజువు చేశారు. ఇలాగే మిగతా పదాల వాడకంలో పోలికలు చూపించారు. ఈ పోలికలు ఈ రెండు కాండలలోనే కాక సుందర కాండలో కూడా ఉన్నాయి. సుందరకాండలో ఎన్నిసార్లు విస్ఫులింగములు అనిగాని, స్ఫులింగములు అని గాని వాడాడో చూడండి:

వేడిమి విస్ఫులింగములు వెల్వడగా ధరణీధరేంద్రమ్ముః (28); సంకీర్ణస్ఫుట విస్ఫులింగ పటలీ సంచారమై ఘోరమై (197); చటులాక్షి స్ఫుట విస్ఫులింగ చయ సంచారంబు ఘోరంబుగా (208); కనదురు విస్ఫులింగములు కన్నుల రాలగ (345); గుటిలభ్రూకుటి భీమధూమ చటుల క్రూర స్ఫులింగచ్ఛటో (427); స్థూణాగ్రోజ్ఝిత రుక్మపుంఖకషణోద్భూత స్ఫులింగచ్ఛటా (445); అన్నింటను విస్ఫులింగములు నిండగ జల్లుచు (476); అవె ఘనవిస్ఫులింగతతు లాకసమంటెడు (477); మండితవిస్ఫులింగ విషమ (514).

మిడుతల దావానలంలో పడడం అనే సామెతను వాడడం కూడా హుళక్కి భాస్కరుడికి ఇష్టమే. ఇది సుందరకాండలో కూడా ఉంది (347). అరణ్యకాండలో సీత రావణునికి ఇలాగ హితబోధ చేస్తుంది :

లంక వైధవ్యకలితయై పొంకమడిగి
నేలపాలుగ జేసి నీ వేల త్రుంగె
దనుజుడును దాను నారాము డరుగుదెంచి
యఖిలబలములతోడ జక్కాడు నిన్ను. (అరణ్య. 2-201)

సరిగ్గా ఇలాంటి హితబోధ సుందరకాండలో కనబడుతుంది.

‘‘................................

దుష్టాసురశ్రేణి దునియలు గావించు - విధవలై యింటింట వివిధగతుల
నెల్ల రాక్షసభామలు నేడ్వగలరు- లంకయేడ్పుల శవధూమసంకరముల
బృధులభస్మరాసులతోడ బ్రేతభూమి
యోజ గడునమంగళమయియుండ గలదు. (అరణ్యా. 252)

ఇటువంటి పోలికలవల్ల సుందరకాండ కూడ హుళక్కి భాస్కరుడు వ్రాశాడేమో అనిపిస్తుంది. ఈ కాండలో కూడా చక్కని కవిత్వం ఉంది. లంకంతా గాలించినా హనుమంతునికి సీత కనబడలేదు. రాక్షసస్త్రీలు తినేశారా? ఆమె ఆత్మహత్య చేసుకొందా? సముద్రంలో పడిపోయిందా? ఏమైంది? సీతను చూడకుండా వెళ్లితే ఈ మాట విని రాముడు మరణిస్తాడు. రాముడు పోతే లక్ష్మణుడుంటాడా? అతడూ ప్రాణాలు విడుస్తాడు. ఈ వార్తవిని భరత శత్రుఘ్నులు చనిపోతారు. అసలు ఇక్ష్వాకు వంశమే అంతరిస్తుంది. సుగ్రీవుడు మరణిస్తాడు. తార, రుమ, అంగదుడు, వానరజాతి అందరూ నశిస్తారు. ఇది తలచుకొని ఆంజనేయుడు ఎలా బాధపడుతున్నాడో, ఏమేమి చేద్దామనుకున్నాడో చూడండి:

కాన రాము కులము గపికులమును ద్రుంప - నేను బోవజాల నెదుర నన్ను
గాంచి గారవమున ‘గంటె జానకి - నన్ను - వెరపుమాలి రామవిభునితోడ
(సుందర. 121)

‘భూమిజ గానన యే’నని - భీమ:నలత ప్తసూచి ఖేదనబాధో
ద్దామంబగు దుర్వాక్యము - లేమనివినిపింతు? నెదుటి కేమనిపోదున్? (-122)

జానకి బొడగని రాగల - నేనని నా కెదురుచూచు హితవానర సం
తానము నేమని చేరుదు - భాను:జు ముందరికి నేమి పనియైపోదున్? (-123)

జానకి గానకయుండిన - వానప్రస్థుండ నగుదు, వనధిం బడుదున్
మేను ఖగావలి కిత్తు మ-హా నలముఖశిఖలు సొత్తు హతవిధిజత్తున్. (-124)

నిశిత బలదర్పితుం డగు-దశముఖు విదళించి రామధరణీశునకుం
బిశితో పహార మిచ్చెద-బశుపతికిం బశువు జంపి బలియిచ్చుక్రియన్. (-125)

ప్రుచ్చిలి రఘుభూపతిసతి-దెచ్చిన దుర్వృత్తికిం బ్రతీకారముగా
ముచ్చటులముష్టిహతుల వి-యచ్చరకంటకుని దర్ప మడచి నధింతున్. (-126)

అటుగా కుర్వి సమస్రముం బెరికి కొం చా రాము డీక్షింప నం
తట శోధించెద సీత జూపుమని వేధం బట్టి బాధించెదం

బటురోషమ్మున బార మీటెద వడిన్ బ్రహ్మాండముల్ వీక నొ
క్కట లంకాది నిశాటకోటి సుదధిన్ గాలించి కారించెదన్. (-127)

అని యిట్లనేక ప్రకారంబుల దలపోసి 'నాకిపుడు వేగిరపడనేల, జనకరాజ నందనం గనుం గొనునందాక నిశ్శంక నీ లంక నుండి వెదకెద' (-128).

ఇందులో హనుమంతుని భావాలలో ఒక క్రమం కనబడుతుంది. ఆశాభంగంతో వెళ్లడంకన్న ఆత్మహత్యా చేసుకోవడం మేలనుకొన్నాడు. చచ్చేముందు రావణాసురుణ్ణి చంపుదామనుకున్నాడు. వాడిని చంపితే ఏం ప్రయోజనం? పట్టుకొని చిత్రహింస చేసి, సీతను ఎక్కడ దాచావు అని అడగాలి. ఎక్కడేనా రాక్షసుడు దాచితే వాడు చెప్పడమెందుకు, మనమే వెదుకుదాం అనే చివరి ఆలోచన దానంతటదే వస్తుంది.

సుందరకాండలో కూడ జాతీయాలనూ, సామెతలనూ కవి చక్కగా సందర్భోచితంగా వాడాడు. చూడండి :

ఎల్లసుఖంబుల జేకొన-జెల్లుట యౌవనమునంద చిక్కిన మరి పా
టిల్లునె వెన్నెలదినముల-నల్లోనేరేళ్లుగాక యావల గలవే? (సుం.181)

ఆ రోజుల్లో కౌముదీ ఉత్సవాలు ఉండేవి. వెన్నెల రాత్రులలో అల్లోనేరేళ్లు పాడుతూ ఆనందించేవారు. ఇటువంటి జాతీయాలే కాక నన్నెచోడుడు, మంచెన వాడిన 'నోరి కొలదులు' అనే ప్రయోగం కూడ సుందరకాండలో కనబడుతుంది (201). 'అందని మ్రానిపండులకు నర్రులు సాతురె' (192), 'వంటిల్లు సొచ్చిన కుందేటికి నీకు బోక గలదే' (234) వంటి సామెతలు, ప్రాణాలు చిక్కబట్టుకొనడం (332), కాయకసరు (178) వంటి జాతీయాలు కనబడతాయి.

మల్లికార్జునభట్టు సుందరకాండలో తండ్రితో సరితూగే రచన చేవాడు. ఇతర కాండలలో కూడ అతని కవిత్వం బాగానే వుంది. ఇతడు లోకజ్ఞుడు. తన కాలంలో రాజులు ఎన్నిరకాల వేటలు ఆడేవారో వాలితో రాముడి నోటంట చెప్పించాడు.

మృగయుండు మృగముల నొగి బొంచి వెస జంపు
    గానకుండగ జంపు గడక జంపు
విముఖంబులైయుండ వేచంపు మరి సమ్ము
    ఖంబున నుండగ గడగి చంపు
వలబోను లాదిగా బలుయంత్రముల జంపు
    వడిమీరు శునకాలి విడిచిచంపు
మరియొక్క మృగముతో మలసి పోరగ జంపు
    దీమంబునకు జేర్చి తెగువ జంపు

నెన్ని భంగులనయిన మాంసేచ్ఛ మృగము
నరులు చంపుదు రిల దాన దురిత మొంద
రఖిల ధర్మార్థకోవిదులైన రాజ
వరులు మృగయాభిరతులైన వారు కారె? (కిష్కింధ. 257)

బాలకాండలో ఋష్యశృంగుని వారకాంతలు వలపించి నగరానికి తీసుకుపోయే ఘట్టంలో మల్లికార్జునభట్టు ముగ్ధశృంగారం విపులంగా వర్ణించాడు.

హుళక్కి భాస్కరునితోనూ, మల్లికార్జునభట్టుతోనూ సాటిరాకపోయినా కుమార రుద్రుడు కూడ మంచి కవి. ఇతడు ''రాజవీథులందు తుటుములు తుటుములై సందులేక (46), తేనె పూసిన భీకరఖడ్గం (80), కొంతసేపు వేల్పెక్కినభంగి ఉండడం (147), నింబ భూజంబునకు క్షీరంబును గట్టి పోషించిన మాధుర్యంబు వచ్చునె (186)'' మొదలైనవి అయోధ్యాకాండలో ప్రయోగించాడు. శిఖరాలను అందుకొనే కవిత్వం కనబడదు. శైలి అంతంత మాత్రం. ఇతనికన్న యుద్ధకాండ శేషాన్ని పూర్తిచేసిన అయ్యలభట్టు ఎంతో మెరుగు.

హుళక్కి భాస్కరుడు యుద్ధకాండలో 1140 పద్యాలు చెప్పాడు. వానరులు లంక కాల్చడం దాకా రచించాడు. హుళక్కి భాస్కరుడి ఆఖరు పద్యం ఇది :

ఇంక బలీముఖుల్ బలసి రెక్కడి రావణు డేటి లంక పొం
డింకెను మేఘనాథునగ రీపెనుమంటలతోడి చిచ్చు ల
భ్రంకషశాతకుంభ శిఖరంబగు మోసల గంటి రెట్లు నా
వంక జరింప దగ్ని యవి వారి విభీషణు పుణ్య గేహముల్. (యుద్ధ. 1140)

ఈ పద్యం తరువాత నుంచీ అయ్యలార్యుడు వ్రాసినది. బాలకాండ శ్రీకారంతో ప్రారంభం కాకపోయినా శేషకాండకు శ్రీకారం చుట్టి అయ్యలార్యుడు రచన కొనసాగించాడు. ఈ పద్యం చెప్పాడు:

శ్రీమతమూర్తియైన రఘుశేఖరు తేజము బోలె బర్యుచున్
భానుసహస్రమండల విభాసిసమగ్రతరప్రకాశుడై
మానుగ మింటితో నొఱయు మంటలు దిక్కుల గ్రమ్మ నుగ్రవై
శ్వానరు డేపుతో నెసగె వానరరోషసముత్థుడోయనన్. (1141)

భాస్కర రామాయణం వ్రాతప్రతులలో ఈ పద్యానికి ముందు, ''ఈ ఘట్టము హుళక్కి భాస్కరకవి విరచితము; ఇది మొదలు కడవరకు వేదగిరి నాయనింగారి ప్రేరణమున నయ్యలార్యుడు రచించినది'' అనే వివరణలు ఉన్నాయి. ఈ వేదగిరి నాయనింగారు క్రీ.శ. 1384-1394 ప్రాంతాలలో దేవరకొండను పాలించిన పద్మనాయక ప్రభువు. అయ్యలార్యుడు యుద్ధకాండ శేషాన్ని ఆ మధ్యకాలంలో పూర్తిచేసి ఉంటాడు.[8]

8. ఆంధ్ర కవి తరంగిణి - నాలుగవ సంపుటం, పుట 155లో చాగంటి శేషయ్యగారు క్రీ.శ. 1370లో ఇది జరిగిందని వ్రాశారు

అయ్యలార్యుడు పూర్తిచేసిన యుద్ధకాండ శేషం ఆద్యంతాలలో రకరకాల వివరాలు వివిధ ప్రతులలో దొరికాయని వీరేశలింగం పంతులుగారు తెలియజేశారు.[9]

1. 'ఇక్కడనుండి అయ్యలార్యుని కవిత్వం' అని కొన్ని ప్రతులలో ఉంది.

2. 'ఇకమీద శాకల్యమల్లుభట్టు చెప్పిన కవిత్వం' అని కొన్ని ప్రతులలో ఉంది.

3. 'ఈమీద వేదగిరి నాయనింవారు శాకల్యమల్లుభట్టుగారి మనుమడు అయ్యలుభట్టుగారిచేత చెప్పించిన యుద్ధకాండ విశేషము' అని కొన్ని వ్రాతప్రతులలో ఉంది.

4. కాండాంతగద్య కొన్ని ప్రతులలో 'అష్టభాషాకవిమిత్రకుల పవిత్ర భాస్కరసత్కవి మిత్రాయ్యలార్యరచితంబైన...' అని ఉంది.

5. వావిళ్లవారి ముద్రిత ప్రతిలో "ఇది శ్రీ శాకల్యమల్లకవి వీర నరసింహా వరజాప్పలార్య నందనోభయభాషా కవితావిశారద శారదా చరణ కమల పరిచరణ పరిలీఢ మానసాయ్యలార్య విరచితంబైన..." అని కాండాంత గద్య ఉంది.[10]

ఈ గద్యలన్నిటిని అయ్యలభట్టు వ్రాసుకొని ఉండడు. వివిధ లేఖకులు వ్రాసినవే అవాలి. అయితే గద్యల సారాంశం వల్ల కొన్ని విషయాలు తెలుస్తాయి.

అయ్యలార్యుడు భాస్కరకవికి మిత్రుడు అని మొదటి గద్య చెప్తూంది. రెండవ గద్యవల్ల అయ్యలుభట్టుకు శాకల్యమల్లు పెదతండ్రి అని తెలుస్తుందని వీరేశలింగంగారు భావించారు. అయ్యలుభట్టుకు శాకల్యమల్లు తాతగారే అని చాగంటి శేషయ్యగారు నిర్ణయించారు.[11] హుళక్కి భాస్కరుడి కాలంలో అయ్యలుభట్టు లేడని కూడా చెప్పారు.

అయ్యలభట్టు గురించి ఇతర వివరాలేమీ దొరకలేదు. ఇతడు ఉభయ భాషాకవితా విశారదుడని గద్యవల్ల తెలుస్తున్నది. ఇతని తాతగారు శాకల్యమల్లుభట్టు సంస్కృతంలో లక్ష్యలక్షణ గ్రంథము రచించినట్లు అనంతర కవుల సాక్ష్యం ఉంది. మరింగంటి సింగరాచార్యులవారు తమ 'దశరథరాజ నందన చరిత్ర' అవతారికలో ఇలా వ్రాశారట :

మును రామాయణమున్ నిరోష్ఠ్యముగ నింపున్ మీర శాకల్యమ
ల్లనతా సంస్కృత భాష జేసెనను నాలాగుఁ జెవుల్ నిండగా
వినుటేగాని ధరిత్రిపై నిజముగా వీక్షింపలేదట్టి దే
దెనుగుంజేసెద నెల్లెడం గవులకుం దృష్టాంతమై యేర్పడన్.[12]

---

9. ఆంధ్ర కవుల చరిత్ర – ప్రథమ భాగం, పుట. 318
10. భాస్కర రామాయణం, పుట 671
11. ఆంధ్రకవితరంగిణి, 4–వ భాగం, పుట 155
12. చాగంటి శేషయ్యగారు, ఆంధ్రకవితరంగిణి – 4వ భాగం పుట 156లో ఉదాహరించారు

ఈ సింగరాచార్యుల వారు క్రీ.శ. 1750 ప్రాంతాలవారు. అప్పటికే శాకల్య మల్లనగారి రచనలు అంతరించిపోయాయన్నమాట. ఈ పద్యం వేములవాడ భీమకవి రాఘవ పాండవీయం గురించి పింగళి సూరన్న చెప్పిన పద్యాన్ని జ్ఞాపకం చేస్తుంది.[13]

నన్నయగారి శైలి కొంత తోచేటట్లు ఎఱ్ఱయ్యగారు అరణ్యపర్వ శేషాన్ని ఎలా పూరించారో, అలా హుళక్కి భాస్కరుడు ఎక్కువగావాడే సామెతల్నీ పడికట్టుమాటలనూ వాడి అయ్యలుభట్టు యుద్ధకాండాన్ని పూరించాడు. ఎత్తుగడలో మొదటి పది పన్నెండు పద్యాలలో 'ఉదితాగ్నికి శలభవృత్తి' (1149) అని, 'మహోజ్జ్వల విస్ఫులింగములును' (1154) అని హుళక్కి భాస్కరుడు తరచుగా వాడేవి కనబడతాయి. వానరులు లంక కాల్చడాన్ని అయ్యలుభట్టు చాలా విస్తారంగా 17 పద్యాలలో వర్ణించాడు. చూడండి:

సొరిది మద్యము గ్రోలి చొక్కెడివారును బలునిద్రచే దొట్రుపడెడువారు
లలనాగ్ర భుజలతాలంబితవస్త్రులు గార్ముకముద్గర ఖడ్గధరులు
భామల గూడి తల్పముల నిద్రితులును బుత్రదారల దేర బోవువారు
బొగసుట్టుముట్టిన బోలేనివారును గరమును చిమ్మిటి గదియువారు

జేరగా రాని సెగ దాకి చిక్కువారు
బొదలు మిడుగుర్ల తాకున బొగులువారు
నైన దైత్యులు పదివేవు రగ్నియందు
బండుటాకుల కైవడి భస్మమైరి.

ఇంద్రజిత్తు యుద్ధాన్ని అయ్యలభట్టు ఇలా వర్ణించాడు :

పిడుగులొకో కావు పొడతేవు ఘనము లుల్కా సహస్రంబులో కావుధరణి
యడలదు కాల సర్పావళు లొకొ కావు పాతాళ వివరంబు బయలుపడదు
ఖరమైన ముక్కంటి కంటి మంటలొ కావు జగదవసానంబు జాడలేదు
కాలకూటార్చులో కావు మందరగోత్ర మానితాంభోరాశి గానబడదు
మొదలెరుంగ రాదు ముసుకొని పుట్టిన - చొప్పు దెలియరాదు చూడ నెచట
నని కపీంద్రు లిట్టు లాజి దల్లడ మంది - రింద్రజిత్తు తూపు లేపు మాప.

(యుద్ధ. 1268)

చదివీ చదవగానే ఈ పద్యం బాగానే ఉందనిపిస్తుంది గాని లోతుకు వెళితే ఔచిత్యం లేదనిపిస్తుంది. ఇంద్రజిత్తు వేసే బాణాలకు కపిసైన్యాలు తల్లడమందుతున్నాయి. ఇవి పిడుగులా, కావు; మబ్బులు లేవు, ఉల్కాసహస్రాలా? ధరణి కంపించదు. కాలసర్పాలా, కావు; పాతాళం బయటకు కనపడదు. శివుడికంటి మంటలా, జగత్ప్రళయం కనబడదు అని కపులు తల్లడిల్లారట! ఎవడి ప్రాణం వాడికి తీపి! తన ప్రాణాలమీదికి వచ్చినప్పుడు ప్రపంచం అంతమైపోతున్నదని భావిస్తేనే సహజత్వం ఉంటుంది. ఇది జగదవసానకాలం కాదనుకోవడంలో ఔచిత్యమేముంది?

---

13. సమగ్ర ఆంధ్రసాహిత్యం - చాళుక్య యుగం

ఇటువంటి అనౌచిత్యపు రచన శివుడి నోటంట చెప్పించిన మాటలలో అయ్యల భట్టు వ్రాశాడు. రావణాసురుణ్ణి సంహరించినందుకు శివుడు రాముణ్ణి మెచ్చుకొంటు న్నాడు. వినండి, ఆ పద్యం:

సురలకు గుండె తల్లడము శూరుల డెందములోని కొఱ్ఱు ఖే
చరతతి కంటిలో నలుసు సాధ్యుల కొంగున నున్న చిచ్చు భూ
సురులకు నెల్ల నాడు మెడ జుట్టిన పాము మునీంద్రకోటిపై
బొరి బడనున్న యా పిడుగు బొల్పర జేసితి వీవు రాఘవా! (యుద్ధ. 2430)

రావణుడు భూసురులకు మెడచుట్టిన పాముట! ఇది నాగభూషణుడు చెప్పిన మాట. ఇరవైనాలుగు గంటలూ మెడలో పామున్నవాడు స్వానుభవంవల్ల చెప్పిన మాటా ఇది? తన ఆభరణాన్ని తానే కించపరచుకొంటాడా? ఇది అయ్యలుభట్టు రాముడితో అనే మాటలేగాని శివుడు అనేవి కావు. పాత్రపోషణలో అయ్యలుభట్టు శ్రద్ధ తీసుకొన్నట్లే లేదు. అగ్నిపరీక్ష ఘట్టానికి ముందు రాముడు సీతమ్మతో అనే మాటలు వినండి :

ఇంతి! వినుము పురుషుడెట్టివాడయినను
బరుని యింట నున్న పడతి మగుడ
బ్రాకృతుండపోలె జేకొన నేర్పునే
యింతకంటె నింద యెద్ది గలదు? (2353)

ఘనతర సౌందర్యము గల - నిను జూచి దశాననుండు నిశ్చలమతియై
మనసిజ రాగమునొందక - మనమున ధైర్యంబు గలిగి మసలునె చెపుమా.
(2354)

భరతలక్ష్మణ శత్రుఘ్ను తరణి సూను
వాలినందన దావన వరులలోన
నీమనంబున కెవ్వడో నెరి బ్రియుండు
వాని జేకొను మిప్పు డు వనిత! యనిన. (2355)

వాల్మీకి రామాయణంలో ఈ భావము ఉంటే ఉండవచ్చును. ఇంత కటువుగా చెప్పించేసరికి ఉదాత్తనాయకుడి మీద పాఠకులకు ఉండవలసిన గౌరవం పోతుంది. రంగనాథ రామాయణంలోనూ, ఎఱ్ఱయ్యగారి అరణ్యపర్వంలోని రామకథలోనూ రాముడు సీతను ఎక్కడికేనా వెళ్లమంటాడు కాని ఇలా 'స్వయంవరం' చేసుకోమనడు. పోనీ, అయ్యలుభట్టు మంచి కవి కాడా అంటే చక్కని భావాలు ఉన్నవాడాయె. రాముడు ఈ మాటంటే సీతమ్మ, ''తన శరీరంలోననే తానడంగు-కరణి దెసలేని వెరవున ధరణి సొచ్చుపగిది సృుక్కిపోయిం''దని గొప్పగా చెప్పాడు (2356). ఉత్తరోత్తరా పోతరాజుగారు అనుకరించే పద్ధతిలో కొన్ని పద్యాలు చెప్పాడు. చూడండి :

మందార భూజంబు మరగిస భృంగికి బిచుగంధ శాఖిపై బ్రేమ గలదె
లలితమానసంబున మెలగెడు హంసికి వెలయ బల్వలముపై వేడ్క గలదె
మలయద్రుమంబున మలయుభుజంగికి బర్బూరతరువుపై వలపు గలదె
భాస్కరోదయమున భాసిల్లు పద్మిని కిందుకర స్పృష్టి నెలమి గలదె
రాజితానేక సద్గుణారామ రామ - ధర్మపాలన పరమ నీ ధర్మపత్ని
యైన సాధ్వికి సీతకు నన్యునందు - గూర్మి యే చందమున సమకూడునయ్య!

(2405)

పోతరాజుగారి 'మందార మకరంద మాధుర్యమునదేలు' (భాగ.7-150) అనే ప్రసిద్ధ పద్యానికి ఈ పద్యం ఒరవడిలాగ లేదూ!

కావ్యాన్ని ఆస్వాదించి రసానందం పొందాలని చదివేటప్పుడు అయ్యలుభట్టు చేసిన పాత్రపోషణ బాగులేదనిపిస్తుంది కాని మూల విధేయతను పాటించి రామునిచేత అలాగ అనిపించినందుకు అభినందించక తప్పదు. ఒకనాటి సాంఘిక చరిత్రగా రామాయణాన్ని అర్థం చేసుకొనడానికి మూలవిధేయతగల అనువాదాలు పనికివస్తాయి. రామాయణం అంతా విని రాముడికి సీత ఏమౌతుందని ప్రశ్నించేవాడు వెర్రివాడు కాడు. బౌద్ధ జాతక గాథల ప్రకారం రాముడు, సీత ఒక తండ్రి బిడ్డలు. జనకుడు సీతారాములిద్దరికీ జనకుడే. పితృ కన్యలను వివాహమాడే ఆచారం - అత్యంత ప్రాచీన ఆచారం - ఈజిప్టులో ఉండేది.

రామాయణ గాథ ఎక్కడ జరిగింది? అది హిందూదేశంలో తప్ప ఇంకొక చోట జరగడానికి వీల్లేదని సహజంగా అందరం భావిస్తాం. అయితే కొందరు దీనితో ఏకీభవించరు. రాజమండ్రి ట్రైనింగు కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసి, రిటయిరయిన మల్లాద వెంకటరత్నంగారు 'రాముడు ఈజిప్టు మహాప్రభువు' (రామా ది గ్రేటెస్ట్ ఫారో ఆఫ్ ఈజిప్ట్) అనే గ్రంథాన్ని ఇంగ్లీషులో వ్రాశారు. అందులో అపూర్వమైన వాదాన్ని ప్రతిపాదించారు. ''వాల్మీకి కవికోకిలకు నారదులవారు చెప్పిన రామాయణ గాథ హిందూదేశంలో జరిగింది కాదు. ఈజిప్టును పరిపాలించిన 'రామ్సెస్' అనే మహానుభావుని చరిత్ర. దానినే వాల్మీకి హిందూదేశపు పేర్లతో కథనం చేశాడు.'' ఇదీ వెంకటరత్నంగారి వాదనలోని సారాంశము.

ఈ విడ్డూరమైన వాదంలో ఎంత సత్యముందో సమగ్రంగా చర్చిస్తేగాని తేలదు. దిగితేగాని లోతు తెలియదు. అయోధ్య, సరయూనది, మిథిల, దండకారణ్యం మొదలైనవి హిందూదేశంలోని ప్రదేశాలేకదా! రామాయణం ఇంకొకచోట జరగడానికి వీలులేదు - అని మనం భావించవచ్చు కాని, మన రామాయణ గాథనే తీసుకొని తమ తమ దేశాలలో జరిగినట్టు ఇతరులు చిత్రించుకున్నారు.

భారతీయ ఇతిహాసాలపై ఎ.డి. పుసాల్కర్‌గారు పరిశోధనలు చేశారు. భారతీయ విద్యాభవన్‌వారు ప్రచురించిన ఒక పుస్తకంలో రామాయణంపై విపులమైన విభాగం

వ్రాశారు. విదేశాలలో రామాయణ గాథెలా మారినదీ వివరించారు. టిబెట్టు దేశపు రామాయణంలోని సంఘటనలూ, పేర్లూ చాలా వేరుగా ఉన్నాయట. మలయా దేశపు రామాయణాన్ని ముస్లిం ఆస్థానంలోని అభిరుచులకూ, అవసరాలకూ అనువుగా ఒక కవి మార్చారట. జావా, సుమత్రా, బాలి, కంబోడియా దేశాలలోని రామాయణ గాథలో సంఘటనలు విభిన్నమయినవి. సయాం, ఇండోచైనా, చైనా దేశాలలో కూడ రామాయణ ప్రతులున్నాయి. మూలంతో ఇవి విభేదిస్తాయి.

లావోస్ దేశపు రామాయణానికి, వాల్మీకి రామాయణానికి సంబంధమే లేదు. హిందూదేశపు ప్రాదేశిక నామాలు కాక లావోస్‌లోని పేర్లతోటే ఆ రామాయణం జరుగుతుంది. 'కుప్పుస్వామి శాస్త్రి పరిశోధక సంస్థ' ప్రచురించిన పత్రికలో 22వ సంపుటిలో హెన్రీటేడియర్‌గారు లావోస్ రామాయణంపై ఒక చిన్న వ్యాసం వ్రాశారు. దానివల్ల చాలా కొత్త సంగతులు తెలుస్తాయి. వారు చెప్పిన లావోస్ రామాయణాన్ని వివరిస్తాను.

'చంద్రపురిస సత్తానాగమాహ నగర' అనే ప్రదేశాన్ని (ఆధునిక వియంటైన్) దతరథ అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. అతని కుమార్తె పేరు 'సంగ్ చంద'. ఆమెను రావణుడనేవాడు ఎత్తుకుపోయాడు. ఇతడు 'ఇంద్రపత్తానగర్' పాలకుడైన 'విరులహ' రాజకుమారుడు. రావణుని సంహరించగల పుత్రుణ్ణి ప్రసాదించమని ఇంద్రుణ్ణి ప్రార్థిస్తాడు. 'ప్రలమ్' అనే దేవపుత్రుణ్ణి ఇంద్రుడు పంపిస్తాడు. (ఇతడే రాముడు). సోదరుని సహాయంతో రాముడు సంగచందను వియంటైన్‌కు తీసుకువస్తాడు. రావణుడిని అతని తండ్రి బహిష్కరిస్తాడు. లంకలో రావణుడు వాసమేర్పరచుకుంటాడు. ఒకసారి ఇంద్రుడి అమరలోకవాసాన్ని చూడడానికి రావణుడు వెళ్లాడు. అక్కడ ఇంద్రుని అజాగ్రత్తను వినియోగించుకొని రావణుడు ఒక అంతఃపురకాంత శీలాన్ని చెరుస్తాడు. ఆమె ప్రతీకారం కోసం తపస్సు చేస్తుంది. భూలోకానికి దిగివచ్చి రావణుని కుమార్తెగా జన్మించి, అతణ్ణి సంహరించడానికి ప్రయత్నిస్తుంది. అంతట రావణుడు ఆమెను వెళ్లగొడతాడు. తెప్పలో కొట్టుకుపోతున్న ఆమెను ఒక ముని రక్షించి ఆమెకు సీత అనే పేరు పెడతాడు. ఆమె సౌందర్యకీర్తి దశదిశలకు విస్తరిస్తుంది. రాముడు కూడా అది వింటాడు. ఆమెను పరిణయమాడ నిశ్చయించుకుంటాడు. ఆమె తన కూతురే అన్న సంగతి జ్ఞాపకం లేక రావణుడు కూడ రాముడితో పోటీకొస్తాడు. మునియొక్క దివ్య ధనుస్సును రాముడొక్కడే వంచగలిగి సీతను పరిణయమాడతాడు. (ఇక్కడే మాయలేడి సంఘటన, సీతాపహరణం జరుగుతాయి.) రాముడు భార్యకోసం అన్వేషణ మొదలెడతాడు. అయితే అతడి విపత్కరమైన కర్మవలన మూడేండ్లపాటు రాముడు వానరుడుగా మారిపోతాడు. అతడికి హనుమాన్ అనే కుమారుడు కలుగుతాడు. రాముడు మళ్లా మానవరూపాన్ని పొందాక లక్ష్మణుడూ, హనుమా సహాయం చెయ్యగా పెద్ద వానర సైన్యంతో లంకపై దాడి వెడలి రావణుని సంహరించి సీతను వియంటైన్‌కు తీసుకుపోతాడు.

ఇదీ టూకీగా లావోస్ రామాయణ గాథ. ఇందులోని ప్రదేశాలన్నీ లావోస్ లోనివే. పైగా కావ్యంలో విపులంగా పేర్కొన్న ఆచార వ్యవహారాలన్నీ స్థానికమైనవేనట. మన దేశంలో మన రామాయణానికి ఎంత ప్రచారముందో ఈ రామాయణానికీ అంత ప్రచారముందట. వాల్మీకి రామాయణానికి ఇది చాలా విభిన్నమైనది.

హిందూదేశపు వాల్మీకి రామాయణాన్ని లావోస్ రచయితలు తమ ప్రాదేశిక నామాలతో, తమ ప్రాచీన ఇతిహాసాలకు అనుగుణ్యంగా మార్చుకున్నట్లు ఈజిప్టు దేశపు గాథను మన వాల్మీకి కూడ ఆదిలో మార్చివేశాడనే అనుమానానికి ఆస్కారం లేకపోలేదు. మల్లాది వెంకటరత్నంగారి వాదాన్ని సులభంగా కొట్టిపారేయలేము. వేదం వెంకటాచలయ్యగారి పరిశోధనలు కొన్ని దీనికి తోడ్పడుతాయి.

''భరతవర్షం-భరతఖండం'' అనేవి ఎక్కడున్నాయో తేల్చాలని వేదం వెంకటాచలయ్యగారు విపులంగా పరిశోధించారు. ప్రాచీన భరత వర్షం నేటి భారతదేశపు సరిహద్దులకు చాలా దూరంలో వున్నదని తేల్చారు. యూఫ్రటీస్ టైగ్రీస్ నదులు ప్రవహించే ఆధునిక మెసపొటేమియా దేశమే ప్రాచీన భారత వర్షమని వారి వాదన. ఆ నదుల చరిత్రే మన గంగావతరణ గాథ అని కూడ వివరించారు. మెసపొటేమియాకు ఈజిప్టు దగ్గరలోనే వుంది.

ఒక్క రామాయణ విభేదాలనే కాదు, ఇతర దేశాల పురాణగాథలను పరిశీలించినా వివిధ సంస్కృతుల మధ్య ఇతివృత్తాల ఎగుమతి దిగుమతులు, ఇచ్చి పుచ్చుకోవడాలు మొదలైనవి జరుగుతూ ఉండేవని ఊహించవచ్చు. లావోస్ రామాయణంలో సీత రావణుని కూతురు. మన కట్టుకథలలోనికే ఈ అభిప్రాయము దిగుమతి అయిందో, మన దగ్గరనుండే ఎగుమతి అయిందో ఊహించలేనంత కాలం గడిచిపోయింది.

ఒక ప్రఖ్యాత కావ్యంలోని సంఘటనలలోనూ పాత్రల సంబంధబాంధవ్యాల లోనూ ఇలాంటి భేదాలు ఎలా వస్తాయి? విశ్వనాథ సత్యానారాయణగారి రామాయణమే కొద్దిగా జవాబు చెప్తుంది. ఆయన సన్నివేశాల క్రమాన్ని ఔచిత్యం పేరిట మార్చారు. పరశురాముడు జనకుని దర్బారులోకి వచ్చినట్లు కల్పించారు. దీనిని చలనచిత్ర నిర్మాతలు కూడా స్వీకరించారు. అందరూ ఆమోదించిన మార్పును 'పదుగురాడు మాట పాడియై ధరజెల్లు' అని సరిపెట్టుకుందాం. ఏ కొద్దిమంది ఛాందసులో ఇటువంటి దానికి ''శతాంధాః కూపం ప్రవిశంతి'' అని తిట్టిపోస్తారు. స్త్రీలరామాయణం పాటలలో ఉన్న సన్నివేశాలన్నీ మూలంలో ఉన్నవేనా? తరతరాలుగా పాడుకుంటున్నారు కదా! భారతీయ సాహిత్యంలోని ఆదికావ్యమైన రామాయణం వాల్మీకి వ్రాసినది వ్రాసినట్టుగా పూర్తిగా కాకపోయినా మూలానికి చాలా విధేయంగా అనువదించిన ఈ భాస్కర బృందం భాషకు చక్కని సేవ చేశారు.

ఈ పద్మనాయక యుగంలోనే గేయరామాయణమైన ఆధ్యాత్మ రామాయణం ప్రచారంలో ఉందని మనం భావించవచ్చు. ఈ యుగంలోని కవి త్రిపురాంతకుడు ప్రేమాభి రామం వ్రాశాడు. దానిని అనువదించిన శ్రీనాథుడు క్రీడాభిరామంలో 'విద్దికూచి రామాయణం' అనే గేయ రామాయణాన్ని చెప్పాడు.

కోయల పంచమ స్వరము క్రోల్చిన భంగిని విద్దికూచి రా
మాయణ మారుకాండలును నచ్యుత జాగరవేళ బాడె నా
రాయ వితంతు రత్నమను రాగము తోడ నమశ్శివాయ శాం
తాయ సమస్త దోష హరణాయ సమానమె దాని కెవ్వరున్? (క్రీడా. 170)

ఈ పద్యంవల్ల విద్దికూచి రామాయణంలో ఆరు కాండలుండేవని, దానిని అచ్యుత జాగరవేళల (వైకుంఠ ఏకాదశి) వితంతువులు పాడేవారని తెలుస్తుంది. ఇది ఆడవాళ్ళ రామాయణం పాటల్లో చేరుతుందా? నేటికీ ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు తెలుగులో ప్రచారంలో ఉన్నాయి. విద్దికూచి రామాయణంలో ''నమశ్శివాయ'' అనే పాట ఉందని, శ్రీనాథుడు చెప్పాడు.[14] నేటి ఆధ్యాత్మ రామాయణంలో కూడా ''నమశ్శివాయ'' అనే మొదటి పాట ఉందని నిడుదవోలు వెంకటరావుగారు గుర్తించారు.[15]

విద్దికూచి రామాయణం, బహుశా యక్షగాన ప్రదర్శన కోసం చేసిన రచన కావచ్చును. కూచి అంటే నాట్యకత్తె. ద్రావిడ భాషలలో నాట్యాన్ని కూత్తు అంటారు. కూత్తాడే స్త్రీని కూత్తి అని పిలుస్తారు. ఆదిలో మంత్ర చర్య చేస్తూ ఆడవాళ్ళే నాట్యం చేసేవాళ్ళు. ఇతర ద్రావిడ భాషలలోని కూత్తి శబ్దం తాలవ్యీకరణం వల్ల తెలుగులో కూచ్చి అయింది. దీర్ఘాచ్చు మీద జడ్డ లోపించి స్పర్శాక్షరం ఎక్కటి వ్యంజనమై కూచి అనే రూపం వచ్చింది. మగవాళ్ళు ఆడవాళ్ళ మంత్రచర్యల ప్రాంగణంలో ప్రవేశించి ఆడవేషాలు వేసుకొని నాట్యం చేయడం ప్రారంభించాక 'పోతు కూచి' అనే పదం పుట్టింది. మగవాళ్ళు నాట్యమాడడం సర్వ సామాన్యమయ్యాక ఆట భాగవతులందరినీ కూచిగాళ్ళు అని పిలవడం పరిపాటి అయింది. మగవాళ్ళ పేర్లలో కూచి అన్నది చరమావయవంగా కనబడుతుంది. పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో విశస్తుల కూచి, ఆదిత్ర కూచి, చిప్పనకూచి, దొడ్డనకూచి అనే అగ్రహారీకుల పేర్లను సప్తమాశ్వాసంలో చెప్పాడు.[16] కాకతీయ యుగంలో కూచి ఆటలుండేవనడానికి ఈ పేర్లే దాఖలాలు.

కాకతీయ యుగంలో కూచి ఆటలు ఆడే నాట్యవినోదులు పటుము పన్నించి పాత్రలను ఆడించేవారని సింహగిరి వచనాలలో కృష్ణమాచార్యుడు చెప్పాడు.[17] విద్దికూచి వారు కూడా అలాగే ఆడించేవారేమో. కాకతీయ యుగంలోని నాట్యనాటిక వినోదులను పాల్కురికి సోమనాథుడు ఇలా చెప్పాడు :

---

14. మణిమంజరివారు ప్రచురించిన క్రీడాభిరామం (1960)లో 'విద్దికంచి రామాయణం' అని ఉంది
15. భారతి - ఆగష్టు 1945 (కలగూరగంప)
16. బసవపురాణం, ఆంధ్రగ్రంథమాల ప్రచురణ (1952) పుటలు 186-187
17. సింహగిరి వచనములు - వచనము నెం. 32

రమణ బంచాంసి పేరణి యాడువారు
బ్రమథ పురాతన వటు చరిత్రములు
గ్రమ మొంద బహునాటకము లాడువారు
లలితాంగ రస కళాలంకార రేఖ
లలవడ బహురూప మాడెడువారు,...

....

భారతారి కతల జీరమరుగుల
నారంగ బొమ్మల నాడించువారు
గడు నద్భుతంబుగ గంబసూత్రంబు
బడరంగ బొమ్మల నాడించువారు.

ఈ జాబితాలో పటము పన్నించి ఆడించువారిని ప్రత్యేకంగా పేర్కొనలేదు. ఇది నాటకాలలోగాని బహురూపాలలోగాని చేరవచ్చు. విద్దికూచి రామాయణాన్ని అలాగే ఆడేవారు కాబోలు. వాటిని చూచిన ఆడవాళ్ళు ఆ పాటలను ఇంట్లో పాడుకొనేవారేమో!

విద్దికూచి రామాయణాన్ని త్రిపురాంతకుడు మొదట ప్రేమాభిరామంలో పేర్కొన్నాడో లేదో తెలియదు. ఏమైనా శ్రీనాథుడి కాలానికి ముందే ఇది ప్రచారంలో ఉండేదని కచ్చితంగా చెప్పవచ్చు. ఒకవేళ కాకతీయ యుగంలో ప్రచారంలో ఉండిన ఆట రామాయణం నుంచో ఆడవాళ్ళు పాడుకొనే రామాయణం నుంచో ఈ భాస్కర రామాయణ కవులు ఈ కూర్పులు స్వీకరిస్తే వాళ్ళని అభినందించాలి. వాల్మీకి పట్ల భక్తితోపాటు తెలుగు తల్లులకు కూడా అంత గౌరవమిచ్చిన ఈ భాస్కర రామాయణ కవులు ప్రశంసనీయులు.

శరభాంకుడు

కాకతీయ రాజులలో కడపటివాడైన ప్రతాపరుద్రుడి ఆస్థాన జనాన్ని వర్ణిస్తూ ''మల్లికార్జునభట్టు మొదలైన బ్రాహ్మణ విద్వాంసులు బంగారుపల్లకినెక్కి చనుదెంచువారు నూటయాబదియును. భాస్కరుడు మున్నుగాగల కవీశ్వరులు యిన్నూరు వుండేవా''రని ప్రతాపచరిత్ర తెలియజేస్తూవుంది.[1] ప్రతాపరుద్రుణ్ణి ఢిల్లీ సేనలు చెరబట్టి తీసుకు వెళుతున్నప్పుడు అతని పరివారంగా వెళ్లినవాళ్ల జాబితాను కూడ యిస్తోంది. ''ఊడిగంబుల వారు వేయిన్నేనూరు, పరిహాసకులు నలుబంద్రును, శాకవెల్లి మల్లికార్జునుడు మొదలుకొని విద్వాంసులు నూరును... రాజు యొక్క ఉత్తమాశ్వంబులు యేనూరును, గజంబులు

1. సిద్ధేశ్వర చరిత్రము – సంపాదకులు : ఖండవల్లి లక్ష్మీరంజనంగారు పుట 152

యెనిమిది నూర్లును, శివదేవయ్య, శరభాంకుడు, మల్లికార్జునుడు, రంగనాథుడు మొదలుగా గలవారు యిన్నూరును.... రాజు సుముఖంబునకు'' వచ్చుట.[2]

ఇందులో శివదేవయ్య పురుషార్థసారం రచించిన కవి, మహామంత్రి అని మనకు తెలుసు. శరభాంకుడు కూడా కవే అని తెలుస్తున్నది. ఏమంటే మల్లికార్జునుడు, రంగనాథుడు అనేవాళ్లు ఆనాటి ప్రఖ్యాత కవులు. వీళ్ళతో కలిపి చెప్పటం వల్లనే కాక శరభాంకుడనే కవి ప్రతాపరుద్రుని మహమ్మదీయులు చెరపట్టినప్పుడు ఈ పద్యాన్ని చెప్పాడని సంప్రదాయం వల్ల కూడా తెలుస్తున్నది:

చాపముగా సహార్యమును జక్రిని బాణముగాగ నారిగా
బాపదొరన్ బొనర్చి తలపం ద్రిపురంబుల గాల్చవే మహా
దీపిత తీవ్రకోపమున దేవతలెల్ల నుతింప నాటివిల్
పాపపు డిల్లిమీద దెగ బాపగదే శరభాంకలింగమా.

ఈ పద్యం మొదట 'చ' కారం, ఆరవచోట 'హ' ఉందట. అందుచేత యిది శక్తివంతమయిన తిట్టు అని చెప్పుకుంటారు. ఈ పద్యం చాలా ప్రసిద్ధమై వుంటుంది. లింగమకుంట తిమ్మకవి (క్రీ.శ. 1560) దీనిని లక్ష్యముగా ఉదాహరించాడు.[3]

శరభాంకుడు కేవలం కవేగాక ప్రతాపరుద్రుని మంత్రివర్గంలోని వాడని కూడా తెలుస్తూంది. 'లింగధారణ చంద్రిక'లో ''శ్రీమద్యజుశ్శాఖా పస్తంబ సూత్ర కౌశికగోత్ర పవిత్రానాది వీరశైవభక్త త్రయాంతర్భూతాయ ప్రతాపరుద్ర పృథివీశ్వర సంస్థానమంత్రిశేఖర శరభాంక వంశసంభూతాయ'' అనే వాక్యాలు వున్నాయట. దానివల్ల శరభాంకుడు ప్రతాపరుద్రుని మంత్రి అని విశ్వసించవచ్చు. లింగధారణ చంద్రిక నుండి వాక్యాలను ఉదాహరించిన వావిళ్ళ సంస్థవారు ''శరభాంకుడు, శివదేవయ్య, విశ్వేశ్వరదేశికులు సోదరులనియు, నీ ముమ్మురు ప్రతాపరుద్రుని మంత్రులనియు జెప్పుచున్నారుగాని, కాకతీయ సామ్రాజ్యమునకు సంబంధించిన చరిత్ర గ్రంథములందు మా చూచినంతలో శరభాంకుని పేరు గానరాదు''[4] అని చెప్పారు. కాని, మనం ప్రతాపచరిత్రలో శివదేవయ్యతోబాటు శరభాంకుణ్ణి పేర్కొనటం ముందే చూశాం.

శరభాంకుణ్ణి కవిగా అనంతర కవులు నుతించారు. 17వ శతాబ్ది చరమపాదంలో ఉన్న ఎడపాటి ఎర్రయ్యకవి తన మల్హణచరిత్రలో యితణ్ణి స్తుతించాడు. అప్పకవికి పూర్వుడైన రాజలింగకవి కూర్మపురాణంలో శరభాంకుణ్ణి నుతించాడు. అందుచేత శరభాంకుడు కవిగా కూడా ప్రసిద్ధుడే.

ఇతడు 'శరభాంకలింగమా' అనే మకుటంతో శతకం వ్రాశాడు. అందులోని అయిదు పద్యాలను వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ చాటుపద్యమణిమంజరి - మొదటి

2. సిద్ధేశ్వర చరిత్రము, పుట 169
3. సులక్షణసారం (234వ పద్యం). వావిళ్ల ప్రచురణ, రావూరి వారి పరిష్కరణ, పుట 147
4. నీతిశతక సంపుటము. శరభాంకలింగ శతకము పీఠిక పుట 175

భాగంలో ఉదాహరించారు.[5] వావిళ్ళవారు 1928లో ''నీతిశతక సంపుటము''లో ఈ శతకాన్ని ప్రకటించారు. ప్రభాకరశాస్త్రిగారి ఉదాహృతపద్యముల వలన శరభాంకలింగ శతకము లోకోత్తరముగా నుండునని భ్రాంతిపడితిమి గాని భాషావిషయిక దోషములు శతకమునిండ గలవు'' అని వావిళ్ళవారు వ్రాశారు.[6] ఈ శతకంలో నాలుగు పాదాల పద్యాలు 60 ఉన్నాయి. 5 పాదాల పద్యాలు 40 ఉన్నాయి. ఒక పద్యంలో ఆరు పాదాలు కూడా ఉన్నాయి. దాని నెంబరు 32. ఈ శతకంలోని 70వ నెంబరు పద్యం తరువాత అన్నీ నాలుగు పాదాలవే. అవి ప్రౌఢంగా ఉన్నాయి.

నాలుగు పాదాల పద్యాలను శరభాంకుడు వ్రాశాడనీ, అయిదు పాదాలవి ఎవరో అనంతర కవి వ్రాసి ఉంటాడనీ ఊహించవచ్చు. ఆదిని శరభాంకుడు నాలుగు పాదాల పద్యాలలో శతకం చెప్తే అందులో కొన్ని నష్టమై ఉంటాయి. అనంతర కవి వాటిని పూరించటానికి ప్రయత్నించి ప్రతిభాలోపం చేత అయిదు పాదాల పద్యాలు చెప్పి వుంటాడు.

నమ్మికలేక శాంకరికి అంగములో సగ మిచ్చె నీశుడున్
రొమ్మున కాంత నిల్పెను సరోజ సునాభుడు పద్మజుండు తా
నిమ్ముగ నోటనే సతిని నేమరకుంచె నఖండ వేల్పులీ
కుమ్మకు నోపలేక మది కోరికవోక మునింగి రిట్లు పో,
నెమ్మది నల్పకోటి భవనిగ్రహులా శరభాంకలింగమా. (16)

అనే పద్యంలో కవి తాను వ్రాస్తున్న శతకం యేమిటో, ఏ దేవుణ్ని సంబోధిస్తున్నాడో మరిచిపోయాడు. శరభాంకుడు శివుడే కదా! మరి భావనిగ్రహం లేదని శాంకరికి అంగంలో సగమిచ్చిన ఈశుణ్నే యీ పద్యంలో తిడతాడేం? అనంతర కవి ఆవేశంలో యతిప్రాసలు చూసుకోటం లేదు. చూడండి యీ పద్యపాదం:

''పొలతుల నమ్మకంబు పొరుగూరి సుఖంబు ధనీకుజ్ఞానమున్.'' (17)

ఇందులో యతి భంగముంది. ఇతడు దుష్టసమాసాలు గూడ చెప్పాడు.

''నీదు త్రిశూలపోటుల'' అని ఒక ఉత్పలమాల ఎత్తుకొన్నాడు. (25) ఈ అనంతర కవి మహమ్మదీయ పరిపాలన దేశంలో బాగా పాతుకుపోయిన కాలంలోని వాడని యీ పద్యమే చెపుతుంది. చూడండి:

పరులొక రివ్వరైరనుచు బ్రస్తుతి యేల దురాత్మకోటికిన్,
హరుసము లేకపోయెనని యావద యేల పరాత్పరుండు తా
గరుణదలంచెనేని జనకంటకులెల్ల గులాము లౌదురే,
మరియును జన్మ సంచితమె? మర్మములేని సుతుండుగాక తా
బరులకు నమ్మియెక్కడకు బాత్రుడయా శరభాంకలింగమా. (29)

5. పుటలు 208, 209
6. నీతిశతక సంపుటము, పుట. 177

'గులాము'లన్నమాట కాకతీయ యుగంలో వాడేది కాదు. ఆ తరువాత వచ్చింది. ఈ పద్యంలోనే కాక ''మొండిగులాములరాలు నతి మూర్ఖుల పాలిటి వేడ్కకత్తెబో' అని 42వ పద్యంలో మళ్లా 'గులాము' వాడాడు. ఈ అనంతర కవి 'గ్రామ్యం' కూడా వాడాడు. చూడండి – ''నీపదపద్యఘోషములు నెచ్చటనైన బఠించుచుండగా. పాపద యింటికాడ పనిబాయ నటందురు''

ఈనె కపీశు డంటి యిక నింతకు బత్తుడు బుట్ట డంటవో,
స్నానము చేయునంట మరి సందెజపంబులు వార్చునంటరో,
గానము చెప్పు నంట మనగాలియు పొరక గూడదంటరో,
మానవు డీడకాడ మన మాతనికంటెను తక్కువైతిమా,
కాని యటంద్రు మూర్ఖజన గణ్యులయా శరభాంకలింగమా. (68)

ఈ పద్యంలోని గ్రామ్యాన్ని చూస్తే ''కాపుకవీశ్వరుల్ కంచర యోగులు సాతాని వైష్ణవుల్...'' అని విసుక్కున్న కూచిమంచి తిమ్మకవి కాలంలో ఈ పంచపాదాల భాగం పుట్టినట్టు కనపడుతూంది. 70వ నెంబరు పద్యం దగ్గర నుంచి ప్రౌఢమైన కవిత్వముందని, అక్కడనుంచి అన్నీ నాలుగు పాదాల పద్యాలేనని ముందు చెప్పుకున్నాం. ఇవే ఆదిని శరభాంకుడు రచించి వుంటాడని నమ్మకంగా భావించవచ్చు. అతని భావాలను, ప్రతిభను యీ పద్యాలలో చూద్దాం. పూజకు పువ్వులు, పత్తిరి అక్కరలేదు – ప్రార్థన చాలునని చాలా చమత్కారంగా చెపుతున్నాడు. పూజ చేయటానికి పత్రికోస్తే ముళ్లు గుచ్చుకుంటాయట. పూజాఫలంవల్ల స్వర్గభోగాలు అనుభవిస్తున్నపుడు అప్సరసలగోళ్లు మొదలయినవి గుచ్చుకుంటాయట. చూడండి:

చిత్తజవైరి పూజకని శ్రీ ఫలపత్రము లోలి గోయగా
పత్తిరిముండ్లు నొత్తు సమరాంగన చేతి నఖంబు లొత్తు త
ద్వృత్తకుచంబు లొత్తు నెరి వీపున గావున సద్దిరయ్యయా,
పత్తిరిత్రోవ నొల్ల మిక ప్రార్థనయా శరభాంకలింగమా. (74)

ఇంకో పద్యంలో ''అంగజు డింటిముంగిలి నిరంతరం 'చదుక' అని యోగులు మరీ పంకపూరితమైన మకరధ్వజుని కొంపప్రాంగణం త్రొక్క'' రట (71). నిజమైన యోగుల గురించి ఇలా చెప్పాడుగాని, దొంగసన్యాసులు ఆ కాలంలో కూడా వున్నారు. వాళ్లని ఇలా గర్హిస్తున్నాడు:

రాగిలి రాత్రులెల్ల రతిరాజ సుఖార్ణవకేళి దేలి సం
భోగమునందు బొంది తమ పోకడ లోకు లెరుంగకుండగా
వేగమె వేషధారులయి వేరొక రీతి చరించు నా వృథా
యోగులు కామినీ జనుల యోగులయా శరభాంకలింగమా. (78)

కపటయోగులను యింకొక పద్యంలో కూడా దూషించాడు. చూడండి:

ముక్కిడి యాలివెంట నొక ముగ్గురు నల్గురు బిడ్డ లేగ గా,
కుక్కయు గోతి పిల్లియును గూరయు కూడునుగొంచు నిక్కుచున్,
జిక్కము తోలుబుఱ్ఱయును జిందరవందర నీతచాపయున్
నక్కున బోవు వారలును యోగులె పో శరభాంకలింగమా! (81)

నిజమైన యోగులు ఎలా వుండాలో చెపుతున్నాడు:

వాలిన యింద్రియాలయి కవాటము లన్నియు మూసి నెమ్మదిన్
దాళముబెట్టి లోని పరతత్త్వ మహత్త్వ త్రికోణ మందిరా
లాలిత నాగకన్య సువలాలనజేసిన యోగిగాక పై
మాళపు వేషముల్ యముని మార్కొనునా శరభాంకలింగమా. (82)

శరభాంకుడు మంచి లోకజ్ఞానపు నీతులుగూడ చెపుతాడు :

పెట్టక కీర్తి లేదు వలపించక యింతికి నింపులేదు తా
దిట్టక వాదు లేదు మరి ధీరత వైరుల సంగరంబులన్
గొట్టక పేరు లేదు కొడుకొక్కడు లేక వరంబులేదు నా
పట్టపురాజుకైన నిది పద్ధతి శ్రీ శరభాంకలింగమా. (90)

ఇతడు ''బొందితో కైలాసం'' అనే జాతీయానికి మారుగా ''బొందితో శ్రీశైలం'' అని 72వ పద్యంలో ప్రాసస్థానంలో 'శైలము' వాడాడు. 'చిట్టెడు పొట్టకోసమై' అని 92వ పద్యంలో చెప్పాడు. ఇతడు ముక్తపదగ్రస్తంలో మంచి భావాలు చెప్పాడు. చూడండి:

పుట్టితి మర్త్య్య జన్మమున బుట్టియు బుట్టి యనేక మార్గముల్
మెట్టితి మెట్టి యేదియును మెచ్చక నీ పదపద్మముల్ మదిన్
బట్టితి బట్టి పాపముల బాపితి బాపి మహత్త్వ తత్త్వముల్
ముట్టితి ముట్టి తొంటి తుదిముట్టితి నో శరభాంకలింగమా! (87)

ఈ కవి తుదముట్టా చెప్పిన శతకం మనకు దొరక్కపోవటం మాత్రం దురదృష్టమే.

శ్రీగిరి అయ్యగారు

ఒక కవి వ్రాసిన పద్యకావ్యాన్ని ఇంకొక కవి ద్విపదగా రచించడం, ఒక కవి ద్విపదలో వ్రాసినదాన్ని మరొక కవి చంపూకావ్యంగా చెప్పడం మన సాహిత్యంలో పరిపాటే. పాల్కురికి సోమనాథుడు ద్విపదగా వ్రాసిన పండితారాధ్య చరిత్రను శ్రీనాథుడు పద్యకావ్యంగా రూపొందించాడు. అలాగే శ్రీగిరికవి వ్రాసిన నవనాథ చరిత్ర అనే పద్యకావ్యాన్ని గౌరన ద్విపదగా చెప్పాడు. ఈ సంగతి క్రింది ద్విపదలవల్ల తెలుస్తుంది.

> అవిరళయోగ విద్యాధికులైన – నవనాథవరుల పుణ్యప్రవర్తనలు
> పరగశ్రీగిరి కవి పద్యబంధములవిరచించినా డది...[1]

ఈ నవనాథ చరిత్రలో తొమ్మండుగురు సిద్ధుల కథలు ఉంటాయి. వీటిని పద్యకావ్యంలో చెప్పడంవల్ల జనసామాన్యంలో వ్యాప్తిరాదని శ్రీశైలంలోని శాంతభిక్షావృత్తి మఠాధిపతి గౌరన చేత ద్విపదగా చెప్పించాడు. శ్రీశైలంలో పాల్కురికి సోమనాథుని ద్విపద కావ్యాలు ఎంత ప్రబలంగా ప్రజలలో ప్రచారం చెందినదీ ఈ శాంతభిక్షావృత్తి రాయనికి తెలుసు. నవనాథుల కథలు కూడా అక్కడ అందరూ చెప్పుకొంటున్నవే. వీటిని పద్యబంధముగా కాక ద్విపదలలో ఒక కవి చేత చెప్పిస్తే మత ప్రచారం విరివిగా సాగుతుందని భిక్షావృత్తి రాయడు భావించాడు. అందుకే గౌరన చేత ద్విపద కావ్యంగా చెప్పించాడు. జనంలో ద్విపద ప్రచారమై అల్లుకొని పోయాక పద్యకావ్యం మరుగున పడి చివరకు నష్టమైపోయింది కాబోలు.

నవనాథ చరిత్రను పద్యబంధంగా రచించిన శ్రీగిరికవి మతాచార్యుడు కాబోలు. శైవాచార్యులను అయ్యగారు అని, వైష్ణవాచార్యులను అయ్యంగారు అని పేర్కొనడం రివాజు. వీరశైవ ప్రముఖులను అయ్యవరులని పిలవడం కూడా పరిపాటి. కాకతీయ ప్రభువులలో ప్రతాపరుద్రుడు (క్రీ.శ.1291–1323) చివరివాడు. ఇతని చివరి దశాబ్దంలో ఒక శ్రీగిరికవి ఉన్నాడు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకాలో మోగల్లులో శకసంవత్సరాలు 1237కి సరియైన రాక్షసనామ సంవత్సరంలో అనగా క్రీ.శ. 1315లో ఒక శ్రీగిరికవికి భూదానం చేసినట్టు ఒక శాసనం ఉంది.[2] అదే గ్రామంలో దానమిచ్చిన కాలం చెప్పని మరో శాసనంలో కూడా ఒక శ్రీగిరికవికి రాజు భూదానం చేసినట్టు దాఖలా ఉంది. ఈరాజు రెడ్డిరాజ్యాన్ని స్థాపించిన ప్రోలయ వేమారెడ్డి (క్రీ.శ. 1325–1353). ఈ రెండు శాసనాలవల్లా తెలియవచ్చే శ్రీగిరి అనే కవులు ఒక ఊరివారే కనుక అభిన్నులని ఊహించవచ్చు. ఈ కవి క్రీ.శ. 1300 నుండి 1353 దాకా జీవించి ఉండేవాడని కూడా

---

1. నవనాథచరిత్ర – అవతారిక.
2. శాసన సంఖ్యా దాని కాల వివరాలను మల్లంపల్లి సోమశేఖరశర్మగారు 'History of the Reddy Kingdoms'లో ఇచ్చారు. పుట 499 (శ్రీ ప్రమథకవి సిరిగిరి అయ్యంగారికిని లంజెపాటి పొలాన వ్రిత్తి అఇదువుట్లు లెకాఖ X నంద్దికంబాలు వెట్టిన చేలు..... SII x 510 (శ. 1237) శాసన శబ్దకోశము, కుందూరి ఈశ్వరదత్తు, P.155 అరోపము, నందికంబము.

భావించవచ్చు. ఇతని పేరు శ్రీశైలక్షేత్రునికి సంబంధించినది. శ్రీపర్వతం, పర్వతం, శ్రీగిరి, సిరిగిరి అనే పేర్లు పర్యాయపదాలు.

శ్రీశైలం అత్యంత ప్రాచీన క్షేత్రం. పురాణ ప్రసిద్ధం. అగ్నిపురాణం దీనిని సిద్ధక్షేత్రం అని పేర్కొంది. సంస్కృత సాహిత్యంలో ఈ క్షేత్ర ప్రసక్తి చాలాసార్లు వస్తుంది. భవభూతి తన మాలతీ మాధవంలోనూ, హర్షవర్ధనుడు తన రత్నావళి రూపకంలోనూ శ్రీశైలంలోని సిద్ధులను చిత్రించారు. ఈ సిద్ధులంతా శైవులు. వివిధ పురాణాలవల్లా, ఇతర ఆకరాలవల్లా ఇరవై నాలుగు రకాల శైవులున్నట్లు తెలియవస్తూంది. వాళ్ళ పేర్లు ఇవి :

1. కంకాళులు
2. సిద్ధాంతులు
3. కాపాలికులు
4. కాలదమనులు
5. కాలాసనులు
6. కాలాముఖులు
7. జంగములు
8. నాకులీశులు
9. పాంచరాత్రులు
10. పాశుపతులు
11. భాట్టమతానుసారులు
12. భైరవులు
13. మహాపాశుపతులు
14. మహావ్రతధారులు
15. ....
16. లకులీశులు
17. లాగుడయులు
18. లోకాయతులు
19. వామాచారులు
20. వాకులీయులు
21. శైవులు
22. సిద్ధాంతమార్గులు
23. సోమసిద్ధాంతులు
24. సోములు

ఈ పట్టికలో లోకాయతులు, వామాచారులు చేరడం గమనార్హం. తాంత్రిక విధానాలు బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ మతాలలో ప్రవేశించడానికి కారణాలు లేకపోలేదు. గణజీవన వ్యవస్థలోనే కులాచార విధానం, పంచ 'మ' కారాలూ ప్రముఖాలు. వైదిక మతవ్యాప్తివల్ల బ్రాహ్మణ్యానికి మడిమాన్యాలూ, జీవన సౌకర్యాలూ ఇనుమడించడంవల్ల వారికీ గణరాజ్యాలవారికీ పరస్పర సంఘర్షణ ఏర్పడి సాంఘికంగా, ఆర్థికంగా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. తాంత్రికమతం ఈ సమస్యలను కొంతవరకూ పరిష్కరించింది. బ్రాహ్మణ్యపు వర్ణాశ్రమ ధర్మాలు జైనంలో కూడా ప్రవేశించాయి. బౌద్ధ సంఘం బానిసలకూ, బాకీదార్లకూ తన తలుపులు మూసివేసింది. తాంత్రిక చక్రమే వర్ణ, లింగ విభేదాలు లేకుండా అన్ని వర్ణాల వారికీ తన తలుపులు తెరచి స్వాగతం చెప్పింది. అందుకే బౌద్ధయానంలాగా శైవ, వైష్ణవాలు కూడా శాక్తాన్ని తాంత్రిక విధానాలను స్వీకరించవలసి వచ్చింది. సిద్ధులు కాల తంతులను ప్రచారం చేశారు. నవనాథులు ఈ సిద్ధుల నుండే వచ్చారు. మత్స్యేంద్రనాథుడు మహాకాల జ్ఞాన వినిర్ణయం అనే గ్రంథాన్ని రచించాడు. దీని వ్రాతప్రతి నేపాలులో ఉంది. క్రీ.శ. 859 నాటి ఇంకొక వ్రాతప్రతి లిపి కూడా

దీనిలాగే ఉంది.[3] నవనాథులలో గోరక్షనాథుడు గోరఖ్‌నాథ్ పేర ప్రసిద్ధుడు. 'గోరక్ష సిద్ధాంత సంగ్రహం' అనే గ్రంథం వల్ల ఈ మార్గప్రవర్తకులు ద్వైతాద్వైత వివర్జితులని విశదమవు తుంది. నాథసిద్ధుల ఆచార వ్యవహారాలు కాపాలికుల తాంత్రిక విధులలాగే ఉంటాయి. శబర తంత్రాలు ఇందులో ఉన్నాయి. చతుర సిద్ధులూ, అంటే ఎనభై నలుగురు సిద్ధులూ, నవనాథులూ, ఈ మార్గ ప్రవర్తకులలో ప్రసిద్ధులు.[4] మంత్ర యోగం, హఠయోగం, లయ యోగం, రాజయోగం అనే నాలుగు యోగాలలోనే కాక రసయోగంలో ఈ నవనాథులు నిష్ణాతులు. తమ సిద్ధులను ప్రజల కోసం వినియోగించేవారు. కనుకనే జనులకు ఆరాధ్యులయ్యారు. శ్రీశైలానికి తూర్పు, పడమర ద్వారాలయిన త్రిపురాంతకం, అలంపురాలు ఈ సిద్ధుల ఉనికి పట్టులు, నవనాథుల కథలకు ఆటపట్టులు.

ప్రజల ఆదరాభిమానాలనూ, ఆరాధనాలనూ దోచుకొన్న నవనాథుల చరిత్రను శ్రీగిరి అయ్యగారు పద్యబంధంగా రచించాడు. ఇది శిష్ట సాహిత్యంలో చేరి కొంత ప్రాచుర్యం పొందిందని భావించవచ్చు. అయితే పండితులు మాత్రమే కాక పామరులు కూడా విని ప్రభావితులు కావాలని శాంతభిక్షారాయడు దీనిని గౌరనచేత ఉత్తరోత్తరా ద్విపదగా చెప్పించాడు.

అయితే గౌరన ద్విపద వ్రాయడానికి ముందు ఈ కావ్యాన్ని కవులూ, పండితులూ చదివేవారనీ, నవనాథులు తెలుగుదేశంలో ఆనాడు ప్రచారం పొందిన సిద్ధ పురుషులనీ చెప్పడానికి ఆనాటి సాహిత్య సాక్ష్యాలు కొన్ని మనకు దొరుకుతాయి. క్రీ.శ. 1375–1404 ప్రాంతాల మధ్య రచించిన జక్కన విక్రమార్క చరిత్రలో నవనాథుల ప్రసక్తిగల పద్యముంది. విక్రమార్కుడు భద్రసింహాసనం మీద కూర్చొని కొలువు తీరినప్పుడు ఆ సభలోనికి ఒక సిద్ధుడు వచ్చాడట. అతణ్ణి జక్కన ఇలా వర్ణించాడు:

ఆదినాథుని యవరావతారము పూని మత్స్యేంద్రనాథుని మహిమ దనరి
సారంగనాథుని సామర్థ్యమును బొంది గోరక్షనాథుని గుణము దాల్చి
సిద్ధబుద్ధుని బుద్ధి చిత్తంబునం జేర్చి ఖనిరువిద్యాధిక ఘనత జేర్చి
మేఖనాథుని మంత్రవైఖరి వహియించి నాగార్జునుని కళాశ్రీ గమించి

యావిరూపాక్షు డిత డన నతిశయిల్లి
యర్థి నవనాథుసిద్ధుల కైక్యమైన
మోహనాకృతి యిడ తను మూర్తి దనరి
చిన్మయస్వాంతుడగు నొక్క సిద్ధవరుడు (విక్ర. 6–4)

జక్కన ఈ విధంగా వ్రాయడానికి శ్రీగిరికవి పద్యకావ్యంగా వ్రాసిన నవనాథ చరిత్ర చాలా ప్రచారంలో ఉండడమే కారణమనిపిస్తుంది. జక్కన ఇంచుమించుగా గౌరనకు

3. R.S. Sarma in INDIAN SOCIETY : HISTORICAL (in Memory of D.D. KOSAMBI) P. 185.
4. DAVID.LORENZEN : The Kapalikas and Kalamukhas (Two lost Saivite sects) - New Delhi - 1972. p. 37

సమకాలికుడు. అందుచేత ద్విపదకావ్య పతనం తర్వాత జక్కన ఇది వ్రాయడానికున్న అవకాశాలకన్న పద్యకావ్య పతనం తర్వాత వ్రాశాడనడానికే ఎక్కువ ఆధారాలున్నాయి.

ఈ పద్యకావ్యం ఇప్పుడు దొరకదు. దీనిని వ్రాసిన శ్రీగిరికవే 'శ్రీరంగ మాహాత్మ్యము' అనే ఇంకొక గ్రంథము కూడా వ్రాశాడట. ఇది కూడా నేడు అలభ్యమే. ఇతడు వ్రాసిన ఒకే ఒక పద్యం మడికిసింగన ధర్మమా అని మనకు లభ్యమవుతున్నది. శ్రీగిరి శతకంలోనిదని చెప్తూ 'రాజునకు కొరగాని గుణములు' అనే శీర్షికలో ఇది సింగన ఉదాహరించాడు.

జీతంబు గిలిబిలిచిలుకలు దూరంబు వహి జూడ నది పొల్లువ్రాత కల్ల
అపరాధములు కోటిన్నృపుజంపడను సాటి మాన్యత వెడవెడమాట బొంకు
కోపంబు ముమ్మ కోలాస నలుమడ సత్యమారజమీగి జమలితొట్లు
ఆచారమెడదప్ప లాశ్రమ మట్టట్టు దొరతనం బది పూతదూరములేత
చరితమెల్ల నింద్రజాలంబు తలపెల్ల - నెల్లి దంబుమాట లెల్లదంబ
మిట్టికుమతి గొలిచి యెవ్వాడు మననోపు - జిరతరప్రకాశ శ్రీగిరీశ.

(సకలనీతి. 241)

ఈ సీసపద్యం నడక శ్రీనాథుడి తూగుకు దగ్గర్లోకి వస్తున్నది. పూర్తిగా ఆ గమనం లేకపోవడం గమనార్హమే. మడికి సింగన కాలం మనకు తెలిసిందే. ఇతడు 1374 ప్రాంతాలవాడు. శ్రీగిరికవి అంతకు పూర్వుడు అన్న సత్యాన్ని ఈ ఉదాహృత పద్యం రుజువు చేస్తున్నది. నవనాథ చరిత్ర పద్య కావ్యాన్ని ద్విపదచేసిన గౌరన క్రీ.శ. 1385-1445 ప్రాంతాలవాడు కనుక శ్రీగిరి అయ్యగారి పదబంధ కావ్యమైన నవనాథ చరిత్ర ఆ తరువాత మరుగున పడి ఉండవచ్చు.

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకాలోని మోగల్లు గ్రామంలో దొరికిన శాసన ప్రమాణాల వల్ల ఈ కవి పేరు 'ప్రమథకవి శ్రీగిరి' అని తెలుస్తూంది. 'ప్రమథకవి' అన్న పదబంధం ఇంటిపేరు కావచ్చునని చాగంటి శేషయ్యగారు భావిస్తున్నారు.[5] శివకవి అనే అర్థంలో ప్రమథ గణాలను సూచించే మాట అవడానికి కూడా ఆస్కారముందని వారు ఊహిస్తున్నారు. అయితే ఇది వీర శైవ సూచకమైన పేరు. ఇతడు వైష్ణవ గ్రంథంగా శ్రీరంగ మాహాత్మ్యం రచిస్తాడా? ఇంతకూ శాసనాలలో కనబడే ప్రమథకవి శ్రీగిరి నవనాథ చరిత్ర వ్రాసిన శ్రీగిరి ఒకరే అని తేలలేదు. వాస్తవానికి మడికిసింగన శతకం పేరు చెప్పాడేగాని దాని రచయిత పేరు విశదపరచలేదు.

నవనాథ చరిత్రను శ్రీగిరి అయ్యగారు అనే కవి పద్యకావ్యంగా రచించారనీ, దీనిని గౌరన ద్విపదగా రూపొందించాడనీ మాత్రమే మనం నికరంగా చెప్పుకోవచ్చు. ఇతని ఇంటిపేరు చెన్నమల్లు కావచ్చునని కొందరంటున్నారని చాగంటి శేషయ్యగారు

5. ఆంధ్ర కవి తరంగిణి - 4వ సంపుటం, పుట 153

అంటున్నారు.[6] శ్రీగిరి అయ్యగారు శ్రీగిరి అయ్యంగారుగా మాఁర శ్రీరంగ మాహాత్మ్యం వ్రాశాడేమో. గౌరన కుమారుడు తొలుత శైవుడుగా ఉండి వైష్ణవునిగామారి శ్రీరంగ మాహాత్మ్యం పద్యకావ్యంగా తొలిరాయల యుగంలో గాశాడు. శ్రీగిరి అయ్యగారి ప్రభావం పడిందేమో చెప్పలేం.

రావిపాటి తిప్పన్న

ఆంధ్రులలో అక్షరాస్యులెవరైనా నన్నయగారి పేరు చెప్పినా, తిక్కనగారి పేరు చెప్పినా చేతులెత్తి దండం పెడతారు. ప్రాచీన కవులలో రావిపాటి తిప్పన్న కూడా ఆ కోవలోని వాడని శ్రీనాథుడు వల్లభరాయడి క్రీడాభిరామంలో ఇలాగ కీర్తించాడు :

నన్నయభట్టు తిక్క కవి నాయకులన్న హుళక్కి భాస్కరుం
డన్నను జిమ్మపూడి యమరాధిపు డన్నను సత్కవీశ్వరుల్
నెన్నుదుటం గరాంజలులు నింతురు జే యని రావిపాటి తి
ప్పన్నయు నంతవాడ తగునా యిట దోసపుమాట లాడగన్? (క్రీడా-36)

శ్రీనాథు డంతటివాడు ఈ విధంగా స్తుతించిన కవి నిజంగా మహాకవే అవుతాడు. శ్రీనాథుడు నుతించాడు కనుక అతనికి పూర్వుడవుతాడు. తిప్పన్న కాలాన్ని ఇలాగ చూచాయగా నిర్ణయించినా అతడు ఎప్పటివాడో కచ్చితంగా తెలుసుకోవడానికి ఆధారాలు అంతంతమాత్రంగానే వున్నాయి. ఇతడు క్రీ.శ. 1295 మొదలు 1326 వరకు పాలించిన ప్రతాపరుద్రుని కాలంవాడు అయి ఉంటాడని పరిశోధకులు భావిస్తున్నారు.[1] ''త్రిపురాంతకుడనే కవి ద్వితీయ ప్రతాపరుద్రుని యాస్థానమున నున్నట్లు ప్రతాప చరిత్రమున గలదు'' అని 'ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సం.7. పుట-7' ప్రమాణంగా చూపిస్తూ నిడుదవోలు వెంకటరావుగారు వ్రాశారు. చాగంటి శేషయ్యగారు కూడా ''ప్రతాపచరిత్రమున, రెండవ ప్రతాపరుద్రుడి యాస్థానమున త్రిపురాంతకుడను కవి యున్నట్లు చెప్పబడినది'' అని వ్రాశారు.[2]

అయితే ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ప్రచురించిన సిద్దేశ్వర చరిత్రములోని ప్రతాపచరిత్రలో త్రిపురాంతకుడనే కవిపేరు కనపడదు. ఆనాటి ఆస్థానజనంలో 'మల్లికార్జునభట్టు మొదలైన బ్రాహ్మణ విద్వాంసులు బంగారు పల్లకి నెక్కి చనుదెంచువారు నూటయాబది...

సర్వమండల చక్రవర్తి, చిలుకపలుకుల త్రిపురారి మొదలైన బిరుదుపాత్రలు యెనభైనూర్లు, భాస్కరుడు మున్నుగాగల కవీశ్వరులు యిన్నూరు' ఉన్నారని

6. అదే పుస్తకంలో పుట-265.
1. ఆంధ్ర కవి తరంగిణి, 4వ భాగము, ప్రథమ ముద్రణ, పుట-38.
2. ఉదాహరణ వాఙ్మయచరిత్ర, నిడుదవోలు వెంకటరావుగారు, పుట-88.

తెలుస్తున్నది.[3] ప్రతాపరుద్రుణ్ణి చెరపట్టి మహమ్మదీయులు తీసుకుపోయినప్పుడు అతనివెంట వెళ్ళినవాళ్ళలో శివదేవయ్య, మల్లికార్జునభట్టు, శరభాంకుడు, రంగనాథుడు అనేవాళ్లేగాని త్రిపురాంతకుడు కనబడడు.[4]

ప్రతాపరుద్రుని ఆస్థానంలో లేకపోతే తిప్పన్న ఇంకెవరి ఆస్థానంలో ఉన్నట్టు? ఏకాలంలో జీవించినట్టు? ఆధారాలేమైనా దొరకుతాయా అని ప్రశ్నించుకొని వెదికితే కొన్ని ఆకరాలు దొరుకుతాయి. రావిపాటి తిప్పరాజు చాటుధార అని అప్పకవి ఒక పద్యాన్ని ఉదాహరించాడు. తన అప్పకవీయంలో అనుస్వారసంబంధయతికి లక్ష్యంగా ఈ క్రింది పద్యాన్ని ఇచ్చాడు :

సరి బేసై రిపు డేల భాస్కరులు భాషానాథ పుత్రా వసుం
ధర నం దొక్కడు మంత్రియయ్యె వినుకొండ న్రామయామాత్య భా
స్కరుడో యౌ నయితే సహస్రకరశాఖ ల్లె వదే యున్నదే
తిరమై దానము సేయుచో రిపుల హేతి వ్రేయుచో వ్రాయుచో.

(అప్పకవీయం-తృతీయ.60)

ఈ పద్యం సంభాషణధోరణిలో వుంది. నాటకధోరణిలో కనబడుతుంది. ఇద్దరు ఇలాగ మాట్లాడుకొంటున్నారు :

''భాషానాథా! సరి సంఖ్యలో ఉండే భాస్కరులు ఇప్పుడు బేసి సంఖ్యలో ఎందుకున్నారు?''

''పుత్రా! వాళ్లలో ఒకడు భూలోకంలో మంత్రిగా పుట్టాడు కాబట్టేనయ్యా!''

''ఓహో! ఈ పుట్టినవాడు వినుకొండ రామయామాత్యులవారి భాస్కరుడా?''

''ఔను.''

''అయితే వెయ్యి చేతుల్లేవే?''

''ఆ ఉన్నవే, చూడు! శాశ్వతమైన దానాలిచ్చేటప్పుడూ, శత్రువులను చంపేటప్పుడూ, వ్రాసేటప్పుడూ అతనికి వేయి చేతులుంటాయి''.

సప్తఋషులు, అష్టదిక్పాలకులూ ఉన్నట్టే మనకు పదకొండుమంది రుద్రులూ, పన్నెండుమంది ఆదిత్యులూ వున్నారు. ఈ పన్నెండనే సరిసంఖ్యలో ఒకణ్ణి తగ్గించి బేసిని చేసి కవి ఇంత చమత్కరించాడు. ఈ పద్యం రావిపాటి తిప్పరాజుదే అని అప్పకవి చెప్పాడు. ఈ పద్యంలో వినుకొండలో రామయామాత్య భాస్కరుడనే మంత్రి దండనాథుడు వుండేవాడని వర్ణించాడు. క్రీ.శ. 1362 ప్రాంతాలలో రాయన భాస్కరుడనే మంత్రి వినుకొండలో ఉన్నాడు. ఈ పద్యంలో 'రామయామాత్య' అనే మాట బహుశా 'రాయనామాత్య' అనే విధంగా ఉండేదని, లేఖకులు పొరబడి వ్రాశారని చరిత్రకారులు

3. సిద్దేశ్వర చరిత్ర - ఖండవల్లి లక్ష్మీరంజనం గారిచే సంపాదితం, పుట-152
4. అదే సిద్దేశ్వర చరిత్ర, పుట-169

భావిస్తున్నారు. అనవేమారెడ్డి (క్రీ.శ. 1364-1386) కాలంలో ఒక రాయన భాస్కరుడు ఉన్నాడని కొన్ని చాటువులు చెప్తున్నాయి. రావిపాటి తిప్పరాజు అప్పటి వాడు కావచ్చునని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు భావిస్తున్నారు.[5] త్రిపురాంతకుడు క్రీ.శ. 1300 ప్రాంతాన పుట్టి తన ముసలితనంలో ఈ పద్యం చెప్పి వుంటాడని చాగంటి శేషయ్యగారు సమన్వయం చేశారు. ఇది చక్కగానే కుదురుతుంది. ప్రతాపరుద్రుడు రాజ్యం చేస్తున్న కాలంలో త్రిపురాంతకుడు పాతికేళ్లవాడు. అందుచేత ఆ స్థానంలో అప్పటికి ప్రవేశం కలిగి ఉండదు. అతనికి పేరు వచ్చేసరికి కాకతీయ సామ్రాజ్యం అంతరించింది.

ప్రతాపరుద్రుడు పరిపాలిస్తున్నపుడు రావిపాటి తిప్పన్న కనీసం పాతికేళ్ళవాడై వుంటాడని ఎందుకు ఊహించవలసి వస్తుందంటే అతడు తన 'ప్రేమాభిరామం'లో కాకతీయ సామ్రాజ్య వైభవాన్ని కన్నులకు కట్టినట్టు వర్ణించి ఉండాలి. శ్రీనాథుడి వీధి నాటకమైన క్రీడాభిరామంలో ఓరుగల్లు వివరాలన్నీ ప్రతాపరుద్రుని కాలంలో జీవించిన కవియొక్క కావ్యానికి అనుకరణలాగే కనబడతాయి. కళ్ళారా చూస్తేనేగాని తిప్పన ఇలా వర్ణించడు. తన కాలంలోని విషయాలనే అతడు చెప్పాడు.

అప్పకవి ఉదాహరించిన చాటుధార నాటకపద్ధతిలో ఉండడం మనం గమనించాం. త్రిపురాంతకుడు నాటకాలంటే అభిమానించే కవి. అతడు దశరూపకాలలో ఒకటైన 'వీధి' నాటకాన్ని వ్రాశాడు. 'ప్రేమాభిరామం' అనే పేర ఇది సుప్రసిద్ధం. అయితే దీనిని అతడు సంస్కృతంలో రచించాడు. దీనిలోంచి శ్లోకాలను అనంతర రచయితలు ఉపయోగించారు. 'సాహిత్యచింతామణి' అనే గ్రంథంలో పెదకోమటి వేమారెడ్డి ఒక శ్లోకం వాడుకొన్నాడు. నృత్తరత్నాకరవ్యాఖ్యలో ఒక శ్లోకం కనబడుతుంది. ఇది రావిపాటి తిప్పన ప్రేమాభి రామంలోనిదేనని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు గుర్తించారు.[6] సంస్కృతంలో వున్న ఈ 'వీధి' నాటకాన్ని అనుసరించే శ్రీనాథుడు క్రీడాభిరామం వ్రాశాడు. అందులోని తెనుగు పద్యాలకు సరిగ్గా సరిపోయే శ్లోకాలనే పైగ్రంథాలలో ఆయా రచయితలు ఉదాహరించారు. సాహిత్యచింతామణిలో పెదకోమటి వేమారెడ్డి వాడిన శ్లోకం చూడండి :

> పరారి సందర్శిత సన్ని వేశౌ పరుత్పరాభూతపయోజకోశౌ,
> ఇహైషమ స్తాళఫలో పమానౌస్తనౌ కియన్తౌ పురతో భవేతామ్.
>
> (క్రీడా. పీఠిక. పు. 86)

ఇది శ్రీనాథుడు ఈ విధంగా తెనిగించిన పద్యానికి సరిపోతుంది :

> గొరసెమునందు చుట్టుకొని తోరణకట్టె మరోవిభాగమున్
> నిరుడు పయోజకోశరమణీయత దాల్చెను, వర్తమానవ
> త్సరమున నొప్పె హేమకలశంబునల బాగున, ముందుటేటికిం
> గరినిభయాన చన్నుగవ కౌగిలిపట్టులు గాక యుండునే? (క్రీడా. పు.97)

5. History of Reddy Kingdoms. P. 511
6. క్రీడాభిరామం - వేటూరి ప్రభాకరశాస్త్రిగారి ప్రచురణ-1928, పుటలు-86, 87.

ఇంకొక శ్లోకం, ప్రేమాభిరామంలోనిదే, నృత్తరత్నాకర వ్యాఖ్యలో కనబడుతుంది.

తరుణం సర్ష పశాకం నవౌదనం పిచ్ఛిలాని చ దధీని,
స్వల్ప వ్యయేన సుందరి గ్రామ్యజనో మృష్ట మశ్నాతి. (క్రీడా. పీఠిక. పు. 86)

ఇది శ్రీనాథుడు వ్రాసిన ఈ క్రింది పద్యానికి అక్షరాలా సరిపోలుతుంది :

శీతకాలంబు కడి మాడ సేయ గుడుచు
భాగ్యవంతుండు రేపాడి పల్లెపట్ల
గ్రొత్త యొరెంబు నిగు రావకూరతోడ
బిచ్ఛిలంబైన నేతితో బెరుగుతోడ. (క్రీడా. పు. 18)

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు గుర్తించిన ఈ రెండు శ్లోకాలూ తప్పించి ప్రేమాభిరామంలోని భాగాలు మనకేం దక్కలేదు. ఆ గ్రంథం పేరు తప్పించి మరేం దొరకలేదు. దీనిని సంస్కృతంలో వ్రాసిన తిప్పన్న తెలుగులో ప్రశస్తమైన ఇతర రచనలు చేశాడు. ప్రేమాభిరామం శృంగారరస భూయిష్ఠం. ఇటువంటి రచన చేయడానికి కవికి అనుభవం, శాస్త్ర పాండిత్యం ఉండాలి. తిప్పన కామశాస్త్రాన్ని క్షుణ్ణంగా చదవడమేగాక తెలుగులో దానిని వివరించాడు. అది 'మదనవిజయం' అనే ఎనిమిది ఆశ్వాసాల గ్రంథం. అందులో సంజ్ఞాభియోగికం, భార్యాధికారం, పారదారికం, వైశికం అనే ప్రకరణాలున్నాయట. ఈ తెలుగు పుస్తకాన్ని తాము చూచామని మానవల్లి రామకృష్ణకవి గారు వ్రాశారు.[7] అప్పటికే అది శిథిలావస్థలో వుందట. అందులోంచి ఈ రెండు పద్యాలను వారు ఉదాహరించారు :

సతిగుణవతి యగునేనియు - పతి కది రత్నంబు ప్రాణ బంధువ యమృతం
బతివయ దుర్గుణి యగునే - బతి కెడపని చిచ్చు కాలుపక యది కాల్పున్.
గుణమున్ సుందరరూపమున్ విభవమున్ గూటంబు సౌభాగ్యల
క్షణముం జారుచరిత్రమున్ వినయమున్ జాతుర్యమున్ ధర్మభూ
షణముం గల్గి పతివ్రతామహిమ మించం గల్గనే దత్సతీ
మణి చింతామణి దాని దాల్పగలగన్ మర్త్యుండె మర్త్యుండిలన్.
(ఉదా. వా. పుట. 88)

ఈ గ్రంథాన్ని మళ్లా చూద్దామనుకొంటే గ్రంథస్వాములు దానిని రామకృష్ణ కవిగారికి చూపెట్టలేదట. వారు ఉదాహరించిన ఈ రెండు పద్యాలే తప్ప ఆ గ్రంథంలోంచి ఇంకేమీ మనకు దక్కలేదు. ఇవాళ అది అలభ్యమైనా ఒకనాడు అది విశేష ప్రచారంలో ఉండేది. తెలుగులో కొక్కోకం వ్రాసిన కూచిరాజు ఎర్రనకవి తన గ్రంథాదిని కామశాస్త్ర రచయితలలో రావిపాటి త్రిపురాంతకుణ్ణి చేర్చి ఇలా నుతించాడు :

---

7. భారతి-సం|| 26, సం|| 8, 'పూర్వ సాహిత్యవీధులు' అనే వ్యాసంలో ఈ సంగతి చెప్పినట్టు 'ఉదాహరణ వాఙ్మయం'లో 88వ పుటలో వ్రాశారు.

పృథివి రావిపాటి త్రిపురాంతక కవి శృం
గార కవులనెల్ల గారవించి. (కొక్కోకము- ప్రథమ.4)

కూచిరాజు ఎర్రన ఇలా నుతించబట్టి రావిపాటి తిప్పన్న వ్రాసినది కామశాస్త్రమని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ మదనవిజయం స్వతంత్ర కావ్యం కాదనీ, కన్నడంలోని 'మదనతిలకం' అనే గ్రంథానికి అనువాదమనీ నిడుదవోలు వెంకటరావుగారు చూపెట్టారు. సంస్కృతంలో స్వతంత్ర కావ్యాలు వ్రాసే తెలుగు రచయిత కన్నడ భాష నుండి కామశాస్త్రాన్ని అనువాదం చేయవలసినంత అవసరమేమిటొచ్చిందో!

రావిపాటి తిప్పన్న సున్నితమైన శృంగారాన్ని వ్రాయగల సరసకవి. ఈ సంగతి అతను వ్రాసిన 'అంబికాశతకం' రుజువు చేస్తుంది. పూజనీయులైన పార్వతీ పరమేశ్వరుల శృంగారాన్ని అతడు ఎక్కడా రసాభాస కానియ్యకుండా ఉదాత్తంగా వర్ణించాడు. ఈ శతకంలోని నూరు పద్యాలకు నేడు ఏడు పద్యాలు మాత్రమే లభిస్తున్నాయి. ఈ పద్యాలను 'ప్రబంధరత్నావళి'లోను, రామకృష్ణకవిగారు ప్రచురించిన 'త్రిపురాంత కోదాహరణం' లో మొదట ఉదాహరించారు.

ఆదిమ శక్తి యీ తరుణి, యాద్యకుటుంబిని యీ కుమారి, ము
త్తైదువ యీ తలోదరి, చిదాత్మక యీ సతి, విశ్వమాత యీ
పైదలి, సర్వలోకగురు భామిని యీ చపలాక్షి యంచు బ్ర
హ్మాదులు వచ్చి నిచ్చలు హిమాద్రికి నిన్నెరిగింతు రంబికా!

కూడెడి వెంద్రుకల్ నిడుదకూకటి బ్రోవగ, బొట్టుపై వళుల్
జాడలు దోవ గ్రొమ్ములక చన్నులు నించుదొలంక, సిగ్గునన్
జూడగ నేరముల్ మెరుగు జూపులు నీన హిమాద్రియింట నీ
వాడుట శూలికిన్ మనమ్ము వాడుటగాదె తలంప నంబికా!

భారతివై సరోజభవుపాల వసించి, రమావధూటివై
నీరజనాభు జెంది, ధరణీధరనందవై మహేశ్వరుం
గోరి వరించితమ్మ నిను గొల్వక యూరక యేల కల్గు సం
సారసుఖంబు లీ మనుజ సంతతికిం దలపోయ నంబికా!

బెడగగు రత్నదర్పణము జేరిన వెన్నెల వోసి నిచ్చళున్
దుడువగ, పాలసంద్రమున దోచి సుధాకరు మేనికందు వో
గడుగగ, నేరెటేట సితకంజము ముంపగ, నైజకాంతితో
దొడరిన తల్లి నీ మొగముతో సరిపోల్పగజాలు నంబికా!

రెప్పల బోరు దల్పులిసిరింతలు వారెడు చూపు గుంచియన్
ద్రిప్పి తళుక్కునందెరచి తిన్నని మోమున గాయు వెన్నెలల్

ముప్పిరిగొన్న వేడుకలు మూగిన సిగ్గసియాడ బ్రీతి నీ
పప్పరమేశు జూచి తను వర్ధము గొంటి పొసంగ నంబికా!

వ్రాలిన కన్ను ముంగురులు వాదెరకెంపు మెరుంగు జంటిపై
గ్రాలెడు తారహారములు కంకణచారుకరంబు డావలన్
దూలుచునున్న పయ్యెదయు దోచిన కన్నులు మోడ్చి మోడ్చి నీ
పాలగు నీశుమేను సగపాలు మనంబున జేర్తు నంబికా!

లాచివరాంగనల్ వరవిలాస మనోహర విభ్రమంబులన్
చూచిన జూడ ఁడుత్తముడు చూచిన జూచును మధ్యముండు దా
జూచిన చూడకుండినను జూచు కనిష్ఠుడు నన్ను వీరిలో
చూచిన చూడకుండు గుణి జూచిన చూపున చూడు మంబికా!

(ఉదా. వా. పుటలు 85, 86)

ఇంత సున్నితమైన శృంగార భక్తిభావాలతో ఇతడు అంబికాశతకమొక్కటే కాకుండా 'చంద్రతారావళి' అనే ఇరవైఏడు పద్యాల కృతిని కూడ రచించాడు. అందులో 'చంద్రా! రోహిణీ వల్లభా!' అనే మకుటముంటుంది. ఈ తారావళిలోని నాలుగు పద్యాలు మాత్రమే లభించాయి. అంబికా శతకంలో చిన్నచిన్న తత్సమ పదాలు, దేశ్యాలు ఎక్కువగా వుంటే, ఇందులో అట్టే పొడుగులేని సంస్కృత సమాసాలు, ఎక్కువగా తత్సమ శబ్దాలు కనబడతాయి. కవి తీసుకొన్న ఛందస్సు దానికి కారణం కావచ్చు. మత్తేభంలో ఈ పద్యాలను చెప్పాడు. తొలి రెండు పద్యాలూ మరీ ప్రౌఢంగా వున్నా మిగతా రెండూ సరళంగా అంబికా శతకంలోని పద్యాల లాగే వున్నాయి. చూడండి :

చరమక్ష్మాధర చారుసింహముఖ దంష్ట్రాకోటి యౌనాగ నం
బర శార్దూలనఖంబు నాగ దిమిరేభ ప్రస్ఫురద్గర్వ సం
హరణ క్రూరతరాంకుశం బసగ నుద్యల్లీల మైరేఖని
త్వరుచిం బోల్పగ బెంపగు న్విదియచంద్రా!' రోహిణీవల్లభా!

అమితధ్వాంత తమాలవల్లిలవన వ్యాపారరీణదా
త్రము, సౌగంధికషండ కుట్మలకుటీరాజీ సముద్ఘాటన
క్రమ నిర్వాణధురీణ కుంచికయొ నాగం బెంపునన్మీకళా
రమణీయత్వము జూడ నొప్పెసగు చంద్రా! రోహిణీవల్లభా!

రతినాథుండను మాయజోగి చదలం ద్రైలోక్య వశ్యాంజనం
బతియత్నమ్మున గూర్చి మౌక్తికమయంబై యున్న పాత్రంబునన్
మతకంబేర్పడ బెట్టి దాచెనన మీ మధ్యంబునన్ మచ్చ సం
తతమున్ కన్నులపండువై వెలయు చంద్రా! రోహిణీవల్లభా!

పొలకయ్యంబుల గల్గు ముద్దటలుకన్ బుష్పాయుధారాతి మ్రొ
క్కు్ల దీర్పన్ దలమీద గాన నగు నీక్రొమ్మేను పుణ్యాంగనా
తిలకంబైన భవాని పాదనఖ పంక్తిం జెంద డెందంబులన్
దలతాచుక్కలతోడి మక్కువలు చంద్రా! రోహిణీవల్లభా!

(ఉదాహరణ వాఙ్మయము - పుట 87, 88)

తెలుగులో రెండు, సంస్కృతంలో ఒకటి మొత్తం మూడు ఉత్తమ కృతులను రావిపాటి తిప్పన్న రచించినా అందులోనివి ఒకటీ అరా మాత్రమే మనకు లభించాయి. అతడు వ్రాసిన 'త్రిపురాంతకోదాహరణ' మొక్కటే మనకు లభ్యమయిన సంపూర్ణకృతి.[9] ఉదాహరణాలను సంస్కృతంలో క్షుద్రకావ్యాలుగా పరిగణిస్తారు. తిప్పన్న బాల్యంలో కాకతీయ సామ్రాజ్యంలో నున్న విద్యానాథుడనే ఆలంకారికుడు ఉదాహరణ లక్షణాన్ని సంస్కృతంలో వ్రాశాడు. దానిని వ్యాఖ్యానిస్తూ కుమారస్వామి సోమయాజి 'క్షుద్రకావ్య భేదాలలో ఉదాహరణ ఒక'టని వివరించాడు. సంస్కృత కవులకు దేశివచనాలంటే చిన్నచూపు. దేశి సంప్రదాయాలలోంచి సంస్కృతంలోకి వచ్చి తిష్ఠవేసుకొని కూర్చున్న మధుర కవితను నిర్లక్ష్యం చేయలేక లక్షణం చెప్పారేకాని ఆచరించలేదని చెప్పాలి. మన తెలుగులో కూడ పండితులూ, ప్రబంధకవులూ పద సాహిత్యాన్ని ఈసడిస్తూనే వచ్చారు.

ముదివిటులు విధవలంజలు - పదకవితలు మారు బాస బాపనవారల్
చదువని పండితవర్యులు - కదనాస్థిర వీరవరులు కడిదిపురమునన్.[10]

అని శ్రీనాథుడే అన్నాడట. ఈ దృక్పథంతోనే సంస్కృత ఆలంకారికులు ఉదాహరణ కావ్యాలను క్షుద్రమన్నారు. ఈ వాఙ్మయంపైన ప్రప్రథమంగా అమోఘమైన పరిశోధనలు చేసిన నిడుదవోలు వెంకటరావుగారు ఈ కావ్యభేదం దేశిసాంప్రదాయం లోంచి జనించినదేనని చక్కగా రుజువు చేశారు. వీరు చెప్పిన వివరాలు ... ఉదాహరణమంటే భాషలోవున్న ఏడు విభక్తులనూ, సంబోధనా విభక్తినీ ఉదాహరించే లఘుకృతి. ఇందులో వృత్తాలు, కళికలు, ఉత్కళికలు, సార్వవిభక్తిపద్యము, కవికృతినామాంకిత పద్యము ఉంటాయి. వృత్తాలలో చంపక ఉత్పలమాలలు, మత్తేభ శార్దూలాలూ మాత్రమే ఉపయోగిస్తారు. కళిక అంటే మాత్రాచ్ఛందస్సుకు సంబంధించిన రగడభేదం. ఉత్కళిక అంటే అందులో సగం - అర్ధకళిక. కళికలూ, ఉత్కళికలూ రమారమి పాటలవంటివి. అందుచేత వీటిలో ఆది ప్రాసలతోపాటు అంత్యప్రాసలు కూడా విధిగా ఉండాలి. పద్యాలలోకన్నా పాటలలోనే అంత్య ప్రాసలు చక్కగా రక్తి కడతాయి. తెలుగులో మాత్రా ఛందస్సులలో చేసిన ఏ రచనైనా సరే ఏదో ఒక రగడ భేదానికి సరిపోతుంది.

రగడలు ఎనిమిది రకాలుగా ఉంటాయి. ఒక్కొక్క నడకకు ఒక్కొక్క పేరు పెట్టారు. సాతవాహనుల కాలంనుంచీ వాడుకలో ఉన్న ఈ రగడలను గురించి తొలి తెలుగు

---

9. త్రిపురాంతకోదాహరణము - నిడుదవోలు వెంకటరావుగారి ప్రచురణ, పరిశిష్టం, పుట 47.
10. చాటుపద్య మణిమంజరి - వేటూరి ప్రభాకర శాస్త్రి.

ఛందోగ్రంథం కవిజనాశ్రయంలో ఏమీ చెప్పలేదు. అప్పటికి ఉదాహరణలనుగాని, వీటిలో ఉపయోగించే రగడలను గాని శిష్టులు కనీసం క్షుద్రకావ్యాలుగానైనా ఆమోదించి ఉండరు. విన్నకోట పెద్దన కాలానికి ఒప్పుకొన్నారు కాబోలు. క్రీ.శ. 1402-1407 ప్రాంతాలలో ఉండిన ఇతడు తన కావ్యాలంకారచూడామణిలో రగడల లక్షణాలను ముక్తసరిగా చెప్పాడు.[11] ఆ తరువాత 1435 ప్రాంతాల జీవించిన అనంతామాత్యుడు తన అనంతునిఛందంలో రగడ భేదాలను వివరంగా విశదపరిచాడు.[12] రగడ భేదాలను విపులీకరించడమేకాక ఉదాహరణ లక్షణాన్నీ చెప్పాడు.[13]

తెలుగు కవులు సంస్కృత భాషలో సైతం రగడ భేదాలను వ్రాశారు. నన్నయగారి భారత రచనాకాలానికి ముందున్న శాసనాలలో ఈ రగడలున్నాయి. కన్నడ భాషలో క్రీ.శ. 840 ప్రాంతాలనుంచీ ఇవి కనబడతాయి. కవి రాజమార్గం అనే కన్నడ ఛందో గ్రంథంలో వీటిని పేర్కొన్నారు. కన్నడ భాషలో రగడలున్నా ఉదాహరణ కావ్యాలు లేవు. అరవంలో అంతకన్నా లేవు. అందుచేత ఇది పూర్తిగా తెలుగు తయారీ అని చెప్పవచ్చు. ''పాల్కురికి సోమనాథునికి ముందు సంస్కృత భాషలో అతి ప్రాచీనకాలము నుండి ఉదాహరణములున్నట్లు ఈవరకే సూచించితిని. కాని ఇట్టి యుదాహరణ మొక్కటి యేని, యుదాహరణమునకైన లభ్యము కాలేదు. మొత్తము మీద తెలుగున నున్నన్ని యుదాహరణములు సంస్కృత భాషలో లేవనియే చెప్పనగును'' అని నిడుదవోలు వెంకటరావుగారు వ్రాశారు.[14] సంస్కృతంలో కూడా తెలుగువాడు తప్పించి ఇంకొకడు వ్రాసిన ఉదాహరణలు దొరకలేదు.

తెలుగులో పాల్కురికి సోమనాథుడు తొలిసారిగా ఉదాహరణలు వ్రాసినట్లు గమనించాం. రావిపాటి తిప్పన్న వ్రాసిన త్రిపురాంతకోదాహరణం తెలుగు సాహిత్యంలో మనకు దొరికే ఉదాహరణాలలో ద్వితీయమే గాని కావ్యశ్రేష్ఠతలో అద్వితీయం. దానిలోని అక్షరరమ్యత, ఉదాత్త భావాలూ ఎవరినైనా మంత్రముగ్ధులను చేస్తాయి. దేవతాస్తుతిలో ఏడు విభక్తులూ వాడుకొని పాటలాగా పాడుకొందుకు ఏభాషలోనైనా ఇంతకన్నా మంచి కావ్యభేదం దొరకదు. ఆధునిక యుగంలో 'గోపాలోదాహరణం' వ్రాసిన విశ్వనాథ సత్యనారాయణగారు ఉదాహరణ రహస్యాన్ని ఈవిధంగా విశదపరుస్తున్నారు.

> ''ఉదాహరణ కావ్యముయొక్క గొప్పదన మిట్లనుకొందును...
> జగత్తంతయు క్రియారూపం
> సర్వ క్రియయు బరమేశ్వరునందు బర్యవసించును

---

11. కావ్యాలంకార చూడామణి, 4వ ఉల్లాసం, 405వ పద్యం.
''సరి యెనిమిది రేకులచే - బరువడి నుత్సాహవృత్త పదయుగళముచే
నిరువగబడి ప్రాసంబుల - నరుదుగరచియింప రగడయగు తగురీతిన్''.
12. అనంతుని ఛందం - తృతీయాశ్వాసం, 52 నుంచి 61 దాకా 10 పద్యాలు.
13. అదే పుస్తకం, అదే ఆశ్వాసం - 63, 64 పద్యాలు.
14. ఉదాహరణ వాఙ్మయం - నిడుదవోలు వెంకటరావుగారు, పుట-57.

ధాతువు సర్వదా విభక్త్యాశ్రయము
ఏవిభక్తికో సంబంధము లేక క్రియ లేదు
అందుచేత నన్ని విభక్తులతో బరమేశ్వరుని
జెప్పినపుడు భగవంతుడు సర్వక్రియా స్థాన
భూతు డని వ్యంగ్యము'' ఇది యుదాహరణ కావ్య రహస్యము.[15]

ఇది చాలా చక్కని గూఢార్థ వివరణ. భగవంతుని మీదనే కాక మానవమాత్రుల మీద కూడా ఉదాహరణలు చెప్పిన కవులు లేకపోలేదు. బసవ, శేషార్య, రఘునాథీయ, నాగేశ్వర, గోపాలోదాహరణాలు మానవపరముగా చెప్పినవేనని నిడుదవోలు వెంకటరావుగారు పట్టిక వేసి చెప్పారు.

మానవజీవితానికైనా క్రియే ముఖ్యం.

చిమ్మపూడి అమరేశ్వరుడు

శ్రీనాథుడంతటివాడు చేతులెత్తి నెన్నుదుట కరాంజలి సమర్పించే సత్కవి మనకు పద్మనాయక యుగంలో దొరుకుతాడు. అతని పేరు చిమ్మపూడి అమరేశ్వరుడు. వల్లభ రాయని క్రీడాభిరామంలో శ్రీనాథుడిలాగ పూర్వకవుల స్తుతితోబాటు రావిపాటి తిప్పన్నను పొగిడాడు.

నన్నయభట్టు తిక్కకవి నాయకు లన్న హుళక్కి భాస్కరుం
డన్నను జిమ్మపూడి యమరేశ్వరు డన్నను సత్కవీశ్వరుల్
నెన్నుదుటం గరాంజలులు నింతురు జే యని.... (క్రీడాభిరామం. 36)

అమరేశ్వరుణ్ణి శ్రీనాథుడే కాక క్రీ.శ. 1690 ప్రాంతంలో ఉన్న కూచిమంచి తిమ్మకవి దాక చాలామంది కవులు నుతించారు. రామరాజభూషణుడు (క్రీ.శ. 1580కి పూర్వం) చేసిన స్తుతివల్ల అమరేశ్వరుడిది 'సహస్రముఖ దృష్టి' అని తెలుస్తున్నది. అంగర నృసింహ కవి (క్రీ.శ. 1650) చేసిన ప్రశంసవల్ల చిమ్మపూడి కులశేఖరుడు అమరేశ్వర సత్కవి ''వచః ప్రసాద సంసిద్ధుడు'' అని తెలుస్తున్నది. ఇతణ్ణి స్తుతించిన కవుల పట్టిక ఇది...

క్రీ.శ.	1400 తరువాత	శ్రీనాథుడు
క్రీ.శ.	1430-1490	కొరవి గోపరాజు
క్రీ.శ.	1435 ప్రాంతాలు	అనంతామాత్యుడు
క్రీ.శ.	1450 తరువాత	ప్రౌఢకవి మల్లన
క్రీ.శ.	1475-1500	నూతనకవి సూరన్న
క్రీ.శ.	1580కి పూర్వం	రామరాజ భూషణుడు

15. నిడుదవోలు వెంకటరావుగారి 'ఉదాహరణ వాఙ్మయం' అనే పుస్తకం యొక్క అట్టమడతమీద ఆఖర్న ముద్రించిన అభిప్రాయం.

క్రీ.శ.	1580కి తరువాత	అయ్యంకి బాల సరస్వతి
క్రీ.శ	1650	అంగర నృసింహకవి
క్రీ.శ.	1690	కూచిమంచి జగ్గకవి

ఇలాగ తొమ్మండుగురు కవులు స్తుతించారని చెప్పుకోవాలి తప్పించి చిమ్మపూడి అమరేశ్వరుడి గురించి మరే వివరాలూ తెలియవు. అతని ఊరేమిటో, తల్లితండ్రులెవరో, ఏ రాజును ఆశ్రయించాడో, ఏఏ ఇతర కృతులు చెప్పాడో మొదలయిన భోగట్టాలు చూచాయగా కూడా తెలియవు. శ్రీనాథునితోపాటు అనంతామాత్యుడు, కొరవి గోపరాజు స్తుతించారు గాబట్టి వాళ్ళ కాలానికి ముందువాడని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు.

ఇతర వైనాలు ఏమీ తెలియకపోయినా ఈ కవి రచించిన 'విక్రమసేనం' అనే రసవత్తరమైన కావ్యంలోంచి 54 పద్యాలు దొరుకుతున్నాయి. పెదపాటి జగ్గన్న అనే కవి 'ప్రబంధ రత్నాకరం' అనే సంకలన గ్రంథాన్ని చేశాడు. అందులో కవీంద్ర కావ్యనామాలతో వివిధ కవుల బంగారంలాంటి పద్యాలను సేకరించి వాటికి సువాసనలు అబ్బజేశాడు. చిమ్మపూడి అమరేశ్వరుని 'విక్రమసేనం'లోంచి విరివిగా పద్యాలను సేకరించాడు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి కార్యాలయంలో 'ఉదాహరణ పద్యము' లనే పేరుతో మరొక సంకలన గ్రంథం ఉంది. ఈ రెండు పుస్తకాల్లోంచి పద్యాలను గుచ్చి చెప్పి వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'ప్రబంధ రత్నావళి' అనే మరొక సంకలన గ్రంథాన్ని తయారుచేశారు. నవకము, చవి, చక్కన కలిగి ఆంధ్రతావాసనలు పరిమళించే ఈ కూర్పులో చిమ్మపూడి అమరేశ్వరుని మొత్తం 52 పుష్పాలను (11వ సంఖ్యనుండి 63 దాకా) వేటూరి ప్రభాకరశాస్త్రిగారి దండ గుచ్చారు. ఇవిగాక కూచిమంచి తిమ్మకవి ఉదాహరించిన పద్యాలు, అప్పకవి చెప్పినవి మొదలయినవి చేర్చుకొంటే 54 పద్యాలు లభిస్తాయి.

వీటిలో కందుకూరి వీరేశలింగంగారు[1] (16 పద్యాలు), చాగంటి శేషయ్యగారు[2] (10 పద్యాలు), ఇద్దరూ ఇచ్చినవి 11 పద్యాలు - మొత్తం 37 పద్యాలు కూడా ఉన్నాయి. ఈ పద్యాలన్నిటినీ ఒకచోట చేర్చి శీర్షికల వారీగా వింగడించి, వాటిని కవి ఏ క్రమంలో వ్రాసి వుంటాడో ఉజ్జాయింపుగా ఊహించుకొంటూ ఒక 'కావ్యరూపం' తయారు చేశాను. రసవత్తరమయిన పద్యాలు 54 దొరికితే వాటివల్ల కథను కొద్దిగా ఊహించడం కష్టం కాదు. ఇంతవరకూ అమరేశ్వరుడి విక్రమసేనం ఇలా వుంటుందని ఎవరూ ఈ వరుస వ్రాయలేదు. అమరేశ్వరుడి పూర్వులు ఏ క్రమంలో కావ్యం వ్రాశారో అదే అనుకరించి ఈ లీలారూపం తయారుచేయగలిగాను. ఉత్తరోత్తరా అమరేశ్వరుడి మహాకావ్యం దొరికితే మన క్రమాన్ని సరిదిద్దుకొందాం. అంతదాకా, తెలియవచ్చిన సంక్షిప్త 'విక్రమసేన' కావ్యాన్ని పఠించి అమరేశ్వరుని కవితారసాన్ని ఆస్వాదిద్దాం.

1. ఆంధ్ర కవుల చరిత్ర, ప్రథమ భాగం, పుటలు 292 నుండి 299 దాక
2. ఆంధ్ర కవి తరంగిణి నాల్గవ భాగం, పుటలు 132 నుండి 139 దాక

విక్రమసేనము

సాధారణంగా మన కవులు శ్రీకారంతో తమ కావ్యాలను మొదలుపెడతారు. నన్నయగారి కాలంనుండి హరిహర పద్మగర్భులను వరుసగా నుతించడం అలవాటు. అమరేశ్వరుడూ శ్రీకారంతో విష్ణువును నుతించే వుంటాడు. ఆ తరువాత శివుణ్నీ ప్రార్థించాడు. ఆ పద్యం మనకు లభించింది. అది మన 'విక్రమసేనం'లో మొదటిది. చూడండి...

సారథి శతవృద్ధు చక్రంబు లొనగూడి జరగవు రథమున సంఘటించి
యుదకంబు సోకున కోర్వడి యరదంబు చేతికి బిరుసైన రాతివిల్లు
గరి తాకు కోర్వక గడగడ వడకుచు ముమ్వంకబోయెడి చిమ్వినారి
మేవు నీరును లేక మెదలాడ నోపక వర్ణహీనంబైన వారువములు
నిట్టి సాధనములు నీకు నెట్టు లొదవె-త్రిపురముల నెట్లు గెలిచితి దేవదేవ!
యనుచు నగజాత చెలులాడ నలరు శివుడు-చిత్త మిగురొత్త మనల రక్షించుగాత. 1

శివుణ్ణి ప్రార్థించడంలోనే పార్వతిని కూడా పేర్కొన్నాడు. త్రిమూర్తుల దేవులను వాళ్ళను నుతించడంలో అమరేశ్వరుడు గడుసుగా ఇరికించాడా అనిపిస్తుంది. మిగతా పద్యము మనకు లభించలేదు. కాని ఇష్టదేవతా ప్రార్థనలో గణపతి ప్రార్థన దొరికింది. చూడండి...

పరముడు కందర స్థలము పైనిడి వేడుక ముద్దులాడగా
గరమున మౌళి గంగ యుదకంబులు మెల్పున బీల్చి యాని శీ
కరములు భూషణేందునకు గౌరవతారకలీల జేయు త
త్కరివదనుండు మత్కృతికి దాను ముఖస్థితితోడ దోడగున్. 2

గణపతియొక్క బాల్యాంకచేష్టను పేర్కొని నుతించడం కేతన మొదలుపెట్టాడు. అమరేశ్వరుడు గణపతిని అభిషేకం చేస్తున్న వాడిలా ఊహించాడు. కుమారస్వామిని మాత్రం కుమారుడిగా చిత్రించాడు. ఆరు ముఖాలతో అల్లరి చేయించాడు. చూడండి...

చనవున రెండు వక్త్రములు చన్నులపాల్ గుడువంగ నొక్క మో
ము నగగ నొక్క యాననము ముద్దు నటింపగ నొక్క యాస్యమున్
గనగ నిదేమి పల్కవని యాలపనంబున బెక్కులించు ను
బ్బున నగు షణ్ముఖుం డెలమి బొంది త్రిశక్తులు మాకు నీవుతన్. 3

కేతన తన దశకుమార చరిత్రలో షణ్ముఖుణ్ణి మయూర వాహనుణ్నిగానే ప్రార్థించాడు. ఈ ఆట లేదు. నన్నెచోడుడు తాను కుమారసంభవమే వ్రాస్తున్నా ప్రత్యేకంగా కుమారస్వామిని, గణపతి ప్రార్థన అయినాక కీర్తించాడు. ఆ తరువాత మన్మథుణ్ణి స్తుతించాడు (1-9). అమరేశ్వరుడు కూడా మన్మథనుతి చేశాడు.

గొనయము తమ్మినూల్ చెరకు గోల ధనుర్లత పూవులమ్ములే
టును నొకమాటు తా నతనుడున్ మును నుగ్రుజయించె జీవరా
శి నొడుచు టేమి చెప్పనని చేయు నుతుల్ తగు మోహన ప్రవ
ర్తనగల కాము డీవుత ముదంబున మీకిల గామసౌఖ్యముల్. 4

తెలుగు సాహిత్యంలో మన్మథుణ్ణి నుతించిన వాళ్లలో నన్నెచోడుడు ఒక్కడే ఉన్నట్టు కొన్నాళ్ళక్రిందదాకా అందరూ భావించేవారు. మన్మథస్తవం ప్రాచీనకాలంలో రివాజు కాబోలు. నన్నెచోడుడే కాక, దశకుమార చరిత్రలో కేతన (1-7) కూడా చేశాడు. వేములవాడ భీమకవి చేసినట్టు మనం చూశాం. ఇప్పుడు అమేశ్వరుడి మన్మథస్తుతి చూశాం. ఆ కాలపు నష్టకావ్యాలు యిప్పుడు లభిస్తే మన్మథస్తుతి చాలా గ్రంథాలలో కృత్యాదిని కనపడవచ్చు. దైవ ప్రార్థన అయ్యాక మన కవులు పూర్వకవులను స్తుతిస్తారు. అమరేశ్వరుడు కూడ అలాగే చేశాడు చూడండి...

భట్టనారాయణ భాషారమాదేవి లబ్ధవర్ణుల కర్థలబ్ధి జేయు,
బాణవాగ్భామినీ ప్రసవమంజరి విశారదుల కలంకార రమణజేయు,
రాజశేఖర భారతీజహ్ను కన్యక సుకవీంద్రులకు భావశుద్ధి జేయు
మాఘువాణీశీతమారుతగతి సారమతులకు రోమోద్గమంబు జేయు,
నని యెరింగి వారి యడుగులు దలచి న-మస్కరించి దండిమరి మురారి
వామనుని గుణాఢ్య క్షేమేంద్రునిల నలం-కారవిదుల దలచి గారవమున. 5

ఇందులో అందరూ సంస్కృత కవులే. భట్టనారాయణుడు 'వేణీ సంహారం' అనే నాటకం వ్రాశాడు. బాణుడు కాదంబరి, హర్షచరిత్ర మొదలైన ప్రసిద్ధ గద్యగ్రంథాలు వ్రాశాడు. రాజశేఖరుడు 'విద్ధసాలభంజిక' అనే ప్రసిద్ధ రూపకం రచించాడు. మాఘుడు పంచకావ్యాలలో ఒకటైన 'శిశుపాల వధ' రచించాడు. దండి, మురారి, వామనుడు, గుణాఢ్యుడు, క్షేమేంద్రుడు ప్రసిద్ధులే. వీళ్లను అమరేశ్వరుడు అలంకారవిదులన్నాడు. ఇందులో కొందరు లక్షణకర్తలు. గుణాఢ్యుని రచనలను అమరేశ్వరుడు ఏమిటి చదివాడో మరి పేర్కొన్నాడు. ఈ సంస్కృత కవుల పట్టికలో వ్యాస, వాల్మీకి, కాళిదాసులు లేరు. వాళ్లను వేరే పద్యంలో మొదటనే నుతించాడేమో, ఈ పద్యంలో భట్టనారాయణ రాజశేఖర మురారులను నాటక కర్తలను ముగ్గుర్నీ నుతించడంవల్ల అమరేశ్వరుడికి నాటక సాహిత్యమంటే ప్రీతి అనుకోవచ్చు. కాళిదాసాదుల నుతిలో భాసుణ్ణి కూడా నుతించాడేమో తెలియదు. అతడు తెలుగులో ఏకవులను స్తుతించాడో కూడా ఆ పద్యాల్ని ఎవరూ ఉదాహరించలేదు.

సుకవులను నుతించాక మన కవులు కుకవులను తిరస్కరించి తమ కావ్యాన్ని వ్రాయడానికి ఉద్యుక్తులవడం చేస్తారు. అప్పుడు ఎవరో శ్రీమంతుడు నిండుకొలువుండి కవిని పిలిచి, అతడి గొప్పతనాన్ని కీర్తించి, ''నువ్వు ఇంతటి కవివి గనుక నామీద ఒక కావ్యం చెప్పు'' అని అర్థిస్తాడు. కవి అంతట అతని వంశాన్ని విపులంగా వర్ణించి కృతపతికి

షష్ఠ్యంతాలు చెప్పి 'నాయొనర్పంబూనిన, మహాకావ్యంబునకు కథాక్రమం బెట్టిదనిన' అని కథలోకి దిగుతాడు. ముందు కథానాయకుని పురాన్ని వర్ణిస్తాడు. ఈ తతంగం అంతా పూర్తి అయ్యాకనే అమేరేశ్వరుడు పురవర్ణనకు పూనుకున్నాడనుకొందాం. అతడి కావ్యంలో మొదటి కథాభాగపు పద్యం ఇది అని ప్రస్తుతానికి మనం చెప్పవచ్చు.

ప్రత్యగ్ర రచనాతి భాసురప్రాసాదనిర్జిత గోత్రావనీధరంబు,
ప్రాకార శిఖరాగ్రబంధురమణిగణ ద్విగుణిత తారకావిభ్రమంబు,
పరిఖాజలాంతర ప్రతిబింబితద్రుమ స్మారిత పాతాళభూరుహంబు,
వనపుష్ప సౌరభావర్జిత మధువశూన్యీకృతాశా వారణేంద్రగండ,
మప్పరస్ప్రహణీయ లీలాతిశయవి- లాసినీ జన నేత్ర విలాసజనిత
కుసుమశరబాణ వైఫ్యాత్యమసదృశార్ధ- నిర్జితాలక ముజ్జయినీపురంబు. 6

కథానాయకుని ఊరిపేరు ఉజ్జయినీపురం అని దీనివలన తెలిసింది. పురంలోని మేడలు, మిద్దెలు, వాడలు, వర్ణాలు, దొడ్లు, తోటలను విపులంగా మన కవులు వల్లించడం, వర్ణించడం నన్నెచోడుని కాలం నాటికే మొదలైంది. నన్నెచోడుడు కుమార సంభవంలో 40 పద్యాలలో పురవర్ణన చేశాడు (7-91 నుండి 130 దాకా). అమరేశ్వరుడి పద్యాలు మనకు 54 మాత్రమే దొరికాయి. అందులో 13 పద్యాలు పురవర్ణనమే. అంటే ఇతడు నన్నెచోడుడంత విపులంగానూ పురవర్ణన చేశాడనుకోవాలి.

కొలదికి మీర బెద్దయగు కోటతనర్చున వస్తు సంతతో
జ్జ్వలతరసత్ప్రభాత రవిచంద్రరుచుల్ సొరనేరకున్న సం
ధ్యలు దివసత్రియామములు దత్పురి పౌరజనం బెరుంగు ద
మ్ములము చవిన్ విహంగతతి బూవులతావి రతిప్రసంగతిన్. 7

కోటగోడలు మరీ ఎత్తు అని వర్ణించాలి. ఆకాశం తాకుతాయి అని చెప్పడం కవిసమయం. ఈ ఉత్ప్రేక్షను చమత్కరించడంలోనే కవి చాకచక్యం తెలుస్తుంది. కోట గోడలు ఎంత ఎత్తు ఉన్నాయంటే సూర్యచంద్రుల కాంతులు జొరబడనంత ఎత్తు. మరి ఆ ఊళ్ళో వున్నవాళ్ళకు ప్రొద్దెలా తెలుస్తుంది? ఝాములు ఎలా తెలుస్తాయి? తెలియకేం, వేసుకొనే తమలపాకుల రుచివల్ల, పక్షుల గతివల్ల, పువ్వుల తావివల్ల, రతిసంగతివల్ల టైము తెలుస్తుంది అని కవి చమత్కరించాడు. కోట ఎత్తయినదనేకాక, ఆ ఊళ్ళోవాళ్ళు భోగులు అని చెప్పాడు. ఇది విక్రమసేనంలోని పద్యమని ప్రబంధ రత్నాకరంలోనూ, ఉదాహరణ పద్యసంకలనంలోనూ చేర్చినా ఇది వాస్తవానికి నన్నెచోడుని పద్యమే. కుమారసంభవం సప్తమాశ్వాసంలోని 108వ పద్యం చూడండి.

కోట ఎంత ఎత్తుగా ఉందో దాని కొమ్మలను వర్ణిస్తూ ఇలా చెప్తున్నాడు.

తరులు పడి యుత్తరాయణ దక్షిణాయ
నముల రవితేర విడిసిన వరవ లట్లు

మెరయు గనుగొన గొమ్మలు మింటి కిడిస
కుదురు విధమున దసరారు కోటమీద. 9

కోట అంత ఎత్తు అయితే ఆ ఊళ్ళో ఉండే ఇళ్ళు ఎలా ఉంటాయి?

హరగిరి సురగిరి రోహణ- గిరులీనిన కొదమ లనగ గృహములు పురిన
చ్చెరువగును గుద్యరత్న స్ఫురణను విలసిల్లి తగిన పొడవులతోడన్.

కైలాసపర్వతం, మేరుపర్వతం, రోహణగిరి ఈనిన పిల్లలలాగ ఉంటాయట! అయితే ఆ యింటి మేడలు కొన్ని ఆకాశాన్ని అందుకొంటాయి కదా? అవును. అందుకు సందేహమా! అయితే చంద్రుడు ఆ మేడలమీదకు వస్తాడా? వస్తాడు. ఆ బింబంలోని మచ్చకు ఆ మేడమీద ఆడుకొనే యింతులు పేరు పెడతారు. చూడండి :

ఇర్రి పావయిల్కుందేలు మర్రి యనుచు
జనులు కనుకని పలికెడు చందమామ
నడిమి మచ్చకు నెరిగి పేరిడగ నేర్తు
రప్పు రమున మేడలవయి నాడు సతులు. 10

అమరేశ్వరుడు చెప్పిన ఈ పద్యాన్ని ఆధారం చేసుకొనే చేమకూర వెంకటకవి తన 'విజయవిలాసం'లో ఒక పద్యం చెప్పాడు. చూడండి...

రేలమృతాంశులో శశము రెమ్మదమంచు దలంచి జాళువా
మేలి పసిండిసోయగపు మేడల గుజ్జనగూళ్ల సందడిన్
బాలిక లుండి యావల జనం గని చింతిలి వంటయింటి కుం
దేలిది ఎందు బోగలదు నేటికి నేమని యందు రందులని. (విజయ విలాసం. 1-6)

అమరేశ్వరుని పద్యాన్ని చూసే మేడమీద ఆడే వాళ్ల వంటయింటి కుందేలు అనే కల్పన చామకూర అనుసరిస్తే ఆ కవికాలం దాకా అమరేశ్వరుని కావ్యం ప్రచారంలో ఉండేదని ఊహించవచ్చు. అంటే క్రీ.శ. 1616దాకా దీని ప్రతులు తంజావూరులో ఉండేవి. మూడువందలా యాభై సంవత్సరాలలో ఈ కావ్యం మూలపడిందన్నమాట. లేక 1550-60లో సంకలనం చేసిన జగ్గన ప్రబంధరత్నాకరమునే చేమకూర చూశాడా?

కాకతీయ పద్మనాయక యుగాలలో అందరూ ఎక్కువగా జూదమాడేవారు. మొలల గోచిపాతలు మాత్రము మిగులునంతవరకు పందెములొడ్డి జనులు పాడగు చుండిరి. (పాపద్యూతమీపన్నిదం బంగీకారము సేయు వారి మొలలన్ బ్రాపించు కౌపీనమర్మ). వ్యవసాయ వృత్తితో జీవించు హాలికుడు కూడా నీపణములకై పచ్చడము లమ్ముకొని చలికాలమున బాధపడుచుండిరి (పచ్చడము లమ్ముకొన్నాడు పణము లకును). సర్వజనులీ జూదపు పిచ్చియందు మునిగిపోయేవారు.[3] ఈ వాతావరణంలో

3. మన సంస్కృతి - చరిత్ర - డాక్టర్ బి. రామరాజుగారు విద్యార్థులచే వ్రాయించిన సంపుటి. పుట-242

మన భాషలో జూదపు మాటలు విరివి అవక తప్పదు. జనులు చీటికీ మాటికీ అన్నింటికీ పందెం కట్టక మానరు. అమరేశ్వరుడు ఈ యుగానికి తక్షణ వారసుడు. అందుకే మనతో ఇలా పందెం కడుతున్నాడు.

నూరు క్రతువులు సేయని పారు నిల్లు
కోటి పడగలు లేని కిరాటగృహము
జాతి రత్నంబు గాని పాషాణకులము
వెదకి చూపిన వీటు బన్నిదము గలదు. 11

నీర నగ్నియునికి యారయ విస్మయం
బనుచు బాడబాగ్ని కడలి యప్పు
రంబు జొచ్చె నొక్కొ రత్నాకరము మణు
లనగ జెలువ మమరు నాపణములు. 12

పొడవుగ నెల్లయంగడుల ప్రోవులు వోసిన నూత్నరత్నముల్
కడక ననేక వేషములు గైకొని వచ్చిన యర్థికోటికిన్
బిడికెడు లాదిగాగ బలి వెట్టుదు రప్పు రి వైశ్యభామిను
ల్కడవక హస్తకంకణ ఝుళధ్వను లొప్పగ నెల్లయప్పు డున్. 13

ఈ పద్యాన్ని విక్రమసేనంలోనిదని ఆంధ్రసాహిత్య పరిషత్తు ఉదాహరణ గ్రంథంలో సంకలనకర్త చేర్చాడు గాని ఇది జక్కన విక్రమార్క చరిత్రలోనిది. సరిగ్గా ఇదే పద్యం ఆ గ్రంథంలో కనబడుతుంది. చూడండి - జక్కనపురవర్ణన (విక్రమార్క చరిత్ర 1-74)

దానానేకపబృంహిత స్వనము గంధర్వావలీ హేషిత
ధ్యానంబున్ మృదువేదనాదమును గాంతానూపురారావమున్
గానా నూనరవంబు దూర్యబహుశంఖ స్ఫారరావంబు బె
ల్లై నీరార్ర ఘోష మొయనగ నిత్యంబుం జెలంగుం బురిన్. 14

ఈ పద్యంలో రాజధానిలో వినబడే శబ్దాలను అమరేశ్వరుడు చక్కగానే వర్ణించాడు గాని ఈ ధ్వనులన్నీ నన్నెచోడునికి ప్రతిధ్వనులే. ఈ పద్యం కవిరాజశిఖామణికి అనుకరణం. చూడండి, కుమార సంభవంలోని పద్యం...

సమదానేకప బృంహితంబు హయహేషా ఘోషమున్ గీతవా
ద్యమృదుధ్వానము వేదరావము భటోద్దండో క్తులుం భోరిపం
చమహాశబ్దరవంబు గూడి సుమహత్ సంక్షోభితాంబోధి నా
దమొనా దిగ్బధిరీకృతం బగుచు నిత్యంబున్ జెలంగుం బురిన్. (7-128)

ఈ సంవాదరచనవల్ల అమరేశ్వరుడు నన్నెచోడుని ప్రబంధాన్ని తప్పకుండా చూశాడని తెలుస్తున్నది. నన్నెచోడుడు చేసినన్ని ప్రయోగాలు అమరేశ్వరుడు కూడా అంత

ప్రౌఢంగానూ చేశాడని భావించవచ్చు. పురవర్ణనలో మన కవులు అందరినీ వర్ణిస్తారు గాని పతివ్రతల పేరెత్తరు. అమరేశ్వరుడు ప్రత్యేకంగా వారిని వర్ణించాడు. చూడండి...

తరుణవయస్కుల యౌవన-పరిపాకుల వృద్ధజనుల భటులను నిజసో
దరులను గురులను గా జూ-తురు పురము పతివ్రతాసతులు పుణ్యావతుల్. 15

మన కవులు వ్రాసేవి శృంగారకావ్యాలు కనుక వాళ్ల దృష్టి విలాసినుల మీదా, వారకాంతల మీదా పడేటంత ఎక్కువ పతివ్రతలపై పడకపోవచ్చు. అమరేశ్వరుడు పుణ్యావతుల తరువాత పణ్యాసతులను వర్ణించాడు. చూడండి....

చూపులకట్టు పూదూపుల జేపట్టు సబలల చూడ్కుల యాయుధములు
తాయంబునకు గండుగోయిల గూయించు - బాలల పలుకులు మూలమంత్ర
మెదిరికి దేటుల నెడయాటలాడించు - సబలల యలకల యాప్తబలము
సవరణకుం జంద్రు జాలించు మగువుల - మొగముల సేవకు దగిన మొగము
భావభవునకు; నటుగాక బలమె బలము
గాగ దిరిగెనే పెల్లుచే గాసి బడడె?
యనగ సౌందర్య సంపద లభినవముగ
వరలుదురు దత్పురంబున వారసతులు. 16

కాకతీయ యుగంలో వేశ్యలు ఉద్ధోలంగా ఉండేవారు. ఆ యుగానికి వారసులైన పద్మనాయక యుగంలోనూ వాళ్ళ ప్రాభవం ఎక్కువే. వారస్త్రీలు ఎప్పుడూ అసమాస్త్రుని ఖడ్గలతికలే. అమరేశ్వరుడు మన్మథునికి కొత్త ఆయుధాలు సరఫరా చేశాడు. ఇటువంటి వారకాంతలతో విహరించడానికి మంచి ఉద్యానవనాలు ఉండాలి. ఉజ్జయినీ నగరంలో ఎలాంటి వనాలున్నాయో వర్ణిస్తున్నాడు. వెళ్ళి విహరిద్దాం రండి.

పూవుల ప్రోవులై చిలుకబోదలు కోయిలపిండు మందలై
తావుల క్రోవులై యలివితానము గానము తానకంబునై
కావను బండ జాలుట ద్రికాలము గల్గ వరంబు గన్నయ
ట్లై పనరాజి పొల్పగు బురాంతికభూముల నెల్ల జూడగన్. 17

ఈ తోటలో చల్లనిగాలి వీస్తుంది. ఈ ఊళ్లో గాలికి కూడ భోగలాలసత్వం వుంది. మందానిలుడు కొంటెవాడు. ఆడవాళ్లతోనే వుంటాడు. చూడండి...

సుదతులు డస్సినచో నలంతలు వోవ సొబగుడై చలిమిరి చూపి చూపి,
యువిదలు తిలకించి యున్నచో వేడుక గొలది మీరగ నొజ్జ గుదిసి కుదిసి.
సొబగుల పెనకువచో దాన వలతియై యెరుకువ వాసన కెక్కియెక్కి.
వెలదులు మదమున విహరించుచో సోయగంబున వీధుల గ్రాలి క్రాలి,
యతులితంబైన శృంగార రతుల నిజని
భూతిపొందాస సేసి తత్పురములోన

బవలు రేయును నుడుగక తవిలి తిరుగు
మిండడును బోలె మందానిలుండు లీల. 18

పురవర్ణన చేస్తున్నప్పుడు పిల్లగాలిని వర్ణించడం తిక్కనగారిలో కనబడుతుంది. వారు ఒకటి కాదు, రెండు సీస పద్యాలలో మందానిల వర్ణన చేశారు. వారి మొదటి పద్యంలో కూడా పిల్లగాలిని ఆడవాళ్ల విషయంలోనే వర్ణించారు. చూడండి...

పడతుల నెరివీగు బాలిండ్లు బెడదోపలీల బయ్యదలు దూలించుటకును
దెరవల పూతలు మెరయంగ నాటమై నడరిన నునుచెమటార్పుటకును
మెలతల చెక్కుల మెరుగు వింతగ నవతంసమంజరుల గదల్పుటకును
గొమ్మల యలికదేశమ్ముల గ్రొత్త చెన్నొలయ గుంతలముల దెలచుటకును
విటకుమారులు తనరార వేచివేడ్క
నెదురుకొని యింపు సొంపు వహించుచుండ
నడపు మెలపున జనుల కానంద మొదవ
గంధవహు డప్పు రంబున గలయబొలయు. (నిర్వ. 1-59)

తిక్కనగారు తన రెండవ పద్యంలో (1-63) రాజమరాళం, కలకంఠకుమారుడు మొదలయినవాళ్లతో మందానిలుడిని పోల్చారు. అమరేశ్వరుడు తిక్కనగారి రచనలను చూసే వుంటాడు.

కథానాయకుని ప్రశంస :

ఇటువంటి మేడలు, మిద్దెలు, పుణ్యస్త్రీలు, పణ్యస్త్రీలు, తోటలు, కోటలు ఉన్న పురాన్ని విక్రమసేనుడు అనే రాజు పాలిస్తూ వుండేవాడు. అతడు ఎలాంటి వాడంటే...

కులశైలంబులలో సువర్ణగిరి దిక్కుంభీంద్రవర్గంబులో
బలభిన్నాగము లోక పాలకులలో బర్జన్యుడుగ్రోరగం
బులలో శేషుడు పెంపుగన్న కరణిం బూజ్యాధిపశ్రేణిలో
వెలసెన్ విక్రమసేన భూవిభుడు దోర్వీర్య ప్రతాపంబునన్. 19

ఈ రాజు వద్దకు ఎవరో వచ్చి ఏదో దూరదేశంలోని వింతను చెప్పినట్టుంది ఆ వైనం విందాం.

ధరణీశ! లవణాబ్ధి పరివేష్టితక్షితి వరలిన నేరెడు గరితికొలది
నొక్కొక్క దిక్కున కొక్కొక్క లక్షయోజనములు దన్మధ్యమునసువర్ణ
సారమై యున్నది చతురుత్తరాశీతి సాహస్రయోజన సంఖ్య మొదలి
వలము పదారువేల్గలిగి వెడల్పు ముప్పదిరెండువేలుగా బాతులోతు
మొదలివలమున యంతయై తుదిబదారు
నేసి వేలుగా మేరువన్ శిఖరి యొప్పు

దానిపై బ్రహ్మపురి చతుర్దశ సహస్ర
యోజనస్థితి గనుగొన దేజరిల్లు.

విక్రమసేనుడు అక్కడికి వెళ్లాలనుకొన్నాడు కాబోలు. సఖునితోనో, ఈ వివరాలు చెప్పినవాడితోనే వెళ్ళాడు. అతనికి దారిలో కైలాసం కనిపించింది. దానిని అమరేశ్వరుడు ఇలా వర్ణిస్తున్నాడు...

కైలాస వర్ణన :

అదె కైలాసము దృగ్విలాసము విహాయశ్చారిణీ సమ్మద
ప్రదవిన్యాస ముదగ్రభాసము మరుద్భామాసదాధ్యాసమ
భ్యుదయన్యాస మసన్ని రాసము మయూరోదారనిధ్యానబి
భ్యదహివ్రాతకృతప్రవాసము త్రినేత్రావాస మర్వీశ్వరా! 21

ఈ కైలాస పర్వతాన్ని దాటాక వాళ్ళు ఒక ఉద్యానవనంలోనికి వెళ్ళినట్టున్నారు. అక్కడ సఖుడు రాజును ఒక ప్రశ్న వేస్తాడు.

ముత్తాకేకుజము ల్పడల్చె? మొగడ ల్మన్నేమహీజంబులం
దొత్తెం? బువ్వులు నిండగా బెరిగె నేయుర్వీజముల్? పూపలన్
మొత్తంబై విలసిల్లె నేధరణిజంబుల్? కాయలం బండులం
జిత్తానందము జేర్చె నేక్షితిజముల్? చెల్వొందగా జెప్పు మా. 22

దానికి విక్రమసేనుడు ఏం జవాబు చెప్పాడో మనకు తెలియదు. తరువాత సఖుడు వనంలోని వృక్షాలను పేరుపేరునా వర్ణిస్తున్నాడు. వినండి...

అరుణ పుష్పావలి యగ్నిగా సంధించి యళుల నుల్కాలుగాగ నావహించి,
దందడి వీతెంచు దక్షిణపవనంబు భస్త్రానిలంబుగా బరిఢవించి,
చిలుకలు పికములు చేదోడు సేయంగ మాధవుండను కనుమరి గడంగి,
యంగజుండను పతియానతి బనిపూని మొగడలన్ముకులుల మొనలుచరచు

కొలిమి యొక్కొ యనగ గురియు పరాగంబు
విస్ఫులింగములుగ విరహు లులుక
నేచిపూచియున్న యీ యశోక మహీరు
హంబు గంటె మాళవాధినాథ! 23

విక్రమసేనుడు ఆ అశోకాన్ని చూశాడు. ఆనాటికి ప్రొద్దుపోయిందేమో. సూర్యుడు అస్తమించాడేమో. నాయకుడు అక్కడే ఆగాడేమో. సూర్యుడు ఎలా క్రుంకాడో కవి వర్ణిస్తున్నాడు.

తరుణుండగు శీతలకరు - మరగి వియల్లక్ష్మి తన్ను మాని ముదుకడున్
ఖరకరుడును సని ద్రొబ్బిన - కరణిన్ రవి పశ్చిమాద్రికడ గ్రుంకె నృపా! 24

ఈ వర్ణన కథలోని వ్యంగ్యాన్ని సూచిస్తున్నదేమో మనకు తెలియదు. ఈ పద్యం విక్రమసేనంలోనిదని ప్రబంధ రత్నాకరంలోనూ, ఉదాహరణ గ్రంథంలోనూ ఇద్దరు సంకలనకర్తలు చేర్చినా ఇది నిజంగా బమ్మెర పోతరాజుగారి పద్యం. దశమస్కంధ పూర్వభాగంలోని 1288వ సంఖ్యగల పద్యం అచ్చంగా ఇదే. సంకలనకర్తలు పొరబడ్డారు కాబోలు.

సూర్యుడస్తమించాక చంద్రుడుదయిస్తాడు కదా! పొడుస్తున్న జాబిలి ఎర్రగా ఉంటాడు. చంద్రబింబం దేవతల చేదలా ఉందట - చూడండి:

అమరులమృతాబ్ధిలోపలి యమృత రసము
వెండి చేరుల పటికంపు కుండగట్టి
చేదుకొని యెదరో నాగశీత రోచి
మెల్ల మెల్లన రుచులతో మిన్నువ్రాకె. 25

ఎర్రని చందమామ కొంతసేపటిలో తెల్లబడతాడు. దక్షిణాది రాజుల ఇళ్లలో దంతవజ్రాలు కడిగితే ఎంత తెల్లబడతాయో చంద్రుడూ అలాగే ఉన్నాడట.

ఉదయరాగ మించించుక యుజ్జగించి
నిండు జంద్రుడు గన్నుల పండువయ్యె
ధావనాసంతర స్నిగ్ధ దాక్షిణాత్య
రాజ శుద్ధాంత దంతవజ్రముల కాంతి. 26

ఈ పద్యం చిమ్మపూడి అమరేశ్వరుడిదిగా ఆంధ్ర సాహిత్య పరిషత్తు సంకలనంలో ఉందిగాని, ఇది అసలు శ్రీనాథునిది. ఇది ఆయన భీమేశ్వరపురాణంలో ఉంది (2-43). ఆ మాటకు వస్తే ఇది శ్రీనాథునిదీ సొంతం కాదు. దీనిని ఆయన బాలరామాయణం నుండి అనువదించాడు. ఆ మూలశ్లోకం ఇదిగో :

సంబంధీ రఘుభూభుజాం మనసిజ వ్యాపారదీక్షాగురుః
గౌరాంగీ పదనోపమాపరిచితః తారావధూవల్లభః
సద్యోమార్జిత దాక్షిణాత్య తరుణీ దంతావదాతద్యుతిః
చంద్రస్సుందరి దృశ్యతామయమితశ్చండీశ చూడామణిః (దశమాంకం - శ్లో. 41)

ఇందులోని దంతద్యుతులకు బదులు శ్రీనాథుడు దంతవజ్రాలను పేర్కొన్నాడు. ఈ అనుసరణను కుందూరు ఈశ్వరదత్తుగారు చూపించారు.[4]

4. శ్రీనాథుని కవిత్వతత్త్వము, పుట 128.

దాక్షిణాత్య రాజశుద్ధాంతాలతో ప్రమేయంగల పై పద్యం అమరేశ్వరుడిది కాకపోయినా, రాగముక్తుడైన చంద్రుణ్ణి పరమయోగిలా వర్ణించిన ఈ క్రింది పద్యం అమరేశ్వరుడిదే కాబోలు!

తనరి రాగిల్లి ముక్తుడై తరతరంబ
నిర్మలత్వంబు బొందుచు నీరజారి
పరమ యోగియుబోలె సత్పథమునందు
నడువగా జొచ్చె గువలయానంద మొసగ. 27

బహుశా రాజుతో వచ్చినవాడు యోగి కాబోలు. తెల్లారాక వాళ్లున్నచోట ఎలా ఉందంటే...

మదవతీగండూష మదిరాభిషేచనవడి నంకురించిన వకుళములను
నతివల మృదుపాదహతి నూత్నకోరక స్ఫురణ గైకొన్న యశోకములను
సుదతుల క్రేగంటి చూడ్కిపై బారిన దిలకించి యలరిన తిలకములను
నన్నుల యవ్వీగు జన్నుల సోకున గొమరొంది ననిచిన కురవకముల
నెరగ జరణములను నెరకలు విరిసిన-మొగడలందునుండి మొరయు తేటి
కొదమ లెలమి బొంది ఘూర్ణిల్ల నధికవి-భూతి దనరు చూతపోతములను. 28

ఇటువంటి తోటలోనికి సఖులతో కథానాయిక పువ్వులు కోయడానికి వచ్చింది. ఆ పడుచుపిల్లలు ఎలా పుష్పాపచయం చేస్తున్నారంటే :

దక్షిణ పవనంబు తమ గంధమున నూని
మలయా చలముమీది మరులు మాన
దివిచి పట్టిన లతచివుళుల చాయకు
గరతలంబుల కాంతి వరము లొసగ
గుసుమముల్ గోయుచో గోళ్ల మెరుంగులు
తని మొగ్గలకు గవిసెన లొనర్ప
పిలువంగ జెలగెడు పలుకులు రాజకీ
రములకు నొజ్జతనములు సేయ
గురులు నలుల పిండు బెరయగ వనమయూ
రముల గతులతోడ గమనలీల
నసగి పెనగి ప్రీతి వనకేళి సలిపిరి
వనజముఖులు వేడ్క బనుపుచేయ. 29

పువ్వులు కోస్తూవుంటే వాళ్లు మదనాధిరాజ్యలక్ష్మలలాగ వున్నారట – వినండి :

అలకలు తేటిదాటులును, హస్తతలంబులు పల్లవంబులుం
బలుకులు గీతపోతముల భాషలు, మేనులు బువ్వుదీగెలున్

లలి దమలో దడంబడ విలాసవతు ల్మదనాధిరాజ్యల
క్ష్మలగతి నెల్లచో విరులు గోయుట చెన్నెసలారె దోటలన్. 30

ఈ గుంపులో ఉండక ఒకర్తె విడిగావెళ్ళి పువ్వులు కోస్తున్నదట. ఆమెను కవి వర్ణిస్తున్నాడు:

నెరవుగా విరియక నెగడు నెత్తావితు
మ్మెదలచే మునుమును మీదువోక,
యకరువు నెరయక మకరంద మొలుకక
నెరిదప్పు నొరగక కరకులేక
బింకంబు లొక్కింత ప్రిదులక జిగిసొంపు
చెదరక వేకులు చిక్కుపడక,
పొరటతో రాయక పొలుపు సొంపెడలక
సుడియుక్రీగాలిచే సూరగిలక
కరము శోభిల్లు రుచిరమంజరులు గోసి
వనిత యొక్కర్తుతనదు లావణ్యరసము
నెలమి నుద్యానమొక క్రొత్త చెలుపుదాల్ప
లతలలో నాడు జంగమలతికవోలె. 31

ఈ పిల్ల చిటారుకొమ్మల పూవులు కోయబోయింది. అవి దట్టమైన ఆకులలో దాక్కున్నాయి. వెలుగు చాలదు. అంత దట్టం. ఆమె చేతులు పైకెత్తి కోయబోయింది. ఆమె బాహుమూలకాంతులు ఎత్తిన చెయ్యితోనే ఎగబ్రాకి 'టార్చిలైట్లు' అయినాయి కాబోలు. ఆ వెలుతుర్లో ఆమె మొదట కోద్దామనుకొన్న పువ్వులు కోసిందట. వినండి ఈ కల్పన :

ఇరియుకుచంబులం దొకటి యించుక వీడ్వడ నొక్కకేల లే
బొర గబళించి నిక్కుచును బూవున కెత్తిన చేతి చంకక్రొ
మ్మెరుగులు హస్తముం గడచి మీదికి బ్రాకగ మున్ను గన్న యా
గురుతులు డాసి కోసె దుది కొమ్మల పూవులు కొమ్మనెమ్మితోన్. 32

ఈ ఒంటరిపిల్ల కథనాయిక కాబోలు, మనకు తెలియదు. ఈమెను నాయకుడు చూశాడో లేదో, అతణ్ణి ఆమె వీక్షించిందో లేదో కూడ మనకు తెలియదు. మిగతా వెలదులు పువ్వులు కోయడం కవి వర్ణిస్తున్నాడు. వాళ్లు మన్మథుడి దండులాగ వున్నారు. చూడండి:

పాంథుల హృదయముల్ పల్లటుంబులు సేయ దర్పకు పనిచిన దండసంగ
విరహిమృగంబుల సురిగింప దివిరెడు కాయసంభవుని మొక్కల మనంగ
గడు నల్గి జైత్రునాగారంబు ముద్రింప మనసిజు పనిచిన యనుగు లనగ
సహచరుండగు గంధవహు గానగా మీనకేతను పంచిన దూతలనగ
నభినవాకారసౌందర్య సుభగలీల - లతిశయంబుగ మెలగుచు నసమబాణు
పుష్పలావికాజనముల పోలె నెరసి - కోమలాంగులు పువ్వులు గోసిరెలమి. 33

ఆడుతూ, పాడుతూ, విచ్చలవిడిగా ఆడుపిల్లలు ఒక తోటలో పువ్వులు కోసుకొంటూ వుంటే, ఆ వనంలో ఏ పొదచాటునో, గుబురుచాటునో ఒక అందగాడు పొంచి వుంటే వాళ్లు అతన్ని గుర్తించకుండా వుంటారా? అతడి గాలి వాళ్లవైపు వీచి అతణ్ని పట్టివ్వకుండా వుంటుందా? ఆ పిల్లలంతా అతన్ని చుట్టుముట్టకుండా ఉంటారా? వాళ్లు చూశారు. అతడి వద్దకు వెళ్లారు. అమరేశ్వరుడు అది ఎలా చెప్పాడో వినండి.

ధమ్మిల్లభారముల్ కమ్మపూవులతోడ
బొదిగొని వెన్నుల బొలసి వ్రేల
నలికతలంబుల బొలుచు కుంతలములు
ఘర్మజలంబుల గలసియంట
గల్హారదళముల కాంతి మిన్నక కొన్న
చెన్నున గనుగవ జేగురింప
సోలెడు వల్లుల బోలెడు మేనుల
బయ్యట గాలిచే బ్రస్ఫురింప
ఘనపయోధరముల గాశ్మీరచర్చలు
గలగ నలసగతులు చెలువ మొంద
బువ్వుబోడు లంత బుష్పాపచయకేలి
సోలి వచ్చి రానృపాలుకడకు.

ఇతడు బహుశా వాళ్లకు పరిచయస్థుడేమో! లేకపోతే సోలి వస్తారా? ఏమో. ఈ వనితా బృందంలో విక్రమసేనుడు కథానాయికను చూశాడు. ఆమె ఎలాగ వుంది?

పలుచని చంద్రికారసము ప్రన్నని నున్నని తేటక్రొమ్మెరుం
గుల తుదలు న్విదిర్చు నెల కొమ్మలకాంతి పసిండి నిగ్గుతో
గలిపి యలంతి వన్నెయిడి కాయజునిల్పిన రత్నపుత్రిక
న్నలువ సజీవి జేసె నొకొ నాదగు నాతివిభూతి చూడ్కికిన్. 35

నాయికానాయకులు ఒకరినొకరు చూసుకొన్నారు. కళ్లూ కళ్లూ కలుసుకొన్నాయి. మరులు కొన్నారు. మాటాడుకొన్నారు. విడిపోయారు. ప్రతి ప్రబంధంలోలాగే వీళ్లు కూడా విరహంలో పడ్డారు. ఆమె ఒక పూపొదరింట కూర్చుంది. ఆమెను వర్ణించడంలో అమరేశ్వరుడు చక్కని ఉపమానాలు వాడాడు. చెంపమీద చెయ్యివేసుకొని, ఒక తొడ మడచి రొమ్ముకు ఆనించుకొని, చెమటలు పొయ్యగా కన్నీరు కారుస్తూ ఆమె కూర్చుంది. అక్కడికి ఆమె చెలికత్తెలు వచ్చి చూశారు.

పరిణత ఫణిలతాపత్రంబు గదిసిన
చివరునా జెక్కున జేయి చేర్చి
కందర్పమదకరి కరముపై జక్కవ

లెరగెనా దొడగుచు మిరియమోపి
దవనంబు పొరకల గవిసిన మంచునా
బలుచని చెమట మై గలసి మెరయ
గలువరేకులు మౌక్తికముల నీనెడిననా
గన్నుల బాష్పంపు గణములురల
వేడి నిట్టూర్పు గాడ్పులు విరహవహ్ని
శిఖలు ప్రబలంగ వలవంతచింత నొగిలి
యేకతం బున్న దాని రాజేంద్రతనయ
గనిరి లతికాగృహంబులో వనజముఖులు. 36

ఆమె మనసులో ఏమనుకొంటున్నది? తను ప్రేమించిన వాడు తనకు దక్కడు. అతడిని ప్రేమిస్తే తల్లితండ్రులు, బంధువులు ఒప్పుకోరు. ''మనసా, నీ కిది తగునో, తగదో, ఆలోచించుకో!'' అని ఆమె హెచ్చరిక చేస్తున్నది.

వల్లభు డేగు దుర్లభుడు వానిదెసన్ దగులూరి యిమ్మెయిన్
దల్లడ మందెదేల యుచితస్థితికిన్ నను బాపచూచినన్
దల్లియు బంధులోకమును దండ్రియు నేమనువా రెరింగిలే
నుల్లమ, యిట్లు నీకు దగునో తగదో పరికించి చూడుమా.[5] 37

ఆమె మనోభావాలు ఎలా ఉన్నా ఆమె బాహ్య రూపాన్ని చెలులు వీక్షించారు. ఆమె కన్నులు నీరు పదను పెట్టే మన్మథుడి అమ్ములలాగ వున్నాయట. చూడండి సంపూర్ణ చిత్రం:

ప్రాణంబు లెడల సభ్యాసంబు సేయు మా
ర్గం బన నిట్టూర్పు గాడ్పు లెసగ
గవ్యశాలను నేయి గ్రమ్మకైవడి గామ
శిఖి గ్రాగి మైదీగె చెమట వొడమ
మదమనమ్ములు నీరుపదను పెట్టిన క్రియ
వాలు గన్నులు బాష్పవారి మునుగ
బగ లేదుటయు నెడబడు రథాంగము చంద
మున జన్నులు ముఖోద్గముగ వడంక
ప్రాణ మెడలి నెరపువడి యొడలు
భూషణములతోడి పొత్తు విడిచి
లాతు లైరి సఖులు లలతులు వాయని
పాత్రలైరి నిషధరాజసుతకు. 38

5. ఈ పద్యం 'విజయసేనము'లోనిదని చెప్తూ కాకుస్వరవళికి లక్ష్యంకా కాకునూరి అప్పకవి ఉదాహరించాడు (అప్పకవీయం 3-254). అయితే ఇది 'విక్రమసేనము' లోనిదని కూచిమంచి తిమ్మకవి పేర్కొన్నాడని పండితులంటున్నారు. చూ॥ చాగంటి శేషయ్య. ఆంధ్ర కవి తరంగిణి, 4వ సంపుటం.

నాయిక బాధను ఇష్టసఖి అర్థం చేసుకొన్నట్టు ఉంది. నచ్చచెప్పింది. ఊరడించింది, ఆశగొలిపింది, మన్మథుడు నిన్ను బాధిస్తున్నాడని, వాడికి భయపడకు అని ధైర్యం చెప్పింది. వినండి...

ఏపున జెలరేగి యేము మనోజన్ము
చెరకువిల్ రెండుగా విరిచివైతు
బలువలై పలుకు చిల్కల నాలుకల ముల్లు
విరిచి యారములలో వెడల నడతు
మదమున మ్రోయు తుమ్మెదల జంపకలతాం
తములలో మునుగంగ నిమురింతు(?)
దగులమై వీ తెంచు దక్షిణాశాగంధ
నహు మహోహింద్రుని వాత ద్రోతు
నేటి కులికెదు నాయట్టి బోటి కలుగ
వెలది! నీమదిలోపల వెరవకుండు
మమ్మ! ధైర్యంబు వదలకు మమ్మ! యెందు
గత్తలము గల్గు మేనికి గలదె బాధ? (39)

అవును, తనలాంటి చెలికత్తియ ఉండగా ఏంభయం? ఇంతకూ మన్మథుని విల్లు మనం నమిలిపారేసే నల్లచెరుకు. వాడి అమ్ములు మనం కొప్పులో ముడుచుకొనే పువ్వులు... అని మన్మథుణ్ణి, అతని బలగాన్ని, ఆయుధాలనూ ఈసడించింది.

మకరధ్వజుని విల్లు మనము వాయిని నిడి
సమలింపుగా జేయు నల్లజెరకు
మదను బాణావళి మనము క్రొమ్ముళ్లపై
బొలుపార దురిమెడు పుష్పచయము
మనసిజాతుని తెల్లి మనము వినోదార్థ
మై వచ్చి యాడెడు మావిచిగురు
మరుతేరి హయములు మన యిండ్లలో బంజ
రంబుల బొరలు కీరవ్రజంబు
తాననంగు డట్టివాని నలంచుట
యేమి? యతని కడిది యేమి? యతని
బీరమేమి? ధరణి బిచ్చుక యలుకేమి
వాలగ...... నేమి వాలుగంటి(?) (40)

తన రాజకుమారి తరపున తాను నాయకుడి వద్దకు రాయబారం వెళతానని చెప్పింది కాబోలు. వెళ్లి అతన్ని ఇలా అంటానన్నదేమో!

దళమైన చీకటి గుళియలు సేసి ప
ద్మాసనుం డాయువు వోసె ననగ
దొలుకారు మెరుగులు కొలదికి నరికి వి
రించి వాల్గనుల నూరించె ననగ
జంద్రికాసార మబ్జజుడు గట్టిగబద
నిడి యాణి పాణియు బడెసె(?) ననగ
బాటించి విధిరాగ పరమాణువున బల్ల
వితమూర్తి గాగ నిర్మించె ననగ
బొలుచు నలులను మదను నమ్ములను ముత్తి
యముల విద్రుమవల్లిక నపహసించు
దరుణి యలకలు జూడ్కులు దశనములును
నధరమును బ్రస్తుతింప నా యలవి యెట్లు? 41

తాను ప్రేమించినదానిని ఎంత వర్ణించి చెప్పినా తనివి తీరదు. నాయకుడు విని ఆనందించి వుంటాడు. ఆ మధ్యలో వచ్చిన అడ్డంకులు తీరిపోయాయి కాబోలు. ప్రేయసీ ప్రియులు పెళ్ళి చేసుకున్నారు. పెళ్లిలో తెనుగుదేశపు ఆచారవ్యవహారాలను ఎలా వర్ణించాడో మనకు తెలియదు. వివాహమైనాక నూతన వధూవరుల జలకేళి, విలాసవిహారాలను అతడు ఎలా వర్ణించాడో చూద్దాం. నాయకుడు ఒక సరోవరాన్ని చూశాడు. అది ఇలా ఉంది :

పరపై యెప్పెసలారు మానికపు సోపానంబులం బ్రజ్వల
ద్వరవజ్రోపలసైకతంబులను సౌవర్ణారవిందంబులన్
హరినీలాసిత వారిజంబులను జక్రాంగాది వాః పక్షివి
స్ఫురణం గల్గు సరోవరంబు గనియెన్ భూవల్లభుం డయ్యెడన్. 42

అందులో భార్యతో, చెలికత్తెలతో వనవిహారం చేద్దామనుకొన్నాడు కాబోలు. నీళ్ళల్లోకి ముందు ఒక మగువ దారితీసింది. ఎలాగ?

కటి వడకాడ నీల్గ నసికౌను కరంబున నక్కులించి పి
న్నటు తరళంబుతోడ నయనద్యుతి భ్రూలతలం దెలర్ప నుం
గుటములు మోపి నిక్కుచును గ్రొవ్విరి చన్నుల చాయ మోముచ
క్కటి కెసగంగజొచ్చెనొక కామిని తోయజషండ మిమ్ములన్. 43

ఆ తరువాత అందరూ నీళ్ళలోకి దిగారు. కోనేటిలో కమలాలు, చక్రవాకాలు, ఉత్పలాలు, హంసలు ఉంటాయి. ఆ మగువల మొగాలు కమలాలనూ, కుచాలు చక్రవాకాలనూ, చూపులు ఉత్పలాలనూ, నడకలు హంసలనూ తోలుతూ వుండగా వాళ్లు సరోవరంలోకి దిగారు.

మొగములు విరిదమ్ముల గుచ
యుగములు గోకముల జూడ్కు లుత్పలముల మం
దగతులు హంసల ద్రోల న
రుగుగతి జొచ్చిరి సతుల్సరోవర మెలమిన్. 44

నాయిక లీలావతితో విహరిస్తూనే విక్రమసేనుడు ఇంతమంది ఆడవాళ్ళతోనూ జలక్రీడలాడాడు. ఏవిధంగానంటే,

కేలి దెప్పము సేసి గ్రాలి లీలావతి
నీదించుచును నొక్కయింతి డాసి
చేయిచ్చి యిందు విచ్చేయు మంచును దన్వి
నడిపించుచును నొక్క పడతిసూది
ముదిత చేకూడిన ముత్తలాడుచు నొక్క
తరుణికి నిమ్ముల దమ్మయొసగి,
రమణిపాపట బుష్పరజముబోయుచు నిదె
మిగిలె గొమ్మని యొక్క మగువ కిచ్చి,
కదల బడినట్టు లొక్కతె గౌగిలించి
ముంపు మునిగిన ట్లొక్కతె మోవియాని
లలిత నాయక కేలీవిలాస మమర
లీల జలకేలి సలిపె భూపాలసుతుడు. 45

అతనితోనేకాక ఆడవాళ్లు వాళ్ళలో వాళ్లు కూడా ఆడుకుంటున్నారు. అందమైన మగువ మోము తామరపువ్వులాగ వుంటుంది. అయితే ఆ కోనేటిలో ప్రతిపువ్వు మీదా బోలెడన్ని తుమ్మెదలు. ఒక పువ్వును ఒక ఇంతి వేరొక అతివకు చూపితే ఆ తుమ్మెదలన్నీ తన కురుల్లాగే ఉన్నాయట. అద్దంలోగాని కనిపించని కురులు ఆమెకు అది లేకుండానే కనపడ్డాయట.

అలికలితపంకజము నొక్క యతివ దెచ్చి
చుట్టమగునట్టి వనితకు జూపుటయును
తన కురులు మోమునెదుట నద్దంబులేక
తోచె ననుచు నమ్ముగ్ధ యద్భుతము బొందె. 46

ఆ అతివలు ఒకరిపై ఒకరు నీళ్ళు చల్లుకొంటూ దెబ్బలాడుకొంటున్నారు.

సతులు చల్లు బోరాడుచో జలకణములు
నెరికురులమీద నిండి క్రిక్కిరిసి చెలువ
మమర గనుగొన నింద్రనీలములతోడ
గలయ గ్రుచ్చిన మౌక్తికంబులును బోలె. 47

నల్లని కురుల మీద తెల్లని నీటిబిందువులు పడితే ఇంద్రనీలాల మీద గుచ్చిన ముత్యాలలాగా ఉన్నాయట. నీళ్ళల్లో ఆ ఆడపిల్లలు ఈదుతున్నారు. పొడుగాటి జడలు రాహువుల్లాగా, ముఖాలు చంద్రబింబాలలాగా ఉన్నాయట. ఈతలో ముఖం ముందుకు వెళుతూ వుంటే వేగంగా జడ కూడా కబళించడానికి అనుసరిస్తున్నట్టు తేలుతూ వస్తున్నది.

బలిమి రాహుసుధాంశుబింబంబు వెరచి
పార గడు డాసి వెనుకొనుపగిది నొక్క
యెడ సఖులు గూడి చెలరేగి యీదుచోట
నీలవేణియు మొగమును నెలత కొప్పె. 48

నీళ్ళలో మునిగినప్పుడు వాళ్ళ కళ్లు చేపలను, తలలెత్తి లేచినప్పుడు వాళ్ల ముఖాలు తామరపువ్వులను అపహసించాయట.

క్రాలుగన్నులు ముద్దు మొగములు దమకు
నసదృశప్రభావమున జెల్వగుట జేసి
మునిగి మీలను దలలెత్తి వనరుహముల
దూలపరచిరి వనకేళి వేళ సతులు.

ఈ జలకేళిని ముగించుకొని వాళ్లు సరోవరంలోంచి వెలుపలికి వచ్చారు. ఎలాగ?

కలయంగ నలదిన కస్తూరి పెల్లుగ జలమున కెల్లను గలుగజేసి
కుచమండలంబుల కుంకుమ చర్చల నీరెల్ల జేవురునీరు చేసి
తనులిప్తసురభిచందన కర్దమంబున వారినెల్ల బురుగుపండు చేసి
మూలల నవపుష్పమాలికావితతుల వనమెల్ల దెట్టువగొనగజేసి
య[illegible] లలికవీధి నంటగన్గవల గెం-పెలయగామచిహ్నాలెల్ల జెలయ
సెలరువాతు లమర జలకేళి చాలించి - కొలను వెడలి రింతులలసగతుల. 50

దొరికిన 54 పద్యాలలోని 8 పద్యాలలో జలకేళి వర్ణనలున్నాయి. నన్నెచోడుడు ఏ ముహూర్తాన కుమార సంభవం తొమ్మిదో ఆశ్వాసంలో 75 నుండి 93 దాక 19 పద్యాలలో శివపార్వతుల జలకేళిని వర్ణించాడోగాని, తిక్కనగారు నిర్వచనోత్తర రామాయణంలో సీతారాములచేత ఓలలాడించారు (నిర్వ. 8-43 నుండి 66; మొత్తం 24 పద్యాలు). ఎర్రాప్రగ్గడగారు హ[illegible]వంశంలో శివపార్వతులచేత మళ్ళా జలకేళి ఆడించారు (ఉత్తర.7-80 నుండి 90; మొ[illegible] 11 పద్యాలు). చిమ్మపూడి అమరేశ్వరుడు కూడా తిక్కనాదుల కోవలోనివాడే. వాళ్లలాగే విపులంగా జలక్రీడ వర్ణించాడు. కథలో నాయికానాయకులు ఓలలాడడం ముగించాక అప్పటికి... సంధ్యాసమయమైంది. రాజులు, అంతఃపురస్త్రీలు హాయిగా కేళిలో ఉంటారుగాని పొలాలలో పనిచేసే గ్రామీణస్త్రీలు ఆ గోధూళివేళలో ఇళ్ళకు మరలుతారు. ఎలాగ వెళతారో అమరేశ్వరుడు చక్కగా వర్ణించాడు.

మరలగబోదు రిండ్లకును మానవునంతకు జేలలోపలం
దిరిగి యొకింత లేతవడదేరెడు మోముల జెన్ను సేయుచున్
చిరిగొని క్రాలు దృగ్రుచుల పెల్లున జీకటినెల్ల బాచినం
దెరువరు లర్ధిగూడ బరతేరగ బామరభామినీజనుల్. 51

సంజ ఎర్రగా ఉంటుంది. ఎందుచేత? దక్షిణదిగ్గజం చక్రవాళ పర్వతపు ఎర్రని సానువుల కోరాడితే ఆధూళి పైకి ఎగసి ఆకాశం ఎర్రబడిందట!

వామనా నేకవము చక్రవాళకుధర
ధాతుతటము గోరాడుచో దరులు విరిగి
కూలుటయు మింటికెగసెడు ధూళివోలె
బర్వె నెరసంజ పడుమర పట్టుకొనుచు. 52

ఎర్రబడిన పడమటి దిశలో సూర్యుడు క్రుంగుతాడు. సరాగియై అతడు వారుణీసక్తుడై పతనమయ్యాడని కవి చమత్కరిస్తాడు.

కమలినీ కాంత యెంతయు గంది వంద
వారుణీ సక్తుడై వసువ్యయము చేసి
యరిగినట్లు సరాగియై యంబరంబు
దొరిగి పశ్చిమ జలధిలో నురికె ధరణి. 53

సూర్యుడు అస్తమించాక చీకట్లు క్రమ్ముకొంటాయి. ఆ తరువాత నక్షత్రాలు కనబడతాయి. కవి ఇలా చమత్కరిస్తున్నాడు:

భూమినిండె మింట బూర్ణమై కర్కట
మకర మీనరాశి మహితమైన
హరియశస్సుధాబ్ధియందుల తుంపురు
లనగ జుక్క లొప్పె నాకసమున. 54

ఈ పద్యం అమరేశ్వరుని విక్రమసేనంలోనిదిగా ఇద్దరు సంకలనకర్తలూ భావించినా, వాస్తవానికి ఇది పోతరాజుగారి భాగవతంలోనిది. దశమ స్కంధం పూర్వభాగంలోని 1291వ నెంబరు పద్యం సాక్షాత్తూ ఇదే!

నక్షత్రాలు కనబడ్డ తరువాత చంద్రోదయం, శృంగార రసోద్దీపనం... చంద్రబింబం కాముని నిరంజనౌషధి యట.

ధరవియోగుల నెల్ల బరిమార్ప బూని హ్రా
ద్భవుడు గట్టిన వీరపట్ట మనగ
విరహులపై దండు వెడలుచో మదనున
కెత్తిన కెంజిపు రెల్లి యనగ

దోయధి వెడగ్రుంకదోచు పురందర
కుంభి సిందూరిత కుంభమనగ
గులిశాయుధుని పెద్ద కొలువున జెన్నొంద
దీపించు మాణిక్య దీప మనగ
గుముదినీ రాగరససిద్ధ ఘుటిక యనగ
గాముని నిరంజనౌషధి కబళ మనగ
బొడుపు గెంపున బింబంబు పొలుపుమిగుల
జంద్రు డుదయించె గాంతిని స్తంద్రు డగుచు. (55)

ఇటువంటి చంద్రుడు ఉదయించాక ఆలుమగలు హాయిగా విహారం చేయటాన్ని, నాయికానాయకుల సంభోగ శృంగారాన్ని అమరేశ్వరుడు ఇలా వర్ణిస్తున్నాడు :

అలరుల పాన్పులం దలిరుటాకుల సెజ్జల హర్మ్యవేదికా
తలముల దీవెయిండ్ల సిక తాళయనంబుల మున్ వియుక్తిమై.
నలదురిపందు కందువుల నప్పటి కప్పటి కింపు బెంపగో
ర్కులు తనివారి వేడ్కవడ గూడిరి వేడుకతోడ దంపతుల్. 56

నాయకుడు అలసిపోయాక ఆమె నాథుని అధికారం తీసుకొని కేలి సల్పిందట.

నలువగు రక్తి మించిన మనంబున నుబ్బు లావు పుట్టిచెం
గలువవికాసవేళ మురుకంబు (?) నటింపగ బువ్వుబోడి మొ
క్కలమున బేర్చి నాథు నధికారము గైకొని కేలిసల్పె స
చ్ఛలమున సిగ్గు చాలమియు జన్గవహారము లోలిజెప్పగన్. 57

ఆమెకు సిగ్గు చాలమి! మనం పక్కకు తప్పుకుందాం.

అమరేశ్వరుని కావ్యంలోని పద్యాలను ఒక క్రమంలో చెప్పుకొంటే ఈ కథను మనం కట్టుకోవచ్చు. అతడు ఇలా కథను అల్లాడో లేదోగాని ఆ పద్యాలను అర్థంచేసుకొందుకు ఈకథను చెప్పుకొన్నాం. ప్రబంధ రత్నాకరంలోనూ, ఉదాహరణ గ్రంథంలోనూ ఇద్దరు సంకలనకర్తలూ, అప్పకవీ చిమ్మపూడి అమరేశ్వరునివనీ, విక్రమసేనంలోనివనీ ఇచ్చిన అన్ని పద్యాలను ఇలా కథలాగ చెప్పుకొన్నా, ఇందులో ఏవేవి ఇతరులవో కూడా ఆయా సందర్భాలలో జ్ఞాపకం చేసుకొన్నాం. కథావిధానం ఎలా ఉందో ఊహించుకొన్నాం. మన అదృష్టం బాగుండి అతని గ్రంథం బయటపడితే ఆ ప్రౌఢకవి ఇంతకన్నా చక్కని ప్లాటు వేసి కథ చెపితే తప్పక ఆనందిద్దాం. అంతదాకా ఈ కథతోనే తృప్తిపడదాం.

సంకలన కర్తలు ఇచ్చిన పద్యాలనుబట్టి అమరేశ్వరుడి 'విక్రమసేనం' విషయసూచిక

వరుస	విషయం	పద్యం కొంత	ప్రబంధ రత్నాకరం సంఖ్య	ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక సంఖ్య
1.	ఇష్టదేవతా ప్రార్థన - శివుడు	సారథి శత వృద్ధు	61	1
2.	ఇష్టదేవతా ప్రార్థన - గణపతి	పరముడు కందర స్థలముపై నిడి	43	51
3.	ఇష్టదేవతా ప్రార్థన - షణ్ముఖుడు	చనవున	27	2
4.	ఇష్టదేవతా ప్రార్థన - మన్మథుడు	గొనయము తమ్మినూల్	26	52
5.	పూర్వ కవిస్తుతి - సంస్కృత కవులు	భట్టనారాయణ	52	3
6.	పురవర్ణన-ఉజ్జయినీపురం	ప్రత్యగ్ర రచనాది భాసుర	49	4
7.	పురవర్ణన - కోటఎత్తు	కొలదికి మీర	24	6
8.	పురవర్ణన - కోట కొమ్మలు	తరులు వడి	31	5
9.	పురవర్ణన - గృహములు	హరిగిరి సురగిరి	63	8
10.	పురవర్ణన - గృహముల ఎత్తు	ఇరిపాపయిన్	17	7
11.	పురవర్ణన - బ్రాహ్మణులు, కోమటులు	నూరు క్రతువులు	40	17
12.	పురవర్ణన - వైశ్య భామినులు	పొడవుగ నెల్లయంగడులు	39	9
13.	పురవర్ణన - ఆపణములు	నీరనగ్నియు	48	10
14.	పురవర్ణన - ధ్వనులు	దానానేకప	34	16
15.	పురవర్ణన - పతివ్రతలు	తరుణ వయస్కుల	29	11
16.	పురవర్ణన - వారకాంతలు	చూపులకట్టు	28	12
17.	పురవర్ణన - ఉద్యాన వనములు	పూవుల ప్రోవులై	47	13
18.	పురవర్ణన - మందమారుతం	సుదతులు డస్సిన	62	15
19.	కథానాయక ప్రశంస	కులశైలంబులలో	28	18
20.	బ్రహ్మపురివైనం	ధరణీశ లవణాబ్ధి	37	19
21.	కైలాసవర్ణన	అదె కైలాసము	11	20
22.	ప్రశ్న-వృక్షాల గురించి	ముక్తకేకుజముల్ సడల్పె	57	21
23.	అశోకవర్ణన	అరుణ పుష్పావళి	12	22
24.	సూర్యాస్తమయ వర్ణన	తరుణుండగు	30	40
25.	చంద్రోదయ వర్ణన	అమరులమృతంబు	...	41
26.	చంద్రోదయ వర్ణన	ఉదయరాగమించుక	...	43
27.	చంద్రోదయ వర్ణన	తనరిరాగిల్లు	...	42
28.	వనవర్ణన	మదవతీగండూష	55	23

వరుస	విషయం	పద్యం కొంత	ప్రబంధ రత్నాకరం	ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక
29.	పుష్పాపచయం	దక్షిణ పవనంబు	32	28
30.	పుష్పాపచయం	అలకలు తేటిణటులును	13	26
31.	పుష్పాపచయం	నెరవుగావివి యిక	41	27
32.	పుష్పాపచయం	ఇరియు కుచంబులందొకటి	16	25
33.	పుష్పాపచయం	పాంథుల హృదయముల్	46	24
34.	పుష్పాపచయకేళి	ధమ్మిల్ల భారముల్	36	29
35.	నాయికవర్ణన	పలుచని చంద్రికా రసము	45	49
36.	నాయిక విరహం	పరిణత ఫణి	44	53
37.	నాయిక స్వగతం	వల్లభుడేగు దేశ	...	...
38.	నాయిక విరహం	ప్రాణంబువెల	50	54
39.	సఖీవాక్యం	ఏపున జెలరేగి	18	56
40.	సఖీవాక్యం	మకరధ్వజుని విల్లు	54	55
41.	దూతివాక్యం(?) నాయికవర్ణన	దళమైన చీకటి	33	50
42.	సరోవర వర్ణన	పరపైయొప్పెసలారు	42	30
43.	జలక్రీడ వర్ణన - ఒకరైనీటజొచ్చె	కటివడకాడ	19	32
44.	జలక్రీడవర్ణన - అందరూ	మొగముల విరిదమ్ముల	58	31
45.	జలక్రీడవర్ణన - నాయకునిలీల	కేలిదెప్పముచేసి	23	37
46.	జలక్రీడవర్ణన - పంకంచూపుట	అలికలిత పంకజ	15	36
47.	జలక్రీడవర్ణన - చల్లుపోరాటం	సతులుచల్లు	60	34
48.	జలక్రీడవర్ణన - ఈత	బలిమిరాహు	51	30
49.	జలక్రీడవర్ణన - తలలెత్తుట	క్రాలుగన్నులు	25	35
50.	జలక్రీడవర్ణన - కేళీసమాప్తి	కలయంగబడిన	21	38
51.	సంజ వర్ణన	మరలగబోదురిండ్లకు	56	14
52.	సంజ వర్ణన	నామనానేకపము	59	47
53.	సూర్యాస్తమయ వర్ణన	కమలినీకాంత	20	44
54.	తారల వర్ణన	భూమినిండెమింట	53	39
55.	చంద్రోదయ వర్ణన	ధరవియోగుల	35	40
56.	రతికేళి వర్ణన	అలరుల పాన్పులందలి	14	48
57.	పురుషాయిత వర్ణన	నలువగురక్తిమించి	38	46

నాయిక వర్ణనం అప్పకవి ఒక్కడే చేయడం కన్పిస్తూంది (3-254). ఈ విషయసూచికలో లెక్కకు 57 పద్యాలు విక్రమసేనం లోనివని చెప్తూ ఇద్దరు సంకలన కర్తలు ఇస్తున్నా వీటిలో

మూడు ఇతరుల పద్యాలని గుర్తించాము (వరుసగా 13, 24, 54 సంఖ్యాలుగల పద్యాలు). ఈ మూడూ పోగా నికరంగా 54 పద్యాలే అమరేశ్వరుడు చెప్పినవని తేలుతున్నాయి. అయితే ఇంకొన్ని పద్యాలు కూడా విక్రమసేనంలోనివంటూ ఇటీవలి పరిశోధకులు చాటుతున్నారు.

1910లో మానవల్లి రామకృష్ణకవిగారు 'ప్రబంధమణి భూషణము' అనే సుకవికృత కథాకావ్యాన్ని ప్రకటించారు. ఇందులో ఏయే కృతుల నుండి పద్యాలను తీసుకొని ఈ కథను రచయిత అల్లాడో చెప్పలేదుగాని కావ్యంలో మొత్తం 867 పద్యాలున్నాయి. వీటిలో 411 పద్యాలకు మాత్రమే కర్తలెవరో కవిగారు కనిపెట్టగలిగారు. ఏయే కావ్యాలలోంచి ఏయే నెంబరు పద్యాలను సంకలన కవి తీసుకొన్నాడో కవిగారు గుర్తించి విశదం చేశారు. వారు చిమ్మపూడి అమరేశ్వరుని పేరుగాని, 'విక్రమసేనం' ఉనికినిగాని చెప్పలేదు. అయితే విక్రమసేనంలోని పద్యాలు కొన్ని ప్రబంధమణి భూషణంలో లేకపోలేదు.

కవిగారు ప్రచురించిన ప్రబంధమణి భూషణాన్నే 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు మళ్ళా ప్రకటించారు. దీనికి నిడుదవోలు వెంకటరావుగారు సుదీర్ఘమైన పీఠిక రాశారు. కవిగారి ప్రతికి మూలమేమిటో విశదపరిచారు. తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయంలో ప్రబంధ రత్నాకరానికి నాలుగైదు మూలప్రతులున్నాయి (R 190-193). అదే గ్రంథాలయంలో కళావతి వ్రాసిన ప్రబంధ సారము (R.192) అనే ఇంకొక సంకలన గ్రంథం ఉంది. ఈ నాలుగు వ్రాతప్రతుల నుండే కవిగారు ప్రబంధమణి భూషణాన్ని తయారుచేసినట్టు కనబడుతుంది.

ప్రబంధ మణిభూషణంలో విక్రమసేనంలోని 8 పద్యాలు సంకలన కర్త ఇచ్చాడనీ, వేటూరి వారి ప్రబంధ రత్నావళిలో ఇందులోని మూడంటే మూడు పద్యాలే ఉన్నాయని చెప్తూ నిడుదవోలు వారు ఇతర పద్యాలను ఇలా గుర్తించి పొందుపరిచారు.

విక్రమసేనము (క్రీ.శ.1350) – (చిమ్మపూడి అమరేశ్వరుడు)

		ప్రబంధమణి భూషణం	ప్రబంధరత్నావళి
41.	గీ.	ప్రత్యగ్రరచనాతిభాసురు....	49 వ.
42.	గీ.	నూఱుక్రతువులు సేయని	40 వ.
43.	ఉ.	పూవుల ప్రోవులై	47 వ.

– ప్రబంధరత్నావళిలో లేనివి –

137. మ. శరధిప్రఖ్యము వేదమూర్తులు కుభృత్సంకాశముల్ మాయతో
ద్ధురవేగంబులు కిన్నరేశధను లుద్ధూతారు లభ్రంకష
స్ఫురణౌన్నత్యము లభ్రగేహనిభముల్ పుణ్యాప్తముల్ తత్పురే
పరిఖావిప్రగజాశ్వ వైశ్యసుభటప్రాకారసౌధోన్నతుల్.

147. సీ. వికచారవిందదీర్ఘికలలో విహరించి
నలిగమ్మఁ దావులననఁగి పెనఁగి
కుసుమితనవలతావిసరంబుఁ గదలించి
యలఁదేనియలసోన నలముకొనుచు
సహకార పాదపచ్ఛాయలకైయేఁగి
శశికాంతవేదుల సంచలించి
సురతకేళీశ్రాంతి సొగియుముద్దియలపై
చిట్టాడు తనువుల చెమటలార్చి

గీ. చంచరీకంబరీతి బర్దన్యుఖాతి
విరహమాడ మాడ్కిసురటిపోల్కి
నప్పురంబున సకలజనానుమోద
కరణదక్షుడు దక్షిణగంధవహుఁడు.

492. గీ. రత్నసుందరి వక్త్రేందు రమ్యలీలఁ
గాంచి విలసిల్లె నృపనేత్రకైరవములు
పొంగెరాగబంధం నిట్టఁ బుప్పధన్వు
నగ్గమగు వారిచేష్టల నభిమతించు.

493. కం. కప్పురపురాశి యొక్కఁడు
గుప్పుల ఖస్వేద మొడలఁగూరక యున్నన్
మెప్పువడ గుండలద్వయి
నొప్పుఁగ వీడ్డరఁగరాల్పు నొక్కొండొఱిమన్.

494. కం. మంచాంతమ్ము దవ పా
దాంచలమున మెట్టిగర్వహాసవికాసా
భ్యంచిత ధనసముడై యా
డించున్ కలవాలమలపు డిగ్గంద్రోచున్.

ప్రబంధ రత్నావళిలో లేనివంటూ నిడుదవోలు వారు ఇచ్చిన అయిదు అదనపు పద్యాలు విక్రమసేనములోనివే అని చెప్పగలగడానికి నిడుదవోలు వారికి గల ఆకరాలేమిటో వారు చెప్పలేదు. మనకు తెలియవు. కళావతి వ్రాసిన ప్రబంధసారములో ఇవి విక్రమసేనములోనివని ఆమె చెప్పిందా? ప్రబంధసారశిరోమణి (R 190-193) నాలుగు ప్రతుల మూక ఉమ్మడిగద్యలో 'సకల ప్రబంధములలో గలిగిన పద్యములు సారముగా సంగ్రహించి వ్రాసిన ప్రబంధసారశిరోమణి' అన్న వివరణనే కేటలాగు కర్తలు ఇచ్చారు. కళావతి గ్రంథనామాలూ, గ్రంథకర్తల నామాలూ పెదపాటి జగ్గన్నలాగే తానూ పేర్కొంటే ఆ వైనాన్ని పరిశోధకులు ఎవ్వరూ చెప్పలేదు.

ప్రబంధమణి భూషణానికి ముడిసరుకును ప్రబంధసారశిరోమణి నుండి మానవల్లి వారు తీసుకొంంటే కళావతి విక్రమసేనాన్ని పేర్కొంటే ఆ సంగతి చెప్పడం విస్మరిస్తారా? కచ్చితమైన సాక్ష్యం దొరికేదాకా నిడుదవోలు వారు ఇచ్చిన అదనపు అయిదు పద్యాలనూ ప్రస్తుతానికి అనామతు పద్దులో చేర్చాలి.

ఈ పద్యాలలో 137 నెంబరుగల పద్యం పురవర్ణనలోనిది. ఇది నిజంగా విక్రమసేనం లోనిదే అయితే మన విషయ సూచికలో ఇచ్చిన 11వ పద్యం తర్వాత అదనపు పద్యంగా చేర్చాలి.

147వ నెంబరుగల పద్యం పయ్యెదకు సంబంధించినది కనుక ఈ దక్షిణ మంద మారుత వర్ణన మన విషయసూచికలో 18దిగా చేర్చుకోవాలి.

492వ పద్యం విక్రమసేనంలోనిది కాకపోవచ్చు. ప్రబంధమణి భూషణంలోని కల్పిత కథలోని నాయిక పేరు రత్నసుందరి. ఈ పద్యంలో ఈ పేరు కనబడుతోంది. చిమ్మపూడి అమరేశ్వరుని కథానాయిక పేరు వేరొకటి. బహుశా ప్రబంధమణి భూషణ కర్త ఈ పద్యాన్ని తన కథాగమనానికి వంతెనగా రాశాడేమో!

493, 494 నెంబరుగల పద్యాలు ఏ సందర్భంలో కవి చెప్పాడో ఊహించడం కష్టం. కావ్యంలోని కథా, పాత్రలూ, సన్నివేశాలూ తెలియనప్పుడు ఊహాగానం మంచిది కాదు.

పై అయిదు అదనపు పద్యాలను పొందుపరిచాక 'అన్నట్టు ఇందాక మరిచిపోయా' నన్నట్టు విక్రమసేనంలోనివంటూ మరో మూడు పద్యాలను కొసరుగా నిడుదవోలు వారు తమ పీఠికలో చేర్చారు. 'విజయసేనము' అనడానికి బదులు 'విక్రమసేనము' అని పొరపాటున నిడుదవోలువారు చెప్పినారేమో అని పరిశోధకులు భావిస్తున్నారు. (అలభ్య కావ్య పద్యముక్తావళి - సంపాదకుడు డాక్టర్ ఆర్. శ్రీహరి - పుట. 147) నిడుదవోలువారు ఇచ్చిన మూడు కొసరు పద్యాలను చూడండి. మొదట కనబడే పద్యసంఖ్యలు ప్రబంధమణి భూషణంలోని వరుస నెంబర్లు.

విక్రమసేనము

104. సీ. సుందరీ సమితికి మందయానములయి
యిరవులఁ గఱపెడు గురువులనఁగ
మధుకర బృందంబు మదజలక్షేపణఁ
జేసియాకర్షించు సిద్ధులనఁగ
జనులచూడ్కి కిఁగుల్గశైల భావంబులు
చూపి యాడెడు బహురూపులనఁగ
బరవీరభటుల నుద్ధురభీషణాకృతి
భంగుల వెఱపించుఁ గొంగలనఁగ

గీ. గతుల యొప్పు ను దానాంబు గంధములును
నున్నతులయొప్పు జేష్టాసమున్నతులును
నతిశయిల్లును బురిబొలుపారు చిత్త
రంజనాకృతులగు భద్రకుంజరములు.

171. గీ. రమణివంశక్రమాగత రాజ్యలక్ష్మిఁ
గీర్తిలక్ష్మి సపత్నిగాఁగీలుకొలిపి
యేలఁగలపట్టిలేమికి నీమనంబు
కలఁగు నోడకంబముమీఁది పులుగువోలె.

172. కం. లావణ్యామెల్ల ప్రతిబిం
బావహమయిరూపుదాల్చి యాత్మజుఁడంక
శ్రీవహియించుటకంటెను
భావింపఁగనొండు గలదె పరమప్రియమై.

ఈ కొసరు పద్యాలను ఇవ్వడంలో నిడుదవోలు వారు కొద్దిగా పొరపడ్డారనక తప్పదు. ఈ మూడింటిలో తొలి పద్యం ఎక్కడిదో మానవల్లివారు గుర్తించలేదుగాని మిగతా రెండు పద్యాలూ (171, 172) బిల్హణుని విక్రమాంకదేవ చరిత్రములోని భావములు గల పద్యాలని కవిగారు ప్రథమ ముద్రణ పీఠికలోనే విశదపరిచారు. 'విక్రమాంక దేవచరిత్రము' అనడానికి బదులు విక్రమసేనము అని యీ కొసరు పద్యాలకు నిడుదవోలు వారు శీర్షికను పెట్టారనిపిస్తుంది. అయితే కవిగారు చెప్పని 104వ నెంబరు పద్యం ఎలా గుర్తించారో మరి?

''నాకు మూలము గుర్తింపరాని పద్యములు ప్రాయశః దక్షిణ దేశపు గావ్యములలోనివై యుండవచ్చును'' అని మానవల్లివారు ప్రథమ ముద్రణ పీఠికలో చెప్పారు. తాము గుర్తుపట్టక వదలిన తక్కిన పద్యములేయే కావ్యములలోనివో పండితలోకమే నిర్ణయింపజాలును అని చెప్పారు. బహుగ్రంథ పరిశీలకులకు ఇంకా చేతినిండాపని మిగిలిపోయింది.

చిమ్మపూడి అమరేశ్వరుని విక్రమసేనంలోని పద్యాలను ఇతోధికంగా నిక్కచ్చిగా గుర్తుపట్టడం చేయదగ్గపనే!

ఎఱ్ఱాప్రెగ్గడ

వేగినాడులో పూర్వం కరాపర్తి అగ్రహారం ఉండేది. అందులో ఎరపోతసూరి అనే వృత్తిమంతుడు క్రీ.శ. 1230 ప్రాంతాలలో ఉండేవాడు. ఆయన ప్రాచీన ఋషిలాంటివాడు; విష్ణుభక్తుడు. ముఖ్యంగా అహోబల నారసింహుడు అతని ఇష్టదైవం. ఈ ఎరపోత సూరిగారి తాతగారు భీమన మంత్రి వెలనాటి చోడుల వల్ల క్రీ.శ. 1170-1180 ప్రాంతాలలో సత్కారాలు పొందాడు.[1] తాతలు ఆర్జించిన ఈ మడిమాన్యాలను ఎరపోతసూరి అనుభవిస్తూ పుత్రపౌత్రాభివృద్ధిగా ఉండేవాడు.

ఈయనకు సూరన్న అనే కుమారుడున్నాడు. అతడు అప్రతిమానంగా, అద్భుతంగా ఉభయభాషల కవిత్వాలలో ప్రౌఢశబ్దార్థయోగాజ్ఞాసిద్ధిలో ఘనుడై ఉండేవాడు.[2] ఇతడు 'ప్రాజ్ఞప్రస్తుతభవ్యభోగాల'లో 'విభవస్ఫారాత్ము'డై జీవించాడు. క్రీ.శ. 1280 ప్రాంతాలలోనే, లేక 10, 15 సంవత్సరాలు ఇటో, అటో ఇతనికొక కుమారుడు జన్మించాడు. ఆ బిడ్డకు సూరన్న తన తండ్రిపేరే పెట్టుకొని ఎర్రన్న అని పిలిచేవాడు.

తన పేరింటివాడైన మనుమణ్ణి ఎరపోతసూరి ఎప్పుడూ గారాబంగా చూసుకొనేవాడు. తాతగారు విష్ణుభక్తుడైనా మనుమడు శివభక్తుడయ్యాడు. దానికి కారణం వుంది. ఎర్రన్నకు శంకరస్వామి అనే గురువు ఉండేవాడు. ఆయన ప్రతిరోజూ ఎనిమిది ఝాములూ నియమంగా శివార్చనలు చేసేవాడు. నిత్య శివరాత్రి వ్రతం నిర్వహించేవాడు. ఈ శంకరస్వామి కూడా మునీంద్రునివంటివాడు. ఈ గురువుగారు ఇంత శివభక్తుడు కనుక శిష్యుడు అంతకన్నా ఎక్కువ భక్తుడయ్యాడు. 'శంభుదాసు'డనే 'లక్షణాభి ధేయం' పొందాడు. సూరన్న 'ఆరాధ్యసర్వజ్ఞుడు'[3] వీరశైవ మతానికీ, ఈ మాటకూ ఏదైనా సంబంధం ఉందేమో! సూరన్న వీరశైవమతం తెలుగుదేశంలో ఉద్ధృతంగా ఉన్న రోజుల్లో పుట్టి పెరిగాడు. తండ్రి ఎరపోతసూరి విష్ణుభక్తుడైనా ఇతడు వీరశైవాన్ని ఆదరించి ఉండవచ్చు; కాబట్టి కుమారుడు శంభుదాసుడయ్యాడు.

సూరన్న తన కుమారుడు ఎర్రన్నకు తనకు తెలిసిన ఉభయ భాషాకవిత్వ రహస్యాలు సవిస్తరంగా నేర్పి ఉంటాడు. ఎర్రయ్య జన్మించే నాటికి తెలుగు భాషలో మహాభారత రచన 'ఒక మాదిరిగా' పూర్తి అయింది. నన్నయ్యగారు కొంత తక్కువగా మూడుపర్వాలు, తిక్కనగారు తతిమ్మా పదిహేను పర్వాలూ పూర్తిచేశారు. ఉభయకవిత్వ ప్రౌఢుడైన సూరన్న తిక్కనగారి భారతానికి ప్రతి వ్రాయించుకొనే ఉంటాడు. బహుశా ఈ పనికి కుమారుడు ఎర్రన్నను నియోగించాడేమో!

---

1. చాగంటి శేషయ్యగారు ఈ కాలనిర్ణయం చేశారు. చూ. ఆంధ్ర కవి తరంగిణి – 4వ సంపుటి. పుట 57.
2. నృసింహ పురాణం, పీఠిక-26.
3. నృసింహ పురాణం, పీఠిక-26.

వేగినాడులోని కరాపర్తి గ్రామంలో ఉండే ఈ కుటుంబం ఆ ఊరు ఏ కారణాలవల్ల విడిచిపెట్టారోగాని పాకనాడులోని గుడ్లూరుకు వచ్చి స్థిరపడ్డారు. ఇది మన్నేరు ఒడ్డున ఉంది. ఈ ఊళ్ళో నీలకంఠేశ్వరస్వామి ఆలయం ఉండేది. శివాలయమేకాక కేశవపెరుమాళ్ళ కోవిల కూడా ఉండేది. పామరజనాలు పోలేరమ్మను పూజిస్తూ వుండేవారు. ఆ అమ్మవారికి బంగారపు తొడుగు ఉండేది.[4] క్రీ.శ. 1300 ప్రాంతాలలో ఈ ప్రదేశం కాకతీయ సామ్రాజ్యంలో ఉండేది. ఇది అద్దంకిసీమలో చేరిన భాగం. ఆనాడు అద్దంకినాయంకరాన్ని పంటవంశంలోని రెడ్లు పాలిస్తూ ఉండేవారు.

తాను నివసిస్తున్న గుడ్లూరులోని నీలకంఠేశ్వరస్వామి మీద ఎఱ్ఱయ్య గారు కొన్ని పద్యాలు కవితాబాల్యంలో చెప్పినట్టుంది. చాలా జటిలమైన సమాసకల్పనతో ఒక చాటువు కనబడుతుంది.

నిను సేవించిన గల్గు మానవులకున్ వీటీవధూటీ ఘటీ
ఘనకోటీశ కటీకటీ తటిపటీ గంధేభ వాటీపటీ
రసటీ హారికటీ సువర్ణమకుటీ ప్రచ్ఛోటికాపేటికల్
కన దామ్నాయమహాతురంగ! శివలింగా నీలకంఠేశ్వరా![5]

ఈ పద్యం అనంతర కవి అల్లసాని పెద్దనగారి ప్రఖ్యాతమైన ఉత్పలమాలిక 'పూత మెరుంగులు' అనేదాని సంస్కృత భాగానికి ఒరవడి పెట్టిందేమో! అంతకన్నా ఇది జటిలం. ఇటువంటి సమాసకల్పనతో కవిత్వం చెప్తున్న ఎఱ్ఱయ్యగారికి ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలో కొంత లోటుగా ఉండిపోవడం నచ్చలేదు. దాన్ని పూరించాలను కొన్నారు. నన్నయగారి రచనావిలాసాన్నీ, శిల్పరహస్యాలనూ బాగా ఆకళించుకొన్నారు. తిక్కన్నగారి శైలినీ, ప్రతిభనూ అర్థం చేసుకొన్నారు. ఈ రెండు రచనలకూ వంతెన కట్టడానికి ఉపక్రమించారు.

నన్నయగారు అరణ్యపర్వంలో మూడాశ్వాసాలు పూర్తిగా చెప్పారు. 4వ ఆశ్వాసంలో 142 పద్యాలు చెప్పాక రచన ఆగిపోయింది. వారు చెప్పిన ఆఖరిపద్యం ఇది :

శారదరాత్రు లుజ్జ్వలలసత్తర తారక హారపంక్తులం
జారుతరంబులయ్యె వికసన్నవకైరవ గంధ బంధురో
దార సమీర సౌరభము తాల్చి సుధాంశు వికీర్యమాణక
ర్పూరపరాగ పాండురుచి పూరములం బరిపూరితంబులై. (అరణ్యా. 4-142)

నన్నయగారు వదలిన భారతాన్ని పూర్తిచేయదలచుకొన్నవాళ్లు ఎవరైనా ఇక్కడనుంచీ రచన మొదలుపెట్టాలి. అయినా 'తిక్కనగారు అరణ్యపర్వశేషాన్ని ఎత్తుకొనక విరాటపర్వంలో 'శ్రీకారం' చుట్టి పదిహేను పర్వాలూ పూర్తిచేశారు.

4. విష్ణుపురాణంలో వెన్నెలకంటి సూరన్న చేసిన గుడ్లూరి వర్ణన పీఠిక - 16
5. హరివంశం పీఠికలో వేలూరి శివరామశాస్త్రిగారు ఉదాహరించారు. కాని ఇదే పద్యం ఎఱ్రాప్రెగడగారి రామాయణంలోనిదని వివిధ అకరాలనుండి సేకరించిన 46 పద్యాలలో కనబడుతుంది. చూ॥ హరివంశం, పుట-31.

అరణ్యపర్వంలోనే నన్నయగారి రచనకు విఘ్నం రావడం, ఆ తరువాత దాని జోలికి తిక్కనగారు పోకపోవడం మొదలైన వాటివల్ల అరణ్యపర్వాన్ని ముట్టుకొంటే ఆపదలొస్తాయన్న నమ్మకం ఉండేదని మనవాళ్ళు చెప్పుకొంటారు. ఎఱ్ఱయ్యగారు ఆ నమ్మకాన్ని ఏమాత్రం నమ్మక ధైర్యంగా అరణ్యపర్వశేషాన్ని పూర్తిచేయడానికి నడుం కట్టారు; కలం పట్టారు. (అదే - గంటం చేతపూనారు).

మొదటి మూడాశ్వాసాలూ రాజరాజనరేంద్రునికి అంకితమైనవి. తాము పూర్తిచేయబోయే మూడున్నర ఆశ్వాసాలూ అతనికే అంకితమిచ్చి నన్నయగారి పేరుతోనే ఎఱ్ఱయ్యగారు ప్రకటించదలిచారు. ఇది నన్నయగారిపట్ల వారికుండే భక్తిని, భారతం సంపూర్ణంగా విరాజిల్లాలనే ఆకాంక్షను తెలియజేస్తుంది. ఏదేనా కావ్యాన్ని వ్రాస్తున్నప్పుడు శ్రీకారం చుట్టి వ్రాయడం తెలుగు సంప్రదాయం. అప్పటికి వచ్చిన లక్షణగ్రంథాలన్నీ అలాగే కావ్యారంభం చేయాలన్నాయి. ఇంకొకరి రచనను పూరిస్తున్నా 'ఆశీర్నమస్క్రియావస్తునిర్దేశా'లలో ఏ ఒక్కటైనా చేసి ముందుకు సాగే అవకాశం ఇక్కడ లేదు. అయినా ఎఱ్ఱయ్యగారు ప్రతిభావంతులు కనుక దేవతా ప్రార్థన చేయడానికి ఈ భారతభాగంలో అవకాశం చూశారు. తాము పూర్తిచేయవలసిన భాగంలో 'సరస్వతీగీత' అనే ఘట్టం ఉంది. అందులో తార్క్ష్యుడు అనే ముని భారతిని ఆరాధించి, ఆమె ప్రత్యక్షమైతే ఆమెవల్ల సందేహాలు నివృత్తి చేయించుకుంటాడు. అనుమానాలు నివారణచేశాక ఆ ముని 'కృతాంజలియై' ఇలా వినుతించాడు :

అంబనవాంబుజోజ్జ్వల కరాంబుజ శారద చంద్ర చంద్రికా
డంబర చారుమూర్తి ప్రకటస్ఫుట భూషణరత్న దీప్తికా
చుంబిత దిగ్విభాగ శ్రుతి సూక్త వివిక్తనిజప్రభావ భా
వాంబరవీథి విశ్రుతవిహారి ననుం గృప జూడు భారతీ. (అరణ్యా. 4-216)

సంస్కృతమూలంలో తార్క్ష్యుడు వాగ్దేవతను స్తుతించలేదు. ఇది ఎఱ్ఱయ్యగారు చేసిన స్తుతి. అరణ్యపర్వశేషాన్ని రచిస్తున్నప్పుడు వారు మొట్టమొదట ఈ పద్యాన్నే చెప్పారని నేను తలుస్తున్నాను. తరువాత ఆయన శారద వేళను 'స్ఫురదరుణాంశు రాగరుచి' (అరణ్యా. 4-143)తో ప్రారంభించి వర్ణించసాగారు. 'అరుణం' అంటే ఎరుపు. ఎఱ్ఱయ్యగారు ఈ పద్యంలో తమ పేరును, తాము తలపెట్టిన పనిని స్ఫురింపజేస్తున్నారని నోరి నరసింహశాస్త్రిగారు భావిస్తున్నారు.[6]

'అంబనవాంబుజోజ్జ్వల' అనే పద్యంలో వాగ్దేవతాస్తవం చేశాక ఎఱ్ఱయ్యగారు తమ గురువు శంకరస్వామిని కూడా ప్రార్థించినట్టు కనబడుతున్నది. ఆయన తాము వ్రాసిన నృసింహపురాణంలో కృత్యాదిని భారతీస్తవం ఇలా చేశారు :

కరకమలంబునందు బటికంపు గమండలు పచ్చకాంతి భా
సురమగు మౌక్తికంపు జపసూత్రము దాల్చుట, బ్రహ్మవాదియై

6. తెలుగు భాషాసమితివారి విజ్ఞాన సర్వస్వం - 3వ సంపుటి: తెలుగు సంస్కృతి - పుట-735.

పరగిన హంసముం బిలిచి బాలమృణాళము జూపు చందమౌ
సిరి దిలకింప నొప్పు బుధసేవితమూర్తి దలంతు భారతిన్. (నృసింహ. పీఠిక. 6)

ఇందులో భారతీదేవిని సన్యాసిరూపంలో అపూర్వంగా ధ్యానించారు. దీనికి నోరి నరసింహశాస్త్రిగారు ఇలాగ వివరణ ఇచ్చారు :

తండ్రికంటెను ఎఱ్ఱయ జీవితములో నాతనికి ఆదర్శప్రాయుడైయుండి మహత్త్వము చేకూర్చినది గురువు. 'శ్రీ శంకరస్వామి సంయమీశ్వర చరణసరోరుహ ధ్యానానంద సౌందర్య ధుర్యుడ'నని ఎఱ్ఱయ్య సగర్వముగా తన గద్యములన్నిటిలో చెప్పుకొన్నారు... శ్రీ విద్యారణ్యులు స్తోత్రము చేసిన శంకరానందగురుపాదులీతడే కావచ్చును. కాకున్న నాతని సతీర్థుడై యుండును. శృంగేరి మొదలగు మూల శంకర పీఠముల స్వాములందరు భారతీ సంప్రదాయ యతులగుటచే ఎఱ్ఱయ గురువు కూడ భారతీయతియై యుండును. కర్ణాటక ప్రాంతములో శ్రీ విద్యారణ్యులు చేసినట్టి ఉద్ధరణ కార్యమును ఈ శంకరస్వామి శ్రీశైల భూమిలో చేసియుండుననుటకు సందేహము లేదు. శంభుదాసుడను లక్షణాభిదేయము ఎఱ్ఱయ్యకీ గురువే ప్రసాదించి యుండును.[7]

ఈ వివరణ మన ఊహకు బలమిస్తున్నది. 'అంబనవాంబుజోజ్జ్వల' అనే పద్యంలోని 'భారతి' ఇటు వాగ్దేవతకూ, అటు గురువుకూ సరిపోతుంది. ఒక్క క్రియతో రెండు కార్యాలు సాధించినట్టు ఎఱ్ఱయ్యగారు ఈ పద్యంతో ఇష్టదేవతా ప్రార్థనా, గురుస్తుతీ కావించారు. ఇది గ్రంథంలో కథతో విలీనమయే ప్రార్థన. ప్రతిభంటే ఇలా ఉండాలి.

అన్నట్టు మన తెలుగువాళ్ళకు గ్రంథాదిని శ్రీకారం ఎలా ఉండాలో అలా తమిళులకు ఆరంభంలో 'అ'కారం ముఖ్యం. వాళ్ళ తిరుక్కురళ్ అకారంతోనే మొదలవుతుంది. పద్యంలో ఎక్కడో ఒక దగ్గర 'ఉళఘు' ప్రశంస ఉండాలి.[8] నా తమిళకవిమిత్రులు సినిమాపాటైనా చిత్రంలో తొలిసారి వ్రాస్తున్నప్పుడు అకారంతోగాని, 'అన్బే' అని కరుణానురాగాత్మక పదంతోగాని మొదలుపెడతారు. 'అంబనవాంబుజోజ్జ్వల' పద్యంతో ఎఱ్ఱయ్యగారి రచన మొదలైతే అది పవిత్రాక్షరంతోనే ప్రారంభమైనట్టు మన లాక్షణికులు మరొక విశ్వాసాన్ని గ్రంథస్థం చేసుకోవచ్చు.

నన్నయగారి ఇతిహాసశైలినీ, తిక్కనగారి నాటకీయ శిల్పాన్నీ పుణికిపుచ్చుకొని ఎఱ్ఱయ్యగారు భారతరచన పూర్తిచేశారు. వారి భారతభాగంలో ఉన్న ఘట్టాలు ఇవి :

(చతుర్థాశ్వాసం)

1. కృష్ణమార్కండేయాగమనం
2. బ్రాహ్మణప్రభావ కథనం
3. సరస్వతీ గీత
4. వైవస్వతుచరిత

7. తెలుగు భాషాసమితివారి విజ్ఞాన సర్వస్వం – 3వ సంపుటి, పుట 734, వేలూరి శివరామశాస్త్రిగారు 'ఇతడు కామకోటి మొదలగు పీఠములకు చెందిన ఆచార్యుడు కాడు' అని వ్రాశారు. నృసింహ పురాణం పీఠిక, పుట.4
8. అని నా మిత్రులు చల్లా రాధాకృష్ణశర్మగారు చెప్పారు.

5.	కల్పాంతప్రకారం	6.	యుగధర్మ కీర్తనం
7.	కామ్యాశ్వహరణం	8.	ఇంద్రద్యుమ్నోపాఖ్యానం
9.	ధుందుమార చరిత్ర (పంచమాశ్వాసం)	10.	పతివ్రతా చరిత్ర
11.	ధర్మవ్యాధుడు చెప్పిన ధర్మాలు	12.	అగ్నివంశానుకీర్తన
13.	కుమారసంభవము	14.	సత్యా ద్రౌపదీ సంవాదం
15.	పాండవులు ద్వైతవనం చేరడం	16.	ధృతరాష్ట్ర కార్యాలు
17.	దుర్యోధనాదుల దుర్మంత్రం	18.	ఘోష యాత్ర
19.	కౌరవ గంధర్వ యుద్ధం	20.	దుర్యోధనాదుల చెర
21.	అర్జునుడు వాళ్లను విడిపించడం (షష్ఠాశ్వాసం)	22.	దుర్యోధన ప్రాయోపవేశం
23.	పాతాళగతులైన దానవులు అతణ్ణి ఆశ్వాసించడం	24.	దుర్యోధనుని వైష్ణవయాగ ప్రవర్తన
25.	పాండవులు కామ్యకవనం మళ్ళా చేరడం	26.	వ్రీహిద్రోణాఖ్యానం
27.	ద్రౌపదీ హరణం	28.	సైంధవ పరాభవం
29.	రామాయణంలో రామ రావణుల జననం	30.	రాముని వనప్రస్థానం
31.	సీతాపహరణం	32.	సుగ్రీవ మిత్రత్వం
33.	వాలి వధ	34.	త్రిజటా స్వప్న కథనం
35.	రావణ దుష్ట వచనాలు (సప్తమాశ్వాసం)	36.	సీతాన్వేషణం
37.	లంకాభిగమనం	38.	రామ రావణ యుద్ధం
39.	రాఘువాభ్యుదయం	40.	సావిత్రీ చరిత్ర
41.	కర్ణునికి సూర్యుని హితోపదేశం	42.	కరుణని జన్మ కథ
43.	ఇంద్రుడు విప్ర వేషంలో కవచ కుండలాలు	44.	అరణీయం
45.	యక్షప్రశ్నలు	46.	ధర్ముని వరాలు

ఎఱ్రయ్యగారే మహాభారత గద్యలో ఇచ్చిన ఈ విషయాల పట్టికలో ఇరవై మాత్రమే భారతవ్యక్తులకు సంబంధించిన సూటి కథా భాగాలు. మిగతావి ధర్మరాజుగారి పురాణకాలక్షేపం. ఎఱ్రయ్యగారు మొత్తం 1595 గద్య పద్యాలతో భారతశేషాన్ని పూరించారు. ఇందులో మొదటిభాగంలో నన్నయగారి శైలి, రెండవ భాగంలో క్రమంగా తిక్కనగారి శిల్పం కనబడతాయి.

విరాటపర్వంలోని కీచకుడు ద్రౌపదిని ఎలా వేధిస్తాడో అరణ్యపర్వంలో సైంధవుడు అలాగ బాధపెడ్తాడు. విరాటనగరంలో ద్రౌపది 'దుర్వారోద్యమ' అనే ఒకే ఒక పద్యంలో తన భర్తల ప్రభావాన్ని ఉగ్గడించి కీచకునికి హెచ్చరిక చేస్తుంది (విరాట. 2-55) అప్పుడు ఆమె అజ్ఞాతవాసంలో ఉంది. మితంగా భాషించాలి. వ్యంగ్యంగా చెప్పాలి. అరణ్య పర్వంలో ఆ ప్రతిబంధకాలు ఏమీ లేవు. తన అయిదుగురు భర్తల ప్రతాపాన్నీ నోరార

వర్ణించవచ్చు. అందుకే ''ప్రకటితశౌర్యసారులు'' ఘనతను పేరు పేరునా చెప్పి 7 పద్యాలలో సైంధవునికి చీవాట్లు పెడుతుంది (అరణ్యా. 6-174 నుండి 180). ఇందులో ధర్మరాజు మదపుటేనుగులాంటివాడు. భీముడు సింహం, అర్జునుడు బెబ్బులి, నకుల సహదేవులు జంటపాములు అని ద్రౌపది చెప్తుంది. ఈ ఉపమానాలు సంస్కృత భారతంలోనూ ఉన్నాయి.[9] అయినా ఎర్రయ్యగారి అనువాదంలో ఎంతో హుందాతనం వచ్చింది. చూడండి.

నాగం ప్రభిన్నం గిరికూటకల్ప ముపేత్య కాం హైమవతీం చరతాం,
(వ)? దండేనయూ ధానవసేధ సేత్వం యోజేతు మాశంసి ధర్మరాజం.

అని మూలంలో ద్రౌపది ధర్మరాజు సంగతి చెప్తుంది. ఎర్రయ్యగారి ద్రౌపది ఎలా అంటున్నదో వినండి.

హిమవత్పాదవనాంత కేలిరతిమై నేపారి కోపారుణ
క్రమనేత్రాంచలమై ప్రభూతమదరేఖంబైన గంధద్విపేం
ద్రము డాయంజని సిళ్లు సూపుట సుమీ ధర్మాత్మసత్యాగ్రవి
క్రము గౌంతేయవరిష్ఠు నీవు దొడరంగా జూచు టూహింపగన్.

ఏనుగుకు సిళ్ళు చూపడం మన జాతీయం. తిక్కనగారు విరాట. 5-84లో వాడారు. ఇక్కడ ఎర్రయ్యగారు వాడారు. 'సిడి' అంటే బరి గోల, అంకుశం అనే అర్థాలు శబ్దరత్నాకరం, ఆంధ్రవాచస్పత్యాలలో కనబడతాయి. పదబంధపారిజాతంలో 'ఏనుగు నకు సిళ్లు చూపినట్లు' అనే జాతీయానికి ఇలాగ వివరణ వ్రాశారు : ''ఎట్టిగుడ్డలు మొదలగునవి చూపి పశువులను బెదిరించినట్లు ఏనుగును బెదరగొడితే అది విజృంభిస్తుంది. బెదిరించిన పశువులు విరుచుకొని పడడం సహజం.''[10] మందలోంచి విడదీయదలచిన ఏనుగు సంగతి మూలంలో ఉంది. ఇక్కడ అది కాదు. చాళుక్య సోమేశ్వరుడు తన 'మానసోల్లాసం'లో గజవినోదం గురించి వ్రాశాడు. ఏనుగులకు మదమెక్కించి పోట్లాటలు పెట్టి రాజులు ఎలాగ క్రీడించారో వివరించాడు. ఇది ఆనాటి రాజభోగం. ఎర్రయ్యగారు దీనినే ఇక్కడ సూచిస్తున్నారు కాబోలు.

పంచపాండవులను మూలంలోని ఉపమానాలతో సరిపోల్చినా తెనుగుతనాన్ని తెచ్చారు. ఏనుగుకు సిళ్లు చూపడం, సింహంజూలు పట్టుకొని ఊగడం, పులిని కోలతో కొట్టి తోసెయ్యడం, బుసకొట్టే త్రాచుపాముల్ని కాళ్లతో రాయడంవంటి సాహసాలను ఎర్రయ్యగారు పేర్కొన్నారు. ఈ హితోపదేశాన్ని సైంధవుడు లక్ష్యపెట్టలేదు. వాడు సింహాగారంబు చొచ్చే వృకంవలె పాండవ నివాసంలో జొరపడ్డాడు. ద్రౌపదిని మోహించిన కీచకుణ్ణి తిక్కనగారు రెండుమూడుసార్లు 'లేడి'తో పోల్చారు. చూడండి.

---

9. 268వ అధ్యాయము.
10. పదబంధ పారిజాతం - ప్రథమ సంపుటం - పుట 281

ద్రౌపదీరూప మను నురి దగిలి తనదు
హృదయ మను మృగమత్తరినుదిలగొనుచు
గాముడను బల్లిదవు వేటకాని బారి
బడుట కెంతయు నాసింహబలుడు దలరి. (విరాట. 2-25)

కీచకుని మనస్సును మృగమనడంలో ఔచిత్యం రెండువిధాలా వుంది. ద్రౌపదిని చూసిన తొలిచూపు తరువాత ఇలాగ వర్ణించిన కీచకుణ్ణి మళ్ళా నర్తనశాలలోనికి ప్రవేశిస్తున్నప్పుడు మృగంతోనే పోల్చారు. 'ఇంతి జేరగా - జనియె విధాతృలుబ్ధకవశంబున బోవు మృగంబుచాడ్పునన్' అన్నారు. (విరాట. 2-247) పేరుకు వాడు సింహబలుడే అయినా ఈ ఘట్టంలో మృగం = బెదిరిపోయే లేడి. ఎఱ్రయ్యగారి సైంధవుడు అంతకన్నా తక్కువ; నక్క. సింహాగారము చొచ్చే వృకమని వాడిని వర్ణించి, వాడిమీద యుద్ధానికి పోయే పాండవులను 'ఆమిషంబునకుం గవియు డేగల'తో పోల్చారు. ఇలాంటి చిన్నచిన్న మాటలే ఎంతో ఔచిత్యమున్న చక్కని అర్థాలను చెప్తాయి. సైంధవుడు ద్రౌపదిని తీసుకుపోతున్నప్పుడు అడవిలో ఇంకొకచోట ఉన్న పాండవులకు అపశకునాలు కనబడ్డాయి. వాటిని చూడగానే ధర్మరాజు భయపడ్డాడు. 'చెయివెట్టి కలచినట్లయ్యెడు చిత్తంబు, తనువు నిశ్చేష్టమయ్యె' అన్నాడు (అరణ్య. 6-194). బయటకు ఏ చేష్టా కనబడకపోయినా లోపల ఎంత క్షోభ ఉందో ఇలాంటి అలతిపదాలు చెప్తాయి.

విరాటపర్వంలో ద్రౌపది వంటశాలలో భీముని ముందు పాండవులందరిని వరసగా ఎలా పొగడుతుందో అలాగే అరణ్యాపర్వంలో సైంధవుని రథంమీద నిలబడి, యుద్ధానికి వస్తున్న పంచపాండవులను తలో రెండు పద్యాలతో వర్ణిస్తుంది. మూలానికి విధేయత చూపిస్తూ ఎఱ్రయ్యగారు ఇక్కడ తిక్కనగారికి దగ్గరలో ఉన్నారు. సావిత్రీ చరిత్రలో వారు అక్కడక్కడ మూలంలో లేని భావాలను చెప్పారు. సత్యవంతుని తండ్రి అంధుడు. అతనికి సావిత్రి కోరిన వరంవల్ల కన్నులు వస్తాయి. కన్నులు రాగానే అతడు కొడుకు కోసం వెతికాడు. కనబడలేదు. 'కన్నులు వచ్చి యెల్లెడలు కన్గొని వృద్ధనరేంద్రుడాత్మకుం గన్నులు బోలెనైన గాదిలిపుత్రుడు' కనబడక 'కన్నులు లేనియట్లొకడకుగానక యేడ్చె సతీసమేతుడై' అని ఇక్కడ ఎఱ్రయ్యగారు చెప్పారు. అరణ్యాపర్వంలోని సావిత్రీచరిత్ర 110 పద్యాలు (7-170 నుండి 279 దాకా). ఇది ఒక చిన్నసైజు ప్రబంధం.

ఇలాంటి ప్రబంధాలను అరణ్యాపర్వశేషంలో వ్రాయబట్టే ఎఱ్రయ్యగారికి ప్రబంధపరమేశ్వరుడు అనే బిరుదు వచ్చింది. 'వారు అరణ్యాపర్వంలో కొత్త పద్యాలేం వ్రాయలేదు. తాటాకులను పురుగులు కొట్టేస్తే శిథిలమైన అక్షరాలను పూరించారు' అనే వాదాన్ని కొందరు పండితులు లేవదీశారు.[11] ఇందులో సారం లేదని దీనిని పెద్దలు తోసిరాజన్నారు. ఎఱ్రయ్యగారు తాము 'అరణ్యాపర్వశేషోన్నయం' నిర్వహించామని చెప్పుకొన్నారు (నృసింహ. 1-17). ఈ 'ఉన్నయ' పదాన్ని మరొకసారికూడ -

11. నడకుదుటి వీరరాజు పంతులుగారు ఈ వాదం బాగా ప్రచారం చేశారు. భారతి 1వ - సంపుటి. (4వ సంచిక)

నన్నయగారిని నుతిస్తున్నప్పుడు వాడారు (హరివంశం, పూ. 1-8). 'ఉన్నయం' అనే మాటకు 'కడముట్టజెప్పుట' అనే అర్థాన్ని వేలూరి శివరామశాస్త్రిగారు సిద్ధాంతకౌముది, అమరకోశం, భట్టి మొదలైన ప్రయోగాలతో చెప్పారు.[12] అరణ్యపర్వశేషాన్ని నన్నయగారి శైలి కొంత తోచేటట్లు వారి రచనే అయేటట్లు ఉన్నయం చేశాక నన్నయభట్ట మహాకవీంద్రుని సరససార స్వతాంశ ప్రశస్తి నిజంగా ఎర్రయ్యగారికి చెందింది. ఈ సంగతులు వారే చెప్పుకున్నారు.

భవ్యచరిత్రు డాపస్తంబసూత్రుండు శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ
సంతత ధ్యాన సంసక్త చిత్తుడు సూరనార్యునకును బోతమాంబికకును
నందనుడిల బాకనాటిలో నీలకంఠేశ్వరస్థానమై యెసక మెసగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు ధన్యుడు ధర్మైక తత్పరాత్ము
డెర్రనార్యుండు సకల లోకైక విదితు-డయిన నన్నయభట్ట మహాకవీంద్రు
సరస సారస్వతాంశ ప్రశస్తిదన్ను - జెందుటయు సాధుజన హర్ష సిద్ధిగోరి.
ధీరవిచారుడు తత్కవి-తారీతియు గొంత దోప దద్రచనయ కా
నారాయణ్యపర్వశేషము - పూరించె గవీంద్ర కర్ణపుట పేయముగాన్.

(అరణ్య. 7-469, 470)

ఇవి గర్వంతో చెప్పుకొన్న మాటలులాగ కనబడతాయిగాని ఎర్రయ్యగారు చాలా వినయం గలవారు. అరణ్యపర్వశేషం తర్వాత ఒక మహా ప్రబంధకల్పనా కుతూహలంతో కూర్చున్నారు. ఎప్పుడో ఎంతో వినయంతో ఏవో నాలుగక్షరాలు నేర్చుకొనబట్టి సహజంగావచ్చే చాపల్యం అంటూ ఇలా చెప్పారు.

... కతిపయాక్షర పరిగ్రహజనితంబైన నైసర్గిక చావలంబు కతంబున

(నృసింహ. పీఠిక 12)

మించిన వేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మ రా
యంచలు కూయ గ్రౌంచమును నావల గూయ గడంగుభంగి బ్రౌ
ఢాంచిత శబ్దసారులు మహాకవులాద్యులు కావ్య శయ్యగీ
లించిన కీర్తి సంగసుఖలీలకు నేను గాంక్షజేసితిన్. (నృసింహ. పీఠిక 13)

ఈ కోరికతో కనులు మూసికొని భావసమాధిలో కూర్చున్న ఎర్రయ్యగారి మనసులో వారి తాతగారు ఆవిర్భవించారు. "నాయనా! నీవు ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదాలతో కావ్యకర్తవై, యెన్నికతో ప్రబంధపరమేశ్వరుడనే బిరుదుపొంది ఆ నన్నయభట్ట తిక్కకవినాథుల భక్తి పెంపుతో అరణ్యపర్వశేషోన్నయం ఆంధ్రభాషలో సుజనోత్సవ మొప్పగా నిర్వహించావు. శంభుదాసుడనే పేరుతో పరమేశ్వరభక్తుడవైనా నీకు గోవింద గుణాదరం ఉంది. గురుభజనపరాయణుడవు. సరసబహు పురాణ ధర్మశాస్త్ర కథా విస్తరవేదివి. వినయోదయభరితుడవు. తులలేని అనుభవ భవ్యుడవు.

12. హరివంశం పీఠిక, పుట.15 - అధోజ్ఞాపిక

ప్రబంధ రచనా ప్రావీణ్యం నీకు సహజపరిణత సిద్ధమై వెలసినది. అహోబల నరసింహస్వామి నాకు ఇష్టదైవం. అతని విభవం, ఆ మహిమావతారం నీ మధురోక్తి గుంభనతో మనీషులు మెచ్చుకొనేట్టు ప్రస్తుతించు'' అని తాతగారు చెప్పారు. ఈ మాటలు విన్నాక ఎర్రయ్యగారు పులకించారు. వారి మనస్సు వికసించింది. ఆయన కన్నులు తెరిచారు. అద్భుతానందరసమూర్తిగా అయ్యారు. ''ఇది ఈశ్వరానుశాసనం. నృసింహావతార సంస్తవసరణిని ప్రబంధం రచిస్తాను అనుకొన్నారు. బ్రహ్మాండాది పురాణాలలో ఉన్న విషయాలను తీసుకొని అయిదు ఆశ్వాసాలలో 804 గద్యపద్యాలు రచించారు. నన్నెచోడుని కుమారసంభవ ప్రభావం ఎర్రయ్యగారి మీద పూర్తిగా పడింది. చిన్న కథను విపులమైన వర్ణనలతో ప్రబంధం వ్రాశారు. 12 పద్యాలలో సముద్రవర్ణన, 13 పద్యాలలో వైకుంఠవర్ణన, 6 పద్యాలలో నగరవర్ణన, 5 పద్యాలలో బ్రాహ్మణాధిక్య ప్రశంస, 11 గద్యపద్యాలలో హిరణ్యకశిపుని తపోవర్ణన, 16 పద్యాలలో వసంతవర్ణన (ఒక్క లయగ్రాహి కూడా లేదు), 5 పద్యాలలో పుష్పాపచయం, 5 పద్యాలలో అచ్చరల ఆటపాటలు, 5 గద్యపద్యాలలో రాజనీతి, 27 పద్యాలలో మునుల వినుతి, 24 పద్యాలలో వెన్నెల, వేసవి వర్ణన, 10 పద్యాలలో మధుపానవర్ణన, 6 పద్యాలలో లీలావతి గర్భ లావణ్యా లాలిత్యవర్ణన, 23 పద్యాలలో ప్రహ్లాద గీతాలు, 38 పద్యాలలో అహోబలక్షేత్రమహిమ ఈ ప్రబంధంలో కనబడతాయి.

ఎర్రయ్యగారు ఈ కథను బ్రహ్మాండాది పురాణాల నుండి తీసుకొన్నామన్నారు. అయితే బ్రహ్మాండ పురాణంలో ఈ కథ అల్పాల్పం.[13] విష్ణుపురాణంలోంచి కొంత తీసుకొన్నారు. సంస్కృత నరసింహపురాణానికీ, ఎర్రయగారి పురాణానికీ పొత్తు కుదరదు. వేలూరి శివరామశాస్త్రిగారి వాస్తవ కథను ఇలా వ్రాశారు.

హిరణ్యకశిపుడు మహా పరాక్రమము గల రాజు. ఇంద్రుడును మరియొక బలశాలి. ఇతడు ఇలావృతవర్షమునకు రాజు. ఇలావృతమునకు స్వర్గమని పేరు. ఇలావృతము నందలి వారికి దేవతలని పేరు. హిరణ్యకశిపుడు ఇంద్రునితో పోరి స్వర్గమును ఆక్రమించుకొనెను. దేవత లతనికి భీతిచెంది మనుష్య వేషములతో తిరుగదొడగిరి. అపుడు భారతవాసులకు మనుష్యులని పేరు. వారు మనువు ప్రజలు. పూర్వకాలమున మనుష్య శబ్దార్థమిప్పటివలె ఇంత వ్యాపకము కాదు.

హిరణ్యకశిపుడు విష్ణు సమకాలికుడు. ఈ విష్ణువు వామన విష్ణువునకు వెనుకటివాడు. ఇలావృతమునకును ఉత్తరముననున్న క్షీరోదతీర భూములకు (?) ఇతడేలిక.

ప్రహ్లాదునకును తండ్రికిని పడలేదు. హిరణ్యకశిపుడు కొడుకు నెంతయో హింసించెను. ప్రహ్లాదుడు విష్ణువు నాశ్రయించెను. తుదకెటులో ఈ తండ్రీ కొడుకుల నడుమ సద్భావమేర్పడెను. హిరణ్యకశిపుడు అనుతాపము చెంది ప్రహ్లాదునెడల

13. నృసింహపురాణం పీఠికలో వేలూరి శివరామశాస్త్రిగారు పుట-8

వాత్సల్యము పూనెను. ధర్మజ్ఞుడగు ప్రహ్లాదుడును తండ్రిని పరమ భక్తితో జూడ మొదలిడెను. నృసింహుడేల హిరణ్యాకశిపును వధించెనో విష్ణు పురాణము చెప్పదు. నృసింహుడు స్తంభమును బద్దలు కొట్టుకొని ఆవిర్భవించుటయు విష్ణుపురాణమున లేదు. మృగయా విహారమున హిరణ్యాకశిపుని ఒక సింహము చీల్చి చంపియుండును. ఇతడు విష్ణు విద్వేషి కావున ఆ విష్ణువే సింహరూపమున హిరణ్యా కశిపుని చంపెనని కల్పన చేసియుందురు – అని వాస్తవవాదులు అందురు. ఇది అధునాతనుల హిస్టరీ. (నృసింహ పురాణం పీఠిక, పుటలు 10–12)

ఉత్తరోత్తరా ప్రహ్లాదుడు దేవతలలో భీకరంగా యుద్ధం చేశాడు. హరివంశం ఉత్తరభాగం 10వ అధ్యాయంలో దేవదానవుల ద్వంద్వయుద్ధం సుప్రసిద్ధంగా జరిగిన వైనం ఎఱ్ఱయ్యగారే సవిస్తరంగా వ్రాశారు. ప్రహ్లాదుడు యమునితో చేసిన పోరాటం 19 గద్యపద్యాలలో వర్ణించారు. ప్రహ్లాదుడు, అతని కొడుకు విరోచనుడు, మనుమడు బలిచక్రవర్తి అంతా కలిసి దేవతలతో యుద్ధం చేశారు. అందుచేత నృసింహావతారం తరువాత ప్రహ్లాదుడు సంపూర్ణంగా దేవతాపక్షపాతి కాలేదు. ఈ యుద్ధానికి హిరణ్యాకశిపుని వధే కారణం. ''కపట నరమృగేంద్రకాయుచే నతని జంపించి, సురలు శక్రునకు తదీయసంపద ఇచ్చి ఏలించి రీజగత్ప్రపంచమెల్ల'' అని బలిచక్రవర్తి సభలో దొరలు చెప్పారు (హరి. ఉ.10–12).

ఎఱ్ఱయ్యగారి పురాణంవల్ల, పోతరాజుగారి పోతవల్ల నరసింహావతారం, ప్రహ్లాదకథ ఆంధ్రదేశానికి అత్యంత ఆదరణీయాలు అయినాయి.

పోతరాజుగారి కథ ''మొన్న మొన్నటివరకు తెలుగునాట బాలుర కందరకును కంఠస్థము. స్త్రీలు చల్లచిలుకుచును, మెల్ల యలుకుచును ఈ కథను కోయిలల కుగ్గుపెట్టుదురు'' అని వేలూరి శివరామశాస్త్రిగారు చెప్పారు. ఎఱ్ఱయ్యగారిని బమ్మెరపోతన గారు ఎక్కడెక్కడ అనుకరించినది బాగా విశదపరిచారు.

కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు మధువైరి దవిలిన మనము మనము
భవగంతు వలగొను పదములు పదములు పురుషోత్తమునిమీది బుద్ధి బుద్ధి
దేవదేవుని జింతించు దినము దినము
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు
తండ్రి! హరి జేరుమనియెడి తండ్రి తండ్రి. (భాగ. 7–169)

పోతరాజుగారి ఈ పద్యం జగత్ప్రసిద్ధం. దీనికి ఎఱ్ఱయ్యగారి పద్యాలు రెండు మూడు తోడ్పడ్డాయి.

హరిభక్తుల తపము తపము - హరిభక్తుల జపము జపము హరిభక్తుల భా
సురజన్మము భవసారము - హరిభక్తులు భువన పావనైక విహారుల్.

(నృసింహ. 2-33)

అనే పద్యభాగంతోపాటు నిషేధరూపమగు ఈ క్రింది పద్యం పోతరాజుగారికి ఉత్తేజం.

వాసుదేవుని పాదవనరుహంబుల భక్తి తగదను తండ్రియు దండ్రి గాడు
వేదచోదితమైన విష్ణు ధర్మమునకు గోపించు గురుడును గురుడు గాడు
భవదుఃఖములు మాన్ప బ్రభువైన హరిసేవనెడలించు హితుడును హితుడు గాడు
పరయోగమత మగు వైష్ణవజ్ఞానంబు వదలిన చదువును జదువు గాదు
కేశవాకారలీలలు గీలుకొని ము-దంబు బొందని తలపును దలపుగాదు
మాధవస్తోత్ర ఘనసుధామధురరుచుల - జిలుక కుండెడు జిహ్వయు జిహ్వ గాదు.

(నృసింహ. 5-22)

ఎఱ్ఱయ్యగారు విష్ణుపూజ చేయవద్దనే తండ్రి తండ్రి కాడని పద్యం ఎత్తుకున్నారు. పోతరాజుగారు హరిని చేరమనే తండ్రే తండ్రి అని పద్యాన్ని ముగించారు. ఇంకొకరి ప్రభావంతో పద్యం చెప్పినా ఇంత సహజంగా చెప్పాలి. అదే ప్రతిభ. ప్రహ్లాదుడు ఇరవైనాలుగు గంటలూ హరినామస్మరణే చేస్తాడని పోతరాజుగారు ఈ క్రింది పద్యంలో చెప్పారు.

పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాదసం
ధానుండై మరచెన్ సురారిసుతు డేతద్విశ్వమున్ భూవరా! (భాగవతం. 7-123)

దీనికి ఎఱ్ఱయ్యగారి పద్యమే ఒరవడి. చూడండి.

కుడిచినపుడు నిద్రగూరిన యప్పుడు - మేలుకొనినపుడు మెలగినపుడు విష్ణు
కీర్తనంబు విష్ణుచింతయ కాని - పలుక డొండు బుద్ధి దలపడొండు.

(నృసింహ. 3-150)

ఇందుగల డందు లేడని - సందేహము వలదు, చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన - నందందే కలడు దానవాగ్రణి వింటే?

(భాగవతం, 7-275)

అన్న ప్రసిద్ధమైన పద్యానికి, దానిముందు చెప్పిన ''కల డంబోధి గలండు'' అనే పద్యానికి ఎఱ్ఱయ్యగారిదే ఒజ్జబంతి. చూడండి.

కలడు మేదినియందు గల డుదకంబుల గలడు వాయువునందు గలడువహ్ని
గలడు భానునియందు గలడు సోమునియందు గల డంబరమ్మున గలడు దిశల

గలడు చరంబుల గల డచరంబుల గలడు బ్రాహ్యాంఘ్రున గలడులోన
గలడు సారంబుల గలడు కాలంబుల గలడు ధర్మంబుల గలడు క్రియల
గలడు కలవానియందును గలడు లేని - వానియందును గల డెల్లవానియందు
నింక వేయును నేల సర్వేశ్వరుండు - కలడు నీయందు నాయందు గలడు కలడు.
(నృసింహ. 5-78)

ఇలాంటివెన్నో ఉదాహరణలు యివ్వవచ్చును. దీనివలన ఎర్రన్న పోతన్నకు అన్నయ్యని తెల్లము - అని వేలూరివారు వ్రాశారు.[14]

ఈ కావ్యం చిన్నదే అయినా కవిత్వం చాలా గొప్పది. ఎర్రయ్యగారి భావుకతకు ఇది గొప్ప తార్కాణం. చంద్రుణ్ణి అందరూ వర్ణిస్తారు. అయినా ఎర్రయ్యగారిలాగా ఎవరూ గొప్ప యెత్తులకు ఎక్కలేదేమో! చూడండి.

వెన్నెలవెల్లి పాల్కడలి వ్రేకదనంబున బేర్చి దిక్కులున్
మిన్నును ముంపనందు రజనీకరబింబము కుండలీభవ
త్పన్నగతల్పకల్పనముభంగి దనర్చె దదంతరంబునన్
వెన్నుని భంగి జూడ్కులకు వేడ్క యొనర్చె గలంకమత్తరిన్. (నృసింహ. 3-87)

శేషతల్పశాయి అన విష్ణువులాగ చంద్రుడు అందరి కళ్ళకు కనబడడు. శేషశాయి అంటే ఎర్రయ్యగారికి చాలా ఇష్టం. ప్రహ్లాదుడిని మున్నీట పడేస్తే అతడు ఎర్రయ్యగారి కళ్ళకు అలాగే కనిపించాడు.

ఘనభుజగశత ఫణావృత - తనుడై బాలుడు పయోధితరగలమీదన్
బెనుపాప సెజ్జ బవళిం - చిన వెన్నునిపొటి యగుచు జెన్నెసలారన్.
(నృసింహ. 4-175)

ఇంత అరుదైన భావాలు గల ఎర్రయ్యగారే అక్కడక్కడ న్యూనోపమానాలు వాడితే మనస్సు చివుక్కుమంటుంది. చూడండి వనవర్ణన.

పొగడ మ్రాకు మొదళ్లను బుష్పరసము
దొరగి నెత్తావియందును నెరయనొప్పె
బూచుకొరకు నై మున్న యింపులు దలిర్ప
గడగి వనలక్ష్మి యుమిసిన కళ్లయనగ. (నృ. 2-69)

గంభీర వాక్ప్రకారప్రౌఢితో ఎర్రయ్యగారు దేవశ్రవునిచేత చెప్పించిన ఈ పురాణంలో ఇటువంటి నెరసులు తక్కువే. ఎర్రయ్యగారు చాలా గడుసువారు. శివుడు వారి ఇష్టదైవం. శంభుదాసుడు అనేది వారి బిరుదు. ఈశ్వరుడు దిక్పాలకులలో ఒకడు. హిరణ్యకశిపుడు మిగతా దిక్పాలకులచేత ఊడిగాలు చేయించుకున్నా ఎర్రయ్యగారు అతణ్ణి ఈశ్వరుడి జోలికి పోనియ్యలేదు. కారణం చాలా చక్కగా చెప్పారు.

14. నృసింహపురాణం పీఠిక, పుట-17

ఎక్కొడి దెద్దు భూతియును నెమ్ములు సొమ్ములు భిక్ష జీవనం
బొక్కటి కట్ట జీరయును నుండగ నిల్లును లేదు నిక్కువం
బిక్కరకు న్దపస్విజను డేచిన సయ్యెడు నేమి యంచు దా
నొక్కని శర్వునిక్ బరుప నొల్లడు దైత్యుడనాదరంబునన్. (నృసింహ. 2-124)

శంభుదాసుడన్న పేరున్నా ఎర్రయ్యగారు విష్ణువును కీర్తించేటప్పుడు ప్రహ్లాదుడి లాగా ఒళ్ళు మరచిపోతారు. అకారంతో మొదలయ్యే ఏదైనా మాటతో ఒకసారి విష్ణువును పేర్కొంటే పద్యంలో చోటున్నంతవరకూ అకారం విడిచిపెట్టరు. అభవ, అక్షయ, అప్రమేయ అంటూ చెప్పుకుపోతారు. ఈ పద్ధతి భారతశేష రచనలో మొదలైంది. 'అవ్యయు నచ్యుతున్' (4-374); ఆదిదేవు డంబుజాక్షు డధోక్ష జుడక్షనుండు (4-375) అని వ్రాశారు. నృసింహ పురాణంలో చాలాచోట్ల, హరివంశంలో కొన్నివందలసార్లు ఈ విధానం కనబడుతుంది. హుళక్కి భాస్కరునికి విస్ఫులింగం అనే మాట వాడడం ఎంత ఇష్టమో ఎర్రయ్యగారికి 'స్ఫురత్' అనే మాటతో సమాసం కట్టడం అంత ఇష్టం. అరణ్యాపర్వ శేషంలో 'స్ఫురదరుణాంశు రాగరుచి' మొట్టమొదట కనబడుతుంది. అదే మాటను ఎర్రయ్యగారు ఈ నృసింహపురాణంలో యథాతథంగా 'స్ఫురదరుణాంశు రాగరుచి సూరెల బర్వగ' అని వాడారు (1-73). ఎర్రయ్యగారికి విజ్ఞానం అంటే చాలా ఇష్టం. ఈ మాట చాలాసార్లు వాడారు. నృసింహపురాణం విజ్ఞానాత్మక వాఙ్మయం అన్నారు (పీఠిక 26). తపస్సు చేసుకుంటున్న హిరణ్యకశిపుడు ''నిశ్చలకళావిజ్ఞాన సర్వస్వమో'' అన్నట్లు ఉన్నాడట (2-88). ప్రహ్లాదుడు విజ్ఞానపరవశుడు (5-73). అనంతర కవులు పడికట్టు సమాసాలలాగ వాడే మందస్మితసుందరవదనారవిందుడు మొదలైనవి ఎర్రయ్యగారు అరణ్యాపర్వంలోనూ, ఇందులోనూ వాడారు. అనంతర కవులు ఎర్రన్నగారిని బాగా చదువుకొన్నారు. శతక కవులు కూడా అనుసరించారు. చూడండి కృష్ణ శతకంలో ఈ పద్యం చాలా ప్రసిద్ధం.

హరి యను రెండక్షరములు - హరియించును పాతకంబు లంబుజనాభా!
హరి! నీ నామ మహత్త్వము - హరిహరి పొగడంగ వశమె హరి శ్రీకృష్ణా!

దీనికి ఎర్రయ్యగారి పద్యం ఆధారం.

హరి యను రెండక్కరములు - దొరకొన దీపాసగు జిహ్వాతుది నెవ్వనిక
న్నరుడొక డిభ్యుడు భవసా-గర నిస్తరణప్రకార కౌశలమునకర్హు!
(నృసింహ. 2-34)

వ్రాస్తున్నది పురాణమే అయినా ఎర్రయ్యగారు తమ సమకాలిక విషయాలను కొన్ని వర్ణించారు. 'స్వర్గానికి వెళ్లినా సవతిపోరు తప్పదు' అన్నట్లు వైకుంఠంలో కూడా బిళ్ల బంట్రోతుల అట్టహాసం ఉంటుంది. విష్ణుమూర్తిని కొలుచుకొందుకు వచ్చిన వాళ్ళను పణిహారులు సర్ది కూర్చోపెడుతున్నారు. చూడండి.

అవసరం బిప్పు డ యగు నంతదాకను బగళమై నిలుడు దిక్పాలవరులు
సందడిసేయక యందరు నించుకసేపు కూర్చుండుడు సిద్ధమునులు
దండియలును మీరు దడియంగ బడకయంతక యటు వొండుగంధర్వముఖ్యు
లిందాక బొగడితి రించుకవడి యింక జగడంబు మానుడు చారణేంద్రు
లనుచు నుద్ధత వేత్రదండాభిరామ - హస్తులై ఫణిహారు లందంద నిలువ
నధికమై యొప్పె సమ్మర్దమాదిదేవు - భూరిమందిరతోరణభూమియందు.

(నృసింహ. 1-80)

ఎఱ్ఱయ్యగారు తమ కాలంలో ఉన్న పణిహారులనే వర్ణించారన్నది స్పష్టం. క్రీ.శ. 1300 ప్రాంతాలలో పాకనాటి అద్దంకిసీమను పంటరెడ్లు పాలించేవారని ముందు చెప్పుకొన్నాం. ఆ ప్రభువుల హజారంలోని పణిహారులను ఎఱ్ఱయ్యగారు చూసి ఉంటారు. రెడ్డిరాజ్యం స్థాపించిన వేమారెడ్డికి మల్లారెడ్డి అనే తమ్ముడున్నాడు. ఈయన ఎఱ్ఱయ్యగారిని ఆదరించి అభిమానించాడు.

ప్రతాపరుద్ర చక్రవర్తిని బంధించి ఢిల్లీ సైన్యాలు తీసుకుపోయాక కాకతీయ సామ్రాజ్యం అంతరించింది. ఒక పక్క పద్మనాయక రాజ్యం, ఇంకొకపక్క సంగమ రాజ్యం, పాకనాటిలో రెడ్డి రాజ్యం స్థాపన జరిగిందని చెప్పుకొన్నాం. అద్దంకి రాజధానిగా ప్రోలయ వేమారెడ్డి రాజ్యాన్ని స్థాపించి పరాక్రమంతో భూములు ఆక్రమించి అనుజులకు, తనుజులకు, బంధువులకు, మిత్రజనులకు ఇచ్చాడు. తన తమ్ముడు మల్లారెడ్డికి సముద్రతీరస్థ గ్రామాలమీద అధికారం, ద్వీపాంతర వ్యాపారం మీద పెత్తనం ఇచ్చాడు. మల్లారెడ్డి వర్తకాన్ని బాగా అభివృద్ధిచేసి రత్నాలు, గుఱ్రాలు మొదలైనవి అన్నగారికి ఇచ్చేవాడు. రత్నాల నిచ్చినట్టే కవిరత్నాన్ని కూడా ఇచ్చాడు. ఎఱ్ఱయ్యగారిని మల్లారెడ్డి ఆదరించి వేమారెడ్డికి ఇచ్చాడు.

మల్లారెడ్డి ఆదరించాక ఎఱ్ఱయ్యగారు మన్నేరుమీద నున్న గుడ్లూరు వదలిపెట్టి గుండ్లకమ్మతీరాన ఉన్న చదలువాడకు వెళ్లి అక్కడ నివాసమేర్పరచుకొన్నారు. అక్కడ మల్లారెడ్డివల్ల మడిమాన్యాలు పొందినట్లుంది. మల్లరథినీ నాథుడు ఎఱ్ఱయ్యగారిని ఆతతశ్రీతోడన్ సముపేతు చేశాడని ఎఱ్ఱయ్యగారే ఒక పద్యంలో చెప్పుకొన్నారు.[15] మల్లారెడ్డి రామభక్తుడు, చదలువాడలో ఆలయం కట్టించి రామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠ చేయించాడు. క్రీ.శ. 1325లో ప్రోలయ వేమారెడ్డి స్వయంగా చదలువాడకు వచ్చి తమ్ముడు కట్టించిన ఆలయంలోని దేవుడికి ఒక అగ్రహారం ఇచ్చాడు. ఒక చంద్రగ్రహణం నాడు గుండ్లకమ్మనదిలో ఒక ఇసుకతిన్నె మీద కూర్చొని వేమారెడ్డి ఈ అగ్రహారాన్ని ఇచ్చినట్టు ఒక శాసనం చెప్తున్నది.[16] దీనికి తన తమ్ముడు మల్లారెడ్డి పేర మల్లవరం అని పేరు పెట్టారు. మల్లవరం నేటికీ చదలువాడకు అరక్రోసు దూరంలో ఉంది. అందులో రామాలయం ఉంది.

15. హరివంశం పూ.1-39
16. రెడ్డి సంచిక - అనుబంధం - పుట. 15

ప్రోలయ వేమారెడ్డి చదలువాడకు వచ్చినప్పడే మల్లారెడ్డి తాను చేపట్టిన ఎఱ్ఱయ్యగారిని తన అన్నగారికి ఇచ్చి ఉంటాడు. రామాలయానికి ఒక గ్రామాన్ని దేవభోగంగా ఇస్తున్న సందర్భంలో ప్రోలయ వేమారెడ్డి ఎఱ్ఱయ్యగారిని రామాయణం రచించమని కోరినట్లుంది. రెడ్డి మల్లవరంలో రామలక్ష్మణ ప్రతిష్ఠకు, రామాయణానికి ఏదో సంబంధం ఉందని వేలూరి శివరామశాస్త్రిగారు ఊహించినది సత్యమే. ఎఱ్ఱయ్యగారు సంపూర్ణంగా రామాయణం రచించినట్లు హరివంశంలోని ఈ క్రింది పద్యం వల్ల తెలుస్తున్నది.

నా తమ్ముండు ఘనుండు మల్లరథనీనాథుండు నిర్నాతత
శ్రీతోడన్ సముపేతుజేసి యెలమిం జేపట్టి మాకిచ్చుటం
జేతోమోద మెలర్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం బొందితి నింక నేను దనియన్ గావ్యామృతాస్వాదనన్.

(హరి.పూ. 1-39)

ఎఱ్ఱయ్యగారు రామాయణం పూర్తిగా వ్రాసినా అది నష్టమైపోయింది. క్రీ.శ. 1756 ప్రాంతాల జీవించిన కూచిమంచి తిమ్మకవి కాలం దాకా ఎఱ్ఱాప్రెగ్గడగారి రామాయణం ప్రతులు దేశంలో ఉండేవి. తిమ్మకవి తన సర్వలక్షణ సారసంగ్రహంలో ఎఱ్ఱయ్యగారి రామాయణం నుండి 9 పద్యాలను ఉదాహరించాడు. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోని ఒక సంకలన గ్రంథంలో ఎఱ్ఱాప్రెగ్గడగారి రామాయణంలోని 28 పద్యాలు కనబడ్డాయట. వీటిని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రకటించారు.[17] ఈ పద్యాలున్నాయేమో అని శాస్త్రిగారు భాస్కర రామాయణం, భారతారణ్య పర్వములోని రామకథ, భాగవతంలో ఉన్న రామచరిత్రను, మొల్ల రామాయణాన్ని, రామాభ్యుదయాన్ని, ఘనగిరి రామకవి సకలవర్ణనాపూర్ణ రామాయణాన్నీ పరిశీలించి చూశారు. ఈ పద్యాలు వాటిలో ఎక్కడా కనపడలేదు.

వివిధ ఆకరాల నుండి సేకరించి వేటూరివారు ప్రకటించిన ఎఱ్ఱయ్యగారి రామాయణం పద్యాలను వేలూరి శివరామశాస్త్రిగారు కూడ వావిళ్ల వారి హరివంశంలో ప్రకటించారు. ఇవి 46 పద్యాలు. ఇందులో మూడు పద్యాలు గణపవరపు వెంకటకవి తన ప్రయోగరత్నాకరంలో ఉదాహరించినవి. వెంకటకవి కాలం 1674 ప్రాంతాలు. ఇతడు ఎఱ్ఱయ్యగారి పద్యాలు సంక్షేపరామాయణంలోనివని చెప్పాడు. ఎఱ్ఱయ్యగారు మూడుసార్లు రామకథ వ్రాశారు.

1.	భారతం అరణ్యపర్వంలో: షష్ఠాశ్వాసం 267 నుండి 409	=	143
	భారతం అరణ్యపర్వంలో సప్తమాశ్వాసం 1 నుండి 168	=	168
	మొత్తం గద్యపద్యాలు	=	311
2.	వేమారెడ్డి చెప్పించినవి (దొరికినవి)		42
3.	హరివంశం పూర్వభాగంలో 4-57 నుండి 4-68 దాక	=	12

17. రెడ్డి సంచిక - ఎఱ్ఱాప్రగడ రామాయణం - పుటలు 399-413

ఇలాగే నరసింహావతారాన్ని కూడా ఎఱ్ఱయ్యగారు మూడుసార్లు వ్రాశారు.

1. నృసింహ పురాణం 804 గద్యపద్యాలు
2. హరివంశం పూర్వభాగంలో 4-18 నుండి 4-38 వరకు 21 గద్యపద్యాలు
3. హరివంశం ఉత్తరభాగంలో 9-211 నుండి 9-257 దాకా 47 గద్యపద్యాలు

అరణ్యపర్వంలోని రామోపాఖ్యానంలో ఎఱ్ఱయ్యగారు మూలంలో లేని విషయాలను వ్రాశారు. మూలంలో 288వ అధ్యాయంలో రావణుడు ఇంద్రజిత్తును పిలిపించి రామలక్ష్మణులను సంహరించి రమ్మని చెప్తాడు. కుమారుని పరాక్రమాన్ని తండ్రి మెచ్చుకొంటాడు. ఎఱ్ఱయ్యగారు మాత్రం ఇంద్రజిత్తు వస్తూనే తండ్రిని ఊరడించడం వ్రాశారు.

కూడిన కొండముచ్చులను గ్రోతుల నుగ్రత ముట్టి కిన్క జెం
డాడెద నుజ్జ్వలోగ్ర వివిధాంబకజృంభితదిఙ్ముఖుండనై
యాడెద వీరనృత్యము రయంబున బార్థివ సూను లిద్దరం
గ్రీడయపోలె గిట్టి పెడకేళ్ళొగి గట్టెద బట్టి తెచ్చెదన్. (అరణ్యా. 7-111)

ఇందులోని వీరనృత్యం పద్మనాయక యుగంలో ప్రబలిన 'రణముకుడుపుట'ను సూచిస్తున్నదేమో. సమకాలిక ఆచారాలే కాక చక్కని జాతీయాలు, పలుకుబళ్లు అరణ్యా పర్వ రామాయణంలోనే ఉన్నాయి. 'కలవారెల్లను మడిసిరి. కలిగియు లేడయ్యొ కుంభ కర్ణుడు' అని రావణుడు వాపోయి (7-93) కుంభకర్ణుణ్ణి లేపిస్తాడు. అతనితో రాముడు 'మమ్మెల్లను నేలకుండ గోలకుం దెచ్చుచున్నవాడు' (7-96) అని మొరపెడతాడు. అరణ్యపర్వ రామాయణంలోనే ఇన్ని దొరుకుతూ ఉంటే అసలు రామాయణంలో ఎఱ్ఱయ్యగారు ఎంత చక్కని కవిత్వం వ్రాశారో మరి! రామరాజ్యం ఎలా ఉంటుందో ఎఱ్ఱయ్యగారు హరివంశంలోని సంక్షేపరామావతారంలో వ్రాశారు.

మునులును సురలును వేడుక - మనుజులలో గలసిమెలసి మనుచుండుదు రెం
దును గుడువుడు గట్టుడు గొను-డను మాటలు వినగవచ్చు నఖిలక్షోణిన్.
(హరి. పూ. 4-67)

ఎక్కడ చూసినా తినండి, కట్టుకోండి, తీసుకోండి అనే పుష్కలమైన మాటలు వినబడితే అంతకన్నా మంచి రాజ్యం ఎక్కడుంటుంది?

ఇతర రామాయణాలలో రాముడి పాత్ర దెబ్బతిన్నట్టు కనబడుతుంది. సీతమ్మ అగ్నిప్రవేశానికి ముందు రాముడు చాలా కర్కశంగా మాట్లాడుతాడు. భాస్కర రామాయణంలో అనకూడని మాటలే అంటాడు. ఆ అగ్నిపరీక్ష అయ్యాక, ఎవరెవరో ఎంతెంతగానో సీతమ్మ శీలాన్ని ప్రస్తుతించాక రాముడు నిరుత్తరుడై ఒక్కింత విచారించి తీసుకొంటాడు. ఎఱ్ఱయ్యగారు రాముడిచేత తన కఠినమైన మాటలకు కనికరం లేని పరీక్షకు కారణం అగ్నిహోత్రుడికే చెప్పించారు. చూడండి :

అవనిజనంబు లెల్లను దశాసను నంతిపురంబునందు బె
క్కపు దివసంబులున్న జనకాత్మజ శోధిత జేయకే యనా
ర్యవిహితవృత్తి దెచ్చె రఘురాముడు బాలిశు డంచు నెంచరా
భువనము లెల్ల నమ్ముటకు భో యిటు సేసితి హవ్యవాహనా![18]

ఇప్పుడు రాముడి మీద మనకు వచ్చే కోపం పోతుంది. అతడి పాత్రలో ఔచిత్యం కనబడుతుంది. రాముడు తన అంతరాంతరాలలో సీత 'నిప్పువంటి మహనీయచరిత్ర' గలదనే నమ్ముతున్నట్టు ఎర్రయ్యగారు వ్రాశారేమో. చూడండి ఈపద్యం.

ప్రకటతరాత్మతేజమున రక్షిత యా మిథిలాధిరాజక
న్యకను బయోధివేల బలె నాశరు డెంద నతిక్రమింప డె
న్నికకును నిప్పు వంటి మహనీయచరిత్రము గల్గు నిట్టి జా
నకిని దరంబె వానికి మనంబున నేనియు జుల్కజూడగన్.[19]

ఇతర రామాయణాలకన్న విలక్షణమైన పాత్ర పోషణేకాక ఎర్రయ్యగారి రామాయణంలో ఛందస్సులలో వింతలు కూడా ఉన్నట్టున్నాయి. సాధారణంగా మన కవులు స్రగ్ధర, మహాస్రగ్ధరవృత్తాలు వీరరసానికే వాడుతారు. మహాస్రగ్ధరలో ఎర్రయ్యగారు స్త్రీవర్ణన చేశారు. శూర్పణఖ రావణుని ముందర సీతమ్మను వర్ణించే ఈ మహాస్రగ్ధరా వృత్తాన్ని చూడండి.

కరిణీయానంబు నవ్వున్ గతి, నవలతికాకార మంగంబు, చంద్రున్
బురుణించున్ ముద్దుమో, మంబురుహదళములం బోలు గన్నుల్విపంచీ
స్వరసంకాశంబు పల్కున్, జలదళినిచయస్పర్ధియై యుండు వేణీ
భర, మాతన్వంగి కింద్రప్రముఖనిఖిలదిక్పాలకాభీలశౌర్యా.[20]

ఈ పద్యాన్ని, ఇంకొక రెండింటిని నేలటూరి వెంకటరమణయ్యగారు గుర్తించారట. ఆనెగొందిలో దొరకిన భాస్కర రామాయణపు తాళపత్ర ప్రతిలో అరణ్యకాండలో కొన్ని పద్యాలు కనవచ్చాయట. ప్రభాకరశాస్త్రిగారు సేకరించి ప్రకటించిన పద్యాలలో కొన్ని ఎర్రయ్యగారి రచనల్లాగ కనబడదని నోరి నరసింహశాస్త్రిగారు అభిప్రాయపడుతున్నారు.[21] ఎర్రయ్యగారి రామాయణం తాళపత్రప్రతి ఎన్నడేనా ఆంధ్రుల అదృష్టం కొద్దీ దొరికితే అప్పుడుగాని ఈ నలభైఆరు పద్యాలలో ఏవేవి ఎర్రయ్యగారివో తేలుతాయి. అంతదాకా కవిత్రయంలోని ఒక ప్రముఖుని ప్రశస్తరచన పోయిందే అని విచారమొక్కటే మనకు మిగులు. ఈ రామాయణం చెప్పించే కదా 'అత్యుత్తమ ఖ్యాతిని' పొందినట్టు ప్రోలయ వేమారెడ్డి సగర్వంగా పేరోలగంలో ప్రకటించాడు.

18. నెంబర్లు ఇవ్వలేదుగాని 'హరివంశం'లో ప్రకటించిన రామాయణం పద్యాలలో 20వ పద్యం – పుట. 29
19. అందులోనే 21వ పద్యం
20. అందులోనే 45వ పద్యం;
21. తెలుగు భాషాసమితి – 4వ సంపుటి

ఆ నిండు సభలోనే ప్రోలయ వేమారెడ్డి సవినయంగా ఎర్రయ్యగారిని పూజించి, ''అయ్యా, నీవు సకల భాషాకవిత్వ విశారదుడవు. నిత్య సౌమ్యమతివి. భవ్యుడవు. అందుచేత నీవంటే నాకు పక్షపాతం. హరివంశం భారతపరాంశమని యింపారగా పెద్దలు చెప్పుకొంటారు. ఆ రమ్యకథను నీవు తెలుగుగా నిర్వహించి మాకు తెలుపు!'' అని అడిగాడు. అప్పుడు ఎర్రయ్యగారు ప్రహర్షిత పులకిత దేహులయ్యారు. కృతార్థతా కలిత వృత్తమైన చిత్తంతో ఆ సంప్రార్థన స్వీకరించి -

నన్నయభట్టతిక్కకవినాథులు చూపిన త్రోవ పావనం
బెన్న బరాశరాత్మజమునీంద్రుని వాఙ్మయమాది దేవుడౌ
వెన్నుని వృత్త మీవు కడు వేడుకతో విను నాయకుండ వి
ట్లెన్నియొ సంఘటించె మదభీప్సితసిద్ధికి రాజపుంగవా. (హరి.పూ.1-42)

''కాబట్టి కల్యాణావహమైన మహనీయరచన హరివంశాన్ని చెప్తాను, అవధరించు'' అని ఎర్రయ్యగారు ఉపక్రమించారు. నిజానికి హరివంశం రచించకపోతే భారతరచన పూర్తికాదు. ''హరివంశము భారతమునకు ఖిలము. ఖిలమనగా పరిశిష్టము. ఆదిపర్వము మొదలుకొని స్వర్గారోహణ పర్వమువరకు గల గ్రంథము భారతమనియు హరివంశముతో కలిసిన గ్రంథమును మహాభారతమనియునందురు'' అని వేలూరి శివరామశాస్త్రిగారు వివరించారు.[22] నన్నయగారు తమ పర్వానుక్రమణికలో ''హరివంశంబు భవిష్యత్ప ర్వంబునను శతపర్వంబులు గలిగి''న భారతాన్ని పేర్కొన్నారు. అందుచేత హరివంశం కూడా వివరిస్తేనే భారతాన్ని పూర్తిచేసిన కృతార్థత సిద్ధిస్తుంది.

భారతమంత ప్రశస్తమైన ఈ గ్రంథం పద్దెనిమిది పర్వాల భారతం కన్నా ఎక్కువ పవిత్రమైంది కాబోలు. ఇప్పటికీ నేపాళదేశంలో న్యాయస్థానాలలో సాక్షులు హరివంశం తమ తలమీద పెట్టుకొని ప్రమాణం చేస్తారట.[23]

ఎర్రయ్యగారి హరివంశంలో పర్వవిభాగం లేదు. రెండు భాగాలున్నాయి. పూర్వభాగంలో తొమ్మిది ఆశ్వాసాలూ, ఉత్తరభాగంలో పదీ ఉన్నాయి. పూర్వభాగంలో 2044 గద్యపద్యాలున్నాయి. ఉత్తరభాగంలో 2660 ఉన్నాయి. మొత్తం 4704 గద్యపద్యాలు. ఇప్పుడున్న సంస్కృత హరివంశ ప్రతులనుపట్టి చూస్తే ఎర్రయ్యగారు ప్రభావతీ ప్రద్యుమ్నోపాఖ్యానం, హంసడిభకోపాఖ్యానం వదలివేశారనిపిస్తుంది. ''ఎర్రయ్యకు లభించిన మూలప్రతి ఎట్టిదో నిర్ధారణ చేయనిది అతడేమైన వదలినదీ లేనిదీ తేల్చుటకు వీలులేదు. అతడు ప్రధాన కథలు వదలువాడు కాడు'' అని నోరి నరసింహశాస్త్రిగారు వ్రాశారు.[24]

---

22. హరివంశం పీఠిక - పుట 21.
23. ఇలాగ History of Indian Literature లో (Vol.1.P.452) వింటర్నిట్జిగారు వ్రాశారని రెడ్డి సంచికలో కిళాంబి రంగాచార్యులుగారు వ్రాశారు. పుట - 257
24. తెలుగు భాషాసమితి విజ్ఞానసర్వస్వం - 3వ సంపుటి - పుట 736.

ఎ(ర్రయ్యగారి హరివంశం 'సమస్త విస్తరప్రశస్తం'గానే ఉంది (పూర్వ 1-50). 'కొఱతపడకుండ ప్రత్యక్షపరిచితమైంది', (పూర్వ 1-52). అది విశ్రుతమైన పురాణం. పూర్వభాగంలో ఉన్న కథలు కొన్ని మళ్ళా ఉత్తరభాగంలో వస్తాయి. విష్ణుమూర్తి అవతారాలలో కొన్ని పూర్వ భాగంలోనూ ఉత్తరభాగంలోనూ రెండుసార్లు కథనం చేశారు. ఉత్తర భాగంలో దశమాశ్వాసం తొలినుంచీ 283 పద్యందాకా వామనావతారమే. నిజానికి ఉత్తరభాగంలో అష్టమాశ్వాసంతోనే హరివంశం పూర్తి అయిపోయింది. ఉషాపరిణయమైనాక వరుణుడితో యుద్ధం చేశాక శ్రీకృష్ణుడు ఇంద్రాదిదేవతలతో ద్వారకాపురానికి రావడంతోనే కథ సంపూర్ణమైంది. అందుకే అష్టమాశ్వాసంలో 332వ పద్యంలోనే వైశంపాయనుడు ఫలశ్రుతి చెప్పేశాడు. తరువాత రెండాశ్వాసాలూ నిజానికి హరివంశం కాదు. జనమేజయుని సంతానం గురించి వివరణ. అతనికి వేదవ్యాసులవారు అనాగతం చెప్పడం, జనమేజయుడు అశ్వమేధం చేయడం మొదలైనవి ఉన్నాయి. పూర్వభాగంలో సంక్షేపరూపంలో చెప్పిన అవతారాలను విస్తరించమని జనమేజయుడు వైశంపాయనుడిని కోరడం, అతడు చెప్పడం ఉన్నాయి. చివర మహాభారతాన్ని - అంటే ఆదిపర్వంనుంచి హరివంశం దాకా నూరుపర్వాలు విని ఏ సత్కార్యాలు చేయాలో, ఎన్నిసార్లు వింటే ఏఏ పుణ్యాలు లభిస్తాయో వివరణ ఉంది.

సరసఘృత శర్కరాయుత - పరమాన్నంబులును భక్ష్యపానముల గడున్
బరితుష్టి జేయవలయును - హరివంశము భక్తి విని మహా ద్విజతతికన్.
(ఉత్తర. 10-325)

అని ఎ(ర్రయ్యగారు చెప్పారు. నా ఉద్దేశంలో అక్కర్లేదనిపిస్తున్నది. ఏమంటే ఎ(ర్రయ్యగారి హరివంశం వింటే చాలు పంచభక్ష్యపరమాన్నాలతో భోంచేసినట్టు కడుపు నిండిపోతుంది. అంత తృప్తినిచ్చే కవిత్వం ఇందులో ఉంది. పోతరాజుగారికి ఒరవడి పెట్టిన కృష్ణలీలలు చదువుతూంటే సస్యశ్యామలమై పాడిపంటలతో వర్ధిల్లే పచ్చని తెలుగు పల్లెటూళ్లలో స్వచ్ఛమైన ప్రాణవాయువులను పీలుస్తున్నట్టు ఉంటుంది.

అరణ్యపర్వశేషం ఎత్తుగడలో ఎ(ర్రయ్యగారు 5 పద్యాలలో శారదాగమనం వర్ణించారు. నన్నయగారి శైలితో తులతూగడానికి ''శారదరాత్రులుజ్జ్వల'' అన్న పద్యానికి తరువాయిగా చెప్పడం వల్ల ఆ ధోరణి వేరు. హరివంశంలో పది పద్యాలలో శరన్నవసంపదను వారు వర్ణించిన తీరే వేరు. శరదంబరం రాజచిహ్నాలతో అమరిందట. చూడండి.

మును వర్షోదక ధారలన్ ముదముతో మూర్ధాభిషేకంబు గై
కొని శుభ్రాభ్ర కిరీటశోభి యయి సంక్షుభ్య స్మరాళావళుల్
ఘనవాలవ్యజనంబులై మెరయగా గాంతేందు బింబాతప
త్రనిరూఢిన్ శరదంబరం బమరె నుద్యద్రాజ చిహ్నంబులన్. (పూర్వ. 7-111)

సముద్రపు కెరటాలను కౌగలించుకొనడానికి ఏరులు ఉత్తరపడుతున్నాయి.

తెలినవ్వు ల్వొలిదమ్మి నెమ్మొగములం దీపార నేపారు చూ
పులు దారై మదలోల భృంగరచన ల్వొల్వార వీచీ భుజా
వళి యాలింగనకేళి కుత్తలపడన్ వార్ధిందగం గూడుచో
గలకల్దేరి తనర్చె నేరులు శరత్కల్యాణ కల్యాకృతిన్. (పూ. 7-112)

ఏడాకుపొన్నకొమ్మల వావిలిపూతీగెలు తొగపువ్వులతో ఒప్పారే కాసారాలు గుప్పించి వర్ణించిన ఈ శరత్కాల వర్ణన ఎంతో సహజంగా ఉంది. సంస్కృత కవి సంప్రదాయానుసారంగా వచనంలో ''...శంకరవిహారంబులుంబోలె ననపేతవృషంబులు, శ్రుతివిభవంబులుంబోలె లోకోద్ధారకంబులు, విష్ణుకీర్తనంబులుంబోలె శ్రవణ మంగళంబులు'' అంటూ సుదీర్ఘంగా వర్ణించినా అది ఆ కాలంలో కొత్తగా పాకుతున్న సాహిత్యఫేషను, తిక్కనగారు విరాట పర్వంలో ''వివేక రహితహృదయంబునుంబోలె దమో దూషితంబును, విగద్ధవనితా ప్రేమంబునుంబోలె దుర్ని రూపంబును...'' అని ఒక వచనం వ్రాశారు (విరాట. 2-325). దీనిని అనుసరించి ఇక్కడ ఎఱ్ఱయ్యగారు, ఉత్తర హరివంశంలో నాచన సోముడు ఈ వచనాలు వ్రాశారు. అనంతర కవులు గుడ్డిగా అనుకరించారు. ''ఇట్టి వచనములు భావపుష్టిలేక శిరోవేదనా జనకములగుగాని కవితాకళకెంతమాత్రముపయోగపడవు'' అని వేలూరి శివరామశాస్త్రి గారు వ్రాశారు.[25] ఇది అక్షరాల నిజమే. అయితే ఎఱ్ఱయ్యగారు తెలుగుతనం వుట్టిపడే వచనాలు వ్రాయడంలోనూ సిద్ధహస్తులు. వానా వంగుడూ వస్తే గోవులూ గోపాలురూ ఎన్ని పాట్లు పడతారో కళ్లముందు చిత్రించారు. చూడండి :

''అట్టి సమయంబున నిరంతర ధారాపాతంబునం దడిసి నలుదెసలం బరచి వ్రేయు వాయువున గొందలపోయి యొండొంటి చాటున కొదింగి కడగానక నిలువంబడియు గొమ్ములొడ్డి కన్నులు మోడ్చి కడరెప్పల నీళ్లుగారం దలలు డిగ్గవైచి నెమరులుడిగి మూర్ఛలువోయినట్లుండియు వడకు సొచ్చి యరచు క్రేపుల ముందటబెట్టుకొని గంగడోళ్ళం బొదువుకొని యంభారవంబుల కాక్రందించియు వెల్లువకతన డెంకి లేక నిలువు జాలుండియుండి యోటరికాళ్లు వడంక సైరణ దప్పి నెరిదప్పం బెనురొంపిలో నంద్రెళ్ళియు బెలుచ మెరచు మెరుంగులం జెదరి యదరంట నురుముపేరురుముల బమ్మెరపోయి మందపట్లు విడిచి యిట్టునట్టు నుందెరల దిరిగియు నాహారంబు లేక యీదచాటువడి మేయంజాలక యెత్తువడి తెవులుగొంట్లు ముదుసళ్ళును నుడియ బలవంతంబులైనవియు జేవదక్కియు బసులు పెక్కు బాధలం దల్లడిల్ల బశుపాలురును గుడిసెలు గూలి బండ్లు (దడబడం) దూలి సొమ్ములు శిథిలపడి పాకాదిక్రియలు మాలి దోహదంబులు నిలిచి మహాక్లేశంబున గొందలంబునొంద నందరు కృష్ణకృష్ణ కావుము, గోవులకు మాకును దిక్కు నీవ యని యాక్రోశింప''. (పూర్వ. 7-171)

శ్రీరంగం శ్రీనివాసరావుగారు ఒక అనువాదంలో ఇలా వ్రాశారు :

25. ''సోముడు'' - ఉత్తర హరివంశ విమర్శ అనే పుస్తకంలో - పుట-23

అంతేలే పేదల కన్నులు
అశ్రువులే నిండిన కుండలు
తుఫానులో తడిసిన జడిసిన
గోమాతల కన్నుల తమ్ములు.[26]

ఎర్రయ్యగారు వర్ణించిన సంపూర్ణ చిత్రం కళ్లముందు కనబడ్డాక దీని అర్థం బోధపడుతుంది. ఎర్రయ్యగారు చేసే వర్ణనలలో సూక్ష్మాంశాలు ఉంటాయి. ఏదీ ఒదిలెయ్యరు. పాఠకుణ్ణి విసిగించరు. చూడండి. కాళీయుని మడుగులోనికి దుమికేముందు కృష్ణుణ్ణి ఎలా వర్ణిస్తున్నారో-

ఒడి సిక్కుగొన జెక్కి మడిసంది నునిచిన తలుగులు ద్రాళులు దొలగవైచి
డాకేలబట్టిన ఢక్కయు జంకదాల్చిన వేణువును నన్యుచేతి కిచ్చి
పొలుచు పింఛపుదండ పుచ్చి వెండ్రుకల నొప్పెడు జడగా నల్లి ముడి యమర్చి
మొలగచ్చగట్టుపై మలగిన పచ్చని నునుగొంగు దిండుగా నునిచి చుట్టి
చెప్పు లూడ్చి కదంబకస్ఫీతతరువు
బ్రాకి పెడబొబ్బ యిడి యార్చి యాకగొనక
మడువులోనికి నురికె నున్మత్తలీల
నెగసి తత్తోయకణములు నింగిబొదువ. (పూర్వ. 7-13)

ఎర్రయ్యగారికి ఒక ఊరు నుంచి ఇంకొక ఊరు వలస వెళ్లడం బాగా అనుభవం. వేగినాడులో కరాపర్తి నుంచి గుడ్లూరు, అక్కడనుంచి చదలువాడ, అక్కడనుంచి అద్దంకి వారు మారారు. వ్రేపల్లె నుండి బృందావనానికి వలస వెళ్లే గోకులాన్ని ఎలా వర్ణించారో చూడండి.

బండ్ల మెట్టింపుపై బరువు లెక్కింపుమీదళ్ళను బూన్పు కావళ్ళ నునుపు
పదిలంబుగా నేతిపనటులు క్రొత్తగోనియల బియ్యము వడ్లు నెమిలివడ్లు
నొదివిరి ప్రాలును నొనరంగ బోసి చాపలు మంచములు మీద బలియగట్టు
దామెనలును వల్లెత్రాళ్లను దలుగులు గవ్వము ల్గొడవలి కత్తిసూడు
గొడుపు వాదోళ్ల మొదలుగా జెడకయుండ
వలయు ముట్లెల్ల దెమ్ముకంటలపుటెడ్ల
నాయితము సేయు ముదుసళ్ళ నాడు వారి
గంపమోపులు ముందర గదలు మనుము. (పూ. 6-22)

అని మఱియు బెక్కుభంగుల యెలుంగుల నొక్కకోలాహలం బెసంగ మందయంతయు నొక్క పెట్ట కదలి లావుమానుసులు కదుపులం గొని ముందరం బోవ బిరుంద బండ్లను బండ్లజాడం దక్కిన ప్రజయును నడువం దరుణతరుణీ జనంబు లొండరుల తోడి

26. మహాప్రస్థానం

మేలంపుటాలాపంబులం బ్రమోదకరంబులగు వినోదంబుల సదటుమీరి కడచి చనం బంగ్వంధజరత ప్రముఖులు గ్రుస్సియోలాకుపడ నెడనెడం గావలియై తగువారు నడిపింప నవ్విధంబునం జని బృందావనంబు ప్రవేశించి యుచిత ప్రదేశంబులు నివేశంబులుగా నిరూపించి గోపాలముఖ్యులు నిలువ నాక్షణంబ. (పూర్వ. 6-23)

ఈ వలసలో ఎంత తెనుగుతనం కనబడుతుందో శ్రీకృష్ణుని బాలక్రీడాభివర్ణనలో అంతకు రెట్టింపు ముందే చూపించారు. చూడండి తెలుగు ఇళ్లలోని పసిబిడ్డగా కృష్ణుణ్ణి ఎలా మార్చారో

పాలుపారగా బోరగిలి పాన్పునాల్గుమూలలకును వచ్చును మెలగి మెలగి
లలి గపోలంబులు గిలిగిలింతలు పుచ్చి నవ్వింప గలకల నవ్వి నవ్వి
ముద్దులు దొలకాడ మ్రోకాల గేలను దడవుచు నెందును దారితారి
నిలుచుండబెట్టి యంగుళులూతసూపగా బ్రీతి దప్పడుగులు వెట్టి పెట్టి
యన్నగంటి ధంద్రినిగంటి నయ్యగంటి
నిందు రావయ్య విందుల వింద వనుచు
నర్థిదనుబిలువగ నడయాడియాడి
యుల్లసిల్లె గృష్ణుడు శైశవోత్సవముల. (పూ. 5-193)

యశోద బాలకృష్ణునికి వెన్న, పాలు ఎలా పెట్టేదో, ఏం చేసేదో వర్ణిస్తున్నారు చూడండి.

ముదముతో గడ్పునకు బెట్టి మూతిజిడ్డు
మోముననను మేన జమరి యమ్ముదిత యక్కు
గలయనిమురునేనుగు దిన్న వెలగపండు
నాగ నొప్పు గృష్ణుడు చారునయను డగుచు. (పూ. 5-197)

ఈ పద్యంలో యశోదాకృష్ణులు పూర్తిగా తెలుగువాళ్ళయ్యారు. ఈ ఘట్టం అంతా చదివి ఆనందించాలేగాని ఒకటి రెండు ఉదాహరించినందువల్ల తృప్తివుండదు. ఇల్లిల్లు తప్పక కొంటెకృష్ణుడు చేసిన దుండగాలు ఎఱ్ఱయ్యగారు విపులంగా వర్ణించారు. వ్రేపల్లె అంతటినీ కృష్ణుడు 'నేలకుం గోలకుగా'[27] చేస్తున్నాడని విసుగెత్తిన గోపికలు యశోద వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు.

ఎక్కడికేనియు బోయెద - మిక్కష్టపు బాటువడగ నే మోర్వము నీ
చొక్కపు గొడుకును నీవును - నొక్కతలయు నొక్క మూరి నుండుడు నెమ్మిన్.
(పూర్వ. 5-231)

ఈ పద్యమే ఉత్తరోత్తరా పోతరాజుగారికి ఒరవడి అయింది.

27. ఇవే మాటలు ఎఱ్ఱయ్యగారు అరణ్యపర్వ శేషంలో చెప్పిన రామకథలో వాడినట్టు మనం చూశాం.

ఓయమ్మ నీకుమారుడు - మాయిండ్లను పాలుబెరుగు మననిడమ్మా!
పోయెద మెక్కడికైనను - మాయన్నల సురభులాన మంజులవాణీ!

(భాగ. పూర్వ. 10-330)

పోతరాజుగారి యశోద ఈ ఫిర్యాదు విన్నాక గోపికలతో ఇలా అంటుంగి:

అన్యమెరుగడు, తనయంత నాడుచుండు
మంచివాడీత, డెగ్గులు మానరమ్మ
రామలార త్రిలోకాభిరామలార
తల్లులార గుణవతీమతల్లులార! (భాగ.పూ. 10-333)

అని వారల నొడంబరచి పంపించిందట. వాళ్ల అందాన్నీ గుణాలనీ ఎంత పొగడినా 'మావాడు మంచివాడు, మీరు ఎగ్గులుమానండి' అంటే, దెబ్బలాటకు వచ్చిన అమ్మలక్కలు వెళ్లిపోతారా? ఎఱ్ఱయ్యగారి యశోద ఏం చేసిందో చూడండి.

మీసేగు లెల్ల నచ్చెద - వేసరకుడు మీరు లేక వేగునె మాకుర్
జేసెం జేయడు బాలకు - డాసురపుంబనులు నిజము లనియెదరు బలే!
బొంకాడెడు గరితలె మీ- రింకిట జూచుకొను డితని నెట్లడిచెదనో
కింకయును గలకయును మది - శంకయుబోవిడిచి చనుడు సదనంబులకున్.

(హరి. పూ. 5-233, 234)

'మీకు కలిగిన నష్టాన్ని ఇచ్చుకుంటాను' అని ముందు చెప్పింది. 'మీరు అబద్ధమాడరు' అంది. ''వీడిని ఎలా అణచేస్తానో చూడండి. మీ కనుమానం వద్దు. ఇళ్లకు వెళ్లండి'' అంది. ఇంత చెప్తేకదా ఇంటిమీద పడి దెబ్బలాటకు వచ్చినవాళ్లు వెళ్లారు! ఎఱ్ఱయ్యగారి యశోద లోకజ్ఞురాలు. వాళ్లు వెళ్లగానే కొడుకును ఆమె కూడా పోతనగారి యశోదలాగ దండించలేదు. పైగా లాలించింది.

ఏలా యిందును నందు బారెదవు నీకేఁబ్రాతియే వెన్నలుం
బాలుం బాలక చాలజేసె నిదె నాపాలిండ్లు పెన్సోనలై
పాలొక్కుచ్మడి గ్రమ్ముచున్నవి నీ భావంబునం దృప్తిగా
గ్రోలం జాలవె యింతవట్టకట యీగోసేల చుట్టాలలోన్? (హరి.పూ.5-237)

తల్లి చనుబ్రాలు గుక్కెడైనా అవి తక్కినవాటితో పుట్టెడుకు సమానమట. ఈ సామెత అబద్ధమైందిరా నాయనా అని వాపోయింది. పాలు ఇచ్చాక

విడిచిన నెప్పటి చని యా
గడములు సేసెదవు నిన్ను గాచుట మాకుం
గడుప్రేగు దుర్జనుని నిల
దడయక యెరుకమెయి ద్రోవు తగు మందెందున్. (5-243)

ఇందు రమ్మని మెత్తని బింకంబునం గొడుకుం గేలు పట్టి యొయ్యన తివిచికొనుచుంబోయి పెయ్యదామెన త్రాటం గొని శకటసమీపంబున బలితంబగు రోల సుదరంబు బంధించి నున్నని సెలగోల చేతంగొని (5-244)

కదలిన మొత్తుదు నెక్కడ
గదలెద వటు గరదులాడ కదలుసమ యేజూ
చెద ననుచుబోయి యిమ్ముల
ముదితనిజకుటుంబకార్యముల దత్పరయై. (5-245)

'కదిలితే మొత్తుతాను, ఎక్కడకు వెళ్తావు, కదలు చూస్తాను' అని అన్నది కాస్తా ఇంటిపనులలో మునిగిపోయింది. ఎఱ్ఱయ్యగారి యశోద అచ్చంగా తెలుగుతల్లి! ఈ సొగసులన్నీ ఎఱ్ఱయ్యగారి హరివంశం చదివితే తెలుస్తాయి. అయితే దురదృష్టంకొద్దీ తెలుగువాళ్ళు తమ కవులపేర్లను స్మరిస్తారేగాని ఆ కవుల రచనలు శ్రద్ధగా చదవరు. ఆంధ్రుల ఔదాసీన్యం గురించి వేలూరి శివరామశాస్త్రిగారు ఏమంటున్నారో చూడండి :

''1901లో అచ్చయిన ప్రతి మరల 1960లో అచ్చుగుచున్నదనిన రమారమి 60 ఏండ్లకుగాని వేయిప్రతులు అమ్ముడుపోలేదన్నమాట. గ్రంథమా భారతశేషము! కవియా ఎఱ్ఱాప్రెగడ! కవిత్రయంలో నొకడైన ఎఱ్ఱయ గ్రంథమునే తెలుగువారు చదువుకొనుట లేదన్నమాట.''[28]

కవిత్రయంవారి ప్రయోగాలే మాకు ప్రమాణమనే పండితులు సైతం ఎఱ్ఱయ్యగారి హరివంశం బాగా శోధించలేదన్న సంగతి స్పష్టం. శబ్దాలంకారాల మోజులో పడ్డ అనంతర పాఠకులు ఎఱ్ఱయ్యగారి హరివంశానికి చిన్న పీట వేసి నాచన సోముని ఉత్తర హరివంశం వైపు మొగ్గడమే కవిత్రయంలో మూడవ మనీషి పైన ఉన్న భక్తిని చూపెడుతుంది. ఎన్నో విధాలుగా పోతరాజుగారికి ఒరవడిపెట్టిన ఎఱ్ఱయ్యగారి హరివంశంలోని కృష్ణలీలలకు దశమ స్కంధంలోని పద్యాలంత ప్రచారం జనసామాన్యంలో లేకపోవడం శోచనీయమే!

నడకుదుటి వీరరాజుగారికి ఎఱ్ఱరాజుగారి మీద ఏ మాత్రం గౌరవం లేకపోవచ్చునుగాని వారి ధర్మమా అని మన పండితులు ఎఱ్ఱయ్యగారి గురించి చర్చలు చేశారు. ఎఱ్ఱాప్రెగడవారు నాచన సోముని తరువాతివారనీ, ఆయన సోముని ఉత్తర హరివంశం చదివి తమ హరివంశంలో అనుకరించారని వీరరాజుగారి వాదం. అయితే ఎఱ్ఱయ్యగారు, నాచన సోముడు సమకాలికులని మన విమర్శకులలో చాలామంది తేల్చారు.

ఎఱ్ఱయ్యగారి పైన ఎంతగానో పరిశోధనలు చేసిన వేలూరి శివరామశాస్త్రిగారు నిష్పక్షపాతంగా నలభై ఏళ్ళ కిందట ఇలా వ్రాశారు :

---

28. హరివంశం – పీఠిక, పుట. 25

''నాచనసోముని యుత్తర హరివంశమును నెఱ్ఱాప్రెగడ హరివంశమును నొకమారు గ్రమక్రమముగా జదువుచుబోవగా సోమననే యెఱ్ఱన యనుకరించినటులు నాకు దోచినది. విద్యాస్నాతకులు సత్యమునకు నిశ్చాయకు లగుదురుగాక!''[29]

అయితే నాకు మాత్రం సోముడే ఎఱ్ఱయ్యగారిని అనుకరించాడనిపిస్తున్నది. సోముని ఉత్తర హరివంశాన్ని ఎఱ్ఱయ్యగారు చదివివుంటే అతడు అనువదించిన హంసడిభకోపాఖ్యానం వదిలివేయరుకదా. తమ మూలప్రతిలో అది లేకపోతే కర్ణాటక మండలం నుంచి తెప్పించుకొనరా! రెడ్డిరాజ్య స్థాపకుని ప్రాపకంలో ఉండి అతని అభ్యర్థన మీద హరివంశాన్ని విస్తరప్రశస్తంగా చెప్పదలచిన ఎఱ్ఱయగారు ఈ ఘట్టాన్ని సోముని హరివంశం చదివితే ఎంతమాత్రం వదలరు. ప్రోలయ వేమారెడ్డికి చెప్తే అడిగిన వెంటనే అంచె గుర్రాల మీద నాచన సోముని మూలాన్ని తెప్పించడా? ఎఱ్ఱయ్యగారికి, నాచన సోమునికి గల తేడాపాడాలు, పోలికలు అతని చరిత్రలో చెప్పుకొందాం. ఇద్దరి ఉత్తర హరివంశాలనూ అక్కడే అక్కడక్కడ తైపారు వేద్దాం.

ఎఱ్ఱయ్యగారు నాలుగు పుస్తకాలు వ్రాశారు. అవి వరుసగా ఇవి :

1. అరణ్యాపర్వశేషం 3. రామాయణం
2. నృసింహపురాణం 4. హరివంశం

ఒకటీ రెండూ ఒక జంట. మూడోదీ నాలుగోదీ ఒక జంట. నృసింహపురాణంలో అంతకు పూర్వం అరణ్యాపర్వశేషోన్నయం చేసినట్టు చెప్పారు. హరివంశంలో దానికి ముందు రామాయణం రచించినట్టు చెప్పారు. ఈ నాలుగింటిలో ఏ జంట ముందు వ్రాశారో, ఏ జంట తరువాత వ్రాశారో నిర్ణయించడం కష్టమే. అయితే మనం వేసుకొన్న నెంబర్లవారీగానే రచన జరిగి ఉండడానికి ఆస్కారం లేకపోలేదు. ఏది ఏమైనా హరివంశ రచన క్రీ.శ. 1335కు పూర్వమే జరిగి ఉండాలి. ప్రోలయ వేమారెడ్డి ఆ సంవత్సరంలో శ్రీశైలానికి, అహోబలానికి సోపానపంక్తి నిర్మించాడు. ఈ సంగతి ప్రప్రథమంగా ప్రోలయ వేమడి చీమకుర్తిశాసనంలో కనబడుతుంది. అది క్రీ.శ. 1335లో వేయించిన శాసనమే. హరివంశంలో ఎఱ్ఱయ్యగారు ప్రోలయ వేముని దానధర్మాలను ఈ విధంగా వర్ణించారు :

అగ్రహారములు విద్యా తపోవృద్ధ విప్రులకిచ్చి యజ్ఞకర్తలుగ బనిచె
గొమరార జెరువులు గుళ్లు ప్రతిష్ఠించి లోకసంభావ్యంబులుగ నొనర్చె
నిధులు నల్లిండ్లును నిలిపె దోటలు సత్రములు చలిపందిళ్లు వెలయబెట్టె
హేమాద్రిపరికీర్తి తామిత వ్రతదాన నివహంబులన్నియు నిర్వహించె
జేసె జేయుచు నున్నాడు సేయనున్న
వాడు పునరుక్త కృతి శుభావలుల నెల్ల
ననగ శ్రీవేమవిభునకు నలరు పేర్మి
వశమె వర్ణింప దద్భాగ్యవైభవంబు. (హరి. పూర్వ. 1-19)

29. సోముడు – ఉత్తర హరివంశ విమర్శ, పుట. 15

హరివంశ రచన క్రీ.శ. 1335 తరువాత జరిగితే శ్రీశైల అహోబలసోపాన నిర్మాణం గురించి ఇందులో చెప్పేవారు కదా! అందుచేత ఆ మెట్లు కట్టించడానికి ముందే హరివంశ రచన జరిగింది అని చెప్పాలి. ఈ పద్యంలో నిధులు, నల్లిండ్లు అనే మాటలున్నాయి. నల్లిండ్లు అంటే అగ్రహారాలు అని నిఘంటువులలో అర్థమిచ్చారు. కాని నల్లిల్లు అంటే ఎఱ్ఱయ్యగారి కాలంలో అగ్రహారం కాదేమో. పద్యం ఎత్తుగడలో అగ్రహారాన్ని చెప్పారు. మళ్ళా అదే అర్థంలో నల్లిల్లు వాడవలసిన అవసరం ఏముంది? వేదం వెంకటరాయశాస్త్రి గారు దీనికి చక్కని అర్థం ఇచ్చారు.

''నల్లార్ అంటే వేదవిదులని అర్థం.... 'నల్లవారి'కి ధర్మవివాహం చేయించి భూములిచ్చి ఇండ్లు కట్టించి ఇచ్చి వారి ఇండ్లను (కుటుంబములను) నిలుపుటచేతనే (పెండ్లిచేసి వారిని ఒక్కొక్కరిని ఒక ఇంటి వాంఢ్రనుగా చేయుటచేతనే) నల్లిండ్లు నిలుపుట మొదట ధర్మవివాహముగా నుండి తర్వాత నల్లిల్లు అగ్రహారము అను వ్యవహారమేర్పడుటకు కారణ మిట్లుండునని నాకు తోచినది'' అని వివరించారు.[30]

ఎఱ్ఱయ్యగారి కాలానికి 'నల్లిండ్లు నిలుపుట' అనేది అగ్రహారానికి విభిన్నమైనదని చూశాం. ప్రాచీనార్థాన్నే వాడిన ఎఱ్ఱయ్యగారి కాలాన్ని మాత్రం వేదం వేంకటరాయ శాస్త్రిగారు క్రీ.శ. 1364-86 అన్నారు.[31] నాచన సోముని కాలాన్ని 1347 అన్నారు. మడికి సింగన అదేకాలంలోనివాడనీ, సింగన ఎఱ్ఱయ్యగారిని పేర్కొనలేదు కాబట్టి వారు అర్వాచీనులని వేంకటరాయశాస్త్రిగారి అభిప్రాయం. ప్రోలయ వేమారెడ్డి కాలాన్ని 1325-1353 అని సరిగ్గా ఇచ్చి అతడికే హరివంశాన్ని అంకితమిచ్చిన ఎఱ్ఱయ్యగారిని వేదంవారు 1364-86కు తీసుకొనిపోవడానికి కారణం కనబడడం లేదు. ఇది అనవేమారెడ్డి కాలం. ఇతడు ప్రోలయ వేముని కొడుకు. హరివంశంలో స్పష్టంగా ప్రోలయ వేముని పేరు యతిప్రాసల స్థానాలలో ఎన్నెన్నో చోట్ల వస్తుందే! ప్రోలయ వేముడికి తప్ప మల్లారెడ్డి అనే తమ్ముడు లేడు కదా, మరి వేదంవారు ఇలా ఎందుకు నిర్ణయించారో!

ఈ 'అగ్రహారములు' అనే పద్యంలో 'పునరుక్తకృతి శుభావలులు' అనే మాటను మీరు గమనించే ఉంటారు. పునరుక్తిలాంటిదే ఆమ్రేడితమనే మాటను కూడా లాక్షణికులు వాడుతారు. ఎఱ్ఱయ్యగారు ఇది రెండుసార్లు వాడారు. చూడండి.

ఆడితి బేలమాట లవియన్నియు వమ్మయిపోయె నస్త్రసం
తాడన శక్తి గీడ్పడియె దథ్యము బ్రాహ్మణశక్తి యెక్కుడే
నోడుదు వామదేవునకు నోజనసంఘములార సజ్జనా
మ్రేడిత కీర్తి నిమ్ముని సమిత్రనిషూదను నాశ్రయించెదన్. (అరణ్యా. 4-358)

30. నన్నెచోడుని కవిత్వం. పుట 49
31. అదే పుస్తకంలో, అనుబంధం (అ), పుట-9

హరివంశాన్ని ఎనిమిదిసార్లు వింటే వచ్చే పుణ్యాన్ని ఇలా చెప్పారు :

వేడుక వేల్పుదొయ్యలుల వీగు చనుంగవమీద మన్మథ
క్రీడల వ్రాలి నిద్రల సుఖించి ప్రభాతములందు సాదరో
త్తాడన లబ్ధతచ్చరణ తామరసాంచిక నూపురంబు లా
మ్రేడితనిస్వనంబులయి మెల్పున దెల్పగనొందు భోగముల్.

(హరి. ఉత్తర. 10-306)

ఒక కావ్యంలో వ్రాసిన సంగతిని ఇంకొక కావ్యంలో అప్రయత్నంగా వాడుకోవడం కవులకు నైసర్గికమే. ఎర్రయ్యగారు కూడా అలాగే చేశారు. హరివంశంలో కాలనేమి దిక్పాలకుల్ని జయించి మొగము మీద చప్పటులు పెడతాడు (పూర్వ. 4-154). నృసింహ పురాణంలో ఇంతకుముందు హిరణ్యాకశిపుడు కూడా అలాగే మొగము మీద చప్పట్లు పెట్టడం ఎర్రయ్యగారు వర్ణించారు. చిన్నచిన్న పాఠాంతరాలతో ఒకే పద్యం రెండు కావ్యాలలోనూ కనబడుతుంది.

మెచ్చుకఁ యెదురైన మృత్యువుమెడ ద్రొక్కి
క్రొవ్వాడికోరలు ద్రెవ్వ రాచి
కిస్కతో జంకించి కింకరకోటుల[32]
బొంకంబు చెడ గొంకునోప నడిచి
మదురువుగొని మారుమలయు కారెనుపోతు
నొడిసి కొమ్ములు పట్టి ముదుగద్రోచి.[33]
మండెడు పటుకాలదండంబు చేతుల
బిసికి వేడిమి యార్చి బెండుచేసి
[34]పిదప్రాణుల బొరిగొను బిరుదు మగడ
పగుదు వీవని యందంద మొగముమీద
జప్పటులు నెట్టె దైత్యుడు[35] జమునిలావు
జేవయును బొల్లుగా గాకుచేసి విడిచె. (నృసింహ. 2-119)

మొగం మీద చప్పట్లు పెట్టడం జాతీయంలాంటిమాట. ఎర్రయ్యగారు సామెతలు, జాతీయాలు వాడడంలో సిద్ధహస్తులు. మూడు రచనలలోనూ కోకొల్లలుగా వాడారు. కొన్నింటిని మచ్చుకు చూద్దాం.

అరణ్యాపర్వశేషం :

నోరరుగంగ ప్రేలుట (4-197), ఎరువు సతమగున్ (4-347), కొరవిగొని వెర్రినే తల గోకికొనగ (5-19), శుభం బిచ్చునె చావు లెందును (6-53), ఏనుగుకు సిళ్లచూపడం (6-175),

32. 'కిన్నెరగణముల' అని హరివంశంలో పాఠాంతరము.
33. 'మడగ ద్రొబ్బి' అని హరివంశంలో
34. 'పిరికిప్రాణుల' అని హరివంశంలో ఉంది.
35. 'యాతడు' అని హరివంశంలో పాఠాంతరం.

పులిగోలంగొని వ్రేయడం (6-177), చెయ్యిపెట్టి కలచినట్లు అవడం (6-194), వీనులు గొరవింగొని చూడినయట్లు (6-303), పిడుగడచిన క్రియ (6-303) బెబ్బులి మీసలురక యెవ్వాడు నేడూచికొనియె (6-315), నేలకుంగోలకుం దేవడం (7-96), చెవుల గొరవిగొని చూడినట్లు (7-118), మొదలు నరక నొరగు కదళిచందంబున (7-158), సడికంటె చావు మేలు (7-293).

నృసింహపురాణం :

పుక్కిటి బంటి నీట (2-20), నాలుకాడు (2-28), తోడునీడ (2-49), చిందిలి మందిలి (2-53), అడవిగాచిన వెన్నెలలు (2-90), చెవిటికూదిన సంకువిధమున (2-90), త్రవ్వితండముగొను (2-116), శంకయు గింకయు (3-61), కుంపటిలో తామర మొలచినక్రియ (3-127), మూడేండ్లలేని సద్బుద్ధి ముప్పదేండ్లలేదు (3-151), ఒక గ్రుడ్డు మురిగిపోయిన నేమి (4-25), కాదు కూడదు (4-28), నిప్పున జెదలంటునె (4-32), నోరుమూయ పెడతల వాపోయె (4-37), నోరెత్తు (4-39), దేవుడు గీవుడు (4-95), చదివిన యెరుకలకు సరియె చదువని యెరుకల్ (4-105), గొడ్డుపోయె (4-135), చప్పిడినోరు (4-173), తామరపాకున నీరువోలె (4-182), బలవంతపు వెర్రి (5-74).

హరివంశం :

కరతలామలకం (పూర్వ. 1-13), ఏనుగు తిన్న వెలగపండు నాగ (5-197), బంగారము బోలెడు కొడుకు (పూ. 5-248), పుట్టిబుద్దెరుగుట (పూ. 6-3), ముప్పునకు నోమదయ్యె నే (పూ. 7-42), నిప్పు నీరు నొదివి నట్టులున్న (7-67), ఆ బాలవృద్ధులు (7-145), చీమ చిటుక్కను (ఉ. 5-21), హస్తి మశకాంతరం (ఉ. 5-75), గాలిదాకని దీవియ కరణి వెలుగు (ఉ. 5-200), విచ్చేయుము (వెళ్ళు అను వెటకారపు అర్థంలో) (ఉ. 6-129), ఏరు విడిచి చిక్కులు పారుటిదియ (ఉ. 6-153), తలపక బువ్వల కతనం దలకెక్కెను; నార లను విధంబున (ఉ. 8-303), తగవు - ధర్మము (ఉ. 10-197). కడుపు చల్లనయ్యెడు (ఉ. 10-216).

ఎఱ్ఱయ్యగారికి ప్రబంధపరమేశ్వరుడనే బిరుదు వుందని తెలుసుకున్నాం. అనంతర ప్రబంధకర్తలు ఎవరెవరు ఎఱ్ఱయ్యగారిని ఎలా అనుసరించారో చూద్దాం.

ఎవ్వరిదాన వంబుజదలేక్షణ యేకత మిట్టు లేల నీ
వివ్వన భూమియందు జరియించెదు నావుడు దండ్రి పంపునం
దివ్వనభూమియందు జరియించెద సద్వరు గోరి కన్య నే
నెవ్వరిదాన గావలయు నేర్పడ జెప్పుము రాజనందనా! (అరణ్యా. 4-324)

దీనిని అల్లసాని పెద్దనగారు మనుచరిత్రలోనూ (2-39), మడికి అనంతయ్యో ఎవరో విష్ణుమాయానాటకంలోనూ (3-149) అనుకరించారు.

తనను కామించిన రావణాసురునితో సీతమ్మ పర్ణశాలవద్దనే ఇలా అంటుంది :

మహితకమలమధుర మధురసాస్వాదన
పరవశాత్మయైన భ్రమరకాంత
రిత్తబుద్ధి నకట రేగుపువ్వుల రసం
బాను నెట్లు బేలవైతిగాక? (అరణ్య. 6-341)

దీనిని పోతరాజుగారు 'మందారమకరందమాధుర్యమునదేలు' అనే పద్యంలో అనుకరించినట్టుంది (భాగ. 7-150). అయితే ఈ పద్యం పోతరాజుగారికి ప్రోద్బలం ఇతర కవుల రచనలోంచి కూడా వచ్చింది. ఎర్రయ్యగారిని శ్రీనాథుడు ఎంతగానో ప్రశంసించి 'పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని దేవ సూక్తివైచిత్రినొక్కమాటు' అని చెప్పాడు (కాశీ. 1). శ్రీనాథుడు ఎక్కడ ఎర్రయ్యగారిని అనుకరించినదీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చూపించారు. ఈ క్రింది పద్యం ఎఱ్ఱాప్రెగడగారి రామాయణంలో లక్ష్మణమూర్ఛ ఘట్టం లోనిది.

కందక గాజువాఱక మొగంబు వికాసము జెందె జేతులీ
యందము లైన కాళ్ల నరుణాంబురుహంబుల లీల జూడ జె
న్నొందెడు జీవహీనులిటు లుండరు ప్రాణముతోడ నున్నవా
డిందు సహోదరుండు ధరణీశ్వర నీకు విషాద మేటికిన్?

ఇందులోని సూక్తివైచిత్రిని శ్రీనాథుడిలా పుణికి పుచ్చుకున్నాడు.

కందక గాజువారక వికాసము డిందక మందహాస ని
ష్యందము చెక్కుటద్దముల నారక నెమ్మది నిద్రపోవున
ట్లందము నొందె ధాత్రి సిరియాలకుమారుని వక్త్రచంద్రు డా
నందము నొందె నప్పు డెలనాగ మనంబును భర్తచిత్తమున్. (హర. 2-118)

ఎర్రయ్యగారి కవితాగుణాలలో శబ్దవైచిత్ర ప్రముఖమైనదని విక్రమార్కచరిత్ర వ్రాసిన జక్కన మాటలవల్ల తెలుస్తుంది. పూర్వకవి స్తుతిలో ఇలా నుతించాడు.

ఈత్రయి దా బ్రబంధపరమేశ్వరుడై విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వమున శేషము శ్రీనరసింహరామచా
రిత్రములున్ బుధవ్రతగరిష్ఠత నెర్రయ శంభుదాసు డా
చిత్రకవిత్వవాగ్విభవజృంభితు గొల్చెద భక్తియుక్తితోన్. (విక్ర. 1-14)

ఇందులో జక్కన హరివంశాన్ని పేర్కొనలేదు. కాబట్టి జక్కయ విక్రమార్కచరిత్ర రచించేనాటికి హరివంశ రచన జరగలేదని చాగంటి శేషయ్యగారు భావించారు.[36] జక్కన రచనాకాలం క్రీ.శ. 1390 తరువాతనే కావాలి; అతని కృతిపతీ, ఆ కృతిపతికి ఆశ్రయ మిచ్చిన పోషకుడు అప్పుడున్నవాళ్ళే కాబట్టి, ఈ పద్యంలో ''అరణ్య పర్వమున శేషము'' అనే పాఠం కాక ''అరణ్యపర్వమును శేషము'' అనిగాని, ''అరణ్యశేషమును శేషము'' అనిగాని పాఠాంతరాలు ఉండి ఉండేనే హరివంశం కూడా పట్టికలో ఉంటుంది.

36. ఆంధ్ర కవి తరంగిణి - 4వ సంపుటి, పుట 216

హరివంశం భారత శేషమే కదా! ఏమైనా జక్కన చెప్పిన శబ్దవైచిత్రి ఎఱ్ఱయ్యగారిలో ప్రస్ఫుటంగా ఉంది.

ఎఱ్ఱయగారి గ్రంథాలలోంచి పట్టికలు తయారు చేసుకొని చూస్తే ఎన్నో భాషా విశేషాలు కనబడతాయి. నన్నయ తిక్కనల పద ప్రయోగ సూచీలు తయారు చేయించిన సాహిత్య అకాడమీవారు ఎఱ్ఱయ్యగారి రచనలకు కూడా పదప్రయోగ సూచిక చేయించాలి. అప్పటికిగాని కవిత్రయ భాష సంపూర్ణంగా మన కోశాలకు ఎక్కదు. సలహాసంఘ సభ్యునిగా నేను ఎన్నిసార్లు మొత్తుకున్నా అకాడమీవారు ఈ పథకాన్ని మూల పడేశారు. ఇప్పుడు అకాడమీయే లేదు. తెలుగు విశ్వవిద్యాలయం ఈ మంచి పని చేపట్టే సూచనలు కనపడవు. గుడ్డిలో మెల్ల! కొన్ని పదాల పట్టికలను వేలూరి శివరామశాస్త్రిగారు నృసింహ పురాణం, హరివంశ గ్రంథాలకు అనుబంధంగా ఇచ్చారు.

కర్మణి ప్రయోగాలను చేయడం ఎఱ్ఱయ్యగారికి ఇష్టమే - 'పుట్టింపబడిన యా మనుష్యులు' (అరణ్యా. 4-170); కల్గింపంబడు విశిష్ట ద్రవ్యంబులన్నియు (అరణ్యా. 4-215); ఇలాగ 'బడు' ధాతువులు చాలాచోట్ల కనబడతాయి. వారి కాలంనుంచీ ఇవి తెలుగు భాషలో జీవిస్తున్నాయి. ఎఱ్ఱయ్యగారు ఎంతకాలం వరకూ జీవించారు అన్నది కూడా కాలనిర్ణయంలాగ వివాదగ్రస్తమే.

ఎఱ్ఱాప్రెగ్గడ వాడిన వృత్తాలు 36. అవి :

1. అంబురుహం
2. ఆటవెలది
3. ఆటవెలది (సీస)
4. ఉత్పలమాల
5. ఉత్సాహ
6. కందం
7. క్రౌంచ పదవృత్తం
8. గీతం
9. గీతం (సీస)
10. చంపకమాల
11. చూర్ణిక
12. తరల
13. తరువోజ
14. తేటగీత
15. తేటగీత (సీస)
16. తోటకము
17. తోదకము
18. దండకం
19. పృథ్వి
20. భుజంగ ప్రయాతం
21. మందాక్రాంతం
22. మత్తకోకిల
23. మత్తేభం
24. మధురాక్కర
25. మధ్యాక్కర
26. మహాస్రగ్ధర
27. మాలిని
28. లయగ్రాహి
29. వచనం
30. వనమయూరం
31. శార్దూలం
32. శ్లోకం
33. సీసమాలిక
34. స్తంభోద్భవ వచనం
35. స్రగ్ధర
36. స్రగ్విణి

1335 నాటికే ఎఱ్ఱయ్యగారు తనువు చాలించి వుంటారని వేలూరి శివరామశాస్త్రిగారు వ్రాశారు.[37]

ప్రోలయ వేముని జ్యేష్ఠ కుమారుడు అనపోతారెడ్డి రాజ్యకాలములో (క్రీ.శ.1353-1364) కూడ ఎఱ్ఱయ జీవించియున్నట్లు తోచును. అనపోతారెడ్డి కొల్లూరు దానశాసనములో ఆ రాజు తమ్ముడు అనవేమ భూపతి 'యఱ్ఱయప్రగడగారికి' కేసరపాటి యాభైపుట్ల చేను ధారపోసి కొల్లూరునే కలిపినట్లున్నది. అతడును ఎఱ్ఱయయే యగును.

37. హరివంశం పీఠిక, పుట - 10

కావున నితడు తన పేరిట వాడగు తాతగారివలెనే పూర్ణపురుషాయుషజీవిక ధన్యుడన వచ్చును. సుమారుగా క్రీ.శ. పదునాలుగవ శతాబ్దము మొదటి 75 సంవత్సరములలో జీవించియుండెననదగును అని నోరి నరసింహశాస్త్రిగారు వ్రాశారు.[38]

ఈ కొల్లూరు గ్రామం తెనాలి తాలూకాలో ఉంది. దీనితో కలుపుకొని ఎఱ్ఱయ్యగారి నివాసస్థలాలు 5 అవుతున్నాయి.

1. వేగినాటిలో కరాపర్తి
2. మన్నేరుమీది గుడ్లూరు
3. బల్లవరం దగ్గర చదలువాడ
4. అద్దంకి
5. తెనాలి తాలూకా కొల్లూరు

ఎఱ్ఱయ్యగారు హరివంశంలో ఒకచోట ''మన భూమిబోలు భూమి యెందును బుట్టదు'' అన్నారు (ఉత్తర. 2-102). ఇది వారికి ఒక్కొక్క వూరు చూచినప్పుడల్లా పాత వూరును గురించి వచ్చిన తలపులాంటిది కావచ్చు. కొల్లూరు దగ్గర చదలువాడ అనే గ్రామం ఎఱ్ఱయ్యగారి వల్లనే ఏర్పడిందేమో!. అనపోతారెడ్డి తమ్ముడు వేమయ్యా ఇచ్చిన దానం స్వీకరించి అక్కడ స్థిరపడ్డాక వారినిబట్టి ఆ గ్రామానికి ఆ పేరు రావచ్చు. ఎఱ్ఱయ్యగారి సంతతికి చదులువాడవారనే ఇంటిపేరు కూడా ఇందువల్ల వచ్చింది.

అనవేముని పుట్టుక ఎఱ్ఱయ్యగారికి తెలియదని, అందుకే హరివంశంలో ఆ పేరు లేదని వేలూరివారు వ్రాశారు. 1336లోనే ఎఱ్ఱయ్యగారు చనిపోయి ఉంటారని వ్రాశారు. హరివంశం 1335కు పూర్వం వ్రాసిన వారు అనవేముని దానాలు పుచ్చుకొనేటంత కాలం బ్రతకవచ్చు. ఈ విషయంలో శివరామశాస్త్రి అభిప్రాయం ఏమైనా వారు ఎఱ్ఱయ్యగారి గురించి చెప్పిన ఈ క్రిందిమాటలు అక్షరాలా నిజం.

''ఎఱ్ఱయ జన్మతః కవి. భావుకత అతనికి పరివేషము. అతని కవితా శయ్యపుష్పగుంఫితము. హృదయము రసప్రస్రవణము.[39]

ఎఱ్ఱయ్యగారు నృసింహపురాణంలో నన్నయ తిక్కనలను ఇలా స్తుతించారు:

భాసురభారతార్థములభంగులు నిక్క మెరుంగనేరమిన్
గాసటబీసటే చదివి గాథలు ద్రవ్వ తెనుంగువారికిన్
వ్యాసమునిప్రణీతపరమార్థము తెల్లగ జేసినట్టి య
బ్జాసనకల్పులం దలతు నాద్యుల నన్నయతిక్కనార్యులన్.

ఈ ఆర్యులలో చేరి భారతాన్ని అక్షరాలా పూరించిన ఎఱ్ఱయ్యగారు లేకపోతే వ్యాసముని ప్రణీతపరమార్థము తెలుగువారికి తెలిసేదే కాదు.

ఈ విజ్ఞానఖనికి మనం ఎప్పుడూ ఋణపడివున్నవాళ్లమే.

---

38. తెలుగుభాషాసమితి వారి విజ్ఞానసర్వస్వం, సంపుటి 3, పుట 734. ఇందులో వీరు పేర్కొన్న కొల్లూరు శాసనం రెడ్డి సంచిక అనుబంధంలో 19-20లో ఉంది.
39. నృసింహపురాణం - పీఠిక. 17

నాచన సోముడు

నన్నయగారు అంకితమిచ్చిన రాజరాజుకే తామూ అంకితమిచ్చి అన్ని ఆశ్వాసాలలో అదే గద్య ఉంచి 'తద్రచనయకా' ఆరణ్య పర్వశేషాన్ని ఎఱ్ఱయగారు పూరించారు. అలాగే మిగతా పదిహేనుపర్వాల భారతాన్ని రచించిన తిక్కనగారి పేరును కూడా తన గద్యలో వాడి వారు రచించకుండా విడిచిపెట్టిన భారతశేషం హరివంశాన్ని పూరిస్తున్నట్లు తోపిస్తూ రచించిన కవి నాచన సోముడు. ఈయన తిక్కనగారు అంకితమిచ్చిన హరిహరనాథునికే తన రచన అంకితమిచ్చాడు.

ఇతడు గొప్ప కవి అనీ, ఉత్తర హరివంశం లోకోత్తరంగా వ్రాశాడనీ రసికలోకం చెప్పుకొనడమేగాని ఇతన గురించి వివరాలేమీ ఏభై సంవత్సరాల క్రిందటి దాకా ఎవరికీ తెలియవు. 'ఆంధ్రుల చరిత్ర' వ్రాసిన చిలుకూరి వీరభద్రరావుగారు 1910లో ఆంధ్రపత్రికలో ఒక శాసనాన్ని ప్రకటించారు.[1] దానివల్ల నాచన సోముని జీవిత విశేషాలు కొన్ని దేశానికి తెలియవచ్చాయి.

క్రీ.శ. 1355–1377 సంవత్సరాల మధ్య సంగమ దేశపు రాజు మొదటి బుక్కరాయలు విద్యానగరాన్ని పాలిస్తూ ఉండేవాడు. ఇతడు తన అన్నగారు మొదటి హరిహరరాయల తరువాత రాజ్యానికి వచ్చాడు. అన్నగారు ఏలుతూ ఉన్నప్పుడు ఇతడు యువరాజుగా ఉండి అగ్రహారాలూ మొదలైనవి దానాలు ఇస్తుండేవాడు. క్రీ.శ. 1344వ సంవత్సరంలో ఇతడు నాచన సోమునికి ఒక అగ్రహారం దానం చేశాడు.

దానశాసనంలో చెప్పిన విషయాలను బట్టి నాచన సోముని కాలం గురించి, జీవించిన ప్రదేశం గురించి, ఆశ్రయించిన రాజుల గురించి వివరాలు తెలుస్తున్నాయి. శాసనంలోని భాగాన్ని వేలూరి శివరామశాస్త్రిగారు ఇలా అనువదించారు.

''ఆపస్తంబసూత్రుడును, భారద్వాజ గోత్రుడును, యజుశ్శాఖా బ్రాహ్మణుడును, నాచన వంశాంబుధి చంద్రుడును, సకలాగమవేదియును, అష్టాదశ పురాణాభిజ్ఞార్థ వేదియును, అష్టభాషాకవిత్వ శ్రీయుతుడును, విశేషించి మహాకవియు, సకలాగమవేదియు నగు సోమయాఖ్యునకు సంగమ భూపాలుని తృతీయ పుత్రుడును, విద్యానగరాధిపతి యునగు బుక్కరాయలు పంపాతటంబునందలి భాస్కర క్షేత్రంబునందుండిన శ్రీ విరూపాక్షస్వామి సన్నిధిని శాలివాహనశకము 1266 తారణ సం॥ చైత్రశుద్ధ నవమినాడు[2] పినాకినీ తటమునందలి బుక్కరాయపురమను నామాంతరము కల పంచాకలదిన్నయను గ్రామము నగ్రహారముగా దానము చేసి ధారపోసెననియు అంతట నమ్మహాకవి యిమ్మహారాజును చిరంజీవి యగునటుల నాశీర్వదించెననియు జెప్పబడినది.''[3]

---

1. చూ. సోముడు – ఉత్తర హరివంశ విమర్శ. వేలూరి శివరామశాస్త్రిగారి గ్రంథం, మొదటి పుట.
2. అంటే క్రీ.శ. 1344లో. 3. సోముడు, పుట 4

శాసనంలో ఇంత స్పష్టంగా తారీఖు ఇస్తే ఏ చిక్కూ ఉండదు. సంస్కృత శాసనంలో శకవర్షాలని ''అలంకృతశకస్యాబ్దే రసర్తునయనేందుభిః'' అని చెప్పారు. ఇక్కడ వ్రాత సందిగ్ధంగా ఉంది. అందుచేత వివిధ పండితులు వివిధరకాలుగా దీనిని పఠించారు. 'రసర్తునయనేం దుభిః' అని చదివితే ఆరు రసాలు ఆరు ఋతువులు రెండు కళ్ళు ఒక చంద్రుడు ఉన్న శకాబ్దాలు ఎడమ నుంచి లెక్కిస్తే 1266 వస్తుంది. ఈ మాటను 'రసర్తునయనేందుభిః' అని చదవక 'రసాభ్రనయనేందుభిః' అని చదివితే ఆరు రసాలు, ఒక ఆకాశం, రెండు కళ్ళు, ఒక చంద్రుడు అంటే 1206 వస్తుంది. అంటే క్రీ.శ. 1284 అన్నమాట. అప్పటికి ఇంకా బుక్కరాయలు పుట్టలేదు. విద్యానగరము కట్టలేదు. అందుచేత ఇలా చదవకూడదు. కొందరు 'రసభూనయనేందుభిః' అని చదివారు. అంటే క్రీ.శ. 1216 అవుతుంది. అయితే దానికి సరియైన సంవత్సర నామం తారణ కాదు.

పండితులు ఇన్ని రకాలుగా చదివి చదివి చివరకి వేటూరి ప్రభాకరశాస్త్రిగారు నిర్ణయించిన 'రసర్తునయనేందుభిః' అన్న పాఠాన్నే అంగీకరించారు. శాసనకాలం క్రీ.శ. 1344 అవుతుంది. అసలు పండితులు ఇలా పాఠాలు మార్చి మార్చి చదవడానికి వేరే కారణముంది. మన ఆంధ్ర సాహిత్యంలో ఆ రోజుల్లో రెండు పార్టీలుండేవి. ఒకటి నాచన సోముని పార్టీ; రెండోది ఎర్రాప్రెగ్గడ పార్టీ. మొదటివాళ్ళు నాచన సోముడు గొప్పవాడు, అతడు వ్రాసిన హరివంశాన్ని చూసే ఎర్రయ్య అనుకరించాడు అనేవాళ్ళు. వాళ్ళే తమ వాదానికి బలం చేకూర్చడానికి నాచన సోముని కాలాన్ని ఎంత ప్రాచీనం చేయాలో అంతా చేయడానికి ఇలా ప్రయత్నించారు. శాసనకాలం క్రీ.శ. 1344 అయితే నాచన సోముడు ఎర్రాప్రగడగారికి సమకాలికుడు; ఒకరకంగా కొద్దిగా చిన్నవాడు అవుతున్నాడు. అందుకే సోముని పార్టీవారు తారీఖు మార్చాలని ప్రయత్నించారు. ఇవాళ వేటూరివారి పాఠాన్ని అందరూ ఆమోదించారు.

నాచన సోముని గురించి వివరాలు చెప్పే శాసనం గురించి చర్చించాక అతడి గురించి మరికొన్ని వివరాలు చెప్పే అతడి గద్యను చూద్దాం.

''ఇది శ్రీ మదుభయ కవిమిత్రకొమ్మనామాత్య పుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారత కథానంతరంబున శ్రీ మత్సకల భాషాభూషణ సాహిత్యరస పోషణ సంవిధాన చక్రవర్తి సంపూర్ణకీర్తి నవీనగుణ సనాధ నాచనసోమనాథ ప్రణీతంబైన ఉత్తర హరివంశంబు''

ఈ రెండు ఆకరాల నుంచీ నాచన సోముని గురించి తెలిసే సాహిత్య విషయాలను బేరీజు వేద్దాం. ఇతడు

1. సకలాగమవేది, 2. అష్టాదశ పురాణాల అభిజ్ఞార్థవేది, 3. అష్టభాషా కవిత్వ శ్రీ, 4. శ్రీవాణీ విజిత సంపద గలవాడు, 5. సకల భాషాభూషణుడు, 6. సాహిత్య రసపోషణుడు, 7. సంవిధాన చక్రవర్తి, 8. సంపూర్ణ కీర్తి, 9. నవీనగుణ సనాథుడు.

ఈ పట్టికవల్ల ఇతడు నవవిశేషణాలున్నాడు. ఇతని ఉత్తర హరివంశ రచన పెంచుకదిన్నె శాసనకాలానికి ముందుగానే ఉంటుందేమో అని ఆలోచించాలని కొందరి అభిప్రాయం.[4] పై శాసన కాలానికి ఇరవై సంవత్సరాలకు పూర్వం ఉత్తర హరివంశ రచన జరిగి ఉంటే ఎర్రాప్రగడగారి హరివంశం, ఇదీ ఏకకాలంలో పుట్టి ఉంటాయనీ, ఒకరి రచన ఇంకొకరు చూసి ఉండరనీ చాగంటి శేషయ్యగారు అభిప్రాయపడుతున్నారు.[5] ఒకవేళ ఒకరి రచన ఇంకొకరు చూడడమే తటస్థపడితే నాచన సోముడే ఎర్రయ్యగారి రచన చూసి ఉండాలని చెప్తున్నారు.[6] ''సోముని హరివంశమును, ఎర్రన హరివంశమును పోల్చి చూచినచో ఎర్రన్న ననుసరించియే సోముడు వ్రాసెననుటలో సందేహము లేదు'' అని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వ్రాశారు.[7]

మనం కూడ ఎర్రయగారి చరిత్ర చెప్పుకునేటప్పుడు వారు నాచన సోముని హరివంశం చూడడానికి ఆస్కారం లేదని, చూస్తే హంసడిభకోపాఖ్యానం వదిలేయరనీ చెప్పుకొన్నాం. సోముని హరివంశంలో ఏవేవి ఉన్నాయో చూద్దాం.

1. ప్రథమాశ్వాసంలో పూర్తిగా నరకాసుర వధ.
2. ద్వితీయాశ్వాసంలో విప్రకుమార రక్షణ, రుక్మిణి పుత్రదానం చేయమనడం, కృష్ణుని తపోయాత్ర, ఘంటాకర్ణుడి కథ, శివకేశవుల సమాగమం.
3. తృతీయాశ్వాసంలో పౌండ్రక వాసుదేవుని దాడి, సంకుల సమరం, కృష్ణుడు ద్వారకకు వచ్చి పౌండ్రుని చంపడం, కృష్ణుడు రుక్మిణీ సత్యభామలతో జూదమాడడం, ఒకవంక జూదమాడుతూనే కృత్యను చంపడం, చతుర్థాశ్వాసం పూర్తిగా హంసడిభకోపాఖ్యానం.
4. పంచమ, షష్ఠాశ్వాసాలు పూర్తిగా బాణాసుర వృత్తాంతం, ఉషాపరిణయ ఘట్టాలు.

సంస్కృత హరివంశంలోని చాలా విషయాలను నాచన సోముడు అనువదించలేడు. అందులోలేని నెత్తాలాటను తీసుకొచ్చాడు. సంస్కృత హరివంశంలో మూడు పర్వాలు ఉన్నాయి. హరివంశపర్వంలో సృష్టిప్రకారం, మన్వంతరాలు, సూర్యవంశ వృత్తాంతాలు ఉంటాయి. విష్ణుపర్వంలో శ్రీకృష్ణుని చరిత్ర సంపూర్ణంగా ఉంటుంది. ఇందులో రెండు భాగాలు. పూర్వభాగంలో పారిజాతాపహరణం దాకా ఉంది. ఉత్తర భాగం ఉషాపరిణయం దాకా ఉంది. ఈ విష్ణుపర్వం రమారమి భాగవత దశమ స్కంధంలాగ ఉంటుంది. ఇక మూడవ పర్వమైన భవిష్యపర్వంలో చాలా గాథలు ఉన్నాయి. ఇందులో జనమేజయ వంశవర్ణన, భూతోత్పత్తి ప్రకారం, యజ్ఞకర్మఫలం, మధుకైటభ సంహారం, అవతారప్రశంస, శ్రీకృష్ణుని కైలాసయాత్ర, ఘంటాకర్ణవృత్తాంతం, పౌండ్రక వాసుదేవ వధ, హంసడిభకోపాఖ్యానం మొదలైనవి ఉన్నాయి.[8]

---

4. సోముడు-శివరామశాస్త్రిగారు, పుట 9
5. ఆంధ్ర కవి తరంగిణి, 4వ సంపుటి-పుట. 122
6. అదే పుస్తకం, పుట 120
7. సారస్వతాలోకం, పుట 53
8. రెడ్డి సంచికలో కిళాంబి రంగాచార్యులగారి వ్యాసాన్ని అనుసరించి ఇచ్చిన విషయాలు, పుట 258

నాచనసోముడు ఉత్తర హరివంశం అని పేరుపెట్టినా ఇందులో జరాసంధుడు మధురమీద దండెత్తడం, రుక్మిణీపరిణయం, పారిజాత వృత్తాంతం తెనిగించలేదు.

పురాణమంతా అనువదించకుండా కొద్దిపాటి కథలు మాత్రమే తీసుకొని ప్రబంధాలు రచించడం సోమునితోనే మొదలైంది.

నాచన సోముడు తీసుకొన్న అయిదు కథలలోని అంతరార్థాన్నీ వాటిని ఆ క్రమంలోనే చెప్పడంలో ఉన్న మహాశిల్పాన్ని విశ్వనాథ సత్యనారాయణగారు చాలా గొప్పగా వివరించారు.[9]

''మొదటి కథ నరకాసుర వధ భూమికి పుట్టిన బిడ్డను చంపడం, రెండవ కథ బిడ్డలుపోయిన భూసురుడి కుమారులను బ్రతికించి తీసుకురావడం, మూడవ కథ తాను స్వయంగా సంతానం కోసం తపస్సు చేయడం, మిషగా శివకేశవుల సమాగమం. నాలుగవ కథలో దుష్టశిక్షణ. అయిదవ కథలో శివతత్త్వంకంటె విష్ణుతత్త్వం అధికమని నిరూపించడం.

''ఈ కథలు వ్రాయుటలో నాచన సోమన్న తన కావ్యమున కొక మహాప్రయోజనమభిలషించెను. ఇట్టిదానికి ప్రబంధధ్వని యని పేరు. ఈ ప్రబంధ ధ్వని విషయము మహోత్తాలమైన కొలది ప్రధానముగా కవి మహాకవియగుచున్నాడు'' అని విశ్వనాథ సత్యనారాయణగారు విశదపరిచారు.

సోముడు నవీన గుణసనాథుడు కదా. అతడు శ్రీకారం చుట్టి ఆ తరువాత వెనువెంటనే చెప్పిన పద్ధతిని అనంతర ప్రబంధకవులు తూచా తప్పక వాడుతున్నారు. నాచన సోముని మొట్టమొదటి పద్యం చూడండి.

శ్రీసర్వమంగళాకుచ – వాసంతీ వకుళగంధవద్యసమాలా
వాసుకి విలాసవేద – వ్యాసముని మనోనివాస హరిహరనాథా.

ఈ పద్యంలో ఎత్తుగడలోనే అమ్మవారి వక్షోజాల ప్రశంస ఉంది.

ఏ తెలుగు ప్రబంధం తెరచినా 'శ్రీవక్షోజ' అనో, 'శ్రీరామాకుచ మండలీ' అనో కనబడుతుంది.

తెలుగు కవికుమారులందరూ వాస్తవానికి 'చంటి' వారని చెప్పడానికి ఇలాగ గ్రంథాదిని మంగళాచరణంలో అమ్మవారి పాలిండ్లను మొదటే నోటపట్టడంవల్ల రూఢీ అవుతున్నా మొదటి 'చంటి' వాడు నాచన సోముడు.

అతనికి ముందున్న గ్రంథాలలో మొదటి పద్యం ఎలా ఉందో ఈ పట్టికలో చూడండి.

9. తెలుగు భాషాసమితి విజ్ఞాన సర్వస్వం – 3వ సంపుటం; తెలుగు సంస్కృతి పుటలు 1221–1228.

వరుస సంఖ్య	కవి పేరు	గ్రంథం	తొలి పద్యం
1.	నన్నయ	ఆదిపర్వం	శ్రీవాణీగిరిజాశ్చిరాయ
2.	పావులూరి మల్లన	సారసంగ్రహగణితం	శ్రీవాణీందుసురేంద్ర
3.	నన్నెచోడుడు	కుమారసంభవం	శ్రీకంఠం సగుణం
4.	మల్లియరేచన	కవిజనాశ్రయం	శ్రీకాంతాతిప్రియ
5.	పండితయ్యా	శివతత్త్వసారం	......
6.		1. నిర్వచనోత్తర రామాయణం	శ్రీరాస్తాం
7.	తిక్కనగారు	2. విరాటపర్వం	శ్రీయనగౌరినాబరగు
			శ్రీరమణీ గృహాంగణము
8.	కేతన	1. దశకుమారచరిత్రము	చెన్ను వహింప
		2. ఆంధ్రభాషాభూషణం	శ్రీవాణీగిరిజేశా
		3. విజ్ఞానేశ్వరీయం	శ్రీవాణీగిరిజేశా
9.	మారన	మార్కండేయ చరిత్ర	శ్రీ తరుణీముఖోజ్వల
10.	మంచెన	కేయూరబాహుచరిత్ర	శ్రీవసియించు గాత
11.	బద్దెన	నీతిశాస్త్ర ముక్తావళి	శ్రీవిభుడ
12.	ఎఱ్ఱాప్రెగ్గడ	1. నృసింహపురాణం	
		2. హరివంశం	శ్రీకిం బ్రేమపదంబు
13.	భాస్కర రామాయణ	....	......
	కవులు		......
14.	మడికి సింగన	1. పద్మపురాణం	శ్రీమద్దివ్యమునీంద్ర
		2. జ్ఞానవాసిష్ఠం	చిత్త నిలయం
		3. సకలనీతి సమ్మతం	శ్రీ మహిళా కటాక్ష
15.	రావిపాటి తిప్పన	త్రిపురాంతకోదాహరణం	శ్రీనగ చక్రవర్తి
16.	మడికి అనంతయ్యా	విష్ణుమాయా నాటకం	భాగవత ముఖ్యుడగు
			శుకబ్రహ్మ
17.	గోనబుద్ధరాజు	రంగనాథ రామాయణం	శ్రీకామినీనాథు
			జితదైత్యనాథు
18.	గోనసోదరకవులు	ఉత్తరకాండ	......

ఈ పట్టికవల్ల నాచన సోముని నవీనగుణాలు దేశంలో ప్రచారంలోనికి వచ్చేదాకా కృత్యాదిని శ్రీకారం పద్యాలు శృంగారరసంతోకాక భక్తి భావాలతో ఉండేవని తెలుస్తుంది. నాచన సోముని పుణ్యామా అని ఇలాగ మారాయి. నాచన సోముని తరవాత అతని సమీపకాలస్థుడైన జక్కన ఇలా చెప్పాడు :

ప్రతి పద్యము జోద్యముగా – కృతి చెప్పిన గొప్పగాక కృతినొక పద్యం
బతిమూఢుడైన జిత్రత – బ్రతిపాదింపడె ఘుణాక్షర న్యాయమునన్.

(విక్రమ. 1–17)

ప్రతిపద్యం చోద్యంగా చెప్పడమనేది జక్కన నాచన సోముని వద్దనే నేర్చుకున్నాడు. (జక్కనకృత్యాది పద్యం : శ్రీగౌరీకుచనీల మౌక్తికమణి శ్రేణీ) వాస్తవానికి నాచన సోముని ప్రతి పద్యంలోనూ శబ్దాలంకారమో, చమత్కారంతో ఉండే సంభాషణో, వర్ణనో, హాయిగా ఉండే సామెతలో ఉంటాయి. 1487 పద్యాలలో ఎన్నెన్నో సామెతలు, జాతీయాలు, పలుకుబళ్ళు బళ్లనిండా దొరుకుతాయి.

తలపువ్వు వాడదని (1-21); కారుచిచ్చునకు గాడ్పులుదోడగు చందం (1-23); బీరపుబొత్తము గట్టుకొని (1-32); ఇటురా చూతువు చేతిలావనుచు (1-45); చిల్కవోయినం బంజరమేమిసేయ (1-72); ఎంత దరిగిన మిరియాలు జొన్నలంతచేయవా (1-75); క్రొరెవ్వడింటి కంబముసేసెన్ (1-94); శిరసుండగా మోకాలను సేసలుపెట్టుట (1-96); తనకుగానని దయ్యంబెదరికి వరమిచ్చుననుట (1-97); చీమచిటుకనుట (1-131); గతజలసేతుబంధనం (1-187); మంత్రపునీళులు సల్లవచ్చునే (2-19); ప్రారెడు బండ్లకు గాళ్లుసాఁగా (2-31); కడుపు చల్లనికాంతలగలుపునన్ను (2-76); నుదుటుపట్టంగట్టడం (2-154); చిట్టకాలకులోనగుట (2-184); జితేంద్రియులకేటి సంతతి (2-189); నాలుక ఆడనిపాటి (3-8); పేచ్చారితనం (3-10); మంటలో మిడుత బీరము సూపుట (3-14); విశ్వామిత్రసృష్టి (3-21); జట్రాతిపైపోతలై (3-30); తామరపాకునీరువలె దల్లడమందిరి (3-35); జొక్కాకుతో రాయడం (3-41); కుమ్మరావమున రాగిముంతలేరంగ గలవె (3-48); జీలుగువెరిగినమాలెకు గంబంబు (3-50); పిడుగుచిట్లినభంగిన్ (3-83); లజ్జకండయొడల గలదే (3-98); బొమ్మకట్టుట (గెలుచుట) (3-117); చుక్కయెదురు (3-147) పెన్నిధిగని పొంగుచున్న పేదలక్రియ (4-15); నీరముంచిన సొరకాయనెగసినట్లు (4-28); పరుగుతోదాగరయునెండ వలసినట్లు (4-54); తవుడుతినిచచ్చువానికి విషముపెట్టువాడు వెర్రిగాడె (4-62); దాగంబోయి తలారివానియెదురన్ దాగంగ (4-92); చెట్టెరుగువారికాకులు సిదుమనేల (4-95); పులిపేదవడిన బసులవాండ్రే యెక్కాడిరనుకత (4-102); ముద్దులుమునింగి పార వెంపళ్ళు తమకెంత బంటియనుట (4-124); దాపటికాలబొమ్మ (4-137); చల్లకువచ్చి ముంత దాచినగతి (4-149); పాముకాటు సీరదుడిచినంబోవునె (4-150); గాజులుందొడవుగా గల్పించిరా (4-157); వెదకంబోయినతీవ కాలదవిలెన్ (4-163); దువ్వజూచి నక్కయొడలు గాల్చికొన్న పడువున (4-165); వెర్రివారపిడుగు వ్రేసిన దలటొప్పియగునె (4-166); కరవగ వచ్చునే బలిమిగాడిదకుం బులితోలుగప్పినన్ (4-188); కరాసిధారచే పచ్చడి చేయడం (4-196); చిచ్చునుంగాడ్పును కూడినట్టి (4-199); పాపటపై అడిదంపెట్టడం (4-208); మంగలములోని పేలాల మాడ్కి (4-216); వెలుగుచేన్మేసిన గాచువారలెందుకలరే (5-40); నిప్పు జెదలంటునటే (5-88); ముల్లుపుచ్చి కొర్రడిచినచందం (5-101); ఏనొకటి చేయదలచిన తానొకటి దలంచెవిధి (5-135); నేమిటికిబోయిన నీళ్ళకు గట్టవెట్ట (5-155); నువ్వుల కండ్లనునోరబోసికొన్నారము (5-156); ప్రేవులలోన సురియద్రిప్పిన కలవన (5-161); పయ్యోరదూది (5-179);

తగరంబుచరచు టెంతటిభారము (5-182); చుట్టాలసురభి (5-276); కన్నుండ కంటిపాపంగొన్నట్లు (5-286); పట్టెడుచోటు కాల్చుకొను బాలిశుడుంగలడే (5-303).

ఈ జాతీయాలనూ, సామెతలనూ చూస్తే నాచన సోముడు తన కాలపు శిష్టవ్యావహారికాన్ని, సమకాలికపు సంభాషణలనూ గ్రంథస్థం చేశాడని చెప్పాలి. తిక్కనగారు ఎలాగైతే పాతబడ్డ మాటల్ని ఏవగించుకున్నారో నాచన సోముడూ అలాగే నిరసించాడు. సజీవమైన జాతీయాన్ని, నిత్యజీవితంలోని మాటల్ని వాడాడు. 'ఉత్తర హరివంశమునందలి సామెతలు, జాతీయములు' అనే శీర్షికతో నాచన సోముని తెలుగుతనాన్ని శ్రీమతి పి. యశోదారెడ్డిగారు ప్రశంసించారు. ''ఈగ్రంథము రాసిబోసిన జాతీయముల ప్రోవు. కుప్పబోసిన సామెతల కాటపట్టు. సూక్తి వైచిత్ర్యమునకు నెలవైన యీ గ్రంథమునందు సాధారణముగ నితరకవు లెవ్వరును తెలుగు వాఙ్మయమునందు ప్రయోగించి యెరుగని యుపమానములను, అర్థాంతరన్యాసములను, దృష్టాంతములను, సామెతలను చూడవచ్చు'' అని ఆమె వ్రాశారు.[10] ఈ సామెతలకు తోడు నన్నెచోడుడు సంవిధానంలో చేసిన గమ్మత్తులన్నింటినీ తానూ వాడాడు. పద్యంలో రెండేసి క్రియాపదాలు వాడడం, ఒకమాట వాడితే పక్కనే దానినే పోలిన ఇంకోమాట వాడడం, అనుప్రాసం, నిరోష్ఠ్యం మొదలైన అన్నింటినీ చక్కగా వాడాడు. ఇతని సంవిధానం కొట్టవచ్చినట్లు కనబడుతుంది.

అందుకే ఇతణ్ణి చాలామంది అనంతరకవులు పద్య రచనా విధానంలో పూర్తిగా అనుకరించారు. నరకాసురవధ ఘట్టంలో రాక్షసుడు వేసిన బాణంవల్ల కృష్ణుడు మూర్ఛపోయాడు. అప్పుడు సత్యభామ యుద్ధం చేసింది. సోముడు ఆమెను ఇలా వర్ణించాడు :

అరిజూచున్ హరిజూచు జూచుకములం దందంద మందారకే
సరమాలామకరందబిందు సలిలస్యందంబులందంబులై
తొరుగంబయ్యెద కొంగొకింత దొలగందోడ్తో శరాసారమున్
దరహాసామృతపూరముం గురియుచుం దన్వంగి కేళీగతిన్.

(పుట. 130, ఉత్తరహరి. 1-162)

ఇదే ఘట్టంలో ఇదే సన్నివేశాన్ని బమ్మెరపోతరాజుగారు తమ భాగవతంలో వర్ణిస్తూ ణ్ణి [illegible]కరించారు చూడండి :

పరుజూచున్ వరుజూచునొంప నలరింపన్ రోష రాగోదయా
విరతభ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్
జరగన్ గన్నుల గెంపుసొంపు బరగన్ జండాస్త్రసందోహమున్
సరసాలోకసమూహమున్ నెరవుచున్ జంద్రాస్య హేలాగతిన్.

(భాగ. దశమ. ఉత్తర 178)

10. కావ్యానుశీలనము - యం. కులశేఖరరావు - పి. యశోదారెడ్డి వ్యాసాలు, పుట 41

పోతరాజుగారి సత్యభామలో పయ్యెదకొంగు ఒకింత తొలగలేదు. సోముని భామలో ఆ తొలగిన పైటను కృష్ణుడే పొందుపరచవలసి వచ్చింది. సోముని సత్యభామ యుద్ధం చేసినందుకు సంతోషించి కృష్ణుడు చేసినదేమిటో చూడండి.

చెలువచెక్కులనెలకొన్న చెమటదుడిచి
తరుణినుదుటబైకొన్న కుంతలములొత్తి
రమణికుచమధ్యమునను హారములుద్రోచి
సొలతి పయ్యెదకొంగుపై బొందుపరచి. (ఉత్తరహరి. 1-170)

ఆ తరువాతనే ఆమె చేతిలోని విల్లు అందుకొన్నాడు. అతడు పొందుపరిచేదాకా అది తొలగే ఉంది. భార్య పయ్యెదకొంగు ఎంత మహాకవి తొలగించినా ఏ మగవాడు ఊరుకుంటాడు?

ఇతని కాలందాకా తెలుగు గ్రంథాలలోని పాత్రలు సమకాలిక మనస్తత్త్వాలతో, చేష్టలతో ఆట్టే ఉండేవి కావు. పురాణపురుషులు ధీరోదాత్తులు, హితభాషులు. అందరూ చాలా హుందాగా బింకంగా ఉండేవారు. నాచన సోముడు ఆ పాత్రలను తన కాలపువాళ్ళను చేశాడు. నరకాసురుడు ఓరుగల్లుమీద దండెత్తిన తురక సరదారులాగ, ఊర్వశి ఏ మాచల్దేవిలాగనో కనబడుతుంది. లక్ష్మీదేవి అవతారంలాంటి రుక్మిణే జూదంలో అబద్ధం ఆడుతుంది. సత్యభామ మగడంటే లక్ష్యంలేని అందరు గయ్యాళి పెళ్ళాలలాగే మొట్టమొదట భర్తను నిందిస్తుంది. జూదరివి, సుమాళివి, నెరవాదివి, తసుకరివి అని పడపడ తిడుతుంది (3-113). నరకాసురుడి సేనలు ఆనాడు జరిగే దండయాత్రలలోలాగానే ఇళ్ళు దోచుకుంటారు. ఇల్లాళ్ళను చెరపడతారు. చూడండి :

''మరియును మగలు దిగవిడిచిపోవుటయును మానంబుతోడన గ్రమంది మందిరంబుల నడంగియున్న మగువల దెగువతోడ వెడలం దిగిచి తెచ్చి చక్కనివారి నేర్పరిచి యొక్క యెడం గూడబెట్టు ధూర్తదనుజులను, గడిచిపోవచ్చిన నొడిచి కచభరంబులు పట్టికొన్న 'నన్నన్న! నీ చెలియలి' నని విడిపించుకొని కన్నీరు దొరుగు మొగంబుల బయ్యెదలొత్తుకొని యేడ్చు సుదతుల నదలించు నిర్దయ దైతేయులును, సవరనిపావలందడవితడవి తమ యేలికకుం గానికగా నీవలయు నని కొనిపోవచ్చిన బైఫడి విడువజాలక పెనంగు తల్లుల బ్రల్లదంబునం ద్రెళ్ళంద్రోచి తిట్టుచు సైకపుంబైదలి మూకలగదడెనని చెలంగు ఘాతుకదైతేయులును, వెండియుం గడుసరి దానవులు మిసిమి గల పసిడి కాస చేసి పడద్రోసి గాసిం బరచిన ప్రాసాదంబులునుం జతురులగు దితిసుతులు దమతమ నికేతనంబులకుం గొనిపోవుటకై విరుగకుండం బెరికించి సురకుమారకుల తలలకెత్తి(ంచి)న ఘటిత మణికోటికోటీమండిత కవాటసంఘాతంబులును... (1-53)

ఏ తురకసేనో దండయాత్ర తరవాత కొల్లగొట్టడం ఇందులో కనబడుతుంది. సోముడు యుద్ధాన్ని ఎంత సమకాలికదృశ్యాలతో వర్ణించాడో వేటను కూడా అలాగే వర్ణించాడు.

''ఇవ్విధంబున నెగసిన యిర్రి నాలుగుకాళ్ళనుం ద్రెవ్వనొక్కమ్మునేసి చనునెడ మరియు నప్పటప్పటికిం జొప్పరులవలన నుప్పతిల్లిన చప్పుళ్ళకు దెప్పరంబైన తుప్పలం దూరు దుప్పులును (నిడువేటకార్లు) (వేటకుం) గడంగిన నడికినడికి కనవారికినెడగాక తొడిగిన యమ్మున పడి పొరలు పిడుల విడువక చిడిముడిపడుకడతులును నీటెలకుం బోటబ్బక సూటిమెయి దాటియు వేటచే విటతాటంబైన లేటికదుపులును బిరుంద రొప్పు చొరిగారకుగాక వెరచరచి పరచునెడ దెరపి నురికిన తొరుద్రొక్కునం గుక్కలచే బరిపరి యైన యురుములును గొందరు గొందరు ముందటం గొందలం బంది యందంద సందడి గ్రిందుమీదుగా వైచినం జిందరవందరలుగా వ్రందిన కుందేళ్ళను నేదెస దొలంగినను సూదిపిరింది[త్రా]డై యాదిగొని పొదులవారిచే యాదులకాదులచే మూదలించిన సిదరంబులతో బాదుకొనిన యేదులును నివ్వలవ్వలనుండి యెడత్రెవ్వకుండ ద్రవ్విన యొదంబులం బడి క్రొవ్వరక మవ్వంబు నివ్వటిల్లంబట్టువడిన చివ్వంగులునుం గలిగినం గనుంగొనుచు వెండియు గ్రీగాలినోలిం జాలుకొలిపిన కాలువలలకుం బాలుపడి లోలోపలం గళవళించియు దోడ్తోడ జోడెంపువలలకు లేటివేడెంబు చేసినం గూడబడియును మున్ను పన్నిన కన్నెవలల సన్న సన్నంబోవక యన్నదం గన్ను దిరిగి పడి సన్నసున్నంబుగా దన్నుకొనియును నడ్డగించి నించిన యొడ్డు వలలకు సడ్డించి వెడ్డునంబడక గడ్డురికియు మృగంబులనేకంబులు వొలియుటయును, వేట చాలించి...''

(4-29)

ఇలాగే కోటలు లగ్గలుపట్టుకు వర్ణించాడు.

వంకదారకు జేరి.వాకిటి దద్దడంబులు సేర్చి కొమ్మల మ్రోకువైచి
ప్రాకి లోపల జొచ్చి పలుగాడిదెరచిన పంతగార్లకు మున్న బ్రద్దవరుల
తోన నిచ్చెన లెక్కి లోగి కొత్తళములో బురణించి చొచ్చిన పోటుమగల
వాడి మెచ్చక యాళువరిమీద బాళెలవారిదాకించిన వాసిబిరుదు
లచ్చెరువునొంద మేడలు సొచ్చి యార్చు
దొడ్డకార్లచే బరిపోయె దూర్పుదిక్కు
రాలవాటుల నేటుల రంతుమిగిలి
తరిమి రచ్చటి బలము గొందరు గడంగి. (3-34)

నాచన సోముడు తాను సాహిత్యరసపోషకుణ్ణి అని చెప్పుకున్నాడు. అయితే అతని రసపోషణ అందరికీ నచ్చదు. రుక్మిణిచేత బొంకించినందుకు వేలూరి శివరామశాస్త్రిగారి మనస్సు చివుక్కుమంది.[11] అది కవి బొంకేగాని రుక్మిణిది గాదన్నారు. ఊర్వశీ-నరకుల సంభాషణ బజారుస్థాయిలో సాగినందుకు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు నొచ్చుకున్నారు.[12] అయితే ఈ ఊర్వశీ-నరకుల సంభాషణలోని ఔచిత్యాన్ని

11. సోముడు - పుట. 51
12. 'సోముడు'లో ఆంధ్రవాఙ్మయమున నాచన సోమన కీయదగిన స్థానం' అని రాళ్ళపల్లివారు వ్రాసిన వ్యాసంలోని ఉదాహరణ. పుటలు 54-58.

చూపెడుతూ ఇందులోని రచనాశిల్పానికే 'సంవిధానచక్రవర్తి' అనే బిరుదు నాచన సోమునికి సార్థకమవుతుంది అని విశ్వనాథ సత్యనారాయణగారు వ్యాఖ్యానం చేస్తూ వ్రాశారు.[13]

నరకాసురుడు ఊర్వశిమీద వ్యామోహంతో ఆమెను నిండుసభలోనికి పిలిపించాడు. ఆమెకు అతనిమీద ఇష్టం లేదు. అతడు ''నీకను దోయి వెన్నెలలు నిండక కోర్కులు నాకు నిండునే'' అన్నాడు. ''నీలోగిట చేర్చనే యుభయ లోకసుఖమ్ములు నన్ను పొందినన్'' అన్నాడు. 'ఇదంతా ప్రేమకాదు, ఇతడు సరసుడు కాడు' అని ఊర్వశి నిండుసభలో రుజువు చేయాలి. ఇంత చక్కటిమాటలు వచ్చిన అతని నోటంటే జుగుప్సాకరమైన పలుకులు రావాలి. అందుకు ఆమె గడుసుగా సంభాషణలోనికి దింపింది.

''నామీద ఇంత మక్కువ అయితే ఒక్కనాడైనా వచ్చి నన్ను గారవించావా?'' అని అడిగింది.

''పగవాడి ఊరికి నేను మిండరికానికి వస్తానా? వస్తే నాకు ఆపద కాదా'' అన్నాడు అతను. 'మిండరికం' అనే మాట రాగానే అతనిది ప్రేమ కాదు, కామం అని తేలిపోయింది. 'నాకు ఆపద కదా' అనడంలో శౌర్యం, సత్తా బయటపడింది.

''నిన్ను రమ్మనడం పొసగదు సరే! నన్ను ఒక్కనాడైనా రప్పించుకోలేదేం? నాకామాత్రం చనువు లేదా?'' అంది ఊర్వశి.

''పగవాడి కొలువులో వున్న దానిని నేను పిలిపించుకొనడమా! చాలు చాలు! ఇలాంటి లంజెమాటలు ఎక్కడైనా వున్నాయా?'' అన్నాడు రసికతలేని నరకాసురుడు.

ఎప్పుడైతే అతని నోటంట 'లంజె' అన్నమాట వచ్చిందో అప్పుడే అతని పరాజయం మొదలయింది. ఆమె అటువంటి పతనంకోసమే కాచుకొని ఉంది. ఈ మాటను పట్టుకొని నిర్మొహమాటంగా అతనితో సంభాషణ కొనసాగించింది. ''లంజనైనను నీవు లంజయని యన్నచో కోపము వచ్చును'' ఇట్టి మాటనేర్పుమీద మానవప్రకృతి మీద గడుసుదనముమీదనే సంవిధాన సౌధమును నాచన సోమన నిర్మించినాడు.

ఇంత గడుసుగా సంవిధాన నిర్వహణము చేసిన తెనుగు కవులు లేనేలేరని చెప్పవచ్చును'' అని విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాశారు.[14]

---

13. ఆంధ్రసాహిత్య పరిషత్ పత్రిక - సంపుటి 43; సంచిక 4లోనూ, తెలుగుభాషాసమితివారి విజ్ఞాన సర్వస్వం - 3వ సంపుటి పుట 1224లోనూ.
14. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం - 3వ సంపుటి - పుటలు 1125.

ఇలా వ్యాఖ్యానం చేస్తే నాచన సోమనలో ఎన్నో సొగసులు కనబడతాయి. అయితే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు చాలాకాలం క్రిందట ఇలా వ్రాశారు :

''తన శక్తినంతయు నుపయోగించి యింత దీర్ఘముగ వ్రాసినను సోముడు వారినెంత నీచాతినీచపాత్రములుగా దోపజేసినాడో పరిశీలింపుడు! నరకాసురు డెంతనీచుడగు కిరాతస్వభావుడగు రాక్షసుడని యనుకొన్నను, వారిద్దరి కిట్టి రసాభాసమగు సల్లాపము నిండుసభలో నడచియుండదు. ఒకవేళ నడచి యుండవచ్చుననుచో, కవి దా నిట్లు వ్రాయుట ప్రమాదము. ఇందుగల మిండరికము, లంజెతనము మొదలగు పదముల దలచుకొన్న నెవ్వరికి రోత జనింపదు! కావ్యము సౌమనస్య ప్రధానము. కావున స్వభావోక్తినే వర్ణింపదలచిన వాడైనను కవి యా సౌమనస్యముపై ముఖ్యముగ దృష్టి యుంచవలయును. అట్లు గాదేని యుత్తమ పాత్రములం దింత నీచస్వభావము నెంతయో సొగసుగ వర్ణించిన శుకసప్తతికారుడగు కదిరీపతినాయకుడు మహాకవి యని చాటవలసి యుండునుగదా! (నిజముగా నతని మహాకవిత్వమునందు బుద్ధిమంతులెవరును సంశయింపరు.) ఎక్కువ చాతుర్యము జూపబూనిన విపరీతమగు ననుట కీ ఘట్టము ప్రథమోదాహరణము.[15]

మిండరికము, లంజెతనము అనే మాటలు సోముడు కావాలని నీచత్వం కోసం వాడిన మాటలు కావు. అతని సమకాలిక సమాజంలో వాటిని వాడేవారు. పాల్కురికి సోమనాథుని బసవపురాణంలో 'మిండరికం' అనే మాట పలుమార్లు ముఖ్యంగా ముగ్ధ సంగయ్యా కథలో కనబడుతుంది. అలాగే వేశ్యను లంజ అనే అచ్చిక పదముతోనే పిలిచేవారు. మన కాలపు మర్యాదస్థులు వాడే మాటలను నాచన సోముడు ఊర్వశీ నరకాసురుల నోట వాడలేదని తప్పుపట్టక్కర్లేదు.

ఈ ఊర్వశీ నరకాసుర ఘట్టాన్ని ఎఱ్ఱయ్యగారు తమ హరివంశంలో రెండే రెండు పద్యాలలో తేల్చారు. చూడండి :

వాసవసింహాసనం బెక్కి యూర్వశి రావించి భావం బనురాగ తరళంబుగా నత్తరళనయనతోడ

వరుణుం దోలితి నర్థపుం జదిపితిన్ వైవస్వతున్ గెల్చితిన్
హరి బోజోసితి నేన యీశ్వరుడ సర్వామర్త్యసిద్ధోరగా
సురగంధర్వవియచ్చ రాదులకు మెచ్చుల్మీర నీ వింక న
న్నరవిందానన సత్కరింపుము మనోజానీకసంక్రీడలన్.

అనుటయు నమ్మృగాక్షి యిది యట్టిద యంతటివాడవైన నీ
పెను పసదే తలంప రిపుభేదనసంయమికోటిభక్తితో
నిను నఖిలాధ్వరంబులను నిత్యసమర్చితుజేసిరేని నే
నును ముదమొప్ప గైకొని వినూత్న విహారరసాబ్ధి దేల్చెదన్.

---

15. సోముడు – పుటలు 57, 58లో వేలూరి శివరామశాస్త్రిగారు ఉదాహరించారు.

అంతటి మహాత్త్యంబు గని నన్నుం గామింపు మనిన నట్లుకాకయని యనంతరంబ యతండు... (హరి. ఉత్తర 4-41 నుండి 44). ''ఎఱ్ఱన ఈ భాగమును రెండు పద్యములలో నెంతయు గంభీరముగ, మధురముగ ముగించినాడని, రా.అ.గారు తలంచుచున్నారు. ఇయ్యది సత్యమేకాని 'వినూత్న విహార రాసబ్దిదేల్చెదన్'' అని యూర్వశి పల్కుటయు, 'మెచ్చులీర నీ వింక నన్నరవిందానన సత్కరింపుము మనోజానీక సంక్రీడలన్' అని నరకుడు పల్కుటయు నేమిసొబగుగా నున్నది? ఎవడైనను ఇట్టి విషయమును రచ్చయొనర్చుచో జుగుప్సను పుట్టింపక మానడు'' అని వేలూరి శివరామశాస్త్రిగారు వ్రాశారు.[16]

ఇటువంటి సంభాషణలకు తిక్కనగారు ఒరవడి పెట్టారు. నిర్వచనోత్తర రామాయణంలో రంభారావణ సంవాదంవంటిదే ఈ ఊర్వశీ నరకాసుర సంభాషణ. తిక్కనగారు చిట్టచివర రావణుడు రంభను ఎంగిలి చేశాడని వ్రాశారు. సూటిగా వాచ్యం చేయకపోవడంవల్ల ఔచిత్యముంది. ఉషాకన్య ''కలలో గుమారుడొకడేమో చేసినం దాల్మి పెంపేదన్ దిగ్గన మేలుకాంచి''నది అని నాచన సోముడు కొద్దిగానే పోనిచ్చాడు (5-62). కలలోని కలయికకు ఆ ముద్దరాలు భయపడి ఎలుగెత్తి ఏడ్చింది.

మా తండ్రి కొలువులో మానినీతిలకంబ రమ్మన నా పేరు వమ్మువోయె
నాతోడి నీడలై నను బిన్న పెద్దగా సవరించు మీ చూపు జారువారె
బ్రతిదేవతలు నన్ను బయలనెత్తిన దివ్వె యరచేతి మానిక మనుట దప్పె
నల్లపాల్లెరుగని నాకులం బను మంచి మడుగుజీరకు జాల మైల సోకె
నింక మెచ్చనివారు మోమెత్తి చూడ
గూడు చవిగాగ గుడుచుట గూడునమ్మ
నమ్మ కిటమీద నేను బ్రాణాన గలిమి
చెలిమి మరువక తలపుమీ చిగురుబోడి. (5-90)

అని వెక్కి వెక్కి ఏడ్చిందట. నాచన సోముడు ఒక్కమాటలో 'ఏమోచేసి' అని తప్పించు కొన్నది ఎఱ్ఱయ్యగారు అంతకు ముందు బాగా విస్తరించి వ్రాశారు.

కలలోన నయ్యింతి గదిసి మోమున నవ్వుగడలొత్తదియ్యని పలుకు పలికి
కెంగేలితో గేలు గీలించి నెమ్మేను మేనను బెరయించి మెలపుతోడ
బిగియారగౌగిట సొగియించి మనసులు రెండును గరగి యొక్కండ కాగ
నేకోర్కు లేమిటి కెలసిన వానికి జబ్బనచూరలై చొప్పడంగ
జతురసంభోగరసములు చవులవెంట - నిద్దరును గ్రొత్తగా గని యేపుమిగుల
నట్టి చందంబుగావించి యాత్మమూర్తి - యబల తలపున నచ్చొత్తినట్లుసేసె.

16. సోముడు - పుట. 60

తదనంతరంబ

ఉదరిపడి మేలుకని కన్ను లువిద విచ్చి
చూచి కానద యట్టి యాసొబగు నచట
భయము లజ్జయు మోహంబు బాలమనసు
పొదివె దమము మంచును దమ్మి బొదువుమాడ్కి

అది కలలోని కానుపయి యంబికయానతిమున్న కల్గియ
ట్లొదవుట ముగ్ధతం దలప కుగ్మలి నిక్కమ కాగ జూచి పె
ల్లొదవెడు బాష్పవారి సయనోత్పలపీడ యొనర్ప రోదనా
భ్యుదయ మనోజ్ఞమై వదన మొప్ప వడంకుచు నార్తి నొందగాన్.
(హరి. ఉత్తర. ఆ.7-96 నుండి 99)

కాబట్టి ఎర్రయగారు కుదించిన కొన్నిచోట్ల సోముడు విస్తరించాడు. విస్తరించిన చోట్ల కుదించాడు. ఇద్దరూ సరిసమానంగా వ్రాసిన ఘట్టాలూ ఉన్నాయి. హరిహరనాథునికి తన గ్రంథాన్ని అంకితమివ్వకపోయినా ఎర్రయ్యగారు శివకేశవులు ఇద్దరూ ఒక్కదగ్గర ఉన్నప్పుడు చూపరులకు ఎలా కనబడ్డారో మనోజ్ఞంగా వర్ణించారు. చూడండి :

హరిజూతురు హరుజూతురు - హరిజూతురు గ్రమ్మరంగ హరుజూతురు ని
ర్జరులును మునులును నిమ్మెయి - హరిహరతత్త్వముగ విస్మితాలోకనులై,

అందరు నయ్యిరువురకుం బ్రణామంబులు సేసి యంజలిపుటంబులు ఘటించి

యజ్ఞరక్షకుడును యజ్ఞవిధ్వంసియు నై లోకనుతుల బెంపారువారు
కందర్పజనకుండు గందర్పదర్పైకదమనుండు నై లీల దనరు వారు
భువనసంభర్తయు భువనసంహర్తయు నన నాత్మగుణకృత్యులైనవారు
భూధరోద్ధారియు భూధరావాసియు నగుట నిత్యప్రీతి నెగడువారు

విషధిజాతంబు లగు రత్న విషము లురము
గప్పు కంఠంబు గైసేయ నొప్పువారు
భుజగశయనుండు భుజగవిభూషణుండు
నెపుడు గరుణతో వరదు లయ్యెదరు మాకు.
(హరి. ఉత్తర. 6-39 నుండి 41)

ఎర్రయగారు ప్రబంధధోరణిలో వ్రాసిన ఈ ఘట్టాన్ని నాచన సోముడు కూడా మొదట ప్రబంధధోరణిలోనే వ్రాశాడు. శివకేశవులు ప్రక్క ప్రక్కల నిలబడగానే

ఇత్తెరగున నయ్యిరువుర-చిత్తముగతి నొడలు గలసి సిద్ధాంతపరా
యత్తులగు మునుల యెరుకకు-విత్తై చెలువారె జమిలి వేల్పని తెలుపన్.

అట్టియెడ,

అభ్రంకషంబైన యాలపోతు నితండు ద్రుంచినా డీతండు పెంచినాడు
సాధుసమ్మతముగా సామజంబు నితండు గాచినా డీతండు ద్రోచినాడు
బర్హిర్ముఖార్థమై పర్వతేశు నితండుదాల్చినా డీతండు వ్రాల్చినాడు
ఫణపరంపరతోడి పన్న గేంద్రు నితండు మెట్టినా డీతండు సుట్టినాడు
నేడు నాడును నాడును నేడు మనకు
జూప జెప్పంగ జెప్పంగ జూపగలిగె
ననుచు గొనియాడు సంయమిజనుల కొదవె
రజతగిరిమీద హరిహరారాధనంబు. (ఉత్తరహరి. 2-178 నుండి 180)

ఆ తరువాత పురాణపద్ధతిలో వ్రాశాడు. శివకేశవులు వాళ్ళలోవాళ్ళు ఎక్కువగా మాట్లాడుకొనడం, పిమ్మట అక్కడనున్న సకల దేవతా మునిసంఘాన్ని కనుగొని

ఆద్యబీజాయ విశ్వకర్త్రే ఒక్షరాయ
నిర్గుణాయ గుణాత్మనే నిర్మలాయ
హరిహరాత్మనే ప్రవరదివ్యాయ యజ్ఞ
సూక రాయ నమో యనుచు న్నుతింతు. (ఉత్తరహరి. 2-219)

అని మహేశ్వరుడు మునులు వినగా ''ఇది పురాణ ముఖ్యస్తోత్రం'' అని చెప్పడం నాచన సోముడు వ్రాశాడు. గంభీరంగా ఉండవలసిన ఘట్టాలలో ఏ మాత్రం చమత్కారాలకూ పోక సీరియస్‌గా వ్రాశాడు. విస్తరించి వ్రాయకుండా చిన్నచిన్న మాటలలో నాచన సోముడు కూడా మన కళ్ళముందు మంచి దృశ్యాలు నిలబెట్టగలడు. పాంచజన్యం పూరిస్తున్న కృష్ణుని ఎలా వర్ణించాడో చూడండి :

అంగిరుడు పెల్లగిల్లిన - సంగరజయ మమర బాంచజన్యము బూరిం
చెం గంసవైరి ముందర - మ్రింగిన శశి నుమియు నీలమేఘముపోలెన్.
(ఉత్తరహరి. 6-47)

కరుణరసం వ్రాయడంలో కూడ సోముడు తన కాలపు విషయాలను వ్రాస్తాడు. చూడండి: పుట్టిన బిడ్డలు చచ్చిపోతూ ఉంటే, ఈసారి కానుపైనా కాపాడమని కృష్ణునితో మొరపెట్టుకొనే బ్రాహ్మణుడు ఎలా రోదిస్తున్నాడో...

తడియొత్తు చీరతో దాదికౌగిట జేర్చి చూపంగ గన్నార జూడనైతి
దడవి యాడక మున్న తట్టాడు మని పట్టి పడకంగ సెజ్జపై వ్రాల్చనైతి
నల్లంత దవ్వుల నప్పలప్ప లనంగ నెదురుగా బరతేర నెత్తనైతి
వియ్యాల చే నిచ్చి వేడుక నను వారు తిట్టింప విని దప్పిదేరనైతి

నకట మిథ్యామనోరథుం డైతి గాని
కొడుకులం గని దమవారు గొండసేయ
నుండలేదయ్యో సంపద లుబ్బనేని
లేబరమకాదె బిడ్డలు లేని బ్రతుకు. (ఉత్తరహరి. 2-16)

అల్లంతదూరంలో 'అప్పలప్పలన'డం, వియ్యాల చేనిచ్చి వేడుకకు వాళ్ళు తిట్టిస్తే వినడం - ఎంత సహజమైన తెలుగుతనం వర్ణించాడో! తెలుగు దేశంలో కాకతీయ యుగం నుండీ ఆడే పాచికల ఆటను పాల్కురికి సోమనాథుడు వర్ణించినట్టే సోముడు ఈ యుగంలో విపులంగా వర్ణించాడు. (ఉత్తరహరి. 109-142). పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్ర - పురాతన ప్రకరణంలో కుమారపాల ఘూర్జరుని కతలో నెత్తాల ఆటను వర్ణించి ద్యూత పరిభాషను విరివిగా వాడాడు. దుగ, ఇత్తిగ, దచ్చౌక, తీవంచ మొదలైనవి ఆనాటి పారిభాషిక పదాలు. పాల్కురికి సోమనాథునిలాగే నాచన సోమనాథుడు కూడా ద్యూత వర్ణనను సవిస్తరంగా వర్ణించి ఒక ఫ్యాషనుగా చేశాడు. అందుకే విష్ణుమాయా నాటకం కర్తకూడా లక్ష్మీనారాయణుల చేత సొగటాలాడించాడు (2-11 నుండి 21). ఈ పద్యాలనుండి ఈ ఆటను ఎలా ఆడేవారో సురవరం ప్రతాపరెడ్డిగారు వివరించారు.[17] నాచన సోముని ఉత్తరహరివంశంలో ఎన్నో సాంఘిక విషయాలను సేకరించవచ్చు. ఇప్పుడున్న ఉత్తర హరివంశం సంపూర్ణం కాదని, మిగతా భాగం దొరికితే ఎన్నో కొత్త విషయాలు దొరుకుతాయని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వ్రాశారు.[18] ఉన్న గ్రంథంలోనే కొంత దొరకలేదనే విచారం ఉన్నా ఇతడు వ్రాసిన ఇతర గ్రంథాలేమిటో తెలుసుకొందాం.

నాచన సోమన ఉత్తరహరివంశాన్నే కాక 'వసంత విలాసం' అనే కావ్యాన్ని కూడా రచించాడు. ఇది కాలగర్భంలో కలిసిపోయింది. లాక్షణికులు, సంకలనకర్తలు క్రోడీకరించిన నాలుగైదు పద్యాలు తప్ప ఈ కావ్యంలో మరే భాగం మనకు దక్కలేదు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ ప్రబంధ రత్నావళి అనుబంధంలో ఈ క్రింది పద్యాన్ని ఉదాహరించారు.[19]

ప్రాలేయప్రతిసీరసేన బరపెన్ బైపై వసంతంబులన్
గాలోన్మీలితకోరకోదరపరాగప్రౌఢ కోపాగ్నియై
హాలాపానవిహారపౌరమహిళాహంకారదోస్సారమై
హేలాపల్లవహేతి ఖండితమహాహేమంతసామంతమై.

క్రీ.శ. 1656లో ఉన్న అప్పకవి ముకారయతులు పేర్కొన్న సందర్భంలో 'వసంత విలాసం'లోంచి ఈ పద్యాన్ని ఉదాహరించాడు.

17. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పుటలు 85-92.
18. సారస్వతాలోకం, పుట 78
19. పుట 184. ఈ పద్యం ఆంధ్రసాహిత్యపరిషత్తులో ఉన్న ఉదాహరణ పద్యాల సంధాత సంగ్రహించినదని పట్టికలో వేటూరివారు చెప్పారు.

అత్తరివిటనాగరికులు-చిత్తమున వసంతకేళి చిగురొత్తంగా
మొత్తములు గట్టి తెచ్చిరి - ముత్తెపురుఖుల్లరులతోడి బుఱ్ఱటకొమ్ముల్.
(అప్ప. 3-73)

ఇదే పద్యాన్ని బహుజనపల్లి సీతారామాచార్యులవారు 'బుఱ్ఱట కొమ్ము' అనే మాటకు అర్థం వ్రాస్తున్న సందర్భంలో శబ్దరత్నాకరంలో ఉదాహరించారు. అయితే ఇది వైజయంతీ విలాసంలోనిదని చెప్పారు. దీనికే విప్రనారాయణ చరిత్ర అనే మారుపేరు ఉంది. దీనిని 1510 ప్రాంతాలలో జీవించిన సారంగు తమ్మయ్య వ్రాశాడు. బహుజనపల్లివారు చెప్పారుగాని ఈ పద్యం 'వైజయంతీ విలాసం' లో లేదు.[20] ఇది అప్పకవి పేర్కొన్న 'వసంత విలాసం' లోనిదే కావచ్చు. పద్యాలను ఉదాహరిస్తున్నప్పుడు కర్తలపేర్ల విషయంలోనూ, గ్రంథాల పేర్ల విషయంలోనూ అప్పకవి పొరబడకపోలేదు. నాచన సోముని ఉత్తరహరివంశంలోని 'ఒక నాడిందుధరుండు' (5-47) అనే పద్యాన్నే అప్పకవి ఆదిపురాణంలోనిదని చెప్తూ ఉదాహరించాడు (3-118). హరివంశానికి ఆదిపురాణమనే మారుపేరుండేదేమో అని వేలూరి శివరామశాస్త్రిగారు సందేహపడుతున్నారు.[21] ఇటువంటి కారణాంతరం లేకపోతే నాచన సోముడు 'ఆదిపురాణం' అనే మరొక గ్రంథం కూడా వ్రాసి అందులో ఉత్తర హరివంశంలోని 'ఒక నాడిందుధరుండు' అనే పద్యాన్నే వాడుకొన్నాడేమో అని కూడా శివరామశాస్త్రిగారు అనుమానిస్తున్నారు. ఈ ఆదిపురాణాన్నే ఆదిత్యపురాణమని అప్పకవీయంలో అధోజ్ఞాపికలో వావిళ్ళవారు వివరించారు.[22]

అప్పకవి 'సోముని హ రివంశమునందు' అని చెప్పి ఈ క్రింది పద్యాన్ని సంయుతా సంయుత ప్రాసముల ప్రసక్తిలో చెప్పాడు.

నాతో మార్కొనలేరు నిర్జరపురీనాగేంద్రబృందారకా
రాతుల్మున్నుగ దేవసంఘములు పోర న్దీరసంగ్రామకుం
డీ త్రైలోక్యమునందు గల్గడు రణంబెచ్చోట లేకుండగా
జేతుల్వేయువృథాభరంబగుచు వచ్చె న్దేవ యీ మేనికిన్. (అప్ప. 3-319)

ఇది బాణాసురుడు శివునితో చెప్పే పద్యం. అయితే సోముని ఉత్తర హరివంశము వ్రాతప్రతులలో ఈ పద్యం కనబడదు అని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాశారు. ఇది పంచమాశ్వాసంలో 19, 20 సంఖ్యలు గల పద్యాల క్రమంలో ఉండాలి. 21వ నెంబరు పద్యంలో ''నావుడు దేవదేవుడు మనంబున నించుక నవ్వి'' అనే మాటలున్నాయి. దీనికి ముందుగానే ''నాతో మార్కొనలేరు'' అనే పద్యానికి ఆస్కారముంది. కనుపర్తి అబ్బయామాత్యుని 'అనిరుద్ధచరిత్రము' లోగాని, రంగాజమ్మ 'ఉషాపరిణయము' లోగాని

20. వావిళ్ళవారు 1909లో ప్రకటించిన ప్రతిలో.
21. ఉత్తరహరివంశ విమర్శ, పుట. 10
22. 1934 ముద్రణలో, 143వ పుట.

ఈ పద్యంలేదు. ఎఱ్ఱన్నగారి 'హరివంశం'లో కూడ లేదు. పోతరాజుగారి దశమ స్కంధంలో సైతం లేదు. అందుచేత అప్పకవి చెప్పినట్టు సోముని హరివంశంలోనే 'నాతో మార్కొనలేరు' అనే పద్యం ఉండవచ్చు. ఇది వ్రాతప్రతులలో కనబడకపోవడంవల్ల అప్పకవినాటి ఉత్తరహరివంశపు ప్రతులు నష్టమైపోయాయే అన్న విచారం కలుగుతుంది. 'అత్తరి విటనాగరికులు' అనే పద్యం నాచన సోముని వసంత విలాసంలోనిదే అని అప్పకవి చెప్పిన విషయం వాస్తవమే. దీనికి కూచిమంచి తిమ్మకవి సాక్ష్యముంది. సర్వలక్షణ సారసంగ్రహంలోని విశ్రమ ప్రకరణంలో ఎక్కటి యతుల సందర్భంలో ఈ పద్యాన్నే తిమ్మకవి నాచన సోముని వసంత విలాసంలోనిదని ఉదాహరించాడు.[23] అయితే తిమ్మకవి కూడా పుస్తకాల పేర్ల విషయంలో పొరబడి ఉండడానికి అవకాశం ఉంది. సోముని ఉత్తరహరివంశంలో నరకాసురుడు ఊర్వశిలో సంభాషించిన ఘట్టంలో ఈ క్రింది పద్యముంది.

అంజెదవుగాక నను జెం- తం జేరగనీక యెంత దరిసిన[24] మిరియా
లుం జొన్నల సరిపోవే - లంజెతనములందు గొమిరెలన్ గెలువనటే.[25]

(ఉత్తర. 1-75)

ఇదే పద్యాన్ని పాఠాంతరాలతో కూచిమంచి తిమ్మకవి ఉదాహరిస్తూ ఇది సోముని వసంతవిలాసంలోనిదన్నాడు.[26] ఇది ఉత్తరహరివంశంలో సుప్రసిద్ధమైనది. ఇటువంటి ఘట్టమే వసంతవిలాసంలో కూడా ఉందని, అందుకే అదే పద్యాన్ని మళ్ళా వాడుకొన్నాడని ఇంకొకసారి మనం భావించడం కన్నా తిమ్మకవి పొరబడి ఉండడానికి అవకాశాలున్నాయనుకొనడం మంచిది.

అడిదం సూరకవి తన కవిసంశయవిచ్ఛేదంలో ఒక శార్దూలంలోని మొదటిపాదంలో కొంతమాత్రమే ఉదాహరించి అది నాచన సోముని వసంతవిలాసం లోనిధని చెప్పాడు. ఈ పద్యం పూర్తి పాఠాన్ని మానవల్లి రామకృష్ణ కవిగారు తమ క్రీడాభిరామం పీఠికలో ఇవ్వడమేగాక ఇది ఆ కావ్యంలోని తొలిపద్యమని చెప్పారు.[27] ఎత్తుగడలోనేకాక మొత్తంమీద పద్యం కృత్యాదిని ఉండే దానిలాగే కనబడుతుంది. చూడండి :

శ్రీ చన్నుంగవక్రేవఁ గ్రొమ్మెఱుగులన్ శృంగారపుం దోటకుం
బ్రాచీనం బగుచున్న వింశతినఖ ప్రౌఢిన్ సుఖాంబోధివే
లా చంద్రోదయమైన దేవుఁడు కృపాలంకార చిత్తంబునం
జూచున్ మాచయ బ్రహ్మధీమణిఁ గవిస్తోమైక చింతామణిన్.

23. మంత్రిప్రగడ భుజంగరావుగారి ముద్రణ (1901) పుట. 148, పద్యం నెం. 110.
24. 'తగ్గిన' అని పాఠాంతరము.
25. గెలువనొకో అని పాఠాంతరం.
26. ''సర్వలక్షణసారసంగ్రహం'' - మంత్రిప్రగడ భుజంగరావుగారి ముద్రణ, పుట 18, పద్యం నెం. 13
27. అలభ్యకావ్య ముక్తావళి - డాక్టర్ ఆర్. శ్రీహరి, పుట 120

తిరుపతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోని బాలబోధ ఛందస్సు అనే లక్షణ గ్రంథంలో వితాళచౌపదకు ఉదాహరణంగా నాచన సోముని వసంతవిలాసం నుండి ఈ కింది వచనం ఉదాహరణంగా ఇచ్చారు.

వీణనాదముల్ వెన్నెల తేట
రాణ మీఱఁగా రమణులయాట
ప్రాణమైన పిన బ్రాహ్మణువీట
జాణలు మెత్తురు జాజరపాట. (R.1212)

నాచన సోముని వసంతవిలాసంలోనిదంటూ వీరేశలింగంగారు ఒక పద్యాన్ని ఆంధ్రకవుల చరిత్రలో ఉదాహరించారు.

లంజె వశ్యగాక ననుజెం
తం జేరగనీక యెంతతగ్గిన మిరియా
లుం జొన్నల సరిగానే
లంజతనము లందు కొమిరెలం గెలవనొకో. (పుట. 355)

ఇదే పద్యాన్ని కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణసార సంగ్రహంలో అచ్చ తెనుగు ప్రకరణంలో 'లంజె' అనుటకు ప్రామాణిక ప్రయోగం చూపిస్తూ ఇది ఉదాహరించాడు. 1901లో మంత్రిప్రగడ భుజంగరావుగారు ప్రచురించిన సర్వలక్షణసార సంగ్రహంలో ఈ పద్యం నాచన సోముని వసంతవిలాసంలోనిదని స్పష్టంగా చెప్పారు. (2-13 పుట 18) అయితే కోవెల సంపత్కుమారగారు పరిష్కరించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రకటించిన కూచిమంచి తిమ్మకవి 'లక్షణసారసంగ్రహం'లో ఈ పద్యాన్నే నాచన సోముని 'హరివిలాసము'లోనిదని చెప్పారు. (1-83, పుట 17). సంపత్కుమార గారు 1914లో నందివాడ చలపతిరావుగారు ఏలూరు మంజువాణి ప్రెస్సులో ముద్రించిన ప్రతిని చూశారు గానీ అదే ప్రెస్సులో 1901లో ప్రచురితమైన ప్రతిని చూడలేదు. నా గ్రంథాలయంలో ఇంకొక ముద్రిత ప్రతి ఉంది. దీనిని ఎవరు ముద్రించారో, ఎప్పుడు ముద్రించారో తెలిపే ముఖపత్రం లేదు. దీనిపేరు 'సర్వలక్షణసారసంగ్రహం' అని కాక ఉత్త 'లక్షణసారసంగ్రహము' అని ఉంది. ఇందులో కూడా 'అంజెదవుగాక' అనే పద్యం 'దేశ్యగ్రామ్య ప్రకరణం'లో ఉదాహరిస్తూ నాచన సోముని వసంత విలాసము నుండి తీసుకొన్నదే అని చెప్పారు. (పుట 11). (ఈ ముద్రిత ప్రతి రెంటాల సుబ్బారావుగారు వివిధ లక్షణ గ్రంథాలను కలిసికట్టుగా బైండు చేయించిన సంపుటంలో ఉంది. ఈ ప్రతి యతి ప్రకరణంతో ఆగిపోయింది.) వీరేశలింగంగారూ, మంత్రిప్రగడవారూ, మరొకరూ వసంత విలాసంలోనిదిని ఉదాహరించిన పద్యం 'హరి విలాసం'లోనిదంటూ ఇతర ఆకరంవల్లనో, ఆకరాలవల్లనో సంపత్కుమారగారు పరిష్కరించిన ప్రతిలో చోటు చేసుకొంది. అయితే నాచన సోముడు హరివిలాసమనో, హరవిలాసమనో ఒక ప్రబంధాన్ని రచించాడన్నది వాస్తవేతర విషయం కాదు. గణపవరపు వేంకటకవి రచించిన

ఆంధ్ర ప్రయోగ రత్నాకరములోనూ, కస్తూరి రంగకవి చేసిన ఆనందరంగరాట్ఛందంలోనూ సోముని ఈ గ్రంథం నుండి ఉదాహరణ పద్యాలు ప్రామాణిక ప్రయోగాలుగా కనబడుతున్నాయి. ఎటొచ్చీ కస్తూరి రంగ కవి తన ఛందోగ్రంథంలో ఒక చోట ఒకలాగ ఇంకొకచోట మరొకలాగ కావ్యనామం చెప్పాడు.

''ఆద్యక్షర హల్లుతో అచ్చుకూడి ఉన్నందున హల్లునకైనను, అచ్చునకైనను యతి యుండ జెప్పితే అది ప్రాది యతి యగును'' అంటూ ఆ ప్రాది యతికి ప్రామాణిక ప్రయోగాన్ని చూపిస్తూ కస్తూరి రంగకవి నాచన సోముని 'హరి విలాసమున' అని ఈ పద్యాన్ని ఇలా ఉదాహరించాడు.

శంబర వైరి విభంజన
సాంబ శివా యంధక ప్రశాసక గజచ
ర్మాంబర ధరయని నీదుప
దంబులు పూజించువాడు ధన్యుడు సుమ్మీ? (3-124)

కావ్యనామం హరివిలాసమని చెప్తున్నా ఇందులో హరుని ప్రస్తుతి కనబడుతోంది. ప్రాదియతులలోనే 'ఆజ్' అనే ఉపసర్గలోని హల్లుకు ప్రమాణంగా ''నాచన సోముని హర(రి) విలాసమున'' అని ఈ క్రింది పద్యాన్ని కస్తూరి రంగకవి ఉదాహరణంగా ఇచ్చాడు.

మౌని తిలక సజ్జన సం
తాన మహీరుహ! భవత్సుధాలాపమునా
వీనులకు విందొనర్చెన్
మేనున గల తాప మణచె మృషగాదు సుమీ! (3-357)

నాచన సోముడు హరిహర నాథ భక్తుడు కనుక ఇది హరివిలాసమైనా, హరవిలాసమైనా శివకేశవుల కథలు రెండూ ఇందులో చెప్పాడని లాక్షణికులు ఉదాహరించిన పద్యాలవల్ల తెలుస్తున్నది. నాచన సోముని 'హరి(ర) విలాసం' నుండి లభించే 12 పద్యాలను డాక్టర్ ఆర్. శ్రీహరిగారు వివిధ ఆకరాల ద్వారా క్రోడీకరించారు.[28] వీటిలో ఒకటి మాత్రం వసంతవిలాసంలోనిది. మిగతావి హరి(ర) విలాసంలోనివే అని భావించవచ్చు. ఒకటి మినహాయించి, శ్రీహరిగారు సేకరించిన 11 పద్యాలను కృతజ్ఞతలతో పొందుపరుస్తున్నాను.

1. జయవిజయవినుత జన్యా
వ్యయ దూరానందరూపభాసుర దత్తా
భయ హరిహయముఖనిర్జర
నయనన్నక్షత్రయూథ నళినీనాథా!

---

28. అలభ్యకావ్యముక్తావళి - పుట 196 నుండి.

2. భూకాంతవర్యా పుణ్యా
శ్లోకులు నీవలననే ఫలోన్నతి చాలం
గైకొందురు నిజముగ నని
రేకల తెఱఁగెల్ల విస్తరింప గడంగెన్.

3. మౌని తిలక సజ్జనసం
తానుమహీరుహ భవత్సుధాలాపము నా
వీనులకు విందొనర్చెను
• మేనునఁ గల తాప మణచె మృషగాదు సుమీ!

4. చెంగలువల తళతళమను
కంగవినిద్ధావసిండి కలకల నగు మే
నంగజుని కుంభికుంభము
లం గేరు నురోజములు నెలంతకుఁ దనరెన్.

5. సకియా! వినవే నీతో
నిఁక యేమి వచింతు నాదు హృదయేశ్వరునీ
డకు తోడి తెమ్ము లేదే
ని కదలు ప్రాణములు మేన నిలువకయైనన్.

6. జపము చాలించి యత్తపసి యచ్చరకన్ని
యను కంట నింపెసలారఁ జూచె
చూచి వెంబడి...............

7. జయమగుటకు నీ మది సం
శయమేటికి విను మనుచు సమంచితకరుణా
లయుఁడగు మునీంద్రుఁడెంతయుఁ
బ్రియముగ మంత్రంబు జెప్పె నృపవరుఁ డెలమిన్.

8. అభవుఁ డాహవమదోద్ధతుఁడైన యంధకా
సురుబారి గొనకేల శూల మూని

9. రేదొరయల్లుడు మెఱయన్
గేదఁ గిఱేకు తెలిగచ్చునె జనుగుమ్మెన్
పైదలి గుబ్బల నడుమను
వాదుడుకగు బలము చుట్టువారు వరాంగన్.

10. శంబరవైరి విభంజన
సాంబశివా యంధకారిశాసన గజచ
ర్మాంబరధర యని నీదు ప
దంబుల్ పూజించువాఁడు ధన్యుఁడు సుమ్మీ

11. గౌడనరపాల మౌనిశేఖరుల వార్త
కృష్ణకథ విన్నయట్టి నీ కింక నేను
క్లప్తి గాక హర్యవతారలీలలెల్ల
తెలివిడిగ వచియించెద తెలిసికొనుము.

డాక్టర్ పి. యశోదారెడ్డిగారు నాచన సోముడు హరివిలాసమని ఒక గ్రంథం, హరవిలాసమని ఇంకొక గ్రంథం రచించాడని భావిస్తున్నారు. హరివిలాసంలో శ్రీకృష్ణుని బాల్యాన్నీ ఇతర లీలావిలాసాలనూ వర్ణించాడనీ, ఈ కావ్యం దేనికీ అనువాదం కాదనీ యశోదారెడ్డిగారి విశ్వాసం. ఈ విషయాన్ని ''నాచన సోముడు - అతని కాలము - రచనలు'' అనే ప్రకరణంలో విపులంగా చర్చించారు.[29]

మొత్తంమీద లాక్షణికులో, సంకలనకర్తలో ఉదాహరించడంవల్ల నాచన సోముని కృతులు నాలుగు ఉన్నట్టు తెలుస్తున్నది.

అవి 1. ఉత్తర హరివంశం; 2. ఆది పురాణం లేక ఆదిత్యపురాణం; 3. వసంత విలాసం; 4. హరి(ర) విలాసం.

ఈ నాలుగింటిలోనూ మొదటిదే (అందులోనూ కొన్ని పద్యాలు లోపించి) నేడు దొరుకుతూంది. ఇదైనా కొంత దక్కినందుకు మనం సంతోషించాలి.

ఈ పుస్తకం నాచన సోముడు వ్రాయడం వల్లనే మన సాహిత్యం పురాణ ధోరణి నుండి ప్రబంధ పద్ధతికి మారింది.

అనంతకృష్ణ శర్మగారు చెప్పినట్లు తరువాత కవులలో ''వస్తుకళ చాలావరకూ అంతరించి రచనపై దృష్టి ప్రబలింది. శబ్దార్థముల చిత్రరచనలు పుంఖానుపుంఖములుగా శాఖోపశాఖలుగా అల్లుకొన్నది. క్రమంగా రచనలో కూడా అర్థము కన్న శబ్దములు ఎక్కువ ప్రాముఖ్యము వహించి నిలిచినవి. సరసత్వము కంటే చమత్కారమే ఎక్కువ సాహిత్య ధర్మముగా మారినది.''[30]

దీనికి ఎక్కువ కారణభూతుడు నాచన సోముడు.

దీని మంచిచెడ్డల కీర్తి పూర్తిగా అతనిదే.

---

29. యశోదారెడ్డి, పి. తెలుగులో హరివంశములు - హైదరాబాదు, 1973
30. సారస్వతాలోకము, పుట 64

గోన బుద్ధరాజు

చిత్తశుద్ధితో, ప్రేమతో జేసిన ఎటువంటి సేవనైనా తెనుగువాళ్ళం 'ఉడతాభక్తి' అంటాం. ఇది తెలుగు జాతీయం. సేతువు కడుతున్నప్పుడు రాములవారికి తోడ్పడిన ఉడత పూర్తిగా తెనుగుదే. వాల్మీకి రామాయణ మూలంలో లేని ఈ ఘట్టం తెలుగు రామాయణాలలో వుంది. మొదటిసారిగా ఈ ఉడతాభక్తిని గ్రంథస్థం చేసినవాడు గోన బుద్ధరాజు. ఇతడు పాడుకోటానికి అనువైన ద్విపద చ్ఛందస్సులో రామకథ చెప్పాడు. దీనినే రంగనాథ రామాయణం అని లోకం చెప్పుకొంటున్నది. ఈ ద్విపద రామాయణం ఎలా ప్రభవించిందో తెలుసుకుందాం.

క్రీ.శ. 1294 ప్రాంతాలలో కదనప్రచండ, మీసరగండ, ఉభయ బలగండ గోన గన్నయరెడ్డిగారు వర్ధమానపురంలో సుఖసంకథా వినోదంతో పృథివీరాజ్యం చేస్తూ ఉండేవాడు. ఆ రాజ్యానికి రక్షామణియైన విట్ఠలనాథ భూనాథుడు ఆదవాని, తుంబుళం, మాలువ, హాలువ మొదలైన దుర్గాలు సాధించి తదనంతరం రాచూరి పట్టణ ప్రవేశాభి ముఖుడై సుఖసంకథా వినోదంతో పృథ్వీరాజ్యం చేస్తూ శా.శ. 1216కు, అంటే క్రీ.శ. 1294కు సరియైన జయ సంవత్సర మార్గశిర శుద్ధ సప్తమినాడు సర్వరాష్ట్ర సమస్త ప్రజారక్షణార్థమైన దుర్గం రచించాడని రాయచూరి శాసనం చెపుతున్నది.[1]

బహుశః ఈ విట్ఠలనాథ భూపతి 'ఆ దుర్గంలోనే కాబోలు కొన్నేళ్ళ తరువాత కొలువు ఉన్నాడు. ఆ సభలో బహు పురాణజ్ఞులు, బహు శాస్త్రవిదులు, బహు కావ్యనాటక ప్రౌఢమానసులు, హితులు, మంత్రులు, పురోహితులు, ఆశ్రితులు, సుతులు, రాజులు, బహుశ్రుతులు ఉన్నారు. భూలోక దేవేంద్రుడిలాగ ఏపారివుంటూ, రసికులు భారత రామాయణాది రసగోష్ఠి చెల్లిస్తూ వుండగా, రసిక శేఖరుడు విట్ఠలనాథుడు రామకథా సుధా రససక్తుడై ఆ సభలో అందరినీ చూచి, ''రమణీయంగా తెలుగులో రామాయణం క్రమ[illegible]ప్పగా చెప్పడానికి ఘనకావ్యశక్తిగలవాళ్ళెవరు భూమ్మీద వున్నారు'' అని ప్రశ్నించాడు. అప్పుడా సభలో ఉన్న విబుధులు ''మీ అబ్బాయి బుద్ధరాజు కన్న రామాయణ మర్మం తెలిసిన వాళ్ళెవ్వరున్నారు?'' అని విన్నవించుకొన్నారు. అప్పుడు విట్ఠలనాథుడు తన కుమారుణ్ణి పిలిపించాడు. ''భూమ్మీద కవులూ, విబుధులూ మెచ్చుకొనేటట్టు రామాయణ పురాణకావ్యం నాపేర తెలుగులో చెప్పి దానిని ప్రఖ్యాతం చెయ్యి'' అని ఆనతిచ్చాడు.

తండ్రి ఆజ్ఞను శిరసావహించి బుద్ధరాజు పనిబూని అరిగండభైరవ, మీసర గండాంకుడైన తన తండ్రి పేర రాజులు, బుధులు, రసికులు, సుకవిరాజులు గోష్ఠిని రాగిల్లి పొగిడేటట్టు పదాలు, అర్థాలు, భావాలు, గతులు, పదశయ్యలు, అర్థసౌభాగ్యాలు,

---

1. గోనవారి రాయచూరి శాసనం. కాకతీయ సంచిక నుండి. చాగంటి శేషయ్యగారు ఉదాహరించినది. ఆంధ్ర కవి తరంగిణి, 4. పుట 20

యతులు, రసములు, గుంభనములు, ప్రాస సంగతులు, అసమానమైన రీతులు అన్నీ ఉండే కావ్యం ఆదికవీశ్వరుడైన వాల్మీకి చెప్పిన పద్ధతిని రామాయణాన్ని చెప్పడం మొదలు పెట్టాడు.

రాయచూరి శాసనంలోని విట్ఠలనాథుడే కొడుకు చేత రంగనాథ రామాయణం వ్రాయించినాడనడానికి ఆస్కారం ఉంది. ఆ శాసనంలో 'మీసరగండ' అనే బిరుదు గోన గన్నయరెడ్డికి ఉంది. అతని రాజ్యరక్షామణి అయిన విట్ఠలనాథుడికి కూడా ఆ బిరుదు ఉండవచ్చు. సాధారణంగా ఏలికల బిరుదులను అణకువగా ఉన్నవాళ్ళు ధరిస్తారు. రంగనాథ రామాయణం వ్రాయించిన విట్ఠలనాథుడికి కూడా 'మీసరగండ' బిరుదు ఉంది. ఈ బిరుదులు కాలక్రమానుగతంగా కూడా వస్తాయి. క్రీ.శ. 1294 ప్రాంతాలలో ఉన్న విట్ఠలనాథుడేకాక అతని మనుమడో, ముని మనుమడో ఎవ్వరైనా ఈ బిరుదు ధరించడానికి అవకాశం లేకపోలేదు.

రంగనాథ రామాయణంలో కవి తన వంశాన్ని వర్ణిస్తూ మొట్టమొదట గోన కాటభూపతిని పేర్కొన్నాడు. గోనవంశం వారి శాసనాలు కొన్ని తెలంగాణాలో దొరికాయి. అందులో గోన కాటయ పేరు మాత్రం కనపడడం లేదు. చెంగల్పట్టు జిల్లా తిరుప్పుక్కు శాసనంలో ఒక గోన కాటయ్యా పేరు కనపడుతూందని మల్లంపమల్లి సోమశేఖర శర్మగారు గుర్తించారు.[2] ఈ కాటయ కాలం క్రీ.శ. 1250 ప్రాంతాలు. ఇతడే రంగనాథ రామాయణంలో పేర్కొన్న కాట భూపతి అయితే వాళ్ళ వంశవృక్షం వివిధ కాలనిర్ణయాలలో ఇలాగ వుంటుంది.

గోన కాటభూపతి	క్రీ.శ. 1250
రుద్రనరేంద్రుడు	క్రీ.శ. 1275 – క్రీ.శ. 1300
బుద్ధభూవిభుడు	క్రీ.శ. 1325
విట్ఠలభూనాథుడు	క్రీ.శ. 1350
బుద్ధభూపతి	క్రీ.శ. 1375

సోమశేఖర శర్మగారు చేసిన కాలనిర్ణయం మనం అంగీకరిస్తే రంగనాథ రామాయణం వ్రాయించిన విట్ఠలనాథుడికీ రాయచూరి శాసన కాలానికీ 55 సంవత్సరాల వారడి కనబడుతుంది. రాయచూరి శాసనం అతడి పహిలా పచ్చీసులో వ్రాయించి ఉంటే అతడు కనీసం క్రీ.శ. 1270లో పుట్టి ఉండాలి. అప్పుడుగాని క్రీ.శ. 1294లో రాయచూరి దుర్గరచన జరగదు. రాయచూరు విట్ఠలనాథుడికి అతని పహిలా పచ్చీసులోనే బుద్ధరాజు జన్మించాడనీ, రామాయణ మర్మమంతా కరతలామలకం చేసుకొనే వయసు అయినా ముప్ఫయ్యో సంవత్సరం బుద్ధరాజుకు వచ్చాకనే విట్ఠలరాజు సభలో అటువంటి ప్రశ్న వేయడం జరిగిందనీ అనుకుంటే ఆ కాలం క్రీ.శ. 1294+30=1324వ సంవత్సరమవుతుంది.

2. రంగనాథ రామాయణం : రాయల ప్రచురణ, పీఠిక, పుట 7

అది ప్రతాపరుద్రుడు అస్తమించిన సమయం. రాజ్యం అల్లకల్లోలంలో వున్నది. అటువంటి పరిస్థితులలో స్తిమితంగా కావ్యరచనకు ఆనతివ్వడంగాని, వ్రాయడంగాని జరగదు. అందుచేత మరికొన్ని సంవత్సరాలు, కనీసం 10-15 సంవత్సరాలు పోయాక ఆంధ్రదేశానికి ఢిల్లీ సుల్తాను సేనల బెడద తప్పిన కాలంలో కాపయనాయకుడు శాంతిని సుస్థిరం చేసేదాకా ద్విపద రామాయణ రచనకు ఆనతివ్వడం జరక్కపోవచ్చు. అంటే ఇది క్రీ.శ. 1339-40. సోమశేఖర శర్మగారు చేసిన కాలనిర్ణయానికి ఒక పురుషాంతరం పైన పదేళ్ల తేడా కనపడుతున్నది. కాస్త కుడి ఎడంగా ఇది సరిపోతున్నది.

బుద్ధరాజు కొంచెం వయస్సు పైబడ్డాకనే రామాయణం రచించాడనటానికి ఆస్కారం కనపడుతున్నది. ఇతడు పూర్వరామాయణం ఆరు కాండలు రచించాక తన కుమారులను పిలిచి ఉత్తరరామాయణం రచించమని ఆనతిచ్చాడట. నిండుయౌవనంలో పూర్వరామాయణం రచన మొదలుపెడితే బుద్ధరాజే ఉత్తరరామాయణం పూర్తిచేసేవాడు. కొడుకుమీద ఆ భారం పెట్టాడంటే పూర్వభాగరచన పూర్తయ్యేసరికి అతడు ముసలివాడై వుండాలి. ''పూర్వభాగం వ్రాశాను. ఉత్తరకాండ వ్రాయడం ఎలాగ?'' అని బుద్ధరాజు చింతిస్తూ ఉన్న సమయంలో దేవుడే కనిపించి ''నీ వింక మము గూడనెమ్మి నేతెమ్ము. నీకామితార్థముల్ నిర్వహింపంగ నీ కుమారులున్నారు, వాళ్లను నియోగించు''మని చెప్పాడట.[3] అంటే అప్పటికి బుద్ధరాజు కాటికి కాళ్లుజాచుకున్నట్టే కదూ! ఏతావతా విట్ఠలనాథుడు తన డెబ్బయ్యో సంవత్సరంలోనో, ఆ తరువాతనో తన యాభై సంవత్సరాల కుమారుణ్ణి బుద్ధరాజును తన పేర రామాయణం వ్రాయమని అడిగి ఉండవచ్చు. పూర్వరామాయణాన్ని ముగించి బుద్ధరాజు తన డెబ్బయ్యోయేటనో, ఆ తరవాతనో తన కుమారులను ఉత్తరరామాయణం వ్రాయమని ఉండాలి. రచించిన రోజునుండి నేటిదాకా రంగనాథ రామాయణం ఆంధ్రదేశంలో చాలా ప్రచారంలో ఉంది. ముగ్గురు ప్రకాశకులు దీనిని ప్రచురించారు. వావిళ్ళప్రతి ప్రాచీనం, నాగపూడి కుప్పుస్వామయ్యగారు మొదటి కూర్పుకు పీఠిక వ్రాశారు. 1960లో వేదం లక్ష్మీనారాయణ శాస్త్రిగారు పరిష్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రచురణ కట్టమంచి రామలింగారెడ్డిగారి ఆధ్వర్యంలో జరిగింది; పింగళి లక్ష్మీకాంతంగారు పీఠిక వ్రాశారు. రాయలు అండ్ కో వారు ప్రకటించిన దాన్ని మల్లంపల్లి సోమశేఖర శర్మగారూ, టి.వి. రంగాచార్యులుగారూ పరిష్కరించారు. ఈ మూడు ముద్రణల పీఠికలలో చాలా విషయాలు మనకు తెలుస్తాయి. ''ఈ గ్రంథము బుద్ధభూవిభుడు రచించెను. తన తండ్రి విట్ఠలుని పేర ప్రఖ్యాతము చేసెను. గ్రంథమున గోచరించు నాధారము లివ్వి. తండ్రిపేర ప్రఖ్యాతముసేయుట యనగా అతని పేర రామాయణమును పిలుచుట'' అని ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు వ్రాశారు.[4] బుద్ధరాజు తండ్రిపేరు విట్ఠలనాథుడు. మరి రామాయణానికి రంగనాథ రామాయణం అనే పేరు ఎలా వచ్చింది? లక్ష్మీకాంతం గారు ఇలా వివరించారు :

3. ద్విపద రామాయణం - ఉత్తరకాండ. కర్తలు : గోన కాచవిభుడు, విటలరాజు, అవతారిక.
4. గౌతమవ్యాసాలు - పుట 121.

''ఈ యర్థమున దీనికి విట్ఠల రామాయణమనియో, విట్ఠలనాథ రామాయణ మనియో పేరుండదగును. అటులలేదు. రంగనాథ రామాయణమనియున్నది. ఇటులున్నను విట్ఠలు పేరనే వెలయించుటయే యగునేమో మన మాలోచింపవలయును. అగుననియే యొక యూహచే నాకు తోచుచున్నది. విట్ఠలుని పూర్తిపేరు ''పాండురంగ విట్ఠలనాథు''డై యుండవచ్చును. (విట్ఠలుడనునది పండరీపురములో వెలసిన పాండురంగ విట్ఠలనాథుని పేరు గనుక). దీనికి ఉచ్చారణసౌలభ్యము గల ''రంగనాథ రామాయణము'' అని కర్ణపేయ మైన పేరు పెట్టి యుండవచ్చును. 'నామైకదేశే నామగ్రహణం' శాస్త్రసమ్మతమేకదా! అథవా, అతని పేరు ప్రఖ్యాతము సేయుట యనగా కృతియిచ్చుట యగునేని, తండ్రికి కృతి యిచ్చిన యీ కావ్యమును ధర్మపురి, లేపాక్షి రామాయణములవలె ఏ క్షేత్ర దేవతావరముగనో కవి పిలిచియుండవచ్చును. ఈ రెంటిలో మొదటి పక్షమే నాకు బలవత్తరముగా తోచుచున్నది.''[5]

ఈ వివరణ కొందరికి రుచించలేదు. శిష్టా రామకృష్ణశాస్త్రిగారు ఇలా వ్రాశారు :

''ఈ విషయ మేమాత్రము సమంజసముగాలేదు. ఇందనౌచిత్యములనేకములు ... నామైకదేశేనామగ్రహణ మను వాక్యమునకు నామమందలి పూర్వార్ధముగాని, యుత్తరార్ధముగాని స్వీకరింపనగును గాని యొక నామమును నాలుగైదుముక్కలు చేసి యిష్టమువచ్చిన యక్కడక్కడి ముక్కలను చేర్చినచోనేక దేశసంప్రదాయము సిద్ధంపదు. పాండు-రంగ-విట్ఠల-నాథ అను భాగములో రెండు, నాలుగు భాగములను గూర్చి మధ్య 'విట్ఠల' పదమును త్యజించినచో లక్ష్మీకాంతంగారి సంకల్పము నెరవేరునేమోగాని రసాభాసము మాత్రమగును. ఏలన, విట్ఠలనాథుడు పాండురంగ క్షేత్రమందలి స్వామి. రంగనాథుడు శ్రీరంగ క్షేత్రమందలి స్వామి, అయ్యవారిని జేయబోయిన కోతియైనట్లున్నది వీరి యూహ. కాన రంగనాథ రామాయణము కృతిపతి ననుసరించి వచ్చిన దనుట కల్ల.''[6]

బుద్ధరాజు తన తండ్రి విట్ఠలనాథుని పేర రామాయణం చెప్పాడన్న మాటకు తండ్రి పేరు తన గ్రంథానికి పెట్టాడనుకోడంవల్ల ఇన్ని చిక్కులు వస్తున్నాయి. ద్విపద సంప్రదాయంలో ఎవరైనా 'ఒకరి పేర' కావ్యం చెప్పడమంటే వారికి అంకితమివ్వడమనే అర్థం. చూడండి, ఈ శతాబ్దంలోనే ఉన్న మడికిసింగనకవి ద్విపద భాగవతాన్ని ఎలా వ్రాశాడో!

> అని యిట్లు నయనిర్జరామాత్యు పేర - ధనధాన్యమణిమయదానాఢ్యు పేర
> భూభరణక్షమభుజసారు పేర - ఔభళమంత్రి కందామాత్యుపేర
> గోరి భారద్వాజగోత్రసంజాతు-డారూఢమతి నయ్యలార్యనందనుడు
> శృంగారరసకళా శ్రితవచోధనుడు-సింగయామాత్యుడు చెలువగ్గలింప
> సలలితరసభావశబ్దగుంభనల-వలనొప్ప శ్రీభాగవతపురాణమును

5. గౌతమవ్యాసాలు - పుట 122-123.
6. ఆంధ్రవాఙ్మయచరిత్ర సర్వస్వము, పుటలు 555 & 556

మహనీయమగు దశమస్కంధసరణి- విహితలీలల నొప్పు విష్ణుచరిత్ర
ప్రాకటంబగు మధురాకాండ మనిన- నాకల్ప మాకల్పమగుభంగి జెప్పె.
(ద్విపద భాగవతం, మధురకాండ, 682-688. పుట 63)

మడికిసింగన వ్రాసిన భాగవతాన్ని కందామాత్యుని పేర చెప్పిన దానికి ద్విపద భాగవతం, దశమస్కంధం అనే పేర్లేగాని కందామాత్య భాగవతం అనే పేరు లేదుకదా! ఇలాంటి ఉదాహరణలు ఎన్నయినా ద్విపద కావ్యాలలోంచి చూపవచ్చు. గౌరన మల్లికార్జునదేవు పేర 'నవనాథ చరిత్ర' చెప్పాడు. దానికి మల్లికార్జున నవనాథచరిత్ర అన్న పేరు లేదు. ఆచార్య లక్ష్మీకాంతంగారు ''అథవా అతని పేరు ప్రఖ్యాతము చేయుట యనగా కృతినిచ్చుట యగు నేని''.... అని సక్రమంగానే ఊహించినా, ఇది బలవత్తరం కాదని త్రోసిపారేసి వేరే సమర్థింపులకు పాల్పడడంవల్ల ఇలా జరిగింది. వారు ఇంకా ఇలా వ్రాశారు :

మొదలు రంగనాథ రామాయణ మన్న పేరు తొల్లింటినుండియు గలదా? మధ్యకాలమున వచ్చినదా? నడుమ వచ్చినదని చెప్ప సాహసించువారెవరును ఉండరు. ఉన్నచో, తొలినాటి పేరేమైయుండునని యడిగినపుడు చెప్పలేరు. అదిగాక, ఎంత ప్రయత్నించి ప్రచారము చేసినను నడుమ వచ్చిన పేరులు తొల్లిటివానిని తుడిచివేయలేవు. కావున, ఈ గ్రంథమునకు మొదటినుండియు రంగనాథ రామాయణమనియే పేరు.[7]

అయితే మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఇలా చెప్తున్నారు :

''బుద్ధభూపతి కాలములోగాని, అతని కుమారుల కాలములోగాని దీనికి రంగనాథ రామాయణమను పేరు వచ్చియుండదు. ఇది తమ పేరుతో నున్నపుడు రామాయణకర్త బుద్ధక్ష్మానాథుడుకాని, అతని కుమారులుకాని దీనిని రంగనాథ రామాయణమనుట కంగీకరింపరుకదా. అట్లంగీకరించుట తమ ప్రతిష్ఠకే భంగము. కావున బుద్ధనృపాలునికి జాల తరములకు దరువాత, ప్రాయికముగా రంగనాథుడు రచియించెనను ప్రతీతి యెట్లో యేర్పడి, యది యక్కడక్కడ వ్రాతప్రతులలో రంగనాథ రామాయణమని పేర్వడి క్రమముగా నది లోకవ్యవహారమున నల్లుకొనిపోయి ముద్రణము వచ్చినపిదప రూఢమైనట్లు తోచుచున్నది. తంజావూరు శరభోజిమహారాజు సరస్వతీమహల్ లైబ్రరీలోనూ రంగనాథ రామయణము ప్రతులున్నవి. ఆ లైబ్రరీలో పుస్తకముల పట్టికలో నిది పట్టి రామాయణమనియే కలదు కాని రంగనాథ రామాయణమని లేదు. ''ఈ రామాయణమునకే (బుద్ధభూవిభుడు కర్త) రంగనాథ రామాయణమని వాడుక కలదు'' అని యా పుస్తకముల పట్టిక తయారుచేసినవారు వ్రాసియున్నారు. (పుట 118)[8]

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు కూడా ఇది మధ్యలో వచ్చిన పేరే అని నమ్ముతున్నారు.

---

7. గౌతమవ్యాసాలు, పుట 123.
8. రంగనాథ రామాయణము - రాయల ముద్రణ, పీఠిక, పుటలు 13-14.

''మరి యీ రంగనాథ రామాయణమను పేరెవరు పెట్టిరి? కర్తగాని, యుత్తర కాండము వ్రాసిన బుద్ధారెడ్డి కొడుకులుగాని యీ పేరెక్కడను సూచింపలేదు. వారే ఆ పేరు పెట్టినారని లక్ష్మీకాంతంగారన్న మాట నిరాధారము... వ్యవహారములో అనుకూలము నకై యెవరో, ఎప్పుడో పెట్టియుండరాదేమి?... కాబట్టి దానికి రంగనాథ రామాయణ మనునది నడుమంత్రపు పేరు కావచ్చును. ఇట్లనుకొనుటలో సాహసమేమియును లేదు.'' అని స్పష్టపరిచారు.[9] ఈ గ్రంథానికి ఈ పేరు ఎవరు పెట్టి వుంటారో ఇంకొకచోట అనంతకృష్ణ శర్మగారు ఊహించారు.

''రంగనాథుడను ఒక కవి యుండి ఈ రామాయణము వ్రాసి బుద్ధరాజుపేర ప్రకటించుట. దీని నెరిగిన సమకాలికుల మూలమున దీనికి రంగనాథ రామాయణమను పేరు నిలుచుటయు అసంభవములు గావు. మరి బుద్ధరాజే రచించి యుండుటయు అసాధ్యము కాదు. కొంతవరకు అసంభవ మనిమాత్రము చెప్పక తప్పదేమో!'' అని సందేహపడుతున్నారు.[10] అనంతకృష్ణ శర్మగారి సందేహంలో కొంత సబబు కూడా ఉందనిపిస్తున్నది. బుద్ధరాజు కవిపోషకుడు. అతణ్ని ఆశ్రయించుకొన్న వాళ్ళల్లో ఒక రంగనాథుడు వుండి ఉండవచ్చు. బహుశా అతడు అచ్చవెల్లి రంగనాథుడు కావచ్చు. ఉత్తరోత్తరా పుష్పగిరి తిమ్మన కంకంటి పాపరాజుకు సహాయం చేసినట్టు, కిరీటికి శౌరి తోడైనట్లు రంగనాథుడు బుద్ధరాజుకు తోడ్పడ్డాడేమో! 'పాయక పాకశాసనునికి' అని నన్నయగారు నారాయణభట్టు సహాయాన్ని చెప్పుకొన్నట్టు బుద్ధారెడ్డి చెప్పకపోవడంవల్ల రంగనాథ సహాయక పాత్రను తెలిసినవాళ్లు దీనికి రంగనాథుని సంబంధాన్ని ప్రచారం చేశారేమో! ఏది యేమైనా బుద్ధరాజు సామాన్యుడు కాడు. అతని విద్వత్తును సాటికాలపువాళ్ళు ఇలాగ పొగిడారు :

> సర్వజ్ఞుడనఘుండు, చతురవర్తనుడు
> సర్వపురాణ విచారతత్పరుడు
> కమనీయబహుకళాగమ విచక్షణుడు
> సుమనీషి పోషణోత్సుక సుఖోన్నతుడు
> కవిసార్వభౌముండు, కవికల్పతరువు
> కవిలోకభోజుండు, కవిపురందరుడు. (రంగనాథ. 1-84, 86)

ఈ 'కవికల్పతరువు'ను ఆశ్రయించుకొన్న ఏ కోకిలో గొంతెత్తి పాడిన స్వరాలు కొన్ని ఈ రామాయణంలో మారుమ్రోగితే వింతలేదు. గోన బుద్ధరాజుకు సర్వజ్ఞబిరుదు ఉండడం కూడా గమనించతగ్గది. ఇతని సమకాలికుడు కుమారసింగ భూపాలునికి కూడా ఇదే బిరుదు ఉంది. రాచకొండ ఏలికలాగ బుద్ధరాజు కూడా సర్వజ్ఞ బిరుదును

---

9. సారస్వతాలోకం, పుట 115
10. సారస్వతాలోకం, 106

పెట్టుకొన్నాడేమో, ఇతనికి కవిసార్వభౌమ బిరుదు కూడా ఉంది. మన ఛందోగ్రంథాలలో 'కవిసార్వభౌమ ఛందస్సు' అనే నామాంతరమున్న 'కవివాగ్బంధనము' ఒకటుంది. దీనిని తిక్కనగారు వ్రాసినట్టు చెప్పుకొంటారు. బహుశా దీనికీ బుద్ధరాజుకూ ఏదైనా సంబంధం ఉందేమో, పరిశోధిస్తేగాని తేలదు. ద్విపదలో గ్రంథాలు వ్రాసిన గౌరన ఒక లక్షణ గ్రంథాన్ని సంస్కృతంలో రచించాడు. అలాగే బుద్ధరాజు కూడా తెలుగులో రచన చేశాడేమో!

బుద్ధరాజు కొలువులో రంగనాథుడు ఉన్నాడో, లేడో తేల్చి చెప్పలేంగాని కవిభల్లటుడు ఉన్నట్టు ఒక శ్లోకం వల్ల తెలుస్తున్నది. భల్లటుడు ఒక వ్యాకరణం వ్రాసినట్లు చెప్పుకుంటారు. దానిని బుద్ధరాజు ప్రోత్సహించి వ్రాయించాడేమో.

రంగనాథ రామాయణంలోని ప్రయోగాలు లాక్షణిక సమ్మతాలు. వాళ్ళకు ప్రమాణాలు. పండితు లకు ఇది ఎలా ఆమోదకరమైందో సామాన్య ప్రజలకు అలా శిరోధార్యమైంది. ''ఈ రామాయణము నుండి కొన్ని ప్రకరణములను పాటలుగా పాడుకొను నారీమణు లిప్పటికిని గలరు. రామాయణ కథాప్రదర్శనముల వేళ తోలుబొమ్మలవారు గానము చేయు గ్రంథమిదియే.''[11] అని పింగళి లక్ష్మీకాంతంగారు వ్రాశారు.

ఈ కావ్యంలో ఎన్ని ద్విపదలు ఉన్నాయో చూద్దాం.[12]

బాలకాండ - 2,493, అయోధ్యాకాండ - 1,834, అరణ్యకాండ - 1,560, కిష్కింధాకాండ - 1,345, సుందరకాండ - 1,177, యుద్ధకాండ - 8,881, మొత్తం - 17,290. బాలకాండ నుండి సుందరకాండ దాకా కలిపి 8,409 ద్విపదలున్నాయి. యుద్ధకాండలోనే అంతకన్నా 472 ద్విపదలు ఎక్కువున్నాయి.

'వాల్మీకి చెప్పిన తెరగున' తాను రామాయణం వ్రాస్తానని బుద్ధరాజు చెప్పినా వాల్మీకి రామాయణంలో లేని కథలను ఇతడు విపులంగా వ్రాశాడు.

ఈ కథలు కొన్ని భాస్కర రామాయణంలో కూడా వున్నాయి. వాటిని వివిధ పండితులు విభిన్న రామాయణాలతో తైపారు వేశారు.

ముఖ్యంగా మల్లంపల్లి సోమశేఖర శర్మగారు వివిధ రాష్ట్రాల రామాయణాలతో సరిపోల్చారు. ఆ పరిశోధనలను ఒక చోట క్రోడీకరిద్దాం.

11. గౌతమవ్యాసాలు, పుట 132
12. 'రంగనాథ రామాయణం' (రాయల ప్రచురణ) నుండి

వివిధ రామాయణాలలోని అవాల్మీక గాథలు

విషయము	భాస్కర	రంగనాథ	ఆనంద (మహారాష్ట్ర ప్రసిద్ధం)	లాహోరు ప్రతి	ఇటాలియన్ ప్రతి క్రీ.శ. 1850
బాలకాండ :					
1. అహల్య రాయిగా అవడం	నెం. 527	1481, 1482	–	–	–
2. ఇంద్రుడు కోడై కూయడం	–	నెం. 1470	–	–	–
అయోధ్యకాండ :					
1. మంథరకు రామునిమీద కోపానికి కారణం	నెం. 57	145, 146	–	–	–
2. కాకాసుర వధ (మూలంలో సుందరకాండలో ప్రసక్తి)	292	1144, 1155	–	–	–
అరణ్యకాండ :					
1. జంబుకుమారుని వృత్తాంతం	ప్రథమ 118 నుండి 125	270, 352	సప్తమసర్గ (40–45, పేరు సాంబుడు		
2. లక్ష్మణుడు ఏడుబరులు గీయడం	–	960, 961	–	–	–
యుద్ధకాండ :					
1. విభీషణుడిని రావణుడు సభలో తన్ని వెళ్ళగొట్టడం	–	538, 540	–	–	–
2. బహిష్కారము పొందిన విభీషణుడు తల్లిని చూడడం	155–162	559, 612	–	–	–
3. శ్రీరాముడు ఉడుత భక్తిని మెచ్చుకొనడం	–	1093, 1120	–	–	–
4. కైకసి నీతిబోధ – రాముని మహిమ రావణుడికి చెప్పడం, జలప్రళయం చెప్పడం	–	1237, 1312 1316, 1342, 1343, 1347	–	–	–
రావణుడు రాముని విలువిద్యను మెచ్చుకొనడం		2192, 2201	–	–	–
6. నాగపాశబద్ధులైన రామ లక్ష్మణుల వద్దకు నారదుని రాక	609, 626	2627, 2660	–	26వ సర్గలో ఉంది	–
7. రావణునితో మండోదరి రాముని బలపరాక్రమాలు చెప్పటం	766, 782	3130, 3155	–	35వ సర్గలో ఉంది	ఇందులో ఉంది
8. సులోచన పతిభక్తి	–	5835, 5996	11వ సర్గలో ఉంది	–	–
9. కాలనేమి వృత్తాంతం	1618, 1724	6607, 6801	,,	81వ సర్గ (51–110)	–
10. రెండవసారి సంజీవి కోసం వెళుతున్న హనుమంతుణ్ణి భరతుడు చూడడం		–	–	–	82వ సర్గ 62వ శ్లోకం నుండి

11. సంజీవి తెస్తున్న హనుమంతుణ్ణి భరతుడు చూడడం	1739, 1752	6837, 6870	-	-	-
12. సంజీవి తెస్తున్న హనుమంతుడితో మాల్యవంతుని యుద్ధం	1753, 1766	6871, 6908	-	-	-
13. శుక్రునివద్ద రావణ విలాపం	1830, 1836	7074, 7090	-	82వ సర్గ	82వ సర్గ 122వ శ్లోకం దాక
14. రావణుడి పాతాళ హోమం	1838, 1839	7091 నుండి	-	"	-
15. అంగదుడు మండోదరిని ఈడవడం	1869, 1876	7162, 7192	-	"	-
16. మండోదరి రామమహిమ చెప్పడం	1878, 1886	7225, 7269	-	-	-
17. యుద్ధంలో రావణుడి శిరస్సులు మొలవడం, విభీషణుడు ఉపాయం చెప్పడం	మాతలి చెప్తాడు. 2186, 2187	7748, 7750	-	ఉపాయం మాతలి చెప్తాడు. అమృత ప్రస్తావన లేదు.	-

ఈ క్రోడీకరణ వివరణలలో లాహోరు ప్రతి అని ఒకటి, ఇటాలియన్ ప్రతి అని ఇంకొకటీ కనబడతాయి. దేశంలోని ఇతర రాష్ట్రాలలోనూ, విదేశాలలోనూ రంగనాథ రామాయణం ప్రతులు ఉన్నట్టు ఇందువల్ల తెలుస్తుంది. మల్లంపల్లి సోమశేఖర శర్మగారు చెప్పిన ఈ ప్రతులే కాక ఇతర ప్రతులు విదేశాలలో ఉన్నట్టు ఇటీవల నా పరిశోధనల వల్ల తెలుసుకున్నాను. లండన్‌లోని ఇండియా ఆఫీసు గ్రంథాలయంలోని ప్రాచ్యభాగంలో రెండు రంగనాథ రామాయణం వ్రాత ప్రతులను నేను చూశాను. వాటి వివరాలు ఇవి :

1.TEL-MSS-UR 5397 కాగితం ప్రతి. ఇది బాల అయోధ్య కాండలున్న గ్రంథం. వ్రాతప్రతి లేఖనకాలం 1844 సంవత్సరం మార్చినెల 10వ తేదీ వరకు. గ్రంథాన్ని 1890 జూన్ నెల 15వ తేదీనాడు జి.ఇ. హే అనే దొరగారి దగ్గర గ్రంథాలయం వారు కొన్నారు. సి.పి. బ్రౌను మాత్రమే కాక ఇతర తెల్లదొరలు కూడా తెలుగు సాహిత్య గ్రంథాలు సేకరించేవారని ఇందువల్ల తెలుస్తుంది. ఈ ప్రతిని అచ్చుకు సిద్ధం చేసినట్టు కనబడుతుంది.

2. TEL-MSS-OR.8841. తాళపత్రప్రతి. ఇది చాలా చరిత్ర గల ప్రతి. ఆకులు అరచేయి అంత వెడల్పు, మూరెడు పొడుగూ ఉన్నాయి. ఇటువంటి పెద్దకమ్మలున్న ప్రతులను శ్రీతాళం, రాజతాళం అని పిలుస్తారు. ఇది లంకను సాధించిన ముత్తుస్వామి అనే తెలుగు దాక్షిణాత్యుని పారాయణ గ్రంథం. క్రీ.శ. 1517 నుండి 140 సంవత్సరాలు కోటకట్టుకొని లంకను పాలించిన డచ్చివారిని ఓడించి 1796లో ఇంగ్లీషువారు ఆ రాజ్యాన్ని ఆక్రమించారు. ముత్తుస్వామి 1802 దాకా కాండీని పాలించాడు. అప్పుడు శత్రువులు యుద్ధం చేసి ముత్తుస్వామినీ, బ్రిటిషువారినీ ఊచకోత కోశారు. ఈ రంగనాథ

రామాయణం ప్రతిని ముత్తుస్వామి సేవకుడు రక్షించి ముప్పయ్యేళ్ళు భద్రంగా రహస్యంగా ఉంచాడు. తరవాత 1883లో హార్బీ అనే తెల్లదొరకు విక్రయించాడు. ఈ చరిత్రనంతా ఒక యాదస్తులో నివేదిస్తూ ఈ గ్రంథాన్ని హార్బీదొర బ్రిటిషు గ్రంథాలయానికి బహూకరించాడు. నేను ఈ అరుదైన తాళపత్రప్రతిని కొంత పరిశీలించాను. సమగ్రంగా ఉంది. విపుల పరిశోధన అవసరం. కొత్త పాఠాలు దొరకవచ్చు. ఒక్క బ్రిటన్‌లోనే కాక ఫ్రాన్సుదేశంలో పారిస్ నగరంలో కూడా ఒక రంగనాథ రామాయణం వ్రాతప్రతి ఉంది. జెసూటు ఫాదరీలు తెలుగునాట క్రైస్తవమత ప్రచారం చేస్తూ తమ మతంలో కలుపుకొన్న తెలుగువారి దగ్గర ఉండే భారతీయ మత గ్రంథాలను సేకరించి పారిస్‌లోని రాజుగారి గ్రంథాలయానికి పంపించారు. ఈ గ్రంథాలలో రంగనాథ రామాయణం ప్రతి ఒకటి ఉంది. దీనిని పారిస్ నగరంలోని నేషనల్ లైబ్రరీలో భద్రపరిచారు. (కార్డు నెంబర్ - 38-938-H.271.1) కర్తపేరు గోన బుద్ధభూపతి అని స్పష్టంగా నాకు చేరిన కేటలాగు వ్రాతప్రతిలో ఉంది. దీనిపై కూడా పరిశోధన అవసరం. భారతదేశంలో ఉన్న ప్రతుల మాట అటుంచి మన తెలుగు ప్రచురణ కర్తలు ప్రకటిస్తున్న ప్రతులలోని పాఠాలనే పీఠికాకర్తలు శ్రద్ధగా చదివినట్టు కనబడదు. ఉదాహరణకు, వావిళ్ళవారి ప్రతిలో ఒక పీఠిక వ్రాసిన వేదము లక్ష్మీనారాయణ శాస్త్రిగారు ఇలా రాశారు.[13]

> ''అకంపను మాట మీద రావణుడు రామునిజంప బయలుదేరి వచ్చును. త్రోవలో మారీచుని యుపదేశము విని లంకకు మరలి వచ్చినట్లును తర్వాత శూర్పణఖ ప్రేరణమున మరల నుద్యుక్తుడైనట్లును మూలమున నుండ కవి రంగనాథ రామాయణమున ప్రేరకత్వమంతయు నొక్క శూర్పణఖకే యారోపించి యా ఘట్టమున సరసతగూర్చినాడు. అంతేకాదు యకంపమని వృత్తాంతమును పూర్తిగా వదలినాడు''.

ఈ మాటలలో సరసత లేదు. ఈ ఆరోపణ పూర్తిగా వాస్తవానికి దూరం. ఏ ప్రతిలో ఈ మాటలు రాశారో ఆ ప్రతిలోనే 145వ పుటలో ఒకటి కాదు రెండు కాదు ఇరవై ద్విపదలలో అకంపనుడు రావణునికి సమాచారం చెప్పడం, సలహాలు ఇవ్వడం కవి వర్ణించాడు. రాముణ్ణి చంపడానికి రావణాసురుడు ఉద్యోగిస్తే అకంపనుడే -

> కదనము వలన దాకాకుస్థకులుని
> దేవిలావణ్యావార్ధిని దెచ్చి తేని
> యావియోగాగ్నిని హతుడగునతడు -

అంటూ మార్గోపదేశం చేస్తే రావణుడు పొంగిపోయి అకంపనుని పదినోళ్ళ బొగడి బంగారు రథమెక్కి వెళ్ళాడు. కవి ఇంత స్పష్టంగా అకంపనుని సంగతి చెప్తే పీఠికాకర్తలు అరనోటితో కూడా ఆ మాటను చెప్పకపోవడం దురదృష్టకరం. రంగనాథ రామాయణం శారదాకాంతులు ఇటువంటి మేఘావృతాలు కాకూడదు. రంగనాథ రామాయణాన్ని

13. రంగనాథ రామాయణము - వావిళ్ళ ప్రచురణ (పీఠిక రచనా కాలం 22-1-60) పుట 17

రచిస్తూ బుద్ధరాజు 'హారకర్పూరనీహార గోక్షీర తారకాకృతిశారదాదేవి'ని కొలిచాడు. ఈ భావాలు కొన్ని బమ్మెరపోతరాజుగారి ''శారద నీరదేందు...'' అనే స్తవంలో కనబడతాయి. బుద్ధరాజు రామాయణంలో పాత్రలు ప్రవేశపెట్టడంలోనే ఎంతో ఔచిత్యం కనపరుస్తాడు. అయోధ్యను వర్ణించి ఆపురి దశరథుం డను మహారాజు చాప విద్యాపర శైలకార్ముకుడు'' పరిపాలిస్తున్నాడని చెప్తాడు. దశరథుని విలువిద్యను ఎత్తుకొనడంలోనే ప్రస్తుతించడంలో ఎంతో వ్యంగ్యాత్మకమైన సూచన ఉంది. ఏ విలువిద్యలో తనకున్న ప్రావీణ్యాన్ని నమ్ముకొని ''వీనుల వీక్షించి వెస శబ్ద వేధులు'' వేశాడో అదే అతని శాపానికి కారణమైంది. అవసానదశలో తండ్రి వద్ద వుండకుండా రాముడు అడవులపాలవడానికి అదే కారణమైంది. కైక వరాలు అడగడమనేది ఆ శాపాగ్నికి తోడ్పడ్డ గాలి. కైక అలిగి తల కట్టుకొని పడుకొన్నప్పుడు బుద్ధరాజు దశరథుని చేత ఓదార్పు కోసం అనిపించిన మాటలలో కూడా ఎంతో ఔచిత్యం వుంది.

> వనిత నీకొరకునై వధ్యులుగాని - అనఘచరిత్రులనైన జంపెదను
> జంపంగదగిన దుర్జనకోటినైన - గంపించి నీమాట గాచిపుచ్చెదను
> నీకు ప్రియంబైన నిరుపేదనైన - జేకొని రాజుగా జేసెద నెలమి
> భామిని! నీదయబాసినయట్టి - శ్రీమంతునైన దరిద్రుజేసెదను.

సరిగ్గా అలాగే చెయ్యవలసివచ్చింది. కైక దయబాసిన రాముణ్ని దరిద్రుణ్ని చేసి అడవులకు పంపక తప్పలేదు. బుద్ధరాజుగారి దశరథుడు మాటవరుసకన్న మాటలు కూడా తప్పలేదు. రాముడు తాపసి కాక తప్పలేదు. అయితే కైక కోరినట్లు భరతుడు పట్టం కట్టుకోలేదు. వ్రతం పట్టాడు. అందుకే బుద్ధరాజుగారి రాముడు భరతుణ్ని తలచుకొని ''పట్టంబు దొలగి తాపసి నైతినేను. పట్టంబుగలిగి తాపసియయ్యె నతడు'' అని బాధపడతాడు. సీతాపహరణం మొదలు సీత అగ్ని ప్రవేశం దాక రాముడు ఆమె కోసం తలచుకొని పడిన బాధను క్రమక్రమంగా బుద్ధరాజు వర్ణించాడు. తనతో సీత ఉన్నంతకాలం తాను వనవాసం చేస్తున్నట్లు రాముడు భావించలేదు. ఆమె ఎడబాయగానే ఇలా అంటాడు :

> ఇది మహారణ్యమై యిప్పుడు తోచె - నిది పర్ణశాలయై యిప్పుడుతో చె;
> నిది నాకు దపమని ఇప్పుడు తోచె - నిదినాకు దుఃఖమై యిప్పుడుతోచె;
> నేలె మహీపుత్రి! యేలెమృగాక్షి! యేలెసరోజాక్షి! యేలెలతాంగి!
> నేలె వధూమణీ! ఇన్ని చందములు-గాలుచునున్నాడ; 'గటకటా' యనవు!

అని విలపిస్తాడు. సీత చనిపోయిందా అని భయపడతాడు. ఆమె నడక, చాయ, దీప్తులు, పలుకులు అన్నీ అక్కడే ఉన్నాయి. అయితే ఆమె లేదు. అందుకే ఇలా విలపిస్తాడు :

> అలసయానముల బా గంచల కిచ్చి - లలితాంఘ్రిరుచి ప్రవాళంబుల కిచ్చి
> వరకుచోన్నతి చక్రవాకుల కిచ్చి - కరముల కెంపు పంకజముల కిచ్చి
> మెయిచాయ క్రొక్కారు మెరుగుల కిచ్చి - నయనవైభవముమీనములకునిచ్చి
> చల్లని ముఖదీప్తి చంద్రునకిచ్చి - తెల్లని నగవు చంద్రికలకు నిచ్చి

చెలువంపు బలుకులు చిలుకలకిచ్చి - యలకల నునుగాంతి యళులకు నిచ్చి
రదముల యొప్పు వజ్రంబుల కిచ్చి - పొదలు మైతావులు పూవులకిచ్చి
సన్నపునడు మాక సంబునకిచ్చి - నిన్ను దైవము మ్రింగెనే నేడు సీత!

ఈ భావాలు గురజాడ అప్పారావుగారి 'పూర్ణమ్మకథ'లో చివరిన కనబడతాయి. పూర్ణమ్మ మరణించినప్పుడు అప్పారావుగారు ఎలా వర్ణించారో చూడండి :

చీకటి నిండెను కొండల కోనల-మేతకు మెకములు మెసలజనెన్ -
దుర్గకు మెడలో హారము లమరెను - పూర్ణమ యింటికి రాదాయె.
కన్నులకాంతులు కలవల చేరెను - మేలిమి జేరెను మేనిపసల్ -
హంసల జేరెను నడకల బెడగులు - దుర్గను చేరెను పూర్ణమ్మ.

''పూర్ణమ్మ కథ'' నాకొక ఏకాంక విషాదాంతనాటికగా కనపడుతుంది'' అని చెప్పి చివరి చరణం ఉదాహరించి, ''ఒక మహాకావ్యాన్ని చదివి ముగించిన అనుభూతి ఈ చరణంలో మనకు లభిస్తుంది'' అని శ్రీరంగం శ్రీనివాసరావుగారు వ్రాశారు.[14] రంగనాథ రామాయణం నుండి గురజాడ ఉత్తేజులవబట్టే ఔచిత్యంతో తమ ఖండకావ్యాన్ని ముగించారు. బుద్ధరాజుగారి రాముడు సీతావియోగంవల్ల ''మదన వేదనలనున్మత్తు చందమున - బెదరిచూచుచు దన పెంపెల్ల మరిచి'' విలపించినవాడు. అందుకే -

నెలత! నీవిరహాగ్ని నీదులావణ్యా - జలరాశి మునుగక చల్లార్పరాదు!
తగిలి యీశోకాబ్ధి దరుణి! నీ మేను - తగు తెప్పగా కెట్లు తరియింపవచ్చు?
మగువ! నీపాలిండ్ల మరుగు లేకున్న - నొగి గాము శరవృష్టికోర్వంగరాదు

అని శోకిస్తాడు. అనంతర కవుల కావ్యలలోలాగ మరీ ముఖం మొత్తేట్లు కనబడే పద్ధతిలోనే సీత కోసం గాలిస్తాడు.

నెలదీగ! కానవే యెలదీగబోడి? - జలజంబ! కానవే జలజాతగంధి?
హరిరాజ! కానవే హరిమధ్య నీవు? - కరిరాజ! కానవే కరిరాజగమన?
హరిణంబ! కానవే హరిణాయతాక్షి? - బరభృత! కానవే పరభృతవాణి?
నళినాథ! కానవే యలినీలవేణి? - దిలకంబ! కానవే తిలకాంచితాస్య?
జందన! కానవే చందనగంధి? - గుందంబ! కానవే కుందాభరదన?
ననుచు విభ్రాంతుడై...

వెలది కోసం రాముడు వెతికాడు. కొన్నాళ్ళకు వెలలేని నగలు సుగ్రీవుడు చూపించాడు. రావణుడు తీసుకుపోతున్నప్పుడు ఆమె ఆ నగలను తీసి చీర చెంగు చింపి మూటకట్టి పడేసింది. ఆ నగలను చూడగానే రాముడు -

మున్ను గా వగలనుమున్నీట మునిగి - కన్నీట నాసొమ్ము కసటెల్ల గడిగి
యందందయురమున నాభూషణములు - పొందించి పొందించి భూమిజదలచి

అంటూ బాధపడ్డాడు. చిరిగిన చీర చెంగును చూచి చింతించాడు.

4. ముత్యాలసరాలు (విశాలాంధ్ర ప్రచురణాలయం), పరిచయం. పుట 11

ఇదికాక ప్రాణనాయికయైన సీత - కుదురునిండిన గబ్బిగుబ్బలమీద
కాయని ఈజిల్గుపయ్యదచీర- కీయవస్థలు వచ్చె నేమనవచ్చు?

ఏమంటాం? ''పన్నీట నా పాదపద్మములు కడిగి చీరతో ఒత్తేది. దానితో నాకు విసిరేది. అడుగులకు మడుగులు వేసేది'' అని అన్నీ జ్ఞాపకం చేసుకున్నాడు. దుఃఖసముద్రంలో ఇంత అల్లాడి, సముద్రానికి సేతువు కట్టి, ఉత్తరోత్తరా భీకరయుద్ధానికి ఉపమానంగా ఉండే 'రామరావణయుద్ధం' చేశాక, ఏ సీత కోసం ఇంత కథ జరిగిందో, ఆ సీతను తన దగ్గరకు తీసుకొని వచ్చాక రాముడిలో వచ్చిన మార్పు చూచి పాఠకులందరూ తల్లడిల్లుతారు. సీతమ్మ చిరవిరహాగ్నుల చెచ్చెర ఆర్పి పరమాను రాగసంభరితాత్మ అయింది. రాముణ్ణి చూచి అవనతవదనయై అశ్రుపూరాలు ధవళ విలోచనోత్పలాల తొరుగ భయంతో ప్రియంతో పైపాటు సిగ్గు పైపడుతూఉంటే సీతమ్మ నిలబడింది. రాముడు ఆత్మలో కోపం ఉప్పొంగుతూ ఉంటే ఇలా అన్నాడు: ''పగవాని యింటిలోపల నున్న నిన్ను దగిలి వరించుట ధర్మము కాదు. ఆలిని పొగొట్టుకొని మళ్ళా తేలేకపోయాడనే తిట్టుపాటుకు వెరచి ఇంత చేశాను. అంతే. నిన్ను ఒల్లను. ఒరపైన చోట్ల నువ్వుండు!'' అని నిర్దయతో చెప్తాడు. ఈ మాటలు విన్న సీతమ్మా, పాఠకులూ నివ్వెరపోతారు. అప్పటి సంతోషమంతా మరచి, చెప్పనోరాడక, చేష్టలు దక్కి, తాపం పొంది, ఉత్తలమంది, కోపించి, వగచి, డగ్గుత్తిక పెట్టి రాముణ్ణి చూచి సీతమ్మ మొరపెట్టుకుంది. ఆమె తరపున రామునితో వాదిద్దామని మనకనిపిస్తుంది. వాళ్ళిద్దరి ప్రవర్తనలూ చూసినవాళ్ళం మనం. ఇతర రామాయణాలలోని సీతమ్మకన్నా బుద్ధరాజుగారి సీతమ్మ ఎంతో ఉచితజ్ఞురాలు. ఇతర రామాయణాలలో ఒక్క అశోకవనంలోనే ఆమె గడ్డిపోచను అడ్డం పెట్టుకొని రావణుడితో మాట్లాడినట్లు వుంది. బుద్ధరాజుగారి సీతమ్మ అరణ్యాకాండలోనే రావణుడిని గడ్డిపోచలాగ భావించింది. చూడండి - రాములవారి భార్యను ఎత్తుకుపోవడానికి స్వాములవారి వేషం వేసుకొన్న రావణుడు ఆమె అందం చూచి -

నీ మందహాసంబు నిత్యంబు నాదు - ప్రేమాంబునిధికి జంద్రిక యగుగాక
రమ్ము నాళంకాపురమ్మున కనుడు - నమ్మాట విని సీతయతిభీతయగుచు
ధీరగావున వాని దృణముగా జూచి - తీరున దనచేతితృణముజూచుచును

- జవాబు చెప్పింది. అది వినిపించుకొనక రావణుడు ఆమెను చెరపట్టి తీసుకుపోయాడు. అప్పుడామె శోకిస్తే భూదేవి వణికింది. గోదావరి పారకుండా గ్రక్కున నిలిచిపోయింది. ఈ ఒక్క భావన చాలు - బుద్ధరాజు మహాకవి అని చెప్పడానికి. ఇటువంటి భావాలు ఎన్నెన్నో ఈ కావ్యం నిండా అతని ప్రతిభకు గుర్తుగా నిలిచిపోయాయి. ఇందులోని భావాలనే నాటినుంచి నేటిదాగా తెలుగుతల్లులు పాడుకొంటున్నారు. వాస్తవానికి 'ఊర్మిళాదేవి నిద్ర', 'లక్ష్మణదేవర నవ్వు' మొదలయిన మధుర ఖండాలకు బీజాలు ఈ రామాయణంలో ఉన్నవే.

సీతా, రామ, లక్ష్మణులు శృంగబేరపురంలో ఉన్నప్పుడు పధ్నాలుగేళ్ళు నిద్ర పోకుండా వుంటానని లక్ష్మణుడు నియమం ఏర్పరచుకొనడమే యితర రామాయణాల్లో కనబడుతుంది. బుద్ధరాజు అక్కడ లక్ష్మణస్వామికీ నిద్రాదేవికీ ఒక 'కాంట్రాక్టు' ఏర్పాటు చేయించాడు. చూడండి :

పదనాలు గేండ్లును బగలును రేయి – నిదురవోవకయుండ నియమంబుసేసి
తమయన్నసెజ్జకుడవ్వల నిలిచి – యలమలమానసుడునై యటుగొల్పియుం
నారాత్రి నిద్రా మాయారూపు దాల్చి – ధీరు డాలక్ష్మణదేవుని జేరి
'యేను నిద్రాదేవి; మేర్పడ దెల్పు – మా నాకునింకెట్లు మానాఢ్య! యంత
విధి విధించెను వెంటవెంట వర్తింప; – విధ మేది నిన్ను నే విడుచుట కింక?'
ననిన 'నూర్మిళయందు నహరహంబులును – జనియుండు; మంత నీ సమయంబు దీర్చి
వచ్చినగైకొందు వరుస ని'న్ననిన – నిచ్చ 'నౌగా' కంచు నేగె నిద్రయును;
నలరుచు 'నీదేవతానుగ్రహంబు–గలిగెనా' కనుకు లక్ష్మణదేవుడుండి.

శ్రీరామ పట్టాభిషేకమైనాక నిండుకొలువులో లక్ష్మణదేవుడు ఫక్కున నవ్వాడు. దానికి కారణం ఇన్నాళ్లూ రాని నిద్ర ఆనాడు రావడమే. బుద్ధరాజు కొద్దిగా సూచించిన కథలేశాలను తెలుగుతల్లులు విస్తరించి పాడుకొంటున్నారు. బుద్ధరాజు సీతారామ లక్ష్మణులను తెలుగుదేశంలో సుస్థిరంగా కట్టివేశాడు. తెనుగుతల్లులు ఆ రామాయణ పాత్రలను తమ చిత్తమొచ్చినట్లు తిప్పుకొంటున్నారు. తెలుగునాట రామాయణం ఇంత నాటుకుపోవడానికి కారణం బుద్ధరాజు దానిని తన తండ్రి పేర ప్రఖ్యాతం చేయడమే.

భారత జాతీయ కావ్యాన్ని ఆంధ్రులసొమ్ము చేయడానికి బుద్ధరాజు యథాశక్తి సేవచేశాడు. అది ఏదో 'ఉడతాభక్తి' కాదు. కొండంత సేవ. బంగారుకొండకు వేసిన రత్నాల నిచ్చెన.

కాచభూపతి, విట్ఠలరాజు

గోన బుద్ధరాజు ఉత్తర రామాయణం కూడా వ్రాద్దామనుకుని వయస్సు ముదిరిపోవటం వల్ల ఆ భారాన్ని తన కుమారులు కాచభూపతి, విట్ఠలరాజుల మీద పెట్టినట్లు చెప్పుకొన్నాం. ఆ అన్నదమ్ములు, బహు పురాణజ్ఞులు, బహు కళాన్వితులు, బహు కార్య కోవిదులు, కవిరాజ భోజులు, ఉరుతర ప్రావీణ్యులు – అని ఉత్తరకాండ అవతారికలో వాళ్ళు చెప్పుకొన్న మాటలనుబట్టి తెలుస్తున్నది. ఆరుకాండలూ వ్రాసిన అనంతరం బుద్ధరాజు మానసంలో భగవంతుడు కనబడి 'ఇంక నువ్వు మాతో ఉండటానికి రా. నీ వాంఛితార్థాన్ని నిర్వహించటానికి నీ కుమారులను నియోగించు' అని చెప్పాక బుద్ధరాజు కుమారులను పిలిపించి, ''నాకూర్మిసుతులు కాబట్టి నేను పూనిన కథ ఎల్లజనులూ మానుగా కొనియాడేటట్లు మధుర వాక్యాలలో చెప్పండి'' అని ఆదేశించాడు. వాళ్లు తమ

తండ్రి ప్రతిన చిరకీర్తులు పెంపొందగా చెల్లించడం పరమధర్మమని భక్తితో ఉత్తర రామాయణం తుదముట్టా చెప్పారు.

అప్పటికి తిక్కనగారి నిర్వచనోత్తర రామాయణం దేశంలో బాగా ప్రచారమైంది. అయితే తిక్కనగారు తమ కావ్యాన్ని శుభాంతం చేయటం కోసం లక్ష్మణస్వామి, రామచంద్రుడు నిర్యాణం చెందడం వ్రాయలేదు. గోన సోదరులు తమ తండ్రి ప్రతిన నెరవేర్చటానికి వాల్మీకి రచన అనుకొన్నదంతా చివరివరకూ చెప్పారు. తిక్కనగారు విడిచిపెట్టిన చివరి భాగాలనే కాక మధ్యలో కొన్ని కథలను కూడా విపులంగా చెప్పారు. ఉదాహరణకు, అహల్యకు గౌతముడు శాపం ఇవ్వడం, లక్ష్మణుడు రామునికి వృత్రాసుర కథ చెప్పడం, రాముడు అతనికి ఇలుని కథ, బుధుని కథ చెప్పడం మొదలైనవి ఇందులో ఉన్నాయి. ఒకటి రెండు ఘట్టాలలో తిక్కనగారి రచనకు, ఈ గోన సోదరుల రచనకు పోలికలు చూద్దాం. తిక్కనగారి రంభారావణ సంవాదం ప్రసిద్ధమైంది. వారు రంభను ఎలాగ వర్ణించారో చూడండి. రావణుడు వెన్నెలలో కూర్చున్నాడు.

అప్పు డొకర్తు గొంచెమగు నాభరణంబులు సన్నపూతయుం
గొప్పిడి త్రిప్పిలో జెరివికొన్న నడంగిన పూవులుం బయం
గప్పిన చేలకొంగుననుగప్పు ను మెల్పున నేగు మెట్టెలే
జప్పుడు చెన్ను జేయుగతి చందము వింతగ బోవునయ్యెడన్. (నిర్వ. 6-58)

నాలుగే పాదాలలో తిక్కనగారు వ్రాశారు. గోన సోదరులు ఎలా వర్ణించారో చూడండి:

అందంద రుచిజాల మడరంగ వెలుగు / చందురు జూచు నా సమయంబునందు
రోలంబకుల నీలరుచి బొల్చు కచము / బాల చంద్రుని బోలు ఫాలరేఖయును
సోముడు కామారి సూడు సాధింప / గాము నమ్ములు విల్లు గైకొన్న కరణి
మురిపెంబునిండారు ముఖమండలమున / సొరిది చెన్నగు వాడి చూపులు బొమలు
యవిరళ రేఖమై సమరంగ బొల్పు / నవకుందకళికల నవ్వు దంతములు
పానాభిరతి దన్ను బట్టినవారి / మానుపజాలని మధురాధరంబు
కందుసుధాధార గడిగిన వెలుగు / నిందు బింబముతోడ నెనవచ్చు మోము
కంబు సన్నిభమైన కంఠంబు పసిడి / పంచిన జిగిమించు బాహుమూలములు
గరమొప్పు నవపుష్పకాంతి జెన్నారు / కరపల్లవంబులు గల బాహులతలు
నిండారు పెంపున నిక్కి క్రిక్కిరిసి / యెండొంటితో రాయు నురుకుచద్వయము
వారు చెన్నారులు నాస్తి వాదమున / కారంగ నవకాశమైన నెన్నడుము
రోమావళీ ధోమరుచిరమై కాము / హెూమ కుండముక్రియ నొప్పు నాభియును
మదను జయోత్సవమహిమ సూచించు / కదళికాయుగళంబు గతి యూరుయుగము
రతిరాజవర తపోరాశినా దనరు, నతి దీర్ఘ మేఖలంబగు నితంబమును
భావజు వాటించు పసిడి తూనికల / కైవడి చిత్తంబు గలచు జంఘులును
జిత్తంబు లలరంగ జిగుళుల గడచు / మెత్తని యడుగులు మెరపారు నడువు

కనక రేఖాకాంతి గడగడ పరచు / తనువల్లికయు వీణదలిపించు నెలుగు
చెన్నారు నప్సర స్త్రీలలో నెల / మున్నెన్నదగు జగన్మోహన స్ఫురణ
చారులక్షణ కళా సౌభాగ్యవతుల / కారయ నుపమాన మగుచున్న రంభ
యున్నతస్తనకుంభకు యుగళ భారమున / నన్నుపు కౌదీగె యసియాట కులికి
చెలువున సేమంబు చింతించె ననగ / గొలది భూషణములు కొమరార బూని
కొన్నియు విరులొప్ప గొప్పున దురిమి / సన్నపు నునుబూత చదునుగా బూసి
కట్టిన పుట్టంబు కప్పుదనగ్గప్ప / మెట్టుచో మట్టియల్ మెలపున దాక
మనసిజ మంత్రంబు మరవక లోన / మునికినట్లందియల్ మొగి నొయ్య మొరయ
నవిరళగతి గాము డమరించు కోలు / దివిరి యా కెంగేలు దీప్తి రాగిల్ల
వలనొప్ప మన్మధ ధ్వజమీనరుచుల / గెలిచి దృష్టులు భీతి గెలకుల బొలయ
దాలిమి దూలించి తావి లేజమట ....
తరళభావంబగు తమకంబుతోడ, నరుగంగ బొడగని యడ్డమేతెంచి.[1]

(రంగ. ఉత్తర. పుటలు 69,70)

తిక్కనగారు వ్రాసినది నాలుగు పాదాలే అయితే ఈ సోదరకవులు ఇరవైఎనిమిది రెళ్లు - యాభైఆరు ద్విపద పాదాలు వ్రాశారు. తిక్కనగారు 'కొంచెమగు నాభరణాలు' చెప్తే, వీరు కూడా కొలది భూషణాలే రంభకు మంజూరు చేశారు గాని ఎన్నో ఉపమాలంకారాలను వాడేశారు. తాము కూడా కొలదిగానే అలంకారాలు వాడితే అందంగాను ఉండేది. తిక్కనగారిలాగ వీళ్లు రంభ ఒంటి మీద 'సన్న పునునుపూత' పూసినా గ్రంథంలో వర్ణనలు ఎంతగానో పులిమేశారు.

తిక్కనగారి రంభ 'నీళ్లుల పట్టున నేయి మందొక్కొ' అంటే వీళ్ల రంభ కూడా అలాగే 'నీరువట్టయినచో నేయి ద్రావెదనె' అని రావణునితో మొగమాటం లేకుండా విరసవచనాలు చెప్తుంది. ఆ మాటలు విన్నాక తిక్కనగారి రావణుడు ఉన్మత్తుని గతి అంతా విన్నా వినిపించుకోకుండా రంభను పట్టుకొన్నాడు. ఈ సోదరకవుల రావణుడు ఇంకా వాదం పెట్టుకొంటాడు.

...నీదిట్ట - తనము వేశ్యల కెందు ధర్మంబు గాదు
వెలయాలుజెలమయు వీధియు వనము - జలిపందిరియు సర్వజనులకు సమము
లంజె యెవ్వని యాలు? లలన! యీమేర - కంజనేటికి నీకు నప్సరాంగనలు
కాముదీమంబుల కరణికాముకుల - తామసంబున ముంచి తమకంబు పెంచి
వలరాజువలకు దీవలతురుగాక - వలతురె మదిలోన వారకామినులు?

(రంగ. ఉత్తర, పుట 71)

1. రంగనాథ రామాయణం ఉత్తరకాండను శతావధానులు దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు పరిష్కరించారు. చెలికాని లచ్చారావుగారు 1930లో ప్రచురించారు. (ముద్రితాంధ్ర గ్రంథసర్వస్వం - 5వ గ్రంథం)

అని హితోపదేశం చేస్తాడు. ఇవి వేశ్యామాత మాటలులాగున్నాయిగాని ఉన్మత్తుని గతిలో ఉండవలసిన కాముకుని మాటలులాగ లేవు. ఎంత డబ్బిచ్చి వారకాంత దగ్గరకు వెళ్లినా మగవాడు తాత్కాలికంగా వలపు కోరుతాడు. 'సానిదానికి ప్రేమ యేమిటే' అనేవాడు సరసుడే కాడు. తిక్కనగారి రావణుడు అంగనను పొదివిపట్టుకొని సగాఢాలింగనగా తామ్రచూడలీలా చతురానంగ క్రీడాసంగతికి మదము నేడ్తేర మిగుల 'ఎంగిలి' గావించాడు. తిక్కనగారు ఇలాగ అల్పాక్షరాలతో అనల్పార్థాన్ని స్ఫురింపజేశారు. గోన సోదరకవులు ఇలా వ్రాశారు :

కుటిలంపు గనుబొమల్ కొరారు విండ్లు - పటుకటాక్షంబులు బాణజాలములు
భామిని పలుకులు బాణమంత్రములు - కాముకచిత్తముల్ ఘనశరవ్యముల
గాలీల మెలగు నిగ్గనుగొన్న మీద - దాలిమి గలుగు నె తనుమధ్య యనుచు
లాతిమించుల చూపులలితకక్షములు - బ్రాతిచన్నులు దోపబయ్యెద దొలగ
బలువిడి నంటగ బట్టి పూకొమ్మ - వలచినట్లాలింగనంబు గావించి
కుంభికుంభస్థలగురునితంబమును - రంభానిభోరులు రణితమేఖలయు
గంభీరనాభియు గడుకాంక్ష బెనచి - సంభోగమిమ్ములజరిపి పొమ్మనియె.
(రంగ. ఉత్తర. పుట. 71)

ఇష్టం లేని రతిలో నలిగిన రంభను ఎంతో సానుభూతితో తిక్కనగారు ఇలా వర్ణించారు :

పగరాజు పైవచ్చి బలువిడి బరిభవించిన దలంకిన పురశ్రీవిధమున
సమదద్విపము కేళి సలిపిన జాల నలంగిన యుద్యానలక్ష్మికరణి
ఘనలులాయము సొచ్చి తన యిచ్చ నాడిన గలగిన నెత్తమ్మి కొలనిభంగి
గడు బెట్టిదపు గాలి సుడిసిన నెరిదప్పితిరిగిన మవ్వంపు దీగెమాడ్కి

మున్ను గైసేసి యలవడ్డ చెన్నుదప్పి
యెలమి బ్రియుపాలి కేగెడులలి యడంగి
వేరచందమై యెంతయు విన్ననయ్యె
నసుర గారించివిడిచిన నమ్మృగాక్షి. (నిర్వ. 6-75)

ఈ సోదరకవులు ఈ భావుకత్వాన్ని మించకపోతే పోయె పూర్తిగా అనుకరించలేదు. 'అంత నా రంభయు నంభోజ సరసి దంతిసొచ్చిన చొప్పు' అని ఒక్కటే ఉపమానం చెప్పారు. కచకుచాదుల వర్ణనలో అంత ఉదారంగా ఉండే ఈ కవులు ఇటువంటి చోట్ల చాలా మితభాషులు. తిక్కనగారి నిర్వచనోత్తర రామాయణంతో ఈ ఉత్తరకాండను తైపారువేసి చూస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయి.

ఈ సోదరకవులు అవతారికలో చెప్పిన విషయాలవల్ల తెలిసే చారిత్రకాంశాలు పరిశోధకుల్ని మా చెడ్డ ఇబ్బందిలో పెట్టాయి. పూర్వ రామాయణంలో బుద్ధరాజు తమ

తండ్రి పేరు విట్ఠలనాథుడని చెప్పాడు. ఉత్తరకాండలో ఈ సోదరకవులు తమ తండ్రిపేరు బుద్ధరాజని, తాతపేరు మాత్రం గన్నయ్య అని చెప్పారు. ఈమాట యతిస్థానంలో ఉంది. చూడండి :

కోనవంశార్ణవకువలయ ప్రియుడు
నానొప్పు కోనగన్న క్షితీంద్రునకు
ననుకూలమై యున్న యన్నమాంబికకు
దనయుండు సాహిత్యతత్త్వకోవిదుడు
దానప్రసిద్ధుండు ధర్మశీలుండు
భూసుతాచారుండు బుద్ధభూవిభుడు.[2]

ఈ పేర్లలో ఉండే వైరుద్ధ్యానికి సంజాయిషీలు చెప్పడానికి పరిశోధకులు ఎంతెంతో ప్రయత్నించారుగాని ఏదీ సంతృప్తి ఇవ్వదు.

బుద్ధరాజు మేనత్త కుప్పాంబ వేయించిన బూదపూరు శాసనం[3] సహాయంతోనూ, ఇతర ఆకరాలతోనూ కొంత ఊహించి గోనవారి వంశవృక్షాన్ని రచించవచ్చు.

శాసన ప్రమాణం కన్నా ఊహాగానమే ఈ వంశవృక్ష రచనకు ఎక్కువ అవసరమవుతుంది. ఇంకకొన్ని నికరమైన శాసనాలు బయటపడితేగాని విశ్వసనీయంగా, అందరికీ ఆమోదకరంగా ఉండేటట్టు ఈ నామధేయ వైరుద్ధ్య సమస్యను పరిష్కరించలేము. చాగంటి శేషయ్యగారు ఇలా వ్రాశారు:[4]

''ఉత్తర రామాయణంలో 'నానొప్పు గోనగన్న క్షితీంద్రునకును' అను ద్విపదను[5] 'నానొప్పు విఠలసరనాథమణిక' అని సవరింపనైన సవరింపవలయును, లేదా యీద్విపదకును తరువాతి ద్విపదకు నడుమ గన్నారెడ్డికిని, విఠలనాథునకును గల సంబంధమును దెలుపుచు విఠలుని పేరుదాహరించి మరి రెండు ద్విపదల నైనను జేర్చవలయును. ఇంతకంటే నీ సమన్వయమునకు మార్గాంతరము లేదు.

భావిపరిశోధనమున నీ కఠిన సమస్య పూరింపబడునేమో చూడవలసియున్నది.

2. రంగనాథ రామాయణం – ఉత్తరకాండ 5 నుండి 10 దాకా పాదాలు
3. తెలంగాణా శాసనాలు – సంపుటి 1. నెం. 36 – పుట 78
4. ఆంధ్ర కవి తరంగిణి – 4వ సంపుటి, పుట 24
5. 'నానొప్పువిట్ఠల' అని ఉండాలి. లేకపోతే మాత్రాధిక్యం

గోనవారి ఒక మాదిరి వంశవృక్షం

1. గోన కాట భూపతి

2. రుద్ర భూపతి

3. పేరు తెలియదు

4. బుద్ధ భూపతి | 5. కాట భూపతి (1250-58)

6. గన్నయ | 7. కుప్పమ | 8. మల్లయ

9. బుద్ధయ | 10. విట్టయ (1284) | 11. దత్తుడు గుండయ (1276) | 11. (?)

12. బుద్ధయ | 13. బుద్ధయ (పూర్వ రామాయణ కర్త)

14. కాచయ్య | 15. పిన విట్ఠయ
(ఉత్తర రామాయణ కర్తలు)

సూచన : 11వ సంఖ్యగల వ్యక్తులు ఇద్దరూ ఒక్కరే

''ఈ వంశవృక్షంలో 5, 6, 7, 10 సంఖ్యలు గల కాటభూపతి, గన్నయ, కుప్పమ, విట్ఠయల శాసనాలు దొరుకుతున్నాయి. చెంగల్పట్టు జిల్లా కాంచీపురం తాలూకా తిరుప్పుక్కు గ్రామంలో గోన కాటయ శాసనం ఒకటి ఉంది. ఇది క్రీ.శ. 1250-58 ప్రాంతాలదని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు నిర్ణయించారు.* అయితే ఈ కాటయను వారు ఒకటవ సంఖ్యగల కాటభూపతిగా గుర్తించారు. ఆ వ్యక్తి కాలం 1250-58 అయితే మిగతా శాసన కాలాలను సమన్వయం చేయడం పడదు. ఒకటవ నెంబరు వ్యక్తి క్రీ.శ. 1250-58 ప్రాంతాల వాడైతే అతని మునిమనుమడి యొక్క కూతురు (7వ నెంబరు వ్యక్తి) క్రీ.శ. 1276లో ఎదిగిన కొడుకుల తల్లి అయి ఉండడానికి ఆస్కారం లేదు. ఈమె శాసనం ఒకటి బూదపూరులో దొరికింది. దానిలో కాలం అసందిగ్ధంగా ఇచ్చారు. అది శాలివాహన శకవర్షాలు 1195 ధాతసంవత్సర మాఘశుద్ధ దశమి, అంటే క్రీ.శ. 1276. అందుచేత తిరుప్పుక్కు శాసనంలోని కాటయ ఈమె తండ్రి కాలానికి వస్తాడు. ఈమె తండ్రి బుద్ధరాజు అనీ, ఈమెకు మల్లయ, బుద్ధయ, విట్ఠయ, కాటయ కొడుకు గుండయ అనే తమ్ములున్నారన్న విషయాలు ఈమె శాసనం వల్ల తెలుస్తాయి. ఈమె కడగొట్టు తమ్ముడు గుండయను కాటయకు దత్తత ఇచ్చారు కాబోలు. అందుచేత తమ్ముళ్ళ జాబితాలో 'కాటయ కొడుకు గుండయ' అని చెప్పారు. లేక పినతండ్రి కొడుకును తమ్ముడుగా

* రంగనాథ రామాయణం - రాయల ప్రచురణ

చెప్పుకొన్నా చెప్పుకోవచ్చును. ఈ కాటయ తిరుప్పుక్కు కాటయ కావడానికి రెండు శాసనాలలోని కాలాలూ సరిగా అతుకుతాయి.

కుప్పమ్మ సోదరులలో విట్ఠయ ఒక్కడున్నాడని బూదపూరు శాసనం వల్ల తెలుస్తున్నది. గోన గన్నయకు రాజ్య రక్షామణిగా పలుదుర్గాలు సాధించిన ఒక విట్ఠలభూపతి గురించి రాయచూరు శాసనంవల్ల తెలుస్తూంది. దీని కాలం క్రీ.శ. 1284. ఈ విట్ఠలభూపతే రంగనాథ రామాయణకర్త బుద్ధరాజు తండ్రి. ఇతనికి బుద్ధరాజే కాక ఇతర సంతానం కూడా వుంది. రంగనాథ రామాయణం కృత్యాదిని విట్ఠలనాథుని కొలువును కవి వర్ణించాడు. అందులో "హితులు, మంత్రులు, పురోహితులు, ఆశ్రితులు, సుతులు, రాజులు, బహుశ్రుతులు" కొలుచుకొంటున్నారని చెప్పాడు. ఈ సుతులందరిలోనూ బుద్ధరాజు కడగొట్టువాడై ఉండవచ్చును. ఇతడు తన పెద తండ్రి కొడుకు గన్నయగారి బుద్ధయకు పుట్టిన బిడ్డలు కాచవిభుడు, పిన విట్ఠలరాజులను దత్తత చేసుకొన్నాడేమో."

మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఈ సమస్యను చర్చించారు.

"పితామహుని పేరు ఈ విధముగా నుండుటకు కారణము నూహింపలేము. ఈ విషయమున చిక్కు విడదీయుటకు ప్రయత్నించుట నేలవిడిచి సాము చేయుటయే. ప్రమాణ రహితములైన కల్పనలతో, ఊహలతో ఈ సమస్యను పరిష్కరింప బూనుటకంటె దీనిని భావి పరిశోధకులకు వదలి పెట్టుట యుక్తము."[6]

చాగంటి శేషయ్యగారు భావించేటట్టు సవరించటం కన్నా సోమశేఖర శర్మగారు చెప్పినట్టు ఆగడమే మంచిది.

కుశలవులలాంటి ఈ గోన సోదరకవులు రంగనాథ రామాయణాన్ని ఏనాడో పూర్తిచేశారు.

ఈ తొలి జంటకవుల రచనమీద పరిశోధనలు మాత్రం ఇంకా పూర్తికాలేదు.

6. రంగనాథ రామాయణం (రాయలు అండ్ కో ముద్రణ), పీఠిక, పుటలు 11-12

దోనయామాత్యుడు

కవికులగురువు కాళిదాసు తన మేఘసందేశంలో ఆ కావ్యానికి ఆధారభూతమైన మేఘుణ్ణి ప్రత్యేకంగా ఒక 'మంచి' రోజున కథలోనికి ప్రవేశపెట్టారు. చూడండి శ్లోకభాగం:

ఆషాఢస్య ప్రథమదివసే మేఘ మాశ్లిష్టసానుం
వప్ర క్రీడాపరిణతగజప్రేక్షణీయం దదర్శ. (ప్రథమ - 2)

ఈ శ్లోకంలో 'ఆషాఢస్య ప్రథమ దివసే' అనడంలో ఎంతో వాతావరణ శాస్త్ర పరిజ్ఞానం ఉంది. మూడువందలా అరవై రోజులలోనూ మరేదీ కాకుండా ఆషాఢ శుద్ధ పాడ్యమిని కాళిదాసు ఎంచుకొనడంలో మహత్తరమైన ఔచిత్యముంది. ఈ సంగతి తెలియక కొందరు 'ప్రథమ దివసే' అనే మాటను మార్చి 'ప్రశమదివసే' అనే పాఠాన్ని కల్పించడానికి ప్రయత్నించారు. అది అసంగతమని మల్లినాథ సూరి తెగ చీవాట్లు పెట్టాడు.[1] కాళిదాసు పనిగట్టుకొని ఆషాఢ శుద్ధ పాడ్యమినే పేర్కొనడానికి కారణం మల్లినాథ సూరి చెప్పకపోయినా, తెలుగు వాఙ్మయంలో ఒకానొక కవి ధర్మమా అని మనం ఊహించగలం. అతని పేరు దోనయామాత్యుడు. అతడు 'సస్యానందం' అనే శాస్త్ర గ్రంథం వ్రాశాడు. అందులో ఇలా ఉంది.

పొలుపగు నాషాఢంబున - తొలుపాడ్యమి మృగశిరంబుతో గూడి ఘనా
వలి యాకసమున బన్నిన - వెలయుం ధర బూర్వసస్యవితతలు తరుచె (2-42)

ఏ సంవత్సరం ఆషాఢ శుద్ధ పాడ్యమి మృగశిరా నక్షత్రముతో కూడి ఉండగా మేఘాలు దట్టంగా పట్టుతాయో ఆ యేడు తొలుకారు పంటలు బాగా పండుతాయి అని చెప్పాడు. అంతే కాదు -

అమరగురుడు చెప్పె నాషాఢమాసంబు
పెంపుపాడ్యమందు పెల్లు రేగి
యస్తమానవేళ నభ్రాళి పడమర
బన్నెనేని నవని బాయు కఱవు (2-43)

ఆషాఢ శుద్ధ పాడ్యమినాడు సూర్యుడు అస్తమించే సమయంలో పడమటివైపు దట్టంగా మేఘం పట్టితే ఆ సంవత్సరం కరువు ఉండనే ఉండదని బృహస్పతి చెప్పాడు. యక్షుడు కరువుతీరా సందేశం చెప్పి పంపించే మేఘం కాబట్టి క్షామనివారణమై, క్షేమదాయకమైన ఆషాఢ శుద్ధ పాడ్యమి మేఘాన్ని కాళిదాసు కావ్యంలో ప్రవేశపెట్టారు. ఈ కవితా శిల్ప రహస్యాన్ని అర్థం చేసుకొనడానికి తోడ్పడిన దోనయామాత్యునికి మనం ముందు కృతజ్ఞత చెప్పుకొని అతని గురించి తెలుసుకొందాం.

---

1. సంజీవినీవ్యాఖ్యా - కేచి 'దాషాఢస్య ప్రథమదివస' ఇత్యత్ర ప్రత్యాసన్నే సభసీతి వక్ష్యమాణనభో మాస ప్రత్యాసత్త్యర్థం 'ప్రశమదివస' ఇతి పాఠం కల్పయంతి, త దసంగతమ్

''ఇతడు వ్రాసిన సస్యానందం వర్షశాస్త్రం. వానలు రావడానికీ, రాకపోవడానికీ లక్షణం అందరికీ బోధపడేటట్టు వ్రాశాడు. ఇదే తన మాటలలో ఇలా అన్నాడు: ''ప్రవర్ష వివర్షణంబులు జనులకు బోధసేయుటకునై సస్యానందము జెప్ప నుద్యోగించితి'! (1-8) ఫలానా పరిస్థితులలో వానలు పడతాయని జ్యోతిష్యం చెప్పడం సాహసమే. అయినా మన పూర్వులు వాతావరణాన్ని బాగా పరిశీలించారు. చుక్కలు, దిక్కులు, గాలులు, మేఘాలు, వీటి పరస్పర సంబంధాలు కనిపెట్టారు. పశుపక్షులు వాతావరణంలోని మార్పులకు ఏవిధంగా చేష్టలు చేసేవీ గుర్తించారు. వాతావరణ శాస్త్రాన్ని జ్యోతిష్యంలో భాగంగా వ్రాసుకొన్నారు. అయినా వాన రాకడ, ప్రాణం పోకడ చెప్పలేమని మన సామెత. దీనినే సస్యానందంలో ఇలా చెప్పాడు :

దానవసురఖచరాదులు
గానరు మానినుల చిత్తగతియును ధరలో
వానల రాకయు బోకయు
మానవు లది దెలియు టకట మాన్యము గాదే! (1-7)

దోనయామాత్యుడు వాన రాకడ తెలిసిన మాన్యుడే. ఏయే గ్రహాలు ఏయే ఇళ్లలో నున్నపుడు వానపడుతుందో జ్యోతిషశాస్త్రం ప్రకారం చెప్పడమేకాక ప్రకృతిలోని మార్పులను కూడా క్రోడీకరించాడు. మెట్ట కప్పలు కూసినప్పుడు, జంతువులు నీళ్లలో దిగి నిలిచినప్పుడు, చిన్న చిన్న చేపలు ఎగిరిపడుతున్నప్పుడు, తామరల పుప్పొడిలో తొండ పొర్లాడినప్పుడు అన్ని పంటలూ బాగా పండేటట్లు వానపడుతుంది.[2] భూనాగాలు మెట్టన విడువకుండా పోర్లాడినప్పుడుగాని, పశువులు కారణం లేకుండానే పుట్టలమీదా, మిట్టలమీద ఎక్కినప్పుడుగాని వానలు దట్టంగా కురుస్తాయి.[3] ఊరి పొలిమేరలలో వున్న పశువులు దట్టించి 'తోక లెత్తుకొని చెవులు నిక్కబొడుచుకొని, అంభారావలు చేస్తూ' గ్రామలలోకి ప్రవేశించినా, సంతోషంతో చీమలు ముక్కుల గ్రుడ్లు కరచుకొని బారులు తీరిపోతున్నా వానలు పడతాయి.[4]

దోనయామాత్యుడు క్రోడీకరించిన వాతావరణ సూచనలన్నింటిని అతని సమకాలికులు, అనంతర కవులు వర్షకాల వర్ణనలలో వాడుకున్నారు. శ్రీనాథుడు హరవిలాసంలో ఇరవైఒక్క రోజుల వర్షాన్ని గొప్పగా వర్ణించాడు. హర 2-16 నుండి 23 దాకా ఎనిమిది గద్యపద్యాలలో వర్షసూచన మొదలు కుంభవృష్టి దాకా వర్ణించాడు. శ్రీనాథునిలాగే జక్కన తన విక్రమార్క చరిత్రలో వర్షసూచనలు వర్ణించాడు, చూడండి.

గగనరత్నము కట్టు మొగులతో నుదయించె
జరమదిక్కున దోచె శక్రధనువు

2. సస్యానందం, 3-21
3. అందులోనే, 3-22
4. అందులోనే, 3-27

పూర్వాపరవ్యాప్తి బొలుపారెజల రేఖ
లాలోలగతి వీచె మూల గాలి
మెరుగు మొత్తంబులు మొరసె నుత్తరమున
గడగె దక్షిణపు మేఘములగములు
ప్రాలేయ భానుండు పరివేషగతు డయ్యె
జాతకంబులు నింగి సంచరించె
నెరల పెనుపిట్టె నేలపై గొరలజొచ్చె
మొనసి చీమలగమి గ్రుడ్లు మోపదొణగె
గుజముకొన కొమ్మడిగి క్రిందికొమ్మ మీది
నిలుపుగైకొను పురుగుల యెలుగు లెచ్చె.

తూనిగలాడె దోయనిధి దోరపు మ్రోత జనించె బంక్తులై
కానబడెన్ బలాకములు కప్పయెలుంగు చెలంగె నిర్జల
స్థానములందు గుంజము తుదం గృకలాసము నిల్చి నింగికై
యానన మెత్తె భూమిరజ మంగములన్ బెరయించె బిచ్చుకల్

తదనంతరంబ జనముల-కిది పగలిది రాత్రి యనుచు నేర్పరువంగా
హృదయముల కగోచరమై - చదలం బొదలంగ జొచ్చె జలధరవితతుల్
ధారుణిగల మేలెల్లను - ధారాళకరాళ వర్ష ధారల చేతన్
నీరామనిగా గలదని - పూరాల్చిన భంగి ముసురు పొరిబొరి గురిసెన్.

(విక్ర. 4-27 నుండి 30)

వాయుప్రసారం తెలుసుకొనడానికి మన పూర్వులు దుప్పట్లు నేసే ముతకనూలుతో ఎనిమిదిమూరల పొడవూ, రెండుమూరల వెడల్పాగల వస్త్రాన్ని నేయించి పెట్టుకొనేవారు. దాన్ని పతాకంగా నిర్మించి నలబై ఎనిమిదిమూరల పొడుగున్న వంకరలేని కర్రకు కట్టి ఆషాఢ శుద్ధ పూర్ణిమనాడు తెల్లవారుతున్నప్పుడు నిలబెట్టి జాగ్రత్తతో చూసేవారు. ఆ జెండా గాలివల్ల తూర్పువైపు పోతే పంటలు బాగా పండుతాయి. ఆగ్నేయ దిశకు పోతే వానలు పడవు. దక్షిణపు దిక్కుగాగాని, నైఋతి మూలగాగాని పోతే మేఘాలు పట్టి విడిపోతాయిగాని, వానలు పడవు. పడమటి దిక్కుకు పోతే అతివృష్టితోపాటు గాలి; వాయవ్యంగా పోతే అతివృష్టి, సుడిగాలి; ఉత్తర దిక్కుగా పోతే పంటలు బాగా పండడానికి తగినంత వాన; ఈశాన్య దిశగా పోతే మధ్య రకంగా పంటలుంటాయి. అన్ని వైపులకూ తిరుగుతూ మెలికలుగా పడుతూవుంటే పంటలు వుండే సమయంలో వానలు దట్టంగా పడి చేలు చెడిపోతాయి. వానలు పడి చెడిపోకపోతే శత్రువులైనా చెడగొడతారు.[5]

ఒకానొక ప్రత్యేకమైన రోజున గాలివాటాన్ని బట్టి మనవాళ్లు ఇటువంటి ఫలితాలు చెప్పేవారు. అలాగే ఒక రాత్రి కురిసిన మంచునుబట్టి కూడా వాన ప్రమాణాన్ని చెప్పడం

5. సస్యానందం, 2-52, 2-53, 2-54

వుంది. పుష్యమాసంలో పున్నమినాడు ఒక ప్రయోగం చేసేవారు. ఆనాడు ప్రదోష సమయంలో పలిమెడు దూది నాగలికి తగిలించి ఆరుబయట పెడతారు. ఆ దూదికి, ఆకాశానికి మధ్య అడ్డేమి ఉండకూడదు. మర్నాడు ఉదయం దాకా అది అలాగే ఉండాలి. ప్రొద్దుటే ఆ దూదిని పిండాలి. నీళ్లు ధారగా వస్తే వచ్చే ఏడు వానలు సమృద్ధిగా ఉంటాయి. కొన్ని చుక్కలే పడితే మధ్యరకం వానలు. దూది ఏ మాత్రం మంచుకు తడవకపోతే మీదటికి అనావృష్టి అని చెప్పాలి.[6] ఇవాళ మనం వాతావరణఫలితాలు పత్రికలో ముందుగా చదువుకుంటున్నాం; రేడియో, టి.వి.లలో చెప్తే వింటున్నాం. ఆధునిక శాస్త్రీయ పద్ధతులలో విద్యావంతులు వాతావరణ పరిశోధనలు చేసి వీటిని కనుక్కొని మనకు చెప్తున్నారు. పూర్వులు ఏయే విధాలుగా వానరాకడ తెలుసుకొనేవారో మనం తెలుసుకొనడం కూడా సరదాగా ఉండే విషయమే. ఈ విషయాలన్నింటినీ దోనయామాత్యుడు తన సస్యానందంలో చక్కగా వివరించాడు. ఇతని పుస్తకం మన దేశంలో బాగా ప్రచారంలో ఉండేదని చెప్పవచ్చు. ''ఇందలి పద్యములు పల్లెలో చాలా వ్యాప్తిలో వున్నవి'' అని నిడుదవోలు వెంకటరావుగారు వ్రాశారు.[7] తమ చిన్నప్పుడు నాగలికి దూదిపెట్టి వర్షసూచన గురించి తులాపరీక్ష చేసి అందులో నిజముందని తెలుసుకొన్నామని శేషయ్యగారు వ్రాశారు.[8] ఈ పుస్తకాన్ని క్రీ.శ. 1891లో, 1921లో, 1955లో మూడుసార్లు ముగ్గురు ప్రకాశకులు అచ్చువేశారట. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో తాళపత్ర, కాగిత ప్రతులు కొన్ని ఉన్నాయి. వీటన్నిటిని పరిశోధించి నిడుదవోలు వెంకటరావుగారు ఈ కవి మీద మంచి వ్యాసం వ్రాశారు.[9]

ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్న డి.2385 సంఖ్యగల 'సస్యానందం' కాగితం ప్రతిలో ఈ గ్రంథరచన శకసంవత్సరాలు 1278 అంటే క్రీ.శ. 1356లో జరిగిందనటానికి ఈ కింది దాఖలా కనబడుతుంది.

కరినగ దినకర శకవ
త్సరములు భువి బరుగుచుండ సస్యానందం
బిరవుగ శ్రీగిరినాథున
కరుదుగ రచియించె దోసయామాత్యుడిలన్.

ఈ కాలం నికరమైనదనడానికి గ్రంథంలో అంతరంగిక సాక్ష్యం ఉంది. కవి ఇలా చెప్పుకున్నాడు.

వసుధలోన బరమవంశవిభూషణ-మైన నన్నుపేంద్రుడాదరింప
శ్రీకరముగ సర్వలోకాశ్రయము జెప్పి మిన్నుముట్ట కీర్తి గన్నవాడ.[10]

6. సస్యానందం, 1–42
7. భారతి – జూన్ 1946.
8. ఆంధ్రకవితరంగిణి – 4వ సంపుటం, పుట 145
9. భారతి – జూన్ 1946
10. సస్యానందం 1–14.

విశాఖపట్నం జిల్లాలో ఎలమంచిలి సర్వసిద్ధిని పాలించిన చాళుక్యవంశంలో ఆరుగురు ఉపేంద్రులు ఉన్నారు. వీరికి సర్వలోకాశ్రయ బిరుదు వుంది. ఈ వంశంలోని మూడవ ఉపేంద్రుడే దోనయామాత్యునికి పోషకుడని చెప్పవచ్చు. అతడు 1356 నుండి 1364 దాకా ఎలమంచిలి కళింగాన్ని పాలించాడు. కవికూడా ఆ ప్రాంతాల వాడని చెప్పడానికి కృత్యాదిని ఇలా దైవప్రార్థన చేశాడు.

దురితమహోల్కఁ బెంపుడిపి దుఃఖదవానల మార్చి చక్రవి
స్ఫురణతటిల్ల తామహిమ సొంపు వహింపననారతంబు నా
దరమున సింహశైలమున దద్దయు వేడ్కఁ జరింపుచున్న
సుందరజలదంబు ధాత్రికి సుధాంతకృపామృతవృష్టి జేయుతన్. (సస్యా 1-2)

కవి తను వ్రాస్తున్నది వర్షశాస్త్రం కనుక దైవాన్ని మేఘంతో పోల్చడంలో ఔచిత్యముంది. ఈ పద్యం సింహాచలంలోని దేవుణ్ణి పేర్కొంటుంది. కవీ, అతని పోషకులూ ఈ ప్రాంతాలవాళ్లే. అయితే సస్యానందంలో శ్రీశైల మల్లికార్జునుని పేరు ఇంచుమించు అన్ని పద్యాలలోనూ వస్తుంది. సిద్ధవటపురారి అనే సంబోధన రెండుసార్లుంది (1-34; 1-46). కవి నెల్లూరు జిల్లాలోని సిద్ధవటం ప్రాంతాలవాడేమో, ఎలమంచిలి ప్రాంతాలకు వెళ్లాడేమో అనే అనుమానం సహజంగా కలుగుతుంది. అయితే అద్దంకి లింగకవి అనే వ్యక్తి ఈ ప్రక్షిప్తాలను చేర్చాడు. ఇతడు దోనయామాత్యుని అవతారికను మార్చివేశాడు. డి. 2388 నెంబరు గల ప్రతిలో ఇతని పేరుగల పద్యాలున్నాయి. డి. 2387 నెంబరు ప్రతిలో చివర ఈ పద్యం ఉంది.

ఈ సస్యానందమునకు
భాసురముగ గ్రమము లెరిగి పరమార్థముగా
నీసుడిగి యెరుగడ స్మృతి
వాసన నందవర లింగ వర్యుడు చెప్పెన్.

ఈ నందవరలింగ కవే శ్రీశైల మల్లికార్జునునీ, సిద్ధవటపురీశుని తీసుకొచ్చి గ్రంథంలో చేర్చాడు. దోనయామాత్యుని కృతిని సంగ్రహించి అద్దంకి లింగకవి తనదిగా వెలయించుకున్నాడని, గద్యలో ఇది సకల జనస్తుత్య దోనయామాత్యపుత్ర సజ్జన విధేయ అద్దంకి లింగయ నామధేయ ప్రణీతంబైన సస్యానందము అని వ్రాసుకున్నాడని నిడుదవోలు వెంకటరావుగారు ఆరోపిస్తున్నారు.[11] అయితే ఈ గద్యను మనం పట్టించుకొంటే దోనయ ఇంటి పేరు అద్దంకివారనీ, అతడు నందవరీనుడనీ లింగయ అనే కొడుకు ఉన్నాడనీ, అతడు పైతృకమైన రచనలో చేర్పులు చేశాడనీ ఊహాగానం చేయడానికి ఆస్కారముంది.

11. భారతి అక్టోబరు 1965 పుట 72.

దోనయామాత్యుని గ్రంథాన్ని ''శాస్త్రీయ దృష్టిచేతనేగాక భాషా వాఙ్మయ విషయదృష్టి చేతను పరిశీలింపదగియున్నది'' అని నిడుదవోలు వెంకటరావుగారు వ్రాశారు. నిజమే. ఈ పుస్తకంలో రసానందం కలిగించే కవిత్వం లేకపోయినా వాఙ్మయ విశేషాలను, చాలా కొత్తవాటిని చెప్తుంది. ''రచన ప్రాచీన ధోరణి ననుసరించియున్నది. తరువోజ, తోటకము మున్నగు ప్రాచీనవృత్తములు వాడబడినవి''[12] అని వెంకటరావు గారు వ్రాశారు. అయితే ఇందులో తరువోజలు వున్నట్టు ముద్రిత ప్రతులలో, బహుశా వ్రాతప్రతులలోనూ పొరపాటున లేఖకులు వ్రాయబట్టి ఆయన అలా చెప్పారేగాని తరువోజలు లేవు. చూడండి ఈ పద్యం.

మానుగా వైశాఖమాసంబు[13] గృష్ణ
పాడ్యమి యాదిగా బరగెడి[14] నాల్గు
దినములు బరగు నాదినమునై పార
మహిమీద శ్రావణమాసంబు లాది
గా నాల్గు నెలలకు గాన యద్దివస
ముల గాలియును నెండ మెయిలులు[15] గలుగు
నన్నెల వరపని రార్యజనములు[16]
సితపద్మసంకాశ శ్రీగిరివాస.[17] (సస్యానందం 2-5)

దీనిని ముద్రాపకులు తరువోజ అని అచ్చువేశారు. అయితే ఇది మంజరీద్విపద. అలాగే ఇంకొక పద్యాన్ని కూడా వాళ్లు అక్కడ తరువోజ అని అచ్చువేశారు. అదీ మంజరీద్విపదే – చూడండి.

మానుగా జ్యేష్ఠమాసము[18] పెంపులోను
వుడుపతి యాషాఢయుగముల నొండె
మానవైరోహిణి మద్యంబు నొండె
జనజొచ్చి వెడలిన జలధార లవని
భాసిల్లు గర్భ సంపద పెంపుపెలుచ
గాక నవ్వని వానకాలంబులోన
వానలు లేవని వలన మీరంగ
మునుజెప్పె కైలాసమున నీశ్వరుండు. (సస్యానందం. 2-18)

---

12. భారతి – జూన్, 1946, పుట 500
13. 'మాసంబులో' అని ముద్రిత పాఠం.
14. 'బరగు' అని ముద్రితపాఠం;
15. మెరుగులుగలుగు అని ముద్రితపాఠం –యతిభంగం;
16. అర్యజనులు అని ముద్రితపాఠం – గణభంగం,
17. శ్రీగిరీశ అని ముద్రితపాఠం – గణభంగం, ఇవన్నీ బరూరు త్యాగరాయశాస్త్రులువారి 1921 సం॥ ప్రతిలో
18. యతిభంగం – పాఠం సరిచేయడానికి ఆస్కారం కనబడడం లేదు.

ఇందులోకూడా ప్రాసలు లేవు. ప్రాచీన తరువోజ లక్షణాలయిన ఏకయతి నియమం పాటించలేదు. ఈ పద్యాలను చూశాక క్రీ.శ. 1356 ప్రాంతాలలోనే మంజరీ ద్విపదలు తెలుగు సాహిత్యంలో ప్రవేశించాయని చెప్పుకోవాలి. పాల్కురికి సోమనాథుడు ద్విపద ఛ్ఛందస్సును కొత్తగా సృష్టించినందుకు లాక్షణికులు తిట్టిపోయడం జరిగి అర శతాబ్దం కూడా తిరగలేదు. అప్పుడే మంజరీ ద్విపద కూడ ప్రవేశించిందా అనే అనుమానం సహజమే గాని ఒకటి మాత్రం నిశ్చయం. క్రీ.శ. 1407 ప్రాంతాలలో వున్న విన్నకోట పెద్దన తన కావ్యాలంకార చూడామణిలో మంజరీ ద్విపదకు లక్షణం చెప్పాడు - చూడండి.

శక్రత్రయంబును సవితృండు బాద
విక్రీడుతులు మృదుద్విపదకి నెపుడు
వళియుప్రాసంబులు వలయు దీనికిని
వలదు ప్రాసం బంద్రు వరుసమంజరికి. (కావ్యా. అష్టమ-62)

దోనయామాత్యుని పోషకుని యొక్క మనుమని కొలువులోనే ఈ విన్నకోట పెద్దన వుండేవాడు. దోనయామాత్యుని మంజరి ద్విపదలను పెద్దన చూసే వుంటాడు. అయితే ద్విపదలను పద్యకావ్యాలలో ఇలాగ ఎనిమిదేసి పాదాలుగా వాడడం అపురూపం. మొత్తం కావ్యాన్ని ద్విపదలో చెప్పడమే ఆనాటి సంప్రదాయం. ఆ రోజులలో చంపూకావ్యాలలో రగడలను వాడడమే అరుదు. అటువంటప్పుడు తన సస్యానందంలో వాడడం గమనించదగ్గ విషయమే. చూడండి ఒక మధురగతి రగడ.

ఎసగగ సితునకు నేడగు చోటన్
మసలిన శనికిని మానుగ సోముల్
వెసగను గూడిన వెసమేఘుంబుల్
వసుమతి నుడుగని వానలు జేయన్ (సస్యానందం. 4-18)

దీనిని బరూరు త్యాగరాయశాస్త్రులువారు 'మణిమంజరి' అనే ఛందస్సుపేర అచ్చు వేశారు.[19] అటువంటి వృత్తమే లేదు అని రావూరి దొరస్వామి శర్మగారు చెప్పారు. మధురగతి రగడను దోనయామాత్యుడు పద్యగ్రంథంలో వాడడంవల్ల ఇతర కవులు కూడా ఆ కాలంలో అలాగ వ్రాసేవారేమో అనిపిస్తున్నది.

ఛందస్సు విషయంలో కొన్ని క్రొత్త సంగతులు చెప్పినట్టే దోనయామాత్యుడు మన భాషలో ఆనాడు వాడుకొనే కొన్ని మాటల గురించి కూడా మనకు చెప్పాడు. ఇవి మనకు తరచుగా కనబడని ప్రయోగాలు, మన తిథులలో ద్వాదశి మనకెంతో పుణ్యమైనది. దానికి పారశి అనే పర్యాయపదమున్నట్టు దోనయామాత్యుడు యతి ప్రాసస్థానంలో వాడినందువల్ల తెలుస్తున్నది.

---

19. పుట - 61.

తోరంబై మాఘములో
పారశిపాడ్యములయందు పర్వోత్తరమున్
చారుతరయిష్టముల హిమ
మారుతములు గలుగ జ్యేష్ఠమాసము వీచన్.[20] (సస్యానందం, 1-43)

దోనయామాత్యుడు కొన్ని విలక్షణమైన యతులను వాడాడు. తెలుగు లాక్షణికుల మతం ప్రకారం పఫబభలకు 'మా' తో యతిలేదు. తమిళంలో 'వ' కారం 'మ'కారం యతి చెల్లుతుంది. తెలుగులో వకారానికి పఫబభలకు మాత్రమే యతి ఉంది. దోనయామాత్యుడు 'మ'కార 'బ' కారాలకు యతి చెప్పాడు చూడండి.

మానితంబగు చున్న యమ్మధుమాసవేళల కృత్తికన్
బూని రెండవ యంశ భానుడు బొల్చునయ్యెడ చంద్రుడున్
మానుగా కరివైరి జెందిన బస్తలో గురు డుండగా
వాసలుం జెలువారు మేదిని వారిజారి కళాధరా! (సస్యానందం, 2-9)

ఈ మత్తకోకిల మూడవ పాదంలో ఈ యతి ప్రయోగం కనబడుతుంది. ఇటువంటి దేశీయ యతులు దోనయామాత్యుడు అక్కడక్కడ వాడాడు. ఇతడు వ్రాసిన ఈ ఒక్క పుస్తకంలోని 228 పద్యాలలో నాలుగాశ్వాసాలలో ఇన్ని వింతలు కనబడుతూంటే ఇతని రెండవ పుస్తకం 'సర్వలోకాశ్రయం' దొరికితే అందులో ఎన్ని దేశీయ సంప్రదాయాలు తెలిసేవో!

దొరకనిదానికి బాధపడి లాభం లేదు, దొరికిన దానిలోని మరికొన్ని విషయాలు తెలుసుకుందాం. మేఘాలను వర్ణించడంలో దోనయామాత్యుడు 'కాటుకక్రోవులు' (2-39) అని ఒక దగ్గర అన్నాడు. రైతులు వాడుకొనే 'ఓదెలు' అనే మాటను ప్రయోగించాడు (3-3). ఓరంతప్రొద్దు (1-44; 3-26); నూలి పున్నమ (2-60) అనే జాతీయాలు వాడాడు. నోరకొలదులు అనే ప్రయోగం (1-16) ఇతనికి ముందు నన్నెచోడుడు, మంచెన చేశారు.

సస్యానందంలాంటి గ్రంథాలు సేద్యగాళ్ళకు చాలా ప్రయోజనకారులు. విషయాలను కృషీవలులు స్వానుభవం వల్లనే తెలుసుకొంటారు. రైతులకు ఎప్పుడూ కళ్ళు పొలంమీదనో లేకపోతే ఆకాశంమీదనో ఉంటాయి. అక్షరజ్ఞానం లేకపోవచ్చునుగాని వాళ్ళకు లోకానుభవం ఎక్కువ. ప్రకృతిమాత హావభావాలు ఏమాత్రం మారినా వారికి తెలుస్తాయి. వాటి అర్థాలను వాళ్ళు కచ్చితంగా చెప్పగలరు. జ్యోతిష శాస్త్రజ్ఞులు గ్రంథాలలో వ్రాసిన విషయాలను గ్రామ పండితులు చెప్తే విని తెలుసుకొన్నా మానినా రైతులు అహర్నిశలూ వాతావరణాన్ని, ప్రకృతినీ పరిశీలించి నేర్చుకొన్నది ఎంతో ఉంది.

20. బరూరువారి ప్రతి - పుట 14లో దీనికి నోరి గురులింగశాస్త్రుల వారి శిష్యుడు సంగ శేషాచలశాస్త్రిగారు ''మాఘమాసములో ద్వాదశియందును పాడ్యమియందును'' అని అర్థం వ్రాశారు.

నక్షత్రాలకూ గ్రహాలకూ తమ పేర్లు వేరే పెట్టుకొన్నారు. ముఖ్యంగా శుక్రునికీ, గురునికీ తెలుగు రైతులు ఎన్నో పదాలను పెట్టుకొన్నారు.[21]

శుక్రుని పేర్లు: ఆలబొద్దు చుక్క; కుందేటి చుక్క.

పర్యాయ పదాలు: ఎదురుచుక్క, కోడికూతచుక్క, గుంటచుక్క, గుడ్డిచుక్క, చాకలిచుక్క, ఛాయజొన్నలచుక్క, తెలగాయచుక్క, తెల్లవారుచుక్క, పడమటి చుక్క, పసరం చుక్క, పసులచుక్క, పెద్దచుక్క, పొద్దుపొడుపు చుక్క, మోటచుక్క, వలచుక్క, సందెచుక్క.

శుక్రుని పేరుతో ఉండే చుక్క పొద్దుపొడిచే ముందు తూర్పున కొన్ని నెలలు, పొద్దుగూకేముందు పడమట కొన్ని నెలలు ప్రకాశవంతంగా ఆకాశంలో కనిపిస్తూంటుంది. ఇది పొడిచిన తర్వాత సాయంకాలం కుందేళ్ళు మేతకు పోతాయట. అందుకే గ్రామీణులు దీనిని కుందేటి చుక్క అంటారు.

గురుని పేర్లు: మూలచుక్క, జాముచుక్క, తెలగాయచుక్క, దొంగచుక్క (ఒక్కొక్కప్పుడు రాత్రి రెండు జాములకు పొడుస్తుంది), నడిజాముచుక్క, రెడ్డిచుక్క, రెడ్డిపొడుపుచుక్క, రేచుక్క, రేయినడుపుచుక్క (రాత్రుళ్ళు ఉదయాస్తమానాలున్న నక్షత్రం), వడ్లచుక్క, సందెచుక్క, సందుచుక్క, సందె (కాడ) చుక్క. బృహస్పతి పేరుతో ఉండే నక్షత్రం ఒక్కొక్కప్పుడు సూర్యుడు గ్రుంకిన తర్వాత పడమట కనబడుతుంది. రాయలసీమలో ఒకచోట దీన్ని 'కాపు చెరువు చుక్క' అంటారు. ఇది జ్యేష్ఠ ఆషాఢ మాసాలలో రాత్రి ఒంటిగంటకు పొడుస్తుంది. దీన్ని చూసి తెల్లవారిందనే భ్రమతో ఒక రైతు పొలానికి వెళ్ళి అపాయంతో మరణించాడట. ఇది కొన్ని నెలలు సంధ్యవేళ, కొన్నినెలలు అర్ధరాత్రివేళ, కొన్ని నెలలు తెల్లవారుజామున పొడుస్తుంది.

బృహస్పతి పేరుతో ఉన్న నక్షత్రం ఈశాన్యమూలలో పొడుస్తుంది. కనుక గ్రామీణులు దీనిని మూలచుక్క అని వ్యవహరిస్తారు. తెలుగు రైతులు ఈ రెండు గ్రహాలకు ఇన్ని పేర్లు పెట్టుకొనడానికి తగినంత కారణముంది. తెలుగుదేశపు వాతావరణంలో మార్పులకూ, ఈ గ్రహాలకూ సంబంధం ఉందని లోకానుభవంగల గ్రామీణులకు తెలుసు. అందుకే ఆ గ్రహాల ఉదయాస్తమయాలనూ, ఆకారాలనూ ప్రత్యేకతలను అంత పరిశీలించారు. భారతదేశంలో ఏయే గ్రహాలు ఏ ప్రాంతాలపై ఆధిపత్యం వహిస్తాయో దోనయామాత్యుడు ఇలా చెప్పాడు.

వింధ్య శిఖరినుండి వేడ్క గోదావరి
గురుతుగాగ దేవగురుడు రాజు
మీరియేలు గౌతమీ కృష్ణ వేణ్యుత్త
రంబు భార్గవుండు రాజమౌళి. (సస్యా 4-3)

---

21. మాండలిక వృత్తిపదకోశం - ప్రథమ సంపుటం - సంపాదకులు భద్రిరాజు కృష్ణమూర్తి, పుట 427 నుండి.

దోనయామాత్యుడు చెప్పిన పద్యాల ప్రకారం నవగ్రహాలలో ఆరింటికి ఆధిపత్యం ఇలా ఉంటుంది.

గ్రహం	ప్రదేశం	గ్రహం	ప్రదేశం
1. శని	హిమాలయం నుండి గంగామధ్యదేశం	4. శుక్రుడు	కృష్ణా గోదావరుల మధ్యదేశం
2. బుధుడు	గంగానది నుండి వింధ్యదాకా	5. అంగారకుడు	కృష్ణ నుండి లంక దాకా
3. గురువు	వింధ్య నుండి గోదావరి దాకా	6. చంద్రుడు	మూడు లోకాలనూ

ఈ ఆధిపత్యాల పట్టికలో రాహుకేతువులూ, సూర్యుడూ లేరు. అయినా మన పూర్వులు సూర్యుణ్ణి బాగా పరిశీలించేవారని చెప్పవచ్చును. దోనయామాత్యుడు ఇలా చెప్పాడు.

ఒనరగ భానుబింబమొక యూష్మ తెరంగున గోకిలంబుచే
పునగడి కున్న యిట్టిగతి బొల్పెసలారెడు నట్టి లాంఛనం
బున దివసంబు రోహిణిని బూర్ణశశాంకుడు నుష్ణరోచియున్
దనరగ గూడి యుండి నను ధారుని మృత్యుభయా కులంబగున్

(సస్యానందం, 2-63)

వృషభ మాసంలో రోహిణీ నక్షత్రంనాడు సూర్యబింబములో ఉబ్బులాగ, కోకిలంలాగ, కున్నలాగ అంటే బిడ్డలాగ కనిపిస్తే ఆ సంవత్సరం మృత్యుభయం వుండదట. ఈ పద్యంలో కూన అనే అర్థంలో 'కున్న' అన్న ప్రయోగం ఉంది. దీనిని ప్రాచీనులలో ఎర్రాప్రెగ్గడవారు నృసింహపురాణం (5-17)లో, పాల్కురికి సోమనాథుడు బసవపురాణం (35వ పుట)లో చేశారు. దోనయామాత్యునిదీ ఆనాటి ప్రయోగమే. ఇంత చిన్న గ్రంథంలోనే ఇన్ని విలక్షణ ప్రయోగాలు కనబడితే ఇది ఒక విశేషమే.

శాస్త్రగ్రంథాలనేకాక కథాకావ్యాలను కూడా దోనయామాత్యుడు వ్రాసి ఉంటే దేశిపద్ధతులలో రచించేవాడనుకోవచ్చు. ఇతని సస్యానందంలో రసానందం కలిగించే కవిత్వం లేకపోయినా కాళిదాసుయొక్క 'ఆషాఢస్య ప్రథమదివసే' అనే శ్లోకంలోని అంతరార్థం మనం తెలుసుకొనునట్లు చేసిన ఇతని కావ్యంలో అందమైన అర్థాల ఆ గడపలు కొన్నే ఉన్నాయి.

అవి వర్షించిన చిన్నజల్లు ఉల్లాసకరమైనదే.

పశుపతి నాగనాథ కవి

పద్మనాయక ప్రభువులలో ఆరవవాడైన మొదటి అనపోతనాయనిగారి ఆస్థానంలో క్రీ.శ. 1369 ప్రాంతాలలో నాగనాథకవి ఉండేవాడు. ఇతని తండ్రి పేరు పశుపతి. అందుచేత ఇతణ్ణి పశుపతి నాగనాథుడు అని పిలుస్తారు. ఈయన సంస్కృతాంధ్రభాషలు రెండింటిలోనూ మంచి కవి. సంస్కృతంలో ఇతడు 'మదనవిలాస'మనే భాణం వ్రాశాడు. తెలుగులో విష్ణు పురాణాన్ని అనువదించాడు. ఈ రెండు గ్రంథాలూ నేడు దొరకవు.

భాణం అన్నది దశరూపక భేదాలలో ఒకటి. రంగస్థలంమీద ఆడే ప్రతిదాన్నీ మనం నాటకం అంటున్నాం. చిన్నదైతే నాటిక అంటున్నాం. ఒక్కటే అంకమైతే ఏకాంకిక అంటున్నాం. అయితే మన పూర్వులు రంగస్థల ప్రదర్శనకు యోగ్యమైన రచనలను రూపకాలు అనేవారు. అవి పదిరకాలు. నాటకం, ప్రకరణం, అంకం, వ్యాయోగం, భాణం, సమవకారం, వీధి, ప్రహసనం, డిమం, ఈహామృగం అని వీటి పేర్లు. ఒక్కొక్కదానికీ కొన్ని కొన్ని లక్షణాలూ, నియమాలూ ఉన్నాయి.

భాణం ఎలా ఉండాలంటే, రంగస్థలం మీదకు ఒకే ఒక పాత్ర ప్రవేశిస్తాడు. తాను అనుభవించిన విషయాలను గురించి చెప్తాడు. లేకపోతే ఇతరులు అనుభవించిన విశేష విషయాలను వర్ణిస్తాడు. ఆకాశంలో ఉన్న పురుషుడొకడు ఏదో చెప్తున్నది విని వాటికి తగిన ప్రతివచనాలను అభినయపూర్వకంగా చాలారకాలయిన చేష్టలతో నివేదించాలి. ఈ పాత్ర ధూర్తుడుగాని, విటుడుగాని అయి ఉండాలి. భాణంలో ఒకేఒక అంకం ఉంటుంది. ఇందులోని ఇతివృత్తం కల్పితమే కావాలి.[1]

పశుపతి నాగనాథుడు ఈ లక్షణాలతో మదనవిలాసం రచించాడని మాత్రం మనం చెప్పగలంగాని అందులోని కవితామాధుర్యం మనం ఆస్వాదించలేం. ఈ మదనవిలాసం నుంచి నాలుగైదు పంక్తులను మాత్రం మన సాహితీవేత్తలు ఉదహరిస్తున్నారు.[2] చూడండి :

రేచర్ల వంశతర్నాకరేణ... శ్రీసింగభూపాల పూర్వాచలప్రభాకరేణ... కేసమాంబికా కల్పప్రసూన గుచ్ఛేన... శ్రీయనపోతభూపాలేన సతత సన్నిధీకృత కల్యాణ నారాయణస్య వసంతోత్సవ... భావధ్వ జాన్వయ పరిపూర్ణ రత్నాకరస్య గురువిశ్వేశ్వరకవి చంద్రస్య ప్రియశిష్య నాగనాథకవి:

ఈ భాణం అముద్రితమని నిడుదవోలు వెంకటరావుగారు,[3] దాని అసంపూర్ణ ప్రతి దొరుకుతున్నదని చాగంటి శేషయ్యగారు[4] వ్రాశారు. వీరిద్దరూ ఉదహరించిన ఈ కొద్ది

1. నాట్యశాస్త్రము – డాక్టరు పోణంకి శ్రీరామ అప్పారావుగారు, పుట 528.
2. 1945 జూలై భారతిలో నిడుదవోలు వెంకటరావుగారూ, ఆంధ్రకవి తరంగిణి 5–వ సంపుటం – పుట 112లో. చాగంటి శేషయ్యగారు ఇవే పంక్తులు ఉదాహరించారు.
3. 1945 జూలై భారతిలో వ్యాసం.
4. ఆంధ్రకవితరంగిణి, నాలుగవ సంపుటం, పుట 149.

వాక్యభాగాలు తప్ప ఈ భాణం గురించి మనకేం తెలియదు. అయితే ఇందులోంచి కొన్ని విషయాలను మనం ఊహించవచ్చు. నాగనాథుని గురువు విశ్వేశ్వరకవి చంద్రుడు చాలా గొప్పవాడు. ఇతడు 'చమత్కారచంద్రిక' అనే కావ్యాలంకారగ్రంథం వ్రాశాడు. ఇందులో కావ్యగుణ దోషాలు చక్కగా చర్చించాడట. ఈ 'చమత్కారచంద్రిక'లో ప్రసక్తి వచ్చినప్పుడల్లా 'ఈ విషయం రసార్ణవ సుధాకరంలో చెప్పడమైనది, అందులో చూడండి' అని చెప్పడముందట. రసార్ణవ సుధాకరం సర్వజ్ఞసింగభూపాలుడు వ్రాసినది అంటారు. అయితే అందులో చెప్పిన కొన్ని కవికృత గ్రంథాలను చమత్కారచంద్రికలో విశ్వేశ్వరకవి తాను చెప్పిన వాటినిగా పేర్కొన్నాడు. కందర్పసంభవం, కరుణాకందళం, వీరభద్ర విజృంభణం మొదలైన సంస్కృత రచనలను విశ్వేశ్వరకవి చేశాడు. నాగనాథుడు ఈ గురువుకు తగిన శిష్యుడనుకోవచ్చు.

తెలుగులో రచించిన ఇతరుల భాణాలనుంచి కొన్ని ఉదాహరణలు లక్షణ గ్రంథాలలో దొరుకుతున్నాయి.

వార్తాకవి రఘునాథయ్య తన లక్షణదీపికలో ఒక మత్తేభ భాగాన్ని ఉప్పులూరి వెంకటరెడ్డి తన సకలలక్షణసారసంగ్రహంలో ఒక పూర్తి మత్తేభవృత్తాన్ని ఉదాహరించి ఇవి అంబాల భాణంలోనివని పేర్కొన్నారు. ఈ భాణాన్ని రచించిన కవిపేరు తెలియదు. 'పశుపతి నాగనాథునికి ఇతడు పూర్వుడో, అర్వాచీనుడో కూడా తెలియదు. అంబాల భాణం తెలుగు రచన బహుశా సంస్కృత మాతృకకు అనువాదం కావచ్చు. అంబాల భాణం గురించి ఈ మాత్రమైనా తెలుస్తూందిగాని, నాగనాథుని భాణం గురించి చూచాయగానైనా సూచనలు లేవు.[5]

మదన విలాసభాణంలో ఎటువంటి శృంగారముంటుందో తెలియదుగాని, ఇతడు విష్ణుపురాణంలో వ్రాసిన ఒక పద్యంవల్ల ఇతని తెలుగు రచనతో మనకు ప్రత్యక్ష పరిచయం కలుగుతుంది.

మాసరమయ్యె నంత మధుమాసము పాంథవిలాసినీజన
త్రాసము పుష్పబాణనవరాజ్యవిలాసము వల్లరీవధూ
హాసము మత్తకోకిల సమంచిత పంచమనాదమంజిమ
వ్యాసము జీవలోక హృదయంగమ సౌఖ్యవికాస మెంతయున్

(ప్రబంధరత్నావళి, 183)

ఇది పురాణంలోనిదైనా ప్రబంధ ధోరణిలో వుంది. క్రీ.శ. 1530-1555 ప్రాంతాల వుండే వెన్నెలకంటి సూరన కూడా విష్ణుపురాణాన్ని తెనిగించాడు. తనకు ముందు రమారమి రెండువందల సంవత్సరాల క్రిందట పశుపతి నాగనాథుడు అనువదించిన గ్రంథాన్ని పేర్కొనకపోవడం, పూర్వకవిస్తుతిలో అతని పేరు చెప్పి నమస్కరించకపోవడం చిత్రంగానే

5. అలభ్య కావ్య పద్యముక్తావళి - డాక్టర్ ఆర్. శ్రీహరి

వుంది. వెన్నెలకంటి సూరన విష్ణుపురాణం ప్రచారంలోనికి వచ్చాక నాగనాథునిది మాటునపడిపోయింది కాబోలు. అందులోనిది ఒక పద్యమైనా లభించింది. ఇంత చక్కటి ధార, శైలి గల కవి రచన సంపూర్ణంగా కాకపోతే మానె కనీసం మరికొన్ని పద్యాలైనా దొరకనందుకు విచారించాలి. ఇతని కవిత్వంలోంచి కాకపోయినా ఇతర రచనలలో కొన్ని భాగాలు లభ్యమవుతున్నాయి. నాగనాథుడు అనపోతనాయనింగారి ఆస్థానంలోవుంటూ సంస్కృతాంధ్ర భాషలలో శాసనాలు కూడా వ్రాసేవాడు. అతడు రచించిన ఒక శాసనం చారిత్రక దృష్ట్యా చాలా విలువైనది. శకసంవత్సరాలు 1291 అంటే క్రీ.శ. 1369లో పాలించిన పద్మనాయక ప్రభువు అనపోత నాయకుని అయినవోలు శాసనానికి నాగనాథుడు కర్త.[6] ఇందులో కొంతభాగం మొదట సంస్కృతంలోనూ, తరువాత కొంత తెలుగులోనూ ఉంది. ఈ తెలుగు భాగాన్ని చాగంటి శేషయ్యగారు తమ పుస్తకంలో ఉదాహరించారు.[7] ఈ శాసనంవల్ల నాగనాథుని భోగట్టాలు మనకు తెలియవు. ఇతడిని పూర్వకవిగా నుతించినవాడు కొరవి గోపరాజు ఒక్కడే.

> అనఘుహుళక్కి భాస్కరు మహామతి పిల్లల మఱ్ఱి వీరరా
> జును ఘను నాగరాజు గనిసోముని... (సింహా 1-12)

అనే పద్యంలోని నాగరాజే నాగనాథుడని నిడుదవోలు వెంకటరావుగారి భావన.[8] కొరవి గోపరాజు పెదతండ్రులు అనపోతనాయనింగారి కుమారుడు సింగమనాయనింవారి ఆస్థానంలో మంత్రులు. అందుచేత అప్పటికి ఆ పద్మనాయక రాజ్యంలో వున్న నాగనాథుణ్ణి గోపరాజు నుతించాడు కాబోలు.

రెడ్డిరాజుల కాలంలో అస్థానకవిగా ఉన్న శ్రీనాథుడు విద్యాధికారి హోదాలో శాసనాలు రచించాడు. బహుశా పశుపతి నాగనాథుడుకూడా పద్మనాయక రాజ్యంలో విద్యాధికారి హోదాలో ఉండేవాడేమో? ఇతని గురించి ఇంతకంటె ఎక్కువ ఏమీ ఊహించలేం.

ఒక్కటి మటుకు చెప్పవచ్చు. ఇతని తండ్రి పశుపతి పండితుడేగాని ఇతడు పండితపుత్రుడు కాడు! మంచి కవి!!

---

6. History of Reddy Kingdoms - P. 531.
7. ఆంధ్రకవితరంగిణి-5, పుటలు 108-109.
8. భారతి, జూలై 1945.

ప్రకాశ భారతీయోగి

పూర్వం రాజులు, సామంతులు, మాండలీకులు, సాధారణ భక్తులు దేవాలయాలలో వేయించే శాసనాలను కొన్నింటిని పద్యాలలో వ్రాయించేవారు. వైభవం గల రాజులైతే వాళ్ళ ఆస్థానంలోని మహాకవులే ఆ పద్యాలను రచించేవారు. లేఖకుడు గండరించేవాడు. నన్నయగారిలాంటి పెద్దకవులు శాసనకావ్యాలు వ్రాయడం మనం గమనించాం. మహాకవుల ఇతర రచనలు దొరికినప్పుడు ఈ శాసనకావ్యాలను మనం పట్టించుకొనం. ఇంకే రచనలూ దొరకక శాసన పద్యాలు మాత్రమే లభించేటప్పుడు అవే పదివేలని ఆ కవి గురించి తెలిసినంతమటుకే చెప్పుకొని తృప్తిపడాలి.

క్రీ.శ. 1381 ప్రాంతాలలో ప్రకాశభారతీయోగి అనే కవి ఒకడు ఉండేవాడని శాసనపద్యాలవల్ల తెలుస్తున్నది. జయంతి రామయ్యపంతులుగారు ఈ రెండు పద్యాలను ఉదాహరించారు.

నందిదీపావలి నాట్యకల్యాణ హోమశనివార గయార్క మంటపములు
దిరుచుట్టుమాలియ దివ్యలింగమ్ముల గుళ్ళు వజ్రంపురాకోట గోపు
రములు వాతాళగేహములు సోపానభాండాగారవివిధ ధాన్యాలయములు
వంటయిండులు చతుర్వార కవాటములు ప్రేమ దాక్షారామ భీమనాధు
నగరనాచంద్రతారకోన్నతులు దిశల
వెలయజేయించె ననవేము వేచురాను(?)
(విజయ) చండధాముని జగనొబ్బగండ డహిత
ఖండనోద్దండదోర్దండమండనుండు.

(ప్రకాశ భారతీయోగికావ్యం, పెద్దనాచార్యలిఖితం)

అమరాద్రిభీమేశ్వరావాసమబ్ధిసప్తకము శ్రీసప్తగోదావరంబు
వలయాచలేంద్రంబు వజ్రపు ఆకోట గుల పర్వతంబులు గోపురములు
దిరుచుట్టుమాలియ యరవిందజాండంబు మర్త్యలోకము నాట్యమంటపంబు
పరివారదేవతాభవనంబు లీచతుర్దశభువనంబులు దారకములు
గనకకుంభతతులు గాగ దాక్షారామ
మన్నవొంకువేమనానుజుండు
గడు నపూర్వసృష్టి కావించి వాసన
కక్కౖ శ్రీవేమసితయశుండు

(ప్రకాశభారతీయోగికావ్యం - పెద్దనాచార్యలిఖితం)[1]

ఈ రెండూ వివిధ శాసనాలలోని పద్యాలు అయినా ఒక కవి రచించినవే. ఒక శిల్పి గండరించినవే. ఈ రెండు పద్యాలలోనూ వజ్రంపు ఆకోట, తిరుచుట్టుమాలియ

1. శాసనపద్యమంజరి, ప్రథమభాగం, నెం. 70, 71. పుటలు 92, 98.

మొదలైన పదాలు సమానంగా వాడినవి వున్నాయి. ఈ పద్యాలవల్ల దేవాలయాలలో ఎన్నిరకాల కట్టడాలు ఉండేవే తెలుసుకోవచ్చు. ఈ పద్యాలలోని విషయాల పట్టిక చూడండి:

1. నంది దీపావళి
2. నాట్యమండపం (రెండు పద్యాలలోనూ ఉంది)
3. కల్యాణ మంటపం
4. హోమమంటపం
5. శనివారమంటపం
6. గయార్కమంటపం
7. తిరుచుట్టు మాలియ
8. దివ్యలింగంబుల గుళ్ళు
9. వజ్రంపు రాకోట
10. గోపురాలు
11. పాతాళగేహాలు
12. సోపానాలు
13. భాండాగారాలు
14. వివిధ ధాన్యాలయాలు
15. వంటయిండ్లు
16. చతుర్ద్వారకవాటములు
17. పదివారదేవతా భవనములు

ఈ రెండు పద్యాలే తప్ప ప్రకాశభారతీయోగి వ్రాసినవేమిటో మనకు తెలియవు. ఇతర వివరాలు కూడా తెలియవు. ఇతడు అనవేమారెడ్డి ఆస్థానంలో ఉండేవాడేమో. అనవేముడు క్రీ.శ. 1364 నుండి 1386 దాకా పాలించాడు. ఎంతోమంది విద్వాంసులను, కవులను పోషించాడు. అయితే ఇతనిపై చాటువులే తప్ప ఇతనికి ఎవరూ గ్రంథాలను అంకితమిచ్చినట్లు కనబడదు. సప్తసంతానాలలో ఒకటైన గుడులు ఎన్నో కట్టించాడు. ప్రకాశ భారతీయోగి చెప్పిన పై వివరాలవల్ల తెలియవచ్చే ఆలయ విషయాలు చెప్పుకొందాం.

దేవాలయాలలో మంటపాలు నిర్మిస్తారు. గర్భగుడిలో మూలవిరాట్టులుంటారు. మంటపాలలో నిర్ణీత సమయాలలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకమైన అవసరాల నిమిత్తం నిలుపుతారు. ప్రకాశభారతీయోగి అయిదు మంటపాలను పేర్కొన్నాడు.

1. **అర్కమంటపం:** సూర్యమంటపం. ఇది రథాకారంగల మంటపవిశేషం. రథసప్తమి నాడు స్వామివారి సేవచేయడానికి ఆలయంలో నిర్మించే ప్రత్యేకమంటపం ఇది. భారతీయోగి అర్కమంటపాన్ని గయార్కమంటపం అన్నాడు. ఎందుకోమరి.

2. **కల్యాణమంటపం:** దేవుని కళ్యాణోత్సవాలకోసం నిర్మించిన ప్రత్యేక మంటపం.

3. **నాట్యమంటపం:** దైవసన్నిధిలో నృత్యగీతాదిభోగాలు జరిపే మంటపం. ఇది ముఖమంటపంకన్నా విభిన్నమైనది.

4. **శనివారమంటపం:** కొన్ని దేవాలయాలలో శనివారమహోత్సవాలు జరుపుతారు. అటువంటి ఉత్సవాల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మంటపాన్ని ఈ పేరుతో పిలుస్తారు.

5. **హోమమంటపం:** దేవాలయాలలో యాగాది క్రతువులు చేయటానికి నిర్మించే మంటప విశేషాలు.

ప్రకాశభారతీయోగి రెండు పద్యాలలో ఇన్ని ఆలయ విశేషాలు చెప్పాడు. ఇతని కావ్యాలు దొరికితే ఇంకేవి తెలిసేవో!

కందనామాత్యుడు

నేటి కరీంనగరు జిల్లానూ, వరంగల్లు జిల్లా అనుమకొండ ప్రాంతాన్నీ పూర్వం సబ్బినాడు అని పిలిచేవారు. ఇది గోదావరికి దక్షిణాన మాత్రమే ఉండేది. ఈ సబ్బి రాష్ట్రాన్ని రాయగిరిదుర్గం రాజధానిగా క్రీ.శ. 1350 ప్రాంతాలలో గురిజాల ముప్ప భూపాలుడు పాలించేవాడు. ఇతని దగ్గర వానసవారివంశంలో జన్మించిన కేసనామాత్యుడూ, అతని తమ్ముడు కందనామాత్యుడూ మంత్రులుగా ఉండేవారు. కందనామాత్యుడు వెలిగందల గ్రామంపై అధికారిగా ఉండేవాడు కాబోలు, అతనికి వెలిగందలామాత్యుడనే పేరు కూడ ఉంది.

ఈ అన్నదమ్ములిద్దరూ చాలా వైభవంగా జీవించారు. దానధర్మాలు చేశారు. గుళ్లూ గోపురాలూ కట్టించారు. కేసన మంత్రి ధర్మపురిలో అన్నసత్రం పెట్టించాడు. ఆ వూళ్లో ఉండే నరసింహస్వామికి ఉత్సవాలు చేయించేవాడు. రామగిరి దుర్గంలో కేశవస్వామికి ఆలయం కట్టించాడు. ఈ కేసన మంత్రిని మడికి సింగన ఇలా వర్ణించాడు.

తన నీతి ముప్పడి ధరణీశు డేలెడి ధరణికి వజ్రపంజరము గాగ
దన మంత్ర ముద్దండ దండనాయకులకు బంచిన వాగ్బంధనంబుగాగ
దన దాన సంపద ధారుణీసురులకు జెలువార బండిన చేను గాగ
దనకీర్తి దిగ్వధూధమ్మిల్లములమీద మహనీయ పుష్పదామంబుగాగ

గోరి భూజనయనచకోరములకు
దన విహారంబు వెన్నెల తనువు గాగ
నురుతరైశ్వర్యలీలల నొప్పు చుండు
మంత్రి మణియైన కేసన మంత్రివిభుడు.[1]

(పద్మపురాణం అవతారిక.)

ఈ కేసన మంత్రి రాయదుర్గంలో తాను కట్టించిన కేశవాలయానికి హేమకుంభ శిఖరాలు ఎత్తించాడు. ఇది సూర్యునిలాగ ధగధగ మెరుస్తూ ఉంటుందట.

1. మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంవారి వర్ణనాత్మక కేటలాగు మొదటి సంపుటి, పుట – 32.

అన్న ఎంతటి సుప్రసిద్ధుడో, ఎంత వైభవంగా జీవించాడో కందన మంత్రి కూడా అలాగే ఉండేవాడు. ఇతడు ముప్ప భూపాలునికి అఖిల సామ్రాజ్యభార ధురంధరుడు. నీతి చాతుర్య వివేక విశేషగుణ గణాలంకారుడై ఆ మహారాజు మన్నన పొంది విశేష వస్తువాహనాలు, ఛత్రాలు, చామరాలు, పల్లకీలు మొదలైన రాచచిన్నెలు పుచ్చుకున్నాడు. ఒకే ఒక పద్యంలో ఇతనికి ఇరవై విశేషణాలను మడికి సింగన వాడాడు. కందనామాత్యుడు ఎలాంటివాడంటే

1. స్వామిభక్తుడు, 2. కార్యచతురుడు, 3. బహుకళావేది, 4. నీతిజ్ఞుడు, 5. విప్రహితుడు, 6. సరససల్లాపుడు, 7. సప్తాంగ రక్షణక్షముడు, 8. భావజ్ఞుడు, 9. సర్వసులభుడు, 10. అరిమంత్ర ఛేదనపరుడు, 11. ధర్మాత్ముడు, 12. సుందరాకారుడు, 13. సజనవినుతుడు, 14. ఉరుదయాపరుడు, 15. నిత్యోత్సవాసక్తుడు, 16. సద్గుణాధారుడు, 17. సౌమ్యమూర్తి, 18. సతత గురుదేవతా పరిచారరతుడు, 19. గుణ సముద్రుడు, 20. మదనసదృశుడు.

ఈ కందనామాత్యునికి ఇద్దరు భార్యలు. పేర్లు మల్లమాంబ, కాచమాంబ. ఈ ఇల్లాళ్ల ఎల్ల సంపదలకూ ఎల్లలై ఎప్పుడూ దానధర్మాలు చేస్తూ ఉండేవారు. కందనామాత్యుని పోషకుడైన ముప్ప భూపాలుడు ఎలా ఉండేవాడంటే - చూడండి. పూలరంగడి లాగుండేవాడు.

సంపెంగ విరులతో జాజులుం గురువేరు కొమరార నునుసేసకొప్పు వెట్టి
మృగమదకర్పూర మిళితమౌ పన్నీరు తనుపార మేన జందన మలంది
యుదయ భానుప్రభ నుల్లసంబాడెడు మణిభూషణ స్ఫూర్తి మారుమలసి
పరపైన వెన్నెల నురువుల పోలిక దనరారు ధవళవస్త్రములు గట్టి

మానినీకర చామర మరుత చలిత
కుండలుండయి తగ నిండు కొలువునందు
దనువు గీర్తియు గల పుష్పధన్వు డనగ
జూడ నొప్పారు ముప్పయ క్షోణివిభుడు.

ఈ రాజుగారి వర్ణనవల్ల ఈ కాలంలో మగవాళ్లు కూడా కొప్పులో పువ్వులు పెట్టుకొనేవారని తెలుస్తున్నది. ఈ భోగరాజు పోషణలో ఉండే కందనామాత్యుడు కూడా బంధుజన ముక్తావళీ మధ్య రత్నంలాగ ఉండేవాడు. విద్వజ్జనులు, సరస కవిగాయక కామినీజనాలు పరివేష్టించి ఉండగా సకల పురాణేతిహాసగోష్ఠీ వినోదాలలో ఉండేవాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో పదిసార్లు చెప్పుకోవలసిన మడికి సింగనకు ఈ కందనామాత్యుడు పోషకుడేగాక అతి స్నేహబాంధవుడు. అందుకే మడికి సింగన తాను వ్రాసిన పద్మపురాణం (ఉత్తరకాండ), భాగవత దశమస్కంధం కందనామాత్యునికే అంకితమిచ్చాడు.

కందనామాత్యుడు కేవలం కృతిపతేకాక కృతికర్త అని కూడా మడికి సింగన మూలంగానే తెలుస్తున్నది. కందనామాత్యుడు అపూర్వవచన రచనాబంధుర కావ్యరసాభిజ్ఞుడు అని సింగన చెప్పాడు.[2] సింగన సహవాససౌఖ్యం చేత కావ్యవిద్యాసుఖకేళిలో శిష్టజనవర్గంచేత పొగడ్తలు పొంది తాను ధన్యుడనయ్యానని కందన కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు. పద్యాలు కూడా చెప్పాడేమో కందనామాత్యుడు. ''నీతి తారావళి'' అనే కృతి ఒకటి రచించాడు కాబోలు. వివిధ గ్రంథాల పేర్లు చెప్తూ ''కందనాతారావళి'' అనే గ్రంథనామాన్ని సింగన పేర్కొన్నాడు. అందుచేత కందన కృతికర్త అనుకోవచ్చు. అయితే సింగనే పద్యాలు రాసి తన కృతిభర్త పేర వాటిని చెలామణి చేశాడని మానవల్లి రామకృష్ణకవిగారూ, నిడుదవోలు వెంకటరావుగారు భావిస్తున్నారు. సకల నీతిసమ్మతంలో తన సొంత పద్యాలను చేర్చినప్పుడు ''మదీయము'' అని ప్రత్యేకంగా సింగన చెప్తూ వచ్చాడు. నీతి తారావళి పద్యాలను అలాగ చెప్పలేదు. 'కందనామాత్య నీతి తారావళి' అని పేర్కొని ఇందులోని 12 పద్యాలను మడికి సింగన తాను సంకలనం చేసిన సకలనీతి సమ్మతంలో చేర్చుకొన్నాడు. మొదటి పద్యం కృతి ప్రశంస.

అమలమగు సప్త సంతానములం దనిశంబు యశనమునకు గుదురై నా
శములేక నెగడు సత్కావ్యము ధారుణిలోన నౌభళార్యునికందా! (సకలనీతి. 23)

కృతి చెప్పి దేవతలను మెప్పించవచ్చునని కందనామాత్యుడు ఒక పద్యం చెప్పాడు.

అమరగ వేల్పులచే గబ్బము చెప్పియ కాదె వరము వడసిరి మును బా
ణ మయూరాదులు సత్కా-వ్యము జెప్పిన బడయరాని వస్తువు గలదే?
(సకలనీతి. 24)

కందనామాత్యుడు చెప్పినదని మడికి సింగన ఈ పద్యాన్ని సకలనీతిసమ్మతంలో చేర్చినా ఇది యథాతథంగా 'కవిజనాశ్రయంలో' సంజ్ఞాప్రకరణంలో ఒక పద్యంగా కనబడుతుంది. ప్రతుల లేఖకులు పొరబడ్డారా?

కందనామాత్యుడు వ్రాసిన ఇంకొక పద్యంకూడా మరొక కవి గ్రంథంలో కనబడుతున్నది. చూడండి. ఆ రోజులలో దుష్ప్రయోగాలు చేసే వాళ్లమీద అతడు చెప్పిన పద్యం:

తెలుగని చెప్పి సంస్కృతము తీపును నారడిబుచ్చి శబ్దముల్
తెలుగునుగాక యే సభల దెల్పగరాని యపప్రయోగముల్
పలుమరు గ్రుచ్చి వాదడువ బాడుచు గబ్బపుద్రబ్బు ముండ్లచే
బెలుచన కర్ణముల్ పొడుచు బేలు గవిం గవిగా దలంతురే? (సకలనీతి. 27)

ఈ పద్యంలోని భావాలు, అనుకరణ కొరవి గోపరాజు వ్రాసిన పుస్తకంలో కనబడతాయి, చూడండి.

2. వాసిష్ఠ రామాయణం, 1-10

తెనుగన దేటగా గథలుచెప్పిన కావ్యము పొందులేదు మె
త్తన పసచాలదంద్రు విశదంబుగ సంస్కృత శబ్దమూద జె
ప్పిన నవిదర్భముండ్లనుచు బెట్టరు వీనులగావునన్ రుచుల్
దనరదెనుంగు దేశియును దద్భవములంగలయంగ జెప్పెదన్. (సింహా. 1-32)

కొరవి గోపరాజు కాలం క్రీ.శ. 1430-1490 అని చాగంటి శేషయ్యగారు నిర్ణయించారు.[3] గోపరాజు తన సమీపకాలంలో ఉన్న కందనామాత్యుని రచన చదివే ఈ దబ్బుముళ్ళ ప్రయోగం చేసి ఉంటాడు. సకలనీతి సమ్మతంలో 23వ పద్యంనుంచి 28వ పద్యందాకా ఆరు పద్యాలు 'కందనామాత్యు నీతితారావళి'లోనివని ముద్రితప్రతిలో కనబడతాయి. ఇందులో కొన్ని ఇతర కవికృతాలు లేఖక దోషాలు ఉన్నాయేమో.

కందనామాత్యునికి సామెతలు వాడటమంటే చాలా సరదా కాబోలు! దొరికిన పన్నెండు పద్యాలలో నాలుగు సామెతలవంటివి దొరికాయి. వడ్లూ, పెరుగు పిసికినట్లు (26) అనీ, చెలమలు త్రవ్వినట్లగునె చెర్వులుగట్టుట (సకలనీతి.28) అనీ, పొన్నాకులమీద తేనెపూసిన భంగిన్ (411) అనీ, ఇలనూనెయు కర్పూరము కలసిన విషమైనట్లు (988) అనీ వాడాడు. తన కాలంలో ఉండే కావ్యదోషాలేమిటో కందనమంత్రికి బాగా తెలుసు. వాటి పట్టిక ఇచ్చాడు చూడండి.

గ్రామ్యంబు దుస్సంధి కాకువిరోధోక్తి పోలుసంక్లిష్టంబు జల్లిపాదవు
వ్యర్థబంధంబు పిరర్థంబు పునరుక్తి దోషం బలంకార దూషణంబు
రసవిరుద్ధము క్రియారాహిత్య మస్పష్టభావంబు గణయతి భంగశబ్ద
భంగంబు లెరుగక సంగతంబుగ వట్టిమాటలు పురికొల్పి మచ్చరమున
బెనచి వడ్లును బెరువును బిసికినట్లు
కెలను నవ్వంగ బిలిబిలికృతులు సప్పి
వాదులడువంగ బరతెంచువారు కవులె
గోపికా జాలసుఖలోల గోపబాల! (సకలనీతి. 26)

ఇందులో చివరిపాదం ఒక శతకంలోని మకుటంలాగ కనబడుతున్నది. 'గోపబాల' అనే మకుటం గల కొన్ని పద్యాలు సకలనీతి సమ్మతంలో 'మదీయము' అంటే సింగన రచనలుగాం కూడా ఉన్నాయి. కొన్ని పద్యాలు దేవుణ్ణి సంబోధిస్తూ, కొన్ని పద్యాలలో తనను తాను సంబోధించుకొంటున్నట్టు కందనమంత్రి పేర సింగన 'నీతి తారావళి' చెప్పాడు అని తోస్తే తప్పు లేదు. కానీ 'కందనామాత్యు నీతి తారావళి' అని స్పష్టంగా గ్రంథంలో ఉండటం వల్ల కందన కొన్ని స్వయంగా స్వానుభవంతో చెప్పి ఉండొచ్చునని కూడా భావించవచ్చు. కుకవి నింద ఎలా చేశాడో చూడండి.

పలుకులు గొన్ని పేర్చి పడి బ్రాసము నందుల దోపనేర్చు భం
గుల నెటువంటి పద్యములుగూర్చిన గూర్పగవచ్చు గాక తద్

3. ఆంధ్రకవితరంగిణి, ఆరవసంపుటి, పుట 147.

జ్ఞులు పొగడుం బ్రబంధములు చోద్యముపుట్టి రచింపవచ్చు నే?
చెలమలు ద్రవ్వినట్లగునె చెర్వులుగట్టుట భూతలంబునన్? (సకలనీతి. 28)

చెరువులు కట్టడం ఎంతకష్టమో స్వానుభవంమీద తెలుసుకునే కందనామాత్యుడు ఇది చెప్పాడు. వాళ్ళ వానసవంశంలో పూర్వులందరూ చెరువులు తవ్వించినవారే. కందనామాత్యుని ముత్తాతగారి తండ్రి గన్నయ మంత్రి గణపతిదేవ చక్రవర్తి కాలంలో (క్రీ.శ. 1198–1262) ఉండేవాడు. ఆ మంత్రి తమ స్వగ్రామము మొలగూరి పడమటి గవనిలో రుద్రసముద్రం తవ్వించాడు. ఆనాటినుంచి ఈ వానసవంశంలోని మంత్రులందరూ రాజులు కట్టించవలసిన గుళ్ళూ, గోపురాలు కట్టించినవాళ్లే. తవ్వించవలసినచ చెరువులూ, బావులూ తవ్వించినవాళ్ళే. అందుకే కందనమంత్రి 'చెలమలు తవ్వినట్లగునె చెరువులు కట్టడం' అన్నాడు. ఇప్పటికి ఇతడి పద్యాలు ఐదు విపులంగా చర్చించుకున్నాం. మిగతా ఏడూ చూడండి.

బహ్వర్థ త్రిపాదకంబు లయి శబ్దంబుల్ నిరాయాసభా
వాహ్వానం బొనరింపగా రసనవీనాపాదనంబుల్ చతు
ర్వాహ్వాంఘ్రీ ప్రభవావగా మహిమ దోపం జూపలేకుండినన్
జిహ్వాకండువు పొంటె మేలె కవిరాట్చిల్పంబు లల్పంబులే. (సకలనీతి. 25)

పలుకుల తీపును సరసము
చెలువము నడబెడగు బంధచిత్రము సొబగున్
గలకలన జూపవలదే
కలకంఠియుబోలె కవిత కందనమంత్రీ! 30

ధరనొప్పు నీతిమార్గము - బరికింపగ దిరుగు మంత్రివని మంత్రమలే
కురువిష భుజగము పట్టిన - కరణి సుమీయౌభళార్యు కందనమంత్రీ!

బలవంతుడు మన్నించిన
బలహీనుడు బలియుడనగబడు ధారుణిలో
వలరాయడు చేపట్టిన
యలరులు బాణములుగాటె యౌభళకందా!

తన్నని నమ్మిన బ్రోవక - పొన్నాకులమీద దెనెబూసిన భంగిన్
నున్నని మాటలయన్నల - మన్ననలేమందు మబ్బుమంత్రియ కందా!

వివిధ కళాకోవిదుడై - సవినయుడై యొగిగలిగి సంగరజయుడై
నిపుడని నృపతుల బొందునె - యువిదయు గీర్తియును నౌభళోత్తరు కందా. (791)

ఖలుసంగతి గూడిన ని-ర్మలచిత్తుండైన జేయు బ్రతికూలుండై
యలనూనియ కర్పూరము - గలసిన విషయమైనయట్లు కందామాత్యా (988)

ఈ కందామాత్యుని ఇతర రచనలేమీ దొరకలేదు. కందనామాత్యుడు కవి కాడనుకొంటే అతనిపేర సింగన చెప్పిన రచనల పేర్లు కూడా తెలియవు.

ఈ కవితా పోషకుని పేరిట కమ్మని పద్యాలు కనీసం పన్నెండు మనకు ఇచ్చినందుకు మడికి సింగనకు మనం కృతజ్ఞత చెప్పుకోవాలి. ఇంక సింగన జీవిత కథ తెలుసుకుందాం.

మడికి సింగన

ఆపరమేశ్వర మకుట
వ్యాపితగంగా ప్రవాహవరకవితాస
ల్లాపు డగు మడికిసింగన
జేపట్టక కీర్తి గలదె శ్రీమంతునకున్?[1]

ఇలా సగర్వంగా ధిషణాహంకారంతో చెప్పుకొన్న మాటలు అక్షరాలా నిజమే. క్రీ.శ. 1350 ప్రాంతాలలో మడికి సింగనను చేబట్టిన శ్రీమంతులు కందనామాత్యుడూ, ముప్పభూపాలుడూ కీర్తివంతులు అయ్యారు. అయితే కొంతమంది కవుల పేర్లు, వాళ్ల గ్రంథాల నామాలు, అందులోని కొన్ని పద్యాలూ నేటికీ సజీవంగా ఉండడానికి నిస్సందేహంగా వాళ్లను మడికి సింగన చేపట్టడమే కారణం.

కాకతీయ యుగంలో సుమారు అరడజనుమంది అజ్ఞాత కవులను గురించి మనం మడికి సింగన ధర్మమా అని సవిస్తరంగా చెప్పుకోగలిగాం. ఇతడు సంకలనం చేసిన 'సకలనీతి సమ్మతం' అనే గ్రంథం ప్రాచీన నీతిమంజరి; భవ్యకవితా పారిజాతం. ఆ సుమాలు ఎప్పటికీ వాడవు. ఆ సువాసనలు ఎన్నటికీ తగ్గిపోవు. ''అల్లకల్లోలమైన పాలసముద్రాన్ని చిలికి దేవామృతం తేటతేల్చిన విధంగా గంధకారుడు మున్నుగల వస్తువులు అందంగా కూర్చి సుగంధం జతచేసినట్టు అడివి పువ్వుల తేనెను తుమ్మెదలు జున్నుపెట్టే విధంగా తన నేర్పు కనబడేటట్టు ముత్యాలను సైజుల వారీగా పేర్చి హారాలు గుచ్చేటట్టు పూర్వం చెప్పిన కృతులన్నింటిని తవ్వి ఒక్కచోట కనబడేటట్టు సకలనయశాస్త్రాల మతాలు సంగ్రహించి లోకోపకారం కోసం గ్రంథం చేస్తాను. ఇది అక్రమం అనకండి. అన్నింటినీ వర్గువులు చేసి చెప్పిన వరుస జూచి సమస్తం తెలుసుకోండి. కడివెడుపాలలో కొణిదెడు చల్ల పోసి తోడు వేసినట్టు అక్కడక్కడ ఒక్కొక్క పద్యం వ్రాసి 'మదీయం' అని పేర్కొంటాను'' అని స్పష్టంగా మడికి సింగన ఈ కావ్యం సంకలనం చేశాడు.

---

1. పద్మపురాణం అవతారికలో పద్యం - ప్రాచ్యలిఖిత భాండాగారంవారి కేటలాగు - సంపుటి I (1915) పుట 34.

అతడు ఈ కావ్యం సంకలనం చెయ్యకపోతే ఇవన్నీ నష్టమయ్యేవి, నిజానికి అతడు రచించిన పుస్తకంలో కూడా 3 ఆశ్వాసాలు మాత్రమే మనకు దొరికాయి. మిగతా ఆశ్వాసాలలో ఎందరు కవులను పేర్కొని ఎన్ని పద్యాలు ఏయే అపూర్వ గ్రంథాలలోంచి ఇచ్చాడో మనకు తెలియదు. అతడు చేసిన వర్గువులు చూడండి.

1. షష్ఠ్యంతములు, 2. దుర్గసంరక్షణము, 3. ప్రజాపాలనము, 4. రాజనీతి, 5. అంగీకరించి విడుచుట, 6. కరణీకపునీతులు, 7. వాచకలక్షణము, 8. వైద్యనీతులు, 9. యాజ్ఞికుడు, 10. విద్వాంసుడు, 11. చారులనీతులు, 12. రాజభృత్యనీతులు, 13. రాజులకు గొరగాని భృత్యులు, 14. సేవకుగొరగాని రాజులు, 15. సామము, 16. భేదోపాయము, 17. మాయోపాయము, 18. షాడ్గుణ్యము, 19. పానవ్యసనము, 20. అనసూయత, 21. శకునజ్ఞానము, 22. ప్రయాణవ్యసన పరీక్ష, 23. కార్యత్వరితనీతులు, 24. చోరనీతులు, 25. నీతిశాస్త్రప్రశంస, 26. ఆజ్ఞాపాలనము, 27. రాజాదాయవ్యయ ప్రకారము, 28. రాజునకు గొరగాని గుణములు, 29. విషపరీక్షా లక్షణము, 30. రాయసము - కరణము, 31. బ్రాహ్మణాచారము, 32. పురోహితనీతి, 33. జ్యోతిషికుడు, 34. రాయబారప్రకారము, 35. సేనాపతిలక్షణము, 36. భృత్యులకు గొరగాని రాజుల లక్షణము, 37. సేవకనీతులు, 38. షోడశసంధిప్రకారము, 39. దానము, 40. దండోపాయము, 41. ఉపేక్షోపాయము, 42. అష్టాదశవ్యసనములు, 43. మంత్ర రక్షణార్థములు, 44. దండయాత్ర, 45. యుద్ధదానప్రకారము, 46. కూటయుద్ధము, 47. అధికాధముల సయోధ్య ప్రకారము, 48. శత్రునపనమ్మిక నీతులు.

ఈ వర్గువులలో మడికి సింగన ఏయే గ్రంథాలనుంచి ఎన్నెన్ని పద్యాలు తీసుకొన్నాడో క్రోడీకరించి అకారాదిగా కేటాయించి ఆ గ్రంథాల కర్తల పేర్లు తెలిసినవి జోడించి ఒక పట్టిక తయారు చేశాను. చూడండి:

సకలనీతి సమ్మతములోని గ్రంథములు

వరుస సంఖ్య	గ్రంథములు	గ్రంథకర్త	ప్ర	ద్వి	తృ	మొ
1.	అజ్ఞాతము		5	25	17	47
2.	కామందకము		68	131	109	308
3.	కుమారసంభవము	నన్నెచోడ	1		1	2
4.	కేయూరబాహుచరిత్ర	మంచెన		1	1	2
5.	చాటువు		3	4	10	17
6.	చారుచర్య	అప్పనమంత్రి	1			1
7.	ధృతరాష్ట్రనీతి	తిక్కనగారు	2	4	2	8
8.	ధౌమ్యనీతి	తిక్కనగారు	1	5		6

వరుస సంఖ్య	గ్రంథములు	గ్రంథకర్త	ప్ర	ద్వి	తృ	మొ
9.	నీతితారావళి	కందనామాత్యుడు	9	1	2	12
10.	నీతిభూషణము	ఆంధ్రభోజుడు	14	4	7	25
11.	నీతిసారము	రుద్రదేవుడు	44	21	57	122
12.	పంచతంత్రి		31	77	68	176
13.	పద్మపురాణము	మడికి సింగన	1			1
14.	పురుషార్థసారము	శివదేవయ్య	38	25	29	92
15.	బద్దెన నీతి	బద్దెన	19	12	6	37
16.	భీష్మ పర్వము	తిక్కనగారు	1			1
17.	మదీయము	మడికిసంగన	24	7	8	39
18.	మార్కండేయము	మారన	1		2	3
19.	మిత్రనీతులు				1	1
20.	ముద్రామాత్యము	క్షేమేంద్రలక్కాభట్టు	8	14	17	39
21.	విదురనీతి	తిక్కనగారు	1	4	3	8
22.	శాంతిపర్వం	తిక్కనగారు			2	2
23.	శాలిహోత్రము				1	1
24.	శ్రీగిరిశతకము	శ్రీగిరి	2			2
25.	శ్రీరామాయణము				1	1
26.	సభాపర్వం	నన్నయగారు	9	12	2	28
27.	సౌప్తికపర్వం	తిక్కనగారు	2	2	6	10

ఇందులో 'మదీయం' అని కవి గ్రంథం మధ్యలో వ్రాసినవి 39 పద్యాలు మాత్రమే. సకలనీతిసమ్మతం ఒక్కటే మడికి సింగన కృతిగా లోకానికి దొరికి వుంటే 39 సొంత పద్యాలతో ఇతడు కవిగా చలామణి అయ్యాడన్న అపవాదు నిలచిపోయేది. ఇతడు వ్రాసిన ఇతర కృతులు - అందులోనూ ఎన్నతగ్గవి; మంచివి - మరో మూడు ఉన్నాయి. అందులోని కవిత్వం అఖండ గౌతమిలాగ సజీవంగా ఉంటుంది. మడికి సింగన గోదావరి ప్రాంతంవాడే. ఇతని తండ్రి అయ్యలమంత్రి గోదావరికి ఉత్తరపు దిక్కున పెద్దమడికిలో స్థిరమైన తోటలూ, పొలాలూ చాలా ఆర్జించి అఖిలజగత్తుకు అన్నదాత అనే కీర్తితో జీవించాడు. ఈ అయ్యలమంత్రి తొయ్యేటి అనపోతనాయకునికి మంత్రిగా ఉన్నాడు. ముసునూరి కాపయనాయకుని ప్రతినిధిగా అనపోతనాయకుడు రాజమహేంద్రవరాన్ని రాజధాని చేసుకొని పాలించాడు. కాపయనాయకుని కాలం క్రీ.శ. 1345 నుండి 1367 అని చరిత్రకారులు చెప్తున్నారు.[2] అనపోత నాయకుని శాసనం ఒకటి దాక్షారామంలో ఉంది.[3]

2. ఆంధ్రకవితరంగిణి - 4వ సంపుటి, పుట - 174.
3. History of Reddy Kingdoms, P. 154.

ఇది క్రీ.శ. 1347 నాటిది. ఈ కాలంలో అయ్యలమంత్రి జీవించడంవల్ల అతని కుమారుడు మడికి సింగన కూడా ఇప్పటివాడే అవుతాడు. మహా అయితే ఒక తరం అర్వాచీనుడు కావచ్చు. తరానికి ముప్ఫయి సంవత్సరాలు లెక్కించినా మడికి సింగన 1377 వాడు కాగలడు.

తొయ్యేటి అనపోతభూపతిని చోడ భక్తిరాజు క్రీ.శ. 1355లో వధించాడు. ఆ సంవత్సరం నుంచి రాజమండ్రి ప్రాంతాలు చోడభక్తి రాజు స్వాధీనంలో ఉన్నాయి. అంతదాకా రాజమహేంద్రవరంలో మంత్రులుగా ఉన్న మడికివారు రామగిరి దుర్గానికి వలసపోవలసి వచ్చింది. ఈ వంశంలో వలసలు వెళ్లడం కొత్త కాదు. అసలు మడికివారి కుటుంబానికి ఆ యింటిపేరు రాకముందు, వాళ్ళు గుంటూరు జిల్లా గుంటూరు తాలూకా రావెల గ్రామంలో ఉండేవారు. సింగనమంత్రి తాత అల్లాడమంత్రి కృష్ణానదికి దక్షిణపు దిక్కున రావెల అగ్రహారాన్ని మొత్తంగా ఏకభోగ్యంగా ఏలుతూ ఉండేవాడు. ఈ అల్లాడమంత్రి తక్కువవాడు కాడు. తన ఊళ్ళో ఒక కోవెల కట్టించాడు. అందులో కృష్ణుణ్ణి ప్రతిష్ఠించాడు. అన్ని వైభవాలతోనూ అతిశయిల్లి మనుజమందారుడని వాసి కెక్కాడు. ఈ అల్లాడమంత్రి సాక్షాత్తూ తిక్కన సోమయాజిగారి మనుమరాలి భర్త.[4] (వాసిష్ఠ 1-29)

రావెలలో కోవెల కట్టించిన అల్లాడమంత్రీ, అతని కొడుకు అయ్యలమంత్రీ కృష్ణానది దక్షిణతీరం నుంచి గోదావరి ఉత్తరతీరానికి వెళ్లవలసిన అవసరమేమొచ్చింది? తొయ్యేటి అనపోతభూపతి పూర్వం గుంటూరు మండలంవాడే. అతని పెదతండ్రి కుమారుడు కాపయ నాయకుడు ప్రతాపరుద్రుని రాజ్యం అంతరించాక ఓరుగల్లుకు ప్రభువయ్యాడు. రాజ్యానికొచ్చాక కాపయనాయకుడు తన బంధువులను వివిధ ప్రాంతాలను పరిపాలించడానికి నియమించాడు. తొయ్యేటి అనపోత నాయకుణ్ణి కాపయ గోదావరి మండలానికి పాలకుణ్ణిగా నియమించాడు. అనపోతుడు పోతూ పోతూ తనతో అయ్యలమంత్రిని కూడా తీసుకొని వెళ్లి ఉంటాడు. మడికిలో వాళ్ళకు పొలాలూ తోటలూ ఇచ్చి ఉంటాడు.

తొయ్యేటి అనపోతనాయకుడు పోయాక మడికివారి వంశం మరో కొమ్మ పట్టుకొనవలసి వచ్చింది. రాజమండ్రి నుంచి రామగిరి దుర్గానికి వెళ్లారు. అది గోదావరికి ఇద్దరిని తెలంగాణాలో నేటి కరీంనగర్ జిల్లాలో ఉంది. మడికివారు ప్రత్యేకంగా రామగిరి దుర్గం రాజధానిగా సబ్బిరాష్ట్రాన్ని పాలిస్తున్న ముప్పభూపతి పూర్వీకులు గుంటూరు జిల్లానుంచి వెళ్ళినవారే. వారి ఇంటిపేరు 'గురిజాల'. ఈ రాజుల వద్ద మంత్రులుగా ఉన్న వాణసవారూ, మడికివారూ బంధువులు కాబోలు. వాణస కందనామాత్యుడు మడికి సింగనకు అతి స్నేహబాంధవుడు.

---

4. ముని మనుమరాలి భర్త అని కొందరంటారు.

రామగిరి దుర్గానికి వెళ్ళి సింగన కందనామాత్యుణ్ణి ఆశ్రయించాడు. అతని పోషణలో ఉండి సకల పురాణేతిహాస గోష్ఠులలో పాల్గొనేవాడు. మడికి సింగన సహవాసం వల్ల కందనామాత్యునికి మంచి పేరు వచ్చింది. ఆ మంత్రి ఇలా అన్నాడట:

నీ సహవాస సౌఖ్యముల నెమ్మి జరించుట చేసి దిక్కులన్
వాసికి నెక్కి శిష్టజనవర్గముచే బొగడొంది కావ్య వి
ద్యా సుఖకేళిబేర్చి కడు ధన్యతతో బహుదానలక్ష్మలన్
భాసురకీర్తిమై నెగడి ప్రస్తుతి కెక్కితి మర్త్యకోటిలోన్.[5]

అట్లు గావున

కృతిపతుల కీర్తి దిక్కుల
నతులితమై యునికిజేసి యనవరతంబున్
గృతివాంఛ కలదు నన్నుం
గృతిపతి గావింపుమీవు కీర్తి యొసగెడున్.

కందనామాత్యుడు ఏదో ఒక కృతిని చెప్పమనలేదు. అష్టాదశ పురాణాలలో సాత్త్వికమైనదీ, ధర్మార్థకామమోక్ష ప్రదమైనదీ, విష్ణు కథాప్రధానమైనదీ అయిన పద్మపురాణాన్ని తెలుగు చేయమన్నాడు. మడికి సింగన అంగీకరించాడు. అయినా 'సత్యనిరతుడైన సాత్యవతేయుడు చెప్పిన అర్థమంతా తప్పకుండా తెలుగుచేయడం నలువకైనా చేత కాదు. భక్తి కారణంగా కథ రచిస్తాను' అని ఉపక్రమించాడు. ఇది పదకొండు ఆశ్వాసాల గ్రంథం. ప్రతి ఆశ్వాసం చివరా గద్యలో విషయ సూచికను చెప్పాడు. ఇందులో భాగవత, రామాయణ గాథలు ఎక్కువ. ఈ విషయ సూచికను చూస్తే ఈ గ్రంథం యొక్క ప్రాముఖ్యం తెలుస్తుంది. చూడండి.

పద్మపురాణం విషయాలు

ప్రథమాశ్వాసం: (1) పూర్వఖండకథాసూచన, (2) దిలీపుడు వేటకు వెళ్ళడం, (3) వైఘానసదర్శనం, (4) వసిష్ఠాశ్రమానికి వెళ్లడం, (5) భృగువిద్యాధర సంవాదం, (6) పురూరవుచరితం, (7) మాఘమాసస్నానవిశేషకథనం, (8) వృక్షకాంగణ చరిత్రం.

ద్వితీయాశ్వాసం: (1) సుందోపసుందోపాఖ్యానం, (2) హేమకుండలు చరిత్రం, (3) అతని తనయులు శ్రీకుండల, వికుండలులు యమసదనానికి వెళ్ళడం, (4) వికుండలుడు యమదూతవలన అఖిల ధర్మాధర్మములు విని తన పూర్వజన్మ సుకృత ఫలం ఇచ్చిన నరకంలో ఉన్న శ్రీకుండలుణ్ణి ఉద్ధరించుట. (5) కాంచన మాలినీచరిత్ర.

తృతీయాశ్వాసం: (1) ఇంద్రు డహల్యను పొందుట, (2) గౌతముని శాపంవలన పదభ్రష్టుడైన ఇంద్రుడు మాఘస్నానవిశేషం వల్ల ఇంద్రపదవిని పొందుట, (3) ప్రయాగ

5. పద్మపురాణం, అవతారిక, ప్రాచ్యలిఖిత భాండాగారంనుంచి వర్ణనాత్మక కేటలాగు, (డి-18) పుట 34.

మొదలైన బహుతీర్థ మాహాత్మ్యం, (4) గంధర్వకన్యలు ఘోషతీర్థం విప్రతనయుణ్ణి చూచి విరహాక్రాంతలు అవడం, (5) విప్ర కుమారకన్యకల అన్యోన్యశాపం, (6) పిశాచరూపులైన వారు వేదనిధి కనుగొనుట, (7) రోమశముని దర్శనం, (8) అతనివల్ల సకలతీర్థస్నాన ఫలవిశేషాలు వినుట, (9) వీరసేన చరిత్ర, (10) భద్రకచరిత్ర.

చతుర్థాశ్వాసం: (1) దేవద్యుతితపోమాహాత్మ్యం, (2) పుండరీకాక్షుడు తనకు ప్రత్యక్షమగుట, (3) యోగసారస్తోత్రకథనం, (4) చిత్రసేనచరిత్ర, (5) కేరళ విప్రపథిక సంవాదకథనం, (6) ప్రయాగజలపానం, (7) కేరళుడు ప్రేతత్వవిముక్తి పొంది దివ్యలోకము నకు చనుట, (8) మాఘమాసస్నానంవల్ల గంధర్వకన్యకలు, మునికుమారుడు శాప విముక్తులై దివ్యశరీరము దాల్చుట, (9) ప్రయాగ తీర్థదర్శనం.

పంచమాశ్వాసం: (1) ద్వయమంత్ర ప్రభావం, (2) సుదర్శన ధారణ మాహాత్మ్యం, (3) ఊర్ధ్వ పుండ్రధారణ, అష్టాక్షరీ మంత్ర ప్రభావ కథనం, (4) లక్ష్మీ స్వరూపం, (5) మూలప్రకృతి స్వరూపం, (6) నారాయణ దివ్యస్వరూపం, (7) విష్ణు లోకావరణభేదం.

షష్ఠాశ్వాసం: (1) సర్వభూతాంతర్యామి అయిన విష్ణువు ప్రకృతియందు పొందుట, (2) మహదాది సర్గ ప్రతిసర్గమాహాత్మ్యం, (3) సకలభూత సంభవ కథనం, (4) చతుర్వ్యూహ మాహాత్మ్యం, (5) మత్స్యావతారం, (6) దూర్వాసుడి శాపంవల్ల మహాలక్ష్మి అణగుట, (7) సముద్ర మథనకథనం, (8) కూర్మవిభవం, లక్ష్మి పుట్టడం, (9) ద్వాదశీ వ్రత మాహాత్మ్యం (10) పాషండ కథనం, (11) త్రిగుణ స్వరూపస్మృతి పురాణ విశేషం.

సప్తమాశ్వాసం: (1) సనకాదుల శాపం, జయవిజయులు భూమిమీద జన్మించుట, (2) వరహావతార కథనం, హిరణ్యాక్షునివధ, (3) హిరణ్యకశిపు తపోమాహాత్మ్యం, (4) పితాపుత్రవివాదం, (5) నరసింహావతారం, హిరణ్యకశిపుహరణం, (6) వామనావ తారం (7) పరశురామ చరిత్ర.

అష్టమాశ్వాసం: (1) స్వాయంభువ మనువు తపోమాహాత్మ్యం, (2) రావణ కుంభకర్ణుల జన్మం, (3) శ్రీరామజన్మం, (4) తాటకవధ, (5) సీతా వివాహం, (6) పరశురాముని వివాదం, (7) వనవాసగమనం, (8) కాకాసుర రక్షణ, (9) విరాధవధ, (10) శూర్పణఖ నాసికాచ్ఛేదనం, (11) ఖరదూషణాది రాక్షసవధ, (12) సీతాపహరణం, (13) జటాయు మరణం, (14) సుగ్రీవ దర్శనం, (15) వాలివధ, (16) సీతాన్వేషణ, (17) లంకాదహనం, (18) సేతువుకట్టడం, (19) రావణ కుంభకర్ణవధ, (20) విభీషణ పట్టాభిషేకం, (21) అయోధ్యా నగర ప్రవేశం, (22) శ్రీరామ పట్టాభిషేకం.

నవమాశ్వాసం: (1) శ్రీరామ అష్టోత్తర శతనామ కథనం, (2) భూభారాన్ని తగ్గించడానికి వసుదేవులకు కృష్ణుడు పుట్టడం, (3) వసుదేవుడు కృష్ణుణ్ణి రేపల్లెలో వుంచి యశోదకు పుట్టిన యోగమాయను తేవడం, (4) రేపల్లెలో బలరామకృష్ణులు పెరగడం,

(5) కృష్ణుడు పూతనను చంపడం, (6) శకటాసుర సంహారం, (7) కుక్కుటాసుర వధ (8) యమళార్జునమోక్షం, (9) బకాసుర వధ, (10) వత్సాపహరణం, (11) కాళీయ మర్దనం, (12) అఘాసురవధ, (13) ధేనుకాసుర సంహారం, (14) ప్రలంబాసుర వధ, (15) అరిష్ట దళనం, (16) కేశి మరణం, (17) బృందావన క్రీడ, (18) గోవర్ధనగిరి ఎత్తడం, (19) బలరామకృష్ణులను అక్రూరుడు మధురకు తీసుకొనిరావడం, (20) కువలయాపీడ, చాణూర ముష్టికాదులతోబాటు కంసుణ్ణి వధించడం, (21) సాందీపని కొడుకును బ్రతికించుట, (22) జరాసంధ యుద్ధం, (23) కాలయవనుని చంపడం, (24) ముచికుందుని మోక్షం.

దశమాశ్వాసం: (1) రుక్మిణీ పరిణయం, (2) సత్యభామాది మహాదేవుల వివాహం, (3) శమంతకమణి కథనం, (4) కృష్ణుడు జాంబవంతుణ్ణి ఓడించి జాంబవతిని పెళ్లాడడం, (5) సులక్షణ, సుశీల స్వయంవరం, (6) నరకాసురవధ, (7) పదహారువేల రాజకన్యకలను పెళ్ళాడడం, (8) పారిజాతాపహరణం, (9) ఉషాకన్యకోసం చిత్రరేఖ అనిరుద్ధుని తీసుకొనిపోవడం, (10) బాణాసుర భుజావచ్ఛేదనం, (11) పౌండ్రకవధ, (12) కృత్యా విధ్వంసనం, (13) భీమునిచేత జరాసంధుణ్ణి చంపించడం, (14) శిశుపాల దంతవక్త్రుల వధ, (15) నందవ్రజ నివాసులకు విష్ణులోకప్రాప్తి, (16) స్వర్గగతులైన విప్రబాలురను తెచ్చి వారి తల్లితండ్రుల కర్పించడం, (17) భారత కథా సూచన, (18) యాదవుల పరిక్షయం, స్వర్గలోక గమనం, (19) ద్వారావతి సముద్రంలో మునిగిపోవడం, (20) అర్జునుని తపశ్చర్య.

ఏకాదశాశ్వాసం: (1) వాసుదేవార్చన కథనం, 92) నిత్యనైమిత్తిక పూజా విశేషం, (3) శ్రీరామ అష్టోత్తరశతనామ జపాన్ని శంకరుడు అంబికకు తెలియజేయుట, (4) భృగుడు దధ్రుపాణులను శపించుట, (5) విష్ణువు పరమ బ్రాహ్మణ్యదైవమని కొనియాడడం, దిలీపుడు పరమపదమున కేగడం.

ఆంధ్రదేశంలో 'చేసేవి మాఘస్నానాలూ, దూరేవి దొమ్మరి గుడిసెలు' అనే సామెత ఎందుకు ప్రచారమైందో పద్మపురాణ విషయసూచిక చూస్తే తెలుస్తుంది. ఈ పురాణం మాఘస్నానాల మహిమను వేనోళ్ల చాటుతుంది. సర్కారు జిల్లాలో ఈ పద్మపురాణం వ్రాతప్రతులు విరివిగా దొరికేవని బ్రౌను దొర వ్రాశాడు. ఆయన జూలూరి అప్పయ్యపంతులు చేత ఒక తీర్పుప్రతిని తయారు చేయించాడు. అప్పయ్యపంతులు ఇలా పీఠిక వ్రాశాడు.

'ఈ తెలుగు పద్మపురాణమునకు అయిదు ప్రతులు తెప్పించి వ్యత్యాసములు యెక్కించి నిర్దోషముగా నియమించుకోవడమైనది. ఇదిగాక గీర్వాణమందు అధ్యాయములు బయలుదేరిన స్థలములందు వాటి లెక్కకూడా తగిలించినాము. ఈ తెలుగు కవి గీర్వాణ గ్రంథం కొంత మటుకు బాగా తెనిగించుకొని తర్వాత వేరే భాగమునందు కొన్ని అధ్యాయములు తెచ్చి గ్రంథ మధ్యముగా పెట్టివున్నాడు.

పద్మపురాణోత్తర ఖండమును సింగనకవి లెస్సగా తెనుగుచేసి యుండగా కాలాంతరమందు లేఖక దోషములచేత ననేక స్థలములయందు చెడిపోయి శుద్ధ ప్రతి లేకయుండుట చేతను అనేక ప్రతులు తెప్పించి గీర్వాణమునకు సరిగా అధ్యాయ సంఖ్య యేర్పడేటట్టున్నూ నిర్దోషముగా నుండేటట్టున్నూ పార్శ్వములయందు ఆయా కథా భాగములయందలి వర్ణనాంశములు మొదలైన వాటియొక్క సూచనలు వ్రాయబడి యుండేటట్టున్నూ యీ ప్రకారము తీర్పుచేయవలసినదని మచిలీపట్టణ న్యాయకర్తలైన మహారాజశ్రీ చా.పి. బ్రౌన్‌దొరగారు అనుజ్ఞ యిచ్చినందున శాలివాహన శకవర్షములు 1754 అగు నేటి నందననామ సంవత్సరమునకు సమానమైన ఇంగిలీషు యుగ 1832 సంవత్సరమందు బందరులో జూలూరి అప్పయ్య సంపూర్ణముగా పదకొండు ఆశ్వాసము లున్నూ తీర్పుచేసి గీర్వాణమునకున్ను తెనుగునకున్న కొన్ని స్థలములయందు భేదములు వచ్చియుండగాను అధ్యాయ క్రమ వ్యత్యయములు ఆయా స్థలములయందు విశదపరచడ మైనది. ఈ పద్మపురాణమందు ఉత్తర ఖండము మాత్రము తెనుగు అయినట్టు తెలియబడు చున్నది గాని కడమ ఖండములను తెనుగు చేసినట్టుగా యెక్కడనున్ను మాకు కనపడలేదు.'

మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో దీనికి నెం. 18 నుండి 26 దాకా తొమ్మిది ప్రతులు ఉన్నాయి. రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలోని తాళపత్ర విభాగంలో ఇప్పటికీ రెండు పద్మపురాణ ప్రతులు ఉన్నాయి (నెంబర్లు 44; 123). ఈ గ్రంథం 1885లో, అంటే నూరు సంవత్సరాల క్రిందట అచ్చుపడింది. ఆ తరువాత వావిళ్ళ సంస్థ వంటి ప్రఖ్యాత ప్రచురణాలయం వారు సైతం దీనిని ఉపేక్షించి ఎందుకో అచ్చువేయలేదు. ఇది పూర్తిగా ధర్మపన్నాలు చెప్పే పురాణశైలిలోని గ్రంథం కాదు. చక్కని శృంగాగ పద్యాలు కూడా ఉన్నాయి. వెంకటగిరి సంస్థానాశ్రితుడు శ్రీమోదీ జగన్నాథమల్ సేకరించి ప్రకటింగిన శృంగార పద్యరత్నావళిలో పద్మపురాణంలోంచి 17 పద్యాలు ప్రచురించారు. ఇప్పటికైనా ఎవరైనా ప్రచురణకర్తలు ఈ పురాణాన్ని ప్రచురిస్తే భాషకు ఎంతో సేవచేసిన వాళ్లవుతారు.

తృతీయాశ్వాసంలో మడికి సింగన 67 పద్యాలలో అహల్యాసంక్రందనుల కథ వ్రాశాడు. ఇది ఒక చిన్నసైజు శృంగార ప్రబంధం. నాయకుడు ధీరోదాత్తుడు కాకపోయినా, విషయం పరదారాగమనం కనుక పాపభూయిష్ఠమైనా ప్రయోజనం మాఘస్నాన మహిమను చెప్పడం కనుక మడికి సింగన దీనిని చాలా రసవత్తరంగా రచించాడు.

ఆడవాళ్ళను వర్ణించడంలో మడికి సింగన హద్దులు దాటడు. ఔచిత్యవంతంగా భావుకతతో వ్రాస్తాడు. శూర్పణఖ సీతమ్మను రావణుని ముందు ఎలా వర్ణిస్తుందో వినండి.

పసిడిసలాక పూవిలుతు బాణముసోగసుధారసంబుపై
మిసిమిదలంప వెన్నెలల మీగడ జేసిన బొమ్మకందులో
నుసిమిన చంద్రరేఖ బెళుకొందనికారు మెరుంగుతీగయా
శశిముఖి రాముదేవి సడిసన్నది యెప్పు న రాక్షసేశ్వరా. (పద్మ. 8-168)

త్రేతాయుగంలోని సీతమ్మే ద్వాపరయుగంలో రుక్మిణిగా జన్మించిందని హిందువుల నమ్మకం. రుక్మిణీదేవిని ఎలా వర్ణించాడో చూడండి.

కదలని క్రొమ్మెరుంగు కసుగందని కెందలిరాకు నాచుతో
జొాదువని తూడు బంగరపుపుత్తడి మవ్వపుబువ్వు భర్గుతో
నెదురని కామునమ్ము ఫణి యెంగిలికాని సుధాంశురేఖనా
నొదవుచునుండె రుక్మిణిపయోరుహనాభుని భాగ్యరేఖగాన్. (పద్మ. 10-15)

ఈ రుక్మిణీదేవిని రాక్షస వివాహపద్ధతిలో శ్రీకృష్ణుడు ఎత్తుకుపోయి పెళ్లి చేసుకున్నా మడికి సింగన మాత్రం వాళ్ళకు శాస్త్రోక్తంగా పెళ్లి చేశాడు. అందులోనూ తెలుగు పెళ్లి చేశాడు. నన్నెచోడుని కాలం నుంచి కావ్యాలలో పెళ్లిళ్ల తెలుగుతనం తెచ్చుకొనడం మొదలుపెట్టాయి. కుమారసంభవం అష్టమాశ్వాసం అంతా పెళ్లి ప్రయత్నాలే. (1) పెళ్లి మాటలకు వెళ్లిన మునులు వచ్చి పార్వతిని వర్ణిస్తారు. (2) శివుడు పెళ్లికి తరలి వెళతాడు. (3) ఊరేగింపు, పౌరకాంతలు శివుణ్ణి చూస్తారు. (4) శివుడు విడిదిలో దిగుతాడు. (5) పెళ్ళివారు విడిదిలో విశ్రమిస్తారు. కథా విశ్రమిస్తుంది. అన్నీ వర్ణనలే. ఇంత పూర్వరంగం ఉన్నా పెళ్లిలో తెలుగు ఆచారాలు లేవు. తిక్కనగారికాలం వచ్చేసరికి కొన్ని కొన్ని తెలుగు పద్ధతులు ద్వాపర యుగంలోని వ్యక్తులకు నేర్పారు. ఉత్తరాభిమన్యులు తలంబ్రాలు పోసుకొంటారు. మడికి సింగన మాత్రం పెళ్లిమండపానికి తీసుకురావడం దగ్గర్నుంచి పెద్దల కాళ్లకు మొక్కించడందాకా తంతు అంతా జరిపించాడు. మధ్యలో తెరపట్టడం, పౌరోహితులు మంగళాష్టకాలు చదవడం, పేరంటాళ్లు పాటలు పాడడం అన్నీ ఉన్నాయి. చూడండి రుక్మిణీకృష్ణుల వివాహం:

'అప్పుడు వసుదేవుండు సకలబాంధవరాజనుసమూహంబును నుద్ధవాది మహాద్రుభంబును సర్వపూజలం దృప్తిసలిపి విప్రానుమతంబున బుణ్యాహవచనాది కృత్యంబులాచరించిన వాసుదేవరుక్మిణులకు మంగళస్నానంబు చేయించి దివ్యాంబరాభరణ మాల్యానులేపనంబుల నలంకరించి వివాహ సమయంబగుట ననేక వృద్ధపుణ్యాంగనలు సేసలుబెట్టుచు నుద్యానమంటపంబునకుం దెచ్చి

తెరచీరపట్టు యిరువురు - నిరువంకల నిలువబెట్టి యింపుదలిర్పన్
సురయక్షసిద్ధకిన్నర - నరకాంతలు మము భజించి నలి గీర్తింపన్.

సుముహూర్తమనుచు భూసురులు నల్గడ నిల్పి లలిమంగళాష్టకములు పఠింప
నిత్యమంగళమని నిఖిలార్థవరులును జెలువార గైవారములు వచింప
జయజయధ్వనులకు సకలదేవతలును జదల నెల్లెడ నిల్చి సంస్తుతింప
నత్యంతకల్యాణమనియు పేరంటాండ్రు పాటించి పెండిలిపాట బాడ
దేవదుందుభులును దివ్యగానంబులు - బుణ్యకీర్తనములు భూరిసుతులు
రూఢి జెలగె నపుడు రుక్మిణీకృష్ణుల - పరవివాహవైభవంబు వొలిచె.

అప్పుడు శుభగృహంబునం దెరదిగవిడుచుటయు నవ్వధూవరు లత్యంత ప్రేమాతిశయంబునం బొంది యొండరులం గనుగొనునప్పుడు

తరుణి చేతను బ్రాలు వరు మౌళి బోయుచో జనుగ్రేవ మెరుగులు చౌకళింప
నన్యోన్యముఖవీక్షణాసక్తులైనచో గలువలు దమ్ములు జెలిమిసేయ
బ్రథమ సంగమకాంక్ష బ్రసరింపు దలపులు పొదవి మేనుల యందు బులక లలయ
కన్నియబతికరగ్రహణంబు సేయుచో బంచబాణుడు పునర్భవుడు గాగ

గల్పతరువును లతయును గలసి మెలసి
యొక్క కుదుటను మొలచి పెంపొదవినట్లు
బెండ్లిపీఠంబుపై నుండి ప్రేమ లోలయ
నవ్వధూవరు లొప్పారి రపుడు చూడ.

ఇవ్విధంబున హెూమానంతరంబున యుద్ధవుండు తద్దంపతులను వసుదేవోగ్రసేన బలదేవులకును దేవకీరోహిణులకును నభివందనంబు సేయించి. (పద్మ. 10. 49 నుండి 56)

తలంబ్రాలు పోసుకోవడం వర్ణిస్తున్నపుడు మడికి సింగన పూర్తిగా తిక్కనగారిని అనుసరించాడు. అతడు రుక్మిణీకృష్ణులు ఒక్కకుదుట మొలచిన కల్పతరుపూలతాలాగ ఉన్నారన్నాడా? తిక్కనగారూ ఈ తరువూలతా పోలికే తెచ్చారు.

పెనుగుదుటనిడినచూతం - బును నవమాలికయుబోలె బోలుపొంది రతం
డును నమ్ముగ్ధయు నేకా - సనమున నున్నపుడు నూత్న సౌభాగ్యమునన్.
(విరాట. 5-401)

తిక్కనగారిని అనుసరించినా మడికి సింగన వ్యక్తిత్వం గల రచయిత. అతడు యశోదను చిత్రించిన తీరు వేరు. భాగవతంలో పోతరాజుగారు ''మన యశోద చిన్ని మగవాని గనెనట, చూచి వత్తమమ్మ సుదతులార''[6] అని వర్ణించి గోపెమ్మలచేత ''పాపనికి నూనె తలయంటి, పసుపు బూసి - బోరుకాడించి హరిరక్ష పొమ్మటంచు - జలము లొక కొన్ని చుట్టి రాజిల్లి తొట్ల నునిచి దీవించి'' పాడించారు.[7] పోతరాజుగారి కృష్ణుడు లోకుల సొమ్ము. మడికి సింగన మాత్రం యశోదచేత యివన్నీ చేయించారు, చూడండి.

అంత యశోదయు నతిభక్తి పుత్రుల నూరులపై నిడి యుగ్గువెట్టి
తలల నూనియలంటి తనువు లల్లన దోము సడలజేతులు గాళ్ల సాగదిగుచు
నలుగిడి నులివేడి జలము దోయిట బట్టి తరమి వీపులమీద జరచుగడుపు
లదుము మేనుల బసపార్చు దోసిటి నీళ్ల బడసి పోద్రిప్పును మడమమన్ను

6. భాగ. దశమ. పూర్వ. 184;
7. అందులోనే, 189.

లలికమున బెట్టి యంగుళు లదుము జెవుల
గొరవి తిరి(దిప్పు రెప్పలు విరిచి యూదు
గాటుకలు వెట్టు నుయ్యేల గట్టి చీర
లచ్చి పరపించు పొదుగుళ్ళ దెచ్చి యునుచు. (9-108)

తిరుమణి వెట్టు నౌదలల తెల్లని చీరలుగప్పు జిన్నియా
భరణములెల్ల బెట్టు తగు భంగుల డగ్గరి చన్నులిచ్చునే
భరముగ సూచి జోలలును బాడు ముదంబుననందగోపసుం
దరియిది నిత్యకృత్యముగ దా బెనిచెందగ రామకృష్ణులన్. (9-109)

తను పెట్టుకునే తిరుమణి తన దేవునికి కూడ మడికి సింగన పెట్టాడు. అతడు తాతల కాలంనుంచీ విష్ణుభక్తుడు. కృష్ణునిమీద ఉన్న భక్తితోనే అతడు భాగవతంలోని దశమస్కంధాన్ని కూడ అనువాదం చేశాడు. ఇది చంపూకావ్యంగా కాక ద్విపదగా రచించాడు. పోతరాజుగారి కన్నా ఒక అరవై సంవత్సరాలు ముందుగానే ఈ అనువాదం జరిగింది. భాగవత దశమస్కంధాన్ని కూడ మడికి సింగన కందనామాత్యునికే అంకితమిచ్చాడు.

దశమస్కంధాన్ని 'ద్విపద భాగవతం' అనే పేర తంజావూరు సరస్వతీ మహల్‌వారు 1950లో అచ్చు వేశారు. ఇందులో మధురకాండ, కల్యాణకాండ, జగదభిరక్షకాండ అని మూడు కాండలున్నాయి. గ్రంథం పూర్తిగా లభించలేదు. ఉన్నంతమటుకు అచ్చు వేశారు. మడికి సింగన ఇందులో అట్టే సవిస్తరంగా కవిత చెప్పలేదు. వర్ణనలకోసం, పాత్ర చిత్రణకోసం ఎక్కువసేపు ఆగక కథ చెప్పుకొనిపోతాడు. అలాగని కట్టె-కొట్టె-తెచ్చె అన్నట్టు ఉండదు.

మడికి సింగన కాలంలో ఎఱ్ఱయగారి హరివంశంగాని, నాచన సోముని హరివంశంగాని ఇంకా ప్రచారంలోకి వచ్చినట్టు లేదు. సింగన రెండుసార్లు నరకాసురవధ వర్ణించాడు. ఒకసారి పద్మపురాణంలో, రెండోసారి దశమస్కంధంలో. రెండుసార్లూ సత్యభామ యుద్ధం లేనేలేదు. ఊర్వశీ నరకాసుర సంవాదం కూడా లేదు. పద్మ పురాణంలో అంత చక్కగా రుక్మిణీ కల్యాణం వర్ణించిన సింగన ఇందులోనూ ఉదాత్తంగా వర్ణించాడు. హరివంశంలో రుక్మిణి బ్రాహ్మణునిచేత రాయబారం పంపడమన్నదే లేదు. నారదుడే ఆకాశంలో పోతూపోతూ ఆమె అందాన్ని చూసి మెచ్చుకొని పనికట్టుకొని ద్వారకలో దిగి కృష్ణుని చెవిని వేసిపోతాడు. ఆ తరువాత ప్రకృతి వర్ణనలూ అవీ అయ్యాక నారదుని మాటలు కృష్ణుడు జ్ఞప్తికి తెచ్చుకుంటాడు. ఇది ఎఱ్ఱయగారు వ్రాసింది. నాచన సోముడు అసలు రుక్మిణీ కల్యాణమే వ్రాయలేదు. మడికి సింగన పద్మపురాణంలో పురోహితుని కొడుకుచేత రాయబారం పంపినట్లు వ్రాశాడు. చూడండి:

ఇత్తెరంగున వివాహ మహోత్సవంబునకు వచ్చిన రాజలోకంబు గనుంగొని రుక్మిణీదేవి విచారించి చతురమానసుండగు తన పురోహిత పుత్రుం బిలువంబంచి యేకాంతంబున,

తనకుం గృష్ణుని రూపము - మనమున దగులుటయు నతడు మగడుగ వ్రతమున్
మునుకొని సలుపుటయును-జై-ద్యుని రాకయు దెలియ నతనితో నెరిగించెన్.
(పద్మ. 10-19, 20)

పద్మపురాణంలో పంపించిందేగాని ఆ బ్రాహ్మణుడు వెళ్లాడో లేదో, చెప్పాడో లేదో, వస్తాడో రాడో అన్న తహతహ లేదు. ద్విపదలో చక్కని పాత్రపోషణ, భావసంచలనం ఉంది.

... మంగళ తూర్య నినద
మెడపక మ్రోయంగ నెరిగి రుక్మిణియు కలగి మ్రాన్పడి నిల్చు కళవళంబందు
బెలుకురులో దారు పెదవులు దడవు బలుక కూరకనుండు బలుమాటలాడు
నిలువనేరక వ్రాలు నిట్టూర్పు పుచ్చు నంతయు హరి జేర్చు నంతరంగమున
సంతాప మొదవంగ జర్చించి చూచు ''నక్కట! యెక్కడి కరిగెనో! విప్రు
డెక్కడ బోయెనో ఏలకో తడసె! హరికి యిక్కడి వార్తలందెనో! నడుమ
దిరిగెనో! శౌరి దోతెచ్చుచున్నాడో! ఈ కార్య మెరిగింప నిందిరావిభుడు
కైకొన కుండునో! కడ వేడ్కతోడ వచ్చునో! ఎవ్వరే వలదందురొక్కొ!
మచ్చికతో నన్ను మన్నించు నొక్కొ! నెడమకన్నును జన్ను నెడమభుజంబు
వడి నదరెడి హరి వచ్చు నిశ్చయము. (కల్యాణ. 70 నుంచి 78)

ఈ భావాలే పోతరాజుగారి ''ఘనుడా భూసురుడేగెనో'' (దశమ. పూర్వ. 1730) అనే ప్రసిద్ధ పద్యానికి మేలుబంతులు. సంసారసుఖాలు అనుభవిస్తున్నప్పుడు రుక్మిణి శ్రీకృష్ణునికి రాజోపచారాలు ఎలా చేసిందో మడికి సింగన వర్ణించాడు.

కర్పూర మిశ్రితాలైన క్రముక భాగాలు గాజులు అల్లల్లాడగా చేచాచి కృష్ణుని అరచేతికి ఇస్తుందట. తెల్లని పండు తమలపాకులు కూడ గోర సవరించి చూర్ణమిశ్రం చేసి మడచి చిటికెవేస్తే శ్రీకృష్ణుని చేతికి అందించేదట. తన పాలిండ్లు శ్రీకృష్ణుని పాదాలకు ఆన్చి అతని కాళ్లు పట్టేదట. (కల్యాణ. 669-682)

ఇటువంటి వర్ణనలూ అవీ చేయడంవల్లనే ఈ కావ్యం 'గద్య'లో ''శృంగార రసకళాశ్రితవచోధనుడు'' అనే బిరుదును మడికి సింగన తగిలించుకొన్నాడు. పద్మపురాణం రచించిన దగ్గర్నుంచి అతనికీ పట్టం కట్టినట్టుంది. హేమంతాన్ని ఎలా వర్ణించాడో చూడండి:

వలరాజున కాశ్రయమగు - చెలువల పాలిండ్ల చేరక యున్నన్
చలి పింఛ మడచకుండునె - సొలపక పెనుగిరుల మరువు సొచ్చినవైనన్. (పద్మ. 3)

ఈ పద్యం చూడండి:

తడిసిన చీర పెందొడల దార్కొనలోజిగి చౌకళింపగా
బడువగు కౌనుదీగె కుచభారమున న్వెడ వ్రాల వెన్నడిన్
దొడవగు వేణియం దురలి తోరవు దీర్ఘపు బిందు లొప్పగా
నడుగుల కాంతి కెందలిరుటాకుల యందము డిందజేయగన్.[8]

ఎంత శృంగార రసకళాశ్రితవచోధనుడైనా మడికి సింగన వేదాంతంవైపు మొగ్గుతాడు. తాను వ్రాసి అంకితమిచ్చిన రెండు కావ్యాలకూ సంతోషించి కందనామాత్యుడు సింగనకు రాజాశ్రయం ఇప్పించాడు. ముప్పభూపాలుడు సింగనకు రామగిరిసీమలో పెక్కు వృత్తులూ, గ్రామాలూ ఇచ్చాడు. అతని ఆశ్రితులందరిలోనూ అధికుడని, చతురుడని సింగన ధన్యత పొందాడు.[9] అయినా ముప్పభూపాలునికి ఏ పుస్తకం అంకితం ఇవ్వలేదు. అతడే ప్రసక్తి తెచ్చి వ్రాసినా జ్ఞానవాసిష్ఠ రామాయణాన్ని అతడు అహోబల నరసింహస్వామికి అంకితమిచ్చాడు. అంతకుముందు వ్రాసినదో, ఆ తరువాత చెప్పినదోగాని సకలనీతి సమ్మతం కూడా దైవాంకితమే చేశాడు. కందనమంత్రి అన్నగారు కేసన కట్టించిన ఆలయంలోని కేశవేశ్వరునకు సమర్పించుట పరమ పూజావిశేషంబకావుత మని మనసులో ఉపక్రమించాడు.[10]

ఈ పూజావిశేషం అన్నది తిక్కనగారికి ఆధ్యాత్మికమైన అనుకరణ. ఆయన ''పుణ్యప్రబంధంబులు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్క యారాధనావిశేషం బగుటం చేసి'' అన్నారు (విరాట. 1-31). ఆధ్యాత్మికంగా తిక్కనగారిని ఇలా అనుసరించిన మడికి సింగన ఎర్రయగారిని కూడా అనుసరించాడు. ''తొల్లి హరిభక్తిరసావేశంబున గతిపయాక్షరా భ్యాస చాపలంబునం జేసి, విష్ణువిభవాభిరామకథా ప్రభూతంబులం బద్మ పురాణోత్తరఖండమును భాగవత దశమ స్కంధంబును దెనుంగున రచియించి'' అని జ్ఞానవాసిష్ఠ రామాయణంలో చెప్పుకొన్నాడు (1-10). ఇలాగే ఎర్రయగారు ''కతిపయాక్షరాభ్యాస కాలంలో...'' అని నృసింహపురాణంలో చెప్పుకొన్నారు. ఎర్రయగారిని ఈ విధంగా అనుకరించిన సింగన వారిని ఎక్కడా ప్రస్తుతించలేదు. కారణం తెలియదు. పద్మపురాణం రచనాకాలం నాటికి ఎర్రయగారికి పేరు రాలేదనుకోవచ్చుగాని వాసిష్ఠ రామాయణం నాటికి వచ్చి ఉండాలి.

వాసిష్ఠ రామాయణంలో ఏమీ లేదు. దీనిని సంస్కృతంలో యోగవాసిష్ఠం అంటారు. శ్రీరామచంద్రునికి నూనూగు మీసాలు రావడానికి ముందే సంసారం మీద

8. మోథీ జగన్నాథమల్ ఉదాహరించిన పద్యం నెం. 189
9. వాసిష్ఠ రామాయణం, 1-40.
10. సకలనీతి సమ్మతం, 1-9.

విరక్తి, సాధుజన గోష్ఠిలో ఆసక్తి జనించాయి. విశ్వామిత్రుని సలహాపైన వసిష్ఠుడు రామునికి జ్ఞానబోధ చేస్తాడు. ఇది అయిదు ఆశ్వాసాల గ్రంథం. చిన్న చిన్న కథలుంటాయి. వాటిని దృష్టాంతాలుగా చూపించి జ్ఞానబోధ జరుగుతుంది. వైరాగ్యం, ముముక్షుత, ఉత్పత్తి, స్థితి, ఉపశమనం, నిర్వాణం అని జ్ఞానోపదేశం ఆరు ప్రకరణాలు. వ్రాస్తున్నది వేదాంత గ్రంథమే అయినా సింగన దీనినిండా సామెతలు, జాతీయాలు, చక్కని ఉపమానాలు గుప్పించాడు.

ఎలుకలు త్రవ్విన ఇంటి చందంబున నీ మేను మిగుల డస్సె. (1-76)

దూరము పని గలగతి జను - నూరక యిల్లిల్లు సొచ్చు, నొగి జీయ
గూరదు సిగ్గున; సుజనుల - జేరదు చిత్తంబు, గ్రామసింహము వోలెన్. (1-99)

సూది పిరుదన చనుదెంచు సూత్రమట్లు (2-97); వడ్లును పెరుగును గలుపుభంగి నకట వికటంబు (2-172); ముక్కున వేలిడి; శిరంబు లూచి (2-163); ఇనుమును ఇనుముచే దునుమునట్లు (2-244); ఎలుకలు తిన్న చామలట్లు (3-32); ప్రియుని యిల్లు తస్కరించినట్లు (3-33); యోహరి సాహరింబెనగి (3-39); వ్వెవెదుక మణి యిచ్చినట్లు (5-138); కుచములమీద బెన్నిదుర గూరిన బాలుని దల్లి గానలే కెచటికి బోయెనో యనుచు నేడ్చినట్లు (5-249).

ఆదిమ చాళుక్యయుగాలలో మన భాషలో మధ్యాక్కరలు చాలా ప్రచారంలో ఉండేవని చెప్పుకొన్నాం. యుద్ధమల్లుని శాసనంలో ఛందస్సు ఉందని, నన్నయగారు వీటిని వాడారని చెప్పుకొన్నాం. అక్కరలు అయిదు రకాలు - 1. మహాక్కర, 2. మధ్యాక్కర, 3. మధురాక్కర, 4. అంతరాక్కర, 5. అల్పాక్కర.[11]

చిత్రకవి పెద్దన తన ఛందోగ్రంథంలో అయిదు రకాల అక్కరలు చెప్పి 'ఎక్కువ సత్కవులు కృతుల నిడుదురు వీనిఁ' అన్నారు.[12] దీని మీద రావూరి దొరస్వామి శర్మగారు వ్యాఖ్యానం చేశారు.

'ఇందు చిత్రకవి 'ఎక్కువ' శబ్దమును బ్రాసపూజా కుసుమముగా నుపయోగించెగావలయు. ఏయే కృతులలో నేయే సత్కవులు ఎక్కువగా నక్కర లుపయోగించిరో. అక్కరల నెక్కువ యిడిన గ్రంథములన్నియు నక్కరకు రాక కాలగర్భమున దాగెనా?'

మడికి సింగన జ్ఞానవాసిష్ఠంలో ఒక అల్పాక్కర చెప్పాడు.

11. వీటిలో రెండింటినే నన్నయగారు (39 మధ్యాక్కరలు, 1 మధురాక్కర - ఆది - 449) చెప్పారు. ఎఱ్ఱయ్యగారు ఒక మధ్యాక్కర, 2 మధురాక్కరలు చెప్పారు (అరణ్య. 4-310; 5-352; 7-109). మిగతావి ఎవరూ, ఎప్పుడూ వ్రాయలేదట.

12. సర్వలక్షణ సారసంగ్రహం, ద్వితీయాశ్వాసం, 102.

మీరిందు శంబరు మెచ్చిచూడ
నారూఢి నేనొక్క హయము నెక్కి
దూపించి పో వనదుర్గభూమి
భారంబుగా జొచ్చె వాజి వేగ. (వాసిష్ఠ. 2-223)

అజ్ఞాత కవులనేకాక అజ్ఞాత ఛందస్సులు కూడా మడికి సింగన మనకు ప్రసాదించినందుకు ధన్యవాదాలు చెప్పాలి. ఇతడీ జ్ఞానవాసిష్ఠం చిన్నవయసులో, అంటే ప్రౌఢనిర్భర వయఃపరిపాకంలో చెప్పాడా అన్న అనుమానం కలగడానికి ఇందులో ఒక పద్యం కనబడుతున్నది. అతడు ఇలా కుకవి నింద చేశాడు.

కదిసిన నోరవోయి, యొరుకబ్బపు దొంతుల సత్పదార్థముల్
గదుకుచు, నెట్టివారి బొడగన్నను, గుఱ్ఱని, స్నేహ సౌఖ్యముల్
మదికి నసహ్యమై శునకమార్గమునం జరియించుచున్న దు
ష్పదకవు లెల్ల మత్కవిత దప్పు లుపట్టక వింౘుగావుతన్. (వాసిష్ఠ. 1-7)

'ఎట్టివారి బొడగన్నను' సరిగ్గా చూడరనే ఆరోపణ కొంచెం వయసు తక్కువగా ఉన్నప్పుడే వుంటుంది. ఇది సింగన్న తన నలభయ్యో ఏట చెప్పాడేమో. ఇంతకు పూర్వమే పద్మపురాణ, భాగవత రచనలు జరిగాయి. అయితే పద్మపురాణం క్రీ.శ. 1420లో రచించి ఉంటాడని ఈ పద్యం వల్ల తెలుస్తున్నది.

మంగళ మహా శ్రీ వృత్తము

ఆ కరయుగానల మృగాంక శకవత్సరమునై పరగు శార్వరిని బుణ్యా
ప్రాకటిత మార్గశిర పంచమిని బొల్చునుడు పాలసుత వాసరమునందున్
శ్రీకరముగా మడికిసింగన దెనుంగున రచించె దగ బద్మ పురాణం
బాకమలమిత్ర శిశిరాంశువుగ గందసచివాగ్రణికి మంగళ మహాశ్రీ.
(కేటలాగు, పుట 36)

కర = 2, యుగ = 4, అనల = 3, మృగాంక = 1, అంకెలు కుడినుండి లెక్కించాలి కనుక 1342 శాలివాహన శకవత్సరాలు. దీనికి 78 కలిపితే క్రీ.శ. 1420 అవుతుంది. అయితే ఈ పద్యం అన్ని ప్రతులలోనూ లేదు. కనుక నమ్మక్కర్లేదు అని మల్లంపల్లి సోమశేఖరశర్మగారూ,[13] వేదం వెంకటరాయశాస్త్రిగారూ చెప్తున్నారు.[14] ఈ పద్యంలోని కాలాన్ని విశ్వసించి చాగంటి శేషయ్యగారు ఇలా వ్రాశారు.

''పద్మపురాణమును ముగించునాటికి సింగనకవికి నలువది అయిదేండ్లుండెనని యనుకొందుమేని అయ్యలమంత్రికి 45 సంవత్సరముల వయసున, ననగా క్రీ.శ. 1375

13. History of Reddy Kingdoms - P. 514.
14. నన్నెచోడుని కవిత్వం, పుట - 82.

సంవత్సర ప్రాంతమున సింగన జన్మించి యుండునని యూహింపవలసి యున్నది. ఈ యూహ సరియైనదనియే నా అభిప్రాయము.''

చాగంటివారు ఇలా కాలనిర్ణయం చేయడానికి రెండు ఇబ్బందికరమైన తారీఖులున్నాయి. ఒకటి క్రీ.శ. 1345లో తొయ్యేటి అనపోత భూపతి రాజ్యానికొచ్చి ఉండవచ్చు. క్రీ.శ. 1420లో పద్మపురాణ రచన జరిగిందని పై పద్యం చెప్తున్నది. ఈ రెండు సంవత్సరాలకు మధ్య 75 సంవత్సరాల సుదీర్ఘకాలముంది. క్రీ.శ. 1345 నాడు మంత్రిత్వం చేసే వ్యక్తికి కనీసం ఇరవై సంవత్సరాల ప్రాయం ఉండాలి కదా! అంటే అయ్యల మంత్రి జననం 1325 అవుతుంది. అంటే తండ్రి జననానికీ, కొడుకు మొదటి రచనకూ 95 సంవత్సరాల ఎడం వస్తుంది! ఇది ఎలా సరిపెట్టడం? అందుచేత శేషయ్యగారు అయ్యలమంత్రికి 45వ యేడు వచ్చేదాకా మొదటిబిడ్డను ప్రసాదించలేదు. సింగన్నకు నలభైయవ ఏడు వచ్చేదాకా మొదటి పుస్తకం రాయనివ్వలేదు. అంతదాకా మొదటి పుస్తకం వ్రాయకుండా అతడేం చేసినట్లు? 'ఆ కరయుగానల' పద్యాన్ని నమ్మితే ఈ బెడద తప్పదు.

మల్లంపల్లి సోమశేఖరశర్మగారూ, వేదం వెంకటరాయశాస్త్రిగారూ చేసిన కాలనిర్ణయమే గ్రాహ్యం.[15]

మొదటి పుస్తకంలో 'ఆ పరమేశ్వర మకుట వ్యాపిత గంగా ప్రవాహ వరకవితా సల్లాపుడు' అనే ధిషణాహంకారాన్ని ప్రకటించిన మడికి సింగన తన ఆఖరి పుస్తకంలో అహంకారం గురించి ఒక చక్కని మాట చెప్పాడు. చూడండి.

ఎరుక పడకున్న సహమర్థ మెద్దియేని
మలిన రూపంబు దోచి దంభకము నొందు
నెరుకవడియున్న సహమర్థ మెద్దియేని
యదియ పరమాత్మ నభము తానై వెలుంగు.[16]

ఇది సత్యం.

---

15. ఆంధ్రకవి తరంగిణి, 4వ సంపుటి, పుట – 194
16. వాసిష్ఠ, 3.43

మడికి అనంతయ్య

ఒక కవి వ్రాసిన పద్యం ఇంకొక కవి గ్రంథంలో కనబడడం, ఒక కవి వ్రాసిన పుస్తకం మరొకరి పేరుమీదుగా ప్రచారం కావడం మన సాహిత్య చరిత్రలో కొత్త కాదు. కేయూరబాహు చరిత్ర వ్రాసిన మంచెన రచించిన 'బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్' అనే పద్యం బమ్మెర పోతరాజుగారి రచనగా చలామణీకావడం ఇంతకు ముందు గుర్తించాం. అలాగే ఎర్రయ్యగారు భారతంలో వ్రాసిన 'అంబనవాంబుజోజ్జ్వల' అనే పద్యం భాగవతంలో కనబడుతుంది. ప్రతులకు పుత్రికలను వ్రాసుకొనే లేఖకులు వారి చిత్తమొచ్చిన మార్పులు, కూర్పులు చేయడంవలన మన చరిత్రలో ఎంతకూ విడని చిక్కులు ఏర్పడ్డాయి. అటువంటి సమస్యలలో విష్ణుమాయానాటకం ఎవరు వ్రాశారన్నది ఒక సమస్య.

ఇది అయిదాశ్వాల రసవత్తర కావ్యం. ఇందులోని ఇతివృత్తాన్నే అనంతర కవులు నలుగురు అనుసరించారు కాబట్టి ఇది ఎంత చక్కని కథాసన్నివేశాలు గల కావ్యమో తెలుసుకోవచ్చు. ఇందులో పుండరీకుడనే నియమం నిష్ఠాగల సదాచారవంతుని కథ ఉంది. అతడు విష్ణుమాయ వల్ల ఒక బోయదానిని పెళ్ళిచేసుకొని సంసారం చేసి పామరుడై జీవించి తుట్టతుదకు ముక్తిని పొందుతాడు. అగ్రవర్ణంలో జన్మించి ఉన్నత సంస్కారం ఉండికూడా విషయ భోగాలలో చిక్కుకుని పతనమై హేయమైన జీవితాన్ని గడిపి నిష్కృతి లేని నికృష్టులైన వ్యక్తులు మోక్షాన్ని పొందిన చరిత్రలంటే మన కవులకు చాలా ఇష్టంలాగ కనబడుతుంది. చూడండి ఇదే ఇతివృత్తం ప్రధానంగా ఉన్న కావ్యాల పట్టిక.

పతితులు మోక్షం పొందిన కథలు

	రచన	కవి	కాలం
1.	విష్ణుమాయానాటకం	?	?
2.	కాశీఖండం (గుణనిధికథ)	శ్రీనాథుడు	1370–1450
3.	శివరాత్రి మాహాత్మ్యం (సుకుమారుని కథ)	శ్రీనాథుడు	1370–1450
4.	ఉద్భటాచార్య చరిత్ర (మదాలసుని కథ)	తెనాలి రామలింగడు	1505–1575
5.	పాండురంగ మాహాత్మ్యం (నిగమశర్మ కథ)	తెనాలి రామకృష్ణుడు	1505–1575
6.	తారకబ్రహ్మారాజీయం	చింతలపూడి ఎల్లన	1520–1530 ప్రాంతాలు
7.	నిరంకుశోపాఖ్యానం	కందుకూరి రుద్రకవి	1568–?
8.	విష్ణుమాయావిలాసం యక్షగానం	కంకంటి పాపరాజు	1550–1560
9.	విష్ణుమాయావిలాసం ద్విపద	కంకంటి నరసరాజు	1560–1625
10.	విష్ణుమాయావిలాసం కావ్యం	దోసనూరి వెంకటపతి	1700–1760
11.	విష్ణుమాయావిలాసం కావ్యం	ఎర్రగుడిపాటి వెంకటకవి*	?

* ఇతడు ఈ కావ్యం రాసినట్టు కోరాడ రామకృష్ణయ్యగారు చెప్పారు.

వీటన్నింటిలో విష్ణుమాయానాటకాన్ని మనం అగ్రస్థానంలో నిలబెట్టడానికి కారణముంది. దాని ప్రభావం వల్లనే ఈ ఇతర కావ్యాల రచన జరిగి ఉండవచ్చు. అయితే దాని రచయిత ఎవరో తేల్చకుండా ప్రస్తుతానికి మనమొక ప్రశ్నార్థకపు గుర్తు అక్కడ పెట్టాం. విపులంగా చర్చించాక కవి పేరుండవలసిన స్థానంలో మనం నిర్ణయించుకొన్న పేరు వ్రాద్దాం.

విష్ణుమాయానాటకానికి మూడు ప్రతులు దేశంలో దొరుకుతున్నాయి. ఒకటి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు కార్యాలయంలో ఉంది. ఇది అసమగ్రం. ఇంకో రెండు ప్రతులు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోనివి. ఇందులో ఒకటి మాతృక; రెండోది దీనిని చూసి వ్రాసిన పుత్రిక. కాకినాడ ప్రతిలో గద్యం ఇలాగ ఉంది.

'ఇది శ్రీమదనగోపాలప్రసాదలబ్ధకవితావిలాస భారద్వాజస గోత్రపవిత్ర అయ్యలామాత్యపుత్ర అనంతనామధేయప్రణీతంబైన విష్ణుమాయా నాటకం బను మహాప్రబంధంబునందు బంచమాశ్వాసము.'

అయితే మద్రాసు ప్రతులలో మాత్రం గద్య వేరుగా ఉంది చూడండి:

''ఇది శ్రీ మదనగోపాలచరణకమల సేవాధురీణసత్కళాపారీణకృష్ణ భట్టారక పౌత్ర చింతలపూడికామయ ప్రభుసుపుత్ర సుకవివర్య రాధామాధవ యెల్ల నార్య ప్రణీతంబైన విష్ణుమాయానాటకము.''

చింతలపూడి ఎల్లనార్యుడు సుప్రసిద్ధుడు - మలిరాయల యుగంలోవాడు. కృష్ణదేవ రాయలే ఇతని రాధామాధవ కావ్యంలోని కవిత్వాన్ని మెచ్చుకొని 'రాధామాధవకవి' అని బిరుదు ఇచ్చాడు. ఇంత సుప్రసిద్ధుడే విష్ణుమాయానాటకం వ్రాసి ఉంటాడని ఈ గద్యలు రెండూ చూశాక చటుక్కున స్ఫురిస్తుంది. అయితే సాహిత్య చరిత్రలో తరచిచూసి నిర్ణయించిన విషయాలనే మనం చేర్చుకోవాలి.

విష్ణుమాయానాటకాన్ని మద్రాసు యూనివర్సిటీవారు 1933లో ప్రచురించారు. దానిని కోరాడ రామకృష్ణయ్యగారు పరిష్కరించి విపులమైన పీఠిక వ్రాశారు. ఈ ముద్రణ సంతృప్తికరంగా లేదని పిఠాపురం రాజారావు ఇంకొకసారి అచ్చువేయించారు. దానికి టేకుమళ్ల అచ్యుతరావుగారు పీఠిక వ్రాశారు. ఈ యిద్దరు పరిష్కర్తలూ చింతలపూడి ఎల్లనార్యుని గద్యనే స్వీకరించి అతడే విష్ణుమాయానాటకాన్ని వ్రాసినట్టు నిర్ణయించారు.

కోరాడ రామకృష్ణయ్యగారు అనంతయ్యను 'తరువాతికాలపు సాహసికుడి'గా భావించారు. ఎల్లనార్యుడు కృత్యాది పద్యాలు లేకుండా రచించిన గ్రంథానికి అనంతయ్య తన పేరు గద్యలో చేర్చుకొన్నాడని విశ్వసించారు. సంపూర్ణ గ్రంథచౌర్యానికి ఇది ప్రథమోదాహరణంగా చూపించారు.[1] అయితే అనంతయ్యే ప్రాచీనుడనీ, ఎల్లనార్యుడే

1. విష్ణుమాయానాటకం (మద్రాసు యూనివర్సిటీ ప్రచురణ) - పుటలు 6, 7.

అర్వాచీనుడనీ చాగంటి శేషయ్యగారు ప్రతిపాదించారు. మడికి సింగన తమ్ముడు అనంతయ్య ఒకడున్నాడు. కాలం క్రీ.శ. 1374-1400 ప్రాంతాలు. ఇతడే విష్ణుమాయా నాటకం వ్రాశాడని ఇందులో వున్న ఒక కథలాంటి కథనే చింతలపూడి ఎల్లనార్యుడు 'తారకబ్రహ్మ రాజీయం'లో వ్రాశాడు కనుక, తరువాతి లేఖకులెవరో అనంతయ్య గ్రంథంలో ఎల్లనార్యుని తారకబ్రహ్మ రాజీయపు గద్యను చేర్చి ఉంటారని శేషయ్యగారు ఆరోపించారు.[2]

మడికి సింగనకు అనంతయ్య అనే తమ్ముడున్నట్టు ఈ క్రింది పద్యంవల్ల తెలుస్తున్నది. సింగన తన తల్లిదండ్రులను గురించి చెప్పాక ఇలా విశదపరిచాడు.

డెనరగు నవ్వధూవరు లహోబిలదేవుని గొల్చి తద్వరం
బున నొగి సింగనార్యుని నమోఘగుణాఢ్యు ననంతునిన్ మహీ
జనసుతు నోబయాంకు బుధసన్నుతిపాత్రుని నారయాహ్వయుం
గని నరసింహనామములు గారవమారగ బెట్టి రందరున్.

(వాసిష్ఠరామయణం, 1-34)

ఇతడు కవి అని సింగన చెప్పలేదు. అంతమాత్రాన కవి కాకపోడు అని చాగంటి శేషయ్యగారు అన్నారు.[3] మడికివాళ్లది భారద్వాజగోత్రమే. ఈ సోదరుల తండ్రిపేరు అయ్యలార్యుడే. విష్ణుమాయానాటకం కాకినాడ ప్రతిలోని గద్యలో చెప్పిన విషయాలు మడికి అనంతయ్యకు సరిపోతున్నాయి. గ్రంథంలోని ఆంతరంగిక సాక్ష్యాన్ని బట్టికూడా అనంతయ్యే దీనిని రచించివుంటాడన్నది చాగంటి శేషయ్యగారి ఉద్దేశం. ఆ విషయాలను చెప్పుకొని మరికొన్ని కొత్త విషయాలతో మనం దానిని పరిశీలిద్దాం.

విష్ణుమాయానాటకంలో గోదావరీ పరీవాహప్రదేశ ప్రశంస, సర్పవర క్షేత్రమహిమ ఉన్నాయి. ''మడికి అనంతయ్య ఈ మండలంవాడే. చింతలపూడి ఎల్లన రాయలసీమ వాడు. అచ్యుతదేవరాయల వద్ద మంత్రిగా ఉండి కందాచారము లెక్కలు వ్రాసే నంజతిమ్మయ్యకు ఎల్లన బంధువు. గోదావరి మండలం వాడైన అనంతయ్యే తన నివాససీమను విష్ణుమాయా నాటకంలో గొప్పగా ప్రశంసించా''డని చాగంటి శేషయ్యగారు వాదిస్తున్నారు.

తారకబ్రహ్మరాజీయం ద్వితీయాశ్వాసంలో ఎల్లనార్యుడు వ్రాసిన కథకూ, విష్ణుమాయానాటకంలోని మూడవ ఆశ్వాసంలో కథకూ చాలా పోలికలున్నాయి. మహారాష్ట్ర దేశంలోని ఒక బ్రాహ్మణుడు తీర్థయాత్రలు చేస్తూ దారిలో ఒక బోయదానిని చూసి కామించి మరులుకొని దానిని తీసుకొనిపోతాడు. ఆ బోయదాని భర్త బ్రాహ్మణుని కత్తితో పొడిచి రాజసభలో చంపుతాడు. చనిపోయే సమయంలో రాజుగారు పెంచే

2. ఆంధ్రకవితరంగిణి - 4వ సంపుటం, పుటలు 189 నుండి 195.
3. అదే పుస్తకం, పుట 193.

పెంపుడు చిలుక చేసే రామనామం విని బ్రాహ్మణుడు సద్గతి పొందుతాడు. ఇది తారకబ్రహ్మ రాజీయంలోని కథ.

ఇక విష్ణుమాయానాటకంలోని కథ చూద్దాం. యమునానది ప్రాంతాలలో మధురాపురంలో పుండరీకుడనే మహాభాగవతుడున్నాడు. ఈ భక్తుని వద్దకు నారదుడు వచ్చి విష్ణుమాయ గురించి చెప్పాడు. ఆ మాట ఏమిటో తెలుసుకోవాలని పుండరీకుడు గాఢంగా వాంఛించాడు. ఒకనాడు ఇంట్లో ఆబ్దీకం వచ్చింది. భార్య సావిత్రిని వంటచేయమని చెప్పి మధ్యాహ్నం నదికి స్నానానికి వెళ్లాడు. నీట్లో మునుగుతూ ''స్వామీ, నీ మాయ చూడాలని వుం''దని విష్ణువుని ప్రార్థించాడు. మునిగి లేచేసరికి ఒక బోయది వచ్చింది. దానిని చూసి పుండరీకుడు మోహించాడు. పెళ్లి చేసుకున్నాడు. ఎక్కడికో పోయాడు. ఆ ఇద్దరూ ఇరవై సంవత్సరాలు కాపురం చేశారు. ఆ తరువాత గొప్ప కరువు వచ్చింది. గోదావరీ పరిసరాలు సుక్షేత్రాలని పుండరీకుడు బోయదానినీ, కొడుకునూ తీసుకొని వలసపోయాడు. వాళ్ళనొక చెట్టుకింద కూర్చోబెట్టి అగ్రహారంలో బిచ్చమెత్తడానికి వెళ్లాడు. ఒక ఇంటిముందు నిలబడి ''భిక్షాం దేహి!'' అని అరిచాడు. ఆ యింటి ఇల్లాలు ''అయ్యా! వేళకాదు తిరిగిరా!'' అంది. అతడు ''అమ్మా! నా ఆలుబిడ్డలు చెట్టుకింద ఆకలితో అలమటిస్తున్నారు. లేదనక పెట్టమ్మా!'' అన్నాడు. ఆ ఇల్లాలు బయటికొచ్చి చూచింది. పుండరీకుడు తన ఇంటికే వచ్చి తన భార్య సావిత్రినే బిచ్చం పెట్టమన్నాడు. ఆమె 'భర్త నదికి వెళ్లాడు, ఎంతకీ రాడేం - కుతుపకాలంలో తద్దినం పెట్టాలే' అని ఆతృతతో ఉంది. భర్తను చూచింది. అతడు హాస్యానికి బిచ్చం పెట్టమంటున్నాడనుకొంది. అతడు మాయాభ్రాంతుడు. అది తన యిల్లు. ఆమె తన భార్య. తాను ఏటికి వెళ్ళి ఆ రోజునే కొద్దిసేపటిలో తన ఇంటికి వచ్చినట్టు తెలియదు. మాయవల్ల ఎంతోకాలం బోయదానితో కాపురం చేసినట్టు, కరువు వచ్చినట్టు భావిస్తున్నాడు. చివరకు సావిత్రి పాతివ్రత్యంవల్ల ఈ మాయే విడుతుంది.

పోలికలున్న ఈ రెండు కథలనూ తెలుసుకొన్నాం కాబట్టి వీటిని బట్టి పూర్వ పరిశోధకులు ఏం వ్రాశారో చూద్దాం. చాగంటి శేషయ్యగారు ఇలా చెప్పారు. ''తారక బ్రహ్మరాజీయమునందు విష్ణుమాయా నాటకంలోని పుండరీకుని కథవంటి కథ యొకటి యుండుటచే ఈ రెండు గ్రంథములు రచించిన దొక్కడేయని శ్రీరామకృష్ణయ్యా గారు పీఠికలో వ్రాసియున్నారు. ఈ కారణము వలననే యీ గ్రంథకర్తలు భిన్నులని తలంపవలయునని నా యభిప్రాయము. ఏ కవియును ఒకమారు తాను వ్రాసియుండిన కథను మరల నింకొక గ్రంథమున వ్రాసి యుండడనియు, రామనామ మాహాత్మ్యమును తెలుపుటకై చెప్పిన కథను విష్ణుమాయా ప్రభావమును బోధించుటకై రెండవమారుపయోగింపడనియు, తన రెండవ గ్రంథమున నింకొక కథను గల్పించి చెప్పి తన ప్రతిభను వెల్లడింప బ్రయత్నించుననియు నా యుద్దేశము.[4] ఈ వాదనలో బలం లేదు.

4. ఆంధ్రకవితరంగిణి, 4-వ సంపుటం, పుట 206.

శ్రీనాథుడు కాశీఖండంలో గుణనిధి కథనూ, శివరాత్రి మాహాత్మ్యంలో సుకుమారుని కథా చెప్పలేదా? అలాగే తెనాలి రామకృష్ణుడు ఉద్భటాచార్య చరిత్రలో మదాలసుని కథ, పాండురంగ మాహాత్మ్యంలో నిగమశర్మ కథా కథనం చేయలేదా? ఎల్లన కూడా ఈ దారిలోనే పయనించాడనుకోవచ్చు కదా!

విష్ణుమాయానాటకంలోని కథగాని, తారకబ్రహ్మరాజీయంలోని ఇతివృత్తంగాని ఏ పురాణంలోనూ లేదు. కవి ఈ కథను ఎక్కడినుండి స్వీకరించి ఉంటాడన్నది ప్రశ్న. మడికి సింగన వాసిష్ఠ రామాయణం వ్రాసినట్టు మనం తెలుసుకొన్నాం. అందులో మాయా వైభవం గురించి ఎన్నో చిన్న చిన్న కథలున్నాయి. దానిలో లవణరాజు కథ ప్రసిద్ధమైనది. లవణుడనే రాజు కొలువ కూటంలో కూర్చున్నప్పుడు ఒక ఐంద్రజాలికుడు వచ్చి తన విద్య ప్రదర్శించాడు. ఆ ప్రభావంలో రాజు ఒక గుర్రాన్ని ఎక్కిపోతున్నట్టు, దారిలో ఒక చెట్టుకు తాను తగులుకున్నట్టు, తనను ఒక బోయ వనిత కాపాడినట్టు భావించాడు. ఆమె అందానికి ముగ్ధుడై పెళ్ళి చేసుకొని కాపురం చేసి, కరువు వస్తే పెళ్లాం బిడ్డలతో వలసపోయి, వాళ్లు మరణిస్తే ఆ వియోగం భరించలేక నిప్పులలో పడి చనిపోతాడు. ఇంత కథా త్రుటికాలంలోనే జరిగింది. రాజు కళ్ల తెరిచేసరికి కొలువులోనే వున్నాడు. ఎదుట ఐంద్రజాలికుడూ వున్నాడు.

విష్ణుమాయా నాటకంలోని పుండరీకుని కథకూ దీనికీ ఎక్కువ పోలికలున్నాయి. రెండూ చిత్తభ్రమను సూచిస్తాయి. లవణరాజు కళ్లు తెరిచి తన కొలువులోనే ఉంటాడు. పుండరీకుడు నీళ్లలోంచి వచ్చి తన యింటికే వెళతాడు. సింగన వాసిష్ఠ రామాయణంలో కథవల్లనే కవి ఉత్తేజితుడై విష్ణుమాయా నాటకంలో ఈ కథను వ్రాసివుండవచ్చు. కథలో ఇన్ని పోలికలున్నాయి. రచనలో ఉన్నాయేమో పరిశీలిద్దాం చూడండి. లవణరాజు చూసిన మాలదానిని మడికి సింగన ఎలా వర్ణించాడో:

చేతులగాజులున్ జెవుల జిట్లును బొట్టును దాటియాకులున్
నా తెరతీరునై పరపు వాలిన కన్నులు నల్లరూపునున్
భాతి దలిర్ప నొక్కతి యనామిక గ్రద్దన గంపమోచి కొం
చా తెరువట్టి చేనికడ కంబలి తండ్రికి గొంచుబోవగన్. (వాసిష్ఠ. 2-227)

ఇక విష్ణుమాయానాటకంలో పుండరీకుడు చూసిన బోయ వనితను కవి ఎలా వర్ణించాడో గమనిద్దాం.

పచ్చగాజుల యొప్పు పచరించు చేతుల సంకుటుంగరముల ఛాయ లెసగ
నిగనిగల్ దొలకాడు బిగువు చన్నుల మీద గురువిందపూసల సరముదనర
ధవళ తాళపలాశ తాటంకరుచి మించు చెక్కుల జిరునవ్వు జీరువార
గొప్పు న కందని కురుల నించుక దోచునుదుటి జేవురుబొట్టు కుదురు మెరయ

సన్న బలిపెంపు టొల్లియ సగముగట్టి
సగము ముసుకిడి యొయ్యారముగ మెరుంగు
కంచు మెట్టెలు మెరయంగ గడకవచ్చు
నవ్విలాసిని దగమెచ్చె నవనిసురుడు. (విష్ణు. 3-137)

పుండరీకుని కథలోనూ, లవణరాజు కథలోనూ కరువు వస్తే వలసపోవడము ఉంది. సింగన వ్రాసిన పద్యాన్ని, విష్ణుమాయా నాటకంలో అనుసరించిన పద్యాన్ని కూడా చూద్దాం. సింగన ఇలా వర్ణించాడు.

కడవులు కావటందు నిడగ్రక్కున మూపున మోచి బిడ్డనిన్
దడయక వీపునం దునిచి తక్కిన మువ్వుర దోడుకొంచు, నా
పడతియు గంప మోచికొని పల్మరు దిట్టుచు వెంటగూడిరా
నడవికి నేగి పెక్కిడుము లందితి నయ్యెడ నేమి సెప్పుదున్? (వాసిష్ఠ. 2-234)

ఇక అనంతయ్య పద్యాన్ని చూద్దాం.

కొడుకు జంకట నిడికొని బోయయిల్లాలి జక్కగా వీపునసంతరించి
గంజి చిత్తడికి నీగలు పోక ముసిరెడు నుగ్గంపుకుండచే నొకటిపూని
యొక్క కరంబున నెక్కుడించిన విల్లు గోలల పిడియంబు గూడ బట్టి
నడు నెత్తిపై ద్రాట మడచి చుట్టిన చింపి యీతాకు చాప వహించి క్రుంగి

పీనుగుల నెత్తుకొని నిజస్థానమునకు
జరుగు వెక్కురు బడుగుపిశాచమనగ
మైలపట్టిన మైచాయ మ్రాగుపడుచు
పుండరీకుండు గౌతమీ భూమి కరిగె.

ఇతర విషయాల సాక్ష్యంతో చాగంటి శేషయ్యగారు అనంతయ్య కర్తృత్వాన్ని ఎంత బలంగా ప్రతిపాదించినా దానిని ఈ ముఖ్యమైన పోలికలను బట్టి ఎవరైనా పూర్వపక్షం చేయవచ్చు. విష్ణుమాయా నాటకంలో పుండరీకుని చరిత్రేకాక నారదుడు సంసారం చేసిన కథకూడా ఉంది. దీనిని కూడా విష్ణుమాయా నాటకకర్త సింగన గ్రంథంలో పేర్కొన్న చిన్న సన్నివేశంలోనుంచే స్వీకరించి వుంటాడు. వాసిష్ఠ రామాయణంలో నారదుని సంతానం ప్రసక్తి ఉంది. శిఖిధ్వజుడనే రాజుకు చూడాల అనే భార్య ఉంది. అతడు వైరాగ్యం పొంది రాజ్యాన్ని భార్యకు అప్పగించి తపస్సుకు పోతాడు. ఆమె అతణ్ణి కర్మబంధ విముక్తుణ్ణి చేయడంకోసం ఒక బ్రహ్మచారియై వెళుతుంది. అతడు 'నువ్వెవరవు' అని ప్రశ్నిస్తే.

''నేను నారదపుత్రుండనన, నన్నరపతి యమ్మహాముని కెట్లు పుత్రుండవై తెరింగింపవేయన, నక్కుమారుండిట్లనియె.

నారదుడొక్కనాడు మును నాకనదిన్ విహరించుచో మీరు
న్నారులు నీటిలో వివసనంబులతో దమియింప వారియా
కారము లెల్ల జూచి ముని గ్రక్కున సంస్కలనంబు నొందినన్
గోరీ మయోఘు వీర్య మొక కుంభమునం దిడనందు బుట్టితిన్.

(వాసిష్ఠ. 5-146, 147)

మడికి సింగన పుస్తకంలో ఉన్న ఈ నారద సంతాన ప్రసక్తిని చూశాక విష్ణుమాయా నాటకకర్త ఇతర పుస్తకాలు వెదకి దేవీ భాగవతంలోని నారద సంసారపు గాథలు చదివి సర్వవరక్షేత్ర మాహాత్మ్యంగా దానిని రచించి ఉంటాడు.

శ్రీనాథుడు చాలా గ్రంథాలను మలచడంలో ఘటికుడు. అతడు నందనందన చరిత్ర అనే కావ్యం ఒకటి రచించాడని లాక్షణికులు విశ్వసిస్తారు. ఆ నందనందన చరిత్రమే ఈ విష్ణుమాయానాటకమని బాలాంత్రపు వెంకటరావుగారి ప్రతిపాదన. విష్ణుమాయా నాటకంలో ''నందనందన గాథామరందధార'' అనే సమాసం ఒకటి ఉంది (1-30). అందుచేత ఇది శ్రీనాథ రచితమైన నందనందన చరిత్రమని బాలాంత్రపు వారు విశ్వసించారు. వీధి నాటకాన్ని వల్లభరాయని పేరుమీద ప్రకటించినట్టే విష్ణుమాయా నాటకమైన నందనందన చరిత్రను అనంతయ్య పేరిట లోకం మీదకు వదిలాడని ఆయన వాదం.

మడికి అనంతయ్య విష్ణుమాయానాటకాన్నే రచించి ఉంటాడని చాగంటి శేషయ్యగారు ఎంత గట్టిగా నమ్ముతున్నా కర్తృత్వం అతనికే దఖలు పర్చలేం. ప్రస్తుతానికి అతడు మడికి సింగన తమ్ముడు మాత్రమే.

ఏ లేఖకుల ఔదార్యం వల్లనో విష్ణుమాయానాటకం గద్యలో అతని పేరు కనబడుతుంది.

భావిపరిశోధన కొత్త విషయాలను తెలియచేస్తుందేమో.

కొరవి సత్యనారన

ఆంధ్రకవి పితామహుడనే బిరుదు గల పూర్వకవులలో కొరవి సత్యనారన ఒకడు. ఈయన రామాయణం వ్రాశాడని ఇతని చిన్నన్నగారి మనుమడు కొరవి గోపరాజు వ్రాసిన పద్యంవల్ల తెలుస్తున్నది. గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక' అనే కావ్యం రచించాడు. అందులో తన వంశం గురించి చెప్పుకుంటూ పినతాతగారిని ఒక పద్యంలో వినుతించాడు.

రామాయణకృతి కృతియై - తా మెరయుచు నాంధ్రకవిపితామహుడనగా
భూమిని మించిన భీమన[1] - నామంబున బరగె సత్యనారన ఘనుడై.
(సింహా. 1-49)

గోపరాజు ఈ పద్యం సింహాసన ద్వాత్రింశికలో వ్రాయబట్టి సత్య నారన అనే కవి ఉన్నాడనీ, రామాయణం వ్రాశాడనీ, అతనికి భీమన అనే మారుపేరు ఉందనీ తెలుస్తున్నది. ఈ పద్యంలోని మొదటి పాదంలోని 'కృతి కృతియై' అనే పదానికి 'కృతిపతియై' అనే పాఠాంతరం ఉంది గాని, ఇతడు 'ఆంధ్రకవి పితామహుడు' అనే బిరుదు పొందినవాడే కనుక రామాయణ రచన ఇతనిదే అయి ఉంటుందని భావించి పండితులు 'కృతిపతియై' అనే పాఠాంతరాన్ని తోసిరాజన్నారు.

సింహాసన ద్వాత్రింశికలోనే ఇంకో పద్యంలో గోపరాజు తన పినతాతగారిని స్మరించాడా అనే అనుమానం కలుగుతున్నది. చూడండి ఈ పద్యం:

భీమనపద్యమన్న గడు ప్రీతి వహించుచు మేలుమేలునా
నేమిది చెప్పినార మననిక్కమె ప్రాసము గూర్చి నాడ వౌ
నేమిది కాదు దీని వడి కిక్కడి కర్థమిదెట్టి దీగణం
బేమని పెట్టినా డవని ఎగ్గులువట్టు గుబుద్ధి పెద్దలన్. (సింహా. 1-18)

భీమన ఈ పద్యం చెప్పాడంటే 'భళిభళీ!' అని మెచ్చుకొంటారట. నేను చెప్పాను అంటే 'ఔను మరి. నిజమే. ప్రాసపెట్టావు. ఇది సరిపోదు. ఈ యతికి ఇక్కడ అర్థమేమిటి? ఈ గణం ఎందుకిలా వేశావు?' అని కుబుద్ధులయిన పెద్దలు తప్పులు పట్టుకొంటారట. ఈ పద్యంలోని భీమన ఎవరు? వేములవాడ భీమకవేనా? మన సాహిత్యంలో భీమన అనే పేరు కనబడగానే వేములవాడకవే అనుకోవడం పరిపాటి. గోపరాజు ఇతణ్ణి పూర్వకవి స్తుతిలో వినుతించాడుగాని ఈ పద్యంలో అతడు వేములవాడ భీమకవినిగాని, మరే ప్రఖ్యాతులైన ఇతరేతర భీమకవినిగాని స్మరించడు. తన పినతాత గొప్పకవి కనుక తాను వ్రాసిన పద్యం ఆంధ్రకవి పితామహుడైన భీమన సత్యనారన వ్రాసినదని చెప్తే తన చిన్నతనంలో ఎవ్వరైనా మెచ్చుకొని వుంటారు. తనదే అని బయటపెడితే స్తన శల్యపరీక్ష చేసి

1. 'భూమిన్ చినభీమన యను' అని శిష్టావారి పాఠాంతరం. ఆంధ్రవాఙ్మయచరిత్ర సర్వస్వం. పుట. 597

వుంటారు. ఈ పద్యంలో భీమన నిజంగా గోపరాజు పినతాత అయితే ఆనాడు అతనికి మంచి సాహిత్య జీవనముండేదనీ, పలుకుబడి ఉండేదనీ విశదమవుతుంది.

కొరవి వారిది ప్రఖ్యాతమైన కుటుంబం. సత్యనారన యొక్క పెదతండ్రి అన్నయామాత్యుడు ప్రసిద్ధమైన ముప్ఫయి ఇద్దరు మంత్రులలో ఒకడు. గండపెండెము దాల్చినవాడు.

ఘనదానకర్ణుడై గండపెండెము దాల్చె
గొరవియన్నామాత్యకుంజరండు.[2]

అని 32 మంత్రుల సీసమాలిక అతనిని పేర్కొంటుంది. ఈ అన్నయమీదనే ఇంకొక పద్యముంది:

హరి సిరిని వలచుసిరియును - నరుదుగ హరిగోరు గొరవియన్నయయెపుడున్
పరకీర్తిసతిని వలచును - వరుసన్ పరకీర్తి యతని వలచు సతతమున్.[3]

అన్న మంత్రిని ప్రశంసిస్తూ, ఇలాంటి పద్యాలున్నా ఆయనను గురించి గోపరాజు ఏమీ వ్రాయలేదు. అయితే అతని కొడుకు పెద్దిరాజును ప్రస్తుతించాడు. ఈ పెద్దిరాజూ, సత్యనారనా ఒక తరంవాళ్లు. పెద్దిరాజు పల్లికొండ రాజయిన మల్లన బేతరాజుచేత కుంచెలు అందలాలు బహుమానం పుచ్చుకున్నాడు. తన పెదతండ్రి కొడుకు పల్లికొండ రాజుల వద్ద ఉన్నాడు కనుక 'సత్యనారన అక్కడి వాడేనేమో అనే అనుమానానికి ఆస్కారం ఉంది.[4]

అయితే కొరవి వంశంలోని వాళ్లు వివిధ రాజన్యుల వద్ద వున్నవాళ్లు. ఈ వంశంలోని మొట్టమొదటివాడు వెన్నయామాత్యుడు వెలనాటి చోళుల వద్ద పృథ్వీశ్వరుని కాలంలో మంత్రిగా ఉండేవాడు (క్రీ.శ.1220). అప్పటి వెలనాటి రాజధాని సదనవోలు. ఇది గుంటూరు మండలంలోనిది. ఈ వంశంలోని మొట్టమొదటివాడు గుంటూరు మండలంలో వుంటే, కట్ట కడపటివాడు గోపరాజు తన స్వగ్రామం వేముగల్లు అని చెప్పేడు. ఇది ప్రస్తుతం నిజామాబాదు జిల్లా ఆరుమూరు తాలూకాలో ఉంది. దీనిని చేముగల్లు అని కూడా అంటారు. వీళ్ల ఇంటిపేరుకు మూలకారణమైన కొరవి రాష్ట్రం వరంగల్లు మాత్రమే.

సత్యనారన తెలంగాణాలోని వాడని మాత్రం చెప్పవచ్చు. ఇతడు నల్లగొండ జిల్లాలోని 'రాచకొండ' వాడు కావచ్చు. చాగంటి శేషయ్యగారు అలాగే నిర్ణయించారు.[5] సత్యనారన యొక్క అన్న కొడుకులు సర్వజ్ఞ సింగమనాయని మంత్రులు. రాచకొండ,

---

2. చాటుపద్యమణిమంజరి - ప్రథమభాగం
3. సింహాసనద్వాత్రింశిక, పీఠిక, పుట. 18.
4. పల్లికొండ అనే గ్రామం నేటి ఉత్తర ఆర్కాడులో గుడియాత్తంవద్ద ఉందని చాగంటి శేషయ్యగారు ఆంధ్రకవితరంగిణి - 6వ సంపుటం (పుట 144)లో వ్రాశారు.
5. ఆంధ్రకవితరంగిణి - 4వ సంపుటి - పుట 152.

దేవరకొండలు రాజధానులుగా పాలించిన పద్మనాయక యుగంలో సత్యనారన ఉన్నాడన్నది సత్యం. వెన్నమంత్రి కాలంనుంచి తరానికి పాతికేళ్ళ చొప్పున లెక్కేస్తే ఇతడు క్రీ.శ.1320–1345 ప్రాంతంవాడని చెప్పవచ్చు.

ఇతడు రామాయణం వ్రాశాడని గోపరాజు చెప్పాడేగాని, లాక్షణికులెవరూ ఇందులోని పద్యాలను ఉదాహరించలేదు. అనంతర కవులు ఇతణ్ణి కీర్తించలేదు. ఆంధ్ర కవి పితామహుడమనే బిరుదు వహించినా ఇతడి కవిత ఏ కారణంవల్లనో దక్కలేదు. ఇతని రామాయణంలోని మంచి పద్యాలను లేఖకులు వ్రాసుకున్నవాటిని, అంతకుముందున్న ప్రఖ్యాతమైన ఇతర కవుల రామాయణ ప్రతులలో, ఆయా ఘట్టాలలో పొందుపరచడంవల్ల తమ వ్యక్తిత్వాన్ని కోల్పోవడం జరిగిందేమో! కవిత్రయంలో ఒకడైన ఎర్రనగారు వ్రాసిన రామాయణంలోని పద్యాలే ఇతర గ్రంథాలలో చేరిపోయాయి. సత్యనారన రచన కూడా ఇలాగే లుప్తమై వుంటుంది.

ఈ కవి చరిత్రవల్ల ఒక్కటి మాత్రం నికరంగా తెలుస్తుంది. ఇవాళ ఆంధ్రదేశంలో సర్వసాధారణమైన 'సత్యనారాయణ' అనే పేరు పద్మనాయక యుగంలో కూడా పెట్టుకొనేవారు.

విన్నకోట పెద్దన

అలంకారాలు కోరని ఆడవాళ్లు ఉండరు. అలాగే ఆడవాళ్లతో పోల్చబట్టి కావ్యకన్యకలు కూడా ఎన్నో అలంకారాలు చేయించుకొంటారు. రచనా చమత్కృతితో ఉండే రకరకాల సొగసులకు లాక్షణికులు అలంకారాలని పేరు పెట్టారు. శబ్దాన్నిబట్టి కొన్ని, అర్థాన్నిబట్టి కొన్ని చాలా అలంకారాలను సృష్టించారు. వీటికి నగిషీలు పెట్టిన మహానుభావులు ఎందరో వున్నారు.

సంస్కృతంలో అలంకారశాస్త్రం ఒక సముద్రం లాంటిది. ఒడ్డున నిలబడితే దాని తరంగాలు మహాభీకరంగా కనబడతాయి. ముంచెత్తేస్తాయి. లోతుకు వెళ్లిన వాడికి రత్నాలు గొరుకుతాయి. అది ఎంత గంభీరమో తెలుస్తుంది. ఈ సముద్రాన్ని దాటడానికి చిన్న ,లు, ద్దపడవలు, విశాలమైన ఓడలు నిర్మించినవాళ్లు లేకపోలేదు. తెలుగువాళ్లు కట్టిన నావలు చాలా గొప్పవి.[1]

రెడ్డి రాజుల కాలంలో భౌతికంగా సముద్రయానం, విదేశ వ్యాపారం, సుగంధద్రవ్యాల దిగుమతి అధికమైంది. అలాగే ఈ యుగంలో సంస్కృత సాహిత్య

1. సంస్కృతంలో అలంకార శాస్త్ర గ్రంథాలు వ్రాసిన తెలుగు వాళ్ళ సంఖ్య 50. వీళ్ళ పేర్లు, గ్రంథాలు, రచించిన కాలాలు ఒక పట్టికగా ఈయూణ్ని వెంకటవీరరాఘవాచార్యులవారు పొందుపరిచారు. ఆంధ్రప్రతాపరుద్ర యశోభూషణం, సాహిత్య కుసుమాంజలి అనుబంధం 1, పుటలు 80, 81.

సముద్రయానం చేయడం, అందులో అలంకారాలనే సుగంధ ద్రవ్యాలను తెలుగులోనికి దిగుమతి చేసుకోవడం జరిగింది. ఈ సాహిత్య బేహారి పేరు విన్నకోట పెద్దన. ఇతడు వ్రాసిన పుస్తకం పేరు కావ్యాలంకార చూడామణి. దీనిని రచించిన కాలం క్రీ.శ. 1402 - 1407 మధ్య. ఇది చాళుక్యరాజు విశ్వేశ్వరభూపతికి అంకితం.

ఆంధ్రదేశ చరిత్రలో మొదటిసారిగా దీర్ఘకాలం విశాల సామ్రాజ్యాన్ని పాలించిన రాజులు చాళుక్యులు అని మనం తెలుసుకున్నాం. ఈ చాళుక్యులే మొదట మార్గ కవిత దేశంలో వుండేటప్పుడు దేశి కవిత పుట్టించి ఆంధ్రవిషయంలో నిలిపారు. లక్ష్య గ్రంథాలను రచింపజేసిన చాళుక్యుల వంశంలోని రాజే లక్షణ గ్రంథ శాఖలలో ప్రముఖమైన అలంకార శాఖను తెలుగులో పుష్పింపజేయడం కేవలం యాదృచ్ఛికమే అయినా గమనించ తగిన విషయమే.

తెలుగుదేశంలో చాళుక్య రాజ్యాన్ని స్థాపించినవాడు కుబ్జవిష్ణువర్ధనుడు. అతని కుమారుడు జయసింహుడు క్రీ.శ. 633-663 మధ్యకాలంవాడు. ఇతడు ఈనాటి విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి ప్రాంతాలను ఆనాడే తన పాలనలోనికి తెచ్చుకొని ఊళ్లు కట్టించాడు. ఇతనికి సర్వసిద్ధి అనే బిరుదు వుంది. అందుచేత అతడు కట్టించిన పెద్ద పట్టణానికి సర్వసిద్ధి అనే పేరు వచ్చింది. ఆ పేరుతో నేటికీ ఒక తాలూకా వుంది. నెల్లూరు నెరజాణలకు ఎలా ప్రసిద్ధమో సర్వసిద్ధి సరసులకు అలా ఆటపట్టు. ''నెల్లూరి నెరజాణలయాట ఈ సర్వసిద్ధి సరసులకడ సాగిరాలేదు'' అని గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు వ్రాశారు.[2]

జయసింహుని కాలంనుంచి సర్వసిద్ధి, దానికి అనుబంధమైన ఎలమంచిలి చాళుక్య చరిత్రలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయి. చాళుక్య వంశవృక్షంలో ఒక శాఖ బాగా విస్తరించి ఇక్కడ ఫలించింది. క్రీ.శ. 633 నుండి క్రీ.శ. 1407 దాకా సుమారు ఎనిమిది వందల సంవత్సరాలు ఇది తూర్పు చాళుక్యుల పీఠం. అయితే నెల్లూరు సిద్ధిరాజులతో పుల్లరి తగాదా పెట్టుకొని పోరాడిన కాటమరాజు పూర్వీకులు ఈ ఎలమంచిలినే పాలించారని యాదవ గ్రంథాలు చెప్తున్నాయి. కాటమరాజు చెల్లెలి పేరు పాపనూకమ్మ. ఎలమంచిలి కొండమీద నూకిపాప మేడ ఉంది.[3] కాటమరాజు తాతతండ్రులు బహుశా విశ్వేశ్వరభూపతి కులం వాళ్లు కావచ్చు. ఈ సర్వసిద్ధి సరసులే నెల్లూరు నెరజాణల వద్దకు వెళ్లి పోరాటం పెట్టుకొన్నారు కాబోలు.

విశ్వేశ్వరభూపతి వేదశాస్త్ర రహస్య విధులన్నీ పరికించాడు. చతుర్వర్గ ప్రశస్తి పొందాడు. రాజ విద్యా తంత్రరక్తి సంభావించాడు. వర్ణక్రమాల వలను ఎరిగాడు.

---

2. కళింగ సంచిక : 'కళింగము - ఎలమంచిలి' పుట 289.
3. విశాఖపట్నం జిల్లా మాన్యువల్, పుట 74

జ్యోతిషాయుర్వేద సంగతిని ఎగడు పొందాడు. సంగీత సాహిత్యసరణి నేర్చుకొన్నాడు.[4] గజాశ్వాల ఆరోహణాదుల విశ్రుతికెక్కినాడు. ఆయుధ విద్యలలో అతిశయించాడు. అక్కడా అక్కడా కావ్యాగమాలను సత్కవుల సౌకర్యసిద్ధికోసం ఒకచోట ఒడగూర్చడానికి ఉత్సహించాడు. తన ఆస్థానంలో ఉండే విన్నకోట పెద్దనను లాలించాడు.

విమలాదిత్యుడు
|
రాజరాజనరేంద్రుడు – మహాభారత కృతిభర్త
|
కులోత్తుంగుడు
|
విజయాదిత్యుడు
|
మల్లపదేవుడు – i. (లక్ష్మీదేవి)
|
ఉపేంద్రుడు – i. (గంగాంబ)
|
మల్లపదేవుడు – ii. (చోడాంబ)
|
(క్రీ.శ. 1283) ఉపేంద్రుడు – ii. (మల్లాంబ)
|
కొప్పరాజు (గంగాంబ)
|
ఉపేంద్రుడు – iii. (భీమాంబ) సస్యానందమున పేర్కొనబడినరాజు

- చెన్నేశ
- ఉపేంద్రుడు – iv. (మనుమోపేంద్రుడు–లక్కాంబిక)
  - విశ్వేశ్వరరాజు (కావ్యాలంకార చూడామణి కృతిభర్త)

పెద్దన కావ్యక్రమవేది, కళాకౌశలుడు, చతురుడు. అతనితో రాజు ఇలా అన్నాడు.

4. తన ప్రభువు సంగీతం బాగా నేర్చినవాడు కనుక విన్నకోట పెద్దన ఇలా సరిగమ పదనిసలలో అతన్ని నుతించాడు.
నీసరి పని నీసరి ధని – నీసరి మాధారి గరిమ నీ సరిగారీ
నీ సరిగా నిగమాగమ – గోసారులునుం జళుక్యకుల విశ్వేశా!
ఇది కల్యాణిరాగంలో రూపకతాళంలో (రెండు కాళ్ళ చౌకం) పాడుకొంటే శ్రావ్యంగా ఉంటుందని నా మిత్రుడు వైణిక సార్వభౌముడు చిట్టిబాబు 72 మేళకర్తలలోనూ పాడిచూపి చెప్పాడు.

భావరస ప్రపంచమున బర్వునలంకృతి లక్షణంబు, ఛం
దోవిచితి ప్రచారము, గుతూహల దస్ఫుర దంధ్రదేశ భా
షా వివిధ ప్రసంగముల చందము, నందముగా నొనర్చి వి
ద్యావిధి గానుపించుట గదా చతురత్వ మనంగ మేదినిన్. (కావ్యా. 1-11)

ఇలాగ అన్న విశ్వేశ్వరవిభుని అనుమతి అనే కొత్త ఓడ ఆధారంగా విన్నకోట పెద్దన ఘనరసరత్నాకరం కనుగొని కబ్బపు మణులు ఒడగూర్చి యిస్తానన్నాడు. ''కావ్యాలంకార చూడామణి'' అనే గ్రంథాన్ని రచించాడు. సాధారణంగా కావ్యాలలో విభాగాలను సంస్కృతంలో సర్గలంటారు. తెలుగులో ఆశ్వాసాలు అంటారు. దృశ్యకావ్యాలలో అంకాలు ఉంటాయి. గద్యకావ్యాలలో ఉచ్ఛ్వాసం; లంబకాలు ఉంటాయి. ఈ సంగతి పెద్దన్నే ఇలా చెప్పాడు.

సర్గబంధంబు కావ్యంబు సంస్కృతమున,
బ్రాకృతంబున నాశ్వాస భాసురంబు,
నాటకము లెల్ల నంక సనాథకములు,
గద్య ముచ్ఛ్వాస లంబకాంకంబయంద్రు. (కావ్యా. 4-7)

తెలుగు కావ్యాలనే వివిధ ప్రకరణాలకు ఆశ్వాసాలనే పేర్లు ఉంటాయని చెప్పిన పెద్దన తన పుస్తకంలో అధ్యాయాలకు ఉల్లాసములు అని పేరు పెట్టాడు. ఉల్లాసమంటే ప్రకాశమని అర్థం వుంది. పుస్తకం పేరు కావ్యాలంకార చూడామణి. మణి ప్రకాశిస్తుంది. కనుక ఉల్లాసమనే పేరు పెట్టడం సముచితమే. అయితే ఇందులో ఒక సొగసుకూడ వుంది. అర్థాలంకారాలలో ఒక అలంకారం పేరు ఉల్లాసం. దీనిలో ఒకరి గుణదోషాలను ఇంకొకరి గుణదోషాలను యెత్తి చెప్పడంతో సూచిస్తారు. ఆంధ్ర వాచస్పత్యంలో ఇలా అర్థం చెప్పారు.

ఉల్లాసాలంకారము: అర్థాలంకారములు నూరింటిలో నొకటి. గుణముచే దోషము, దోషముచే గుణము కల్పించబడుట. ఉదా: గంగానదిలో సాధ్వి స్నానము చేసి నన్ను బవిత్రురాలిం జేయుతమని కోరుచున్నది.

విన్నకోట పెద్దన 36 అర్థాలంకారాలే చెప్పాడు. అందులో ఉల్లాసం అనే పేరు లేదు. అతని కాలంనాటికి అర్థాలంకారాలు 36 మాత్రమే అనుకోవడానికి వీలులేదు. ప్రతాపరుద్ర యశోభూషణం అనే అలంకార శాస్త్రగ్రంథాన్ని విద్యానాథుడు క్రీ.శ. 1327కు ముందే వ్రాశాడు. దానిని చెలమచర్ల రంగాచార్యులుగారు చక్కగా అనువదించారు. ఇందులో 66 అర్థాలంకారాలు ఉన్నాయి (వీటిలోనూ ఉల్లాసం అనే పేరు లేదు).

ప్రతాపరుద్రయశోభూషణంలో విద్యానాథుడు లక్షణాలు చెప్పి వాటికి లక్ష్యాలను ప్రతాపరుద్రపరంగా రచించాడు. అలాగే కావ్యాలంకార చూడామణిలో విన్నకోట పెద్దన లక్ష్యాలను విశ్వేశ్వరభూపతి పరంగా చెప్పాడు. అయితే కావ్యాలంకార చూడామణి

విద్యానాథుని గ్రంథానికి అనుసరణ కాదు. విద్యానాథుని మతాన్ని పూర్తిగా విన్నకోట పెద్దన ఆమోదించాడని కూడ చెప్పలేం. ఇద్దరికీ అభిప్రాయ భేదాలు ఉన్నాయి.

విద్యానాథుని మతంలో రీతులు మూడే. అవి వైదర్భి, గౌడి, పాంచాలి. పెద్దన నాలుగు చెప్పాడు. అందులో విద్యానాథుడు చెప్పినవికాక - లాటి అధికంగా ఉంది. విద్యానాథుడు 18 శృంగార చేష్టలు పేర్కొన్నాడు. పెద్దన 20 చెప్పాడు (2-15). విద్యానాథునితోనేకాక ఇతర ఆలంకారికులతోకూడ పెద్దన భేదిస్తున్నాడు. రాజశేఖరుడు పదిరకాల కవులను చెప్పాడు. పెద్దన వీళ్లు విభాగించిన పద్ధతిలో కాక ఇంకోరకంగా కవుల స్వభావాలను కేటాయించాడు. అతని ఉద్దేశంలో కవులు ఏడు రకాలు.

వాచికార్థులు శిల్పక రౌచికులును
భూషణార్థియు మార్దవ స్ఫురణకరుడు
నల వివేకియు ననగ సప్తాహ్వయముల
గవులు నెగడుదు రీహిత కావ్యములను. (కావ్యా. 3-80)

ఈ సప్తవిధ కవుల స్వభావాలను ఏడు పద్యాలలో పెద్దన వివరించాడు. వాటిని చెలమచర్ల రంగాచార్యులు గారు ఇలా క్రోడీకరించారు.[5]

1. **వాచికుడు:** పదాడంబరము గల కవిత చెప్పువాడు. 2. **ఆర్థికుడు:** మితములైన పదములతోనే విపులమైన అర్థమును స్ఫురింపజేయువాడు. 3. **శిల్పకుడు:** బహువిధ యమకాదులగు శబ్దాలంకారముల నభిమానించువాడు. 4. **రౌచికుడు:** వెదకి వెదకి మృదు మృదు పదములతో కవన మల్లెడి నేర్పుగలవాడు. 5. **భూషణార్థి:** అర్థాలంకార భూయిష్టమైన రచన చేయువాడు. 6. **మార్దవానుగతుడు:** సరళములగు శబ్దములను విరళము లగు అర్థములను చూపుచు వీనుల కింపుగా రసప్రధానముగా కావ్యమును రచించువాడు. 7. **వివేకి:** బహుముఖ శాస్త్రజ్ఞాన సంపన్నుడును, శబ్దార్థగుణదోష వివేకపూర్ణుడును, రసవదుత్తమ కావ్యనిర్మాణ చాతురీధురీణుడునైనవాడు. ఈ వివేకియే సర్వకవి మూర్ధన్యుడు, మహాకవి విఖ్యాతుడు.

ఇన్నిరకాల కవులను చెప్పి, ఛందోలంకారాదుల పొందు ఎరిగినా, ఏది లేకపోతే పొసగదో అది కవితా సుందరి శక్తి; ఆ కందువ తెలిసినవాడే కవి అని చెప్పాడు.

శక్తి వెలియైన కావ్యోక్తి సాధనంబు
లెల్ల జీకటియింటిలో నిడిన సరకు;
లెన్ని ఋతువులు గల్గిన నెట్లు పూచు
మహి వసంతాగమము లేక మావిమోక? (కావ్యా. 3-89)

విన్నకోట పెద్దన శక్తిమంతుడే. ఇతడు వ్రాసిన ఇతర కావ్యాలు ఏమీ దొరకలేదు. లభిస్తే కథాకథనం, ప్రాతోన్మీలనం, రసపోషణ మొదలైనవి ఏమి చేశాడో

5. ప్రతాపరుద్రయశోభూషణం - కావ్యప్రకరణం, పుట 58.

చదువుకొనేవాళ్ళం. ఇతడు ప్రద్యుమ్న చరిత్రమనే ప్రబంధం రచించినట్లు మానవల్లి రామకృష్ణకవిగారు చెప్పారు. రెండు పద్యాలు ఉదాహరించారు.[6] అయితే అవి పొన్నాడ రచించిన గ్రంథములోనివి. విన్నకోట పెద్దనను కూడా పెద్దిరాజు అని అనంతర కవులు పిలిచేవారు. కావ్యాలంకార చూడామణికి 'పెద్దిరాజు అలంకారం' అనే వ్యవహారనామం వుంది. ఇందులోంచి అనంతర లాక్షణికులు ఎన్నో నిర్వచనాలను తీసుకొన్నారు. పెద్దనే తొలిసారిగా తెలుగులో ఉదాహరణ లక్షణాలను, రగడలను మొదలైనవాటిని చెప్పాడు. అందుచేత అతడే కొన్ని విషయాలకు పరమ ప్రామాణికుడు.

పెద్దన తన కాలం నాటికి ఉదాహరణలు బహుళ ప్రచారం పొందడంచేత విస్తరంగా లక్షణం చెప్పాడు. ఎనిమిదిరకాల విభక్తులను చెప్పి వాటికి నామాంతరాలుగా అధిదేవతలను పేర్కొన్నాడు.[7] మన లాక్షణికులు ఎప్పుడైతే ఏవైనా విభాగాలకు అధిదేవతలను పేర్కొంటారో అప్పుడవి శంఖంలో పోసిన తీర్థాలు అవుతాయి. విభక్తుల నామాంతరాలను, అధిదేవతలను పెద్దన ఏ లక్షణగ్రంథాలనుంచి తీసుకొన్నాడో తెలియదు. అతడు స్వతంత్రించి ఉండడు. చూడండి. అతడు చెప్పినవాటికి చేసిన పట్టిక.

వరుస నెం.	విభక్తి	మారుపేరు	అధిదేవత
1.	ప్రథమ	వాణి	వీరావళి
2.	ద్వితీయ	ఝుట	కీర్తిమతి
3.	తృతీయ	కీర్తి	సుభగ
4.	చతుర్థి	దేవలాబిని	భోగమాలిని
5.	పంచమి	పాణి	కళావతి
6.	షష్ఠి	మోటి	కాంతిమతి
7.	సప్తమి	ఘోటి	కమల
8.	సంబుద్ధి	సరసావళి	జయవతి

ఇది ఏదైనా శాస్త్రీయ గ్రంథంలోనుంచే తీసుకొని ఉండాలనడానికి కారణం లేకపోలేదు. గ్రంథం చివర ఈ పద్యం వుంది.

లలి నన్యోన్యముఖావలోకనము లీలం జేయగాలేని యా
విలసత్కావ్యకళా చతుష్టయము లుర్విం బర్వ నేకస్థలిం

6. కుమార సంభవ టిప్పణంలో ఇచ్చారని వీరేశలింగంగారు ఆంధ్ర కవుల చరిత్ర - ప్రథమభాగం (పుట 287) లో చెప్పారు.

7. విభక్తులకు ఈ అధిదేవతలనే అనంతామాత్యుడు తన ఛందోదర్పణంలో చెప్పాడు. అయితే విభక్తులనామాంతరాలు, ఉదాహరణ భేదాలూ చెప్పలేదు. (అనంతుని ఛందం, 3-64)

గలిగించెం బదవాక్యవేదియు నలంకారుజ్ఞుడన్ భూవరో
జ్జ్వల విద్యావిభవోన్నతుండు నగు విశ్వక్ష్మావిభుం డిమ్ములన్. (కావ్యా. 9-172)

అన్యోన్య ముఖావలోకనం లేని శాస్త్రీయ గ్రంథాలను పెద్దన క్రోడీకరించాడనడానికి సందేహం లేదు. పూర్వం కల్పిత శాస్త్రానుగతంబుగా సంగతంగా లక్షణం చెప్తున్నానని ఒకచోట చెప్పనే చెప్పాడు (3-77). వివిధ సంస్కృత సాహిత్య లక్షణ గ్రంథాలను కూడా అనుసరించాడు. సంస్కృత లక్షణ గ్రంథాలలో చిత్రకవితను శబ్దాలంకార ప్రకరణంలో చెప్పారు. పెద్దన కూడా తన గ్రంథంలో అలాగే చిత్రబంధ కవిత్వాలను శబ్దాలంకార విభాగంలోనే 6వ ఉల్లాసంలోనే చెప్పాడు. ఈ గ్రంథంలో 9 ఉల్లాసాలు ఉన్నాయి. మొదటి ఆరు ఉల్లాసాలూ అలంకార శాస్త్రం. ఏడు ఎనిమిది ఉల్లాసాలు ఛందస్సుకు సంబంధించినవి. తొమ్మిదో ఉల్లాసం వ్యాకరణం. చాళుక్యరాజు మొదలుగ పలువురు దేశి కవిత పుట్టించి ఆంధ్ర విషయంలో నిలిపిన కాలాన తెలుగులో ఛందోగ్రంథంగాని, వ్యాకరణంగాని లేదు. రేచన కవిజనాశ్రయం వ్రాసి ఛందోగ్రంథం లేని లోటు తీర్చాడు. కేతన వ్యాకరణం లేని కొరత తీర్చాడు.[8] వేదం వెంకటరాయశాస్త్రిగారు చెప్పినట్లు -

'ఇట్లు ఛందోవ్యాకరణాదులైనంతట రసభావాదులు కావలసి వచ్చినవి. అవియు క్రమముగా చూడామణియందు వెలసినవి. సంస్కృతమందును ఇవి వేర్వేరు గ్రంథములుగానే వెలసినవి. అన్నింటిని కలిపిన కావ్యాలంకార చూడామణివంటి పాఠ్యగ్రంథము గీర్వాణమున కూడా లేదు.'

సంస్కృతంలో కూడా లేని పుస్తకాన్ని పెద్దనచేత రచింపజేసిన విశ్వేశ్వరభూపతి ప్రశంసనీయుడు. ఇతడు స్వతహాగా ఛందశ్శాస్త్ర వివక్షుడు; సత్కృతి పరిష్కారక్రియా దక్షుడు. (7-ఆశ్వాసాంతం) ధీశాలేకాక ధైర్యోజ్జ్వలుడు. ఇతడు క్రీ.శ. 1402లో చాలా పెద్ద యుద్ధంలో పాల్గొని విజయం సంపాదించాడు.

చతురపాయ బాహుశక్తిక్షమావళి - బారవిడిచి చిత్రభానుసాక్షి
బారె సర్వసిద్ధిపదమేది ధరణీవ - రాహమునకునోడి రాచకదువు.

(కావ్యా. 7-41)

ఈ పద్యంలోని 'చతురుపాయబాహుశక్తిక్షమ' అనే సమాసం శకసంవత్సరాలను కూడా సూచిస్తుంది. ఇందులోని 'రాచకదుపు' ఆంధ్ర సైన్యమని ఒక శాసనంలోని శ్లోకంవల్ల తెలుస్తుంది. సరిగ్గా అనే అర్థం వచ్చే శ్లోకం ఎలమంచిలిదగ్గర ఉన్న పంచధార్ల ఆలయంలోని శాసనంలో ఉంది.[9]

ఈ యుద్ధంలో జయించి విశ్వేశ్వరభూపతి రాజమహేంద్రవరందాకా రాజ్యాన్ని విస్తరించి ఉంటాడు. రాజమహేంద్రవరమున వెలనాటిచోడరాజుల ప్రాభవము తగ్గి

8. కావ్యాలంకారచూడామణి - ఉపోద్ఘాతం, పుట 7.
9. దక్షిణభారత శాసనాలు, 6-665.

రెడ్డిరాజులు అధిపతులగునట్టి సంధి కాలమున అత్యల్పకాలము విశ్వేశ్వరభూపతి రాజమహేంద్రవరము నాక్రమించియుండెనేమో యనునది చక్కగా పరిశోధించినగాని తేలదు.' అని వేదం వేంకటరాయశాస్త్రిగారు వ్రాశారు.[10]

కావ్యాలంకార చూడామణిలో పురవర్ణన లక్షణానికి లక్ష్యంగా రాజమహేంద్రవరాన్నే పెద్దన వర్ణించాడు (3-94). అయితే ఇది విశ్వేశ్వరుని రాజధాని కాదు. ఇది తాత్కాలికంగా అతనికి వచ్చిన అభ్యుదయం. ఈ ''అభ్యుదయ పరంపరల కకంపితస్థితి యావహిల్లునట్టుగా'' పెద్దన కావ్యాలంకార చూడామణి చెప్పాడు (1-16). సాధారణంగా ఇతర కవులు షష్ఠ్యంతాలయ్యాక కృతిపతికి 'అభ్యుదయ పరంపరాభి వృద్ధిగా' కావ్యాన్ని చెప్తున్నామంటారు. పెద్దన అభివృద్ధికి బదులు 'అకంపితస్థితి' అనే మాటను వాడడంలో ఏదో విశేషార్థం ఉండి ఉంటుంది. విశ్వేశ్వరభూపతి ధరణీరాజ్యానికి కంపితస్థితి వచ్చిందేమోగాని కావ్యాలంకార చూడామణిలో సాహిత్య రాజ్యానికి అకంపితస్థితి నిజంగా ఆవహిల్లింది. అన్నిరకాల అలంకారాలూ తయారు చేయించి పెద్దన అతని కీర్తికాంతకు పెట్టాడు. ఈ నగలన్నింటికి విడివిడిగా ఉల్లాకువేయడం అవసరం.

ఈ కావ్య కన్యక తనకు లోపించిన మరికొన్ని అలంకారాలను కోరుకొంటూ ఉంది. ఉన్న నగలతో తృప్తిపడకపోవడం ఆడవాళ్లకు నైజం కదా మరి!

జన్నమంత్రి, కవిరాక్షసుడు

వచన రచనలో శిష్టవ్యావహారికం వాడుకున్నా పద్యం రాయాలనేసరికి నేటికీ మన కవులు పాతబడ్డమాటలే వాడుతారు. సమకాలంలో సజీవంగా వుండే రూపాలను వాడరు. పద్యంలోకూడా శిష్టవ్యావహారికం వాడిన శతకమొకటి మనకు ప్రాచీనమైనదే లభిస్తున్నది. దాని పేరు దేవకీనందన శతకం. ఇది తెలుగుదేశంలో చాలా ప్రసిద్ధమైనది. దీని మకుటంలో 'కృష్ణా! దేవకీనందనా!' అని వుంటుంది. క్రీ.శ. 1656లో ఉన్న అప్పకవి తన గ్రంథంలో ఈ క్రింది పద్యాన్ని దేశ్యనిత్యసమాస విశ్రాంతుల సందర్భంలో ఉదాహరించాడు.

చతురంభోధిపరీత భూవలయరాజన్యాతికోటీరరం
జితమాణిక్యవిరాజిత చ్చరణరాజీవుండు ధర్మాత్మజుం
డతికార్పణ్యము తోడ మత్స్యవతి దా నాసింపడే నీదు శా
శ్వతకారుణ్యము గల్గునంతకును గృష్ణా! దేవకీ నందనా! (అప్పకవి. 3-209)

ఈ శతకాన్ని ఎవరు వ్రాశారో అప్పకవి చెప్పలేదు. ఇందులో పద్యాన్ని ఉదాహరించడంవల్ల ఇది అతని కాలానికే చాలా ప్రసిద్ధమని మాత్రం తెలుసుకోగలం.

10. కావ్యాలంకారచూడామణి - ఉపోద్ఘాతం, పుట 5.

'విక్రమార్క చరిత్ర' అనే కావ్యంలోని వంశావళి పద్యాలవల్ల దేవకీనందన శతకం, ఎవరు వ్రాసినదీ మనం వూహించవచ్చు. విక్రమార్క చరిత్రను జక్కన వ్రాశాడు. వెన్నెలకంటి సిద్ధన మంత్రికి అంకితమిచ్చాడు. కృతిపతి తండ్రి పేరు జన్నమంత్రి. అతణ్ణి జక్కన యిలాగ వర్ణించాడు.

విమలవర్తనమున వేదశాస్త్రపురాణవాక్యార్థసరణికి వన్నె బెట్టె
పరమహృద్యంబైన పద్యశతంబున దేవకీతనయు విధేయు జేసె
రసికత్వమున దేవరాయమహారాయకరుణా కటాక్షవీక్షణముగాంచె
గర్ణాటకటకముల్ గలయంతయును మెచ్చ గణకవిద్యాప్రౌఢి ఘనత కెక్కె
గురుల బోషించె సత్కవివరుల మనిచె
బ్రజల బాలించె భాగ్యసంపద వహించె
హరితముని ముఖ్య వంశరత్నాకరేంద్ర
చంద్రుడై యొప్పు సిద్ధయజన్నమంత్రి. (విక్రమార్క. 1-44)

ఈ పద్యంలోని రెండవ పాదంలో దేవకీ తనయుని పద్యశతంతో విధేయుణ్ణి చేసినట్టు జన్నమంత్రి గురించి జక్కన చెప్పాడు. మూడవ పాదంలో దేవరాయల కరుణను జన్నమంత్రి పొందాడని కూడా చెప్పాడు. ఈ రెండు సీసపాదాలవల్లా జన్నమంత్రి కృతిపేరే కాక అతని కాలంకూడా చాలా సునాయాసంగా మనకు తెలుస్తున్నాయి.

దేవరాయలు సంగమవంశపు రాజులలో ప్రసిద్ధుడు. క్రీ.శ. 1377-1404 దాకా పరిపాలించిన రెండవ హరిహరరాయల కుమారుడు. దేవరాయలు క్రీ.శ. 1406 నవంబరు 5వ తేదీన సింహాసనానికి వచ్చాడని చరిత్రకారులు చెప్తారు. క్రీ.శ. 1406లో పట్టాభిషేకం చేసుకొన్నా దేవరాయలు తన తండ్రి జీవితకాలంలోనే యువరాజ పదవిలో ఉదయగిరిని పాలించాడు. క్రీ.శ. 1372లో అతడు యువరాజుగా వేయించిన శాసనం ఒకటి నెల్లూరు జిల్లాలో కనబడుతుంది.[1] అప్పుడు అతని దగ్గర చామరుసు అనే మంత్రి ఉండేవాడు. ఈ చామయ్య గారిని నమ్ముకొని వెన్నెలకంటి జన్నమంత్రి కుమారుడు సిద్ధన ఉండేవాడని ఈ క్రింది పద్యంవల్ల తెలుసుకోవచ్చు.

దేవరాయమహారాయధీవిధేయ-మంత్రివల్లభచామనామాత్యదత్త
చామరచ్ఛత్ర శిబికాదిసకలభాగ్య-చిహ్నముల నొప్పెజన్నయ సిద్ధమంత్రి
(విక్రమార్క. 1-50లో ఎత్తుగీతి)

''వెన్నెలకంటి జన్నమంత్రి దేవకీనందన శతకం వ్రాశాడు. ఇతడు క్రీ.శ. 1372 ప్రాంతాలవాడు. సంగమవంశపు రాజు దేవదరాయల కరుణకు ఈ కవి పాత్రుడైనాడు...'' అని నాలుగుముక్కలలో కవిచరిత్రను ముగించుకొని, ఇతడు వ్రాసిన శతకంలోని సొగసులను చూడడానికి మనం ఉపక్రమించవచ్చుగాని మన కవుల చరిత్రలు ఇంత సునాయాసంగా తేల్చుకొనేవికావు. ఈ దేవకీనందన శతకాన్నే కవి రాక్షసుడు రచించాడనే

1. బట్టర్‌వర్తు వేణుగోపాలచెట్టిగార్ల నెల్లూరి శాసనసంపుటి, 1వ సంపుటం, పుటలు 668, 693)

నమ్మకం కొంతకాలం దాకా దేశంలో వుండేది. ఈ శతకం కొన్నిప్రతులలో చిట్టచివర ఈ పద్యం ఉంది.

సదయామూర్తికళన్ ఘటించు కవిరక్ష శ్రేష్ఠు డామోదియౌ
పదివేల్ పద్యములందు నూటెనిమిదౌ పద్యంబు లర్పింప మీ
పదనీరేజములందు దివ్యతటినీపాథః ప్రపూర్ణాభిము
ఖ్యదశం గాంచిన దౌట మీకరుణ కృష్ణా! దేవకీనందనా.[2]

ఈ పద్యంలో కవిరక్షశ్రేష్ఠుడు అనే మాటవల్ల 'కవిరాక్షసుడు' అనే ప్రసిద్ధుడు ఈ శతకాన్ని వ్రాసివుంటాడని పండితులు భావించారు. ఒక్క గద్వాలవారు వేయించిన ప్రతిలోనేకాక కాశీనాథుని నాగేశ్వరరావుగారు ప్రకటించిన దేవకీనందన శతకంలో కూడా ఈ పద్యమే కొద్ది పాఠాంతరాలతో చిట్టచివరన వుంది. అడయారు గ్రంథాలయంలో వున్న తాళపత్రప్రతిలో కట్టకడపట ఇంకో మోస్తరుగా ఇదే ఛందోబద్ధమైంది.

కవనాచాతురి మీర మున్న కవిరక్షశ్రేష్ఠు డామోదియై
భువి గావించినయట్టి కృష్ణశతకంబున్ భక్తితాత్పర్యవై
భవ మొప్పన్ లిఖియించె సద్వరకవిప్రావీణ్యుడౌ భాస్కరా
ర్యవరగ్రామణి మీలసత్కరుణ కృష్ణా! దేవకీనందనా.[3]

ఇది లేఖకుడు వ్రాసుకొన్న పద్యం అయినా కవిరక్షశ్రేష్ఠుడు ఈ శతకాన్ని చెప్పినట్టు దీనివల్ల తెలుస్తుంది. కవిరాక్షసుడు అనే ప్రసిద్ధుడు దేవకీనందన శతకాన్ని చెపితే ఆ సంగతి జక్కనకు తెలియకపోదు. ఏమంటే ఏ విక్రమార్క చరిత్రలో శతకం చెప్పి దేవకీ తనయుని జన్నమంత్రి విధేయుణ్ణి చేశాడని జక్కన వ్రాశాడో అదే పుస్తకంలో కవిరాక్షసుణ్ణి కూడా నుతించాడు, చూడండి:

శ్రీహర్షు శివభద్రు జిత్తవు శివదాసు సౌమిల్లిని సుబంధు సార్వభౌము
కర్ణామృతకవీంద్రు గామందకు గళింగు గవిరాక్షసుని భాసుని గాళిదాసు
.... గవి రాజు నాత్మదలచి. (విక్రమార్క. 1-11)

వీళ్ళందరూ సంస్కృత కవులే. ప్రసిద్ధులే. సంస్కృతంలో కవిరాక్షసీయమనే అన్యోక్తుల కావ్యముంది; అది శతశ్లోక కావ్యం. అందులో కవి ఇలా చెప్పుకొన్నాడు:

సాక్షరేషు భవతీహ జగత్యాం - సర్వఏవ హృది మత్సరయుక్తః
సాక్షరం కవిజనేషు తమేకం - లోక ఏష కవిరాక్షసమాహ.

---

2. గద్వాల సంస్థానంవారు ప్రచురించిన ప్రతిలో ఉందని చాగంటి శేషయ్యగారు వ్రాశారు. ఆంధ్రకవితరంగిణి - నాలుగవభాగం, పుట 243.
3. ఆంధ్రకవితరంగిణి, నాలుగవ సంపుటం, పుట 247.

దీనిని మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు ఉదాహరించారు.[4] సంస్కృత కవుల శ్రేణిలో కవిరాక్షసుణ్ణి నుతించిన జక్కన తెలుగులో ఒక కవిరాక్షసుడు తన కాలానికి ముందుంటే చెప్పడా? అందులోనూ ఆ కవిరాక్షసుడు తన కృతిపతి తండ్రి వ్రాసినట్టే దేవకీనందనునిపై శతకం వ్రాస్తే ఆ సంగతి విస్మరిస్తాడా? ఒకటి, జక్కన కాలానికి ముందు తెలుగు కవి రాక్షసుడు లేకపోవాలి. ఉంటే దేవకీనందన శతకం వ్రాసి ఉండకపోవాలి; లేదా ఇంకో దేవకీనందన శతకానికి సంబంధం వున్న 'తెలుగు' కవిరాక్షసుడు జక్కనకు అర్వాచీనుడుగావాలి.

'తెలుగు' కవిరాక్షసుడు అని ఎందుకు చెప్పవలసివస్తున్నదంటే మన లాక్షణికులలో కూడా కవిరాక్షసుడు ఒకడున్నాడు. కాకునూరి అప్పకవి (క్రీ.శ. 1656) కవి రాక్షసుని గురించి ఇలా వ్రాశాడు :

ఆదిని శబ్దశాసనమహాకవి చెప్పిన భారతంబులో
నేది వచింపగాబడియె నెందును దానినె కాని సూత్రసం
పాదన లేమిచే దెనుగుపల్కు మరొక్కటి గూర్చి చెప్పగా
రాదని దక్షవాటి కవిరాక్షసుడే నియమంబు జేసినన్.
ఆ మూడు పర్వములలో - నా మాన్యుడు నుడువు తెరగు లరసికొనికృతుల్
దాము రచించిరి తిక్కసు-ధీమణి మొదలైన తొంటి తెనుగుకవీంద్రుల్.

(అప్ప. పీఠిక. 46, 47)

మొదటి పద్యంలో కవిరాక్షసుని పేరు చెప్పి అతని అనుశాసనాన్ని వివరించిన అప్పకవి 'పూర్వగ్రంథనామ సంగ్రహం'లో 'కవిరాక్షసీయం' అనే లక్షణ గ్రంథాన్ని పేర్కొన్నాడు.[5] అప్పకవికి నూరేళ్ల తరవాత క్రీ.శ. 1750 ప్రాంతాలలో వున్న కస్తూరిరంగకవి కూడా కవిరాక్షసుణ్ణి పేర్కొని 'కవిరాక్షసచ్ఛందం' అనే అతని పుస్తకం పేరు చెప్పాడు.[6] అందులో నుంచి పద్యాలను ఉదాహరించాడు. ''శ్రీదైతా! యతులిర్వదొక్కటి యగుర్'' అని 21 విధాలైన యతులను చెప్పే పద్యాన్ని కవిరాక్షసచ్ఛందంలోనిదని కస్తూరి రంగకవి ఇచ్చాడు.[7] కవిరాక్షసుడు చెప్పిన 21 విధాలైన యతులలో నాలుగింటి లక్షణాలను ఆ గ్రంథంనుంచే తీసుకొని ఇస్తున్నట్లు చెప్పాడు.

1. అభేదయతి:ళలకు డడలకు నొకటొక టలవుగ బ్రాసంబు యతియునౌ (ఆనంద. 3-52)
2. ప్రాదియతి:ప్రాదినిత్యసమాసశబ్దములుగాక...[8] (ఆనంద. 3-211)
3. ఆదేశయతి:ద్వీపనాకాంతరీవప్రతీపశబ్దములకు... (ఆనంద. 3-219)
4. విభాగయతి:సంఖ్యకును బరిణామసంజ్ఞకును... (ఆనంద. 3-254)

---

4. సంస్కృతవాఙ్మయచరిత్ర - లౌకికవాఙ్మయం, పుట 336.
5. అప్పకవీయం, 1-5, 6. ఆనందరంగరాట్ఛందం, 1-7, 7. అదే పుస్తకంలో, 8-12, 8. ఇదేపద్యం అనంతుని ఛందంలో ఉంది. 1-92.

కవిరాక్షసుడు చెప్పిన యతుల సంఖ్యనుబట్టి అతని కాలాన్ని నిర్ణయించవచ్చు. మన భాషలో మొట్టమొదటి లక్షణగ్రంథాన్ని భీమన వ్రాశాడని మన లాక్షణిక మతం. భీమన పది యతులే చెప్పాడన్నారు. ఆ తరువాత వాటిని అనంతుడు ఇరవైనాలుగు దాకా పెంచాడు. ఇరవైఒకటి చెప్పిన కవిరాక్షసుడు అనంతునికి పూర్వుడే అవుతాడు. అనంతునికాలం క్రీ.శ. 1435. అందుచే కవిరాక్షసుడు చేసిన నియమాన్ని అనుసరించి తిక్కనాదులు నన్నయగారి ప్రయోగాలనే చూసి కావ్యాలు వ్రాశారని అప్పకవి చెప్పాడు. అందుచేత కవిరాక్షసుడు నన్నయగారికి, తిక్కనగారికి మధ్య కాలంలో ఉండేవాడని కూడా భావించవచ్చుగాని, అప్పకవి ఇచ్చే ఇతర కవుల కాలంలో తారీఖులలో చాలా తకరార్లు ఉంటాయి.

కస్తూరి రంగకవి కవిరాక్షసచ్ఛందంలోనివని చెప్పి ఉదాహరించినా కవిరాక్షసుడు సంస్కృతంలోనే వ్రాసిన లాక్షణికుడని కచ్చితంగా చెప్పవచ్చు. గౌరన అనే తెలుగుకవి సంస్కృతంలో తెలుగు కవిత్వానికి లక్షణం చెప్పాడు. తన గ్రంథానికి 'లక్షణదీపిక' అని పేరు పెట్టాడు. ఇందులో తెలుగు లాక్షణికులు వ్రాసిన తెలుగు పద్యాలను కూడా ఉదాహరించాడు. గౌరన ఒక్కసారి యీ కవిరాక్షసుని పేరు చెప్పి అతని సంస్కృత శ్లోకాన్నే ఉదాహరించాడుగాని ఒక్క తెలుగు పద్యాన్ని కూడా వాడుకోలేదు. చూడండి.[9]

తథాచ కవిరాక్షస: అనంతపదవిన్యాసచాతుర్యం సరసంకవే:
బుధో యది సమీపస్థో నకుజన్మా పురో యది.

కవిరాక్షసుని పేరు చెప్పి అతని శ్లోకాన్ని ఉదాహరించిన గౌరన, నిజంగా కవిరాక్షసుడు తెలుగులో గ్రంథాన్ని రచిస్తే అందులోనుంచి లక్షణాలను పేర్కొనడా? కవిరాక్షసుడు తెలుగులో గ్రంథం వ్రాయలేదనుకోవాలి. గౌరన ఉదాహరించడంవల్ల క్రీ.శ. 1400–1450 ప్రాంతాలలోనే కవిరాక్షసుడు ప్రసిద్ధుడని చెప్పాలి. తన పేరుమీద ప్రసిద్ధమైన ఛందాన్నేకాక కవి రాక్షసుడు ఏ యితర గ్రంథాలు వ్రాశాడో తెలియదు. ఇతడు ఆదినారాయణ చరిత్రం అనే గ్రంథం వ్రాశాడట. అందులోనిదని ఈ పద్యాన్ని ఒకానొక లక్షణ గ్రంథంలో ఉదాహరించాడట.

శ్రీయుతలోచనోజ్జ్వలమరీచులు భానుమరీచివిస్ఫుర
త్తోయజకాంతితోడ దులతూగెడు పచ్చని పట్టుగట్టియ
త్యాయతశంఖచక్రరుచిరాసిగదాధరు డేగుదెంచె నా
రాయణు డార్తరక్షణపరాయణు డాకరిరాజుపాలికిన్.[10]

---

9. ఆంధ్రసాహిత్యపరిషత్ పుస్తకభాండాగారంలో 1391వ నెంబరుగల తాళపత్రప్రతిలోని భాగం.
10. ''కవిరాక్షసుని యాదినారాయణ చరిత్రములోనిదని యొకానొక లక్షణగ్రంథములో నీక్రింది పద్య ముదాహరింపబడినది'' అని కందుకూరి వీరేశలింగంగారు ఈ పద్యాన్ని కవులచరిత్ర – ప్రథమ భాగం (669వ పుట)లో ఇచ్చారు. ఏ లక్షణ గ్రంథమో వారు పేరు చెప్పలేదు. పరిశోధిస్తేగాని పేరు, కాలం, లాక్షణికుని ఉదాహరణలోని చారిత్రక ప్రామాణికబలం తెలియదు. ఏ పద్యాన్ని ఏ పుస్తకంలోంచి ఎన్నోపుటలోంచి తీసుకొన్నారో మన పరిశోధకులు చెప్పకపోతే తరువాతి సాహిత్య విద్యార్థులకు ఇబ్బంది.

ఇది గజేంద్రమోక్షఘట్టంలోనిదని పద్యమే చెప్తున్నది. ఆదినారాయణ చరిత్రలో ఇంకా ఏయే విషయాలుంటాయో ఊహాగానం చేసి ప్రయోజనం లేదు.

దేవకీనందన శతకంలో 'కవిరక్షశ్శ్రేష్ఠుడు' అనే మాట ఉండబట్టి కవిరాక్షసుని గురించి ఇక్కడే ఇంత చర్చించుకొన్నాం. మూడు ప్రతులలో ఈ పద్యం కనబడుతున్నది. కాబట్టి దానిని తేలికగా కొట్టిపారేయకూడదని ఇలాగ తరచిచూశాం.

ఒకటి మాత్రం కచ్చితంగా చెప్పుకోవచ్చు. జక్కన చెప్పినదానిని బట్టి వెన్నెలకంటి జన్నమంత్రి దేవకీనందన శతకం చెప్పాడు. ఇప్పుడు దేశంలో ఒక్కటే ఒక శతకం ప్రచారంలో వుంది. దానిని అతడే వ్రాశాడనడానికి ఆస్కారముంది. శతకకర్త తను సాధారణ కవినని వినయంగా ఇలా చెప్పుకొన్నాడు.

కొండల్వంటి కవీశ్వరుల్ శతకముల్ఘూర్పంగ గోటానకో
ట్లుండన్ నీవును చెప్ప బూనితి వదేమో యంటివా వింటివా
వండే నేర్పుల బెక్కురీతుల రుచుల్ వర్తింపవే శాకముల్
దండిన్ నామన వాలకింపు మది కృ... 10

తాను 'కొండంత కవి' కాకపోయినా చక్కగా రాయగలవాడినని వినయంతోనే తన కావ్యాన్ని రుచిచూడమంటున్నాడు. అతని కాలంలో చిన్నపిల్లవాళ్ల అలంకరణ ఎలా ఉండిందో ఈ చక్కని బాలకృష్ణుని వర్ణనతో మనం తెలుసుకోవచ్చు.

అందెల్ చిన్ని పసిండిగజ్జియలు మ్రోయన్ మేఖలాఘుంటికల్
క్రందై మ్రోయగ రావిరేక నుదుటన్ గంపింప గోపార్భకుల్
వందారుల్ గన వెన్నముద్దలకు నై వర్తించు మీ బాల్యపుం
జందం బాదివిజుల్ నుతించుటలు కృష్ణా! దేవకీనందనా! 5

దీనిముందు పద్యంలో కూడా బాలకృష్ణ వర్ణన అతి మనోహరంగా ఉంది. చూడండి!

నీడల్దేరెడు చెక్కుటద్దములతో నిద్దంపు గెమ్మోవితో
కూడీకూడని చిన్నికూకటులతో గోపార్భకశ్రేణితో
వ్రీడాశూన్యకటీరమండలముతో వేడ్కన్ వినోదించుచు
న్నాడాశైశవమూర్తి నేదలతు గృ... 4

ఈ పద్యంలోని 'కూడీకూడని' అనే ప్రయోగం ఇతని విలక్షణత్వాన్ని చూపిస్తున్నది. తన కాలంలోని సజీవ భాషను కవిగ్రంథంలో నిస్సంకోచంగా వాడుకొన్నాడని ఈ వ్యావహారికరూపం చెప్తున్నది. ఇటువంటిదే 'వండే నేర్పు' అనే మాట కూడ. ఇప్పటి వ్యాకరణ శాస్త్రాలరీత్యా 'వండెడి నేర్పు' అన్నదే సాధువు. 'కూడియుగూడని కూకటుల్' అనమంటుంది వ్యాకరణం. సజీవభాషలోని ప్రయోగాలను మన లక్షణ గ్రంథాలు చూసీ చూడవు. వాటిని లక్ష్యపెట్టకుండా జన్నమంత్రి తన కాలంలోని ఉచ్చారణ రూపాలను

చక్కగా వాడాడు. జన్నమంత్రి ఇటువంటి ప్రయోగాలతోబాటు 'విహరించే కరి' (39), 'ఏలింది', 'ఇబ్బంది' (100) వంటి రూపాలను హాయిగా, వీనుల విందుగా ప్రయోగించాడు. ఇతని పద్యాలలోని భావాలకు సుమతి శతకకర్త భావాలకు పోలికలున్నాయి. చూడండి:

చీమలుపెట్టిన పుట్టలు - పాముల కిరవైనయట్లు పామరుడు దగన్
హేమంబు గూడబెట్టిన - భూమీశుల పాలజేయు భువిలో సుమతీ. (43వ పద్యం)

ఇదే భావం దేవకీనందన శతకంలో జన్నమంత్రి చక్కగా చెప్పాడు:

చీమల్ పుట్టలు పెట్టుచుండ నవి విస్తీర్ణంబు గావించినన్
పాముల్ జేరినరీతి లోభిజనసంపన్నార్థరాసుల్ వృథా
భూమీపాలుల పాలుగాక చనునా పుణ్యాంబులేలొల్లరో
సామాన్యంబు ధనాధినాధులకు కృ... 72

ఇతడు రసికత్వంలో దేవరాయలను మెప్పించాడని జక్కన చెప్పాడు. ఆ రాసిక్యత ఏమిటో చూద్దాం. జన్నమంత్రి మంచి శృంగార కవిత్వం చెప్పేవాడని కొన్ని పద్యాలవల్ల తెలుస్తుంది. చూడండి:

ఇలగోవర్ధన మెత్తితీ వనుచు బ్రహ్మేంద్రాదు లెంతో నినుం
బలుమారు న్నుతులొప్ప జేసెదరు పద్మాక్షా కుచాగ్రంబునం
జులక న్నెత్తిన రాధ నెన్నరిదిగో సొంపొంద సత్కీర్తిని
శ్చలపుణ్యాంబునగాక చొప్పడునె కృ... 15

ఇంట్లో ఉన్న పదహారువేలమంది భార్యలు చాలక ఊరివాళ్లమీద పడ్డావని కృష్ణుణ్ణి దెప్పుతున్నాడు చూడండి:

విలసిల్లన్ పదియారు వేలసతులన్ వీక్షించి వారిండ్లలో
పలవర్తించుచునుండవీటగలగోపస్త్రీల నెల్లన్ గడుం
బలిమిన్ బట్టిరమించి నాడవు భళీ ప్రాజ్ఞుండవీవౌదుభూ
స్థలి నీవేకద కొంటెదేవరపు కృ... 12

శృంగారంతోబాటు సున్నితమైన హాస్యంకూడా ఈ కవిలో ఉంది. భార్యలకు చనువిస్తే నెత్తికెక్కుతారన్న విషయాన్ని 'మృదువుగా' చెప్తున్నాడు చూడండి:

నొసటన్ గన్నులగట్టి వేల్పుసతినెంతో భక్తితో జూడగా
నిసుమంతైనభయంబులేక తలమీదెక్క న్నదట్లుండనీ
వసుధన్ భర్తలు స్త్రీలకెవ్వరయినన్ వశ్యాత్ములైమట్టులే
క సమితయ్యం దలకెక్కకుండుదు రె కృ... 66

ఇతడు జీవితాన్ని బాగా అనుభవించిన తరువాతనే ఈ శతకాన్ని చెప్పినట్టు ఈ క్రింది పద్యంవల్ల తెలుస్తుంది.

బాలక్రీడల గొన్ని నాళ్ళు పిదపన్ భామాకుచాలింగ నా
లో లాభ్యున్నతి గొన్ని నాళ్ళుమరి యిల్లున్ ముంగిలింగొన్ని నా
ళ్ళీలీలన్ విహరించితిన్ సుఖఫలం బెందేనియున్ లేదుగా
చాలన్ నీపదభక్తి జేసెదను కృష్ణా 82

భక్తి భావంతో ఇతడు చెప్పిన ఈ క్రింది రెండు పద్యాలూ తెలుగు దేశంలో చాలా సుప్రసిద్ధమైనవి :

అరయం జందనగంధిపై విదురుపై నక్రూరుపై గుబ్జపై
నరుపై ద్రౌపదిపై గుచేలకునిపై నందవ్రజ స్త్రీ లపై
బరగంగల్గు భవత్కృపారసము నాపై గొంత రానిమ్ము నీ
చరణాబ్జంబుల నమ్మినాడ హరి కృష్ణా 91

కరి నేలింది హుళక్కి ద్రౌపదికి కోకల్ మెచ్చి యిచ్చింది ద
బ్బర కాకాసురునిం గటాక్షమున జేపట్టిం దబద్ధం బహో
శరణన్నన్ బగవాని తమ్మునికి రాజ్యం బిచ్చుట ల్కల్లయి
త్తరి నన్నేలిన నిక్క మీకథలు కృష్ణా! దేవకీనందనా! 100

చిన్న చిన్న తెలుగు పదాలతోనేకాక సుదీర్ఘ సంస్కృత సమాసాలతో కూడా ఇతడు పద్యం చెప్పగలడు.

కుటిలారాతినిశాటకోటికదళీకూటాట వీభంజనో
ద్భటమత్త ద్విప కేళిలోలము సముత్ప్రా వీణ్యదైత్యాంగనా
స్ఫుట ముక్తామణిరత్న హారతిలకాపుంజాతలూన క్రియా
చటులజ్వాలము నీసుదర్శనము కృష్ణా 96

ఇటువంటి పద్యాలు చెప్పడానికి తెలుగు సాహిత్యంలో మిగతా కవులెందరో ఉన్నారుగాని తన కాలంనాటి ఉచ్చారణతో శిష్టవ్యావహారికాన్ని గ్రంథస్థం చేసినవాళ్ళు అరుదు. చూడండి ఈ పద్యం:

గట్రాలన్ బలుకానలన్ గుహల గంగాసింధు దేశంబులన్
వట్రారావుల దేహమెల్ల జెదరన్ వర్తించినన్ మేరువున్
చుట్రా యేబదిమార్లు మెట్టిన మనశ్శుద్ధుండు గాకుండినన్
చట్రావాని ప్రయాసమంతయును గృష్ణా! దేవికీనందనా! 77

వెన్నెలకంటి జన్నయ్య తాను కొండంత కవిని కానని చెప్పుకోవచ్చును గాని నిజంగా 'కొండ అద్దమందు కొంచమై ఉండదా' అనిపించేటంత ఉన్నతుడు.

ఇతడు మొదటి వ్యావహారిక భాషాకవి!

శ్రీనాథుడు

కాకతీయ సామ్రాజ్యం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా ఉంటున్నప్పుడు సామ్రాజ్యాధిపతిచేత మన్ననలు పొందిన ఒక సరస సాహిత్య సామ్రాజ్య చక్రవర్తి తీరాంధ్రంలో ఉండేవాడు. అతని పేరు కమలనాభామాత్యుడు. అతడు తూర్పు తీరాన ఉన్న కాల్పట్టణమనే ఒక కరపట్టణానికి అధికారి. ఇది బహుశా మచిలీపట్టణానికి దగ్గర్లో ఉన్న కాళీపట్టణం కావచ్చు. లేకపోతే దానికి సమీపంలో ఉన్న 'కలపటం' అవటానికి కూడా ఆస్కారం లేకపోలేదు. ఈ రెండు పట్టణాలూ కాకపోతే ఒంగోలు తాలూకాలో సముద్రానికి సమీపాన ఉండే 'కాల్ స్థానకోట' అనే గ్రామం కావచ్చు.[1]

కమలనాభామాత్యుడు సరససాహిత్య చక్రవర్తికాక కవితా విద్యాధరుడు. పద్మ పురాణ సంగ్రహాన్ని ఈయన రచించాడో, లేక కృతి పుచ్చుకున్నాడో తెలియదు. ఈయన క్రీ.శ. 1320 ప్రాంతాలలో ఈ కరపట్టణంపై అధికారం నెరపుతూ ఉండివుంటాడు. ఇతనికి మారయ్య అనే కుమారుడున్నాడు. అతడు కూడా తండ్రిలాగే అమాత్యుడు - అంటే రాజోద్యోగి. ఈ మారయ్య విద్యారాజీవభవుడు. తండ్రంత తానూ చదువుకున్నవాడు కాబోలు. ఈయన భీమాంబిక అనే 'పుణ్యాచార' శీలను పెళ్ళిచేసుకున్నాడు. ఈ దంపతులకు క్రీ.శ. 1370కి అయిదారేళ్లు ఇటో అటో ఒక కుమారుడు జన్మించాడు. అతనికి శ్రీనాథుడు అని పేరు పెట్టారు.

కమలనాభామాత్యుని కుటుంబం వారికి యజుర్వేదం ప్రమాణం. శ్రీనాథునికి ఉపనయనం చేశాక వేదం చెప్పించారు. ''అధర్వ వేదశాఖాధీతినిష్ణాతు'' డయ్యాడు. ఈలోగా అక్షరాభ్యాసం చేసినదాదిగా సంస్కృత పంచకావ్యాలు తాతదగ్గరో, తండ్రిదగ్గరో నేర్చుకొని వుంటాడు. తాత వ్రాసిన పద్మపురాణ సంగ్రహం చదివి పద్యాలు అల్లడం చిన్నప్పుడే మొదలుపెట్టి ఉంటాడు. అప్పటికి తెలుగులో వచ్చిన తిక్కనగారి భారతం, మార్కండేయ పురాణం, ఎఱ్ఱయ్యగారి హరివంశం కూడా క్షుణ్ణంగా చదువుకొని ఉంటాడు. చిన్నారి పొన్నారి చిరుత కూకటి వయసులో బాల శ్రీనాథునికి మరుత్తరాజు కథ బాగా నచ్చింది. దీని నతడు పద్యకావ్యంగా వ్రాశాడు. ఈ కథ అతనికి అంతగా నచ్చటానికి అందులో చాలా చక్కని నాటకీయత ఉంది. పట్టుదల ఉంది. కథ వినండి ;

అనగనగా కరందముడనే రాజు. అతని భార్య పేరు వీరమహాదేవి. ఈ దంపతులకు అవీక్షితుడనే కుమారుడు పుట్టాడు. అతడు పెరిగి పెద్దవాడై పెళ్ళీడు కొచ్చేసరికి విశాల రాజపుత్రిక వైశాలినికి స్వయంవరం చాటించారు. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవడానికి అతడు వెళ్ళాడు. కాని దురదృష్టవశాత్తూ ఇతర రాజకుమారులు అసూయ చెంది అతణ్ణి పట్టి బంధించారు. కొడుకు బంధితుడయ్యాడని తెలియగానే కరందముడు

---

1. ఈ గ్రామాన్ని ఒకరు పేర్కొన్నారని బండారు తమ్మయ్యగారు ''శ్రీనాథ మహాకవి'' అనే వ్యాసంలో వ్రాశారు. చూ॥ రెడ్డి సంచిక, పుట 270.

సైన్యాలతో వెళ్ళి యుద్ధం చేసి కొడుకును విడిపించాడు. సొంత శక్తిసామర్థ్యాలతో కాక తండ్రివల్ల విడుదల పొందినందుకు అవీక్షితునకు వల్లమాలినంత సిగ్గువేసింది. తలయెత్తుకోలేకపోయాడు. ఇటువంటి చేతకానివాడికి పెళ్ళి ఏమిటను కున్నాడు; రాజ్యమెందుకనుకున్నాడు. తండ్రి ఎంత చెప్పినా వినక శాశ్వత బ్రహ్మచర్యం అవలంబిస్తానని వెళ్ళిపోయాడు.

ఇంత పౌరుషమున్న చిన్నవాణ్ణి తప్ప ఇంకొకరిని పెళ్ళాడటం ఇష్టం లేక ఆ వైశాలిని కూడా పట్టు పట్టి అడవులకు పోయి తపస్సు చేసుకొంటోంది. ఆమెను ఒకనాడు ఒక వృద్ధనాగేంద్రుడు తనతో నాగలోకానికి తీసుకుపోయాడు. అతనికే దురుద్దేశమూ లేదు. ఈమెకు పుట్టబోయే బిడ్డ నాగజాతికి రాబోయే ఆపద తప్పించగలడని అతనికి తెలుసు. దేవుడు మేలు చేసి ఆ బిడ్డ పుట్టి పెద్దవాడయ్యాక నాగశిక్షణ చేసినపుడు ఈమె వారిస్తుందని ఇప్పటినుంచి మంచి చేసుకుంటున్నాడు.

అయితే శాశ్వత బ్రహ్మచర్యం చేస్తానని పంతం పట్టిన అవీక్షితునికీ, ఈమెకు పెళ్ళి ఎలా అవుతుంది? బిడ్డ ఎలా పుడతాడు. అది ఒక ప్రశ్నే. తపస్సు చేసుకుంటున్న అవీక్షితునికి ఒక వ్రతం ఉంది. తన తల్లి నోము నోచే వేళలో ఎవరేది అడిగితే అది ఇవ్వాలని అతని నిర్ణయం. ఒకనాడు అతని తండ్రే కుమారుణ్ణి ఆ నోమువేళలో ఒకటి ఇస్తావా అని అర్థించాడు. కొడుకు ఇస్తానన్నాడు. 'అయితే మన కులాన్ని ఉద్ధరించేవాడిని కను' అన్నాడు. ఇచ్చిన వరం కోసం పట్టిన పంతాన్ని అవీక్షితుడు కొంచెం సడలించి పెళ్ళికి సుముఖుడయ్యాడు.

కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులవల్ల వైశాలినీ, అవీక్షితులు కలుసుకున్నారు. పెళ్ళి చేసుకున్నారు. వాళ్ళకు ఒక కుమారుడు జన్మించాడు. అతనికి మరుత్తుడు అని పేరు పెట్టారు. ఇతడు పెరిగి పెద్దవాడై తాతగారి రాజ్యాన్ని ఏలుతూ ఉండేవాడు. ఇతడు ఎంత పరాక్రమవంతుడంటే ఇంద్రునికే యుద్ధాలలో తోడ్పడేవాడు. ఇతని ఘనత చూసి ఇంద్రునికే కన్ను కుట్టింది. మరుత్తుడు చేసే యాగాలలో ఉపద్రష్టగా ఉండవద్దని బృహస్పతి చెవుల్లో ఇల్లు కట్టుకొని ఇంద్రుడు చెప్పాడు. బృహస్పతి సరేనన్నాడు. మరుత్తుడు యాగం మొదలెట్టి బృహస్పతిని రమ్మన్నాడు. ఆయన రాలేదు. ''నువ్వు రాకపోతే నీ తమ్ముడున్నా''డని మరుత్తుడు సంవర్తుడనే ఋషిని తన యజ్ఞానికి ఉపద్రష్టగా చేసుకొన్నాడు.

ఇంతలో మరుత్తుని నాయనమ్మ మనుమడికో కబురు పెట్టింది. నాగులు మునులను చంపుతున్నారని, ఏర్లూ, కోనేర్లూ విషపూరితాలు చేస్తున్నారనీ, అందుచేత నాగసంహారం చెయ్యమనీ ఆదేశించింది. నాయనమ్మ మాట తల దాల్చి మరుత్తుడు అందుకు ఉపక్రమించాడు. అతడు పుట్టకముందే మరుత్తుని తల్లిని మంచి చేసుకొని మాట పుచ్చుకున్న నాగులు వైశాలిని అండ చేరారు. 'నీ కొడుకుచేత ఈ సంహారానికి ఉపసంహారం చేయించు' అని ప్రార్థించారు. ఆమె తన భర్త అవీక్షితుని వద్దకు వెళ్ళి అబ్బాయిని వారించండి' అని చెప్పింది. అవీక్షితుడు వెళ్ళి చెప్పాడు. మరుత్తుడు వినలేదు.


ఇద్దరూ వాదించుకున్నారు. లాభం లేకపోయింది. ఆయుధాలు పట్టుకొని యుద్ధానికి దిగారు. భూమి దద్దరిల్లింది. ఆకాశం పొగచూరింది. తండ్రీకొడుకుల యుద్ధాన్ని ఆపడానికి వాళ్ళ తాతలు, దేవతలు దిగి వచ్చారు...

తరువాతి కథ అందరికీ తెలిసినట్టే సుఖాంతమవుతుంది. ఏ ఒక్క కావ్యంలోనూ ఇంత సూటిగా లేదు. ఒక్కొక్క పుస్తకంలో ఒక్కొక్క లాగుంది. ఈ కథలన్నింటిని బహుశా తెలుగుకావ్యాలలోనే చదువుకొని ఉత్తేజితుడై బాల శ్రీనాథుడు కావ్యాన్ని వ్రాశాడు. అప్పటికి అతనికి పదమూడు, పధ్నాలుగు సంవత్సరాలకన్నా ఎక్కువ వయసు ఉండదు. ఈ కావ్యం శ్రీనాథుడు ఎంతో రసవత్తరంగా వ్రాశాడు కాబోలు, తన ఇతర రచనలలో దీనిని ప్రస్తుతిస్తూ వచ్చాడు.

చిన్నారిపొన్నారి చిరుతకూకటినాడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర. (కాశీ. 1-7)

అని అతడే రచనాకాలం చెప్పాడు. బాలశ్రీనాథుడు ఈ రచన చేస్తున్నకాలంలో కొండవీటి రెడ్డిరాజ్యాన్ని అనవేమారెడ్డి పాలిస్తూ ఉండేవాడు. ఇతడు ఏటేటా ఎంతో వైభవంగా వసంతోత్సవం చేస్తూ ఉండేవాడు. ఈ ఉత్సవాలు చూడడానికి వచ్చినవాళ్ళ మీద చందనం, పన్నీరు, కస్తూరి మొదలైనవాటితోపాటు ఈ రాజు కర్పూర ఖండాలు వెదజల్లేవాడు. ఏటేటా వసంతోత్సవాలు నిర్వహించడంవల్ల అనవేమారెడ్డికి వసంతరాయడనీ, వచ్చినవాళ్ళపై కర్పూర ఖండాలు వెదజల్లుతుండటంచేత కర్పూర వసంత రాయడనీ బిరుదులుండేవి.

వచ్చిన జనం అందరిమీదా వెదజల్లడానికి తగినంత కర్పూరం సరఫరా చేయాలంటే మాటలు కాదు. ఈ సుగంధ ద్రవ్యాలను దేశదేశాల నుంచి తెప్పించి, నెల్లూరిపావాణి సెట్టిగారి కుటుంబంలోని వాళ్ళు సప్లయి చేసేవారు. ఈ కాలంలో విదేశ వ్యాపారం బాగా వృద్ధి చెందింది. రెడ్డి రాజ్యాన్ని స్థాపించిన ప్రోలయ వేమారెడ్డి నౌకా వ్యాపారం వృద్ధి చేయించడానికి తన తమ్ముడు మల్లారెడ్డిని నియోగించాడు. అతడు మోటుపల్లి రేవును బాగు చేయించాడు.



ప్రోలయ వేమారెడ్డి అవచి దేవయసెట్టికి ప్రాపై ఉండేవాడు. రెడ్డి రాజ్యం క్రమేణా అలా విస్తరించింది. అనవేమారెడ్డి కాలం వచ్చేసరికి అవచి దేవయసెట్టి కొడుకు తిప్పయ్యసెట్టి ద్వీపాంతర వ్యాపారం స్వయంగా చూచుకుంటూండేవాడు. రెడ్డి రాజ్యానికి ముఖ్యమైన రేవుపట్టణం మోటుపల్లి. దేశి, పరదేశి, నానాదేశి అనబడే 'చాలుమూల సమస్త పెక్కండ్రు', బేహారులు మోటుపల్లికి వచ్చి వ్యాపారం విరివిగా సాగిస్తూ ఉండేవారు.[2] అందుచేత తిప్పయ్యసెట్టి అప్పుడప్పుడు మోటుపల్లికి వచ్చినప్పుడల్లా కొన్నాళ్ళపాటు అక్కడే ఉండేవాడు.

ఈ మోటుపల్లి శ్రీనాథుని జన్మస్థానమైన కాల్పట్టణానికి 50, 60 మైళ్ళ చేరువలో ఉండేది కాబోలు. శ్రీనాథుడు చిన్నప్పుడే తిప్పయ్యసెట్టితో బాగా స్నేహం చేశాడు. తన పద్యాలూ, కావ్యాలూ, అతనికి వినిపిస్తూ ఉండేవాడు. తిప్పయ్యసెట్టి తనతోబాటు అతణ్ణి కొండవీడు తీసుకువెళ్ళి వసంతోత్సవం చూపించాడు కాబోలు. చిన్నప్పుడు కళ్ళారా చూసిన ఆ వసంతోత్సవ వైభవాన్ని శ్రీనాథుడు తన అనంతర కావ్యంలో వర్ణించాడు.

తిప్పయ్యసెట్టితోబాటు కొండవీటికి వెళ్ళిన శ్రీనాథుడు రాజ దర్శనం చేసుకున్నాడని చెప్పలేం. కావ్యం వ్రాసినా అతడు చిన్నవాడు. మంత్రుల దర్శనం మాత్రం చేసుకున్నాడు. అనవేమారెడ్డి దగ్గర 'మామిడి' వారి కుటుంబంలోని వ్యక్తులు మంత్రులుగా, దండనాథులుగా ఉంటున్నారు. మామిడి పెద్దన మంత్రి అనవేమారెడ్డికి మహాప్రధాని. అతనికి ముగ్గురు కుమారులు. పెద్దతని పేరు వేమనామాత్యుడు (పెద్దన తన రాజు పేరే పెద్దకొడుక్కు పెట్టుకొన్నాడు). రెండో కొడుకు పేరు పైగడన్న. మూడో కుమారుని పేరు సింగన్న.

శ్రీనాథుడు కొండవీడు వెళ్ళినపుడు ఈ మంత్రి కుమారులు మహావైభవంతో ఉండేవారు. వీళ్ళ స్నేహం, ప్రాపకం శ్రీనాథునికి లభించింది. మామిడి వేమయ్య ఈ బాలకవిని చేరదీసి ప్రోత్సహించినట్లుంది. మరుత్తరాట్చరిత్ర బహుశా ఇతనికి అంకితం ఇచ్చాడేమో. ఈ వేమనామాత్యుణ్ణి శ్రీనాథుడు తన అనంతర కావ్యంలో ఇలా వర్ణించాడు.

> కాలకంఠ కఠోరకంఠహుంకారంబు చెవులు సోకనినాటి చిత్తభవుడు
> కుపిత రాఘవఘనక్రూరనారాచంబు తనువు నాటని నాటి వసధి రాజు
> క్రుద్ధ కుంభోద్భవ భ్రూలతాకౌటిల్య వికృతి గ్రుంకని నాటి వింధ్యశిఖరి
> వీరభద్రోదారఘోరివీరావేశ విహృతి గందని నాటి తుహినకరుడు
> చక్కదనమున గాంభీర్యసారముసను - బ్రకటధైర్యకళాకలాపములయందు
> దండనాయకచూడావతంసమైన - మంత్రిమామిడి వేమనామాత్యు డెలమి.
>
> (నైషధం. 1-35)

ఈ వేమయ్యకు శ్రీనాథుడు తన మరుత్తరాట్చరిత్ర అంకితమిచ్చాడని ఇప్పటికి ఎవరూ చెప్పలేదు. ఊహించనూ లేదు. అయితే శ్రీనాథుడు తరువాత ఎప్పుడో చెప్పిన ఒక

2. విజ్ఞాన సర్వస్వం -తెలుగుభాషాసమితి, 3వ సంపుటి, పుట 313

పద్యంవల్ల ఇది ఊహించవచ్చు. ఈ మామిడి పెద్దన్నగారి కుమారులు ముగ్గురిలో ఇద్దరికి శ్రీనాథుడు తన కావ్యాలను అంకితమిచ్చాడు. కడగొట్టువాడైన సింగన్న ఇలా అన్నాడట:

జగము నుతింపగ జెప్పితి - ప్రెగడయ్యకు నాయనుంగు బెద్దనకు గృతుల్
నిగమార్థ సారసంగ్రహ - మగు నాయారాధ్య చరిత మాదిగ బెక్కుల్.
(నైషధం. 1-14)

ప్రెగడయ్య ఈ సింగనకు పెద్దన్న కాడు. చిన్నన్నే. వేమయ్య అతనికి పెద్దన్న. తన అనుగు పెద్దన్నకూ, ప్రెగడయ్యకూ కూడా శ్రీనాథుడు కృతులు అంకితమిచ్చినట్టు సింగన్న ఈ పద్యంలో చెప్పాడని భావించడమే సముచితం.

మామిడి పెద్దన్నగారి పెద్దకొడుకు వేమయ్యకు ఒక పుస్తకాన్ని అంకితమిచ్చిన తరువాత చిన్నబ్బాయి ప్రెగడయ్యకు పండితారాధ్య చరిత్ర అనే పద్య కావ్యాన్ని బాలశ్రీనాథుడు కృతి యిచ్చాడు. అప్పటికే ద్విపదలో పాల్కురికి సోమనాథుడు వ్రాసిన పండితారాధ్య చరిత్ర దేశంలో ప్రచారం పొందింది. శైవులందరూ దానిని భక్తిశ్రద్ధలతో పఠించేవారు. దానిని సోమనాథుడు జనసామాన్యం కోసమే వ్రాసినా అది ప్రౌఢపాకంలో బాగాపడి సామాన్య పాఠకుల స్థాయిని మించిపోయింది.[3] అందుచేత కథాభాగాన్ని పద్య ప్రబంధం చేయమని ప్రెగడయ్య కోరి ఉంటాడు. సోమనాథుని ద్విపదలు తన కావ్యంలో పొందుపరుస్తూ శ్రీనాథుడు పండితారాధ్య చరిత్ర వ్రాశాడు. ఇది ఇతడు ఇలా రచిస్తే, మిగిలిపోయిన సోమనాథుని ఇతర ద్విపద కావ్యమైన బసవపురాణాన్ని పిడుపర్తి సోమనాథుడు పద్య కావ్యాన్ని చేశాడు. అలా చేస్తున్నప్పుడు పండితారాధ్య కథను శ్రీనాథుడు ఇంతకుముందే ప్రబంధంగా వ్రాసినట్లు చెప్పాడు.

అప్పటికి శ్రీనాథునికి నూనూగు మీసాల నూత్న యౌవనం వచ్చింది. ఆ రోజుల్లో అష్టభాషాపాండిత్యం విద్వాంసులకు అవసరం. సంస్కృత నాటకాలలో పాత్రోచిత భాషలు వాడుతారు కాబట్టి వాటిని కరతలామలకం చేసుకోవడానికి సంస్కృతంతో బాటు ప్రాకృత, మహారాష్ట్రి, శౌరసేని మొదలైనవీ తెలుగు పండితులు గట్టిగా మథించి నేర్చుకొనేవారు. శ్రీనాథుడు ప్రాకృతం అభ్యసించాడు. ఆ భాషలో హాలుడు సంకలనం చేసిన 'గాథాసప్తశతి' రసవత్తరమైన గ్రంథం. దానిని యువక శ్రీనాథుడు అనువదించాడు. ఈ ఏడువందల గాథలనూ అతడు తెలుగు చేసే ఉంటాడు. అయితే ఈ అనువాదం నష్టమైంది. మూడు పద్యాలు మాత్రమే లభిస్తున్నాయి. వాటి ప్రాకృతమూలం సంస్కృత ఛాయ, ఆంధ్రానువాదం చూడండి.

గాథ : విక్కి ణ ఇ మాహమాస - మ్మి పామరో పా ఇడింప ఇవేణ
ణిద్ధూమముమ్ముర‌వ్వి ఆ - సామలి యథణో పడిచ్ఛన్తో.

3. ఇది బండారు తమ్మయ్యగారి అభిప్రాయం. చూ॥ 'శ్రీనాథ మహాకవి' రెడ్డి సంచిక, పుట. 281.

ఛాయ : విక్రీణీతే మాఘమాసే పామరః ప్రాపరణం బలీవర్దేన
నిర్ధూమమ్ముర్మురనిభౌశ్యామల్యాః స్తనౌపశ్యన్. (3-88)

అనువాదం : మాఘమాసంబు పులివలె మలయుచుండ
బచ్చడం బమ్ముకొన్నాడు పసరమునకు
ముదితచన్నులు పొగలేని ముర్మురములు
చలికి నొరగోయి కేలుండు సైరికుండు? (క్రీడా. 262)

సైరికుడు అంటే దున్నేవాడు, రైతు. ఒరగోయ అనే వీరోచితమైన మాట వాడబట్టి సైనికుడు లాగ ధ్వనించే సైరికుడు అనే మాటను మూలంలోని పామరునికి వాడాడు. స్త్రీ వక్షోజాలు పొగలేని కుంపట్లట. వాటి వెచ్చదనం చూసుకొని, పులిలాంటి మాఘమాసపు చలిమీద కత్తిదూసి రైతు పచ్చడం అమ్మి పశువులను కొన్నాడని కల్పన. రగ్గుకన్నా రమణి ఉరోజాలే వెచ్చన అని చమత్కారం. ఈ గాథనే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఇలా సూటిగా అనువదించారు.

పొగయకుండు కుమ్ముబోలెడు చామచ-స్గవను బడసి శీతకాలమందు
పల్లెసేద్యగాడు పచ్చడంబును విల్చి - క్రొత్త యెద్దు దెచ్చుకొనియెజూడు
(గా.స. సారం. 191)

చలిలో ప్రియురాలి భరవసా చూసుకున్న రైతుబిడ్డ గడుసుదనం ఈ పై గాథ మనకు చెప్తే, వర్షాకాలంలోని జవరాలి విరహాన్ని ఈ క్రింది గాథ చెప్తుంది.

గాథ: ఝ ఞ్ఝావా ఉత్తణిఏ - ఘరమ్మి వో ఊఊణ ణీసహిణిసణ్ణామ్
దా వే ఇ వ గ అ వ ఇఅం - విజ్జుజ్జో ఓ జలహరాణం.

ఛాయ: ఝ ఞ్ఝావాతో త్తృణితే - గృహేరుది త్వా నిస్సహనిషణ్ణామ్
దర్శయతీవ గతపతికాం - విద్యుదుద్ద్యోతో జలధరాణామ్. (4-15)

అనువాదం: వటుర్ఝంఝూపవనోత్తృణాలయములో భద్రంబునం బట్టెకం
కటిపై ముచ్చ ముడింగి నిర్భరవియోగగ్లాని శోషించి యె
క్కటి నిద్రించుచున్న పాంథవనితన్ గర్జావచః ప్రౌఢిమన్
దటిదుద్యోతము చూపు నట్టనడురే ధారాధర శ్రేణికిన్. (క్రీ. 60)

వర్షాకాలం విరహాన్ని ఉద్రేకపరుస్తుంది. నాయకుడు ఊళ్ళోలేడు. నాయిక ముచ్చముడిగి నిర్భరవియోగ దుఃఖంలో సొమ్మసిల్లి ఒక్కర్తే పట్టెమంచంమీద పడుకొంది. ఆమె అవస్థను చూస్తే సాటి ఆడదానికి గుండె కరుగుతుంది. అందుకే మెరుపుకన్నె తన వెలుగులో ఆమె దుస్థితిలో మొయిలురాయడికి చూపించి కనికరించమంది. ఇదీ ఈ పద్యంలోని భావం. ఈ గాథనే అనంతకృష్ణ శర్మగారు ఇలా అనువదించారు.

పూరికపొప్పడు గాలిత్రోపునకు జెదర
నేల గతిలేక యేడ్చుచు గూలబడిన
వలసపోయిన యాతని చెలిని జూడు
మెరసె మేఘంబునకు జూపుకరణి మెరపు. (గా.స.సారం. 247)

శ్రీనాథుడు చేసిన రెండు గాథల అనువాదాలూ మనకు క్రీడాభిరామం అనే ఇతర కావ్యంలోనుంచి దొరుకుతున్నాయి. పూర్వం వ్రాసిన కావ్యాలలోని పద్యాలను తరువాతి కృతులలో వాడుకోవడం మన కవులకు పరిపాటే. కొన్ని లక్షణ గ్రంథాలలో ఈ క్రింది పద్యం శ్రీనాథుని సప్తశతిలోనిదని చెప్పారట. ఆ సంగతి చెప్తూ మానవల్లి రామకృష్ణ కవిగారు దానిని ఉదాహరించారు.[4]

వారణసేయ దానిగొనవా? నవవారిజమందు దేటి క్రొ
వ్వారుచునుంట నీ వెరుగవా? ప్రియ! తెరగంటిగంటి కె
వ్వారికి గెంపురాదు తగవా మగవారల దూర నీ విభుం
డారసి నీనిజం బెరుగునంతకు నంతకు నోర్వు నెచ్చెలీ!

ఇది 'కస్సన ణహెూ ఇరోసో' అనే గాథకు అనువాదం అని రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు చెప్పారు.[5] శ్రీనాథుని తరువాత ఈ గాథాసప్తశతి నిధి జోలికి అనంత కృష్ణశర్మగారు తప్ప ఇంకెవరూ పోలేదు. శ్రీనాథుని కాలంలో పెదకోమటి వేమారెడ్డి ఒక నూరు గాథలు తీసుకొని సప్తశతీ సారం అనే పేర వాటికి మంచి టీక వ్రాశాడు.

పెదకోమటి వేమారెడ్డి ఆ రోజుల్లో అంటే శ్రీనాథునికి నూనూగు మీసాల నూత్నయౌవనం వచ్చిన రోజుల్లో చందవోలులో యువరాజుగానో, రాజుగానో ఉండేవాడు. ఇతడు ప్రోలయవేమారెడ్డిగారి అన్నగారి మనుమడు. కొండవీటికి అణకువగా చందవోలులో ఆ వంశం రెడ్లు పరిపాలన చేస్తూ వచ్చేవారు. మామిడి పెద్దన్నగారి కుమారులలో కడగొట్టువాడైన సింగన ఉత్తరోత్తరా ఈ పెదకోమటి వేముడికి మంత్రి అయ్యాడు. క్రీ.శ. 1385 ప్రాంతాలలో ఈ ముగ్గురు అంటే శ్రీనాథుడు, మామిడి సింగన్న, పెదకోమటి వేమారెడ్డి కలిసి సాహిత్య వ్యాసంగం చేస్తూ వుండేవారు కాబోలు. శ్రీనాథుడు సప్తశతిని తెనిగించే రోజుల్లో పెదకోమటి వేముడు కొన్ని గాథలకు టీక వ్రాసి వుంటాడు.

ఆ తరువాత కొన్నాళ్ళపాటు పెదకోమటి వేమునికి సాహిత్య గోష్ఠులు జరిపేటంత తెరపి ఉండేది కాదని చెప్పాలి. ఏమంటే క్రీ.శ. 1386లో అనవేమారెడ్డి మరణించాడు. ఆ గద్దెమీద అనవేమారెడ్డి గారి అన్న కొడుకు కొమరగిరిరెడ్డిని రాచమరిది కాటయవేముడు

4. కుమారసంభవం - పూర్వభాగం (1908) 4వ ఆశ్వాసం - 568వ పద్యానికి అధోజ్ఞాపికలో ఇది ఇచ్చారు.
5. గాథాసప్తశతీ సారం – పీఠిక, పుట 23.

నిలబెట్టాడు. కోమటి వేముడు కొండవీటి గద్దెకోసం తాను ప్రయత్నాలు చేశాడు. ఒక ప్రక్కనుంచి కటకం కళింగాధిపతులు, మరోమూలనుంచి విజయనగరం రాయర్లు రెడ్డి రాజ్యాన్ని కబళించాలని చూశారు. కొండవీడు, చందవోలు రాజ్యాలలో అంతఃకలహాలు జరిగాయి. కాటయ వేముడు ఏ చాణక్యతంత్రం నెరపాడో తెలియదుగాని కోమటి వేముడు శాంతించాడు. కొమరగిరి రెడ్డి బ్రతికున్నంతకాలం అతడు కొండవీడు పాలించేటట్టూ, ఆ తరువాత పెదకోమటి వేమునికి గద్దె సంక్రమించేటట్టూ సంధి షరతులు పెట్టుకున్నారు. పెదకోమటి వేముడు తృప్తిపడి చందవోలులో రాజ్యం చేసుకుంటున్నాడు. అతనితో మామిడి సింగన్న మంత్రిగా, శ్రీనాథుడు కవిగా చందవోలులో వుండిపోయారు. తమ విద్యాగోష్ఠులు కొనసాగించారు.

మామిడి సింగన్నకూడా సంస్కృతంలో దిట్ట. జ్యోతిష్యమంటే చెవి కోసుకుంటాడు. అందులోనూ సిద్ధాంత భాగమంటే ఇష్టం. సోమసిద్ధాంతానికి వ్యాఖ్యానం వ్రాశాడు. అందులో తాను ''జ్యోతిర్విద్యానిరాఘాట సరస్వత్సారదృశ్వ''డనని చెప్పుకున్నాడు. ఈ వ్యాఖ్యానాన్ని అతడు క్రీ.శ. 1418లో వ్రాశాడుగాని క్రీ.శ. 1386 దాటాక మంచి నిండు యౌవనంలో శ్రీహర్షుని నైషధీయ చరిత్ర అంటే ఒళ్ళు మరచిపోయేవాడు. అందుకే ఒక పద్యంలో శ్రీనాథుడు ఈ మామిడి సింగన్నను ఇలా సంబోధించాడు.

శ్రీహర్ష సుకవి కవితా - వ్యాహార కథా సుధా సాస్వాద సుఖ
శ్రీ హర్షోదయ నిత్య స - మాహిత మహితాంతరంగ మామిడిసింగా.
(నైషధం. 3-1)

'శ్రీహర్షుడనే సుకవి యొక్క కవిత్వంచేత భాషితమైన కథామృతరసాన్ని ఆస్వాదించుటచేత జనించిన సౌఖ్యానంద శ్రీలవల్ల నిత్యం కందళించిన డెందం కలవాడా' అని దీని అర్థం. అంటే ఇరవై నాలుగు గంటలూ హర్షుని కావ్యామృతంలో మామిడి సింగన్న మునిగి తేలుతూ ఉండేవాడు. ఈ ప్రౌఢకావ్యాన్ని తెనిగింపజేయాలని మామిడి సింగన్న అనుకొన్నాడు. దీనికి తగినవాడు శ్రీనాథుడే అని నిశ్చయించుకున్నాడు. అప్పటికి శ్రీనాథుడు ఉద్దండ పాండిత్యం కరతలామలకం చేసుకున్నాడు. అతడు ఏయే కవుల గ్రంథాలు చదివాడో చూడండి:

వ్యాసవాల్మీకి మహర్షుల వాక్సుధా సముద్రాల కెరటాలపై ఓలలాడాడు. భట్టబాణుని కాదంబరీ, హర్షచరిత్రలతోపాటు మయూరుని సూర్యశతకంలోని సౌభాగ్యగరిమనూ సంగ్రహించాడు. సంస్కృతంలో నాటకాలు వ్రాసిన భాసుడు, సౌమిల్లుడు మొదలైనవారి ప్రతిభాసమున్మేష హేలావిశేషాలను మెచ్చుకున్నాడు. మాఘుని శిశుపాల వధలోనూ, భారవి కిరాతార్జునీయంలోనూ ఉండే వచోమకరంద నిష్యంద మాధుర్యానికి ఆనందం పొందాడు. కాళిదాసును ఎప్పుడూ మనసులో ప్రార్థించుకొంటూ ఉండేవాడు. బాలరామాయణ నాటకం వ్రాసిన రాజశేఖరుణ్ణీ, సంస్కృతంలో రెండర్థాలు

వచ్చే రాఘవపాండవీయమనే కావ్యం వ్రాసిన కవిరాజునూ మెచ్చుకొనేవాడు. ఇంతమంది సంస్కృత కవుల కావ్యాలను మథించి వీళ్ళ రచనలతోపాటు తెలుగులో కవిత్రయంవారి కావ్యాలలో వెన్న తీసి ముద్ద చేసుకున్నాడు. వీటితోపాటు బ్రహ్మాండాది పురాణాల తాత్పర్యార్థం నిరూపించిన బ్రహ్మజ్ఞానం కూడా తెలిసినవాడు.

అందుకే ఇంతటి పండితుడైన శృంగారకవిని శ్రీనాథుని పిలిపించి సింగన ఇలా అన్నాడు.

బ్రాహ్మీదత్తవరప్రసాదుడ పురుప్రజ్ఞావిశేషోదయా
జిహ్వా స్వాంతుడ వీశ్వరార్చన కళాశీలుండ వభ్యర్హిత
బ్రహ్మాండాది మహాపురాణచయతాత్పర్యార్థనిర్ధారిత
బ్రహ్మజ్ఞానకళానిధానమవు నీ భాగ్యంబు సామాన్యమే? (నైషధం. 1-13)

అసామాన్యమైన కవితాభాగ్యం గలవాడని ఎంచే శ్రీనాథునితో శ్రీహర్షుని గొప్పతనం వివరించి అతని గ్రంథాన్ని తెనుగు చేయమని ఇలా చెప్పాడు.

కవిరాజరాజిశేఖరహీరముకుటంబు, శ్రీహీరకులవార్ధి శిశిరకరుడు
మామల్ల దేవీకుమారరత్నంబు, చింతామణీమంత్ర చింతనఫలంబు
కవికులాదృష్టాధ్వగమనాధ్వనీనుండు, కాశ్మీరనృపసభాకమలహేళి
ఖండన గ్రంథ సంగ్రంథకర్కశబుద్ధి, షట్కర్మమర్మైకచక్రవర్తి
భట్టహర్షుండు ప్రౌఢవాక్పాటవమున
సద్ది రచియించి బుధలోకహితము పొందె
నట్టి నైషధ సత్కావ్యమాంధ్రభాష
ననఘ యొనరింపు నాపేర నంకితముగ. (నైషధం. 1-16)

అయితే సంస్కృతంలోని నైషధం ఉత్తనారికేళపాక రచన. దానిని అర్థం చేసుకోవాలంటే ఎన్నో వ్యాఖ్యానాలు చదవాలి. ఇటువంటి గ్రంథాలను మానసికంగా సోమరిపోతులైన వాళ్ళు హర్షించలేరట. అందుకే శ్రీనాథుడు ఈ పద్యం చెప్పాడు.

పనిపడి నారికేళ ఫలపాకమునం జవియైన భట్టహ
ర్షుని కవితాసుగుంభములు సోమరిపోతులు కొందరయ్యా తా
నని కొనియాడ నేర రది యట్టిద లేజవరాలు చెక్కుగీ
టిన వసవల్చు బాలకుడుడెందమునం గలగంగ నేర్చునే? (నైషధం. 1-17)

మాంచి పైలాపచ్చీసులో ఉన్న పడుచుపిల్ల చెక్కిలిమీద చిటిక వేస్తే యువకుల మనసులు ఉయ్యాలలూగుతాయిగాని చంటి వాళ్ళకేం చలనముంటుంది? ఈ విధంగా చెప్పి మామిడి సింగన్న బహుమానంగా కర్పూర తాంబూలం ఇచ్చాడు. దానిని స్వీకరించి శ్రీనాథుడు నైషధాన్ని శృంగారనైషధంగా అనువాదం చేశాడు. ఎలా చేశాడో తానే చెప్పుకున్నాడు, వినండి.

నైషధ శృంగారకావ్యం బాంధ్రభాషావిశేషంబున నశేషమనీషి హృదయంగమంబుగా

1. శబ్దంబనుసరించియు, 2. అభిప్రాయంబు గురించియు, 3. భావం బుపలక్షించియు, 4. రసంబు పోషించియు, 5. అలంకారంబు భూషించియు, 6. ఔచిత్యం బాదరించియు, 7. అనౌచిత్యంబు పరిహరించియు. మాతృకానుసారంబున చెప్పబడిన యీ భాషానైషధ కావ్యంబు... విలసిల్లు నాచంద్ర తారార్కంబు. (నైషధం. 8-202)

ఇన్ని శ్రద్ధలు తీసికొని అనువదించిన నైషధ కావ్యాన్ని ఇలా పూర్తిచేశాడో లేదో, క్రీ.శ. 1395లో ఒక రాచకార్యం శ్రీనాథునిపై వచ్చి పడినట్లు ఉంది. కాటయ వేమునితో పెదకోమటి వేముడు ఒక ఒప్పందానికి వచ్చాడని ఇందాకా చెప్పుకొన్నాం. ఈ ఒప్పందం క్రీ.శ. 1390 ప్రాంతాలలో జరిగి ఉంటుంది. దాని ప్రకారం కొమరగిరి రెడ్డి తరువాత కొండవీటి రాజ్యం ఎంత ఉంటే అంత పెదకోమటి వేమునికి రావాలి. అయితే క్రీ.శ. 1395లో కొమరగిరి రాజ్యంలో కొంత భాగాన్ని రాచమరది కాటయ వేమునికి ఇచ్చేశాడే. అందువల్ల కొండవీటి సామ్రాజ్యానికి క్రొత్త రాజధాని అయిన రాజమహేంద్రవరం కాటయ వేముని చేతికి వచ్చింది. ఇది పెదకోమటి వేమునికి బాధ అనిపించింది. ఎలాగైనా కాటయ వేముని తప్పించి కొండవీటి రాజ్యాన్ని కైవసం చేసుకోవాలనుకొన్నాడు. అయితే కాటయ వేముడు అసాధ్యుడు. విజయనగరం రాజులతో ఉన్న సఖ్యతను బంధుత్వంవల్ల ముందే గట్టిపరచుకొన్నాడు. ఏదైనా యుద్ధం వస్తే విజయనగరం రాజులు కొండవీటికి కాటయ వేమునికి తోడ్పడతారు. ఈ సహాయం వారికి లభించకుండా చేయాలి. అప్పుడు కాటయ వేముడు బలహీనుడవుతాడు. విజయనగర రాజులవద్దకు వెళ్ళి ఈ మంతనాలు ఎవరు చేయగలరు? ఒక్కడే ఒక్కడున్నాడు. అతడు అవచి తిప్పయ్యసెట్టి క్రీ.శ. 1395 ప్రాంతాలకు తిప్పయ్య ''ఇంతింతై వటు డింతయై'' అన్నట్టు భారతదేశమంతా వ్యాపారం చేస్తున్నాడు. పండువా, ఢిల్లీ, రాఢాధి పట్టణాల అధిపతులు తిప్పయ్యసెట్టి తెప్పించే రత్నాలను కిరీటాలలో దాలుస్తున్నారు. అతని వ్యాపారం ఎలా ఉందో శ్రీనాథుడే హరవిలాసంలోని ఒక పద్యంలో (పీఠిక, 26) ఇలా వర్ణించాడు.

పంజారగర్పూర పాదపంబులు తెచ్చె జలనోగి బంగారు మొలక తెచ్చె
సింహళంబునగంధసింధురంబులు దెచ్చె హురుమంజిబలు తేజిహరులుదెచ్చె
గోవసంశుద్ధ సంకుమద ద్రవముదెచ్చె యావసనాణి ముత్యాలదెచ్చె
భోటగస్తూరికాటంకమ్ములందెచ్చె జీని చీనాంబర శ్రేణిదెచ్చె
జగదగోపాలరాయ వేశ్యాభుజంగ - పల్లవాదిత్య భూదాన పరశురామ!
కొమరగిరి రాజేంద్రు కూర్మిహితుడు - జాణజెగ జెట్టిరామయ్య చామసెట్టి.

ఇటువంటి వ్యాపారం చేయటంవల్ల అవచి తిప్పయ్యసెట్టి విజయనగరం పాలించే హరిహరరాయలకు, ఫిరోజిషాకు, కటకం రాజులకు విశ్వాసపాత్రుడై, చాలా ఆంతరంగికుడై వుంటాడు. అవచి తిప్పయ్యసెట్టి చేత చెప్పిస్తే హరిహరరాయలు రెడ్డిరాజుల

అంతర్యుద్ధాలలో ఎవరికీ సహాయం చేయకుండా ఊరుకుంటాడు. మరి తిప్పయ్యసెట్టికి ఎవరు చెప్తారు? అతని బాలసఖుడు శ్రీనాథుడు ఉండనే ఉన్నాడు. అందుచేత సున్నితమైన ఈ రాచకార్యాన్ని పెదకోమటి వేముడూ, మామిడి సింగన్నా శ్రీనాథునిపై పెట్టారు.

అవచి తిప్పయ్య అప్పటికే ముసలివాడయ్యాడు. కంచిలో స్థిరపడి హెడ్ ఆఫీసులో వ్యవహారాలు చూసుకుంటున్నాడు. ఎదిగొచ్చిన పిల్లలు మిగతా వ్యాపారం చేస్తున్నారు. అందుకే శ్రీనాథుడు పనికట్టుకొని కంచికెళ్ళాడు. చిన్ననాటి సఖుడైన తిప్పయ్యను చూశాడు. వెళ్ళిన వెంటనే రాచకార్యాల ప్రసక్తి తేలేదు కాబోలు. తన కళ్ళముందు కవిగా పెరిగిన శ్రీనాథుని చూసి తిప్పయ్య పొంగిపోయాడు.

ఉభయభాషా కవిత్వ ప్రయోగకుశలుడని గౌరవించాడు. శ్రీనాథుడు తాను వ్రాసిన నైషధాన్ని చదివి వినిపించాడు. అది మామిడి సింగన్న మంత్రికి అంకితమని చెప్పాడు. తిప్పయ్యసెట్టి మనసులో కోరిక పుట్టింది. శ్రీనాథునితో ఇలాగ అన్నాడు:

కంటినినిశుద్ధసంతతి - వింటిబురాణములు పెక్కు విశ్వము వొగడన్
మంటి బహువత్సరంబులు - గొంటి యశోధనము సుకవికోటి నుతింపన్.
(హర. పీఠిక. 9)

ఆగమజ్ఞాననిధివి తత్త్వార్థఖనివి - బహుపురాణజ్ఞుడవు శుభభవ్యవతివి
బాలసఖుడవు శైవప్రబంధ మొకటి - యవధరింపుము నాపేర నంకితముగ.
(హర.పీఠిక. 12)

తిప్పయ్యసెట్టి ఇలాగ అడగగానే శ్రీనాథుడు అంగీకరించి శుభ ముహూర్తాన 'హరవిలాసం' అనే 7 ఆశ్వాసాల ప్రబంధం చెప్పాడు. 1, 2 ఆశ్వాసాలలో తిప్పయ్యసెట్టి పూర్వీకుడయిన సిరియాళుని కథను వ్రాశాడు. 3, 4 ఆశ్వాసాలలో గిరిజా కల్యాణాన్ని చెప్పాడు. 5వ ఆశ్వాసంలో పరమేశ్వరుని దారుకావనవిహారం, 6వ ఆశ్వాసంలో హాలాహలభక్షణం, 7వ ఆశ్వాసంలో కిరాతార్జునీయం రచించాడు. వివిధ మూలగ్రంథాల నుండి ఈ కథలను తీసుకొన్నాడు. సిరియాళుని చరిత్ర స్థానికంగా విన్నదీ, పాల్కురికి సోమనాథుని బసవపురాణంలో చదివినదీ, అప్పటికి ఆడవాళ్ళు పాడుకొనేదీ సమన్వయించి శ్రీనాథుడు రసవత్తరంగా వ్రాశాడు. కాళిదాసు కుమారసంభవంలోని శ్లోకాలను అనువదిస్తూ గిరిజా కల్యాణం చెప్పాడు. భారవి కృతినుంచి కిరాతార్జునీయ ఘట్టం గ్రహించాడు.

ఈ ఏడాశ్వాసాల గ్రంథాన్నీ శ్రీనాథుడు త్వరత్వరగా ఒకటి రెండు నెలల్లో ముగించినట్టున్నాడు. 6వ ఆశ్వాసంలో హాలాహలభక్షణ గాథను శివునిచేత పార్వతికి చెప్పించాడు.[6] 64 పద్యాలదాకా శివుడు ఆ కథను చెప్తున్నాడని మరచిపోయి తాను

6. బహుశా వాయుపురాణం చూసి ఇలా చెప్పించాడేమో, వాయుపురాణం ఆధారంగా బమ్మెర పోతరాజుగారు వ్రాసిన వీరభద్ర విజయంలో ఈ కథనమే ఉంది.

చెప్పసాగాడు. ప్రథమ పురుషలో కథనం చేశాడు. 6-65లో విరూపాక్షుడు, 6-66లో ఈశ్వరుడు, 6-68లో శివుని హస్తసరోరుహం, 6-69లో మృడుడు అంటూ వరుసగా శివుని చేత అనిపించాడు. చాలా తొందరగా వ్రాయడంవల్లనే ఇటువంటి పొరపాట్లు రచనలో దొర్లాయి. రాచకార్యాలు ముంచుకురావడంవల్లనే తొందరగా వ్రాయడం జరిగింది. కృతిసమర్పణ జరిగాక శ్రీనాథుడు తన రాకలోని అంతరార్థాన్ని సున్నితంగా తిప్పయ్యసెట్టికి చెప్పి ఉంటాడు. బాలసఖుడూ, తనకు కృతి నంకితమిచ్చినవాడూ కోరిన కోరికను తిప్పయ్య మన్నించాడు. చేయవలసిన ఏర్పాటు చేసి చెప్పవలసిన వాళ్లకు చెప్పి శ్రీనాథుడు కోరిన రాచకార్యాలను చక్కబెట్టాడు.

శ్రీనాథుని కంచికి పంపించి మామిడి సింగన్న ఊరుకోలేదు. అతడు 'యవనాధీశ సభా నిరంకుశవచో వ్యాపార పారాయణుడు.' యవనభాషలో అనర్గళంగా మాట్లాడ గలడు. బహుశా అతడు ఫిరోజిషా ఆస్థానానికి వెళ్ళి కొన్ని రహస్య సమాలోచనలు చేసి వుంటాడు. ఇటు తానూ, అటు శ్రీనాథుడూ కావించిన రాజనీతివల్ల చక్కని విప్లవ పరిస్థితులు పరిపక్వమైనాయి.

1. (మామిడి సింగన్న మంతనాలవల్లనే, బహుశా) ఫిరోజిషా కొండవీటిపై దండెత్తి వచ్చాడు.

2. (శ్రీనాథుడు చెప్పించడంచేత తిప్పయ్యమాటలు విని బహుశా,) విజయనగరం వారి సహాయం కాటయ వేమునికి లభించలేదు.

3. పెదకోమటి వేమారెడ్డి ఏ రాజతంత్రం ప్రయోగించాడోగాని, కుమారగిరి రెడ్డి సామంతులు మొదట విశ్వాసంగా కొండవీడు ప్రక్కనే పోరాడి ఉన్నట్టుండి శత్రువులతో చేరారు.

4. పెదకోమటి వేమారెడ్డి చిట్టచివరకు కొండవీడు జయించి రెడ్డి రాజ్యానికి పట్టం కట్టుకొన్నాడు.[7]

తన రాజ్య లాభానికి కారణభూతులలో ఒకడైన శ్రీనాథుణ్ణి పెదకోమటి వేముడు సముచితంగా సన్మానించాడు. అతణ్ణి విద్యాధికారిగా నియమించాడు. ఆశ్రితుడూ, అన్ని విధాల ఉపకారం చేసినవాడూ అనే కారణాలవల్లనే కాక అర్హుడని కూడా యోచించే కోమటి వేముడు ఈ పదవిని శ్రీనాథునికి ఇచ్చాడు. ఈ మహోన్నత పదవిలో పద్దెనిమిది సంవత్సరాలు రాజభోగాలను అనుభవిస్తూ శ్రీనాథుడు కాలం గడిపాడు. ఈ ఉద్యోగంలో అతడు ఏయే విధులు నిర్వర్తించాడో చాగంటి శేషయ్యగారు ఈ విధంగా ఊహించారు.[8]

---

7. ఈ చారిత్రక విషయాలను క్రోడీకరించి శ్రీనాథుని రాజకీయ పాత్రను మిత్రులు వేదం వెంకటరాయశాస్త్రిగారు అంచనా వేశారు - శృంగారనైషధ సర్వంకష, ప్రకాశక విజ్ఞప్తి (1961).
8. ఆంధ్రకవితరంగిణి. 5-వ భాగం, పుట 25.

1. ప్రభువు చేసే దానాలకు శాసనాలు వ్రాయడం. 2. రాజసభలో తీరిక వేళల్లో విద్యాగోష్ఠులు నిర్వహించడం. 3. రాజసభకు వచ్చే పండితుల సామర్థ్యాన్ని పరీక్షించి వారివారికి తగినట్టు బహుమానాలు ఇప్పించటం. 4. రాజు చదివే గ్రంథాలలో కఠిన ఘట్టాలకు అర్థ విచారణ చేసి స్పష్టార్థం నిర్ణయించి చెప్పటం. 5. రాజు ఏదైనా గ్రంథాలు రచిస్తూ ఉంటే వాటిలోని తప్పొప్పులు చూసి వివరించి సహాయం చేయటం. 6. రాజు ఇచ్చే సమస్యలను పూరించే కవుల పద్యాలలోని గుణగణాలు చెప్పటం, తాను స్వయంగా సమస్యలను పూరించటం, 7. ప్రాచీన, అధునాతన గ్రంథ సముదాయాలకు ప్రతులు వ్రాయించటం, వాటిని పరీక్షించటం, పుస్తక భాండాగారాన్ని సంరక్షించడం, రాజుకు పండితులకు కావలసిన పుస్తకాలు తెప్పించడం, ఇప్పించడం మొదలైనవి. 8. రాజపోషణలో ఉన్న పాఠశాలలను పరీక్షించడం, అందులో పండితులను నియోగించడం, వాళ్ళకు తగిన వేతనాలిప్పించడం మొదలైనవి.

ఈ అధికారాలలో చాలా వాటిని శ్రీనాథుడు నిర్వర్తించే వాడని చెప్పడానికి అతని మాటలే ఉన్నాయి. క్రీ.శ. 1402 నుండి 1420 దాకా అతడు విద్యాధికారిగా రచించిన శాసన కావ్యాలు 12 దొరుకుతున్నాయి. ఇవి సంస్కృతాంధ్ర భాషలలో ఉన్నాయి. వాటి వివరాలు ఇవి:

	కాలం	శాసనం	ప్రతిగ్రహీత, లేక శాసనవిషయం
1.	క్రీ.శ. 1404	కల్వపాయల తామ్రశాసనం	గోదావరీతీరాన యజ్ఞం చేసిన పెద్దయజ్వ
2.	క్రీ.శ. 1404	పొన్నుపల్లి తామ్రశాసనం	భూలోకధన్వంతరి, భాస్కరాచార్యుడు
3.	క్రీ.శ. 1404	కసుకుర్రు తామ్రశాసనం	....
4.	క్రీ.శ. 1405	పినపాడు తామ్రశాసనం	శంకరదేశికడు, మామిడి సింగన్నగారి గురువు
5.	క్రీ.శ. 1408	పొన్నుపల్లి తామ్రశాసనం	పెద్దవిళ్ళ సింగనార్యుడు (తర్క మీమాంస వ్యాకరణ శాస్త్ర పండితుడు)
6.	క్రీ.శ. 1408	పొట్లపాటి తామ్రశాసనం	పినిపాటి రామభద్ర సోమయాజి
7.	క్రీ.శ. 1409	ఫిరంగిపుర శిలాశాసనం	పెదకోమటి వేమునిభార్య తవ్వించిన సంతానసాగరం అనే తటాకప్రతిష్ఠ. ఇందులోని తెలుగు భాగంలో శ్రీనాథుడు సీసపద్యాలు వ్రాశాడు.

	కాలం	శాసనం	ప్రతిగృహీత, లేక శాసనవిషయం
8.	క్రీ.శ. 1411	నందమూరు తామ్రశాసనం	ఒకటవ నెంబరు శాసనంలోని పెద్ద యజ్వ మరొక దానం
9.	క్రీ.శ. 1412	అలపాడు తామ్రశాసనం	సకలకవి సార్వభౌముడు విశ్వేశ్వర విద్వాంసునికి తుంగభద్రా తీరంలో అలపాడు అగ్రహారం
10.	క్రీ.శ. 1415	పుల్లరిబోడు శిలాశాసనం	పెదకోమటి వేముని కొడుకు రాచవేముడు తన తల్లి తవ్వించిన సంతానసాగరానికి జగనొబ్బ గండ కాలువ తవ్వించాడు. ఆ సందర్భంలో వ్రాసిన శాసనం. ఒకే సీస పద్యం ఉంది.
11.	క్రీ.శ. 1418	రుద్రవరం తామ్రశాసనం	పెద్దయజ్వ కుమారుడు రామచంద్ర జ్యోతిష్కుడు.
12.	క్రీ.శ. (?)	ములగూరమ్మ కొండపై	ములగూరమ్మ గుడికి ప్రాకారనిర్మాణం శాసనం (రెండు సీసపద్యాలు, కొంత వచనం)

ఈ పన్నెండు శాసనాలూ శ్రీనాథుడు వ్రాసినవే అని నికరంగా చెప్పవచ్చు. ఇవికాక ఇంకొక రెండు అతడు వ్రాసినవే అని ఊహించేవి వున్నాయి. క్రీ.శ. 1404లో వేయించిన కురునూతల శిలాశాసనం ఒకటి.[9] ఆ సంవత్సరమే షడ్దర్శనాల వల్లభ సోమయాజులగారికి ఇచ్చిన పెదపూడి తామ్రశాసనం రెండోది.[10] ఇంతమందికి ఇన్ని అగ్రహారాలు ఇప్పించిన శ్రీనాథుడు తాను స్వయంగా ఏమీ అర్థించలేదు, పుచ్చుకోలేదు. ఈ శాసనాల కాలాలను పరిశీలిస్తే క్రీ.శ. 1405–1408లకు మధ్య పెదకోమటి వేముని దానాలు ఏమీ తెలుగుదేశంలో కనబడవు. దానికి కారణం అతడు ఆ సంవత్సరాలలో కాశీయాత్ర చేయడమే. 1408 తరవాత వేయించిన ఫిరంగిపుర శాసనంలో ఈ క్రింది శ్లోకముంది :

శ్రీశైలే స్థిరమూలతా ముపగతా వృద్ధిం కుమారాచలే
పంచారామతలే ప్రతానసుషమాసింహాచలేంద్రే తతః
శ్రీకూర్మే పురుషోత్తమే కుసుమితా యద్ధర్మకీర్తిర్లతా
కాశ్యాం విశ్వపతేః పురః ఫలవతీ నిత్యోపహారోచితం.

9. శృంగార శ్రీనాథం, పుటలు 111–112
10. ఆంధ్రకవితరంగిణి, 5–వ భాగం, పుట 31.

ఇది శ్రీనాథుడే వ్రాశాడు. పెదకోమటి వేమారెడ్డి కీర్తిలత శ్రీశైలంలో స్థిరమూలమై కుమారాచలంలో వృద్ధిపొంది పంచారామాలలో సింహాచలంలో పందిరల్లి శ్రీకూర్మం లోనూ, పురుషోత్తంలోనూ పుష్పించి కాశీలో విశ్వనాథుని ఎదుట నిత్యనైవేద్యానికి పనికివచ్చేటట్లు ఫలించిందని ఈ శ్లోకానికి అర్థం. అంటే కాశీలోనూ, కాశీకి వెళ్ళే దారి పొడుగునా పెదకోమటి వేముడు దానధర్మాలు చేశాడు. తన ప్రభువుతో శ్రీనాథుడు కూడా కాశీయాత్ర చేశాడని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు భావించారు.[11] ఈ భావన సమంజసమే. ఉత్తరోత్తరా శ్రీనాథుడు కాశీఖండం అనువదించాడు. అందులో కాశీపట్టణాన్ని చూసినట్టు విపులంగా వర్ణించాడు. కాశీకి వెళ్ళే దారిలో ఉన్న పుణ్యక్షేత్రాలపై శ్రీనాథుని చాటువులు, పద్యాలు ఉన్నాయి. ముఖ్యంగా సింహాచలంలో చెప్పినవి ఎక్కువ. సింహాద్రి అప్పన్న చందనయాత్ర సందర్భంగా అక్కడికి వచ్చిన వివిధ జాతుల నాతుల సౌందర్యాన్ని శ్రీనాథుడు కళ్ళకు కట్టేటట్టు వర్ణించాడు.

ఆంధ్రనియోగిభామ :

హరినీలముల కప్పు నణగించు నునుగొప్ప విడిపువ్వుదండదావీడబార
గోటిచందురు డాలు గోటుసేయగజాలు మొగముకుంకుమచుక్క సొగసుగులుక
నలజక్కవల జిక్కు అణగద్రొక్కగ నిక్కు పాలిండ్లపై నాచుపైటజార
నిసుకతిన్నెల మెట్టి పసిడి చెంపలగొట్టు పిరుదుపై మొలనూలు బెళుకుదేర
జిగు గెమ్మోవి బగడంపు జిగియు మెరయు
మాటలాడగ గనుదోయి తేట అమర
చెమటలూరంగ సింహాద్రి చేరవచ్చె
భోగగుణధామ యాంధ్రనియోగిభామ.

వేపారిభామ :

రాపాడంగల గుబ్బచన్నుగవతో రాకేందుబింబంబుపై
దూపేయంగల ముద్దునెమ్మొగముతో దోరంపుమైఛాయతో
జూపు న్వద్దను బాలసంఘములతో సొంపారు లేనవ్వుతో
వేపార్యంగన వచ్చె కాసెబిగితో వేణీభరచ్ఛాయతోన్.

విడిన కొప్పు న జాజివిరులొప్ప గారాలచిట్టి కుంకుమచుక్క బొట్టు చెదర
జక్కగా బటువార సందెడు కుచ్చెళ్ళు జిలుగుమట్టియలపై జిందులాడ
గొదమగుబ్బలబైట కొంగు పయ్యనజార ముక్కునత్తొక వింతముద్దుగులుక
మొలగంట లిమ్మగు మ్రోతతో రంజిల్లుగనకంపుటందియల్ గల్లురనగ
పొసగ గర్పూరవీడ్యము ల్పొందుపరచి
యనుగుజేడెలతో ముచ్చట లాడికొనుచు
నలరు సింహాద్రిపై కెక్క హర్షమునను
వచ్చె గలకంఠి వేపారిమచ్చెకంటి.

---

11. శృంగారశ్రీనాథం, పుట 128.

అగసాలి వన్నెలాడి:

పొలుపొందగ విభూతిబొట్టు నెన్నొసలి పై దళుకొత్త జెమట లుత్తలపడంగ
సొగసు గా బూదండ జోపిన కీల్గొప్పు జారగా నొకచేత సరుదుకొనుచు
బిగిచన్నుగవమీద బిరుసుపయ్యెద చెంగుదిగజారి శివసూత్ర మగుపడంగ
ముక్కునహురుమంజి ముత్యాలముంగరకమ్మవాతెరమీద గంతులిడగ
గౌను జవ్వాడ మట్టియల్ గదిపి మ్రోయు
గమ్మవిలుకాని జాళువాబొమ్మ యనగ
మెల్లమెల్లన సింహాద్రిమీది కేగె
కన్నెపూబోడి యగసాలి వన్నెలాడి.

సాతానివెలది:

మీగాళ్ళ జీరాడు మేలైన కుచ్చెళ్ళు దేరగా మడిచీర దీర్చికట్టి
బిగువుగుబ్బలమీద నిగనిగల్దళుకొత్తు నోరపయ్యెదకొంగు జారవైచి
వలపులకొక వింత గలుగగా గొప్పలొ కురులు నున్నగ దువ్వి కొప్పువెట్టి
నెలవంక నామంబు సలలితంబుగ నుంచి తిరుచూర్ణ మామీద దీర్చుచేసి
యోరచూపుల విటులదానూరడించి - గిల్కు మెట్టెల రవరవల్ గులకరింప
జికిలిచేసిన తామ్రంపుజేతబూని - వీధినేతెంచె సాతాని వెలది యొకతె.

ఒడ్డెవనిత:

మకరధ్వజుని కొంప యొకచెంప గనుపింప జీరకట్టినదయా చిగురుబోణి
యుభయకక్షములందు నురుదీర్ఘతరములౌ నెరులు పెంచిన దయా నీలవేణి
పసుపు తావులుగ్రమ్ము పైటచేలము లెస్స ముసుగు వెట్టినదయా ముద్దుగుమ్మ
పూర్ణచంద్రునిబోలె బొసగ సిందూరపుబొట్టు పెట్టిన దయా పొలతి నుదుట
యెమ్మెమీరగ నిత్తడిసొమ్ము లలర
నోరచూపుల గుల్కు సింగార మొల్క
గల్కి యేతెంచె మరుని రాచిల్క యనగ
వలపులకుచేటి యొక యొడ్డెకులవధూటి.

ఆడవాళ్ళ సౌందర్యాన్ని నిశితంగా పరీక్షించడంలో, సహజంగా వర్ణించడంలో శ్రీనాథుడు అందె వేసిన చేయి. ఇటువంటి పద్యాలను అతిగా చెప్పడంవల్ల అతడు స్త్రీలోలుడు అనే అపకీర్తి అతణ్ణి అలముకొంది. శ్రీనాథుడు అవినీతిపరుడు కాడు. రసికుడు. ఆనాడు శాస్త్రాలు, సమాజం అంగీకరించిన విధంగా భోగంవాళ్ళదగ్గర తన రాసిక్యత చూపి సుఖించాడే కాని మగనాలి జోలికి పోలేదు. చూడండి - ఆకాంక్షనీయమైన ఒక వనితను భోగందానిగా చేయక దాసరి వనితగా పుట్టించినందుకు విధిని తిడుతున్నాడు.

వాసనగల్గు మేను నిడువాలుకనుంగవ గబ్బిగుబ్బలున్
గేసరిమధ్యమున్మదనకేళికి నింపగు బాహుమూలవి
న్యాసముగల్గి నట్టి యెలనాగను బోగముదాని జేయ కా
దాసరిదాని జేసిన విధాతను నేమనవచ్చు నీశ్వరా!

ఇలాగే ఇంకొక పద్యంలో వగలాడిని మగనాలిగా సృష్టించినందుకు బ్రహ్మను నిందిస్తున్నాడు. చూడండి:

గుబ్బలగుమ్మ లేజిగురు గొమ్మ సువర్ణపు గీలుబొమ్మ బల్
గబ్బి మిటారి చూపులది కాపుది దానికి నేల యొక్కనిన్
బెబ్బులి నంటగట్టితీవి పెద్దవునిన్ననరాదుగాని దా
నబ్బ! పయోజగర్భ! మగనాలికి నింత విలాస మేటికిన్?

వారకాంతలతో వినోదించటమేగానీ కులస్త్రీల జోలికి శ్రీనాథుడు పోడని పై పద్యాలు రుజువు చేస్తున్నాయి. వేశ్యలలో కూడా రాసిక్యత లేనివాళ్ళంటే అతనికి గిట్టదు. చూడండి ఈ పద్యం.

చీరయ ముక్కు ముంగరయు జెంపల గంధము జుక్క బొట్టు మం
జీర ఝుళంఝుళారవము జేతుల గంకణనిక్వణంబు నొ
య్యారపు జారుకొప్పు ను గయాళితనంబును గాని లోన శృం
గార మొకింత లేదనుట గంటిని నీపురి వారకాంతలన్

ఈ ఊరేమిటో తెలీదు. వెళ్ళిన ప్రతి ఊళ్ళోనూ ఉన్న అందచందాలను, చూడదగ్గ ప్రదేశాలను, కూడవలసిన వారకాంతలను చూసి చాటు పద్యాలు చెప్పటం శ్రీనాథునికి సరదా. వెళ్ళిన ప్రతీచోటా కొత్తలూరించే భోజనం చేసి దానిని పద్యంలో చెప్పటం కూడ ఇష్టమే. అంత మాత్రాన అతడు స్త్రీలోలుడై తన కుటుంబాన్ని నిర్లక్ష్యం చేశాడని, తిండిపోతని అనుకోనక్కరలేదు. అతడు చక్కని భోజనాన్ని ఎంత మెచ్చుకుంటాడో సహపంక్తిని గూర్చున్న బంధువులతో కూడా అంత చక్కగా పరిహాసోక్తులు పలుకుతూ ఆదరిస్తాడు. చూడండి. ఈ చాటువు - తాటికాయంత ముద్దలు చేసి తినే బంధువును వెక్కిరిస్తున్నాడు.

గ్రామము చేతనుండి పరికల్పిత ధాన్యము నింటనుండి శ్రీ
రామకటాక్షవీక్షణపరంపరచే గడతేరెగాక మా
రామయమంత్రి భోజన పరాక్రమమేమని చెప్పవచ్చు నా
స్వామి యెరుంగుదత్కబళ చాతురి తాళఫలప్రమాణమున్.[12]

12. చాటుపద్య మణిమంజరి -1 పద్యసంఖ్య 367.

ఈ రామయమంత్రి ఎవరో శ్రీనాథునికి హాస్యమాడదగిన బావమరదుల వరుసలోని వాడై వుంటాడు. అయితే శ్రీనాథునికి సాక్షాత్తు బావమరదులు ముగ్గురు ఉన్నారు. వాళ్ళు దగ్గుపల్లి తిప్పయ్యగారి కుమారులు పూతన, ఎర్రన, దుగ్గన్న అనేవాళ్ళు. శ్రీనాథుని బావమరుదులలో ఒక పోతన్న ఉన్నాడు. కనుక అనంతరకవులూ, ప్రజలూ పొరపడి బమ్మెర పోతన గారినే శ్రీనాథుని బావమరిదిగా భావించి కట్టుకథలు కల్పించారు. దగ్గుపల్లి పోతన్న కవికూడా కాడేమో. అయితే బావమరదులలో మూడవవాడు దుగ్గన్న మంచికవి. శ్రీనాథునికి అతడంటే ఇష్టం. శ్రీనాథుడు వివాహం చేసుకొన్న దగ్గుపల్లి వారి ఆడపడుచు పేరేమిటో తెలియదు. అత్తవారి ఊరైన దగ్గుపల్లి కృష్ణా జిల్లా గూడూరుకు చేరువనున్నది కావచ్చు. శ్రీనాథుడు తన కడగొట్టు మరిది దుగ్గన్నను శిష్యునిగా చేసుకొని తనతో తిప్పుకున్నాడు. శ్రీనాథునికి పుత్రసంతానం వుందో లేదో తెలియదు. ఒక కూతురును కొండవీడులోనే ఇచ్చి పెళ్ళి చేశాడు. ఈమె కుమారుణ్ణే అతడు యింట్లో పెట్టుకొని పెంచాడట. అందుచేత ఆ అబ్బాయిని, అతని సంతతిని శ్రీనాథునివారని లోకులు పిలవసాగారట.[13]

బంధుమిత్రులతో, భార్యాదుహితలతో శ్రీనాథుడు హాయిగా క్రీ.శ. 1402 నుంచి 1420 దాకా పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో ఉండేవాడు. ఈ కాలంలో అతడు శాసనాలను, చాటు పద్యాలను మాత్రమే రచిస్తూ విద్వాంసులతో గోష్ఠిలో పాల్గొంటూ వేమారెడ్డికి అఖిలపురాణ విద్యాగమాలు వినిపిస్తూ సుఖంగా ఉండేవాడు. అయితే ఈ పద్దెనిదేళ్ళ సుదీర్ఘకాలంలో అతడు ఏ ఒక్క గ్రంథాన్ని వ్రాయకపోవడం కొంచెం విచిత్రంగానే కనబడుతుంది. శ్రీనాథుని గ్రంథాలుగా తెలియవస్తూ నేటికీ దొరకని కొన్ని గ్రంథాలు ఉన్నాయి. (1) నందనందన చరిత్ర (2) వల్లావాభ్యుదయం (3) కామశాస్త్రం (4)ధనంజయవిజయం అనేవి వీటిలో ఉన్నాయి. ఈ గ్రంథాలలో చిట్టచివరిది శ్రీనాథుడు వ్రాసి ధాన్యవాటి గన్న భూపాలునికి అంకితమిచ్చినట్టు అనంతరకవుల సాక్ష్యం ఉంది. దంతులూరి బాపిరాజు అనే కవి 19వ శతాబ్దిలో 'మూర్తిత్రయోపాఖ్యానం' రచించాడు. అందులోని ఈ పద్యభాగాన్ని చూడండి.

....

శ్రీనాథసుకవీంద్రుచే ధనంజయవిజయంబనుసత్కావ్య మంది వెలసె
నృపతిమాత్రుండె నిజపాదనీరజాత
ఘటితకోటీరవైరిభూకాంతమాన
సాంతరభయాపహారి! శ్రీదంతులూరి
గన్నభూపాలమౌళి దోర్గర్వశాలి.[14] (మూర్తిత్రయోపాఖ్యానం)

---

13. శృంగార శ్రీనాథం, పుట 35.
14. శృంగార శ్రీనాథంలో వేటూరివారు ఉదాహరించారు. పుట. 87.

శ్రీనాథుని కాలంలో ధాన్యవాటిని పాలించే గన్నభూపాలుడొకడు ఉన్నాడు. అతడు సాక్షాత్తు పెదకోమటి వేమారెడ్డికి మామగారు. తన ప్రభువుల మామగారి పేర ఒక కావ్యం వ్రాసి శ్రీనాథుడు అంకితమిచ్చాడేమో! అతడు వ్రాసిన ఫిరంగిపుర శాసనంలో -

శ్రీధాన్యవాటిపురాధిపతియుంగ్రిష్ణవేణ్ణాజలక్రీడావినోదుండ్డునగుగన్నభూపాలు

అనే ప్రసక్తి ఉంది.[15] ఇవి శ్రీనాథుని మాటలే.

భారవి కిరాతార్జునీయాన్ని సంపూర్ణంగా అనువదించి శ్రీనాథుడు ఈ గన్నభూపాలునికి అంకితమిచ్చి వుంటాడు. ఈ గాథను కొద్దిగా హరవిలాసం ఆఖరి ఆశ్వాసంలో చెప్పాడు. అది తృప్తినివ్వక విస్తరించి వ్రాశాడేమో. తరువాత శ్రీనాథుడే వ్రాసిన కాశీఖండంలో 18 గద్యపద్యాలలో ఒక ధనుంజయోపాఖ్యానం ఉంది. (5-59 నుంచి 76 దాకా). అయితే ఈ కథను శ్రీనాథుడు పెంచి కావ్యంగా వ్రాశాడని చెప్పడానికి ఆస్కారం ఏమాత్రం లేదు. విశ్వేశ్వరాజ్ఞ లేనిదే కాశీలో ఎవరూ ప్రవేశింపలేరని, ప్రవేశిస్తే పడరానిపాట్లు పడతారని ఈ ధనుంజయోపాఖ్యానం చెప్తుంది. శ్రీనాథుడు వ్రాసినది ధనుంజయవిజయం కనుక కథ పాండవమధ్యముని విజయగాథ కావచ్చు. గ్రంథం దొరికితేనేగాని మరేమీ చెప్పలేం. ఈ కావ్యాన్ని శ్రీనాథుడు క్రీ.శ. 1409 తరువాత వ్రాసి ఉండవచ్చు. ఆ సంవత్సరం పెదకోమటి వేమారెడ్డి భార్య భూరి సద్గుణనికురుంబ సూరమాంబ సంతాన సాగరం అనే తటాకం నిర్మించింది. దాని ప్రతిష్ఠకు ఆమె తండ్రి గన్నభూపాలుడు వచ్చి వుంటాడు. తన క్రిష్ణ వేణ్ణాజలక్రీడావినోదాన్ని యథాలాపంగా శిలాక్షరాలలో చెక్కించిన శ్రీనాథుని మెచ్చుకొని అతనిచేత కృతి అందుకొని వుంటాడు. అవి సప్తసంతానాలలో కృతి ముఖ్యమని తలచే రోజులు కదా.

శ్రీనాథుడు విద్యాధికారిగా పనిచేసిన పద్దెనిమిది సంవత్సరాలూ కొండవీటి రెడ్డిరాజ్యంలో ఒడిదుడుకులు లేవనుకోకూడదు. రాజమండ్రికి, కొండవీటికి పచ్చగడ్డివేస్తే భగ్గున మండుతూనే ఉంది. ఈ అంతఃకలహములను ఆసరా చేసుకొని విజయనగర రాజులు వెలమ దొరలు, గజపతులు ఈ రాజ్యాలను కబళించటానికి ఎత్తులు వేస్తున్నారు. వీటికి తోడు అంతకుముందు రాజమండ్రిని పాలించిన చోడభక్తి రాజకుమారుడు అన్నదేవుడు పద్మనాయకులనూ, వాళ్ళ ప్రభువులైన బహమనీ సుల్తానునూ ఆశ్రయించి రెడ్డిరాజ్యాలపై తళ్లు తెచ్చాడు. ఈ అన్నదేవునితో పెదకోమటి వేముడు చేతులు కలిపాడు. కాటయ వేమునికి, విజయనగరం వాళ్ళకూ వియ్యముంది. అందుచేత వాళ్లు పెదకోమటి వేముణ్ణి ఇరకాటంలో పెట్టివుంటారు. క్రీ.శ. 1411లో దేవరాయలు కొండవీటిపై దాడి చేశాడు. రెడ్డిరాజ్యంలో కొంత ఆక్రమించుకొన్నాడు. క్రీ.శ. 1417లో పెదకోమటి వేమన ఫిరోజ్‌షాతో చేతులు కలిపి రాజమండ్రిపై దాడి చేశాడు. ఫిరోజ్‌షా రెడ్లతో కలిశాడని వెలమవారు మండిపడ్డారు. వాళ్ళు విజయనగరం వాళ్ళతో కలిశారు. పద్మనాయక

15. శాసనపద్యమంజరి, ప్రథమభాగం, జయంతిరామయ్యగారు. పుట. 24

వంశంలోని లింగమనేడు పెద్దసైన్యంతో కొండవీటిమీదకి దండెత్తి వచ్చి పెదకోమటి వేముని ఓడించి అతనికి బొమ్మపెట్టాడు. అంటే అతని బొమ్మను తన ఎడమకాలి గండపెండెరానికి కట్టుకున్నాడు. ఇంతటితో ఊరుకోక పెదకోమటి వేముని సింహాలాంఛనాన్ని, 'నందికంతపోతురాజు కఠారి'ని తీసుకొనిపోయాడట.

ఈ పరాజయాలు రెడ్డిరాజులకు తలవంపులయ్యాయి. బహుశా యివి క్రీ.శ. 1419లో జరిగాయి కాబోలు. 1420లో పెదకోమటి వేముడు మరణించాడు. ఈ రాజకీయ విప్లవాలలో శ్రీనాథుడు తలమునకలుగా మునిగిపోయి ఉంటాడు. అందుచేత గ్రంథ రచన చేసివుండడు. పెదకోమటి వేముని అనంతరం రాజ్యం సుస్థిరంగా లేదు; సుభిక్షంగా లేదు. పెదకోమటి వేముని కొడుకు రాచవేముడు తండ్రంత సమర్థుడు కాడు; పరాక్రమవంతుడు కాడు. పైగా ప్రజాకంటకుడు. పురిటి మంచంమీద పన్నువేసిన మహానుభావుడు. ఈ పురిటిపన్ను వసూలు చేయబోతూ వుంటే సవరం ఎల్లయ్య అనే బలిజ నాయకుడు రాచవేమారెడ్డిని పొడిచి చంపివేశాడట. ఇతడు రాచలెంక. స్వామిభక్తి పరాయణత్వం వెల్లివిరిసే రోజుల్లో ఒక భృత్యుడు ప్రభువును పొడిచి చంపాడంటే అదెంత కర్కోటకత్వమో తెలుస్తుంది. రాచవేమారెడ్డితో కొండవీటి రెడ్డిరాజ్యం అంతరించింది. ఒక మహావటవృక్షం కూలిపోయింది. ఆ కొమ్మలమీద గూడుకట్టుకొన్న పక్షులు వేరే చెట్లు వెతుక్కోవలసి వచ్చింది. పద్దెనిమిది సంవత్సరాలు విద్యాధికారిగా మహోన్నత పదవిలో ఉండి, ఇరవై నాలుగు సంవత్సరాలు ఒక వంశాన్ని నమ్ముకొని ఆ రాజ్యపు శత్రువులకు శత్రువై, రాజుకు, మంత్రులకు తలలో నాలుకై ఒడిదుడుకులకు లోనై అష్టైశ్వర్యాలు అనుభవించి కష్టాలను తట్టుకొన్న శ్రీనాథుడు క్రీ.శ. 1424 ప్రాంతాలలో ఇంకొక రాజును ఆశ్రయించవలసి వచ్చింది. రాజమండ్రి రెడ్డిరాజుల ప్రాపకం తనకు కావాలనుకొన్నా వెనువెంటనే లభించేది కాదు. ఇద్దరికీ మొఖం చెల్లదు. అందుకే శ్రీనాథుడు పల్నాటి ప్రాంతాలకు రాజాశ్రయం కోసం వెళ్ళివుంటాడు.

అప్పుడు కూడా పల్నాడు వెనుకబడిన రాజ్యమే. కొండవీటిలో రాజభోగాలు అనుభవించిన శ్రీనాథునికి ఈ ప్రాంతాలు రుచించకపోవటంలో వింత లేదు.

చిన్నచిన్న రాళ్లు చిల్లరదేవుళ్ళు - నాగులేటినీళ్లు నాపరాళ్లు
సజ్జజొన్న కూళ్లు సర్పంబులును దేళ్లు - పల్లెనాటి సీమ పల్లెటూళ్లు.

అని వాటిని పేర్కొన్నాడు. రాజమందిరాలలో విడిది చేసిన శ్రీనాథుడు ఈ చిన్న పల్లెటూళ్ళలో పురోహితుని యింట్లో బసచేయవలసి వచ్చింది. అతనికి శుచీ శుభ్రతా లేకపోతే పరమ రోత. పురోహితుని ఇల్లు ఇలా వర్ణించాడు.

దోసెడు కొంపలో బసుల ద్రొక్కిడి మంచము దూడరేణమున్
బాసిన వంటకంబు పసిబాలుర శౌచము విస్తరాకులున్
మాసిన గుడ్డలున్ దలకుమాసిన ముండలు వంటకుండలున్
రాసెడు కట్టెలున్‌దలపరాదు పురోహితునింటి కృత్యముల్.

బహుశా ఈ పురోహితుని ఇల్లు కారెమపూడిలో ఉండి వుంటుంది. శ్రీనాథుడు ఆ వూరు చూశాడు. అంతకుముందు అతడు పెదకోమటి వేమునితో కాశీకి వెళ్ళాడు. కారెమపూడిని కాశీతో సరిపోలుస్తూ ఈ పద్యం చెప్పాడు.

వీరులు దివ్యలింగములు విష్ణువు చెన్నుడు తల్లి పోతురా
జారయ గాలభైరవుడు నంకమశక్తి యు నన్నపూర్ణయున్
గేరెడి గంగధార మడుగే మణికర్ణికగా జెలంగునీ
కారెమపూడి పట్టణము కాశిగదా పలినాటి వారికిన్

పల్నాడులో సంచరిస్తున్నప్పుడే శ్రీనాథుడు వీరుల కథలను విని ఉత్తేజితుడై ఉంటాడు. బ్రహ్మనాయుడు, కల్లు ప్రతిష్ఠ, బాలచంద్రుని యుద్ధం మొదలైన ఘట్టాలను జానపదులు ద్విపదగా పాడినపుడు శ్రీనాథుడు ఉప్పొంగిపోయి ఉంటాడు. ఆ ప్రదేశాలలో తిరిగినపుడు స్థానికులు ఎక్కడెక్కడ ఏమేమి జరిగాయో చూపించి ఉంటారు. దానిని శ్రీనాథుడు ఇలా ఛందోబద్ధం చేశాడు.

ఇచ్చోట భుజియించి రేక కార్యస్థులై సామంతనృపతులు చాపకూడు
ఇచ్చోటజింతించెనిచ్చునుపాయంబున నళినాక్షి యార్వెల్లి నాయకురాలు
నిజమునుశుద్ధికై నిప్పుల యేటిలో నోలాడె నిచ్చోట బీలసాని
ఇచ్చోట బోరిరి యిలపణంబుగ గొల్ల సవతితల్లుల బిడ్డ లవనిపతులు
ధీరులగువార లేవురు వీరపురుషు
లై మదోద్ధతి నిచ్చోట నాజిబడిరి
యనుచు జెప్పెదు రైతిహ్యామచటనచట
జనపపెద్దలు పల్లెదేశములయందు (క్రీడా. 122)

స్థానికులు ఆ ప్రదేశాలు చూపిస్తున్నపుడు శ్రీనాథుని కళ్ళ ముందు ఆ వీరచరిత్ర మళ్ళా కనబడి వుంటుంది. విన్న పాటను, కన్న ఆటను సమన్వయం చేసుకొని వుంటాడు. ఇంతటి ఉద్రేకపూరితమైన కథనాన్ని, ఉత్తేజవంతమైన కథను విన్నప్పుడు ఏ కవీ ఊరుకోడు. అందుచేత శ్రీనాథుడు పల్నాటి వీర కథలోని కొన్ని భాగాలను ఆశువుగా ద్విపదలో రచించి ఉంటాడు. కోళ్ళ యుద్ధంలో వైదికోపమానం చెప్పటం శ్రీనాథునివంటి వానికే తగును. చూడండి.

వృత్రాసురుండు దేవేంద్రుండు మరల
వైరముల్ పొడమగా వారి ఈపగిది
రూపులు మార్చి యారూఢివిక్రములు
కయ్యంబు చేయంగ కడగిరో యనగ.[16]

16. పల్నాటివీరచరిత్ర, విశాలాంధ్ర ప్రచురణ, పుట 142.

కోళ్ళు దెబ్బలాడాయట. పలనాటి వీరభారతాన్ని శ్రీనాథుడు ఎంత చెప్పాడో తెలియదు. కల్లుప్రతిష్ఠ, బాలచంద్రుల యుద్ధాలకు ఆద్యంతాలలో అతని పేరుంది. మిగతా భాగాలలో ద్విపద కవులు అతణ్ణి స్మరించాకనే రచన చేశారు. కాటమరాజు చరిత్రను వ్రాసిన కవులు సైతం శ్రీనాథుణ్ణి స్మరించి అతని వచన పద్ధతిలో కావ్యం వ్రాస్తున్నామన్నారు.[17] అందుచేత శ్రీనాథుడు కాటమరాజు చరిత్రను కూడా చెప్పాడేమో అని పండితులు భావిస్తున్నారు.[18] అయితే దీనిని శ్రీనాథుడు వ్రాయడానికి ఆస్కారం లేదేమో. పల్నాటి వీరచరిత్ర లాగా అప్పటికి కాటమరాజు కథ ప్రచారంలోనికి రాలేదు. శ్రీనాథుడు చాటువుగా పల్నాటి వీరులను గురించి చెప్పినట్లు కాటమరాజు కథలోని వ్యక్తులపై ఒక్క పద్యం కూడా వ్రాయలేదు. కాటమరాజు కథలాగా ప్రచారంలోకి వచ్చింది తాళ్ళపాక తిరువెంగళనాథుని కాలంలోనే. ఇతడు అన్నమాచార్యులవారి మనుమడు. క్రీ.శ. 1530–1550 ప్రాంతాలవాడు. ఇతడు తన ఇష్టమహిషీ కల్యాణంలో కాటమరాజు కథలోని పేర్లయిన 'ఎరనన్న, నలనన్న' మొదలైన పేర్లు, గొల్లల శివాలు పేర్కొన్నాడు.[19] పల్నాటి వీరుల శివాలను శ్రీనాథుడు ఇలాగా వర్ణించాడు.

> గర్జించి యరసి జంఘాకాండయుగళంబు వీరసంబెట కోల వ్రేయునొకడు
> ఆలీఢ పాదవిన్యాస మొప్పగ వ్రాలి కైంగతాభినయము గైకొను నొకండు
> బిగువుగన్నుల నుబ్బు బెదరు జూపులతోడ ఫీట్కార మొనరించు బెలుచ నొకడు
> పటుభుజావష్టంభపరిపాటి ఘటియిల్లధరణి యా స్ఫోటించి దాటు నొకడు
> ఉద్ది ప్రకటింప నొక్కరుండోలనాడు
> బయలు గుఱ్ఱంబు భంజళ్ళ బరపు నొకడు
> కొడుము దాటింపుచుమ బెద్ద గొలువులోన
> బడతి పల్నాటివీరుల బాడునపుడు. (క్రీడా. 117)

కాటమరాజు కథ విషయంలో శ్రీనాథుడు ఒక్క పద్యం కూడా ఇటువంటిది చెప్పినట్లు లేదు. పల్నాటి వీరచరిత్రలో కూడా శ్రీనాథుని పోకడలు గ్రహణం పట్టిన సూర్యుని కాంతిలాగా కనబడుతాయేమోగాని కాటమరాజు కథలో అటువంటి ఘట్టాలే లేవు.

ద్విపద సాహిత్యం చేసుకొన్న అదృష్టంకొద్దీ శ్రీనాథుడు కొన్నాళ్ళపాటు పల్నాటిసీమలో సంచరించాడు. ఆ గాథను గ్రంథస్థం చేశాడు. అయితే ఆ సీమపైన అతనికి మక్కువ లేదు. తిండి రుచించదు. ఊరు బాగులేదు. సన్నన్నం తినే అతనికి ఆ ప్రాంతం లోని జొన్నకూడు నచ్చలేదు.

---

17. కాటమరాజు కథ – మదరాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయం వారి ప్రచురణ, అవతరణిక, మొదటి పేజీ.
18. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శృంగార శ్రీనాథం, పుట 255, బంగారు తమ్మయ్యగారు; శ్రీనాథ మహాకవి – రెడ్డి సంచిక, పుట 281.
19. అష్టమహిషీ కల్యాణం, పుట 80.

జొన్నకలి జొన్నయంబలి - జొన్నన్నము జొన్న పిసరు జొన్నలుతప్పన్
సన్నన్నము సున్నసుమీ - పన్నుగ బలినాటి సీమప్రజలందరకున్.

ఈ జొన్నన్నానికి తోడు చింతకూర, బచ్చలికూరా కలిపి వండిన ఉడుకు పులుసు ఒకటి! ఆ చేదు శ్రీనాథుడు భరించలేకపోయాడు. తానేమిటి, తనను పుట్టించిన జేజెమ్మ కూడా తినలేడు. శ్రీనాథుడు శ్రీకృష్ణుణ్ణి ఇలాగ సవాలు చేశాడు:

పుల్లసరోజనేత్ర యల పూతన చన్నుల చేదు ద్రావినా
నల్లదవాగ్ని మ్రింగితి నటంచును నిక్కెదవేల? తింత్రిణీ
పల్లవయుక్తమౌ నుడుకు బచ్చలిశాకము జొన్నకూటితో
మెల్లన నొక్క ముద్ద దిగమ్రింగుము నీపస గానవచ్చెడిన్.

పోనీ ఈ హాలాహలాన్ని ఎలాగో దిగమింగుదామంటే నీళ్ళు కూడా కరువు. పై పద్యంలో శ్రీకృష్ణుణ్ణి సవాలు చేస్తే ఈ క్రింది పద్యంలో పరమేశ్వరుణ్ణి ఎత్తి పొడిచాడు.

సిరిగలవానికి జెల్లును - దరుణులు బదియారువేల దగబెండ్లాడన్
దిరిపెమున కిద్దరాండ్రా - పరమేశా! గంగవిడుము పార్వతి చాలున్.

ముష్టెత్తుకునేవానికి ఇద్దరు పెళ్ళాలెందుకు, గంగను విడిచిపెట్టమన్నాడు. పల్నాటి సీమలో శ్రీనాథునికి అక్షరాలా నీళ్ళు పుట్టలేదు కాబోలు. అందుకే విసుగెత్తిపోయాడు. ఈ పద్యాలు చెప్పాడు.

అంగడి యూరలేదు వరియన్నములేదు శుచిత్వమేమిలే
దంగనలింపులేరు ప్రియమైనవనంబులు లేవు, నీటికై
భంగపడంగ బాల్పడు కృపావరు లెవ్వరులేరు దాతలె
న్నంగను సున్న, గాన బలనాటికి మాటికి బోవనేటికిన్?
రసికుడుపోవడు పల్నా-డెనగంగా రంభయైన నేకులెవడకున్
వసుధేశుడైన దున్నును-గుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్.

పల్నాటికి 'గుడ్‌బై' చెప్పి, అంగన లింపుగా ఉండే చోటు, వనాలుండే ప్రదేశం, శుచిగా ఉండే పరిసరాలు గల గోదావరీతీరానికి వెళ్ళాడు. పెదకోమటి వేమునితోపాటు కాశీకి వెళ్ళినప్పుడు ఈ ప్రదేశాలను అతడు చూశాడు. మెచ్చుకొన్నాడు. దాక్షారామంలో భీమేశ్వరాలయానికి తన బంధువు బెండపూడి అన్నమంత్రి మొగలివాకిట మండపం కట్టించాడు. ఆ ప్రాంతాలకు వెళ్ళడమే ఉత్తమమనుకొన్నాడు. 1428 ప్రాంతాలలో అక్కడకు వెళ్ళాడు. సరిగ్గా అదే కాలానికి సాంపరాయని తెలుగురాయలు కూడా అశ్వారూఢుడై సింహాచలయాత్రకు వెళుతున్నాడు. శ్రీకాకుళంలోని ఆంధ్ర విష్ణువు పేరు ఆ రోజుల్లో చాలామంది పెట్టుకొనేవారు. ఆంధ్రవిష్ణువు తెలుగురాయడు. వ్యక్తులకేగాక గ్రామాలకు కూడా ఈ పేరు ఆ రోజులలో ఉండేది. నెల్లూరు మండలంలో ఆత్మకూరు

తాలూకాలో 'తెలుగురాయని పుర' మొకటి ఉంది. కృష్ణాతీరంలో శ్రీకాకుళాన్ని ఆనుకొని తెలుగు రాయని పాలెం ఒకటి ఉంది. సింహాచలంవైపు వెళుతున్న తెలుగు రాయలు ఏ గ్రామంవాడో తెలియదు కానీ అతడు ''కన్నడదేశంలోని సంబు రాయని కొడుకు'' అని ఒక శాసనం వల్ల తెలుస్తున్నది.[20] ఇతడు అశ్వారూఢుడైనపుడు చూసి శ్రీనాథుడు ఇలాగ దీవించాడు.

ధాటీ ఘోటకరత్న ఘట్టనమిళద్ధాఘిష్ట పల్యాణ ఘం
టా టంకార విలుంఠలుంఠన మదోన్మత్తాహితక్షోణి భృ
త్కో టీ రాంకిత కుంభినీధర సమాత్యూటాటవి ఝూట క
ర్ణాటాంధ్రాధిప! సాంపరాయని తెలుంగా! నీకు బ్రహ్మాయువౌ

కర్ణాటాంధ్రాధిపుడైన ఈ తెలుగురాయలు గోదావరీ తీరమండలంలో ఉండేవాడేమో. ఇతని పేరుతో కలిసిన సాంపరాయణ గ్రామం తుల్యభాగా నదీ తీరాన ఉంది. ఇది సాధారణమైన గ్రామం కాదు. ఆ రోజుల్లో అది మహా గ్రామం.[21] ఇది దాక్షారామానికి చేరువలో ఉంది. ఈ సాంపరాయణ గ్రామంలో ఉండే తెలుగు రాయల్ని యాచించి శ్రీనాథుడు కస్తూరి పుచ్చుకున్నాడు. తాను వెళుతున్నది అప్సరసల్లాంటి సానికూతులున్న దాక్షారామం. వాళ్ళకు బహూకరించటానికి కస్తూరి కావాలి. అందుకే దాపరికం లేకుండా తాను కస్తూరి ఎందుకు యాచిస్తున్నాడో దాతకు చెప్పాడు. చూడండి.

అక్షయ్యంబుగ, సాంపరాయని తెలుంగాధీశ! కస్తూరికా
భిక్షాదానము సేయరా సుకవిరాడ్బృందారక శ్రేణికిꣳ
దక్షారామ పురీ విహారవర గంధర్వాప్సరో భామినీ
వక్షోజద్వయ కుంభికుంభములపై వాసించు దద్వాసనల్![22]

శ్రీనాథుడు తన కింకేరాజుల ప్రాపకం లేనప్పుడు గోదావరీ మండలంలో సంచరిస్తున్నప్పుడు దాక్షారామానికి వెళుతూ సాంపరాయణ మహాగ్రామంలో ఆగినపుడు అక్కడి తెలుగురాయల్ని కస్తూరి యాచించాడనడమే సమంజసం.[23] ''శ్రీనాథుడు ఈశ్వరార్చనా కళాశీలుడు గనుక అతడేమాత్రం వేశ్యాలోలుడు కాడు. ఈ యాచించిన కస్తూరిని అతడు భక్తిశ్రద్ధలతో స్వామివారికి సమర్పిస్తే ఆ ప్రసాదాన్ని గుడిని నమ్ముకున్న సానులు మానులు పుచ్చుకొని తమ వక్షస్థలాలపై తామే వ్రాసుకొనెడివారని, శ్రీనాథుని హస్తాలు వేశ్యావక్షోజద్వయ సంపర్కంచేత మైలపడలేదని కొందరు భావించి ఇలా వ్రాశారు.

---

20. సింహాచలం శాసనం. దక్షిణభారత శాసన సంపుటి, 6వ భాగం, నెం. 905.
21. సాంపరాయ మహాగ్రామ సవిధనిలయు' భీమ 2-74.
22. దాక్షారామ పురీవిహార పరగంధర్వాప్సరో భామినీ - అని పాఠాంతరం.
23. బండారు తిమ్మయ్యగారు ఈ గ్రామాన్ని సరిగ్గా గుర్తించారు. గాని ఈ పద్యం వేములవాడ భీమకవిది అంటున్నారు. చూ. రెడ్డి సంచి. పుట 312.

'శ్రీనాథుని భావనలో దాక్షారామ రమాజనమంతయు భీమేశ్వర సేవకై సముపలబ్ధ జన్మముగల దేవగంధ ర్వాప్సరో జాతి వనితా సమితియే గాని మానవ భామినీ జన మేమాత్రమూ గాదు. యా దేవవేశ్యలు దేవతో భోగయోగ్యాలు గావలయు నట్టులేగాని మానవోపభోగయోగ్యులై యుండినట్టులు శ్రీనాథుని రచనా పద్ధతినిబట్టి యెచ్చటను తెలియవచ్చుట లేదు.'[24]

అయితే శ్రీనాథుని దృష్టిలో వాళ్ళు మానవోపభోగ యోగ్యులు కూడా అని చెప్పవచ్చు. భీమనాథుని సేవలో ఎలా ఆడి పాడుతారో, మంత్రిగారి భార్య నెల తప్పినా ఆ సీమంతోత్సవంలోనూ మేజువాణీ కట్టి నడివీధులలో ఆడి పాడుతారు.[25] భీమనాథునికేగాక మంత్రిగారి భార్యకు కూడా చామరాలు వీస్తారు. శుభకార్యంలో కావలసిన పనులు చూడండి.

పూజకుండలు నిల్పె బువ్వబోడి యొకర్తు శుభవితర్దిక చతుష్కోణములను
జాజాల పాలెల సర్వౌషధులు నించి ప్రోక్షించి నొక్కపద్మాక్షి జలము
కాంత యొక్క తె సన్నెకలు బొత్తరంబును దోరించె వటశాఖతోడగూడ
బీరికంబులు వెట్టె బింబోష్ఠి యొక్క తె మడుగుబట్టము గప్పె నడుగు మునుగ
రమణి యొక్క తె వింజామరంబు దాల్చె
దరుణి యొక్క తె తాళవృంతంబు పూనె
లలన యొక్కతె పసిడి సంబెల ధరించె
వాలపట్టంబు ధరియించె నతివయొర్తు. (శివరాత్రి. 2-56)

శ్రీనాథుని కాలంలో పంచారామవిలాసినులవల్ల ఇటువంటి భోగాలు అనుభవించిన మంత్రి బెండపూడి అన్నమంత్రి. అతడు భీమేశ్వరునికి మహావైభవోపేతంతో వసంతోత్సవం జరిపించేవాడు. ఇతడు కట్టించిన మండపంలోనే ఏటేటా భీమేశ్వరునికి కల్యాణ మహోత్సవాలు, సానికూతుల అభినయ ప్రదర్శన జరుగుతూండేవి. ఆ వేశ్యలు స్వామివారి కటాక్షవీక్షణాలకోసం ఎంత సేవించేవారో, మంత్రిగారి ఆదరాభిమానాల కోసం అంత ప్రాకులాడేవారు. అన్నమంత్రి గురించి, వీళ్ళ గురించి ఒకే పద్యంలో శ్రీనాథుడు ఇలా చెప్పాడు.

కాంచీకంకణ తారహార కటకగ్రైవేయ భూషావళుల్
లంచం బిత్తురు దూతికాతతికి లీల న్బెండపూడన్ననిన్

24. ఇది మిత్రులు చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు ''శ్రీనాథుని కవితా సమీక్ష'' - ''శ్రీనాథుడు శృంగారియా?'' అనే గ్రంథంలో 'చాటువులు' శీర్షికలో వ్రాసిన మాటలు. పుట. 19-20

25. శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యంలో యజ్ఞదత్తుని భార్య నెల తప్పితే పంచారామ లీలావతులు పదునాలుగు జాతులవారూ వచ్చారు. ''వేడ్క నృత్యంబులాడిరి వీధులందు - బాడి రెలుగెత్తి పికకుహూ పంచమమున - బంజళంబున ధవళప్రబంధగీత - కముల నప్పేళ కర్ణాటకమలముఖులు'' (2-54, 55)

బంచాస్త్రోవము దారతారకవయం బ్రార్థించి లోలోపలన్
బంచారామములందు బల్విలతపురిం బ్రౌఢేందు బింబాననల్. (భీమ. 1-78)

దాక్షారామంలోనో లేక రాజధానిలోనో శ్రీనాథుడు బెండపూడి అన్నమంత్రిని కలుసుకున్నాడు. కొండవీటికి రాజమండ్రికి గల విరోధాలు మరిచిపోయేటంత మార్పులు వచ్చాయి. కాటయ వేముడు పోయాడు. పెదకోమటి వేమారెడ్డి మరణించాడు. కాటయ వేముని వియ్యంకుడు అల్లాడరెడ్డి కూడా పోయాడు. అతని సోదరులు రాజ్యాన్ని ఆక్రమించుకుంటే పినతండ్రుల చేతిలోంచి అల్లాడ వేమారెడ్డి వీరభద్రారెడ్డి స్వాధీనం చేసుకొన్నారు. పాత రాజకీయ విప్లవం, వాటిలో శ్రీనాథుని పాత్ర విస్మరించి అతణ్ణి ఆదరించే తరుణం వచ్చింది. శ్రీనాథునికి రాజమండ్రీ రెడ్డిరాజుల ప్రాపకం కలిగించాలని అన్నమంత్రి తలచాడు. దానికి ప్రాతిపదికగా తానొక కృతి అంకితం పుచ్చుకొని శ్రీనాథునిపట్ల ప్రభువులను సుముఖులను చేయాలనుకొన్నాడు. శ్రీనాథుణ్ణి చూసి ఇలా అన్నాడు :

వినిపించినాడవు వేమభూపాలున కఖిలపురాణ విద్యాగమములు
కల్పించినాడవు గాఢపాకంబైన హర్షనైషధకావ్యమాంధ్రభాష
భాషించినాడవు బహుదేశబుధులతో విద్యాపరీక్షణవేళలందు
వెదజల్లినాడవు విశదకీర్తి స్ఫూర్తి కర్పూరములు దిశాంగణములందు
బాక నాటింటినాడవు బాంధవుడవు
కమలనాభుని పౌత్రుడవమలమతివి
నాకు గృపసేయు మొక ప్రబంధంబు నీవు
కలితగుణగణ్యా! శ్రీనాథకవివరేణ్యా! (భీమ. 1-23)

'సప్తసంతానాలు నాకు సంభవించాయి. ఒక్క కృతిమాత్రం వెలితిగా వుంది. ఆ లోటు తీర్చటానికి శివపురాణం తెనుగుగా చేసి అంకితం కావించు - అని అన్నమంత్రి అడిగాడు. స్కాందపురాణంలో గోదావరీ ఖండమనేది ఏదీ కనబడలేదు. ఇది శ్రీనాథుని స్వకపోల కల్పితమని, అతని తెలుగు భీమఖండాన్ని చూసి అర్వాచీనులు సంస్కృతీకరించి తెలుగు లిపిలోనే వ్రాసిపెట్టుకున్నారని పండితులు కొందరు భావిస్తున్నారు. మరికొందరు ఈ ప్రవాదం నిరాధారమని, శ్రీనాథునికి ముందే సంస్కృత గోదావరీ ఖండం ఉందని అది వ్యాసప్రోక్తమే అని విశ్వసిస్తున్నారు.[26] ఆ మూలాన్ని మాత్రం వ్యాసులవారు శ్రీనాథునిలాగా భీమఖండంలో ప్రతిమూలా తిరిగి వ్రాశారనీ చెప్పాలి. మూలాన్ని సాకుగా పెట్టుకొని శ్రీనాథుడు తాను భీమఖండంలో చూసిన ప్రతి చిన్న విషయాన్ని ఇందులో చొప్పించాడు. మూలంలోంచి నాలుగు నూలుపోగులు తీసుకొని వాటిని తన

26. శ్రీ భీమేశ్వరపురాణం (సరస్వతీ గ్రంథమండలి ప్రచురణ), చిలుకూరి పాపయ్యశాస్త్రిగారి పీఠికలో పుట. 11.

వర్ణనల జలతారుతో నేశాడు. కథ లేకపోయినా ఫరవాలేదు కమ్మని వర్ణనలుంటే చాలు అనే దృక్పథాన్ని మన సాహిత్యంలో ఇతడు ఈ కావ్యంతో ప్రవేశపెట్టాడు.

పేరుకు ఆరు ఆశ్వాసాల కావ్యమైనా మొదటి ఆశ్వాసమంతా అవతారికే. మిగతా ఆశ్వాసాలలోకూడా వర్ణనలే ఎక్కువ. వ్యాసుల వారి యాత్రలో మజిలీల వర్ణన మూడో ఆశ్వాసంలోగాని వ్యాసులవారు దాక్షారామంలో అడుగుపెట్టరు. అన్నట్లు చెప్పటం మరిచిపోయాను. వ్యాసులవారు ఎప్పుడూ కాశీలో ఉండేవారు. వారికీ, శిష్యులకీ ఒకసారి కాశీలో భిక్ష దొరకలేదు. దాంతో వారు అలిగి కాశీని శపించబోయారు. వారిని వారించి కడుపునిండా భోజనం పెట్టించి అన్నపూర్ణా విశ్వేశ్వరులు ఆయన్నే శపించి కాశీనుంచి వెళ్లగొట్టారు. వ్యాసులవారు దక్షిణకాశి అనే దాక్షారామానికి వచ్చి స్థిరపడ్డారు. ఇంతకు పూర్వం వేరే కారణాలవల్ల కాశీని వదిలిపెట్టిన అగస్త్యులవారు ఈయన్ని కలుసుకున్నారు. ఇద్దరూ ఉమ్మడిగా తూర్పుగోదావరి జిల్లాలో కొంత సంచారం చేస్తారు. కావ్యం వ్యాసులవారు కాశీ వదలిపెట్టడంతో మొదలవుతుంది. మూడో ఆశ్వాసంలో ఆయన అగస్త్యులవారితో కలిసి దాక్షారామంలో ప్రవేశిస్తారు. చతుర్థ ఆశ్వాసంలో క్షీరసాగర మథనం, హాలాహలభక్షణం మొదలైన శివపురాణ కథలున్నాయి. ఈ విషయాలను శ్రీనాథుడు ఇంతకుముందు హరవిలాసంలో వ్రాశాడు. అయితే అప్పుడు చూపెట్టని సొగసులు కొన్ని ఈ కావ్యంలో చూపించాడు.

హరవిలాసంలో దేవతలు సముద్ర మథనం ప్రారంభించే ముందు విఘ్నేశ్వరపూజ చేస్తారు. ఉండ్రాళ్ళు సూపిండి పెడతారు. ఒక దండకం చదువుతారు (హర. 2-15 నుంచి 2-58. ఎనిమిది గద్యపద్యాలు). ఇంత చేసినా హాలాహలం పుట్టింది. ఇది విఘ్నమే. అందుచేత భీమఖండంలో శ్రీనాథుడు కథ మార్చాడు. సముద్ర మథనం ప్రారంభించే ముందు సురాసురులు వినాయకపూజ మరచిపోతారు. ఉపక్రమించి శ్రమించగానే హాలాహలం పుట్టింది. దేవదానవులు పంచబంగాళమై పారిపోయారు. చివరకు శివుడు హాలాహలం మ్రింగి 'మనం వినాయకుణ్ణి పూజించటం మరచిపోయాము. అందుకే ఈ విఘ్నం వచ్చింది' అని చెప్తాడు. అప్పుడు సురాసురులు తాండవవిఘ్న నాయకునికి పూజలు చేస్తారు. సముద్ర మథనం తిరిగి ప్రారంభిస్తారు. ఈసారి అమృతం వగైరాలు లభిస్తాయి. అమృతం పంపకంలో జరిగిన అన్యాయానికి మండిపడి దానవులు కక్షకడతారు. త్రిపురాసురుడు విజృంభిస్తాడు. శివుడు అతణ్ణి నిర్జిస్తాడు.

ఆ తరువాత శివుడు ''పాయ కొక చోట చతికిలబడగనుండ నైననేమి ఫలము? ఊసుపోక వినోదంబులు పరీక్షింపగ ఆంధ్రక్షమాస్థలికి పోదామా?'' అనుకొంటాడు.[27]

దాక్షారామానికి మకాం మార్చేసి అతడు పరీక్షించిన వినోదాలు ఒకటా? రెండా? శ్రీనాథుడు భీమనాథునికి తన మనసునకు నచ్చినట్టు బుద్ధులు మప్పాడు. కట్టూ బొట్టూ మార్పించాడు.

27. భీమఖండం, 5-15, 16.

గజచర్మ మెన్నడోకాని నిచ్చలుకట్టు
పసిడికమ్ముల పట్టుపచ్చడమ్ము
భసిత మెన్నడోకాని ప్రతిదినమ్ము నలందు
మలయజమ్ము కురవంగ మదము గూర్చ
నిడుదపాముల రాజు తొడవు లెన్నడొ కాని
తారహారములు నిత్యము ధరించు
నృకరంకరుండమాలిక లెన్నడో కాని
ధరియించు గల్హారదామ మెపుడు
కాటినడు దక్కి నెన్నడో గాని యుండు
దక్షవాటి సువర్ణ సౌధములమీద
నెన్నడొ పిశాచులను గాని యిందుముఖుల
నెల్లకాలంబు దలచు భీమేశ్వరుండు. (భీమ. 1-116)

ఎల్లకాలం ఇందుముఖులను తలచడమే కాక శ్రీనాథుని భీమనాథుడు కొంచెం ధూర్తుడు. అంతఃపురాంగనల కన్నుగప్పి సానివాడకు వెడతాడు.

ఎనయంగల్గిన కూర్మి భృంగిరిటిగానీ తండుగానీ నికుం
భునిగానీ కయిదండ పట్టుకొని సంభోగేచ్ఛ నంతఃపురాం
గనలంగన్ను మొరంగి యప్పు రమునన్ గన్నేరుకాదారి ప్రా
ద్దున భీమేశుడు సానివాడ కరుగున్ ధూర్త ప్రకారంబునన్ (భీమ. 1-112)

శివుడు పధ్నాలుగు మహాయుగాల ముసలివాడు. ఇతనికి సానిపెళ్ళి ఎప్పుడు ఎందుకు మొఖం మొత్తదు? అది దాక్షారామ మహిమ! శ్రీనాథుని శివుడే కాదు. పాల్కురికి సోమనాథుని శివుడు కూడా ''దాక్షారామ మందు అహర్నిశలు కాంతా సుఖోప భోగంబులందుచు'' ఉంటాడు.[28] శివునికి సాక్షాజ్జగదంబ సమానులధికంబు గలరు దాక్షారామ మందు అని శ్రీనాథుడు చిన్నప్పుడే బసవపురాణం చదువుకొంటున్నప్పుడు తెలుసుకొన్నాడు.[29] శివుని విషయంలో చెప్పలేంకానీ శ్రీనాథుడు భీమఖండంలో షష్ఠ్యంతాల తరువాత గంటం పుచ్చుకొని ఓం ప్రథమంగా చేస్తున్న దాక్షారామ వర్ణనలో ఆడవాళ్ళే మొదటి పాదంలో అడుగుపెట్టారు.

పర్యంత మందార పారిజాతకవనీరమమాణ కిన్నరీ సముదయంబు. (భీమ. 1-88)

ఇంక రెండో పద్యం నుండి 7 పద్యాలలో ఆ వూరి సానులనే వర్ణించాడు. వీలు చిక్కినప్పుడల్లా వాళ్ళచేత ఆడించాడు. పాడించాడు. ఈ కావ్యంలో ఆద్యంతాలు శృంగార

28. బసవపురాణం - చతుర్థాశ్వాసం - హలాయుధుని కథలో ద్విపద నెం. 1181
29. బసవపురాణం - తృతీయాశ్వాసం - ముగ్ధసంగయ్య కథలో ద్విపద నెం. 348

వర్ణనలే ఉన్నట్లు తోస్తోందికానీ ఉదాత్తమైన భక్తిభావాలు, స్తుతులు, చక్కని గద్యాలు, వచనాలు వున్నాయి. పంచమాశ్వాసంలో 156 నుంచి 198 దాకా 43 గద్య పద్యాలు గల శివగీత వుంది.

తత్పదార్థంబు పరమాత్మ తలిరుబోణి
త్వంపదార్థంబుజీవుండు తలచిచూడు
దత్వ మారుత వేదసూత్రంబులోని
యర్థమిది చిత్తమందున నవధరింపు. (భీమ. 5-180)

ఇలా సులభశైలిలో వేదాంతం కూడా అందులో లేకపోలేదు. బమ్మెర పోతరాజు గారికి ఒరవడి పెట్టినట్టు లాటానుప్రాసంలో చెప్పిన శివభక్తిమయమైన పద్యం కూడా లేకపోలేదు. చూడండి.

శ్రీభీమనాయక శివనామధేయంబు చింతింపనేర్చిన జిహ్వ జిహ్వ
దక్షవాటీపురాధ్యక్ష మోహనమూర్తి చూడంగ నేర్చిన చూపుచూపు.
దక్షిణాంబుధి తటస్థాయి పావనకీర్తిచేనింప నేర్చిన చెవులు చెవులు
తారకబ్రహ్మవిద్యాదాత యొాదలవిరులు పూన్పగనేర్చు కరముకరము
ధవళకరశేఖరునకు బ్రదక్షిణంబు - నర్థిదిరుగంగ నేర్చిన యడుగు అడుగు
అంబికానాయకధ్యానహర్షజలధి - మధ్యమున దేలియాడెడి మనసుమనసు.
(భీమ. 3-197)

అయితే ''సాని ఈశానియై'' ఆడిన ఆటలు, పాడిన పాటలు మెచ్చి శ్రీనాథుడు కావ్యం అంతా సానికూతుల సౌందర్యం మెచ్చుకోవడానికి వ్రాసినట్టే అపోహపడేవాళ్ళు మొట్టమొదట అతని సమకాలికులే. అతడు రాజమండ్రిలో అడుగు పెట్టాక పండితం మన్యులకు కన్నెర్ర అయింది. వాళ్ళు కూపమండూకాలు. చదువు తక్కువ, గర్వం బోలెడు. అంతకుముందు ఏ పుస్తకంలోను చేయని కుకవినింద శ్రీనాథుడు భీమఖండంలో చేయవలసి వచ్చింది. వాళ్ళను ఇలా నిరాకరించాడు.

బోధ మల్పంబు గర్వ మభ్యున్నతంబు
శాంతి నిప్పచ్చరంబు మచ్చరము ఘనము
కూపమండూకములుబోలె గొంచె మెరిగి
పండితంమన్యులైన వైతండికులకు. (భీమ. 1-13)

వీళ్ళు కూపమండూకాలు కనుకనే శ్రీనాథుని శైలిని, భాషను తప్పుపట్టారు. కొందరు తత్సమపదభూయిష్ఠమైన అతని పద్యాల ప్రౌఢిని మాత్రమే చూసినవాళ్ళు శ్రీనాథుని భాష సంస్కృతం అన్నారు. పలుకు నుడికారం విన్నవాళ్ళు ఆంధ్రభాషే అన్నారు. ఎవ్వరేమను కుంటేనేం అని శ్రీనాథుడు తన భాషేమిటో తనే ఇలా వివరించాడు.

ప్రౌఢి బరికింప సంస్కృత భాష యండ్రు
పలుకునుడికారమున నాంధ్రభాష యుండు
ఎవ్వరేమండ్రుగాక నాకేటి కొరత
నా కవిత్వంబు నిజము కర్ణాట భాష (భీమ. 1-15)

తన భాష కర్ణాట భాష అనడంలో శ్రీనాథుడేమిటి ఉద్దేశించాడోకాని అందులోని అర్థం, అంతరార్థం ఇవాళ మనకు స్పష్టంగా తెలియదు. ఈ మాటకు నేటి పండితులు తలొకరూ తలో అర్థం చెప్తున్నారు. ఈ మాట పట్టుకొని కొందరితడు కన్నడదేశం వాడన్నారు.[30] కర్ణాటక దేశంలో జనించి కొండవీటికి చిన్నప్పుడే వచ్చాడని సమర్థించుకున్నారు. కొంతమంది, కర్ణాటక భాష అంటే ఆ భాషామర్యాదలను పాటించే తెలుగు కవిత్వం అని అర్థం చెప్పారు.[31] కొందరిది మాండలిక భేదాలను సూచిస్తుందన్నారు.[32] ప్రౌఢి పలుకు నుడికారాలను వేరుగా చెప్పి నాభాష కర్ణాట భాష అనడంవల్ల ఇది ఆ రెండిటి మిశ్రమాన్ని సూచించే శైలీ భేదమేమో అనిపిస్తుంది. అయితే కొత్త పరిశోధనలవల్ల తప్ప శ్రీనాథుడు ఉద్దేశించిన అంతరార్థం ఏమిటో చెప్పలేమని మాత్రం చెప్పవచ్చు.

శ్రీనాథుడు పాకనాటివాడు. ''పాకనాటింటివాడవు, బాంధవుడవు - కమల నాభుని మనుమడవమలమతివి'' అని బెండపూడి అన్నయ్య చెప్పాడు. (భీమ. 1-23). కమలనాభుడు తూర్పు సముద్రతీరంలో ఉన్న కాల్పట్టణానికి·అధీశ్వరుడేకాని వాళ్ళది పాకనాడు. శ్రీశైలం అడివార నుండి తూర్పు సముద్రందాకా విస్తరించిన సీమను పాకనాడు అని పిలిచేవారు. శ్రీనాథుని స్వస్థానాన్ని ఆనాడు కర్నాడు అని కూడా వ్యవహరించేవారు.

కర్ణినాడు, కర్నాట, కణ్ణవిషయ అన్నవి ప్రాచీననామాలు. నందికొట్కూరు, కర్నూలు, నంద్యాల తాలూకాలోని కొన్ని భాగాలు కలిసి ఒకప్పుడు కరునాడు అలి చలామణి అయ్యేవి. సాతవాహనుల కాలంలోని కర్ణిరాజుల ఏలుబడిలోని ప్రాంతాలను కర్ణినాడు అని పిలిచేవారు. కణ్ణ విషయమని వ్యవహరించేవారు. సాతవాహని కోటకు రూపాంతరమైన సాతానికోట ఇప్పటికీ ఈ ప్రాంతాలలో ఉంది. కులోత్తుంగ చోళుని కాలంలో కరునాడులోనివారు వడుగు అంటే తెలుగు మాట్లాడేవారు కళింగత్తుపరణి కావ్యంలో జయంగొండాన్ కవి ఇలా రాశాడు.

మఘులై చిరుమొఘియిల్, చిలవడగుం, చిలతమఘు
కురిత్తరు కరునాటియర్ కురికిక్కడై తిరమిన్.

దీన్ని నేను ఇలా అనువదించాను.

---

30. అక్కిరాజు ఉమాకాన్తంగారు: పల్నాటివీరచరిత్ర (వావిళ్ళ ప్రచురణ), ప్రథమభూమిక, పుట. 46.
31. చిలుకూరి వీరభద్రరావుగారు: ఆంధ్రుల చరిత్ర, మూడవ భాగం, పుటలు 214-217. కందుకూరి వీరేశలింగంగారి ఆంధ్రకవుల చరిత్ర, ప్రథమభాగం, పుట 511. వేదం వెంకటరాయశాస్త్రిగారు: శృంగార నైషధసర్వంకష, ప్రథమముద్రణావతారిక, పుట 7.
32. కుందూరి ఈశ్వరదత్తుగారు : 'శ్రీనాథుని కవిత్వతత్త్వము', పుటలు 27-28.

మురిపించుతూ కొన్ని ముద్దు తెలుగుపదాలు
అరవమ్ముతో కలసి అచటచట వాడబడుచు
చిరుతీపి పలుకులు చెవులు విందులుసేయ
కరునాడు యువతులు గడియతీయండి.

కులోత్తుంగుని కాలంలో కాదు పాల్కురికి సోమనాథుని కాలంలో కూడా కర్నూలు ప్రాంతాలను కర్నాడు అని పేర్కొనేవారు. కర్నూలు తాలూకాలోని గొబ్బూరును కర్ణాటక భూమికి కుటీరమని సోమనార్యుడు చెప్పాడు. శ్రీనాథుని కాలంలోనే పాకనాడులోని కొన్ని ప్రాంతాలకు పాలకుడైన తెలుగురాయణ్ణి ''కన్నడదేశమందులసాంబురాయని కొడుకు తెలుగు రాయడు'' అని పేర్కొనడం శాసనాల కెక్కిన విషయం.[33] ఈ తెలుగు రాయని కొడుకు తిరుమలయ్య దేవుడు గుంటూరు మండలంలోని నూతలపాడు ఏలిక.

శ్రీనాథునీ కాలంలో కొంత పాకనాడు, కొంత కమ్మనాడు కలిసి కర్నాడుగా చలామణి అయ్యేవని చెప్పవచ్చు. అందుకే తన భాషప్రౌఢివల్ల, సంస్కృతం పలుకు నుడికారంవల్ల తెలుగు అయినా 'మొత్తంమీద కర్ణాటక భాష' అని శ్రీనాథుడు చాటుకొన్నాడు. కొండవీడు, రాజమండ్రి మొదలైన చోట్ల ఎన్నాళ్ళుండినా అతని నెల్లూరి యాస పోలేదు కాబోలు. ఇతరులు 'మారుబాపనవారల్' అయిపోయి వుంటారు. యాస మాత్రమే కాదు శైలి కూడా చాలా తేడా ఉన్నదే.

శ్రీనాథుని శైలిని కొందరు ఆక్షేపించటానికి కారణం ఉంది. 'గాఢపాంకబైన హర్షనైషధకావ్య మాంధ్రభాష'లో కల్పించానని శ్రీనాథుడు సగర్వంగా చెప్పుకుంటాడు. అయితే కొన్ని ఆయువుపట్టు శ్లోకాలను అతడు యథాతథంగా తెలుగులోకి దించి చివర 'డుమువులు' చేర్చినట్టు కనబడుతుంది. అందుకే సంస్కృత పండితులు 'నీ డుమువులు నువ్వు తీసుకొని మా నైషధం మాకిచ్చేయి' అని శ్రీనాథునితో అన్నారని చెప్పుకుంటారు. ఇటువంటి కథలకు యీ క్రింది పద్యాలు కారణాలు. నైషధంలో శ్రీహర్షుడు సంస్కృత వ్యాకరణంలోని విషయాలను, పారిభాషిక పదాలను వాడి చక్కగా కల్పనలు చేశాడు. హంస నలునితో తను నానాదేశాలు చూశానని అన్నప్పుడు హర్షుడు గడుసుగా ఒక సకర్మకక్రియతో ఆడుకొన్నాడు.

సరసీః పరిశీలితుం మయా గమికర్మీకృతనైకనీవృతా
అతిథిత్వ మనాయాసాదృశోసదసత్సంశయగోచరోదరీ. (నైష. 2-40)

'గమ్' అనే క్రియకు కర్మగా చేయబడిన అనేక దేశములు కలవాడనై[34] సరస్సులు పరిశీలిస్తూ ఉందో లేదో అనే సందేహానికి ఆస్పదమైన నడుము కలదానిని చూశానని మూలంలోని భావం. దీనిని శ్రీనాథుడు మొదట ఇలాగ అనువదించాడు.

---

33. History of Reddi Kingdoms - P. 518

34. 'నేను అనేక దేశాలు వెళ్లాను' అనే వాక్యంలో 'నేను' కర్త; 'అనేక దేశాలు' కర్మ; 'వెళ్లాను' అన్నది క్రియ. ఈ మాటను డొంకతిరుగుడుగా చెప్పాలంటే వెళ్ల అనే క్రియకు కర్మగా చేయబడిన అనేక దేశాలు కలవాడనై అని చెప్పాలి. సంస్కృతంలో శ్రీహర్షుడు ఇదే చెప్పాడు.

మృదురీతిం బ్రతివాసరంబు గమికర్మీభూతనానానదీ
నదకాంతారపురీశిలోచ్చయుడనై నైకాద్భుత శ్రీజిత
త్రిదివంబైన విదర్భదేశమున నారీరత్నముం గాంచితిన్
సదసత్సంశయగోచరోదరి శరత్సంపూర్ణ చంద్రాననన్. (శృం.నైష. 2-20)

మూలంలో 'గమి కర్మీకృత...' అనే సమాసం ఉంటే అనువాదంలో 'గమీకర్మీ భూత...' అనే సమాసం ఛందస్సు వల్ల వచ్చింది. ఇది శ్రీనాథునికి నచ్చలేదు. నైషధాన్ని అనువాదం చేస్తున్నప్పుడు అతడు కొన్ని నియమాలు పెట్టుకొన్నాడు. శబ్దానుసరణ మొదటి నియమం. మూలంలో ఉన్న శబ్దాలను అవసరం అనుకొన్నంత వరకు అనుసరించడం మంచిదని భావించాడు. ఈ పద్యానువాదంలో 'గమీకర్మీకృతనైకనీ వృతా' అనే సమాసం రాలేదు. అంచేత ఈ శ్లోకాన్ని ఇంకోలాగ అనువదించాడు. అది ఈ పద్యం.

కమలేందీ పరషండమండితలసత్కాసారసేవారతిన్
గమికర్మీ కృతనైకనీవృతుడనై కంటిన్ విదర్భంబునన్
రమణింబల్లవపాణి పద్మనయనన్ రాకేందుబింబాననన్
సమపీనస్తని నస్తి నాస్తి విచికిత్సా హేతుశాతోదరిన్. (శృ.నై.2-21)

ఈ పద్యంలో మూలంలోని 'గమీకర్మీకృతనైకనీవృత' అనే సమాసం దిగుమతి అయినా తొలి పద్యంలో లాగ 'సదసత్సంశయ గోచరీదరి' అనే మూలంలోని సమాసం రాలేదు. ఇది తెలుగు ఛందస్సులోని ప్రాసవల్ల వచ్చిన చిక్కు! ఈ సమాసాలను యథాతథంగా దించాలంటే మత్తేభవృత్తంలోని ఏ పాదంలోనైనా మొదటి పదకొండు అక్షరాలలోనే సాధ్యం అవుతుంది. ఈ రెండు సమాసాలలోనూ రెండో అక్షరాలు విభిన్నమైనవి. అందుచేత ఈ రెండూ ఒకే పద్యంలో ఇమడ్చడం సాధ్యం కాదు. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కుదరకపోవచ్చుగానీ శ్రీనాథుడు బువ్వ తిని అవ్వదగ్గిర కూర్చుంటానని రెండు పద్యాలలో అనువాదం చేసి తన గడుసుదనం చూపించాడు. 'గమీకర్మీకృత...' అనే పదబంధం శ్రీనాథునికిష్టం. శృంగారనైషధంలోనే కాక భీమఖండంలో కూడా 'గమీకర్మీభూత కైవల్యమున్' అని వాడాడు (భీమ 6-37). ''తెలుగున గమనార్థమైన క్రియలేనపుడు 'గమీకర్మీకృతనై కనీవృతుడనై' అనుట కంటే 'అనేక దేశములు తిరిగిన వాడనై' అను అర్థమిచ్చు వేరొక వాక్యమును వాడుటయే సముచితమని తోచుచున్నది. ఇట్టి భాషాంతరములు సంస్కృత పాండిత్యముకల విద్వాంసులకే గానీ సామాన్యాంధ్రభాషాజ్ఞానము కలవారికి బోధపడవు'' అని కందుకూరి వీరేశలింగంగారు వ్రాసిన మాటలు అక్షరాలా నిజం.[35]

ఈ పద్యానికే ఇలా అనుకుంటే 'అతనికంటె ఘనుడు ఆచంట మల్లన్న' అని దీని పితృపితామహవర్గంలో ఉండే నిగూఢశాస్త్రార్థమున్న పద్యం మరొకటి ఉంది. చూడండి.

35. ఆంధ్రకవులచరిత్ర, ప్రథమభాగం, పుటలు 447-48.

ప్రాతఃకాలము వాయసంబు పణినాపత్యోక్త శాస్త్రంబులో
దాతజ్ స్థానులు చెప్ప డెవ్వి యను చందంబొప్ప గౌకౌయసం
జాతుర్యం బలరార నుత్తరము విస్పష్టంబుగా గోకిల
వ్రాతం బిచ్చె దుహీ తుహీ యని గృహారామ ప్రదేశంబులన్. (శృ.నై. 8-19)

కాకులు 'కావ్‌కావ్' అంటాయి. కోయిలలు 'కుహూకహూ' అంటాయి. కవిగారి చెవులకు కాకులు 'కౌ? కౌ?' అని కూస్తున్నట్లు, కోయిలలు 'తుహితుహి' అన్నట్టు వినిపించాయి. ఈ శబ్దాలమీద తన పాణినీయ పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ చమత్కరిస్తు న్నాడు. వ్యాకరణ పరిభాషలో ఆదేశములు, స్థానులు, అనే మాటలు ఉన్నాయి. మాటవరుసకు మన తెలుగులో 'కచటతప'లకు కొన్ని చోట్ల 'గసడదవ' లు ఆదేశమవుతాయి. వీటిలో కచటతపలు స్థానులు గసడదవలను ఆదేశాలు అని చెప్పుకోవచ్చు. సంస్కృతంలో తు, హి అనే అక్షరాలకు బదులుగా కొన్ని సందర్భాలలో తాత్(జ్) అనేది వస్తుంది.[36] అప్పుడు తు, హి లు స్థానులు తాత్ (జ్) ఆదేశం. నైషధంలో కాకి తాతజ్‌స్థానులు ఏ రెండు (కౌ) ఏ రెండు (కౌ) అని ప్రశ్నిస్తే కోకిలలు తుహీ తుహీ అని జవాబు చెప్పాయట. ఇటువంటి ప్రౌఢిని పరికిస్తే శ్రీనాథుని భాష సంస్కృతం అనడానికి ఎవరూ వెనుతీయరు. అయితే యీ పద్యాలు వ్రాసిన శృంగారనైషధంలోనే అతడు పలుకు నుడికారంలో తీయందనాన్ని చూపించాడు. కొన్ని చూద్దాం.

నీకంటికి పేలగింజయుం బెద్దయ్యెనే (1-110), తిలలు పైనెత్తి చల్లిన దిగువబడని యంత సందడి (4-123) ముదిసిముప్పున పెళ్ళి (4-129) పామునకు బలి ఈగకెన్నడు ఇలి (7-53) నిండు బండికింజేట భరంబె (7-76) ఆవగింజలు తాటికాయలుగా వాడి దొడ్డసేయుట (7-119), పారెడు నీళ్ళకుం గట్ట పెట్టం బనియేమి (7-122) చేదు తిన్న విధము (7-129) ఐదు పది చేయు (7-168).

తలుచుకుంటే చిన్న సంస్కృత శ్లోకాన్ని శ్రీనాథుడు చక్కని నుడికారంలో పెంచి అనువదించగలడు. తనను పట్టుకొన్న నలునితో హంస ఇలాగ అంది.

మదేక పుత్రా జననీ జతరాతురా నవప్రసూతి ర్వరటా తపస్వినీ
గతిస్తయోరేష జనస్తమర్దయన్నహెూ విధేత్వాం కరుణారుణద్ధినో (నై. 1-135)

---

36. ''పాణినీయ వ్యాకరణ శాస్త్రంలో 'తు' 'హి' యనెడు లోట్ప్రత్యయములకు బదులుగా తాజ్ (జ్) అనునది వచ్చును అని తుహ్యోస్తాత జాశిష్యన్యతరస్యామ్' అను సూత్రముచేత జెప్పబడియున్నది. బదులుగా వచ్చుదానికి ఆదేశమనియు, దేనికి బదులుగా వచ్చునో దానికి స్థానియనియును వ్యాకరణమందు సంజ్ఞలు. అట్లే 'యా' ధాతువునకు లోట్ప్రథమపురుషైకవచనరూపములు 'యాతు' 'యాతాత్' (పోవుగాక) అనునవి; లోణ్మధ్యమపురుషైక వచనరూపములు 'యాహి' 'యాతాల్' (పొమ్ము) అనునవి. 'కౌ' అనునది కింశబ్ద ప్రథమాద్వివచనము. 'తుహీ' అనునది తుశ్చ హిశ్చ తుహీ - తు శబ్దమునకు, హి శబ్దమునకు ద్వంద్వసమాసము, ప్రథమాద్వివచనము. తెల్లవారగానే ఇండ్ల తోటలయందు కాకులు 'కౌ కౌ' అనియు, కోయిలలు 'తుహీతుహీ' యనియు కూయుట ఎట్లుండెననగా 'తాతజ్ఞునకు' స్థానులేవని యడుగుటగాను, 'తుహులు' అని యుత్తరము చెప్పుటగాను ఉండినది'' అని ''శృంగారనైషధ సర్వంకష''లో వేదం వెంకటరాయశాస్త్రిగారు వ్యాఖ్యానించారు. పుట. 658-59.

ఈ శ్లోకంలోని ఒకే ఒక మాటతో శబ్దానుసరణ చేసి మిగతాదంతా తెలుగుదనంతో నింపి కరుణరసం జాలువారేటట్లు స్వభావోక్తులతో అనువదించాడు. చూడండి:

తల్లి మదేకపుత్రక, పెద్ద, కన్నులు గానవిప్పుడు, మూడుకాళ్ళముసలి
యిల్లాలు గడుసాధ్వి యేమియు నెరుగదు పరమపాతివ్రత్య భవ్యచరిత
వెనుకముందర లేరు నెనరైన జుట్టాలు లేవడి లేవడి యెంతేని జీవనంబు
గానకకన్న సంతానంబు శిశువులు జీవనస్థితి కేనతావలంబు
కృప దలంపగదయ్యా యోనృపవరేణ్యా
యభయ మీవయ్యా యోతుహినాంశు వంశ
కావగదవయ్యా యర్థార్థి కల్పశాఖి
నిగ్రహింపకువయ్యా యోనిషధరాజ! (శృ.నై. 1–109)

ఇంత చక్కగా తేటతెలుగులో అనువదింపగల నేర్పున్నా శ్రీనాథుడు ఆరభటీ వృత్తిలో చెప్పిన సమాసభూయిష్ఠమైన రచనలే నాటికీ నేటికీ పేరుకెక్కడం తప్పనిసరే అయింది. నిజానికి ఆరభటీవృత్తి అతనికీ, ఆంధ్రులకూ ఇష్టమేమో. శ్రీనాథుని ఒరవడి దిద్దని అనంతరకవి అరుదు. సమకాలికులు అతణ్ణి ఈసడించడం తాత్కాలికమే. అయితే అదే అతని మనసును బాగా కష్టపెట్టింది. కువిమర్శకు బాధపడని కవి ఎవడైనా ఉంటే వాడు మనిషే కాదని చెప్పాలి. శ్రీనాథుని శైలినేకాక శీలాన్ని కూడా రాజమంద్రిలోని పండిత మన్యులు దుయ్యబట్టారు కాబోలు. ఇహంలో వేశ్యలను ఆదరిస్తున్నందుకు తనను తిట్టిన వేదజడులను బహుశ వాళ్ళు తిట్టిన మోతాదులోనే ఇలా తిట్టాడు.

శ్రుతిశాస్త్రస్మృతు లభ్యసించుకొని విప్రుండంత నానాధ్వర
వ్రతుడై పోయి కనున్ బురందర పురారామద్రు మానల్ప క
ల్పతరు ప్రాంతకుడుంగ సుఖసుప్త ప్రాప్తరంభా భగ
ప్రతి రోమాంకుర పాటనక్రమ కళాపాండిత్య శౌండీర్యమున్.
(కవితా సమీక్ష చాటువులు పుట. 81)

ఇంత కటువుగా తిట్టడానికి శ్రీనాథుణ్ణి వాళ్ళు ఎంతగా రెచ్చగొట్టారో! తన కవిత్వంలోని సొగసును అర్థం చేసుకోనక వూరకే తర్కించడం మొదలుపెడితే ఏ కవికైనా బాధ కలుగుతుంది. 'కొయ్యబొమ్మల మెచ్చు కళ్ళకు కోమలుల సొరెక్కునా' అని ప్రశ్నించక తప్పదు.[37] శుష్క తర్కాలు చేసేవాళ్ళను శ్రీనాథుడు ఈ క్రింది విధంగా యద్దేవా చేశాడు.

హంసీయానకు గామికన్న ధమరోమాళు ల్నభః పుష్పముల్
సంసారద్రుమ మూలపల్లవగుళుచ్ఛంబైన యచ్చోటు వి
ద్వాంసు ల్రాజ మహేంద్రపట్టణమున న్ధర్మాసనం బుండి ప్ర
ధ్వంసాభావము ప్రాగభావ మనుచుం దర్కింతు రశ్రాంతమున్.

37. గురజాడ అప్పారావుగారు – ముత్యాల సరాలు.

ఈ ఎత్తిపొడుపు విన్నాక రాజమహేంద్రవరంలోని విద్వాంసులకు మరీ గంగ వెర్రులెత్తి ఉంటాయి. శ్రీనాథునిమీద ఉమ్మడిగా విరుచుకుపడి ఉంటారు. ''నీ కవిత్వం నిజంగా కర్ణాట భాష అయితే ఆ రాజ్యానికే పోక ఇక్కడెందుకు దిగబడ్డావు?'' అని యీసడించారేమో! సరే, అక్కడికే పోదామని శ్రీనాథుడు భావించాడు కాబోలు. రాజమండ్రి విడిచిపెట్టదలుచుకొన్నాడు. అతని మనస్తత్వం మంచిది. కాకిగోల పడలేక, హంస నోరు మూసుకొనడమే మంచిది. సహించలేకపోతే ఎక్కడికైనా పోవడమే మేలు. ఈ భావాలనతడు భీమఖండం రచిస్తున్నప్పుడు కుకవి నిరాకరణంలో చెప్పనే చెప్పాడు.

నికటముననుండి శ్రుతిపుట నిష్ఠురముగ
నడరి కాకులు బిట్టు పెద్దరచినప్పు
డుడిగి రాయంచ యూరకయుంట లెస్స
సైపరాదేని నెందైన జనుట యొప్పు. (భీమ. 1-14)

కూపమండూకాల బెకబెకలు, కుకవి కాకాల నిష్ఠూరాలూ శ్రీనాథుడు సైపలేకపోయాడు. ఎక్కడికైనా పోదామనుకున్నాడు. కర్ణాట రాజ్యంలో తన ప్రతిభ రాణిస్తుందని విజయనగరానికి బయలుదేరాడు. విజయనగరానికి వెళ్లే దారిలో శ్రీనాథుడు వినుకొండలోనే, మోపూరులోనే ఒక పెద్ద మజిలీ చేశాడు. బహుశా ఆ రెండు గ్రామాలలోనూ కొన్నాళ్లపాటు ఉండి ఉంటాడు. దానికి పెద్ద కారణముంది: తాను వెళుతున్నది పెద్దరాజ్యానికి, అక్కడి వాళ్లంతా తనకు కొత్త. ఫలించే పరిచయాలు చేసుకుంటే తప్ప రాజదర్శనం జరగదు. తన ప్రతిభను, పాండిత్యాన్ని గుర్తించి సరైనవాళ్లకు పరిచయం చేయదగిన స్నేహితుణ్ణి సంపాదించాలి. ఆ మిత్రుడు విజయనగర సామ్రాజ్యంలో మంచి పలుకుబడి కలవాడై ఉండాలి. తన రచనలోని సొగసులు కనిపెట్టడానికి తెనుగు కవిత్వం తెలిసినవాడై ఉండాలి. అటువంటి వ్యక్తి ఈ రోజుల్లో లేకపోలేదు. అతడు వినుకొండ వల్లభరాయడు.

ఈయన ఆ కాలంలో ములికినాటిలోని మోపూరు మీద అధికారిగా ఉండేవాడు. ఇది కడప జిల్లాలో పులివెందల తాలూకాలో ఉంది. అక్కడ ఏటా తిరునాళ్ళు జరిగేవి. ఆ ఉత్సవాలలో రాత్రులు నాటకాలూ అవీ ప్రదర్శించేవారు. ఎక్కడెక్కడనుంచో నటులు వచ్చేవారు. గ్రామాధికారిగా ఉండే వల్లభరాయడు ఈ ఉత్సవాలను చాలా ఆసక్తితో జరిపించేవాడు. అక్కడ ప్రదర్శించే నాటకాలలో కొన్ని ఇతడు వ్రాసినవే కాబోలు. శ్రీనాథుడు కలుసుకొనేనాటికి ఇతడు భైరవస్వామిమీద స్తుతులు, పద్యాలు వ్రాశాడు కాబోలు. ''ప్రత్యక్షమొనరించి భైరవస్వామిచే సిద్ధసారస్వత శ్రీ వరించె'' అని ఒక పద్యంలో శ్రీనాథుడు వల్లభరాయణ్ణి ప్రశంసించాడు.[38] అప్పటికే వల్లభరాయడు మంచి చాటువులు చెప్పి వాసికెక్కినట్టుంది; శ్రవ్యకావ్యాలుగాని, దృశ్యకావ్యాలుగాని వ్రాశాడేమో. శ్రీనాథుడు రెండు పద్యాలలో వల్లభరాయని చాటుపద్యాలను ప్రశంసించాడు. చూడండి.

38. క్రీడాభిరామం, పద్యం 22.

హాటకగర్భవధూటీ - వీటి కర్పూరశకలవిస్ఫురమరసౌర
భ్యాటోపచాటుకవితా - పాటవమరుదవనివల్ల భన్నకునమరున్. (క్రీడా. 24)

అమృతరసమథనసంభవ - ఘుమఘుమితవయః పయోధికోలాహలమున్
భ్రమియించు దిప్పసచివో- త్తము వల్లభవిభుని చాటు ధారాఫణితుల్. (క్రీడా. 26)

చాటుకవిత్వం చెప్పే ఈ వల్లభరాయడు క్రీడాభిరామం అనే రూపకాన్ని వ్రాస్తున్నాడు. ఇది రావిపాటి తిప్పన సంస్కృతంలో వ్రాసిన ప్రేమాభిరామం అనే నాటకానికి అనుసరణ. సరిగ్గా యీ రూపక రచన జరుగుతున్నప్పుడే శ్రీనాథుడు వల్లభరాయణ్ణి కలుసుకున్నాడు కాబోలు. వల్లభరాయడు వ్రాసిన ప్రతి పద్యాన్నీ అతడు సంస్కరించినట్టు కనబడుతుంది. తన పద్యాలనెన్నిటినో ఇందులో కలిపాడు. రూపకానికి ప్రస్తావనగా కృతికర్త వంశవర్ణన పూర్తిగా శ్రీనాథుడే చేశాడు. రావిపాటి తిప్పన్న వ్రాసిన ప్రేమాభిరామంలో ఏ ఇతివృత్తం ఉందోగాని శ్రీనాథుడు తన సిద్ధహస్తం వేసి పూర్తి చేసిన క్రీడాభిరామంలో తాను విన్నవీ కన్నవీ, అనుభవించినవీ ఆనందించినవీ అన్నీ ఓరుగల్లు నగరంలో కేంద్రీకరించాడు. క్రీడాభిరామానికి ఓరుగల్లు కథారంగం. ఈ తెనుగు నగరంలో ఒకనాడు సంచరించిన ఇద్దరు మిత్రుల అనుభవాలే ఈ రూపకంగా రూపొందించాడు. శ్రీనాథుడు కాక ఇంకెవరు ఈ రచనలో చెయ్యివేసినా ఈ వీధి ఇంత పకడ్బందీగా, పసందుగా ఉండేది కాదు. లభించినంతమటుకు క్రీడాభిరామంలో 294 గద్యపద్యాలు ఉన్నాయి. చివరి గద్యలో ఇలా ఉంది:

ఇది శ్రీమన్మహామంత్రి శేఖర వినుకొండ తిప్పయామాత్యనందన చందమాంబా గర్భపుణ్యోదయ సుకవిజనవిధేయ వల్లభరాయ ప్రణీతంబయిన క్రీడాభిరామంబను వీథినాటకంబున సర్వంబు నేకాశ్వాసము.

గద్యలో కవి పేరు ఇలా ఉన్నా ఈ కావ్యాన్ని శ్రీనాథుడే వ్రాశాడని ఇందులోని బోలెడు పద్యాలను, పదబంధాలను అతని ఇతర కావ్యాలలోని పద్యాలతో, పదాలతో తైపారు వేసి వేటూరి ప్రభాకరశాస్త్రిగారు రుజువు చేశారు. గ్రంథం సొంతం శ్రీనాథుడే వ్రాసి వల్లభరాయని పేరు పెట్టాడని వారు ప్రబలమైన సాక్ష్యాలు చూపించి చెప్పాక పండితలోకం చాలావరకు ఆ వాదాన్ని ఆమోదించారు. క్రీడాభిరామంలోని పచ్చి శృంగారాన్ని ఏవగించుకుని శ్రీనాథుడు ఇటువంటి కావ్యాన్ని సొంతం వ్రాసి ఉండడని భావించేవాళ్లూ, అతడు ఇరవైనాలుగు గంటలూ ఈశ్వరార్చన కళాశీలుడని నిరూపించదలచినవాళ్లూ కూడా ఈ గ్రంథంలో శ్రీనాథుని చెయ్యి లేకపోలేదని ఒప్పుకున్నారు.[39]

వల్లభరాయడుగాని, శ్రీనాథుడుగాని ఈ క్రీడాభిరామం మహాకావ్యం అని భావించి ఉండరు. ఇద్దరూ బోలెడు చాటువులు చెప్పినవాళ్ళు. వాటిలో రసవత్తరమైనవన్నీ

39. చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు ''శ్రీనాథుడు శృంగారియా?'' అని ప్రశ్నిస్తూ ''శ్రీనాథుని కవితాసమీక్ష'' అనే గ్రంథం వ్రాశారు. అందులో క్రీడాభిరామరచనలో సుమారు 40 పద్యాలు శ్రీనాథునివేనని ఒప్పుకున్నారు.

చేర్చి ఒక చిన్న కథాసూత్రంలో జారుముడి వేశారు. మోపూరు భైరవస్వామి తిరునాళ్ళలో ఏదో నాటకం వేయడానికి ద్వారసముద్రంనుంచి నటులు వచ్చారు. వాళ్ళచేత వల్లభరాయడు, శ్రీనాథుడు ఈ వీధి ఆడించి ఉంటారు. మహాకవి కాబట్టి ఆశువుగా ఎన్నైనా పద్యాలు చెప్పుకుంటూ పోగలడు కాబట్టి రూపకంలో మూడువంతులా ముప్పాతిక శ్రీనాథుడే తడుముకోకుండా సాయం పట్టి ఉంటాడు. తాను ఆశించినది వల్లభరాయనివల్ల వేరే ఉపకారమేగాని ఈ రూపక కర్తృత్వం కాదు కాబట్టి గద్య విషయంలో శ్రీనాథుడు పట్టించుకొని ఉండడు. పైపెచ్చు ఉదారంగా వల్లభరాయని పేర తానే గద్యం వ్రాయించీ ఉండవచ్చు. నటబృందంలో ఎవరో లేఖకుడు ఇది వ్రాసుకొని ఉంటాడు. పద్యాలు అద్భుతంగా ఉండబట్టి ప్రదర్శన తరువాత ఈ వీధికి ప్రతికలు పుట్టి వుంటాయి. రచనలో శ్రీనాథునికి ఉన్న ప్రముఖ పాత్ర తెలిసినవాళ్ళు దీనిని శ్రీనాథుని వీధినాటకమని పిలవసాగారు కాబోలు. ప్రతి సాహితీపరుని గ్రంథాలయంలోనూ దీని ప్రతి ఒకటి ఉండేదని చెప్పవచ్చు. శ్రీకృష్ణదేవరాయలవారు దీనిని చక్కగా చదువుకొన్నారు. ''దేశ భాషలందు తెలుగు లెస్స'' అనే వాక్యాన్ని రాయలవారు క్రీడాభిరామం నుంచే గ్రహించారు. ముద్దరాజు రామన్న (క్రీ.శ. 1580-1650), కాకునూరి అప్పకవి (క్రీ.శ. 1656), గణపవరపు వెంకటకవి (క్రీ.శ. 1676), కూచిమంచి తిమ్మకవి (క్రీ.శ. 1676) మొదలైన లాక్షణికులు ఈ క్రీడాభిరామంలో నుంచి ఉదాహరణలు ఇచ్చారు.

లాక్షణికులకు పనికి వచ్చినట్లే ఈ క్రీడాభిరామం సాంఘిక చరిత్రకారులకు మరింత ఎక్కువగా ఉపయోగిస్తుంది. రెడ్డిరాజుల యుగం నాటి కట్టుబొట్టులూ, ఆటపాటలు, ఆహారవిహారాలు, ఆచార వ్యవహారాలు ఎన్నో ఈ గ్రంథంవల్ల తెలుస్తాయి. ఆంధ్ర రాజ్యలక్ష్మి ఆటపట్టయిన ఓరుగల్లు ఆ రోజులలో ఎలా వుండేదో ఈ రూపకం వల్లనే ఎక్కువగా విశదం అవుతుంది. కోటవెలిపాలెం కట్టకడపట నున్న మేదరవాడ దగ్గరనుంచి ప్రతాపరుద్ర ధరణీశోపాత్తగోష్ఠీ ప్రతిష్ఠాపారిణీ మాచల్దేవి కొత్తగా కట్టించుకొన్న చిత్రశాలదాకా ఎన్నో వాడలు మేడలూ ఇందులో వర్ణించాడు. హట్టమార్గంలోని మైలసంతలో 'సుసరభే' త్తనే రోమహారిణిని బాహాటంగా ఎలుగెత్తి విక్రయించేవాళ్ల దగ్గర్నుండి సానులకు విటుల సందేశాన్ని చేరవేసే వీరభద్రేశ్వరా స్థానంలోని 'పూజారివిధవ' దాకా ఎంతమందినో రకరకాల వ్యక్తులను కళ్ళకు కట్టేట్లు చిత్రించాడు. ఈ పుస్తకం లేకపోతే తెనుగు చరిత్రలోని ఒక ప్రకరణంలోని వివరాలు లోపించేవి. ఆనాటి రసిక జీవనం ఇంతగా మనకు తెలిసేది కాదు. ప్రతి పుటలోను శ్రీనాథుని ముద్ర స్పష్టంగా కనబడుతున్న ఈ కావ్యానికి వల్లభరాయడే కర్త అని ఉన్నందువల్ల శ్రీనాథుని కీర్తికి ఏమాత్రం లోపం లేదు. ఆ మూలగ్రంథం అతడే వ్రాసాడని భావి పరిశోధనలవల్ల తేలి క్రీడాభిరామం సంపూర్ణ ప్రతులు దొరికి, అదనపు పద్యాలవల్ల నిర్ధారణ అయితే ఇంత పచ్చి శృంగారం వ్రాసినందుకు శ్రీనాథుని శీలానికి వచ్చే కళంకం కూడా కొత్తగా ఏమీ ఉండదు! శ్రీనాథుడు షష్టి గడియలూ మడికట్టుకొని ఉన్నట్లు నటించే కుహనశీలుడు కాడు. చేసినది

నిర్భయంగా చెప్పుకోగలడు. చూసినది నిస్సంకోచంగా వ్రాయగలడు. అతిగా శృంగారాన్ని వ్రాసినా అతడు అవినీతిని ఆకర్షవంతంగా ప్రచారం చెయ్యలేదు. ఆనాటి ప్రహసనాలలో ఉన్న జుగుప్సాకరమైన విషయాలను పక్కన పెడితే శ్రీనాథుని పద్యాలు చాలా అమాయకంగా పవిత్రంగా, నిర్మలంగా కనబడతాయి. శ్రీనాథుని అశ్లీలం సామాన్యునికి బోధపడదు.**40** బోధపడినా వారు కవిహృదయాన్ని అర్థం చేసుకోగలరుగాని అసహ్యించుకోరు.**41** అనంతర కవులు బూతుల బుంగలు కొన్ని శ్రీనాథుని భుజాలపై పెట్టినవాళ్ళు ఉన్నారు. దానికి శ్రీనాథుడు బాధ్యుడు కాడు.

ఎంతో కొంత తాను వ్రాసినా క్రీడాభిరామం పూర్తిగా వల్లభరాయని పేరుమీదుగా చలామణీ అవనివ్వడం శ్రీనాథుని హృదయ వైశాల్యానికి నిదర్శనం. వల్లభరాయడు ఈ మేలు మరచిపోకుండా ప్రత్యుపకారం చేసి విజయనగర సామ్రాజ్యంలోని ప్రముఖులకు శ్రీనాథుని పరిచయం చేసి వుంటాడు. వల్లభరాయడు మంచి హోదాలో ఉన్నవాడే. అతని తాత, తండ్రులు మంత్రులుగా, దండనాథులుగా విజయనగరం కొలువులో ఉన్నవాళ్ళే. వల్లభరాయని తండ్రి తిప్పన్నమంత్రి. వినుకొండ దుర్గానికి అధికారేకాక వీరహరిహరరాయల వారి రత్నభాండాగారానికి అధికారి. వల్లభరాయని పెత్తండ్రులలో ఒకడు సింగనమంత్రి. ఇతడు కూడా హరిహరరాయలవద్ద సేనానిగా, అమాత్యుడుగా ఉండేవాడు. ఈ అన్నదమ్ములు సేవించిన రాయలు క్రీ.శ. 1377 నుంచి 1404 దాకా పాలించిన రెండవ హరిహరరాయలు. శ్రీనాథుడు విజయనగరానికి వెళ్ళిన కాలం క్రీ.శ. 1428-38 ప్రాంతాలు. అప్పుడు రెండవ దేవరాయలు ఆ సామ్రాజ్యాన్ని పాలిస్తూ ఉండేవాడు. ఇతని ఆస్థానంలో పలువురు దిగ్దంతుల వంటి కవులూ, పండితులూ ఉండేవారు. ఆ కవులలో ఒకని పేరు ముమ్మయ్య. అతనితో శ్రీనాథునికి పరిచయం అయింది (బహుశ వల్లభరాయనివల్లనే). శ్రీనాథుడు విజయనగరం వెళ్ళాడు. ఆ రాజధాని చుట్టుపక్కలున్న ప్రకృతి రామణీయకతను చూశాడు. వాటంత మనోహరంగానూ తన కవిత్వముంటుందని ముమ్మకవితో చెప్పుకుంటూ శ్రీనాథుడీ చాటువు చెప్పాడు.

పంపావిరూపాక్షబహుజటాజూటి కా-రగ్వధప్రసర సౌరభ్యములకు
తుంగభద్రాసముత్తుంగ వీచీఘటా గంభీరఘుమఘుమారంభములకు
కళసాపుర ప్రాంతక దళీవనాంతర -ద్రాక్షాలతాఫల స్తబకములకు
కర్ణాటకామినీ కర్ణహాటకరత్న - తాటంక యుగ ధాళధళ్యములకు
నిర్నిబంధనిబంధమైనెనయుకవిత
తెలుగునను సంస్కృతంబున బలుకనేర్తు
ప్రౌఢదేవేంద్రరాయభూపాలవరుని
సమ్ముఖమ్ములన దయజూడు ముమ్మ సుకవి!

---

40. ఉదాహరణకు చూ. ''యజమానప్రమదావికస్వర...'' (శృంగా.నై. 7-133)
41. ఈ పద్యానికే చిలుకూరి పాపయ్యశాస్త్రిగారి సమర్థింపు. శ్రీనాథుని కవితాసమీక్ష (శ్రీనాథుడు శృంగారియా?) మొదటి భాగం, పుటలు 34-35.

ముమ్మ కవి దయచూశాడో లేదో తెలియదు గానీ కన్నడ రాజ్యలక్ష్మికి దయ రాలేదు. శాస్త్రనిషిద్ధమైన వస్త్రాలు ధరించి, ఆహారాలు భుజించి అతడు చాలా కష్టపడ్డాడు. టోపీలు పెట్టుకొనడం,[42] తలపాగాలు చుట్టడం, అంగరఖాలు తొడగడం, వితంతువు వడ్డిస్తే తెలకపిండి, వెల్లుల్లీ తినడం, చల్లా అంబలీ త్రాగడం మొదలైనవి చెయ్యకూడని పనులు చేయవలసి వచ్చింది. ఈ గోడు శ్రీనాథుడు క్రింది పద్యంలో ఇలా చెప్పుకున్నాడు.

కొల్లా యుంచితి గోక సుట్టితి మహాకూర్పాసముందొడ్గితిన్
వెల్లుల్లిన్ దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా
జల్లాయంబలి ద్రావితిన్ రుచులు దోసంబంబు బోనాడితిన్
తల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుడన్.

శ్రీనాథుడు అనే పేరు చెప్తే చాలు, అతని విద్వత్తు ఏమిటో తెలుసుకొనేటంత కీర్తిమంతుడు అతడు. కొండవీటి రాజ్యంలో విద్యాధికారిగా ఉండి బహుదేశబుధులతో విద్యాపరీక్షణ వేళలందు భాషించినవాడు; తన కీర్తి కర్పూరాలు దిశాంగణాల వెదజల్లాడు. ఇటువంటి పేరుప్రఖ్యాతులు ఉండబట్టే బహుశా కొందరు అసూయాగ్రస్తులైన పండితులు శ్రీనాథునికి సభాప్రవేశం కలుగనివ్వలేదు కాబోలు.

అటువంటి పండితులలో అరుణగిరినాథుడొకడు. ఇతనికి కవిసార్వభౌముడనే బిరుదు ఉండేది. ఇతని పితామహుడు కూడా గొప్ప పండితుడు. తండ్రి అష్టభాషాకవితా సామ్రాజ్యపట్టాభిషిక్తుడు. తల్లి తండ్రి (తాత) శైవవేదాంత పారంగతుడు. విజయ డిండిమము కలవాడు. ఈ మాతామహుని వద్దనుంచే అరుణగిరినాథుడు డిండిమ బిరుదును దఖలు పుచ్చుకొన్నాడు. 'బిరుదడిండిమవాద్యసంతాడిత వినుతకవిమండలుడు డిండిమకవి సార్వభౌముడు' అన్నది ఇతని బిరుదు. ఇతని వైభవాన్ని, దర్పాన్ని చెప్పే చాటువు ఒకటుంది.

అగ్రే డిండిమతాడనం తతఇతో వందివ్రజోద్ఘోషణం
ద్విత్రా శ్చిత్రపటాఃకియంతి బిరుదప్రోతాని పద్యానినః
అస్తాం తాప దిదం మహేశమకుటీకోటీరకల్లోలినీ
కల్లోలప్రతిమల్లసూక్తివిభవైర్ద్వేష్యాన్విజేష్యామహే.

ఈ శ్లోకాన్ని చక్కగా తెనిగించి వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఇలాగ వివరించారు.[43]

మాకు ఎట్టయెదుర విజయడిండిమము మ్రోయింపు, ఇటువంటి వందిజనుల స్తోత్రములు, రెండుమూడు చిత్రపటములు (రూపప్రతిబింబాలు?) మరికొన్ని

42. విజయనగరరాజ్యంలో రాజులు, రాజోద్యోగులు, ఆస్థాన పండితులు అందరూ టోపీలు పెట్టుకోవాలి. నాచన సోముడు విజయనగరానికి ఆశ్రితుడు. అతడు 'పిడుగువేసిన తలటోపి యాగునే' (ఉ.హరి.4-146) అని వ్రాశాడు. తిరుపతిలోని కృష్ణదేవరాయలవారి విగ్రహానికి టోపీ ఉంది.

43. శృంగార శ్రీనాథం, పంచమప్రకరణం, పుట 163.

బిరుదాంకితములగు పద్యములు గలవు. ఇవి యిట్లుండ పరమేశ్వరుని జటాఘుటింపజాలు సూక్తివైభవములచే ప్రత్యర్థి పండితులను జయింతుము.

ముంగల జైత్రడిండిమపు మ్రోతలు వందిజనస్తవార్భటుల్
చెంగట రెండుమూడు తన చిత్తరువుల్ బిరుదాంకి తంబులిం
కం గల వింతకంటే శతికంఠశిరస్స రిదూర్మిభంగివా
గ్బంగు లెసంగు మాకు ప్రతిపక్షబుధౌఘము నోడగొట్టగన్

విద్యానగర వీధులలోనే విద్వాంసుల ఇళ్ళలోనే మరెక్కడో డిండిమభట్టూ శ్రీనాథుడు ఘర్షణ పడినట్లున్నారు. వాదం పెట్టుకున్నారు కాబోలు. ఒకరినొకరు సవాలు చేసుకున్నారేమో.

''నేను కవిసార్వభౌముణ్ణి సుమా!'' అని అరుణగిరినాథుడు అని ఉంటాడు.

''నేనూ అంతే'' అని శ్రీనాథుడు అని వుంటాడు. 'మరి నీ బిరుదులు ఏవి' అని అక్కడివారు అడిగి వుంటారు. సమయస్ఫూర్తిగల శ్రీనాథుడు ఇలాగ సమర్థించు కొన్నాడు.

తరువున గాండివంబిడడె ధర్మరాజునాన గిరీటి? యేను వా
క్సరసిజనేత్రయానతి విచారము చొప్పున గర్వహీనతన్
మరలి తెనుంగుభూమి కసమానగతిన్ గొనిపోవువాడనే
బిరుదులు నారివాగుకడబెట్టితి సత్కవిసార్వభౌముడన్

'నేను అజ్ఞానవాసం చేస్తూన్న అర్జుననంతటివాణ్ణి. సరస్వతీదేవి ఆజ్ఞచేత నా బిరుదులను దాచాను' అని టక్కున చెప్పిన శ్రీనాథుణ్ణి డిండిమ భట్టూ, అతని శిష్యులూ వెటకారం చేశారేమో! కంచుఢక్కను కర్ణకఠోరంగా మ్రోగించారేమో? ఇటువంటి ప్రత్యర్థిని గెలవకపోతే ఎలాగ? శ్రీనాథుడు ఈ క్రింది విధంగా భావించి వుంటాడు.

కంటికి నిద్రవచ్చునె? సుఖంబగునేరతికేళి? జిహ్వకున్
వంటకమించునే? యితరవైభవముల్ పదివేలు మానసం
బంటునె? మానుషంబు గలయట్టి మనుష్యున కెట్టివానికిన్
గంటకుడైన శాత్రవు డొకండు తనంతటివాడుగల్గినన్?[44]

వాదం పెట్టుకుంటే ఇలాంటి కవితో పెట్టుకోవాలి. ఇటువంటి ప్రౌఢ పండితుణ్ణి గెలిస్తే పేరూ, ప్రతిష్ఠా ఉంటాయి. అందుకే దేవరాయలకు శ్రీనాథుడు యీవిధంగా విన్నపం చేసుకున్నాడు.

డంబుసూపి ధరాతలంబుపై దిరుగాడు కవిమీదగాని నాకవచ మేయ
దుష్ప్రయోగంబుల దొంకొని చెప్పెడు కవిశిరస్సునగాని కాలుచాప

---

44. కాశీఖండంలో శ్రీనాథుడీమాటలు వింధ్య పర్వతంచేత చెప్పించాడు. (కాశీ. 1–108)

సంగీతసాహిత్య సరసవిద్యల నేర్పు కవుల రొమ్ములగాని కాల్చి విడువ
చదివి చెప్పగ నేర్చి సభయందు విలసిల్లు కవినోరుగాని వ్రక్కలుగ దన్న

దంటకవులకు బలువైన యింటిమగడ
గవుల వాదంబు వినవేడ్క కల్గెనేని
నన్ను బిలిపింపు మాస్థానసన్నిధికిని
లక్షణోపేంద్ర! ప్రౌఢరాయక్షితీంద్ర!

ప్రౌఢదేవరాయలకి కవుల వివాదం వినాలనే వేడుక కలిగింది. సభ పెట్టించాడు. ఇంతటి ఉద్దండ పండితులు వాదించుకుంటున్నప్పుడు మాధ్యస్థం చేయగలిగినది ఎవరు? విజయనగర రాజులకు కులగురువైన చంద్రభూషక్రియాశక్తి ఒడయరు తప్ప ఇంకెవరు మాధ్యస్థం చేయగలరు.[45] నిండుకొలువులో రాజు, రాజగురువు, కవులు, పండితులు ఉన్నారు. శ్రీనాథుడూ డిండిమభట్టూ వాదం సలిపారు. ఏ విషయం మీదనో చెప్పలేం కానీ ఎలా సాగిందో చెప్పగలం. అది ఉద్భటంగా సాగింది. శ్రీనాథుని పాండిత్యం సామాన్యం కాదు. అతడు సంస్కృతం, ప్రాకృతం, శౌరసేని మొదలైన భాషల్లో సపరిజ్ఞాన పాటవం కలవాడు. శ్రుతి స్మృతి పురాణేతిహాసాలు షట్శాస్త్రాలు మథించినవాడు. ఇక కవిత్వం సంగతా? అతడు చుళుకీకృత సంస్కృత వాఙ్మయ జలనిధి అని చెప్పవచ్చు. అతడు నుతించినంతమంది సంస్కృత కవులను ఇంకెవరూ నుతించలేదని చెప్పాలి. చూడండి ఈ పట్టిక:

1. వ్యాసుడు 2. వాల్మీకి 3. భట్టబాణుడు 4. మయూరుడు 5. భవభూతి 6. శివభద్రుడు 7. కాళిదాసు 8. రాజశేఖరుడు 9. భారవి 10. మాఘుడు 11. ప్రవరసేనుడు, 12. దండి 13. భాసుడు 14. శ్రీహర్షుడు 15. బిల్హణుడు 16. మల్హణుడు 17. భట్టి, 18. చిత్రపకవి 19. సొమల్లుడు 20. భల్లుడు 21. క్షేమేంద్రుడు.

పేరు చెప్పి నుతించకపోయినా శ్రీనాథుడు అనుసరించిన కవులు ఇంకా వున్నారు. భట్టుమురారి విశాఖదత్తుడు, భట్టగోపాలుడు మొదలైన ముఖ్యులే ఉన్నారు. ఇంతటి పాండిత్యం, సాహిత్యం ఉన్న శ్రీనాథుడు అమోఘంగా అన్ని శాఖలలోనూ వాదించి వుంటాడు. డిండిమభట్టు ఓడిపోయాడు. ఎదుట వాగే అతని కంచుఢక్కను శ్రీనాథుడు పగల గొట్టించాడు. ప్రౌఢదేవరాయలు శ్రీనాథుణ్ణి ప్రశంసించి డిండిమభట్టుకుండే కవిసార్వభౌమ బిరుదు ఇతనికిచ్చాడు. ఆ ప్రభువుకు ధన్యవాదాలు చెప్తూ కీర్తించడానికి ముందు ఇతర నృపులను పొగడిన వాగ్దోషం పోవడానికిగాను తనకు కనకస్నానం చేయించమని ఈ క్రింది పద్యంలో అడిగాడు.

---

45. చంద్రభూషక్రియాశక్తి ఒడయరు గురించి శాసనాలు క్రీ.శ. 1400 నుంచి 141 దాకా పాలించిన మొదటి దేవరాయల కాలంలోనే ఉన్నవని, శ్రీనాథుడు దర్శించిన దితనినే అని నేలటూరు వెంకటరమణయ్యగారు అభిప్రాయపడుతున్నారు. (భారతి, అక్టోబరు 1945).

జననాథోత్తమ! దేవరాయనృపతీ! చక్రేశ శ్రీవత్సలాం
ఛనసంకాశ! మహాప్రభావ! హరిదక్షారక్ష! నాబోటికిన్
గున్నృపస్తోత్రసముద్భవంబయిన వాగ్దోషంబు శాంతంబుగా
గనకస్నానము చేసిగాక పొగడంగా శక్యమే దేవరన్?

దక్షిణాధీశుడు ప్రౌఢదేవరాయలు తన ముత్యాలశాలలో సభామధ్యమున ఉన్నత పీఠంపై కూర్చోపెట్టి కవిసార్వభౌమునికి కనకాభిషేకం చేయించాడు. తలకడుగునీళ్ళు స్నానం చేసినవాడు మళ్ళా సొంతానికి ఉపయోగించడు. అందుకే శిరస్సుమీద జలధారలాగా క్రుమ్మరించిన దీనారటంకాలను ఆ సభలోవున్న ఇతర విద్వాంసులకు పంచి పెడతారు. శ్రీనాథుని అభిషేకించిన బంగారు నాణెములు అలాగే ఇతరులు పంచుకొన్నారు. ఇంక దేవరాయల్ని దీవించాలి. అప్పుడు శ్రీనాథుడు భారతీదేవిని ఈ విధంగా ప్రార్థించాడు.

జోటీ భారతియర్భాటీన్మెరయుమీ చోద్యంబుగా నేను గ
ర్ణాటాధీశ్వరు ప్రౌఢదేవనృపతిన్ నాసీర ధాటీచమూ
కోటీఘోటకధట్టికకకాఖురపుటీ కుట్టాక సంఘట్టన
స్ఫోటిధూతధరారజశ్చుళుకితాంభోటిన్‌బ్రశంసించెదన్.

శ్రీనాథుడు దేవరాయలను ఏమని ప్రశంసించాడో తెలియదు. ఆ చాటువులు గాని, కావ్యాలుగాని దొరకవు. కనకాభిషేకం తరువాత కొన్నాళ్ళు కర్ణాట దేశంలో ఉండి అక్కడి రాజును, విద్వాంసులను ఆనందింపజేసి వుంటాడు. 'కర్ణాటదేశ కటక పద్మవనహేళి శ్రీనాథ భట్టమౌళి' అని తనను తాను చెప్పుకున్నాడు.[46-1] ఇటువంటి విశేషణాన్ని ఇంతకు ముందు శ్రీనాథుడు శ్రీహర్షునికి వాడాడు. అతణ్ణి కాశ్మీర నృపసభా కమలహేళి అని పిలిచాడు.[46-2] కర్ణాటక నృప సభాకమలాలను వికసింపజేశాడేకానీ శ్రీనాథుడు శాశ్వతంగా అక్కడే ఉండిపోదలుచుకోలేదు. సూర్యునిలాగా సాగిపోయాడు. మరల తెనుంగుభూమికి అసమానంగా బిరుదులు పట్టుకొని పోతానని చేసిన శపథం చెల్లించుకొని నిజంగానే అసమానంగా తిరిగి వెళ్ళాడు. తన కాలంలో మూడు ముఖ్యమైన రాజ్యాలు తెలుగు గడ్డను పాలిస్తున్నాయి. ఒకటి - రెడ్డిరాజ్యం. రెండు - విజయ నగర సామ్రాజ్యం. మూడు - పద్మనాయకుల రాచకొండ, దేవరకొండ ప్రభుత్వాలు. ఈ మూడింటిలో రెండు రాజ్యాలలో తాను సత్కారాలు పొందాడు. మూడోదానిలో కూడా సన్మానాలు పొందితేనేకానీ తృప్తి లేదని శ్రీనాథుడు పద్మ నాయక రాజ్యానికి ప్రయాణం కట్టాడు.

అప్పటికి ముమ్మడి సింగభూపాలుడు రాచకొండను పాలిస్తుండేవాడు. అతని రాజ్యకాలం క్రీ.శ. 1430-1475 మధ్య ప్రాంతాలు. ఇతనికి కూడా ఇతని పితామహునికి సర్వజ్ఞ బిరుదు ఉండేది.[47] ప్రజ్ఞా బలార్జితాన్వర్థ సర్వజ్ఞ బిరుదోజ్జ్వలుడని దేశాంతరాళ

46-1. కాశీఖండం, 1-7.

46-2. శృంగారనైషధం, 1-16.

47. విజ్ఞానసర్వస్వం - తెలుగుభాషాసమితి -3వ సంపుటి, పుట 301.

విశ్రాంత యశస్క పరాక్రముడని ఇతణ్ణి తిరుపతి శాసనంలో కీర్తించారట.[48] ఇతణ్ణి దర్శించడానికి శ్రీనాథుడు వెళ్ళడు. ఈ రాజు ప్రజ్ఞాబలం చేత సర్వజ్ఞ బిరుదు పొందినవాడు. కనుకనే ఇతణ్ణి ఎలా మెప్పించాలో అని శ్రీనాథుడికి బెంగ పట్టుకుంది. తన ఇష్టదైవమైన శారదాదేవిని ఇలాగ స్తుతించాడు.

దీనారటంకాల తీర్థ మాడించితి దక్షిణాధీశు ముత్యాలశాల
బగులగొట్టించి తుద్భటవివాద ప్రౌఢి గౌడడిండిమభట్టు కంచుఢక్క
చంద్రభూషక్రియా శక్తి రాయల యొద్ద బాదు కొల్పితి సార్వభౌమబిరుదు
పలుకుతోడై తాంధ్రభాషామహాకావ్య నైషధగ్రంథసందర్భమునను
నెటుల మెప్పించెదో నన్ను నింకమీద రావు సింగమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండు నీవు సకలసద్గుణనికురుంబ శారదాంబ

పవిత్రమైన స్త్రీలకు 'సద్గుణనికురుంబ' అనే విశేషణం వాడడం శ్రీనాథునికి ఇష్టం. 'భూరిసద్గుణనికురుంబ సూరమాంబ' అని ఫిరంగిపురం శాసనంలో వాడాడు.[49] ముదిత సజ్జననికురుంబ ముమ్మమాంబ అని కడపటి గ్రంథంలో వ్రాశాడు.[50] ఎలాగ మెప్పిస్తావో అని దేవతలమీద భారం వేసి శ్రీనాథుడు వెళ్ళడానికి రాజకీయపు కారణాలు కూడా ఉన్నాయి. తాను లోగడ రెడ్డిరాజుల ఆస్థానంలో ఉన్నాడు. వాళ్ళకు పద్మనాయకులకు బద్ధవైరం. శత్రువుల మనిషిని సింగభూపాలుడు చిన్నచూపు చూస్తాడేమో అని భయం. అయితే అతడు సర్వజ్ఞుడు. సంకుచిత స్వభావం కలవాడు కాడు. శ్రీనాథుణ్ణి రెండుచేతులా ఆదరించి అభిమానించి ఉంటాడు. అందుకే శ్రీనాథుడు ఈ క్రింది పద్యం చెప్పాడు.

సర్వజ్ఞ నామధేయము శర్వునకే రావుసింగజనపాలునకే
యుర్వింజెల్లును దక్కొరు - సర్వజ్ఞుడనుట కుక్క సామజమనుటే.

ఈశ్వరుని సర్వజ్ఞుండనటం లాక్షణిక వృత్తి అని శ్రీనాథుడు ఇంతకు ముందు నైషధంలో దశావతారస్తుతిలో వ్రాశాడు.

ముఖ్యచతురాననుడ వీవు మునిశరణ్యా
గౌణచతురాననమండల కమలభవుడు
నీవు సర్వజ్ఞుడవు బుద్ధిదేవ! నిజము
శంభుసర్వజ్ఞుడనుట లాక్షణికవృత్తి. (శృ.నై.140)

శ్రీనాథుని ప్రతిభకు, పాండిత్యానికి, కవిత్వానికి, మాటకారితనానికి మెచ్చుకొని రావుసింగమహీపాలుడు ఏం కావాలో కోరుకొమ్మన్నాడు. పద్దెనిమిది సంవత్సరాలు ఎవరి కొలువులో తాను విద్యాధికారిగా పనిచేశాడో ఆ పెదకోమటి వేమారెడ్డిని ఒకప్పుడు

48. విజ్ఞానసర్వస్వం (తెలుగు భాషాసమితి) 3వ సంపుటి, పుట 305.
49. శాసనపద్యమంజరి, ప్రథమభాగం, పుట 94.
50. శివరాత్రి మాహాత్మ్యం, 1-18.

ఈ పద్మనాయక ప్రభువులు జయించి, రెడ్డిరాజులు సగర్వంగా ఎంచుకొనే 'నందికంత పోతరాజు' కఠారిని తీసుకుపోయారు. అది పరరాజుల అధీనంలో కన్నా తనవంటివాళ్ళ చేతిలో ఉండటం మంచిది అని శ్రీనాథుడు భావించి వుంటాడు. ఆ కఠారిని అడిగి పుచ్చుకున్నాడు. దానిని చూస్తుంటే పాతరోజులు జ్ఞాపకం వచ్చి ఉంటాయి. తాను చిన్నప్పుడు తిప్పయసెట్టితో కొండవీడు వెళ్ళటం, మామిడి సోదరులకు కృతులు ఇవ్వడం, పెదకోమటి వేమారెడ్డికి ప్రధాన రాజ్యం సంపాదించటానికి సున్నితమైన రాజకీయ వ్యవహారాలలో తను పాల్గొనడం, తాను విద్యాధికారి అవడం అన్నీ మళ్ళీ ఒక్కసారి కళ్ళముందు నాటకంలాగ కనబడి ఉంటాయి. ఇంటిమీద మమత పుట్టి మళ్ళీ రెడ్డి రాజ్యానికే కఠారిని తీసుకొని శ్రీనాథుడు వెళ్ళిపోయాడు.

పెదకోమటి వేమారెడ్డితో కాశీకి వెళ్ళిననాటినుంచి శ్రీనాథునికి స్కాందపురాణం లోని కాశీఖండం అంటే అభిమానం. అది అనువదించదలుచుకొన్నట్టుంది. ఎప్పటికప్పుడు వాయిదావేస్తూ మానేసినట్టుంది. ఒక్కసారి చిన్నప్పటినుంచి తాను వ్రాసిన కావ్యాలు జాబితా వేసుకొని ఇలా అనుకున్నాడు.

చిన్నారి పొన్నారి చిరుతకూకటినాడు రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూగుమీసాల నూత్నయవ్వనమున శాలివాహనసప్తశతి నుడివితి
సంతరించితి నిండు జవ్వనమునను హర్షనైషధకావ్యమాంధ్రభాష
బ్రౌఢ నిర్భరవయః పరిపాకమున గొనియాడితి భీమనాయకుని మహిమ
బ్రాయ మెంతయు మిగుల గైవ్రాలకుండ
గాశికాఖండ మను మహాగ్రంథమేను
దెనుగుజేసెద గర్ణాటదేవకటక
పద్మవనహేళి శ్రీనాథభట్టసు కవి. (కాశీ. 1-7)

వయసు వాలిపోకుండా కాశీఖండాన్ని అనువదించడం ఆరంభించాడు. ఈ ప్రారంభాన్ని కర్ణాకర్ణిగా విని రాజమండ్రి రాజ్యాన్ని తమ్ముడు వీరభద్రారెడ్డి చేత పాలింపజేస్తున్న అల్లాడ వేమారెడ్డి శ్రీనాథుణ్ణి పిలిపించి సముచితాసనంపై కూర్చోపెట్టాడు. తన తమ్ముని కోరికను గ్రహించి ఇలా ఆనతి ఇచ్చాడు.

వచియింతు వేములవాడభీమనభంగి నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టుమార్గంబున నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాకృత్తు తిక్కయజ్వప్రకారము రసాభ్యుచితబంధమున నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని దేవసూక్తివైచిత్రి నొక్కొక్కమాటు
నైషధాంధ్రిమహాప్రబంధములు పెక్కు
చెప్పినాడవు మాకు నాశ్రితుడ వనఘ
ఇపుడు చెప్పదొడంగిన యీ ప్రబంధ
మంకితముసేయు వీరభద్రయ్యా పేర (కాశీ. 1-18)

తన తమ్ముని పేర కృతి చెప్పమన్నాక, అల్లావేమారెడ్డి కోరి శ్రీనాథుణ్ణి యీవిధంగా ప్రస్తుతించాడు.

ఈక్షోణిన్ని నుబోలు సత్కవులు లేరీ నేటి కాలంబునన్
దాక్షారామచళుక్యభీమపరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయగంధసారఘుసృణద్వైరాజ్యభారంబున
ధ్యక్షించుం గవిసార్వభౌమ! భవదీయప్రౌఢసాహిత్యముల్ (కాశీ. 1-14)

'రాజుగారి అన్నగారు రాజుగారు శ్రీనాథుణ్ణి ఇలా ప్రశంసించేసరికి అప్పటివరకూ అతణ్ణి ఆడిపోసుకున్న పండితంమన్యుల నోటికి తాళం పడి వుంటుంది. వాళ్ళంతా నడమంత్రపుసిరి వచ్చినవాళ్ళే. రాజాశ్రయం వల్ల వారికి వచ్చిన వైభవాన్ని శ్రీనాథుడు ఇంతకుముందే చెప్పాడు.

ధరియింప నేర్చిరి దర్భవెట్టెడు వ్రేళ్ళ లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింప నేర్చిరి గంగమట్టియమీద గస్తూరి కాపుంద్రకములు నొసల
సవరింప నేర్చిరి జన్నిదంబుల మ్రోల దారహారములు ముత్యాల సరులు
చెరువంగ నేర్చిరి శిఖల వెన్నడములు గమ్మని క్రొత్త చెంగల్వవిరులు
ధామముల వెండియును బైడి దడబడంగ
బ్రాహ్మణోత్తములగ్రహారములయందు
వేముభూపాలు డనుజన్ము వీరభద్రు
ధాత్రి యేలింప గౌతమీతటమునందు. (భీమ. 1-41)

గౌతమీ తటంలో రాజమహేంద్రవరంలోనే కాశీఖండాన్ని శ్రీనాథుడు పూర్తి చేశాడు. ఇది ఏడాశ్వాసాల మహాప్రబంధం. అగస్త్యుడు కాశీని వదిలిపెట్టడం, వ్యాసులవారు కాశీని వీడి వెళ్ళవలసి రావడం - ఆద్యంతాలలో ఉన్నాయి. మధ్య వివిధ లోకాల వృత్తాంతాలు, కాశీలోని వివిధ ప్రదేశాలు, ప్రభావాలు, వివరణలు మొదలైనవి ఉన్నాయి. సాముద్రికం, యోగశాస్త్రం, మంత్రశాస్త్రం మొదలైనవి కూడా ఉన్నాయి. శ్రీనాథుడు అనువదించిన రెండు ముఖ్య గ్రంథాలలో నైషధాన్ని 'విద్వదౌషధం' అని, కాశీఖండాన్ని 'అయఃపిండం' అని చెప్పుకోవడం మొదలైందని తెలుగు పండితులు కొందరు వ్రాశారు.[51] అయితే 'శ్రీనాథుని కాశీఖండ మిట్టి నానుడికి గురికాదగినంత కఠినశైలిలో లేదనుట నిక్కువము' అని బండారు తమ్మయ్యగారు చెప్పారు.[52]

శృంగార నైషధంలో కన్నా కాశీఖండంలోనే ఎక్కువగా శ్రీనాథుని పలుకు నుడికారపు సొంపులు కనబడతాయి. కాశీఖండంలోను, భీమఖండంలోను ఒకే కథాఘట్టం వుంది. వ్యాసుడు భిక్ష దొరకలేదని కోపించి కాశిని శపించబోతాడు. పార్వతి ముత్తయిదువ

51. కాశీఖండం పీఠిక, నిడుదవోలు వెంకటరావుగారు, పుట 1.
52. రెడ్డిసంచిక, శ్రీనాథమహాకవి, పుట 300.

రూపంలో వచ్చి వారించి కడుపునిండా భోజనం పెడుతుంది. తరువాత శివుడు శపించి వ్యాసుణ్ణి కాశీనుండి వెలివేస్తాడు. శపించబోతున్న వ్యాసుణ్ణి శర్వాణి వారించే పద్యాలు రెండు కావ్యాలలోనివీ చూద్దాం.

భిక్ష లేదని యింత కోపింతురయ్య
కాశికాపట్టణముమీద గాని నేయ!
నీమనశ్శుద్ధి తెలియంగ నీలకంఠు
డింత చేసెనుగాక కూడేమి బ్రాతి? (భీమ. 2-114)

ఇది వ్యాసుణ్ణి వారించే తొలిపద్యం. దీని తరువాత మరి నాలుగు పద్యాలున్నాయి. అయితే మొట్టమొదటనే శివుడు నిన్ను శోధించటానికి భిక్ష పుట్టకుండా చేశాడని చెప్పేసింది. ఆ తరువాత తిట్టినా, నచ్చచెప్పినా, హితోపదేశం చేసినా లాభం లేదు. ఇది తన చిత్తశుద్ధిని తెలుసుకోవడానికి చేసిన పరీక్ష అని తెలిస్తే వ్యాసుడు జాగ్రత్తపడడా? శివునిచేత శాపం పుచ్చుకొంటాడా? మొదటనే యీసంగతి ఆమె చెప్పిన తరువాత -

ఏడుదినంబులన్నమున కెడ్డము పుట్టిన యంతమాత్రలో
నేడుచుచున్నవాడవు మునీశ్వర! నేడును నీదు ధీరతల్
పాడరిపోయెనే శివుని భార్యకు గాశికి పుణ్యరాశికిన్
గాడు యొనర్ప జూచెదవు కష్టపు గ్రోధము పెచ్చు లెచ్చగన్

క్రొన్నెలపూవుదాల్పునకు కూరిమిభోగపురంధ్రి కక్కటా!
యిన్నగరీలలామమున కీపరిపాటికి నిట్టి కోపమే
లన్న! ఘటించె దో మునికులాగ్రణి! నిక్కమువో 'బుభుక్షితః
కిన్నకరోతి పాప, మను కేవలనీతి దలంచిచూడగన్ (భీమ. 2-116, 117)

ఆకలి బాధతో పాపం చేస్తున్నావని హెచ్చరిస్తే ఇంగితజ్ఞానం ఉన్న వ్యాసుడు తన తప్పు తెలుసుకొని మొదటే క్షమాపణ వేడుకుంటాడు. అందుకే భీమఖండంలో వ్రాసిన క్రమాన్ని కాశీఖండంలో శ్రీనాథుడు మార్చివేశాడు. మొదట తిట్టించాడు. తరువాత హితోపదేశం చేయించాడు. ఆ పిమ్మట కాశిని ప్రస్తుతింపచేశాడు. చూడండి -

ఆకంఠంబుగ వేడ్కతో నిపుడు భిక్షాన్నంబు భక్షింపగా
లేకున్నంగడు నంగలార్చెదవు మేలే! లెస్స! శాంతుండవే?
నీకంటె నతిహీనులే కటకటా! నీవారముష్టింపచుల్
శాకాహారులు గందభోజులు శిలోంఛప్రక్రముల్ దాపసుల్?

ఓ మునీశ్వర వినవయ్య! యున్నయూరు
గన్నతల్లియు నొక్కరూ పన్నరీతి
యటువిశేషించి శివుని యర్ధాంగలక్ష్మి
కాశి యిప్పీటిమీద నాగ్రహము దగునె?

వేయి శాఖలతో సామవేదరాశి
యేకవింశతిరూపమై ఋజ్నిగమము
తొమ్మిదియు నూటయొక్కండ్రు త్రోవలందె
యొరివనాధర్వణ యజుస్సు లుండుగాశి.

ఇట్టి కాశికానగరంబు మీద భిక్షలేకుండుట కారణంబుగ నీయంతవాడు గటకటంబడి శపింపదలంచునే? బ్రాహ్మణుడవు గదా? నీకు నేమన్నన్ జెల్లు. అటు విశేషించి యాకొన్నవాడవు. కావున నీ యవసరంబున నిన్ను హెచ్చు కుందాడుట మముబోటి గృహిణులకు హెచ్చు గాదు. మాయింటికి గుడువరమ్ము. కుడిచికూర్చున్న పిమ్మటం గొన్ని మాటలు నీతోడ నాడగల నిప్పుడు.

వైశ్వ దేవాదివిధులు సర్వమును దీర్చి
యరసి యున్నాడు నాభర్త యతిథిరాక
నతిథి పంక్తికి రాకున్న నారగింప
డొంటి నొక నాడు బతి యెట్టి యొరకమున

అభ్రగంగ నుపస్పర్శ మాచరించి
వేగ విచ్చేయవలయు నావిభుడు దసిలి
నాకటికి నోర్వలేడు బ్రాహ్మణవరేణ్యా
యర్కమండల మిదె వ్రాలె సపరదిశకు. (కాశీ 7-163 నుండి 168)

ఇందులో 'నీచిత్తశుద్ధి కిది పరీక్ష' అని చెప్పటం ఏమీ లేదు. బంతిలో అతిథి లేనిదే భోజనం చెయ్యాని ఒక గృహమేధి భార్య అతిథి కోసం వెతుక్కుంటూ వెళ్ళి అతడు దొరికాక చెప్పే మంచి మాటలేకానీ మరేమీ కావు. భీమఖండంలో 'బుభుక్షితః కిన్నకరోతిపాపం' అనే ఆర్యోక్తి వాడినందువల్ల వచ్చిన ఫలితం కన్నా కాశీఖండంలో 'ఉన్నయూరుగన్నతల్లి నొక్కరూపు' అన్న నానుడి వాడినందువల్ల కలిగే ఆనందమే ఎక్కువ. భీమఖండంలో తనను భోజనానికి పిలిచిన ఇల్లాలెవరో తెలుసుకుందామనే తహతహ వ్యాసునిలో లేదు. కాశీఖండంలో ఆమె ఊరడించి అమృత భిక్షాన్నం పెట్టే విశాలాక్షి అని గ్రహిస్తాడు.

చేయగలవాడ నేను నీ చెప్పినట్ల
బ్రాహ్మణుడగాన నాకు జావలము ప్రకృతి.
బుద్ధి గృపసేసి రక్షింపు పుణ్యసాధ్వి
కాన! నీపేరు నాకు నిక్కముగ జెప్పు! (కాశీ. 7-172)

అని అడుగుతాడు. అప్పుడామె మురిపింతాలు పెడుతుంది.

ఊకోజెప్పగ నెంత యేని తడవౌనో విప్రశార్దూల! నీ
వాకొన్నాడవు భోజనోత్తరమునందాస్థానమై యుండియ

ఱాకం బెట్టక చెప్పెదర్ వినుము వృత్తాంతంబునుం దేటగా
వీక స్వేళ యతిక్రమించె గుడువన్ వేంచేయుమాగ్రక్కునన్. (కాశీ. 7-174)

ఈ పద్యంలో 'ఊకో' అనే మాట నాటి వ్యావహారిక రూపంలాగా కనబడుతుంది. ఇలాంటివి కాశీఖండంలో అక్కడక్కడ కనబడతాయి. 'ఓ రాత్రి గనురెప్పవెట్టక' (5-189) అని ఒకచోట వ్రాశాడు. వింధ్య పర్వతం తన ఈసునంతా నారదుడితో చెప్పి పక్షపాతం లేకుండా సలహా చెప్పమన్న తరువాతి పద్యం చూడండి.

అని యవష్టంభసంరంభ మతిశయిల్ల
బలుకుటయు నాత్మ గర్హించి నలువవట్టి
యొండనాక యొక్కింత సేపూరకుండి
యుసురనుచును వేడినిట్టూర్పు పుచ్చి (కాశీ. 1-101)

ఇందులో 'ఒండనాక' అనేది విలక్షణ ప్రయోగం. 'అనక' అనడానికి 'అనాక' అనే రూపం వాడాడు. తిక్కనగారు 'మరువక' అనడానికి బదులు 'మరాక' అని వాడడం మనం గమనించాం.[53] శ్రీనాథుని రచనల్లో మంచి భాషావిశేషాలు దొరుకుతాయి. అతనికి స్వదేశమన్నా, మాతృభాష అన్నా మక్కువ. ఎన్ని ఊళ్ళు తిరిగినా చివరకు స్వదేశానికి రావాలని అతని అభిమతం. ''త్యజింపగవచ్చునె జన్మదేశమున'' (కాశీ. 5-291) అని ఒకచోట అంటాడు. అయినవాళ్ళు వెళ్ళగొట్టినా అక్కడే ప్రాకులాడాలని చెప్పేటంత స్వజనపక్షపాతం అతనికుంది.

చులక గాల్వట్టి యీడ్చిన జూరుపట్టి
వేలుదురుగాక తమవారి నిడుతు రెట్లు? (కాశీ. 5-298)

అని ఒకచోట అన్నాడు. కలకలలాడుతూ పదిమంది బంధుమిత్రులతో కలిసి జీవించడమెంత ఆనందదాయకమో క్రీడాభిరామంలో చెప్పాడు.

కొడుకులు కూతులుంగలిగి కూడును బాడియు ద్రవ్వి తండమై
విడిముడిలాతు గా గలిగి వెండియు బైడియు నిండ్లలోపలన్
దడబడ దారు బంధువులు దామరతంపరలై సుఖించువా
రుడుపతిమౌళి నొక యుమ్మెత పూ విడువారు వేడుకన్ (క్రీడా. 256)

ప్రాయం కైవ్రాలే రోజులలో బంధుమిత్రులలో కడుపులో చల్ల కదలకుండా జీవించే అదృష్టాన్ని శ్రీనాథుడు నోచుకోలేదు. ముసలితనం ముంచుకొచ్చే వయసులో మళ్ళీ రెడ్డిరాజుల ప్రాపకం దొరకిందనుకుంటే అది సుస్థిరం కాలేదు. కాశీఖండం రచన జరిగిన ఒకటి రెండేళ్ళలో రెడ్డిరాజ్యం చిక్కుల్లో పడ్డట్టుంది. క్రీ.శ. 1434-35లలో కటకంలో కపిలేశ్వర గజపతి సింహాసనం ఆక్రమించుకున్నాడు. ఇతడు చాలా బలపరాక్రమశాలి.

53. సమగ్రాంధ్రసాహిత్యం, కాకతీయయుగం,

కార్యసాహసోపేతుడు. దక్షిణ కళింగ విజయనగర రాజులకు, వాళ్ళ సామంతులకు అణకువగా ఉండడం సహించలేకపోయాడు. కళింగ భాగాలనేకాక రాజమహేంద్ర రాజ్యాన్ని కూడా జయించి కళింగోత్కళ సామ్రాజ్యంలో చేర్చుకోవాలనే అతడు దండయాత్రలు చేశాడు. ఇతనికి విజయం ఎప్పుడు లభించిందో, రాజమండ్రి రెడ్డిరాజ్యం ఎప్పుడు అంతరించిందో తెలియదు కానీ క్రీ.శ. 1443 నాటికి రాజమండ్రి ప్రాంతాలన్నీ అతని అధికారంలోకి వచ్చాయి. [54]

ఈ గజపతుల తళ్ళు ప్రారంభం అవగానే శ్రీనాథుడు రాజమండ్రి విడిచిపోయాడో, లేక రెడ్డిరాజ్యమంతరించాక బయలుదేరాడోగాని అతడు మళ్లా దేశాటనకి కదిలాడు. దినవెచ్చానికి మైలారరెడ్డిని ఆశ్రయించాడు. ఇతడు విజయనగర రాజుల సామంతుడు. నెల్లూరు మండలంలోని కందుకూరు తాలూకాలో ఉన్న పైడిపాడు పాలించేవాడు.[55] ఇతనికి చౌహత్తమల్ల, బిరుద ధరణీవరాహ, ఘంటానాదన అనే బిరుదులు ఉండేవి. ఇతడు క్రీ.శ. 1424 నుంచి పాలిస్తున్నట్టు చెప్పే శాసనాలు ఉన్నాయి. క్రీ.శ. 1429లో ఇతడు ప్రౌఢ దేవరాయలచేత కొంతమంది బ్రాహ్మణులకు అగ్రహారం ఇప్పించాడు. శ్రీనాథుడు ఇతణ్ణి దిన వెచ్చం కోసం ఎప్పుడు ఆశ్రయించాడో తెలియదు. కొండవీటి రెడ్డిరాజ్యం పోయాక 1424లోనో, లేక మరో పది పదిహేను సంవత్సరాలకు రాజమండ్రి రెడ్డిరాజ్యం పోయాకో చేరి వుంటాడు.

మైలారరెడ్డి విజయనగర రాజ్యంలో మంచి పలుకుబడి కలవాడే. ఇతడు ప్రౌఢదేవరాయలకు యుద్ధంలో సహాయం చేసి ప్రతిఫలంగా వరాలు అడిగించుకొన్నవాడు. బహుశా ఇతని ప్రోద్బలం మీదనే శ్రీనాథుడు విజయనగరం వెళ్లాడేమో. ఏమైనా ఆశ్రయించిన రోజు దగ్గరనుంచి తాను మరణించేవరకు మైలారరెడ్డి దినవెచ్చం తీర్చిన మాట మటుకు స్పష్టం. కైలాసగిరికి పంట మైలారుడు చేరాక శ్రీనాథుడు శ్రీశైలానికి వెళ్ళినట్టుంది.

అప్పుడు శ్రీశైలంలో పండితారాధ్య పీఠాన్ని పాలిస్తూ భిక్షావృత్తి మఠం వుండేది. దానికి శాంతభిక్షవృత్తి యతీశ్వరుడు అధికారిగా ఉండేవాడు. శ్రీనాథుడు ఈయన సందర్శనం చేసుకొన్నాడు. ఈ యతీశ్వరుని వైభవం రాజులను మించిపోతూ ఉంటుంది. ఈయన తన మూలభృత్యుడైన పువ్వుల శాంతయ్యపేర శివరాత్రి మాహాత్మ్యాన్ని రచించమని శ్రీనాథుని ఆదేశించాడు. శ్రీనాథుడు ఐదాశ్వాల కావ్యాన్ని చెప్పాడు. ఈ ప్రబంధంలో లభించిన నాలుగు ఆశ్వాసాలను మాత్రమే ఆంధ్రసాహిత్య పరిషత్తువారు ప్రకటించారు. ముద్రిత ప్రతివల్ల తెలిసే కథ ఇది.

ప్రథమాశ్వాసం : నైమిశారణ్యంలో శౌనకాదిమునులు సూతుణ్ణి శివరాత్రి మాహాత్మ్యాన్ని తేటపడ వివరింపమన్నారు. అతడు చెప్పాడు. ప్రళయకాలం తుద

54. విజ్ఞాన సర్వస్వం, తెలుగుభాషాసమితి, 3వ సంపుటం, పుట 336.
55. నెల్లూరు శాసన సంపుటం, 3వ భాగం, పుటలు 1089-92.

కాళరాత్రి అయ్యాక బ్రహ్మ, విష్ణువులు నేను అధికుణ్ణి అంటే నేను అధికుణ్ణి అని పోట్లాడుకున్నారు. ఆయుధాలు దూశారు. వాళ్ళ అస్త్రయుద్ధం ఆపడానికి శివుడు వాళ్ళమధ్య మహాస్తంభరూపంలో ఆవిర్భవించాడు. దాని ఆద్యంతాలు తెలుసుకోవడానికి బ్రహ్మ విష్ణువులు ఉద్యుక్తులై విఫలురయ్యారు. తరువాత శివుడు ప్రత్యక్షమై వాళ్ళకు శివరాత్రి వ్రతచర్యను ఉపదేశించాడు. మునుపొక బ్రాహ్మణుడు మహాపాపాలు చేసినా శివరాత్రి దర్శనంవల్ల శివలోకం చేరాడని చెప్పాడు. ఈ కథ చెప్పమని శౌనకాదిమునులు అడిగారు. (116 గద్య పద్యాలు)

ద్వితీయాశ్వాసం: వింధ్యపర్వత ప్రాంతాల రత్నపురముంది. దానిని హేమాంగదుడనే రాజు పాలిస్తున్నాడు. అతనికి యజ్ఞదత్తుడనే మంత్రి ఉన్నాడు. ఆ మంత్రిగారికి సంతానం లేదు. మంత్రి భార్య చాలా విచారిస్తే మంత్రి ఊరడించి పూజలు చేశాడు. వ్రతాలు సలిపాడు. ఆమె గర్భవతి అయింది. రాజుగారు సీమంతోత్సవమే ఘనంగా చేయించారు. మగబిడ్డ పుట్టాడు. వానికి సుకుమారుడనే పేరు పెట్టాడు. కుర్రవాడు పెరిగి పెద్దవాడయ్యాడు. గొప్ప గ్రంథసాంగుడయ్యాడు. జూదం, తాగుడు, వ్యభిచారం - ఒకటేమిటి సర్వావలక్షణాలు ఒంటబట్టాయి. తల్లిదండ్రులు ఎంతగానో చెప్పారు. ఏడ్చారు. ఇకమీదట జవదాటనన్నాడు సుకుమారుడు. (113 గద్య పద్యాలు)

తృతీయాశ్వాసం: తల్లిదండ్రులతో అలా అన్నాడేగాని సుకుమారుడు తన పద్ధతులు మానలేదు. వేడుకకాడై పుణ్యస్త్రీలను ఇలువరుస చెరచడం మొదలుపెట్టాడు. రాజపురుషులు బంధించారు. రాజు దేశబహిష్కారం చేశాడు. సుకుమారుడు అడవిలో ఒక కడగొట్టు జాతి కన్యను చూశాడు. మోహించి, పెళ్ళిచేసుకుంటానని మాటయిచ్చి, చాటుగా దానితో కాపురం పెట్టాడు. కపటమార్గాలలో కడుపు నింపుకోసాగాడు. దారులు కొట్టి, దారుణాలు చేసి చెడ్డపేరు సంపాదించాడు. ఆ ప్రాంతాలలో జీవించలేక చండాలాంగనతో వలసపోయాడు. (133 గద్య పద్యాలు)

చతుర్థాశ్వాసం: ఆ జారదంపతులు పోయిపోయి ఒకచోట స్థిరపడ్డారు. ఆ చండాలాంగన ఇద్దరు కుమార్తెలను కని చనిపోయింది. వయసు ముదిరినా సుకుమారుని వ్యసనాలు వదలలేదు. కడుపున పుట్టిన కన్యలతోనే కాని పనులు చేశాడు. ఆ వూరివాళ్ళు కూడా వాళ్ళను వెళ్ళగొట్టారు. మాఘమాసంలో ఒకనాడు కూతుళ్ళకోసం పువ్వులు కోద్దామని శివాలయం వద్దకు తాగి వెళ్ళాడు. నాడు శివరాత్రి, భక్తులు ఉత్సవం చేస్తున్నారు. అది సుకుమారుడు చూశాడు. తరువాత కొన్నాళ్ళకు మరణించాడు. యమదూతలు తీసుకుపోవడానికి వచ్చారు. శివదూతలు కూడా వచ్చారు. జన్మానికో శివరాత్రి దర్శించినా సుకుమారుడు పుణ్యం చేసుకోబట్టి శివలోకానికి అతడు నోచుకున్నాడు. యమభటులను చావచంపి, శివదూతలు అతణ్ణి కైలాసం తీసుకుపోయారు. యమభటులు పోయి తమ ఏలికకు చెప్పుకున్నారు. (ఇక్కడదాకా కథ చెప్పాక) శౌనకాది మహామునులు ''భటులు ప్రమథులచే భంగపడుట చూచి చిన్నవోయి యముండేమి చేసె పిదప?'' అని ప్రశ్నించారు. (92 గద్య పద్యాలు)

ఇంతదాకా మాత్రమే బాగా శిథిలమైపోయిన తాళపత్ర గ్రంథం దొరికింది. అందులోనూ శిథిలమైన భాగాలు కొన్ని వున్నాయి. దొరికినంత మటుకే శ్రీనాథుడు వ్రాశాడని భావించి ఆంధ్రసాహిత్య పరిషత్తువారు దానిని ప్రచురించారు. కఱ్ఱి సాంబమూర్తిగారు పరిష్కరించి భట్టబాణుని కాదంబరిని శ్రీనాథుడు దీనిలో ఎంత అనుకరించాడో చూపించారు. దీనిలో బాణునకు తాను ఋణపడుతున్నాడు. కాబట్టి పూర్వకవిస్తుతిలో పద్యం ఎత్తుకొంటూనే అతణ్ణి శ్రీనాథుడు 'బాణునద్భుతశాస్త్ర బహుకళాపారీణు' అని పూజించాడు. శ్రీనాథుడు నాలుగాశ్వాసాలే వ్రాశాడని పండితలోకం చాలావరకు భావించింది.[56] కొందరు నాల్గవ ఆశ్వాసం తర్వాత కొంత కథ ఉన్నట్లే గోచరిస్తుందని అన్నారు.[57]

వాస్తవానికి నాల్గవ ఆశ్వాసం తరువాత కథ లేకపోలేదు. శ్రీనాథుడు గ్రంథాన్ని సాంతం వ్రాశాడు. ఆంధ్రసాహితీలోకం చేసుకొన్న అదృష్టంవల్ల ఈసంపూర్ణ గ్రంథాన్ని నా మిత్రులు డాక్టరు బిరుదురాజు రామరాజుగారు సంపాదించారు. ఆ ప్రతిని నాకు దయతో ఎరువిచ్చారు. శిథిల పూరణం చేసి గ్రంథాన్ని ఇటీవలే ముద్రించడం జరిగింది. అయిదవ ఆశ్వాసాన్ని గురించి ఆంధ్రపండితలోకంలో ఏదైనా సరే ముందుగా చెప్పడం ధర్మం కనుక వారి పీఠికలోని భాగాలనే క్రింద పొందుపరుస్తాను.

'శ్రీనాథ కవిసార్వభౌముడు రచించిన శివరాత్రి మాహాత్మ్యమును ఆంధ్రసాహిత్య పరిషత్తు (కాకినాడ) వారు ౧౫వ ప్రకాశముగా ప్రచురించినారు. లభించిన శిథిలప్రతి యాధారముగా కఱ్ఱి సాంబమూర్తిగారు దానిని పరిష్కరించినారు. ఆనాడు వారికి లభించినది నాలుగు ఆశ్వాసముల ప్రతియే కనుక శ్రీనాథుడంతే రచియించియుండునని యూహించి తమ పీఠికలో నటులే వ్రాసినారు. ఒకటి రెండు అక్షరములు శిథిలమైన చోటులందు పూరించియు, మిక్కిలిగా శిథిలములైన తావులయందు చుక్కలగుర్తు లుంచియు ముద్రించినారు. ఇందు కాంధ్రసాహిత్యలోకము వారికెంతేని ఋణపడివున్నది.

ఇటీవల మెదకు మండలమున (దన్నారం గ్రామమున నొక జంగమ దేవరకడ) నాకొక శివరాత్రి మాహాత్మ్యమును తాళపత్రప్రతి లభించినది. వ్రాయసకాడు దానియందు తాను వ్రాసిన తేదీ మున్నగు వివరములు ఏమియు వ్రాయలేదు. తాటియాకుల స్థితినిబట్టియు, లిపినిబట్టియు, ఈ ప్రతి వయసు దాదాపు 250-300 ఏండ్లుండునని యూహించుచున్నాను. ఇది సమగ్రమైన ప్రతి. దీనిలో నైదాశ్వాసము లుండుటయేగాక ముద్రితములైన నాలుగాశ్వాసములందు లేని కొన్ని క్రొత్త పద్యములధికముగా కలవు. ముద్రితప్రతిలో శిథిలములున్న చోటులన్నియు నీప్రతిద్వారా పూరించి సవరించుకొన వచ్చును. మీదుమిక్కిలి కొన్ని పాఠభేదములు కూడ కలవు. పైన చెప్పిన నాల్గు

56. కఱ్ఱి సాంబమూర్తిగారు ఇలా వ్రాశారు. 'కథాభాగము నాల్గాశ్వాసములు మాత్రము. శ్రీనాథుని చరమదశయందు రచింపబడినదనియు, ఈ గ్రంథమునందలి కథానాయకుని తోడనే శ్రీనాథుడు ప్రమథపదవి నందెననియు నూహించవచ్చును.' – శివరాత్రి మాహాత్మ్య ప్రథమ ముద్రణపీఠిక.

57. బండారు తమ్మయ్యగారు – 'శ్రీనాథ మహాకవి', రెడ్డిసంచిక, పుట 302.

విషయములు దృష్టియందుంచుకొన నాకు లభించిన ఈ క్రొత్తప్రతి వైశిష్ట్యమును స్థాలీపులాకముగా ప్రదర్శించుటయే నా ప్రస్తుత కర్తవ్యము.'

1. **పంచమాశ్వాసము :** ముద్రితములైన ప్రతులలో నాలుగాశ్వాసములే ఉన్నను సుకుమారుడు పరమశివుని యనుగ్రహమున ప్రమథుడగుట యిందలి వృత్తాంతము. ఆశ్వాసాంతమున మునులు సూతుని 'చిన్నవోయి యముండేమి చేసె పిదప?' అని అడిగిన ప్రశ్నకు సమాధానముగా పంచమాశ్వాసము కలదు. ఇది ౬౧ గద్య పద్యములు గల చిన్నయాశ్వాసము. యముడు చిత్రగుప్తునితో సంభాషించి తన యశక్తాధికారమునుగూర్చి పరమశివునికే విన్నవించుకొన నిశ్చయించుకొని కైలాసమున కేగుట, కైలాసవర్ణనము, శివుని స్తుతించుట, సుకుమారుని నేరములు చెప్పుట, శివుడు యమునికి శివరాత్రి మాహాత్మ్యమును, శివభక్తుల లక్షణములు చెప్పుట, యముడు తన లోకమునకు తిరిగి వచ్చి, తన భటులకు శివుడు చెప్పినవన్నియు మరల చెప్పుట ఇందలి వృత్తాంతము.'

ఈ అయిదవ ఆశ్వాసంలో కొన్ని మంచి పద్యాలు ఉన్నాయి. యమధర్మరాజు చేసే శివస్తుతి బాగుంది.

ఎవ్వానియందుండు నెల్లభూతంబులు సింధువునందు వీచికలువోలె
నెవ్వాడు వసియించు నెల్లభూతములందు నంబువుల్లోలంబుబోలె
నెల్లభూతమ్ముల హృదయములందును వసియించు నెవ్వడాకసమువోలె
ఒకడు పెక్కై తోచు నుదధి జంద్రుడువోలె నెవ్వడజ్ఞాన మూఢేంద్రియములకు
పురుషుడని బ్రహ్మమని యజ్ఞపురుషుడనియు
నర్కుడని వాయువని శక్రుడని హరియని
చంద్రుడని కొల్తు రాయాయి సరణివారు
భక్తి నెవ్వాని బట్టినీబంటు నభవ. (శివ. రా.5-24)

సుకుమారుడు చేసిన పాపాలను లెక్కించలేమని యముడు శివునితో చెప్పే పద్యంకూడ చక్కనిది.

జలధరంబులనుండి స్రవియించు జలధార లెన్నవచ్చిన యేని నెన్నవచ్చు
గగనమండలి దారకాచక్రవాళంబు నెన్నవచ్చిన నేని నెన్నవచ్చు
భాగీరథీమహాపగిలోని సికతంబు నెన్నవచ్చిన నేని నెన్నవచ్చు
కలశపాధోరాశి కల్లోలమాలిక లెన్నవచ్చిన నేని నెన్నవచ్చు.
కాని నరునకు నెన్న శక్యంబు కావు
పాయ కీతండు చేసిన పాతకములు
భర్గ యేమని విన్నవింపంగనేర్తు?
నిట్టి పాపాత్ము బొడగాన మెన్నడేని. (శివరా. 5-82)

ఇన్ని పాపాలు చేసిన ఇంకొక కథానాయకుని కథ ఇటువంటిదే శ్రీనాథుడు ఇంతకుముందు కాశీఖండంలో వ్రాశాడు. అది కుబేరుని పూర్వజన్మ వృత్తాంతం. యజ్ఞదత్తుడనే బ్రాహ్మణునికి గుణనిధి అనే కుమారుడున్నాడు. అతడు చెడుదారులు పట్టాడు. తండ్రికి తెలియకుండా తల్లి గారాబం చేయడంవల్ల మరీ చెడ్డాడు. కొడుకుకు ఆమె నచ్చచెప్పటం వింటే ఎవరికైనా కళ్లు చెమ్మగిల్లుతాయి.

అన్న! మీ తండ్రి కోపగాడౌనొ కాడొ
యీవు వొనరించు దుర్వృత్త మెరిగెనేని
గల్లతనమున పలుమారు కప్పిపుచ్చు
నట్టి నామీద జంపంగ నలుగకున్నె?

సచ్ఛ్రోత్రియులు ననూచానులు సోమపీథులు నైన కులము పెద్దల దలంచి
రాజమాన్యుడు సత్యరతుడు వినిర్మలాచారవంతుడు నైన జనకు దలచి
భాగ్యసంపద బుణ్యవతి దేవతలలోన నెన్నంగదగియెడు నన్ను దలచి
వేదశాస్త్ర పురాణవిద్యానిరూఢులై వాసికెక్కిన తోడివారి దలచి

చెడ్డయింటి చెదారమై శివుని కరుణ
నివ్వటిలు నిర్వదేనేండ్ల నిన్ను దలచి
పదియు నార్వత్సరంబుల భార్య దలచి
గోరతనములు మానురా! కొడుకుగుర్ర!

అఖిల కళ్యాణగుణగణాయత్త యత్త
మామ యౌదార్య తేజఃక్షమామహితుడు
మాతులుండు యశోమహిమాతులుండు
తనయ! యేలయ్యా కైకోవు వినయబుద్ధి?

విడువక నీవు పట్టణము వీథుల వీథుల వెఱ్ఱివాడవై
చెడుగుల గూడి ధైర్యములు సేయ మహీరమణుం డెరింగెనే
విడుచును సోమయాజిమనువృత్తులు చేకొను నెల్లభంగులన్
జెడుదుము నీకతంబునను జీరయు గూడును లేక పుత్రకా!

పట్టణములోన నీవు దర్పమున జేయు
కొయ్యతనములు వీక్షించి కూర్మితనయ
నవ్వుదురు నిన్ను మొదల నానావిధముల
నవ్వుదురు దీక్షితుని ననంతరమజనులు

అని యంత, నిలువక –

తల్లి బడి కొల్లిచట్టంచు నుల్లసంబు
లాడుదురు నన్నుగూర్చి నిన్నుహరహంబు
దుర్ణయం బెల్ల నామీద ద్రోచి జనులు
డబ్బరలు పల్కు వారి కడ్డంబు కలదె? (కాశీ. 4-90-96)

శివరాత్రి మాహాత్మ్యంలోని యీ గుణనిధి తల్లి పాండురంగ మాహాత్మ్యంలోని నిగమశర్మ అక్కకు అక్కగారు. చెవినిల్లు కట్టుకొని యీమె ఇంత హితోపదేశం చేసినా కొడుకు వినలేదు. ఇంట్లో ఉన్న ఉంగరం ఎత్తుకుపోయి జూదం ఆడాడు. అది ఒక జూదరి గెలుచుకొని పెట్టుకొన్నాడు. అది దీక్షితులవారు యజ్ఞంలో పెట్టుకొన్నది. దానిని ఒకనాడు ఆయన వీధిలో చూశాడు. అది తన సొమ్మని గుర్తించి ఎలుగెత్తి జూదరిని పిలిచి ఆపి, ''ఇది నీకెలా వచ్చిం''దని అడిగాడు. ''ఉన్నరూపు చెప్పు, తప్పు చెప్పితేని భూపాలు సన్నిధింబెట్టి నిజంబు తెలిపి దండింతు''నన్నాడు. జూదరి నిజం చెప్పేసి

అక్షధూర్తులలోన నీయనుగుగొడుకు
దొరయునంతటి యక్షధూర్తుండు లేడు
క్షితితలంబున యాగదీక్షితులలోన
గీర్తి నీయట్టి యాగదీక్షితుడు లేడు.

అనిన విని లజ్జా క్రోధంబులు మనంబున ముప్పిరిగొన యజ్ఞదత్తుండర్ధ ముండితంబైన మూర్ధంబున నీర్కావిధోవతి నరిమురిజుట్టుకొని యింటికేతెంచి మొగంబు గంటువెట్టుకొని 'సోమిదమ్మ! ఏమి చేయుచున్నదానవిటురమ్ము! నీకొడుకెక్కడంబోయె? బోవుగాకేమి? విను' మని యిట్లనియె

అంగోద్వర్తనవేళ నీవు దరహాసాంకూరముల్ లోచనా
పాంగప్రాంతములందిగుర్పనొక సయ్యాటంబు గల్పించి నా
యంగుళ్యాభరణమ్ము పుచ్చుకొనవా? యా యుంగరం బిప్పు డే
శృంగారింపని చేత బావకునకున్ జేయన్ హవిర్దానమున్ (కాశీ. 4-101-103)

ఈ విధంగా అడిగిన భర్తతో ఆమె కల్లబొల్లి కబుర్లు చెప్పింది. మధ్యాహ్నం అయింది. సంధ్యావందనం చెయ్యమంది. వంటలు చల్లారిపోతాయి. భోజనానికి లెమ్మంది. ఉంగరం పెట్లో పెట్టాను. ఇప్పుడు తీరికలేదంది. ఇలా చెప్పాక సోమయాజి కోపాగ్రహాన తత్తిరించాడు. ''ఔనె! సత్పుత్రజనయిత్రి! ఔనె! సాధ్వి! ఔనె! సూనృతభాషిణి! ఔనె దేవి!'' అంటూ వెటకారంగా సంబోధిస్తూ అడగవలసిన నాలుగూ అడిగి కడిగేశాడు. మాటిమాటికి ''నేను నీ మాటనమ్మి యరసి రక్షింపనేరక యనుగుగొడుకు భ్రష్టుజేసితి నేమి చెప్పంగ గలదు?'' అని తనను తాను తిట్టుకొన్నాడు. ''ఊచముట్టుగా నీవు నీ యొంటికొడుకు బాడు చేసితి గృహము నిర్భాగ్యురాల!'' అని నిందించాడు. తరువాత

చాలు నింక నాపాలికి జచ్చినాడు
కొడుకు గుణనిధి యనువాడు కులవిషంబు
తిలలు దర్భయు నుదకంబు దెత్తుగాక
యే నివాపాంజలుల వాని కిత్తు నిపుడు! (కాశీ. 4-109)

కుపుత్రత్వం కంటె అపుత్రత్వం మేలు అని కొడుకును విడిచిపెట్టాడు.

ఈ గుణనిధి కథ చాలా చిన్నది. మొత్తం 59 గద్యపద్యాలు శ్రీనాథుడు తన జీవితంలో వ్రాసిన 5814 గద్యపద్యాలలో ఇది నూరవవంతు మాత్రమే. అయితే అతని సృజనాత్మక శక్తికి, పాత్రపోషణ, సంభాషణా రచన అన్నీ యీ ఒక్క ఉపాఖ్యానంలో కనబడతాయి. వాస్తవానికి శ్రీనాథుడు తన కావ్యాలలో కడుపునింపేటట్లు ఎక్కడా కథ చెప్పడు. ఏ పాత్ర కథ చెప్తుందో జ్ఞాపకం పెట్టుకోడు. శ్రీనాథునిపై వ్యాసం వ్రాస్తూ మిత్రులు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు చెప్పిన కొన్ని విషయాలు అక్షరాలా నిజం.

'కథానిర్వహణములో మాత్రము పూర్వకవులలో చాలామందికి వలెనే శ్రీనాథునికి శ్రద్ధలేదు. కాశీఖండమున వింధ్య విజృంభణమును అడపుమని అగస్త్యుని నడగ వచ్చినపుడు వాచస్పతి లోపాముద్రకు చేసిన ధర్మోపదేశము కథౌచిత్యమునకు భంగకరమని చెప్పక తప్పదు. భీమఖండమున ఒక కథ యనియే లేదు. స్థలపురాణమును కవితా సౌందర్యముతో నోలలాడించుటయే యిందు ప్రముఖముగ గాన్పించును. తాను మోజుపడి చెప్పుకొను నైషధములో కూడా తక్కిన కవితా గుణముల గాఢపాకముల మాట యట్లుంచిన కథ సుడితిరిగి మందగమనము చూపును. అయినను ఈతని సమ్మోహనమైన ప్రతిభ యెన్నిలోపములనైనను సురక్షితముగా మ్రింగివేయును.'[58]

అనన్యమైన తన ప్రతిభతో కాశీఖండంలో వ్రాసిన గుణనిధి కథలాగా మిగతా కథలన్నీ శ్రద్ధగా వ్రాస్తే శ్రీనాథుడు తిక్కనగారికన్నా ఒక మెట్టు పైనే వుండేవాడు. ఇంతటి శైలీ సంపన్నుడు తెలుగు సాహిత్యంలో గ్రంథకర్తల శ్రేణిలో రెండవ తరగతివాడని కొందరనడానికి అశ్రద్ధే కారణం.[59] శ్రీనాథుడు తెలుగుదేశాన్ని, భాషను ఎంత ప్రేమించినా తెలుగు కవిత్వాన్ని సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉండనివ్వకుండా తత్సమ రోదసిలోకానికి పంపించాడు. నభోమండలంలోనికి నౌకను పంపడం అఖండ సాంకేతిక శాస్త్రీయ విజయమే. అయితే అది నేల విడిచిన గొప్పసాము.

శ్రీనాథుడు ఆగర్భ పండితుడు; ఆ బాల్యకవి[60] నిజంగా సకల విద్యాసనాథుడు. సంస్కృతాన్ని ఆదరించి, అందులోనే రచనలు చేసే ప్రభువుల కొలువులో, గీర్వాణాన్నే అభిమానించి దానిలోనే పాండిత్య పాటవాన్ని ప్రదర్శించే కవిపండితుల సాహచర్యంలో కాలం గడిపినా శ్రీనాథుడు తెలుగుమీద చిన్నచూపు చూడలేదు. మొదటిసారిగా ఈ భాష గొప్పతనాన్ని ఇతడే చాటాడు.

జనని సంస్కృతంబు సకలభాషలకును - దేశభాషలందు దెనుగులెస్స
జగతి తల్లికంటె సౌభాగ్యసంపద - మెచ్చుటాడు బిడ్డ మేలుగాదె? (క్రీడా. 37)

శృంగార నైషధం, హరవిలాసం, భీమేశ్వరపురాణం, క్రీడాభిరామం, కాశీఖండం, శివరాత్రి మాహాత్మ్యం, కావ్యాలలో శ్రీనాథుడు వాడిన వృత్త విశేషాలు ఇవీ : 1. ఆటవెలది,

58. విజ్ఞానసర్వస్వము - (తెలుగు భాషాసమితి) 3వ సంపుటం, పుట 1164.
59. శబ్దరత్నాకరంలో బహుజనపల్లివారు శ్రీనాథుణ్ణి రెండవతరగతి కవిగా అంచనా వేశారు.
60. పదబంధాలను కుందూరి ఈశ్వరదత్తుగారు తమ శ్రీనాథుని కవిత్వతత్వంలో వాడారు. పుట 82.

2. ఉత్పలమాల, 3. ఉత్సాహం, 4. ఉపేంద్ర వ్రజ, 5. కందం, 6. కవిరాజ విరాజితం, 7. చంపకమాల, 8. తాళవృత్తం, 9. తేటగీతి, 10. తోటకం, 11. దండకం, 12. పంచ చమిరం, 13. పృథ్వి, 14. భుజంగ ప్రయాతం, 15. మత్తకోకిల, 16. మత్తేభం, 17. మహాస్రగ్ధర, 18. మానిని, 19. మాలిని, 20. రగడ, 21. లయిగ్రాని, 22. వచనం, 23. విషమవృత్తం, 24. శార్దూలం, 25.శ్లోకం, 26. సీసం, 27. స్రగ్ధర, 28. స్రగ్విణి; ఆటవెలది (సీసం), తేటగీతి సీసం – అయితే శ్రీనాథుడు జీవితకాలమంతా రాసిన గద్యపద్యాల సంఖ్య మొత్తం 5814.

అయితేనేం ఇంటి ఆడబడుచుకు శ్రీనాథుడు పెట్టినన్ని అలంకారాలు ఇంకొక కవి పెట్టలేదు.

కవిత్రయం వారికన్నా, నన్నెచోడునికన్నా శ్రీనాథుడే సాహిత్యలోకంలో బహురంజకుడు. ప్రతి అనంతరకవీ తన సీసాలు ఇతని సీసాల మూసలో తయారు చేసుకున్నట్టే కనబడుతుంది.

శ్రీనాథుడు వ్రాసిన గద్యపద్యాలలో సీసాలు 7వ వంతుకన్నా తక్కువే. అతడు వ్రాసినవి ఎక్కువగా తేటగీతులు. అతని మొత్తం రచనలో తేటగీతులు రమారమి నాలుగవ వంతు ఉంటాయి. శ్రీనాథుడు సీసపద్యాల తరువాత తేటగీతులనేగాని ఆటవెలదులను వాడడు. శృంగార నైషధంలో ఎక్కడో ఒక్కమాటు సీసపద్యం తరువాత ఆటవెలది వ్రాశాడు. (శృ.నై.2-62) ఆంధ్ర ఛందః పరిణామంలో ఇదొక ముఖ్యఘట్టాన్ని సూచిస్తుంది. ''నన్నెచోడుని తన కావ్యమున సీసపద్యముల కాటవెలదులనే యను సంధించియున్నాడు'' అని ఒకచోట,[61] ''నన్నయ నన్నెచోడ మహాకవుల సీస పద్యములలో చాలావరకు సీసముల కాటవెలదులే యుండును'' అని మరొకచోట[62] నిడుదవోలు వెంకటరావుగారు వ్రాశారు.

నన్నెచోడుడు రెండింటిని ఇంచుమించు సరిసమానంగానే వాడాడు. సీసాల తరువాత 95 ఆటవెలదులు, 90 గీతిపద్యాలు రచించాడు. శ్రీనాథుడు తేటగీతుల వైపు మొగ్గడం గమనించదగ్గ విషయం.

జీవితంలో ఆటవెలదులంటే ఇష్టపడే శ్రీనాథుడు సీసాల తరువాత వాటిని చేరనివ్వకపోవడం అబ్బురమే!

శ్రీనాథుని ఛందస్సులను శ్రద్ధగా పరిశోధించటం చాలా అవసరం. అతడు రగడలలో అంత్యప్రాస వాడినట్టు లేదు.

---

61. దాశరథి శతకం (దాశరథిగారు వ్రాసినది) పీఠికగా వ్రాసిన 'శతకవాఙ్మయ సమీక్ష'లో, 85 పుట.
62. అదే పుస్తకం, అదే పీఠికలో, 19 పుట.

శివరాత్రి మాహాత్మ్యంలో తాళవృత్తము (4-34) అని అచ్చువేసినది హరిగతి రగడ. ఇందులో అంత్యప్రాస లేదు. ద్వితీయాక్షర ప్రాసకూడ కనబడదు.

కాశీఖండం ఆరో ఆశ్వాసంలో కూడా ఒక హరిగతి రగడ ఉంది. అది 66 పాదాలలో మణికర్ణికా ప్రభావ వర్ణన. దీనిలో అంత్యప్రాస లేకపోయినా ద్వితీయాక్షర ప్రాస ఉంది.

శ్రీనాథుని రగడలాగే అతని దండకాలు విలక్షణమైనవి. వాటిని సంస్కృత సంప్రదాయంలో రెండు నగణాలపై రేఫలు పెట్టి వ్రాస్తాడు.

శృంగార నైషధం (4-168)లో ఉన్న సరస్వతీ దండకం అంతా సంస్కృతమే. తెలుగు డుమువులు లేవు.

ఇదే సంస్కృత లక్షణంలో హరవిలాసంలో ఒక దండకం వ్రాశాడు (6-57). ఇది అంతా ఏకపాదం. ఇవి స్తుతులే. నమస్తే నమస్తే నమః అని చివర ఉంటాయి.

అయితే స్తుతి కాకుండా కథ నడపడానికి శ్రీనాథుడు దండకం వాడకపోలేదు. కాశీఖండంలో దక్షుని యాగశాలలో దాక్షాయణి ఒక్కొక్కర్నే పట్టుకొని దులిపెయ్యడాన్ని శ్రీనాథుడు నాల్గుపాదాల దండకంగా సంస్కృత లక్షణంతో తెలుగులో వ్రాశాడు (కాశీ. 7-74). ఇందులో చివర 'నమస్తే నమస్తే నమః' ఎలాగూ ఉండదు.

అలా నమస్తేలు చివర వ్రాసినవన్నీ దండకాలు కావు.

భీమఖండంలో రెండుచోట్ల 'నమస్తే'లతో అంతమయ్యే వచనాలు ఉన్నాయి (భీమ 3-212; 5-53).

హరవిలాసంలో ఒకటి ఉంది (6-57). ఇది సంబోధన ప్రధానంగా గల బిరుదు గద్య అనుకోవచ్చు. శ్రీనాథుడు వచనంలో కథ చెప్తున్నపుడు 'ఇతడు గ్రంథాలన్నీ ఇలాగు వచనంలో వ్రాస్తే ఎంత బాగుండు'ననిపిస్తుంది.

ఉదాహరణకు నారదునితో వింధ్య పర్వతం చెప్పిన మాటలు (కాశీ. 1-100) చూస్తే తెలుస్తుంది.

వచనమైనా, పద్యమైనా తన సొంతముద్రతో రచించేవాడే మహాకవి. శ్రీనాథుని పురుషపాత్రలందరూ అఘమర్షణ స్నానమే[63] చేస్తారు. అతని స్త్రీ పాత్రలందరు చిరుబంతి పసుపాడుతారు. అతనికి నాట్యాలలో 'గొండ్లి', 'ఇష్టం'; రాగాలలో 'మాల్కవుస్' అంటే అభిమానం. హరవిలాసంలో కాళిదాసు శ్లోకాలు అనువాదం చేస్తూ మూలంలోని సంగతి

63. అఘమర్షణము : పాపము నశించుటకు జపించే మంత్రం. ఇది ఋగ్వేదమున 190-వ సూక్తం. జలంబులందుండి మూడుమారులు దీనిని జపించగా గురుతల్పగమనాది మహాపాతకములు గూడ నశియించును. (సూర్యరాయాంధ్ర నిఘంటువు)

చెప్తూ అచ్చరలచేత ఈ హిందోళరాగమే పాడించాడు (హర. 3-63). అతని అభిరుచులు చిత్రమైనవి. రుచులు అనేకం. తెలుగు వంటకాలను, పానీయాలను ఇతడు పేర్కొనినన్ని ఇంకెవరూ పేర్కొనలేదు. ఏఏ కావ్యాలలో ఎక్కడెక్కడ ఎనెన్ని పేర్కొన్నాడో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

శ్రీనాథుని గ్రంథాలన్నీ పరిశోధకులకు ఎంతగానో పనికి వస్తాయి. అతని అవతారికలవల్లా, చాటువులవల్లా రాజకీయచరిత్ర, దేశ చరిత్ర వ్రాయవచ్చు. అతని కావ్యాలలోని వివరాలనుబట్టి సాంఘికచరిత్ర వివరించవచ్చు. కొన్ని అతి చిన్న ఆచారాలు కూడా అతని గ్రంథాల వల్ల తెలుస్తాయి.

మాటవరసకు ఇవాళ ఎవరైనా సంధ్యావందనంలోనైనా, వ్రతాలలోనైనా ఆచమనం చేసి కేశవనామాలు ఉచ్చరిస్తారు. ఆనాడు శైవులు ఆచమించి ఏ పేర్లు చెప్పేవారు? ''కొందరనుష్ఠానపరులీచతుర్వింశత్యాచమన క్రియ లందు కేశవాది చతుర్వింశతి నామంబు లుచ్చరింతురు'' అని శ్రీనాథుడు చెప్పాడు (కాశీ. 5-201). ఆచమన ప్రకారం తెలిపి, అది ఎవెరెవరిని ఎలా శుద్ధి చేస్తుందో వివరించాడు.

శుద్ధుడగు హృద్గతములభూసురుడు; నీళ్ళ
గళగముల భూమిపతి; తాలుగముల వైశ్యు
డాస్యగంబుల శూద్రుడునాటదియను
నాచమనవేళ యందు వింధ్యాద్రిదమన! (కాశీ. 5-202)

శూద్రులకు కూడా ఆచమనార్హత వుంది. వాళ్ళు కేశవనామాలు ఇరవైనాలుగూ ఉచ్చరిస్తూ వివిధాంగాలు స్పృశించేవారు. ఇరవైనాలుగు కేశవనామాలనే గాక అష్టోత్తర శత హరిహర నామాలను కూడా శ్రీనాథుడు చెప్పాడు (కాశీ. 3-159-162 దాకా నాలుగు గద్యపద్యాలు). హరిహరుల వంటి ప్రసిద్ధదైవాలనే కాక క్షుద్రదేవతలను సహితం శ్రీనాథుడు సగౌరవంగా స్తుతిస్తాడు. 'కాకతమ్మకుసైదోడ ఏకవీర' (క్రీడా. 128) అని ఒకసారి చెప్తాడు. ''చర్మముండకు జెలికత్తె శైలదమన'' అని కాశీఖండంలో చెప్పాడు (6-208). కాశీలోని గ్రామదేవతలను వివరించి అందులో చర్మముండ, మహోరుండ అనే దేవతలు ఎలా విహరిస్తారో ఇలా చెప్పాడు.

హాలాపాన మొనర్చి యిద్దరును అన్యోన్యంబు మత్తిల్లి కం
కేళీనృత్తవినోదకందుకమణిక్రీడావిహారక్రియా
లీలా హాస్యకళాప్రసంగముల నుల్లేఖించి వర్తింతురె
క్కాలంబున్ఘటజన్మ! కాశినడుమన్ గర్వించి యిద్దేవతల్. (కాశీ. 6-210)

కాశీలోని గ్రామదేవతలను ఎలా వర్ణించాడో దక్షిణకాశి అయిన దాక్షారామంలోని మాతృకలనూ అలాగే పేర్కొన్నాడు. దక్షవాటిక పశ్చిమ ద్వారాన గోగులమ్మ, ఉత్తరద్వారాన

మండతల్లి, తూర్పుగవనిలో నూకాంబ, దక్షిణపార్శ్వాన ఘట్టాంబిక అనే గ్రామ దేవతలు ఉంటారని భీమఖండంలో ప్రథమాశ్వాసంలో చెప్పాడు (99-102). ఈ గ్రామదేవతలచేత భూత కోటితో వసంతాలాడించాడు.

సేతుల నూనెలం బసుపునీరును గుంకుమ చెందిరంబుల
స్నూతనగంధసారములనుం బొనరించిరి కేలితంత్రముల్
కౌతుక మొప్ప దక్షవనికాపురవీధుల భూతకోటితో
మాతృక గోగు నూకసతి మండమదేవియు ఘట్టతల్లియున్. (భీమ. 5-116)

ఇది గ్రామదేవతల జాతరలో కాదు; భీమనాథుని వసంతోత్సవంలో భీకరమైన క్షుద్రదేవత లను అప్సరసలతో సరి సమానంగా శ్రీనాథుడు చూడగలడు. ఈ వసంతోత్సవంలో అంతకు ముందర అచ్చరలేమలచేత జాజరపాటలు పాడించాడు.

జాదురజాదురంచు మృదుచర్చరగీతుల వారుణీరసా
స్వాదమదాతి రేకముల జంద్రిక కాయగ దక్షవాటికా
వేదులమీదటన్ గనకవీణలు మీటుచు బాడి రచ్చరల్
మోదమెలర్పగాభువనమోహనవిగ్రహు భీమనాథునిన్. (భీమ. 5-103)

పాటలు పాడించేటప్పుడూ, నాట్యాలు చేయించేటప్పుడూ, శ్రీనాథుడు పక్షపాతం లేకుండా దేశి, మార్గసరణులు రెంటినీ పేర్కొంటాడు. దేశికవితలో ఒకటైన యక్షగానాన్ని శ్రీనాథుడు పేర్కొన్నాడు (భీమ. 2-65). వీథి నాటకాన్ని వ్రాశాడు. వీథుల్లోని వినోదాలు వర్ణించాడు. మొగ్గవేసి ఆ భంగిమలోనే నాలుకతో పూసలు గుచ్చే దొమ్మరి పిల్లను మెచ్చుకొన్నాడు. మేషయుద్ధాలలో, కోడిపందాలలో ఓడిపోయినవారి విలాపాన్ని గ్రంథస్థం చేశాడు.

మన కవులకు ఏడుస్తున్న ఆడపడుచును అందంగా వర్ణించడం అలవాటే. ఎర్రయ్యగారు ఉషాకన్యచేత ఏడిపించి 'పెల్లొదవెడు బాష్పవారి నయనోత్పలపీడ యొనర్ప రోదనాభ్యుదయ మనోజ్ఞమై వదన మొప్పిం'దని వర్ణించాడు (ఉ.హరి. 7-99). శ్రీనాథుడు కూడా ఏడుస్తున్న ఆడపడుచును వర్ణించాడు.

కొసరి వసంతకాలమున గోయిల గ్రోల్చిన భంగి నేడ్చెన
బ్బిసరుహనేత్ర కొండచరి బెద్దియెలుంగున వెక్కివెక్కి వె
క్క సమగు మన్యువేగమున గాటుకకన్నులనీరు సోనలై
యుసిరిక కాయలంత లు పయోధరముల్ దిగజారునట్లుగన్. (కాశీ. 5-167)

అనంతర కవులు ఇది చూసి మహత్తరంగా ఏడిచారు. 'ముక్కు తిమ్మన ముద్దుముద్దుగా ఏడ్చాడు. అల్లసానివారు అటూఇటూ ఏడ్చారు. భట్టుమూర్తి బావురుమని ఏడ్చాడు' అనే సాహిత్యలోకపు సామెతకు శ్రీనాథుని రోదనాభ్యుదయం దారితీసింది. నిజానికి అతని కవితావిధానాలు ఎంటరెందరో అనంతర కవులకు దారిచూపాయి. అందుకే

కవితా ప్రపంచపు త్రిమూర్తులలో శ్రీనాథుడు శ్రీనాథుడైన విష్ణువే అని భట్టుమూర్తి తన వసుచరిత్రలో ఇలా కీర్తించాడు.

మహి మున్ వాగనుశాసనుండు సృజియింపం గుండలీంద్రుడు త
న్మహనీయస్థితిమూలమై నిలువ శ్రీనాథుండు ప్రోవన్ మహా
మహులై సోముడు భాస్కరుండు వెలయింపన్‌సొంపు వాటిల్లునీ
బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమున దత్త్రాగల్భ్యమూహించెదన్ (వసు. 1-10)

భట్టుమూర్తి ఇలా నుతిస్తే శ్రీనాథుని కవిత్వంలో 'సూనాస్త్రప్రమదా మదస్ఫురిత వక్షోజాత కాఠిన్యము' ఉందని రాధామాధవకవి చెప్పాడు. ఎందరెందరో ఎన్నెన్ని విధాలుగానో నుతించారు. అందుకే శ్రీనాథుడు కవిసార్వభౌముడై పట్టం కట్టుకొన్నాడు. తన కాలంనాటి ఏ పెదకోమటి వేమారెడ్డి పట్టాభిషేకాన్నో జ్ఞాపకం చేసుకొని చతుర్భుజ పట్టాభిషేకమనే ఆఖ్యానాన్ని కాశీఖండంలో వ్రాశాడు. వెల్లగొడుగు పట్టి నడిపిస్తే ముత్తయిదువలు కైసేసి రత్నదర్పణం చూపి దీపసంచయంతో నివాళించాక మేటి దొరలు వీచోపులిస్తే వెండికట్టుల వేత్రదండం దాల్చి దండనాయకుడుండగా గద్యపద్యసరణి కైవారాలు వింటూ ఆనాడు రాజులు పట్టాభిషేకం చేసుకునేవారు కాబోలు.

పట్టాభిషేకాలనే కాక పచ్చి బీభత్సాలను కూడా శ్రీనాథుడు వివరాలతో చిత్రించగలడు. అతని కాలంలో చంపుడు గుళ్ళు ఉండేవి. వాటిలో శైవులు ధీర హృదయాలతో చూపరుల ఒళ్ళు గగుర్పొడిచేటట్లు భీకర నృత్యాలు గావించేవారు. వాటిని శ్రీనాథుడు ఇలాగ వర్ణించాడు.

రవరవమండు నెర్రని చంద్రమల్లెల చోద్యంపుగుండాలు చొచ్చువారు
కరవాడియలుగుల గనపపాత్రల్లో నుట్టిచేరులు గోసి యురుకువారు
గాలంపుగొంకి గంకాళచర్మము గ్రుచ్చి యుడువీధి నుయ్యెల లూగువారు
కటికి హెున్నాళంబు గండకత్తెర వట్టి మిసిమింతులును గాక మ్రింగువారు

సందులను నారసంబులు సలుపువారు
నెడమకుడిచేత నారతులిచ్చువారు
సాహసము మూర్తిగైకొన్న సరణివారు
ధీరహృదయులు మైలార వీరభటులు (క్రీడా. 142)

శ్రీనాథుని కాలంలో ఇంతకన్నా దారుణమైన ఆచారం ఒకటి వుండేది. దాని నతను వ్రాసిన కాశీఖండంవల్ల ఎక్కువగా తెలుసుకోవచ్చు. ఆ సాంఘిక దురాచారం సహగమనం. దీనిని గురించి సురవరం ప్రతాపరెడ్డిగారు ఇలా వ్రాశారు.

''సహగమనమును మద్యవచ్చిన ఉత్తరహిందూస్థానాచారము. మహమ్మదీయుల అత్యాచారాలు ఏమూలనుండిన అచట ఆ యాచారానికి అతి వ్యాప్తి కలిగెను.

ముఖ్యముగా ఇది కాశ్మీర, రాజపుత్రస్థాన, పంజాబు దేశాలలో ప్రబలమయ్యెను. తర్వాత బెంగాలులో ప్రబలమయ్యెను. దక్షిణదేశాలలో కాకతీయుల కాలములో రెడ్డిరాజుల కాలంలో ప్రారంభమై అరుదుగా నందందు జరుగుటకు మొదలయ్యెనని తలంతును. సతి యను ఘోరాచారము తెనుగుగడ్డపై పాదుకొన్నది కాదనియే తలంతును'[64]

సురవరంవారు వ్రాసినదాంట్లో కొంత సత్యం లేకపోలేదు. శ్రీనాథుడు తన రచనలో 'సతి'ని ప్రచారం చేశాడు. కాశీఖండంలో లోపాముద్రను కుశల ప్రశ్నలు వేసే బృహస్పతిచేత కొన్ని పతివ్రతా ధర్మాలు చెప్పించాడు. తండ్రి వంశంలో ఏడుతరాలు, తల్లివంశంలో ఏడు తరాలకు, మగనివంశంలో ఏడుతరాలవాళ్ళకు శాశ్వత స్వర్గసౌఖ్యం ఇవ్వగల పతివ్రత తన భర్త చనిపోయిన వెంటనే చితాగ్నిలో దూకిన వెంటనే ఏం జరుగుతుందో చెప్తున్నాడు.

తొలుగుదు రంతనంత యమదూతకిరాతులు భీతచిత్తులై
కలుషసమన్వితుండయిన కాంతుని దారుణలోహపాశశృం
ఖలికలు విచ్చి పుచ్చుకొని కాంత చితాగ్నిశిఖాముఖంబునన్
వెలువడి యాత్మభర్త వెనువెంట హుటాహుటి గూడివచ్చినన్. (కాశీ. 2-90)

ఈ విధంగా సహగమనం చేసిన స్త్రీకి ఎంత పుణ్యమో లెక్కగట్టి చెప్తున్నాడు.

ఎన్నికకు రోమకూపంబు లెన్ని కలవు
దివ్యవర్షంబు లన్ని మోదించుసాధ్వి
నాకభువనంబునం దాత్మనాథుగూడి
వెర పాకింతయు లేక చిచ్చురికెనేని. (కాశీ. 2-91)

అందుకే శ్రీనాథుడు 'హరవిలాసం'లో రతీదేవి చేత సతీకృత్యం చేయింప చూశాడు. రతీదేవి వసంతుణ్ణి చూసి ఇలా అంటుంది.

''నీవును పరమ మిత్రుండవు గావున నన్నును నగ్ని ముఖంబున నీసఖుం గూర్చ, బాడి, శశితోడంగూడ గౌముదియు మేఘంబుతోడం గూడ మెరుంగుననుట సకలసమ్మతంబు. కుసుమశరు శరీరభసిత చూర్ణంబు శరీరంబునం దాల్చి నా మేను విభావసునందు వేల్చెదం గిసలయ తల్పం బులకు నిటమున్ను సహాయుండవగు నీకు జితి పేర్చంజాలవచ్చెనే యని పల్కి శోకావేశంబున వెండియు.

హస్తయుగ్మము మోడ్చి ప్రార్థించి పలికెద దమ్ముడా నాకిమ్ము దగ జితాగ్ని
8 మందమందంబుగా మలయానిలంబులు వెరపుతో మండంగ విసరుగాత
బరలోకతృప్తికై బంధులిద్దరకును ధర్మోదకం బిండు తమ్మితేనె
సహకారమంజరీ చరుపిండకబళంబు పెట్టుండు మాకు నైపికము ముట్ట

64. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పుటలు 168, 169.

దేనె పెట్టుండు కస్తూరి దీర్చి యచట
జేర గొజ్జంగ పూనీటు జెంబు లిడుడు
నన్ను వలరాజు దలచి మన్నన దలిర్ప
దగ సమర్పణ చేయుడు దంపతులకు (హర. 3-93, 94)

అయితే ఇది కాళిదాసు కుమారసంభవములోనే ఉంది. ఆ శ్లోకాలకు మెరుగుపెట్టి శ్రీనాథుడు అనువదించాడు. చూడండి. మూలంలో రతి వసంతుణ్ణి చితి పేర్చమనే శ్లోకం.

తదిదంక్రియా మనంతరం భవతా బంధుజనప్రయోజనం
విధురాం జ్వలనాతిసర్జనాన్నసుమాంప్రాపయపత్యురన్తికం. (కుమార. 4-32)

ఈ శ్లోకాన్ని అనువదించలేదుకాని నన్నెచోడుడు తన కుమార సంభవంలో రతీదేవి సహగమనం చేయాలనుకొన్న సంగతిని మాత్రం ఇలా వచనంలో చెప్పాడు.

'అని తన్ను తాను నిరాకరించుచుం బతి సహవృత్తి లేమినింగుల పాలికాధ మవృత్తినైనం బురుషునితోడం బరలోకంబున కరుగవలయుననవశ్యం బగ్ని ప్రవేశంబు సేయుదునని రతి మరణనిశ్చయంబు సేసిన.' (కుమార. 5-94)

నన్నెచోడుడు క్రీ.శ. 12వ శతాబ్దివాడు. కాళిదాసు పాశ్చాత్య చరిత్రకారుల ప్రకారం క్రీ.శ. 400 ప్రాంతాలవాడు. భారతీయ విద్వాంసుల నమ్మకం ప్రకారం క్రీస్తుపూర్వపువాడు. అంత ప్రాచీనకాలంలో కూడా సహగమనం ఉండేదన్నమాట. వేదాలలో కూడా సహగమన ప్రసక్తి ఉందని, ఋగ్వేదంలోని ఒక ఋక్కు దానిని స్పష్టం చేస్తోందని అంటారు. అయితే ఆ ఋక్కులో 'అగ్రే' అన్న పదానికి 'అగ్నే' అని మార్చినందువల్ల (10-18-7) ఇటువంటి భావనకు ఆస్కారం వుంది. "వేదకాలంనాటి స్త్రీలు" అనే విషయంపై ఎంతో పరిశోధన చేసిన శ్రీమతి శకుంతలారావుశాస్త్రి ఇలా వ్రాసింది.

The Rigveda does not mention anywhere the practice of the burning or burial of widows with their dead husbands; but on the contrary considers the widow to be married to the brother of the dead husband.[65]

అయితే అధర్వవేదంలో మొదట సహగమనం ఉన్నా తరువాత లాంఛనప్రాయంగా భార్యను చనిపోయిన భర్త ప్రక్కన పడుకోబెట్టి మళ్ళీ లేపేవారు.

"... It is clear that burning of wives along with their dead husbands was a practice of the Adharva vedic cult and it became almost extinct and was observed only as a show."[66]

కొన్ని ఆదిమ సమాజాలలో సహగమనం ఉన్నమాట నిజమే. అయితే నాగరికత పెంపొందినకొలదీ ఈ దురాచారం మెల్లమెల్లగా తగ్గుముఖం పట్టి నశించింది. అయితే

65. "Women in the Vedic Age" Sakunthala Rao Sastri, P. 25

66. "Women in the Vedic Age" P. 54.

మహమ్మదీయుల రాకతో మళ్లా ఇది మనకు దాపురించింది. రాజారామ్మోహనరాయ్ ధర్మమా అని అంతరించింది.

మరీ అత్యంత ఆదిమ సమాజాలలో మృగాలలాగా జీవించే మనుష్యులు నరభక్షణ చేసేవారు. నేటికీ కాంగోలో పగవాళ్లను చంపి పచ్చిమాంసాన్ని తినడం కనబడుతూనే వున్నది. మన భారతదేశంలో ఈ ఘోరం ఒక్క రాక్షసులకే నైజం. అయినా కొన్ని దారుణ మతసంప్రదాయాలున్న రహస్యవర్గాలు పసిపాపలను బలివేసి మాంసభక్షణ చేసేవారని ప్రతీతి. తన భక్తులను పరీక్షించటానికి శివుడే తనకు మాంసం కావాలనడం, భక్తుడు తన కన్నకొడుకునే చంపి భార్యచేత వండి పెట్టించటం శ్రీనాథుని హరవిలాసంలో ఉంది. అది చిరుతొండనంబి చరిత్ర.

''చిరుతొండడు చారిత్రకవ్యక్తే. ఇతణ్ణి గురించి వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఇలా వ్రాశారు.[67]

చిరుతొండడు: సిరియాలుడు, దభ్రభక్తుడు నామాంతరములు. ఈతడు రెండవ పులకేశిని జయించి, వాతాపికోటను పట్టుకొని తన రాజున (మొదటి నరసింహవర్మ?) కొసగెను. ఈతడు సేనాధిపతి కాంచీపురవాస్తవ్యుడు. క్రీ.శ. 630 నాటివాడగు. ఈతని కొడుకు సిరియాలుడు. భార్య తిరువెంగణి. దాసి చంద(న) నంగ.''

ఈ చిరుతొండనంబి చరిత్రము శ్రీనాథుడు వ్రాయడానికి ముఖ్య కారణము ఇతడు అవచి తిప్పయ్యసెట్టి పూర్వీకుడు కావడమే. ఈ భక్తుని కథ పాల్కురికి సోమనాథుడు వ్రాసిన బసవపురాణం నాలుగో ఆశ్వాసంలో ఉంది. అది 190 ద్విపదపాదాల గాథ. దానిని శ్రీనాథుడు 170 గద్య పద్యాలలో విపులంగా రచించాడు. పాల్కురికి సోమనాథుడు రచించిన పండితారాధ్యచరిత్రను, ఆ ద్విపదలనే వాడుతూ శ్రీనాథుడు పద్యకావ్యంగా ఎలప్రాయంలోనే రచించాడు. అయితే ఈ సిరియాల చరిత్రలో శ్రీనాథుడు సోమనాథుని అట్టే అనుసరించలేదు. సోమనాథుని కథలో సిరియాలుని తల్లిపేరు సంగళవ్వ. శ్రీనాథుని కథలో చారిత్రక సత్యమైన పేరే వుంది. స్థానికులు చెప్పిన కథలు విని శ్రీనాథుడు ఈ రచన చేసి వుంటాడు.

అతని ఇతర రచనలన్నీ సంస్కృత పురాణాలకో, ప్రసిద్ధ కావ్యాలకో అనువాదాలు.[68] ఈ సిరియాలచరిత్ర మాత్రం స్వతంత్రరచన. అందుకే ఇందులోని శిల్పం కథా నిర్వహణ మొదలైనవి పరిశీలించటం చాలా అవసరం.

---

67. బసవపురాణం, ఆంధ్రగ్రంథమాల ప్రచురణ (1926), పీఠిక పుటలు 60, 61
68. శ్రీనాథుడు రచించిన భీమఖండానికి సంస్కృతమూలమున్న గోదావరీఖండం అనంతర కృతి అనే ప్రవాదం ఉన్న సంగతి ఇంతకు ముందు చెప్పుకొన్నాం. అతని శివరాత్రి మాహాత్మ్యానికి మాతృక అనబడే ఈశానసంహితకూడా ఆర్వాచీనకల్పితమే అని పండితుల భావన. (చూ॥ కఱ్ఱి సాంబమూర్తిగారి వ్యాసం. ఆం. సా. పరిషత్పత్రిక. సంపుటం 30, సంచిక 2-3). అయితే బ్రహ్మోత్తర ఖండంలో ఈశానసంహిత ఉండవచ్చునని చిలుకూరి పాపయ్యశాస్త్రిగారి ఊహ. (చూ॥ అం.సా.ప.సం.30. సంచిక 4, 5) కాబట్టి శ్రీనాథుని ఇతరరచనలన్నీ అనువాదాలనుకోవచ్చు.

దూర్వాసుని శాపం వల్ల తుంబురుడు కాంచీనగరంలో వైశ్య కుటుంబంలో చిరుతొండడు అనే పేర జన్మించాడు. అతని భార్య తిరువెంగణి. వాళ్ళకు సిరియాలుడనే పుత్రుడు జన్మించాడు. వాళ్ళు శుద్ధ వీరశైవాచార పరాయణులు. చిరుతొండడు జంగాలు ఏదడిగినా లేదనకుండా ఇస్తాననే వ్రతం పట్టాడు. ఒకనాడు ఒక భిక్షావృత్తి జంగం వచ్చి 'శివకారుణ్యాం' అని దీవించి తన నియమం చెప్పాడు. కంచి గరిపాడు గట్టు తూముతో తూమెడు చెరుకు రసం కావాలన్నాడు. అది చేగాను గాడినదే అవాలి. దానిని శివునికి అర్పించిగాని భోజనం చేయకూడదనే నియమం జంగానికుంది. 'ఇదేం భాగ్యం' అని చెరకుగడలు తేవడానికి చిరుతొండడు వెళ్ళాడు. అయితే తూమెడురసం తీయడానికి నూరుగడలైనా కావాలి అని బిగువుగా మోపు కట్టించాడు. ''వాడి పళ్ళు బిగించి చేవలంయెదిగి ఎత్తబోతే మోపు ఎత్తబడలేదు. వెగ్గలమైన మోపు ఎత్తలేక మ్రొగ్గితిలబడ్డాడు. ముఖాన చెమట పట్టింది. అప్పుడు కైలాసంనుంచి శివుడే వచ్చి సాయం పట్టాడు. ఆ మోపు శివునికే బరువై చెమట పట్టింది. వెంటనే మాయమైపోయాడు.

అప్పుడు కైలాసంలో అప్సరసలు నాట్యం చేస్తున్నారు. మాయమై వచ్చి మళ్ళా శివుడు నాట్యం చేస్తున్నాడు. అతని ఒళ్ళు చెమర్చింది. ఇది చూసి పార్వతికి ఈర్ష్య కలిగింది. మొగుణ్ణి మొత్తింది. (నయం! సత్యభామ కాలితో కృష్ణుని తన్నింది. అమ్మవారు శివుణ్ణి పువ్వుతో కొట్టింది. అలా కొడితే పుప్పొడి మూడుకళ్ళలోనూ చిందిందిట.) వినండి శ్రీనాథుని పద్యం.

అమరవరేణ్యా ప్రేంకణములాడెడు వేలుపు లేమజూచియే
చెమరిచితంచు గేళి సరసీరుహమెత్తి ప్రతాపమొప్పగా
హిమగిరి రాజనందన మహేశ్వరు మొత్తె మధూళికావరా
గములు శశాంక శేఖరుని కన్నులమూటను జిందునట్లుగన్ (హర. 1-25)

అపుడు శివుడు అందరూ వింటుండగా ఇలాగ సంజాయిషీ చెప్పుకున్నాడు. అప్సరసల చూచి ఒళ్ళు చెమర్చలేదన్నాడు.

కమలాక్షి ఇది యేమిగా దలంచితి విప్పు డర్ధదేహంబు నీయదియకాదె
హృదయంబు పొరువున హృదయముండుట లేద యేకీభవించిన యిరువురకును
నేభావమైన నీహృదయంబునకు దాపనే భంగివచ్చు నాహృదయమునకు
నపరాధశంక యావంతయైనను లేదు నీచిత్తమునకెక్క నిక్కువంబు

తప్పు లేకుండ నేల నెత్తమ్మి మొగడ
విసరి వక్షఃప్రదేశంబు వ్రేటుకొంటి
కేసరంబులరజము బుష్పాసవంబు
నెరసె నిదె చూడు కన్నుల నీరు గ్రమ్మె. (హర. 1-27)

తన కంటినీరు చూపించి ఒంటినీటికి గల కారణం చెప్పాడు. చిరుతొండ నంబికి చెరకు మోపు ఎత్తడంవల్లనే చెమట పట్టిందని చెప్పాడు. అంత గొప్ప భక్తుని చూడాలని పార్వతీదేవి కోరింది. సాధారణంగా చూపడం ఎందుకని శివుడు ఒక ప్లాను వేశాడు. ఇంద్రుణ్ణి పిలిచి కంచిలో ఇరవై ఒక్కరోజులపాటు ఎడతెరిపి లేకుండా అకాలవర్షం కురిపించమన్నాడు. ఇంద్రుడు 'చిత్తం' అన్నాడు. కనీ వినీ ఎరుగని వర్షం కురిపించాడు. శ్రీనాథుడు ఎనిమిది గద్య పద్యాలలో ఆ వర్షం వివరంగా వర్ణించాడు. ఆ వర్షానికి అందరూ భయపడిపోయారు. ఊళ్ళో కాపురం వున్నవాళ్ళు తప్ప తక్కినవాళ్ళు వాన వెలసిన వెంటనే ఊరువదలి పోవాలనుకున్నారు. వాళ్ళు 'గుంపులుకట్టి కోలంగట్టిన తెరంగున జలోపద్రవంబు దిట్టువారై మూడామడ మేర యంతయు బుక్కిటిబంటియైన తత్ప్రదేశంబు వెడలి గండంబు గడిచితిమని గుండియలు నిగిడికొనుచు' వెళ్ళారట.

జంగమారాధాన చేయనిదే భోజనం చేయకపోవడం చిరుతొండ నంబికి మరొక వ్రతం. వాన వెలసిన మరునాడు ఒక్క జంగం కూడా దొరకలేదు. ''శివయోగి యొకండు లేడు నేడు మొగసాల నిదియేమి మోడె నొక్కొ!'' అనుకొని వెదకడానికి వెళ్ళాడు.

వచ్చినవాడకు వచ్చున్ - జొచ్చినవానంబు జొచ్చు జొచ్చినచోటే
యచ్చుగగ్రమ్మరజొచ్చుం - బచ్చు శివార్చనకు శంభుభక్తులవెదకన్
(హర. 2-46)

ఊరంతా వెదికాక చివరకు, ఊరవతల పువ్వులతోట చేరువన శతవృద్ధుడు ఒకడు పడుకొని ఉంటే ఒక గుడ్డిఅవ్వ కాళ్ళు ఒత్తుతూ ఉంది. వాళ్ళను చూచి చిరుతొండనికి ప్రాణం లేచివచ్చింది. నమస్కరించాడు. ఆ శతవృద్ధుడు ఎలా చూశాడో, ఎలా దీవించాడో, ఏమన్నాడో శ్రీనాథుడు రెండు పద్యాలలో బాగా వర్ణించాడు. చూడండి.

సరసి వ్రాలిన బొమలెత్తి పరమవృద్ధు
తలవడకంగ నొయ్యొ నీరెలుగుపడుచు
నంబి నెమ్మోము దేరకొనంగ జూచి
'శివుని కారుణ్య' మనుచు నాశీర్వదించె.
దీవించి యితని వదనము - చే వెలుగిడి చూచి యేమి చెప్పెదు చెపుమా
మీవీనుల వినగావున నీ వొత్తుచు చెప్పు చెప్పెదేని మహాత్మా. (హర. 2-49, 50)

కనుబొమలమీద అరచేయి అడ్డుపెట్టుకొని ఆ చేవెలుగులో చూడడం ఎంత సహజంగా ఉంది! ఇలా చూసి ప్రశ్నించిన వృద్ధును చిరుతొండడు ఇంటికి భోజనానికి పిలిచి విభూతి అందుకొమ్మన్నాడు. అప్పుడు వృద్ధుడు ఇలా అన్నాడు.

ఏడు గాలంబయ్యె నేను నిరాహారఘోరవ్రతంబు గైకొన్నవాడ
హరునినుద్దేశించి యమ్మహావ్రతముననుద్యాపనంబు పశూపహార

మయ్యాగపశువు నన్యంబేదియును గాదు నరుడు గావలయు నన్నరుడు బ్రాహ్మ
ణక్షత్ర వైశ్య సంతతులలో నొక్కడౌ వాడును గడు బిన్నవయసువాడు

రోగశంకా విహీనుండు రూపసియును
వాని తల్లియు దండ్రియు వడుగు సేసి
పాక మొనరించి వడ్డింప భవున కొసగి
కుడుతు నా పంక్తి నీవు నీకొడుకు గుడువ. (హర. 2-54)

'అలాగే, మహాప్రసాదం' అన్నాడు చిరుతొండడు. భక్తుడేది అడిగితే అది ఇవ్వడం అతని వ్రతం. శతవృద్ధు విభూతి అందుకోలేదు. 'నీకు ఇష్టమే కావచ్చు. నీ భార్య ఏమంటుంది? ఆమె కాదు కూడదంటే నేను రాను' అన్నాడు. పైగా ఇలాగ హెచ్చరించాడు.

ఉదరమునన్ ధరించి ప్రసవోద్భవ వేదన బొంది పిమ్మటన్
ముదిముదియైన పీత బడి మూత్రమునన్ బడి లజ్జపండుగా
నదవదయైన తల్లికి బ్రియంబౌ సుతుండు వృథాభిమాన ధు
ర్మదుడగు తండ్రికిం బ్రియుడౌ మానసవీధి దలంచి చూడుమా. (హర. 2-59)

చిరుతొండడు ఇంటికి వెళ్ళి చెప్పితే అతని భార్య ముసిముసి నవ్వు నవ్వి ''మన శరీరార్థప్రాణంబులకు గర్తలు ఎవరు? వారి సొమ్ములు వారికే సమర్పించుటయును నొక దొడ్డపనియేమి?'' అని విభూతి ఇచ్చి రమ్మంది. చిరుతొండడు వెళ్ళి వృద్ధ దంపతులను తీసుకువచ్చాడు. చిరుతొండని కొడుకు బడిలో చదువుకొంటున్నాడు. శతవృద్ధు వేషంలో వచ్చిన శివుడు మరొక వేషం వేసుకొని సిరియాలుని వద్దకు వెళ్ళాడు. 'మీ నాన్న నిన్ను చంపి శివయోగికి పెట్టబోతున్నాడు. 'జీవన్భద్రాణి పశ్యతి' అను వేదవచనం అవలంబించి ఎక్కడికైనా పోయి ఈ బారి తప్పించుకొనడం నీ కర్తవ్యం' అని చెప్పాడు. అప్పుడా కుర్రాడు చెవులు మూసుకొని నీతులు చెప్పాడు.

ఎరుక చాలని వాడందమే దధీచి
నల్పబుద్ధులె మేఘవాహనుడు శిబియు
ధర ''బరోపకారార్థ మిదం శరీర''
మనెడు వాక్యంబు వినవె సంయమివరేణ్యా! (హర. 2-80)

ఈ మాటలు విన్నాక శివుడు 'వీడు చిరుతొండనంబి కంటె నధికుడు పొ'మ్మని మరలిపోయాడు. సరిగ్గా అప్పుడే సిరియాలుని మేనమామలు వచ్చారు.

పల్లియచోటునుండి యెలపాసెము నడ్కులు జక్కిలంబులున్
బెల్లపుటచ్చులున్ సెనగబేడలు జిమ్మిలి నువ్వుటుండలున్
బెల్లుగ నంబి వియ్యములు పెద్దరికంబు బ్రియంబు నొప్పమే
నల్లునకున్ గుమార శిరియాలునకుం గొని తెచ్చి రర్మిలిన్. (హర. 2-92)

ఈ ఆటంకానికి తోడు పదహారు సంవత్సరాల పచ్చి బాలింతరాలు వేషం వేసుకొని పార్వతీదేవి వచ్చింది తన పాపనికి పాలు పొయ్యమని. తిరువెంగనాచి పచ్చి పాలు పోసింది. అప్పుడు పార్వతి ఇలా అంది.

ప్రజలెల్లం బురి గ్రంత క్రంతల మహాపాపంబుగా బల్కెడున్
నిజమో కల్లయొగాని మీరట కడున్నిస్త్రింశ భావంబునన్
నిజ పుత్రున్సుకుమారు జంపి యొక దుర్నిర్వాణికిం జోగికి
న్భుజియింపంగ నొనర్చువారటిది యెందుంగల్గునే యిద్ధరన్?

జోగులు కపటోపాయ - ప్రాగల్భ్యంబున నిధాన నవసిద్ధులకై
యేగతులనైన దిరుగుదు-రోగిరముగ సుతుని జంపుటుచితమె మీకున్?
ఆవగింజంత భూతి మై నలదికొనిన - వెలది గుమ్మడికాయంత వెర్రిపుట్టు
గటగటాఎట్లు తన బుద్ధి కాటగలియ -నిసువు జంపంగదలచెనో నీమగండు?
కానండుగాక కన్నులు - దానేమిటివాడు నీదు తనయునిజంపన్
మానవతీ, 'మగవాడో, - మానో' యనుమాట నేటిమాటయె చెపుమా.
(పర. 2-98-101)

అంతా విన్నాక తిరువెంగనాచి 'అంతటికి శివుడు కర్త, శివుడు భోక్త' అని చెప్పి,

''ఈ యర్థంబునకుం జింతింపనేల, నీకుం దడవయ్యెడు, బాలెంత రాలవు, చన్నులు చేపుచున్నవి, బిడ్డ యింత కెంత యలమటంజెందునో, పాలు చాలుగదా, యెప్పుడు మాయింటికి వచ్చుచుం బోవుచుండునది నిండుకొనియుండు మని కేలుదోయి ఫాలంబున గీలుకొల్పి సముచితవ్యాపారంబులం బ్రవర్తించుచుండం జంకు గానరాక పార్వతీ దేవియు నటునుండి చని యంతర్ధానంబుసేసె. (హర. 2-102)

అప్పుడామె తన కుమారుణ్ణి బడినుంచి తీసుకువచ్చింది. శివునితో అంత ఘనంగా జ్ఞానవృద్ధులాగ పలికిన సిరియాలుడు అన్నెం పున్నెం ఎరుగని పసికందులాగ బాల్యచేష్టలు చేస్తున్నాడు.

మంచిగ మేనయత్తలు సమాదరణం బడరంగ బెట్టి పు
త్తెంచిన మంచి భక్ష్యములు తేనియ నేతను ముంచిముంచి భ
క్షించుచు తల్లితండ్రి దన చిన్ని కరాంగుళి వంచివంచి యూ
రించుచు నిచ్చమీరగ జరించె గుమారకు డింటి ముంగిటన్. (హర. 2-106)

ఆ బిడ్డతో ''నిన్ను భైరవయోగి పారణకు పెట్టబోతున్నాం'' అని తల్లిదండ్రులన్నారు. అంతదాకా తాయిలం తింటూ వాళ్లను ఊరించిన కుర్రాడు ఉదాత్తమైన భాషలో ఇలా అన్నాడు.

సంసారభ్రమ మించుకేనియును, మత్స్వాంతంబునన్ లేదు మీ
వంశం బీపరిపాటిదే యుడుగుడీ వైక్లబ్య సంభావనల్
మాంసాహారము నయ్యెదన్ శివునకున్ మాయామహాయోగికిన్
హింసాక్లేశము మానుడీ గురులు మీరే, మిమ్ము బ్రార్థించెదన్. (హర. 2-112)

తల్లి చన్నిచ్చులాగున తొడపై బిడ్డను పడుకోపెట్టుకుంది. తండ్రి చుగకత్తి వాడిగా నూరాడు.

మది శంకింపకుమన్న మావలని ప్రేమస్నేహ వాత్సల్య సం
పద వాటింపకుమన్న నాలుకతుదిన్ పంచాక్షరీ మంత్రముం
బదిలంబొప్ప బఠింపుమన్న పరమ బ్రహ్మార్థ సంసిద్ధి య
య్యది సుమ్మన్న యనుంగునందన శిరాలా! వీరశైవవ్రతా! (హర. 2-117)

అని వధించాడు. తరువాత చిరుతొండనంబి భార్యలిద్దరూ వంట వండారు. శ్రీనాథుడు ఏ పెదకోమటి వేమారెడ్డిగారి సువారంలో వండే మాంసపు వంటలు యథారూపంగా నిశిత కవితాదృష్టితో గమనించాడో మరి, వివరంగా ఆ వంటను ఇలా వర్ణించాడు.

మిరియము నుల్లియున్ బసుపు మెంతియు నింగువ జీరకంబు శ
ర్కరయును జింతపండును గరాంబువు గమ్మని నేయి తైలమున్
బెరుగును మేళవించి కడు బెక్కువిధంబుల బాకశుద్ధి వం
డిరి శిరియాలునిం గటికి డెందమునం దరళాక్షు లిద్దరున్.

కమ్మగాగాచిన కట్టు నంజుళ్ళను నీరు వెళ్లగ నొత్తి నేత వేచి
చక్కగా దరిగిన నన్నమాంసంబులు పరిపాటిమైజుట్టుబదనువండి
మూల్గు టెమ్ములతోడ ముదక గాకుండగ జాదుచేసిన నల్లచారు గాచి
వలయు సంబారాలు వడియాలు బలియించి దళమైన క్రొవ్వుతో దాలబోసి

షడ్రసోపేతములు గాక జతురభంగి
నమృత పాకంబులుగ జేసి రాక్షణంబ
సెట్టి శిరియాలు వంశాబ్ధి శీతకరుని
సతులు తిరువెంగనాచియు జందనికయు. (హర. 2-121, 122)

ఇలా వంట వండి శతవృద్ధుని కాళ్ళు కడిగి వడ్డించారు. ఆ కపట జంగం చేసే పరీక్ష ఇంకా ఆగలేదు.

బైరవయోగిరాజు పసిపాపని నంజుడు గూరలందు లో
నారసి చూచి మస్తకమునందలి మాంసము లేమి గాంచి యీ
నీరసమాంస మేటికి వణిగ్వర! పుత్రుని యుత్తమాంగమున్
గూరలు సేయవైతి వివిగో నిజపుత్ర విసర్గమోహముల్. (హర. 2-127)

ఇక్కడిదాకా శ్రీనాథుడు స్వతంత్రంగా రాశాడు. ఈ పద్యానికి సరిపోయే ద్విపదలు పాల్కురికి సోమనాథుని బసవపురాణంలో ఉన్నాయి.

అంగనయును సెట్టి సాష్టాంగ మెరగ
బొంగి తాపసి శాకములు వేరు వేర

పరికించి చూచి యేర్పడ శిరోమాంస
మరసి యెయ్యెడ గాన కంత నిట్లనియె

తలనూచి యెనను దనయునిమీది
వలపు దక్కింపగ వచ్చు బొమ్మనియె

తలదాచుకొన్నారు తగవయ్య బాలు
తలగొని యికమీరు ధన్యులు గారు. (బస. 4-795, 802)

తలమాంసం వడ్డించాక ఆ భైరవయోగి చిరుతొండనంబితో 'నువ్వు, నీ కొడుకు నాబంతిని కూర్చుని తినాలని ముందే చెప్పాను. వచ్చి కూర్చోండి.' అన్నాడు. 'ఉన్న ఒక్క కొడుకునూ చంపిపెట్టాము, ఇంకెలా వస్తాడు' అన్నాడు నంబి. 'నీ భార్య పిలిస్తే వాడు వచ్చాడా సరేసరి, కలిసి తిందాం' అన్నాడు యోగి. తల్లి ఇలా పిలిచింది.

రారా వణిగ్వంశవారాశిహిమధామ! / రారా వికస్వరాంభోరుహాక్ష!
రారా మహాఘోర శీర్షశైవాచార! / రారా ఘనౌదార్య రాజరాజ!
రారా కుమారకంఠీరవేంద్రకిశోర! / రారా సమగ్రధీరౌహిణేయ!
రారా మనోభవాకారరూపవిలాస! / రారా యపారసంసారదూర!
రార నావన్నెవడుగ రారా తనూజ / రార శిరియాల రార నాప్రాణప్రదమ
రార నాకుర్ర! నాజియ్య రార యనుచు / జీరె గారాపుకొడుకు రాజీవనయన.
(హర. 2-134)

బసవ పురాణంలో పాల్కురికి సోమనాథుడు ముప్ఫయి రెండు ద్విపద పాదాలలో తల్లిచేత పిలిపించాడు. నాలుగు దిక్కులవైపు తిరుగుతూ ఆమె పిలుస్తుంది. చూడండి –

పూర్వజన్మార్జిత భూరికర్మములు / గుర్వణగించు నాకొడుక రావయ్య
దక్షిణాధీశ్వరు దర్పమడంచు / దక్షత గల్గు నాత్మజుడ రావయ్య.
విరస పశ్చాజ్జన్మ మరణ దుఃఖములు / పౌరి మార్పజాలు నాపుత్ర రావయ్య
ఉత్తరం బేలు నుదాత్త యోగీంద్రు / చిత్తంబునకు వచ్చు శిశువ! రావయ్య
అలరు నాకోప భోగాతీత పదము / లలవడె నేడు నాయయ్య రావయ్య
దండధరోద్దండ దండప్రశక్తి / ఖండింపనోపు పుత్రుండ రావన్న!
పాయని వ్యామోహ పాశబంధములు / కోయంగజాలు నాకుర్ర రావన్న
ద్రవిడాది కేషణత్రయ విజృంభణము / తవులునబడని నా తండ్రి రావన్న
సురరాజసుతుడు విశ్రుత తపోవేషి / వరదుడైనాడు నావడుగ రావన్న

అంత కాంతకమూర్తి యగు తవరాజు / సంతసంబంద నాసామి రావన్న
ఘోర నిస్సార సంసార వారాశి / పారమీదించు పాపండ రావన్న
అంచి తాగణ్యా పుణ్యప్రాప్తి నమరు / కాంచీవిలాసు నగ్రజుడ రావన్న
దివిజ కన్యకలతో దివి ముక్తి కన్య / కవయనున్నది భక్తి కాంతుండ రావె
దండడి మీయయ్యా దక్షిణ భుజము / నందంద యదరెడి నన్న రావన్న
భాను డెంతేనియు పడమట వ్రాలె / శ్రీనిలయుండ నా సిరాల రావె
స్వాదొంద నర్థేశసఖుని సన్నిధి / బ్రసాదంబు గొనగ నా గాదిలి! రావె.

(బస. 4, పుట 102)

తల్లి పిలిస్తే ఆ పిలుపు విని చనిపోయిన కొడుకు తిరిగి వచ్చాడు. శివుడు ప్రత్యక్షమయ్యాడు. చిరుతొండనికే కాక, కంచి ఏడువాడలవారికీ ముక్తి ఇచ్చాడు. ఈ కథను ఇంత వివరంగా కళ్ళముందు బొమ్మలాడేటట్టు రచించడానికి అది తన కృతిపతి పూర్వీకుని చరిత్ర కావడమే ముఖ్య కారణమైనా ఈ కథ శైవులలో మంచి ప్రచారం పొందడం కూడా అదనపు కారణం అయివుంటుంది. ఇది నేటికీ జంగం కథగా పదంగా ప్రజల్లో బ్రతికి ఉంది.[69] ఇదే కథ 'చిరుతొండరాజు చరిత్ర' అనే స్త్రీలపాటగా కూడా ప్రచారంలో ఉంది.[70] శ్రీనాథుని కథకు, దీనికి పోలికలు ఉన్నాయి. ఆడవాళ్ల పాటలో కూడా శివుడు చదువుల సదనానికేగి సిరియాలుని పొరిపొమ్మంటాడు.

ఇదియేమి యయ్యా మీ కీలాటి వెఱ్ఱి
చెట్టుపెట్టినవాడు చెలగి తొలి కాయ
నిజముగా నిచ్చును నీలకంఠునకును.

అని మందలిస్తాడు. అయితే శ్రీనాథుని కథాపాత్రలు వైశ్యులు. ఆడవాళ్ళ పాటలో వారు వెలమలు.

వెలమయింటను నీవు ఏల బుట్టితివి.
పాపపు గర్భాన జన్మించు కతన
బాల్యమందున చావు నీకిచ్చె బ్రహ్మ.

అని తల్లిదండ్రులు కొడుకును చూసి ఏడుస్తారు. ఆ బిడ్డ హితోపదేశం చేసి 'తపసికడుపున బడి తెతగును లోకముకు, అంటాడు. అప్పుడు తల్లి బిడ్డకు కస్తూరి నలుగు పెట్టి పన్నీట స్నానం చేయించి పంచభక్ష్యాన్నములు తినిపించి 'జాలి కాంభోజిరాగంలో, ''ముద్దుల తనయ నీమోము రోకలిచేత సుద్దగా త్రొక్కుట చూడవలసివచ్చె'' అని విలపిస్తుంది. తల్లి మసాలాతో వండుతుంది.

దంచిన మాంసంబు పచనంబు చేసి
తాలింపులో చమురు, తగ్గ మిరియంబు

69. తెలుగు జానపదగేయ సాహిత్యం, డా॥ బి. రామరాజు, పుటలు 309-413
70. స్త్రీల పౌరాణికపు పాటలు (ఆంధ్రసారస్వత పరిషత్తు), పుట 300.

ఉప్పు మెంతియు బెట్టి ఉత్పలాగంధి
నవరసాన్నంబులు సిద్ధంబుజేసె

ఆడవాళ్ళ పాటలో కూడా 'తలలేని వంటకం' అని శివుడు తగువు పెడతాడు. బిడ్డను పిలవమంటాడు. శ్రీనాథుని కథలో సిరియాలుడు బ్రతికిరాగానే కథ అయిపోయింది. ఆడవాళ్ళ కథలో బిడ్డ రాగానే శివుడు రెచ్చిపోతాడు.

మెచ్చక ఈశ్వరుడు హెచ్చుగా బల్కె / కుక్కను జంపితి కురూపి నీవు
నక్కను జంపితివి నాకొరకు ఇపుడు / గాని మాంసంబివ్వ కరమెట్లు వచ్చె
అప్పు డేటికి తప్పు యిప్పు డే జూడు / తప్పక ఖండింతు నీశిరస్సనిన.

ఆయుధం వేయగా అది పూలహారం అవుతుంది. కథ సుఖాంతం అవుతుంది!

మన దేశంలో శ్రీనాథుని కాలంలోగాని, ఆ తరువాతగాని అంతకు ముందుగాని నరభక్షణ లేదని చెప్పవచ్చుగాని, జంగాలను తృప్తిపరచడానికి ఆనాటి శైవులు ఏదైనా చేసేవారని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. శ్రీనాథుడు వీరశైవాన్ని కొంచెం విమర్శించినవాడే. ''ఆవగింజంత భూతిమై నలదికొనిన వెలది! గుమ్మడికాయంత వెట్టిపుట్టు!'' అనడం చూశాం (హర. 2-100). శ్రీనాథుడు తన కాలంలో ఉన్న భిక్షా వృత్తి జంగాన్ని హరవిలాసంలో పేర్కొన్నాడు. (హర. 2-7) చిరుతొండనంబిని తూమెడు చెరుకు పానకం తెమ్మన్న జంగాన్ని భిక్షావృత్తి మఠం జంగంగా వర్ణించడం వల్ల శ్రీనాథునికి తొలిదగ్గర నుంచీ శ్రీశైల పరిచయం ఉందని చెప్పాలి. అతడు తన అవసానకాలంలో అక్కడికే వెళ్ళాడు. ఆ మఠాధిపతి కోరికపై చివరి గ్రంథం వ్రాశాడు.

శ్రీనాథుడు ఎప్పుడెప్పుడు ఏఏ గ్రంథాలు వ్రాశాడన్నది సంతృప్తికరంగా తేలని ప్రశ్న. ఆంధ్ర సాహిత్యలోకంలో చెప్పుకోదగ్గ పరిశోధకులు తలొకరూ తలొక విధంగా చెప్పారు. శ్రీనాథుని కాలనిర్ణయం కూడా అపరిష్కృత సమస్యే. క్రీ.శ. 1370 మొదలు 1450 పర్యంతం శ్రీనాథుడు జీవించి ఉంటాడని నేలటూరి వెంకటరమణయ్యగారు స్థూలంగా నిర్ణయించారు.[71] ఇతర పరిశోధకులు ఏయే కాలాలను నిర్ణయించినదీ చూడండి.

తారీఖుల పట్టికలో ఇచ్చిన గ్రంథాలలో ''నంద నందన చరిత్ర' అనే వివాదాస్పదమైన కావ్యం పేరును ఇవ్వలేదు. శ్రీనాథుడు ఇలాంటి పేరుతో ఒక గ్రంథాన్ని రచించాడని కొందరు లాక్షణికులు చెప్పారు. కస్తూరి రంగకవి అభేదయతికి లక్షణం చెప్పి 'ర' కార 'ల' కారాలకు యతి చెల్లుతుందనటానికి ప్రామాణిక ప్రయోగంగా శ్రీనాథుని నందనందన చరిత్రలోనిదంటూ 'శాశ్వత విశ్వంభరాచక్రమీ రాజ కుమారు జేరంగలదు'' అనే సీస పద్యపాదాన్ని ఉదాహరించాడు (ఆనందరంగరాట్ఛందం 3-274). గణపరపు వెంకటకవి తన ప్రయోగ రత్నాకరంలో ఇంకో పద్యపాదాన్ని ఉదాహరించి అది నందనందన చరిత్రలోనిదన్నాడు.

71. భారతి, అక్టోబరు, 1945.

శ్రీనాథుని తారీఖులు

వివరాలు	కృతిపతులు	కొమర్రాజు వారి ప్రకారం	కందుకూరి వారి ప్రకారం	బండారు వారి ప్రకారం	మల్లంపల్లి వారి ప్రకారం	చాగంటి వారి ప్రకారం	పేటూరి వారి ప్రకారం
జననకాలం	.....	1360	1365	1367–70	1378	1380– రెండేళ్ళు అటుఇటు	1385
1. మరుత్తరాట్చరిత్ర	మామిడి వేమనామాత్యుడు (?)	1376	1383	1380–85	1391 (?)	1400–1405	1398–1402
2. శాలివాహన సప్తశతి	....	1385	1387	1385	1396	1405–10	1402–1405
3. పలనాటి వీరచరిత్ర	.....	1400–1420	1384	1385–95			
4. కాటమరాజు కథ	......			1385–95			
5. పండితారాధ్య చరిత్ర	మామిడి ప్రెగడయ్య		1390	1385–95	1410–05		
6. శృంగారనైషధం	మామిడి సింగన	1395	1395	1395–1400	1413–18	1405–10	1410–15
7. హరవిలాసం	అవచి తిప్పయ్య శెట్టి	1400	1400	1400–03 1410–15	1424 తll	1425	
8. ధనంజయవిలాసం	ధాన్యవాటి గన్న భూపతి			1410–15			
9. భీమఖండం	బెండపూడి, అన్నమంత్రి	1420	1430	1430	1428 తll	1430	1428–35
10. క్రీడాభిరామం	వల్లభరాయ ప్రశంస			1432			
11. కాశీఖండం	వీరభద్రారెడ్డి	1430	1435	1435	1438 తll	1430–33	1435 పిదప
12. శివరాత్రి మాహాత్మ్యం	ముమ్మడి శాంతయ్య	1475	1424	1440		1440	
మరణకాలం ...	...	1440	1440–45	...	1448	1445	1475

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఈ గ్రంథం శ్రీనాథ రచితమని విశ్వసింపలేమన్నారు.[72] కందుకూరు వీరేశలింగంగారు పేరునుబట్టి చూస్తే ఇలాంటిది అతడు రచించి ఉండవచ్చు నంటూనే భీమఖండంలో విష్ణుకథ వచ్చే సందర్భాలలో దానిని విడిచి పెట్టిన మహానుభావుడు కేవల కృష్ణకథ అయిన నందనందన చరిత్ర రచించి ఉంటాడా? అని అటూ ఇటూ కాకుండా చెప్పారు.[73]

అయితే భీమఖండంలో శ్రీనాథుడు మొట్టమొదట అవతారికలో రాధాకృష్ణుల ప్రసక్తి తీసుకువచ్చాడు. తెలుగు సాహిత్యంలో మొట్టమొదట రాధామాధవ శృంగారాన్ని వర్ణించి ధూర్తగోపాలుని చేత రాధ మోవిపయి తాంబూలము మోవి మోపించి ముద్దు పెట్టించిన ఘనత శ్రీనాథునిదే. చూడండి ఆ పద్యం.

వాలిక మోము మత్తవనబర్హికిశోరకలాస్యలీల బై
వాలిచి పచ్చకప్పు రపు వాసనతోడి ముఖారవిందతాం
బూలపుమోవిమోవిపయి మోపుచు రాధకు నిచ్చుధూర్తగో
పాలుడు ప్రోచుగావుత నపారకృపామతి మంత్రియన్ననిన్. (భీమ. 1-3)

ఈ రాధామాధవ శృంగారంలో పడే బహుశా శ్రీనాథుడు నందనందన చరిత్ర వ్రాసి వుంటాడు. ''మడికి అనంతయ్య వ్రాసిన విష్ణుమాయా నాటకమే శ్రీనాథుడు రచించిన నందనందన చరిత్ర'' అనే కొత్త వాదాన్ని కవిరాజహంస బాలాంత్రపు వెంకటరావుగారు నాతో ముచ్చటించారు

పారికాక్షి పరీక్షిన్నృపాలమౌళి
మధుకరస్వాంతసంతోషమయములైన
కోరికలమించు శుక ముఖాంభోరుహంబు
నందనందనగాథామరందధార (విష్ణుమాయానాటకం, 1-30)

ఈ ఎత్తుగీతిలోని 'నందనందనగాథ' అనే మాట ఒక్కటే కాక మరికొన్నింటిని కూడా బాలాంత్రపువారు బేరీజు వేశారుగాని ఎంతో కూలంకషంగా చర్చిస్తేనేగాని శ్రీనాథుడు వ్రాసిన నందనందన చరిత్రే విష్ణుమాయా నాటకమని, వీధి నాటకాన్ని వల్లభరాయని పేరుమీద ప్రకటించినట్లే విష్ణుమాయా నాటకాన్ని అతడు మడికి అనంతయ్య పేరుమీద ప్రచురించాడని పండితలోకం ఆమోదించకపోవచ్చు. అయినా పరిశోధకులు ఆలోచిస్తారని బాలాంత్రపువారి యీ కొత్తవాదాన్ని నివేదించాను.

నందనందన చరిత్రను శ్రీనాథుడు రచించి ఉంటాడన్న వాదాన్ని అంగీకరించ వచ్చునని చాగంటి శేషయ్యగారు అభిప్రాయపడుతున్నారు.[74] దీనిని వైష్ణవ మతాభిమాని అయిన మైలారరెడ్డిచేత దినవెచ్చం పుచ్చుకుంటూ శ్రీనాథుడు రచించాడనడంలో తప్పు

72. శృంగార శ్రీనాథం, పుట. 278.
73. ఆంధ్రకవుల చరిత్ర - ప్రథమ భాగం, పుట 576.
74. ఆంధ్రకవితరంగిణి - అయిదవ సంపుటం - పుట 191.

లేదని కూడా చాగంటివారు చెప్తున్నారు. ''ఇంతకును ఆ గ్రంథము లభింపనపుడు విశేష చర్చతో పనిలేదు'' అని శేషయ్యగారు అన్నారు. అయితే పరిశోధకులు చర్చను ముగించలేదు. కొర్లపాటి శ్రీరామమూర్తిగారు భీమఖండంలోని రాధామాధవస్తుతి శ్రీనాథుడు నందనందన చరిత్ర రచించాడన్న వాస్తవానికి పరోక్ష నిదర్శనమన్నారు. పంటమైలారరెడ్డి (1424–1429) వైష్ణవ మతాభిమాని అని చెప్పటానికి శాసన ప్రమాణాలు ఇంకో నిదర్శనమన్నారు. ఈ రెండూ కలిపి శ్రీనాథుడు 1426లో నందనందనచరిత్ర రచించాడని తన పరిశోధనా గ్రంథంలో తేల్చారు.[75]

శ్రీనాథునిపై ఎందరెన్ని పరిశోధనలు చేసినా ఇంకా చేయవలసినదెంతో ఉంది. ఇతని జీవిత చరిత్రమీదా, కవితాతత్త్వం మీదా ఎన్ని గ్రంథాలను వ్రాసినా ఈ విషయం పుష్పకవిమానం లాంటిది. చిలుకూరి వీరభద్రరావుగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు, కుందూరి ఈశ్వరదత్తుగారు ప్రత్యేకంగా పుస్తకాలు వ్రాసి ప్రకటించారు. బండారు తమ్మయ్యగారు ఎన్నో వాదోపవాదాలలో పాల్గొన్నారు. తెలుగు సాహిత్య పత్రికలలో ముఖ్యంగా భారతి ఉగాది సంచికలు, ఆంధ్ర సారస్వత పరిషత్ పత్రిక మొదలైనవాటిలో శ్రీనాథుని జీవిత వివరాల గురించి, కావ్య విశేషాల గురించి ప్రచురితం అయిన వ్యాసాలు కోకొల్లలు. ఎందరెందరో ఎన్నెన్నో అపూర్వ విషయాలు చెప్పారు. వీటిలో చాలామటుకు గ్రంథరూపంలో రాలేదు. వీటన్నింటినీ క్రోడీకరించి పరిశీలించి, సమన్వయం చేసి చక్కని తీర్పు గ్రంథం ప్రకటించవలసిన అవసరం మన విశ్వవిద్యాలయాలకు, అకాడమీలకు ఎంతైనా వుంది.

శ్రీనాథుని పదప్రయోగ సూచికను మన సాహిత్య అకాడమీ వారు ప్రచురింపబోతున్నారు. అది లభ్యమయ్యాక సాహిత్య విద్యార్థుల శ్రమ కొంచెం తగ్గి పరిశ్రమ సుకరం అవుతుందని ఆశింపవచ్చు. అతని ప్రయోగాలన్నీ అందుబాటులో ఉంటే ఏ మాట ఎన్నిసార్లు వాడాడో ఏ అర్థంలో వాడాడో తెలుస్తుంది. మాటవరుసకు - 'పెండ్లికొడుకు' అనే మాటను అల్లుడు అనే అర్థంలో శ్రీనాథుడు చాలాసార్లు వాడాడు. అల్లుడు అనే మాటను కూడా విడిగా వాడాడు. ఏది ఎన్నిసార్లు వాడాడో తెలిస్తే ఎటు మొగ్గాడో తెలుస్తుంది. బహుశా ఈ 'పెండ్లికొడుకు' అనే ప్రయోగం ద్రావిడభాషా సంప్రదాయం గాబోలు. అరవంలో అల్లుణ్ణి 'మాప్పిళ్ళై' అంటారు. ప్రాచీన రూపం మణప్పిళ్లై (?) కాబోలు. ఇలాగే నంగ, నాచి అనే స్త్రీ పర్యాయ పదాలను విడివిడిగా వాడాడు. ''మాటాడనేరని మాటనంగవునీవు'' (కాశీ. 3-62), హరవిలాసంలో 'నాచి' పదం తిరువెంగణి పేరుతో కలిపి వాడాడు. తమిళంలో మంగై, నంగై అనే స్త్రీ పర్యాయపదాలు వయోభేదాలను తెల్పుతాయి.[76] ఆడది అనే మాటకు తెలుగు భాషలో

75. శ్రీనాథుడు – పుట 156.

76. మంగై అంటే పన్నెండు పదమూడు సంవత్సరాల కన్య; ముద్దరాలు. నంగై అంటే ఉత్తమ స్త్రీ అని అర్థం. వదిన, కోడలు అనే అర్థాలుకూడా ఉన్నాయి. నాచ్చియార్ అనే మాటను రాచవారి ఆడపిల్లలకు వాడుతారు. దేవతాపరంగా వాడేటప్పుడు దైవానికి ఇరుపార్శ్వాలలో ఉండే స్త్రీలకు వాడుతారు. ఈ నైఘంటికార్థాలను మిత్రులు చల్లా రాధాకృష్ణశర్మగారు సేకరించి చెప్పారు.

ఎన్ని పర్యాయపదాలున్నాయో, దేనికేది అర్థమో వివరిస్తూ తిరుమల రామచంద్రగారు మంచి పరిశోధన చేశారు.[77]. శ్రీనాథునివంటి ప్రముఖ కవుల పదప్రయోగ సూచికలు వెలువడితే ఇటువంటి పరిశోధనలు మరీ ఫలప్రదమవుతాయి. సాహిత్యం శ్రీమంతమవుతుంది.

చివరి గ్రంథం పూర్తిచేశాక శ్రీనాథునిలో శ్రీ తొలగింది. అతణ్ణి ఆదరించే నాథుడూ లేకపోయాడు. అతడు వెలిగిన వెలుగు ఏ కవీ వెలగలేదు. రత్నాంబరాలు కట్టాడు. బంగారు పళ్ళెంలో తిన్నాడు. ముత్యాలశాలలో కనకాభిషేకం చేయించుకున్నాడు. రాజులను 'రా' కొట్టి, కస్తూరి పుచ్చుకొని వారవనితలకు ఇచ్చాడు. రెండుచేతులా ఆర్జించాడు. తన చేతులతో ఎందరెందరికో అగ్రహారాలు ఇప్పించాడు. తాను ఒక కేసరపాటి గడపాటి భూమిని పుచ్చుకోలేదు. అవసాన కాలంలో భూమీశులను గాక భూమిని నమ్ముకోవాలనే జ్ఞానోదయం కలిగింది. శ్రీశైల ప్రాంతాలలోనే, మరెక్కడో కృష్ణ ఒడ్డున బొడ్డుపల్లి అనే గ్రామాన్ని గుత్తకు తీసుకుని వ్యవసాయం మొదలుపెట్టాడు.

'బాపన సేద్యం బాల వైద్యం' అని సామెత ఉండనే ఉంది. 'బాపన సేద్యం బ్రతకడానికీ కాదు బ్రతికించడానికీ కాదు' అంటారు. అంతే అయింది. శ్రీనాథుడు పండించిన పైరంతా కృష్ణవరదలు వచ్చి కొట్టుకొని పోయింది. వరిచేలు అలాగైంది అనుకొని నువ్వులు, పెసలు వేస్తే అవి పండగానే 'బిలబిలాక్షులు' కాస్తా తినిపోయాయి. పంట లేకపోయినా పన్నుకట్టక తప్పదు. ఏడువందల బంగారు టంకాల శిస్తు శ్రీనాథుడు కట్టవలసి వచ్చింది. బకాయి పడ్డాడు. అప్పటి రాజులెవరో, రాజోద్యోగులెవరో తెలియదు కానీ కవిసార్వభౌముని కనికరించలేదు. సర్వసాధారణ సైరికుడు శిస్తు బకాయిపడితే ఎలాగ నిర్బంధించి శిక్షిస్తారో అలాగే బాధించారు.

దాక్షారామ చాళుక్యభీమవర గంధర్వాప్సరో భామినుల గొండ్లి నృత్యాన్నీ, హిందోళ రాగాన్నీ పండువెన్నెలలో అనుభవించిన శృంగారిశేఖరుణ్ణి మండుటెండలో ఎదురెండలో నిలబెట్టారు. ఖండశర్కరల కన్న తియ్యగా చెప్పిన కవిరాజు కంఠాన బొగడదండ వేశారు. ఆంధ్రదేశం నలుమూలలా సంచరించి ఎక్కడెక్కడి అందచందాలను తన చాటువులలో బిగించడానికి వెళ్ళిన చరణాలకు సంకెళ్ళు తగిలించారు. పసిడిగంటం పట్టుకొని ప్రశస్తమైన కవిత్వాన్ని రచించిన హస్తానికి వెదురుకర్ర యిచ్చారు. ఒక సాహిత్యా యుగకర్తగా వెలసి వాఙ్మయ ప్రపంచ భారాన్ని వహించిన భుజస్కంధంపై ఊరి పొలిమేరలో ఉండే నల్లగుండు ఎక్కించారు.

మండుటెండలో చెమటలు కారుస్తూ, బొగడదండ బాధపెడుతూ ఉంటే కాళ్ళ నున్న సంకెళ్లు కదలనివ్వకుండా ఉంటే, వెదురుకర్ర వూతతో భుజంమీది నల్లగుండును మోస్తూ, నడుస్తూ, కన్నీళ్ళు కారుస్తూ వణుకుతున్న కంఠంతో ఎనభై సంవత్సరాల వృద్ధుడు యీ క్రింది పద్యం చెప్తూ ఉన్న దృశ్యం తలుచుకుంటే ఎవరి కళ్ళవెంట కరుణాస్రవంతి ద్రవించదు?

---

77. భారతి, జూన్, 1947.

కవిరాజు కంఠంబు కౌగిలించెనుకదా
పురవీధి నెదురెండ బొగడదండ
ఆంధ్రనైషధ కర్త యంఘ్రియుగ్మంబున
పగిలియుండెనుకదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత
వియ్యమొందెనుకదా వెదురుగొడియ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెనుగదా
నగరివాకిట నుండు నల్లగుండు
కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు దినిపోయె దిలలుపెసలు
బొడ్డుపల్లెను గొడ్డేరి మోసపోతి
నెట్లు చెల్లింతు డంకంబు లేడునూర్లు? (శృ.శ్రీ. పుట 296)

సహస్రమాస జీవిని, సహస్రాధికులు సన్నుతించే వ్యక్తిని ఇంత నిర్దాక్షిణ్యంగా రాజోద్యోగులు శిక్షిస్తున్నప్పుడు ఎవరు అడ్డుపడ్డారో, ఎవరు విడిపించారో తెలియదు. నల్లగుండు దింపి, కాళ్ళ సంకెళ్ళు తెంపి, వెదురు లాగేసి, బొగడదండ పారేసి కవిసార్వభౌముని నీడపట్టున చేర్చి వుంటారు. పొట్ట చేత్తో పట్టుకొని మళ్ళీ ఎక్కడికైనా అతడు వెళ్ళగలిగే అవకాశం కల్పించి వుంటారు. అయితే అతడు ఎక్కడికి వెడతాడు? వెళ్ళగలిగినప్పుడు, వెళ్ళవలసినప్పుడు అతడు చూడని ముఖ్యుడు లేడు. మెప్పించని ఏలిక లేడు. తెలుగు గడ్డను ఏలిన మూడు ముఖ్యమైన రాజ్యాలను సందర్శించాడు. అవచి తిప్పయ్య, మామడి సోదరులు, పెదకోమటి వేమారెడ్డి మొదలైనవాళ్ళు ఎప్పుడో పోయారు. ప్రౌఢదేవరాయలు, సింగభూపాలుడు లేరు కాబోలు. జీవితంలో ప్రొద్దువాటారిన తరువాత తాను ఆశ్రయించిన ప్రతి ఒక్కడూ రాలిపోయాడు. ఇంక తాను వెళ్ళవలసినది ఒక్కచోటుకే. అక్కడికి మహా ప్రస్థానం చేస్తూ శ్రీనాథుడీ పద్యం చెప్తాడు.

కాశికా విశ్వేశు గలసె వీరారెడ్డి రత్నాంబరమ్ములే రాయడిచ్చు?
గైలాసగిరి బంట మైలారు విభుడుండె దినవెచ్చ మేరాజు తీర్పగలడు?
రంభగూడె దెలుంగురాయ రాహుత్తుండు కస్తూరి కేరాజు ప్రస్తుతింతు?
స్వర్గస్థుడయ్యె విస్సనమంత్రి మరి హేమ పాత్రాన్న మెవ్వనిపంక్తి కలదు?

భాస్కరుడు మున్నె దేవుని పాలి కరిగె
గలియుగంబున నికనుండ కష్టమనుచు
దివిజకవివరు గుండియల్ దిగ్గురనగ
నరుగుచున్నాడు శ్రీనాథుడు డమరపురికి. (శృ.శ్రీ.పుట. 298)

స్వర్గంలో కూడా 'దేశభాషలందు తెలుగు లెస్స' అని చాటే కవి ఉండడం మన సాహిత్యం చేసుకొన్న అదృష్టమే. శ్రీనాథుడు అసాధారణ వ్యక్తి; అపురూపమైన మహాకవి!

నిశ్శంక కొమ్మన

శ్రీనాథుడు కాశీఖండం రచించి రాజమండ్రి పాలించిన వీరభద్రారెడ్డికి అంకితమిస్తే, అతని తమ్ముడు దొడ్డారెడ్డికి నిశ్శంక కొమ్మన శివలీలా విలాసాన్ని అంకితమిచ్చాడు. శ్రీనాథుడు శివలీలలు కొన్నింటిని చేర్చి హరవిలాసం రచిస్తే శివుని లీలలు అన్నింటినీ క్రోడీకరించి కొమ్మన శివలీలా విలాసాన్ని వ్రాశాడు.

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఈ గ్రంథాన్ని సంపాదించి దేశానికి సమర్పించారు. గ్రంథం పూర్తిగా దొరకలేదు. అవతారికలో కొంతా, మొదటి రెండు ఆశ్వాసాలూ మాత్రమే దొరికాయట. ఈ గ్రంథాన్ని ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు తమ పత్రికలో అచ్చువేశారు.[1] అవతారికలో దొరికిన భాగాన్ని ప్రచురించలేదు. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఈ గ్రంథానికి మరొక అసంపూర్ణ ప్రతిని హైదరాబాదు వాస్తవ్యులు విద్వాన్ ఓగేటి సుబ్బారావుగారి ద్వారా సంపాదించారు. ఈ గ్రంథంలో మొదటి మూడు ఆశ్వాసాలు, అసమగ్రమైన అవతారిక ఉన్నాయట. ఈ అవతారికను శర్మగారు తమ రెడ్డి రాజుల చరిత్ర అనే ఆంగ్ల గ్రంథం అనుబంధంలో ప్రకటించారు.[2] ఈ అవతారికలో 84 పద్యాలున్నాయి. వేటూరి వారు సంపాదించిన అవతారికలోని భాగాలను, తాము సంపాదించిన దానిలోని భాగాలను జతచేసి శర్మగారు ప్రకటించారు.

ఇది అసంపూర్ణమైనా కవిని గురించి ఎన్నో విషయాలను తెలియజేస్తుంది.

కొమ్మన ముత్తాత పేరు గంగయ సింగనార్యుడు. ఇతడు కృతికర్త కాడు గాని, కావ్యాన్ని అంకితం పుచ్చుకొన్నాడు. తూర్కరాజు చూస్తుండగా ఊరయ్య అనే కవి తాను వ్రాసిన సుభద్రా కల్యాణం అనే కావ్యం ఈ సింగనకు అంకితమిచ్చాడు. ఈ తూర్కరాజు ఎవరో, ఊరయ్య ఎవరో సరిగా గుర్తించాలని సోమశేఖరశర్మగారు రెడ్డిరాజ్యాల చరిత్రలో వ్రాశారు (పుట. 509). ఈ తూర్కరాజు మరెవరో కాదు. శృంగార నైషధాన్ని అంకితం పుచ్చుకున్న మామిడి సింగనగారి ముత్తాత తండ్రి. ఈ వంశావళిని శ్రీనాథుడు వర్ణించాడు (నైషధం 1-20 నుండి). అతణ్ణి పెదతూర్కరాజని శ్రీనాథుడన్నాడు. ఇతని తమ్ముడో, ఎవరో చినతూర్కరాజయి ఉంటాడు. ఈ అన్నదమ్ములలో ఎవరూ చూస్తూ ఉండగా ఊరయ్య కొమ్మన ముత్తాతకు కృతి ఇచ్చాడు. చూడండి పద్యం.

ఆకల్పంబుగ దూర్కరాజు కన సూరాఖ్యాకుచేత న్సుభ
ద్రాకల్యాణ మనం దనర్చు కృతిరత్నం బొప్ప నైకొన్న సు
శ్లోకు న్మత్ప్రపితామహున్ బుధజనస్తోతవ్యదీవ్యద్గుణో
త్సేకున్ గంగయసింగనార్యు దలతున్ ధీనిర్జరాచార్యునిన్. (శివ.అవతారిక. 14)

---

1. 31వ సంపుటం నుండి 39వ సంపుటందాకా కొన్ని కొన్ని సంచికలలో ప్రకటించారు.
2. History of Reddi Kingdoms, by M. Somasekhara Sarma, pp. 553 - 563.

తన ముత్తాత బుద్ధిలో బృహస్పతి అంతటివాడట. ఈయన కొడుకు పేరు నిశ్శంకమంత్రి. అతని కుమారుడు అబ్బమంత్రి. ఇతడే కొమ్మన తండ్రి. కవి తల్లి పేరు అంబమాంబ. ఈ వివరాలన్నీ అవతారికలోని 14వ సంఖ్యనుంచీ 16 దాకా ఉన్న పద్యాలవల్ల తెలుస్తున్నాయి.

శివలీలా విలాసం వల్ల కొమ్మన వంశం గురించి అట్టే తెలియకపోయినా కొన్ని శాసనాలవల్ల మరికొన్ని వివరాలు తెలుస్తున్నాయి. పట్టి స్వగ్రామానికి దగ్గరలో ఉన్న పోలవరంలో మహానందీశ్వర దేవాలయం ఉంది. నిశ్శంక కొమ్మన దీనికి స్థానాపతిగా ఉండేవాడని ఒక శాసనం చెప్తున్నది.[3] ఈ శాసనకాలం క్రీ.శ. 1408. ఇందులో చోడభక్తరాజు కుమారుడైన అన్నదేవుడు కొప్పాక గ్రామంలో కొన్న భూముల వివరణ ఉంది. ఈ భూములను అన్నదేవుడు మహానందీశ్వర లింగదేవుని ఆలయానికి దానమిచ్చాడు.

ఈ శాసనం నిశ్శంక కొమ్మన అన్నదేవుని కాలంవాడని, క్రీ.శ. 1408లో ఆ దేవాలయానికి స్థానాపతిగా ఉండేవాడని తెలియచేయడమే, కాక బహుశా అన్నదేవుని పోషణలో కవిగా ఉండేవాడనే ఊహకు తావు ఇస్తున్నది. ఈ అన్నదేవుణ్ణి అల్లాడరెడ్డి బహుశా క్రీ.శ. 1415లో యుద్ధంలో చంపాడు.[4] ఈ సంగ్రామంలో అల్లాడరెడ్డి మూడవ కొడుకు దొడ్డారెడ్డి పాల్గొని ఉంటాడు. శివలీలా విలాసంలోని క్రింది పద్యం చూడండి.

స్తుతిసేయందగు నల్లడేంద్రతనయున్ దొడ్డక్షమాపాలకున్
హితహేమాద్రివిశిష్టదానకలనానిర్దిష్టధూనిర్జితాం
చితవాణిన్ స్థలవీథి ముక్తశిశిరగ్ర... ధారాపయస్
స్తుతిదూరీ(ర?) ప్రతిఘాతచోడపకృతాంతస్ఫారత్నాకరున్ (అవతారిక. 72)

ఈ పద్యంలోని చోడపుడు అన్నదేవచోడుడే అని చెప్పవచ్చు. అంటే శివలీలావిలాస రచన క్రీ.శ. 1415 తరువాత జరిగి ఉంటుంది. అన్నదేవచోడుని నిర్జించాక అతని కొలువులో ఉండే నిశ్శంక కొమ్మనను దొడ్డారెడ్డి చేపట్టి ఉంటాడు. ఈ సంగతులు వివరించాక తన తాత ముత్తాతల గురించి కొమ్మన మూడే మూడు పద్యాలు వ్రాశాడు. తన వంశం గురించి ఇంత ముక్తసరిగా చెప్పినా 6 పద్యాలలో కుకవి నింద చేస్తూ తన కాలపు సాహిత్య వ్యవస్థను చక్కగా చెప్పాడు.

తెలుగని చెప్ప సంస్కృతవిధిజ్ఞత లేదని సంస్కృతంబునన్
బలుక దెనుంగు నేరనని ప్రాక్తసమార్గము నంద వచ్చినం

3. A.R. 292 of 1920. ఈ శాసనంలో నిశ్శంక కొమ్మయ్య అనే పేరుకు బదులు నిశ్శంక కామయ్య అని పొరపాటుగా వ్రాశారని సోమశేఖరశర్మగారు చెప్పారు. చూ॥ History of Reddy Kingdoms, పుట 519
4. History of Reddi Kingdoms, పుట 183.

గలవది మున్ను నంచు నొక కైవడి గ్రొత్తగ గూర్చి రేనిపె
ద్దలుప (?ప) నిగోరటం (రం?) చు మహిదజ్ఞులు నాడుదు రల్పధీయుతుల్.

కలిత మహాకవీంద్రకృతకావ్యసమర్థ పదార్థమర్మముల్
తెలియగలేక చీకటియె తెంపుగ ద్రవ్వుదు రహ్హహా కడున్
ములుచలు కొంద రట్లయగు ముందట నున్నను పుట్టుజీకులు
జ్వలమణిదర్పణాంతరల సత్ప్రతిబింబము గాన నేర్తురే? (అవతారిక. 18. 19)

మహాకవులు ఇంతకుముందే లక్షలు గ్రంథాలు వ్రాశారు. ఇంక చెప్పక్కర్లేదు అనే వాళ్లకు జవాబు చెప్తూ తన ఉద్దేశంలో కావ్యం అంటే ఎలా ఉండాలో, అష్టాదశ వర్ణనలు ఏమిటో వివరిస్తూ మూడు పద్యాలు వ్రాశాడు.

ఇల నలఘుకవులు కబ్బం-బులు లక్షలు జెప్పినారు మున్నని నాకున్
వల దుడుగ గావ్యరచనము - చెలగి కరులు నడచుత్రోవ జీమలు జనవే?

క్రొత్తగ నర్థముల్ దలచి గుంభనశబ్దములు న్విచిత్రతా
యత్తత నల్లసిల్ల నిది యచ్చుట నచ్చుట నర్థవర్ణముల్
మెత్తిన నూలుకొల్పి రసమేళన మొప్పగ జెప్ప కూరకే
కత్తర బెత్తరల్ బెనచి కారులు కబ్బము లన్న నవ్వరే?

పురభూవర్తువు లంబుజా ప్తహిమరుక్ప్రత్రోదయంబు ల్మహీ
ధరమంత్రాహవముల్ వివాహరతియాత్రల్ ద్యూతపానాంబుధుల్
విరహాంభోవనలీల లుత్తమరసావిర్భావభావక్రియా
సరణిం జెప్పదగున్ బుధుల్ గరము మెచ్చున్ సత్ప్రబంధంబులన్
(అవతారిక 21-28)

ఈవిధంగా తలస్తూ 'ఉదంచితరచనా చమత్కృతి' ఉండేటట్టు ఒక సత్కృతి రచించాలనుకున్నాడు. అప్పుడు అల్లాడ దొడ్డారెడ్డి అతణ్ణి పిలిపించి ఇలా అన్నాడట.

శ్రీవత్సాన్వయ శేఖరుండవు సదా శ్రీరామచంద్రానుకం
పావర్థిష్ణుశుభాన్వితుండవు ఆ(శుభా?) పస్తంబసూత్రక్రమ
వ్యావర్ణీ చరణప్రసిద్ధుడవు రమ్యార్థాష్ట భాషాకవి
త్వావిర్భావవిధాధురీణుడవు కొమ్మామాత్యా నీ విమ్మహిన్.
చతురుడవు పూర్వకవినాథసన్మహత్వ
మహితుడవు సర్వబుధలోకమాననీయ
చరితుడవు గాన నింపున జలుపవలయు
బెంపుగల్గంగ నస్మదభీష్ట మొకడు. (అవతారిక. 25-26)

అతని అభీష్టమేమిటంటే సప్తసంతానాలలో కావ్యం ఎక్కువ కీర్తినిస్తుంది. అందుచేత కృతిపతిత్వం కావాలని కోరుకున్నాడు. దొడ్డారెడ్డి అంతకుముందు ఎన్నో పురాణాలు

విన్నాడట. అయితే సర్గ వంశ చరిత్రలు మొదలైనవాటిచేత శివచరిత్రకు ఏకతం కలగడం లేదు. అందుచేత కేవల శివచరితం వ్రాయమన్నాడు. ఆ పద్యాలు చూడండి.

వింటి పురాణముల్ గరము వేడుకతోడ ననేకభంగులన్
గంటి కృతార్థతాకలితగౌరవకౌతుక మట్లనయ్యు ము
క్కంటి మహత్త్వ మేకతము గల్గదు యెందు వినంగ రొ(లొ?)చ్చుగా
నంటిన సర్గవంశచరితాదులచే నటుగాన నామదిన్.
కేవలశివచిరతము నే- భావనవినగోరుదుం బ్రబంధనిధాన
శ్రీ వరలగ వినిపింపుము - భావరసాలంకృతాంధ్రభాషాసరణిన్
(అవతారిక, 29-30)

దొడ్డారెడ్డి తనతో అన్న మాటలే కొమ్మన శౌనకాది మహామునులచేత సూతునితో చెప్పించాడు.

అవియుగావున సర్గమన్వంతరాదు
లడరి యందును గ్రందుగా గడలుకొనుట
వరుస నప్పు రాణముల బ్రవ్యక్తసరణి
దెలియగా రావు శిమమహాదివ్యకథలు (శివలీల, 1-7)

ఇలా అన్న శౌనకాది మహామునులతో ఆ మహాదేవుని చందమంతా 'క్రమరీతి' తేటపడగా చెప్పుతున్నాడు. ఈ భావం వాఙ్మయ సృష్టి అంతటికీ ముకురభావమట! (1-9) ఈ ఆదేశాన్ని విన్నాక సూతుడు ఇలా ఉపక్రమించాడు.

కడగి బహుపురాణంబులు గనిన తెరగు
వెదకి యాగ మజ్ఞుల చేత వినిన తెరగు
నొక్క తెరగున (కడు) నోజ గూర్చి
శివుని లీలావిలాసంబు చెప్పు వాడ. (శివలీల. 1-15)

కావ్యంలో సూతుడు ఇలాగ అన్నా నిశ్శంక కొమ్మనే నిజంగా నూతన సూతుడు. రాజమండ్రే నైమిశారణ్యం. అల్లాడ దొడ్డారెడ్డి కోరికలే శౌనకాది మహామునులు.

ఈ దొడ్డారెడ్డి గొప్ప దండనాయకుడని ఈ క్రింది పద్యంవల్ల తెలుస్తుంది.

ఎడపకాగ్రహములు విడువని నృపతులు
  వీడరు (విడుతురు?) నిజరాజ్యవిహరణములు
సొలవ కాఙ్క్షలుసేయ జొరని భూరమణులు
  చొత్తురుగ్రాచలస్థూలగుహలు
కడక కప్పంబు లీగానని నృపతులు
  గాంతురు నానాస్త్రఘర్షణములు
వరుస పాదములకు వ్రాలని జనవిభుల్
  వ్రాలుదు రాజిధరాతలమున

దనసముద్ధండజైత్రయాత్రాప్రతిష్ఠ
భూరిభేరీభణంకారఘోరరవము
నఖిల దిక్కుల దళుకొత్తునప్పు డనిన
బొగడనేల నల్లయదొడ్డభూపమణిని? (శివలీలా. 73)

దొడ్డారెడ్డిచే ఉక్కాడిన శత్రువులు యుద్ధంలో పడినప్పుడు అప్సరసలు ఎలా నాట్యం చేస్తారో ఇలా చక్కగా వర్ణించాడు. చూడండి.

దృక్కర్యాధిపబాహు డల్లడధరిత్రీనాథు దొడ్డాంకుచే
నుక్కాడన్ రిపుకోటియాజిబడుచో నొప్పార (రు?) నాకంబులో
జక్కాకిటట డుడ్డుడూధణధణర్ఝుంఝుంధిమింధిద్ధిమిం
ధిక్కత్తోణక కీర్ణ వాద్యములతో దివ్యాంగనానృత్యముల్. (శివలీల. 74)

దొడ్డారెడ్డి జైత్రయాత్రకు వెళ్లేటప్పటి సంగతులే కొమ్మన ఇందులో చెప్పాడుగాని ఆయన ఏయే యుద్ధాలలో పాల్గొన్నాడో, ఏయే దుర్గాలు పట్టుకొన్నాడో చెప్పలేదు. అయితే ఈ దొడ్డారెడ్డినే వర్ణిస్తూ శ్రీనాథుడు కాశీఖండంలో ఇలా చెప్పాడు.

ఔరా! యల్లయరెడ్డిదొడ్డవసుధాధ్యక్షుండు ధాటీచమూ
భేరీభాంకృతిఘోరఘోషము న నిర్భేదించె నొడ్డాది శృం
గారంకోటయు లోతుగడ్డయును నుద్ఘాటించె సత్యుద్ధతిన్
కీరాంభోదితటంబున న్నిలిపె దిక్సీమాజయస్తంభముల్ (కాశీఖండం. 1-52)

ఇందులో ఒడ్డాది, శృంగారపుకోట, లోతుగడ్డ అనే ప్రదేశాలున్నాయి. ఇవి విశాఖపట్నం జిల్లాలో ఉన్నాయి. ఈ విజయాలను కొమ్మన పేర్కొనలేదు. కాబట్టి శివలీలా విలాసాన్ని అతడు శ్రీనాథుని కాశీఖండానికి ముందే రచించి ఉంటాడు. ఈ ఇద్దరు కవులూ దొడ్డారెడ్డిని వర్ణిస్తూన్నప్పుడు ఒక ముఖ్యమైన సంగతిని చెప్పారు. అతడు గొప్ప గుర్రపురౌతు. ఒకసారి ఇరవైనాలుగు మూరల మేర గుర్రాన్ని దాటించాడట. ఈ 'ఫీటు'ను కొమ్మన ఇలా చెప్పాడు.

అరరే! అల్లయదొడ్డభూవిభుడు వాహారోహరేవంతు డిం
పరుదారన్ వడిమూలగూరికడ వాహ్యాళిస్థలిక్ రాజకుం
జరసింహం బను వారువంబును యదృచ్ఛాలీల దాటింపడే
తిరమై యిర్వదినాల్గుమూళ్ల నిడు త్సేకంబు చేయెత్తుగన్ (అవతారిక. 77)

ఈ సంగతినే శ్రీనాథుడిలా వర్ణించాడు.

హరి దాటించె బురోపకంఠమున వాహ్యాళిప్రదేశంబునం
దరరే! యల్లయ రెడ్డి నందనుడు దొడ్డయ్యా క్షమాధీశ్వరుం
డిరువైనాలుగు మూళ్ళ మేర యనుగోసెక్కింపగా నేలయ
ద్ధరణీనాథుని కీర్తి దాటె గడు నుద్దండించి బ్రహ్మాండముల్ (కాశీఖండం. 1-53)

కొమ్మన పద్యంలోని 'అరరే' అనే ఆశ్చర్యం శ్రీనాథుని రెండవ పాదంలో ఉంది. శ్రీనాథుని కాశీఖండానికి ముందే శివలీలావిలాస రచన జరిగినా శ్రీనాథుని హరవిలాసమే దీనికి మార్గదర్శి. హరవిలాసంలో కొన్ని శివలీలలే ఉంటే, దీనిలో అన్నీ ఉన్నాయి. వీటిని పరిశీలిద్దాం.

ఇతడు ఒక్కొక్క కొత్తలీల మొదలుపెడుతున్నప్పుడు ఒక ఆటవెలది వ్రాస్తాడు.

వినుడు సముచితముగ వివరింతు నిటమీద
నభవు డవధరించినట్టి లీల.

అనే రెండుపాదాలు ప్రతిపద్యంలోనూ మొదట విధిగా ఉంటాయి. తరువాత రెండుపాదాల లోనూ ఆ లీల పేరేమిటో వివరిస్తాడు. మొదటిలీల 1-23తో మొదలవుతుంది. ఈ పద్యంలోని చివరి రెండు పాదాలు శిథిలం కావడం వల్ల ఈ మొదటి లీల పేరు తెలియదు. అయితే ఈ లీల కడపట ఫలశ్రుతి చెప్తూ 'శివుడిట్లు పురుషభావము సవరించిన యట్టి లీల'గ దీనిని పేర్కొన్నాడు (1-37). రెండవ లీల 1-38తో మొదలు. ఈ పద్యంలోనూ పేరు దగ్గరే అక్షరాలు పోయాయి. అయితే ఫలశ్రుతిలో (1-94) చెప్పిన దానిని బట్టి దీనిని 'అజబోధ' అని సవరించవచ్చు. తరువాతి పేర్లను కొమ్మన పెట్టినవే పేర్కొని క్రోడీకరిద్దాం.

1.	పురుషభావం సవరించినలీల	1-23	(పుట 7)
2.	అజబోధ	1-38	(పుట 10)
3.	సతీవిరహం	1-95	(పుట 20)
4.	గణేశ్వరోద్భవం	1-190	(పుట 38)
5.	చంద్రధారణం	2-3	(పుట 51)
6.	వృషభవాహనం	2-31	(పుట 57)
7.	భృంగిప్రసాదం	2-51	(పుట 61)
8.	నందివాహనం	2-73	(పుట 66)
9.	సింధురాసురమర్దనం	2-98	(పుట 71)
10.	భుజంగధారణం	2-142	(పుట 80)
11.	గంగాధరణం	2-194	(పుట 91)
12.	అంతకదహనం	2-285	(పుట 110)
13.	జలంధరవధ	2-324	(పుట 120)

(రెండవ ఆశ్వాసాన్ని ముద్రిస్తున్నపుడు పరిషత్తువారు పద్యాల సంఖ్యను ఇవ్వలేదు. అందుకే పుటలను పేర్కొన్నాను.) దొరికిన పదమూడు లీలలను ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారు పూర్తిగా ప్రచురించారు. అయితే పదకొండు లీలలకే సంఖ్యను పేర్కొంటూ ఉపశీర్షికలు అచ్చువేశారు. పన్నెండు, పదమూడు లీలలను అచ్చువేస్తున్నప్పుడు ఆ సంఖ్యలుండవలసిన చోట ఖాళీలు వదిలేశారు. అందుచేత కొమ్మన వ్రాసిన పదకొండు లీలలే దొరికాయని కొందరు భావించవచ్చు. నిడుదవోలు వెంకటరావుగారు ''ఉపలబ్ధమగు గ్రంథములో బదునొకండవ లీలయగు జలంధరుని వధతో ద్వితీయాశ్వాసము ముగియుచున్నది. ఆపై ఎంత గ్రంథమున్నదో యెరుగరాదు'' అని వ్రాశారు.[5] చాగంటి శేషయ్యగారు కూడా ''లభించిన రెండాశ్వాసములలో పదకొండు లీలలున్నవి. ఇంక నెంత గ్రంథమున్నదియో తెలియరాదు'' అని వ్రాశారు.[6]

కొమ్మన తన గ్రంథంలో 36 శివలీలలు ఉంటాయని చెప్పాడు (1-17). అందులో పదమూడు దొరికాయి. ఇంక 23 లీలలు దొరకాలి. వాటి పేర్లను తెలుసుకొందాం.

14. దారుకావనవిహారం 15. హాలాహలభక్షణం 16. సుదర్శనప్రదానం 17. దక్షిణామూర్తిరూపం 18. దక్షునిపై కోపం 19. కామదహనం 20. కపటువటురూపం. 21. గిరిజాకల్యాణం 22. తారకాసుర వధకు ఉద్యోగం 23. శతమన్యునిపై కోపం 24. ఉపమన్యుని బ్రోచడం 25. త్రిపురసంహారం 26. కాలభైరవుడు బ్రహ్మశిరస్సు త్రుంచడం 27. కాలభైరవ భిక్షాటనం 28. నందక ప్రహరణం 29. దక్షయజ్ఞ విధ్వంసనం 30. అగ్నిముఖునిచేత మృత్యువును పరిమార్పించడం 31. అర్ధనారీశ్వర, 32. నృసింహ గర్వభంగం 33. చండీశ్వరరక్షణ, 34. త్రివిక్రమ కంకాళధారణ 35. కిరాతార్జునీయం 36. కల్పావసానంలో ఉరులింగ ప్రదర్శన.

కొమ్మన 630 గద్య పద్యాలలో 13 లీలలు వర్ణించాడు. ఈ లెక్కనే అతడు మిగతా కావ్యం వ్రాశాడనుకొంటే సగటున అతడు సుమారు 1745 గద్య పద్యాలలో ఈ కావ్యం రచించి ఉంటాడు. ఇంకా వెయ్యి పైచిలుకు గద్యపద్యాలు ఇతనివి లభించాలి. కొంతభాగం దొరుకుతున్నదనుకోవచ్చు. 13-వ లీల దారుకావన విహారం కాకినాడలో ఉంది గాబోలు. ''శ్రీనాథునికంటె బరమశివభక్తుడుగా లెక్కింపబడు నిశ్శంక కొమ్మనామాత్యుడు తన శివలీలా విలాసమున దేవదారు వనవిహార ఘట్టమున పురుషాయతమును బంధాదికమునుగూడ పరమేశ్వరాశ్రయముగా వర్ణించి పెట్టినాడు'' అని చిలుకూరి పాపయ్య శాస్త్రిగారు వ్రాశారు.[7]

దారుకావన విహారాన్ని ఆంధ్రసాహిత్య పరిషత్తువారు ప్రకటించలేదు. ఈ గ్రంథం తృతీయశ్వాసంలో కొంత లభ్యమవుతున్నదనుకోవాలి. ఈ పద్యాలు కాక కొమ్మన వ్రాసినవి ఇంకో 14 పద్యాలు ప్రబంధ రత్నాకరంలో ఉన్నాయి. వాటిని ఒక ప్రాచీన

5. రెడ్డిసంచిక, శివలీలావిలాసము, పుట 374.
6. ఆంధ్రకవితరంగిణి, 5వ సంపుటం, పుట 214.
7. శ్రీనాథుని కవితాసమీక్ష - శ్రీనాథుడు శృంగారియా? పుట 63.

సంకలనకర్త సేకరించాడు. ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి 'ఉదాహరణ పద్యములు' అనే పుస్తకంలో అవి వున్నాయి. ఈ 14 పద్యాలు నిశ్శంక కొమ్మన వ్రాసిన 'వీర మాహేశ్వరము' అనే గ్రంథంలోనివని ఆ సంధాత పేర్కొన్నాడు.

''ఈ శివలీలావిలాసమునకే వీరమాహేశ్వరమన్నది నామాంతరమో, లేక యిది వేరు గ్రంథమో తెలియరాదు. గ్రంథము దొరకు వరకును వీరమాహేశ్వరము ప్రత్యేక గ్రంథమనియే భావింతము'' అని కందుకూరి వీరేశలింగముగారు వ్రాశారు.[8] అయితే ఆ పధ్నాలుగు పద్యాలనూ చూస్తే అవి ఈ శివలీలావిలాసంలోనివే అయి ఉంటాయని చెప్పవచ్చు. చూడండి. వీరమాహేశ్వరంలో సుదర్శనంపై ఒక పద్యముంది.

దైతేయకాంతల తళుకుగెమ్మోవుల వీటికాశ్రీలకు వీడుకోలు,
వేల్పుటిల్లాండ్ర క్రొవ్విదపుజన్నులమీద యలుపుబయ్యెదలకు నిలువనీడ.
విశ్వజగత్త్రయీ విజయలక్ష్మీగాఢ బిరుదోత్సవములకు బెండ్లివిందు.
పరిపంథి వాహినీపరిచితపరిభవప్రాప్త సంకటముల పాయుత్రోవ.
సేసి యెయ్యది విలసిల్లు జిత్రమహిమ?
నది ప్రయోగింప నెత్తె సయ్యచ్యుతుండు
విలయసమయసముద్భూతవిపులదహన
దారుణస్పర్శనంబు సుదర్శనంబు. (ప్రబంధ. 110)

ఇది శివలీలావిలాసంలో 16వ లీలలోనిది. అది ''ఇందిరా వల్లభున కలరి, సుదర్శనం బొసంగుటయును'' అని కొమ్మన్న విషయ సూచికలో (1-17) చెప్పిన లీల. పార్వతీదేవిని గిరిజగా వర్ణించే పద్యమొకటి వీరమాహేశ్వరంలో ఉంది.

ప్రణవపీఠిక నెక్కి భాసిల్లు నేదేవి యామ్నాయహేమహర్మ్యాగ్ర వీథి?
జరియించు నేదేవి సహజారుణజ్యోతి రానందమూర్తియై బ్రహ్మనాడి?
నేదేవి రవణిల్లు నిచ్ఛా క్రియాజ్ఞానశక్తి భేదమున విశ్వంబు నిండి?
తోడునీడయుబోలె దులకించు నేదేవి యెల్ల కాలంబు విశ్వేశుగూడి?
యట్టిదేవి జగన్మాత యఖిలవంద్య
నిఖిలవిద్యాకళేశ్వరి నిత్యమహిమ
నొకటియును శ్రీగళుని గ్రేవ నుల్లసిల్లు
నలఘుకల్యాణశుభగాత్రి యద్రిపుత్రి. (ప్రబంధ. 115)

ఇది వటుభావంబున గిరిజభావం తెలుసుకొన్నాక ''తదీయగరిష్ఠ నిష్ఠకు మెచ్చి యాయమం బెండ్లియగుట'' అని కొమ్మన చెప్పిన 21వ లీలలోని పద్యం. ''పార్వతీ ప్రణయ వశంబున నర్ధగాత్రం బంగీకరించుటయు'' ని కొమ్మన ఒకలీల రచించాడు. ఇది 31వ లీల. ఇందులోని పద్యమే ఒకటి వీరమాహేశ్వరంలోనిదని సంకలనకర్త సంతరించాడు.

8. ఆంధ్రకవుల చరిత్ర, ప్రథమభాగం, పుట. 589.

తల్లిదండ్రులతోడితగు లొల్లకుండియు దల్లిదండ్రులతోడి తగులు వలచి,
కందర్పుమీదియక్కటికంబు సెల్లియు గందర్పుమీది యక్కటిక మొదవి.
సంసారకేళి ప్రసక్తి బోదట్టియు సంసార కేళి ప్రసక్తిగలిగి,
సగుణవిశేషయోజనము ల్లటించియు సగుణవిశేషయోజనము మరగి,
సగము పురుషుండు కంజాక్షి సగము గాగ
నర్ధనారీశ్వరాకృతి ననుపుపఱిచి
హరుడు తల్లింగమధ్యంబునందు నుండి
హరివిరించుల కంత బ్రత్యక్షమయ్యె. (ప్రబంధ. 109)

అర్ధనారీశ్వర లీలకు ముందుగా 'ఏకశరంబునం ద్రిపురంబు లేర్చి యబ్ధింబడగూల్చుట' అనే 25వ లీల ఒకటి వుంది. అందులోని పద్యమే ఈ క్రిందిది.

జడివట్టుపడగలు, పడగలమీదబోగదలెడి కండ్లును, గండ్లనడుపు
సూత్రించు జోడును, జోడుపై జరియించుబంట్లను, బంట్లకు బాయరాని
ధనువును, ధనువుతో దగిలిన యరదంబు, నరదంబు క్రిందికి నరుగు నారి...
నారినిద్రించు బాణము, బాణ మొదవించుసూతుండు, సూత సంజాత హరులు
గాన నద్భుతార్థకరపదార్థావళి - యుల్లసిల్ల నొప్పు చున్న దిపుడు
త్రిపురహరణకరణదృఢదత్త ధీర మనోరథంబు దేవ! నీరథంబు. (ప్రబంధ. 108)

'పునర్భ్యాతుండగు దక్షుబన్నంబు వీరభద్ర పరాక్రమంబున విపులీకరించుటయు' అనే 29వ లీలలో వీరభద్రునితో వచ్చిన ప్రమథుల వర్ణనమే ఈ క్రింది పద్యం.

కమలజాండంబులు కందుకంబులు సేసి యొండొండ దాటింప నోపువారు,
విలయవహ్నులబట్టి వెసదండలుగగ్రుచ్చి యురమునధరియింపునోపువారు,
తివిరి సంహారభైరవునైన బొరివోవ నొకమాత్ర పసిమాల్పనోపువారు,
కాలచక్రక్రియాఘటనంబు ద్రిప్పి యొండొకలాగు గావింపనోపువారు,
ప్రమథవీరులు వివిధరూపములతోడ
హసనలనుఘునతాపనాద్యలఘు గతులు (?)
వెలయ గోటానకోటులు కొలిచివచ్చి
దతడు హరు గొల్వ నేతెంచు నవసరమున. (ప్రబంధ. 105)

ఈ విధంగా గుర్తుంచుకొంటూ దీనిలో మిగతా పద్యాలు ఏయే ఘట్టాలలోనివో తెలుసుకోవచ్చు. మొత్తానికి వీరమాహేశ్వరం శివలీలా విలాసానికే నామాంతరమని చెప్పవచ్చు. ఈ శివలీలావిలాసం అవతారికలో ఉన్న పూర్వకవిస్తుతినే వీరమాహేశ్వరంలో సంకలనకర్త ఉదాహరించాడు.

నన్నయభట్టు గావ్యరచనావిధి, దిక్కనసోమయాజిన
చ్ఛిన్నమహత్త్వసంవిహిత శేముషి, నెఱ్ఱియప్రెగ్గడిన్ సము

త్పన్ననవ ప్రబంధరసభావన, నింపున బ్రార్థనాంజలుల్
మున్నుగ నాత్మలో దలతు మువ్వుర మువ్వుర బోలు పుణ్యులన్.[9]

(ప్రబంధ. 111)

కొమ్మన కవిత్రయాన్ని త్రిమూర్తుల్లాంటి పూజ్యులన్నాడు. నన్నెచోడుని నుతించలేదుగాని అతని కుమారసంభవాన్ని కొమ్మన చదివాడని చెప్పవచ్చు. 3వ లీల సతీ వివాహంలో ఆమెను మొదట నఖశిఖ పర్యంతం కొమ్మన వర్ణించాడు. కాళిదాసు కుమారసంభవంలో అలాగే మొదట చేశాడు. అది చూసి నన్నెచోడుడు 31 కంద పద్యాలలో వర్ణించాడు. నిశ్శంక కొమ్మన 24 పద్యాలలో వర్ణించాడు (1-135 నుంచి 158 దాకా). ఇందులో మీగాళ్ల వర్ణన చూడండి.

సర్వమంగళమీగాళ్ళ చక్కదనము
తమకు బడయంగరాకపో కమఠము...
మెనయజాలక తల యెత్తుకొనగలేక
బయలు మెరసి చలింపవు భయముకతన. (శివలీలా. 1-137)

దీనిని నన్నెచోడుని పద్యంతో పోల్చి చూడండి.

కన నీచయోని పడుటే - లని సకళత్రమును నుమపదారాధనకొం
దిన విష్ణుకమఠరూప మొ-యనదగి మీగాళు లగజ కందం బొందున్.

(కుమార. 3-45)

కాళిదాసు మూలంలో దీనికి సరిపోయిన వర్ణన లేదు. కాబట్టి కొమ్మన నన్నెచోడుని చూసే ఇలా చెప్పి ఉంటాడు.

నన్నెచోడుడు అన్నీ కందపద్యాలే వ్రాశాడు. కొమ్మన 16 కందాలు, 7 గీతలు, 1 చంపకం వ్రాశాడు. చంపకమాల చూడండి - ఆఖరుది.

సవరదనంబు లెల్లను బొసగంగ నొక్కెడ జూచువేడ్కవా
గ్ధవు డుపమాపదార్థసముదాయము లన్నియు దెచ్చి దక్షసం
భవనొనరించెగాక తలపన్నది యట్టిదగాక తక్కినన్
సవతియ లేక యాసతియ చానలలో బ్రకటిల్లుచుండునే? (శివలీల. 158)

ఇది పార్వతీ వర్ణనలో కాళిదాసు వ్రాసిన చివరి శ్లోకానికి అనువాదం. చూడండి.

సర్వోపమాద్రవ్యసముచ్చయేన - యథాప్రదేశం వినివేశితేన
సా నిర్మితా విశ్వసృజా ప్రయత్నా - దేకస్థసౌందర్యదిదృక్షయేవ. (కుమార. 1-49)

---

9. ఈ పద్యం శివలీలావిలాసం అవతారికలో 13వ పద్యం. చూ. History of Reddy Kingdoms, Appendix.

కాళిదాసు, నన్నెచోడుడు మొదలైన ప్రాచీనులను అనుకరించడమేగాక సమకాలికులను కూడా కొమ్మన అనుకరించాడు. వీర మాహేశ్వరంలోనిదని సంకలనకర్త ఉదాహరించిన గరుత్మంతుని వర్ణనలో ''దంభోళి నొక ఈక తాకు గానిక సేసి యమృతంబు దెచ్చిన యవఘళుండు'' అని కొమ్మన వ్రాశాడు. (ప్రబంధ. 113). ''జిష్ణుపతి కొక్క యీకయిచ్చిన ప్రదాత'' అని శ్రీనాథుడన్నాడు (కాశీ. 6-14).

శ్రీనాథుడు హరవిలాసంలో వ్రాద్దామనుకొని కొన్నే వ్రాసిన శివలీలలు తీసుకొని సంపూర్ణంగా - కల్పారంభం నుండి కల్పాంతందాకా, ఒక క్రమంగా కొమ్మన కథనం చేశాడు. దానికి ప్రబంధ లక్షణాలు ఉండడానికి అక్కడక్కడ సముచితంగా వర్ణనలు చేశాడు. గణేశ్వరోద్భవంలో బాల్యాంక చేష్టలు చక్కగా వర్ణించాడు. ఆటలో బిడ్డ తల్లిని ఏడిపిస్తూ ఉంటే తండ్రి నవ్వుకొంటాడు. తండ్రిని ఇబ్బంది పెడితే తల్లి నవ్వుకొంటుంది. పార్వతీపరమేశ్వరులను గణపతి ఉల్లాసపరిచాడు. చూడండి.

సతి దను పంకపీఠిక బొసంగగ జేరిచి ముద్దులాడుచో
నతిమహితాద్భుతంబులగు నాయమచన్నుల కాత్మకుంభముల్
ప్రతియిడి వీని వాని గురుభావము చెప్పుమటంచు ముగ్ధతా
స్మిత నడుగు న్మహేశ్వరుని వీనులకు న్ముద మావహిల్లగన్.

జనకుడు తన్ను నూరుతలసంగతుజేసి యథోచితోపలా
లనముల నింపు సేయగ జెలంగుచు దత్పదనశ్మశ్రులో
చననికరంబు చూచి జలజాతసరోవరమంచు దొండ మొ
య్యన జరిగించు దల్లిహృదయంబునకుం బ్రియముల్ జనింపగన్.

(శివలీలా. 1-234, 235)

పార్వతీపరమేశ్వరుల వద్ద వినాయకునికి ఎంత చనువు ఉందో కొమ్మన కూడా అంత తీసుకొన్నాడనిపిస్తున్నది. మొగలిపువ్వు శివపూజకు పనికిరాదు. అయినా శివుని నెత్తికెక్కిన చంద్రుడి కథలో కొమ్మన మొగలిరేకును లాక్కొచ్చి తురిమాడు. చూడండి.

ఆతూణచంద్రకళచే - జేతః ప్రియకరనిరూఢి శివు డింపలరన్
నూతనవిలాసలీలా - స్ఫీతంబగు మొగలిరేకు చెరివిన కరణిన్. (శివలీలా. 2-28)

కవి నిరంకుశుడు! చంద్రుణ్ణి ఇలా వర్ణించినవాడు నక్షత్రాలను ఎలా వర్ణించాడో చూడండి. గంగావతరణం ఘట్టంలో శివుడు తన మేను పెంచుకొన్నాడు. నక్షత్రాలు మొదట తలపువ్వులులాగ ఉన్నాయట. అతడు పెరుగుతున్నకొద్దీ అవి ఇతర ఆభరణాలతో సరిపోలి చివరకు కాలిమువ్వలలాగ ఉన్నాయట. చూడండి.

తొలిదొలి శేఖరస్థలమున కలవడి మవ్వంబు మిగిలిన పువ్వులగుచు
నంతలోపలను గర్ణావతంసములకు బ్రకట వినూత్నవజ్రంబు లగుచు
దదనంతరంబకంఠ ప్రదేశమునకు దీపితహారమౌక్తికము లగుచు
మరి యాక్షణమ కటి మహితమేఖలకునిమ్ముల రచించిన వెండిమువ్వలగుచు

నిట్లు నక్షత్రములు చిత్రమెసక మెసగ
క్రమము దప్పక నిజకపర్దములు దలప
నుగ్రమాహేశ్వరుండున్న యునికి తోన
నిగిడి బ్రహ్మాండమండలినిండ బెరిగి. (శివలీలా. 2-265)

ఇటువంటి కవిత్వం పాత్రనే కాదు, కవినిగూడ ఆకాశమంత ఎత్తుకు పెంచుతుంది.

కొమ్మన తెనుగు కవిత్వంలో ఆజానుబాహుడే.

దగ్గుపల్లి దుగ్గన

శ్రీనాథుడూ, బమ్మెర పోతరాజుగారూ బావమరదులని లోకం చెప్పుకొంటుంది గాని అది చారిత్రక సత్యం కాదన్న సంగతి మనం శ్రీనాథుని చరిత్రలో గుర్తించాం. కవిసార్వభౌమునికి దగ్గుపల్లి దుగ్గన్న అనే బావమరిది ఉన్నాడనీ, అతణ్ణి శ్రీనాథుడు అభిమానించి తనతో తిప్పుకొన్నాడని కూడా చెప్పుకొన్నాం. తన బావగారి సాన్నిధ్యంలో చిన్నప్పట్నుంచీ పెరగడంవల్ల దుగ్గన మంచికవి అయ్యాడు. శ్రీనాథుని దయవల్లనే తాను కవి అయినట్లు తాను వ్రాసిన 'నాసికేతోపాఖ్యానం' అనే గ్రంథంలో ఇలా చెప్పుకున్నాడు.

ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర కవిసార్వభౌమ సకల విద్యానాథ శ్రీనాథమహాకవీంద్రప్రసాదలబ్ధ కవితావిశేష దగ్గుపల్లి తిప్పనార్య ప్రియ తనూజ దుగ్గననామధేయప్రణీతంబైన నాసికేతోపాఖ్యానంబను మహాప్రబంధంబు...

దుగ్గన ఈ ప్రబంధాన్ని వ్రాయడానికి ముందు 'కాంచీమాహాత్మ్యం' కథ చిత్రతరంగా విస్తరించి వ్రాశాడు. దీనిని తీసుకువెళ్ళి ఉదయగిరి పాలించే పూసపాటి బసవరాజుగారి కొలువులో వుండే చెందలూరి దేవయ్య మంత్రికి అంకితమిచ్చాడు. శ్రీనాథునితో పాటు పర్యటనం చేస్తున్నప్పుడు దుగ్గన కంచిని సందర్శించి ఉంటాడు. ఆ క్షేత్ర మాహాత్మ్యాన్ని గ్రంథస్థం చేయాలనే కాంక్షతో ఈ కావ్యాన్ని చెప్పి శ్రీనాథుని మరణానంతరం ఉదయగిరి మంత్రులను ఆశ్రయించి ఉంటాడు. దుగ్గన వ్రాసిన 'శివకాంచీ మాహాత్మ్యం' ఇవాళ మనకు ఎక్కడా దొరకలేదు. ఆ గ్రంథంలోని రెండు పద్యాలు మాత్రం పెదపాటి జగ్గన సంకలనం చేసిన ప్రబంధ రత్నాకరంలో చేర్చడంవల్ల దక్కాయి. అవి వర్షాకాలాన్ని వర్ణించే సీస పద్యాలు, చూడండి.

క్షోణీనభంబులు సూత్రించిన ట్లింద్రచాపంబు చాపమై సంఘటింప
బ్రహ్మాండభాండంబు పగిలించు గర్జలు సింహనాదస్ఫూర్తి జేయుచుండ
సౌదామినీదామజాలము ల్దిక్కుల స్వప్రతాపానలజ్వాలలుగను
నాహార్యహారిణోద్యదశనిసంఘంబులు దివ్యాస్త్రవితతులు తేజరిల్ల

నాశుశరవృష్టి శరవృష్టి నఖిలోక - బాధ కోర్ద్రీష్మశుంభత్ప్రతాప
మార్పెనర్జునయుత శింఖడ్యాభివర్ధ (?) నాఖ్యవర్ధర్తునారాయణాఖ్యమూర్తి.
బంధూక మడరించె బరపయ్యె గేదంగి కడిమి పుష్పితమయ్యె గ్రంథి పూచె
నర్జునం బలరారె నరవిందములు కేరె భూస్థలి నేరులు ప్రక్కిలించె చెలగె
గండూపదము లుబ్బె గలరె హంసచయంబు నటియించె గప్పలు నమిలి
జాతకంబులుమించె సాగరం బెడయించె హరిగోపములతోడ నాడెలేళ్లు
మత్తభృంగంబులకు దేనె రిత్తయయ్యె - గండుకోయిల కూతలు గట్టుకొనియె
చూలుకొన స్వాతి చూటి బొదువ (?) - విష్ణునకు నిద్రపోయెడి వేళయయ్యె.
(ప్రబంధరత్నాకరం, 177-78)

ఈ శివకాంచీమాహాత్మ్యానికి మూలగ్రంథమేమిటో, కావ్యంలో ఏయే విషయాలు ఉంటాయో టేకుమళ్ళ అచ్యుతరావుగారు ఇలా చెప్తున్నారు.[1]

''ఈ శివ కాంచీమాహాత్మ్యకథ స్కాందపురాణమందలి సనత్కుమార సంహితాంత ర్గతమైన కాళికాఖండమున తీర్థస్థలప్రశంసలో చెప్పబడినది. కాంచీపురం లేక సత్యవ్రత క్షేత్రమందున్న క్షేత్రపాలకులందరి కథలున్ను అనగా కచ్చపేశ్వరుడు, సిద్ధేశ్వరుడు, త్రిదశేశ్వరుడు, వల్మీకమాహేశ్వరుడు మున్నగు నుపదేవతలకథలున్ను, ఆ దివ్యక్షేత్రమునకు ప్రధానముగా నున్న ఏకామ్రనాథుని చరిత్రమున్ను ఇత్యాది మాహాత్మ్యములెన్నియో అభివర్ణింపబడియుండవచ్చును.

''చతుర్వేదముల ఏకమయమూర్తి కాంచీనగరమందలి కంపానదీ తీరమున ఒక మామిడిచెట్టు (ఏకామ్ర) రూపమున జనించెను. ఆ చెట్టు మొదట నర్ధేందుమౌళి యంబికా సహితుడై స్థిరనివాసమేర్పరచుకొనెను. కావున నప్పరమేశ్వరునకు నేకామ్రనాథసంజ్ఞయు, నంబికకు కామాక్షి సంజ్ఞయు కలిగెను.''

ఈ కాంచీపురములో నొక భాగము విష్ణుకంచి, దాని అధిష్ఠాన దైవము వరదరాజస్వామి. ఇది వైష్ణవక్షేత్రము. శివకాంచీమహాత్మ్యాన్ని రచించాక దుగ్గన ఉదయగిరిలోనో, చెందలూరులోనో ఉండి చెందలూరు మంత్రుల ఆశ్రయంలో జీవిస్తూ ఉండేవాడు. ఆ మంత్రులపై చాటుపద్యాలు చెప్తూండేవాడు. శివకాంచీ మాహాత్మ్యం అంకితం పుచ్చుకున్న దేవయ్య మంత్రిగారి పెత్తండ్రి కొడుకు గంగయ్య మంత్రిమీద దుగ్గన చాటుపద్యాలు చెప్పినట్టు ఈ క్రింది పద్యం వల్ల తెలుస్తున్నది.

హితమతివి సకలవిద్యా - చతురుండవు చాటుపద్యజాలంబుల నా
కతులితకీర్తులగలిగిం-చితి దుగ్గన కవివరేణ్యా! శివకారుణ్యా! (నాసి. 1-17)

తనమీద చాటుపద్యాలు చెప్పిన దుగ్గన 'నాసికేతోపాఖ్యానం' అనే కావ్యాన్ని - 'చదవడానికీ, వినడానికీ ఇంపైన దానిని' వ్రాస్తున్నట్టు 'సకల విద్వజ్జన

1. విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయ చరిత్ర, ప్రథమభాగం, పుటలు 128, 129.

శ్రోత్రపరంపరావశంబున' విన్నాడు. విన్నాక దుగ్గన కవిత్వంలోని గొప్పతనాన్ని తలచుకొన్నాడు. పరమానందంతో ఇలాగ ప్రస్తుతించాడు:

శ్రుతుల విహార దేశములు సుస్థిరవాక్యపదప్రమాణశా
స్త్రతతుల యిక్క లాగమపురాణచయమ్ముల కేలిసద్మముల్
స్మృతుల నివాసముల్ కవిసమీహితసత్క వితాగుణప్రసా
దితములు దగ్గుబల్లి కవితిప్పయ దుగ్గని గద్యపద్యముల్. (నాసి. 1-15)

దుగ్గన గద్య పద్యాలలో వేదాలు విహరిస్తాయట. అవి శాస్త్రాలకు తావులట. ఆగమ పురాణాలకు ఆటపట్టులట. స్మృతులకు ఉనికి పట్టులట. వేదశాస్త్రసమ్మతాలైన ప్రమాణాలతో దుగ్గన శివకాంచీమాహాత్మ్యం వ్రాసి ఉండబట్టే గంగయ్యామంత్రి ఇంతగా పొగుడుతూ భాషించి ఉంటాడు. దుగ్గనను తన సముఖానికి రప్పించుకొని, శ్రీనాథుని పొగడి, ''అటువంటివాని ముద్దుమరిదివి. ఇప్పుడు వ్రాస్తున్న నాసికేతోపాఖ్యానం నాకు అంకితం ఇయ్యి'' అని అర్థించాడు. గంగయామాత్యుడు ప్రస్తుతించినట్టూ, తన కంకితం ఇవ్వమన్నట్టూ దుగ్గన చెప్పిన పద్యాల వల్ల కవిసార్వభౌముని సర్వతోముఖ వైదుష్యం తెలుస్తున్నది. చూడండి.

సంస్కృత ప్రాకృత శౌరసేనీముఖ్యభాషాపరిజ్ఞానపాటవంబు
బన్నగ పతిసార్వభౌమభాషితమహాభాష్యవిద్యాసమభ్యాసబలము
నక్షపాద కణాదపక్షిలోదీరిత న్యాయకళాకౌశలాతిశయము
శ్రుతిపురాణాగస్మృతిసాంఖ్యసిద్ధాంతకబళనవ్యుత్పత్తిగౌరవంబు
  పూర్వకవిముఖ్యవిరచితాపూర్వ కావ్య
  భావరససుధాచర్వణ ప్రౌఢతయును
  గందళింపగ గాశికాఖండనైష
  ధప్రముఖవివిధప్రబంధము లొనర్చి

కవిసార్వభౌముడై కర్ణాటవిభుచేత కనకరత్నాభిషేకములు గనిన
శ్రీనాథసుకవి కూరిమచేయు మరిదివి దుగ్గయ కవిరాజ! దగ్గుబల్లి
తిప్పనార్యునకును సతీమణి యెరమకును దనూజుడవు పోతనకు నెఱ్ఱ
నామాత్యవరునకు ననుగుదమ్ముండవు శాండిల్య గోత్రుడౌ సరసమతివి
  చెప్ప నేర్తువు కృతులు సుస్థిరముగాగ
  గాన నీవు రచింపంగ గడగియున్న
  నాసికేతచరిత్రంబు నాదు పేర
  నంకితము సేయు కవిరాజు లాదరింప. (నాసి. 1-18, 19)

ఇలా కృతి అడగడానికి ఇంకొక కారణం తన పినతండ్రి కుమారునికి దుగ్గన శివకాంచీమాహాత్మ్యం అంకితం ఇవ్వడం కూడ అయి వుంటుంది. ఆ సంగతి ఈ పద్యంలో చెప్పాడు.

మా పినతండ్రి గంగయ యమాత్యశిఖామణి తత్తనూభవుం
డై పెనుపొందు దేవసచివాగ్రణి కిచ్చితి వంద్రభాషగాం
చీపురనాథు దివ్యకథ చిత్రతరంబుగ విస్తరించి నీ
వోపుదు వార్యహృద్యమధురోక్తుల సత్కృతు లొప్పజెప్పగన్.

(నాసికేతో పాఖ్యానం. 1-20)

నిజానికి దుగ్గన అంతవాడే, ఆర్యహృద్యమధురోక్తులతో సత్కృతులొప్పేటట్టు చెప్పడానికి ఓపినవాడే. చిన్న కథను తీసుకుని చిత్రతరంగా విస్తరించి వ్రాయగల్గిన జాణడే, సలలిత కావ్యబృందాలను జాణలు వ్రాస్తే దుష్కవులు దోషాలు ఎన్నవచ్చుగాని వాటిని ఖాతరు చేయరని దుగ్గన యీ పద్యంలో చెప్పాడు:

సలలిత కావ్యబృందములు జాణలు కావ్యరసానుబంధరీ
తుల గొనియాడ దుష్కవులు దోషము లెన్నగ జాతు రట్టియో
వెలదుల మేన నేర్పరులు విభ్రమలీలలు చూచి మెచ్చ నీ
గలు వ్రణమర్మముల్ వెదకుగాక యెరుంగునె తద్విలాసముల్?

(నాసికేతోపాఖ్యానం, 1-9)

ఈ పద్యంలో దుగ్గన నన్నెచోడుని అక్షరాలా మక్కికి మక్కి అనుసరించాడు. నన్నెచోడుడు కుకవినిందలో వాళ్లను ఈగలతో పోల్చాడు (కుమారసంభవం, 1-30). నన్నెచోడుని ఇలా అనుసరించినా దుగ్గన అతణ్ణి పూర్వకవి స్తుతిలో పేర్కొనలేదు. ఆ మాటకొస్తే అతణ్ణి ఏ తెలుగు కవీ నుతించలేదు. దుగ్గన ప్రస్తుతించిన తెలుగు కవులు కవిత్రయంలోనివాళ్లే. ఎర్రయగారి యింటిపేరు 'చెదలువాడ' అని దుగ్గన మాటలవల్ల తెలుస్తున్నది. కవిత్రయం వారి ప్రభావం దుగ్గన రచించిన నాసికేతోపాఖ్యానంలో పూర్తిగా కనబడుతుంది.

శౌనకాది మహామునులు తనకెలాంటి కథ వినాలని ఉందో సూతునికి చెప్పారు. ఆ సంగతి నన్నయగారిలా వ్రాశారు:

ఏయది హృద్యమపూర్వం - బేయది యెదా వినిన యెరుక సమగ్రం
బైయుండు, నఘనిబర్హణ - మేయది యక్కథయ వినగ నిష్టము మాకున్.

(భారతం. 1-1-30)

ఈ పద్యాన్ని దుగ్గన అనుసరించాడు. ఎలాటి కథను తెలుగు చేస్తే బాగుంటుందా అని అతడు ఇలా భావించాడు:

ఏకథ పురాణసమ్మత - మేకథ వేదప్రసిద్ధ మేకథ పుణ్యా
శ్లోక స్తుత్యగుణాన్విత - మేకథ చదువంగ వినగ నింపై యుండున్

(నాసికేతోపాఖ్యానం. 1-11)

ఇన్ని షరతులతో కూడుకొన్న కథా విశేషం కోసం దుగ్గన అన్వేషించాడు. నాసికేతోపాఖ్యానం దొరికింది. అది సకలధర్మ మర్మ జ్ఞాపకం, దురితదూరీకరణ పారీణం, అపూర్వ ఆశ్చర్యధుర్యం, సకలపురుషార్థసాధకం అని నిశ్చయించాడు. ఆ యితిహాసాన్ని తెలుగు చేయదలిచాడు. నాసికేతుని కథ కఠోపనిషత్తులోనూ, భారతం ఆనుశాసనిక పర్వంలోనూ ఉంది. అయితే ఆ కథలకూ, దుగ్గన వ్రాసిన కథకూ చాలా తేడా ఉంది. అంతమాత్రాన ఇది దుగ్గన స్వకపోలకల్పితం కాదు. ఇతడు వ్రాసినదానికి సరిపోయే సంస్కృతమూలం ఒకటి లేకపోలేదు. అది పూనాలోని భండార్కర్ పుస్తక భాండాగారంలో ఉంది. ఈ మూలప్రతిని పరిశీలించి అందులోని కథను సవిస్తరంగా టేకుమళ్ళ అచ్యుతరావుగారు పొందుపరిచారు.[2] ఒక్క మూలకథనేకాక, కఠోపనిషత్తులోని కథ, భారతంలోని మూలకథ, దుగ్గన వ్రాసిన చరిత్ర అన్నీ చర్చించారు.

నాసికేతోపాఖ్యానం ముఖ్యంగా యమలోకాన్ని వర్ణించడానికి, ఏయే పాపాలు చేస్తే, యేయే శిక్షలు వేస్తారో చెప్పడానికీ పురాణకర్తలు ఉద్దేశించారు. కావ్యకర్త మాత్రం దాన్ని వేరే అభిప్రాయంతో తీసుకున్నాడు. నిరంతర బ్రహ్మచర్యం పనికి రాదనీ, మునులు సహితం గృహస్థాశ్రమం స్వీకరించాలనీ ప్రబోధించడానికి ప్రయత్నించాడు. బ్రహ్మమానస పుత్రుడైన ఉద్దాలకుడనే ముని అడవిలో తపస్సు చేసుకుంటున్నాడు. పెళ్ళి చేసుకుని ఒక ఇంటివాడవు కమ్మని తోటి మునులు చెప్పారు. లాభం లేకపోయింది. అతణ్ణి పుట్టించిన జేజమ్మ వచ్చి చెప్పాడు వినలేదు. బ్రహ్మకు ఒళ్ళు మండింది. 'నీ కొడుకే నీకూ, నీ పెళ్ళానికీ పెళ్ళి చేస్తాడు పో, అని శపించాడు. ఆ శాప ప్రకారం ఉద్దాలకునికి కొడుకు పుట్టనూ పుట్టాడు; తల్లితండ్రులకు పెళ్ళీ చేశాడు. ఆ తరువాత వాళ్ళు సుఖంగా ఉండేటప్పుడు ఒకసారి తండ్రికి కోపం వచ్చి కొడుకును ''యమలోకానికి పో'' అని శపించాడు. కొడుకు అలాగే పోయి, తిరిగి వచ్చి తాను చూసిన విషయాలన్నీ మునులకందరికీ చెప్పాడు. ఇదీ ఈ కావ్యంలోని కథ.

అడవిలో ముక్కుమూసుకుని కూర్చునేవాడికి - పెళ్ళి చేసుకోనని భీష్మించుకున్న వాడికి కొడుకెలా పుట్టాడు? ఆ బిడ్డ తల్లితండ్రులకు ఎలాగ పెళ్ళిచేశాడు? అన్నవే కుతూహలాన్ని రేకెత్తించే ప్రశ్నలు. ఉద్దాలకుడు పట్టుదలకు పెళ్ళి వద్దన్నాడేగాని నిద్రలో సర్వప్రజలకూ సహజమైన స్వప్నాలు రాకుండా ఉన్నాయా? కలగన్నాడు. అందులో ఒక వన్నెలాడి కనిపించింది. ఆమెతో భోగించినట్టు భావించాడు. వీర్య స్ఖలనమైంది. దానినా ముని ఒక తామరపూవులో నిక్షిప్తం చేసి ఆకులు చుట్టి తూళ్ళతో కట్టి నదిలో పారవేశాడు. అది కొట్టుకొని వెళ్లి వెళ్ళి తన రాచవారి చిన్నదానికి దొరికింది ఆమె ఆ పొట్లం విప్పి అందులోని పువ్వును చూసి, తీసి గట్టిగా వాసన చూసింది. ఇంకేముంది? కొంప మునిగింది! కొన్నాళ్ళకామె నెల తప్పింది. పళ్ళకూ, పాయసాలకూ పిల్లలు పుట్టరనీ మగవాని వీర్యంవల్లనే సంతానం కలుగుతుందనీ గుర్తించని తొలిరోజులలో మన ఆదిపురాణకర్తలు ఇలాంటి కథలు ఎన్నో కల్పించారు. మహాభారతంలోని

2. విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్రము, ప్రథమభాగం. (క్రీ.శ. 1330-1500) పుట 135

మహానుభావులు ద్రోణుడు, కృపుడు, ద్రుపదుడూ కామాతురులైన మునుల రేతః పతనంవల్ల పుట్టినవాళ్ళే. భారతీయులకు పరమ పూజ్యురాలైన సీతమ్మవారు కూడా ఇలాగ పుట్టిందే. తన జన్మవృత్తాంతాన్ని ఆమె అనసూయతో నిస్సంకోచంగా చెప్పుకుంది. మేనకను చూసి మరలుకొన్న జనకుడు 'బీజముష్టివిక్షేపం' చేసేటప్పుడు సీత జన్మించింది.[3] పురుష వీర్యాన్ని ధరించిన స్త్రీలేకాక నేల, నీరు, రెల్లుగడ్డి మొదలైన చేపలు వగైరా జీవులు కూడ బిడ్డల్ని కంటాయని వివిధ పురాణాలు మనవాళ్లు కల్పించారు. ఆదిమ శాస్త్రజ్ఞులు చెప్పిన గోరంత సత్యంతో ప్రాచీన భావుకులు కొండంత పురాణ సంచయాన్ని నిర్మించారు.

ముక్కుమూసుకొని తపస్సు చేసుకొనే మునివీర్యాన్ని ముక్కుతో వాసన చూడడం వలన పుట్టినవాడు కనుక ఆ బిడ్డకు 'నాసికేతుడు' అని పేరు పెట్టారు.

నాసికాంత సముద్భూతః సర్వలక్షణ సంయుతః
నాసికేతు రితి ఖ్యాతః మునిభిఃకృతమంగళః

అని మూలంలో ఉంది. ఇతణ్ణే 'నాచికేతుడు' అని కొందరు చకారయుతంగా వ్యవహరిస్తారు. భారతంలోనూ, కఠోపనిషత్తులోనూ అలాగే వుంది.[4] అయితే దుగ్గన నాసికేతుని జన్మవృత్తాంతం కూడా వ్రాయడంవల్ల ఔచిత్యవంతమైన పేరునే పెట్టాడు. వాస్తవానికి దుగ్గన, మూలంలో ఉన్న అనౌచిత్యాన్ని పరిహరించి చక్కని పాత్రపోషణతో కథ నడిపాడు.

మునిచర ధాతువును ఆఘ్రాణించి నెలతప్పిన చంద్రవతి తన అకారణ గర్భానికి అగ్గిలించి, ఉప్పొంగే కన్నీరు సంఖాకురాలతో మీటుతూ, ఏమని చెప్పుకోవాలో తెలియక 'కొంకిన గర్భము దాగ నేర్చునే' అని భావించి తన పరిస్థితిని తల్లిదండ్రులకు చెప్పమని చెలికత్తెలను కోరింది. వాళ్ళు వెళ్లి రాజుకు చల్లగా తెలియజేయగానే అతడు వెంటనే మూర్ఛపోయాడు. తరువాత తెప్పరిల్లి ఇలా బాధపడ్డాడు.

రాజవంశములోన పూజనీయంబైన - కులము సత్కీర్తులు కోలుపోయె
బహుళ సదాచార పావనమైన గో - త్రంబు నీనిందకు పాత్రమయ్యె
బాంధవకోటికి ప్రమదంబు గావించు - నిలువడి పెంపెల్ల నిలువబడియె
లోకవిఖ్యాతమై యేకళంకము లేని - యభిమాన గరిమకు హాని కల్గె
వసుధ సరివారిలో తలవంపులయ్యె - గన్నియల గన్నవారిలో కష్టపడితి
గాని వారిలో నేను నొక్కరుడ నైతి - శుతిలపడితిని గొరగాని కూతు గాంచి.

(నాసికేతోపాఖ్యానం. 1-181)

3. భాస్కర రామాయణం, అయోధ్య. 432-437.
4. భారతం, అనుశాసనికం. 2:446-462 కఠోపనిషత్తు ప్రథమాధ్యాయం, ప్రథమవల్లీ ప్రథమశ్లోకంలోనే నాచికేతుడనే పేరుంది.

ఈ కొరగాని కూతురు యెంతకైనా తెగిస్తుందని మండిపడ్డాడు.

నెఱయలి పాతకంబునకు నిందకు రోయక రంతుసేసి మా
కెరుగగ జెప్పు డంచు మది యించుక నేనియు గొంకులేకయా
పఱచుల [5] నెల్ల నాయెడకు బంచిన దిమ్మెయి నిట్టికైతవం
బరిమురి నెట్లు నేరెచి నొకొ యంతకు నేర్చిన దింతనేరదే!

(నాసికేతోపాఖ్యానం, 1-192)

దీనికి ప్రాయశ్చిత్తం ఆమెను అడవికి పంపడమే అనుకున్నాడు. ''త్యజే దేకం కులస్యార్థే'' అన్న నీతిని అవలంబించాడు. భృత్యులను పిలిచాడు. ఇలా చెప్పాడు.

దీనికి మీర్ ప్రతి చెప్పక దానిని గొనిపోయి ఘోరదారుణ వనసం
తానముల పాలు సేయుడు హానికి నిరవైన కూతు నర్మిలి యేలా?

(నాసికేతోపాఖ్యానం, 1-192)

ఈ పద్యంలో 'మీరు' అనే మాటలో ఉకారలోపం ఉంది. పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడూ కొందర్, అనియెదర్, కొనినవార్ మొదలైన ఉకారలోప రూపాలను వాడినట్టు మనం ఇంతకుముందు గమనించాం.[6] పండితయ్యా సోమనాథుల లాగ దుగ్గన కూడా శైవుడే. కాని వీరశైవుడు కాదు. నాసికేతోపాఖ్యానం మంగళాచరణంలో విష్ణువును మొదట నుతించాడు. దుగ్గన తిక్కనగారి దారిలో, ఎర్రయగారి పద్ధతిలో సంచరిస్తాడు. భర్త అడవిలో విడిచిపెట్టించినప్పుడు సీతమ్మ ఎలా భావించిందని తిక్కనగారు వ్రాశారో ఆ పోలికలున్న పద్యాలను తండ్రి వెళ్ళగొడితే అడవుల పాలైన చంద్రవతి భావాలుగా వ్రాశాడు. చూడండి:

ఎవ్వరే నిక్కాన కేల వచ్చితి వన్న నేమని యుత్తరం బిచ్చుదాన
నేరీతి విఫల సంసారంబు నపకీర్తి ముంచుచు వెడలంగ బోవుదాన?
నిర్మానుషంబైన నిబిడ దుర్గముల నెవ్వారలు దిక్కని చేరుదాన
దిగ్భ్రాంతి చేయు నీ దీర్ఘాటవులలోన నేత్రోవ నెయ్యెడ కేగుదాన?
భాగ్యహీనత కేమని వనగుదాన - జెనటి బాముస కేమని వనరు దాన
మాయగర్భంబు గలిగించి మన్నె గొన్న, దుష్టదైవంబు నేమని దూరుదాన?

(నాసికేతోపాఖ్యానం, 1-207)

ఈ పద్యానికీ, నిర్వచనోత్తర రామాయణం (9-35) లోని సీతమ్మ భావాలకూ పోలికలున్నాయి చూడండి.

5. 'పఱచు' అనే మాటకు 'దుష్టుడు, దుష్టురాలు, చెడ్డది, వ్యభిచారిణి, కులట' అనే అర్థాలు సూర్యరాయాంధ్ర నిఘంటువులో ఇచ్చారు. దుగ్గన్న ప్రయోగంవల్ల అన్నెం పున్నెం ఎరుగని వాళ్ళను కూడా పఱచులు అనవచ్చు అని తెలుస్తోంది. పెళ్ళికాకుండా రాచబిడ్డ నెల మసలిందని చెప్పడానికి వచ్చిన చెలులు కులటలు కారుకదా. అయితే ఒక సంగతి గుర్తుపెట్టుకోవాలి. నాటికీ నేటికీ ప్యూడలు అంతఃపురాలలో ఆడపాపలు దాసీలుగా ఉండడం రివాజు. వీరికి వివాహ నియమాలు ఉండవు. వావి వరుసలు పాటించక ప్యూడలు పురుషపుంగవులకు వీళ్ళు భోగినులుగా ఉపయోగపడతారు. అందుకే బహుశా 'పరచు' అనే మాట పడుపుగత్తెకు పర్యాయపదమయింది కాబోలు.

6. సమగ్ర ఆంధ్ర సాహిత్యం, చాళుక్య యుగం.

''మున్నా తెలుంగున నున్నట్టి యే నిప్పు డిమ్మెయివనమున కెట్లు వోదు నిది యేమి యొంటియై నేతెంచి తనిన నెప్పాట నే మరుమాట వలుకనేర్తు నెవ్వరి తోడ నే నేమని యీ దురవస్థ మాటికి జెప్పి వనరుదాన బతియిల్లు వాపిన కతము నన్నడిగిన నేను దప్పేదిగా నేర్పరింతు మునిసతీ జనంబు ముందట గొంకకయె నెవ్విదమున మెలంగి కాల మెట్టిభంగి యిచట్ నిలిచి గడపుదునేనని, యడలి యేడ్చుచున్న యవసరమున.

తిక్కనగారి గ్రంథంలో ఇంకోచోట రాముడు సడికన్న చావు మేలని తలిస్తే, చంద్రవతి 'సడితోటిబ్రతుకదేటికి, విడిచెద ప్రాణములు' అనుకొంది. తాను గర్భవతి. భ్రూణహత్యా పాపమని కిన్నెరకంఠి విముక్తకంఠయై రోదించింది. ''కొందలమంది పెల్లోరలు కొంచగతిన్ మొరవెట్టుచున్న'' ఆమె ఆర్తనాదం తృణబిందుడనే ఋషి విన్నాడు. ఆదుకొని ఆశ్రమానికి చేర్చాడు. అక్కడ ఆమె ప్రసవించింది. రోజూ కుమిలిపోతూ ఇలా రోదించేది.

మాతామహుండును మాతామహియు జేయు - గారాము గైకొనం గానవైతి
యానందమున నెత్తి యర్మిలి ముద్దాడు - మేనమామల మేలుగానవైతి
గరిమ నక్కున జేర్చి శిరసు మూర్కొను తండ్రి - కౌగిట మెలగగా గానవైతి
యుత్సంగమున నుంచి వాత్సల్యమున దాది - గైసేయు మోహంబు గానవైతి
పరిజనంబులు సఖులును ప్రమద మెసగ - బూని యొనరించు ప్రియమును గానవైతి
చుట్టములకెల్ల వెలువడి రట్టుపడిన - నాకు జనియించి యిట్లైతివే కుమార
(నాసికేతోపాఖ్యానం, 1-286)

తన కెందుకిలా ఆబడిచూలు వచ్చిందని ఏడ్చింది. 'నాకెందుకు పుట్టావురా కొడుకా!' అని బాధపడింది. ఇతడెవ్వరి కొడుకని అడిగితే తండ్రి పేరు ఎలా చెప్తానని శోకించింది. తల్లితండ్రుల వియోగం, నీలాపనింద, అరణ్యావాసం అన్నీ కలిసి ఒక్కసారి బాధపెట్టేసరికి పుత్ర వాత్సల్యం విస్మరించి ఆ కొడుకును ఒక పెట్టెలో పెట్టి నీళ్లలో వదిలి పెట్టింది. కర్ణుని వదిలినప్పుడు కుంతి సకల దేవతలనూ కాపుపెట్టింది. ఎఱ్ఱయ అరణ్యపర్వంలో (7-348) చెప్పినట్టే దుగ్గనకూడా 'ఫాల భాగంబునన్ గరకమలంబులు మొగిడిచి భాగీరథికింబ్రణామంబు జేసి'' సకల భూతంబులను సకలలోకపాలకులను సకలదేవతలను ప్రార్థించింది (నాసి. 7-239). ఎటొచ్చీ ఎఱ్ఱయగారు పద్యంలో చెప్పారు; దుగ్గన వచనం వ్రాశాడు.

చంద్రవతి బిడ్డను నీళ్లలో వదిలిపెట్టి ''ఈ కుఱ్ఱాడు తన జననానికి కారణభూతుడైన ఆ మహానుభావుని చేరుగాక'' అనుకొంది. కుఱ్ఱవాడున్న పెట్టెను గంగ చంకను పెట్టుకు కొనిపోయినట్టు అది కదలాడింది. వెళ్లి తండ్రిని చేరుకుంది. అద్దంతో తన నీడలో కనబడే కుమారుణ్ణి తండ్రి తీసుకున్నాడు. సంతోషించాడు.

అనఘుండీ పసిబిడ్డడు - మునుకొని నాకిప్పుడింత ముద మొదవించెన్
దనుగన్న తల్లిదండ్రుల - కొనరగ వీడెట్టి మోహ మొనరించునొకో!
(నాసికేతోపాఖ్యానం, 1-243)

అని భావించాడు. ఆబిడ్డను పెంచడం మొదలుపెట్టాడు. అతనికి కుఱ్ఱవానిని సాకడమే లోకమైంది. తన కుమారుడని తెలియకుండా తండ్రి అలా పెంచుతుంటే తల్లి రమారమి ఉన్మత్త అయింది. ''తల్లిదండ్రులకు కానిదాననైతి, దోడ బుట్టువులకు దూరమైతి, సుతుని కన్నులనైన చూచుచుండకతని పేరేటి వరుత పోనాడికొంటి'' అని విలపించి బిడ్డను వెతుక్కొంటూ బయలుదేరింది. చివరకు ఒకచోట కనబడ్డాడు. ఆమె అతివేగంగా

చిక్కక గౌగలించు తన చెక్కుల బాలకుచెక్కు జేర్చునిం
పెక్క శిరంబు మూరుకొని యేడ్చుచు నచ్చెరువందు నాత్మలో
మక్కువతోడ మైనిమురు మాటికి మాటికి మోము జూచుచున్
గ్రక్కున గ్రుచ్చి యెత్తుకొను గామిని చన్నులు చేపుచుండగన్.

తరువాత కొడుకుతో ఇలా అంది:

అక్కటికంబు మాని నిను సమ్మెయి బారగవైచి చన్న నా
కక్కట కన్నతల్లి యని యర్మిలి సేసెద వన్న! భూమిలో
నెక్కడ నాడు బుట్టువుల కేకరినట్టులు దైవ మిట్లు నిన్
రక్క సినైన నా కడుపునన్ గలిగించెనె పాపజాతియై! (నాసికేతోపాఖ్యానం, 2-14)

అని తన్ను తాను నిందించుకొని ''కడుపున పుట్టిన బిడ్డలను ఏట్లో కలపడానికి ఏ పడతులకైనా, నిర్దయాత్ములకైనా చెల్లుతుందా. నాకు చెల్లిందికాక!'' అనుకొంది. తరవాత, నిన్నెవరు ఆదుకొన్నారు? ఎవరు పెంచుతున్నారు? అని అడిగింది. కుఱ్ఱవాడు బదులు చెప్పాడు. ఆ పిమ్మట ఆమె ఇలా అడిగింది:

తనయ! నీ వాకొన్న తరి యెరింగి మునీంద్రు
డెపుడు నీ కాహార మేమి పెట్టు?
నే పదార్థము లిచ్చు? నేమని మాట్లాడు?
మౌని ని న్నేరీతి మరపికొనియె?

నాతోడి ప్రేముడి నను దలంపవు కదా
మతిలేక మరిచిపోయితి వె నన్ను?
దగనాసికేతాభిధానుండ వీవని
ఋషివరుం డే వెంట నెరిగె నిన్ను?

అత్తపస్వికి బంధులు నాప్తజనులు
తల్లిదండ్రులు గురులు సోదరులు కలరె?
యతని యాకృతి యేరీతి, యతని మేని
వర్ణ మే ఛాయ, యాత డే వయసువాడు? (నాసికేతోపాఖ్యానం, 2-23)

కుఱ్ఱాడు అడిగిన ప్రశ్నలన్నిటికీ జవాబు చెప్పలేకపోయాడు. ఆమె వాసకసజ్జికలాగ మునిరాకకోసం ఎదురు చూసింది. ఆశ్రమాన్ని అలంకరించింది. ముని వచ్చి కుఱ్ఱాడిని

చూశాడు. ఈ అలంకారాలు కుర్రవాడికి చేతకావు. మరి ఎవరు చేశారు? ప్రశ్నించాడు. కొడుకు చెప్పాడు. ముని ఆమెను ఎదుటికి తీసుకు రమ్మన్నాడు. అప్పుడామె మనసులో ఇలా అనుకొన్నదట.

అవ్వరమౌని నన్ను గని యాదరణంబున గారవించి నీ
వెవ్వరిదాన వే యనిన నేమనుదాన? 'సహాయహీనవై
యివ్వనభూమి గ్రమ్మరగ నే'మనిన న్మరి (యేమి) యుత్తరం
బెవ్వరు బుద్ధి చెప్పగల రిత్తరి బోదునొ పోకయుందునో

(నాసికేతోపాఖ్యానం, 2-43)

ఎలాగైతేనేం, వెళ్ళి ఎదుట పడింది. ఒకరినొకరు చూసుకున్నారు. మన్మథ వికారాలు కలిగాయి. 'అలనాడు రాత్రి కలలో కనపడ్డదీ పిన్నది కాదె' అని అతడనుకొన్నాడు. ఒకరి సంగతులు ఒకరికి చెప్పుకున్నారు. చివరకతడు తన తమకం తేటపడగా చెప్పాడు. ఆమెను చెట్టపట్టదలిచాడు. ఆమె

జిలిబిలిపోవు చేతలకు సిగ్గులు నిగ్గులు వన్నెవెట్టవే
నలి యర వీడుచుండ జరణంబులు దొట్రిల గ్రాలుగన్నులం
దొలకెడు మందహాసములు తొంగలి రెప్పలలోన డాగగా
నలికుల వేణి యోసరిలె నల్లన బయ్యెద సంతరింపుచున్.

ఇట్లు మైదిగిచికొని యత్తెరవ కృతాంజలియై యమ్మౌనివరుస కిట్లనియె.

నీచే పడ్డది సొమ్మిది - వాచంయమ వేగ పడగ వలవదు కృపతో
నాచనువు లీయకొని కా-లో చితధర్మకృతనిశ్చయుడ వగు మనఘా!
ఉపయమతంత్రమ సతులకు - నుపనయనం బంద్రు పెద్ద లోమునివర నీ!
కృప నాకు నట్టిశోభన - ముపలబ్ధముగాగవలదె యుర్వియెరుంగన్?

(నాసికేతోపాఖ్యానం, 114-117)

ముందు పెళ్ళి చేసుకోవాలని షరతు పెట్టింది. ముని అంగీకరించాడు. రాజుకు కబురుపెట్టాడు. బ్రహ్మమానసపుత్రుడు అల్లుడవుతున్నాడని రాజు బ్రహ్మానందం పొందాడు. కుమార్తెకు వచ్చిన అపవాదు తొలగిందని సంతోషించాడు. పెళ్ళి చేశాడు. పెళ్లి ప్రయత్నాలనుంచి అంపకాల దాకా దుగ్గన 65 గద్యపద్యాలలో వర్ణించాడు (2-157 నుంచి 2-221 దాకా). ఇంతకుముందున్న కావ్యాలలోని వర్ణనలలాగే ఉన్నాయిగాని కొత్తదనం లేదు. తన తల్లిదండ్రుల పెళ్ళి జరుగుతున్నప్పుడు ఆ పందిట్లోనే ఉన్న నాసికేతుని చేష్టలు మాత్రం చిరునవ్వు పుట్టిస్తాయి - చూడండి.

పరిణయద్రవ్యసంపాదనపరులైన వృద్ధపురంధ్రులు వేగుదెంచు
తలంబ్రాలుతరి తల్లిదండ్రుల శిరముల దానును శేషాక్షతములు జల్లు

నాశీర్వదించు విప్రాయమరవరుతో దానును గూడి మంత్రములు నొడువు
తరుణీజనులు పెండ్లిధవళంబు వాడంగ నాగానములు దాను ననువదించు
తల్లిబలగంబువారును తండ్రివంక - వారు నుత్సంగతలముల గారవించి
వీడ పెండిలి పెద్దని వేడ్క చూడ - తల్లితండ్రుల కతిమహోత్సవముజేయు
(నాసికేతోపాఖ్యానం, 2-202)

పెళ్లి అయాక బిడ్డతోపాటు వధూవరులు ఆశ్రమానికి వెళ్లారు. కొన్నాళ్లకు తండ్రికి, బిడ్డకు అభిప్రాయ భేదాలు వచ్చాయి. తండ్రి హోమానికి కుమారుడు సమిధలు తీసుకురాలేదు. మునికి కోపం వచ్చింది. 'అన్నింటికంటె ముఖ్యమైన హోమాన్ని మాన్పించావు. నీవు నా కొడుకువా?' అని తిట్టాడు. ఇలా చెప్పాడు:

వినుము బ్రాహ్మణునకు వేదంబు ముఖ్యంబు
వేదములును యాగవిధుల నొడువు
యజ్ఞములకు మూల మగ్ని హోత్రముగాన
యగ్నిహోత్రసేవ యాత్మసేవ. (నాసికేతోపాఖ్యానం, 3-13)

దానికి కుమారుడిలా సమాధానం ఇచ్చాడు:

అగ్నిహోత్రంబు మేలని యానతిచ్చి
తనఘ! యోగంబు మేలందు రాత్మవేదు
లాత్మవిద్యనే ధారసమాస్వదించు
మనసు సే(?) [illegible]రకర్మముల్ మరగు నెట్లు?

ఎన్నిక్రతు[illegible]లు సేసిన నేమిఫలము?
మగుడ[illegible] సు కృతంబు తెగిన యపుడు
యపునరా వృత్తికిని మూల మాత్మవిద్య
యాత్మవిద్యా విదూషణ మఘముజేయు (నాసికేతోపాఖ్యానం, 3-15, 16)

దానితో తీవ్రరోషుడై తండ్రి కుమారుణ్ణి యమలోకానికి పొమ్మని శాపం ఇచ్చాడు. నాసికేతుడు యముణ్ణి చూసి, అతణ్ణి మెప్పించి తిరిగి వచ్చాడు. పరలోక విశేషాలు అడిగినవారందరికీ సవిస్తరంగా చెప్పాడు. 3వ ఆశ్వాసంలో 58వ పద్యంనుంచి ఆ కథనం మొదలవుతుంది. 187 పద్యందాకా గ్రంథం దొరికింది. ఆ తరవాత ఎంత ఉన్నదీ తెలియదు. ఉన్న గ్రంథంలో కూడా శిథిలాలు ఎక్కువ. అయితే శ్రీనాథుని ప్రియశిష్యుని కావ్యం కొంతవరకైనా నిర్దుష్టమైనది దొరికిందనీ, కథాభాగమున్నది శిథిలమవలేదనీ సంతోషించాలి.

నాసికేతుని కథ భారతీయ తత్త్వశాస్త్ర చరిత్రలో ఒక సంధి యుగానికి సంబంధించినది. వేదాలు అనుశాసించే యాగకర్మలకన్నా వేదాంతం ప్రచారం చేసిన యోగాచారం గొప్పదని ఆత్మవిద్య తెలుసుకోవాలని చెప్తుంది. ఉత్తరోత్తరా వేమనగారు

''చావు తెలియలేని చదువేమి చదువయా?'' అని తెలుసుకొనడానికి ప్రయత్నించాడు. శిథిలమైన గ్రంథభాగంలో దుగ్గన దీని గురించి ఏమి చెప్పాడో?

దుగ్గన శ్రీనాథుని శిష్యుడైనా చాలా విషయాలలో బావగారి పద్ధతులను ఒంట బట్టించుకోలేదు. కృతిపతి వంశచరిత్ర రాస్తున్నప్పుడు శ్రీనాథుడెన్నో చారిత్రక విషయాలు చెప్తాడు. వాస్తవానికి రెడ్డిరాజుల చరిత్రను సమన్వయం చేయడానికి శ్రీనాథుని రచనలు ఎంతో తోడ్పడుతాయి. దుగ్గన నాసికేతోపాఖ్యానంలో చెందలూరి మంత్రుల వంశాన్ని 53 గద్య పద్యాలలో (1-22 నుంచి 1-75 దాకా)... వర్ణించాడు గాని ఒక్క చారిత్రక విషయం కూడా చెప్పలేదు. అయితే అనంతరకవులు అనుసరించడానికి అనువైన పద్యాలు కొన్ని అందులో ఉన్నాయి. చూడండి.

రాజు నవీనకాంతి రతిరాజు విలాసమునందు వాహినీ
రాజుగభీరతన్ ఖచరరాజు నిరంతరదానశక్తిరా
రాజు రమాసమృద్ధి నని ప్రస్తుతి సేయగ సర్వలోకసం
పూజితుడైన కొమ్మయ సుపుత్రుడు గంగన మించె నిమ్మహిన్.

(నాసికేతోపాఖ్యానం, 1-48)

ధనపక్షంలో చెప్పిన ఈ పద్యానికి ఋణపక్షంలో అనుకరణ:

రాజుకళంకమూర్తి రతిరాజు శరీరవిహీను డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతరసీమవర్తివి
భ్రాజితపూసపాడ్విజయరామనృపాలుడు రాజుగాక యీ
రాజులు రాజులే పెనుతరాజులుగాక ధరాతలంబునన్? (సూరకవిచాటుధార)

దీనిని అడిదం సూరకవి వ్రాశాడు. ఇతడు దుగ్గన పద్యాన్ని చదివే వుంటాడు. అరుణాస్పదమనే పురాన్ని వర్ణిస్తూ అల్లసాని పెద్దన్నగారు ''అచటి విప్రులు మెచ్చరఖిల విద్యాప్రౌఢి ముదిమదితప్పిన మొదటి వేల్పు'' (మను 1-504) అని యేయే వర్ణాలవారు ఎలా ఉంటారో వర్ణించారు. దుగ్గన తన కృతిపతి వంశంలోని దుగ్గమంత్రి చేసే దానాలకు తృప్తిపడి కవులు కల్పవృక్షాన్నీ, కామధేనువునూ లక్ష్యపెట్టరని వ్రాశాడు, చూడండి.

పొరువున నున్న కల్పకము బ్రోది యొనర్పరు దొడ్డి లోపలన్
దిరిగిన కామధేనువల దేరకొసంగనుగోరు కొంగునన్
బెరసిన దివ్యరత్నము గణించ రనంతయు దుగ్గమంత్రియ
చ్చెరువుగ నిచ్చు నర్థముల జెందిన సత్కవి రాజవర్గముల్

(నాసికేతోపాఖ్యానం, 1-65)

ఈ పద్యాన్ని చదివాకనే పెద్దనగారు అవ్యక్తంగా 'అచటి విలపులు', 'తెలకుల నున్న తంగెటి జున్ను' అనే రెండు పద్యాల రచనకు మనసు సిద్ధం చేసుకొని ఉంటారు.

అనంతర కవులలో ఈ మాత్రం ఛాయలు పడనిచ్చే కవి తక్కువవాడు కాదు. తాను మొట్టమొదట చేపట్టిన ఇతివృత్తాన్నే అర్వాచీనులు స్వీకరించి రచనలు చేయడానికి పూనుకొనేటట్టు స్ఫూర్తినిచ్చిన వాడేమి తక్కువ వాడుకాడు. చందలూరి చిక్కయ్య (క్రీ.శ. 1550కి పూర్వం), శృంగారకవి తిరుమలనాథుడూ (క్రీ.శ. 1740 ప్రాంతాలవాడు), మిక్కిలి మల్లికార్జునుడూ (1805–1875), తోలేటి వెంకట సుబ్బారావు (1887) మొదలైనవారు నాసికేతోపాఖ్యానాలు దుగ్గన ప్రభావం వల్ల కూడా రచించారు.

దగ్గుపల్లి దుగ్గన శ్రీనాథుని బావమరిది కాకపోయినా చదువతగిన కవే.

జక్కన

ఒక్కొక్క దేశానికి ఒక్కొక్క సాహస వీరుడుంటాడు. ఎటువంటి భీకరమైన సన్నివేశంలోనైనా అతడు తొణకడు, బెణకడు. వెనుకంజ వేయడు. అద్భుత కార్యాలను సాధిస్తాడు. సాధించిన సంపదలను గడ్డిపోచలాగ చూడగలడు. అడిగినవాళ్ళకేకాక అడగనివాళ్లకు కూడా దానమిస్తాడు. ఎటువంటి ధర్మసందేహాన్నయినా తీర్చగలడు. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కోగలడు.

ఇటువంటి వీరుడు లేకపోతే జనులు అతణ్ణి సృష్టించుకొంటారు. ఎక్కడ, ఏ దేశంలో, ఏ చెప్పుకోదగ్గది జరిగినట్టు విన్నా ఆ ఘనకార్యాన్ని తమ కథానాయకునికి ఆపాదిస్తారు. ఇటువంటి జనాదరణకు నోచుకున్న వీరులే చిరంజీవులు. మన భారతదేశానికి ఏకైక సాహసవీరుడు విక్రమార్కుడు. అతని గురించి చెప్పుకొనే కథలు అనేకం. విక్రమార్కుని కథలు, భట్టివిక్రమార్కుల కథలు, విక్రమార్కుని సింహాసనంపై ఉండే ముప్పయిరెండు బొమ్మలు చెప్పిన కథలు, భేతాళుణ్ణి తెస్తున్నప్పుడు విక్రమార్కునికి అతడు చెప్పిన ఇరవైఐదు కథలు ఇలా ఎన్నో ఉన్నాయి.

ఆదిమ యుగంలోనే శూద్రకరాజ చరిత్ర అనే పేరుతో విక్రమార్కుని కథ కన్నడ తెలుగు సాహిత్యాల్లో ప్రాచుర్యం పొందాయని ఇంతకు ముందు తెలుసుకొన్నాం. క్రీ.శ. 1400 ప్రాంతాలకే విక్రమార్కుని కథలు అతని పేరుమీదుగానే తెలుగుదేశంలో ప్రచారంలో ఉన్నాయి. వీటిని గ్రంథరూపంలో 'విక్రమార్కచరిత్ర'గా రూపొందించినవాడు జక్కన. ఇతడు పాకనాటివాడు. బహుశా నెల్లూరివాడు. ఇతని తాత పెద్దయామాత్యుడు గొప్ప చిత్రకవి. ఈయన ఎన్నెన్ని విద్యలలో అందెవేసిన చెయ్యో మనం ఇంతకుముందు తెలుసుకున్నాం.[1] ఈ పెద్దయామాత్యుని కుమారుడు అన్నయ్య. ఇతడు చక్కని మాటకారి. ఈయనను జనవినుకరమైన రసప్రసంగసంగీత కవితాఘనతేజులు రాజులు అఖిలరాజ కుంజర సభలలో కొనియాడేవారట. ఏమని?

---

1. సమగ్ర ఆంధ్రసాహిత్యం – కాకతీయయుగం.

అడుగు మయూరరేఖను - గాడంబారండు బాణగతి మన మెరియన్
బ్రోడగు పెద్దయయన్నయ - మాడకు మాడెత్త యతని మాటలు జగతిన్.
(విక్రమ. 1-21)

ఇందులో శ్లేష ఉంది. మయూరుడు, బాణుడు ప్రసిద్ధమైన సంస్కృత కవులు. పెద్దయ్యగారి అన్నయ్య మాటలు మాడకు మాడ ఎత్తట. ఇటువంటి మాటకారి నోట్లోంచి ఇతని కొడుకు జక్కన పుట్టుకొచ్చాడు. వైదుష్యం, కావ్యరచనా చాతుర్యం ఉన్నవాడు, గద్యలో చెప్పుకొన్నట్టు శారదాదయా విధేయడు; అఖిల కవిమిత్రుడు. ఇతని తాత నెల్లూరిరాజుల వద్ద ఉన్నవాడు కనుక వీళ్ళది నెల్లూరే అని చెప్పవచ్చు. జక్కన విక్రమార్క చరిత్రలో ఒకచోట కథలో నెల్లూరును వర్ణించాడు.

శ్రీకవితాసూనచిత్రరేఖాయుక్తి కొమ్మలందును గోటకొమ్మలందు
నవరసపదయుక్తి నానార్థగరిమలు రాజులందును గవిరాజులందు
గవిలోకసంతోషకరజీవనస్థితి సరసులందును గేళిసరసులందు
నవనవ శ్రీసుమనః ప్రవాళవిభూతి మాపులందునునెలమాపులందు
గలిగి సముదగ్రసౌధాగ్రతలసమగ్ర - శాతకుంభమహాకుంభజాతి గుంభి
తోరురత్న వినూత్న శృంగార మగుచు - సిరులనొప్పారువిక్రమసింహపురము.
(విక్రమ. 7-133)

బెల్లంకొండ పెన్న ఒడ్డున ఉండే సిద్ధపట్టణస్థానం. నెల్లూరు మొదలైన పాకనాటి ప్రదేశాలను జక్కయ పేర్కొన్నాడు. క్రీ.శ. 1400 సంవత్సరానికి ఒక పాతికేళ్లు ఇటో అటో ఈ ప్రాంతాలలో వెన్నెలకంటివారి వంశంలోని వ్యక్తులు మంచి రాజకీయోద్యోగాలలో ఉండేవారు. వాళ్లలో సిద్ధన మంత్రి ఒకడు. ఇతని తండ్రి జన్నయ దేవకీనందన శతకం వ్రాశాడని ఇంతకుముందే చెప్పుకున్నాం. ఈ సిద్ధనమంత్రి జక్కనను పిలిపించి ఇలా అన్నాడు: ''పురాణాలు, భారత రామాయణాలు, ప్రబంధ కావ్యాలు, కమనీయ చిత్రాలు, నాటకాలూ సకల దేశభాషా విశేషాలలో వరుసగా ప్రఖ్యాతం, ఉత్పాద్యం, మిశ్రమం అని ఒప్పే సత్కథామేళనలు ఎన్నో చిన్నప్పుడే విన్నాను.''

తలప దదీయమేకతవితానముకంటెను సాహసక్రియా
కలితవదాన్య తాదిగుణ గౌరవరేఖల విక్రమార్కభూ
తలపతి యెక్కుడై నెగడె దచ్చరితంబు బ్రబంధశయ్యగా
దెలుగున జెప్పి యా కృతిపతిత్వము మా కొడగూర్పు నేర్పునన్. (విక్రమ. 1-28)

అంతకుముందే జక్కన 'అపూర్వకథాప్రబంధం' వ్రాయాలనుకొన్నాడు. కృతిపతి కోరినట్టు విక్రమార్క చరిత్రను వ్రాశాడు. ఇది ఎనిమిది ఆశ్వాసాల కావ్యం. ఇందులో 1519 గద్య పద్యాలున్నాయి. జక్కన తన కాలంనాడు విశేష ప్రచారంలో ఉన్న విక్రమార్కుని కథలను ఒకచోట చేర్చి చక్కని కథలా చెప్పాడు. ఇప్పుడు విక్రమార్కుని

కథలు మనకు వచనగ్రంథాలుగా ఎన్నో లభిస్తున్నాయి. కాని మొట్టమొదటిసారిగా తెలుగు భాషలో వెలువడ్డ విక్రమార్కుని కథలేమిటో టూకీగా తెలుసుకొని, తరువాత కావ్యం గురించి చెప్పుకొందాం.

విక్రమార్క చరిత్ర

ప్రథమాశ్వాసం: మధురా నగరాన్ని పాలించే శృంగారశేఖరుడనే రాజు కొలువులో చంద్రగుప్తుడనే బ్రాహ్మణ యువకుడు చేరాడు. అతడు గొప్ప పండితుడేకాక ఎంతో అందగాడు. ఆ రాజ్యపు దండనాథుని చెల్లెలు మదనరేఖ చంద్రగుప్తుని చూసి మోహించింది. తనను పెళ్ళిచేసుకోమని కబురుపెట్టింది. కులం తక్కువ పెళ్ళికి చంద్రగుప్తుడు ఒప్పుకోలేదు. నిరాశవల్ల ఆమె బ్రతికేటట్లు లేదు. దండనాథునికి చెల్లెలంటే ప్రేమ. అతడంటే రాజుకు ఇష్టం. అందుచేత శాస్త్రరీత్యా బ్రాహ్మణుడు నాలుగు కులాల కన్యలనూ క్రమంగా పెళ్ళి చేసుకోవచ్చునని చెప్పి రాజు చంద్రగుప్తునిచేత పెళ్ళికి ఒప్పించాడు. రాజుగారి పురోహితుని కూతురు శీలవతిని, రాజుగారి కూతురు రాగమంజరిని, రాచనిధుల అధికారి ధనగుప్తుడనే వైశ్యుని కూతురు సుమతిని పెళ్ళి చేసుకున్నాక చంద్రగుప్తుడు మదనరేఖను మామగారిచ్చిన రాజ్యంతోబాటు చేపట్టాడు. ఈ నలుగురు ఇల్లాళ్ళలో బ్రాహ్మణ స్త్రీకి వరరుచి, క్షత్రియకాంతకు విక్రమార్కుడు, వైశ్యవనితకు భట్టి, శూద్రభామకు భర్తృహరి అనే కుమారులు జన్మించారు. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక విక్రమార్కునికి పట్టంగట్టి చంద్రగుప్తుడు శ్రీశైల పర్వతం దగ్గర కాలం గడపడానికి వెళ్ళిపోయాడు.

ద్వితీయాశ్వాసం: విక్రమార్కుడు రాజ్యం పాలిస్తూ ఒకసారి వింధ్య పర్వత ప్రాంతాలకు వెళ్లాడు. అక్కడ ఇద్దరు రాక్షసులు కొట్టుకుంటున్నారు. వాళ్ళదగ్గర ఒక కంథ, మంత్ర దండం, పాంకోళ్లు, రత్నపాత్ర ఉన్నాయి. రత్నపాత్ర అడిగితే పంచభక్ష్యపరమాన్నాలు ఇస్తుంది. పాంకోళ్ళు తొడుక్కుంటే ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళవచ్చు. కంథ బోర్లిస్తే కనకరాసులు కురుస్తుంది. ఈ అద్భుత వస్తువుల కోసం రాక్షసులు పోట్లాడుకొంటున్నారు. విక్రమార్కుడు ఆ తగవు తీర్చడానికి వారి మధ్యకు వెళ్ళి పరుగుపందెంలో ఎవరు గెలిస్తే వారిని తీసుకోమని చెప్పి వాళ్లు పరుగెత్తగానే పాపాత్ముల సొమ్ము దఖలు పుచ్చుకొనడం రాజుల ధర్మం కనుక ఆ వస్తువులు తను సంగ్రహించాడు. పాంకోళ్లు తొడుక్కొని మిగతా మూడింటిని పట్టుకొని ఎగిరిపోయి మేరుపర్వతం దక్షిణ దిక్కున దిగేడు. మంత్రదండంతో ఒక పట్టణం నిర్మించి దానికి చంద్రపురం అని పేరుపెట్టి పాలించసాగాడు. కోరినంత ధనమిచ్చే కంథ తన దగ్గరుంది. కనుక అడిగిన వానికి లేదనకుండా, చూస్తే వేయి, మాట్లాడితే పదివేలు, కలిసి భోంచేస్తే లక్ష, మనసుకు నచ్చితే కోటి ధనం అర్థులకు ఇవ్వసాగాడు. పాంకోళ్లు తొడుక్కొని విక్రమార్కుడు ఒకసారి బ్రహ్మలోకం వెళ్ళాడు. బ్రహ్మ ఏం కావాలి అని అడిగాడు. వెంటనే విక్రమార్కుడు కత్తితో నుదురు చీల్చి ''ఈ నొసట ఇంతకన్నా మంచి వ్రాతలు కొన్ని వ్రాయి'' అని అడిగాడు. బ్రహ్మ ఆ సాహసానికి మెచ్చుకొని దీవించి బ్రహ్మాస్త్రం కూడా ఇచ్చాడు.

తర్వాత విక్రమార్కుడు మరో అద్భుతమైన సాహసం చేశాడు. ఉజ్జయినిలో కాళికాదేవి ఆలయం వద్ద అగాధమైన కొలని గట్టున మర్రిచెట్టుకు ఒక ఉట్టి ఉంది. దానిలో ఎక్కి ఆ తాళ్ళు కోసి క్రింద నున్న శూలంపైన పడ్డవానికి సామ్రాజ్య పదవి లభిస్తుంది. ఎవరా ఉట్టి కోయబోయినా, ఒకటి కోసి రెండవది కోస్తుంటే మొదటిది మొలుస్తుంది. ఈ ఉట్టి మొదలంటా ఒకేసారి కోస్తే మంచిదని భట్టి చాలా గట్టి ఉపాయం చెప్పాడు. విక్రమార్కుడు అలాగే చేసి కాళిని మెప్పించి ఉజ్జయిని రాజధానిగా సామ్రాజ్య పదవినేకాక వేయి సంవత్సరాల పాలన చేసే చిరాయువును కూడా నోచుకున్నాడు. ఏడాదికి ఆర్నెల్లే పాలిస్తే రెండువేల సంవత్సరాలు సామ్రాజ్యాన్ని ఏలవచ్చుననే ఉపాయంతో భట్టి దీనిని రెట్టించాడు. విక్రమార్కుడు మిగతా ఆర్నెల్లూ దేశసంచారం చేశాడు.

ఒకసారి విక్రమార్కుణ్ణి దేవేంద్రుడు స్వయంగా పిలిపించి నాట్యంలో రంభా ఊర్వశులిద్దరిలో ఎవరు అందె వేసిన చెయ్యో చెప్పమన్నాడు. విక్రమార్కుడు పోటీ చూసి న్యాయనిర్ణయం చేశాడు. అందుకు మెచ్చుకొని ముప్పైరెండు బొమ్మలున్న సింహాసనాన్ని ఇంద్రుడు ఇచ్చాడు. దీనిమీద కొలువుండి విక్రమార్కుడు దేశాన్ని పాలించాడు. ఎవరెక్కడ ఏ వింత ఉన్నదని చెప్తే అది కళ్ళారా చూసి సాహసాలు చేసి సాధించిన అపూర్వ వస్తువులు, అమూల్య సంపదలు అక్కడక్కడే ఎవరు ఎదురు పడితే వాళ్ళకు దానం చేసి పేరు పొందాడు.

ఒక బంగారు కమలం సూర్యోదయంతో పైకిలేస్తూ మధ్యాహ్నం సూర్యుణ్ణి కలుసుకొని అతడు అస్తమించేటప్పుడు నేలకు వాలుతుంది. విక్రమార్కుడు ఈ వింత సంగతి విని కమలనాళంలోంచి ప్రవేశించి పువ్వులో బ్రహ్మలాగ కుదురుకొని సూర్యుణ్ణి కలుసుకొని అతడిచ్చిన మణి తీసుకొని సాయంత్రం పువ్వుతోపాటు నేలకు దిగాడు. అనుదినం రెండుబారువుల బంగారం ఇచ్చే ఆ మణిని ఒక పేద బ్రాహ్మణునికి విక్రమార్కుడు దానం చేశాడు. పాతాళానికి వెళ్ళి బలిచక్రవర్తిని కలుసుకొని అతడిచ్చిన రత్నద్వయాన్ని, బయటికొస్తూనే ఒక ముసలి బ్రాహ్మణునికి ఇచ్చాడు.

ఉజ్జయినిలో ఒక వైశ్యకుమారుడు తీర్థయాత్రలకు వెళ్ళి వచ్చి, మధురాపురం పరిసరాలలో ఉన్న బిల్వవాటికలో ప్రతిరాత్రీ ఒక ఆడది ఆర్తనాదం చేస్తుందని విక్రమార్కునితో చెప్పాడు. ఆ ఆడదాన్ని కొందరు రాక్షసులు బాధపెడుతూ ఉంటారు. విక్రమార్కుడు వాళ్ళను నిర్జించాడు. దాంతో ఆ కామినికి శాపవిమోచనమైంది. ఆమె ఒక దేవకాంత. ఇంద్రుని ఆజ్ఞ చొప్పున ఒక ముని తపస్సును భంగం చేయటానికి వెళ్ళి ఇలా శాపం పొందింది. విమోచనం కాగానే ఆమె విక్రమార్కునికి ఒక రత్నాన్ని సమర్పించింది. దానిని అతడు ఆ వైశ్యకుమారునికి అక్కడే ఇచ్చేశాడు.

తృతీయాశ్వాసం : విక్రమార్కుని తమ్ముడు భర్తృహరి భార్యాసమేతుడై రాజధానికి వచ్చాడు. అతనికి ఒక బ్రాహ్మణుడు తాను తపస్సు చేసి సంపాదించిన ఫలాన్ని ఇచ్చాడు.

భర్తృహరి దానిని తన భార్యకు ఇచ్చాడు. ఆమె తన ప్రియుడు గుర్రపువాడికి ఇచ్చింది. అది అలా అలా చేతులు మారి పేడ పోగుచేసుకునే దానికి దొరికింది. అది ఒక సాయంత్రం ఆ పండు పిడకలబుట్టమీద పెట్టుకొని పోతూ ఉంటే భర్తృహరి చూశాడు. ఆరాతీసి అంతా తెలుసుకొని 'ఆడవాళ్ళంతా ఇంతే' నన్న వైరాగ్యంతో తపస్సుకు పోతూ మంత్రి చెప్పినట్లు రాజు నడుచుకోవాలి. రాజుకు వచ్చే బ్రహ్మహత్యా పాతకాన్నైనా మంత్రి తప్పించగలడని 'ససేమిరా' కథను సవిస్తరంగా అన్నగారికి చెప్పాడు.

చతుర్థాశ్వాసం: విక్రమార్కుణ్ణి అల్లుణ్ణి చేసుకోవడానికి విదర్భరాజు పూజలు చేసి అనంగవతి అనే ఒక కూతుర్ని కన్నాడు. ఆమె అందానికి ముగ్ధుడై సిద్ధపురం ఏలే శకవల్లభుడు ఆమెను పెళ్ళాడదలిచాడు. విదర్భరాజు ఇవ్వనన్నాడు. శకరాజు దండెత్తాడు. విదర్భరాజుకు సహాయం చేసి అనంగవతిని వివాహం చేసుకొమ్మని నారదుడు వచ్చి విక్రమార్కునికి హితోపదేశం చేశాడు. విక్రమార్కుడు యుద్ధానికి వెళ్లి శకరాజును జయించి విదర్భరాజుకు పట్టంకట్టి అతని కూతుర్ని చేపట్టాడు.

పంచమాశ్వాసం: విక్రమార్కుడు తన భార్య అనంగవతితో వినోదిస్తూ ఆరేసి నెలలు రాజ్యం చేస్తూ సంచరిస్తూ సుఖంగా ఉన్నాడు. ఒక ముని చిత్రకూటంలో ఎన్నాళ్ళనుంచో తపస్సుచేస్తూ వున్నాడని, ఎంతకాలానికీ అతనికి దేవి ప్రత్యక్షం కాలేదని చారులవల్ల విని విక్రమార్కుడు ఆశ్చర్యపోయాడు. తాను ఆ ప్రదేశానికి వెళ్ళి తన మెడ ఉత్తరించుకోబోగా దేవి వచ్చి 'ఏం వరం కావా'లన్నది. అతడు 'ఈ మునికి వరమిస్తే నాకిచ్చినంతగా సంతోషిస్తా' నన్నాడు. ఆమె ఇచ్చింది. ఆ తరువాత విక్రమార్కుడు అశ్వమేధయాగం చేశాడు. బ్రాహ్మణులకు మృష్టాన్నభోజనాలు పెట్టి దానధర్మాలు చేసి రాజ్యామే ధారపోశాడు. కాని వాళ్లు దానిని అతనికే ఇచ్చివేశారు. అతడు 32 బొమ్మల గద్దెపై నుండి పాలిస్తూ వచ్చాడు.

అతడొకనాడు వేటకువెళ్ళి అడవిలో అలసిపోయి సొమ్మసిల్లి పడుకొన్నాడు. అప్పుడొక బ్రాహ్మణుడు అతనిమీద నీళ్లజల్లి సేదదీర్చాడు. ఆ బ్రాహ్మణుణ్ణి తనతో తీసుకుపోయి విక్రమార్కుడతణ్ణి తన పురోహితునిగా చేసుకొన్నాడు. ఒకనాడు ఆ పురోహితుడు రాజుగారి బిడ్డను ముద్దాడుతున్నట్లు తీసుకుపోయి నగలకోసం ఆ కుర్రాణ్ణి చెప్పరానంత చేత చేశాడు. నేరం చేస్తూ దొరికిపోగా రాజోద్యోగులు అతణ్ణి దండించబోయారు. అప్పుడు విక్రమార్కుడు 'అడవిలో ఇతను నాకు ఉపచారాలు చేశాడు. ఇతణ్ణి, ఎంత అపచారం చేసినా మన్నించాల్సిందే' నని చెప్పి విడిపించాడు. 'నిన్ను శోధించడానికే ఇలా చేశాను. నీకొడుకు బాగానే ఉన్నా' డని పురోహితుడు రాకుమారుణ్ణి బయటపెట్టాడు. విక్రమార్కుణ్ణి అందరూ కొనియాడారు.

కంచిలో నవమోహిని అనే వారకాంత ఉంది. ఆమెను చూస్తే అందరూ మరులుకొంటారు. కాని ఆమెతో క్రీడించటానికి వెళ్ళే ప్రతివాడినీ ఒక రాక్షసుడు చంపేస్తుంటాడు. ఈ సంగతిని విక్రమార్కుని పురోహితుని కొడుకు, కాశ్మీర దేశంలో చదువుకొని వస్తున్నప్పుడు తెలుసుకొని రాజుకు చెప్పాడు. వెంటనే విక్రమార్కుడు అతణ్ణి

వెంటబెట్టుకువెళ్లి ఆ రాత్రి ఆ రాక్షసుణ్ణి సంహరించాడు. అందుకామె కృతజ్ఞత చెప్పగా కమలాకరుణ్ణి పెళ్లాడమని విక్రమార్కుడు ఆమెతో చెప్పాడు. అతడు రాజ్యానికి తిరిగివస్తూ అడవిలో పడుకొన్నాడు. పక్షులు మాట్లాడుకొన్న మాటలవల్ల బకాసురుడులాంటి ఒక రాక్షసునివద్దకు ఆ మర్నాడు ఒక పేద బ్రాహ్మణుడు వెళ్లే వంతు వస్తుందని తెలుసుకొన్నాడు. తనే అక్కడికి వెళ్లి రాక్షసునికి ఆహారం కాబోయాడు. ఆ పరోపకారాన్ని రాక్షసుడు మెచ్చుకుని ఇంక నరభక్షణ చెయ్యనని వరం ఇచ్చాడు.

షష్ఠాశ్వాసం: ప్రష్టపురం ఏలే రాజుకు కళావతి అనే కూతురు ఉంది. ఆమె వనంలో ఉన్న ఒక పాముల పుట్టపైన తన చేతులు ఉంచుతుంది. తన చేత్తో చెయ్యి కలిపినవాడిని ఇంటికి తీసుకువెళ్ళి స్నానం చేయించి భోజనం పెడుతుంది. తరువాత వేర్వేరు మంచాలమీద పడుకొని ఉండగా ఆమెచేత ముమ్మారు మాట్లాడించిన వాణ్ణి పెళ్లి చేసుకొంటుంది. ఈ సంగతి విని ఒక సిద్ధుడు వచ్చి విక్రమార్కునికి చెప్పి కొన్ని మంత్రసిద్ధులుపదేశించి వెళ్ళిపోయాడు. విక్రమార్కుడు ఆమెను కలుసుకొని మజ్జనభోజనాదులయాక ఆమె తన మంచంమీద ముసుగు పెట్టుకొని పడుకొంది. ఆ గదిలో ఉన్న దీపం సెమ్మెకు ప్రాణం పోసి దానినొక కథ చెప్పమన్నాడు విక్రమార్కుడు. 'అనగనగా ఒక రాకుమారి ఒక యువకుణ్ణి పెళ్ళిచేసుకొని అతని కోసం ఎన్నో త్యాగాలు చేసి అడవులు పట్టింది. అతడు ఊళ్ళో కెళ్లి అన్నం తెస్తానని చెప్పి వెళ్ళాడు. అక్కడొక వారకాంత చెలికత్తె అతణ్ణి చూసి, ఆ వేశ్యతో అతణ్ణి కలిపింది. వేశ్య చెలిమితో అతడు భార్యనే మరిచిపోయాడు. ఆమె భర్తకోసం వెదకి వేసారి నిప్పుల్లో దూకింది. అప్పటికి భార్య జ్ఞప్తికొచ్చి ఇంక నా బ్రతుకెందుకని అతడూ ఆ గుండంలో దూకాడు. తనవల్ల ఆ దంపతుల కెడబాటు కలిగినందుకు వారకాంత కూడా దుమికింది. దీనికంతటికీ తనదే తప్పు అని ఆమె చెలికత్తె కూడా నిప్పుల్లో కురికింది. వీళ్ళలో ఎవరిది నిజమైన సాహసమో చెప్పగలవా అని దీపపు సెమ్మె రాజును అడిగింది. అతడు వారకాంతదే సాహసమన్నాడు. ఇది విన్న కళావతి 'అబ్బే! వారకాంత కొంత అనుభవించింది. దానిది సాహసమే! ఏ సుఖమూ ఎరుగని చెలికత్తెదే నిజమైన సాహసం' అని బదులు చెప్పి యథాప్రకారం ముసుగుపెట్టి పడుకుంది.[2]

సప్తమాశ్వాసం: విక్రమార్కుడు కళావతిచేత రెండోసారి మాట్లాడించడానికి ఆ గదిలో ఉన్న కర్పూరపేటికకు ప్రాణం పోసి కథ చెప్పమన్నాడు. అది ఇలా చెప్పింది. 'అనగనగా రాజశేఖరుడనే ఒక రాకుమారుడు వేటకు వెళ్ళి ఒక యోగిని కలుసుకున్నాడు. ఆమె అతనికొక మాట్లాడే చిలుకనిచ్చింది. దానినతడు ఇంటికి తెచ్చి ఆప్యాయంగా చూసుకుంటున్నాడు. 'నిన్ను కర్పూరమంజరి అనే రాజకుమార్తె పెళ్ళి చేసుకుంటుంది, ఇప్పుడే పెళ్ళిమాటలకు వస్తారు' అని అది రాజశేఖరునితో చెప్పింది. అతడు నమ్మలేదు. అంతలో కర్పూరమంజరి చెలికత్తెలు అక్కడికి వచ్చి తమ రాకుమార్తెకు ఒక గోరువంక దొరికిందని, అది రాజశేఖరుని గురించి చెప్పిన వార్తలు విని కర్పూరమంజరి అతణ్ణి మోహించిందని, అందుకామె తల్లిదండ్రులంగీకరించారని చెప్పారు. ఇద్దరికీ పెళ్లయి అన్యోన్యంగా వున్నారు. రాజశేఖరుని పెంపుడు చిలుకా, కర్పూరమంజరి మచ్చిక

2. ఈ కథను అనంతామాత్యుడు తన భోజరాజీయంలో అనుకరించాడు.

గోరువంకా ఈ అన్యోన్యతను చూశాయి. తామకూడా అలాగుంటే బాగుంటుందని చిలుకరాజు కన్నెగోరతో అన్నాడు. 'మగవాళ్లు పాపాత్ములు, వాళ్ళను నమ్మకూడదు' అని కన్నెగోర అంది. 'ఆడవాళ్లే ఎంతకైనా తెగించినవాళ్లు. వాళ్ళను నమ్మకూడదు' అని రాజకీయంగా అంది చిలక. దాంతో మాటామాటా పెరిగి ఆ రెండూ దెబ్బలాడు కుంటుండగా రాజశేఖరుడు, కర్పూరమంజరి చూచి ఏమిటని ప్రశ్నించారు. చిలుకా, గోరింకా తమ తమ వాదాలు చెప్పి చెరో కథా చెప్పాయి. గోరింక నీతి కథ చెప్పింది; చిలక ఒక బూతుకథ చెప్పింది. ఆ రెండు కథలూ వినిపించి, 'ఆడవాళ్లా మగవాళ్ళా, ఎవరు దుష్టులు' అని కర్పూర పేటిక విక్రమార్కుణ్ణి ప్రశ్నించింది. అతడు 'మగవాళ్లే చెడ్డవాళ్లు' అనగా అది విన్న కళావతి దిగ్గున లేచి 'మగవాళ్లు పాపం చెయ్యొచ్చు. కాని అతడు చేస్తున్నాడని ఆడదికూడా తెగిస్తే పతివ్రతాధర్మాలేమైపోతా'యని రెండోసారి మాట్లాడి మళ్ళా ముసుగు పెట్టి పడుకొంది.

అష్టమాశ్వాసం : కళావతిచేత మూడోసారి మాటాడించడానికిగాను విక్రమార్కుడు ఆ గదిలో ఉన్న సువర్ణకలశానికి ప్రాణం పోసి కథ చెప్పమన్నాడు. అది ఇలా చెప్పింది: అనగనగా ఒక రాజుకు పద్మావతి, గుణవతి, లీలావతి అని ముగ్గురు కుమార్తెలున్నారు. అతడు వాళ్ళకు పెళ్ళిళ్లు చేసి ముగ్గుర్నీ మూడు ఊళ్ళలో ఉంచాడు. వారిలో పద్మావతి, అహర్నిశలూ విల్లమ్ములు చేతబట్టి భర్త వెంట తిరుగుతున్నాసరే, భర్తను మోసగించి తన చిత్తమొచ్చినవాడితో వ్యభిచరించగలదు. ఈ సంగతి విన్న విటుడొకడు ఆమె ఇంటికి వెళ్ళి తాను విన్నది నిజమని ప్రత్యక్షంగా తెలుసుకొన్నాడు. అందుకామెకు జోహారు చెయ్యగా 'నా చాతుర్యానికి ఆశ్చర్యపోవడమేమిటి? మా గుణవతి భర్తకళ్ళముందరే పరపురుషుడితో క్రీడించగలదు' అని చెప్పింది. వెంటనే ఆ విటుడు ఆ వూరు వెళ్ళి, ఆ సంగతి కూడా అక్షరాలా నిజమని తెలుసుకున్నాడు. అందుకామెను ప్రస్తుతించబోగా 'మా లీలావతి భర్త పడుకొన్న మంచంమీదనే ప్రియునితో రమించగలదు, నా గొప్పతనమేముంది' అని చెప్పింది. ఆ విటుడు ఆవూరు కూడా వెళ్ళి ఆ విషయంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదని తెలుసుకున్నాడు.

ఈ మూడు 'నిరంకు'శోపాఖ్యానాలూ సవిస్తరంగా చెప్పి ఈ ముగ్గురిలో ఎవరు జాణలో నిర్ణయించమని సువర్ణకలశం విక్రమార్కుణ్ణి కోరింది. అతడు 'పద్మావతి' అన్నాడు. అప్పుడు కళావతి లేచి 'వాళ్ళలో లీలావతి నిజంగా విదగ్ధ కాదా? పద్మావతి అని చెప్పవచ్చా' అని బదులు పలికింది. ఆ విధంగా ఆమె మూడుసారులు మాటాడక తప్పలేదు. తాను పెట్టిన షరతు పూర్తిచేసినందుకు ఆమె విక్రమార్కుణ్ణి వివాహమాడింది.

విక్రమార్కుడు ఆర్నెల్లు దేశాటనం చేశాడోలేదోగాని విక్రమార్కుని చరిత్ర వ్రాసిన జక్కనకుమాత్రం తీర్థయాత్రలంటే చాలా ఇష్టంగా ఉంది. ఈ కావ్యంలో తీర్థయాత్రల ప్రసక్తి, పుణ్యక్షేత్రాల ప్రశంస విరివిగా ఉంది. విక్రమార్కునికి పట్టం గట్టి చంద్రగుప్త మహీసురుడు వానప్రస్థానికి వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిన చోటు శ్రీశైలం. అలా వెళ్ళడానికి ముందు 7 పద్యాలలో (అందులో రెండు సీసాలు) అతడు శ్రీశైలక్షేత్ర మహిమను ఉగ్గడిస్తాడు (1:195-201).

ఉజ్జయినీ నగరంలో పురందరుడనే వైశ్యుడు ఉన్న ఆస్తినంతా దానధర్మాలు చేసి తీర్థయాత్రలకు వెళతాడు. జక్కన అతణ్ణి ఉజ్జయిని నుంచి మధురకు పంపాడు. అక్కడ నుండి కాశీకి మళ్ళించాడు. ఆరు గద్య పద్యాలలో (2:189-194) కాశీవర్ణనం కావించి, శ్రీశైలానికి పంపించాడు. 13 గద్య పద్యాలలో (2:195-207) ఆ పుణ్యక్షేత్ర దర్శనం వర్ణించాడు. 'శ్రీశైలం చూస్తే ముక్తి, కాశీలో మరణిస్తే మోక్షం' అన్న నమ్మకం ఇంతకుముందే ప్రథమాశ్వాసంలోనే వక్కాణించాడు. కాశీలో మరణించేవాళ్లు ఎలా గణనకెక్కేది లెక్కలలో ఇలా చెప్పాడు.

రూపమొక్కటి రెండు రూపులై చెలువొందు
        మూడు మొనల పోటు ముట్టు బట్టు
బాహుచతుష్కంబు బంచాస్యములు బూను
        షణ్ముఖుపై బ్రేమ సలుపుచుండు
సప్తాశ్వచంద్రు లీక్షణములుగా నొప్పు
        నెనిమిది మూర్తుల వినుతికెక్కు
నవనిధీశసఖుం డనంగ గీర్తివహించు
        బదికొంగులైన యంబరముగట్టు
బదునొకండు విధంబుల బ్రణుతికెక్కు
        వెలయ బండ్రెండుగనుపుల విల్లు పట్టు
గర్మపాశలవిత్రవిఖ్యాతి మెరయు
        గాశిలో మేను దొరగిన ఘనయశుండు. (విక్రమార్క.. 2-192)

ఈ అంకెల సంవిధానం చూస్తే కేయూరబాహు చరిత్రలో మంచెన చేసిన ఆశీర్వాదం జ్ఞాపమొస్తుంది. అందులో ఒకటినుంచి అనంతందాకా లెక్కగల దేవతలు తన కృతిపతిని బ్రోచాలని కాంక్షించాడు (కేయూర. 1-2). మంచెన యొక్క కృతిపతిలాగ జక్కన కృతిపతి కూడ గణకుడే. అందుకే ఇలా అంకెలతో సంబంధించే పద్యం అనంతామాత్యుడు భోజరాజును ప్రశంసించిన పద్యం ఈ కోవలోనిదే.

జక్కన శ్రీశైలంలో అన్ని ప్రదేశాలూ స్వయంగా చూసినట్టున్నాడు. పురందరునికి తోడవీరేశ్వర దేవాలయం కూడా చూపెట్టాడు (2-206). అక్కడ నుంచి కొండ దింపించి అహోబిలం చూపించాడు. ఆ తరువాత పురాణసిద్ధంబగు సిద్ధపట్టణస్థానం పంపించి పెన్నలో స్నానం చేయించాడు. బహుశా సిద్ధపట్టణం జక్కన స్వగ్రామమే అయి ఉంటుంది. అక్కడ నుంచి కాళహస్తి, తిరుపతి, కంచి, శ్రీరంగం, కుంభకోణం, రామేశ్వరం, సేతుబంధనం, అనంతశయనం చూపించి హేమకూటానికి విరూపాక్షలింగ దర్శనం కోసం పంపించాడు. జక్కన స్వయంగా ఈ యాత్రలు చేసినట్టుంది. ఈ తీర్థాలలో తాను చేసిన స్తోత్రాలే పురందరుని నోటంట చెప్పించినట్టుంది. విరూపాక్షలింగాన్ని మూడు శ్లోకాలలో నుతించాడు. ఇవి అతడు రచించినవే అయిఉంటాయి.[3]

3. విక్రమార్క చరిత్ర. 2:222-224

హేమకూటంలో ఈ విరూపాక్షలింగదర్శనం చేయించి జక్కన పురందరుణ్ణి పంపించాడు. 'పుట్టి పెరిగిన దేశం బెట్టి జనులకైన జూడ ఫిచ్చగుట నేపట్టున కాలూదక నిజపట్టణమునకు' ఆ వైశ్యుడు వెళ్లాడు (2-220). పురందరుని తీర్థయాత్రలలో 'సర్వలోక లోచన సము త్సేధ సౌధగోపురంబగు కాంచీపురంబు' అని ఒక్క వాక్యంలో చెప్పేశాడు. కాని జక్కనకు ఆ ఊరంటే చాలా ఇష్టం. సప్తమాశ్వాసంలో 7 పద్యాలలో సుదీర్ఘంగా, సవిస్తరంగా వర్ణించాడు. 'కంచి జూడని కన్నులు కన్నులగునె' అని ప్రశ్నించాడు (7-114). 'ద్రవిళబాలా విలాసినీతతుల' సౌందర్యాన్ని శ్రీనాథునిలాగే ఇతడూ తనివితీరా వర్ణించాడు.

జక్కన శ్రీనాథునికి కొంచెం పూర్వుడు. కనుక జక్కనను చూసే శ్రీనాథుడు కొన్ని పద్యాలను వ్రాశాడని కుందూరి ఈశ్వరదత్తుగారు పోలికలు చూపించారు. వాటిని మనం ఒక పట్టికగా వేసి క్రమంగా చూద్దాం.

జక్కన	శ్రీనాథుడు
1. దానంబునకు నిదానంబునకు, ధర్మంబునకు మర్మంబును, విభవంబునకు బ్రభవంబును, విక్రంబునకు ననుక్రమంబును, సౌఖ్యంబునకు ముఖ్యంబునై యొప్పు నప్పురంబునకు నధీశ్వరుండు. (విక్రమార్క చరిత్రము, 1-101)	విభవంబునకుబ్రభవంబును, విలాసంబునకు నివాసంబును, నపవర్గంబునకు సర్గంబును, ధర్మంబునకు మర్మంబును, దానంబునకు నిదానంబును, నానందమునకు మూలకందమును, విద్యకునిషద్యయు, విశ్రామంబునకు ధామంబునునైన పట్టణంబున కధీశ్వరుండు. (భీమఖండము, 1-110)
2. తన కీర్తినర్తకి దశదిశా మండలీ రంగ మధ్యమున నర్తనము సేయ (విక్రమార్క చరిత్రము, 1-102)	తన కీర్తినర్తకి ఘనతర బ్రహ్మాండ భవన భూములగొండ్లి పరిఢవిల్ల (శృంగారనైషధము, 1-9)
3. నారీచిత్తసరోమరాళ నవ నానా గంధ సౌగంధ్య వి స్తారోదారభుజాంతరాళ ప్రతిభా సర్వజ్ఞ సోమాబ్జ వి స్మేరాకారశరన్ని శాకరకరా శ్లేషప్రియంభావుక స్ఫారక్షీరపయోధి లంఘనకళా జంఘాల కీర్తీశ్వరా. (విక్రమార్క చరిత్రము, 4-229)	నారీచిత్తసరోమరాళ నయచాణక్యా విరించాన్వయ క్షీరాంభోధి సుధామయూఖ కవితా సిద్ధాంత సర్వజ్ఞ జం భారాతిద్విపహస్తకాండవిభబాహా ఖడ్గధారాపయో ధారాశాంతవిరోధిభూధవమహో దగ్ర ప్రతాపానలా! (శృంగారనైషధము, 6-144) లాటీచిత్తసరోమరాళకుకురీ లావణ్యా లోలాత్మక

జక్కన	శ్రీనాథుడు
	ర్ణాటీనృత్యకళావిలోకన సమారంభ ప్రియంభావుకా భోటీనేత్రచకోర చంద్రమగధీ పుష్పాస్త్రచోళీకుచా ఘటస్థాపిత మన్మథాంక కుహాళీ గాఢాంక పాళిప్రియా (శృంగార నైషధము, 4-141)
4. కుకురుకురుచేర కేరళ శకమరుకర్ణాటలలాట సౌరాష్ట్ర మహీ పకుమంత్రిజనమనీషా నికషోవలనయకలాప! నిగమా లాపా. (విక్రమార్క చరిత్రము, 6-146)	కుకురుకురుచోళ కేరళ శకమరు కర్ణాటలాట సౌవీరనృప ప్రకరసభాభరణ మహా సుకవిజనానీక వినుతశుభచరితు నకున్ (శృంగారనైషధము, 1-41)
5. వెన్నెలజరియిడ్డ వెండితీగలబోలు యజ్ఞోపవీతంబు లరుత సమర గన్నె చెంగల్వపూవన్నె మించిన నీరు కావిదోవతికట్టు కటిదలిర్ప వెలిదమ్మివిరిమీది యెలదేటిగతి గంగ మట్టిపై వేలిమిబొట్టు దనర నీలికందుకముపై గీలించుముత్యాల విధమున సిగగమ్మ విరులు మెరయ లలితనవయౌవనారంభ కలితమైన మేని మెరుగులు మెరుగుల మెరుగు దెగడ జంద్రధరు కృప బ్రహ్మవర్చసము గన్న మారుడన నొప్పు విప్రకుమారు గాంచె (విక్రమార్క చరిత్రము, 7-143)	సరిగొన్న దెలిపట్టు జన్నిదంబుల తోడ రత్నాలతారహారము ధరించి వలిపనీర్కావి దోవతిపై బదార్వన్నె కళయైన పసిడిమేఖల ఘటించి గంగమట్టియమీద గస్తూరిరసమున బుండ్రకస్ఫురలలాటమున నమర్చి కమలకర్ణిక కుండలముల పార్శ్వములందు లలితంబులగు నొంటులలవరించి యాత్మవంశపరంపరాయాతమైన వైదికాచారమార్గంబు వక్కణించి యారజము రాచరికము నలవరించి నగరివీథుల జరియించు బ్రెగడ సుతుడు. (శివరాత్రిమాహాత్మ్యము, 2-90)
6. ముగురంగూర్చిన ముండదైనమువకున్ మ్రొక్కించు జేజేయనున్. (విక్రమార్క చరిత్రము, 8-80)	ముగురంగూర్చినముండ దైవమునకున్ మోమాట లేదో సుమీ! (భీమఖండము, 3-6)

ఈ పోలికలు కొట్టవచ్చినట్టు స్ఫుటంగా కనబడుతున్నాయి. లాటీచిత్తసరోమరాళ (శృం.నై. 4-141) శ్రీనాథుడు మంచెన పద్యాన్ని కూడా జ్ఞాపకం చేసుకొని చెప్పి ఉంటాడు. ''గౌళీనిర్ఝర రాజనందనుని...'' (కేయూర 1-78) అని మంచెన తన కృతిపతిని

సంబోధించాడు. ఈశ్వరదత్తుగారు ఈ పోలికలు కాక జక్కన రచించిన అయిదుసీసాలను ఉదాహరించి ఇలా వ్రాశారు.

శ్రీనాథుని ఉపచార క్రియాప్రయోగములు జక్కన క్రియాప్రయోగముల ననుసరించుచున్నవి... పై సీసపద్యములలో చరణాంతముల నిరూపింపబడిన ఉపచార క్రియావిచ్ఛిత్తి సహృదయాహ్లాదకరమై చమత్కారా తిశయమును బోషించుచున్నది. ఇట్టి వైచిత్రియే శ్రీనాథుని కొరవడియైనది.[4]

అయితే శ్రీనాథునిదే శిల్పంలో పైచేయి. జక్కన 'వెన్నెల జరి యిడ్డ వెండితీగెలబోలు యజ్ఞోపవీతంబు లరుత సమర' అని కేవలం వర్ణనే చేశాడు. శ్రీనాథుడు యజ్ఞోపవీతాలను, రత్నాల హారాలను కలిపాడు. నీర్కావి ధోవతిపై పసిడిమేఖల కట్టించాడు. గంగమట్టిమీద కస్తూరి బొట్టు పెట్టించాడు. కుండలాల పక్కన ఒంటులు అలంకరింపజేశాడు. వైదికాచారాన్ని, రాజరికాన్ని పక్కపక్కన పెట్టాడు. ఒకడిలోనే రెండు విరుద్ధమైన వాటిని ఇమిడ్చాడు. అదీ కవిత్వం. శ్రీనాథుడే జక్కనను అనుకరించాడా, లేక జక్కనే శ్రీనాథుణ్ణి అనుసరించాడా అన్నది ఒక చిక్కు ప్రశ్నే! విక్రమార్క చరిత్ర రచనాకాలాన్ని చాగంటి శేషయ్యగారు క్రీ.శ. 1375–1404 అని నిర్ణయించారు.[5] దీనికి కారణం ఆ ఇచ్చిన కాలంలో దేవరాయలు యువరాజుగా ఉదయగిరిని పాలించాడు. అతని దగ్గర చామరసు అనే మంత్రి ఉండేవాడు. అతణ్ణి దేవరాయల మంత్రిగా జక్కన విక్రమార్క చరిత్రలో పేర్కొన్నాడు. దేవరాయలు క్రీ.శ. 1406లో మహారాజు అయ్యాడు. అతని కొడుకు రామచంద్రరాయలు యువరాజుగా అప్పటినుంచి ఉదయగిరి ఏలాడు. అతని దగ్గర చామరసు ఉన్నాడు. అయితే జక్కన తన కావ్యంలో రామచంద్రరాయల్ని పేర్కొనలేదు. కనుక జక్కన విక్రమార్క చరిత్రను 1375–1404 మధ్య ఎప్పుడేనా వ్రాసి ఉంటాడు అని శేషయ్యగారు చెప్పారు. జక్కన 1404లోనో, 1405లోనో వ్రాస్తే అతడు శ్రీనాథునికి సమకాలికు డవుతాడు.

జక్కన విక్రమార్క చరిత్రలో దేవరాయల గురించి, చామరసు గురించి చెప్పినది కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే దేవరాయలు రాజుగా ఉన్నప్పుడే, అంటే 1406 తరువాతనే విక్రమార్క చరిత్ర రచన జరిగి ఉంటుంది అని తెలుస్తుంది. ఈ కావ్యంలో దేవరాయల్ని 'మహారాయలు' అని జక్కన పేర్కొన్నాడు (1-44). 'కర్ణాటమహామహేశ్వరు'డన్నాడు (3-137). చామరసు చామరచ్ఛత్ర శిబికాది భాగ్యచిహ్నాలను జన్నయ సిద్ధమంత్రికి ఇచ్చాడు. యువరాజుగారి మంత్రిగా కన్నా రాజుగారి మంత్రిగానే అవి ఇవ్వడానికి ఆస్కారముంటుంది. ఆ రోజుల్లో గొడుగు ఇవ్వడం అంటే ఎంత గొప్పో గౌరన వ్రాసిన హరిశ్చంద్ర చూస్తే తెలుస్తుంది. మాలెతలను రాజు 'మీకు ఏమికావా'లని అడిగాడు. వాళ్ళు అడిగినదేమిటో, హరిశ్చంద్రుడన్నదేమిటో చూడండి.

---

4. శ్రీనాథుని కవిత్వతత్త్వము, పుటలు 45–47.
5. ఆంధ్రకవితరంగిణి, 4వ సంపుటం, పుట 287

'గొడుగిచ్చి రక్షింపు కువలయాధీశ!
యుచితసవాలక్ష లొండొల్ల మేము;
పచరణ గాదు, మీ పాదంబు లాన,'
యని పల్క, మనసు దిగ్గని విర్గి రోసి
మనుజేశు డా మాల మగువల కనియె:
'మును సిరివచ్చిన మోకాలి నొగ్గ
ననువున నా త్యాగ మందక మీరు
పొందెరుంగక వేడబోలునే? పొసగ
దందని ఫలముల కర్రులు సాప
నొనర మహారాజయోగ్యంబులైన
వినుతవస్తువు లేడ? విద్యవా రేడ?
లేరొ విద్యలవారు? లేరొ భూనాథు?
లీరీతి వేడిరో? యిచ్చిరో తొల్లి?
గోరెడివారికి గొరత లెందుండు?
నీరాని వస్తువు లీరాదు...? (హరిశ్చంద్ర. పూర్వ. 998-1012)

మహారాజయోగ్యములైన గొడుగులు మహారాజుగారి మంత్రి మాత్రమే ఇవ్వగలుగుతాడు. అందుచేత దేవరాయల పరిపాలనా కాలమైన క్రీ.శ. 1406-1422 మధ్య ఎప్పుడేనా విక్రమార్క చరిత్ర రచన జరిగి ఉండవచ్చు. దేవరాయల కొడుకు వేయించిన శాసనంలో చెప్పిన చామరసు మంత్రి చామరసు కాడు. 'కప్రతిదేవనిచామవొడయలు' ఈ శాసనకాలం క్రీ.శ. 1406. ''ఇతడు దోనికొండగ్రామం ఏలుతూ ఉండేవాడు. ఉదయగిరిలో ఉన్న మంత్రిని ఈ శాసనం చెప్పదు.[6] అందుచేత ఈ శాసనంలోని చామరసును నమ్ముకొని జక్కన కావ్యరచనా కాలాన్ని నిర్ణయించలేం. శ్రీనాథునే జక్కన అనుసరించి ఉండవచ్చు. అయితే శ్రీనాథుని చివరి రచనలలో జక్కన పద్యాల పోలికలు ఉన్నాయి. వాటి మాట ఏమిటి అనే ప్రశ్న వస్తుంది. దానికి సమాధానం చెప్పవచ్చు.

శివరాత్రి మాహాత్మ్యంలోని నగరివీథుల జరియించు ప్రెగడసుతుడు (2-90) అనే పద్యానికీ, జక్కన చెప్పిన 'మారుడననొప్పు విప్రకుమారుడు' (7-143) అనే పద్యానికి వస్తుసామాగ్రిలో తప్ప పోలికలు లేవేమో అనిపిస్తున్నాయి. శివరాత్రి మాహాత్మ్యాన్ని శ్రీనాథుడు తన అవసానకాలంలో వ్రాశాడు. ఈ పద్యాన్ని వ్రాస్తున్నప్పుడు జక్కన పద్యంకన్నా తన కాలపునాటి మంత్రి కుమారులే కళ్ళముందు కనబడి ఉంటారు. 'ముగురం గూర్చిన ముండ దైవం' అనేది ఆనాడు ప్రచారంలో ఉన్నది కావచ్చు. విక్రమార్క చరిత్ర, భీమఖండాలలోని వచనాలు బహుశా ఒకటే సంస్కృత మూలానికి అనువాదమేమో, పోతే

6. నెల్లూరు శాసన సంపుటం, 1వ భాగం, పుట 310

నైషధంలోని పద్యాలకు, విక్రమార్క చరిత్రలోని పద్యాలకు పోలికలుండడం, శ్రీనాథునే జక్కన అనుకరించాడేమో అనే వాదానికి ఆస్కారం లేకపోలేదు.

జక్కన ఎర్రయ్యగారి కాలంవాడని కూడా కొందరు భావిస్తారు. ఏమంటే ఇతడు ఎర్రయ్యగారిని స్తుతిస్తూ ఆయన అరణ్యపర్వశేషం, నరసింహపురాణం, రామాయణం వ్రాసినట్టు చెప్పాడేగాని హరివంశం వ్రాసినట్టు చెప్పలేదు. అందుచేత జక్కన విక్రమార్క చరిత్ర రచించేనాటికి హరివంశ రచన జరగలేదంటారు.[7] జక్కన ఎర్రయగారిని గురించి చెప్పిన పద్యం ఇది.

ఈత్రయి దా బ్రబంధపరమేశ్వరుడై విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వమున శేషము శ్రీనరసింహరామచా
రిత్రములున్ బుధవ్రజగరిష్ఠత నెర్రయ శంభుదాసు డా
చిత్రకవిత్వవాగ్విభవజృంభితు గొల్చెద భక్తియుక్తితోన్. (విక్రమ. 1-14)

ఇందులో 'అరణ్యపర్వమున శేషము' అన్నమాటను 'అరణ్య శేషమును శేషము' అని దిద్దడానికి అవకాశమున్నదేమో వ్రాతప్రతులు శోధించాలి. హరివంశం భారతశేషమే కదా. ఈ దిద్దుబాటుకు అవకాశం ఉంటే ఎర్రయగారి నాలుగు రచనలూ జక్కన పేర్కొన్నట్టే అవుతుంది. ఎర్రయగారిని ఈ పద్యంలో జక్కన చిత్రకవిత్వవాగ్విభవ జృంభితుడన్నాడు. అయితే తన ఒరవడిని చెప్పుకున్నాడు.

ప్రతిపద్యము జోద్యముగా - గృతిజెప్పిన నొప్పు గాక కృతి నొకపద్యం
బతీమూఢుడైనజిత్రత - బ్రతిపాదింపడె ఘుణాక్షరన్యాయమునన్?
(విక్రమ. 1-17)

అని తాను కచ్చితంగా చెప్పాడు. ఇతడు తన గురించి కృతిపతి చేత ఇలా అనిపించాడు.

చక్కన నీ వైదుష్యము - చక్కన నీకావ్యరచనచాతుర్యంబుల్
చక్కన నీ వాగ్వైఖరి - చక్కన నీవంశమహిమ జక్కనసుకవీ!
స్వాభావికనవకవితా - ప్రాభవముల నుభయభాష బ్రౌఢిమ జెప్పన్
భూభువనంబునసరిలే - రా భారతి నీవు దక్క నన్నయజక్కా!
(విక్రమ. 1:23-24)

జక్కనది నిజంగా ఒక ప్రక్కనించి స్వాభావిక నవకవిత్వమే, అతని వాగ్వైఖరి చక్కనే. నాచన సోముని తరువాత సరిగ్గా అతికినట్టు సామెతలు వాడడంలో ఇతని కితనే సాటి. తెనుగుతనం ఉట్టిపడే జాతీయాలు మాత్రమే కాక సంస్కృత లోకోక్తులు కూడా బాగా వాడుతాడు. చూడండి.

7. ఆంధ్రకవితరంగిణి, 4వ భాగం, చాగంటి శేషయ్యగారు, పుట 216.

జక్కన సామెతలు - లోకోక్తులు

తెలుగు:

తూచ తప్పకుండ (1-110), పసిడిపళ్లెరమ్మైనన్ జేరుపగచోటు వలెను (1-111), పూసగ్రుచ్చినగతి (1-145), తెడ్డునాకి యుపవాసము మాన్పుకొనంగ నేటికిన్ (1-150), మరువము మొలువగ తొడసె పరిమళ ముదయించినట్లు (1-), సూదిపిరింది త్రాటిక్రియ (2-72; 2-136), గుడి మ్రింగువారికి నంది పిండి వడియము (2-238), నెయ్యివోసిన యగ్గియట్లు (3-64), ముందటు నుయ్యి వెన్క లోతగు గొయ్యి యున్నలాగు (3-81), ఆమూలచూడంబు (1-190; 3-106; 7-39), పులిమీసల నుయ్యాల లూగవచ్చునే (4-59), కాకతాళీయం (4-61), బాపనపోటును కప్పకాటును గలదె? (4-63), హస్తిమశకాంతరం (4-68), తామరపాకున నీటిక్రియ తల్లడము (4-99), కమలదళంబుమీది యుదకంబును బోలె (4-132), సింహము మెడగంటవోలె (4-132), ఏమిటికి ఏనుగునెక్కియు దిడ్డి దూరగన్ (4-149), చుట్టములసురభి (4-191), ఏనుగు పల్లనంబడిన ఏడికకున్ వశమేవహింపగన్ (5-132), తలపూ వాడకయుండగ (6-98), పలికిన పగడంబులు రాలునట్లు (7-4), చెరుకున పండొదవినట్లు (7-20), ఏమిటికి చల్లకు వచ్చి ముంతదావగన్ (7-38), పెన్నిధానంబు గాంచిన పేదవోలె (8-22), మొలపూసలు త్రెవ్విననాటనుండి (8-41).

సంస్కృతం

అహింసా పరమోధర్మయనంగ (1-148), 'ధర్మస్య త్వరితాగతి' యను పురాణవచనము (2-185), 'కామినీ లోకానాం జాతిః ప్రకల్పితా' యనునీతి (3-28), 'కామాంధోఽపి నపశ్యతి', నా మును వినబడిన పలుకు (3-68), 'గుర్వాజ్ఞాం ప్రతిపాల యేత్తనెడి పల్కుల్' (5-133), 'వచస్సు భాషిత పరివ్యక్తం బలమేవహి కేవల' మను పలుకు (5-160) 'పరోపకారార్థమిదం శరీర' మనిన ధర్మమార్గం (5-226), 'సర్వం విష్ణుమయం జగ'త్తనుట (6-65).

ఈ సామెతలను జక్కన ఎంత చక్కగా పద్యాలలో వాడాడో గమనిద్దాం. విక్రమార్కుని తండ్రి చంద్రగుప్తుడనే బ్రాహ్మణుడు. ఈ సంగతిని ఎత్తిపొడుస్తూ పరరాజులు పంపిన దూత ఏమంటున్నాడో వినండి.

పలుకులు వేయునేటి కిక బ్రాహ్మణసూనుడ వీవు నీకు దో
ర్బలమున కేమికారణము బాపనపోటును గప్పకాటునుం
గలదె ధరిత్రి భట్టి మొన గట్టిగ నమ్మకు మోసపోకు నీ
కొలదులె రాచకార్యములు కోమటిబుద్ధుల దీర్పదీరునే? (విక్రమ. 4-63)

ఈ దూతే వీరమరణం ఘనతను ఎలా చాటుకొంటున్నాడో చూడండి:

ఇంచుక సూదివేదన వహించిన మాత్ర నృపాంగనాకుచో
దంచితసౌఖ్యకేళి సతతంబును గంచులి గాంచు నాజిని
ర్వంచన దీవ్రబాణనికరక్షతదేహుల కబ్బవే మరు
చ్చంచలలోచనాఘనకుచస్తబకద్యుతిసంగసౌఖ్యముల్? (విక్రమ. 4-71)

కాస్త సూదిపోట్లు ఓర్చుకొన్నంతమాత్రంచేత రవిక రాచకూతుళ్ళ పాలిండ్ల సౌఖ్యకేళికి నిరంతరం నోచుకుంటున్నది. యుద్ధంలో తీవ్రబాణాలవల్ల క్షతదేహులైతే దేవతాస్త్రీల సంగమసౌఖ్యం లభిస్తుందట.

ఇతని ఒకటి రెండు పద్యాలు చదివినంత మాత్రం చేతనే ఇంత ఆనందం కలిగితే కావ్యమంతా చదివితే ఇంక ఎంత హాయిగా ఉంటుందో అన్నది సహజమైన కుతూహలమే.

జక్కన కవిత్వం నిజానికి చక్కన.

గజపతుల యుగం

శ్రీనాథుడు తన అవసానకాలంలో అనుభవించిన అగచాట్లకు ఎవరు కారణం అని ప్రశ్నిస్తే మన సాహిత్యకారులు గజపతులను చూపిస్తారు. రాజమండ్రిలో కూడా రెడ్డిరాజ్యం పతనమయ్యాక ఆంధ్రదేశాన్ని ఓఢ్రగజపతులు ఆక్రమించుకుని కొంతకాలం పాలించారు. తెలుగు భాష అంటే అభిమానంగాని, ఆసక్తిగాని ఏ కోశానా లేని ప్రభువులూ, వారి క్రింద పనిచేసే ఉద్యోగులూ సర్కారుకు రావలసిన పన్నులు నిర్దాక్షిణ్యంగా వసూలు చేశారు. కట్టవలసినవాడు కవిసార్వభౌముడైనాసరే, నిరక్షరకుక్షి అయినాసరే కచ్చితంగా ఒకే నీతి అమలు జరిపి బాకీపడితే ఒకేవిధంగా శిక్షించారు కాబోలు. 'కవిరాజుకంఠంబు కౌగలించెనుకదా' అనే పద్యంతో శ్రీనాథుడు ఆ రాజులకు శాశ్వతమైన అపకీర్తిని నెలకొల్పాడనీ, ఆంధ్రవాఙ్మయం ఉన్నంతకాలం అది చిరస్థాయిగా ఉండిపోతుందనీ మన సాహితీపరులు తడికళ్ళు తుడుచుకొంటూ భావిస్తారు.


ఒక ప్రముఖ కవి కష్టాలకు లోనయ్యాడని బాధపడుతూ ఆ రాజ్యాన్ని కర్కోటకరాజ్యంగా భావించుకొనడంలో తప్పులేదుగాని గజపతుల వల్ల మొత్తంమీద భారతదేశానికి ఉపకారమే జరిగింది. చరిత్రకారులు ఈ విధంగా భావిస్తున్నారు.

''యావద్భారతమును యవనుల దండయాత్రలకు లోనై హైందవ స్వాతంత్ర్యము అడుగంటనున్న తరుణములో కపిలేశ్వర, పురుషోత్తమ, వీరరుద్రులు తురుష్కుల నెదుర్కొని వారి ధాటి నాపి హిందూధర్మమును, మతమును ఉద్ధరించి వన్నెకెక్కిరి. తమ రాజ్యములో శాంతిభద్రతలను నెలకొల్పి చక్కని పరిపాలనా విధానము నేర్పరచి, ప్రజాహిత కార్యములు చేసి చిరస్మరణీయులైరి. వారి మతాభిమానమును, భక్తి ప్రపత్తులును, కళాసాహిత్య పోషణయు మరపునకు రానివి.[1]

శ్రీనాథునివంటి కవిని బాధించారన్న కోపంతో గజపతుల చరిత్రను అపార్థం చేసుకొనక దానిని సానుభూతితో పరిశీలించడమే మన కర్తవ్యం. వాళ్లూ తెలుగు పండితులకు, కవులకు భూములు, అగ్రహారాలు ఇవ్వకపోలేదు. ఈ సంగతి గ్రంథస్థమైంది. క్రీ.శ. 16వ శతాబ్ది ప్రథమ భాగంలో జీవించిన అజ్జరపు పేరయలింగం అనే కవి 'ఒడయనంబివిలాసం' అనే కావ్యం వ్రాశాడు. అందులో తన పూర్వులకు గజపతులు అగ్రహారం ఇచ్చినట్లు ఇలా చెప్పాడు.[2]

శ్రీరంజిల్ల జెలంగుచున్న గజరాట్సింహాసనాధ్యక్షునిన్
ధారాళంబుగ వేదశాస్త్ర బహువిద్యారూఢి మెప్పించి యా
వీరాగ్రేసరు డియ్యకొండన మహావిఖ్యాతిగా గౌతమీ
తీరక్షోణిని నజ్జరం బసగ దా దెచ్చెన్ మహాగ్రామమున్. (ఆ.క.త. 6-174)

1. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వము, 3వ సంపుటం, పుట 278.
2. ఆంధ్రకవితరంగిణి, సంపుటి 174వ పుటలో చాగంటి శేషయ్యగారు ఉదాహరించారు.


గజపతులనాటి ఆంధ్రదేశం

తొలి రాయల యుగంలో పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు చాలా సుప్రసిద్ధుడైన కవి. ఇతనికి ఇద్దరు కుమారులు. వారిలో రెండవవాడు మల్లేశ్వరుడు. ఈయన కటకం గజపతుల అనుగ్రహం సంపాదించి వారి కొలువులో ఉన్నాడు. మడిమాన్యాలూ, అగ్రహారాలూ అందుకొన్నాడు. 'పెనుమళ్ళ' అనే అగ్రహారాన్ని స్వీకరించాక ఈ పిల్లలమఱ్ఱి వారి ఇంటిపేరు 'పెనుమళ్ళ'గా మారింది. ఈ వంశంలోని వాడినని చెప్పుకొనే పెనుమళ్ళ సోమన అనే కవి తన సీమంతినీ కల్యాణం అనే కావ్యావతారికలో ఇలా చెప్పాడు.

మహనీయ తేజు మల్లేశ్వరుండంత
దన కార్యదక్షతా ఘనత జూచి
మెచ్చి యాకటకేంద్రుడిచ్చిన పెనుమళ్ళ
యన్నగ్రామమునందు నధివసించే
నాటినుండియు తదీయనామంబు చేతన
య్యన్వాయంబు ప్రకాశమందుచుండె (సీమంతినీ 1-51)

ఈ పెనుమళ్ళ సోమన పూసపాటి తమ్మరాజుగారి ఆశ్రితుడు. పూసపాటి వారిలో ఎందరో ప్రసిద్ధులు గజపతుల కొలువులో ఉన్నవారే. పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని రెండో కుమారుడు మల్లేశ్వరునికి పెనుమళ్ళ అగ్రహారాన్ని కటకేంద్రుడిచ్చాడని సీమంతినీ కల్యాణం స్పష్టపరుస్తోంది. దానివల్ల ఇంటి పేరు మారింది. ఈ ఒక్క సందర్భంలోనే కాదు, మరొక వంశం వారి విషయంలో కూడా గజపతుల ఆదరణ వల్ల ఇంటిపేరు మారిన సాక్ష్యాలు ఉన్నాయి. కడపటి రాజుల యుగంలో ఏనుగు లక్ష్మణకవి తమ యింటిపేరు మారిన వైనాన్ని ఇలా తన సుభాషితరత్నావళిలో గ్రంథస్థం చేశాడు.

పరమేష్ఠితుల్య ప్రభావుండు వాధూలు
డను మునీంద్రుం డొప్పు ననఘమూర్తి
యమ్మునినాథు వంశమ్మున క్షీరాంబు
నిధిసుధాకరుడు జన్మించినట్లు
ప్రభవించె శ్రీ పైడిపాటి సింగనమంత్రి
వంశాగ్రగణ్యుడై వరలునతని
మహిత సంతాన క్రమంబున జలపాల
సచివుడొప్పె బలారి సచివసముడు,
గజపతి భర్తచే గజముతోడ
నగ్రహారం బితండు పరిగ్రహించె
నెలమి నేనుఁగు వారన్న యింటిపేరు
గలిగె నతనికి గజలాభకలనవలన. (అవతారిక. 29)

భర్తృహరి సుభాషితాలను అనువదించిన ఏనుగు లక్ష్మణకవి ఆ గ్రంథం అవతారికలో తమ ఇంటిపేరు మార్పుగురించి ఇలా విశదం చేయడమే గాక, తాను రచించిన

జాహ్నవీ మాహాత్మ్యం అనే కావ్యంలో ఇంకో విషయం చెప్పాడు. ఈ కావ్యాన్ని అతడు నండూరి కావురాజుకు అంకితం ఇచ్చాడు. ఈ నండూరి వారి మూలపురుషుడు తిమ్మరాజు గజపతుల కొలువులో చేరాక 'మహాపాత్రుడు' అయ్యాడు. అతడు

గజరాజు నృపదత్త గజరాజు చామర
ధ్వజ భూషణాంబర వ్రజ విరాజు (జాహ్నవి 1-38)

అనంతర కవులు కావ్యాలలో చెప్పిన ఈ పూర్వ విషయాలవల్ల గజపతులు ఎందరో కవుల పూర్వీకులకు ఏనుగులూ, అగ్రహారాలు ఇచ్చాడన్న సంగతి స్పష్టమవుతుంది. ఈ పద్యంలో పేర్కొన్న గజపతి ఎవరో నికరంగా తేల్చి చెప్పలేం. గజపతులలో ముగ్గురే ప్రసిద్ధులయ్యారు. వారి పేర్లూ, రాజ్యకాలాలూ చూడండి:

కపిలేశ్వర గజపతి	...	క్రీ.శ. 1434-1468
పురుషోత్తమ గజపతి	...	క్రీ.శ. 1468-1497
ప్రతాపరుద్ర గజపతి	...	క్రీ.శ. 1497-1538

ఈ ముగ్గురూ వరుసగా తాత, తండ్రి, మనుమలు. కపిలేశ్వరుడు గజపతి రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు గంగ వంశపు రాజులవద్ద మంత్రిగా ఉండేవాడు. తన రాజు రెడ్డి రాజ్యంపై యుద్ధానికి వెళ్ళినప్పుడు ఇతడు సింహాసనాన్ని స్వాధీనం చేసుకున్నాడు. గంగవంశపు రాజులకు కూడా 'గజపతి' అనే బిరుదముండేది. వీరి సైన్యంలో గజబలం ఎక్కువగా ఉండేది. కనుక వీళ్ళకు గజపతులని, గజనివహపతులని, గజఘటాపటులని బిరుదులున్నాయి. కపిలేశ్వరుని తోటే 'గజపతి' అనే మాట రూఢి అయింది. అయితే కపిలేశ్వరుడు పట్టం కట్టుకోడానికి ఒక పదిహేను సంవత్సరాలు ముందుగా క్రీ.శ. 1419-20లోనే లాంగూల గజపతి రాజమహేంద్రవరాన్ని ఆక్రమించుకొని పన్నెండు సంవత్సరాలు పాలించినట్లు స్థానిక చరిత్రలు చెప్తున్నాయి.[3] మధ్యాంధ్రం ఈ గజపతి అధికారంలో ఇంతకాలం ఉన్నా లేకపోయినా కొన్నాళ్ళపాటు ఉండేదని చెప్పవచ్చు.

కపిలేశ్వర గజపతి క్రీ.శ. 1434లో గంగవంశపు భానుదేవుని రాజ్యభ్రష్టుని చేసి సింహాసనాన్ని ఆక్రమించుకొన్నాడు. అతడు మేధావి, శూరుడు, మందీమార్బలం గలవాడు. బంధుమిత్రుల సహాయంతో అధికారాన్ని సురక్షితం చేసుకొన్నాడు. క్రీ.శ. 1435 జూన్ నెల 29వ తేదీనాడు పట్టాభిషేకం చేసుకొన్నాడని చరిత్రకారులు నిర్ణయిస్తున్నారు.[4] పదవీభ్రష్టుడైన భానుదేవుని మళ్ళా సింహాసనమెక్కించడానికి చూసిన శిలావంశీయులైన నందాపురం రాజులనూ, ఒడ్డాది మత్స్యవంశపు రాజులనూ, యలమంచిలి చాళుక్యులనూ జయించి లొంగదీసుకొని రాజ్యాన్ని సుస్థిరం చేసుకొన్నాడు. ఉత్తరాదిని వంగదేశపు

3. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 3వ సంపుటి, పుట 272
4. Subrahmanyam, R. SURYAVAMSIGAJAPATIS OF ORISSA, Andhra University, Waltair, 1957, P. 34.

సుల్తానులను ఓడించాడు. క్రీ.శ. 1443 నాటికి తన రాజ్యాన్ని ఉత్తరాన గంగానది నుండి దక్షిణాన విశాఖ జిల్లాలోని కోరుకొండదాకా విస్తరింప చేసుకొన్నాడు. రాజ్యాన్ని కట్టుదిట్టం చేసుకొన్నాక, మరో అయిదేళ్లలో క్రీ.శ. 1448లో కపిలేశ్వరుడు రాజమండ్రి రెడ్డి రాజ్యాన్ని కమ్మంమెట్టును కైవసం చేసుకున్నాడు. ఈ విజయాలలో అతనికి తన కుమారుడు హంవీరదేవుడూ, పద్మనాయకవీరుడైన గజరావు తిప్పయ చాలా తోడ్పడ్డారు. ఈ తిప్పయ గురించి చాటుపద్యాలున్నాయి.[5]

యవనుల గెల్వడే యంబరాయలు జూడ
నెట్టైన కంభము మెట్టు బైట
పరిపంథియోధుల బరవడె వాడిమై
యుద్ధండవృత్తి కోసూరి యొద్ద
కాటయవేమ భూ కాంతు సైన్యంబెల్ల
గొట్టడె యలగుండు కొలనిక్రేవ
జడమపామాత్యుని సాబిగా గొట్టడె
కొండవీడా పెద్ద కొండగడిని
ప్రబల రణరంగ జయభేరి భాంకృతుండు
రాయచేకోలు గండధరాధి నాథు
రామరఘురామ బలభద్ర రామనిభుడు
దీప్తబలుడైన గజరావు తిప్పఘనుడు.

రాజమండ్రి రాజ్యాన్ని జయించాక ఆ సీమమీద రాజప్రతినిధిగా తన తమ్ముడు పరశురాముని కుమారుడైన రాఘుదేవనరేంద్రుని కపిలేశ్వరుడు నియమించాడు. గోదావరి దాకా రాజ్యం విస్తరించాక కృష్ణానది దాకా విస్తరింప చేయదలిచాడు. క్రీ.శ. 1453 నాటికి కొండవీడు, అద్దంకి, వినుకొండ గజపతుల ఏలుబడిలోనికి వచ్చాయి. గాణదేవుడనే సర్దారును ఈ ప్రాంతాలకు ప్రతినిధిగా పరీక్షగా కపిలేశ్వరుడు నియమించాడు. గజపతులు తమ గవర్నరులను 'పరీక్ష' అనే పేరుతో పిలుస్తారు. దగ్గరి బంధువులకే ఈ పదవులు ఇస్తారు.

కపిలేశ్వరుని సైన్యంలోని పరాక్రమశాలురైన తెలుగువారున్నారు. పూసపాటి తమ్మభూపతి గజపతుల కోసం బెల్లంకొండ, వాడపల్లి, రంగరాజుకొండ సాధించాడు. క్రీ.శ. 1460 నాటికి పూసపాటి తమ్మరాజు గజపతుల కోసం ఉదయగిరిని జయించాడు. ఆ దుర్గానికి అతనినే అధిపతిగా కపిలేశ్వరుడు నియమించాడు. ఆ పూసపాటివారే దానిని పాలించి సాహిత్య పోషణ కూడా చేశారు.[6] గజపతుల సామంతునిగా ఉదయగిరిని ఏలిన

5. Further sources - P. 86
6. చూ. దగ్గుపల్లి దుగ్గన్న నాసికేతోపాఖ్యానం, దూబగుంట నారాయణ పంచతంత్రం.

పూసపాటి బసవరాజు ''రణరంగభైరవ, రసికశిఖామణి'' అనే బిరుదులు పొందాడు. కపిలేశ్వరుని రాజ్యవిస్తరణ కాంక్ష ఈ విజయాలతో తీరలేదు. బహమనీ సుల్తానులను ఓడించడానికి తెలంగాణాలో ప్రవేశించాడు. దేవరకొండ అతనికి సామంత రాజ్యమయింది. బహమనీ సుల్తానులు పరాజయం పొందారు. కపిలేశ్వరుడు 'కలుబరగేశ్వర' అనే బిరుదును క్రీ.శ. 1458లో ధరించాడు. తెలంగాణా గజపతుల రాజ్యంలో ఒక భాగమైంది. ఓరుగల్లు కోటపై ఓఢ్ర పతాకం వెలసింది,

ఈ విజయాలలో కపిలేశ్వరునికి దామెర తిమ్మనాయకుడు తోడ్పడ్డాడు. అతనిపై చాటు పద్యాలున్నాయి.[7]

కటకంబు లోపలి గజవాడ బెజవాడ
యొద్ది బండారిల్లు యోరుగల్లు
తోటకూరంగళ్ళు తొండమారయగుళ్ళు
పెరటి బచ్చలి తోట బెడదకోట
వీరపుంగవులకు వేటలు మాడెలు
మణికి విహారంబు మాహురంబు
గజయూధముల గట్టుగంబాలు గంబాలు
పట్టణంబు గురాలుపల్లె ఢిల్లి
ఇట్టి గజరాజు శౌర్యంబులెన్ని చూడ
కొలది మీటిన దేవర కొండకొండ
నీదు కోర్గంటి సింహంబు నిఖిలబిరుదు
దిశలములు సూపుదామెర తిమ్మభూప.

తెలంగాణా స్వాధీనమయ్యాక గజపతుల సేనలకు, విజయనగరం నరపతుల రాజ్యం కూడా ఓడిపోయింది. క్రీ.శ. 1458 నాటికి హంప, ధారా,* కలుబరుగ ఢిల్లీలను గజగజలాడించినట్టు కపిలేశ్వర ప్రశస్తిలోని శ్లోకాలు చెప్తాయి.[8] కపిలేశ్వరుని బిరుదులలో 'నవకోటి కర్ణాటేశ్వరా' అనే పదం చేరింది. గజపతుల సైన్యాలు కర్నూలు మండలాన్ని జయించాయి. కోయిలకుంట్లలో కపిలేశ్వరుని పుణ్యాం కోసం నరసింహపాత్రుడు జయస్తంభం వేయించాడు. కపిలేశ్వరుడే క్రీ.శ. 1460లో ఒక చంద్రగ్రహణంనాడు శ్రీశైలంలో దానాలు చేశాడు. గజపతుల సేనలు తిరువారూరు, తిరుచునాపల్లి దాకా దక్షిణాపథాన్నంతా జయించాయి. కుమార హంవీరుడే కాక అతని కుమారుడు దక్షిణ కపిలేశ్వర కుమార మహాపాత్రుడు కూడా ఈ విజయాలకు బాధ్యుడు. అందుకే కపిలేశ్వరుడు తన మనుమడు దక్షిణ కపిలేశ్వరుని క్రీ.శ. 1464 జూన్ నెలలో ఈ జయించిన ప్రాంతాలకు 'పరీక్ష'గా నియమించాడు. తమిళ దేశపు కవిలెలలో, శాసనాలలో ఈ

7. Further Sources - Vol. II (Texts) P. 86.
8. కపిలేశ్వరుని తామ్ర శాసనం చూ. THE SURYAVAMSI GAJAPATIS OF ORISSA - P. 44.

గజపతుల తళ్ళును 'ఒడ్డియన్‌గలబై' అని పేర్కొన్నారు. పదేళ్ళపాటు దేశం అల్లాడిపోయింది. ఆలయాలలో అర్చనలు కూడా స్తంభించిపోయాయి. అయితే గజపతుల రాజ్య విస్తరణ ఆగలేదు. కొండపల్లి, అద్దంకి, వినుకొండ, తెలంగాణా, కొండవీడు, ఉదయగిరి, చంద్రగిరి, పడవీడు, పళుదలపట్టు సావిడి, తిరువారూరు, తిరుచిరాపల్లి మొదలైన రాజ్యాలను కైవసం చేసుకొని కపిలేశ్వరుడు ''గజపతి గాడేశ్వ నవకోటికర్ణాట, కలుబరుగేశ్వర'' అనే బిరుదులు ధరించి ఉత్తరాన గంగానది మొదలు, దక్షిణాన కావేరిదాకా ఒక సామ్రాజ్యాన్ని సంస్థాపించి సార్వభౌముడయ్యాడు.

సామ్రాజ్య నిర్మాణం ఒక యెత్తూ, దానిని నిలుపుకొనడం ఇంకొకయెత్తు. కపిలేశ్వరునికి పద్దెనిమిదిమంది కుమారులట. వీరిలో కొందరు సామ్రాజ్య నిర్మాణంలోనూ, పాలనలోనూ తోడ్పడినవాళ్ళే. అయితే వీళ్ళలో ఏ ఒక్కరికీ తన తర్వాత రాజ్యం రాకుండా పురుషోత్తముడనే చిన్నకొడుకునే వారసునిగా ప్రకటించాడు. కుమార హంవీరుడూ, అతని కొడుకు దక్షిణ కపిలేశ్వరుడూ తిరగబడి కృష్ణాతీరంలో తమ అధికారాన్ని నిలుపుకొనచూశారు. కపిలేశ్వరుడు క్రీ.శ. 1468లో స్వయంగా కృష్ణా తీరానికి వచ్చాడు. తిరుగుబాటును అణచాడు. పురుషోత్తమ గజపతికి పట్టంకట్టి తెలుగుదేశంలోనే కృష్ణాతీరంలో కాలం చేశాడు.

తండ్రి యిచ్చిన రాజ్యాన్ని పురుషోత్తమ గజపతి (క్రీ.శ. 1468-1497) అంతఃకలహాలలో నాలుగేళ్ళపాటు నిలుపుకోలేకపోయినా తర్వాత దక్కించుకొన్నాడు. కుమార హంవీరుడూ, దక్షిణ కపిలేశ్వరుడూ సామ్రాజ్యం స్థానంలో కిమిడి సంస్థానంతో సంతృప్తిపడ్డారు. పురుషోత్తముడు 'చక్కగ చదివిన విద్వాంసుడు, కవి' అని చరిత్రకారులు చెప్తారు.[9] ఇతని పాలనలో గజపతుల రాజ్యం తరుగుతూ, చెరుగుతూ మళ్ళా పెరుగుతూ వచ్చింది. ఉదయగిరి రాజ్యం చేతులు మారినా మళ్ళా గజపతులకే దక్కింది. పురుషోత్తముని తర్వాత అతని విశాల రాజ్యానికి అతని కుమారుడు ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1497-1538) రాజయ్యాడు. ఇతని కాలంలోనే కృష్ణదేవరాయలు దండెత్తి జయించేదాకా సుమారు నూరు సంవత్సరాలపాటు యావదాంధ్రపై గజపతుల ప్రభావం గట్టిగా పడింది.

తెలుగుదేశపు చరిత్రలో ఈ గజపతులేకాక అశ్వపతులు, నరపతులు కూడా ప్రసిద్ధులు. అశ్వపతులంటే బహమనీ రాజ్యాన్ని పాలించిన తురుష్క పాలకులు. నరపతులంటే విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన మహారాజులు. క్రీ.శ. పదిహేను, పదహారు శతాబ్దుల చరిత్రలో ఈ మూడు వంశాల రాజకీయ గాథలూ ముప్పేటలుగా అల్లుకొని ఉంటాయి. గజపతులలో చివరివాడైన ప్రతాపరుద్రుని కుమార్తెనే కృష్ణదేవరాయలవారు వివాహం చేసుకొన్నారు. గజపతుల ఇంటి ఆడపడుచును చేపట్టడమేకాక, రాయలవారు గజపతుల ఆస్థానంలోని ప్రముఖ విద్వాంసులను కూడ

9. తెలుగు సంస్కృతి (పునస్సంశోధితం) మొదటి సంపుటం (1983) పుట 364.

ఆదరించి తమతో తీసుకుపోయారు. వాళ్లలో లొల్లలక్ష్మీధరుడు, దివాకరులు ముఖ్యులు. లక్ష్మీధరుడు మహోపాధ్యాయ బిరుదాంకితుడు. ఆదిశంకరుల 'సౌందర్యలహరి'కి వ్యాఖ్యానం వ్రాశాడు. ఇతడు 'సరస్వతీ విలాసం' అనే ధర్మశాస్త్ర గ్రంథాన్ని వ్రాసి గజపతిపేర ప్రకటించాడు. ఈ లక్ష్మీధరుని పూర్వులు ఏడు పురుషాంతరాల దాకా మహాపండితులు. వాళ్ల వంశక్రమమిది.

1. గజపతుల యుగం

1. **మహామహోపాధ్యాయ మహాదేవాచార్యుడు :** ఇతడు లొల్లకుల సంప్రదాయ ప్రవర్తకుడు. భట్టలొల్లటుని నాట్య శాస్త్రానికి వ్యాఖ్యానం, వివరణా వ్రాశాడు. ఈయన ఎఱ్ఱాప్రెగ్గడవారి సమకాలికుడు. ఆయనతోపాటు ప్రోలయవేమారెడ్డిగారి ఆస్థానంలో ఉండేవాడు.

2. **మహాదేవాచార్యుల వారి కుమారుడు లక్ష్మీధరుడు :** ఇతడు 'సాహిత్యపారిజాతం', 'స్మృతికల్పతరువు' అనే గ్రంథాలు వ్రాశాడు.

3. **లక్ష్మీధరుని కుమారుడు విరించి మిశ్రుడు:** ఇతడు 'భరతార్ణవపోతము' 'సాహిత్య మీమాంస' అనే కృతులు రచించాడు.

4. **విరించిమిశ్రుని పుత్రుడు పురుషోత్తమ మహోపాధ్యాయుడు:** 'మీమాంస ద్వయం', 'జీవాతు' అనే గ్రంథాలకు ఇతడు కర్త.

5. **ఈ పురుషోత్తముని పుత్రుడు లక్ష్మణాచార్యుడు:** ఇతడు 'ప్రభాకరామృత వాహిని', 'ప్రభావళీఖండనం' మొదలైన బహుగ్రంథాలు వ్రాశాడట. ''లొల్ల లక్ష్మణార్యుడను మరియొక యాంధ్రుడు సకల సిద్ధాంత విషయములను పరామర్శించి 108 ఉల్లాసములలో 'దైవజ్ఞవిలాస'మను మహాగ్రంథము నిర్మించెను'' అని మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు వ్రాసింది ఇతని గురించే కావచ్చు.[10]

6. **పై లక్ష్మణాచార్యుని తనయుడు విశ్వనాథ భట్టారకుడు:** ఇతనికి 'నూతనవ్యాస', 'మహోపాధ్యాయ', 'విద్వత్సార్వభౌమ' బిరుదులుండేవి. ఇతడు 'నయవివేక దీపిక' రచించాడు.

7. **ఈ విశ్వనాథ భట్టారకుని కుమారుడు లక్ష్మీధరుడు:** ఇతడు సాహిత్య మహీధరుడు. షడ్దర్శనీ పారంగతుడు. గజపతి పేర ప్రకటించిన 'సరస్వతీ విలాసం' కాక 'సాహిత్యలక్ష్మీధరం' మొదలైన మీమాంసా గ్రంథాలు, 'యోగదీపిక' వంటి యోగ గ్రంథాలు, మానవ ధర్మశాస్త్ర టీక 'కర్ణావతంసబర్హావతంసాది అనేక కావ్యాలు కూడ వ్రాశాడు. కెంచెం మల్లయార్యునితో కలిసి దైవజ్ఞవిచారం కూడ ఇతడే వ్రాశాడని ఈయూణ్ణి వెంకట వీరరాఘవాచార్యులుగారు చెప్తున్నారు.[11] మల్లాదివారు పేర్కొన్న దైవజ్ఞ

---

10. సంస్కృత వాఙ్మయ చరిత్ర, రెండవ సంపుటి, పుట 171.
11. తెలుగు భాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, సంపుటి 3, పుట 1048.
లొల్లవారి వంశచరిత్ర ఈయూణ్ణివారి వ్యాసం నుంచి గ్రహించిందే.

విలాసమూ, ఇదీ ఒకటే కాబోలు. అయితే లక్ష్మీధరుడు అనే పేరుకు బదులు లక్ష్మణాచార్యుడని మల్లాదివారు పొరబడ్డారేమో!

లక్ష్మీధరుని తాతముత్తాతల వంటి మహాపండితులు గజపతులవద్ద ఉండేవారు. పురుషోత్తమ గజపతి స్వయంగా కవి. చక్కగా చదువుకొన్న విద్వాంసుడు. అభినవ గీతగోవిందం, ఆగమకల్పతరువు, నామమాలిక, గోపాలార్చనావిధి, హోరావళి, త్రికాండశేషం, పద్యావళి మొదలైన గ్రంథాలు వ్రాశాడట. ఇవన్నీ నేటికీ అచ్చుకాలేదు. ఇతని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి విద్యలలో సాక్షాత్తూ కమలభవుడట. ఇతడు కౌతుకచింతామణి, నిర్ణయసంగ్రహం, ప్రౌఢ ప్రతాపమార్తాండం మొదలైన గ్రంథాలు వ్రాశాడు. ఇతని పేరనున్న 'సరస్వతీ విలాసం' లొల్ల లక్ష్మీధరుడు వ్రాశాడని ఇంతకు ముందు తెలుసుకొన్నాం. ఈ ప్రతాపరుద్రుని సామంతుడుగా రాజమహేంద్రవరాన్ని పాలించిన రామానందరాయలు కూడా సాహితీపరుడే. ఇతడు జగన్నాధ వల్లభ నాటకాన్ని వ్రాశాడు.

రెడ్డిరాజులు, సంగమవంశ రాజులు, పద్మనాయకులూ పోషించినట్లే గజపతులు కూడా సంస్కృత భాషను ఆదరించి, పోషించి అందులో స్వయంగా గ్రంథాలు వ్రాసి వన్నెకెక్కారు. వీరి కాలంలో ఒరియా భాషలో సాహిత్యం మొగ్గతొడిగి వికసించింది. రామాయణ, భారత భాగవతాలు ఆ భాషలో అనువాదం పొందాయి. గజపతుల కాలంలోనే ఓఢ్రభాషలో భాగవతం అనువాదం అయింది. అదేకాలంలో కొంచెం ముందుగా మన తెలుగు భాషలో కూడా భాగవతాన్ని పోతరాజుగారు అనువదించారు. ఈ రెండు భాషలలోనూ భాగవతం ఒకేవిధంగా ప్రజాదరణ పొందడం గమనించతగ్గ విశేషం.

ఒరియా భాషలో భాగవతాన్ని అనువాదం చేసిన జగన్నాధదాసు చైతన్యప్రభువులకు ఆంతరంగిక మిత్రుడు. ఆయన ఈ కవికి 'అతిబడా' అనే బిరుదు ఇచ్చాడు. ఇతని భాగవతం ఒరియా భాషలో అత్యంత ప్రజాదరణ పొందిన గ్రంథం. మన పోతరాజుగారి భాగవతాన్ని ఎలాగైతే గ్రామీణులు కంఠస్థం చేసుకొని రోజూ పారాయణ చేస్తారో అలాగే ఒరిస్సాలోని పల్లెటూళ్లలో 'భాగవతఘర్' అనే ప్రార్థనామందిరాలలో జగన్నాధదాసుగారి భాగవతాన్ని గానం చేస్తారట. పాడుకోడానికి అనువుగా చాలా సులభమైన తొమ్మిది అక్షరాల ఛందస్సులో సరళంగా జగన్నాధదాసు భాగవతాన్ని వ్రాయడంతో అది ప్రజారంజకం అయింది. మన పోతరాజుగారిలాగే జగన్నాధదాసు కూడా భాగవతపురాణంలో ఇతర గ్రంథాలలోని గాథలను జోడించాడట.[12] ఒరిస్సా ప్రదేశంలోని జనుల నైతిక విలువలు పెరగడానికి ఈ కావ్యమే కారణమట. దీనిని చదవాలనే ఆకాంక్షకొద్దీ అక్కడి జనులలో అక్షరాస్యత కూడా వృద్ధి చెందిందట.

సంస్కృత ఓఢ్రభాషలను పోషించిన గజపతులు స్వయంగా ఆంధ్రభాషను ఆదరించకపోయినా వారి సామంతులు మాత్రం తెలుగు కవులకు ఆశ్రయమిచ్చి

12. The Delhi Sultanate (The History and Culture of the Indian People). Bharatiya Vidya Bhavan, P. 521.

ఆదుకొన్నారు. గజపతుల రాజ్యం వివిధ కాలాలలో వివిధ ప్రాంతాలదాకా ఆంధ్రదేశంలో విస్తరిల్లింది. వివిధ దుర్గాలలో రాజప్రతినిధులు ఉండేవారు. వాళ్ల కళాపోషణ ఆయా తెలుగు కవుల చరిత్రలలో చెప్పుకుందాం.

తమ 120 సంవత్సరాల పరిపాలనలో గజపతులు తెలుగు దేశానికిచ్చిన సాంస్కృతిక వారసత్వమేమిటో ఇప్పుడు తెలుసుకొందాం. పోతనగారి మహాభాగవతంతో ఈ గడ్డమీద మధురభక్తి ప్రచారమైనా గజపతుల పరిపాలన దీనిని అధికం చేసింది. సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఏమన్నారో చూడండి. ''కటకము గజపతి వంశజుల పరిపాలన కాలమున బంగాళ దేశమునుండి చైతన్య స్వామి తెలుగుదేశమునకు వచ్చుటతోనే తెలుగు శతక కవితలో మధుర భావములకు ప్రాచుర్యము హెచ్చింది.''[13]

పోతరాజుగారి మహాభాగవతంలో కృష్ణుని ప్రియురాలిగా రాధ ప్రసక్తి లేనేలేదు. కటక గజపతుల సంపర్కంవల్లనే రాధామాధవ శృంగారం తెలుగుదేశంలోకి వచ్చింది. పోతరాజుగారు రాధ గురించి ఏమీ చెప్పకపోయినా వారి సమకాలికుడైన శ్రీనాథుడు ఒక కృతిలో రాధా మాధవుల శృంగారాన్ని ఆంధ్ర సాహిత్యంలో తొలిసారి కీర్తించాడు. [భీమఖండం 1-3].

క్రీ.శ. 1420-25ల మధ్య గజపతుల సంపర్కం తెలుగుదేశానికి ఏర్పడ్డాకనే భీమఖండ రచన జరిగింది. రాధా మాధవుల శృంగారం మనకు గజపతులు ఇచ్చిన వారసత్వమే. భారతీయ శిల్పరీతులలో కళింగరీతి అనేది విలక్షణమైంది. గజపతులు తాము జయించిన ప్రదేశాలలో దేవాలయాలు నిర్మించేవారు. వీరు కట్టించిన గుళ్లు ఉత్తరాన మిథునపురంలో, దక్షిణాన నెల్లూరుదాకా ఉన్నాయి.[14] గజపతుల సంపర్కం వల్లనే పూరీజగన్నాథం కూడా తెలుగువాళ్లకు దర్శింపవలసిన ముఖ్యక్షేత్రమైంది. తిరుపతి మొక్కులు ఎంత ప్రాచీనమో పూరీజగన్నాధునికి కానుకలు కూడా ప్రాచీనమే. కాటమరాజు కథలో యాదవులు అల్లుదాడెన్నతో కటుకం జగన్నాధానికి మూడువందల ఆవులు, మూడు ఆబోతులూ అర్పణంగా పంపిస్తారు. దానికి ముందు కటకం నుంచి వచ్చిన దాసర్లు ప్రసాదం ఇచ్చి అప్పనం సంగతి హెచ్చరిక చేస్తారు.[15] 'కటకము జగన్నాథుకరుణను' ఆవులూ, ఎద్దులూ, యుద్ధం చేస్తాయట.[16] ఈ దేశిరచన గజపతుల సంపర్కం వచ్చాక వ్రాసిందే.

గజపతులు తెలుగువారికి వంశపారంపర్యంగా వస్తున్న హక్కులను సంరక్షిస్తూ వాటికి సముచితస్థానాన్ని ఇవ్వడమే కాక అవి శాశ్వతంగా ఉండేటట్టు శాసనబద్ధం చేయడం కనీసం ఒక విషయంలో స్పష్టంగా కనబడుతుంది. జయదేవుని గీతగోవిందం

13. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు, ఆంధ్రసారస్వతపరిషత్తు, హైదరాబాదు ప్రచురణ, పుట 7.
14. ఉత్కళదేశ చరిత్ర - రాళ్ళబండి సుబ్బారావుగారు, కళింగ సంచిక, పుటలు 663-664.
15. కాటమరాజు కథ - ప్రాచ్యలిఖిత గ్రంథాలయం (మద్రాసు) వారి ప్రచురణ, పుటలు 101-104.
16. అదే పుస్తకంలో, పుట 133.

జగమెరిగిన శృంగార గేయప్రబంధం. దీనిని పూరీ జగన్నాథుని ఆలయంలో నేటికీ గానం చేసి అభినయిస్తారు. ఆదిలో ఈ రసమయ శిఖరాలయిన అష్టపదులను గానం చేసే హక్కు తెలంగాణా నుండి వచ్చి పూరీలో స్థిరపడ్డ నట్టువమేళం ఆటగత్తెలకే ఉండేది. దీనిని ప్రతాపరుద్రగజపతి గుర్తించి మన్నించాడు. అది వారికే కలకాలం చెందాలని ఆజ్ఞాపిస్తూ పూరీ ఆలయంలో ఒక శాసనాన్ని ఒరియా భాషలో, ఒరియాలిపిలో వేయించాడు. దాని సారాంశం చూడండి.[17]

''స్వస్తిశ్రీ చాంద్రమాన కకడ నామవత్సరపు తొమ్మిదో అంశంలో శుక్లదశమీ బుధవారమునాడు శ్రీవీర గజపతి గౌడేశ్వర నవకోటి కర్ణాటక కలుబరుగేశ్వరులయిన వీరశ్రీ ప్రతాప రుద్రదేవ మహారాజుల వారు శాసించిన ఉత్తరువుల క్రమం ఎటువలెననంగా.

పెద్దదేవరబల భద్రాస్వామి వారికిన్ని, గీతగోవింద శ్రీమన్మహాదేవర జగన్నాథ స్వామివారికిన్ని ఆరగింపు భోగాలు సమయములందు యథావిధిగా నాట్యసంసేవలు జరిపింపగలవారలు. సాయంసంధ్యా సమయాల ఆరగింపు భోగాలు ఆరభ్యపవళింపు భోగాల పర్యంతం నాట్యసేవలు శాయంగలవారలు. పెద్దదేవర నట్టువమేళము వారున్నూ, కపిలేశ్వరదేవరవారి ఆటగత్తెలున్నూ, తెలంగాణమునకు చెందినటువంటి ప్రాచీన నట్టువమేళము వారున్నూ పెద్దదేవర వారి అనుగ్రహాన గీతగోవిందము వినా తదితర కీర్తనలు దేర్పరాదు. ఓం వారు తదితర కీర్తనలు పాడరాదు. నట్టువమేళముతో బాటు గీతగోవిందమును మాత్రమే గానము చేసే నలుగురు గాయకులున్నూ స్వామివారిని సేవించుకొనగలవారలు. గీతగోవిందము రానివారు వంతలో పాల్గొనగలవారలు. వారు తదితర సంకీర్తనలు నేర్వరాదు. అన్యగీత నాట్యాదులను తెలసి తెలసి ఆలయాన అనుమతించే పౌరసత్వంవారలు జగన్నాథస్వామి వారికి ద్రోహము చేసినవారలు కాగలవారలు.''[18]

ప్రతాపరుద్రగజపతి ఈ శాసనాన్ని 1499లో వేయించాడు. ఇది జగన్నాథస్వామి వారి ఆలయంలో జయవిజయ ద్వారానికి ఎడమపక్కన ఉంది. తాను పట్టంకట్టుకొన్న రెండేళ్ళలోగా ఈ శాసనాన్ని వేయించడంలో ఏదో బలవత్తర కారణం ఉండే ఉంటుంది. ఆలయంలో గీతగోవిందమే పాడాలి, గీతగోవిందమే ఆడాలి అని ఎందుకు శాసించాడు. జన్మతః పూరీజగన్నాథానికి, జయదేవునికీ సంబంధం ఉంది. కనుక ఆ ఆలయంలో ఆ మధుర ప్రబంధమే గానం చేయాలనడంలో అర్థముంది. అయితే తెలంగాణా నట్టువమేళంవారికే ఈ హక్కును గుర్తించడంలో నిబిడీకృతమైన చారిత్రక కారణాలు

---

17. MANMOHAN CHAKRAVARTI. "ORIYA INSCRIPTIONS OF THE 15th and 16th CENTURIES" Journal of the Asiatic Society of Bengal 62 Pt. I (1894) 88-104.
18. BARBARA STOLER MILLER. (Ed. and Trans) JAYADEVA'S GITAGOVINDA - OXFORD UNIVERSITY PRESS - 1977. ఈ గ్రంథంలో ఉదాహరించిన ఆంగ్లానువాదం ఆధారంగా ఈ తెనిగింపు చేశాను.

ఉన్నట్లు తోచక మానదు. జయదేవుడు గీతగోవింద రచన చేస్తూ దానిని గానం చేస్తున్నప్పుడు పద్మావతి అనే చిన్నది నాట్యం చేసేది. గీతగోవిందం అవతారికలో తాను 'పద్మావతీ చరణ చారణ చక్రవర్తి'నని జయదేవుడే చెప్పుకొన్నాడు. 21వ అష్టపదిలో 'విహిత పద్మావతీసుఖసమాజే భణతి జయదేవ కవిరాజరాజే' అని ఇద్దరి పేర్లూ చేర్చాడు.

పద్మావతి జయదేవుని భార్య అనీ, కులాంగన అని కొందరు భావిస్తే, శృంగార గీతాలను అభినయిస్తూ ఆడేది కులాంగన కావడానికి వీల్లేదని గుడిసాని మాత్రమేనని కొందరు విశ్వసిస్తారు.

పద్మావతి నాట్య విద్యావిశారద అన్న సంగతి మాత్రం నిజం. జయదేవునితో పరిచయానికి ముందే ఆమె నాట్యంలో ఆరితేరి అందెవేసిన పాత్రురాలు కావచ్చు.

పద్మావతీ జయదేవుల వివాహం విషయమై కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి. దేవశర్మ అనే బ్రాహ్మణుడు పద్మావతిని వెంటబెట్టుకొని పూరీకి వచ్చాడు. ఆమెను జగన్నాధస్వామికి యిచ్చి పెండ్లి చేయదలిచాడు. దేవుడు ఆమెను జయదెవునికి ఇమ్మని కలలో కనబడి చెప్పాడు. దేవశర్మ ఈ సంగతి జయదేవుడికి చెబితే అతడు నిరాకరించాడు. పద్మావతిని ఆలయంలో అర్చకులకు అప్పగించి దేవశర్మ వెళ్ళిపోయాడు. దేవుడు పండాల కలలో కూడా కనబడి తన అభిమతాన్ని చెప్పాడు. చివరకు జయదేవుడు పద్మావతిని చేపట్టాడు. ఈ కథలోని సారాంశం ఏమిటంటే, పద్మావతిని పూరీలో దేవదాసిగా అర్పించదలిచారు. ఆమె జయదేవుని ప్రేయసి అయింది. జయదేవుడు ఆమెను తన హృదయంలోనూ, కావ్యంలోనూ శాశ్వతంగా నిలుపుకొన్నాడు. ఆమె చరణాలను చలింపచేసే చక్రవర్తిగా తాను తరించాడు. ఆమె సుఖసామ్రాజ్యానికి తాను కవిరాజు అయ్యాడు.

కథ ప్రకారం దేవశర్మ పద్మావతిని వెంటపెట్టుకొని వచ్చాడు. సరే! ఎక్కడినుండి వాళ్ళు వచ్చారన్నది పెద్ద ప్రశ్నే. దేవశర్మ పద్మావతినేకాక మరికొన్ని దేవదాసి కుటుంబాలను వెంటబెట్టుకొని తెలంగాణా నుండి పూరీ జగన్నాధానికి వెళ్ళి వుండటానికి ఆస్కారం ఉంది. నేటి తిరుపతి మొక్కుల్లాగ నాడు కటకం మొక్కులు సర్వసామాన్యం. జయదేవుని కాలంలో జగన్నాధుని ఆలయంలో తమ బిడ్డలను కొందరు తెలుగువాళ్ళు దేవదాసీలను చేసే ఆచారం ఉండేదేమో. పూరీ ఆలయంలోని ప్రతాపరుద్ర గజపతి శాసనంలో చెక్కిన ''తెలంగాణాకు చెందినటువంటి ప్రాచీన నట్టువమేళం'' తోనే పద్మావతి వచ్చి ఉండాలి. ఆమె జయదేవుని ప్రియురాలు కావడం వల్ల ఆమెతో వచ్చిన ఇతర దేవదాసీలకు సైతం గీతగోవిందంపై ఒక రకమైన 'ఆడపడచుల హక్కు' ఏర్పడిందేమో. సుమారు మూడువందల ఏళ్ళుగా ఈ కుటుంబాలవారు కటకం జగన్నాధుని సన్నిధిలో ఆ ప్రబంధాన్ని అభినయిస్తూ సేవించుకోవడం గమనించిన ప్రతాపరుద్రగజపతి ఆ సంప్రదాయం శాశ్వతంగా కొనసాగేటట్టు ఈ శాసనం వేయించి ఉండవచ్చు. ప్రతాపరుద్ర గజపతికి ముందుగా అతని తాత కపిలేశ్వరుడు కూడా తెలంగాణా

నట్టువమేళం వారిని ఆదరించాడు. అతడు క్రీ.శ. 1459కి ముందే ఓరుగల్లు జయించాడు. బహుశా ఓరుగల్లులోని ఆంధ్రనాట్యం నర్తకీమణులు అతని హృదయాన్ని జయించి ఉంటారు. అతను కటకానికి తిరిగి వెళుతూ తన వెంట నట్టువమేళాన్ని, ఇతర కళాకారులనూ తీసుకువెళ్ళాడు కాబోలు. ఈ దేవదాసీలనే శాసనకర్త 'కపిలేశ్వర దేవర ఆటకత్తెలు' అని ప్రత్యేకంగా పేర్కొన్నాడు. ఆంధ్రనాట్యం తన అనుంగు నట్టువమేళాన్ని జగన్నాథునికి అర్పించే అవకాశం నోచుకుంది.

పూరీ జగన్నాథుని ప్రసాదం కులభేదాలను విస్మరింపజేస్తుంది. అన్నివర్ణాలవాళ్లూ పట్టింపులు లేకుండా పుచ్చుకోవాలి. 'సర్వం శ్రీజగన్నాథం' అనే సామెత గజపతుల పాలనవల్ల వచ్చిందే. కులభేదాలను నిరసించిన చైతన్యుని మతాన్ని అభిమానించిన గజపతుల వైదికమత సంప్రదాయాలను కూడా కాపాడి పోషించారు. హేమాద్రి చెప్పిన షోడశ దానాలు చేశారు. అయితే తెలుగుదేశానికి సంబంధించినంతమటుకు వీళ్ల హృదయం లేని రాక్షస పాలకులనే అభిప్రాయం పాతుకుపోయింది. చూడండి, సురవరం ప్రతాపరెడ్డిగారు ఏం వ్రాస్తున్నారో -

''రెడ్డిరాజుల రాజ్యపతనము క్రీ.శ. 1434 ప్రాంతములో నయ్యెను. చిరకాలమునుండి ప్రబల యత్నాలు చేయుచువచ్చిన ఓఢ్ర (ఒడ్డె) రాజులు తూర్పుతీరపు దేశమును, గుంటూరుసీమను ఆక్రమించుకొని పాలించిరి. వారికి ప్రజలపై ప్రీతి లేకుండెను. దేశము నుండి అన్నివిధముల ద్రవ్యమును లాగుకొని పోవుటయే వారి ప్రధానాశయమై నట్లుండెను. కవుల ఆదరము, కళాపోషణము వారిలో లవలేశమైన కానరాలేదు. అఖిలాంధ్రపరిపూజ్యుడును కవిసార్వభౌముడును సార్వభౌమసమ్మాన్యుడును నగు శ్రీనాథునే వారు కష్టపెట్టిరి.''[19]

ఇంతవరకు వ్రాసి ప్రతాపరెడ్డిగారు శ్రీనాథుని ప్రసిద్ధ పద్యం 'కవిరాజు కంఠంబు కౌగలించెను కదా' అనేది ఉదాహరించి ఇలా వివరించారు.[20]

''ఆనాడు పన్ను లియ్యనివారి నెన్నివిధముల కష్టపెట్టుచుండిరో ఈ పద్యము బాగా విశదపరచినది. చిత్రమేమనగా క్రీ.శ. 1900 వరకు హైద్రాబాదుసీమలోని పల్లెలలోని పటేలుపట్వారీ లివే పద్ధతులను అవలంబిస్తూ వుండిరి. ఊరిముందర చావడియుండెడిది. అందు చేతులకు 'కట్టెబేడీలు' వేయు 'కోడాలు' ఉండెడివి. రెండు చేతులను మణికట్టు వరకు రెండు కట్టెల రంధ్రములందుంచి ఒక వెదురు చీలను (గౌడిగను) వాటికి బిగించువారు. మరియు ఎండలో నిలబెట్టి బండలెత్తుట, లేక ఊరిముందర నుండు గుండును భుజముపై మోయించుట, లేక ఒక పెద్ద మొద్దుకు గొలుసును కట్టి దానిని కాళ్లకు తగిలించుట ఇట్టివన్నియు చేయిస్తూ ఉండిరి. అనగా ఒడ్డె రాజుల సృష్టి దేశమంతటను వ్యాపించె నన్నమాట. అయితే, తటాలున ఒడ్డె రాజులే యీ శిక్షలన్నిటిని ప్రవేశపెట్టినారనుట కాదు.

19. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, రెడ్డిరాజులకాలము, పుట 134.
20. అదే పుస్తకంలో, పుటలు 135-136.

అంతకు ముందును ఇట్టివి యాచారములందుండెనేమో! కాని వాఙ్మయంలో వాటి సూచనలరుదు. ఒడ్డెరాజుల యవయశస్సుమాత్ర మీ శ్రీనాథుని చాటుధారయున్నంత కాలము తెలుగునాట నుండక మానదు.''

నిజానికీ శిక్షలన్నీ ఒడ్డెరాజు లొక్కరే సృష్టించినవి కావు. కేయూర బాహుచరిత్రలో అన్యాయ వ్యాపారం చేసిన వర్తకునికి విధించిన శిక్షను మంచన గ్రంథస్థం చేశాడు. ఈ గజపతుల యుగంలోనే ఉన్న అనంతా మాత్యుడు తన 'భోజరాజీయం'లో చాలా వింత శిక్షను పేర్కొన్నాడు. 'వీధుల తిరుగంగ వెన తలారులు పట్టి కొజ్జాను చేసిరో' అని ఒక యువతి తన్ను నిరాకరించిన వానిని ప్రశ్నిస్తుంది (భోజ. 4-319). ఇది తురుష్కుల సంపర్కం బాగా ఉన్న రోజుల్లో, ఇంతకుముందే కాకతీయ యుగంలోని కేతన విజ్ఞానేశ్వరీయంలో ఆర్థిక నేరాలకు వివిధ శిక్షలను పేర్కొన్నాడు. వాస్తవానికి శ్రీనాథుని సమకాలికుడైన కపిలేశ్వర గజపతి ప్రజారంజకుడైన పాలకుడేగాని లోకకంటకుడు కాదు. అతడు ఉప్పుమీద, గవ్వలమీద ఉండే పన్నులు తొలగించాడు.[21] ప్రజల మన్నన పొందాడు. 15వ శతాబ్దంలో దక్కనులో పర్యటించిన రష్యన్ యాత్రీకుడు అఫనాసి నికితిన్ వ్రాసిన వ్రాతలవల్ల శ్రీమంతులు స్వార్థపూరితమైన వైభవాలూ, భోగాలూ అనుభవిస్తూ ఉంటే సామాన్య ప్రజలు అష్టకష్టాలూ పడేవారని తెలుస్తుంది.[22] శ్రీనాథుడు ఒకనాడు శ్రీమంతుల భోగాలు అనుభవించినవాడే. అతణ్ణీ, అతని ప్రభువులనూ సుఖపెట్టడానికి సామాన్య రైతులనుండి ప్రభుత్వోద్యోగులు ఎలా పన్నులు వసూలు చేసేవారో దీనివల్ల ఊహించవచ్చు.

గజపతులలో కపిలేశ్వరుడు ఉన్న పన్నులు కొన్ని తొలగించినా శత్రురాజులపై ఎక్కువ పన్నులు విధించినట్టు కూడా శాసనాధారాలు లేకపోలేదు. అనంతవర తామ్రశాసనంలో ఇలా ఉంది- ''ప్రసహ్యా కర్ణాటమహీపతేః పురానిమధ్యా విద్యానగరీం నిజైర్బలైః సమున్నతం మానమి వో చ్ఛ్రయాకారం సమాదదే కర్కశచక్రవిక్రమః.'' ఈ శాసనాన్ని ప్రకటించిన వేటూరి ప్రభాకరశాస్త్రిగారు దీనికి ఇలా అర్థం చెప్పారు.[23] ఈతడు బలాత్కరించి కర్ణాట రాజధాని అయిన విద్యానగరిని తన సేనలతో నరికట్టి సమున్నతమైన మానమునుబోలె హెచ్చుపన్నును గైకొనెను.'' అయితే ఇతడు అనేక అగ్రహారాలు దానం చేసినట్టు కూడా ఈ శ్లోకానికి ముందుగా మరొక శ్లోకముంది. ''ఘనేన యేన ద్విజసంఘసాత్కృతా మహాగ్రహారా శ్శుచిమౌక్తికోజ్జ్వలాః మహీపురంధ్రీ హృదయావలంబిలో మహాగ్రహారా ఇవ సంచికాసతే.'' కపిలేశ్వరగజపతి ఎన్నో అగ్రహారాలు ఇవ్వబట్టే తెలుగు జిల్లాలలో కపిలేశ్వపురాలు చాలా ఉన్నాయి. (ఉదాహరణకు - కృష్ణా జిల్లా గూడూరు తాలూకాలో ఒకటి, తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకాలో ఒకటీ ఉన్నాయి.) విశాఖపట్నం జిల్లాలోని పార్వతీపురం ఈ కపిలేశ్వరుని


21.*Delhi Sultanate, Gajapati Kings of Orissa, P.365
22.*Delhi Sultanate, Gajapati Kings of Orissa, P.365
23.*Delhi Sultanate, Gajapati Kings of Orissa, P.365

భార్య పేర కట్టించిన ఊరే. కపిలేశ్వరుని కుమారుడైన పురుషోత్తమ గజపతి పేరనే బెజవాడ దగ్గర ఉన్న పురుషోత్తమ పట్టణం కట్టారు. ప్రతాపరుద్రగజపతికి విద్యాధరుడనే మారుపేరు వుంది. ఈ పేరుమీదనే విద్యాధర పురమనే గ్రామం వెలసింది. కొండపల్లి వద్ద విద్యాధర గజపతి చెరువు అనే తటాకం ఉంది. అందులో ఇతడు లక్క పడవమీద షికారు చేసేవాడట.

మొత్తంమీద ముగ్గురు గజపతులు ఆంధ్రదేశంలో చిరస్థాయిగా ఉండే ఊళ్ళు కట్టించి చెరువులు తవ్వించి పాలించారు. వీరి రాజకీయపు చరిత్ర తొలిదశ రెడ్డిరాజుల అవసానకాలంలోనూ, చివరిదశ మలిరాయల యుగంతోనూ పెనవేసుకొని ఉంది. వీరి పాలనములో తెలుగు సాహిత్యాన్ని పోషించారు.

తొలి రాయల యుగం

కాకతీయ సామ్రాజ్యం అస్తమించిన తరువాత తెలుగుదేశంలో మూడువైపులా మూడు రాజ్యాలు వెలిశాయి. నేటి తెలంగాణాలో పద్మనాయకులు, తీరాంధ్రంలో రెడ్డిరాజులు, రాయలసీమలో దానికా పేరు ప్రసాదించిన విజయనగరం రాయల వంశంవారూ స్వతంత్ర రాజ్యాలు స్థాపించుకొని, పెరుగుతూ, తరుగుతూ యుద్ధాల ప్రభంజనాలకు అల్లాడుతూ, శాంతి చిక్కగానే ప్రకాశిస్తూ గొప్ప వెలుగు వెలిగారు. కాకతీయ సామ్రాజ్యాధిపతి ప్రతాపరుద్రునివద్ద హరిహరరాయలు, బుక్కరాయలు అనే సోదరులు దండనాధులుగా ఉండేవారు. ఓరుగల్లు పతనమయ్యాక, వారు ఆనెగొందిని పాలించే కంపిలి రాజుల వద్ద చేరారు. క్రీ.శ. 1327-28లో ఢిల్లీ సుల్తాను మహమ్మద్ తుగ్లక్ ఆనెగొందిని ముట్టడించాడు. రాజు మరణించాడు. రాజోద్యోగులు హరిహరరాయలు, బుక్కరాయలు పట్టుపడ్డారు. సుల్తాను వాళ్ళను బంధించి ఢిల్లీకి తీసుకునిపోయాడు. సమర్థులైన హైందవ సేనానాయకులకు ఇస్లామ్ మతం ఇచ్చి తమ కొలువులో ఉంచుకొనడం ఆనాటి ఢిల్లీ సుల్తానుల రాజనీతి. ప్రతాపరుద్రుని దండనాధులలో ఒకడైన గన్నయ నాయకుడు ఢిల్లీ సైన్యాలకు పట్టుబడి మతం మార్చుకున్నాడు. ఇతడు మారయగారిచేత మార్కండేయపురాణం అనువదింపజేసినవాడు. మతం మార్చుకున్నాక మల్లిక్ మక్బూల్ అనే పేరుతో అతడినే ఓరుగంటికి పాలకునిగా ఢిల్లీసుల్తాను పంపాడు. గన్నయ నాయకుడు చాలా విశ్వాసంతో సుల్తానును సేవించాడు. హరిహరరాయలు, బుక్కరాయలు కూడా అలాగే తన కొలువులో ఉంటారని సుల్తాను వాళ్ళను కంపిలిరాజ్యానికే తన ప్రతినిధులుగా పంపాడు. మాతృదేశానికి తిరిగి రాగానే సోదరులు మధ్యలో పుచ్చుకున్న మతాన్ని మధ్యలోనే తుంగభద్రలో విడిచిపెట్టారు. మాధవాచార్యుడనే మహనీయుని బోధనతో మళ్ళీ వైదిక మతాన్ని స్వీకరించారు. ఆనెగొందిని పాలించసాగారు. ఈ మాధవాచార్యులవారే సన్యసించి విద్యారణ్యస్వాములయ్యారు. తమ గురువుగారి పేరిట,



తొలి రాయలనాటి ఆంధ్రదేశం

వారి ఆదేశానుసారం సోదరులు విద్యానగరమనే రాజధానిని నిర్మించారు. అది ఉత్తరోత్తరా పధ్నాలుగుమైళ్ళ పొడుగు, పదిమైళ్ళ వెడల్పు గల మహానగరం అయింది. చుట్టూ ఏడు ప్రాకారాలతో శత్రుదుర్భేద్యమై ఉండేది. మాధవవిద్యారణ్యులవారి దీవెనలతో పునాదులు పడిన ఈ నగరం అక్షరాల విద్యానగరమే అయింది.

విద్యారణ్యులవారికి సాయణాచార్యులు, భోగనాథుడు అనే సోదరులున్నారు. సాయణాచార్యుల వారితో వారు నాలుగు వేదాలకూ భాష్యం వ్రాయించారు. వేద భాష్యానికి సాయణ భాష్యం అనే పేరు రూఢమయింది. విద్యారణ్యులవారు సన్యసించకముందు 'పరాశరమాధవీయం' అనే పేరుతో పరాశరస్మృతికి వ్యాఖ్యానం వ్రాశారు. 'కాల నిర్ణయ' అనే నామాంతరం ఉన్న 'కాలమాధవం' అనే ధర్మశాస్త్రాన్ని రచించారు. రాజు కోరికమీద 'జైమినీ న్యాయమాలావిస్తరం' అనే మీమాంసా గ్రంథాన్ని వ్రాశారు. సన్యసించాక శృంగేరీపీఠానికి ఆధిపత్యం స్వీకరించి ఎన్నో వేదాంత గ్రంథాలు వ్రాశారు. (1) పంచదశి (2) జీవన్ముక్తి వివేకం (3) అనుభూతిప్రకాశం (4) వివరణప్రమేయ సంగ్రహం (5) అపరోక్షానుభూతి - టీక (6) బృహదారణ్యాక వార్తికసారం (7) ఐతరేయోపనిషద్దీపిక (8) తైత్తిరీయోపనిషద్దీపిక (9) ఛాందోగ్యోపనిషద్దీపిక వారు రచించారు. ఇవన్నీకాక 'సర్వదర్శనసంగ్రహం' అనే పేర వివిధ మతాల స్వరూపాలను సాక్షాత్కరింపజేసే గ్రంథం ఒకటి వ్రాశారు. 'సంక్షేపశంకరవిజయం' అనే గ్రంథం కూడా రచించారు.

ఈ మహనీయుని చల్లని దీవెనలతో వెలసిన విజయనగర సామ్రాజ్యమే సుప్రసిద్ధుడైన తుళువ శ్రీకృష్ణదేవరాయల వారి పరిపాలనలో మహావైభవంతో విరాజిల్లింది. ఆ కాలానికి ముందు ఒకటిన్నర శతాబ్దాలకు పైగా సంగమ సాళువవంశాల వారు ఈ రాజ్యాన్ని పాలించారు. ఇదే మన తొలి రాయల యుగంలో కొంతభాగం. శ్రీనాథునికి కనకాభిషేకం చేసిన రెండవ ప్రౌఢదేవరాయలు (క్రీ.శ. 1423-1446) వరకు సంగమరాజుల చరిత్రను ఇతర యుగాలలో మనం తెలుసుకున్నాం. క్రీ.శ. 1355-1377 సం.ల మధ్య విజయనగరాన్ని పాలించిన మొదటి బుక్కరాయలు నాచనసోముని ఆదరించి అగ్రహారం ఇచ్చినట్టు ముందుగానే తెలుసుకొన్నాం. అప్పటినుంచి ఆంధ్రసాహిత్య పారిజాతపు పెద్ద శాఖ ఒకటి ఆ రాజ్యంలో విస్తరించి మంచి పువ్వులు పూస్తూ వచ్చింది. ఆ సామ్రాజ్యంలో వర్ధిల్లిన కవుల చరిత్రను, వారు సృష్టించిన వాఙ్మయ విమర్శను జోడించి మన చరిత్రకారులు ప్రత్యేక గ్రంథాలను వ్రాశారు.[1] క్రీ.శ. 1485లో సంగమవంశం అస్తమించి సాళువవంశ రాజులు గద్దెకెక్కారు. సాళువవారు విజయనగర సామ్రాజ్యంలో దండనాయకులుగా, మండలాధిపతులుగా ఉండేవారు. వీళ్ళు స్వామిభక్తిపరాయణులు. అయితే సంగమవంశం అవసానకాలంలో దుర్బలులు రాజులయ్యారు. చెట్టు చెడేకాలానికి

1. 'విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయ చరిత్రము' ప్రథమభాగం (క్రీ.శ. 1330-1500). రచన : టేకుమళ్ళ అచ్యుతరావుగారు.

కుక్కమూతిపిందెలన్నట్టు చివరికాలంలో స్త్రీలోలుడు, విషయలంపటుడు, సురాపాన మత్తుడు అయిన విరూపాక్షరాయలు సింహాసనం ఎక్కాడు. ఇతడు ఇరవైనాలుగ్గంటలూ అంతఃపురకాంతలతోనే గడిపేవాడు. ఇతని కాలంలో రాజకీయ పరిస్థితులు భయంకరంగా ఉండేవి.

రెడ్డిరాజుల వైభవాన్ని కబళించి గజపతులూ, పద్మనాయకుల ప్రాభవాన్ని దిగమింగి బహమనీ సుల్తానులూ తెలుగు రాజ్యాలపై పడ్డారు. ఈ దుస్థితినుంచి విజయనగర సామ్రాజ్యాన్ని రక్షించడానికి సాళువ నరసింహరాయలనే సేనాని అధికారాన్ని హస్తగతం చేసుకొన్నాడు. ఇతడు ఒక్క అయిదు సంవత్సరాలు మాత్రమే రాజ్యం చేశాడు. తరువాత అతని సంతతివారినే విశ్వాసపాత్రులైన తుళువవంశపు దండనాయకులు గద్దె ఎక్కించారు. సంగమరాజుల సింహాసనాన్ని వాళ్ళ దండనాయకులైన సాళువవారు ఎలా అధిష్ఠించారో అలాగే, దానిని వాళ్ల దండనాయకులైన తుళువవారు కైవసం చేసుకున్నారు. అయితే తుళువ నరసానాయకుడు ప్రత్యక్షంగా సింహాసనం ఎక్కక సాళువ ప్రభువులను కీలుబొమ్మలలా ఆడించి వాళ్ల పేరున రాజ్యం చేశాడు. ఇతడు క్రీ.శ. 1506లో మరణించాడు. ఆ తరువాత ఇతని కుమారుడు తుళువ వీరనరసింహరాయలు తిన్నగా గద్దె ఎక్కాడు. దానితో రాయరాజ్యంలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమయింది.

సంగమవంశంలో కడపటి రాజులూ, సాళువవంశపు వారూ ఏలిన కాలాన్ని (క్రీ.శ. 1450–1500) తొలి రాయల యుగంగా చర్చించుకొందాం. 'సాళువ' అంటే డేగ అని అర్థం. క్రీ.శ. 1352 ప్రాంతాలలో మొదటి బుక్కరాయల కాలంలో మంగరాజనే సేనానాయకుడు, యువరాజైన కుమారకంపరాయలకు కుడిభుజమై దండయాత్రలలో పాల్గొన్నాడు. మధురను జయించి 'పరపక్షిసాళువ' అనే బిరుదాన్ని పొందాడు. ఆనాటి నుంచి అతడు 'సాళువమంగు' అనే పేర సుప్రసిద్ధుడయ్యాడు. చంద్రగిరి మండలానికి ఏలిక అయ్యాడు. అతని సంతతివారు తమ తండ్రిలాగే విజయనగర రాయరాజ్యాన్ని విశ్వాసంతో కొలుచుకున్నారు. ఈ కుటుంబంతో రాయప్రభువులు వియ్యం కూడా అందారు. ఈ రెండు వంశాల పట్టిక చూడండి –

వ.నెం.	సంగమ వంశం	క్రీ.శ.	సాళువ వంశం
1.	మొదటి హరిహరరాయలు	1335–1355	మంగరాజు
2.	మొదటి బుక్కరాయలు	1355–1377	ఇమ్మడి గౌతమరాజు
3.	రెండవ హరిహరరాయలు	1377–1404	గుండరాజు
4.	రెండవ బుక్కరాయలు	1404–1406	గుండరాజు
5.	మొదటి దేవరాయలు	1406–1422	–
6.	ప్రౌఢ దేవరాయలు	1423–1446	–
7.	మల్లికార్జునరాయలు	1446–1465	–

వ.నెం.	సంగమ వంశం	క్రీ.శ.	సాళువ వంశం
8.	విరూపాక్షరాయలు	1465–1478	–
9.	రాజశేఖరరాయలు	1478–	–
10.	ముమ్మడి దేవరాయలు	1485–	–
11.	–	1485–1490	నరసింహరాయలు
12.	–	1490–	తిమ్మరాయలు
13.	–	1490–1506	ఇమ్మడి నరసింహరాయలు

ఈ పట్టిక చూస్తే సాళువగుండరాజు రెండవ హరిహరరాయల కొలువులో కనిపిస్తాడు. ఈ తిమ్మరాజుకుమారుడే నరసింహరాజు. ఇతడే సంగమవంశంలోని కడపటి రాజులవద్ద దండనాయకుడుగా ఉండి రాయగద్దెను చేత పట్టాడు. దానికి తగినంత కారణం మనం గుర్తించాం. విరూపాక్షరాయల పెద్దకొడుకు పేరు రాజశేఖరరాయలు. ఇతడు తన తండ్రి చెడుప్రవర్తన చూసి సహించలేక అతణ్ణి చంపించి తమ్మునికి పట్టం కట్టాడు. ముమ్మడి దేవరాయలు తనకు రాజ్యమిచ్చిన అన్ననే హత్య చేశాడు. అధికారం కోసం పితృహత్యలు, భ్రాతృ హత్యలు చేసే రాజుల పాలనలో ప్రజలకు సుఖం ఉండదు. పరుల దండయాత్రలనుండి రాజ్యాన్ని కాపాడడానికి సాళువ నరసింహరాయలు పట్టాభిషేకం చేసుకున్నాడు. ఇతని మూర్ధాభిషేకాన్ని పిల్లలమర్రి పినవీరభద్రుడిలా వర్ణించాడు:

తిగుళభూములు తెంకులుగ జరించిన దొడ్డ చెవుల పోతుల నెల్ల జెండివైచి
ఘనమైన కండక్రొవ్వున బారుతెంచిన యొడ్డీని పెనులావులూడదన్ని
పరతెంచి చక్కగ బాలదుర్గము మెట్టి సుడివడ్డ చామల జుట్టుముట్టి
పెనుకొండకడ వ్రాలి పిక్కిళ్ళు మొదలైన ప్రతిపక్షులను హతాహతముచేసి
సత్కవుల త్రుప్పు డుల్చు వసంతవేళ
రాయమీసరగండధరావరాహ
విజయవిఖ్యాతగుండ భూవిభు నృసింహ
సార్వభౌముని బిరుదైనసాళువంబు (జైమినిభారతము, 1–45)

ఇది జైమిని భారతంలోని పద్యం. దీనిని పినవీరభద్రుడు సాళువ నరసింహ రాయలకు అంకితం ఇచ్చాడు. ఈ ప్రభువు తెలుగు కవిత్వాన్ని బాగా పోషించాడు. కృతిభర్తగానేకాక కృతికర్తగా కూడా పేరుకెక్కాడు. ఇతడు స్వయంగా రామాభ్యుదయం అనే కావ్యం వ్రాశాడట. ఇతడు తాళ్లపాక అన్నమాచార్యులవారికి బాల్యసఖుడు. ఆయనను చాలా గౌరవించాడు. ఎంతో హింసించాడు. కాళ్లమీదపడి వేడుకొన్నాడు. ఈ నరసింహరాయని కొలువులో ఉండే తుళువ దండనాయకులు కూడ తెలుగు కవిత్వాన్ని బాగా ఆదరించి కృతులు అంకితం పుచ్చుకున్నారు. వీళ్లతో పోటీకా అన్నట్టు గజపతుల సామంతులూ రెండు చేతులా అంకితాలు అందుకున్నారు.

సప్తసంతానాలలో శాశ్వతమైనది కృతియేనని అందరూ ప్రతిగ్రంథాదిని ఈ యుగంలో మరీ ఎక్కువగా చెప్పసాగారు. ఎప్పుడో నన్నెచోడుడు మొదటిసారిగా ఈ సంగతి అన్నాడు. నన్నెచోడుని కాలంలో మొగ్గతొడిగిన అష్టాదశవర్ణనలు, ముద్రాలంకారాలు, చిత్రబంధకవిత్వాలు ఈ యుగంలో పూర్తిగా వికసించి సౌరభాలు ఘాటుగా వెదజల్లాయి. నాచన సోముడు నేర్పిన అర్థాలంకారాలు అనర్థం తెచ్చేటంతదాకా విస్తరించడం ఈ యుగంలోనే మొదలు. నవఘంటాసురత్రాణులు, అష్టఘంటావధానులు, ఇతర చిత్రకవిత్వ ప్రక్రియా ప్రదర్శకులు కోకొల్లలుగా ఈ యుగంలో కంఠమెత్తారు.

తిక్కనగారు పెట్టిన వరవళ్లు దిద్దడం మానేసి తెలుగు కవిత ఈ యుగంలో జాత్యముగాని సంస్కృత పదాలను చొప్పించుకొనసాగింది. కొమ్ములు తిరిగిన పండితులకు సహితం ఒకమారు వినగానే అర్థం అవని పద్యాల రచన ఒకవంక మొదలైతే, పసిబిడ్డలకు కూడా బోధపడే సంకీర్తనలూ, యక్షగానాలూ ఇంకొకవంక వికసింప సాగాయి. ప్రముఖమైన పురాణేతిహాసాల అనువాదం అయిపోవడం వల్ల చిల్లర కథలకు ఇనుమిక్కిలి మెరుగులు పెట్టడం కూడా ఈ యుగంలోనే శ్రీకారం చుట్టుకొంది.

ఈనాటి లక్షణగ్రంథాల కొలబద్దలతో కొలిస్తే తొలి రాయల యుగంలోని మహాకవుల రచనలలో కూడా లక్షణ విరుద్ధమైన ప్రయోగాలు కనబడతాయి. ఇవి వాళ్ళ తప్పులనడంకంటే వ్యాకరణ గ్రంథాల లోపమనడమే మంచిది. ఉన్నవాటికి గతి కల్పించడం వ్యాకర్తల కర్తవ్యం. తొలి రాయల యుగంలోనే కృతులు చాలా వెలుగు చూడలేదు. చూసినవాటి ముఖం మన లాక్షణికులు కొందరు చూడలేదు. చూసినవాళ్ళు చూసీచూడనట్టు ఊరుకున్నారు!

ఈ యుగంలోని కవులను, వాళ్ల రచనలను కూలంకషంగా పరిశీలించి సమన్వయం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

గౌరన

ప్రాచీన తెలుగు సాహిత్యంలో నాటకాలను ఎవరూ వ్రాయలేదుగాని ఆద్యులెవరైనా మొదలుపెట్టి సంప్రదాయాన్ని నెలకొలిపితే తెలుగుజాతి గర్వించదగ్గ నాటక రచయితగా పేరుపొందే కవి ఒకడు లేకపోలేదు. అతని పేరు గౌరన. ఆయన హరిశ్చంద్రుని కథను, నవనాథుల చరిత్రను ద్విపద కావ్యాలుగా వ్రాశాడు. ఇవి పేరుకు ద్విపద కావ్యాలైనా కవి వీటిని నాటకాలు వ్రాస్తున్నట్టే రచించాడు. హరిశ్చంద్ర కావ్యంలో ఇది మరీ ఎక్కువగా కనబడుతుంది.

తన కాలంనాటి సంఘంలో సామ్రాజ్యాన్ని ఏలే మహారాజుదగ్గర నుండి శ్మశానాన్ని గుత్తకు పాడే కటికవాడిదాకా ఎవరెవరు ఎలా మాట్లాడేవారో, ఎలా ప్రవర్తించేవారో, వాళ్ళ కట్టూ, బొట్టూ, హావభావచేష్టలూ ఎలా ఉండేవో సునిశితంగా పరిశీలించి, సూక్ష్మవిషయాలు కూడ గుర్తించి, పాత్రలను సూటిగా చిత్రించిన మహాకవి గౌరన. శుద్ధఛాందస కుటుంబాలలోని గయ్యాళి భార్యల ఆగడాల దగ్గర్నుంచి నేరం చేస్తే రాజుగారి భోగపత్నులను రచ్చకీడ్చేముందు మంత్రులు మొదలైనవాళ్ళు అంతఃపురంలోనే వాళ్ళను విచారణ జరిపే పద్ధతిదాకా ఎన్నో సాంఘిక ఆచారాలను చూపించాడు.

గౌరన ఈ రాచమర్యాదలను స్వయంగా చూసి ఉంటాడు. అందుకు ఆస్కారం ఉంది. ఇతని పెదతండ్రి పేరు పోతన. ఆయన గొప్ప మంత్రి. అతడు క్రీ.శ. 1361–1384 దాకా దేవరకొండను పాలించిన మాదానాయకుని దగ్గర ఉండేవాడు. ఈ పోతనామాత్యుడు స్వామికార్య ధురంధరుడు. రాజనీతి యుగంధరుడు.[1] పెదతండ్రితో గౌరన చిన్నప్పుడు రాజభవనంలోని వివిధాంశాలను చూసి ఉంటాడు. తను చూసిన సమాజాన్ని తన కావ్యాలలో చిత్రించాడు. ఇతని పెదతండ్రికాక తండ్రి కూడా మంత్రే. ఆయన పేరు అయ్యలుమంత్రి. ఆయన ఎవరిదగ్గర, ఎక్కడ మంత్రిగా పనిచేశాడో గౌరన చెప్పలేదు. బహుశా పద్మనాయకుల వద్దనే ఉద్యోగిగా ఉండి ఉంటాడు. అయ్యలుమంత్రికి ఇద్దరు కుమారులు. పెద్దవాని పేరు ధరణిమంత్రి. రెండవవాడే గౌరన. ధరణిమంత్రి కూడా పద్మనాయకుల వద్దనే ఉద్యోగం చేసినట్లుంది.,

ధరణి నమాత్యరత్నం బనబరగు
ధరణిమంత్రికి గూర్మితమ్ముడ ఘనుడ.

అని గౌరన హరిశ్చంద్ర చరిత్ర ఆరంభంలో చెప్పుకొన్నాడు. తండ్రి, పెదతండ్రి, అన్న మొదలైన బంధువులందరూ రాజోద్యోగులుగా చేసినా గౌరనమాత్రం అలాంటి బెడదలు పెట్టుకొన్నట్టు లేదు. 'కవిత్వసుమహిత సామ్రాజ్యసుఖపరాయణు'నిగా తనను తను చెప్పుకొన్నాడు.[2] ఇతనికి చతురసాహిత్యలక్షణ చక్రవర్తి, ప్రతివాదిమదగజ పంచాననుడు

---

1. ఇవి ఆంధ్రసాహిత్యపరిషత్తువారి గ్రంథాలయంలోని 2585 నెంబరు తాళపత్ర గ్రంథం 'లక్షణదీపిక'లో గౌరన చెప్పిన మాటలే.
2. హరిశ్చంద్రద్విపద, ఉత్తరభాగం చివర 2911వ పాదం.

అనే బిరుదులు ఉండేవి. లక్షణచక్రవర్తి అనే బిరుదు ఇతనికి ఊరకనే రాలేదు. లక్షణదీపిక అనే ప్రామాణిక లక్షణగ్రంథం వ్రాశాడు. తెలుగు ఛందస్సులను గురించి సంస్కృతంలో రచించాడు. ఇందుకు కారణం లేకపోలేదు. ఆనాడు రాజులందరూ సంస్కృత భాషాభిమానులు. సంస్కృతంలో గ్రంథాలు వ్రాయగలిగిన సమర్థులు. గౌరన సమకాలికుడైన పద్మనాయక ప్రభువు మాదానాయకుడు రామాయణానికి రాఘవీయమనే టీక వ్రాశాడు. ఆ టీక నేడు లభ్యం కాలేదు. అయినా అతడు అది రచించినట్లు ఆయన భార్య వేయించిన శాసనంవల్ల తెలుస్తున్నది. ఈ మాదానాయకుడు గౌరన పెదతండ్రిని పోషించిన 6వ తరంలోని మాదానాయకుడు కాడేమో (అతని కాలం క్రీ.శ. 1361-84). 8వ తరంలో ఉన్న మాదానాయకుడు కావచ్చు (ఇతని కాలం క్రీ.శ. 1427). ఈ మాదానాయక నృపాలుడు రామభక్తుడు. రామాయణమంటే అభిమానమున్నవాడు. ఈ ప్రభువు వల్లనే గౌరనకూడ రాముణ్ణి స్తుతిస్తూ సంస్కృతంలో లక్షణ గ్రంథం వ్రాసి ఉంటాడని భావించవచ్చు.

గౌరన రచించిన లక్షణదీపికకు రెండు విభిన్నమైన ప్రతులు ఉన్నాయి. ఒకదానికి 'క' అని, రెండవదానికి, 'గ' అని సంకేతాలు పెట్టారు.[3] 'క' ప్రతిలో ప్రారంభం ఇలా ఉంది.

> జానకీముఖపద్మార్కం - జానకీకుచభూషణం
> జానకీరమణం వందే - జగతాం మంగళప్రదం! (ఆ.సా.ప. తాళపత్రం, 2585)

ఈ ప్రతిలో మొదట శ్రీరాముణ్ణి స్తుతించడం కనబడుతుంది. అయితే 'గ' ప్రతిలో

> ప్రణమ్య విద్వజ్జనపారిజాతం - కవీంద్రవిప్రార్చితపాదపంకజం
> విభుం ప్రభుం విశ్వసృజం మహేశం - సంవక్ష్యతే లక్షణదీపి కేయమ్.
> (ఆ.సా.ప. తాళపత్రం, 1391)

ఈ రెండవ ప్రతిలో ఈశ్వరునికి ప్రణుతి కనబడుతుంది. గౌరన తెలుగులో వ్రాసిన రెండు కావ్యాలలోను గ్రంథాదిని శివుణ్ణే స్తుతించాడు. నవనాథచరిత్ర శ్రీశైలమల్లికార్జున దేవునికి అంకితం. అయితే అంతమాత్రంచేత గౌరన ఇతర దేవతలపట్ల అగౌరవం గలవాడు కాదు. రాముడన్నా, రామాయణమన్నా ఇష్టమే అనిపిస్తుంది. నవనాథచరిత్రలో మీననాథుడు శిష్యులతోపాటు భారతదేశంలోని దివ్యక్షేత్రాలు దర్శిస్తూ కైలాసానికి వెళతాడు. అయోధ్యకు వెళ్ళినపుడు మీననాథుడు శిష్యులకు రామకథ చెప్పాడు. ఈ సందర్భంలో గౌరన ఇరవైనాలుగు ద్విపదపాదాలు వ్రాసి చివర 'మహాపాతకహరమైన రాము వినుత చరిత్రంబు' అన్నాడు.[4] అందుచేత 'క' ప్రతిలోని శ్రీరామనందనం గౌరన చేసినదే అని చెప్పవచ్చు.

---

3. 'గౌరన-లక్షణదీపిక' చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు, ఆంధ్రసాహిత్యపరిషత్ పత్రిక 31వ సంపుటి, 34 సంచిక.
4. నవనాథచరిత్ర, చతుర్థాశ్వాసం, పుట 200.

ఈ లక్షణదీపిక రచించడంలో గౌరన సుమారు ఏభై ప్రామాణిక గ్రంథాలు సంప్రదించాడు. ఆ రోజుల్లో ప్రామాణిక గ్రంథాలను సంప్రదించడమంటే అవన్నీ వాచోవిధేయంగా ఉండడమే. 'క' ప్రతిలో 39 ప్రామాణిక గ్రంథాలు, 'గ' ప్రతిలో 20 గ్రంథాలు ఉన్నాయి. ఇవికాక 6 తెలుగు ఛందోగ్రంథాలను గౌరన పేర్కొన్నాడని చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు వ్రాశారు. ఈ పట్టికల నుంచి క్రోడీకరించిన గ్రంథాల అకారాది క్రమాన్ని చూడండి.

	'క' ప్రతిలో చెప్పినవి	'గ' ప్రతిలో చెప్పినవి
1.	అమరుకము	అమరుకము
2.	అలంకారచూడామణి	
3.	అలంకారసంగ్రహము	
4.	అలంకారసర్వస్వము	
5.	ఉత్తమగండఛందము	
6.	ఉత్తరరామచరితము	
7.	ఋగ్వేదము	
8.	కవికంఠపాశము	కవికంఠపాశము
9.	కవిగజాంకుశము	....
10.	కవిరాజగజాంకుశము	కవిరాజగజాంకుశము
11.	కాలనిదానము	.....
12.	....	కిరాతార్జునీయము
13.	కుమారసంభవము	....
14.	కృష్ణవిజయము	....
15.	చమత్కారచంద్రిక	చమత్కారచంద్రిక
16.	ఛప్పన్నము	....
17.	....	త్రిభాష్యరత్నాకరము
18.	త్రివిధము	....
19.	....	నామలింగానుశాసనము
20.	నిధిప్రదీపిక	....
21.	....	నైషధము
22.	న్యాయసారము	న్యాయసారము
23.	....	ప్రపంచసారము
24.	....	ప్రబంధదీపిక
25.	పణితశాస్త్రము	....
26.	బృహజ్జాతకము	బృహజ్జాతకము
27.	భరతసంగీతరత్నకోశము	....

	'క' ప్రతిలో చెప్పినవి	'గ' ప్రతిలో చెప్పినవి
28.	భోజరాజీయము	....
29.	మంత్రిమహార్ణవము	....
30.	మంత్రాధర్వణము	....
31.	మణిదర్పణము	....
32.	మనుస్మృతి	....
33.	మాఘము	....
34.	యోగరత్నాలయము	....
35.	రత్నమాల	రత్నమాల
36.	రసార్ణవసుధాకరము	....
37.	....	వాసవదత్త
38.	వాసిష్ఠసంహిత	....
39.	శాకినీసహకారము	....
40.	....	శారదాతిలకము
41.	శారదావిలాసము	....
42.	సంహితాసంగ్రహము	సంహితాసంగ్రహము
43.	సంహితాసారము	సంహితాసారము
44.	సాహసాంకకావ్యము	....
45.	సాహిత్యచంద్రోదయము	సాహిత్యచంద్రోదయము
46.	సాహిత్యచూడామణి	సాహిత్యచూడామణి
47.	సాహిత్యరత్నాకరము	సాహిత్యరత్నాకరము

(రెండింటిలోనూ ఉమ్మడిగా చెప్పినవి 12 మాత్రమే.)

ఇన్ని గ్రంథాలను కూలంకషంగా చదవబట్టే గౌరన 'ప్రతివాది మదగజ పంచాననుడు' అనే బిరుదు పొందడానికి తగినంత పాండిత్యం సంపాదించాడు. అతడు ఎంత పండితుడైనా తన పాండిత్య ప్రకర్షను పనిగట్టుకొని తన కావ్యాలలో ప్రదర్శించలేదు. సంస్కృతం క్షుణ్ణంగా చదువుకొన్నా శ్రీనాథునిలాగ తత్సమ సమాసాలు గుప్పించి అదే తెలుగు కవిత్వమనిపించ లేదు. గౌరన అలాంటి సమాసాలు కట్టలేక కాదు. కావలసిన నాలుగైదుచోట్ల ఏడు పాదాలను ఏకబిగిన ఒకటే సమాసం కట్టాడు. చూడండి:

ఫలితపుష్పితలతాభవనాంతరళ - చలితమరందనిర్ఝరకణశిశిర -
కలితమిళిందసంగతపికకీర - లలితగీతామృతలహరీవిలోల - కిన్నరకరపల్లకీ
నాదముదిత - సన్నుతసారంగశాబకప్రకర - కోమలవానీరకుంజపుంజములు
(హరి - పూర్వ. 1919 నుండి 1925)

ఇంతకుముందే పది ద్విపద పాదాలు సమాసం కట్టి చెప్పాడు.

మందార మంజరీ మంజుమరంద నందదిందిందిర నందనారామ
కమనీయ వికసిత కనకారవింద - కమలినీతలు లతాగార లతాంత
రచిత శయ్యాతల రతిరయగళిత - కచభర సురపురగణికా కపోల
కవిత ఘర్మోదక కణగణమిళిత - మలయ సమీర కోమల కంపితాగ్ర
మహిత చిత్రధ్వజ మాలా సహస్ర - సహిత చింతామణీ సౌధపాళికల.
(హరి - పూర్వ. 1355 నుండి 1364)

ఇలాంటి వర్ణనలు హరిశ్చంద్ర చరిత్రలో అక్కడక్కడ అరుదుగా కనిపిస్తాయి. మిగతా గ్రంథమంతా తేనెలు చిలికే జాను తెనుగే. అంతటి లక్షణ పాండిత్యాన్ని కలిగి ఉండి, ఛందస్సుమీద పుస్తకం వ్రాసి, వివిధ వృత్తాలు వ్రాయగలిగిన గౌరన ద్విపద ఛందస్సునే స్వీకరించి రెండు గొప్ప కావ్యాలు వ్రాశాడంటే అతనికి ప్రజలపట్ల ఉండే శ్రద్ధ తెలుస్తుంది. సామాన్య ప్రజల కోసం వ్రాస్తున్నా అతడు కవులను, పండితులను నిర్లక్ష్యం చేయలేదు. తన రచనలోని 'కవితా చమత్కృతి కాంచి, హర్షించి కవులందరును శిరఃకంపంబు సేయ పచరించి వీనుల పండువుగాగ' ఋగ్వేద ప్రసిద్ధుడైన హరిశ్చంద్రుని చరిత్ర వ్రాస్తానన్నాడు.

గౌరన తన కావ్యంలోఋగ్వేద ప్రసిద్ధుడైన హరిశ్చంద్రుని కథ వ్రాస్తానన్నాడేగాని వేదహరిశ్చంద్రుని జీవితాన్ని ఏమాత్రం ముట్టుకోలేదు. వేదహరిశ్చంద్రుని కథకు, ప్రచారంలో ఉన్న హరిశ్చంద్రుని కథకు పోలికలే లేవు. వేదహరిశ్చంద్రుడు ఆడిన మాట రమారమి తప్పి వాయిదాలు వేసే మహారాజు. సొంత కొడుకును పుట్టగానే బలి ఇస్తానని దేవతకు మ్రొక్కుకొని ఏళ్ళూ, పూళ్ళూ అది చెల్లించక సొమ్ములిచ్చి ఒక బ్రాహ్మణ కుమారుణ్ణి కొని అతణ్ణి బలిచేయబోయిన మహానుభావుడు. ఈ హరిశ్చంద్రుని కథకు, దేవీభాగవతంలోను, భాగవతంతోను, మార్కండేయ పురాణంలోను ఉన్న కథలకు సంబంధం లేదు. గౌరన స్కాందపురాణంలోని కథనే తీసుకొని స్వేచ్ఛానువాదం చేశాడు. రసవత్తరమైన కావ్యానికి కావలసిన మార్పులు చేశాడు. గౌరన హరిశ్చంద్ర కావ్యాన్ని వేదం వెంకటరాయశాస్త్రిగారు సటిప్పణంగా 1912లో ప్రకటించి సాహిత్యసేవ చేశారు. అవతారికలో ఇలా వ్రాశారు.

''అతిహృద్యమయిన యీతని యీ గ్రంథమందు రెండుతావుల గొప్ప పొరబాట్లు సంభవించినవి. ఎవ్వియన, గ్రంథారంభ ఘట్టంబునందును, ఉపసంహారమందును వసిష్ఠవిశ్వామిత్రులు నీచులవలె జగడమాడుట, ఆదిలో నరమూర్తులుగాను, అంతములో పక్షీమూర్తులుగాను. ఈ దోషము హిందూమతద్వేషులు మిక్కిలి ప్రాకట్యమునకుం దెచ్చి తమ గ్రంథములందు విస్తరించి మన పెద్దలను తిరస్కరణీయులనుగాను, పరిహాస నీయులనుగాను కావించుచున్నారు. ఇందు ఆదియందలి దుష్టభాగము కథకు ఆవశ్యక మయినందున దానిని అట్లే ముద్రించి, అంతమందలి పక్షియుద్ధభాగము కొన్ని పంక్తులే అగుటచేతను, ప్రక్షిప్తమని ప్రసిద్ధమైయుండుటంబట్టియు ముద్రింపక విడిచినాడ.''

అయితే వసిష్ఠవిశ్వామిత్రుల - పక్షియుద్ధం గౌరన సృష్టించినదేం కాదు. అది భాగవతపురాణంలో ఉంది. చూడండి:

ఇట్లు విశ్వామిత్రుండు హరిశ్చంద్రు నెగులుపరచుట విని, వసిష్ఠుండు, విశ్వామిత్రుని గృధ్రముగమ్మని శపించె; విశ్వామిత్రుడును వసిష్ఠుని బకంబు గమ్మని శపించె. పక్షి రూపులయ్యును వారు యిరువురు యుద్ధంబు సేసిరి. బ్రహ్మ వారించి యెప్పటి నిజాకృతులుగా నొనరించె.[6] (భాగ. 9-192)

గౌరన వివిధ మూలాలను పరిశీలించాడని ఇందువల్ల తెలుస్తుంది.

ఇతనికి ముందు తెలుగులో హరిశ్చంద్రుని కథను రచించినవాళ్ళు లేకపోలేదు. మార్కండేయ పురాణాన్ని అనువదించిన మారన అందులోనే 144 గద్యపద్యాలలో హరిశ్చంద్రోపాఖ్యానాన్ని రమణీయంగా చెప్పాడు. పాత్రచిత్రణ, మనస్తత్త్వ నిరూపణ చక్కగా ఉంది. అయితే గౌరన మారనను పాత్రపోషణలో ఏమాత్రం అనుసరించలేదు. మారన చిత్రించిన హరిశ్చంద్రుడు కొన్ని ఘట్టాలలో దీనుడు. గౌరన పోషించిన హరిశ్చంద్రుడు మంచి రాజసం కలవాడు. ఆడినమాట తప్పడుగాని ఎవరికీ భయపడడు. తాను చేస్తున్నది తప్పనుకోడు.

పెళ్ళాన్ని అమ్ముకోవడంకన్నా దారుణం ఇంకొకటి ఉండదుకదా! మారనవారి హరిశ్చంద్రుడు భార్యను విక్రయిస్తూ

''నృశంసుండను'' అంటే ''ప్రజలను బాధపెట్టేవాడను, దానవుణ్ణి'' అని చెప్పుకొన్నాడేగాని పేరు చెప్పుకోలేదు. (మార్కండేయ పురాణం, 1-214) గౌరన చిత్రించిన హరిశ్చంద్రుడు మొదటనే ప్రజలతో సగర్వంగా ఇలా చెప్పుకుంటాడు.

వినరయ్య, చెప్పెద, విశ్వంబులోన గొనియాడదగు భానుకులమున నేను
జనియించినాడ త్రిశంకునందనుడ సార్వభౌముడ హరిశ్చంద్రు డన్వాడ
సర్వసర్వంసహా చక్రంబునెల్ల నాకౌశికున కిచ్చి యితనికి మున్ను
మేకొన్న ధనమునకై మెలత నమ్మెదను (పుట. 139)

మారనగారి హరిశ్చంద్రుడు అలా ప్రకటించిన వెంటనే ఒక బ్రాహ్మణుడు వచ్చి 'వెల ఎంత' అని అడుగుతాడు. విపుల దుఃఖవేదనతో పలకడానికి రాజు నోరాడకపోతే ఆ బ్రాహ్మణుడే తగినంత ధనం హరిశ్చంద్రుని వల్కలాలలో మడిచిపెట్టి శైబను తలపట్టి ఈడ్చాడు (మార్కండేయ పురాణంలో హరిశ్చంద్రుని భార్య పేరు శైబ, చంద్రమతి కాదు. ఉత్తర భారతదేశంలో ఈమెను తారామతి అంటారు. చంద్రమతి అనే పేరు గౌరనే ప్రచారం చేశాడు). మార్కండేయ పురాణంలో తను తలపట్టి ఈడ్చినప్పుడు శైబ కొడుకుతో

6. ఇది పోతనగారి వచనం. సంస్కృతమూలంలో కూడా ఈ అర్థమున్నదే ఉంటుంది.

అమ్ముడుపోయిన వెనువెంటనే ''నేను దాసిని, అశుచిని. నువ్వు రాజకుమారుడవు. నన్ను ముట్టుకోకూడదు'' అని చెప్పి రోదించే కన్నతల్లి గుండెల కడలి 'పిండలివండుగా' కలత చెందినపుడు చదివేవాళ్ళ కడుపులో చెయ్యి పెట్టి తిప్పినట్టయి గుండెలు అవిసిపోక మానవు.

గౌరన ఇంత హృదయవిదారకంగా చంద్రమతి నోటంట అనిపించలేదుగాని తల్లిని అమ్మాక కొడుకు ఆమెను పోనీక బిగువుగా పైట పెనచిపట్టుకొని కూకటితూగాడుతూ ఉంటే గునుస్తున్నప్పుడు హరిశ్చంద్రుడు చూస్తాడు. అతిదుఃఖితాత్ముడై, అశ్రువు లొలక, అప్పుడు 'తాలిమివదలి' గద్గదకంఠంతో కాలకౌశికుణ్ణి చూసి ఇలా అంటాడు.

నెలమి ధేనువు విక్రయించుచో గ్రేవు
దొలగింతురే తల్లి తొలగగా జేసి?
నా కులభూషణు నా కూర్మిపట్టి
నీకొమారుని గొను మిచ్చెద నీకు.
విలువ వీనికి వేయివేలు నిష్కములు
వలనొప్ప నొసగుము వసుధామరేంద్ర. (హరి. ఉత్తర. 711 నుండి 716)

హరిశ్చంద్రుడు, కాలకౌశికుడు ఖరీదుకోసం కొట్లాడుకొంటారు. హరిశ్చంద్రుడు వేయివేల నిష్కాలు ఇమ్మన్నాడు. కాలకౌశికుడు ఊరకే ఇమ్మంటాడు. ''వీడు నా దాసుడు. వెలది నా దాసి. ఇంకా పుత్రుణ్ణి ఎలా అమ్ముతావో చెప్పు'' అంటాడు. దానికి హరిశ్చంద్రుడు మండిపడతాడు.

ప్రొద్దున లేచి నీ మొగము కన్గొనిన - నిద్దినమున వచ్చు నాపద లెల్ల
నిన్నొక విప్రుని నిందింపనేల - మిన్నక తలపోయ మేదినిలోన
గూడు వడ్డికి నిచ్చి కూర్చెడివారి - జాడ లిట్టివియ, యాశ్చర్య మేమిటికి?
గులము ప్రధానమే గుణము లేకున్న- గలశాబ్ది బుట్టదె కాలకూటంబు?

అని హరిశ్చంద్రుడు నిందిస్తే కాలకౌశికుడు ఊరుకోడు.

నీచాత్మ! ప్రొద్దున నీవు నామొగము - జూచితి గాన నాసొమ్ము నీకబ్బె
దివిరి నాకులము నిందించి నా గుణము - వివరింప నీకేల? వియ్యమందెదవొ?

అని ఎగురుతాడు. ఈ దెబ్బలాట చాలా సహజంగా ఉంది. హరిశ్చంద్రుడు 'వడ్డీకి డబ్బిచ్చేవాడవు' అని కాలకౌశికుణ్ణి ఊరకే నిందించలేదు. చంద్రమతిని కొనడానికి
3 ముందు కాలకౌశికుడు అప్పు ఎగవేసే ఉపాయాలు అడక్కుండానే హరిశ్చంద్రునికి బోధిస్తాడు. వడ్డీకి డబ్బిచ్చి ఎలా ధనార్జన చేయాలో పాఠాలు చెప్తాడు. అప్పుచేసి ఎగవేయడాన్ని ఒక కళగా వర్ణించాడు. దానిని సురవరం ప్రతాపరెడ్డిగారు ఇలా క్రోడీకరించారు.

ధనికుల యిండ్లకేగి, ప్రియములు పలికి, సేవచేసి, నమ్మికపుట్టించి, మనసులు కరగించి, మాయసొమ్ములు, లక్కపొదుపులు, మాయబంగారు, బంగారునీ రెక్కించిన ఇత్తడి ఇనుపసొమ్ములు, మాయమణులు గుప్తంగా రాత్రి తీసుకొనిపోయి, ఇవి దాచుడని లక్కముద్రలు వేయించి, లండుబోతులపూటగా బెట్టి అప్పులుగొని, యెగబెట్టి, పట్టుబడా రచ్చకీడ్వబడి, వారిచ్చు శిక్షలనుభవించి, రాళ్లు మోసి, దెబ్బలు తిని యైనను మందిని ముంచవలెనట.[7] (హరిశ్చంద్ర, ఉత్తరభాగం, పుటలు 151–152)

కాలకౌశికుడు తాను డబ్బు ఎలా కూడబెట్టినదీ వివరించాడు. ఆ ద్విపదలను కూడా సురవరంవారు ఇలాగ సంక్షిప్తంగా వ్రాశారు.[8]

''రోగులవల్ల కొంత లాగి, ప్రేతవాహకుడై కొంత గడించి, గండశాంతులందు, సప్తకములందును (ఏడుగురను పిలిచి పెట్టు శ్రాద్ధములందును) 'తృప్తాఃస్మ'గా భుజించి, గ్రహణకాలములో ఒక మాడయైన దక్షిణగా పొంది, ఇంటింట పంచాంగ పఠనము చేసి, ఆయవారములెత్తి దానము పట్టిన ధాన్యాలను తన వస్త్రమందు మూలమూలలందు మూటలుగా కట్టి, ఏమి లేనినాడు కరతిత్తి వట్టి ముష్టియెత్తి, కూడబెట్టిన పైకాన్ని అప్పులకిచ్చి పత్రాలు వ్రాయించుకొని వృద్ధి, చక్రవృద్ధి, మాసవృద్ధి అని వడ్డీలు గడించాడు.'' (హరిశ్చంద్ర, ఉత్తర. 145, 146 పుటలు)

తనకాలంనాటి వంచకపురోహితులూ, కుహనా జ్యోతిష్కులూ అంటే గౌరనకు ఒళ్లుమంట. నవనాథచరిత్రలో ఒక వంచకపురోహితుణ్ణి ఎంత హేయంగా చిత్రించాలో అంత హేయంగానూ చిత్రించాడు. పురోహితుడు రాజుగారి అమ్మాయిపైన కన్ను వేశాడు. ఆమె అందం ఎలాగైనా అనుభవించాలనుకొన్నాడు. అందుకోసం ఒక గుర్రపువాడితో లాలూచీపడ్డాడు. ''ఫలానారాత్రి గుర్రపుశాల తగలబెట్టు. సరిగ్గా ఆరోజు అది తగలబడుతుందని ముందుగానే నేను రాజుకు జ్యోతిష్యం చెప్తాను. నిదర్శనమయ్యాక రాజు నాకు డబ్బిస్తాడు. అందులో నీకు సగంవంతు ఇస్తాను'' అని కుమ్మక్కు అయ్యాడు. అన్నట్లే జరిగింది. రాజు పురోహితుణ్ణి నమ్మాడు. కొన్నాళ్లు పోయాక ''నీ రాజ్యానికి అరిష్టముంది. నీ కూతుర్ని ఒక మందసంలో పెట్టి ఏట్లో వదిలెయ్యి. శని విరగడ అవుతుంది'' అని పురోహితుడు చెప్తాడు. విధిలేక రాజు అలాగే చేశాడు. ఏట్లో కొట్టుకువచ్చే మందసాన్ని పట్టి అడవిలో రహస్యంగా ఉంచమని శిష్యులను ముందే పురమాయించాడు. వాళ్లూ అలాగే చేశారు. ఆ పెట్టె దొరికినందుకు పురోహితుడు పడ్డ ఆనందం ఇంతా అంతా కాదు. పట్టపగ్గాలులేక ''వగ్గుకోతికి సివము వచ్చిన రీతి'' కుప్పిగంతులు వేశాడు. వాటిని ఆ రోజులలో 'గోవిందగంతులు' అనేవారు. ''ధోవతి మొలనంట బిగించి భుజంమీది తన మూటలు అటుపెట్టి మడమలు మాటిమాటికి పిరుదులు వడిగా తాకేట్టు ముప్ఫయిరెండు గోవిందగంతులలాగ వేసి 'ఇంక నాతరంకా'దని

7. ఆంధ్రుల సాంఘికచరిత్ర, రెడ్డిరాజుల కాలం, పుట 126.
8. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పుటలు 125–126

శిష్యులను పంపించేసి పెట్టె తెరిచాడు. అందులోంచి ఒక ఎలుగుబంటి వచ్చింది (ఎలా వచ్చిందంటే అది వేరేకథ). అది అతణ్ణి రక్కి చంపింది. శిష్యులు వచ్చి మూగారు. ప్రథమ చికిత్స చేశారు. అప్పుడు కొనప్రాణంతో "ఈ సంగతి ఎవరికీ చెప్పకండి. మేదినీనాథు డిట్టి నాదుర్వృత్త మెరిగిన వెడలగొట్టించు మేనెల్ల కుక్కచ్చు లొత్తి" అని రోదిస్తాడు.

ఆ రోజులలో కుక్కచ్చు ఒత్తించడం అన్నది బ్రాహ్మణులకు వేసే గొప్ప శిక్ష. ఈ సంగతి కేతన విజ్ఞానేశ్వరీయంలో విశదపరిచాడు.

చంపినవానిని సరిగా - జంపుట తగు విప్రుడైన జంపక పతి త
త్సంపద గొని తల గొరిగి ప - దంపడి కుక్కచ్చు వ్రాసి దండింపదగున్.
(విజ్ఞాన. 2-64)

ఈ వ్రాసిన కుక్కచ్చు కలకాలం ఉండిపోయేది కాబోలు. కుక్కచ్చు అంటే కుక్కపాదంలాగ కనబడే బొట్టు. ఈ శిక్ష అమలుపరచే విధం కూడా కేతన చెప్పాడు:

తల గొరిగించి కుక్కడుగు తప్పక ఫాలమునందు వ్రాసి ముం
గలధనమెల్ల బుచ్చుకొని గాడిద నెక్కగజేసి గ్రామమున్
వెలువడ ద్రోచిపుచ్చుటయు విప్రుని జంపుట క్షుద్రజంతులన్
జొలువన చంపు తప్పు గలచో దగు చంపుట ధర్మమెమ్మెయిన్. (విజ్ఞాన. 3-42)

తన కాలంనాడు కఠినశిక్ష వేసినవాళ్లను ఎలా అలంకరించేవారో, ఏవిధంగా నడిపించేవారో గౌరన చక్కగా వర్ణించాడు. నవనాథచరిత్రలో సారంగధరుని కథ వుంది. కాళ్లూ, చేతులూ కొట్టెయ్యడానికి అతణ్ణి తీసుకొని వెళ్లడానికి ముందు వర్ణన ఇది:

నడురేయి యగుటయు నగరరక్షకులు - తడయక సారంగధరుని బంధములు
సడలించి వీడిన జడ జక్కవల్లి - మొగలిరేకులు మీద మురువుగా జెరివి
మృగనాభితిలకంబు మెచ్చుడి దీర్చి - పలుచగా గుంకుమపంకంబు నలది
చెలువారు నెరిపట్టు చీర గట్టించి - పొలుపొంద భూషణంబులు చక్కదిద్ది
కలువపువ్వుల దండ గళమున వేసి - వెలయ గప్పురములో వేడెంబు లొసగి
పటుఖడ్గఖేటకపాణులై యతని - నటుతోడుకొనుచును నరుగు నవ్వేళ.
(నవనాథ. పుట. 78)

నేడు ఆంధ్రదేశంలో విశేష ప్రచారం పొందిన సారంగధరుని కథ ఆదిలో గౌరన వ్రాసినదే. అయితే ఈ సారంగధరుడు మన రాజమండ్రి ఏలిన రాజరాజుకుమారుడు కాడు. మాళవదేశంలో మాంధాతపురాన్ని ఏలిన రాజమహేంద్రుని కుమారుడు. ఆ రాజుకు రత్నాంగి అనే భార్య, చిత్రాంగి అనే ఉంపుడుకత్తె ఉన్నారు. రాజు వేటకు వెళ్లినప్పుడు సారంగధరుడు పావురాన్ని ఎగరేయడం, అది చిత్రాంగి మేడపై వాలడం, వెళ్లి తెచ్చుకోబోతే

వద్దని సుబుద్ధి వారించడం మొదలైన ఘట్టాలన్నీ గౌరన వ్రాసినవే. కాళ్లూ, చేతులూ కొట్టేశాక అడవిలో అల్లాడుతున్న సారంగధరుణ్ణి మీననాథుడనే సిద్ధుడు కాపాడి దీక్ష ఇచ్చి సిద్ధుణ్ణి చేసి చౌరంగి అనే పేరు పెడతాడు. మీననాథుని ప్రథమ శిష్యుడు చౌరంగి. ఆ తరువాత ఇంకో ఆరుగురు శిష్యుల్ని చేర్చుకొంటాడు. శివుడు ఆదినాథుడు. ఈ తొమ్మండుగురి చరిత్రే నవనాథ చరిత్ర. ఇది శ్రీనాథుని కాలంలో చాలా ప్రచారంలో ఉండేది కాబోలు. ''ఏ దేవి గొల్చి మత్స్యేంద్రనాథాదులు యోగసంసిద్ధికి నొడయులైరి'' అని హరవిలాసం (1-3)లో వ్రాశాడు. శ్రీనాథునిచేత ఏ శాంతభిక్షావృత్తిరాయడు శివరాత్రిమాహాత్మ్యం చెప్పించాడో అతడే గౌరనచేత నవనాథచరిత్ర ద్విపదలో వ్రాయించాడు. ఇది ఇంతకుముందే చంపూకావ్యంగా తెలుగులో వెలసింది. దానిని శ్రీగిరికవి వ్రాశాడు. ద్విపద కావ్యమైతే జనంలో బాగా ప్రచారం పొందుతుందని ఆ మఠాధిపతి అలా పురమాయించాడు. అతడు కోరినట్లే గౌరన వ్రాసిన నవనాథ చరిత్రే ప్రఖ్యాతమైంది.

''ఈ నవనాథుల చర్యలకు బ్రధానరంగము మహారాష్ట్ర దేశభాగముగా గనబడుచున్నది'' అని కోరాడ రామకృష్ణయ్యగారు వ్రాశారు.[9] అయితే తెలుగుదేశంతో వీళ్లకు సంబంధం లేకపోలేదు. గోరక్షకనాథుడు శ్రీశైలం కొండమీద అల్లమప్రభువుతో వాదించి తన ఓటమి ఒప్పుకొన్నాడట. అల్లమప్రభువు చారిత్రకవ్యక్తే. క్రీ.శ. 1125లో జన్మించి వీరశైవ మతాన్ని స్థాపించి ప్రచారం చేసిన బసవేశ్వరుడు 'అనుభవ మంటపం' అనే వీరశైవ విద్యాపరిషత్తు నెలకొల్పాడు. దానికి అధ్యక్షుడు అల్లమప్రభువు. వీరశైవ తత్త్వబోధకులలో అతడు నిరాడంబరుడు. ఇతణ్ణి ప్రభుదేవుడనికూడా పిలుస్తారు. కన్నడంలో అతడు వ్రాసిన వచనాలు ప్రసిద్ధమైనవి.[10] క్రీ.శ. 12వ శతాబ్దిలోనేకాక నవనాథులు ఇంకా ప్రాచీనులు. నాగార్జుననాథుని శిష్యుడు సిద్ధనాగార్జునుని చర్యలు కూడా తెలుగుదేశంలోనే జరిగాయి. అతడు ''తన పేరు తత్పర్వతస్థలి కీర్తులెనయ గల్పించిన యేలేశ్వరం'' చూశాడు. అక్కడే వాసం కల్పించుకొన్నాడు. ఈనాడు పురాతత్త్వ పరిశోధన శాఖవారు తవ్విస్తే బయటపడిన విజయపురి గౌరనకాలంనాటికి ఉండేదేమో. దానిని ఇలా వర్ణించాడు.

> ఆకృష్ణవేణి మహానది దాటి – వీక నేలేశ్వరవిభు నుత్తరమున
> నాయతంబై మించు నశ్వమేధాద్రి – వాయవ్యమున నవద్వారకవాట
> పరిఘ సమున్నతప్రాకారయంత్ర....

(నవనాథ. పుట 239)

దురదృష్టవశాత్తూ ఇక్కడ గ్రంథం శిథిలమైంది. లేకపోతే ఆ కోటవర్ణన పూర్తిగా దొరికేది. ఇవాళ విజయపురిలో అశ్వమేధఘట్టం అవీ బయటపడ్డాయి. ఈ ప్రదేశంలోని

---

9. నవనాథచరిత్ర, పీఠిక.

10. Struggle for Empire Bharatiya Vidya Bhavan పుటలు 367, 370

కొండనే సిద్ధనాగార్జునుడు పూర్తిగా బంగారం చేద్దామనుకొన్నాడట. ఆ ప్రయత్నాన్ని విష్ణువు పడనియ్యలేదు. సిద్ధనాగార్జునుణ్ణి చంపేశాడు. దానికి కారణం ఇలా చెప్పాడు:

అప్పుండరీకాక్షు డందరు వినగ - నెలు గెత్తి యిట్లనె నిత డహంకార
కలితుడై యనుచితకర్మంబు పూనె - నది యెట్లనిన మానవావళి కెందు
వదలక బహువిధ వ్యవహారములకు - గారణంబై యుండు కాంచనం బిప్పు
డేరీతి శ్రీగిరి యెల్ల దానైన - వారికి వారికి వలసినంతైన
గోరికైకొని తమకును దామె రాజు - లై యల్పు అధికులు నను వాసి లేక
రాయిడింపుడు బ్రతిగ్రహదాముఖ్య - ధర్మంబు లన్నియు దప్పి మర్యాద
నిర్మూలమై భూమి నెరిదప్పుగాన - దడయక లోకహితంబుగా నితని
పొద పణగించితి భువనవిద్వేషు - గాసిగా శిక్షింపగలవా రుపేక్ష
చేసిన దోషంబు సిద్ధించుగాన - నేనే జగంబు లన్నియును రక్షింప
బూనిన లక్ష్మీవిభుడ నని చెప్పి యంతర్హితుడయ్యె...

(నవనాథ. పుటలు 216-247)

సర్వమానవ సమానత్వం ఆర్థికంగా పాలకవర్గాలకు ఇష్టం లేదు. ప్రజలకు మేలుచేసే సిద్ధులను ఆనాటి రాజులు చంపించి వేసేవారు. రసయోగశాస్త్ర నిర్మాతయైన నాగార్జుననికి వ్యాళిసిద్ధుడు అనే ఒక శిష్యుడుండేవాడు. ఇతడు కాయసిద్ధి పొందాడు. ఇతని విద్యను పరీక్షించే నెపంతో రాజు ఇతణ్ణి మరుగుతున్న తైలంలో ఉరకమన్నాడు. సిద్ధుడు ఉరికేముందు కొన్ని మందులు అందులో వెయ్యమన్నాడు. వాటి ప్రభావంవల్ల బ్రతికి కొత్త తేజస్సు పొందవచ్చు అని చెప్పాడు. రాజును నమ్మక మంత్రులకిచ్చాడు. అయితే సిద్ధుడు తైలంలో ఉరికాక రాజు మంత్రులను ఆ మందులు వెయ్యవద్దని వారించాడు. ఎందుకంటే ''ఇతడిందు బ్రతికిన నిలకెల్ల దానె పతియగు నసమానబలరూఢు'' డవుతాడనే.

గోరక్కుడనే సిద్ధుని సౌరాష్ట్రదేశాపతి చంపించబోయాడు. దానికి కారణం ఆ సిద్ధునివద్ద సమాకర్ష విద్య వుంది. కృష్ణకందారుడనే రాజు తాను తవ్వించే తటాకానికి ఒక సిద్ధుని బలివేయాలనుకున్నాడు.[11] కలలో జలదేవత కనబడి పదివేలమంది శూద్రులనో, వెయ్యిమంది వైశ్యులనో, నూరుమంది క్షత్రియులనో, పదిమంది బ్రాహ్మణులనో, లేక ఒక సిద్ధుణ్ణో బలివేయమన్నదట. చెరసాలలో ఉన్న పదివేలమంది ఖైదీలనూ రాజు చంపించబోయాడు. జలదేవత ఒప్పుకోలేదు. తనకు ఈ పీనుగులు పనికిరావంది. రాజ్యంలో ప్రజలంతా తల్లడిల్లిపోయారు. ఎవరిని చంపిస్తాడోనని అందరికీ భయమే. అప్పుడు గోరంటకుడు అనే సిద్ధుడు జాలి పొందాడు.

దయలేక యక్కట ధరణీశ్వరుండు - నయ మేది పాపంబునకు రోయడయ్యె
దీనుల నొరలగా దెగటార్చి పిదప - బూని తా జేసిన పుణ్యమేమిటికి

---

11. ఈ కృష్ణకందారుడుకూడా చారిత్రకవ్యక్తే. క్రీ.శ. 939లో రాష్ట్రకూటసింహాసనం అధిష్ఠించిన మూడవ కృష్ణునికే ఇది నామాంతరం.

ముని ''అహింసా పరమో ధర్మ'' యనుచు - వినుతింతు రటుగాన విడిపింతు వీరి
నేవెరపునసైన నిప్పుడే యనుచు... (నవనాథ. పుట. 278)

రాజుకు జ్ఞానోదయం కలిగించాడు. మొత్తంమీద ఆనాటి సిద్ధులు భూతదయ కలవాళ్లు. ప్రజలకు మేలుచేసేవాళ్ళు. అందుకే వాళ్ల చరిత్రను శాంతభిక్షావృత్తిరాయడు గౌరనచేత వ్రాయించాడు. శైవసిద్ధుల చరిత్రతోబాటు తన కాలంనాటి ఆర్థిక, సాంఘిక పరిస్థితులను, ఆచార వ్యవహారాలను అతడు కళ్లకు కట్టేటట్టు చిత్రించాడు.

ప్రతీ ప్రథమశ్రేణి రచయితా తాను వర్ణించే ప్రతి సన్నివేశాన్ని మనోఫలకంమీద సంపూర్ణంగా సందర్శిస్తాడు. తన సాహిత్య నేత్రంతో సాకల్యంగా దానిని విశ్లేషించు కొంటాడు. తన కథలోని పాత్రలు సజీవ వ్యక్తులనీ, సంఘంలోని వివిధ వర్గాలలోని శక్తులనీ తెలియజేయడానికి ఎంత పొదుపుగా వీలయితే అంత పొదుపుగా సూచనలు ఇస్తాడు. తన ప్రాచీనులు పఠించిన సామెతల, జాతీయాల, పలుకుబళ్ళ సజీవజలాలను తన కవితల కాలువలోనికి మళ్ళించి తన కథల పొలాలను తడుపుకొని కమ్మని పంటలు పండిస్తాడు. వాటి ఫలాలను అనంతర కవులకు దక్కింపచేస్తాడు. గౌరన తన కావ్యాలలో ఇదే చేశాడు. అతని హరిశ్చంద్ర ద్విపదనూ, నవనాథ చరిత్రనూ చదువుతూ ఉంటే సాహిత్యపరిశోధనా నిపుణులకు ఎందరో పూర్వమహాకవుల ప్రయోగాలు కొన్నికొన్ని చోట్ల స్ఫురిస్తాయి. తిక్కనగారూ, పాల్కురికి సోమనాథుడూ, నాచన సోమన మొదలైన వారు ఎక్కడెక్కడ ఎంత చక్కటి సామెతలను వాడారో, జాతీయాలను గుప్పించారో, పలుకుబళ్ళను నడిపించారో తలపునకు వచ్చి గౌరన అటువంటి మెరుపులనే మెరిపించడం చూసి మెచ్చుకొనబుద్ధి వేస్తుంది. ఉదాహరణకు తిక్కనగారు మహాభారతం ఉద్యోగపర్వంలో ధర్మరాజు పలికిన సంధిపలుకులను సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్తున్నప్పుడు ఇలా అంటాడు.

అనుజులకు నడవడియే
మిని జేయగ నేమి జూచి మెచ్చితిగాకీ
పును సాదురేగెనేని న్వి
ను తలపొలమునను కాని నిలువదు సుమ్మీ (ఉద్యోగ. 2-13)

ఇందులో చాలా చరిత్రగల సామెత ఉంది. ''సాదురేగిన తల పొలానగాని ఆగదు'' అన్నది ఎప్పటినుంచో నానుతున్న నానుడి. దానిని గౌరన వాడాడు. చంద్రమతిని అమ్మిన పైకాన్ని తన భత్యానికి జమకట్టుకొని నక్షత్రకుడు హరిశ్చంద్రునితో తగవు పెట్టుకొంటాడు.

ఉరిసిన పుండ్లపై నుప్పును జల్లి - కెరలి జేసెదవు నేగినిసితి నేని
చక్కబెట్టగలేరు సాదురేగినను - బొక్కి నిల్వదు తలపొలమునగాని

(హరి. ఉత్తర. 1257 నుండి 1260)

ఈ ద్విపద పంక్తుల కింద అర్థవివరణ చేస్తూ వేదం వెంకటరాయశాస్త్రిగారు ఇలా తెలియజేశారు.

''సాదు = సాధువైన గోమహిషాధిక్యము, పొక్కి = ఊరికి, తలపొలమునన్ = పొలిమేర దగ్గరి చేనులో'' (పుట. 180)

అయితే 'తలపొలము' అనే మాటకు 'పొలిమేర' అన్న అర్థం తొలిరాయల యుగంలో ఉంది. అన్నమయ్య ఒక పదంలో ఇలా చెప్పాడు.

పుట్టుచు రేగితె పొలమేర నిలువడు
నెట్టననేటి మాట నిజమాయెనేడు. (శృంగార సంకీర్తనలు 20-305)

మన తెలుగు సాహిత్యంలోని ఇతర కావ్యాలలో కూడా ''సాదురేగు'' అనే ప్రయోగం కనబడుతూందిగాని ప్రాచీనరూపం 'సాఁతు' అయి ఉంటుందేమో. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్ర పర్వతప్రకరణంలో చాలాచోట్ల అర్ధానుస్వార యుతంగా ''సాఁతు'' అనే ప్రయోగాలు చేశారు (చలువపట్టువిడిసె సాఁతెల్లననుచు; కదలె నీ సాఁతు నిక్కములకు ననుచు; జయవెట్టు ఇటు గూడి సాఁతెల్ల ననుచు; సననభిముఖుండుగా, సాఁతున నలరి... వగైరా ప్రయోగాలు వరుసగా 290, 291, 299 పుటలలో ఉన్నాయి). పాల్కురికి సోమనాథుని ఎన్ని చోట్లనో అనుకరించిన గౌరన కూడా 'సాతు' అనే ప్రయోగించాడనుకోవచ్చు. ఈ పదానికి ఎన్నో పర్యాయ పదాలు ఉన్నాయి. సొంత్తు, సాత్తూ, సాఁతు, సాతు, సాదు అన్నవి వాటిలో కొన్ని రూపాలు. తెలుగు సామెతలలో సాధారణంగా ప్రాసలుంటాయి. ''సాదురేగినా, బూతురేగినా సవసవగా పోవు'' అన్న సామెతలో శిష్టులు 'సాదు' అనే రూపాన్ని స్వీకరించినా ప్రాస పాటించి ఆదిలో ''సాతురేగినా, బూతురేగినా'' అన్న ప్రయోగమే ఉండి ఉంటుంది. ఈ పదస్వరూపం గురించి చర్చించవలసినది ఎంతో ఉంది. సాతవాహనుల కాలం నాటి విషయాలదాకా ఆ చర్చ సాగవచ్చు.

సాతు అంటే 'బాటసారుల గుంపు' అనే అర్థాన్ని బ్రౌణ్యం ఇస్తుంది. ప్రామాణిక కావ్యాలనుండి ''బేహారంబున నొక సాతుంగూడి పరదేశంబున కరుగుచో'' అనిన్నీ! వనకరి యొక్కటి యా సాతునకుం గదిసి జనచయంబు ద్రుంప దనకుటన్'' అనే ఉదాహరణలు చూపెడుతుంది. బ్రౌణ్యంలోని ఈ ప్రయోగాలవల్ల సాతు ఎప్పుడూ గుంపు అనే అర్థం చేసుకోవాలి.

సాతులో రవాణాకు వాడే గోనెలను కూడా సాతులు అంటారు. ఆ గోనెలను నేసే వాళ్ళను 'సాతులవాండ్లు' అంటారు. ఆ గోనెలను మోసే ఎడ్లను సాతెద్దులు అంటారు. సాతులలోని గోనెలకు వేసే గట్టి ముళ్ళను సాతుముడి అంటారు. ''సాతుముడికి సత్తువేటుపడితే సచ్చిన తాతయినా లేచివస్తాడు. అన్నట్లు'' అనే సామెత ఒకటి మనకు ఉంది. సాతవాహనుల కాలంలో సాతుముడి అన్నది ఉన్నట్టుంది. ఆ రాజవంశంలోని ఒక

రాజు పేరు శాంతమూలుడు అని మన చరిత్రకారులు చదువుతారు గానీ ఇది నిజానికి 'చన్తముల' అని ఇటీవలి పరిశోధనలవల్ల తేలుతూంది. 'చాత్తముట్టు' అనే రూపాన్ని కూడా సదరు పరిశోధకులు ఊహిస్తున్నారు.[12] ఇది బహుశా 'సాంత్తముళ్ళ' అనే రూపమై ఉంటుందని నేను భావిస్తున్నాను.

సాతు రేగుతున్నప్పుడు అందులో కావళ్ళవారు మోపరులు, చావళ్ళవారు, మందళ్ళు మొదలైన గుంపులు, త్రోపులు, తొక్కిళ్ళు పాల్కురికి సోమనాథుడు వర్ణించాడు. సాతు ఒకసారి రేగితే విడియవలసిన చోటగాని ఆగదు. ఆ చోటే గమ్యస్థానంలోని తలపొలము.

పాల్కురికి సోమనాథుని ప్రభావం గౌరనమీద సంపూర్ణంగా ఉంది. బసవ పురాణంలో సోమనాథుడు చెప్పిన ముప్ఫయిరెండు రాగాలను హరిశ్చంద్రంలో గౌరన తన మాతంగకన్యల చేత పాడించాడు. ఆకాలంలోని విద్యావంతులైన మాలెతలు రాజుమీద సూళాది గీతాలు కట్టి పాడారని కూడా గౌరన చెప్పాడు. మన సంగీతసాహిత్యంలో సూళిదుల ప్రసక్తి కనబడ్డా లక్ష్యంగా తాళ్ళపాక అన్నమాచార్యుల వారి సూళాది ప్రబంధం ఒక్కటే ప్రాచీనమైనది లభిస్తోంది.[13] ఇది సుప్రసిద్ధమైన రాగమాలిక మాత్రమేకాక, విశిష్టమైన తాళమాలిక కూడా అని గ్రహించాలి. గౌరన కాలంలో విద్యలవారు ఇటువంటి సంగీత రచనలు చేసేవారు.

పాల్కురికి సోమనాథునిలాగే నాచన సోముని కూడా గౌరన పలుచోట్ల జ్ఞాపకం చేస్తాడు. ఇద్దరూ సామెతల పుట్టలే. అడుగడుగునా నానుడుల కవులే. ఉత్తర హరివంశంలో ఒకచోట నాచన సోమన పాముకాటు సీరదుడిచిన పోవునే (4-150) అని అడిగాడు. గౌరన కూడా చెడు నొకో చీరరాచిన పాముకాటు'' (హరి.ఉత్తర-2134) అని వాడాడు.

ప్రాచీనుల ప్రభావం గౌరన మీద ఎంతగా ఉందో అతని ప్రభావం అనంతర కవుల మీద అంతకు రెట్టింపు కనబడుతుంది. గౌరన పిమ్మట హరిశ్చంద్రుని కథ చెప్పిన ప్రతీ ఒక్క కవిలోనూ అనుకరణలు కనబడతాయి. అలాగే సారంగధర చరిత్రలో చేమకూర వెంకట రాజంతటి ప్రతిభావంతుడే గౌరనను మక్కికి మక్కి అనుకరించాడంటే గౌరన గొప్పతనం తెలుస్తుంది. వేమనగారు చాలాచోట్ల గౌరన భావాలకు ప్రతిధ్వనులైన పద్యాలను చెప్పారు. ఉదాహరణకు నక్షత్రకుని కాలకౌశికుడు మెచ్చుకుంటూ ఇలా అంటాడు.

వటు శిరోమణి, భవద్వాక్యంబు మాకుఁ
బటు బుద్ధి దలపోయ బ్రహ్మమంత్రంబు

12. తెలుగుమడుగులు – పుట 19 నుండి.

13. శృంగార సంకీర్తనలు – సంపుటం 31 – సంకీర్తన సంఖ్య 478

పన్నిన చీకటి బాసి వెల్గింప
సన్నపు దీపంబు సాలదే తలప?
చిన్నవైనను బుద్ధి బెద్దవునీవు; (హరి. ఉత్తర-785 నుండి 789)

ఈ భావాలనే వేమన గారు ఇలా చెప్పారు.

అంకి లెరిగి మాటలాడ నేర్చినపుడు
పిన్నపెద్ద తనము లెన్ననేల
పిన్న చేతిదివ్వె పెద్దగా వెలుగదా
విశ్వదాభిరామ వినురవేమ.

వేమనగారు ప్రజలనుండి వచ్చినవారు. గౌరన తనకాలంనాటి సమాజాన్ని సాకల్యంగా పరిశీలించిన చైతన్యవంతుడైన కవి. వర్గతత్త్వాలను, మనస్తత్వాలనూ విశ్లేషణ చేయగలవాడు. నాటకీయత తెలిసిన ప్రతిభావంతుడు. అందుకే ఆనాటి ప్రజల సంభాషణలనే అతడు తన పాత్రల నోట పలికించి నాటకంలాగా కొన్ని ఘట్టాలు వ్రాశాడు. అతడు కల్పించిన పాత్రలు ఆ పేర్లతో నేటికీ నిలిచిపోయాయి. నక్షత్రకుని పాత్రను సృష్టించినది ఇతడే. కాలకౌశికుని భార్యకు కలహకంఠి అనే పేరు పెట్టిందితడే. సారంగధరుని చెలికాని పేరు సుబుద్ధి అని పెట్టింది కూడా గౌరనే.

నాటకాలు వ్రాయకపోయినా ఇతడు సృష్టించిన పాత్రలే ఇటీవల స్టేజి నాటకాలకు పనికివచ్చాయి. ఇతడు కల్పించిన సన్నివేశాలనే అనంతర రచయితలు వాడుకొన్నారు. ఇలా శాశ్వతంగా నిలిచిపోయి బహుళప్రచారం పొందిన కావ్యాలు వ్రాసిన గౌరన ధన్యుడు.

ఇతని పేరు కలకాలం చెప్పుకొని ఇతని కావ్యాలను చదవడం ఆంధ్రుల విధి.

వెన్నెలకంటి అన్నయ్య

భట్టి విక్రమార్కుని కథలు, విక్రమార్కుని సింహాసన సాలభంజికల కథలు అంటే సామాన్య ప్రజలకు ఎంత ఇష్టమో భేతాళుని కథలన్నా అంత ఇష్టమే. విక్రమార్క చరిత్రను జక్కన, సింహాసన ద్వాత్రింశికను కొరవి గోపరాజు రచించిన కాలాల మధ్యలోనే వెన్నెలకంటి అన్నయ్య భేతాళ పంచవింశతిలోని కొన్ని కథలను తన షోడశకుమార చరిత్రలో వాడుకొన్నాడు. అందువల్లనే కవి గద్యలో తాను వ్రాసిన కావ్యం 'షోడశకుమార చరిత్రము' అని స్పష్టంగా చెప్పినా దీనికి భేతాళ పంచవింశతి అనే పేరు నిన్న మొన్నటి దాకా, అంటే చిన్నయసూరి కాలందాకా ఉండేది.

అయితే ఈ షోడశకుమార చరిత్రలో ఒక భేతాళ పంచవింశతి కథలు మాత్రమే కావు. దశకుమార చరిత్రలోని కొన్ని కథల పోలికలు, విక్రమార్క చరిత్రలోని కొన్ని సంఘటనల అనుకరణలు, కథాసరిత్సాగరంలోని కొన్ని కెరటాల తుళ్లింతలు, మంచెన కేయూరబాహు చరిత్ర ప్రభావం దీనిలో కనబడుతుంది. ఈ గ్రంథాన్ని శ్రద్ధగా పరిశీలిస్తే ఇది జక్కన కాలానికి తరువాత వ్రాసినదే అనిపిస్తుంది. ఇది శ్రీనాథుని రచనలు ప్రచారంలోనికి వచ్చాక వ్రాసినదేమో అని చెప్పవచ్చు. శ్రీనాథుని ప్రభావం కూడా కనబడుతుంది. శ్రీనాథుడు శృంగారనైషధంలో తన కృతిపతిని ఇలా సంబోధించాడు.

శ్రీహర్ష సుకవికవితా - వ్యాహారకథా సుధారసాస్వాదసుఖ
శ్రీహర్షోదయ సత్యస - మాహితమహితాంతరంగ మామిడిసింగా! (నైష. 3-11)

వెన్నెలకంటి అన్నయ్య కూడా తన కృతిపతిని ఇంచుమించు ఇలాగే సంబోధించాడు. చూడండి.

శ్రీహర్ష ముఖ్యసుకవి స-మాహిత కావ్యప్రపంచమాధుర్యసుధా
గాహనలీలారసిక - వ్యాహారవిహారమంత్రి యన్నయసూరా! (షోడశ. 6-1)

శ్రీహర్ష పండితుడు క్రీ.శ. 1189-1195 ప్రాంతాలవాడు. ఇతని నైషధీయ చరిత్రానికి మొదటి వ్యాఖ్యాత విద్యాధరపండితుడు క్రీ.శ. 1250 లేక 1260 ప్రాంతాలవాడు. రెండవ వ్యాఖ్యాత చెండూ పండితుడు క్రీ.శ. 1297లో వ్యాఖ్య రచించినట్టు తనే చెప్పుకొన్నాడు.[1] క్రీ.శ. 1300 తర్వాత అది బహుళ ప్రచారం పొందింది అని చెప్పుకోవచ్చు. మడికి సింగన శ్రీహర్షుణ్ణి పూర్వకవిస్తుతిలో పేర్కొన్నాడు.

వ్యాసవాల్మీకి శుకకాళిదాసబాణ
హర్ష ణాదుల నాద్యుల నాత్మ నిలిపి
సకల భాషారసజ్ఞుల సముల నన్న
యార్యతిక్కకవీంద్రుల నభినుతింతు. (జ్ఞానవాసిష్ఠం. 1-5)

1. శృంగారనైషధ సర్వంకష, ప్రకాశకవిజ్ఞప్తి, పుట 27.

చిమ్మపూడి అమరేశ్వరుడు చేసిన అర్వాచీన సంస్కృత భాషాకవుల పట్టికలో హర్షుని పేరు లేదు.[2] వెన్నెలకంటి అన్నయ్యా మడికి సింగనకన్న ప్రాచీనుడు కాడేమో. ఇతని, కాలాన్ని నిర్ణయించడానికి గ్రంథంలో ఏమీ ఆధారాలు లేవు. ఈ పుస్తకం అవతారిక దొరకలేదు. అందుచేత ఆశ్వాసాంత పద్యాలలోని సాక్ష్యాలను బట్టి కాలనిర్ణయం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఒక పద్యంలో కవి తన కృతిపతిని ఇలా నుతించాడు.

సరసానందనసత్కళాగమపరీక్షాకృష్ణకందార భా
స్వరనానారసభావనిర్మథనభోజక్ష్మావవిద్యానిరం
తరగోష్ఠీజగదేకమల్లబహుశాస్త్రగ్రంథసిద్ధాంతవి
స్తరవిజ్ఞానకవిత్వతత్త్వకలనాసర్వజ్ఞసోమేశ్వరా! (షోడశ. 7-128)

ఇందులో కృష్ణకందారుడు, భోజుడు, జగదేకమల్లుడు, సర్వజ్ఞసోమేశ్వరుడు అనే చారిత్రక వ్యక్తులున్నారు. వీళ్ళ కాలాలు తెలుస్తున్నాయి. ఈ ప్రసిద్ధులతో కృతిపతిని పోల్చినందువల్ల కవి వీళ్ళ కాలానికి అర్వాచీనుడే అవుతాడు. ఎంత అన్నది వేరే ప్రశ్న.

1.	భోజుడు ధారాపురాధిపతి	క్రీ.శ. 11వ శతాబ్ది
2.	సర్వజ్ఞ సోమేశ్వరుడు పశ్చిమ చాళుక్య చక్రవర్తి	క్రీ.శ. 1126-1138
3.	జగదేకమల్లుడు	క్రీ.శ. 1148
4.	కృష్ణకందారుడు యాదవరాజు	క్రీ.శ. 1250

ఈ చారిత్రక వ్యక్తులలో ఆఖరివాడు క్రీ.శ. 1250 ప్రాంతాలు కనుక వెన్నెలకంటి అన్నయ్యా కూడా ఆ కాలంవాడే అని నిడుదవోలు వెంకటరావుగారు అభిప్రాయపడు తున్నారు.[3] అయితే మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఇతణ్ణి రాష్ట్రకూట రాజుల్లో మూడవ కృష్ణునిగా గుర్తించారు.[4] అతని కాలం క్రీ.శ. 939. పశ్చిమచాళుక్య చక్రవర్తినీ, రాష్ట్రకూటరాజునూ పేర్కొనడంవల్ల కవి అప్పటివాడే కానక్కర్లేదు. దూబగుంట నారాయణకవి తన పంచతంత్రంలో తన కృతిపతిని భోజ సర్వజ్ఞ సోమేశులతో సరిపోల్చాడు. చూడండి.

రామరఘురంతిసగరధర్మజదిలీప
భోజసర్వజ్ఞసోమేశరాజసరణి
ధాత్రిపాలించె తమ్మభూధవసుతుండు
శాశ్వతంబుగ బసవభూమీశ్వరుండు. (పంచ. 1-38)

దూబగుంట నారాయణకవి కాలం మనకు చూచాయగా తెలుసు. ఇతడు గజపతుల సామంతుడుగా ఉదయగిరిని పాలించిన బసవరాజు కాలంవాడు. నారాయణకవి

2. సమగ్ర ఆంధ్రసాహిత్యం, పద్మనాయకయుగం, 1964.
3. తెనుగుకవుల చరిత్ర, పుట 380.
4. History of Reddi Kingdoms, పుట 504.

పేర్కొన్నట్టే భోజసోమేశ్వరులను ఆశ్వాసాంత పద్యాలలో పేర్కొన్న అన్నయ కూడా ఆ కాలంవాడే కావచ్చు.

ఆశ్వాసాలలోని ఆద్యంత పద్యాలవల్ల షోడశకుమార చరిత్ర కృతిపతి చాలా చాలా గట్టివాడని తెలుస్తున్నది. అతడు ఆఖ్యానం, కల్పితకథ, ఉపాఖ్యానం, ఆఖ్యాయికా ప్రపంచరహస్య వ్యాఖ్యాన వ్యవహారణ ప్రఖ్యాత చరిత్రుడు (139). శ్రీరామాయణం, భారతం, పారాశరసూక్తి, కూర్మపురాణం, పద్మపురాణం మొదలైన ప్రముఖమైన అపార పురాణ విలోచన గౌరవ మతిధన్యుడు (2-185). కేవల పండితుడే కాడు, అశ్వశిక్షకుడు కూడా ఇతడు 'సింధురాత్త ప్రచురతురగ సేవ్యవాజి శిక్షణుడు' (5-158). శైవసిద్ధాంతవేది (1-40). ఇతనికి బోలెడంత శిష్యవర్గం ఉంది (61). నాటకముఖకోహళాది నాట్యరహస్యాల ఉద్ఘాటన నిపుణప్రజ్ఞాచాతుర్యుడు. నూత్న భరతాచార్యుడు (8-91).

ఈ కృతిభర్త పేరు సూరామాత్యుడు. కృతికర్త తండ్రి పేరు కూడా సూరామాత్యుడే. ఇద్దరిదీ హరితసగోత్రమే. అందుచేత అన్నయ తన తండ్రికే ఈ షోడశకుమార చరిత్రను అంకితమిచ్చాడని పరిశోధకులందరూ భావిస్తున్నారు. భావిపరిశోధనవల్ల కానీ ఇంతకన్నా వివరాలు లభించవు. ఈ గ్రంథం కూడా పూర్తిగా దొరకలేదు. ఇది ఎనిమిది ఆశ్వాసాల కావ్యం. అయినా మూడో ఆశ్వాసం, నాలుగో ఆశ్వాసం పూర్తిగా దొరకలేదు. మిగతా ఆశ్వాసాలలో శైథిల్యాలు లేకపోలేదు. గ్రంథపాతాలు కూడా ఉన్నాయి. అయినా ఉన్న గ్రంథంతో ఆ షోడశకుమారులెవరో, వాళ్ళ హోదాలేమిటో, కథలేమిటో చాలామటుకు తెలుసుకోవచ్చు. చూడండి.

షోడశకుమార చరిత్ర కథ

1. కమలాకరుడు - రాజకుమారుడు:

ఇతడు జనమేజయ మహారాజు కొడుకు. ఇతనికి ఎనమండుగురు మంత్రి కుమారులు, నలుగురు దండనాయకకుమారులు, ముగ్గురు పురోహిత కుమారులు. వెరసి పదిహేనుమంది స్నేహితులు తనతో కలుపుకొని వీళ్ళంతా షోడశకుమారులు, ఈ పదహారుమంది దండకారణ్యంలో ఒక సాధకునికి సహాయం చేయబోయారు. అపుడు ఒక పన్నగంవల్ల వాళ్లు ఆపన్నులయ్యారు. చెట్టుకొక పిట్టగా చెల్లాచెదరయ్యారు. కొన్నాళ్ళకు కమలాకరుడు బోయపల్లెలో ఒక నెమలిని చూశాడు. నిమరగానే ఆ మయూరం తన స్నేహితుడు భీమభటుడుగా మారిపోయాడు. (ద్వితీయ ఆశ్వాసం - 1 నుండి 16 దాకా.)

2. భీమభటుడు - సేనాని కొడుకు:

ఆ పన్నగంవల్ల ఆపన్నులయ్యాక భీమభటుడు ఉజ్జయినిలో ఒక ముసలిదాని ఇంటికి వెళ్ళాడు. అది మంత్రకత్తె. అతణ్ణి అది మోసం చేయబోయింది. అతడు దాన్నే మోసం

చేశాడు. చివరికి మంత్రపాశంతో అతణ్ణి నెమలిని చేసింది. ఆ నెమలి బోయలకు దొరికింది. రాజకుమారుని స్పర్శవల్ల నిజరూపం వచ్చింది. (ద్వితీయ. 17 నుండి 26 దాకా)

'ఈ కిరాతులు మనల్ని చంపుతారు. మంత్రపాశం చేత మయూరాలమై ఎగిరిపోదాం' అన్నాడు భీమభటుడు. ఎగిరి ఎగిరి ఒక చెట్టు క్రిందకు చేరారు. ఆ ఎండుచెట్టు చంద్రోదయంకాగానే చిగురొత్తి మొగ్గవేసి పూసింది. ఉన్నట్టుండి చెట్టు వాళ్ళ స్నేహితుడు కరుణాకరుడుగా మారిపోవడం జరిగింది. (ద్వితీయ. 27 నుండి 30 దాకా)

3. కరుణాకరుడు (గుణాకరుడు?) - మంత్రికుమారుడు:

పాములవల్ల చెదరిపోయాక కరుణాకరుడు అడవిలో ఒక మునిశాపం వల్ల చెట్టుగా మారాడు. మిత్రదర్శనం వల్ల శాపవిమోచనం జరిగింది. (ద్వితీయ. 30-34)

ఈ స్నేహితులు ముగ్గురూ కలుసుకొన్నాక ఆకాశంలోంచి ఒక వ్యక్తి వీళ్లను చూసి క్రిందికి దిగాడు. అతడు పాంకోళ్ళు తొడుక్కున్నాడు. అతని పక్కన ఒక యువతి ఉంది. అతడు వీళ్ళ మిత్రుడు చిత్రకరుడే. (ద్వితీయ. 35 నుండి 36)

4. చిత్రకరుడు - మంత్రి కుమారుడు:

పామువల్ల చెదిరిపోయిన చిత్రకరుడు అడవిలో ఇద్దరు రాక్షసులు దెబ్బలాడు కొనడం చూచాడు. వాళ్ళు ఒక పాత్ర, ఒక దండం, ఒక పాంకోళ్ళ జతకోసం తగువులాడు కుంటున్నారు. అవి మంత్రశక్తులు గలవి. ఆ రాక్షసుల్ని పరుగుపందెం వేసుకొనమని చెప్పి మంత్రసామగ్రిని దక్కించుకొని మంత్రికుమారుడు ఎగిరిపోయాడు. ఒక ఊళ్ళో రాజుగారి కుమార్తెను చూసి మోహించాడు. పాదుకల శక్తితో కన్నెమాళిగపై దిగి ఆమెను కలుసుకొన్నాడు. రహస్యంగా కొన్నాళ్ళు సాగింది. రాజుకు తెలియగానే ఆమెతోపాటు ఎగిరిపోయాడు. స్నేహితులను చూసి దిగాడు. (ద్వితీయ. 35 నుండి 60)

తన దగ్గర ఉన్న పాత్ర పంచభక్ష్యపరమాన్నాలూ ఇస్తుంది. లాతంతో ఊళ్లూ నగరాలూ నిర్మించవచ్చు. చిత్రకరుడు పట్టణం నిర్మించాడు. రాజకుమారుడు ముగ్గురు స్నేహితులతో హాయిగా రాజ్యం పాలిస్తున్నాడు.

(రాక్షసుల దగ్గర వస్తుసామగ్రిని చిక్కించుకొనడం, ఊళ్ళు నిర్మించే మంత్రదండం మొదలైనవి విక్రమార్క చరిత్రలోని కథలోనూ ఉన్నాయి. (చూ. జక్కనకావ్యం, ద్వితీయ. 4 నుండి 12 దాకా నెంబరు పద్యాలు).

మంత్రదండం వ్రాసిన ఊరును కమలాకరుడు పాలిస్తున్నాడని తెలిసి కాంతిమంతుడు, బుద్ధిమంతుడు అనే మిత్రులు ఆ ఊరు చేరుకొన్నారు. వాళ్ళు తమ కథలు చెప్పుకొన్నారు. (ద్వితీయ. 66-68)

5. కాంతిమంతుడు – మంత్రికుమారుడు:

పాముపల్ల చెదిరిపోయాక కాంతిమంతుడు ఒక ఊరు చేరుకొన్నాడు. ఆ రాజుగారి కూతురు మదిరావతిని చూసి మోహించాడు. ఆమెకూడా అతణ్ణి ప్రేమించింది. అయితే రాజు ఇంకొకరితో వివాహాన్ని నిర్ణయించాడు. కాంతిమంతుడు విరహంతో, విచారంతో బయటకు వెళ్ళాడు. ఊరవతల అతణ్ణి స్నేహితుడు బుద్ధిసహాయుడు కలుసుకొన్నాడు. (ద్వితీయ. 67-90)

6. బుద్ధిసహాయుడు – మంత్రికుమారుడు:

పాముపల్ల ఎడబాటు కలిగాక బుద్ధిసహాయుడు ఎన్నో అడవులు గడచి ఒక సరస్సు చేరుకున్నాడు. అక్కడకు కొందరు యువతులు స్నానానికి వచ్చారు. వాళ్ళ నొక ఏనుగు బెదిరించింది. ఒక యువతి భయపడి పరుగెత్తి బుద్ధిసహాయుడిని కౌగలించుకుంది. ఆమె మదిరావతి పినతల్లి కూతురు. యిద్దరూ ప్రేమించుకున్నారు. కాని విడిపోవలసి వచ్చింది. విరహంతో తిరుగుతూ బుద్ధిసహాయుడు కాంతిమంతుణ్ణి కలుసుకున్నాడు.

(ద్వితీయ. 91-106)

కాంతిమంతుని ప్రేయసి తన పెళ్ళినాడు లగ్నానికి ముందురాత్రి కాముని గుడికి వచ్చి గర్భగుడిలో ఉరిపోసుకొని చచ్చిపోదామనుకొంది. ఆలయంలో స్నేహితులిద్దరు కాచుకొని ఉన్నారు. ఆమెను వారించాడు. బుద్ధిసహాయుడు ఆడవేషం వేసుకొని బయటకు వచ్చి పల్లకీ ఎక్కి అంతఃపురానికి వెళ్ళిపోయాడు. అక్కడ పినతల్లి కూతురు పెళ్ళికి వచ్చిన ప్రేయసిని కలుసుకొన్నాడు. కాపలావాళ్ళ కన్ను కప్పి అడవిలోకి వచ్చి కాంతిమంతుణ్ణి, అతని ప్రియురాలిని కలుసుకొన్నాడు. ఈ జంటలు రెండో కమలాకరుని సంగతి విని ఆ నగరం చేరుకున్నారు. (ద్వితీయ. 107-135)

కమలాకరుడు ఒకనాడు ఏనుగు వేటకు వెళ్ళాడు. అడవిలో దుర్గాలయంవద్ద నరబలి ఇస్తున్న కిరాతుల్ని చూశాడు. రాజకుమారుణ్ణి చూసి వాళ్లు బంధితుణ్ణి వదిలి పారిపోయాడు. ఆ బంధితుడు రాజకుమారుని స్నేహితుడు వసంతకుడే.

(ద్వితీయ. 136-138)

7. వసంతకుడు – పురోహితపుత్రుడు:

పాముపల్ల ఎడబాశాక వసంతకుడు అడవిలో తిరుగుతున్నాడు. ఒక బేహారిని దొంగలు కొల్లగొడుతూ ఉంటే రక్షించాడు. ఆ వైశ్యుడు అతణ్ణి ఒక ఊరికి తీసుకుపోయాడు. ఆ ఊళ్ళో రూపిణి అనే వేశ్య ఉంది. అది వసంతకుణ్ణి చూసి ప్రేమించింది. వాళ్లు ఆనందంతో ఓలలాడుతూ ఉంటే వేశ్యమాత ధనాశచేత మందుపెట్టి వసంతకుణ్ణి నదిలో పారవేయించింది. నీళ్ళలో పడ్డ వసంతకుడు ఒక చచ్చిన ఏనుగు డొక్క తేలుతూ వుండే దానిలోకి ఎక్కాడు. దానినొక మాహాపక్షి ఎగరేసుకుపోయింది.

లంకాద్వీపంలో పడేసింది. లంకనప్పుడు విభీషణుడు పాలిస్తున్నాడు. వసంతకుని కథ విని అతనికి శంఖచక్రాలు, గదాంబుజాలూ ఇప్పించి మళ్లా ఆ రూపిణి ఇంటిదగ్గరనే తన రాక్షసులచేత విభీషణుడు వదిలిపెట్టించాడు. శంఖచక్రాలతో వచ్చిన వసంతకుడు విష్ణువులాగే ఉన్నాడు. వేశ్యమాత ఆశ్చర్యపోయి అత్యాశ జెంది బొందితో వైకుంఠం వెళ్లాలనుకుంది. వసంతకుడు ఆమెకు తగిన గుణపాఠం చెప్పాడు. ఆ తరువాత మంత్రదండంతో వ్రాసిన పట్టణాన్ని కమలాకరుడు ఏలుతున్నాడని విని రూపిణితో కలిసి అక్కడకు బయలుదేరాడు. దారిలో కిరాతులు ఆమెను బంధించి గూడెంలో పెట్టారు. అతణ్ణి బలివేయబోయారు. ఇదీ అతడి కథ. (ద్వితీయ. 137-172)

కమలాకరుడు వసంతకుని కథ విని కిరాతులగూడెంపై దాడి చేయించి రూపిణిని విడిపించి కలుసుకొన్న స్నేహితులతో సుఖంగా ఉంటున్నాడు. (దీనితో ద్వితీయాశ్వాసం ముగిసింది.)

(ఈ వసంతకుని కథ దశకుమార చరిత్రలోని అపహారవర్మ కథ వంటిది. అందులో అతడు వేశ్యకు ఇంకొకరకంగా బుద్ధి చెప్తాడు.)

8. విక్రమకేసరి – సేనానికొడుకు:

పాముపల్ల విడిపోయాక ఇతడు ఎక్కడికి వెళ్లాడో, ఏయే సాహసాలు చేశాడో తెలియదు. ఎందుచేతనంటే, ఇతని కథ సగంలోంచి మొదలవుతుంది. ఇతనికి భేతాళుడు త్రివిక్రమసేనుని వినుత చరిత్రాన్ని చెప్పాడు. ఇతనికి కూడా వాహనంగా ఉండడానికి అనుకూలమైన మంత్రాన్ని చెప్పాడు. దాని ప్రభావంవల్ల విక్రమకేసరి భేతాళ వాహనుడై తన స్నేహితుడు కమలాకరుని కలుసుకొన్నాడు. ఇతనికి భేతాళుడు చెప్పిన కొన్ని కథలే ఈ ఆశ్వాసంలో ఉన్నాయి.

పంచమాశ్వాసం పూర్తిగా ఇతని కథే. వాటి వివరాలు:

1. భోజనవనితాశయ్యాచంగుల కథ (3-26)
2. జ్ఞానవిజ్ఞానశూరుల కథ (28-45)
3. మదనమంజరి కథ (46-59)
4. దేవసేనచరిత్రం (60-86)
5. వైశ్యకన్య కథ (ముగ్గురుతండ్రుల పిండప్రదాన సమస్య) (87-123)
6. ధర్మరాజు కథ (విక్రమకేసరి జవాబు చెప్పలేకపోయింది) (124-139)

ఈ కథల తరువాత భేతాళ పంచవింశతి ఉపసంహారం కథ కొంత ఉంది. త్రివిక్రమసేనుణ్ణి బ్రాహ్మణులు బలివేయబోవడం, భేతాళ దర్శనం, వరం ఇవ్వడం మొదలైనవి. (140 నుండి చివరిదాకా)

రాజకుమారుడు నిండుసభలో ఉన్నాడు. అతనివద్దకు కళావతి అనే యువతి ఒక చిలుకను తీసుకొచ్చింది. అది అసాధ్యపు చిలుక, కమలాకరుడు ప్రేమిస్తున్న హంసావళి అనే రాజకన్యకూ, అతనికీ నలుని, దమయంతిని గూర్చిన కలహంసలాగ కూర్చడానికి ప్రయత్నించింది. ఆ చిలుకను రాజకుమారుడు మెచ్చుకొని దువ్వేసరికి అది అతని స్నేహితుడు వివేకనిధి రూపాన్ని పొందింది. (షష్ఠా. 1-60)

9. వివేక నిధి – మంత్రికుమారుడు:

పాముపల్ల విడిపోయాక వివేకనిధి చాలాదూరం వెళ్ళి కాశ్మీరభువిలో శరదనగరం చెంత అడవిలో ఒక మునిశాపంవల్ల చిలుకగా మారిపోయాడు. ఈ స్నేహితులు కాంక్షించే హంసావళి అనే మాళవదేశపు రాజకుమార్తెను అతనికి సుముఖురాలిని చేసి నీ స్నేహితుణ్ణి నువ్వు కలుసుకొన్నప్పుడు నీకు శాపవిమోచనం అని ముని చెప్పాడు. (వివేకనిధి చిలుకరూపంలో కళావతికి చిక్కాడు. ఆమె యింటికి సిద్ధులు వస్తూ ఉంటారు. ఒక సిద్ధుడు కమలాకరుని చిత్రాన్ని, హంసావళి చిత్రాన్ని ఫలకాలపైన వ్రాసి తనే వీళ్ళకు సమాధానం కలిగించమని చిలుకకు చెప్పాడు. చిలుక మొదట హంసావళిని కలుసుకొని ఆమెకు కమలాకరునిమీద మరులు పుట్టించింది. ఆమె వ్రాసిన రెండర్థాల పద్యం పట్టుకొని ఇక్కడకు వచ్చింది) ఇప్పుడు ఇలా శాపవిమోచనం కలిగింది. (షష్ఠా. 62-68)

తన అసాధారణపు చిలుక మనిషిగా మారినందుకు కళావతి చింతించింది. అప్పుడు కమలాకరుడు తన స్నేహితుడు చిత్రకరుడి మంత్రదండం చేత సర్వజ్ఞత్వం ఉన్న చిలుకను వ్రాయించి ఇప్పించాడు. తరువాత హంసావళిని కలుసుకొనడానికి ఆమె దేశానికి దిగ్విజయం నెపం మీద వెళ్ళాడు. దారిలో ఒక విమానంలో ఎవరో వ్యక్తి ఎగిరివెళ్ళడం రాకుమారుడు చూశాడు. విమానం ఆగింది. అందులోని వ్యక్తి దిగాడు. అతడు తన స్నేహితుడు ప్రభాకరుడే. (షష్ఠా. 69-79)

10. ప్రభాకరుడు – మంత్రికుమారుడు:

పాముపల్ల చెదిరిపోయాక ప్రభాకరుడు అడవిలో ఒక మునిని కలుసుకొని నమస్కరించాడు. అతడు దివ్యదృష్టితో చూచి విచారించాడు. 'నానాయాతనలూ పడి నలుగురు యువతులను పెళ్ళి చేసుకొని చివరకు మీ స్నేహితుణ్ణి కలుసుకొంటావు' అని చెప్పాడు. కనకపురిని చూసినవాళ్ళకు తన కుమార్తె కనకలేఖను ఇచ్చి పెళ్ళిచేస్తానని వర్ధమానపురం రాజు చాటించాడు. ఆ రాజకుమార్తెమీది మోహంవల్ల ప్రభాకరుడు చూడకుండానే చూశానని మొదట బుకాయించాడు. తరువాత ఎన్నో కష్టాలుపడి అది చూశాడు. ఆ గదులలో చైతన్యం లేకుండా పడుకొన్న ముగ్గురు కన్యలున్నారు. చివరి కన్య తాను వలచిన కనకరేఖ. ఆమె మరణించిందా? ప్రభాకరుడు విలపించాడు. అంతలో ఒక మాయగుర్రం వచ్చి అతణ్ణి ఒక్కసారి వూపుగా డెక్కతో కొట్టింది. అతడు కనకపురి నుంచి

ఎగిరి వర్ధమానపురంలో పడ్డాడు. కనకపురి చూశానని చెప్పాడు. మూడు మంచాలమీద ముగ్గురు కన్యలను చూశానన్నాడు. అది వినగానే కనకరేఖ మరణించింది. ఆమె ప్రాణాలు కనకపురిలో ఉన్న కన్యలో కలసిపోయాయని అతడు మళ్ళీ ప్రయాసపడి ఆ ద్వీపానికి వెళ్ళాడు. కష్టాలు పడి నలుగురు కన్యలను పెళ్ళి చేసుకొని విమానం పొందాడు. దానిలోనే వస్తూ ఇలా స్నేహితుణ్ణి కలుసుకొన్నాడు. (షష్ఠ. 81 నుండి చివరదాకా)

దిగ్విజయం చేస్తూ కమలాకరుడు కప్పాలు చెల్లించే రాజును మన్నిస్తూ సాగిపోయాడు. పుత్రవర్ధనం అనే పురాన్ని ఏలే రాజు మాత్రం వచ్చి కానుకలు ఇవ్వలేదు. అతణ్ణి శిక్షించడానికి ఆ పురంమీద దండెత్తాడు. ఆ కోటలోనుంచి ఇద్దరు వీరులు రథమెక్కి యుద్ధానికి వచ్చారు. తీరా చూస్తే వాళ్ల కమలాకరుని మిత్రులే. ఒకడు దృఢముష్టి, రెండవవాడు దీర్ఘబాహు. వాళ్ళు తమ కథలు ఇలా చెప్పారు. (సప్తమ. 1-7)

11. దీర్ఘబాహుడు – సేనాని కొడుకు:

పాామువల్ల విడిపోయాక దీర్ఘబాహుడు వెళ్ళి వెళ్ళి ఒక ఊళ్ళో ఒక బ్రాహ్మణుని ఇంటిముందు ఆగాడు. ఆ ఇల్లాలు - ముసలిది - ఏడుస్తూంది. ఎందుకంటే ఆరోజు తన కొడుకు మరణిస్తాడు.

12. దృఢముష్టి – సేనాని కొడుకు:

ఆ వూరి రాజుగారి కుమార్తె రోజూ రాత్రికొక యువకుణ్ణి రప్పించుకొంటుంది. అలా పిలిపించుకొన్నవాడు రాత్రి మరణిస్తాడు. ఈరాత్రి తన కొడుకు వెళ్ళాలి అని ఆమె రోదిస్తోంది. 'నీ కుమారుడి బదులుగా నే వెళతాను' అని దీర్ఘబాహుడు వెళ్ళాడు. ఆ రాకుమార్తె వద్ద ఒక రాక్షసుడు ఉన్నాడు. దీర్ఘబాహుడు తన కత్తిని దూసి ''నేను కమలాకర రాకుమారుని బంటును, కాచుకో'' అని ఉరికాడు. అయితే నేను నీ స్నేహితుని మామను అన్నాడు రాక్షసుడు. ఏమిటి సంగతి అని ప్రశ్నిస్తే దృఢముష్టి ఆ రాక్షసుడికి అల్లుడయ్యాడు. అతని బహుసాహసాలను వివరించాడు. అతడెక్కడున్నదీ తెలిపాడు. ఇద్దరూ చివరకు పుత్రవర్ధనం అనే పురభారాన్ని వహించారు. ఇప్పుడు ఇలా తమ స్నేహితుణ్ణి కలుసుకొన్నారు. (సప్తమ. 8-64)

ఆ తరువాత కమలాకరుడు హంసావళి రాజ్యానికి వెళ్ళి ఆమె తండ్రికి కబురు పంపుతాడు. అతడు కూతుర్ని ఇవ్వడానికి ఒప్పుకొంటాడు. అయితే ఒక పరిచారిక కుట్రవల్ల అవాంతరాలు, ప్రమాదాలు వస్తాయి. చివరకు కమలాకర హంసావళులు పెళ్ళి చేసుకొంటారు. సుఖసంకథావినోదాలలో ఓలలాడుతారు. షోడశకుమారులలో ఇప్పటికి తేలినవాళ్ళు పన్నెండుమందే. మిగతా నలుగురి కథలూ లభించలేదు. కాని వాళ్ళ పేర్లు తెలుస్తున్నాయి. (సప్తమ, 64 నుంచి చివరిదాకా, అష్టమాశ్వాసం పూర్తిగా వివాహం వివరాల కథ.)

13. యశఃకేతుడు - మంత్రికుమారుడు
14. నీతిమంతుడు - మంత్రికుమారుడు
15. మతిమంతుడు - పురోహితపుత్రుడు
16. కళానిధి - పురోహితపుత్రుడు

ఇందులో షష్ఠాశ్వాసంలోగాని మంచి పాకాన పడిన రచన కనబడదు. మొదటి ఆశ్వాసాలలో కథ చెప్పుకుపోవడమేగాని ఆగి వర్ణించడం, పాత్రల భావాలను చిత్రించడం మొదలైనవి తక్కువే. అక్కడక్కడ మరీ లేకపోలేదు. ఉన్నవి మంచివే. ఆ కాలపునాటి వేశ్యల వైభవాన్ని వర్ణిస్తున్నాడు, చూడండి.

హాటకహర్మ్యం దేకులవారు పరిచారికావళి భటచయంబు
ర్మరబంధచిత్రము ల్ప మంచము ల్పరుపు గీరంబులు బారువంబుకొనల
లాలవట్టంబులు గీలుబొమ్మలు మంచి పైడిపన్నారులు బట్టుతెరలు
నిలువుటద్దములు గంటల యుయాలలు హంసతూలికపాన్పులు దోమతెరలు
సారమృగమదకర్పూర చందనములు
లలిత చీనాంబరాదులు పొలుపుమిగిలి
చెలువుమీర మనోహర శ్రీలమెరసి
యొప్పుదురు వారకామిను లప్పురమున. (షోడ. 2-145)

ఆనాడు రాజాస్థానాలలో ఉండే ప్రతీహార కాంతలను వర్ణిస్తున్నాడు చూడండి.

చిత్తజాజ్ఞాలక్ష్మీచేతి పూసెల కట్టె కరణి బెత్తము గేల గరము మెరయు
గనకకుంభములపై వెన్నెలవోలె జన్నుల చందనచర్చ దనర
జపలాలతాసంగి శారదాభ్రమ గట్టిన వెలిపట్టుపుట్టమమర
వదనేందునకు బొంచియుదిగిన రాహునా గక్షభాగమున ఖడ్గంబు వ్రేల
రమణియై యున్న శృంగారరసమువోలె
నుర్విపై గరజానువు లొంద మ్రొక్కి
యల్లనల్లన యాప్రతీహారకాంత
వినయ మొసగంగ నిట్లన విన్నవించె. (షోడ. 6-4)

శ్రీనాథుని ప్రభావంలో రచించిన పద్యంలాగ కనిపించే శైలిలో శారదాపీఠాన్ని వర్ణిస్తున్నాడు. చూడండి.

శ్రుతులుపుట్టిన యిల్లు మతిజనంబుల పంట యాగమగోష్ఠీవిహారదేశ
మష్టమహాసిద్ధు లందెడు కందువ పరమయోగీంద్రుల పట్టుకొమ్మ
సిద్ధసారస్వతసిద్ధి కాలవాలంబు శబ్దశాస్త్రమునకు జన్మభూమి
నిశ్రేయసంబుల నిచ్చెన మహనీయమహిమల గని శ్రీల మనికిపట్టు

గరుడగంధర్వకిన్నరఖచరసిద్ధ
పన్నగామరకోటుల బ్రదుకుజోటు
సర్వసర్వంసహావిభూషణ మనంగ
దనరె శారదాపీఠంబు మనుజనాథ! (షోడ. 6-19)

పరస్పర విరోధమున్న ఉపమానాలతో కథానాయిక అవయవాలను వర్ణించి కొసమెరుపుగా నడుమును వర్ణించాడు చూడండి.

కరతరంబుల యొప్పు సరసిజంబులబోల నెరచందురుని బోలె నెమ్మొగంబు
తనవుటూర్పుల యింపు గనుగాలిమించిన నవరోమరేఖ పన్నగము మించె
నలకలు తేటుల చెలువంబు గెలువ నాసికయొప్పు హేమపుష్పకము గెలిచె
ఘనకుచంబులు శైలగరిమంబు మీరిన రదనదీప్తులు వజ్రరశ్మిమీరె
గారణమ్ము లేక కడు బరస్పరవైర
మయ్యె నొక్కొ మేనియందె యిప్పు
డవయవముల కనుచు నతిచింత డస్సెనా
నడుము సన్నమయ్యె నలినముఖికి. (6-32)

ఇతని తండ్రి కృతిభర్త నూత్నభరతాచార్యుడు కనుక కవి నటరాజు రూపాన్ని వర్ణించడంలో చాకచక్యం చూపించకపోడు. చూడండి. కారుమేఘాన్ని ఎలా వర్ణిస్తున్నాడో.

వితతవర్ణవితీర్ణవిద్రుమవల్లులు పరగెడు ఘనజటాపంక్తి దొరయ
నంబుపానసమాగతాంబుదపటలంబుదనరారు కుంజరాజిసముగాగ
బ్రబలవాతోద్ధూతభంగసంఘంబులు విస్తరిల్లెడు హస్తవితతిబోల
ఘోరతరస్ఫురద్ఘుమఘుమాఘోషణం బారభటీభాతి నతిశయిల్ల
బ్రళయకాల తాండవలీల బ్రజ్వరిల్లు
ఫాలలోచను నుగ్రరూపంబువోలె
నంబరంబును దిక్కులు నాక్రమించె
యతిభయంకరమయ్యె నా యంబుదంబు. (6-102)

ఇతని తండ్రి శైవసిద్ధాంతవేది కనుక అన్నయ్య కూడా శివభక్తుడే అనవచ్చు. అందుకే తుపాను మేఘాన్ని నటరాజుతో పోల్చాడు. ఉదయచంద్రుణ్ణి శివలింగంతో సరిపోలుస్తున్నాడు. చూడండి.

పూర్వగిరి పానవట్టమై పొలుపుమిగుల
బద్మరాగలింగమువోలె బ్రబలె రాజు
పూజచేసిన నవకంబు బూవులట్టు
లుపరితలమున దారక లొప్పుమిగల.

శైవుడైన ఇతడు శివకవులలో ప్రసిద్ధుడైన పండితయ్యగారి ప్రయోగాలను కూడా చేశాడు. పండితయ్య కొందరు అనే మాటలో తుది ఉకారలోపంగా ప్రయోగించినట్టు మనం చూశాం. ఇతడు కూడా అలాంటి ప్రయోగం చేశాడు.

తెగియెనుదునుమదొడంగిన
బగగొని ఖడ్గహతి కోర్చి పైబడి కొందర్
దెగగా గొందరు గాల్సే
యెగయకయును మెలగ మిడుకనీక యదిమినన్. (షోడ.శ. 2-180)

ఒకే పద్యంలో కొందరు అనే పదాన్ని ఉకారలోపంగానూ, ఉకారయుతంగానూ కూడా వాడడంవల్ల తన పూర్వకవుల ప్రయోగాల అనుకరణలు కేవలం శుకానువాదాలు కావని అన్నయ్య ప్రకటించుకొంటున్నాడు. ఇతడు తన కావ్యంలో ఒక చిలుకను సృష్టించాడు. శ్రీనాథుని హంస తరువాత అన్నయ్య చిలుకే తెలుగు సాహిత్యంలో అడుగుపెట్టిన ద్వితీయ విహంగపాత్రం. ఈ రాజశుకం కవితలు కూడా చెప్పగలదు. ఆ సంగతులు అన్నయ్య ఇలా విశదం చేశాడు.

అష్టభాషల మధురాశు విస్తరచిత్ర - కవితలు చెప్పు సత్కవులు మెచ్చ
నామ్నాయములు నాల్గుసంగంబు లాఱును - నఖిల శాస్త్రంబులు నవగతములు
నూతనరీతుల ధాతు విభ్రమముల - రసములు మెఱయు వర్ణకము వాడు
నేపురాణముల నేకథ యడిగినం - దడబాటు లేక యేర్పడగ జెప్పు
నోలి నవధానములు వేనవేలు సూపు - శబ్దవిజ్ఞానినైనను సరకుగొనదు
గౌతముని నైన దొడరి తర్కమున గెలుచు - నవధరింపు మీకీరంబు నవనినాథ.

తన కావ్యంలోని చిలుక వేనవేలు అవధానాలు చూపుతుంటే అన్నయ్య - తానూ స్వయంగా ఏవైనా అవధానాలు ప్రదర్శించాడో లేదో. అయితే కవితలలో ఇతడు చూపిన కొన్ని మెరుగులు అనంతర కవులలో జిగేలుమన్నాయి. చూడండి. ఆడపిల్ల మొక్కు మొక్కితే తళుక్కుమనే సొగసులు ఎలా వర్ణిస్తున్నాడో.

చిలుకకు దాదియైన సరసీరుహలోచన రాజసూతి కిం
పెలయఁగ మ్రొక్కె బయ్యెద యొకించుక జాలుఁగ బాహు
మూలదీప్తులు లలి ద్రుళ్ళియాడ సరి దోరపుజన్ను లొ
కింత నిక్కగా, సులలితముద్రికారుచులు చూచుకరోచుల మీద జెందగన్.

ఈ పద్యంలోని బాహుమూల దీప్తులు ఉత్తరోత్తరా మనుచరిత్రలోని వరూధిని బాహుమూల రుచులుగా శోభిల్లాయి. పెద్దనగారి ఆ పద్యం సుప్రసిద్ధం. (మను 2-68). షోడశకుమార చరిత్రలో కేవలం ఇటువంటి దీప్తులేకాక వేరే నిగనిగలు కూడా లేకపోలేదు. అయితే దురదృష్టవశాత్తూ గ్రంథం అంతా వెలుగులోనికి రాలేదు. ఇతని గ్రంథం

సంపూర్ణంగా దొరికితే భేతాళ పంచవింశతికథల ఆదిమ రచన తెలుగు భాషలలోనిది సంపూర్ణంగా ఉండేది. పంచమాశ్వాసంలో ఇప్పుడు పది కథలు మాత్రమే ఉన్నాయి. కవిభల్లటుని భేతాళ పంచవింశతినీ, దీనినీ తైపారువేసి పరిశీలిస్తే వివరాలు తెలుస్తాయి.

భావి పరిశోధకులకు చేతినిండా పని కల్పించే కవులలో వెన్నెలకంటి అన్నయ్యా ఎవ్వరికీ తమ్ముడు కాడు.

అనంతామాత్యుడు

అనగనగా ఒక ఊళ్లో ఒక ఆవు ఉండేది. అది ఒకనాడు అడవికి వెళ్లి మేతమేస్తూ ఉంటే ఉన్నట్టుండి ఒక పులి దానిమీద విరుచుకుపడి విరుచుకొని తినబోయింది. అప్పుడా ఆవు దానిని కొంచెం ఆగమని ప్రార్థించింది. ఆ ప్రార్థన విని పులి ఆగగానే ఆవు ఇంకొకటి ప్రార్థించింది. ''పులిరాజా! పులిరాజా! ఆకలితో ఉన్నవానికి ఆహారం పెట్టడమంత పుణ్యాం ఇంకొకటి లేదు. నువ్వు ఆకలితో ఉన్నావు. నేను నీకు ఆహారం అవడానికి నాకేం అభ్యంతరం లేదు. అయితే ఒక చిన్న విన్నపం: నాకు ఇంకా పొదుగు విడవని చిన్నారి పెయ్య ఉంది. ఇంటికి వెళ్లి దానికి పాలిచ్చి వచ్చేస్తాను. కొంచెం ఓపికపట్టగలవా?'' ఆవు మాటలు విని పులి 'అలాగే కానివ్వు' అంది. ఆవు ఇంటికి వెళ్లి పిల్లకు పాలిచ్చి, ఆడిన మాట తప్పకుండా పులికి ఆహారంగా అడవికి వెళ్లింది. పులి ఆశ్చర్యపడి ఆవును చంపడం మానేసి ఇంటికి పొమ్మంది. కథ కంచికీ, మనమింటికీ.

ఈ నీతికథ ఆంధ్రదేశంలోని ఆబాలగోపాలానికీ తెలుసు. దీనిని రచించి మొట్టమొదట తెలుగు సాహిత్యంలో గ్రంథస్థం చేసిన కవి పేరు మాత్రం తెలియకపోవచ్చు. అతని పేరు అనంతామాత్యుడు. ఇతడు కృష్ణా జిల్లావాడు. క్రీ.శ. 1435 ప్రాంతాలవాడు. ఇతని తాతతండ్రులు కవులని చెప్పలేంగాని ముత్తాత బయ్యన్న మాత్రం మంచి కవి. తిక్కనగారంతటివారు ఆయన కవిత్వాన్ని మెచ్చుకొని భవ్యభారతి అనే బిరుదు ఇచ్చారు. బయ్యన్న ఉత్త కవే కాడు, దండనాథుడు కూడ. అనంతామాత్యుడు తన ముత్తాతను బయ్యచమూపతి అనీ, గదానిపుణుడు, అసహాయసాహసుడు, అరాతిభయద బాహాఢ్యుడు, అక్షరాదివిద్యలందు చతురుడు, కవిరత్నం అనీ, రాజసభలలో పూజలు పొందినవాడనీ చెప్పాడు.[1] బయ్యనమంత్రి నెల్లూరి రాజుల సభలో కూడా సత్కారాలు పొందాడేమో! అప్పుడే ఆ సభలో ఉన్న తిక్కనగారు భవ్యభారతి అనే బిరుదు ఇచ్చారేమో. బయ్యనమంత్రి పాకనాడులోగాని, వెలనాడులోగాని దండనాథుడుగా ఉండి ఉంటాడు. ఇతని తాతతండ్రులను గురించి కూడా అనంతామాత్యుడు వివరాలు చెప్పాడు. ఈ బయ్యనమంత్రి పినతండ్రి షణ్మాసాలు పునశ్చరణచేసి వాళ్ళ వంశజుల యింటి మార్గాలమున కైన నరకంబు లేకుండ వరము బడసినవాడట.[2]

---

1. భోజరాజీయం, 1:2౨-25.
2. అదే పుస్తకంలో, 1-21.

తిక్కనగారిచేత బిరుదు పొందిన బయ్యనమంత్రి తన మనుమడొకనికి తిక్కన అని పేరు పెట్టుకొన్నాడు. ఈ తిక్కనమంత్రి కృష్ణా జిల్లా శ్రీకాకుళంలోని ఆంధ్రవల్లభుని భక్తుడు. బహుశా ఈ గ్రామానికి దగ్గరలోనే పెరుమగూరు అనే ఊరు ఉండి ఉంటుంది. ఇది కృష్ణవేణామలాపహారిణీ భీమరథీనదులు కలిసే అంతర్వేది పావనక్షేత్రంలో ఉందట. అంతర్వేది అంటే ఈ మూడు నదుల మధ్యనున్న గడ్డకాక ఈ నదులు కలిసిన తావునకు చివరనున్న భాగమని జనమంచి శేషాద్రిశర్మగారు అర్థం చెప్పారు.[3]

అనంతామాత్యుని తండ్రి నివసించిన పెరుమగూరు ఎక్కడుందో ఎలా తెలియదో అలాగే అనంతామాత్యుడు నివసించిన ధ్రువపట్టణం ఎక్కడుందో కూడా చెప్పలేం. ఇతడు రసాభరణం అనే అలంకారశాస్త్ర గ్రంథాన్ని వ్రాసి ధ్రువపట్టణంలోని గోపాలకృష్ణునికి అంకితమిచ్చాడు.[4] ధ్రువ శబ్దానికి మర్రి, మ్రోడు అనే అర్థాలున్నాయని, మర్రిపూడి, లేక మర్రివాడ అనే పేరును కవి సంస్కృతీకరించి ధ్రువపట్టణమనే పేరు పెట్టి ఉంటాడని చాగంటి శేషయ్యగారు అభిప్రాయపడ్డారు. కృష్ణా జిల్లా గన్నవరం తాలూకాలో మర్రివాడ ఉందట. దివి తాలూకాలో మోడుమూడి ఉందట. ఈ రెండు గ్రామాలలో ఏదయినా ధ్రువపట్టణమయి ఉంటుందని చాగంటివారు ఊహించారు. ఈ రెండూకాక కృష్ణా మండలంలోని దరువూరే ధ్రువపురి అని నిడుదవోలు వెంకటరావుగారి ఉద్దేశం.[5]

అనంతామాత్యుడు ఎక్కడివాడైనా అతడు అహోబలనరసింహుని భక్తుడు. తన మొదటి కావ్యాన్ని ఆ దేవునికే అంకితమిచ్చాడు. అందులోనూ దేవుడు ముచ్చటపడి వచ్చి అడిగితే ఇచ్చాడు. తిక్కనగారి కలలోకి వచ్చి వాళ్ళ నాన్నగారు సిఫార్సు చేస్తే హరిహరనాథునికి ఆయన భారతాన్ని అంకితమిచ్చారు. ఎర్రయ్యగారి కలలోకి వాళ్ళ తాతగారు వచ్చి అహోబలనరసింహునికి కృతి ఇవ్వమని ఆదేశించారు. అలాగే అనంతామాత్యుని కలలోనికి అతని గురువు తిరుమల నల్లాళ్ గోవిందచక్రవర్తిగారితో కలిసి అహోబలనరసింహుడు విజయం చేశాడు. గురువుగారు ఈ దేవునికి ఒక కృతి అంకితం ఇవ్వమని ఉపదేశం చేశాడు. అనంతామాత్యుడు పులకించాడు. కొంచెం వినయంగా ఇలా అనుకున్నాడు.

వెలయగ దొంటిపెద్దల కవిత్వము వోలె రుచించు నొక్కొ యే
బ డు నూత్న కావ్యరసభావములైనను భూమి దల్లిదం
డ్రులకు నిజాగ్రసూనుల పటుప్రచురోక్తులకంటె జిన్నబి
డ్డల వెడతొక్కుబల్కులు దృఢంబగు ముద్దుల నీవకుండునే

(భోజరాజీయం. 1-70)

3. బోజరాజీయం, వావిళ్ళ ప్రచురణ, మొదటికూర్పు పీఠికలో పుట 5.
4. ఆంధ్రకవితరంగిణి, 5వ సంపుటి, పుట 262.
5. అనంతుని ఛందము, వావిళ్ళ ప్రచురణ, ద్వితీయముద్రణ పీఠిక, పుట 47.

నిజంగా ముద్దులీనే కవిత్వమే చెప్పాడు. పాత కథలను తీసుకొని వాటిని అనుసరిస్తూనే స్వకపోల కల్పిత పురాణాలు సృష్టించి చక్కగా చెప్పాడు. విక్రమార్కుని సింహాసనంపైన ఎక్కదలచిన భోజుని కథలు ఆంధ్రదేశంలో ప్రసిద్ధంగా ఉన్నాయి. అయితే ఇందులో సింహాసనం ఎక్కడానికి భోజుడు ప్రయత్నించిన గాథలేమీ ఇతడు వ్రాయలేదు. పోనీ అని భోజకాళిదాసు కథలుగా ఈనాడు మనం చెప్పుకొనే కథలను కూడా వ్రాయలేదు. బహుశా ఇతని కాలంనాటికి ఆ కథల కల్పన జరగలేదేమో.

అనంతామాత్యుని కాలంనాటికి భోజుని కీర్తి దేశంలో వ్యాపించినా చారిత్రక వివరాలు విపులంగా ప్రచారమై ఉండవు. అందుకే అనంతుడు మరీ పలచని కథ తీసుకొని దానికి చేర్పులు మార్పులు ఎన్నో చేశాడు. తన ప్రణాళికను ఇలా చెప్పాడు.

సూత్రకథ భోజరాజ చ- రిత్రమయా నడుమ ధర్మరీతులు నీతుల్
చిత్రకథలై తలిర్పగ- శ్రోత్రసుఖముగా నొనర్పఁజొప్పడియుండున్. (భోజ. 1-86)

తన కావ్యం నూతనంబయ్యు పురాతనకృతులట్లు సంతతశ్రవ్యమై పరగుతూ ఉంటుందని, 'ఇందు చెప్పబడిన కథలన్నియు ప్రశస్తధర్మోపదేశా'లనీ అనంతుని విశ్వాసం. ఇంత నమ్మకంగా అతడు రచించిన కావ్యంలోని కథలేమిటో కొంచెం సంగ్రహంగా చెప్పుకొందాం.

పూర్వం మహుడు అనే కాంభోజరాజుకు కుష్ఠురోగం వచ్చింది. దాన్నతడు భరించలేకపోయాడు.

కడుకొని కామినీజనుల కౌగిట నేమని యుండువాడ నా
కొడుకుల బొత్తునం గుడువ గొంకక యేమని పిల్చువాడ నా
యెడ కరుదెంచు సేవకుల కేమని యే గొలువిచ్చువాడ నే
కడ చనువాడ నేదికడగా నిటు వేగెడువాడ ధీరతన్? (భోజ. 1-104)

అని బాధపడ్డాడు. గౌతమీనదిలో పడి ఆత్మహత్య చేసుకొంటే 'రోగము గీగము మాను నంతటన్' అనుకొన్నాడు. అనుకొన్నట్లే వెళ్ళి ఆ నదిలో పడబోతూ ఉండగా ఒక మునిపత్ని వచ్చి అతణ్ణి వారించింది. ఆమె మరెవరోకాదు, గౌతమీనదే. అతడు భరించలేని హేయమైన రోగాన్ని తానూ భరించలేననుకొంది. అందుకే మునిభామ వేషం వేసుకొని వచ్చి ఆపింది. హేమకూట పర్వతంమీద ఉండే దత్తాత్రేయమహర్షి దర్శనం చేసుకొంటే నీ వ్యాధి పోతుందని చెప్పింది. కాంభోజరాజు అలాగే అని అక్కడికి వెళ్లాడు.

దత్తాత్రేయుడు ఎప్పుడూ 'ముక్కునబంటిగా మాంసములు' మ్రింగుతూ ఉంటాడు. 'హృద్యంబగు మద్యభాండము'లోని సుర త్రాగుతూ ఉంటాడు.[6] ఇది కపట వేషమని కాంభోజరాజుకు తెలుసు. దత్తాత్రేయుని మద్యమాంస వ్యసనాలను ఏవగించుకొనకుండ

6. దత్తాత్రేయుని ప్రవర్తన మార్కండేయపురాణంలో మరీ విపులంగా ఉంది. చూడండి.

అతణ్ణి 6 పద్యాలలో స్తుతించాడు. దత్తాత్రేయుడు కనికరించాడు. తాను ప్రొద్దుట ప్రయాగలో, మధ్యాహ్నం హేమకూటంలో, రాత్రి శ్రీరంగంలో ఉంటానని చెప్పాడు. ఇప్పుడు శ్రీరంగం పోవాలి, రేపు వచ్చి నిన్ను రోగవిముక్తుణ్ణి చేస్తాను అన్నాడు. కాంభోజరాజు 'చిత్తం' అని ఆగాడు. చెప్పినట్టే దత్తాత్రేయుడు మర్నాడు వచ్చాడు. అందులోనూ ఎలా వచ్చాడంటే 'క్రేపుపైనొలసిన మక్కువన్ సురభి యుద్ధవడిం బరతెంచు చాడ్పునన్' వచ్చాడు (1-135). రోగవిముక్తుణ్ణి చేశాడు. కాంభోజరాజు అతన్ని స్తుతించి 'అయ్యా! మీరుండే ప్రయాగ, హేమకూటం, శ్రీరంగాల మాహాత్మ్యం విశదపరచండి' అని అడిగాడు.

దత్తాత్రేయుడు 24 గద్యపద్యాలలో శ్రీరంగమహిమను వర్ణించాడు. 5 పద్యాలలో హేమకూటాన్ని, 5 పద్యాలలో ప్రయాగను ప్రశంసించాడు. అప్పుడు కాంభోజరాజు ఒక ప్రశ్న వేశాడు. ''అయ్యా! ప్రయాగలో మరణిస్తూ ఏది కోరుకుంటే అది జరుగుతుందట. నిజమేనా? అలా కోరిక తీరినవాళ్లు ఎవరైనా ఉన్నారా?'' అన్నాడు. ''లేకేం? ఉన్నారు. ప్రయాగ మరణం ఇష్టకామ్యసిద్ధితం. పూర్వం ఒక పేద బ్రాహ్మణుడు దరిద్రం భరించలేక ఊరు వదిలిపెట్టి కాశీకి వెళ్లాడు. ఆ వెళ్లడం దుక్కెద్దు దేశాంతరం వెళ్లినట్టే అయింది. కాలం తీరి ప్రాణాలు పోయాకనే కాశీ మోక్షమిస్తుందట. కావాలని ప్రాణాలు తీసుకొన్నా ప్రయాగ కోరుకొన్నది నెరవేరుస్తుందట. అందుచేత ఆ బ్రాహ్మణుడు ప్రయాగకు వెళ్లాడు. అక్కడ గంగాయమునల సంగమంలో పడి చచ్చిపోవాలనుకొన్నాడు. ఆ నదుల కలయిక ఎలా ఉందంటే, రెండూ విడివిడిగా కూడా కనబడుతున్నాయి.

> ఆవె దివిజాపగాజలము, లల్లవె యాయమునాజలంబులా
> ధవళతయు న్వినీలతయు దార్కొని చూడ్కికి వేడ్క చేసె మా
> ధవసదనాంగణం బగుట దత్పరిచారిక లర్థి జందన
> ద్రవమున గ్రొత్తకస్తురిని దక్కక రేకలుపెట్టిరో యనన్. (భోజ. 2-20)

ఈ సంగమంలో అతనిలాగే పడి ఆత్మహత్య చేసుకోవాలని నలుగురు కాంతలు వచ్చారు. వాళ్లు నలుగురూ నాలుగు రకాల కోరికలు కోరుకుంటూ చచ్చిపోయారు. ఒకామె తనకు వచ్చేజన్మలో కనకపు కుప్పలు, మణినికాయాలు, ధనధాన్యరాసులు, గుర్రాలు, ఏనుగులు, ఆవులు, గేదెలు అన్నీ ఉండి దాత అయినవాడు భర్త కావాలని కోరుకొని చచ్చిపోయింది. ఇంకొకామె వచ్చేజన్మలో తన భర్త వదనంలో సరస్వతి తాండవించాలనీ, అతని ముఖం చూడగానే జనులు కవిత్వం చెప్పగలగాలనీ కోరుకొంది. మూడవ కాంత తనకు మరుజన్మలో నిర్మలకోమలాంగుడైన రాజు భర్త కావాలని కోరుకొంది. అందమైనవాడు, మన్మథకళాతంత్రంలో ప్రవీణుడైనవాడు ముందుజన్మలో తన భర్త కావాలని ఒకామె కోరుకొని చచ్చిపోయింది.

ఈ నలుగురి కోరికలూ వింటున్న బ్రాహ్మణునికి ఒక చక్కని యోచన తట్టింది. ఈ వనితా చతుష్టయం తనకు వచ్చే జన్మలో భార్యలవాలని కోరుకొంటూ అతడు ఆ నదుల

సంగమంలో 'హరీ' అన్నాడు. ఆ హరీ 'సరీ' అన్నాడు. తరువాతి జన్మలో అతడు భోజరాజై పుట్టాడు. లాటదేశంలో ధారానగరానికి అధీశ్వరుడై అనేక సంవత్సరాలు పాలించాడు.

ఇది అనంతామాత్యుడు చెప్పిన భోజరాజు పూర్వకథ కల్పితమే, అయితే భోజుడు చారిత్రక వ్యక్తి. అతని గురించి చరిత్రకారులు చెప్పే విషయాలు ఇవి.

భోజుడు పరమారవంశపు రాజు. క్రీ.శ. 1000–1055 మధ్య అతడు మాళవ దేశాన్ని పాలించాడు. 1020–1047 మధ్య పాలించాడని నికరంగా చెప్పగలిగే శాసనాలు ఉన్నాయి. అతడు బహు పరాక్రమవంతుడు.

ఘజ్నీ మహమ్మదు దండయాత్ర చేసినప్పుడు తూర్పు పంజాబులోని రాజులు కొందరు తమ రాజ్యాలను విడిచిపెట్టి పరభూములు పట్టారు. శాహిరాజు త్రిలోచనాపాలుడు తన రాజ్యాన్ని వీడి మాళవ దేశాధిపతియైన భోజుని ఆశ్రయం పొందాడు.[7] భోజుడు బ్రతికున్నంతకాలం మహమ్మదీయులకు సింహస్వప్నంలాగ ఉండేది. అతడు మరణించాక (క్రీ.శ. 1055) మహమ్మదీయులు భారతదేశంపై తమ దృష్టి ప్రసరించారు.[8] అయితే ఇంతటి భోజుని చాళుక్యరాజు రెండవ జయసింహుడు క్రీ.శ. 1019కి పూర్వం ఓడించాడు. ఒక్క భోజుణ్ణే కాదు, అతనితో చెయ్యి కలిపిన విక్రమాదిత్యుని కూడా జయసింహుడు ఓడించాడు. నేటి జబల్పూరు ప్రాంతాలలో ఉన్న మధ్యప్రదేశ్‌ను ఆ రోజుల్లో దాహళదేశమనేవారు. దానిని క్రీ.శ. 1019కి ముందుగా రెండవ కోకల్లుడు పాలించాడు. అతని బిరుదు విక్రమాదిత్యుడు.

భోజుడు ఎన్ని యుద్ధాలు చేసినా ఒక కొంకణాన్ని తప్ప కొత్త ప్రాంతాలను తన రాజ్యంలో కలుపుకొనలేకపోయాడు. అతడు పరాక్రమవంతుడే. పరరాజ్యాలపై కత్తికట్టినవాడే. కాని కలంపట్టి 'సుకవితా యద్యస్తిరాజ్యేనకి'మ్మన్న సూక్తి నిదర్శనంగా కవితారాజ్యాన్ని వదలిపోయాడు. అతడు రమారమి 23 గ్రంథాలు వ్రాసినట్టు చెప్పుకొంటారు. రామాయణ చంపులో కిష్కింధాకాండను అతడు వ్రాశాడట.[9] 'నామమాలిక' అనే సంకలన గ్రంథం వ్రాశాడు.[10] 'సరస్వతీ కంఠాభరణం' అనే అలంకార శాస్త్రాన్ని రచించాడు. 'యుక్తి కల్పతరువు' అనే న్యాయశాస్త్రాన్ని కూడా వ్రాశాడట. విద్యాలయాలు స్థాపించాడు. ధారానగరంలో అతడు కట్టించిన సరస్వతీమందిరంలో వాగ్దేవత విగ్రహాన్ని అతడు ప్రతిష్ఠించాడు. పరమార శిల్పకళ ఇందులో పరమావధి చేరుతుందట.[11]

---

7. Struggle for Empire - The History and Culture of the Indian people, Bharatiya Vidya Bhavan, పుట 16.
8. అదే పుస్తకంలో, పుట 51.
9. Struggle for Empire పుట 312, 10. అదే పుస్తకంలో, పుట 317 11. అదే పుస్తకంలో, పుట 658.

ఈ చారిత్రక విషయాలను అనంతామాత్యుడు చెప్పలేదు. అయితే భోజరాజు ముఖం చూస్తే కవిత్వం పుట్టుకొస్తుందనే మాటను పట్టుకొని ధారానగరాన్ని బాగా వర్ణించాడు. చూడండి:

కైపద మిచ్చువారలును గ్రక్కున బద్యము చెప్పువారలున్
రూపిత సంస్కృతాదిపదరూఢి యెలర్పన మహా ప్రబంధముల్
వే పొసగంగ బల్కి పృథివిం బ్రథితంబుగ జేయువారు ధా
రాపురమందెకాక కలరా మరి తక్కినపట్టణంబులన్? (భోజ. 2-50)

ఇటువంటి విద్యానిలయమైన పట్టణంలో ఉండి పరిపాలిస్తున్న భోజునికి ఒక అపురూపమైన విద్య అలవడిందట. అది ఏలోహాన్నైనా బంగారంగా మార్చే మహావిద్య. దీనిని అతడు ఎలా నేర్చుకున్నాడో దత్తాత్రేయుడు కాంభోజరాజుకు చెప్పాడు. భోజుడు ఒకనాడు వేటకు వెళ్లాడట. అడవిలో అతడొక మర్రిచెట్టును చూశాడట. దానిని అనంతామాత్యుడు రెండు సీసపద్యాలలో బ్రహ్మాండంగా వర్ణించాడు, చూడండి.

ఇట్టి మర్రియుండ నీద్వీపమును వట - ద్వీప మనక యేమి తెలివి యొక్కొ
తొంటి పెద్దలెల్ల దొడగి జంబూద్వీప - మనిరి నాగ నొప్పె నక్కుజంబు.
(భోజ. 2-61)

దిక్పాలపురముల తెరు వేల యడుగ నీ
శాఖి శాఖలవెంట జనగరాదె?
యంబరస్థల మెంత యన నేల యీమ్రాను
ఘన విశాలత చూచి కొనగరాదె?
యడుమండలం బెంత పొడవొకో యననేల
యీభూజ మెక్కిన నెరుగరాదె?
యవని యేమిట నిల్చె నన నేల యీమ్రాన
దిగిన యూడలు చూచి తెలియరాదె?
యనగ నాశ్చర్యమై యఖిలమృగ స
మాజ మాశ్రితచ్ఛాయమై యమరియుండు
బక్షిపక్షచ్ఛదాఘాతపాతఫలస
హస్రవర్షోద్భటంబు మహావటంబు. (భోజ. 2-62)

ఈ మర్రి చెట్టుకు తలక్రిందులా ఒక సిద్ధుడు వ్రేలాడుతూ ఉండడం భోజరాజు చూశాడు. అతని పేరు సర్పటి. ఆయనను రాజు తన పట్టణానికి తీసుకుపోయాడు. ఆతిథ్యమిచ్చిన రాజుకు ఉపకారం చేద్దామని సర్పటి అనుకొన్నాడు. 'వీడిల్లు బంగారంగాను' అని మనసులో దీవించి రాజుగారి కొలువు చవికెను బంగారం చేసి తెల్లారేలోపున చక్కాపోయాడు. మర్నాడు ఆ వింతను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. రాజుగారు మెల్లగా నిద్రలేచారు. ఇవాళ మనలో కొందరు నిద్రలేస్తూ తమ అరచేతులు చూసుకొంటారు. భోజరాజు అలాగే చేశాడని అనంతామాత్యుడు ఇలాగ చెప్పాడు.

అతడట్లు మేలుకని య- చ్యుతు సంస్కృతియందు దగిలి శుభలక్షణల
క్షితములగు నిజకారంభో- జతలంబులు చూచుచుండు సమయమునందున్.
(భోజ. 2-120)

సేవకులు వచ్చి కొలువు చవికె బంగారమైనట్టు చెప్పారు. ఇది సర్పటి చేసిన అద్భుతమే అని భోజరాజు తెలుసుకొన్నాడు. వెళ్లిపోయిన సర్పటిని కపటోపాయంతో రప్పించి, మాయోపాయంతో, అతివినయంతో ఆ బంగారం చేసే విద్యను సంగ్రహించాడు. ఇటువంటి మోసం చేసినందుకు కథానాయకుని శీలం దెబ్బతింటుంది. అయితే సర్పటి ఒక వేశ్యను మోసం చేసి ఈ విద్యను నేర్చుకొనబట్టి అది అలాగే అతని చేతుల్లోంచి పోయిందని కవి సమర్థించాడు. ఒక శాపాన్ని సృష్టించాడు. దగాపడిన సర్పటిని భోజరాజు తన ఇంట్లో భోంచేసి వెళ్ళమంటాడు. సర్పటి తాను పంచభిక్ష చేసే వ్రతమున్నవాడినని చెప్తాడు. అందుచేత నీ ఇంట తిననంటాడు.

అప్పుడు భోజుడు అగస్త్యవసిష్ఠుల కథ చెప్పాడు. అగస్త్యుడు ఒక ఏటికి అద్దరిని తపస్సు చేసుకొంటున్నాడు. అతనికి రోజూ వసిష్ఠుడు తన భార్య అరుంధతిచేత భోజనం పంపిస్తున్నాడు. ఒకనాడు మింటికీ మంటికీ ఏకధారగా వర్షంపడి ఏరుపొంగింది. అరుంధతి అన్నం తీసుకవెళ్లడానికి వీల్లేకపోయింది. ఆమెకు వసిష్ఠుడు అభయమిచ్చాడు. ''నేను సదా బ్రహ్మచారి పంపిస్తే వెళుతున్నాను'' అని ఏటికి చెప్పమన్నాడు. ఆమె అలాగ చెప్పగానే నది దారి ఇచ్చింది. ఆ తెరిపిలో నడిచి వెళ్లి ఆమె అగస్త్యునికి అన్నం పెట్టింది. తిరుగు ప్రయాణం ఎలాగ? అగస్త్యుడు ఆమెకు ఉపాయం చెప్పాడు. ''నిత్యనిరాహారి పంపిస్తే వెళుతున్నాను'' అని ఏటితో చెప్పమన్నాడు. ఆమె అలా అనగానే ఏరు మళ్లా తెరిపిచ్చింది. కాపురం చేస్తున్నా వసిష్ఠుడు సదా బ్రహ్మచారే! కడుపునిండా భోజనం చేస్తున్నా అగస్త్యుడు నిత్యోపవాసే! ఎందువల్ల! దానికో ధర్మసూక్ష్మముంది.

అశనాభిరళి లేక యటవీస్థలంబున నియతతపోనిష్ఠ నెరపుచుండ
గృహధర్మనిరతులు కొనివచ్చి భక్తిపూర్వకముగా దగ సమర్పణచేయు
నన్నపానాదుల నాసక్తుడై కొనునతడు నిరాహారుడంద్రు బుధులు
ధర్మమార్గమున సంతతి యుపార్జింప సమాన్వయంబున వివాహంబు పడసి
మనసు తమకంబులే కాత్మ వనితయందు
బూని ఋతుకాలమందున గాని తిథులు
పరిహరించి యథోచితభంగి గేలి
సలుపువాడు సదా బ్రహ్మచారి యంద్రు. (భోజ. 3-27)

ఈ నిర్వచనం అనంతామాత్యుడు భారతం నుండి తీసుకొన్నాడు.[12] ఈ ఒక్క సందర్భంలోనే కాదు, మిగతా చోట్లకూడా అనంతుడు భారతంలోంచి తనకు కావలసినంత చేదుకొన్నాడు. నన్నయగారు శకుంతలోపాఖ్యానంలో ఇలా వ్రాశాడు.

12. భోజరాజీయం పీఠిక, బులుసు వెంకటేశ్వర్లుగారు, పుట 18.

నుతజలపూరితంబు లగు నూతులు నూరిటికంటె సూనృత
వ్రత యొక బావి మేలు మరి బావులు నూరిటికంటె నొక్క సత్
క్రతు వది మేలు తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు త
త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు చూడగన్. (భార.ఆది. 4-94)

ఈ పద్యభావాన్ని అనంతుడు ఒక కందంలో అందంగా ఎలా చెప్పాడో చూడండి :

శతకూపాధికదీర్ఘిక
శతవాప్యధికంబు గ్రతువు శతయజ్ఞ సము
న్నతు డొక్క సుతుడు దత్సుత
శతకంబున కెక్కు డొక్క సత్యోక్తి నృపా. (భోజ. 6-92)

తాను చెప్పే ధర్మసూత్రాల ప్రామాణికత్వం కోసం అనంతుడు ఇలాగ పూర్వగ్రంథాలను అనుకరిస్తాడు. అందుకే సదా బ్రహ్మచారి నిత్యోపవాసుల నిర్వచనాన్ని భారతం నుండి తీసుకొని అంత చక్కగా భోజరాజు చేత కథ చెప్పించాడు. రాజు చెప్పిన ఈ చిన్న కథకు సమాధానంగా సర్పటి మూడు పెద్ద కథలు చెప్పాడు.

(1) చెప్పుగూడతో పాయసం తోడి ఆతిథ్యమిచ్చిన సజ్జనుడు స్వర్గంలో ఇందుకు అనుభవించిన ప్రతిఫలంకథ. (2) బ్రహ్మరాక్షసికి ఆహారంగా బలికావలసిన యోగమున్నా అందుకు సిద్ధపడి పుష్పగంధిని పెళ్ళాడిన రత్నకుండుని కథ. (3) అన్నదానం చేసే మరదిని వదినెలు వేరు కాపురానికి పంపించిన కథ. ఈ మూడు పెద్ద కథలలో ఎన్నో ఉపాఖ్యానాలున్నాయి. ఉపకథలలో మళ్ళీ ఉపకథలున్నాయి. వాటి వివరాలు చూడండి.

1. చెప్పుగూడతో పాయసం తోడి ఆతిథ్యమిచ్చినవాని కథ. 3-36 నుండి 3-123 దాకా. 88 గద్యపద్యాలు.

   ఇందులో ఉపకథ. ఇంద్రుడు చెప్పినది. మంటిముద్ద యోగికి భిక్షగా పెట్టి ప్రతిఫలమనుభవించిన స్త్రీ కథ. 3-63 నుండి 118 దాకా. 56 గద్యపద్యాలు.

   ఇందులో మళ్ళీ మరో ఉపకథ ఉంది. తినగా మిగిలిన అన్నం భిక్షం పెట్టి చండాల దంపతులుగా పుట్టినవాళ్ల కథ. 3-109 నుండి 3-118 దాకా 10 గద్యపద్యాలు.

2. పుష్పగంధి రత్నమండనుల ప్రధాన కథ. 3-127 నుండి 6-119 దకా 978 గద్యపద్యాలు.

   A. చిన్న ఉపకథలు రెండు:

   1. ఎలుకకథ, 4-75 నుండి 4-27 దాకా. 13 గద్యపద్యాలు.
   2. విప్రప్రభావం, 4-49 నుండి 4-70 దాకా. 22 గద్యపద్యాలు.

   B. చాలా పెద్ద ఉపాఖ్యానం ఒకటి. రత్నమండనుడు బ్రహ్మరాక్షసికి చెప్పిన గోవ్యాఘ్రసంవాదం కథ. 4-129 నుండి 6-79 దాకా 587 గద్యపద్యాలు.

ఈ గోవ్యాఘ్రసంవాదంలో మూడు పెద్ద ఉపకథలు ఉన్నాయి.

(అ) చాకెతవల్ల తపోమహిమ తగ్గి పందిగా పుట్టిన యోగికథ. ఇది పులి చెప్పినది. 4-143 నుండి 4-208 దాకా. 66 గద్యపద్యాలు.

(ఆ) ఆవు చెప్పిన మదనరేఖ కథ. పెళ్ళికి ముందు తనను కామించిన గురుపుత్రునివద్దకు పెళ్ళి కాగానే భర్త అనుమతితో మొదటిరాత్రి ముందుగా వెళ్ళిన యువతి కథ. 4-217 నుండి 4-353 దాకా 137 గద్యపద్యాలు.

(ఇ) ఈ మదనరేఖ సోదరుడు పాపకలోమునికి మిత్రద్రోహి తెచ్చిపెట్టిన కష్టాల కథ. పంచమాశ్వాసం పూర్తిగా ఇదే. 372 గద్యపద్యాలు.

ఇందులో రెండు ఉపకథలు ఉన్నాయి:

(1) స్వర్ణకారుని నమ్మకూడదని ముసలిది చెప్పిన, నెత్తురుకారే కొండకథ. 5-21 నుండి 264 దాకా 53 గద్యపద్యాలు.

(2) తండ్రి చెల్లెలి కొడుకునూ, తల్లి అన్నకొడుకునూ కాక పిచ్చుగుంటును పెళ్ళాడిన రాజకుమారి కథ. 5-327 నుండి 367 దాకా. 31 గద్యపద్యాలు.

(3) అన్నదానం చేసే మరదిని వదినెలు వేరుకాపురం పెట్టించిన కథ. 6-122 నుండి 7-233 దాకా 522 గద్యపద్యాలు.

ఇందులోని ఉపకథలూ, ఘట్టాలూ:

(అ) అల్పాశశం పెడితే వచ్చే అనర్థాల కథ. కథానాయకుడు భార్యకు చెప్పినది. 6-166 నుండి 182 దాకా. 17 గద్యపద్యాలు.

(ఆ) విష్ణువు పరీక్షిస్తే కథానాయకుని భార్య చేటతో ఇసుక చెరిగి అది వండిపెట్టిన గాథ. 6-183 నుండి 207 దాకా. 25 గద్యపద్యాలు.

(ఇ) అన్నదానఫలం ఏమిటో అప్పుడు పుట్టిన పాప చెప్పగలదని గౌరీదేవి కథానాయకుణ్ణి ఒకచోటకు పంపిన ఘట్టం. 6-222 నుండి 6-259 దాకా. 38 గద్యపద్యాలు.

(ఈ) ఈ 'అప్పుడు పుట్టిన పాప పూర్వచరిత్ర'గా గంగాదేవి చెప్పిన పంజరోపాఖ్యానం కడవరకూ ఇదే.

ఈ ఉపాఖ్యానాలనూ, వాటిలోని ఉపకథలనూ అనంతామాత్యుడు చాలా చాకచక్యంగా, ఔచిత్యాన్ని పోషిస్తూ అష్టాదశ వర్ణనలు పెట్టి, సజీవమైన భాషలో, సామెతలూ, పలుకుబళ్లూ వాడుతూ, అక్కడక్కడ హాస్యోక్తులు వాడుతూ రచించాడు. సున్నితమైన వెటకారంలో అనంతామాత్యుడు సిద్ధహస్తుడు. విప్రప్రభావం చెప్పే కథలో

ఒక శకునం చెప్పేవాడు. ఫలానా రైతు గడ్డికోస్తూ చచ్చిపోతాడని జోస్యం చెప్పాడు. ఆ రైతు చావక తిరిగివస్తాడు. అప్పుడు శకునజ్ఞుణ్ణి రాజు ఎత్తిపొడిచే మాటలు చూడండి.

చంపంగ వచ్చిన జముని రూతలకు లంచము పెట్టివచ్చెనో, చావనొల్ల
బొమ్మని మోరకంబునద్రోచివచ్చెనో, యింటివారికి చెప్ప కిచట జచ్చి
నట్లైన గోపింతురని చెప్పవచ్చెనో, వీని పెంజెమట నవ్విషము గరగి
వడిసెనో, సర్పంబు వాతప్పిపోయెనో, శకునంపుబులుగు లీసారి బ్రమసి
తప్పజెప్పెనో యితండేమివిధమున - బ్రతికివచ్చెననిన 'బార్థివేంద్ర!
యవధరింపు మింత యణకింపనేల నీ - బంటువంత' మనుచు బలికె నతడు.
(భోజ. 4-58)

ఇంటివారికి చెప్పక ఇక్కడే చస్తే కోపిస్తారని భయపడి చావలేదనడం చక్కని ఎత్తిపొడుపు. చమత్కారంగా సంభాషణ నడిపించడంలోను, మనోజ్ఞమైన కల్పనలు చేయడంలోనూ అనంతుడు గట్టివాడు. ఒక రాజుగారి అమ్మాయిని త్రిమూర్తులు ముగ్గురూ చూశారు. 'ఈమె ఎవరిని పెండ్లాడుతుంది' అని హరిహరులిద్దరూ అడిగారు. అప్పుడు అనంతుడు నడిపిన కథ చూడండి.

అడిగిన బద్మజుండు దరహాసవిలాసముఖారవిందుడై
యుడుపతిజూట! యీతరుణి యొడ్డుల సాలగుగాని యిందులో
నడరగ నబ్బ దెవ్వనికి' నన్న మహాద్భుతచిత్తుడౌచు 'నీ
పడతుక యింక వేనరుని పాలగు నాతని మాకు జూపుమా!' (భోజ. 5-329)

అనిన నూరిలోన నెనుపోతుపై కెక్కి
వచ్చుచున్న యొక్క పిచ్చుగుంటు
జూపి 'యితడు సుమ్ము సుదతికి మగ'డన్న
నగుచు విష్ణుదేవు మొగము జూచి. (330)

'వింటికదా నీ తనయుని - కొంటెతనము, వీరిమాని కుటిలాలక స
క్కుంటునకు నిత్తురట, యిటు - వంటివి సోపెక్కునోళ్ళవారల మాటల్.' (331)

అనిన చతుర్వదనుం డిట్లను 'రమ్మా! పంచవదన! యనృతంబులు ప
ల్కునె బ్రహ్మ నన్నెరుంగవె - విను మిది బొంకైన నీకు విరిగిన వాడన్. (332)

తనకు పెక్కునోళ్లని శివుడు ఈసడిస్తే బ్రహ్మ ఊరుకుంటాడా! బ్రహ్మ ఊరుకొన్నా కవిబ్రహ్మ మెచ్చుకున్న కవిగారి మనుమడు ఊరుకుంటాడా! ఈశ్వరునికి ఐదు ముఖాలని వ్యంగ్యంగా ఎత్తిపొడిచాడు. ఈశ్వరుని ముఖాలమీద చమత్కరించడం అనంతునికి సరదా. సారంగధరునిలాగ కాళ్లూ చేతులు పోయాక రత్నమండనునికి పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమవుతారు. అప్పుడు అతను చేసిన స్తవంలో ఈ పద్యముంది చూడండి:

ఆరు మొగంబులాతడు మదాత్మజుడాతని ముద్దుసేయగా
నారు మొగంబులు స్వలయు నంబిక, యేమను నీవు గూడగా
నారు మొగంబు లౌ, నతిరయంబున రమ్మని నీవు నవ్వుచుం
జీరుట యోగివర్యులకు జింత్యమగున్ ముఖపంచకోజ్జ్వలా! (భో జ. 5-201)

ఈ ఘట్టంలో అనంతుడు నాలుగు పద్యాలలో ఈశ్వరుని స్తుతించాడు. ఇంకొక ఘట్టంలో అపరభగీరథుడు వంజరునికి శివుడు ప్రత్యక్షమైనపుడు ఒక లయవిభాతిలో, ఒక లయగ్రాహిలో, ఒక లయహారిలో మూడు స్తుతులు వ్రాశాడు. ఈ ఒక్క ఘట్టంలో ఇలా విశేషవృత్తాలను వాడినా అనంతుడు సర్వసాధారణమైన చంపకోత్పలాలు, సీసాలు, కందాలు వంటి ఛందస్సులలోనే కావ్యం వ్రాశాడు. అందుచేత ఇతనికి ఇతర విశేషవృత్తాలు తెలియవనుకోకూడదు. ఇతడు ఛందోగ్రంథం వ్రాశాడు. దానికతడు ఛందోదర్పణమనే పేరు పెట్టినా లోకులు దానిని అనంతుని ఛందం అనే చెప్పుకొంటున్నారు.

ఈ గ్రంథాన్ని అతడు భోజరాజీయం వ్రాశాకనే రచించాడు. ఈ సంగతి ఛందోదర్పణంలోని ఈక్రింది పద్యం వల్ల తెలుస్తున్నది.

శ్రీనిధి చక్రవర్తి గురుశేఖర పుణ్య కటాక్షలబ్ధము
జ్ఞాను డనంతధీమణి లసన్మణి భోజచరిత్ర చెప్పి ల
క్ష్మీనరసింహు గూర్చిన ప్రసిద్ధుడు వేడుకతో నొనర్చె ఛం
దోనుతి యోగిహృద్విమలతోయజవర్తి కనంతమూర్తికిన్. (ఛందం. 4-132)

ఇది నాలుగాశ్వాసాల శాస్త్రం. మొదటి ఆశ్వాసంలో గద్యపద్యాది కావ్యలక్షణాలు, గురులఘు నిర్ణయం, గణనిరూపణ, ప్రాసయతి విశేషాలు, పరిగణనసంజ్ఞ ఉన్నాయి. రెండో ఆశ్వాసంలో ఉభయభాషానురూపాలైన గద్యపద్యాల విధాలు ఇరవైఆరు ఛందోనామాలు, వాటిలో పుట్టిన సమవృత్తాలు, వృత్తమిశ్రాలైన అర్ధసమవృత్తాలు, ఛందోతిరకాలైన మాలావృత్తాలూ, తద్భేదమైన దండక లక్షణం ఉన్నాయి. మూడో ఆశ్వాసంలో జాతిలక్షణలక్షితాలైన కందాలు, మాత్రాలక్షణయుక్తాలైన గీతాలు, సీసాలు, ఉత్సాహ, తరువోజ, అక్కర, షట్పద, ద్విపద, మంజరి, చౌపద, రగడలు అనే చాటుకావ్య ప్రమాణాలు, ఉదాహరణములు, షట్ప్రత్యయాలు, సప్తమాప్రత్యయాలైన సమవృత్తాల లెక్క ఉన్నాయి. నాలుగో ఆశ్వాసంలో వర్జనీయాలైన దశదోషాలు ఏర్పరచడం అందు దోషరహితాలైన ఆదరణీయాలైన పట్టు తేల్చడం, సంధి, సమాసాలు, యాభైఅక్షరాలు ఏర్పరచడం ఉన్నాయి.

అనంతామాత్యుని లెక్కలో మన భాషలో ఏభై అక్షరాలే ఉన్నాయి. అతని దృష్టిలో ళకారం విడి అక్షరం కాదు. 'క్ష' మాత్రం హల్లే. ఈ లెక్క అప్పకవికి నచ్చలేదు. అందుకే ఇలా వెక్కిరించాడు.

కాకు షాజడ్డయైన క్షకారమగుట
దలప కేబది లిపులలో దాని గూర్చి
తొలుత భిన్నాక్షరంబైన దొడ్డ 'ళా' ను
విడిచిపెట్టెననంతుడు వెర్రివాడె! (అప్పకవీయం)

అప్పకవి ఇతణ్ణి వెర్రివాడన్నా లక్షణం చెప్పడంలో ఇతని అడుగుజాడల్లోనే నడిచాడు. అప్పకవీయం మీదా, అనంతుని ఛందంమీదా ప్రత్యేకంగాను, ఇతర ఛందోగ్రంథాలను కూలంకషంగానూ పరిశోధించిన రావూరి దొరస్వామిశర్మగారు ఇలా వ్రాశారు:

''చిత్రకవి పెద్దన వ్రాసిన లక్ష్మణసారసంగ్రహము చాలవరకు ఛందోదర్పణాను సారియని పరికించిన తెలియగలదు. సులక్షణసారము, కవిసంజీవని, అప్పకవీయము, సర్వలక్షణసారసంగ్రహము, రంగరాట్ఛందము మున్నగు లక్షణగ్రంథములందు ఛందోదర్పణ ముదాహృతము. మీదుమిక్కిలి యప్పకవి కీఛందోదర్పణమే యుపజీవ్య గ్రంథములలో బ్రధానమైనది. పెక్కులక్ష్యలక్షణము లప్పకవిఛందోదర్పణఛాయలో సంతరించెను. మరికొందరు వ్యాఖ్యాతలిందలి పద్యముల బ్రమాణముగా నుదాహరించిరి.''[13]

అనంతుని ఛందాన్ని ఉపయోగించుకొనని లాక్షణికులు ఎలాగైతే లేరో ఈ ఛందస్సుపై పరిశోధనలు చేయని ఆధునిక పండితులు కూడా లేరు. 1921లో వావిళ్లవారు తొలిసారిగా ప్రచురించినపుడు గిడుగు సీతాపతిగారు అనంతుని ఛందానికి విపులమైన పీఠిక వ్రాశారు. కవిజనాశ్రయంలో పది యతులే చెప్పాడు. విన్నకోట పెద్దన పంద్రెండు చెప్పాడు. అనంతుడు ఇరవై చెప్పాడు. అప్పకవి వాటిని 41 దాకా పెంచాడు. సీతాపతిగారు పట్టికలు వేసి సమాకలనం చేసి వీటిని విపులంగా చర్చించారు. తెలుగు ఛందోగ్రంథాలు సంస్కృతాన్ని గుడ్డిగా అనుకరించడం తప్ప ఈ భాషలో ఛందస్సులు ఎలా ఉండాలో చెప్పవని చక్కగా వ్రాశారు.

''అన్ని పాదములలోనూ విశ్రాంతి ఒక్కచోటనే ఉండుటకంటె పద్యము రసోచితముగా ఉండుటకు అక్షరమైత్రి కావలెనని కోరేవారు విశ్రాంతి స్థలమందు వడి పాటించుట మంచిదేకాని విశ్రాంతి స్థలమును నిర్ణయించుటలో రసజ్ఞులైన కవులు తమ స్వాతంత్ర్యము చెడగొట్టుకోకూడదని నా మతము. మూడేసి అక్షరముల గణమంటే గణవిభజన పద్యము నడకనుబట్టి ఉండడం మసంభవము. నడకబట్టి గణవిభజన ఉంటేనేగాని గణవిభజన ప్రయోజనము కనబడదు... జాగ్రత్తగా విమర్శించి చూచిన యెడల చక్కగా నడిచే పద్యములన్నీ ఏదో ఒక తాళమునకో, లయకో సరిపడి ఉంటవి... పాదమందుండే అక్షరముల సంఖ్యనుబట్టి ఛందము లేర్పరచి ఆ ఛందములలో ఒక్కొక్కటి విస్తరించి వృత్తములు కల్పించడమువల్ల ప్రయోజనము విశేషముగా కనబడలేదు.

13. అనంతుని ఛందం – వావిళ్ళ ప్రచురణ (1958) – సమీక్ష, పుట 66.

అంతకంటే శ్రుతికింపుకొలిపే నడకకు ఆధారమైన లక్షణముబట్టి త్రిస్రగతిచ్ఛందము, చతురస్రగతిచ్ఛందము మొదలయిన ఛందము లేర్పరచి పద్యములు చెప్పుటవల్లను ప్రయోజనము విశేషముగా ఉండునని, అట్లు ఏర్పడిన పద్యములు తెలుగు భాషకు అమరిఉండు నని న్ని నా యభిప్రాయము.''[14]

సీతాపతిగారు చెప్పిన సంగతులను శ్రద్ధగా పరిశీలించి ద్రావిడ భాషలలోని ఛందస్సులను గురించి ప్రత్యేకమైన తులనాత్మక పరిశోధన కావాలి. టేకుమళ్ళ రాజగోపాలరావుగారు కొంత చేశారు. అయినా ఈ పద్ధతులలో ఇతరులు చేయడం లేదు. సీతాపతిగారు స్థూలంగా సూచనలే చేశారు గాని సూక్ష్మంగా పరిశీలన జరగాలి.

అనంతుని ఛందం ద్వితీయ ముద్రణకు పీఠిక వ్రాస్తూ నిడుదవోలు వెంకటరావుగారు కూడా కొన్ని కొత్త విషయాలు చెప్పారు. అనంతుని మతంలో 'వీపు'లో అరసున్నలేదని ఋజువు చేశారు (అయితే ముద్రాపకులు అరసున్నతోనే అచ్చువేశారు).[15] మూడవ ముద్రణలో రావూరి దొరస్వామిశర్మగారు విపులమైన సమీక్ష చేశారు. వీరు అంతకుముందే ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో అనంతుని ప్రశస్తి గురించి వ్రాశారు.[16] అందులో గిడుగువారి ఉపోద్ఘాతాన్ని విమర్శించి అనంతుడు కవిజనాశ్రయాన్ని చూశాడని నిరూపించారు.

అనంతుడు కవిజనాశ్రయాన్ని చూశాడు గాని విన్నకోట పెద్దన వ్రాసిన కావ్యాలంకార చూడామణి చూశాడో లేదో! పెద్దన ఉదాహరణ లక్షణాలు చెప్తూ, ఒక్కొక్క విభక్తికి ఒక అధిదేవతను చెప్పాడు. అనంతుడు కూడా అలాగే చెప్పాడు గాని పెద్దన చెప్పినట్టు సద్ధళి, విద్ధళి మొదలైన ఉదాహరణ భేదాలను చెప్పలేదు.

ఈ గ్రంథంలో ఛందస్సు గురించి విపులంగా, వ్యాకరణం గురించి కొద్దిగా చెప్పిన అనంతుడు అలంకారాలకు ముఖ్యమైన రసం గురించి విపులంగా ఒక ప్రత్యేక గ్రంథమే రచించాడు. దాని పేరు రసాభరణం. అయితే గద్యలో దీనిని అనంతుడు 'రసాలంకారం' అని పేర్కొన్నాడు. కొందరు దీనిని రసార్ణవం అని పిలుస్తున్నారు.[17] ఇది కూడా నాలుగు ఆశ్వాసాల గ్రంథం. ఇందులో 344 గద్యపద్యాలు ఉన్నాయి. ఒక్కొక్క ఆశ్వాసానికి ఒక్కొక్క పేరు పెట్టాడు, మొదటి ఆశ్వాసం చివర అది సంజ్ఞాప్రకరణమని, తరువాత మూడూ వివిధ ప్రకరణాలనీ ఇలా చెప్పాడు.

అరయ సంజ్ఞాప్రకరణ - మీరీతి దనర్చి వెలయు నిట రత్యాది
స్ఫారప్రకరణమును శృం - గార ప్రకరణము నాయకప్రకరణమున[18]

(రసా. పుట 7)

14. ఛందోదర్పణము - వావిళ్ళప్రచురణ - మొదటిముద్రణ ఉపోద్ఘాతం.
15. అనంతుని ఛందం - మూడవముద్రణ - పుట 57.
16. ఆంధ్రసాహిత్యపరిషత్తు పత్రికలు - సంపుటాలు 32, 37, 38.
17. అనంతుని ఛందం - మొదటిముద్రణ పీఠికలో గిడుగు సీతాపతిగారు
18. రసాభరణాన్ని ఆంధ్రసాహిత్యపరిషత్తువారు ప్రచురించారు.

ఈ అలంకార శాస్త్రాన్ని అనంతుడు చాలా చక్కగా రచించాడు. విన్నకోట పెద్దన మనకు మొదటి అలంకార గ్రంథాన్ని ఇచ్చాడు. అయినా అనంతుని గ్రంథంలో రసవివరణ స్పష్టంగా ఉంది. ''లక్షణముల కుదాహరణముల నిచ్చుటలో గొన్ని తావుల బెద్దనకంటె ననంతునిదే పైచేయియైనదని నా యుద్దేశము'' అని చాగంటి శేషయ్యగారు అన్న మాటలు అక్షరాలా నిజం.[19] చూడండి. 4వ ఆశ్వాసంలో దుష్టనాయకుని కిచ్చిన ఉదాహరణ.

(పద్యాలకు నెంబర్లు వేయలేదు. కాబట్టి పుటలు పేర్కొంటున్నాను.)

చనునెడ పిన్నదాన నను జాయలు వల్కకు వేటసన్నదూ
వనతరుపల్లకీకుసుమవాసనగంధము కంటకాగ్రసం
జనితము లీవ్రణంబులు ప్రచండపు టెండచెమర్చుటల్. సతీ!
ఘనముగ మోవిగందుట తగన్ విను శంఖరవం బొనర్పగన్.

(రసా. పుటలు 31, 32)

నాయకుడు అన్యకాంతాసుఖం పొంది వచ్చాడు. ఘుమఘుమలాడుతున్నాడు. ఒంటిమీద రక్కులు ఉన్నాయి. ఒళ్ళంతా చెమట పోస్తోంది. మోవి బాగా కందింది. తను వేటకు వెళ్ళివచ్చానని, అడవిలోని పువ్వుల వాసనే ఒంట బట్టిందని, ముళ్ళవల్ల ఒళ్లు గీసుకుపోయిందని, ఎండ తీవ్రతవల్ల చెమటలు పోస్తున్నాయని, శంఖం బాగా ఊదడంవల్ల మోవి కందిపోయిందని నాయికతో నచ్చచెప్తున్నాడు. ఆడవాళ్ళ కళ్లు మగవాని అబద్ధాలను ఇట్టే పట్టేస్తాయి. పై సంజాయిషీ నమ్మి ఉండదు. అయితే చేపలలాగా ఉండే ఆమె కన్నులను, బాగా కఠినంగా ఉండే వక్షోజాలను శ్రీహరి మెచ్చుకోలేదట. ఎందుచేతనంటే, ఇలా చమత్కరిస్తున్నాడు చూడండి:

తెరవాలికకన్నుల క్రొ - మ్మెరుగులు గచకఠినతయును మెచ్చులె హరికిన్
నెరమీనై తాబేలై - వరలె నతం డనిన నింతి వదనము వంచెన్. (రసా. పుట 27)

నాయికలలో స్వీయ, పరకీయ, పణ్య అని మూడురకాలు ఉంటారు. పరకీయ లక్షణాన్ని ఇలా చెప్పాడు. చూడండి.

అత్తయు నూర లేదు మగడా మరి మందకుబోయి రాడు నే
నిత్తరి నొంటి నుండు దనియే జను తెంచితి గృష్ణరాయ నీ
చిత్త మెరింగి మూలదేస జీకటి దాచినదాన వెన్నగో
డొత్తున నుండి యేల నను నూరకె చూచెదు తొంగిచూపులన్? (రసా.పుట 33)

ఈ పద్యంలో హాలుని గాథాసప్తశతిలోని ఒక గాథ ఛాయలు లేకపోలేదు. అనంతుడు ప్రాచీన గ్రంథాలను బాగా చదివినవాడు. రసాభరణానికి పీఠిక వ్రాసిన కోపల్లి శివకామేశ్వరరావుగారు ఇలా వ్రాశారు: ''రసాభరణమును తెనుగున వ్రాసిన

19. ఆంధ్రకవితరంగిణి, 5వ సంపుటం, పుట 263.

యనంతామాత్యుడు విశ్వనాథుని దర్పణమును, ముమ్మటుని కావ్యప్రకాశమును గూడ మేళవించి యందేవిషయమున ప్రశస్తమయినదో దానినెల్ల గ్రహించినాడనవచ్చును.''[20] అయితే అలంకార శాస్త్రంమీద సమగ్రంగా, కూలంకషంగా పరిశోధనలు చేసిన బులుసు వెంకటరమణయ్యగారు ఇలా వ్రాశారు: ''విషయ నిరూపణమునుబట్టి ఇది చాలావరకు విద్యానాథుని ప్రతాపరుద్రీయమునే యనుకరించుచున్నది. దర్పణాదుల ననుకరించు చున్నట్లు తోచదు. ప్రతాపరుద్రీయానుక్త విషయమున గ్రంథాంతర్థసాహాయ్యా మపేక్షింప బడవచ్చును.''[21]

అనంతామాత్యుడు ముమ్మటుని కావ్యప్రకాశమును బాగా పఠించినవాడే. అందులో ఈ క్రింది శ్లోకం చాలా ప్రసిద్ధమైనది.

కావ్యంయశసే ర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే
పద్యఃఫలనిర్వృతయే కాంతాసమ్మితతత యోపదేశయుదే.

దీనికి అనంతామాత్యుడు తాను వ్రాసిన సాహిత్య శాస్త్రంలో అనువదించకపోయినా తన మొదటి గ్రంథమైన భోజరాజీయంలోనే ఇలా అనువరించాడు:

సకలవిద్యలయందు జర్చింప గవిత యుత్కృష్టమం డ్రది నిత్యకీర్తికొరకు
నర్థాప్తికొరకును వ్యవహారలక్షణం బెరిగెడుకొరకు ననేకవిధము
లగు సమంగళములపహరియించుకొరకు నుచిత నిత్యసౌఖ్యసంసిద్ధికొరకు
వొరర గాంతాసమ్మితోపదేశంబున బ్రీతిమై హితమాచరించుకొరకు
పయ్యోగాన బెద్ద లాచరించెద రంచు
నేర్పుకొలది గృతి యొనర్పబూని
యస్మదీయకృతికి నధిపతి గావింప
నర్హు డెవ్వడొక్కొ యని తలంచి. (భోజ. 1-60)

కావ్యాన్ని కాంతా సమ్మితంగా వ్రాసేవాళ్లు మన తెలుగు సాహిత్యంలో ఉత్తరోత్తరా అరుదయ్యారు. ఆడవాళ్లూ మగవాళ్లూ కలసి చదువుతున్నప్పుడు వనితలు సిగ్గుపడనిదే కాంతాసమ్మితమైన కావ్యం. మన ప్రబంధ కవులు కాంతా సమ్మితమైన కావ్యం వ్రాశారుగాని ఆ కాంతలు కులకాంతలు కారు. వారకాంతలే. అనంతుడు నూటికి తొంభైతొమ్మిది వంతులు కులకాంతా సమ్మితంగానే వ్రాశాడు. ఏదో ఒకటి రెండుచోట్ల కుక్కల రతిని వర్ణిస్తూ చివుక్కుమనే మాట వాడాడు (భోజ. 6-351). అయితే అది జంతువుల సహజ ప్రవృత్తికి సంబంధించినది. పశుపక్షుల స్వభావాలను గమనించడంలో అనంతుడు గట్టివాడు. అతని కావ్యంలో కొన్ని పట్లు చదువుతూ ఉంటే వాల్ట్ డిస్నీ తీసిన 'ట్రూ లైఫ్' చలనచిత్రాలు చూస్తున్నట్టు ఉంటుంది. చూడండి, ఒక ఎలుకపిల్లను ఎలా వర్ణించాడో.

20. రసాభరణం, భూమిక, పుట 3.
21. ఆంధ్రాలంకారవాఙ్మయచరిత్రము, పుట 16.

'మరియు నచ్చిరుతెలుక తన తొొరటలోన యుండి వెలుపలికి దనమూతి సాపుచుందలచూసి మరలం దిగుచు నర్ధ శరీరంబు దోవ బిగుడి దుగుడుచు బుచ్ఛంబుం దక్కందక్కటి శరీరం బంతయు బయలుపడ నించుకసేపు కంపంబునొందుచు నుండి యుండి మరచి తలచినట్లుదరి వడి తిరిగి తొొఱ్ఱచొొచ్చుచు వెండియు నుండలేక వెలువడి శాఖామార్గంబునం గొొంతద వ్వరిగి వర్ణరవంబులు కర్ణంబులు సోకినం బెదరి .కోటరద్వారంబునకుం బరతెంచుచు నిట్లుశైశవక్రీడలు నడిపి తదనంతరంబ యెలప్రాయంబు సొచ్చుడు నూగుదోసపిండెగతి నందంబగు దేహంబును, దరుణశాకినీ మూలంబును బోలు వాలంబును శాల్మలీతూలకంబళంబు వధంబున నత్యంతమృదులం బగు నుదరంబును నాఖుకర్ణిపర్ణంబుల మాడ్కి రిక్కించుకొని యున్నర్ణంబులును నలంతిపూసలంటించినట్లు దనరు కనుంగవయును, నుచ్చింతపువ్వులలోని కేసరంబుల క్రియ భాసురంబగు పలువరసయు, దన పయోరూపంబున కనురూపంబు లగుచుండజెలంగి సెలగొమ్మ లెక్కి వ్రేలుచు బలిష్ఠంబులగు తిర్యశ్శాఖలపై ద్రుళ్లగింతలు పెట్టుచు నాకుజొొంపంబులు సొచ్చి దాగుచు నిటు బహువిధంబుల వివరించుచుండు నమ్మూషకమయోషంజూచి యొక్క మూషకతరుణ పురుషుండు వివశాంతఃకరుణుం డగుచు జురచుర నామ్రాకు ప్రాకి వేగిరపడి చెనకిన నది కినుకతోడ.' (భోజ. 4-19)

మద మొదవంగ మూషకకుమారసమూహము వెన్ను సమ్మెట్టై
పొదవిన వాల మార్చుచు బ్రబుద్ధ విటుండురుధైర్యమూలమున్
జెదరగ ద్రవ్వగోళ్ళగొని చెక్కిలి వ్రేసిన మూర్ఛవోయి తా
గదలకయుండె కాముబడిగంటదొొడింబడియున్నకైవడఇన్. (భోజ. 4-21)
భువి నట్లకాదె యువతియు గవితయు - సహజప్రసంగగతి నొొందినచో
దివిరి కడుబల్మి చేసిన - నవి సరసత యుడిగి నిరసమయి చనుటరుదే?
(భోజ. 4-21)

ఎలుకపిల్ల నిలా వర్ణించినట్లే ఒక ఎంద్రకాయపిల్లను కూడ చక్కగా ఇంకొొకచోట వర్ణించాడు (భోజ. 6-274 నుండి). ఈ ఎంద్రకాయపిల్ల గంగాయాత్ర చేస్తానంటుంది. ఇది ముందు తన తల్లికి వేసిన ప్రశ్నలు ఎంతో ముగ్ధంగా ఉంటాయి. చూడండి.

నరలోకం బెటువంటిది - సురలోకం బెట్టి, దీవు చూచితె? మనమం
దిరముల సాటివి యొొనో - విరచితగతి నింతకంటె విస్తీర్ణములో?
అందుండెడివారికి మన - చంద మొ రూపములు వేరెచందమొనాకా
చందము వివరింపుమనిన - నందను మాటలకు దల్లి నవ్వుచు బల్కెన్.
(భోజ. 6-282, 283)

ఎలుకను, ఎంద్రపీతను వర్ణించడం ఒక ఎత్తు, గోవును దాని పెయ్యను వర్ణించడం ఒక యెత్తు, చూడండి. పెయ్య పాలు తాగుతూ ఉంటే ఆవు కదలనైనా కదలలేదట.

కొడుకు చనుగ్రోలుచున్నంత దడవు దల్లి
యడుగుదిరుగక కదలక యన్యచిత్త

గాక పై నీగ సోకిన గదలకుండె
నెమ్మి బాషాణధేనువు నిలిపినట్లు.

పాలు త్రాగాక ఆ దూడపెయ్య వేసే చంగనాలు ఎలా వర్ణించాడో చూడండి.

పొట్టపొంగున దల్లి పొది వాసి వీథికి బారి క్రమ్మరు బెద్ద పరువుతోడ
దలయెత్తి చూచుచు బలుమారు దనుదల్లిపిలువంగ నిటనటుబొలసియాడు
నిలమీద మోమిడి యేమేని మూర్కొను బసివెట్టుకొనుచు దత్ప్రాంత
నంతంత బసిబిడ్డ లడ్డంబుసుడిసిన జంకించి మిన్నంట బౌకళించు (మందు)
నిట్లు శైశవక్రీడల నెసగుచున్న
కొడుకుదెసజూచి కన్నీరు గ్రక్కుకొనుచు
'గటకటా! యిట్టి నెత్తురు గందు నిచట
వైచిపోవంగ వలసినే నీచగతికి!' (భోజ. 6–25)

అప్పుడు ఆవు తన బిడ్డను పిలిచి నీతిబోధలు చేసి పులికి ఆహారంగా పోతుంది. ఇలాంటి ఆవును తెలుగు సాహిత్యంలో సృష్టించిన అనంతామాత్యుడు నిజంగా ఆవుకన్నా సాధువే. అయితే ఇంతకన్నా గోవులాంటి కవి మనకు లేకపోలేదు. ఆయన బమ్మెరపోతరాజుగారు. అయితే ఆయనకు అనంతుడు చాలా విషయాలలో మార్గదర్శి. చూడండి. పోతరాజుగారి ఈ పద్యం చాలా ప్రసిద్ధమైంది.

కుప్పించి ఎగసిన కుండలంబుల కాంతి గగనభాగం బెల్ల గప్పికొనగ
నురికిన నోర్వక యుదరంబులో నున్నజగముల వ్రేగున జగతి గదల
జక్రంబు జేపట్టిరి చనుదెంచు రయమున బైనున్న పచ్చని పటము జార
నమ్మితి నాలావు నగుబాటు సేయకు మన్నింపు మని క్రీడి మరలదిగున
గరికి లంఘించు సింహంబు కరణి మెరసి
నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు
విడువు మర్జున! యనుచు మర్విశిఖవృష్టి
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు. (భాగ. 1–185)

దీనికి అనంతామాత్యుడు చక్కని వరవడి పెట్టాడు. చూడండి:

ఉంకించి యెగయుచో నుభయపార్శ్వంబుల
పర్వతంబులును గంపంబునొంద
బక్షనిక్షేపణప్రౌఢిమ నెరవుచో
గారాకులటుఅల మేఘములు గూల
గమనీయబహుచిత్రగతుల నేపారుచో
సురవిమానంబులు నూరగిలగ
నిద్దంపుచూపులు నిగిడించుచో శంభు

తొడవు పాములకు దల్లడము గదుర
గరుడగమనుండు వచ్చెన కాదలంచి
నెమ్మి దళుకొత్త ప్రమథగణమ్ముతోడ
గదలి బాలేందుశేఖరుం డెదురునడవ
నిగిడె గరుడుండు కైలాసనగముపైకి. (భోజ. 7-34)

తన అనంతర కవులకు తాను ఎలాగ మార్గదర్శకుడో అనంతుడు అలాగే తను తన పూర్వులు చేసిన బాటలో నడిచాడు. చూడండి. ఇది భోజరాజును ప్రశంసించే పద్యం.

చర్చింప రెండవ చంద్రుడు మూడవ యశ్విని నాలవ యగ్నిదేవు
డైదవ లోకపాలాఖ్యు డారవ పాండుసంతాన మేడవ చక్రవర్తి
యెనిమిదవనయగు సన్మునీశుడా తొమ్మిదవయగు భోగిపతి పదియవ నిరించి
పదునొకండువచక్రపాణి పంద్రెండవ శూలి పద్మూడవ సూర్యుడనగ
దనరు గాంతిరూపమున బ్రతాపమున స
త్యమున ధర్మచరిత నాజ్ఞ శుచిని
భూరిసత్త్వమున బ్రబుద్ధత గలిమిని
భూతి దేజమునను భోజవిభుడు. (భోజ. 7-245)

ఇటువంటి అంకెల సంవిధానమున్న పద్యాన్ని మనం ఇంతకుముందు గుర్తించాం.[22]

భోజరాజు రెండవ చంద్రుడు, మూడవ అశ్వని అని వరుసగా అనంతుడు వర్ణించినా అతడు మాత్రం తెలుగు భాషలో మొదటి గడుసువాడు.

22. సమగ్రఆంధ్ర సాహిత్యం, మంచన, కాకతీయయుగం

కొలని గణపతిదేవుడు

తెలుగు భాషలో నాటకాలు లేవనీ, ఉంటే గౌరన చాలా మంచి నాటక రచయితగా రాణించేవాడనీ చెప్పుకొన్నాం. అయితే గౌరనకాలంలోనే తెలుగులో నాటకాలు వ్రాసిన మహానుభావుడు లేకపోలేదు. కొలను గణపతిదేవుడనే కవి శివయోగసారమనే గ్రంథాన్ని వ్రాశాడు. దాని అవతారికలో అతని గురువు ఇలా అన్నాడు.

మరియును శివపరమున య్యై-నెరయు కృతుల నాటకముల నేర్పు జనులం
దరు నౌనౌనని పొగడగ - కరకంఠుని కరుణ రచన కావించి తిలన్.

(శివయోగ. పీఠిక. 92)

ఇతని కృతులన్నీ దేశితెనుగులో ఉండేవని ఇంతకు ముందు పద్యంలో ఆ గురువే చెప్పాడు.

పశుపాశపతిజ్ఞానము - నశరీరభవవిజయమనోబోధముగా
విశదములగు నీకృతులస-దృశగతి చెప్పి దేశితెనుగున తెలియన్.[1]

(శివయోగ. పీఠిక. 91)

దురదృష్టవశాత్తు కొలని గణపతిదేవుడు రచించిన నాటకాలు, పశుపాశపతి జ్ఞానము, అశరీరభవవిజయం మొదలైన కృతులు లభించలేదు. దొరికినవల్లా అతని శివయోగసారం, మనోబోధలు మాత్రమే. ఈ రెండింటిలో శైవమతబోధ, వేదాంత ప్రబోధం తప్ప రసానందమిచ్చే కథాకథనం లేదు. అయితే శివయోగసారం పీఠిక చారిత్రకంగా మనకెంతో పనికివస్తుంది.[2]

కాకతీయ సామ్రాజ్య చరిత్రలో కొన్ని ఘట్టాలను ఈ శివయోగసారం పీఠిక సహాయం తోనే పూరించగలం. పాల్కురికి సోమనాథునికి శిష్యుడై అతని ప్రీతికోసం డోకిపఱ్ఱు అగ్రహారాన్ని శివభక్తులకు ప్రతాపరుద్రచక్రవర్తి చేత ఇప్పించిన ఇందులూరి అన్నయ దేవుని వంశచరిత్ర అంతా ఈ శివయోగసార పీఠికవల్లనే తెలియవస్తున్నది. ఈ అవతారికను ఆధారం చేసుకొనే చిలుకూరి వీరభద్రరావుగారు 'అన్నయదేవుడు - వింత చరిత్రాంశములు' అనే వ్యాసం వ్రాసి కాకతీయ చరిత్రలో ఒక ప్రకరణాన్ని సవరించారు.[3]

కొలను గణపతిదేవుడు తన గ్రంథం అవతారికలో ఇందులూరివారి వంశచరిత్రను ఇంత విపులంగా వ్రాయడానికి కారణం లేకపోలేదు. అది తన వంశచరిత్రే. ఇందులూరివారి వంశంలో ఒక శాఖకే ఉత్తరోత్తరా కొలనువారనే ఇంటిపేరు వచ్చింది. ఆ సంగతులు తెలుసుకొందాం.

1. ఈ పద్యంలో యతిభంగాలు, గణభంగాలు ఉన్నాయి.
2. ఈ పీఠిక కాకతీయసంచికలో అనుబంధంగా ప్రకటించారు. పుటలు 10-20
3. 'సుభాషిణి' పత్రికలో సంపాదకుడు పందిరి మల్లికార్జునరావుగారు, ప్రథమ సంచిక, అక్టోబరు 1927.

కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన గణపతిదేవ చక్రవర్తికీ, అతని కుమార్తె రుద్రమదేవికీ మగసంతానం లేదు. అందుకే గణపతిదేవుడు తన జీవితకాలంలో కుమార్తెను గద్దె కెక్కించాడు. ఆమె తన మనుమణ్ణే దత్తత చేసుకొంది. తన కుమార్తె రాజ్యపరిపాలన సుస్థిరంగా ఉండాలంటే మంత్రి దండనాథులు విధేయులైనంతమాత్రాన చాలదు. బంధుత్వాలు కూడా ఉండాలని గణపతిదేవుడు భావించి ఉంటాడు. రుద్రమదేవి కుమార్తెలను మాండలికులకు, మంత్రులకు ఇచ్చి పెళ్ళి చేయించాడు. రుద్రమదేవికి ముమ్మడమ్మ, రుయ్యామ్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దపిల్లను నిడుదవోలు మండలాన్ని పాలించే మహదేవరాజుకు ఇచ్చి పెళ్ళి చేయించాడు. రెండవ కుమార్తె రుయ్యామ్మను తమ కొలువులో వున్న ఇందులూరి పెద్దగన్నయ్యగారి అబ్బాయి అన్నయదేవునికిచ్చి వివాహం జరిపించాడు.

ఈ ఇందులూరివారు అప్పటికి మూడు తరాలనుంచీ కాకతీయ చక్రవర్తుల కొలువులో మంత్రులుగా, దండనాథులుగా ఉంటున్నారు. అన్నయదేవుడు గొప్ప పరాక్రమవంతుడు. ఇతడు కారణజన్ముడనీ, ఒక యతి తన కడపటి జన్మ ఈవిధంగా ఎత్తాలని కోరుకుని అన్నయదేవుడుగా జన్మించాడనీ లోకులు చెప్పుకొనేవారు. ఇతడు ఓరుగల్లు దగ్గర్నుంచి తూర్పున సింహాచలం దాకా ఎన్నో భూములు చిన్నప్పుడే జయించాడు. ఇతడు తన పెదతండ్రి సోమనగారితో ఈ దండయాత్రలలో పాల్గొని ఉంటాడు. ఏమంటే సోమన్న కూడా ఓరుగంటికి తూర్పున ఉన్న శత్రురాజ్యాలన్నీ జయించి కొలనువీడు జలదుర్గాన్ని తన సొంతం చేసుకొన్నాడు. పెదతండ్రీ, అన్నదేవుడూ రెండుసార్లు ఓరుగల్లునుంచి తూర్పున దిగ్విజయం చేయవలసిన అవసరం ఉండదేమో, ఇందులూరి సోమన్న కొలనువీడు దుర్గాన్ని సాధించి సొంతం చేసుకొన్నాడు. అందుచేత గణపతిదేవ చక్రవర్తి అతణ్ణి కొలనుసోమన్న అని పిలువసాగాడు. అదే రూఢి అయిపోయింది. దానితో ఇందులూరివారి వంశంలో సోమన్నగారి సంతతికి 'కొలను' వారు అనే ఇంటిపేరు వచ్చింది. వారు ఇందులూరువారికి ఉండే బిరుదులతోనే కొలనువీడు పాలిస్తూ ఉండేవారు. కొలనువీడు అంటే అదేదో ఊరు అనుకోకండి. నేటి ఏలూరునే ఆనాడు ఆ పేరుతో పిలిచేవారు.

కొలను సోమన్నగారి తర్వాత అయిదోతరంలో శివయోగసారం వ్రాసిన గణపతిదేవుడు జన్మించాడు. అంటే ఇతడు సోమన్నగారి మునిమనుమడి మనుమడు. ఇందులూరి అన్నమంత్రికి 'రాజచౌహత్త మల్లు' డనే బిరుదు వుంది. అది వంశక్రమానుగతంగా ఈ గణపతిదేవునికి కూడా ఉంది. ఇతడు మంత్రిగా, దండనాథుడుగా పేరుపొందకపోవచ్చు. కాని సగర్వంగా తాను అన్యనారీసహోదరుడనని, యోగీజన పదపంకేరుహ మత్తమధుకరుడననీ, అన్యస్తుతీ పరాఙ్ముఖుడననీ, శివస్తుతి సుముఖుడననీ చెప్పుకొన్నాడు. ఇతడు సేవించిన యోగులు శివయోగులు. అందులోనూ శ్రీగురుచన్న సదాశివయోగికి ప్రియశిష్యుడు. ఈ యోగి కవికి పరాయివాడు కాడు. సాక్షాత్తు మేనబావ. చిన్నప్పుడే సన్యసించి శివయోగిగా ప్రసిద్ధుడై ఉంటాడు. లేకపోతే మేనమరిది

శిష్యుడవడానికి ఆస్కారాలు తక్కువ. ఈ శ్రీగురుచన్న సదాశివయోగికి పూర్వాశ్రమంలోని పేరు ఈడూరి నూకనారాధ్యుడు. ఈ ఇంటిపేరులోని ఈడూరు నేటికీ పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలూకాలో ఉంది.

ఈడూరి నూకనారాధ్యుడు సకల వేదపురాణశాస్త్రార్థ సారసం విజ్ఞాత, సర్వజ్ఞుడు. గురుకటాక్షంచేత సిద్ధుడైనాడు. ఆధ్యాత్మసంవేత్త. కాశీ మొదలైన ముఖ్య ప్రదేశాలు చరించినవాడు (శివయోగపీఠిక, 85). ఇతడు శైవయోగ శాస్త్రసారసముచ్చయాన్ని ముందే నిశ్చయించాడు. దానిని తెలుగు భాషలో చెప్పించాలనుకొని తన మేనమరిదిని కొలను గణపతిదేవుణ్ణి రప్పించి ''విలసంనూతనకవితానిపుణుడవు. ఇంతకుముందు నాటకాలు, శైవకృతులు చేశావు. అందుకే ఇది నియోగిస్తున్నాను'' అన్నాడు.

శైవయోగశాస్త్రసారసముచ్చయం - బేమమున్ను నిశ్చయించినార
మది తెనుంగుబాస నఖిలలోకోపకా-రార్థముగ రచింపు మభినవముగ.
ఇల యజ్ఞానులయెడ కృప - కలిగి శివజ్ఞానపుస్తుకశ్లోకమునం
గలుగు యథార్థము చెప్పిన - గలుగు సుకృతమునకు మేర కలదే తలవన్?
లోకానురంజసంబుగ - మాకృప మత్కృతియు దగిన మాతృకగాదే
వేకావింపుము తెనుగున - నౌకృతి శివయోగసార మను నామమున్.

(శివయోగ. పీఠిక, 93-95)

ఈ పద్యాలవల్ల శివయోగసారం సంస్కృత గ్రంథానికి అనువాదమని తెలుస్తున్నది. దీనిని గణపతిదేవుడు రెండు భాగాలుగా రచించాడు. పూర్వభాగంలో ఎనిమిది ఆశ్వాసాలు ఉన్నాయి. ఉత్తరభాగంలో నాలుగు ఆశ్వాసాలు ఉన్నాయి. ఈ వివరాలన్నీ ఉత్తరభాగంలోని లవతారికలో ఉన్నాయి. చూడండి:

గణపతిదేవనామమున గల్గిన యే శివయోగసారముం
బ్రణుతమహాప్రబంధమున బల్కితి నాక్రియ పూర్వభాగముం
ద్రిణయనభక్తులౌ నన గథింతు సదాశివయోగనాథధీ
మణి యన రూఢికెక్కి గరిమంబున నుత్తరభాగ మేర్పడన్.
విశ్వేశస్థిరభక్తి వర్ధిల్లగ నుర్విం బూర్వభాగాష్టసం
ఖ్యాశ్వాసంబుల గర్మయజ్ఞము దపోయజ్ఞప్రకారంబు స
ర్వైశ్వర్యప్రదమై తనర్చు జపయజ్ఞాచారముం గూడగా
విశ్వస్తుత్యగతిం బ్రబంధ మమరెన్ విద్వత్పరిగ్రాహ్యమై
ఈ యుత్తరభాగంబున - నాయతి రచియింతు నాలుగాశ్వాసములం
బాయక ధ్యానజ్ఞాన మ -హాయజ్ఞద్వయము యమిజనానందముగన్.

(ఉత్తర. అవతారిక, 2, 3, 4)

శైవమత ప్రచారం కోసం వ్రాసిన గ్రంథం కాబట్టి ఇది సార్వజనీనం కాదేమో అనిపించవచ్చుగాని ఇందులో అందరికీ వర్తించే నీతులు కూడా లేకపోలేదు. పాత్రమెరిగిన దానం మంచిదని రుజువు చేస్తూ ఆవుకు గడ్డిపెట్టినా పాలు ఇస్తుంది; పాముకు పాలుపోస్తే విషం కక్కుతుంది అని ఎంత చక్కగా చెప్పాడో చూడండి.

ప్రమదముతో నొకింతయిన బాత్రున కీని మహాఫలం బగున్
బ్రమసి యపారవిత్తము లపాత్రున కిచ్చిన గీడుపొందు ఘూ
సము నొసగంగ దుగ్ధముల జాలగ ధేనువు లిచ్చు నట్టి దు
గ్ధము లొసగన్ విసం బొలుకుగాదె భుజంగమయూథ మిమ్మహిన్.[4]

ఈ శివయోగసారాన్ని పరిశీలిస్తే ఇలాంటివి ఎన్నో దొరకవచ్చు. ఈ కృతిని రచించడానికి ముందు కొలను గణపతిదేవుడు దేశితెనుగులో నాటకాలు మొదలైనవి వ్రాశాడని చెప్పుకొన్నవాటిలో మానసబోధ ఒకటి. ఇది 459 పాదాల ద్విపద గ్రంథం. ఇందులో చివర ''ఉర్విపై గాంతాసహోదరుండనగ గణపనారాధ్యులం గరుణించు శివుడు'' అని వుంది. శివయోగసారంలో గణపతిదేవుడు తాను అన్యకాంతా సహోదరుడనని చెప్పుకొన్నాడు. ఈ సంగతి తన తొలి రచనలోకూడ చాటుకొన్నాడన్న మాట.

గణపనారాధ్యుడనే కవి 'స్వరశాస్త్రమంజరి' అనే ద్విపద కావ్యాన్ని వ్రాశాడు. అందులో కవి తనకు పరనారీ సహోదరుడనే బిరుదు చెప్పుకోలేదుగాని తన అన్నగారు రామరాజుకు 'పరసతిసోదరభావంబు బిరుదు'' అని చెప్పాడు. శివయోగసారం, మనోబోధ వ్రాసిన గణపనారాధ్యుని తండ్రి పేరు ఆదిమూలుడు. అందుచేత ఇద్దరూ ఒకరు కారని చెప్పాలి. అదీకాక తొలి గణపనారాధ్యుడు (అంటే స్వరశాస్త్రం వ్రాసిన కవి) ప్రతాపరుద్రుని కాలంలోనూ, ఆ తరువాత ఓ రెండు పుష్కరాలూ జీవించి ఉంటాడు. అతని అన్న రామరాజు ఢిల్లీ సుల్తాన్‌చే మన్ననలు పొందినట్లు స్వరశాస్త్రమంజరిలో ఉంది.[5] అయితే ఈ గణపనారాధ్యుడు కొలని గణపతిదేవుని పూర్వీకుడై ఉంటాడు. గోత్రాలు ఒకటే. ఒక రాజ్యంలోనే మంత్రులుగా కొలువు చేసిన వారి సంతతిలో వాళ్ళ, మొదటి గణపనారాధ్యుడు ఈ వంశంలోని 4వ తరంలోనూ, రెండవ గణపనారాధ్యుడు 8వ తరంలోనూ ఉంటారు.

ఉమామహేశ్వర సంవాదరూపమైన స్వరచింతామణి అనే 25 అధ్యాయాల గ్రంథం ఒకటి సంస్కృతంలో ఉంది. స్వరశాస్త్రం అంటే సంగీతానికి సంబంధించిందని పొరబడవచ్చునుగాని, సంగీతానికీ దీనికీ సంబంధం లేదు. ఇది యోగశాస్త్రం. ఇందులో

---

4. శివయోగసారం, పూర్వభాగం.
5. ఈ స్వరశాస్త్రమంజరి నేలటూరి వెంకటరమణయ్య, టి.వి. రంగాచార్యులుగార్లు తమ హంపీయాత్రలో సంపాదించారు. దీని గురించి నేలటూరివారు భారతి 12వ సంపుటి 1వ సంచికలో వ్రాశారు. స్వరశాస్త్రమంజరి వ్రాతప్రతిని మిత్రులు నిడుదవోలు సుందరేశ్వరరావుగారు నాకు దయతో ఇచ్చారు.

పిండోత్పత్తి దగ్గరనుంచి శకునాలూ వశ్యమూలికలు దాకా ఎన్నో విషయాల గురించి చెప్పారు.[6] ఈ స్వరచింతామణికి గణపనారాధ్యుని స్వరశాస్త్రమంజరి ముక్కస్య ముక్క అనువాదం కాదుగాని రెండు గ్రంథాలలోని విషయాలూ ఒకటే. ''మహిమీద ముఖ్యమై యున్న యోగశాస్త్రములెల్ల యోచించి చూచి జీవహితంబుగా జీవునిబట్టి తెరగొప్ప జనులెల్ల తెలియునట్లుగను స్వరశాస్త్ర మంజరి''ని గణపనారాధ్యుడు వ్రాశానన్నాడు. ఈ స్వర చింతామణినికూడా చూసి ఉంటాడు.

మొదటి గణపనారాధ్యుని స్వరశాస్త్రమంజరిని రెండవ గణపనారాధ్యుడు, అంటే కొలను గణపతి దేవుడు చూసి ఉంటాడు. శివయోగసారంలోని కొన్ని భావాలకు, దీని పోలికలు ఉన్నాయి. వీటిని తైపారువేయడం వేరే పరిశోధన. శివయోగసారం వ్రాయడానికి ముందు గణపతిదేవుడు స్వరశాస్త్రాన్ని చదివాడనీ, మొదటి గణపనారాధ్యుని అన్నలాగ పరసతి సోదరభావంబు బిరుదుగా పెట్టుకొన్నాడనీ చెప్పుకొనడమే ఇక్కడ ముఖ్యం. ఈ బిరుదు పెట్టుకొనడంవల్ల శివయోగసారం, మనోబోధ వ్రాసింది ఒక్కరే అని తెలుసుకొనడానికి వీలవుతున్నది. ఈ మనోబోధను నిడుదవోలు సుందరేశ్వరరావుగారు పరిష్కరించి ప్రకటించారు.[7] ఇందులో గణపతిదేవుడు వైరాగ్యాన్ని చాలా తేటమాటలలో చెప్పాడు. పాపాత్ముడు భక్తిమార్గాన్ని చేపట్టడని ఇలా అన్నాడు:

అలరుల తావికి నలరునే మిడుత?
మృదుశంఖనాదంబు మెచ్చునే చెవుడు?
కొమరారు నృత్యంబు కోరునే చీటి?
కస్తూరి వెరుకునే గ్రామమాసూకరము?
వెలయ సౌభాగ్యంబు వెదకునే గూబ?
తనరారి చతురత దనరునే యెద్దు
పాపాత్మునకు నేల భక్తుని క్రియలు? (మనో. 396-402)

ఈ వైరాగ్యబోధలోని భావాలు నాటినుంచి నేటిదాకా ప్రచారంలో ఉన్నాయి. ''కర్రలే చుట్టాలు, కట్టెలే బంధువులు కన్నతల్లెవ్వరే చిలుకా'' అని, పోయేనాడు ఎవరూ వెంబడిరారని మనస్తత్త్వాలు బోధిస్తాయి. గణపతిదేవుడు మనోబోధ ఎలా చేస్తున్నాడో చూడండి.

మాయ బంధుల నేల మరిగెదవు మనస
చుట్టాలు పక్కాలు సుతులు సోదరులు
కలిమిలో సరి, వారు కలిమి గుందినను

6. సంస్కృత స్వరచింతామణిని ఆంధ్ర పబ్లిషింగ్ హౌస్ (వేపేరి మద్రాసు) వారు అచ్చువేశారు. (1955) ఈ యోగశాస్త్రాన్ని తెన్మకం శ్రీ రంగచార్యులుగారు పరిష్కరించారు.

7. మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం వారి బులెటిన్, 1950 - పుటలు 61-77

సిరవోయెనని తన్ను జేరంగ నీరు
కొంటెపెంపున మాన దూలపోనాడి
ఏమేడ, మీరేడ? యేమి పోరామి
అని పెక్కుభంగు లందంద బలుఁ
పగల సందడి నోర్చి వాసికి బాసి
మాటలు దలపోసి మది నీవు గుందు
చుండుట కోవుదే ఉండవు మనస!
ఎవ్వరెవ్వరివారు ఏమిపోరామి?
చావు మాన్పగ లేరు చా దోడరారు
తన చేయు పుణ్యంబు తన తోడు నీడ (మనో. 195-207)

మనోబోధలోని ఈ భావాలు గణపతిదేవుని అనంతరకృతి శివయోగసారంలో కనబడతాయి. చూడండి.

మొత్తములు గట్టి తగు భృత్యులును జుట్టములు
నత్తికొని యుండుదురు నిత్యమును మర్త్యుల్
విత్తనబహుళంబైన యత్తరిన యొక్కయెడ
విత్త మెడత్రెవ్వడును దత్తరముతో దా
నొత్తుకొని నీదుకడ కొత్తుమన నేటి కని
రిత్తలును నుగ్గులును నెత్తికొని యాడం
జిత్తమున సంతతము నుత్తలము నొందుటకు
నుత్తములు చూచి మరి మ్మెత్తురే ధరిత్రిన్! (ఉత్తర. 1-1282)

ఏవారైనను వారలేమవుదు రూహింపంగ నెవ్వారికిం
జావామాన్పగ లేరు వారు పిదపం జా దోడురానైనలే
రావేగంబున దోడ జచ్చినను గర్మాయత్తులై యస్యలో
కావాసంబున కేగుచుండుదురు తథ్యంబంతయుం జూడగన్. (ఉత్తర. 1-283)

మనోబోధలోని వైరాగ్యాన్ని వేమన్నగారు కూడా అలవరచుకొన్నారు. ఇందులోని కొన్ని పాదాల మువ్వలు అతని ఆటవెలదుల పాదాల గజ్జలైనాయి. 'తలలు బోడులైన తలఫులు బోడులా?' అన్నారు వేమన్నగారు. గణపతిదేవుడు ఏమన్నాడో చూడండి.

వెంట్రుకల్ చీరలు విడిచిపోయినను
మాయలు విడుచునే మనస భావింప
తలబోడిచీరయు తలపులో నెపుడు
తలవని పడుచుల తత్త్వజ్ఞు లంద్రు. (మనో. 339-342)

గణపతిదేవుణ్ణి వేమన్నగారు చాలాసార్లు చాలాచోట్ల అనుకరించారనే చెప్పాలి. చూడండి.

ఆవులు పలుచాయలై యుండుగాక
పాలు నాచాయలై బరగునె చెవును?
జాతులు పెక్కని చాటిన నేమి...? (మనో. 383-390)

ఈ మాటలు వేమన్నగారు ఎలా అనుకరించారో చూడండి:

కనగ సొమ్ము లెన్నొ - కనకంబు నొక్కటి
పసులవన్నె లెన్నొ - పాలునొకటి
పుష్పజాతు లెన్నొ పూజ యొక్కటి సుమీ
విశ్వదాభిరామ వినుర వేమ!

ద్విపదలను నడిపించడంలో గణపతిదేవుడు గౌరనకు ఏమాత్రం తీసిపోడు. ఒకొక్క పాదంలో రెండు అంత్యప్రాసలు పెడుతూ చక్కగా కదను తొక్కిస్తాడు. చూడండి.

దేహంబుతెరగెల్ల తెలియజెప్పెదను - మోహంబు ఎడబాసి ముదమార వినుము
హేయంబులకు దిట్ట యెమ్ములపుట్ట - మజ్జంబు నిలయంబు మలయసదనంబు
శోణితంబుల కుంట శుక్లంబుపెంట - చీముకరాటంబు శ్లేష్మభాండంబు
ముదిమియుండెడు యిక్కమూత్రంపుబొక్క - అదియైన నిలచునే యచలంబుగాక
నీరు బుగ్గయుబోలి నరవంబగును (మనో. 235-243)

దేహం ఎంత హేయమైనదో చెప్పి, అటువంటిదాని మీద మమకారం పొందినా అది శాశ్వతంగా ఉండదనీ, నీటిబుడగ అనీ చివర చెప్పడంలో వైరాగ్యం శిఖరాగ్రాన్ని చేరుకొంటున్నది. ఇంత తేటతెల్లమైన దేశితెనుగులో గణపతిదేవుడు వ్రాసిన ఇతరకృతులు లభించకపోవడం దురదృష్టమే.

జనులందరు 'ఔను ఔను' అని మెచ్చుకొన్న ఇతని నాటకాలు దొరికితే మన తెలుగు సాహిత్యం కూడా ఈ విషయంలో సగర్వంగా తలయెత్తుకొని తిరిగేది. నాటకాలు దొరక్కపోయినా నాటకాలు వ్రాసిన రచయిత పేరు తెలిసింది. అదెంత కాదు!

అయ్యలరాజు తిప్పయ్య

వీరశైవమతం మన దేశంలో వేళ్లు నిలద్రొక్కుకుని విజృంభించడం ఈ సాహిత్య చరిత్రలో మనం గమనించాం. వీరశైవంలాగే వీరవైష్ణవం కూడా కొంతకాలానికి ప్రబలింది. మల్లికార్జున పండితారాధ్యుల గురించి చెప్పుకొంటున్నప్పుడు ఆయన శివుణ్ణి మించిన దైవం లేడని చెప్పడానికి తన తల ఇస్తానన్నాడని తెలుసుకొన్నాం.[1] అతడు నిప్పుముట్టుకుంటానన్నాడు. శివునికన్నా వేరే దైవమున్నాడని ఎవరైనా చెప్తే వాళ్ళ తల తన కాలితో తంతానన్నాడు.[2] వీరశైవుడైన ఒక తెలుగుకవి తన మతాన్ని ప్రచారం చేసుకొందుకు ఇటువంటి జబర్దస్తీ మాటలు చెప్పినట్టే కొంచెం తగ్గుశ్రుతిలో ఒక వీరవైష్ణవుడైన తెలుగు కవికూడ తన మతాన్ని చాటిచెప్పాడు. వినండి.

ఇల నీమీదను జాల భక్తిగలవాడే యెట్టివాడైన నే
ఖలుడైనను దుది నుత్తమోత్తము డగున్ గాదన్న గొంగీడ్చెదన్
దెలుపన్ నిల్చిన నాడుకొన్న బరవాదిన్ గెల్చెదన్ వేదశా
స్త్ర లసద్వాక్యనుతప్రతాపరఘువీరా! జానకీ నాయకా.[3]

ఈ పద్యాన్ని వ్రాసిన కవి పేరు అయ్యలరాజు త్రిపురాంతకుడు. ఇతడు 'రఘువీరా జానకీనాయకా'! అనే మకుటంతో శతకం వ్రాశాడు. ఇది చాలా ప్రసిద్ధమైంది. ఈ శతకం చెప్పిన తిప్పయ్య మా పూర్వీకుడు అని ఇతని సంతతివాళ్ళు గొప్పగా చెప్పుకున్నారు. కృష్ణదేవరాయలవారి కాలానికి కొంచెం అర్వాచీనుడైన అయ్యలరాజు రామభద్రుడు ఈ తిప్పయ్యకు సాక్షాత్తూ మునిమనుమడు.[4] కొందరు మునిమనుమడు కాడు ఉత్త మనుమడే అంటారు.[5] మనుమడైనా, మునిమనుమడైనా రామభద్రకవి తన పూర్వీకుడైన తిప్పయ్యగారు ఒంటిమిట్ట రఘునాథ శతకం వ్రాసిన సంగతి తన కావ్యం రామాభ్యుదయంలో ఘనంగా చెప్పుకొన్నాడు. కృత్యాదిని పద్యాలలోకాక ప్రతి ఆశ్వాసం చివరా గద్యలో ఇలా ప్రకటించాడు:

ఇది శ్రీమదొంటిమిట్ట రఘువీరశతక నిర్మాణకర్మఠ
జగదేకఖ్యాతిధుర్యాయలరాజు తిప్పయమనీషి పర్వతాభిదాన పౌత్రాక్కయార్య
పుత్రపరిశీలిత సమిద రామానుజసిద్ధాంతామాత్య ముమ్మడి వరదా
చార్యకటాక్షవీక్షాపాత్ర హృదయపద్మాధిష్ఠిత శ్రీ రామభద్రకవి ప్రణీ
తంబైన రామాభ్యుదయ మహాప్రబంధంబునందు ప్రథమాశ్వాసము.[6]

---

1. సమగ్రాంధ్రసాహిత్యం, చాళుక్యయుగం.
2. పండితారాధ్యచరిత్ర, వాదప్రకరణం, పుట 711.
3. ఒంటిమిట్ట రఘువీరశతకం, పద్యం 84.
4. ఆంధ్రకవితరంగిణి, 6వ సంపుటి, పుట 12.
5. వావిళ్ళవారు ప్రచురించిన ఒంటిమిట్ట రఘువీరశతకం పీఠికలో గన్నవరపు సుబ్బరామయ్యగారున్ను, శతకకవుల చరిత్రలో వంగూరి సుబ్బారావుగారున్ను. శతక. పుట. 147.
6. వీరేశలింగంగారు ప్రకటించిన రామాభ్యుదయము (పుట 26)

ఈ గద్యవల్ల అయ్యలరాజు తిప్పయ్యగారు ఒంటిమిట్ట రఘువీర శతకం చెప్పినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. అయితే శతకం మకుటంలో 'ఒంటిమిట్ట' అనే మాట మనకు కనబడదు. శతకంలోని 108 పద్యాలలోనూ ఎక్కడో ఒకటి రెండుసార్లు అరుదుగా కనబడుతుంది. ఇతడు ఒంటిమిట్టలో ఉండే రాముడిమీద చెప్పడంవల్ల శతకానికి ఈ పేరు వచ్చింది. కవే ఒక పద్యంలో ఇలా చెప్పాడు:

తారుణ్యోదయ యొంటిమిట్ట రఘునాథా! నీకు నే బద్యముల్
నూరుం జెప్పెద నూరుపేరు వెలయన్ నూత్నంబుగా నంత నా
నోరుం బావన మౌను నీకరుణ భక్తి నన్నుందరున్
రారమ్మందురు గారవించి రఘువీరా! జానకీనాయకా! (65)

ఈ శతకం చెప్పడానికి ముందే ఇతణ్ణి అందరూ, 'రారమ్మ'నే వారు. సామాన్యులు కారు. మహారాజులే గౌరవించేవారు. ఆ సంగతి ఇతడే ఒక పద్యంలో మొదట ఇలా చెప్పాడు.

ఆ కర్ణాటకమండలాధిపతిచే నాస్థానమధ్యంబునన్
నాకావ్యంబులు మెచ్చజేసితిని నానారాజులుం జూడగా
నీకుం బద్యము లిచ్చుచో శివుడు వాణీదేవి నాజిహ్వకున్
రాకుండ న్వసియించు టెట్లు రఘువీరా! జానకీనాయకా! (57)

నానారాజులు చూస్తుండగా ఆస్థానమధ్యంలో కర్ణాటక మండలాధిపతి మెచ్చుకొనేటట్టు తిప్పయ్యగారు చెప్పిన కావ్యాలేమిటో మనకు తెలియవు. ఇతని వంశంలో ఎందరో కవులు పుట్టారు. వాళ్లు ఈయన వ్రాసిన ఇతర గ్రంథాలను పేర్కొనలేదు. ఈయన వ్రాసిన కావ్యాలను మెచ్చుకున్న కర్ణాటక మండలాధిపతి ఎవరోకూడ నికరంగా తెలియదు. అయితే మునిమనుమడైన అయ్యలరాజు రామభద్రయ్య క్రీ.శ. 1540 ప్రాంతాలవాడు కాబట్టి తరానికి పాతికేళ్ళ చొప్పున వెనుకకు వెళితే ముత్తాత క్రీ.శ. 1440 ప్రాంతాల వాడవుతాడు. ఆ కాలంలో కర్ణాటక రాజ్యాన్ని పరిపాలించిన సంగమవంశం రాజు రెండవ దేవరాయలు. ఇతని ఆస్థానంలోనే మొదట తిప్పయ్యగారు ఉన్నా కొన్నాళ్ళకు విరక్తితో దానిని వదిలిపెట్టినట్టు కనబడుతుంది. రాజులను తిరస్కరిస్తూ ఇతడు ఈ పద్యం చెప్పాడు.

తన గర్వంబున దారువుంగుడగుచున్ దైవంబు మంత్రంబు తం
త్రములన్ వీడగ నాడుచున్ దిరుగు నిర్భాగ్యుల్ మహారాజులై
మము నూరింపగ నేము నిన్నెరిగి నీమంత్రం బెరింగిన్ దరి
ద్రమతిన్ వేడగబోవు టెట్లు రఘువీరా! జానకీనాయకా! (59)

రాజులు ఊరించినా ఇప్పుడు లోబడలేదుగాని ఇతడు ఒకనాడు విచ్చలవిడిగా తిరిగినట్టు కనబడుతుంది.

చెడుగన్ గష్టుడదుష్టచిత్తుడ బరస్త్రీలోలుడన్ బాలుడన్
జడుడన్ మూఢుడ గొండెగాడను దురాచారిన్ నిషేధాత్ముడన్
గడుసన్ గాకరిగల్లగుల్లగపటిన్ గర్విన్ననున్ గావు మూ
రడియున్నాడను నీవెదిక్కు రఘువీరా! జానకీనాయకా! (17)

ఈ పద్యంలో చెప్పిన అవలక్షణాలన్నీ నిజంగా అతని కున్నాయో లేవో తెలియదు. భక్తుడు తాను పాపినని చెప్పుకొనడం మామూలు. అయితే ఈ పద్యంలో చెప్పిన 'పరస్త్రీలోలుడన్' అనేది నిజమే అనిపిస్తుంది. ఇంకొక పద్యంలో కూడ ఆ సంగతిని ఇంకొంచెం విశదపరిచి చెప్పాడు. చూడండి.

పరనారీకుచకుంభపాళికలపై బాదాబ్జయుగ్మంబుపై
గరమూలంబులపై గపోలతటిపై గంఠంబుపై గొప్పుపై
బరువుల్ వారెడు నాతలంపులు మిమున్ భావింపగాజేసి స
ర్వరసాధీశ్వర నన్ను బ్రోవు రఘువీరా! జానకీనాయకా! (69)

ఈ పద్యానికీ, పోతరాజుగారి పద్యం 'ఆదిన్ శ్రీసతికొప్పుపై' అనేదానికీ పోలికలున్నాయని పరిశోధకులు గుర్తించారు.[7] పోతరాజుగారి పద్యం చూడండి.

ఆదిన్ శ్రీసతికొప్పుపై దనువుపై నంసోత్తరీయంబుపై
బాదాబ్జంబులపై గపోలతటిపై బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందు కరంబు క్రిందగుట మీదై నాకరంబుంట మే
ల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే? (భాగ. అష్ట. 591)

పై రెండు పద్యాలలోనూ పాదాబ్జాలు, కపోలతటి అనే మాటలున్నాయి. పోతరాజుగారి పద్యంలో అంసోత్తరీయం ఉంది; తిప్పయ్యగారి పద్యంలో లేదు. మొదటే పరనారీకుచకుంభపాళి కనబడుతుంది. ఈ రెండు పద్యాలకూ సంస్కృత భాగవతం ఆధారమో, లేక తిప్పయ్యగారినే పోతరాజుగారు అనుకరించారో తెలుసుకోవాలని పరిశోధకులు భావిస్తున్నారు.[8]

తిప్పయ్యగారు పూర్వకవులను అనుకరిస్తారన్న సంగతి రఘువీర శతకాన్ని చదివితే తెలుస్తుంది. అందులో ఆయన ఇలా వ్రాశాడు.

బాలత్వంబున గొంతకాలము వృథాపాల్మాలి దుర్బుద్ధినై
జాలన్ యౌవనమందు గర్వమతినౌ సంసారినై దుష్క్రియా
జాలభ్రాంతి జరింతుగాని నిను గాంక్ష గొల్వలే దయ్యె యే
రాళంబైనది చింత వంత రఘువీరా! జానకీనాయకా! (73)

---

7. వంగూరి వెంకటసుబ్బారావుగారి శతకకవుల చరిత్ర, పుట 151.
8. చాగంటి శేషయ్యగారు, ఆంధ్రకవితరంగిణి, 6వ సంపుటి, పుట 15.

ఇది ఆదిశంకరుల 'భజగోవిందం' లోని 7వ శ్లోకానికి అనుకరణ. చూడండి.

బాలస్తావ త్క్రీడాసక్త స్తరుణ స్తావ త్తరుణీసక్తః
వృద్ధ స్తావశ్చింతాసక్తః పరే బ్రహ్మణి కోపి నసక్తః

ఈ పోలికను చూపిన వంగూరి వెంకటసుబ్బారావుగారే జానకీపతి శతకంలోని ఒక పద్యానికి పోలికలున్న తిప్పయగారి పద్యాన్ని చూపించారు. రెండూ చూడండి.

చిలుకను బెంచి ముద్దులకు జేడియ కుల్కుచు రామరామయన్
బలుకులు నేర్చుచున్ పలుకపైబడి మోక్ష మొసంగి తలచునే
మఱుమరు నీకథ ల్వినియు భక్తిని నామము లుచ్చరింపుచున్
బలమగు పాపబంధమున బారగగంటిని జానకీపతీ! (జానకీపతి శతకం. 7)

చిలుకన్ ముద్దులు చిల్క బల్కుతరి రాజీవాక్షి యొక్కర్తుని
చ్చలు 'రామా, రఘురామ, రావే' యనినన్ సాలోక్యసామీప్యముల్
కొలదుల్ మీరగ నిచ్చినాడవట నీకు, బిడ్డపేరిడ్డవా
రల పుణ్యంబున కేది మేర రఘువీరా! జానకీనాయకా! (82)

జానకీపతి శతకాలను ఇద్దరు కవులు చెప్పారు. ఆణివిళ్ళ సీతారామకవి (క్రీ.శ. 1750), రామభద్రకవి (క్రీ.శ. 1800కి పూర్వం) అనేవారు వీటిని వ్రాశారు. తిప్పయ్య గారి చిలుక పద్యానికి పోలికలున్న పద్యం రామభద్రకవి వ్రాసిందే. ఈ చిలుకకథ తిప్పయ్య గారి కాలం తరువాత కూడ ప్రచారంలో ఉన్నదనడానికి మొల్ల వ్రాసిన ఈ క్రింది పద్యం సాక్ష్యం.

వారాంగన శ్రీరాముని - పేరిడి రాచిలుక బిలిచి పెంపు వహించెన్
నేరువు గల చందంబున - నారాముని వినుతిసేయ హర్షముగాదే!
(రామాయణం పీఠిక, 22)

మొల్ల చెప్పిన వారకాంత తిప్పయ్య గారి కాలానికి ముందుదై ఉండాలి. లేదా సమకాలికురాలైనా అయిఉండాలి. ఆయన తన సమకాలిక విషయాలను కొన్ని శతకంలో గ్రంథస్థం చేశాడు. చూడండి:

చెలువంబొప్పు సువర్ణముద్ర లితరుల్ చెల్లించుటేక్రొత్తకా
కలనీముద్రలు చూడజెల్లుబడి చక్రాలంచు వేయించు మం
డలనాథాగ్రణి క్రొత్త నీ బలిమి నానావర్ణంపుందోలుము
ద్రలు చెల్లించితి వేదునందు రఘువీరా! జానకీనాయకా! (ఒంటిమిట్ట 80)

ఈ పద్యంలో చెప్పిన నానారకాల తోలుముద్రల కథేమిటో చారిత్రకులు చెప్పాలి. పిచ్చి తుగ్లక్ రాగినాణాలు వేయడం మనం విన్నాం. తోలునాణాలు వేసిందెవరో? నాణెం

6

బంగారానిదైతేనే ఆ రోజుల్లో విలువ. ఇనుమునుంచి బంగారం చేయాలని ఆనాడు ఎందరో ప్రయత్నించారు. వేమన్నగారి పద్యాలలో రసవాదం ప్రసక్తి ఎన్నోసార్లు కనబడుతుంది. తిప్పయ్యగారు కూడా రసవాదం సంగతి చెప్పారు. చూడండి.

కసుమాలంబగు దేహి పుల్లువుల నీకష్టంబులం బాపి ది
వ్యనుకాయం బొనరింతు వెవ్వడు నినున్ వాక్రుచ్చినన్ యోగిమా
నసగేహంబుల నుండి లోహము సువర్ణచ్ఛాయగాజేయగా
రసవాదంబులు నేర్చితౌర రఘువీరా! జానకీనాయకా! (94)

ఈ శతకంలో సమకాలిక విషయాలకన్నా భారత భాగవత రామాయణ గాథలలోని సంగతులు సహజంగా ఎక్కువ ఉన్నాయి. రెండు ఇతిహాసాలలోని కథలను ఒక్కసారే చెప్పి కవి చమత్కరించడం కూడ కనబడుతుంది.

రవిసూనున్ బరిమార్చి యింద్రసుతునిన్ రక్షించినా డందునో
రవిసూనున్ గృప నేలి యింద్రసుతు బోరం ద్రుంచినాడందునో
యివి నీయందును రెండునుం గలవు నీ కేదిష్టమో చక్కగా
రవివంశాగ్రణి తెల్పవయ్యా! రఘువీరా! జానకీనాయకా! (92)

భారతంలో కర్ణుడు రవిసూనుడు, అర్జునుడు ఇంద్రసూనుడు, రామాయణంలో వాలి ఇంద్రసూనుడు; సుగ్రీవుడు రవిసూనుడు. రవిసూనుణ్ణి చంపి ఇంద్రసూనుణ్ణి రక్షించావననా? రవిసూనుణ్ణి రక్షించి ఇంద్రసూనుణ్ణి పరిమార్చావనేదా? ఈ రెండూ నువ్వు చేశావు, ఇందులో నీకేది ఇష్టం అని అడుగుతున్నాడు. ఈ ప్రశ్న తిక్కనగారు హరిహరనాథుణ్ణి ''ప్రభూ, నీకు అస్థిమాల ఇష్టమా, కౌస్తుభం ఇష్టమా? కాలకూటం రుచిగా ఉంటుందా, యశోదాదేవి చనుబాలు రుచిగా ఉంటాయా? సెలవియ్యి'' అని అడిగిన శ్లోకాన్ని గుర్తు చేసింది.[9]

పురాణ కథలను పేర్కొన్నాడేకాని తిప్పయ్యగారు చెప్పే కొన్ని కథలు హరివంశం మొదలైన ప్రామాణిక గ్రంథాలకు విరుద్ధమైనవి చూడండి.

చెవి నీనామము విందునో యని కడున్ శంకించి కర్ణంబులన్
రవముల్ మీరిన ఘంట అంటనిడి ఘంటాకర్ణుడే తేరగా
నవి చూచున్ వరమిచ్చినాడ వట నీయంఘ్రిద్వయీసేవక
ప్రవరుం గాచుట ఏమి లెక్క రఘువీరా! జానకీ నాయకా! (91)

9. మహాభారతం, విరాట 1-11

హరివంశంలోని ఘంటాకర్ణుడు విష్ణుభక్తుడే. హరినామస్మరణ చేసేవాడే. విష్ణునామం వినబడకూడదని చెవులకు ఘంటలు కట్టుకొనలేదు. ఈ కథ ఆ పురాణానికి వ్యతిరేకమైనది. ఇంకో ఘంటాకర్ణుడు ఉన్నట్లు కనబడడు.[10]

తిప్పయ్యగారి కాలానికే పురాణ కథలు వేరే రూపాలను పొందుతున్నట్లు కనబడుతుంది. కొత్త పురాణాలను సృష్టించుకొనడం కూడా మొదలైంది.

ఎటువంటి పాపాత్ములైనాసరే శివరాత్రినాడు పుణ్యం చేసుకుంటే ముక్తులౌతాడని నిరూపించడానికి శ్రీనాథుడు కాశీఖండంలోని గుణనిధి కథను శివరాత్రిమాహాత్మ్యంగా తిరగవ్రాశాడు. సుకుమారుడు చెయ్యని పాపమంటూ లేదు. అటువంటివానికి శైవులు ముక్తియిప్పిస్తే ఈ వైష్ణవుడు ఏమంటున్నాడో చూడండి.

గోమాంసాళిని మద్యపాని సగరిన్ గొండీడుచండాలుడున్
హేమస్తేయుడు సోదరీరతుడు కూడేకాదశిన్ భుక్తిచే
సేమూఢాత్ముడు లోనుగాగలుగు దుశ్శీలాత్ముడైనన్ తుదిన్
రామా యన్నను ముక్తిగాచు రఘువీరా! జానకీనాయకా! (52)

వీరశైవులు ఎలాగైతే శివుని పేరు తప్పించి అన్యుల పేరు ఉచ్చరించరో వీరవైష్ణవులు కూడా అంతే అని ఇంకొక పద్యంవల్ల తెలుస్తుంది. పిడుగులు పడుతున్నప్పుడు సాధారణంగా 'అర్జునః ఫల్గునః పార్థః కిరీటి' అని గాండీవిపేర్లు చెప్పుకొనడం పరిపాటి. ఇతడేమంటున్నాడో చూడండి.

పటునిర్ఘాతకఠోరనాదము ఘనబ్రహ్మాండభాండంబు పి
క్కటిలం జేయుచు వచ్చునప్పు డితరుల్ గాండీవినామంబు లె
న్నుట మేలందురు వైష్ణవుల్ దలప రమ్యం గోరి యెంతెంత దు
ర్ఘటముల్ వచ్చిన నిన్నెకాని రఘువీరా! జానకీనాయకా! (14)

ఆరాధనాభేదాలకన్నా ఆచార్యుల భాష్యాలలోని సామ్యాలను అర్థం చేసుకొనడం ఉత్తమం అనీ, రామానుజ శంకరదర్శనాలను అధ్యయనం చేసి సమన్వయం చేసుకొనడం విశాల దృక్పథానికీ అవసరమనీ తలచే మన ఇరవయ్యో శతాబ్దంలో ఈ వీరశైవ, వీరవైష్ణవ కవితల పరిశీలన, మన పూర్వులు ఎలా బ్రతికారో, ఏమి భావించారో, ఎలా భాషించారో తెలుసుకొనడానికి మాత్రమే పనికివస్తుంది.

అయ్యలరాజు తిప్పయ్య భావాలు ఎలాంటివైనా భాష సజీవమైంది. దేవకీనందన శతకంలో వెన్నెలకంటి జన్నమంత్రి ఎంత సజీవమైన భాషను వాడాడో తిప్పయ్యగారు కూడా అంత చక్కని వ్యావహారికాన్ని ఆనాడే పద్యాలలో వాడాడు.

---

10. పూర్వగాథాలహరిలో వేరే ఘంటాకర్ణుని సంగతి లేదు.

అడిగే విద్యకు (18), చేసే మతి (34) పుట్టేద (78) మొదలైన ప్రయోగాలు కనబడతాయి. శబ్దాలంకారాలూ, శ్లేషలూ వాడడంలో కూడా ఈ కవి చతురుడే. చూడండి.

ఇనవంశోత్తమ వేదశాస్త్రములలో నేవింటి నేవింటివా
డును నీకుం బ్రతిగాడు నీకుగల బంటున్ నన్ను రక్షించుకా
లుని బంటున్ విదలింపగావలయు నాలో నుండు మీ మెండుమీ
రసమోఘాస్త్రమువిల్లు బూని రఘువీరా! జానకీనాయకా! (41)

ఇతని ఇతరకృతులు కొంచెం దీర్ఘమైనవి. దీని తరువాతివి దొరికితే వీటిలోంచి ఇంతకన్నా కమనీయమైన కవితను ఆస్వాదించేవాళ్ళమేమో! ఆ కృతులు ఎలాంటివో చెప్పలేంగాని అవి రాజులకు అంకితమిచ్చినవి మాత్రం కావు. ఏమంటే, అల్పులమీద ఇతడు కృతులు చెప్పడు. వినండి.

క్షితిలో నల్పులమీద జెప్పిన కృతుల్ చీచీ నిరర్థంబు లౌ
నుతికింబాత్రము గావు మేక మెడచన్నుల్ నేతిబీరాకులున్
వితతప్రౌఢిని నీకుజెప్పిన కృతుల్ వేదాలు శాస్త్రాలు భా
రతరామాయణంలో దలంప రఘువీరా! జానకీనాయకా! (26)

తిప్పయ్యగారికి రాజూ, రవుతూ దేవుడే. ఈ రెండు మాటలమీదా చమత్కరించి ఎలా పద్యం చెప్పాడో చూడండి.

తేజంబొప్పగ నీవె కావె మొదలన్ ద్రేతాయుగాంతంబునన్
రాజై పుట్టితి వింక నీ కలియుగాంతంబందునన్ రౌతువై
వాజిం దోలి విరోధులం దునుమ దేవా నీవ యొం డెవ్వడా
రాజున్ రౌతవు నీవ కావె రఘువీరా! జానకీనాయకా! (10)

ఒంటిమిట్ట రఘువీర శతకం చెప్పకముందూ తిప్పయ్య ఒక కర్ణాటకమండలాధిపతి ఆస్థానంలో ఉన్నా, ఈ శతకంలో అతని కర్ణాటేశ్వరుడు దేవుడే అని ఈ క్రింది పద్యంవల్ల తెలుస్తుంది.

నేటం దీరె ననేకజన్మములనుండిన్ నన్ను వెంటాడుచున్
వాటంబై చనుదెంచు పాపములునుశ్రీవత్సాంక నీవంక నీ
పాటల్ పాఠముసేయువారికి మరిన్ పాపంబులన్ బాపు గ
ర్ణాటాధీశ్వర! యొంటిమిట్టరఘువీరా! జానకీనాయకా! (13)

ఇందులో తిప్పయ్య పాటలు పాఠం చేయడం గురించి చెప్పాడు. ఇతడు ఏ పాటలు పాఠం చేశాడో, రచించాడో మనకు తెలియదుగాని ఈ యుగంలో జన్మించి పాటలు రచించిన ఇంకొక మహాకవి గురించి ఎంతో తెలియవస్తున్నది. అది ముందుముందు తెలుసుకొందాం!

ఆంధ్రకవి రామయ్య

మన తెలుగు కవులందరూ వాస్తవానికి ఆంధ్రకవులే అయినా ఇంటిపేరువల్లగాని, బిరుదువల్లగాని ఆంధ్రకవి ఒక్కడే ఒక్కడు మనకున్నాడు. అతని పేరు రామయ్య. ఇతడు 'విష్ణుకాంచీమాహాత్మ్యం' అనే ప్రబంధం వ్రాశాడు. ఈ గ్రంథం నేడు లభ్యం కావడం లేదుగాని ఇందులోని పన్నెండు పద్యాలు మాత్రం ఒక సంకలన గ్రంథకర్త ధర్మమా అని దొరుకుతున్నాయి. ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి కార్యాలయంలో 'ఉదాహరణ పద్యములు' అనే వివిధ కావ్యాలలోని పద్య సంకలనం ఉంది. అందులోనివే ఇవి.

'ప్రబంధరత్నాకరం' అనే ఇంకొక సంకలన గ్రంథాన్ని క్రీ.శ. 1550-60ల ప్రాంతాలలో ఉండిన పెదపాటి జగ్గన్న నిర్మించాడు. అతడు ఆంధ్రకవి రామయ్య పద్యాలు సేకరించలేదుగాని వాసిరాజు రామయ్య అనే కవి వ్రాసిన 'బృహన్నారదీయం' అనే కావ్యంలోనివి 3 పద్యాలు ఉదాహరించాడు. ఈ రామయ్యలు ఇద్దరూ ఒక్కరేనా, లేక విభిన్నులా అన్నది భావిపరిశోధనవల్ల తేలవలసిందే.

శ్రీనాథుని బావమరది దగ్గుపల్లి దుగ్గన 'శివకాంచి మహాత్మ్యం' వ్రాశాడు. అతడు శివకంచి మహిమను కీర్తిస్తే ఈ రామయ్య 'విష్ణుకంచి' ఘనతను చాటడానికి ఈ పుస్తకం వ్రాసి ఉంటాడు. అందుచేత ఈ రామయ్య దుగ్గన్నకు సమకాలికుడో, లేక కొద్దిగా సమీపకాలంలోని అర్వాచీనుడో అవుతాడు.

ఈ కవి రాయలసీమవాడై ఉంటాడని చాగంటి శేషయ్యగారు ఊహించారు[1] గాని ఆ ఊహకు ఆధారం చూపలేదు.

విష్ణుకాంచీ క్షేత్రమాహాత్మ్యం ఏ పురాణంలో ఉందో తెలియదుగాని పూర్వగాథాలహరిలో 'కంచి' గురించి ఇలా ఉంది.

కంచి : ముక్తిదాయకమగు క్షేత్రములలో నొకటి. ఇది తొల్లి సత్యవ్రతక్షేత్రం బనబడునది. ఇచ్చటనే బ్రహ్మ విష్ణువును గూర్చి యశ్వమేధయాగము చేసెను, ఆ యాగము చూడవచ్చువారి సదుపాయమునకు బ్రహ్మ విశ్వకర్మను రావించి యిట నొక పట్టణము నిర్మింపుమనియె. అతడు నిర్మించిన పట్టణమే కంచి.

మన ప్రాచీన గాథలలో ముగ్గురు సత్యవ్రతులు ఉన్నారు. ఒకడు ద్రవిడ దేశాధీశ్వరుడు వైవస్వత మనువు. రెండవవాడు దేవీభాగవతంలోనివాడు. మూడవవాడు భారతంలోని సుశర్మ సోదరుడు. ఈ ముగ్గురిలోను మొదటి ఇద్దరికి, విష్ణుకంచికి ఏదైనా సంబంధం ఉందేమో[2] ఆ కార్యక్రమాల గురించి తెలుసుకొందాం.

---

1. ఆంధ్రకవితరంగిణి, 8వ సంపుటము, పుట 233.
2. పూర్వగాథాలహరి, వేమూరి శ్రీనివాసరావుగారు, పుట 90.

సత్యవ్రతుడు: ద్రవిడ దేశాధీశుడు[3]

సత్యవ్రతుడు: దేవదత్తుడను బ్రాహ్మణుని కుమారుడు.[4]

ఇందులో ఏ సత్యవ్రతుని గురించి ఈ కావ్యం చెప్తుందో, అసలు చెప్పదో తెలియదు. ఈ కావ్యాన్ని వ్రాయడానికి ముందు ఆంధ్రకవి రామయ్య పూర్వకవులను ఇలా స్తుతించాడు.

పూర్వకవిస్తుతి: కాళిదాసు

ద్రాక్షాపాకనవీనవైఖరి ప్రబంధస్తోమముల్ సెప్పియ
ధ్యక్షుండయ్యె మహాకవీంద్రులకు నాహా! యెట్టి పుణ్యాత్ముడో
సాక్షాద్భారతిగాక యితడు మనుష్యవ్యక్తియే యంచు సం
లక్షింపందగు కాళిదాసు గృతిలీలావ్యాసు గీర్తించెదన్. (ప్రబంధ. 418)

కాళిదాసును ఇంత స్తుతించడంవల్ల అతని కావ్యాలలోనుంచి శ్లోకాలను అక్కడక్కడ అనువదించి తన కావ్యంలో పొందుపరిచేవాడేమో అనిపిస్తుంది. ఇతడు ఏ ఇతర సంస్కృత కవులను స్తుతించాడో తెలియదుగాని తెలుగు కవులను స్తుతించిన పద్యం లభిస్తున్నది. అందులో రమారమి ముఖ్యులందరూ ఉన్నారు. చూడండి.

పూర్వకవిస్తుతి - ఆంధ్రకవులు

శబ్దశాసన కావ్యసంఘట్టన క్రమానందితబుధవర్యు నన్నపార్యు,
నుభయభాషారచనోన్నిద్రభద్రవచోరాజి దిక్కన సోమయాజి
లక్ష్యలక్షణ కళాలంకారసౌభాగ్యసత్కావ్యవిన్యాసు శంభుదాసు,
ఛందోనిబంధనచాతురీ ధారేయవాగ్ధాము వేములవాడ భీము,
రసికజనపద్మదీననాథు రంగనాథు
బ్రకటకృతికర్మ నిస్తంద్రు భాస్కరేంద్రు
నమితరసభావు శ్రీత్రిపురారిదేవు
సూక్తితిమిధాము నాచనసోము దలతు. (ప్రబంధ. 422)

ఈ పద్యంలో ప్రతి కవికి ఒక విశేషణాన్ని వాడడం గమనించదగ్గది. నన్నయగారిని శబ్దశాసనుడన్నారు. నన్నయగారు వ్యాకరణం వ్రాసి వుంటారని ఈ మాట చెప్తుందని పండితలోకంలో కొందరు విశ్వసిస్తారు. నన్నయగారే తనను గురించి తాను చెప్పుకొన్న పద్యంలో తాము విపుల శబ్దశాసనులమన్నారు (ఆది 1-9), ఎర్రయగారిపట్లగూడ ఇతడు 'లక్షణ... కళావిన్యాసు' అనే ఛందోగ్రంథాన్ని వ్రాశారట.[5] కస్తూరి రంగకవి ఆనందరంగ

3. అదే పుస్తకంలో, పుట 479
4. అందులోనే, పుట 479
5. ఆంధ్రకవితరంగిణి, 4వ సంపుటం, పుట 72.

రాట్ఛందంలో చెప్పాడు (1-7). అయితే కవిసర్పగారుడాన్ని రచించింది పట్టాభిరామకవి. ఎర్రయగారి విషయంలో స్పష్టంగా చెప్పకపోయినా వేములవాడ భీమకవిమాత్రం ఛందోగ్రంథం వ్రాసినట్లు ఇతడు చెప్తున్నాడు. ఈ సంగతి మొదటిసారిగా చెప్పినవాడు ఆంధ్రకవి రామయ్యే. అయితే భీమకవి ఛందం వ్రాశాడా లేదా అన్న సంగతి మనం ఇంతకుముందే చర్చించాం.[6]

కవిత్రయాన్నీ, భీమకవినీ స్తుతించి రామయ్య రంగనాధుణ్ణి, భాస్కరుణ్ణి, రావిపాటి తిప్పయ్యను, నాచనసోముని తలచుకున్నాడు. శ్రీనాథుడు క్రీడాభిరామంలో ప్రశంసించాడుగాని సోముని ఎక్కడా స్తుతించలేదు. తిప్పయ్యను, సోముని స్తుతించబట్టి ఆంధ్రకవి రామయ్య శ్రీనాథునికి కొంచెం అర్వాచీనుడనీ, రామకవి దగ్గుపల్లి దుగ్గన్నకు సమీపకాలస్థుడని చెప్పవచ్చు.

ఇతని కావ్యం పేరు 'విష్ణుకాంచీమాహాత్మ్యం' కనుక అందులో కాంచీ నగరవర్ణన ఉండడం సహజం. అష్టాదశ వర్ణనల్లో ఒకటైన పురవర్ణనలో రామయ్య కంచిని వర్ణించాడు చూడండి.

కాంచి – పుర వర్ణన:

కాంచనబహువిధరత్నా- భ్యంచితమై చిత్రరచనబంధురతరమై
మించి సురాసురముఖ్యులు - కాంచి - నుతింపంగ గాంచి కాంచిం బోలెన్.

(ప్రబంధ 415)

ఈ కాంచీపురవర్ణన నాలుగోపాదంలో 'కాంచి' అనే మాటను మూడు అర్థాలలో వాడాడు. (1) కాంచి; కాంచు అనే క్రియా వాచకానికి క్త్వార్థకం. (2) కాంచి; పుణ్యక్షేత్రం పేరు. (3) కాంచి; ఆడవాళ్ళ ఒంటిపేట మొలనూలు.

భారతదేశంలో ముక్తిదాయకమైన పుణ్యక్షేత్రాలు ఏడు ఉన్నాయి. ఒక శ్లోకంలో ఆ యేడింటిని మన పూర్వులు స్మరించారు.

అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ అవంతికా
పురీ ద్వారవతీచైవ సప్తైతే మోక్షదాయకాః

ఉజ్జయని కాశి మాయ యయోధ్య కాంచి
మధుర ద్వారక యనెడి నామములు గలిగి
పట్టణము లేడు గీర్తి సంపద వహించు
మహితకైవల్య లక్ష్మికి మందిరములు. (కాశి. 3-87)

ప్రాచీన శ్లోకంలోనూ, శ్రీనాథుని పద్యంలోను పేర్కొన్న 'మాయా' పట్టణం హరిద్వారమే. ఈ సంగతి కాశీఖండంలోనే ఉంది. (3-120). ఈ ఏడు పుణ్యక్షేత్రాలనూ

6. సమగ్రఆంధ్రసాహిత్యం, చాళుక్యయుగం.

పేర్కొన్న శ్రీనాథుడు శివశర్మ అనే బ్రాహ్మణునికి ఈ క్షేత్రాలు చూపించాడు. అందులో కాంచి ప్రసక్తి ఇలా ఉంది.

కాంచికి బోయి బ్రాహ్మణుడు గాంచె మదావళభూమిభృచ్ఛిరః
కాంచనకంధరానిలయు గైటభమర్దను గామకోటి ద
ర్శించి భజించె బాలశశి శేఖరు నే కరిపాలనాయకు
న్బంచె ననేక పూర్వజననంబుల బుట్టిన పాతకాఘముల్. (కాశీ. 3-108)

కంచిలో దేవతలను చూపించాక శ్రీనాథుడు ఎందుకైనా మంచిదని తాను అంతకు ముందు చూసిన అరవ 'మామీ'ల అందాలను శివశర్మకు ఇలా చూపించాడు.

ముడువంగనేర్తురు ముడువ దావటికి రా జికురబంధము లీగ జీరువార
జొన్న పువ్వులబోలు పొక్కిళ్ళు బయలుగా గట్టనేర్తురు చీర కటిభరమున
దొడువంగ నేర్తురు నిడుద్రేలు జెవుల యందవతింపకంబుగా నల్లి పువ్వు
పచరింపనేర్తురు పదియారు వన్నియ పశిడిపాశములోర పట్టు చెంప
పయ్యెద ముసుంగు బాలిండ్లబ్రాకనీరు
తరచు పూయుదురోల (లి) గంధంబు బసువు
బందికత్తెలు సురతప్రపంచవేళ
గంచిద్రేతలు కుసుమాస్త్రఖడ్గలతలు (కాశీ. 3-109)

శ్రీనాథుడు కంచిలో చూచిన అరవతల అందాన్ని ఆంధ్రకవి రామయ్య చూశాడో, లేదోగాని వాళ్ళను ఇలా వర్ణిస్తున్నాడు.

పడియలలో వలబడియలందురు గాక
  గండుమీనము లంబకముల సరియె?
పొదలు మాటుగ వేచి పొదలు టగనుగాక
  యలరుగుత్తుల కుచావలుల సరియె?
గహనంబులోనన గహనమ్మై చనుగాక
  చమరవాలములు కేశముల సరియె?
ఘనములయొద్దనఘుములై మనుగాక
  తళుకులు మించు గాత్రముల సరియె?
కలువ లొండెను జక్రవాకంబులొండె
దేటు లొండెను బువ్వారుదీగెలొండె
గాక యని ప్రస్తుతింప నా కాంచిలోన
సతులు విలసిల్లుదురు హేమలతలుబోలె. (ప్రబంధ. 419)

ఇటువంటి విలాసినులున్న కంచి పట్టణంయొక్క మాహాత్మ్యానికీ హిమవత్ పర్వతానికీ కావ్యంలో ఏ సంబంధమో మనకు తెలియదుగాని ఆంధ్రకవి రామయ్య తన కావ్యంలో ఆ పర్వతాన్ని ఇలా వర్ణిస్తున్నాడు.

తనుబట్టి విడువని తగవరి యితడంచు
మృడునకు నొకవంక మేలు సేసె
దనకు బూర్వాశ్రితుడని సుర్యాధ్యక్షుని
శతకోటి ధనసన్వితుని జేసె,
దన పాదములు నితాంతము జేరి కొలువగు
రాజీవశ్రుతుని రాజు జేసె,
దనకు గుణంబుగా దగిలియుండుట సూచి
యహికులాధిపుని భోగాఢ్యు జేసె
వనుచు దనయందు గాన్పించుననుదినంబు
ననుచు మిన్నక కొనియాడినను నిజంబు
జగతి నొప్పారు నీ శైలచక్రవర్తి
యసమతరకీర్తి నిత్యకల్యాణమూర్తి. (ప్రబంధ. 417)

ఈ ప్రదేశంలోనో, మరిలేక ఇంకెక్కడో సంచరించే విష్వక్సేనుని గురించి ఇలా చెప్తున్నాడు:

ఇష్వాపక్రకచాది సాధన పరాహీన ప్రభాంగీకృతా
భిష్వంగద్యుమణి ద్యుతి ప్రకరుడై పీతాంబరాలంకృతుని
విష్వక్సేనుని గౌస్తుభాభరణు నుర్వీ శ్రీయుతుం గొల్పి యా
విష్వక్సేనుడు సంచరించు గణరాడ్విఖ్యాతు డా చక్కటిన్. (ప్రబంధ. 41)

మన ప్రాచీన పురాణాలలో ఇద్దరు విష్వక్సేనులు వున్నారు. ఒకడు విష్ణుమూర్తి సేనాని; రెండవవాడు శుకుని దౌహిత్రుడైన బ్రహ్మదత్తునికి గోదేవియందు పుట్టినవాడు. ఇతని కుమారుడు ఉదక్సేనుడు. ఈ ఇద్దరు విష్వక్సేనులను కవి ఇక్కడ సరిపోలుస్తున్నట్లు కనబడుతుంది.

ఈ పద్యంలో కవి చాలా దుష్కర ప్రాసమును తీసుకున్నాడు. ఇష్వాసము అంటే ఇషువులు వేసేది, విల్లు; అభిష్వంగము అంటే అత్యాసక్తి, అభిరుచి. ఈ విష్వక్సేనునికి, కథానాయకునికి ఏమిటి సంబంధమో తెలియదు. దశావతారాలు యెత్తినట్టి విష్ణువు యెలాగైతే వివిధ కాలాలలో శిష్టరక్షణ చేశాడో అలాగే బహుశా నాయకుడు సమర్థుడని ఈ క్రింది పద్యాలలో వర్ణిస్తున్నాడు.

శ్రుతులును నిర్జన స్థితులును మగిడింప
నిగిడింప జాలు నీ నేర్పు కలిమి,
దరణియు రిపుగర్వసరణియు ధరియింప
హరియింపజాలునీ యలపు కలిమి,
భ్రాత సర్మిలి గన్నమాతను బాలింప

లాలింప జాలు నీ లావు కలిమి,
గేహిని రమిసుతా వాహిని సాధింప
భేదింపజాలు నీ పేర్మి కలిమి,
జనుల బాతక జనులను జరుప మరుప
నలరు నీ నేర్పు కలిమి చిహ్నాములు నీకు
మత్స్య కూర్మ మహీధర మనుజసింహా
ఖర్వరామత్రయీబుద్ధ కల్కిగతులు (ప్రబంధ. 423)

దశావతారాలైన విష్ణువు నెలకొన్న కాంచీపట్టణ మాహాత్మ్యానికి గరుత్మంతునికి ఏదో సంబంధం కనిపిస్తుంది. అతణ్ణి ఇలా వర్ణిస్తున్నాడు.

గజ కచ్ఛపంబులే
రునికుక్షి లోనికిరానిది (టి) (?) భిక్ష -
సకల లోహములు నేజవసత్వసంపన్ను
ఖురళి కాయతకు గోష్పదంబు,
బలభేది వజ్ర మేయలఘు ఱెక్కలలోన
జిక్కి పెంపెపే (దిన) చిరుత పుల్ల
కద్రూతనూజవర్గంబు లే మహనీయు
నాగ్రహంబునకు జొక్కాకు వదువు
లతడు హరి గొల్వ వచ్చోటి కరుదెంచె
శంఖచూడ సుదక్షిణ క్షమపయోద
వాహనోద్దార తాభీల సాహసైన
అనిత దాక్షిణ్యు డైనట్టి వినతపట్టి (ప్రబంధ. 416)

ఈ గరుత్మంతుని వర్ణన శ్రీనాథుని కాశీఖండం చదివాక చేసినట్టు కనబడుతుంది. ముక్కస్యముక్క అనుసరణ కాదుగాని శ్రీనాథుని ప్రభావం లేకపోలేదు.

పరమసంయమి కశ్యపప్రజాపతికిని
వినత కాత్మజుడైన విహగ భర్త
విషధి కుక్షినిషాద వితతి భక్షించుచో
ద్విజాగ్రాసి యుమిసిన విమలబుద్ధి.
యిభకచ్ఛపముల రోహిణి శాఖతో దాల్చి
దివి మీద బారిన పవనవేగి
యహికోటి గెల్చి చిచ్చార్చి చక్రము దూరి
యమృతంబు గొన్నట్టి యమితబలుడు
జిష్ణుపని కొక్కయీక యిచ్చిన ప్రదాత
యచ్యుతుని వాహనము తార్క్ష్యు డగ్రజులును

దాను దల్లియు గాళికా స్థలమునందు
గొలిచి రర్కుల నలువుర గుంభజన్మ. (కాశీ. 6-14)

శ్రీనాథుడు ఎవరినైనా వర్ణిస్తున్నప్పుడు అతని జీవితంలోని ముఖ్య ఘట్టాలన్నింటిని తీసుకొని సీసపద్యంలో ఒక్కొక్కటి చెప్పి అలాటివాడు ఫలానాది చేశాడనో, చూశాడనో ఎత్తుగీతిలో పూర్తి చేస్తాడు. ఆ సంవిధానం ఇందులో కనిపిస్తుంది.

పురాణాలు వ్రాస్తున్నా పుక్కిటిపురాణాలు వ్రాస్తున్నా వాటికి కావ్యగౌరవం ఇవ్వడానికి మనవాళ్లు అష్టాదశ వర్ణనలు చెప్పారు. అందులో 'ఋతువర్ణన' ఒకటి. ఆంధ్రకవులు అందరూ చేసే వసంత వర్ణన మన ఆంధ్రకవి ఎలా చేశాడో చూడండి.

రాలు కారాకుల గ్రాలు మారాకుల గలయ భూజములెల్ల గానరాగ,
సతుల డెందంబుల నతుల కుందంబుల వికసనం బాత్మకు వ్రేగుగాగ,
బొలుచు దారకముల గెలుచు కోరికముల విరవాది తీగెలు విర్రవీగ.
జంపక జాలంబు నింపక యోలంబు గొని దవ్వులనె తేట కొలములాగ
నెంతయును వింత యిది యన నంతనంత
సంతతాక్రాంత మదన నితాంత తాంత
కాంత కాంతా కదంబక స్వాంతములకు
సంతసము నింప వచ్చె వసంత మంత. (ప్రబంధ. 421)

అష్టాదశ వర్ణనలలో వెన్నెలను వర్ణించడం కూడా ముఖ్యమే. ఆ వెన్నెలలో విహరించే చకోరాలను వర్ణించడం కూడా అవసరమే. ఆంధ్రకవి రామయ్యా ఎలా వర్ణిస్తున్నాడో చూడండి.

రసికత సోలిసోలి యనురాగ రసంబున దేలి తేలి యా
కసములు మెట్టి మెట్టి తమకంబున గాంతల బట్టిపట్టియా
దొసకుల జిక్కిచిక్కి కడుదూరముగా జని తక్కి తక్కి పై
కొసరెసగం జకోరికలు కోరిక లీరక లొత్త మత్తిలున్. (ప్రబంధ. 420)

ఈ చకోర విలాసవర్ణన తిక్కనగారి చకోరవిహారాలను జ్ఞాపకం తెస్తుంది, చూడండి.

క్రమ్మి పైదొరగెడు కౌముది తీయంబు సొంపున దనువున జొక్కిచొక్కి
పచరించు చంద్రతాపంబు కాలువలలో నడ్డంబుగా నిల్చి యాగి యాగి
వెల్లువ పెల్లు నూపెడు సాంద్ర చంద్రికాపూరంబు గని మది బొంగిపొంగి
మిన్నులతో రాయు వెన్నెల కరడుల నెరకలు సడలించి యీది యీది
చెలగి చెలగి మలగి మలగి యల్లల్లన - క్రాలి క్రాలి బిట్టు తూలి తూలి
ప్రమదవృత్తి గేలి సలిపె జకోరచ-యంబు సదలు దమమయంబుగా
(నిర్వచన. 6-48)

ఈ చకోర వర్ణనలోనే తిక్కనగారు మరపురాని ఒక చక్కని దృశ్యాన్ని చూపిస్తున్నారు. పెద్ద చకోరాలు వెన్నెలను చిత్తం వచ్చినట్టు తాగుతాయి. జాబిలి రేకులను తింటాయి. మరి పిల్లలో? ప్రకృతిసిద్ధమైన మాతృప్రేమను తెలియచేస్తున్నారు.

తివిచి నవకంబు దీప్తులు దెంచి యలతి
తునియలుగ జంచుపుటముల ద్రుంచి తల్లు
లాదరంబున నంది యీ నర్రు లెత్తి
ప్రీతి గముచు జకోరంబు బిల్లగములు (నిర్వచన. 6-46)

ఈ గీతపద్యంలోని భావాన్ని ఒక సీసపాదంలో చెప్తూ జక్కన తన విక్రమార్క చరిత్రలో తిక్కనగారిని అనుసరించాడు. చూడండి, జక్కన చేసిన చకోర వర్ణన:

వసగల వెన్నెల మిసిమి పుక్కిట బట్టి
పొసగ బిల్లల నోళ్ల బోసి బోసి
నున్నని క్రియ్యన్కు వెన్నెల తుంపరల్
హోమ్మని చెలుల పై నుమిసి యుమిసి
కమ్మని వెన్నెల కడుపు నిండగ గ్రోలి
తెలివెక్కి గర్రున ద్రేన్చి త్రేన్చి
కన్ని చ్చులకు వచ్చు వెన్నెల కొన్నురు
వేరివే ప్రియురాండ్ర కిచ్చియిచ్చి
తరచు వెన్నెల గుంపుల దారి తారి
యీరమగు వెన్నెలోన దూరి తూరి
పలుచనగు వెన్నెలలలోన బారి బారి
మెలగె బెక్కు చకోరంపు బులుగుగములు (విక్రమార్క. 6-71)

చంద్రుడున్నంతవరకే చకోరాలకు ఈ సందడి. సూర్యోదయమైతే ఆటకట్టే! రామయ్య సూర్యోదయాన్ని ఇలా వర్ణించాడు:

అరుణ స్ఫూర్తిసురేంద్ర దిక్తట మహావ్యాప్తిన్ విజృంభింపగా
శిరము ల్వంచె జకోర వర్గములు హెచ్చం జక్కవాకంబు లా
తురతం గైరవపం క్తిదూలె గడు సంతోషించె బద్మంబులొ
క్కరి చే టొక్కరి మేలు పొమ్మనుట విక్కంబైన చందంబునన్. (ప్రబంధ. 413)

తొలిసంజె వెలుగులు విజృంభింపగా చకోరాలు తలలు వంచాయి. చక్రవాకాల ఆతురతలు హెచ్చాయి. కలువలు విచారించాయి. పద్మాలు సంతోషించాయి. 'ఒకరి చేటు ఇంకొకరి మేలే లేపో' అన్నది నిజమైన విధంగా భళ్లున తెల్లవారింది.

అయితే దీనిలోనే ఈ కవి చరిత్రమీద కారుచీకటులు ఆవరించాయి.

పోతన

వీరశైవమతాన్ని ఉద్రేకంగా, ఉడ్డోలంగా ప్రచారం చేసిన పాల్కురికి సోమనాథుడు తెలంగాణాలోని ఓరుగల్లు నగరానికి ముప్ఫయిమైళ్ళ దూరంలో ఉన్న 'పాలుకుర్తి' గ్రామంలో జన్మించాడు. ఆయన ప్రభవించిన ఈ గ్రామానికి రెండుమైళ్ళ దూరంలో ఉన్న బమ్మెర గ్రామంలో, బహుశా ఆయన మరణించిన నూట ఏభయి సంవత్సరాలకు భాగవత వైష్ణవాన్ని భక్తిపారవశ్యంతో ప్రచారం చేసిన పోతరాజుగారు జన్మించారు. వీరశైవ మతాన్నీ, భాగవత వైష్ణవాన్నీ ఉద్ధరించిన ఉద్దండులు ఇరుగు పొరుగు గ్రామాలలో పుట్టడం కేవలం కాకతాళీయం కావచ్చు గాని అందులో ఎంతో ఔచిత్యం ఉంది. శైవమైనా, వైష్ణవమైనా ఒక్క కుదుట్లోంచి పుట్టినవే. అవి ఆశించే పరమార్థం ఒకటే. బోధించే పద్ధతులలో తేడాలు వుండవచ్చుగాని, సాధించేది ఒక్కటే.

ఒకరకంగా చూస్తే పాల్కురికి సోమనాథుని విచిత్ర వ్యక్తిత్వమే బమ్మెర పోతరాజు గారిలో అవిచ్ఛిన్నంగా రూపాంతరం పొందిందనుకోవచ్చు. తన ఆరాధ్యలక్ష్యానికి త్రికరణశుద్ధిగా తాను అంకితం అయ్యే మానవనైజం పరిపక్వమైన స్థితిలో ఈ ఇద్దరిలోనూ ఒక్కలాగే కనబడుతుంది. సోమనాథుడు విడిచిపెట్టిన చోటునుంచి పోతరాజుగారు అందుకున్నారు. మానవునిలోని తామసాన్ని సాత్వికంలోనికి అనువదించారు.

వాస్తవానికి నూనూగు మీసాల నూత్నయౌవనం వచ్చేదాకా పోతరాజుగారు కూడా సోమనాథుడు ప్రబోధించిన వీరశైవాన్ని ఆచరించినవారే. వారు పుట్టినది వీరశైవం విజృంభించిన పాలకుర్తి పరిసరాలలో. వారి తండ్రి కేసన 'శైవశాస్త్రమతాల లోతు చూసినవాడు.[1] వారి తల్లి అక్కసానమ్మ సదాశివపాదయుగార్చనాను కంపాయన వాగ్భవాని.[2] ఆమె పెద్దకొడుకు తిప్పయ్య ఈశ్వరసేవాకాముడు.[3] తల్లిదండ్రులూ, తోడబుట్టిన అన్నగారూ శైవులయినప్పుడు పోతరాజుగారు కూడా ఆ మతాన్నే ఆచరించడంలో, ఆ మత గురువులను ఆశ్రయించడంలో ఆశ్చర్యం లేదు.

పాలకుర్తి ప్రాంతాలలో, ఆ రోజులలో ఇవటూరి వారు శైవమత గురువులుగా ఉంటూ ఉండేవారు. వీరు బమ్మెరవారికీ, తదితరులకూ వంశక్రమానుగతంగా గురువులు. పోతరాజుగారి కాలంలో ఇవటూరి సోమనాథుడు మతబోధ చేస్తుంటేవాడు. ఆయన బాలపోతరాజుగారిలోని ఉత్సాహాన్ని మెచ్చుకుని ఆ బాలుని కవిత్వానికి చక్కగా కొనమళ్ళించాడు. అప్పటికి పోతరాజు చాలా పిన్నవాడు. పెక్కు సత్కృతులు విననివాడు.[4] తండ్రి అతనికి అక్షరాభ్యాసం చేసి తనకు వచ్చినదంతా చెప్పాడు. సంస్కృత పంచకావ్యాలూ పాఠం చెప్పి వుంటాడు. పండితయ్య శివతత్త్వసారం, సోమనాథుని బసవపురాణం, పండితారాధ్య చరిత్ర మొదలైన తెలుగు పుస్తకాలను పోతరాజుగారే స్వయంగా చదువుకుని వుంటారు. పూర్వకవులంటే ఆయనకు అకుంఠితమైన భక్తి ఉన్నా

1. భాగవతం, 1-22. 2. అదే, 1-24, 3. అదే, 1-25 4. వీరభద్రవిజయం, 1-21

వీరశైవులంటే మరీ ఎక్కువ అభిమానం. అందుకే వీరమాహేశ్వరాచారపరులు, వీరసత్యవ్రతులు, వీరసచ్చరిత్రులు వీరవిక్రములు అయిన సిరియాలుడు, కరికాలుడు, పండితారాధ్యుడు మొదలైనవారిని ఆయన మొక్కేవాడు.[5] బాలపోతరాజు ఎటువంటి వారిని ఆరాధించేవాడో ఒక పద్యంలో చెప్పాడు.

భవి జూడక భవి డాయక - భవు పదములు గొల్చి ఘోరభవభంజనులై
భవదూరులైన పుణ్యుల - భవు నర్చనచేసి వరము వడసినవారిన్.

(వీరభద్రవిజయం. 1-10)

ఇటువంటి బాలపోతరాజుగారిని ఇవటూరి సోమనాథుడొకనాడు పిలిపించి 'వీరభద్రవిజయం' అనే కావ్యం చెప్పమని ఆదేశించాడు. 'చిన్నవాడవైనా, ఎక్కువ చదువుకోకపోయినా మత్ప్రసాదదివ్యమహిమచే ఎంతైనా కవిత చెప్పేలావు నీకుంటుంది' అన్నాడు. బాలపోతరాజుగారు వ్యాసవాల్మీకులను పూజించాక తాము చదువుకొన్న పంచకావ్యాలు వ్రాసిన కాళిదాసు, బాణుడు, మాఘుడు, భారవి మొదలైనవారినీ, తెలుగు కవులనూ ఇలాగ స్తుతించాడు:

బాణు సంచితశబ్దపారీణు నసమానకవితాగుణావాసు కాళిదాసు
మాఘు వాక్యామోఘు మణిభద్రు శివభద్రు రమణీయతరకవిరాజు భోజు
బ్రకటితవిమలప్రభారవి భారవి సన్నుతగుణధుర్యు నన్నపార్యు
సేవితకవిరాజి శ్రీసోమయాజిని శృంగారకవినాథు రంగనాథు
నవని రెండవ శారదయై వెలుంగు - వైభవోద్దాము వేములవాడ భీము
నాదిగాగల కవులను నధిక భక్తి - దలచి వర్ణించి తత్ప్రసాదంబు వడసి.

(వీరభద్రవిజయం, 1-9)

ఈ పద్యంలోని 'శృంగారకవినాథు' అదే పదబంధం వల్ల పోతరాజుగారు శ్రీనాథుణ్ణి ఉద్దేశించారని కొంతమంది ఊహిస్తారు.[6] కాని అది వాస్తవం కాదేమో. ఈ పద్యంలో సన్నుతగుణధుర్యు, సేవితకవిరాజి, శృంగారకవినాథు, వైభవోద్దాము అనే పదబంధాలు వరుసగా నన్నయ, తిక్కన, రంగనాథ, భీమకవులకు విశేషణాలు. ఈ పద్యంలో శ్రీనాథుని ప్రశంసించలేదనుకోవాలి. ఈ పద్యంలో ఇంకో విశేషముంది. ఇందులో వీరశైవులైన పండితయ్యనుగాని, సోమనాథునిగాని తెలుగు కవులుగా నుతించలేదు. పండితయ్యను వీరమాహేశ్వరాచారపరునిగా కీర్తించాడు (వీర. 1-11). బహుశా, 'భవిచూడక, భవి డాయక' అనే (వీర 1-10) పద్యంలో పోతరాజుగారు పాల్కురికి సోమనాథుణ్ణే స్తుతించారేమో. అందులో 'వరమువడసినవారిన్' అనే పాఠానికి బదులు 'వరము వడసిన సోమున్' అనే పాఠాంతరం ఉందేమో తెలియదు.

5. వీరభద్రవిజయం, 1-11
6. 'పోతన' - నిడుదవోలు వెంకటరావుగారి గ్రంథం, నేషనల్ బుక్ ట్రస్ట్‌వారి ప్రచురణ, పుట 30.

తెలుగు కవులలో మరి ఇద్దరి ప్రభావం పోతరాజుగారి మీద లేకపోలేదు. వారు ప్రబంధపరమేశ్వరులు ఎఱ్ఱయ్య గారునూ, నాచన సోముడూను. ఈ ఇద్దరి రచనలనూ చిన్నప్పటినుంచీ ఒంటపట్టించుకుని పోతరాజుగారు పెద్దయ్యాక కూడా అనుసరించారు. భాగవతం సప్తమస్కంధం ప్రహ్లాద చరిత్రలోని ఎన్నో పద్యాలకు ఎఱ్ఱయ్యగారి నృసింహపురాణంలోని గద్య పద్యాలు ఒజ్జబంతులు. దశమస్కంధం ఉత్తరభాగంలో నరకాసురవధ ఘట్టంలోని సత్యభామా యుద్ధాన్ని పోతనగారు నాచన సోముని ఉత్తర హరివంశం చూశాకనే వ్రాశారు. ఆ ఘట్టంలో సత్యభామ ''అరి జూచున్ హరిజూచు'' అని నాచన సోముడు వ్రాస్తే ''పరుజూచున్ వరుజూచు'' అని పోతరాజుగారు వ్రాసిన సంగతి ఇంతకుముందు చెప్పుకొన్నాం.[7] ఇటువంటి సంవిధానం పోతరాజుగారి తొలి గ్రంథమైన వీరభద్రవిజయంలో కూడా ఉంది. శివునిమీద పూలబాణాలు వెయ్యడానికి మన్మథుడు వెళ్ళాడు. ఆ ఘట్టంలోని పద్యం చూడండి.

విలు జూచున్ వెలి జూచు జూచు సురలన్ విశ్వేశ్వరుం జూచు గొం
దలమందుం దలపోయజొచ్చు గడిమిన్ దర్వీకరాలంకృతో
జ్జ్వలవిభ్రాజితనిత్యనిర్గుణతపోవారాన్నిధింజెచ్చెరం
గలవంజూచు గలంపలేక తలకుం గాముండు నిశ్చేష్టుడై.

(వీరభద్రవిజయం, 2-101)

ఈ ఒక్క పద్యరచనా విధానంలోనే కాక నాచన సోముణ్ణి పోతరాజుగారు బాగా అనుసరించి అతడు చేసిన మూలవిరుద్ధమైన మార్పును ఆమోదించి భాగవతంలో చేర్చారు. శ్రీకృష్ణుడు రుక్మిణీసత్యభామలతో జూదం ఆడుతున్నప్పుడు కాశీరాజు కృత్యను ప్రయోగించాడనీ, ఆడుతున్న ఆటను ఆపకుండా కృష్ణుడు చక్రాన్ని ప్రయోగించాడనీ నాచన సోముడు వ్రాశాడు.[8] ఇది మూలవిరుద్ధమే. దీనిని పోతరాజుగారు దశమస్కంధం ఉత్తరభాగంలో ఇలా అనుసరించారు.

...సుధర్మాభ్యంతరంబునం జూదంబాడు దామోదరుం గనని రక్ష
రక్షేతియార్తవంబులం గృష్ణ! కృష్ణ! పెనుమంటలం బురంబు కాల్పన్
బ్రళయాగ్ని చనుదెంచె నన, వారిం జూచి, మీరోడకుండని భయంబు
నివారించి సర్వరక్షకుండైన పుండరీకాక్షుండు జగదంతరాత్ముండు
గావున తద్వృత్తాంతం బంతయు దన చిత్తంబున నెరింగి కాశిరాజపుత్ర
ప్రేరితయమ్మహాకృత్యను నిగ్రహింపం దలంచి నిజపార్శ్వవర్తియైయున్న
యద్దివ్యసాధనంబున్ గనుంగొని యప్పుడు,
భీమమై బహుతీవ్రధామమై హతరిపుస్తోమమై సుమహితోద్దాసు మగుచు
జండమై విజితమార్తాండమై పాలితాజాండమై విజయప్రకాండమగుచు

---

7. సమగ్రాంధ్రసాహిత్యం, పద్మనాయకయుగం.
8. ఉత్తరహరివంశం, 3:140-144.

నిత్యమై నిఖిలగంతవ్యమై సుజనసంభావ్యమై సద్భక్తసేవ్యమగుచు
నిత్యమై నిగమ స్తుత్యమై వినమితాదిత్యమైనిర్జితదైత్యమగుచు
విజయసమయసముద్ధూతవిపులభాస్వ
దశికలోచనలోచనానలసహస్ర
ఘటితపటుసటాజ్వాలికాచటులసత్వ
భయదచక్రంబు కృత్యపై బంపె శౌరి. (భాగవతం. 10-ఎ. 529-60)

నాచన సోముని ప్రభావంవల్లనే పోతనగారు శ్రీకృష్ణునిచేత జూదం ఆడించారు. ఇన్ని విధాల నాచన సోముణ్ణి మొదటినుంచి కడవరకూ అనుసరించినా, ఎందుచేతనో పోతరాజుగారు నాచన సోముని పేరు ఏ రచనలోనూ చెప్పలేదు. అయితే భాగవతంలో ''ఇతర పూర్వకవిజన సంభావనంబు చేసి'' అని, ''ఉభయకార్యకరణ దక్షుండునై ఉన్నా'' మని చెప్పారు. ఆ ఇతర పూర్వ కవులలో సోముణ్ణి చేర్చుకోవాలి. వీరభద్ర విజయంలో కూడా నన్నయ, తిక్కన, రంగనాధ, వేములవాడ భీముల పేర్లు చెప్పి 'ఆదిగాగల కవులను అధిక భక్తి తలచి' అన్నారు. ఇందులో ఎర్రయగారు సోముడు చేరుతారు.

బాలపోతరాజుగారు నాలుగాశ్వాసాల కావ్యంగా వీరభద్రవిజయం వ్రాశారు. ఇందులో ప్రథమాశ్వాసంలో దక్షయజ్ఞం జరుగుతుంది. అందులో సతీదేవి మరణిస్తుందిగాని వీరభద్రుడు ప్రభవించడు. నాలుగవ ఆశ్వాసంలో మళ్ళీ దక్షుడు ఇంకో మన్వంతరంలో యజ్ఞం చేసి శివనింద చేస్తాడు. అప్పుడు వీరభద్రుని పుట్టించి శివుడు విజయానికి పంపిస్తాడు. ఈ రెండు యజ్ఞాలకు మధ్య గిరిజ ప్రభవించడం, శివుని తపస్సు, ఆమెను శుశ్రూషకు నియోగించడం, దేవేంద్రుడు కాముణ్ణి పంపించి, శివుని తపస్సు ఆపించమనడం రతీమన్మథుల వివాదం, కామదహనం, శివుడు ఎరుకలసాని వేషంలో పార్వతికి సోది చెప్పడం, పార్వతి తపశ్చర్య, శివుడు కపట బ్రహ్మచారి వేషంలో వచ్చి ఆమెను పరీక్షించడం, తరువాత శంకరుడు సప్త మహర్షులను పిలిచి వాళ్ళను పెళ్ళి పెద్దలుగా పంపడం, పెళ్ళిమాటలు, వివిధ ఆచారాలూ, నాలుగు రోజుల పెళ్ళి, పార్వతీపరమేశ్వరులు సుఖంగా ఉండడం, ఆమె అతని కంఠం నీలంగా ఉండడానికి కారణం అడిగితే అతడు క్షీరసాగర మథనం హాలాహల భక్షణ కథనం చేయడం మొదలైనవి పోతరాజుగారు ప్రథమాశ్వాసంలో కొంతా, రెండు మూడు ఆశ్వాసాలలో పూర్తిగా వ్రాశారు.

ఇది పోతరాజుగారి బాల్య రచన కాబట్టి చదువుతూ ఉంటే ఉడికీ ఉడకని అన్నంతో పండీ పండని పండు నంచుకున్నట్టు ఉంటుంది. దుష్ట సమాసాలు, అపశబ్దాలు, వ్యర్థపదాలు కోకొల్లలు. అయితే ఒక మహాకవి ప్రాథమిక రచన ఎలా ఉంటుందో కూలంకషంగా పరిశీలించడానికి తోడ్పడుతుంది. ఎంత అపక్వమైన రచన అయినా ఇందులో పోతరాజుగారు ఆనాటి సాంఘిక ఆచారాలను చాలా చక్కగా చెప్పారు. సప్తర్షులను పిలిచిన శివుడు ఈవిధంగా పురమాయించాడు.

శీతాచలేంద్రుని కూతు బార్వతి కన్యనతిమోదమున మాకు నడిగి రండు
ఉడురాజవదనకు నుంప వేమడిగిన నెంతైన మైకొని యిచ్చిరండు
మదిరాక్షి నాతండు మన కిచ్చునట్లుగా బెంపార నుంగ్రము బెట్టి రండు
పాలకూళ్ళు గుడిచి బాలను మనసొమ్ము చేసి రండనువొంద చేసిరండు
ఇదియె మాకు మెచ్చు నెల్ల భంగులనైన - దీనిజేయవలయు దెరగు మెరసి
కదలిపోవ దిదె కడు మంచి లగ్నము - భూధరేంద్రపురికి పోయిరండు.

(వీరభద్రవిజయము, 3-27)

ఈ పద్యం ద్వారా ఆనాడు పెళ్ళి మాటలకు వెళ్ళేవాళ్ళు ఉంకువ ఇచ్చి ఉంగరం పెట్టి పాలకూళ్ళు భుజించి వచ్చేవారని తెలుస్తూంది. పెళ్ళి ముహూర్తాన్ని నిర్ణయించడానికి ఇంటి అరుగుమీద గడియారం కట్టించేవారు. దానిని పోతరాజుగారిలా వర్ణించారు:

తమ పెద్దింటి యరుంగుమీద గడకర్ ధాన్యంబుపై బెండ్లిల
గ్నము సాధింప బసిండి పేర్పున నభోగంగా నదీ తోయముల్
రమణం బోసి యలంకరించి ఘుడియారం బొప్ప గట్టించి య
య్యమరాచార్యునిచే మహా మహిమతో నర్క ప్రతాపంబునన్.

(వీరభద్రవిజయం. 3-126)

పుణ్యస్త్రీలు పాడుతూ క్రంతలు నడవడం, పెళ్ళిలో వధూవరుల మధ్య తెర కట్టడం, మధుపర్కాలు ఇవ్వడం, సుముహూర్తంలో తెర తియ్యడం, తలంబ్రాలు పోసుకోవడం, పెద్ద ఇంట్లోనుంచి పెండ్లి అరుగుమీదకు వచ్చి ప్రవేశహోమం చేయడం మొదలైన నాలుగు రోజుల పెళ్ళిని పోతరాజుగారు వివరంగా వర్ణించారు. ఆ మరునాడు అప్పగింతలు. ఇక్కడ మనం ఒక ముఖ్యమైన సంగతి చెప్పుకోవాలి, పోతరాజుగారు నాలుగు రోజుల పెళ్ళిని వర్ణించినా మంగళసూత్రధారణను పేర్కొనలేదు. నాకు తెలిసినంతవరకూ పోతరాజుగారి కాలందాకా ఏఒక్క తెలుగుకవీ మాంగల్య బంధాన్ని వివాహంలో వర్ణించలేదు. తిక్కనగారి కాలం నుంచి అందరూ పెళ్ళిలో ముఖ్యంగా తలంబ్రాలు పోసుకోవడమే పేర్కొన్నారు. మడికి సింగన తొలిసారిగా తెరసంగతి చెప్పాడు. వివాహ వర్ణనలో మాంగల్యధారణను గురించి వివరించకపోయినా పోతరాజుగారు వీరభద్ర విజయంలో మంగళసూత్ర బంధం గురించి వ్రాశారు. భస్మమైన పతిని చూసి రతి విలపిస్తున్న ఘట్టంలోని ఈ క్రింది పద్యం చూడండి.

రారే యేడుపు మాన్పరే మధురిపుర్ రప్పింపరే కావరే
పోరే కుయ్యోరిగింపరే సిరికి నా పుణ్యంబు విన్పింపరే
తేరే దేవర వేడి నా పెనిమిటిన్ దీర్ఘాయుషోపేతుగా
నీరే మంగళసూత్ర బంధనము మీకెంతేని పుణ్యంబగున్.

(వీరభద్ర విజయం, 2-126)

పోతరాజుగారు భాగవతంలో కూడ ఒకసారి మాంగల్య ప్రసక్తి తెచ్చారు. శివుడు హాలాహలం మింగబోతున్నప్పుడు పక్కన ఉన్న పార్వతి వారించలేదట. కట్టుకొన్న మొగుడు కాలకూటం త్రాగుతూంటే ఏ యిల్లాలయినా ఎలాగ ఊరుకోగలదు అనే ప్రశ్న పరీక్షిత్తుకు వచ్చింది. దానికి శుకుడు సమాధానం చెప్పాడు. చూడండి ఆ పద్యాలు.

అమరన్ లోకహితార్థ మంచు నభవుం డౌగాక యంచాడె బో
యమరుల్ భీతిని మ్రింగుమీ యనిరి నో యంభోజ గర్భాదుల్
దము గావన్ హర! లెమ్ము లెమ్మనిరి నో తా జూచి కన్గంటన
య్యుమ ప్రాణేశ్వరు నెట్లు మ్రింగుమనె నయ్యుగ్రానల జ్వాలలన్?

అనిన శుకుం డిట్లనియె.

మ్రింగెడువాడు విభుండని - మ్రింగెడిది గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగుమనె సర్వమంగళ - మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో?

(భాగవతం. 8:239-241)

మంగళసూత్రం సంగతి పోతరాజుగారు ఇంకొకచోట చాలా చక్కగా చెప్పారు. భారతస్త్రీలు ఏ ఆభరణమైనా తీసేస్తారుగాని పుస్తెలు మాత్రం తియ్యరు. తాను కొలుచుకునే సీతారాములచేత అన్నీ దానం చేయించి పోతరాజుగారు సీతమ్మకు తాళిబొట్టూ, రామయ్యకు రెండు జతల ధోవతులూ మిగిల్చారు. శ్రీరామచరిత్ర ఘట్టంలో రాముడు యాగం చేసి భూసురులకన్నీ ఇచ్చేశాడన్న సీసపద్యం తరువాతి ఎత్తుగీతి చూడండి.

తనకు రెండు పుట్టంబులు దనకునైన
మెలత మంగళసూత్రంబు మినుకుదక్క
వినతుడై యుండె రాముని వితరణంబు
పాండవోత్తమ! యేమని పలుకవచ్చు? (భాగ. 9-341)

పోతరాజుగారికి సమకాలికుడో, లేక కొంచెం పెద్దవాడో అయిన శ్రీనాథుడు కాశీఖండంలో దక్షయజ్ఞం గురించి వ్రాస్తూ శివుణ్ణి కాదని యాగానికి వచ్చిన దేవతలను పేరుపేరునా దధీచిచేత తిట్టించాడు. ఆ పద్యంలో మంగళ సూత్రాలకు దేశ్యమైన తాళ్ళను పేర్కొన్నాడు. చూడండి.

శితికంధరునకు నెచ్చెలికాడు గాడొకో
యటమటీడైన యీ యక్షభర్త?
యహికంకణునకు మూడవ కన్ను గాడొకో
పాల్మాలినట్టి యీ పాపకుండు?
పురవైరి కవతంసపుష్పంబు గాడొకో
నిర్భాగ్యుడైన యీ నీరజారి?

గంగాధరునకు లెంకలలెంక గాడొకో
　　　　పెనుగూళయైన యీ యనిమేషేంద్రు?
డేమి గుడువంగ వచ్చినా రిండ్ల విడిచి
హరుని వెలివెట్టినట్టి యీ యాగమునకు?
పంచవదనుని కను జేగురించె నేని
దత్యణంబున తమ యాంధ్ర తాళ్ల దెగవె? (కాశీఖండం, 7-60)

ఇదే పద్యం చాలా కొద్దిపాటి మార్పులతో వీరభద్ర విజయంలోకూడా ఉంది (4-47). అయితే ఇది ప్రక్షిప్తమనుకోవాలి. లేఖకులెవరో మోజుపడి దూర్చి ఉంటారు. పోతరాజుగారు అనుకరించడానికి కొద్దిపాటి ఆస్కారం లేకపోలేదు. శ్రీనాథుని కాశీఖండ రచన 1430 తరువాత జరిగిందని పండితులందరూ ఏకగ్రీవంగా భావిస్తున్నారు.[9] అప్పటికి పోతరాజుగారికి ఏ పదమూడేళ్లో ఉండిఉండవచ్చు. కాశీఖండ ప్రతిని వీరభద్ర విజయం వ్రాసేటప్పుడు చూసిఉండవచ్చు. అయితే ఈ తొలిరచనలో పోతరాజుగారు నన్నెచోడుణ్ణీ, పండితయ్యనూ ఎక్కువగా అనుకరించారు.

పండితయ్య తన శివతత్త్వసారంలో దక్షాధ్వర ధ్వంసం, గణాడంబరం విపులంగా వర్ణించాడు. అదితి, సరస్వతి, స్వాహా మొదలైన దేవతాస్త్రీల ముక్కులు, చనుముక్కులు వీరభద్రుడు కోశాడని కందపద్యాలలో పండితయ్య చెప్పాడు. అలాగే కందపద్యాలలోనే పోతరాజుగారు కూడా వ్రాశారు. శివతత్త్వసారంలోని 309, 314 పద్యాలతో వీరభద్రవిజయం నాల్గవ ఆశ్వాసంలోని 118 నుంచి 121 దాకా ఉన్న కందపద్యాలు తైపారువేస్తే ఈ సంగతి తెలుస్తుంది. వీరభద్రవిజయం రెండవ ఆశ్వాసంలో, మూడవ ఆశ్వాసంలో ముఖ్యంగా రతీమన్మథుల సంభాషణలో పోతరాజుగారు ఎక్కువగా నన్నెచోడుని అనుకరించారు. అయితే దక్షుణ్ణి సతీదేవి చేత ఉపాలంభనం చేయిస్తున్నప్పుడు నన్నెచోడుడు చూపిన నేర్పు, వాడిన పదపటిమ పోతరాజుగారు చూపలేకపోయారు. చూడండి, ప్రజాపతి కుమార్తె - పరమేశ్వరుని ఇల్లాలు పదిమంది మధ్య తండ్రిని ఏమంటుందో -

ఏరా దక్ష యదక్షమానస వృథా యీ దూషణం బేలరా
యోరీ పాపములెల్ల బోవిడువరా యుగ్రాక్షు చేపట్టరా
వైరం బొప్పదురా శివుం దలపరా వర్ణింపరా రాజితోం
కారాత్ముం డగు నీలకంఠు దెగడంగా రాదురా మన్మతీ. (వీరభద్రవిజయం, 46)

ఇవి శివదూషణ చేసిన భవిమీద వీరశైవుడు ప్రయోగించే మాటలేగాని ఒక కావ్యంలో ఉదాత్తమైన పాత్రచేత చెప్పించే మాటలు గావు. వీరభద్రవిజయం వ్రాస్తున్నప్పుడు పోతరాజుగారి మతాభిమానం అటువంటిది. పరమతసహనం ఆ వయసులో లోపిస్తే ఆశ్చర్యపడనక్కరలేదు. అయితే ఇటువంటి ఉడుకునెత్తుటి వీరశైవుడు

9. సమగ్రాంధ్ర సాహిత్యం, రెడ్డిరాజుల యుగం.

పరమసాత్త్వికుడై భాగవత రచన చేయడానికి వీలుగా ఎలా మారాడో తెలుసుకొనడంలో ఆనందముంటుంది.

వీరభద్రవిజయం వ్రాసేనాటికి పోతరాజుగారికి మీసకట్టు కూడా వచ్చి వుండదని చెప్పుకొన్నాం. నూత్నయౌవనం వచ్చి కొందరు భావించినట్టు తన గ్రామానికి సమీపాన ఉన్న పట్టణానికి ధనార్జనకో, మరెందుకో పోయి ఉండవచ్చు. ''ఈతడు కుటుంబమునకు పెద్దవాఁడు కాడు కావున గ్రామకరణీక మీతని కుండదు. పండితుడు కవి బీదవాడును నగు నీతడు సమీపమందున్న గొప్పపట్టణమునకు పోయి ఋజుమార్గముననే కొంత ధనమార్జించి కుటుంబపోషణము చేయకూడదా?'' అని కొమర్రాజు లక్ష్మణరావుగారు వేసిన ప్రశ్న సమంజసమైనదే.[10] వారు చెప్పినట్టి ఆ రోజులలో, రాజున్నా లేకపోయినా, ఏకశిలానగరం పెద్దపట్టణం. పలువురు విద్వాంసులు, కవులు, రసికులు, శ్రీమంతులు అక్కడ ఉండడం సహజం. వారి సహవాసనిమిత్తం పోతరాజుగారు అక్కడ ఎక్కువగా ఉండవచ్చు.

పోతరాజుగారి పూర్వులు గణకులు. అందులో ఒకాయన గణకవ్రజమాన్యుడు.[11] పోతరాజుగారు కూడా గణితశాస్త్రం బాగా అధ్యయనం చేసినట్టు కనబడుతుంది. భాగవత నవమస్కంధంలో గంగావతరణం ఘట్టంలో ఆయన శ్లేషమూలోపమా లంకారాలతో 78 పంక్తులలో సుదీర్ఘమైన 'బాణవచనం' వ్రాశారు. అందులో 'గణిత శాస్త్రంబు కొలందిని ఘన, ఘనమూల, వర్గమూల, సంకలిత, భిన్న మిశ్రప్రకీర్ణ ఖాతభీష్మంబై' అని వర్ణించారు (9-229). (ఆ వచనంలో ఇతర శాస్త్రాల ప్రసక్తికూడా ఉందిగాని అందులో కొన్ని వరంగల్లు చేరాక నేర్చుకొన్నవి కావచ్చు). యుక్తవయసు వచ్చాక పోతరాజుగారు ఏ శ్రీమంతుని కొలువులోనో గణకుడుగా చేరి ఉండవచ్చు. ఓరుగల్లులోనే, పద్మనాయక రాజధాని రాచకొండలోనే పోతరాజుగారు నివసించి ఉండవచ్చు. ఆ రోజుల్లో చాలామంది ప్రభువులు, ప్రభుత్వోద్యోగులు వైష్ణవంవైపు మొగ్గుతున్నారు. రాచకొండ, దేవరకొండ ప్రభువులు మొదట శైవులైనా, వేదాంత దేశికులవారి కుమారుడు అక్కడి పండితులను ఓడించి, వైష్ణవాన్ని స్థాపించినట్టు మనం ఇంతకుముందు తెలుసుకున్నాం.[12] వేదాంతదేశికులవారి వైష్ణవగ్రంథాలు పఠించడం అప్పుడు విరివిగా సాగేది. అదీకాక, నాటి ఆంధ్రసాహిత్య సంప్రదాయంలో హరిహరాద్వైతం బాగా వేళ్ళూనింది. శైవుల ఇంట్లో పుట్టి శంభుదాసు అని బిరుదు వహించిన ఎఱ్ఱయ్యగారు నృసింహపురాణం, హరివంశం రచించారు. వైష్ణవుడైన అనంతామాత్యుడు తన భోజరాజీయంలో శివుని బాగా వర్ణించాడు; నుతించాడు. ఎఱ్ఱయ్యగారి హరివంశంలోని కృష్ణలీలలు, మడికి సింగన్న రచించిన పద్మపురాణంలోని దశమాశ్వాసం (ఇది పూర్తిగా కృష్ణావతారచరిత్ర) బాగా చదివిన పోతరాజుగారికి

10. లక్ష్మణరాయ వ్యాసావళి – 'ఏకశిలానగర మోరుగల్లే', పుట 91.
11. వీరభద్రవిజయం, 1-32.
12. సమగ్రాంధ్ర సాహిత్యం, పద్మనాయకయుగం

కృష్ణావతారం గురించి, వాసుదేవతత్వం గురించి పూర్తిగా తెలుసుకోవాలనే కుతూహలం జనించి ఉండవచ్చు.

ఈ కుతూహలం తీరేలోగా పోతరాజుగారు వయసుకు తగిన సొగసులు చూసి ఆనందించేవారని తోస్తుంది. ఆయన ప్రాయమా? పైలాపచ్చీసు! ఆయన ఉంటున్నదా ముఖ్యపట్నం. వైభోగాలతో, వారవిలాసినుల నృత్యావధానాలతో, మంజులగానాలతో ఆటపాటలు, శృంగారగానాలూ వెల్లివిరిసే కాలం. పోతరాజుగారు కూడా సానివాడను పావనం చేసేవారు కాబోలు. ఆ రోజుల్లో వారికి రాజాశ్రయం కూడా దొరికేది కాబోలు. రాచకొండ నేలే సర్వజ్ఞసింగభూపాలుడు (క్రీ.శ. 1425–1475) కూడా మంచి రసికుడు. అతడొకనాడు గోపాలదేవోత్సవక్రీడలో పాల్గొన్నాడు. అప్పుడొక మేడలోంచి వారకాంత ఒకర్తె అతణ్ణి చూసింది. మోహించింది. ఆమె తల్లి 'ఆ ప్రభువు మనింటికి ఎందుకొస్తాడే? మన తాహతుకు తగ్గ దొరలనే వరించి వలపించాలి' అని హితోపదేశం చేసింది. సానికూతురు వినలేదు. ఎన్నిరకాలుగానో తల్లిని తిట్టి, బ్రతిమాలి, శపించి, ప్రాథేయపడి సింగభూపాలుని తీసుకురమ్మంది. చివరకు ఆ ప్రభువు వచ్చి ఆమెను ఏలుకొన్నాడు. సద్భోగినీపట్టం దిట్టమౌనట్టుగా ప్రసాదించాడు. ఏనుగు ఎక్కించాడు. రాజాశ్రయంలోను, సానివాడలోనూ సమానంగా వున్న పోతరాజుగారు ఈ సంగతులు ఒక దండకంలో వ్రాశారు.

దాన్ని 'భోగినీదండకం' అంటారు. అంతవరకూ వున్న స్తుతి రూపక సంప్రదాయమునకు బదులుగా, దండకాలలో ఇతివృత్త సంప్రదాయం పోతరాజుగారి దండకంతోనే ప్రారంభం అయిందని కొందరు పరిశోధకులు చెప్పారు.[13] అయితే దండకంలో ఇతివృత్తం చెప్పడం పోతరాజుగారితో కాక శ్రీనాథునితో మొదలైంది. దక్షయజ్ఞ సందర్భంలో కవిసార్వభౌముడు సతీదేవి చేత శివుణ్ణి భూషించి, దేవతలను దండకంలోనే దూషించాడు (కాశీఖండం, 7-24). నన్నయ తరువాత తిక్కన, ఎర్రనలు దండకాలు ఉపయోగించలేదని కూడా పరిశోధకులు పొరబడుతున్నారు.[14] ఎర్రనగారు నృసింహపురాణంలో దండకం వ్రాశారు (5-11). పోతరాజుగారు దండకరచనలో ఎర్రన మార్గాన్ని అనుసరించారు. శ్రీనాథుడు రెండు నగణాలపై రగణంతో దండకం వ్రాశాడు. ఎర్రనగారు ఎత్తుగడతోనే తగణ దండకం వ్రాశారు. పోతరాజుగారి భోగినీదండకం, భాగవతంలోని అక్రూర దండకం తగణ దండకాలే.

పోతరాజుగారు పరమ భక్తులుగా భాగవతంవల్ల ప్రసిద్ధులైనారు కనుక అటువంటి భోగినీ దండకంలాంటి శృంగార రచనలు చేయరని కొందరి మతం.[15] అయితే వారకాంతలను చూడకూడదు; వారిని వర్ణించకూడదు అన్న నియమం పోతరాజుగారికి భాగవత రచనాకాలంలో కూడా లేదు. దశమస్కంధ ఉత్తరభాగంలో ధర్మజుని

13. పోతన : నిడుదవోలు వెంకటరావుగారు, పుట 91.
14. పోతన : నిడుదవోలు వెంకటరావుగారు, పుట 91.
15. ఉదాహరణకు : చాగంటి శేషయ్యగారు, ఆంధ్రకవితరంగిణి, సంపుటి, పుట 184.

రాజసూయ యాగానికి 'వారాంగనా జనంబులు తమతమ వారలి గూడుకొని' వెళ్లారని పోతరాజుగారు వర్ణించారు. ఈ వర్ణన ఒకటి రెండు మాటలతో కాదు. ఒక సీసపద్యంలోనూ, 24 పంక్తుల సుదీర్ఘ వచనంలోనూ చేశారు. మహిత కుచభారకంపిత మధ్యలగుచు మొలనూళ్ల మెరయపయ్యెదలు జార ఒకరిమీద ఒకరు జల్లుకొన్న పన్నీటితో చెంగావి జిలుగుపుట్టంబులు దట్టంబులుగా దోగిలి మర్మంబులు బయటపడిన అగ్గలంబు లగు సిగ్గులకు ఒప్పిదాలైన తమ కనురెప్పలకు అడ్డంచేస్తూ ఆ వారకాంతలు పురుషులతో రసోక్తులెనయ వసంతాలాడారని ఈ సుదీర్ఘ వర్ణనలో పోతనరాజుగారు చెప్పారు.

మహాభక్తులై పారవశ్యంతో భాగవతం రచిస్తూ బహుశా ఆ రచన కడపటిదశలో వారకాంతలను గురించి ఇంతగా వ్రాసిన పోతనరాజుగారు యౌవనంలో భోగినీదండకం వంటిది వ్రాయకుండా ఉంటారా? ఆ దండకం చివర నున్న ఒక పద్యం - అది పోతరాజుగారు వ్రాసినట్టే ఉంది - చూడండి.

పండిత కీర్తనీయుడగు బమ్మెరపోతన యా సుధాంశు మా
ర్తాండ కులాచలాంబునిధి తారకమై విలసిల్ల భోగినీ
దండకమున్ రచించె బహుదాన విహర్తకు రావు సింగభూ
మండల భర్తకున్ వినుత మానవనాధ మదావహర్తకున్.

ఈ పద్యంలో అనుప్రాస పోతరాజుగారి సంవిధానాన్నే పోలినది. దండకంలో కూడా పోతరాజుగారికి చాలా ఇష్టమైన 'మందార మకరంద మాధుర్యమున తేలు మధుపంబు వోవునే మదనములకు' అనే భావాలు ఉన్నాయి. (ఈ భావాలను గురించి తరువాత చెప్పుకొందాం). భాగవతంలోని ఇతర పద్యాల పోలికలు కూడా దండకపాదాలలో కనపడతాయి. మాటవరుసకు సింగభూపాలుని చూశాక భోగినీ ఇలా అనుకొంటుంది:

మున్నే బ్రహ్మాస్త్రారవిందంబు నైనన్
మహీపాలు హస్తారవిందంబునై నేడు లీలారవిందంబునై యందుబో
రత్న హారంబు నైనన్
శుభాకారు వక్షోవిహారంబు గైకొందుబో యేల ఇట్లైతి.

సరిగ్గా ఇటువంటి భావాలే దశమస్కంధంలో శ్రీకృష్ణుని చూసినప్పుడు మధురలోని కాంతలకు వస్తాయి. చూడండి.

వేణునాదములమై వెలసిన మాధవుం డధరామృతము నిల్చి యాదరించు
బింఛదామములమై పెరిగిన వెన్నుండు మస్తకంబున దాల్చి మైత్రినెరపు
బీతాంబరములమై బెరసిన గోవిందు డంసభాగముల బాయక ధరించు
వైజయంతికలమై వ్రాలిన గమలాక్షు డతి కుతూహలమున ఇరుత దాల్చు
డనరు బృందావనంబున దరులమైన - గృష్ణు డానందమున చే క్రీడ సల్పు
నెట్టి నోములనైన మున్నిట్టి విధము - లేల కామైతి మోయమ్మ యింక నెట్లు!

(భాగవతం, దశమ, 1-1352)

ఇలా పోలికలున్న భావాలవల్లనేకాక శైలి, సంవిధానాలవల్ల కూడా భోగినీదండకం పోతరాజుగారు వ్రాసినదే అని చెప్పవచ్చు. సర్వజ్ఞసింగ భూపాలుని ఆశ్రయించి ఉన్నప్పుడు పోతరాజుగారు చెప్పిన చాటువు కూడా ఒకటి లభించింది. ఆడవాళ్లకు లొంగడం మగవారికి పాడికాదని సింగభూపాలుడు భావిస్తే - అది తప్పనీ, లోలాక్షులకు లోబడడం రసికుల లక్షణమనీ పోతరాజుగారు చెప్పారట. చూడండి ఆ పద్యం.

రసికులైనవారు రమణుల కొౌక వేళ - వంగుటెల్ల ధర్మ వర్తనంబు
ఈరసమున విల్లు నారికి వంగదా - చిత్తజాతరూప సింగభూప

ఈ సింగభూపాలుని కొలువులో ఉండడం వల్లనేకాక, ఆ సంస్థానంలోని వైష్ణవ గురువుల సాన్నిహిత్యంవల్ల కూడా పోతరాజుగారు ఈ దండకాన్ని రాశారని భావించవచ్చు. దక్షిణాది నుండి వచ్చిన ఆ ఆచార్యస్వాములు ద్రావిడ వేదంతో పాటు తమిళ సాహిత్య సంప్రదాయాలను కూడా ప్రవచనం చేస్తూ ఉండేవారు కాబోలు. ప్రభువులకు దీక్షనిచ్చిన ఈ వైష్ణవస్వాముల వల్ల ప్రజలూ, పండితులూ కూడా ప్రభావితులయ్యారు. తమిళ కావ్యాల గురించి సహజంగా పోతరాజుగారు తెలుసుకొని ఉండి ఉంటారు.

తమిళ సాహిత్యంలో 'ఉలా' ప్రబంధమనే ప్రక్రియ ఒకటి ఉంది. అందులో ఊరేగుతున్న రాజును సామాన్య నాయిక చూడడం మరులు కొనడం, విరహవేదన అనుభవించడం రాయబారం పంపడం, తరువాత మనోరథప్రాప్తి కలగడం వరుసగా ఉంటాయి. సరిగ్గా ఇదే ప్రణాళికమీద పోతరాజుగారు భోగినీ దండకాన్ని రాశారు.

ఉత్తమ కావ్యాలలో నాయికానాయకులు ఎటువంటి వారైనా ఉలా ప్రబంధంలో సామాన్య నాయిక కావచ్చు. కావ్యానికి తగిన నాయకుడు ఎలా ఉండాలి? నాయిక ఎలా ఉండాలి? ఎటువంటివారు కావ్యనాయికా నాయకులుగా ఉండడానికి పనికిరారు? ఇటువంటి ప్రశ్నలకు అలంకార శాస్త్రాలు జవాబు చెప్తాయి. విన్నకోట పెద్దన తన 'కావ్యాలంకార చూడామణి'లో ఇలా చెప్పాడు. కావ్యనాయికలు స్వీయ, పరకీయ, సాధారణి అని మూడు రకాలు. నీతివలన గుణాయత్తార్ణములు కలుగుతాయి (3-26). సాధారణి అంటే గణిక, ఈమె కళాదౌరేయాత్మ అయిన కపటలంపట లీలా మాధుర్య విధాయిని; దాని గతి తెలుసుకొంటే దురగాథా మనోవృత్తి (3-33). ''పైడివెట్టి నిలువం గలవే వెలయాలి కూరుముల్?'' (3-34) అని ప్రశ్నిస్తున్నాడు.

పోతరాజుగారి కాలానికి 'కావ్యాలంకార చూడామణి' ఒక్కటే ప్రసిద్ధమవుతున్న తెలుగు అలంకార శాస్త్రగ్రంథం. తెలుగు లాక్షణికులు సహజంగా సామాన్య నాయికలను ఆమోదించలేకపోవచ్చు. అయితే పోతరాజుగారి పోషకులైన సింగభూపాలుని వంశంలోని వాళ్ళకు వేశ్యాశృంగారం విషయంలో పట్టింపు లేదు. సర్వజ్ఞసింగభూపాలుడు (1383-1399) 'రసార్ణవసుధాకరం' అనే అలంకార శాస్త్రాన్ని సంస్కృతంలో రచించాడు.

అందులో పూర్వ లాక్షణికుల మతాన్ని చెప్పి వాటితో విభేదించే తన అభిప్రాయాన్ని స్పష్టపరిచాడు.

వేశ్యకు గుణవంతుడగు నాయకుని యందును ననురాగముండదు. అట్టియరక్తను వర్ణించుట రసాభాసమునకే కారణమగును; కాని వేశ్యను నాటకాదులందు వర్ణింపరాదని కొందరందురు. వారిట్లు చెప్పుదురు.

''వేశ్యసామాన్య వనిత: ఆమె ప్రధానముగా ద్రవ్యమునే కోరును. ఆమెకు గుణహీనుని యెడ నిష్టముండును. గుణియెడ నిష్టముండదు. అట్టి వేశ్యయెడ శృంగారాభాసమేగాని శృంగారమెంత మాత్రము నుండదు'' అని,

''కాని ధీమంతుడగు శ్రీ సింగభూపతి యీ మతము నంగీకరింపడు. ఏలయన వేశ్యకు భావానుబంధము లేనిచో నాయికత్వమే నశించును. ఆమె ప్రకరణాదులయందు నాయికగా వర్ణింపబడి యున్నది గదా! నాయికకాని దానికి నాయికగా వర్ణించినచో రసాభాసమే యగును. అట్టి వర్ణనల వలన త్రికరణాదులు లోకాశ్రయములు కాపోవలసి వచ్చును. కాని నాటక ప్రకరణాదులు పదియును రసాశ్రయములేయని పెద్దలే నియమించి యున్నారు. కావున సామాన్య స్త్రీలకు, వేశ్యలకు గుణవంతుడగు నాయకునియందనురాగ ముండును. దీనిని రుద్రటుడు నంగీకరించెను.

(రసార్ణవ సుధాకరం - నాయికా ప్రకరణం, పుటలు 4, 95)

సర్వజ్ఞ సింగభూపాలుడు ఇంత చర్చించి వేశ్యను కావ్యనాయికగా వర్ణించవచ్చునని లక్షణం చెప్పినా తెలుగులో లక్ష్యం ఏదీ? అందుకే పోతరాజుగారు భోగినీ దండకాన్ని చెప్పారేమో. తమిళ సాహిత్య ప్రక్రియలలోని ఉలా ప్రబంధం ఒక్కటే వారికి మార్గదర్శకం కాదు అనుకోవచ్చు. రాజు ఊరేగుతున్నప్పుడు పౌరకాంతలు చూడడం ముగ్ధులవడం మన సాహిత్యానికేం కొత్తకాదు. రఘువంశంలో అజుడు స్వయంవరా నంతరం ఊరేగడాన్ని కాళిదాసు సవిస్తరంగా వర్ణించనే వర్ణించాడు (సప్తమవర్గ 5వ శ్లోకం నుండి 16వ శ్లోకం దాకా). కాళిదాసులాగే నన్నెచోడుడు కూడా ఇటువంటి వర్ణనలు చేయకపోలేదు. కుమారసంభవం అష్టమాశ్వాసంలో 47వ పద్యం నుండి 70వ పద్యందాకా 24 పద్యాలలో పౌరకాంతలు శివునికొనియాడడం, చూడడానికి రెండు కన్నులు చాలవనుకొనడం చెప్పాడు. ఈ వర్ణనలన్నీ పోతరాజుగారిలో గట్టి ముద్రను వేశాయి. భోగినీదండకంలోనే కాక భాగవతంలో కూడా కొన్ని ఊరేగింపు ఘట్టాలను ఆయన చాలా విపులంగా వర్ణించాడు. ఉదాహరణకు కంసవధకు ముందు కృష్ణుని పౌరకాంతలు తిలకించి, పులకించడం కథనం చేశారు.

పోతరాజుగారు అర్థం లేని నిషేధాలను పాటించరు. అందుకే లాక్షణిక ధిక్కారం చేసి వేశ్యను నాయికగా ఎన్నుకుని తెలుగులో మొట్టమొదటి శృంగార దండకం రచించి కొత్త ఒరవడి పెట్టారు. వీరు ఈ మార్గాన్ని చూపాక ఈ బాణీ రచనలు ఫ్యాషనయ్యాయి. విద్యావతీ దండకం (గణపవరపు వేంకటకవి క్రీ.శ. 1674). చంద్రాననా దండకం :

(నుదురుపాటి చిదానందం; 1844-86); ఇంకో చంద్రాననా దండకం (నుదురుపాటి సాంబశివయ్య- 19వ శతాబ్ది), మోహినీ దండకం వంటి వెన్నో పోతరాజుగారి ఫక్కీలో వెలువడ్డాయి.

పోతరాజుగారు పెట్టిన ఉలా ప్రబంధధోరణి ఇతివృత్తానుకరణ నాయకరాజుల యుగంలో దండకాలలో కాకపోయినా 'ఇలాసాల'నే నాట్యనాటక కావ్యాలలో కనబడుతుంది. ఒక్క ప్రతిభావంతుడు లాక్షణిక ధిక్కారం చేసి జనం చేత ఔననిపించుకుంటే వెయ్యిమంది వెన్ను తట్టుతారు. వెంట వస్తారు. అయితే పోతరాజుగారిది అర్థం లేని తిరుగుబాటు కాదు. వివిధ విజ్ఞులవద్ద తెలియవచ్చినది తెలుసుకొని శ్రేయోదాయకమైన మార్గంలో మసలుకొనడమే. ఎందరివల్లనో ఎన్నో తెలుసుకొని అందరినీ మెప్పించడం వారి లక్ష్యం.

గడపవలసిన సమయంలో రసిక జీవితం గడిపిన పోతరాజుగారు ఓరుగల్లులో విబుధవరుల సాన్నిధ్యంలో ఎన్నో సంగతులు వింటూ వాళ్ల చెప్పిన గ్రంథాలలో ఎన్నో విషయాలు కంటూ సాహిత్య జీవనం గడుపుతూ ఉండేవారు. భాగవత పురాణాన్ని గట్టిగా చదువుతూ ఉండేవారు. ఆ అధ్యయనం వల్ల వారికి కలిగిన భావాలు గమనించతగ్గవి.

1. ధర్మంబునం దవ్యభిచారియైన యర్థంబునకు చామంబు ఫలంబుగాదు.
2. తత్త్వ జిజ్ఞాస యనునది ధర్మజిజ్ఞాస.
3. కొందరు ధర్మంబెతత్త్వంబని పలుకుదురు
4. ధర్మంబునకు భక్తి ఫలంబు (భాగవతం, 1-56)

అందుకే వారు భక్తిమార్గాన్ని అవలంబించారు. ఆ భక్తికూడా సత్త్వగుణ ప్రధానమైనదే అయితే మంచిదని భాగవత పఠనంవల్లనే తెల్చుకున్నారు. భక్తి మోక్షదాయకమని నమ్మారు.

> మోక్షార్థులైనవారలు ఘోరరూపులైన భూతపతుల విడిచి దేవతాం
> తరనింద సేయక శాంతులై నారాయణ కథలయందే ప్రవర్తించుదురు.
> (భాగవతం, 1-59)

అందుకే దేవతాంతరనింద చేసే మతాన్ని మాని తాత్త్విక గుణాన్ని అలవరచుకున్నారు. దీనికి కూడా భాగవత పఠనమే కారణం.

'కాష్ఠంబుకంటె ధూమంబు, ధూమంబుకంటె త్రయీమయంబైన వహ్ని యెట్లు విశేషంబగునట్లు, తమోగుణంబుకంటె రజోగుణంబు, రజోగుణంబుకంటె బ్రహ్మ ప్రకాశంబగు సత్త్వగుణంబు విశిష్టంబగు.' (భాగవతం, 1-59)

ఆ కాలంలో వైష్ణవులు చాలా పేదవారు. మూల భాగవత రచనాకాలంనుండి పోతరాజుగారి కాలందాకా విష్ణుభక్తులు దరిద్ర నారాయణులే. 'కొందరు రాజసతామసులై సిరియు నైశ్వర్యంబును బ్రజలను గోరి పితృభూత ప్రజేశాదుల నారాధింతురు (భాగవతం 1-59)' అని పోతరాజుగారే చెప్పారు. భాగవతంలో ఒక

ఘట్టంలో శివభక్తులు ధనవంతులై విష్ణుభక్తులు పేదలవడానికి కారణం చెప్పమని పరీక్షిత్తే శుకయోగిని ప్రశ్నిస్తాడు. చూడండి.

మునినాథోత్తమ! దేవ దానవులలో ముక్కంటి సేవించువా
రనయంబున్ బహువస్తు సంపదల సౌఖ్యానందులైయుండ న
వ్వనజాతాక్షు రమామనోవిభుని శశ్వద్భక్తి సేవించు న
న్మునివర్యుల్ గడు బేదలౌటకు గతంబుర్ నా కెరిగింపవే!

(భాగవతం, 10, ఎ.ఎ. 1227)

శివుడు గుణత్రయాన్వితుడు కనుక రాగాదియుక్తమై రాగిల్లి అతణ్ణి కొలిచేవారు సంపదలు పొందుతారనీ, విష్ణువు గుణాతీతుడు కనుక అతని భక్తులు రాగాదిరహితులై ఉంటారనీ శుకయోగి చెప్పాడు. ఇదే ప్రశ్న ఒకసారి ధర్మరాజు వేస్తే కృష్ణుడిలా జవాబు చెప్పాడట -

వసుమతీనాథ! యెవ్వనిమీద నా కను
గ్రహ బుద్ధి వొడము నా ఘనుని విత్త
మంతయు గ్రమమున నపహరించిన వాడు
ధనహీనుడగుచు సంతాపమందు
విడుతురు బంధు లవ్విధమున నొంటరి
యై చేయునది లేక యఖిల కార్య
భారంబు లుడిగి మద్భక్తులతో మైత్రి
నెరపుచు విజ్ఞాన నిరతుడగుచు
బిదప వా డవ్యయానంద పదము నాత్మ
నెరిగి సారూప్య సంప్రాప్తి నెలమి నొందు
గాన మత్సేవ మిగుల దుష్కర మటంచు
వదలి భజియింతు రితర దేవతల నెవుడు. (భాగవతం, 10-11, 1230)

తనను పూజింపదలచుకొన్నవాళ్ళలో ఎవరినైనా కరుణించదలచుకొంటే వాళ్ళను మొదట బుక్కాపకీర్లను చేస్తానని భగవంతుడు భాగవతంలో ఇంకొక ఘట్టంలో కూడా చెప్తాడు. 'ఎవ్వని గరుణింప నిశ్చయించితి వాని యఖిల విత్తంబు నే నపహరింతు, అని వామనుడు చెప్పాడు (భాగవతం, 8-659). ఈ భగవద్వాక్యాలను భాగవత పురాణ పఠనంవల్ల పోతరాజుగారు మనస్ఫూర్తిగా నమ్మి దరిద్ర్యాన్ని వరించారు.

భాగవత పురాణ రచనాకాలంలోగాని, ఆంధ్రీకరణకాలంలోగాని శివభక్తులు ధనవంతులై, విష్ణుభక్తులు పేదవారుగా ఉండడానికి తగిన కారణాలు సాంఘిక రాజకీయ చరిత్రలలో దొరకవు. ఆదిమ యుగం దగ్గర నుంచి మన దేశంలో శివాలయాలు ఎక్కువగా ఉండేవి. చాళుక్య ప్రభువు ఒక్క నరేంద్రమృగరాజే 108 శివాలయాలు కట్టించాడు.

ప్రభువులు, ప్రజలు కూడా పూర్వం శివాలయాలకే బాగులు చేస్తూ ఉండేవారు. మన ప్రాచీన సాంఘిక జీవనం, సాంస్కృతిక జీవనం ఆలయాలపైన ఎక్కువగా ఆధారపడేవి. పెద్ద దేవాలయాలను నమ్ముకొని 72 నియోగాలవారు ఉండేవారని, ప్రతి ఆలయం ఒక చిన్నసైజు రాజధాని అని మనం ఇంతకుముందు చెప్పుకొన్నాం.[16] ఆ రోజులలో శివాలయాలకు ఆస్తులుండేవి. రామానుజాచార్యులవారు కొన్ని శివాలయాలను వైష్ణవాలయాలుగా మార్చి ప్రసిద్ధం చేశారు. తరువాతి యుగాలలో శివాలయాల ప్రభ తగ్గి వైష్ణవ దేవాలయాలలో అంగరంగభోగాలు ఎక్కువైనాయి. శైవులు క్రమేణా బీదవాళ్లు కాజొచ్చారు.

రామానుజులు చేసిన మార్పు మన చరిత్రలో కొత్తది కాదు. జైనబసదులను, బౌద్ధారామాలను మనవాళ్లు అంతకుముందు శైవక్షేత్రాలుగా మార్చేశారు. వాస్తవానికి భాగవత పురాణంలోనే జైనబౌద్ధ మతాలను వాసుదేవతత్త్వంలో విలీనం చేసుకొనడం కనబడుతుంది. పరమ నాస్తికమైన సాంఖ్యాన్ని సవైదికం చేసి, ఆస్తికం, చేసి, ఆధ్యాత్మికం చేసి భాగవతం దానిని సొంతం చేసుకొంది. భాగవతంలో వాసుదేవుడు ఎత్తిన అవతారాల సంఖ్య 21, వాటిని చూడండి.

ప్రథమస్కంధంలో చెప్పిన వరుస -

1. ప్రథమమైన దివ్యరూపం, 2. యజ్ఞవరాహరూపం, 3. నారదావతారం, 4. నర నారాయణావతారం. 5. కపిలుని అవతారం. 6. దత్తాత్రేయావతారం. 7. యజ్ఞావతారం, 8. ఉరుక్రమావతారం, 9. పృథుచక్రవర్తి అవతారం, 10. మీనావతారం, 11. కూర్మావతారం, 12. ధన్వంతరి అవతారం, 13. మోహినీ అవతారం, 14. నరసింహావతారం, 15. వామనావ తారం, 16. పరశురామావతారం, 17. వ్యావారవతారం, 18. రామావతారం, 19. బలరామావతారం, 20. కృష్ణావతారం, 21. బుద్ధావతారం. తరువాత కల్క్యవతారం (భాగవతం, 1-61).

ద్వితీయ స్కంధంలో చెప్పిన వరుస -

1. యజ్ఞావతారం, 2. కపిలుని అవతారం, 3. దత్తాత్రేయావతారం, 4. సనకసనంద నాదుల అవతారం, 5. నరనారాయణ అవతారం, 6. ధ్రువావతారం, 7. పృథుని అవతారం, 8. వృషభావతారం, 9. హయగ్రీవ అవతారం, 10. మత్స్యావతారం, 11. కూర్మావతారం, 12. నృసింహావతారం, 13. ఆదిమూలావతారం, 14. వామనావతారం,15. హంసాఖ్యావ తారం, 16. మన్వావతారం, 17. పరశురామావతారం, 18. శ్రీరామావతారం, 19. కృష్ణావ తారం, 20. వ్యాసావతారం, 21. బుద్ధావతారం. తరువాత కల్క్యవతారం.

(భాగవతం, 2, 112-199)

ఈ అవతారాలలో కొన్నిటి సవిస్తరగాథలు భాగవతంలో ఉన్నాయి. కపిలాచార్యుని కథ, అతడు తల్లికి సాంఖ్యం ఉపదేశం చేయడం తృతీయస్కంధంలో

16. సమగ్రాంధ్ర సాహిత్యం, చాళుక్యయుగం

ఉన్నాయి. కపిలుడు నిరీశ్వరమైన భౌతికవాదాన్ని ఆదిలో ప్రవచించాడు. నేడు మనకు లభించిన సాంఖ్యసూత్రసాంఖ్యకారికలు ఆదిమ రచనలు కావని, ఆదిమ సాంఖ్యం లోకాయతమేనని దేవీప్రసాద చటోపాధ్యాయగారు వివరించారు.[11]

ఆదిమ సాంఖ్యం అవైదికం. అది భౌతికవాదం; నిరీశ్వరం. దానిని చాలామంది ఆదరించి ఆచరించారు. జైన బౌద్ధదర్శనాలు దానినుండే ప్రభవించాయి. అందుచేత సాంఖ్య, జైన బౌద్ధ ప్రవక్తలను వాసుదేవుని అవతారాలను చేసి; ఆ దర్శనాలలో ప్రజారంజకమయిన వాటిని స్వీకరించి వైదికులు ఇంకొక దర్శనాన్ని సృజించారు. వాసుదేవుని 21 అవతారాలలో ఒకటైన వృషభావతారం, లేక ఋషభావతారం జైనతీర్థంకరులలో ప్రథముడైన ఋషభదేవుని కథకు రూపాంతరం. పంచమస్కంధంలో 41నుండి 89 దాకా 49 గద్యపద్యాలలో ఉంది. ఋషభుడు దక్షిణ కర్ణాట దేశానికి వచ్చి ఉన్మత్తునిలాగా వికీర్ణకేశుడై, దిగంబరుడై సంచరించాడట. అతని కృత్యాలను విని ఆ రాష్ట్రాధిపతి నిజధర్మాన్ని విసర్జించి మనుజులను అసమంజసమైన పాషండమతాభి నివేశులను చేశాడట (భాగవతం, 5-89). తెలుగుదేశంలో కూడ ఒకనాడు ఈ ఋషభుని పూజ ఉండేది. వరంగల్లు జిల్లాలోని కొలనుపాక నేటికీ జైనులకు యాత్రాస్థలం. ఇక్కడ ఋషభదేవుని ఆకుపచ్చని రాతివిగ్రహం ఉంది.[12] జైనుడైన ఋషభుని వాసుదేవుని అవతారంగా చేయడంలో అంతరార్థం అతని నోటివెంట బ్రాహ్మణాధిక్యతను చాటించడమే. ఋషభుడు తన కుమారులకు చేసిన నీతిబోధలో యీ క్రింది పద్యం ఒకటి :

భూతజాలములందు భూజముల్ వర్యముల్ భూరుహంబులకంటె భోగికులము
భోగి సంతతికన్న బోధనిష్ఠులు బోధమాన్యులకన్నను మనుజపరులు
వీరికన్నను సిద్ధవిబుధగంధర్వులు వారికన్నను సురుల్ వారికన్న
నింద్రాది దేవత లిందరికన్నను దక్షాదిపన్మునుల్ దలప నెక్కు

డంతకన్నను భర్గు డా యభవుకన్న
గమలభవు డెక్కు డాతనికంటె విష్ణు
డధికు డాతడు విప్రుల నాదరించు
గాన విప్రుడు దైవంబు మానవులకు. (భాగవతం. 5-74)

దీని తరువాత పద్యాలు కూడా బ్రాహ్మణ పూజనే బోధిస్తాయి. ఈ ఋషభావతారం గురించి కొంతమంది పండితులు వేరేవిధంగా వ్యాఖ్యానం చేస్తారు. ''వాసుదేవతత్త్వము, అవతారములు, భాగవతవైష్ణవము'' అనే విషయాలపై ఉపన్యసించిన వేదాల తిరువేంగళాచార్యులుగారు ఇలా వ్రాశారు :

ఇతడు జడస్వభావమైన యోగముతో జరించెను. ప్రశాంతాంతరికరణుండై పరిముక్తసంగుడై ఇతడుండగా అదియే పరమహంసల కభిమన్యమగు పదమని పరమర్షులు

11. Lokayata by Devi Prasad Chattopadhyaya, Peoples Publishing House, P. 359-458.

12. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 4వ సంపుటి, పుట 1387.

తెల్పిరి. ఈ మహానుభావుని జడయోగము అవధూతప్రవృత్తిలోని అంతరార్థము నెరుగక అర్హతలు, జైనులు విపరీతముగా గ్రహించి అవైదికమై, శిష్టులకు పరిగ్రహింపరానిదగు మార్గము నవలంబించిరి.[13]

అయితే చారిత్రకంగా చెప్పుకోవాలంటే ఋషభుని ఉపదేశాలకు వేదానుసారులు వేరే వ్యాఖ్యానం చెప్పి చరిత్రను తిరగవ్రాశారు అనుకోవాలి. భాగవతతత్వాన్ని ప్రచారం చేయడానికి ఇటువంటిది జరగడంలో ఆశ్చర్యం లేదు. భాగవతమతం గురించి మేడేపల్లి వరాహనరసింహ స్వామిగారు ఇలా చెప్పారు:

ఇది వేదాల ఉపనిషత్తుల కాలంలో ప్రచారం పొందిన మతం. ఇది ఆర్యేతరమతాంశాల నన్నింటిని తనలో జీర్ణించుకుని ఉండి ఉంటుంది. ప్రజామతము కాలక్రమేణా సాంప్రదాయికరూపమును ఆర్జింపనని వాసుదేవ శ్రీకృష్ణనామములతో సాహచర్యమును సంపాదించుకొన్నది. దీని సంపూర్ణరూపము భగవద్గీతలో మనకు గోచరమగును. ఈ వాక్యమునకు సాధ్యమైనంత ప్రాముఖ్యమును కలిగించుటకుగాను మహాభారతమంతయు తిరిగి వ్రాయబడినట్లు అగుపించును.[14]

శ్రీకృష్ణుని జీవితం గురించి సమగ్రంగా చెప్పే ప్రాచీన గ్రంథాలలో హరివంశం, బ్రహ్మపురాణం, విష్ణుపురాణం, భాగవతబ్రహ్మవైవర్త పురాణాలు ముఖ్యమైనవి. వీటిలోని కథలు కొన్ని పరస్పర విరుద్ధాలు. ఈ పురాణాలనన్నిటిని తులనాత్మకంగా, కూలంకషంగా పరిశీలించిన పండితులు బ్రహ్మ, విష్ణుపురాణాల రెండింటి పాఠాలూ ఒక్కలాగా ఉన్నాయని, ఈ రెండింటిలో బ్రహ్మపురాణమే ప్రాచీనమని చెప్తారు. పద్మ, అగ్ని, భాగవత, బ్రహ్మవైవర్త పురాణాలలో కృష్ణచరిత్ర వుందిగాని వీటిలో భాగవతమొక్కటే పురాణేతిహాసాలలో కథలను ఒక క్రమంగా చెప్తుంది. బ్రహ్మవైవర్త పురాణం చాలా అర్వాచీనమని, రాధకు ప్రాముఖ్యం ఇవ్వడానికి రచించినదని విజ్ఞులు చెప్తారు.[15]

భారత కృష్ణుడు, భాగవత కృష్ణుడు విభిన్న వ్యక్తులనే వాదం ఒకటి ఉంది. మన ప్రాచీన చరిత్రలో చాలామంది కృష్ణులున్నారు. ఋగ్వేదంలో 'కృష్ణ అంగీరసుని' ప్రసక్తి ఉంది. ఇతడు అనార్యనాయకుడని, అంశుమతీతీరంలో పదివేలమంది సైనికులతో ఇతడు వేచి ఉన్నప్పుడు ఇంద్రుడు ఇతణ్ణి సంహరించాడనీ సీతానాథతత్త్వభూషణ్. ఆర్.డి. భండార్కర్ మొదలైనవారు భావిస్తున్నారట.[16] ఋగ్వేదంలో ఎనిమిదవ మండలం (85- 3,4) (96-13, 15) లలో కృష్ణ ప్రసక్తి ఉంది. కౌషితకీబ్రాహ్మణం (30-9)లో కూడా కృష్ణఅంగీరసుని ప్రసక్తి ఉంది. ఐతరేయ బ్రాహ్మణం (171-2,6) హారీతకృష్ణుడనే ఆచార్యుని పేర్కొంటుంది. ఛాందోగ్యోపనిషత్తులో దేవకీపుత్రకృష్ణుని ప్రసక్తి ఉంది (3-17, 6). దీనిమీద వ్యాఖ్యానం వ్రాస్తూ స్వామీస్వాహానందగారిలా అన్నారు.

13. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు, ఆంధ్రసారస్వతపరిషత్తు, పుట 361
14. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 7 సంపుటం - దర్శనములు, పుట 585.
15. Studies in Epics and Puranas of India - by A.D. Pusalker, P. 61
16. Ibid, P.51

"In this passage historians find the earliest reference to Sri Krishna which cannot be dismissed as legendary."[17]

బౌద్ధజైన వాఙ్మయంలోకూడా కృష్ణ ప్రసక్తి ఉంది. ఘటజాతకం కృష్ణవాసుదేవుడు మధురరాజవంశంలోనివాడని పేర్కొంటుంది. జైనుల ఉత్తరాధ్యాయనసూత్రంలోని ద్వాదశోపాంగం వృష్ణివంశీయుడైన కృష్ణవాసుదేవుని, బలరాముని గురించి చర్చిస్తుంది. శ్రీకృష్ణుని గురించి దొరికినన్ని వివరాలను శ్రీ పుసాల్కర్‌గారు సేకరించి శ్రీకృష్ణుని చారిత్రకత్వంపై సుదీర్ఘ వ్యాసం వ్రాశారు.

పాణిని కాలంనాటికే వాసుదేవుణ్ణి, అర్జునుణ్ణి వీరులుగా ఆరాధించేవారు. పాణినికాలం క్రీ.పూ. 760-600 అని బెల్వాల్కర్‌గారూ, క్రీ.పూ. 350 ప్రాంతాలని మాక్సుముల్లర్ మొదలైనవారూ చెప్తారు. ఈ మధ్యకాలంలో ఎప్పుడైనా అతడు ఉండవచ్చు. పాణినీయ సూత్రాలలో పేర్కొనబట్టి వాసుదేవుడు, అర్జునుడు అప్పటికే ప్రసిద్ధపురుషులు. వారిని ప్రజలు ఆరాధించేవారు. పుసాల్కర్‌గారి లెక్కప్రకారం క్రీ.పూ. 950లో మహాభారత యుద్ధం జరిగింది. హస్తినాపురంలోనూ, రూపర్‌లోనూ జరిపిన త్రవ్వకాలను పట్టి ఈ కాలనిర్ణయం ధ్రువపడిందట.[18] కాబట్టి కృష్ణుడు క్రీ.పూ. 1000 సంవత్సరాలవాడు.

శ్రీకృష్ణుడు తన కాలంలో వైదిక మతంపట్ల తిరుగుబాటు చేసినవాడే. అప్పటిదాకా సంప్రదాయానుసారం జరిపే ఇంద్రయాగాన్ని అతడు మానిపించాడు. ''కానలు, కొండలు, పసుల గాదిలి వేల్పులు గొల్లవారికిన్'' అని ప్రకృతిపూజ నేర్పాడు (హరి I. 7-131). ''మనమేమి ఎరుగుదుమ శుక్రుని అమరులు మునులు అతని గొలుతురుగాక, ఇవ్వనములు గిరులు మన జూచిన మేరలు, ''వీటినే పూజించాలి'' అన్నాడు (హరి. I 7-137). తాను చెప్పిన కొండపండుగ చేయకపోతే బలవంతంగానైనా చేయిస్తానన్నాడు. ''నేను మీకు కావాలంటే ఒప్పుకోండి'' అన్నాడు. హరివంశంలో ఇలా చెప్పినవాడు అదే భాగవతంలో కర్మయోగాన్ని ఉపదేశిస్తాడు.

కర్మమున బుట్టు జంతువు - కర్మమునన్ వృద్ధి పొందు, కర్మమున జెడున్
గర్మమే జనులకు దేవత - కర్మము సుఖదుఃఖములకు కారణ మధిపా!

(భాగవతం, 10, 1-88)

సత్త్వరజస్తమో గుణంబు లుత్పత్తిసిద్ధిలయకారణంబులు. అందురజంబున జగంబు జన్మించు. రజోగుణ ప్రేరితంబై మేఘంబులు వర్షించు. వర్షమునం బ్రజావృద్ధియగు. ఇంద్రుడేమి సేయంగలవాడు? (భాగవతం, 10, 1-884)

ఇటువంటి ప్రబోధలు చేసిన కృష్ణుడు క్రమంగా తానే ఆరాధ్యదైవం అయ్యాడు. అతని జీవితకాలంనుంచి ప్రచారమైన కథలన్నీ క్రీ.శ. 5వ శతాబ్దం తరువాత ఎప్పుడో

17. Chandogya Upanishat, Swami Swahananda, Ramakrishna Math Publication.
18. పుసాల్కర్‌గారి Studies in Epics and Puranas of India, 765 పుటలో

భాగవత పురాణరూపం దాల్చాయి. నామలింగానుశాసనం అనే అమరకోశం వ్రాసిన అమరసింహుడు ఆ కాలపువాడు. అతడు పురాణాలకు పంచలక్షణం చెప్పాడు.

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ
వంశానుచరితంచైవ పురాణం పంచలక్షణం.

అన్నది అమరసింహుని నిర్వచనం. భాగవతపురాణంలో మటుకు దశలక్షణ నిర్వచనం ఉంది.

సర్గోస్యాథ విసర్గశ్చ వృత్తిరక్షాంతిరాణిచ
వంశో వంశానుచరితం సంస్థా హేతురపాశ్రయః
దశభిర్లక్షణైర్యుక్తం పురాణం తద్విదో విదుః
కేచిత్పంచవిధం బ్రహ్మాన్ మహదల్ప వ్యవస్థయా. (భాగవతం, 1-7, 9-10)

ద్వితీయ స్కంధంలో శుకయోగి మహాభాగవతం ఉపన్యసిస్తానని చెప్పి ''అమ్మహాపురాణంబు చతుశ్లోకరూపంబున దశలక్షణంబు ఉచిత మార్గంబుల నొప్పు. అందు దశలక్షణంబులెయ్యవి? యనిన - సర్గంబును, విసర్గంబును, స్థానంబును, పోషణంబును, ఊతులును, మన్వంతరంబులును, నీశానుచరితంబును, నిరోధంబును, ముక్తియు నాశ్రయంబను పది తెరంగులయ్యె'' అని వివరించాడు (భాగవతం, 2-259). ఈ లక్షణాలతోపాటు సాంఖ్య తత్త్వవివరణ, వేదాంత ప్రతిపాదకాలైన బాదరాయణ బ్రహ్మసూత్రాలను క్రోడీకరించడం మొదలైన వాటితో భాగవతం బాగా పెరిగింది. ఇతర పురాణాలు భాగవతంలో 18 వేల గ్రంథాలు, 12 స్కంధాలు ఉన్నట్టు చెప్తాయి. గ్రంథమంటే ముప్పయి రెండు అక్షరాలు. ఇప్పటి ప్రతులలో 22 వేల గ్రంథాలున్నాయి. అంటే 4 వేల గ్రంథాలు ఇతరులు కలిపారన్నమాట, ఇవి ఎవరు కలిపి ఉంటారు?

క్రీ.శ. 1271-1309 ప్రాంతాలలో దేవగిరి రాజ్యాన్ని రామరాజు పాలిస్తూండేవాడు. అతని ఆస్థానంలో హేమాద్రి అనే మహామంత్రి, బోపదేవుడనే మహాపండితుడు ఉండేవారు. భాగవతంలోని అన్ని స్కంధాలలోనుంచీ విష్ణులక్షణ, విష్ణుభక్తి, విష్ణుతత్త్వ ప్రతిపాదకాలైన పద్యాలు ఉద్ధరించి బోపదేవుడు ముక్తాఫలం అనే పద్యాత్మక గ్రంథం వ్రాశాడు. వాటికి హేమాద్రి పేరు పెట్టాడు. ఈ బోపదేవుడే భాగవత పురాణం వ్రాసిన దానికి వ్యాసులవారి పేరుపెట్టాడనే అపనింద వ్యాపించింది. అందుచేత మహాభాగవతం అష్టాదశ పురాణాలలో చేరదని, దేవీ భాగవతమే అందుకు అర్హమైనదనీ శాక్తేయులు వారింపసాగారు.[19] బోపదేవుడు అధికపాఠాలు చేర్చి ఉంటాడు.

భాగవతానికి 'హయగ్రీవ బ్రహ్మవిద్య' అనే నామాంతరం ఉంది. ఈ పురాణాన్ని అర్థం చేసుకొనడం కష్టం. అందుకే, సాధారణంగా పండితులు కూడా భాగవతాన్ని పారాయణ చేయడానికి భయపడతారట. పూర్వం ఒక పండితుని వ్యుత్పత్తి గమనించడానికి

19. సంస్కృత వాఙ్మయ చరిత్ర, ద్వితీయ సంపుటం, మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు, పుటలు 76-77.

భాగవతానికి అర్థం చెప్పమనేవారట. ఈ సంగతులు విశదం చేస్తూ వ్యాసభాగవతంలో కవిత్వం కార్కశ్యమున పరాకాష్ఠ అందిందని పుట్టపర్తి నారాయణాచార్యులుగారు చెప్పారు.[20] క్లిష్టమైన ఈ పురాణంలోని అర్థాన్ని స్పష్టం చేయడానికి శ్రీధరులు విపులమైన వ్యాఖ్యానం వ్రాశారు. పోతరాజుగారు భాగవత తత్వాన్ని అర్థం చేసుకొనడానికి శ్రీధర వ్యాఖ్యతో ఎన్నోసార్లు దాన్ని అధ్యయనం చేసి ఉంటారు. అంతరార్థాలు గ్రహించి ఉంటారు.

పోతరాజుగారు భాగవత పారాయణ చేస్తూండే రోజులలో వారికి శ్రీమన్నారాయణ ప్రపంచాన్ని వివరించాలనే కుతూహలం కలిగింది. ఒకనాడు చంద్రగ్రహణం వచ్చింది. అది చాలా విశిష్టమైన సంపూర్ణ చంద్రగ్రహణం కావచ్చు. అందుకే ప్రత్యేకం పనికట్టుకుని పెద్దల అనుమతి తీసుకొని గోదావరిలో స్నానం చేయడానికి ఓరుగల్లునుంచి అంతదూరం వెళ్లారు. నిండు పున్నమిరాత్రి. గోదావరిలో పట్టుస్నానం చేసి పోతరాజుగారు ఇసుకతిన్నెలమీద కూర్చుని మహేశ్వరధ్యానం చేస్తూ కళ్లు మూసుకొన్నారు. అప్పుడు కాంతాసమేతుడైన ఒక రాజముఖ్యుడు వారి కళ్లముందు కనిపించాడు. ఆయన ఆ దంపతులను తేరిచూసి, మాట్లాడాలని ప్రయత్నించేలోగా ఆ దివ్యపురుషుడు, తాను శ్రీరామచంద్రుడనని తెలియబల్కి తన పేరు మీదుగా శ్రీ మహాభాగవతం తెలుగు చేయమని, దానివల్ల వారి భవబంధాలు తెగుతాయని ఆనతిచ్చాడు. పోతరాజుగారు కళ్ళు మూసుకుని వెరగుపడి ఇలా అన్నారు.

పలికెడిది భాగవతమట - పలికించెడివిభుడు రామభద్రుండట నే
పలికిన భవహరమగునట - పలికెద వేరొండు గాథ పలుకగనేలా?

(భాగవతం. 1-16)

కాని భాగవతాన్ని అర్థం చేసుకుని రచించడం చాలా కష్టం. అయితే పెద్దలవల్ల తెలుసుకున్నది, తాము బోధపరచుకున్నది విశదం చేయవచ్చు. అందుకే ఇలా చెప్పారు.

భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు - శూలికైన దమ్మి చూలికైన
విబుధజనులవలన విన్నంత కన్నంత - తెలియవచ్చినంత తేటపఱతు.

(భాగవతం. 1-17)

ఇది ఎటువంటి శైలిలో వ్రాయాలి అన్నది ప్రశ్న. ఆ రోజులలో కొందరు సంస్కృత సమాసభూయిష్టమైన రచన హర్షించేవారు. కొందరు తేటతెనుగు మెచ్చుకొనేవారు. కొందరు రెండూ ఆదరించేవారు. పోతరాజుగారు అందరినీ మెప్పించదలిచారు. ఈ సంగతే ఈ పద్యంలో చెప్పారు:

కొందరికి తెలుగు గుణమగు - గొందరికిని సంస్కృతంబు గుణమగు రెండున్
గొందరికి గుణములగు నే-నందరి మెప్పింతు గృతుల నయ్యై యెడలన్.

(భాగవతం, 1-18)

20. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు, పుట 105.

నన్నయగారు, తిక్కనగారు మొదలైన మహాకవులు ఎన్నో కావ్యాలు తెలుగుచేసినవాళ్లు తాము చేసుకొన్న పుణ్యం కొద్దీ భాగవతాన్ని విడిచిపెట్టారని పొంగిపోయారు.

ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీ యుర్విం బురాణావళుల్
తెనుగుల్ సేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు తా నెట్టిదో
తెనుగుంజేయరు మున్ను భాగవతమున్ దీనిని దెనింగించి నా
జననంబున్ సఫలంబు చేసెద బునర్జన్మంబు లేకుండగన్. (భాగవతం, 1-19)

అంతకుముందే వారు పూర్వ కవులను సంభావన చేశారు. వర్తమాన కవులను ప్రియాలు పలికారు. భావి కవులను బహూకరించారు.[21] కుకవులను నిందించనేలేదు. భాగవతాన్ని కల్పతరువుగా భావించి ఇలా నుతించారు:

లలిత స్కంధము గృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం
జులతా శోభితమున్ సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై. (భాగవతం, 1-20)

ఇలాంటి మహాభాగవతాన్ని తెనిగించాలని నిశ్చయించి విడుపుస్నానం చేసి దీక్షపట్టారు. కొన్నాళ్ళకు ఏకశిలానగరానికి వెళ్ళి గురువులు, వృద్ధబంధువులు మొదలైనవారి అనుజ్ఞ తీసికొన్నారు. మనసులో శ్రీరామచంద్రుని సన్నిధానం కల్పించుకొన్నారు. నాలుగు ఉత్పలమాలలలో కృష్ణునికి ఇది సమర్పించుకొంటున్నట్లు షష్ఠ్యంతాలు వ్రాశారు. తాము ఆంధ్రభాషలో రచింపబూనిన శ్రీమహాభాగవతానికి ప్రారంభం చెప్పారు.

పోతరాజుగారు ప్రారంభించిన భాగవతాన్ని సంపూర్ణంగా అనువదించలేదు. 12 స్కంధాలలోనూ వారు వ్రాసినవి ఎనిమిదే. మిగతా నాలుగూ ఇతరులు రచించారు. ఒకటినుంచి నాలుగు, ఏడునుంచి పది స్కంధాలను పోతనగారు వ్రాశారు. పంచమ స్కంధాన్ని బొప్పరాజు గంగ, షష్ఠస్కంధాన్ని ఏర్చూరి సింగన, ఏకాదశద్వాదశ స్కంధాలను వెలిగందల నారయ వ్రాశారు. భాస్కరరామాయణంలాగే భాగవతం కూడా ఇంతమంది వ్రాయడానికి కారణం తెలియదుగాని వీరేశలింగంగారు భాస్కరరామాయణ విషయంలో చేసిన వివరణవంటిది ఈ సందర్భంలో నిడుదవోలు వెంకటరావుగారు చేశారు. చూడండి.

''పోతన భాగవతమును రచింప దలపుగొని దాను గ్రంథరచనకు ప్రారంభించి తొలి నాలుగు స్కంధములు రచించి వెనుక భక్తిరస ప్రధానములగు సప్త, మాష్టమ, నవమ, దశమస్కంధముల దానే రచింపదలచి మధ్యస్కంధములలో బంచమము గంగనకు, షష్ఠము

21. పోతరాజుగారిలాగా భావి కవులను బహూకరించిన తెలుగుకవి ఇంకెవరూ లేరు. 'తమకు మంచి భవిష్యత్తు' ఉందని వారికి ముందే తెలుసు.

సింగనకు నిచ్చి రచింపుడని చెప్పి యుండవలెను... దశమస్కంధాంతము వచ్చుసరికి బోతనకు చాలాకాలము పట్టుటచే నేకాదశ ద్వాదశ స్కంధములు దన శిష్యుడగు వెలిగందల నారయ కొసగియుండును.''[22]

నిడుదవోలుగారి వివరణతో ఖండవల్లి లక్ష్మీరంజనంగారూ, పింగళి లక్ష్మీకాంతంగారూ ఏకీభవిస్తున్నారు. ''పోతనామాత్యుడు స్వయముగా తన శిష్యుల ననుగ్రహింపకోరి భాగవతమునందలి చిన్న చిన్న స్కంధములను వ్రాయుడని వారికి ప్రసాదించియుండును'' అని ఖండవల్లివారు అన్నారు.[23] ''కొన్ని భాగాలు పోతన జీవితంలోని ఆయన అనుజ్ఞపై ఆ కవులచే వ్రాయబడియుండునని నా యుద్దేశ్యము'' అని పింగళివారు చెప్పారు.[24] అయితే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఈ ఊహకు ఆధారం చాలదంటున్నారు. భాగవతాన్ని తనకు కృతి ఇవ్వలేదన్న కోపంకొద్దీ సర్వజ్ఞసింగమరేడు దానిని పాతిపెట్టించాడనీ, అందువల్ల కొన్ని భాగాలు క్రిములు తిన్నాయనీ, గ్రంథాన్నీ పైకితీశాక నష్టమైన భాగాలను మిగతావాళ్లు గురువుగారిమీదా, గ్రంథంమీదా ఉండే భక్తిచేత పూరించారన్న కథను అనంతకృష్ణశర్మగారు నమ్ముతున్నారు.[25] ఈ కథను కూచిమంచి తిమ్మకవి ప్రచారం చేశాడు. ఇక కాకునూరి అప్పకవి, అహోబలపతి, ముద్దరాజు రామన్న మొదలైన లాక్షణికులు పోతరాజుగారి కవిత్వంలో బండిరాలకు, కొమ్ముఱాలకు సాంకర్యం జరిగిందని, అందుచేత అది అప్రమాణం అన్నారట! పోతరాజుగారు అలా వ్రాయలేదు. నష్టమైన భాగాలను ఇతరులు పూరించడంవల్ల వారి రచనలో యీ సాంకర్యం వచ్చిందని తిమ్మకవి తన సర్వలక్షణసారసంగ్రహంలో చెప్పాడు.

అఖిల వేదాంత విద్యారహస్యుడు, సహజపాండిత్య విశారదుడు, పటుతరకవితా విభాసితుడు, సకలాంధ్రలక్షణ చక్రవర్తి అయిన పోతరాజుగారు రేఫఱకారాలు ఎరగరని అజ్ఞులు కొందరాడుకొంటారు. ఆ మహాత్ముని కవిత్వంలో ఎక్కడా లోపం కలుగదని తిమ్మకవి చెప్తూ ఈ పద్యాలు వ్రాశాడు.

అఖిల వేదాంతవిద్యారహస్యవిదుండు సహజపాండిత్యవిశారదుండు
మత్తక్షితీశాధమస్తోత్రవిముఖుండు శంభుపదాబ్జపూజారతుండు
పటుతరకవితావిభాసితప్రతిభుండు సకలాంధ్రలక్షణచక్రవర్తి
రఘుకులేశనిదేశ రచితమహాభాగవతపురాణుడు పుణ్యావర్ధనుండు
బుధజనసహితుండు బమ్మెరపోతనసుకవి
యొన్న రేఫ రకాంబు లెరుగడనుచు
నజ్ఞలొకకొంద రాడుదు రమ్మహాత్ము
కవితనెందును లోపమ్ము కలుగ దభవ!

---

22. భాగవతం, వావిళ్ల ప్రచురణ, 1948 ముద్రణ. పీఠిక పుటలు 83, 84.
23. ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం, పుట 67.
24. తెలుగుభాషాసమితివారి విజ్ఞాన సర్వస్వం, 3వ సంపుటి, పుట 409.
25. భాగవతం, రాయలు ముద్రణ, పీఠిక, పుటలు 8–10 వరకు.

ఘనుడు పోతనమంత్రి మునుభాగవతము రచించి చక్రికిసమర్పించునెడల
సర్వజ్ఞసింగయక్ష్మావరుండది దనకిమ్మనివేడిన నిడకయున్న
నలిగి యాపుస్తకంబునవనిబాతించిన జివికి యందొకకొంతశిథిలమయ్యె
గ్రమ్మర నది వెలిగందలనారవరాజును మరి బొప్పరాజు గంగ
రాజు మొదలగు కవివరుల్దేజమెసగ
జెప్పి రాగ్రంథములయందె తప్పులొదవె
గాని పోతకవీంద్రుని కవితయందు
లక్షణంబెందు దప్పదు దక్షహరణ.

(సర్వలక్షణసారసంగ్రహం, రేఫరకారప్రకరణం, 265, 266)

క్రీ.శ. 1756లో ఉన్న తిమ్మకవి చెప్పేదాకా ఈ కథ దేశంలో ప్రచారం కాలేదు. పాతించడమే నిజమైతే పోతన శిష్యుడు వెలిగందల నారయ్య గ్రంథస్థం చేయకుండా ఉంటాడా? షష్ఠ స్కంధంలో స్పష్టంగా వేరే కృత్యాదీ, అవీ ఉంటే తిమ్మకవి ఆ స్కంధం పోతరాజుగారు చెప్పినదే అని చెప్పాడు. పై పద్యం తరవాత నెంబరులేని వచనంలో ఇలా ఉంది: ''పోతరాజు చెప్పినవి ప్రథమ స్కంధమును, ద్వితీయ స్కంధమున కొంతయు, షష్ఠసప్త మాష్టమ నవమ స్కంధములును, దశమ స్కంధము పూర్వభాగము కొంతయునున్నవి. అందులో రేఫఱకార సాంకర్యము లేకుండుటను వ్రాయుచున్నాము'' అని ప్రమాణాలు ఇచ్చారు.[26] తృతీయ స్కంధములో పోతరాజుగారి గద్య వుంటే వారి రచనగా తిమ్మకవి ఇవ్వనేలేదు.

పోతరాజుగారి మీద ఉండే గౌరవము కొద్దీ తిమ్మకవి ఈ పాతిపెట్టడం కథ ప్రచారం చేశాడని పండితలోకంలో చాలామంది నమ్ముతారు. తమ ఆశ్రయంలో ఉన్న కవులు తమకు అంకితం ఇవ్వకుండా దేవునిపేర కావ్యాలు చేస్తే సహించిన రాజులు లేకపోలేదు. మడికి సింగన 'జ్ఞానవాసిష్ఠ రామాయణాన్ని' రాజాశ్రయంలో ఉంటూనే దేవునికి అంకితం ఇచ్చాడు. సర్వజ్ఞ సింగమరేడు భాగవతం తనకంకితం ఇవ్వలేదని బాధపడినా, దేవునిపేర తెనిగిస్తున్నందుకు సంతోషించే ఉంటాడు.

ఇంతకూ భాగవత రచనాకాలంనాటికి సింగమరేడు రాజ్యం చేస్తున్నాడా? ఈ ముమ్మడి సింగమ నాయకుని రాజ్యకాలం క్రీ.శ. 1430-1475 సంవత్సరాల మధ్యనే. భాగవత రచనా కాలంనాటికి ఇతడున్నాడని చెప్పలేము. ఇతని కాలంలోనే రాచకొండ దేవరకొండ రాజ్యాలు క్షీణదశలోపడ్డాయి. బహమనీ సుల్తాను అహమ్మదుషా క్రీ.శ. 1433 నుండి తెలంగాణాపై దండెత్తడం ప్రారంభించాడు. ఓరుగల్లు దుర్గాధిపతి, మరికొందరూ పాదాక్రాంతులై తమ రాజ్యాలు నిలుపుకొన్నారు. బహమనీ సుల్తానులు క్రీ.శ. 1437లో దేవరకొండను జయించారు. అదే సంవత్సరం అహమ్మదు షా మరణించాడు కనుక తమ రాజ్యాన్ని మళ్ళీ సంపాదించుకొనడానికి గజపతుల సహాయాన్ని రాచకొండ దేవరకొండ

26. రాజామంత్రిప్రగడ భుజంగరావుగారు 'మంజువాణి'లో ప్రకటించిన సర్వ లక్షణసారసంగ్రహ ప్రతి, పుట 262.

రాజులు అర్థించారు. కపిలేశ్వర గజపతి సహాయం చేయడంతో ఊరుకొనక క్రమేణా తన సార్వభౌమత్వాన్ని సంస్థాపించుకొన్నాడు. తెలంగాణా అంతా ఉత్తరోత్తరా ఈ గజపతి పాలనలోనే సామంతరాజ్యమైంది. కపిలేశ్వర గజపతి మరణానంతరం కటకం సింహాసనం కోసం అతని కుమారులు హరివీరదేవుడూ, పురుషోత్తముడూ పోరాడుతున్నారు. ఈ అదనులో బహమనీ సుల్తానులు తెలంగాణాను పూర్తిగా స్వాధీనం చేసుకొన్నారు. రేచర్ల ప్రభువుల రాజ్యం క్రీ.శ. 1475 నాటికి అంతరించింది.

క్రీ.శ. 1430లో సింగమరేడు రాజ్యానికి వచ్చిన కొత్తలో పోతరాజుగారికి రాజాశ్రయం దొరికి ఉంటుంది. 1433 నుండి సింగమరేడు యుద్ధాలలోనే తలమునకలుగా ఉన్నాడు. క్రీ.శ. 1430-33 సంవత్సరాల మధ్య భోగినీ దండకం రచన జరిగి ఉంటుంది. ఆ పిమ్మట ఒక దశాబ్దంపాటు పోతరాజుగారు భాగవతం శ్రీధర వ్యాఖ్యతో అధ్యయనం చేశారనుకోవచ్చు. బహుశా ఒక పుష్కరం కాలం కావచ్చు. ఇన్నేళ్ళు అధ్యయనం చేశాక భాగవత రచనకు పూనుకొన్నారని నికరంగా చెప్పడం చాలా కష్టం.

పోతరాజుగారిని పోషించిన సింగమరేడు కటకం గజపతులతో జరిగిన యుద్ధంలో పురుషోత్తమ గజపతి ఉదయగిరి దండయాత్రలో గజపతుల కొలువులోని కంఠమరాజ్య వంశజుడైన తమ్మభూపాలుని చేతిలో మరణించాడు.[27]

ముమ్మడి సింగమనేని రాజ్యకాలంలోని తెలంగాణాలోని రాజకీయ సాంఘిక పరిస్థితులు విషమించాయి. సమాజంలో అస్థిరత్వం నెలకొంది. ప్రాణ, విత్త, మానాలకు రక్షణలేదు. ఒకప్రక్క బహమనీ సుల్తానుల దాడులవల్ల, ఇంకొకప్రక్క గజపతుల ఆక్రమణ వల్ల చిల్లరమనుజాధిపతులు పుట్టుకొచ్చారు. పెళ్ళాం, పిల్లలను పోషించుకొనడానికి భూమీశులను నమ్ముకొనడంకన్నా భూమిని నమ్ముకొనడం మేలన్నది సత్యం. భాగవతాన్ని ఎన్నోసారులు పారాయణ చేసి ఆ తత్త్వాన్నే ఒంటపట్టించుకొన్న పోతరాజుగారు భోగాలకు విముఖులై సర్వసాధారణ జీవితాన్ని సాగించడంలో సిద్ధాంతాల ఆచరణ సంపూర్ణంగా కనబడుతుంది. పోతరాజుగారు బీదతనం అనుభవిస్తూ వ్యవసాయం చేసుకొంటూ జీవించారనీ, రాజులన్నా, వారిచ్చే సంపదలన్నా కిట్టక భోగాలకు విముఖులై భాగవతం రచించారనీ లోకులు చెప్పుకొనే విషయాలు సుప్రసిద్ధాలు. ఈ క్రింది పద్యం వారు వ్రాసిందే అంటారు.

> ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
> సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము బాసి కాలుచే
> సమ్మెట వ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
> బమ్మెరపోతరా జొకడు భాగవతంబు జగద్ధితంబుగన్. (భాగవతం, 1-11)

అయితే ఇది ప్రక్షిప్తమని పండితులు భావిస్తారు. ఈ పద్యమూ, దీనితోపాటు 'చేతులారంగ శివుని పూజింపడేని' అనే పద్యమూ రెండు వచనాల మధ్య ఉన్నాయి. తొలి వచనం ఉభయకార్య దక్షుండనై' అనే ఉత్తమ పురుషతో ముగుస్తుంది (1-10). మలి వచనం

27. తెలుగు సంస్కృతి - మొదటి సంపుటం దేశము చరిత్ర, పుట 381.

మదీయ పూర్వజన్మసహస్ర సంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణకథా విరచన కుతూహలుండనై' అని ఉత్తమ పురుషతోనే మొదలవుతుంది (1-13). ఈ రెండు వచనాలూ కలిసి ఏకాండంగా ఉండేవనీ, అందుకే రెండూ ఉత్తమ పురుషలోనే ఉన్నాయనీ, ఎవరో లేఖకులు ప్రథమ పురుషలో ఉండే 'ఇమ్మనుజేశ్వరాధముల' అనే పద్యమూ, 'చేతులారంగ శివపూజ' అనే పద్యమూ కలిపి ఉంటారనీ భావించవచ్చు. అయితే ఆ రెండు వచనాల మధ్య ఈ రెండు పద్యాలూ దేశంలో ఉన్న వ్రాతప్రతులన్నిటిలోనూ ఏమాత్రం మినహాయింపు లేకుండా ఉన్నాయట. ఇటీవల మన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు రెండువందల తాళపత్ర గ్రంథాలను సేకరించి పరిశీలించి, వాటిలో ముప్ఫయి ప్రతులను ఎన్నుకొని పాఠాలు నిర్ణయించి భాగవతం అచ్చు వేశారు. అకాడమీ సంపాదకులు చూసిన అన్ని వ్రాతప్రతులలోనూ ఈ పద్యాలు ఉత్తమ పురుష వచనాలమధ్యనే ఉన్నాయట.[28]

అనన్య ప్రచారం పొందిన ఆంధ్రసాహిత్య గ్రంథాలలో పోతరాజుగారి భాగవతం ఇప్పటికీ చాలామందికి పారాయణ గ్రంథం. ఎందరెందరో లేఖకులు పోతరాజుగారి మాతృక నుండి పుత్రికలు రాసుకొనే ఉంటారు. ఆ కాలమునుంచీ ఇప్పుడు చర్చిస్తున్న పద్యాలు వ్రాతప్రతులలో ఉన్నాయో లేవో చెప్పలేము. ఎప్పుడు వచ్చి చేరాయో ఊహించడం అనవసరం. పోతరాజుగారి మనస్తత్వాన్ని అర్థం చేసుకొన్న పరిశోధకు లందరూ ఆ పద్యాలను వారు రచించిరని భావిస్తారు. ఉదాహరణకు ఆంధ్ర సారస్వత పరిషత్తువారు ఏర్పాటు చేసిన 'ఆంధ్రమహాభాగవతోపన్యాసాలు - పోతన చరిత్ర స్థలకాలములు' అనే అంశంపై ఉపన్యసించిన సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు ఇవి ప్రక్షిప్తములనే సకారణంగా నొక్కి చెప్పారు.

మల్లంపల్లి సోమశేఖరశర్మగారూ ఇంకా ఇలా అభిప్రాయపడుతున్నారు. ''భాగవతమును రచించుచుండగనే పోతనామాత్యుడు లోకాంతరగతుడై యుండునని నాయూహ. ఏకాదశ, ద్వాదశస్కంధముల నాయన రచియింపనే లేదనియు, అందువలననే భాగవత సంపూర్ణార్థము పోతనామాత్య ప్రియశిష్యుడైన వెలిగందల నారయ, తన గురువుగారి మీదగల భక్తి గౌరవముల వలన వానిని రచించి యుండుననియుననుకొను చున్నాను. మిగిలిన యాంధ్ర మహాభాగవతమును పోతనమాత్యుడే రచియించియుండ వలెను. దీనిలో పంచమ, షష్ఠ స్కంధములు ఉత్పన్నములగుటకు ప్రాయకముగా ఆనాటి రాజకీయ పరిస్థితులే కారణమై యుండవచ్చునని నేనూహించుచున్నాను.''[29] శర్మగారు రాజకీయ పరిస్థితులే కారణమని స్పష్టపరచినా, ఎవరు ఎందువల్ల పంచము, షష్ఠ స్కంధాలు నాశనం చేశారో ఊహించడం అసాధ్యమయిన విషయం. అందుకే ఆ సుప్రసిద్ధ పరిశోధకులు సూచించి ఊరుకొన్నారు. ఇటీవల ఒక సాహితీపరుడు షష్ఠస్కంధాన్ని

---

28. భాగవతం, ప్రథమస్కంధం, 35 పుటలో అధోజ్ఞాపిక.
29. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు - పుటలు 16-17.

పాషండులు విధ్వంసం చేశారని భావిస్తున్నారు. రాచమల్లు హరికవులు చెప్పిన షష్ఠ స్కంధంలో ఈ పద్యం కనబడడమే ఆ భావనల నేలవిడిచిసాము చేయబోవడానికి కారణం.

చండాంశుప్రభచిక్క తిమ్మయ తనూజా! తిమ్మ! విధ్వస్తపా
షండంబైన త్రిలింగ భాగవత షష్ఠస్కంధ కావ్యంబు నీ
కుం దక్కెం జతురానన త్వ గుణయుక్తుతమీర వాణీ మనో
భాండారోద్ధత చూరకార బిరుద ప్రఖ్యాతిసార్థంబుగన్.

(కవిజన సంజీవని - 1-35)

ఈ పద్యంలోని ''విధ్వస్త పాషండంబైన'' అనే సమాసాన్ని తీసుకొని పోతన భాగవతమును పాషండులు ధ్వంసము చేసినట్లు కవుల షష్ఠములోనిట్లు గలదు'' అని చెప్పి ''పాషండవిధ్వస్త'' యనుటకు బదులు ప్రాసనమున్కై విధ్వస్త పాషండయని వాడబడినది'' అని ఈ సాహితీపరుండు వివరిస్తున్నాడు.[30] ఇది పొసగని వాదన. సుప్రసిద్ధమైన నందిఘంట కవుల జంటనే రాచమల్లు హరికవులంటారు. వీరి షష్ఠస్కంధానువాదాన్నే కవుల షష్ఠమనీ, శృంగార షష్ఠమనీ లాక్షణికులు పేర్కొన్నారు. ఈ ప్రతిభావంతులైన కవులు 'ప్రాసమకోసము' విధ్వస్తపాషండం అనే మాటకు పాషండవిధ్వస్తమనే మాటకు తేడా తెలియని వారని ఊహించడం సాహసోపేతమైన సంగతి.

నిజంగా పాషండులవల్లనే త్రిలింగ భాగవతం నష్టమైతే షష్ఠస్కంధాన్ని పూరించిన ఏర్చూరి సింగన భాగవత నైష్ఠికుడని కీర్తించి కవి పట్టపురాజని తలంచి బమ్మెర పోతరాజుగారికి మొక్కిన పద్యం చెప్పాక 'పాషండవిధ్వస్తం' గురించి పేర్కొనడా? భాగవతం వాస్తవానికి నాస్తిక దర్శనాలలోని మంచిని 'సొంతం చేసుకొని ఆ మతాలను నిర్మూలం చేయడానికి ప్రయత్నించిన రచనే. భాగవతంలోని అన్ని స్కంధాలూ విధ్వస్తపాషండాలు కావడానికి ప్రయత్నించాయి. ''ప్రవిస్తర దుర్ధాంతదురంత దుస్సాహ జనుస్సంభా వితానేక దుస్తర గంభీర కఠోర కల్మష కనద్దావానలం'' అన్నది 'గోవింద కథాసుధారసమహావర్షోరుధాద... చేతనే ఆరుతుందని ఆ కథనే వింటామని శౌనకాది మహామునులు సూతునికి చెప్పారు (భాగ. 1-47). సూతుడు వినిపించినదే, మునులు విన్నదే పోతరాజుగారు తెలుగువారికి వినిపించారు.

అకాడమీవారు ప్రచురించిన భాగవతం పీఠికలో ఈ క్రిందిపద్యం ఉదాహరించి కొన్ని సంగతులు వ్రాశారు. చూడండి.

వినుము శుకుడు వచ్చి విజ్ఞానపద్ధతి - నతని కెట్లు సూపె, నతడు పిదప
దనశరీర మెవ్విధంబున వర్జించె - విప్రముఖ్య! నాకు విస్తరింపు.[31] (భాగ 1-275)

30. సమాలోచన అనే పత్రికలో ''పోతనమహాకవి'' అనే వ్యాసంలో జి.ఏ.ఎన్.ఎస్. సోమయాజుల శర్మ.
31. అకాడమీ సంపాదకులు పీఠికలో యీ పద్యం 1-275 అన్నా అచ్చు వేయడంలో 274గా వేశారు.

''అచ్చు ప్రతులలోను, వ్రాతప్రతులలోను పాఠమిట్లే ఉన్నది. 'వినుము' అను క్రియ పద్యమున సంగతి పడుటలేదు. సరియైన పాఠమేమో ఇంకను విచారింపవలసియున్నది.''[32]

ఈ పద్యంలో 'వినుము' అన్న క్రియ సంగతపడకపోవడానికి కారణం ఉంది. 'వినుము' అన్నది పోతరాజుగారి ఊతపదం. చాలాపద్యాలు వారు 'విను' 'వినుము' అని ఎత్తుకొంటారు. అప్పుడప్పుడు ఒకే పద్యంలో రెండుసార్లు 'వినుము' అనే మాట వాడుతారు. చూడండి. వారు 'వినుము' వాడిన గద్యపద్యాల జాబితా.

వినుండు (1-65), విను (1-112), వినుమీసృష్టి (1-127), వినుమీసంసారం (1-130), వినుము నీకు నేడు (2-12), వినుము భగవంతుడైనహరి (2-16), వినుమూఢుండు (2620), వినుమప్పరమాత్ముమైన (2-28), వినుమునీవడిఇన (2-34), వినుడంభోజభవుండు (2-35), వినుముబ్రహ్మకర్పన (2-38), వినుమీ ఈశ్వరు (2-83), వినముమాయావిభుండైన (2-86), వినువత్స (2-102), వినువేయేటికి (2-106), నీకెరింగించెద వినుము (2-112), 2-116 నుంచి 197 దాకా విష్ణువు యొక్క 21 అవతారాల వర్ణన. ఈ గద్యపద్యాలలో 20సార్లు 'వినుము' అనే మాట దొర్లింది. వాటి సంఖ్యలు - 116, 118, 120, 122, 124, 135, 137, 139. రెండుసార్లు, 141, 143, 145, 149, 152, 154, 172, 173, 193, 197. అన్యులన్ జెప్పనేల వినుము (2-199), ఎరిగింతు వినుము (2-203). వినుశుకయోగికి (2-217), వినుమని చెప్పెవడినూతుండు (2-222), వినువిప్రుడు (2-284).

పోతరాజుగారు వ్రాసిన ప్రథమ ద్వితీయస్కంధాలలో వెరసి 715 పద్యగద్యాలు ఉన్నాయి. వాటిలో 'వినుము' అనే క్రియ 41 సార్లు దొర్లింది. ఇతర స్కంధాలలో కూడా పోతరాజుగారిలా ఈ క్రియను చాలాసార్లు వాడారు. గ్రంథవిస్తరణ భీతిచేత, అన్నీ క్రోడీకరించినా, ప్రకటించడం లేదు.

కొంతమంది కవులకు కొన్ని పదాలు ఎలాగ ఊతపదాలు అవుతాయో, అలాగే కొన్ని ఉపమానాలు కూడా విరివిగా వాడేవి అవుతాయి. 'మందారమకరంద మాధుర్యమునతేలు మధుపమ్ము వోవునే మదనములకు' అనే భావం పోతరాజుగారికి చాలా ఇష్టం. దీనిని ఆయన పాల్కురికి సోమనాథుని రచననుండి గ్రహించారు. బసవ పురాణంలో బిజ్జలుడు కోపించి బండారు బసవన్నను బిలిచి తన సొమ్ము తనకిమ్మన్నప్పుడు అతనన్నవి -

బగుతు డాసించునే పరధనంబునకు
మృగపతి యెద్దెస మేయునే పుల్లు?
క్షీరాబ్ధిలోపల గ్రీడించు హంస
గోరునే పడియలనీరు ద్రావంగ
జూతఫలంబుల జుంబించు చిలుక
బ్రాతి బూరుగుమ్రాని పండ్లు గన్గొనునె

32. శ్రీమహాభాగవతం, మొదటి సంపుటం, పీఠిక పుట 111.

రాకాయలజ్యోత్స్న ద్రావు చకోర
మాకాంక్షసేయునే చీకటి ద్రావ?
విరిదమ్మి వాసనల విహరించు దేటి
వరిగొని సుడియునే ప్రబ్బలి విరుల
నెరుగునే యలదిగ్గజేంద్రంబు కొదను
యెరపందిచనుసీక నెరుగవుగాక. (బసవపురాణం, 3:32-42)

సోమనాధునికే చాలా ఇష్టం. బసవపురాణంలోనేకాక చతుర్వేదసారంలో కూడా వీటిని చెప్పాడు.

రాకాయలజ్యోత్స్న ద్రావనిచ్చలుగొన్న నాచకోరంబుల కరుచియగునె?
సహకారపల్లవచయములు దొరికిన జగతి కోయిలకును చప్పనగునె?
క్షీరాబ్ధిలోపల గ్రీడింపగల్గిన భువి రాజహంసకు బుల్లనగునె?
విరిదమ్మివాసన వెల్లిముంచిన గ్రోలు షట్పదమ్ములకు నాస్వాదమగునె?
బహుశతరదయార్ద్రభావప్రభావన - మహిమ దనరు జంగమంబు రాగ
నతులభక్తి పరుల కావశ్యకంబగు - పరిహృతాభిభంగ బసవలింగ!
(చతుర్వేదసారము, 153)

చిన్నప్పుడు పాల్కురికి సోమనాథుని రచనలు బాగా చదువుకొన్న పోతరాజుగారికి ఇవి చక్కగా ఒంటపట్టాయి. యౌవనంలో వ్రాసిన భోగినీదండకంలో ఈ భావాలను పోతరాజుగారు ఇలా చెప్పారు:

సింగభూపాలుపై వ్రాలి నాచిత్తమున్మత్తమై సోలి కామానలా యత్తమై రాదు, తేరాదు నే నామరుండనై గౌరీవరుండైన వాణీధవుండైన దేవోత్తరుండైన నన్యున్ మదిం గోరగా నొల్లనే? ఉల్లసత్ఫుల్ల మందారరాజన్మరందంబునం గ్రోలు మత్తాళి దుత్తూరముం గ్రోలునే? హేమరాజీవరాజీరజోరాజితాకాశగం గానదీలోలకల్లోల డోలా నటద్రాజ

హంసంబు శైవాలగండూనదీ భేక భేకీడు లీ సంకులాసారకాసారముంజేరునే?
మండితాఖండలానీలజీమూతనిర్యత్పయోధావలన్ ద్రాపు సారంగి కుంభాం
తరాంభఃప్రపూరంబులన్ ద్రాపునే మాధవోజ్జృతచూతాంకురస్వాదు
లీలాలసత్కోకిలేంద్రంబు ఝుల్లీవరక్రూరభల్లాతకీశాఖకున్ బోవునే?

ఇవే భాగాలు భాగవతంలో చాలాసార్లు దొర్లాయి. చూడండి

హరినామాంకిసత్క థామృతరసన్యాలోలుడైనట్టి స
త్పురుషశ్రేష్ఠు డసత్కథాలవణవాఃపూరంబు దా గ్రోలునే
పరమందారమరందపాసకుతుకస్వాంతద్విరేఫంబు స
త్వరమైపోవునె చేతివేములకు తద్గంధానుమదాత్మయై? (భాగవతం, 3-223)

కాన సరోజలోచను జగత్ స్తవనీయకథాసుధారసం
బానిన యట్టి జిహ్వ యసదన్యకథాలవణోదకంబులన్
బానముసేయ జూచునె సుపర్యమహీజమరందపావలా
భానుభవంబు నొందు మధుపంబున్ బోవునే వేపచెట్లకున్ (భాగవతం, 3-441)

పూని భవత్పదాంబురహ మూలనివాసులమైన మేము మే
ధానిధి! నీ విలోకనము దక్కగ నన్యము గోరనేర్తుమే?
మానిత పారిజాతకుసుమస్ఫుటనవ్యమరందలుబ్ధ శో
భానయశాలియైనమధుపంబు భజించునె యన్యపుష్పమున్? (భాగవతం, 4-295)

మందారమకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు?
నిర్మలమందాకినీవీచికల దూగు రాయంచ చనునె తరంగిణులకు?
లలితరసాలపల్లవఖాదియై చొక్కు కోయిల సేరునే కుటజములకు?
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరక మరుగునే సాంద్రనీహారములకు?
అంబుజోదరదివ్యపాదారవింద - చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు - వినుతగుణశీల! మాటలు వేయునేల?
(భాగవతం, 7-150)

నను బాణిగ్రహణంబు చేసితిగదా నాభర్తవున్నీవ దై
వనియోగం బిది బౌరుషంబునకు నావాక్యంబు సిద్ధంబు సౌ
ఖ్యనివాసు న్ని ను మాని యొండువరునిం గాంక్షింప నేనోర్తునే
వనజం బాసెడి తేటి యన్యకుసుమావాసం బపేక్షించునే? (భాగవతం, 9-529)

సిరికి నుదార చిహ్నముల జేయు భవచ్చరణారవిందముల్
సరసిజనేత్ర మాతపముసంపదజేరితి మెట్టకేలకున్
మరలగలేము మానుగలమాటల నొల్లము పద్మగంధముల్
మరగిన తేటు లన్యకుసుమంబుల చెంతల జేరనేర్చునే? (భాగవతం, 10-1-989)

నీరదాగమ మేఘ నిర్ముక్తపయఃపాన చాతకం బేగునే చౌటిపడెకు
బరిపక్వమాకంద ఫలరసంబులు గ్రోలు కీరముల్ చనునె దుత్తూరములకు
ఘనరవాకర్ణ నోత్కలిక మయూరముల్ గోరునె కఠినఝల్లీరవంబు
గరికుంభ పిశిత సద్గ్రాసమోదిత సింహ మరుగునే శునకమాంసాభిలాష
బ్రవిమలాకారా! భవదీయ పాద పద్మ
యుగ సమాశ్రయ నైపుణోద్యోగ చిత్త
మన్యు జేరునె తన కుపాస్యంబు గాగ
భక్తమందార! దుర్భర భవవిదూర! (భాగవతం, 10-11.257)

పోతరాజుగారి ప్రసిద్ధమైన పద్యాలలో ''సిరికింజెప్పడు శంఖచక్ర యుగమున్ జేదోయి సంధింపడు'' (8-96) అనేదీ, ''తన వెంటన్ సిరి, లచ్చివెంట నవరోధ

వ్రాతమున్'' (8-98) అనేదీ చాలా ముఖ్యమైనవి. భక్తులను రక్షించడానికి ఎవ్వరికీ చెప్పకుండా విష్ణువు బయలుదేరితే భార్య, పరివారం అనుసరించారని ఈ అష్టమ స్కంధంలో గజేంద్రమోక్షంలోకాక ముందుగా తృతీయ స్కంధంలోనూ వ్రాశారు.

సనకసనందనాదులు విష్ణువును సేవించుకొనడానికి వచ్చారు. వాళ్ళకు జయ విజయులు 'ఇప్పుడు అవకాశం దొరక'దన్నారు. అడ్డగించారు. మునులు ఘర్షణపడ్డారు, శపించారు. ఆ కలకలం లోపలనున్న హరి ఆలకించాడు. శ్రీదేవితో సరసాలాప వినోదసౌఖ్య రచనలు చేస్తున్నాడు. వాటిని చాలించి శుద్ధాంతమందిరపు మాణిక్య గేహళుండు నడచి వెళ్ళాడు. అతని వెంట శరనిధికన్యకామయు సంభ్రమమొప్పగ తోడు వెళ్ళింది. ఆమె వెంట అచ్చరలు వెళ్ళారట. వాళ్ళ తరువాత పక్షీంద్రుడుకూడ ఉన్నాడు. కైన తేయాంసవిన్యస్తవామహస్త కలితకేయూర వలయకంకణములొప్ప అని పోతరాజుగారు వర్ణించారు. జయవిజయులకు శాపం ఇస్తున్న సనకసనందనాదుల వద్దకు వెళ్ళిన శ్రీమన్నారాయణుని కవి పోతరాజుగారు 8 గద్యపద్యాలలో వర్ణించారు (38-535). ఈ దృశ్యాన్నే వారు సంక్షిప్తం చేసి 'తనవెంటన్ సిరి లచ్చివెంట' అనే ఒకే పద్యంలో తరువాత చెప్పారు. దశమస్కంధంలో శ్రీకృష్ణుని వెతుక్కుంటున్న గోపికలచేత పోతరాజుగారు చెప్పించిన పద్యం వినని తెలుగువాడు దేశంలో ఉండడు. చూడండి అది.

> నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై
> జల్లెడువాడు మౌళి పరిసర్పిత పింఛమువాడు నవ్వు రా
> జిల్లెడు మోమువాడొకడు చెల్వల మానధనంబు దెచ్చెనో
> మల్లియలార! మీ పొదలమాటున లేడు కదమ్మ చెప్పరే. (భాగవతం, దశమ, 1.1010)

అయితే ఇటువంటి పద్యాలే పోతరాజుగారు నవమస్కంధంలోనూ వ్రాశారు. అక్కడ రాముణ్ణి వర్ణిస్తూ ఇవే మాటలు వాడారు చూడండి.

> నల్లనివాడు పద్మనయనంబులవాడు మహాశకంబులన్
> విల్లును దాల్చువాడు గడు విప్పగు వక్షమువాడు మేలు పై
> జల్లెడువాడు నిక్కిన భుజంబులవాడు యశంబు దిక్కులం
> జిల్లెడువాడు నైన రఘుసత్తము డీవుత మా కభీష్టముల్! (భాగవతం, 9-360)

రాముడాదేశించి వ్రాయమన్న పుస్తకాన్ని ప్రారంభిస్తూ శ్రీకృష్ణుని-నందాంగనా డింభకుని ప్రార్థించారు. షష్ఠ్యంతాలు కృష్ణపరంగా వ్రాశారు. మిగతా కవులంతా షష్ఠ్యంతాలు కందపద్యాలలో వ్రాస్తే పోతరాజుగారు ఉత్పలమాలలు గట్టి పూజించారు. పద్యంలోనూ అంత్యానుప్రాస హాయిగా వాడారు. కృష్ణస్తుతిలో వాడిన అనుప్రాసను రామకథ చెప్పడంలో విరివిగా వాడారు. నవమస్కంధంలో వారు 258 నుంచి 362 దాకా శ్రీరామ చరిత్ర వ్రాశారు అంటే 105 గద్యపద్యాలు. వీటిలో అనుప్రాసలు తెగ వ్రాశారు.[33] చిట్టచివర ఇలా వ్రాశారు:

---

33. ఈ రామచరిత్రలో పోతరాజుగారి పద్యాలకన్నా 'ఇతరుల చేతిపని చాల కల'దని రాళ్లపల్లివారు శంకిస్తున్నారు. చూ॥ శ్రీమదాంధ్ర భాగవతం, రాయలప్రచురణ, పీఠిక, పుట 11.

మంతనములు సద్గతులకు - పొంతనములు ఘనములైన పుణ్యాముల కిదా
నీంతన పూర్వమహాఘుని - కృంతనములు రామనామకృతి చింతనముల్
(భాగవతం, 9-362)

ఇటువంటి పద్యమే రుక్మిణీకల్యాణం ప్రారంభిస్తూ చెప్పారు:

భూషణములు చెవులకు బుధ-తోషణము లనేక జన్మదురితౌఘ విని
శ్శోషణములు మంగళతర - ఘోషణములు గరుడగమను గుణభూషణముల్.
(భాగవతం, 10-1, 1682)

పోతరాజుగారి దృష్టిలో శ్రీరామునికి, శ్రీకృష్ణునికి తేడా లేదు. కాబట్టే ఇటువంటి సంవాద రచనలు సాధ్యమైనాయి. అయితే దశమ స్కంధంలోని 'నల్లనివాడు' అనే పద్యమే ఎక్కువ ప్రచారం అయింది. పోతరాజుగారి భాగవతంలోని వివిధ ఘట్టాలలోని కొన్ని పద్యాలు మన జాతిజీవనంలో కలిసిపోయాయి. ఎవరైనా అపురూపంగా మన ఇంటికి వస్తే ''ఊరకరారు మహాత్ములు'' అంటాం. ఇది పోతరాజుగారి పద్యభాగం. దశమస్కంధంలో బలరామకృష్ణులకు సంస్కారం చేసి నామకరణం కావించడానికి గర్గుడు మందకు వెడతాడు. అప్పుడు నందుడు తగిన సత్కారాలు చేసి ఇలా అంటాడు.

ఊరక రారు మహాత్ములు
వా రధముల యిండ్ల కడకు వచ్చుట లెల్లన్
గారణము మంగళములకు
నీరాక శుభంబు మాకు నిజము మహాత్మా! (భాగవతం, 10-1.283)

ఈ పద్యంలోని తొలిపాదం తెలుగువాళ్ళ సంభాషణలో ఒక చక్కని వాక్యంగా నిలిచిపోయింది. ఇటువంటిదే 'మాట తిరుగలేరు మానధనులు' అనేది. అది అష్టమస్కంధం లోని వామనావతార ఘట్టంలోనిది. శుక్రాచార్యునితో బలిచక్రవర్తి చెప్పినది. పూర్తిపద్యం చూడండి.

బ్రతుకవచ్చుగాక బహు బంధనములైన - వచ్చుగాక లేమి వచ్చుగాక
జీవధనములైన జెడుగాక పడుగాక - మాట దిరుగలేరు మానధనులు
(భాగవతం, 8-597)

బలిచక్రవర్తి ఈ మాట అనడానికి రెచ్చగొట్టిన శుక్రాచార్యుని హితోపదేశం కూడా చాలా ప్రసిద్ధమైనదే. చూడండి.

వారిజాక్షులందు వైవాహికములందు - బ్రాణవిత్తమాన భంగమందు
జకిత గోకులాగ్రజన్మ రక్షణమందు - బొంకవచ్చు నఘముపొంద దధిప!
(భాగవతం, 8-584)

ఇలాగే 'పృథివి నధిపులు నూతనప్రియులు గారె' అనేది కూడా ప్రసిద్ధమే. ఇది భ్రమరగీతలలోనిది (10-1-1463). ఇదే భావం 10-1-1216లో కూడా ఉంది.

పోతరాజుగారి పద్యాలలో ప్రచారం పొందిన మిగతావన్నీ ఒక ఎత్తు, ఈ క్రింది పద్యం ఒక్కటీ ఒక ఎత్తు.

నీ పాద కమలసేవయు - నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును - తాపసమందారా! నాకు దయసేయగదే!

(భాగవతం, 10-1.1268)

ఇది కంసవధకోసం మధురకు వెళ్ళిన బలరామకృష్ణులకు మాలికుడు దండనిచ్చిన ఘట్టంలోనిది. తమకు పూలహారం ఇచ్చిన మాలికుణ్ణి 'నీకేమి వరం కావాలంటే అతడు పై పద్యములోని కోరిక కోరుతాడు. ఇది పోతరాజుగారి వ్యక్తిగత ప్రార్థనకూడా కావచ్చు. భాగవత రచనకు ముందు పోతనగారు భగవత్ప్రార్థన చేస్తూ 'నారాయణా' అనే మకుటంతో ఒక శతకం వ్రాశారని లోకులు చెప్పుకుంటారు. అయితే ఇది పోతరాజుగారు వ్రాయలేదని, ధర్మపురిలో ఉండే లక్ష్మీనారాయణ స్వామిమీద ఎవరో చెప్పిన శతకం అని చాగంటి శేషయ్యగారు భావిస్తున్నారు. ఈ ఊహకు కారణమైన ఈ క్రింది పద్యాన్ని శతకంలోంచి చూపించారు.

అపరాధమ్ములు నిన్ను నమ్మి విను మే నా జన్మ పర్యంతమున్
విపరీతంబుగ జేసినాడ నిక నీవే దిక్కు నాలోనికిన్
గపటం బింతయు లేక దండధరునుం గటిక రక్షింపుమీ
కృపకుంబాత్ర నయ్య ధర్మపురి లక్ష్మీనాథ నారాయణా! (నారాయణశతకం, 98)

ఈ ఒక్క పద్యంవల్లనే కాక ఇంకో పద్యంవల్ల కూడా ఇది పోతరాజుగారి రచన కాదని చెప్పవచ్చు. చూడండి.

నీమూర్తుల్ గన నీ కథల్ విన దుదిన్ నీ పాదనిర్మాల్య ని
ష్ఠామోదంబు నెరుంగ నీచరణతోయం బాడ నైవేద్యముల్
నీమం బొప్ప భజింప నీజపము వర్ణింపన్ గృపం జేయవే
శ్రీమించన్ బహుజన్మ జన్మములకున్ శ్రీయాది నారాయణా!

(నారాయణశతకం, 105)

ఇందులో 'బహుజన్మజన్మములకున్' అనే మాట పోతరాజుగారి తత్వానికి విరుద్ధం. వారు పునర్జన్మ కోరరు. భాగవతాన్ని తెనిగించి 'నాజననంబున్ సఫలంబు జేసెద బునర్జన్మంబు లేకుండగాన్' అని వారు దీక్ష వహించారు (భాగవతం 1-19). అందుచేత బహుజన్మజన్మాలు చెప్పే నారాయణశతకం పోతరాజుగారి రచన కాదని చెప్పవచ్చు.

ఈ శతకం ఆయన వ్రాసింది కాదని కొందరు నమ్ముతున్నట్టే వీరభద్రవిజయం కూడా పోతరాజుగారి రచన కాదని కూడా భావిస్తున్నారు. పింగళి లక్ష్మీకాంతంగారూ[34] ఖండవల్లి లక్ష్మీరంజనంగారూ[35] మొదలైనవారు ఈ వాదాన్ని గాఢంగా నమ్ముతున్నారు. వీరభద్ర విజయంలో పోతన పేరు గద్యములో ఉండడంవల్లా, కవివంశంలో వ్యత్యాసాలు

34. తెలుగుభాషాసమితి వారి విజ్ఞానసర్వస్వం, 3వ సంపుటి, పుట 33.
35. ఆంధ్రసాహిత్యచరిత్రసంగ్రహం, పుట 69.

లేకపోవడంవల్లా ఖండవల్లి వారు బమ్మెర పోతరాజుకు అదే పేరుగల సవతి తమ్ము డున్నాడని, అతడు వీరభద్రవిజయం వ్రాశాడని భావిస్తున్నారు. పోతరాజుగారీగ్రంథాన్ని వ్రాయలేదనే విశ్వాసానికి ఆద్యులు గురజాడ శ్రీరామమూర్తిగారు. వీరు 'వీరభద్ర విజయవివేకం' అనే సుదీర్ఘచర్చ చేశారు.[36]

పండితులు ఇలా భావించడానికి ప్రప్రథమ కారణం భాగవత రచన పూర్తి అయ్యాక అందులో దక్షయాగఘట్టంలో శివనింద చేసి, అందుకు ప్రాయశ్చిత్తంగా పోతనగారు ఈ వీరభద్రవిజయం చెప్పినట్టు ఎవరో ఒక పద్యం కల్పించి గ్రంథంలో చొప్పించారు, చూడండి ఆ పద్యం.

> భాగవతప్రబంధ మతిభాసురతన్ రచియించి దక్షదు
> ర్యాగకథాప్రసంగమున నల్పవచస్కుడ నైతి తన్నిమి
> త్తాగతవక్త్రదోషపరిహారమునకై యజనైకశైవశా
> స్త్రాగమవీరభద్రవిజయంబు రచించెద వేడ్క నామదిన్. (వీరభద్రవిజయం, 1-41)

భాగవతంలోని భావోద్వేగం, సురుచిరపాకం, పరిణతభావనా వీరభద్రవిజయంలో లేవు. అందుచేత భాగవత రచన తరువాత ఇంత పేలవంగా ఉండే గ్రంథం వ్రాయడం జరగదు అనే సహజభావం జనించి అసలు వీరభద్ర విజయం పోతరాజుగారు ఎప్పుడూ రచించి ఉండరనే గాఢవిశ్వాసానికి దారితీసింది. అయితే ఇది పోతరాజుగారి బాల్య రచన కావచ్చు. ఇందులో చేసిన దోషాలు ఏమిటో విబుధవరుల వల్ల విన్నంత కన్నంత తెలుసుకొని తరువాతి రచనలో దిద్దుకొనవచ్చు. వీరభద్రవిజయం అసహ్యంగా కన్పించే గొంగళిపురుగు కావచ్చు. దీనినుంచి రంగురంగుల రెక్కలున్న సీతాకోక చిలుకలాగా భాగవత రచనాశిల్పం జనించడానికి అవకాశాలు లేకపోలేదు. పోతరాజుగారికి లాటానుప్రాస ఇష్టమే (కమలాక్షు నర్చించు కరములు, 7-169). వీరభద్ర విజయంలో కూడా లాటానుప్రాస రచన ఉంది. శివుని మీదకు పంపించేముందు ఇంద్రుడు మన్మథుని పొగిడే పద్యం చూడండి.

> 'జగములోపల గల జంతురాసులబట్టి మనసుల గలచు నీ మహిమ మహిమ
> నాడుచో గంటు గానగరాక వాడియై సరిలేక నటు నీ శరము శరము
> పరమేష్ఠిసృష్టిలోపలి పురుషుల కెల్ల దీపమై వెలుగునీరూపు రూపు
> అఖిలంబు నెందాక నందాక నందమై పృథుతరంబైన నీ బిరుదు బిరుదు
> శూలినైన దాపసులనైన బాధింతు - గాలినైన నెట్టి ఘనులనైన
> గలదె నీదు పేర్మి ఘనత తక్కొరులకు - నిన్ను బోల వశమె నిరుపమాంగ!
> (వీరభద్రవిజయం, 2-58)

పోతరాజుగారికి చాలా ఇష్టమైన అంత్యానుప్రాస భాగవతంలోనే తన విశ్వరూప ప్రదర్శనం చేస్తుంది. 'అతని వర్ణన పద్యములలో అంత్యానుప్రాసలేని దెక్కడనో గాని ఉండదు' అని అకాడమీవారి భాగవత సంపాదకులు అన్నారు.

36. కవిజీవితములు, పుటలు 622-642.

ఈ అంత్యానుప్రాస భాస్కరరామాయణం నుంచి పోతరాజుగారు అలవరుచుకొన్నారు. నాచన సోముడు మరికొన్ని శబ్దాలంకారాల మజాలు నేర్పాడు. ఎఱ్ఱయ్యగారు అర్థాలంకారాల రహస్యాలు బోధించారు. పాల్కురికి సోమనాథుని అమితావేశానికి పోతరాజుగారే ఏకైక వారసులు. భాషాప్రపంచంలోని శబ్దాలన్నీ వారికి కరతలామలకాలు. అనుప్రాసలు వాడేటప్పుడుగాని, పర్యాయ పదాలను గుప్పించేటప్పుడు గాని తడుముకోవడం లేనేలేదు. పాటలాగ ధ్వనించే పద్యాలలో వ్యర్థపదాల అపశ్రుతులు వినబడవు. అయితే శబ్దాలపైన వారికున్న మక్కువ ఎక్కువ కావడంచేత పోతరాజుగారిపై అభిమానం ఉన్నవారు సైతం ఇలా భావిస్తారు. ''ఈ శబ్దదృష్టి పోతన్నలో కొంత చాపల్యమునకే దారితీసినదనవచ్చు. ఒక్కొక్కసారి ఇతడు శబ్దములను శబ్దములకొరకే వాడును. బ్రహ్మయన్నచో నాతనికి చాలదు. 'తలవాకిట వాణిగల పోడిమిచే వాడిమికెక్కిన నలుమొగంబుల తక్కరిగొంటు' అని బ్రహ్మాండముగ విస్తరించి చెప్పిననే యాతనికి తృప్తి!'' అని పుట్టపర్తి నారాయణాచార్యులుగారు చెప్పిన మాటలు నిజం.[37] అయితే శైలికి తగ్గ శబ్దాలను స్వీకరించడం అవసరం. పోతరాజుగారి భాగవతం ఆంధ్రదేశంలో ప్రచారం కావడానికి మధురమధురమైన శైలికూడా కారణమే. ''భాగవతమునకింతటి ప్రజాదరణము అందలి భక్తి ప్రభావమువలననే కాదు. మంద్రగంభీరగమనముగల యాతని శైలివలనను వచ్చినది. అది సహజధారా విలసితము. ఓజఃప్రసాదగుణోజ్జ్వలితము బిగువైన ఆ పదబంధమున సంస్కృతములు, తెలుగులు చెరిసగముగా గుచ్చిన మల్లెలు జాజులై పరిమళించును'' అని గడియారం శేషశాస్త్రిగారు చెప్పిన మాటలు వాస్తవాన్ని వ్యాఖ్యానం చేస్తాయి.[38]

ఈ పరిమళాల మత్తులో తన్ను తాను మరిచిపోయి పోతరాజుగారు పారవశ్యంలో ఊదులాడుతారు. కళ్లుమూసుకుని భాగవత తరంగనిస్వనాలు వింటారు. నిజానికి భాగవత దశమస్కంధంలోని పలుఘట్టాలకు సరిసమానమైనవి - ఎఱ్ఱయ్యగారి హరివంశంలో ఎన్నో ఉన్నాయి. రెండు రచనలూ తులనాత్మకంగా పరిశీలిస్తే ఎఱ్ఱయ్యగారి రచన దృశ్య కావ్యంగా ఉంటుంది; పోతరాజుగారిది పాట కచ్చేరీ. ఉదాహరణకు గోపికలు కృష్ణుని మీద నేరాలు యశోదతో చెప్పే ఘట్టం తీసుకుందాం. పోతరాజుగారు 23 పద్యాలు ఏకబిగిని వ్రాశారు (భాగవతం 10-ఐ-306-328). ఎఱ్ఱయ్యగారు 25 గద్యపద్యాలు వ్రాశారు (హరివంశం, 1-5:211-235).

పోతరాజుగారి రచనలో అన్నీ గోపికల మాటలేగాని కవివచనాలు లేనే లేవు. ఎఱ్ఱయ్యగారు గోపికలు ఎలా చెప్పారో వివరిస్తారు. ''ఒర్తుకీర్తించువిధంబున జేతుల వీచుచు కృష్ణజననిం గదిసి ఇట్లనియె'' అంటారు. ''మరియొక్క యతివ ఆగ్రహమున అందరం ద్రోచికొం చరు దెంచి'' చెప్పిందంటారు. పోతరాజుగారికి గోపికలు ముఖ్యం కాదు. కృష్ణ లీలలే ప్రధానం. అందుచేత కృష్ణుడు ఏం చేశాడో చెప్పించారుగాని వాళ్లు ఎలాగ చెప్పారో తాము చెప్పదలచుకోలేదు.

37. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు, పుట 195.

38. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 3వ సంపుటి, పుట 935.

పోతరాజుగారి కవితాదృష్టిని వారి పాత్రలు అలవరచుకొని బాలకృష్ణుని దేవునిగానే భావిస్తాయి. కాళిందిమడుగులో పడ్డ కృష్ణుని తలచుకొని పోతరాజుగారి యశోద ''తండ్రీ! నీవు సర్పదష్టుండవైయున్న నిచట మాకు ప్రభువు లెవ్వరింక'' అని రోదిస్తుంది. ఆమె దృష్టిలో కృష్ణుడు కొడుకు కాదు, ప్రభువే. ఎఱ్ఱయ్యగారు ఇదే ఘట్టంలో యశోదచేత తల్లిలాగ విలపింపజేశారు. ''కన్న కడు పగ్గలమై వెలపెట్టరాని పెంపునగల మానికం బొదవి బుగ్గలు పోయెనె యిక్క డక్కటా!''[39] అని ఆమె ఏడుస్తుంది. వెన్నతిన్న నేరానికి రోలుకు కట్టినందుకు ఇలా చేశావా అని విలపిస్తుంది.

ఎఱ్ఱయ్యగారి యశోద పూర్తిగా వెఱ్ఱిబాగుల తెలుగుతల్లి. పూతన వచ్చి దారుణం చేశాక నందుడు వచ్చి 'నీవేల యేమరితివి' అని గద్దిస్తాడు. అప్పుడామె,

కడుపునిండగ జన్నిచ్చి కొడుకునిద్ర
నోవ దీవియమండంగ బ్రొద్దువోవు
నందనుక మేకొనియుండియలసికన్ను
కొంతమూసితి నాలస్యమేదియిందు? (హరివంశం, 1-5-157)

ఇవి తెలుగు ఇల్లాలి మాటలే. కృష్ణుడు శకటాసురుణ్ణి చంపాక ఎఱ్ఱయ్యగారి యశోద విరిగిన బండిని చూసి ఎంతో భయపడుతుంది. కృష్ణుని చూసి 'భవజ్జనకుండు వచ్చి నన్నెన్ని తెరంగుల బరుపడు' అంటుంది. ఇలా బాధపడుతుంది:

ఈమెయి శకటం బెడలుట - కేమి గతము దీని నెవ్వ రెరుగుదురువిభుం
డేమి యది యనిన నుత్తర మేమని నేనిత్తు నిండ యిడుదురు నాకున్.
(హరివంశం, 1-5-179)

ఇలా అన్నాక ఎఱ్ఱయ్యగారి యశోద బాలుణ్ణి తొడమీద పెట్టుకొని మాట్లాడక పాలిస్తుంది. ఇలాంటి భయాలు, నింద వేస్తారనే బెంగ పోతరాజుగారి యశోదలో లేవు. అయితే 'బాలుని రోదనంబు విని పరతెంచి' సహజంగా ఇలా అంటుంది.

'అలసితివి గదన్న! యాకొంటివి గదన్న!
మంచియన్న యేడ్పుమాను మన్న
చన్ను గుడువు మన్న సంతసపడు మన్న
యనుచు జన్ను గుడిపె నర్భకునకు.[40] (భాగవతం, 10-1-258)

కృష్ణలీలలనే పాలతో ఎఱ్ఱయ్యగారు పాయసం చేశారు. పోతరాజుగారు కోవా చేశారు. వాస్తవానికి భాగవతంలోని యితర ఘట్టాలలోని పద్యాలు కూడ తియ్యని కోవాబిళ్ళలే. భీష్మస్తవం, కృష్ణనిర్యాణం, ప్రహ్లాదచరిత్ర, గజేంద్రమోక్షం, వామనావతారం,

39. హరివంశం, (7-4)
40. భాగవతం, వావిళ్ళ ప్రచురణ, 1922 ముద్రణ, పీఠిక, పుట 70.

రుక్మిణీకల్యాణం మొదలైన ఘట్టాలన్నీ సుప్రసిద్ధాలు. ''పోతన కవితాసముద్రమునందు గల పద్యములన్నియు గుమ్మడికాయంత ముఖ్యములే. ఇందేవి గణనీయములో నిర్ణయింప నవసరం లేదు. ప్రతిపద్యము పఠనీయము. ప్రతికథాంశము స్మరణీయమే'' అని శేషాద్రి రమణకవులు చెప్పిన మాటలు నిజానికి నిమ్మకాయలంత రత్నాలు. పోతనగారి పద్యాలు పరిమళాలు వెదజల్లే పారిజాతాలు. భాగవతానికి కల్పవృక్షంగా భావించిన పోతరాజుగారు ఆ వృక్షశాఖపై కూర్చుని గానం చేసే మత్తకోకిలవంటివారు. ఛందస్సులలో ఆయనకు మత్తకోకిల అంటే ఇష్టం. ఏఏ వృత్తాలు, జాతులు ఎన్నెన్ని వ్రాశారో చూడండి.

పోతరాజుగారి భాగవతంలో గద్యపద్యాలు (అకాడమీప్రతిని అనుసరించి)

సంఖ్య	ఛందస్సు	సంఖ్య	ఛందస్సు
1.	ఆటవెలది	14.	మత్తకోకిల
2.	ఇంద్రవజ్ర	15.	మత్తేభం
3.	ఉత్పలమాల	16.	మహాస్రగ్ధర
4.	ఉత్సాహం	17.	మానిని
5.	ఉపేంద్రవజ్ర	18.	మాలిని
6.	కందం	19.	లయగ్రాహి
7.	కవిరాజవిరాజితం	20.	లయవిభాతి
8.	చంపకమాల	21.	వచనాలు
9.	తరళ	22.	శార్దూలం
10.	తేటగీతి	23.	శ్లోకం
11.	దండకం	24.	సీసం
12.	పంచచామరం	25.	స్రగ్ధర
13.	భుజంగప్రయాతం		

పోతనగారి భాగవతంలో ఆటవెలది పద్యాలు మొత్తం 326 ఉన్నా సీసం వెనుక ఆటవెలది వాడిన సందర్భం ఒక్కటే కన్పిస్తుంది. మిగిలిన సీసాలన్నీ తేటగీతి అనుసంధానమైనవే. భాగవతంలో అతి చిన్న వచనం ఒక్కమాటగా వుంటే (మరియును, వెండియును) అతి దీర్ఘమైనది 112 పంక్తులు దాటింది. వృత్తాలన్నీ చూశాక - పోతనగారి కవితాకన్య మత్తేభగమన అనక తప్పదు.

వారి గద్యపద్యాల వివరాలు చూస్తే విశేషవృత్తాలలో మత్తకోకిలలంటే పోతరాజు గారికి ఇష్టం అని తెలుస్తుంది. భాగవతంలో 35 సార్లు, వీరభద్రవిజయంలోకూడా 20 మత్తకోకిలలు ఆలపించడం గమనించదగ్గ విషయమే. మత్తకోకిలలాగే నడచే తరళను పోతరాజుగారు వీరభద్రవిజయంలో నాల్గుసారుల భాగవతంలో 17సార్లు వాడడం కూడ

గమనించాలి. పోతరాజుగారి ఛందస్సులు భాగవతాన్ని కూలంకషంగా చదివిన పాఠకుణ్ణి సమ్మోహింపజేస్తాయి. పుట్టపర్తి నారాయణాచార్యులుగారు ఇలా అన్నారు :

''భాగవతమున ప్రతిసీసపద్యము కడపటను సాధారణముగ ఆటవెలదియే తగులుచుండును. ప్రత్యేకముగ వ్రాసిన యాటవెలదులుకూడ నెక్కువ. వీనిలోని సౌందర్యమును 'చాలు!చాలు!' నననంతవరకు పోషించినవాడు వేమనయోగి! కాని తొలుత నొక వింత యొయ్యారముతో, ఆంధ్రభాషలో నాటవెలది యడుగుపెట్టినదీ పోతన్నతోనే!''[41]

పోతరాజుగారి ఆటవెలదుల నడకలోని ఘులంఘులలు చెవులను భ్రమింపజేయడం వల్లనే వారు సీసాల తరువాత తేటగీతులు ఆలపించడంకన్నా ఆటవెలదులను ఆడిస్తారనే భావన కలుగుతుంది. అయితే వాస్తవానికి ఆయన భాగవతంలో వ్రాసిన 899 సీసాలలో 677 తేటగీతులు, 222 ఆటవెలదులు ఎత్తుగీతులుగా వ్రాశారు. వీరభద్ర విజయంలో 118 సీసపద్యాలున్నాయి. అందులో 101 ఆటవెలదులు, 17 తేటగీతులు మాత్రమే ఉన్నాయి.

శ్రీనాథుడు తన సీసాల తరువాత ఒక్కటే ఒక్క ఆటవెలదీ, మిగతా తేటగీతులే వ్రాశాడని మనం ఇంతకు ముందు గమనించి ఆంధ్ర ఛందః పరిణామంలో ఇదొక ముఖ్య ఘట్టాన్ని సూచిస్తుందని చెప్పుకొన్నాం.[42] శ్రీనాథుడూ, పోతరాజుగారూ బావమరదులు కాకపోయినా ఇంచుమించు సమకాలికులు కావడంవల్ల ఇద్దరి సీసాల ఎత్తుగీతులలో పోలికలు కనబడుతున్నాయి. వీరభద్రవిజయం వ్రాసే కాలంలో, బహుశా పోతరాజుగారు ఆధునిక పద్ధతులు వినకపోవడం వల్ల ప్రాచీనుల పద్ధతివైపు మొగ్గారు. తరువాత శ్రీనాథుడు వాడినట్టే ఎక్కువ తేటగీతులు, సీసాలపిదప వాడారు. అయితే ఈ మహాకవుల జీవిత దృక్పథాలలోకూడా ఎవరికివారే. చనిపోతున్న సమయంలోకూడా శ్రీనాథుడు 'కస్తూరి కేరాజు ప్రస్తుతింతు?' అని వాపోయాడు. పోతరాజుగారిది ఎప్పుడూ పై చేయే. అది నిద్రలోకూడా క్రిందవదు. పరీక్షిత్తుకు శాపమిస్తున్న శృంగిచేత ఆయన ఇలా అనిపించారు :

సోము హిరణ్యాదానములు పుచ్చుకొనంగ ధనంబు లేమియుం
దేము సపంచనంబులుగ దీవెనలిచ్చుచు వేసరింపగారము (భాగ 1-465)

వస్తుతః పోతరాజుగారికి భోగాలంటే ఇష్టంలేదు. వారి దృష్టిలో కటికనేల కమనీయం. పట్టుబట్టలకన్నా ముతకదుస్తులే వారికి మెత్తగా ఉంటాయి. అందుకే భాగవతంలో ఇలా ఒక పద్యం చెప్పారు (2-21).

కమనీయభూమి భాగములు లేకున్నవే పడియుండుటకు దూదివరపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే భోజన భాజన పుంజమేల?
వల్కలాజినకుశావళులు లేకున్నవే కట్ట దూకూల సంఘాతంబు లేల?
కొనికొని పసియింప గుహలు లేకున్నవే ప్రాసాదసౌధి పటల మేల?

41. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు, పుట 196, 197.

42. సమగ్రఆంధ్రసాహిత్యం, రెడ్డిరాజులయుగం.

ఫలరసాదుల గురియవే పాదపములు - సాధుజలముల నుండవే సకలనదులు?
పొసగ భిక్షము పెట్టరే పుణ్య సతులు - ధనమదాంధుల కొలువేలతాపసులకు?

భాగవతంలో ఎక్కడ పడితే అక్కడ ఇటువంటి భావాలు సాక్షాత్కరించడంవల్ల పోతరాజుగారి పదాలని కొన్ని ప్రక్షిప్తాలను లోకులు నమ్ముతారు. వాటిలో 'ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి' అనే పద్యం గురించి ఇంతకుముందు చెప్పుకొన్నాం. పోతరాజుగారికి సుమారు రెండువందల సంవత్సరాలకు పూర్వమున్న మంచెన తన కేయూరబాహు చరిత్రలో ఈ క్రింది పద్యం వ్రాశాడు.

బాలరసాలపుష్ప[43] నవపల్లవకోమల కావ్యకన్యకన్
గూళల కిచ్చి యప్పడుపుగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి మరి యంతకు నాయలి లేనివాడు గౌ[44]
ద్దాలికులైననేమి నిజదారసుతోదరపోషణార్థమై? (కేయూర. 1-13)

అయితే ఈ పద్యం పోతరాజుగారి చాటువుగా కొద్ది మార్పులతో బహుళ ప్రచారం పొందింది.[45] ఇందులో 'సత్కవులశ్రీ హాలికులైననేమి?'' అనే ప్రశ్న శ్రీనాథుణ్ణి చూసి పోతరాజుగారు వేశారని లోకం చెప్పుకొంటుంది. కమ్మని కావ్యాన్ని ఏ ప్రభువుతో అంకితమిచ్చి వెయ్యినూటపదహార్లు పుచ్చుకోమని సహజపాండిత్య బిరుదాంకితునికి కవిసార్వభౌముడు సలహా ఇచ్చాడనీ, అది విన్నాక పోతరాజుగారు అంత పనీ చేస్తారనీ భయపడి సరస్వతీదేవి కళ్ళనీళ్లు పెట్టుకొందనీ, అప్పుడు ఆయన ఈ పద్యం చెప్పి ఊహించారనీ ఇంకొక కథ.

కాటుకకంటినీరు చనుకట్టుపయిం బడనేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలి కోడల యో మదంబ! యో
హాటకగర్భురాణి! నిను నాకటికింకొనిపోయి యల్ల క
ర్ణాటకిరాటకీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ!

ఆలుబిడ్డలను పోషించుకోడానికి పుస్తకాలు అమ్ముకోనక్కర్లేదనే విశ్వాసం పోతరాజుగారికుందని ఈ చాటువులే చెప్పవలసిన అవసరం లేదు. ఇంతకుముందు గమనించినట్టు భాగవతంలోని పద్యాలెన్నో సాక్ష్యమిస్తాయి. ఉన్న దానితో తృప్తిపడి పోతరాజుగారు కుటుంబాన్ని హాయిగా పోషించుకొన్నారు. ఆయనకు ఎంతమంది సంతానమో నికరంగా తెలియదు. వారి వంశంలోని వారే మనుమలో, మునిమనుమలో వ్రాసిన కృతులలోని పద్యాలవల్ల పోతరాజుగారి వారసుల సంగతి తెలుస్తున్నది.

43. 'సాలసాల' అని పాఠాంతరంలో పోతరాజుగారి చాటువు అని ప్రవాద.
44. 'గహనాంతరసీమల కందమూలగౌద్దాలికు లైననేమి'' అని చాటువులో పాఠాంతరం.
45. 'బాలరసాలసాల' అనే పదప్రయోగం భాగవతం, 3-753లో ఒకసారి

అయితే పరిశోధకులు ఈ పద్యాలను కృతులగద్యలను రకరకాలుగా వ్యాఖ్యానం చేస్తున్నారు. కట్టుకథల ప్రకారం పోతరాజుగారికి మల్లన అనే కుమారుడున్నాడు.[46] వారసుల గ్రంథాల సాక్ష్యంవల్ల ప్రౌఢసరస్వతి అనే బిరుదున్న కుమారుడున్నాడు. ఇతని అసలు పేరు కేసన, పోతరాజుగారు తమ కొడుక్కి తండ్రిపేరు సహజంగా పెట్టుకొని ఉంటారు. అయినా ఈ కేసన పోతరాజుగారి కొడుకు కాడు. మనుమడు అని కొందరంటారు.[47] బమ్మెరవారి వంశంలో మల్ల అనే పేరు పోతరాజుగారికి కొన్ని తరాలు ముందూ, వెనుకా కనబడదు. కుమారునికి ఆ పేరు నెందుకు పెట్టారో!

ఇహలోకంలో పుత్రపౌత్రాభివృద్ధిగా పోతరాజుగారు చల్లగా జీవించినా పరంలో వారు కోరుకున్న వరం ఒక్కటే ఉంది. అది మోక్షం.

పోతరాజుగారు భాగవతం ప్రథమ స్కంధంలో శ్రీకారం చుట్టి కైవల్యం కావాలనుకొన్నారు. 'శ్రీకైవల్యపదంబు జేరుటకునై చింతించెదన్'' అని గ్రంథం ఆరంభించారు.

దశమ స్కంధంలో చిట్టచివర శుకయోగిచేత ఫలశ్రుతి చెప్పిస్తూ, ఈ కృష్ణకథాసుధారసము గ్రోలినవారు 'కాంతురచ్యుతపదంబైనట్టి కైవల్యమున్'' అని ముగించారు (భాగవతం దశమ, 11-1332). వారి ఆకాంక్ష తొలినుంచి చివరిదాకా కైవల్యమే. భాగవతజన్మ వల్ల వారికి పునర్జన్మ లేదని భావించారు.

నిజమే పోతరాజుగారికి పునర్జన్మ లేదు. అసలు మరణిస్తే కదా మళ్లీ పుట్టడం అనే సమస్య వస్తుంది?

తెలుగు సాహిత్యం జీవించి వున్నంతకాలం ఆయన బ్రతికే ఉంటారు.

---

46. అకాడమీవారి భాగవత పీఠిక, పుట 153.

47. ఆంధ్రకవితరంగిణి, చాగంటి శేషయ్య, 11వ సంపుటి, పుటలు 92. పోతరాజుగారు చేశారు.

బొప్పరాజు గంగన్న

మన దేశానికి భారతదేశమనే పేరు రావడానికి కారణభూతుడైన భరతుని కథ భాగవతం పంచమ స్కంధంలో ఉంది. చతుర్థ స్కంధందాకా మహాభాగవతాన్ని అనువదించిన బమ్మెర పోతరాజుగారు ఎందుచేతో ఈ స్కంధాన్నీ, దీని తరువాతి దాన్నీ తెనిగించలేదు. మళ్లా సప్తమస్కందాన్నే అందుకున్నారు. భరతుని కథ ప్రధానంగా ఉన్న ఈ పంచమ స్కంధాన్ని బొప్పరాజు కుమారుడు గంగన్న అనువదించాడు. ఇతని జీవిత విశేషాలేమీ తెలియవు. గద్యంలో సైతం ఇతడు తనను గురించి విపులంగా చెప్పుకోలేదు. ''ఇది శ్రీ సకల సుకవిజనానందకర బొప్పనామాత్యపుత్ర గంగనార్య ప్రణీతంబైన శ్రీమద్భాగవత పురాణంబు నందు'' అని కథల పట్టికే ఇచ్చాడుగాని కనీసం తన గోత్రమైనా చెప్పుకోలేదు.

పంచమ స్కంధాన్ని గంగన్న రెండు ఆశ్వాసాలుగా విభజించాడు. ప్రథమాశ్వాసంలో 183 గద్య పద్యాలున్నాయి. రెండో ఆశ్వాసంలో 166 గద్య పద్యాలున్నాయి. ప్రథమాశ్వాసంలో ఒక ఇరవై కథలు, రెండోదానిలో ఆరు ఉన్నాయి. ద్వితీయాశ్వాసంలో భూగోళ ఖగోళ విషయాలు ఎక్కువ. అందుకే కథలు తక్కువ. ప్రథమాశ్వాసంలో లెక్కకు ఇరవై కథలు గద్యంలో చెప్పినా అంతా ఒక రాజవంశ చరిత్ర. మనుపుత్రుడైన ప్రియవ్రతుడు రాత్రులన్నీ దినాలు చేస్తానని ఏడురోజులు రెండో సూర్యునిలాగ రథం నడిపాడట. ఆ రథనేమి మార్గాలు సప్తసముద్రాలూ, సప్తద్వీపాలూ అయ్యాయట (5-1-18). ఇతనికి ఆగ్నీధ్రుడు మొదలైన ఏడుగురు కుమారులు పుట్టారు. ఒక్కొక్కనికి ఒక ద్వీపం ఇచ్చి ప్రియవ్రతుడు 'నారద పదవికి' వెళ్లిపోయాడు.

ఆ తరువాత ఆగ్నీధ్రుడు రాజయ్యాడు. అతడు పుత్రకాముడై బ్రహ్మను అర్థించాడు. తన సమ్ముఖంలో సంగీతం చేసే 'పూర్వచిత్తి' అనే అప్సరసను బ్రహ్మ ప్రసాదించాడు. ఆ యువతిని చూసి ఆగ్నీధ్రుడు ''నాతోడంగూడి తపంబు సేయుము, సంసారంబు వృద్ధిపొందసేయుము'' అన్నాడు. వారిద్దరికీ తొమ్మండుగురు కుమారులు పుట్టారు. అందులో నాభి పెద్దవాడు. ఇతనికి వాసుదేవుడు ప్రత్యక్షమై ''నీకు కుమారుణ్ణి నయి జన్మిస్తా''ననే వరం ఇచ్చాడు. ఆమాట మేరకు ఋషభావతారం ఎత్తాడు. ఋషభునికే భరతుడు మొదలైన నూరుగురు కుమారులు పుట్టారు.

ఋషభుని తరువాత భరతుడు రాజయ్యాడు. ఈ సంగతులను కవి ఇలాగ చెప్పాడు:

భరతు డాదిగ సుతుల నూర్వురను గాంచె,
నట్టి భరతుని పేరను నవనితలము
పురవరాశ్రమ గిరితరుపూర్ణ మగుచు
నమరి భారతవర్ష నామమున మించె (భాగవతం, 5-1-63)

ఈ భరతుడే సుప్రసిద్ధుడైన జడభరతుడయ్యాడు. తపస్సు చేసుకుంటూ ఒక జింకపిల్లను పెంచాడు. దానిమీద మమత చేత తపస్సు చెడింది. పునర్జన్మలో లేడిగా జన్మించాడు. ఆ

తరువాతి జన్మలో విప్రుడై పుట్టి జడుడుగానే జీవించాడు. బలిపశువయ్యాడు. రాజుగారి పల్లకి మోశాడు. ఆయనకు జ్ఞానోపదేశం చేశాడు. ఇది పంచమ స్కంధం ప్రథమాశ్వాసంలోని కథల వరుస.

సూర్యుడు బ్రహ్మాండానికి మధ్యగతుడై ఉంటాడని, ఆ సూర్యుని కిటూ అటూ ఇరవైఐదు కోట్ల యోజనాల అండకటాహం వుంటుందని, సూర్యుని రథం ముహూర్తమాత్రంబున ముప్ఫయినాలుగు లక్షలా ఎనభైనూర్ల యోజనాలు సంచరిస్తుందని ఒకసారీ, ఒక క్షణంలో సూర్యుడు రెండువేలా యాభై యోజనాలు సంచరిస్తాడని ఇంకొకమారూ ఈ ఆశ్వాసం తెలియజేస్తుంది. మన పురాణాలు ఆదిమ విజ్ఞానసర్వస్వాలు. ప్రతిపురాణంలోనూ ఇటువంటి విజ్ఞాన విషయాలు అక్కడక్కడ ఉంటాయి. స్కాందపురాణం, కాశీఖండంలో సూర్యుని రథ వేగం శ్రీనాథుడు తెనిగించాడు.

రెండువేలును నిన్నూట రెండు యోజ
నంబులర్ధనిమేష మాత్రంబునందు
సంబరంబున బారు తీవ్రాంశురథము
నిలచె బహుకాల మిట్టిదే నియతిమహిమ. (కాశీఖండం, 1-135)

ఈ సూర్యరథ వేగాన్ని మన సాహిత్య పరిశోధకులు కొందరు కాంతివేగమని భ్రమించారు.[1] సూర్యుని రథంలో సూర్యుడు ఉంటాడు కనుక సూర్యరథ వేగం కాంతి వేగం కాదని వైజ్ఞానికవేత్త శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు విశదం చేశారు.[2] ''సూర్యుడు సాగే వేగం సెకనుకు సుమారు 18½ మైళ్లు. కాంతివేగం 186000 మైళ్లు. మరి 'తీవ్రాంశురథం' అనే మాటలు ఏ వేగంతో అన్వయం? సూర్యుణ్ణి రథాన్నీ వెనుకవిడిచి రథాలు పరుగెత్తిపోయినవన్న అర్థం కాదుగదా? ఇది కుదరదే?'' అని గోపాలకృష్ణమూర్తిగారు సందేహించారు. మన ప్రాచీన గ్రంథాలలోని వైజ్ఞానిక విషయాలను సమర్థులు శాస్త్రీయ పద్ధతులలో బాగా తరచి నిగ్గుతీయడం చాలా అవసరం.

ఈ పంచమ స్కంధంలో ఏ కవికైనా తన కావ్యకళను చూపించే అవకాశాలు తక్కువ. వచ్చిన సందర్భాలలో బొప్పరాజు గంగన్న యథాశక్తి తన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. అది ఇతర భాగవత రచయితల సామర్థ్యం ముందు తీసికట్టే. బ్రహ్మ పంపిస్తే తనముందుకొచ్చిన పూర్వచిత్తిని చూసి ఆగ్నీధ్రుడు వేసిన ప్రశ్నలను గంగన్న 14 గద్య పద్యాలలో చెప్పాడు. ఒకటి రెండు చూద్దాం.

సతి! నీ వెవ్వతె? వీ ప -ర్వతమున కేమైన గోరి వచ్చిన వనదే
వతవో? శారదవో రతి - పతిపంపిన మాయవో? తపస్సారమవో?
(భాగవతం. 5-1-27)

---

1. 'అల్లసానివాని అల్లికబిగిబిగి' అనే కావ్యంలో నిడుదవోలు వెంకటరావుగారు, భారతి- బే, 1964.
2. కలగూరగంప, భారతి - నవంబరు, 1964.

ఈ పద్యాన్ని పేర్కొని కురుగంటి సీతారామయ్యగారు ఆక్షేపించారు. మన్మథ పరవశుడవై నీవు శారదవో అని సరస్వతినిగా పలుకుట యశ్లీల ద్యోతకముగా నున్నది అని వారన్న మాటలు ప్రస్తుత కాలంలో నిజమే.[3] అయితే ఒక సంగతి మరచిపోకూడదు. తన వద్దకు బ్రహ్మ ప్రసాదించితే వచ్చిన పూర్వచిత్తి అనే అప్సరసతో అతడు ''నాతోడంగూడి తపంబుచేయుము'' అని చెప్పాడు. ఆ ఆదిమకాలంలో ''సంసారంబు వృద్ధిసేయుట'' ఒక రకమైన తపస్సే. అందుకే శారదలాగ కనుపించిన అప్సరసను 'తపస్సారమవో?' అని ప్రశ్నించాడు. ఆమె కురులనుండి రాలే పుష్పాల వర్ణన ఇలా తెనిగించాడు.

చెదరగ వేదముల్ చదువు శిష్యులపై దగ పుష్పవృష్టి స
మ్మదమున నంతలో గురియు మాడ్కిని మన్మథసామ గానముల్
చదివెడు శిష్యులో యనగ షట్పద పంక్తులు చేరి మ్రోయగా
బదపడి మీద రాలు గచభారమునందుల జారు క్రొవ్విరుల్. (భాగవతం. 5-1-30)

ఇటువంటి శృంగార ఘట్టాలలో కవులు విజృంభిస్తారు. 14 గద్య పద్యాలను వ్రాసిన గంగన్న రక్తికట్టించలేకపోయాడు. కరుణరసం చిప్పిల్లే ఘట్టంలో ఎలా వ్రాశాడో చూద్దాం.

వ. అంత నాభరతుం డొక్కనా డా మహానదిం గృతాభిషేకుండై ముహూర్తత్రయం బంతర్జలంబులందు బ్రణవోచ్చారణంబు సేయుచుండు సమయంబున నిర్భర గర్భిణియగు హరిణి జలార్థినియై యొంటి జలాశయ సమీపంబునకు వచ్చి జలపానంబు సేయునెడ నా సమీపంబున మృగపతి గర్జించి (లోకభయంకరంబుగ) నాదంబుసేయ హరిణి స్వభావంబున భీత యగుటంజేసి బెగ్గడిలి (హరవిలోకన వా లచిత్తయై) దిగ్గన నదరి గగనంబునకు నెగిరి యవగతతృషయగుచు నది నుల్లంఘించు నెడ నధికభయంబునంజేసి యా గర్భంబు యోనిద్వారంబున గళితంబైజలంబులం బడియె. (ఆ హరిణి యుల్లంఘునాది భయంబునంజేసి) తత్తీరంబుననుండు (గిరిదరిం) బడి శరీరంబు బాసె. అంత నాహరిణ పోతంబుజలంబుల దేలుచున్న భరతుండు గనువిచ్చి చూచి కరుణార్ద్ర చిత్తుండై (మృత జనని)యగు హరిణపోతంబును దన యాశ్రమంబునకు గొనిపోయి...

(భాగవతం. 5-1-101)

ఇంకొక కవి అయితే ఘట్టంలో గుండెలు కరిగించే పద్యాలు వ్రాసేవాడు. బొప్పరాజు గంగన్న నిస్సారమైన వచనం వ్రాశాడు. ఎంత చెడ్డా మంచి రసవంతమైన ఘట్టం కనుక జింకపిల్ల భరతునితో ఎలా ఆడుకొనేదో ఒక పద్యంలో వర్ణించకపోలేదు.

గురువులువారి బిట్టురికి కొమ్ముల జిమ్ముచు నంతనంత ద
గ్గరుచును గాలుద్రవ్వుచు నఖంబుల గీరుచు గాసిసేయుచు
న్నొరుగుచు ధారణీశ్వరుని యూరుపులన్ శయనించి యంతలో
నరకడ మెక్కుచుం బొదలి యాడుచు నాహరిణంబు లీలతోన్.

(భాగవతం, 5-1-106)

3. 'ఆంధ్ర మహాభాగవతోపన్యాసములు' పుట 38.

ఇటువంటి జింకపిల్ల ఒకనాడు పారిపోయింది. దానిమీద ఎంతో మమత పెంచుకున్న భరతుడు ఎలా బాధపడ్డాడో, ఏ విషయాలు తలచుకొన్నాడో గంగన్న ఒక వచనం వ్రాశాడు. చూడండి.

వ. ఇట్లు భరతుడు హరిణకుణక క్షేమంబు గోరుచు నెప్పుడు వచ్చి నన్ను సంతోషపరచు? నానా ప్రకారంబులైన తన గతుల చేత నెప్పుడానంద మొందించు? ధ్యానసమాధి నున్నప్పుడు నన్నుం గొమ్ముల గోకుచునుండునట్టి వినోదంబు లెప్పుడు గనుగొందు? దేవపూజా ద్రవ్యంబులు ద్రొక్కి మూర్కొనినం గోపించి చూచినం గుమారుండువోలె దూరంబునకు జని నిలచిన మరల నేబిలచిన వెనుక నిలచియుండు నిట్టి మెలుకువ స్వభావంబు గలుగుట యెట్టు? లీ భూదేవి ఎంత తపంబు జేసినదియో? ఏ హరిణ పాదస్పర్శంబున బవిత్రంబైన భూమి స్వర్గా(పవర్గ)కాములైన మునులకు యజ్ఞార్హమైనట్టి హరిణపోతంబునెట్లు కనుగొందు? అదియునుంగాక భగవంతుండగు చంద్రుండు మృగపతి భయంబున మృతజననియు స్వాశ్రమ పరిభ్రష్టంబు నైన మృగశాబకంబును గొనిపోయి పెంచుచున్నవాడో? మున్ను పుత్రవియోగతాపంబును జంద్రకిరణంబులంబాపుడు ఇపుడు హరిణపోతంబు తన శరీరస్పర్శంజేసి చంద్ర కిరణంబులకన్న నధికం బగుచు బుత్రవియోగతాపంబు నివర్తింపజేసి... (భాగవతం, 5-1-112)

కనీసం ఈ భావాలను పద్యాలలో పొదిగితే మంచి కవిత్వం అయేది. కాని గంగన్న ఈ అవకాశాన్ని వినియోగించుకోలేదు. పెంపుడు జంతువులపైన ప్రేమ కూడదని బోధించే ఘట్టంలో ఇంతకన్నా శిల్పం కూడదనుకొన్నాడు కాబోలు! ఏమైనా ఇది సహృదయులకు ఆనందం ఇవ్వదు.

కొంచెం ఉదార దృక్పథంతో చూసేవాళ్ళకు గంగన్న రచన మెరుగుగానే కనబడుతుంది. ''పోతన కవిత్వమువలె నుండకపోయినను, సింగన నారయల కవిత్వమునకు దీసిపోదనియు, సింగన కవిత్వము కంటె నొక్కింత యిదియే వాసిగాంచుననియు'' చాగంటి శేషయ్యగారు అభిప్రాయపడుతున్నారు.[4] దీనికి ఒక కారణం లేకపోలేదు. గంగన్న కవిత్వంలో చాలాచోట్ల పోతరాజుగారిని అనుసరించాలనే తాపత్రయం కొంత ఫలప్రదం కావడమే. ఇందువల్ల ''పంచమస్కంధమును బొత్తిగ రచించినట్లు గంగనార్యుడు గద్యంలో వ్రాసికొనియున్నను నీస్కంధమున బోతనామాత్యుని కవిత చాలా బాగుగా నున్నదని కూడా శేషయ్యగారు పొరబడుతున్నారు.[5]

పోతరాజుగారు పంచమ, షష్ఠ స్కంధాల జోలికి మొదట్లోనే వెళ్ళదలుచుకోలేదేమో అనిపిస్తుంది. పంచమస్కంధం చాలావరకు జైనపురాణ గాథలకు వైష్ణవత్వపు రంగు పూయడమే. భగవంతుడగు నారాయణుడు ఋషభావతారం ఎత్తాడు. యజ్ఞ సంస్కృతిని తిరస్కరించడం, తనకు ''బహువిధద్రవ్యసంపాదనంబు గలిగి, విభవ

4. ఆంధ్రకవితరంగిణి – 6వ సంపుటం – పుట 211.
5. అదే పుస్తకంలో – పుట 212.

యుక్తంబులైన యశ్వమేధాదులు తృప్తికరం కావనడం, దిగంబరుడై, ఉన్మత్తకారుడై 'దక్షిణ కర్ణాటదేశంలో అర్హనామకుడు అవడం మొదలైన కథలు జైనతీర్థంకరులలో మొదటివాడైన ఋషభనాథుని జీవిత చరిత్రకే మారువేషం వేయడం ఆదిలోనే ఉంది. ఆ ఋషభనాథుని కుమార భరతుని కథ, ఆ భరతుని కుమారుడైన సుమతి పాషండమతాన్ని ఆదరించడం కూడా విపులంగా ఉంది. పాషండులు అతణ్ణి చూసి ఇలా అన్నారట.

ధరణీవల్లభ! నిన్నును
నిరతమును బుద్ధ దేవునిం గొలిచిన యా
తెరగున గొలిచెదమని భా
సురమతి బోధించి రపుడు సుమతింబ్రీతిన్. (భాగ. 5-2-5)

ఇక్కడ పాషండులు బోధించిన తమ దర్శనాన్ని గంగన్న దాటేశాడు. పంచమ స్కంధాన్ని కథను చేస్తున్న శుకయోగీప్రహ్లాద చరిత్రం వగైరాలు వక్ష్యమాణగ్రంథంబున విస్తరించుతానని వాయిదా వేశాడు (5-2-114). భాగవతాన్ని ఎన్నోసార్లు పారాయణం చేసిన పోతరాజుగారు అందుకే సప్తమ స్కంధంలోని విస్తరమైన ప్రహ్లాద చరిత్రను చెప్పడానికే ఉవ్విళ్లూరినట్లు భావించడంలో తప్పులేదు. దశమస్కంధ రచన దాకా తమ ఆంధ్రీకరణను కొనసాగించి ఉంటారు. ''గోపికాజనమనోజాతుండైన కృష్ణుండు లీలామానుష విగ్రహుండై నిజరాజధానియైన ద్వారకాపురంబున నమానుష విభవంబులగు సౌఖ్యంబులను బొదలుచుండెను'' (మ - ఉత్తర 1331) అని రాశాక యాదవ కులంలో ముసలం పుట్టడం రాయడానికి పోతరాజుగారికి మనస్కరించలేదేమో. ఏకాదశ, ద్వాదశ స్కంధాలను వదలిపెట్టినట్లే మధ్యలో వాయిదా వేసిన పంచమ, షష్ఠస్కంధాలను శాశ్వతంగా వాయిదా వేశారు కాబోలు.

అయితే తెలుగువారి విశ్వాసం ప్రకారం భాగవతం పూర్తిగా పోతరాజుగారి రచనే. అందుకే దేశంలోని చాలా ప్రతులలో అన్ని స్కంధాలలోనూ వారి గద్యనే లేఖకులు రాసుకొన్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి 'బహుపాఠాంతర పరిష్కార విపులపీఠికా సహిత' ప్రచురణలో తాము దేశం మొత్తంమీద 257 ప్రతులను సంపాదించి పరిశీలించినట్టు చెప్పారు. చాలా ప్రతులలో పంచమ, షష్ఠ, ఏకాదశ, ద్వాదశ స్కంధాలలో పోతరాజుగారి గద్య కనబడుతోందట. ఇది లేఖకుల భక్తిప్రపత్తులకేగాని శ్రద్ధకు నిదర్శనం కాదు.

గంగన తన గద్యంలో 'సకల సుకవి జనానందకర' అనే విశేషణాన్ని వాడుకొన్నాడుగాని ఒకందుకే సుకవిజనులు ఆనందిస్తారు. అది గంగయ్య అనువదించడం వల్ల పోతరాజుగారి భాగవతంలో పంచమస్కంధం ఎలాగో ఒకలాగ పూర్తయిందన్న సంతోషమేగాని ఇంకేమీ కాదు.

ఏర్చూరి సింగన్న

భాగవతంలో షష్ఠస్కంధాన్ని బమ్మెర పోతరాజుగారు ఎందుచేతనో అనువదించలేదు. వారు విడిచిపెట్టిన ఈ స్కంధాన్ని ఎందరో అనువదించారుగాని ఒక్క ఏర్చూరి సింగన అనువదించిన భాగాన్నే పోతరాజుగారి రచనలతో జోడించి ఆది నుంచి ఆంధ్రులు అతణ్ణి గౌరవిస్తున్నారు. దీనికి కారణం అతని తెనిగింపు పోతరాజుగారి అడుగుజాడలలోనే నడిచింది. అతని రచనాశిల్పం వారి వరవళ్ళనే దిద్దుకొంది. కొన్ని కొన్ని చోట్ల పోతరాజుగారే ఈ పద్యాలు వ్రాశారా అన్నంత చక్కగా సింగన్న గ్రంథాన్ని నడిపిస్తాడు. సొగసులు చూపిస్తాడు. పారవశ్యం కలిగిస్తాడు. సహృదయులను మెప్పిస్తాడు.

ఈ మెప్పించే విద్య సింగన్నకు విద్యాభ్యాసం చేస్తున్న రోజులనుంచి అలవడ్డదే. చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడో, నూనూగు మీసాల నూత్నయౌవనమందో, సింగన్న మృదుశయ్యమీద నిద్రపోతున్నప్పుడు శారద కలలో సాక్షాత్కరించిందట. ఎలా దర్శనమిచ్చిందో సింగన్న ఈ పద్యంలో వర్ణించాడు.

> ఉరవడి ప్రాగ్వీథి నుదయించు మార్తాండకోటిబింబచ్ఛాయ గూడినట్లు
> హరిహరబ్రహ్మల యాత్మలలో నుబ్బి కరుణ యొక్కట మూర్తి బెరసినట్లు
> ఖరకరకరతీవ్రగతిని గరంగుచు హేమాద్రి సొగపెల్లగసినట్లు
> ఫణిరాజఫణిరాజిమణిగణవిస్ఫూర్తిశిరంబు వెలి దల చూపినట్లు
> ఉట్టి పడ్డట్లు కట్టెఱ్ఱ నాదినట్లు - తేజమొసగంగ నామ్రోల దివ్యవాణి
> పూని సాక్షాత్కరించి సంపూర్ణదృష్టి - జూచి ఇట్లని పలికె మంజులముగను.
>
> (భాగవతం, 6-17)

'విద్యాభ్యాసంబునం దలిగి కొండుక'గా ఉన్న సింగన్న అప్పటికే సంగీత సాహిత్యాలలోనూ, రకరకాల సాములలోనూ గడితేరాడు. ఇంక ఈ చిన్నవాడు కవిత్వం చెప్పడం మంచిదని ఆమె తలచి ఆనతిచ్చిందట.

> ఆటలుపాటలుం జదువు లద్భుతముల్ వినవొప్పు వాదయముల్
> సాటిదలంపరాని బలుసాములు మున్నగు విద్యార్థులెల్ల నీ
> కాటలు పాటలయ్యె విను మిన్నిటికిన్ మెరుగిడ్డ భంగి నా
> చాటున జాటుకారపదసాధుకవిత్వము జెప్పు మింపుగన్. (భాగవతం, 6-18)

అమ్మవారు కలలో అలా చెప్పీచెప్పగానే ఆమె యొక్క కృపాలోకాన సుశ్లోకుడై సింగన వెంటనే ఒక శ్లోకం చెప్పాడు (భాగవతం, 6-20). దాన్ని అమ్మవారు మెచ్చుకొంది. తరువాత సింగన్న మేలుకొన్నాడు. ఆనాటినుంచి అతనికి కవిత్వ తత్వజ్ఞానం గోచర మయిందట. సింగన చేసిన ఈ కథనంవల్ల చిన్నప్పటినుంచీ అతడు ఉభయభాషా కావ్యాలను గట్టిగా చదువుకున్నాడనీ, స్వప్నంలో సాక్షాత్కరించిన సరస్వతి తనను

దీవించగలదన్న ఆత్మవిశ్వాసం, దీవించాలనే అభిలాష కలవాడనీ చెప్పవచ్చు. ఆధునిక మనస్తత్వశాస్త్రరీత్యా మానవులు తమ చిరవాంఛలు కలల్లో తీర్చుకుంటారన్న సంగతి స్పష్టం. అయితే పుట్టిబుద్ధెరిగినది మొదలు విద్యలన్నీ ఆటపాటలు చేసుకున్నవాడు అలా అభిలషించడం నైజం.

సింగన్న ఏర్చూరు గ్రామంలో పుట్టాడు. అది నల్లగొండ జిల్లాలో ఉంది. వాళ్ళ తాతముత్తాతలలో ఒక ఎఱ్ఱాప్రెగ్గడ ఆ గ్రామానికి శాసకుడు. ఈ ఎఱ్ఱాప్రెగ్గడా, కవిత్రయంలోని ఎఱ్ఱనగారూ విభిన్నులు. పేరూ, గోత్రం (శ్రీవత్స) ఒకటేగాని వ్యక్తులు వేరువేరు. ఈ వంశంలో కసువన్న అనే మంత్రి పుట్టాడు. అతడు శివభక్తుడు. అందుకే అతని కుమారుడు సింగన్న కూడా శివపూజలో తనరినవాడే. అయితే వివిధ గ్రంథాలు చదవడంవల్ల విశాల దృక్పథం అలవరచుకున్నాడు. అతడు 'విష్ణుచరితామృతనిష్యందిపటు వాగ్విలాసా నందోచితమానసుడు' (భాగవతం, 6-30). తెలుగు కవులలో కవిత్రయం వారినీ, భాస్కరుడు, నాచన సోముడు, శ్రీనాథుడు మొదలైనవారిని అభిమానించి సింగన్న నమస్కరిస్తాడు. శ్రీనాథుణ్ణి అతడు 'కవిమనోనాథు'డని పేర్కొన్నాడు. అయితే అతని దృష్టిలో కవి పట్టపురాజు బమ్మెర పోతరాజుగారే. ఆ సంగతిని కృత్యాదిని పూర్వకవులను స్తుతిస్తున్నప్పుడు ప్రత్యేకంగా ఒక పద్యంలో చెప్పాడు.

ఎమ్మెలు సెప్పనేల? జగమెన్నగ పన్నగరాజశాయికిన్
సొమ్ముగ వాక్యసంపదలు సూరలు చేసినవాని భక్తితో
నమ్మినవాని భాగవత నైష్ఠికుడై తగువాని బేర్మితో
బమ్మెర పోతరాజు కవిపట్టపురాజు దలంచి మ్రొక్కెదన్. (భాగవతం, 6-12)

పోతరాజుగారంటే ఇంత భక్తి కనుకనే, వారు విడిచిన షష్ఠస్కంధాన్ని తెనిగించడానికి సింగన్న పూనుకొన్నాడు. 'విబుధవరులవల్ల విన్నంత కన్నంత' తేటపరుస్తామని పోతరాజుగారు అన్నట్టే సింగన్న కూడా ఉపక్రమించాడు.

భాగవతం తేటపరుప నెవ్వడు సాలు - శుకుడుదక్క నరుని సకుడుదక్క?
బుద్ధి తోచినంత బుధులనే విన్నంత - భక్తి నిగిడినంత పలుకువాడ
(భాగవతం, 6-23)

స్కంధాంతంలో సింగన్న వ్రాసుకొన్న గద్య ప్రకారం ఈ స్కంధంలో నలభై కథలున్నాయి. వీటిలో మొట్టమొదట ఉన్న అజామిళోపాఖ్యానం, చిట్టచివరనున్న చిత్రకేతూపాఖ్యానం సింగన్న చాలా రసవత్తరంగా వ్రాశాడు. ఇవి ఇంత హృద్యంగా ఉండడంవల్ల ఇవి పోతరాజుగారు వ్రాసినవనే పండితులు నమ్ముతున్నారు.[1] అయితే పోతరాజుగారిపైనున్న గౌరవాభిమానాల కొద్దీ సింగన్నను కించపరచనక్కరలేదు. అతడు చాలా సమర్థుడు. పోతరాజుగారి శిల్పాన్ని పుణికిపుచ్చుకొన్న సత్యాన్ని మంగళాచరణంనుంచి

1. భాగవతం (వావిళ్ళ ప్రచురణ) పీఠిక - శేషాద్రిరమణకవులు, పుట 71. వీరి అభిప్రాయంతో కురుగంటి సీతారామయ్యగారు ఏకీభవించారు. చూ. ఆంధ్ర భాగవతోపన్యాసములు, పుటలు 43-44.

షష్ఠ్యంతాలదాకా ఉన్న 36 గద్య పద్యాలలో నిరూపించాడు. పై రెండు ఉపాఖ్యానాలలో పోతరాజుగారు అభిమానించే అంత్యనియమాలు, సాంస్కృతిక దీర్ఘసమాసాలు, సీసపద్యనియతులు ఉండడంవల్ల పండితులు అలా భావించారు. కాని మొదటి ముప్ఫయిఆరు గద్య పద్యాలలో ఈ విషయాలు సింగన్న పోతరాజుగారి ఒరవడిలో ఎలా వ్రాసినది చూద్దాం.

కాళికి బహుసన్నుతలో - కాళికి కమనీయవలయ కరకీలితకం
కాళికి తాపసమానస - కేళికి వందనము సేసి కీర్తింతు మదిన్. (భాగవతం, 6-7)

ఇది పోతరాజుగారే వ్రాశారా అన్నంత చక్కగా ఉంది. పోతరాజుగారు తమ తల్లిని ప్రస్తుతిస్తూ భాగవతంలో ఇలా వ్రాశారు:

మానిను లీడుగారు బహుమాన నివారిత దీనమానస
గ్లానికి దానధర్మ మతిగౌరవ మంజులతా గభీరతా
స్థానానికి ముద్దసానికి సదాశివపాదయుగార్చనానుకం
పానయ వాగ్భవానికిని బమ్మెర కేసయఅక్క పానికిన్. (భాగవతం, 1-24)

ఇదే ఒరవడిలో సింగన్న కూడా తన తల్లిని కీర్తించాడు.

ఆడదు భర్తమాట కెదురాడదు వచ్చినవారి వీడగా
నాడదు పెక్కుభాష లెడనాడదు వాకిలి వెళ్లి కల్లమా
టాడదు మిన్న కేని సుగణావళి కిందరగాక సాటి యే
చేడియ? యేరి చూరికుల శేఖరు కన్వయముమ్మడమ్మకున్. (భాగవతం, 6-27)

తన తల్లి అంటే ఎంత భక్తో పోతరాజుగారి కవిత్వం మీద కూడ భక్తి సింగన్నకు వుంది. నిజంగా అజామిళోపాఖ్యానం, చిత్రకేతూపాఖ్యానం పోతరాజుగారు వ్రాసిఉంటే ఆ సంగతి కృత్యాదిని 'ఎమ్మెలుసెప్పనేల?' పద్యం తరువాతనో, ఎక్కడో చెప్పి మిగతాది తాను పూర్తిచేస్తున్నట్టు సింగన్న వ్రాసిఉండేవాడే.

అవసానకాలంలో కన్నకొడుకును 'నారాయణా' అని పిలిచినంతమాత్రాన మోక్షం పొందిన పరమ పాపాత్ముని కథ అజామిళోపాఖ్యానం. ఇది సుప్రసిద్ధం. అజామిళుడు సదాచార సంపన్నమైన కుటుంబంలో పుట్టిన బ్రాహ్మణుడు. అతడు మొదట 'మంచి గుణములు తనయందు మరపినాడు'. అయితే ఉద్రేకమదం పుట్టించే యౌవనం అతనిలో అంకురించింది. మన తెలుగు కవులు ఎంతసేపూ ఆడపిల్లలకు యౌవనం రావడమే వర్ణిస్తారుగాని సింగన్నలాగ తుమ్మెద పంక్తుల్లాగ మీసకట్టు వస్తున్న చిన్నవాడి అందాన్ని వర్ణించినవాళ్లు అరుదు. చూడండి. అజామిళునికి యుక్తవయసు ఎలా వచ్చిందో.

కడకంట యౌవనగర్వంబు వొడగట్టె మదిలోని సుద్రేవమదముదొట్టె
కడుమేన గామవికారంబు దలసూపె ముఖమున చిరునవ్వు మొలకలెత్తె

నతివృష్టి నిష్ఠురంబయ్యె దేహంబెల్ల గచభారమున నెరికప్పు మెరసె
కటిభారమున నూరుకాండముల్ జిగిమీరె బాహుశాఖలు దీర్ఘభంగితోచె
నురము విపులమయ్యె నుల్లసద్వరకాంతి - పూరమంగకమున పొందువడియె
భూరితేజుడైన భూసురాన్వయమునకు - నభినవైకయౌవనాగమమున.

(భాగవతం, 6-90)

ఈ కుర్రవాడు ఒకనాడు పువ్వులూ పండ్లూ తేవడానికి, నాన్నగారి అనుమతితో పూదోటకు వెళ్లాడు. అక్కడ ఒక పొదరింట చీకటితప్పు చేస్తున్న విటీవిటులను చూశాడు. వాళ్లీ లోకంలో లేరు. ఈ అబ్బాయిని గమనించనేలేదు. అజామిళుడు చూసిన దృశ్యాన్ని సింగన్న 7 పద్యాలలో వర్ణించాడు. ఆ సానికూతురు పురుషాయితం చేయడం కూడా అజామిళుడు చూశాడు.

కురులలికంబుపై నెగయ క్రొమ్ముడి వీడగ గుబ్బదోయిపై
సరములు చౌకళింప గటి సంగతి మేఖల తాళగింప స
త్కర వరకంకణావళులు గర్జిల గౌ నసియాడ మీదుగా
మరుని వినోదముల్ సలిపె మానిని యౌవన గర్వరేఖతోన్. (భాగవతం, 6-100)

ఈ దృశ్యం చూడగానే అజామిళుని 'మనోగహనమందు మరుండు పావకు కైవడి' చలించాడు. తత్ఫలితంగా వేశ్యాలోలుడయ్యాడు.

ఆలీలావతి గండపాళికలపై హాసప్రసాదంబుపై
నాలోలాలక పంక్తిపైనొసలిపై నాకర్ణదృగ్భ్రూతిపై
హేలపాది కుచద్వయోరు కటిపై నిచ్చల్ పిసాళింపగా
జాలిం బొందుచు నాత్మ గుందుచు మనోజాతవలోపేతుడై. (భాగవతం, 6-108)

సింగన్న ఈ పద్యంలో పోతరాజుగారిని అనుసరించాడు. 'ఆదిన్ శ్రీసతికొప్పుపై తనువుపై అంసోత్తరీయంబుపై' అనే పద్యం పోతరాజుగారు వామనావతారంలో వ్రాశారు (భాగవతం, 8-591). ఆ పద్యానికి పై సింగనపద్యం అనుసరణ, అజామిళుడు ఇంకా ఇంకా ఎలా చెడిపోయాడో సింగన మరీ వివరంగా వర్ణించాడు.

సముచిత శ్రుతిచర్చ చర్చింపనొల్లక సతికుచద్వయచర్చ చర్చసేయు
దర్కకర్కశపాఠతర్కంబు కాదని కలికితో ప్రణయతర్కంబుసేయు
స్మృతిపదవాక్యసంగతిగాక తత్సతిపదవాక్యసంగతి బరగజేయు
నాటకాలంకారనైపుణ్యం బుడిగి తన్నాటకాలంకారపాటి దిరుగు
బరగ చిరకాల మీరీతి బాపనియతి
రమణ దాసీకుటుంబ భారము వహించి
యది కుటుంబిని గాగ బాపాత్ము డగుచు
నసుచియును దుష్టవర్తనుండై మెలంగె. (భాగవతం, 6-107)

ఇంతకూ అజామిళునికి పెళ్లి కాలేదా, భార్య అందకత్తె కాదా అంటే ఆమె కులస్త్రీలలామ, కుసుమాస్త్రఖేలనకామ' (భాగవతం, 6-105). అయినా, అజామిళుడు వేశ్యా వ్యామోహంలోపడి దారులు కూడా కొట్టాడు.

బంధుల దిట్టి సజ్జనుల బాధలుబెట్టి యనాథకోటి బెన్
బందెలునుట్టి యీరములు పట్టి పథంబులు గొట్టి దిట్టయై
నిందలకోర్చి సాధుకులనిందితుడై గడియించు విత్తమీ
సుందరి కిచ్చి మచ్చికలు సొంపెనగూర్చి వసించె దత్కృపన్. (భాగవతం, 6-106)

శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యంలో సుకుమారుడు కూడా దారులుకొడతాడు. ఈ అజామిళోపాఖ్యానం శ్రీనాథుని రచనలు చదివాక వ్రాయడంవల్ల ఇంత శృంగారభరిత మయింది. ఈ అజామిళోపాఖ్యానంలోనే కాక ఇతరత్రా కూడా 'కవిమనోనాథు'డైన శ్రీనాథుని అనుసరించాడు. కశ్యపుని భార్యల సంగతి, వాళ్ళ సంవాదం గురించి చెప్తాను విను అని పరీక్షిత్తుతో శుకయోగి చెప్పే సర్వసాధారణ విషయాన్ని సింగన్న శ్రీనాథుని చలువవల్లనే ఇలా వ్రాశాడు.

కామితప్రదుడైన కశ్యపు కౌగిట ముచ్చట దీర్తు రే ముద్దరాండ్రు
అఖిలలోకములకు నవ్వులై జగమెల్ల బూజింప నుందు రే పూవుబోండ్లు
బలియులై పుత్రులు బౌత్రులు త్రిజగంబు లేలంగ జూతు రేయిందుముఖులు
ముంగొంగుపసిడియై మూల్గుపుణ్యంబుల విర్రవీగుదు రెట్టివింతరాండ్రు
వారి కలగంపకడుపుల నేరుపరుప
నరిది బిడ్డల బడసిన బిరుదుసతుల
నామములు నన్వయంబులు నీమనంబు
పూనజెప్పుదు వినవయ్య మానవేంద్ర! (భాగవతం, 6-255)

ఈ ఇల్లాళ్ళకు పుట్టిన దేవదానవులు పరస్పరం చేసుకొన్న యుద్ధాలను వర్ణించే ఘట్టంలో సింగన నాచన సోముణ్ణి చక్కగా అనుసరించాడు.

... నుదురు వెడలించియు, మెదళ్లు గెడలించియు, నడుములు ద్రుంచియు, నాసికలు ద్రెంచియు, పదంబులు విరిచియు, బార్శ్వంబులం జెరచియు...

అని సింగన్న వ్రాయడానికి నాచన సోముడు నరకాసురఘట్టంలో చేసిన శ్రీకృష్ణుని యుద్ధవర్ణన ఒరవడి, (ఉ. హరివంశం - 1-148)

యుద్ధవర్ణనలో నాచన సోముని పదాల పంథాలలో నడచినా, పాత్రపోషణలో, వాళ్ల సంభాషణలు నడిపించడంలో సింగన, తిక్కన సోమయాజిగారినే అనుసరిస్తాడు చూడండి. ఇంద్రునితో వృత్రాసురుడు అనే మాటలు -

దీకొని నే డిచట దిక్కని వచ్చినవారు కల్గిరే
నేకమతిం బిశాచముల కెల్లను తృప్తిగ మన్నిశాతశూ

లైక మహాగ్నీ కీలల ననేకవిధంబుల సోమయాజినై
మేకలజేసి వేల్చెద నమేయ మదోద్ధతి వ్రాలియియ్యనిన్. (భాగవతం, 6-395)

మాటలు ఇంత పరుషంగా ఉన్నా వృత్రాసురుడు చాలా పెద్దమనిషి. 'యుద్ధధర్మ మెరిగియున్న శత్రుని జూచి సిగ్గుతోడ వజ్రిశిరము వంచె' (6-411). అసలు వృత్రాసురుడు భగవద్భక్తుడు, విష్ణువు చేతిలో మోక్షంకోరి యుద్ధానికి దిగాడు. ఇలా ఆక్రోశించాడు.

ఆకలిగొన్న క్రేవులు రయంబున నీకలురాని పక్షులుం
దీకొని తల్లికిన్ మరి విదేశగతుండగు భర్త కంగజ
వ్యాకుల చిత్తయైన జవరాలును దత్తరమందుభంగి నో
శ్రీకర పంకజాక్ష నిను జేరగ నామది గోర్కెయుం గదే! (భాగవతం, 6-400)

వృత్రాసురుడిలా భగవత్ప్రార్థన చేయడం వింతగానే ఉంటుంది. అయితే అతడు శాపంవల్ల అలా రాక్షసుడై పుట్టాడు. అతడు పూర్వజన్మలో చిత్రకేతుడనే రాజు. అతనికెందరో భార్యలున్నారు. ఈ సంగతి సింగన ఇలా వర్ణించాడు:

మానితతారుణ్యామదనతురంగులు కందర్పవిజయైకఖడ్గలతలు
మదనసమ్మోహనమంత్రాదిదేవతల్ పంచశిలీముఖు బందెకత్తె
లసమాస్త్రుడఖిలంబు నడకించు బొమ్మలు నాత్మసంభవుని కట్టాయితములు
పుండ్రేక్షుకోదండు భూరితేజంబులు శంబరవిద్వేషి సాయకములు
నాగ బొలుపారు నొకకోటి నళినముఖులు
తనకు బత్నులుగాగ నత్యంతవిమల
కీర్తివైభవసన్మార్గవర్తి యగుచు
జగతి బాలించుచుండె నా జనవిభుండు. (భాగవతం, 6-445)

ఇంతమంది భార్యలున్నా అతనికి సంతానం లేదు. అప్పుడు అంగీరసుడనే ముని వచ్చి పుత్రుణ్ణి ప్రసాదించాడు. చిత్రకేతుని అగ్రమహిషికి ఒక బిడ్డ పుట్టాడు. రాజు కుమారునిమీద మక్కువతో పట్టపురాణి ఇంట్లోనే ఉండిపోసాగాడు. మిగిలిన రాణులను అలక్ష్యం చేశాడు. వాళ్లకు అసూయపుట్టి పట్టపురాణి బిడ్డకు విషం పెట్టి చంపారు. బిడ్డ పోతే తల్లి ఇలా రోదించింది:

కుంకుమరాగరమ్యకుచకుంభములన్ కడు కజ్జలంబుతో
బంకిలమైన బాష్పముల బాల్పడ మజ్జన మాచరింపుచున్
కంకణపాణిపల్లవయుగంబున వక్షము మోదికొంచు నా
పంకరుహాక్షి యేడ్చె బరిభావితిపంచమసుస్వరంబునన్. (భాగవతం, 6-451)

ఈ ఏడుపు పద్యం శ్రీనాథుని పద్యానికి అనుసరణ (కాశీఖండం 5-167). ఇలా పూర్వ కవులను అనుసరించిన మాత్రాన ఏ కవీ స్వతంత్ర రచనలు చేయలేదనుకోకూడదు. ఏర్చూరి సింగన ఒకచోట ఇలా వ్రాశాడు. ''అవిద్వాంసుడైన వాడ నవరతంబు దన్ను

స్వతంత్రునిగా దలంపుచుండు'' (భాగవతం, 6-416). సింగన్న విద్వాంసుడే, భాగవత షష్ఠస్కంధం రచించాక కువలయాశ్వ చరిత్ర అనే ప్రబంధం వ్రాశాడు. ఇది మార్కండేయ పురాణంలోని కథ. కువలాయాశ్వుడు ఒక పందిని వేటాడుతూ పాతాళానికి వెడతాడు. అక్కడ ఒక రాక్షసుని సంహరించి మదాలసను పెళ్లిచేసుకుంటాడు. వాళ్లు సుఖంగా ఉన్నప్పుడు చచ్చిపోయిన రాక్షసుని సోదరుడు పగబట్టి, కువలయాశ్వుడు దూరంగా ఉన్న సమయంలో అతడు చచ్చిపోయాడన్న పుకారు పుట్టిస్తాడు. మదాలస ప్రాణం విడుస్తుంది. ఆమె మరణవార్త విన్నాక కువలయాశ్వుడు విరాగి అవుతాడు. ఆ తరువాత సరస్వతీదేవి దయ వల్ల ఇద్దరూ మళ్లీ కాపురం చేస్తారు.

ఈ కథను తీసుకొని సింగన్న ఎన్ని ఆశ్వాసాల ప్రబంధం వ్రాశాడో తెలియదుగాని, పట్టుమని పన్నెండు పద్యాలు మాత్రమే ఈ కావ్యంలోవి లభిస్తున్నాయి. పెదపాటి జగన్న తన ప్రబంధరత్నాకరంలో ఈ పద్యాలను చేర్చుకున్నాడు. ఈ పన్నెండు పద్యాలలో ఏడు పురవర్ణనలోనివే. వరుసగా చూడండి:

బ్రాహ్మణులు:

ఆది బ్రహ్మముఖాళి చాలక విహారార్థప్రయత్నంబుతో
వేదంబుల్ భువి ధర్మపోషణకునై విఖ్యాతిగా బుట్టెనో
కాదే నిట్టి మహత్వ మన్యుల యెడన్ గానంబునాబొల్తురా
భూదేవోత్తము లప్పురంబున మహాపుణ్యప్రభావంబులన్ (ప్రబంధరత్నావళి, 465)

వైశ్యులు:

శేషఫణులకు మణులైన జేరి యమ్మ
గోరి రత్నాకరంబైన గుత్తగొనగ
జాలి పరవస్తుసంచయమితి నొనరి
పరగుదురు వైశ్యవరు లప్పట్టణమున. (ప్రబంధరత్నావళి, 476)

గృహాలు: ఔన్నత్యం

గోపురగోపురప్రతిమగోపురముల్ చెలువంద నప్పురిన్
మాపులు రేపు లంగనలు మంజులగీతవినోదకృత్యముల్
చూపగ గిన్నరాదు లవి చూచు నెపంబున వచ్చి నేర్తు రా
లాపని శేషనర్తనవిలాసకలాపములన్ ముదంబునన్.
చల్లని పండువెన్నెలల సౌధతలోన్నత హేమవేదులం
దల్లన వల్లభుల్ గదిసినట్టి సుధాకరు జూసి ప్రాణముల్
జల్లన రాహువుం దలచి సయ్యన బావుదు రంకసంగతో
త్పల్లవధూముఖంబులను బొల్పగు కస్తురిపత్ర భంగముల్

ప్రాచీనంబు రత్నకాంతులు లసత్ప్రాకారముల్ హేమముల్
సూచింపన్ ఘనవేది కుట్టిమము లాశుభ్రాంశుకాంతంబులై
యేచోటన్ వరవత్నజాలములచే నింపాలంది సొంపొందుచున్
వాచాగోచరమై గృహంబు లమరున్ వస్తుప్రశస్తోన్నతిన్.

(ప్రబంధరత్నావళి, 467, 468, 473)

పుణ్యకాంతలు:

తమచూపు లొగి బాంధరతులపై బూనిన
భావజు కరవాలభాతు లనగ
తమకురుల్ యువమృగేంద్రములకూ తీర్చిన
మరునసమానంపు టురులనంగ
దమ హాసములు విటోత్కరమనముల బట్టు
వలరాజుపూవుల వల లనంగ
దమ కాంతి పురుషుల దాపంబు నొందించు
రతిరాజు మోహనరస మనంగ
జలజకాహళకదళికా పులినగహన
కోకబిసశంఖచంద్రాళికులము దెగడు
పాదజంఘోరు కటిమధ్యపటుకుచోరు
బాహుగళవక్త్రకచముల పుణ్యసతులు. (ప్రబంధరత్నా. 470)

పుణ్యకాంతలు:

నిరుపమ ధర్మస్థితిచే - వరప్రాతివ్రత్యనిరతివైభవమున న
ప్పురి పుణ్యకాంత లమరిరి - గిరిదత్పురివాణు లెల్లకీర్తిగతులన్

(ప్రబంధరత్నావళి, 472)

ఇటువంటి పురంలో నివసించే కువలయాశ్వుడు పందిని వేటాడడానికి అరణ్యానికి వెళ్ళాడు. అక్కడి శబరకాంతలను సింగన్న ఇలా వర్ణించాడు:

గిటగిటనగు నెన్నడుములు
పుటపుటనగు చన్నుగవలు బున్నమనెలతో
చిటచిటలాడెడు ముఖములు
గటితలముల యొప్పు శబరకాంతల కొప్పుల్ (ప్రబంధ. 466)

ఈ అడవిలో సింహాలూ, ఏనుగులూ సహజంగా దెబ్బలాడుకుంటాయి. ఏనుగు కుంభస్థలాలను సింహాలు చీల్చినప్పుడు రాలిన ముత్యాలను ఏరి శబరబాలికలు గీరనగింజలాట ఆడుతారట.

మీరిన భద్రనాగములమీదికి దాటి తదీయకుంభముల్
జూరలు వట్టి కేసరికిశోరసఖావళినుండి రాలి సొం
పారిన మౌక్తికంబులు ప్రియంబున నేరి కిరాతబాలికల్
గీరనగింజలాడుదురు గేలి దలిర్పగ బక్కణంబులన్. (ప్రబంధరత్నావళి, 474)

గీరనగింజలాట ఎలా ఆడుతారోగాని ఒకనాడు తెలుగుదేశంలోని తెలుగుపిల్లలు దానిని ఆడేవారని పింగళి సూరన్న (కళాపూర్ణోదయం, 6-202), ధూర్జటి (కాళహస్తీశ్వర మాహాత్మ్యం, 3-33), శేషము వెంకటపతి (శశాంక విజయం, 2-19), అయ్యలరాజు నారాయణుడు (హంసవింశతి, 3-416) ఈ క్రీడను పేర్కొన్నారు. అయితే ఏర్చూరి సింగన్న వాళ్ల అందరికన్నా ప్రాచీనుడు. యతిప్రాసస్థానాలలో ఈ మాట వాడాడు. ఇది ఓమనగుంటలాట కాదు. ఏమంటే పింగళి సూరన 'గీరనగింజ లోమన్‌గుంటల్' అని విడివిడిగా ఆటలు పేర్కొన్నాడు. బహుశా ఇది ఈ రోజుల్లో తెలుగు బాలికలు ఆడే చింతపిక్కలాట కావచ్చు. గీరనగింజలాడే శబరబాలికలున్న అడవిలోంచి కువలయాశ్వుడు పాతాళంలోకి వెళ్ళాడు. అక్కడ మదాలసను చూశాడు. ఆమె అందాన్ని సింగన్న ఇలా శ్లేషతో వర్ణించాడు.

తనజన్మ మప్పుల దలమున్క లని రోసి
పులిన మీ పొంకంబు బొందెనొక్కొ?
పరికింప తన పట్టు దిరిగెడి పాటని
పెన్నిధి సుడిమూర్తి బెరసెనొక్కొ?
బ్రతుకెల్ల గతి బట్టబయలాయె నని చూచి
గగన మీపుట్టువు గనియె నొక్కొ
పనిలేక పాసెడి పాపంబు దలపోసి
జక్కన లీరీతి కెక్కెనొక్కొ?
యనగ లలనజఘన మంబుజముఖినాభి
చామనడుము బాలచన్నుదోయి
మహితరుచుల దెగడి మానవసతికన్ను
దోయి పండువగుచు దొరిసెనంత (ప్రబంధరత్నావళి, 469)

ఇలా కన్నుపండుగ చేసే కథానాయికను కువలయాశ్వుడు వివాహం చేసుకున్నాడు. ప్రతి ప్రబంధంలో ఉండే అష్టాదశ వర్ణనలలో ఒకటైన పుత్రోదయాన్ని చంద్రోదయంతో పోల్చి సింగన్న ఇలా పద్యం చెప్పాడు.

తిమిర మంతయు బాసి దిక్కులు తెలివొందె
నమృతాంశువులు చెందె నభ్రవీథి
గువలయానందమై కోరిక లిగురొత్తె
విబుధుల మదిలోన వెట్టలొదవె

నక్తంచరశ్రేణి నయమెల్ల దిగజారె
జిత్తజోల్లాసంబు దెలుపుమిగిలె
దివ్యనీరంబుల తేటలల్లనబర్వె
భువనాధిపతి వేడ పొంగిపొరలె
దీపికాజాలమెల్ల చిత్రించినట్టి
రమణ దోపంగ దృక్చకోరములు మెచ్చ
నమిత తేజోవిరాజమానాత్ముడైన
పుత్రచంద్రుడు జననంబు నొదమెనపుడు. (ప్రబంధరత్నావళి, 471)

ఇదే భావాన్ని ఇంకో పద్యంలో ఇలా వర్ణించాడు:

వైరితమస్తమంబడగ వంశమహోర్ధిని ముబ్బి బాంధవో
ద్ధారచకోరసంతతి ముదంబున దేలగ వర్ధివర్గస
త్కైరవజాత మెల్లను వికాసము బొందగ బుత్రచంద్రజ
న్మారవచంద్రికానుభవ మబ్బిన చిత్తము మిన్నుముట్టదే? (ప్రబంధరత్నావళి, 475)

ఒకే భావాన్ని రెండు రకాలుగా చెప్పడం అనే గుణం సింగన్నకు షష్ఠస్కంధ రచనాకాలంనుంచీ అలవడినదే. భాగవత మూలంలో ఈ శ్లోకం వుంది:

కేచి త్కేవలయాభక్త్యా వాసుదేవపరాయణాః
అఘం ధున్వంతి కార్త్స్న్యేన నీహారమివ భాస్కరః (6-1-15)

దీనిని సింగన మొదట ఇలా అనువదించాడు:

కొందరు పుణ్యవర్తనలు గోపకుమారపదార విందజా
నందమరందపానకలనారతషట్పదచిత్తు లౌచు గో
విందపరాయణుల్ విమలవేషులు దోషమడంతు రాత్మలన్
జెందిన భక్తిచేత రవి చేకొని మంచు నడంచుకైవడిన్. (భాగవతం, 6-52)

ఆ శ్లోకాన్ని మళ్ళీ ఇలా ఒక కందంలోకి అనువదించాడు:

హరిభక్తిచేత కొందరు - బరిమార్తురు మొదలుముట్ట బాపంబుల ని
ష్ఠురతకరములసూర్యుం - డరుదుగ బెనుమంచు పించ మణచినభంగిన్.
(భాగవతం, 6-53)

'రవిచే మంచు విడడం' అనే భావం సింగన్నకు ఇష్టం. దీనినే మళ్ళా 'మంచు విరియించు మార్తాండుని చందంబున' (6-436) అని వాడాడు. ఒకే శ్లోకాన్ని రెండు రకాలుగా అనువదించడం సింగన్న శ్రీనాథుని చూసి నేర్చుకున్నాడు. నైషధంలో శ్రీనాథుడు ఒకే శ్లోకాన్ని రెండువిధాలుగా అనువదించడం మనం గమనించాం.[2] సింగన్న

2. సమగ్రాంధ్రసాహిత్యం - రెడ్డిరాజులయుగం.

ఈ పద్ధతిని స్వతంత్ర రచన అయిన కువలయాశ్వ చరిత్రలో కూడా అనుసరించడం గమనించదగిన విషయమే. ఈ గ్రంథం పూర్తిగా దొరకకపోవడం దురదృష్టమే. అనువాదమైన షష్ఠస్కంధ రచనలోనే ఎన్నో పలుకుబళ్లు, సామెతలు, నుడికారపు సొంపులు చూపిన సింగన్న స్వయంగా వ్రాసిన ప్రబంధములో ఎన్ని కుప్పలు పోసేవాడో! అజామిళుడు పశ్చాత్తాపపడే ఘట్టంలోని మాటలలో తెలుగుతేనె ఊరుతూ ఉంటుంది.

వృషలియం దనురాగవృద్ధి బిడ్డల గని కులము గోదావరి గూలద్రోసి
రచ్చల కెక్కి పెన్‌రజ్జుసేతల పరివారిలోపల దలవంపుచేసి
కట్టిడిముదుకనై కర్మబంధంబుల పుట్టనై నిందల ప్రోవ నగుచు
దరుణుల రోతల దవిలి భోగించిన కడిది నాజన్మంబు గాలిపోయె
చదువు చట్టువడియె శాస్త్రంబు మన్నయ్యె
బుద్ధి పురువుమేసె పుణ్యమణగె
నీతి మట్టువడియె నిర్మలజ్ఞానంబు
మొదలికుడిగె బోధ మూరిపోయె. (భాగవతం, 6-134)

సింగన్న వ్రాసిన కువలయాశ్వ చరిత్ర దొరక్కపోవడంవల్ల ఇటువంటి చక్కని పద్యాలు ఎన్ని కాలగర్భంలో కలిసిపోయాయో!

అయితే పోతరాజుగారి భాగవతం ఉన్నన్నాళ్ళూ సింగన్న షష్ఠస్కంధం కూడా జీవిస్తుంది.

సింగన్న ధన్యుడు!

వెలిగందల నారయ్య

బమ్మెర పోతరాజుగారి ప్రియశిష్యుడినని చెప్పుకొంటూ మహాభాగవతంలోని ఏకాదశ, ద్వాదశ స్కంధాలను వెలిగందల నారయ్య అనువదించాడు. పోతనగారి రచనగా గద్యలున్న స్కంధాలలో కూడా కొంత నారయ్య రచించినట్టు లోకం చెప్పుకుంటుంది. ద్వితీయ స్కంధంలో 92వ పద్యంనుంచి నారయ్య రచన అనే ప్రవాదం ఉంది. అంటే ద్వితీయ స్కంధంలో ఉన్న 289 గద్య పద్యాలలో 91 మాత్రమే పోతరాజుగారు వ్రాస్తే మిగిలిన 198 నారయ్య వ్రాశాడన్నమాట. అలాగే దశమస్కంధం ఉత్తరభాగంలో ఉన్న 1337 గద్య పద్యాలలో నారయ్య 1100 వ్రాసి గురువుగారి పేరు పెట్టాడనుకోవాలి.[1]

తన సొంత పేరుతో అనువదించిన స్కంధాలలోని కవిత్వానికీ, ఇతడు పూరించినవనుకొనే పోతరాజుగారి స్కంధాలలోని కవిత్వానికీ చాలా తేడా కనబడుతూంది. ఏకాదశ, ద్వాదశ స్కంధాలు మొక్కుబడికి చెయ్యాలికదా అని

1. శైలివల్ల మాత్రం అలా అనిపించదు.

అనువాదం చేసినట్టు కనబడతాయేగాని అందులో ఉత్తేజకరమైన కథనమైనా లేదు. ఏకాదశ స్కంధంలో 125 గద్య పద్యాలున్నాయి. వాటిలో 37 వచనాలు. వీటిలో 48 పంక్తులదాకా ఉన్నవి కూడా కనబడుతాయి. ద్వాదశ స్కంధంలోని మొత్తం 49 గద్యపద్యాలలో 21 వచనాలే. దీనిలో 71 పంక్తులదాకా విస్తరించిన వచనం కూడా ఉంది.

నారయ్య వ్రాసిన ఏకాదశ, ద్వాదశ స్కంధాలలో అక్కడక్కడ ఒకటో, అరో మంచి పద్యం కనబడుతుంది. అయితే ఈ పద్యాలు హరిభట్టు వ్రాసిన ఏకాదశ ద్వాదశ స్కంధాలలోనివని చాగంటి శేషయ్యగారు పరిశోధించి తేల్చారు.[2] హరిభట్టు గ్రంథంలో నుంచి ఈ పద్యాలను తీసికొని ప్రతిలేఖకులు నారయ్య కృతిలో కలిపి ఉంటారన్న చాగంటివారి భావన సమంజసమైనదే. రాజమహేంద్రవరం గౌతమి గ్రంథాలయంలో ఉన్న హరిభట్టు కృతులతో తైపారువేసి ఈ క్రింది పద్యాలు హరిభట్టువే అని చాగంటివారు రుజువు చేశారు.

వాలాయము యదుకుల నిర్మూలకరం బయినయట్టి ముసలం బొక టీ
బాలిక కుదయించును బొం-డాలస్యము లేదటంచునట పల్కుటయున్.

(భాగవతం, 11-22)

వినుము స్వాయంభువుం డను మనువుకును
రమణ నుదయించె నట ప్రియవ్రతు డనంగ
దనయు డాతని కాగ్నీధ్రు డనగ సుతుడు
జాతుడయ్యె భువనవిఖ్యాతు డగుచు. (భాగవతం, 11-34)

దారలయందు పుత్రధనధాన్యములందు ననేకభంగులం
గూరిమి చేయు మర్త్యుడతిఘోరవియోగజదుఃఖమగ్నుడై
నేరువుదక్కి చిక్కువడి నీతివివేక విహీనుడై మనో
భారముతో గపోతపతిభంగి నిజంబుగ బోవు నష్టమై. (భాగవతం, 11-96)

నారయ ద్వాదశ స్కంధంలో మొదట కృతిపతి సంబోధన అయ్యాక 8 పంక్తుల వచనం వుంది. తరువాత ఈ పద్యం ఉంది.

నరవర ఈప్రశ్నమునకు - సరిచెప్పగ రాదు నాదు సామర్థ్యముచే
బరికించి నీకు చెప్పెద - గరమొప్పగ భావికాలగతులన్ వరుసన్.

(భాగవతం, 12-8)

ఈ పద్యం తరువాత 37 పంక్తుల సుదీర్ఘ వచనం ఉంది. ఈ రెండు వచనాలకూ వంతెనలాంటి ఈ పద్యాన్ని హరిభట్టు నుంచి తెచ్చి లేఖకులు కలిపారు. అలాగే పదకొండు పంక్తుల వచనం అయ్యాక ఒక చంపకమాల కనబడుతుంది. ఈ పద్యం తరువాత కూడ 11 పంక్తుల వచనం ఉంది. ఈ చంపకమాల కూడా హరిభట్టు దేనట! చూడండి.

2. ఆంధ్రకవితరంగిణి, 6వ సంపుటి, పుట 208.

నరవర తొంటిభూపతుల నామగుణంబులు వృత్తిచిహ్నముల్
సిరియును రూపసంపదలు చెన్నగు రాజ్యము లాత్మవిత్తముల్
వరుస నణంగెగాని యిట వారల కీర్తులు నిర్మలంబులై
యురవడి భూమిలో నిలిచియున్నవి నేడును రాజశేఖరా! (భాగవతం, 12-14)

ఇలా ఈ ద్వాదశ స్కంధంలో మరి నాలుగు పద్యాలు హరిభట్టువేనట. అవి 1. ఈ జగంబేలు (12-17), 2. ఉత్తమశ్లోకుండన (12-19), 3. ఏనుమృతుండ నౌదునని (12-25), 4. మృతియును జీవనంబు (12-27) అనే పద్యాలు. ఈ జాబితా ఇంతకంటే ఎక్కువ ఉండవచ్చుగాని ''హరిభట్టు గ్రంథములోనుండి నారయ కవివని ముద్రిత ప్రతిలో జేర్పబడిన పద్యములనన్నింటిని నిట వ్రాయుట గ్రంథవిస్తరమని యెంచి వాని మొదళ్లను కొన్నిటి నీక్రింద నిచ్చుచున్నాడను'' అని చాగంటి శేషయ్యగారు కొన్నే పేర్కొన్నారు.[3] ఈ పద్యాలను తొలగిస్తే నారయ్య అనువాదం ఎక్కువగా వచనంలోనే జరిగిందని చెప్పాలి.

రసవంతమైన కవిత్వం వ్రాయకపోయినా ఏకాదశ స్కంధంలో నారయ గారడీ కవిత్వాన్ని ప్రదర్శించాడు. ఒక సర్వలఘుసీసాన్ని వ్రాశాడు చూడండి.

నవవికచసరసిరుహనయనయుగ నిజచరణగగనచరనదినిఖిలనిగమవినుత
జలధిసుతకుచకలశలలితమృగమదరుచిరపరిమళితనిజహృదయధరణిభరణ
ద్రుహిణముఖసురనికరవిహితనుతికలితగుణకటిఘటితరుచిరతరకనకవసన
భుజగరిపు వరగమనరజతగిరిపతివినుత సతతవృతజపనియమసరణిచరిత
తిమి కమఠ కిటి నృహరి ముదితబలినిహి
తపద పరశుధర దశవదనవిదళన
మురమథన కలికలుషసుముదపహరణ
కరివరదమునివరసురగరుడవినుత (భాగవతం, 11-72)

ఇది పోతరాజుగారు అప్పుడప్పుడు భాగవత రచనలో చూపిన గారడీకవిత్వ ప్రకియల ప్రభావం. అష్టమస్కంధంలో క్షీరసాగరమథనం వర్ణిస్తూ రెండు సర్వలఘు కందాలు వ్రాశారు పోతరాజుగారు. చూడండి.

ఎడమ గుడి మునుపు దిరుగుచు
గుడి నెడమను వెనుక దిరుగు కులగిరి కడలిన్
గడవెడల సురలు నసురులు
దొడిదొడి ఫనిఫణము మొదలు తుదియును దిగువన్

వడిగొని కులగిరి దరువగ
జడనిధికగమకరమఠఝష ఫణిగణముల్
సుడివడు దడబడు గెలకుల
బడు భయపడి నెగసి బయలబడు నురలిపడు. (భాగవతం, 8-211, 22)

3. ఆంధ్రకవితరంగిణి, 6వ సంపుటి, పుట 208.

ఈ అష్టమ స్కంధంలోనే ఇంకో మూడుచోట్ల సర్వలఘుకందాలను పోతరాజుగారు వ్రాశారు (8-146; 8-199; 8-526). గురువుగారు వాడిన ఈ ప్రక్రియను అనుసరించి ప్రియశిష్యుడు సర్వలఘుసీసాన్ని వ్రాసినా, పోతరాజుగారు సర్వలఘువులలో కూడా వాడిన యమకాలు, ఛేకాలు నారయ్యా సాధించలేదు.

నారయ్యా పోతరాజుగారికి ప్రియశిష్యుడేగాని వారి మతాన్ని మటుకు అనుసరించ లేదు. పోతరాజుగారు అద్వైతులు. నారయ్యా విశిష్టాద్వైతి, ఇతడు ఆంధ్రీకరించిన ఏకాదశ ద్వాదశ స్కంధాలలో విశిష్టాద్వైత సంప్రదాయాలు కనబడుతున్నాయి. ''నారయ ఏకాదశద్వాదశస్కంధ రచనము మూలమునకంటే చాలాచోట్ల న్యూనముగను, కొన్నిచోట్ల మూలాభిప్రాయమునకు విరుద్ధముగ నున్నది'' అని నిడుదవోలు వెంకటరావు గారు సోదాహరణంగా రుజువు చేశారు.[4] నారయ్యా గురించి శేషాద్రిరమణ కవులు వ్రాసిన యీ క్రింది విషయాలు అక్షరాలా సత్యం.[5]

నారయ్యా యంత లాక్షణికుడు, ప్రౌఢకవి కాడు; అతని కవితాధార పదపూర్ణముల తోడను, రచనావ్యత్యస్తములతోడను వ్యాకరణ దోషముల తోడను నిండియుండును. ఇంచుమించుగా నేకాదశ ద్వాదశ స్కంధములలో ఉన్నట్టి భాషాలోపములు ద్వితీయ, తృతీయ, చతుర్థ స్కంధములలో, దశమస్కంధోత్తరభాగములలో నుండుటచే, నివన్నియు నారయ్యాకవియే సంస్కరించినటుల నిర్ధారణము చేయవచ్చును. నారయ్యా కవితలో నుదంతషష్ఠికి నుగాగమంబురామి కొనికి కాదేశము కొన్నిచోటుల గననగును. ఇంకను ఎశోద, వాక్పృవ్య, మూపరము రజితములోనగు నపశబ్దములు తరచుగా గానవచ్చును. ఇతడు పూర్తిచేసిన భాగములలో వచనము లెక్కువగా గానవచ్చుచున్నవి. మూలగ్రంథము కూడా కొంత విడిచిపెట్టబడి మరికొంత క్లుప్తీకరింపబడియున్నది. దీనింబట్టి చూడ పోతరాజు పద్యభాగములు కథాంశములలో కలుపుటకై వచన రచనము విరివిగ గావించె ననియు నారయ్యా కవితాప్రాగల్భ్యము కలవాడు కాడనియు దోచుచున్నది.

దీనికి ఒక్క ఉదాహరణ చాలు. శ్రీకృష్ణ నిర్యాణవార్తను పోతరాజుగారు ప్రథమ స్కంధంలో గుండెలకు హత్తుకుపోయేటట్టు, చెవిలో నిలిచిపోయేటట్టు వ్రాశారు. మహానిధిగోలుపోయిన పేదచందంబున నిట్టూర్పులు నిగుడింపుచు అర్జునుడు అన్నతోఇలా చెప్తాడు:

మన సారథి మన సచివుడు
మన నెయ్యము మన సఖుండు మన బాంధవుడున్
మన విభుడు, గురువు దేవర
మనలను దిగనాడి చనియె మనుజాధీశా! (భాగవతం, 1-356)

---

4. పోతన, నేషనల్ బుక్‌ట్రస్టు ప్రచురణ, పుట 183
5. మహాభాగవతం, వావిళ్ళ ప్రచురణ (1922), పుటలు 72,73

ఆ తరువాత ఆనకట్టను బద్దలు చేసుకొని పారే మహానదిలాగ 22 పద్యాలలో ఆక్రోశిస్తాడు. ఇది శ్రీకృష్ణుని నిర్యాణ వార్తను మాత్రమే చెప్పుతున్నప్పుడు వచ్చిన కవిత్వం. పోతరాజుగారే స్వయంగా నిర్యాణ ఘట్టాన్ని రచించి ఉంటే మాటలతో ఉద్రేకాల అగ్ని పర్వతాలను బ్రద్దలుచేసి కన్నీళ్ళ లావాతో హృదయాన్ని ఉడికించేవారు. కృష్ణనిర్యాణ ఘట్టాన్ని ఏకాదశ స్కంధంలో నారయ్య ఎలా వ్రాశాడో చూడండి.

...అప్పరమేశ్వరుని సన్నిధానంబునకు వచ్చి, జగన్నాథుంగా దెలిసి భయంబున, మాహాపరాధుండను, బాపచిత్తుడను, కుటిల పచారుండనని అనేకవిధ దీనాలాపంబులం బలుకుచుబాష్పజలధారాసిక్తవదనుండైన సరోజనేత్రుండు వానింగరునించి యిట్లనియె – నీ వేల జాలింబడెదు? పూర్వజన్మకర్మంబు లెంతవారికినైనా నను భావ్యంబులుగాని యూరకపోవనేరవు. నీవు నిమిత్తమాత్రుండ వింతియ. (భాగవతం, 11-118)

కాలుమీద కాలు ఆనించి ఊపుతూ ఉన్న కమనీయరూపాన్ని ఆఖరుసారి పోతరాజుగారు వర్ణించకుండా ఊరుకొనేవారా? బోయవాడు విల్లు ఎక్కుపెడు తున్నప్పుడు ఆరాటంలో ఆ సంగతి ఒక పద్యంలో చెప్పేవారు కదా? కదలుతున్న కృష్ణుని హాహారవంతో వర్ణించి మన హృదయాలు కదిలించి మనచేత హాహాకారాలు చేయించేవారు కదా! పోతరాజుగారి ప్రియశిష్యుడు ముక్తసరిగా ఉత్త వచనంలో ఇది వ్రాశాడు. పడిపోయిన కృష్ణుని వద్దకు దారుకుడు వచ్చాడు. చూశాడు. ఈ సన్నివేశాన్ని నారయ్య ఎలా చెప్పాడో చూడండి.

దారుకుడు కనియె నంతట – జారునిరూఢావధాను సర్వజ్ఞు హరిన్
మేరుసమధీరు దనుజవి – దారుని నేకాంతపరుని దద్దయువేడ్కన్.
కని, అత్యంతభయభక్తితాత్పర్యంబుల ముకుళితకరమలుండై యిట్లనియె
నిన్ను జూడని కన్నులు నిష్ఫలములు
నిన్ను నొడవని జిహ్వ దా నీరవంబు
నిన్నుగానని దినములు నింద్యములగు
గన్నులను చూచి మమ్ముల గారవింపు
అనుచు దారుకుండు నిర్వేదనపరుండై యిట్లని విన్నవించె

(భాగవతం, 11-119-122)

పోతరాజుగారే కాదు. ఇంక ఎవ్వరైనా ఇంత నిష్ఫలంగా, 'నీరసంగా', 'నింద్యంగా' ఈ ఘట్టాన్ని వ్రాయరు, ''నారయ్యరచితమైన ఏకాదశ ద్వాదశ స్కంధాలిట్లు మూలమునకు విభిన్నముగా నుండి పోతన గ్రంథముతో పొత్తు కలుగకపోవుటచేతనే నాటినుండి నేటివరకు ఈ రెండు స్కంధములను ఐదారుగురు కవులు తెనిగింపవలసిన యావశ్యకము కలిగినది'' అని నిడుదవోలు వెంకటరావుగారు చెప్పిన మాటలు నిజమే.[6]

అయితే ఎవరు అనువదించినా పోతరాజుగారి కవిత్వంతో సరితూగలేదన్నదీ శుద్ధ సత్యమే.

6. పోతన: నేషనల్ బుక్ ట్రస్టు ప్రచురణ, పుట 185.


కాకునూరి పండితులు

ఆంధ్ర సాహిత్యంలో పరమప్రామాణిక గ్రంథం అప్పకవీయం. దీనిని వ్రాసిన కాకునూరి అప్పకవి తన తల్లివంక చుట్టాలు కవులని చెప్పుకొన్నాడుగాని, తన తాతముత్తాతలు కావ్యాలు వ్రాసినట్టు ఎక్కడా విశదీకరించలేదు గాని ఒక్కచోట 'మదీమాన్వయ ప్రభుండగు తిరుమలభట్టారకుండు' కాలామృతమునందు 'శ్రీమద్వేంకటనాయకం' అని మంగళాచరణం చేసినట్టు చెప్పాడు.[1] ఇది బహుశా కాలామృతానికి ఆంధ్రీకరణమట.[2] అయితే ఇది తెలుగు భాషలో వెలసిన తొలి జ్యోతిషగ్రంథం అవుతుంది. ఈ కవిని గురించి చెప్పుకొనడం సముచితమే.

అప్పకవి తన కాలాన్నీ, వంశాన్నీ చాలా స్పష్టంగా వివరించాడు. శాలివాహనశకం 1578 మన్మథనామ సంవత్సరం శ్రావణ బహుళ అష్టమినాడు అంటే క్రీ.శ. 1656 ఆగస్టు 3వ తారీఖునాడు తనకు కల వచ్చిందని చెప్పుకొన్నాడు. అందులో దేవుడు కనిపించి నన్నయగారి వ్యాకరణ గ్రంథాన్ని తెనిగించమని ఆదేశించినట్టు చెప్పాడు. అప్పకవి స్పష్టంగా చెప్పిన ఈ తారీఖును ఆధారం చేసుకొని అతని తాతముత్తాతల కాలాన్ని నిర్ణయించవచ్చు.

అప్పకవి తన గ్రంథంలో ఆరు తరాలవరకూ తన వంశాన్ని చెప్పాడు. అందులో ముఖ్యుల జీవిత విశేషాలను పేర్కొన్నాడు. అతడు ఇచ్చిన వివరాలను ఆధారం చేసుకొని అతని వంశవృక్షాన్ని ఈ విధంగా పొందపరచవచ్చు.

అప్పకవి వంశం



1. అప్పకవీయం, 4-67 2. ఆంధ్రకవిసప్తశతి - బులుసు వెంకటరమణయ్యగారు, పుట 88.

ఈ వంశవృక్షంలో 4వ నెంబరు వ్యక్తిగా మనం పేర్కొన్న తిరుమలభట్టే కలామృతం వ్రాశాడని ఇంతకు ముందు పరిశోధకులందరూ భావిస్తూ వచ్చారు. అయితే 1 నెంబరు వ్యక్తిగా సూచించిన మూలపురుషుడు ఆ గ్రంథాన్ని వ్రాసి ఉంటాడని నేను భావిస్తున్నాను. తన పెదతాత ఆ గ్రంథాన్ని వ్రాస్తే అప్పకవి అతనికి 'మదీమాన్వయప్రభుండు' అనే విశేషణం వాడి ఉండడు. మూలపురుషుని పేరు తిమ్మన. ఇది తిరుమల శబ్దభవం. ఈ తిమ్మనగారినే తిరుమలభట్టు అని 4వ ఆశ్వాసంలో పేర్కొన్నాడని ఊహించవచ్చు.

అప్పకవి చెప్పిన 'శ్రీమద్వేంకటనాయకం' అనే పదాలతో ప్రారంభం అయే మంగళాచరణమే నేటి సంస్కృతకాలామృత ప్రతులలో కనబడుతుంది.

శ్రీమద్వేంకటనాయం కులగురు నత్వా సదాభీష్టం
జ్యోతిశ్శాస్త్రపయోనిధి ప్రమథనా త్సారం సముత్కృష్యతం
విద్వద్విశ్వమనోహరం మృదుపదం సంక్షేపత స్సంస్ఫుటం
గర్భాదానముఖం పిపాసుసులభం కాలామృతం వచ్మ్యహమ్.

ఇలా సంస్కృతంలో మంగళాచరణం చేసి తిమ్మయ్య తెలుగులో కూడా కాలామృతం వ్రాశాడని అనుకోడానికి ఆస్కారం తక్కువే. మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఆంధ్రటీకాసహితమైన ఒక కాలామృతం వుంది.[3] దానిలో వాస్తు ప్రకరణం మాత్రమే ఉంది. దాని వ్యాఖ్యాత కవితార్కికసింహుడు వేదాంతాచార్యులు. భావిపరిశోధన వల్లనే తప్ప కాకునూరి తిమ్మయ్య తెలుగులో కాలామృతం వ్రాశాడో, లేదో తేల్చి చెప్పలేం.

క్రీ.శ. 1500 ప్రాంతాలలో ఉండే ఈ కాకునూరి తిమ్మనగారు, అతని కుమారుడు సోమన చాలా ప్రసిద్ధులని చెప్పవచ్చు. ముఖ్యంగా సోమన ఉద్దండుడు, చిన్నప్పుడే కాశీకి వెళ్లి బ్రహ్మేంద్రులవారి వద్ద శాస్త్రాలు చదివాడట. బ్రహ్మరాక్షసితో క్రమం చెప్తూ బండికట్టిన గండభాగాన్ని మోదాడట. మధురకు వెళ్ళి అక్కడి పండితులను వేదశాస్త్రపురాణాది వాదాలలో ఓడించాడట. వాళ్ళ కాకునూరింటిని చేయడంవల్ల సోమన్నకు కాకునూరింటివాడనే పౌరుషనామం వచ్చిందట.

అతడు మధురను బుధసమూహముల దొడరి
వేదశాస్త్రపురాణాదివాదములను
గాకునూరింటి చేసిన కారణమున
గాకునూరింటివా డన ఘునత గాంచె. (అప్పకవీయం, పీఠిక 72)

ఈ కాకునూరి సోమన మధురకు వెళ్ళి పండితులను ఓడించడం ఆనాటి రాజకీయ కారణాలవల్ల సాధ్యమైందని ఊహించవచ్చు. క్రీ.శ. 1470 ప్రాంతాలలో సాళువ నరసింహరాజు రామేశ్వరం, కన్యాకుమారుల వరకు దిగ్విజయం చేశాడు. విజయనగర

3. R. 819 Triennial Catalogue of Mss. Vol. VI.

సామ్రాజ్యాధిపతులు క్రీ.శ. 1352లోనే మధురను జయించారు. దక్షిణదేశంలో శ్రీరంగపట్టణం ఎప్పుడూ విజయనగరం ఏలికల ఆగ్రహానికీ, అనుగ్రహానికీ లోనవుతూ వచ్చింది. తొలి రాయల యుగంలోనూ, అంతకు ముందూ మధుర మీదకు దండనాయకులే కాక తెలుగు పండితులు కూడా దాడి చేసేవారని దీనివల్ల స్పష్టమవుతూంది.

ఈ కాకునూరి పండితులు నేటి మహబూబ్‌నగర్ జిల్లా నాగరకర్నూలు తాలూకా లోని 'లేమావిళ్ళ' అనే గ్రామంలో ఉండేవారు. దీనినే అప్పకవి 'అభినవచూతసద్గ్రామం' అన్నాడు (పీఠిక 73). తిమ్మకవిగారి సోమయ్యా చరిగొండసీమలో కాకునూరనే సర్వాగ్రహారం సంపాదించాడట. నిడుదవెల్లి, బొద్దినేపల్లి, నివరలపురి అనే గ్రామాలలో మాన్యక్షేత్రాలు ఆర్జించాడట.[4] కాకునూరి సోమయ్యా గురించి ఈ వివరాలన్నీ అప్పకవి ఈ క్రిందిపద్యంలో చెప్పాడు.

> బాలుడై కాళికాపట్టణంబున కేగి బ్రహ్మేంద్రునొద్ద శాస్త్రములు చదివె
> బ్రహ్మరాక్షసిచేత క్రమము చెప్పంబడి కట్టిన గండభాగంబు వొందె
> చరికొండసీమలో సంతరించెను గాకునూరన సర్వాగ్రహార మొకటి
> నిడుదవెల్లిని బొద్దనేపల్లి నివరల పురిని మాన్య క్షేత్రములు గడించె
> నవని సర్వజ్ఞుడగుట గంగాంబికాభి
> రాముడగుటను నిక్కంబు సోముడనగ
> మనియె నిల గాకునూరి తిమ్మన సుతుండు
> సోముడభినవచూత సద్గ్రామమున. (అప్పకవీయం, పీఠిక 73)

ఈ సోమయ్యగారే తపస్సు చేసి తమ ఇంట్లో ఎప్పుడూ విద్యాప్రస్తుత అవాలనే వరం సరస్వతీదేవి దగ్గర పొందారట. అందుకే కాకునూరి వారింట్లో ఏ శుభకార్యం జరిగినా ముందు వాణీపూజ చేస్తారట (అప్పకవీయం, పీఠిక 74). ఎప్పుడూ తన ఇంట సరస్వతీపూజ జరగాలనే వరం కోరుకున్న ఈ సోమయ్యా, కాలామృతం వ్రాసిన తాత తిరుమలభట్టారకుడూ తొలి రాయల యుగంలోని ఉద్దండపండితులు. మధురలోని పండితులను పురాణాది వాదాలలో జయించిన సోమయ్యా తెలుగులో గ్రంథాలేమీ రచింపక పోవడం ఒక వింతే!

---

4. ఈ గ్రామాలూ, కాకునూరు మహబూబ్‌నగర్ జిల్లా, కల్వకుర్తి తాలూకాలో ఉన్నాయి. చూ॥ బూర్గుల రామకృష్ణరావుగారి సారస్వతముక్తావళి, పుట 47

నూతనకవి సూరన

''ధనమూల మిదం జగత్'' అన్నారు మన ప్రాచీనులు. నవీన రాజకీయ శాస్త్రకారులు సహితం అన్నిటికీ ఆర్థిక కారణాలే ముఖ్యం అన్నారు. డబ్బుంటే చాలు, దానితోపాటు అన్నీ వస్తాయనుకొంటారందరూ. అయినా ధనంకన్నా గుణం ప్రధానం అని ప్రతిఒక్కరూ నీతిని బోధిస్తూ ఉంటారు. పెళ్లిచూపులలో సహితం, 'అందం కొరుక్కుతింటామా?' అని సర్ది చెప్పుకుని డబ్బువైపే మొగ్గుతారు. అందానికీ, ఐశ్వర్యానికీ ఉన్న దెబ్బలాట ఈనాటిది కాదు. రూపం ముఖ్యమని మన్మథుడూ, రూకలు ముఖ్యమని కుబేరుడూ ఒకసారి ఇంద్రసభలో వాదులాడుకొని తమ పంతాలు నెరవేర్చుకోడానికి భూమికి దిగివచ్చారని ఒక కవి చక్కని ఇతివృత్తం కల్పించాడు. ఆంధ్రసాహిత్యంలో ఈ వివాదాన్ని విశదం చేసిన మన పాత కవిపేరు - నూతనకవి సూరన. అతని కావ్యం పేరు 'ధనాభిరామం.'

ఇతడు తాను తిక్కన సోమయాజిగారి వంశంలోనివాడినని కంఠోక్తిగా చెప్పుకున్నాడు. 'ధనాభిరామం' అవతారికలో అతడిలా అన్నాడు:

అనువుగ భారతాంబునిధి యవ్వలికిన్ దగ నీది నందులో
ఘనకవితామృతంబు చవిగాంచిన తిక్కయసోమయాజి పా
వనతరమైన - యట్టి కులవర్ధనుడన్ మహి బేరు కల్గు నూ
తనకవి సూరనాహ్వయుడ ధర్మగుణప్రతిపాలనీయుడన్. (1-15)

ఇతడు ఏవిధంగా తిక్కనగారి కులవర్ధనుడో తెలియదు. తిక్కనగారు గౌతమ గోత్రులు, ఇతడు కౌశికగోత్రుడు. గోత్రాలు వేరు కావడంవల్ల ఈ నూతనకవి తిక్కనగారి వంశంలోని వాడని చెప్పలేం. పోనీ, కూతురి సంతతివాడని సరిపెట్టుకోలేం. మన తెలుగు కవులలో మడికి సింగన్న ఒక్కడే తాను తిక్కనగారి మనుమరాలి వంశంలోనివాడనని చెప్పుకున్నాడు.[1]

ఈ నూతనకవి సూరన తన బంధుత్వాన్ని విశదీకరించకపోబట్టి, మన పరిశోధకులు, తిక్కనగారూ ఇతడూ నియోగి బ్రాహ్మణులే కాబట్టి కవి అలాగ చెప్పుకొన్నాడని భావిస్తున్నారు.[2] అయితే, ఇది ఇలాంటి ఉత్త బాదరాయణ సంబంధం కాదేమో. భావిపరిశోధనవల్లగాని ఈ బంధుత్వం ఏమిటో తేల్చి చెప్పలేం. ఈ కవిని గురించి ఇతర విషయాలు కూడా తక్కువే. 'రత్నపరీక్ష' వ్రాసిన భైరవకవికి ఇతడు సమకాలికుడని చెప్పవచ్చు. ఎందుకంటే, ఇద్దరూ ముదిగొండ వీరభద్రుని శిష్యులు. నూతనకవి సూరన గ్రంథంలోనుంచి ఒక పద్యాన్ని పెదపాటి జగ్గన్న తన ప్రబంధ రత్నాకరంలో ఉదాహరించాడు. కాబట్టి సూరన విధిగా క్రీ.శ. 1550కి ముందువాడని చెప్పవచ్చు. ధనాభిరామంలో చేసిన పూర్వకవి స్తుతిలో చివరివాడు నాచన సోముడు. అతనికాలం

---

1. వాసిష్ఠరామాయణం, 1-29
2. ఆంధ్రకవితరంగిణి, చాగంటి శేషయ్యగారు, 6వ సంపుటి, పుట 84.

క్రీ.శ. 1344 ప్రాంతం. కాబట్టి సూరన నాచన సోమునికి, పెదపాటి జగ్గన్నకూ మధ్య కాలంలోవాడని నికరంగా చెప్పవచ్చు. క్రీ.శ. 1344-1550లకు మధ్య ఇంచుమించు రెండువందల సంవత్సరాలున్నాయి. అందుచేత ఇటో ముప్పాతిక, అటో ముప్పాతిక లెక్కించి, ఇతడు క్రీ.శ. 1420-1475 ప్రాంతాలవాడని చెప్పుకోవచ్చు. ఈ కాలంకూడా భైరవకవి కాలానికి సరిపోతుంది.

గ్రంథంలోని ఆంతరంగిక సాక్ష్యంవల్ల ఇతడు బమ్మెర పోతరాజుగారికి కొంచెం సమీపకాలంలోని చిన్నవాడని చెప్పవచ్చు. భాగవతంలో సంస్కృత కవులను స్తుతిస్తూ పోతరాజుగారీ పద్యం చెప్పారు.

పుట్టం బుట్ట శరంబునన్ మొలవ వనంభోయాన పాత్రంబునన్
నెట్టంగల్గను గాళి గొల్వను బురాణింపన్ దొరంకొంటి మీ
దెట్టేవెంట జరింతు దత్సరణి నా కీవమ్మ యోయమ్మ మేల్
పట్టున్ మానకు మమ్మ నమ్మితి జుమీ, బ్రాహ్మీదయాంభోనిధీ! (1-7)

పోతరాజుగారీ పద్యం చెప్పాక తెలుగు సాహిత్యంలో వాల్మీకి ప్రసక్తి వచ్చినప్పుడు చాలామంది కవులు 'పుట్టన్ పుట్టడం' చెప్తారు.

కావ్యం అన్నిటికన్నా గొప్పదని చెప్పవలసివచ్చినప్పుడు సూరన కూడా ధనాభిరామంలో పోతరాజుగారిని ఇలాగే అనుసరించాడు.

పుట్టం బుట్టి మహానది - బుట్టియు సైకతస్థలమును బుట్టి జగంబుల్
నెట్టన బొగడగ వెలసిన - యట్టి మహాత్ముల దలంతు నాదిమకవులన్
(ధనాభిరామం, 1-10)

ఈ ఒక్క విషయంలోనే కాదు. అంత్యానుప్రాసలో కూడా సూరన ఒకచోట పోతరాజుగారిని అనుసరించాడు. భాగవతంలో పోతరాజుగారు సరస్వతీ ప్రార్థన ఇలా చేశారు:

క్షోణితలంబు నెన్నుదురు సోకగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికి జంచరీకచయసుందర వేణికి రక్షితానత
శ్రేణికి దోయజాతభవచిత్తవశీకరణైక వాణికిన్
వాణికి నక్షదామశుక వారిజపుస్తకరమ్యపాణికిన్. (భాగ. 1-6)

ఈ అనుప్రాసాన్ని చివరి పాదాలలో అనుసరిస్తూ సూరన ధనాభిరామంలో సరస్వతీ ప్రార్థన ఇలా చేశాడు:

వీణెయు బొత్త మంకుశము వేడుకతో జపమాల జేతులం
బ్రాణపదంబులై వెలయు భవ్యతనుప్రభ నిండి సర్వగీ

ర్వాణులు సన్నుతింపగను వర్ణన కెక్కిన బ్రహ్మరాణికిన్
వాణికి మత్తకీరపిక వాణికి మ్రొక్కెద కార్యసిద్ధికిన్. (1-8)

ఈ అనుకరణవల్ల నూతనకవి సూరన కచ్చితంగా పోతరాజుగారికి తరువాతి కవే అని చెప్పవచ్చు. అందుచేత ఇతని కాలం భాగవత రచన జరిగాక, అది ప్రజాదరణ పొందాక అని చెప్పవచ్చు. అంటే క్రీ.శ. 1475-1500 ప్రాంతాలని నిర్ణయించవచ్చు. ఈ కవి తన గ్రంథాన్ని దాక్షారామభీమేశునికి అంకితం ఇచ్చాడు. అందుచేత అతడు ఆ ప్రాంతాలవాడని చెప్పవచ్చు. ధనాభిరామానికి కథారంగం కూడా దాక్షారామమే. రూపం గొప్పదో, ధనం గొప్పదో తేల్చడానికి మన్మథ కుబేరులు భూలోకానికి దిగి యెకాయెకిని దాక్షారామానికే వెళ్ళారు. ఆ దేవతలను కవి తన సీమకే తీసుకొని వెళ్ళడంలో ఆశ్చర్యం లేదు. రూపం కన్నా, ధనంకన్నా స్వస్థలాభిమానం గొప్పదే. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్నారు మరి!

స్వర్గంలో ఇంద్రుడు కొలువుతీరి ఉన్నప్పుడు మన్మథుడు అక్కడకు వెళ్లాడు. అతని రాక చూసి రంభ. ఊర్వశి మొదలైనవాళ్ళు అతులిత మోహాయత్తచిత్తలై అన్నీ మరిచి పోయారు. అప్పుడు ఇంద్రుడు ఆ దేవవేశ్యలను చూసి మీకు ధనమా, రూపమా? ఏది చాలా అవశ్యం?'' అని అడిగాడు. వాళ్లు చెప్పలేకపోయారు. అప్పుడు మన్మథుడు ఇలా అన్నాడు.

మానితరూపయౌవనసమగ్రతచే తుదిముట్టి పైకళా
స్థానము లంగ భేదములు జాతులు తప్ప కెరింగి కామవి
ద్యానిపుణుండనై మెలగునాతని గూడి రమించునట్టి యా
మానిని యొండొరుం గవయ మైకొను నే ధన మెంత యిచ్చినన్?
(ధనాభిరామం, 1-46)

మన్మథు డీమాటలు చెప్పగానే కుబేరునికి ఒళ్లు మండింది. ధనాన్ని చులకన చేయడం సహించలేకపోయాడు. దాని మహిమ నిలా వర్ణించాడు.

కడు వికృతాంగు చక్కనివానిగా జేయు పాపకర్ముని పుణ్యావరునిజేయు
చంచలాత్ముని నిశ్చలచిత్తుగా జేయు నధికభీతుని సాహసాంకు జేయు
కులహీను మిక్కిలి కులజునిగా జేయు వీరిడివాని వివేకి జేయు
వడి ననాచారు నాచారవంతుని జేయు సరవితో జడమతి సరసు జేయు
బేల నిల భీము డనుపేర పిలువజేయు - రసికతలు యింతలేని నిరక్షరీకు
పావనంబైన సకలవిద్యావిశాలు - డనగ జేయును ధనము, తథ్యంబు వినుము.
(ధనాభిరామం, 1-51)

దీనికి మన్మథుడిలాగ సమాధానం చెప్పాడు:

రూపంబు ధనము నిచ్చును - రూపం బటు తన కులంబు రూఢిగ జేయున్
రూపంబు లోకవశ్యము - రూపము లేనట్టి నరుని రోతురు భామల్.
(1-62)

'అబ్బే' ఆడవాళ్లకు కావలసినది డబ్బేగాని రూపంకా'దని కుబేరుడు చెప్తూ వాళ్ళ మనసులు బ్రహ్మకూడా తెలుసుకోలేడని రెట్టించి ఇలా అన్నాడు.

పోనీక నొకని చూపులచేత కరగించి మాటల నొక్కని మరగజేసి
ఆలింగనముల దేలాడించి యొక్కని నొకని కౌగిటిలోన నోలలార్చి
అధరామృతంబుచే నలరించి యొక్కని యొక్కని మరుకేళి జొక్క జేసి
బాసల నొక్కని భ్రమయించి సేతల దొడ్డుగా నొక్కని నొడ్డుబెట్టి
ఇన్ని విధముల భ్రమియించి యెవ్వరికిని
వలవ రెంతయు ధనము కేవలము విటుల
భ్రమల బెట్టుదు రిదిగాన కమలముఖుల
మనము లెరుగంగ వశమె యవ్వనజజునకు? (ధనాభిరామం, 1-64)

నూతనకవి సూరన వ్రాసిన ఈ పద్యంలోని భావాలే కొక్కోకం వ్రాసిన ఎర్రయ్య తన సకలనీతి కథావిధానంలో రెండుచోట్ల చెప్పాడు చూడండి.

ఒక్కని జూచు వేరొకని నొల్లక మారు మొగంబు వెట్టు నొం
డొక్కని కాసజూపు మరి యొక్క నితో రమియించు వేడ్కతో
నొక్కని గౌగిలించు తల పొక్కనిపై నిడి తాల్మిదూలు నే
దిక్కునబట్టి చూడ సుదతీజనవర్గము నమ్మవచ్చునే? (సకల. 1-88)

కౌగి లొక్కని కిచ్చు గామించు నొక్కని
నలుగు నొక్కనితోడ గలియు నొకని
బలుకునొక్కనితోడ బులకించు నొక్కని
దక్కించు నొక్కని దగులు నొకని
నొకని రమ్మని పిల్చు నొకని కాసలు జూపు
కనుసన్న నొకనికి గాక సేయు
నమ్మించు నొకనిబంతము చెప్పు నొకనికి
మ్రొక్కు వేరొక్కని దిక్కు చూచు
తడవు నొక్కని మనమునదలచు నొకని
వన్నె యొకనికి నొకనికి వలపు జెప్పు
నింట నొకడుండ బొన్నింట నొకని గలయు
వారవనితల దెలియ నెవ్వారు గలరు? (సకల. 2-330)

కుబేరుడు ధనప్రభావాన్ని ఇలా విస్తరించాడు:

చుట్టములు గానివారలు - చుట్టాలము మీకు ననుచు పొంపు దలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు - గట్టిగ ద్రవ్యంబు చాలగలరే బంధుల్?
(ధనాభిరామం, 1-70)

ఈ మాటలు విన్నాక మన్మథుడు ఊరుకోలేదు. డబ్బు పాపిష్ఠిదని ఇలా తిట్టాడు:

ప్రాణమిత్రునినైన పగవానిగా జేయు నరమి ప్రాణముమిద నలుగ జేయు
కొరగానికతిలోభిగుణముబుట్టగజేయు దోడబుట్టినవాని దొలగజేయు
నరయబాపంబుల కాలయంబుగజేయు సత్యమార్గంబుల సమయజేయు
వివరింప గురుజనవిద్వేషిగా జేయు దుష్టవర్తనమున దొడరజేయు
వసుమతీ చక్రమున నెంతవారికైన
దగిలి ధనకాంక్ష యెన్ని విధంబులకును
దెచ్చునది గాన యిన్ని యు దెలియ వినుము
ధనము పాపస్వరూపంబు తథ్య మరయ. (ధనాభిరామం, 1-75)

ధనాన్ని ఇంత తిడుతూ ఉంటే కుబేరుడు సహించలేకపోయాడు. ఇలా సవాల్ చేశాడు.

తరమిడి యిన్ని మాటలు వృథా పనిలేవు సమస్తవైభవో
త్కరమగు దక్షవాటిపురి గల్గు ధరాస్థలిలోన బోయి నీ
నిరుపమరూపసంపదయు నేర్పున జూపుము నేను వచ్చియా
పురవరసీమ జూపెదను భూరిధనంబున నా మహత్త్వమున్.(ధనాభిరామం, 1-79)

ఓడిపోయినవారికి దేవలోకం వెలి అని నిర్ణయించుకున్నారు. మారుకు మారు ప్రతిజ్ఞలు చేశారు. ఇంతలో 85 పద్యాలున్న ప్రథమాశ్వాసం ముగిసింది. ధనాభిరామం, ద్వితీయాశ్వాసం, వసంత కాలవర్ణనతో మొదలవుతుంది. 8 గద్యపద్యాలలో ఆ వర్ణన అయ్యాక మన్మథుడు దాక్షారామం వెళ్లడం కవి చెప్తాడు. 14 పద్యాలలో రోకలి పాటలాంటి పురవర్ణన. మన్మథుడు మారువేషంలో ఊళ్లోకి రాగానే అతణ్ణి చూసి అందరూ అబ్బురంగా చెప్పుకొంటారు. అతడు భీమేశ్వరస్వామి సాన్నిధ్యంలోకి వెడతాడు. నూతనకవి సూరన 10 పద్యాలలో విపులంగా స్వామివారి ముందు సానికూతురు చేసే నాట్యాలు వర్ణించాడు, ఈ ఘట్టంలోని పద్యాన్నే పెదపాటి జగ్గన్న తన ప్రబంధరత్నాకరంలో ఉదాహరించాడు. చూడండి.

ఇరువదియారు వీక్షణము లెన్నగ నాలుగు వర్ణచేష్టలన్.[3]
బిరుదుగ నేడు భ్రూనటన లర్వదినాలుగు దోర్విలాసముల్
నరపతి జూపి హంసవృష సామజవాయసశుద్ధసంగతుల్
పరువడి ముట్ట నిల్చి సితపంకజలోచన లాడుచుండగన్. (ధనాభిరామం, 2-46)

ఈ సానికూతుళ్లలో ఒకదానిమీద మన్మథుని కన్ను పడింది. ఆ సంగతి కవి ఇలా చెప్పాడు:

---

3. ఇది వేటూరి ప్రభాకరశాస్త్రిగారి ప్రబంధరత్నావళిలో 482-వ పద్యం. అందులో మొదటి పాదంలో నాలుగు వక్రచేష్టలు అనే పాఠం ఉంది. చివరిపాదంలో 'లోచన పాడుచుండగన్' అనే పాఠం ఉంది.

వెన్నెల వాడ బాడ జదువంగల కావ్యము జెప్ప వ్రాయగా
గిన్నెరమీట వీణెయును గీర్తిత బుద్ధిని బట్టు రూపము
న్సన్నుతి కెక్క వైభవవిశాలగుణోజ్వలచారుమూర్తితో
నన్నిట నేర్పరైన సుగుణావతి జూచె మరుండు వేడుకన్. (ధనాభిరామం, 2-63)

ఈమె మన్మథుని జూచి మరులుకొన్నది. అలంకార శాస్త్రంలో చెప్పిన దశావస్థలు ఆమెకు ప్రాప్తించాయి. దర్శనం, మనస్సంగం, సంకల్పం, జాగరం, కార్శ్యం (చిక్కుట), అరతి = (అరుచి), అలజ్జ, ఉన్మాదం, మూర్ఛ, మరణోద్యమం అని వాటికి శాస్త్రకారులు పేర్లు పెట్టారు. ఈ పదింటినీ ఒకే ఒక పద్యంలో స్త్రీ పర్యాయపదాలతో గుత్తళం చేసి ఏమాత్రం భావుకత లేకుండా సూరన వ్రాశాడు.

కనుకలితో టెత్తగాంతాశిరోమణి తలపోయుచుండెను దరళనయన
కాంక్షల కడుడస్సె గామినీతిలకంబు వర్ణింపగా వచ్చె వనజనయన
తమకించె గవయ నెంతయును గోకిలవాణి సిగ్గు జక్కంబెట్టె చిగురుబోణి
ప్రియము రెట్టించంగ నియమించె మానిని వలపున శోషించె వరవధూటి
యతను ధ్యానంబు జేసె రాయంచమిన్న
మదముతో తన్ను మరచెనో మోహనాంగి
తనరి యది దశావస్థల ననుసరించి
యంగజుని జూచి గుందె నా యతివ యవుడు. (ధనాభిరామం, 2-75)

యతిప్రాసలకోసం వాడిన మాటలలాగే కనబడతాయి. కాని పర్యాయపదాలు ఔచిత్యంతో, భావుకతతో వ్రాసినవి కావు. కవిసమయాలప్రకారం పాతబడ్డ మాటలే వాడినా రసవత్తరంగా చెప్పడం ఏ కొద్దిమందికో చేతనవుతుంది ఉదాహరణకు శ్రీనాథుని పద్యం తీసుకుందాం.

శ్రీరస్తు భవదీయచికురంబులకు మహాభూర్యబ్దములు సితాంభోజనయన!
వరకాంతిరస్తు తావకముఖనఖముల కాచంద్రతారకం బబ్జవదన!
మహిమాస్తు నీకటిమధ్యంబులకు మన్ను మిన్నుగలన్న న్నాళ్ళు మించుబోడి!
విజయోస్తు నీ గానవీక్షల కా నీలకంఠహరిస్థాయిగా లతాంగి
కుశలమస్తు లచ్ఛాతశతాకుంభ - జంభభిత్కుంభికుంభాభిజృంభమాణ
భూరిభవదీయవక్షోజములకు మేరు - మందరము లుండుపర్యంత మిందువదన.
(చాటువు.)

ఈ పద్యంలో తరచినకొద్దీ అర్థాలు దొరుకుతాయి. శ్రీ చంచలమైనది; చికురములు కదలిక కలవి. ఎన్నో సంవత్సరాల కాలం అలా గడుస్తూ ఉంటుంది. ఆడవాళ్లు చంచలాక్షులు. వాళ్ల ముఖాలను చంద్రులతోటి, నఖాలను తారలతోటి పోల్చడం కవిసమయం. అవి కాంతివంతాలు. ఆచంద్రతారకం ఆ రెండూ వరకాంతితో వర్ధిల్లాలని

దీవించడంలో సొగసుంది. అలాగే ఆడువారి నడుము ఆకాశంతో పోలుస్తారు. మిన్ను ఉన్నంతకాలం నీ సన్నని నడుముండాలనటం సముచితం.

అలంకార శాస్త్రంలో చెప్పిన దశావస్థలను పేర్కొన్నాడేగాని నూతనకవి సూరన సొగసైన కల్పనలు చేయలేదు. ఆమె మన్మథుని చూసి మోహించి చెలికత్తెచేత రాయబారం పంపింది. అతడు 'పచ్చబైకంబు నేను వెచ్చమునకు బెట్ట'నన్నాడు. ఆమె సరే అంది. 'కుబేరుడంత ధనవంతు డొచ్చినను తన్నువిడువనని' చెప్పాక మన్మథుడా సుగుణావతి ఇంటికి వెళ్లాడు. ఆ ఇంట్లో పడకగదిని సూరన ఇలా వర్ణించాడు.

ప్రకటితబంధసంగతులు వ్రాసిన చొక్కపు మేలుకట్టులన్
సకినెల మంచమున్ ఖరచు చల్లని పువ్వుల పాన్పు బ్రోదిరా
శుకములు వీణెయున్ సురటియున్నరసొంపుగ గల్గి పైడిజా
లకముల మేడమీదను విలాసమున్నతి నొప్పు మెప్పుగన్.

(ధనాభిరామం, 2-120)

ఆ గదిలో మేడమీదను పురాణములోని శృంగారపు ఘట్టాలను చిత్రకారుడు చిత్రించాడట. ఆ సంగతి ఇలా చెప్తున్నాడు:

పాయక కమలసంభవు కూతు జెరబట్ట నేడ్తెర వెను వెంట నేగువిధము
జంభానురారియు సంభ్రమంబున వచ్చి గౌతమునిల్లాలి గవయు తెరగు
తన తపోవిధి మాని ఘనవరాశరమౌని కణగి యోజనగంధి గనయురీతి
చందురుండును సురాచార్యుని సతి జూచి యరసి మోహించిన యట్టి రీతి
నసమనయనుడు దారువనాంతరమున
గాంతలను భ్రమియించెడు వింతలాగు
గోపికల గృష్ణు డలయించు క్రొయ్యదనము
లింట పొసపరి నిండ చిత్రించినాడు. (ధనాభిరామం, 2-122)

ఈ గోడమీది బొమ్మలన్నీ శ్రీనాథుణ్ణి చూసి చెప్పినవే. కవిసార్వభౌముడు శృంగారనైషధంలో నలదమయంతుల విహారసౌధంలోని కుడ్యచిత్రాల నిలా వర్ణించాడు:

అమరవల్లభుడు గౌతము కూర్మి నిల్లాలి జీకటితప్పు జేసినవిధంబు
సితభాను డాచార్యు చిగురాకుబోడిపై గన్ను వైచిన కన్నెకలుపుమరులు
నట్టేట దాశకన్యకకు నువ్విళులూరి జాలిబొందిన పరాశరు విరాళి
గారాబుకూతుపై గాగాని పని బూను వనజసంభవుని నెమ్మనము వెలితి
దారువనవీథిశీతాంశుధరుని రంతు - శౌరి గోపాలకామినీచౌర్యకేళి
కామరసభావములుమించికానబడగ - దీర్చియిడువులయందు చిత్రించినారు

(శృంగారనైషధం, 7-151)

ఈ పద్యాన్ని చెప్పాక దీనిని శ్రీనాథుడే అనుసరిస్తూ క్రీడాభిరామంలో మాచల్దేవి ఇంట్లోని చిత్రశాలను ఇలా వర్ణించాడు:

ఆదె దారువనభూమి నసమనేత్రుడు వాడె
సంయమీంద్రుల పుణ్యసతులు వారె
యదె కన్యకారత్న మబ్జాసనుడు వాడె
యదె రతిక్రీడావిహారశయ్యా
వాడె వైకుంఠుడు వారె గోపస్త్రీలు
యమునానదీసైక తాంతకమదియె
అదె యహల్యాదేవి యమరాధిపుడు వాడె
యదె పర్ణశాలికాభ్యంతరంబు
చందురుడు వాడె యదె బృహస్పతిపురంధ్రి
జాలరియు నదె శ్రీపరాశరుడు వాడె
కుశికజుడు వాడె యదె యింద్రుకొలువులేను
చిత్తజుని శౌర్య మెరిగించె చిత్రశాల. (క్రీడాభిరామం, 191)

శ్రీనాథుడు ఇంత చక్కగా వర్ణించిన కుడ్యచిత్రాల వర్ణనను అనుకరించి అనంతరకవులు వాటిని శుద్ధ 'బూతు' చిత్రపటాలను చేశారు. ఎంతో మంచి కవిత్వం వ్రాసే బైచరాజు వెంకటనాథుడు తన పంచతంత్రంలో పడక గదిని ఎలా వర్ణిస్తున్నాడో చూడండి.

చంద్రికపూవన్నె జిలుగుదువ్వలున మేల్కొ ట్టుదంతపుకోళ్ళ పట్టెమంచ
మొరుగుబిల్లలు పట్టుపరుపు కప్రపుబల్కు సురటి క్రొవ్విరులు కస్తూరిరాయి
పూవుకట్టిన గంధపొడి కదంబము పెట్టె కలవంబు చికిలిబాగాలబరణి
పండుటాకులు నాసవోల్బానకములును గండచక్కెర తెల్లపిండివంట
సంజసరిపట్టు బకదారిజాతి పారువములు, గుజరాతి కెంపుదీపములు బూతు
చిత్రపటములు కుడివీరుచెంబుగలిగి తనరు సదనంబు రాజనందనుడుసొచ్చె.
(పంచ. 4-390)

ధనాభిరామంలో నూతనకవి సూరన ఈ చిత్రాలకు ఏమి విశేషణం వాడలేదు. ఆ బొమ్మలున్న మేడలోనికి వెళ్ళి నానావిధ మోహాలతో, నవరసగతుల సుఖంగా ఉన్నాడు మన్మథుడు. ఇంతతో 132 గద్యపద్యాల ద్వితీయాశ్వాసం ముగిసింది.

మూడో ఆశ్వాసంలో ఒక సిద్ధుని వేషం వేసుకుని కుబేరుడు దక్షవాటికలోనికి ప్రవేశిస్తాడు. అప్పుడు కనబడ్డ శుభసూచన నిలా వర్ణిస్తాడు.

క్రమమున బాలభారద్వాజములు వచ్చి చేరువ పచ్చని చెట్ల వ్రాలె
తొలగక చమరు... తునుమయసంబును యెడమదిక్కు నుండి కుడికివచ్చె
కలకలమని పక్షి గలిసి పైజేసెను కదిసి మందర క్షేమకార్మియాడె

బాగొంద బూర్ణకుంభము లెదురుగావచ్చె కళ్యాణమగుచోట గౌళి పలికె
యేచి గణికాసముహంబు లెదురువచ్చె
మంచిమాటలు వినవచ్చె మించి కెలన
వెడల ననుకూలవాయువుల్ విసరె మీద
మేటి ధనదుండు శ్రీదక్షవాటి జొరగ (ధనాభిరామం, 3-7)

మంచి శకునాలను వర్ణించాలనే పోకడ కవులకు పిల్లలమర్రి పినవీరభద్రుడు నేర్పాడు. శకుంతలాపరిణయంలో దుష్యంతుడు వేటకు బయలుదేరినప్పుడు కనుపించిన శకునాలను తరువాత మాండవ్యుడు ఏకరువు పెడతాడు. (శకుంతలా పరిణయము, 1-132)

పినవీరభద్రుని ఆ శకునాల పద్యం చూసే సూరన కుబేరుడు దక్షవాటికలో ప్రవేశించినప్పటి శుభసూచనలను వర్ణించాడు. భీమేశ్వరుని పూజారులను పిలిపించి ఆ దేవుని నైవేద్యానికని నూరు సువర్ణ పుష్పాలు కుబేరుడు సమర్పించాడట. గుడిలో నాట్యమాడేవారికి, అందరూ ఆశ్చర్యపోయేటట్టు మణులు, వస్త్రాలు ఇచ్చాడుట. వచ్చి అడగని వాళ్ళది పాపం! అందరికీ అన్నీ రెండు చేతులా విరజిమ్మాడు. ఆనాటి ఆభరణాల జాబితాను సూరన్న ఇలా వర్ణించాడు.

కమ్మలు పచ్చలకడియాలు జోళ్ళును పతకంబు మొలనూలు బాహుపురులు
పుంజాల దండలు పూదెల కడియాలు ముంగరల్ రాకట్టు నుంగరములు
ముత్యాలపేరులు మొలనూళ్లు డోరీలుకుంటెనల్ నీలాల కంటసరులు
ముంగామురంబులు మొగపులతీగెలు సందులదండలు సరపణులను
బసిడియెత్తులు నేవళా ల్బన్నసరులు
చేరుబొట్లును తాళీలు చెవులపువులు
కదలు మట్టెలు పిల్లాండ్రు మొదలుగాను
బుడమి వెలసిన నవరత్నభూషణములు (ధనాభిరామం, 3-36)

ఇది ఇరవైఆరు ఆభరణాల పట్టిక, ఇటువంటి కేటలాగులు సాంఘిక చరిత్రకు బాగా పనికి వస్తాయి. ఈ జాబితాల కవిత్వాన్ని మూలఘటిక కేతన దశకుమార చరిత్రలో మొదలుపెట్టాడని మనం ఇంతకుముందు చెప్పుకొన్నాం.[4] (దశమ 3-77). కేతనలాగే సూరన నగలను పేర్కొని, తన కాలంలోని చీరల రకాలను కూడా పేర్కొన్నాడు.

వెల్లలు నీటంచు వెలిపముల్ కరకంచు పట్టును జిబులును పదకడములు
మంజిష్ఠకిముకముల్ మదావళంబులు కర్పూరవన్నెలు ముత్తెసరులు (?)
తోపులు బిరనెతులు గజపొప్పళ్ళు వ్రాతలు పతినిలురాయగళులు
జాళీలు చెరగులు సామంతవిధులును కావులు దసలిలు ఖండసరులు
సర్వశృంగారములు చిర్తచౌకములును
చిన్న కస్తురిముళ్ళను... లుక చారు

4. సమగ్రాంధ్రసాహిత్యం - దశకుమార చరిత్ర, కాకతీయయుగం.

వన్నియలు మంచి బొమ్మంచు వన్నియలును
మొదలుగా గల చీరలు ముదమెలర్ప (ధనాభిరామం, 8-37)

ఈ పద్యంవల్ల క్రీ.శ. 1475 ప్రాంతాలలో ఆడవాళ్ల చీరల ఫాషన్లు ఏమిటో మనకు బోధపడతాయి. కుబేరుడిలా విచ్చలవిడిగా చీరలూ, నగలూ కురిపిస్తూ ఉంటే, ఒక్క సుగుణావతి తప్ప అందరూ వెళ్ళి పుచ్చుకొన్నారు. ఆమె తల్లి వెళ్ళి కుబేరుణ్ణి చూసి 'మాయింటికి దయచేయండి' అంది. అతడు ఎంత వారవనిత పిలిచినా ఒకడున్న చోటికి వెళ్ళడం కూళతనం అన్నాడు. ''దానికేముంది, ఉన్నవాణ్ణి వెళ్ళగొడతాను'' అని వేశ్యమాత వెళ్ళింది. 'కంతునైనా నుద్దవిడిగాసిలబెట్టిలు వెళ్లగొట్టెదన్' అని తీర్మానించుకుంది. సిద్ధుని వేషంలో ఉన్న కుబేరుని తన ఇంటికి తీసుకువెళ్ళింది. కాళ్ళు కడిగి కమ్మని పానీయం ఇచ్చింది. అదేమిటంటే -

పసిమిగల క్రొత్తయిప్ప పూరసము దిగిచి
ఖండశర్కరతో కూడ వండి మిగుల
మేలిమి కర్పూరజముతో మిళితమైన
మంచి సారాయి రయమున గొంచువచ్చి (ధనాభిరామం, 3-59)

ఆమె ఇచ్చిన సారాయిని అతడు మణులు తాపడం చేసిన కొప్పెరలో పోసి తాగి బాగులేదని కప్పుతో పాటు పారవేశాడు. 'ఏదీ నీ కూతురు?' అని అడిగాడు? అప్పుడు వేశ్యమాత మేడమీదికి వెళ్ళి కూతురికి హితోపదేశం చేసి పాత అల్లుని వెళ్ళగొట్టమంది. సుగుణావతి వినలేదు. వేశ్యమాత నీతులు చెప్పింది. సుగుణావతి కరిగింది. వెళ్లి సిద్ధుణ్ణి పూజించి వస్తానని మన్మథునితో చెప్పింది. అతడు ఆరు పద్యాలలో 'మన ఒప్పందం ఏమిటంటావు?' అని ఇలా దెప్పిపొడుస్తాడు.

అతులనవరూపవిద్యా - చతురత్వము చూడనైతి జలజానన స
మ్మతి మీర ధనము జూచితి క్షితి వారాంగనల నెందు జేరగ బాసెన్?
(ధనాభిరామం, 3-88)

ఈ మాటలు విన్నాక సుగుణావతి వూరుకొన్నా వేశ్యమాత ఊరుకోలేదు. నాలుగు పద్యాలలో చెడామడా తిట్టింది.

పటువగు నీదు రూపమును బ్రాయము నేర్పును మేలు విద్యలున్
సటవెట మాకు నేల మణిజాలములో కనకాంబరాదులో
నటనలు సేసిపోయెదవు నాకడ జెల్లవు కట్టిపెట్టి మీ
కటకట లంజపెట్టు భువి గల్దె యెరుంగవుగాక యేమియున్
పెట్టినవాడవో సతికి బ్రేమతో సొమ్ములు చాలదెచ్చి చే
పట్టినవాడవో పనులపట్టున నాపదలెల్ల మాన్చి ఛీ
రట్టున కోడవేమియును రాదొక పైకము చాలుజాలు నీ
పట్టువు దోతొలంగు విటపంతముగా దిట నుండ మిండడా!
(ధనాభిరామం, 9-93, 94)

చేసేదిలేక మన్మథుడు బయటికి నడిచాడు, భీమేశ్వరుని గుడికి వెళ్లి ఒక దండకం చదివితే దేవుడు ప్రత్యక్షమయ్యాడు. ధనమే గెల్చి రూపం ఓడిపోయినా భీమేశ్వరుడిలా తీర్పు చెప్పాడు.

రూపు లేకున్న జగములో రూఢి లేదు
ధనము లేకున్న మరియు నంతకును కొరత
వలయు రూపంబు ధనము నవశ్య మఖిల
మానవులకును సురలకు మాన కిపుడు (ధనాభిరామం, 3-106)

భీమనాథుడు చేసిన ఈ రాజీలో, 111 పద్యాలున్న తృతీయాశ్వాసం, దానితోపాటే ధనాభిరామం కూడా సంపూర్ణం అవుతుంది. ఈ కావ్యంలో సానిరమణులు (2-57), సానిచకోరలోచనలు (2-58), మీనటెక్కెము (2-64) అనే వింత ప్రయోగాలు వాడాడు. వేశ్యమాతను 'విటరంపము' అని తరచుగా పేర్కొన్నాడు. ఈ ధనాభిరామం సూరన స్వకపోలకల్పితమో, లేక దేనికైనా అనువాదమో చెప్పలేం. అయితే రావిపాటి తిప్పన వ్రాసిన ప్రేమాభిరామాన్ని, ధనాభిరామాన్నీ మరింగంటి సింగరాచార్యులు ద్విపద కావ్యాలుగా రచించినట్లు తెలుస్తుంది.

అనఘ! ప్రేమాభిరామ ధనాభిరామ
కావ్యములు జాతివార్తలు గడలుకొనగ
ద్విపదలగు జేసితిని గడుగృపను నెన్న
బూని షోడశవత్సరములనె మొదల[5] (సీతాకల్యాణం, R. 703)

సింగరాచార్యుల కాలం క్రీ.శ. 1750 ప్రాంతాలు. ఈయన నూతనకవి సూరన ధనాభిరామాన్ని ద్విపదగా చెప్పాడో, లేక రావిపాటి తిప్పన్న సంస్కృతంలో ప్రేమాభిరామంతోపాటు ధనాభిరామం కూడా చెపితే, దానిని జాతి వార్తలతో చెప్పాడో తెలియదు. ఈ ధనాభిరామం కావ్యం చాలా ప్రచారం పొందిందని కూచిరాజు ఎర్రన వ్రాసిన ఈ క్రింది పద్యం చాటుతూంది.

సాక్షాన్మన్మథు గూడి యిష్ట గతులన్ సంభోగముల్ సల్పినం
దాక్షిణ్యంబున గూడియున్నతరి ఖేదం బొంది హేమాంబరా
పేక్షన్నిల్వ కుబేరునిం గలసి చూపెం గూర్మి కామాంధయై
దాక్షారామమునందు నొక్క సతి కాంతుల్ పేదకుం గూర్తురే?
(సకలనీతి కథానిధానము, 2-332)

సూరన 328 గద్యపద్యాలలో ధనాభిరామంలో చెప్పిన కథను ఎర్రన ఒక్క పద్యంలో సంక్షిప్తం చేశాడు. అలాగే ఇందులోని సారాంశాన్ని సుమతి శతకకారుడు ఏనాడో ఒక్క పద్యంలో వివరించాడు.

5. ఈ పద్యాన్ని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు క్రీడాభిరామం పీఠికలో ఉదాహరించారు. నూతనముద్రణ, పుట 93.

ఎక్కువ చదువు చదివిన - చక్కనివాడైన రాజచంద్రుండైనన్
మిక్కిలి రొక్కము లియ్యక - చిక్కదురా వారకాంత సిద్ధము సుమతీ

ఉత్తరోత్తరా ఇంకొక శతకకర్త అయిన వేమనగారు ధనమన్నది ఎలా ఉత్పన్న మవుతుందో చెప్పారు.

భూమిలోనవుట్టు భూసారమెల్లను
తనువులోన పుట్టు తత్వమెల్ల
శ్రమములోన పుట్టు సర్వంబు ధనమౌను
విశ్వదాభిరామ వినురవేమా!

మన శతక కవుల దృక్పథం విలక్షణమైనది. కావ్యకవుల సంప్రదాయం విభిన్నమైనది. ఇంటిపేరువల్ల మాత్రమే సూరన కొంతవరకూ నూతనకవి.

చంద్రమౌళి, దేవరాజభట్టు

ఆడితప్పని హరిశ్చంద్రుని కథను గౌరన ద్విపద కావ్యంగా రచించి దానికి ఆంధ్రదేశంలో అశేష ప్రచారం కలిగించాడు. గౌరన శ్రీనాథుని సమకాలికుడు. క్రీ.శ. 1385-1445 ప్రాంతాలలో జీవించాడు. గౌరన ద్విపద కావ్యాన్ని చదివాక దాని ప్రభావంలో పడి చంద్రమౌళి అనే కవి ఆ కథను పద్యకావ్యంగా తిరగరాశాడు. ఈ చంపూహరిశ్చంద్ర కావ్యం నేడు దొరకడం లేదుగాని, ఒకనాడు చాలా ప్రచారంలో ఉండేదని చెప్పవచ్చు. దీనిని రచించిన చంద్రమౌళిని అనంతరకవులు నుతించారు. క్రీ.శ. 1720 ప్రాంతాలలోనున్న జంటకవులు తురగా రాజకవి, అయ్యంకి బాలసరస్వతులు ఈ చంద్రమౌళిని సుప్రసిద్ధులైన పూర్వకవులతో చేర్చారు.

నన్నపను దిక్కమఖి బ్రబంధపరమేశు
సాధు నాధర్వణాచార్య చంద్రమౌళి
భాస్కరు ననంతు శ్రీనాథభట్టు భీము
సోము నమరేంద్రు దలతు నుత్సుకత నాత్మ.[1] (నాగరఖండం)

ఈ జంటకవులకన్న చాలా పెద్దవాడు పెదపాటి జగ్గన్న కూడా చంద్రమౌళి హరిశ్చంద్ర కావ్యాన్ని చదివి ఆనందించినవాడే. వాస్తవానికి పెదపాటి జగ్గన్న ఈ గ్రంథంలోని ఒక పద్యాన్ని ఉదాహరించడంవల్లనే చంద్రమౌళి అనే కవి ఒకడు హరిశ్చంద్రో పాఖ్యానాన్ని పద్యకావ్యంగా క్రీ.శ. 1550కి పూర్వం వ్రాశాడని ఊహించగలుగుతున్నాం. జగ్గన్న తన ప్రబంధరత్నాకరంలో పేర్కొన్నది ఒకే ఒక పద్యం. అది రాజదోషాలను తెలియజేస్తుంది.

1. ఈ పద్యాన్ని నిడుదవోలు వెంకటరావుగారు ఉదాహరించారు. భారతి 13వ సంపుటం, 1వ భాగం, పుటలు 166-168.

అలసట టొంకు నాస్తికత యాయతచింత యయుక్తి కారితా
కలనము దీర్ఘసూత్రము వికాసము బొందమి దుర్వ్యయంబు పె
ల్లలుక నిరర్థకార్యరుచి యర్థమతచ్యుతి మంత్రసాని ప్రా
జ్ఞుల వెలి శాంత సౌమ్యకృతిశూన్యత నా నివి రాజదోషముల్
(ప్రబంధరత్నావళి, 136)

పధ్నాలుగు రాజదోషాలను పట్టికలాగ చెప్పే ఈ పద్యం ఏ ఘట్టంలోనిదో తెలియదు. బహుశా, వేటాడి తన ఆశ్రమానికి వచ్చిన హరిశ్చంద్రునికి వసిష్ఠుడు చేసిన నీతిబోధ కావచ్చు. గౌరన తన ద్విపదకావ్యంలో వసిష్ఠుని చేత ఇలా చెప్పించాడు.

అనఘాత్మ పతి కతివ్యసనంబు చనదు - మనువంశమున బుట్టి మరతురే నీతి?
గ్రూరమృగవ్యాళఘోరనిశాట - భేరుండసంచారభీకరంబైన
గహనభూముల గులకాంతయు నీవు - విహరించు టిది యవివేక మంతయును
బురి కేగు మింకొక బుద్ధి చెప్పెదను - జొరకు మెన్నడు గాధిసుతు తపోవనము
జడలుగట్టులు వృథా శాంతి యాతనికి - నుడుగక ముక్కున నుండు గోపంబు.
(హరిశ్చంద్ర - పూర్వ. 651-660)

గౌరన ద్విపదకావ్యంలో వసిష్ఠుడు చేసిన ఈ కొద్దిపాటి నీతిబోధలు చంద్రమౌళి విపులీకరించి ఉంటాడు. రాజదోషాలను పేర్కొనే ఈ ఒక్కపద్యమే కాక మరొకటి కూడా లభిస్తోంది.

అకటా! చేరెడు నేలకుం దగడె సప్తాంభోధివేష్టీభవ
త్సకల ద్వీపకలాపభూపమకుటాం చత్పద్మరాగోజ్వల
ప్రకటానర్గళ నిర్గళత్కరణశుంభ త్పాదుడైనట్టి రా
జుకుమారుండని యేడ్చె కన్నుగవ నశ్రుల్ కాల్వలై పారగన్.[2]

ఈ పద్యం ఆఖరు పద్యంలో, 'రాజకుమారుడు' అని ఉండవలసిన చోట 'రాజుకుమారుడు' అని యతిస్థానంలో ఒక ప్రయోగం ఉంది. దీనిని గణపవరపు వేంకట కవి అనే లాక్షణికుడు తన 'ఆంధ్రకౌముది' అనే గ్రంథంలోని వ్యాకరణ సీసమాలికలో పేర్కొన్నాడు.

సరసపుమాటల చంద్రమౌళికవి రచన ఘటించిన హరిశ్చంద్రకథను
ధోరణి గ 'నకటా చేరెడు నేలకు' ననెడి మత్తేభ నాలవపదమున
రాజుకుమారుడ' న్నా జిల్లె జేతనమగు పదమునకు షష్ఠ్యర్థమునను
రహిగ నాదేశంబు రాక యీ రీతుల గృతులందు జెల్లు నొకెక్కడలగనుక
యెచట నేయర్థమం దెట్లుండె సట్టులె రచియింపగావలె రసికుల కిక.
(ఆంధ్రకౌముది, పుట - 30)

---

2. ఆంధ్ర సాహిత్యపరిషత్తువారి ప్రచురణ, సంఖ్య 36

యతికోసం, గణాలు కిట్టించుకొనడంకోసం మాత్రమే కాక నిజంగా చంద్రమౌళి సరసపు మాటలలో హరిశ్చంద్ర కావ్యాన్ని వ్రాయడం వల్లనే గణపవరపు వెంకటకవి ఈ విశేషణాన్ని చెప్పి ఉంటాడు. క్రీ.శ. 1674లో ఈ లాక్షణికుడు ఉదాహరించిన 'అకటా చేరెడు నేలకు' అనే మత్తేభం క్రీ.శ. 1500–1550 ప్రాంతాలలో ఉన్న రేచనగారి శంకరకవి రచించిన హరిశ్చంద్ర కావ్యంలో నేడు కనబడుతుంది. అయితే శంకరకవి కావ్యంలో ఈ అర్థం వచ్చే పద్యాలు రెండున్నాయి. చితి పేర్చడానికి ముందు కాటిసుంకంగా ఒక మాడ ఇమ్మని హరిశ్చంద్రుడు అడిగాక, శంకరకవి కావ్యంలో చంద్రమతి ఇలా విలపిస్తుంది.

> శ్రీలు దైవార జలనిధి – వేలావలయితధరిత్రి విమలయంశుండై
> యేలు నృపనూతి యడుగెడు – నేలకు పాత్రుండు గాడె నీ కిటుతగునే?
>
> (హరిశ్చంద్ర, 5–84)

ఈ పద్యం తరువాత 'అని మరియు' అనే చిన్న వచనం ఆ పిమ్మట 'అకటా చేరెడు నేలకుందగడె' అనే మత్తేభం శంకరకవి కావ్యంలో కనబడుతున్నాయి. ఈ వచనమూ, పద్యమూ ప్రక్షిప్తాలని చెప్పవచ్చు. పునరుక్తిగా శంకరకవి ఈ మత్తేభం వ్రాయడని చాగంటి శేషయ్యగారు భావిస్తున్నారు.[3] అదీకాక, ఒక సుప్రసిద్ధ లాక్షణికుడు చెప్పాక ఈ మత్తేభం చంద్రమౌళి రచనే అని విశ్వసించాలి. అయితే ఇంకొక లాక్షణికుడు ఉదాహరించిన దానినిబట్టి క్రీ.శ. 1715 – 1756 మధ్య ఈ 'అకటా చేరెడు నేల' అనే పద్యం కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణసారసంగ్రహంలో హరిశ్చంద్రోపాఖ్యానంలో నుంచి ఆరు ప్రయోగాలు ఇచ్చాడని తెలుస్తూంది.[4] ఆ ప్రయోగాలు ఈ పద్యాలలోనివని తెలుస్తున్నాయి.

1. సమయసముచితమృదువాక్యసరణి వెలయ (హరి 1–76, సర్వ. పుట 78, పద్యం 47)
2. తన సామ్రాజ్యము బాసినన్ (హరి. 1–175, సర్వ. పుట 162, పద్యం 68)
3. నీవు చేసిన దోషంబు నీకె యుండె (హరి. 2–172, సర్వ. పుట 148, పద్యం 80)
4. క్ష్మాచక్రమెల్ల విశ్వామిత్రమునికి (హరి. 4–207, సర్వ. పుట. 161, పద్యం 64)
5. ఒక్కింత శంకింపకున్న సాహసురాల (హరి. 5–73. సర్వ. పుట 56, పద్యం 129)
6. అకటా! బెత్తెడు నేలకుం దగడె! (హరి. 5–86, సర్వ. పుట 56, పద్యం 18)

ఈ వరుసలోని మొదటి ఐదు ప్రయోగాలూ కూచిమంచి తిమ్మకవి నికరంగా శంకరకవి గ్రంథంలోనుంచే ఇచ్చాడు. ఆరవది కూడా అందులోనుంచే ఇచ్చాడని మంత్రిప్రగడవారి ప్రతి చూస్తే అనుమానించవచ్చు. కాని నా దగ్గిర వున్న మరొక గుజిలీప్రతిలో ''యొక్క షష్ఠికి సులభము'' అనే వచనమేగాని 'అకటా! జుత్తెడు నేలకున్' అనే ఉదాహరణమే లేదు. ఇది మంత్రిప్రగడవారి ప్రతిలో విలేఖకులు చేర్చినట్టున్నారు.

---

3. ఆంధ్రకవితరంగిణి, 8వ సంపుటి, పుట 76. 4. రాజామంత్రిప్రగడ భుజంగరావుగారు ప్రచురించిన సర్వలక్షణ సారసంగ్రహం (1901) ప్రతిలోని నీ ఉదాహరణలు.

'జుత్తెడునేల', 'అడుగుడునేల' అనేవన్నీ ఏ కవి అయినా గౌరన నుండే గ్రహించారు. అతడు ద్విపదలో ఇలా వ్రాశాడు:

సకలదీపుల నేలు జనపతిపుత్రు - డకట! చేరెడు నేల కర్హుండు గాడె?

(హరి. ఉత్తర. 2162-63)

ద్విపద కావ్యాలలో గౌరన ఏది రాస్తే అది చంద్రమౌళి, శంకరకవీ అనుకరించినట్టు తోస్తుంది. దొరికిన రెండు పద్యాలవల్లా చంద్రమౌళి కొంత స్వీయప్రతిభను జోడించినట్లు కనబడుతుంది. పూర్తిగ్రంథం ఎప్పుడేనా దొరికితే చంద్రమౌళి సరసపు మాటలేమిటో తెలుసుకోగలుగుతాం.

చంద్రమౌళేకాక శంకరకవికి పూర్వం దేవరాజభట్టు అనే కవికూడా హరిశ్చంద్ర కథను చక్కని పద్యకావ్యంగా వ్రాశాడు. ఈ గ్రంథంలోనుంచి రెండు పద్యాలను ఒక ప్రాచీక సంకలనకర్త సేకరించాడు.[5] ద్విపద హరిశ్చంద్రలో గౌరన వ్రాసిన భావాలను శంకరకవీ, చంద్రమౌళీ అనుసరించారు కానీ దేవరాజభట్టు అలా చేయలేదేమో అని ఈ రెండు పద్యాలవల్లా తెలుస్తూంది. ఇతడు విష్ణుభక్తుడు. దిక్కులనే ఆకులున్న లతలాగ భూమి విష్ణుగ్రహాన్ని చుట్టుకొంటే ఆకాశమనే పూవు, అబ్జజాండమనే పండు పండుతుందని ఒక చక్కని పద్యంలో చెప్పాడు.

అంబుధు లాలవాలము దిగంతము లాకులు కూర్మశేషవ
ర్ష్మంబులు కందమూలములు చక్రపు గొండలు కోట నాగ హ
ర్షంబున విష్ణువిగ్రహకుజంబున జుట్టి పెనంగి మిన్నుపు
ష్పంబుగ నబ్జజాండ మను పండును బండు ధరిత్రి వల్లియై.

(ప్రబంధరత్నావళి, 180)

అయోధ్యానగరం అమరావతికన్నా గొప్పదని దేవరాజభట్టు ఇలా వర్ణించాడు:

సురనిచయంబు ద్రోచి నహుషుం డటు లేలకయున్న రాక్షసు
ల్వరుసల వచ్చి చూరకొని వాసవు వెట్టికి బట్టకున్న శ
ర్వరిగనుమూయగన్న ద్రిదివం బను నారడి నల్పజీవమై
యరుగక భూమినున్న అమరావతి యీడగు నయ్యయోధ్యకున్.

(ప్రబంధరత్నావళి, 181)

స్వతంత్రంగా ఇంత చక్కని కవిత్వం చెప్పిన దేవరాజభట్టు కావ్యం నష్టం కావడం నిజంగా దురదృష్టమే. ఈ కవులేకాక మరొక అజ్ఞాత కవికూడా హరిశ్చంద్ర కథ పద్య ప్రబంధంగా వ్రాశాడు. శ్రీరామునికి అగస్త్యుడు ఈ కథ చెప్తాడు. ఈ కావ్యంలో 18 తాటాకులు మాత్రమే దొరుకుతున్నాయి.[6] హరిశ్చంద్రుని అడవులకు పోవడం దాకా గ్రంథం దొరుకుతూంది.

5. ఆంధ్రసాహిత్యపరిషత్తులోని ఉదాహరణపద్యాలు సేకరించిన కవి.
6. మదరాసు ప్రాచ్యలిఖితగ్రంథాలయం సంఖ్య R-400 ట్రై కేటలాగు, మూడవ సంపుటి, మూడవ భాగం, పుట 1007

విరజాజు లే వేళ దురిమెడు వేసలి ముడి విప్పి జడలుగా మురియజేసి
గురుతరలలితదుకూలముల్ దొలగించి కాఠిన్యవల్కాంశుకములు గట్టి
మణిమయమకుటభూషణములు దొలగించి యక్షమాలికలు నెయ్యమునదాల్చి
శ్రీచందనము వగ చిల్కెడు మేన ధరాపరాగము దాల్చి యేపు మిగిలి
రాజయోగిరీతి రాజవర్యుం డేగ - సతియు సుతుడునట్ల చనిరి తోడ
జూచి పౌరు లెల్ల శోకార్తులై యట్టి - కారణంబుజేసెగా విధాత.

ఈ పద్యాలు గౌరనకు అనుకరణలు కావు. ఈ అసమగ్రకావ్యం వ్రాసిన రచయిత పేరైనా కనీసం తెలియకపోవడం విచారకరమే.

వీరశరభకవి అనే యింకొక రచయిత వ్రాసిన హరిశ్చంద్రోపాఖ్యానం కూడా లభిస్తుంది.[7] ఇది సమగ్రమేగాని కృత్యవతరణిక లేదు. కాబట్టి కవి కాలం తెలియదు. కావ్యం ద్వైతవన వర్ణనతో మొదలవుతుంది. కాబట్టి గౌరనకు అనుసరణ అని చెప్పవచ్చు. అంతేకాదు. పద్యం ఎత్తుగడ శంకరకవి రచనలోలాగే ఉంది. ఈ విషయాలు తరువాత చర్చించుకొందాం.

---

7. మదరాసు ప్రా.లి. గ్రంథాలయం సంఖ్య R-812 ట్రై. కేటలాగు, 5వ సంపుటి.

కూచిరాజు ఎర్రన్న

కామం పురుషార్థాలలో మూడవదని మన ప్రాచీనులు నిర్ణయించారు. నరుడు 'కామి గాక మోక్షగామి' కాడన్నారు. కామం పాపం కాదనే ఆరోగ్యవంతమైన దృక్పథం అలవరిచారు. ధర్మశాస్త్రాలూ, అర్థశాస్త్రాలూ వ్రాసినట్టే కామశాస్త్రాలు కూడా వ్రాశారు. 'వాత్స్యాయన కామసూత్రాలు' జగత్ప్రసిద్ధమైన గ్రంథం. సంస్కృత వాఙ్మయంలో కామశాస్త్రానికి సంబంధించిన శాఖలో ఇది ప్రాచీనతమమైనది. వాత్స్యాయనుడు క్రీ.పూ. 150 సంవత్సరాల ప్రాంతంవాడైన పతంజలికి ఇంచుమించు సమకాలీనుడని పండితులు భావిస్తున్నారు.[1] అయితే ఇంత ప్రాచీనమే కాకుండా ప్రామాణికం అయిన వాత్స్యాయన కామసూత్రాలకు కాక 'కొక్కోకము' అనే రతిరహస్యానికే ఆంధ్రదేశంలో ప్రశస్తి వచ్చింది. పంచకావ్యాలకూ వ్యాఖ్యానం వ్రాసిన మల్లినాథసూరి కొక్కోకము నుంచి ఉదాహరణ లిచ్చాడు. క్రీ.శ. 1450-1500 ప్రాంతాలలో ఉండే కూచిరాజు ఎర్రన కొక్కోకాన్ని తెనిగించాడు. తెలుగులో మనకు దొరుకుతున్న కామశాస్త్రం గ్రంథాలలో ఇదే మొదటిది.

ప్రాచీనమైన వాత్స్యాయన కామసూత్రాలు ఉండగా కొక్కోకాన్నే మనవాళ్ళు అనువదించడానికి సామాజిక పరిస్థితులే బహుశా కారణం. వాత్స్యాయనుడు 'ధర్మార్థ కామేమోభ్యోనమః' అని తన గ్రంథాన్ని మొదలుపెట్టాడు. అతనిది మడికట్టుకొన్న కామశాస్త్రం. కొక్కోక పండితుడు కామశాస్త్ర ప్రయోజనాన్ని ఎత్తుకొంటూనే ఇలా చెప్పాడు.

> అపాధ్యాయా స్సుంసిద్ధి స్సాద్యాయా శ్చానురంజనం
> రక్తాయా శ్చ రతి స్సమ్యఖ క్కామ శాస్త్ర ప్రయోజనం

ఈ శ్లోకాన్ని కూచిరాజు ఎర్రన్న ఇలా అనువదించాడు.

> తన కసాధ్యమైన తరుణి సాధించుట
> దొరకెనేని తన్ను మరగికొనుట
> మేలు కలుగు సతులు మెలుపంగ నేర్చుట
> కామశాస్త్రమునకు కలుగు ఫలము (కొక్కోకము, 1-3)

అసాధ్యం అయిన ఆడవాళ్ళను వశపరుచుకోవడానికి చిట్కాలు చెప్పే కొక్కోకం అధిక ప్రచారం పొందడంలో ఆశ్చర్యం లేదు. కొక్కోకం పండితుడు తన రతి రహస్యంలో జాత్యాధికారం మొదలైన 15 ప్రకరణాలు వ్రాశాడు గానీ కూచిరాజు ఎర్రన్న మూడు అధికరణాలే అనువదించాడు. ఆడవారిలోనూ, మగవారిలోనూ ఉండే పద్మినీజాతి మొదలైన జాతి బేధాలు, ఏఏ దేశాల ఆడవారికెలా ఎలా తృప్తి కలుగుతుందో మొదటి ఆశ్వాసం వివరిస్తుంది. అరవైనాలుగు బంధాలూ, అందులోని భేదాలూ, విపరీతబంధాలకు

---

1. వాత్స్యాయన కామసూత్రములు, 1930-పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు, పీఠిక, పుట 4

తగినవాళ్ళెవరో రెండవ ఆశ్వాసం తెలుపుతుంది. మూడవ ఆశ్వాసంలో ఆడవాళ్ళను వశపరచుకోవడానికి మంత్రాలూ, మూలికలూ మొదలైనవి చెప్పాడు. వాటితోపాటు వీర్యవృద్ధి, గర్భోత్పత్తి వంటి విషయాలు కూడా ఉన్నాయి.

కొక్కోకంనుంచి అనువదిస్తున్నప్పుడు కూచిరాజు ఎర్రన్న ఎటువంటి ప్రణాళిక వేసుకొన్నాడో రమారమి అదే పద్ధతి భారతదేశంలో అందరూ అనుసరించారు. కొక్కోక పండితుడు కామశాస్త్ర ప్రయోజనాన్ని ప్రకటించి విజయభేరి మ్రోగించాక దేశంలో పరిస్థితులు ఎలా మారిపోయాయో పంచాగ్నులవారిలా వివరించారు.[2]

''సరి, ఇకనేమున్నది? క్రొత్త యొక వింత పాత ఒక రోత' అని కదా కేవలము పరమ శ్రోత్రియులము; అనూచానము నావంతయేని జవదాట మనుకొన్న మహామహోపాధ్యా యులందరును నాడు మొదలుకొని కొక్కోకుని త్రోవ తొక్కినారు. దానితో ఎవ్వరే గ్రంథమును చేసినను జాత్యాధికారము బంధాదికారము వశౌషధనిధానములు మొదలగు ప్రకరణములు అనివారితముగా నారంభింపబడినవి. నిజమునకు వాత్స్యాయనాదులలో గూడా బంధాదులును వశ్యౌషధాదులును లేకపోలేదు. కాని వానికి నియమము కలదు. ప్రయోక్తృ భేదములు కలవు. ఇంతయేల ఔపనిషధికాధికరణమును అవలంభించు వాత్స్యాయను డేమనుకొనుచున్నాడో చూడుడు. 'వ్యాఖ్యాతంచ కామసూత్రం తత్రోకైః విదిభిం అభిప్రేత మర్థం అవధిగచ్ఛ న్నౌపనిషదిక మాచరేత్'' అన్నాడు. కాని మనవారు పెండ్లికిని పిడుగునకు ఒకటే మంత్రమును సాయించినారు.''

మంత్రాలతో చింతకాయలు సహా రాల్చగలమనే గట్టి నమ్మకం ఉన్న మన ప్రాచీనులు ఆడవాళ్ళను వశపరచుకోవడానికి మహామంత్రాలు పుట్టించారు. ''ఓం చాముండ జయజృంభ మోహాయ వశమానయాయ స్వాహా'' అని మంత్రించి పూవులు పంపితే ఎలాంటి వనితైనా వశమవుతుందట.[3] కూచిరాజు ఎర్రన్న మరో చిట్కా చెప్పాడు.

వెఱ్ఱి యెత్తినట్టి నేపి దక్షిణదిక్కు నెముకమీద నొక్క యింతిపేరు
వ్రాసి ప్రేతభూమివహ్నిచే గాల్చంగ - వలచివచ్చు నెట్టి వనితయైన
(కొక్కోకము 3-23)

వెఱ్రికుక్క కుడిపక్క యెముకమీద ఆడదాని పేరు వ్రాసి వల్లకాట్లో తగలబెడితే ఆ పేరున్న స్త్రీ ఎలాంటిదయినా వచ్చి వశమవుతుందట! పేరు రాస్తున్నప్పుడు కుక్క కరిస్తే వెఱ్రి కుదిరి రోకలి తలకు చుట్టాలి! ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా ఇటువంటి చిట్కాలు యిస్తే నమ్మేవాళ్ళుంటారు. ఈ మంత్రాలూ తంత్రాలూ చెప్పేవాళ్ళకు దండం పెడతారు.

సుకవులే దండం పెట్టగా కొక్కోకాన్ని తెలుగు చేస్తానని కూచిరాజు ఎర్రన్న సంకల్పించారు. ఇతనికి రాచరామన అనే ఇంకొక పేరుంది. నవఘంటాసుత్రాముడు అనే

2. వాత్స్యాయన కామసూత్రములు, పీఠిక, పుట 15.
3. కొక్కోకము, 3-15

బిరుదు వుంది. ఇతడు అష్టభాషా కవిప్రవీణుడు. అవధానకవిత్వం కూడా చెప్పేవాడు. క్రీ.శ. 1468-1497 ప్రాంతాలలో పురుషోత్తమ జగపతి పాలనలో ఆంధ్రదేశంలోని వినుకొండ దుర్గాన్ని కుంటముక్కల మల్లమంత్రి ఏలుతూ ఉండేవాడు. ఇతడు కూచిరాజు ఎర్రన్న కొక్కోకాన్ని తెనిగిస్తున్నాడని విన్నాడు. అతణ్ణి పిలిపించి ఇలా అన్నాడట.

నవఘంటానుత్రాముడ - నవధానకవీశ్వరుండ వగు దీపు మహినె
దివిరి రచియింప బూనిన - కవితామణి భూషణంబు గావలె మాకున్
జల్లులు పదపూరణములు బొల్లులు నసమర్థములును బునరుక్తములుం
జెల్లని విడి ప్రాసంబులు వల్లికలును బోరవు నుపధమగు నీకృతినిన్
(కొక్కోకము 1-10-11)

అంకితం పుచ్చుకోబోయేవాడు ప్రతికవి కవిత్వాన్ని ఇలా పొగడుతూనే ఉంటాడు. అయితే కొక్కోకము తెనిగింపులో నిజంగా జల్లులు, పదపూరణములు మొదలయినవి కనబడవు. ఇతని అనువాదం గురించి పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు ఇలా వ్రాశారు.[4]

'ఎర్రయకవి ఆంధ్రీకరణము భావప్రధానమైనది. కాని ప్రతిపదార్థపరిపాటిని పాటింపదు. అసలే కొక్కోకకవి క్రొత్తదోవ ద్రొక్కినాడు. ఆపైని ఎర్రయ కవియును మరియొక ఆకు నెక్కువ చదివినాడు. ఈయన ఏ అధికారమునం దేశ్లోకము నాంధ్రీక రించినను నరనారీప్రయోజనము లేనిదే కదలువాడు కాడు. కామశాస్త్రమునందంతటను ముఖ్యమగు నాయిక వేశ్య యేనా అని ఈయన గ్రంథము చదువుచున్నప్పుడు దోచును.'

అయితే పాపం ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఎర్రన్న ప్రతివ్రత లక్షణాలు మొదలైనవి వ్రాయకపోలేదు.

కసవున్ గట్టెలు నూకలు న్నుముక యంగారంబునున్ భస్మమున్
మసలంబాయక చేర్చి దాసులకు గర్మవ్యాప్తి పాటించి దు
ర్వ్యసనంబుల్ విడజేసి భర్త విడువన్ వస్త్రాదిసంరక్షణన్
బిసబాహామణి జాగురూక యయి మన్నింపదగున్ భృత్యులన్
(కొక్కోకము, 2-145)

ఇంట్లో చాలా కసపు, కట్టెలు, నూకలు, ఊక, బొగ్గులు, బూడిద మొదలయిన 'నిష్కామము' పదార్థాలతో మునిగిన ఇల్లాలు భర్తతో ఎలా సుఖించాలో చెప్తున్నాడు.

పూవుందోటల వృక్షవాటికలలో బూబోడి బ్రాణేశు సం
భావింపన్ వలయున్ విదూషక నట భ్రష్టాంగనా భిక్షలున్
దైవజ్ఞుల్ వెలయాలునున్ వివిధమంత్ర ప్రక్రియాయోగినీ
భావస్త్రీ సహభాషణంబులు నసద్భావ్యంబు లిల్లాలికిన్ (కొక్కోకము, 2-142)

4. వాత్స్యాయన కామసూత్రాలు, పీఠిక, పుట 19.

ఇల్లాలికి ఎవరెవరి స్నేహసంభాషణలు కూడవో చెప్పాడు. దానికి ముందు ఆరుబయట తోటలో కలుసుకోవాలని చెప్పాడు. అయితే పడకగది ఎలా ఉండాలో వర్ణించాడు:

పట్టెమంచము దూదిపరుపు ముక్కాల్పీట యగురుధూపము వెలుగైన దివ్వె
పూలు గంధము గంధపొడి పున్గు బరిణయు జాలవల్లిక వన్నె మేలుకట్లు
తమపదగమ్మును దలగడ చిరుచాప సానరాయడవంబు సంచి గిద్ద
గొడుగు పాపలు గాజుగుడక నున్న పుగ్రోని గంధపుజిప్ప బాగాల బరిణి
గిండి చెంబును జిరు తెరగిన్నె బోన - నిలువుటద్దము వీణయు జిలుకసురటి
మిదియ యిల్లును మంజూరు మిగిలినట్టి పంచయును గల్గు కేళికాభవనమును.
(కొక్కోకము, 2-2)

ఇటువంటి కేళికాభవనాలు కలవారికే సాధ్యమవుతాయి. భాగ్యవంతులకు తప్ప ఇటువంటి చిత్రభోగాలు లభించవు. ఈ సంగతులే కొంచెం వేదాంతం చెప్పాక విశదం చేస్తున్నాడు.

భవము ఘటాంతతోయచలభావము, దీనికి సారమొక్కటే
వివిధ సుఖ ప్రపంచ మతివిభ్రమ మందుల సౌఖ్య మాత్మలో
దవిలిన చర్మ నిర్మితము దాని నెరుంగడు మందబుద్ధి హృ
ద్భవరతిచిత్ర భోగములు భాగ్యవిహీనులు కెట్లు చొప్పడున్?
(కొక్కోకము, 1-32)

ఈ కొక్కోకాన్ని అంకితం పుచ్చుకొన్న కుంట ముక్కల భైరవమంత్రి భాగ్యవంతుడే. ఇతని కీర్తి కటకం, గుల్బర్గ, ఢిల్లీ నగరాలదాకా ప్రాకింది. ఇతణ్ణి గజపతి, అశ్వపతి గౌరవించారని చెప్పాక కూచిరాజు ఎర్రన్న ఇలా షష్ఠ్యంతాలు మొదలుపెట్టాడు.

ఇటువంటి మంత్ర నిధికిని - బటుతరవిద్యావిశేషపాండిత్యునకున్
గటక కలుబరగు ఢిల్లీ - కటక స్తవనీయసుగుణగుణనీయుకున్.
(కొక్కోకము, 1-20)

ఈ మల్లమంత్రికి కటకం గజపతులు మహాపాత్ర బిరుదు ఇచ్చారు. కలుబరగ అశ్వపతుల దండనాథుడు జమాఖాను వినుకొండ దుర్గాధిపత్యాన్ని మల్లమంత్రికి ఇచ్చాడు. ఈ సంగతులన్నీ ఈ క్రింది పద్యంవల్ల తెలుస్తున్నాయి.

హరిపదధ్యానసురుడు చందలమహాలక్ష్మీ ప్రదానైక లభ్యదనుడు
రమణతో గజపతిరాయ లిచ్చిన సముంచిత మహాపాత్ర ప్రసిద్ధయశుడు
ఆ జమాఖానరాయని చేత నొడయడై వినుకొండ దుర్గమేలిన ఘనుండు.[5]

5. ములగనేటి సోమయాజిశర్మగారు ప్రచురించిన కొక్కోక ప్రతిలో (1955) అజిముఖానరాయునిచేత నొడయడై 'ఘనమన్నె' దుర్గ మేలిన అనే పాఠాంతరం ఉంది.

గుడిచెర్వు నల్లిల్లు కృతిపతినని క్షేప తనయాదిసప్త సంతానకరుడు[6]
మునిపరాశరగోత్ర సంజనితు డార్య
శేఖరుని వెంకటాచార్యు శిష్యు డనఘు
మంత్రి పెరుమాళ్ళతో కొమ్మయ మనుఓబయ్యా
మంత్రి తెలగయ్యా భైరవమల్లమంత్రి (కొక్కోకము, 1-18)

ఈ పద్యంలోని చివరి పాదాలలోని పేర్లు మల్లమంత్రి తాతముత్తాల పేర్లు, కుంటుముక్కల వారి వంశంలో పెరుమాళ్ళమంత్రి పుట్టాడు. అతని కొడుకు కొమ్మయ ఆయనకు మనుమయ్యా జనించాడు. ఇతని కుమారుని పేరు ఓబమంత్రి. ఈయనకు తెలగయ్యా అనే కొడుకున్నాడు. ఇతనికి భైరవమంత్రి ప్రభవించాడు. ఈయన కుమారుడైన మల్లమంత్రే కృతిభర్త. 'పేదరాసి పెద్దమ్మా పెద్దమ్మ కొడుకా కొడుకుచేతి గొడ్డలా' అన్నట్టు కనిపించిన ఈ పద్యం వంశవృక్ష నిర్ణయానికి, చరిత్రకారులకు ఎంతో పనికి వస్తుంది.

కొక్కోకం అంకితం పుచ్చుకొన్న మల్లమంత్రి భైరవమంత్రికి చిన్నకొడుకు. పెద్దకొడుకు పేరు గంగయ్యా. ఈ గంగయ్యా మంత్రికి కొడుకు పుడితే తండ్రి పేరే పెట్టుకొన్నాడు. అతణ్ణి పినభైరవుడు అంటారు. ఈ పినభైరవుడు కూడా గజపతుల కొలువులో ఉన్నాడు. గంధకరీంద్రశిక్షుడై[7] కొండపల్లి దుర్గానికి ఏలిక అయ్యాడు. మహాపాత్రబిరుదు వహించాడు. తన పినతండ్రికి కొక్కోకం అంకితం ఇచ్చిన కూచిరాజు ఎఱ్ఱన్నను అతడు కొండపల్లికి రప్పించాడు. 'పురాణసారం' అనే కృతిని అంకితం పుచ్చుకున్నాడు. తరువాత కొన్నాళ్ళకు ఇలా అన్నాడు.

శ్రీవత్సగోత్రవారధి పూర్ణశీతాంశుడికి కూచిమంత్రికి నాత్మజుడవు
వివిధాష్టభాషాకవిత్వవాచాప్రౌఢి- బూర్వ కవీంద్రుల బోలినాడ
వఖిల పురాణేతిహాసకావ్యస్మృతిచయము రచించిన చారుమతిని
మాపిన తండ్రియౌమల్ల మంత్రికిని గొక్కోకం చెప్పిన కోవిదుడవు
రసికు లభినుతిసేయ బురాణసారమనుపమంబుగ నాకిచ్చినట్టి ప్రౌఢ
వట్లు గావున నొకటి నిన్నడుగ దలచి - యిచ్చటికిబిల్వ బంచితి నెఱ్ఱనార్య!
(సకలనీతి కథానిధానము, 1-18)

పినభైరవమంత్రి అడగదలచినది ఏమిటంటే - తనకు కలియుగ భూపాలుర కథలన్నీ వినాలని ఉంది. వాటిని ఎఱ్ఱన్న ఆంధ్రకావ్యంగా వ్రాయాలి. వ్రాసి, తన ఇష్టదైవమైన తిరుపతి వెంకటేశ్వరునికి అంకితమివ్వమని పినభైరవమంత్రి కోరాడు. ఎఱ్ఱన్న అంగీకరించాడు. 'సకలనీతికథా నిధానము' అనే ఐదు ఆశ్వాసాల గ్రంథం వ్రాశాడు.

---

6. చాగంటి శేషయ్యగారు, ఆంధ్రకవితరంగిణి, 8వ సంపుటి, పేజి 202లో 'కృతివననిక్షేప పృథు తటాకాలయ తనయాది' అనే పాఠం ఇచ్చారు. ములగలేటివారు 'గుడిచెర్వువర్ధిల్లు వడివననిక్షేప' అని అచ్చువేశారు.

7. సకలనీతి కథానిధానము, 5-222

ఇందులో 1662 గద్యపద్యాలు లభిస్తున్నాయి.[8] ఈ కథలన్నీ నారదుడు బలిచక్రవర్తికి చెప్పాడని ఎర్రన్న ఒక పుక్కిటి పురాణాన్ని కల్పించాడు. ప్రథమాశ్వాసంలో విక్రమార్క చరిత్రనంతా వ్రాశాడు. ద్వితీయాశ్వాసంలో భేతాళ పంచవింశతి పూర్తిగా చెప్పాక కేయూరబాహు చరిత్ర వివరించాడు. తృతీయాశ్వాసంలో పంచతంత్రం తిరగవ్రాశాడు. చతుర్థాశ్వాసంలో దశకుమార చరిత్రలో 125 నీతిపద్యాలు చొప్పించాడు. పంచమా శ్వాసంలో కథాసరిత్సాగరంలోని కథలు కొన్ని చెప్పాడు. వీటిని సంస్కృతమూలంనుంచే కాక తెలుగు కావ్యాలలోంచి తీసుకున్నాడు. కేయూర బాహుచరిత్రలో మంచెన ఇరికించిన నీతికథల వరుసను ఎర్రన్న యథాతథంగా అనుకరించాడు. పూర్వకవులు చెప్పినవి శిలాక్షరాలుగా భావించి అలా చేశాడు కాబోలు. సుకవుల రచన గురించి ఈ అభిప్రాయం ఇలా చెప్పాడు.

సుకవులు, చెప్పిన కవితా-నికరములు శిలాక్షరముల నిలుకడ గాంచున్
గుకవులు చెప్పిన కవితా-నికరములు జలాక్షరముల నీచత నణగున్
(సకలనీతి కథానిధానము, 1-10)

ఈ సకలనీతి కథానిధానములోని 1662 గద్యపద్యాలలో 125 నీతిపద్యాలు పోగా, 35 కృత్యాది పద్యాలు మొదలైనవి పోగా మిగిలిన 1500 గద్యపద్యాలలో సుమారు 150 కథలు చెప్పడానికి ఎర్రన్న ప్రయత్నించాడు. అంటే కథకు సగటున పది పద్యాలు అన్నమాట. ఒకప్పుడు ఒకే ఒక పద్యంలో కథ చెప్పాడు. ఏ గూటిచిలక ఆగూటి పలుకే పలుకుతుందని ఒక సీసపద్యంలో చెప్పాడు.

వేటవో యొక భూమివిభుడు బోయలపల్లె జేరంగ వాకిట చిలుక జూచి
'జనపతి చనుదెంచె జంపి సొమ్మెల్లను బుచ్చుకొండ'నుటయు బోక మిగిడి
యొక మునీశ్వరుల పల్లెకు జేర వాకిట కీరంబు బలికెను. 'క్షితివిభునకు
నర్ఘ్యపాద్యాదు లి'మ్మనిన సంతోషించి మునుపటి చిలుక దన్ననినమాట
జెప్పుటయు భూమిపతికి నచ్చిలుక పలికె నట్టి కీరంబు నాతోడబుట్టె దుష్ట
సంగతమున ని న్నభంగి ననియె - శిష్ట సంగతి నేబూజసేయు మంటి.
(సకలనీతికథానిధానము, 3-54)

కేయూరబాహు చరిత్రలో 'బుద్ధిమాలిన కపి భూపాలుని చంపిన కథ'ను మంచెన 12 గద్యపద్యాలలో వర్ణించాడు. (3-289-300). ఈ కథనే ఎర్రన్న ఒక్క పద్యంలో ఇలా చెప్పాడు.

ఒకనాడు నృపతి వేటకు నేగి మర్కట శిశువును తెచ్చి బోషింప బెరిగి
యదియు వర్ధనబొంది యధిపతి హితచర్య వర్తింప నాసన్నవర్తి జేసి
ఖడ్గ మొక్కటి దాని కరమున కందించి యేనిద్రపోయెద నీవు నన్ను
బోతుటీగైనను బొలయంగ రాకుండగాచుండు మెవ్వరే గదిసిరేని

8. మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయ ప్రచురణల్లో, సంఖ్య 18గా దీనిని ప్రకటించారు. గ్రంథపాఠాలు చాలా ఉన్నాయి.

ఖండనము చేయు మనిన నక్కపియు నట్ల
నుండి భూపతి నిద్రింప నొక్క యీగ
ముట్టుటయు ఖడ్గమున దాని బెట్టుగొనిన
గళముదెగుటయు బ్రాణసంగతిని బాసె. (సకలనీతి కథానిధానము, 2-85)

ఇంత పరమ టూకీగా కథ చెప్పితే ఎలా రసవంతంగా ఉంటుంది? పాత్రపోషణ ఉండదు. ఎక్కడోగాని సంభాషణలు ఉండవు. ఉన్నా చమత్కారాలకు ఆస్కారం ఉండదు. ఏఏ సన్నివేశాలలో పాత్రలు ఏఏ అనుభూతులు పొందుతాయో ఏవిధంగా భావించాయో కవి ఏమీ చెప్పడు. ఈ సకలనీతి కథావిధానము వాస్తవానికి బోలెడు కథల అస్పష్టరేఖా చిత్రాలని చెప్పవచ్చు. కొక్కోకం వంటి బూతుల శాస్త్రమే కాకుండా ఇలాంటి నీతుల గ్రంథం కూడా వ్రాయగలనని చెప్పుకొందుకే ఎఱ్ఱన్న ఇది వ్రాశాడేమో!

అయితే ఈ నీతికథల నిధానంలో ఎఱ్ఱన్న వాడిన భాష ఏమంత మృదువైనది కాదు. ప్రయాగలో నలుగురు స్త్రీలు ఆత్మహత్య చేసుకుంటూ మరుజన్మలో తమకు ఇలాంటి భర్త కావాలనుకొన్నారనీ, 'వచ్చేజన్మలో' వీరి నల్గురికీ నేనే భర్తనవ్వాలనుకొంటూ ఒక పేదబ్రాహ్మణుడు వాళ్ళతోటే మరణించి భోజరాజుగా కోర్కెలు తీర్చుకున్నారని భోజరాజీయంలో అనంతమాత్యుడు వ్రాశాడు.[9]

ఈ కథనే చెప్తూ ఎఱ్ఱన్న వాడిన మాటలు చూడండి

ముండితుడాప్రయాగవసుముఖ్యము లొల్లక తీర్థవాసులన్
ముండన మాచరించునెడ ముగ్గురు ముండలు వచ్చి యిందులో
రండయొకర్తె నాత్మపతి రాజుగ గోరి త్రివేణి గూలె నా
రెండవ ముండయున్ బ్రియధురీణమనోహరుగా దలంపుచున్

ఆ త్రివేణి గూలె నంత మూడవదియు నాత్మ భర్త కళల నధికు డగుచు
జేరి మొగము జూచు వారెల్లకవులుగా గోరి యాత్రివేణి గూలుటయును

ఈ ముండలు మువ్వురకు స్నేమగాడం గావలయు నిహమున నని తా
నాముండియందు గూలుచు - భూమిపయిన్ ధరణి యేలే భోజుం డగుచున్
(సకలనీతికథానిధానము, 2-7, 8-9)

ఉదాత్తపురుషుడైన భోజుని భార్యలుగా జన్మించబోయే వాళ్ళను గురించి చెప్తూ ముండలు, రండలు అనే మాటలు వాడడం వల్ల వెగటు కలుగకపోదు. ఈ పదాలు మార్చలేని చోట్ల యతి ప్రాసస్థానాలలో శిలాక్షరాలుగా ఉన్నాయి. సుకవుల రచనలు శిలాక్షరాలని చెప్తూనే ఎఱ్ఱన్న ఈ గ్రంథంలో కొన్నిచోట్ల సుప్రసిద్ధ కథలను మార్చేశాడు. పంచతంత్ర గాథలను విష్ణుశర్మ రాజకుమారులకు చెప్తాడన్నది లోకవిదితం. ఎఱ్ఱన్న దీన్ని రమారమి 'ఆరబ్బీరాత్రుల గాథలు'గా చెప్పించాడు. ఇలావర్షాన్ని వజ్రుడనే రాజ పాలిస్తున్నాడట. ఒక మంత్రివరునకు కన్య దొరకకపోతే అతని చెలికాడు తన కూతుర

9. భోజరాజీయం, 2:27-37

తంత్రీకన్యను ఇచ్చాడట. ఇచ్చి ''ఇది యఖిల కళలనెరుగు, గాథ చెప్పనేర్చు. భూమీశ్వరున కన్య చిత్తంబు లేకుండా నాదరించు'' అంటాడు (3-43). ఆ కన్య తన దాదికి కథలు చెప్పటం మొదలుపెడుతుంది. ఈ కథలు పంచతంత్ర కథలే. ఈ కథలు విన్నాక రాజు మంత్రులను 'దినక్రొత్తల' నడగడం మరిచిపోయాడట. (3-336)

పంచతంత్రాన్ని ఎర్రన్న ఇలా మార్చేయడం వల్ల ఒకటి మాత్రం స్పష్టంగా తెలుస్తూంది. క్రీ.శ. 1450-1500 ప్రాంతాలలో అరబ్బీ పారశీక భాషలలోని కథలు - ముఖ్యంగా వేయిన్నొక రాత్రుల కథలు - తెలుగుదేశంలో ప్రచారం పొందాయని చెప్పవచ్చు. అరబ్బీ కథలలోని శహరజాద్ ఈ గ్రంథంలో తంత్రీకన్యగా రూపొందింది. ఈమె చెప్పిన కథలు కొన్ని రెండుమూడు కథల మేళవింపులు. పంచతంత్రంలో రెండు కొంగలు ఒక తాబేలును తీసుకొని ఆకాశంలో ఎగురుతూ ఉంటాయి. జనం వింతగా చూస్తారు. క్రిందనున్న కోలాహలం ఏమిటని తాబేలు అడుగుతుంది. ప్రశ్నించడానికి నోరు తెరవగానే కరచిపట్టుకున్న కర్రనుంచి తాబేలు క్రిందపడిపోతుంది. ఈ కథను ఎర్రన్న ఇక్కడితో ఆపలేదు. అసలు తాబేలు క్రిందపడడానికి కారణం, క్రిందనున్న నక్క ఒకటి ఈ దృశ్యాన్ని చూసి ఇలా అడిగింది.

కటకట యాకమఠము మీ - రటుగొని చనుటెల్ల మెసగనా! యన ముఖసం
పుట ముడిగి హంస లేలా -యిటుచేసెద రనుచు గూర్మమవనిం బడియెన్
(సకలనీతికథానిధానము, 8-63)

కిందపడిన తాబేలును నక్క తినబోయింది. గట్టిగా ఉండడంవల్ల సాధ్యం అవలేదు. 'నన్ను నీటిలో పెట్టి నానపెట్టు, మెత్తబడతాను' అని తాబేలు అంటుంది. నక్క తీసుకువెళ్ళి నీళ్ళలో పెట్టి తన కాలితో తాబేలును అదిమి పట్టింది. కొంచెంసేపయ్యాక 'ఒళ్ళంతా నానింది కానీ నీ అడుగున్నచోట నానలేదు' అన్నది తాబేలు. నక్క కాలు తీసింది, తాబేలు నీటిలోకి, కథ కంచికీ వెళ్ళిపోయాయి! ఈ రెండు కథలు ఇలా జోడించడం బాగానే ఉంది. గానీ తాబేలు ఇంత తెలివైనదైతే అసలు ఆకాశంలో నోరెందుకు విప్పుతుంది? ఈ సంగతి ఎర్రన్న చెప్పడు!

ఈ గ్రంథంవల్ల ఒకటి మాత్రం విశదమవుతుంది. ఒకటి - ఇందులోని పద్యాలు కొన్ని ఇతరుల గ్రంథాలలో ఉండాలి. లేదా, ఇతరుల పద్యాలను ఎర్రన్న చేర్చుకొని ఉండాలి. కవిభల్లటుని విక్రమార్క చరిత్రలోనిదని కందుకూరి వీరేశలింగం పంతులుగారు ఈ క్రింది పద్యాన్ని ఉదాహరించారని మనం ఇంతకుముందు చెప్పుకున్నాం.**10** అయితే అది ఎర్రన్న గ్రంథంలోనిది.

చెప్పుకొన్న నీవు జీవంబు విడుతువు - చెప్పినపుడే నాకు జీవహాని
చెప్పి మున్ను నేను జీవంబు విడిచెద - నీవు చన్నపిదప నిలవలేను
(సకలనీతి కథానిధానము, 2-189

10. సమగ్రాంధ్రసాహిత్యం, రెడ్డిరాజులయుగం

ఇది భేతాళ పంచవింశతి కథలను చెప్తున్న ఘట్టంలో ఎఱ్ఱన్న వ్రాశాడు. చీమల భాష వచ్చిన రాజు, తను విన్న సంగతి భార్యతో చెప్పడమా మానడమా అని డోలాందోళనలో ఉన్నప్పుడు అన్న మాటలు. ఇది కవిభల్లటుడు కాక ఎఱ్ఱన్న వ్రాసినదే అని చెప్పవచ్చు. అయితే చతుర్థాశ్వాసంలో వ్రాసిన యీ క్రింది పద్యాలలో ఇతరుల అనుకరణలు కొన్ని ఉన్నాయి. వాటి గురించి ఎఱ్ఱన్న ఇలా వ్రాశాడు.

ప్రాణంబు సకలజనులకు - వానయ యివ్వాస తరచు వచ్చిన దిట్టం
బూనుదురు గాన పరిచయ మేనరునకు నైన మానహీనత జేయున్
(సకలనీతికథానిధానము, 4-102)

ఇది బద్దెన నీతిశాస్త్ర ముక్తావళికి అనుసరణ. చూడండి.

వాన సమస్తజీవుల కవశ్యము ప్రాణము ప్రాణమైన య
వ్వానయ బల్మరుం గురియవచ్చిన దిట్టుదు లెల్లవారలున్
హీనమనస్కులై యొరులు ఇండ్లకు బల్మరు బోవు నేనియుం
మానిని కట్లవచ్చు నవమానము, నూనము మానభంగమున్.
(నీతిశాస్త్రముక్తావళి, 105)

సుమతీశతకంలోని కొన్ని పద్యాలకు పోలికలున్నవి కూడా ఎఱ్ఱన్న వ్రాసిన నీతులలో ఉన్నాయి. చూడండి.

తేలునకు తోక విషమగు - వ్యాలమునకు బండ్ల విషము వనమక్షికకున్
బోలంగ శిరము విషముయగు - కాలినఖలునకును విషము కాయంబెల్లన్
(సకలనీతికథానిధానము 4-77)

ఇది సుమతీశతకంలోని ప్రసిద్ధమైన ఈ క్రింది పద్యానికి పూర్తిగా అనుకరణ.

తల నుండు విషము ఫణికిని - వెలయంగా తోక నుండు వృశ్చికమునకున్
తలతోక యనక నుండును - ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!

సుమతీశతకములోనిదే ఇంకొక పద్యం చాలా ప్రసిద్ధమైనది ఉంది. తావు మారితే మిత్రులే శత్రువులవుతారన్న పద్యం చూడండి.

కమలములునీటబాసిన కమలాత్ముని రశ్మిసోకి కమలినభంగిన్
దమతమ నెలవులు తప్పిన దమ మిత్రులె శత్రు లౌట తథ్యము సుమతీ

దీనికి అనుకృతి ఎఱ్ఱన్న గ్రంథంలో ఇలా కనబడుతుంది.

తమవారి బాసినను నుత్తము మిత్రుండైన మిగులదాపము సేయుఁ
గమలంబు నీటబాసిన కమలాప్తుని వేడిచేత కమలినభంగిన్
(సకలనీతికథా సంవిధానము, 4-133

ఈ పద్యంలో 'తమవారి' అన్న చోట కొంచెం చమత్కారం ఉంది. ఈ 'వారి' అంటే నీళ్ళనీ, కావలసిన వాళ్ళనీ రెండర్థాలు ఉన్నాయి. ఈ సకలనీతి కథానిధానాన్ని అంకితం ఇస్తూ షష్ఠ్యంతాలలో చిత్ర కవిత్వం గురించి ఇలా చెప్పాడు:

నవరసభావవిశేషో-ద్భవరచనాచిత్రమధురబంధుర కావ్య
స్తవవచనామృతలహరీ - కవితానాధునకున్ శ్రీజగన్నాధునకున్
(సకలనీతి కథానిధానము, 1-34)

ఈ పద్యంలో ఇలా చిత్ర మధుర, బంధుర కావ్యాలను పేర్కొన్నా సకలనీతి కథానిధానంలో ఎర్రన్న చిత్ర కవిత్వ ప్రక్రియలు చేయలేదు గానీ కొన్ని అపురూపమైన విశేష వృత్తాలు వాడాడు. వాటికి వింతపేర్లు పెట్టాడు. 'వీరభద్రభూషణ'మనే ఒక కొత్త పేరుతో ఒక వృత్తం వ్రాశాడు చూడండి.

ఆకళింగదత్తు పుత్రి యాది తేయ కాంతచే
నాకథాక్రమంబు వించు నబ్జనేత్ర నీపతిన్
నాకు జూపు మన్న శ్రీదనందనుండు మత్రియున్
నీకు నెట్లు చూపవచ్చునీవు కన్య ఓ సఖీ! (సకలనీతి కథానిధానము, 5-58)

ఇది 15వ ఛందంలో ర-జ-ర-జ-ర అనే 10923వ వృత్తాంతం. దీనిని అప్పకవి సుగంధి అని పేర్కొన్నాడు. దీనికే శాలిని, చామర, ప్రశాంతులనే ఇతర పేర్లు ఉన్నాయట. దీనికే ఎర్రన్న వీరభద్రభూషణమని పేరుపెట్టాడు. 17వ ఛందస్సులో 'న-జ-జ-జ-వగ' అనే గణాలతో కవిరాజితం అనే వృత్తాన్ని వ్రాశాడు. చూడండి.

కమలవిలోచన కౌస్తుభభూషణ కంజభవా
ద్యమరగణార్చిత నాకమునీశ సమాశ్రయ శ్రీ
రమణీమనోహరరాక్షససంహారరక్షణచి
త్ర్పముదితగంగయభైరవపాత్రశుభస్థిరదా! (సకలనీతి కథానిధానము 2-391)

ఇది అప్పకవీయంలో లేదు. ఇలాగే పన్నెండవ ఛందంలో భ-భ-స-స అనే గణాలతో ప్రజవృత్తాంతం వ్రాశాడు (5-4). ఇది కూడా అప్పకవి పేర్కొనలేదు.[11] 'నందన' అనే పేరుతో ఒక రగడ భేదాన్ని వ్రాశాడు.

నందన నిటునకు ననిచి ప్రియమునన్
బొందుచు మరియొక పురుషుని నెచటున్
చెందక ధనమునుచినుకక యుండన్
సుందరివిటునియసువులు గొనగన్ (సకలనీతి కథానిధానము, 3-303)

11. దీని ఆఖరుపాదంలో గణభంగం ఉంది.

ఇది మధుర గతి రగడ. ఎఱ్ఱన్న ప్రతిపాదానికి 16 మాత్రలు సరిగ్గానే వాడాడు. మొదటి రెండు పాదాలలో 14 అక్షరాలు. చివరి రెండు పాదాలలో 13 అక్షరాలు ఉన్నాయి. దీనిని ఒక నందనవృత్తంగా సృష్టించాడు. ముద్రాలంకారం వాడాడు. ఇతడు 'విలసితం' అనే వృత్తం ఒకటి వ్రాశాడు చూడండి.

కపటసఖ్యమును గామినితోడన్ - (శపథ) యుక్తముగా జాగణరాయం
డుపమ విలారి సరసోక్తుల తోడన్ - నృపతి యాత్మ గరుణింపగ జేసెన్
(సకలనీతి కథానిధానము, 2-346)

ఇది పన్నెండవ ఛందంలో 'న-భ-జయ' అనే గణాలవృత్తం. దీనిని అప్పకవి చెప్పలేదు.[12] కూచిరాజు ఎఱ్ఱన్న వాడిన విశేషవృత్తాల పరిశీలన చాలా అవసరం. దోదక వృత్తం వ్రాసి దానికి ఉన్న పర్యాయపదాలన్నీ ఒక్కొక్క మారు ఒకటి వాడాడు. పాదపం (1-99), తోదకం (5-169), దోదకం (1-266:2-108; 3-238; 3-340 (గణభంగం, 4-399) అని ఈ పుస్తకంలో పర్యాయపదాలు కనబడతాయి. ఇలాంటి విశేషవృత్తాలను వాడిన ఎఱ్ఱన్న గర్భ కవిత్వం కూడా వ్రాసినట్టు ఒక పద్యం వల్ల తెలుస్తున్నది. చతుర్విధ వృత్తం అని ఒకటి కనబడుతుంది. చూడండి.

పనసరసాలపాటల పాటిగ నుత్తమమధ్యమాధముల్
వినబడుచుండ్రు పూయక ఫలించియు బూచి ఫలంబు నొందియున్
ననిచి ఫలంబు బూనక వినాశము బొందినయట్టి పోలికన్
మును ఫలమిచ్చి పూచి ఫలముల్ ఘటియించియు బూచి పండకన్
(సకలనీతి కథానిధానము, 4-105)

ఈ చంపకమాలలో ఏ పద్యాలు ఇమిడ్చాడో తెలియడం లేదు. విజ్ఞులు వెదికి చెప్పితే సంతోషం. ఎఱ్ఱయ్య సకలనీతి కథానిధానంలో శబ్దాలతో చమత్కారాలు చేయలేదుగాని కొక్కోకం పీఠికలో కొంత తన అవధానకవీశ్వరత్వం ప్రదర్శించాడు. కొక్కోకం కృతి పుచ్చుకొన్న మల్లమంత్రిగారి అన్నను ఇలా వర్ణించాడు:

మాధవమాధవ మాధవులకు సాటి సౌందర్య విక్రమసంపదలను
గోపాల గోపాల గోపాలురకు జోడు భోగసాహసకళాభోగములను
గాంగేయ గాంగేయ గాంగేయులకును బ్రతివర్ణప్రతాపపావనరూఢి
కుంభజకుంభజకుంభజులకు నీడు రణ తపస్సామర్థ్యరాజసముల
నితరజసముల సరిపోల్చ నెట్లు - వచ్చు భాగ్యసౌభాగ్య వైభవప్రాభవముల
కుటిలరిపుమంత్రిహృద్వేదికుంటముక్ల - గంగ యామాత్యునకుదానకర్ణునకును
(కొక్కోకం, 1-17)

12. ఎఱ్ఱన్న వాడిన ఈ అపూర్వవృత్తాలు అప్పకవీయంలో లేనట్లే మన ఛందోగ్రంథాలలోనూ కనబడలేదు. రావూరి దొరస్వామిశర్మగారు విపులంగా వృత్తపట్టికలు ఇచ్చిన 'తెలుగు భాషలో ఛందోరీతులు' అనే గ్రంథంలోనూ లేవు.

కొంచెం నిదానంగా వ్రాస్తే సకలనీతికథా నిధానంలోకూడా ఇటువంటి మజాలు చూపేవాడేమో! నవఘంటాసుర త్రాణ అవధానకవీశ్వర బిరుదాలు ఆశు, చిత్రకవిత్వాలు చెప్పడంవల్లనే వచ్చాయి కాబోలు, 'ఇతడు కవిత్వరచనా ప్రౌఢి బూర్వకవీంద్రులను పోలినవాడు' అని కృతిపతి పినబైరవ మహాపాత్రుడు భావించాడు. ఎర్రన్న తాను తన కవిత్వంలో అనుసరించిన పూర్వులను మాత్రం కృతజ్ఞతతో స్మరించాడు.

వినుతి యొనర్తు నాంధ్ర సుకవీంద్రుల నన్నయ్య భట్టు దిక్కయ
జ్వను నమరేశ్వరుఙ్ జెదలువాడ మహాత్ముని మారనార్యు నా
చనుసుతు సోము భాస్కరుని జక్క యనుం గవిసార్వభౌమునిన్
వనరుహపుత్రసన్నిభుల వర్ణిత కావ్యకళావిధిజ్ఞులన్. (సకలనీతి కథానిధానం, 1-8)

మారనను పూర్వకవులతో చేర్చి నుతించిన పద్యం నేను చూచినంత మటుకు ఇది మొట్టమొదటిది. విక్రమార్క చరిత్రను అనుసరించినందుకు జక్కనను స్మరించిన ఎర్రన్న కేయూరబాహు చరిత్రను అనుసరించినందుకు మంచెన పేరు ఎందుకు ఎత్తలేదో తెలియదు. బహుశ 'మారనార్యు' అనే మాటకు బదులు 'మంచనార్యు' అని వ్రాశాడేమో పాఠాంతరాలు వెదకాలి. ఐతే దురదృష్టవశాత్తు సకలనీతి కథానిధాన ప్రతులు దేశంలో లేవు. ఇతని కొక్కోకం ప్రతులు మటుకు అన్ని ఊళ్ళలోనో దొరుకుతాయట! ''ఎఱ్ఱయకవి'' కొక్కోకము వ్రాతప్రతులు ఆంధ్రదేశమున నింటింట వందలకొలదిగా ఉన్నవి'' అని పంచాగ్నులవారు వ్రాశారు.[13]

ఇంత ప్రచారం అన్ని గ్రంథాలకూ రాదు. అది ఒక విశేషమే!

13. వాత్స్యాయన కామసూత్రాలు, పీఠిక, 19

అడిదం కవులు పూసపాటిరాజులు

గంటాన్ని నడిపించినట్టే కత్తిని ఝళిపించి రెండు విద్యలలోనూ ఆరితేరిన ఆంధ్రకవి కుటుంబాల్లో అడిదము వారిదొకటి. అడిదం అంటే ఖడ్గమని అర్థం. క్రీ.శ. 1720–1785 ప్రాంతాలలో వున్న సుప్రసిద్ధకవి అడిదం సూరకవి. తమ వంశంలో అప్పటికి 23 పురుషాంతరాలనుంచి అందరూ కవిత్వమే వృత్తిగా జీవించినారని చెప్పాడు. తరానికి 25 ఏళ్లు లెక్కవేసుకుంటే క్రీ.శ. 1160 నుంచి ఈ కుటుంబంలో వ్యక్తులు కవులై జీవించారనీ తెలుస్తుంది. మూలపురుషునినుంచి పధ్నాలుగు పురుషాంతరాలు గడిచాక, అంటే క్రీ.శ. 1440 ప్రాంతాలలో ఈ కుటుంబంవారికి రాజాశ్రయం లభించిందట. ఈ సంగతి సూరకవి ఇలా చెప్పాడు.[1]

ఇరువది మూడు పూరుషము లిప్పటి కయ్యె గవిత్వవృత్తిచే
నరపతులెల్ల మెచ్చ బదునాల్గు తరంబులు మించు పిమ్మటన్
వెరవగు జీవనస్థితి లభించుట తొమ్మిది యయ్యె బూరుషాం
తరములు నిక్కళింగవసుధాదవు చెంగట నాశ్రయించుటల్.

(చాటు. II పుట 128/3019)

ఈ పద్యంలో చెప్పిన కళింగరాజు పేరు పూసపాటి ఇమ్మడి తమ్మిరాజు. ఇతడు క్రీ.శ. 1458 ప్రాంతాలలో కపిలేశ్వర గజపతివద్ద సేనానిగా ఉండేవాడు. ఇతని తండ్రి మొదటి రాచిరాజు క్రీ.శ. 1380 – 1440 మధ్య మన్యసుల్తాను అనే బిరుదుతో ప్రౌఢదేవరాయలవద్ద రణోద్యోగిగా ఉండేవాడు. తండ్రి నరపతులైన విజయనగర రాజుల వద్ద వుంటే, కొడుకు గజపతుల వద్ద చేరాడు. ఇతనివద్ద అడిదంవారి వంశంలో ఉన్న నీలాద్రికవి చేరాడు.

ఈ రాజాశ్రయం దొరకడానికి ముందు అడిదంవారికి గ్రంథవారణం వారనే ఇంటి పేరు ఉండేది. ఎందుకంటే తాము వ్రాసిన గ్రంథాలన్నింటిని ఒక ఏనుగుమీద వేసుకొని ఈ కవులు సంచారం చేసేవారట. అప్పటికి పధ్నాలుగు తరాలనుంచీ కవిత్వం చెప్పుకుంటూ జీవిస్తున్నవాళ్లు అన్ని పుస్తకాలు వ్రాయడంలో ఆశ్చర్యం లేదు. గ్రంథవారణం వారనే ఇంటిపేరు రావడానికి ముందు వీరు మోదుకూరివారు. గోదావరి మండలంలో ఒక మోదుకూరు ఉంది. పూసపాటి తమ్మిరాజును నీలాద్రికవి ఆశ్రయించి ఆ రాజుతోపాటు పర్యటన చేస్తూవుండేవాడు. తమ్మిరాజు చాలా పరాక్రమవంతుడు. కటకం గజపతులతో పాటు అనేక యుద్ధాలలో పాల్గొని అశ్వపతులను, నరపతులను, పద్మనాయకులను జయించాడు. ఇతని విజయాలు గురించి ఈ పూసపాటివారి వంశంలోనే క్రీ.శ. 1640 ప్రాంతాలలో ఉన్న ఇంకో తమ్మిరాజు తన శ్రీకృష్ణవిజయంలో ఇలా వ్రాశాడు:

అరిబలంబుల నందపురశైలమునొద్ద మర్దించి గజపతి మాన్యుడయ్యె
భూరిసైన్యములతో బొడివి బెల్లముకొండ సాధించె నిశ్శంకసాహసమున

---

1. అడిదం సూరకవి చాటువులను వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చాటుపద్య మణిమంజరి రెండవ భాగంలో విపులంగా ప్రచురించారు.

దట్టించి లగ్గలు పట్టించి చేకొనె బ్రబలుడై శ్రీరంగరాజుకొండ
బల్లిదుడై యోడపల్లి గైకొనియె విపక్షులందరు పటాపంచలుగను
త్రిభువనీరాయబిరుదప్రదీప్త రావు - సింగన జయించి బెదవీటి చెంద బొదవి.
కలన శరణన్న బాహాదిఖానుగాచె - రాచభూపాలు తమ్మిధరావరుండు.
(శ్రీకృష్ణవిజయం, 1-117)

ఇమ్మడి తమ్మిరాజు సాధించిన ఈ విజయాలను నాలుగవ తమ్మిరాజు పేర్కొన్నట్టే పూసపాటివారి వంశంలోనే వున్న వేంకటపతిరాజు ఉషాభ్యుదయంలోనూ, విజయ రామరాజు విష్ణుభక్తిసుధాకరంలోనూ, ఈ వంశాన్ని ఆశ్రయించిన కొటికలపూడి సోమశేఖరకవి నరసభూపాలరాజీయంలోనూ పేర్కొన్నాడు. అయితే ఈ ఘనవిజయా లన్నిటినీ నీలాద్రికవి ఒక కావ్యంగా వ్రాశాడట. దాని పేరు రణరంగవిజయం. తమ్మిరాజుతోపాటు తాను కూడా యుద్ధాలలో ప్రత్యక్షంగా పాల్గొన్న నీలాద్రికవి ఈ విజయాలను ఎంతో చక్కగా వర్ణించి వుంటాడు. నిండుకొలువులో ఈ కావ్యాన్ని నీలాద్రికవి చదివి వినిపిస్తే తమ్మిరాజు సంతోషించి ఒక అడిదాన్ని బహూకరించాడట. అప్పటినుంచి గ్రంథవారణం వారికి అడిదంవారనే ఇంటిపేరు కలిగింది. ఈ సంగతి సూరకవి ఇలా చెప్పాడు:

కదనపార్థు డందె రాజునీలాద్రి - అల కళింగరాజు లడిద మొసగ
నిందుచేత నయ్యె నింటిపే రడిదము - రామరాయవినుత రామచంద్ర.[2]

కవి స్వయంగా పాల్గొన్న యుద్ధాలను వర్ణించే ఈ రణరంగవిజయం నేడు దొరక్కపోవడం దురదృష్టం. దొరికితే ఆంధ్రసాహిత్యంలో తొలి చారిత్రక గ్రంథంగా ఇది నిలబడిపోయేది. పూసపాటి తమ్మిరాజుపైన చాలా భట్టు పద్యాలున్నాయి. బహుశా ఇవి అడిదం నీలాద్రికవి వ్రాసిన రణరంగవిజయంలోనివి కావచ్చు.

అతిశౌర్యుండగు పూసపాటి కులరాచాధీశుతమ్మయ్య కు
న్నతి గావించుచు నాశ్రయించి రిలపర్నాటీపరిచ్ఛేది కా
కితికోటిప్రభు లాత్మ బాంధవతనో మహా
చతురుండంచునొ షడ్ద్విపాగ్నిశశభృచ్ఛాకాబ్ధకాలంబునన్. (ఆంధ్రకవితరంగిణి, 6-234)

ఇతణ్ణి సేవించే రాజుల గురించి భట్టుపద్యం ఉండేది.

కొందరు రాజులప్పనము కొమ్మని యియ్యగ బంధువర్గమై
కొందరు గొల్వ బేరు లిడి కొందరు మ్రొక్కగ నూడిగంబులన్
ముందర కొందరుం బిరుదుమ్రోవగ రాజుల పూజలింగమై
యందున మించె రాచమనుజాధిపు తమ్మన రాజమాత్రుడే? (ఆంధ్రకవితరంగిణి, 6-234)

ఈ తమ్మిరాజు ప్రతాపాన్ని వర్ణించే పద్యం కూడా వుంది.

2. అడిదము సూరకవి జీవితం. రచన:అడిదము రామారావు గారు. పీఠిక:నిడుదవోలు వెంకటరావు గారు, పుట 7

మెండెండ రాజుల గుండెలో గాలాము నిరసించు రాజుల వెన్నుతరటు
కలహించు రాజుల కడుపులోపల కత్తి గర్వించు రాజుల కాలయముడు
మార్కొన్న రాజుల మత్తేభసింహంబు మదవైరిరాజుల మగల మగడు
క్రోధించు రాజుల కొసమీసముల మిండ నిరసించు రాజుల నెత్తిపిడుగు
సకలసౌజన్యరాజన్యచక్రవర్తి - రాజు కబళేశ్వరస్వామి రాజ్యధుర్యు
భూసురారాసుతగువాటిపూసపాటి - రాచవిభు తిమ్మవుద్దండరాచమాన.

(ఆంధ్రకవితరంగిణి, 6-234)

ఈ రెండవ తమ్మిరాజు కుమారుని పేరు రాచిరాజు. ఇతడు క్రీ.శ. 1462 నుండి 1496 దాకా రాజ్యం చేసిన పురుషోత్తమ గజపతి కొలువులో వున్నాడు. కేతవరం అనే పట్టణానికి అధిపతి అయ్యాడు. రాజ్యాన్ని విస్తరించుకొనో, ప్రతాపాన్ని ప్రదర్శించో, ఆనాటి రాజకీయాలలో ప్రముఖపాత్ర వహించో పూసపాటి రాచిరాజు గజపతుల వియ్యంకుడయ్యాడు. ప్రతాపరుద్రగజపతి కుమార్తెను తన కుమారుడు మూడవ తమ్మిరాజుకు చేసుకొన్నాడు. ఇతడు కృష్ణదేవరాయలవారి తోడల్లుడు. పూసపాటి రాచిరాజును శ్రీకృష్ణవిజయంలో నాలుగవ తమ్మిరాజు ఇలా వర్ణించాడు:

నవభారతాఖ్యాన నవ్యకావ్యమునకు నాయకుండయ్యె నేనరవరుండు
కటకేశ్వరునిచేత గని కేతపరమాత్మ పురముగా నేలె నేభూవిభుండు

నిలిపె బారుహబున్నె నృపగండపెండేర మెపుడు డా కాలనే నృపతిమౌళి
అఖిలసద్గుణవతి యక్కమాంబాదేవిప్రాణేశు డయ్యె నే పార్థివుండు
ప్రథితగజపతిరాజవీరప్రతాప- రుద్రుతనయాధినాయకారూఢతమ్మి
రాజజనకత గాంచెనే రాజతిలక - మత డలరు తమ్మ విభురాచయప్రభుండు.

(శ్రీకృష్ణవిజయం, 1-121)

ఈ పద్యంలో చెప్పిన నవభారతం అనే కావ్యానికి రాచిరాజు నాయకుడయ్యాడనే విషయాన్ని తలొకరూ తలొకవిధంగా అర్థం చేసుకొంటున్నారు. ఈ కావ్యాన్ని ఇతడు రచించాడని కొందరు, లేదు - అంకితం పుచ్చుకొన్నాడని కొందరు అంటున్నారు. నరసభూపాలరాజీయంలో ఇలా చెప్పాడట.[3]

వారిలోపల రాచభూవాసవుండు - గండపెండేరమును బూనె దండినూత్న
భారతంబన గృతిజేసి భాసురముగ - గేతవరపట్టణేశుడై కీర్తిమించె.

ఈ పద్యంవల్ల రాచిరాజు 'నవభారతం' రచించనట్టే విశదమవుతుంది. అయితే ఈ కావ్యం నష్టమైనది. ఈ రాచిరాజే పూసపాటి వారి వృత్తాంతాన్ని తెలిపే వసిష్ఠగోత్రక్షత్రియుల గురించి 56 చరణాల సీసమాలిక వ్రాశాడట. దీనిని విజయనగరం మహారాజావారి కాలేజీపత్రికలో 1933వ సంవత్సరానికి పూర్వం ప్రకటించినట్లుంది.[4] దీనినే దువ్వూరి

---

3. ఆంధ్రకవితరంగిణి, 8వ సంపుటము,పుట 49లో చాగంటి శేషయ్యగారు ఉదాహరించారు.
4. టేకుమళ్ళ అచ్యుతరావుగారు ఈ సీసమాలికలో భాగాలను తమ 'విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్రము'లో ఉదాహరించారు. ఆ పాదాలు పై పత్రికలోనివన్నారు.

జగన్నాథశర్మగారు చిన్న పుస్తకంగా ప్రకటించారు. ఈ సీసమాలిక కాపీకోసం నేను ఎంతగానో ప్రయత్నించానుగాని చాలాకాలం దాకా దొరకలేదు. దొరికాక ఎన్నో అనుమానాలకు తావిచ్చింది. ఈ సీసమాలికలో నంధేల కృష్ణంరాజు ప్రసక్తి ఉంది కనుక ఇందులో ప్రక్షిప్తాలు చేరాయనో లేక సీసమాలికే కూటకరణమనో అనుమానించడానికి ఆస్కారం ఉంది. ఆనందగజపతి మరణానంతరం జరిగిన విజయనగరం పెద్దదావాలో చాలా సాహిత్య వ్యళీకాలు జరిగాయి. నిప్పులేందే పొగరాదు కనుక రాచిరాజు ఒక సీసమాలికను చెప్పాడేమో. ఆ నిప్పులో ఎవరికి కావలసిన సమిధలు వాళ్ళు ఆహుతిచ్చారేమో. ఈ సీసమాలికను నిజంగా రాచిరాజే వ్రాస్తే వంశచరిత్రలను శతాబ్దాలతో గ్రంథస్థం చేసిన కవులలో ఇతడు ప్రథముడవుతాడు. ఈ సీసమాలిక కడపట ఇలా వుందిట.

> .... శరణాగత త్రాణబిరుదవార.............
> లనుచు శ్రీరామచంద్రార్పణముగ ఋతుగగ నాబ్ధిచంద్రశకంబునందు
> సరససంగీతసాహిత్యచక్రవర్తి - రాజమార్తాండ శ్రీతమ్మరాజరాజు
> రాచిరాజోచితంబు విభ్రాజితంబు - ధరణి వెలయుత నా చంద్రతారకంబు.[5]

దీనివలన రాచిరాజు సరస సంగీత సాహిత్య చక్రవర్తి అని తెలుస్తున్నది. ఇతనికి అడిదము నరసింహమంత్రి సమకాలికుడు. ఈ మంత్రి నీలాద్రికవికి ఏమవుతాడో తెలియదు. బహుశా కుమారుడు కావచ్చు. ఇతని గురించి అడిదం ఇలా వ్రాశారు:

> మా నృసింహమంత్రి సేనానిగా దొల్లి - గజపతీంద్రు గొలిచి కటకమందు
> అడిద మన్వయంబు నన్వర్థముగ చేసె - రామరాయవినుత రామచంద్ర.[6]

ఇతడు అడిదంవారి వంశంలోనివాడే కనుక 'కవిత్వవృత్తి' చేత జీవించాడని చెప్పవచ్చు. ఇతని గ్రంథాల పేర్లైనా తెలియవు. చాటువులు చెప్పాడేమో. రాచిరాజుపైన ఒక చాటువు లభిస్తున్నది.

> మన్నెసులతాను బిరుదం - బెన్నగ గజరాజువీట నెన్నగ దామున్
> మన్నీల మనుచు వచ్చిన - దన్నును నీగొడుగువాడు తమ్మయరాచా.[7]

ఇది నరసింహమంత్రి చెప్పాడో లేదోగాని మొత్తంమీద తొలి రాయల యుగంలో అడిదం కవులూ, పూసపాటి రాజులూ చాలా పేరుమోసివాళ్ళని చెప్పవచ్చు.

---

5. నిడుదవోలు వెంకటరావుగారు ఉదాహరించారు. భారతి, 26వ సంపుటము, సంచిక 3, పుటలు 137-139.
6. అడిదము సూరకవి జీవితము - పీఠిక, పుట 8
7. ఆంధ్రకవితరంగిణి, సంపుటము 8, పుట 50

దూబగుంట నారాయణకవి

ప్రపంచ కథా వాఙ్మయాన్నే శ్రీమంతం చేసిన భారతీయ నీతికథల సంపుటం ఒకటి అత్యంత ప్రాచీన కాలంలోనే ప్రభవించింది. దాని పేరు పంచతంత్రం. చదువురాని రాజకుమారులకు ఆర్నెల్లలో రాజనీతిని బోధించడానికి విష్ణుశర్మ అనే మేధావి ఒక కథాక్రమంలో చెప్పిన రకరకాల కాకమ్మ కథలతో అయిదు ముఖ్యమైన తంత్రాల శీర్షికలందులో ఉన్నాయి. అవి మిత్రభేదం, 1. మిత్రలాభం, 2. సంధి, 3. విగ్రహం, 4. లబ్ధనాశనం, 5. అసంప్రేక్ష్యకారిత్వం అనేవి. తంత్రం అనే మాటకు కపటోపాయం అనే అర్థమే నేడు ప్రసిద్ధమైనా, రాజ్యాదుల పరిపాలనా వ్యవస్థను ప్రాచీనకాలంలో తంత్రమనేవారు. స్వతంత్రం పరతంత్రం అనే మాటలలో ఈ అర్థం నేటికీ ఉంది. కాళిదాసు శాకుంతలంలో 'లోక తంత్రాధికారి' అని వాడాడు. రాజ్యాంగంలో అన్నిటికంటే ముఖ్యమైన నీతి అవయవానికి తంత్రమనేవారు.

తనకాలంనాటి ప్రచారంలో ఉన్న నీతిబోధకమైన పిట్టకథలను రసవత్తరంగా ఉండడానికి కొన్ని 'రంకు' కథలు తీసుకొనో, కల్పించో పంచతంత్రాన్ని విష్ణుశర్మ క్రీ.శ. మూడవ శతాబ్దంలో రచించాడు. అది అతిత్వరలో బహుళ ప్రచారాన్ని పొందింది. క్రీ.శ. 531-597 మధ్య పారశీక దేశాన్ని పాలించిన (ససానియిన్ రాజు) ఖుస్రూ అనూషల్వాన్ కోరికపై బర్జో అనే రాజవైద్యుడు పహ్లవీభాషలోకి పంచతంత్రాన్ని అనువదించాడు. ఇది లోకానికి దక్కలేదుగాని దీనిని ఆధారం చేసుకొని ఆరవ శతాబ్దంలోనే సిరియన్ భాషలోకి అనువదించిన గ్రంథం నేటికీ సురక్షితంగా ఉంది. బర్జో చేసిన అనువాదాన్నే అనుసరిస్తూ క్రీ.శ. 725లో జనించిన అబ్దుల్లా ఇబిన్-ఆల్‌ముకఫ్ఫా అనే కవి అరేబియన్ భాషలోకి పంచతంత్రాన్ని పరివర్తనం చేశాడు. అది కలీలా-వా-దిమ్న' అనే పేరుతో సుప్రసిద్ధమయినది. మిత్రభేదం అనే మొదటి తంత్రంలో ఉన్న కరటకదమనకుల పేర్లే అరేబియన్ గ్రంథనామాన్ని సగర్వంగా అలంకరిస్తున్నాయి. బహుమూద్ (షావాన్) అనే రచయిత ఒక అరేబియన్ ప్రతికి ఉపోద్ఘాతం వ్రాస్తూ భారతీయ పంచతంత్రాన్ని 'బీద్పా' అనే ఋషి వ్రాసినట్టు తెలియజేశాడు. పాశ్చాత్య లోకంలో పంచతంత్రం అంటే 'బీద్పానీతికథ'లనే పేర విశేష ప్రచారాన్ని పొందాయి. ముకఫ్ఫా వ్రాసిన గ్రంథం అచిరకాలంలోనే పర్షియన్, తుర్కి, మంగోల్, మలె, ఇతియోపియో భాషలలోనికి పరివర్తన పొందింది. క్రీ.శ. 12వ శతాబ్దంలో హిబ్రూ భాషలలోనికి, దానినుండి లాటిన్ భాషలోనికి 13వ శతాబ్దం మూడవ పాదంలో అనువాదం అయింది, భారతీయ భాషలన్నింటికి సంస్కృతం మూలభాష అయినట్టు యూరోపు భాషలకు ఏలిక అయిన లాటిన్‌లోంచి వివిధ పాశ్చాత్య దేశాలవాళ్ళు తమ మాతృభాషలలోనికి పంచతంత్రాన్ని అనువాదం చేసుకున్నారు.[1]

ప్రొఫెసర్ జొహన్నెన్ హర్‌టిల్ సవిస్తరమైన పరిశోధనలు చేసి జర్మన్ భాషలో ఒక గ్రంథాన్ని ప్రచురించాడు. అందులో ఏఏ భాషలలో ఎన్నిరకాలుగా పంచతంత్రం

1. ఎన్‌సైక్లోపిడియా బ్రిటానికా, సంపుటి 3, 548 పుట.

అనువాదం అయిందో చెప్పాడు. ఆయన లెక్క ప్రకారం 50కన్నా ఎక్కువ ప్రపంచ భాషలలో 200 పైచిలుకు అనువాదాలు ఉన్నాయట. ఇతడు లెక్కించిన అనువాదాల గురించి ఫ్రాంక్లిన్ ఎడ్జర్టన్ వివరించాడు.[2]

క్రీ.శ. 13వ శతాబ్దం నాటికే ప్రపంచ భాషలలోకి పరివర్తనం పొందిన పంచతంత్రం మన తెలుగు భాషలలోనికి కూడా రమారమి ఆ కాలంలోనే వచ్చింది. క్రీ.శ. 1347లో ఉన్న మడికి సింగన్న నాటికి ఒక పంచతంత్రం తెలుగులో ప్రసిద్ధమయినది. ఆ కావ్యం పూర్తిగా మనకు నేడు లభించదు. గాని అందులోనుంచి 189 పద్యాలు మడికి సింగన్న తన 'సకలనీతి సమ్మతం' అనే సంకలన గ్రంథంలో చేర్చుకోబట్టి మొదటి పంచతంత్రం యొక్క ఉనికి మనకు తెలుస్తున్నది.

నేడు మన భాషలో లభిస్తున్న మొట్టమొదటి సంపూర్ణ పంచతంత్రం రచించిన కవి దూబగుంట నారాయణకవి. ఇతడు నెల్లూరు జిల్లాలో ఉదయగిరికి చేరువలోనున్న దూబగుంట అనే గ్రామానికి క్రీ.శ. 1470 ప్రాంతంలో కరణంగా ఉండేవాడు. నెల్లూరు జిల్లాలో మూడు దూబగుంట గ్రామాలున్నాయి.[3] ఒకటి మనం ఇప్పుడు చెప్పుకొన్నది. రెండోది నెల్లూరు దగ్గరే ఉంది. మూడోది ఆత్మకూరు ప్రాంతంలో ఉంది. నారాయణకవి ఉదయగిరికి చేరువలోనున్న దూబగుంట వాడని ఊహించడానికి కారణం - అతడు ఉదయగిరి దుర్గాన్ని పాలించిన బసవరాజుకు పంచతంత్రాన్ని అంకితం ఇచ్చాడు. అందుచేత కవి తన కృతిభర్త రాజధానికి చేరువలో ఉన్న దూబగుంట వాడని చెప్పవచ్చు. ఇటీవలి సాహిత్య పరిశోధకులు కావలి-ఉదయగిరి మార్గములో గల కనిగిరి గ్రామమునకు ఈశాన్యదిశగా తొమ్మిది మైళ్ళ దూరమున గల దూబగుంట గ్రామమే నారాయణకవి నివాసమని భావిస్తున్నారు.[4]

ఈ బసవరాజు పూసపాటి వారి వంశంలోని వాడు. కటకం రాజధానిగా కొన్నాళ్ళు తెలుగుదేశాన్ని పాలించిన గజపతులకు ఇతడు సామంతుడు. బసవరాజు తండ్రి పేరు తమ్మారాయుడు. ఈయన శాసనాలు రెండు దొరుకుతున్నాయి.[5] క్రీ.శ. 1460లో ఉదయగిరి మీది మన్యాన్యనను 'కటుమరాజువల్లభయ్యాగారి కుమారుడు తమ్మరాయనింగారు కాశీ విశ్వేశ్వరునికి, గోపాలకృష్ణునికి విడివిడిగా చెరొక నగరు కట్టించి ప్రతిష్ఠ చేయించాడు. తండ్రి క్రీ.శ. 1460 ప్రాంతాలవాడు కనుక కొడుకు కూడా అదే ప్రాంతాలవాడని

2. The Panchatantra by Franklin Edgerton, George Allen and Unwin Ltd., 1965.
3. Alphabetical list of villages in the Madras Presidency (1924) అనే పుస్తకం ప్రకారం నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు తాలూకాలో ఒకటి, కనిగిరి తాలూకాలో ఇంకొకటి, కావలి తాలూకాలో వేరొకటి. వెరసి మూడు దూబగుంట గ్రామాలు కనబడుతున్నాయి. పునర్విభజన తర్వాత జిల్లాల సరిహద్దులు మార్చాక, కొత్త జిల్లాలు వచ్చాక ఈ మూడు గ్రామాలున్న తాలూకాల పేర్లు మారడం సహజం.
4. సూర్యదేవర రవికుమార్ - 'వ్యాససుధ' పుట 70
5. నెల్లూరు శాసన సంపుటి, పుటలు 1373-1376

అనుకోవచ్చు. లేదా, చారిత్రకులు తరానికి పాతికేళ్ళు లెక్కిస్తారు కనుక 1485 ప్రాంతాలవాడని చెప్పవచ్చు.

ఈ రాజవంశంలో ఇంకొక బసవరాజు కూడా ఉన్నాడు. అతడు పంచతంత్రంలో కృతిభర్తకు స్వయానా సవతి సోదరుడు. ఇతని కుమారుడు సింగరాజు శాసనమొకటి క్రీ.శ. 1518 నాటికి లభిస్తున్నది.[6] అందులో ఈ వంశం వాళ్ళకు 'హొసబిరుదరగండ', 'సహకారబాంధవ','మల్లనావల్లభ', 'రణరంగభైరవగండధనుంజయ' అనే బిరుదులు ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ బిరుదులలో కొన్ని దూబగుంట నారాయణకవి పంచ తంత్రంలో పేర్కొన్నాడు. 'ప్రసవాంబకసమనూపున కొసబిరుదరగండనికి మహోర్వీశున కున్' (1-4) అనీ, 'రణరంగభైరవునకున్ ప్రణమితరాజన్యహృదయ పద్మార్కునకున్' (1-43) అనీ, 'సహకారబాంధవునకున్ సహజాలంకారదేహసౌందర్యకున్' (1-44) అనీ శాసనాలలోని బిరుదులనే నారాయణకవి చెప్పాడు. శాసనాలలో చెప్పిన వంశక్రమాన్నే చెప్పాడు. అందుచేత కవికాల నిర్ణయం కచ్చితంగా చేయవచ్చు.

తన కాలంనాటికి ఒక పంచతంత్రం తెలుగులోకి అనువాదమై ప్రసిద్ధమై, సకలనీతి సమ్మతంవంటి సంకలన గ్రంథంలో చేరినా దూబగుంట నారాయణకవి ఎందుకో కొత్తగా దీనిని అనువదించాడు. బసవరాజు ప్రత్యేకంగా ఏరికోరి దీన్ని తెనిగించమన్నాడు. కవీ, అతని పోషకుడూ మొదటి పంచతంత్రాన్ని చూడలేదనుకోవాలి. చూస్తే మరేదో కారణాలవల్ల మళ్ళీ ఆంధ్రీకరణకు పూనుకొని ఉండాలి. నారాయణకవి తన గ్రంథంలో కవిత్రయాన్ని తప్ప ఇంకెవరినీ నుతించలేదు. తన గురించి కూడా అట్టే చెప్పుకోలేదు. బసవరాజు నిండు కొలువులో కూర్చొని తనను పిలిపించినట్టే ఇలా చెప్పాడు.

హరిహర భక్తు నార్యసుతు నంధ్రకవిత్వవిశారదు మహీ
శ్వర పరమాననీయ గులవర్ధను శాంతు బ్రబంధ వాచకా
భరణము నాగమాంబకును బ్రహ్మయమంత్రికి నాత్మసంభవున్
సరసుని దూబగుంట పురశాసను నారన నామధేయునికిన్.

(రూ. పంచతంత్రం, 1-14)

ఈ పద్యం వల్ల కవి హరిహరభక్తుడని, ఆంధ్రకవిత్వ విశారదుడని, రాపూజితుడని, ప్రబంధవాచకాభరణమనీ తెలుస్తున్నది. తిక్కనగారు ప్రవచించి ప్రచారం చేసిన హరిహరనాథతత్వం ఆంధ్రదేశంలో క్రీ.శ. 1480 ప్రాంతాలలో, అంటే తిక్కనగారు పోయిన రెండువందల ఏళ్ళ తరువాత కూడా, నెల్లూరు మండలంలో సంస్కారులను ఆకర్షిస్తూనే ఉంది. నారాయణకవి హరిహరభక్తుడని చెప్పుకొన్నా కావ్యంలో ఎక్కడా హరిహరనాథ రూపాన్ని వర్ణించనే లేదు. గానీ రెండు మూడు చోట్ల హరిశంభుకీర్తనము (2-119), హరిహరస్మరణము (5-44) అని ఇద్దరు దేవుళ్ళను కలిపి చెప్పినా మొత్తంమీద హరిని హరుని విడివిడిగానే స్తుతించాడు. ఈ కవిని బసవరాజు పిలిపించి ఇలా అన్నాడు.

6. దక్షిణభారత శాసనసంచయం, 4వ సంపుటి, నెం. 789

సురుచిరమైన నీకవితనూరి నభాంతర యోగ్యతామనీ
హరిసరసార్థ గుంభనల నందము గావున నార నార్యసు
స్థిరగతి గీర్తినన్నొర జేసి సమస్త జగత్ప్రసిద్ధమై
పరగుచు నుండు మాకొక ప్రబంధ మొనర్చు ప్రియంబెలర్పగన్.

తత్ప్రబంధం బెయ్యది యంటేని,

పంచతంత్రం మనగ సంచితగీర్వాణ భాష మున్ను చెప్పబడినయట్టి
కావ్య మంధ్రభాష గర్ణాంచితంబుగా - గూర్పువలయు నీదు నేర్పు మెరయ.

(దూ. పంచతంత్రం, 1-17-18-19)

నారాయణకవి యొక్క నేర్పు అంతంతమాత్రమే అని చెప్పాలి. ఇతడు కవిత్రయాన్ని మాత్రమే స్మరించడంచేత శక్తిమంతుడనిపిస్తాడని శివశంకరస్వామిగారు భావిస్తున్నారు.[7] గాని టేకుమళ్ళ అచ్యుతరావుగారు చెప్పినట్టు నారాయణకవి సామాన్యుడే. ''భావసంపుటియందును, భావనావిస్మృతియందును నెక్కువగా ప్రతిభాగాంభీర్యములు కాన్పింపవు. అయినను కవన ధోరణి ఎచ్చోటైనను రసవిహీనత నొందదు. నారాయణకవి గొప్ప పండితుడని చెప్పుట కవకాశము లేదు. మహాకవీశ్వరుడని చెప్పుటకు వీలు లేదు. సామాన్య కవియనియే భావింపదగినది.[8] అని టేకుమళ్ళ వారు చెప్పిన మాటలు అక్షరాలా నిజమే. నారాయణకవి రచన అంతా ప్రౌఢంగానే లేదని బైచరాజు వెంకటనాథుడు అనే మరొకతడు మళ్ళీ పంచతంత్రం తెనిగించి ఉంటాడని టేకుమళ్ళ వారు ఊహించడం కూడా సముచితమే.

తెలుగులో కొన్ని పంచతంత్ర కావ్యాలు

వరుస నెం.	కాలం క్రీ.శ.	పేరు	వివరణ
1.	1256	మంచెన	ఇతడు తన కేయూరబాహు చరిత్రలో పంచ తంత్రంలోని కథలు ఉపయోగించుకొన్నాడు.
2.	1347కు ముందు	పేరు తెలియని తొలి అనువాదకుడు	ఇతని కావ్యంలో 189 పద్యాలు సింగన తన సకలనీతి సమ్మతం అనే సంకలనంలో ఉదహరించాడు.
3.	1480 ప్రాంతం	దూబగుంట నారాయణకవి	లభిస్తున్న అనువాదాలలో మొదటి సంపూర్ణగ్రంథం
4.	1497 ప్రాంతం	కూచిరాజు ఎర్రన	సకలనీతికథానిధానంలో కథలు చేర్చాడు
5.	1500-1570	బైచరాజు వెంకటనాథుడు	చాలాప్రౌఢంగా వ్రాసిన పద్యకావ్యం.
6.	1510-1530	తిప్పయ్యగారి భానుకవి	కృష్ణదేవరాయల కాలంవాడు. సంపూర్ణంగా ఆంధ్రీకరించాడు. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంవారు ప్రకటించారు.

7. తెలుగు భాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 3వ సంపుటి, పుట 911.
8. విజయనగరసామ్రాజ్యమండలి ఆంధ్రవాఙ్మయచరిత్రము, పుట 119.

వరుస నెం.	కాలం క్రీ.శ.	పేరు	వివరణ
7.	18, 19వ శతాబ్దులు	రావిపాటి గురుమూర్తిశాస్త్రి	విద్యార్థులకోసం వచనకావ్యంగా అనువదించిన ప్రథముడు
8.	19వ శతాబ్ది	పరవస్తు చిన్నయసూరి	మిత్రలాభ మిత్రబేధాలను 'నీతిచంద్రిక' అనే పేర వ్రాశాడు. హితోపదేశాన్ని అనుసరించాడు.
9.	19వ శతాబ్ది	శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి	పంచతంత్రం వీరుకూడా పద్య కావ్యంగా ఆంధ్రీకరించారని తెలుస్తున్నది.
10.	19వ శతాబ్ది	కందుకూరి వీరేశలింగంగారు	చిన్నయసూరి విడిచిన భాగాలు ఆంధ్రీకరించారు.
11.	19వ శతాబ్ది	కొక్కొండ వెంకటరత్నం	కందుకూరివారికి పోటీగా ఉన్న చిన్నయసూరి వదలిన భాగాలు తెనిగించారట.
12.	19వ శతాబ్ది	ఉల్లంగి రామచంద్రరావు, నెల్లూరు	పద్యకావ్యంగా అనువదించాడు.
13.	20వ శతాబ్ది	విశ్వాత్ముల నరసింహమూర్తి	బొమ్మలకథగా బాలురకోసం చిత్రించారు. మిత్రబేధం, మిత్రలాభాలకు నండూరి రామమోహనరావుగారు సాహిత్యం వ్రాశారు.
14.	20వ శతాబ్ది	బాపు	నరసింహమూర్తిగారు విడిచిన అసంప్రేక్ష్యకారిత్వం చిత్రించారు. నండూరివారు సాహిత్యం వ్రాశారు.
15.	20వ శతాబ్ది	విద్వాన్ విశ్వం	నాలుగువేల పంక్తులు ద్విపద కావ్యంగా బాలురకోసం రచన చందమామ పత్రికలో ప్రచురితమైనది.

రామాయణం లాగే పంచతంత్రం కూడా తెలుగు భాషలోకి చాలాసార్లు రచితమైంది. ఆదినుంచి నేటిదాకా ఎన్నిసార్లు ఎలా అనువాదం అయిందో ఈ పట్టిక చూస్తే తెలుస్తుంది. పంచతంత్రాన్ని కమ్మని మాటలోనే కాక బొమ్మలరూపంలో కూడా చెప్పుకొనడం కేవలం ఆధునిక ప్రక్రియేకాదు. అత్యంత ప్రాచీనకాలంలో కూడా పంచతంత్ర కథలను భారతీయ శిల్పులు గండరించారు. మహాబలిపురంలో 'అర్జుని తపస్సు' అనే సుప్రసిద్ధ శిల్పం ఉంది. సంధి విగ్రహతంత్రంలోని 'తగువుతీర్చిన పిల్లికథ' ను ఇక్కడ శిల్పులు గండరించారని ఎ.ఎస్.పి. అయ్యర్‌గారు గుర్తించారు.[9] ఈ శిల్పం క్రీ.శ. 7వ శతాబ్దిలోనిది. కర్ర కరచిన తాబేలును కొంగలు ఎగురవేసుకొని వెళ్ళే కథను (మిత్రభేదం) తంజావూరుకు ఆరుమైళ్ల దూరంలో ఉన్న 'కండియార్' దేవాలయంలో గండరించారని వారే చెప్పారు. ఇదే కథను ముక్తేశ్వరం శిల్పులు కూడా చెక్కారు. కాంబోడియాలోని అంగోర్ వాట్ శిల్పాలలో పంచతంత్రం కథలున్నాయట. కొటాన్‌లోని ప్రాచీన గుహలోనూ, చివరకు చీనాదేశపు నడిబొడ్డున ఉన్న ఒక గుహలోనూ పంచతంత్రం కథలను శిల్పులు చెక్కుకున్నారు.

9. Panchatantra Hitopadesa Stories by A.S.P. Ayyar, Introduction, P.5

శిల్పం కళ్ళముందు కన్పడుతున్నా మాట్లాడుతూ ఏదో చెప్పగలగాలి. కావ్యం ఏదో చెప్తున్నా కళ్ళముందు కనబడేటట్టు చిత్రించాలి. అప్పుడే కళ రాణిస్తుంది. నారాయణకవి మూలవిధేయత ఎక్కువగా పాటించడం వల్ల ముక్తసరిగా చెప్పినట్టు కనబడుతుంది. వెంకటనాథుడు అష్టాదశ వర్ణనలూ పెట్టి దీన్ని మహాప్రబంధం చేద్దామనుకోవడం వల్ల ప్రౌఢత్వం చిక్కనైంది. భానుకవి రచన మధ్యరకంగా ఉంది. నారాయణకవి చక్కగానే అనువదించినా సింగన ఉదాహరించిన ప్రథమకవి తెనిగింపే ఇంపుగా ఉందేమో అనిపిస్తుంది. రెండు అనువాదాలు తారతమ్యం చూడండి.

మిత్రభేదంలో దమనకుడు తన ప్రభువైన పింగళకునితో భృత్యులను రాజు యోగ్యతలనుబట్టి ఎలా వాళ్ళ వాళ్ళ స్థానాలలో నిలపాలో చెప్పే ఘట్టంలోని పద్యాలు ఇవి:

నరపతి భృత్యుల దొడవుల - నొరసి తగిన నెలవులందు నునుపక యున్నన్
జరణంబున చూడామణి - శిరమున నందియము బెట్టు చెలువముగాదే!
కుందనము కూర్ప నర్హమై యందపడిన
పృథులరత్నంబు వెండిలో బెట్టెనేని
రత్నమున కేమి కొరయగు రాజు బంటు
దగిన పని బెట్టకుండిన తగవుకాదె? (దూబగుంట, 1-132, 133)

ఇవే పద్యాలను ప్రథమకవి ఎలాగ అనువదించాడో చూడండి.

అధికుడైన వాని నతినీచతరమైన - యట్టిపదవి దెచ్చి పెట్టుటెల్ల
వర్ణనీయమైన నరశిరోరత్నంబు - కాలగట్టినట్లు కాదె తలప
తగిన పదంబునం దిడెడు దక్షత రాజున కుండుగాక యీ
జగమున - నీతిమంతుడన జాలిన సేవకు డుండకుండునే
తగరముమీద దెచ్చి నిరతంబగ రత్నము గీలుకొల్పగా
వగచునే రత్న మట్టిపనివానిది దోషముగాక యారయన్?
(సకలనీతి సమ్మతం, 210-211)

అనవసరమైన విషయాలలో మనం జోక్యం కలిగించుకోవడం ఎందుకు, సీల పీకి దూలంలో చిక్కి చచ్చిన కోతి కర్మ మన కెందుకు అని కరటకుడు చెప్పినప్పుడు ఆ నక్కతో దమనకుడు మూలంలో ఇలా చెప్తాడు.

సుహృదా ముపకారకారణాత్ ద్విషతా మప్యపకారకారణాత్
నృపసంశ్రయ ఇష్యతే బుధైర్జతరం కో నభిభర్తి కేవలం (పంచతంత్రం, 1-22)

దీనిని ప్రథమకవి ఇలాగ కందంలో అందంగా అనువదించాడు.

కడుహితులకు నహితులకును వడి మేలును గీడు జేయవలసినవారల్
పుడమి పులగొలువవలయును గడుపెవ్వడు బ్రోచుకొనడు కరటక చెపుమా
(సకలనీతి సమ్మతం, 460)

దీనిని నారాయణకవి కూడా కందంలోనే అనువదించాడు.

మిత్రుల కుపకారంబును - శత్రుల కపకారమును నిజంబుగా, జేయన్
క్షత్రియులగొలుచుటయుదర-మాత్రముకొరకైన సేవ మహిదొరయగునే?
(దూబగుంట, 1-95)

ఇదే పద్యాన్ని వెంకటనాథుడు కూడా కందంలోనే తెనిగించాడు.

తనవారి బ్రోచుటకు నొంటరివాని వధించి వైచుటకు గా నృపులం
బనివడి గొలుచులే కెవ్వని కెద్దడి పుట్టె నన్నవస్త్రంబులకున్?
(వెంకటనాథకవి, 1-132)

ఈ పద్యాన్నే భానుకవి చంపకమాలగా అనువదించాడు.

పరుల మదంబు ద్రెంచ దన బాంధవకోట్లను మన్చి దిక్కులన్
గురుతరకీర్తి నించ దన కోరిక లెల్ల ఫలించ రాజశే
ఖరులను సజ్జనాళి కలకాలము గొల్చుటకాక పొట్టకై
తిరముగ గొల్వనేల కులదీపక విఠ్ఠయలక్ష్మధీమణి!
(భానుకవి పంచతంత్రం, 1-77)

మూలంలోని 'జఠరం కో నభిభర్తి కేవలం' అన్న మాటలను ప్రథమకవి 'కడు పెవ్వడు బ్రోచుకొనడు' అని జాతీయతతో తెనిగించాడు. దూబగుంట కవి ప్రాసకోసం 'ఉదరమాత్రముకొరకైన సేవ' అని వ్రాయవలసి వచ్చింది. వెంకటనాథుడు తిండితో ఆగక అన్నవస్త్రాలు రెండూ చెప్పి 'ఎద్దడి' అనే దేశ్యం బాగా వాడాడు. భానుకవి 'పొట్టకై' అనే నుడికారం వాడాడు. సాధారణమైన ఈ చిన్న శ్లోకాన్ని నలుగురూ నాలుగువిధాలుగా అనువదించిన తీరు చూస్తే వాళ్ళవాళ్ళ మనస్తత్వాలు తెలుస్తాయి. ఈ నలుగురు కవులూ అనుసరించిన మూలప్రతి రమారమి ఒకటే అని చెప్పవచ్చు. దూబగుంట కవీ, వెంకటనాథుడు దంతిలుని కథ, కౌలికుని కథ మొదలైనవి విడిచిపెట్టారు. ఈ సందర్భంలో టేకుమళ్ళ అచ్యుతరావుగారు ఇలా వ్రాశారు. ''బహుశః రెండింటిలో రాజస్త్రీల అనులోమవ్యభిచారక విషయకమగు వృత్తాంత ముండుటచే బరిత్యాజింపబడియె కాబోలు. అటులే, నీలితొట్టెలో పడిన నక్కకథయు విడుచుటకు గారణము మృగ్యము. దండనాథునకు, వాని కొడుకునకు సమానబంధకి యగు గొల్లదాని కథ విసర్జితమై ఆ స్థానమందు జారత్వకళంకరహితమైన వేరొక కథ కాన్పించుచున్నది.[10] అచ్యుతరావుగారు ఏ ప్రతులు చూశారో గానీ ఈ తండ్రీకొడుకులు ఇద్దరితో భోగిస్తూ మగడితో అతికే అబద్ధం ఆడిన గొల్లదాని కథ నారాయణకవి గ్రంథంలోనూ, వెంకటనాథుని కావ్యంలోనూ కూడా ఉంది.

---

10. విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయము, ప్రథమ భాగం, పుట 116.

మిగతా కథలలో ఎక్కడా తీరుబాటు చేసుకొని ఆడదానిని వర్ణించని దూబగుంట నారాయణకవి ఈ కథ చెప్పేటప్పుడు ఎత్తుకొంటూనే గొల్లభామను ఇలా వర్ణించాడు:

కరికుంభయుగ మతికాఠిన్య మగుకాని యీకాంత చనుదోయికింతవెలితి
దళితారవిందంబు తెలివి మేలగుగాని యీ యింతిమోముతో నీడుగాదు
మెరసి నిల్చిన కారుమెరుగు మేలగుగాని యీకొమ్మతనుకాంతికింత కొరత
మించి కెంజిగురాకు మెరుముచుండునుగాని యీలేమపదముల కీడుగాదు
అనుచు కొనియాడు తలుపుల కగ్గలించి - కమ్మనిల్తునిమృదుసాయకమ్మనంగ
జారుశృంగారమోహనాకారయగుచు - బ్రణతికెక్కిన గోపాలబాలయోర్తు
(దూబగుంటకవి, 1-455)

క్రొత్తదనం ఏమాత్రం లేని వర్ణనతో ఇలా గొల్లభామను ప్రవేశపెట్టి వెనువెంటనే తరువాతి పద్యంలో కాంతుగనుబ్రామితా భోగకాంక్ష దండపాలకుడు దతుడు నుపతులుగాక నెన్నడును వారు దమలోన నెరుగకుండ నొనరరతికేళి సలుపంగ నొక్కనాడు (దూబగుంట, 1-456) అని పేలవంగా కథలోనికి వెళ్ళాడు. (నారాయణకవి 13 గద్యపద్యాలలో చెప్పాడు.) మొదట గొల్లెత ఇల్లూ వాకిలీ ఇలా వర్ణించాడు.

గొరియలమంద యాబసులగుంపు కృషిక్రియ దుక్కిటెడ్ల దొ
డ్డిరికిటి పెళ్ళు కంప బలియించిన లోగిలి ముల్లు పెండెముల్
తరువుల గాడి కోడి యలదామెను గాదెల గొల్పు గల్గి యే
కొరతయు లేక యుండు నొక గొల్లత యొండొక పట్టణంబునన్.
(వెంకటనాథకవి, 1-586)

తరువాత ఆ గొల్లత కట్టూ బొట్టూ వర్ణించాడు.

వన్నెల బెట్టు గట్టుజలువల్చలువ ల్వెదజల్లు చన్నులన్
గన్నుల కల్కి పూయు సిరిగంధము మందమరుత్కి శోరముల్
జన్నులు రేప మెచ్చు ముడుచు న్గడు జొక్కపు గ్రొవ్విరుల్ సరుల్
పన్ను శిరోధివీధి గనుపట్టు నయారె యొయార మేర్పడన్
(వెంకటనాథకవి, 1-587)

గొల్లెత ఒయారం చెప్పాక అది వ్యభిచరించటానికి గల కారణం వ్యంగ్యగుంభనంగా చెప్తున్నాడు.

పాయని మందనుండి 'యడపాదడపా' జనుదెంచు బోయనిన్
బోయిన జీరజిక్కదట పుణ్యము లేదని మానవంబునం
ద్రోయ కహో పరస్థలము ద్రొక్కియు జూచిన యేని నాలుగేణ్
గాయలు గాయ నచ్చెలు వగర్భమునం దెటువంటిపాపమో!
(వెంకటనాథకవి, 1-588)

ఈ పద్యంలో అడపాదడపా, చీరచిక్కుట మొదలైన జాతీయాలు చక్కగా వాడాడు. మగడు మందలో ఉంటాడు. దాని కడుపున నాలుగు కాయలు కాచలేదు. అందుచేత చీకటి తప్పులు చేయటానికి ఆస్కారం ఎక్కువ. ఆ సంగతి వెంకటనాథుడు ఇలా చెప్పాడు.

కనిపెంచని గొల్లాడలది - గననొడలు న్నొడలు నడలు కటి నెన్నడు మున్
జనుదోయి మెరుగుజిగిబిగి - యనయంబున్ దచ్చి వేసిన ట్లొప్పెసగున్.

(వెంకటనాథకవి, 1-589)

అంతమాత్రం చేత ఆమె ఇంటిపనులు మానేస్తుందని, ఎప్పుడు వ్యభిచరిస్తూనే ఉంటుందని కవి చెప్పటం లేదు. రెండు పద్యాలలో ఆ గొల్లది చల్ల చేయడాన్ని చక్కగా వర్ణించాడు.

వేవిన నిద్రమేలుకొని వేరొక బానకు నేర్పుతోడ బై
మీగడ బుచ్చి కవ్వమిడి మిట్టచనుంగ రాయడింప మే
దీప నటింప నెన్నడుము దీలుపడం గటిగుల్క గాచముల్
జోనల బాడ జల్ల దరుచున్ వడి దర్శిణిరజ్జు పాణియై
వెడవెడ వేడివెన్నొరయు వేనలి మస్తకసీమ దక్రవుం
గడవ యొకింత పయ్యెదకు గాకర దోచును రోజమాజ్యంపు
బిడుతపికాంగనోక్తి వలపించు నెలుం గమరంగ వీటన
ప్పడతుక చల్లవిల్చు గనుపండవజారుల కాచరింపుచున్

(వెంకటనాథకవి, 1-520-591)

జారులకన్నుల పండువ చేయబట్టె దండనాథునితో, అతని కొడుకులతో ఆమెకు సంపర్కం ఏర్పడింది. ఒకనాడు కొడుకుతో క్రీడిస్తున్నప్పుడు తండ్రి వచ్చాడు. అప్పుడు చిన్నవాడిని గాదెలో దాచింది. దండపాలునితో సయ్యాటలాడుతుంటే మగడు వచ్చాడు. ఆ గొల్లవానిని వెంకటనాథుడు ఎంత సహజంగా వర్ణించాడో చూడండి.

అట్టలెత్తిన ప్రాతమెట్టులు కడుకుంటుబడి చారికలతోడి పరువకాళ్ళు
నడిప్రాత ముతక గోణము మించు ములుగకత్తి యలిమిడి మూలికలును
కొడిది పూసల నంటుకొలిపిన మొలత్రాడు తలదుడ్డు చీరణంబులు పొదియును
నొడిసెల పాలకావడి నుచ్చు ప్రాతలగుది మూపుపై వ్రేలు గోర్పడంబు
తూతకొమ్ము చంకదోపిన యెదమెట్టి - తొర్లుగొ వి ధూళిధూసరితము
లైన కురులు నమరి నాకస్మికంబుగా మంద... ఇంటి మగడు వచ్చె.

(వెంకటనాథకవి, 1-598)

ఇటువంటి స్వాభావిక వర్ణనలు, పాత్ర పరిశీలనలు, స్వభావనిరూపణలు వెంకటనాథుని పంచతంత్రంలోనేగానీ, దూబగుంటకవి గ్రంథంలోగానీ, భానుకవి రచనలోగాని కనబడవు. రాజనీతిని బోధించే పంచతంత్రంలో శృంగార ఘట్టాలు పెంపు, అష్టాదశవర్ణనలు సొంపూ ఎందుకంటే అది వేరే ప్రశ్న. సామెతలు, పలుకుబళ్ళు,

జాతీయాలూ, కల్పనలు, నుడికారపు రుచులు వెంకటనాథుని గ్రంథంలో పుటకుపుట్టెడు. దూబగుంటకవి అడపాదడపా అక్కడక్కడ రసపుష్టి ఉన్న కథ నడపటంలో కుంటుతాడు. నీతులు మాత్రం చక్కగా పద్యరూపంలో పెడతాడు. నారాయణకవి పద్యాలను కొన్నింటిని చివర మార్పు చేసి భానుకవి తన పంచతంత్రంలో వాడుకొన్నాడు. వాటి వివరాలు ఇవి:

దూబగుంట	భానుకవి
(1) 2-108	2-70
(2) 2-109	2-71
(3) 2-110	2-72
(4) 3-30	3-18

ఇప్పుడు భానుకవి స్వీకరించిన తన గ్రంథంలో వాడిన నారాయణకవి పద్యాలను చూద్దాం.

పరదేశమే నిజదేశము పరులే బాంధవులు ద్రవ్యపరిపాలునకున్
ధరణి నసాధ్యం బెయ్యది పరమార్థము ధనము చూవె ప్రజలకు నెల్లన్ (2-108)

కులసతి రోయును జుట్టం - బులు వాయుదు రొరులు కష్టపుం బలుకుల ని
మ్ముల వాడ దొడగుచుందురు కలియుగమున ద్రవ్యహీను కలకాలంబున్(2-109)

మృతి నొందిన జనునైనను - హితులెల్లను డాయుదురు మహీస్థలిలోన్
మతి దలప బేద జేరరు - బ్రతిమాలిన నైన సఖులు బంధులు నెపుడున్ (2-110)

అతిబలవంతుడైన వినయంబున వారలతోడి మైత్రి సం
తతమును నిశ్చలంబగు జనంబునజేసి నిజప్రదేశసం
గతుడయి పోల్చు టొప్పు నది గాదని యొండొక దేశ మేగినన్
ధృతి మెయి బోరిన న్వినుము ధీయుత నొచ్చునతండు నేరమిన్. (3-30)

ఈ నారాయణకవి రచనలో ఈనాటి బాలవ్యాకరణానికి విరుద్ధమైన ప్రయోగాలు కనబడతాయి. 'క్రియాఫలంబు కర్తగామి యగుచో గొనుధాతు ననుపయుక్తంబగు' (క్రియ, 52) అని చిన్నయసూరి సూత్రీకరించాడు. కొన్ని చోట్ల 'కొను' కు 'క' వస్తుంది. దీనికి గతి కల్పించలేదు. నారాయణకవి పొడుచుక (1-96), మోచుకుపోవు (1-112), కట్టించుక (1-191)-ఇలాగ పదకొండుచోట్ల ప్రయోగించాడు. మహాకవిగా కీర్తిపొందిన పిల్లలమర్రి పినవీరభద్రుడు కూడా కనీసం అరడజనుసార్లు ఈ ప్రయోగాన్ని జైమినీ భారతంలో వ్రాశాడు. చుట్టుక (3-103), కట్టుక (3-109), పట్టుక (4-123), తోలుక (-7-42), అలందుక (7-116), ఎత్తుక (8-24) అనే ప్రయోగాలు పినవీరభద్రునివి కనబడుతాయి.

భానుకవి కూడా ఇలాగే ''కొను''కు 'క' వాడాడు. ఇది పదిహేనో శతాబ్దంలో గ్రంథస్థమైన వ్యావహారిక రూపం. భాషాపరిశోధనకు చాలా ఉపయోగకరం.

ప్రపంచ సాహిత్యాన్నే శ్రీమంతం చేసిన పంచతంత్రాన్ని తర్జుమా చేసి యథాశక్తి మన సాహిత్యాన్ని పెంపొందించిన అనువాదకులలో సంపూర్ణ గ్రంథం దొరికిన మొదటివాడుగా నారాయణకవి తెలుగువాళ్ళకు చిరస్మరణీయుడు.

అన్నమయ్య

చందమామ రావే! జాబిల్లి రావే! అని పాడుతూ ప్రతి తెలుగుతల్లీ తన బిడ్డకు గోరుముద్దలు తినిపిస్తుంది. ''జో అచ్యుతానంద! జోజోముకుందా!'' అని ఉయ్యాల ఊపుతూ జోకొడుతుంది. ఆంధ్రదేశంలో ఆబాలగోపాలానికీ తెలిసిన ఈ పాటలు వ్రాసిన కవి ఎవరు? జాతి సంస్కృతిలో ఒక భాగంగా కలిసిపోయిన కమ్మని కవితను ప్రసాదించిన చాలామంది బయకారుల పేర్లు కాలసముద్రపు హోరులో వినబడవుగానీ, పసివాళ్ళను సహితం పరవశింపజేసే పై పాటలు వ్రాసిన మహనీయుని పేరు మనకు తెలియవస్తోంది. అతడు తాళ్ళపాక అన్నమాచార్యులు.

పొత్తపినాటిలో, అంటే కడప జిల్లా రాజంపేట సిద్ధవటం మండలాల భూభాగంలో తాళ్ళపాక అనే గ్రామం ఉంది. ఆ ఊరిలో అన్నమయ్య జన్మించాడు. ఈయన సంతతి వాళ్ళంతా చదువుల సరస్వతులేగాని ఇతని పూర్వీకులకు ఓ పట్టాన చదువు అబ్బలేదు. పంతులు దగ్గర పాఠం కన్నా పాము పుట్టలో చెయ్యి పెట్టడమే నయమని అన్నమయ్య తాతగారు నారాయణసూరి చిన్నప్పుడు భావించి పారిపోయాడు. ఉన్న ఊళ్ళో చదువు రాలేదని ఊటుకూరులో చదువపెట్టారు. అయితే ఆ బిడ్డకు ఎంత చెప్పినా ఒక్క అక్షరం వచ్చిన పాపాన పోలేదు. నూరుమాటలు చెప్పి నూరిపోసినా, చెవులు నులిపెట్టినా కోదండం వేలాడదీసినా, గుంజిళ్ళు తీయించినా, ఎంత బాధపెట్టినా ఏడుపు తప్పించి ఇంకేమీ వచ్చేది కాదు. ఊటుకూరు చింతలమ్మ గుడిలో ఒక పాము పుట్ట వుందని తెలుసుకొని నారాయణసూరి అక్కడ చావడానికి తెగించాడు. అప్పుడు చింతలమ్మే వచ్చి నచ్చచెప్పిందా అన్నట్టు ఏ యిల్లాలో వచ్చి ఊరడించింది. ''చదువు రాకేమిచేస్తుంది''? మీ తాళ్ళపాకలో కేశవస్వామి దేవాలయం ఉందిగా? పోయి ఆ స్వామిని సేవించి చదువు ప్రసాదించమను, ఇస్తాడు'' అని ఆమె చెప్పింది. నారాయణసూరి అలాగే చేశాడు. ''అయ్యా నువ్వు సరస్వతికి మామగారివి, నాకు విద్య దయ చెయ్యి'' అని అడిగాడు. తరువాత ఎవరూ నమ్మలేనంతగా అతడు విద్యాధికుడయ్యాడు. చావచంపి చెవులు మూసినా ఓనమాలు రాని కుర్రవాడు చూస్తుండగా పదం క్రమం ఏమీ తప్పకుండా ఘన, జట మొదలైన వేదపాఠాలు నేర్చుకున్నాడు. క్రమంగా నారాయణసూరి అన్ని విద్యలలోనూ అందెవేసి సర్వజ్ఞుడనిపించుకున్నాడు. ఇతని మనుమడే అన్నమయ్య తాతగారంత సర్వజ్ఞుడయ్యాడు. అచ్చంగా తాతగారి పోలికలే వచ్చాయి.

పాము పుట్టలో చేయి పెట్టడానికి తాతగారు పారిపోయినట్టు తిరుపతి కొండలమీద తిరిపెమెత్తుకున్నా ఫరవాలేదని మనుమడు చిన్నప్పుడే ఇంట్లోంచి పారిపోయాడు. అడ్డాలలో బిడ్డగా ఉన్నప్పటినుంచీ అతనికి పాటలంటే ఇష్టం. ఉగ్గుపోస్తున్నా, ఉయ్యాల ఊపుతున్నా పాలు పట్టినా లాల పోసినా పాటలు పాడవలసిందే. అతని తల్లి లక్కమ్మగారి గొంతుకలో ఏం మాధుర్యం ఉందోగానీ, పసిబిడ్డ మంత్రముగ్ధుడై వినేవాడు. ఆమె పుట్టిల్లు మాడుపూరు.[1] ఆ ఊళ్ళో ఉన్న మాధవస్వామితో ఆమె ఆడుతూ, పాడుతూ మాట్లాడేదని లోకులు చెప్పుకునేవారు. ఆమెకు తిరుపతి వెంకన్న అంటే అమిత భక్తి, అన్నమయ్య ఆ దేవుని ప్రసాదమే అని ఆమె నమ్మకం. ఈ బిడ్డకోసం ఆమె నోములు నోచింది. తిరుపతి కొండ ఎక్కి గరుడ స్తంభానికి దండం పెట్టింది. సంతానం వేడుకొంది. ఆనాటి రాత్రి ఆమెకు కలలో స్వామివారి బిరుదు గజ్జల ముప్పడి కిఠారం సాక్షాత్కరించింది. ఆ తరువాత అన్నమయ్య పుట్టాడు. అందుకే ఈ బిడ్డనిచ్చిన తిరుపతి వెంకన్న అంటే అంత భక్తి. ఆ కొండల కోనేటి రాయడి మీద ఆమె పారవశత్వంతో పాటలు పాడుతూ ఉండేది. అవి పసిబిడ్డ చెవులు రిక్కబొడుచుకొని వినేవాడు. ఉగ్గుపాలతో తల్లి నేర్పిన విమలగాంధర్వం అన్నమయ్య ఒంటపట్టింది. చిన్నప్పటినుంచి సొంతంగా పాటలుకట్టి పాడుకొనేవాడు. అతడు ఆడిన మాటెల్లా అమృతకావ్యమై పాడిన పాటెల్లా పరమ గానమైంది. వెంకటపతి మీద వింత వింత సంకీర్తనలు ఆ కుర్రవాడు పాడసాగాడు, వేదం చెప్పుకునే బ్రాహ్మణ కుటుంబంలో కూనిరాగాలు తీస్తూ పాటలు పాడడం, అందులోనూ తెలుగు పాటలు స్వయంగా కట్టి పాడడం ఎబ్బెట్టుగా ఉంది కాబోలు, బంధువులు ఈసడించేవారు. అన్నమయ్యకు అందరూ పనులు చెప్పేవారే. ఎవరే పని చెప్పినా చేసుకుంటూపోయేవాడు. ఇంత అణకువగా ఉన్నా వదినెగారతన్ని రాచిరంపాన పెట్టేది. పశువులకు గడ్డి కోసుకురమ్మని పంపేది.

ఒకనాడు అన్నమయ్య గడ్డి కోస్తున్నాడు. కిందనున్న గడ్డి కోస్తున్నప్పుడు, పైనున్న ఏ గాంధారం గొంతుకలో ధ్వనించిందో కొడవలితో గడ్డికి బదులుగా వేలు కోసుకున్నాడు. నెత్తురు కారింది. బాధతో అన్నమయ్య 'శ్రీహరీ' అని కేక వేశాడు. నెత్తురు చూసుకున్నాడు. తన రక్తంలో లీనమైన కర్తవ్యమేదో అతనికి జ్ఞాపకం వచ్చినట్టుంది. ఆ కొడవలి అక్కడే పారేసి కట్టుబట్టలతో కదలిపోయాడు. తొడుక్కున్న చెప్పులు కిర్రుకిర్రుమని తాళం వేస్తూ ఉంటే పాట పాడుకుంటూ తిరుపతి దారి పట్టాడు.

వీణలు మీటుతూ, మద్దెలలు వాయిస్తూ, చిందులు తొక్కుతూ విలసిల్లే శ్రీరాగ వెల్లువలాగా భక్తులు తిరుపతికి సాగారు. వాళ్ళతో అన్నమయ్య కలిసి గొంతు కలిపాడు. ఊరూరా ఆయా దేవతలను సేవిస్తూ తిరుపతి గ్రామానికి వచ్చాడు. ఆ గ్రామ దేవతలను పూజించి అలిపిరి దగ్గర కొండ ఎక్కడం ప్రారంభించాడు. అడుగడుగునా కనబడిన ప్రతివేల్పునూ దర్శించుకుంటూ సాగిపోయాడు. ఏడుకొండలు కాదు ఏడేడు పధ్నాలుగు లోకాలూ కూడా చుట్టబెట్టవచ్చి ఉత్సాహంతో ఉన్నవాడు. అయినా బహుశః ఏ మాత్రం

1. ఇది కడపజిల్లా సిద్ధవటం తాలూకాలో ఉంది.

విశ్రమించకుండా ఏకబిగిన కొండ ఎక్కడం మొదలుపెట్టాడు కాబోలు పెద్ద ఎక్కుడు చేరేసరికి సొమ్మసిల్లాడు. చెప్పుల కాళ్ళతో కొండ ఎక్కితే త్వరగా అలసిపోతారని తెలియనివాడు. ఆ జోళ్ళతోనే అలా మేను వాల్చాడు. చల్లనిగాలి వీస్తూ, తుమ్మెదలు తొలిచిన రంధ్రాలు పూరిస్తూ వేణుగానం చేస్తూ వుంటే వెదురు పొదకింద కూర్చున్న నల్లని అన్నమయ్య కృష్ణునిలాగే ఉన్నాడట. లే చెమటలతో బడలికతో ఎవరికీ కనబడని ఆకలితో అతడు నిద్రపోయాడు.

అప్పుడెవరో ఒక చల్లని తల్లి వచ్చి ఇది చూసింది. కుర్రాణ్ణి చూసి జాలిపడింది. లేపింది. ''ఏం నాయనా, అలా ఉన్నావు?'' అని అడిగింది. ''ఏం చెప్పమన్నావమ్మా! ఆకలి, ఎంతో దూరంనుంచి వస్తున్నాను. కళ్లు పైకిపోతూన్నయి. ఎలాగో నాకు దేవుణ్ణి చూపించు'' అన్నాడు. కుర్రాడు ''చెప్పుల కాళ్ళతో కొండ యెక్కితే అంతే నాయనా'' అంది. అన్నమయ్య వెంటనే జోళ్లు విడిచేశాడు. ఆ ఇల్లాలు తనతో తెచ్చిన ప్రసాదాన్నాలు అతనికి కడుపునిండా పెట్టింది. ఆమె అతనిపాలిటి అలమేలుమంగ, కడుపు నిండింది. అలసటపోయింది. గొంతు విడిచింది. అన్నమయ్య ఆశువుగా సరసకవిత్వం వాచాప్రౌఢితో ఒక శతకం చెప్పాడు.

> అరిసెలు నూనెబూరియలు నౌగులు జక్కెర మండిగల్ వడల్
> బురుడలు పాలమండిగ లవూపము లయ్యలమేలుమంగనీ
> కరుదుగ విందు వెట్టు పరమాన్న చయంబులు నూపకోటియున్
> నిరత వినిర్మలాన్నములు నేతులసోనలు వెంకటేశ్వరా! (వెంక. 50)

ఈ వెంకటేశ్వర శతకము ఎంతో ప్రఖ్యాతమైనది. కడుపునిండా తిండిపెట్టిన తల్లిని అలమేలుమంగగా భావించి, ఆమెను దేవుణ్ణి చూపించమని అంతకుముందే అడిగాడు. అదే భావాన్ని పద్యంలో చెప్పాడు.

> ఓ లలితాంగీ యో కలికి యో యెలజవ్వని యో వధూటి యో
> గోల! మెరుంగుజూపు కనుగోనల నోయల మేలుమంగ మ
> మ్మేలిన తల్లి నీ విభున కించుక మా దెస జూపుమంచు నీ
> పాలికి జేరి మ్రొక్కుదురు పద్మభవాదులు వెంకటేశ్వరా! (వెంక. 5)

అప్పటికే అన్నమయ్యకు పోతరాజుగారి భాగవతంలోని పద్యాలు కంఠతా వచ్చినట్లున్నాయి. ఆ ఒరవడిలో అనుప్రాసంతో ఒక పద్యాన్ని చెప్పారు.

> చక్కని తల్లికిన్ నవరసంబుల వెల్లికి బుష్పవల్లికిం
> జక్కని మోవి ముత్తియపు జల్లికి శ్రీయల మేలుమంగకున్
> జెక్కులు మించుటద్దములు చేతులు క్రొత్త మెరుంగదీగ
> లాక్రిక్కిరిగుబ్బలే పసిడి కిన్నెరకాయలు వెంకటేశ్వరా! (వెంక. 49)

ఈ శతకం చెప్తున్నప్పుడు అన్నమయ్య ఏ తన్మయత్వంలో ఉన్నాడో అలమేలుమంగను,

వెంకటేశ్వరుని ఎన్నెన్నో సన్నివేశాలలో ఊహించుకున్నాడు. ఎవరికీ తెలియని దేవరహస్యాలు తనకు తెలుస్తున్నట్టు భావించాడు. అదే ఒక పద్యంలో చెప్పాడు.

ఒప్పగు తూగుటుయ్యెలల నూగుచు నీ వల మేలుమంగతో
నప్పుడు కౌగిట న్రతుల వాకటిపెల్లున నప్పళించుచున్
రెప్పల నవ్వుతో మనసు కిచ్చలతో నరగన్నులార్చుచున్
దెప్పలదేలు సౌఖ్య మిదే దేవరహస్యము వెంకటేశ్వరా! (వెంక. 46)

ఈ దేవరహస్యాలు కళ్లకు కనిపించినంత స్పష్టంగా ఊహించబట్టే అన్నమయ్య ఆశువుగా చెప్పిన ఆ శతకంలో ఎన్నో మధురశృంగార దృశ్యాలున్నాయి. పచ్చి తలంపులున్నాయి.

మానవాతీత శిరోమణికి మంజులవాణికి మోవితేనియల్
కానిక లిచ్చినాడ వట కౌగిట నాయల మేలుమంగకున్
మీనచకోరనేత్రి నిను మెచ్చి ముదంబున గౌగలించి నీ
పానుపుమీది చేత లివి పచ్చితలంపులు వెంకటేశ్వరా! (వెంక. 94)

ఉత్తరోత్తరా అన్నమయ్య పన్నెండు శతకాలు చెప్పాడు. ఆ పన్నెండువందల పద్యాలు మింజుమలె మనకు ఈ వెంకటేశ్వరశతకము లభిస్తున్నది. మోకాళ్ళముడుపు దగ్గిర అన్నమయ్య చెప్పిన శతకం ఇదే అని మనం తృప్తిపడుతున్నాం. ఈ శతకం అలమేలుమంగపై చెప్పినదే అని ఈ పద్యం వల్ల తెలుస్తున్నది.

అమ్మకు తాళ్ళపాక ఘను డన్నడు పద్యశతంబు చెప్పెగో
కొమ్మని వాక్ప్రసూనముల గూరిమితో నలమేలుమంగకున్
నెమ్మది నీవు చేకొని యనేకయుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మద మంది వర్థిలను జవ్వనలీలలు వెంకటేశ్వరా! (వెంక. 100)

పచ్చి తలంపులు, దేవరహస్యాలూ నివేదించిన ఈ శతకం చెప్పాక అన్నమయ్య కదిలాడు. కొండమీది దివ్యస్థలాలు చూచాడు. చంపకప్రదక్షిణం చేసి స్వామి పుష్కరణిలో స్నానం చేశాడు. గుడిలోకి వెళ్ళాడు. కానుకలు పెట్టండి దండాలు పెట్టండి, అంటూ హెచ్చరికలు చేశారు. అన్నమయ్య తన పంచెకొంగుచివర చుట్టిన ఒక కాసు కానుక పెట్టాడు. తరువాత కన్నుల కరువుతీరా స్వామిని సేవించాడు. తనివిదీరక మళ్ళా చూశాడు. అక్కడ నవకీర్తనలు చేశాడు. ఆ పాటలు విని అందరూ మెచ్చుకున్నారు. తీర్థప్రసాదాలు పుచ్చుకొని ఒక విడిదలకు వెళ్ళాడు.

మరునాడు ఆకాశగంగలో పాపవినాశంలో స్నానం చేసి కట్టుచీర ఉతికి ఆరవేసి అది ఎండేలోగా 'కుతుకంబు సమకూర శతకంబు' ఒకటి చెప్పాడు. ఇది వితతవృత్తాలలో రచించాడు.[2] ఆ తరువాత దేవాలయం వద్దకు వస్తే తలుపులు బీగాలు వేసి ఉన్నాయి. తన

2. అన్నమాచార్యచరిత్ర – రచన : చిన్నన్న, పుట 24

దైవాన్ని చూద్దామని తహతహలాడుతున్న అన్నమయ్య ఉండబట్టలేకపోయాడు. వెంకటేశ్వరునిమీద ఇంకో శతకం చెప్పాడు. నూరు పద్యాలు పూర్తి అయ్యేలోగా గుడితలుపులు తెరుచుకున్నాయి. అర్చకులందరూ ఆశ్చర్యపోయారు. ఇంత చిన్నకుర్రాడు సంకీర్తనలు, శతకాలు ఆశువుగా రచించి పఠిస్తూంటే అతడు వరప్రసాదుడని గుర్తించారు. అతనికి చందనతీర్థప్రసాదాలు ఇచ్చారు. అప్పుడు తిరుపతిలో ఘన విష్ణువు అనే వైష్ణవయతి ఉండేవారు. ఈ నల్లని చిన్నవానిని శ్రీవైష్ణవుని చేయాలనే సంకల్పం ఆయనకు కలిగింది. అదే అర్ధరాత్రి దైవశాసనంగా భావించి కలగన్నాడు. మరునాడు ''ఏం నాయనా, ముద్రాధారణ చేయించుకుంటావా? ఓర్చుకోగలవా?'' అని అడిగాడు. అన్నమయ్య 'కృతార్థుణ్ణి' అన్నాడు. వైష్ణవయతి చక్రాంకితలు వేశాడు. అన్నమయ్య వైష్ణవులతో కలసి భుజించాడు. వీరశైవులు దీక్ష పుచ్చుకొన్నాక పునర్జన్మ పొందినట్టు భావిస్తారు. వైష్ణవులు అలా కాదేమో –

> పుట్టినట్టె ఉన్నవాడ పోలేదు రాలేదు
> యిట్టి నీ దాసుడైతే యెంగిలెల్ల బాసె
> తెరమరుగుదానాలు దేవుడ నీ కల్పితమే
> సొరిది ఈ సురలెల్ల చుట్టాలే నాకు
> నిరతి శ్రీ వెంకటేశ నీ మరుగుచొచ్చి నేడు
> గురుని యానతి చేత గొంకు లెల్ల బాసె. (సంపుటి 8, పుట 8)

అని ధన్యాసి రాగంలో అన్నమయ్య చెప్పిన కీర్తన ఏ సందర్భంలోనిదోగానీ ఇక్కడ బాగా అతుకుతున్నది. వాళ్ళ కులంలో ఎన్నడూ లేని వైష్ణవాన్ని తామసులుగా ఉండే తమ వంశాన్ని పరమ సాత్వికులుగా చేశాడు.[3] తిరుపతి కొండపై అతడలా ఎన్నాళ్ళు బ్రహ్మచారిగా ఉన్నాడో తెలియదు. గడ్డికోయడానికి వెళ్లిన బాలుడు ఇంటికి రాలేదని అందరూ తల్లడిల్లారు. ఊళ్ళన్నీ అతనికోసం గాలింపసాగారు. అతడు తిరుపతిలో ఉంటాడని తల్లికి తెలుసు కాబోలు వెళ్ళింది. తనతో ఇంటికి రమ్మని బతిమాలింది. అన్నమయ్య వినలేదు. ఆ తల్లి దేవునితో మొరపెట్టుకొన్నట్టుంది. అన్నమయ్య డోలాందోళనలో పడ్డాడు. తనకు తిరుపతి వదలడం ఇష్టం లేదు. తల్లిని కాదనడం ఇష్టం లేదు. ఏం చేయాలో తోచక దేవుణ్ణి తలుచుకుంటూ నిద్రపోయాడు. ఆ రాత్రి కలలో దేవుడే కనిపించి 'జననివాక్యము ద్రోజనదు' పోయి రమ్మన్నాడు.[4] అప్పుడే మేలుకాంచి అచ్యుతుణ్ణి కొనియాడాడు.

అన్నమయ్య జీవిత చరిత్రలో ఈ కల చాలా ముఖ్యమైనది. ఆయన సంకీర్తనల సంపుటాల మొదట, ఈ కలవచ్చిన తారీఖున అతని సంతతి వారు భద్రం చేశారు. ''స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు 1346 అగు నేటి క్రోధిసంవత్సర

---

3. తాళ్ళపాకవారి గేయరచనలు, చినతిరుమలయ్య, అధ్యా. 9వ రేకు.
4. అన్నమయ్య చరిత్ర – చిన్నన్న, పుట 29.

మందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదహారేళ్ళకు తిరువేంగడనాథుడు ప్రత్యక్షమైతేను అది మొదలు'' ఆ దేవునిపై అంకితంగా అతడు సంకీర్తనలు చెప్పాడు'' అని రాగిరేకుల మీద అతని సంతతివారు చెక్కించారు. తల్లితో తిరిగి ఇంటికి వెళ్ళమన్న కలలోనే తనమీద పాటలు చెప్పమని దేవుడు ఆనతిచ్చి ఉంటాడు. అన్నమయ్యా తల్లితో ఇంటికి వెళ్ళాడు.

అబ్బాయికి పెళ్ళి చెయ్యాలని ఆమె భావించింది. కులమువాళ్ళ ఇళ్ళకు వెళ్ళి సంబంధాలు చూడసాగింది. ఏ ఒక్కరూ పిల్లనివ్వడానికి సిద్ధపడలేదు. దానికి కారణం లేకపోలేదు. ఎప్పుడు చూసినా అన్నమయ్యా 'శ్రీరామ! గోవింద! హరీ!' అనుకోవడమే గానీ సంసారం చేద్దామనే తాపత్రయంలో ఉన్నట్టు కనబడేవాడు కాదు. ఈ ఆచారాల దాసరయ్యాకు చూసిచూసి ఎవరైనా తమింటి ఆడబడుచు ఎలా ఇస్తారు? అయినా అన్నమయ్యాలో ఉండే ఆకర్షణశక్తి ఎటువంటిదో - ఒక అమ్మాయిని కాదు; ఇద్దరిని ఇచ్చి పెళ్ళి చేస్తానని ఒక బంధువు ముందుకు వచ్చాడు. తిమ్మక్క అనే తిరుమలమ్మను, అక్కలమ్మలనే ఇంకో కన్యను అన్నమయ్యా వివాహం చేసుకున్నాడు.

ఆ తరువాత అన్నమయ్యా అహోబలం వెళ్ళి, అక్కడ పీఠాధిపతులైన ఆదివణ్ శఠగోప మునీశ్వరులవద్ద వేదాంతాన్ని అధ్యయనం చేశాడు. అహోబల నరసింహునిపైన ఎన్నో సంకీర్తనలు పాడాడు. నరసింహావతార ఘట్టాన్ని వర్ణిస్తూ పదకొండు చరణాల పాటను వ్రాసాడు. హిరణ్యాకశిపుడు స్తంభాన్ని చరచినప్పుడు

అటుమరి పెటపెటమని బేట్లెగసి - చిటచిటరవముల జిరుతపొగ లెగసి
తటతట మనుచును తరలి వ్రయ్యలై - వటవట మనుచును పగిలె కంభము.

అలాగ పగిలిన స్తంభంలోనుంచి విజయసింహం, వీరసింహం, విమలసింహం, భయదసింహం, ఎలా వెడలిందో, ఎలా కెరలిందో, ఎలా మెరసిందో వర్ణించాడు. ధీరసింహం ఘోరసింహం అవడం చెప్పాడు. ఆ విష్ణుసింహం శాంతమై అహోబల నారసింహమైంది. శ్రీ వెంకట నగమున ఉన్న మూర్తి ఇదే అని అన్నమయ్యా భావించాడు.[5]

కనకసింహమైన ఈ అహోబల నారసింహాన్ని స్తుతించే రోజులలోనే అన్నమయ్యాకు ఇంకో నరసింహంతో మరింత స్నేహమయింది. అతడు సాళువవంశంలోని నరసింహరాయలు. తాళ్ళపాకకు దగ్గరిలో ఉన్న టంగుటూరును అతడు పాలిస్తూ ఉండేవాడు. అతడు అన్నమయ్యాకు బాల్య సఖుడు. అతడు అన్నమయ్యాను దర్శించి కానుకలు ఇచ్చి 'మా వూరు వచ్చి మాకు బుద్ధులు చెప్పి మా పూజలు స్వీకరించండి' అని ప్రార్థించాడు. అన్నమయ్యా అతనితో టంగుటూరు వెళ్ళాడు. ఆ ఊరి దేవునిమీద పాటలు పాడాడు. అప్పటికి సాళువనరసింగరాయడు రాచమూకలలో పరాక్రమశాలి మాత్రమే. అన్నమయ్యా ఆశీస్సులతో రాజ్యం సంపాదించవచ్చునని అతడు భావించాడు. 'శ్రీకృష్ణుని

5. ఆధ్యాత్మ సంకీర్తనలు, సంపుటి 8, సంకీర్తన 239.

మన్ననతో క్రీడి భూచక్రమెల్ల ఏకచక్రంగా ఏలినట్టు మీ సహాయంతో ప్రపంచం అంతా ఏలగలను' అన్నాడు నరసింగరాయలు. అన్నమయ్య దీవించాడు. అది ఫలించింది.

కొన్నాళ్ళకు సాళువ నరసింగరాయలు పెనుగొండలో పట్టం కట్టుకున్నాడు. తనకీ వైభవాన్ని దీవించిన అన్నమయ్యను రాయలు మరిచిపోలేదు. సవినయంగా వారిని పెనుగొండకు పిలిపించుకున్నాడు. ఎదురేగి సత్కరించాడు. దేవునిపై మీరు రోజుకొకటి రచించే పాటలు వినాలని వుంది అన్నాడు. 'దానికేం భాగ్యం వినిపిస్తా'నన్నాడు. అన్నమయ్య తిపిరిదండెల శృతులు తిన్నగా కూర్చాడు. నెర గాన దండెను, వాద్యం దండెను షడ్జం, పంచమ స్థాయిలు చేసి తేనెలు తేటలుమీద చెరుకుపానకం చిలికినట్లు పాటలు పాడాడు. అక్కడున్న కవులంతా చేతులెత్తి మ్రొక్కారు. ఇటువంటి శృంగారభావాలు కాళిదాసాదుల కవిత్వంలో కనబడవని జోహారు చేశారు. అన్నమయ్యకు నరసింగరాయలు ఎన్నో కానుకలు ఇచ్చాడు. పచ్చల కడియాలు, బంగారు జరీ ఉన్న పచ్చడాలు, కెంబట్టు కుళ్ళాయిలూ, అంగదాలు, ఆతపత్రాలు, వింజామరల జోడు మొదలైనవి ఇచ్చాడు.

ఇలా రాజోపచారాలు పొందుతూ అన్నమయ్య రాజధానిలోనూ, స్వగ్రామంలోనూ, తిరుపతిలోనూ చుట్టుపక్కలనున్న దివ్య క్షేత్రాలలోనూ జీవించేవాడు. ఇద్దరు భార్యలకు ఇద్దరు కొడుకులు పుట్టారు. ఒక కూతురు కూడా జన్మించింది. తిమ్మక్క కొడుకు పేరు వరసింగన్న; అక్కాంబ కొడుకు పేరు పెదతిరుమలయ్య. ఇతడు కూడా తండ్రిలాగే సంకీర్తనలు చెప్పాడు. ఈ పెద తిరుమలయ్యకు అయిదుగురు కొడుకులు. వీళ్ళందరూ కవులే. కొడుకులూ, మనుమలూ మాత్రమేకాక అన్నమయ్య అల్లుడు కూడా కవే. అతని పేరు రేవణూరి తిరుమలకొండయ్య; విద్వత్ప్రచండుడు. ఈయన రామచంద్రోపాఖ్యానం అనే ప్రబంధం వ్రాశాడు. ఈ సంగతి ఇతని కుమారుడు వెంకటార్యుడు తన 'శకుంతలా పరిణయ' కావ్యం గద్యంలో తెలియజేశాడు. అన్నమయ్య కొడుకు కొడుకులేగాక, కుమార్తె కొడుకు కూడా కావ్యకర్త. ఇలాగ ఇంటిల్లిపాదీ సంకీర్తనలు పాడుతూ, సాహిత్యాన్ని రచిస్తూ సుఖంగా ఉండేవారు.

ఒకనాడు నరసింహరాయలు మళ్ళా అన్నమయ్యను పిలిపించి పాటలు వినిపించమన్నాడు. విద్వాంసులు, గాయకులు, రాజులు, సామంతులు, అందరూ ఉన్న సభలో అన్నమయ్య శృంగారకీర్తనలు గానం చేశాడు. అలమేలుమంగమ్మ కడకన్నులు ఎరుపెక్కాయట! ఎందువల్ల? ఆమె చూపులు ప్రాణేశునిపై నాటుకున్నాయి. వాటిని బలవంతాన పెరికితే నెత్తురు కారడంవల్ల కన్నులు ఎరుపెక్కలేదు కదా అని అన్నమయ్య ప్రశ్న వేస్తాడు.

యేమొకో చిగురుటధరమున నెడనెడం గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక గాదుకదా? ॥
కలికి చకోరాక్షికిం గడగన్నులు గెంపై తోచిన

చెలువం బిప్పు డిదేమోచింతింపరె చెలులు
నలువున బ్రాణేశ్వరుపై నాటిన యా కొనచూపులు
నిలువున బెరుకగ నంటిన నెత్తురు గాదుగదా? ॥

పడతికి చనుగన మెరుగులు పైపైబయ్యెద వెలువల
కడుమించిన విధమేమేలా కనుంగొనరెచెలులు
వుడుగని వేడుకతో ప్రియుడొత్తిన నఖశశిరేఖలు
వెడలగ వేసవికాలపు వెన్నెల గాదుగదా? ॥
ముద్దియ చెక్కుల కెలకుల ముత్యాల జల్లుల చేర్పుల
వొద్దికలాగు లివేమో ఊహించరె చెలులు
గద్దరి తిరువెంకటపతి కౌగిట యధరామృతముల
అద్దిన సురతపువేళల అందము కాదుగదా? (సంపుటి 3, సంకీర్తన, 417)

ఈ పాట విన్నాక నరసింగరాయలు ఒక్క మాటలో 'ఇది కవిత్వం' అని మెచ్చుకొన్నాడు. ఎన్నోమార్లు పాడించుకున్నాడు. తనివి తీరలేదు. దానితోపాటు ఆశ కూడా పుట్టింది. ఇటువంటి శృంగారపదాలు తనమీద చెప్పించుకొంటేనో? అన్నమయ్యను తెగించి అడిగాడు. ఆయన చెవులు మూసుకున్నాడు. ''నరహరికీర్తన నానిన జిహ్మాబరుల నుతింపగ నోపదు జిహ్వా'' అన్నాడు. దిగ్గున లేచి వెళ్ళిపోయాడు. నరసింగరాయలకు కోపం వచ్చింది. భటుల చేత పట్టించి తెప్పించాడు.

తన బాల్యం సఖ్యంబు తలచి సంపదల - దనయంతవానిగా దనరచేసితిని
గబ్బిమై నొకమాట కావలెనన్న గొబ్బున కోపించు కొన నేల వచ్చె?[6]

అని రాయలు మండిపడ్డాడు. అన్నమయ్యకు మూరురాయర గండసంకెల వేయించి చెరలో పెట్టాడు. పట్టి చంపేవేళ పట్టం కట్టేవేళ ఒక్కలాగ ఉండే అన్నమయ్య చలించలేదు. చెరలోనే పాటలు పాడాడు.

అకటివేళల నలపైన వేళలలను తెకువ హరినామమే దిక్కుమరి లేదు
కొఱమాలి ఉన్నవేళ కులము చెడినవేళ చెరవడి వొరులచే జిక్కినవేళ
నొరపైన వచ్చినవేళ నారడిబడినవేళ పాపువేళ భయపడిన వేళ
నొరపైనహరినామ మొక్కటేగతి గాక మరచి తప్పిననైన మరిలేదు తెరగు ॥
నాపద వచ్చిన వేళ నారడి బడిన వేళ - పాపపు వేళల భయపడిన వేళ
నోసినంత హరినామమొక్కటే గతి గాక - మూపుదాకా బొరలిన మరిలేదు తెరగ॥
సంకెల బెట్టిన వేళ చంపబిలిచిన వేళ - అంకిలిగా నప్పుల వారాగినవేళ
వెంకటేశునామమే విడిపించ గతిగాక మంకుబుద్ధి బొరలిన మరిలేదు తెరగు ॥
(అన్నమాచార్య చరిత్ర, పీఠిక పుట 55, రేకు 26)

6. అన్నమాచార్యచరిత్ర, చిన్నన్న, పుట 37

అన్నమయ్య పాటలు పాడుకుంటూ ఉంటే సంకెలలు వాటంతటు అవే ఊడిపోయాయటు. బంట్లు ఈ సంగతి రాయలకు విన్నవించారు. 'ఈసారి ఊడితే నీవే నా దైవమనుకుంటాను' అన్నాడు. అన్నమయ్య మళ్ళీ ఆపాటే పాడాడట. కాలిసంకెల చిటికెనవ్రేలి పలుము సీలలు వెంటనే ఊడాయట. నరసింగరాయలు అన్నమయ్య కాళ్ళమీద పడ్డాడు. ''నాకు చిన్ననాటినుంచి పనుపడబంటుగా నున్నావు. నన్ను రక్షించు'' అన్నాడు. అన్నమయ్య కనికరించాడు. నరసింహరాయలు ఆయనను పల్లకీ ఎక్కించి కొమ్ము స్వయంగా భుజాన పెట్టుకొని మోశాడు. అన్నమయ్య అతణ్ణి దీవించాడు. రాయలు కర్ణాటక సామ్రాజ్యానికి ఏలిక అయ్యాడు. అన్నమయ్య కర్ణాటక సంగీతానికి మూలవిరాట్టయ్యాడు.

అన్నమయ్య పాటలు ఆనాడు ఆంధ్రదేశపు నలుమూలలా మారుమ్రోగాయి. అతణ్ణి చూడ్డానికి ప్రఖ్యాత వాగ్గేయకారులు వచ్చేవారు. పురందరదాసు స్వయంగా వచ్చి అన్నమయ్య సంకీర్తనలు విని పులకించాడు. అన్నమయ్య తనకు దేవుడు కలలో కనబడిననాటినుంచి రోజుకో పాటను తక్కువగాకుండా రచించాడు. పాటలకు సాహిత్య గౌరవం ఇవ్వడానికి సంస్కృతంలో సంకీర్తన లక్షణం వ్రాశాడు. 32 వేల సంకీర్తనలు వ్రాసినట్టు అన్నమయ్య సంతతివాళ్ళు చెప్పారు. ఇప్పటికి పన్నెండువేలా చిల్లర దొరికాయి. అన్నమయ్య సంస్కృతంలో వెంకటాచలమాహాత్మ్యంలో వ్రాశాడు. అది వరాహపురాణంలో అంతర్భాగం అయింది.[7] ఇంక తెలుగులో రామాయణాన్ని మళ్ళా క్రొత్తగా ద్విపదలో వ్రాశాడు. శృంగారమంజరి అనే ద్విపదను వ్రాశాడు. ప్రాసలలో బమ్మెర పోతన రాజుగారిని, ద్విపద నడకలో గౌరనను మరిపింపచేసే రచన ఇది. ప్రబంధ కవులు వర్ణించే పుష్పాపచయం, విరహవర్ణనం, వసంతోత్సవం అన్నీ అన్నమయ్య ఈ ద్విపదలో చేశాడు. వెంకటేశునిపై ఒక బాల మరులు కొంది. ఆమె 'కోకిలవాణి, చిగురాకుబోణి, తలపుల విశ్రాంతి, తలిరాకు బంతి, వలరాజు చిగురెల్లి, వలపుల వెల్లి.'

ఈ చిన్నది విరహంలో పడింది.

కొంచదు ప్రాణంబు గురుతుగా జేసి యెంచదు వీణ వాయించదు పరిణ
మించదు మది సంభ్రమించదు చెలియ - కించు కేనియు సయించదుగాని
కప్పదు చనుదోయి కనుగ్రేవరెప్ప విప్పదు. తన ప్రాణవిభుమీది మనసు
త్రిప్పదు మదిలోన దీకొన్న ప్రేమ చెప్ప దెవ్వరితోడ జెప్పునో కాని
పెట్టదు కస్తూరి పేర్కొని చేత బట్టదు సేవంతిబంతి నెత్తమ్మి
ముట్టదు సిగ్గుల మొదలించు కైన బుట్టదు తల పెందు బుట్టునోగాని
(శృంగార మంజరి పుట 11)[8]

ఇటువంటి కన్యను వెంకటేశ్వరుడు కరుణించాడు.

---

7. అన్నమాచార్యచరిత్రపీఠిక, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, పుట 70
8. శృంగారమంజరి, తాళ్ళపాకవారి లఘుకృతులలో ఉంది. తాళ్ళపాక గేయరచనలు, సంపుటి 1

చిట్టంబు చేతల సేదలు దీర్చి చెదిరిన యలకల చిక్కెల్ల దీర్చి
యెడలేని పులకల యింపు పుట్టించి – కళలమర్మంబుల కడ గానుపించి
యాలింగ నాది సౌఖ్యముల నొందించి కరగించి మరగించి కలికి గావించి
యుడివోని సురతాబ్ధి నోలలాడించి చిత్తజసామ్రాజ్య సింహాసనమున
బాలికారత్నంబు బట్టంగ గట్టి... (శృంగారమంజరి, పుట 13)

నీ వెంకటేశ్వరుడు ఏలుకొన్నాడని మధురంపు శృంగార మంజరిలో అన్నమయ్యా చెప్పాడు. ఇందులోని రచన ఇతర ప్రబంధాలలాగే ఉంటుంది కాని అన్నమయ్యా తన శృంగార సంకీర్తనలలో వెలిబుచ్చిన భావాలు. చేసిన కల్పనలు, గుప్పించిన చమత్కారాలు, పచరించిన శిల్పాలు, వినిపించిన పలుకుబళ్ళు కోకొల్లలు, అన్నీ స్వతంత్రాలు. అన్నీ జాతిరత్నాలు. కోటి చల్లని వెల్గులు జిమ్మే మణిదీపాలు. అతని శృంగార సంకీర్తనల సంపుటం కాయజోపనిషత్తు. మన్మథవేదం. ఇందులోని కొన్ని ఋక్కులు విందాం.

వూరులేని పొలిమేర పేరుపెంపు లేని బ్రదుకు
గారవంబు లేని ప్రియము కదియ నేటికె
ఉండరాని విరహవేదన వుండని సురతసుఖ-మేల
యెండలేని నాటి నీడ యేమిసేయనే
దండికలుగు తమక మనేటి దండలేని తాలిమేల
రెండు నొకటిగాని రచన ప్రియము లేటికె
మెచ్చులేని చోట యెంత మేలుకలిగి నేమిశెలవు
మచ్చికలేని చోట మంచిమాట లేటికి
పెచ్చు పెరుగులేని చోట బ్రియము గలిగి యేమిఫలము
ఇచ్చలేని నాటి సొబగు లేమిసేయనే ॥
బొంకులేని చెలిమిగాని బొందులేల మనసులోన
శంకలేక గదియలేని చనవు లేటికె
కొంకుకొసరు లేని మంచి కూటమలరనిట్లగూడి
వేంకటాద్రివిభుడులేని వేడు కేటికె ॥ (శృం.సంకీ. ఎఎఎ. పుట 38)

అన్నమయ్యా శృంగార వైరాగ్యాలు ఒక్కచోటనే మలచి చూపగలడు, ప్రపంచంలోని ఏ విరుద్ధ భావాలనైనా మచ్చికచేసి పక్కపక్కల పెట్టగలడు. శాస్త్రంలో చెప్పిన నవరసాలను ఏకకాలంలో గుబాళింప జేయగలడు. కామశాస్త్రంలోని వనితల జాతిలక్షణాలన్నీ అలమేలుమంగకు ఆపాదించి వ్రాయగలడు. మేషాది రాసులన్నీ ఆమెవే.

ఇన్ని రాసుల యునికి ఇంతి చెలువపురాశి
కన్నె నీ రాశి కూటమి కలిగిన రాశి ॥
కలికి బొమవిండ్లు గల కాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికిని మీనరాశి

కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభరాశి
వెలుగు హరిమధ్యకును సింహరాశి ॥
చిన్ని మకరాంకపు బయ్యెదచేడెకు మకరరాశి
కన్నెప్రాయపు సతికి కన్నె రాశి
వన్నెమై పైడితులదూగు వనితకుం తులరాశి
తిన్నని వాడిగోళ్ళ సతికి వృశ్చికరాశి ॥
అముకొనునొరపుల మెరయు నతివకు వృషభరాశి
గామిడి గుట్టు మాటలు సతికి కర్కాటకరాశి
కోమల్లపు చిగురుమోవి కోమలికి మేషరాశి
ప్రేమవెంకటపతికి కలిసె ప్రియ మిథునరాశి॥ (శృంగార సంకీర్తనలు - పుట 62)

ఎంత విచ్చలవిడి శృంగారాన్ని వ్రాసినా అన్నమయ్య నిజమైన వైష్ణవుడు. వైష్ణవాన్ని అన్నమయ్య పదకవిత్వంగా రూపొందించారు. విశిష్టాద్వైతాన్ని మతంగా స్వీకరించినందు వల్లనే అన్నమయ్య ఈ సాహసాన్ని చేశారు. ఏమంటే, ఆనాటికే పదకవిత్వమంటే పండితులకు ఈసడింపు. తెలుగు పండితులు ఏమనుకొన్నా సరే ద్రావిడ వేదంతో తమిళ కవిత్వంతో ప్రత్యక్ష సంబంధమున్న విశిష్టాద్వైతాన్ని స్వీకరించిన అన్నమయ్య ఆ భాషలోని మధుర భక్తినంతా అనుభవించి తత్తుల్యమైన గేయాలను తెలుగులో వ్రాయాలనుకున్నాడు. ప్రపంచంలోని ఏ మొదటిరకం కవిత్వానికీ తీసిపోని రచనలు చేశారు. తమిళంలో కవిత్వమంటే పాటలే. వాటికి సాహిత్య గౌరవముంది. అన్నమయ్య సంకీర్తనలను ఉత్తమ సాహిత్యం అనకపోతే అననివాళ్ళదే లోపం.

అన్నమయ్య కవితామానససరోవరంలో అడుగుపెట్టడానికి, అడుగు పెట్టినదే తడవుగా వోలలాడడానికి ముందు వైష్ణవ మతసూత్రాలను కొద్దిగా క్రోడీకరించుకోవడం మంచిది. పరమాత్మ ఒక్కడే కానీ జీవులు 3 రకాలు. వారు నిత్యులు, ముక్తులు, బద్ధులు. జీవులకు కర్మ, జ్ఞాన, భక్తిప్రపత్తులనే యోగాలచేత బ్రహ్మప్రాప్తి కలుగుతుంది. అయితే ఈ యోగాలలో ప్రపత్తి అనే శరణాగతి యోగమే సర్వజీవకోటికి ఉపయుక్తమైన యోగమని విశిష్టాద్వైతం చాటి చెప్తుంది. ప్రపత్తిలో ముఖ్యమైనది భగవానుని లీలలను అనుభవించి అతని దయను ప్రస్తుతించడమే. ప్రపత్తినే న్యాసమనికూడా అంటారు. వైష్ణవ పరిభాషలో న్యాసమంటే భక్తుడు తన ఆత్మను పరిపూర్ణంగా పరమాత్మాధీనం చేయడం. హరిని సేవించడం ఎంత పుణ్యదాయకమో హరిదాసులను పూజించడం అంతకన్నా ఎక్కువ పుణ్యం. ఈ మత సూత్రాలను వివరించే గేయాలు అన్నమాచార్యుల వారి ఆధ్యాత్మిక సంకీర్తనలలో కోకొల్లలుగా దొరుకుతాయి.

తందనానా ఆహి తందనానా పురె
తందనానా భళా తందనానా
బ్రహ్మ మొకటే పరబ్రహ్మమొకటే పర
బ్రహ్మమొకటే పరబ్రహ్మమొకటే

కందువగు హీనాధికము లిందులేవు
అందరికీ శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికీ శ్రీహరే అంతరాత్మ

నిండాగ రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమియొకటే
చండాలు డుండేటి సరిభూమి యొకటే

కడగి యేనుగుమీద కాయు నెండొకటే
పుడమి శునకము మీద పొలయు నెండొకటే
కడుపుణ్యులను పాపకర్ములను సరిగావ
జడియు శ్రీవేంకటేశ్వరనామ మొక్కటే. (ఉత్సవసంపుటి, సంకీర్తన 59)

మతం సాధారణ విద్యకు పెద్దపీట వేయదు. భక్తులు లోకవిద్యలను లెక్కింపరు. గురూపదేశం, బ్రహ్మవిద్య మొదలైనవానికే వారు ప్రాముఖ్యమిస్తారు. పాండిత్యంలోగాని, ఇతర వైదుష్యంలోగాని అన్నమాచార్యులవారు ఎవరికీ తీసిపోరు. ఆయన ఉభయ భాషా పండితుడు. పాంచరాత్రాగమ సార్వభౌముడు. సంగీతరత్నాకరం, సంగీత నీతిచంద్రిక, సంగీతసుధాకరాది గ్రంథాలలోనూ, భరతశాస్త్రంలోనూ చెప్పిన పద లక్షణాలను పూర్తిగా తెలుసుకున్నాడు. సంస్కృత భాషలో సంకీర్తన లక్షణాన్ని రచించాడు. ఆయన తను ఎంత చదివినా అది భక్తిముందు దిగదుడుపే అని వైష్ణవభావనను పలుకీర్తనలలో ఇలా ప్రకటించారు:

చదివితి దొల్లికొంతచదివేనింకాకొంత - యెదిరి నన్నెరగనుఎంతైననయ్యో
నాటికి నాడే నా చదువు - మాటలాడుచును మరచేటి చదువు
యెనయ నీతిని నెరుగుటకే పో-వెనుకవారు చదివిన చదువు
మనసున నీతిని మరుచుటకే పొ-పనిపడి యిప్పటి ప్రౌఢల చదువు
(ఉత్సవసంపుటి, సంకీర్తన 120)

చదువుసంధ్యలలో చదువుపట్ల ఈ విధమైన భావాలు ప్రకటించిన అన్నమయ్యా సంధ్య గురించి ఇలా గానం చేశారు.

సహజవైష్ణవాచారవర్తనుల - సహవాసనమే మా సంధ్య
అతిశయమగు శ్రీహరి సంకీర్తన - సతతంబును మా సంధ్య
మతి రామానుజ మతమే నాకును - చతురత మెరసిన సంధ్య
పరమభాగవత పదసేవనమే - సరవి నెన్న మా సంధ్య
సిరివరు మహిమలు చెలువొందగ వేసరక వినుటే మా సంధ్య

మంతుకెక్క తిరుమంత్ర పఠనమే సంతతమున మా సంధ్య
కంతుగురుడు వేంకటగిరి రాయని సంతర్పణమే మా సంధ్య

(ఉత్సవసంపుటి, సంకీర్తన, 187)

విద్యాసంస్కారాలు నిత్యసదాచారాలు అన్నీ ఒకందుకే అని నమ్మిన మతాన్ని నమ్మిన అన్నమయ్యా తాను విశ్వసించిన సత్యాన్ని స్పష్టంగా ప్రకటించారు. అతని దృష్టిలో హరిదాసు ఎలా వుండాలో చక్కగా వివరించారు.

అటువంటివాడెవో హరిదాసుడు అటమటాలు విడచినాతడే సుఖి
తిట్టేటిమాటలును దీవించేటి మాటలను అట్టేసరేని తలచినాతడేసుఖి
పట్టి చంపేవేళను పట్టముకట్టే వేళను అట్టునిట్టు చలించని యాతడే సుఖి
చేరి పంచదిరిడిన చేదుదెచ్చి పెట్టినాను ఆరగించి తనివొందేయతడే సుఖి
తేరకాండ్లజూచిన తెగరాని చుట్టములనారయ సరిగాజూచే యాతడే సుఖి
పొందిపుణ్యము వచ్చినా, పొరి పాపము వచ్చినా అందలి ఫల మొల్లని యాతడే సుఖి
విందుగా శ్రీ వెంకటాద్రివిభుని దాసుల జేరి అందరాని పదమంది నాతడే సుఖి

(ఉత్సవసంపుటి, సంకీర్తన 90)

మోక్షసాధనకు భక్తిప్రపత్తులే రాజమార్గమని వైష్ణవమతం నమ్ముతుంది. అయితే భక్తిలో వివిధ రకాలున్నాయి. శాంత, దాస్య, సఖ్య, వాత్సల్యం, మధుర భావాలనే పంచవిధ భక్తిరూపాలున్నాయి. అన్నమాచార్యులవారు ఈ అయిదు రూపాల భక్తితో తాను నమ్మిన దైవాన్ని ఆరాధించారు. ఒక్కొక్క భక్తిమార్గంలో కొన్నివేల గేయాలు రచించారు. ఆయన అనుభవసముద్రులు. ఒక్కొక్క భక్తిమార్గంలో ఆయన కవిత ఎలా ఉంటుందో మచ్చు చూద్దాం.

పరాభక్తియొక్క ప్రప్రథరూపమే శాంతభక్తి అంటారు. భగవంతుని ఆత్మగా గ్రహించి సర్వదా అభిన్నుడై, సమదర్శనుడై అనన్యభావమున ప్రేమించుచు అద్వైతానంద నిమగ్నుడైన బ్రహ్మజ్ఞానినే శాంతభక్తుడంటారు. అన్నమయ్య ఈవిధమైన భక్తిమార్గంలో

నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమైయుండు బ్రహ్మమైయుండు సం
స్తుత్యు డీ తిరువెంకటాద్రి విభుడు. (ఉత్సవసంపుటి, సంకీర్తన 124)

అనీ...

ఏదితుద? యెన్నడు ముగుసును? - ఆదికి సనాది హరిమాయ
సాదించిసుజ్ఞానియైతే యీ దెసవెదికిన ఇహమే పరము (సంపుటి.ఎ.ఎ.సంకీర్తన 10)

అనీ తెలియచేశాడు. శాంతభక్తితో ఆయన తర్కించిన విషయాలు చాలా తాత్త్విక సంపదతో కూడినవి.

దేవ ఈతగవు తీర్చవయ్యా - వేవేలకునిది విన్నపమయ్యా
తనువున బొడమిన తతి నింద్రియములు-పానిగి యెక్కడకు పోవునయ్యా
పెనగి తల్లికడ బిడ్డలు భువిలో యెనగొని యెక్కడికేగుదురయ్యా
పొదుగుడుమనమున బొడమిన యాసలు - అదన నెక్కడికి అదగునయ్యా
వొదగుచు జలముల నుండు మత్స్యములు పదవడి యేగతి బాసేనయ్యా
(ఉత్సవసంపుటి, సంకీర్తన 76)

అని జీవాత్మ పరమాత్మల సంబంధాన్ని అద్వైత భావనలను వివరించారు. ఇక దాస్యభక్తిలో ఆయన చెప్పిన సంకీర్తనలు కూడా కొన్నివేలుంటాయి. భక్తుడు తను భగవత్సేవకుడనని సంభావించడమే దాస్యభక్తి, శ్రద్ధాయుక్తుడైన సేవకునికి తన ప్రభువునందుండే అనురాగమే దాస్యభక్తునకు ఆదర్శమంటారు. ఈ భక్తిమార్గంలో అన్నమయ్య చెప్పిన ఒకటి రెండు కీర్తనలు చూద్దాం.

కొంత నా కర్మఫలము కొంత నీ రక్షకత్వము
ఇంతలో రెండు గలవా యేమో దేవా
అంతర్యామివి నీవు ఆడేటి బొమ్మను నేను
చెంతగాంచుట నీ పని సేవచేయుట నాపని (సంపుటి-2, సంకీర్తన 33)

అనీ...

శక్తి గలిగితే నీ సరస దేవుండగానా - యుక్తి గలిగితే నే నొడల మోతునా
శక్తియు యుక్తియు నొకటి లేక నీ భక్తుండనైతి నన్ను పాలింపవే.
(సంపుటి-ఎ.ఎ. సంకీర్తన 27)

అనీ...

నేనైతే ఈడేరుదు, నీకు లీలామాత్రమింతే
మానక నన్నేలుకొమ్ము మాధవగోవిందా
ఇందరిపై సూర్యుండు ఎండలు గాసించేను
అందు కొన్ని కిరణాలు అణగిపోయేనా. (సంపుటి-ఎ.ఎ.సంకీర్తన 28)

అనీ దేవుణ్ణి హెచ్చరిస్తాడు.

కర్మమంటానూ మాయకట్టేవుగానీ
కర్మము ధర్మము నీ కల్పితమే కదా? (సంపుటి-II సంకీర్తన 14)

అని అంతా అతనిదేనని తెలియజేస్తాడు. ఇక సఖ్య భక్తిలో దేవుణ్ణి తన ప్రాణమిత్రునిగా భావించి హితోపదేశం చేస్తాడు.

ఇంత మేలుకొంటి నింక విడువరాదు - చెంత నావిన్నప మిద్ది చేకొనవయ్యా
చెలిమి సేయంగరాదు చేసివిడువంగరాదు తలచి బాసలీరాదు తప్పగరాదు
మలసి మన్నింపగరాదు మన్నించి చెరుపరాదు వలపరాదు వలచి వదలరాదు
(సంపుటి-III సంకీర్తన 107)

అని మన్మథోపనిషత్తులలోని పాఠాలు చెప్తాడు. దేవుడితోనే మనసియ్యరాదు, యిచ్చి మరువరాదు అనే ఒరవడి దిద్దిస్తాడు. స్వప్నంలో జాగ్రదవస్థలో నెచ్చెలి, చుట్టము, హితుడు అతనికి తానే, తనకు అతడే.

సందేహ మెక్కడా లేదు సంతోషించుకొలదీ నేను
కందువ బ్రహ్మానందము గైకొంటి నేను
కైవసమై నీకు నాకు కలము నానతియ్యగా
నావద్ద వున్నాడ వని నమ్మితి నేను
యేవేళ శ్రీవెంకటేశ యెదురనే వుండగాను
పావనమైన యన్నింటను ప్రబలితినేను. (సంపుటి-III, సంకీర్తన 363)

అని తన ప్రాబల్యాన్ని చాటుకున్నాడు. ఇక వాత్సల్య భక్తితో భగవంతుని పుత్రభావంతో ప్రేమించాడు. తానే యశోదగా, తన బిడ్డ దైవముగా ఊహించుకొన్నాడు. ''జో అచ్యుతానందా జోజో ముకుందా, రావె పరమానంద రామగోవిందా,'[9] అని లాలిపాటలు పాడాడు. ''చందమామరావె జాబిల్లి రావే మంచికుందనపు పైడికోర వెన్నపాలు తేవే''[10] అని గోరుముద్దలు తినిపించాడు. ఆనాడు అన్నమయ్య దైవకిశోరాన్ని ఊహించి పాడిన లాలిపాటలు, జోలపాటలు నేటికి తెలుగు తల్లులు తమ బిడ్డలను ఆడించుకుంటూ పాడుకుంటున్నారు. అన్నమయ్య తన దేవుణ్ణి చూసి 'చిన్నిశిశువూ చిన్నిశిశువూ ఎన్నడూ చూడమమ్మ ఇటువంటి శిశువూ' అని పొంగిపోయాడు[11] ముద్దుగారే యశోద ముంగిట ముత్యము తిద్దరాని మహిమల దేవకి సుతుడు అని మెచ్చుకున్నాడు. ఆ లీలలన్నీ పాడాడు. గోపకాంతలు కృష్ణునిపై నేరాలు చాటితే తానే యశోదగా వాళ్ళను గద్దించాడు.

కానరటె పెంచరటె కటకటా బిడ్డలను
నేను మీ వలనే కంటి నెయ్యమైన బిడ్డను
బాయిం పారవేసిన పాలు వెన్నయును
చేయిపెట్టకుందురా చిన్ని బిడ్డలు
మీ ఇండ్లు జతనాలు మీరు సేసుకొనక
పాయకదూరేరేమే ప్రతిలేని బిడ్డను. (ఉత్సవసంపుటి, సంకీర్తన 112)

9. శ్రీ అన్నమాచార్య సంకీర్తనలు (1951), ఉత్సవాలకోసం వేసినది, సంకీర్తన 152.
10. అదే పుస్తకంలో, సంకీర్తన 144.

అని నిందించడానికి వచ్చిన గోపికలనే, దేవుణ్ణి పెనవేసుకువచ్చి నిందించాడు. భగవంతుని ప్రాణనాథునిగా యెంచుకునే మహాభావమే మధురభక్తి అంటారు. ఇదే ఆధునిక భారతీయ సాహిత్యంలో వైష్ణవకవిత అనే పేరుతో చెలామణీ అవుతున్నది. ఈ భక్తిమార్గంలో అన్నమయ్యా రచించిన సంకీర్తనలు వేలాదివేలు. ఆయన తన జీవితంలో ముప్పయిరెండువేల సంకీర్తనలు వ్రాశారట. అందులో సగానికి ఎక్కువగానే శృంగార సంకీర్తనలు ఉంటాయని భావించడంలో తప్పులేదు. తనే నాయికగా అలమేలుమంగగా చెప్పిన వెన్నో ఉన్నాయి. దూతికగా దివ్యప్రేయసీప్రియులకు రాయబారాలు, రాజీలు, రహస్యాలు చెప్పడాలు మొదలైనవెన్నో ఉన్నాయి. శృంగార లక్షణ గ్రంథాలలోని లక్షణాలకు వ్యతిరేకం కానివి, ఆ సూత్రాలకు లొంగనివి వేలకువేలు ఆయన రచించారు. అష్టవిధ నాయికలూ ఒకప్పుడు ఒక కీర్తనలో కనబడతారు. రెండుమూడు విభిన్న రసాల మేలుకలయిక ఒక చరణంలోనే కనబడవచ్చు. ఉపమానాలు, ఉత్ప్రేక్షలు మొదలైనవి వివిధాలంకారాల కోటానుకోట్లు దొరుకుతాయి. పురాణాలను, ఇతిహాసాలను అన్నింటినీ శృంగార రసంలోనికి అనువాదం చెయ్యగలరు. దశావతారాలను, జ్యోతిష్యంలోని ద్వాదశరాసులను అన్నింటినీ శృంగార భాషలోనికి అనువదించగలరు.

క్షేత్రయ్యా కవిత్వంలో మేలుపూస అనదగ్గ 'మగువ తన కేళికామందరము వెడలెక్' అనే పదంలోని నాయిక దివ్యరూపాన్ని అన్నమయ్యా అలనాడే కండ్లారా దర్శించారు.

లలిత లావణ్యావిలాసముతోడ నెలంత ధన్యతగలిగె నేటితోడ ॥
కుప్పలుగా మైనసలు కొన్న కస్తూరితోడ తొప్పదోగేటి చెమట తోడ ॥
అప్పుడటుశశిరేఖలైన చనుంగవతోడ దప్పి రేపేటి మోము దమ్మితోడ ॥
కులుకు కబరిభరము కుంతలంబులతోడ తొలగదోయని ప్రేమతోడ
మొలకనవ్వులు దొలక ముద్దుజూపులతోడ పులుకలు బొడమైన పొలుపుతోడ ॥
తిరువెంకటాచలాధిపుని మన్ననతోడ సరిలేని దివ్యావాసనలతోడ
పరికించరాని అరవిరిభావముతోడ సరిదొలంగెడు చిన్ని సిగ్గుతోడ ॥

(సంపుటి 3 సంకీర్తన 78)

ఈ ఒక్క సంకీర్తనతోనే గాదు ఇటువంటి గేయాలెన్నింటితోనో ముగ్ధమోహన రూపాలను ఆయన కన్నుల కట్టేటట్టు వర్ణించారు. ఇతరుల కవిత్వంలో అయితే ఈ కవి వాడిన నానుడులు, పలుకుబళ్ళు, సామెతలు అని ఒకటో అరో వెతికి వెతికి అతికష్టంమీద పట్టి చూపించాలి. కాని అన్నమయ్యా రచనంతా దేశీయమే. అడుగడుగునా సామెతలే. ప్రతి చరణంలోనూ నానుడులే. అన్నమయ్యా మూర్తీభవించిన తెలుగుతనము.

11. తాళ్ళపాకవారి గేయరచనలు, సంపుటి 4, సంకీర్తన 1.

ఆలకించి వింటేను అన్నియు నీ పలుకులై వేలసంఖ్యపై తోచె వీనులకు... అని అన్నమయ్య తన ప్రభువు గురించి చెప్పారుగాని అన్నమయ్య గురించి అతని తరువాత కవులూ అలా అనక తప్పదు. రకరకాల తెలుగు, వైష్ణవ భక్తిభావాలను అర్థం చేసుకోవాలంటే అన్నమయ్యని కూలంకషంగా చదువుకోవాలి. ఈ మాట యిలా వుంచి అన్నమాచార్యులవారి సంకీర్తనలను వ్రాసిపెట్టిన రాగిరేకులను సంపాదించి తెలుగు వారికీ పెన్నిధినిచ్చిన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'తాళ్ళపాకవారిని చదవందే తెలుగు రాదు' అన్నారట. ఆ మాట అక్షరాలా నిజం.

తాళ్ళపాకవారి సాహిత్యమంతా ఇంకా వెలుగు చూడలేదు. అన్నమయ్య కీర్తనలు మొత్తం ముప్ఫయిరెండువేలని చిన్నన్న చెప్పడు. ఆ పాటలన్నీ రాగిరేకులకు ఎక్కించారు. అనుకుంటే రేకుకు సగటున ఆరుపాటల వంతున ఎక్కితే అన్నమయ్య రేకులే 5,400 తక్కువ తేలుతాయి. అయితే ఇప్పటికి లభించిన అన్నమయ్య రేకులు కేవలం 2,284 మాత్రమే. మొత్తం తాళ్లపాక కుటుంబ సభ్యుల రేకుల సంఖ్య వెరశి 2,531 అని పరిశోధకులు చెప్తున్నారు.[12]

ఇంత పదసంపద మనకు లభ్యమవుతున్నా, ప్రచురణ అయినంత మటుకు సమర్థవంతమైన విశ్లేషణ నోచుకోలేదు. ''ముప్పదేండ్ల పైబడి ఈ సారస్వత శాఖ తెలుగులో ఉన్నా తెలుగువారి చూపు దీనిమీద తగినంత పారలేదు. దానికి కారణాలెన్నో.... శబ్దం, అర్థం, తాత్పర్యం, వాక్యం, వ్యాకరణం, జాతీయం, దేశీయం, సంగీతం, శృంగారం, పదరచనా పరిణామం, సంకీర్తన, భక్తితత్త్వం, సమకాలపు సంఘచరిత్ర నీడలు, ఇత్యాదిగా పలు మొగములు పర్యవేక్షణ యిందు సాగవలసియున్నది'' అన్న రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి మాటలు శిరోధార్యాలు.[13]

లభ్యమైన గ్రంథాలన్నీ అచ్చుపడనిదే ఏ రచయితకైనా పదప్రయోగ సూచికలను తయారు చేస్తే, అది సమంజసమూ కాదూ, సంప్రదాయము కూడా కాదు. అందుకే గ్రంథమంతా ప్రామాణికంగా పూర్తిగా బైటపడేవరకు సాహిత్య పరిశోధకులు వేచివుండడం మంచిదే. కాని దానికి కొండంత ఓర్పూ, ఆయుస్సూ కావలసి వున్నాయి. ఆ సాహిత్య రాగిలోని అందచందాలూ, ఓజస్తేజస్సులూ, రసధార, భావవైవిధ్యాలు, అలా వేచివుండనీయవు. అందుకే 'తాళ్ళపాకవారి పలుకుబళ్ళు', అనే సంకలనం ఒకటి రామలక్ష్మి ఆరుద్ర సంకలనం చేసింది.[14] తాళ్ళపాక వారి సంకీర్తనల సంపుటాలు అప్పటికి 18 మాత్రమే వెలుగు చూశాయి. వాటిలోంచి ఎన్నో ప్రయోగాలను ఇచ్చారు.

రాళ్ళపల్లివారు చెప్పిన ''శబ్దం, అర్థం'' వగైరా పలు మొగములు పర్యవేక్షణలో ఒక శబ్దాన్ని, అర్థాన్ని తీసుకుని చూద్దాం. అన్నమయ్య చాలా సంకీర్తనలలో 'దోమటి' అనే

12. గౌరిపెద్ది రామసుబ్బశర్మ – తాళ్ళపాకవారి పదసాహిత్యము. సంపుటి 22 – పీఠిక – పుట 15.
13. రామలక్ష్మి ఆరుద్ర – తాళ్ళపాకవారి పలుకుబళ్లు – పీఠిక vii
14. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ 1971

పదాన్ని ప్రయోగిస్తారు. దీని అర్థం ఏమిటి? సూర్యరాయ ఆంధ్రనిఘంటువులో ఇలా వుంది.

''దోమటి. వి. అన్నము (చి.వి.శ.ర. ఈ క్రింది ప్రయోగములను బట్టి ఔప విభక్తముగా దోచుచున్నది. కాని ప్రథమాంత రూపమునకు బ్రయోగములు కానరావు.)

సీ. దోమటి దొడుకు నే ప్రేమ గోకిలములు పాటలే
సహకార పల్లవముల చంద్రా
సీ. కడుసిగ్గుదేరు తొల్పడువు దోమటు జొక్కియా
నంద మున జిందులాడ గొన్ని మే. సంచ -

సూర్యరాయాంధ్ర నిఘంటువులోని ఈ అర్థవివరణవల్లా ఇచ్చిన ప్రయోగాల వల్లా 'దోమటి' అనే శబ్దానికి గల అర్థం అవగాహన కాదు. ఇక్కడ 'అన్నము' అనే అర్థంలో తరిగొప్పుల మల్లన చంద్రభాను చరిత్రలోగాని, బైచరాజు వెంకటనాథుడు 'పంచ తంత్రం' లోగాని మాటను ప్రయోగించినట్టు కనబడదు.

'తాళ్ళపాకవారి పలుకుబళ్ళు' గ్రంథంలో రామలక్ష్మి ఆరుద్ర ఒకటి కాదు రెండు కాదు, 24 ప్రయోగాలను దోమటి అనే ఆరోపంకింద ఇచ్చారు. వాటన్నిటినీ పరిశీలించితే అన్నము అనే అర్థం తట్టదు. ఆ ఆరోపాలన్నీ గమనించండి.

దొడ్డ మేఁకపాల గూడు దోమటి దొడికినాఁడు
గుడ్డు వయసగు బిడ్డ గన్నవాడు (4-43)

దోమటి నా మతిలోనఁ దోడునీడవైయుండి
పామెట సుఖములనే బ్రమయించవలెనా (6-59)

యేమాయ నీపాదములిటు మేము పిసికితే
దోమటి నాపై కాలు దొక్కఁగా గాఁక (13-9)

తొఁడవొడ మోచిన మేలము
దోమటి వీడెవుఁ టుచటులు
జడిగొను చూపుల నునువులు పతికిని నీ కమరె (13-131)

కామినికెమ్మోవికాంతి కట్టుకొనే చంద్రగాని
ఆముకొన్న మోహకళ లాభరణాలు
దోమటి మాటలవిందు ధూపదీప నైవేద్యాలు
కామించినటువలె కలిగె నీ కిపుడు (13-168)

దొంతుల నెరిగి గొల్ల దోమటాయ లవు
యెంతటిదాననయ్యెనో యిందరిలో నేడు (14-121)

ప్రేమపుమోవితేనెలు పెగవిమీదనేవుండు
చే ముట్టి వడ్డించబోతె చిరునవ్వులు
గామిడి శ్రీవెంకటేశ్వర కలసితివిటు నన్ను
దోమటి దౌడికేమంటే దొడ్డమాకు (14-267)

మఱియేఁటి మద్దులు ను మ్మేమడిగేవు నీవు
మెఱసి మీయిక్కువలు మించెను దోమట్లై (14-174)

కూడిన నీ సతులను గూచుండ బెట్టుకోఁగా
తోడులు నీడలు రొక్క దోమటాయను (14-273)

ప్రేమమున బిలువగ బెట్టి వూఁకొంటిఁ గాన
దోమంటిఁ విడవకుంటే దొమ్మి సేతునా (15-132)

ఏమిసేతు నీ ముద్దుల కేమందను
దోమంటిఁ గొంగుపట్టఁగ తొలఁగి పోరాదు (15-271)

చూవరల జూడ జూడ జుట్టాల వలనె వుండి
దోమటి పంచేంద్రియాల దోడుగాక పోయెను (16-1-6)

దోమటి చెమకులనె దుండగాలు సేసేని
దీమనము తోవ సన్నతి వెంగళప్పడు (16-2-29)

ఏమి బాచితివే యిటునాకె దక్కితివే
దోమటి విందుకే పోనీ తొత్తవైతి నేను (17-2)

యేమాడిన నాట దాని కెగ్గులేదు కప్పలేదు
నేమాన నూరకుండిన నేరమిలేదు
దోమటిగా జూచినాడు దొరతనమ్మై తోడు
నేనూరు నవ్విన నని వేడుకలై విలచు (17-15)

కా మించి శ్రీ వెంకటేశ్వరు గక్కన గూడిన నన్ను
దోమటి దొడికించితే దూతను నే నానెను (17-69)

నీ మేలులోనినాన నీవు మన్నించేటిదాన
దోమటినన్నియ నీ చేతులు మన్నవికము (17-136)

యేమనినె చెన్నుడూ యేకతానన్నుమా
దోమటి వాపులునాపై దొరలించీరి (17-152)

కామించి మగవచ్చేవు కౌగిట బిగిసేవు
యేమి నననివారితో చేతులా నీకుప
దోమటి దొడికితిన్ దొడ్డ చుట్టమువలె
వేమవు శ్రీవెంకటేశనీవె నేనైతిరా (17–223)

తామరవేపై నతడు తట్టితిని చేతనీవు
దోటి దొడికేవు దోమా యేమి (17–382)

అది దోమటి కర్మాలు
దోమటి కర్మాలు సేస తుదకెక్కినాడణామ
యేమిటికి గాచేతివో యిది సోద్యమయ్యా (8–181)

అది దోమటి కుడుచు
శ్రీమంతుడ నీచేత దేహమిది
దోమటి గుడువక తోయక వశమా (9–119)

అది దోమటి దొడికినట్టు
తొల్లియురేపల్లె గొల్ల దోమటి దొడికినట్టు
తల్లి అనసూయ పాలదివిసినట్టు (6–50)

దోమటి దొడుకు
దొంతిపెట్టిగొల్లె దోమి కొడుకకాను
బంతిచిక్కిపెట్టి మోమిపండునేల దాచితివే (14–79)

ఇన్ని ప్రయోగాలు లభించడంవల్ల కొన్ని విశేషాలు గోచరిస్తున్నాయి. దోమటి అనే మాటతోపాటు 'దొడకు' అనే క్రియావాచకం విరివిగా వాడడం జరిగింది. దోమటి దొడికినాడు దోమటి దొడకించితే' దొమటి దొరికితివి దోమటి దొడకేవేళ దోమటి దొడికినట్టు దోమటి దొడకుగాను అనే ప్రయోగాలు కనబడుతున్నాయి. దోమటికి వివాహానికి సంబంధం ఉందని దోమటి నాపెకాలు దొక్కుగా' అని (13-9) కనబడుతున్నాయి. పెళ్ళి భోజనం అనే అర్థంలో దోమటి విందు (17-2) అనే ప్రయోగముంది. ఇది గొల్లవారికి సంబంధించినదని గొల్ల దోమటాయె (14-121) అనే ప్రయోగమూ తొలియురేపల్లె గొల్ల దోమటి దొరికినట్టు (6-60) అనే ప్రయోగము సాక్ష్యము ఇస్తాయి. దోమటి విందు భోజనం కుడుచుట అన్నది (9-119) అనే ఈ ఆరోపంలో కనబడుతుంది.

గొల్లవారిలో ఈ పెళ్ళి భోజనం సర్వసామాన్యమే. అయితే వారి ఉచ్చారణలో మూర్ధన్య శ్వాస స్పర్శం, మూర్ధన నాదస్పర్శ మారింది. వారు దోమటిని దోమటిలా అని ప్రయోగిస్తారు. మన శిష్ట నిఘంటువులు ఈ ఆరోపాన్నే స్వీకరించలేదుగానీ, బ్రౌను తన నిఘంటువులో దీనిని కొంత సందేహంలోనే చేర్చారు.

''దోమడి A Phrase for marriage among shepherds?''

చివర ప్రశ్నార్థకపు గుర్తు పెట్టడంలో ఔచిత్యముంది. బ్రౌనుకు హంసవింపశతిలోని పద్యం ప్రమాణంగా దొరికింది.

వేగ దలబ్రాలు దోమడి నాగవల్లి
యైన పిమ్మట నత్తింటి కనువదలచి
పయన మొనరించి నెమ్మది బ్రియము దనర
ననగు గూతును నల్లుని ననిపిరపుడు (హంస. 2-115)

హంసవింశతిలోని కథ గొల్లవారి చిన్నదానికి సంబంధించినది కనుక బ్రౌనుదొరగారు గొల్లవారింటి పెళ్ళి అని దోమడిని అర్థం చేసుకున్నాడు. దోమడి కేవలం పెళ్ళి భోజనం మాత్రమే కాదు పెళ్లి చేసుకున్న దంపతులు ఇద్దరూ సజీవులుగా ఉంటే వాళ్ళు జీవితంలో ఎప్పుడు బువ్వపు బంతిలో విడిగాగానీ కలసిగానీ కూర్చుంటే ఆ విందును దోమడి అని పిలుస్తారని ఇంకో ఆంగ్లేయుని వివరణవల్ల తెలియవస్తుంది.

కందుకూరు తాలూకాలో పోసూరుగ్రామంలో ఉసురమ్మ అనే పేరంటాలు ఉత్సవం అయిదు రోజులపాటు చేస్తారు. నాలుగవ రోజు జరిగే బంతిలో దోమడి ఉంటుంది.

In the evening the people of the shepherd caste observe the domadi, or marriage fest, in which only married people whose partner are still living may take part. This takes place under the Jammi tree.[15]

ఈ భోగట్టావల్ల దోమటి అంటే పెళ్ళి భోజనమే కాక దంపతుల బంతి అని కూడా తెలుస్తోంది.

అన్నమయ్య వాడిన ఒక శబ్దానికి అర్థనిర్ణయం చేయడంలో ఎంతటి కృషి జరగాలో సూచించడానికే ఇంత విస్తారమైన చర్య అవసరమైంది. అన్నమయ్య ప్రయోగాన్ని శ్రద్ధగా వివిధ సామాజిక శాస్త్రాల సహాయంతో అధ్యయనం చేస్తే మన కోశాలు, సాంఘిక చరిత్ర ప్రకరణాలు సంపన్నమవుతాయి. అయితే అన్నిటికన్నా ముందుగా తాళ్ళపాకవారి భాషా విశేషాలకు భాష్యం సిద్ధ కావాలి.

అసంఖ్యాకమైన సంకీర్తనలేకాక ద్విపద కావ్యాలు, శతకాలూ, ఇతర పద్యగ్రంథాలు చెప్పిన తాళ్ళపాకవారు తమ తత్సమ పదాలుకన్నా దేశ్యాలూ, విశిష్ట గ్రామ్యాలూ విశేషంగా ప్రయోగించారని విజ్ఞులు భావిస్తారు. ఈ కుటుంబంలోనే కవులందరూ ఎన్నో అపూర్వ ప్రయోగాలూ చేశారు. తమ కాలంలో సజీవ భాషను వాడారు. లాక్షణికులు గతి కల్పించవలసిన వ్యావహారిక రూపాలను ప్రయోగించారు. తమ రచనలను తమ కాలంలోనే రాగిరేకులపై చెక్కించారు. కనుక ఆ పదాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా

15. W.T. Elmore - Dravitan gods in modern Hinduism (1913) Asian Educational Services, New Delhi (1984)

ఉన్నాయి. ఇతర కావ్యకర్తలలాగా తాళ్ళపాకవారు కొన్ని భాషా విభాగాలను బహిష్కరించలేదు. ''జగతిగల జెల్లు బళ్ళె నగినగి భాషించునట్టి నానుడి పలుకుల్ తగదన రహి చెడు'' నన్న సంగతి అన్నమయ్యకు బాగా తెలుసు. అందుకే ''విధితౌర్థ గ్రామ్యోక్తులు పదిలముగా పొంకమెరిగి పలుకంజెల్లు'' అని సంకీర్తన లక్షణంలో చెప్పాడు. ఒక్క గ్రామ్యమే కాదు - వల్లవ నారీ మ్లేచ్ఛోక్తులు నీచవధూపరిభాష ఇతర భాషలు కూడా సంకీర్తనలలో వాడవచ్చునన్నారు. ఆయనకు కావలసినదల్లా ఔచిత్యమే. ఆ విషయాన్నే సంకీర్తన లక్షణంలో స్పష్టం చేశారు. ''ఉచిత భాష పదములజెల్లు'' అని శబ్దాలపట్ల సమభావాన్నే ప్రదర్శించారు. పొంకమెరిగి వాడిన శబ్దాల వల్లనే పదురసానికి ఆస్పదం అవుతుంది.

అన్నమయ్య పదకవితా పితామహుడు. మన సాహిత్యంలో పదరచన పరిణామాన్ని ఆయన రచనలవల్ల బేరీజు వేయవచ్చును. పాల్కురికి సోమనాథుడు తన కాలంలో ప్రచారంలో వున్న తుమ్మెద పదాలూ ప్రభాత పర్వత పదాలూ, ఆనంద పదాలూ, వెన్నెల పదాలూ, శంకర పదాలూ, సంజయవర్ణన పదాలూ, గొబ్బిపదాలూ, గణవర్ణన పదాలూ మొదలైనవి కొన్ని చెప్పాడు. అయితే వీటిపేర్లు తెలుస్తున్నాయేగాని వాటి తీర్లు తెలియవు. అన్నమయ్య సంకీర్తనలో ఈ పదాలే కాక ఇంకా ఎన్నో కనబడతాయి. అసంఖ్యాకమైన ఆ పదాలలో ఒక్కొక్కవర్గానికి ఎన్నెన్నో ఉదాహరణలు అన్నమయ్య సాహిత్యంలో దొరుకుతాయి. వెతుక్కోవాలేగానీ ఈ పదాలలోని వివిధ రీతులకు కొదువలేదు. అకారాదిగా కొన్ని పదాల వివరాలను చూడండి:

అర్థచంద్రిక పదం	సంకీర్తన లక్షణం	5
అల్లోనేరేళ్ళు	సంకీర్తన లక్షణం	3-47
ఉయ్యాలపదం	సంకీర్తన లక్షణం	12-242
ఏలపాట	సంకీర్తన లక్షణం	51
ఓబలేశపదాలు	సంకీర్తన లక్షణం	37-202
కూగూగుపదం	సంకీర్తన లక్షణం	4-56
కోరోచల్లాపదం	సంకీర్తన లక్షణం	4-109
గొబ్బిళ్ళ పదం	సంకీర్తన లక్షణం	12-98
చందమామ పదం	సంకీర్తన లక్షణం	50
ఛాంగుభళా పదం	సంకీర్తన లక్షణం	3-493
చిలుక పదం	సంకీర్తన లక్షణం	4-9
జక్కుల రేకులు	సంకీర్తన లక్షణం	50
జాజర పదం	సంకీర్తన లక్షణం	12-331

జోల	ఉత్సవ	–152
తందానపదం	ఉత్సవ	7–151
తుమ్మెదపదం	ఉత్సవ	4–32
దోబూచిపదం	ఉత్సవ	3–295
దరువులు	సంకీర్తన లక్షణం	–50
నీరాజనం	సంకీర్తన లక్షణం	26–295
పల్లాండు	సంకీర్తన లక్షణం	12–187
ప్రభాతపదం	సంకీర్తన లక్షణం	30–218
మంగళ కీర్తన	సంకీర్తన లక్షణం	5–273
మేలుకొలుపు	సంకీర్తన లక్షణం	21–215
యాలపదం	సంకీర్తన లక్షణం	13–223
లాలి	ఉత్సవ	151
శిఖాపదం	ఉత్సవ	5–130
శోభనం	ఉత్సవ	3–18
సువ్వి	ఉత్సవ	12–352
సువ్విలాల	ఉత్సవ	3–419
సూళాది గీతాలు	ఉత్సవ	31–478

ఇంకా శ్రద్ధగా అన్ని సంపుటాలూ గాలిస్తే మరెన్నో రకాల పదాల వివరాలు లభించవచ్చు. పలువురు కలసి పలుముఖాల చేయవలసిన పరిశోధనలు ఒంటిచేత్తో చేయడం సముద్రానికి సేతామెత్తడమే.

అన్నమయ్య అనుభవ సముద్రుడు!

తాళ్ళపాక తిమ్మక్క

ఎన్నడో ఇక్ష్వాకుల కాలానికి ముందు హాల శాతవాహనుడు పాలించే రోజులలో మన తెలుగు బిడ్డమీద మగవాడితోబాటు సమానంగా మహిళ కూడా కవిత్వం చెప్పిన సాక్ష్యాలు మనకు దొరుకుతాయిగాని ఆనాటినుంచి రెడ్డిరాజుల యుగందాకా కమ్మని రచనలు చేసిన ఆడవాళ్ళ పేర్లయినా కనీసం మనకు లభించవు. గాథాసప్తశతిని సంపన్నం చేసిన సౌభాగ్యవతుల పేర్లు చెప్పుకొని, ఆ తరువాత మొట్టమొదటి తెలుగు రచయిత్రి కావ్యాన్ని చదువుకొందాం.

గాథాసప్తశతిలోని మహిళా రచయితలు.[1]

1.	అణులచ్ఛి	(రెండు గాథలు) 3-28 (182); 3-63 (210)
2.	అసులద్ధి	(రెండు గాథలు) 2-77 (139); 2-78 (140)
3.	పహాయీ	(ఒకటి) 1-86 (65)
4.	ఖేజ్జా	(ఒకటి) 6-84 (439)
5.	మాధవి	(ఒకటి) 1-91 (69)
6.	రేవా	(ఒకటి) 1-87 (66); 1-90 (68)
7.	రోహా	(రెండు) 2-63 (126); 7-24 (466)
8.	వద్ధావహీ	(ఒకటి) 1-70 (52)
9.	నోహా	(ఒకటి) 7-30 (469)
10.	ససిప్పహా	(ఒకటి) 4-4 (237)

పదిమంది పేర్లు, వాళ్ల వ్రాసిన పధ్నాలుగు గాథలు మనకు లభించాయి. వీటిలో స్త్రీహృదయం మనకు సాక్షాత్కరిస్తుంది. అంతరాంతరాలలో ఆడది ఎలా భావిస్తుందో ఆడదే వ్రాయగలదుగాని మగవాడు ఎంత ఊహించినా అది ఊహాగానమే అవుతుంది. మగవాడు మొరటువాడు. మగువను నొప్పిస్తాడు. అయినా ఆమె సహిస్తుంది. కొట్టి కోరికలకోసం ఆమెను అనునయిస్తాడు. అప్పుడు ఆమె ఏం చేస్తుంది. ప్రాచీనకాలపు రచయిత్రి పహాయీ చెప్పిన గాథ వినండి.

> కొట్టి నొచ్చిన యొక చేయి పట్టి వాడు – వేగ నూర్పుల గాలిచే విసరబోవు
> నేమి సేయుదు? నవ్వుచు నేను వాని –గౌగలించితి బెరచేత కంఠసీమ.
>
> [గా.స. సారము, 1-89 (65)]

---

1. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి గాథసప్తశతీసారం – అనుబంధం-1 అనుసరించిన పట్టిక (బ్రాకెట్ల లోని సంఖ్యలు శర్మగారి అనువాదపద్యాల నెంబర్లు.)

ఒక చేయి నొప్పించినా, రెండో చేత్తో మగవాడిని కౌగలించుకొన్నట్టు వ్రాయడం ఆడదానికే చేతనవుతుంది. ఆమె చూపులకు హృదయాలు, వీపునకు కళ్ళూ ఉంటాయి. రవి కాంచలేనిది కవి కాంచిన, కవి కాంచలేనిది కాంత మాత్రమే చూడగలదు. మగవాడు ఆవలిస్తే పేగులు లెక్కపెట్టవచ్చు గాని ఆడది ఆవలి మొఖమైనా ఇంగితాన్ని తెలుసుకోగలదు. చూడండి. అది కవయిత్రులలో ఒక తల్లి రేవాదేవి చెప్పిన గాథ -.

> అలిగి పెడమోము పెట్టి నీ వరుగుచున్న - గాని, మానిని వెనువెంట గదలివచ్చు
> మగని ప్రక్క నె యున్నదిమనసటంచు - పులకరించిన నీవీపె తెలుపు మాకు.
> [గా.స.సారము, 1-87 (66)]

అవును మగవాడు ఎటువంటివాడైనా సరే మగువ మనసు ప్రేమించినవాడిని పెనవేసుకుని వదిలిపెట్టదు. అతడు మొరడైనా, నరుడే చూడండి 'ససిప్పహా' దేవి ఏమంటుందో

> నిలువగారాని వలపుబందెమున దగిలి
> యతడు వాయించినట్లెల్ల నాడుచుందు;
> మ్రాను సాజంపు మ్రోడైన గాని, చెలియ!
> చొక్కి పెనగదె యద్దాని చుట్టు దీగ. (గా.స. సారము, 4-4 (237)

ముద్దరాలు చుట్టుకొన్న పురుషుడు మ్రోడువారి వున్నా పచ్చగా కనబడతాడు. చిలుకలు వాలిన ఎండుచెట్టు పచ్చగా, చూడముచ్చటగా ఉంటుంది. చూడండి, అణులచ్చి ఎంత చక్కగా ఆ సంగతి చెప్పుతున్నదో :

> ఎండు మఱ్ఱిమ్రాని యండకు జేరి చ
> ప్పట్లు సరచి సగిరి పాంథజనులు
> తమ్ము జూచి బెదరి దాని యాకుల పండ్ల
> పగిది నున్న చిలుక లెగిరిపోవ. (గా.స.సారము, 3-63 (210)

చప్పట్లు కొడితే చిలుకలు ఎగిరిపోతాయిగాని, ఎన్ని ఇక్కట్లు వచ్చినా చిలుకలకొలికి చెలుణ్ణి వదలిపోదు. మనసైన దంపతులను మామిడి చెట్టుతోను, దానిని అంటిపెట్టుకొన్న మాధవీలతతోను పోల్చడం సహజమేగాని ప్రేయసీ ప్రియుల కలయికను రెండు మవ్వపుతీగెలు పెనవేసుకొనడంతో పోల్చడం అనువైన భావనాపటిమ ఉన్నవాళ్ళకే చెల్లుతుంది. ఆది కవయిత్రులంత సున్నితమైన ఊహలలో ప్రథమాంధ్ర భాషారచయిత్రి -

> నాగమల్లియతీగె, నవమల్లెతీగె - కలసి పెనగుచున్న కడు వింత జూపు.[2]

ఆమె పేరు తాళ్లపాక తిమ్మక్క. ఆమె వ్రాసిన కావ్యం పేరు సుభద్రా కల్యాణం. ఆమె కవీ, మహాకవి తాళ్లపాక అన్నమయ్యగారి ఇల్లాలు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అత్యంత

2. సుభద్రాకల్యాణం, పుట 46.

ప్రాధాన్యంగల ఈ నిర్ణయాన్ని చేసినవారు పరమ ప్రామాణికులని ప్రసిద్ధులైన వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. వారి ప్రతిపాదన కొంత వివాదాస్పదమైనది. కొందరు సాహితీవేత్తలు అభ్యంతరం చెప్తున్నారు. తిమ్మక్క అర్వాచీనురాలని భావిస్తున్నారు. ఈ తగువు సంగతి తర్వాత చెప్పుకొందాం. తిమ్మక్క అనే వ్యక్తి ఉండడం వాస్తవం. ఆ వ్యక్తి మహిళ అన్నది కూడా సత్యమే. ప్రాచీనమో, అర్వాచీనమో ముందు కావ్యం గురించి చెప్పుకొని తర్వాత కాలనిర్ణయం, వ్యక్తి నిర్ణయం గొడవలలోనికి తీరుబాటుగా వెళదాం.

తిమ్మక్కగారి సుభద్రాకల్యాణానికి ఆధారం నన్నయగారి భారతమే. వారు ఆదిపర్వం అష్టమాశ్వాసంలో 135 గద్యపద్యాలలో 'విజయవిలాసం' రచించారు (ఆది. 8-89 నుండి 223 దాకా). వారు చూపిన త్రోవలోనే తిమ్మక్క 1163 పాదాల ద్విపదకావ్యం వ్రాసింది. ఈమె తన రచనను కావ్యం అనే పెద్దమాటతో పిలువలేదు. ఇది పాట అని మాత్రమే చెప్పుకొంది. అయితే 'కడుమంచి తేటపలుకుల'తో చెప్పినట్టు తెలియజేసింది. కొన్ని కొన్ని ఘట్టాలలో నన్నయగారు మూలాతిక్రమణ చేసినట్లే ఈమె కూడా స్వతంత్రించి పాటకు జీవం పోసింది. నన్నయగారు చూపించినట్లే ఈమె కూడా ప్రాంతీయాభిమానం చూపింది. మూలంలో తీర్థయాత్రలు చేస్తున్న అర్జునుడు కళింగాన్ని అతిక్రమించి తపసులచే ఉపశోభితంబైన మహేంద్ర పర్వతాన్ని చూచి సముద్రతీరము వెంట మణులూరు పురానికి వెళ్లినట్లు కనబడుతుంది. కొన్ని దక్షిణదేశ ప్రతులలో అర్జునుడు గోదావరిలోనూ, కావేరిలోనూ స్నానం చేసినట్లు ఉందట.[3]

ఈ ఘట్టంలో నన్నయగారు టూరిస్టుగైడుగా మారి అర్జునునికి సగర్వంగా తమ వేంగీదేశాన్ని చూపించారు. ఆయన ఈమాత్రం లైసెన్సు తీసుకున్నారు. కనుక అర్జునుని 'ప్యాసుపోర్టు'లో మరికొన్ని క్షేత్రాలు లిఖించినా తప్పులేదని తాళ్లపాక తిమ్మక్క అర్జునుని రెక్కపట్టుకొని ఆపి తిరుపతి వెంకటేశ్వరులకు మ్రొక్కించింది. చూడండి:

అమర నహోబళం - బా వెంకటాద్రి వరుస నాపై కంచి - వరదుల గొలిచె
(పుట 6)

దక్షిణాదికి వచ్చిన అర్జునుడు మా తిరుపతికి రాకుండా ఉంటాడా అని ఆమె భావించడంలో తప్పులేదు. అతిక్రమణకు ఒరవడి పెట్టినది నన్నయగారు కదా. ఆయన వేలు చూపినచోట ఈమె మండ అందుకొంటుంది.

తీర్థయాత్రలు చేస్తూ వీలైన చోట్లలో వివాహాలాడుతూ అర్జునుడు ద్వారక ప్రాంతాలకొచ్చాడు. వచ్చీరాగానే వావికుదిరిన పెళ్ళీడుపిల్ల ఆ వూళ్లో ఉందని జ్ఞాపకమొచ్చింది. యాదవులు యతులను పూజిస్తారని కపటయతి వేషం వేసుకొని ఊరవతల నిలబడి కృష్ణుని తలచుకొన్నాడు. వెంటనే అతడు అర్జునుని ఉనికి తెలుసుకొని ఒక్కడే ఆ ప్రభాసతీర్థానికి వచ్చాడు. తన దగ్గరకు వచ్చిన కృష్ణుని చూసి అర్జునుడు

3. 'నన్నయభారతము' డా॥ దివాకర్ల వెంకటావధానిగారు, పుట.575

'అతిసంభ్రమమున నమస్కరించి' ''ద్వాదశ మాసికవ్రతం చేస్తున్నాను; నిన్ను చూడడంవల్ల నా పాపాలు పోయాయి'' అన్నాడు. ''అనిన విని నగుచు నబ్జనాభుండర్జును నతిస్నేహంబునం గౌగలించుకొని యెల్లవారల కుశలంబును నడిగి యాతని తీర్థాభిగమన నిమిత్తంబును సుభద్రయందు బద్ధానురాగుండగుటయు నుపలక్షించి ద్వారకాపురంబునకు దోడ్కొని యరిగె'' అని నన్నయగారు వ్రాశారు (ఆది. 1-8-170). నన్నయగారు 'నగుచు' అని అన్నారేగాని కృష్ణుని పరిహాసవాక్యా లేమీ వ్రాయలేదు. తిమ్మక్క వ్రాసింది చూడండి.

అత్తరి శౌరిసర్వాత్మకుడగుట - అంత నా నరునీ తలం పంతయు దెలిసి
యొక్కరుం డేతెంచె నొనర నచ్చటికి - నరుడు నచ్చెరువొంది నారాయణునకు
సరుగున ప్రణమిల్లి సద్భక్తి మొక్కి - వనమాలి కెదురుగా వచ్చి యర్జునుడు
దండప్రణామమ్ము తగ నాచరించె - నారాయణా యనుచు నవ్వుచు నరుడు
కరముబట్టుక వాని కడు లేవనెత్తె - హరియునవ్వుచుబల్కె నర్జును జూచి
నిన్ననేసుతులగని నెరతనమ్మునను - యింతలో సన్యాసి వెట్లయితి వయ్యా
యెరుగుదుము మీవిద్యలెల్లను మేము - గరిమ వేసాలల్ల గ్రాసాలకొరకె
అని గేలిసేయుచు నతని దోకొనుచు - చనుదెంచె రైవతశైలమ్ముకడకు
అచట నర్జునునుంచి హరియు నంతటను - నడనడచి ద్వారకానగరి కేతెంచె.
(సుభద్ర. పుట 13)

నన్నయగారు వ్రాయని బావమరదుల పరిహాస వాక్యాలను ఈమె ఇక్కడ వ్రాసినా ఆయన వ్రాసిన ఒక ఘట్టంలోని మాటలను అనుకరించలేదు. చూడండి: అర్జునుడే తన భర్త కావాలని సుభద్ర రైవతపర్వతానికి మ్రొక్కింది.

దాని సుభద్రగా నెరిగి తత్క్షణజాతమనోజసంచల
న్మాననుడైన యవ్విజయు మానుగ జూచి మునీంద్ర నీకు జ
న్నే నలినాక్షులందు మది నిల్పగ నుంచును మందహాసగ
ర్భావనుడై రథాంగధరుడాతని కిట్లనియెం బ్రియంబునన్. (ఆది. 1-8-179)

ఈ ఘట్టాన్ని తిమ్మక్క ఇలా వ్రాసింది. నన్నయగారు చెప్పిన మందహాసాన్ని వదిలేసింది.

కవ్వడి గనుగొని కమలాక్షు డనియె - కనుచూపినంతలో కాంక్షింపతగున
మొదల సుభద్రపై మోహంబు నీకు - వదలక యుండుట వడి యెరుంగుదుము
తలపు నీ కీడేరు తలకకు మనుచు - జలజాక్షు డావేళ చెలిని రప్పించి
వందనము జేయించె వరమునీంద్రునకు (సుభద్ర - పుట 16)

కపటసన్యాసికి కన్నెపిల్ల పరిచర్యలు ఏర్పాటు చేశాడు. అపూర్వములైన వపుర్విలాస యుక్తులు వెలయించుచు ముదముతో సుభద్ర అతనికి భక్తితో భోజనాలు పెడుతూ ఉండేదని, సవ్యసాచికి కామవికారం నానాటికీ అగ్గలమైందని నన్నయగారు

వ్రాశారు. (ఆది. 8-183). తిమ్మక్క సుభద్రచేత ఈడుకు తగిన ఆటలు ఆడించింది. ఒకప్రక్క మౌనిని సేవిస్తూ సుభద్ర బొమ్మల పెళ్ళిళ్ల చేస్తున్నది. పాలుపైన రత్నాల బొమ్మరింటికి తళుకైన పగడాల ద్వారబంధాలు వాటికి పచ్చల తలుపులు, అందులో అచ్చపుదంతాల బొమ్మలు. వాటికి ఆమె పెళ్లి చేయిస్తున్నది. అప్పుడు అర్జునుడు అక్కడకు వచ్చాడు. ఇలా అన్నాడు:

ఇందు పురోహితుండెవ్వరె నీకు - అందమైనట్టి ఘడియారమ్ము నేదె
అన్నియు నేల నీ యాశ్రితుడ నేనె - యున్నాను నీ పెండ్లి నొనరజేయించ
పప్పు బూరెలు మంచి పాయసాన్నములు - వొప్పైన భిక్ష మాకొనరగా గద్ద
పన్నారుగురుగుల పంచభక్ష్యములు - నెన్నిక భుజియించె నెలమితో నగుచు
తెరయొద్ద నిలుచుండి దేవేంద్రసుతుడు - సరసిజవదనతో సరసమ్ము లాడు
భావగర్భితముగా పలుకు మర్మములు - భావించి సతి జూచి పరగ తమకించు
చెలియలక్షణములు చెప్పెద ననుచు - కలికి నొయ్యెనలేమ కరము చేబట్టి
అక్షీణ జృంభణం బది యొంట గద్దు - అక్షణసౌభాగ్య మది యింట గద్దు
పద్మరేఖలు నీకు భాసిల్లు ననుచు - పద్మాక్షి పాదముల్ భావించి చూచె
వియ్యమ్ము లందగా వెలదిరో గురుతు - ముడివడె హారముల్ ముద్దుల గుమ్మ
చిక్కు విడిపింతునే చేడె సుభద్ర - మక్కువ నామీద మరవకు మనెను
వేదోక్తయుక్తిని వింత పెండ్లిండ్లు - కావించవలె నంద్రు ఘనశాసనమున
నాల్గవ దినమున నాయుపతికిని - శోభనంబగుగదే సుదతి యిద్దరకు
పానుపుటింటికి పరగ బొమ్మలను - కడువేగ నంపుదమ కమలాయతాక్షి
అనుచు కందునమాట యతి తను బలుక - నివ్వెరపడియుండె నెలత సుభద్ర
మరి యెన్నొరీతుల మాయల తపసి - వెరవక తను జూడ వెరగందె నబల.
(సుభద్ర పుటలు 18-20)

వెంటనే వెళ్ళి కృష్ణునితో ఫిర్యాదు చేసింది. ''ఎక్కడి యతివరుండితడు వోయన్న, చూడ సంయమిగాడు చూరకాడితడు'' అని చెప్పింది. కృష్ణుడు ఆమెను ఊరడించి మాయా మునిని ఆకాశానికెత్తి పొగడి, ఇంక కొన్నినాళ్లు అతనికి భిక్ష పెట్టమన్నాడు. ''సుదతి యాతనిచూడ సురపతిసుతుడె, మనసులో నీ కనుమానమ్ము వద్దు'' అని చెప్పాడు. దానితో సుభద్ర స్తిమితపడింది. బొమ్మల పెళ్లి, అర్జునుని ఆకతాయిమాటలు, సుభద్ర అన్నయ్యతో ఫిర్యాదు, అతడు ఓదార్చడం మొదలైనవన్నీ తిమ్మక్క స్వకపోల కల్పితాలే. ఈ ఘట్టం తరువాత ఆమె కొద్దిగా నన్నయవారిని అనుసరించింది.

''ఈచూపు లీతమక మీవిలాసములు - యేతాపనులయందు నెరుగ మెన్నడును
విజయుని రూపవివేకసంపదలు - గజరాజ వరదుచే గరిమ నే విందు
తెగవాలుకన్నులు దీర్ఘబాహువులు - పగడంపు వన్నెగల పాదపద్మములు
చూడగా నీతండు క్రీడియేగాని - వాలాయముగ యతీశ్వరుడు గాబోడు

కపటసన్యాసిగా కల్పించి యిచట - వుపమను శ్రీకృష్ణు డునిచినాడేమో అని మనము జాల హర్షమ్ము నొంది. (సుభద్ర, పుట 26)

నన్నయగారు ఒకనాడు భోజనావసానాన సుభద్రచేత తిన్నగా మాటలు మొదలెట్టించినారు. కాని తిమ్మక్క చాలా పూర్వరంగం రచించింది. మాట కలపటానికి ముందు ఎంతో అలంకారాన్ని వర్ణించింది. జాతిగొజ్జగి నీట జలకాలాడి, ఉమ్మెత్తపువ్వులాగా ఉతికిన మడతకొనగోళ్ళతో కొని తీసుకునివచ్చి ఒక కోమలాంగి ఇస్తే పుచ్చుకొని చెంగావిపావడ రంగుమీరగా చుంగువిడిచి కట్టి పాలిండ్లవలను కనబడగా ఒక వింతలీల పయ్యెదకొంగు వేజారవిడిచి, కొప్పు ఇంచుక జార ముడిచి, విటులమన్మథుడేయు విరిమొగ్గతూపులా ఉండే గుమ్మడిగింజనామం తీర్చి మూడువేలు చేసే ముక్కరపెట్టి, రామచిలుకను భుజాన ఎక్కించుకొని తోటలోకి వెళ్లింది. ఉత్సాహంతో మేను ఉబ్బి పొంగగా పలుకుపలుకునా తేనె ఒలుకుతూ ఉండగా ఇలా అడిగింది.

అయ్యామీరేదేశమరసి చూచితిరొ యెయ్యది మీనామ మెచటనుండుదురొ
పరగ నింద్రప్రస్థ పట్టణంబునను - బహుళ సంపదలతో బరుగుచున్నారు
ధీరమానసులు కుంతీసుతుల్ వారు - అరయ గడు సుఖులై యున్నవార
కోరిమామేనత్తకొడుకు లైదుగురు - వారికి కుశలమా వరమునిచంద్ర
ఆరాజవరులలో నర్జునుం డెలమి - ధారుణీ తీర్థముల్ దరిసింప నేగె
తీర్థముల్ క్షేత్రముల్ తిరుగుచో మీరు - ఇంద్రనందను నెందునే జూడలేదా
జగతినంతట మీరు చరియింతు రనగ - అరసి మిమ్మిప్పుడు అడుగంగవలసె.
(సుభద్ర. పుటలు 29-30)

ఆమె ఆడే వాక్యాలు అర్జునునికి చెవుల పండుగలయ్యాయి. అతడు ఇలా బదులు చెప్పాడు.

పద్మాక్షి నీతోను పలుకగా వెరతు - పలికిన పలుకులు భావ మేర్పరచి
దూరులెక్కించెదో తోయజాక్షునకు - వలపుగల్లకయుండ పలుకగల్గుదునె
పడుచుదనమున నేను పలుకుపల్కులను - మనసులో నుంతువా నను రాజఋషిని
(సుభద్ర. పుటలు 30-31)

అతని మాటలు విని అర్థాంతరాలను మనసులోనే భావించుకొని చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వుతో 'కామతంత్ర రహస్యములు పుష్పించా'యట. మన్మథుడు బాణం వేశాడు. అర్జునుడు మూర్ఛపోయాడు.

ఓ ముద్దుచిలుక! నేనుల్కి పల్కితిని - వల దింక వలదని వ్యవహరింపుచును
బడలికగొని మౌళి పవలించె నంత - నారామచిలుక ఫక్కన నేగుదెంచె
పసిడిరెక్కలు సొంపులెసగియాడగను - మాణిక్యపుంగంఠమాలికల్ మెరయ
పార్థుని భుజములపై నిల్చి యపుడు - నయభయములతోను నరునకిట్లనెను.
(సుభద్ర. పుటలు 31-32)

సుభద్ర నోరారా అనని వరుసను చిలుక అంది – 'బావా! లే లె'మ్మంది. మోవిగంటినిచేసి ముద్దులు పెట్టింది. ప్రేయసీ – ప్రియులకు సముఖంలోనే రాయబారం చేసింది. అతనితో ఇలా అంది:

ఇదియేమి విజయుడా యీరీతినుండ – అన్నిట గుణశాలి వౌదువు నీవు
అర్జున నీమన మలరుచుండగను – నిర్జరీగతి నాతి నిన్నె తా వడిగె
నెలమి ధుర్యోధనున కిచ్చెద ననిన – కడుతాపమును బొంది కాంత నిన్నడిగె
యిరువురి మనసులో నెల్లతాపములు – నెరిగియు నెరుగని తెర గుండవలెను
ఇంతిని తోడ్కొని యింద్రప్రస్థమున – కెంతో వేడుకల నీవేగుదువుగాని
కమలాక్షి పెంచిన కడు ముద్దుచిలుక – నడుగవలెనా నీకు అన్నిబుద్ధులకు
మందె మేలమ్ములకు మరి వేళగాదు – అనుచు ముంజేతి కంకణముపై వ్రాలె.
(సుభద్ర. పుట 32)

ఈ చిలుక యింత నెరజాణ కనుకనే దీనిని చేమకూరవెంకటకవి తన 'విజయ విలాసం'లో ఎరువు తీసుకున్నాడు. సుభద్రార్జునుల నర్మగర్భితమైన సంభాషణలలో దీనిని ఆయన వాడుకొన్నారు. తిమ్మక్కగారి వర్ణనలను కూడా యథాతథంగా వినియోగించుకొన్నారు. చూడండి: 'మీ బావ ఎలా ఉంటాడు?' అని కపటమౌని అడిగినప్పుడు తిమ్మక్కగారి సుభద్ర ఇలా వర్ణిస్తుంది:

ఎగుభుజమ్ములవాడు మృగరాజునడుము – నడచిపుచ్చుకొను నెన్నడుముగలవాడు
గరగరనివాడు చక్కనివాడు నతడు – గొప్పకన్నులవాడు కోదండగుణకి
ణాంకంబులౌ బాహు లమరినవాడు – వెన్నున మచ్చగల విభవంబువాడు
బవిరిగడ్డమువాడు పన్నిదంబిడిన – వెన్నుపగడసాల వెసనాడవచ్చు
చిగురొత్తు చెంద్రిక చెలగు పాదములు. (సుభద్ర.పుట 34)

సరిగ్గా ఈ మాటలే కొన్ని చేమకూరివారి 'విజయవిలాసం'లో ఉన్నాయి. గమనించండి:

ఎగుభుజంబులవాడు మృగరాజమధ్యంబు
పుడికి పుచ్చుకొను నెన్నడమువాడు
నెరివెండ్రుకలవాడు నీలంపు నికరంపు
మెరుగు జామనచాయమేనివాడు
గొప్పకన్నులవాడు కోదండగుణకిణాం
కములైన ముంజేతు లమరువాడు
బవిరిగడ్డమువాడు పన్నిదంబిడి డాగ
వచ్చు నందపువెన్ను మచ్చవాడు

గరగరనివాడు నవ్వు మొగంబువాడు - చూడగలవాడు మేలైన సొబగువాడు
వానిమేనత్తకొడుకు గావలయు నాకు - నర్జునుండు పరాక్రమోపార్జునుండు.
(విజయవిలాసం, 2-164)

సుభద్ర మనసులోని మరులు తెలుసుకొన్నాక అర్జునుడు బయటపడ్డాడు. తమకముతో అతడు చేయిచాస్తే ఘనమైన సిగ్గుతో ఆమె యిలా అన్నదని తిమ్మక్క వ్రాసింది:

తల్లియు దండ్రియు తగిన బాంధవులు - బల్లిదు లన్నలు పాయకున్నారు
వారి యనుజ్ఞచే వర్తించు మిచట - నీలాగు పనులైన యిందరు నగర
హరి నీకు నిచ్చునట అనుమానమేల - తెరలి యేనుగునెక్కి దిడ్డుదూరెదరె
అని చెప్పి తానగరి కతివ పోయినను. (సుభద్ర, పుట 35)

స్త్రీసహజమైన ఈ సమాధానాన్ని చేమకూర తన విజయవిలాసములో అనుకరించాడు. చూడండి, సుభద్ర చిలకతో అర్జునునికి చెప్పమన్న మాటలు -

మేరలా యివి మీయంతవారలకును - బెద్దలున్నా రెరిగి వారె పెండ్లిసేయ
గలరు వేగిరిపాటింత వలదటంచు విన్నపము సేయరాదెయో చిన్నచిలుక!
(విజయవిలాసము, 2-187)

ఇతరులనుకరించేటంత రసవంతంగా తిమ్మక్క ఈ ఘట్టాన్ని ఇంత విస్తరించి రాయబట్టే కావ్యానందం కలుగుతుంది. నన్నయగారి అర్జునుడు అడగగానే బయటపడి పోయాడు (ఆది 3-137). తిమ్మక్క సుభద్రార్జునులను ఎంతో ఆడించిగాని బయట పెట్టించలేదు. తాళి కట్టించలేదు. గుట్టుగా పెళ్లి జరిగాక తిమ్మక్క రుక్మిణిచేత అప్పగింతలు పెట్టించింది. ''ద్రౌపదితో సఖ్యంగా ఉండు'' అని సుభద్రకు హితోపదేశం చేసింది. ఇంకొకరితో భర్తను పంచుకొనడంలో ఎంత సహనం కావాలో రుక్మిణికి తెలుసు, అందుకే -

పొలతి నమ్మగ రాదు పురుషుల నెపుడు - పలురీతి గృష్ణసర్పమ్ములై యుండ్రు
కొంచక కృష్ణకు కూర్మితో నుండు - వంచనసేయకు వనిత యెప్పుడును
అనుచు బుద్ధులు చెప్పి అనుగుమరదల్ని - అర్జునుచేతి కొయ్యాన నప్పగించె.
(సుభద్ర. పుట 44)

వదిన చెప్పిన సలహాను సుభద్ర పాటించింది. ఇంద్రప్రస్థానికి వెళ్లాగానే ద్రౌపదికి మ్రొక్కింది. అతివ పాంచాలిని అక్కున చేర్చింది. ఆ తరువాత సుభద్రార్జునుల శోభనానికి స్వయంగా ద్రౌపదే ఏర్పాట్లు చేయించింది. శయ్యాగృహాన్ని ఎలా అలంకరించిందో చూడండి.

ఒప్పైన బంగారు టుప్పరిగలోను - కప్పురవాసనల్ గ్రమ్ముకొనంగ
సాంబ్రాణిధూమముల్ సఖితానువేసి - చిత్రముల్ నిర్మించెచెలియ యంతటను

దిక్కుల మాణిక్యదీపముల్ వెలుగ - నిలువుటద్దముల నెలతచెక్కించె
వెయ్యిదీపమ్ములు వెలుగంగ నందు - గవుసెనల్ దీయించె గాజుకంబముల
బంగారు తరికోళ్ళ పట్టెమంచమ్ము - అంగన వెలయించి యమరించె సెజ్జ
సన్నవిరిమల్లెలు జాజిమల్లెలును - బొండుమల్లెలు చాలనిండ బరపించి
యిరుదెసల్ తలగడ లిమ్ముగా దాసి - బంగారుసురటిదా పడతి వెట్టించె
పంకించి బాగాలు బరణులం బోసి - గాలించి, సున్నముకాయబెట్టించి
పండుటాకులు దెచ్చిదిప్రణతి మడిపించి - మదిరాక్షియునిచెనుమరియునచ్చటను

(సుభద్ర. పుట 50)

ఆ తరువాత సుభద్రకు పన్నీట స్నానం బాగుగా చేయించి తన చేతులతో అలంకరించింది.

ఝుణఝుణత్కారమై పణతు లిద్దరును జోడుచిల్కలవలె శోభిల్లి రపుడు.

(సుభద్ర. పుట 52)

అక్కడ ధర్మరాజు అర్జునునికి అలంకారాలు చేయించాడు. సవ్యసాచిని చూచి సన్నచేసి శయ్యాగృహానికి వెళ్లమన్నాడు. అర్జునుడు అన్నపాదాలకు మ్రొక్కి పానుపు దగ్గరకు వెళ్లి ఇంతిరాకకోసం ఎదురుచూస్తున్నాడు. ద్రౌపది సుభద్రను పడకటింటికి వెళ్ళమంది. ఆమె వెళ్ళలేదు.

సజ్జకు జనుమన్న సకియ యప్పుడును - సిగ్గున మురిపెమున చెలియ సుభద్ర
అడుగు లోడకయుండి అటుకొంతసేపు - కూరిమి గలవాడుకొమరాల నీకు
మేలిమి గలవాడు మేనత్తకొడుకు - నాల్గునెలలు భిక్షమేల్గగ బెట్టి
యిప్పుడిటువలె సిగ్గు లేటికి సుదతి - అనుచుసుభద్రను అతివ తోడ్కొంచు
విజయునిపాన్పునవేడ్కతో నుంచె - తలుపులు మూసికొని తరుణియేతెంచె.

(సుభద్ర. పుట 53)

ఎంతో సంతోషముతో ఇంత చేసిన ద్రౌపది బయటకు రాగానే బాధపడింది. ''తలపోసె మనసులో తాళంగలేక - యేమి వస్తువులైన నియ్యవచ్చుగాని ప్రాణేశునిచ్చి మరి బ్రతుకంగరాదు.'' అని అల్లాడింది. ఇవి ఆడదే వ్రాయగలిగిన మాటలు. తిమ్మక్క సుభద్రా ద్రౌపదులను ఎలా చిత్రించిందో ముద్దుపళనికూడా అలాగే ఇళా - రాధలను రాధికాసాంత్వనంలో చిత్రించింది. ఇళ రాధ దోహదంతో పూచిన మొగ్గ. విరిసిన పువ్వు. ఆ ముద్దరాలికి మరుని బుద్ధులు బుజ్జగించి సారె గదిలో విడిచి రాధ బయటకు వచ్చింది. ఆత్మగతంగా ఇలా అనుకుంది.

సొమ్ములియ్యవచ్చు సొమ్మంద మియవచ్చు - నియ్యరాని ప్రాణమియ్యవచ్చు
దనదు విభుని వేరుతరుణి చేతికి నిచ్చి - తాళ వశమె యెట్టిదానికైన

(రాధిక. 1-116)

ఇలా పరితపించినా తిమ్మక్క చిత్రించిన ద్రౌపది వెంటనే సర్దుకుంది.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని - చెల్లెలు గనక నేనొల్ల ననరాదు
అదిగాక సభలోని క్కౌరవులకు - మానభంగము గల్గు హీనకాలమున
మానధన మొసగిన మాహాత్మ్యశాలి - అటువంటి శ్రీకృష్ణు కనుగుచెల్లెలట
అని మది తలపోసి అతివ మోదించె. (సుభద్ర. పుట 54)

ఇందులో ఒక చిన్నకావ్య దోషముంది. సుభద్ర కల్యాణమయ్యేనాటికి ద్రౌపదీ వస్త్రాపహరణం జరగలేదు. ఇటువంటి కాలవ్యత్యాసం ఇంకొకటికూడా తిమ్మక్క వ్రాసింది. కపటమునిమీద సుభద్ర ఫిర్యాదు చేసినప్పుడు కృష్ణుడు అతణ్ణి ఇలా ప్రశంసిస్తాడు:

ఏమని వర్ణింతు నితని పౌరుషము - ప్రమథగణముతోను పార్వతీశ్వరుడు
సవతాడవచ్చి తాచాలంగ నొచ్చె - అకాలకంఠుడు నటు లోడిపోయె
నీతని గెలువగా నెవ్వరి వశము? (సుభద్ర. పుట 24)

సుభద్రా కళ్యాణంనాటికి కిరాతార్జునీయం కూడా జరుగలేదు. అయితే ఆడవాళ్ళ పాటలో ఇవి దోషాలు కావు. భూతభవిష్యద్వర్తమానాలు అన్నీ వాళ్ళకొక్కటే. ఏ ఒక్కటి వారు మరిచిపోరు. అన్నీ కలగలిపి కమ్మగా మధుర వచనాలను పచనం చేయడం వాళ్ళకే తెలుసు.

సుభద్రాకల్యాణం స్త్రీలకోసం స్త్రీ రచించిన రచనే అన్నది గ్రంథం నిండా ధ్వనిస్తున్న సత్యం. రచయిత్రి ఎవరన్నదే ప్రశ్న. తిరుపతి తిరుమల దేవస్థానం వారు 1950లో తమ ఓరియంటల్ సీరీస్‌లో పదవ ప్రచురణగా సుభద్రా కల్యాణం ద్విపదను ప్రచురించారు. దానిని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించి చిన్న పీఠికను రాశారు. అందులో తాళ్ళపాక అన్నమాచార్యులవారి భార్య తిమ్మక్క ఈ గేయకృతికి రచయిత్రి అని ప్రకటించారు. 'ఆమె సంగీత సాహిత్యచతుర' అని అదనపు సమాచారం ఇచ్చారు. ''ఈ పాటలోని పలుకుబళ్ళు చేమకూర వెంకటకవి విజయ విలాసమున జేరినవి'' అని స్పష్టపరిచారు.

మన ఆంధ్ర సాహిత్య లోకంలో చేమకూర వెంకటరాజుగారి విజయవిలాసాన్ని చక్కని వ్యాఖ్యానంతో మరింత సుప్రసిద్ధం చేసిన తాపీధర్మారావుగారికి వేటూరి మాటలు రుచించలేదు. చేమకూర్పైన ఈగనైనా వాలనీయని తాపీవారు ఆ కవిమీద అనుకరణలనే ఆరోపణలు పడితే ఊరుకొంటారా. ఈ సమగ్ర ఆంధ్రసాహిత్య తొలి ముద్రణ సందర్భంలో పిదప సంపుటమైన నాయకరాజుల యుగం మొదటి భాగానికి పీఠిక రాస్తూ తాపీవారు సుదీర్ఘమైన చర్చ చేశారు. దానిని యథాతథముగా పొందుపరుస్తున్నాను.

''తాళ్ళపాక తిమ్మక్కగారి కర్తృత్వము. ఇదొక పండిత ప్రమాదంగా చేశారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1950లో తాము తిరుపతిలో ముద్రింపించిన సుభద్రా

కల్యాణము (తాళపత్రంలో 'సుభద్రాబరణము' అని ఉంది.) పరిష్కర్త దానిని సుభద్రా పరిణయము అని ఉంచడం న్యాయము. ఈ ద్విపద స్త్రీల పాటను శాస్త్రిగారే మొట్టమొదటసారిగా అచ్చువేస్తున్నామనుకొని ప్రమాదానికి లోనయారు. ఆ తిమ్మక్కను సంగీతసాహిత్య చతుర అని ప్రశంసించారు. ఈ ప్రశంసకు ఆధారము ఎంత ప్రయత్నించినా కనబడలేదు. తాళ్ళపాకవారి సంకీర్తనలు కొన్నివేల సంఖ్యను ఉద్ధరించినవారు శాస్త్రిగారు. సాహిత్యవిషయాల పరిశోధనలో ఆరితేరి, ఆంధ్రులకెంతో మేలుచేశారు. వారు ఈ తిమ్మక్కను గురించి చెప్పిన మాటలు ఆధార సహితములయిన సత్యములే అని మన పండితులు, పరిశోధకులు, అధ్యాపకులు అందరు పెద్ద బస్సు ప్రమాదంలో చిక్కిపోయారు. వారందరు శాస్త్రిగారి సిద్ధాంతము సమంజసమనే అనుకున్నారు.

కాని, ఇది ప్రథమ ముద్రణం కాదు. 1910లో గోదావరి జిల్లాలో ఈ స్త్రీలపాటే ముద్రణ జరిగింది. అప్పటికి తాళ్ళపాకవారంటే అభిమానదురభిమానాలేమీ ఉండటానికి ఆస్కారం లేదు. దానిని రచించిన వ్యక్తి ''పరకవి తాళ్లపాక తిమ్మప్ప చెప్పెను. విష్ణుకథను జగతిలోపలను'' అని చెప్పుకున్నాడు తిమ్మక్క.

''అవనిలో తాళ్ళపాకన్నయ్యగారి తరుణీ తిమ్మకచెప్పె తాను సుభద్ర కల్యాణ మనుపాట...'' అని చెప్పుకొంది. అసలు తాటాకు గ్రంథంలో ఉన్నదేమంటే

''ధరలోను తాళ్ళపా కన్నయ్యగారు
ధరను తిమ్మక చెప్పె ధరలోనువెలయ''

అది తరుణి కావచ్చు, తనయ కావచ్చు కదా! దీనిని పట్టుకొని తన కుందేటికి మూడేకాళ్ళని వేటూరివారు ప్రయత్నించారు.

దీనిలో నిర్ణయం కావలసిన విషయాలు చాలా వున్నాయి.

1. ఈ తాళ్ళపాకన్నయే సంకీర్తనాచార్యవర్యుడయి, దినము పాడిన పాట మరల పాడకుండ, దాదాపు 30 వేల కీర్తనలు పాడినవాడని వారు భావించారు. అంత ప్రసిద్ధి పొందిన మహాభాగవతోత్తముని పేర్కొనప్పుడు 'అన్నయ్యగారు' పాడి మాటలలో, ఆ తిమ్మక్క తన భార్యయే అయి ఉంటే చెప్పి ఊరకుంటుందా?

2. సంకీర్తనాచార్యుల కుమారుడు పెదతిరువెంకటనాథుడు తన వంశ గౌరవమును సుస్థిరంగా నిల్పడానికి అన్నమయ్యగారి కీర్తనలను రాగిరేకుల మీద చెక్కించి భద్రపరిచారు. అలాగే వారి మనుమడు చిన్నన్న (ద్విపదకవి) అన్నమార్యుని జీవితమును ద్విపదగా వ్రాసి ప్రకటించాడు. దానిలో ఆచార్యుల వారి కుటుంబమును గురించి కొంత వ్రాశాడు. అంతేగాని ఆ తిమ్మక్క సంగీతసాహిత్య చతుర అన్న భావం ఎక్కడా చూడలేదు. చదువుకుందో లేదో కూడా తెలియదు.

3. తిమ్మక్కకు భర్తయందు భక్తిప్రపత్తులు లేకపోయినా అన్నమాచార్యుని యిష్టదైవమగు శ్రీవెంకటాచలపతికి తన ద్విపద పాటను అంకితమియ్యకుండ ఉండగలదా?

4. తిమ్మక్కే వ్రాసి ఉంటే ఆ తిమ్మక్క ఎప్పటిదో, తన భర్త ఏ అన్నయ్యో తెలుసుకోవలసి ఉంది... తాళ్ళపాక వారిలో ఈ పేరులు చాలా తరచుగా వినబడుతుంటాయి.

5. ఈ స్త్రీల పాటలు ఇప్పటికీ చాలావరకు పురుషులే వ్రాసి స్త్రీలకిచ్చేవారు. కొందరు పురుష రచయితలు పాట చివరను తన పేరును గూడా చెప్పేవారు. ఈ పురుష రచయితలు తమ కాలములో ఉండిన చక్కని కావ్యాలను రుచి చూచినవారు గూడ, ఆయా వర్ణనలను అనుకరించేవారు.

6. ఈ పాటకు, విజయవిలాస మహాకావ్యానికి ఉన్న పూర్వాపరాలు నిర్ణయించవలసి ఉంది, అప్పుడుగాని ప్రబంధాన్ని ఆ పాట అనుకరించిందో, ఆ పాటను ప్రబంధమే అనుకరించిందో తేలదు. కాబట్టి ఆ పోలికలున్నంత మాత్రాన చేమకూరకవి తిమ్మక్కను కాపీ కొట్టాడని నిర్ణయించడం అక్రమము.

7. ఆరుద్రగారు సూచించిన తాళ్ళపాక తిమ్మాచార్యుడు 1740 ప్రాంతంలో ఉన్నాడనీ, అతడు సాహిత్యము వ్రాతకోతలలో కొంత పరిశ్రమ చేసి గ్రంథ పరిచయం కలవాడనీ తేలుతుంది. ఈయన గోదావరి జిల్లా ముద్రణములో తిమ్మప్ప వరకవీశ్వరుడు కావచ్చును.

8. అన్నిటికంటే ముఖ్యమయిన ఒక్క కారణము. పాటే అర్వాచీనమని రుజువు చేయుటకు మనకు రుజువుంది. ప్రభాకరశాస్త్రిగారు ముద్రించిన ఈ పాటలో, 39వ పేజీలో, చివర నుంచి 8వ చరణంలో ''మురవైరి వందితమువ్వగోపాల'' అని రుక్మిణి అంటుంది. 'మువ్వగోపాలుడు' క్షేత్రయ్యగారి ముద్దుపేరు. ఇతడు 1650 ప్రాంతమువాడు. అతని ముద్దు పేరుతో కృష్ణుని సంబోధించడం గట్టిగా ఆలోచించవలసిన విషయం, కాబట్టి ఈ తిమ్మక్క 1660 ప్రాంతాలది కావాలి. వేటూరివారు ఈ పదముతో చిక్కునపడ్డారు. క్షేత్రయ్యగారు 'మువ్వపురిగోపాల' అనే అనేవారనీ, ఈ మువ్వగోపాలుని కర్థం ''మువ్వలు దాల్చిన బాలగోపాల'' అనీ ఎంచవలెనట. సుభద్రా వివాహ ఘట్టంలో రుక్మిణి మొదలయిన అష్టభార్యలున్నప్పుడు 'మువ్వలున్న బాలగోపాలా' అని అర్థం చెప్పడం మహాసాహసం.

ఇన్ని కారణాలచేత ఈ పాట ప్రబంధానికి చాలా వెనుకను వ్రాశారని నిర్ధారణ చేయక తప్పదు.

ఈ పీఠికలో ఇంత సుదీర్ఘంగా వ్రాయడానికి ముందే సుభద్రా కల్యాణం ద్విపద అర్వాచీనమని తాము భావిస్తున్నట్లు తాపీవారు నాతో చెప్పారు. 1910లో కాకినాడలో

మంగువారు ప్రచురించిన ప్రతితో తిరుపతివారి ప్రతిని తైపారు వేసి చూశాను. మంగువారి ప్రతిలో తాళ్ళపాక తిమ్మప్ప అనే ఒక కవి పేరు ఉండబట్టి తాళ్ళపాక వంశంలోనే ఎవరో పురుషుడు బహుశా చేమకూర వారికి అర్వాచీనుడు ఈ ద్విపద చెప్పి ఉంటాడేమో అన్న తాపీవారి తలపోతను సమర్థించే ఆధారాలు దొరుకుతాయేమోనని నేను పరిశోధనలు చేశాను. సాహిత్య విషయాలలో అభిమాన దురభిమానాలకు చోటు ఉండకూడదు. వివాదాస్పదమైన విషయాలలో నిష్పక్షపాతంగా ఇరుపక్షాలవైపునున్న సబవులను సమీక్షించాలి. సుభద్రా కల్యాణం ద్విపదగా వ్రాసినది ఎవరో అర్వాచీన పురుషుడే అని అనుమానించిన తాపీవారిని బలపరచడానికి నాకు కొన్ని ఆధారాలు వంటివి దొరికాయి. శాలివాహన శకవర్షాలు 1662 నళనామ సంవత్సర పుష్య శుద్ధసప్తమీ బుధవారంనాడు ఒక తాళ్ళపాక తిమ్మాచార్యులవారు పంజ వెంకట్రెడ్డిగారికి ఏడుకొండల రంగనాథ రామాయణం కాపీచేసి ఇచ్చారు. ఈయన క్రీ.శ. 1741లో ఉన్నాడు.[4] ఇతడే ద్విపద సుభద్రా కల్యాణం వ్రాశాడేమో అన్న అనుమానం భావిపరిశోధనవల్ల తేలాలి. అయితే ఈ సమస్యను ఇంకొంచెం చిక్కుపెట్టడానికి ద్విపద సుభద్రా కల్యాణం రచయిత మరొకరు కావచ్చుననే అనుమానం కలుగుతుంది. ఆంధ్రసారస్వత పరిషత్తువారు ప్రచురించిన స్త్రీల పాటలలో ఒక సుభద్రా కల్యాణం ఉంది. కొద్ది పాఠభేదాలతో అది అచ్చంగా వేటూరివారు ప్రచురించినదే. దానిలో చివర ఇలా ఉంది.

''ధరణిలో హేమాద్రి తనయుడప్పన్న - గురుభక్తి తిమ్మక్క మధుభక్తిరతియు మలయుపూర్ణా సుభద్రావివాహ - యివ్వరు పాడినరాయవ్వరు విన్న...''[5]

ఈ హేమాద్రిగారి అప్పన్న పులిమీద పుట్రలాగ వచ్చాడు. ఇతనికీ, తిమ్మక్కకీ ఏమి బంధుత్వమో! సర్వసాధారణంగా సాహిత్య కర్తృత్వ నిర్ణయాలలో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పొరపాట్లు చేయరు. వారు మంగువారి అచ్చు ప్రతినుండికాక ఏదో తాళపత్ర ప్రతినుంచీ పరిష్కరణ చేసినట్టు చెప్పనే చెప్పారు. సర్వసాధారణంగా స్త్రీల పాటలలో కృత్యాది వివరణలు ఏమీ ఉండవు. తిన్నగా, సూటిగా కథనే ఎత్తుకుంటారు. ఈ సుభద్రా కల్యాణంలోనూ అంతే జరిగింది. మన మహిళలు చెప్తే గ్రంథాంతంలో కొద్ది వివరాలు ఇస్తారు. ఈ కృతిలో చివర ఒక వివరణా, ఫలశ్రుతి ఉన్నాయి. ప్రభాకరశాస్త్రిగారి కుమారులు వేటూరి ఆనందమూర్తిగారు ఇలా రాస్తున్నారు.[6]

''అవనిలో తాళ్లపాకన్నయ్యగారి
తరుణి తిమ్మక్కచెప్పె - దామ సుభద్ర
కల్యాణమను పాట - కడుమంచితేట

4. ఆంధ్రసాహిత్య పరిషత్తులో 2610 సంఖ్యగల మైరావణ చరిత్ర ఒకటి ఉంది. ఆ గ్రంథం చివర ఈ సంగతులు ఉన్నాయి. చూ॥ పరిషత్పత్రిక సంపుటి 6, పుటలు 238 – 240.

5. స్త్రీల పౌరాణికపు పాటలు (భారత భాగవత కథలపాటలు) ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ, పుట 228.

6. తాళ్ళపాక వారి కృతులు - వివిధ సాహిత్య ప్రక్రియలు.

పలుకుల; నీపాట పాడినా విన్న
శ్రీహరి వారికి - చేరువైయుండు (పుట. 56)

అని యీ గేయకృతిని గూర్చి చెప్పుకొన్నది. (ఇదియును పెండ్లిపాటయే. తాళ్లపాక కవులు పెండ్లి విషయముగల పాటలకు మంజీర ఛందమునే వాడియుండిరి.)

ఈ లఘుకృతిని శ్రీకాళహస్తి రాజాగారి యాస్థానినుండి తెచ్చిన తాళపత్ర గ్రంథం సంచయమునుండి వెలికిదీసి తిరుమల తిరుపతి దేవస్థానము వారి పక్షమున శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించి ప్రకటించి వెలుఁగునకుఁ తెచ్చినారు. అందీకావ్యాంతము నందలి పంక్తులిట్లేయుండి యిది అన్నమాచార్యుని తరుణియగు తాళ్లపాక తిమ్మక్క రచనగా తెలియదగి విస్పష్టముగనున్నది. అందు సందేహములేదు.

ఈ రచనమే పూర్వమెన్నడో గుజిలీ కాగితములో ముద్రితమయిన ప్రతియొకటి భ్రష్టరచనా రూపమున కాననగుచున్నది. అందిది యెవరో ''తిమ్మప్ప'' యను వ్యక్తి రచించినట్లున్నది. రచనయును చాల చెడియున్నది. ఆ అచ్చుప్రతి కాధారమగు తాళపత్ర ప్రతియేదో తెలియరాదు. కాని దీనికి నేటికి లభ్యమగు తాళపత్ర ప్రతియొక్కటే యున్నది. అదియే ఇప్పటి ముద్రిత ప్రతికాధారమయి కాళహస్తినుండి తిరుపతికిఁ గొని తేబడినది. ఈ ప్రతియందటి పాట స్త్రీ పామరాదుల నోటఁబడి చాలరూపు చెడియున్నది. కాని శక్యమయిన సంస్కారములు జరిపి శ్రీ శాస్త్రిగారు దానిని ప్రకటించిరి. ఏది యెట్లున్నను ఇది తిమ్మప్ప రచనకాక అన్నమాచార్యుని తరుణియగు తిమ్మక్క రచనయని యెఱుఁగుటకు మాత్రము తగినంత సాక్ష్యమిచ్చుచున్నది.

ఆ గుజిలీ ప్రతియందలి 'తిమ్మప్ప' ప్రసక్తి ప్రామాదికమని తలఁతును. 'తిమ్మక్క' విషయమే 'తిమ్మప్ప' విషయముగా పొరబాటున ముద్రితమై యుండునని పై ప్రతినిబట్టి తెలియుచున్నది.

జానపదుల వీరగాథలైనా, స్త్రీలు పాడుకొనే కథాగేయాలైనా ఒక తరంనుండి ఇంకొకతరానికి మౌఖికంగానే సంక్రమిస్తాయి. అవి ఎంత పొడుగైనవైనా వాటిని సర్వసాధారణంగా తాటాకులకు ఎక్కించడం జరగదు. తిమ్మక్క చెప్పిన సుభద్రా కల్యాణం పాటకూడా అలాగే తరతరాలుగా స్త్రీలనోట ప్రచారం పొందింది. ఆమె తాళ్ళపాక వారి కుటుంబవ్యక్తి కనుక ఆ ప్రచారం దక్షిణానికి కూడా సాగడంలో ఆశ్చర్యం లేదు.

తాళ్ళపాకవారి పాటలు కొన్ని నేటికీ కావేరీపరీవాహ ప్రదేశంలో సజీవంగా ఉన్నాయి. మేలట్టూరు భాగవతమేళావారు ఏటేటా ప్రదర్శించే నాట్యనాటక కార్యక్రమాలలో ప్రతిరోజూ తాళ్ళపాకవారు రచించిన ఈ క్రింది అయిదు పాటలను విడిగా జతులతో కలిసి పాడుతారు.

నెం.	పల్లవి ఎత్తుగడ మాటలు	రాగం	తాళం
1.	జయజానకీ రమణ	నాట	జంపె
2.	శరణు శరణు	ఆరభి	మిశ్రచాపు
3.	మురహర నగధర	మధ్యమావతి	ఆది
4.	దేవేశగణా రాధిత	సావేరి	రూపకం
5.	మాధవ భవతుతే	పంతువరాళి	ఆది

ఈ అయిదు సంకీర్తనలను కలిపి ఉమ్మడిగా 'తోడయమంగళం' అంటారు. భాగవత మేళా ప్రదర్శనముల ముందు మాత్రమే కాదు, తమిళనాడులోని భజన కూటాలలో కూడా ఈ అయిదు పాటలను తప్పనిసరిగా ఆదిలో పాడుతారు. తాళ్ళపాక వారి కీర్తనలు నాయకరాజులతోపాటు తమిళనాడుకు వెళ్ళాయి. అక్కడ బతికున్నాయి. తాళ్ళపాకవారి తదితర కీర్తనలతో పాటే తిమ్మక్క చెప్పిన సుభద్రా 'బరణ'మో, సుభద్రాహరణమో, సుభద్రా కల్యాణంగా దక్షిణాది స్త్రీల నోట ప్రచారం పొందింది.

ఏ స్త్రీల పాట అయినా చేర్పులకు చోటు ఇస్తూ ఉంటుంది. తంజావూరులో క్షేత్రయ్య పదాలు ప్రచారం అయిన పిమ్మట 'మువ్వగోపాల' అనే పదం ఇంటింటికీ మారుమోగాక "మురవైరివందిత మువ్వగోపాల" అనే పాదం సుభద్రా కల్యాణంలో ప్రవేశించి వుంటుంది. అంతకుముందే తమ ఇళ్ళలో ఆడవారు పాడుకొనే ఈ పాటను చేమకూర వెంకటరాజుగారు వినే ఉండి ఉంటారు. మంచి కవిత ఎక్కడన్నా ఎంచుకొని తమ కవితలో మలచుకొనే వెంకటరాజుగారు తమ విజయవిలాసంలో స్త్రీల పాటను కొన్నిచోట్ల అనుసరించాలని చెప్పాలి. చేమకూరవారిలానే ముద్దుపళని కూడా ఈ పాటను అనుసరించి వుండాలి. లేకపోతే పోలికలు రావు.

క్రీ.శ. 1740లో కనబడే తాళ్ళపాక తిమ్మనార్యులు గ్రంథాల లేఖకునిగానే మనకు తెలుస్తున్నాడు. కవి అని చెప్పలేం. హేమాద్రి అప్పన్న కూడా తన పేరు తరువాత తిమ్మక్క పేరును స్మరించడంలో మొట్టమొదట చెప్పిన వ్యక్తి తిమ్మక్క స్పష్టం చేస్తూంది. హేమాద్రి అప్పన్న కూడా లేఖకుడే కావచ్చును.

సుభద్రా కల్యాణాన్ని ఎప్పుడు తాటాకులకు ఎక్కించారో తెలియదు. దాని ప్రతులు మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోగానీ, తంజావూరు సరస్వతీమహాలు లైబ్రరీలో గానీ లేవు. మంగువారి ప్రచురణకు, ఆంధ్రసారస్వత పరిషత్తు వారి ప్రచురణకూ మాతృకలయిన తాళపత్ర ప్రతుల భోగట్టాలు తెలియవు. వేటూరివారు పరిష్కరించిన తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రచురణకు కాళహస్తి ప్రతి ఆధారమని స్పష్టంగా చెప్పారు.

సుభద్రా కల్యాణం పాటను పాడుకొనే వాళ్ళెవరూ తిమ్మక్క పేరును విస్మరించడం లేదుగానీ తాళ్ళపాకవారి కుటుంబంలోని మగమహారాజులందరూ పేరుమోసిన

కవిపుంగవులయినా వొక్కరూ తిమ్మక్క కవయిత్రి అన్న సంగతి గ్రంథస్థం చేయలేదు. వాస్తవానికి ఆమె అన్నమాచార్యులవారి భార్యే అయితే ఆమెను రచయిత్రిగా గుర్తించకపోవడం ఒక అపచారమే. ఆడవారికి మగవారు ఎన్నో అన్యాయాలు చేశారు, చేస్తున్నారు. అందులో ఇదొకటి అనుకోవాలి. చెడుపు చేసి క్షమాపణలు చెప్పుకొనడం సహజమే. సాతవాహనుల కాలం నుంచీ ఇది జరుగుతూనే ఉంది. చూడండి. ఆదిమ కవయిత్రులలో ఒకతె 'రేవా' దేవి చెప్పిన గాథ.

చేసియున్న యవియొ చేయుచున్నవో యింక
జేయునదియొ నీదు చెట్టలందు
సరిగ జెప్పు మేని మరచిపొమ్మనెదవు
సొగసుకాడ సిగ్గు దెగినకాడ. (గా.స.సారం. 1-90 (68))

మగువలు మంచిచెడ్డలు రెండూ మరచిపోరు. వాళ్ళ మధువాక్యాలు మగవాళ్ళకు మరపు రమ్మన్నా రావు.

ప్రోలుగంటి చెన్నయమంత్రి

నూటికి నూరుపాళ్ళు తెలుగుదనం ఉట్టిపడే దృశ్యకావ్య ప్రక్రియలలో యక్షగానం సుప్రసిద్ధమైనది. పట్టికలు వేయడం మొదలుపెడితే, ఇవాళ కొన్నివేల యక్షగానాలు లెక్కకు తేలుతాయి. కానీ ఈ ప్రక్రియ మన దేశంలో ఎప్పుడు ప్రారంభమయిందో మాత్రం ఇదమిత్థంగా చెప్పలేం. యక్షగానాన్ని ఆ పేరు పెట్టి మొట్టమొదట పేర్కొన్న కవి శ్రీనాథుడు. అతడు భీమఖండంలో దక్షవాటికను వర్ణిస్తూ ''కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగానసరణి'' (2-65) అన్నాడు. కాబట్టి శ్రీనాథుని జీవితకాలమైన క్రీ.శ. 1370-1450 ప్రాంతాల మధ్య యక్షగానాలు ఉండేవని నికరంగా చెప్పుకోవచ్చు. అయితే శ్రీనాథుని జననకాలానికి ఒక వంద సంవత్సరాలకు పూర్వం అంటే, పాల్కురికి సోమనాథుడు సమీప భూతకాలంలో కూడా యక్షగానాలుండేవని అనుకోవచ్చు. అతడు తన పండితారాధ్య చరిత్రలో శివరాత్రిని ఇలా వర్ణించాడు.

భారతాధికథలు చీరమరుగుల - నారంగ బొమ్మల నాడించువారు
కడు నద్భుతంబుగా కంభమాత్రంబు - లడరంగ బొమ్మల నాడించువారు
ఆదట గంధర్వ యక్షవిధ్యాధ - రాదులై పాడెడు నాడెడువారు.
(పండితారాధ్య చరిత్ర, పర్వత. పుటలు 435, 436)

ఈ ద్విపదలనుబట్టి యక్షపాత్రలు ధరించి ఆకాలంలో ఆడుతూ పాడుతూ ఉండేవారని తెలుస్తున్నది. ఈ ద్విపదకే ''యక్షవిద్యాధరాదులై పాత్రల నాడించువారు'' అనే పాఠాంతరమున్నట్టుంది. ప్రామాణికులైన వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఈ

పాఠమిచ్చారు.[1] దీని ప్రకారం చూస్తే యక్షగానం కూడా బొమ్మలాట అనిపిస్తుంది. పాత్రలను ఆడించే నాటకానికి పాల్కురికి సోమనాథుని కాలంలోనే ''గొండ్లి'' అనే పేరున్నట్టు బసవ పురాణంవల్ల తెలుస్తున్నది. అందులో బసవేశ్వరుని పెండ్లి వర్ణిస్తూ సోమనాథుడు ఇలా చెప్తాడు.

కోలాటమును బాత్ర గొండ్లి పేరణియు
గేళిక జోకయు లీల నటింప (బసవపురాణం-1 పుట 19)

ఈ పాత్ర గొండ్లి బొమ్మలాటే అని పిల్లలమర్రి పినవీరభద్రుని పద్యంవల్ల రూఢి అవుతుంది. దుష్యంతుని యుద్ధాన్ని వర్ణిస్తూ ఈ బొమ్మలాట ప్రసక్తిని అతడు తెచ్చాడు.

క్రవ్యాదుం బరిమార్చి యెంతయును నుగ్రంపశ్యుడై నిల్చి వా
యవ్యాస్త్రం బరివోసి యేయుటయును వాత్యావేగనిస్ఫూర్తినా
ర్తివ్యాహారము లుప్పతిల్లు నుడువీధిం గొండ్లియాడించెదై
త్యవ్యాధుల్ తెరబొమ్మలట్ల నిగుడం దా నాటకాడుంబలెన్.
(శకుంతలాపరిణయము, 3-125)

తెరబొమ్మల పాత్రలతో గొండ్లి ఆడించేవారిని పిల్లలమర్రి వాడిన మాటలవల్ల, ఈ పాత్రల నాడించేవారు గంధర్వయక్ష విద్యాధరులవుతారని సోమనాథుని ద్విపదవల్ల తెలుస్తున్నది. ఈ గంధర్వులు గాంధర్వాన కీర్తించేది యక్షగానమే అని శ్రీనాథుడు మాటలవల్ల నికరమవుతున్నది. గొండ్లి తెరనాటకమని నాచన సోముని ప్రయోగంవల్ల కూడా తెలుస్తున్నది.

తెరలెత్తి సప్తసాగరములు పొరలంగ
వరుణుండు గొండలి పరిఢవింప (ఉత్తరహరివంశం, 4-216)

అని అతడు తెరల సంగతి చెప్పాడు. పోతరాజుగారు కూడా తమ కాలంలో నటులు తెరమరుగున నాట్యాలు చేస్తారని కుంతీస్తవంలో ''జవనికమరువున నాట్యంబు సలుపు నటుని చందంబున'' అని ఉపమించారు (భాగవతం 1-186). నాలుగైదుసార్లు గొండ్లిని పేర్కొన్న శ్రీనాథుడు ఒకచోట దానిని చక్కగా వివరించాడు. తెరలు, పుష్పాంజలి, మద్దెల చప్పుళ్ళు, రంగస్థలం, నాట్యకత్తె గొండ్లిలో ఉండాలని చెప్పాడు. చూడండి ఈ రూపకం.

కొదమ మొగుళ్ళు దెరలును దడంబడబడు పలుదవడగండ్లు పుష్పాంజలులును నురుము చప్పుళ్ళు మర్దళధ్వనులుగా గగనరంగస్థలంబున గ్రొమ్మెరుంగు మెరుంగుబోడి గొండ్లి పరిఢవించె. (కాశీఖండం, 3-23)

తన కాలంలో ఉండే నృత్యభేదాలను సహితం శ్రీనాథుడు చెప్పాడు. భీమఖండంలో దాక్షారామభీమేశ్వరుడు ముంగలివాకిట నిండుపేరోలగం ఉండి ఆ వూరి

---

1. మీగడతరకలు, మధురకవితలు, పుట 95.

సానికూతురు ఆడే 'కుండలి' దండలాసక, ప్రేరణీ, ప్రేంకణ, సింధుకంచుక, ధమాళి, బేల, మత్తల్లీ, హల్లీసకాది నృత్యంబులు' అవలోకిస్తాడట. (భీమఖండం 2-108).[2] ఈ నృత్యాలలో కుండలీ నృత్యాన్నే గొండ్లి అనే దేశ్యంలో పిలుస్తారు కాబోలు. కాశీనగరంలో కర్పూరతిలక అనే వేశ్య రత్నలింగేశుని ఆస్థానరంగభూమిలో వివిధ మత భేదాలలో దేశి మార్గపద్ధతులలో ఈ కుండలీ నృత్యాన్ని ఆడిందని శ్రీనాథుడు చెప్పాడు. (కాశీఖండం, 6-169)

వృత్తభేదాన్ని గొండ్లి అని పిలుస్తూ కొన్నాళ్ళకు ఆ మాటను నాట్యకత్తెకే పర్యాయపదంగా చేశారు. దేశిపద్ధతిలో ఈ నాట్యాన్ని పూర్వం జక్కులవారు చేసేవారు కాబోలు. ఆంధ్రదేశంలో అత్యంత ప్రాచీన కాలంలో నాగులు, యక్షులు ఉండేవారు. వీరిలో యక్షులే జక్కులవారు అయ్యారు. వాళ్ళ దేశి సంప్రదాయమే యక్షగానం కావచ్చు. క్రీ.శ. 1330లో ప్రాచీన చిత్రకవి పెద్దన తన లక్షణాన్ని సంగ్రహంలో యక్షగానాలలో ఉండే రగడభేదాలకు ఇలాగ తొలిసారి లక్షణం చెప్పాడు.

వృషభగతిత్రిపుడరేకం ఘియుగమగు దుద నేడు లఘువులు తొలగజేయ
జంపె రేకునకు లక్షణము ద్విరదగతి యగుగొన నొక లఘు వశిందు మాన
రచ్చరే కగును దురగవల్గనముగతి మఱి యేక తాలియౌ మధురగతిని
ఆటతాళమునమాత్ర అంఘ్రి కిర్వదినాల్గు నాల్గిట విరతి పధ్నాలుగింట
నిలుచు నర్ధంబు నర్ధచంద్రికలు దీన
యక్షగానాదికృతులలో నార్యులిడిన
రగడ భేదంబు లివి యొను రమ్యచర్య
యవిత నిజదాస సముదాయ యాంజనేయ (లక్షణసార సంగ్రహం, 2-141)

చిత్రకవి పెద్దన చెప్పిన ఈ లక్షణాన్నే కొద్ది మార్పులతో క్రీ.శ. 1656లో ఉన్న అప్పకవి కూడా చెప్పాడు (4-304). 'యక్షగానంలో యేయే రకాల పదాలు ఉంటాయో క్రీ.శ. 1600 ప్రాంతాల ఉండిన వార్తకవి రాఘవయ్య తన లక్షణదీపికలో చెప్పాడు.[3] క్రీ.శ. 1450కి ముందున్న కవులు యక్షగానపు అస్తిత్వాన్ని చెప్పారు. తరువాత వంద సంవత్సరాలకు క్రీ.శ. 1550లో ఉండిన లక్షణకర్తలు యక్షగానాల లక్షణాన్ని చెప్పారు. ఈ మధ్యకాలంలో అంటే క్రీ.శ. 1485 నుంచి 1512 దాకా పాలించిన సాళువ నరసింహరాయల కాలంలో 'నిశ్చయంగా ఇతడు యక్షగానం వ్రాశాడని' చెప్పుకోదగ్గ రచయిత కనబడుతున్నాడు. అతడే ప్రోలుగంటి చెన్నయమంత్రి.

తుంగభద్ర నదీతీరాన ప్రోలుగంటి పురం ఉంది. ఆ ఊళ్ళో చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. అది ఒక చిన్నసైజు రాజధాని. యవనాశ్వాలూ, ఏనుగులు,

---

2. ఈ వాక్యాలలో సింధుకంచుక అనేది సాధుపాఠం కామ, చింతు, కంచుక అని రెండు విభిన్న రచనలుగా చదవాలి.

3. సమగ్రాంధ్రసాహిత్యం, పద్మనాయకయుగం.

చతురవారవిలాసినులు మొదలైన వైభవ సంపదలన్నీ ఉన్నాయి. విజయనగర సామ్రాజ్యాధిపతుల ప్రతినిధులు ఈ ఊరు ఏలుతూ ఉండేవారు. క్రీ.శ. 1422 నుంచి 1447 దాకా విజయనగరాన్ని పాలించిన ప్రౌఢదేవరాయలు వద్ద ప్రోలుగంటి తిప్పయ దండనాథుడుగా ఉండేవాడు. ఇతడు పంపావిరూపాక్షునికి గోపురం, విఠ్ఠలనాథునికి భోగమంటపం, మాల్యావంతంలోని రామచంద్రునికి ఘనకిరీటం, మతంగి వీరన్నకు కట్టాణి ముత్యాల కంఠమాల మొదలైన దానాలు చేసి వినుతి కెక్కారు. ఇతనికి కొండయ్య, నాగన్న అని ఇద్దరు కుమారులు. ఈ ఇద్దరు విజయనగరం కొలువులో మంత్రులుగా ఉండేవారు. ఇందులో నాగన్నమంత్రికి ఒక కొడుకు పుట్టాడు. ఆ బిడ్డకు ప్రోలుగంటిపురంలోని ఆరాధ్యదైవం చెన్నకేశవస్వామి పేరు పెట్టాడు. అతడు పెరిగి పెద్దవాడయ్యాక అతణ్ణి చెన్నశౌరి, చెన్నయమంత్రి అని పిలిచేవారు.

ఇతడు అష్టభాషా కవి. ద్విపదగా నారసింహపురాణం వ్రాసి అహోబల నరసింహునికి అంకితం ఇచ్చాడు. వచన కావ్యంగా బాలభారతాన్ని వ్రాసి ప్రశంసల నందుకున్నాడు. 'సౌభరిచరిత్ర' మనే జక్కుల కథ లాలిత నవరసాల కృతంగా చెప్పాడు. ఇంకా ఎన్నో కృతులు రచించినాడు. ఇతడు సాళువ నరసింహరాయలవల్ల అగ్రహారాలు, ఇతర దానాలు పుచ్చుకున్నాడు. ఈ చెన్నయమంత్రికి, నీతిలో వాచస్పతితుల్యుడు, విద్యలో చతురాననుడులాంటి కుమారుడున్నాడు. అతని పేరు నరసన్న. దురదృష్టవశాత్తు చెన్నమంత్రి వ్రాసిన ఏ ఒక్క పుస్తకం నేడు లభించదు. అయితే ఇతని గురించి ఈ వివరాలు ఎలాగ తెలుస్తున్నాయంటే - హరిభట్టు రచించిన నారసింహ పురాణాన్ని తండ్రి మరణానంతరం అతని కుమారుడు ప్రోలుగంటివారి వంశంలో రంగనమంత్రికి అంకితం ఇచ్చి కృతిపతి వంశాన్ని వర్ణించాడు. అందులో ఈ చెన్నమంత్రిని గురించి ఇలా చెప్పాడు.

ఆ నాగమంత్రివరునకు - బ్రాణపదంబైన దేవమాంబకు దానే
దానీంతనకానీనుండో నా దగి చెన్న శౌరి యుదయము నొందెన్.
ఆమంత్రి పుంగవుం డష్టభాషాకవివర్యుడై పొగడొందె వసుధయందు
ద్విపదగానారసింహ పురాణ మొనరించి భక్తి నహోబల భర్త కిచ్చె
బాలభారత మంధ్రభాషను వచన కావ్యంబు చేసెను. గవీశ్వరులు మెచ్చ
సౌభరిచరితంబు జక్కుల కథ చెప్పె లాలిత నవరసాలంకృతముగ
మరియు బెక్కు కృతు ల్పటుమతి రచించె
ఖ్యాతి నరసింహరాయులచేత గొనియె
నగ్రహారంబులను వివిధార్థంబులను
వెలసె గొండమ బెండ్లియై విభవమెసగ
ఆ చెన్నమంత్రికి బు- ణ్యాచారకు గొండమాంబ కంచితనీతి
న్వాచస్పతి తుల్యుడు విద్యా చతురాననుడు నరసనాఖ్యుడు పుట్టెన్.

(నారసింహపురాణం, 1-32-34)

ఈ చెన్నమంత్రి జక్కన కథగా వ్రాసిన సౌభరి చరిత్ర విష్ణుపురాణంలోనిది. సౌభరి ఒక ముని. ఈయన జలమధ్యంలో కూర్చొని తపస్సు చేసుకుంటూ ఉండేవాడు.

అతనికి క్రిందా మీదా, కుడిపక్కా, ఎడంపక్కా కూడా నీళ్ళలో మత్స్యరాజు అనుభవించే రాగభోగాలు చూశాక, మునికూడా ఆ సౌఖ్యాలు రుచి చూడాలనుకున్నాడు. దేశమేలే మాంధాత దగ్గరకు వెళ్ళి కన్యాదానం చెయ్యమన్నాడు. ''అయ్యా, నీలాంటి ముసలాడిని మా అమ్మాయిలు ఎలా వరిస్తారు? ఏవగించుకుంటారు'' అని మాంధాత విన్నవించుకున్నాడు. ''నీకు అభ్యంతరం లేదు కదా? నీ కుమార్తెలు నన్ను వలచి వరిస్తారు. నన్ను కన్నెమాళిగలోనికి వెళ్ళనీ'' అన్నాడు. ముని, తన తపోమహిమచేత సౌభరి సౌందర్యవంతుడయ్యాడు. అతణ్ణి చూశాక కుమార్తెలందరూ మరులుకొన్నారు. వరించారు. ముని అందరినీ వివాహమాడి చాలాకాలం సుఖంగా ఉన్నాడు.

ఈ కథను నవరసభరితంగా యక్షగానరూపంలో చెన్నమంత్రి వ్రాశాడని తెలుసుకున్నాం. ఇదే కథను మరో నూరేళ్ళ తరువాత క్రీ.శ. 1530-55 మధ్యనున్న వెన్నెలకంటి సూరన 74 గద్యపద్యాలలో తన విష్ణుపురాణంలో వ్రాశాడు (5-122 నుంచి 195 దాకా). శృంగారంలో ఈ సౌభరి శ్రీకృష్ణుని మించిపోయాడు. ఇతణ్ణి చూడగానే మాంధాత కూతుళ్ళు ఇలా దెబ్బలాడుకున్నారని సూరన వ్రాశాడు.

ఈతడు నాకు ప్రాణవిభుడీతనికిం బ్రియురాలు నన్ను ము
న్నీతడు సూచె నీతనికి నిల్లడమానిసి నేను నాకుగా
నీతడు వచ్చె తండ్రి నను నీతని కిచ్చె నటంచు నొక్కమై
నాతరుణీమణుల్ జగడమాడిరి మారవికారచిత్తలై. (వి.పు.రా. 5-151)

ఇదే ఘట్టంలో పోతరాజుగారు భాగవతంలో ఇలా వ్రాశారు:

కోమలులారా! వీడు నలకూబరుడో, మరుడో, జయంతుడో
యేమరివచ్చె వీని దడవేల వరింతుము నేమ నేమ యం
చామునినాథు జూచి చలితాత్మికలై సొరిదిన్ వరించి రా
భామిను లందరున్ గుసుమబాణుడు ఘీయని ఘంట వ్రేయుగన్.

(భాగవతం, 9-176)

ఈ ఏభైమంది రాజకుమార్తెలను సౌభరి పెళ్ళి చేసుకొని ఒక్కొక్కకాంత కొక్కొక్క దివ్యసౌధం కట్టించి అప్సరసలను చెలికత్తెలుగా నియమించి ఆనందిస్తాడు.

ఒకనాడు మాంధాత కూతుళ్ళను చూడాలనుకొని అల్లుడున్న అడవికి వెళ్ళి ఆ సౌధాలు చూసి ఆశ్చర్యపోయాడు. ఒక కూతురింటికి వెళ్ళి ''అమ్మా, నిన్ను అల్లుడు సరిగా చూసుకుంటున్నాడా?'' అని అడిగాడు. ''నిన్ను చూడలేదన్న విచారం తప్ప నాకింకేం లేదు నాన్నా'' అని ఆ అమ్మాయి అంది.

''అయ్యో, బుద్ధిలేని ముని దీని నొక్కతెనే ఏలుకొని మిగిలిన కూతుళ్లకు అన్యాయం చేస్తున్నాడే'' అని మాంధాత బాధపడి రెండో కూతురింటికి వెళ్ళి కుశల ప్రశ్నలు వేశాడు. ఆ పిల్లకూడా అక్క చెప్పినట్లే సమాధానం చెప్పింది. మూడు, నాలుగు, వరుసగా, యాభయ్యో కూతుఃరు కూడా ఒకటే సమాధానం చెప్పింది. ఏకకాలంలో ప్రతి గోపిక ఇంట్లో ఉండే శ్రీకృష్ణునిలాగా సౌభరికూడా ఏభయిమంది ఇల్లాళ్ళతో ఒక్కసారి కాపురం చేశాడు. వెన్నెలకంటి సూరన ఈ కథకిలా ఫలశృతి వ్రాశాడు :

ఈ సౌభరికథ దలచిన - వ్రాసిన బేర్కొనిన వినిన వర్ణించిన న
భ్యాసము చేసిన వారికి - శ్రీసంపద లొనరి మోక్షసిద్ధియు కలుగున్.

(విష్ణుపురాణం, 5-195)

నవరసాలకు ఆస్కారం ఉన్న ఈ కథను ప్రోలుగంటి చెన్నమంత్రి చక్కగానే రచించి ఉంటాడు. అయితే ఈ కాలంలో ఇతడొక్కడే కాక ఇతరులు కూడా యక్షగానాలు రచిస్తూ ఉండేవారు. ఈ దృశ్యకావ్యాలను కేవలం వినోదం కోసమేకాక సాంఘిక ప్రయోజనాల కోసం కూడా వాడుకునేవారని తెలుస్తుంది. మాచుపల్లి కైఫీయత్‌లో ఉన్న కథ ఒకటి ఈ సంగతి విశదం చేస్తుంది.

మాచుపల్లె గ్రామం సిద్ధవటం సీమలో ఉంది. సిద్ధవటానికి వాయవ్య భాగంలో రెండు పరుగుల దూరంలో ఇది ఉంది. పూర్వం నెల్లూరి చోళులలో ఒకడైన నల్లసిద్ధిరాజు వద్ద సరదారుడైన సంబెట కొండ్రాజు వంశీకుడు సంబెట వెంకట్రాజు ఈ ప్రాంతాలకు వచ్చి కొన్ని గ్రామాలకు ప్రభుత్వం చేస్తూ ఉండేవాడు. ఈ వెంకటరాజుకే గురవరాజు అనే కుమారుడు పుట్టి, పరమ దుర్మార్గునిగా ప్రసిద్ధుడయ్యాడు. ఈ ప్రాంతంలోనే కాశీ రామేశ్వరాలకు పోయే మార్గాలు వెడతాయి. సంబెటవారు తమకు చుట్టుపట్ల వున్న సీమలలో కావలి సుంకం వసూలు చేస్తూ తాము అనుభవిస్తూ ఉండేవారు. సంబెట వారి వర్తమానాలు విని దేశమేలే విజయనగర సింహాసనాధీశ్వరులు చాలాసార్లు వాళ్ళను అదుపులో తేవాలని ప్రయత్నించారు. సంబెట గురవరాజు దుర్మార్గాలు మరీ మితిమీరితే ఆ సంగతులను సాంఘిక ప్రయోజనం గల నాట్య మేళం వారు లోకానికి చాటిన వైనాన్ని మాచుపల్లి కైఫీయత్తు ఈ విధంగా విశదం చేస్తుంది.[4]

''వీరశ్రీ బుక్కరాయల వారి కుమారుడు శ్రీ మన్మహారాజాధిరాజ పరమేశ్వర శ్రీ వీరప్రతాప దేవరాయ మహారాయలు వారు విద్యానగరమందు రత్నసింహాసనంబున నుండి సుస్థిరమున రాజ్య పరిపాలన చేస్తూన్నుండగాను మహారాజాజ్ఞనుసారముగాను శ్రీ మన్మహామండలేశ్వర సంబెట గురవరాజు అనే ఆయన మాచుపల్లె మొదలయిన యీ సామీప్యమందున కొన్ని గ్రామములు యేలుకొంటందుకు కర్త అయి యీ స్థలానికి వచ్చి చూచి యిక్కడికి తూర్పు, ఉత్తరం రెండువైపులను పినాకినీనది వున్నదిన్ని పశ్చిమ, దక్షిణ

---

4. Further sources of Vijayanagar History - Vol. II tents P-117 to 119.

దిక్కులయందు పర్వతములు వున్నవి. గనుకనున్ను యిది జాగ్రత్త స్థలమని యోచన చేసి మాచుపల్లె గ్రామానికి దక్షిణభాగమందు గుండ్లకట్ట బండ్లమ్మకొండ అనే రెండింటికి సామీప్యముగా కోట నిర్మాణం చేయించినారు.

అదిగాక యిక్కడికి ఆగ్నేయభాగమందు పరుగున్నర దూరమున ఒక గండి కలదు. ఆ గండి అనే ఉభయ పర్వతముల మధ్యనుంచి పూర్వవాహిని అయి పినాకిని నది ప్రవహిస్తున్నది..., ఆ గండి వద్ద నొక కొండపైన తెట్టె పెట్టించి అక్కడ వొక చౌకీనిన్ని కోటకు నిండు పశ్చిమం అరపరుగుదూరం బండికనమ అనే కనుమమీద వొక చౌకీనిన్ని ఉంచి గురవరాజు గారు తగు సైన్యముతో కూడా గుండ్లకట్ట బండ్లకొండ సామీప్యమున కట్టించిన కోటలో వుండి ప్రభుత్వం చేస్తూ వుండిరి. యీ గురవరాజు గారి ముచ్చటలు ప్రజలు స్థలములో వారు ప్రసిద్ధిగా చెప్పుకోవడము మాత్రమే కానీ శిలాశాసనములవల్ల రుజువు కనిపించినది కాదు...

''ఆయన (గురవరాజు) చాలా దినములు జీవించి ప్రభుత్వము చేసినందుకు ఆయనను తాత గురవరాజు అని చెప్పుకొనేవారు... ఆ గురవరాజు ప్రభుత్వములో ప్రజలకు అతి దారుణ శిక్ష చేయిస్తూ ఉండేవారు. ప్రజలవద్ద ద్రవ్య ఆకర్షణ చేసేయడల త్వరగా సొమ్ము ఇవ్వకపోతే స్త్రీలను తీసుకువచ్చి స్తనాలకు చిరతలు పట్టించేవారు. ఆలాగంటి దినములలో వినుకొండ బెల్లంకొండ తట్టున కూంచిపూడి అనే గ్రామంనుంచి బ్రాహ్మణులు భాగవతులనే వేషధారులు కీర్తన నిమిత్తమై యీ స్థలమునకు వచ్చి వుండి సంబెట గురవరాజుగారి యొక్క దారుణప్రభుత్వం చూచి యిక్కడనుండి లేచిపోయి విద్యానగరమునకుపోయి అక్కడ వీరనరసింహరాయలు రాజ్యపరిపాలన చేస్తూ వుండగా భాగవతులు దర్శనం అయి కేళిక అడుగగా శలవు యిచ్చినారు. కూచిపూడి మేళం వాండ్లు చాలా విద్యావంతులని ప్రసిద్ధిగా వినికిడి వున్నందున రాయలవారు స్త్రీలు సహా చూడవలెనని నగర్లవద్ద దివాణములో కీర్తనకు సెలవు యిచ్చినారు. అక్కడ కీర్తన వినికి చేసేటప్పుడు సంబెట గురవరాజు వేషం వేసి వొకడు, మరీ యిద్దరు బంట్రోతుల వేషములు వేసుకొని వొకడు, స్త్రీవేషం వేసుకొని సంబెట గురవరాజువలె ఆ వేషగాడు కూర్చుండి రాయల సమక్షమమందు ఆ స్త్రీ యొక్క స్తనాలకు చిరతలు పట్టించి సొమ్ము యివ్వమని తహశ్శీలు చేసినట్టు వినికి చేసినారు.

''అప్పుడు రాయలువారు చూచి 'అదియేమ'ని అడుగగా సముఖస్తులయినవారు భాగవతులముఖతా ఆ వర్తమానము తెలిసి ''సిద్దవటం సీమలో సంబెట గురవరాజు అనే ఆయన ప్రజలవద్దనుంచి ద్రవ్యాకర్షణ్ చేసే యెడల స్త్రీలను తీసుకొనిపోయి యీ ప్రకారముగనే తహశ్శీలు చేస్తున్నారు. గనుక యేలినవారలకు తేట పడగలందులకై యీ ప్రకారము వేషములుకట్టి వినికి చేసినార''ని విన్నపం శాయగా చాలా తీక్షణం చేసి మరునాడు ఉదయమందు ఆ సంగతి తీరుగా జ్ఞాపకం సేయమని ముఖ్యస్తులయినవారికి ఆజ్ఞ యిచ్చినారు. ఆ రాత్రి కీర్తనసాంతనమైన వెనుక తెల్లవారిన పిమ్మట రాయలవారు

కాలోచితకృత్యములు తీర్చుకొని ఆస్థానమునకువచ్చి పేరోలగమునుండి తమవద్ద కార్యభారకు వచ్చి సంబెట గురవరాజుగారి వర్తమానం జ్ఞాపకం విజ్ఞాపన చేయగా విని ప్రధానులను సేనానాయకులను పిలిపించి మోహిమును సైన్యము సిద్ధం చేయించవలసిందని సెలవు యివ్వగా ఆస్థానపంజరములో చిలుక ''జయం, జయం, జయం'' అని మూడుసార్లు పలికినది. ఆ పలుకులు మహారాజు విని ''యిదే మనకు శకునము'' అని అప్పుడే పేషఖాను బయట వేయించి సిబ్బందీ బట్టువాడాలుగా చేయించి సైన్యం యావత్తుకు ఖర్చు వెచ్చములకు యిప్పించి, ఆమోహీముకు రాయలుకు కొమారుడు అనిపించుకొనివున్న యీసుమాలు ఖానుడనే తురకనే తురకను సరదారుడుగా మొకర్రరు చేసి అతనిని పిలుపించి సమక్షమందు వలసిన బుద్ధిమంతులు సెలవు యిచ్చి తాంబూలం యివ్వగా ఆ సరదారుడు తాంబూలం అందుకొని సంబెట గురవరాజు తల తెస్తున్నానని ప్రతిజ్ఞ పలికి సైన్యమును వెంటబెట్టుకువచ్చి గురవరాజుగారు వున్న కోటకు పశ్చిమం వైపున వున్న బండ్ల కనుమమీద లడాయి చేసి కనుమపై వున్న చౌకీ విరగ బొడిచి కనుమ ఫారు అయి వచ్చి కోటకు పశ్చిమ భాగమందు దిగివుండి ఆదినం రాత్రి కోటకు పశ్చిమం వైపున వున్న బండ్లమ్మకొండ తిప్పమీదనున్న తూర్పువైపున వున్న గుండ్లకట్ట అనే సన్నకొండ మీదనున్న దమదమాలు యెత్తి మొహచార్‌లు ఖాయంచేసి కోటమీద లడాయి షురువు చేసినంతటు, శక్తి వున్నంత మట్టుకు కోటలోనుంచిన్ని వేటువారు జవాబు యిచ్చినారు. అంతటు కోటలో నిభావు చెయ్యలేక కౌలుమీద కోట యివ్వగా అప్పుడు గురవరాజును పట్టుకొని తలకోసి తీసుకొనిపోయినారు. కోటలో స్త్రీలు బాలలు అందరు దేహత్యాగము చేసినారు.''[5]

కూచిపూడి భాగవతుల ప్రసక్తి మన సాంఘిక చరిత్రలలో మొట్టమొదటిసారిగా ఈ మాచుపల్లె కైఫీయత్తులోనే కనబడుతుంది. సర్వసాధారణంగా కూచిపూడి అనే స్థలనామాన్ని చెప్పగానే ఇప్పుడు కృష్ణా జిల్లా దివిసీమలో ఉన్న గ్రామమే జ్ఞప్తికి వస్తుంది. ఈనాడు అఖిల భారత స్థాయిలోను, అంతర్జాతీయంగా కూడా తెలుగువారి నాట్య సంప్రదాయంలో ఒకటైన నాట్యమేళం భాగవతుల కళకు పేరు తెచ్చిన కృష్ణా జిల్లా కూచిపూడి వారి పూర్వీకులే వీరనరసింహరాయల ముందు ఆడిన మేళం వారని సహజంగా భావించడం జరుగుతుంది. దివిసీమ కూచిపూడి వారు తమ చరిత్రను చెప్పుకొనేటప్పుడు మాచుపల్లె కైఫీయత్తును యెచ్చుగా ఉదాహరిస్తూ ఉంటారు. అయితే ఈ స్థానిక చరిత్రలో దివిసీమ కూచిపూడిని కాక వినుకొండ బెల్లంకొండ తట్టున ఉండే కూచిపూడి గ్రామాన్నే పేర్కొన్నారు.

ఆంధ్రదేశంలో వివిధ జిల్లాలలో కూచిపూడి అనే పేరుగల గ్రామాలు చాలా ఉన్నాయి. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాలో ఒక కూచిపూడి ఉంది. తెనాలి తాలూకాలో ఒక కూచిపూడి ఉంది. నెల్లూరు జిల్లా పొదిలి డివిజన్‌లో కూచిపూడి అనే జమీందార్ గ్రామం ఉంది. అయితే కైఫీయత్తులో చెప్పిన వినుకొండ సీమలోని పదహారు సముతులలోని 207 గ్రామాలలోనూ ఏ ఒక్కదానికీ కూచిపూడి అనే పేరు లేదు. అయితే

5. Kaifiyat of Macupalle, L.R. 56, pp. 65 ff.

కొండవీటి సీమలో పూర్వం కూచిపూడి అనే స్థలం కేవలం ఒక గ్రామంగానే కాక కసుబానగరంగా కేంద్రంగా ఉండేది. కొండవీటి సీమలలోని సముతుల గురించి ఒక చాటు పద్యం కూడా ప్రచారంలో ఉండేది.

కొండవీటిసీమ కోర్కులు దీర్పంగ
దండి సముతులు పండ్రెండు రెండు
ఎలమితో జెప్పెను ఏదేది యంటివా
పాలడ్గు పులిపర్రు ప్రత్తిపాడు
సంతన రావూరు సరసను నూతక్కి
పొంతను చేబ్రోలు పొన్నునూరు
మంగళగిరి యను మరి మంచి మునుగోడు
రంగైన నాదెండ్ల రాయపూడి
దాచినధనంబు వంటిది కూచిపూడి
పంటలధికంబు గుంటూరు ప్రజలకెల్ల
పాడి బానలు గవిగుండు తాడికొండ
పరమ మల్లేశ శివలింగ! పార్వతీశ (చాటుపద్యమణిమంజరి II -760 పద్య)

దాచిన ధనం వంటి ఈ కొండవీటి సీమ కూచిపూడికి ప్రత్యేకంగా ఒక కైఫీయత్తు కూడా ఉంది. దీనిని మెకంజీ గుమాస్తాలు కాగితాల కెక్కింపజేశారు. మెకంజీ మాతృకల నుండి బ్రౌను పుట్టించిన స్థానిక చరిత్రల సంపుటాలలో ఈ కూచిపూడి కైఫీయత్తు కనబడుతుంది.[6] కైఫీయత్తు మౌజే జంపని సంతు కూచిపూడి సర్కారు ముత్తుజానగరు తాలూకే చింతపల్లి రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు మంనె సుల్తాను'' వారి ఏలుబడిలో దీనిని గ్రంథస్తం చేశారు. గుంటూరు జిల్లాను పూర్వం ముత్తుజానగరు సర్కారు అనేవారు. ఇప్పుడు ఎల్లలు మారి వేరే జిల్లాలు ఏర్పడ్డాయి. అయినా ప్రాచీన చరిత్రగల కూచిపూడి గ్రామం తెనాలి తాలూకాలోనిదే.

శాలివాహన శక సంవత్సరం 1056 అంటే క్రీ.శ. 1134 నుంచి ఈ కూచిపూడి చరిత్రను స్థానికులు చెప్పుకుంటున్నారు. కైఫీయత్తు రచనాకాలం అయిన 1812 డిసెంబరు 24వ తేదీ నాటికి కూచిపూడి సాధారణ గ్రామం కాదు. కసుబా, అంటే పెద్ద వూరు గడి స్థలం ఈ కూచిపూడి కసుబాక్రింద వెరసి 44 గ్రామాలుండేవి. ఈ కసుబాలో పరశురామ స్వాములు వారు ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి ఆలయం ఆదినుంచీ ఉంది. దీనికి భారద్వాజ గోత్రీకులైన పసుమర్తివారు అర్చకులు. ఈ కూచిపూడిలోనే శాలివాహన శకసంవత్సరాలు 1240 అంటే క్రీ.శ. 1318లో రెడ్లు ప్రభుత్వం చేసేటప్పుడు శ్రీ గోపాలస్వామి వారికి దేవాలయం కట్టించడం, ప్రతిష్ఠ చేయడం జరిగింది. దీనికి ఆత్రేయ సగోత్రీకులైన వేదాంతంవారు అర్చకులు. ఈ తెనాలి కూచిపూడి సముతుల్లోనే 'పెరవలి'

6. బ్రౌను లోకల్ రికార్డ్సు సంపుటం నెంబరు 5, పుటలు 409 నుండి.

అనే గ్రామం ఉంది. ఇక్కడి మాధవ పెరుమాళ్ళ గుడిలోని శాసనాన్ని మెకంజీ గుమాస్తాలు కూచిపూడి శాసనం కిందనే జమకట్టి కాపీ చేశారు.[7]

ఈ కూచిపూడి కైఫీయత్తువల్ల పసుమర్తివారు, వేదాంతం వారూ పూర్వం కొండవీటి సీమలోని కూచిపూడి కసుబాగడిలో ఉండేవారని తెలుస్తుంది. ఇక్కడనుంచే కొన్ని కుటుంబాలవారు దివిసీమ కూచిపూడికి వలస వెళ్ళి అక్కడ స్థిరపడ్డారని, రామలింగేశ్వరస్వామి వారిని ప్రతిష్ఠ చేసుకొన్నారని ఊహించడం ఏమంత కష్టం కాదుగానీ రుజువు చేయటానికి ఇతోధికమైన ఆధారాలు కావాలి. దివిసీమ కూచిపూడికి ప్రత్యేకంగా ఒక కైఫీయత్తు లేదు. ఈ గ్రామంలోని నాట్యమేళం కుటుంబాల చరిత్ర గురించి లిఖిత సాక్ష్యాలు 1763 ఆగస్టు 24వ తేదీ నుంచి మాత్రమే లభిస్తున్నాయి. పసుమర్తి, వేదాంతం మొదలైన ఇంటిపేర్లు వారితోపాటు 15 కుటుంబాలవారు అప్పుడు ఆ గ్రామంలో భూములు అనుభవిస్తూ ఉండేవారు. ఆ తారీఖులకు ఎంత పూర్వం నుంచి వారు అక్కడ జీవిస్తున్నారో తెలియదు. దివిసీమ కూచిపూడి చరిత్ర చుట్టూ ఇంకా దట్టంగా పొగమంచు తెరలు ఉన్నాయి. తెరలు తొలిగేదాకా చాటుపద్యమణిమంజరిలో చెప్పిన, దాచిన ధనం వంటిది కూచిపూడే. మాచుపల్లె కైఫీయత్తులోని కూచిపూడి విభిన్నమైనవన్నవి విస్పష్టం. అయితే చాలా విద్యావంతులైన వేషధారులైన బ్రాహ్మణ భాగవతులు కూచిపూడి గ్రామవాసులైనా తొలి రాయలు యుగంలో సంచార జీవనం గడిపేవారని, సాంఘిక ప్రయోజనం గల సద్యోరచనలు చేయగల సామర్థ్యం గలవారని చెప్పవచ్చు. వీరనరసింహరాయలు సమక్షంలో వారు ఆడిన కీర్తన గొల్లకలాపం కావచ్చును. అందులోనే సుంకాలు వసూలు చేసే ఘట్టం కలపడానికి ఆస్కారముంది. ఆదిలో రాజు ముందు ఆడిన ఈ యక్షగానాన్ని తర్వాత ప్రజలమందు కూడా ఆడేవారని చెప్పవచ్చు.

సాంఘిక ప్రయోజనాన్ని సాధించిన ఈ యక్షగానాన్ని ఎవరు వ్రాశారో తెలియదుగానీ తెలుగు భాషలో ఇప్పటికి పేరు తెలిసిన ప్రప్రథమ యక్షగానంగా సౌభరి చరిత్ర, దాని రచయితగా ప్రోలుగంటి చెన్నయమంత్రి ఆంధ్రసాహిత్య చరిత్రలో ఒక విశిష్ట స్థానాన్ని అలంకరిస్తారు.

---

7. బ్రౌను లోకల్ రికార్డ్సు సంపుటం నెంబరు 42, పుట 251.

పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు

వాణి నారాణి అని సగర్వంగా చెప్పుకున్నాడని లోకం చెప్పుకొనే కవి ఒకడు మనకున్నాడు. ఆయన పేరు పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు. ఒకరాత్రికి రాత్రి ఈయన ఒక మహాకావ్యాన్ని పూర్తి చేశాడని, వాస్తవానికి సరస్వతీదేవే ఈ గ్రంథం వ్రాసిందని అనుశ్రుతంగా చెప్పుకుంటున్నారు. ఈ విషయాన్నే ఒక చాటుపద్యం కూడా వక్కాణిస్తుంది.

పిల్లలమఱ్ఱి పినవీరన కిల్లాలట వాణి యట్టులే కాకున్నన్
దెల్లముగ నొక్కరాతిరి – తెల్లగ తెలవారువరకు తేగలడె కృతిన్?

(చాటుపద్యమణిమంజరి–I పుట 141)

ఇల్లాలుగా ఈ కవి భారతీదేవిని ఎన్నడూ భావించలేదనీ, పరదేవతగా తనను పాలించే ఏలికసానిగా పూజించేవాడని ఈయన వ్రాసిన గ్రంథాలలోని కృత్యాదిప్రార్థన పద్యాలవల్ల తెలుస్తున్నది. అయినా సమకాలికులు అతన్ని మహానుభావునిగా గుర్తించి ఇటువంటి కథలను ఆపాదించారు. పినవీరభద్రుని సమీపకాలంలో ఆర్వాచీనుడు కొరవి గోపరాజు ఇతనికి 'మహామతి' అనే విశేషణం వాడాడు.[1] ఎలా వ్రాసినా సమకాలంవారు మెచ్చరనే విషయాన్ని పినవీరభద్రుడు వమ్ము చేశాడని చెప్పవచ్చు.

పిల్లలమఱ్ఱి వారి ఇంటిలో అంతా కవులేనట. పినవీరభద్రుని తాత, తండ్రి, భ్రాత అందరూ 'భువనభాసురమైన కృతినిర్మాతలట[2] అసలు పిల్లలమఱ్ఱి వంశమే శారదా పీఠం.[3] తెలంగాణాలోని నల్లగొండ జిల్లాలో నల్లగొండకు చేరువలో పిల్లలమఱ్ఱి గ్రామం ఉంది. ఈ విద్వత్కుటుంబం ఎప్పుడీ గ్రామంనుండి పాకనాటికి వెళ్లిందీ తెలియదుగాని శ్రీనాథుని కాలంనాటికి పిల్లలమఱ్ఱివారు నెల్లూరులో ప్రధానులుగా ఉండేవారు. శ్రీనాథుని బాల్యసఖుడు అతని హరవిలాసానికి కృతిపతి అయినా అవచితిప్పయ్య సెట్టికి అక్షరాభ్యాసం చేయించి ఆ తరువాత విజ్ఞానబోధ చేసిన గురూత్తముని పేర్లు పిల్లలమఱ్ఱి పెద్దన అని శ్రీనాథుని పద్యం వల్ల తెలుస్తున్నది.

పిన్నటనాడు సత్కరుణ బిల్లలమఱ్ఱి మహాప్రధాని పె
ద్దన్న గురూత్తముండు తగ నక్షరశిక్షయు దైవమార్గసం
పన్నతయున్ వివేక పరిపాటియునుం గృపసేసె నర్థి నే
యన్నకు నట్టి పెట్టి త్రిపురాంతకునిం దగు బ్రస్తుతింపగన్.

(హరవిలాసం, పీఠిక 30)

ఈ పెద్దన్నగారు క్రీ.శ. 1360 ప్రాంతాలలో ఉండేవారు. ఈయన కుటుంబంలోనే బహుశా మరి రెండు తరాలకు గాదిరాజు అనే ఆయన జన్మించాడు. అతడు

1. సింహాసన ద్వాత్రింశక, 1–12, 2. జైమినిభారతం, 1–21, 3. జైమిని భారతం, 1–22.

'విద్యాభారతీజాని' అనే విశేషణానికి తగినంత పండితుడు. ఈయన భార్య పేరు నాగమాంబ. వీళ్ళకు చాలాకాలందాకా పిల్లలు లేరు. నోములునోచి, వ్రతాలు చేసి చివరకు శ్రీశైలప్రాంతంలో ఉండే భారతీతీర్థులనే మహనీయుణ్ణి సేవించారు. ఆయన దీవన ఫలించి ఈ దంపతులకు ఒకరికిద్దరు బిడ్డలు పుట్టారు. ఆ కవలపిల్లలకు పెదవీరభద్రుడు, పినవీరభద్రుడు అని పేర్లు పెట్టారు. శారీరక శాస్త్రరీత్యా ఏ ప్రత్యేక పరిస్థితులవల్లనో పుడుతున్నప్పుడే పినవీరయ్య జుట్టు జడలు కట్టినట్టుందట. అందుచేత ఇతడు నిజంగా పినవీరభద్రుని అవతారమే అని లోకులు భావించారు.

పినవీరయ్య తన చిన్నవయసులోనే అఖిల శాస్త్రాలూ అభ్యసించాడు. కాళిదాసాదులకన్నా ఎక్కువగానే బహుకావ్య రచనాప్రౌఢిని కాంచినట్టు అతని సంతతిలోని వాళ్ల ఉత్తరోత్తరా భావించారు. పినవీరయ్యకు ఏడెనిమిది తరాల తరువాత నున్న పెనుమళ్ళ సోమయ్య 'సీమంతినీపరిణయం' అనే కావ్యం వ్రాశాడు. అందులో పినవీరయ్య తల్లితండ్రులు నోములు నోచడం మొదలైన కథలు చెప్పి తరువాత ఈ పద్యం వ్రాశాడు.

మహనీయపిల్లలమఱ్ఱి వంశభుడు గాదిరాజునుతుండు ఘనయశుండు
వీరేశ్వరుని యవతారమే యతడంచు జను లెన్నదగిన సౌజన్యశాలి
పినవీరభద్రుడు పిన్న ప్రాయమునందు నఖిలశాస్త్రంబులు నభ్యసించె
గాళిదాసాదిసత్కవులకు హెచ్చు గా బహుకావ్యవిరచిన ప్రౌఢి గాంచె
వాణి యిల్లాలుగా గవిశ్రేణి కెల్ల
బృధుత రాశ్చర్యకరమైన బిరుదు పూనె
దుహినగిరిరాజరామసేతువుల నడుమ
నితని కెవమైన కవివరుం డెందు గలడు? (1-45, R. 513)

ఆ సేతు శీతనగపర్యంతం ఇటువంటి కవి ఇంకొకడు లేడని చెప్పడానికి 'వాణి నారాణి' అనే కథనే ఈ సోమయ్య ఉటంకించాడు. ఇటువంటి పృథుతరాశ్చర్యకరమైన బిరుదు పొందటానికి తగిన నైదుష్యం పినవీరయ్యకు ఉండేది. నన్నయ్యగారి ప్రబంధప్రౌఢవాసనాసంపత్తి, సొంపు, తిక్కనగారి వాక్కులు ఫక్కి ఆమోదం, నాచన సోముని వాచామహత్త్వం సౌరభం, శ్రీనాథుని భాషానిగుంభాల పరిమళాలు ఇతని కవిత్వంలో ఉండేవని సమకాలికులు భావించేవారు.

పుట్టి పెరిగిన నెల్లూరులోనో, దగ్గరలో ఉన్న బిట్రగుంటలోనో, లేక సోమరాజుపల్లెలోనో పినవీరయ్య ఉండేవాడు. పాతిక, ముప్ఫయి సంవత్సరాలు వచ్చేసరికి అతడు వివిధ గ్రంథాలు వ్రాశాడు. బహుశా విష్ణుమూర్తి యొక్క పది అవతారాలను విశదీకరిస్తూ 'అవతారదర్పణం' అనే కావ్యాన్ని 'రమణీయవాగ్రీతి'లో వ్రాశాడు. నారదీయ పురాణాన్ని తెలుగులో తేటపడ చేశాడు. మంజుల విధానంలో, తన శేముషీవిశేషం కనబడేటట్టు మాఘమహత్యం చెప్పాడు. సముల్లసితమైన శయ్యతో, తన

ఘనమైన బుద్ధికుశలత కనబడేటట్టు 'మానసోల్లాసం' వ్రాశాడు. ఈ గ్రంథాలేవీ నేడు మనకు లభించవు. అయితే ఈ గ్రంథాల జాబితాను పినవీరభద్రుడు తాను వ్రాసిన ఒక కావ్యంలో చెప్పాడు.[4] ఇతని కవితావిభూతిని సాటి కవులు గౌరవించేవారు. 'విపులచాటూ నిర్నిద్ర వీరభద్ర'' అని ప్రస్తుతించేవారు.

పినవీరయ్య ఈ కావ్యాలన్నీ రచించిన కాలంలో నెల్లూరి దగ్గర సోమరాజుపల్లెలో చిల్లర వెన్నమంత్రి మంచి వైభవంలో ఉండేవాడు. ఈయన పూర్వీకులు పంటరెడ్లవద్ద మంత్రులుగా ఉండేవారు. ఆ రోజులలో సోమరాజుపల్లె అరవైనాలుగు విద్యలకూ అపూర్వ ఘంటాపథంగా ఉండేది.[5] ఆ గ్రామానికి అధికారి అయిన చిల్లర వెంకన్నమంత్రి సహజంగా పినవీరయ్య కీర్తి విని పిలిపించాడు. శ్రీ మహాభారతంలోని శకుంతలోపాఖ్యానం మిశ్రమబంధంగా జేసి తనకు అంకితమిమ్మన్నాడు. కాళిదాసు వ్రాసిన శాకుంతలం చాలా ప్రసిద్ధమై ఉంది. దానిని ఎవరూ అనువదించలేదు. నాటకాల్ని నాటకంగా తెనిగించే ఆచారం మన ప్రబంధ కవులకు లేదాయె. అందుచేత కాళిదాసు నాటకాన్ని శ్రవ్యకావ్యంగానే అనువదించవలసి వచ్చింది.

భారత ప్రోక్తకథ మూలకారణముగా - కాళిదాసుని నాటకక్రమము కొంత
తావకోక్తిని నభినవశ్రీ వహింప - గూర్మి గృతిసేయు నాక శాకుంతలమ్ము.
(శృంగారశాకుంతలము, 1-27)

అని చిల్లర వెన్నమంత్రి కోరాడు. పినవీరయ్య ఒప్పుకున్నాడు. నైషధీయ చరిత్రను శ్రీనాథుడు శృంగార నైషధం పేర అనువదించినట్లు శాకుంతలాన్ని పినవీరయ్య 'శృంగార శాకుంతలము' అని చెప్పసాగాడు. అష్టరసాలలో శృంగారం మిన్నయని ఆ రోజుల్లో భావించేవారు. ఈ విషయాన్ని పినవీరయ్య ఇలా చెప్పాడు.

శృంగారము ముఖ్యంబగు నంగియు నంగములు దలప[6] నష్టరసములన్
సాంగమగు నేని డంకము బంగారముతోడ యొక ప్రబంధము నొందున్
(శృంగారశాకుంతలం, 1-21)

కవిత్రయంలో ఒకరైన ఎర్రయ్యగారు కూడా నవరసాలనుగాక, అష్టరసాలనే పేర్కొన్నారు. నృసింహపురాణంలో వైకుంఠవర్ణన చేస్తూ ఎర్రయ్యగారిలా చెప్పారు.

ఆడుదు రెల్ల ప్రొద్దు లలితాభినయంబుల దేవకామినుల్
పాడుదు రింపు వీనులకు బండుగ సేయక వేడ్క గిన్నరుల్
గూడి సమగ్రసత్త్వరసగోష్ఠి సుఖింతురు యోగిబృందముల్
క్రీడయొనర్తు రష్టరసకీర్తితభంగి బ్రపన్ను లయ్యెడన్ (నృ.పు. 1-61)

---

4. శృంగార శాకుంతలం, 1-22
5. శృంగార శాకుంతలం, 1-32
6. 'అన్యరసములున్' అని వావిళ్ళ పాఠాంతరం.

ఈ పద్యాన్ని పేర్కొని 'ఎఱ్ఱయ్య' అష్టరసవాది యనుట యతని తల్లి గొడ్రాలనుట' అని వేలూరి శివరామశాస్త్రిగారు 'ఇష్టరస' అనే పాఠాన్ని సాధువుగా గుర్తించారు.[7] రూపకాలలోనే అష్టరసాలనీ కావ్యములలో తొమ్మిదనీ వివరించారు. దండికాలందాకా ప్రాచీనాలంకారికులు ఎనిమిది రసాలనే గుర్తించారు. మమ్మటుడు ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు మొదలైనవారు శాంతరసాన్ని కూడా కలుపుకొని తొమ్మిది రసాలని చెప్పారు. ఆదిలో కాళిదాసు మాత్రం అష్టరసవాదే.'' ''మునినా భరతేనయః ప్రయోగో భవతీష్వష్ట రసాశ్రేయో వియుక్తః'' (విక్రమోర్వశీయం, II-18) అని చెప్పాడు.[8]

ఎఱ్ఱయ్యగారూ, పినవీరయ్య · అష్టరసాలనే పేర్కొనడంవల్ల క్రీ.శ. 14, 15 శతాబ్దాలలో సోమరాజు పల్లెప్రాంతాలలో విద్వాంసులు అష్టరసవాదులనుకోవాలి. చిత్రం ఏమిటంటే రససంఖ్యలో ఎఱ్ఱయ్యగారితో ఏకీభవించిన పినవీరయ్య తన శృంగార శాకుంతల కృత్యాదిని అంకితం పుచ్చుకొన్న చిల్లరవారికి ఎఱ్ఱయ్యగారి కుటుంబానికి ఏవో విరోధాలు ఉండడంవల్ల తన కృతిపతికి ఇష్టం లేని కవిపేరు పినవీరయ్య ఎత్తలేదని కొందరు ఊహిస్తున్నారు.[9] ఈ ఊహకు కారణం ఎఱ్ఱయ్యగారి నివాసస్థలాలలో ఒకటైన గుడ్లూరు గ్రామం సోమరాజు పల్లెకు దగ్గరిలో ఉండడమే తప్ప ఇంకేదీ లేదు. ఏ కారణం వల్లనైనా ప్రబంధ పరమేశ్వరులైన ఎఱ్ఱయ్యగారిని నుతించకుండానే మిశ్రమబంధంగా పినవీరయ్య శాకుంతలాన్ని వ్రాశాడు. అయితే ''పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవసూక్తివైచిత్రి నొక్కొక్కమాటు'' (కాశీ. 1-13) అని చెప్పుకొన్న కవిసార్వభౌముని అడుగుజాడలలో పినవీరయ్య నడిచాడు. నాలుగు ఆశ్వాశాలలో 722 గద్యపద్యాలలో శృంగార శాకుంతలం వ్రాశాడు.

మహాభారతంలోని మూలకథలో పాత్రల శీలాదులు ఔచిత్యం దెబ్బతిన్నదని కాళిదాసు మార్పు చేశాడు. కన్నెపిల్ల తన జన్మవృత్తాంతాన్ని నోరువిడిచి ప్రియునితో ఎలాగ చెప్తుందని భావించి చెలికత్తెలచేత శకుంతల పుట్టుకను దుష్యంతునికి చెప్పించాడు. కలుసుకొన్న నాయికానాయికలు విడిపోవడానికి విరహంలో పడడానికి విప్రలంభ శృంగారాన్ని కవి వర్ణించడానికి అనువుగా ఒక అడవి ఏనుగును ప్రవేశపెట్టి దానివెంట మహారాజును పంపించి వేశాడు. ఉంగరం ఆనవాలుగా ఇచ్చి దుష్యంతుడు రాజధానికి వెళ్ళిన తరువాత భరతుడు పుట్టిన ఆరేళ్ళకు మూలకథలో కణ్వులవారు శకుంతలను అత్తవారింటికి పంపించడం అట్టే బాగులేదని గర్భవతినే కాళిదాసు భర్తవద్దకు పంపించాడు. ఎవరో శాపం ఇవ్వకపోతే దుష్యంతునివంటి మహారాజు కోరి పెళ్ళి చే[illegible]కున్న శకుంతలను ఎందుకు అన్యాయం చేసి పొమ్మంటాడని కవికుల గురువు భావించాడు. దూర్వాసుని శాపాన్ని అంతకుముందు సృష్టించాడు. మూలకథలో ఆకాశవాణి జ్ఞాపకం చేసేదాకా

7. నృసింహపురాణం – పీఠిక, పుట 14.
8. రససంఖ్య గురించి 'ఆంధ్రప్రతాపరుద్రయశోభూషణ'లో చలమచెర్ల రంగాచార్యులుగారు ఎంతో విపులంగా చర్చించారు.
9. విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్రము - ప్రథమ భాగంలో టేకుమళ్ళ అచ్చుతరావుగారు, పుట 172.

దుష్యంతునికి శకుంతల జ్ఞాపకం రాదు. నాటకంలో ఉంగరాన్ని చూడగానే గుర్తు చేసుకుంటాడు. ఇంకా ఇటువంటి మార్పులతో కాళిదాసు మహాకవి శాకుంతలాన్ని రసమయ కావ్యాన్ని చేశాడు.

కాళిదాసు చేసిన ఈ మార్పులలో కొన్నింటినే పినవీరయ్య స్వీకరించాడు. శకుంతల జన్మకథలో మరింత శృంగారం చొప్పిస్తే అది ఆడపిల్లలు చెప్పటం బాగుండదు. ప్రబంధం శృంగారకావ్యం కనుక చొప్పించక తప్పదు. అందుచేత పినవీరయ్య మేనకా విశ్వామిత్రుల ప్రణయాన్ని కణ్వముని శిష్యులచేత చెప్పించాడు. కాళిదాసు కల్పించిన ఉంగరం, శాపం, నాయకుని మతిమరుపు వగైరాలు స్వీకరించినా కొడుకు పుట్టాక శాకుంతలను భర్తవద్దకు మూలానుసారంగా పంపించాడు.

మూలకథను అనుసరిస్తున్నప్పుడు నన్నయ్యగారిపట్ల గౌరవాన్ని చూపిస్తూ ఆయనను అనుకరిస్తాడు. ఆదిపర్వంలో నన్నయ్యగారు సుమారు నూరు గద్యపద్యాలలో శకుంతలోపాఖ్యానం వ్రాశారు. తీరుబాటు చేసుకొని కణ్వుని ఆశ్రమాన్ని ఇలా చోద్యంగా వర్ణించారు:

శ్రవణసుఖంబుగా సామగానంబులు చదివెడు శుకముల చదువు దగిలి
కదలక వినుచుండు కరులను గరికరశీతలచ్ఛాయ దచ్ఛీకరాంబు
కణముల చల్లని గాఢ్వాసపడి వాని చెంది సుఖంబన్న సింహములును
భూసుర ప్రవరులు భూతబలుల్ దెచ్చిపెట్టు నీవారాన్న పిండతతులు
గడగి భక్షింప నొక్కట గలసి యాడు
చున్న యెలుకలు ఓల్లులు రనొండు సహజ
వైరివర్గంబులయ్యు సహవాస మపుడు
సూచి మునిశక్తి కెంతయు జోద్యమంది. (భారతం, ఆది : 4–23)

ఋష్యాశ్రమ వర్ణనలో ఏనుగులు నీడ సింహాలను, ఏ ముహూర్తాన నన్నయ్యగారు తెలుగు సాహిత్యంలో పడుకోబెట్టారోగానీ ఇటువంటి అపూర్వ సర్కసు ఫీట్లు ఆ తరువాత ప్రతి తెలుగుకవీ విధిగా వర్ణించసాగాడు. ఉత్తరహరివంశంలో నాచన సోముడు కోతులను, పువ్వులను, దున్నపోతులను కాసారాలకు కాపలా పెట్టాడు (2–109). పినవీరయ్య చేసిన ఫీట్లు మూడురింగుల సర్కస్ మించిపోతాయి. చూడండి.

వృద్ధసింహమునకు విహరింప దొండంబు కైదండ గా నిచ్చు గంధగజము
పులి కొత్త యీనిన పొదరింటిలోనికి బురిటాలిత గవు గొంపోవు హరిణి
శరభంబు కొనగోళ్ళ శిరము దువ్వగ జొక్కి కనుమోడ్చు సుఖనిద్ర గండకంబు
సింహకిశోరంబు చేరవచ్చిన వింత లేక చన్నిచ్చు బాలింత కరణి
యెలుకతోడుత జెరలాడు నెనసిపిల్లి
సెమ్మిబురి లిచ్చి నిలిచి ఫించమ్ము నీడ
భుజగకన్య క నాడింపు బూరి నమిలి
యనఘు కణ్వమునీంద్ర పుణ్యాశ్రమమం. (శకుంతలాపరిణయం, 2–45)

ఈ పద్యం వల్ల కొత్తగా పురుడు పోసుకున్న వాళ్ళింటికి పేరంటాళ్ళు 'పులిటాలితగవు' తీసుకొని వెడతారని తెలుస్తున్నది. కణ్వాశ్రమంలో పులి పురుడు పోసుకొంటేనే, వీళ్ళచేత పండుగ చేసే పినవీరయ్య శకుంతల నీళ్లాడితే ఊరుకొంటాడా? చూడండి. ఎంత సందడిగా వర్ణించాడు.

తలలంటి రతి పుణ్యతాపసాంగనలు నెంతయు వేడ్క నింగుదీతైలమునకు
నుటజాంగణమున గావుని పేరి తవుటితో వెల్లుల్లి పొగ యిచ్చి నీతిహోత్రు
జాగించి రంచితోత్సవము మప్పురుటాలి వైభవంబు తృతీయ వాసరమున
నారవ దివసంబునం దాచరించిరి బహుయోగినీగణ ప్రార్థనములు
కొలను గుడిపిరి దినములకొలది యెరిగి యఖిలముని ధర్మపత్నుల నామతించి
మిన్నబోకుండ గ్రియలెల్ల విస్తరిల్ల దగనొనర్చిరి పురుటాలి తగవులెల్ల
(శకుంతలాపరిణయం, 4-62)

తన కాలంలో ఉండే ఆచార వ్యవహారాలను కావ్యంలో తెలియచేయటంలో పినవీరయ్య చాలా గడుసరి. ఇతనికి రాజులతోపాటు వేటకు వెళ్ళడం, యుద్ధాలు చూడడం ఇష్టం కాబోలు. వేటకుక్కల పేర్ల దగ్గరనుంచి చెప్పాడు. దుష్యంతుడు వేటకు బయలుదేరాడు. చాటింపు వినగానే వేటగాళ్ళు కుక్కలను తీసుకుని బయలుదేరారు. ఆ పేర్లు వినండి.

పులిమల్ల డడనిపోతులరాజు గరుడుండు గాలి వేగంబు పందేలపసిడి
విష్ణుప్రసాదంబు వేడిగుండులు పరి పచ్చిమిర్యము వెర్రి పుచ్చకాయ
వేటమాణిక్యంబు పరవాది మెడ బల్కి పెట్టుగాడు వకారి పిడుగుతునక
జిగురుండు చిత్రాంగి శ్రీరామబాణంబు పుల్లియండు కస్తూరి బొడ్డుమల్లె
యనగ మరియును పెక్కుతోయములు పేళ్ళు
దారకులు దేర వచ్చె నుద్దండ వృత్తి
వేటకుక్కలు మృగరాజవిగ్రహములు
వటుక నాథుని వ్యాహాళివాహనములు (శకుంతలాపరిణయము, 1-108)

పినవీరయ్య పెట్టిన ఈ ఒరవడిని అల్లసాని పెద్దన్న అనుసరించాడు. చూడండి.

కణ్వమహాముని శంకరుణ్ణి ఇలా నుతించాడు.

గిరిజావిభుండు ముంగిక పెన్నిధానంబు కృత్తివాసుండు తంగేటిజున్ను
గోరాజగమనుండుగుజ్జుమామిడిపండు - కుసుమాస్త్ర హరుడు ముంగొండిగడికి
శీతాంశుధరు డర చేతిమాణిక్యంబు కద్రూజకటకుండు గాదె కొలుచు
కరటి దానవైరి పెరటి కల్పద్రుమం బసమనేత్రుడు సిద్ధరసము చెలి
విషగళుడు గాడికట్టిన వేల్పుటావు
హాటకాచలధ్వని సిద్ధాంజనంబు
పురహరుడు పెట్టెలోనున్న పరుసవేది
ప్రమధభర్త చింతామణి భక్తులకును (శకుంతలాపరిణయము, 1-4)

ఇందులోని పలుకుబళ్ళనే పెద్దనగారు తన మనుచరిత్రలో గృహస్తును వర్ణిస్తూ చెప్పారు.

కెలకుల నున్న తంగేటిజున్ను గృహమేధి యజమాను డంకస్థితార్థిమెట్టి
పండిన పెరటికల్పకము వాస్తవ్యుండు దొడ్డిబెట్టిన వేల్పుగిడ్డి కావు
కడలేని యమృతంబు నడబావి సంసారి సవిధమేరునగంబు భవనభక్తి
మరుదేశపథమధ్యమప్రప కులపతి కాకటికొదవు సస్యము కుటుంబ
బధిరవంగ్వంధభిక్షుక బ్రహ్మచారి - జటిపరివ్రాజకాతిథిక్షపణకావ
ధూత కాపాలి కాద్య నాథులకునెల్ల భూసురోత్తమ గార్హస్థ్యమునకు సరియె?
(మనుచరిత్ర, 1-16)

అయితే ఈ పద్య పదబంధాలన్నీ పినవీరయ్య సొంతాలు కావు. ''పరమగు పదంబు తంగేటిజున్ను చందంబునొరమి'' అని తిక్కనగారు వ్రాశారు (శాంతి, 5-391). పాల్కురికి సోమనాథుడు ఈ మాటలలో కొన్ని ఒక పద్యంలో వాడాడు.

తంగేటి జున్ను ముంగేటి నిధానము పండిన కల్పనవల్లియుం
గొంగున ముత్తియంబనగ గూర్మి మనంబున దొంగిలింపదా
జంగమకోటి కర్చనలు సల్పుచు (వృషాధిప శతకం)

ఇలా పదబంధాలను, భావాలను ప్రాచీనులనుండి అర్వాచీనులు స్వీకరించడం ఆనవాయితే. శాకుంతలాన్ని అనుసరిస్తూ అందులోని శ్లోకాన్ని మాత్రమేకాక కాళిదాసు ఇతర కావ్యాలలోని శ్లోకాలను కూడా పినవీరయ్య అనుసరించాడు. కుమారసంభవం లోని తొలి శ్లోకం ఇది.

అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయోనామ నగాధిరాజః
పూర్వాపరౌ వారినిధీ విగాహ్య స్థితః పృథివ్యా ఇవ మానదండః

తన ఉక్తికి అభినవశ్రీ వహించేటట్టు పై శ్లోకాన్ని తను స్వయంగా నాల్గుపాదాలు వ్రాసిన సీసపద్యానికి జతచేసి ఎత్తుగీతిగా ఇలా చెప్తాడు.

అలరి పెంపొందు పూర్వాపరాంబునిధుల
నడుమదరనికి మానదండంబువోలె
దేవతాత్మధరాధీశ దిగ్విభూష
పుణ్యానిలయంబు నీహారభూధరంబు. (శకుంతలా, 2-10)

ఇది కణ్వమహాముని శిష్యులు చెప్పే శకుంతల జన్మవృత్తాంత ఘట్టంలో తొలిపద్యం. శాకుంతలంలోని శ్లోకాలను కూడా పినవీరయ్య చక్కగా వాడుకున్నాడు. సుప్రసిద్ధమైన 'అనాఘ్రాతం పుష్పం' అనే శ్లోకానికి క్రింది పద్యం అనుకరణం.

కొసకొని తావి మూర్కొనని క్రొవ్విరి యెయ్యెడ వజ్రసూచిడా
యని రతనంబుజి హ్వాచవియానని తేనియ గోరుమోపి గి

ల్లని చిగురాకు లాలితవిలాసనికేతసమాలతాంగి దా
ననుభవకర్త యే ఘనుడొ యావిధియత్న మెరుంగనయ్యెడున్

(శకుంతలా. 2-158)

కావ్యాలలో నాటకం, నాటకాలలో శాకుంతలం, దానిలో చతుర్థాంకం, అందులో ఆ నాలుగు శ్లోకాలు రమ్యంగా ఉంటాయని చెప్పుకొంటారు. పినవీరయ్య వ్రాసిన అంపకాల సన్నివేశం ప్రబంధశైలిలో జాతీయాలు ఉట్టిపడేటట్టు వ్రాశాడు. ''కాళిదాసు నాటక చతుర్థాంకమునకు గూడ ఈ ఘట్టము వన్నెపెట్టుచున్నది'' అని కొందరు భావిస్తున్నారు.[10] పినవీరయ్య కావ్యంలో కణ్వమహర్షి పూర్తిగా తెలుగువాడయ్యాడు. పిల్లలమర్రి వారింట్లోనే, ఊళ్లోనే అల్లుళ్ల ఎంత అల్లరిపెట్టారోగాని పినవీరయ్య ఈ పద్యంలో అది విశదం చేశాడు.

నేరములెన్ని గల్గినగణించుట నేరములట్లు వారిపై
నేరువులైన యల్లురును నేరములెన్నుదు రత్తవారివారిపై
వారల నేర్పు నేరములు వంకలు దీర్చ నయుక్త మెల్లెడం
గౌరవహీనులిజ్జగతి గన్నియ నిచ్చినవారు కోమలీ! (శకుంతలా, 4-78)

దీని తరువాత 8 పద్యాలలో కులకన్యకా ధర్మాలు చెప్తాడు. ఆనాటి తెలుగు ఇల్లాళ్లు ఎలా ఉండేవారో చూడండి.

కంచెలయుం బటీరతిలకంబును బాపటచెందిరంబు ఫా
లాంచలసీమ లేబసువు టచ్చుతబొట్టు జెవాకు గాజులుం
గొంచెపు వీడ్యము న్విరులుకొప్పున నొప్ప నొనర్ప నెప్పుడుం
జంచలనేత్ర యుండదగు సంతతభర్తృఫలాభివృద్ధికిన్. (శకుం. 4-78)

పాపిట సింధూరం ఒకనాడు తెలుగువాళ్లు కూడా పెట్టుకొనేవారన్నమాట. శకుంతల ఈ విధంగానే అలంకరించుకుని అత్తవారింటికి వెడుతూ, వీడలేక ఆశ్రమాన్ని వీడడం పినవీరయ్య చక్కగా వర్ణించాడు. 'తండ్రిబాయంగలేని సంతాపజలమూ, అత్తవారింటికేగెడి ఆహ్లాదజలమూ గోరువెచ్చనై పాలిండ్లు తడుపడపదడప పయ్యెద తుడుచుకుంటూ శకుంతల ఎలా సాగిందో చక్కగా చిత్రించాడు.

కదలు నాలుగు మూడు బదములు క్రమ్మరి తండ్రిపాదంబు లౌదల ఘటించు
గొంతద వ్వేగు నేగుచు వచ్చి కణ్వుని కడుపులో దలమోపి కౌగలించు
నరుగు కొండొక వేగ దిరిగి మౌనులకు మాయయ్యసుడీ యని యప్పగించు
గమనించు బెడమర్లి కాశ్యపుదెస జూచి నేబోదు నంచు గన్నీరు నించు
జనకు డుపలాలనము సేయ సంయమీంద్ర
భామలదలింప ననసూయ వట్టి తిగువ

10. శృంగార శాకుంతలం (శకుంతలా పరిణయం) - వావిళ్లముద్రణ కావ్య సమీక్ష - విశ్వనాథ నరసింహంగారు, పుట 4.

నిగిడి యడుగిడె నొకభంగి మగిడిమగిడి
చూచుకొంచు శకుంతలానూనగంధి. (శకుంతలా. 4-97)

ఇలా కన్నీళ్ళు కాలువలు కట్టాక రత్నాకరంని వెతుక్కుంటూ వెళ్ళే గంగానదిలాగే శకుంతల హస్తినాపురానికి వెళ్ళిందని చెప్పి యా పురవర్ణన చేశాడు. ప్రబంధాలలో ఉండే అష్టాదశ వర్ణనలు వీలు చూసుకొని పినవీరయ్య చక్కగా చేశాడు. కొన్ని రాచమర్యాదలు పాటించాడు. కణ్వమహాముని కొందరాడవాళ్లతోపాటు తన శిష్యులను దేవరవారి దర్శనానికి పంపించారని దౌవారికుడు చెప్పగానే ''సభాస్థలంబులు స్త్రీజనులం బొడసూపించుకొనుట యనర్థం''బని అందరినీ పంపించేసి ఏకాంతగృహంలో ఉండి మాన్యులైన వృద్ధకాంతలను పంపించి వచ్చినవాళ్ళను రప్పించాడట. (శకుంత. 4-100)

ఇటువంటి రాచమర్యాదలన్నీ పినవీరభద్రుని ప్రత్యక్షానుభవాలు కావచ్చు. వాళ్ల అన్నయ్య పెదవీరభద్రుడు రాయ సామ్రాజ్యంలో గొప్ప ఉద్యోగి, ధీనుతకార్యదక్షుడు. కర్ణాటధరణికి వెళ్లి రాయసింహాసనాన ఉండే అధికులకు, రాయదాయాదులకు, డెబ్బయివేలమంది సామంతులకు పెదవీరభద్రుడు అధికారి అయ్యాడు.[11] సంగమవంశంలోని కడపటిరాజుల వద్ద - బహుశా విరూపాక్ష రాయలవద్దగాని, సాళువ నరసింగ రాయలవద్దగాని అతడు ఉండేవాడని పరిశోధకులు భావిస్తున్నారు.[12] అన్నగారు అంతటి అధికారి అయ్యాక పినవీరయ్య కూడా రాయసామ్రాజ్యంలో ఆస్థానకవి అయ్యాడు. సాళువ నరసింగరాయల కొలువులో అతడు ఉండేవాడు.

నరసింగరాయలు స్వయంగా కవి. తొలినుండీ కవులతో సంపర్కం ఉన్నవాడు. ''మీరు శ్రీకృష్ణునిలాగా కాపాడితే, నేను అర్జునునిలాగా ఏకచ్ఛత్రాధిపత్యం వహిస్తాను'' అని చిన్ననాడే అన్నమయ్యతో చెప్పాడు. తాను అర్జుననంతటి పరాక్రమవంతుడే. అతని విజయాలను గురించి ఎంత విన్నా తనకు తనివి తీరదు. అర్జునుని గురించి కొత్త కథలేమైనా ఉంటే అవి వినిపించుకొనేవాడు. జైమిని అనే మహారాష్ట్ర దేశీయుడు బహుశా క్రీ.శ. 12వ శతాబ్దంలో భారతంలోని అశ్వమేధపర్వాన్ని కొత్తగా వ్రాశాడు. వ్యాసభారతంలో వింధ్యకు దక్షిణాన ఉండే రాజుల సంగతేం లేదు. అందుకు కొత్తగా ఇది సృష్టించాడు. ఈ భారతం పేరు జైమినీ భారతం. ఈ పురాణాన్ని సాళువ నరసింగరాయలు విన్నాడు. ఇది తెనుగైతే, చెప్పనేర్చిన కవి సుప్రసిద్ధుడైతే తెనుగు నుడికారమున మించకనియెనేని బంగారానికి తావి అబ్బినట్టే అని నరసింగరాయలు భావించాడు. ఈ సంగతి నిండు సభలోనే చెప్పాడు. సభలో ఉన్న ఒకాయన లేచి

ఏరీతి నెరిగెనో పిన - వీరన దేవర తలంపు విఖ్యాతముగా
బేరును బెట్టిదియును దన [13] - పేరున రచియింపబూనె పేశలఫణితిన్
(జై.భార. 1-20)

---

11. పెనుమళ్ల సోమయాజి చేసిన కథనం.
12. ఆంధ్ర కవితరంగిణి 6వ సంపుటి, పుట - 49
13. తమ అనే పాఠాంతరం సమంజసం అనుకొంటాను.

అని విన్నవించాడు. వెంటనే నరసింగరాయలు సభలో ఉన్న పినవీరయ్యను చూశాడు, తరువాత ఏం జరిగిందో ఇలా చెప్పాడు:

అని విన్నపంబు జేసిన - ను గనుగొని యలరి నా ధనంబు ఋణముగా
దినక యుపార్జించె యశో - ధన మిటు గావలదె యాశ్రితత్వంబనుచున్
(జైమినిభారతం, 1-23)

తాను అడక్కుండానే ఇంగితం కనిపెట్టి తన పేర గ్రంథం వ్రాస్తున్న పినవీరయ్యా తన సొమ్ము వూరికే తిని కూర్చోడం లేదని రాయలు పొంగిపోయాడు. అతనికి పిన వీరయ్యా కవిత్వం అంటే ఇష్టం. దాన్ని ఇలా అభినందించాడు.

అల్లన విచ్చు చెంగలువలందు రజం బను కప్పురంబుపై
జల్లగ జల్లనై వలచు సౌరభముల్ వెదజల్లు భావముల్
పల్లవహస్తచన్నుగవపయ్యెద జీబుగ దోచు భాతిగా
బిల్లల మఱ్ఱి వీరన యభిజ్ఞుడు చెప్పగ నేర్చు గబ్బముల్ (జై. భార. 1-25)

తన ఏలికను ఏవిధంగా సంతోషపెట్టాలో పినవీరయ్యకూ తెలుసు. అందుకే అతణ్ణి భారతవంశ మండనుడు, పాండవ గాండీవ ముక్తబాణ సంభార తత ప్రభావ నుతిపారగుడు (1-13) అని నుతించాడు. వ్యాస భారతంలో లేని బోలెడు కథలు జైనులు వ్రాయగా లేనిది నేను మరో చిన్న పురాణం కల్పించి పైన పడవేస్తే భారతం భారమంటుందా? భారతీయులు ఘోరమంటారా? అని పినవీరయ్యా శ్రీకృష్ణుని చేత ఇంకో అవతారం ఎత్తించాడు. అశ్వమేధం పూర్తి అయ్యాక ధర్మరాజుతో భగవాన్ ఉవాచ: కలియుగం ప్రథమభాగంలో పెరుగూ, వడ్లూ కలిసిపోయినట్లు వర్ణాశ్రమములు కత్తరి గలియున్' కాబట్టి

ఆసమయంబున ధర్మజ సే సోమనిలంబున జనించి కుటిలున్
శాపించి ధరణిపాలన చేసెద సాళ్వనారసింహుడగుచున్ (జైమినీభారతం, 8-214)

కృత్యాదిని తన ఏలికను అర్జునునితో పోల్చి చివరకు వచ్చేసరికి శ్రీకృష్ణుని అవతారంగానే చెయ్యడం 'నావిష్ణుః పృథివీపతిః' అనే ఆర్యోక్తి ప్రకారం ఎవరేనా సమర్థించవచ్చుగాని ఎవరు పడితే వాళ్లు మన పురాణాలలో ఇలా ప్రక్షిప్తాలు కలపబట్టి వాటి విలువ మరీ సన్నగిల్లింది. చుట్టూ వున్న కవులు అవతారపురుషుడవని ఇలా పొగడబట్టే సాళువ నరసింగరాయలు తనమీద సంకీర్తన చెప్పమని అన్నమయ్యలాంటి వాడికి సంకెళ్లు వేయించాడు. పొగడ్త తలకెక్కనివాడు ఇంకా పుట్టాలి!

పినవీరయ్యా తన ప్రభువును అలా పొగిడినా తన సంగతి 'వినయ విద్యా సముద్ర పినవీరభద్ర' అనే గద్యలో వ్రాసుకున్నాడు. ఈ కావ్యంలో 8 ఆశ్వాసాలూ, 1473 గద్యపద్యాలూ ఉన్నాయి. మొదటి ఆశ్వాసంలో వ్యాసులవారు ధర్మరాజును

అశ్వమేధయాగం చేయమంటారు. ''అంత డబ్బేదీ! పన్నులు వేస్తే ప్రజలు ఊరుకొంటారా!'' అని ధర్మజుడు ఇలా అంటాడు.

కాక నెదిర్చి సంగరముఖంబున హెచ్చిన రాజవంశమున్
గూకటివేళ్ళతో బెరికి గోత్రవధంబును జేసినట్టి యా
ప్రేకపుగీడుగాక ప్రజ వేచదలంచిన గోరుచుట్టు పై
రోకటిపోటుచందంబుగ రోసి జనుల్ ననుజూచి తిట్టరే! (జై. భార. 1-64)

ఇందులో ''గోరుచుట్టుపై రోకటిపోటు'' అనే సామెత పినవీరయ్య చక్కగా వాడాడు. ఇలాగే ఈ కావ్యంనిండా అడుగడుగునా నుడికారంలో మెరుపులు కనబడుతాయి. ధర్మరాజలా అంటే వ్యాసులవారు ''ధనం గురించి బాధపడకు. ముద్రవేయని సువర్ణం ఒక 'అద్రి' వద్ద మూలుగుతున్న''దంటాడు. ''అది పూర్వం మరుత్తరాట్టు చేసిన యాగంలో బ్రాహ్మణులు దక్షిణ కింద పుచ్చుకొన్నారు. మోయలేక మంచుకొండ దగ్గిర పారవేశారు. ఆ డబ్బు పెట్టి యాగం చేయి'' అన్నారు.

''బాగుంది. బంధువును చంపిన పాపం పోవడానికి యాగం చేస్తూ పరుల సొత్తు అపహరించి తేవాలా? ''కుడిచి కూర్చుండి శిల దెప్పకొయ్య జేసి జలధిలో యీదులాడంగ తలచినట్లుంది'' అంటాడు ధర్మరాజు.

వ్యాసులవారు ధర్మబోధ చేస్తారు. ధర్మరాజు యాగానికి ఒప్పుకుంటాడు. యజ్ఞానికి కావలసిన అంశాన్ని తీసుకువస్తానని భీముడు శపథం చేస్తాడు. ''అలాగ లేకపోతే ఊరివారు వాడని నూతిలో నీరు తాగిన పాపానికి పోతా''నని చెప్తాడు. ఇంతలో కృష్ణుడు వస్తాడు. ద్వారం దగ్గిరే నిలబడి కబురు పంపిస్తాడు. ''ఎంతవారికేని మహికాంతుని యవసరంబు తెలియక చనవు మెరసి అంతఃపురంబునకుం జనుట యనుచితం'' బని కబురుపెడతాడు. ధర్మరాజు దిగ్గున లేచి వెళ్లి కృష్ణుని తోడ్కొని వస్తాడు.

శ్రీకృష్ణుడూ, భీముడూ ఈ కావ్యంలో తెగ హాస్యాలాడుకుంటారు. మోతాదు మించి మోటుగానే ఉంటుంది. భీముడు ధర్మరాజుకు తమ్ముడే కాక మంత్రి, ఎటువంటివారిని మంత్రిగా పెట్టుకోకూడదో శ్రీకృష్ణుడిలా చెప్తాడు.

అంగవిహీను నిల్లటపుటల్లుని బ్రల్లదు నీచభామినీ
సంగతు వామనున్ బధిరుసాధ్వసమానను మామ గాముకున్
వెంగలి నంగనాజితుని నిర్దయు గ్రోధి బ్రమత్తు మంత్రి జే
యం గొరగామి కెల్ల గుదు రంచు గణింతురు నీతికోవిదుల్.
(జైమినీభారతం, 1-121)

ఈ మాటలు విని భీముడు ''చిత్తం, ఈ అవలక్షణాలన్నీ నాకున్నవే! అయితే దేవరవారికి లేవా?'' అని అడగడమే కాక వరసపెట్టి శ్రీకృష్ణుని సుగుణాలు ఏకరవు పెడతాడు.

అనఘ! నీ వానతిచ్చిన యట్ల మిగుల - దుందిలుండను బహ్వాశిదుష్టరాక్ష
సీరతుండను నగుదు జర్చించి చూడ - దేవరకు నట్టి గుణములు లేవుగాన?
మొదల నత్యంతకాముకుడ వౌటకు గొల్లఇల్లాంఢ్ర గుబ్బపాలిండ్లుసాక్షి
యతినీచరతిశీలి వగుటకు బాలీన కమఠసూకరవిగ్రహములు సాక్షి
బహ్వాశి వగుటకు బ్రహ్మాండకోట్లును బూరింపలేని నీ బొజ్జ సాక్షి
స్త్రీలోలుడగుటకుద్రైలోక్యమునెరుంగ ధరకు తెచ్చి ఎనవేల్పు తరువు సాక్షి
జడసముత్సాహితవగుటకు జలధిసాక్షి - వామనుడవగుటకు బలీశ్వరుడు సాక్షి
మందమతినవుటనది మరపొందె గాక - సరివి బేర్కొ్న దరమ నీసటలు కృష్ణ!
(జై. భార. 1-125, 126)

ఇంతటితో ఊరుకోలేదు. మరో నాలుగు పద్యాలలో కడిగివేశాడు. దానికి కృష్ణుడు ప్రమోదితుడయినాడట! ఈ బావమరదుల హాస్యం ఎప్పుడూ ఇలాగే వుంటుంది. అశ్వమేధ యాగానికి రమ్మని పిలవడానికి (3వ ఆశ్వాసంలో) భీముడు ద్వారకకు వెళ్ళాడు. సరిగ్గా అదే సమయానికి శ్రీకృష్ణుడు పేరుగల మాంసాలు నంజుకొంటూ భోజనం చేస్తున్నాడు. రుక్మిణీ సత్యభామలు తాటాకూ విసనకర్రలతో విసురుతున్నారు. భీముడు రాగానే కృష్ణుడు నవ్వుతూ ''క్షేమాలన్నీ తరువాత చెప్పవచ్చు. ముందు భోజనం చెయ్యి. బాగా ఆకలితో ఉన్నట్టున్నావు'' అంటాడు. 'నీ బంతిలో కూర్చుంటే, నా ఆకలి తీరినట్టే'' అని భీముడు ఇలా ఎత్తిపొడుస్తాడు.

తల్లిచన్నుల పాలు ద్రావి యంతట బోక పూతన బొరిగొంటి పురిటిలోన
జననియుగ్గున తృప్తిసనక నిన్నటిదాక వెరజితి వ్రేపల్లె వెన్నలెల్ల
సంబపొత్తున దనియక వెక్కసంబైన యుదరాగ్నినార్చి తింత్రోత్సవమున
జనయిత్రి యొసగుభక్షణము చాలక తింటివాకుచేలుని చేతి యడుకులొడిసి
కడుపులోపల సకల లోకములు వరుస-గూరుకొన్నప్పుడును నరగొరతగాని
తుష్టుడవు గావు నీదు పొత్తునభుజింప - దీరునే నాకు ఘనమైన దీవనంబు?
(జైమినిభారతంబు, 3-53)

ఇటువంటి హాస్యం చదువుతూ ఉంటే హాయిగానే ఉంటుందికాని కొన్ని చోట్ల ఇది శ్రుతిమించుతుంది. శ్రీకృష్ణుడు సకుటుంబ బంధుమిత్ర పరివారంగా హస్తినాపురానికి కదిలాడు. పరివారంలో వృద్ధవేశ్యలున్నారు. వాళ్లను చూపెడుతూ శ్రీకృష్ణుడు భీమునితో ఇలా అన్నాడట.

వీరి బరిగ్రహింపు మిది వేళ సమానలు నీకు భీషణా
కారకఠోరమన్మథవికారగుణంబుల నన్న నవ్వి య
మ్మారుతి పల్కె నిట్టి కొరమాలిన జంతల జక్కబెట్టి
భారము వన్నె కెక్కు దురవస్థలు నీ కరలాలనంబునన్ (జై. భార. 3-63)

ఈ ముతక హాస్యానికి మనం పినవీరయ్యను తప్పుపట్టనక్కరలేదు. ఇది మూలంలో ఉన్న జైమిని ఇంతకన్నా మనసు చివుక్కుమనిపించే శ్లోకాలు వ్రాశాడు. సాయంకాలమైంది.

సూర్యుడు అస్తమించాడు. సరోవరంలో తామరపువ్వులను హంసలు, ఏనుగులు, తుమ్మెదలూ చుట్టుముట్టాయి. ఆ పువ్వులు సుఖిస్తున్నాయట. ఈ దృశ్యాన్ని కృష్ణుడు రుక్మిణికి చూపెట్టి ''చూశావా మగవాడు కనుచాటు కాగానే పరపురుషులతో పద్మిని ఎలా క్రీడిస్తున్నదో! 'స్త్రీణాం చిత్తంతు చంచలమ్'' అని అంటాడు.

దానిని పినవీరయ్య ఇలా అనువదించాడు.

కమలదళాక్షు డంత నిజకామిని రుక్మిణితోడ నిట్లనున్
గమలిని జూచితే ప్రియుడు గన్గొనరామి మరాళసాము
భ్రమరకులంబు పైబడ గరంబుసుఖించెడు గామమెప్పుడున్
రమణునికంటె నెన్మిదిగుణంబులు గాదె లతాంగి కాయన్?

(జైమిని భారతం, 3-67)

కృష్ణుడిలా అనగానే రుక్మిణి మెత్తగా చీవాట్లు పెట్టింది. ''మీ అబ్బాయి బ్రహ్మవాహనము హంస. నా వాహనం ఏనుగు. తుమ్మెదలపట్ల తనూజభావం ఉండాలి. కాబట్టి నువ్విలా అనడం బాగులేదు'' అంది. 'పద్మిని పరపురుషులను కోరుతుందా' అని పద్మినీజాతి ఆధిక్యం చెప్తుంది. భార్యాభర్తల మధ్య జరిగిన ఈ సంభాషణ 'పరిహాసపల్లవితం బగు సల్లాపంబు' అని పినవీరయ్య చెప్పాడు. మూలంలో ఉన్నవన్నీ ఆంధ్రజైమినీ భారతంలో ఉన్నాయని, రెండింటిని తైపారువేసి టేకుమళ్ల అచ్యుతరావుగారు ఇలా చెప్పారు.

మాతృకయందలి గుణదోషములు, అనుచితపరిహాసోక్తులు, స్వభావ విరుద్ధాలంకారములు యథామూలముగా గ్రహింపబడినవి కావున నీతని గ్రంథమందేలోపములు నిర్ణయించినను ఆ లోపములు ప్రాయికముగ మూలమున నున్నవనియే నిశ్చయింపవచ్చును. కథాభాగములు గాని కథాసందర్భములుగాని యెచ్చోట నతిక్రమింపబడలేదు.[12]

తెలుగు సాహిత్యంలో ఇప్పటికి యథామూలంగా అనువాదం చేసిన ఒక కవి కనబడుతున్నందుకు నిజంగా సంతోషించాలి.

పినవీరయ్య స్వతహాగా మంచి సున్నితమైన హాస్యాన్నే వ్రాస్తాడు. ఈ సంగతి జైమిని భారతంలో రెండో పద్యంలో కనబడుతుంది. ఈశ్వరుని స్తుతిస్తూ చక్కని పరిహాసం చేశాడు. గౌరీకల్యాణంలో పెళ్లికొడుకు జటాజూటంలో గంగ ఉందట. అది నీటి గడియారంలాగా ఉందని పినవీరయ్య ఇలా చలోక్తి విసిరాడు.

జడముడి జాహ్నవీతటనిశాకరపోతము జూచి యెవ్వ రీ
కొడిమెలుగట్టి పెండ్లికొడుకుం గడియారము మోపజేసి రం
చడుగ వివాహవేదిపయి నంబిక నెచ్చెలి జూచి నవ్వ నా
మృడుడు నృసింహశౌరికి సమిజ్జయముల్ దయసేయు గావుతన్.

(జైమినీ భారతం, 1-2)

12. విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయ చరిత్రము, ప్రథమభాగము, పుట 201.

నరసింగరాయలు అభిలషింపబట్టి పినవీరయ్య జైమినీ భారతాన్ని అనువదించాడు గాని రాయలు ఇంకొకటి తలుస్తే దానినే ఇంత చక్కగా నుడికారపు మెరుపులు చూపిస్తూ చెప్పేవాడు. జైమినీ భారతంలో ఉపకథలు చాలా ఉన్నాయి. మగడు యతి అంటే ప్రతి అనే గంపగయ్యాళి చండి కథ యిందులోనే ఉంది. పెళ్లాం సంగతి తెలుసుకొని కావలసిన దానికి విరుద్ధంగా చెప్పుతూ పితృకార్యం జరిపించుకొని గంగలో కలపవలసిన పిండాలు పెంటమీద పారవేయించుకొన్న ఉద్దాలకుని చరిత్ర మూడవ ఆశ్వాసంలో ఉంది. అహల్యా రాయిగా మారినట్టు చండికూడా భర్త శాపంవల్ల రాయి అవుతుంది. యజ్ఞాశ్వం వల్ల శాపవిమోచనమవుతుంది.


ప్రమీలార్జునీయ కథ పంచమాశ్వాసంలో ఉంది. కుశలవులు శ్రీరాముని యజ్ఞాశ్వాన్ని పట్టుకొనడం కథ షష్టాశ్వాసంలో పూర్తిగా ఉంది (273 గద్యపద్యాలు). అష్టమాశ్వాసంలో చంద్రహాస కథ ఉంది. మిగిలిన భాగాలన్నీ అర్జునుని యుద్ధాలే. యజ్ఞాశ్వాన్ని అపహరించి శత్రువుల గట్టి వ్యూహాల మధ్య పెడితే అర్జునుడు జయించడం, విడిపించడం పుస్తకం నిండా ఉంది అనుసాళ్వుడు అనే రాజు అశ్వాన్ని గృధ్రవ్యూహంలో పెడతాడు (3-89). హంసధ్వజుడు పద్మవ్యూహంలో పెడతాడు (5-4).

భారతంలోను, జైమినీ భారతంలోను పద్మవ్యూహం ప్రసక్తి ఉందేకాని దాని ఆకారం ఎలా ఉంటుందో మనకు తెలియదు. ప్రాచీన భారతీయ యుద్ధతంత్రాలను వివరించే గ్రంథాలు ఉన్నాయిగాని ఈ వ్యూహాల రూపాలను చిత్రించే పుస్తకాలు కనిపించవు. అయితే అదృష్టవశాత్తూ ఆగ్నేయాసియాలోని కొన్నిచోట్ల భారతీయ సంప్రదాయాలు కొన్ని ఇంకా సజీవంగా ఉన్నాయి. సయామ్ దేశంలోని కొన్ని అముద్రిత గ్రంథాలను ఆధారం చేసుకొని పాశ్చాత్య యుద్ధ శాస్త్రవేత్తలు పన్నెండు ప్రాచీన భారత యుద్ధవ్యూహాలను చిత్రించారు. వాటిని డాక్టర్ క్వారిట్జ్‌వేల్సు ప్రకటించారు.[13]


ఈయనకు కృతజ్ఞతతో ఆ పన్నెండు వ్యూహాలలో కొన్నిటిని ప్రకటిస్తున్నాను చూడండి. ప్రతివ్యూహంలోనూ, ఈ క్రింది సైన్యవిభాగాలలోని దళాలుగాని, వ్యక్తులుగాని ఆయా నిర్ణీత ప్రదేశాలలో ఉంటారు.

1. సర్వసేనాని, 2. మూలబలం, 3. పదాతిదళాలలో రక్షకులు, 4. నేత్రహస్తులు, 5. పదాతిదళం (ఆయుధాలు చెప్పలేదు). 6. పదాతి దళం (ధనుస్సులు, శూలాలు, కత్తులు), 7. పదాతిదళం (శూలపాణులు), 8. పదాతిదళం (కత్తులు, శూలాలు), 9. పదాతిదళం (డాలు, కత్తి), 10. విలుకాండ్రు, 11. ఆశ్వికదళం, 12. ఖడ్గహస్తులైన ఆశ్వికులు, 13. గజదళం, 14. శూలపాణులైన గజవాహకులు, 15. పురోగామిదళాలు, 16. పృష్ఠ రక్షకులు, 17. నిలువదళాలు, 18. ఆగ్నేయాస్త్రధారులు, 19. శతఘ్నులు, 20. రథాలు.


13. Ancient South East Asian Warfare - by H.G. Quaritch Wales, Ph.D., Litt.D



శ్యేనవ్యూహం



గృధ్రవ్యూహం



పద్మవ్యూహం

ఈ వ్యూహాలలో పద్మవ్యూహం క్రీ.శ. 1592లో నయామ్ రాజు 'నరెసుయన్' నిర్మించాడట.[14] అంటే ఇది పినవీరభద్రుని కాలానికి పిమ్మట ఒక శతాబ్దం తరువాత. అందుచేత ఒకవేళ పినవీరయ్య పద్మవ్యూహాన్ని చూసి ఉంటే, అది ఎలా ఉంటుందో మనం విశ్వసనీయంగా ఊహించగలుగుతున్నాం. పినవీరయ్య చాలా యుద్ధాలను కళ్లారా చూచాడు. అందుకే శృంగార శాకుంతలంలో సహితం 41 గద్యపద్యాలలో యుద్ధవర్ణన చేశాడు. తరువాత 46 పాదాల రగడలో రాజధానినుండి కదలిన మూలబలాలను వర్ణించాడు. అది దుష్యంతుని సైన్యం కాదు; విజయనగర సామ్రాజ్య మూలబలాల వర్ణనే.

ఎంతో వైవిధ్యంతో రచన చేసి తన సమకాలిక జీవితాన్ని చక్కగా తన కావ్యంలో ప్రతిఫలింపజేసిన పినవీరయ్య కవిత్వాన్ని అంచనా వేస్తూ విజ్ఞులే ''ఈ కవికి ప్రపంచానుభవజ్ఞానము తక్కువ. గ్రంథపఠనజ్ఞాన మెక్కువయని తోచుచున్నది'' అని వ్రాయడం బాధగానే ఉంటుంది.[15] లోకజ్ఞానం ఎక్కువగా ఉంది కనుకనే పినవీరయ్య రాజనీతులను ప్రత్యేకంగా వ్రాశాడు. ''గుండభూపాలు నరసింహమండలేంద్ర'' అనే మకుటంతో నవరత్నపద్యాలు, సప్తాంగ పద్ధతి పద్యాలు బహుశా పినవీరయ్య వ్రాసి ఉంటాడు.[16]

శృంగార శాకుంతలంలో భరతునికి పట్టం కట్టాక నారదునిచేత సుదీర్ఘంగా రాజనీతులు చెప్పించాడు. శృంగారంవైపు మొగ్గినా పినవీరయ్య సహజంగా రాజనీతివేత్త. సున్నితమైన హాస్యం తెలిసినవాడు. కళ్లకు జిగేలుమనిపించేటట్టు నుడికారపు మెరుపులు మెరిపించగలడు. జైమినీభారతంలో ఒకచోట సూర్యాస్తమయాన్ని ఇలా వర్ణించాడు:

> అంతట కనుపట్టెను భారస్వంతుడు చరమాద్రి మీద వారుణదిక్సీ
> మంతిని జలకేళికి చిరు - బంతి పసుపుముద్ద సన్నెపై నిడుభంగిన్.
>
> (జైమినీ భారతం, 2-100)

ఈ పద్యంలో 'చిరుబంతిపసుపు' అనే సమాసం శ్రీనాథునికి ఎంతో ఇష్టమైనది. అతని 'భాషానిగుంభంబుల పరిమళాలు' కూడబరచ నేర్చిన పినవీరయ్య ఈ మాటలు వాడుకొనడంలో వింత లేదు. శ్రీనాథుని ప్రయోగాలకు స్పష్టమైన అర్థాలు తెలియాలంటే పినవీరయ్య గ్రంథాలు చూడాలేమో అనిపిస్తుంది. ఉదాహరణకు, శృంగారనైషధ గ్రంథాంతంలో శ్రీనాథుడు 34 పద్యాలలో చంద్రవర్ణన చేశాడు. ఆఖరిదాంట్లో ఇలా భరతవాక్యం వ్రాశాడు:

> ముక్కంటి తలపువ్వు మున్నీటిలేబట్టి కైటభారాతి డాకన్నుదమ్మి
> గగనలక్ష్మికి దంతకాండతాటంకంబు కలువలవిందుజక్కవల గొంగ

---

14. Ancient South East Asian Warfare, P. 174
15. విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయ చరిత్రము, ప్రథమ భాగం టేకుమళ్ల అచ్యుతరావుగారు, పుట 133.
16. వీటిని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చాటుపద్యమణిమంజరి 1వ భాగంలో ప్రచురించారు. పుటలు 37-39.

వలరాజు వెల్లల్లి వనజబాంధవునుద్ది శిశిరాంశురత్నంబు చేదుమందు
గన్నులపండువు గ్రహసార్వభౌముఁడు సురలయాకటిపంట యిరుల దాయ
శ్రీమహాలక్ష్మిసైదో డశేషభువన - సౌధకలధౌతకలశంబు చందమామ
రాజవదన! కళ్యాణపరంపరాభి - వృద్ధి గావించుగాత మీ విశ్వమునకు.

ఈ పద్యంలో శ్రీనాథుడు చందమామను 'వలరాజువెల్లల్లి' అని భావించాడా, లేక 'వెల్లెల్లి' అని భావించాడా అన్నది వివాద విషయమైంది. వెల్ల+అల్లి=వెల్లల్లి, తెల్లకలువ అని వేదం వెంకటరాయశాస్త్రిగారు అర్థం చెప్పారు.[17] వెల్ల+ఎల్లి=వెల్లెల్లి, తెల్లగొడుగు అనే పాఠాంతరం సాధువని గిడుగు రామమూర్తి పంతులుగారు వాదించారు.[18] చంద్రుడు మన్మథుని చేతిలోనిదిగాని, చెవియందలిదిగాని తెల్లకలువవంటివాడు'' అని సంస్కృత మందయినా తెలుగులోనైనా, పూర్వులైనా ఆధునికులైనా వర్ణించి ఉన్నారా? మేమెరిగినంత మటుకు కవులు చంద్రుణ్ణి, మన్మథుని వెల్లెల్లి, అనగా తెల్లని గొడుగుతో పోల్చి ఉన్నారు'' అని రామమూర్తి పంతులుగారు 6 సంస్కృత ప్రయోగాలు ఇచ్చారు.

దీనిని వేదం వెంకటరాయశాస్త్రిగారు (మనుమడు) ఆక్షేపించారు. 'వెడవిల్లు లీలారవిందంబు' అనే తిక్కనగారి ప్రయోగాన్ని (నిర్వ. 6-42) చూపించి ''శ్రీపంతుల వారీపద్యమును గుర్తించి యుండిన యెడల పైరీతిగా వ్రాసి యుండరేమో! శ్రీనాథుని పద్యమునకు శ్రీహర్షుని మూలము లేదు. ఇది అతని సొంతము. రెండుమూడు విధముల పాఠములు దొరికిన ఆయాప్రకార మర్థములు చెప్పుకొనవలసినదేగాని శ్రీనాథుని పాఠము ఏదో ఎట్లు చెప్పగలము? శ్రీపంతులుగారు తెలుగు కవుల యుదాహరణముల నొసగలేదు. తిక్కనది అరవిందము; శ్రీనాథునిది వెల్లల్లి. ఇదే శ్రీనాథుని పాఠముగా నుండదా?[19]

తెలుగు ఉదాహరణములుగూడ యివ్వవచ్చును. ఆమాటకొస్తే శ్రీనాథుని ఇతర గ్రంథాలనుంచే తెల్ల గొడుగు అనే అర్థమున్న ప్రయోగాలు చూపవచ్చు. చంద్రుడు 'అసమశరసార్వభౌమముత్యాలగొడుగు' అని భీమఖండంలో శ్రీనాథుడే స్వయంగా వ్రాశాడు (2-42). శృంగారశాకుంతలంలో కూడా చంద్రవర్ణన విపులంగా ఉంది. ''ప్రాచీదిశాపతి పావడబెనచిన మవ్వంపు జిగురల్లి మన్మథునకు'' అని పినవీరయ్య వ్రాశాడు (శకుంతలాపరిణయం, 3-155). ఈ ప్రయోగంతో తైపారువేస్తే శ్రీనాథుడు 'అల్లి' అనే అర్థంలో కూడా ప్రయోగంచేసి ఉండవచ్చునేమో. దీనినిబట్టి పండితులు సాధుపాఠ నిర్ణయం చేయగలరని భావిస్తున్నాను.

పినవీరయ్య 'వాణి నా రాణి' అన్నాడో లేదోగాని అతని కవిత కొన్ని క్షణాలసేపు ఆమెచేతిలో ఉండే చిగురల్లి కాకపోదు.

---

17. శృంగార నైషధసర్వంకష, పుట 748
18. ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజం, విషము 74, పుట 108
19. శృంగారనైషధసర్వంకష, ప్రకాశకుల విజ్ఞప్తి, పుట 14.

నంది-ఘంటల జంట

జమీందారీ యుగంలో దివాకర్ల తిరుపతిశాస్త్రిగారూ, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారూ కలిసి తిరుపతి వెంకటకవులనే పేర జంటకవిత్వానికి బహుళ ప్రచారం చేసిన తరువాత కనీసం ఊరికొక జంట, కొన్నిచోట్ల వీధికొక జంట చొప్పున కవుల యుగళాలు ఆంధ్రదేశంలో కవితావ్యాసంగం చేయడం పరిపాటి అయింది. అయితే జంటకవిత్వం కేవలం అర్వాచీన సంప్రదాయం కాదు. ప్రాచీనులు కూడా జంటకవిత్వం చెప్పారు. రంగనాథ రామాయణం ఉత్తరకాండను రచించిన గోన కాచభూపతీ, విఠలరాజూ అనే అన్నదమ్ములు మన సాహిత్యంలో మొట్టమొదట సాక్షాత్కరించే జంట కవులు. వీరు స్వయంగా రాజులు కనుక వీరెవరినీ ఆశ్రయించలేదు. పోషకుల కోసం దేశాలు పట్టిన జంటకవులు మనకు తర్వాత కనబడలేదు. మన సాహిత్యంలో అటువంటి తొలి జంటకవుల పేర్లు నంది మల్లయ్యా, ఘంట సింగన్న. వీరికే రాచమల్లు కవులనే పేరు ఉంది.[1] వీళ్ళు చాలా దగ్గర బంధువులు. నంది మల్లయ్యకు ఘంట సింగన్న మేనల్లుడు.[2] ఈ జంటకవులు గుంటూరు, నెల్లూరు మండలాలలో క్రీ.శ. 1480 ప్రాంతాలలో ఉండేవారు.

ఆ రోజులలో ఉదయగిరి దుర్గాన్ని గజపతుల సామంతుడైన పూసపాటి బసవరాజు పాలిస్తూ ఉండేవాడు. ఇతనికే దూబగుంట నారాయణకవి తన పంచతంత్రం అంకితం ఇచ్చాడు. ఈ బసవరాజు దగ్గర పెసరువాయ గంగన్న మంత్రి ఉండేవాడు. ఇతడు చెందలూరు వాసి. ఇతనికే దగ్గుబల్లి దుగ్గన్న తన నాసికేతోపాఖ్యానం అంకితం ఇచ్చాడు. ఈ గంగయ్య మంత్రి సరిలేని నీతిచాతురిచేత రాజతంత్రం నడిపితే నడుపవచ్చుగాక, ఎప్పుడూ పువ్వులు, చందనం, వనితలు మొదలైన సౌఖ్యాలు అందితే అందవచ్చుగాక, సంగీత, సాహిత్య సరసవిద్యావినోదాలలో కాలం గడిపితే గడపవచ్చుగాక, నిజానికి నీళ్ల లోపలి తామరాకులాగ నిర్లిప్తుడైన 'సంసారయోగి' అని సమకాలికులు పొగడేవారు. ఇటువంటి మంత్రి వేదాంతంపై మొగ్గడంలో ఆశ్చర్యం లేదు. అతనికి సంస్కృతంలో ఉన్న ప్రబోధచంద్రోదయం అంటే ఇష్టం.

అది సుప్రసిద్ధమైన నాటకం. దానిని కృష్ణమిశ్రుడనే కవి రచించాడు. అతడు క్రీ.శ. 1098 ప్రాంతాలవాడు.[3] మహాపండితుడు. ఇతని శిష్యులలో ఒకడు ఎప్పుడూ కావ్య నాటకాదిగ్రంథాలనేగాని వేదాంత విషయాలు చదివేవాడుకాడట. అతనికి వేదాంతంపై ఆసక్తి కలిగించడానికి కృష్ణమిశ్రుడు ఈ ఆరంకాల నాటకాన్ని వ్రాశాడట. దీనిని సహృదయులిలా పొగుడుతారు:

వివరింప నిది సర్వవేదాంతసారంబు తలపగా నిది గట్టి తెలిపిత్రోవ
యిది భోగమోక్షసంపదలకు మూలంబు మోసలేదిది ఘనంబులకు ఘనము

---

1. పోతన - నిడుదవోలు వెంకటరావుగారు.
2. ఘంట సింగన్నకు ప్రసిద్ధుడైన నంది తిమ్మన మేనల్లుడు.
3. సంస్కృతవాఙ్మయచరిత్ర - మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు, పుట 137

జ్ఞానకర్మరహస్యసాధనంబును నిది యిది నవరసముల నీనుసురభి
షడ్దర్శనంబులు సరవి నిందున్నవి సందేహములు దీర విందుగాని
యిమ్మహారసపాకము నెరిగినట్టి - జను డెరుగడు మరి తల్లి చన్నుబాలు
దీని సరిచెప్ప మరిలేవు త్రిభువనముల - దొరక దీకృతి నీవంటిదొరకుగాని.
(ప్రబోధచంద్రోదయం, 1-21)

ఈ మహారసపాకం చవిచూశాక మరి పునర్జన్మ అన్నదే లేక, తల్లి చనుబాలు తాగక్కరలేదని ఈ గ్రంథాన్ని తెలుగులోకి అతియోగ్య కవీంద్రులచేత అనువదింపజేసి అంకితం పుచ్చుకొంటే, కస్తూరివాసన బంగారానికి అబ్బినట్లు, పసిడిరంగు కస్తూరికి కల్గినట్లు ఉంటుందని పెసరవాయ గంగయ్యామంత్రికి ఆశ్రితులు చెప్పారు. ఆ రోజుల్లో ఉదయగిరి ప్రాంతాలలో దూబగుంట నారాయణకవి, దగ్గుబల్లి దుగ్గన్న, నంది ఘంట కవులు మొదలైన సత్కవులున్నారు. వీరిలో ఎవరు దీనిని బాగా అనువదించగలరని గంగయ్యామంత్రి ఆలోచనలో పడ్డాడు. ఇటువంటి ఘననాటకాన్ని ప్రబంధశయ్యకు ఒనగూర్చనేర్చిన సుకవులు లోకంలో ఉన్నారా అని సందేహించాడు. లేకేం? నంది ఘంట కవులున్నారని పక్కనున్నవాళ్లు అన్నారు. పెసరవాయ గంగయ్యామంత్రి ఆ కవులను పిలిపించి తాంబూలమిచ్చాడు. వాళ్లు తర్జుమా చేశారు.

మన భారతదేశంలో హిందూమతం అనే పేరుతో ఏ ఒక్కటీ లేదు. గాని ఎన్నో దర్శనాలు ఉన్నాయి. ఆర్యులీదేశానికి వచ్చి, ఇక్కడి అనార్యుల పూజా విధానాలు కొన్ని తాము స్వీకరించి తమ మతాన్ని విస్తృతం చేశారు. ఆర్యుల సంప్రదాయాలను స్వీకరించి అనార్యులూ మార్పు చెందారు. సృష్టి ఎలా మొదలైంది, ఈ ప్రకృతి రహస్యాలేమిటి, మరణించిన మానవుడు ఎక్కడికి పోతాడు, ఉదయించిన సూర్యుడు ఎందుకు అస్తమిస్తాడు, మొదలైన ప్రశ్నలు వేసుకొని అన్ని దేశాలలోనూ, ఆది మానవులు తర్కించి తత్త్వజిజ్ఞాస చేశారు. బుద్ధి పరిణతి చెందిన నాగరికతలలో నివసించే మేధావులు అతి చక్కని దర్శనాలకు కారకులయ్యారు. భారతదేశంలో ప్రభవించిన దర్శనాలు ప్రతిభావంతమైనవి.

ప్రకృతిలోని వివిధ శక్తులను గుర్తించి వాటిని దేవతలుగా భావించి బహుదేవతారాధన చేసిన వైదిక ఋషులు చివరకు ఏకదేవతారాధన ప్రతిపాదించారు. వారు అసత్తులో సత్తుయొక్క యోజన సంబంధాన్ని కనుగొన్నారు. ఏకమైన సత్తే విశ్వకారణమని, దానినే నానావిధాల ఊహించి రకరకాల పేర్లతో పిలుస్తున్నామని, ఆ సత్తు మానవునిలో అంతర్వర్తి అని కొన్ని వేదసూక్తాలు చెప్తున్నాయి.[4] ఈ తార్కికచింతనలో పురోగమించి ఉపనిషత్తులొక నూతనదర్శనమైనవి.

బృహదారణ్యకోపనిషత్తు బ్రహ్మపదార్థాన్ని విశదం చేస్తుంది. బ్రహ్మము నిర్గుణం. అదేమిటో కచ్చితంగా నిర్దేశించలేం. 'ఇది కాదు, ఇది కాదు' అని మాత్రమే (నేతి నేతి) చెప్పగలం అంటుంది. విజ్ఞానం ఆనందం అంటుంది. మనిషి మరణించాక ఇంద్రియాలు

4. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 7వ సంపుటి దర్శనములు - మతములు, పుట 56.

పంచభూతాలలో కలుస్తాయి. ఆత్మ ఆకాశంలో లీనమౌతుంది. మరి పురుషుడెక్కడ ఉంటాడు? అని ప్రశ్నిస్తే ఈ ఉపనిషత్తు 'అది నల్గురిలో సమాధానం ఇవ్వవలసిన ప్రశ్న కాదు' అంటుంది. సమస్తం బ్రహ్మలోకమందు ఓతప్రోతం. మరి బ్రహ్మలోకం దేనిలో ఓతప్రోతం అని ప్రశ్నిస్తే ''అట్టి ప్రశ్నలు వేసినచో బుర్ర పగులును. ప్రశ్నల హద్దు దాటిపోకూడదని, దేవతల విషయమున అతిప్రశ్న కూడదు'' అంటుంది.[5]

ప్రశ్నించడం మానవనైజం. అడ్డుపెడితే బుద్ధి ఆగదు, తర్కిస్తుంది. ఆదిమభౌతిక వాదమైన లోకాయతదర్శనం, చార్వాకదర్శనం, తీర్థంకరుల దర్శనాలు, జైనం, బౌద్ధం మొదలైన వివిధ తాత్త్విక శాఖలు మూడు పువ్వులు ఆరుకాయలైనాయి. న్యాయ, వైశేషిక, సాంఖ్యయోగ, మీమాంస, వేదాంతాలు వికసించాయి.

మనకు ఆరు ఆస్తిక దర్శనాలూ, ఆరు నాస్తిక దర్శనాలూ ఉన్నాయి. వేదప్రామాణ్యాన్ని ఆస్తిక దర్శనాలు అంగీక దర్శనాలు ఎంత మాత్రం ఒప్పుకోవు.

ఆస్తిక దర్శనాలు	**నాస్తిక దర్శనాలు**
1. న్యాయము	1. చార్వాకము
2. వైశేషికము	2. సౌత్రాంతికము
3. వేదాంతము	3. వైభాషికము
4. మీమాంస	4. యోగాచారము
5. సాంఖ్యము	5. మాధ్యమికము
6. యోగము	6. అర్హామతము

ఆస్తిక దర్శనాలను అవలంబించి ఆరు మతాలు వర్ధిల్లాయి. 1. శైవం 2. వైష్ణవం, 3. శాక్తం, 4. గాణాపత్యం, 5. సౌరం, 6. కాపాలికం అనే ఆరూ దేశంలో ఇప్పటికీ అంతో ఇంతో ప్రచారంలో ఉన్నవే. నాస్తిక దర్శనాలను ఆరు పేర్లతో పిలిచినా నిజానికి అవి మూడే. సౌత్రాంతికం, వైభాషికం, యోగాచారం, మాధ్యమికం అనేవి బౌద్ధమతంలోని విభేదాలు. బౌద్ధాన్ని సౌగత్యం అనికూడా పిలుస్తారు. అర్హామతమంటే జైనమన్నమాట. నాస్తిక దర్శనాలలో చార్వాకం, బౌద్ధం, జైనం ఈ మూడే ఉన్నాయి.

ఇతర దర్శనాలలోని గుజ్జును స్వీకరించి వేదాంతం నాస్తిక దర్శనాలు సర్వస్వం అయింది. ఏ దర్శనంలో ఏముందో తెలియనంత దట్టంగా ఈ తత్త్వాలు ఆవరించాయి. వీటి సారాన్ని సంగ్రహంగా చెప్పవలసిన అవసరం ఏర్పడింది. సాధా[illegible] మానవులకు అంతుచిక్కని ఈ తార్కిక ఫలితాలను కథలాగ చెప్పవలసి వచ్చింది. అందుకే కృష్ణమిశ్రుడు ఈ నాటకం వ్రాశాడు.

చిదానంద నగరాన్ని ఈశ్వరుడు పాలిస్తున్నాడు. అతనికి మాయ అనే పట్టపురాణివల్ల మనస్సు అనే కుమారుడు పుట్టాడు. అతనికి ప్రవృత్తి, నివృత్తి అని ఇద్దరు భార్యలు. ప్రవృత్తివల్ల మహామోహుడు మొదలైన దుష్టులు, నివృత్తివల్ల వివేకుడు మొదలైన

5. తెలుగు భాషాసమితివారి 'దర్శనములు – మతములు', పుట 61.

శిష్టులు పుట్టారు. ఈ రాజకుమారులు కురుపాండవులలాగా రాజ్యం కోసం కలహించారు. మహామోహుడు రాజ్యాన్ని పాలించసాగాడు. వివేకాదులు అడవులు పట్టారు. వివేక మహారాజు ఉపనిషద్దేవిని పరిగ్రహించబోతాడనీ, ఆ దంపతులకు విద్యా, ప్రబోధ చంద్రులు ఉదయించబోతారనీ, తత్ఫలితంగా తనకు వినాశనం కలగబోతుందనీ మహామోహుడు తెలుసుకున్నాడు. వివేకుడామెను పరిగ్రహించకుండా ఎన్నో అవాంతరాలు కల్పించాడు. శ్రద్ధాదేవీ, ఆమె కుమార్తె శాంతీ కలిసి ఉపనిషద్దేవికీ, వివేకునికీ సమాగమం ఏర్పాటు చేయబోతున్నారని తెలిసి, మహామోహుడు శ్రద్ధను బంధింపజేస్తాడు. శాంతి ఆమెకోసం వెతుకుతుంది. జైన, బౌద్ధ కాపాలికులవద్ద అవినీతిగా సంచరిస్తున్న శ్రద్ధను ఆమె చూస్తుంది. కాని, ఆమె తన తల్లి కాదని, తామసి అనీ తెలుసుకుంటుంది. నిజమైన శ్రద్ధ విష్ణుభక్తి మహాదేవివద్ద ఉంది. చివరికామె వివేక మహారాజువద్దకు చేరింది. ఉపనిషద్దేవి జీవేశ్వరుని వద్ద ఉంది. ఆమె ఎన్నో కష్టాలుపడ్డాక వివేకుని కలుసుకోగలుగుతుంది. చివరకు ప్రబోధ చంద్రోదయం అవుతుంది.

వేదాంత పరిభాషలో ఉండే ప్రతిసంకేతాన్నీ సజీవవ్యక్తిగా రూపొందించి కృష్ణమిశ్రుడు ఆడించిన ఈ నాటకాన్ని నంది ఘంటకవులు చక్కగానే ప్రబంధశయ్యకు పట్టించారు. కథాప్రణాళికలో ఔచిత్యం కోసం చిన్న మార్పులు చేశారు. తమ సమకాలిక కవిత్వరీతులను రసవంతంగా చొప్పించారు. అయితే దురదృష్టవశాత్తూ ఇతర దర్శనాలపట్ల వేదాంతులకుండే అసహనం ఈ రచనలో విద్వేషంగా రూపాంతరం పొంది జుగుప్సను కలిగిస్తుంది. దిగంబర జైనులు, బౌద్ధులు, సోమసిద్ధాంతులు కొందరు తమ కాలంలో చెడుగా ప్రవర్తించవచ్చు. అంతమాత్రాన ఆ దర్శనాలను తిట్టనక్కరలేదు. వాళ్ళు వ్యభిచారాన్నే బోధించారని అబద్ధాలు ఆడనక్కరలేదు. చూడండి. దిగంబర జైనుడు ఇలా బోధించాడట.

> వినుడు ఋషి సేవ దగులం - గని మ్రొక్కగవలయునారు కాంక్షించిన భో
> జనమిడవలె వారలు దమ - వనితల రమియింప ఈర్ష్యవలువదు చేయన్.
>
> (ప్రబోధ. 3-15)

బౌద్ధుడు కూడా తన మతాన్ని ఇలాగే ప్రచారం చేశాడట. వినండి.

బ్రహ్మచర్యాదిప్రయాసంబుల గుండక, మనోహరమందిరంబుల వసింపుచు. మృదులశయనంబుల శయనింపుచు, నచ్చపువెన్నెలరేలు వృథపుచ్చక నిచ్చలు నిచ్చకువచ్చు మెచ్చులకొమరుమచ్చెకంటుల బచ్చవిల్తులీలం దేలింపుచు, సుఖియింప వచ్చు, ముక్తియుం బడయవచ్చు. సర్వసంస్కారంబులు క్షణికంబులు నాత్మయ స్థిరంబు గావున భిక్షకులు తమరారల నాక్రమించిన నుపాసకులను నీసడింపరాదు. (ప్రబోధ. 3-21)

ఈ జైనబౌద్ధుల యొద్దకు ఒక సోమసిద్ధాంతి వచ్చి తన మతాన్ని ఇలాగ చెప్పాడు.

> పార్వతీవనితగా భావనజేసి చక్కని చకోరేక్షణ గౌగిలించి
> తన్ను సదాశివాత్మకునిగా భావించి క్రీడించునత డిందుచూడమూర్తి.
>
> (ప్రబోధ. 3-41)

ఈ సిద్ధుడు రాజసశ్రద్ధాదేవిని రప్పించి బౌద్ధుని కౌగిలించుకోమంటాడు. అప్పుడు నంది ఘంటకవులీ పద్యాలు వ్రాశారు.

జవరాలగు కాపాలిని - కవుగిట దన మేను గజరుగజరులు వోగా
పవిరళసుఖమున హృదయం - బివతాళింపంగ బౌద్ధుడిట్లని తలచెన్.
వెనుకను నెంచర రండల - ఘనకఠిన స్తనుల రతుల గౌగిట జేర్చన్ గాన
నెన్నడు నీకాపా - లిని కౌగిటి సుఖములోని లేశం బయినన్ (ప్రబోధ. 3-46, 47)

బౌద్ధుడు, జైనుడు, సిద్ధుడు ఆ కాపాలినితో కలిసి తప్పతాగుతారు. దాని ఎంగిలిని బౌద్ధుడు తీసుకొంటాడు.

స్త్రీముఖంసందాకుచియటంచుబౌద్ధుండు - తత్ప్రసాదమధువుత్రాగిచొక్కి
దర్శనములలోన దలవ గాపాలిక-దర్శనంబు సుఖనిదర్శనముగ (3-55)

తాగుడు కోసం, కామిని కోసం బౌద్ధుడూ, జైనుడూ కాపాలికుని శిష్యులవుతారట. ఇటువంటి రోత పుట్టించే సన్నివేశాలను సృష్టించినంత మాత్రంచేత కృష్ణమిశ్రుడు బౌద్ధజైనమతాలను ఖండించాడని కొందరు భావిస్తున్నారు.[6] నిజంగా జైన బౌద్ధదర్శనాలు ఏమిటి బోధిస్తాయో, వాటినుంచి హిందూమతం ఎంతగా భావాలను ఎరువు తెచ్చుకుని సొంతం చేసుకొందో తెలుసుకోవచ్చు.[7] అప్పుడు కృష్ణమిశ్రుని అసత్యచిత్రణపై ఏవగింపు కలుగుతుంది. మూలాన్ని అనుసరించిన నంది ఘంటకవుల తప్పేం లేదు. మిగతా ఘట్టాలు బాగా నుడికారపు సొంపుతో అనువదించారు. చూడండి.

ఇది నాతల్లి యితండు తండ్రి యిది నాయిల్లీకళత్రంబు నా
యది నాబిడ్డలు వీరు నాహితులు వీ రీ వైభవంబెల్ల నా
యది యంచున్ జడమాససోదయు డవిద్యానిద్ర ఘూర్ణిల్లుచున్
సదసద్వస్తువివేకియయ్యుగనుసంసాతామిత స్వప్నముల్ (ప్రబోధ. 1-77)

ఆశకు అంతులేదన్న సామెతను దృష్టిలో పెట్టుకొని ఎంత చక్కగా అనువదించారో చూడండి.

పుడమిలో మాన్యంపుమడి కొంత కలవాడు గ్రామమెల్లను నేలగాదలంచు
గ్రామమేలెడువాడు కాంక్షించు గిరివనస్థలజలదుర్గనద్రాజ్య మేల
రాజ్య మేలెడువాడు రాజ్యవైభవమునహెచ్చి తానొక ద్వీపమేలగోరు
ద్వీపమేలెడు వాడు తేజస్వియై మహీవలయ మెల్లను నేల వాంఛచేయు
నిట్లు కడలేని యాసాస లీనుచుండ - జనులు బ్రహ్మాండకోటుల దనివినొంద
రనిన శాంతికి గాలూదనైన గలదె - యెడము మది తృష్ణ నీవింతవెడలితేని.
(ప్రబోధ, 2-64)

---

6. సంస్కృతవాఙ్మయచరిత్ర - లౌకికవాఙ్మయం, మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు, పుట 416.
7. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 7వ సంపుటి దర్శనములు - మతములు.

క్రోధుడు తన ధర్మపత్ని అయిన హింసతో ఇలా అంటున్నాడు.

పడతీ, తల్లిని తండ్రి జంపుట తృణప్రాయంబు తోబుట్టులన్
మడియంజూచుట లెక్కగాదనిన జన్మజ్ఞాతికీటంబులన్
గెడపంబూనుట నాకు దొడ్డె గుడిమ్రింగేవానికింద దల్పుల
ప్పడము ల్గావున బిల్లపిల్ల తరమున్ భక్షింతు దాయాదులన్. (2-67)

జీవపురుషుడు 'సవిస్తర భంగుల నన్ను తెల్పుమా' అని వివేకునితో అన్నాడు.

నావుడు వివేకు డిట్లను నావిభునిం జూచి తత్త్వమని యను వాక్యం
బేవివరించెద శాంతం - బైవెలిగెడు తత్త్వ మీవ యగు టెరుగబడన్.
ఇది నే గానిది నే గా - నిది నేగాననుచు నిశ్చయింపుచురా ని
ర్వదియైదు నడచియెయ్యది - తుది దోచెడి నదియె ఈవు ధ్రువమని పలికెన్.
(ప్రబోధ. 5-105, 106)

ఆదిమ సాంఖ్యంలో ఇరవైఅయిదు తత్త్వాలే వున్నాయి. వేదాంతుల మతంలో జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు, భూతాలు ఐదు. శబ్దాదివిషయాలు ఐదు, మనోబుద్ధి అహంకారప్రకృతి చిదాభాసులు ఐదుగురు - మొత్తం 25. 26వ వాడు పురుషుడు. ఇది తెలిశాక ప్రబోధచంద్రోదయమవుతుందట. అతడిలా ప్రవేశిస్తాడు.

కలుగునొ కల్గదో యవునొ కాదొకొ తోచునొ తోచదో మదిన్
నిలుచునొ నిల్వదొ యనెడు నిర్భదసంశయమెల్ల మాని ని
ర్మలసహజప్రకాశమహిమంబును బొందురు రెల్లవారు నే
గలిగినయట్టినాడయిదెకల్గితి నేను ప్రబోధచంద్రుడన్. (ప్రబోధ, 5-109)

ఈ వేదాంతమయమైన నాట్య ప్రబంధాన్ని అంకితం పుచ్చుకొన్న గంగయ్యామంత్రి 'సంసారయోగి' కావచ్చునేమోగాని ఆనాటి రాజకీయ చరిత్రలో ప్రముఖపాత్ర వహించిన వాడే. కటకం గజపతులకు, కర్ణాటక నరపతులకు జరిగిన యుద్ధాలలో పాల్గొన్నాడు. సాళువ నరసింగరాయలను ఒక యుద్ధంలో పురుషోత్తమ గజపతి సజీవంగా పట్టుకొన్నాడు. ఇందులో గంగన్నమంత్రి ఎంతగానో తన నయవిద్యాకరణ మహత్త్వం చూపించాడు. ఈ సంగతిని నంది ఘంటకవులిలా చెప్పారు.

శ్రీకరవీక్షణ - శ్రీకర నరసింహనృపవశీకర నయవి
ద్యాకరణ చతుర్దశ వి-ద్యాకర ధీరంగ మతియనంతయగంగా. (ప్రబోధ. 2-1)

సాళువ నరసింహరాయలను పురుషోత్తమ గజపతి క్రీ.శ. 1486లో ఓడించాడు.**[8]** ఆ తరువాత తాను పోగొట్టుకొన్న ఉదయగిరి, కొండవీటి దుర్గాలను సాళువ నరసింహ రాయలు తిరిగి గెలుచుకోలేకపోయాడు. ఈ చింతలో క్రుంగిపోయి మంచంపట్టిన

8. తెలుగుభాషాసమితివారి ఆంధ్రవిజ్ఞానసర్వస్వం, 3వ సంపుటి, తెలుగు సంస్కృతి, పుట 276.

నరసింహరాయలు తన సేనాపతి అయిన తుళువ నరసానాయకునికి ఇంకా ప్రాజ్ఞులుగాని తన చిన్న కుమారులను, రాజ్యభారాన్ని అప్పగించాడు. తుళువ నరసానాయకుడు చాలా దక్షుడు. ఇతడు శత్రురాజుల సామంతులను, వాళ్ళ ఆస్థానంలోని కవులను ఆకర్షించినట్టు కనబడుతుంది. గజపతుల సామంతులైన పూసపాటి బసవరాజుగారి మంత్రికి పుస్తకం అంకితమిచ్చిన నంది ఘంటకవులు కొన్నాళ్ళకు తుళువ నరసానాయకుని ఆశ్రయించారు. తుళువ నాయకులు ఉత్తరార్కాడు జిల్లా ఆరణి తాలూకాలోఉన్న దేవకాపురంలో ఉండేవారు. దీని అసలు పేరు దేవకీపురం, తుళువ నరసానాయకుని నాయనమ్మ పేరు దేవకీదేవమ్మ. ఆమె పేరున ఈ గ్రామం కట్టారు. అక్కడ బృహదంబదేవాలయం ఉంది. ఈ అమ్మవారికి తుళువవారు, సాళువవారు ఎన్నో దానాలు చేశారు. ఆ శాసనాలన్నీ నేటికీ ఆ దేవాలయంలో ఉన్నాయి.[9] ఈ దేవకీపురానికి నంది ఘంట కవులు చేరారు. కర్ణాటక సామ్రాజ్యాధిపతుల ఆశ్రయం కోరుకొన్నారు కాబోలు. ఆ రాజులకు 'ధరణీవరాహ' అనే బిరుదు ఉంది కనుక బహుశా వరాహపురాణం అనువదించి అంకితం ఇద్దామనుకొన్నారు. ఈ వార్త తుళువ నరసానాయకుడు విన్నాడు. పిలిపించి ఇలాగా అన్నాడు.

మీ రిరువురు నెప్పుడును శ- రీర ప్రాణముల క్రియ జరింతురు మిగులం
గూరిమికృతి బ్రతిపద్యము- జారుఫణితి జెప్పగలరు చాటువుగాగన్.

(వరాహ. 1-13)

కాబట్టి మీరు తలపెట్టిన వరాహ పురాణం నాపేర గావించండి అని విడెము ఇచ్చాడు. జంటకవులు ఆ పురాణాన్ని 1709 గద్యపద్యాలలో పన్నెండు ఆశ్వాసాలలో అనువదించారు. టేకుమళ్ల అచ్యుతరావుగారు చెప్పినట్టు ఈ వరాహ పురాణం నేతిబీరకాయ! ఇందులో వరహావతారపు కథ ఏమీ లేదు. ఆదివరాహమూర్తి భూదేవికి చెప్పిన కథల సంకలనమె ఈ పురాణం, పోనీ ఆ కథలైనా ప్రసిద్ధమైనవా అంటే కావు. పాడ్యమి మొదలు పున్నమ, అమావాస్యలదాకా రోజూ ఆచరించవలసిన వ్రతాలు, చేయవలసిన దానాలు, చైత్రం మొదలు ఫాల్గుణం దాకా పట్టవలసిన నోములు, ఇవ్వవలసిన దానాలు, కొన్ని స్థలపురాణాలు, ప్రాచీన భూగోళ విజ్ఞానం మొదలైనవి ఈ గ్రంథంలో ఉన్నాయి. ఇంత 'చప్ప'గా ఉండే పురాణాన్ని గొప్ప ప్రబంధంగా చేయడానికి నంది ఘంటకవులు ప్రయత్నించారు.

వసువు అనే రాజు సర్వసంగపరిత్యాగం చేసి పుండరీకాక్ష పారస్తవం చేశాడు. అప్పుడతని శరీరంనించి ఒక వికృతాకారుడు జనించాడు. అతడు ఆ రాజు పూర్వజన్మలో చేసిన బ్రహ్మహత్యాపాతకమే కాని ఇంకెవరూ కాడు. తొలిజన్మలో ఆ రాజు వేటాడుతూ పొరపాటున ఒక మునిని చంపినందువల్ల ఈ పాపం చుట్టుకొంది. దానిని పోగొట్టుకొనడానికి ఆ జన్మతోనే ఆ రాజు వ్రతాలు మొదలుపెట్టాడు. ఆ సమయంలో వేసవి వచ్చింది.

9. ఈ గ్రామాన్ని టేకుమళ్ల అచ్యుతరావుగారు గుర్తించారు. విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్ర - ప్రథమభాగం, పుట 246.

ఆ వేసవి ఎలా ఉందంటే - వినండి.

> జిలిబిలిమంచు కించిన్మాత్రమునులేక పంచబంగాళమై పారిపోవ
> చల్లదనంబెల్ల బల్లవాధరల నిబ్బరపుబ్బుపాలిండ్ల పంచ నొదుగ
> నుదకంబు తెకతెక నుడుక మీదికి రాక మడుగుల మీనంబు లడుగుచేర
> దశదిశాంతరముల దరచుగా విస్ఫులింగములు గ్రక్కుచు వడగాలి నుడియ
> సధ్వనీనుల గుండియ లవియ వాడి-చూపె మల్లీలతా వల్లరీపరాగ
> ధూసరంబులు దప్త ముక్తాసరములు-మాసరంబులు నైదాఘవాసరములు.
>
> (వరాహ. 2-64)

ఇటువంటి వేసవి రోజులలో శుక్రమాసంలో శుక్లపక్షంలో ఆ రాజు ఏకాదశీవ్రతం చేశాడు. అయినా బ్రహ్మహత్యా దోషం పోలేదు. ఎన్ని యజ్ఞదానాది పుణ్యకృత్యాలు చేసినా పోలేదు. చివరకు పుండరీకాక్ష పారస్తవంవల్ల ముక్తి పొందాడు. మోక్షానికి వెడుతూ ఆ రాజు బ్రహ్మహత్యకు ఒక వరం ఇచ్చాడు. ధర్మవ్యాధుడనే కిరాతుడుగా జన్మించమని దీవించాడు. అతడలాగ జన్మించాడు. ధర్మవ్యాధునికి అర్జునుడు అనే కొడుకు, అర్జునకి అనే కుమార్తె పుట్టారు. ఆమె పెరిగి పెద్దదై సంపూర్ణ యౌవనవతి అయింది.

ఈ సంగతి కూడా 7 పద్యాలలో నంది ఘంటకవులు చెప్పారు. ఆమె పెట్టుకొనే చుక్కల బొట్టును ఇలా వర్ణించారు.

> గ్రహణభయమున రవిసుధాకరులుహీను
> లై చికురబంధరాహుగ్రహంబుకడకు
> శరణువేడంగ వచ్చిన చాడ్పు దోప
> బెట్టు సిందూరమున జుక్కబొట్టు నొసల. (వరాహ. 2-117)

ఆమెకు ధర్మవ్యాధుడు పెళ్ళి చేశాడు. పెళ్ళికొడుకు మతంగముని కుమారుడు ప్రసన్నుడు. అత్తవారింటికి పంపుతూ ధర్మవ్యాధుడు ఇలా హితోపదేశం చేశాడు:

> కసరకుమీ కోపించిన - విసువకుమీ సేవచేయు వేళల నీగుల్
> గొవరకుమీ నీపాలికి - బిసరుహముఖియేడుగడయు పెనిమిటిసుమ్మీ.
>
> (వరాహ. 2-125)

అత్తవారింట కూతురును దిగవిడిచిన ధర్మవ్యాధుడు వెళ్లలేక వెళ్లలేక వెడుతూ 'దైవమా, పగవారికైన ఆడబడచులనీకె' అని చింతిస్తూ వెళ్ళాడు. అర్జునకి చాలా వినయవిధేయలతో అత్తింటి కాపురం చేస్తూంది. అయినా ఒకనాడు ఒక చిన్న తప్పునకు అత్తగారికి కోపం వచ్చింది. పళ్లు పటపట కొరుకుతూ ఇలా అంది:

> ఓసి దురాత్మురాల, మృగయూధముల న్మొరలెట్టగా మెడల్
> కోసి వధించు పాతకుని కూతుర బుద్ధులు చెప్పి చెప్పి నే

వేసరితిన్ మహాముని వివేకహీనుడు గాక యెట్టుగా
జేసె నినుం బ్రసన్నునకు శిష్టవిధిజ్ఞత లేని రక్కసన్? (వరాహ. 2-133)

'ఇంక నువ్వు నా యింట ఉండవద్దు పో' అని నెత్తురు కారేటట్టు కొట్టి తగలేసింది. అప్పుడు అర్జునకి ఇలా ఉందట.

ఇట్లు గొట్టిన కొట్టున నెఱ్ఱవారి - పుష్పకోమలిధవళకపోలతలము
గరుణపుట్టించె రాహువు కరచివిడువ - దొరుగునెత్తురుతోడి చందురునిపగిది.
(వరాహ. 2-135)

ఆమె పుట్టింటికి పోయి తండ్రితో చెప్పుకొంది. అతనికి రోషం వచ్చింది. 'మునిభార్య, నన్ను అలాగా దూషిస్తుందా? సరే, చూద్దాం పదమ్మా' అని వియ్యంకుని ఇంటికి వెళ్ళాడు. 'ఏం బావగారు ఇలా వచ్చారు' అని ఆయన అడిగాడు. ''మరేం లేదు. తమ ఇంట నిర్జీవభోజనం చేద్దామని వచ్చాను'' అన్నాడు ధర్మవ్యాధుడు. మతంగముని సరే అన్నాడు. మధ్యాహ్నాం కాగానే వంట అయిందన్నారు. భోజనాలకు కూర్చున్నారు. పదార్థాలన్నీ 'వ్రీహి, గోదుమ, యవల'తో చేసినవే. అయినా, ధర్మవ్యాధుడు అవేమిటో ఒక్కసారి చూపించమన్నాడు. చేటల్లో తీసుకువచ్చి చూపించారు. ధర్మవ్యాధుడు 'హరి హరీ' అని లేచిపోయాడు. 'అరె, ఏమొచ్చింది?' అని ఆశ్చర్యంతో అడిగాడు మతంగముని. 'రోజూ కనికథం లేకుండా అసంఖ్యాకమైన ప్రాణాలు గొని భుజించే ఘాతకుని యింట భోజనం చేయకూడదు. కాబట్టి పోతున్నాను. నిర్జీవభోజనం ఉంటే పెట్టండి అన్నాడు. 'ప్రతి ఏడూ ఒక విత్తనం లక్ష అయే జీవాలను మీరు తినడం లేదా?'' అన్నాడు. అంతటితో ఊరుకోలేదు. ఇలా కడిగేశాడు.

ఇలుపడి గల నా కూతురు కొలదియెరిగి జీవఘాతికూతురయనచున్
బలుకగ నోయి మునీ నీ-కులకామిని ఏ విశిష్టు కూతురు చెపుమా. (2-148)

ఆ తరువాత వియ్యంకులు రాజీపడ్డారుగాని ధర్మవ్యాధుడిలా శపించాడు. కనబంతాంతరధాత్రిపై నిది మొదల్గా సార్వకాలంబు నత్తకు కోడండ్రకు నొంటకుండెను' గాక అన్నాడు (2-150). ఆ తరువాత ధర్మవ్యాధుడు విష్ణునామస్తవం పఠించి వైకుంఠ దాసుడయ్యాడు.

మూలంలోని ఒక చిన్నకథను పెంచి ఇలా వ్రాశారు గాని ఇందులో ప్రబంధ లక్షణాలు లేవు. దీనిని శృంగారమయం చేయడానికి వీలులేదు. అందుచేత ఆ ముచ్చట ఇంకొక కథలో, ఈ పురాణంలోనే నంది ఘంటకవులు తీర్చుకున్నారు. ఆ కథ పేరు దుర్జయోపాఖ్యానం.

అనగా అనగా కృతయుగంలో సుప్రతీకుడనే రాజున్నాడు. అతనికి పిల్లలు లేరు. కాబట్టి తపస్సు చేయసాగాడు. దానికి మెచ్చుకొని వరం ఇవ్వడానికి దూర్వాసుడు

బయలుదేరాడు. సరిగ్గా అదే సమయానికి ఇంద్రుడు తన ఏనుగెక్కి షికారు బయలుదేరాడు. ఇద్దరూ సుప్రతీకుడు తపస్సు చేసే తోటలో తారసపడ్డారు. ఇంద్రుడు ఏనుగు దిగి దూర్వాసునికి అభివాదం చెయ్యలేదు. కోపిష్ఠిముని మండిపడి 'నీ ఇంద్రత్వం పోయి నేల కూలిపో' అని శపించాడు. ఆ నోటితోనే సుప్రతీకునికి కుమారుణ్ణి ప్రసాదించి దీవించాడు. ఆ కుమారుని పేరు దుర్జయుడు. ఈ దుర్జయుడు పుట్టడం, పెరగడం, దిగ్విజయం చెయ్యడం, వనవిహారానికి వెళ్ళడం, ఇద్దరమ్మాయిలని చూడడం, ఆ యువతులు చెలికత్తెలతో పుష్పాపచయం, జలకేళి చేయడం, నాయికానాయకుల తొలిసమాగమం. విడిపోవడం, నాయకుని విరహం, చంద్రుడు చల్లగాలి వగైరాలను తిట్టడం, వివాహం, విహారం, పుత్రజననం మొదలైనవన్నీ ఒకటి తరువాత ఒకటి చొప్పున సవిస్తరంగా నంది ఘంటకవులు వర్ణించారు. భావిప్రబంధాలకు తాము కూడా యథాశక్తి నమూనాలు తయారుచేశారు. వీళ్ల ప్రవేశపెట్టిన ఒక మార్పును అనంతర కవులు చాలా అనుసరించారు. ఈ కాలందాకా పూర్వ కవులు కూడా పుష్పాపచయాన్ని వర్ణించినా దానిని మామూలు ఛందస్సులలోనే చేశారుగాని వీళ్ళలాగా రగడలో చేయలేదు. నందిఘంట కవులు 32 పాదాలలో పుష్పాపచయం వర్ణించారు. ఓ పన్నెండు పాదాలు చూడండి.

మందగమున చొరకు చొరకు మావిమావిమోకలెల్ల
నిందువదన మనసువిరిగె నీడ నీడ నిలువనొల్ల
లేమ జాదిపువ్వు మొగ్గ లేదులే దురాశగాని
చామవృక్ష వాటి దిరుగజాలజాల సొలపు వూని
రామ మమ్ములూటిసేయ రాకు రాకుమారి ననుచు
హేమవర్ణ విరులు నాకు నీవు నీవు దాచికొనుచు
కొమ్మ ఇది నిజంబు పలుక గొంచెగొంచెపరచి ప్రేమ
తమ్మికంటి చంపకంబు దా సదా సగంధసీమ
నతివ నారదములు గోయ నందు నందు వేగ పొమ్ము
సతి తదీయ భాషణము పిసాళి సాళి జెప్ప జుమ్ము
సూనగంధి వెదకు తావి జొక్క జొక్కమైన దిక్కు
మానవతి గయాళిపొత్తు మాను మానుషంబె దక్కు. (వరాహ. 3-92)

నందిఘంట కవుల బాణీని అల్లసాని పెద్దన (మను. 3-84), భట్టుమూర్తి (వసు.13-149) వంటి ప్రసిద్ధులే అనుసరించి రగడలో పుష్పాపచయం చేయించారు. అయితే ఈ జంటకవులు తమ ప్రాచీనులను తాము అనుసరించకపోలేదు. శ్రీనాథుని అడుగుజాడల్లో నడచిన ఘట్టాలు కొన్ని వున్నాయి. కవిసార్వభౌముడు శృంగార నైషధంలో మందమారుతునికి నాయకుడు బాధపడడాన్ని చెప్పించాడు.

దీనినే నంది ఘంటకవులు కథానాయికల విరహంలో ఉపయోగించుకొన్నారు.

ఫణికన్యాముఖఫేలచందనగిరి ప్రత్యగ్రసంభూతభీ
షణదవానలకీలపాంథరమణీసంఘాత చేతోవిదా
రణపంచాశుగళస్త్రి శైత్యవిషధారాభస్త్రి సంతాపకా
రణ మీమఁ పసమీరణంబు సఖులారా మమ్ము మన్నించునే? (వరాహ. 4-28)

సాధారణంగా మన కావ్యాలలో నాయకుడు దక్షిణ నాయకుడేగాని ఇందులోలాగ ఏకకాలంలోనే ఇద్దరమ్మాయిల కోసం అతడు తహతహలాడడం, అతనికోసం వాళ్ళు తపించిపోవడం అరుదు. ఈ అమ్మాయిల పేర్లు సుకేశి, మిత్రకేశులు. వీళ్ళు సాహేతి, ప్రహేతి అనే దానవుల కుమార్తెలు. ఈ అమ్మాయిలు తన కెప్పటికేనా తలంబ్రాలు పోస్తారా అని నాయకుడు ఇలా తపిస్తాడు.

వెడవెడబయ్యెదల్ సడలి వ్రేకపు గుబ్బచనుంగవల్ బయ
ల్పడ వెడవింటి వేల్పునకు లక్తకరక్తిను తొంగలింపగా
నడుగులు గొంత యెత్తి కుసుమాంజలి యిచ్చినరీతి నాకునె
న్నడు దలబ్రాలు పోయుదురో నర్మసఖా తదరాళకుంతలల్? (వరాహ. 4-4)

పెళ్ళి చేసుకున్నాక ఇద్దరు భార్యలతోనూ ఎలా క్రీడించాలో కలలుకంటూ నర్మసఖునికి చెప్పుకొంటాడు.

ఒక సతి మత్సమర్పితసముజ్జ్వలహారముపై బరాకుగా
నొక చపలాక్షి మోవిచవి నొల్లనచొక్కుననుం దదీయనా
యకమున గాంచి వంచనవిహార మెరింగి సరోషయైన బా
లిక చరణంబులత్తుక చెలీ ధరియింతునొకో శిరంబునన్? (వరా. 4-11)

ఈ నాయకుని కోసం విరహంలో మునిగిన అమ్మాయిలు చంద్రుణ్ణి ఇలా తిట్టిపోసుకుంటారు:

వీని చంద్రికలు ద్రావిన చకోరికలకు మ్రింగుట భారమే యింగలంబు
వీని జన్మస్థానమైన వార్ధికి లోనుపరచుట భారమే బాడబాగ్ని
వీని నౌదలదాల్చు విషమలోచనునకు నాగుట భారమే హాలాహలము
వీని త్రొక్కుడు గారవించుప్రాగ్గిరికి సహింపజాలుట భారమే దవాగ్ని
మానవతులార! చూడు డామత్తచంచ-రీక మౌర్వీనినాదగర్జితకరాళ
భావసంభవనీరంధ్రబాణవృష్టి-గడలుగొన గానబడు చలిపిడుగువీడు.
(వరాహ. 4-28)

చంద్రుడు అట్టేకాలం వీళ్ళకు చలిపిడుగులాగ తోచలేదు. కోరిన కోరికలు ఫలించి ఇద్దరమ్మాయిలూ కోరుకున్న ఆ అబ్బాయిని పెళ్ళిచేసుకొన్నారు. ఆ తరువాత ఆకాశంలో వున్నది చంద్రుడో, సూర్యుడో కూడా వాళ్ళకు తెలియదు. వాళ్ళ విహారాన్ని జంటకవులు ఇలా చెప్పారు.

కలహించుటయే రాత్రియు - గలయుటయే పగలునయ్యె గాని తలంపన్
గలనైన లేవు మరివా-రలహృదయాంభోజములకు రాత్రింబగలున్

(వరాహ. 4-67)

ఆ తరువాత ఆ యిద్దరు కాంతలకు చెరో కొడుకు పుట్టారు. దుర్జయుడు కోటలో వుండక వేటలో మునిగాడు. పిల్లలమర్రి పినవీరయ్య వర్ణించినట్టే ఈ కవులూ వేటను విస్తరంగానే వర్ణించారు. వీళ్ళు చెప్పిన వేటకుక్కల పేర్లు వినండి.

చలమరి సూడుబంటు గరిసాన మిటారికటారికాడు బె
బ్బులి సురగాలి చోర బలుబూతము కాలరి కారుచిచ్చు కు
క్కల గరికట్టు వాపెటులుగండను పేరుల కుక్క లందలం
బుల పరుదెంచె సింగముల పోలిక భూతలభర్తవెంబడిన్. (వరాహ. 4-73)

కుక్కలకు అందలాలట! ఏం భోగం! తొలి రాయల యుగంనించి కవులు తమ కావ్యాలలో ఈ శునకాల పేర్లను ఎందుకు ఏకరువు పెట్టేవారో ఇప్పుడు బోధపడుతుంది. దుర్జయుడు తీరుబాటుగా వేటాడి ఒక ఆశ్రమానికి వెడతాడు. ఆ ఆశ్రమాన్ని వర్ణిస్తూ జంటకవులు ఇలా వుత్ప్రేక్షించారు.

కానను బులికి బుట్టిన కూన పూరి - మేయు నోటను సామెత మిథ్యగాగ
బులులు సైతము పాలమాని పూరి మేయు - నన్న దుష్టమృగంబుల నెన్న నేల?

(వరాహ. 4-97)

అది గౌరముఖుడనే మునిది. ఆయన రాజుకూ, పరివారానికీ ఆతిథ్యమిస్తాడు. అది రామాయణంలో భరద్వాజుని విందులాంటిది. మునివద్ద ఒక మణి వుంది. దాని ప్రభావం చేత లెక్కలేనంతమంది విలాసవతులు రాజుకూ, పరివారానికీ ఉపచారాలు చేస్తారు. పగలు సంపెంగనూనెతో తలంటుపోయడం దగ్గర్నుంచి రాత్రి కేళీసుఖందాకా అన్ని సౌకర్యాలూ ముని కలిగిస్తాడు. రాజుగారి శయ్యాగృహంలోకి ప్రవేశించిన వధూటి వర్ణన చూడండి.

కరిమయూరమరాళికలకు నొయ్యారమీనామిచ్చి నడపు నన్నంపునడపు
కమలకోరక చక్రకనకకుంభముల సౌష్ఠవము దోరణకట్టు చన్నుకట్టు
విషమాస్త్రశరమీనవిద్యుల్లతల సోయగములకు ములుచూపు కలికిచూపు
మధుకరశైవాలమఘవనీలంబుల నిగ్గుబైకొని కప్పు నెరులకప్పు
నొప్పుమీరంగ నరుదెంచె నొక వధూటి - నిరుపమానవిలాసమాణిక్య నేటి
ముఖరచరణతులాకోటి ముఖసుగంధ సంపదభివృద్ధి కరఘనసారవీటి.

(వరాహ. 4-159)

ఈ కావ్యం ఒకవిధంగా చారిత్రాత్మకమైనది. పై పద్యంలో 'ఈనాము' అనే అన్యదేశ్యం కనబడుతుంది. ఇంతకుముందు రగడలో 'లూటి' అనేది వుంది. మన ప్రాచీన

కవులు జాతిజీవనంలో కలిసిపోయిన ఏ పదాన్నయినా వాడడానికి ఎప్పుడూ తటపటాయించలేదు. కాకతీయ యుగంలో మన దేశానికి మహమ్మదీయులతో సంపర్కం ఏర్పడింది. మనవాళ్లు పలు భాషలు నేర్చుకొన్నారు. భీమఖండాన్ని అంకితం పుచ్చుకొన్న బెండపూడి అన్నమంత్రి నేర్చుకొన్న భాషలను శ్రీనాథుడు ఇలా పేర్కొన్నాడు.

అరబీభాష తురుష్కభాష గజకర్ణాటాంధ్రగాంధారమూ
ర్జరభాషల్ మళయాళభాష శకభాషాసింధుసౌవీరబ
ర్బరభాషల్ కరహాటభాష మరియుం భాషావిశేషంబుల
చ్చెరువై వచ్చు న రేటియన్ననికి గోష్ఠీసంప్రయోగంబులన్ (భీమ. 1-73)

తాము నేర్చిన కొత్త భాషలలోని మాటలు ఇటువంటి సంస్కారులు ప్రచారము చేయడంవల్ల, తరచు వాడడంవల్ల భాష శ్రీమంతం అవుతుంది. నంది ఘంటకవులు కొత్త మాటలు వాడడమేకాక చిత్ర, బంధ, గర్భకవిత్వాలలో కూడా తమాషాలు చేశారు. ప్రతిలోమానులోమకందం వ్రాశారు. చూడండి. తొలినుంచి చదివినా, కొసనుంచి చదివినా ఒకలాగే వుంటుంది.

సారసనయనాఘనజఘ-నారచితరతారకలికహారసారరసా
సారరసారహాకలికర-తారతచిరనాఘజనఘనాయనసరసా. (వరా.9-155)

ఈ కందపద్యంలో మరొక విశేషముంది. ఇది నిరోష్ఠ్యం, ఈ కవులకు సమకాలికుడైన పినవీరయ్య మరీ ఎక్కువగా చిత్రకవిత్వం వైపు మొగ్గలేదుగాని ఒక పాద భ్రమకం వ్రాశాడు. అంటే ఏ పాదానికాపాదం ఎటునుంచి చదివినా ఒకలాగే ఉంటుంది.

వీరవరకైరవరవీ-సారసభరసౌధయూధసౌరభసరసా
వారణరథ్యరణరవా-తారభవనతానమానతాననభరతా. (జై.భా. 8-221)

పినవీరయ్య ఇటువంటి మాటల గారడీ చేస్తే నంది ఘంటకవులు తమ ప్రజ్ఞ ఇంకా ప్రకటించారు. రెండక్షరాల తోటే ఒక కందపద్యం వ్రాశారు. చూడండి.

కాకలికాకలకలకల-కోకిలకులలీలకలులకులుకులకలుకే
కైకోకుకేలికొలకుల-కోకాలీకేలికులికికొంకకుకలికీ. (వరాహ.11-69)

పై ద్వ్యక్షరకందంలో క, ల అనే రెండక్షరాలే వివిధ గుణింతాలలో తిరిగాయి. 'న' అనే ఒకే అక్షరంలో కూడా జంటకవులు ఒక పద్యం చెప్పారు.

నాననననునిననూనన - నేనేనినునన్ను నెన్న నీనీమెను
న్నానౌననోన్నినానౌ- నేనే నను నన్ను నాన నేను నన్నన్. (10-90)

ఈ చిత్రకవిత్వాలేకాక కందద్వయగర్భభాస్కరవిలసితం (9-156), కందగర్భితమణి గణవికరం (11-112) వ్రాశారు. ఒక క్షురికాబంధంకూడా రచించారు (9-41),

ముద్రాలంకారాలలో తరళ, వనమయూరం, లయవిభాతి కూడ రాశారు. ఈ రచనా ప్రక్రియలన్నీ కవిత్వంలో భావుకత, రసానందాలకు బదులు శబ్దాలంకారాలు, చమత్కారాలు రాజ్యమేలడానికి ప్రయత్నాలు చేయడాన్ని సూచిస్తాయి. అయితే ఈ కవులు మంచి నుడికారం, శైలి, భావుకత వున్నవాళ్లే. చూడండి: ఈ వరాహపురాణంలో వాళ్లు కుప్పించిన జాతీయాలు కొన్ని - శాంతి చిత్తుడైన సామ్రాజ్యాధిపతికాలంలో రాజులు ''గాదములోని దోసకాయ''లవలె వున్నారట (3-24), తాటాకు చప్పుళ్లకు దయ్యంబులు వెరచునె (3-55), దుర్జయుని తురంగమ ధాటికి నిలువలేక ఇంద్రుడు పారి తిన్నాళ్ల తిప్పలు పట్టాడు (3-65), ఆలినొల్లని వాడు ఈలకూరలో ఉప్పు చాలలేదు అంటాడట (7-47), పిచ్చుకుంటుమీద భాగీరథిపోలె (7-98).

ఈ కవులు 1709 గద్య పద్యాలు వ్రాసిన వరాహపురాణం పూర్తిగా ఆంధ్రీకరించలేదు. కొంతే చేశారు. అయితే, వీళ్లు తెనిగించిన గ్రంథం ఇంకొకటి వుంది. అది భాగవతంలోని షష్ఠస్కంధం. దీనిని ఏర్చూరి సింగన అనువదించాడు. అయినా అతని తర్జుమా బాగులేదనో, లేక అతడు ఆంధ్రీకరిస్తున్నాడని తెలియకనో ఈ నంది ఘంటకవులు కూడా దానిని తెనిగించి నరాంకితం చేశారు. ఆ స్కంధం నేడు పూర్తిగా దొరకదు. అయినా లాక్షణికులు ఉదాహరించిన పద్యాలవల్ల కొన్ని వివరాలు తెలుస్తున్నాయి. ఈ షష్ఠస్కంధాన్ని శృంగారషష్ఠం అంటారు. కవుల షష్ఠమని దీనికే మరో నామాంతరం ఉంది. దీనిని రాచమల్లు వారి కవుల షష్ఠం అని కూడా అంటారు. వీళ్ల భాగవతానువాదంలోంచి పద్యాలు ఉదాహరించిన మొదటి లాక్షణికుడు ముద్దరాజు రామన్న (క్రీ.శ. 1580-1650). పొల్లుచెడి బిందువు అవడానికి ఉదాహరణగా అతడు శృంగారషష్ఠంనుంచి ఇచ్చిన ఉదాహరణ ఇది.

> చండాంశుప్రభ! చిక్క- తిమ్మయతనూజా! తిమ్మ! విధ్వస్తపా
> షండంబైనత్రిలింగ భాగవతషష్ఠస్కంధకావ్యంబునీ
> కుండక్కెం జతురాననత్వగుణయుక్తుల్ మీర వాణీమనో
> భాండారోద్ధత చూరకారబిరుదప్రఖ్యాతి సార్థంబుగన్. (క.సం. 1-35)

ఈ పద్యంవల్ల శృంగారషష్ఠం చిక్కతిమ్మరాజుగారి కుమారుడు తిమ్మరాజుకు అంకితమని తెలుస్తున్నది. ఈ పద్యాన్నే కూచిమంచి తిమ్మకవి కవులషష్ఠంలోనిదన్నాడు.[10] అందుచేత కవుల షష్ఠమన్నా, శృంగారషష్ఠమన్నా ఒకటే అని చెప్పవచ్చు. కూచిమంచి తిమ్మకవి కవులషష్ఠంలోనివని పధ్నాలుగు పద్యాలూ, శృంగారషష్ఠంలోనివని తొమ్మిది పద్యాలూ ఇచ్చాడు.

అడిదం సూరకవి తన కవిసంశయవిచ్ఛేదంలో ఉదాహరించిన ఈ పద్యం (1-99) శృంగారషష్ఠంలోని మంగళాచరణం.

10. సర్వలక్షణసారసంగ్రహం 47-వ పుటలో 98వ పద్యం.

శ్రీరామామణి సీత నాథుని యురస్సీమన్నిజచ్ఛాయ గ
న్నారం గన్గొని యాత్మ నన్యవనితేర్ష్యం బూన దత్కంధరర్
హరాంబున్నుచు నింక జూడు మ్మన దానౌటంద్రపంజెందజె
ల్వారు న్రాముడు ప్రోచుగాత చికతిమ్మాధీశుకు తిమ్మాధిపుర్.

ఈ పద్యంలో చిక్కతిమ్మాధీశుని కుమారుడు తిమ్మాధిపుడు ఎవరో తెలియదు. మానవల్లి రామకృష్ణకవిగారు ఇతడు ఆర్వీటి తిమ్మరాజు అన్నారు.[11] ఆర్వీటి వంశంలో ఉన్న ఏ తిమ్మరాజో తేలలేదు. అళియ రామరాజుగారి పెదతండ్రి ఒక తిమ్మరాజు ఉన్నాడు. చిన్నన్నగారి పేరు కూడా తిమ్మరాజే. క్రీ.శ. 1520లో కృష్ణదేవరాయలవారి సామంతుడో, మంత్రో అయిన ఒక చిక్కతిమ్మయ్యదేవుని కుమారుడైన తిమ్మరాజుదని మంగళగిరి నృసింహస్వామి ఆలయంలో ఒక శాసనం ఉంది. బహుశ ఇతనికే నంది ఘంటకవులు తమ శృంగారషష్ఠం అంకితమిచ్చి ఉంటారు.

ఇది పేరుకు శృంగారకావ్యమైనా ఇతర రసాలు కూడా బాగానే ఉన్నాయని ఉదాహరించిన పద్యాలవల్ల తెలుస్తున్నది. చిత్రకేతోపాఖ్యానంలో సవతులు విషం పెడితే చనిపోయిన బిడ్డవద్దకు తల్లి వెళ్ళిన ఘట్టంలోని పద్యం చూడండి.

పదముల్ తొట్రిల గౌనుదీప వెలయింపం దేవముల్డాల బ
య్యెద వక్షోరుహపాళిచేర గనుదోయిః బాష్పముల్ గ్రమ్మ గ
ద్గదకంఠంబున వాక్యముల్డడబడర్ దద్గేహముం జొచ్చి యా
సుదతీరత్నము గాంచె బాలుని మనశ్శోకానలజ్వాలునిః.

(ఆంధ్రకవితరంగిణి, 8వ సం. పుట 198)

తనకాలంనాడు బహుళ ప్రచారం పొందిన ఎన్నో గ్రంథాలలోంచి పద్యాలను సేకరించి పెదపాటి తన ప్రబంధరత్నాకరంలో శృంగార షష్ఠంలోని పద్యాలను ఎందుచేతనో చేర్చలేదు. అతడు మలయమారుతం సర్వన్న షష్ఠస్కంధంలోంచి ఒకటి గ్రహించాడు. చూడండి :

పోడియోవగనున్నవుదులుజక్కన లింకనక్కట సెగసెగాశాడకున్నె
సరిగామి నెంతయు జరులలో బడనున్నగిరులెల్ల నికబెచ్చుపెరుగకున్నె
పగిలి లోగరగెడు బంగారుకుండలుతల కెక్కి యటమీదజెలగకున్నె
కలగిన మాలూరఫలము లింకిటమీదగిట్టితి దీవుల బెట్టకున్నె
సద... గమ్మైన నున్నతీబాయవలసె
నక్కటా! మాకునని యని యాత్మ గుంద
మునుపు చింతాంధకారంబు మొనసె ననగ
నలినలోచన చను మొనల్ నల్లనయ్యె (?) (ప్రబంధరత్నావళి, పుట 182)

11. క్రీడాభిరామం, పీఠిక

నంది ఘంటకవులలో ఘంట సింగన్న మలయమారుతాంకితుడు. మలయమారుతం సింగన్న అనడానికి బదులు సర్వన్న అని జగ్గన్న పొరబడ్డాడా? లేక రాచమల్లు కవులే కాక మలయమారుతం సర్వన్న కూడా షష్ఠస్కంధం అనువదించాడా? ఇవి భావిపరిశోధనలవల్ల తేలాలి. పెదపాటి జగ్గన్న ఈ జంటకవుల రచనలను జమిలిగాకాక విడిగా ఉదాహరించడం కద్దు. నందిమల్లయ వ్రాసిన 'మదనసేనము'లోనివని ఒక గీతపద్యాన్ని, మూడు సీసపద్యములను జగ్గన్న ఉదాహరించాడు (ప్రబంధరత్నావళి, 338 నుండి 341). ఈ కావ్యాన్ని జంటకవిత్వం మొదలెట్టకముందో, లేక విడిపోయాకనో నంది మల్లయ్య వ్రాసి ఉంటాడు. చిన్నప్పుడు కాక ప్రౌఢనిర్భరవయః పరిపాకంలోనే వ్రాసినదని ఈ శ్లేష చెపుతుంది. చూడండి.

మెరుగుశృంగములందు మెదలకయున్నవి నీలమేఘంబులు నీరజాస్య!
వెన్నెలపులుగులు వేకువ చంద్రుపై దేలుచున్నవి చూడు తియ్యబోడి.
మింట నాగడపలు మెల్లమెల్లన నిచ్చి కానరావయ్యె నో కలువకంటి!
పారిజాతపుదీగ బహువర్ణపుష్పభారంబు మోపగలేదు కంబుకంఠి!
యనుచు దమలోన గర్భోక్తు లాడుకొనుచు
దనకు నుపచారములు సేయు ననుగుజెలుల
జూచి నవ్వుచు సహజన్య చూడనొప్పె
జారుదోహదలక్షణసహిత యగుచు. (ప్రబంధరత్నావళి, 841)

వెలుగునీడలలో సరోవరాన్ని వర్ణిస్తున్నాడు. చూడండి.

పరిపుల్లహల్లకప్రభలు నిండినచోట సాంధ్యచోటరాగచ్యుతి చౌకళింప.
వికచనీలోత్పలప్రకరస్థలంబుల గిరిగొన్న చీకట్లు గ్రేళ్లుదాట,
నిర్నిద్రకుముదవనప్రదేశంబుల దేటవెన్నెల పిల్లతీపులాడ,
వికసితకనకారవిందబృందంబులు బెరయు నీ రెండ చింపిళ్ళ గూయ,
బగలు రేయును దమలోన బగలు మాని - కలసి మెలసినబాగున గడలుకొల్పి
వివిధమహిమల దనరు నావిమలసరసి - జూచి నివ్వెరపడి రాజసూనుడపుడు.
(ప్రబంధరత్నావళి, 340)

నంది ఘంటకవులిద్దరూ కలిసి ఈ 'మదనసేనము' వ్రాసినా పెదపాటి జగ్గన్న మల్లయ ఒక్కణ్ణే ఉదాహరించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. ఇటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకపోలేదు. కస్తూరి రంగకవి తన రంగరాట్ఛందంలో నంది సింగన్న వామనపురాణంలోనివని రెండు లక్ష్యాలు ఇచ్చాడు. నంది మల్లయ్య, ఘంట సింగన్న అనే పేర్లేగాని నంది సింగన అనే పేరు ప్రసిద్ధమైనది లేదు. అయితే నంది మల్లయ్య తండ్రి పేరు సింగయ్య. చూడండి. వరాహపురాణం గద్య.

ఇది శ్రీమదుమామహేశ్వర ప్రసాదలబ్ధసారసారస్వతాభినంది, నంది సింగయామాత్య పుత్ర మల్లమనీషిమల్ల మలయమారుతాభిదానఘంట నాగయప్రధానతనయ సింగరాయ కవిపుంగప్రణీతంబైన శ్రీ వరాహపురాణం...

మల్లయ్య తండ్రి సింగన్న వామన పురాణం చెప్పాడా? అయితే ఆ సంగతి ఈ కవులు తమ కావ్యాలలో చెప్పుకోరా? అన్నది ఒక ప్రశ్నే.

తెలుగు భాషలోని తొలిజంట కవులైన ఈ నంది ఘంటకవుల గురించి ఇంకా చేయవలసిన పరిశోధనలు ఉన్నాయి.

భైరవ కవి

హరిశ్చంద్రుని కథా, నవనాథ చరిత్రా ద్విపద కావ్యాలుగా వ్రాసిన గౌరనకు భైరవుడనే కుమారుడున్నాడు. ఇతడు కూడా తండ్రిలాగా చాలా మంచి కవి. శ్రీరంగమాహాత్మ్యం, రత్నపరీక్ష అనే పద్య గ్రంథాలు వ్రాశాడు. కవిగజాంకుశం అనే లక్షణ గ్రంథాన్ని రచించాడు. ఈ మూడు పుస్తకాలవల్లా ఇతడు గౌరనకుమారుడని తెలుస్తూంది. కాని వీటిలో ఏ ఒక్కదానిలోనూ తన తండ్రి వ్రాసిన పుస్తకాల పేర్లను భైరవుడు చెప్పలేదు. అందుచేత కొంచెం సంశయించి సుప్రసిద్ధుడైన గౌరనకుమారుడేనా ఈ భైరవుడు అనే ప్రశ్న వేసుకోవలసివస్తుంది. దీనికి నిస్సందేహమైన సమాధానం చెప్పుకోవచ్చు. భైరవుని మూడు గ్రంథాలనుంచి సాక్ష్యాలు సేకరించి సమన్వయం చేద్దాం. శ్రీరంగమాహాత్మ్యంలో భైరవుడిలా గద్య వ్రాసుకున్నాడు.

> ఇది శ్రీమద్భ్రమరాంబావరప్రసాదలబ్ధసిద్ధ సారస్వతవిలాస గౌరన గౌరనామాత్యపుత్ర సుధీవిధేయ భైరవనామధేయ ప్రణీతంబైన శ్రీరంగమాహాత్మ్యంబను పురాణకథ.

ఈ గద్యవల్ల భైరవుని తండ్రిపేరు గౌరన అనీ, అతడు సారస్వతవిలాసుడనీ తెలుస్తుంది. ఈ శ్రీరంగమాహాత్మ్యంలోనే అవతారికలో కృతిపతి తనను పిలిపించి అంకితం ఇవ్వమన్నాడని చెప్పే సందర్భంలో తన స్వవిషయం భైరవుడే ఇంకా వివరంగా చెప్పుకున్నాడు.

> కృతవిద్యాఖురళీపరిశ్రమకళాకేళీవిలాసుం జన
> స్తుతిచారిత్రుని గౌతమాన్వయపవిత్రుం గౌరనామాత్యస
> త్సుతు గళ్యాణకవిత్వలక్షణసమర్థున్ సూక్తిముక్తాఫలా
> తతకాంతి స్ఫుట చంద్రికోల్లసిత విద్వత్కైరవున్ భైరవున్.

(శ్రీరంగమాహాత్మ్యం, 1-18)

ఈ పద్యంవల్ల కూడా భైరవుని తండ్రి గౌరన అనీ, అతడు గౌతమగోత్రుడనీ తెలుస్తున్నది. హరిశ్చంద్ర నవనాథ చరిత్రలు వ్రాసిన గౌరనకూడా గౌతమగోత్రుడే. ఈ పద్యంలోనే తాను 'కళ్యాణకవిత్వలక్షణసమర్థు'ణ్ణని భైరవుడు చెప్పాడు. అతడు లాక్షణికుడే 'కవిరాజ గజాంకుశం' అనే లక్షణ గ్రంథంలో చివర స్వవిషయం ఇలా చెప్పుకొన్నాడు.[1]

గణపర్ణాదుల మేలుగీడు వెలయంగా జెప్పె సాహిత్యం
క్షణదీక్షాగురుడైన గౌరన సుధీసత్పుత్రు డత్యుల్లస
ద్గుణరత్నాభరణుండు భైరవకవీంద్రుం డెందు దద్జ్ఞల్ దనుం
బ్రణుతింపం గవిరాడ్గజాంకుశము భూప్రఖ్యాతమై మించగన్. (78)

ఈ పద్యంవల్ల గౌరన సాహిత్య లక్షణదీక్షాగురుడని తెలుస్తుంది. గౌతమగోత్రుడూ, సారస్వతవిలాసుడూ, లాక్షణికుడూ అయిన గౌరన తెలుగు సారస్వతంలో ఒక్కడే కనబడుతున్నాడు. అతడు హరిశ్చంద్ర, నవనాథ చరిత్రలూ లక్షణదీపికా వ్రాసిన గౌరనకవే. భైరవుడు తన మూడు పుస్తకాలలోనూ తన తండ్రి భ్రమరాంబావరప్రసాదంవల్ల కవిత్వం చెప్పినవాడని విశదం చేశాడు. రత్నపరీక్షలోని ఈ పద్యం (4) చూడండి :

భ్రమరాంబాదేవికృపన్ - సముచితనిరపద్యహృద్యసాహిత్యకళా
క్రమవిమలప్రతిభామణి - క్రమవైభవశాలియైన గౌరనసుతుడన్.[2]

ద్విపద కావ్యాలూ, లక్షణదీపికా వ్రాసిన గౌరన కూడా భ్రమరాంబావర పుత్రుడే. హరిశ్చంద్ర ద్విపదలో చివర ఇలా వ్రాసుకున్నాడు.

భ్రమరాప్రసాదసంప్రాప్తకవిత్వ
సుమహితసామ్రాజ్య సుఖపరాయణుడు
చతురసాహిత్యలక్షణచక్రవర్తి
ప్రతివాదిమదగజపంచాననుండు
మతిమంతు డయ్యలమంత్రిపుంగవుని
సుతుడు గౌరనమంత్రి సుకవిశేఖరుడు
కవులెన్న నుత్తరకథ రచియించె. (హరి. ఉత్తర 2910–2916)

గౌతమగోత్రం, భ్రమరాంబావరప్రసాదం, లాక్షణికత్వం, సారస్వతవిలాసం అనే నాలుగు విషయాలలో ఏకీభావం కుదిరింది కనుక సుప్రసిద్ధుడైన గౌరనే ఈ భైరవుని తండ్రి అని చెప్పుకోవచ్చు. తండ్రిలాగే భైరవుడు కూడా రసత్కావ్యాలు వ్రాయడానికి ముందు లక్షణగ్రంథం వ్రాశాడు. గౌరన తాను ప్రతివాదిమదగజపంచాననుడనని చెప్పుకొంటే, భైరవుడు కవిగజాంకుశాన్ని తయారు చేసి చేత ధరించి వాళ్ల మదాన్ని పోగొట్టాడు. కవిగజాంకుశంలోని తొలిపద్యాలలో ఈ సంగతి చెప్పాడు:

1. 'కవిగజాంకుశం' ఆంధ్రసాహిత్యపరిషత్ పత్రిక 18వ సంపుటం 2వ సంచికలో ప్రచురితమయింది.
2. కొద్ది పాఠభేదాలతో ఇదే పద్యం కవిగజాంకుశంలో ఉంది. వాని నెంబరు 6.

సందడివడు లక్షణమును - పొందుగ దవళించి జాగుపోవిడచి సుధీ
బృందంబు మెచ్చ నే నొక - చందమ్మున గవి గజాంకుశమ్మను పేరన్
లక్షణ గ్రంథమొనరించి లాగుమీర - దానిగొని యేను గుకవిమాతంగములను
మదముదూలంగ గీపెట్ట పాలపువాడ - నని ప్రతాపించి పలికిన పలుకువినుడు.
(కవిగజాంకుశం - 4, 5)

ఇలా ప్రతాపించి అతడు వ్రాసిన లక్షణగ్రంథం చాలా ప్రామాణికమే అయింది. కొడుకు వ్రాసిన కవిగజాంకుశంలోని పద్యాలు తండ్రి రచించిన లక్షణదీపికలో సహితం కనబడుతున్నాయి. ఈ సంగతి కొట్టవచ్చినట్టు కనబడగానే, తండ్రి తన కొడుకు పుస్తకంలోంచి పద్యాలను ఉదాహరిస్తాడా అనే అనుమానం కలిగి అది లక్షణదీపిక వ్రాసిన గౌరనా, కవిగజాంకుశం వ్రాసిన భైరవుడూ తండ్రీ కొడుకులే అనే సిద్ధాంతానికి బాధకమవుతుంది. ఈ సంగతి తెలియజేస్తూ మానవల్లి రామకృష్ణకవిగారు ఇలా వ్రాశారు.[3]

''గౌరన తన లక్షణదీపికలో కవిగజాంకుశమువనుండి నాలుగు పద్యము లాంధ్రము లుదాహరించెను. పుత్రుని లక్షణగ్రంథంనుండి ఉదాహరించెనా యనునదియే సందియము. లక్షణదీపికాప్రతులు నాయొద్దను, బ్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునను కలవు. కవిగజాం కుశప్రతులు భిన్నదేశప్రతులు నాయొద్ద నాల్గు కలవు. చెన్నపురి యడయారు సంస్కృత పుస్తకశాలలో నొకటి కలదు. లక్షణదీపికలో నన్నిప్రతులలో నానాల్గుపద్యములు గవిగజాంకుశములోని వనియే యున్నవి. కవిగజాంకుశప్రతులలో నా నాల్గు పద్యములలో నేదియు గానరాదు... వాస్తవానికి లక్షణదీపికలో ఉదాహరించిన ఒక పద్యం భైరవుని కవిగజాంకుశంలో కనబడుచున్నది.''

తాము చూసిన ప్రతులలో కనబడనందున మానవల్లివారు ''లక్షణదీపికలో నుదాహరింపబడిన కవిగజాంకుశము మరియొక ప్రాచీనవిరచితమై ఉండునేమో'' అని అభిప్రాయపడ్డారు.[4] కాని కుమారుని కవిగజాంకుశంలోని పద్యాలే తండ్రి పుస్తకంలోకి లేఖకుల మూలంగా వెళ్లి ఉంటాయి. లక్షణదీపికలో రెండు కవిగజాంకుశాలనుండి ఉదాహరణలిచ్చారు. ఒకటి సంస్కృతగ్రంథం; రెండవది భైరవుడు తెలుగులో వ్రాసినది. ఆంధ్రసాహిత్య పరిషత్తువారి గ్రంథాలయంలో ఉన్న ఒక లక్షణదీపిక ప్రతిలో ఆంధ్రకవిగజాంకుశంలో ఆరు పద్యాలు కనబడుతున్నాయి. ఇవి స్వతంత్ర లక్షణాలు కావు. సంస్కృత లక్షణ గ్రంథాలలోని శ్లోకాలకు తెనిగింపులే. గౌరన లక్షణదీపికలో కవిగజాంకుశంలోని ఉదాహరణ కనిపించినప్పుడల్లా వానికి మూలమైన సంస్కృత శ్లోకం మొట్టమొదట విధిగా ఉంటున్నది.

3. శ్రీరంగ మహత్త్వం, పీఠిక పుట 4
4. లక్షణదీపిక, తాటాకుప్రతి, నెం. 1391

తండ్రి వ్రాసిన లక్షణదీపికలోని ఉదాహరణలను భైరవుడు అనువదించి తన గజాంకుశంలో పొందుపరిచి ఉంటాడు. వాటిని అనంతర లేఖకులు లక్షణదీపికలో పొందుపరిచి ఉంటారు. మూలశ్లోకాలనూ, అనువాదాలనూ పరిశీలిస్తే ఈ సంగతి స్పష్టమవుతుంది.

లక్షణదీపికలో ఇచ్చిన ఆంధ్రకవి గజాంకుశంలోని పద్యాలను వరుసగా చూద్దాం. మొదట ఈ పద్యం కనబడుతుంది.

మగణంబు పద్యముఖమున - సగణముతోకూడి జెప్పజనుకృతి యుండెన్
దగు పద్య మొండె గర్తకు - సగణితముగ నిష్టసిద్ధులయ్యెడు కొరకున్.

(లక్షణ, తృతీయ)

ఇది అలంకారచూడామణిలోని శ్లోకానికి అనువాదం.

కర్తుః కారయితుశ్చైవ మగణో బుధకర్తృక:
సగణేన సమాయుక్త స్సర్వకామఫలప్రదః

ఈ శ్లోకాన్ని పై తెలుగు పద్యానికి ముందు గౌరన ఉదాహరించాడు. ఇక రెండవ పద్యం.

ఆరోగ్యకరుడుభాస్కరు - డారయ జగణమున కొడయుడది మొదలిడగా
నేరోగము పైకొనదా చేరువ చుట్టంబు గణయు చేర్చిన చాలున్.[5]

(లక్షణ. తృతీయ)

ఇది సాహిత్యరత్నాకరంలోని శ్లోకానికి అనువాదం.

జగణస్సూర్యదైవత్యో రుజం హంతిన దోషకృత్
గణానా ముత్తమాజ్ఞేయా గ్రహాణాం భాస్కరో యథా

'తథానుమతః ఆరోగ్యం భాస్కరా దిచ్ఛేత్ ఇతి' అని గౌరన చెప్పాడు. తరువాత పై తెలుగు పద్యం లేఖకుడు ఉటంకించాడు. ఇక మూడవది.

పరుసవేదితోడ బెరసిన లోహంబు - జాతకరూపమైనచందమునను
సారమైనగణసంగతితనకీడు - మాని దుష్టగణముమంచిదౌను. (లక్షణ. తృతీయ)

ఇది కూడా ఒక శ్లోకానికి అనువాదమే. సాహిత్య చంద్రోదయంలో ఇలా ఉందని గౌరన ఉదాహరించాడు.

నగణస్య సమీపస్థో దుర్గుణ శ్శుభదో భవేత్
అయః కాంచనతా మేతి స్పర్శాద్ధి స్పర్శవేదినః

ఈ శ్లోకం తరువాత కవిరాజగజాంకుశంనుండి ఒక శ్లోకాన్ని గౌరన ఉదాహరించాడు.

5. ఇది పరిషత్తువారు ప్రచురించిన కవిగజాంకుశంలో 42వ పద్యం. తొలిపాదంలో 'ఆరోగ్యప్రతుడగు నిను' అని పాఠాంతరం ఉంది.

పర్వతానాం యథా మేరు స్సురాణాం శంకరో యథా
మృగాణాంచ యథా సింహో గణానాం నగణ స్తథా.

దీని అనువాదం తెలుగు కవిరాజగజాంకుశంలో కనబడదు. ఆంధ్రగోకర్ణఛందంలోని ఈ క్రిందిపద్యం ఉదాహరించాకనే కవిగజాంకుశంలోని పరుసవేది పద్యాన్ని లేఖకుడు పేర్కొన్నాడు.

ఏగణము గదిసె నగణం - బాగణము సమస్తమంగళావాసంబై
రాగిల్లు వినుము పరుషము - తో గదిసినపసిడివన్నె దూకొనుమాడ్కిన్.

సాహిత్య చంద్రోదయంలోని 'నగణస్య' అనే శ్లోకాన్ని ప్రమాణంగా చూపాక దానికి అనువాదమైన రెండు తెలుగు పద్యాలు ఉదాహరించవలసినంత అవసరం గౌరనకు ఎందుకు కలిగింది? ఇంక తరువాతి తెలుగు పద్యాన్ని చూద్దాం.

మృతుడగు పద్యాదిని దా - మృతనక్షత్రంబు లిడిన మేదిని సౌఖ్యా
న్వితుడగు నమృతము లనన - ప్రతిమములగు తారకములు పద్యాదినిడన్.
(లక్షణ. చతుర్థ)

దీనికికూడా సంస్కృతమూలం ఉంది. గౌరన మొదటనే అది చెప్పాడు.

జీవపక్షే సితే చంద్రే కార్యం స్యాదమృతోపమం
మృతపక్షేమృతం జ్ఞేయం యా పచ్చంద్రబలాబలం.

దీని తరువాత నక్షత్రయోనుల గురించి చెప్పే సీసపద్యం కనబడుతుంది.

గుఱ్ఱంబుకరియును గొఱ్ఱెయు ఫణియుగం
బును పిల్లియును మేషమును మహోగ్ర
మూషకయుగమును మునుకొనిధేనువు
సెనుమును బులియును నేనుగుయును
పుండరీకమును నేణమును నక్కయుగపి
పరయుగళంబు వానరము హరియు
గుఱ్ఱంబు మృగపతి గొఱ్ఱెయు గరిణియు
నానొప్పునక్షత్రయోనులివియ
ఎలుకపిల్లి సింహమేనుగ వానర
పులియు పన్నగంబు ముంగిసయును
నొనరవైరివర్గమగు వాని బద్యాది
నిలుపదగదు పొంతు దెలిసి వాని. (లక్షణ. చతుర్థ)

దీనికి కూడా సంస్కృతమూలం ఉంది. 'రత్నమాల'లోని 'అశ్వేభాజఫణి ద్వయంచ' అనే శ్లోకాన్ని గౌరన ఉదాహరించాడు. ఈ సీసపద్యం భైరవునిది కాదేమో అన్నంత

పేలవంగా ఉంది. ఇందులోని భావాలు కవిగజాంకుశంలోని ఇతర పద్యాలలో కనబడతాయి.

ఉరగంబు ముంగిసయును
హరిణంబును కుక్కుటంబు నావును బులియున్
దరుచరమును మేషంబును
దురగము మహిషమును జెలిమి దొరయును మరియున్. (కవిగజాంకుశం. 54)

లక్షణదీపిక ప్రతి విలేఖకుడు పొరపాటున పై సీసపద్యం భైరవునిదని వ్రాసి ఉంటాడు. అలా పొరపడడానికి ఆస్కారం ఉంది. ఈ పద్యం తరువాత మాతృకాపూజావిధానంలో 'కలువలకొప్పుదీర్చి' అనే పద్యం ఆంధ్రకవిగజాంకుశంలోనిదని లక్షణదీపికలో కనబడుతున్నది. అయితే ఇది అధర్వణఛందంలోనిదని కస్తూరి రంగకవి ఉదాహరించాడు. (రంగ. 2-270)

ఈ పరిశీలనవల్ల లక్షణదీపికలో ఇచ్చిన వివిధ సంస్కృత ప్రమాణాలకు అనువాదాలు అదనంగా ఉన్నాయన్నది స్పష్టమవుతుంది. ఇవి బహుశా తండ్రి గ్రంథానికి కొడుకు వ్రాసుకొన్న పుత్రికలో చేరిన పద్యాలు కావచ్చుగాని, తండ్రి తనంతట తాను ఇచ్చిన ఉదాహరణలు కావని చెప్పవచ్చు. అయితే అనంతరలాక్షణికులు భైరవుని కవిగజాంకుశంనుండి ప్రమాణాలు ఉదాహరించారు. ఈ లక్షణ గ్రంథంలో అతడు బహుశా ఈ క్రింది పద్యంలో చెప్పిన విషయాలన్నీ రచించి ఉంటాడు.

శబ్దార్థరూఢిరసస్థితిబహువిధవ్యంగ్య భేదములు భావములు గతులు
శయ్య లలంకారసరణులు రీతులు పరిపాకములు దశప్రాణములును
వృత్తులు వస్తువివేకంబు గుణములు గవిసమయము జమత్కారములును
వర్ణనంబులు గణవర్ణఫలంబులు దత్కులంబులు సధిదైవతములు
గ్రహములు శత్రుమిత్రయోగములు దశలు
నంశవేధయు భూతబీజాక్షరముల
పొత్తువులు దెల్పి శాంతవిస్ఫురణదనరు
సత్కవీంద్రుని కృతి బుధసభల వెలయు. (శ్రీరంగమాహాత్మ్యం, 1-12)

ఇన్ని విషయాలలో, బహుశా కవిగజాంకుశాన్ని భైరవుడు వ్రాసినా అందులోని 78 పద్యాలు మాత్రమే నేడు లభ్యమవుతున్నాయి. ఈ కృతిని భైరవుడు నూనూగు మీసాల నూత్నయౌవనంలో వ్రాసి ఉంటాడు. అప్పటికి అతడూ తండ్రిలాగే భ్రమరాంబాభక్తుడు. కవిగజాంకుశం ప్రారంభంలో ఇలా చెప్పుకున్నాడు.

శ్రీమత్పరమసితానన - తామరసవికాసలీల దగిలి భ్రమరాం
బామధుమత్తభ్రమరిక - నామనసరసీరుహంబునన్ భ్రమయించున్.

అని ఇష్టదేవతా ప్రార్థనంబు జేసి... లక్షణగ్రంథాన్ని విరచించాడు. అప్పటికే అతడు ఉభయభాషాపారీణుడు. దుష్కవి పిశాచాలను అదలించే భైరవుడనని ఇలా చెప్పుకొన్నాడు.

భైరవుడ నుభయభాషా - పారీణుడ లోభిభవనభవభూమివ్యా
పారసవికారదుష్కవి - ఘోరపిశాచుల వదల్చుకొను భైరవుడన్.[6]

(కవిగజాంకుశం, 7)

తన పేరులోని భైరవత్వాన్ని సమర్థించుకొనడానికి ఇలా పద్యం వ్రాశాడేగాని అతడంత భయంకరుడు కాదు. సద్గుణరత్నాభరుణుడు (కవిగజాంకుశం, 78)

రత్నాలను గురించి భైరవుడు చాలా సాధికారంగా మాట్లాడగలిగిన ప్రామాణికుడు. అతడు 'రత్నపరీక్ష' అనే శాస్త్రీయ గ్రంథం వ్రాశాడు. అందులో నవరత్నాల నామాలు, వాటి లక్షణాలు, దోషనివారణలు మొదలైనవి 79 పద్యాలలో వ్రాశాడు. శుద్ధమైన వజ్రం ఎలా ఉంటుందో ఇలా చెప్పాడు.

దాకటిమీద పెట్టి బెడిదంబుగ సమ్మెట వేయ భిన్నమై
పోక జలంబులో మునిగిపోవక యెప్పుడు లోహపత్రి కిన్
జేకొని వ్రాయరేఖవిలసిల్లని వజ్రము వజ్రమిద్ధరన్
బ్రాకటరీతిదాల్చునట భర్గు డొసంగు శుభంబు లెప్పుడున్ (రత్న. 27)

లోపాలున్న వజ్రాలను ధరిస్తే యముడు తిట్టినట్టు చస్తారట (రత్నపరీక్ష 25), సున్నం పూసినా బాలసూర్యునిలాగ ప్రకాశించే పచ్చ అరవై నాల్గువేల దీనారాల వెల చేస్తుందట (రత్నపరీక్ష 32). ఈ రత్నపరీక్షను భైరవుడు ముదిగొండ కేదారయ్య కోరికపై ముదిగొండ వీరభద్రునికి అంకితం ఇచ్చాడు (రత్నపరీక్ష 1-3). ముదిగొండ గ్రామం తెలంగాణాలో ఉంది.

ఏ కావ్యమైనా ఆవిర్భవించడానికి కొన్ని చారిత్రక పరిస్థితుల నేపథ్యం ఉంటుంది. 'రత్నపరీక్ష' వంటి శాస్త్రగ్రంథాలు కొన్ని కొన్ని ప్రత్యేకమైన సాంఘిక, రాజకీయపరమైన అవసరాలవల్ల నిపుణులు రచించవలసివస్తుంది. భైరవుడు ఈ గ్రంథ రచన చేయడానికి కారణం ఏమై ఉంటుందో ఆలోచించి పరిశోధకులు 'కొంత సమాధానముగా నుపకరించవచ్చునని' ఇలా చెప్తున్నాడు.[7]

''మహబూబునగరం జిల్లాలోని - అచ్చంపేట తాలూకాకు చెందిన నేటి అమరాబాదు (గ్రామము) పీఠభూమికి పూర్వము ప్రతాపగిరి సీమయని పేరు. ఈ పీఠభూమిపైగల మద్దిమడుగు ఒకనాడు పట్టణము. అప్పుడిది రవ్వలపేట. దీని సమీపములోనే గల 'తీగల మాను' వద్ద ఆనాడు వజ్రములు కాల్చి తీసేవారు. అప్పుడు తవ్వి విడిచిన గనులు నేటికీ గలవు... రాచకొండ-దేవరకొండ-పద్మనాయకుల పరిపాలన

6. ఈ పద్యమే రత్నపరీక్షలోకూడా ఉంది. దాని నెంబరు 5.
7. రంగాచార్య - (సం. శ్రీరంగమాహాత్మ్యం - పీఠిక - పుట XLI)

సమయమందీ ప్రాంతము దేవరకొండలోనిదే. ఆనాడు భూమిలో గల రత్నాలు వెలికితీసి పరీక్షించుట, వ్యాపారము జరుగుట, సంభవించుట వలననే భైరవుడు రత్నపరీక్షను తెనిగించి మరికొన్ని విషయములు క్రోడీకరించి యుండవచ్చు.''

వాస్తవానికి ఒక్క దేవరకొండ రాజ్యం మాత్రమేకాక తెలుగుగడ్డ వజ్రాలసీమ. కృష్ణానది ప్రవహించినంతమేర వజ్రాలు దొరికే చోటే. గుంటూరు జిల్లా చేజర్ల దగ్గర, సత్తెనపల్లి తాలూకా కొల్లూరుదగ్గర, నూజివీడు తాలూకా మలపల్లి, గొల్లలపల్లె దగ్గర, కర్నూలు జిల్లా జన్నంపల్లె, మానిమడుగు, రామళ్ళకోట ఇలాకాల దగ్గరా, అనంతపురం జిల్లా వజ్రకరూరుదగ్గర వజ్రాలు దొరుకుతూ ఉండేవి. కొల్లూరుదగ్గరే కోహినూరు వజ్రం దొరికిందని కథలుగా చెప్పుకొంటారు. క్రీ.శ. 1679 ప్రాంతాలలోని తూర్పు ఇండియా కుంఫిణీ ఏజంట్ల కథనం వల్ల తెలుగుదేశంలోని వజ్రాల గనుల వైనాలు తెలుస్తున్నాయి.[8]

'రత్నపరీక్ష' గ్రంథాన్ని రచించమని కోరిన ముదిగొండ కేదారయ్య బహుశా గనుల గుత్తదారు కావచ్చును. సర్వసాధారణంగా గనులుండే భూములను గుత్తదారులు పాడుకుంటారు. సర్కారుకు చెల్లించవలసిన వాటా చెల్లిస్తారు. తెలుగుగడ్డ ఇంతటి వజ్రాలసీమ అయినా రత్నపరీక్ష గ్రంథంలో ఈ సంగతిని భైరవుడు చెప్పలేదు. 'వజ్రములు పుట్టుస్థలములు' ఎక్కడెక్కడ ఏయే కాలాలలో ఉన్నాయో ఇలా వివరించాడు.

మహిశైల మాతంగ మహితస్థలంబుల
నుదయించునవి కృతయుగమునందు
గురుతర కాశ్మీర కోసలోద్భవములై
కరమొప్పు త్రేతా యుగంబునందు
బౌండ్రక సౌరాష్ట్ర భవ్యదేశములందు
బ్రభవించి వెలుగు ద్వాపరమునందు
వైరాట సింధువిదూరదేశములందు
విలసిల్లు గలియుగవేళ నిపుడు

విమల వజ్రంబు లీరీత క్రమము మెఱసి
నిజసముత్ఫుల్ల కాంతుల నిఖిలదిశల
నిగుడు ధగధగ మెఱయును నిండి తనసు
మంత్రతభ నూర్కొని మెండు మెఱయ (రత్నపరీక్ష. 21)

త్రిలింగభూమి 'వజ్రాలునికిపట్టు' అని భైరవుడు చెప్పకపోయినా ఉత్తరోత్తరా తెలుగుసీమకు రాజధాని అయిన 'గోల్కొండ' అన్న స్థలనామ రత్నాలకు పర్యాయపద మైంది. ప్రపంచ భాషలలో విస్తారంగా వ్యాప్తి చెందిన ఇంగ్లీషులో గోల్కొండ అన్న పదానికి 'ఎ రిచ్ సోర్స్ ఆఫ్ వెల్త్' అనే అర్థాన్ని చాంబర్స్ నిఘంటువు ఇస్తూ ఒకనాడు వజ్రాలు సానపెట్టే నగరం ఇప్పుడు శిథిలమై హైదరాబాదు వద్ద ఉన్నదని వివరణ కూడా చెప్తుంది.

8. ఆరుద్ర వ్యాసపీఠం, పుట 77

చాపచిరిగినా చదరంత అని నిన్నటిదాకా అనంతపురం జిల్లా గుత్తి తాలూకా దగ్గరున్న వజ్రకరూరులో వర్షం వెలసిన తర్వాత వజ్రాలు బయటపడుతూ ఉండేవి. సాధారణ గ్రామీణులు అన్నం మూటలు కట్టుకొని వజ్రాలు వెదకడానికి వెళ్లేవాళ్ళు. వాళ్ళ వాళ్ళ అదృష్టాన్ని బట్టి వజ్రాలు దొరుకుతూ ఉండేవి. సాధారణ గ్రామీణుల సంగతేమోగాని సాహిత్య పరిశోధకులు కూడా వెదకడం మొదలుపెడితే ప్రాచీన కవులలో గౌరన వంటి పద్మరాగం, భైరవుని వంటి రవ్వలు దొరుకుతారు. గౌరన, భైరవుడు రాచకొండ పద్మనాయకుల కొలువులోనున్న మంత్రుల కుటుంబంలోనివాళ్లు. భైరవుడు ప్రౌఢ రచనలు చేసే కాలానికి రాచకొండ దేవరకొండ రాజ్యాలలో రాజకీయమైన మార్పులు వచ్చాయి. రెండవ అల్లావుద్దీన్ అహమ్మద్ క్రీ.శ. 1435లో బహమనీ రాజ్యపు గద్దె ఎక్కాడు. అతడు తన తమ్ముడు ముహమ్మద్ ఖానుకు రాచకొండ జాగీరును ఇచ్చాడు. పద్మనాయకరాజ్యం పరాధీనమైంది. రాచకొండ ప్రభువుల సేవలో ఉండే మంత్రులు మహమ్మదీయుల కొలువులో చేరారు. భైరవుడు ఈ మంత్రులను ఆశ్రయింప వలసిన అవసరం వచ్చింది. అతడు చాగయ రామదేవపండిత మహాప్రధానికి శ్రీరంగమాహాత్మ్యం అంకితం ఇచ్చి ఆయన పోషణలో ఉన్నాడు. ఈ మంత్రి చిన్నన్నగారు ఇమ్మడి సైఫఖాను వద్ద అమాత్యుడుగా ఉండేవాడు. విజయనగరంమీద బహమనీ సుల్తానులు క్రీ.శ. 1443-44 సంౕలలో చాలా విజయవంతమైన దండయాత్ర చేశారు.[9] ఆ యుద్ధంలో విఠ్ఠలదేవుడు పాల్గొని ప్రశంసలు పొంది ఉంటాడు. భైరవుడు ఈ విజయాన్ని ఇలా గ్రంథస్థం చేశాడు.

పటుధాటీముఖజృంభమాణకలహప్రౌఢార్థ సంఘాతవి
స్ఫుటరింఖాపుటకోటిఘట్టనపరిక్షుణ్ణక్షమోద్యద్విశం
కటధూళీ పటల ప్రశోషితమహాకర్ణాటేనాసము
ద్భటపాథోనిధి విఠ్ఠలేంద్రు బురణింపన్ మంత్రు లేరీ ధరన్?

(శ్రీరంగమాహాత్మ్యం, 1-42)

ఈ విఠ్ఠలమంత్రి తమ్ముడు రామదేవపండితుడు కూడా చాలా పరాక్రమవంతుడు, తురగారోహరేవంతుడు, అమిత సాహసుడు. ఇతడు కూడా తన మహమ్మదీయ ప్రభువులతో కర్ణాటకంపైన చేసిన యుద్ధాలలో పాల్గొన్నాడు. శ్రీరంగమహాత్మ్యం షష్ఠ్యంతాలలో భైరవుడు ఇలా చెప్పాడు.

సింహతలాటాంకున కువ - సంహృత కర్ణాటకటకజననాథచమూ
రంహునకు జారులక్షణ - సంహానునకు నమిత భాగ్యసంపన్నునకున్.

(శ్రీరంగమాహాత్మ్యం, 1-60)

అని చెప్పి శ్రీరంగమాహాత్మ్యం భైరవుడు అంకితం ఇచ్చాడు. ఈ రచన చేసే వయసు వచ్చేసరికి రాజకీయ పరిస్థితులే కాదు, భైరవుని దృక్పథంలో కూడా మార్పు వచ్చింది. ఆదిలో భ్రమరాంబా భక్తుడైన ఇతడు వైష్ణవుడయ్యాడు. ''సకలధర్మంబులందును

9. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, సంపుటి 3, పుట 360.

సాత్వికంబు పరమధర్మం బిది అవలంబించి చరియించునిర్మలాత్ములు మనోవాక్కాయ కర్మంబుల పరాత్మలగునెల్లవారికి గురువులు'' అని భైరవుడు భావించాడు.[10] ఇతనికి బమ్మెర పోతరాజుగారు పరమ గురువు అయినట్లు ఊహించవచ్చు. శ్రీరంగ మాహాత్మ్యంలో పోతరాజుగారి ప్రభావం అడుగడుగునా కనబడుతుంది. చూడండి:

హరిదివ్యనామధేయామృతం బింపారజెలగి యాస్వాదించు జిహ్వ జిహ్వ
గోవిందకళ్యాణగుణవిశేషంబులు బలుమారు తలపోయు తలపు తలపు
కమలాక్షు నిత్యమంగళమూర్తివిభవంబు సొంపార వీక్షించు చూపు చూపు
ఫణిరాజతల్పు శ్రీపాదపద్మంబులుచేరి యర్చనసేయు సేత సేత
వాసుదేవప్రియంబైన వ్రతము వ్రతము
దైత్యభేది నుపాసించు తపము తపము
శౌరి నారాధనముసేయు జపము జపము
విష్ణుపదభక్తి సమకొల్పు వినికి వినికి. (శ్రీరంగమాహాత్మ్యం, 1-77)

ఈ పద్యం కథారంభంలోనే కనబడుతుంది. వాస్తవానికి శ్రీరంగమాహాత్మ్యంలో కథ విశేషంగా ఏమీలేదు. కావేరీతీరాన విభీషణుడు శ్రీరంగధామాన్ని నిలిపాడు. ఇది అతనికి శ్రీరామచంద్రుడు ఇచ్చాడు. అది ఇక్ష్వాకుల కాలంనుంచి ఆ రాజవంశంలో వుంది. దానిని ఇక్ష్వాకు మహారాజు తపస్సు చేసి పొందాడు. ఆయన ఆ తపస్సు చేస్తున్నప్పుడు సహజంగా ఇంద్రుడు దానిని చెడగొట్టదలిచాడు. అప్సరసలను పంపించాడు. వాళ్లు తెలుగు ప్రబంధాలలో విధిగా వుండవలసిన పుష్పాపచయం అదీ చేశాక ఆయన తపస్సు చెడగొట్టలేకపోతారు. అప్పుడు ఇంద్రుడు కుమారసంభవంలోలాగ మన్మథుణ్ణి పంపిస్తాడు. మన్మథుడు కూడా గెలవలేకపోతాడు. ఇంద్రుడే స్వయంగా చెయ్యి చేసుకున్నాడు. అప్పుడు ఇక్ష్వాకు మహారాజు శ్రీహరిని తలచుకొన్నాడు. ఆయన తన సుదర్శనాన్ని పంపించాడు. అది ఇంద్రునికి బుద్ధి చెప్పింది. దానితో ఇంద్రుడు బ్రహ్మ దగ్గరికి వెళ్లాడు. ఇక్ష్వాకు డేమి కావాలని తపస్సు చేస్తున్నాడో బ్రహ్మ తెలుసుకున్నాడు. రంగధామం సూర్యవంశ రాజధానిలో వెలసింది. ఈ శ్రీరంగాన్ని విభీషణుడు తీసుకువచ్చి కావేరివద్ద తాత్కాలికంగా దింపి మళ్లా లంకకు తీసుకుపోదా మనుకున్నాడు. దింపాక దాన్ని మరి కదిలించలేకపోయాడు. అక్కడే అది ఉండిపోయింది. పుణ్యక్షేత్రం అయింది. ఆ చుట్టుప్రక్కల వున్న తీర్థాలు గొప్పవి అయ్యాయి. అక్కడ మరణించిన దుర్మార్గులను తీసుకువెళ్లడానికి యమభటులు వస్తే విష్ణుదూతలు చితకబాదుతారు. శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యంలోలాగ ఆ యమదూతలు పోయి యమధర్మరాజుతో చెప్పుకొంటారు.

శ్రీరంగమాహాత్మ్యం గరుడ పురాణంలో ఉంది. బ్రహ్మాండ పురాణంలో కూడా ఉందట. గారుడంలో నూరు అధ్యాయాలున్నాయి. బ్రహ్మాండ పురాణంలో 9 మాత్రమే

10. శ్రీరంగమాహాత్మ్యం, 3-708

ఉన్నాయి. గరుడ పురాణాన్ని ఆధారం చేసుకొనే భైరవుడు దీనిని రచించాడు. మూలంలో లేని ఋతువర్ణనలు, పురవర్ణనలు చేశాడు. విష్ణుమూర్తిచేత, లక్ష్మీదేవిచేత జలక్రీడలు ఆడించాడు. మారువేషాలు వేయించాడు. సనత్కుమారుడు తపస్సు చేసుకుంటూ ఉంటే, విష్ణువు కపట భూసురుని వేషం వేసుకొని వటువులు వెంటరాగా వెళ్ళాడు. అతనిని చూసి సనత్కుమారుడు ''నీ ఊరేమిటి? పేరేమిటి? తల్లి ఎవరు? తండ్రి ఎవరు? నీ భాగవతార్థమెయ్యది? దయచేసి చెప్పు?'' అని అడిగాడు. అప్పుడా కపట వటువు ఇలా సమాధానం చెప్పినట్టు పోతరాజుగారు శ్లేషప్రధానంగా వ్రాశారు.

ఇది నాకు నెలవని ఏరీతి పలుకుదు నొకచోటనక నిండియుండ నేర్తు
నెవ్వనివాడనం చేమని పలుకుదు నాయంతవాడనై నడవనేర్తు
నీ నడవడియని యెట్లు వక్కాణింతు బూని ముప్పోకల బోవనేర్తు
నది నేర్తు నిది నని యేలచెప్పంగ నేరువులన్నియు నేస నేర్తు
నొరులుగారు నాకు నొరులకు నే నొదు
నొంటివాడ జుట్ట మొకడు లేడు
సిరియు దొల్లి కలదు సెప్పెద నాటెంకి
సుజనులందు దరచు జొచ్చియుందు. (భాగవతం, 8-552)

పోతరాజుగారి ననుసరించే భైరవుడు తన శ్రీరంగమాహాత్మ్యంలో సనత్కుమారుని ప్రశ్నకు విష్ణువుచేత భాగవత పద్యంలాగే సమాధానం చెప్పించాడు.

ఇందుండి వచ్చితి నిప్పుడే ననరాదు సకలలోకైకసంచారి గాన
నిది యది నెలవని యేర్పరింపగబోల దెందు చూసిన వసియింతుగాన
రూపించి తల్లిదండ్రుల జూపి చెప్పగా లేదు వారెవ్వరు లేరు గాన
వీరు బంధువులని వివరింపగూడదు సర్వభూతములకు సముడగాన
వటువు లిట్టట్టు గతి జేరి వచ్చిరనగ
బొందుగాదు నిమిత్తసంభూతు లగుచు
జిత్తగతమైన కార్యంబు చేతలందు
నెరుగదగుగాక మాటలు నేమిచెప్ప? (శ్రీరంగమాహాత్మ్యం, 3-457)

పోతరాజుగారిలాగే భైరవుడు కూడా సుదీర్ఘవచనాలు వ్రాస్తాడు. తత్సమపదాడంబరం చూపుతాడు. అచ్చతెలుగు నుడులు వాడి ముచ్చట తీరా ముచ్చల సవ్వడులు చేస్తాడు. పోతరాజుగారు యమకానికి అప్పుడప్పుడు ముగ్ధులవుతారు. 'ఈ యమకంలోని గమకాలన్నీ భైరవుడు పోతరాజుగారినుండి పుణికిపుచ్చుకున్నాడు. ఆదిదంపతులు విష్ణుమూర్తి, మహాలక్ష్మి వనవిహారం చేస్తున్న ఘట్టంలో వరుస ప్రక్రియలో కందపద్యాలను భైరవుడు వ్రాశాడు. రెండు మూడు చూద్దాం.

మాకందము కడునిది ర-మ్మా కందము డాయబోయి మంజీరులకున్
మాకందగ వెరగవిసిన - మాకందము మగువ మధురమాకందమిలన్
వారములగు నతనుని పరి - వారములకు నెలవు లగుచు వాలెడి సమ్యా
గ్వారము వారము దనకై - వారము లొనరింపసింధువారము లతివా
శుకముఖరుచి గల తపనా-శుకముల నెరి మెరయునంగజునితటభవనాం
శుకములన మెరయు నవకిం - శుకముల గనుగొనుము రాజశుకమృదువాణీ
(శ్రీరంగమాహాత్మ్యం, 4, 816, 817, 819)

పోతరాజుగారికి సర్వలఘుకందాలు వ్రాయడం సరదా. భైరవుడు కూడా సర్వలఘు రచనలు చేశాడు. 37 అక్షరాలుండే లయ హరివృత్తంలో పాదానికి 35 అక్షరాలు లఘువులే ఉంటాయి. ఆ ఛందస్సులో భైరవుడు పద్యం చెప్పాడు చూడండి.

లయహారి

జయజయ సకలదివిజచయముకుటఘటితమణి
చయరుచిరపదయుగళయకలపద్మ
ద్వయనిబిడతరతిమిరలయకరణచణహరిత
హాయవినుతసుజనభవభయశమననానా
మయవిపినదహనఫణిశయనరచరణవృత
నియమమునినుతనిగ మమయసరసిజాతి
ప్రియదురిత హరనిరతిశయమహిమనితత
రథరయవిహగవిభవకువలయవనది నేశా. (శ్రీరంగమాహాత్మ్యం, 5-1230)


ఈ వృత్తం ఎవరు వ్రాసినా పాదానికి ముప్పయిఆరు చొప్పున నాలుగు పాదాలకు 130 లఘువులు వ్రాయాలి. వాములు మ్రింగే స్వాములవారికి పచ్చగడ్డి ఫలహారం అని రుజువు చేయడానికన్నట్టు తృతీయాశ్వాసంలో 790 అక్షరాల గద్య ఒకటి వ్రాశాడు. అందులో ఏ ఒకటి రెండు చోట్లనో తప్ప సర్వత్రా లఘువులే వాడాడు. ఈ వైదుష్య విన్యాసం చాలదన్నట్టు ఇందులోనే ఒక సర్కస్‌ఫీటు చేశాడు. ఈ సర్వలఘువులతో ముక్తపదగ్రస్తం వాడడం, గద్యమంతా చదవడానికి విసుగువస్తుందిగాని కొంత చూడండి -

జయజయ జలజభవముఖ నిఖిలసురనిక - మకుటతతటఘటిత మణిరుచి
రుచిరచరణయుగళ, గళవిచరదవిరళగరళకబళ, బలవదఘనివహబాణప
టలవిఘటచనచటులదివసకరకమలదమృతకరణమధుర మధురసభరిత శశికు
సుమ, సుమహితశుచివిభవనిలయరహిత. (శ్రీరంగమాహాత్మ్యం, 3-655)

ఇటువంటి సర్వలఘు రచనలేకాక గ్రంథాంతంలో బంధకవిత్వం కూడా వ్రాశాడు. ఒక చక్రబంధం (5-1290), నాగబంధం (5-1291), తరువాత ఒక గోమూత్రికాబంధం (5-1292) రచించాడు.

నన్నెచోడుని తరువాత బంధకవిత్వం వ్రాసిన కవులు ఎందరున్నారో మనకు తెలియదుగాని ఇతని గ్రంథంలోనే ఇప్పటికి మొదటిసారి ఈ ప్రక్రియ మనకు లభ్యం అవుతున్నది. ఇతని గోమూత్రికాబంధం బొమ్మ చూడండి.

గోమూత్రికాబంధం



హరిపదసరసిజమధుకర - మురభిదసితమూర్తి రామభోగయ రామా
కరిరద సురకుజ విధుకర - శరదుద సితకీర్తి ధామ చాగయ రామా.

(శ్రీరంగమాహాత్మ్యం, 5-1292.)

శ్రీరంగ మాహాత్మ్యంలోనూ, వరాహ పురాణంలోనూ ఆ కవులు రచించిన బంధకవిత్వ పద్యాలను బొమ్మలలో ప్రచురించేముందు ముద్రిత ప్రతులలో ఉన్న పాఠాలు చేయవలసిన దిద్దుబాట్లు కొంచెం చర్చించుకుందాం.

	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19
౧	స	వ్య	శ్రీ	క	ప	రా	భి	ర్భ	ర	వ	చ	ర	వ్నా	క	ద్రు	మా	వ	ర్ల	భా
౨	గ్య	వ్యా	రం	భ	క	ఘు	స్మ	ర	స్త	వ	శు	చి	స్యేం	త	ప్ర	పూ	ర్ణ	ప్ర	భా
౩	భ	వ్యా	గ	ప్ర	వ	వాం	క	వా	వ	వ	త	[illegible]	ప్రా	ము	ఖ్య	నం	దం	యు	భా
౪	భా	వ్యా	భి	వ	సు	రా	ది	కై	వ	ధ	వ	కై	భా	ధ	ద్ర	భా	స్వ	న్న	భా

ఈ చక్రబంధంలో కొన్ని కిటుకులు ఉన్నాయి. తొలిపాదంలో పదవ అక్షరం ఏదైతే రెండుమూడు పాదాలలో పదో అక్షరమూ అదే అవాలి. మూడవ పాదం ఏ అక్షరంతో ముగిస్తే ఆ అక్షరంతోనే తీసుకొని నాలుగవ పాదంలో నిర్ణీత స్థానాల వాడుతూ పద్యం సరిపెట్టాలి. నాలుగవ పాదంలో నాలుగవ అక్షరం తొలిపాదంలోని మొదటి అక్షరం కావాలి. తరువాత రెండేసి అక్షరాలు విడిచిపెట్టుకొంటూ రెండు మూడు పాదాల తొలి అక్షరాలు వేసుకొని పోవాలి. ఆ పిమ్మట రెండేసి అక్షరాల తరువాత పాదాంత అక్షరాలను వేసుకుంటూ పోవాలి. పద్యంలో ఈ అక్షరాలు ముద్దటైపులో ఉన్నాయి చూడండి.

నాలుగవ పాదంలో నిర్ణీతాక్షరాలలో ఒకటి 'ది' అని ఉంది. ఈ అక్షరం తొలిమూడు పాదాల ఆద్యంత అక్షరాలలో ఎక్కడా లేదు. అందుచేత బొమ్మలో పద్యం ఇమడ్చడం కష్టం. కాబట్టి ఒకటి; రెండో పాదాన్నో లేదా నాలుగో పాదాన్నో కొద్దిగా మార్చాలి. మొదటి పాదం మలుపునుంచీ 'భాక్ దివ్యారంభక ఘుస్మర స్తవశుచి స్థేయ ప్రపూర్ణాప్రభా' అనే పాఠాన్ని మిత్రులు వేదం లక్ష్మీనారాయణశాస్త్రిగారు సూచించారు.


నాలుగవ పాదాన్ని ''భావ్యాళివసురా గవాగ్విభవ శోభాభద్ర భాస్వన్నిభా'' అనే పాఠాన్ని శ్రీ నాదెళ్ళ మేధా దక్షిణామూర్తిగారు సూచించారు. ఈ రెండు మార్పులలో ఏ ఒక్కటి తీసుకొన్నా బొమ్మ సరిగ్గా వస్తుంది. నాలుగవ పాదంలో మార్పే మంచిదనుకొన్నారు. యతిస్థానంలో మార్పులు ఉండవు.

ఈ చక్రబంధంలో గ్రంథం పేరు, కవిపేరు సూచితమయినాయి. మొదటి మూడు పాదాలలోని మూడవ అక్షరాలను ముందునుంచి, వెనుకనుంచి కూడా తీసుకొని నిలువునా చదివితే పుస్తకం పేరు ఒకలాగ వస్తుంది. 'శ్రీరంగవర్ణదేం' అని 'ఆ, ఆ'లతో సూచించిన మాటలూ ఎనిమిదవ అక్షరాలను తీసుకొని నిలువునా చదివితే 'భైరవా రచితః' అని వస్తుంది.

ఇతని చక్రబంధ, నాగబంధాల పద్యాలలో లేఖకుల పొరపాట్లు ఉన్నట్టున్నాయి. బొమ్మలలో ఇమడటం లేదు. బంధకవిత్వ ప్రక్రియలో ఇతడొకరకంగా ఆద్యుడు కనుక ఆ పద్యాలు బొమ్మలలో ఎలా ఇమడ్చాలో పరిశీలించమని కొంతమంది విజ్ఞులను సంప్రతించాను. వారి సూచనలమేరకు వచ్చిన పాఠాంతరాలూ, బొమ్మలూ చూడండి

చక్రబంధం:

నవ్యశ్రీకపరాతిభైరవచరన్నాకిద్రుమాపర్ణభా
గ్భవ్యారంభకఘుస్మరస్తవశుచిస్వాంత ప్రపూర్ణప్రభా
భవ్యాంగ ప్రసవాంక వాసవతతః ప్రాముఖ్య సందేందుభా
భావ్యాళీనమ రాదిశోవిభవశోభాభద్రభాస్వన్నిభా. (శ్రీరంగమాహాత్మ్యం, 5-1290)




నాగబంధం:

వరగుణరత్నవిశ్రుతసువర్ణవతంస సబాలసత్పర
స్ఫురితమరాళశ్రీగురవచోవశచిత్తవిలాసవాసవా
వరజసమాంగవైరికరివారిదరానిలధీరమాంచితో
త్తరసశుభానురక్తతతతత్పరచాగయమంత్రి శేఖరా! (శ్రీరంగమాహాత్మ్యం, 5-1291)

అప్పకవీయంలో ఇచ్చిన బొమ్మ ప్రకారం పాము తలలో ఒక అక్షరం, తోకలో ఒక అక్షరం మాత్రమే వేసి పార్శ్వాల మలుపులలోనూ, అడుగు మలుపులోను రెండేసి అక్షరాలు వేయాలి. అయితే ఆ పద్ధతి ప్రకారం దాట్లు వేస్తే బంధం సరిగ్గా రాదు. అందుచేత తలలో రెండూ, తోకలో రెండూ వర్ణాలు వేసుకొని, పార్శ్వాలలో ఒక్కొక్కటీ, అడుగున రెండు అక్షరాలూ వేస్తే బంధం సరిపోతుంది, అని వేదంవారూ, నాదెళ్ళవారూ సూచించారు.

ముద్రిత ప్రతిలో పద్యం 'మంత్రిశేఖరా!' అని పూర్తవుతుంది. దానిని 'మంత్రి రాఘవా' అని దిద్దుకుంటే బొమ్మ సరిపోతుందని నాదెళ్ళవారు చెప్పారు. 'మంత్రి రాఘవ'లోనే పాఠాంతరం కూడా ఉంది. ఈ సూచనలు చేసినందుకు వేదంవారికి, నాదెళ్ళవారికి నా కృతజ్ఞతలు.



ఇలాంటి సాముగరడీలవల్ల గాక రసవత్తరమైన కథాకథనంవల్లా, హృదయానికి హత్తుకుపోయే పాత్రపోషణవల్లా, చక్కని జాతీయాలు వాడుతూ నుడికారపు రుచులు చూపెట్టడంవల్లా ఏకవి అయినా గొప్పవాడనిపించుకుంటాడు. గౌరన రచనలో ఉండే సామెతలూ, పలుకుబళ్ళూ భైరవునిలో తక్కువ.

ఎక్కడో 'కొరవిం దలగోకుకొనుట' (668)

'ఒదవునె మూడేండ్లకు లేని బుద్ధి ముప్పదేండ్లకున్ (1205)

అనే ప్రయోగాలు వాడిన చోట్లతప్ప భైరవుడా 'తండ్రికి కొడుకే ఈతడు' అని స్ఫురింపచేయడు.

ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం

సంప్రదించిన గ్రంథాలు

అచ్యుతరావు, టేకుమళ్ళ	ఆంధ్రవాఙ్మయ చరిత్రము, విజయనగర సామ్రాజ్యమండలి ప్రచురణ, విజయనగరం
అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి	గాధాసప్తశతీసారము, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1964
అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి	సారస్వతావలోకం, త్రివేణి పబ్లిషర్స్, మచిలీపట్నం, 1954
అనంతామాత్యుడు	ఛందోదర్పణము, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1921
అన్నమాచార్యులు, తాళ్ళపాక	ఆధ్యాత్మ సంకీర్తనలు, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి, 1952.
అప్పకవి, కాకూనూరి	అప్పకవీయం, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1934.
అప్పారావు, గురజాడ	ముత్యాలసరాలు, విశాలాంధ్ర ప్రచురణ, విజయవాడ, 1953
ఆదినారాయణశాస్త్రి, పంచాగ్నుల	వాత్స్యాయన కామసూత్రములు, ఆర్య భారత ప్రెస్సు, మద్రాసు, 1930
ఆనందమూర్తి, వేటూరి	తాళ్ళపాక కవులు; వివిధ సాహితీ ప్రక్రియలు, విజయనగర్ కాలని, హైదరాబాదు, 1974
	తొలి సంకీర్తన కవులు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి, కళాభవన్, హైదరాబాద్, 1975
ఆరుద్ర	వెన్నెల వేసవి, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1977.
	వ్యాసపీఠం, న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడ, 1985
ఈశ్వరదత్తు, కుందూరి	ప్రాచీనాంధ్ర భూగోళం, శివాజిప్రెస్, సికిందరాబాద్, 1963.
	శ్రీనాథుని కవిత్వ తత్త్వము, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1964
ఉమాకాన్తమ్, అక్కిరాజు	పల్నాటి వీరచరిత్ర, శ్రీరామ ముద్రాక్షరశాల, మద్రాసు, 1955
కులశేఖరరావు, ఎం	యశోదరెడ్డి, పి - కావ్యానుశీలము, వ్యాసాలు
కులశేఖరరావు, ఎం.	సింహగిరి వచనములు - ఆంధ్ర రచయితల సంఘం, హైదరాబాదు, 1968
కృష్ణమూర్తి, భద్రిరాజు (సంపా.)	తెలుగుభాషా చరిత్ర, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1974
కృష్ణమూర్తి, భద్రరిరాజు (సంపా.)	మాండలిక వృత్తిపదకోశం, ప్రథమ సంపుటం, వ్యవసాయ పదాలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1962
కేశవాచార్యులు, నంబూరి	ఆచార్య సూక్తి ముక్తావళి, శ్రీ జమ్మిలి నమ్మాళ్వార్ ధర్మనిధి, గుంటూరు, 1972

కోదండరామయ్య, కె.ఎస్	నన్నయ్యభట్టు ఏ ప్రాంతమువాడు?, ఆంధ్ర సాంస్కృతిక సమితి, హోసూరు, 1983
కోదండరామయ్య, తిమ్మావజ్ఝల	కవిరాజ శిఖామణి, సారస్వత ప్రసారము, మద్రాసు, 1959
గోపరాజు, కొఱవి	సింహాసన ద్వాత్రింసిక, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, హైదరాబాదు, 1960
గోపాలకృష్ణమూర్తి, శ్రీపాద	స్త్రీల పౌరాణిక పాటలు, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1955
చినతిరువెంగడనాథుడు, తాళ్ళపాక	అన్నమాచార్య చరిత్రము, తిరుమల తిరుపతి దేవస్థానము, తిరుపతి, 1949
జగన్నాథశర్మ, దువ్వూరి	'తెలుగు పారాశరీయ హోర విజయరామ రాజీయము', నటశ్రీ ప్రచురణాలయం, రామచంద్రపురం
తిరువెంగళనాథుడు	అష్టమహిషీ కల్యాణం, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రెస్సు, మద్రాసు, 1936
తిరువేంగళాచార్యులు, వేదాల	ప్రాకృతభాషాచరిత్రము, (వ్యాససంగ్రహము), గిడుగువారి సప్తతి తమ జన్మదినోత్సవ సంపుటం, తెలికచర్ల వెంకటరత్నం, గుంటూరు
దాశరథి	దాశరథి శతకం, ఎం. శేషాచలం అండ్ కో, మద్రాసు, 1962
దొణప్ప, తూమాటి	భాషాచారిత్రక వ్యాసావళి, నవయుగ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, హైదరాబాదు, 1987
దొరసామిశర్మ, రావూరి	తెలుగు భాషలో ఛందోరీతులు, వెల్డన్ ప్రెస్, మద్రాసు, 1962
దొరసామిశర్మ, రావూరి	సులక్షణసారం, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1955
నారాయణరావు, చిలుకూరి	పండితారాధ్య చరిత్ర (పీఠిక), ఆంధ్రపత్రిక ప్రెస్, 1939
పాపయ్యశాస్త్రి, చిలుకూరి	శ్రీనాథుని కవితా సమీక్ష, ద్వితీయ సంపుటం, రిపబ్లిక్ ప్రెస్, కాకినాడ, 1934
ప్రతాపరెడ్డి, సురవరం	ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1950
ప్రభాకరశాస్త్రి, వేటూరి (సంపా.)	కాటమరాజుకథ (మల్లంపల్లి సోమశేఖరశర్మ పీఠిక), మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, మద్రాసు, 1953
ప్రభాకరశాస్త్రి, వేటూరి	చాటుపద్య మణిమంజరి (1, 2 సంపుటాలు), ముక్త్యాల, 1952
ప్రభాకరశాస్త్రి, వేటూరి	ప్రబంధ రత్నావళి, కాజావెంకటశేషయ్య, మద్రాసు, 1918
ప్రభాకరశాస్త్రి, వేటూరి	మీగడతరగలు, మణిమంజరి, ముక్త్యాల, 1951
ప్రభాకరశాస్త్రి, వేటూరి	శృంగార శ్రీనాథము, ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్, బెజవాడ, 1926
ప్రభాకరశాస్త్రి, వేటూరి	సింహావలోకనము (వ్యాస సంపుటి), మణిమంజరి, ముక్త్యాల, 1952
బద్దెన	నీతిశాస్త్రముక్తావళి, నరేంద్రనాథ సాహిత్య మండలి, తణుకు, 1910

బాలసరస్వతి, ఎలకూచి	బాలసరస్వతీయము, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1963
బ్రహ్మానంద, హెచ్.ఎస్.	తెలుగు సాహితికి నన్నయ్య ఒరవడి, అక్షర ప్రసాద ప్రచురణ, అనంతపురం, 1986
భారతీదేవి, దేశిరాజు	'కవిత్రయ కవితారీతులు-తరువాతి కవులపై వారి ప్రభావము', బాపట్ల, 1959
మల్లికార్జునరావు, పందిరి (సంపా.)	కస్తూరిరంగకవి, ఆనందరంగరాట్ఛందము, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1924
మృత్యుంజయరావు, జొన్నలగడ్డ	వ్యాస భారతము, నన్నయ పరిష్కారము, రాజోలు, 1979
రంగకవి, కస్తూరి	ఆనందరంగరాట్ఛందము, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1922
రంగాచార్యులు, చెలమచర్ల	ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము (పీఠిక), నాగార్జున బుక్ డిపో, హైదరాబాదు, 1944
రజనీకాంతరావు, బాలాంత్రపు	ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ, 1958
రమణారెడ్డి, పి.వి	చారుచర్య (తెలుగు అనువాదం), నరసరావుపేట, 1979
రవికుమార్, సూర్యదేవర	వ్యాససుధ, భట్టిప్రోలు, 1989
రాజేశ్వరశర్మ, అమరేశం	ఆంధ్ర వ్యాకరణ వికాసము, ప్రాచ్య విద్యా పరిషత్తు, కామారెడ్డి, 1973
రాజేశ్వరశర్మ, అమరేశం	నన్నెచోడుని కవిత్వము, అజంతా ప్రింటర్స్, సికిందరాబాదు, 1958
రాధాకృష్ణ, బూదరాజు	ప్రాచీనాంధ్ర శాసనములు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1971
రామకృష్ణకవి, మానవల్లి	కుమార సంభవము (నన్నెచోడుడు), మద్రాసు విశ్వవిద్యాలయము, మద్రాసు
రామకృష్ణయ్య, కోరాడ	'దక్షిణదేశ భాషాసారస్వతములు - దేశి', కోరాడ ప్రచురణాలయం, మద్రాసు, 1954
రామకృష్ణశాస్త్రి, శిష్టా	ఆంధ్రవాఙ్మయచరిత్ర సర్వస్వము, మద్రాసు విశ్వవిద్యాలయం, 1957
రామకృష్ణారావు, బూర్గుల	సారస్వత వ్యాసముక్తావళి
రామమూర్తి పంతులు, గిడుగు	ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజం, ఆంధ్ర ప్రింటర్స్, విజయవాడ, 1979
రామయ్య, జయంతి	కవిజనాశ్రయం (పీఠిక), పరిషత్ ప్రచురణ, శ్రీపతి ముద్రణాలయం, కాకినాడ, 1959
రామయ్య, జయంతి	శాసనపద్యమంజరి, మొదటి సంపుటం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, కాకినాడ, 1930
రామయ్య, బాడాల	బసవేశ్వర వచనాల సమగ్ర సమీక్ష, తరళబాళు జగద్గురు విద్యాసంస్థ, సిరిగెరె, 1976-77
రామరాజు, బి	ఆంధ్ర సంస్కృతి చరిత్ర (విద్యార్థుల చేత రాయించిన సంపుటం), హైదరాబాదు, 1960.

రామరాజు, బి	తెలుగు జానపద గేయ సాహిత్యం, హైదరాబాదు, 1958
రామలక్ష్మి ఆరుద్ర	తాళ్ళపాకవారి పలుకుబళ్ళు, ఆంధ్రసాహిత్య అకాడమి, హైదరాబాదు, 1971
రామసుబ్బశర్మ, గౌరిపెద్ది	తాళ్ళపాకవారి పదసాహిత్యము, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి, 1977
రామారావు, అడిదము	అడిదము సూరకవి జీవితము, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1955
రామేశంపంతులు, వేపా	తెలంగాణా శాసనములు, లక్ష్మణరాయ పరిశోధక మండలి, హైదరాబాదు, 1935
రేచన, మల్లియ	కవిజనాశ్రయము, సంజ్ఞాభిషేకము, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1950
లక్ష్మణరావు, కొమర్రాజు	లక్ష్మణరాయ వ్యాసావళి, ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ, 1965
లక్ష్మీకాంతం, పింగళి	గౌతమవ్యాసములు, ఎం.ఎస్.ఆర్. మూర్తి అండ్ కో, విశాఖపట్నం, 1963
లక్ష్మీనారాయణరావు, భూపతి	భారతము తిక్కన రచన, అద్దేపల్లి అండ్ కో, రాజమండ్రి, 1949
లక్ష్మీరంజనం, ఖండవిల్లి	'ఆంధ్రసాహిత్య చరిత్ర సంగ్రహము'
లక్ష్మీరంజనం, ఖండవిల్లి	ఆంధ్రుల చరిత్ర సంస్కృతి, జైహింద్ పవర్ ప్రెస్, కర్నూలు, 1957
లక్ష్మీరంజనం, ఖండవిల్లి	(సంపా.) కాసెసర్వప్ప సిద్ధేశ్వర చరిత్రము, ఆంధ్ర రచయితల సంఘం, హైదరాబాదు
విశ్వం, విద్వాన్	(దశకుమారచరిత్ర, పీఠిక), అన్నపూర్ణ పబ్లిషర్స్, విజయవాడ, 1962
వీరభద్రరావు, చిలుకూరి	ఆంధ్రుల చరిత్రము, పూర్వయుగం, మధ్యయుగం, 1910; 1912; 1916 ప్రచురణలు
వీరేశలింగం, కందుకూరి	ఆంధ్రకవుల చరిత్ర, సంపుటాలు, హితకారిణి సమాజం, రాజమండ్రి
వెంకటకృష్ణశర్మ, వేదం	శతక వాఙ్మయ సర్వస్వము, శ్రీధరరావు, 1954
వెంకటకృష్ణారావు, భావరాజు	(సంపా.) రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక, ఆంధ్రప్రదేశ్ ఇతిహాస పరిశోధక మండలి, రాజమహేంద్రవరం, 1922
వెంకటరమణయ్య, నేలటూరు	పల్లవులు చాళుక్యులు, వేదం వెంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్, మద్రాసు, 1969
వెంకటరమణయ్య, నేలటూరు	సోమనాథుడెప్పటివాడు, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1955
వెంకటరమణయ్య, బులుసు	ఆంధ్రకవి సప్తశతి, వెల్డన్‌ప్రెస్, మద్రాసు, 1956
వెంకటరమణయ్య, బులుసు	ఆంధ్రాలంకార వాఙ్మయ చరిత్రము
వెంకటరాయశాస్త్రి, వేదం	నన్నెచోడుని కవిత్వము, వేదం వెంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్, మద్రాసు, 1959

వెంకటరాయశాస్త్రి, వేదం	శృంగార నైషధ సర్వంకష, వేదం వెంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్, మద్రాసు, 1961
వెంకటరావు, నిడుదవోలు	ఆంధ్ర కర్ణాట సారస్వతములు-పరస్పర ప్రభావము, క్రాంతి ప్రెస్, మద్రాసు, 1962
వెంకటరావు, నిడుదవోలు	ఆంధ్ర వచన వాఙ్మయము, నాగలక్ష్మి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు, 1954
వెంకటరావు, నిడుదవోలు	ఉదాహరణ వాఙ్మయ చరిత్ర, విజయభాస్కర పబ్లికేషన్స్, హైదరాబాదు, 1950
వెంకటరావు, నిడుదవోలు	తెలుగు కవుల చరిత్ర, మద్రాసు విశ్వవిద్యాలయం, మద్రాసు, 1959
వెంకటరావు, నిడుదవోలు	త్రిపురాంతకోదాహరణము (పరిష్కరణము), మద్రాసు, 1937
వెంకటరావు, నిడుదవోలు	పోతన, నేషనల్ బుక్ ట్రస్టు, న్యూఢిల్లీ, 1962
వెంకటావధాని, దివాకర్ల	నన్నయ్య భారతము, ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాదు, 1960
వెంకటేశ్వరరావు	పదబంధ పారిజాతము (ప్రథమ సంపుటి), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1961
శాస్త్రి, బి.ఎన్	ఆంధ్రుల సాంఘిక చరిత్ర, సరస్వతి నిలయం, హైదరాబాదు, 1975
శాస్త్రి, బి.ఎన్	నల్గొండ మండల సర్వస్వం, మూసి పబ్లికేషన్స్, హైదరాబాదు, 1986
శివకుమార్, హరి	కేతన, శ్రీకృష్ణ ప్రచురణలు, వరంగల్, 1973
శివరామశాస్త్రి, వేలూరి	ఉత్తర హరివంశము, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1961
శివరామశాస్త్రి, వేలూరి	నృసింహపురాణము (పీఠిక), వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1960
శివరామశాస్త్రి, వేలూరి	సోముడు (ఉత్తర హరివంశ విమర్శ)
శివరామశాస్త్రి, వేలూరి	హరివంశము (పీఠిక), వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1960
శేషగిరిరావు, చీమకుర్తి	తెలుగు మరుగులు, తెలుగు గోష్ఠి, హైదరాబాదు, 1986
శేషగిరిరావు, చీమకుర్తి	(సంపా.) 'తెలుగు సంస్కృతి దేశము చరిత్ర', మొదటి సంపుటం, 1983
శేషయ్య, చాగంటి	ఆంధ్రకవితరంగిణి (సంపుటాలు), రామచంద్రాపురం, 1955; 1959
శ్రీనివాసరావు, వేమూరి	పూర్వగాథాలహరి, వెంకట్రామా అండ్ కో, మద్రాసు, 1952
శ్రీరామ అప్పారావు, పొణంకి	నాట్యశాస్త్రము, అజంతా ప్రింటర్స్, సికిందరాబాదు, 1958
సంపత్కుమారాచార్య	తెలుగు ఛందోవికాసము, కులపతి సమితి, వరంగల్లు, 1962
సత్యనారాయణశాస్త్రి, మధునాపంతుల	నన్నయగారి వెన్నెలరేయి (సాహిత్య వ్యాసాలు), ప్రీమియర్ ప్రింటర్స్, రాజమండ్రి, 1982
సింగన, మడికి	సకలనీతి సమ్మతము, సంపా. మానవల్లి రామకృష్ణకవి, ఆంధ్రపత్రిక ముద్రాక్షరశాల, 1923
సీతారామయ్య, కురుగంటి	ఆంధ్రమహాభారతోపన్యాసములు, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, హైదరాబాదు, 1957
సుందరం, ఆర్వీయస్	కన్నడ సాహిత్య చరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1977
సుబ్బారావు పంతులు, వంగూరి	శతకకవుల చరిత్ర, కమలకుటీర ప్రెస్, నరసాపురం, 1957
సుబ్బారావు, రాళ్ళబండి	కళింగదేశ చరిత్ర
సుబ్బారావు, వావిలకొలను	'సుందరం' బాలకాండ, శ్రీ కోదండరామ సేవక ధర్మసమాజం, అంగలకుదురు, తెనాలి

సుబ్రహ్మణ్యం, రాయప్రోలు — అశోకుని ఎర్రగుడి శిలా శాసనములు, ఆం.ప్ర. ప్రభుత్వ పురావస్తు శాఖ, హైదరాబాదు, 1975
సూర్యనారాయణశాస్త్రి, మల్లాది — 'సంస్కృత వాఙ్మయ చరిత్ర-లౌకిక వాఙ్మయం', ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1961
సోమన, నాచన — ఉత్తర హరివంశము, వావిళ్ళవారి ముద్రణ, 1961
సోమనాథుడు, పాల్కురికి — అనుభవసారము, పరిష్కరణ : బండారు తమ్మయ్య, తిమ్మావజ్ఝల కోదండరామయ్య, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1955
హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి — సారమతి నన్నయ్య, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1976
హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి — 'దక్షిణ భారత సాహిత్యములు' ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణ, శివాజి ప్రెస్, సికిందరాబాదు, 1962
హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి — 'సాహిత్యోపన్యాసములు', ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణ, హైదరాబాదు, 1970

సంచికలు

ఆంధ్రపత్రిక - ఉగాది సంచికలు
ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక - సంచికలు
కళింగ సంచిక
కాకతీయ సంచిక
తంజావూరి గ్రంథాలయంలోని తెలుగు వ్రాతప్రతుల వర్ణనాత్మక కేటలాగు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రచురణ
త్రిలింగ రజతోత్సవ సంచిక, మద్రాసు, ఆగస్టు 1941
దక్షిణ భారత శాసన సంచయం
నెల్లూరి శాసన సంపుటాలు
పరిశోధన - సంచికలు
పరిషత్పత్రిక భాండాగారము, 3వ భాగం, ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రచురణ
భారతి - సంపుటాలు
మణిమంజరి, సంపా. వేటూరి ఆనందమూర్తి, శ్రీ ప్రభాకర పరిశోధక మండలి, హైదరాబాదు (సంచిక-1, సంపుటి-1).
మణిమంజరి - 10వ సంపుటం; సంపా. వేటూరి ఆనందమూర్తి, వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్ట్, హైదరాబాదు, ఆగస్టు, 1985
మాలెపాడు శాసనాలు, 11వ సంపుటం, 35వ సంచిక; ఎపిగ్రాఫికా ఇండికా, హెచ్. కృష్ణశాస్త్రి.
రెడ్డి సంచిక - వడ్డాది అప్పారావు, రాజమండ్రి, 1947
విజ్ఞాన సర్వస్వం - సంపుటాలు, తెలుగు భాషాసమితి, విశాఖపట్టణం మాన్యువల్
సమాలోచన - పత్రిక

ENGLISH

Andronov, M.S.	The Brahui Language, Nauko Publishing House, Mascow, 1980
Barbara Stoler Miller (Ed.)	Jayadeva's Gitagovinda, Oxford University Press, 1977
Debi Prasad Chattopadhyaya	Lokayata - A Study in Ancient Indian Materialism, People's Publishing House, New Delhi, 1984
Grierson, G.A.	Linguistic Survey of India, Vol. IV, Calcutta, 1909
Kosambi, D.D.	Myth & Reality, Bombay, 1962
Krishna Sastry, V.V.	The Proto and Early Historical Culture of A.P., the Govt. of A.P., Hyderabad, 1983
Kuppuswami Sastry, S.	Triennial Catalogue MSS, Govt. Oriental Library, Madras, 1934
Letchmajee, Lingum	An Introduction to the Grammar of the Kui or Kandha Language, Calcutta, 1902, IInd Ed.
Majumdar, R.C. (Ed.)	The Age of Imperial Unity, Vol. II, Bharatiya Vidya Bhavan, Bombay, 1960
Majumdar, R.C. (Ed.)	(Ed.) The History and Culture of the Indian People, The Age of Imperial Unity, Vol. II, Bharatiya Vidya Bhavan, Bombay, 1957
Majumdar, R.C. (Ed.)	The History and Culture of the Indian People, Vol.V, Bharatiya Vidya Bhavan, Bombay, 1957; Vol. II, 1960
Manmohan Chakravarthy	Griya Inscriptions of the 15th & 16th Centuries, Journal of the Asiatic Society of Bengal, 1894
Nilakanta Sastry, K.A.	The Cholas, University of Madras, 1955.
Nilakanta Sastry, K.A. & Venkata Ramanayya, N.	Further Sources of Vijayanagara History, Vol. II, University of Madras, 1946.
Parabrahma Sastry, P.V.	Srisailam - Its History and Culture, Srinivasa Printers, Hyderabad, 1982
Pusalkar, A.D.	Studies in Epics & Puranas of India, Bharatiya Vidya Bhavan, Bombay, 1955
Rajagopalarao, T	A Camparitive prosady of the Dravidian Languages, Part - I (Sutrams).
Russell, R.V.	The Tribes and Castes of the Central Provinces of India, Vol. III, 1916
Sakuntala Rao, Sastri	Women in the Vedic Age, Bharatiya Vidya Bhavan, Bombay, 1952
Saletore, B.A.	Social and Political Life in the Vijayanagara Empire, Vol. I, Madras, 1934
Satya Shrava	The Sakar in India, Pravana Prakashen, New Delhi, 1981

Sivarama Murthi, O	The Early Eastern Chalukyas Sculpture, Madras, 1960
Somasekhara Sarma, M.	History of the Reddy Kingdoms, Andhra University, Waltair, 1948
Srinivasachari Puttaparthi	Journal of Indian History, Vol. XV, Srikanta Chola's Inscriptions
Subramanya Iyer	Historical Sketches of Ancient Deccan, 1917
Subramanyam, R	Suryavamsi Gajapaties of Orissa, Andhra Univeristy, Waltair, 1957
Suryanarayana, Kotturu	History of the Minor Chalukya Families in Medival Andhra Desa, B.R. Publishing Corporation, New Delhi, 1986
Swami Swahananda	Chandogyopanishat, Sri Ramakrishna Math, Mylapore, Madras, 1956
Syed Sirajul Hassan	The Castes and Tribes of H.E.H., The Nizam's Dominions, Vol.I, 1920
Venkata Krishna Rao, Bhavaraju	A History of the Early Dynasties of Andhra Desa, Madras, 1942
Venkata Ramanayya, Nelaturu	Trilochana Pallava and Karikalachola
Viayapuri Pillai	History of Tamil Language and Literature, New Century Book House, Madras, 1956
Yajdani, G. (Ed.)	The Early History of The Deccan, Vol. I to VI & Vol. VIII to XI., Hyderabad.
Yajdani, G. (Ed.)	"The Minor works of Tallapaka Annamacharya and his sons - Telugu Works, Published by Tirupati Devastanam, Anderson Street, Madras, 1935

Encyclopedia Britanica, A New Survey of Universal Knowledge, London

Indian Antiquary, Vol. XX

Inscriptions of Andhra Pradesh, Karim Nagar Dist. 1974

Journal of Christian College, Madras, 1929

Volumes of Epigraphia Andhrica, 1974

Volumes of Epigraphia Karnatika

Volumes of South Indian Inscriptions

ముఖ్యపదాను క్రమణిక

(కవులు, కావ్యాలు, ఇతరులు, ఇతర సాహితీ విషయాలు)

అంబికా శతకము	518
అక్షర రమ్యత	141
అజ్ఞాత కవుల కావ్యాలు	264
అజ్జరపు పేరయలింగం	795
అడిదం కవులు	971
అడిదం సూరకవి	971
అధర్వణాచార్యుడు	459
అనంతయ్య, మడికి	657
అనంతామాత్యుడు	841
అనంతుని ఛందము	851
అనవేమారెడ్డి	683
అన్నమయ్య, తాళ్ళపాక	985
అన్నమయ్య, యథావాక్కుల	280
అన్నయ్య, వెన్నెలకంటి	830
అప్పకవి	940
అప్పకవి వంశం	940
అప్పకవీయం	940
అప్పనమంత్రి	354
అమరేశ్వరుడు	522
అమృతనాథుడు	190
అయ్యలరాజు తిప్పయ్య	866
అయ్యలార్యుడు	485
అర సున్న	134
అవచి తిప్పయసెట్టి	684
అవాల్మీక గాథలు	608
అష్టాదశ వర్ణనలు	168
ఆంధ్రకవి రామయ్య	873
ఆంధ్రకౌముది	955

ముఖ్యపదాను క్రమణిక

(కవులు, కావ్యాలు, ఇతరులు, ఇతర సాహితీ విషయాలు)

అంబికా శతకము	518
అక్షర రమ్యత	141
అజ్ఞాత కవుల కావ్యాలు	264
అజ్జరపు పేరయలింగం	795
అడిదం కవులు	971
అడిదం సూరకవి	971
అధర్వణాచార్యుడు	459
అనంతయ్య, మడికి	657
అనంతామాత్యుడు	841
అనంతుని ఛందము	851
అనవేమారెడ్డి	683
అన్నమయ్య, తాళ్ళపాక	985
అన్నమయ్య, యథావాక్కుల	280
అన్నయ్య, వెన్నెలకంటి	830
అప్పకవి	940
అప్పకవి వంశం	940
అప్పకవీయం	940
అప్పనమంత్రి	354
అమరేశ్వరుడు	522
అమృతనాథుడు	190
అయ్యలరాజు తిప్పయ్య	866
అయ్యలార్యుడు	485
అర సున్న	134
అవచి తిప్పయసెట్టి	684
అవాల్మీక గాథలు	608
అష్టాదశ వర్ణనలు	168
ఆంధ్రకవి రామయ్య	873
ఆంధ్రకౌముది	955

ఆంధ్రభోజుడు	349
ఆంధ్రశబ్దచింతామణి	143
ఆదికవి	095
ఆదిమయుగం	001
ఉత్తర హరివంశం	580
ఉల్లాసములు	669
ఎర్రన్న, కూచిరాజు	959
ఎర్రయ్య	946
ఎఱ్ఱాప్రెగ్గడ	549
ఎల్లనార్యుడు	658
ఎల్లమ భీమన	223
ఏకావళి	393
ఏనుగు లక్ష్మణకవి	797
ఏర్చూరి సింగన్న	925
ఒడయనంబి విలాసము	795
కందనా తారావళి	638
కందనామాత్యుడు	636
కందము	26
కన్నడ కావ్యాలు	86
కమలనాభామాత్యుడు	392, 681
కలభ్రులు	35
కవిగజాంకుశము	1066
కవిభల్లటుడు	293
కవిరాక్షసచ్ఛందము	677
కవి రాక్షసీయము	676
కవి రాక్షసుడు	673
కవి వాగ్బంధనము	288, 306
కస్తూరి రంగకవి	677
కాకతీయ యుగం	255
కాకతీయులు	259
కాకునూరి పండితులు	940

కాచభూపతి	614
కాటమరాజు కథ	702
కాదంబరి	277
కావ్యభాష	133
కావ్యము	146
కావ్యాంకితము	169, 270
కావ్యానువాదము	138
కావ్యాలంకార చూడామణి	667
కాశీఖండము	695
కుకవి నింద	164
కుబ్జవిష్ణువర్ధనుడు	667
కుమారరుద్రుడు	485
కుమారస్వామి	54
కువలయాశ్వ చరిత్ర	931
కూచిపూడి భాగవతులు	1030
కూచిమంచి తిమ్మకవి	902
కూచిరాజు ఎర్రన్న	959
కృష్ణమాచార్యులు	433
కృష్ణశతకము	307
కేతన	366, 808
కేయూరబాహు చరిత్రము	394, 406
కేసనమంత్రి	636
కొక్కోకము	959
కొమ్మన నిశ్శంక	757
కొరవి గోపరాజు	664
కొరవి సత్యానారన	664
కొలని గణపతిదేవుడు	859
క్రీడాభిరామము	701
క్షేమేంద్రుడు	287
గంగన. బొప్పరాజు	920
గజపతుల యుగం	795

గణపవరపు వెంకటకవి	955
గాథాసప్తశతి	1008
గొండ్లి	1024
గోండులు	12
గోపరాజు, కొరవి	664
గోనబుద్ధరాజు	601
గౌడడింండిమభట్టు	719
గౌరన	815, 1066
ఘంట సింగన్న	1050
చంద్రతారావళి	519
చంద్రమౌళి	954
చక్రపాణి రంగనాథుడు	427
చమత్కార చంద్రిక	632
చారుచర్య	354
చాళుక్యయుగం	118
చాళుక్యులు	47, 259
చింతలపూడి ఎల్లనార్యుడు	658
చిత్రకవి పెద్దన	852, 1025
చినవీరభద్రుడు, పిల్లలమర్రి	797, 1033
చిమ్మపూడి అమరేశ్వరుడు	522
చెదలవాడ భీమన	224
చెన్నయమంత్రి, ప్రోలుగంటి	1023
చేమకూరి వెంకటకవి	1017
ఛందోదర్పణము	851
జంగమ మల్లికార్జునుడు	170
జగ్గన్న. పెదపాటి	673, 780, 873, 931
జన్నమంత్రి	673
జాహ్నవీమాహాత్మ్యము	798
జైనకవి	100
జైనము	077
జైనులు	097

జైమిని భారతము	813, 1041
తమ్మిరాజు. పూసపాటి	971
తారక బ్రహ్మరాజీయము	659
తాళ్ళపాక అన్నమయ్య	985
తాళ్ళపాక తిమ్మక్క	1008
తిక్కన	288, 298
తిక్కన వంశవృక్షం	333
తిట్టుకవిత్వము	211
తిమ్మకవి, కూచిమంచి	902
తిమ్మక్క, తాళ్ళపాక	1008
తెలుగు కవిత్వం (9 శ.)	48
తెలుగు జనులు	86
తెలుగు శాసనాలు	40
తొలి తెలుగుమాట	03
తొలి రాయల యుగం	809
త్రిపురాంతకోదాహరణము	520
దగ్గుపల్లి దుగ్గన	768
దశకుమార చరిత్ర	367
దూబగుంట నారాయణకవి	975
దేవకీనందన శతకము	673
దేవరాజభట్టు	954
దేవరాయలు	674
దేశి	120
దోనయామాత్యుడు	621
ద్విపద భాగవతము	651
ధనంజయుడు	37
ధనాభిరామము	943
నందిమల్లయ్య	1050
నందివర్మ	36
నన్నయ్య	125, 143, 1010
నన్నెచోడుడు	160

నవనాథ చరిత్ర	510, 815
నాగనాథకవి	631
నాగులు	12
నాచనసోముడు	580
నారయ్యా వెలిగందల	935
నారాయణకవి, దూబగుంట	975
నారాయణభట్టు	130
నారాయణ శతకము	912
నాసికేతోపాఖ్యానము	768
నిడుదవోలు చాళుక్యులు	259
నిశ్శంక కొమ్మన	757
నీతి తారావళి	638
నీతిభూషణము	349
నూతనకవి సూరన	943
నృసింహపురాణము	551
పంచతంత్ర కావ్యాలు	978
పండితారాధ్య చరిత్రము	685
పండితారాధ్యుడు	237
పదకవిత్వం	20
పద్మనాయక యుగం	469
పద్మనాయకులు	469
పద్మ పురాణము	392, 645
పశుపతి నాగనాథకవి	631
పాల్కురికి సోమనాథుడు	411, 881, 907
పావులూరి మల్లన	196
పిల్లలమర్రి పినవీరభద్రుడు	797, 1033
పుణ్యకుమారుడు	38
పురుషార్థసారము	360
పురుషోత్తమ మహోపాధ్యాయుడు	802
పూరమ భీమన	223
పూసపాటి రాజులు	971

పెదకోమటి వేమారెడ్డి	687
పెదపాటి జగ్గన్న	768, 873, 931
పెద్దన, విన్నకోట	666
పెద్దయామాత్యుడు	404
పెనుమళ్ళ సోమన	797
పోతన	881
ప్రకాశభారతీయోగి	634
ప్రద్యుమ్న చరిత్ర	671
ప్రథమాంధ్ర కవితా పితామహుడు	360
ప్రబంధ రత్నాకరము	768, 873, 931
ప్రబోధ చంద్రోదయము	1051
ప్రసన్నకథా కవితార్థయుక్తి	150
ప్రాస	58
ప్రేమాభిరామము	516
ప్రోలయ వేమారెడ్డి	683
ప్రోలుగంటి చెన్నయమంత్రి	1023, 1078
బంగెన భీమన	223
బంధకవిత్వము	1078
బద్దెన	186
బయ్యాన	392
బసవపురాణము	417, 749
బుద్ధరాజు. గోన	601
బృహన్నారదీయము	873
బొప్పరాజు గంగన	920
భల్లట శతకము	293
భాగవతము	881, 920, 925,935
భాణము	631
భారతము	128
భారతీయోగి	634
భాస్కర రామాయణము	484
భాస్కర రామాయణకవులు	484

భాస్కరుడు	271, 272
భాస్కరుని కేతన	276
భీమఖండము	705
భీమన(లు)	203, 220, 222, 223, 224
భేతాళపంచవింశతి	830
భైరవకవి	1066
భోగినీ దండకము	889
భోజరాజీయము	842
భోజుడు	349
మంత్రి భాస్కరుడు	271
మంచెన	394
మడికి అనంతయ్యా	657
మడికి సింగన	351, 641
మతాలు కామితాలు	61
మదన విజయము	517
మదన విలాసము	631
మధుర కవిత	119
మధ్యాక్కర	52
మనోబోధ	859
మరుత్తరాట్చరిత్రము	681
మల్లికార్జున పండితుడు	237
మల్లికార్జునభట్టు	485
మల్లియ భీమన	222
మల్లయ రేచన	101
మహాదేవాచార్యుడు	802
మహేంద్ర విక్రముడు	37
మాధవాచార్యులు	809
మారన	448, 820
మార్కండేయ పురాణము	448
మార్గ	120
ముద్దుపళని	1016

ముద్రామాత్యము 288
మూలఘటిక కేతన 366
యథావాక్కుల అన్నమయ్య 280
రంగకవి. కస్తూరి 677
రంగనాథ రామాయణము (ఉత్తరకాండ) 614
రఘువీర శతకము 866
రత్నపరీక్ష 1066
రసాభరణము 842
రసార్ణవ సుధాకరము 891
రాజరాజు 127
రాధామాధవకవి 658
రాధికా సాంత్వనము 1016
రామయ్య, ఆంధ్రకవి 873
రామయ్య, వాసిరాజు 016
రామాభ్యుదయము 813
రావిపాటి తిప్పన్న 514
రెడ్డిరాజుల యుగం 469
రెడ్డిరాజులు 472
రేచర్లవారు 469
రేనాటి చోళులు 29
రేనాడు 28
లక్షణ చక్రవర్తి 815
లక్షణ దీపిక 816, 677
లక్ష్మణకవి. ఏనుగు 797
లక్షణసార సంగ్రహము 852
లక్ష్మణాచార్యుడు 802
లక్ష్మీధరుడు 802
వంగిపర్రు భీమనప్పయ్య 222
వరాహపురాణము 1056
వల్లభరాయడు 716
వస్తుకవిత 163

వాత్స్యాయన కామసూత్రాలు	959
వాసిరాజు రామయ్య	873
వికృతి వివేకము	459
విక్రమసేనము	524
విక్రమార్క చరిత్ర	673, 780
విజ్ఞానేశ్వరీయము	386, 808, 823
విజయ విలాసము	1014
విజయసేన ప్రబంధము	300
విట్ఠలనాథుడు	614
విద్యాధరుడు	393
విద్యారణ్యస్వాములు	809
వినుకొండ వల్లభామాత్యుడు	716
విన్నకోట పెద్దన	666
విరించి మిశ్రుడు	802
విశ్వనాథ భట్టారకుడు	802
విశ్వేశ్వరకవి	631
విష్ణుకాంచీ మాహాత్మ్యము	873
విష్ణు పురాణము	631
విష్ణుమాయా నాటకము	657
వీరభద్ర విజయము	882
వీరశరభకవి	958
వెంకటకవి. చేమకూర	1014, 1017
వెంకటేశ్వర శతకము	987
వెన్నెలకంటి అన్నయ్య	830
వెన్నెలకంటి జన్నమంత్రి	673
వెలిగందల నారయ్య	935
వెలిగందలామాత్యుడు	636
వేమన్న	864
వేమారెడ్డి. అన	683
వేమారెడ్డి, పెదకోమటి	687
వేమారెడ్డి, ప్రోలయ	683

వేములవాడ భీమకవి	203
వైదిక ఛందస్సు	52
వైష్ణవులు	97
శతపక్షి సంవాదము	288
శరభాంకుడు	505
శాసనాలు (రాగివి, రాతివి)	57
శివకాంచీ మాహాత్మ్యము	768
శివతత్త్వసారము	245
శివదేవధీమణి శతకము	360
శివదేవయ్య	359, 505
శివయోగసారము	859
శివరాత్రి మాహాత్మ్యము	729
శివలీలా విలాసము	757
శూద్రకరాజు చరిత్రము	293
శూద్రకుడు	293
శృంగార నైషధము	688
శృంగార మంజరి	993
శృంగార శాకుంతలము	1035
శైవులు	97
శ్రీకృష్ణవిజయము	971
శ్రీగిరి అయ్యగారు	510
శ్రీగిరి కవి	510
శ్రీధరుని భీమన	224
శ్రీనాథుడు	681
శ్రీరంగమాహాత్మ్యము	1066
షష్ఠ్యంతములు	172
షోడశకుమార చరిత్రము	830
సకలనీతికథానిధానము	946, 963
సకలనీతి సమ్మతము	349, 360, 641
సత్యానారన. కొరవి	664
సర్వజ్ఞసింగ భూపాలుడు	891

సర్వదేవుడు	95, 99
సర్వలక్షణసార సంగ్రహము	902
సర్వేశ్వర శతకము	280
సస్యానందము	621
సారసంగ్రహ గణితము	196
సాళువ నరసింహరాయలు	813
సాహిణి మారన	487
సింగన. మడికి	641
సింగన్న. ఏర్చూరి	925
సింహగిరి వచనాలు	433
సింహాసన ద్వాత్రింసిక	664
సీమంతినీ కల్యాణము	797
సుభద్రాకల్యాణము	1009
సుభాషిత రత్నావళి	797
సుమతి భీమన	220
సూరకవి. అడిదం	971
సూరన. నూతనకవి	943
సోమన. పెనుమళ్ళ	797
సోమనాథుడు. నాచన	580
సోమనాథుడు. పాల్కురికి	411
సౌభరి చరిత్ర	1026
స్వరశాస్త్ర మంజరి	862
హరవిలాసము	691
హరిభట్టు	936
హరివంశము	572
హరిశ్చంద్ర కావ్యము	954
హరిశ్చంద్ర చరిత్ర	815
హుళక్కి భాస్కరుడు	272, 484



31 ఆగస్టు 1925 - 4 జూన్ 1998

దీనిలో నన్నయపూర్వపు భాషాస్వరూపం, స్వభావం గురించి పరిశోధనా పూర్వమైన చర్చ ఉంది. ఇది ఒక ప్రశంసనీయమైన విషయం. కవుల జాబితాలతో, గ్రంథాల పట్టీలతో నింపి సాహిత్య చరిత్ర వ్రాయవచ్చు చప్పగా. అటువంటిది కాదిది. కవులను గురించిన కథలూ, కబుర్లు, వాళ్ళ జీవితాల్లోని ప్రధానఘట్టాలు, సాహిత్య విమర్శలు, వీటితో రసవంతంగా, ఆకర్షణీయంగా వ్రాసిన చరిత్ర ఇది. ఆరుద్రకు అద్వితీయమైన ఆంధ్రసాహిత్య జ్ఞానం ఉంది. అంతేగాక ప్రపంచసాహిత్య పరిచయం సహా ఉంది. పరిశోధనకృషి, విమర్శకదృష్టి ఉంది. సరళమైన సజీవభాషలో వ్రాయగల శక్తి ఉంది. వ్యవహారంలోని తెలుగు నుడికారం సొంపు అతనికి వెన్నతోడ పెట్టింది. సౌందర్యపిపాసి, రసికుడు, అన్నివిధాల ఇటువంటి చరిత్రకు తగిన రచయిత. చదువుకొన్న ప్రతి ఆంధ్రుడు ఈ కానుకను రెండు చేతుల్తో పుచ్చుకోవలెనని నా కోరిక.

జస్టిస్ పి.వి. రాజమన్నారు

ఎందరో, ఎందరెందరో సాహిత్య చరిత్రలు రాశారు. కాని అవి అన్నీ మేధావుల కోసం. చదువుకున్న వారికోసం. ఈ సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో భాష వ్యావహారికం దాటి వాడుక భాషలో, కోమలంగా అందరికీ అర్థమయ్యే రీతిలో రమ్యంగా సాగింది. దీనిని - అతి సామాన్య సాహితీపిపాసి కూడా చదివి ఆనందించగల శైలిలో ముచ్చట కల్గిస్తుంది. చదవక వదలలేము.

లోకాయుక్త ఆవుల సాంబశివరావు

తెలుగు జాతికి గర్వకారణం ఆరుద్ర. ఈ వాఙ్మయచరిత్రకారునికి ఇవ్వవలసినంత ఖ్యాతి మనం ఇవ్వలేదేమో అనిపిస్తూంది. ఇదే - తదితర ఏ భాషలో రాసినా అతన్ని అపూర్వ మేధావిగా గ్రహించేవారు. ప్రపంచంలో, వివిధ భాషా సాహిత్యాలలో ఎక్కడా ఒక్కచేతిపై సాహిత్యచరిత్ర రాసిన దాఖలాలు లేవు. ఉత్సాహమే మూలధనంగా ఆరుద్ర ముందుకి సాగిపోవాలని, న్యాయమూర్తిగా శాసిస్తున్నాను.

జస్టిస్ ఓ. చిన్నప రెడ్డి

సమగ్ర ఆంధ్ర సాహిత్యం - మొదటి సంపుటి
తెలుగు అకాడమి-విశిష్ట ప్రచురణ

తెలుగు అకాడమి
హిమాయత్‌నగర్, హైదరాబాదు-500 029.
Email: teluguakademi@teluguacademy.com
Web: www.teluguacademy.com